ప్రైవేట్ ఐటీఐ పరీక్షలు రాసేందుకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: వివిధ ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయివేటు సంస్థలలో పనిచేస్తున్న అభ్యర్థులకు ఐటీఐ వివిధ ట్రేడ్‌లలో పరీక్షలు రాసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కంచరపాలెంలోని ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపల్ ఎన్. సోలమన్ తెలిపారు. సంబంధిత ట్రేడ్‌నందు అభ్యర్థులు మూడేళ్ల పైబడిన సర్వీసు కలిగి ఉండాలన్నారు. సంస్థ ధ్రువీకరణ పత్రం, ఎంప్లాయి గుర్తింపు కార్డుతో పాటు పరీక్ష ఫీజు రూ.500 చెల్లించి దరఖాస్తులను వచ్చే నెల 28 తేదీలోగా అందజేయాలన్నారు.

యథేచ్ఛగా కలప రవాణా

మన్యంలో పచ్చదనంపై గొడ్డలి వేటు పడుతోంది. యథేచ్ఛగా కలప అక్రమ రవాణా సాగుతోంది. అటవీశాఖ అధికారులు అడ్డగోలుగా అనుమతులు ఇస్తుండటంతో కలప రవాణా రోజురోజుకూ పెచ్చుమీరుతోంది. గిరిజన రైతుల పేరిట గుట్టుచప్పుడుగా అనుమతులు పొంది ప్రైవేటు వ్యాపారులు చక్రం తిప్పుతున్నారు. ఇక్కడి విలువైన కలపను మైదాన ప్రాంతానికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారని గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒడిశా, తుని, రాజమహేంద్రవరం, విశాఖ ప్రాంతాలకు నిత్యం లారీలు తరలిపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని గిరిజనులు కోరుతున్నారు. – డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

ఈనాడు
అల్లూరి సీతారామరాజు

సోమవారం 29 డిసెంబరు 2025

వేడినీరా.. బయట కొనుక్కోండి!

ప్రసూతి విభాగం వార్డులో హీటర్ పెట్టుకున్న బాలింత

పాడేరు, న్యూస్‌టుడే: అప్పుడే ప్రసవమైన బాలింత ఆరోగ్యానికి వేడి నీరు ఎంతో అవసరం. వేడినీరు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయ పడుతుంది. పాడేరు జిల్లా ఆసుపత్రిలోని ప్రసూతి విభాగంలో ప్రతిరోజూ సుమారు పది వరకు ప్రసవాలు జరుగుతుంటాయి. జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ కాకుండా ముందు ప్రసూతి, శిశు సంరక్షణ విభాగం (ఎస్ఎన్‌సీయూ), ఎన్ఆర్‌సీ విభాగాలు ఒకేదగ్గర ఉండడంతో వేడి నీరు పుష్కలంగా ఉండేది. జిల్లా ఆసుపత్రిగా స్థాయి పెరిగినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రసూతి విభాగంలో బాలింతలకు వేడినీరు సమకూర్చిన దాఖలాలు లేవు. ప్రసవించిన బాలింతకు మరుసటి రోజు నుంచి పరిశుభ్రత కీలకం. ప్రస్తుతం కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో ప్రసూతి విభాగంలో బాలింతలు వేడినీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొంతమంది బయటకు వెళ్లి డబ్బులు ఇచ్చి వేడి నీరు తెచ్చుకుంటున్నారు. మరికొంతమంది సొంతంగా హీటర్లు కొనుగోలు చేసి వార్డులోనే వాటిని వినియోగిస్తున్నారు. ఈ వార్డుల్లో కిటికీలు, తలుపులు లేకపోవడంతో చలిగాలి వీస్తోందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● దీనిపై ఆసుపత్రి ఇన్‌ఛార్జి పర్యవేక్షకురాలు డాక్టర్ హేమలతాదేవిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. గతం నుంచి వేడి నీరు ఇవ్వడం లేదు. ఉన్నతాధికారులతో మాట్లాడి సోలార్ లేదా, గీజర్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. బాలింతల వార్డులో కిటికీలు బాగుచేయించి.. వెచ్చదనం ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అరకు చూశారు.. ఇరుక్కుపోయారు!

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే

➡ విశాఖ తిరుగు ప్రయాణంలో పాట్లు
➡ ఎప్పుడూలేనివిధంగా ఘాట్‌లో వన్‌వే ఆంక్షలు

అరకు అందాలు చూసి మధురానుభూతులతో తిరిగి ప్రయాణమైన వారికి ఆదివారం చుక్కలు కనిపించాయి. ఉదయం బస్టాండుకు వచ్చిన వారు సాయంత్రం వరకు అరకు దాటలేకపోయారు. విపరీతమైన ట్రాఫిక్ కారణంగా పోలీసులు రాకపోకలపై ఆంక్షలు విధించడంతో పర్యాటకులు అపసోపాలు పడ్డారు.

అరకు కాంప్లెక్స్‌లోనే నిలిచిన బస్సులు

★ వరుస సెలవులు, వారాంతం, నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో అరకులోయకు సందర్శకుల తాకిడి విపరీతంగా పెరిగింది. అరకులోయ సందర్శనకు ఆదివారం పర్యాటకులు బారులుతీరారు. పెద్దసంఖ్యలో ఉదయం నుంచి వందలాది వాహనాలతో తరలిరావడంతో విశాఖ- అరకు ఘాట్‌రోడ్డు, మాడగడ వ్యూపాయింట్, స్థానిక సందర్శిత ప్రాంతాలు జనజాతరగా మారాయి. విశాఖ నుంచి అరకు ఘాట్‌రోడ్డులో కాఫీ తోటలు, ఉడెన్ బ్రిడ్జి, బొర్రా మార్గంలో ప్రకృతి అందాలను తిలకించేందుకు వాహనాలు నిలిపివేయడంతో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో రద్దీ నియంత్రణకు పోలీసులు ఆంక్షలు విధించారు. ఉదయం నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల అనంతరం కాఫీతోటల సందర్శనకు వీలు కల్పించేలా చర్యలు తీసుకున్నారు.

★ విశాఖ నుంచి అరకు వచ్చేందుకు మాత్రమే వాహనాలను అనుమతించారు. వన్‌వే మాత్రమే అవకాశం కల్పించారు. అరకు నుంచి విశాఖకు తిరుగు ప్రయాణానికి పాడేరు మీదుగా వెళ్లాల సూచనలు చేశారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో ఈ చర్యలు తీసుకోవడంతో అప్పటికే అరకులోయ వచ్చిన వాహనాలు విశాఖకు తిరిగి వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో అరకులోయ పరిసరాల్లోనే ఆగిపోవాల్సి వచ్చింది.

★ విశాఖ, శృంగవరపుకోట నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సులను తిరిగి వెళ్లేందుకు అవకాశం కల్పించకపోవడంతో అరకులోయ బస్టాండ్‌లోనే నిలిచిపోయాయి. 11 గంటల ప్రాంతం నుంచి బస్సులు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో బస్టాండ్‌లో, అప్పటికే నిలిచిన నాలుగు బస్సుల్లో ప్రయాణికులు కూర్చుని గంటల పాటు వేచి చేశారు. మధ్యాహ్నం వరకు వేచి చూసినా బస్సులు బయలుదేరకపోవడంతో ప్రయాణికులు డబ్బులు నష్టపోయి ఇళ్లకు వెళ్లారు. మధ్యాహ్నం అనంతరం విషయం ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో 1.30 గంటల తర్వాత బస్సులు బయలుదేరాయి. కానీ స్థానిక డిగ్రీ కళాశాల వద్ద వాహనాలను ఘాట్‌రోడ్డు ప్రయాణానికి అనుమతించకపోవడంతో అక్కడ 3.30 గంటల వరకు నిలిచిపోయాయి.

★ లోతేరు మార్గంలో బొర్రా మీదుగా షార్ట్‌కట్‌లో ప్రయాణికులను తీసుకువెళ్లామని ప్రైవేటు వాహనదారులు ఒక్కొక్కరి వద్ద రూ. 750 వరకు వసూలు చేశారు. వాటికి వాహనాలకు అవకాశం కల్పించకపోవడంతో అరకులోయకు తిరిగి వచ్చారు. మధ్యాహ్నం 3.30 గంటల అనంతరం వాహనాలను విడిచిపెట్టారు. అరకులోయ అందాలను ఆస్వాదిద్దామనుకున్న పర్యాటకులకు అధిక రద్దీ.. సమాచార లేమి, అవస్వర్గం తీసుకున్న పోలీసు ఆంక్షలు ప్రయాణికులను గురిచేశాయి.

తండ్రీకొడుకుల జలసమాధి

కూనవరం, న్యూస్‌టుడే: నీళ్లలో మునిగిపోతున్న కొడుకును కాపాడే ప్రయత్నంలో తండ్రి సైతం నీటిగుంతలో పడి జలసమాధి అయిన హృదయవిదారక ఘటన కూనవరం మండలం నర్సింగపేటలో ఆదివారం చోటుచేసుకుంది. వ్యవసాయం కోసం ఏర్పాటు చేసుకున్న నీటిగుంత కుటుంబంలోని ఇద్దరి ప్రాణాలు తీసింది. కూనవరం ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింగపేట గ్రామానికి చెందిన సింహాద్రి పాపారావు (45), తొమ్మిదో తరగతి చదువుతున్న తన కొడుకు జశ్వంత్ (13)తో కలసి బహిర్భూమికి వెళ్లారు. ఉదయం ఏడు గంటలకు వెళ్లిన తండ్రీకొడుకులు 11 గంటలు అవుతున్నా రాకపోవడంతో భార్య మంగ వెతుకుతూ చెరువు వద్దకు చేరుకుంది. తండ్రీ కొడుకుల చెప్పులు గుంత వద్ద కన్పించడంతో కేకలు వేసింది. ఆమె అరుపులు విన్న గ్రామస్థులు వచ్చి అందులో దిగి వెతకడం మొదలుపెట్టారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఈతగాళ్లను తీసుకొచ్చి వెతికించగా ఇద్దరి మృతదేహాలు బయటపడ్డాయి. బహిర్భూమికి వచ్చిన వారిలో కొడుకు జశ్వంత్ పొరపాటుగా గుంతలో పడిపోయి ఉంటాడని.. కొడుకుని కాపాడే యత్నంలో తండ్రి మునిగిపోయి ఉంటారని స్థానికులు చెబుతున్నారు. భార్య మంగ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. కుటుంబంలో ఒకేసారి ఇద్దరు మృత్యువాత పడడంతో గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది.

మృతదేహాల వద్ద రోదిస్తున్న భార్య, అక్క

జశ్వంత్‌కు కేకు తినిపిస్తున్న తండ్రి పాపారావు (పాత చిత్రం)

బోటు షికారు.. పట్టించుకోరు!

గిరిజన మ్యూజియం ఆవరణలో మూలకు చేరిన బోట్లు

ఆంధ్రా ఊటీ అరకులోయను సందర్శించే పర్యాటకులు గిరిజన మ్యూజియంలోని బోటులో షికారు చేద్దామని ఎంతో ఆశతో వస్తున్నా.. పాడైన బోట్లతో నిరాశ తప్పడం లేదు. గిరిజన మ్యూజియంలో ప్రస్తుతం రెండు బోట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే నాలుగు బోట్లు మరమ్మతులకు గురై మూలకు చేరాయి. మరిన్ని బోట్లని అందుబాటులోకి తీసుకొస్తే బాగుంటుంది. మ్యూజియానికి అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. అయినప్పటికీ నిర్వాహకులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఐటీడీఏ అధికారులు స్పందించి మరిన్ని బోట్లని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.– అరకులోయ, న్యూస్‌టుడే

వలిసె మెరిసె.. మన్యం మురిసె

మన్యం వలిసెల సాగుకు ప్రసిద్ధి. కనుచూపు మేరలో చుట్టూ దట్టమైన పచ్చటికొండలు, వాటి మధ్య పసుపు తివాచీ పరిచినట్టుండే ఈ సాగు మన్యానికే ప్రత్యేకం. ఏటా ప్రస్తుత సీజనులో సందర్శకులకు కనువిందు చేసే ఈ పంట సాగు కాలానుగుణంగా తగ్గుతూ వస్తోంది. నూనె గింజల పంటలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం ప్రత్యేకంగా ఈ సాగుపై జాతీయస్థాయి ప్రాజెక్టును అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఇక్కడ ప్రదర్శనా క్షేత్రాల్లో వలిసెల పంటను సాగు చేస్తున్నారు. – చింతపల్లి, న్యూస్‌టుడే

నాలుగు రోజులు.. 3,920 మంది పర్యాటకులు

దేవీపట్నం, న్యూస్‌టుడే: పాపికొండల విహారయాత్రకు క్రిస్మస్ పండగ రద్దీ కొనసాగుతోంది. గురువారం నుంచి ఆదివారం నాటికి పాపికొండలు అందాలను తిలకించడానికి 3,920 మంది పర్యాటకులు వెళ్లారని కంట్రోల్ రూం అధికారులు తెలిపారు. ఆదివారం కావడంతో మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొండపై నుంచే గండిపోశమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. నాలుగు రోజులు పాటు పాపికొండల విహారయాత్రకు పర్యాటకులు అధిక సంఖ్యలో వెళ్లడంతో వ్యాపారాలు జోరుగా సాగాయి. ఆలయం వద్ద వరద నీరు తగ్గడంతో అమ్మవారి దర్శనాలను త్వరితగతిన పునః ప్రారంభించాలని భక్తులు కోరుతున్నారు.

పాపికొండలకు వెళ్తున్న పర్యాటకులు

అసలు పోయిందా.. నకలు పొందండిలా!

అనంతగిరి, న్యూస్‌టుడే: విద్య, ఉద్యోగ జీవితానికి పది, ఇంటర్మీడియట్ ధ్రువపత్రాలు ఎంతో ముఖ్యమైనవి. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన వీటిని పోగొట్టుకుంటే నకలు మళ్లీ పొందేందుకు మార్గాలు ఉన్నాయి. ఇందుకు కొన్ని రకాల పత్రాలు సమర్పించడం ద్వారా వీటిని పొందేందుకు అవకాశం ఉంది.

పదో తరగతి..

● bse.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి డూప్లికేట్ ఎస్ఎస్‌సీ దరఖాస్తు ఐచ్ఛికంపై క్లిక్ చేస్తే తెరుచుకుంటుంది. ప్రింట్ తీసి వివరాలను నింపాల్సి ఉంటుంది.

● దరఖాస్తుపై ఫొటో అతికించి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుని సంతకంతో కూడిన లేఖ, రూ.50 విలువైన స్టాంప్ పేపర్‌పై చేయించిన అఫిడవిట్, సబ్ ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ తహసీల్దార్, అంతకంటే ఎక్కువ స్థాయి కలిగిన అధికారి ఇచ్చిన నాన్‌ట్రేసింగ్ ధ్రువపత్రం, పోగొట్టుకున్న పదో తరగతి ధ్రువపత్రం నకళ్లను జతచేయాలి.

● రూ. 250 విలువైన చలానా తీసి ఇవన్నీ కలిపి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ద్వారా డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్ వారికి పోస్టు ద్వారా పంపాలి.

● పోస్టు పంపిన నాటి నుంచి నెల రోజుల లోపు నకలు ధ్రువపత్రం ఆ పాఠశాలకు వస్తుంది. విద్యార్థి ఫొటోతో పాఠశాలకు వెళ్తే ధ్రువపత్రంపై అతికించి ప్రధానోపాధ్యాయుడు సంతకం పెట్టి ఇస్తారు.

ఇంటర్మీడియట్ ఇలా..

● blcap.apcfss.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి స్టూడెంట్ సర్వీసెస్‌లోకి వెళ్లి డూప్లికేట్ ఓపెన్ చేయాలి. (మొదటిసారి పోతే డూప్లికేట్, రెండోసారి అయితే ట్రిప్లికేట్) అందులో హాల్‌టికెట్ నంబరు, పుట్టిన తేదీ, మెయిల్ ఐడీ నమోదు చేస్తే విద్యార్థి వివరాలు కనిపిస్తాయి.

● ఎఫ్ఐఆర్ కాపీ కోసం సమీపంలోని మీసేవా కేంద్రంలో మిస్సింగ్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేస్తే సరిపోతుంది.

● ఆ తర్వాత అఫిడవిట్, ప్రిన్సిపల్ సంతకం చేసిన దరఖాస్తు ఫారాన్ని నింపి అప్‌లోడ్ చేయాలి. సర్టిఫికెట్ పొందాల్సిన అవసరాన్ని కూడా పొందుపరచాలి. తర్వాత చలానా తీసి ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేస్తే అప్లికేషన్ నంబరు వస్తుంది.

● అన్నీ పరిశీలించి చరవాణి నంబరు నమోదు చేశాక... సర్టిఫికెట్ పోయిందా, చిరిగిపోయిందా? పోయినట్లయితే ఎఫ్ఐఆర్ కాపీ, చిరిగిపోతే చిరిగిన కాపీ అప్‌లోడ్ చేయాలి.

● ఆ నంబరు ద్వారా దరఖాస్తు స్థితిని తెలుసుకోవచ్చు. అప్‌లోడ్ చేసిన ఒక సెట్ పత్రాలను సంబంధిత కళాశాలకు ఇవ్వాలి. అనంతరం కళాశాలకు నకలు వస్తుంది. ఈ విధంగా పోయిన ధ్రువపత్రాల నకలును పొందవచ్చు.

ఎమ్మెల్సీ బెదిరింపులు దారుణం

అనంత బాబుపై పోలీసులకు తెదేపా నాయకుల ఫిర్యాదులు

రంపచోడవరం, న్యూస్‌టుడే: కనుసైగ చేస్తే అమెరికాలో ఉన్నా... తన అనుచరులు చంపేస్తారంటూ రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవిని బెదిరిస్తున్న ఎమ్మెల్సీ అనంత బాబుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నియోజకవర్గం పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో తెదేపా నేతలు ఆదివారం ఫిర్యాదులు చేశారు. రంపచోడవరం పోలీసుస్టేషన్‌లో పందిరిమామిడి గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు పండా చెల్లన్నదొర ఎస్సై వెంకటరావుకు ఫిర్యాదు లేఖను అందజేశారు. నియోజకవర్గం పరిధిలోని రాజవొమ్మంగి, జడ్డంగి, అడ్డతీగల, ఎటపాక పోలీస్ స్టేషన్లలో కూడా తెదేపా నేతలు ఫిర్యాదులు అందజేశారు. అడ్డతీగల మండలం ఎల్లవరం గ్రామానికి చెందిన ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ (అనంత బాబు) నిత్యం ఎమ్మెల్యేపై లేనిపోని అసత్య ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఈనెల 25న ఐ.పోలవరంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి ఒక మహిళ అని కూడా చూడకుండా ఎమ్మెల్యేను తీవ్ర దుర్భాషలాడారన్నారు. ఎస్టీ నకిలీ కుల ధ్రువపత్రంతో గతంలో ఎంపీపీగా, జడ్పీటీసీ సభ్యుడిగా పనిచేసి గిరిజనులకు అన్యాయం చేశారన్నారు. హత్యానేరంతో ఉన్న ఈయన నియోజకవర్గంలో సమావేశాలను ఏర్పాటు చేసి ప్రభుత్వానికి భంగం కలిగేలా మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. సీతపల్లి బాపనమ్మ ఆలయ ఛైర్మన్ బాపన్న దొర, సింహాచలం దొర పాల్గొన్నారు. రాజవొమ్మంగి, జడ్డంగి పోలీస్ స్టేషన్లలో మండల తెదేపా అధ్యక్షుడు పెద్దిరాజు, ప్రధాన కార్యదర్శి గంగాధర్ ఫిర్యాదు చేశారు.

రంపచోడవరంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న తెదేపా నాయకులు

ఎటపాక, అడ్డతీగల, వరరామచంద్రాపురం: అడ్డతీగలలో తెదేపా మండల అధ్యక్షుడు జర్తా వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో.. వరరామచంద్రాపురంలో మండల తెదేపా అధ్యక్ష, కార్యదర్శులు బొర్రా నరేశ్, పాయం రామారావు ఆధ్వర్యంలో నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎటపాక ఎస్.ఐ. అప్పలరాజుకు తెదేపా మండల అధ్యక్షులు బొల్లా పుల్లయ్య, ఉప ఎంపీపీ మంగేశ్వరరావు ఫిర్యాదు చేశారు.

రక్తహీనతతో ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

వార్డెన్‌తో మాట్లాడుతున్న మృతురాలి బంధువులు

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు బాలికల ఆశ్రమ పాఠశాల ఆరో తరగతి విద్యార్థిని పాంగి నందిని (11) రక్తహీనతతో ఆకస్మికంగా మృతి చెందింది. తనకు జ్వరం వచ్చినట్లు శనివారం నందిని వసతిగృహ సిబ్బందికి తెలియజేయడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. వైద్యాధికారి నారాయణరావు పరీక్షించారు. రక్తహీనతతో బాధపడుతోందని గుర్తించి చింతపల్లి తీసుకెళ్లాలని సూచించారు. తల్లిదండ్రులకు సిబ్బంది సమాచారం అందించారు. ఆదివారం ఉదయం అల్పాహారం తీసుకుని సహచర విద్యార్థినులతో మాట్లాడుతుండగా అకస్మాత్తుగా పడిపోవడంతో అంబులెన్స్‌లో సీలేరు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందిందని వార్డెన్ శకుంతల తెలిపారు. తోటి విద్యార్థులు విషాదంలో మునిగిపోయారు. మృతదేహాన్ని స్వగ్రామం గాలికొండ పంచాయతీ నిమ్మగొందికి తరలించారు.

ఆసుపత్రికి తీసుకెళ్దామని వచ్చేలోపే..

నందినికి రక్తం తక్కువగా ఉందని వార్డెన్ ఫోన్ చేయడంతో ఆదివారం ఉదయాన్నే బయలుదేరి సీలేరు వచ్చానని, అప్పటికే విగతజీవిగా మారిందని విద్యార్థిని తండ్రి సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. బాగా చదువుకుంటుందని ఆశ్రమ పాఠశాలలో చేర్పించామని, ఇలా కడుపుకోత మిగిల్చిందని కన్నీటి పర్యంతమయ్యారు.

★ విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఎ.బుజ్జిబాబు డిమాండ్ చేశారు. నిమ్మగొంది గ్రామాన్ని ఆయన సందర్శించారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఉపాధ్యాయుల ప్రతిభ

ఎటపాక, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఈ నెల 27, 28 తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌లో 12వ రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలో వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎస్.నాగిరెడ్డి, కె.కృష్ణవేణి, పి.పుల్లమ్మ, ఎస్.సంకురమ్మ, ఎస్.విజయకుమారి, టి.శైలజ, సీహెచ్.లక్ష్మణ్ షాట్‌పుట్, ట్రిపుల్ జంప్, జావెలిన్‌త్రో, నడక, పరుగు పోటీల్లో పలురకాల పతకాలు సాధించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన వ్యాయామోపాధ్యాయులు

ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు

సింహాచలం, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సింహాద్రి అప్పన్న స్వామి దర్శనానికి సుమారు 50 వేల మంది భక్తులు వస్తారనే అంచనాతో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా వివరాలను ఆదివారం ఈవో సుజాత విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

★ 'ఈ ఏడాది ఆన్‌లైన్ ద్వారా 9వేల టికెట్లు విక్రయిస్తున్నారు. సోమవారం సాయంత్రం వరకు అవి అందుబాటులో ఉంటాయి. ఉత్తర ద్వారంలో కొలువైన స్వామిని భక్తులు క్యూలైన్ల ద్వారా పది నిమిషాల పాటు దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. ఉదయం 11గంటల వరకే ఈ దర్శనం ఉంటుంది. తర్వాత వచ్చిన భక్తులకు సాధారణ దర్శనాలు ఉంటాయి. 30న కేవలం లడ్డూ ప్రసాదం మాత్రమే విక్రయిస్తారు. ఆ మేరకు లక్ష లడ్డూలు తయారు చేస్తున్నారు.

అరకు పర్యాటకులకు నేడు ప్రత్యేక రైలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: పండగ రోజుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వారికి కల్పిస్తున్న మౌలిక సదుపాయాల గురించి తెలుసుకునేందుకు వాల్తేర్ డీఆర్ఎం లలిత్ బోహ్రా ఆదివారం విశాఖ రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్లాట్‌ఫామ్‌ల పరిశుభ్రత, ప్రయాణికుల భద్రతకు సంబంధించిన పలు అంశాలపై ఆరా తీశారు. విశాఖ - కిరండూల్ మార్గంలో నడిచే రైలుకు అరకు ప్రయాణికుల తాకిడి అమాంతం పెరగడంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై 'ఈనాడు'లో వరుసగా కథనాలు ప్రచురించడంతో ఆయన స్పందించారు. ప్రస్తుతం నడుస్తున్న రైలుకు 29 నుంచి జనవరి 20 వరకు ఒక సాధారణ రెండో తరగతి బోగీని అదనంగా జత చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 29న విశాఖ-అరకు(08525/08526) మధ్య ప్రత్యేక రైలు నడపనున్నట్లు తెలిపారు.

బహుదూరం.. పనిభారం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, సామాన్యులకు ఆరోగ్య సేవలందించడంలో, సమాచార సేకరణలో ఆశా వర్కర్లది కీలక పాత్ర. జాతీయ ఆరోగ్య మిషన్ నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 1000 మంది జనాభాకు ఒకరు, పట్టణ ప్రాంతాల్లో రెండు వేల జనాభాకు ఒకరు పనిచేయాలి. జనాభా పెరుగుదల, అందుకు తగినట్లుగా సిబ్బంది లేకపోవడంతో పనిభారం పెరుగుతోందని వారు వాపోతున్నారు. హెల్త్‌క్లినిక్‌ల పరిధిలో 4 వేల నుంచి 5 వేల జనాభా ఉన్న ప్రాంతాల్లో ఒకరు, ఇద్దరు చొప్పున పనిచేస్తున్నారు. ఇతర సర్వేలూ చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. జిల్లాలో ఆశా కార్యకర్తల నియామకానికి గతంలో నోటిఫికేషన్ ఇచ్చారు. నెలలు గడుస్తున్నా నియామకాలు జరగలేదు. జిల్లా పరిధిలో వందల మందికి పైగా అవసరం ఉందని అంచనా. పని భారం తగ్గించాలని వారంతా కోరుతున్నారు.

సర్వే చేస్తున్న ఆశా కార్యకర్తలు

★ అల్లూరి జిల్లా పరిధిలో పలువురు ఆశా కార్యకర్తలు పదవీ విరమణ చేశారు. వారి పని భారం మరొకరిపై పడింది. మన్యంలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాలకు కొండలు, గుట్టలు, గెడ్డలు దాటి వెళ్లాల్సి వస్తోందని, వర్షాకాలం, చలికాలంలో ఇబ్బందులు పడుతున్నామని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

★ అల్లూరి జిల్లాలో ఆశా కార్యకర్తలు సుమారు 2800 మంది, సీహెచ్‌డబ్ల్యూవోలు 700 మంది పనిచేస్తున్నారు.

ఇవీ ప్రధాన విధులు

★ పిల్లలు, మహిళలకు టీకాలు వేయడం
★ గర్భిణుల వివరాలు నమోదు, ప్రసవాల సమయంలో ఆసుపత్రికి తీసుకెళ్లడం
★ లెప్రసీ, జ్వరాల సర్వే
★ ఎప్పటికప్పుడు వివరాల నమోదు
★ వీటికి అదనంగా కొత్తగా వచ్చే ఆదేశాలకు అనుగుణంగా సర్వేలు
★ ప్రత్యేక సందర్భాల్లో వైద్యశిబిరాల నిర్వహణ

కొత్తవారిని నియమించలేదు

2019 నుంచి 2025 వరకు చాలామంది ఆశా కార్యకర్తలు పదవీ విరమణ చేశారు. మరికొంత మంది వివిధ కారణాలతో మృతి చెందారు. వారి స్థానాల్లో కొత్తవారిని భర్తీ చేయలేదు. వారి కుటుంబాల్లో ఎవరికైనా ఉద్యోగమిస్తే కుటుంబానికి భరోసాగా ఉంటుంది. సిబ్బంది కొరత, పని భారంతో ఇబ్బందులు పడుతున్నాం.

– కొండమ్మ, ఆశా కార్యకర్తల సంఘం జిల్లా కార్యదర్శి, చింతపల్లి

మధురమే..మధురమే..మధురమే..
ఈ క్షణములు ఇంకా మధురమే..
పదవీ విరమణ శుభాకాంక్షలు

మీ కుటుంబసభ్యులు, మీ బంధుమిత్రులు,
మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా!
అయితే వారికి అందించండి, అభినందన చందనాలు.
వారి భావి జీవితం సుఖమయంగా సాగాలని ఆకాంక్షిస్తూ,
ఈనాడు ద్వారా వారికి అందించండి,
పదవీ విరమణ శుభాకాంక్షలు.
మరిన్ని వివరాలకు :
8008709638

(c) eenadu

బంతితో తిప్పేసి.. బ్యాటుతో బాదేసి..

ఉత్సాహంగా 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025'

క్రీడాకారులను ఉత్సాహ పరుస్తున్న ప్రభుత్వ ఛాతి, అంటువ్యాధుల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్, ఏఎంసీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎస్.ఎన్. పాత్రుడు తదితరులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రా మెడికల్ కళాశాల మైదానంలో 'ఈనాడు - ఈతరం క్లబ్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ధనిక్‌భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్' ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్(ఈఎస్ఎల్)-2025' టోర్నీలో ఆదివారం బ్యాటర్లు పరుగులు తీసి ఆకట్టుకున్నారు. వారిని అవుట్ చేసేందుకు బౌలర్లు నానా తంటాలు పడ్డారు. పోటీలను ప్రభుత్వ ఛాతి, అంటువ్యాధుల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ పీడీ డాక్టర్ ఎం.ఎస్.ఎన్. పాత్రుడు తదితరులు పాల్గొన్నారు. 'ధనిక్‌భారత్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే'గా ఆంధ్రా మెడికల్ కళాశాల క్రీడాకారుడు ఎల్.మనోజ్ (29 పరుగులు, 2 వికెట్లు) ఎంపికయ్యారు.

■ ఆంధ్రా మెడికల్ కాలేజీ వర్సెస్ డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు: మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా మెడికల్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 87 పరుగులు చేసింది. జట్టులో ఎల్.మనోజ్ 29, జె.అజయ్ 18 పరుగులు చేశారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు బౌలర్లు వి.ప్రసాద్, ఆర్.సాయి చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు 9.3 ఓవర్లలో 49 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. సీహెచ్.డేవిడ్ 14 పరుగులు చేశాడు. ఏఎంసీ జట్టు బౌలర్లు యోగి 3 వికెట్లు తీయగా, దివాన్స్, మనోజ్ చెరో 2 వికెట్లు తీశారు.

గెలుపొందిన ఆంధ్రా మెడికల్ కళాశాల జట్టు

'ధనిక్ భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

ఎల్.మనోజ్ (29 పరుగులు, 2 వికెట్లు)

■ రఘు ఇంజినీరింగ్ కాలేజ్ వర్సెస్ డాక్టర్ లంకపల్లి బుల్లయ్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ డిగ్రీ అండ్ పీజీ జట్టు 5 వికెట్ల తేడాతో రఘు ఇంజినీరింగ్ జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన రఘు ఇంజినీరింగ్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 74 పరుగులు చేసింది. జె.హర్షిత్ 25, పి.వి.ఎస్.సుహాస్ 21 పరుగులు చేశారు. బుల్లయ్య కాలేజ్ బౌలర్లు జి.రిత్విక్ 3, శ్రీవర్ధన్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బుల్లయ్య కాలేజ్ జట్టు 8.5 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసింది. జట్టులో బస్వంత్ 34, రిత్విక్ 12 పరుగులు చేశారు. రఘు కాలేజ్ బౌలర్లు సాత్విక్ 2, దిలిప్ ఒకట వికెట్ తీశారు.

ప్రతిభ చూపిన డాక్టర్ లంకపల్లి బుల్లయ్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల జట్టు

■ ఆదిత్య డిగ్రీ కాలేజ్(గాజువాక) వర్సెస్ అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్: అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ జట్టు 38 పరుగులు తేడాతో ఆదిత్య డిగ్రీ కాలేజ్‌పై గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన అనిల్ నీరుకొండ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 105 పరుగులు చేసింది. జట్టులో కె.రాకేష్ 29 పరుగులు చేశారు. ఆదిత్య డిగ్రీ కాలేజ్ బౌలర్ దుర్గ, జయంత్ తలో వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆదిత్య డిగ్రీ కాలేజ్ జట్టు 8 ఓవర్లలో 67 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జి.జయంత్ 31 పరుగులు చేశారు. అనిల్ నీరుకొండ జట్టు బౌలర్లు ఆర్.గగన్ 3, ఎం.సిద్ధార్థ 2 వికెట్లు తీశారు.

విజయం సాధించిన అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ జట్టు

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor
Dhanik Bharat Educational Institutions
The Lloyd Group Initiative

Protein Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ
(Non-Govt. Public Charitable Trust)
"Sunday ho yah Monday roz khao ande"

Beverage Partner
CMR SHOPPING MALL
The joy of life

Gift Partner
KL UNIVERSITY (DEEMED TO BE)

Regional Sponsor
GGU GODAVARI GLOBAL UNIVERSITY
RAJAMAHENDRAVARAM, A.P.
Call: 994 999 3483 | www.ggu.edu.in

TV Partner
ఈటీవీ ఆంధ్రప్రదేశ్

Digital Partner
ఈనాడు.నెట్ ETV BHARAT

Dolphin Diagnostic Services

District Sponsor
TIRUMALA విద్యాసంస్థలు

Organised by
ఈనాడు ఈతరం క్లబ్

నేటి మ్యాచ్‌లు ● ఉదయం 8 గంటలకు: సీనియర్స్ విభాగంలో శ్రీకశ్యప్ డిగ్రీ కాలేజ్ × వీఎస్ డిగ్రీ కాలేజ్ (గాజువాక) ● ఉదయం 10 గంటలకు: జూనియర్స్ విభాగంలో క్రైస్ట్ జూనియర్ కాలేజ్ × గవర్నమెంట్ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ● మధ్యాహ్నం 12 గంటలకు: జూనియర్స్ విభాగంలో.. గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజ్ × మిసెస్ ఏవీఎన్ జూనియర్ కాలేజ్

30-12-25 నాటి మ్యాచ్‌లు... ● ఉదయం 8 గంటలకు: సీనియర్ విభాగంలో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ × గీతం డీమ్డ్ యూనివర్సిటీ ● ఉదయం 10 గంటలకు: సీనియర్ విభాగంలో ఎన్ఎస్ఆర్ఐటీ(శొంఠ్యాం) × గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కాలేజ్(రుషికొండ) ● మధ్యాహ్నం 12 గంటలకు: జూనియర్స్ విభాగంలో శ్రీకశ్యప్ జూనియర్ కాలేజ్ × విశాఖ పాలిటెక్నిక్ కాలేజ్

ఆదివాసీల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమారి ఆధ్వర్యంలో ఆదివారం నేతలు ఘనంగా నిర్వహించారు. శాంతకుమారి చేతులమీదుగా పార్టీ జెండా ఆవిష్కరించారు. ఆదివాసీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ అమలుచేసిన సంక్షేమ పథకాలను గుర్తుచేశారు. కాంగ్రెస్ నాయకులు సత్యసాయి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

అడ్డతీగల, న్యూస్‌టుడే: స్థానిక గాంధీబొమ్మ కూడలిలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి దంగేటి సత్తిబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ములూరు గ్రామాన్ని ముంపు జాబితాలో చేర్చాలి

కూనవరం, న్యూస్‌టుడే: ములూరు గ్రామాన్ని పోలవరం ముంపు ప్రాంతాల గ్రామాల జాబితాలో చేర్చాలని తెదేపా మండల కోశాధికారి సోమక సత్యనారాయణ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఆదివారం కలిసి కోరారు. గ్రామానికి చెందిన భూములు గతంలోనే పరిహారాలు ఇచ్చారని పునరావాసం, పరిహారం జాబితాలో మాత్రం చేర్చలేదని చెప్పారు. భూములు కోల్పోవడం వల్ల ఇప్పటికే రైతులు ప్రభుత్వ ఉపాధిలేకుండా దూరమయ్యారన్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. అధికారులతో చర్చించి న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

మంత్రికి సమస్య వివరిస్తున్న తెదేపా మండల కోశాధికారి సత్యనారాయణ

దేశభక్తిని అలవర్చుకోండి

రంపచోడవరం, న్యూస్‌టుడే: సమాజంలో దైవభక్తితో పాటు దేశభక్తిని అలవర్చుకోవాలని గోదావరి విభాగ్ కార్యకారిణి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చక్రధారి పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం జాగరంపల్లిలో 'హిందూ సమ్మేళనం' నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వానంద భారతి దత్తస్వామితో కలిసి చక్రధారి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చక్రధారి మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. విశ్వానంద భారతి దత్తస్వామి మాట్లాడుతూ భారతీయ జీవన విధానంలోనే అందరూ జీవించాలన్నారు. ముందుగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, శక్తి సంస్థ డైరెక్టర్ శివరామకృష్ణ, ఆదిపట్ల కళా పీఠం హైందవ సంస్థ స్టేట్ వైస్ ప్రెసిడెంటు సుబ్బలక్ష్మి, ఆర్యవైశ్య సంఘం మాజీ ప్రెసిడెంటు తిరివీధి సుబ్రహ్మణ్యం, వీహెచ్‌పీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న చక్రధారి, విశ్వానంద భారతి దత్తస్వామి

ట్రాక్టర్ సహాయంతో స్పీడు బోటు తరలింపు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్‌లో తిరిగే టూరిజం స్పీడు బోట్లను స్థానిక తీరంలో ఉంచిన సురక్షిత ప్రదేశం నుంచి ట్రాక్టర్ సహాయంతో రోజూ ఉదయం సముద్రం వద్దకు, తదనంతరం సాయంత్రం తిరిగి అదే చోటుకు చేర్చుతున్నారు. ఇక్కడ పర్యాటక శాఖకు చెందిన రెండు బోట్లతో పాటు ప్రైవేటు సంస్థలకు చెందిన నాలుగు బోట్లను నడుపుతున్నారు. తీరంలో సురక్షిత ప్రాంతం నుంచి వీటిని గతంలో మనుషులే మోసుకుంటూ వెళ్లేవారు. దీంతో వ్యయప్రయాసలతో పాటు పలు ఇబ్బందికర పరిణామాలు తలెత్తేవి. ఈ నేపథ్యంలో సమకూర్చుకున్న ట్రాక్టర్ ద్వారా వీటిని తరలిస్తున్నారు. దీంతో అన్ని విధాలుగా ప్రయోజనం చేకూరుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

సాగర జలాల్లోకి బోటు తరలింపు

పర్యాటకుల కారు బోల్తా

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: ఘాట్‌రోడ్డుపై అవగాహన లేమి, అప్రమత్తత లేని కారణంగా పర్యాటకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అరకులోయ నుంచి సుంకరమెట్ట, పిరిబంధ మీదుగా కటికి జలపాతానికి వెళ్లేదారిలో ఆదివారం పర్యాటకుల కారు ప్రమాదానికి గురైంది. మలుపులో రహదారి కిందకు జారి పల్టీలు కొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. అదృష్టవశాత్తు రోడ్డు పక్కనున్న పల్లపు ప్రాంతంలో పల్టీలు కొడుతూ నిలిచిపోవడంతో కిందన ఉన్న వాగులోకి కారు పడిపోకుండా ఆగింది. దీంతో ప్రయాణికులు చిన్నపాటి గాయాలతో బయటపడినట్లు స్థానికులు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణ లోపాలతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపించారు. తరచూ ప్రమాదాలతో ఈ ప్రాంతీయులు ఆందోళన చెందుతున్నారు. వల్లభనేని వంశీ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ద్వారా 2023లో నిర్మించిన ఈ రోడ్డు రెండేళ్లలో ఛిద్రమైందన్నారు. రహదారి మరమ్మతులు కోరుతూ పలుమార్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

పిరిబంధ వద్ద ప్రమాదానికి గురైన కారు

చెట్టును ఢీకొన్న కారు: ఇద్దరికి గాయాలు

చింతూరు: కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. చింతూరు మండలం పోతనపల్లి సమీపాన ఆదివారం సాయంత్రం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మారేడుమిల్లి నుంచి భద్రాచలం వైపునకు వెళ్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ సంఘటనలో తల్లి బిందు, కూతురు అక్షశ్రీకి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స నిర్వహించారు. కారులో ఉన్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వీరంతా భద్రాది కొత్తగూడెం జిల్లాలోని సారపాక గ్రామానికి చెందిన వారు.

కలెక్టరేట్‌లో రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు

విశాఖపట్నం: రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలపై వచ్చే వినతులను ప్రత్యేకంగా స్వీకరించేందుకు కలెక్టరేట్‌లో రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేశారు. దీని సేవలు ఈనెల 29వ తేదీ సోమవారం నుంచి అందుబాటులోకి వస్తాయని జేసీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక నుంచి ప్రతీ సోమవారం రెవెన్యూ క్లినిక్ సేవలందిస్తుందని, విశాఖ జిల్లాలో ఉన్న ఆర్డీఓలు, తహసీల్దార్లు ఇతర అధికారులు ఇక్కడ అందుబాటులో ఉంటారన్నారు. భూ సంబంధిత సమస్యలు, 22ఏ మినహాయింపులు, టైటిల్ డీడ్‌కు సంబంధించిన అంశాలపై ఇక్కడ ఫిర్యాదులు అందజేయవచ్చు.

అడ్డురోడ్డుకు మహర్దశ!

✦ రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఎంపిక

✦ ఈనెల 31కి తుది నోటిఫికేషన్ వచ్చే అవకాశం

ఈనాడు డిజిటల్, అనకాపల్లి – న్యూస్‌టుడే, నక్కపల్లి

నక్కపల్లి కేంద్రంగా ఏర్పాటు చేయాల్సిన కొత్త రెవెన్యూ డివిజన్‌ను ప్రభుత్వం మార్చింది. ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు కూడలిలో దీనిని ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. మంత్రులు, అధికారులతో సీఎం చంద్రబాబునాయుడు అమరావతిలో ఇటీవల నిర్వహించిన మంత్రివర్గ ఉపసంఘం సమీక్షలో రెవెన్యూ డివిజన్ మార్పుపై నిర్ణయం తీసుకున్నారు. దీంతో నక్కపల్లికి బదులు అడ్డురోడ్డు కేంద్రంగా డివిజన్ ఏర్పాటు కానుంది.

■ పారిశ్రామికాభివృద్ధి పరంగా శరవేగంగా అడుగులు వేస్తున్న నక్కపల్లిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మంత్రి అనిత చొరవ చూపారు. ఇందుకు మంత్రివర్గ ఉపసంఘంలోనూ ఆమోదం లభించింది. ప్రాథమిక నోటిఫికేషన్ తర్వాత.. రాష్ట్రవ్యాప్తంగా నూతన జిల్లాలు, డివిజన్ల ఏర్పాటుపై అభ్యంతరాలను స్వీకరించింది. ఈ క్రమంలో నక్కపల్లి డివిజన్‌ను తప్పించి.. ఎలమంచిలి కేంద్రంగా నూతన రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయాలంటూ ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలు నిరసనలు తెలిపారు. స్థానిక కూటమి నేతలు సైతం ఎలమంచిలి కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయాలంటూ ప్రతిపాదించడంతో దీంతో ఇక్కడి ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని నక్కపల్లికి బదులుగా దీనికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అడ్డురోడ్డు జంక్షన్‌ను డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. తద్వారా ఆయా ప్రాంతాల వారికి మరింత అందుబాటులో ఉంటుందని ఆలోచన.

అడ్డురోడ్డు వాణిజ్య కూడలి

మునగపాక.. అనకాపల్లిలోనే!... అనకాపల్లి పట్టణానికి అతి దగ్గరగా ఉన్న మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లోనే ఉంచాలని స్థానిక నేతలు, ప్రజలు విన్నవించారు. ఇటీవల జిల్లా డీఆర్‌సీ సమావేశంలోనూ అనకాపల్లిలోనే మునగపాక మండలాన్ని కొనసాగించాలని తీర్మానించారు. మరోవైపు అదనంగా చీడికాడ మండలాన్ని నర్సీపట్నం నుంచి అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లో కలిపేలా మార్పు చేస్తున్నారు. దీంతో అనకాపల్లిలో 10, నర్సీపట్నం, అడ్డురోడ్డు రెవెన్యూ డివిజన్లలో ఏడేసి మండలాల చొప్పున కొనసాగనున్నాయి. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల, ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలతో అడ్డురోడ్డు కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు కానుంది.

అభివృద్ధిలో వేగంగా .. ■ తుని, పాయకరావుపేట తర్వాత అడ్డురోడ్డు వాణిజ్యపరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. పేరుకే తిమ్మాపురం పంచాయతీలో ఉన్నా.. అందరికీ అడ్డురోడ్డు పేరే సుపరిచితం. ఇక్కడ అనేక విద్యా సంస్థలు, ఆసుపత్రులు, వస్త్ర, ఇతర వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లు, స్థిరాస్తి వ్యాపారం.. ఇలా అన్నివిధాలా అభివృద్ధి చెందుతోంది. దీనిపై ఈ నెలాఖరున ప్రభుత్వ తుది నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది.

■ మరోవైపు ఆది నుంచి నక్కపల్లి పేరును తెరపైకి తెచ్చి చివరిలో అడ్డురోడ్డు డివిజన్ ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

మలి వయసులో మేటి అథ్లెటిక్..!

పరుగులో లతాదాస్ అద్భుతాలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: మలి వయసులోనూ అద్భుతాలు చేస్తున్నారు ఎంవీపీకాలనీకి చెందిన కె.లతాదాస్ (72). ప్రపంచంలో ఎక్కడ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు జరిగినా పాల్గొని పతకాలు కైవసం చేసుకుంటున్నారు. ఇటీవల చెన్నైలో జరిగిన ఆసియా స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటి ప్రశంసలు అందుకున్నారు.

★ లతాదాస్ ఎంవీపీకాలనీలోని ఆళ్వార్ దాస్ పబ్లిక్ స్కూల్‌లో 28ఏళ్లుగా వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. 15ఏళ్ల వయసు నుంచే పరుగు పోటీల్లో పాల్గొనడం ప్రారంభించారు. వివాహమైన తర్వాత కూడా పరుగును ఆపలేదు. 1996 నుంచి మాస్టర్ అథ్లెటిక్స్‌పై దృష్టి పెట్టారు. పరుగు, హర్డిల్స్, ట్రిపుల్‌జంప్ విభాగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తూ దూసుకెళ్తున్నారు. అంతేకాకుండా మూడుసార్లు హిమాలయ పర్వతాలపై ట్రెక్కింగ్ చేశారు. వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూనే యోగా కోర్సులో పీజీ డిప్లమో పూర్తి చేశారు.

సాధించిన విజయాలు: 1995లో ఇండోనేషియా జకార్తాలో జరిగిన ఆసియా మాస్టర్ అథ్లెటిక్స్ మీట్‌లో 10వేల మీటర్ల పరుగులో పాల్గొని కాంస్య పతకం సాధించారు. 2010 కౌలాలంపూర్, 2013 బ్రెజిల్, 2014 జపాన్, 2018 స్పెయిన్, 2019 ఫిన్‌లాండ్, 2024 స్వీడన్ దేశాల్లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు కొల్లగొట్టారు.

సాధించిన పతకాలు	స్వర్ణం	రజతం	కాంస్యం
అంతర్జాతీయ	8	12	10
జాతీయ	150	50	320

ఇదీ ఆరోగ్య రహస్యం: 'ప్రతిరోజు రాత్రి 10గంటలకల్లా నిద్ర పోతా.. తెల్లవారుజామున 4 గంటలకు నిద్ర లేస్తా.. 4.45 నుంచి 5.45గంటల వరకు జాగింగ్ చేస్తా.. ఉదయం రాగిజావ, పాలు, స్వల్పంగా ఆహారం తీసుకుంటా.. అనంతరం కళాశాలలో విధులకు హాజరవుతా. సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత గంట సమయం యోగా చేస్తాన'ని లతాదాస్ తెలిపారు. 2026 జూన్‌లో దక్షిణ కొరియాలో జరిగే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

వీఆర్‌ఓల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శశిధర్

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షునిగా అమిరపు శశిధర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఈరెల్ల శివశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గ ఎన్నిక ఆదివారం గుండాల కూడలిలో జరిగింది. సహ అధ్యక్షుడిగా దేవాడ చిన్నంనాయుడు, కోశాధికారిగా ఆశ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా డి.రాజేష్‌కుమార్, రాంజీ వ్యవహరించారు. నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

కొత్త 'కట్టు' కథ

నిర్వాసిత ప్రాంతాల్లో పరిహారం కోసం ఎత్తుగడ

నక్కపల్లి, న్యూస్‌టుడే

నక్కపల్లి మండలంలోని పారిశ్రామిక ప్రాంతంలో ఏపీఐఐసీ ద్వారా పరిహారం, ప్యాకేజీల కోసం కొందరు ఎత్తుగడలు వేస్తున్నారు. ఇందుకు నిర్వాసిత గ్రామాల్లో ఆగమేఘాలపై నూతన నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదంతా అధికారుల కళ్ల ముందే జరుగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం విశేషం.

పరిశ్రమల నిమిత్తం నక్కపల్లి మండలంలోని పలు గ్రామాల్లో 4300 ఎకరాలకు పైగా భూములను తీసుకోగా.. చందనాడ, తమ్మయ్యపేట, తుమ్మలపేట, పాటిమీద, డి.ఎల్.పురం, మూలపర్ర గ్రామాల్లో దాదాపు 300కు పైగా ఇళ్లను తీసుకున్నారు. వీటి పరిధిలో 745 మంది లబ్ధిదారులను గుర్తించారు. తొలగించే ఇళ్లు, ఇతర నిర్మాణాలకు పరిహారం చెల్లించడంతోపాటు, అర్హులందరికీ ప్యాకేజీ కింద రూ.8.98 లక్షల నగదు, అయిదు సెంట్ల చొప్పున ఇంటి స్థలం కేటాయించారు. పెదబోదుగల్లం ఇళ్ల స్థలాలను ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా పునరావాస కాలనీ తయారు చేస్తున్నారు. ఇప్పటికే ఇళ్ల స్థలాల కేటాయింపు పూర్తి చేశారు. ఇప్పుడు మళ్లీ గ్రామాల్లో కొందరు నాయకులు స్థానికులను మభ్యపెట్టి పరిహారం కోసం కొత్త కథకు తెర తీశారు. ఈ క్రమంలో ఖాళీ స్థలాల్లో రేకుల షెడ్లు వేయిస్తున్నారు. వీటి నిర్మాణ ఖర్చు తక్కువగా ఉన్నప్పటికీ పరిహారం ద్వారా ఎక్కువ పొంది, తద్వారా ప్యాకేజీ వస్తుందని ఆశపడుతున్నారు. తాజాగా తమ్మయ్యపేట గ్రామంలో ఇలాంటి కొత్త నిర్మాణాలు అనేకం చేపట్టారు. మరింత మంది నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. తమకు పై అధికారులతో పరిచయాలు ఉన్నాయని, షెడ్లు వేసుకుంటే పరిహారం, ప్యాకేజీ ఇప్పిస్తామని కొందరు నాయకులు చెబుతూ, ఇందుకుగాను తమకింత చెల్లించాలనే లోపాయికారీ ఒప్పందాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. వాస్తవంగా నిర్వాసిత ప్రాంతాల్లో ఉన్న నిర్మాణాలకు తుది గడువుగా 2024 డిసెంబరు నెలాఖరు వరకు మాత్రమే ఇచ్చారు. వీటన్నింటినీ కాదని, ఇప్పుడు నూతన నిర్మాణాలు చేస్తుండటం విశేషం.

ప్రస్తుతం చేస్తున్న నిర్మాణాలు

ఇలాంటి వాటికి పరిహారం ఇచ్చేది లేదు

నిర్వాసిత గ్రామాల్లో ఇప్పటికీ కొందరు నిర్మాణాలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. వీటిపై దృష్టి సారించాం. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటికి సంబంధించి ఎలాంటి పరిహారం ఇచ్చేది లేదు. దీనిపై మా ఉద్యోగులకు స్పష్టమైన సూచనలు చేశాం.

– నరసింహరావు, ఏపీఐఐసీ, జెడ్ఎం

ఉద్యోగులపై చర్యలు తప్పవు... పారిశ్రామిక ప్రాంతంలోని ఇళ్లను తొలగించే గ్రామాల్లో గతేడాది డిసెంబరు వరకు మాత్రమే కటాఫ్ ఇచ్చారు. వీటన్నింటికీ సంబంధించి సర్వే చేసి నివేదికలు ఇచ్చారు. ఇప్పుడు కొత్తగా నిర్మాణాలు చేసి, పరిహారం..ప్యాకేజీ కావాలంటే కుదరదు. గ్రామాల్లో కార్యదర్శులు ఎవరైనా ఇంటి పన్నులు ఇచ్చి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

– ఆర్.నరసింహమూర్తి, తహసీల్దారు

మూడు గ్రామాలు.. ఇంటికో సైనికుడు..!

సైనికుల గ్రామంగా పేరొందిన చిప్పాడ గ్రామం

చిప్పాడ (తగరపువలస), న్యూస్‌టుడే: భీమిలి మండలం తగరపువలస, చిట్టివలస సమీప చిప్పాడ, మూలకుద్దు, గుడివాడ ప్రధాన గ్రామాల్లో ప్రతి కుటుంబం నుంచి ఓ వ్యక్తి సైన్యంలో చేరుతున్నారు. ఇక్కడి యువత పది, ఇంటర్, డిగ్రీ పూర్తి కాగానే ఆర్మీలో చేరడమే లక్ష్యంగా ముందుకు సాగుతుండటం విశేషం.

1956 నుంచి ఇప్పటి వరకూ..		
గ్రామం	సైన్యంలో పనిచేసిన వారు	ప్రస్తుతం విధుల్లో..
చిప్పాడ	279	123
మూలకుద్దు	203	98
గుడివాడ	255	87
మొత్తం	737	308

★ ఇప్పటి వరకూ ఈ మూడు గ్రామాల నుంచి దాదాపు 700 మందికి పైగా సిపాయి, నాయక్, హవల్దారు, జూనియర్ కమాండింగ్ అధికారి, సుబేదార్, లెఫ్టినెంట్ కెప్టెన్, మేజరు, తదితర ఉద్యోగాల్లో పనిచేశారు.

తొలి సైనికులు వీరే: చిప్పాడకు చెందిన కొయ్య అప్పారావురెడ్డి తొలిసారిగా 1956లో సైన్యంలో చేరారు. ఆయన ఐదేళ్ల కిందట మృతి చెందారు. ఆయన స్ఫూర్తితో వందల మంది సైన్యంలో చేరారు. ఆయన కుమారులు సుబేదార్ కొయ్య నాగేశ్వరరావు, ఈశ్వరరావు దేశానికి సేవలందించి ఉద్యోగ విరమణ చేశారు. మూలకుద్దు నుంచి 1985లో కొయ్య గురయ్యరెడ్డి మొదటిసారిగా సైన్యంలోకి వెళ్లారు. 'చిప్పాడ పరిధి పాతపాలేనికి చెందిన ఉప్పాడ గోవింద్‌రెడ్డి ఆర్మీ కమాండింగ్ అధికారిగా ఐక్యరాజ్యసమితి శాంతి దళంలో ఉంటూ పలుదేశాల్లో విధులు నిర్వహించి రాష్ట్రపతి నుంచి పతకాలు అందుకున్నార'ని మాజీ సైనికుల సంఘం భీమిలి నియోజకవర్గ శాఖ అధ్యక్షులు కొయ్య గురయ్యరెడ్డి తెలిపారు.

దేశసేవలో చిప్పాడ, మూలకుద్దు, గుడివాడ యువత

ఐక్యరాజ్యసమితి శాంతి దళంలో పనిచేసిన ఆర్మీ అధికారి ఉప్పాడ గోవిందరెడ్డి

వేతన సవరణ సంఘాన్ని నియమించాలి

అనకాపల్లి, న్యూస్‌టుడే: సీనియర్ ఉపాధ్యాయులను టెట్ నుంచి పూర్తిగా మినహాయించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య (ఏపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్ కోరారు. ఆదివారం అనకాపల్లిలో ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనుదారులు సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించి, మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని కోరారు. సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.వెంకటపతిరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై బోధనేతర, యాప్‌ల భారం తగ్గించాలని కోరారు.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	131	130
లైవ్	158	150
డ్రెస్డ్	229	270
స్కిన్‌లెస్	261	280

(c) eenadu

కోతుల బెడద.. సీలేరువాసుల బెంబేలు!

జెన్‌కో కాలనీలో ఇంటిపై కోతుల గుంపు

సీలేరు పురవీధుల్లో కోతుల బెడదతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. ఎక్కడికక్కడ గుంపులుగా చేరి స్వైరవిహారం చేస్తున్నాయి. ఇళ్లలోకి చేరి సామగ్రిని చిందరవందరగా పడేస్తున్నాయి. ఆహార పదార్థాలను వంటపాత్రలతో సహా పట్టుకుపోయి బయట పడేస్తున్నాయి. పంటలను నాశనం చేస్తున్నాయి. విద్యుత్తు, టెలిఫోన్ వైర్లపై వేలాడుతుండటంతో అవి తెగి సేవలకు అంతరాయం కలుగుతోంది. సీలేరులో రేకుల ఇళ్లు అధికంగా ఉన్నాయి. వీటిపై గెంతుతుండడంతో రేకులు పగిలిపోతున్నాయి. వర్షం వస్తే ఇళ్లు కారిపోతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల దుకాణాల సమీపంలో తిష్ఠ వేసి కూర్చుంటున్నాయి. ఏపీ జెన్‌కో, పంచాయతీ అధికారులు స్పందించి సీలేరులో కోతుల స్వైరవిహారాన్ని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. **- సీలేరు, న్యూస్‌టుడే**

పంచాయతీలకు స్వచ్ఛ వాహనాలు!

ఎంపీడీవో కార్యాలయంలో ట్రాక్టర్ తొట్టెలు

గ్రామ పంచాయతీల్లో చెత్తాచెదారాలను తొలగించేందుకు స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా ట్రాక్టర్ తొట్టెలు మంజూరయ్యాయి. అరకులోయ మండలంలోని గన్నెల, చినలబుడు, కొత్తభల్లుగుడ, బస్కి, లోతేరు పంచాయతీలకు వీటిని ప్రభుత్వం అందించింది. ఏడాదిన్నర క్రితమే ఆయా పంచాయతీలకు ట్రాక్టర్ల ఇంజిన్లను అందించారు. సుమారు ఏడాదిన్నర వరకు ఇవి వృథాగా మూలన ఉన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తొట్టెలు మంజూరు చేసింది. ప్రస్తుతం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇవి ఉన్నాయి. అయితే ఆయా పంచాయతీల పరిధిలో గతంలో ఇచ్చిన ఇంజిన్లు అసలు ఉన్నాయా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. **- అరకులోయ, న్యూస్‌టుడే**

అధికారులు ఆదేశించినా పట్టదా?

చింతపల్లి ఎంపీడీవో కార్యాలయం పక్కన చేపల విక్రయాలు

రోడ్లపై, కార్యాలయాల పక్కన చేపలు, మాంసం అమ్మకాలు నిర్వహించవద్దని.. వ్యాపారులకు నోటీసులు అందజేస్తామని ఇటీవల ఎంపీడీవో సీతామహాలక్ష్మి హెచ్చరించినా వ్యాపారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈనెల 24న మండల పరిషత్ కార్యాలయం వద్ద చేపల దుకాణం ఏర్పాటు చేయడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. దీనిపై నోటీసులు జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, గుమస్తా అంబేడ్కర్‌లను నోటీసులు జారీ చేశారు. వీరికి మార్కెట్లో ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని పేర్కొన్నారు. అయినా ఆదివారం యథావిధిగా ఎంపీడీవో కార్యాలయం పక్కనే చేపల దుకాణం ఏర్పాటు చేశారు. **- చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే**

నమ్మండి.. ఇది చెక్‌డ్యాం!

పెదబయలు మండలంలోని గలగండ పంచాయతీలో చెక్‌డ్యాం సుమారు ఐదేళ్ల క్రితం మరమ్మతులకు గురైంది. పలుమార్లు ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్‌కు స్థానిక రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఇది నామరూపాలు లేకుండా పోయింది. చెక్‌డ్యాం గోడలు పూర్తిగా కొట్టుకుపోవడంతో పంటపొలాలకు చుక్కనీరు అందడం లేదు. దీనిపై ఆధారపడిన సుమారు రెండువేల ఎకరాలకు రెండో పంటకు అవకాశం లేకుండాపోయింది. అధికారులు స్పందించి దీనిని బాగు చేయాలని రైతులు కోరుతున్నారు. **- పెదబయలు, న్యూస్‌టుడే**

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

అవగాహన ర్యాలీలో ఫౌండేషన్ ప్రతినిధులు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని రాజమహేంద్రవరానికి చెందిన 'మన బాధ్యత ఫౌండేషన్' జోనల్ ఇన్‌ఛార్జి, అసిస్టెంట్ ప్రొఫెసర్ కాశీనరేంద్ర పిలుపునిచ్చారు. మారేడుమిల్లిలో ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివారం పర్యటకులతో పాటు, ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. మారేడుమిల్లిలో వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల్లోని పర్యాటక ప్రదేశాలకు వెళ్లి వ్యర్థాలను డస్ట్‌బిన్‌లోనే వేయాలని, ఎక్కడ పడితే అక్కడ పారేయడం వల్ల భూమి నిస్సారం అవుతుందన్నారు. పర్యాటకులు బాధ్యతాయుతంగా మెలగాలని, స్థానికులతో పాటు వ్యాపారులు వారికి సరైన దిశానిర్దేశం చేయాలని కోరారు. మన బాధ్యత ఫౌండేషన్ రాజమహేంద్రవరం నగర అధ్యక్షురాలు శ్రీవిద్యరాణి, ఫౌండేషన్ సభ్యులు సింధు, జ్యోత్స్న, ప్రసాద్, ట్రైబల్ హెల్పింగ్ హేండ్స్ ఫౌండర్ అర్జున్, ఎస్సై శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సింహాచలానికి మన్యం కూరగాయలు

సింహాచలం దేవాలయానికి కూరగాయాలు పంపిస్తున్న భక్తులు

హుకుంపేట, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని సింహాచలంలో వరాహ నృసింహ స్వామి దేవాలయానికి హుకుంపేట నుంచి కూరగాయలు, గుమ్మడి కాయలు, నాగడి దుంపలు ఆదివారం పంపించారు. కోరిబిల్లి కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. దేవాలయంలో అన్నదాన కార్యక్రమాలకు వీటిని వినియోగిస్తారని ఆమె తెలిపారు. భక్తుల సహకారంతో వీటిని సమకూర్చామని తెలిపారు. రామరాజు, లక్ష్మి, గంగరాజు, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

దేవీపట్నం, న్యూస్‌టుడే: రైతులకు అందుబాటులో యూరియా ఉందని మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. శరభవరం, ఇందుకూరుపేట రైతు సేవాకేంద్రాల్లో 40.50 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకూరు రైతు సేవా కేంద్రానికి సోమవారం 20 టన్నుల యూరియా రానుందని తెలిపారు. ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మొక్కజొన్న, వరి పంటలకు ఎరువుల కొరత లేదన్నారు.

దారి.. ప్రమాదకరంగా మారి!

తమరాడ, అడుగులపుట్టు మధ్య రోడ్డుపై గుంతలు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టు నుంచి పెదబయలు, పాడేరు వెళ్లే ప్రధాన రహదారిలో అడుగులపుట్టు, తమరాడ మధ్య గుంతలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. కుజబంగి నుంచి రోడ్డును విస్తరించి కల్వర్టుల నిర్మాణం విస్మరించారు. కుజబంగి నుంచి సంపంగిపుట్టు వరకు రోడ్డు విస్తరించి మూడేళ్లు గడుస్తున్నా కల్వర్టుల నిర్మాణం చేపట్టలేదు. కుజబంగి, సంపంగిపుట్టు, తమరాడ గ్రామాలకు సమీపంలోని ఆరు ప్రదేశాల్లో రోడ్డు ఎత్తుగా ఉండటంతో వర్షపు నీరు చేరి.. గుంతలు పడి వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల తమరాడ, సంపంగిపుట్టు మధ్య ద్విచక్రవాహనం బోల్తాపడి యువకుడు మృతి చెందాడు. గతంలో కుజబంగి వద్ద జీపు అదుపుతప్పి బోల్తాపడింది. కొత్తాపుట్టు సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి ఇద్దరు మృతి చెందారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అధ్వాన రోడ్లో అవస్థలు

రాళ్లు తేలిన రహదారి

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొమ్మిక నుంచి కృష్ణదేవిపేట, చింతలపూడి నుంచి కంఠారం, బాలారం నుంచి చోద్యం వెళ్లే రహదారులు పలు చోట్ల రాళ్లుతేలిపోయి ఛిద్రమయ్యాయి. మరికొన్ని చోట్ల కోతకు గురయ్యాయి. వాహన చోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. వాహనాలు అదుపు తప్పి గాయాలపాలవుతున్నారు. బాలారం నుంచి చోద్యం వెళ్లే దారిలో పెద్దపెద్ద గుంతలేర్పడటంతో కార్లు అడుగు భాగం భూమికి తగిలి మరమ్మతులకు గురవుతున్నాయి. వాహనాలను తరచూ బాగు చేయించుకోవాల్సి వస్తోందని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైకాపా హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన రహదారులపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఈప్రాంతంలోని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

నేడు ఉద్యోగుల సంఘ ఎన్నికలు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల జి.మాడుగుల సంఘ ఎన్నికలు ఈనెల 29న స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి గంగాధర్ తెలిపారు. మండలంలోని మండల పరిషత్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి పారుదల, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న మినిస్టీరియల్ సిబ్బంది హాజరుకావాలన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

వంతెన రక్షణ గోడను ఢీకొన్న టిప్పర్

కొయ్యూరు, న్యూస్‌టుడే: పెదమాకవరం పంచాయతీ రామరాజుపాలెం సమీప వంతెన వద్ద ఆదివారం త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. జాతీయ రహదారి నిర్మాణ పనులకు వినియోగిస్తున్న టిప్పర్ అదుపుతప్పి వంతెన రక్షణ గోడను ఢీకొంది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరుగలేదు. వాహనం కొంత ముందుకు వెళ్తే కాలువలో పడి పెద్దప్రమాదమే జరిగేది. ఈ ప్రాంతంలో పెద్ద వాహనాలు అతివేగంగా వెళ్తుండటంతో భయభ్రాంతులకు గురవుతున్నామని స్థానికులు తెలిపారు. అతివేగాన్ని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పర్యాటకం.. కోలాహలం..!

వంజంగి మేఘాల కొండ మార్గంలో నిలిచిన వాహనాలు

పాడేరు, న్యూస్‌టుడే: మన్యంలో పర్యాటక ప్రాంతాలు ఆదివారం కళకళలాడాయి. ఇక్కడి మంచు అందాలు పర్యాటకులను పరవశింపచేశాయి. పాడేరు మండలంలోని వంజంగి మంచు కొండలకు తరలివచ్చారు. ఎకో టూరిజం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్ గేటు ద్వారా సుమారు రూ.1.69 లక్షల ఆదాయం వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. వంజంగి ఘాట్‌రోడ్లో సుమారు మూడు కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పాడేరు మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

మారేడుమిల్లిలో సందడి

మారేడుమిల్లి: మారేడుమిల్లి ప్రాంతానికి కొద్ది రోజులుగా పర్యాటకులు పోటెత్తుతున్నారు. ఆదివారం కూడా పర్యాటక ప్రదేశాలు కిటకిటలాడాయి. ప్రధానంగా గుడిస కొండపై సూర్యోదయాన్ని చూడటానికి సందర్శకులు బారులు తీరారు. మంచుతోపాటు, చలి వణికించేస్తున్నా, సూర్యోదయం సుందర దృశ్యాన్ని కనులారా వీక్షించడానికి పోటీపడ్డారు. జలతరంగిణి, అమృతధార జలపాతాలు పర్యాటకులతో రద్దీగా మారాయి.

గుడిస కొండపై సూర్యోదయ దృశ్యం

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: చాపరాయి జలవిహారి, అంజోడ సిల్క్‌ఫాం పీనరీ సందర్శకులతో కిటకిటలాడాయి. జలవిహారి వద్ద ట్రాఫిక్ స్తంభించింది. ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

బొర్రాగుహలకు రూ.8 లక్షల ఆదాయం

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: తాడిగుడ జలపాతం రహదారి కిక్కిరిసిపోయింది. బొర్రాగుహలు కిటకిటలాడాయి. ఎక్కడ చూసినా జన జాతరను తలపించింది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, బెంగాల్, తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. బొర్రాగుహలను సుమారు 8 వేల మంది సందర్శించగా.. సుమారు రూ.8 లక్షల ఆదాయం వచ్చిందని సిబ్బంది తెలిపారు. ఎక్కడా ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా అనంతగిరి పోలీసులు చర్యలు చేపట్టారు.

తాడిగుడ వద్ద వ్యూపాయింట్‌పై పర్యాటకులు

కొత్తపల్లిలో కిటకిట

జి.మాడుగుల, న్యూస్‌టుడే: కొత్తపల్లి జలపాతంలో పర్యాటకులు సందడి చేశారు. ఇక్కడి అందాలు ఆస్వాదించి.. ఫొటోలు దిగుతూ ఆనందంగా గడిపారు.

ఎండిన చెట్టుతో చేటు

పీఎంఆర్‌సీ నుంచి వైటీసీ రహదారిలో ఎండిన చెట్టు

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్థానిక పీఎంఆర్‌సీ నుంచి యూత్ ట్రైనింగ్ సెంటర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ఎండిన చెట్టుతో ప్రమాదం పొంచి ఉంది. ఏడాదికి పైగా చెట్టు ఎండిపోయి ఉంది. ఈ రహదారిలో నిత్యం వేల సంఖ్యలో వాహన చోదకులు ప్రయాణం సాగిస్తుంటారు. అయితే ఈ చెట్టు ఎప్పుడు కూలుతోందనని వాహనదారులతో పాటు స్థానికులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు ముందుగానే చెట్టును తొలగించి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వెదురు పొదలతో వెతలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి ప్రాంతంలో దట్టమైన అటవీ ప్రాంతాలు విస్తరించి ఉండటంతోపాటు, రహదారులు వంపులు తిరుగుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. దీనికి తోడు ప్రధాన రహదారుల్లో వెదురు పొదలు మరింత ప్రమాదకరంగా మారాయి. మారేడుమిల్లి నుంచి రంపచోడవరం, చింతూరు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిలో వెదురు పొదలు పక్కనే ఉన్నాయి. వీటిలో ప్రధానంగా మారేడుమిల్లి శివార్లలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం సమీపంలోనూ, మారేడుమిల్లి నుంచి చింతూరు వెళ్లే ప్రధాన రహదారిలోని వాలమూరు సమీపంలోనూ వెదురు పొదలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. వీటి సమీపంలోనే మలుపులు ఉండటంతో వేగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పి ఆయా వెదురు పొదల్లోకి దూసుకుపోయి ప్రమాదాలకు గురవుతున్నాయి. అంతేకాకుండా వీటిని దాటే సమయంలో ఎదురు వచ్చే వాహనాలు తప్పుకోవడానికి ఖాళీ లేకపోవడంతో వాహనాలు ఎదురెదురుగా ఢీకొంటున్న సంఘటనలు జరుగుతున్నాయి. సంబంధిత ప్రభుత్వ శాఖలు స్పందించి, చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

హక్కులపై అవగాహన అవసరం

మహిళలతో మాట్లాడుతున్న ఉషారాణి

సీలేరు(గూడెం కొత్తవీధి), న్యూస్‌టుడే: మహిళలకు చట్టాలు, హక్కులపై అవగాహన అవసరమని ఆంధ్రా యూనివర్సిటీ దుర్గాబాయి దేశ్‌ముఖ్ రీసెర్చి సెంటర్ సహాయకులు చల్లంగి ఉషారాణి అన్నారు. గూడెంకొత్తవీధి మండలం మాలిగుడ గ్రామంలో ఆదివారం గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహిళల చట్టాలు, హక్కులను వివరించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: గుంటగన్నెల పంచాయతీ లక్క గ్రామానికి చెందిన కిల్లో భగవాన్ భార్య ఇటీవల మృతి చెందింది. కష్టాల్లో ఉన్న ఆ కుటుంబానికి ఎస్టీసెల్ నాయకుడు కొములునాయుడు 50 కేజీల బియ్యం, నిత్యావసర సరకులు, నగదు అందజేశారు. విశ్వనాథం, కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు అర్జున్, పెసా కమిటీ సభ్యులు గాసి, గోపి తదితరులు పాల్గొన్నారు.

జూదస్థావరాలపై పోలీసుల దాడులు

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి సమీపంలోని బైలుకించంగి పరిసర ప్రాంతాల్లో కోడి పందేలు, జూద స్థావరాలపై పోలీసులు ఆదివారం సాయంత్రం మెరుపుదాడి చేశారు. తొమ్మిది ద్విచక్రవాహనాలు, ఐదు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సైలు వెంకటరమణ, వీరబాబు తెలిపారు. సంక్రాంతి సమీపిస్తున్న తరుణంలో కొందరు గుట్టుచప్పుడు కాకుండా చింతపల్లి పరిసరాల్లో జూద స్థావరాలను నిర్వహిస్తున్నట్టు చింతపల్లి ఏఎస్పీ నవజ్యోత్ మిశ్రాకు సమాచారం అందిందన్నారు. ఏఎస్పీ ఆదేశాలమేరకు దాడులు చేశామన్నారు. పోలీసులను చూసి అక్కడి నుంచి చాలామంది పారిపోయినట్లు తెలిపారు. వారిలో ఐదుగురిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సైలు పేర్కొన్నారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు.

స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

పోలీసుల చొరవతో రహదారి బాగు

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయ సమీపంలోని బురదగెడ్డ వంతెన వద్ద కుంగిపోయిన రహదారికి పోలీసులు మరమ్మతులు చేయించారు. ఇక్కడ రహదారి బాగా కోతకు గురవ్వటంతో రూ. 20 లక్షల వ్యయంతో ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేయించారు. గుత్తేదారు సక్రమంగా పనులు చేయకపోవటంతో రహదారి కిందకు కుంగింది. ఈ మార్గంలో వాహనాలు ఒక వైపు నుంచి మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి. ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. అరకులోయ ఎస్సై గోపాలరావు స్పందించి జేసీబీతో కుంగిన చోట సరిచేయిస్తున్నారు.

బురదగెడ్డ వంతెన వద్ద పనులు చేయిస్తున్న పోలీసులు

డొంకరాయి వారపు సంతలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై చరణ్ నాయక్

మత్తు పదార్థాలతో కుటుంబాలు ఛిన్నాభిన్నం

మోతుగూడెం, న్యూస్‌టుడే: గంజాయి, నాటుసారా వంటి మత్తు పదార్థాల వినియోగిస్తే ఎన్నో అనర్థాలున్నాయని, కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని డొంకరాయి ఎస్సై బనవతుల చరణ్ నాయక్ పేర్కొన్నారు. 'పరివర్తన' కార్యక్రమంలో భాగంగా ఆదివారం డొంకరాయి వారపు సంతలో గిరిజనులతో ఎస్సై సమావేశమయ్యారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. గంజాయి సాగు, రవాణా, విక్రయం, నాటుసారా తయారీని వదిలేసి ఉపాధి మార్గాలపై దృష్టి సారించాలన్నారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను క్షుణ్ణంగా వివరించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి, లంబసింగి 516-ఈ జాతీయ రహదారిలో రాజుపాకలు వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. కొయ్యూరు మండలం మూలపేట పంచాయతీ జాజులబంద గ్రామానికి చెందిన భార్యాభర్తలు కొర్రా రాజుబాబు, రాణి.. ద్విచక్రవాహనంపై వస్తుండగా గుర్తుతెలియని వాహనం వీరిని బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో వీరిద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్సులో చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం వీరిని నర్సీపట్నం ఆసుపత్రికి తరలించారు.

గాయపడిన దంపతులు

బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని వినతి

రంపచోడవరం, న్యూస్‌టుడే: గురుకులాల్లో ఏళ్లతరబడి పనిచేస్తున్న బోధనేతర ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల బోధనేతర సిబ్బంది సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదే రామచంద్రరావు డిమాండ్ చేశారు. గురుకులాల్లో ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆదివారం రంపచోడవరంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ 15 ఏళ్ల నుంచి 25ఏళ్లగా ఉద్యోగాలు చేస్తున్న బోధనేతర సిబ్బందిని రెగ్యులర్ చేయడంతో పాటు మినిమం టైమ్‌స్కేల్ వేతనాలను అందించాలన్నారు. ఛైర్మన్‌ను కలిసినవారిలో సంఘం ప్రతినిధులు వెంకటేశ్వర్లు, ఆత్మ, చందు, సుధాకర్, పొట్టిదొర తదితరులు ఉన్నారు.

బొజ్జిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సిబ్బంది

కేజీహెచ్‌లో విద్యుత్తు ఇబ్బందులకు చెక్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: కేజీహెచ్‌లో తరచూ తలెత్తుతున్న విద్యుత్తు సమస్యలను పరిష్కరించి రోగులకు సాంత్వన చేకూర్చేందుకు అదనంగా మరొక 323 కేవీ సామర్థ్యంతో కూడిన మొబైల్ జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. రెండు నెలల క్రితం తీవ్రమైన విద్యుత్తు అంతరాయం ఏర్పడి ఏకంగా 8 గంటల సేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. ఇక మీదట అటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయంగా జనరేటర్ సేవలను విస్తరించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదేశాల మేరకు తక్షణ చర్యలు చేపట్టామని ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ ఐ.వాణి, అడ్మిన్ బి.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో పది జనరేటర్లు ఉన్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు	అరకులోయ: 63034 86346
89853 66570	రంపచోడవరం: 94908 77172

కొయ్యూరు, న్యూస్‌టుడే: బాలారంలోని ఓ విద్యుత్తు స్తంభం ఓవైపునకు ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. విద్యుత్తు తీగలు తెగిపోయేలా ఉన్నాయి. **- స్థానికులు, బాలారం,** ✓: విద్యుత్తు స్తంభం, తీగలు సరిచేయిస్తాం. **- నాగేశ్వరరావు, విద్యుత్తుశాఖ ఏఈ**

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి జాతీయ రహదారిపై పశువులు సంచరిస్తున్నాయి. రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. **- శ్రీను, చింతపల్లి,** ✓: ఇప్పటికే పశువుల యజమానులకు నోటీసులు అందజేశాం. మరోసారి నోటీసులు అందజేస్తాం. **- వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి, చింతపల్లి**

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: బూసిపుట్టు పంచాయతీలోని డెంగాగుడలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం పైకప్పు పోయి చలి తీవ్రతకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త భవనాలు నిర్మించాలి. **- కృష్ణ, డెంగాగుడ** ✓: పాఠశాలకు భవనాలు మంజూరు చేయాలని ప్రతిపాదించాం. నిధులు మంజూరైతే పనులు చేపడతాం. **- కృష్ణమూర్తి, ఎంఈఓ, ముంచంగిపుట్టు**

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి మండలం చట్లవాడ పంచాయతీ పరిధిలోని బోదులూరులో చేతిపంపు మరమ్మతుకు గురైంది. బాగుచేసి వినియోగంలోకి తీసుకుని రావాలి. **- ఆకీము రాజు, బోదులూరు,** ✓: బోదులూరులో చేతిపంపునకు అవసరమైన మరమ్మతు చేపడతాం. **- నారాయణరావు, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్**

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్థానిక అటవీ తనిఖీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలికి వెళ్లే ప్రధాన రహదారిలో పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. మరమ్మతు చేపట్టి ఇబ్బందులను తొలగించాలి. **- సూరిబాబు, రంపచోడవరం,** ✓: ఇప్పటికే ప్రధాన రహదారిలో పడిన గుంతలకు మరమ్మతు చేయించాం. మిగిలిన గుంతలను కూడా బాగుచేయిస్తాం. **- ప్రదీప్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, రంపచోడవరం.**

సనాతన ధర్మ పరిరక్షణకు కృషి

రాజేంద్రపాలెంలో మాట్లాడుతున్న వారాహీ మాతా ఉపాసకులు అరుణానంద స్వామి

కొయ్యూరు, న్యూస్‌టుడే: రాజేంద్రపాలెంలోని అల్లూరి సీతారామరాజు కళామందిర ఆవరణలో హిందూ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. సింగవరం నుంచి రాజేంద్రపాలెం వరకు ర్యాలీ చేశారు. యువతుల కోలాట నృత్యం ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా హాజరైన వారాహీ మాతా ఉపాసకులు, భద్రాద్రి కొత్తగూడెం శ్రీవిద్య పీఠాధిపతి అరుణానంద స్వామి మాట్లాడుతూ.. సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థ ప్రాధాన్యం తెలియజేశారు. వ్యసనాలకు దూరం ఉండాలన్నారు. హిందూ మత గొప్పదనాన్ని వివరించారు. ఆర్‌ఎస్‌ఎస్ విశాఖ ప్రచార ప్రముఖ్ ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్సై కిశోర్‌వర్మ, మండల ఉపాధ్యక్షురాలు నూకాలమ్మ, సర్పంచి సింహాచలం, దానధర్మ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి డీవీడీ ప్రసాద్, వీహెచ్‌పీ, ఎస్ఎస్ఎఫ్‌ల నేతలు మల్లిబాబు, వీర్రాజు, పి. దేముడు, పెదసోమరాజు, బి.కృష్ణ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు సమ్మేళనంలో భక్తులు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: హిందూ ధర్మం, సంస్కృతిని కాపాడుకునేందుకు అందరూ సమైక్యంగా కృషి చేయాలని ఆర్‌ఎస్ఎస్ విశాఖ విభాగ్ ప్రచారక్ వెంకటరమణ అన్నారు. ముంచంగిపుట్టులోని హోలీ మైదానంలో ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఆర్‌ఎస్ఎస్ వందేళ్ల ప్రయాణంలో విజయగాథలను వివరించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మండల విభాగ ప్రచారక్‌లు తమర్భ జయరామ్, జగన్నాథం, బల్లోక్‌దొర, బుద్ధ, అత్తిరామ్, రఘునాథ్ పాల్గొన్నారు.

సనాతన ధర్మం గొప్పతనాన్ని అఖండ-2లో చూపించాం

కేకు కోస్తున్న చిత్ర దర్శకుడు బోయపాటి శ్రీను

తుళ్లూరు, న్యూస్‌టుడే : భారతదేశ గొప్పతనం, సనాతన ధర్మం శక్తిని చాటి చెప్పేందుకు అఖండ- 2 చిత్రాన్ని రూపొందించామని చిత్ర దర్శకుడు బోయపాటి శ్రీను తెలిపారు. ఆదివారం ఆయన తుళ్లూరులో మండల యువసేన అధ్యక్షుడు నెలకుదిటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖండ-2 విజయోత్సవంలో పాల్గొన్నారు. తుళ్లూరు అయ్యప్ప స్వామి ఆలయం నుంచి ట్రాక్టర్లు, కార్లు, ద్విచక్ర వాహనాలతో ర్యాలీ చేశారు. అనంతరం తులసి థియేటర్‌లోకి వెళ్లి కేకు కోసి బాలకృష్ణ అభిమానులతో కలిసి అఖండ-2 చిత్రాన్ని వీక్షించారు. ☛ బోయపాటి శ్రీను మాట్లాడుతూ రాజధాని రైతులు ఐదేళ్ల పాటు వైకాపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి అమరావతిని సాధించుకోవటం గొప్ప విషయం అన్నారు. అఖండ-2 చిత్రంలో సనాతన ధర్మం గొప్పతనాన్ని చూపించామని, రాజధాని రైతులు చేసింది కూడా అదేనని తెలిపారు. ధర్మాన్ని గెలిపించే సమయంలో మీకు ఇబ్బందులు ఎదురయ్యాయి.. ధర్మం గెలవాలి అంటే ఇబ్బందులు తప్పవు అని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సంప్రదించి తప్పకుండా అమరావతిలో సినీ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఫొటోగ్రఫీ, ఏసీ సర్వీసింగ్‌లో ఉచిత శిక్షణ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ టి.సందీప్‌బాబు ఆదివారం తెలిపారు. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ కోర్సు జనవరి 16, కంప్యూటర్ ట్యాలీ కోర్సు జనవరి 19, రిఫ్రిజరేటర్, ఏసీ సర్వీసింగ్ కోర్సు జనవరి 29 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 19 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసున్న గ్రామీణ ప్రాంత పురుషులు, మహిళలు అర్హులని వెల్లడించారు. ఉచిత భోజనం, వసతి సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. వివరాలను గుంటూరు కొత్తపేట ఓల్డ్ బ్యాంక్ స్ట్రీట్‌లో 14-1-14 డోర్ నంబరులోని సంస్థలో నమోదు చేసుకోవాలని కోరారు. రేషన్ కార్డు, ఆధార్, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, పదో తరగతి ఉత్తీర్ణత పత్రం దరఖాస్తుకు జతచేయాలన్నారు. వివరాలకు 0863-2336912, 97034 05066 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

భూసమస్యలా...
రెవెన్యూ క్లినిక్ ఉందిగా

నేడు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి

పెదకాకాని మండలం తక్కెళ్లపాడులో 2008 నుంచి ఇల్లు ఉన్న స్థలాన్ని పొలంగా చూపుతూ రెవెన్యూ అధికారులు 1బి అడంగల్, పాసు పుస్తకాలను జారీ చేశారు. ఆ ఇంటికి పన్నులు చెల్లిస్తున్న విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోలేదు. రికార్డులు తారుమారు చేయడంపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల బాధితులు పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం అందజేశారు.

తాడికొండ మండలం పొన్నెకల్లుకు చెందిన వారికి లచ్చన్నగుడిపూడిలో పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమి ఉంది. దానిని ఇనాం ఫ్రీ హోల్డ్ కింద ఎలా నమోదు చేశారో అర్థం కావడం లేదని, తొలగించాలని కోరుతూ అధికారుల చుట్టూ ఏడాదిగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఇటీవల బాధితులు ఏకంగా బ్యానర్ ఏర్పాటు చేశారు. పీజీఆర్ఎస్‌లో వినతి ఇచ్చారు.

ఇలా రెవెన్యూకు సంబంధించిన ఎన్నో సమస్యలతో బాధితులు మానసిక వేదనకు గురవుతున్నారు. కొంతమందైతే ఏళ్ల తరబడి పీజీఆర్ఎస్‌లో వినతులిస్తూనే ఉన్నారు. ఫలితం ఉండడం లేదు. ఇలాంటివి వచ్చినప్పుడు గతంలో అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లకు విషయం వివరించి పరిష్కరించమని చెప్పేవారు. ఆశించిన ఫలితాలు రావడం లేదు. బాధితులు పదేపదే కలెక్టరేట్ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. ఇకపై ఇలాంటి ఇబ్బందుల్లేకుండా రెవెన్యూ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించేందుకు కూటమి ప్రభుత్వం రెవెన్యూ క్లినిక్‌లకు శ్రీకారం చుట్టింది.

న్యూస్‌టుడే - కలెక్టరేట్

ఎక్కడంటే... ☛ కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలు వద్ద ప్రతీ సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో రెవెన్యూ క్లినిక్‌లు నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ☛ మండలాల వారీగా ఒక్కో కౌంటర్ ఏర్పాటు చేస్తున్నారు. ☛ ఆయా మండలాల దస్త్రాలతో తహసీల్దార్లు పాల్గొంటారు. ☛ రెవెన్యూ డివిజన్ అధికారి ప్రత్యేక కౌంటర్‌లో సమస్యలు తెలుసుకుంటారు.

‘వివిధ రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు రెవెన్యూ క్లినిక్‌లు నిర్వహిస్తున్నాం. తహసీల్దార్లు, గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి, తెనాలి సబ్‌కలెక్టర్ గ్రామస్థాయి రెవెన్యూ రికార్డులతో హాజరవుతారు. ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి.. వాటి స్వరూపాన్నిబట్టి అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. అలా వీలుకాని వాటికి వారం రోజుల్లో పరిష్కరించేందుకు అవసరమైన కార్యాచరణను డివిజినల్, మండల రెవెన్యూ అధికారులు సమర్పిస్తారు. రెవెన్యూ, అడంగల్ సవరణలు, 22ఎ, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, అసైన్డ్ భూములు, ఆక్రమణలు, రెవెన్యూ కోర్టు కేసులు, సర్వే, రీసర్వే, దేవాదాయ, వక్ఫ్ భూముల సమస్యలపై అర్జీలు ప్రత్యేక కౌంటర్ల ద్వారా స్వీకరిస్తాం.’

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ధాన్యం రైతుకు సర్కారే దన్ను

తొలివిడతలో పూర్తికావొచ్చిన సేకరణ లక్ష్యం | బహిరంగ మార్కెట్లో పడిపోయిన ధర

రోడ్డు పక్కన ఆరబెట్టిన ధాన్యం

ఈనాడు–అమరావతి

జిల్లాలో తొలి విడత ధాన్యం సేకరణ లక్ష్యం 50 వేల టన్నులు... శనివారం నాటికి పౌరసరఫరాల సంస్థ 49,479 టన్నులు సేకరించి లక్ష్యానికి చేరువైంది. మన రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల్లోనూ వరిని అధికంగా పండించడంతో మార్కెట్లోకి ధాన్యం భారీగా వస్తోంది. దీంతో ధర నేల చూపు చూస్తోంది. ఈ నేపథ్యంలో రైతులకు అండగా నిలబడిన పౌరసరఫరాల సంస్థ మద్దతు ధరకు కొనుగోలు చేస్తోంది. మిల్లర్ల బ్యాంకు గ్యారంటీలు తీసుకోవడంలో జాప్యం చేయడంతో పొరుగు జిల్లాలకు ధాన్యం పంపి కొనుగోళ్లను వేగవంతం చేసింది.

కొనుగోలు చేసిన ధాన్యం: 49,479 టన్నులు
విలువ : రూ.118.18 కోట్లు
ధాన్యం విక్రయించిన రైతులు: 5,799 మంది
రైతుల ఖాతాలకు జమైన మొత్తం : రూ.85.95 కోట్లు

తేడా ఇలా.. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో 75 కిలోల ధాన్యం ధర రూ. 1,500. ☛ ప్రభుత్వం సాధారణ రకానికి రూ. 1,777, గ్రేడ్-ఎ రకానికి రూ. 1,792 ఇస్తోంది.

కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలు ఇవీ.. ఈ-పంటల నమోదు తప్పనిసరి. ● తేమ 17 శాతం మించి ఉండకూడదు. ● యంత్రాలతో కోసిన ధాన్యంలో తేమ 25 శాతం వరకు ఉంటోంది. 17 శాతానికి తగ్గడానికి నాలుగైదు రోజులపాటు ఆరబెట్టాల్సి వస్తోంది. వాతావరణం మబ్బులు కమ్మి ఉండడం, మంచు కారణంగా తేమ తగ్గడం ఆలస్యమవుతోంది.

డిసెంబరు 27 వరకు ధాన్యం కొనుగోళ్లు ఇలా..

విభాగం	టన్నుల్లో
గ్రేడ్-ఏ రకం	48,328
సాధారణ రకం	1,151
మొత్తం	49,479
ఇతర జిల్లాలకు తరలించింది	
జిల్లా	టన్నుల్లో
కాకినాడ	17,424
తూర్పుగోదావరి	545
మొత్తం	17,969

ఇబ్బందులూ ఉన్నాయి.. కొనుగోలు కేంద్రాల్లో హమాలీ ఖర్చులు రైతులే భరించాలి. గోతాలను సమకూర్చుకోవాలి. కొన్నిసార్లు గ్రామాల్లో ఇవి అందుబాటులో ఉండడం లేదు.
■ రైతులకు సమీపంలో ఉన్న మిల్లులకు బ్యాంకు గ్యారంటీలు లేకపోవడంతో దూరప్రాంతాలకు తరలించాల్సి వస్తోంది. బ్యాంకు గ్యారంటీలు లేవని, కొన్ని రోజులు ఆగాలని సూచిస్తున్న సందర్భాలూ ఉన్నాయి.
■ రైతు సేవా కేంద్రాల్లో పరీక్షించే సమయానికి ధాన్యంలో తేమ శాతం.. రైసుమిల్లు దగ్గర పరీక్షించిన శాతానికి తేడా ఉంటోంది.

ఎవరి దారి వారిదే!

జీజీహెచ్‌లో మొక్కుబడిగా సీసీ కెమెరాల వ్యవస్థ

వైద్యులేమో బయటకు... అపరిచితులు ఆసుపత్రిలోకి

ఈనాడు - అమరావతి

గుంటూరు జీజీహెచ్‌లో నిఘా నేత్రం నిద్దరోతోంది. సీసీ కెమెరాల వ్యవస్థ మొక్కుబడిగా మారుతోంది. ఇప్పటికే ఏర్పాటు చేసిన వాటిలో అనేకం మూలకు చేరుతున్నాయి. ఆసుపత్రిలోకి అపరిచితుల రాకపోకలు ఓ సమస్య కాగా.. వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోతుండడం ఇబ్బందిగా మారింది. జీజీహెచ్‌లో నిత్యం 5 వేలమందికిపైగానే రోగులు చికిత్స పొందుతుంటారు. ఇందులో 3,500 మందికిపైగా అవుట్ పేషెంట్లుగా నమోదవుతున్నారు. ఇంతటి కీలకమైన ఆసుపత్రిలో 280 సీసీ కెమెరాలు అమర్చారు. ఇందులో 40కుపైగా మూలకు చేరాయి. కొన్నిచోట్ల భవనాల నిర్మాణం.. మరికొన్నిచోట్ల మరమ్మతులు.. ఇలా అనేక కారణాలతో ఈ పరిస్థితి ఏర్పడింది. మిగిలినవాటిని సరైన రీతిలో వినియోగించకపోవడంతో అవి ఉండీ లేనట్టుగా పరిస్థితి తయారైంది.

వైద్యులూ... ఇదేం పని? జీజీహెచ్‌లో అనేక కీలక విభాగాల వైద్యులు సమయపాలన పాటించడం లేదు. ప్రభుత్వం ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్)ను ఏర్పాటు చేశాక కూడా పరిస్థితిలో మార్పు రావడం లేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో హాజరు సమయానికి ఠంచనుగా జీజీహెచ్‌లోకి వాలిపోతున్న కొంత మంది.. మిగిలిన సమయాల్లో ప్రైవేటు వైద్యశాలల్లో ప్రాక్టీసులకు, సొంత ఆసుపత్రులు, క్లినిక్‌లకు వెళ్లిపోతున్నారు. వైద్యుల విభాగాల వద్ద సీసీ కెమెరాలున్నా అవి నామమాత్రంగా తయారయ్యాయి. వైద్యులపై పర్యవేక్షణ.. అటు గుంటూరు ప్రభుత్వ వైద్యకళాశాల.. ఇటు జీజీహెచ్.. ఇలా రెండింటికీ సంబంధించిన అంశం కావడంతో ఎవరికీ పట్టని పరిస్థితి. కొంతమంది సిబ్బంది తీరూ ఇదే రీతిగా ఉంది.

అపరిచితులొస్తే.. అపరిచిత వ్యక్తులు జీజీహెచ్ వార్డుల్లో కలియదిరుగుతున్నారు. నకిలీ వైద్యులు పట్టుబడిన ఉదంతాలూ గతంలో బయటపడ్డాయి. ప్రసూతి, పీడియాట్రిక్ వార్డుల్లో 2023, 2024 సంవత్సరాల్లో పసి పిల్లలను ఎత్తుకెళ్లిన ఘటనలు నమోదయ్యాయి. అప్పట్లో చిన్నారులను సురక్షితంగా తల్లుల వద్దకు చేర్చడంలో సీసీ కెమెరాలే అక్కరకొచ్చాయి.

ఇలా చేస్తే... ఫేస్ రికగ్నేషన్ కెమెరాలను ప్రధాన ద్వారాలు, ప్రాంగణంలో విరివిగా ఏర్పాటు చేయాలి. వైద్యులు సమయపాలన పాటించేలా ఉన్నతాధికారులు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ☛ బయట వ్యక్తుల రాకపోకలపై నిఘా పెంచాలి.

అమరావతి వేదిక.. అమ్మభాష వేడుక

● మనసుల్లో నిలిచేలా ప్రపంచ తెలుగు మహాసభలు ● ‘ఈనాడు’తో గజల్ శ్రీనివాస్

ఈనాడు - అమరావతి

అమరావతి వేదికగా అమ్మభాష వేడుకకు అంతా సిద్ధమవుతోంది. గుంటూరులో మూడో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహిస్తుండడం గర్వంగా ఉంది. అంబరాన్ని తాకేలా సంబరం నిర్వహించబోతున్నాం. మారిషస్ అధ్యక్షుడు ధరమ్‌గోకుల్ సహా పలువురు ప్రముఖులు ఈ సభల్లో భాగస్వాములు కానున్నారని ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ చెప్పారు. మహాసభల నిర్వహణకు కేవలం వారం రోజులే గడువు ఉండటంతో యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ‘ఈనాడు’తో ప్రత్యేకంగా ముచ్చటించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ముస్తాబవుతున్న ప్రాంగణం

తెలుగు పరిరక్షణకు కృషి చేస్తున్న వారందరినీ స్మరించుకుంటూ ఈ తెలుగు మహాసభలను విజయవంతం చేయడానికి సమష్టిగా అడుగులేస్తున్నాం. గుంటూరు శివారులోని శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక నగరం ఇందుకు వేదికవుతోంది. 20 ఎకరాల విస్తీర్ణంలో 5 వేదికలను రూపొందిస్తున్నాం. 50 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్నారు. మారిషస్‌లో 40 శాతం తెలుగు వారు నివసిస్తున్నందున ఆ దేశ అధ్యక్షుడిని ఆహ్వానించాం.

ఏడాదిగా ఎన్నో కార్యక్రమాలు : గత ఏడాదిగా అన్ని జిల్లాల్లోనూ తెలుగు సాహిత్యంలో లఘు చిత్రాలు, వ్యంగ్య చిత్రాలు, పద్యగాన పోటీలు నిర్వహించాం. పిల్లల్లో భాషపై మక్కువ పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. మహాసభల్లో 23 సదస్సులు నిర్వహిస్తాం. 5న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ‘నా తెలుగు భాష.. అమృత భాష’ అంశంపై మాట్లాడతారు. అదే రోజు సాయంత్రం సీఎం చంద్రబాబు, సుప్రీంకోర్టు పూర్వ సీజేఐ ఎన్వీ రమణ హాజరవుతారు.

మరచిపోలేని జ్ఞాపకాలు : మహాసభల్లో అడుగడుగునా తెలుగుదనం ఉట్టిపడేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రధాన ద్వారాలకు కవుల పేర్లు పెడుతున్నాం. ప్రదర్శనశాలల్లో మన తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నాం. భోజనశాలల్లోనూ మన ఇంటి రుచులు పరిచయం చేయాలన్నది ఉద్దేశం.

రంగు పడిందో.. దొరికేసినట్టే

రాయితీ బియ్యం అక్రమాలకు చెక్

న్యూస్‌టుడే - కలెక్టరేట్

ఎఫ్ఆర్‌కే ఐరన్ స్పాట్ టెస్ట్ కిట్

కిట్‌తో పరీక్షించాక ఎరుపు రంగులోకి మారితే రేషన్ బియ్యంగా తేలుస్తారు

పేద ప్రజలకు రాయితీపై ఇస్తున్న బియ్యాన్ని అక్రమార్కులు దారి మళ్లిస్తున్నారు. టన్నుల్లో జిల్లా దాటించేస్తున్నారు. మరికొందరు జిల్లాలోని మిల్లులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కడైనా పట్టుబడ్డా.. అది రేషన్ బియ్యమా.. లేదా మిల్లుకు చెందిందా? అన్నది స్టాకు రిజిస్టరును బట్టి తేల్చి చెప్పేవారు. ఒక్కోసారి అలా గుర్తించడం కూడా కష్టమవుతోంది. ఇకపై అలాంటి ఇబ్బంది లేకుండా బియ్యం గుట్టు పట్టేయొచ్చు. ఇందుకోసం కూటమి ప్రభుత్వం ఎఫ్ఆర్‌కే ఐరన్ స్పాట్ కిట్లను పంపించింది. వీటితో పరీక్షిస్తే.. రేషన్ బియ్యమా? కాదా? అన్నది ఇట్టే పసిగట్టేయొచ్చు.

ఎఫ్ఆర్‌కే అంటే..
☛ ఫోర్టిఫైడ్ రైస్‌లో ఇనుము ఉందో లేదో త్వరగా తెలుసుకోవడానికి ఉపయోగించే పరికరం.
☛ ఈ కిట్‌లోని రసాయనాలు బియ్యంపై వేసినప్పుడు అవి ఐరన్ అయాన్లతో చర్య జరిపి రంగు మారుస్తాయి.
☛ ఐరన్ ఉంటే ఆ బియ్యం గింజలు ఎరుపు రంగులోకి మారతాయి.

ఇలా గుర్తిస్తారు..
☛ పట్టుబడిన బియ్యం నమూనా తీసుకుంటారు.
☛ తొలుత హెచ్‌సీఎల్ (హైడ్రో క్లోరిక్ యాసిడ్) ద్రావణాన్ని బియ్యం పూర్తిగా తడిచే వరకు పోస్తారు.
☛ వెంటనే కేఎస్‌సీఎన్ (పొటాషియం థియోసైనేట్) ద్రావణాన్ని కలుపుతారు. ఐరన్ ఉన్న గింజలు వెంటనే ఎరుపు రంగులోకి మారతాయి.
☛ తద్వారా అవి రేషన్ బియ్యంగా గుర్తిస్తారు. సంబంధిత వ్యక్తులపై 6ఏ కేసు నమోదు చేస్తారు.

రాజధానిలో హైస్పీడ్.. ట్రాఫిక్ ఫ్రీ ట్రంక్ రోడ్లు

వేగంగా రహదారుల నిర్మాణం

రాజధాని రహదారి నిర్మాణ పనుల్లో కార్మికులు

తుళ్లూరు, న్యూస్‌టుడే

ప్రజా రాజధాని అమరావతిలో ప్రధాన రహదారులు (ట్రంక్ రోడ్ల) నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. వచ్చే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ సమస్యలు రాకుండా విశాలంగా, అధునాతన సదుపాయాలతో వీటిని నిర్మిస్తున్నారు. హైస్పీడ్ కనెక్టివిటీతో పాటు ట్రాఫిక్ సమస్యలు రాకుండా 50, 60 మీటర్ల వెడల్పుతో ఆర్టీరియల్ రహదారులు నిర్మిస్తున్నారు. ☛ ఈ-11, ఈ-13, ఈ-15 రహదారులను ఎన్‌హెచ్ 16కు అనుసంధానం చేయనున్నారు. అమరావతికి రవాణా సౌకర్యం కోసం సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మిస్తున్నారు. 9 వరుసలతో (ఈ-3) దీని నిర్మాణం జరుగుతోంది. ☛ ఈ రహదారుల్లో భూగర్భ విధానంలో వరద నీటి నిర్వహణ, తాగు నీరు, డ్రైనేజీలు, విద్యుత్తు, ఇంటర్‌నెట్ వంటి సదుపాయాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎన్-7 రహదారిపై వంతెన నిర్మాణ, అనంతవరం సమీపంలో ఈ-5 రోడ్డు నిర్మాణ పనులు వేగంగా పుంజుకున్నాయి. 2026 ఫిబ్రవరి చివరి నాటికి ఈ-3 రోడ్డును ప్రకాశం బ్యారేజ్ సమీపంలో మంగళగిరి రోడ్డుకు అనుసంధానం చేసే పనులు పూర్తి చేసే లక్ష్యంతో ఏడీసీఎల్ ముందుకుసాగుతోంది. ఇందుకోసం తాడేపల్లి వద్ద స్టీల్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. ఏడాదిలో ప్రధాన రహదారులన్నీ ఒక రూపు సంతరించుకుంటాయని, ప్రస్తుతం ట్రంక్ రోడ్ల నిర్మాణాల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయని ఏడీసీఎల్ (అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) సీఈ నరసింహమూర్తి తెలిపారు.

విద్యుత్తు తీగలు అమర్చేందుకు రహదారి పక్కన పైపుల పనులు

ఈ వంతెనకు వందేళ్లు

వంతెన గోడపై సంవత్సర చిహ్నం

స్థానిక రైలుపేటకు వెళ్లే దారిలో కొమ్మమూరు కాల్వపై వంతెన నిర్మించి వందేళ్లు అయింది. గతంలో మార్కెట్ యార్డుకు వెళ్లే దారిలో ఈ ఒక్క వంతెన ఉండేది. కొన్నేళ్ల క్రితం దీని పక్కనే మరో వంతెన నిర్మించారు. అయినా పాత వంతెన నేటికీ వినియోగంలో ఉంది. ఇప్పటికీ పటిష్ఠంగా ఉండటం విశేషం. 1925లో బ్రిటీష్ పాలనలో ఈ నిర్మాణం చేశారు. - న్యూస్‌టుడే, దుగ్గిరాల

అంతటా ఆనందం.. అంతలోనే విషాదం

కుమార్తె వివాహం రోజే తండ్రి మృతి

మస్తాన్‌వలీ (పాతచిత్రం)

పొన్నూరు, న్యూస్‌టుడే: ప్రమాదంలో గాయపడి మంచానికి పరిమితమయ్యారు ఆ తండ్రి. అల్లారు ముద్దుగా పెంచిన కుమార్తెను నూరేళ్లు సుఖంగా ఉండాలని దీవించారు. ఆదివారం ఆమె వివాహాన్ని వైభవంగా జరిపించారు. కుటుంబ సభ్యులంతా పెళ్లి సందడిలో ఆనందంగా ఉన్న వేళ.. ఉన్నట్లుండి ప్రాణం విడిచారు. ఈ విషాదకర ఘటన పొన్నూరులో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. షేక్ మస్తాన్‌వలీ (60), అమీరున్నిషాకు ఇద్దరు కుమార్తెలు. 2015లో రోడ్డుప్రమాదంలో ఆయన గాయపడి మంచానికి పరిమితమయ్యారు. చిన్న కుమార్తె బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం చేస్తోంది. అల్లారు ముద్దుగా పెంచిన ఆమెను సంతోషంగా ఆశీర్వదించి కల్యాణ మండపానికి పంపించారు. నూతన దంపతుల వివాహం కనులపండువగా జరిగింది. వివాహం ముగిసిన కొద్దిసేపటికే మస్తాన్‌వలీ మృతి చెందారన్న వార్త కుటుంబ సభ్యులను కుంగదీసింది. వారు కన్నీరు మున్నీరుగా విలపించడంతో వివాహానికి వచ్చిన వారు కంటతడి పెట్టారు. మస్తాన్‌వలీ మృతి పట్ల ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, నాయకులు సంతాపం తెలిపారు.

కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం పొందడం ఇలా...

మీకోసం

కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం ఎలా పొందాలో తెలియక చాలామంది ఇబ్బంది పడుతున్నారు. దళారులను ఆశ్రయించి వేలాది రూపాయలు పోగొట్టుకుంటున్నారు. కుటుంబంలో ఎవరైనా మరణించినప్పుడు వారి పేరు మీద ఆస్తులు ఉన్నా.. ఎల్ఐసీ బాండ్లు కలిగి ఉన్నా.. విధిగా కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం అవసరం. భవిష్యత్తులో ఇతరత్రా ఆస్తుల లావాదేవీలకు కూడా కావాల్సి ఉంటుంది. ఈ పత్రాన్ని ఎలా పొందాలంటే....

☛ తొలుత వ్యక్తి మరణ ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి.
☛ మరణించిన వ్యక్తి భర్త అయితే భార్యతోపాటు పిల్లల ఆధార్ నకళ్లు దరఖాస్తుకు జత చేయాలి.
☛ కుటుంబ సభ్యుల పేర్లు, ఆధార్ నంబర్లు పొందుపరుస్తూ అఫిడవిట్ చేయించాలి.
☛ పూర్తి చేసిన దరఖాస్తును మీ-సేవలోగానీ, సచివాలయంలోగానీ దాఖలు చేయాలి.
☛ అనంతరం సంబంధిత ఏరియా ఆర్ఐ దరఖాస్తుదారుని ఇంటికెళ్లి విచారణ చేస్తారు. దరఖాస్తులో ఉన్న వివరాలన్నీ పరిశీలించి, చుట్టుపక్కల వారితో సాక్షి సంతకాలు తీసుకుని వివరాలను తహసీల్దారుకు సమర్పిస్తారు.
☛ తహసీల్దారు ఆ దరఖాస్తును పరిశీలించి ఎలాంటి అభ్యంతరాల్లేకుంటే ఆమోదిస్తారు.
☛ దరఖాస్తుదారులు తాము దరఖాస్తు చేసిన పది రోజుల్లోగా ఆన్‌లైన్‌లో కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం పొందొచ్చని తూర్పు నియోజకవర్గ తహసీల్దారు మహబూబ్ సుబానీ ‘న్యూస్‌టుడే’కు తెలిపారు. - న్యూస్‌టుడే, పట్నంబజారు

శిలాఫలకం ఆవిష్కరించిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, కలెక్టర్ తమీమ్ అన్సారియా, మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే నసీర్, కమిషనర్ శ్రీనివాసులు

తాగునీటి ఎద్దడి రాకుండా 50 ఏళ్ల ప్రణాళిక

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: రానున్న 50 ఏళ్లలో గుంటూరు నగరంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఈఎల్ఎస్ఆర్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. ఆదివారం బీఆర్ స్టేడియంలో రూ. 4.60 కోట్లతో 1,590 కిలోలీటర్ల సామర్థ్యంతో ఎగ్జిస్టింగ్ ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్ నిర్మాణానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే నసీర్, మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. గతంలో నిర్మించిన ఈఎల్ఎస్ఆర్‌ల రూఫ్ తక్కువ మందంతో ఉండడం, ప్లాస్టింగ్ చేయకపోవడంతో మరమ్మతులకు గురయ్యాయన్నారు. ప్రస్తుతం 15 సెంటీమీటర్ల మందంతో రూఫ్, లోపల ప్లాస్టింగ్ 50 ఏళ్లు చెక్కు చెదరకుండా ఉండేలా నిర్మిస్తున్నామని వివరించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ త్వరలోనే ఆర్టీసీ కాలనీలో కూడా రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని చెప్పారు. ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, ఏపీ హజ్ కమిటీ ఛైర్మన్ షేక్ హసన్‌బాషా, డిప్యూటీ మేయర్ సజీల, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నగరజీవికి మానస సరోవరం

● ఎట్టకేలకు అభివృద్ధికి ప్రణాళిక
● రూ.18.35 కోట్లతో ప్రతిపాదనలు

ఈనాడు - అమరావతి

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని మానస సరోవరం ఉద్యానవనం అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ప్రణాళిక సిద్ధం కాగా.. కేంద్ర ప్రభుత్వ సాస్కీ పథకం వరంలా మారగా.. అధికారులు రూ. 18.35 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

నిధుల అంచనా రూ.కోట్లలో..

పాత్ వే, పేవర్స్‌కు	1.10
సాఫ్ట్ స్కేప్, హార్డ్‌స్కేప్‌నకు	1.69
ల్యాండ్ స్కేప్, మియావాకీ	11.94
గ్రావెల్ ఫిల్లింగ్‌కు ఫేజ్-1లో	1.85
చైన్ లింక్ మెష్ ఏర్పాటుకు	0.62
పార్కింగ్ టైల్స్, ఫ్లోరింగ్‌కు	0.55
ప్లాంటర్ బాక్సులకు	0.60

పార్కు లోపల పరిస్థితి ఇలా..

నగర శివారులో సుమారు 50 ఎకరాల్లో ఉన్న ఉద్యానవనానికి అప్పట్లో నిత్యం 5 వేల మంది వచ్చేవారు. సెలవుల్లో ఈ సంఖ్య రెట్టింపయ్యేది. నెలకు రూ. 6 లక్షల వరకు ఆదాయం వచ్చేది. కొవిడ్ కాలంలో మూసేశాక వైకాపా ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా పరికరాలు, నిర్మాణాలు పాడైపోయి. . పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారింది.

కూటమి ప్రభుత్వం దృష్టి

గత ఆగస్టు మొదటివారంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు పార్కును సందర్శించి పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. తాజాగా సాస్కీ పథకం కింద ప్రతిపాదనలు సిద్ధం చేయించారు.

పరిపాలనామోదానికి...

కేంద్రం సూచనల మేరకు సాస్కీ 2025-26 ద్వారా అభివృద్ధి చేయడానికి జీఎంసీ ఎగ్జిక్యూటివ్ అథారిటీ ఆదేశాల మేరకు రూ. 18.35 కోట్లతో అంచనాలు వేశారు. పరిపాలనామోదం కోసం కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు.

జీఎంసీ వెచ్చించేది రూ.3 లక్షలే

జీఎంసీ సాధారణ నిధులు రూ. 3 లక్షలతో జంగిల్ క్లియరెన్స్ చేయనున్నారు. మిగిలిన పనులన్నీ సాస్కీ నిధులొచ్చాక చేస్తారు. ల్యాండ్ స్కేప్, మియావాకీ ప్లాంటేషన్ పేరుతో ఏడు దశల్లో రూ. 11 కోట్లను ప్రతిపాదించడంపై విమర్శలొస్తున్నాయి. ఇతర అభివృద్ధి పనులను కూడా పరిశీలించి.. ప్రతిపాదనలు మరింత పకడ్బందీగా సిద్ధం చేయాలన్న వాదన వ్యక్తమవుతోంది.



(c) eenadu

నేడు సెమీస్ పోరు

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్

Aster Ramesh HOSPITALS We'll Treat You Well

గుంటూరు క్రీడలు, తాడికొండ, న్యూస్‌టుడే: ఈనాడు ఆధ్వర్యంలో మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలోని హిల్‌వ్యూ స్టేడియంలో ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ ఈనాడు స్పోర్ట్స్ లీగ్(ఈఎస్ఎల్)-2025 క్రికెట్ టోర్నమెంట్‌లో జూనియర్ విభాగంలో జరిగిన మ్యాచ్‌ల్లో వివిధ కళాశాలల జట్లు తలపడ్డాయి. పలు జట్లు సెమీఫైనల్స్‌కు చేరాయి. కొందరు క్రీడాకారులు ఆల్ రౌండర్లుగా రాణించి తమ జట్లను విజయపథంలో నడిపించారు.

యూనివర్సల్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు విజయ భేరి

గ్రౌండ్-1

మొదటి మ్యాచ్ యూనివర్సల్ పాలిటెక్నిక్ కళాశాల(డోకిపర్రు)-శ్రీగౌతమి జూనియర్ కళాశాల(చీరాల) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన శ్రీగౌతమి కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన యూనివర్సల్ కళాశాల జట్టు 10 ఓవర్లకు 2 వికెట్లు కోల్పోయి 102 పరుగులు చేసింది. బరిలోకి దిగిన శ్రీగౌతమి కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో 69 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. 33 పరుగుల తేడాతో యూనివర్సల్ కళాశాల జట్టు విజయభేరీ మోగించింది. భార్గవ్ 3 కీలక వికెట్లు తీసి జట్టును విజయతీరాల వైపు నడిపించాడు.

సత్తా చాటిన ఎన్నారైటీ

రెండో మ్యాచ్ ఎన్నారైటీ కళాశాల(విశదల)-శ్రీచైతన్య జూనియర్ కళాశాల(గుంటూరు) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన ఎన్నారైటీ బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 108 పరుగులు చేసింది. బరిలోకి దిగిన శ్రీచైతన్య కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 99 పరుగులు మాత్రమే చేసింది. 9 పరుగుల తేడాతో ఎన్నారైటీ జట్టు గెలిచింది. చరణ్ 18 బంతుల్లో రెండు ఫోర్లు ఒక సిక్స్‌తో 30 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించాడు.

'సెయింట్ ఆన్స్'దే పైచేయి

మూడో మ్యాచ్ సెయింట్ ఆన్స్ డిప్లొమా కళాశాల(చీరాల)-ఏఎం రెడ్డి కళాశాల(నరసరావుపేట) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన సెయింట్ ఆన్స్ కళాశాల జట్టు బౌలింగ్‌ను ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఏఎంరెడ్డి కళాశాల జట్టు 10 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. బరిలోకి దిగిన సెయింట్ ఆన్స్ కళాశాల జట్టు 8.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసి లక్ష్యాన్ని అవలీలగా ఛేదించింది. రాహుల్ అద్భుతంగా బౌలింగ్ చేసి మూడు ప్రధాన వికెట్లు తీసి జట్టును గెలిపించాడు.

విజయపథంలో కేఎల్‌యూ

గ్రౌండ్-2

నాలుగో మ్యాచ్ కె.ఎల్.విశ్వవిద్యాలయం(వడ్డేశ్వరం)-కళ్లం హరనాథ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(దాసరిపాలెం) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన కేఎల్‌యూ జట్టు మొదట బ్యాటింగ్ చేసి 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. బరిలోకి దిగిన కేహెచ్ఐటీ జట్టు నిర్ణీత ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసింది. 17 పరుగుల తేడాతో కేఎల్‌యూ జట్టు విజయాన్ని దక్కించుకుంది. కెప్టెన్ గౌతమ్ 21 బంతుల్లో మూడు ఫోర్లు, ఒక సిక్స్ కొట్టి 26 పరుగులు చేశాడు. రెండు ఓవర్లు బౌలింగ్ చేసి మూడు వికెట్లు తీశాడు. జట్టును విజయపథంలో నడిపించాడు.

హిందూ జూనియర్ కళాశాల జట్టు గెలుపు

అయిదో మ్యాచ్ హిందూ జూనియర్ కళాశాల(గుంటూరు)- ఆక్స్‌ఫర్డ్ జూనియర్ కళాశాల(పిడుగురాళ్ల)జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన హిందూ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఆక్స్‌ఫర్డ్ కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 62 పరుగులు చేసింది. బరిలోకి దిగిన హిందూ కళాశాల జట్టు 4 ఓవర్లకే లక్ష్యాన్ని ఛేదించింది. శశాంక్ 2 వికెట్లు తీసి 11 పరుగులు చేశాడు. జట్టు కెప్టెన్ నాయుడు 9 బంతుల్లో 5 ఫోర్లు కొట్టి 23 పరుగులు చేశాడు. ఇందులో మూడు వరుస ఫోర్లు కొట్టి జట్టుకు విజయాన్ని అందించాడు.

Title Sponsor Dhanik Bharat Educational Institutions The Lloyd Group Initiative
Protein Partner నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor CITY Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor CITY Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Beverage Partner CMR SHOPPING MALL The joy of life
Gift Partner KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner ఈనాడు.నెట్ TV Partner ETV Organised by ఈనాడు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్ వీరే..

భార్గవ్, చరణ్, రాహుల్, గౌతమ్, శశాంక్, ఆరిఫ్

చలపతి ఇంజినీరింగ్ కళాశాల జట్టు జయకేతనం

ఆరో మ్యాచ్ చలపతి ఇంజినీరింగ్ కళాశాల(మోతడక)-యూనివర్సల్ పాలిటెక్నిక్ కళాశాల(డోకిపర్రు)జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన చలపతి కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన యూనివర్సల్ కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 73 పరుగులు చేసింది. బరిలోకి దిగిన చలపతి కళాశాల జట్టు 8.2 ఓవర్లకే 4 వికెట్లు కోల్పోయి 76 పరుగులతో లక్ష్యాన్ని ఛేదించింది. ఆరిఫ్ బాజీ 14 బంతుల్లో 3 సిక్సులు, రెండు ఫోర్లు కొట్టి 35 పరుగులు చేసి జట్టుకు చక్కటి విజయాన్ని అందించాడు.

నేడు జరిగే మ్యాచ్‌లు.. వేదిక: చలపతి హిల్‌వ్యూ స్టేడియం

గ్రౌండ్-1, జూనియర్స్ సెమీఫైనల్స్ ★ ఉదయం 8 గంటలకు ఎన్నారైటీ (విశదల)- చలపతి కళాశాల(మోతడక) ★ ఉదయం 11 గంటలకు సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల(చీరాల)- హిందూ జూనియర్ కళాశాల(గుంటూరు) ★ మధ్యాహ్నం 2 గంటలకు వీవీఐటీ(నంబూరు)-విజ్ఞాన్ యూనివర్సిటీ(వడ్లమూడి)మహిళల మ్యాచ్...

గ్రౌండ్-2, సీనియర్స్ సెమీఫైనల్స్... ★ ఉదయం 11 గంటలకు కేబీఆర్ డిగ్రీ కళాశాల(నరసరావుపేట)- జేసీ లా కళాశాల(గుంటూరు) ★ మధ్యాహ్నం 2 గంటలకు ఆర్వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల(గుంటూరు)- కేఎల్ యూనివర్సిటీ (వడ్డేశ్వరం)

ముగిసిన రాజధాని రైతు అంత్యక్రియలు

న్యాయం చేయాలని సీపీఎం నేత బాబూరావు డిమాండ్

తుళ్లూరు, న్యూస్‌టుడే : రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన అన్నదాతలకు.. ఇచ్చిన హామీలు నెరవేర్చటానికి, సమస్యలు తీర్చటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. మందడంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన రైతు దొండపాటి రామారావు (రాములు) అంత్యక్రియలు ఆదివారం ఉదయం ముగిశాయి. కార్యక్రమంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీపీఎం నాయకుడు సీహెచ్ బాబూరావు, తెదేపా జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, రాజధాని రైతులు, రైతు కూలీలు, మహిళలు, ఐకాస నాయకులు, బంధుమిత్రులు పాల్గొన్నారు. రైతు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ మృతి చెందిన రామారావు కుటుంబానికి రూ.50 లక్షలు ఆర్థిక సాయం అందించి.. సరైన ప్లాట్లు కేటాయించాలని కోరారు. ముఖ్యమంత్రి అండగా ఉంటామని ఫోన్ చేసి చెప్పినా ఇంతవరకు ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టలేదన్నారు.

10, 11 తేదీల్లో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) రాష్ట్ర 51వ కౌన్సిల్ సమావేశాలు జనవరి 10, 11 తేదీల్లో గుంటూరులో నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం యూటీఎఫ్ హాల్‌లో జరిగిన జిల్లా కార్యవర్గం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిరంకుశ విధానాలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమాలు రూపొందించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర సహాధ్యక్షులు కుసుమకుమారి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖరరావు, ఎం.కళాధర్, జిల్లా గౌరవాధ్యక్షులు పీవీ.శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, షకీలాబేగం, మహమ్మద్ గయాసుద్దౌలా తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో హనుమాన్ చాలీసా పారాయణం

హనుమాన్ చాలీసా పారాయణకు హాజరైన భక్తజన సందోహం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీఆంజనేయం, ఇలైట్ కుటుంబ సభ్యుల బృందం, ఎన్ఆర్ఐ విద్యాసంస్థల సంయుక్త నిర్వహణలో ఏకాసన స్థిత లక్ష హనుమాన్ చాలీసా పారాయణం ఆదివారం రాత్రి శ్రీపాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాల ప్రాంగణంలో భక్తిప్రపత్తులతో జరిగింది. వేలాది మంది భక్తులు పారాయణంలో పాల్గొన్నారు. అనంతరం మహాహారతి నిర్వహించారు. పారాయణంలో పాల్గొన్న భక్తులందరికీ పూజాద్రవ్యాలు, ప్రసాదాలు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర(నాని), శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యుడు బోడేపూడి వెంకట సుబ్బారావు, ఎస్పీఎస్ హైస్కూలు కార్యదర్శి పాటిబండ్ల విష్ణువర్ధన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమాలను జూపిటర్ ప్రసాద్ పర్యవేక్షించారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

JOBS

Wanted Civil Engineers & Supervisors, 3-5 yrs Exp in Buildings & CC Road Works. @ Gokavaram (A.P). Ph No:8888838677, 9422135347.

భారతదేశ అగ్రగామి సంస్థలో పార్ట్/ ఫుల్ టైం బిజినెస్ పార్టనర్‌గా చేరండి అధిక కమిషన్ పొందండి. అ: 10th, వ: 30-65 సం||. ✆ 79892 46788.

తెనాలి దగ్గర దుగ్గిరాలలోని ప్రముఖ కాఫీ పరిశ్రమలో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ మరియు ప్యాకింగ్ బాయ్స్ కావలెను. రూమ్ మరియు క్యాంటీన్ సౌకర్యం కలదు. ✆ 92980 11777, 8096161777.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/- 5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/- ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

'మహానాడు మీడియా'లో వీడియో ఎడిటర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ, యువకులు కావలెను. కాల్: 73372 22004.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు Acdemic Incharge గా పనిచేయుటకు వివాహితులైన లోకల్ పురుషులు కావలెను. జీతము: 25000/- నుండి 30000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: డిగ్రీ నుండి పి.జి వరకు, వయస్సు: 30 నుండి 45 సంవత్సరాలు. సంప్ర: ✆ 92487 22217.

గుంటూరు 2వీలర్ షోరూంలో పనిచేయుటకు సేల్స్ మేనేజర్ (Exp 3+), సేల్స్ ఎగ్జిక్యూటివ్ (M/F 2+), అకౌంటెంట్ 3+ CA Inter ప్రాధాన్యత, మెకానిక్స్, సర్వీస్ అడ్వైజర్స్ కావలెను. ✆ 83416 22655.

గుంటూరులో నివాసము ఉంటున్న పేషంట్స్‌ను చూసుకొనుటకు బార్య & భర్త మరియు ఆయాలు అర్జంట్‌గా కావలెను. సంప్ర|| ✆ 7842845772.

గుంటూరు, ఆటోనగర్‌లో HP పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మేనేజర్, పంపు బాయ్స్/ గర్ల్స్ కావలెను. పార్ట్ టైమ్/ ఫుల్ టైమ్. 7799689889, 8074546302.

ఉద్యోగం చేస్తూనే అదనపు ఆదాయం కోసం చూస్తున్నారా? నిరుద్యోగులు, మహిళలు పార్ట్‌టైమ్ లేక ఫుల్‌టైమ్ ఖాళీ సమయాల్లో పనిచేస్తూ డబ్బు సంపాదించాలని అనుకుంటున్నారా? సంప్ర: 85003 53577.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జీస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకొరకు సంప్ర. ✆ 89784 80429.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు క్లాసు ఇన్‌ఛార్జీస్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జీస్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీ: 14000/- నుండి 21000/- వరకు. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు, వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. వివరముల కొరకు సంప్ర. ✆ 9248713335.

వాచ్‌మెన్ కావలెను. గుంటూరులోని కమర్షియల్ కాంప్లెక్స్ నందు పనిచేయుటకు 40 సం||ల లోపు భార్యాభర్తలు కావలెను. ఒ.సి.లకు ప్రాధాన్యత. వేతనం: రూ.15,000/-, గృహవసతి కలదు. ✆ 98499 83681.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

కాలనీలో ఆధిపత్యం కోసమే హత్య

చేబ్రోలు, న్యూస్‌టుడే: కాలనీలో ఆధిపత్యం కోసమే నత్తల మృత్యుంజయరావును ప్రత్యర్థులు హత్య చేశారని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శనివారం రాత్రి నారాకోడూరులోని తెనాలి రోడ్డులో హత్య జరిగిన ప్రాంతాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను తెనాలి డీఎస్పీ జనార్దనరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. హత్య జరిగిన సమాచారం తెలియగానే వెంటనే ప్రత్యేక బృందాలను, క్లూస్ టీంను రంగంలోకి దించామని తెలిపారు. కారు నంబరును గుర్తించి సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు చెప్పారు. హత్యలో నలుగురు వ్యక్తులు ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు గుర్తించామని.. వారిని త్వరలోనే అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తామన్నారు.

ఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

* మృత్యుంజయరావు పనిచేసే మిల్లు నుంచి వస్తూ.. వేజండ్ల అడ్డరోడ్డు సమీపంలోని ఓ మెకానిక్ షెడ్డు వద్ద తన వాహనానికి మరమ్మతులు చేయించుకున్నాడు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి రాగా.. కొంత దూరంలో అప్పటికే కారులో సిద్ధంగా ఉన్న వ్యక్తులు.. ద్విచక్రవాహనానికి కారును అడ్డుగా నిలిపి ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆదివారం ఉదయమే నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

నిందితులను గ్రామం నుంచి బహిష్కరించాలని నినాదాలు.. మృత్యుంజయరావు అంత్యక్రియలు ఆదివారం పూర్తయ్యాయి. గుంటూరులో శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని నారాకోడూరు ఎస్సీకాలనీలోని ఆతని ఇంటికి తరలించారు. కాలనీ వాసులంతా అక్కడికి చేరుకున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని.. వారిని గ్రామ బహిష్కరణ చేయాలని నినాదాలు చేశారు.

13 రోజులు.. 5 చోరీలు

నిందితుడిని అరెస్టు చేసి రూ.6 లక్షలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లికార్జునరావు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: జైలుకు వెళ్లి వచ్చినా తీరు మారక వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని తెనాలి వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మల్లికార్జునరావు నిందితుడి వివరాలు వెల్లడించారు. గుంటూరుకు చెందిన ఆటో డ్రైవర్ సయ్యద్ ఖాజా వ్యసనాలకు బానిసై.. సులభంగా నగదు సంపాదించాలని ఆలోచనతో చోరీలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో గుంటూరు, పరిసరాల్లో చేసిన దొంగతనాలు, గొడవకు సంబంధించిన కేసుల్లో జైలుకు వెళ్లాడు. ఈ నెల 13న లోక్‌అదాలత్‌లో కేసులు ముగిసిన తర్వాత జైలు నుంచి బయటకు వచ్చి తిరిగి మళ్లీ చోరీలు ప్రారంభించాడు. తెనాలి చెంచుపేటలో వరుసగా నాలుగు ఇళ్లల్లో చోరీ యత్నాలు చేసి ఒక ఇంటి నుంచి చరవాణి దొంగిలించాడు. తెనాలిలో ఒక ఆటో, పాత గుంటూరు పరిధిలో మరో ఆటో, పెదకాకాని, తాడేపల్లి ప్రాంతాల్లో రెండు ద్విచక్రవాహనాలు చోరీ చేశాడు. తెనాలిలో నమోదైన కేసుకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి సుమారు రూ.6 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఎస్సై విజయకుమార్, సిబ్బంది ఆదినారాయణ, రమేష్ నాయక్, వసంతరావు నాయక్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో రూ.లలో)

వెంకోబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 142, లిఫ్టింగ్ ధర - 169, చికెన్ విత్ స్కిన్ - 245, చికెన్ స్కిన్‌లెస్ - 279.

స్నేహ పౌల్ట్రీ: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 లిఫ్టింగ్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 147, 156, 167 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.

91.9 FM Vijayawada ఈఎఫ్ఎం కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్	ఉ. 7 - ఉ. 11
నువ్వే నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
వరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - ఉ. 5

/Eenadufm For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు Cell: 80085 10541 ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి Cell: 80085 14589

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం ● మృతులు ప్రకాశం జిల్లా వాసులు



అభిషేక్, నాని (పాత చిత్రాలు)

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పి జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ... ప్రకాశం జిల్లా గంగవరానికి చెందిన చల్లా అభిషేక్ (19), చల్లా నాని (16) రోడ్డు ప్రమాదంలో మరణించారు. [illegible] ... స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై నారాయణరెడ్డి సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు.

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ నేడు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు సమస్యలను సంబంధిత అధికారులకు అందించవచ్చన్నారు. ఆర్జీల స్థితిని 1100 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

REPLY PUBLIC NOTICE

The attention of my client Mr. Kanneganti Muralidhar Rao, S/o. Late Kanneganti Kotaiah, aged 79 years, R/o. Shivani Plaza, Flat No.303, 3rd Floor, H.No.8-2-293/82/NG/40/3, Plot No.40, Nandagiri Hills, Jubilee Hills, Hyderabad-500 033, Telangana, has been drawn to a Public Notice published in Eenadu in Bapatla, Amaravati Guntur, and Visakhapatnam Editions on 21st December, 2025 issued by Ms. Kanneganti Umakumari D/o. Late Kanneganti Kotaiah R/o. Kuchipudi village through her Advocate Sri. Ponnam Ravindra Babu, D.No.3-76, I Floor, Opposite Amaravathi Rythu Bazar, JKC College Road, Guntur.

The contention of Ms. Kanneganti Umakumari is that she is the Lessee of Agricultural and other properties belonging to Dr. Kanneganti Kamalakar Rao S/o. Late Kanneganti Kotaiah is false and baseless. She has been falsely proclaiming herself as the Lessee of the said properties with the object of making monetary gains. Dr. Kanneganti Kamalakar Rao has never leased out any of his properties to Ms. Kanneganti Umakumari at any point of time. There is no document evidencing the creation of Lease in favour of Ms. Kanneganti Umakumari by Dr. Kanneganti Kamalakar Rao.

The allegation that due to an alleged injury sustained by Dr. Kanneganti Kamalakar Rao on his head, his health condition was not good is firmly denied. His mental condition was sound and stable. Dr. Kanneganti Kamalakar Rao executed a General Power of Attorney (GPA) in favour of my client on 27th May, 2023 in the presence of witnesses and the Power of Attorney has been duly notarized by a Notary Public State of Washington, namely, OK HEE KIM, County of Pierce, USA. Dr.Kanneganti Kamalakar Rao has also executed a letter of cancelling the Will dated 26th April, 2013 in favour of Ms. Kanneganti Umakumari.

My client Mr. Kanneganti Muralidhar Rao has got the General Power of Attorney validated in India after following the due procedure. The said GPA executed in favour of my client perfectly valid in eye of law. My client states that the GPA executed by Mr. Kanneganti Kamalakar Rao was shared with Ms. Kanneganti Umakumari on 04-12-2024 by Speed Post and Registered Post to her two addresses i.e. at Nadimpalle and another at Guntur. She did not object to the same then, but she has issued the public notice dated 21-12-2025 with some malafide motives.

My client states that Ms. Kanneganti Umakumari is the younger sister of Dr. Kanneganti Kamalakar Rao, and she has been illegally leasing the agricultural properties and collecting the lease amounts of the agricultural properties mentioned in the schedule of the Public Notice dated 21st December, 2025. She has not accounted for the amounts she has illegally collected so far. She has borrowed huge amounts of money from Dr. Kanneganti Kamalakar Rao and has not bothered to repay the amounts borrowed by her. It is precisely for this reason Dr.Kanneganti Kamalakar Rao has executed a GPA in favour of my client.

My client after obtaining GPA in his favour from his brother, Dr. Kanneganti Kamalakar Rao, has opened NRO account in the name of Dr. Kanneganti Kamalakar Rao and paid capital gains tax to the extent of Rs.1.1 Crore to the Income Tax Department by obtaining his PAN number during 2024-25.

My client is looking after payment of Dr. Kanneganti Kamalakar Rao's statutory dues payable by him, for the apartments belonging to him at West Wind Apartments in Visakhapatnam.

The General public are advised not to believe any of such baseless allegations made against Mr. Kanneganti Muralidhar Rao and his family published in 21st December, 2025 by Ms. Kanneganti Umakumari in the form of public notice. The said Public Notice has defamed my client & his family and has lowered his image in the eyes of his relatives, friends, and society at large.

My client calls upon Ms. Kanneganti Umakumari to account all the amounts that she has so far collected in respect of agricultural properties of Dr. Kanneganti Kamalakar Rao within 48 hours of the publication of this Reply Public Notice failing which criminal and civil action will be initiated against her acts of criminal misappropriation and breach of trust.

My client calls upon Ms. Uma Kumari to withdraw the Public Notice dated 21st December, 2025 published in Eenadu in Bapatla, Amaravathi Guntur and Visakhapatnam Editions within 48 hours of the publication of this Reply Public Notice, failing which my client will be initiating appropriate legal action both Civil and Criminal against Ms. Kanneganti Umakumari for civil and criminal defamation, breach of trust and recovery of money.

Sd/- KARUNA RAWAL, P.V.G. NIKITHA, NEMANI SAI CHARAN
Advocates
Office at Flat No.101, Sai Ridah Jeevan Residency, H. No.6-1- 318/1, Walker Town, Padmarao Nagar, Secunderabad-500020. Mobile: 9966897702

(c) eenadu

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రతిపాడు

మంచికలపూడిలో ముమ్మరంగా కోళ్ల పందేలు

దుగ్గిరాల, న్యూస్‌టుడే : మంచికలపూడిలో కోళ్ల పందేలు జోరుగా సాగుతున్నాయి. ఆదివారం ఉదయం 7 గంటలకే పందెంరాయుళ్లు పందేలు కాసేందుకు ఓ ప్రాంతానికి వచ్చారు. పోలీసులు వెళ్లగా అప్పటికే వారు వెళ్లిపోయారు. పందెంరాయుళ్లలో కొందరు రోడ్డు మీద ఉండి పోలీసులు వస్తున్నట్లు సమాచారం ఇస్తున్నారు. గ్రామంలో తోపుగా పిలిచే ప్రదేశంలో, హిందూ శ్మశానవాటిక సమీపంలో ఈ పందేలు నిర్వహిస్తున్నారు. కొందరు వీటిలో పాల్గొనేందుకు దూర ప్రాంతాల నుంచి వస్తున్నారు. దుగ్గిరాల పోలీసులు కాకుండా వేరే ప్రాంతానికి చెందిన వాళ్లు వస్తే తెలియకుండా ఉంటుంది. కొద్ది నెలల క్రితం చిలువూరు- పెదవడ్లపూడి మధ్య జోరుగా జూదం నిర్వహిస్తుండగా పెదకాకాని పోలీసులు పట్టుకున్నారు. గత ఏడాది ఎక్కువ రోజులు పేరకలపూడిలో కోళ్ల పందేలు నిర్వహించారు. విద్యుత్తు వెలుగుల మధ్య బరి పెట్టారు. అప్పుడు పోలీసులు వెళ్లే ప్రయత్నం చేసి దారి మధ్యలో వెనుదిరిగి వచ్చేశారు. దీనికి కారణాలు అనేకంగా చెబుతున్నారు. ఈ ఏడాది కూడా పేరకలపూడిలో బరులు సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. గొడవర్రు, పెదకొండూరు లంక పొలాల్లోనూ పందేలు వేసేందుకు సిద్ధం చేస్తున్నారని తెలిసింది.

గంజాయి నిర్మూలనకు పోలీస్ శాఖ చర్యలు

వివరాలు వెల్లడిస్తున్న తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, సీఐలు వాసు, శ్రీనివాసరావు, శివరామకృష్ణ

మేడికొండూరు, న్యూస్‌టుడే : జిల్లాలో గంజాయి నిర్మూలకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని తుళ్లూరు సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని పేరేచర్లలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు ప్రత్యేకంగా కార్డెన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఎస్పీ వకుల్ జిందాల్ గంజాయి, నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారన్నారు. ఆయన ఆదేశాల మేరకు పేరేచర్ల లక్ష్మీ నరసింహకాలనీ (ఎల్ఎన్ఎస్)లో కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. చుట్టుపక్కల ఇళ్లు సోదా చేశామని తెలిపారు. మొత్తంగా అనుమతి పత్రాలు లేని 55 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు స్వాధీనం చేసుకున్నామన్నారు. సరైన పత్రాలు చూపిస్తే వదిలి పెడతామన్నారు. అనుమానంగా కనిపిస్తే పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు, యువత గంజాయికి దూరంగా ఉండాలని, దాని బారిన పడితే ఎన్నో అనర్థాలకు దారి తీస్తుందని సూచించారు. కార్యక్రమంలో తుళ్లూరు, తాడికొండ, ఫిరంగిపురం సీఐలు శ్రీనివాసరావు, వాసు, శివరామకృష్ణ, తుళ్లూరు ట్రాఫిక్ సీఐ కోటేశ్వరావు, మేడికొండూరు, ఫిరంగిపురం ఎస్సైలు సుబ్బారావు, సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు, ఆటోలు

శ్రామికులకు మరింత ఊతం

తుళ్లూరు, న్యూస్‌టుడే

నీటికుంట తవ్వుతున్న కూలీలు

పల్లెల్లో శ్రామికులకు కూటమి ప్రభుత్వంలో మరింత ఊతం లభించనుంది. ఉపాధి హామీ పనుల్లో ప్రస్తుతం ఉన్న 100 పని దినాలను 120కి పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. గత వైకాపా ప్రభుత్వంలో అరకొరగా వేతనాలు వచ్చేవి. ప్రస్తుతం కనీస వేతన చెల్లింపును సవరించటంతో కార్మికలకు మేలు చేకూరుతుంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును వికసిత్ భారత్ జీ రామ్ జీగా మార్పు చేశారు.

✿ తాడికొండ నియోజకవర్గంలోని తుళ్లూరు, తాడికొండ, మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల్లో ఉన్న వేల మంది ఉపాధి హామీ కార్మికలకు పనిదినాల పెంపుతో ప్రయోజనం చేకూరనుంది. తుళ్లూరు మండలంలో కేవలం పెదపరిమి, వడ్డమాను, అనంతవరం, హరిశ్చంద్రపురం గ్రామాల్లో మాత్రమే శ్రామికులు పని చేస్తున్నారు. నియోజకవర్గంలోని మిగతా మండలాల్లోని అన్ని గ్రామాల్లో జాబ్‌కార్డులు ఉన్న కార్మికులు పనుల్లోకి వెళుతున్నారు.

మండలం	శ్రామికులు	పనిలో పాల్గొనేవారు
మేడికొండూరు	14,772	9,703
తాడికొండ	16,025	11,192
ఫిరంగిపురం	19,597	15,007
తుళ్లూరు	07,529	2,679

వికసిత్ భారత్ జీ రామ్‌జీ పథకంలో పని దినాల పెంపు

✿ తాడికొండ నియోజకవర్గంలో ఈ పథకం ద్వారా వ్యవసాయం, భూగర్భ జలాల పెంపుదల, ఉద్యాన పంటలు, తోటల పెంపకం, మినీ గోకులాలు, రోడ్లు, డ్రైనేజీలు, పంటల సాగు, ప్రభుత్వ భవనాల నిర్మాణం, సీసీ రోడ్లు, పాడి పశువుల పశుగ్రాసం, జల సంరక్షణ, కాలువలు, చెరువుల్లో పూడిక తీయటం వంటి పనుల ద్వారా కార్మికులు లబ్ధి పొందుతున్నారు. రోజుకు కార్మికులకు గరిష్ఠ వేతనం రూ.307 ఉండగా.. జిల్లా సగటు వేతనం రూ.285గా ఉంది.

✿ పథకం పని దినాలను 100 రోజుల నుంచి 120కు పెంచటం ద్వారా శ్రామికులకు ఆదాయం పెరుగుతుంది. ఎక్కువ మంది కార్మిక కుటుంబాలు ఈ పథకంలో చేరి ఉపాధి పొందే అవకాశం కులుగుతుంది.

-వి.శంకర్, డ్వామా పీడీ, గుంటూరు జిల్లా

కాలువలో పూడిక తొలగింపు

పెదనందిపాడు ఎత్తిపోతల పథకం కమిటీ వారు మొక్కజొన్న పైరుకు సాగునీరు అందించేందుకు పథకం పరిధిలోని కాకుమాను మేజర్, మైనర్ కాలువల్లో పూడిక తీయించారు. మొక్కజొన్నకు సాగు నీరు సరఫరా అయ్యేందుకు వీలు కల్పించారు. ఇక సాగు నీరు అందుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కమిటీ వారికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

-పెదనందిపాడు, న్యూస్‌టుడే

తెదేపా జిల్లా అధ్యక్షుడికి సత్కారం

పెదనందిపాడు, న్యూస్‌టుడే : పెదనందిపాడు మండలం వరగానికి చెందిన తెదేపా నాయకుడు చెన్నుపాటి శివనాగేశ్వరరావు తెదేపా జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పిల్లి మాణిక్యాలరావును ఆదివారం గుంటూరులోని ఆయన కార్యాలయంలో కలసి సత్కరించి అభినందించారు. పార్టీ అభివృద్ధికి సహకారం అందిస్తామని ఆయన చెప్పారు.

తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా సుమంత్

పెదనందిపాడు, న్యూస్‌టుడే : పెదనందిపాడు మండలం గోగులమూడికి చెందిన రామినేని సుమంత్ తెలుగు యువత ప్రత్తిపాడు నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా, వెలినేని వినయ్‌కుమార్ ఐటీడీపీ నియోజకవర్గ అఫీషియల్ స్పోక్స్‌పర్సన్‌గా నియమితులయ్యారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. వారికి తెదేపా నాయకులు అభినందనలు తెలిపారు.

నగరపాలక సంస్థలోకి కొర్నెపాడు, పుల్లడిగుంట?

విలీన ప్రతిపాదలపై గ్రామాల్లో చర్చ

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే : గుంటూరు నగరపాలక సంస్థ పరిధి వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడు, పుల్లడిగుంట గ్రామాల్లోకి విస్తరించేందుకు ప్రతిపాదనలు చేశారనే వార్తలు రాగా ఆ గ్రామాల్లో చర్చ మొదలైంది. 1987 నుంచి ఈ గ్రామాలు వట్టిచెరుకూరు మండలంలో చివరిగా ఉన్నాయి. ఇప్పటి వరకు మండలం 17 గ్రామాలతో ఉంది. ఈ రెండు గ్రామాలు గుంటూరు నగరపాలక సంస్థలో కలిస్తే మండలం 15 పంచాయతీలతో 12 ఎంపీటీసీ స్థానాలకు పరిమితమవుతుంది. కొర్నెపాడులో సుమారు ఆరువేల మంది జనాభా, పుల్లడిగుంటలో రెండు వేల జనాభా ఉంది. ఇప్పటి వరకు వట్టిచెరుకూరు మండల పరిధిని తాకుతూ గుంటూరు నగరపాలక సంస్థలోని ఏటుకూరు, లాల్‌పురం వంటి గ్రామాలు ఉన్నాయి. నగరపాలక సంస్థలో విలీనమైతే ఇక్కడ ప్రస్తుతం ఉన్న మంచినీటి, మురుగు సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు ఎదురు చూస్తున్నారు. ఇవి రెండూ విడిపోతే వట్టిచెరుకూరు

రూ.70 లక్షలతో వేగంగా నిర్మాణాలు

నిర్మాణంలో రహదారి, అన్న క్యాంటీన్

దుగ్గిరాల, న్యూస్‌టుడే : దుగ్గిరాలలో అన్న క్యాంటీన్, దానికి ముందు రోడ్డు రెండు నిర్మాణాలు వేగంగా చేస్తున్నారు. దాదాపు రూ.60 లక్షలు నిధులతో క్యాంటీన్ నిర్మిస్తుండగా, రూ.10 లక్షలు పంచాయతీ నిధులతో సిమెంట్ రోడ్డు వేస్తున్నారు. 50 మీటర్ల పొడవు, 7.5 మీటర్ల వెడల్పు ఉండేలా వేస్తున్న సిమెంట్ రోడ్డు వల్ల గతంలో పడ్డ కష్టాలు తీరినట్లే. క్యాంటీన్ దాటి కొద్ది దూరం మాత్రమే వేస్తున్న రోడ్డును మరో 50 మీటర్లు రైల్వేస్టేషన్ వరకు పొడిగించాలని ప్రజలు కోరుతున్నారు.

డొంకదారి.. నిత్యం అవస్థలే మరి

దుగ్గిరాల మండలం చినపాలెం నుంచి కొల్లిపర మండలం వల్లభాపురం వెళ్లే డొంకదారి దారుణంగా ఉంది. నిత్యం వందలాది మంది రైతులు ఉపయోగించే ఈ దారిలో రాళ్లు పైకి లేచి, కొన్ని చోట్ల గుంతలు పడి నడవడమే కష్టంగా మారింది. అన్నదాతలు వ్యవసాయ ఉత్పత్తులు ఇంటికి తెచ్చుకోవాలన్నా, పొలాలకు ఎరువుల బస్తాలు తీసుకెళ్లాలన్నా చాలా కష్టంగా ఉంటోంది. అలా బరువుతో వెళుతున్న ద్విచక్ర వాహనాలు పంచర్లు అయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇక వర్షాకాలం వస్తే పరిస్థితి మరింత దారుణం. అధికారులు రోడ్డు బాగు చేయిస్తే దాదాపు 2వేల ఎకరాలు సాగుచేసే కర్షకులకు అవస్థలు తప్పుతాయని రైతులు కోరుతున్నారు.

-చినపాలెం (దుగ్గిరాల), న్యూస్‌టుడే

ఇలా.. వేస్తే ఎలా?

ఈమనిలో అంతర్గత రహదారుల్లో చెత్త పేరుకుంది. 4వ వార్డులో మూల మలుపు వద్ద విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్త పోగవుతోంది. ఇదే మార్గంలో కొంత ముందుకు వెళితే రామాలయం వద్ద పేరుకుంది. సిబ్బంది ఇళ్లకు వచ్చి చెత్త సేకరిస్తున్నారు. అయినా అయినా అక్కడ కొందరు వేస్తున్నారు. సిబ్బందికి ఇవ్వడం లేదు. మేజర్ పంచాయతీ అయిన ఈ గ్రామంలో ఇటీవల పంచాయతీ కార్యదర్శి రామ్‌కుమార్ పదోన్నతిపై తెనాలి వెళ్లారు. మరో కార్యదర్శిని నియమించాల్సి ఉంది. అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

-ఈమని (దుగ్గిరాల), న్యూస్‌టుడే

4వ వార్డులో చెత్త

చప్టాపై ప్రయాణం.. ప్రమాదకరం

గుంతల వల్ల చప్టా అంచున వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు

పొన్నెకల్లు గ్రామ శివారులో లో లెవెల్ చప్టా గుంతలతో అధ్వానంగా మారింది. దీనికి తోడు ఆ చప్టాకు ఇరువైపులా రక్షణ గోడలు లేవు. చప్టాకు ఇరువైపులా భారీ మురుగు కాలువలు ఉన్నాయి. గుంతలు తప్పించబోయి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. చప్టా అంచున ప్రయాణిస్తున్నారు. ఏ మాత్రం వాహనాలు అదుపు తప్పినా మురుగు కాలువలో పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి చప్టాపై గుంతలు సరిచేసి రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. -తాడికొండ, న్యూస్‌టుడే

గంజాయి విక్రయం.. మైనర్ అరెస్టు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: తాడేపల్లిలో గంజాయి విక్రయిస్తున్న మైనర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి సుమారు కిలో గంజాయి దొరికినట్లు తెలిపారు. తన కొడుకును అన్యాయంగా అరెస్టు చేశారంటూ తల్లి శనివారం రాత్రి స్టేషన్ ముందు భైఠాయించింది. పూర్తి సమాచారం తీసుకొని ఆదివారం నోటీసులు ఇచ్చి ఇంటికి పంపించినట్లు సీఐ వీరేంద్రబాబు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

గారపాడు (వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే : మండలంలోని గారపాడులో గ్యాస్ స్టౌ నుంచి గ్యాస్ లీకై మంటలు రేగి గాయపడ్డ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ రామానాయక్ వివరాల మేరకు.. గ్రామంలో వలస కూలీ అయిన రామిడ్డి సుబ్బారెడ్డి (65) 25న ఇంట్లో గ్యాస్ స్టౌ నుంచి గ్యాస్ లీకవడం వల్ల వచ్చిన మంటల్లో గాయపడ్డాడు. స్థానికులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమాదంలో గాయపడ్డ పాస్టర్..

గ్రామీణ గుంటూరు, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో గాయపడి.. ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న పాస్టర్ ఆదివారం మృతి చెందినట్లు నల్లపాడు పోలీసులు తెలిపారు. ఈనెల 22న నల్లపాడు పాలిటెక్నికల్ కళాశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నార్నెపాడుకు చెందిన సేవా ప్రకాష్‌రావు (75) గాయపడ్డారు. ప్రకాష్‌రావు చల్లావారిపాలెంలోని చర్చిలో ప్రార్థన చేసిన అనంతరం ద్విచక్ర వాహనంపై నార్నెపాడు వెళుతుండగా ఎదురుగా అతి వేగంతో వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. కళాశాల విద్యార్థులు క్షతగాత్రుడిని ఆటోలో జీజీహెచ్‌కి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం పాస్టర్ మృతి చెందారు. మృతుడి కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పాస్టర్ మృతితో ఆయన స్వగ్రామంలో విషదం అలముకుంది.

నల్లమట్టి అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు

తుళ్లూరు, న్యూస్‌టుడే : అనుమతి లేకుండా నేలపాడు నుంచి కొందరు వ్యక్తులు నల్లమట్టిని తవ్వి లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలించి.. అమ్ముకుంటున్నారు. ఆదివారం మట్టిని తరలిస్తున్న మూడు లారీలను వెలగపూడి సమీపంలోని ఎన్-9 జంక్షన్‌లో సిబ్బందితో కలసి తుళ్లూరు ఎస్సై మురళీధర్ అడ్డుకున్నారు. తమ యజమాని చిట్టిబాబు ఆదేశాల మేరకు మట్టిని తరలిస్తున్నట్టు లారీ డ్రైవర్లు తెలిపారు. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి.. 3 లారీలను స్వాధీనం చేసుకున్నట్లు తుళ్లూరు సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు.

రక్తమోడుతున్న రహదారులు

నిత్యం ప్రమాదాలతో పదుల సంఖ్యలో మృత్యువాత

నిర్లక్ష్యం, అతి వేగం, మద్యం మత్తే మూలం

మేడికొండూరు, తాడికొండ, తుళ్లూరు, ఫిరంగిపురం, న్యూస్‌టుడే

తాడికొండ నియోజకవర్గం పరిధిలో రోడ్డు ప్రమాదాలు నిత్య కృత్యమయ్యాయి. ముఖ్యంగా ప్రధాన రహదారులు రక్తమోడుతున్నాయి. ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకుంది. కొన్ని ప్రమాదాల్లో ఇంటిపెద్ద దిక్కు ప్రాణాలు కోల్పోయి ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మరో పక్క యువకులు కూడా మృత్యువాత పడుతున్నారు. దీంతో తల్లిదండ్రుల కడుపుకోత తీర్చలేనిది. మరి కొందరు కాళ్లు, చేతులు దెబ్బతింటున్నాయి. మరో పక్క వాహనాలు పాడవుతున్నాయి. దీంతో ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. ఇలా ప్రమాదాల కారణంగా ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు.

ఇవీ ముఖ్య కారణాలు

రోడ్ల నిర్వహణ సక్రమంగా లేక పోవడం, మితిమీరిన వేగం, మలుపులు అధికంగా ఉండటం, ప్రమాద హెచ్చరికలు, సూచికలు లేకపోవడం, మద్యం మత్తులో వాహనాలు నడపటం, వీధి దీపాలు లేక పోవడం, నిర్లక్ష్యం, నిద్రమత్తు వంటి వాటితో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఇలా నిత్యం రహదారులు రక్తమోడుతున్నాయి. యువత మృత్యువాత పడుతోంది.

❖ తాడికొండ నియోజకవర్గం పరిధిలో ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాలు, మృతుల సంఖ్య, క్షతగాత్రుల వివరాలు ఇలా

మండలం	రోడ్డు ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
మేడికొండూరు	54	20	46
ఫిరంగిపురం	35	15	37
తాడికొండ	34	15	27
తుళ్లూరు	41	14	20

ఈ ప్రదేశాల్లో ఎక్కువ

పేరేచర్ల కైలాసగిరి క్షేత్రం అడ్డరోడ్డు, ఆరోమైలు ప్రాంతం, డోకిపర్రు విద్యుత్తు ఉప కేంద్రం, డోకిపర్రు, విశదల, గుండ్లపాలెం, సిరిపురం, పాలడుగు అడ్డరోడ్డు, భీమినేనివారిపాలెం, వేములూరిపాడు మల్కాజ్ గిరి చెరువు ప్రదేశం, ఫిరంగిపురం చెక్‌పోస్టు ప్రాంతం, రేపూడి, నుదురుపాడు మలుపు, వేమవరం, పొనుగుపాడు, మునగపాడు అడ్డరోడ్డు, తాడికొండ అడ్డరోడ్డు, నిడముక్కల, లాం ప్రాంతం, కంతేరు రోడ్డు, సీడ్ యాక్సెస్ రోడ్డు, తుళ్లూరు- రాజధాని అమరావతి మధ్య, ఫిరంగిపురం ప్రధాన రోడ్డులో గల డివైడర్ వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

❖ నియోజకవర్గంలో ప్రధాన రహదారుల్లో రోడ్డు ప్రమాదాలు ఎక్కువే. గుంటూరు- హైదరాబాద్, గుంటూరు- కర్నూలు, గుంటూరు- రాజధాని అమరావతి రోడ్డుల్లో రాత్రీ పగలు తేడా లేకుండా నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. అధికారులు వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మిత్రమా.. ఎన్నాళ్లకు కలిశావ్!

సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: మంగళగిరి చింతకింది కనకయ్య (సీకే) ఉన్నత పాఠశాల 1999-2000లో 10వ తరగతి పూర్తి చేసిన నాటి విద్యార్థులంతా ఆదివారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. పాతికేళ్ల తర్వాత కలిసిన వారంతా ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ గంజి చిరంజీవి, ప్రిన్సిపల్ రత్నబాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. తమకు పాఠాలు చెప్పిన గురువులు దామర్ల కనక లింగేశ్వరారావు, సైదులు, నరసింహారావు, దేవేంద్రరావు, సాంబశివరావు, గుణేశ్వరరావును పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

1న సిరిపురం చర్చి వార్షికోత్సవం

మేడికొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని సిరిపురంలో గల యేసు నామకరణ దేవాలయ వార్షికోత్సవం జనవరి 1న ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ విచారణ గురువు యస్.వి.తోమస్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహిస్తారు. గురువారం ఉదయం 5 గంటలకు దివ్య బలిపూజ, 10 గంటలకు సమష్టి పూజాబలి కార్యక్రమం ఉంటాయి. ముఖ్య అతిథిగా గుంటూరు మేత్రాసన పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య హాజరు కానున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి కొవ్వొత్తుల సమర్పణ, 5 గంటలకు కోలాట ప్రదర్శన, 10 గంటల నుంచి పురవీధుల్లో తేరు ప్రదక్షిణ చేపడతారు. కులమతాలకు అతీతంగా ప్రజలు వేడుకల్లో పాల్గొంటారు.

మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం 30న

దుగ్గిరాల, న్యూస్‌టుడే : మండల పరిషత్తు సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 30న మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

ముక్కోటికి మంగళాద్రి ముస్తాబు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు మంగళాద్రి క్షేత్రం ముస్తాబవుతోంది. ఆలయ ప్రాంగణాలను అధికారులు విద్యుత్తు దీపాలతో సుందరీకరించారు. భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. 30న తెల్లవారుజామున శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమివ్వనున్నారు. స్వామి దర్శనానంతరం భక్తులు దక్షిణావృత శంఖం ద్వారా తీర్థం తీసుకుంటారు. ముక్కోటి ఉత్సవాలకు ఆలయ అధికారులు ప్రత్యేక వాహన పార్కింగులు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా తొలిసారి స్లాట్ విధానాన్ని ప్రవేశపెట్టారు.

బహిరంగ ప్రకటన మరియు హెచ్చరిక

మా క్లయింట్ బచ్చుమెహర్ ప్రశాంతి W/o బచ్చు సత్యనారాయణ అమరావతి కాలనీ, 3వలైను, డోర్ నెం. 2-582, నిలేష్ ఎన్‌క్లేవ్, ప్లాట్ నెం. FF-1 కానూరు, విజయవాడ రూరల్, ఎన్టీఆర్ జిల్లా నివాసి. సూచనల మేరకు తెలియజేయునది ఏమనగా సదరు బచ్చుమెహర్ ప్రశాంతిగారు కాజగ్రామం బాపతు D.No.501/B, మంగళగిరి మండలం గుంటూరు జిల్లాలోని 50 సెంట్ల పల్లం భూమిని సింహాద్రి ఉమామహేశ్వరరెడ్డి S/o వెంకటసుబ్బారెడ్డి గారి నుంచి కొనుగోలు చేయుటకు నిశ్చయించి ది.14-12-2025 తేదీన విక్రయ బనాయి అగ్రిమెంటు పొంది, అందుకు విక్రయ ప్రతిఫలం యావత్తు చెల్లించి సక్రమమైన దస్తావేజులు పొందుటకు నిశ్చయించి ఉన్నందున ఇందు విషయమై ఎవరికైనా ఎట్టి అభ్యంతరములు ఉన్నా, తక్షణమే రాతపూర్వకంగా ఈ క్రిందివారికి గానీ, పైన తెలిపిన వారికి గానీ తెలియజేయవలెను. లేనిచో నిష్పేచి ఆస్తిగా భావించి సదరు ఉమామహేశ్వరరెడ్డి గారి నుంచి సక్రమమైన విక్రయ దస్తావేజు పొంది బ్యాంకు నందు తనఖా ఉంచి రుణం కూడా పొందెదరు అని భవిష్యత్తులో సదరు ఆస్తిపై ఎట్టి అభ్యంతరములు చెల్లనేరవని, నా క్లయింటు బచ్చుమెహర్ ప్రశాంతి సర్వ సంపూర్ణ హక్కులు కలిగి ఉంటారని యావన్మందికి తెలియజేయుటమైనది.

29-12-2025, గుంటూరు

కానాధిభట్ల శ్రీనివాసమూర్తి, K.V.R.S.లక్ష్మి
న్యాయవాదులు, గుంటూరు. 94406 44769

బేస్‌బాల్ టోర్నమెంట్ విజేత ఆర్వీఆర్ జట్టు

విజేత జట్టుకు కప్ అందజేస్తున్న ప్రిన్సిపల్ విద్యాధర

గ్రామీణ గుంటూరు, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అంతర కళాశాలల బేస్‌బాల్ టోర్నమెంట్‌లో ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజేతగా నిలిచి కప్ అందుకుంది. గుంటూరు శివారు చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఇనిస్ట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (చిప్స్) కళాశాలలో టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. యూనివర్శిటీ పరిధిలోని 10 కళాశాలల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. నాకౌట్ పద్ధతిలో జరిగిన పోటీల్లో ఆర్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విన్నర్‌గా, ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల జట్టు రన్నర్‌గా నిలిచాయి. నరసరావుపేట వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు తృతీయ, చిలకలూరిపేట సీఆర్ కళాశాల నాలుగో స్థానాల్లో నిలిచాయి. చిప్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విద్యాధర విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్‌కు హాజరైన అన్ని జట్ల నుంచి యూనివర్శిటీ జట్టు ఎంపిక చేశామన్నారు. ఎంపికైన యూనివర్శిటీ జట్టు వచ్చే నెల 2న పుణేలో సావిత్రీ బాయి పులే విశ్వ విద్యాలయంలో జరగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ పోటీల్లో పాల్గొంటుందన్నారు. క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తా చాటి నాగార్జున విశ్వవిద్యాలయానికి మంచిపేరు తేవాలని సూచించారు. ఏఎన్‌యూ యోగా కో-ఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణ రావు పోటీలను పర్యవేక్షించారు. చిప్స్ కళాశాల పీడీ ఏడుకొండలు, గౌరీశంకర్, శివరామకృష్ణ, మల్లికార్జున రావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగుతున్న క్రికెట్ పోటీలు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే : మంగళగిరి ప్రీమియర్ లీగ్ సీజన్ 4 బోగి ఎస్టేట్స్ (నారా లోకేశ్ ప్రాంగణంలో) ఎనిమిదో రోజు ఆదివారం ఉత్సాహంగా సాగింది. డీడీ వారియర్స్ వర్సెస్ రైజింగ్ టైటాన్స్ మధ్య మ్యాచ్‌లో డీడీ వారియర్స్ జట్టు, లెవెన్ వోల్ఫ్స్ వర్సెస్ ఎల్లో వారియర్స్ మధ్య మ్యాచ్‌లో లెవన్స్ వోల్ఫ్స్ జట్టు విజయం సాధించాయి. విక్కీ లెవెన్ వర్సెస్ స్పెన్సర్ లెవెన్ బుల్లెట్స్ మధ్య మ్యాచ్‌లో విక్కీ లెవెన్ జట్టు, టీమ్ ఎన్జీటీ వర్సెస్ ట్రూ ఫ్రెండ్స్ టీమ్ మధ్య మ్యాచ్‌లో టీమ్ ఎన్జీటీ జట్టు విజయం సాధించాయి. కాలనీ కుర్రోళ్లు వర్సెస్ అరవపల్లి శ్రీనివాసరావు యూత్ జట్టు మధ్య మ్యాచ్‌లో కాలనీ కుర్రోళ్లు జట్టు గెలిచింది.

తెనాలి

•తెనాలి •పొన్నూరు

ఘనంగా హిందూ సమ్మేళనం

సమ్మేళనంలో హనుమత్ ప్రసాద్, మూర్తి, రాజేష్ తదితరులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతి పట్టణంలో హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంఘ్ పట్టణ ప్రముఖ్ హనుమత్ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం సాలిపేటలో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పొట్టి మూర్తి, కోటా రాజేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చినరావూరుతోటలో నిర్బంధ తనిఖీలు

తెనాలి చినరావూరుతోటలో ఆదివారం ఉదయం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. దాదాపు 100 మందికిపైగా పోలీసులు, అధికారులు తనిఖీలు చేపట్టారు. పాత కేసుల్లో ఉన్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. గంజాయి విక్రయ, వినియోగాలపై సమాచారం ఇవ్వాలని స్థానికులను కోరారు. ఈ మేరకు వారితో ప్రతిజ్ఞ చేయించారు. సరైన ధ్రువపత్రాలు లేని 43 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలు సీజ్ చేశారు. డీఎస్పీ బి.జనార్దనరావు పర్యవేక్షించగా.. సీఐలు మల్లికార్జునరావు, రాములనాయక్, సాంబశివరావు, ఎస్సైలు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలి పట్టణ గాంధీనగర్ జెండా చెట్టు రోడ్డు చివర కాలువలు పూడిపోయి, మురుగు ఇళ్లలోకి వస్తుంది. దోమలు, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. **- మోహన్, గాంధీనగర్**
✔ సత్వరం పూడికలు తొలగింపజేస్తాం. ? తెనాలి ఈటీ కాలనీలో వీధి దీపాలు.. వెలుగుతూ ఆరుతూ ఉన్నాయి. కొన్ని దీపాలు వెలగడం లేదు. **- లక్ష్మి, ఈటీ కాల.** ✔ వెంటనే మరమ్మతులు చేయిస్తాం. **- రామఅప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్**

◆ తెనాలి పట్టణ మారీసుపేటలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు ఈ నెల 26న మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా.. స్పందించిన అధికారులు మరమ్మతులు చేయించారు.
◆ తెనాలి మండలం కొలకలూరు ఎస్టీ కాలనీలో పగలు కూడా వీధి దీపాలు వెలుగుతున్నాయని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. సాంకేతిక సమస్యను సరి చేయించారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

? పొన్నూరు పరిధిలోని 15వ వార్డులో రహదారిపై గొయ్యి పడింది. మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. **- సీహెచ్ నరసింహారావు, 15వ వార్డు.** ✔ మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. **- షేక్ హసీనా, పురపాలక సంఘం సహాయ ఇంజినీరు.** ? పొన్నూరు పరిధిలోని 14వ వార్డులో చెత్త తొలగించడం లేదు. **- పి.డేవిడ్, 14వ వార్డు**
✔ చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం.

- పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి

◆ పట్టణ పరిధి షరాఫ్‌బజారులోని మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకున్నాయని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. పేరుకుపోయిన వ్యర్థాలను కార్మికులతో తొలగింపజేశారు. ◆ 18వ వార్డులో పాడైపోయిన వీధి దీపాన్ని బాగు చేశారు. **- న్యూస్‌టుడే, పొన్నూరు**

క్షణ క్షణం.. భయం భయం..

ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభాలు

పొన్నూరు, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాలను మార్చేందుకు నిధులు మంజూరు చేశామని ఆనాటి నేతలు గొప్పలు చెప్పారు. సంవత్సరాలు గడిచినా విద్యుత్తు స్తంభాలను మార్చలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా వాటిని మార్చి కొత్తవి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

✿ పొన్నూరు నుంచి రేపల్లె వెళ్లు మార్గంలో నిడుబ్రోలు రైల్వే వంతెనపై 27 విద్యుత్తు స్తంభాలను ఏళ్ల కిందట ఏర్పాటు చేశారు. కొన్ని విద్యుత్తు స్తంభాల దిమ్మెలు పగుళ్లిచ్చాయి. కొన్ని పెచ్చులూడి పడుతున్నాయి. చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. కొన్ని విద్యుత్తు స్తంభాలు ఒక వైపునకు ఒరిగి తీగలపై వేలాడుతున్నాయి. ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు.

✿ జీబీసీ రహదారిలోని కొప్పాక వెంకయ్య కూరగాయల మార్కెట్ నుంచి శాంతినగర్ అడ్డ

నిడుబ్రోలు రైల్వే వంతెనపై పగుళ్లిచ్చిన విద్యుత్తు స్తంభం దిమ్మె

రోడ్డు వరకు విభాగినుల మధ్యలో వీధి దీపాల కోసం స్తంభాలు ఏర్పాటు చేశారు. ఆ విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేసి సుమారు 20 ఏళ్ల అవుతుందని సిబ్బంది చెబుతున్నారు. కొంత కాలం కిందట ప్రమాదకరంగా ఉన్న కొన్నింటికి మరమ్మతులు నిర్వహించారు. అందులో నాలుగు స్తంభాలను తొలగించారు. ఆ ప్రాంతంలో బయట ఉన్న విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయలేదు. స్తంభాల మధ్య ఖాళీ ఉండటంతో రాత్రి సమయంలో వెలుగులు లేక చీకట్లో రాకపోకలు నిర్వహించడానికి పాదచారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

కొత్తవి ఏర్పాటు చేస్తాం..

దీనిపై పొన్నూరు పురపాలక సంఘం డీఈ పి.వెంకయ్యను న్యూస్‌టుడే వివరణ కోరగా.. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించి నూతన విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసే విధంగా తగు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

పార్టీ బలోపేతాకి కృషి చేయండి

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

పొన్నూరు, న్యూస్‌టుడే: జనసేన పార్టీ బలోపేతంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉమ్మడి జిల్లా ఆ పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం పొన్నూరులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పవన్ కల్యాణ్ ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడు ఇస్మాయిల్ బేగ్, కృష్ణా రిజినల్ సమన్వయకర్త బోనీ పార్వతీనాయుడు, మండల, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణావతారంలో వేంకటేశ్వరస్వామి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ధనుర్మాసం సందర్భంగా పట్టణ వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి దశావతార మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో 9వ రోజు ఆదివారం స్వామివారు శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు రథంపై ఆసీనులైన స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తన గానం

గీతాలు ఆలపిస్తున్న గాయకులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమాచార్యులు వేంకటేశ్వరస్వామిపై రాసి ఆలపించిన మధురగీతాలను సంకీర్తన గానం పేరుతో గత 8 ఏళ్లుగా నిర్వహిస్తున్నట్లు సంకీర్తన సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పురుషోత్తమరావు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన అన్నమయ్య పదాంజలి సంకీర్తన గానం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గాయకులు భక్తి గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రచయిత పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి, ఆంజనేయశాస్త్రి, మోదుకూరి నగధరరావు, మేడిచర్ల లక్ష్మీ సుజాతను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని సంస్థ కార్యదర్శి రాజేశ్వరరావు పర్యవేక్షించారు.

కాలమానిని ఆవిష్కరణ

కాలమానిని ఆవిష్కరిస్తున్న కాంతారావు తదితరులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: విరాట్ విశ్వకర్మ ఉద్యోగ సంక్షేమ సంఘం తెనాలి 2026 నూతన కాలమానిని కాకతీయ కోఆపరేటివ్ సొసైటీ గౌరవ ఛైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు ఆవిష్కరించారు. ఆయన ఆదివారం సొసైటీ కార్యాలయంలో కాలమానిని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ సలహాదారు పొన్నపల్లి రాజేశ్వరి వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

ఆహారపు అలవాట్ల మార్పుతో మధుమేహం దూరం

వ్యాయామం, ఆటపాటలు, ఆహార అలవాట్లలో మార్పుల ద్వారా మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చని డాక్టర్ శారద తెలిపారు. శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో తెనాలి బుర్రిపాలెం రోడ్డులో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలకు రక్త పరీక్షలు నిర్వహించి నెల రోజులకు సరిపడా మందులు పంపిణీ చేశారు. సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

ముగిసిన తైక్వాండో పోటీలు

పట్టణంలో నిర్వహిస్తున్న రాష్ట్ర తైక్వాండో ఫెడరేషన్ పోటీలు ఆదివారం ముగిశాయి. గుంటూరు జిల్లా క్రీడాకారులు అత్యధిక పతకాలు సాధించారని నిర్వాహక ప్రతినిధులు తెలిపారు. వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం, కృష్ణయ్య, సాంబశివరావు, హరినాథరావు, శ్రీనివాసరావు తదితరులు విజేతలను అభినందించి పతకాలు ప్రదానం చేశారు. **- న్యూస్‌టుడే, తెనాలి**

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: దేశాభివృద్ధిలో సింహభాగం కాంగ్రెస్ పరిపాలనలో జరిగిందని నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చందు సాంబశివుడు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ, పారిశ్రామిక, నీటి పారుదల వంటి పలు రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధించినట్లు ఆయన వివరించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని కూటమి ప్రభుత్వం, వైకాపాలు దేశ ప్రధాని నరేంద్ర మోదీని కోరడం లేదని విమర్శించారు. నరేగా పథకానికి గాంధీ పేరు తొలగించాలని అనుకోవడం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అత్యంత దుర్మార్గ చర్యని మండిపడ్డారు. తొలుత ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు.

'కార్మికుల హక్కులు హరిస్తున్నారు'

మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్

కొల్లిపర, న్యూస్‌టుడే: కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వీవీకే సురేష్ అన్నారు. ఆదివారం కొల్లిపరలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంగ్లేయుల కాలం నుంచి కార్మికులు పోరాడి 44 కార్మిక చట్టాలను సాధించుకున్నారని పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. మహిళా కార్మికుల భద్రతను ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. సీఐటీయూ నాయకులు ములకా శివసాంబిరెడ్డి, కోటా చంద్రశేఖరరావు, జయప్రద, దేవకుమారి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఉపేంద్ర

పొన్నూరు, న్యూస్‌టుడే: ఆర్థికంగా స్థిరపడిన ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఎండీ 316 జీఏటీ ఏరియా లీడర్ మూల్పూరి ఉపేంద్ర పేర్కొన్నారు. ఆదివారం రాత్రి జీబీసీ రహదారిలోని లయన్స్ క్లబ్‌లో నూతన సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవ కార్యక్రమాలు నిర్వహించే విధంగా అడుగులు వేయాలని కోరారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కుటుంబాలు ఆర్థిక అభివృద్ధి సాధించడంలో నేడు మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని వెల్లడించారు. సభ్యులు నన్నపనేని రఘునాథన్, యూన్నీ, శర్మ, బాలస్వామి, సాంబశివరావు, సూరినేని ఆంజనేయులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా వాలీబాల్ పోటీలు

పొన్నూరు, న్యూస్‌టుడే: పాత పొన్నూరులోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సందర్భంగా నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు ఆదివారం ఆసక్తికరంగా జరిగాయి. పోటీలు రెండో రోజుకు చేరుకున్నాయి. బాపట్ల, పాండిచ్చేరి, ఎస్ఆర్ఎం ఏపీ, ఏటికొప్పక, శ్రీకాళహస్తి, కడప జట్లు పోటీ పడ్డాయి.

అధ్వాన దారులు.. ఎన్నాళ్లీ అవస్థలు..?

పొన్నూరు, న్యూస్‌టుడే

పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రజల రాకపోకలకు రూ.లక్షలు ఖర్చుచేసి సిమెంటు రహదారులు నిర్మించారు. అవి ఇప్పుడు పగుళ్లిచ్చి అధ్వానంగా మారాయి. గత వైకాపా పాలనలో మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని అప్పటి నేతలు ప్రకటించారు. కానీ అది కార్యరూపం దాల్చలేదు. దీంతో ఆ మార్గాల్లో ప్రయాణించాలంటే.. ముఖ్యంగా రాత్రివేళల్లో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు వాహనాల టైర్లు గాడిలో పడి దెబ్బతింటున్నాయని.. ఫలితంగా వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొందని వాహనదారులు వాపోతున్నారు. పీబీఎన్ కళాశాల రోడ్డు, ఇందిరా నగర్, ఎస్టీ కాలనీ, ఆలూరు రోడ్డు, డీవీసీ కాలనీ, 19, 29వ వార్డు తదితర ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

29వ వార్డులో రహదారి దుస్థితి..

- పట్టణం : పొన్నూరు ☛ వార్డులు : 31
- జనాభా : 61500
- రహదారుల పొడవు : 170 కి.మీ.
- సిమెంటు రహదారులు : 130 కి.మీ.

నిధుల మంజూరుకు చర్యలు

దీనిపై పురపాలక సంఘం డీఈ పి.వెంకయ్యను న్యూస్‌టుడే వివరణ కోరగా.. నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

వెంకటకృష్ణ ప్రస్థానం స్ఫూర్తిదాయకం

చదువుపై ఆసక్తితో నిత్య విద్యార్థిగా 30కు పైగా డిగ్రీలు, పీజీలు, డిప్లొమోలు చేసిన పణిదెపు వెంకటకృష్ణ ప్రస్థానం స్ఫూర్తిదాయకమని, పెదరావూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల చిత్రకళోపాధ్యాయుడిగా ఆయన అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని మానవత సంస్థ ఛైర్మన్ కొలసాని రాంచంద్ పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జొన్నాదుల నరసింహారావు, ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, వాసు, వెంకట్, ఓంకార్ ప్రసాద్, సోమయ్యశాస్త్రి, ఎస్వీ శర్మ, మొవ్వా సత్యనారాయణ, వెంపటి సత్యనారాయణ, చిట్టినేని సాంబశివరావు, ఆలపాటి వెంకట్రామయ్య, ఈఎల్వీ.అప్పారావు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

సీనియర్ సిటిజన్స్ సంఘ సేవలు ఆదర్శనీయం

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తెనాలి సేవలు ఆదర్శనీయమని, న్యాయపరమైన అంశాలపై తన వంతు తోడ్పాటు అందిస్తానని న్యాయవాది షేక్ నాయబ్ రసూల్ పేర్కొన్నారు. సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన అతిథిగా పాల్గొని.. నూతన కార్యవర్గ ఎంపికను పర్యవేక్షించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మొవ్వా సత్యనారాయణ, ప్రసాదం పూర్ణచంద్రరావుతో పాటు ఈశ్వర్‌చంద్, కోటిరెడ్డి, ఆదినారాయణ, రామకృష్ణ, వెంపటి సత్యనారాయణ, రత్తయ్య, శివప్రసాద్ ఇతర హోదాల్లో ఎంపికయ్యారు. రానున్న రోజుల్లో నిర్వహించాల్సిన సేవలపై చర్చించారు. అనంతరం అతిథిని ఘనంగా సత్కరించారు. అయినాల మల్లేశ్వరరావుతో పాటు పెద్ద సంఖ్యలో సభ్యులు హాజరయ్యారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

పనులు చూపకుండా వేతన చెల్లింపులా?

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పురపాలక పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగాల పరిధిలో మొరాయించిన ఏడు వాహనాల చోదకులకు అధికారులు పనులు చూపకుండా వేతనాలు చెల్లించడంపై కార్మికుల నుంచి విమర్శలు విన్పిస్తున్నాయి. ఇదే అదనుగా పలువురు మున్సిపల్ గుత్తేదార్లు వారిని సొంత పనులకు వాడుకుంటున్నా.. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం తగదని, సరిదిద్దాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం

రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్న తెనాలి మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయుడు జయప్రకాష్‌ను చినరావూరులోని ఆయన నివాసంలో.. స్థానిక పెద్దలు శనివారం రాత్రి ఘనంగా సత్కరించారు. కాకినాడ సీనియర్ ప్రిన్సిపల్ న్యాయమూర్తి కేతావత్ మోతీలాల్, శ్రీనివాస్, పరశురాం నాయక్, ప్రసాద్ నాయక్, బాలకృష్ణ, రాములు, బాలకోటయ్య తదితరులతో పాటు మాస్టారు వద్ద చదువుకున్న పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

తెలుగువెలుగు దివ్వె ఎన్టీఆర్

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: నందమూరి తారక రామారావు తెలుగువెలుగు దివ్వెలాంటి వారని రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ పి.తేజస్వి అన్నారు. ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరణ, ఎన్టీఆర్ పురస్కార ప్రదాన సభ ఆదివారం స్థానిక ఎల్వీఆర్ క్లబ్, రీడింగ్ రూమ్ ప్రాంగణంలో జరిగాయి. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని కాలమానినిని ఆవిష్కరించి ప్రసంగించారు. అనంతరం తెలుగు అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.త్రివిక్రమరావు(విక్రమ్)కు ఎన్టీఆర్ పురస్కారాన్ని అందించి సత్కరించారు. ఆతరువాత సుఖమంచి కోటేశ్వరరావు, కావూరి సత్యనారాయణ, వేముల మోహనరావు, పలమాని శ్రీనివాసరావు, వరకూటి శివప్రసాదు, కేవీజే మురళీకృష్ణలకు రంగస్థల పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఘంటా పున్నారావు, అంబటి మధుమోహనకృష్ణ, ఎంవీఎల్ నరసింహారావు, బి.పూర్ణ, కందిమళ్ల సాంబశివరావు, జి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

ఒక్క చిత్రంతో వేలాది మాటల అర్థాన్ని చెప్పవచ్చని, చిత్రకళపై నిత్య సాధనతో వైవిధ్య ఆవిష్కరణలు చేయాలని త్రీ టౌన్ సీఐ సాంబశివరావు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన డ్రాయింగ్ హయ్యర్, లోయర్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులను ఆదివారం ఆయన తన ఛాంబర్‌లో అభినందించి ధ్రువపత్రాలు అందించారు. గురువు వెంకటకృష్ణ, విద్యార్థుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

అందుబాటులోకి మరుగుదొడ్లు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలపై నవంబరు 4న 'దయచేసి వినండి.. ఇక్కడ అన్నీ సమస్యలేనండి' శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు 2-3, 4-5 ప్లాట్‌ఫాంలపై మరుగుదొడ్లను ప్రయాణికుల కోసం అందుబాటులోకి తీసుకు వచ్చారు. మరమ్మతులు, ఇతర సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని స్టేషన్ మేనేజర్ వెంకటరమణ తెలిపారు.

ఈనాడు కథనానికి స్పందన

బేస్‌బాల్ టోర్నమెంట్ విజేత ఆర్వీఆర్ జట్టు

గ్రామీణ గుంటూరు, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అంతర కళాశాలల బేస్ బాల్ టోర్నమెంట్‌లో ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజేతగా నిలిచి కప్ అందుకుంది. గుంటూరు శివారు చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (చిప్స్) కళాశాలలో టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. యూనివర్సిటీ పరిధిలోని 10 కళాశాలల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. నాకౌట్ పద్ధతిలో జరిగిన పోటీల్లో ఆర్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విన్నర్‌గా, ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల జట్టు రన్నర్‌గా నిలిచాయి. నరసరావుపేట వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు తృతీయ, చిలకలూరిపేట సీఆర్ కళాశాల నాలుగో స్థానాల్లో నిలిచాయి. చిప్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విద్యాధర విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్‌కు హాజరైన అన్ని జట్ల నుంచి యూనివర్సిటీ జట్టు ఎంపిక చేశామన్నారు. ఎంపికైన యూనివర్సిటీ జట్టు వచ్చే నెల 2న పుణేలో సావిత్రీ బాయి పులె విశ్వ విద్యాలయంలో జరగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ పోటీల్లో పాల్గొంటుందన్నారు. క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తా చాటి నాగార్జున విశ్వవిద్యాలయానికి మంచిపేరు తేవాలని సూచించారు. ఏఎన్‌యూ యోగా కో-ఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణ రావు పోటీలను పర్యవేక్షించారు. చిప్స్ కళాశాల పీడీ ఏడుకొండలు, గౌరీశంకర్, శివరామకృష్ణ, మల్లికార్జునరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జనవరి 25న రాజ్యాంగ పరిరక్షణ సదస్సు

గుంటూరు విద్య: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జనవరి 25న విజయవాడ ఎంబీవీకేలో నిర్వహించనున్న రాజ్యాంగ పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. జేవీవీ రూపొందించిన విశ్వం, భూమి ఆవిర్భావంపై ప్రత్యేకంగా తయారుచేసిన నూతన ఏడాది కాలమానిని ఆదివారం ఆవిష్కరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు ఆదివారం తెలిపారు. దుర్గారావు (30) గతంలో గుంటూరులో హోటల్ నిర్వహించారు. ఆ సమయంలో అక్కడ రూ.20 లక్షలు అప్పు చేశారు. అయితే వ్యాపారంలో నష్టం రావడంతో.. ఆ అప్పు తీర్చలేక భార్య, కుమార్తెతో సహా తెనాలి వచ్చి ఓ హోటల్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. కాగా గుంటూరులో అప్పు ఇచ్చిన వారు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో.. ఈ నెల 27న పురుగుల మందు తాగి, గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

దాడికేసులో ముగ్గురి అరెస్టు

కొల్లిపర, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రి (సీహెచ్‌సీ)లో ఈ నెల 25న చికిత్స పొందుతున్న రోగిపై దాడి చేసి, ఆసుపత్రి ఆస్తుల విధ్వంసానికి పాల్పడిన నిందితులను అదుపులోకి తీసుకున్నామని కొల్లిపర ఎస్సై ఎన్‌సీ ప్రసాద్ ఆదివారం తెలిపారు. కొల్లిపర గ్రామానికి చెందిన తోట సూర్యనారాయణపై అదే గ్రామానికి చెందిన సాయిపవన్ కుమార్, షేక్ అబ్దుల్ కరీమ్, పోకూరి శ్రీను దాడిచేశారని తెలిపారు. ఆసుపత్రిలో రోగిపై జరుగుతున్న దాడిని అడ్డుకున్న సెక్యూరిటీ సిబ్బంది తిరుపతిరావు, రమాదేవిపై దాడికి పాల్పడ్డారన్నారు.

నిందితుడి ఆచూకీ లభ్యం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి పరిధిలోని పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తి ఆచూకీ తెలియజేస్తే రూ.10 వేలు బహుమతిగా ఇస్తామని ఇటీవల వన్‌టౌన్ పోలీసులు అతని చిత్రాన్ని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆ నిందితుడి ఆచూకీ తెలిసిందని.. విచారణ కొనసాగుతుందని తెలిసింది.

బీటెక్ విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి బాలాజీరావుపేటకు చెందిన ఓ యువతి బీటెక్ చదువుతున్నారు. కళాశాలకు వెళ్లే నిమిత్తం తండ్రి తన వాహనంపై బస్టాండ్ వద్ద దించారు. అటుపై ఆమె వద్ద ఉన్న ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. ఆదివారం వరకు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని.. దర్యాప్తు చేస్తున్నామని రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

మృతుడు బాపట్ల వాసి..

పెదకాకాని: పెదకాకాని పల్లాలమ్మ చెరువు వద్ద జాతీయ రహదారిపై ఈ నెల 26న గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుని వద్ద ఉన్న చరవాణి ఆధారంగా పోలీసులు వివరాలు సేకరించారు. బాపట్ల జిల్లా యాజిలి గ్రామానికి చెందిన దాసు(55) ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

www.kimssikhara.com
KIMS SIKHARA HOSPITALS
కిమ్స్ శిఖర హాస్పిటల్స్ గుంటూరుకు చెందిన ప్రముఖ సినియర్ కార్డియాలజిస్ట్ (గుండె వైద్యనిపుణులు) కన్సల్టేషన్ కొరకు తెనాలి లో అందుబాటులో ఉంటారు.

డా॥ నాగ శ్రీ హరిత పర్వతనేని
MD (Osm), DM (SVIMS), FESC, FSCAI, FACC
Ex. Associate Professor Guntur Medical College
Sr. Interventional Cardiologist
Director – Cardiac Sciences
ప్రతి మంగళవారం నాడు
సమయం: ఉ॥ 10 గం॥ నుండి సా॥ 6 గం॥ వరకు అందుబాటులో ఉంటారు.
ECG, 2D Echo, TMT సదుపాయం కలదు

స్థలం : ఆశ్రిత సూపర్ స్పెషాలిటి కేర్
7-5-31, లెక్చరర్స్ కాలని, ప్రకాశం రోడ్,
బ్యాంక్ ఆఫ్ బరోడా దగ్గర, గంగానమ్మపేట, తెనాలి.
అపాయింట్‌మెంట్ కొరకు సంప్రదించండి.
ఫోన్ నెం: 97057 53356 | 99661 90493

(c) eenadu

గుంటూరు తూర్పు

తెలుగువెలుగు దివ్వె ఎన్టీఆర్

గుంటూరు సాంస్కృతికం: నందమూరి తారక రామారావు తెలుగువెలుగు దివ్వెలాంటి వారని రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ పి.తేజస్వి అన్నారు. ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరణ, ఎన్టీఆర్ పురస్కార ప్రదాన సభ ఆదివారం స్థానిక ఎల్వీఆర్ క్లబ్, రీడింగ్ రూమ్ ప్రాంగణంలో జరిగాయి. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగు అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.త్రివిక్రమరావు(విక్రమ్)కు ఎన్టీఆర్ పురస్కారాన్ని అందించారు.

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 46, వంగ 20, బెండ 34, పచ్చిమిర్చి 36, కాకర 45, క్యారట్ 32, క్యాబేజీ 24, బీర 30, దొండ 42, బంగాళదుంప 25, ఉల్లిపాయలు 30, గోరుచిక్కుళ్లు 48, దోస 36, పొట్ల 34, చామదుంప 24, గోంగూర 10, తోటకూర 10, చుక్కకూర 10, మెంతికూర రూ.5, కొత్తిమీర 20, బీట్‌రూట్ 28, కీర 35, క్యాప్సికం 55, అల్లం 75, ఫ్రెంచి బీన్స్ 80, సొర 15, అరటి 8 **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

☛ పద్మావతినగర్ మూడో లైన్‌లో కాల్వల్లో తీసిన పూడికను ఇళ్ల ఎదుటే వదిలేయడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొందని స్థానికులు మనోహర్‌రావు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందితో పూడిక మట్టిని తరలించారు.

☛ అలీనగర్ ప్రధాన రోడ్డులో చెత్తకుప్పలు వదిలేయడంతో వీధి అపరిశుభ్రంగా ఉందని స్థానికులు వలి 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలిపారు. సమస్యను ప్రజారోగ్య విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో చెత్త కుప్పలు తీయించి తరలించారు.

- న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ(గుంటూరు)

వాట్సప్‌లో పోలీసు సేవలు

95523 00009కు హాయ్ అని పంపండి

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రజలకు వేగవంతంగా, పారదర్శకంగా, సులభమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్‌ను ఉపయోగించుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆదివారం ఎస్పీ తన కార్యాలయంలో మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ వివరాలను తెలిపారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచి ప్రజలు తమ సెల్ ఫోన్‌లో వాట్సప్ ద్వారా అనేక సేవలు పొందవచ్చని చెప్పారు. వాట్సప్ నంబర్ 95523 00009ను తమ ఫోన్‌లో సేవ్ చేసుకొని ఆ నంబర్‌కు హాయ్ (హెచ్‌ఐ) అని సందేశం పంపిండం ద్వారా మన మిత్ర సేవలు ప్రారంభమవుతాయన్నారు. ఆ తర్వాత పోలీసుశాఖ సేవలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఎఫ్ఐఆర్ డౌన్‌లోడ్ కోసం ఎంపిక చేసుకుని ఎఫ్ఐఆర్ నంబర్, జిల్లా, పోలీసుస్టేషన్, ఎఫ్ఐఆర్ నంబర్, సంవత్సరం వివరాలను నమోదు చేయాలని తెలిపారు. వెంటనే వారి వాట్సప్‌కు ఎఫ్ఐఆర్ కాపీ వస్తుందని, దాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. ఇదే తరహాలో ఈ-చలానా స్థితిగతులు, వాహనాలపై విధించిన ఈ చలానా వివరాలు తెలుసుకోవటంతోపాటు చలానాలను కట్టుకోవచ్చన్నారు. జిల్లాలో మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్ కార్యక్రమాన్ని డిజిటల్‌గా వినియోగించుకునేలా జిల్లా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఎస్పీ తెలిపారు.

విలీన గ్రామాల ప్రతిపాదన వ్యతిరేకిస్తున్నా: ఎమ్మెల్యే మాధవి

పట్టాభిపురం, నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రతిపాదన మేరకు 11 విలీన గ్రామాలను జీఎంసీలో విలీనం చేయాలని కౌన్సిల్ తీర్మానించిందని.. దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. ఆదివారం హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆమె మీడియాతో మాట్లాడారు. 18 గ్రామాలు గుంటూరులో విలీనం ప్రతిపాదన కౌన్సిల్‌లోకి వచ్చే రెండు రోజుల ముందే ముగ్గురు ఎమ్మెల్యేలు, మేయర్, అధికారుల సమక్షంలో సమావేశమై చర్చించామన్నారు. అనేక అంశాలపై సందేహాలున్నాయని, పరిపాలన, మౌలిక వసతుల కల్పన పరంగా ఇబ్బందులు వస్తాయని.. ఈ ప్రతిపాదన సరికాదని.. పునరాలోచన చేయాలని తాను సూచించినట్లు చెప్పారు. ఇదే విషయం మేయర్, ఎమ్మెల్యే రామాంజనేయులకు అప్పుడే చెప్పానని తెలిపారు. అయితే శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో 17 గ్రామాలతోపాటు పెదకాకాని గ్రామాన్ని కలిపితే తాను ఆమోదం తెలిపినట్లు మేయర్ కోవెలమూడి మీడియాకు చెప్పారన్నారు. ఆ గ్రామం వేరే నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది.. పొరుగు నియోజకవర్గాల వ్యవహారాల్లో తాను జోక్యం చేసుకోనని తెలిపారు.

ఏగ్రామం విలీనంలో ఉందో.. లేదో కూడా తనకు అవగాహన, స్పష్టత లేదన్నారు. ఇప్పటికే గుంటూరు పశ్చిమంలో పదేళ్లుగా సరైన నాయకత్వం లేక మౌలిక వసతుల సమస్యలు ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయన్నారు. ఈపరిణామాల నేపథ్యంలో ఇప్పటికిప్పుడు 18 గ్రామాల విలీనాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో పూర్తిగా విశ్లేషించాక 18 గ్రామాలు కలిపితే సరిపోతుందా.. మెగా సిటీగా అవతరించాలంటే మరికొన్నింటిని కలపాల్సి ఉంటుందో ఆలోచన చేయాలన్నారు. కేంద్ర మంత్రి సమక్షంలో కూర్చుని ఈఅంశంపై పూర్తిగా చర్చించాకనే ఒక నిర్ణయానికి వస్తామని తెలిపారు. ఈరోజు కీరోజు ప్రతిపాదన పైకి పంపాల్సిన అవసరం లేదని నా అభిప్రాయమన్నారు. నేను ప్రతిపాదిస్తేనే అందరూ ఏకగ్రీకంగా అంగీకరించారని మేయర్ అన్న మాటల్లో ఆంతర్యమేమిటో తెలియదన్నారు.

విజేతలైన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపల్ బాలకృష్ణ, ఉపాధ్యాయురాలు కోటేశ్వరి

విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: కొత్తపేటలోని ఎన్ఆర్‌బి ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్‌లో 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. వర్తమాన వ్యవహారాలు, జనరల్ నాలెడ్జ్, క్రీడలపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీహెచ్ రూత్‌మేరీ (10వ తరగతి) ప్రథమ, ఓ. పూజిత (9వ తరగతి) ద్వితీయ, డి. హారికీర్తన (8వ తరగతి) తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ బాలకృష్ణ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

జనవరి 25న రాజ్యాంగ పరిరక్షణ సదస్సు

గుంటూరు విద్య: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జనవరి 25న విజయవాడ ఎంబీవీకేలో నిర్వహించనున్న రాజ్యాంగ పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. జేవీవీ రూపొందించిన విశ్వం, భూమి ఆవిర్భావంపై ప్రత్యేకంగా తయారుచేసిన నూతన ఏడాది కాలమానిని ఆదివారం ఆవిష్కరించారు.

4న చలో విశాఖపట్నం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలు సందర్భంగా జనవరి 4న విశాఖలో జరుగనున్న కార్మిక ప్రదర్శన, బహిరంగ సభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. ఆదివారం గుంటూరులోని కార్యాలయంలో గోడ ప్రతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణరావు, సాంబశివరావు, రమణ, ముత్యాలరావు పాల్గొన్నారు.

నాణ్యత లోపం.. పౌరులకు శాపం

న్యూస్‌టుడే, గుంటూరు నగరం

ధ్వంసమైన టైల్స్

నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత కొరవడుతోంది. పది కాలాలపాటు ఉండాల్సిన పనులు ఏడాది తిరగకుండానే మరమ్మతులకు గురవుతున్నాయి. గుత్తేదారుల ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నా అడిగే నాథులు లేరు. పర్యవేక్షించాల్సిన ఇంజినీరింగ్ విభాగం అధికారులు చోద్యం చూస్తున్నారు. అధికారులపై రాజకీయ ఒత్తిళ్ల కారణమో ముడుపుల మాయో తెలియదు కానీ నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న పనులు నాసిరకంగా సాగుతున్నాయి. కొత్తపేట నుంచి నెహ్రూనగర్ రైల్వే గేటు వరకు ఏడాది కిందట చేసిన విస్తరణ పనులే ఇందుకు నిదర్శనం. ఇక్కడ ప్రధాన రహదారిని విస్తరించి సీసీ రోడ్డు నిర్మించారు. సీసీ రోడ్డు, మురుగు కాల్వల మధ్యలో ఉన్న రోడ్డుకు రూ.15 లక్షలతో టైల్స్ వేశారు. సాధారణంగా రోడ్డు పైన బెడ్ వేసి ఆ తర్వాత టైల్స్ పరవాలి. బెడ్ వేయకుండానే పంచగా సిమెంట్ వేసి టైల్స్ అంటించారు. బెడ్ వేయకపోవటంతో కొన్ని చోట్ల టైల్స్ కుంగిపోయాయి. మరి కొన్ని చోట్ల ధ్వంసమయ్యాయి. అధికారులు ముడుపులు తీసుకుని పనుల వైపు తొంగి చూడటంలేదన్న ఆరోపణలున్నాయి.

వాహనాలకు పార్కింగ్‌గా మారి.. రహదారికి రెండు వైపులా టైల్స్ వేసిన ప్రాంతంలో ప్రైవేటు వాహనాలు నిలుపుతున్నారు. కార్లు, మినీలారీలు, అంబులెన్సులు టైల్స్‌పై నిలపటంతో కొన్ని చోట్ల రోడ్డు కుంగిపోయింది. మరికొన్ని చోట్ల వాహనాల బరువుకు టైల్స్ పగులుతున్నాయి. పాదచారుల కోసం రూ.15 లక్షల ఖర్చుచేసి నిర్మించిన వీటిపై వాహనాలు నిలిపినా, వ్యాపారాలు బంకులు, తోపుడుబండ్లు పెట్టినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు.

నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు సహకారం

పట్టాభిపురం: అత్యాధునిక నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు సహకారం అందజేస్తామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. ఐరోపాలో స్థిరపడిన ఎన్నారై దంపతులు బండారు అశోక్‌కుమార్, జయలక్ష్మి ఆదివారం ఆయన్ని కలసి పెదకాకానిలో ఏర్పాటు చేయనున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రం గురించి చర్చించారు. యువత సాధికారతే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

అప్పారావును అభినందిస్తున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మిర్చియార్డుకు వచ్చే రైతులకు మెరుగైన సేవలు అందించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ సూచించారు. మిర్చియార్డు ఛైర్మన్ కుర్రా అప్పారావు ఆదివారం ఆయన్ని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. మిర్చియార్డు పాలకవర్గం కూర్పు, రైతులకు సీజన్‌లో అందించాల్సిన తోడ్పాటు తదితర అంశాలు చర్చకు వచ్చాయి. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ మిర్చియార్డుపై ఆధారపడి వేలాది మంది జీవిస్తున్నారు. అందర్నీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. అప్పారావు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే నసీర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

కూడళ్ల సుందరీకరణ ఏదీ?

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే

అభివృద్ధికి దూరంగా పొన్నూరు రోడ్డు కూడలి

తూర్పు నియోజకవర్గంలోని రద్దీ రహదారుల్లో కూడళ్ల అభివృద్ధి పనుల్లో తాత్సారం జరుగుతోంది. గతంలో వైకాపా ప్రభుత్వ హయాంలో గుంటూరు నగరపాలకసంస్థ పరిధిలో మొత్తం 12 ప్రాంతాల్లో కూడళ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేశారు. వాటిలో మూడు, నాలుగు మినహా మిగిలినవన్నీ వదిలేశారు. తూర్పు నియోజకవర్గంలో ఒక్క చోట కూడా అభివృద్ధి పనులు పూర్తి చేసిన దాఖలా లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక నందివెలుగు రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు పూర్తిచేశారు. సగంలోనే ఆగిన కూడళ్ల అభివృద్ధి పనులను మాత్రం ప్రాధాన్య క్రమంలో చేయాల్సి ఉన్నా ఇప్పటివరకు దృష్టి సారించకపోవడంతో కూడళ్లు కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే గ్రిల్స్, పచ్చదనంతోపాటు, ఫౌంటెయిన్‌లకు మరమ్మతులు చేపట్టాలి. కూడళ్ల వద్ద ఫ్రీలెఫ్ట్‌లు, వన్‌వేల్లో బ్యారికేడింగ్, ట్రాఫిక్ జీబ్రా లైన్లు, రహదారి నిబంధనలపై సూచిక బోర్డులు, ఆక్రమణలు జరగకుండా వెండార్ జోన్ ప్రాంతం వంటివి ఏర్పాటు చేయాలి.

☛ పాత బస్టాండ్ నుంచి మాయా బజారు మీదుగా బస్టాండ్ వరకు రహదారికిరువైపులా ఆక్రమణలు జరగకుండా చూడాలి.

☛ ఇటీవల అధికారులు, ప్రజాప్రతినిధులు ఎక్కువగా రాకపోకలు చేసే ప్రాంతాల్లో చేపట్టిన పెయింటింగ్ ఆకర్షణీయ కూడళ్ల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలి.

☛ కూడళ్ల అభివృద్ధితోపాటు ఇతర సివిల్ పనులు సంబంధించిన డీపీఆర్‌లు, ప్లాన్‌లు సిద్ధం చేసేందుకు ఆర్కిటెక్చర్ ఇంజినీర్లను తూర్పు నియోజకవర్గానికి కేటాయించాలని కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే నసీర్ కోరారు. దీనికి మేయర్ కోవెలమూడి స్పందించి వెంటనే ఆర్కిటెక్చర్‌ను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ ప్రాంతాలపై దృష్టి సారించాలి : ☛ పొన్నూరు రోడ్డు బీఆర్ స్టేడియం కూడలి ☛ ఎన్టీఆర్ సెంటర్ ☛ ఇన్నర్ రింగు రోడ్డు ☛ ఆటోనగర్ కూడలి ☛ గుంటూరువారి తోట ☛ కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డు ☛ పాతబస్టాండ్ ☛ హిమనీ కూడలి ☛ పొన్నూరు రోడ్డు నుంచి లాంచెస్టర్ రోడ్డు ఐలాండ్

సహాయగుణం పెంపొందించుకోవాలి

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

పంపిణీ చేస్తున్న దుర్గారావు, యర్రగోపు నాగేశ్వరరావు, సభ్యులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరు పేదలకు సహాయం చేయడం అలవరచుకోవాలని నెహ్రూనగర్ వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యర్రగోపు నాగేశ్వరరావు అన్నారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో నెహ్రూనగర్ వాకర్స్ అసోసియేషన్ సహకారంతో ఆదివారం వెంకటాద్రిపేటలోని వృద్ధాశ్రమం, ఏటీ అగ్రహారంలోని వృద్ధాశ్రమం, రైల్వేస్టేషన్, ప్రభుత్వాసుపత్రి వద్ద ఉన్న వృద్ధులకు 300 దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు దుర్గారావు, సభ్యులు అయిశెట్టి శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి, సదాశివరావు, శ్రీనివాసకుమార్, వెంకట్రావు, మల్లికార్జునరావు, సాయి, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు మోహిని అలంకారంలో దర్శనం

ముస్తాబైన లక్ష్మీనరసింహస్వామి ఆలయం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : ఆర్ అగ్రహారంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి పర్వదినానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఆదివారం ఆలయ ఈవో ఆంజనేయులు తెలిపారు. 29వ తేదీ సాయంత్రం స్వామివారు మోహిని అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. 30వ తేదీ వేకువ జామున 5 గంటల నుంచి భక్తులకు ఉత్తరద్వార దర్శనంతో పాటు శంఖుతీర్థం అందిస్తారని ఈవో తెలిపారు.

30న ఆలయంలో ప్రత్యేక పూజలు

వెంకటేశ్వరస్వామి విగ్రహం

పట్నంబజారు, న్యూస్‌టుడే: నందివెలుగు రోడ్డు వస్త్రనగర్‌లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత కామ్యసిద్ధి వేంకటాచల దేవస్థానంలో ఈనెల 30వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం దేవస్థాన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 30న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 6 గంటలకు ఉత్తర ద్వారదర్శనం, భక్తులకు శంఖుతీర్థం అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మండల శేషగిరిరావు, మద్దినేని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'పీడీ చట్టం అమలు అప్రజాస్వామికం'

నిరసన తెలుపుతున్న సీపీఎం, ఐద్వా, ప్రజాసంఘాల నాయకులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : ప్రజా ఉద్యమాలపై పీడీ చట్టం ప్రయోగించటం అప్రజాస్వామికమని సీపీఎం నగర కార్యదర్శి నళినీకాంత్ అన్నారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ఐద్వా, ప్రజా సంఘాలు నగరంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి జిల్లాలో ప్రజా సమస్యలపై పోరాడుతున్న సీపీఎం నాయకులు అప్పలరాజుపై ప్రభుత్వం పెట్టిన పీడీ చట్టం రద్దు చేసి జైలు నుంచి విడుదల చేయాలని నళినీకాంత్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అరుణ, ముత్యాలరావు, శంకరరరావు, మల్లికార్జునరావు, సదాశివరావు పాల్గొన్నారు.

బేస్‌బాల్ టోర్నమెంట్ విజేత ఆర్వీఆర్ జట్టు

గ్రామీణ గుంటూరు, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అంతర కళాశాలల బేస్ బాల్ టోర్నమెంట్‌లో ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజేతగా నిలిచి కప్ అందుకుంది. గుంటూరు శివారు చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (చిప్స్) కళాశాలలో టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. యూనివర్సిటీ పరిధిలోని 10 కళాశాలల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. నాకౌట్ పద్ధతిలో జరిగిన పోటీల్లో ఆర్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విన్నర్‌గా, ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల జట్టు రన్నర్‌గా నిలిచాయి. నరసరావుపేట వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు తృతీయ, చిలకలూరిపేట సీఆర్ కళాశాల నాలుగో స్థానాల్లో నిలిచాయి. చిప్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విద్యాధర విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన యూనివర్సిటీ జట్టు వచ్చే నెల 2న పుణెలో సావిత్రీ బాయి పులే విశ్వ విద్యాలయంలో జరగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటుందన్నారు. క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తా చాటి నాగార్జున విశ్వవిద్యాలయానికి మంచిపేరు తేవాలని సూచించారు.

రేపటి నుంచి సంక్రాంతి సంబరాలు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: అయిశెట్టి సీతారామయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం నుంచి నెహ్రూనగర్‌లో సంక్రాంతి సంబరాలు, ధనుర్మాస మహోత్సవాలు ప్రారంభమవుతాయని ట్రస్టు వ్యవస్థాపకులు, స్థానిక కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గా శ్రీనివాస్ తెలిపారు. ఈసందర్భంగా శ్రీకోమలపల్లి తాయారు సమేత శ్రీసారంగపాణి స్వామివార్ల విగ్రహాలను ఏర్పాటు చేసి అఖండ స్థాపన, నిత్య పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 30వ తేదీ వైకుంఠ ఏకాదశి రోజు ఉత్తరద్వార దర్శనం, జనవరి 9న స్వామివార్లకు శాంతి కల్యాణం, 10న కుడారై ఉత్సవం జరుగుతుందని చెప్పారు.

కార్పొరేట్ సంస్థలకు వక్ఫ్ భూములు ఇవ్వొద్దు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: ముస్లింల అభివృద్ధి కోసం కేటాయించిన వక్ఫ్ భూములను పారిశ్రామిక కారిడార్ పేరుతో కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందని జిల్లా కార్యదర్శి నేతాజీ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. వక్ఫ్ భూములు అమ్మటానికి, కొనడానికి, సేకరించటానికి చట్టం అంగీకరించదని తెలిపారు. నాయకులు రామారావు, అప్పారావు, దుర్గారావు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో శ్రీ తిరుపతమ్మ అమ్మవారి సేవల టిక్కెట్లు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో దర్శనం, సేవలు, ప్రసాదాలను రాష్ట్రప్రభుత్వ వాట్సప్ మన మిత్ర ద్వారా పొందవచ్చు. మన మిత్ర నంబరు 95523 00009 వాట్సప్ ద్వారా, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ ఏపీటెంపుల్స్.ఏపీ. జీవోవీ.ఇన్ ద్వారా సేవలు పొందవచ్చని ఈవో మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆయా సేవల కోసం క్యూలైన్‌లో వేచి ఉండాల్సిన అవసరం లేదని ఈవో తెలిపారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని 30వ తేదీ మంగళవారం దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశామని చెప్పారు.

కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యం

రాజీవ్‌గాంధీభవన్‌లో జెండా ఆవిష్కరిస్తున్న డీసీసీ అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్

పట్నంబజారు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని డీసీసీ అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం 140 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం రాజీవ్‌గాంధీ భవన్‌లో ఆయన జెండా ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో అన్ని మూలలా కాంగ్రెస్ పార్టీ జ్ఞాపకాలు ఉన్నాయన్నారు. భవిష్యత్తులో జిల్లా పరిధిలోని కాంగ్రెస్ పార్టీ మహనీయుల విగ్రహాలను గుర్తించి, వాటి మరమ్మతులు చేయించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏడుగురి సభ్యులతో కూడిన కమిటీని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, బిళ్లా సునీల్, ఆర్.జాన్‌బాబు, గడ్డం పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ వినూత్న నిరసన

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు ఇవ్వకుంటే వారికి ఆత్మహత్యలే శరణ్యం అని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు అన్నారు. ఆదివారం నగరంలో ఏఐవైఎఫ్ నాయకులు మెడకు ఉరితాళ్లు వేసుకొని, మరికొందరు బిక్షాటన చేస్తూ వినూత్నంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. రాజేంద్రబాబు మాట్లాడుతూ నిరుద్యోగ భృతి రూ. 3 వేలు ఇవ్వాలని, జనవరి 1న జాబ్ కేలండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాల చైతన్య, షేక్ వలి, నాయకులు చిన్న, శ్రీను, అరుణ్, ఖాసిం, ఖాదర్‌వలి, సాయి, బన్నీ, అజయ్, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు సత్కారం

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్ట్ 15వ వార్షికోత్సవం ఆదివారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఎం. క్యూరీ సంకలనం చేసిన 'మానవతామూర్తి మేడం క్యూరీ' పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం. గేయానంద్, 'ఆధునిక భారత శాస్త్రవేత్తలు' పుస్తకాన్ని చలపతి విద్యాసంస్థల ఛైర్మన్ వైవీ.ఆంజనేయులు, 'బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక' పుస్తకాన్ని మలినేని విద్యాసంస్థల అధినేత మలినేని పెరుమాళ్ళు ఆవిష్కరించారు. భౌతికశాస్త్రంలో విశేష సేవలందిస్తున్న రాయపాటి శివనాగేశ్వరరావుకు విశిష్ట పురస్కారం ప్రదానం చేశారు. మరో 30 మంది భౌతికశాస్త్రం ఉపాధ్యాయులను సత్కరించి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు, ట్రస్ట్ కార్యదర్శి కె.అలీన్, కె.విజయలక్ష్మి, జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య

పట్నంబజారు, న్యూస్‌టుడే: అప్పుల బాధతో వ్యాపారి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకొన్న ఘటన ఇది. లాలాపేట పోలీసుల కథనం ప్రకారం.. చాకలిగుంటకు చెందిన ఎ.లక్ష్మీపతి (44) కొద్ది కాలంగా పట్నంబజారులో తోపుడుబండిపై మిఠాయిలు విక్రయిస్తున్నాడు. వ్యాపార లావాదేవీల నిమిత్తం తెలిసిన వ్యక్తుల వద్ద రూ.20 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అప్పులు తీర్చలేక శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

10 మందిపై కేసులు నమోదు

పట్నంబజారు, న్యూస్‌టుడే: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై ఆదివారం పాతగుంటూరు పోలీసులు కేసులు నమోదు చేశారు. బస్టాండు సెంటర్, బి.ఆర్.స్టేడియం సెంటర్, పొన్నూరు రోడ్డు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి మద్యం తాగి రోడ్లపై తిరుగుతున్న 10మందిపై కేసులు నమోదు చేసినట్లు సి.ఐ. వెంకట ప్రసాద్ తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆర్టీసీలో కలపండి

మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి హనుమంతరావు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆర్టీసీలో కలపాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి హనుమంతరావు డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తపేటలోని కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుధీర్‌కుమార్, కుమార్‌నాయక్, ప్రధాన కార్యదర్శి గంగాంజనేయులు, కార్యదర్శి ప్రసాద్‌కుమార్, జిల్లా నాయకులు రాజేష్, చక్రవర్తి, రాంబాబు, జ్యోతి పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణకు ప్రత్యేక చర్యలు

మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్

పట్నంబజారు, న్యూస్‌టుడే: గంజాయి విక్రయదారులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకొంటున్నారని డీఎస్పీ అబ్దుల్ అజీజ్ అన్నారు. ఆనందపేట 3వ లైనులో ఆదివారం రాత్రి మత్తు పదార్థాల నిర్మూలనపై నిర్వహించిన సంకల్పం సభలో ఆయన మాట్లాడారు. గంజాయి వాడకం వల్ల యువత జీవితం అంధకారంలో మగ్గుతుందన్నారు. మత్తు పదార్థాలు తరలించే వారి సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయి విక్రయాలు చేసిన పాత నేరస్థుల కదలికలపై నిఘా పెట్టామన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారి గురించి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. శివారు ప్రాంతాల్లో పోలీసుల గస్తీలు ముమ్మరం చేయనున్నట్లు డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపారు. కార్యక్రమంలో పాతగుంటూరు సి.ఐ. వెంకట ప్రసాద్, ఎస్.ఐ. రెహమాన్, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పట్నంబజారు, న్యూస్‌టుడే: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని లాలాపేట సి.ఐ. శివప్రసాద్ సూచించారు. పొన్నూరు రోడ్డులోని కొబ్బరికాయ సాంబయ్య కాలనీలో ఆదివారం రాత్రి డ్రగ్స్ నిర్మూలనపై నిర్వహించిన సంకల్పం సభలో ఆయన మాట్లాడారు. శివారు ప్రాంతాల్లో జరిగే మత్తు పదార్థాల విక్రాయల గురించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోరాదని సూచించారు. కార్యక్రమంలో ఎస్.ఐ.లు రవికుమార్, ఆసిన్, బాలనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

భారతదేశపు అతిపెద్ద మరియు అత్యంత విశ్వసనీయమైన సహజ ఫైబర్ ఉత్పత్తులు

ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో వారి శారీస్ ఫెస్టివల్

రానున్న వివాహ సీజన్ & సంక్రాంతి పండుగల సందర్భంగా

100% స్వచ్ఛమైన చేనేత వస్త్రాల ప్రదర్శన & అమ్మకం

తేది: 29, 30, 31 డిసెంబర్ 2025 & 1st జనవరి 2026

4 రోజులు మాత్రమే

ఉ. 10.30 నుంచి రా. 8.00 వరకు

వేదిక: శుభం కన్వెన్షన్ సెంటర్, రింగ్‌రోడ్, రాజేంద్రనగర్ 1వ లేన్, గుంటూరు.

బనారసి ప్రత్యేక సేకరణ | పశ్చిమ బెంగాల్ బోటిక్ వస్తువులు | టస్సార్ కాంత & ప్రింటెడ్ | చందేరి / మహేశ్వరి / కోటా రాజ్‌కోట్ పటోలా | పోచంపల్లి ఇక్కత్ | బెంగళూరు ప్యూర్ క్రేప్ సిల్క్స్ | బీహార్ & జార్ఖండ్ టస్సార్ వస్త్రాల మెటీరియల్స్ | గద్వాల్ | కలంకారి | కాంచీపురం | పైతాని చీరలు | వెంకటగిరి / ఉప్పాడ జమ్దాని చీరలు మరియు కాటన్ దుస్తులు మెటీరియల్స్ | బెడ్ లినెన్లు | ఆభరణాలు

సంప్రదించండి: 95735 53337 లేదా 9000346337 Info@indiansilkgallery.com

(c) eenadu

గుంటూరు పశ్చిమ

అలరించిన సంగీత విభావరి

గానాలాపన చేస్తున్న లక్ష్మీ శ్రీవల్లి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై పాడుతా తీయగా విజేత కాందూరి లక్ష్మీశ్రీవల్లి భక్తి సంగీత విభావరి ఆదివారం రాత్రి జరిగింది. అన్నమాచార్య, త్యాగరాజస్వామి, దీక్షితులు, పురందరదాసు కీర్తనలు, మరి కొన్ని భక్తి గీతాలను ఆలపించారు. కీబోర్డుతో కె.రవిబాబు, తబలాతో బాలాజీ సహకరించారు. విభావరికి ముందు డాక్టర్ కోగంటి వెంకట శ్రీరంగనాయకి తిరుప్పావై ప్రవచనం జరిగింది. తొలుత జ్యోతి వెలిగించి కార్యక్రమాలను దేవస్థానం అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య ప్రారంభించారు.

చదువు భవిష్యత్తుకు పునాది

5కే వాక్‌ను ప్రారంభిస్తున్న నన్నపనేని మంగాదేవి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: చదువు కోసం వేసే ప్రతి అడుగు భవిష్యత్తుకు పునాది అని శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ విద్యాసంస్థల వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ నన్నపనేని మంగాదేవి పేర్కొన్నారు. వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం 5కే వాక్ ఫర్ ఎడ్యుకేషన్.. . హెల్త్, అండ్ పీస్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. జెండా ఊపి 5కె వాక్‌ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో సీఏవో దుర్గా రఘురాం, సహ కార్యదర్శి జయశ్రీ, మరుద్వతి, ప్రిన్సిపల్స్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నవతరం సేవాపథం

కాలనీల్లో జేకేసీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శిబిరాలు

వైద్యశిబిరంలో విధులు నిర్వహిస్తూ..

పరిసరాలను శుభ్రం చేస్తున్న వాలంటీర్లు

నవభారత్‌నగర్, న్యూస్‌టుడే

పుస్తకాలు, పరీక్షలతో కుస్తీపట్టే విద్యార్థులు పలుగు, పార చేతబట్టుకొని సామాజిక సేవకు కదిలారు. మొక్కలు నాటారు. వీధులు, మురుగు కాల్వలు శుభ్రం చేశారు. పిల్లలకు పోలియో చుక్కలు వేయించడం, ఆరోగ్యశిబిరంలో భాగస్వామ్యం, పలు అంశాల మీద ప్రదర్శనలు నిర్వహించి ఆయా ప్రాంతాలవాసులకు అవగాహన కల్పించిన జేకేసీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలను తెలుసుకుందాం.

గుంటూరు జేకేసీ కళాశాలలో మూడు ఎన్ఎస్ఎస్ యూనిట్లకుగాను 150 మంది వాలంటీర్లు ఉన్నారు. ఏడాది పొడవునా జరిగే కార్యక్రమాలతోపాటు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈనెల 18 నుంచి 24 వరకు ఏడు రోజులపాటు ఈ శిబిరం జరిగింది. యూనిట్-1 వాలంటీర్లు నేతాజీనగర్, యూనిట్-2 వాలంటీర్లు ఐద్వా నగర్, యూనిట్-3 వాలంటీర్లు కృష్ణతులసినగర్‌లో సేవలు నిర్వహించారు. రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి ఆచార్య మద్దినేని సుధాకర్, ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య దివ్యతేజోమూర్తి, జిల్లా ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ జె.వి.సుధీర్‌కుమార్ [illegible] ఇరువైపులా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను స్థానికులకు అప్పగించారు. ఆయా కాలనీల్లో అనారోగ్య సమస్యల గురించి సర్వే చేశారు. ఆరోగ్య శిబిరంలో కంటి, దంత, మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ పరీక్షలు చేయించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు చరణ్‌చౌదరి, డాక్టర్ రాహుల్, అజయ్‌బాబు వాలంటీర్లను పర్యవేక్షించారు.

అలరించిన పౌరాణిక పద్యనాటకాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: [illegible]

ఆరోగ్య కేంద్రాలతో ప్రభుత్వాసుపత్రిపై తగ్గనున్న భారం

శిలాఫలకం ఆవిష్కరించిన పెమ్మసాని చంద్రశేఖర్, గళ్లా మాధవి, కోవెలమూడి రవీంద్ర, పులి శ్రీనివాసులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: [illegible] నికి నిధులు మంజూరు చేసి నిర్మాణానికి చర్యలు తీసుకున్నాం. ఇది ఎమ్మెల్యే మాధవి ప్రత్యేకంగా దృష్టి సారించడం వల్ల సాధ్యమైంది. రూ.కోటి వ్యయంతో అన్ని సౌకర్యాలతో కేంద్రం ఏర్పాటు చేస్తామని వివరించారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ ఇప్పటికే ఎనిమిది ఆరోగ్య కేంద్రాలు [illegible] ప్రతిపాదనలు అందజేశానని తెలిపారు. మంత్రి సత్యకుమార్‌యాదవ్ స్పందించి నిధులు మంజూరు చేశారని వివరించారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, తెదేపా జిల్లా అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల తదితరులు పాల్గొన్నారు.

బలహీనవర్గాలకు తెదేపా ప్రాధాన్యం



పిల్లి మాణిక్యరావును సత్కరిస్తున్న వేములకొండ శ్రీనివాస్

పట్టాభిపురం, న్యూస్‌టుడే: బడుగు, బలహీనవర్గాలకు ప్రాధాన్యం ఇచ్చేది తెలుగుదేశం పార్టీ ఒక్కటేనని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు పేర్కొన్నారు. తెదేపా బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్‌తో పాటు బీసీ నాయకులు పలువురు ఆయన్ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాణిక్యరావు మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పని చేస్తే జిల్లాలో తెదేపాకు తిరుగు లేదు...అనే విధంగా ముందుకు సాగుదామన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జిల్లాలో తెదేపా మరింతగా బలపడుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ విభాగం నాయకులు మాదల చినకొండలరావు, గట్టి శ్రీనివాసరావు, గొడుగు శంకర్, ఈగ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల ప్రతిపాదన వ్యతిరేకిస్తున్నా: ఎమ్మెల్యే మాధవి

పట్టాభిపురం, నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రతిపాదన మేరకు 11 విలీన గ్రామాలను జీఎంసీలో విలీనం చేయాలని కౌన్సిల్ తీర్మానించిందని.. దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. 18 గ్రామాలు గుంటూరులో విలీనం ప్రతిపాదన కౌన్సిల్‌లోకి వచ్చే రెండు రోజుల ముందే ముగ్గురు ఎమ్మెల్యేలు, మేయర్, అధికారుల సమక్షంలో సమావేశమై చర్చించామన్నారు. అనేక అంశాలపై సందేహాలున్నాయని, పరిపాలన, మౌలిక వసతుల కల్పన పరంగా ఇబ్బందులు వస్తాయని.. ఈ ప్రతిపాదన సరికాదని.. పునరాలోచన చేయాలని తాను సూచించినట్లు చెప్పారు. ఇదే విషయం మేయర్, ఎమ్మెల్యే రామాంజనేయులకు అప్పుడే చెప్పానని తెలిపారు. అయితే శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో 17 గ్రామాలతోపాటు పెదకాకాని గ్రామాన్ని కలిపితే తాను ఆమోదం తెలిపినట్లు మేయర్ కోవెలమూడి మీడియాకు చెప్పారన్నారు. ఆ గ్రామం వేరే నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది..పొరుగు నియోజకవర్గాల వ్యవహారాల్లో తాను జోక్యం చేసుకోనని తెలిపారు. ఇప్పటికే గుంటూరు పశ్చిమంలో పదేళ్లుగా సరైన నాయకత్వం లేక మౌలిక వసతుల సమస్యలు ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయన్నారు. ఈపరిణామాల నేపథ్యంలో ఇప్పటికిప్పుడు 18 గ్రామాల విలీనాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో పూర్తిగా విశ్లేషించాక 18 గ్రామాలు కలిపితే సరిపోతుందా..మెగా సిటీగా అవతరించాలంటే మరికొన్నింటిని కలపాల్సి ఉంటుందో ఆలోచన చేయాలన్నారు. కేంద్ర మంత్రి సమక్షంలో కూర్చుని ఈఅంశంపై పూర్తిగా చర్చించాకనే ఒక నిర్ణయానికి వస్తామని తెలిపారు. ఈరోజుకీరోజు ప్రతిపాదన పైకి పంపాల్సిన అవసరం లేదన్నారు. నేను ప్రతిపాదిస్తేనే అందరూ ఏకగ్రీకంగా అంగీకరించారని మేయర్ అన్న మాటల్లో ఆంతర్యమేమిటో తెలియదన్నారు.

తెలుగు వెలుగు దివ్వె ఎన్టీఆర్

త్రివిక్రమరావుకు పురస్కారం అందజేస్తున్న తేజస్వి తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: నందమూరి తారక రామారావు తెలుగువెలుగు దివ్వె లాంటి వారని రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ పి.తేజస్వి అన్నారు. ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరణ, ఎన్టీఆర్ పురస్కార ప్రదాన సభ ఆదివారం స్థానిక ఎల్వీఆర్ క్లబ్, రీడింగ్ రూమ్ ప్రాంగణంలో జరిగాయి. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని కాలమానిని ఆవిష్కరించి ప్రసంగించారు. అనంతరం తెలుగు అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.త్రివిక్రమరావు(విక్రమ్)కు ఎన్టీఆర్ పురస్కారాన్ని అందించి సత్కరించారు. ఆతరువాత సుఖమంచి కోటేశ్వరరావు, కావూరి సత్యనారాయణ, వేముల మోహనరావు, పలమాని శ్రీనివాసరావు, వరకూటి శివప్రసాదు, కేవీజే మురళీకృష్ణలకు రంగస్థల పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఘంటా పున్నారావు, అంబటి మధుమోహనకృష్ణ, ఎంవీఎల్ నరసింహారావు, బి.పూర్ణ, కందిమళ్ల సాంబశివరావు, జి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలను పరిషత్ వ్యవస్థాపక కార్యదర్శి కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్ నిర్వహించారు.

మొబైల్ కనెక్టవిటీ లేని గ్రామాల సమస్య పరిష్కారానికి కార్యాచరణ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మొబైల్ కనెక్టవిటీ లేని గ్రామాల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతుందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. ఇండస్ట్ టవర్స్ నిర్వాహకులు క్యాంప్ కార్యాలయంలో ఆయన్ని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. పెమ్మసాని మాట్లాడుతూ రాష్ట్రంలో 414 గ్రామాల్లో మొబైల్ కనెక్టవిటీ లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. 120 గ్రామాల్లో ఒక్క మొబైల్ టవర్ కూడా లేని పరిస్థితిని గుర్తించామన్నారు. రూ.120 కోట్లతో నూతన మొబైల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. డిసెంబర్ 2026 నాటికి పనులు చేయాలని నిర్ణయించామన్నారు. మిగిలిన 250 గ్రామాల్లో టవర్లు ఉన్నప్పటికీ ఒక్కటే ఉండడంతో సమస్యలు ఉన్నాయన్నారు. కనెక్టవిటీని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. డిజిటల్ ఇండియా లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.

నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు సహకారం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: అత్యాధునిక నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు సహకారం అందజేస్తామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. ఐరోపాలో స్థిరపడిన ఎన్నారై దంపతులు బండారు అశోక్‌కుమార్, జయలక్ష్మి ఆదివారం ఆయన్ని కలిసి పెదకాకానిలో ఏర్పాటు చేయనున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రం గురించి చర్చించారు. యువత సాధికారతే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి పెమ్మసాని స్పందిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో అనుసంధానించేలా అవసరమైన పూర్తి సహకారం అందిస్తామన్నారు.

ముగిసిన కల్యాణోత్సవాలు

అలంకరణలో శ్రీవెంకటేశ్వరస్వామి

కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల అన్నపూర్ణనగర్‌లోని పద్మావతీ ఆండాళ్ సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న దశావతార కల్యాణోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉత్సవాల్లో పదోరోజైన ఆదివారం శ్రీవెంకటేశ్వరస్వామి అలంకారంలో స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ కమిటీ ఛైర్మన్ కంచర్ల ఆంజనేయులు, అధ్యక్షులు యర్రంశెట్టి వేణుగోపాల్, సభ్యులు తెలిపారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

బేస్‌బాల్ టోర్నమెంట్ విజేత ఆర్వీఆర్ జట్టు

జట్టుకు కప్ అందజేస్తున్న ప్రిన్సిపల్ విద్యాధర తదితరులు

గ్రామీణ గుంటూరు, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాలల బేస్ బాల్ టోర్నమెంట్‌లో ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజేతగా నిలిచి కప్ అందుకుంది. గుంటూరు శివారు చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఇనిస్ట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (చిప్స్) కళాశాలలో టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. యూనివర్శిటీ పరిధిలోని 10 కళాశాలల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. నాకౌట్ పద్ధతిలో జరిగిన పోటీల్లో ఆర్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విన్నర్‌గా, ఏఎన్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల జట్టు రన్నర్‌గా నిలిచాయి. నరసరావుపేట వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు తృతీయ, చిలకలూరిపేట సీఆర్ కళాశాల నాలుగో స్థానాల్లో నిలిచాయి. చిప్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విద్యాధర విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్‌కు హాజరైన అన్ని జట్ల నుంచి యూనివర్శిటీ జట్టు ఎంపిక చేశామన్నారు. ఎంపికైన యూనివర్శిటీ జట్టు వచ్చే నెల 2న పుణేలో సావిత్రీబాయి పులే విశ్వ విద్యాలయంలో జరగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ పోటీల్లో పాల్గొంటుందన్నారు. క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తా చాటి నాగార్జున విశ్వవిద్యాలయానికి మంచి పేరు తేవాలని సూచించారు. ఏఎన్‌యూ యోగా కో-ఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణ రావు పోటీలను పర్యవేక్షించారు. చిప్స్ కళాశాల పీడీ ఏడుకొండలు, గౌరీశంకర్, శివరామకృష్ణ, మల్లికార్జునరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు సత్కారం

పురస్కారాలందుకున్న ఉపాధ్యాయులతో మాజీ ఎమ్మెల్సీలు గేయానంద్, కేఎస్.లక్ష్మణరావు తదితరులు

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్ట్ 15వ వార్షికోత్సవం ఆదివారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఎం.క్యూరీ సంకలనం చేసిన 'మానవతా మూర్తి మేడం క్యూరీ' పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్, 'ఆధునిక భారత శాస్త్రవేత్తలు' పుస్తకాన్ని చలపతి విద్యాసంస్థల ఛైర్మన్ వైవీ.ఆంజనేయులు, 'బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక' పుస్తకాన్ని మలినేని విద్యాసంస్థల అధినేత మలినేని పెరుమాళ్ళు ఆవిష్కరించారు. భౌతికశాస్త్రంలో విశేష సేవలందిస్తున్న రాయపాటి శివనాగేశ్వరరావుకు విశిష్ట పురస్కారం ప్రదానం చేశారు. మరో 30 మంది భౌతికశాస్త్రం ఉపాధ్యాయులను సత్కరించి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు, ట్రస్ట్ కార్యదర్శి కె.అలీన్, కె.విజయలక్ష్మి, జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ పెట్టారు.. విస్తరణ విస్మరించారు

ఇరుకు రోడ్డుపై గుంతలు ఇలా..

గుంటూరు నగరం, న్యూస్‌టుడే

నగరపాలక సంస్థ, ట్రాఫిక్ పోలీసుల మధ్య సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారుతోంది. శ్యామలానగర్ రైల్వేగేటు వైపు వెళ్లే రహదారిలో వాహనచోదకులు, ప్రజలు నిత్యం నరకం చూస్తున్నారు. స్తంభాలగరువు, రాజేంద్రనగర్, బృందావన్‌గార్డెన్స్, శ్యామలానగర్, ఎస్వీఎన్ కాలనీ తదితర ప్రాంతాలవాసులు ఇటుగా రాకపోకలు చేస్తుంటారు. మిర్చియార్డుకు సైతం ఇటుగానే వెళుతుంటారు. ఇంతటి రద్దీగా ఉండే రహదారి అధ్వానంగా ఉన్నా..ఎవరికీ పట్టడం లేదు. ఇరుకుగా ఉన్న రహదారిలో ఎక్కడ గుంతల్లో పడి ఆసుపత్రి పాలవుతామోనని బెంబేలెత్తుతున్నారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం నుంచి రైల్వేగేటు వైపు మార్గంలో ప్రయాణించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరుకుగా ఉన్న రహదారి విస్తరించకపోగా ప్రమాదకరంగా ఉన్న గుంతలు సైతం పూడ్చలేదు. గతంలో ఈరోడ్డులో ఎలాంటి డివైడర్ ఉండేది కాదు. వచ్చే పోయే వాహనాలకు విడివిడి మార్గాల నిమిత్తం రోడ్డు మధ్యలో సిమెంట్ దిమ్మెలను డివైడర్‌గా ఏర్పాటు చేశారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారింది. నివాసగృహాల ఎదుట మెట్లు, ర్యాంపులు రోడ్డుపైకి ఉన్నాయి. వీటిని తొలగించి రహదారిని పూర్తిస్థాయిలో విస్తరించిన అనంతరం డివైడర్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా..ఇవేమీ పట్టించుకోకుండా తాత్కాలిక డివైడర్ ఏర్పాటు చేసి సిబ్బంది చేతులు దులిపేసుకున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నప్రసాద కార్యక్రమాలు ప్రారంభం

దీక్షాపరులకు అన్నప్రసాద వితరణ చేస్తున్న దేవేంద్ర

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: భారతీధార్మిక విజ్ఞాన పరిషత్, బృందావన గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి దేవాలయం, బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల సంయుక్త నిర్వహణలో 14వ సద్ది, అన్నప్రసాద కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జనవరి 15వ తేదీ వరకు విశేష కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 30వతేదీ ముక్కోటి పర్వదినం సందర్భంగా లోకకల్యాణ సంకల్పంతో లక్ష్మీగణపతి, లక్ష్మీనారసింహ, సుదర్శన, శ్రీసూక్త, పురుషసూక్త హోమాలు జరుగుతాయి. మహాచండీ యాగం ప్రారంభమవుతాయి. చండీ, లలితావిష్ణు సహస్ర నామ, హనుమాన్ చాలీసా తదితర పారాయణలు జరుగుతాయి. దాతలు, భక్తుల సౌజన్యంతో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం రోజూ మధ్యాహ్నం పన్నెండున్నర గంటలకు ప్రారంభమవుతుంది.

సమాజ సజీవ చిత్రాలు పాణిరావు కవితలు

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న భూసురపల్లి వెంకటేశ్వర్లు, రావి రంగారావు తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: యర్రగుంట్ల పాణిరావు కవితలు సమాజ సజీవ చిత్రాలని సాహితీవేత్త డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. బ్రాడీపేట కొరటాల సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన నీరెళ్లిపోతున్నా..నది నాతోనే కవితా సంపుటి ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అమరావతి సాహితీ మిత్రులు అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు సభకు అధ్యక్షత వహించారు. విమల సాహితీ వేదిక(హైదరాబాద్) అధ్యక్షుడు డాక్టర్ జెల్ది విద్యాధరరావు ప్రసంగిస్తూ నవ్యత, మానవత, ఆకుపచ్చని జ్ఞాపకాలతో కవితా సంపుటి పరిమళాలు వెదజల్లుతుందని కవిని అభినందించారు. సభలో పాణిరావును అమరావతి సాహితీ మిత్రులు సంస్థ పక్షాన డాక్టర్ రావి రంగారావు, విద్యాధరరావు, రజాహుస్సేన్, సురేష్, గుంటూరు జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు, పలువురు సాహితీ ప్రియులు, బంధువులు సత్కరించారు.

వాట్సప్‌లో పోలీసు సేవలు

గుంటూరు నేరవార్తలు: ప్రజలకు వేగవంతంగా, పారదర్శకంగా, సులభమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్‌ను ఉపయోగించుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆదివారం ఎస్పీ తన కార్యాలయంలో మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ వివరాలను తెలిపారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచి ప్రజలు తమ సెల్‌ఫోన్‌లో వాట్సప్ ద్వారా అనేక సేవలు పొందొచ్చని చెప్పారు. వాట్సప్ నంబర్ 95523 00009ను తమ ఫోన్‌లో సేవ్ చేసుకొని ఆ నంబర్‌కు హాయ్ (హెచ్ఐ) అని సందేశం పంపిండం ద్వారా మన మిత్ర సేవలు ప్రారంభమవుతాయన్నారు. ఆ తర్వాత పోలీసుశాఖ సేవలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఎఫ్ఐఆర్ డౌన్ లోడ్ చేసుకోవటానికి జిల్లా, పోలీసుస్టేషన్, ఎఫ్ఐఆర్ నంబర్, సంవత్సర వివరాలను నమోదు చేయాలని తెలిపారు. వెంటనే వారి వాట్సప్‌కు ఎఫ్ఐఆర్ కాపీ వస్తుందని, దాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. ఇదే తరహాలో ఆ ఎఫ్ఐఆర్ స్థితిగతులు, వాహనాలపై విధించిన ఈ చలానా వివరాలు తెలుసుకోవడంతోపాటు చలానాలను కట్టుకోవచ్చన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు ఎస్పీ జీవీ [illegible]

అనుమానాస్పద స్థితిలో కార్పెంటర్ మృతి

[illegible]

దుస్తుల పంపిణీ

[illegible]

గుంటూరులో అర్ధరాత్రి ఆకతాయిల వీరంగం

కుటుంబ కలహాల నేపథ్యంలో బావను చితకబాదిన బావమరిది అనుచరులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: [illegible] తన సోదరుడు గణేష్‌కు చెప్పి మాటవి సునీల్‌పై విచక్షణా రహితంగా దాడి [illegible]

భారతదేశపు అతిపెద్ద మరియు అత్యంత విశ్వసనీయమైన సహజ ఫైబర్ ఉత్పత్తులు
ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో
వారి శారీస్ ఫెస్టివల్
తేదీ: 29, 30, 31 డిసెంబర్ 2025 & 1st జనవరి 2026
వేదిక: శుభం కన్వెన్షన్ సెంటర్, రాజమండ్రి
www.indiansilkgallery.com

కేంద్ర ఆర్థిక మంత్రితో ముఖ్యమంత్రి భేటీ

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం రాత్రి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం సమావేశ మందిరంలో భేటీ అయ్యారు. కొంతసేపు పలు అంశాలపై సమాలోచనలు చేశారు. - న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

ప్రజాసమస్యల పరిష్కార వేదిక నేడు

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ పరిష్కార వేదిక ఉంటుందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ సమీపంలోని మండల, డివిజన్ కేంద్రాల్లో అర్జీలు సమర్పిస్తే అధికారులు తగు చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. కాల్ సెంటరులోని 1100 నంబరుకు కాల్‌చేసి అర్జీలు నమోదు చేసుకోవడంతో పాటు వాటి స్థితిగతులు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

ఇంద్రకీలాద్రికి పోటెత్తారు

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనానికి తరలివచ్చారు. దీంతో ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ లిఫ్టు మార్గం భక్తులతో కిటకిటలాడాయి. సుమారు 60 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు భావిస్తున్నారు. సర్వదర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని పలువురు తెలిపారు.

వేతన వెతలు పట్టవా?

■ జిల్లా వ్యాప్తంగా రూ.3.24 కోట్ల బకాయిలు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

వీబీ జీ రామ్‌జీ పథకాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు పని అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సర్కారు ఆదేశాలకు అనుగుణంగా గ్రామాల్లో పనులు నిర్వహిస్తూ నెలలు గడిచిపోతున్నా జిల్లా వ్యాప్తంగా ఉపాధి శ్రామికులకు వేతనాలు జమ కాకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అడిగిన ప్రతి ఒక్కరికీ పనికల్పించడంతో పాటు గరిష్ఠ వేతనం రూ.300 అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దానికి అనుగుణంగా గరిష్ఠ వేతనాన్ని రూ.307 చేశారు. దీంతో ఎక్కువ మంది ఉపాధి పనులను వినియోగించుకుంటున్నారు. వారికి రూ. కోట్లలో బకాయిలు విడుదల కావాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా 2.17 లక్షల జాబ్‌కార్డుదారులు ఉన్నారు. వారిలో వేలాది మందికి 5 నెలల పైబడి బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. బందరు మండల మండలంలో అత్యధికంగా రూ.41.54 లక్షలు, నందివాడ మండలానికి రూ.36 లక్షలు రావాల్సి ఉంది. గన్నవరం రూ.27.53 లక్షలు, పెడన రూ.23.08 లక్షలు, ఉంగుటూరు రూ.17.24 లక్షలు, కంకిపాడు రూ.16.15, గుడ్లవల్లేరు రూ.16.05, గూడూరు మండలానికి రూ.12.21 లక్షలు బకాయిలు రావాల్సి ఉంది. మిగిలిన చోట్ల కూడా ఒక్కో మండలానికి రూ.2 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు రావాల్సి ఉన్నట్లు అధికారిక గణాంకాలు తెలియజేస్తున్నాయి.

ప్రభుత్వానికి నివేదించాం

ఉపాధి శ్రామికులకు రావాల్సిన బకాయిలు చాలా వరకు జమచేయడం జరిగింది. చివరిలో కొంత ఆగాయి. వాటి గురించి కూడా ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుంది. వివిధ కారణాలతో కొంత జాప్యం జరిగింది. కానీ త్వరలోనే నిధులు వారి ఖాతాలకు జమ అవుతాయి. ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆ దిశగా తగు చర్యలు తీసుకుంటున్నాం. - ఎన్వీ శివ ప్రసాద్ యాదవ్, డ్వామా పీడీ

రెక్కాడితే కానీ డొక్కాడదు...

ఆయా గ్రామాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పంట బోదెల తవ్వకాలు, తూడు తొలగింపు ఇలా వివిధ రకాల పనులు చేస్తున్నారు. ఈ పనులకు వెళ్లేవారంతా రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలకు చెందినవారే. రోజూ పనిచేస్తున్నాం.. కానీ నెలల తరబడి వేతనాలు రాకపోతే ఎలా అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులు కూడా వేతనాలు ఎప్పుడు విడుదల అవుతాయో స్పష్టత ఇవ్వకపోవడంతో ఉపాధి శ్రామికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని త్వరితగతిన వేతన బకాయిలు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డ్రెయిన్ ఆక్రమించి.. గోదాము నిర్మించి..

నందమూరు-జింజేరు రోడ్డులో ఓ ఆక్వా రైతు మురుగునీటి డ్రెయిన్ ఆక్రమించి గోదాము నిర్మించాడు. దీన్ని గ్రామస్థులు వ్యతిరేకించినా నిర్మాణాన్ని పూర్తి చేశాడు. ఈ క్రమంలో పంచాయతీ రాజ్ రహదారిని కూడా ఆక్రమించినట్టు ఆరోపణలు వస్తున్నాయి. డ్రెయిన్ మూసివేయడంతో మురుగు నీరు దిగువున ఉన్న నివాస ప్రాంతాల్లోకి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పెడన ఏఈ వెంపటి నాగేశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. - పెడన, న్యూస్‌టుడే

హుషారెత్తించిన విజయ్‌ప్రకాశ్, నేహా

విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో వేడుకలకు తరలివచ్చిన నగరవాసులు

ఉర్రూతలూగించిన దినకర్, సమీరా భరద్వాజ్

ఊరంతా సరిగమ.. ఊసంతా మధురిమ!

- కృష్ణా తీరాన ఆనంద తాండవం చేసిన విజయవాడవాసులు
- ఘనంగా 'ఈనాడు 50, ఈటీవీ 30' వసంతాల వేడుకలు

ఈనాడు @50 ఈటీవీ 30 వసంతాల వేడుకలు

ఈనాడు, అమరావతి - విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే

సంగీత సవ్వడులకు కృష్ణా తీరం పులకించింది. దేదీప్య కాంతుల నడుమ.. ఉర్రూతలూగించే సంగీతం.. ఆకట్టుకునే గీతాలు.. ఆహూతులు మైమరచిపోయారు. ప్రముఖ గాయని, గాయకులతో కలిసి స్వరం కలిపి.. ఆనంద తాండవం చేశారు. 'ఈనాడు 50, ఈటీవీ 30' వసంతాలు పూర్తైన సందర్భంగా.. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన వేడుకలు కనులపండువగా సాగాయి. వేల మంది ప్రజలు తరలివచ్చారు.. వేడుకలను తిలకించారు. సినీ నేపథ్య గాయకులు.. విజయ్‌ప్రకాశ్, సమీరా భరద్వాజ్, దినకర్, నేహా, హారిప్రియ, ఇండియన్ ఐడల్ రేవంత్, మంగ్లీ, వాగ్దేవి, రిషిల్.. ఆలపించిన గీతాలకు.. ఆహ్వానితులు ఆనంద డోలికల్లో మునిగి తేలారు. ఆదివారం కావడంతో.. కుటుంబాలు, పిల్లలతో కలిసి.. భారీగా నగరవాసులు తరలివచ్చి.. ఆస్వాదించారు. ఉర్రూతలూగించే సినీ గీతాలకు.. చిన్నాపెద్ద కేరింతలు కొడుతూ.. స్టెప్పు లేస్తూ ఉల్లాసంగా గడిపారు.

50 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లు..

విజయవాడతో నాకు విడదీయలేని అనుబంధం ఉంది. ఇక్కడ ఈనాడు 50, ఈటీవీ 30 ఏళ్ల ఉత్సవాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది. ఐదేళ్ల ప్రస్థానంలో ఎన్నో అద్భుతమైన కార్యక్రమాలను 'ఈనాడు, ఈటీవీ' చేపట్టాయి. రామోజీరావు చేపట్టిన మహాయజ్ఞం ఫలాలివి. ఆయన సినిమా రంగానికి చేసిన సేవలు అనన్యం. సువిశాల ప్రదేశంలో ఫిల్మ్‌సిటీని స్థాపించారు. కొలమానం లేనన్ని సేవలు అందించారు. ఈటీవీ పాడుతా తీయగా.. లాంటి కార్యక్రమాలు.. ప్రజలకు ఎంతో చేరువయ్యాయి. ఈ వేడుకలకు వెళ్లాలని రామోజీరావు ఆకాంక్షించారు. సిబ్బంది ఆహ్వానించారు.. నేను వచ్చేశాను.
- బ్రహ్మానందం, ప్రముఖ సినీ హాస్యనటుడు



ఇక్కడి నుంచి ఆరంభిస్తే విజయమే..

మా 'అనగనగ ఒకరోజు' సినిమా ప్రచార కార్యక్రమాలను విజయవాడలోని ఈ వేదిక మీద నుంచి ఆరంభిస్తున్నాం. ఇక్కడి నుంచి ఆరంభిస్తే విజయం వరిస్తుందనే నమ్మకం ఉంది. అందుకే విజయవాడలోని ఈ వేదిక పైనుంచి ఆరంభిస్తున్నాం. జనవరి 14న సినిమాను అందరూ తప్పకుండా చూడాలి. - నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి

కార్యక్రమానికి వ్యాఖ్యాతగా సుమ కనకాల వ్యవహరించారు. సినీనటి మానసచౌదరి, బొమ్మరిల్లు శరీష్ తమ నృత్యంతో అలరించారు. ముఖ్య అతిథిగా బ్రహ్మానందం పాల్గొన్నారు.

బొమ్మరిల్లు సీరియల్ టీం సందడి

మంగ్లీ, హారిప్రియ, రేవంత్

ప్రత్యేక అతిథులుగా.. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు, కలెక్టర్ లక్ష్మీశ, ఎన్టీఆర్ జిల్లా తెదేపా అధ్యక్షురాలు గద్దె అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సమస్యలకు..
అరచేతిలో పరిష్కారం

మీ ప్రమేయం లేకుండానే ఖాతాలో నగదు కట్ అయిందా.. ఖాతా పూర్తిగా స్తంభించిపోయిందా.. బ్యాంకు మార్చిన చెక్ సొమ్ము ఖాతాలో జమ కాలేదా.. ఇలాంటి ఇబ్బందులు వచ్చినప్పుడు ఖాతాదారులకు ఏం చేయాలో పాలుపోదు.. పడుతూ లేస్తూ బ్యాంకుకు పరుగులు పెడతారు. నానా హైరానా పడిపోతుంటారు. బ్యాంకు సమస్యలు ఉత్పన్నమైతే అరచేతిలోనే పరిష్కారం ఉంది. అసలేంటీ నంబర్లు.. ఈ అంబుడ్స్‌మెన్‌లో ఫిర్యాదులు ఎలాగో తెలుసుకుందాం పదండి. – ఈనాడు, అమరావతి

ఇవీ టోల్ ఫ్రీ నంబర్లు...

- యూనియన్ బ్యాంకు : 1800 208 2244
- కెనరా బ్యాంకు: 1800 1030
- ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు:1800 425 2045
- స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా:1800 1234
- యాక్సెస్ బ్యాంకు: 1800 209 5577

మొండి సమస్యలు చక్కదిద్దేలా..

సాధారణంగా బ్యాంకుల్లో సమస్యలు టోల్‌ఫ్రీ నంబర్లు, నేరుగా వెళ్లి ఫిర్యాదు చేయడంతో పరిష్కారం అవుతాయి. కొన్ని సమస్యలు ఫిర్యాదులతో కూడా పరిష్కారం కావు. ✪ కొన్నిసార్లు బ్యాంకు అధికారులు సవ్యంగా స్పందించరు. ఈ సమయంలో అవగాహన లేక చాలా మంది ఖాతాదారులు నష్టపోతున్నారు. బ్యాంకులో ఫిర్యాదు చేసిన నెల రోజుల్లో అధికారుల నుంచి సరైన స్పందన లేకపోతే అంబుడ్స్‌మెన్ అనే న్యాయ వ్యవస్థను సంప్రదించవచ్చు. ✪ టోల్ ఫ్రీ నంబరు 14448కు ఫోన్ చేసి సమస్యను తెలియజేయవచ్చు. లేదా సీఎమ్ఎస్. ఆర్‌బీఐ. ఓఆర్‌జీ అనే పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

డిజిటల్ చెల్లింపుల్లో ఇక్కట్లా?

✪ ఉమ్మడి జిల్లాలో దాదాపు ఏడాదికి రూ.3లక్షల కోట్ల విలువైన 30కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతాయి. ప్రస్తుతం అడుగడుగునా డిజిటల్ చెల్లింపులు జరుగుతున్న నేపథ్యంలో అనేక పొరపాట్లు దొర్లుతున్నాయి. ✪ మనం పంపాల్సిన వారికి కాకుండా మరొకరికి నగదు వెళ్లిపోతోంది. కొన్నిసార్లు పెండింగులో ఉండిపోతోంది. ✪ ఈ నేపథ్యంలో వారికి ఫోన్ చేసినా స్పందన ఉండదు. ఈ సమయంలో 24 గంటల్లోగా సదరు బ్యాంకును సంప్రదించాలి. లావాదేవీ వివరాలు అధికారులకు అందించాలి. ✪ ఎన్‌పీసీఐ వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చు. సైబర్ వలలో చిక్కి సొమ్ము చేజార్చుకున్నవారు జిల్లాలో చాలా మంది ఏం చేయాలో తెలియక మిన్నకుంటున్నారు.

వీరు 1930 సైబర్ క్రైం హెల్ప్ లైన్ నంబరుకు ఫోన్ చేస్తే పరిష్కారం దొరుకుతుంది.

రూ.5 కోట్ల ఖర్చుకు.. వెలుగేదీ..?!

- ఆరేళ్లుగా 5.85 ఎకరాలపై ఆదాయమూ లేదు
- ఏటా 16 లక్షల యూనిట్ల విద్యుత్తు ఎక్కడ?

ఈనాడు, అమరావతి

దుర్గమ్మకు వచ్చే ఆదాయాన్ని కరిగించడంలో ముందుండే అధికారులు.. సద్వినియోగంలో మాత్రం విఫలం అవుతున్నారు. 2020లో రూ.5 కోట్లు ఖర్చుపెట్టి.. పాతపాడులో 5.85 ఎకరాల దేవస్థానం స్థలంలో ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్ నిర్మించారు. 2022 సెప్టెంబరులో ప్లాంట్ నుంచి ఉత్పత్తి ఆరంభించారు. ఏటా 16 లక్షల యూనిట్లు ఉత్పత్తి అవుతుందని.. నెడ్‌క్యాప్, దేవస్థానం అధికారులు వెల్లడించారు.

సోలార్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్

"దుర్గగుడికి వాడగా.. తిరిగి విద్యుత్తు సంస్థ నుంచే డబ్బులు వస్తాయని సెలవిచ్చారు. దేవస్థానం డబ్బులు నీళ్లలా ఖర్చుపెట్టి ప్లాంట్ పెట్టేశారు. ఈ లెక్కన.. మూడేళ్లలో 48 లక్షల యూనిట్ల విద్యుదుత్పత్తి అవ్వాలి. దుర్గగుడికి రూపాయి బిల్లు రాకూడదు. కానీ.. ఇవేవీ జరగలేదు. పైగా.. రూ.3.50 కోట్లు తమకే చెల్లించాలనీ.. రూ.40 లక్షల జరిమానాతో సహా విద్యుత్తు సంస్థ తాఖీదులను ఇచ్చింది."

20 ఏళ్లు బిల్లులే ఉండవన్నారు..

దుర్గమ్మ ఆలయ పరిసరాలు, మహామండపం, ఇతర భవనాలు, కార్యాలయాలు, సీవీరెడ్డి ఛారిటీస్, ఉద్యోగుల క్వార్టర్లు, జమ్మిదొడ్డి, మాడపాటి సత్రం అన్నీకలిపి.. 2020 నాటికి నెలకు 1.12 లక్షల యూనిట్ల విద్యుత్తు వాడేవారు. ఏటా 13.50 లక్షల యూనిట్లు వాడి.. రూ.82 లక్షల బిల్లు చెల్లించేవాళ్లు. ✪ ఈ లెక్కన ప్లాంట్‌కు రూ.5 కోట్లు పెడితే.. నిర్మాణ వ్యయం ఆరేళ్లలో వెనక్కి వస్తుందనీ, తర్వాత 20 ఏళ్లు బిల్లే చెల్లించక్కర్లేదనేది ప్రతిపాదన. ✪ పైగా.. 20ఏళ్లు ఈ ప్లాంట్‌ను నిర్మించిన గుత్తేదారు సంస్థే దీని నిర్వహణ చూసుకుని.. ఏటా 16 లక్షల యూనిట్ల విద్యుదుత్పత్తి చేస్తుందన్నారు. ✪ ప్లాంట్ నిర్మాణానికి.. నెడ్‌క్యాప్ నుంచి రూ.92.80 లక్షల రాయితీ రాగా.. మిగతాది దేవస్థానం వెచ్చించింది. ఉత్పత్తయ్యే 16 లక్షల యూనిట్లలో.. 13.50 లక్షలు వాడుకోగా.. మిగిలింది అప్పటి ధర ప్రకారం.. యూనిట్‌కు రూ.5.48 చొప్పున రూ.13.70 లక్షలను విద్యుత్తుశాఖే.. దేవస్థానానికి చెల్లిస్తుందని చెప్పారు.

ఇప్పటికైనా దృష్టిపెట్టాలి..

ప్లాంట్ నుంచి ఎంత విద్యుదుత్పత్తి అవుతుందో.. స్పష్టత లేదు. అప్పటి ఈవోలు, అధికారులు.. ఇప్పుడు లేరు. తాజాగా ఆలయానికి విద్యుత్తు సరఫరా ఆపేసి భక్తులను ఇబ్బంది పెట్టేవరకూ పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా.. కాకిలెక్కలతో కాలయాపన చేయకుండా.. విద్యుత్తు, దేవాదాయ అధికారులు సమస్య పరిష్కరించుకోవాలి.

మన చరిష్మా అదుర్స్..

న్యూస్‌టుడే-విజయవాడ క్రీడలు: రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో పటమటలోని సీహెచ్ఆర్‌కే ఇండోర్ స్టేడియం, గురునానక్ కాలనీలోని సాయి సందీప్ బ్యాడ్మింటన్ అకాడమీలో వారం పాటు జరిగిన యోనెక్స్ సన్‌రైజ్ 78వ అంతర్ రాష్ట్ర ఇంటర్ జోనల్, 87వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్-2025 ఆదివారం ముగిశాయి. ఈ నెల 22, 23వ తేదీల్లో అంతర్ రాష్ట్ర ఇంటర్ జోనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల విభాగంలో ఎనిమిది, మహిళల విభాగంలో ఏడు జట్లు తలపడ్డాయి. 24 నుంచి 28వ తేదీ వరకు జరిగిన జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల వ్యక్తిగత విభాగంలో 119 మంది, మహిళల వ్యక్తిగత విభాగంలో 114 మంది, పురుషుల డబుల్స్‌లో 60, మహిళల డబుల్స్‌లో 58 జోడీలు, మిక్స్‌డ్ డబుల్స్‌లో 61 జోడీలు తలపడ్డాయి. అంతర్ రాష్ట్ర ఇంటర్ జోనల్ ఛాంపియన్‌షిప్‌లో పీవీ సింధు, తమిరి సూర్య చరిష్మ, ఎస్.కవిప్రియ, కందేరి నవ్య, డి.దీపిక, డి.స్రవంతి, సీఎస్ఆర్ ప్రణవి, ఎం.తనిష్క్, ఆమర్తి హర్షిక, ఆమర్తి ప్రవల్లిక మణి రాష్ట్ర మహిళా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు.

మహిళల సింగిల్స్ విజేత సూర్య చరిష్మా(ఆంధ్రప్రదేశ్)ను భుజాలపైకెత్తి అభినందిస్తున్న క్రీడాకారులు

పోటీపడుతున్న కర్ణాటక, మణిపూర్, ఉత్తరప్రదేశ్ జట్లు

పాఠశాల స్థాయి నుంచే నైపుణ్యాలు అవసరం

మాట్లాడుతున్న విప్ యార్లగడ్డ వెంకట్రావు

రామవరప్పాడు, న్యూస్‌టుడే : ఎనికేపాడులోని విజయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాలలో విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న బాలోత్సవ్ సంబరాలు ఆదివారం ముగిశాయి. ఈ మేరకు సాంస్కృతిక పోటీలతో పాటు బంక మట్టితో బొమ్మల తయారీ పోటీలు నిర్వహించారు. ముగింపు వేడుకలకు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హాజరై మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని వందల సంఖ్యలో విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని తమ ప్రతిభను చాటడం అభినందనీయమన్నారు. కేవలం విద్యకే పరిమితం కాకుండా ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే విద్యతో పాటు నైపుణ్యాలు పెంచుకోవాలని కోరారు. అనంతరం పలు విభాగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. వీసీఎస్‌టీఏ అధ్యక్షుడు ముదిగొండ శ్రీహరిరావు, కార్యదర్శి భీమిశెట్టి గణేష్ బాబు, కోశాధికారి పుప్పాల శ్రీనివాసరావు, కో ఛైర్మన్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు

ఆన్‌లైన్‌లో తిరుపతమ్మ ఆలయ టికెట్లు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో దర్శనం, సేవలు, ప్రసాదాలను రాష్ట్రప్రభుత్వ వాట్సప్ మన మిత్ర ద్వారా పొందవచ్చు. మన మిత్ర నంబరు 95523 00009 వాట్సప్ ద్వారా, www.aptemplesap.gov.in ద్వారా సేవలు పొందవచ్చని ఈవో మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆయా సేవల కోసం క్యూలైన్‌లో వేచి ఉండాల్సిన అవసరం లేదని ఈవో తెలిపారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని 30వ తేదీ మంగళవారం దేవాలయంలో ఉత్తర ద్వారదర్శనం ఏర్పాటు చేశామని చెప్పారు.

సభలో ప్రసంగిస్తున్న ఎంపీ శివనాథ్

ఖండాంతరాలు దాటిన కేబీఎన్ కళాశాల పేరు

చిట్టినగర్, న్యూస్‌టుడే : పేద, మధ్య తరగతి వర్గాలకు కేబీఎన్ కళాశాల ఒక విద్యా దీపం వంటిదని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. కొత్తపేటలోని ఆ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఎంపీ మాట్లాడుతూ వందలాది మంది విద్యార్థులు ఇక్కడ చదివి దేశ, విదేశాల్లో స్థిరపడటం హర్షనీయమన్నారు. చంద్రయాన్, ఆదిత్య ఎల్-1, మ్యాన్‌మిషన్, పలు రాకెట్లలో వాడే విడి భాగాలను తయారు చేసే బీఎన్.రెడ్డి వంటి ప్రముఖులు చదివిన ఈ కళాశాల పేరు ఖండాంతరాలు దాటిందన్నారు. కేబీఎన్ కళాశాలలో మరో మూడు నెలల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. పూర్వ విద్యార్థి, సినీ హీరో సుహాస్, ఐఎఫ్ఎస్ అధికారి జె.ఎ.సి.ఎస్.రావు, ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య, కార్యదర్శి టి.శ్రీనివాస్, ఏవో నారాయణరావు, ప్రిన్సిపల్ కృష్ణవేణి తదితరులు ప్రసంగించారు. సీనియర్ అధ్యాపకులు పూర్వ విద్యార్థులను సత్కరించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రథమ వర్ధంతి

మమ్మల్ని గుండెల నిండుగా ప్రేమించి, మాకు ఆప్యాయతానురాగాలను పంచి, మా ఉన్నతికి అహర్నిశలు అలుపెరుగక శ్రమించి, కల్మషమెరుగని మంచి మనిషిగా జీవించిన మీరు దైవసన్నిధికి చేరి నేటికి ఒక సంవత్సరం గడిచినా మీ జ్ఞాపకాలు మరువలేము..

కీ॥శే॥ గుండె నాగేశ్వరరావు గారు
(Retd.) Asst. Divisional Managar
New India Assurance, Vijayawada.
జననం: 12-11-1955, మరణం: 08-01-2025

భార్య : వి.హిమబిందు
Deputy Director, Employment, Vizag Region
కుమార్తె : మన్నే సుధా ప్రియదర్శిని
అల్లుడు : మన్నే సాయికృష్ణ
మనుమడు : అమోఘ శౌర్య
మనుమరాలు : ఆధ్యా సరయు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

సెమీస్‌కు నలంద.. వీఆర్ సిద్ధార్థ జట్లు

ఉత్సాహంగా 'ఈఎస్ఎల్' క్రికెట్ టోర్నీ

KAMINENI HOSPITALS VIJAYAWADA

న్యూస్‌టుడే-విజయవాడ క్రీడలు

'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025 ఉత్సాహంగా సాగుతోంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌ల్లో నలంద డిగ్రీ కళాశాల, వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్లు సెమీఫైనల్స్ బెర్తులు ఖరారు చేసుకున్నాయి. ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కళాశాల జట్టు క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రవేశించింది. కానూరులోని కేపీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ స్కూల్ మైదానంలో జరుగుతున్న ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్

నిప్పులు చెరిగిన రామ్‌ప్రసాద్

● ఆదివారం జరిగిన మొదటి మ్యాచ్‌లో ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కళాశాల జట్టు తొమ్మిది పరుగుల ఆధిక్యంతో పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన పీబీ సిద్ధార్థ జట్టు బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా లయోలా జట్టు నిర్ణీత పది ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 60 పరుగులు చేసింది. వై.అరవింద్ 26 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. ప్రత్యర్థి బౌలర్ ఏక్తాన్‌సింగ్ 11 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన పీబీ సిద్ధార్థ జట్టు 9.4 ఓవర్లలో 51 పరుగులకే ఆలౌటైంది. రూపేష్ 17, మోహిత్ 13 పరుగులు చేశారు. ప్రత్యర్థి బౌలర్ జె.రామ్‌ప్రసాద్ మూడు పరుగులు ఇచ్చి అయిదు వికెట్లు తీశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా జె.రామ్‌ప్రసాద్ ఎంపికయ్యాడు.

రాణించిన నలంద బ్యాటర్లు..

● రెండో మ్యాచ్‌లో నలంద డిగ్రీ కళాశాల జట్టు 74 పరుగుల తేడాతో అమృతసాయి ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నలంద జట్టు పది ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 125 పరుగులు చేసింది. ఎన్.భానుప్రసాద్ 39 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. జె.బన్నీ 36 పరుగులు జోడించాడు. ప్రత్యర్థి బౌలర్ ఆర్.అనిల్ 25 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన అమృతసాయి జట్టు 9.2 ఓవర్లలో 51 పరుగులకే కుప్పకూలింది. కె.సాయిరామ్ 23 పరుగులు చేశాడు. ప్రత్యర్థి బౌలర్ ఎ.వాసు మూడు పరుగులు ఇచ్చి రెండు వికెట్లు కూల్చాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎన్.భానుప్రసాద్ ఎంపికయ్యాడు.

నేటి మ్యాచ్‌ల వివరాలు

★ పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల × కేబీఎన్ డిగ్రీ కళాశాల (మొదటి మ్యాచ్)

★ శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల × ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కళాశాల (రెండో మ్యాచ్)

★ దీక్ష జూనియర్ కళాశాల × విశ్వశాంతి జూనియర్ కళాశాల (మూడో మ్యాచ్)

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్ వీరే..

జె.రామ్ ప్రసాద్ | ఎన్.భాను ప్రసాద్ | పి.మనోజ్

ఆరు వికెట్ల తేడాతో విజయం

● మూడో మ్యాచ్‌లో వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్టు ఆరు వికెట్ల తేడాతో ఎంవీఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన వీఆర్ సిద్ధార్థ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన ఎంవీఆర్ జట్టు పది ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. వి.బాలకృష్ణ 31 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. ప్రత్యర్థి బౌలర్ పి.మనోజ్ 11 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు కూల్చాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన వీఆర్ సిద్ధార్థ జట్టు 8.4 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 68 పరుగులు చేసి విజయకేతనం ఎగురవేసింది. పి.మనోజ్ 13 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. ఎస్.తరుణ్‌సాయి 12 పరుగులు చేశారు. ప్రత్యర్థి బౌలర్ వి.బాలకృష్ణ 12 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా పి.మనోజ్ ఎంపికయ్యాడు.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ NECC (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Regional Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Digital Partner: ETV BHARAT, ఈనాడు.నెట్ FM Partner: ఈ FM Mee FM TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Organised by ఈనాడు

20న ఎన్జీవో జిల్లా కార్యవర్గ ఎన్నిక

భాస్కరపురం(మచిలీపట్నం), న్యూస్‌టుడే: ఏపీఎన్జీవో జిల్లా కార్యవర్గ ఎన్నిక జనవరి 20న మచిలీపట్నంలో జరగనుంది. ఈనెల డిసెంబర్ 30వ తేదీన నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, 31న ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ ఉంటాయి. జనవరి 20వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మచిలీపట్నం ఏపీఎన్జీవో హోమ్‌లో ఓటింగ్ నిర్వహిస్తారు. కార్యవర్గంలో ఒక అధ్యక్ష, రెండు అసోసియేట్ ప్రెసిడెంట్, ఐదు ఉపాధ్యక్ష(జనరల్), ఒక ఉపాధ్యక్ష(మహిళ), ఒక కార్యదర్శి, ఒక ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఐదు జాయింట్ సెక్రటరీ (జనరల్), ఒక జాయింట్ సెక్రటరీ (మహిళ), ఒక కోశాధికారి పదవులకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నికల అధికారిగా ఏపీఎన్జీవో గుంటూరు జిల్లా అధ్యక్షుడు జె.శ్రీనివాసరావు వ్యవహరిస్తారు.

చురుగ్గా ఏర్పాట్లు

విద్యాధరపురం: భవానీపురం పున్నమి ఘాట్ సమీపంలో జనవరి 8 నుంచి 10 వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆవకాయ్ అమరావతి' ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు, నగరవాసులు హాజరుకానున్నారు. కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలతో కార్పొరేషన్, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో మాత్రమే ఉత్సవాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ ప్రకటించారు.



ఈనాడు-50, ఈటీవీ-30 వసంతాల వేడుకలో ఎంపీ కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్, తెదేపా జిల్లా అధ్యక్షురాలు గద్దె అనూరాధ, కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు చేతుల మీదుగా జ్ఞాపికలు స్వీకరిస్తున్న స్పాన్సర్లు తదితరులు

స్పాన్సర్లకు సత్కారం

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో ఈనాడు 50, ఈటీవీ 30 వసంతాల వేడుకలు ఆదివారం రాత్రి వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి స్పాన్సర్లుగా వ్యవహరించిన వారిని ఘనంగా సత్కరించారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ విజయవాడ మేనేజర్ ఎం.చంద్రశేఖర్ అజాద్, ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ ఏరియా సేల్స్ మేనేజర్ నారాయణ, విజయవాడ డిస్ట్రిబ్యూటర్ ఎం.ఆంజనేయులు, తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ ప్రతినిధులు సుభాని, జి.ఎస్.ఎన్.ప్రసాద్, ఫిజికెమ్ మదుక్యూర్ జ్యూస్ అండ్ క్యాప్సుల్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సి.సి.కేశవరావు, రాజేశ్వరి, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ మేనేజర్ కె.కృష్ణమోహన్, ఒటో క్లాతింగ్ డీజీఎం మధుకుమార్, శ్రీలలిత రైస్ విజయవాడ, గుంటూరు రీజియన్ జనరల్ మేనేజర్ ఎస్.ఎ.బాషా, వేగా జ్యూయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వి.నవీన్‌కుమార్, సుధాకర్, మాస్టర్ మైండ్స్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ప్రతినిధి కె.శ్రీనివాసరావు, ఆర్టోస్ కూల్ డ్రింక్స్ విజయవాడ డిస్ట్రిబ్యూటర్ ఎం.నాగశైలజ, ఎం.ప్రభాకర్‌రావు, మల్లిక స్పైన్ సెంటర్(గుంటూరు) మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జె.నరేష్‌బాబు, అక్కినేని హాస్పిటల్స్(విజయవాడ) ప్రతినిధి డి.జి.రెడ్డి, స్వీట్ శ్రీనివాస్‌గారి శ్రీబాలాజీ ఘీ స్వీట్స్(విజయవాడ) మేనేజింగ్ డైరెక్టర్ కనమర్లపూడి శ్రీనివాస్, శ్రీగోసలైట్స్ మెడికల్ అకాడమీ(విజయవాడ) డైరెక్టర్ వెనిగళ్ల నరేంద్రబాబు, విజేత సూపర్‌మార్కెట్ ఏపీ, తెలంగాణ స్టోర్స్ మేనేజర్(విజయవాడ) డి.సాయి పవన్, పినాకెల్ జూనియర్ కాలేజ్(విజయవాడ) ఛైర్మన్ శంకరమంచి సాయిరామ్, శ్రీభాష్యం గ్లోబల్ స్కూల్(విజయవాడ) డైరెక్టర్స్ కిషోర్‌బాబు, లక్ష్మీనారాయణ, మన వీవీఐటీ యూనివర్సిటీ (నంబూరు) ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్‌రావు, అరుణప్రియ, అంబికా దర్బార్‌బత్తి(విజయవాడ) డిస్ట్రిబ్యూటర్ పువ్వాడ భాస్కర్‌రావును సత్కరించారు. వీరికి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్, గద్దె అనూరాధ, కలెక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు.

బారులు తీరిన భక్తులు

స్వామి ఆదాయం రూ. 8లక్షలు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నిత్యాన్నదాన పథకానికి బాపట్ల జిల్లా రేపల్లె వాస్తవ్యులు మునగాల సాంబశివరావు-మీనాకుమారి పేరిట వారి కుమార్తె తూనుగుంట్ల ధర్మనాగేశ్వరరావు-వెంకటలక్ష్మి సునీతాదేవి దంపతులు 106 భోజనం ప్లేట్లు ఆదివారం వితరణగా అందించారు. ఆలయ ఈవో శ్రీరామవరప్రసాదరావు దాతలను ఘనంగా సత్కరించారు. ఆదివారం 280 మంది భక్తులు ఆన్‌లైన్ ద్వారా స్వామి దర్శనం, ఇతర పూజల టికెట్లను తీసుకున్నారు. ఈ రూపేణా రూ.1.77లక్షలు, ప్రత్యక్ష సేవల ద్వారా రూ.6.23 లక్షలు వెరసి రూ.8లక్షల ఆదాయం వచ్చింది.

★ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను జనవరి 7వ తేదీన లెక్కించనున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. లెక్కింపులో భక్తులు డ్రెస్ కోడ్ పాటించి పాల్గొనవచ్చునన్నారు. లెక్కింపు రోజున స్వామి వారి శాంతి కల్యాణం ఉదయం 7గంటలకే జరుగుతుందని, భక్తులు గమనించాలని కోరారు.

క్రమబద్ధీకరణకు తరుణమిదే..

1083 మందికి నోటీసులు
496 మంది చెల్లింపులకు సిద్ధం

గుడివాడ, న్యూస్‌టుడే

బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం 2025 (బీపీఎస్) ద్వారా అనధికారంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకోవడానికి 2026 మార్చి 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని గుడివాడ పట్టణంలో పురపాలక సంఘం విస్తృత ప్రచారం చేస్తోంది. పట్టణంలో 1 జనవరి 1985 నుంచి 31 ఆగస్టు 2025 లోపు అనధికారంగా, అనుతులకు మించి, ప్లానుకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను బీపీఎస్ ద్వారా క్రమబద్ధీకరించుకోవచ్చు. భవన యజమానులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించారు. భవనం ప్లాను, రిజిష్టరు డాక్యుమెంట్, ఇటీవల తీసిన ఈసీ, ఇండెమ్నిటీ బాండ్, గుర్తింపు పొందిన సర్వే ఇంజినీరు ధ్రువీకరించిన స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్, తదితరాలతో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తునకు రూ.10 వేలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలి. ఇప్పటికే గుడివాడ పురపాలక సంఘ ప్రణాళికా విభాగం 1083 భవనాలను అనధికారికమని గుర్తించింది. వీటిలో

పురపాలక సంఘ కార్యాలయం

496 మంది పురపాలక సంఘం వారు ఇచ్చిన నోటీసులకు స్పందించి తమ భవనాలను క్రమబద్ధీకరించుకోవడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆదివారం నాటికి బీపీఎస్‌కు 54 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఇవీ ప్రయోజనాలు : అనధికార భవనాలను క్రమబద్ధీకరించుకోవడం వలన బ్యాంకుల నుంచి రుణాలను పొందవచ్చు. భవనంపై తదుపరి ఏవైనా నిర్మాణాలు చేసుకోవాలన్నా పురపాలక సంఘం అనుమతులకు ఎటువంటి ఇబ్బందీ కలగదు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వస్తుంది. ఇంటి పన్నుకూడా సరళీకరిస్తారు.

కఠిన చర్యలకు అవకాశం: పట్టణంలో అధికారులు గుర్తించిన 1083 భవనాలలో సగానికి పైగా ప్లాన్లు ఉన్నాయి. చాలా వాటిని ప్లాను అతిక్రమించి కట్టారు. ఇప్పుడు వాటిపై బీపీఎస్‌కు దరఖాస్తు చేసుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని పురపాలక కమిషనర్ సింహాద్రి మనోహర్ తెలిపారు. క్రమబద్ధీకరించని భవనాలు ఏక్షణమైనా తొలగించవచ్చు. అధిక మొత్తంలో అపరాధ రుసుముగా పన్ను వసూలు చేస్తారు. ఈ భవనంపై ఎలాంటి అదనపు నిర్మాణాలు చేయడానికి అనుమతులు ఇవ్వరు. క్రిమినల్ కేసులు నమోదయ్యే అవకాశమూ ఉంది.

రూ.6 కోట్ల వరకూ ఆదాయం

గుడివాడ పురపాలక సంఘంలో బీపీఎస్ ద్వారా భవనాల యజమానులు చెల్లించే మొత్తం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి 30 శాతం చెల్లించి మిగిలిన 70 శాతం పురపాలక సంఘం వినియోగించుకోవచ్చు. దీంతో బీపీఎస్ ద్వారా క్రమబద్ధీకరణకు సంసిద్ధత వ్యక్తం చేసిన 496 మందికీ అనుమతులు లభిస్తే సుమారు రూ.6 కోట్లకు పైగా ఆదాయం లభించే అవకాశం ఉంది.

తెదేపాకు సుదీర్ఘ సేవలందించడం అభినందనీయం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : తెదేపా ఆవిర్భావం నుంచి అంకితభావంతో పని చేస్తూ 43 ఏళ్ల పాటు సుదీర్ఘ సేవలందించడం అభినందనీయమని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. బాపులపాడు మండలం ఆరుగొలనుకు చెందిన తెదేపా సీనియర్ నేత మూల్పూరి వెంకటరత్నం(మునసబు) 90వ జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యులు, తెదేపా నాయకుల ఆధ్వర్యంలో హనుమాన్‌జంక్షన్‌లోని ఎస్.ఆర్ కన్వెన్షన్‌లో ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, గద్దె రామ్మోహన్, బోడే ప్రసాద్, చింతమనేని ప్రభాకర్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కేడీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం, మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, వసంత నాగేశ్వరరావు, వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా తెదేపా అధ్యక్షురాలు గద్దె అనూరాధ, విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, విశ్వహిందూ పరిషత్తు జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్ కుమార్ తదితరులు వెంకటరత్నంకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఆదిత్య, ఆశాజ్యోతి దివ్యాంగ పాఠశాలలకు రూ.లక్ష విలువ చేసే సామగ్రిని వెంకటరత్నం వితరణ చేశారు. రైతు నాయకులు వేములపల్లి శ్రీనివాసరావు, గుండపనేని ఉమాప్రసాద్, ఆళ్ల గోపాలకృష్ణ, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటరత్నంకు కేకు తినిపిస్తున్న రామ్మోహన్, నారాయణ

కోతులు అడ్డొచ్చి ఆటో బోల్తా... ఆరుగురికి గాయాలు

ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాము

నందివాడ(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: కోతులు అడ్డు రావడంతో ఆటో బోల్తాపడి ఆరుగురు గాయపడిన ఉదంత మిది. గుడివాడ గ్రామీణ మండలం లింగవరానికి చెందిన 10 మంది వ్యక్తులు ఏలూరులో వెల్డింగ్ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం ఆటోలో బయలుదేరారు. నందివాడ మండలం పుట్టగుంట గ్రామపరిధిలో లింగవరం చెక్‌పోస్టు దాటిన తర్వాత రహదారిపైకి హఠాత్తుగా పెద్దఎత్తున కోతులు రావడం, కొన్ని ఆటో కిందకు, ఒకటి డ్రైవర్‌పై పడటంతో హఠాత్తుగా బ్రేక్ వేయాల్సి వచ్చింది. దీంతో ఆటో కుదుపునకు గురై బోల్తా పడింది. దీంతో అందులోనివారు గాయపడ్డారు. వీరిని గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా వారిలో ఆరుగురు తల, చేతులు, కాళ్లకు చిన్నపాటి గాయాలయ్యాయి. ఒకరికి భుజం తీవ్ర నొప్పిగా అన్పించడంతో మచిలీపట్నం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యసేవ లందించాలని వైద్యసిబ్బంది సూచించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు లేకపోవడంతో కేసు నమోదు కాలేదు.

పే అండ్ అకౌంట్స్ ఉద్యోగులకు అండగా ఉంటాం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్రంలో పే అండ్ అకౌంట్స్ ఉద్యోగులకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ పే అండ్ అకౌంట్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సర్వీస్ రూల్స్, రేషియో ఫిక్సేషన్, పదోన్నతులు, అడిషనల్ చార్ట్ తదితర దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.హరనాథ్ మాట్లాడుతూ.. నూతన జిల్లాల్లో ఎన్నికలు నిర్వహించి, సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. విద్యాసాగర్‌ను సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం కోఆప్షన్ ద్వారా నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పమ్మి శ్రీనివాస్(విశాఖపట్నం), కార్యదర్శులుగా జల్లేపల్లి స్వామి(విజయవాడ), మోహనరావు(విజయనగరం) ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వి.రమణారెడ్డి, సహాధ్యక్షుడు టి.వి.రమణ, కార్యనిర్వాహక కార్యదర్శి కె.శ్రీనివాసరావు, కోశాధికారి టి.లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసాగర్‌ను సత్కరిస్తున్న సంఘ నాయకులు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 152, 161, 172 చికెన్ విత్ స్కిన్ - 294 చికెన్ స్కిన్‌లెస్ - 304.

పంటకాల్వలో గుర్తుతెలియని మృతదేహం

కోడూరు: అవనిగడ్డ-కోడూరు ప్రధాన పంటకాల్వలో మాచవరం వద్ద గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు కోడూరు ఎస్సై కె.చాణక్య తెలిపారు. మాచవరం ఇన్‌ఛార్జి వీఆర్వో హరిబాబు అందించిన సమాచారం మేరకు మాచవరం పంట కాల్వలో కొట్టుకు వచ్చిన మృతదేహాన్ని సాయంత్రం 5గంటలకు గుర్తించారు. సుమారు 25-30 ఏళ్ల వయస్సు ఉన్న పురుషుడు నల్లటి ప్యాంటు, టి-షర్టు ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసి అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

కళాశాలలో విద్యార్థుల ఘర్షణ

పెడన, న్యూస్‌టుడే: పెడన ప్రాంతంలో ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. శుక్రవారం కళాశాల ఎదుట ఇరువర్గాలు తలపడగా అదే సమయంలో అటుగా వెళుతున్న ట్రైనీ ఎస్సై నాగరాజు గొడవను అదుపు చేశారు. అనంతరం శనివారం కళాశాలలో మరోసారి గొడవపడ్డారు. అధ్యాపకులు వచ్చి వారిని అడ్డుకున్నారు. దీనిపై స్పందించిన యాజమాన్యం విచారణకు కమిటీని నియమించామని నివేదిక ఆధారంగా ఇరువర్గాల విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

91.9 FM Vijayawada Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును.బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును స్పాట్‌క్యాష్. ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

INDUSTRY

MACHINERY FOR SALE

విత్తనశుద్ధి యంత్రాలు మరియు జనపనార సంచులు అమ్మకానికి అందుబాటులో ఉన్నాయి సంప్ర॥. ✆ 72880 65253.

JOBS

Wanted Female Telecallers, Counsellors & Receptionist for a reputed college in Labbipet. Pay upto 15k+incentives. Qual: Any Degree. Age: 25-40 yrs. Min 2 yrs exp. Ph: 63030 85727.

VJA-2 గవర్నర్‌పేట పైలెట్ సర్వీసు స్టేషన్ IOCL పెట్రోల్ బంక్ నందు సేల్స్‌మెన్స్‌గా పనిచేయుటకు M/F కావలెను. ✆ 94412 49912/ 92463 75420.

గన్నవరం కార్యాలయంలో పనిచేయుటకు అనుభవం కలిగి ఉన్న అకౌంటెంట్ కావలెను, ట్యాలీ & GST ఫైలింగ్‌లో పని అనుభవం ఉండాలి. ✆ 94401 75207.

'మహానాడు మీడియా'లో వీడియో ఎడిటర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ, యువకులు కావలెను. కాల్: 73372 22004.

కంకిపాడు దగ్గర గల రిలయన్స్ వేర్ హౌస్‌లో పనిచేయుటకు డేటా ఎంట్రీ ఆపరేటర్స్ కావలెను. Q: ఇంటర్ ఆపైన, Ph: 99511 40777.

ప్రముఖ రియల్ ఎస్టేట్స్‌లో పనిచేయుటకు మార్కెటింగ్ మేనేజర్స్, మార్కెటింగ్ ఏజెంట్స్ కావలెను. జీతం+ కమీషన్ ఇవ్వబడును. సంప్ర ✆ 93906 65999.

ఫ్రాంఛైజ్ బ్యూటీపార్లర్‌కు మేనేజర్‌గా పనిచేయుటకు అనుభవం గల అభ్యర్థులు కావలెను. ✆ 81878 89997.

లేడీ అభ్యర్థి (హెల్పర్) 10th P/F ఏలూరురోడ్డు, సీతారాంపురం ఫ్లేవుడ్ అండ్ డోర్స్ షాపులో పనిచేయుటకు కావలెను. 12,000/-. 9-30 to 7-30. ✆92472 88381

డైలీ ఇంటికొచ్చి డ్రెస్సింగ్ (2legs) డ్రెస్సింగ్ చేయుటకు ఫిమేల్ నర్స్ కావలెను. సీతారామపురం, ఏలూరు రోడ్. ✆ 93482 88381.

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డులు & హెల్పర్లు కావలెను. విజయవాడ MG రోడ్‌లో ప్రముఖ షోరూమ్‌లో పనిచేయుటకు. జీతము గార్డ్స్‌కు 15,000/- & హెల్పర్లకు 12,000/-. ఇతర సదుపాయాలు కలవు. ✆ 80994 44758 / 96401 48367.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

BOOK YOUR COLOUR CLASSIFIED
₹1200/- (5 Lines)
PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

(c) eenadu

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

ఉత్సాహంగా ప్రతిభా పాటవ పోటీలు

కేంద్రీయ విద్యాలయంలో విజేతలతో ప్రిన్సిపల్ తదితరులు

గెలుపొందిన వారితో మల్లవోలు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

మచిలీపట్నం (గొడుగుపేట): ప్రతిభ చాటుకునేందుకు పోటీలు దోహదపడతాయని వివిధ పాఠశాలలు, కళాశాలల ప్రతినిధులు పేర్కొన్నారు. నగరంలోని కేంద్రీయ విద్యాలయం, గూడూరు మండలం మల్లవోలు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఈనాడు, ఈటీవీ ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ సంబంధించిన అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించగా ఆయా పాఠశాలల విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభ చాటుకున్నారు. కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన పోటీల్లో ఎస్.ద్వారిక (10వ తరగతి), వి.సాత్విక్ (12వ తరగతి), పి.మోక్షిత్ (9వ తరగతి)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ప్రిన్సిపల్ మహ్మద్ ఆసిఫ్ హుస్సేన్, ఉపాధ్యాయులు జె.సత్యనారాయణ, డి.వెంకటేశ్వర్లు, మహేశ్వర తదితరులు బహుమతులు అందజేశారు. ❖ గూడూరు మండలం మల్లవోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో డి.మహేష్‌బాబు (9వ తరగతి), ఎస్‌కే అల్తాఫ్ (9వ తరగతి), పి.నందిని (9వ తరగతి)లు వరుసగా విజేతలుగా నిలిచారు. అనంతరం హెచ్‌ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు కె.బాలశేఖర, ప్రసాదరావు బహుమతులు అందజేశారు.

ధర వరలు

కిలో టమాట రూ.48, వంగ 20, బెండ 34, పచ్చిమిర్చి 40, కాకర 50, క్యాబేజీ 22, క్యారెట్ 34, దొండ 37, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 30, గోరుచిక్కుడు 40, దోస 40, సొర 20.18, అరటికాయ 7.8, చిక్కుళ్లు 34, బీర 34, చామదుంప 26, మునగ 15/14, కంద 44, బీట్‌రూట్ 30, కీరదోస 36, బీన్స్ 76, క్యాప్సికం 58, అలసందలు 40, చిలకడదుంప 30, కొత్తిమీర 14/07, పుదీనా 15/05 సోమవారం ఉదయం 7 గంటలవరకు ఈ ధరలు వర్తిస్తాయి. – న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

సినిమాలు

రేవతి: ఉషా, మినీరేవతి: శంబాల, సిరికృష్ణ: అఖండ-2, సిరివెంకట్: ఛాంపియన్

పిక్కలు పీకేస్తున్నాయ్..

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

★ కొద్ది రోజుల కిందట నగరంలోని 4వ డివిజన్‌లో శివ పామియానా సందులో ఓ వ్యక్తిపై కుక్కలు దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డారు. ఇదే వీధిలో అనేకమంది కుక్కకాటు బారినపడ్డారు, నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ ప్రాంతానికి చెందిన వసంతరావు స్థానిక సచివాలయంలో అర్జీ అందించారు.

★ పరాసుపేటలోని వివిధ ప్రాంతాల్లో రహదారుల వెంబడి ఎక్కడ చూసినా శునకాలు గుంపులుగా తిరుగుతుండటంతో పాటు తరచూ దాడి చేస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

హిందూ కళాశాలలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

నగరంలో గత కొన్ని నెలలుగా కుక్కలు గుంపులుగా సంచరిస్తూ స్వైరవిహారం చేస్తున్నాయి. వాటి సంతతి విపరీతంగా పెరిగిపోవడంతో రోడ్లపైకి వచ్చి ప్రజల వెంటపడి దాడి చేస్తున్నాయి. సమస్య ఎక్కువగా ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో గతేడాది నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో వీటికి శస్త్రచికిత్సలు చేయించారు. కానీ సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. చిలకలపూడి, సుకర్లాబాద, పరాసుపేట, రాజుపేట, జగన్నాథపురం, నిజాంపేట ఇలా అన్ని ప్రాంతాల్లోనూ వీటి సంచారం రోజురోజుకు ఎక్కువగా ఉంది. ప్రతి నెలా కేవలం మచిలీపట్నంలోనే వందల సంఖ్యలో కుక్కకాటు కేసులు నమోదు అవుతున్నాయి. భాస్కరపురంలో ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా కుక్కదాడి చేయడంతో గాయపడ్డారు. వలందపాలెంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారి వెంట పడడంతో అతడు ప్రమాదానికి గురయ్యారు.

బయటకు రావాలంటే భయమే..

కేవలం బందరు నగరమే కాదు బందరు, పెడన గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పెడన మండలం నడుపూరు, కొంకేపూడి ప్రాంతాల్లో ప్రధాన రహదారిపై కుక్కలు తిష్ట వేసి ద్విచక్ర వాహనదారుల వెంటపడి దాడి చేస్తున్నాయి. దీంతో వాహనదారులు ఆ మార్గంలో రాకపోకలు సాగించేందుకు హడలిపోతున్నారు. ఇదే మండలంలోని చేవేండ్ర, కమలాపురం, దేవరపల్లి, పెనుమల్లి తదితర ప్రాంతాలతోపాటు గూడూరు మండలంలోని గూడూరు, మల్లవోలు, తరకటూరు, పోలవరంతో పాటు పలు గ్రామాల్లో కూడా కుక్కలు ఎక్కువగా ఉన్నాయి.

అలంకారప్రాయంగా డాగ్స్ మినాన్స్ కేంద్రం

కుక్కలను నియంత్రించేందుకు తెదేపా ప్రభుత్వ హయాంలోనే బందరు నగరంలో రూ.17 లక్షలతో ఏర్పాటు చేసిన డాగ్స్ మినాన్స్ సెంటరు అలంకారంగా మారిపోయింది. వివిధ ప్రాంతాలకు చెందిన వీధి కుక్కలను తీసుకువచ్చి శస్త్రచికిత్స చేసి వాటి సంతతి వృద్ధి తగ్గించాలన్న లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కానీ ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం దీని గురించి పట్టించుకోలేదు. ఈ కేంద్రాన్ని వినియోగంలోకి తెచ్చినా కొంతవరకు ప్రయోజనం ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. కూటమి ప్రభుత్వం శునకాల నియంత్రణపై చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

చెత్త తొలగింపు

పోర్టుపురం (కృత్తివెన్ను), న్యూస్‌టుడే: చిన పాండ్రాక పోర్టుపురంలో పేరుకున్న చెత్తను తొలగించారు. 'చెత్త తీసుకెళ్లడానికి వాహనం రావడం లేదంటూ' గత బుధవారం 'ఈనాడు'లో వెలువడిన కథనానికి ఎంపీడీవో శ్రీనివాసరావు స్పందించి పంచాయతీ సిబ్బందిని పంపి చెత్త తొలగింపునకు చర్యలు తీసుకున్నారు.

ప్రకృతి సాగుతో ఆరోగ్యం.. ఆదాయం

గూడూరు, న్యూస్‌టుడే: ప్రకృతి సాగుతో అందరికీ ఆరోగ్యంతో పాటు రైతులు ఆయా ఉత్పత్తుల ద్వారా మంచి ఆదాయం పొందవచ్చని సేవ్ సంస్థ నిర్వాహకులు మేకపోతుల విజయరావు అన్నారు. గూడూరు మండలం పినగూడూరులంక గోసదన్‌లో సౌజన్య విధానంలో పంటలు సాగుపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఆదివారం నిర్వహించిన శిక్షణలో వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వరి సాగు చేయడం కోసం అన్నదాతలు రసాయన ఎరువులు ఎక్కువగా వినియోగిస్తున్నారని అన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా తీసుకువచ్చిన సౌజన్య విధానంలో ఎకరాకు ఏడాదికి రూ.4.50 లక్షల వరకు ఆదాయం పొందవచ్చని అన్నారు.

అలరించిన కళా రూపాల ప్రదర్శన

గుడివాడ, న్యూస్‌టుడే: వివిధ రకాల కళారూపాల ద్వారా సమాజంలోని సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కృష్ణా జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయం వద్ద శ్రామికోత్సవం ఆదివారం రాత్రి నిర్వహించారు. చిరంజీవి ఆలూరి నివేదిత భరతనాట్యం, ప్రసన్న, మేరీ గ్రేస్, రిబ్కాల జానపద నృత్యం, గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి అవిర్నేని వెంకటేశ్వరరావు శకుని ఏకపాత్రాభినయం అలరించాయి.

కార్యకర్తలే.. తెదేపా బలం


ఉత్తమ కార్యకర్త అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

పెడన, న్యూస్‌టుడే: తెదేపాకు కార్యకర్తలే బలమని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఆదివారం పెడన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో నియోజకవర్గంలో ఉత్తమ పనితీరు కనబరిచిన 57 మంది కార్యకర్తలకు మంగళగిరి కేంద్ర కార్యాలయం పంపించిన పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ఏడాది జులై 2 నుంచి ఆగస్టు 31 వరకు నిర్వహించిన కార్యక్రమంలో తమ గ్రామాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని సేకరించడంలో కార్యకర్తలు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు యక్కల శ్యామయ్య, కలపాటి ప్రసాద్, మల్లేశ్వరం మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఒడుగు తులసీరావు, డీసీ ఛైర్మన్ బొర్రా కాశీ, మాజీ వైస్ ఛైర్మన్ అబ్దుల్ ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు. అవార్డులు అందుకున్న వీణం శ్రీనివాస్, మహ్మద్ రియాజ్, రౌతుల పైడిరాజు, పులి రవీంద్రనాథ్, కటకం అయ్యప్ప, ఆమటి శ్వరరావు తదితరులను ఎమ్మెల్యే అభినందించారు.

అంతర్జాతీయ వాకర్స్ పోటీల్లో ప్రతిభ

శ్రీనుబాబును సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

పెదచందాల (కృత్తివెన్ను), న్యూస్‌టుడే: మండలంలోని గరిశపూడి పంచాయతీ పెద చందాలకు చెందిన బొమ్మిడి శ్రీనుబాబు.. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన వాకర్స్ పోటీల్లో వేగంగా నడిచి వరుసగా రెండో ఏడాది ప్రథమ స్థానం సాధించినందుకు భీమవరంలోని డీఎన్ ఆర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఈ నెల 21న విశాఖ బీచ్ రోడ్డులో నిర్వహించిన పోటీలకు అసోసియేషన్ సభ్యులు శ్రీనుబాబును పంపించారు. మూడు రాష్ట్రాల(తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా)కు చెందిన వాకర్స్ పోటీల్లో పాల్గొన్నారు. ఆదివారం డీఎన్‌ఆర్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కడియాల పల్లంరాజు, కార్యదర్శి సీతారామరాజు, జిల్లా కేబినెట్ కార్యదర్శి కొప్పినీడి సూర్యప్రకాష్ తదితరులు శ్రీనుబాబును సన్మానించారు. గత ఏడాది డిసెంబర్ 29న ఏలూరులో నిర్వహించిన అంతర్జాతీయ వాకర్స్ పోటీల్లోనూ శ్రీనుబాబు సత్తాచాటారు.

పంట కాలువకు మరమ్మతులు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పుల్లపాడు రైతులకు సాగునీటిని అందించడానికి పంట కాలువకు మరమ్మతులు నిర్వహించారు. మినుప పైరుకు సాగు నీటిని అందించేందుకు పంట కాలువ సరిగా లేకపోవడంతో నీటి సంఘ అధ్యక్షుడు గూడవల్లి భద్రాచలం సమస్యను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చొరవ తీసుకుని కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగించారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ లక్ష్యాల్ని సాధించాలి

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులు ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) లక్ష్యాలను సాధించాలని ఎస్ఎస్ ఏఎంవో ఆర్.శ్యాంసుందరరావు తెలిపారు. విద్యార్థుల్లో అక్షరాలు, సంఖ్యా పరిజ్ఞానం పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. 75 రోజుల శిక్షణ పూర్తయిన తరువాత విద్యార్థులకు తుది పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

భవనాలు పూర్తయ్యేదెప్పుడో?

అచ్చయ్యవారి పాలెం పంచాయతీలో 2022లో చేపట్టిన ప్రభుత్వ భవనాలు నేటికీ అసంపూర్తిగా మిగిలాయి. జాతీయ ఉపాధి హామీ కింద రూ.83.04 లక్షలతో అప్పట్లో సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ కేంద్రాల నిర్మాణాలను మాజీ మంత్రి జోగి రమేశ్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. గుత్తేదారుకు బిల్లులు చెల్లించక కొంతమేర పూర్తిచేసి పనులు నిలిపేశారు. దీంతో మూడేళ్లుగా భవనాలు నిరుపయోగంగా మారాయి. - న్యూస్‌టుడే, పెడన

అల్లుకున్న గుర్రపుడెక్క

బందరు శివగంగ డ్రెయిన్‌లో గుర్రపుడెక్క దట్టంగా అల్లుకుపోయింది. దీంతో మురుగు నీరు ప్రవహించక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుల్తానగరం వెళ్లే మార్గంలో ఉన్న వంతెన వద్ద నీరు కనిపించని విధంగా గుర్రపుడెక్క అల్లుకుపోయింది. తరచూ ఇదే సమస్య పునరావృతం అవుతోందని ఆ ప్రాంత రైతులు వాపోతున్నారు. ముందుగానే అధికారులు స్పందించి గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

గుంతల రోడ్డుతో అవస్థలు

మండలంలోని పోతేపల్లి రోడ్డు పలుచోట్ల గుంతలు పడి అధ్వానంగా తయారయ్యింది. ఇటీవల కొంత మేర కొంతమేర గుంతలు పూడ్చి మిగిలిన ప్రాంతాన్ని వదిలేశారని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. పోతేపల్లితో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, జ్యూయలరీ పార్కులో రోల్డ్‌గోల్డ్ పరిశ్రమల నిర్వాహకులు, కార్మికులు ఇదే రోడ్డు వెంబడి రాకపోకలు సాగిస్తారు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)

ద్విచక్ర వాహనం ఢీకొని రిక్షా కార్మికుడి దుర్మరణం

పెడన, న్యూస్‌టుడే: బైక్ ఢీకొని రిక్షా కార్మికుడు మృతి చెందిన ఘటన పెడన-గుడివాడ రహదారిపై స్థానిక పల్లోటి స్కూలుకు సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఈదుమూడికి చెందిన బొడ్డు నాగేశ్వరరావు(70) పెడన నుంచి రిక్షాపై రాత్రి 9 గంటలకు ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పెడన, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స అనంతరం ఇంట్లో మృతి చెందిన సంఘటన మండలంలోని నందమూరు పంచాయతీ జయంతి కాలనీలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. బెల్లంకొండ నాగేశ్వరరావు(48) ఈ నెల 20వ తేదీన 216వ జాతీయ రహదారిపై నడిచి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొట్టింది. గాయపడిన అతడిని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం రెండు రోజుల క్రితం ఇంటికి తీసుకొచ్చారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆదివారం ఉదయం మృతి చెందినట్లు ఏఎస్సై నారాయణ తెలిపారు. మృతదేహానికి పంచనామా అనంతరం మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

చోరీ కేసుల్లో నిందితుడి ఆచూకీ లభ్యం

పెడన, న్యూస్‌టుడే: పెడనలో చోరీలు చేస్తున్న నిందితుడి ఆచూకీని పోలీసులు గుర్తించారు. పట్టణంలోని వీరభద్రపురంలో రూ.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. దీనిపై దర్యాప్తు చేసిన సీసీఎస్, పెడన పోలీసులు వీరభద్రపురానికి చెందిన ఓ యువకుడు చోరీలకు పాల్పడినట్లు వేలిముద్రల ద్వారా నిర్ధారించి అదుపులోకి తీసుకున్నారు. పల్లోటి కాలనీలో జరిగిన మరో చోరీలో కూడా ఇతడి పాత్ర ఉన్నట్లు అనుమానిస్తున్నారు. చోరీ చేసిన ఆభరణాలను ఓ ప్రైవేటు సంస్థలో తాకట్టు పెట్టినట్లు తెలిసిందన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనాలకు బానిసై ఈ తరహా నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీరామ్ సేవలు అభినందనీయం

మచిలీపట్నం (గొడుగుపేట): శ్రీరామ్ సేవలు ప్రశంసనీయమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. నగరంలో స్టార్ కళాశాల ఎడ్యుకేషన్ సప్లై అండ్ ఫ్రాంచైజ్ ఎక్స్‌పో-2025లో ఉత్తమ కళాశాలగా గుర్తింపు పొందిన సందర్భంగా ఆదివారం నగరంలోని సన్‌స్టార్ స్కూలులో కళాశాల అధినేత పి.శ్రీరామ్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, తెదేపా రాష్ట్ర నాయకులు గొర్రెపాటి గోపీచంద్, జగన్నాథరావు(బుల్లయ్య) పాల్గొని ప్రసంగించారు. కళాశాల డైరెక్టర్ అయ్యప్పస్వామి మాట్లాడుతూ టైమ్స్‌ఆఫ్ ఇండియా సహకారంతో ముంబయిలో నిర్వహించిన ఎక్స్‌పోలో పురస్కారం అందుకోవడం ప్రత్యేక గుర్తింపు అని అన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ బాబాప్రసాదు, రాము, నాగరాము, డీవైఈవో శేఖర్‌సింగ్ వివిధ పక్షాల ప్రముఖులు, ప్రిన్సిపల్ ఆదిత్య, అధ్యాపకులు శ్రీరామ్‌ను సత్కరించారు.

అమ్మవార్లకు సారె

చల్లపల్లి: ఆర్యవైశ్య మహిళలు గోదాదేవికి, శ్రీకన్యకాపరమేశ్వరి, గ్రామదేవత శ్రీసంపటాలమ్మ, శ్రీగరుడ ఆంజనేయ సహిత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలోని శ్రీగోదాదేవి అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు

కన్యకాపరమేశ్వరి ఆలయంలో కల్యాణమూర్తులు

అలంకరణలో అయ్యప్పస్వామి

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని పలు దేవాలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రంగనాయకస్వామి ఆలయంలో వేదపండితులు పూజలు నిర్వహించారు. బలరామునిపేట యతిరాజభవన్‌లో ఆదివారం నిర్వహించిన పూజల్లో ఆళ్వార్ దివ్య ప్రబంధక్ ప్రాజెక్టు ప్రతినిధి రామచంద్రుని రమేష్‌కృష్ణ పాల్గొన్నారు. శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని, ప్రవచనాలు ఆలకించారు. యతిరాజభవన కార్యదర్శి దోరడ్ల హేమ ప్రకాష్ తదితరులు ఆయనను సత్కరించారు. కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో వేంకటేశ్వరస్వామి కల్యాణ క్రతువు నిర్వహించగా భక్తులు పాల్గొన్నారు. చెమ్మనగిరిపేట అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

అసంపూర్తిగా డ్రైనేజీ నిర్మాణం

మండలంలోని బంటుమిల్లిలో సరైన మురుగునీటి పారుదల వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మచిలీపట్నం, గుడివాడ ప్రధాన రోడ్డు, సంతబజారు, శివాలయం వంటి ప్రాంతాల్లో తప్ప.. ఎక్కడా డ్రెయిన్లు లేవు. ఇవి కూడా చాలా చోట్ల ఆక్రమణకు గురయ్యాయి. దీనివల్ల పూడికతీత సాధ్యపడడం లేదు. బీఎస్ఆర్, గణేశ్, బీసీ కాలనీ, కనకదుర్గ గుడి వంటి ప్రాంతాల్లో అసలు కాలువలే లేవు. బంటుమిల్లిలో బహుళ అంతస్తులు, అపార్ట్‌మెంట్లు విస్తరిస్తున్నాయి తప్పితే అందుకు తగ్గ మౌలిక వసతులు కల్పించడం లేదు. గతంలో వైకాపా ఆర్భాటంగా డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించలేదు. అధికారులు ఇప్పటికైనా వీటిపై దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, బంటుమిల్లి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

స్పందనకు వందనం

❖ నగరంలోని గాంధీనగర్ నుంచి బ్రహ్మపురం వెళ్లే దారిలో ఉన్న చెత్త కుప్ప తొలగించాలని ఆ ప్రాంతవాసులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా అధికారులకు తెలియజేయగా వారు స్పందించి సిబ్బందిని పంపి చెత్త తొలగించారు. ❖ నగరంలోని వలందపాలెంలో ప్రధాన రహదారి పక్కన డ్రెయిన్ పూడిపోయి మురుగు పారుదలకు ఆటంకంగా మారిందని ఆ ప్రాంతవాసులు అధికారులకు వివరించడంతో వారు స్పందించి పూడిక తొలగింపునకు చర్యలు తీసుకున్నారు.

- న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

గ్రామీణ వైద్యుల సేవలు ఎనలేనివి

మాట్లాడుతున్న ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: గ్రామీణ వైద్యుల సేవలు అభినందనీయమని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. ఏపీ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘ వార్షికోత్సవం ఆదివారం నగరంలోని ఓ వేడుక మందిరంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అనారోగ్య సమస్య తలెత్తినా మొదట సంప్రదించేది ఆర్ఎంపీలనేనని అన్నారు. వారు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తారన్నారు. గ్రామీణ వైద్యులు కూడా సకాలంలో ప్రాథమిక చికిత్స అందించి వారికి అవసరమైన వైద్యుల వద్దకు పంపించేందుకు కృషి చేయాలని సూచించారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు బీఆర్ ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర నాయకులు కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య) తదితరులు ప్రసంగించారు. విజయవాడ పెద్దేశ్వర్ హెల్త్‌కేర్ సెంటర్ వైద్యులు పళ్లెం ఆకాష్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో వయసుతో సంబంధం లేకుండా గుండెపోటు బారిన పడుతున్నారని అన్నారు. అలాంటి వారిపై అప్రమత్తంగా ఉంటూ వెంటనే ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సంఘ క్యాలెండర్ ఆవిష్కరించారు. సంఘ నాయకులు నందగోపాల్, డేవిడ్‌రాజు, ఖాన్, సందీప్, కోటేశ్వరరావు, సురేష్‌బాబు, మల్లికార్జునుడు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

మచిలీపట్నం (కోనేరు సెంటరు), న్యూస్‌టుడే: జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ 140వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

పార్టీ జెండాకు వందనం చేస్తున్న నాయకులు

జెండా ఆవిష్కరించి మిఠాయిలు పంచి పెట్టారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అబ్దుల్‌మతీన్, పీసీసీ డెలిగేట్ కోకా ఫణిభూషణ్ తదితరులు మాట్లాడుతూ అహింసే ఆయుధంగా కాంగ్రెస్ సాగించిన పోరు ప్రపంచ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ విషయం అన్నారు. గ్రామీణ పేదలకు ఉపయోగపడే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి మోదీ ప్రభుత్వం తిలోదకాలు ఇవ్వడం దారుణమన్నారు. పార్టీ నాయకులు నల్లబోలు కుమారి, చిలుకోటి ప్రసాద్, షేక్ అయూబ్, శామ్యూల్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దారుల దశ తిరిగేనా..

ఆర్టీసీ కాలనీలో..

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: మచిలీపట్నంలో పలురోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. నగరంలో పలు ప్రాంతాల్లో రబ్బీసు రోడ్లు ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. పట్టణం నడిబొడ్డున జిల్లా పరిషత్ వెనుక భాగంలో రబ్బీసు రోడ్డుతో ప్రజలు పలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ కాలనీలోను రబ్బీసు రోడ్లతో వర్షాకాలంలో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అభివృద్ధికి చిరునామాగా నిలిచిన గాంధీనగర్‌లోను సిమెంటు రోడ్లను పగలగొట్టి వదిలేశారు. ఆశీర్వాదపురంలో మట్టి రోడ్డుకు మోక్షమెప్పుడని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కూటమి పాలనలో రోడ్లను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీకొండలమ్మకు పూజలు

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: మండలంలోని ప్రసిద్ధ వేమవరం శ్రీకొండలమ్మతల్లి దేవస్థానానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి 10 వేల మంది భక్తులు తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. అయ్యప్పభక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మచిలీపట్నం సాంఘిక సంక్షేమ అధికారి ఎస్‌కే.షాహిద్‌బాబు, గుడివాడ ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణ, ఎస్.ఐ పి.హేమసుస్మిత పూజలు చేశారు. వారికి ఆలయ ఛైర్మన్ ఈడే మోహన్ అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

ఆక్యుపంక్చర్ చికిత్సపై అవగాహన

సదస్సులో మాట్లాడుతున్న సత్యనారాయణ

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: ఉదయపునడక మిత్రమండలితో పాటు మండలి మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సంస్థ కార్యాలయంలో ఆక్యుపంక్చర్, ఆక్యుప్రెజర్ చికిత్స విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యులు మాకాల సత్యనారాయణ, హరిబాబు, అమ్మిరెడ్డి స్వప్నలు ఆయా విధానాల ప్రత్యేకత గురించి వివరించారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపిస్తూ, పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని అన్నారు. దైనందిన జీవితంలో యోగా, ధ్యానం, వ్యాయామం లాంటివి భాగస్వామ్యం చేసుకోవాలని సూచించారు. సంస్థల ప్రతినిధులు జల్దు మురళీనాథ్, ఘంటసాల రాము, వేద లక్ష్మీనరసింహం, వై.జగన్‌మోహనరావు, లంకిశెట్టి నీరజ, విన్నకోట సంధ్య, అన్నపూర్ణ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

100 మందికి కంటి పరీక్షలు

చిట్టిపాలెం (మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే: మచిలీపట్నం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం చిట్టిపాలెంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 100మందికి నేత్ర పరీక్షలు చేశారు. 12మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి సిఫార్సు చేశారు. సమితి సభ్యులు, మాజీ సర్పంచి నరిశెట్టి రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ సభలు జయప్రదం చేయండి

ప్రదర్శనలో ప్రజా సంఘాల నాయకులు

బంటుమిల్లి, న్యూస్‌టుడే: మహా సభకు కార్మికులు, కర్షకులు వచ్చి విజయవంతం చేయాలని ఆదివారం మండల కేంద్రంలోని బంటుమిల్లిలో సీఐటీయూ, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 31 నుంచి విశాఖలో సీఐటీయూ మహాసభలు నిర్వహిస్తున్నట్లు సంస్థ మండల కార్యదర్శి మాజేటి శివశ్రీనివాసరావు తెలిపారు. రైతు సంఘ జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, లంకదాసుల అజయ్‌ఘోష్, వెంట్రపాటి శ్యామ్‌సుందర్, రాంబాబు, చంద్రశేఖర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

సేవలకు పురస్కారం


సువార్త

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: మచిలీపట్నంకు చెందిన కొండ్రు సువార్త సావిత్రిబాయి పులె పురస్కారానికి ఎంపికయ్యారు. బాలల సంక్షేమ కమిటీ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల ఛైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె.. అంతకుముందు నాలుగేళ్లపాటు జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యురాలిగా పనిచేశారు. ఆమె బాలలకు అందిస్తున్న సేవలకు అఖిల భారత శరీర, అవయవదాతల సంఘం, సావిత్రి బాయి పులె ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్టులు ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు సంస్థ ఛైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 3న హైదరాబాదులోని రవీంద్రభారతిలో నిర్వహించే కార్యక్రమంలో సువార్త పురస్కారం అందుకోనున్నారు. ఆమెకు నగరానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

(c) eenadu

ఉచిత వైద్య సేవలు

కంకిపాడు: విజయవాడలోని 'హెల్ప్ ఆసుపత్రి, సేఫ్ విజన్ ఐకేర్, రాచూరి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కంకిపాడులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 150 మందికి వివిధ పరీక్షలు చేసి, మందులు అందజేశారు. గుండె, నేత్ర సంబంధిత సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు అశోక్‌కుమార్, రవికిరణ్ వివరించారు. సర్పంచి బాకీ రమణ, ఉపసర్పంచి రాచూరి చిరంజీవి పాల్గొన్నారు.

సర్పంచి మృతికి నివాళి

గన్నవరం గ్రామీణం: ఉంగుటూరు మండలం తేలప్రోలు సర్పంచి లాం దిబోరా(43) అనారోగ్య సమస్యలతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు పలువురు వైకాపా నాయకులు, ప్రజాప్రతినిధులు ఆమె మృతదేహానికి నివాళులర్పించారు.

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

ఘనంగా సుదర్శన యాగం

తాడిగడప (కానూరు), న్యూస్‌టుడే: తాడిగడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు సాయిమణికంఠ నేతృత్వంలో ఆదివారం సుదర్శన యాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందన: ● కానూరు తులసీనగర్‌లో కొద్ది రోజులుగా చెత్తతీయడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. కమిషనర్ షేక్ నజీర్ స్పందించి.. సిబ్బందిని పంపి సమస్య పరిష్కరించారు. ● కానూరు 80 అడుగుల రోడ్డులో కొన్ని రోజులుగా చెత్తతీయడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. శానిటరీ అధికారి సుధాకర్ స్పందించి.. సమస్య పరిష్కరించారు. **- కానూరు, న్యూస్‌టుడే**

విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న బాలకోటయ్య

పర్యవేక్షణ లోపం.. సమస్య అధికం

ఎనికేపాడు, ప్రసాదంపాడు, న్యూస్‌టుడే: విజయవాడ గ్రామీణ మండలం ఎనికేపాడు గ్రామాన్ని అనుకుని ఉన్న కొత్త ఆటోనగర్‌లో కొత్త ఆటోనగర్‌తో పాటు తాడిగడప మున్సిపాలిటీ చెత్తను తరలిస్తున్నారు. ఇలా తరలించిన వ్యర్థాలను అక్కడికక్కడే తగలపెడుతున్నారు. ఫలితంగా ఎనికేపాడు గ్రామ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. చెత్త కాల్చడంతో వెలువడుతున్న పొగ వల్ల నేత్రాలు మండటంతో పాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరింత ప్రభావం: కొత్త ఆటోనగరల్లో డంప్ చేస్తున్న చెత్తలో పారిశ్రామిక వ్యర్థాలతో పాటు హానికరమైన కెమికల్స్ ఉంటున్నాయి. వీటికి నిప్పు పెట్టడంతో వెలువడుతున్న విషపూరిత వాయువులతో శ్వాస తీసుకోవడంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వృద్ధులు, చిన్న పిల్లలు, శ్వాసకోశ సమస్యలతో బాధ పడే వారు దీని కారణంగా మరింతంగా ప్రభావితమవుతున్నారు. వ్యర్థాలను కాల్చడంపై నిబంధనలు ఉన్నప్పటికీ అవి అమలుకు నోచుకోవడం లేదు. తాడిగడప మున్సిపాలిటీ అధికారుల పర్యవేక్షణ లోపమే దీనికి కారణమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని ఎనికేపాడు గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్తను కాల్చడాన్ని వెంటనే నిలిపివేసి, ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎనికేపాడు శివారున చెత్తకు నిప్పు పెట్టిన వైనం..

సొసైటీ అభివృద్ధికి సహకారం అందిస్తాం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : గన్నవరం అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించిన డి.రాయ్‌నగర్ కోఆపరేటివ్ సొసైటీ ఆదర్శమని ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఆదివారం స్థానిక సొసైటీ వజ్రోత్సవ వేడుకల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. తొలుత సొసైటీ స్థాపన, పురోభివృద్ధికి విశేష కృషి చేసిన డా.సీ.ఎల్. రాయుడు, కె.పెద వెంకట రాయుడు విగ్రహాలను ఆవిష్కరించి వారి సేవలను కొనియాడారు. సొసైటీతో తనకున్న అనుబంధాన్ని వెనిగండ్ల రాము గుర్తు చేసుకున్నారు. సొసైటీ అభివృద్ధికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని... కృషి చేస్తున్న కమిటీ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. సొసైటీ అధ్యక్షుడు పెద్దు వెంకటరత్నం, ఉపాధ్యక్షుడు కంభంపాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి మన్నే సుందరరావు, పాలకవర్గ సభ్యులు కొల్లగడ్డ రామచంద్రజోషి, పెద్దు వెంకట శివ రామకృష్ణ, పెద్ద శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవ ప్రతులు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు రాము, వెంకట్రావు, సొసైటీ ప్రతినిధులు

వైభవంగా హిందూ సమ్మేళనం

నున్న (వి.నైనవరం), న్యూస్‌టుడే : వి.నైనవరం గ్రామంలో హిందూ మహా సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాచార్య స్వామిజీ మాట్లాడుతూ...దేశానికి ఆత్మ హిందూ ధర్మం అని, హిందూ సంస్కృతి, హిందూ సమాజం ప్రపంచ వ్యాప్తంగా విరాజిల్లాలని తెలిపారు. హైందవ ధర్మం మాత్రమే ప్రజలను చైతన్యవంతులుగా, అర్థవంతులుగా తీర్చిదిద్దగలదన్నారు. అంబాపురం, పాతపాడు, నున్న గ్రామస్థులతో పాటు సమ్మేళనం నిర్వాహకులు ఏజీ కృష్ణ ప్రసాద్, దావు రంగారావు, వెంకటేశ్వరరావు, రాఘవేంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న శివాచార్య స్వామిజీ, వేదికపై కృష్ణప్రసాద్, వెంకటేశ్వరరావు, రంగారావు తదితరులు

విద్యతోనే విజయాలు

పెనమలూరు, కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యతోనే అన్ని రంగాల్లో విజయాలు సాధించగలమని సామాజిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ బాలకోటయ్య పేర్కొన్నారు. పెనమలూరు బీసీ బాలికలు, ఈడుపుగల్లు బాలుర సంక్షేమ వసతి గృహాలను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే కష్టపడి చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. వసతి గృహాల్లో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటును ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. త్వరలోనే 1300 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించనున్నట్లు చెప్పారు. పెనమలూరు వసతి గృహం సమీపంలో మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయని విద్యార్థినులు ఫిర్యాదు చేయగా.. పోలీసుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించనున్నట్లు బాలకోటయ్య వివరించారు. కార్యక్రమంలో వసతి గృహ సంరక్షకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కొల్లిపర

కంకిపాడు, న్యూస్‌టుడే: వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కొల్లిపర సీతారాంబాబు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కన్యకాపరమేశ్వరి మందిరంలో ఆదివారం సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పూర్తి కార్యవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామని ఆయన తెలిపారు. మందిర ఆధునికీకరణ పనులు, విరాళాలు తదితర అంశాలపై చర్చించారు. సంఘ ప్రతినిధులు శేగు నరసింహారావు, వంకదారు ఆదిశేషు, మద్దుల నాగపోతురాజు, చలవాది రాజాగురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు సీతారాంబాబు

ఉత్సాహంగా 'నవోదయ' అల్యుమిని

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : వేలేరు జవహర్ నవోదయ విద్యాలయం పూర్వ విద్యార్థుల(అల్యుమిని) సమావేశం ఉత్సాహంగా జరిగింది. ప్రతి ఏటా డిసెంబరు మొదటి ఆదివారం అల్యుమిని నిర్వహించడం నవోదయలో ఆనవాయితీగా వస్తోంది. అనివార్య కారణాలతో ఈ ఏడాది చివరి ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా 1996 నుంచి 2025 వరకు నవోదయలో చదువుకుని, వివిధ ప్రాంతాల్లో, పలు హోదాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఇక్కడ సమావేశమయ్యారు. నవోదయ విశిష్టత, భవిష్యత్తు అవకాశాల గురించి ప్రస్తుత విద్యార్థులకు వివరించారు. అనంతరం 6 నుంచి 12వ తరగతి వరకు అగ్రగాములుగా నిలిచిన విద్యార్థులకు అల్యుమిని తరపున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. చదువుతో పాటు, క్రీడల్లో కూడా సత్తా చాటుతున్న వారికి(ఆల్‌రౌండర్) బంగారు పతకం, నగదు బహుమతులు ప్రదానం చేశారు. అల్యుమిని నిర్వాహకులు కోమలికుమారి, కిరణ్, ప్రసేన్ తదితరులు నేతృత్వం వహించారు. ప్రిన్సిపల్ ఎదునందనరావు, వైస్ ప్రిన్సిపల్ ఆదినారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ వైవీబీ

దాతృత్వంతోనే జీవన సాఫల్యం

ఉయ్యూరు, న్యూస్‌టుడే: దాతృత్వంతోనే జీవన సాఫల్యం సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో సరసభారతి సాహిత్య, సాంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం గ్రంథాలయ భవన నిర్మాణ దాత, ప్రవాసాంధ్రుడు మైనేని గోపాలకృష్ణ సంస్మరణ సభలో వైవీబీ పాల్గొని మాట్లాడారు. ఉయ్యూరు ప్రధాన గ్రంథాలయ అభివృద్ధికి మైనేని చేసిన కృషి, సహకారం మరువలేనిదన్నారు. తొలుత వైవీబీతో పాటు సంస్థ వ్యవస్థాపకులు జి.దుర్గా ప్రసాద్‌లు గోపాలకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ ప్రకాష్, కొమ్మమూరు సర్పంచి వెంకటేశ్వరరెడ్డి, పి.గోపాలకృష్ణ, గ్రంథాలయాధికారిణి రమణి, తెలుగు విశ్రాంత అధ్యాపకుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియచేయునది ఏమనగా.. నా క్లయింట్లు ఆయిన 1) ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం, ప్రసాదంపాడు, పిడికిటి వెంకటరత్నం వీధి, డోరు నెంబరు 6-190 కాపురస్తులు ఆయిన ఉంగుటూరు వెంకటస్వామి గారి కుమారుడు ఉంగుటూరు రామకృష్ణ మరియు 2) మహారాష్ట్ర, నవీ ముంబయి, సెక్టార్ 20, సత్యం టవర్స్, ప్లాట్ నెంబరు 18/19, రూమ్ నెంబర్ బి-402 కాపురస్తులు ఉంగుటూరు వెంకటస్వామి గారి కుమారుడు ఉంగుటూరు మురళీకృష్ణ గారలు ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని, కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, పోరంకి, ప్లాట్ నెంబర్ 173, సీతాపురం కాలనీ, డోర్ నెంబర్ 8-264 కాపురస్తులు ఆయిన భోజనపల్లి రామచంద్రరావు గారి కుమారుడు ఆయిన భోజనపల్లి సోమేశ్వరరావు నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొని వారి నుండి ఒక విక్రయ ఎగ్రిమెంటును పొందియున్నారు. సదరు భోజనపల్లి సోమేశ్వరరావు గారికి షెడ్యూలు దాఖలా స్థిరాస్తి వారి తల్లిగారైన భోజనపల్లి రాజరాజేశ్వరి గారి నుండి రిజిష్టరు వీలునామా నెంబరు 177/2015 తేది. 22-09-2015 ద్వారా సంక్రమించినది. సదరు భోజనపల్లి రాజరాజేశ్వరి గారు ది. 28-08-2022న పరమపదించినారు. సదరు వీలునామానే శ్రీమతి భోజనపల్లి రాజరాజేశ్వరి గారి చివరి వీలునామా అయి ఉన్నది. కనుక ఈ విషయమై ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు కానీ, ఆక్షేపణలు కానీ, క్లయిములు కానీ, చెల్లదగు బాకీలు గానీ వున్నయెడల ఈ దిగువ ఉదహరించిన అడ్రసుకు 10 రోజుల లోగా లిఖిత పూర్వకముగా తెలియపరచవలెను. లేనిచో, నా క్లయింట్లు ఎవరికినీ ఏవిధమైన అభ్యంతరములు, ఆక్షేపణలు లేవని భావించి, ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తికి సంబంధించిన విక్రయ దస్తావేజులను నా క్లయింట్ల పేరుతో కాని, నా క్లయింట్లు కోరిన వారి పేరుతో కాని విక్రయ దస్తావేజును ఒకటిగా కాని, విడివిడిగా కాని రిజిష్టరు చేయించుకొనెదరు. గడువు తరువాత వచ్చు ఆక్షేపణలు నా క్లయింట్లను ఏవిధముగానూ బైండు చేయవని యిందుమూలముగా యావన్మందికీ తెలియచేయడమైనది.

షెడ్యూలు: విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి పరిధిలోని, పటమట సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, పెనమలూరు మండలం, వైఎస్ఆర్ తాడిగడప మున్సిపాలిటీ ఏరియాలో చేరినటువంటిన్నీ, కానూరు గ్రామ రీసర్వే నెంబర్ 8/2, ఎల్.పి. నెంబర్ 24/82రు గా అప్రూవల్ కాబడిన ప్లాటు నెంబరు 15 రు, దాఖలా చ॥గ॥ 418లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమునకు **హద్దులు: తూర్పు:** 33 అడుగుల వెడల్పు గల రోడ్డు, **దక్షిణం:** నేరెళ్ల తాండవకృష్ణ మూర్తి గారి భూమి, **పడమర:** పర్వతనేని వెంకటరత్నం గారి భూమి, **ఉత్తరం:** అడుసుమిల్లి సుబ్బారావు చౌదరి గారి భూమి.

విజయవాడ, ఇట్లు: **ఉప్పులూరి ప్రకాశం,** అడ్వకేటు
ది. 27-12-2025 27-20-45, మ్యూజియం రోడ్డు, విజయవాడ-2

కల్పనానగర్ రోడ్డులో కష్టాల ప్రయాణం

కానూరు, న్యూస్‌టుడే: కానూరు కల్పనానగర్ రోడ్డు గోతులతో అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, అటుగా ప్రయాణించే వాహన చోదకులు వాపోతున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

ముందుకు కదలని సాగునీరు

ఏలూరు కాలువలో భారీగా పేరుకున్న గుర్రపు డెక్కతో సాగు నీరు ముందుకు కదలడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గన్నవరం, ఉంగుటూరు మండలాల పరిధిలో సుమారు అయిదు వందల ఎకరాల్లో దాళ్వా వరి, అపరాల సాగు కొనసాగుతోంది. ప్రధానంగా పెద్దఅవుటపల్లి, ఆత్కూరు, పొట్టిపాడు, తేలప్రోలు పరిధిలో భారీగా దర్శనమిస్తున్న గుర్రపు డెక్కను తొలగించాలని అన్నదాతలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.- **న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం**

విద్యార్థులకు సూచనలిస్తున్న ఐపీఎస్ అధికారి సురేష్

పట్టుదల.. నిలకడ.. క్రమశిక్షణతో రాణింపు

పునాదిపాడు (కంకిపాడు), న్యూస్‌టుడే: హైదరాబాద్ మహా నగరంలో డీసీపీగా విధులు నిర్వహిస్తున్న కొల్లి సురేష్ ఆదివారం పునాదిపాడు కాకతీయ విద్యా ట్రస్టు ఆధ్వర్యంలో నడుస్తోన్న బాలుర వసతి గృహం విద్యార్థులకు నిర్వహించిన మోటివేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన తాను.. రోజుకు 14-16గంటల పాటు చదివి ఐపీఎస్ సాధించినట్లు పేర్కొన్నారు. ఉద్యోగం, వ్యాపారం రెండూ ముఖ్యమేనన్నారు. ఉద్యోగంలో ఉన్నత స్థితికి ఎదగడానికి పరిమితి ఉంటుంది. వ్యాపారం, పరిశ్రమల్లో రాణించడానికి సమయానుకూల ఆలోచన, ఆచరణ అవసరం. ముందు చదువుకే ప్రాధాన్యం ఇవ్వాలి. ఆసక్తి రంగాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కుటుంబ ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగా ముందడుగు వేయాలని సూచించారు. ఏ రంగంలోనైనా రాణించాలంటే పట్టుదల, నిలకడ, క్రమశిక్షణ అవసరం. వసతి గృహ నిర్వహణ ప్రతినిధులు అనుమోలు వెంకటరత్నం, యార్లగడ్డ రాజారాం పాల్గొన్నారు.

విద్యార్థులకు రగ్గుల పంపిణీ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : వేలేరులోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసీయ విద్యాలయ(అమ్మ నిలయం) విద్యార్థులకు స్థానిక నవోదయ పాఠశాల తరపున రగ్గులు పంపిణీ చేశారు. పీఎంశ్రీ సామాజిక భాగస్వామ్యంలో భాగంగా చలి నుంచి రక్షణ కల్పించేందుకు వీలుగా వీటిని అందజేసినట్లు ప్రిన్సిపల్ ఎదునందన్, వైస్ ప్రిన్సిపల్ ఆదినారాయణ తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే : వ్యాయామ విద్య అభ్యసిస్తున్న గొల్లపల్లి భార్గవ్ అనే విద్యార్థికి మానవత స్వచ్ఛంద సంస్థ తరపున రూ.7,000 ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని ఆదివారం మానవత కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, పాబోలు గణేష్, ఇందిరాదేవి, సత్యనారాయణ సమక్షంలో ఇచ్చారు.

వసతి గృహానికి దాతల వితరణ

పునాదిపాడు (కంకిపాడు), న్యూస్‌టుడే: కాకతీయ విద్యా ట్రస్టు ఆధ్వర్యంలో పునాదిపాడులో నిర్వహిస్తున్న బాలుర వసతి గృహానికి అదే గ్రామానికి చెందిన పిడికిటి రవీంద్రనాథ్ బాబు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమార్తెలు కోడూరి సుజని, చలసాని రజని, నిమ్మగడ్డ అంజని ఆదివారం శుద్ధజల ఆర్వో ప్లాంట్, వెట్ గ్రైండర్ తదితర ఉపకరణాలు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సుజ్లాన్ సీఈవో చలసాని జయరాంప్రసాద్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చదువు, జ్ఞాన సముపార్జనపై దృష్టిపెట్టాలన్నారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా లక్ష్యసాధనలో వెనుకడుగు వేయొద్దని సూచించారు. కార్యక్రమంలో దాతల కుటుంబసభ్యులు, ప్రవాసాంధ్రులు నిమ్మగడ్డ మౌనిక, కోడూరు మీనా, చలసాని ఆదిత్య, వసతి గృహ నిర్వహణ ప్రతినిధులు యార్లగడ్డ రాజారాం, పిడికిటి సుగుణమూర్తి, అనుమోలు శ్రీహరిరావు, వై.వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేశ భద్రతకు ప్రాధాన్యం

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: దేశ భద్రత విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని భాజపా మండల అధ్యక్షుడు గుళ్లపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం ప్రధానమంత్రి మన్‌కీబాత్ కార్యక్రమాన్ని పలువురు భాజపా నాయకులు వీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా కాంగ్రెస్ హయాంలో జరిగిన చొరబాట్లు, దాడులు.. భాజపా తీసుకున్న చర్యలతోనే ఆగాయన్నారు. కార్యక్రమంలో నాయకులు చక్కా కరుణకుమార్, ఉపద్రష్ట మురళి, గుడిపాటి హరికృష్ణ, షేక్ చిన్నా పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యంపై కేసు

పెనమలూరు, న్యూస్‌టుడే: పదో తరగతి చదువుతున్న ఓ బాలుడి అదృశ్యంపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 27న చదువుకోకుండా చరవాణి చూస్తున్నాడని తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన బాలుడు.. ఇంటి నుంచి బయటకు వెళ్లి.. తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీనిపై పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు.

పీటతో దాడి చేయడంతో గాయాలు

పెనమలూరు, న్యూస్‌టుడే: పెదపులిపాకకు చెందిన వేమవరపు విజయ్ అనే వ్యక్తి చరవాణి దుకాణంలో పనిచేస్తుంటాడు. నెల రోజుల కిందట అతడి బావమరిది రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. అప్పట్నించి తన భార్య శ్రావణితో కలిసి విజయవాడలోని అత్తగారింట్లో ఉంటున్నాడు. క్రిస్మస్ సందర్భంగా విజయ్ ఒక్కడే పెదపులిపాకలోని తన ఇంటికి వెళ్లాడు. ఈ నెల 26న రాత్రి అతడి తోడల్లుడు వంశీ.. బంధువులతో కలిసి విజయ్ ఇంటికి వచ్చారు. శ్రావణిని పుట్టింట్లోనే ఎందుకు వదలి వచ్చావంటూ వారంతా గొడవకు దిగారు. ఆ సమయంలో ఆగ్రహం చెందిన వంశీ.. పీటతో విజయ్‌పై దాడిచేయడంతో తలపగిలింది. బాధితుడు చికిత్స పొందుతూ ఆదివారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

క్రమశిక్షణే విజయానికి పునాది

గుడివాడ, న్యూస్‌టుడే: క్రమశిక్షణే విజయానికి పునాది అని శ్రీశ్రీ పాలిటెక్నిక్ కళాశాల వ్యవస్థాపకుడు సూదసాని వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక విద్యానికేతన్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలో ఆయన మాట్లాడారు. డైరెక్టర్ కొమ్మనేని సాంబశివరావు, ప్రధానోపాధ్యాయులు చాట్రగడ్డ నాగ మల్లేశ్వరరావు మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

ఘనంగా సువార్త క్రిస్మస్ వేడుకలు

భట్లపెనుమర్రు(కూచిపూడి), న్యూస్‌టుడే: భట్లపెనుమర్రులో యేసే జవాబు పరిచర్య సంఘం పాస్టర్ ఆలూరి జాన్ ఇశ్రాయేల్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి సువార్త క్రిస్మస్ వేడుకలు జరిగాయి. శాసనసభ్యుడు వర్ల కుమార్‌రాజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాస్టర్ వేమూరి పరిశుద్ధరాజు ప్రధాన సందేశకులుగా పాల్గొన్నారు. కూటమి నాయకులు శ్రీధర్, నాని, దయాకర్, అశోక్‌కుమార్, చంటి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాను సత్కరిస్తున్న పాస్టర్లు వేమూరి పరిశుద్ధరాజు, ఆలూరి జాన్‌ఇశ్రాయేల్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు: 80085 74684 అవనిగడ్డ: 80085 74679

పెదపారుపూడి, న్యూస్‌టుడే: ❖ పెదపారుపూడి మండలం వెంట్రప్రగడలోని బోసుబొమ్మ సెంటర్‌లో డ్రైనేజీ మురుగు రోడ్డు మీదకు చేరి దుర్వాసన వస్తోంది. - రమేష్ ❖ మురుగు సమస్య త్వరలో పరిష్కరిస్తాం.- సాగరరావ్, పంచాయతీ కార్యదర్శి ❖ వెంట్రప్రగడ గ్రామంలో చెత్త సేకరణ వాహనం రావడం లేదు. - వి.రామచంద్రరావు ❖ చెత్త వ్యానును పంపి చెత్త సేకరణ చేసేలా చర్యలు తీసుకుంటాం. - పంచాయతీ అధికారులు

గుంతల దారులే గత్యంతరమాయె..!

చల్లపల్లి, న్యూస్‌టుడే

చల్లపల్లి మండలం యార్లగడ్డ-దేవరకోట రహదారిలో ఏర్పడిన భారీగుంతలు

పూర్తిగా ధ్వంసమైన చల్లపల్లి-రాముడుపాలెం రహదారి

చల్లపల్లి మండలంలో పలు రహదారులు గోతులమయంగా మారడంతో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శిథిలమైన దారుల్లో ప్రయాణమంటే వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. వీటిపై తప్పని పరిస్థితుల్లో దిగువన ఉన్న పరిసర గ్రామాల ప్రజలు మాత్రమే ప్రయాణించే పరిస్థితి. చల్లపల్లి-నడకుదురు రోడ్డులో నిత్యం అవనిగడ్డ నుంచి విజయవాడకు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఉయ్యాల లూగుతూ, గోతుల్లో పడిలేస్తూ... నడకుదురు కరకట్టపైకి చేరుకుని అతి కష్టం మీద ప్రయాణిస్తున్నాయి. విజయవాడ వెళ్లాలనుకునేవారు చల్లపల్లి నుంచి కొడాలి మీదుగా శ్రీకాకుళం వెళ్లి కరకట్టకు చేరుకోవాలి. చల్లపల్లి-నడకుదురు రహదారి 4కి.మీల మేర భారీ గోతులు పడి ధ్వంసం అయింది. చల్లపల్లి శ్రీనగర్ కాలనీ నుంచి నడకుదురు వంతెన వరకు 4కి.మీ అప్రోచ్ సహా రహదారి అధ్వానంగా పెద్దపెద్ద గోతులు పడటంతో ప్రయాణించే వారి ఒళ్లు హూనమవుతుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. దారికి ఇరువైపులా అప్రోచ్ కోతకు గురై వాహనం కిందకు దిగితే పైకి ఎక్కించేందుకు నానాపాట్లు పడాల్సిందే.. పైకి ఎక్కించిన టైర్లు పగిలిపోవాల్సిందే... ఇది పరిస్థితి.

➡ కృష్ణా కరకట్ట నిమ్మగడ్డ వంతెన వద్ద నుంచి ఘంటసాల మండలం దేవరకోట వరకు ఏర్పాటు చేసిన రహదారి సైతం ఇలాగే దర్శనం ఇస్తోంది. వక్కలగడ్డ నుంచి కృష్ణా కరకట్ట వరకు ఎత్తుపల్లాలు ఉండి గోతులు పడి ధ్వంసమైపోయింది. చల్లపల్లి-నడకుదురు దారి శిథిలమైపోవడంతో కరకట్టకు చేరుకోవడానికి వక్కలగడ్డ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఐనుకోడు టిప్పర్లు సైతం ఈ దారిలోనే తిరగడంతో పూర్తిగా ధ్వంసమైంది.

➡ 2016 కృష్ణా పుష్కరాల సమయంలో నడకుదురు పంచాయతీలోని రాముడుపాలెం గ్రామానికి తారురోడ్డును ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నేటి వరకు ఆ రహదారికి మరమ్మతులు చేయలేదు. ఈ దారిలో గోతులు పడి రాళ్లు పైకిలేచి ఉండటంతో ఎదురువచ్చే వారిపై పడుతూ ఎన్నో సార్లు ప్రమాదాలకు గురయ్యారు. వీటికి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పిచ్చి కుక్కల స్వైరవిహారం

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలంలోని లక్ష్మీపురం, వక్కలగడ్డ గ్రామాల్లో పిచ్చికుక్కలు ఆదివారం స్వైర విహారం చేయడంతో పలువురు గాయాలపాలయ్యారు. లక్ష్మీపురంలో శని, ఆదివారాల్లో పిచ్చికుక్క దాడిలో 9మంది గాయపడ్డారు. ఆదివారం లక్ష్మీపురం గ్రామానికి చెందిన జయంపాటి శ్రీదేవి, చింతలమడుకు చెందిన సూదాని విష్ణుమూర్తిలు ఈ దాడిలో తీవ్రంగా గాయపడి చల్లపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వక్కలగడ్డలో మరో పిచ్చికుక్క ఐదుగురు వ్యక్తులను కరిచినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. లక్ష్మీపురం, వక్కలగడ్డ గ్రామాలతో పాటు పురిటిగడ్డ, నడకుదురు గ్రామాల్లో కరకట్ట నుంచి చల్లపల్లి-నడకుదురు రహదారిలో నుంచి చల్లపల్లికి రావాలంటే ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. పాదచారులు, ద్విచక్ర వాహనదారులపైకి కుక్కలు దూకుతూ కరుస్తున్నట్లు ప్రజలు చెబుతున్నారు. వాటిని నియంత్రించాలని ఆయా పంచాయతీ అధికారులను కోరుతున్నారు.

చల్లపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విష్ణుమూర్తి

రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాము

రెండు రోజుల్లో బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ బైపాస్ రోడ్డు నిర్మాణపు పనులు మరో రెండు రోజుల్లో పూర్తవుతాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. రూ.2.50 కోట్లతో పనులు వేగవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. గుడివాడ-కంకిపాడు రహదారి సమస్య కూడా త్వరలో పరిష్కరించడానికి కృషి చేస్తున్నామన్నారు. రహదారులు, భవనాల శాఖ డీఈ జె.కామేశ్వరరావు, నేతలు శ్రీకాంత్, పమిడిముక్కల వంశీ, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

గుడివాడ, న్యూస్‌టుడే: జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను స్ఫూర్తిగా తీసుకుని యువత రాజకీయాల్లోకి వస్తున్నారని జనసేన గుడివాడ బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్ పేర్కొన్నారు. స్థానిక టిడ్కో కాలనీలో సూదాబత్తుల వెంకటేష్ ఆధ్వర్యంలో కొంతమంది ఆదివారం జనసేన పార్టీలో చేరారు. నేతలు మజ్జి శ్రీనివాసరావు, వేమూరి త్రినాథ్, శాయన రాజేష్, వై.శ్రీనివాసరావు, షేక్.మీరాషరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వారితో బూరగడ్డ శ్రీకాంత్ తదితరులు

శ్రీకొండలమ్మకు అధికారుల పూజలు

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని ప్రసిద్ధ వేమవరం శ్రీకొండలమ్మతల్లి దేవస్థానానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచి 10 వేలమంది భక్తులు తరలి వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. అయ్యప్పభక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మచిలీపట్నం సాంఘిక సంక్షేమ అధికారి ఎస్‌కే.షాహిద్ బాబు, గుడివాడ ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణ, ఎస్.ఐ పి.హేమసుస్మిత పూజలు చేశారు. వారికి ఆలయ ఛైర్మన్ ఈడే మోహన్ అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

ఆలయంలో సంక్షేమాధికారి షాహిద్‌బాబు

అమ్మవార్లకు సారె

చల్లపల్లి: ధనుర్మాసం సందర్భంగా చల్లపల్లి ఆర్యవైశ్య మహిళలు గోదాదేవికి, శ్రీకన్యకాపరమేశ్వరి, గ్రామదేవత శ్రీసంపటాలమ్మ, శ్రీగరుడ ఆంజనేయ సహిత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలోని శ్రీగోదాదేవి అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీగోదాదేవికి సారె సమర్పించిన ఆర్యవైశ్య మహిళలు

శ్రీఅయ్యప్పస్వామివారి గ్రామోత్సవం

కోడూరు, న్యూస్‌టుడే: కోడూరులో కొలువై ఉన్న శ్రీఅయ్యప్పస్వామి వారి 21వ మహాపడిపూజా మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పడిపూజ, ఆదివారం అయ్యప్ప స్వామి ఉత్సవ మూర్తితో మేళతాళాల మధ్య పురవీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్త భావన్నారాయణ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, అయ్యప్ప మాలధరించిన స్వాములు, భక్తులు పాల్గొని ప్రధాన వీధుల్లో ఊరేగించారు

ముగిసిన ఆరాధన మహోత్సవాలు

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: కురుమద్దాలిలోని శ్రీరామ అవధూత పిచ్చమ్మ ఆశ్రమంలో అమ్మవారి ఆరాధన మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉదయం విఘ్నేశ్వరపూజ, కుంకుమార్చన అనంతరం మహా నివేదన నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు ఆలయ అర్చకుడు తోలేటి పిచ్చేశ్వరరావు, ఆలయ కార్యదర్శి కొసరాజు చంద్రభాను ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం స్థానిక అగ్నిమాపక కేంద్రం వెనుక ఉన్న కార్యాలయంలో ఏకగ్రీవంగా జరిగింది. జిల్లా అధ్యక్షుడు కె.రాజేంద్రప్రసాద్ ఎన్నికల అధికారిగా, జిల్లా కార్యదర్శి సి.హెచ్.ఆశీర్వాదం సహాయ ఎన్నికల అధికారిగా, కె.శంకర్‌రావు పరిశీలకుడిగా వ్యవహరించారు. యడ్ల దుర్గారావు అధ్యక్షతన జరిగిన ఎన్నికలో ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గం 3 సంవత్సరాలు కొనసాగుతుంది. నూతన అధ్యక్షుడిగా భూపతి భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా బొప్పన కాశీవిశ్వేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షులుగా వడ్లమూడి సాగర్‌రావు, పద్యాల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా వడ్లమూడి చంద్రశేఖర్‌రావు, ఆకుల వెంకటరత్నారావు, అద్దంకి శ్రీరామమూర్తి, వేమూరి గోవర్ధన్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మండవ నాగవరప్రసాద్, కార్యదర్శులుగా కొడాలి అమర్‌చంద్, కోలా గరుడాచలం, యలవర్తి బాబూరావు, కోశాధికారిగా బడే దానారావు ఎన్నికయ్యారు. జీవిత కాల గౌరవాధ్యక్షులుగా కాశీభట్ల నాగేశ్వరరావును ఎన్నుకున్నారు

నేడు చల్లపల్లిలో రెవెన్యూ క్లినిక్

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రెవెన్యూ క్లినిక్ జరుగుతుందని తహసీల్దార్ డి.వనజాక్షి తెలిపారు. ఈ క్లినిక్‌లో భూసేకరణ సంబంధిత సమస్యలు, రీసర్వే విస్తీర్ణం తేడా, జాయింట్ ఎల్పీయం సంబధిత సమస్యలు, పట్టాదారు పాసుపుస్తకాలు, సుమోటో అడంగల్ కరెక్షన్ సంబంధిత సమస్యలతో పాటు ఇతర రెవెన్యూ సమస్యలపై అర్జీలను స్వీకరిస్తామన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

హనుమంతపురం(పమిడిముక్కల): ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.1,26,769 చెక్కులను పామర్రు ఎమ్మెల్యే కుమార్‌రాజా హనుమంతపురంలోని బాధితులకు అందచేశారు.

పెడసనగల్లు(కూచిపూడి), న్యూస్‌టుడే: మొవ్వ మండలం పెడసనగల్లు గ్రామంలో ఇద్దరు బాధితులకు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ఆదివారం సీఎమ్మార్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నన్నపనేని వీరేంద్ర, రాజశేఖర్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు నేడు అవగాహన

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి, ఘంటశాల, మోపిదేవి మండలాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు ఓరియంటేషన్ క్లాసును చల్లపల్లిలోని చంద్రరాజేశ్వరరావు వికాసకేంద్రంలో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ పి.వెంకటేశ్వరరావు తెలిపారు. పదవ తరగతి పబ్లిక్‌పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఇస్తామని తెలిపారు.

తెదేపా జిల్లా కార్యదర్శికి సత్కారం

అవనిగడ్డ: తెదేపా నూతన జిల్లా కమిటీ కార్యదర్శిగా నియమితులైన అవనిగడ్డ ప్రకాశం, లంకమ్మ గుడి డైరెక్టర్‌గా నియమితులైన యాసం లంకమ్మను ఆదివారం మండల తెదేపా కార్యాలయం వద్ద ఘనంగా సత్కరించారు. మండల తెదేపా అధ్యక్షుడు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో నాయకులు రాజేంద్రరావు, ఆదినారాయణ, యలవర్తి చిన్నా, రత్తయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

పామర్రు, న్యూస్‌టుడే: స్థానిక మచిలీపట్నం రోడ్డులోని వాసవీ వృద్ధ శరణాలయంలో వృద్ధులకు గువ్వల గోపాలరెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకుని కుటుంబ సభ్యులు ఆదివారం అన్నదానం, పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమ నిర్వాహకుడు ఘంటసాల భరతుడు తదితరులు పాల్గొన్నారు.

నైతిక, సహకార కార్యక్రమాలపై చర్చ

పామర్రు, న్యూస్‌టుడే: ఆదివారం స్థానిక అరండల్‌పేటలోని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో నిర్వహించిన మావనతా స్వచ్ఛంద సేవా సంస్థ సమావేశంలో అధ్యక్షుడు ఎన్.త్రివిక్రమరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. నైతిక, సహకార కార్యక్రమాలపై చర్చించారు. ఫ్రీజర్ బాక్సుల నిర్వహణ, విద్యుత్తు బిల్లుల చెల్లింపు, హిందూ శ్మశానవాటిక కొత్త కమిటీ ఎన్నిక తదితర అంశాలపై చర్చించారు. జనవరి 26న పసుమర్రు, జమీదగ్గుమిల్లి హైస్కూలులో కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పీఎంఎస్ ప్రసాద్, సీతాల ప్రసాద్, అరిగెల బాలుడు, భీమవరపు శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హిందూ సమ్మేళన కరపత్రాల ఆవిష్కరణ

చోరగుడి(పమిడిముక్కల), న్యూస్‌టుడే: సనాతన ధర్మ పరిరక్షణ సమావేశం చోరగుడిలో ఆదివారం జరిగింది. హైందవ ప్రాశస్త్యం, దానిని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత గురించి నిర్వాహకులు వివరించారు. అనంతరం చోరగుడిలో శ్రీ రాజరాజనరేంద్రస్వామి,శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాల ప్రాంగణంలో జనవరి 5న తలపెట్టిన హిందూ సమ్మేళన కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. సర్పంచి కందిమళ్ల పూర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైకాపా నేతల ఫ్యాక్షన్ సంస్కృతి

అవనిగడ్డ, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్ పుట్టిన రోజు వేడుకల్లో ఆయన ఫ్లెక్సీలకు రక్తాభిషేకాలు చేయడం, గర్భవతిపై దాడి చేయడం పరాకాష్ట అని ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు విమర్శించారు. రాజకీయ ముసుగులో వైకాపా నేతల ఫ్యాక్షన్ సంస్కృతిని ప్రదర్శిస్తుందని ఎండగట్టారు. నాయకులు దుర్గాప్రసాద్, రత్నగిరి, ప్రసాద్, రామమోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు

చల్లపల్లి: భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం అవనిగడ్డలో కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. మాజీ మంత్రి దివంగత మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. నాయకులు మీర్ రిజ్వాన్, భాస్కరరావు, వెంకటేశ్వరరావు, బాబూరావు, అంకంబొట్లు, మహమ్మద్ అన్సారీ, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దానం


శ్రీనివాసరావు (పాత చిత్రం)

నాగాయలంక, న్యూస్‌టుడే: స్థానిక 3వ వార్డుకు చెందిన కనిగంటి శ్రీనివాసరావు(51) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుని కళ్లు మరో ఇద్దరికి చూపునిస్తాయని మృతుని తల్లి భాగ్యలక్ష్మి, కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. సుదర్శి మానవత సేవ సంస్థ నిర్వాహకులు రఘుశేఖర్, నారాయణల ఆధ్వర్యంలో విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి నేత్రాలను దానం చేశారు.

వేలాడుతూ.. భయపెడుతూ..

గుడివాడ పట్టణం బేతవోలు వడ్డేవారి వీధి రావి చెట్టు వద్ద విద్యుత్ స్తంభానికి అమర్చిన వీధి దీపం రెండు నెలల నుంచి వేలాడుతూ ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. వీధి దీపం దిగువకు జారిపోయి ఎవరిమీద పడుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.
– గుడివాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే

పూర్ణచంద్రరావు సేవల స్మరణ

గుడివాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో పుల్లలపాడు వంతెన రోటరీ భవనంలో ఆదివారం గవిర్నేని వెంకట పూర్ణచంద్రరావు వర్ధంతి సభ నిర్వహించారు. పూర్ణచంద్రరావు రోటరీ క్లబ్ తరుపున సేవా, సామాజిక, విద్య కార్యక్రమాల్లో పాల్గొని సహాయ సహకారాలు అందించేవారన్నారు. గవిర్నేని బాబు శ్రీకర్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు యలమంచిలి నాగేశ్వరరావు, ఐఎంఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ సాయం

చల్లపల్లి, న్యూస్‌టుడే: రామానగరం గ్రామానికి చెందిన అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్ రూ.5వేలు ఆర్థికసాయాన్ని అందించారు. జిల్లా బ్రాంచ్ ద్వారా వంటపాత్రలు, పెద్ద టార్పాలిన్, చల్లపల్లి బ్రాంచ్ ద్వారా నిత్యావసర సరకులు అందజేశారు. ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావు, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, ఆకురాతి హరిప్రసాద్ పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్ట్

కూచిపూడి, న్యూస్‌టుడే: కూచిపూడి పక్షులబీడు ప్రాంతంలో జూదమాడుతున్న 8మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.5,800 నగదు స్వాధీనం చేసుకున్నామని కూచిపూడి ఎస్ఐ పి.శిరీష ఆదివారం తెలిపారు. కోడిపందేలు, జూదం ఆడుతున్న వారి సమాచారం 94407 96473 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

కాజ(కూచిపూడి): మొవ్వ మండలం కాజ గ్రామంలో పంట పొలాల్లో జూదమాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని కూచిపూడి ఎస్ఐ పి.శిరీష ఆదివారం తెలిపారు. వారి నుంచి రూ.1640 నగదు స్వాధీనం చేసుకున్నామని ఆమె చెప్పారు.

మూడు ఎకరాల గడ్డివాము దగ్ధం

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన తోట్లవల్లూరు గౌడ రామాలయం ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున కొక్కిలిగడ్డ సాంబశివరావు అనే రైతుకు చెందిన మూడు ఎకరాలు గడ్డివాముకు నిప్పు అంటుకుంది. స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసేలోపు అది పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.30వేలు నష్టం జరిగిందని ఇన్‌ఛార్జి ఫైర్ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

వెంట్రప్రగడ వద్ద దోసపాడు ఛానల్‌పై శిథిలావస్థలో వంతెన

ఈదురమద్దాలి వద్ద చంద్రయ్య డ్రెయిన్‌పై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన తూములు

భయం గుప్పెట్లో ప్రయాణాలు

న్యూస్‌టుడే, పెదపారుపూడి

శిథిలావస్థకు చేరిన వంతెనలపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు భయపడుతున్నారు. ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇటీవల పెదపారుపూడి మండలం ఈదురమద్దాలి గ్రామంలో చంద్రయ్య డ్రైన్‌పై ఉన్న వంతెనపై ఇసుక ట్రాక్టర్ వెళ్తుండగా వంతెన ఒక్కసారిగా కుప్పకూలింది. అధికారులు మాత్రం ఆవంతెన నిర్మించకుండా తాత్కాలికంగా తూములు వేసి మమ అనిపించేశారు. దోసపాడు ఛానల్‌పై పెదపారుపూడి, పాములపాడు వంతెనపై టిప్పర్‌లు తిరగడంతో నెల రోజుల క్రితం కూలిపోయింది. అధికారులు మాత్రం ఈవంతెనకు కూడా తూములు వేసి సరిపెట్టారు. వెంట్రప్రగడ వద్ద దోసపాడు ఛానల్‌పై గుడివాడ విజయవాడ రహదారిలో ఉన్న పురాతన వంతెన కూలిపోయే ప్రమాదం ఉందని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. వంతెన అడుగుభాగం పెచ్చులు ఊడిపోయి ప్రమాదకర స్థితిలో ఉంది. వంతెన మలుపు కూడా కోతకు గురవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

బోర్డుపై ఇంకా పాత చిత్రాలే..



అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనంగా ప్రభుత్వ బోర్డులపై ఇంకా ముఖ్యమంత్రిగా జగన్ చిత్రాలు కనపడుతున్నాయి. అవనిగడ్డ- నాగాయలంక ప్రధాన రహదారిపై వేకనూరు వద్ద ఏర్పాటు చేసిన 'స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ కృష్ణ' జగన్ చిత్రం ఇంకా దర్శనమిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా చిత్రపటాలు ఇంకా కనపడుతున్నాయి. దీన్ని పలువురు విమర్శిస్తున్నారు. – అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే

హిందూ సమాజాన్ని చైతన్య పరచాలి

అవనిగడ్డ, న్యూస్‌టుడే: హిందువులందరూ ఐక్యతతో హిందూ సమాజాన్ని చైతన్య పరచి, భారత్‌ను విశ్వగురువుగా నిలపాలని విజయానందగిరి స్వామీజీ చెప్పారు. ఆదివారం స్థానిక తితిదే కల్యాణ మండపంలో హిందూ సమ్మేళన కమిటీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. హిందూ సమాజం పట్ల గౌరవభావం, ఏకాత్మతా భావన, స్వధర్మం పట్ల అంకితభావం, సేవాగుణంతో హిందూ బంధువులు సమైక్యంగా పనిచేయాలని చెప్పారు. ఉమామహేశ్వరరావు, కార్యకారిణి, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న విజయానందగిరి స్వామీజీ

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

అశ్వరావుపాలెం (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని అశ్వరావుపాలెంలోని సీతారామాంజనేయ కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. న్యాయవాది రేపల్లె జ్యోతిబసు నేతృత్వంలోని రేపల్లె ఛారిటబుల్ ట్రస్టు, గుంటూరులోని లైఫ్ ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహించగా, సర్పంచి నాగ వెంకట లంకమ్మ ప్రసాద్ ప్రారంభించారు. వైద్యులు డి.దుర్గాప్రసాద్ సేవలను అందించారు.

గ్రామస్థులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: జమీగొల్వేపల్లిలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి ప్రజల నుంచి స్పందన లభించింది. ఎన్.ఎస్.ఆర్. కల్యాణ మండపంలో గ్రామ అభివృద్ధి కమిటీ వారి ఆధ్వర్యంలో, స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు టి.వరప్రసాద్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో విజయవాడ కామినేని ఆసుపత్రి వైద్యబృంధం షుగర్, బీపీ, గుండె సంబంధిత ఈసీజీ, 2డీ ఎకో, పీఎస్‌టీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. విజయవాడ హెచ్‌సీజీ క్యాన్సర్ వైద్యబృందం పురుషుల ప్రొస్టేట్ గ్రంథి, మహిళలకు గర్భసంచి క్యాన్సర్ పరీక్షలు, సీఏ125 పరీక్షలు నిర్వహించారు. సుబ్బారాయుడు మెమోరియల్ నర్సింగ్ హోమ్ డాక్టర్ సాయి నిహారిక కోయ ఎముకలు, కీళ్ల కండరాలు, నడుము నొప్పులకు పరీక్షలు నిర్వహించగా డాక్టర్ సుమ వర్మా తోట సంతానం లేని వారికి సలహాలు, అధిక రక్తస్రావం, గర్భాశయం సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించారు. విశ్వభారతి విద్యాసంస్థల ఛైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, మాజీ సర్పంచి వల్లభనేని వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కళా రూపాల ప్రదర్శన

గుడివాడ, న్యూస్‌టుడే: వివిధ రకాల కళారూపాల ద్వారా సమాజంలోని సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకుని రావాలని కృష్ణా జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయం వద్ద శ్రామికోత్సవం ఆదివారం రాత్రి నిర్వహించారు. కళాకారుల్లో సృజనను వెలికి తీయడానికి ప్రదర్శనలకు అవకాశం కల్పించామన్నారు. చిరంజీవి ఆలూరి నివేదిత భరతనాట్యం, ప్రసన్న, మేరీ గ్రేస్, రిబ్కాల జానపద నృత్యం, గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి అవిర్నేని వెంకటేశ్వరరావు శకుని ఏకపాత్రాభినయం అలరించాయి. ప్రజానాట్య మండలి కళాకారులు ప్రభుదాసు, వీరమ్మ, విజయలక్ష్మి అభ్యుదయ గీతాలను ఆలపించారు. పామర్రు సీఐటీయూ నాయకుడు ఓ.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే క్రికెట్ పోటీలు

యద్దనపూడి(కూచిపూడి), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు గొట్టిపాటి సాయి ఫౌండేషన్ మెగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తోందని పామర్రు శాసనసభ్యుడు వర్ల కుమార్‌రాజా అన్నారు. మొవ్వ మండలం అయ్యంకి అడ్డరోడ్డు వద్ద యద్దనపూడి పంచాయతీ పరిధిలో మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి ఎంపిక చేసిన 30 టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. ముందుగా మొవ్వ, బార్లపూడి జట్ల మధ్య పోటీ ప్రారంభించారు. ఫౌండేషన్ అధినేత గొట్టిపాటి సాయి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామలింగేశ్వరరావు, జిల్లా నీటి ప్రాజెక్ట్ కమిటీ వైస్‌ఛైర్మన్ గణేష్, తెదేపా సీనియర్ నాయకులు వీరేంద్ర, మొవ్వ ఏఎంసీ ఛైర్మన్ శివరామయ్య, ఎస్ఐ పి.శిరీష, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాటింగ్ చేస్తున్న ఎస్ఐ శిరీష

(c) eenadu

ప్రభుత్వ స్థలంలోనే ఆవకాయ్ అమరావతి ఉత్సవాలు

తప్పుడు ప్రచారాలు నమ్మొద్దన్న కలెక్టర్ లక్ష్మీశ

విద్యాధరపురం, న్యూస్‌టుడే : 'ప్రభుత్వ స్థలంలోనే ఆవకాయ్ అమరావతి ఉత్సవాలు నిర్వహిస్తాం.. ప్రభుత్వ స్థలం సమీపంలోని ప్రైవేటు వారి గోడలు, నిర్మాణాలను కూల్చివేస్తున్నట్లు చేస్తున్న ప్రచారం అవాస్తవం. సందర్శకులకు ఇబ్బంది లేకుండా పెద్దను ఖాళీ చేయమని కోరాం. సందర్శకుల భద్రత దృష్ట్యా మాత్రమే ఎగ్జిబిషన్ అనుమతులు తాత్కాలిక అనుమతులు రద్దు చేశాం. దీనిపై కొందరు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ వదంతులను నమ్మొద్దు. అవగాహన రాహిత్యంతో అసత్యాలు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఓ ప్రకటనలో స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం- 2026 జనవరి 8 నుంచి 10 వరకు భవానీ ఐలాండ్, బరం పార్కు, సైన్సు సెంటర్, పున్నమి ఘాట్ పరిసరాల్లో 'ఆవకాయ్ అమరావతి' ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల నేపథ్యంలో శాంతి భద్రతలు, ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

సైబర్ మోసాలా.. అవగాహన పెంచుకోండిలా..!

★ డీసీపీ కె.కృష్ణ ప్రసన్నతో ఫోన్ ఇన్ 30న

ఈనాడు మీతోడు

సైబర్ నేరాలు నిత్యకృత్యమయ్యాయి. ఏ లింక్ క్లిక్ చేస్తే ఏమవుతుందో? బ్యాంకు ఖాతా ఎప్పుడు ఖాళీ అవుతుందో అని అందరూ బెంబేలెత్తిపోతున్నారు. పెట్టుబడులు, పార్ట్‌టైం ఉద్యోగాల పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజల కష్టార్జితాన్ని దోచేస్తున్నారు. డబ్బులు పోతే తిరిగి వస్తాయన్న నమ్మకం పూర్తిగా పోయింది. వీటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కావాల్సిన సాయం తదితర అంశాలపై 'ఈనాడు' సైబర్ క్రైం డీసీపీ కె.కృష్ణ ప్రసన్నతో ఫోన్ ఇన్ కార్యక్రమం చేపట్టింది. ప్రజలు తమకున్న సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. మీరు చేయాల్సిందల్లా నిర్దేశిత సమయంలో దిగువ నంబరుకు ఫోన్ చేయడమే. - ఈనాడు, అమరావతి

80085 74651 | 30.12.25 మంగళవారం | ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

యూరియా దందా.. అంతే లేదయా!

బస్తా రూ.400లకుపైగా అమ్మకం ✪ తెలంగాణకు తరలుతున్నా పట్టదే..

ఈనాడు, అమరావతి- న్యూస్‌టుడే, తిరువూరు

తిరువూరు లక్ష్మీపురం సొసైటీ దగ్గర యూరియా కోసం పడిగాపులు

జిల్లాలో ప్రైవేటు వ్యాపారుల యూరియా దందా హద్దు దాటుతోంది. కృత్రిమ కొరత సృష్టించి నల్లబజారులో అడ్డగోలుగా అమ్మేస్తున్నారు. నిల్వలు రాష్ట్ర సరిహద్దులు దాటుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

ప్యాకేజీలు పెట్టి అమ్మకాలు: ★ వరి, మొక్కజొన్న, మిరప, పత్తి, పొగాకు, కూరగాయలు సాగు జరుగుతోంది. దీంతో ప్రైవేటు వ్యాపారులంతా కుమ్మక్కై కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ★ 50 కిలోల బస్తా రూ. 266.50కు అమ్మాలి. రూ.350-400 పైగా అమ్ముతున్నారు. ★ తిరువూరులో దాదాపు అన్ని దుకాణాల్లో మూడు బస్తాల కాంప్లెక్స్ ఎరువు కొంటేనే రెండు బస్తాల యూరియా ఇస్తున్నారు. ఇలా మొత్తం కలిసి బస్తాకు రైతుకు రూ.5 వేలు భారమే. యూరియా మాత్రమే కావాలంటే లేదని చెప్పేస్తున్నారు. ★ కొన్ని సొసైటీల్లోనూ ఇదేతీరు. తిరువూరులోని ఓ సొసైటీ మూడు కాంప్లెక్స్ ఎరువుల బస్తాలు కొంటేనే రెండు యూరియా బస్తాలు ఇస్తున్నామని చెబుతున్నారు. ★ గంపలగూడెం, ఎ.కొండూరు, మైలవరం, ఇబ్రహీంపట్నం... ఇలా ప్రతి చోట ఇదే తంతు. గ్రోమోర్, సొసైటీలు, ఆర్‌ఎస్‌కేల్లో నిల్వలు వచ్చిన వెంటనే ఖాళీ అయిపోతున్నాయి. నిల్వలు రాగానే కొందరు రైతులు అవసరం ఉన్నా లేకున్నా కొని దాచుకున్నారు.

అక్రమ రవాణా..

తిరువూరు, గంపలగూడెం, జగ్గయ్యపేట.. తెలంగాణ సరిహద్దు ప్రాంతాలు కావడంతో భారీగా యూరియా పొరుగు రాష్ట్రానికి తరలిపోతోంది. స్థానిక రైతులకు పాసుపుస్తకం, ఆధార్ ఉంటేనే యూరియా ఇస్తామంటున్న వ్యాపారులు తెలంగాణ రైతులకు మాత్రం ఎన్ని కావాలంటే అన్ని బస్తాలు ఇచ్చేస్తున్నారు.

సమీక్షలతో సరి.. ★ యూరియా అక్రమాలపై అధికారులకు తెలిసినా వ్యాపారులతో మొక్కుబడి సమావేశాలు పెట్టి సరిపెడుతున్నారు. అంతా బాగుందని ఉన్నతాధికారులను మభ్యపెడుతున్నారు. ★ వ్యాపారుల అక్రమాలపై ఉన్నతాధికారులు సైతం కఠిన తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకునేందుకు కదలడం లేదు. స్థానిక అధికారులు వ్యాపారులకు కొమ్ముకాస్తుండటమే కారణమని రైతులు వాపోతున్నారు.

★ జిల్లా వ్యవసాయాధికారిణి విజయ కుమారి మాట్లాడుతూ.. సమావేశాలు పెట్టి వ్యాపారులను హెచ్చరించామని.. పద్ధతి మార్చుకోకుంటే తనిఖీలతో కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 29వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/ నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్ ఆవరణలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతి పత్రాలను స్వీకరించనున్నట్లు వివరించారు.

మీకోసం వెబ్‌సైట్‌లోనూ దాఖలు

ప్రజలు తమ సమస్యల అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు (నమోదు) చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఇందులో దాఖలైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారాన్ని 1100 నంబరుకు నేరుగా ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

హుషారెత్తించిన విజయ్‌ప్రకాశ్, నేహా

విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో వేడుకలకు తరలివచ్చిన నగరవాసులు

ఉర్రూతలూగించిన దినకర్, సమీరా భరద్వాజ్

ఊరంతా సరిగమ.. ఊసంతా మధురిమ!

✧ కృష్ణా తీరాన ఆనంద తాండవం చేసిన విజయవాడవాసులు
✧ ఘనంగా 'ఈనాడు 50, ఈటీవీ 30' వసంతాల వేడుకలు

ఈనాడు, అమరావతి - విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే

'సంగీత సవ్వడులకు కృష్ణా తీరం పులకించింది. దేదీప్య కాంతుల నడుమ.. ఉర్రూతలూగించే సంగీతం.. ఆకట్టుకునే గీతాలకు.. ఆహుతులు మైమరచిపోయారు. ప్రముఖ గాయనీ, గాయకులతో కలిసి స్వరం కలిపి.. ఆనంద తాండవం చేశారు. 'ఈనాడు 50, ఈటీవీ 30' వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా.. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన వేడుకలు కనులపండువగా సాగాయి. వేల మంది ప్రజలు తరలివచ్చి.. వేడుకలను తిలకించారు. సినీ నేపథ్య గాయకులు.. విజయ్‌ప్రకాష్, సమీరా భరద్వాజ్, దినకర్, నేహా, హరిప్రియ, ఇండియన్ ఐడల్ రేవంత్, మంగ్లీ, వాగ్దేవి, రిషిల్.. ఆలపించిన గీతాలకు.. ఆహ్వానితులు ఆనంద డోలికల్లో మునిగి తేలారు. ఆదివారం కావడంతో.. కుటుంబాలు, పిల్లలతో కలిసి.. భారీగా నగరవాసులు తరలివచ్చి.. ఆస్వాదించారు. ఉర్రూతలూగించే సినీ గీతాలకు.. చిన్నాపెద్ద కేరింతలు కొడుతూ.. స్టెప్పులేస్తూ ఉల్లాసంగా గడిపారు.

50 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లు..

విజయవాడతో నాకు విడదీయలేని అనుబంధం ఉంది. ఇక్కడ ఈనాడు, 50, ఈటీవీ 30 ఏళ్ల ఉత్సవాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది. ఇన్నేళ్ల ప్రస్థానంలో ఎన్నో అద్భుతమైన కార్యక్రమాలను 'ఈనాడు, ఈటీవీ' చేపట్టాయి. రామోజీరావు చేపట్టిన మహా యజ్ఞం ఫలాలివి. ఆయన సినిమా రంగానికి చేసిన సేవలు అనన్యం. సువిశాల ప్రదేశంలో రామోజీ ఫిల్మ్‌సిటీని స్థాపించి.. కొలమానం లేనన్ని సేవలు అందించారు. ఈటీవీ పాడుతా తీయగా.. లాంటి కార్యక్రమాలు.. ప్రజలకు ఎంతో చేరువయ్యాయి. ఈ వేడుకలకు వెళ్లాలని రామోజీరావు ఆదేశించారు.. సిబ్బంది ఆహ్వానించారు.. నేను విచ్చేశాను.

- బ్రహ్మానందం, ప్రముఖ సినీ హాస్యనటులు

బొమ్మరిల్లు సీరియల్ టీం సందడి

మంగ్లీ, హరిప్రియ, రేవంత్



ఇక్కడి నుంచి ఆరంభిస్తే విజయమే..

మా 'అనగనగ ఒకరోజు' సినిమా ప్రచార కార్యక్రమాలను విజయవాడలోని ఈ వేదిక మీద నుంచి ఆరంభిస్తున్నాం. ఇక్కడి నుంచి ఆరంభిస్తే విజయం వరిస్తుందనే నమ్మకం ఉంది. అందుకే విజయవాడలో ఈ వేదిక పైనుంచి ఆరంభిస్తున్నాం. జనవరి 14న సినిమాను అందరూ తప్పకుండా చూడాలి. - నవీన్ పోలిశెట్టి, మీనాక్షి చౌదరి

కార్యక్రమానికి వ్యాఖ్యాతగా సుమ కనకాల వ్యవహరించారు. సినీనటి మానసచౌదరి, బొమ్మరిల్లు శిరీష తమ నృత్యాలతో అలరించారు. ముఖ్య అతిథిగా బ్రహ్మానందం పాల్గొన్నారు.

ప్రత్యేక అతిథులుగా.. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు, కలెక్టర్ లక్ష్మీశ, ఎన్టీఆర్ జిల్లా తెదేపా అధ్యక్షురాలు గద్దె అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సమస్యలకు..

అరచేతిలో పరిష్కారం

మీ ప్రమేయం లేకుండానే ఖాతాలో నగదు కట్ అయిందా.. ఖాతా పూర్తిగా స్తంభించి పోయిందా.. బ్యాంకు మార్చిన చెక్ సొమ్ము ఖాతాలో జమ కాలేదా.. ఇలాంటి ఇబ్బందులు వచ్చినప్పుడు ఖాతాదారులకు ఏం చేయాలో పాలుపోదు.. పడుతూ లేస్తూ బ్యాంకుకు పరుగులు పెడతారు. నానా హైరానా పడిపోతుంటారు. బ్యాంకు సమస్యలు ఉత్పన్నమైతే అరచేతిలోనే పరిష్కారం ఉంది. అసలేంటీ నంబర్లు.. ఈ అంబుడ్స్‌మెన్‌లో ఫిర్యాదులు ఎలాగో తెలుసుకుందాం పదండి. – ఈనాడు, అమరావతి

ఇవీ టోల్ ఫ్రీ నంబర్లు...

- యూనియన్ బ్యాంకు : 1800 208 2244
- కెనరా బ్యాంకు: 1800 1030
- ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు:1800 425 2045
- స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా:1800 1234
- యాక్సెస్ బ్యాంకు: 1800 209 5577

మొండి సమస్యలు చక్కదిద్దేలా..

సాధారణంగా బ్యాంకుల్లో సమస్యలు టోల్‌ఫ్రీ నంబర్లు, నేరుగా వెళ్లి ఫిర్యాదు చేయడంతో పరిష్కారం అవుతాయి. కొన్ని సమస్యలు ఫిర్యాదులతో కూడా పరిష్కారం కావు. ✪ కొన్నిసార్లు బ్యాంకు అధికారులు సవ్యంగా స్పందించరు. ఈ సమయంలో అవగాహన లేక చాలా మంది ఖాతాదారులు నష్టపోతున్నారు. బ్యాంకులో ఫిర్యాదు చేసిన నెల రోజుల్లో అధికారుల నుంచి సరైన స్పందన లేకపోతే అంబుడ్స్‌మెన్ అనే న్యాయ వ్యవస్థను సంప్రదించవచ్చు. ✪ టోల్ ఫ్రీ నంబరు 14448కు ఫోన్ చేసి సమస్యను తెలియజేయవచ్చు. లేదా సీఎమ్ఎస్. ఆర్‌బీఐ. ఓఆర్‌జీ అనే పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

డిజిటల్ చెల్లింపుల్లో ఇక్కట్లా?

✪ ఉమ్మడి జిల్లాలో దాదాపు ఏడాదికి రూ.3లక్షల కోట్ల విలువైన 30కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతాయి. ప్రస్తుతం అడుగడుగునా డిజిటల్ చెల్లింపులు జరుగుతున్న నేపథ్యంలో అనేక పొరపాట్లు దొర్లుతున్నాయి. ✪ మనం పంపాల్సిన వారికి కాకుండా మరొకరికి నగదు వెళ్లిపోతోంది. కొన్నిసార్లు పెండింగులో ఉండిపోతోంది. ✪ ఈ నేపథ్యంలో వారికి ఫోన్ చేసినా స్పందన ఉండదు. ఈ సమయంలో 24 గంటల్లోగా సదరు బ్యాంకును సంప్రదించాలి. లావాదేవీ వివరాలు అధికారులకు అందించాలి. ✪ ఎన్‌పీసీఐ వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చు. సైబర్ వలలో చిక్కి సొమ్ము చేజార్చుకున్నవారు జిల్లాలో చాలా మంది ఏం చేయాలో తెలియక మిన్నకుంటున్నారు.

వీరు **1930** సైబర్ క్రైం హెల్ప్ లైన్ నంబరుకు ఫోన్ చేస్తే పరిష్కారం దొరుకుతుంది.

రూ.5 కోట్ల ఖర్చుకు.. వెలుగేదీ..?!

☛ ఆరేళ్లుగా 5.85 ఎకరాలపై ఆదాయమూ లేదు
☛ ఏటా 16 లక్షల యూనిట్ల విద్యుత్తు ఎక్కడ?

ఈనాడు, అమరావతి

దుర్గమ్మకు వచ్చే ఆదాయాన్ని కరిగించడంలో ముందుండే అధికారులు.. సద్వినియోగంలో మాత్రం విఫలం అవుతున్నారు. 2020లో రూ.5 కోట్లు ఖర్చుపెట్టి.. పాతపాడులో 5.85 ఎకరాల దేవస్థానం స్థలంలో ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్ నిర్మించారు. 2022 సెప్టెంబరులో ప్లాంట్ నుంచి ఉత్పత్తి ఆరంభించారు. ఏటా 16 లక్షల యూనిట్లు ఉత్పత్తి అవుతుందని.. నెడ్‌క్యాప్, దేవస్థానం అధికారులు వెల్లడించారు.

సోలార్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్

"దుర్గగుడికి వాడగా.. తిరిగి విద్యుత్తు సంస్థ నుంచే డబ్బులు వస్తాయని సెలవిచ్చారు. దేవస్థానం డబ్బులు నీళ్లలా ఖర్చుపెట్టి ప్లాంట్ పెట్టేశారు. ఈ లెక్కన.. మూడేళ్లలో 48 లక్షల యూనిట్ల విద్యుదుత్పత్తి అవ్వాలి. దుర్గగుడికి రూపాయి బిల్లు రాకూడదు. కానీ.. ఇవేవీ జరగలేదు. పైగా.. రూ.3.50 కోట్లు తమకే చెల్లించాలనీ.. రూ.40 లక్షల జరిమానాతో సహా విద్యుత్తు సంస్థ తాఖీదులను ఇచ్చింది."

20 ఏళ్లు బిల్లులే ఉండవన్నారు..

దుర్గమ్మ ఆలయ పరిసరాలు, మహామండపం, ఇతర భవనాలు, కార్యాలయాలు, సీవీరెడ్డి ఛారిటీస్, ఉద్యోగుల క్వార్టర్లు, జమ్మిదొడ్డి, మాడపాటి సత్రం అన్నీకలిపి.. 2020 నాటికి నెలకు 1.12 లక్షల యూనిట్ల విద్యుత్తు వాడేవారు. ఏటా 13.50 లక్షల యూనిట్లు వాడి.. రూ.82 లక్షల బిల్లు చెల్లించేవాళ్లు. ✪ ఈ లెక్కన ప్లాంట్‌కు రూ.5 కోట్లు పెడితే.. నిర్మాణ వ్యయం ఆరేళ్లలో వెనక్కి వస్తుందనీ, తర్వాత 20 ఏళ్లు బిల్లే చెల్లించక్కర్లేదనేది ప్రతిపాదన. ✪ పైగా.. 20ఏళ్లు ఈ ప్లాంట్‌ను నిర్మించిన గుత్తేదారు సంస్థే దీని నిర్వహణ చూసుకుని.. ఏటా 16 లక్షల యూనిట్ల విద్యుదుత్పత్తి చేస్తుందన్నారు. ✪ ప్లాంట్ నిర్మాణానికి.. నెడ్‌క్యాప్ నుంచి రూ.92.80 లక్షల రాయితీ రాగా. మిగతాది దేవస్థానం వెచ్చించింది. ఉత్పత్తయ్యే 16 లక్షల యూనిట్లలో. 13.50 లక్షలు వాడుకోగా.. మిగిలింది అప్పటి ధర ప్రకారం.. యూనిట్‌కు రూ.5.48 చొప్పున రూ.13.70 లక్షలను విద్యుత్తుశాఖే.. దేవస్థానానికి చెల్లిస్తుందని చెప్పారు.

ఇప్పటికైనా దృష్టిపెట్టాలి..

ప్లాంట్ నుంచి ఎంత విద్యుదుత్పత్తి అవుతుందో.. స్పష్టత లేదు. అప్పటి ఈవోలు, అధికారులు.. ఇప్పుడు లేరు. తాజాగా ఆలయానికి విద్యుత్తు సరఫరా ఆపేసి భక్తులను ఇబ్బంది పెట్టేవరకూ పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా.. కాకిలెక్కలతో కాలయాపన చేయకుండా.. విద్యుత్తు, దేవాదాయ అధికారులు సమస్య పరిష్కరించుకోవాలి.

సభలో ప్రసంగిస్తున్న ఎంపీ శివనాథ్

ఖండాంతరాలు దాటిన కేబీఎన్ కళాశాల పేరు

చిట్టినగర్, న్యూస్‌టుడే : పేద, మధ్య తరగతి వర్గాలకు కేబీఎన్ కళాశాల ఒక విద్యా దీపం వంటిదని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. కొత్తపేటలోని ఆ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఎంపీ మాట్లాడుతూ వందలాది మంది విద్యార్థులు ఇక్కడ చదివి దేశ, విదేశాల్లో స్థిరపడటం హర్షణీయమన్నారు. చంద్రయాన్, ఆదిత్య ఎల్-1, మ్యాన్‌మిషన్, పలు రాకెట్లలో వాడే విడి భాగాలను తయారు చేసే బీఎన్.రెడ్డి వంటి ప్రముఖులు చదివిన ఈ కళాశాల పేరు ఖండాంతరాలు దాటిందన్నారు. కేబీఎన్ కళాశాలలో మరో మూడు నెలల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. పూర్వ విద్యార్థి, సినీ హీరో సుహాస్, ఐఎఫ్‌ఎస్ అధికారి జె.ఎ.సి.ఎస్.రావు, ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య, కార్యదర్శి టి.శ్రీనివాస్, ఏవో నారాయణరావు, ప్రిన్సిపల్ కృష్ణవేణి తదితరులు ప్రసంగించారు. సీనియర్ అధ్యాపకులు పూర్వ విద్యార్థులను సత్కరించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళల సింగిల్స్ విజేత సూర్య చరిష్మా(ఆంధ్రప్రదేశ్)ను భుజాలపైకెత్తి అభినందిస్తున్న క్రీడాకారులు

పోటీపడుతున్న కర్ణాటక, మణిపూర్, ఉత్తరప్రదేశ్ జట్లు

మన చరిష్మా అదుర్స్..

న్యూస్‌టుడే-విజయవాడ క్రీడలు: రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో పటమటలోని సీహెచ్ఆర్‌కే ఇండోర్ స్టేడియం, గురునానక్ కాలనీలోని సాయి సందీప్ బ్యాడ్మింటన్ అకాడమీలో వారం పాటు జరిగిన యోనెక్స్ సన్‌రైజ్ 78వ అంతర్ రాష్ట్ర ఇంటర్ జోనల్, 87వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్-2025 ఆదివారం ముగిశాయి. ఈ నెల 22, 23వ తేదీల్లో అంతర్ రాష్ట్ర ఇంటర్ జోనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల విభాగంలో ఎనిమిది, మహిళల విభాగంలో ఏడు జట్లు తలపడ్డాయి. 24 నుంచి 28వ తేదీ వరకు జరిగిన జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల వ్యక్తిగత విభాగంలో 119 మంది, మహిళల వ్యక్తిగత విభాగంలో 114 మంది, పురుషుల డబుల్స్‌లో 60, మహిళల డబుల్స్‌లో 58 జోడీలు, మిక్స్‌డ్ డబుల్స్‌లో 61 జోడీలు తలపడ్డాయి. అంతర్ రాష్ట్ర ఇంటర్ జోనల్ ఛాంపియన్‌షిప్‌లో పీవీ సింధు, తమిరి సూర్య చరిష్మ, ఎస్.కవిప్రియ, కందేరి నవ్య, డి.దీపిక, డి.స్రవంతి, సీఎస్‌ఆర్ ప్రణవి, ఎం.తనిష్క్, ఆమర్తి హర్షిక, ఆమర్తి ప్రవల్లిక మణి రాష్ట్ర మహిళా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు.

ఆన్‌లైన్‌లో తిరుపతమ్మ ఆలయ టికెట్లు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో దర్శనం, సేవలు, ప్రసాదాలను రాష్ట్రప్రభుత్వ వాట్సప్ మన మిత్ర ద్వారా పొందవచ్చు. మన మిత్ర నంబరు 95523 00009 వాట్సప్ ద్వారా, www.aptemplesap.gov.in ద్వారా సేవలు పొందవచ్చని ఈవో మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆయా సేవల కోసం క్యూలైన్‌లో వేచి ఉండాల్సిన అవసరం లేదని ఈవో తెలిపారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని 30వ తేదీ మంగళవారం దేవాలయంలో ఉత్తర ద్వారదర్శనం ఏర్పాటు చేశామని చెప్పారు.

కాంట్రాక్టు పట్టు.. సొమ్ములు కొల్లగొట్టు!

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

జక్కంపూడి కాలనీలో పారిశుద్ధ్యం పేరిట రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ కాంట్రాక్టును ఓ ముఖ్య ప్రజాప్రతినిధి అనుచరుడికి చెందిన గుత్తేదారు సంస్థకు కట్టబెట్టి అధిక చెల్లింపులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ★ జక్కంపూడి కాలనీలో 5,500 ఇళ్లు, 20,500 మంది జనాభా ఉన్నట్లు ఇటీవల వరకు 41 మంది కార్మికులతో పారిశుద్ధ్య పనులు నిర్వహించేవారు. అందుకు ఏటా రూ.71.59 లక్షలు ఖర్చు చేసేవారు. ★ ప్రస్తుతం ఇళ్లు 8032, జనాభా 30,400కి పెరిగినట్లు చెబుతూ కార్మికుల సంఖ్య 50కి చేర్చారు. వారి వేతనాల కోసం ఏటా రూ. 1,48,09,800 చెల్లించేలా ఇటీవల ఆమోదించారు. ★ కాలనీ పారిశుద్ధ్య వ్యయాన్ని ఏళ్లుగా కార్పొరేషన్ భరిస్తోంది. ఆ ప్రాంతం జక్కంపూడి పంచాయతీ పరిధిలోకి వస్తున్నందున పారిశుద్ధ్య నిర్వహణ పంచాయతీ చూసుకునేలా కౌన్సిల్లో తీర్మానించి, జిల్లా పంచాయతీ అధికారులకు పంపారు. కానీ వైకాపా పాలకపక్షం అధికారంలోకి వచ్చాక కార్పొరేషనే పారిశుద్ధ్య పనులు చేయిస్తూ.. ఆ వ్యయాన్ని పెంచుతోంది.

☛ పారిశుద్ధ్య నిర్వహణ టెండర్‌ను యశ్వంత్ ఫెసిలిటీ సర్వీస్ సంస్థకు అప్పగించగా.. 2025 అక్టోబరు 31తో కాలపరిమితి ముగిసింది. 2025 నవంబరు 1 నుంచి 2026 అక్టోబరు 31 వరకు తిరిగి టెండర్లు పిలిచేందుకు తీర్మానించి బుట్టదాఖలు చేశారు. ☛ నిబంధనలకు తూట్లు పొడిచి పాత గుత్తేదారుని కొనసాగించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్మికుడికి రూ.21,000 చొప్పున వేతనం చెల్లించాలి. కార్మికుల సంఖ్య 50కి పెంచి, రూ.24,683 చొప్పున చెల్లించేలా ఆమోదించుకున్నారు. గుత్తేదారుకు 13 శాతం జీఎస్టీ, 5 శాతం కమిషన్ కలిపి నెలకు రూ.12,34,150 చొప్పున ఏడాదికి రూ.1,48,09,800 చెల్లిస్తున్నారు. ☛ గుత్తేదారు మాత్రం కార్మికులకు రూ.13-15 వేలు చెల్లిస్తున్నట్లు కార్మిక సంఘాలు సీడీఎంఏకు, వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదంటూ వామపక్ష నాయకులు కమిషనర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ప్రతి నెలా కార్మికులకు వేతనాలు చెల్లించినట్లు గుత్తేదారు సంస్థ కార్పొరేషన్‌కు ఎవిడెన్స్ సమర్పిస్తేనే బిల్లు ఇవ్వాలి. కానీ ముఖ్య ప్రజాప్రతినిధి ఒత్తిడితో ప్రతి నెలా ఆ సంస్థ ఖాతాకి జమ చేస్తున్నారు.

జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదంటూ..

ప్రథమ వర్ధంతి



మమ్మల్ని గుండెల నిండుగా ప్రేమించి, మాకు ఆప్యాయతానురాగాలను పంచి, మా ఉన్నతికి అహర్నిశలు అలుపెరుగక శ్రమించి, కల్మషమెరుగని మంచి మనిషిగా జీవించిన మీరు దైవసన్నిధికి చేరి నేటికి ఒక సంవత్సరం గడిచినా మీ జ్ఞాపకాలు మరువలేము..

కీ॥శే॥ గుండె నాగేశ్వరరావు గారు
(Retd.) Asst. Divisional Managar
New India Assurance, Vijayawada.
జననం: 12-11-1955, మరణం: 08-01-2025

భార్య : వి.హిమబిందు, Deputy Director, Employment, Vizag Region
కుమార్తె : మన్నే సుధా ప్రియదర్శిని
అల్లుడు : మన్నే సాయికృష్ణ
మనుమడు : అమోఘ శౌర్య
మనుమరాలు : ఆధ్యా సరయు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

సెమీస్‌కు నలంద.. వీఆర్ సిద్ధార్థ జట్లు

ఉత్సాహంగా 'ఈఎస్ఎల్' క్రికెట్ టోర్నీ

EENADU SPORTS LEAGUE 2025

KAMINENI HOSPITALS VIJAYAWADA

న్యూస్‌టుడే-విజయవాడ క్రీడలు

'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025 ఉత్సాహంగా సాగుతోంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌ల్లో నలంద డిగ్రీ కళాశాల, వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్లు సెమీ ఫైనల్స్ బెర్త్‌లు ఖరారు చేసుకున్నాయి. ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కళాశాల జట్టు క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రవేశించింది. కానూరులోని కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ స్కూల్ మైదానంలో జరుగుతున్న ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్

నిప్పులు చెరిగిన రామ్‌ప్రసాద్

● ఆదివారం జరిగిన మొదటి మ్యాచ్‌లో ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కళాశాల జట్టు తొమ్మిది పరుగుల ఆధిక్యంతో పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన పీబీ సిద్ధార్థ జట్టు బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా లయోలా జట్టు నిర్ణీత పది ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 60 పరుగులు చేసింది. వై.అరవింద్ 26 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. ప్రత్యర్థి బౌలర్ ఏక్తాన్‌సింగ్ 11 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన పీబీ సిద్ధార్థ జట్టు 9.4 ఓవర్లలో 51 పరుగులకే ఆలౌటైంది. రూపేష్ 17, మోహిత్ 13 పరుగులు చేశారు. ప్రత్యర్థి బౌలర్ జె.రామ్‌ప్రసాద్ మూడు పరుగులు ఇచ్చి అయిదు వికెట్లు తీశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా జె.రామ్‌ప్రసాద్ ఎంపికయ్యాడు.

రాణించిన నలంద బ్యాటర్లు..

● రెండో మ్యాచ్‌లో నలంద డిగ్రీ కళాశాల జట్టు 74 పరుగుల తేడాతో అమృతసాయి ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నలంద జట్టు పది ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 125 పరుగులు చేసింది. ఎన్.భానుప్రసాద్ 39 పరుగులతో క్రీజ్‌లో నిలవగా. . జె.బన్నీ 36 పరుగులు జోడించాడు. ప్రత్యర్థి బౌలర్ ఆర్.అనిల్ 25 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన అమృతసాయి జట్టు 9.2 ఓవర్లలో 51 పరుగులకే కుప్పకూలింది. కె.సాయిరామ్ 23 పరుగులు చేశాడు. ప్రత్యర్థి బౌలర్ ఎ.వాసు మూడు పరుగులు ఇచ్చి రెండు వికెట్లు కూల్చాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎన్.భానుప్రసాద్ ఎంపికయ్యాడు.

నేటి మ్యాచ్‌ల వివరాలు

★ పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల × కేబీఎన్ డిగ్రీ కళాశాల (మొదటి మ్యాచ్)

★ శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల × ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కళాశాల (రెండో మ్యాచ్)

★ దీక్ష జూనియర్ కళాశాల × విశ్వశాంతి జూనియర్ కళాశాల (మూడో మ్యాచ్)

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్ వీరే..

జె.రామ్ ప్రసాద్ | ఎన్.భాను ప్రసాద్ | పి.మనోజ్

ఆరు వికెట్ల తేడాతో విజయం

● మూడో మ్యాచ్‌లో వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్టు ఆరు వికెట్ల తేడాతో ఎంవీఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన వీఆర్ సిద్ధార్థ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా. . బ్యాటింగ్‌కు దిగిన ఎంవీఆర్ జట్టు పది ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. వి.బాలకృష్ణ 31 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. ప్రత్యర్థి బౌలర్ పి.మనోజ్ 11 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు కూల్చాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన వీఆర్ సిద్ధార్థ జట్టు 8.4 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 68 పరుగులు చేసి విజయకేతనం ఎగురవేసింది. పి.మనోజ్ 13 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. ఎస్.తరుణ్‌సాయి 12 పరుగులు జోడించాడు. ప్రత్యర్థి బౌలర్ వి.బాలకృష్ణ 12 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా పి.మనోజ్ ఎంపికయ్యాడు.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ NECC (Non-Govt. Public Charitable Trust) "Sunday ho ya Monday roz khao ande"
Regional Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P.
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా | కర్ణాటక
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner: ETV BHARAT, ఈనాడు.నెట్
FM Partner: ఈ FM Mee FM
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు ఉత్సవం క్లబ్

నూతన సంవత్సర వేడుకలు ఆహ్లాదకరంగా ఉండాలి

ప్రజలకు పోలీస్ కమిషనర్ సూచన

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం-2026ను స్వాగతిస్తూ డిసెంబరు 31వ తేదీ రాత్రి నిర్వహించుకునే వేడుకలకు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని పలు ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. వేడుకలు ఆహ్లాదకరంగా.. అందరికీ ఆమోదయోగ్యంగా.. హాని రహితంగా ఉండాలని కోరారు. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తీసేసి అధిక శబ్దాలతో హోరెత్తించినా, అతి వేగంతో రోడ్లపై తిరిగినా, వాహనాలపై విన్యాసాలు చేసినా, బాణసంచా కాల్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం తాగి అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించమని పేర్కొన్నారు.

● అర్ధరాత్రి రోడ్లపై వేడుకలకు అనుమతులు లేవు. ● వాహనాలను అతివేగంగా, అజాగ్రత్తగా నడపరాదు. ● ట్రిపుల్, జిగ్‌జాగ్ డ్రైవింగ్ చేయరాదు. ● మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు. ● మహాత్మా గాంధీ రోడ్డు, కారల్‌మార్క్స్‌రోడ్డు, బి.ఆర్.టి.ఎస్. రోడ్లపై ట్రాఫిక్ ఆంక్షలు. ● బెంజిసర్కిల్ రెండు పైవంతెనలు, కనకదుర్గా పైవంతెనపై వాహనాలను అనుమతించరు. ● గుంపులుగా చేరి నడిరోడ్డుపై కేకులు కోసి అల్లర్లు చేయకూడదు. ● కేకలు వేస్తూ వాహనాలపై తిరగరాదు. ● హద్దు మీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవు.

ఈనాడు-50, ఈటీవీ-30 వసంతాల వేడుకలో ఎంపీ కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్, తెదేపా జిల్లా అధ్యక్షురాలు గద్దె అనూరాధ, కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు చేతుల మీదుగా జ్ఞాపికలు స్వీకరిస్తున్న స్పాన్సర్లు తదితరులు

స్పాన్సర్లకు సత్కారం

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో ఈనాడు 50, ఈటీవీ 30 వసంతాల వేడుకలు ఆదివారం రాత్రి వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి స్పాన్సర్లుగా వ్యవహరించిన వారిని ఘనంగా సత్కరించారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ విజయవాడ మేనేజర్ ఎం.చంద్రశేఖర్ ఆజాద్, ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ ఏరియా సేల్స్ మేనేజర్ నారాయణ, విజయవాడ డిస్ట్రిబ్యూటర్ ఎం.ఆంజనేయులు, తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ ప్రతినిధులు సుభాని, జి.ఎస్.ఎన్.ప్రసాద్, ఫిజికెమ్ మదుక్యూర్ జ్యూస్ అండ్ క్యాప్సుల్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సి.సి.కేశవరావు, రాజేశ్వరి, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ మేనేజర్ కె.కృష్ణమోహన్, ఒటో క్లాతింగ్ డీజీఎం మధుకుమార్, శ్రీలలిత రైస్ విజయవాడ, గుంటూరు రీజియన్ జనరల్ మేనేజర్ ఎస్.ఎ.బాషా, వేగా జ్యూయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వి.నవీన్‌కుమార్, సుధాకర్, మాస్టర్ మైండ్స్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ప్రతినిధి కె.శ్రీనివాసరావు, ఆర్టోస్ కూల్ డ్రింక్స్ విజయవాడ డిస్ట్రిబ్యూటర్ ఎం.నాగశైలజ, ఎం.ప్రభాకర్‌రావు, మల్లిక స్పైన్ సెంటర్(గుంటూరు) మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జె.నరేష్‌బాబు, అక్కినేని హాస్పిటల్స్(విజయవాడ) ప్రతినిధి డి.జి.రెడ్డి, స్వీట్ శ్రీనివాస్‌గారి శ్రీబాలాజీ మీ స్వీట్స్(విజయవాడ) మేనేజింగ్ డైరెక్టర్ కనమర్లపూడి శ్రీనివాస్, శ్రీగోసలైట్స్ మెడికల్ అకాడమీ(విజయవాడ) డైరెక్టర్ వెనిగళ్ల నరేంద్రబాబు, విజేత సూపర్‌మార్కెట్ ఏపీ, తెలంగాణ స్టోర్స్ మేనేజర్(విజయవాడ) డి.సాయి పవన్, పినాకెల్ జూనియర్ కాలేజ్(విజయవాడ) ఛైర్మన్ శంకరమంచి సాయిరామ్, శ్రీభాష్యం గ్లోబల్ స్కూల్(విజయవాడ) డైరెక్టర్స్ కిషోర్‌బాబు, లక్ష్మీనారాయణ, మన వీవీఐటీ యూనివర్సిటీ (నంబూరు) ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్‌రావు, అరుణప్రియ, అంబికా దర్బార్‌బత్తి(విజయవాడ) డిస్ట్రిబ్యూటర్ పువ్వాడ భాస్కర్‌రావును సత్కరించారు. వీరికి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్, గద్దె అనూరాధ, కలెక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు.

చిన్న రాజగోపురం వద్ద బారులు తీరిన భక్తులు

దుర్గమ్మ దర్శనం అపురూపం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. దీంతో ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ లిఫ్టుమార్గం భక్తులతో కిటకిటలాడాయి. వాహనాలు నిలిపేందుకు స్థలం లేకపోవడంతో అధిక శాతం కెనాల్ రోడ్డు, జాతీయ రహదారిపై కుమ్మరిపాలెం సెంటరు వరకు నిలిపి కాలినడకన అమ్మవారిని దర్శించుకున్నారు. రద్దీ దృష్ట్యా మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు భక్తులను ముఖమండప దర్శనానికి పరిమితం చేశారు. ప్రొటోకాల్ దర్శనాలను నియంత్రించారు. సుమారు 60 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు భావిస్తున్నారు. సర్వదర్శనం చేసుకునేందుకు రెండు గంటల సమయం పట్టిందని పలువురు తెలిపారు. క్యూలైన్లో వేచి ఉన్న వారికి తాగునీరు అందించేందుకు ఈవో శీనానాయక్ చర్యలు తీసుకున్నారు.

సైకిల్ ర్యాలీలో కలెక్టర్ లక్ష్మీశ, డీఎస్‌డీవో కోటేశ్వరరావు, క్రీడాకారులు

సైక్లింగ్‌తో మానసిక ఆరోగ్యం సొంతం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : ఆరోగ్యకర జీవితంతో పాటు కాలుష్య రహిత సమాజానికి సైకిల్ సవారీ దోహదపడుతుందని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో ఆదివారం 'ఫిట్ ఇండియా ఆన్ సండేస్' సైకిల్ రన్ కార్యక్రమాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులు, యువత సైక్లింగ్‌ను ఓ ఆనందకర అలవాటుగా చేసుకోవాలని సూచించారు. దీనివల్ల శారీరక, మానసిక ఆరోగ్యం సొంతమవుతుందని చెప్పారు. సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందడంతోపాటు భావి తరాలకు కాలుష్య రహిత పర్యావరణాన్ని వారసత్వ సంపదగా అందించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సైక్లింగ్‌ను అలవాటుగా చేసుకోవాలని సూచించారు. ఒక మంచి అలవాటు.. ఎన్నో విజయాలకు సోపానమవుతుందన్నారు. అవగాహన పెంచుకొని.. సైక్లింగ్‌ను అభిరుచిగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. బెంజిసర్కిల్, పాలీక్లినిక్ రోడ్డు, పీబీ సిద్ధార్థ కళాశాల, రెడ్ సర్కిల్ మీదుగా సుమారు 9కి.మీ. మేర సైకిల్ ర్యాలీ సాగింది. డీఎస్‌డీవో కాకర్ల కోటేశ్వరరావు, శిక్షకులు, జిల్లా సైక్లింగ్ సంఘం సభ్యుడు సుగుణరావు, కోచ్ రాహుల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 152, 161, 172 చికెన్ విత్ స్కిన్ - 294 చికెన్ స్కిన్‌లెస్ - 304.

NANDIGAMA MUNICIPALITY

'e' Procurement Tender Notice Roc No: 1106/2024/E1, Dt: 23-12-2025

Sl. No	Name of the Grant	No of works	Estimate Amount (in Lakhs)	Opening date	Closing date
1	15th Finance Commission	9	176.38	29-12-2025	05-01-2026
2	MPLADS	1	03.32	29-12-2025	05-01-2026
3	General Funds	2	24.13	29-12-2025	05-01-2026
	TOTAL	12	203.83		

Note: All rights are reserved to the Commissioner to cancel or Reject the tenders without any reasons (As per G.O.Ms No.94, Dt. 01.07.2003 I & CAD) Further details can be seen@ 'e' procurement market place @www.tender.apeprocurement.gov.in
1. Download of bid documents starts from : 29-12-2025 @ 11:00 A.M.
2. Last Date/time for receipt of tenders : 05-01-2026 @ 11:00 A.M.
3. Bid Closing : 05-01-2026 @ 05:00 P.M
Contact No: 9490781856, 8341509213
Sd/- Commissioner, Nandigama Municipality

విద్యకు పేదరికం అవరోధం కాకూడదు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : విద్యతోనే విజ్ఞానం, ఉన్నత స్థానాలను అధిరోహించడం సాధ్యపడుతుందని సామాజికవేత్త వి.దొరరాజు అన్నారు. కోపా (కాపు అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యాభివృద్ధిని కాంక్షిస్తూ 28ఏళ్లుగా కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ఉపకారవేతనాలు పంపిణీ చేస్తున్న కోపా సేవలు అభినందనీయమన్నారు. ఇందులో తాను భాగస్వామి కావాలన్న ఉద్దేశంతో ఏటా రూ.లక్ష విరాళాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ దావులూరి కైలాసరావు మాట్లాడుతూ. . దాతలు, సభ్యుల సహకారంతో విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకూ 5376 మంది విద్యార్థులకు రూ.1.82 కోట్ల ఉపకారవేతనాలు అందజేసినట్లు వెల్లడించారు. ఉపకారవేతనాలు పొందిన విద్యార్థులే.. దాతలుగా మారి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. విద్యకు పేదరికం అవరోధం కాకూడదన్న ఆశయంతో డాక్టర్ బల్లెం నాగేశ్వరరావు ఈ సంస్థను ప్రారంభించారని గుర్తుచేశారు. అనంతరం 150 మంది విద్యార్థులకు రూ.10 లక్షల ఉపకారవేతనాలు అందజేశారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బల్లెం నాగేశ్వరరావు, దుట్టా రమేష్ కుమార్, వైద్యుడు సీఎస్ఆర్ ప్రసాదరావు, గల్లా భాస్కరరావు, కొత్తపల్లి సంజీవ్, గాజుల రామారావు, రామాయణం నాగసత్యం, కె.వెంకట రమణారావు, డి.వసుంధర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న నాగేశ్వరరావు, కైలాసరావు, దొరరాజు

'ఆవకాయ్ అమరావతి' ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

విద్యాధరపురం, న్యూస్‌టుడే : భవానీపురం పున్నమి ఘాట్ సమీపంలో జనవరి 8 నుంచి 10 వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆవకాయ్ అమరావతి' ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో నగరవాసులు హాజరుకానున్నారు. కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలతో కార్పొరేషన్, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో మాత్రమే ఉత్సవాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ ప్రకటించారు. అధిక సంఖ్యలో హాజరయ్యే నగరవాసులను దృష్టిలో ఉంచుకొని భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఎగ్జిబిషన్‌కు ఇచ్చిన అనుమతిని రద్దు చేశారు. తాత్కాలికంగా ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన షెడ్లను అధికారులు తొలగించారు. నగరవాసుల రాకపోకలకు అడ్డుగా వచ్చే గోడలు, గట్లను తొలగించే పనులు ముమ్మరం చేశారు.

పే అండ్ అకౌంట్స్ ఉద్యోగులకు అండగా ఉంటాం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్రంలో పే అండ్ అకౌంట్స్ ఉద్యోగులకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ పే అండ్ అకౌంట్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సర్వీస్ రూల్స్, రేషియో ఫిక్సేషన్, పదోన్నతులు, అడిషనల్ ఛార్ట్ తదితర దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.హరనాథ్ మాట్లాడుతూ.. నూతన జిల్లాల్లో ఎన్నికలు నిర్వహించి, సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. విద్యాసాగర్‌ను సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం కోఆప్షన్ ద్వారా నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పమ్మి శ్రీనివాస్(విశాఖపట్నం), కార్యదర్శులుగా జల్లేపల్లి స్వామి(విజయవాడ), మోహనరావు(విజయనగరం) ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వి.రమణారెడ్డి, సహాధ్యక్షుడు టి.వి.రమణ, కార్యనిర్వాహక కార్యదర్శి కె.శ్రీనివాసరావు, కోశాధికారి టి.లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసాగర్‌ను సత్కరిస్తున్న సంఘ నాయకులు

భక్తితో ఏసుక్రీస్తు జయంతి- 2025 జూబిలీ వేడుకలు

పటమట, న్యూస్‌టుడే: విశ్వవ్యాప్త కథోలిక శ్రీసభలో ఏసుక్రీస్తు జయంతి 2025 జూబిలీ ముగింపు వేడుకలు నూతన అధ్యాయానికి నాంది పలుకుతూ, చారిత్రక ఘట్టంగా మిగిలిపోతాయని విజయవాడ కథోలిక డయోసిస్ బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. పటమటలోని సెయింట్ పాల్స్ కథెడ్రల్ చర్చిలో ఆదివారం ఏసుక్రీస్తు జయంతి 2025 జూబిలీ ముగింపు వేడుకలు నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన బిషప్ రాజారావు మాట్లాడుతూ.. విశ్వశాంతి దూత దివంగత పోప్ ఫ్రాన్సిస్ 2025 సంవత్సరాన్ని ఏసుక్రీస్తు జయంతి జూబిలీ వేడుకలుగా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం పవిత్ర పూజ పీఠంపై బిషప్ రాజారావు, విజయవాడ కథోలిక పీఠం మోన్సిన్యోర్ మువ్వల ప్రసాద్, ఫాదర్లు గాబ్రియేలు, కిరణ్ తదితర డయోసిస్ గురువులు సమష్టి దివ్యపూజాబలి సమర్పించారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్లు కొలకాని మరియన్న, జోసఫ్, తోట సునీల్ రాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర శిలువను ప్రదర్శిస్తున్న బిషప్ రాజారావు, మోన్సిన్యోర్ మువ్వల ప్రసాద్, ఫాదర్లు గాబ్రియేలు, కిరణ్ తదితరులు

91.9 FM Vijayawada 91.9 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును.బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును స్పాట్‌క్యాష్. ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

INDUSTRY

MACHINERY FOR SALE

విత్తనశుద్ధి యంత్రాలు మరియు జనపనార సంచులు అమ్మకానికి అందుబాటులో ఉన్నాయి సంప్ర||. ✆ 72880 65253.

JOBS

Wanted Female Telecallers, Counsellors & Receptionist for a reputed college in Labbipet. Pay upto 15k+incentives. Qual: Any Degree. Age: 25-40 yrs. Min 2 yrs exp. Ph: 63030 85727.

VJA-2 గవర్నర్‌పేట పైలెట్ సర్వీసు స్టేషన్ IOCL పెట్రోల్ బంక్ నందు సేల్స్‌మెన్స్‌గా పనిచేయుటకు M/F కావలెను. ✆ 94412 49912/ 92463 75420.

గన్నవరం కార్యాలయంలో పనిచేయుటకు అనుభవం కలిగి ఉన్న అకౌంటెంట్ కావలెను, ట్యాలీ & GST ఫైలింగ్‌లో పని అనుభవం ఉండాలి. ✆ 94401 75207.

'మహానాడు మీడియా'లో వీడియో ఎడిటర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ, యువకులు కావలెను. కాల్: 73372 22004.

కంకిపాడు దగ్గర గల రిలయన్స్ వేర్ హౌస్‌లో పనిచేయుటకు డేటా ఎంట్రీ ఆపరేటర్స్ కావలెను. Q: ఇంటర్ ఆపైన, Ph: 99511 40777.

ప్రముఖ రియల్ ఎస్టేట్స్‌లో పనిచేయుటకు మార్కెటింగ్ మేనేజర్స్, మార్కెటింగ్ ఏజెంట్స్ కావలెను. జీతం+ కమీషన్ ఇవ్వబడును. సంప్ర ✆ 93906 65999.

ఫ్రాంచైజ్ బ్యూటీపార్లర్‌కు మేనేజర్‌గా పనిచేయుటకు అనుభవం గల అభ్యర్థులు కావలెను. ✆ 81878 89997.

లేడీ అభ్యర్థి (హెల్పర్) 10th P/F ఏలూరురోడ్డు, సీతారాంపురం ప్లైవుడ్ అండ్ డోర్స్ షాపులో పనిచేయుటకు కావలెను. 12,000/-. 9-30 to 7-30. ✆92472 88381

డైలీ ఇంటికొచ్చి డ్రెస్సింగ్ (2legs) డ్రెస్సింగ్ చేయుటకు ఫిమేల్ నర్స్ కావలెను. సీతారామపురం, ఏలూరు రోడ్. ✆ 93482 88381.

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డులు & హెల్పర్లు కావలెను. విజయవాడ MG రోడ్‌లో ప్రముఖ షోరూమ్‌లో పనిచేయుటకు. జీతము గార్డ్సుకు 15,000/- & హెల్పర్లుకు 12,000/-. ఇతర సదుపాయాలు కలవు. ✆ 80994 44758 / 96401 48367.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

తిరువూరు

• తిరువూరు • మైలవరం

నేటి నుంచి ఉరుసు మహోత్సవాలు

కొండపల్లి, న్యూస్‌టుడే: షాబుఖారీ దర్గా ఉరుసు మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలిరానుండటంతో నిర్వాహకులు అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు. కొండపల్లి బి.కాలనీ నుంచి దర్గా వరకు విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. పురపాలిక ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం పోలీసులు బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు. మూడు రోజుల పాటు భక్తులకు ఇబ్బందులు పడకుండా షెల్టర్లు ఏర్పాటు చేశారు.

దీప కాంతుల్లో దర్గా

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

నెమలి (గంపలగూడెం): గంపలగూడెం మండలం నెమలిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సహాయ కమిషనర్ ఎన్.సంధ్య తెలిపారు. ఆలయ ప్రధానార్చకుడు గోపాలాచార్యుల ఆధ్వర్యంలో ఆ రోజు వేకువజామున స్వామివారి మూలవిరాట్‌కు విశేష పూజలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వారంలో గరుడ వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు రజత గరుడ వాహనంపై గ్రామోత్సవం ఉంటుందని వెల్లడించారు.


వేణుగోపాలస్వామి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? చెవుటూరు ఎస్సీ కాలనీలో కోతులు గుంపులుగా ఇళ్ల మధ్య తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. బెడద తొలగింపునకు చర్యలు చేపట్టాలి. **-పి.రోహిత్ గ్రామస్థుడు** ✔ సమస్య నా దృష్టికి వచ్చింది. కోతులను పట్టించి అటవీ ప్రాంతంలో విడిచిపెడతాం. **-వై.బసవలింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి. -జి.కొండూరు, న్యూస్‌టుడే**

స్పందనలు: ✦ పట్టణంలోని ఏడు వార్డులో డ్రెయిన్లలో మురుగు పేరుకుపోయిందని స్థానికుడు కోటేశ్వరరావు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. శానిటరీ అధికారి సంతోష్ స్పందించి సమస్య పరిష్కరించారు. ✦ పట్టణంలోని 11వ వార్డులో డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారడం లేదని స్థానికుడు రాజేష్ 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. శానిటరీ అధికారి సంతోష్ స్పందించి.. సిబ్బందితో శుభ్రం చేయించారు. **-తిరువూరు టౌన్ న్యూస్‌టుడే**

పరుగు పందెం పోటీకి అర్హత

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: జోనల్ స్థాయి పరుగు పందెం పోటీలకు మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి హెచ్.రోహిత్‌కుమార్ అర్హత సాధించాడు. గుంటూరు జిల్లా నంబూరులో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు శనివారం ఎవరెస్ట్ బేస్ క్యాంపు నిర్వహించారు. ఇందులో రోహిత్ కుమార్ ఎంపిక కావడంతో స్టేట్ ఐఈ కోఆర్డినేటర్ వనజ, జిల్లా కోఆర్డినేటరు నారాయణ, ఐఈ ఉపాధ్యాయురాలు చంద్రావతి, ఉషారాణి అభినందనలు తెలిపారు.

అభాగ్యుల పెన్నిధి... సీఎం సహాయనిధి!

ఏడాదిన్నరలో రూ.11 కోట్లకు పైగా సాయం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యం పొందలేని నిరుపేదలను ముఖ్యమంత్రి సహాయ నిధి ఆదుకుంటోంది. మైలవరం నియోజకవర్గ పరిధిలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు రాజకీయాలకు అతీతంగా 1406 మందికి చెక్కులు, ఎల్వోసీల రూపంలో రూ.11,42,43,692 ముఖ్య మంత్రి సహాయ నిధిని శాసనసభ్యుడు కృష్ణప్రసాద్ అందజేశారు.

చెల్లింపులు ఇలా.. హఠాత్తుగా ఆరోగ్యం దెబ్బతిని ఆసుపత్రులలో చేరిన వారికి శస్త్రచికిత్సలు చేయడానికి, ఆధునిక వైద్యం అందించడానికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి ఎల్వోసీలు జారీ చేయిస్తున్నారు. వైద్యశాలల్లో చేరి చికిత్స పొందిన వారు సంబంధిత బిల్లులు, పత్రాలను గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సమర్పిస్తే.. శాసనసభ్యుడి సిఫార్సుతో సీఎంఆర్‌ఎఫ్ కార్యాలయానికి సిబ్బంది పంపుతున్నారు. ఖర్చు చేసిన దానిలో 60 నుంచి 90 శాతం వరకు తిరిగి చెల్లిస్తున్నారు.

లబ్ధిదారుడికి ఎల్వోసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

సమర్పించాల్సిన పత్రాలు: రేషన్ కార్డు, చికిత్స పొందుతున్న ఆసుపత్రి రిజిస్ట్రేషన్ పత్రం, చికిత్స పూర్తయితే ఆ వివరాలు, ఖర్చులు, ఔషధాలు, ఆసుపత్రి నుంచి డిశ్ఛార్జి అయినట్లు పత్రం, చెల్లించిన నగదు రసీదులు సమర్పించాలి. వీటికి ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం మొదటి పేజి నకళ్లను జతచేయాలి.

గరిష్ఠంగా రూ.15 లక్షల వరకు: క్యాన్సర్, గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్ర పిండాలు, అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారి వైద్యం కోసం గరిష్ఠంగా రూ.12లక్షల నుంచి రూ.15 లక్షల సహాయం అందుతుంది. అర్హులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు ఉదారంగా సాయం చేస్తున్నారని శాసనసభ్యుడు కృష్ణప్రసాద్ తెలిపారు. పేదలు, సామాన్య ప్రజలకు సాయాన్ని కొనసాగిస్తామని చెప్పారు.

గోడ గడియారాల ఆవిష్కరణ

గడియారాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పక్కన నాయకులు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు చిత్రాలతో తిరువూరు సామాజిక ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ ఎ.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోడ గడియారాలను ఎమ్మెల్యే ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బి.ఉమామహేష్, సింధు శ్రీను, కె.చంటి, ఆర్.శ్రీనివాసరావు, వి.లక్ష్మీనారాయణరావు, హనీ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయపురంలో స్వచ్ఛతా కార్యక్రమాలు

ఆంజనేయపురం (తిరువూరు): మండలంలోని ఆంజనేయపురంలో పలు వీధుల్లో సర్పంచి ఎం.కుటుంబరావు, కార్యదర్శి లావణ్య ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. అంతర్గత రహదారుల వెంట పెరిగిన పిచ్చి మొక్కలను కూలీలతో తొలగించారు.

ఇసుక తరలింపులో జేసీబీల వినియోగంపై ఆగ్రహం

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు, గంపలగూడెం మండలాల పరిధిలోని కట్లేరు పరివాహకంలో ఇసుకను కొందరు యంత్రాలతో తోడేస్తున్నారని ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యానికి కొందరు తూట్లు పొడుస్తున్నా.. అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. గ్రామాల్లోని ప్రజల గృహ నిర్మాణాలకు ఉచిత ఇసుక పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. ఆదివారం కొందరు కూలీలతో కాకుండా జేసీబీలతో కట్లేరులోని ఇసుకను ట్రాక్టర్లలో లోడు చేసుకొని తరలిస్తుంటే.. అధికారులు అటువైపు కన్నెత్తి చూడకుండా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అటువంటి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆలయాల్లో ధనుర్మాస పూజలు

గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం తిరువూరు, ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లోని ఆలయాల్లో అర్చకులు గోదారంగనాథులకు విశేష అలంకరణలు చేసి, పూజలు నిర్వహించారు. పాశురాలు పఠించారు. పలుచోట్ల పాండురంగస్వామికి లక్ష తులసి పూజ, తిరుప్పావై సేవలు చేశారు. భక్తులతో సందడి నెలకొంది.

గంపలగూడెంలో గోపికాకృష్ణుల అలంకరణలో బాలబాలికలు

తిరువూరులో శ్రీకృష్ణుడికి అలంకరణ

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

ఇబ్రహీంపట్నం గ్రామీణం: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నం రాధామాధవ భక్త సమాజం ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారు జామున ఎన్టీటీపీఎస్ ఎ,సి కాలనీల్లో నగర సంకీర్తన నిర్వహించారు. తొలుత వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం అర్చకులు సాయి, శివ స్వాములు.. దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలతో భక్తులు వెంటరాగా నగర సంకీర్తనకు బయలుదేరారు. ఈ సందర్భంగా మహిళలు స్వాగతం పలికి హారతులు ఇచ్చారు.

కోదండ రామాలయంలో లక్ష తులసి పూజ

గ్రంథాలయానికి వితరణ

అర్లపాడు (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని అర్లపాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్రంథాలయానికి తహసీల్దార్ వి.రాజకుమారి రూ.10వేలు విరాళంగా ఇవ్వగా.. పాఠకుల సౌకర్యార్థం కుర్చీలు కొనుగోలు చేశారు. ఆదివారం వాటిని కమిటీ సభ్యులు బి.మోహన్, వి.పరమయ్య, ఎం.ఆంజనేయులు, వి.సురేష్, హనుమ తదితరులు గ్రంథాలయానికి అందజేశారు.

ప్రమాదకరంగా పైపులైన్!

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: స్థానిక 16వ వార్డులోని వైష్ణవ బజారు రీడింగ్ రూమ్ కూడలిలో ఏర్పాటు చేసిన డ్రెయినేజీ పైపులైన్ పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో అటుగా రాకపోకలకు స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. పురపాలక అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

విలువైన జలాలు.. రహదారిపాలు!

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్థానిక హైస్కూల్ రోడ్డులో పోస్టాఫీసు సమీపంలో కృష్ణా జలాల పంపు విరిగిపోయి నీరంతా రహదారి వెంబడి వృథాగా పోతోంది. ఈ కారణంగా రాకపోకలు సాగించే సమయంలో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పంపు విరిగిపోవడంతో నీరు పట్టుకునేందుకు వీలు పడటం లేదని స్థానికులు వాపోతున్నారు. తక్షణమే మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

జాగ్రత్త సుమా.. చూసి వెళ్లండి!

మేడూరు (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని మేడూరులో ప్రధాన రహదారి మధ్యలో గుంత ఏర్పడింది. అటుగా వీరాంజనేయస్వామి, శివాలయం, వేంకటేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయాలు ఉన్నాయి. వాటికి నిత్యం భక్తులు వెళుతుంటారు. వాహనాల రాకపోకలూ అధికంగా ఉంటాయి. రహదారిపై పడిన గుంతను పూడ్చకపోతే ప్రమాదాలు జరుగుతాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గుంతలో కర్ర ఉంచి ఎర్రటి సంచి తొడిగారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

అంచులో కంపలు.. రాకపోకలకు ఇక్కట్లు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు పీటీ కొత్తూరు నుంచి చింతలపాడు వరకు 12 కి.మి మేర ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా అంచుల్లో పిచ్చి మొక్కలు, కంప చెట్లు దట్టంగా పెరిగాయి. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు తప్పుకొనేందుకు అవకాశం లేదు. మరోవైపు రహదారి పొడవునా గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య నెలల తరబడి ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీనిపై ఏఈ గాయత్రి మాట్లాడుతూ గుత్తేదారుకు తెలిపి వెంటనే పెరిగిన కంప, పిచ్చి మొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రజా ప్రతినిధులకు సన్మానం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన విస్సన్నపేట ఎంపీపీ గద్దల మల్లయ్య, ఏఎంసీ డైరెక్టర్ పల్లెపాం రాంబాబులను స్థానిక సీఎస్ఐ చర్చి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి సంఘం డీసీ ఛైర్మన్ కలపాల రాంబాబు, విశ్వాసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అవే దరఖాస్తులు.. తీరని వెతలు!

మైలవరం, న్యూస్‌టుడే

వందల ఎకరాలు.. వేలాది మంది లబ్ధిదారులు. ఇళ్ల స్థలాల సమస్య తీరిందని భావించిన అధికారులు. తీరా చూస్తే.. ఎక్కడ సభ, సమావేశం నిర్వహించినా, మళ్లీ వాటి కోసమే దరఖాస్తులు. ఇదెక్కడి తంటా అంటూ తలలు పట్టుకుంటుంటే, గతంలో పంపిణీ చేసిన కాలనీల్లో స్థలాలు ఖాళీగా వెక్కిరిస్తున్నాయి. దీంతో ముందుకెళ్లలేక, అర్జీలు పరిష్కారం కాక ప్రభుత్వంపైనే భారం వేస్తున్నారు.

దశాబ్ద కాలంగా మైలవరం నియోజకవర్గంలో పేదలకు పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. నాలుగైదు గ్రామాలు మినహా, అన్ని చోట్ల లబ్ధిదారులను ఎంపిక చేసి, పట్టాలు కూడా అందించారు. అయితే, వాటిలో రాజకీయ జోక్యం పెచ్చుమీరడంతో పెద్ద ఎత్తున అనర్హులూ చేరిపోతున్నారు. ఫలితంగా అర్హుల్లో కొందరికి స్థలం అందని ద్రాక్షగా మారుతోంది. దాని ఫలితమే నేటికీ ఎక్కడ సభ నిర్వహించినా.. స్థలాలకు సంబంధించిన అర్జీలే వస్తున్నాయి.

మైలవరం అయ్యప్పనగర్ కాలనీలో ఖాళీ స్థలాలు

విన్నపాలు వినవలె..

★ ఈ నెల 2న మైలవరంలో నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కలెక్టర్, ఎమ్మెల్యే నేతృత్వంలో నిర్వహించారు. సుమారు 600 అర్జీలు వచ్చాయి. అందులో 350 వరకు స్థలాల కోసమేనని అధికారుల చెబుతున్నారు. ఇందులో మైలవరం మండలంలోనే 250కి పైగా ఉన్నాయి. ★ నెల కిందట ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, మండలాల్లో ప్రజాదర్బార్ పేరిట సభలు నిర్వహించగా.. దాదాపు 100 మందికి పైగా స్థలాల కోసం అర్జీలు ఇచ్చారు.

కాలనీల్లో సగం ఖాళీలే..

నియోజకవర్గంలోనే అతి పెద్ద లేఅవుట్ కాలనీగా ఉన్న పూరగుట్టలో 2 వేల మందికి పైగా ఐదేళ్ల కిందటే స్థలాలు పంపిణీ చేయగా, అందులో నేటికీ సగానికి పైగా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ★ మైలవరం అయ్యప్పనగర్ కాలనీలోని 350 ప్లాట్లలో కొన్ని బేరాలు జరగ్గా, సగం మేర ఖాళీగా ఉన్నాయి. ★ కొండపల్లి మున్సిపాలిటీ, ఈలప్రోలు తదితర గ్రామాల్లోని కాలనీల్లో చాలా వరకు ఖాళీలు కన్పిస్తున్నాయి.

ఆన్‌లైన్‌లో నమోదు

మైలవరం పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. ప్రభుత్వ ఆదేశాలు, ప్రజాప్రతినిధుల సూచనలతో స్థల లభ్యత మేరకు చర్యలు తీసుకుంటాం.

-అబ్దుల్ దరియా, తహసీల్దార్, మైలవరం

మహిళలకు చీరల పంపిణీ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మదర్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యక్షుడు కె.విద్యాధరరావు ఆర్థిక సహకారంతో మండలంలోని కూనపరాజుపర్వ గ్రామంలో నిరుపేద వృద్ధులు, వితంతువులు 60 మందికి ఆదివారం చీరలు పంపిణీ చేశారు.

వృద్ధులకు దుప్పట్లు..

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: జంపాల సాహితీ ఫౌండేషన్ ఛైర్మన్, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సీతారామయ్య ఆధ్వర్యంలో కాచవరం అమ్మానాన్న వృద్ధాశ్రమ వృద్ధులకు ఆదివారం దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమార్తె డాక్టర్ సాహితి వర్ధంతి సందర్భంగా ఏటా నిర్వహించే సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జంపాల కుటుంబ సభ్యులతో పాటు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

మైలవరం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం మైలవరంలో ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. దేశ ప్రగతిలో కాంగ్రెస్ పాత్రను వివరించారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల నాగేశ్వరరావు, శీలం రామకృష్ణ, దోసపాటి గిరి, దుర్గారావు, సుధాకర్ పాల్గొన్నారు.

మైలవరంలో పాల్గొన్న నాయకులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: గంపలగూడెం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో నాయకులు వై.రామకృష్ణ, ఎం.దానియేలు, వి.పాపమ్మ, జి.ఆదాం తదితరులు పాల్గొని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కేకు కోసి మిఠాయిలు పంచారు.

తిరువూరులో..

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని రాజీవ్ భవన్‌లో ఆదివారం నాయకులు బి.ప్రకాశరావు, పి.శ్రీనివాసరావు, జీవన్‌బాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.

కరాటేలో ప్రతిభ

జి.కొండూరు: స్థానిక శ్రీశ్రీ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని గొర్రె రమ్యశ్రీ కరాటేలో ప్రతిభ చూపి బ్లాక్‌బెల్ట్ సాధించింది. విజయవాడ సింగ్‌నగర్‌లో కియో జపాన్ షోటోకాన్ కరాటే ఇండియా వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బ్లాక్‌బెల్ట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల డైరెక్టర్ కె.కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా రమ్యశ్రీని, శిక్షకుడు పి.మురళీని.. పాఠశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి అభినందించారు.

ప్రతిభ చూపిన విద్యార్థిని రమ్యశ్రీ, పక్కన శిక్షకుడు మురళీ తదితరులు

కార్మిక, కర్షక హక్కుల సాధనకు సీపీఐ పోరాటం

మాట్లాడుతున్న యల్లమందరావు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: కార్మిక, కర్షక హక్కుల కోసం సీపీఐ నిరంతరం పోరాడుతుందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడు యల్లమందరావు అన్నారు. సీపీఐ కొటికలపూడి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ వ్యవస్థాపక దినోత్సవం గ్రామంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దున్నేవాడికే భూమి దక్కాలన్న నినాదంతో గ్రామంలోని 650 ఎకరాల లంక భూములను పేదలకు పంపిణీ చేసిన ఘనత తమ పార్టీదేనన్నారు. తెలంగాణ రైతాంగ పోరాటంలో గ్రామానికి చెందిన ముగ్గురు కార్యకర్తలు అమరులయ్యారని గుర్తుచేశారు. తొలుత పార్టీ జెండాను గ్రామ కమిటీ కార్యదర్శి బాబూరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, జొన్నలగడ్డ కోటేశ్వరరావు, గోవిందరావు, షేక్ ఖుదాం, రెంటపల్లి దాసు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

మైలవరం: మండలంలోని బొర్రగూడెంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడిచేశారు. ఈ సందర్భంగా నలుగురిని అదుపులోకి తీసుకుని, రూ.3 వేలు, రెండు పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.సుధాకర్ తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

మిట్టగూడెంలో వాహనాల తనిఖీ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మిట్టగూడెం కూడలిలో ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. రెడ్డిగూడెం స్టేషన్ ఏఎస్సై సక్రూనాయక్, సిబ్బంది పాల్గొన్నారు. శిరస్త్రాణం ధరించని వారు, ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించడంపై కేసులు నమోదు చేశారు. వాహనాలు నడుపుతున్న బాలలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు.

తనిఖీ చేస్తున్న ఏఎస్సై సక్రూనాయక్, సిబ్బంది

టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో వృద్ధురాలి దుర్మరణం

కొండపల్లి, న్యూస్‌టుడే: మట్టి రవాణా చేసే టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో వృద్ధురాలు మృతిచెందిన సంఘటన కొండపల్లి ఖిల్లా రోడ్డులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఖిల్లా రోడ్డులో నివాసముండే కంపా సలోమి(65) అదే ప్రాంతంలో రహదారి పక్కన కూర్చొని ఉంది. ఈ క్రమంలో మట్టి రవాణా చేస్తున్న టిప్పర్ డ్రైవర్.. సలోమీని గమనించకపోవడంతో వాహనం ఆమెపై నుంచి వెళ్లింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందింది. సంఘటన జరిగిన అనంతరం అక్కడి నుంచి డ్రైవర్ వాహనంతో సహా వేగంగా వెళ్లిపోయాడు. స్థానికులు ద్విచక్ర వాహనాలతో వెంబడించి పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి.. పోలీసులకు అప్పగించారు. నిందితుడు రాష్ట్రేతరుడుగా పోలీసులు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని విజయవాడ ఆసుపత్రి తరలించారు.

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం

కొండపల్లి, న్యూస్‌టుడే: రైలు పట్టాలపై యువకుడి మృతదేహాన్ని కొండపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో ఆదివారం గుర్తించారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. స్టేషన్ పరిధిలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి(36) మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. పట్టాలకు ఓవైపు తల, మరోవైపు మొండెం ఉండటంతో బలవన్మరణానికి పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ విషయాన్ని రైల్వే, ఇబ్రహీంపట్నం పోలీసులకు అక్కడి వారు తెలియజేశారు. మృతిచెందిన వ్యక్తి రాష్ట్రేతరుడిగా స్థానికులు పేర్కొంటున్నారు.

3న హిందూ మహాసమ్మేళనం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులో జనవరి 3న హిందూ మహా సమ్మేళనం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి హిందూ సంఘాల ప్రతినిధులు సమావేశం జరిగింది. స్థానిక తంబరేణి గార్డెన్స్‌లో ఉదయం 10 గంటలకు జరిగే సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని శ్రీ తిరుపతమ్మ ఆలయ ప్రధాన అర్చకుడు మర్రెబోయిన గోపీబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యులు కాకాని శ్రీనివాసరావు, గజ్జి కృష్ణమూర్తి, భాజపా నాయకురాలు కల్లూరి శ్రీవాణి పిలుపునిచ్చారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలియజేశారు. నేత్ర చికిత్సలతో పాటు సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కూలీ అనుమానాస్పద మృతి

చెవిటికల్లు(కంచికచర్ల), న్యూస్‌టుడే: కూలీ పనులకు వెళ్లిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మండలంలోని చెవిటికల్లులో ఆదివారం జరిగింది. ఎస్సై పి.విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాలది నందయ్య(70) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. పనుల నిమిత్తం తరచూ దూర ప్రాంతాలకు వెళ్లి వారానికి ఒకసారి ఇంటికి వచ్చేవాడు. ఈ నెల 25న అతడు పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం గ్రామ సమీపంలోని కృష్ణా నదిలో వ్యక్తి మృతదేహం కనిపించడంతో పరిశీలించగా అతను నందయ్యగా గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అతని కుమారుడు సురేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తలసీమియా, సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: తలసీమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధులు జన్యుపరమైనవని విజయవాడకు చెందిన ప్రముఖ పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ వి.శ్రీదేవి తెలిపారు. మలేరియాను తట్టుకునే క్రమంలో జరిగే జన్యు మార్పులతో తలసీమియా, ఎర్ర రక్తకణాల సంఖ్య తగ్గిపోతే రక్తహీనత వస్తుందన్నారు. ఎ.కొండూరు మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఆదివారం ప్రజా ఆరోగ్య వేదిక, ఇండియన్ అకాడమి ఆఫ్ పిడియాట్రిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయా వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. పలువురి నుంచి వ్యాధి నిర్ధారణకు అవసరమైన రక్త నమూనాలు సేకరించారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్ మాట్లాడుతూ రక్తహీనత ఉందని వైద్యుని సలహా లేకుండా సొంతగా ఐరన్ మందులు వాడకూడదన్నారు. ప్రజాఆరోగ్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయ్‌ప్రకాష్, కిన్నెర ఫౌండేషన్ యజమాని కె.రాజ్‌గోపాల్, స్థానికులు ఎం.కుమార్‌నాయక్, జె.వెంకటేశ్వరరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

చందర్లపాడు, న్యూస్‌టుడే: సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ నాయకులు చందర్లపాడులో ఆదివారం గోడపత్రికలు ఆవిష్కరించారు. విశాఖలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు సభలు జరుగుతాయని జిల్లా ఉపాధ్యక్షుడు కె.గోపాల్ తెలిపారు. చివరి రోజు జరిగే బహిరంగ సభకు కార్మికులు, కర్షకులు తరలిరావాలని పిలుపునిచ్చాడు. గోపీనాయక్, తోట రామారావు, రంగిశెట్టి ఏడుకొండలు, అమీర్‌బాషా, మౌలాలీ, నాగుల్, మస్తాన్, సందరరావు తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న నాయకులు

8న వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ అభినందన సభ

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో జనవరి 8న నూతన పాలకవర్గ అభినందన సభ నిర్వహిస్తున్నారు. సభను విజయవంతం చేయడానికి అవసరమైన కార్యాచరణపై చర్చించేందుకు మార్కెట్ యార్డ్‌లో నాయకులు, దళితులు ఆదివారం సమావేశమయ్యారు. ఛైర్మన్ పదవిని మల్లెల సీతమ్మకు ఇచ్చిన విషయాన్ని ఇంటింటికి తిరిగి తెలియజేసి, సభకు ఎక్కువ సంఖ్యలో ప్రజలు వచ్చేలా చూడాలని నేతలు నిర్ణయించారు.

(c) eenadu

విజయవాడ తూర్పు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80085 74652

స్పందనకు వందనం.. ✦ 3వ డివిజన్ శ్రీరామచంద్ర నగర్, మహానాడు రోడ్డు ప్రాంతాల్లో దోమలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక నివాసి భగవాన్ మేమున్నాం... మీకు తోడుగా ద్వారా మలేరియా అధికారి హెచ్.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో దోమ పొగ, మందులు చల్లించారు. ✦ గుణదల కాపు రామాలయం, పాత పంచాయతీ కార్యాలయం ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగుతోందని స్థానిక నివాసి మధుసూదన్ రావు ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పూడిక తీయించారు. ✦ పంట కాలువ రోడ్డు 10-4/104 విద్యుత్ స్తంభానికున్న దీపం వెలగడం లేదని స్థానిక నివాసి రామారావు ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు, 3 సర్కిల్ కార్యాలయాల పరిధిలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రజలు తమ పరిధిలోని వివిధ సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్యం, డ్రెయిన్లు, తాగునీరు, వీధి దీపాలు, గుంతలు తదితర సమస్యలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు అందించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పెరిగిన నిఘా.. తగ్గిన నేరాలు

సెంట్రల్ డివిజన్ వార్షిక నివేదిక వెల్లడి

పటమట, రామవరప్పాడు, ప్రసాదంపాడు న్యూస్‌టుడే

పటమట, మాచవరం, గుణదల పోలీస్ స్టేషన్లతో కూడిన సెంట్రల్ డివిజన్ పరిధిలో గత ఏడాది కంటే ఈ సంవత్సరం నేరాలు తగ్గాయి. వార్షిక నేర గణాంక నివేదిక ఆధారంగా దాదాపు అన్ని రకాల నేరాలు తగ్గుముఖం పట్టాయి. సీపీగా రాజశేఖర్‌బాబు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాలు తగ్గాయి. ఆన్‌లైన్ మోసాలపై నిర్వహించిన అవగాహన సదస్సులు మంచి ఫలితాలు ఇచ్చాయి. అన్ని రకాల కేసులు గత సంవత్సరం 1620 పెట్టగా. . ఈ ఏడాది 1250 నమోదు అయ్యాయి.

ప్రత్యేక దృష్టి సారించడంతో...

★ ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సమస్యలపై దృష్టి పెట్టడంతో గతేడాదితో పోల్చితే రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గాయి.★ ప్రభుత్వ చర్యల ఫలితంగా మహిళలపై నేరాలు సగటున 9 శాతం తగ్గాయి. అయినప్పటికీ వారిపై నేరాలు కొంత ఆందోళన కలిగిస్తున్నాయి. ★ అదృశ్యం కేసులు 2024లో 265, 2025లో 153 కేసులు నమోదు కావడం విశేషం. పోలీసులు దర్యాప్తు చేసి చాలా కేసుల్లో వారి ఆచూకీ కనిపెట్టి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

దొంగతనాలకు సైతం అడ్డుకట్ట..

★ సైబర్ మోసాలపై పోలీస్ శాఖ అవగాహన సదస్సులు నిర్వహించింది. ఫలితంగా గతేడాదితో పోలిస్తే సుమారు 60 శాతం మేర కేసులు తగ్గాయి. గత ఏడాది 27 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది ఆ సంఖ్య 11కు చేరింది.

★ కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయిపై ఉక్కు పాదం మోపుతోంది. గంజాయితో దొరికితే కేసు నమోదు చేయడంతో పాటు కొంత మందిపై షీట్లు కూడా తెరిచారు. ★ గస్తీ పెంచడంతో పాటు కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుతో చోరీలతో పాటు ద్విచక్ర వాహనాల దొంగతనాలు బాగా తగ్గాయి. గత ఏడాది 131, ఈ ఏడాది 78 చోరీ కేసులు నమోదు అయ్యాయి. ద్విచక్ర వాహనాల చోరీలు కూడా గత ఏడాది 119, ఈ ఏడాది 85 నమోదు కావడం గమనార్హం.

సాంకేతికత వినియోగిస్తున్నాం

సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర నిఘా పెడుతున్నాం. నేరాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తున్నాం. సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు మంచి ఫలితాలు ఇచ్చాయి.

- దామోదర్, ఏసీపీ, సెంట్రల్ డివిజన్

బీపీఎస్‌కు 785 దరఖాస్తులు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: అక్రమ నిర్మాణాలు, అనుమతి లేని కట్టడాలకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం(బీపీఎస్)కు ఇప్పటిదాకా 785 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా అందాయి. బీపీఎస్‌కు సంబంధించిన ప్రాథమిక ధరావతు సొమ్ము (ఫీజు)గా రూ.101.97 లక్షలు నగరపాలక సంస్థకు ఆదాయంగా లభించింది. ఇప్పటి వరకు అందిన అన్ని దరఖాస్తులను బాధ్యులైన అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, యజమానులకు నోటీసులు జారీ చేసే ప్రక్రియ ప్రారంభించారు. ప్రస్తుతం బీపీఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రాథమికంగా పూర్తి చేసి, 536 మంది భవన యజమానులకు నోటీసులు జారీ చేశారు. పీనలైజేషన్ డిమాండ్ ఆధారంగా వారి నుంచి ఫీజు కింద నిర్ణయించిన సొమ్ము స్వీకరించి, బీపీఎస్ ప్లాన్లను మంజూరు చేసేందుకు పట్టణ ప్రణాళికాధికారులు చర్యలు చేపట్టారు.

పిచ్చయ్య సేవలు ఎనలేనివి

పటమట, న్యూస్‌టుడే: న్యాయవాదిగా, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యుడిగా దివ్వెల పిచ్చయ్య అందించిన సేవలు ఎనలేనివని భారత ప్రభుత్వ అదనపు సొలిసిటర్ జనరల్ కనకమేడల రవీంద్ర కుమార్ అన్నారు. వయోభారంతో పిచ్చయ్య కన్ను మూయగా.. మృతదేహానికి ఆదివారం కనకమేడల నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

పటమట, న్యూస్‌టుడే: తీగల మరమ్మతుల నేపథ్యంలో స్క్యూబ్రిడ్జి ఉపకేంద్రం పరిధిలో సోమవారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు రామాలయం ఫీడర్ పరిధిలోని వల్లభనేని టవర్స్ రోడ్, రజిత్ భార్గవ్ వీధి, ఆంజనేయ స్వామి దేవాలయం వీధి, గులాబీ వీధి, చేపల మార్కెట్ ప్రాంతం, పాత పోస్టాఫీసు రోడ్డు, బాలికల జెడ్పీ పాఠశాల ప్రాంతం, రాఘవ నగర్, కృష్ణవేణి పాఠశాల రోడ్, చిన్న రామాలయం రోడ్డు, పెద్ద రామాలయం ప్రాంతం, గరికపాటి వారి వీధి, కాలువ కట్ట, జాస్తివారి వీధి, ఆశ్రమం వీధి, గంగానమ్మ గుడి ప్రాంతం, జీకే టవర్స్, వెంకట్ హైట్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ పి.రవీంద్ర బాబు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

పటమట, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నందున... ఆ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర విశ్రాంత డిప్యూటీ మేనేజర్ కోనేరు భీమేశ్వర రావు తెలిపారు. ఆదివారం పటమటలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సైబర్ నేరాలతో పాటు సమకాలీన సమస్యలపై ప్రసంగించారు. అనంతరం సాహితీవేత్త నరసింహారావు శ్రీకృష్ణ రాయబారంలోని పాటలను ఆలపించారు. న్యూట్రిషన్ క్లబ్ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం భీమేశ్వరరావును సన్మానించారు. గౌరవాధ్యక్షుడు సూర్యదేవర పాపారావు, కోశాధికారి వసంతం శివశంకర్, కార్యదర్శి కొల్లిపర రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరరావును సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

త్రిముఖ చిత్ర బృందం సందడి

విజయవాడ సిటీ: త్రిముఖ చిత్ర బృందం ఆదివారం నగరంలో సందడి చేసింది. త్రిముఖ ట్రైలర్‌కు విశేష ఆదరణ రావడంతో ఆ చిత్ర బృందం బందర్ రోడ్డులోని ఓ హోటల్‌లో మీడియా సమావేశం నిర్వహించింది. త్రిముఖ సస్పెన్స్.. సైకలాజికల్ థ్రిల్లర్ మూవీగా అందరినీ ఆకట్టుకుంటుందని నిర్మాత మద్దాలి సత్య శ్రీదేవి తెలిపారు. ఏసీపీ శివాణి పాత్రలో సన్నీలియోన్ నటన విశేషంగా ఆకట్టుకుందని చెప్పారు. డైరెక్టర్ రాజేశ్వర్ మాట్లాడుతూ.. చిత్రంలో అందరూ కొత్తవారు అయినప్పటికీ నటనలో విశేష ప్రతిభ కనబరిచారని తెలిపారు. హీరో యోగేష్ మాట్లాడుతూ ఈ చిత్రం ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. నటుడు జెమినీ సురేష్ మాట్లాడుతూ జనవరి 2న సినిమా విడుదల కాబోతుందని, ప్రేక్షకులు ఆదరించాలని కోరారు.

చెట్ల కొమ్మల తొలగింపు

కృష్ణలంక, న్యూస్‌టుడే: కృష్ణలంక గౌతమీనగర్ 3వ లైనులో రోజులు గడుస్తున్నా..పారిశుద్ధ్య సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగించకపోవడంతో ఈ నెల 28న ‘చెట్ల కొమ్మలతో ఇబ్బందులు’ శీర్షికన ప్రచురితమైన చిత్ర వార్తకు అధికారులు స్పందించారు. కొమ్మలు తొలగించారు.

మ్యాన్‌హోల్స్ సక్రమంగా లేక అవస్థ

అయ్యప్పనగర్ నుంచి బందర్ రోడ్డుకు వచ్చే దారిలో పలుచోట్ల మ్యాన్‌హోల్స్ దిమ్మలు ధ్వంసమై గుంతల్లా ఏర్పడ్డాయి. సుమారు 4 మ్యాన్‌హోల్స్ వద్ద ఇదే పరిస్థితి ఉంది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వీఎంసీ అధికారులు స్పందించి మ్యాన్‌హోల్ దిమ్మలు సరి చేసి రోడ్డుకు సమాంతరంగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - పటమట, న్యూస్‌టుడే

తవ్వారు.. వదిలేశారు..

ఆటో నగర్ పంట కాలువ రోడ్డులోని నవ జీవన్ బాలభవన్ జంక్షన్ వద్ద రోడ్డును భూగర్భ పైపులైను నిమిత్తం తవ్వారు. పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా.. ఇప్పటివరకు గుంతను పూడ్చలేదు. ఫలితంగా ఆ కూడలి వద్ద వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు. - ఆటోనగర్, న్యూస్‌టుడే

ఎండలోనే నిరీక్షణ.. ఎన్నాళ్లీ ఆవేదన

రామవరప్పాడు రింగ్ సెంటర్‌లో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గన్నవరం వైపునకు వెళ్లే ప్రయాణికులంతా ఎండలోనే బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. ఆ ప్రాంతంలో బస్ షెల్టర్ నిర్మించాలని కోరుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. వృద్ధులు, పిల్లల అవస్థలు వర్ణనాతీతం. అధికారులు, పాలకులు స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- కరెన్సీనగర్, న్యూస్‌టుడే

భూగర్భ మురుగు లీకేజీ...పట్టదా?

రెండో డివిజన్ గుణదల కుమ్మరి బజార్ గాంధీ బొమ్మ సెంటర్ సమీపంలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగుతోంది. పలుమార్లు మరమ్మతులు చేసినా. . మరలా లీకేజీ అవుతోంది. దీంతో రోడ్డు ధ్వంసమై రాకపోకలకు కష్టతరంగా ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని, శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

- కరెన్సీనగర్, న్యూస్‌టుడే

ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ముక్తార్ అలీ, షేక్ సుభానీ తదితరులు

పిల్లలకు దైవ గ్రంథాల విద్య అవసరం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: భావి భారత సమాజ నిర్మాణానికి నైతిక విలువలతో కూడిన దైవ గ్రంథాల విద్య పిల్లలకు అవసరమని ముస్లిం సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముక్తార్ అలీ అన్నారు. ఆదివారం లబ్బీపేట దర్గా ఇస్లామీ హైస్కూల్‌లో యూఎఫ్‌క్యూఎస్ సంస్థ ఆధ్వర్యంలో ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన చిన్నారులకు ముక్తార్ అలీ, షేక్ సుభానీ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. యూఎఫ్‌క్యూఎస్ సంస్థ ఛైర్మన్ దావూద్ పాల్గొన్నారు.

అందరిలో దైవత్వాన్ని చూడడమే హిందూ ధర్మం ప్రత్యేకత

కృష్ణలంక, న్యూస్‌టుడే: భిన్నత్వంలో ఏకత్వం భారత దేశ విశిష్టతగా నూజివీడు శ్రీలలితా పీఠం అధిపతి ఆదిత్యానంద భారతీ స్వామి అన్నారు. ఆర్‌ఎస్ఎస్ వందేళ్ల కార్యక్రమాల్లో భాగంగా కృష్ణలంక పాత పోలీస్‌స్టేషన్ వీధి వాసవీ బస్తీలో ఆదివారం హిందూ సమ్మేళనాన్ని నిర్వహించారు. స్వామి మాట్లాడుతూ అన్నింటా, అందరిలో దైవత్వాన్ని చూడడమే హిందూ ధర్మం ప్రత్యేకతని చెప్పారు. ఆర్ఎస్ఎస్ మహానగర్ సహ కార్యవాహ మారెళ్ల గౌరీ శంకర్, చిరుమామిళ్ల రమేష్, శనగపల్లి మల్లికార్జున, పెరుమాళ్ల మంగా భవానీ, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదిత్యానంద భారతీ స్వామి, వేదికపై గౌరీశంకర్, రమేష్, మంగాభవానీ తదితరులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: గురునానక్ కాలనీ రామ మందిరంలో నిర్వహించిన సమ్మేళనంలో ఇస్కాన్ విజయవాడ అధ్యక్షుడు చక్రధారి దాస్ ప్రభూజీ, విజయవాడ మహానగర్ ప్రచారక్ హనుమంతు మాట్లాడుతూ... హిందూ గ్రంథాలు నిజమైన చారిత్రక సంఘటనలపై ఆధారపడి ఉన్నాయని, నేటికీ అర్థవంతమైన జీవితం గడపడానికి ప్రేరణ, మార్గదర్శకత్వాన్ని అందిస్తున్నాయని అన్నారు. పెద్దలు ఎం.సి.దాస్, ఓం ప్రకాష్‌జీ అగర్వాల్, బాలకృష్ణన్ భరాదియా, దీపక్ బూబ్‌నా, అజిత్ అగర్వాల్, సునీల్ కుమార్ గుప్తా, ఎం.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: నాలుగో డివిజన్ సుబ్బారావు కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ పేర్కొంది. నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం కాలనీలో నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా ఎం.జెడ్.అలీ, అధ్యక్షుడిగా ఎన్.వి.రవి కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జి.సాయి వర ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఘట్టమనేని సీతారాం ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.రమేష్ బాబు, కోశాధికారిగా వెలగపూడి సుబ్బారావు నియమితులయ్యారు.

నూతన కమిటీ సభ్యులు అలీ, రవి కుమార్ తదితరులు

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

పటమట, న్యూస్‌టుడే: మాచవరం శాంతి రోడ్డులోని ఓ ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో శనివారం రాత్రి మాచవరం పోలీసులు దాడి చేశారు. నిర్వాహకురాలు రమణమ్మతో పాటు ఒక విటుడు, ముగ్గురు బాధిత మహిళలను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మాచవరం సీఐ వెంకట రమణ హెచ్చరించారు.

సిద్ధార్థ వాకర్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: సిద్ధార్థ వాకర్స్ క్లబ్ 2026-27 సంవత్సరానికి అధ్యక్షురాలిగా ఎ.వి.సీతామహాలక్ష్మి, కార్యదర్శిగా జొన్నలగడ్డ ప్రభాకర్‌రావు, ఉపాధ్యక్షులుగా కోనేరు హరినాథ ప్రసాద్, కోశాధికారిగా జె.వి.శ్రీనివాస రావు, సంయుక్త కార్యదర్శులుగా గోపాల్‌కృష్ణ, కడియాల సాంబశివరావు, సభ్యులుగా మరికొందరు నియమితులయ్యారు. ప్రస్తుత అధ్యక్షుడు కట్ట జనార్దన్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం సిద్ధార్థ కళాశాలలో నిర్వహించారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు తాతినేని శ్రీహరిరావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

నూతనంగా ఎన్నికైన సభ్యులు

పింఛను సమస్యలు పరిష్కరించండి

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: నాలుగో డివిజన్ ఏపీఐఐసీ కాలనీలో ఆదివారం ప్రజా దర్బార్ నిర్వహించారు. తెదేపా నాయకుడు గద్దె క్రాంతి కుమార్, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు అర్జీలు స్వీకరించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సమస్యలను నేతల దృష్టికి తీసుకొచ్చారు. ఒంటరి మహిళలు, దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులు తమ పింఛను సమస్యల గురించి ఏకరవు పెట్టారు. టిడ్కో ఇళ్ల కేటాయించాలని, వెదురుపావులూరు, వణుకూరు, గొడవర్రు, గూడవల్లి ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు చూపించాలని వినతులు సమర్పించారు. ఇళ్ల నిర్మాణానికి ఇప్పటికే రూ.35 వేలు, రూ.50 వేలు చెల్లించామని, తక్షణమే పనులు ప్రారంభించాలని కొందరు లబ్ధిదారులు వినతి పత్రాలు అందజేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని నాయకులు పేర్కొన్నారు. తెదేపా 4, 11 డివిజన్ల అధ్యక్షులు వల్లపట్ల గోపాలకృష్ణ, నాదెళ్ల రాజేష్, రాజామణి, సురేంద్ర, బత్తుల దుర్గారావు, వాసు, నగినీ, పాతూరు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

CCS Estd. 1997

ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్

(మల్టీస్టేట్ కో ఆపరేటివ్ సొసైటీ) (Regd No: MSCS/ CCS/225/2005)
హెడ్ ఆఫీస్: 11-14-336 & 337, సిరి నగర్ కాలనీ, ఎల్.బి నగర్, హైదరాబాద్-500074

2025 International Year of Cooperatives
Cooperatives Build a Better World

ఆహ్వానము

ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ హైదరాబాద్ (మల్టీస్టేట్ కో ఆపరేటివ్ సొసైటీ) రూ.4900/- కోట్ల వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ, 6 రాష్ట్రాలలో, 43 శాఖలతో 1,05,000 మెంబర్ల సహకారంతో శ్రీ ఎం.ఎస్.ఆర్.వి. ప్రసాద్ గారి సారథ్యంలో 44వ ఆటోనగర్ శాఖను, విజయవాడలో ప్రారంభిస్తున్నాము.

ప్రారంభము తేది:
29-12-2025
ఉ॥ 9:30 ని॥లకు

బోర్డు ఆఫ్ డైరెక్టర్లు

శ్రీ. ఎం.ఎస్.ఆర్.వి.ప్రసాద్,	ఛైర్మన్,
శ్రీ. పి.ఆర్.వి.ఎస్. రాజు,	వైస్ ఛైర్మన్,
శ్రీ. జి.పి.రావు,	డైరెక్టర్
శ్రీ. ఎ. కోటేశ్వరరావు,	డైరెక్టర్
శ్రీ. ఎ. సోమలింగం గౌడ్,	డైరెక్టర్
శ్రీ. ఎమ్. శ్రీనివాసులు,	డైరెక్టర్
శ్రీ. బి. ప్రభాకరావు,	డైరెక్టర్
శ్రీ. ఎం.బి. రాజేంద్రప్రసాద్,	డైరెక్టర్
శ్రీమతి. కె. లావణ్యరేఖ,	డైరెక్టర్
శ్రీమతి. ఎల్. శరణ్య కృష్ణ,	డైరెక్టర్
శ్రీ కె. వెంకట సుబ్బయ్య,	అడ్వైజర్

ముఖ్య అతిథి:

శ్రీ. మానం ఆంజనేయులు గారు
మాజీ ఎమ్మెల్యే, మాజీ ఛైర్మన్, ఎమెరిటీస్, విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లి॥.
మాజీ డైరెక్టర్ NAFCUB.

విశిష్ట అతిధులు

శ్రీ జె.వి.సత్యనారాయణ మూర్తి గారు
ఛైర్మన్, విశాఖపట్నం కో- ఆపరేటివ్ బ్యాంకు

శ్రీ ఎ.రవి చంద్ర గారు - రిటైర్డ్ ఐ.పి.ఎస్
సిపిఆర్, శంకర్ నేత్రాలయ, గుంటూరు.

శ్రీ బి.రామ బ్రహ్మం గారు
రిటైర్డ్ జనరల్ మేనేజర్, ఆంధ్రాబ్యాంక్

Financials (As on 31.03.2025)

Share Capital	Rs. 66.27 Crs
Reserves	Rs. 385.52 Crs
Deposits	Rs. 2277.67 Crs
Advances	Rs. 2112.54 Crs
Total Business	Rs. 4390.21 Crs
Net Profit	Rs. 82.28 Crs

వారంలో 7 రోజులు తెరువబడును

Interest Rates on Term Deposits from 01.04.2024

PARTICULARS	GENERAL MEMEBERS	SENIOR CITIZENS	SUPER SENIOR CITIZENS
1 Year to Below 2 Years	8.00%	8.50%	9.00%
2 Years & Above	8.50%	9.00%	9.50%
Savings on daily basis	6.50%	6.50%	6.50%
Senior Citizens monthly Interest Scheme: 36 Months	Not Applicable	9.5%	10%

AWARDS
2002 "Model Society Award" by AP State Registrar of Co-op Societies
2007 "Excellence Award" by NAFCUB
2020 ISO 9001:2015 Certificate by M/s HYM International Certificate Pvt Ltd., London.

సొసైటీ అందించు సేవలు :
❖ డిపాజిట్లపై అత్యధిక వడ్డీ 10% వరకు
❖ తక్కువ అద్దెకు లాకరు సదుపాయం కలదు.
❖ బంగారు ఆభరణములపై అన్ని పని దినములలో ఋణము ఇవ్వబడును. గ్రాముకు రూ. 8,300/-లు మాత్రమే.
❖ స్థిరాస్థి తనఖాపై ఋణములు ఇవ్వబడును.

అడ్రస్ : D.No. 48-19-13, బెల్లం వారి వీధి, ఆటో నగర్, విజయవాడ, ఎన్.టి.ఆర్ జిల్లా. ఆంధ్రప్రదేశ్.
ఇట్లు : ఎమ్. నరేంద్ర కుమార్, ఎం.డి | శ్రీమతి సి.హెచ్. స్రవంతి, బ్రాంచ్ మేనేజర్

(c) eenadu

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

వైకుంఠ ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు

ముస్తాబైన ముక్కోటి మండపం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు నందిగామలో ముక్కోటి మండపాన్ని ముస్తాబు చేశారు. ఈనెల 30వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు వేడుకలు కొనసాగనున్నాయి. మండపం, చెన్నకేశవస్వామి దేవాలయాలకు అర్చకుడు దీవి వెంకటరత్నమాచార్యులు సున్నం, రంగులు వేయించారు. 30న స్థానిక రైతుపేట గోకులానందం, రామాలయం, నెహ్రూ నగర్ వెంకటేశ్వరస్వామి దేవాలయం, పల్లగిరిపై కల్యాణ వెంకటేశ్వరస్వామి, మాగల్లు మదన గోపాల స్వామి, లక్ష్మీనరసింహస్వామి, వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో భక్తులు ఉత్తరద్వార దర్శనం చేసుకునేలా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం.. ✦ నందిగామలో మార్కెట్ యార్డు వద్ద విజయవాడ రోడ్డు పక్కన డ్రెయిన్ నిర్మాణ పనుల్లో తాగునీటి పైపులైన్ దెబ్బతిని సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని కమిషనర్ లోవరాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి కార్మికులతో కొత్త పైపులైన్ ఏర్పాటు చేయించారు. ✦ స్థానిక రామన్నపేట రోడ్డులో తాగునీరు పైపులైన్ దెబ్బతిన్న విషయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి మరమ్మతులు చేయించి సరఫరా పునరుద్ధరించారు. ✦ స్థానిక కోర్టు రోడ్డు పైపులైన్ పగిలిపోయి తాగునీరు వృథాగా రోడ్డుపై ప్రవహిస్తోందని ఛైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె వెంటనే కార్మికులతో మరమ్మతులు చేయించారు. ✦ స్థానిక 11, 7 వార్డుల్లో కాలువల నిర్మాణం అధ్వానంగా ఉందని పలువురు కమిషనర్ లోవరాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపి పూడిక తీయించారు. – న్యూస్‌టుడే, నందిగామ

భక్తితో నగర సంకీర్తన

కార్యక్రమంలో స్వాములు, గ్రామస్థులు

చౌటపల్లి (వీరులపాడు): అయ్యప్ప స్వామి నగర సంకీర్తన కార్యక్రమం ఆదివారం చౌటపల్లిలో ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో స్థానిక రామాలయ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పీఠం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని ఊరేగించారు. దీక్షాధారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

30న ఉత్తరద్వార దర్శనం

జగ్గయ్యపేట గ్రామీణం: తిరుమలగిరి శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 30న ఉదయం 6 గంటలకు ముక్కోటి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. మరోవైపు శంఖు తీర్థం అందిస్తామన్నారు. దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి ఆదివారం కోదాడకు చెందిన వందాల శశిరేఖ రూ.10వేలు విరాళం అందించారు.

నిత్యాన్నదానానికి విరాళం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో నిత్యాన్నదాన పథకానికి కంచికచర్ల మండలం పరిటాల గ్రామానికి చెందిన గుంటుపల్లి భాస్కరరావు, విజయకుమారి దంపతులు ఆదివారం రూ.10,100 విరాళాన్ని ఆలయ ఈవో మహేశ్వరరెడ్డికి అందజేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అంగన్‌వాడీ భవనాలు పూర్తయ్యేనా?

అవస్థలు పడుతున్న చిన్నారులు

నందిగామ గ్రామీణం, చందర్లపాడు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ నూతన భవనాలు అసంపూర్తిగా మారాయి. గత వైకాపా ప్రభుత్వంలో నాడు-నేడు నిధులతో వీటి నిర్మాణాలు చేపట్టారు. అసంపూర్తిగా ఉండడం వల్ల వినియోగించడానికి వీలుపడడం లేదు. మరోవైపు అద్దె భవనాల్లో చిన్నారులు అరకొర వసతులతో ఇబ్బంది పడుతున్నారు.

నాలుగు మండలాల్లో 29 చోట్ల..

నందిగామ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాల్లో 29 అంగన్‌వాడీ భవనాలు అసంపూర్తిగా నిలిచాయి. వీటిలో ఎక్కువ 70 శాతం పనులు పూర్తి చేశారు. కిటికీలు, తలుపులు ఏర్పాటు, రంగులు వేయిస్తే భవనాలు ఉపయోగించుకునే వీలుంది. కొన్ని భవనాలను స్లాబు వరకు నిర్మించారు. 2022-23లో ఒక్కో భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.16 లక్షలు మంజూరు చేసింది. ఇందులో రూ.13.50 లక్షలతో భవనం నిర్మించాలి. రూ.2.50 లక్షలతో చిన్నారులకు ఆట పరికరాలు ఏర్పాటు చేయాలి. అంగన్‌వాడీ కేంద్రాల తల్లి దండ్రుల కమిటీల ఆధ్వర్యంలో ఈ పనులు చేపట్టారు.

● నందిగామ మండలం మాగల్లు కేంద్రం-4 స్లాబు వరకు పూర్తి చేశారు. కిటికీలు, తలుపులు ఏర్పాటు చేయాలి. చెర్వుకొమ్ముపాలెం, జొన్నలగడ్డ-2 అంగన్‌వాడీ కేంద్రాలు స్లాబు వరకు నిర్మించారు.

మాగల్లులో అసంపూర్తిగా ఇలా..

● చందర్లపాడు మండలం గుడిమెట్ల-2, లక్ష్మీపురం-2, చింతలపాడు-3, చందర్లపాడు-9, తుర్లపాడు-2, కొడవటికల్లు-4, కంచికచర్ల మండలం చెవిటికల్లు-3, కంచికచర్ల-2, కంచికచర్ల-4, కంచికచర్ల-6, కంచికచర్ల-8, కంచికచర్ల-12, పెండ్యాల-1, పెండ్యాల-3, పెండ్యాల కాలనీ-4, కీసర-3 కేంద్రాలు స్లాబు వరకు నిర్మించారు. ● వీరులపాడు మండలం రంగాపురంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మిగిలిన పనులు పూర్తి చేయడానికి నిధుల కొరత ఉంది. మిగిలిన 30 శాతం పనులను పూర్తి చేయించి రంగులు వేయిస్తే చిన్నారులు ఆహ్లాదకర వాతావరణంలో ఆటపాటలతో విద్య నేర్చుకోవడానికి వీలుపడుతుంది. కూటమి ప్రభుత్వం వీటిపై వెంటనే దృష్టి సారించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ● వీటిపై నాడు-నేడు ఏఈ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ నిధులు మంజూరైన మేరకు భవనాలు నిర్మించామని చెప్పారు. అవసరమైన నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదన చేస్తామని చెప్పారు. భవనాలకు రంగులు వేయించే పనులు ప్రభుత్వ గుత్తేదారుకు అప్పగించిందని చెప్పారు.

ముస్లింల సంక్షేమానికి కృషి

మసీదు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సౌమ్య, మతపెద్దలు

జుజ్జూరు (వీరులపాడు), న్యూస్‌టుడే: నూతనంగా నిర్మించిన మసీదు మత సామరస్యానికి, సామాజిక సేవకు ప్రతీకగా నిలవాలని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. జుజ్జూరులో నూతనంగా నిర్మించిన గౌసియా జామియా మసీదును మత పెద్దలతో కలిసి ఆదివారం ఆమె ప్రారంభించారు. ముస్లిం సోదరుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. ముస్లిం యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. వీరులపాడు దర్గా పీఠాధిపతి ఖాజా మొయినుద్దీన్ చిస్తీతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం కమిటీ ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

3న హిందూ మహా సమ్మేళనం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులో జనవరి మూడో తేదీన హిందూ మహా సమ్మేళనం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి హిందూ సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది. స్థానిక తంగిరాల గార్డెన్స్‌లో ఉదయం 10 గంటలకు జరిగే సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని శ్రీ తిరుపతమ్మ ఆలయ ప్రధాన అర్చకుడు మర్రెబోయిన గోపీబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యులు కాకాని శ్రీనివాసరావు, గజ్జి కృష్ణమూర్తి, భాజపా నాయకులు కట్టా శ్రీహరి కోరారు. వేణుగోపాల స్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కొమరగిరి రాము, ప్రతినిధులు సూరి, కాకాని పద్మ, పూజారులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలియజేశారు. నేత్ర చికిత్సలతో పాటు సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జీకే సొసైటీ పరిచయ సమావేశం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని సత్యా ఫంక్షన్ హాల్‌లో గోదావరి- కృష్ణా కో-ఆపరేటివ్ సొసైటీ పరిచయ సమావేశం ఆదివారం నిర్వహించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని సొసైటీ ఛైర్మన్ జీవన్ మెడూరి, సొసైటీ సభ్యులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఛైర్మన్ సొసైటీ స్థాపన ఉద్దేశాన్ని, సొసైటీ విధివిధానాలను సభ్యులకు వివరించారు. ఇప్పటివరకు ఉమ్మడి కృష్ణా జిల్లాలో 23శాఖలు స్థాపించామని, భవిష్యత్తులో రాష్ట్రం మొత్తం 131శాఖలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో మందుకు సాగుతున్నామని వెల్లడించారు.

8న వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ అభినందన సభ

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో జనవరి 8న నూతన పాలకవర్గ అభినందన సభ నిర్వహిస్తున్నారు. సభను విజయవంతం చేయడానికి అవసరమైన కార్యాచరణపై చర్చించేందుకు మార్కెట్ యార్డ్‌లో నాయకులు, దళితులు ఆదివారం సమావేశమయ్యారు. ఛైర్మన్ పదవిని మల్లెల సీతమ్మకు ఇచ్చిన విషయాన్ని ఇంటింటికి తిరిగి తెలియజేసి, సభకు ఎక్కువ సంఖ్యలో ప్రజలు వచ్చేలా చూడాలని నేతలు నిర్ణయించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

పోటీలు ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ సౌమ్య

నందిగామ, న్యూస్‌టుడే: క్రీడలతో ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తెలిపారు. నందిగామ శివారు అనాసాగరంలో ఆదివారం వంగవీటి మోహన రంగా మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించారు. సౌమ్య మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో వ్యవహరించాలని కోరారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకుని సోదరభావం పెంపొందించుకోవాలన్నారు. క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కౌన్సిలర్ తాటి వెంకటకృష్ణ, తెదేపా పట్టణ అధ్యక్షుడు యేచూరి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కాసర్ల లక్ష్మీనారాయణ, నాయకులు షేక్ ఖాజా, నిర్వాహకులు పాల్గొన్నారు.

చురుగ్గా అభివృద్ధి పనులు

రెండో వార్డులో నిర్మించిన రహదారి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మాగల్లు గ్రామంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. తాజాగా పంచాయతీ సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.15 లక్షలతో గ్రామంలో కొత్తగా పది సిమెంటు రహదారులను విస్తరించారు. గతంలో మట్టి రోడ్లపై బురదతో రాకపోకల సాగించేందుకు స్థానికులు ఇబ్బంది పడ్డారు. సిమెంటు రహదారుల నిర్మాణంతో వీరి సమస్యలు తీరాయి. జిల్లా పరిషత్తు నుంచి రూ.10 లక్షలు మంజూరు కావడంతో రెండో వార్డు పరిధిలో బొడ్డురాయి రహదారి పక్కన సీసీ రోడ్డు, వైఎస్ఆర్ విగ్రహం నుంచి కాలనీలో మురుగు కాలువల నిర్మాణం పనులు మొదలు పెట్టారు. వర్షాకాలం డ్రెయిన్లు పొంగి రహదారిపై ప్రవహిస్తున్నాయి. వీటి నిర్మాణంతో మురుగు సమస్య పరిష్కారమవుతుంది.

రబీ సాగుకు సమాయత్తం

మాగల్లు వద్ద కళకళలాడుతున్న నారుమడి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: రబీ వరి సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. ఖరీఫ్ సమయంలో అధిక వర్షాలకు దిగుబడి తగ్గి రైతులు నష్టపోయారు. ఎకరానికి 25-30 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. ఎంటీయూ-1061 వంటి లావు రకం ధాన్యం ఎకరానికి 40 బస్తాల దిగుబడి రావాలి. ఈసారి దిగుబడిలేక నష్టపోయారు. బోర్ల ద్వారా నీటి వసతి ఉన్న రైతులు వరి నారుమడులు సిద్ధం చేస్తున్నారు. రబీకి అనువైన 1061 వంటి రకాన్ని సాగుచేయడానికి ఆసక్తి చూపుతున్నారు. రబీలో వరి పంట వద్దని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నా రైతులు వినడం లేదు. మరో 20 రోజుల్లో వరినాట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారు.

కూలీ అనుమానాస్పద మృతి

చెవిటికల్లు(కంచికచర్ల), న్యూస్‌టుడే: కూలీ పనులకు వెళ్లిన వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటన చెవిటికల్లులో ఆదివారం జరిగింది. ఎస్సై పి.విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం. . గ్రామానికి చెందిన మాలది నందయ్య(70) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. పనుల నిమిత్తం తరచూ దూర ప్రాంతాలకు వెళ్లి వారానికి ఒకసారి ఇంటికి వచ్చేవాడు. ఈ నెల 25న అతడు పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం గ్రామ సమీపంలోని కృష్ణా నదిలో వ్యక్తి మృతదేహం కనిపించడంతో పరిశీలించగా అతను నందయ్యగా గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అతని కుమారుడు సురేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్టు

గండేపల్లి (కంచికచర్ల), న్యూస్‌టుడే: గండేపల్లి గ్రామ శివారు మామిడి తోటలో కోడి పందేలు ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై పి.విశ్వనాథ్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.8300 నగదు, 3 కోడి పుంజులు, 9 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. కోడి పందేలు, జూదం వంటి వాటిని నిర్వహించినా, పాల్గొన్నా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

బరులను అడ్డుకోవాలని వినతి

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కోడి పందేలు నివారించాలని సీపీఎం నాయకులు పలువురు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, సీఐ వెంకటేశ్వర్లు, చిల్లకల్లు ఎస్ఐ సూర్యశ్రీనివాస్‌లకు ఆదివారం వినతిపత్రం అందించారు. కోడి పందేలు, జూదం వంటివి నిర్వహించడం వల్ల యువత, విద్యార్థులు పెడదారి పడుతున్నారని తెలిపారు. షేర్‌మహమ్మద్‌పేట సమీపంలో ఇప్పటికే కోడి పందేల కోసం బరులు సిద్ధం చేస్తున్నారని వివరించారు.

కట్టలేరు.. ఉండలేరు..

● వైకాపా ప్రభుత్వ నిర్వాకం ● పేదలకు కలగని గృహ భాగ్యం

కంచికచర్లలో ఆగిన ఇళ్ల నిర్మాణాలు

కంచికచర్ల, వీరులపాడు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ నిర్వాకానికి పేదలకు సొంత గూడు కరవయ్యింది. 'మేము కాలనీలు కాదు.. ఊళ్లకు ఊళ్లే నిర్మిస్తున్నామంటూ' నాడు జగన్ చెప్పిన మాటలు ఆనాడే ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఊరికి దూరంగా సరైన వసతులు లేకుండా జగనన్న కాలనీల పేరుతో లేఔట్లు ఏర్పాటు చేసి ఆదరాబాదరాగా స్థలాలు కేటాయించారు. తొలుత ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇస్తుందని చెప్పి ఆతర్వాత ఆన్‌లైన్‌లో ఆప్షన్ కూడా ఎత్తివేసి లబ్ధిదారులే కట్టుకోవాలని చెప్పి చేతులు ఎత్తేసింది. మరోపక్క బ్యాంకుల నుంచి రుణ సాయం అందిస్తామంటూనే మోసం చేసింది. మొత్తంమీద నాటి ప్రభుత్వం మాటలు నమ్మిన లబ్ధిదారులకు ఇప్పటికీ గృహ కల నెరవేరలేదు. కూటమి ప్రభుత్వమైనా తమకు నీడ కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ● కంచికచర్ల- జుజ్జూరు రహదారి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో గత వైకాపా ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న లేఔట్‌లో 1000 మందికి పైగా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. కాలనీకి కనీసం రోడ్డు సౌకర్యం లేదు. ఆ స్థలాల్లో అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు నిరాశే ఎదురైంది. వసతులు లేకపోవడంతో పలువురు లబ్ధిదారులు మధ్యలోనే నిర్మాణాలు ఆపేశారు. దీంతో కాలనీలో కంప చెట్లు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. దీంతో ఇప్పటికే ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న కొంతమంది అక్కడ ఉండేందుకు వెనుకాడుతున్నారు. ● కీసర లేఔట్‌లో 200 మందికి పైగా స్థలాలు కేటాయించినప్పటికీ ఊరికి దూరంగా ఉండడం, రహదారి సౌకర్యం లేకపోవడంతో లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోలేదు. ● గొట్టుముక్కల లేఔట్‌ను ఏనుగుగడ్డ వాగు పక్కనే కేటాయించారు. ఇక్కడ ఒక్కరు కూడా ఇంటి నిర్మాణం చేపట్టలేదు. ● వీరులపాడు మండలం జుజ్జూరు లేఔట్‌లో 400 మందికి పైగా స్థలాలు కేటాయించారు. ఊరికి దూరంగా ఉండడం, సరైన వసతులు లేకపోవడంతో కనీసం 50 ఇళ్ల నిర్మాణం కూడా పూర్తి కాలేదు.

పైపులైను శంకుస్థాపనకు రావాలని ఎంపీకి ఆహ్వానం

ఎంపీ కేశినేని శివనాథ్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, రాఘవేంద్ర

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట పట్టణంలో పైపులైను పునరుద్ధరణ పనుల శంకుస్థాపనకు రావాలని ఎంపీ కేశినేని శివనాథ్‌ను ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మున్సిపల్ ఛైర్మన్ రాఘవేంద్ర ఆహ్వానించారు. ఆదివారం ఎంపీని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పట్టణంలో అభివృద్ధి పనులపై చర్చించారు. సంక్రాంతి అనంతరం 40 ఏళ్ల క్రితం వేసిన పాత పైప్‌లైన్‌ను పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో 133 కిలోమీటర్ల పొడవు నూతన పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డంపింగ్ యార్డ్‌లో కొండలా పేరుకుపోయిన వ్యర్థాలను పూర్తిగా తొలగించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించినందుకు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

సీఐటీయూ మహాసభలు జయప్రదం చేయండి

గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న నాయకులు

చందర్లపాడు, న్యూస్‌టుడే: సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ నాయకులు చందర్లపాడులో ఆదివారం గోడపత్రికలు ఆవిష్కరించారు. విశాఖలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు సభలు జరుగుతాయని జిల్లా ఉపాధ్యక్షుడు కె.గోపాల్ తెలిపారు. చివరి రోజు జరిగే బహిరంగ సభకు కార్మికులు, కర్షకులు తరలిరావాలని పిలుపునిచ్చాడు. గోపీనాయక్, తోట రామారావు, రంగిశెట్టి ఏడుకొండలు, అమీర్‌బాషా, మౌలాలీ, నాగుల్, మస్తాన్, సందరరావు తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్త ట్రాఫిక్‌తో అవస్థలు

నెహ్రూ సెంటర్ వద్ద నిత్యం ఇదే పరిస్థితి

కంచికచర్ల, న్యూస్‌టుడే: కంచికచర్లలోని నెహ్రూ, చెవిటికల్లు సెంటర్‌ల వద్ద ట్రాఫిక్ సమస్య నెలకొంది. ఉదయం సాయంత్రం వేళల్లో పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలకు వెళ్లే బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలతో ఈ రెండు సెంటర్ల వద్ద ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఎటువంటి చర్యలు లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశముందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ఆయా సెంటర్ల వద్ద రహదారిలో ఆక్రమణలు, ఆటోలు ఇష్టారీతిన నిలిపి ఉంచుతుండడంతో ప్రజల రాకపోకలకు మరింత ఇబ్బంది ఎదురవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా సెంటర్ల వద్ద రద్దీ సమయాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

గోడ గడియారాల ఆవిష్కరణ

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు చిత్రాలతో తిరువూరు సామాజిక ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ ఎ.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోడ గడియారాలను ఎమ్మెల్యే ఆదివారం ఆవిష్కరించారు.

తలసీమియా, సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన

ఎ.కొండూరు: తలసీమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధులు జన్యుపరమైనవని విజయవాడకు చెందిన ప్రముఖ పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ వి.శ్రీదేవి తెలిపారు. ఎ.కొండూరు మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఆదివారం ప్రజా ఆరోగ్య వేదిక, ఇండియన్ అకాడమి ఆఫ్ పిడియాట్రిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయా వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు.

చప్టా నిర్మిస్తే ప్రయోజనం

వరదల సమయంలో రోడ్డుపై నీరు

పరిటాల (కంచికచర్ల), న్యూస్‌టుడే: పరిటాల చెరువు సమీపంలోని మద్దులమ్మ డొంక దారిలో చప్టా నిర్మించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. ప్రధాన దారి నుంచి డొంక దారిలోకి వెళ్లే మార్గం బాగా పల్లంగా ఉండడం, చెరువుకు వరద వచ్చిన సమయంలో దారి మీదుగా ప్రవహిస్తుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువు నుంచి బయటకు వెళ్లే వరద నీరు డొంక దారిలో చేరుతుండడంతో ఈ మార్గంలో వ్యవసాయ పనులకు వెళ్లేందుకు వీలుకావడం లేదని రైతులు వాపోతున్నారు. ఇక్కడ చప్టా నిర్మించాలని ప్రజా ప్రతినిధులకు ఎన్ని వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేదని తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో చప్టా నిర్మిస్తే వచ్చే వర్షాకాలంలో తమ ఇబ్బందులు గట్టెక్కుతాయని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి చప్టా నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

చెస్‌లో చిచ్చర పిడుగులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

సాధించిన బహుమతులతో తుషార, దేవాన్షి

నందిగామకు చెందిన అక్కాచెల్లెళ్లు తాటి తుషార, దేవాన్షిలు చిన్న వయసులోనే చెస్‌లో సత్తా చాటుతున్నారు. అమ్మ వద్దే తర్ఫీదు పొంది పోటీల్లో పాల్గొని బహుమతులు సొంతం చేసుకుంటున్నారు. వీరి మాతృమూర్తి త్రివేణి హైదరాబాద్‌లో చెస్ గ్రాండ్ మాస్టర్ జ్యోతికిరణ్, విజయవాడకు చెందిన ప్రత్యూష వద్ద శిక్షణ పొందారు. తన ఇద్దరు పిల్లలను చిన్నప్పటి నుంచే చెస్‌లో రాణించాలన్న లక్ష్యంతో ఏడాది నుంచి తర్ఫీదునిస్తున్నారు. పెద్దకుమార్తె తుషార నాలుగో తరగతి చదువుతోంది. అండర్-9 విభాగంలో విజయవాడలో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకుంది. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ అనేకసార్లు పోటీపడింది. రెండో కుమార్తె దేవాన్షి మూడో తరగతి చదువుతోంది. అండర్-7 విభాగంలో విజయవాడలో నిర్వహించిన చెస్ పోటీల్లో పాల్గొని అయిదు సార్లు జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచింది. వీరిద్దరూ చెస్‌లో అనేక షీల్డ్‌లు, పతకాలు అందుకున్నారు. 15 నిమిషాల సమయంలో చెస్ పోటీల్లో పాల్గొంటున్న వీరిద్దరూ భవిష్యత్తులో రేటింగ్, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని గొప్ప చెస్ క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకోవాలన్న లక్ష్యంతో శిక్షణ పొందుతున్నారు. స్థానిక కాకతీయ అపోలో పాఠశాలలో చదువుతున్నారు.

క్లారినెట్ వాయిద్యంలో రాణిస్తూ..

నందిగామ గ్రామీణం: మాగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అన్నదమ్ములు క్లారినెట్ వాయిద్య పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. **పాలపాటి ఉదయకిరణ్** (పదో తరగతి), **బాలాజీ** (తొమ్మిదో తరగతి) చదువుతున్నారు. వీరిద్దరూ తాత దివంగత జమలయ్య వద్ద క్లారినెట్ వాయిద్యంలో శిక్షణ పొందారు. గత ఏడాది నిర్వహించిన కళా ఉత్సవ్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ, పోరంకిలో నిర్వహించిన రాష్ట్ర సాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచారు. క్లారినెట్‌తో 70 రకాల కీర్తనలు, పాటలు ఆలపిస్తున్నారు. నాలుగో తరగతి నుంచి తాత వద్ద ఇందులో శిక్షణ పొందామని చెప్పారు. సెలవు రోజుల్లో వేడుకలకు హాజరై తండ్రితో కలిసి క్లారినెట్ వాయిద్యం ప్రదర్శిస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో ఇందులో మరింతగా రాణించేలా కృషి చేస్తామన్నారు.

కంకర వేశారు.. తారు మరిచారు

న్యూస్‌టుడే, జగ్గయ్యపేట గ్రామీణం

గరికపాడు-తక్కెళ్లపాడు రోడ్డులో గుంతలు

వత్సవాయి కొత్తరేగులగడ్డ సమీపంలో కంకరతో ఇలా..

జగ్గయ్యపేట నియోజవర్గంలో పలు గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలతో ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో వాహనదారులకు గుంతలు సరిగా కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. బస్సులు, లారీలు, భారీ వాహనాలు ప్రయాణించేటప్పుడు ద్విచక్ర వాహనదారులు చాలా భయంగా ప్రయాణించాల్సి వస్తోంది. గరికపాడు నుంచి తక్కెళ్లపాడు వెళ్లే మార్గంలో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. తెలంగాణ నుంచి జాతీయ రహదారికి వెళ్లే వారు ఈ మార్గంలో ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. గత ప్రభుత్వం రోడ్లను పట్టించుకోకపోవడంతో అధ్వానంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వమూ దృష్టి పెట్టలేదు. ఇటీవల జగ్గయ్యపేటలో గుంతలను పూడ్చే ప్రక్రియను ప్రారంభించినా, గ్రామీణ రహదారుల్లోని గుంతలను మాత్రం పూడ్చలేదు. గత ఏడాది వరదలకు కొట్టుకుపోయిన రోడ్లపై కంకర వేసి తారు వేయడం మరిచారు. రెడ్డినాయక్‌తండా నుంచి బూదవాడ వెళ్లే రహదారిలో కంకర కూడా వేయలేదు. గత ఏడాది వచ్చిన వరదల కారణంగా వత్సవాయి నుంచి పెనుగంచిప్రోలు రోడ్డు కొత్తరేగులగడ్డ వాగు సమీపంలో పూర్తిగా ధ్వంసమైంది. ఇప్పటికైనా అర్ అండ్ బి అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

(c) eenadu

విజయవాడ పశ్చిమ

ధర వరలు

వంకాయలు-20/24, టమాటా-47, బెండ-34, పచ్చిమిర్చి-40, కాకర-50, బీర-34/40, క్యాలీ ఫ్లవర్-30/25, క్యాబేజి-22, క్యారెట్-34, దొండ-36, బంగాళదుంప-24/26, ఉల్లిపాయలు-30, గోరుచిక్కుళ్లు-40, దోస-40, సొర-18/20, పొట్ల-35, అరటికాయ-7/8, చామ దుంప-24, అల్లం-76, మునగ-14/15, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-44, బీట్ రూట్-30, కీరదోస-36, బీన్స్-76, క్యాప్సికమ్-58, చింతకాయలు-60, నిమ్మ (డజను)-20/18, కొత్తిమీర-6/12, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/22 (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

★ సామారంగంచౌకీ కాకరపర్తి భావన్నారాయణ వీధిలో కాంప్లెక్స్ వద్ద మురుగు కాలువలో పూడిక తీయడం లేదని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనిపై ఆదివారం వార్త ప్రచురితమైంది. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించి సమస్య పరిష్కరించారు. **- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

? వించిపేట అప్పర్ రైల్వే యార్డులో రాత్రులు పలువురు కూర్చుని మద్యం తాగుతున్నారు. **- రాంబాబు, స్థానికుడు**

✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి వారిని పట్టుకుంటాం. **- చినకొండలరావు, సీఐ, 2వ పట్టణ పోలీసు స్టేషన్**

? భవానీపురం ఐరన్‌యార్డు ప్రధాన గేటు వద్ద లారీ డ్రైవర్లు కూర్చుని మద్యం తాగుతున్నారు. దీంతో మహిళలు నడిచేందుకు ఇబ్బందిగా ఉంది. **- సరస్వతి, స్థానికురాలు** ✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- ఉమామహేశ్వరరావు, సీఐ, భవానీపురం**

పిల్లలకు దైవ గ్రంథాల విద్య అవసరం

విజయవాడ సిటీ: భావి భారత సమాజ నిర్మాణానికి నైతిక విలువలతో కూడిన దైవ గ్రంథాల విద్య పిల్లలకు అవసరమని ముస్లిం సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముక్తార్ అలీ అన్నారు. ఆదివారం లబ్బీపేట దర్గా ఇస్లామీ హైస్కూల్‌లో యూఎఫ్‌క్యూఎస్ సంస్థ ఆధ్వర్యంలో ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన చిన్నారులకు ముక్తార్ అలీ, షేక్ సుభానీ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. యూఎఫ్‌క్యూఎస్ సంస్థ ఛైర్మన్ దావూద్ పాల్గొన్నారు.

జగన్మాత సేవలో మంత్రి కుటుంబం

మంత్రి సంధ్యారాణికి అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఏఈవో వెంకటరెడ్డి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఏఈవో వెంకటరెడ్డి వారికి అమ్మవారి చిత్ర పటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించారు.

మనసు పెడితే.. మంచి ఆదాయ వనరు

చిట్టినగర్, న్యూస్‌టుడే

కేఎల్‌రావు నగర్, కుండల మార్కెట్ వీధిలోని గుజ్జరి ఎల్లారావు నగరపాలక సంస్థ కూరగాయల మార్కెట్ సముదాయం రోజు రోజుకు అధ్వానంగా మారుతోంది. ఇందులోకి అడుగు పెట్టాలంటే కొనుగోలుదారులకు సాహసమే అవుతుంది. బ్లేడు, గంజాయి, మందుబాబులకు అడ్డాగా తయారయ్యింది. ప్రస్తుతం ఉన్న దుకాణాల నుంచి ఆదాయం శూన్యం. 2014 తెదేపా హయాంలో కొత్త భవన సముదాయం నిర్మించాలని అంచనాలు వేసి వర్క్ ఆర్డర్ వరకు వచ్చింది. ఇప్పుడున్న అధికారులు కొత్తవారు కావడంతో మళ్లీ కసరత్తు చేసే కంటే ఆ రికార్డులను బయటకు తీసి చిన్న చిన్న మార్పులు చేసేలా చూడాలి. రైతుబజారు, కమర్షియల్ కాంప్లెక్సు, కల్యాణ మండపం, పార్కింగ్, మరుగుదొడ్లు ఉండేలా మార్కెట్‌ని ప్రజాప్రయోజనంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా అభివృద్ధి చేయాలంటూ కొందరు తమ అభిప్రాయాలను ఇలా వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా మార్కెట్ పరిసరాలు

ప్రాంతం: 47వ డివిజన్
మార్కెట్ విస్తీర్ణం : సుమారు 2 వేల గజాలు
దుకాణాలు: 60
మార్కెట్ చుట్టూ: 35 దుకాణాలు
కొత్త భవన సముదాయం నిర్మిస్తే ప్రయోజనం : దాదాపు 40 వేల మందికి

వెలువడుతున్న దుర్వాసన

గుజ్జరి మార్కెట్ సముదాయంలోకి అడుగు పెట్టాలంటే ఇబ్బందిగా ఉంటుంది. చేపలు, మాంసం కడిగిన నీరు కాలువ నుంచి బయటకు ప్రవహించక తీవ్ర దుర్వాసన వెలువడుతోంది. వర్షం పడినప్పుడు కాల్వల్లోని మురుగు పొంగి మార్కెట్ సముదాయంలోకి చేరుతోంది. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి నూతన భవనం నిర్మిస్తే మేలు. **- లక్ష్మీరాజ్యం, చిట్టినగర్**

ఎంతో ప్రయోజనం

మా ప్రాంతంలో రైతుబజారు లేకపోగా ఉన్న మార్కెట్ అధ్వానంగా ఉంది. ఎప్పుడు రేకుల షెడ్లు పడిపోతాయనే విధంగా ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా పాలకులు వాటిని పట్టించుకోవడం లేదు. నాణ్యమైన కూరగాయాలు తెచ్చుకోవాలంటే కాళేశ్వరరావు మార్కెట్‌కి వెళ్లాలి. వేల మంది ప్రజలకు మేలు జరిగే విధంగా ఈ మార్కెట్‌ను కొత్తగా రూపుదిద్దాలి. పాలకులు ఆ దిశగా ఆలోచన చేస్తే మంచిదని మనవి. **- నారాయణరావు, లంబాడీపేట**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు, 3 సర్కిల్ కార్యాలయాల పరిధిలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రజలు తమ పరిధిలోని వివిధ సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్యం, డ్రెయిన్లు, తాగునీరు, వీధి దీపాలు, గుంతలు తదితర సమస్యలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు అందించాలని తెలిపారు.

బీపీఎస్‌కు 785 దరఖాస్తులు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: అక్రమ నిర్మాణాలు, అనుమతి లేని కట్టడాలకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం(బీపీఎస్)కు ఇప్పటిదాకా 785 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా అందాయి. బీపీఎస్‌కు సంబంధించిన ప్రాథమిక ధరావతు సొమ్ము (ఫీజు)గా రూ.101.97 లక్షలు నగరపాలక సంస్థకు ఆదాయంగా లభించింది. ఇప్పటి వరకు అందిన అన్ని దరఖాస్తులను బాధ్యులైన అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, యజమానులకు నోటీసులు జారీ చేసే ప్రక్రియ ప్రారంభించారు. ప్రస్తుతం బీపీఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రాథమికంగా పూర్తి చేసి, 536 మంది భవన యజమానులకు నోటీసులు జారీ చేశారు. పీనలైజేషన్ డిమాండ్ ఆధారంగా వారి నుంచి ఫీజు కింద నిర్ణయించిన సొమ్ము స్వీకరించి, బీపీఎస్ ప్లాన్లను మంజూరు చేసేందుకు పట్టణ ప్రణాళికాధికారులు చర్యలు చేపట్టారు.

హిందువులందరూ ఐకమత్యంతో ఉండాలి

ప్రసంగిస్తున్న శ్రీభక్తి సుందర మంగళ మహారాజ్ స్వామీజీ

చిట్టినగర్: మన దేశంలో హిందువులందరూ ఐకమత్యంతో ఉంటే ప్రపంచంలో ఏశక్తి మనల్ని తాకలేదని శ్రీభక్తి సుందర మంగళ మహారాజ్ స్వామీజీ పిలుపునిచ్చారు. ఆదివారం కేఎల్‌రావు నగర్ పార్కు రోడ్డులో దీన్‌దయాళ్ బస్తీ కమిటీ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ప్రవచనాలు వినడం వల్ల మనం ధర్మంగా ఏం చేయాలి, ఏం చేయకూడదు తెలుస్తుందన్నారు. తద్వారా ధర్మం వైపుగా ముందుకు సాగడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రతి రోజు భగవద్గీతలో ఒక శ్లోకాన్ని పిల్లలతో చదివించేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని సూచించారు. స్వయం సేవక్ సీనియర్ కార్యకర్త బిట్ర శ్రీమన్నారాయణ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే పిల్లల మనసుల్లో హిందూ ధర్మాన్ని నింపాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సుమారు రెండు వేల మందికి పైగా హిందు బంధువులకు భోజన సదుపాయం కల్పించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పారిశ్రామికవేత్త చింతలపూడి సత్యనారాయణ, బాలాజీ స్వీట్స్ అధినేత సుబ్బారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

త్రిముఖ చిత్ర బృందం సందడి

విజయవాడ సిటీ: త్రిముఖ చిత్ర బృందం ఆదివారం నగరంలో సందడి చేసింది. త్రిముఖ ట్రైలర్‌కు విశేష ఆదరణ రావడంతో ఆ చిత్ర బృందం బందర్ రోడ్డులోని ఓ హోటల్‌లో మీడియా సమావేశం నిర్వహించింది. త్రిముఖ సస్పెన్స్, సైకలాజికల్ థ్రిల్లర్ మూవీగా అందరినీ ఆకట్టుకుంటుందని నిర్మాత మద్దాలి సత్య శ్రీదేవి తెలిపారు. ఏసీపీ శివాని పాత్రలో సన్నీలియోన్ నటన విశేషంగా ఆకట్టుకుందని చెప్పారు. డైరెక్టర్ రాజేశ్వర్ మాట్లాడుతూ.. చిత్రంలో అందరూ కొత్తవారు అయినప్పటికీ నటనలో విశేష ప్రతిభ కనబరిచారని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ

అయ్యప్ప స్వామికి పూజ చేస్తున్న భక్తులు

చిట్టినగర్, న్యూస్‌టుడే : ఆంజనేయవాగు సెంటర్‌లోని శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలోని హరిహర అయ్యప్ప ఆలయం ప్రాంగణంలో ఆదివారం మండల పూజ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ఈవో వై.సీతారామయ్య తెలిపారు. అయ్యప్ప ఆలయం స్థాపించి 27 ఏళ్లు గడిచిందని, ప్రతి ఏటా క్రమం తప్పకుండా పడిపూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ అర్చకుడు విన్నకోట శ్రీనివాసశర్మ, బెవర రాము గురుస్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు.

కరాటేలో సత్తా

విద్యాధరపురం, న్యూస్‌టుడే : జేకేగ్ జుర్యూ కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా నిర్వహించిన కరాటే బెల్టు గ్రేడింగ్ టెస్టు- 2025లో విద్యాధరపురానికి చెందిన హైకోర్టు న్యాయవాది షేక్ అన్వర్‌కు నిర్వాహకులు బ్లాక్ బెల్టు, ధ్రువపత్రాన్ని ఆదివారం అందజేశారు. న్యాయవాద వృత్తి, కరాటే రంగంలో రాణిస్తున్న అన్వర్‌ను నిర్వాహకులు శ్రీనివాసులు, హరనాథ్ అభినందించారు. దినేష్, నరసింహ, సాయికుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్వర్‌కు బ్లాక్ బెల్టు, ధ్రువపత్రం ఇస్తున్న అకాడమీ నిర్వాహకులు శ్రీనివాసులు, హరనాథ్

దాడులు చేసే అల్లరి మూకలను నియంత్రించండి

నిరసన తెలుపుతున్న దళిత సేన నాయకులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా దళిత సేన ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. పాతబస్తీ రథం సెంటరు నుంచి కాళేశ్వరరావు మార్కెట్ వరకు జాతీయ పతాకాలు చేతబూని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు పోతురాజు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో జరుగుతున్న ఆందోళనలకు ఎటువంటి సంబంధం లేని హిందువులను లక్ష్యంగా దాడులు చేస్తున్న అల్లరి మూకలను అక్కడి ప్రభుత్వం నియంత్రించాలన్నారు. అమాయకులైన వారిపై దాడులు జరిగితే అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నాయకులు విజయదుర్గ, రాజు తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం నేటి తరానికి ఆదర్శం

కార్యక్రమంలో శ్రీధర్, కిరణ్, హరికృష్ణ, రాజేంద్రప్రసాద్, విద్యార్థులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే : అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ నిరతి నేటి తరానికి ఆదర్శం కావాలని వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ శ్రీధర్ అన్నారు. లేబరుకాలనీలోని జీఎన్ఆర్ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో వాసవి క్లబ్ భవానీపురం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం ఆయన చేసిన ఆత్మత్యాగాన్ని విద్యార్థులకు వివరించారు. క్లబ్ సభ్యులు శ్రీనివాసరావు, రాజేంద్రప్రసాద్, కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు మనోజ్ కుమార్, వసంతలక్ష్మి, అనురాధ పాల్గొన్నారు.

బ్యాంకు అభివృద్ధికి విశ్రాంత ఉద్యోగుల కృషి

మాట్లాడుతున్న నెట్టెం రఘురాం

అరండల్‌పేట (సీతారాంపురం), న్యూస్‌టుడే : కేడీసీసీ బ్యాంకు అభివృద్ధికి విశ్రాంత ఉద్యోగుల కృషి, అంకితభావం అనిర్వచనీయమని ఆ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం ప్రశంసించారు. అరండల్‌పేటలోని రాష్ట్ర కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయిస్ సంఘం భవనంలో ఆదివారం కేడీసీసీ బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహాజన సభకు ఆయన హాజరయ్యారు. బ్యాంకు అభివృద్ధికి కృషి చేసిన విశ్రాంత ఉద్యోగుల సేవలను స్మరించుకున్నారు. పింఛను, ఆరోగ్య బీమా పెంపుదల, గౌరవప్రదమైన జీవన భద్రత అంశాలపై యాజమాన్యం ఎల్లప్పుడూ సానుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. వారి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆగిన పనులు.. తప్పని అగచాట్లు

విద్యాధరపురం, న్యూస్‌టుడే

పశ్చిమ నియోజకవర్గం లేబరు కాలనీలోని వాడుక, వర్షపు నీటిని అవుట్ ఫాల్ డ్రెయిన్‌లో కలిపేందుకు చేపట్టిన ఆర్టీసీ వర్కు షాపు రోడ్డు నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. తొలుత రూ.40 లక్షలతో లేబరు కాలనీ నుంచి ఆర్టీసీ వర్కు షాపు వరకు డ్రెయిను, కల్వర్టు నిర్మాణం చేశారు. దాన్ని ఆర్టీసీ వర్కు షాపు పక్కనున్న డ్రెయిన్‌కు కలిపితే వర్షపు, వాడుక నీరు అవుట్‌ఫాల్ డ్రెయినుకు చేరుతుందని కార్పొరేషను అధికారులు భావించారు. తీరా నిర్మాణం పూర్తయిన తర్వాత రూ.19 లక్షల వ్యయంతో పాత డ్రెయిన్ పక్కన మరొక డ్రెయిన్ నిర్మించాలని పనులు ప్రారంభించారు. కొంత వరకు పూర్తి చేసిన తర్వాత ఆర్టీసీ అధికారులు డ్రెయిన్ పక్కన మరొకటి నిర్మిస్తే రక్షణ గోడ దెబ్బతింటుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో నెల రోజులుగా పనులు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో చిన్నపాటి వర్షం కురిసినా లేబరు కాలనీలో నీరు నిలిచిపోయే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న డ్రెయిన్‌ను ప్రహరీ గోడకు సపోర్టుగా నిర్మాణం చేస్తే ఎటువంటి అభ్యంతరం లేదని ఆర్టీసీ వర్కు షాపు అధికారులు చెబుతున్నారు.

అసంపూర్తిగా ఆర్టీసీ వర్కు షాపు డ్రెయిన్

టెండరు పిలిచాం: రూ.19 లక్షల వ్యయంతో చేపట్టిన పనుల్లో ఆర్టీసీ అధికారుల సూచనల మేరకు మార్పులు చేసేందుకు తిరిగి టెండరు పిలిచాం. డ్రెయిన్ విస్తీర్ణం కూడా మరికొంత పెరిగే అవకాశం ఉండటంతో పాటు వర్కు షాపు ప్రహరీ గోడకు రక్షణగా డ్రెయిన్ అంచులు ఉంటాయి. అయితే మరొక రూ.17 లక్షలు అంచనా వ్యయం పెరిగే అవకాశం ఉంది. టెండరు ఖరారు అయిన వెంటనే పనులు వేగవంతం చేస్తాం. **- జనార్దన్, కార్పొరేషన్ ఏఈ**

పిచ్చి మొక్కలు.. విష సర్పాల సంచారం

రైల్వేస్టేషన్ నుంచి ఖుద్దూస్ నగర్‌కు వెళ్లే రహదారిలో పిచ్చి మొక్కలు భారీగా పెరగడంతో విష సర్పాలు సంచరిస్తున్నాయి. సమీపంలో రైల్వే క్వార్టర్లు, నివాసాలు ఉండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం ఈ రోడ్డు మీదుగా పెద్ద సంఖ్యలో ప్రజలు, రైల్వే ఉద్యోగులు రాకపోకలు సాగిస్తారు. పిచ్చి మొక్కల కారణంగా దోమలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వాటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కేదారేశ్వరపేట**

'పేదల పక్షాన నిలిచేది కాంగ్రెస్ పార్టీనే'

వేడుకలో పాల్గొన్న మస్తాన్‌వలీ, నరసింహరావు, శివాజీ తదితరులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : దేశంలో పేదల పక్షాన నిలబడిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలీ పేర్కొన్నారు. రైతులు, కార్మికుల హక్కుల పరిరక్షణే లక్ష్యమని ఆయన చెప్పారు. ఆదివారం ఆంధ్రరత్న భవన్‌లో ఆ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వేచ్ఛ, రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలను అందించిందని కొనియాడారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి దిశానిర్దేశం చేసిందన్నారు. 141 ఏళ్ల ప్రజా సేవా ప్రయాణంలో అనేక ఒడిదొడుకులను ఎదుర్కొందని గుర్తు చేశారు. మహాత్మా గాంధీ అహింసా ఉద్యమం, నెహ్రూ ఆధునిక భారత నిర్మాణం, ఇందిరా గాంధీ బలమైన నాయకత్వం, రాజీవ్ సాంకేతిక విప్లవం దేశాన్ని అగ్రస్థానంలో నిలిపాయని వివరించారు. సామాజిక న్యాయం, సమానత్వమే పార్టీ మూల సిద్ధాంతమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కొలనుకొండ శివాజీ, నరహరిశెట్టి నరసింహారావు, వల్లూరు భార్గవ్, మమతా నాగిరెడ్డి, లక్కరాజు రామారావు, లెనిన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

4న బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం మహాసభ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : రాష్ట్రంలో బీసీ, ఓబీసీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని ఆల్ ఏపీ బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 2026, జనవరి 4న తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సంఘం మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా మంత్రి నారా లోకేశ్, పల్లా శ్రీనివాసరావుతో పాటు 8 మంది బీసీ మంత్రులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. మహాసభ ఏర్పాట్లపై ఆదివారం గవర్నర్‌పేటలోని కమర్షియల్ ట్యాక్స్ యూనియన్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం, ప్రధాన కార్యదర్శి పక్కి భూషణరావు, కోశాధికారి వై.శంకరరావు తదితరులు మాట్లాడారు. ఏప్రిల్ 11న జ్యోతిరావు పులె జయంతి సందర్భంగా ద్విశతాబ్ది ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. ఆ రోజు సెలవు దినంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పులె జయంతిని జనవరి 3న నిర్వహించాలని, ఆమె జీవితచరిత్రను పాఠ్యాంశంగా పెట్టాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు స్టడీ లీవ్‌లు ఇచ్చినట్లుగానే.. బీసీలకూ ఇవ్వాలని కోరారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా బీసీ ఉద్యోగులు ఈ కార్యక్రమానికి తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అసోసియేట్ ప్రెసిడెంట్ కేదారేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు బత్తుల అప్పారావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు హేమలత, వివిధ జిల్లాల ముఖ్య నాయకులు హాజరయ్యారు.

'జ్యోతిష్యం మూఢ నమ్మకం కాదు'

చల్లా శ్రీనివాసశర్మకు గండపెండేరం తొడుగుతున్న జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు తదితరులు

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: జ్యోతిష్య శాస్త్రం మూఢ నమ్మకం, మతానికి సంబంధించినది కాదని, ఒక సైన్స్ అని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు అన్నారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో 'దర్శనమ్' మాస ప్రతిక ఆధ్వర్యంలో శృంగేరి ఆస్థాన జ్యోతిర్విద్వాంసులు డా.శంకరమంచి రామకృష్ణశాస్త్రికి, విజయవాడ శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి చల్లా శ్రీనివాసశర్మలకు విశిష్ట సేవా పురస్కారం, గండపెండేర ప్రదానోత్సవం నిర్వహించారు. దర్శనమ్ సంపాదకుడు మరుమాముల వెంకటరమణ శర్మ నిర్వహణలో జరిగిన సభలో జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారత్‌లో జ్యోతిష్యంపై వ్యతిరేక భావనలు అలుముకుంటున్నాయని, కొందరు ఆ ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారు డా.కె.వి.రమణాచారి, రచయిత జ్వాలా నరసింహరావు, ఉస్మానియా వర్సిటీ తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య సాగి కమలాకరశర్మ, తెలంగాణ విద్వత్సభ గౌరవ కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి, అవధాన విద్యా వికాస పరిషత్ అధ్యక్షుడు మరుమాముల దత్తాత్రేయ శర్మ, ఆచార్య సి.వి.సుబ్రహ్మణ్యం, తత్త్వం ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు బంగారయ్య శర్మ, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చయ్య సేవలు ఎనలేనివి

పటమట, న్యూస్‌టుడే: న్యాయవాదిగా, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యుడిగా దివ్వెల పిచ్చయ్య అందించిన సేవలు ఎనలేనివని భారత ప్రభుత్వ అదనపు సొలిసిటర్ జనరల్ కనకమేడల రవీంద్ర కుమార్ అన్నారు. వయోభారంతో పిచ్చయ్య కన్ను మూయగా.. మృతదేహానికి ఆదివారం కనకమేడల నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రైవేటు భూముల్లో షెడ్లు తొలగించవద్దు

మాట్లాడుతున్న స్థల యజమానులు, న్యాయవాది ఖలీల్ అహ్మద్ తదితరులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే : భవానీపురం పున్నమిఘాట్ సమీపంలోని ప్రైవేటు భూముల్లో ఏర్పాటు చేసిన షెడ్లను అధికారులు తొలగించడం అన్యాయమని కరకట్ట ప్రాంతంలోని స్థల యజమానుల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. భవానీపురం బొబ్బూరి గ్రౌండ్స్ సమీపంలో కరకట్ట ప్రాంత స్థల యజమానుల సంఘం ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘ సభ్యులు మాట్లాడారు. పున్నమి ఘాట్ నుంచి స్వాతి సెంటర్ వరకు 20 ఎకరాల ప్రైవేటు పట్టా భూమి ఉన్నదని, దాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారికి అన్యాయం జరిగే విధంగా 'ఆవకాయ్ అమరావతి' పేరుతో చేపట్టిన కార్యక్రమానికి ఫెన్సింగ్ నిర్మాణాలను తొలగిస్తున్నారని ఆరోపించారు. గత పుష్కరాల సమయంలో ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేశారని, దాని పక్కనే ఉన్న స్థలాల యజమానులు ప్రహరీ గోడ కట్టుకుంటే అధికారులు కూల్చివేయడం దారుణమన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు తాము మద్దతు ఇస్తామని, సర్కారు అవసరమనుకుంటే పట్టాదారులకు మార్కెట్ ప్రకారం రేటు చెల్లించి స్థల సేకరణ చేసుకోవచ్చన్నారు. స్థల యజమానులు బొబ్బూరి భూపాల్, శ్రీనివాసరావు, కృష్ణ ప్రసాద్, అజీమ్‌ఖాన్, న్యాయవాది ఖలీల్ అహ్మద్ పాల్గొన్నారు.

సినిమాలు

★ **అఖండ-2, శంబాల, ఛాంపియన్, ఈషా :** జీ-3(రాజ్-యువరాజ్), జయరామ్, ఊర్వశి ఐనాక్స్ (గాంధీనగర్), స్వర్ణా కాంప్లెక్స్ (గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్ (పాయకాపురం), రామ్ సినిమాస్ (గుణదల), సౌమ్య (వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా, పీవీపీ, పీవీఆర్ మాల్స్ (బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్ (క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్ (పటమట), పవర్ వన్ మాల్ (కానూరు) ★ **వృషభ, దండోర :** ఊర్వశి ఐనాక్స్ (గాంధీనగర్), స్వర్ణా కాంప్లెక్స్(గవర్నర్‌పేట), లైలా, పీవీపీ, పీవీఆర్ మాల్స్ (బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్ (పటమట), పవర్ వన్ మాల్ (కానూరు) ★ **బ్యాడ్ గర్ల్స్ :** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), లైలా, పీవీపీ, పీవీఆర్ మాల్స్ (బందరు రోడ్డు)★ **పతంగ్ :** పీవీపీ మాల్(బందరు రోడ్డు) ★**అఖండ-2 :** అలంకార్, శైలజ **- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

విజయవాడ మధ్య

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఆదివారం వారికి నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్లు, టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ చేశారు. గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. వాటిని అమ్మినా, కొను గోలు చేసినా.. రవాణా చేసినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వంకాయలు-20/24, టమాటా-47, బెండ-34, పచ్చిమిర్చి-40, కాకర-50, బీర-34/40, క్యాలీ ఫ్లవర్-30/25, క్యాబేజి-22, క్యారెట్-34, దొండ-36, బంగాళదుంప-24/26, ఉల్లిపాయలు-30, గోరుచిక్కుళ్లు-40, దోస-40, సొర-18/20, పొట్ల-35, అరటికాయ-7/8, చామదుంప-24, అల్లం-76, మునగ-14/15, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-44, బీట్ రూట్-30, కీరదోస-36, బీన్స్-76, క్యాప్సికమ్-58, చింతకాయలు-60, నిమ్మ (డజను)-20/18, కొత్తిమీర-6/12, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/22 (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. - ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సీతారాంపురం-63036 11232, పాయకాపురం- 90631 44761

పాయకాపురం, న్యూస్‌టుడే : రాధానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న కుండీలో చెత్త తీయడం లేదు. ఈ విషయాన్ని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా'కు సమాచారం ఇచ్చారు. దీనిపై 'ఈనాడు'లో శనివారం వార్త ప్రచురితమైంది. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు.. కార్మికులతో చెత్తను తరలించారు. ❖ ప్రకాష్‌నగర్, రాజీవ్‌నగర్ ప్రధాన రోడ్డులోని మసీదు వద్ద కాలువలో పూడిక పేరుకుపోయింది. దీనిపై వార్త ప్రచురితమవగా.. పారిశుద్ధ్య అధికారులు స్పందించారు. కార్మికులను పంపి పూడిక తీయించారు.

? : తోటవారి వీధి పదో లైన్ గుంతలమయంగా మారింది. - సుస్మిత, స్థానికురాలు ✔ గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. - సతీష్, ఏఈ, సర్కిల్-2

కాలమానిని ఆవిష్కరణ

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : ముత్యాలంపాడులోని శిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కమిటీ గౌరవాధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా బాబా భక్తులకు నూతన సంవత్సర క్యాలెండర్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మందిరంలో నిత్యం పేదలకు అన్నదానంతో పాటు ఉచిత హోమియో వైద్య శిబిరం, ప్రభుత్వ పాఠశాల్లో అత్యధిక మార్కులు సాధించిన పదో తరగతి విద్యార్థులకు ఫీజులు చెల్లిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి.లక్ష్మణరావు, ఎం.సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

తప్పు ఎవరిది.. ఇల్లు ఎవరికి?

వాంబేకాలనీ వాసుల కష్టాలు తీర్చరూ..

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే

పాలకులు, అధికారులు నిర్లక్ష్యం.. పేదలకు శాపంగా మారింది. ఒకే ఇంటిని రెండు విడతల్లో వేర్వేరు వ్యక్తులకు కేటాయించడంతో తలలు పట్టుకుంటున్నారు. అజిత్‌సింగ్‌నగర్ వాంబేకాలనీలో సుమారు 3500 ఇళ్లకుపైగా ఇండిపెండెంట్ గృహాలు ఉన్నాయి. వీటిలో 570 ఇళ్లకు పట్టాదారులు ఎవరో తెలియడం లేదని ప్రస్తుత ఇంటి యజమానులు వాపోతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో.. 2003 సంవత్సరంలో వివిధ ప్రాంతాల్లో ఇళ్లు లేకుండా ఇబ్బంది పడుతున్న వారికి వాంబేకాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. అలాగే బ్యాంకుల ద్వారా రూ.20 వేలు చొప్పున రుణం ఇప్పించారు. 2004 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. పుష్కరాల సందర్భంగా ఇళ్లు నిర్మించి పేదలకు ఇస్తామని పాలకులు ప్రకటించారు. హడావుడిగా నిర్మాణాలు పూర్తిచేశారు. ముందుగా 2003లో కొంత మందికి కేటాయించిన వాటిని అప్పటి అధికారులు సక్రమంగా పరిశీలించకుండా.. సుమారు 570 ఇళ్లను కొత్త వారికి కేటాయించారు. గృహ నిర్మాణ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ హెచ్‌సీఎల్) ద్వారా కొత్తగా రూ.20 వేలు రుణం అందించారు.

బ్యాంకు అధికారుల ఒత్తిడి..

రోజులు గడిచిన కొద్దీ మొదట బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన వారు, రెండో సారి ఇళ్లు పొందినవారు బకాయిలు చెల్లించలేదు. బ్యాంకు వారు ప్రస్తుతం ఉంటున్న ఇంటి యజమాని వద్దకు వచ్చి మీ ఇంటిపై రుణం ఉందని, తీర్చాలని ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో కొంత మంది యజమానులు వడ్డీతో సహా చెల్లించేశారు. ఇంటి పత్రాలు ఇవ్వాలని బ్యాంకు అధికారులను కోరుతుంటే.. అవి మీ పేరుతో లేవని చెప్పడంతో కంగుతిన్నారు. వేరే వ్యక్తిపై ఉందని, వారిని తీసుకురావాలని.. లేదంటే పత్రాలు ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పారు. ఇది 22 ఏళ్ల నాటి సమస్య కావడంతో.. కొందరు మరణించారు. మరికొందరి జాడ తెలియడం లేదు. అప్పటి అధికారులు చేసిన తప్పు.. ప్రస్తుత ఇంటి యజమానులకు శాపంగా మారింది. ఏపీ హెచ్‌సీఎల్ వారిని సంప్రదిస్తే.. రుణాలు కట్టి బాండు తీసుకోవాలని చెబుతున్నారు. అటు బ్యాంకు రుణం.. ఇటు ఏపీ హెచ్‌సీఎల్ రుణం కట్టలేక.. ఏం చేయాలో తెలియక నివాసితులు ఆందోళన చెందుతున్నారు.

అసలు రుణమే తీసుకోలేదు..

మేం ఏ బ్లాక్‌లోని 158 ఇంట్లో ఉంటున్నాం. దీనిని 2004లో మాకు కేటాయించారు. కానీ ఇదే ఇంటికి 2003 సంవత్సరంలో దుబ్బ అనే వ్యక్తికి సత్యనారాయణపురంలోని ఆంధ్రా బ్యాంకులో రూ.20వేల రుణం ఇచ్చారు. మాకు కేటాయించిన తర్వాత ఎలాంటి లోను తీసుకోలేదు. ఇంటి కాగితాలు ఇవ్వాలని గృహ నిర్మాణ కార్పొరేషన్ అధికారులను అడుగుతుంటే.. పత్రాలు తయారు కాలేదని చెబుతూ వచ్చారు. మా ఇంటి పత్రాలు వేరే వారి పేరుతో ఉన్నాయని తెలిసింది. అధికారులు స్పందించి న్యాయం చేయాలి. **- గుళ్ల సల్మాదేవి, వాంబేకాలనీ**

వడ్డీతో సహా కట్టేశాం

మేం డీ బ్లాక్‌లోని 406 ఇంట్లో నివసిస్తున్నాం. 2004 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ఇల్లు కేటాయించింది. ఏళ్లు గడిచిన తర్వాత ఇంటిపై లోను ఉంది, కట్టాలని ఆంధ్రా బ్యాంకు సిబ్బంది వచ్చి ఇబ్బంది పెట్టారు. దీంతో 4.9.2012న వడ్డీతో సహా రూ.33 వేలు బ్యాంకుకు కట్టాం. ఇంటి పత్రాలు ఇవ్వాలని అడిగితే.. కాలయాపన చేశారు. ఆ ఇల్లు వి.దుర్గా మల్లేశ్వరి అనే మహిళ పేరు మీద ఉందని.. ఆమెను తీసుకువస్తే వారికి ఇస్తామని తెలిపారు. డబ్బులు కట్టించుకుని తర్వాత.. ఇలా అనడం బాధాకరం. మాకు ఇంటి పత్రాలు ఇవ్వాలని కోరుతున్నాం. **- బల్లు కుమారి, వాంబేకాలనీ**

పరిష్కార మార్గం చూస్తాం

రెవెన్యూ అధికారుల సమన్వయంతో ఈ సమస్య పరిష్కరిస్తాం. ముందుగా ఇచ్చిన వారికే ఇల్లు చెందుతుంది. తప్పనిసరి అయితే రెవెన్యూ అధికారులతో సర్వే చేయిస్తాం. ఇలాంటి సమస్య ఉన్న వారు తహసీల్దార్ కార్యాలయంలో అర్జీలు ఇవ్వొచ్చు. **- పిచ్చయ్య, ఈఈ, గృహ నిర్మాణ కార్పొరేషన్**

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు, 3 సర్కిల్ కార్యాలయాల పరిధిలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రజలు తమ పరిధిలోని వివిధ సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్యం, డ్రెయిన్లు, తాగునీరు, వీధి దీపాలు, గుంతలు తదితర సమస్యలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు అందించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీపీఎస్‌కు 785 దరఖాస్తులు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: అక్రమ నిర్మాణాలు, అనుమతి లేని కట్టడాలకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం(బీపీఎస్)కు ఇప్పటిదాకా 785 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా అందాయి. బీపీఎస్‌కు సంబంధించిన ప్రాథమిక ధరావతు సొమ్ము (ఫీజు)గా రూ.101.97 లక్షలు నగరపాలక సంస్థకు ఆదాయంగా లభించింది. ఇప్పటి వరకు అందిన అన్ని దరఖాస్తులను బాధ్యులైన అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, యజమానులకు నోటీసులు జారీ చేసే ప్రక్రియ ప్రారంభించారు. ప్రస్తుతం బీపీఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రాథమికంగా పూర్తి చేసి, 536 మంది భవన యజమానులకు నోటీసులు జారీ చేశారు. పీనలైజేషన్ డిమాండ్ ఆధారంగా వారి నుంచి ఫీజు కింద నిర్ణయించిన సొమ్ము స్వీకరించి, బీపీఎస్ ప్లాన్లను మంజూరు చేసేందుకు పట్టణ ప్రణాళికాధికారులు చర్యలు చేపట్టారు.

కాలమానిని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఉమా తదితరులు

దివ్యాంగులకు ప్రభుత్వం భరోసా

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోందని విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం అజిత్‌సింగ్‌నగర్‌లోని వివేకానంద ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సక్షమ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దివ్యాంగులతో కలిసి నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం దివ్యాంగుల పింఛను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచడం ద్వారా వారిలో ఆత్మస్థైర్యం పెరిగిందన్నారు. పూర్తి దివ్యాంగులకు రూ.10 వేలు, తలసీమియా బాధితులకు రూ.15వేల ఆర్థిక సహాయం అందిస్తున్నామని వివరించారు. ల్యాప్‌టాప్‌లు, బ్రెయిలీ శిక్షణ, వినికిడి యంత్రాలు.. తదితరాలు అందిస్తూ ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తోందన్నారు. దివ్యాంగుల సంక్షేమం.. ప్రభుత్వ బాధ్యతతో పాటు సమాజమంతా కలిసి చేపట్టాల్సిన అంశమని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

బ్యాంకు అభివృద్ధికి విశ్రాంత ఉద్యోగుల కృషి

అరండల్‌పేట (సీతారాంపురం), న్యూస్‌టుడే : కేడీసీసీ బ్యాంకు అభివృద్ధికి విశ్రాంత ఉద్యోగుల కృషి, అంకితభావం అనిర్వచనీయమని ఆ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం ప్రశంసించారు. అరండల్‌పేటలోని రాష్ట్ర కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయీస్ సంఘం భవనంలో ఆదివారం కేడీసీసీ బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహాజన సభకు ఆయన హాజరయ్యారు. బ్యాంకు అభివృద్ధికి కృషి చేసిన విశ్రాంత ఉద్యోగుల సేవలను స్మరించుకున్నారు. పింఛను, ఆరోగ్య బీమా పెంపుదల, గౌరవప్రదమైన జీవన భద్రత అంశాలపై యాజమాన్యం ఎల్లప్పుడూ సానుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. వారి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నెట్టెం రఘురాం

సంప్రదాయాలను పరిరక్షించుకుందాం

మధురానగర్, న్యూస్‌టుడే : హిందూ సమాజాన్ని, సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ సంరక్షించుకోవాలని రాధా మనోహర్‌దాస్ స్వామిజీ పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి దేవీనగర్ 8వ రోడ్డులో రామకృష్ణాపురం, దేవీనగర్ హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. హిందువులంతా ఐకమత్యంగా ఉండాలని కోరారు. ఏ చిన్న సమస్య వచ్చినా కలసికట్టుగా ముందుకు రావాలని కోరారు. ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కనీసం ముగ్గురు పిల్లలను కనాలని కోరారు. హిందూ సంస్కృతి, సమాజాన్ని చైతన్యం చేసి.. దేశాన్ని విశ్వగురువుగా నిలపాలని పిలుపు ఇచ్చారు. మహా విద్యానందగిరి మాతాజీ మాట్లాడుతూ.. జీవకోటి సంరక్షణలో గోవుల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. గోవు లేకపోతే భూసారం తగ్గుతుందన్నారు. ఆర్ఎస్ఎస్ ఏపీ ప్రాంత కార్యాలయ ప్రముఖ్ పూర్ణ ప్రజ్ఞ హిందూ ధర్మ పరిరక్షణకు సంస్థ అందిస్తున్న తోడ్పాటును వివరించారు. హిందువుగా ప్రతి ఒక్కరూ గర్వించాలని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న రాధా మనోహర్‌దాస్ స్వామిజీ

ఆకట్టుకున్న ప్రదర్శన : తొలుత రామకృష్ణాపురం గ్రంథాలయం నుంచి దేవీనగర్ వరకు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. మహిళలు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు. సభావేదిక వద్దకు రాగానే అందరూ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ట్రెండ్ సెట్ మెడోస్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గొడవర్తి నరసింహారావు, యర్రంశెట్టి మురళీ, రామాయణపు రామమూర్తి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

'పేదల పక్షాన నిలిచేది కాంగ్రెస్ పార్టీనే'

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : దేశంలో పేదల పక్షాన నిలబడిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలీ పేర్కొన్నారు. రైతులు, కార్మికుల హక్కుల పరిరక్షణే లక్ష్యమని చెప్పారు. ఆదివారం ఆంధ్రరత్న భవన్‌లో ఆ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వేచ్ఛ, రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలను అందించిందని కొనియాడారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి దిశా నిర్దేశం చేసిందన్నారు. 141 ఏళ్ల ప్రజా సేవా ప్రయాణంలో అనేక ఒడిదొడుకులను ఎదుర్కొందని గుర్తుచేశారు. మహాత్మాగాంధీ అహింసా ఉద్యమం, నెహ్రూ ఆధునిక భారత నిర్మాణం, ఇందిరాగాంధీ బలమైన నాయకత్వం, రాజీవ్ సాంకేతిక విప్లవం దేశాన్ని అగ్రస్థానంలో నిలిపాయని వివరించారు. సామాజిక న్యాయం, సమానత్వమే పార్టీ మూల సిద్ధాంతమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కొలనుకొండ శివాజీ, నరహరిశెట్టి నరసింహారావు, వల్లూరు భార్గవ్, మమతా నాగిరెడ్డి, లక్కరాజు రామారావు, లెనిన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న మస్తాన్‌వలీ, నరసింహారావు, శివాజీ తదితరులు

తవ్వారు.. వదిలేశారు..

స్థానిక వానపాల వారి వీధిలో మంచినీటి పైపు లైన్ల కోసం తీసిన గోతులను నిర్లక్ష్యంగా వదిలివేయడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సమీపంలో ఆలయాలు ఉండడంతో నిత్యం ఇటువైపుగా రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. రహదారి మధ్యలో తీసిన గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో అవి కనిపించక.. వాహనచోదకులు అదుపుతప్పి కింద పడుతున్నారు. గత వారం రోజుల్లో చాలా మంది ప్రమాదాలబారినపడ్డారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సత్యనారాయణపురం (గాంధీనగర్)**

భక్తిపారవశ్యంలో మహా పడిపూజ

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో ఆదివారం అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీహరిహరసుత అయ్యప్ప సేవా సమితి భక్త బృందం గురుస్వామి జంధ్యాల రామకృష్ణ ఆధ్వర్యంలో పూజలు చేశారు. స్వాములు భక్తిపారవశ్యంలో మునిగారు. ఉదయం గణపతి హోమం నిర్వహించారు. భజనలతో స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. అయ్యప్ప స్వామికి హారతి ఇచ్చి అన్నప్రసాద వితరణ చేశారు.

జంధ్యాల రామకృష్ణను సత్కరిస్తున్న స్వాములు

బాలల సృజన భళా

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : చిన్నారుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఠాగూర్ గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి పేర్కొన్నారు. ఆదివారం ఆటవిడుపు కార్యక్రమాల్లో భాగంగా గ్రీటింగ్ కార్డుల తయారీలో పోటీలు నిర్వహించారు. బాల బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ ఆలోచనలకు పదును పెట్టారు. 2025కి వీడ్కోలు పలుకుతూ 2026కి స్వాగతం పలుకుతూ.. కొత్త కొత్త డిజైన్లలో కార్డులు తయారు చేసి భళా అనిపించారు. ఇవి అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు కొత్త సంవత్సరంలో కష్టపడి చదవాలని ఆమె ఆకాంక్షించారు. గ్రంథాలయ సిబ్బంది వై.ధనలక్ష్మి, ఎం.వెంకటేశ్వర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

ఉత్సాహంగా కరాటే పోటీలు

పాయకాపురం, న్యూస్‌టుడే : శాంతినగర్ కోఇక్యూ కరాటే అకాడమీలో ఆదివారం ఇంటర్నేషనల్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. వందల మంది విద్యార్థులు హాజరై.. ప్రతిభచాటారు. వీరికి ప్రశంసాపత్రాలు, బెల్ట్‌లు అందజేశారు. వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.గౌతమ్‌రెడ్డి, అకాడమీ చీఫ్ కోచ్ బల్లం కిషోర్, మాస్టర్లు పి.మురళీ, ఎం.కన్నా పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

కళాకారులకు చేయూత

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : మరుగున పడుతున్న కళలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ధూపాటి శ్రీదేవి అన్నారు. చెక్కభజన, కోలాటం, హరికథ, బుర్రకథ, హనుమాన్ చాలీసా పారాయణం వంటి వాటిని ఆదరించాలని కోరారు. ఆదివారం అయోధ్యనగర్‌లోని లోటస్ ల్యాండ్ మార్క్ వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా పలమనేరు సమీపంలోని బైరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 20 మంది పేద కళాకారులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమలో యాక్టివ్ లేడీస్ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.



దుస్తులు అందిస్తున్న శ్రీదేవి తదితరులు

ఆకట్టుకున్న ఛత్రపతి శివాజీ నాటకం

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : హిందూ ధర్మ పరిరక్షకుడు ఛత్రపతి శివాజీ చరిత్రాత్మక నాటకం ప్రేక్షకులను అలరించింది. ఆదివారం అజిత్‌సింగ్‌నగర్‌లోని వివేకానంద ఇంగ్లిషు మీడియం పాఠశాలలో సంస్కార భారతి, సీబీఆర్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్, ఎడ్యుకేషన్ సంయుక్త నిర్వహణలో ఈ నాటకం ప్రదర్శించారు. పవిత్ర హిందూ స్వరాజ్య స్థాపనకు పరాక్రమించిన యోధుడు.. నాటి పాలకులను తరిమికొట్టి హిందూ స్వరాజ్యాన్ని స్థాపించిన రోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. శివాజీ తల్లి జిజియాబాయి బాల శివాజీలో దేశభక్తిని తీర్చిదిద్దిన విధానం, గురువు సమర్థ రామదాసు దిశానిర్దేశం, శివాజీ హిందూ ధర్మ పరిరక్షణకు చేసిన త్యాగం, సాధించిన విజయాలను కళ్లకు కట్టారు. సంస్కార భారతి అధ్యక్షుడు పి.వి.ఎన్ కృష్ణ, సీబీఆర్ అకాడమీ అధినేత చలసాని బలరామయ్య, శ్రీసాయిబాబా నాట్యమండలికి చెందిన 60 మంది నటీనటులు ప్రేక్షకులను అలరించారు.

నాటకంలో ఓ సన్నివేశం

నిరాశ్రయులకు ఆసరా

విజయవాడ సాంస్కృతికం: చలికి వణుకుతూ ఇబ్బందిపడుతున్న యాచకులు, పేదలు, నిరాశ్రయులకు మానవతా దృక్పథంతో ఏటా దుప్పట్లు పంపిణీ చేయడం ఆనందదాయకం అని ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు అన్నారు. ఆదివారం ఎక్స్‌రే ఆధ్వర్యంలో ఘంటసాల సంగీత కళాశాల నుంచి బీఆర్టీఎస్ రోడ్డులోని నిరాశ్రయులకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. సమాజ సేవకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజం మార్పును ఆశిస్తూ రచనలు చేసే కవులు, కళాకారులు కలిసి సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. సంస్థ కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ.. సంస్థ అధ్యక్షుడు కొల్లూరి స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. సంస్థ కన్వీనర్ జయశ్రీ, ఉపాధ్యక్షుడు వసంతకుమార్, సంయుక్త కార్యదర్శి ఏడుకొండలు పాల్గొన్నారు.

దుప్పట్లు అందిస్తున్న ఎక్స్‌రే సంస్థ నిర్వాహకులు

అప్పలరాజుపై పీడీ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

రాఘవయ్యపార్క్ కూడలి (కృష్ణలంక), న్యూస్‌టుడే : అనకాపల్లి జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలరాజుపై ప్రభుత్వం పెట్టిన పీడీ చట్టాన్ని ఉపసంహరించుకుని, ఆయన్ని జైలు నుంచి విడుదల చేయాలని రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో బాలోత్సవ భవన్‌లో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి, రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉండగా ప్రజాస్వామ్యం గురించి మాట్లాడి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యాన్ని అణిచివేస్తున్నారని విమర్శించారు. రైతుల భూములను అక్రమంగా కార్పొరేట్లకు కట్టబెడుతూ, మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసే పరిశ్రమలు ఏర్పాటు చేస్తుంటే దానిని ప్రశ్నించడమే అప్పలరాజు చేసిన నేరంగా ప్రభుత్వం భావిస్తోందన్నారు. మాజీ ఎంపీ పి.మధు మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో హక్కుల గురించి మాట్లాడేవారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హక్కులను హరించేలా పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. సంఘాల నాయకులు మాట్లాడుతూ.. రౌడీలు, గూండాలు, అసాంఘిక శక్తులు, భూకబ్జాదారులపై పెట్టాల్సిన పీడీ చట్టాన్ని రైతు నాయకుడిపై ప్రయోగించడం దారుణం అన్నారు. భాజపా ప్రభుత్వం 2026, మార్చి 31నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తామంటుంటే.. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజల పక్షాన పోరాడుతున్న వారిపై కేసులు పెడుతోందని విమర్శించారు. అఖిలభారత న్యాయవాదుల సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్, న్యాయవాది పొత్తూరు సురేష్ కుమార్ మాట్లాడుతూ.. అప్పలరాజు అక్రమ అరెస్టుపై ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేస్తామన్నారు. న్యాయం కోసం చివరి వరకు ఉద్యమ కార్యకర్తల వెంట ఉంటామని హామీ ఇచ్చారు. వివిధ సంఘాల ప్రతినిధులు వి.వెంకటేశ్వర్లు, వి.ఉమామహేశ్వరరావు, చండూరు రంగారావు, వై.కేశవరావు, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్. వేదికపై శోభనాద్రీశ్వరరావు, మధు తదితరులు

4న బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం మహాసభ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : రాష్ట్రంలో బీసీ, ఓబీసీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని ఆల్ ఏపీ బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 2026, జనవరి 4న తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సంఘం మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా మంత్రి నారా లోకేశ్, పల్లా శ్రీనివాసరావుతో పాటు 8 మంది బీసీ మంత్రులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. మహాసభ ఏర్పాట్లపై ఆదివారం గవర్నర్‌పేటలోని కమర్షియల్ ట్యాక్స్ యూనియన్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం, ప్రధాన కార్యదర్శి పక్కి భూషణరావు, కోశాధికారి వై.శంకరరావు తదితరులు మాట్లాడారు. ఏప్రిల్ 11న జ్యోతిరావు పులె జయంతి సందర్భంగా ద్విశతాబ్ధి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. ఆ రోజు సెలవు దినంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పులె జయంతిని జనవరి 3న నిర్వహించాలని, ఆమె జీవితచరిత్రను పాఠ్యాంశంగా పెట్టాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు స్టడీ లీవ్‌లు ఇచ్చినట్లుగానే.. బీసీలకూ ఇవ్వాలని కోరారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా బీసీ ఉద్యోగులు ఈ కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అసోసియేట్ ప్రెసిడెంట్ కేదారేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు బత్తుల అప్పారావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు హేమలత, వివిధ జిల్లాల ముఖ్య నాయకులు హాజరయ్యారు.

(c) eenadu

ఉత్తర ద్వారంలో కనులారా స్వామిని దర్శించుకునేలా..!

సింహాచలం, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సింహాద్రి అప్పన్న స్వామి దర్శనానికి సుమారు 50 వేల మంది భక్తులు వస్తారనే అంచనాతో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా వివరాలను ఆదివారం ఈవో సుజాత విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

★ 'ఈ ఏడాది ఆన్‌లైన్ ద్వారా 9వేల టికెట్లు విక్రయిస్తున్నారు. సోమవారం సాయంత్రం వరకు అవి అందుబాటులో ఉంటాయి. ఉత్తర ద్వారంలో కొలువైన స్వామిని భక్తులు క్యూలైన్ల ద్వారా పది నిమిషాల పాటు దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. ఉదయం 11గంటల వరకే ఈ

ఉత్తర రాజగోపురం వద్ద జరుగుతున్న పనులు

దర్శనం ఉంటుంది. తర్వాత వచ్చిన భక్తులకు సాధారణ దర్శనాలు ఉంటాయి. 30న కేవలం లడ్డూ ప్రసాదం మాత్రమే విక్రయిస్తారు. ఆ మేరకు లక్ష లడ్డూలు తయారు చేస్తున్నారు. 20 వేల మంది భక్తులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు పొంగలి, పులుసు సిద్ధం చేస్తున్నారు.

★ వాహనాల రద్దీ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు. వివిధ ప్రభుత్వశాఖల సమన్వయంతో పాటు దేవాదాయశాఖ నుంచి అదనపు సిబ్బంది రప్పించేలా చర్యలు తీసుకున్నారు. స్వచ్ఛంద సేవకుల సహకారం తీసుకుంటున్నారు. 29న సాయంత్రం 6 గంటలకు స్వామివారి దర్శనాలు నిలిపివేస్తారు. ఈ సందర్భంగా కొండ కింద నుంచి బస్సులు ఉండవు. 30న వేకువజామున 4 గంటల నుంచి సింహగిరికి బస్సులు ప్రారంభమవుతాయి' అని ఈవో పేర్కొన్నారు.

★ ఏఈవోలు తిరుమలేశ్వరరావు, రమణమూర్తి, ఈఈ సీహెచ్.రమణ, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ పరీక్షలకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం, న్యూస్‌టుడే: వివిధ ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయివేటు సంస్థలలో పనిచేస్తున్న అభ్యర్థులకు ఐటీఐ వివిధ ట్రేడ్‌లలో పరీక్షలు రాసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కంచరపాలెంలోని ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపల్ ఎన్.సోలమన్ తెలిపారు. సంబంధిత ట్రేడ్‌నందు అభ్యర్థులు మూడేళ్ల పైబడిన సర్వీసు కలిగి ఉండాలన్నారు.

వాట్సాప్‌లోనే బస్సు టికెట్

ఎలమంచిలి, న్యూస్‌టుడే

సంక్రాంతి పండగ సమీపిస్తోంది. ఈ సీజన్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆర్టీసీ బస్సుల్లో సీట్లు దొరకని పరిస్థితి. పండగకు దాదాపు 50 శాతం మంది సొంత గ్రామాలకు బంధువుల ఇళ్లకు వెళతుంటారు. ముందుగా టికెట్లు బుక్ చేసుకుంటే ప్రయాణం సుఖంగా ఉంటుంది. ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా వెళ్లి రావచ్చు. టికెట్ల కోసం బస్టాండ్ దగ్గర బుకింగ్ కౌంటర్‌ల వద్దకు వెళ్లాల్సిన పనిలేకుండా ఇంట్లో చరవాణి ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చని జిల్లా ప్రజా రవాణా అధికారి వి.ప్రవీణ చెబుతున్నారు.

మీకోసం

టికెట్టు పొందడం ఇలా..: ముందుగా వాట్సాప్‌లో 95523 00009 నంబరు సేవ్ చేసుకోగానే హాయ్! అని మెసేజ్ పంపాలి. వెంటనే అందులో స్పందన వస్తుంది. సర్వీసు ఎంచుకుని ఏపీఎస్ ఆర్టీసీ సర్వీసుపై క్లిక్ చేయాలి. టికెట్ బుకింగ్ ఎంపిక చేసుకుని ప్రయాణ తేదీ, ఎక్కడకు వెళ్లాలి, ప్రయాణికుల సమాచారం నమోదు చేయాలి. ఆన్‌లైన్ చెల్లింపులో టికెట్టు ధరను చెల్లించాలి. బస్టాండ్‌లు తదితర ప్రాంతాల్లో ఆర్టీసీ క్యూఆర్ కోడ్‌ను చరవాణిలో స్కాన్ చేయడం ద్వారా కూడా టికెట్లు బుక్ చేసుకోవచ్చు.

అడ్డురోడ్డుకు మహర్దశ!

✦ రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఎంపిక
✦ ఈనెల 31కి తుది నోటిఫికేషన్ వచ్చే అవకాశం

ఈనాడు డిజిటల్, అనకాపల్లి – న్యూస్‌టుడే, నక్కపల్లి

నక్కపల్లి కేంద్రంగా ఏర్పాటు చేయాల్సిన కొత్త రెవెన్యూ డివిజన్‌ను ప్రభుత్వం మార్చింది. ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు కూడలిలో దీనిని ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. మంత్రులు, అధికారులతో సీఎం చంద్రబాబునాయుడు అమరావతిలో ఇటీవల నిర్వహించిన మంత్రివర్గ ఉపసంఘం సమీక్షలో రెవెన్యూ డివిజన్ మార్పుపై నిర్ణయం తీసుకున్నారు. దీంతో నక్కపల్లికి బదులు అడ్డురోడ్డు కేంద్రంగా డివిజన్ ఏర్పాటు కానుంది.

అడ్డురోడ్డు కూడలి

■ పారిశ్రామికాభివృద్ధి పరంగా శరవేగంగా అడుగులు వేస్తున్న నక్కపల్లిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మంత్రి అనిత చొరవ చూపారు. ఇందుకు మంత్రివర్గ ఉపసంఘంలోనూ ఆమోదం లభించింది. ప్రాథమిక నోటిఫికేషన్ తర్వాత.. రాష్ట్రవ్యాప్తంగా నూతన జిల్లాలు, డివిజన్ల ఏర్పాటుపై అభ్యంతరాలను స్వీకరించింది. ఈ క్రమంలో నక్కపల్లి డివిజన్‌ను తప్పించి.. ఎలమంచిలి కేంద్రంగా నూతన రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయాలంటూ ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలు నిరసనలు తెలిపారు. స్థానిక కూటమి నేతలు సైతం ఎలమంచిలి కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయాలంటూ ప్రతిపాదించడంతో దీంతో ఇక్కడి ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని నక్కపల్లికి బదులుగా దీనికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అడ్డురోడ్డు జంక్షన్‌ను డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. తద్వారా ఆయా ప్రాంతాల వారికి మరింత అందుబాటులో ఉంటుందని ఆలోచన.

మునగపాక అనకాపల్లిలోనే: జిల్లా కేంద్రానికి అతి దగ్గరగా ఉన్న మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లోనే ఉంచాలని స్థానిక నేతలు, ప్రజలు విన్నవించారు. ఇటీవల జిల్లా డీఆర్సీ సమావేశంలోనూ అనకాపల్లిలోనే మునగపాక మండలాన్ని కొనసాగించాలని తీర్మానించారు. మరోవైపు చీడికాడ మండలాన్ని నర్సీపట్నం నుంచి అనకాపల్లి డివిజన్‌లో కలిపేలా మారుస్తున్నారు. దీంతో అనకాపల్లిలో 10, నర్సీపట్నం, అడ్డురోడ్డు రెవెన్యూ డివిజన్లలో ఏడేసి మండలాల చొప్పున కొనసాగనున్నాయి. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల, ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలతో అడ్డురోడ్డు కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు కానుంది. ఈ నెలాఖరున ప్రభుత్వ తుది నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది.

అభివృద్ధిలో వేగంగా .. తుని, పాయకరావుపేట తర్వాత అడ్డురోడ్డు వాణిజ్యపరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. పేరుకే తిమ్మాపురం పంచాయతీలో ఉన్నా.. అందరికీ అడ్డురోడ్డు పేరే సుపరిచితం. ఇక్కడ అనేక విద్యా సంస్థలు, ఆసుపత్రులు, వస్త్ర, ఇతర వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లు, స్థిరాస్తి వ్యాపారం.. ఇలా అన్నివిధాలా అభివృద్ధి చెందుతోంది. దీనికి తోడు పర్యాటక ప్రాంతమైన రేవుపోలవరం తీరం కూడా ఇదే మండలంలో ఉంది.

■ మరోవైపు ఆది నుంచి నక్కపల్లి పేరును తెరపైకి తెచ్చి చివరిలో అడ్డురోడ్డు డివిజన్ ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

మట్టి కొల్లగొట్టారు.. గుట్ట గుల్ల చేశారు!

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలంలోని పలు గ్రామాల్లో గ్రావెల్, మట్టి తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో, కార్యాలయాలకు సెలవు దినాల్లో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ భూములు, డీపట్టా, రహదారులు, కాలువల పక్కన మట్టిగుట్టల్లో తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రైవేటు లేఅవుట్లకు మట్టి తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. కొండెంపూడి ముఖద్వారంలోని పెద్ద గుట్టను ఏకంగా పొక్లెయిన్‌తో తవ్వి ఇతర ప్రాంతాలకు తరలించారు. అయినా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదు. వీరభద్రపేట, జైతవరం, అడవి అగ్రహారం, బైలపూడి, చీడికాడ, మంచాల, కోనాం, చుక్కపల్లి, అర్జునగిరి ఇలా పలుగ్రామాల్లో పెద్ద ఎత్తున గ్రావెల్, మట్టి తవ్వకాలు యథేచ్ఛగా చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే దాడులు చేయడానికి వెనకాడలేదు. అక్రమ తవ్వకాలపై నిఘా పెంచుతున్నాం.. చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అక్రమార్కులను అడ్డుకోవడంలో విఫలమవుతున్నారు. మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలని ఇటీవల చీడికాడలో జరిగిన ప్రజా దర్బార్‌లో పొక్లెయిన్, ట్రాక్టర్ల యజమానులు వినతిపత్రం అందించడం మరో విశేషం.

కొండెంపూడి వద్ద మట్టి తవ్వుతున్న పొక్లెయిన్

ప్రభుత్వ ఆదాయానికి గండి.. సాధారణంగా తవ్వకాలు చేయాలంటే గనుల శాఖ అనుమతి తీసుకోవాలి. సంబంధిత అధికారులు మట్టి, గ్రావెల్ తవ్వకం చేసే ప్రాంతాన్ని పరిశీలించి ఎంత లోతు తవ్వాలి, ఎన్ని ఘనపు అడుగుల మేర తవ్వకాలు చేయవచ్చు అనేది నిర్ధారిస్తారు. ఆ తరవాతే తవ్వకాలకు అనుమతిస్తారు. మండలంలో మాత్రం అలాంటివేమీ లేకుండా ట్రాక్టర్ గ్రావెల్ నుంచి రూ.వెయ్యి, ట్రాక్టర్ మట్టి రూ.700 వసూలు చేసి రెండుచేతులా ఆర్జిస్తున్నారు.

అనుమతులు లేకుండా తరలిస్తే చర్యలు

అనుమతులు లేకుండా ఎక్కడైనా అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలిస్తే చర్యలు తీసుకుంటాం. మట్టి, గ్రావెల్, ఇసుక అవసరమైన వారు ఎవరైనా రెవెన్యూ కార్యాలయంలో తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి.

– కిశోర్‌లింకన్, తహసీల్దార్, చీడికాడ

కొత్త 'కట్టు'కథ

నిర్వాసిత ప్రాంతాల్లో పరిహారం కోసం ఎత్తుగడ

నక్కపల్లి, న్యూస్‌టుడే

నక్కపల్లి మండలంలోని పారిశ్రామిక ప్రాంతంలో ఏపీఐఐసీ ద్వారా పరిహారం, ప్యాకేజీల కోసం కొందరు ఎత్తుగడలు వేస్తున్నారు. ఇందుకు నిర్వాసిత గ్రామాల్లో ఆగమేఘాలపై నూతన నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదంతా అధికారుల కళ్ల ముందే జరుగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం విశేషం.

పరిశ్రమల నిమిత్తం నక్కపల్లి మండలంలోని పలు గ్రామాల్లో 4300 ఎకరాలకు పైగా భూములను తీసుకోగా.. చందనాడ, తమ్మయ్యపేట, తుమ్మలపేట, పాటిమీద, డి.ఎల్.పురం, మూలపర్ర గ్రామాల్లో దాదాపు 300కు పైగా ఇళ్లను తీసుకున్నారు. వీటి పరిధిలో 745 మంది లబ్ధిదారులను గుర్తించారు. తొలగించే ఇళ్లు, ఇతర నిర్మాణాలకు పరిహారం చెల్లించడంతోపాటు, అర్హులందరికీ ప్యాకేజీ కింద రూ.8.98 లక్షల నగదు, అయిదు సెంట్ల చొప్పున ఇంటి స్థలం కేటాయించారు. పెదబోదుగల్లం ఇళ్ల స్థలాలను ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా పునరావాస కాలనీ తయారు చేస్తున్నారు. ఇప్పటికే ఇళ్ల స్థలాల కేటాయింపు పూర్తి చేశారు. ఇప్పుడు మళ్లీ గ్రామాల్లో కొందరు నాయకులు స్థానికులను మభ్యపెట్టి పరిహారం

తమ్మయ్యపేటలో కొత్తగా నిర్మాణం

కోసం కొత్త కథకు తెర తీశారు. ఈ క్రమంలో ఖాళీ స్థలాల్లో రేకుల షెడ్లు వేయిస్తున్నారు. వీటి నిర్మాణ ఖర్చు తక్కువగా ఉన్నప్పటికీ పరిహారం ద్వారా ఎక్కువ పొంది, తద్వారా ప్యాకేజీ వస్తుందని ఆశపడుతున్నారు. తాజాగా తమ్మయ్యపేట గ్రామంలో ఇలాంటి కొత్త నిర్మాణాలు అనేకం చేపట్టారు. మరింత మంది నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. తమకు పై అధికారులతో పరిచయాలు ఉన్నాయని, షెడ్లు వేసుకుంటే పరిహారం, ప్యాకేజీ ఇప్పిస్తామని కొందరు నాయకులు చెబుతూ, ఇందుకుగాను తమకింత చెల్లించాలనే లోపాయికారీ ఒప్పందాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. వాస్తవంగా నిర్వాసిత ప్రాంతాల్లో ఉన్న నిర్మాణాలకు తుది గడువుగా 2024 డిసెంబరు నెలాఖరు వరకు మాత్రమే ఇచ్చారు. వీటన్నింటినీ కాదని, ఇప్పుడు నూతన నిర్మాణాలు చేస్తుండటం విశేషం.

ఇలాంటి వాటికి పరిహారం ఇచ్చేది లేదు

నిర్వాసిత గ్రామాల్లో ఇప్పటికీ కొందరు నిర్మాణాలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. వీటిపై దృష్టి సారించాం. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటికి సంబంధించి ఎలాంటి పరిహారం ఇచ్చేది లేదు. దీనిపై మా ఉద్యోగులకు స్పష్టమైన సూచనలు చేశాం.

– నరసింహారావు, ఏపీఐఐసీ, జడ్ఎం

ఉద్యోగులపై చర్యలు తప్పవు... పారిశ్రామిక ప్రాంతంలోని ఇళ్లను తొలగించే గ్రామాల్లో గతేడాది డిసెంబరు వరకు మాత్రమే కటాఫ్ ఇచ్చారు. వీటన్నింటికీ సంబంధించి సర్వే చేసి నివేదికలు ఇచ్చారు. ఇప్పుడు కొత్తగా నిర్మాణాలు చేసి పరిహారం.. ప్యాకేజీ కావాలంటే కుదరదు. గ్రామాల్లో కార్యదర్శులు ఎవరైనా ఇంటి పన్నులు ఇచ్చి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

– ఆర్.నరసింహమూర్తి, తహసీల్దారు

భూ సమస్యలకు సత్వర చెక్!

కలెక్టరేట్, న్యూస్‌టుడే: భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం రెవెన్యూ క్లినిక్ విధానానికి శ్రీకారం చుట్టింది. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం ఈ క్లినిక్ అర్జీదారులు, రైతులకు అందుబాటులో ఉండనుంది. ఇప్పటికే ఈ విధానం పార్వతీపురం మన్యం జిల్లాలో అనుసరిస్తున్నారు. పీజీఆర్ఎస్‌కు ఎక్కువగా భూ సమస్యలే వస్తున్నాయి. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు 300 నుంచి 400 వరకూ అర్జీలు వస్తాయి. వీటిలో రెవెన్యూ, భూ సంబంధిత అర్జీలు 200 పైనే ఉంటున్నాయి. వాటిని సకాలంలో పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారు. కొర్రీలు పెట్టి వెనక్కి నెట్టేస్తున్నారు. దీంతో ఈ సమస్య తీవ్రమవుతోంది. అర్జీదారుల్లో సంతృప్తి స్థాయి సైతం పెరగడం లేదు. ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించే దిశగా ఈనెల 29 నుంచి ఈ కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. కలెక్టరేట్‌లో సోమవారం రెవెన్యూ క్లినిక్ ఏర్పాటుకు కలెక్టరేట్ వర్గాలు ఏర్పాట్లు చేపట్టాయి.

ఈ కొత్త విధానంలో తహసీల్దార్లు అందరూ ఒక చోట ఉంటారు. వీరిని నాలుగు బృందాలుగా విభజించి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. వీరికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వ, జిరాయితీ భూముల ఆక్రమణ, రీసర్వే లోపాలు, ఎఫ్-లైన్ పిటీషన్లు, డీపట్టా, వెబ్‌ల్యాండ్‌లో విస్తీర్ణం నమోదు, మ్యుటేషన్, 22-ఏ నుంచి భూముల తొలగింపు, జాయింట్ ఎల్పీఎంలు విభజన, హద్దులు, పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు ఇలా 16 రకాల సమస్యలపై వినతులు స్వీకరిస్తారు. అన్ని అర్జీలు ఒకచోట కాకుండా అంశాల వారీగా కౌంటర్లు పెట్టి స్వీకరిస్తారు. ప్రతి అర్జీకి ఒక నంబరు కేటాయిస్తారు. దరఖాస్తుతోపాటు ఫోన్ నంబరు, ఆధార్‌కార్డు వివరాలు నమోదు చేస్తారు. సమస్య ఆధారంగా సంబంధిత సిబ్బందికి సమాచారం ఇచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. ఈ విధానంలో భూ సమస్యలు తక్షణమే పరిష్కరించి అర్జీదారుల్లో సంతృప్తి స్థాయి పెంచనున్నారు. ఎలాంటి వివాదం లేని భూ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించనున్నారు.

ర్యాంప్‌వాక్ భలే.. ఉత్సాహం ఉరకలేసే..!

ద్వారకానగర్ సెంట్రల్ పార్కు వద్ద ఓ ప్రైవేటు సంస్థ ఆదివారం మోడలింగ్‌పై ఉచిత కార్యశాల ఏర్పాటు చేసింది. దీంతో అక్కడికి వచ్చిన వారు అప్పటికప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. చిన్నారులు, యువతకు ర్యాంప్‌పై ఎలా నడవాలి.. మోడలింగ్ ఎలా చేయాలి.. ఆకట్టుకునేలా ఎలాంటి దుస్తులు ధరించాలనే అంశాలపై నిర్వాహకులు మెలకువలు నేర్పించారు. అనంతరం పిల్లలు, యువతులు వేదికపై ఉత్సాహంగా ర్యాంప్‌వాక్ చేసి అలరించారు. – ఈనాడు, విశాఖపట్నం

ఆయుష్‌కు ఆధునిక హంగులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

జీవన శైలి, ఆహారపు అలవాట్లతో ప్రజలు దీర్ఘకాల వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ రోగాలకు ఆయుర్వేదం, హోమియో చికిత్స విధానాలతో సత్ఫలితాలు వస్తుండటంతో వీటికి ఆదరణ పెరుగుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ వైద్యసేవలను విస్తృతం చేస్తోంది.

జిల్లాలో సంప్రదాయ వైద్యవిధానానికి సంబంధించి 26 ఆసుపత్రులు ఉన్నాయి. వీటిలో నేచురోపతి ఒకటి, 14 ఆయుర్వేద, 11 హోమియో వైద్యశాలలు ఉన్నాయి. వీటన్నింటిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులు, సిబ్బందిని భర్తీ చేశారు. ఆసుపత్రుల ఆధునికీకరణకు నిధులు మంజూరు చేశారు. చోడవరం మండలం గవరవరం, దేవరాపల్లి, ఎలమంచిలి గొలుగొండ ఎ.ఎల్.పురంలలో ఆసుపత్రుల్లో వసతులు మెరుగుపరుస్తున్నారు. పనుల్లో భాగంగా ఈ వైద్యశాలల స్థలాలను ఆయుష్ విభాగం అధికారులు పరిశీలించారు. మాడుగుల మండలం ఖండివరం, కె.కోటపాడులో హోమియో వైద్య సేవలకు ఆసుపత్రులను సిద్ధం చేస్తున్నారు. జాతీయ ఆయుష్ మిషన్ నిధులతో ఈ సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేలా చర్యలు చేపడుతున్నారు.

దేవరాపల్లిలో పీహెచ్‌సీని పరిశీలిస్తున్న అధికారులు

ప్రైవేటుగా లభ్యమయ్యే ఖరీదైన మందులను ఇక్కడ అందుబాటులో ఉంచారు.

■ ఆయుష్ ఆసుపత్రులను ఆధునికీకరించేందుకు నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభించనున్నారు. జిల్లాలో 26 ఆసుపత్రులకు సరిపడా మందులను పంపిణీ చేశాం. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలి. దీర్ఘకాల వ్యాధుల చికిత్సకు ఆయుష్‌లో మంచి వైద్యంతోపాటు మందులు ఉన్నాయి.

– డాక్టర్ లావణ్య, జిల్లా ఆయుష్ అధికారి

అరకుకు నేడు ప్రత్యేక రైలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: పండగ రోజుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వారికి కల్పిస్తున్న మౌలిక సదుపాయాల గురించి తెలుసుకునేందుకు వాల్తేర్ డీఆర్ఎం లలిత్ బోహ్రా ఆదివారం విశాఖ రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్లాట్‌ఫామ్‌ల పరిశుభ్రత, ప్రయాణికుల భద్రతకు సంబంధించిన పలు అంశాలపై ఆరా తీశారు. విశాఖ - కిరండూల్ మార్గంలో నడిచే రైలుకు అరకు ప్రయాణికుల తాకిడి అమాంతం పెరగడంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై 'ఈనాడు'లో వరుసగా కథనాలు ప్రచురించడంతో ఆయన స్పందించారు. రద్దీ రోజుల్లో విశాఖ-అరకు మధ్య ప్రత్యేక రైలు నడపడంతో పాటు, ప్రస్తుతం నడుస్తున్న రైలుకు ఒక సాధారణ రెండో తరగతి బోగీని అదనంగా జత చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 29 నుంచి జనవరి 20 వరకు విశాఖ - కిరండూల్ రైలుకు, ఈనెల 30 నుంచి జనవరి 21 వరకు కిరండూల్-విశాఖ రైలుకు ఒక అదనపు సాధారణ బోగీ జత చేయనున్నట్లు తెలిపారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 29న విశాఖ-అరకు (08525/08526) మధ్య ప్రత్యేక రైలు నడపనున్నట్లు తెలిపారు.

చురుగ్గా కొనుగోళ్లు.. చకచకా చెల్లింపులు

చీడికాడ, న్యూస్‌టుడే

ఈ ఏడాది ఖరీఫ్‌లో వాతావరణ పరిస్థితులు కలిసిరావడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. దళారుల వల మాయాజాలంలో చిక్కకుండా కూటమి ప్రభుత్వం సకాలంలో ధాన్యం సేకరణ కేంద్రాలు అందుబాటులోకి తేవడం అన్నదాతలకు వరంగా మారింది.

జిల్లాలో కోనాం, రైవాడ, పెద్దేరు, తాండవ, కల్యాణపులోవ జలాశయాలతో పాటు చెరువులు అధికంగానే ఉన్నాయి. వర్షాలకు జలాశయాలు, చెరువులో సమృద్ధిగా నీరు చేరింది. దీంతో జిల్లాలో భూగర్భ జలాలు మెరుగయ్యాయి. ఇవన్నీ ఖరీఫ్ సాగుకు కలిసొచ్చాయి. సాగుకు పెట్టుబడులు కాస్త ఎక్కువే అయినా దిగుబడులు బాగుండటంతో అన్నదాత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరికోతలు రైతులు మొదలుపెట్టగానే ప్రభుత్వం ముందుగా మేల్కొని ధాన్యం సేకరణ దశలవారీగా కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. గత వైకాపా సర్కారులా కాకుండా.. రైతు ధాన్యం విక్రయించిన 24 గంటల వ్యవధిలోనే రైతు ఖాతాలో డబ్బులు జమ చేస్తోంది. దీంతో రైతులు సంక్రాంతి పండగ ముందే కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి విక్రయాలు చేస్తున్నారు.

చీడికాడ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన వాహనాలు

రైతుల ఖాతాలో రూ.20 కోట్ల జమ ... ఖరీఫ్ సీజన్‌లో 45 వేల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటి వరకు 12,764 టన్నుల ధాన్యం సేకరణ జరిగింది. రైతు ధాన్యం విక్రయించిన కొన్ని గంటల్లోనే బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుంది. ధాన్యం సేకరణ ప్రభుత్వం ముందుగానే కొంత నగదు కేటాయించింది. ఇప్పటివరకు ధాన్యం విక్రయించిన అన్నదాతలకు రూ.20 కోట్ల రైతు ఖాతాల్లో జమయ్యాయి. ఎవరికీ బకాయిలు లేవు. మార్చి నెలాఖరు వరకు ధాన్యం సేకరణ జరుగుతుంది. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

– కె.వి.ఎల్.ఎ.ఎస్.మూర్తి, జిల్లా పౌర సరఫరాల అధికారి

■ జిల్లాలో 65 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 16 మండలాల్లో ధాన్యం సేకరణ చురుగ్గా జరుగుతోంది. మిగిలిన ఎనిమిది మండలాల్లో జనవరి మొదటి వారంలో ఏర్పాటు చేయనున్నారు. దిగుబడి ఎక్కువగా ఉండటంతో గతేడాది కన్నా.. ఎక్కువగానే ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ. 2,300, 'ఎ' గ్రేడ్ ధాన్యానికి రూ. 2,320 అందిస్తున్నారు. దీంతోపాటు ఇతర సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోంది.

అరకు చూశారు.. ఇరుక్కుపోయారు!

✦ విశాఖ తిరుగు ప్రయాణంలో పాట్లు
✦ ఎప్పుడూలేని విధంగా ఘాట్‌లో వన్‌వే ఆంక్షలు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకు అందాలు చూసి మధురానుభూతులతో తిరిగి ప్రయాణమైన వారికి ఆదివారం చుక్కలు కనిపించాయి. ఉదయం బస్టాండుకు వచ్చినవారు సాయంత్రం వరకు అరకు దాటలేకపోయారు. విపరీతమైన ట్రాఫిక్ కారణంగా పోలీసులు రాకపోకలపై ఆంక్షలు విధించడంతో పర్యాటకులు అపసోపాలు పడ్డారు.

అరకులోయ కాంప్లెక్స్‌లో నిలిచిన బస్సులు

✦ వరుస సెలవులు, వారాంతం, నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో అరకులోయకు సందర్శకుల తాకిడి విపరీతంగా పెరిగింది. అరకులోయ సందర్శనకు ఆదివారం పర్యాటకులు బారులు తీరారు. పెద్దసంఖ్యలో ఉదయం నుంచి వందలాది వాహనాలతో తరలిరావడంతో విశాఖ- అరకు ఘాట్‌రోడ్డు, మాడగడ వ్యూపాయింట్, స్థానిక సందర్శిత ప్రాంతాలు జనజాతరగా మారాయి. విశాఖ నుంచి అరకు ఘాట్ రోడ్డులో కాఫీ తోటలు, ఉడెన్ బ్రిడ్జి, బొర్రా మార్గంలో ప్రకృతి అందాలను తిలకించేందుకు వాహనాలు నిలిపివేయడంతో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. రద్దీ నివారణకు పోలీసులు ఆంక్షలు విధించారు. ఉదయం నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల అనంతరం కాఫీతోటల సందర్శనకు వీలు కల్పించేలా చర్యలు తీసుకున్నారు.

✦ విశాఖ నుంచి అరకు వచ్చేందుకు మాత్రమే వాహనాలకు అనుమతించారు. వన్‌వేకు మాత్రమే అవకాశం కల్పించి.. అరకు నుంచి విశాఖకు తిరుగు ప్రయాణానికి పాడేరు మీదుగా వెళ్లేలా సూచనలు చేశారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో ఈ చర్యలు తీసుకోవడంతో అప్పటికే అరకులోయ వచ్చిన వాహనాలు విశాఖకు తిరిగి వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో అరకులోయ పరిసరాల్లోనే ఆగిపోవాల్సి వచ్చింది.

✦ విశాఖ, శృంగవరపుకోట నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సులకు తిరిగి వెళ్లేందుకు అవకాశం కల్పించకపోవడంతో అరకులోయ బస్టాండ్‌లోనే నిలిచిపోయాయి. 11 గంటల ప్రాంతం నుంచి బస్సులు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో బస్టాండ్‌లో, అప్పటికే నిలిచిన నాలుగు బస్సుల్లో ప్రయాణికులు కూర్చుని గంటల పాటు వేచి చేశారు. మధ్యాహ్నం తరవాత విషయం ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో 1.30 గంటల తర్వాత బస్సులు బయలుదేరాయి. కానీ స్థానిక డిగ్రీ కళాశాల వద్ద వాహనాలను ఘాట్‌రోడ్డు ప్రయాణానికి అనుమతించకపోవడంతో అక్కడ 3.30 గంటల వరకు నిలిచిపోయాయి.

మెట్లెక్కే కష్టం ఉండదిక!

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి నుంచి ప్రయాణించే రైల్వే ప్రయాణికులకు శుభవార్త.. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న లిఫ్ట్ సౌకర్యం సాకారం కానుంది. నిర్మాణంలో ఉన్న కాలిబాట పైవంతెన వద్ద పనులు చేపడుతున్నారు. నెలరోజుల్లో వీటిని పూర్తి చేసి ప్రయాణికులకు ఈ సౌకర్యం అందుబాటులోకి తేనున్నారు. ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రెండోనంబర్ ప్లాట్‌ఫాంపైకి వెళ్లాలంటే కాలిబాటే దిక్కు. వృద్ధులు, లగేజీ ఎక్కువగా ఉన్న వారు చాలా ఇబ్బందులు పడేవారు. చాలా మంది లగేజీ మోయలేక పట్టాలపై నుంచి దాటుకుని వెళ్లేవారు. ఇలాంటి సందర్భాల్లో ప్రమాదాలు ఎదురయ్యేవి. రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఇక్కడ లిఫ్ట్ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. ఒకేసారి 15 మందికి సరిపోయే సామర్థ్యంతో దీన్ని నిర్మిస్తున్నారు.

ఎలమంచిలి రైల్వేస్టేషన్‌లో కాలిబాట వంతెన వద్ద లిఫ్ట్ నిర్మాణ పనులు

(c) eenadu

మాట్లాడుతున్న త్రినాథ్

వేతన సవరణ సంఘాన్ని నియమించాలి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: సీనియర్ ఉపాధ్యాయులను టెట్ నుంచి పూర్తిగా మినహాయించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య (ఏపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్ కోరారు. ఆదివారం అనకాపల్లిలో ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనుదారులు సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించి, మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని కోరారు. సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.వెంకటపతిరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై బోధనేతర, యాప్‌ల భారం తగ్గించాలని కోరారు. ఉపాధ్యాయులను పూర్తిగా విద్యాబోధనకే పరిమితం చేయాలన్నారు. ఏ శాఖలో లేని విధంగా ఇతర శాఖల అధికారుల పెత్తనాన్ని విద్యాశాఖపై మాత్రమే ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. జిల్లా అధ్యక్షుడు కె.వి.వి.ఎ.ధర్మారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎస్.దుర్గాప్రసాద్, పూర్వపు అధ్యక్ష, కార్యదర్శులు ఎన్వీ సూర్యనారాయణ, ఎన్.సన్యాసినాయుడు, శ్రీనివాస్, బాపునాయుడు, గణేష్, నూకేష్, నరసయ్యనాయుడు, కిరీటి, కన్నారావు, గణపతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రాంతీయ అంతర్ పాలిటెక్నిక్ క్రీడలు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ప్రాంతీయ స్థాయి అంతర్ పాలిటెక్నిక్ క్రీడలు సోమవారం నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ తెలిపారు. పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన 24 ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల జట్లు పాల్గొంటాయన్నారు. మొత్తం సుమారు 816 మంది క్రీడాకారులు వివిధ క్రీడల్లో వారి ప్రతిభను నిరూపించుకుంటారన్నారు. క్రీడాకారులకు మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు, వైద్య సదుపాయాలు, తాగునీరు, వసతి, భోజన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

బంతితో తిప్పేసి.. బ్యాటుతో బాదేసి..

ఉత్సాహంగా 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025'

క్రీడాకారులను ఉత్సాహ పరుస్తున్న ప్రభుత్వ ఛాతి, అంటువ్యాధుల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్, ఏఎంసీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎస్.ఎన్. పాత్రుడు తదితరులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రా మెడికల్ కళాశాల మైదానంలో 'ఈనాడు - ఈతరం క్లబ్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ధనిక్‌భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్' ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్(ఈఎస్ఎల్)-2025' టోర్నీలో ఆదివారం బ్యాటర్లు పరుగులు తీసి ఆకట్టుకున్నారు. వారిని అవుట్ చేసేందుకు ఫీల్డర్లు నానా తంటాలు పడ్డారు. పోటీలను ప్రభుత్వ ఛాతి, అంటువ్యాధి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ పీడీ డాక్టర్ ఎం.ఎస్.ఎన్. పాత్రుడు తదితరులు పాల్గొన్నారు. 'ధనిక్‌భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డేగా ఆంధ్రా మెడికల్ కళాశాల క్రీడాకారుడు ఎల్.మనోజ్ (29 పరుగులు, 2 వికెట్లు) ఎంపికయ్యాడు.

■ **ఆంధ్రా మెడికల్ కాలేజ్ వర్సెస్ డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు:** మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా మెడికల్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 87 పరుగులు చేసింది. జట్టులో ఎల్.మనోజ్ 29, జె.అజయ్ 18 పరుగులు చేశారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు బౌలర్లు వి.ప్రసాద్, ఆర్.సాయి చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు 9.3 ఓవర్లలో 49 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. సీహెచ్.డేవిడ్ 14 పరుగులు చేశాడు. ఏఎంసీ జట్టు బౌలర్లు యోగి 3 వికెట్లు తీయగా, దివాన్స్, మనోజ్ చెరో 2 వికెట్లు తీశారు.

గెలుపొందిన ఆంధ్రా మెడికల్ కళాశాల జట్టు

'ధనిక్ భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

ఎల్.మనోజ్ (29 పరుగులు, 2 వికెట్లు)

■ **రఘు ఇంజినీరింగ్ కాలేజ్ వర్సెస్ డాక్టర్ లంకపల్లి బుల్లయ్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల:** డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ డిగ్రీ అండ్ పీజీ జట్టు 5 వికెట్ల తేడాతో రఘు ఇంజినీరింగ్ జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన రఘు ఇంజినీరింగ్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 74 పరుగులు చేసింది. జి.హర్షిత్ 25, పి.వి.ఎస్.సుహాస్ 21 పరుగులు చేశారు. బుల్లయ్య కాలేజ్ బౌలర్లు జి.రిత్విక్ 3, శ్రీవర్ధన్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బుల్లయ్య కాలేజ్ జట్టు 8.5 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసింది. జట్టులో బస్వంత్ 34, రిత్విక్ 12 పరుగులు చేశారు. రఘు కాలేజ్ బౌలర్లు మౌళి 2, దిలీప్ ఒకటి వికెట్ తీశారు.

ప్రతిభ చూపిన డాక్టర్ లంకపల్లి బుల్లయ్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల జట్టు

■ **ఆదిత్య డిగ్రీ కాలేజ్(గాజువాక) వర్సెస్ అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్:** అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ జట్టు 38 పరుగుల తేడాతో ఆదిత్య డిగ్రీ కాలేజ్‌పై గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన అనిల్ నీరుకొండ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 105 పరుగులు చేసింది. జట్టులో కె.రాకేష్ 29 పరుగులు చేశారు. ఆదిత్య డిగ్రీ కాలేజ్ బౌలర్లు దుర్గ, జయంత్ తలో వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆదిత్య డిగ్రీ కాలేజ్ జట్టు 8 ఓవర్లలో 67 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జి.జయంత్ 31 పరుగులు చేశారు. అనిల్ నీరుకొండ జట్టు బౌలర్లు ఆర్.గగన్ 3, ఎం.సిద్ధార్థ 2 వికెట్లు తీశారు.

విజయం సాధించిన అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ జట్టు

నేటి మ్యాచ్‌లు

● ఉదయం 8 గంటలకు: సీనియర్ విభాగంలో శ్రీకృష్ణ డిగ్రీ కాలేజ్ × వీడీసీ డిగ్రీ కాలేజ్ (గాజువాక) ● ఉదయం 10 గంటలకు: జూనియర్స్ విభాగంలో శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్ × గవర్నమెంట్ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ● మధ్యాహ్నం 12 గంటలకు: జూనియర్స్ విభాగంలో.. గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజ్ × మిసెస్ ఏవీఎన్ జూనియర్ కాలేజ్

30-12-25 నాటి మ్యాచ్‌లు...

● ఉదయం 8 గంటలకు: సీనియర్ విభాగంలో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ × గీతం డీమ్డ్ యూనివర్సిటీ ● ఉదయం 10 గంటలకు: సీనియర్ విభాగంలో ఎస్ఐఈటీఆర్(కొర్లాం) × గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కాలేజ్(మధురవాడ) ● మధ్యాహ్నం 12 గంటలకు: జూనియర్ విభాగంలో శ్రీకృష్ణ జూనియర్ కాలేజ్ × విశాఖ పాలిటెక్నిక్ కాలేజ్

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR Shopping Mall
Gift Partner: KL University
Regional Sponsor: GGU Godavari Global University, Rajamahendravaram, A.P.
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Digital Partner: ఈనాడు.నెట్, ETV Bharat
Dolphin Diagnostic Services
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
Organised by ఈనాడు ఈతరం క్లబ్

సంక్రాంతిలోగా తొలగనున్న ఇక్కట్లు

నక్కపల్లి, న్యూస్‌టుడే: అడ్డురోడ్డు - నర్సీపట్నం దారంటే వాహన చోదకులు హడలిపోయేవారు. అడ్డురోడ్డు నుంచి ఇందేశమ్మవాక వరకు పలుచోట్ల రోడ్డు పెద్ద పెద్ద గోతులతో అధ్వానంగా ఉండేది. వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ప్రత్యక్ష నరకం చూపించేది. కూటమి సర్కారు కొలువుదీరిన తర్వాత రోడ్డు నిర్మాణానికి మంత్రి అనిత చొరవ చూపారు. సంక్రాంతి పండగలోగా రాకపోకలకు ఇబ్బంది లేకుండా రోడ్డు పనులు పూర్తికానున్నాయి.

★ సుమారు 9 కి.మీ. దూరం రాళ్లు తేలి, గోతులు పడటంతో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు, ప్రయాణికులు పడిన ఇక్కట్లు వర్ణనాతీతం. చినుకుపడితే రోడ్డు ఏదో.. గుంత ఏదో తెలియని దుస్థితి. ఏడాది కిందట మంత్రి అనిత రహదారి నిర్మాణానికి రూ.24 కోట్లు మంజూరు చేయించి శంకుస్థాపన చేశారు.

★ గుత్తేదారు దార్లపూడి వద్ద 300 మీటర్ల మేర సీసీ రోడ్డు వేసి, కొంత విస్తరణ చేసినా నిధుల లేమి, సాంకేతిక సమస్యలతో పనులు ఆగిపోయాయి. దీనిపై 'ఈనాడు'లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన మంత్రి త్వరితంగా పనులు పూర్తి చేసేలా కొద్ది నెలల కిందట రహదారులు భవనాల శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు.

నీలాద్రిపురం-రైల్వేస్టేషన్ రోడ్డు

★ సంక్రాంతి పండగ సమీపిస్తుండటంతో ఆలోగా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. దీంతో చేయాల్సిన పనుల్లో రోడ్డుకు అధికారులు ప్రత్యేకంగా టెండర్ పిలిచారు. మిగిలిన దాన్ని పాత గుత్తేదారుతో చేయించేలా చర్యలు చేపట్టారు.

★ నీలాద్రిపురం నుంచి నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. పది రోజుల కిందట ప్రారంభమై పనులు దాదాపు పూర్తయ్యాయి. దార్లపూడి సమీపంలో

చురుగ్గా అడ్డురోడ్డు - నర్సీపట్నం రోడ్డు నిర్మాణం

గోతులున్న చోట పిక్క వేసి చదును చేయించారు. చక్కెర కర్మాగారం సమీపంలో రోడ్డు విస్తరణ చేస్తున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుండటంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

★ 'సంక్రాంతిని దృష్టిలో పెట్టుకుని మంత్రి ఆదేశాలతో నీలాద్రిపురం ప్రాంతంలో 1.2 కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మిస్తున్నాం. వారం రోజుల్లో పనులు పూర్తవుతాయి. రహదారి విస్తరణ 15 నుంచి 21 అడుగులకు పెంచాం. ఇతర ప్రాంతాల్లో బాగా ఇబ్బందిగా ఉన్నచోట గుంతలను తాత్కాలింగా పూడుస్తున్నాం. పండగ నాటికి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేస్తాం. మార్చిలోగా తారు రోడ్డు నిర్మాణం పూర్తవుతుంద'ని ఆర్అండ్‌బీ ఏఈ కె.వి.రామన్ చెప్పారు.

నాటక రంగానికి ప్రోత్సాహం అందిస్తాం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: నాటక రంగ కళాకారులను ప్రోత్సహించేలా ప్రతిభ చూపిన వారికి నంది అవార్డులను ప్రభుత్వం అందించనుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచించారు. అనకాపల్లిలోని జార్జిక్లబ్‌లో ఆదివారం రాత్రి జార్జిక్లబ్, హైదరాబాద్ మహతి క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ నాటకం, కళాకారులు సమాజంలో సమస్యలను ప్రతిబింబిస్తూ చైతన్యం తీసుకొస్తున్నారన్నారు. సమాజాన్ని మేలుకొలిపే నీతి ఆదర్శాలను అందించేది నాటకం అన్నారు. వీరికి నంది అవార్డులపై ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామన్నారు. కళాపరిషత్‌లను ప్రోత్సహించేందుకు రూ.కోటి నగదును ప్రభుత్వం సమకూర్చి నాటిక ప్రదర్శనలు నిర్వహించేలా చొరవ చూపాలన్నారు. అనకాపల్లి కళలకు పుట్టినిల్లన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కన్యాశుల్కం ప్రదర్శనతోపాటు కదిలించే రచనలతో రాష్ట్రపతి నుంచి ప్రశంసలు పొందారన్నారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం నింపే నాటికలను ప్రోత్సహించాలన్నారు. జార్జిక్లబ్ అధ్యక్షులు బీఎస్ఎంకే జోగినాయుడు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి బుద్ధ కాశీవిశ్వేశ్వరరావు, కోశాధికారి విల్లూరి చంద్రశేఖర్, పగడాల వీరభద్రరావు, రంగస్థల నటులు సుబ్బారాయుడు, డి.రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

ఆకట్టుకున్న ప్రదర్శనలు : గుంటూరు అభినయ ఆర్ట్స్ ప్రదర్శించిన 'సమయం' నాటిక, హైదరాబాద్ మల్లేశ్వరి ఆర్ట్స్ 'నువ్వో సగం.. నేనో సగం.. నువ్వు సగం.. నేను సగం' నాటికలు ఆకట్టుకున్నాయి.

కేజీహెచ్‌లో విద్యుత్తు ఇబ్బందులకు చెక్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: కేజీహెచ్‌లో తరచూ తలెత్తుతున్న విద్యుత్తు సమస్యలను పరిష్కరించేందుకు అదనంగా 323 కేవీ సామర్థ్యంతో కూడిన మొబైల్ జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. రెండు నెలల క్రితం తీవ్రమైన విద్యుత్తు అంతరాయం ఏర్పడి 8 గంటల సేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. ఇక మీదట అటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయంగా జనరేటర్ సేవలను విస్తరించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదేశాల మేరకు తక్షణ చర్యలు చేపట్టామని ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ ఐ.వాణి, ఆర్ఎంఓ బి.వి.రమణ తెలిపారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో పది జనరేటర్లు ఉన్నాయి. వీటిలో 1690 కేవీ సామర్థ్యంతో కూడిన జనరేటర్లు ఉన్నాయి, 323 కేవీ సామర్థ్యంతో కూడినవి మూడు ఉన్నాయి. నాన్ ఏసీయూ వార్డులైన రాజేంద్రప్రసాద్, భావనగర్, పీడియాట్రిక్ వార్డులకు సరఫరాలో అంతరాయం కలిగితే వెంటనే జనరేటర్ల ద్వారా విద్యుత్తు పునరుద్ధరించవచ్చని వారు వివరించారు. ప్రస్తుతం కేజీహెచ్‌లో సీఎస్ఆర్ బ్లాక్‌లో సోలార్ విద్యుత్తు సదుపాయం అందుబాటులో ఉందని, ఇదే తరహాలో మిగిలిన వార్డులకు విస్తరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

'పేట' కళాకారిణుల బృందం

గిన్నిస్ ప్రదర్శనలో పేట కళాకారిణులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో శనివారం నిర్వహించిన కూచిపూడి గిన్నిస్ రికార్డు నృత్య ప్రదర్శనలో పాయకరావుపేటకు చెందిన పలువురు కళాకారిణులు భాగస్వామ్యమయ్యారు. స్థానిక కూచిపూడి గురువు ఏలూరి దీపిక సారథ్యంలో 32 మంది ఇక్కడి వెళ్లారు. వీరి ప్రదర్శనపై పలువురు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు కీలకం

కశింకోట, న్యూస్‌టుడే: విద్యార్థులంతా క్రమ శిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశసేవ పట్ల అవగాహన కలిగి ఉండాలని 13వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ కమాండర్ నీరజ్‌కుమార్ సూచించారు. కశింకోట సెయింట్ జాన్స్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ఆదివారం శీతాకాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభ, విజ్ఞానం, సృజనాత్మకతను పెంపొందించడానికి ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి వారి ఆలోచనలను ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల డైరెక్టరు బత్తుల నోబుల్‌కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనూరాధ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రదర్శన

హైందవ సమాజ ఐక్యతకు కృషి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: హైందవ సమాజం ఐక్యంగా ఉండడానికి సాధువులు, హిందూధర్మ పరిరక్షకులు అందరూ కలిసి కృషి చేయాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కోరారు. అచ్యుతాపురంలో ఆదివారం హిందూ సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అంటరానితనం పోతే తప్ప సమాజం ఐక్యంగా ముందుకెళ్లదన్నారు. వెయ్యేళ్ల క్రితం ప్రారంభమైన వైషమ్యాలు ఇప్పుడూ కొనసాగించడం మంచిదికాదన్నారు. మంచి గుణాలు అలంకారంగా ఉండాలన్నారు. ఏపీ సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ ప్రసంగిస్తూ హిందువుగా జీవించాలని, హిందువునిగా గర్వించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నృత్య, కళా ప్రదర్శనలు, కోలాటం అందరినీ ఆకట్టుకున్నాయి. జిల్లా ఉపాధ్యక్షులు రాజాన సన్యాసినాయుడు, సమరసతా ఫౌండేషన్ సబ్ డివిజనల్ కన్వీనర్ బీవీ రమణ, గుడివాడ రమణ, బాబ్జీ, కోరుపోలు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కోలాటం కళాకారులకు బహుమతులు అందిస్తున్న మాధవ్

EENADU e Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

REAL ESTATE

GENERAL

సిటీ లిమిట్స్‌లో గల బిల్డింగ్స్ పై గల ఓపెన్ స్పేస్ అమ్మదలచినవారు సంప్రదించండి మరియు మా కన్‌స్ట్రక్షన్ కంపెనీకి కొలేటరల్ సెక్యూరిటీ కావలెను. వివరాలకై : 9963585556.

LAND FOR SALE

GENERAL

పూసపాటిరేగ మం గోవిందపురం రోడ్డు, హైవేకి ½km తార్రోడ్డు ఫేసింగ్ 9ఎకరాలు కొబ్బరితోట & 4 ఎకరాలు కొబ్బరితోట అమ్మకం. 9440255187.

PLOT FOR SALE

KURMANNAPALEM

గాజువాకకిచేరువలో దేశపాత్రునిపాలెం విలేజ్‌లో వెంటనే ఇల్లు కట్టుకోవడానికి VMRDA ఓపెన్ ప్లాట్లు గజం కేవలం 13,500/- ఫెస్టివల్ ఆఫర్. 9703900583

MADHURAWADA

మధురవాడ, హౌసింగ్ బోర్డు కాలనీలో 40ఫీట్ రోడ్డు కలిగిన 35'x60' = 233.33Sq.yds వెస్ట్ ఫేసింగ్ ప్లాట్ అమ్మకంనకు కలదు. ✆ 9177119944.

COMMERCIAL SPACE FOR SALE

GENERAL

3280 sft office space fully furnished space at Seethamapeta main road, beside central Bank. Ph: 8886756222

JOBS

Job Mela : ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ యొక్క వైజాగ్ మెయిన్ బ్రాంచ్ కొరకు మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. సంప్ర: 8883375999.

వైజాగ్‌సిటీలో సెక్యూరిటీగార్డులు- M, క్లీనింగ్ వర్కర్స్- F కావలెను. జీ: 12 గం॥- 15K, 8 గం॥- 10K. బయోడేటా వాట్సాప్ చేసి కాల్ చేయండి. 7306582829

సేల్స్‌బాయ్స్, గర్ల్స్ కావలెను. జీ: 10,000- కమీషన్+ 4రోజులు= 13,000/- పవన్ ఫ్యామిలీ ఆఫర్ మాల్, 5వ లైన్, ద్వారకానగర్, వైజాగ్. 8142863533, 9533691515, 9440802452

ప్రముఖ కార్పొరేట్ సంస్థకు మేనేజర్స్ కావలెను. M/F హౌస్‌వైఫ్స్, Rtd, VRS టీచర్స్ కావలెను. F/P టైం శాలరీ & ఇన్సెంటివ్స్ కలవు. ✆ 9676595920.

వైజాగ్ ప్రముఖ షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువకులు కావలెను. జీతం. 10,000-12,000-ఫుడ్ రూము. ✆ 9030588502/9704637370.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కార్మికుల సంక్షేమానికి సీఐటీయూ ఎనలేని కృషి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు అధికంగా ఉన్న విశాఖ నగరంలో కార్మిక శక్తి కూడా అధికంగా ఉందని వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్‌భరత్ అన్నారు. కార్మిక కర్షక ఐక్యత వర్ధిల్లాలి అనే థీమ్‌తో బీచ్ రోడ్డులోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎగ్జిబిషన్ మైదానంలో ఆదివారం జరిగిన 'శ్రామిక ఉత్సవ్'లో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. కార్మికుల కష్టాలు తీర్చడంలో సీఐటీయూ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇక్కడ కార్మిక శక్తి అధికంగా ఉన్నందున ప్రభుత్వం విశాఖలో ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. వివిధ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయన్నారు. తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్, కాపులుప్పాడ, మధురవాడలలో ఐటీ కంపెనీల రాకతో విశాఖ రూపురేఖలు మారనున్నాయన్నారు. త్వరలో మధ్య తరగతి, దిగువ తరగతుల వారి కోసం వీఎంఆర్డీఏ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తుందన్నారు. కార్మికుల సామాజిక భద్రత, శిక్షణ, నైపుణ్యాభివృద్ధికి లేబర్ సంస్కరణలు తోడ్పడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కళాకారుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

వేదికపై కళాకారుల నృత్యం

తెల్లారిన బతుకులు.. మిన్నంటిన రోదనలు..

విశాఖపట్నం, గజపతినగరం, న్యూస్‌టుడే: రెక్కల కష్టంతో బతుకుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఇద్దరిని తమ బతుకు బండే బలితీసుకుంది. పని ముగించుకుని మరి కొన్ని గంటల్లో ఇళ్లకు చేరుకుంటామనే లోపే రోడ్డు ప్రమాదం వారిని శాశ్వతంగా ఈ లోకం నుంచి దూరం చేసింది. ఈ ఘటనకు సంబంధించి గజపతినగరం ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు, మృతుల బంధువుల కథనం ప్రకారం.. జీవీఎంసీ 49వ వార్డు ఎన్‌జీజీఓఎస్ కాలనీలో నివాసముంటున్న పొట్నూరు వినయ్‌కుమార్(35) తినుబండారాల వ్యాపారం నిర్వహిస్తుంటాడు. బర్మా క్యాంప్ దరి జైభారత్‌నగర్‌కు చెందిన యల్లబిల్లి దినేష్(25)తో కలిసి సరకుల కోసం శనివారం విశాఖ నుంచి రాయగడ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో విజయనగరం జిల్లా గజపతినగరం సమీపంలో వ్యాన్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పొట్నూరు వినయ్‌కుమార్

ఎల్లబెల్లి దినేష్

పెద్ద దిక్కును కోల్పోయి..

★ పొట్నూరు.. వినయ్‌కుమార్ భార్య వాసవి గృహిణి. వీరికి కుమార్తె లాత్విక(5), కుమారుడు జయదీప్(3) ఉన్నారు. గత 18 ఏళ్ల నుంచి బేకరి వస్తువులను విక్రయించే వ్యాపారం నిర్వహిస్తున్నాడు. రాయగడ వద్ద బేకరి సామగ్రిని కొనుగోలు చేసి నగరంలోని పలు దుకాణాలకు హోల్‌సేల్‌గా విక్రయిస్తుంటాడు.

★ యల్లబిల్లి దినేష్ జీవీఎంసీ శానిటేషన్ విభాగంలో తాత్కాలిక ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఇతడి భార్య లయ గృహిణి. వీరికి రెండేళ్ల పాప, ఎనిమిది నెలల బాబు ఉన్నారు. తండ్రి దుర్గ, తల్లి శంకరమ్మ కూడా జీవీఎంసీలో కాంట్రాక్ట్ వర్కర్లుగా పని చేస్తున్నారు.

కారు ఢీకొని ఇద్దరు మహిళలకు గాయాలు

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట కూడలిలోని జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం కారు ఢీకొని ఇద్దరు మహిళలు గాయపడ్డారు. స్థానిక భవాని కాలనీకి చెందిన మహిళలు ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా ఎలమంచిలి-అనకాపల్లి రోడ్డులో వెళుతున్న కారు బైకును ఢీకొని అడ్డుగా ఉన్న వేగ నిరోధక బోర్డును ఢీకొట్టింది. గాయపడిన మహిళలను 108 వాహనంపై అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు.

వీఆర్‌ఓల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శశిధర్

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షునిగా అమిరపు శశిధర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఈరెళ్ల శివశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గ ఎన్నిక ఆదివారం గుండాల కూడలిలో జరిగింది. సహ అధ్యక్షుడిగా దేవాడ చిన్నంనాయుడు, కోశాధికారిగా ఆశ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా డి.రాజేష్‌కుమార్, రాంజీ వ్యవహరించారు. నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులు

ఎస్సైల ఆత్మీయ సమ్మేళనం

రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: వారంతా ఒకేసారి ఉద్యోగం సాధించారు.. శిక్షణ పొందారు.. ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. అంతా కలుసుకుని ఆత్మీయ ఆలింగనాలు, సరదా కబుర్లు, స్వీయచిత్రాలు తీసుకుని సందడి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో ఎస్సై(సివిల్) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కడియంలో జరిగింది. వాళ్ల స్నేహబంధం ఎప్పటికీ కొనసాగేలా 2021లో ఏపీ, తెలంగాణ ఎస్సై 2009 బ్యాచ్ పేరిట సంక్షేమ సంఘాన్ని స్థాపించారు. నాటి నుంచి నేటి వరకూ ఏటా డిసెంబరు రెండోవారంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుంటున్నారు. 2014లో ఆంధ్ర, తెలంగాణ విడిపోయిన తర్వాత కూడా సమ్మేళనాలు నిర్వహించుకుంటున్నారు. సుమారు 1,140 మంది ఎస్సైలుగా తర్ఫీదు పొందగా, అందులో 400 మంది ఆదివారం రాజమహేంద్రవరంలో కలిశారు. వీరిలో 80 మంది ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్నారు. వీరంతా ప్రస్తుతం సీఐలుగా పదోన్నతి పొందారు. వీరంతా కలిసి నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. ఇప్పటి వరకూ ఈ బ్యాచ్‌లో మృతిచెందిన వారికి సంబంధించిన కుటుంబాలకు రూ.8.20కోట్ల సాయం చేసినట్లు తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు బ్యాచ్ అడ్మిన్‌గా ఉన్న హైదరాబాద్ బేగంపేట పీఎస్ రేంజ్ సీఐ జి.శ్రీనివాసరావు వివరించారు. సమ్మేళనానికి కడియం, ధవళేశ్వరం, రాజానగరం, అనపర్తి సీఐల సహకారం మరువలేనిదన్నారు.

కడియంలో 2009 ఎస్సై (సివిల్) బృంద సభ్యులు

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	131	130
లైవ్	158	150
డ్రెస్డ్	229	270
స్కిన్‌లెస్	261	280

(c) eenadu

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: ఈషా రామచంద్ర: దండోరా, వెంకటేశ్వర: శంబాల, పద్మావతి: అవతార్3, సత్యనారాయణ ప్రీమియం: ఛాంపియన్ ప్రీమియర్2, అవతార్3, దండోరా, శ్రీరామ: అఖండ 2 అచ్యుతాపురం: శ్రీ బాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: ఛాంపియన్, స్క్రీన్-2: వృషభ

పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీలు నిషేధం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: నర్సీపట్నం సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్టు అమలులో ఉన్నందున పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీలు, ధర్నాలు చేయడం నిషేధమని సీఐ లొద్దు రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీ చేసినా, పాల్గొన్నా చట్టరీత్యా నేరమని, చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నర్సీపట్నం రూరల్ సర్కిల్ పరిధిలోని ఎస్.రాయవరం, కోటవురట్ల, అడ్డురోడ్డు పరిసర ప్రాంతాల్లో ఎటువంటి ధర్నాలు, నిరసనలకు అనుమతులు లేవని పేర్కొన్నారు.

జాతీయ రహదారి అంచున ప్రమాదం

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎలమంచిలి శివారులతో ఉన్న జాతీయ రహదారి అంచుతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు రహదారి పక్కన మట్టి రోడ్డులో భారీ వాహనాలు దిగడంతో పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. పెద్ద వాహనాలు వచ్చే సమయంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు రోడ్డు కిందకు దిగడానికి వీలు పడటం లేదు. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు ఈ గోతులతో ప్రమాదాలకు గురవుతున్నారు. వెంటనే గోతులను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

షేక్లపాలెం సమీపంలో..

నిబంధనలతో ప్రమాదాల నివారణ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: నిబంధనలతో ప్రమాదాలను నివారించవచ్చని పట్టణ ట్రాఫిక్ సీఐ వెంకట రమణ తెలిపారు. పట్టణంలోని మోటార్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ద్విచక్రవాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు కచ్చితంగా శిరస్త్రాణం ధరించాలన్నారు. ట్రిపుల్ రైడింగ్, అధిక వేగంతో వాహనాలు నడపడం చేయరాదన్నారు. ఎస్సై శేఖరం, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకట రమణ

భక్తితత్వం.. నారాయణ మంత్రం

గ్రామాల్లో సందడిగా మేలుకొలుపు

నక్కపల్లి, న్యూస్‌టుడే: తెల్లవారుజాముననే లేచి.. చలిలో చిన్నా.. పెద్దా.. స్నానాదికాలు పూర్తిచేసి.. భక్తిగీతాలు ఆలపిస్తూ ఊరంతా తిరిగే భక్తులతో పల్లెలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ధనుర్మాసం కొన్ని గ్రామాలకు ఎంతో ప్రత్యేకం.

నక్కపల్లి మండలంలోని చినదొడ్డిగల్లు, రేబాక, ఉద్దండపురం, కాగిత, వేంపాడు కొత్తూరు, గుల్లిపాడు, దోసలపాడు, రమణయ్యపేట తదితర చోట్ల కొడికూతకు ముందే ఇక్కడి ప్రజలను భక్తిపాటలు మేలుకొలుపుతున్నాయి. కేవలం పెద్దలే కాకుండా చిన్నారులు సైతం ఉత్సాహంగా పాల్గొని భక్తితత్వాన్ని, క్రమశిక్షణను అలవర్చుకుంటున్నారు. పల్లెలోని ప్రతి వీధిలో తిరుగుతూ స్థానిక ఆలయానికి వెళ్లి రామ, నారాయణ మంత్రాలు పఠిస్తూ భజనలు చేస్తున్నారు. నెల రోజులపాటు చేపట్టే ఈ కార్యక్రమాన్ని కొన్ని గ్రామాల్లో దశాబ్దాల తరబడి నిర్వహిస్తుండటం విశేషం. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో పట్టకీలు మోస్తూ, తాళాలు చేతబూని చిన్నారులూ ఊరంతా తిరుగుతుంటే నిత్యం సందడిగా ఉంటోంది.

పల్లకి మోతలో చిన్నారులు

భక్తుల సంఖ్య పెరుగుతోంది..

మా గ్రామంలో చాలామంది మేలుకొలుపులో పాల్గొంటున్నారు. ఇందులో చిన్నారులు అధిక సంఖ్యలోనే ఉన్నారు. తెల్లవారుజామున మొదలయ్యే నగర సంకీర్తన దాదాపు మూడు గంటలపైగా కొనసాగుతోంది. ఆలయానికి వెళ్లి పూజలు చేస్తున్నారు. నగర సంకీర్తన చేసే భక్తులకు పలువురు స్వచ్ఛందంగా ప్రసాదాలు, టీ అందిస్తున్నారు. రోజూ రెండు కిలోమీటర్ల పైబడి తిరుగుతున్నారు. ఇద్వారా ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆధ్యాత్మికత అలవడుతున్నాయి. ప్రధానంగా గ్రామ శ్రేయస్సుకోసం ఏటా ఇందులో పాల్గొనేవారి సంఖ్య పెరుగుతోంది. - వి.లక్ష్మణరావు, డి.దావీదు, చినదొడ్డిగల్లు

ప్రోత్సాహం కావాలి..

ధనుర్మాసం సమీపిస్తుంటే నగర సంకీర్తనకు అంతా సిద్ధమవుతారు. ఇక్కడ కార్యక్రమ నిర్వాహకులు పెద్దల ఆధ్వర్యంలోనే ఏర్పాట్లు జరుగుతాయి. అనేక దశాబ్దాల నుంచి మేలు కొలుపు గ్రామంలో చేస్తుండగా, చాలా ఏళ్లగా మహిళలూ ఇందులో భాగస్వాములవుతున్నారు. వైకుంఠ ఏకాదశి రోజున పలు గ్రామాలనుంచి వేలాది మంది కాలినడకన ఉపమాకకు వెళ్లి స్వామివారిని దర్శించుకుంటాం. కార్యక్రమంలో పాల్గొంటున్న పిల్లలకూ మంచి మార్కులు కనబడుతున్నాయి. గ్రామంలో పిల్లలకు భగవద్గీత నేర్పించాలని చూస్తున్నాం. - జి.వరలక్ష్మి, జి.పద్మ, చినదొడ్డిగల్లు

జ్ఞాపక శక్తి పెరిగి.. జీవన విధానం నేర్చి..

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: భగవద్గీత శ్లోకాల పోటీలో జిల్లా వాసులు ప్రతిభ చూపారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అనకాపల్లిలో నిర్వహించిన ఈ పోటీల్లో 18 మంది విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో పాల్గొన్నారు. వీరిలో నలుగురు ప్రతిభ చూపి బహుమతులు సాధించారు. విభాగాల వారీగా నిర్వహించిన పోటీల్లో మహిళలు, యువతులు, బాలికలు ప్రతిభను చాటారు. వీరిని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డీవీ నాయుడు, కటకం లక్ష్మణరావు, హేమ జగదీష్ నాయుడు, గోకవరపు రమేష్, శ్రీకాకుళపు అభినందించారు.

విజేతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

ఇంజినీరింగ్ చదువుతూ..: భగవద్గీత చదవడం చిన్నప్పటి నుంచి అలవాటైంది. 18 అధ్యాయాల్లో శ్లోకాలను చదివాను. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తృతీయ బహుమతి వచ్చింది. భగవద్గీత చదవడం వల్ల జ్ఞాపకశక్తితో పాటు మంచి నడవడికతో జీవన విధానాన్ని సాగించవచ్చు. - పల్లా హేమ అక్షయ

యువత చదవాలి..: యువత భగవద్గీత చదవడం అలవాటు చేసుకోవాలి. జీవన విధానంలో ఎన్నో ప్రశ్నలకు ఇందులో సమాధానాలు ఉంటాయి. ప్రతి రోజూ భగవద్గీత చదువుతాను. శ్లోకాలు నేర్చుకోవడంతో పాటు పోటీలో పాల్గొని బహుమతులు సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. - ఎం.సుమలత

చిన్నప్పటినుంచే..: ఎల్‌కేజీ చదువుతున్నాను. కుటుంబసభ్యులు భగవద్గీత చదవడం నేర్పించారు. నేర్చుకున్న శ్లోకాలతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. విజయవాడలో జరిగిన పోటీలో ప్రథమ బహుమతి పొందాను. - పి.హన్విత

అందరూ నేర్చుకోవాలి..: భగవద్గీత మనకు వరం. దీన్ని చదివి సారాంశాన్ని తెలుసుకోవాలి. భగవద్గీతతో మన జీవన విధానం మారుతుంది. ఎలా జీవించాలన్నది దీంట్లో స్పష్టంగా ఉంది. భగవద్గీత నేర్చుకోవడానికి చాలామంది ఆసక్తి చూపుతున్నారు. - ఈర్ల జ్యోతి.

అందుబాటులో యూరియా

ఎలమంచిలి, న్యూస్‌టుడే: రైతులకు అందించడానికి 24 మెట్రిక్ టన్నుల యూరియా సిద్ధంగా ఉందని ఏవో మోహనరావు తెలిపారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అవసరమైన రైతులకు వీటిని ఇస్తామని చెప్పారు. ఆధార్ కార్డు, పాస్ పుస్తకంతో సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

నడింపల్లిలో రావిపాలెంలో కలపాడు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: నడింపల్లి గ్రామాన్ని నునపర్తిలోనే కొనసాగించాలని రావిపాలెంలో కలపొద్దని పంచాయతీ కార్యదర్శికి గ్రామస్థులు వినతిపత్రం అందించారు. నడింపల్లిని విడదీసి రావిపాలెంలో కలిపేలా అధికారులు గ్రామస్థుల వ్యతిరేకించి గ్రామసభలో తీర్మానించారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయాలి

నక్కపల్లి, న్యూస్‌టుడే: సీపీఎం నాయకుడు అప్పలరాజుపై పోలీసులు పెట్టిన పీడీ యాక్టును రద్దు చేయాలని, జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నక్కపల్లిలో సోమవారం చేపట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్ కోరారు. అప్పలరాజుకు మద్దతుగా రాజయ్యపేటలో పార్టీ నాయకులు, స్థానికులు పలువురు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎం.మహేష్‌బాబు, డి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్య శిబిరానికి స్పందన

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శ్రీగౌరీసేవా సంఘంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇ.కె. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి 150 మంది రోగులు హాజరుకాగా వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. క్లబ్ అధ్యక్షులు బుద్ద శ్రీనివాసరావు, కార్యదర్శి కేవీపీఎస్.ప్రకాశ్‌రావు, ప్రోగ్రాం ఛైర్మన్ బుద్ద సత్యనారాయణ, గౌరీ సంఘం అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, సాన త్రినాథ్, బుద్ద రమణాజీ, రాపేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు

రాంబిల్లి, న్యూస్‌టుడే: రానున్న పంచాయతీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించాలని తెదేపా మండల కమిటీ అధ్యక్షుడు లాలం భరత్ కోరారు. స్థానికంగా మండల పార్టీ మాజీ అధ్యక్షుడు వి.దిన్నుబాబు ఆధ్వర్యంలో ఆదివారం తెదేపా ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథులుగా భరత్, గొంతెన హరీష్ పాల్గొన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు తెస్తామని చెప్పారు. నాయకులు కలిదిండి రఘురాజు, చోడిపల్లి సత్యనారాయణ, అందుకూరి ప్రసాద్, జల్లి ఆదిరెడ్డి, చిన్నా పాల్గొన్నారు.

పేదలకు వితరణ

కశింకోట, న్యూస్‌టుడే: భాజపా జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కశింకోటలో సత్యసాయి మందిరంలో ఆదివారం పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం నారాయణ సేవ నిర్వహించారు.

భారీ వాహనాలతో రహదారిపై చిక్కులు

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని నాగారాజుపేట రైల్వే గేటు నుంచి లింగాలతోట కాలనీకి వెళ్లే ప్రధాన మార్గంలో భారీ లారీలు రహదారి మధ్యలో నిలుపుదల చేయడంతో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి ఇరుకు కావడంతో వాహనాలకు సరిపడ స్థలం లేకపోవడంతో మలుపు తిప్పే క్రమంలో మధ్యలో నిలిచిపోతున్నాయి. దీంతో గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అంతేకాకుండా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పలుచోట్ల మెకానిక్ షెడ్ల నిర్వాహకులు ట్రాక్టర్లు రహదారులపై నిలిపి మరమ్మతులు చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు సమస్యపై దృష్టిసారించి అడ్డంకులు తొలగించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

డ్రైనేజీల నిర్మాణం ఎప్పుడో..!

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఈదటంలో డ్రైనేజీ సమస్య వేధిస్తోంది. కాలనీల్లో నిధుల కొరతతో సమస్యలు పరిష్కారం కావడం లేదు. గ్రామంలో వీధుల్లో మురుగు పోయేందుకు డ్రైనేజీలు పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదు. దీంతో వీధుల్లో మురుగు అక్కడే నిల్వ ఉంటోంది. కుళాయి పైపులు కాలువల్లోనే వేశారు. దీనివల్ల తాగునీరు సైతం కలుషితమవుతోంది. ఇక్కడ మురుగు తాండవమాడుతోంది. దీనివల్ల దుర్వాసన వస్తోందని, దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. రోగాల బారిన పడే ప్రమాదం ముందని వాపోతున్నారు. అధికారులు స్పందించి పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలి. డ్రైనేజీల నిర్మాణంపై దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మలుపుల్లో అప్రమత్తం...

పాయకరావుపేట, న్యూస్‌టుడే: రహదారుల్లో వంపు మార్గాలు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. మలుపు వద్ద సరైన హెచ్చరిక బోర్డులు, వేగనియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పాయకరావుపేట నుంచి నర్సీపట్నం వెళ్లే రోడ్డులో తాండవ వంతెన కర్మాగారం వద్ద రోడ్డులో మలుపు అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇక్కడే గతంలో నర్సీపట్నం వెళ్తున్న కారు అదుపు తప్పి భూమి కాలువలోకి దూసుకుపోయింది. తరచూ ఆటోలు ఇక్కడ బోల్తా కొడుతున్నాయి. ప్రయాణికులు ఆసుపత్రి పాలవుతున్నారు. మండలంలోని పాయకరావుపేట నుంచి మంగవరం, గోపాలపట్నం మీదుగా పెంటకోట వెళ్లే రోడ్డులో దాదాపు అయిదు చోట్ల ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. దీంతో పాటు ఎస్.నర్సాపురం నుంచి రాజగోపాలపురం వెళ్లే దారిలోనూ, పాల్తేరు నుంచి ఈదటం, చినకందిపూడి రోడ్డులోనూ ఇదే పరిస్థితి.

అసంపూర్తిగా సంపద కేంద్రం

కోటవురట్ల, న్యూస్‌టుడే: కైలాసపట్నంలో సంపద కేంద్రం నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన ఈ కేంద్ర నిర్మాణ పనులు స్తంభాల స్థాయిలో నిలిచిపోవడంతో, ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు. ఎనిమిదేళ్ల క్రితం ఈ కేంద్రాన్ని నిర్మించడానికి, ఉపాధి హామీ పథకం ద్వారా, సుమారు రూ. ఐదు లక్షల నగదును మంజూరు చేశారు. అప్పట్లో సాంకేతిక సమస్య రావడంతో పాటు చేసిన పనులకు గుత్తేదారుకి నగదు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయి. సంపద కేంద్రం నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో, గ్రామంలో పలుచోట్ల అపరిశుభ్రత దర్శనమిస్తోంది. గ్రామం శుభ్రంగా ఉండాలన్నా, పంచాయతీకి ఆదాయం సమకూరాలన్నా, చెత్త సంపద కేంద్రాన్ని పూర్తి చేసే బాగుంటుందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఎస్.రాయవరంలో..

కశింకోటలో..

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు జిల్లాలో పలుచోట్ల ఆదివారం సందడిగా సాగాయి. ఎస్.రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986-87 సంవత్సరంలో పదో తరగతి చదివిన వారంతా పాఠశాలలో సమావేశమయ్యారు. పదో తరగతి పూర్తయి 38 ఏళ్లు గడిచిన సందర్భంగా వీరంతా ఒకేచోట కలుసుకున్నారు. యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ప్రధాన కూడలిలోని మహాకవి గురజాడ అప్పారావు విగ్రహానికి వారంతా పూలమాలవేసి నివాళులు అర్పించారు.

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి మండలం సత్యనారాయణపురం సత్యదేవుని ఆలయ ప్రాంగణంలో ఆదివారం కశింకోట డీపీఎన్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1992-93లోలో పదో తరగతి విద్యార్థులు కలిశారు. కమిటీ సభ్యులుగా మళ్ల రాంబాబు, దాడి ఉదయ్ కుమార్, మేడిశెట్టి నూకరాజు, పేలూరి గణేష్, నంబారు రమణ, భర్నికాన సింహాచలం తదితరులను ఎన్నుకున్నారు. సేవా కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించారు.

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక జడ్పీ ఉన్నత పాఠశాలలో 1988-89లో పదో తరగతి చదివిన వారంతా కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. సుమారు 120 మంది వాడ్రాపల్లిలో ఆటపాటలతో సరదా గడిపారు. మళ్ల నర్సింగరావు, సూరిశెట్టి రాము, టెక్కలి పరుశురాం పాల్గొన్నారు. సాయంత్రం వరకు అంతా ఆటపాటలతో గడిపారు.

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాలలో 1985-86లో పదో తరగతి విద్యార్థులు సత్యనారాయణపురం సత్యదేవుని ఆలయ ప్రాంగణంలో సమావేశమయ్యారు. వీరంతా సంఘంగా ఏర్పడ్డారు. 'మిత్రమా.. కుశలమా' పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి నిర్ణయించారు. సంస్థ అధ్యక్షులుగా డొంకా సాయినాథ్, ప్రధాన కార్యదర్శిగా తిమ్మాపాత్రుని గణేష్, కోశాధికారిగా బొగ్గారపు కోటేశ్వరరావు తదితరులను ఎన్నుకున్నారు.

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట జడ్పీ పాఠశాలలో 1984-85లో పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్థానికంగా భేటీ అయ్యారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. మిత్రులంతా ఆరోగ్యంగా ఉండాలని ధ్యానంపై శిక్షణ నిచ్చారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు.



సత్యనారాయణపురంలో పూర్వ విద్యార్థులు



మునగపాకలో..

1985-86 జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులు..

ఆలయాల్లో ధనుర్మాస ప్రత్యేక పూజలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ధనుర్మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అధ్యక్షులు ఉప్పల రవిరామ్ జవహర్, కార్యదర్శి శ్రీదరాల సోమరాజు పాల్గొన్నారు.

వామనావతారంలో వేంకటేశ్వరుడు

వామనావతారంలో వెంకన్న

కొత్తూరు (అనకాపల్లి), అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అనకాపల్లి గాంధీ నగరం అంజయ్యకాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మూలమూర్తి ఆదివారం వామనావతారంలో పూజలందుకున్నారు. ధనుర్మాస వేడుకల్లో ఆలయ సంప్రదాయంలో వామనుడుగా అలంకరించి, పూజలు నిర్వహించారు. మంగళవారం జరుగనున్న ముక్కోటి ఏకాదశి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో లక్ష్మీగణపతి హోమం చేపట్టారు. కార్యసిద్ధి ఆంజనేయస్వామికి సిందూరార్చన, గిరీశ్వరస్వామికి విభూది అభిషేకం చేశారు. జిల్లా నలుమూలలు నుంచి భారీగా భక్తులు హాజరయ్యారు. ట్రస్టీ ఆంజనేయరాజు మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం నిర్వహించిన దంత శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని పాండురంగస్వామి దేవస్థానంలో స్వామిని ఆదివారం కల్కి అవతారంలో అలంకరించారు. భారీగా భక్తులు దర్శనం చేసుకున్నారు. లక్ష తులసి పూజ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచారు. ఈ సందర్భంగా భక్తులు వేషధారణలు అలరించాయి.

పల్లకీలో ఉత్సవమూర్తులకు హారతులిస్తున్న అర్చకులు

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట శ్రీవేంకటేశ్వర ధ్యానమందిరంలో ఆదివారం స్వామివారికి వామనావతారంలో విశేష పూజలు నిర్వహించారు.

కశింకోటలో..

పెద్ద పల్లకీలో శ్రీనివాసుడు

నక్కపల్లి, న్యూస్‌టుడే: ధనుర్మాస వేడుకల్లో భాగంగా ఉపమాక వెంకన్న ఆలయంలో స్వామివారు ఆదివారం భక్తులకు పెద్ద పల్లకీలో దర్శనమిచ్చారు. విశేష పూజలనంతరం అర్చకులు గోదాదేవి తరపున స్వామివారికి పాశురవిన్నపం చేశారు. తర్వాత సతీ సమేతుడైన శ్రీనివాసుడిని పెద్ద పల్లకీలో, గోదాదేవిని పల్లకీలో ముస్తాబు చేసి తిరువీధుల్లో ఊరేగించారు.

నిరంతరం నైపుణ్యాల సాధన

కొత్తూరు (అనకాపల్లి): చదువుతున్న అంశాలతో పాటు నిరంతరం అందివస్తున్న నైపుణ్యాలను కూడా పెంచుకోవాలని ఇండియన్ హైకూ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తలతోటి పృథ్వీరాజ్ అన్నారు. సుందరయ్యపేట ప్రాథమికోన్నత పాఠశాలలో 'విద్యార్థుల భవిష్యత్తు.. నైపుణ్యాల పాత్ర' అంశంపై ఆదివారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ప్రసంగించారు. నైపుణ్యాల సాధన నిరంతర ప్రక్రియగా మారిందన్నారు. హెచ్ఎం మల్లా రెడ్డి శంకర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శారద తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి చేరిక

ఎలమంచిలి, న్యూస్‌టుడే: జంపపాలేనికి చెందిన వైకాపా నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే విజయకుమార్ సమక్షంలో ఆదివారం జనసేనలో చేరారు. జగన్ విధానాలు నచ్చక ఆ పార్టీకి చెందిన సాధారణ కార్యకర్తలు సైతం జనసేనలోకి చేరుతున్నారన్నారు. వైకాపా నాయకులు సతీష్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలకు చెందిన వారు జనసేనలోకి చేరారు. పార్టీలోకి చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

జనసేనలోకి చేరిన వైకాపా కార్యకర్తలు, నాయకులతో ఎమ్మెల్యే విజయకుమార్

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | పాయకరావుపేట- 80085 74750

ఎలమంచిలి- 80085 74726

అనకాపల్లి, న్యూస్‌టుడే పూడిమడక రహదారిలో మురుగు నిలిచిపోతోంది. – భీశెట్టి అభిషేక్, అనకాపల్లి, ✓: మురుగు తరలించేందుకు అవుట్‌లెట్లు ఏర్పాటు చేస్తాం. – కె.చక్రవర్తి, జోనల్ కమిషనర్

ఎలమంచిలి, న్యూస్‌టుడే ఎలమంచిలి ఎర్రవరంలో కాలువలు శుభ్రం చేయక దోమలు పెరిగిపోయాయి. – వి.ప్రతాప్, ఎలమంచిలి, ✓: కాలువలు శుభ్రం చేయించి దోమల నివారణకు మందులు చల్లిస్తాం. – ప్రసాదరాజు, కమిషనర్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే కొండకర్ల వద్ద రోడ్డు విస్తరణ పనులు కోసం తవ్వేసిన మట్టిని తొలగించలేదు. ఇది బురదగా మారి పడిపోతున్నాం. – నూకరాజు, కొండకర్ల, ✓: మట్టిని తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. – పద్మిని, ఏఈ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: మండలంలోని రాజానగరంలో ఉన్నత పాఠశాల ముందు ఉన్న పాడుపడిన బావిని తొలగించాలి. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశముంది. – శ్రీను, స్థానికుడు, ✓: బావిని పూడ్చించేందుకు చర్యలు తీసుకుంటాం. – వంకా రమణ, సర్పంచి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే అనకాపల్లి ఏఎంసీ కాలనీలో చేపల మార్కెట్ వద్ద పరిశుభ్రత పనులు చేపట్టడం లేదు. – సరోజ, అనకాపల్లి, ✓: ఈ మార్కెట్‌ను శుభ్రపరుస్తాం. – రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే మర్రిబంద కాలనీకి వెళ్లే మార్గంలో రైల్వే అండర్ బ్రిడ్జి కింద మురుగు నిల్వ ఉంటోంది. – వెంకట్, స్థానికుడు, ✓: వెంటనే మురుగు తొలగిస్తాం.– గిరి ప్రసాద్, పంచాయితీ కార్యదర్శి

'ఈనాడు' కథనం.. దొరికింది పరిష్కారం

స్పందనకు వందనం

నక్కపల్లి, న్యూస్‌టుడే: 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంతో వసతిగృహ విద్యార్థుల మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. నక్కపల్లిలో జాతీయ రహదారిని ఆనుకుని ఎస్సీ/బీసీ విద్యార్థులకు వసతిగృహం ఉంది. వంట గదితోపాటు విద్యార్థుల వాడుక నీరు ఆవరణలో ఉన్న లోతట్టు ప్రాంతంలో చేరి మురికి కూపంలా మారింది. ఈ పరిస్థితులపై 'ఈనాడు'లో ఇటీవల కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ విజయకృష్ణన్ తక్షణం చర్యలు తీసుకోవాలంటూ అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ బి.చైతన్య, ఉప ఎంపీడీఓ చలపతిరావు, కార్యదర్శి రాజశేఖర్ వసతిగృహంపై ప్రత్యేక దృష్టి సారించారు. మురుగు పోయేందుకు ప్రత్యేకంగా పైపులైను ఏర్పాటు చేయించారు. ఆవరణలో పెరిగిన తుప్పలు తొలగించడంతోపాటు, మందు చల్లించి గడ్డి పెరగకుండా చర్యలు చేపట్టారు. ప్రధాన మార్గం వద్ద శాశ్వత గేటు ఏర్పాటు చేయించారు.

అబాకస్‌లో చిన్నారుల ప్రతిభ

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: అబాకస్ పోటీల్లో చిన్నారులు ప్రతిభ చూపారు. పట్టణంలో ట్రైన్ యువర్ బ్రెయిన్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం పిల్లలకు అబాకస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఏడుగురు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరిని నిర్వాహకులు సునీత, విశ్రాంత ఏఈ మళ్ల చన్నారావు, గిరీష్‌కుమార్ అభినందించారు.

మట్టి రోడ్డుతో అవస్థలు

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: జీవీఎంసీ విలీనమైన గొర్లివానిపాలెంలో మట్టి రహదారులతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. రాళ్లు తేలి నడవడానికి వీలు లేకుండా మారడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వీటి స్థానంలో సిమెంట్ రహదారులు నిర్మించాలని పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని గ్రామస్థులు చెబుతున్నారు.

గొర్లివానిపాలెంలో రాళ్లు తేలిన రహదారి

యర్రవరంలో తాగునీటి కష్టాలకు చెక్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: యర్రవరం గ్రామస్థులను వేధిస్తున్న తాగునీటి సమస్యను తెదేపా ప్రభుత్వం పరిష్కరించింది. గతంలో ఎలమంచిలి ఎమ్మెల్యేగా పనిచేసిన పంచకర్ల రమేష్‌బాబు ఇక్కడ తాగునీటిపథకం నిర్మించడానికి రూ. 35 లక్షలు మంజూరు చేయడంతో సమస్య కొంతవరకు తీరింది. ఈ నిధులు పైపులైన్లకు సరిపడకపోవడంతో జల్‌జీవన్ మిషన్‌లో రూ. 13.5 లక్షలు మంజూరైనా పనులు పూర్తిస్థాయిలో జరగక గ్రామంలోని అన్నివీధులకు నీరు అందని పరిస్థితి నెలకొంది. పైపులైను సమస్య పరిష్కారానికి జడ్పీటీసీ సభ్యులు నర్మాలకుమార్ అభివృద్ధి నిధుల నుంచి నిధులు మంజూరు చేస్తున్నట్లు జిల్లా పరిషత్ అధికారులు ఉత్తర్వులు విడుదల చేశారు. పైపులైను పనుల వేగవంతానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచి రెడ్డి లక్ష్మి కోరారు.

గ్రామంలో నిర్మించిన తాగునీటి పథకం

ఎలమంచిలిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం ధర్మశ్రీ కోరారు. ఆదివారం ఎలమంచిలి పార్టీ కార్యాలయంలో ఆయన నాలుగు మండలాల నాయకులతో సమావేశమై అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నాయకులు బొద్దపు ఎర్రయ్యదొర, బోదెపు గోవింద్, బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ప్రతిపాదనపై వైకాపా నేతలు హర్షం వ్యక్తం చేశారు. తిమ్మాపురం మాజీ సర్పంచి అద్దేపల్లి నూకినాయుడు, వైకాపా సీనియర్ నాయకుడు పోలిశెట్టి పెదఈశ్వరరావు విలేకరులతో మాట్లాడారు. అడ్డురోడ్డు మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య **ఆడి1:** ఈషా, దండోరా, వృషభ, అఖండ-2, **ఆడి 2:** ఛాంపియన్, అనకొండ, **ఆడి3:** శంబాల, బ్యాడ్ గాళ్స్, **ఆడి 4:** అవతార్, అఖండ-2, **రాజు:** అఖండ-2, **బంగార్రాజు:** ఈషా, శంబాల **చోడవరం:** **శ్రీసాయిలక్ష్మి:** శంబాల, **లక్ష్మి:** ఛాంపియన్, **పూర్ణా:** అఖండ-2

ఉత్తరద్వార దర్శనం రేపు

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలం అర్జునగిరిలోని పురాతన స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. వేడుకకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు చెప్పారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేకపూజలు జరుగుతాయన్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తుల ఆలయ ఉత్తరద్వార దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు.

ఓ.. సూరీడూ!

రోలుగుంట, న్యూస్‌టుడే: ప్రస్తుత శీతాకాలం చూపిస్తున్న చలి మన్యం వాతావరణాన్నే తలపిస్తోంది. ఉష్ణోగ్రత డిసెంబరులో 15నుంచి 20డిగ్రీలకు దాటట్లేదు. దీంతో ఉమ్మడి విశాఖజిల్లా పరిధిలో కొద్దిరోజుల నుంచి చలిపులి వణుకు పుట్టిస్తోంది. దట్టమైన పొగమంచు గ్రామాలను, రహదారులను సైతం కమ్మేస్తోంది. ఉదయం 8గంటలు దాటినా భానుడి జాడ తెలియట్లేదు.

కుయ్యో.. మొర్రో..

దేవరాపల్లి, న్యూస్‌టుడే: ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడటంలో 108 వాహనం ఎంతగానో ఉపయోగపడుతుంది. చావు, బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న వారెందరినో ఆసుపత్రులకు చేర్చి అండగా నిలుస్తుంది. అటువంటి 108 వాహనం రోడ్లపై పరుగెత్తలేని స్థితిలో ఉంది. దేవరాపల్లి మండల కేంద్రంలోని 108 వాహనం పాతబడిపోవడంతో దీనిపై భాగం వర్షం కురిస్తే కారిపోతోంది. తలుపులు ఎక్కడికక్కడ ఊడిపోతుండటంతో వాటిని తాళ్లతో కడుతున్నారు. ఈ వాహనం దేవరాపల్లి, అనంతగిరి, వేపాడ మండలాల ప్రజల అత్యవసర సేవలకు వినియోగించే దేవరాపల్లి 108 వాహనం స్థానంలో కొత్తదాన్ని వెంటనే సమకూర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బడుల్లో ఆవిష్కరణలకు ఊతం

రూ.2.31 కోట్లతో ప్రయోగశాలల నిర్మాణం

నర్సీపట్నం, మాకవరపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడుల్లో ప్రయోగశాలల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్ర ఆవిష్కరణలకు దోహదపడే వీటికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తోంది. నర్సీపట్నం నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాలల్లో రూ.2.31 కోట్ల వ్యయంతో పదకొండు సైన్స్ ల్యాబ్‌లు నిర్మిస్తున్నారు. పీఎంశ్రీ కింద వీటికి ఈ నిధులు మంజూరయ్యాయి. సమగ్రశిక్షా ఇంజినీరింగ్ విభాగం అధికారులు వీటిని పర్యవేక్షిస్తున్నారు. ల్యాబుల్లోని అవసరమైన పరికరాలు సైతం ఇప్పటికే సరఫరా అయ్యాయి.

నిర్మాణ దశలో ఉన్న మాకవరపాలెం ప్రయోగశాల భవనం

▼ విద్యార్థుల్లో సైన్స్, సాంకేతికత, ఇంజినీరింగ్, మేథమెటిక్స్‌పై ఆసక్తి పెంపొందించడానికి కేంద్రం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా పీఎంశ్రీ పథకం కింద ప్రయోగశాలలకు విడతల వారీగా నిధులు మంజూరు చేస్తోంది. జిల్లాలకు నిర్ణీత విడతలను నిర్దేశించారు అనకాపల్లి జిల్లాకు ఒకటి, రెండు, ఏడు దశల్లో ప్రయోగశాలలకు నిధులు విడుదల అయ్యాయి. ఇందులో నర్సీపట్నం నియోజకవర్గంలో రెండు, ఏడు విడతల్లో కేటాయించిన సొమ్ముతో ల్యాబ్‌ల పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. సమగ్రశిక్షా ఆధ్వర్యంలోని ప్రయోగశాలల నిర్మాణాలు సైతం వివిధ దశల్లో ఉన్నాయి.

▼ సమగ్రశిక్షా ఏడబ్ల్యూవీ అండబ్ల్యూ 2025-26 కింద మాకవరపాలెంలోని కేజీబీవీ స్కూళ్లు, ఎంపీపీ పాఠశాల అలాగే నర్సీపట్నం మండలంలోని కేజీబీవీ పాఠశాలలు, ఒక హైస్కూల్‌కు రూ.23.10 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. ఈ సొమ్ముతో ఆ బడుల్లో కెమిస్ట్రీ, బయాలజీ, ఫిజిక్స్, సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటవుతున్నాయి. పీఎంశ్రీ కింద రెండో విడతగా నర్సీపట్నంలోని బాలికల ఉన్నత పాఠశాల, ఏజెన్సీ లక్ష్మీపురాల్లోని హైస్కూల్‌కు మంజూరైన రూ.46.20 లక్షల నిధులతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. నర్సీపట్నం మున్సిపాలిటీలోని మరోబడికి కంప్యూటర్ ల్యాబ్ నిమిత్తం రూ.18.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ స్కూళ్లలోని వీటికోసం ఇప్పటికే ప్రయోగాలకు అవసరమైన పరికరాలన్నీ పంపిణీ అయ్యాయి. ఈ సామగ్రికి ఒక్కో బడికి రూ.8 లక్షల చొప్పున వ్యయం చేశారు. ల్యాబ్‌ల నిర్మాణ పనులన్నీ వచ్చే మార్చి నాటికి పూర్తి చేయనున్నామని సమగ్రశిక్షా డిప్యూటీ ఈఈ సుబ్బలక్ష్మి తెలిపారు.

ఇటు బడి.. అటు అంగన్‌వాడీ

రోలుగుంట, న్యూస్‌టుడే: నిర్మాణానికి వినియోగించిన నిధులు, ఆరేళ్లక్రితం సుమారు రూ.5లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన భవనం వృథా అయితే.. అందుబాటులో సకలవసతులతో భవనం ఉన్నప్పటికీ వినియోగించుకునే అవకాశంలేక అంగన్‌వాడీ పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. ఈ విచిత్రమైన కథ రోలుగుంట మండలం గుండుబాడు శివారు బలిజిపాలెంలో ప్రభుత్వ పాఠశాలకు భారంగానూ అంగన్‌వాడీ కేంద్రానికి దూరంగానూ ఈ సమస్య వేధిస్తోంది. గతపాలనలో మంజూరైన అంగన్‌వాడీ భవననిర్మాణానికి చెందిన బిల్లు నేటివరకూ విడుదల కాకపోవడంతో గుత్తేదారు ఆ భవనాన్ని అప్పగించకపోవడంతో ఈ సమస్య ఆరేళ్లుగా వేధిస్తోంది. దీనిపై ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ నూతన భవనాన్ని అప్పగించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

బలిజిపాలెం పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

గతుకుల దారికి మోక్షం

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలంలోని తురువోలు - చోడవరం ఆర్‌అండ్‌బీ శిథిలరోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గోతులతో పదుల సంఖ్యలో గ్రామాలకు చెందిన వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. దీంతో స్పందించిన కూటమి సర్కార్ మరమ్మతుకు నిధులను మంజూరు చేసింది. తురువోలు నుంచి కార్మికులు గుంతల్లో రాతిపిక్కతో పూడ్చి. . తారువేసి మరమ్మతు చేస్తున్నారు.

తూకాల్లో అవకతవకలపై చర్యలు

మాంసం దుకాణంలో తూకాన్ని పరిశీలిస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

రావికమతం, న్యూస్‌టుడే: జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారులు ఆదివారం రావికమతంలో ఆకస్మిక దాడులు నిర్వహించి తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడుతున్న 8 దుకాణాల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వి.రామారావు ఆధ్వర్యంలో అధికారులు మాంసం, కూరగాయలు, పండ్ల దుకాణాలను తనిఖీలు చేశారు. కొందరు వ్యాపారులు కిలోకు 330 గ్రాములు తక్కువ బరువుతో అమ్మకాలు జరుపుతున్నట్లు గుర్తించారు. నాలుగు దుకాణాల్లో లీగల్ మెట్రాలజీ శాఖ నిర్ధారించిన ముద్రలు లేకుండా తూనిక యంత్రాలు వాడుతున్నట్లు గుర్తించినట్టు ఇన్‌స్పెక్టర్ రామారావు చెప్పారు. రావికమతంలోని దుకాణాలు, మాంసం విక్రయాల్లో తూనికలు, కొలతల్లో మోసాలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు అందాయని తెలిపారు. మాంసం, కూరగాయలు, పండ్ల దుకాణాల నిర్వాహకులు ఎనిమిది మంది తూకంలో మోసాలకు పాల్పడుతున్న గుర్తించి కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వీరంతా నేరతీవ్రత ఆధారంగా ప్రభుత్వానికి జరిమానాలు చెల్లించాల్సి ఉందని రామారావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 300 దుకాణాలపై కేసులు నమోదు చేశామని చెప్పారు. తూనికలు, కొలతల్లో తేడాలు జరిగినా, వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించినా టోల్‌ఫ్రీ నెంబరు.1967కు ఫోన్ చేసి సంబంధిత షాపుల వివరాలు తెలుపుతూ సమాచారం అందించాలని, ఫిర్యాదు చేసిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రామారావు తెలిపారు.

శివాలయం సమీపంలోని కోనేరు అభివృద్ధి

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: పి.భీమవరం వెళ్లే మార్గంలోని భీమలింగేశ్వరస్వామి ఆలయం దగ్గర కొత్తగా కోనేరును నిర్మిస్తున్నారు. శివాలయం ఎదురుగా చెరువు తవ్వించి కోనేరుగా అభివృద్ధి చేస్తున్నారు. మధ్యలో శివ పార్వతుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. చుట్టూ ఉన్న ప్రాంతాన్ని మొక్కలు నాటి నందనవనంలా తీర్చిదిద్దుతున్నారు. రాత్రిపూట విద్యుత్తు వెలుగుల కోసం చుట్టూ ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేశారు. కోనేరులో ఎల్లప్పుడూ స్వచ్ఛమైన నీరు నిల్వఉండేలా బోర్లతో నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు కోనేరులో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు లింగభూపాలపుర అగ్రహారం మాజీ సర్పంచి తమరాన దాసు తెలిపారు.

నీటిని నింపిన తర్వాత కోనేరు

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

కె.కోటపాడు, న్యూస్‌టుడే: బ్రాహ్మణులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం చంద్రయ్యపేటలో దూర్వాసుల రామశాస్త్రి ఆధ్వర్యంలో ఏపీ బ్రాహ్మణ అర్చక పురోహిత సంక్షేమ సేవా సంఘం, లలితా గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘంలు సంయుక్తంగా ఉత్తరాంధ్ర బ్రాహ్మణుల ఆత్మీయ కలయిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ బ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. మాజీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ వేమూరి ఆనందసూర్య, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టరు వేదుల సూర్యప్రభ, పెంటశేషుబాబుశర్మ, దంతుర్తి కళ్యాణ్, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టరు రొంగలి మహేశ్, జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు జూరెడ్డి రాము, సబ్బవరపు రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వేమూరి ఆనందసూర్య, చిత్రంలో ఎమ్మెల్యే బండారు, తాతయ్యబాబు తదితరులు

మకరజ్యోతి మహోత్సవాలకు సన్నద్ధం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: మకరజ్యోతి మహోత్సవాన్ని జనవరి 14 నుంచి 16 వరకు ఘనంగా నిర్వహించేందుకు అయ్యప్ప సేవా సంఘం సన్నద్ధమవుతోంది. ఈ కార్యక్రమ ప్రచార పత్రికలను శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. వచ్చేనెల 15న ఉత్తరప్రదేశ్ అదనపు డీజీపీ కిల్లాడ సత్యనారాయణ, జేసీ మౌర్య భరద్వాజ్, సంగీత దర్శకుడు కోటి, గాయకులు మనో, శ్రీకీర్తి, నటుడు సత్యసాయి శ్రీనివాస్, గాయకుడు ధీరజ్‌లను సత్కరిస్తున్నట్లు నిర్వాహకులు వివరించారు.

మహోత్సవాల ప్రచార పత్రికలు విడుదల చేస్తున్న అయ్యన్న తదితరులు

ఆలయ అభివృద్ధికి విరాళం

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎం.కోడూరు గ్రామదేవత మోదమాంబ ఆలయం అభివృద్ధికి భాగంగా ఎం.కే వల్లాపురం గ్రామానికి చెందిన కరణం గంగునాయుడు, కొండమ్మ దంపతులు జ్ఞాపకార్థం కుమారుడు కరణం రాము, వెంకటలక్ష్మి దంపతులు వంటషెడ్ నిర్మాణానికి రూ.20 వేలు విరాళంగా ఆలయ కమిటీ ఛైర్మన్ గొల్లపల్లి సంజీవరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురు ముమ్మిన రమణబాబు, గ్రామపెద్దలు, దాతలు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

నర్సీపట్నం అర్బన్: జనవాణి కార్యక్రమం జరుగుతున్న సమయంలో కార్యాలయంలోకి అక్రమంగా ప్రవేశించి జనసేన నియోజకవర్గ సమన్వయకర్త రాజాన వీర సూర్యచంద్రపై దాడికి ప్రయత్నించారని అందిన ఫిర్యాదు మేరకు మారిశెట్టి రాజా, పరవాడ హర్ష, బాతపల్లి కృష్ణారావుపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ షేక్ గఫూర్ ఆదివారం తెలిపారు. నిందితులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

జిల్లా కార్యవర్గంలో చోటు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా వీఆర్వోల అసోసియేషన్‌లో దేవరాపల్లి మండలానికి చెందిన ఇద్దరు వీఆర్వోలకు చోటు దక్కింది. దేవరాపల్లి వీఆర్వో బి.నాగేశ్వరరావుకి జిల్లా సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కాశీపురం వీఆర్వో కాసప్పకు అనకాపల్లి డివిజన్ సంయుక్త కార్యదర్శి పదవి దక్కింది. వీరిని రాష్ట్ర వీఆర్వోల సంఘ నాయకులు పోతల శంకర్రావు అభినందించారు.

దుస్తుల అందజేత

నర్సీపట్నం, న్యూస్‌టుడే: ఈ ప్రాంతంలోని అనాథలకు ఆదివారం జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి రాజాన సూర్యచంద్ర దుస్తులు పంపిణీ చేశారు. పార్టీ నాయకులతో కలిసి తన సొంత ఖర్చుతో పిల్లలకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవ పార్టీ ముఖ్య సిద్ధాంతమని జనసైనికులంతా తమస్థాయికి తగినట్లు నిరుపేదలకు సాయపడాలని సూచించారు. ఇందులో నాయకులు మాకిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: 'చదవడం మాకిష్టం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో పిల్లలకు వివిధ కార్యక్రమాలను సందడిగా నిర్వహించారు. విద్యార్థుల చేత నచ్చిన కథల పుస్తకాలు చదివించారు. వాటిలో నచ్చిన అంశాలను చక్కగా వివరించిన వారికి గ్రంథాలయ అధికారిణి దమయంతి బహుమతులు అందజేశారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ పిల్లలతో వ్యాయామం చేయించారు.

జూదస్థావరాలపై పోలీసుల దాడులు

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి సమీపంలోని బైలుకించంగి పరిసర ప్రాంతాల్లో కోడిపందేలు, జూద స్థావరాలపై పోలీసులు ఆదివారం సాయంత్రం మెరుపుదాడి చేశారు. తొమ్మిది ద్విచక్రవాహనాలు, ఐదు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సైలు వెంకటరమణ, వీరబాబు తెలిపారు. సంక్రాంతి సమీపిస్తున్న తరుణంలో కొందరు గుట్టుచప్పుడు కాకుండా చింతపల్లి పరిసరాల్లో జూద స్థావరాలను నిర్వహిస్తున్నట్టు చింతపల్లి ఏఎస్పీ నవజ్యోత్ మిశ్రాకు సమాచారం అందిందన్నారు. ఏఎస్పీ ఆదేశాలమేరకు దాడులు చేశామన్నారు.

సీఎం సహాయనిధితో పేదలకు బాసట

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సిఫార్సు మేరకు చెవిటి, మూగ సమస్యతో బాధపడుతున్న చెట్టపల్లికి చెందిన ఏల్లెటి యాసిన్(6)కి శస్త్రచికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.5.90 లక్షలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విడుదల చేశారు. ఈ నిధులతో కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స అనంతరం కోలుకున్న యాసిన్, తల్లిదండ్రులతో కలిసి ఆదివారం అయ్యన్నను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

దేవరాపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాలకు చెందినవారికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదివారం అందజేశారు. నాగయ్యపేటకు చెందిన తమటపు బోగేష్‌కి రూ.74 వేలు, తమటపు దందునాయుడుకి రూ.22 వేలు మంజూరు కాగా వారికి చెక్కుల్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు, నాగయ్యపేట, కాశీపురం సర్పంచ్‌లు కర్రి పుష్ప, వరలక్ష్మి, తెదేపా మండలశాఖ అధ్యక్షుడు వెంకటరమణ, సీనియర్ నాయకుడు అధ్యక్షుడు రామ్మూర్తి నాయుడు, కర్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నగదు మంజూరు పత్రం అందజేస్తున్న అయ్యన్న

దేవరాపల్లి, న్యూస్‌టుడే: ములకలాపల్లి అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదివారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను బాధిత మహిళ ఈశ్వరమ్మను అడిగి తెలుసుకున్నారు. స్థానిక నాయకులు సమకూర్చిన నిత్యావసర సరుకుల్ని అందజేశారు.

రద్దయిన సర్వీసులను పునరుద్ధరించాలి

రోలుగుంట, న్యూస్‌టుడే: రద్దు చేసిన ఆర్టీసీ సర్వీసులను పునరుద్ధరించాలని రోలుగుంట, రావికమతం మండలాలకు చెందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు కోరుతున్నారు. ప్రధానంగా అనకాపల్లి డిపోకి చెందిన స్టీల్‌ప్లాంట్-కొత్తకోట బస్సు కొత్తకోటలో రాత్రిపూట చేరేవి. దీనిని పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు. అలాగే ఈ రూట్లో మరో బస్సు కొత్తకోట నుంచి ప్రయాణించేవారికి ఉపయోగపడేదన్నారు.

పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీకి గ్రామసభలు

చీడికాడ, న్యూస్‌టుడే: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీకి గ్రామసభలను నిర్వహించనున్నారు. చీడికాడ మండలంలో జనవరి 2న తవిటివలస, వెల్లంకి, నీలంపేట, చీడిపూడి, పీలుపాల్లోతీ... 3న వరహాపురం, టి.బి.పాలెం, జె.బి.పురం, చినగోగాడ గ్రామాలకు చెందిన రైతులకు జెబీపురంలో సచివాలయం వద్ద అందజేయనున్నారు. 5న సీతంపాలెం, చెట్టుపల్లి, పెదగోగాడ, వింటిపాలెం, తునివలస, 6న దండిసురవరం, కట్టువాని అగ్రహారం, దిబ్బపాలెం, బైలపూడి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేయనున్నట్లు తహసీల్దారు కిశోర్ లింకన్ చెప్పారు.

కూటమి ప్రభుత్వంలో అందరికీ ప్రయోజనం

కె.కోటపాడు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం సర్వజనుల శ్రేయస్సుకు పాటుపడుతోందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, జిల్లా తెదేపా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు పేర్కొన్నారు. స్థానిక తెదేపా కార్యాలయం వద్ద ఆదివారం కె.కోటపాడు, దేవరాపల్లి మండలాలకు చెందిన 23 మంది బాధితులకు రూ.12.99 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ రెండు మండలాల నుంచి ఉత్తమ రైతులుగా ఎంపికైన 35 మందికి ప్రశంసాపత్రాలు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు జూరెడ్డి రాము, నీమిసెరి రమణకు సన్మానం జరిగింది. రాష్ట్ర వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మండల తెదేపా అధ్యక్షుడు రొంగలి మహేశ్, రైవాడ జలాశయ ఛైర్మన్ పాత్రునాయుడు, కిలపర్తి భాస్కరరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు కన్నూరు సూర్యనారాయణ, కొట్యాడ నారాయణరావు, సబ్బవరపు రామునాయుడు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బండారు, తాతయ్యబాబు, పీవీజీ కుమార్, గవిరెడ్డి తదితరులు

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపులు

రావికమతం, న్యూస్‌టుడే: ధనుర్మాసం సందర్భంగా గ్రామాల్లో మేలుకొలుపు కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. దొడపూడిలో ఆదివారం భక్తి శ్రద్ధలతో మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించారు. కల్యాణ వెంకటేశ్వర మేలుకొలుపు బృందం వేకువజామున 4గంటలు నుంచి భక్తి పాటలు ఆలపిస్తూ మహిళలు, పిల్లలు, భజన బృందాలు దేవతామూర్తుల చిత్రపటాలతో పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లారు.

దొండపూడి దేవతామూర్తుల చిత్రపటాలతో మేలుకొలుపు

పట్టు జారిందా... ప్రాణాలు గోవిందా..

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: నిర్లక్ష్యపు ప్రయాణంతో ఏటా ఎందరో రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. అయినా పలువురు ప్రయాణికుల్లో మార్పు రావట్లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఎలాగైనా గమ్యానికి చేరుకోవడంపైనే దృష్టి సారిస్తున్నారు. అనుకోకుండా ప్రమాదం జరిగితే తల్లిదండ్రులకు కన్నీరే మిగులుతోంది. చోడవరం నుంచి రేవళ్ల గ్రామానికి వెళ్లే రోడ్డులో ఆదివారం కూల్‌డ్రింకుల లోడుతో వెళ్తున్న ఆటోలో ముగ్గురు యువకులు వెనుక నిల్చొని ప్రయాణం సాగించారు. ఈ మార్గం అంతా గతుకులు, పెద్ద పెద్ద గోతులతో అధ్వానంతో ఉండటంతో ప్రమాదవశాత్తు ఏమైనా జరిగితే ప్రాణాలు కోల్పోయే అవకాశం లేకపోలేదు.

ప్రత్యేక పంచాయతీలపై కసరత్తు

రోలుగుంట, న్యూస్‌టుడే: సర్పంచులు, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం పూర్తవడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్రప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే బుచ్చెంపేట పంచాయతీలోని శివారు గ్రామమైన గుర్రంపేటతో కలిపి కె.నాయుడిపాలెం శివారులోని కిలపర్తి పాలెం, అంట్లపాలెం గ్రామాలకు కలిపి ఓ పంచాయతీగా కేటాయించాలని కోరుతున్నారు. అలాగే ఎం.కె.పట్నం పంచాయతీలోని శివారు గ్రామాలు పెదపేట, ఎం.పెదపేట, శింగరాజుపేట, చటర్జీపురం గ్రామాలకు ప్రత్యేక పంచాయతీ కావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గుండుబాడు శివారులోని గుర్రాలపాలెం, కశిరెడ్డిపాలెం గ్రామాలను విడదీసి నూతన పంచాయతీ కావాలని కోరుతున్నారు. అయితే వీటికి సంబంధించి తమకు ఎలాంటి వినతులు అందలేదని ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. అయినప్పటికీ ప్రత్యేక పంచాయతీ కావాలంటే తహసీల్దార్ నుంచి గ్రామాల వివరాలు సేకరించి, ప్రజాభిప్రాయాన్ని తీసుకున్న తరువాతే పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

గుర్రాలపాలెం గ్రామం

స్టడీ మెటీరియల్ పంపిణీ

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: దిబ్బిడి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదోతరగతి విద్యార్థులకు ఆదివారం ఉచితంగా స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాల గణిత ఉపాధ్యాయుడు ఏవీఎన్ మూర్తి తన సొంతనిధులతో 35 మందికి అందజేశారు. పరీక్షల సమయంలో ఆరోగ్యంగా ఉండి చదువుకునేందుకు పండ్లు, డ్రైఫ్రూట్స్ సరఫరా చేశారు. విద్యార్థి మేలుకో కార్యక్రమంలో భాగంగా ఉదయాన్నే విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించారు. వేకువజామునే మేల్కొని చదువుకోవాలని, చదువుతో పాటు క్రమశిక్షణ ఎంతో అవసరమని సూచించారు. పరీక్షల వేళ విద్యార్థుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేసిన ఉపాధ్యాయుడు ఏవీఎన్ మూర్తి

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: తాటిపర్తి ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ ఉన్నత పాఠశాల 1993-2003 పదో తరగతి విద్యార్థులు తాటిపర్తి శివారు గరికిబంద బిల్లలపాలెం వెళ్లే టేకుతోటలో, మండల కేంద్ర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 1993-94లో పదో తరగతి విద్యార్థులు మాడుగుల ఉబ్బలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. ఎక్కడెక్కడో స్థిరపడినవారంతా ఓచోట చేరి ఆనందంగా గడిపారు.

బిల్లలపాలెం పూర్వ విద్యార్థుల కలయిక

అప్పలరాజుకు సత్కారం

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా కాపునాడు సంఘం సభ్యులు ఆదివారం మాడుగుల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజును శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా కాపునాడు సభ్యులు మాట్లాడుతూ పుప్పాల కృషిని ప్రశంసించారు. రానున్న రోజుల్లో మరెన్నో పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాపునాడు అధ్యక్షుడు పలకా రాము, ప్రధాన కార్యదర్శి యడ్ల త్రినాధరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

రోలుగుంట, మా గ్రామానికి దూరంగా ఏర్పాటుచేసిన పీహెచ్‌సీకి వెళ్లేదారిలో ఆసుపత్రిలో వినియోగించిన వ్యర్థాలను రహదారి పక్కనే వేస్తున్నారు. దీనివల్ల అనేక అనర్థాలు చోటుచేసుకునే ప్రమాదముంది. **- రాజునాయుడు, బుచ్చెంపేట,** ✓: ఈ సమస్యపై తప్పకుండా దృష్టి సారిస్తాం. ఆసుపత్రి వ్యర్థాలను అక్కడ వేయకుండా నివారణ చర్యలు తీసుకుంటాం. **- చంద్ర, సర్పంచి, బుచ్చెంపేట**

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: అన్నవరం గ్రామంలో పట్టపగలే విద్యుత్తు దీపాలు వెలుగుతున్నాయి. ప్రతిరోజూ విద్యుత్తు వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. **- అప్పారావు, స్థానికుడు,** ✓: ఈ సమస్య మా దృష్టికి రాలేదు. విద్యుత్తు వృథా కాకుండా పంచాయతీ సిబ్బందితో చెప్పి చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి**

రోలుగుంట, న్యూస్‌టుడే: మా గ్రామం నుంచి బుచ్చెంపేట శివారు గుర్రంపేటకు వెళ్లే దారికిరువైపులా పిచ్చిమొక్కలు విపరీతంగా బలిసిపోయాయి. దీనివల్ల వృద్ధులు, పాఠశాల విద్యార్థులు పయనించడానికి ఆందోళన చెందుతున్నారు. **- పోతురాజుబాబు, కె.నాయుడిపాలెం,** ✓: ఈ సమస్య ఇటీవలే మా దృష్టికొచ్చింది. తక్షణమే పరిష్కారం చూపడానికి చర్యలు తీసుకుంటాం. **- సన్యాసినాయుడు, సర్పంచి, కె.నాయుడిపాలెం**

వరి కంకులతో అలంకరణ

చోడవరం, న్యూస్‌టుడే: పండిన తమ తొలి పంటైన వరి కంకులతో మైచర్లపాలెం వాసులు గ్రామంలోని సీతారామాలయాన్ని సుందరంగా అలంకరించారు. ఈ నెల 30న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఆలయాన్ని కంకులతోపాటు పూలతో అందంగా అలంకరించారు. ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభమైన ధనుర్మాసం సందర్భంగా ప్రతి రోజు ఉదయాన్నే గ్రామంలో మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సర్పంచి మాణిక్యం, అర్చకులు పారుపూడి సత్యనారాయణ మూర్తిలు తెలిపారు.

మైచర్లపాలెంలో అలంకరించిన సీతారామాలయం

(c) eenadu

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ స్క్రీన్-1: **శంబాలా** (మార్నింగ్, ఫస్ట్ షో), **ఈషా** (మ్యాట్నీ, సెకెండ్ షో)
స్క్రీన్-2: **ఛాంపియన్**

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

వేపగుంట (పెందుర్తి), న్యూస్‌టుడే: 11కేవీ సింహాద్రినగర్ ఫీడర్‌పై నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ బి.సింహాచలంనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. దీనివల్ల ఫీడర్ పరిధిలోని సింహాద్రినగర్, బొబ్బిలివారి వీధి, దత్తసాయినగర్, తదితర ప్రాంతాల్లో ఆయా సమయాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

పెందుర్తి

నిఘా నేత్రాలున్నాయ్ జాగ్రత్త..

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడ సంతబయలు ప్రాంతంలో ఇటీవల పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా ఇక్కడ సంబంధిత కెమెరాలు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో ఇక్కడ నాలుగు దుకాణాలు కాలిపోయినపుడు పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. కొందరు దుండగులు ఉద్దేశపూర్వకంగానే నిప్పు పెట్టారని అప్పట్లో కొందరు ఆరోపించారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో నిందితులను గుర్తించలేని పరిస్థితి నెలకొంది. అలాగే ప్రమాదాలు జరిగినపుడు వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు దర్యాప్తులో పోలీసులకు కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు ఇక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల ఎవరు తప్పు చేసినా, నేరాలు, ప్రమాదాలు జరిగినపుడు ఇకపై నిఘా నేత్రాలు గుర్తు పట్టేస్తాయి. పోలీసులు వీటిని ఏర్పాటు చేయడంతో స్థానికులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరవాడ సంతబయలు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం మరిశవానిపాలెం చెరువు వద్ద రహదారి అంచులు దెబ్బతిని తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. –శ్రీనివాస్, కలపాక ✓: రహదారికి త్వరలో మరమ్మతులు చేపడతాం. –లలిత, ఏఈ, ఆర్‌అండ్‌బి

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: గొట్టివాడ కాలనీ చర్చి సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెంటాడుతోంది. –వై.అప్పలనాయుడు, సబ్బవరం ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే సమస్య పరిష్కరిస్తాం. –సోలాపు మీన, సర్పంచి, గొట్టివాడ

?: సబ్బవరం పీహెచ్‌సీకి వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలకు రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. –మామిడి శంకరరావు, బల్లిపాలెం ✓: వైద్య ఆరోగ్య శాఖ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. –పి.పద్మజ, ఎంపీడీవో, సబ్బవరం

పెందుర్తి, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెం సమీప ఎన్ఏడీ లేఅవుట్‌లోని 32ఎ/4 వీధిదీపం రెండు వారాలుగా వెలగడం లేదు. –ఇ.వెంకటేశ్వరరావు, ఎన్ఏడీ లేఅవుట్ ✓: మీ ప్రాంతంలో వెలగని వీధి దీపానికి త్వరలో మరమ్మతులు చేపట్టి వెలిగేలా చర్యలు తీసుకుంటాం. –సోమేష్, వీధి దీపాల నిర్వహణ ఏఈ, 95వ వార్డు

దూసుకొస్తున్న బూడిద

కాలుష్యం బెడదతో స్థానికులకు నిత్యం అవస్థలే..

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ పరిసర గ్రామాల ప్రజలను బూడిద, బొగ్గులారీల కాలుష్యం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. లారీల నుంచి బొగ్గు, బూడిద కిందికి రాలి... దుమ్ము, ధూళి ఎగరడంతో ద్విచక్రవాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సంబంధిత వాహనాల కారణంగా రహదారులు దెబ్బతిని ఈ సమస్య రోజురోజుకు మరింత జటిలమవుతోంది. ఓవర్‌లోడ్, సరకుపై టార్పాలిన్లు సరిగా కట్టని కారణంగా ఈ పరిస్థితి ఏర్పడుతోంది. పరవాడ మండల పరిధిలో రోజుకు 700లకు పైగా బొగ్గు, బూడిద లారీలు రాకపోకలు చేస్తుంటాయి. వీటి కారణంగా కాలుష్యం బెడద వెంటాడుతూ, తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పీసీబీ, రవాణా, ఆర్‌అండ్‌బి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

■ బొగ్గు, బూడిద లారీల కాలుష్యం వల్ల రహదారుల వెంబడి ఉన్న మొక్కలు, చెట్లు నల్లగా మారిపోయాయి. చెట్ల ఆకులపై పెద్దఎత్తున దుమ్ము, ధూళి పేరుకుపోయిందంటే ఇక్కడ కాలుష్యం తీవ్రత ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. నివాసాలు, దుకాణాలు, వసతిగృహాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉన్న మొక్కలు పనికిరాకుండా పోతున్నాయి. ముఖ్యంగా లంకెలపాలెం నుంచి పరవాడ, ఊటగెడ్డకూడలి, సోమునాయుడుపాలెం, కలపాక, పిట్టవానిపాలెం మీదుగా పాలవలస వరకు ఏ మొక్క చూసినా నల్లగా మాడిపోతున్నాయి. దీనికితోడు ఎన్టీపీసీ సర్వీసు రోడ్డులోని పిట్టవానిపాలెం నుంచి దేశపాత్రునిపాలెం మీదుగా లంకెలపాలెం ఏలేరు కాలువ వరకు మొత్తం చెట్లు బూడిదతో నిండిపోయి పర్యావరణం దెబ్బతింటోంది. ఈ మార్గంలో బూడిద ఎక్కడికక్కడ మేటలు వేయడంతో బిక్కుబిక్కుమంటూ పయనించాల్సిన పరిస్థితి నెలకొంది.

లంకెలపాలెం ఏలేరు కాలువ సమీపంలో ఇలా..

దుకాణదారులు, నివాసితుల ఆందోళన: కాలుష్యం వల్ల రహదారి పక్కనున్న నివాసితులు, దుకాణదారులు పడరాని ఇబ్బందులు పడుతున్నారు. బూడిద ఇళ్లు, దుకాణాలపైకి ఎగిరి పడడంతో వ్యాపారాలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ దుకాణాల వద్దకు కొనుగోలుదారులు రావడం లేదని.. గంట గంటకు దుమ్ము, ధూళి శుభ్రం చేసుకోవాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ఈ కారణంగా తరచూ దుకాణాలు మూసుకోవాల్సి వస్తోందని, తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై ఓ లారీ ప్రయాణించినపుడు దాని వెనుక వెళ్లాలంటే భయమేస్తోందని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు వెంటనే స్పందించి ఈ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

దీపాంజలినగర్‌లో ఘనంగా ఆనంద మేళా..

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్ సాధన క్రీడామైదానంలో ఆదివారం రాత్రి దీపికా లేడీస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆనందమేళా సందడిగా జరిగింది. దక్షిణ ప్రాంత దీపాంజలి మహిళా సమితి అధ్యక్షురాలు రుపాలిసిన్హా, రెన్యూవబుల్ ఎనర్జీ సీఈవో పండా, సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ, దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు నీతూశర్మ తదితరులు జ్యోతి వెలిగించి మేళాను ప్రారంభించారు. తొలుత గాల్లోకి బెలూన్లు విడిచిపెట్టి.. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక ఆలయ నమూనా, విద్యుత్తు దీపాలంకరణ, పూల మొక్కల ప్రదర్శన కనువిందు చేశాయి. ఈపడాది మేలో జరిగిన బాలికా సాధికారత కార్యక్రమంలో ప్రతిభ చాటిన 20మంది బాలికలకు ఉచితంగా సైకిళ్లు, మరో అయిగురు దివ్యాంగులకు సోలార్ ట్రైసైకిళ్లు అందజేశారు. ఈ మేళాలో వేర్వేరు అంశాలపై ఏర్పాటు చేసిన 30 స్టాల్స్ ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అలరించాయి. మేళా ద్వారా వచ్చిన ఆదాయాన్ని పేదల సేవా కార్యక్రమాలకు వినియోగిస్తామని క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. సంస్థ జీఎంలు, హెచ్‌ఆర్ అధికారులు, దీపికా లేడీస్ క్లబ్ సభ్యులు, ఎన్టీపీసీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

స్టాల్ తిలకిస్తున్న దక్షిణ దీపాంజలి మహిళా సమితి అధ్యక్షురాలు రుపాలి సిన్హా, ఎన్టీపీసీ అధికారులు పండా, సమీర్‌శర్మ తదితరులు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

ద్రోణంరాజుకు నివాళి

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: మాజీ రాజ్యసభ సభ్యుడు దివంగత ద్రోణంరాజు సత్యనారాయణ వర్ధంతి చినముషిడివాడలోని ఆయన నివాసంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కా రామునాయుడు, నాయకులు కుమార్, కనకారావు, మన్మధరావు, తదితరులు ద్రోణంరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అప్పట్లో ఆయన సమాజానికి అందించిన సేవలను కొనియాడారు.

ఉచిత వైద్య శిబిరాలకు ఏర్పాట్లు

సబ్బవరం, న్యూస్‌టుడే: ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 29న సబ్బవరం దుర్గమాంబ ఆలయ ప్రాంగణంలో, 30న రావికమతం వినాయకుడి గుడి సమీపంలో, 31న తాళ్లపాలెం కూడలి వద్ద ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయా శిబిరాల్లో ఉచితంగా రక్తపోటు, మధుమేహం తదితర పరీక్షలు చేస్తారని తెలిపారు. సంబంధిత శిబిరాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం రావులమ్మపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-1994 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం దేవీపురంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కోసి, సినిమా పాటలకు నృత్యం చేస్తూ ఆనందంగా గడిపారు. ఒక సంఘంగా ఏర్పడి వివిధ సేవా కార్యక్రమాలు చేయాలని, ఏటా డిసెంబరులో ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించాలని నిశ్చయించుకున్నారు. మహిళలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

రావులమ్మపాలెం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

సింహగిరిపై ధనుర్మాస వైభవం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం అర్చకులు దేవతామూర్తుల తిరువీధి వేడుకగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి బంగారు తొళక్కియాన్ పల్లకిలో కొలువుదీర్చారు. వేద పారాయణలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లను ఆలయ బేడామండపంలో చతుర్గతి నడకలతో ఊరేగించారు. తిరుప్పావై సేవాకాలంలో భాగంగా అమ్మవారి సేవ, పాశుర విన్నపం, తీర్థ గోష్ఠి సంప్రదాయబద్ధంగా జరిగింది.

తిరుప్పావై సేవాకాలం.. ఆధ్యాత్మిక వైభవం

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా తిరుప్పావై సేవాకాలం ఆధ్యాత్మిక వైభవాన్ని చాటుతోంది. ఆలయ ప్రధానార్చకులు మహర్షి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు ఆదివారం వేకువజామున శ్రీవారికి ప్రాతఃకాల పూజలు చేశారు. ఆభరణాలు, పూలమాలలతో అలంకరించి ధూపదీప సేవలు చేపట్టారు. తిరుప్పావై సేవాకాలంలో భాగంగా 13వ పాశురాన్ని విన్నపం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక పాశుర పారాయణం చేశారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని సబ్బవరం మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, నగర సంకీర్తనలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం సబ్బవరంలో వేకువజామున 4 గంటల నుంచి సాయిబాబా భక్తులు వీధుల్లో అన్నమయ్య సంకీర్తనలు పాడుతూ ప్రజలను మేల్కొలుపుతున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పెద్దాడ రమణమ్మ, దంగేటి నాగేశ్వరరావు, కోరాడ శ్రీను, ధనిమిరెడ్డి పాప, ద్వారపూడి శ్రీను, గెద్దం కృష్ణవేణి, సత్యంనాయుడు, కొల్లి గంగునాయుడు, ముర్రి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

వేంకటాద్రిపై పూజలందుకున్న వేంకటేశ్వర స్వామి, హారతి స్వీకరిస్తున్న భక్తులు

సబ్బవరంలో భక్తుల నగర సంకీర్తన

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ఈ.బోనంగి ఫార్మాసిటీ పునరావాసకాలనీ కొండపై కొలువైన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఈనెల 30వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీహరికృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. స్వామివారి ఉత్తర ద్వార దర్శనం, భక్తులకు ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

★ పరవాడ జేఎన్ ఫార్మాసిటీలోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీన శ్రీకోదండ సీతారామచంద్రస్వామి వారి ఉత్తరద్వార దర్శనం ఉంటుందని ఆలయ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు ఉంటాయని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ సమీప హరిహర క్షేత్రంలో కొలువైన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం పాశుర విన్నపం సంప్రదాయబద్ధంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు ముప్పిరాల అనంతాచార్యులు నేతృత్వంలో అర్చకులు తిరుప్పావై సేవాకాలం, 13వ పాశుర విన్నపం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఈ.బోనంగిలో శ్రీవేంకటేశ్వరస్వామి

ఫార్మాసిటీలో పంచముఖ ఆంజనేయస్వామి

సుజాతనగర్‌లో..

ఉత్తర ద్వార దర్శనానికి ఆలయాల ముస్తాబు

పెందుర్తి, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 30వ తేదీన భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు పెందుర్తి మండలంలోని పలు ఆలయాలు విస్తృత ఏర్పాట్లు చేశాయి. ఈ నేపథ్యంలో సంబంధిత మందిరాలను విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు.

విద్యుద్దీపాలంకరణలో హరిహర క్షేత్రం

★ వేంకటాద్రిపై కొలువైన శ్రీనివాసుడు 30న వేకువజామున 3.30 గంటల నుంచి ఉత్తర ద్వారంలో భక్తులను అనుగ్రహిస్తారని ఆలయ ప్రధానార్చకులు మహర్షి రామానుజాచార్యులు తెలిపారు. సుమారు 35వేల మంది భక్తులు దర్శనానికి వస్తారన్న అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఆ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు 8 బస్సులు కొండపైకి కిందికి భక్తులను ఉచితంగా రవాణా చేస్తాయని తెలిపారు. రెండు ఘాట్‌రోడ్లను తెరిచి వేర్వేరుగా రాకపోకల సదుపాయం కల్పిస్తామన్నారు. ఉచిత ప్రసాద వితరణ, క్యూలైన్ల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం 35 మంది సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపారు. భక్తులు సంయమనంతో వ్యవహరించి తోపులాట లేకుండా స్వామిని దర్శించుకోవాలని కోరారు. ★ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలిమేలు మంగాదేవి ఆలయంలో ఆరోజు ఉదయం 5గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. ★ సుజాతనగర్ హరిహర క్షేత్రంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ఉదయం 5 గంటల నుంచి తిరువీధి, వైకుంఠ ద్వార దర్శనం ఉంటుందని అర్చకులు పేర్కొన్నారు. దొగ్గవానిపాలెం గోవిందరాజ స్వామి ఆలయంతోపాటు పలు రామాలయాల్లోనూ వైకుంఠ ఏకాదశి ఉత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

వైద్య రంగానికి డా॥ శివరామకృష్ణారావు సేవలు ఎనలేనివి

ఘనంగా శత వసంత జన్మదిన వేడుకలు

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: వైద్య రంగానికి డాక్టర్ శివరామకృష్ణారావు చేసిన సేవలు అజరామరమని ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ వైద్యులు, వక్తలు పేర్కొన్నారు. వైద్యుడిగా ఎందరికో సేవలందించి ప్రొఫెసర్‌గా ఎందరినో ఉత్తమ వైద్యులుగా తీర్చిదిద్దిన డాక్టర్ పట్నం శివరామకృష్ణారావు వందో జన్మదిన వేడుకలు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఓ హోటల్‌లో శిష్యబృందం, కుటుంబ సభ్యుల మధ్య ఆదివారం ఘనంగా జరిగాయి. విశాఖపట్టణం ఆంధ్రా వైద్యకళాశాల, గుంటూరు, కాకినాడ వైద్య కళాశాలల పూర్వ విద్యార్థులైన ప్రముఖ వైద్యనిపుణులు, హైదరాబాద్, కర్నూలు, విజయవాడ, రాజమహేంద్రవరం నగరాలకు చెందిన ఆయన శిష్యులు పెద్దఎత్తున హాజరై శివరామకృష్ణారావును సత్కరించి పాదాభివందనం చేశారు. శివరామకృష్ణారావు నెల్లూరులో జన్మించినా రాజమహేంద్రవరంలో ఉంటున్న తన మనమరాలు(కుమార్తె కూతురు) వద్ద స్థిరపడ్డారు. ఆయన కుమార్తెలు, మనమలు అంతా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన వైద్య ప్రముఖులు డాక్టర్ సోమరాజు, డాక్టర్ ఐవీ రావు, డాక్టర్ బాబ్జీ, డాక్టర్ ఎస్కే అప్పారావు, డాక్టర్ పెదవీర్రాజు, డాక్టర్ గోలు రామారావు తదితరులు మాట్లాడారు. 28 ఏళ్లపాటు వైద్య విద్యబోధన, 70 ఏళ్లకు పైగా క్లినికల్ అనుభవంతో ఆయన ఎన్నో మైలురాళ్లు దాటారన్నారు. ఆయన రాసిన 'డిఫరెన్షియల్ డయాగ్నోసిస్ అండ్ మెడికల్ థెరాపెడిక్స్' పుస్తకం యువ వైద్యులకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు.

ఈ పుస్తకం మొదటి ఎడిషన్ 2001లో విడుదల చేసినా.. దానికి అనుబంధంగా అయిదో ఎడిషన్‌ను ఈ ఏడాది సెప్టెంబర్‌లో విడుదల చేశారన్నారు. ఇది జాతీయ, అంతర్జాతీయంగా వైద్యరంగంలో సంచలనం సృష్టించిన పుస్తకమన్నారు. ఆయన శిష్యులు ఇప్పుడు దేశ విదేశాల్లో ప్రముఖ వైద్యులుగా రాణిస్తున్నారంటే అప్పట్లో ఆయన చేసిన దిశానిర్దేశమే కారణమన్నారు.

వేర్వేరు ప్రాంతాలకు చెందిన వైద్యులతో డాక్టర్ శివరామకృష్ణారావు

'పురోహిత క్రికెట్ కప్' విజేత విశాఖ జట్టు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: భీమవరంలో గన్నాబత్తులవారి క్రీడా మైదానంలో 8 రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ లీగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్స్‌లో హైదరాబాద్ జట్టుపై విశాఖ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు 101 పరుగులు చేయగా.. విశాఖ 102 పరుగులతో విజయం సాధించి కప్ సొంతం చేసుకుంది. వారికి దాత సాగిరాజు అప్పలరాజు తరపున డీఎన్నార్ కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు రూ.లక్ష పారితోషికం అందించారు. రన్నర్స్‌గా నిలిచిన హైదరాబాద్ జట్టుకు దాత డాక్టర్ సిరియాల గౌతమ్‌కుమార్ రూ.50 వేలు అందించారు. పోటీల నిర్వాహకుల తరపున అతిథుల చేతులమీదుగా వారికి కప్‌లు అందించారు.

సెమీ ఫైనల్స్‌లో.. : తొలి మ్యాచ్‌లో కాకినాడ జట్టు 82 పరుగులు చేయగా హైదరాబాద్ జట్టు 83 పరుగులు చేసి విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో విశాఖ జట్టు 99 పరుగులు సాధించగా రాజమహేంద్రవరం జట్టు 93 పరుగులకే ఓటమి పాలైంది. ఈ సందర్భంగా ఆర్గనైజర్లు బ్రహ్మజోశ్యుల సుబ్రహ్మణ్యశర్మ, బ్రహ్మజోశ్యుల సత్యప్రసాద్ శర్మ, చందూరి కామేశ్వరశర్మ, ఆహ్వాన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ పోటీలో 20 జట్లు పోటీలో పాల్గొన్నాయని తెలిపారు.

కప్ అందుకున్న విశాఖ జట్టు క్రీడాకారులు

వెలమ సంఘం ఆత్మీయ సమావేశం

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు పరిధి సుజాతనగర్‌కు చెందిన రంగరాయ వెలమ సంఘం ఆత్మీయ సమావేశం చినముషిడివాడ వుడాకాలనీలోని వీఎంఆర్డీఏ కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఏపీ ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్, పెందుర్తి మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ అవగడ్డ జ్యోతి, కింజరాపు ప్రభాకర్ నాయుడు, చుక్కా చిన్నబాబు, నరవ రాంబాబు, చొక్కాకుల వెంకటరావు, తదితరులు పాల్గొని వెలమల ఐక్యతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు లగుడు శ్రీనివాస్, కార్యదర్శి తైనాల మహేశ్, ఉపాధ్యక్షుడు రంభ ఆనందరావు, కోశాధికారి పోతుల వెంకటరమణ, అధిక సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరిస్తున్న గండి బాబ్జీ, సంఘ నాయకులు

అప్పికొండలో 'జిప్సా' విహారయాత్ర

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే: గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేటు పాఠశాలల సంక్షేమ సంఘం(జిప్సా) ఆధ్వర్యంలో ఆదివారం అప్పికొండ బీచ్‌లో విహారయాత్ర జరిగింది. ఈ సందర్భంగా సంఘ పటిష్టతకు, పాఠశాలల సమస్యలపై చర్చించినట్లు సంఘ గౌరవ అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు పేర్కొన్నారు. సంఘ ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, షణ్ముఖరావు, బాబూరావు, మురళీ సుందర్, జగన్, రాము, సభ్యులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు ప్రతివారం స్టేషన్‌కు రావాల్సిందే

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐలు జిలానీ, లక్ష్మీ

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు ప్రతి వారం తప్పనిసరిగా స్టేషన్‌కు వచ్చి కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని ఎస్ఐలు జిలానీ, లక్ష్మీ పేర్కొన్నారు. స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారి ప్రస్తుత స్థితిపై ఎస్ఐలు ఆరా తీశారు. కార్యకలాపాలు అడిగి తెలుసుకున్నారు. నేర సంబంధిత వ్యవహారాల్లో పాల్గొనవద్దని హెచ్చరించారు.

వృద్ధుడి నేత్రాలు దానం

పెందుర్తి, న్యూస్‌టుడే: భీమిలి ప్రాంతానికి చెందిన ఓ వృద్ధుడి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఇందుకు సంబంధించి పెందుర్తి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీను తెలిపిన వివరాలిలా.. చిప్పాడ గ్రామానికి చెందిన రవ్వా రామారావు (69) శనివారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానం చేయాలని నిర్ణయించుకుని ట్రస్ట్ ప్రతినిధులను సంప్రదించారు. ఈ మేరకు నగరానికి చెందిన మోహిసిన్ నేత్రనిధి కేంద్రం టెక్నీషియన్ కృష్ణ మృతుడి నేత్రాల నుంచి కార్నియా సేకరించారు. ట్రస్టు ప్రతినిధులు సంబంధిత కుటుంబ సభ్యులకు నేత్రదానం ధ్రువీకరణ పత్రం అందజేశారు.

మృతుడి కుటుంబ సభ్యులకు ధ్రువపత్రం అందిస్తున్న టెక్నీషియన్ కృష్ణ

గ్రేటర్‌లో గ్రామాల విలీనానికి కదలిక

పెందుర్తి, న్యూస్‌టుడే: విశాఖ మహా నగరాన్ని ఆనుకుని ఉన్న గ్రామీణ మండలాల్లోని పంచాయతీలను గ్రేటర్‌లో విలీనం చేసేందుకు చర్యలు మొదలయ్యాయి. ఈ మేరకు పెందుర్తి మండలంలోని 15, భీమిలి నియోజకవర్గంలోని 64 పంచాయతీలను జీవీఎంసీలో విలీనం చేయాలని ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, గంటా శ్రీనివాసరావు ఈ ఏడాది అక్టోబరులో సీఎంను ఓ లేఖ ద్వారా కోరారు. ఆ మేరకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.

★ ఇందులో భాగంగా గ్రామ పంచాయతీలను గ్రేటర్‌లో విలీనం చేసేందుకు తొలి అడుగు పడింది. పెందుర్తి మండలంలో 15, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో 64 పంచాయతీలకు సంబంధించిన వివరాలు తెలియజేయాలని జీవీఎంసీ కమిషనర్ జిల్లా పంచాయతీ అధికారిని కోరారు. ఆయా పంచాయతీలకు సంబంధించిన జనాభా, రెవెన్యూ గ్రామాల విస్తీర్ణం, ఇతర వివరాలను ఈ నెలాఖరులోగా అందజేయాలన్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో వాడీవేడి చర్చ జరుగుతోంది. గ్రామీణ నాయకులు కలిసిన ప్రతిచోటా ఇదే సంభాషణ.

★ అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని సబ్బవరం మండలంలో కూడా విలీనానికి అనుకూల సంకేతాలున్నాయి. ఇప్పటికే కొన్ని గ్రామ పంచాయతీలు తమ గ్రామాలను గ్రేటర్‌లో విలీనం చేయాలని ప్రతిపాదించినట్లు సమాచారం. ఈ క్రమంలో పరవాడ మండలం కూడా గ్రేటర్‌లో కలిసే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.

★ **స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం:** మరో ఆరు నెలల్లో జీవీఎంసీ ఎన్నికలు జరగాల్సి ఉంది. అదే సమయంలో గ్రామ పంచాయతీల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. జిల్లా, మండల ప్రాదేశిక పాలకవర్గాలకు వచ్చే ఏడాది నవంబరు వరకు గడువు ఉంది. ఈ నేపథ్యంలో విలీనం ప్రతిపాదనలు స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపనున్నాయి. ప్రభుత్వం ఈ విలీనంపై ముందుకు వెళ్తే ఎన్నికలు వాయిదా పడే అవకాశం ఉందని నాయకులు అభిప్రాయపడుతున్నారు. పెందుర్తి, భీమిలి నియోజకవర్గాల్లోని గ్రామ పంచాయతీలు జీవీఎంసీలో విలీనమైతే విశాఖ జిల్లా మొత్తం నగర ప్రాంతంగా అవతరించి జిల్లా, మండల పరిషత్‌లు కనుమరుగవుతాయి.

ప్రమాదకర మలుపులతో బెంబేలు

తానాం మార్గంలోని ఊరచెరువు వద్ద ఇలా..

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడ నుంచి తానాం, భరణికం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన మార్గాల్లోని మలుపులు ప్రమాదకరంగా మారాయి. వాహనాలు దగ్గరికొచ్చే వరకు కానరాకపోవడంతో పాదచారులు, వాహన చోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు అతివేగంతో వాహనాలు నడపడం వల్ల మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా మార్గాల్లో విద్యుత్తు దీపాలు లేకపోవడం వల్ల రాత్రి వేళ మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంటున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

(c) eenadu

ముక్కోటి ఏకాదశికి ముస్తాబు

విద్యుద్దీప వెలుగుల్లో చింతల వెంకటరమణస్వామి ఆలయం

తాడిపత్రి, న్యూస్‌టుడే: ఈ నెల 30వ తేదీన ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని జిల్లాలోని వెంకటేశ్వరస్వామి ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. తాడిపత్రిలో ప్రసిద్ధిగాంచిన చింతల వెంకటరమణస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. స్థానిక ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి నుంచి ఆలయానికి సమారు 500 లడ్డూలను తెచ్చినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌గా గాజుల ఆదెన్న

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే : రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌గా జిల్లాకు చెందిన న్యాయవాది గాజుల ఆదెన్న నియామకం దాదాపు ఖరారైంది. గవర్నర్ ఆమోదం ముద్ర వేయాల్సి ఉంది. గాజుల ఎర్రమ్మ, గాజుల గోవిందప్ప కుమారుడు గాజుల ఆదెన్న. స్వస్థలం రాయదుర్గం మండలం కెంచానపల్లి. న్యాయవాది వృత్తిలో కొనసాగుతున్నారు. తన పేరును ప్రతిపాదించి, గవర్నర్ ఆమోదానికి పంపడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా ఆదెన్న కృతజ్ఞతలు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కోటంక గ్రామ సమీపంలో కొండల మధ్య వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు రామాచార్యులు అర్చనలు, క్షీరాభిషేకాలు చేసి ఆకుపూజ, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి, అన్నదాన సదుపాయం కల్పించారు.

అలా వస్తారు.. ఇలా వెళ్తారు!

> గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల పనితీరు అధ్వానంగా ఉంది. చాలా మంది విధులకు డుమ్మా కొడుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. ఇలా అయితే ప్రజల సమస్యలు ఎవరు తీర్చేది? - ఈనెల 17, 18న జరిగిన కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు అసంతృప్తి

సచివాలయాల ఉద్యోగుల హాజరుపై నీలినీడలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల పనితీరు అధ్వానంగా.. దయనీయంగా మారింది. అంకిత భావం, బాధ్యతగా పనిచేసే ఉద్యోగులు కొంతమేర ఉన్నా.. అధిక శాతం విధులకు దుమ్మా కొడుతున్నారు. రోజువారి 'హాజరు' నమోదు వారి పనితీరుకు అద్దం పడుతోంది. ముప్పై శాతం మంది దాకా నిర్దేశిత వేళల కంటే ఆలస్యంగా విధులకు వస్తున్నట్లు హాజరు యాప్ ద్వారా తేటతెల్లమవుతోంది. చాలా మంది ఉదయం వచ్చి.. మధ్యాహ్నమే వెళ్లిపోతున్నారు.

★ సమస్యల పరిష్కారం, కుల, ఆదాయ, 1బీ, అడంగల్.. ఇలా ప్రతి ధ్రువీకరణ పత్రం జారీ సచివాలయాల ద్వారానే కొనసాగుతోంది. మున్సిపల్, ఎంపీడీఓ, తహసీల్దారు, ఎంఈఓ, ఏఓ.. ఇలా ప్రతి మండల కార్యాలయాల ద్వారా పొందే సేవలన్నీ సచివాలయాల ద్వారానే నడుస్తున్నాయి. ఇంతటి కీలకమైన సచివాలయాల్లో ఉద్యోగుల హాజరు, పనితీరు దయనీయంగా ఉండటం విచారకరం.

జిల్లా ఉద్యోగుల హాజరు నమోదు శాతం

జిల్లా	అనంత
22న (సోమవారం)	
గ్రామ	74
వార్డు	83
27న (శనివారం)	
గ్రామ	61
వార్డు	73

గ్రామవార్డు సచివాలయాలు, ఉద్యోగుల వివరాలు



గైర్హాజరుపై చర్యలేవీ!

★ అనంత జిల్లాలో ఈనెల 22న పరిశీలించగా.. ఉద్యోగులు సమయానికి హాజరు కాలేదు. ఆ రోజు జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో 2,275 మంది సకాలంలో రాగా.. 733 మంది ఆలస్యంగా విధులకు వెళ్లారు. సాయంత్రం కేవలం 2,139 మంది మాత్రమే హాజరు నమోదు చేసుకోగా.. 205 మంది బయోమెట్రిక్ వేయలేదు. పట్టణ ప్రాంతాల్లోనూ అంతే. ఉదయం 1,068 మంది సకాలంలో వచ్చారు. 144 మంది ఆలస్యంగా వెళ్లారు. 27వ తేదీ సగానికి సగం మంది బయోమెట్రిక్ నమోదు చేసుకోలేదు.

★ శ్రీసత్యసాయి జిల్లాలో మరీ దారుణం. ఈనెల 22న గ్రామ సచివాలయాల్లో 1,748 మంది సకాలంలో విధులకు హాజరు కాగా.. 602 మంది ఆలస్యంగా వచ్చారు. పట్టణ ప్రాంతాల్లో కేవలం 610 మంది నిర్దేశిత సమయానికి రాగా 101 మంది ఆలస్యంగా వెళ్లారు. ఆలస్యంగా, విధులకు డుమ్మా కొడుతున్న వారిపై ఎలాంటి చర్యలు లేవు.

50 శాతం మించొద్దు..

ఈనెల 27వ తేదీన (శనివారం) రెండు జిల్లాల్లోనూ హాజరు శాతం చాలా తక్కువ నమోదైంది. అనంత జిల్లా కంబదూరు మండలం కంబదూరు సచివాలయం-1లో ఇద్దరు ఉంటే ఒకరూ హాజరు కాలేదు. ఇదే మండలం తిమ్మాపురం-1 సచివాలయంలో ఏడుగురు ఉంటే ఒక్కరూ హాజరు వేసుకోలేదు. వీరందరూ సెలవు పెట్టినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం మొత్తం సంఖ్యలో 50 శాతానికి మించకుండా సెలవులో వెళ్లకూడదు. శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం ఓదులపల్లి సచివాలయంలో 9మంది ఉంటే ఒక్కరూ హాజరు కాలేదు.

కూటమి ప్రభుత్వం.. స్వచ్ఛతకు కంకణం

గుత్తిలో సాగుతున్న మరుగుదొడ్ల నిర్మాణం

గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి, ఉరవకొండ, పామిడి, న్యూస్‌టుడే: జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాలకు వివిధ పనులపై ప్రజలు వస్తుంటారు. ఒంటికి, రెంటికి వెళ్లేందుకు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి నియోజకవర్గాల్లోని తహసీల్దారు కార్యాలయాల వద్ద స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు సమకూర్చింది. పనులను ఇప్పటికే గుత్తేదారులు చేపట్టారు.

ఎక్కడెక్కడంటే..? గుత్తి, పామిడి, గుంతకల్లు, పెద్దవడుగూరు, యాడికి, పెద్దపప్పూరు, తాడిపత్రి తహసీల్దారు కార్యాలయాల వద్ద మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. గుత్తిలో స్థలసేకరణ ప్రక్రియ మొదలుపెట్టారు. గుంతకల్లు, ఉరవకొండలో నిర్మాణాలు చేయాల్సి ఉంది. కూడేరు, వజ్రకరూరులకు రెండు చొప్పున, ఉరవకొండ, విడపనకల్లు, బెళుగుప్ప మండలాలకు నాలుగేసి చొప్పున మంజూరయ్యాయి. ఒక్కో కార్యాలయం వద్ద నాలుగు, చిన్న మండలాల్లో రెండు చొప్పున మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు.

★ ప్రతి మండలానికి రూ.12 లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయి. మూడు నియోజకవర్గాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి మొత్తం రూ.1.20 కోట్లు వెచ్చించనున్నారు. ఇవి పూర్తయితే ప్రజల అవస్థలు తీరనున్నాయి.

వరి విత్తనోత్పత్తి క్షేత్రంలో.. అక్రమాలపై చర్యలేవీ?

■ రూ.10 కోట్లు పక్కదారి

కణేకల్లు, న్యూస్‌టుడే: జిల్లాకే తలమానికమైన కణేకల్లు వ్యవసాయ వరి విత్తనోత్పత్తి క్షేత్రంలో రెండేళ్ల కిందట వెలుగు చూసిన అక్రమాలపై నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత క్షేత్రాధికారి కోట్ల రూపాయలు పక్కదారి పట్టించినా అధికారులు కనీస చర్యలకు ఉపక్రమించకపోవడం విమర్శలకు తావిస్తోంది. 2011లో స్థానిక విత్తనోత్పత్తి క్షేత్రం ఏడీఏగా బాధ్యతలు చేపట్టిన అధికారి కార్యకలాపాలు నడిపించారు. అనంతరం కళ్యాణదుర్గంకు బదిలీ అయినా కణేకల్లుకు ఎవరూ రాకుండా జాగ్రత్తలు పాటించి డిప్యుటేషన్ వేయించుకొని ఇన్‌ఛార్జిగా కొనసాగుతూ అక్రమాలకు తెరలేపారు. 140 ఎకరాల్లో ఏర్పాటైన క్షేత్రాన్ని తన సొంత జాగీరుగా మార్చుకొని, ప్రభుత్వానికి సొమ్మును చెల్లించకుండా పక్కదారి పట్టించాడు.

ప్రభుత్వ ఆదాయం పక్కదారి: వాస్తవానికి క్షేత్రం సాగుకు ప్రభుత్వం రివాల్వింగ్ ఫండ్ ఇస్తుంది. దిగుబడుల ద్వార వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వానికి చెల్లించాలి. ఇది ఏటా జరిగే ప్రక్రియ. కాని ఇవేమి చేయకుండా, క్షేత్రాన్ని ప్రైవేటు వ్యక్తులతో సాగు చేయించాడు. వచ్చిన దిగుబడులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాలకు సరఫరా అయ్యేవి. వాటిని అమ్మగా వచ్చిన సొమ్మును ఏటలు క్షేత్రం ఖాతాకు జమ చేస్తే.. ఇతర ఖాతాల ద్వార తన కుటుంబసభ్యుల ఖాతాలోకి మళ్లించుకున్నట్లు తెలుస్తోంది. కనిష్ఠంగా ఏటా రూ.కోటి లెక్కన పదేళ్లలో రూ.10 కోట్లు పక్కదారి పట్టించినట్లు అధికారుల అంచనా.

రెండేళ్లుగా ఉదాసీనత

ప్రభుత్వం నుంచి రివాల్వింగ్ ఫండ్ రాలేదని క్షేత్రం సాగుకు రూ.1.18 కోట్లు అప్పులు చేసినట్లు తెరపైకి తీసుకొచ్చాడు. ఈ నేపథ్యంలో క్షేత్రం సాగు ప్రశ్నార్థకంగా మారడంతో 'ఈనాడు' పలు దఫాలుగా ప్రచురించిన కథనాల ద్వార అక్రమాలు వెలుగులోకి రావడంతో అధికారులు స్పందించారు. అప్పటికే పుట్టపర్తికి బదిలీ అయిన సదరు అధికారిని పిలిపించి అప్పటి కమిషనరేట్ జేడీఏ కృపాదాస్ విచారణ చేపట్టారు. ఒటీఎస్ కింద అప్పులు రూ.78.36 లక్షలకు తీర్మానించి చెల్లించేశారు. అధికారి అక్రమాలపై విచారణ కొనసాగుతుందని చెప్పి, ఆడిట్ నిర్వహించారు. రూ.5 కోట్లకు సంబంధించి బిల్లులు లేనట్లు ప్రాథమికంగా గుర్తించారు. నేటికీ ఆడిట్ నివేదికను బహిర్గతం చేయలేదు. రెండేళ్లు కావస్తున్నా ఉన్నతాధికారులు అక్రమాలను తేల్చకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై జేడీఏ ఉమామహేశ్వరమ్మ వివరణ కోరగా అక్రమాలపై ప్రాథమిక విచారణ, ఆడిట్ నివేదిక ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది. తుది విచారణ పూర్తికాగానే సదరు అధికారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు.

విద్య, ఐక్యతతోనే కురబల అభివృద్ధి : మంత్రి సవిత

కనకదాస విగ్రహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత, కురబ సంఘం నాయకులు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: కురబలు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించడంతో పాటు కలిసికట్టుగా ఉన్నప్పుడే అన్నిరంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని బీసీ సంక్షేమ, చేనేత-జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. తన తండ్రి, మాజీ మంత్రి ఎస్.రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం అందించిన భక్త కనకదాస విగ్రహాన్ని ఆదివారం మండలంలోని రాకలపల్లిలో ప్రారంభించారు. మహిళలతో కలిసి జ్యోతుల ప్రదక్షిణ చేపట్టిన అనంతరం మంత్రి, నాయకులు విశేష పూజలు చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కురబల ఆరాధ్య దైవం కనకదాస జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు జీవో జారీ చేసిందని, గుడికట్ల పూజారుల గౌరవ వేతనం, ఆలయాల్లో దూప, దీప నైవేద్యాలకు సాయం అందించేందుకు దేవాదాయ శాఖ ద్వారా వివరాలు సేకరిస్తున్నట్లు మంత్రి చెప్పారు. గొరవయ్యల నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సర్పంచి క్రిష్టప్ప, నాయకులు నంజప్ప, ఆంజనేయులు, తిప్పన్న, హనుమంతు, నాగరాజు, రామాంజనేయులు, సిద్ధలింగప్ప, రామకృష్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

'దేశ నిర్మాణంలో కాంగ్రెస్ క్రియాశీలకం'

నినాదాలు చేస్తున్న నాయకులు

ఉమానగర్: దేశనిర్మాణంలో కాంగ్రెస్ పార్టీది కీలకమైన పాత్ర అని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డీసీసీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కోశారు. స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు.

రైల్వే స్టేషన్లలో క్విక్ వాటరింగ్ సిస్టం

● బోగీల్లో తీరనున్న నీటికష్టాలు

గుంతకల్లు, న్యూస్‌టుడే: రైలులోని అన్ని బోగీలకు ఒకటి, రెండు నిమిషాల్లో నీటిని నింపే క్విక్ వాటర్‌రింగ్ సిస్టంను అధికారులు అమలు చేస్తున్నారు. సాధారణంగా బోగీల్లోని ట్యాంకులకు నీటిని నింపడానికి ఎక్కువ సమయం పట్టేది. ఒక్కోసారి నీరు లేకపోయినా రైళ్లను నడుపుతుంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడేవారు. ఇక నుంచి ఈ సమస్యలు ఉండవు. గుంతకల్లు డివిజన్‌లో గుంతకల్లు, గుత్తి, ధర్మవరం, కృష్ణ, రేణిగుంట, కొండాపురం, తిరుపతి స్టేషన్లలో కొత్త విధానాన్ని అమలు చేయడానికి అధికారులు టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. ప్రతి స్టేషన్‌కు రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్లు కేటాయించారు. గుంతకల్లు రైల్వేస్టేషన్‌కు మాత్రం రూ.9 కోట్లు కేటాయించారు. ఎస్ఎస్‌ట్యాంకు నుంచి స్టేషన్ వరకు పైప్‌లైన్ ఏర్పాటు, ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం, విద్యుత్తు మోటార్లు, టైమర్లను ఏర్పాటు చేయనున్నారు. బోగీల్లోని ట్యాంకులు నీటితో నిండగానే విద్యుత్తు మోటార్లు ఆటోమేటిక్‌గా ఆగిపోయే విధంగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. రైలు వచ్చి స్టేషన్‌లో ఆగగానే ట్యాంకులకు నింపి సకాలంలో రైళ్లు బయలుదేరి వెళ్లేలా చూడడానికి పనులు చేపడుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో యోగివేమన సంతర్పణ

గాండ్లపెంట, న్యూస్‌టుడే: గాండ్లపెంట మండలం కటారుపల్లిలోని యోగివేమన ఆలయంలో ఆదివారం సంతర్పణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేమన సమాధికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో వేమన గొడుగులను ఊరేగించారు. గొడుగుల ముందు భాగంలో భక్తులు పొర్లుదండాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నందవేమారెడ్డి, కదిరి నరసింహస్వామి ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, గాండ్లపెంట ఎంపీపీ సోమశేఖర్‌రెడ్డి, వాల్మీకి విద్యాసంస్థ అధినేత పవన్‌కుమార్‌రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొడుగుల ప్రదర్శన నిర్వహిస్తున్న భక్తులు

విల్లు ఎక్కుపెడితే పతకాలే!

■ ఆర్చరీలో రాణిస్తున్న విద్యార్థినులు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: వారంతా రైతు కుటుంబాలకు చెందినవారు. ఆర్చరీ క్రీడలో అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. గత నెల అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి రెండో స్థానంలో నిలిచి పతకాలు, ప్రశంసలు అందుకున్నారు. సంకల్పం గట్టిదైతే విజయం వరిస్తుందని నిరూపిస్తున్నారు ముదిగుబ్బ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థినులు.

ఆర్మీలో ఉద్యోగం లక్ష్యం..

మాది యర్రగుంటపల్లి గ్రామం. అమ్మ లక్ష్మీ, నాన్న నారాయణస్వామి. వ్యవసాయమే ఆధారం. మొదట నేను పరుగు పందెం, లాంగ్‌జంప్ క్రీడల్లో పాల్గొన్నాను. ఆరో తరగతి చదివే సమయం నుంచి ఆర్చరీపై ఆసక్తి పెరిగింది. ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో జిల్లాస్థాయిలో రాణించాను. అండర్-17 విభాగంలో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో రాష్ట్రస్థాయి పోటీల్లో రెండో స్థానంలో నిలిచాను. ఆర్మీలో ఉద్యోగం సాధించడమే లక్ష్యం. **- మహిత**

మానసిక ఏకాగ్రత పెరుగుతుంది

లక్ష్యానికి గురిపెట్టి బాణం వేసేటప్పుడు మానసిక ఏకాగ్రత ఎంతో ముఖ్యం. ఆర్చరీ క్రీడతో మానసిక ఏకాగ్రతతోపాటు పోటీతత్వం, శారీరక బలం పెరుగుతోంది. మాది ముదిగుబ్బ. నాన్న పుల్లయ్య బొలెరో డ్రైవర్, అమ్మ గృహిణి. ఆరో తరగతిలో షూటింగ్‌బాల్, ఏడో తరగతిలో కబడ్డీలో జిల్లాస్థాయిలో రాణించాను. ఆర్చరీలో రాష్ట్రస్థాయిలో రాణించి రెండోస్థానం సాధించాను. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేలా శిక్షణ తీసుకుంటున్నాను. భవిష్యత్తులో క్రీడాకోటాలో ఉద్యోగం సాధిస్తా. **- వైష్ణవి**

జాతీయస్థాయిలో గెలవాలని..

ఆర్చరీ క్రీడలో జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నా. మాది ముదిగుబ్బ. నాన్న నల్లప్ప వీఆర్వో, అమ్మ సువర్ణ గృహిణి. మొదట షూటింగ్‌బాల్, ఫ్లోర్‌బాల్ క్రీడల్లో పాల్గొన్నా. గతేడాది అండర్-17 విభాగంలో ఫ్లోర్‌బాల్ నర్సరావుపేటలో రాష్ట్రస్థాయిలో పాల్గొని రెండోస్థానంలో నిలిచాను. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. అల్లూరిసీతారామరాజు జిల్లా పాడేరులో రాష్ట్రస్థాయిలో రాణించి రెండోస్థానం సాధించాను. భవిష్యత్తులో జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలని శిక్షణ తీసుకుంటున్నాను. **- యశ్వంతకుమారి**

ఎకరా తోట.. ఆరోగ్య బాట

రొద్దం, న్యూస్‌టుడే: అభిరుచి, ఆలోచన ఉంటే ఏ రంగంలోనైనా విజయాలను అందుకోవచ్చు. ఈకోవలోనే రొద్దం పంచాయతీ పరిధిలోని కందుకూర్లపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు రమాదేవి వ్యవసాయంలో రాణిస్తున్నారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు సాగు చేస్తున్నారు. తన వ్యవసాయ బోరుబావి కింద ఎకరా పొలాన్ని కేటాయించి డ్రిప్ సాయంతో 30 రకాల కూరగాయలు పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.

ముల్లంగి దిగుబడిని చూపిస్తున్న రమాదేవి

● అందులో ఆకుకూరలు, క్యారెట్, ముల్లంగి, దోస, బెండ, వంకాయలు, చిక్కుడు, బీరకాయ, కాకర, గోరుచిక్కుడు తదితర 30 రకాల పంటలు పండిస్తున్నారు. పూర్తిగా రసాయనాలు మందులు తగ్గించి.. దిబ్బ ఎరువులతో పాటు సేంద్రియ విధానంతో సాగు చేస్తున్నారు.

● ఇటీవల 10 సెంట్ల స్థలంలో తీసిన రెండు క్వింటాళ్ల క్యారెట్ దిగుబడికిగాను రూ.8 వేలు ఆదాయం వచ్చింది.. ఇలా.. ఎకరా పొలంలో 30 రకాలకు చెందిన కూరగాయల దిగుబడి తీస్తున్నట్లు ఆమె చెబుతున్నారు. ప్రస్తుతం తన కుటుంబ అవసరాలతో పాటు బ్యాంకులో తీసుకున్న రుణానికి నెలసరి కంతు చెల్లిస్తున్నట్లు వివరించారు.

బోగస్ వయసు ధ్రువీకరణ పత్రాలకు చెక్

■ క్రికెట్ జట్ల ఎంపికలో ప్రతిభకే పెద్దపీట

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే

ఆరోపణలు, విచారణ ఒక క్రికెటర్ వయసు 16 ఏళ్లు అయితే ఆ అబ్బాయి 14 ఏళ్ల వయోపరిమితి విభాగంలో ఆడాలని బోగస్ వయసు ధ్రువీకరణ పత్రాలు రెండు సృష్టించాడు. దీనిపై జిల్లా క్రికెట్ సంఘం సమగ్ర విచారణ చేయగా. .నకిలీవని తేలింది.

సిఫార్సులు, అందలం అండర్-14 విభాగంలో ఒక కుర్రాడు సెలెక్షన్ పోటీల్లో ఎక్కువ పరుగులు చేశాడు. వాస్తవానికి భిన్నంగా స్కోరు నమోదు చేసి ఆటగాడి అవకాశాలకు గండికొట్టారు. కొన్ని విభాగాల్లో క్రికెటర్లకు ప్రతిభ, పరిజ్ఞానం లేకున్నా రాజకీయ సిఫార్సులతో అందలమెక్కుతుండటమే దీనికి కారణం. అనుభవజ్ఞులను పక్కన బెట్టి మిడిమిడి జ్ఞానం ఉన్నవారికే అవకాశాలుంటే ఇలాంటి వైనాలు పునరావృతమవుతాయి.

ప్రణాళిక, పారదర్శకత పై విధమైన ఆరోపణలు ఇకపై రాకుండా జిల్లా క్రికెట్ సంఘం ప్రణాళిక సిద్ధం చేసింది. పారదర్శకత తీసుకొచ్చేందుకు నూతన కార్యవర్గ సభ్యులు కొత్త విధానాలు తీసుకొచ్చారు.

కొత్త విధానాలు ఇలా..

1. అంతర్ జిల్లా క్రికెట్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఎంపిక చేసే సెలక్ట్ కమిటీల నియామకంలో రంజీ, రాష్ట్రస్థాయిలో ఆడిన సీనియర్ క్రికెటర్లకు తొలి ప్రాధాన్యం ఇస్తారు. ప్రైవేటు అకాడమీలు, రాజకీయాలతో అంటకాగుతున్న మాజీ క్రికెటర్లకు ఇకపై చోటుండదు.

2. సెలక్షన్ కమిటీల ద్వారా అండర్-12, 14, 16, 19, 23, సీనియర్స్ విభాగాల్లో పురుషుల, మహిళల జట్లను ఎంపిక చేస్తారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అంశాలతోపాటు ప్రవర్తన కూడా చూస్తారు. సెలక్షన్ మ్యాచ్‌ల్లో వికెట్లు, స్కోర్లు, క్యాచ్‌లే కొలమానంలో ప్రాధాన్యం.

3. తల్లిదండ్రులు, బయటి వ్యక్తులు నిరాధార ఆరోపణలు చేస్తే కేసులు నమోదు చేస్తారు. జట్ల ఎంపికలో లంచం అడిగినా, తీసుకున్నట్లు రుజువు చేసినా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేస్తారు. క్రికెటర్ల తల్లిదండ్రులకు కూడా ఈ నిబంధనలే వర్తిస్తాయి.

4. బోగస్ వయసు ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన వారిని ఒకటి లేదా రెండేళ్లు నిషేధం ఉంటుంది. వయసు నిర్ధారణకు చేయిస్తున్న ఎముకల పరీక్షలు కొన్ని అసంబద్ధంగా ఉన్నాయి. ఫలితాలు కొన్ని తప్పుగా ఉంటున్నాయి. ఇలాంటి విషయంలో అన్యాయం జరిగిన వారు న్యాయస్థానానికి వెళ్లే వెసులుబాటు కల్పించారు.

క్రీడ బలోపేతమే ముఖ్యం

శ్రీనాథ్, యుగంధర్‌రెడ్డి
జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు

ఉమ్మడి జిల్లాలో క్రికెట్‌ను బలోపేతం చేసి ప్రతిభావంతులను గుర్తించడానికి మండల క్రికెట్ సంఘాలకు పదును పెడుతున్నాం. నిధుల వినియోగం, జట్ల ఎంపిక, సెలెక్షన్ కమిటీల నియామకంలో ఏమాత్రం అలసత్వం లేని విధంగా, లోసుగులు లేని విధానాన్ని తీసుకువస్తాం.

పీపీపీ విధానంపై జగన్‌వి అర్థంలేని ఆరోపణలు: భాజపా

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: పీపీపీ విధానంపై మాజీ సీఎం జగన్ అర్థం లేని ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని భాజపా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు కె.రాజేష్ విమర్శించారు. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్య విధానం రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి అమలవుతున్న విషయాన్ని ఆయన గుర్తించకుండా గుడ్డిగా విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆదివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో వారు మాట్లాడుతూ.. పీపీపీ విధానం మన రాష్ట్రంలోనే కాదని దేశవ్యాప్తంగా అమలవుతోందని తెలిపారు. వైకాపా హయాంలో మొదలుపెట్టిన వైద్య కళాశాలల నిర్మాణంలో కేవలం పులివెందుల మాత్రమే పూర్తయిందని, దీనినే చూపిస్తూ ప్రజల్లో విషబీజాలు నాటుతున్నారని విమర్శించారు. వైద్య కళాశాలల భవనాల నిర్మాణానికి టెండర్లు పిలవగా.. వాటిని అడ్డుకోవడానికి చూడటం హేయమన్నారు. అధికారంలోకి వస్తే వాటిని రద్దు చేస్తామని జగన్ హెచ్చరికలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన అధికారంలోకి రావడం కలని, కూటమి ప్రభుత్వమే మరోసారి అధికారంలోకి వస్తుందన్నారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆంజనేయులు, రాష్ట్ర మైనార్టీ నాయకుడు జి.మహమ్మద్ రఫీ, జిల్లా నాయకులు సోమన్న, శివశంకర్ పాల్గొన్నారు.



సామాజిక సేవలో మేముసైతం

డిపాజిట్ చెక్కును అందిస్తున్న స్వధర్మ సేవా సమితి సభ్యులు, సీఐ జయనాయక్

కళ్యాణదుర్గం గ్రామీణం, రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే : బళ్లో అక్షరాలు నేర్చుకొనే వయస్సులో ఏర్పడిన స్నేహం నేడు ఎంతో మందికి సేవలు చేసేస్థాయికి తీసుకొచ్చింది. ఆపదలో ఉన్నవారికి మేమున్నామంటూ సేవలందిస్తున్నారా యువకులు. యూనియన్ బ్యాంకులో ఉద్యోగం చేస్తునంన కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన లోకేష్ శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాల్లో పదోతరగతి చదువుతున్న 500 మందికి రూ.40 వేలు ఖర్చుచేసి మోడల్ పేపర్స్, పుస్తకాలు అందజేశారు. కొత్తూరు ఉన్నత పాఠశాలలో రేకుల షెడ్ నిర్మాణం, బొచ్చుపల్లి పాఠశాలకు టీవీని, కుందుర్పి పాఠశాలలో రూ.35 వేలతో సామాగ్రి అందించారు. గుండ్లపల్లి మండలం కెంచానపల్లితో క్యాన్సర్ బాధితుడు మృతిచెందగా ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. కళ్యాణదుర్గంలో ఓ పేద విద్యార్థి బీఫాం చదువుకు రూ.40 వేలు, దొడగట్టలో నర్సింగ్ విద్యార్థిని చదువుకు రూ.25 వేలు అందించారు.

స్నేహితులతో కలిసి...

గుమ్మఘట్ట మండలం కలుగోడు గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ కుమారుడు మనోజ్‌కుమార్ 2019లో 'స్వధర్మ సేవా సమితి' సంస్థను స్థాపించి ఆపదలో ఉన్న వారిని ఆదుకొంటున్నారు. గుమ్మఘట్ట మండలం చెరువుదొడ్డిలో మూర్ఛవ్యాధి బాధపడుతున్న ఓ బాలుడికి 'రాయదుర్గం ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ క్రికెట్ టీమ్' సభ్యులతో కలిసి రూ.57 వేలు ఆర్థిక సాయం చేశారు. రాయదుర్గంలోని కోటవీధిలోని ఓ యువతి వివాహానికి రూ.30 వేలు విలువైన వస్త్రాలు అందించారు. గుమ్మఘట్ట మండలం కలుగోడుకు చెందిన కూలీ మల్లికార్జున వైద్యానికి, మురడికి చెందిన దివ్యాంగుల దంపతులకు నగదుతోపాటు సరకులు అందించాం. కణేకల్లు, కళ్యాణదుర్గంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న మహిళలను ఐసీడీఎస్ అధికారుల సాయంతో ఆశ్రమాల్లో చేర్పించారు. పదుల సంఖ్యలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశాం.. మనోజ్‌కుమార్ ఇప్పటికే 30 సార్లు రక్తదానం చేయడం గమనార్హం.

విధి నిర్వహణలో మానవీయ విలువలు ముఖ్యం

జ్ఞాపికలు అందజేస్తున్న మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఉద్యోగాల్లో చేరిన ఉద్యోగులు విధి నిర్వహణ సక్రమంగా నిర్వర్తించడంతో పాటు మానవీయ విలువలను జోడించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పిలుపు నిచ్చారు. ఆదివారం నగరం శివారులో ఉన్న కనకదాస కళ్యాణ మండపంలో కొత్తగా ఉద్యోగాల్లో చేరిన కురుబ ఉద్యోగులకు సన్మానం, 2026 సంవత్సరం నూతన కాలమానిని ఆవిష్కరణ కార్యక్రమం జిల్లా కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పద్మావతి, నాగరాజుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఎంతో క్రమశిక్షణతో ఆటుపోట్లును ఎదుర్కొని ప్రభుత్వ ఉద్యోగం సాధించడం అన్నది అంత సులభతరం కాదన్నారు. ఈ సందర్భంగా ఏడుగురు ఎస్సైలు, 30 మంది కానిస్టేబుళ్లు, మెగా డీఎస్సీ-2025లో 50 మంది ఉపాధ్యాయులుకు, ఎంబీబీఎస్, జేఈఈలో మంచి ర్యాంకులు సాధించిన వారికి జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగం కోల్పోయిన జేఎన్‌టీయూలో పర్యవేక్షకులు ఎండీ నాగభూషణం పునర్నియామకానికి కృషి చేయడంపై మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. హిందూపురం ఎంపీ బీకే.పార్థసారథి, భాజపా జిల్లా అధ్యక్షుడు రాజేశ్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్లు ఆవుల కృష్ణయ్య, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ మేయర్ రాగే పరశురాం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, పెనుకొండ నాగార్జున పాల్గొన్నారు.

నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

ఆజాద్‌నగర్(అనంతపురం), న్యూస్‌టుడే: అనంతపురం నగరంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపునకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. నేటి (సోమవారం) సాయంత్రం 5 గంటల నుంచి మంగళవారం మధ్య రాత్రి 12 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపు కొనసాగుతుంది. ● కళ్యాణదుర్గం, బళ్లారి వైపు నుంచి ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాలు నగరంలోకి వచ్చే క్రమంలో సుభాష్‌రోడ్డు, రాజు రోడ్డు మీదుగా శ్రీకంఠం కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండుకు చేరుకోవాలి. ● అలాగే తాడిపత్రి వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు ఎన్టీఆర్ మార్గ్ లేదా చెరువుకట్ట, కలెక్టరేట్ మీదుగా వాహనాలు వెళ్లాల్సి ఉంటుంది. కావున వాహనదారులు సహకరించాలని డీఎస్పీ శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

అనంతలో శంబాల చిత్ర బృందం సందడి

ఆది, అర్చన అయ్యార్, నటుడు సాయికుమార్‌తో బైకు ర్యాలీలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే : ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ తనయుడు ఆది హీరోగా నటించిన 'శంబాల' చిత్ర బృందం అనంత నగరంలో సందడి చేసింది. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో మాసినేని గ్రాండ్ హోటల్ నుంచి శ్రీకంఠం కూడలి మీదుగా వీ మెగా టాకీస్ వరకు చిత్ర బృందం ఆదివారం బైకు ర్యాలీ నిర్వహించారు. చిత్ర బృందం హీరో ఆది, హీరోయిన్ అర్చన అయ్యార్, నటుడు సాయికుమార్, మధు, ఇంద్రనీల్, రవి, రాజేష్ బైకు ర్యాలీలో అభిమానులను ఉత్సాహపరిచారు. హీరో, హీరోయిన్, నటుడు సాయికుమార్‌తో ఫొటోలు, సెల్ఫీలు దిగటానికి యువత పోటీ పడ్డారు. చిత్ర విజయానికి తోడ్పడిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంత రుచులైన ఓలిగ, నన్నారి వంటి ఆహార పదార్థాలను కచ్చితంగా రుచి చూడాలని ఎంతో అభిమానంతో మాకు చెబుతుంటే ఇక్కడి వారి ప్రేమ, అభిమానం అర్థమవుతుందన్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. హీరో ఆదికి విజయం అందించిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. 50 ఏళ్లుగా సినీ చరిత్రలో సాయికుమార్ ఎంతోమందికి డబ్బింగ్ చెబుతూ గుర్తింపు తెచ్చుకున్న నటుడిగా పేరు ప్రఖ్యాతులు గడించారన్నారు. ఆది మరిన్ని విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చిత్ర బృందాన్ని సన్మానించి జ్ఞాపిక అందించారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

REAL ESTATE

అనంతపురం టౌన్‌లో టవర్‌క్లాక్ దగ్గర కమలానగర్ నందు DCMS రోడ్లో 5 అంతస్తుల కమర్షియల్ బిల్డింగ్ అమ్మకానికి కలదు. స్థలం 10 సెంట్లు. 17,000 Sqf షెల్లార్ పార్కింగ్ కలదు. బాడుగలు నెలకు 5 లక్షలు. ✆ 9948266888

FLAT FOR SALE

నూతన సంవత్సర స్పెషల్ ఆఫర్ 3 BHK, 2 BHK ఫ్లాట్స్ ఆధునిక సౌకర్యాలతో అనంతపురం నడిబొడ్డున గల మీనాక్షి అపార్ట్‌మెంట్ నందు కొన్ని ఫ్లాట్స్ మాత్రమే కలవు. సెల్: 7416560179, 9515651111.

PLOT FOR SALE

హిందూపురంలో వెల్‌డెవలప్ ఓపెన్ ప్లాట్స్ బెంగళూరు రోడ్‌లో, లేపాక్షి రోడ్‌లో, సేవమందిర్ రోడ్‌లో కావాలనుకునే వారు 8143917999కి కాల్ చేయ్యండి.

JOBS

Wanted Audit Assistants for CA Firm Qul: B.Com with Computer Knowledge Send Resume to vukpra@rediffmail.com

బెంగుళూరులో పనిచేయుటకు ప్రముఖ వస్త్ర దుకాణంలో అనుభవం గల సేల్స్‌మెన్స్ కావలెను. Age: 18-45Y, ESI+PF+ జీ-17K ✆ 7019632854

కావలెను: M.G.B Mobiles (మహీంద్రా కార్ షోరూమ్) నందు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్‌గా పని చేయుటకు డిగ్రీ పూర్తి చేసినవారు కావలెను. ఆటోమొబైల్ సేల్స్ నందు అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఫ్రెషర్స్ కూడా దరఖాస్తు చేసుకొనవచ్చును. సంప్ర: 8333929186.

అనంతపురంలోని ప్రముఖ కంపెనీలో పని చేయడానికి "కార్ డ్రైవర్స్" కావాలి. క్రమశిక్షణ మరియు నిబద్ధత కలిగి కష్టపడే వారు మరియు దీర్ఘకాలం పనిచేయగలిగే వారికి ఆకర్షణీయమైన జీతం. ఇతర సదుపాయాలు కల్పించబడును. వయస్సు 25 నుండి 40 మధ్య వారికి ప్రాధాన్యత. సంప్రదించండి: 7799888354

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

5 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

అల్లాహ్‌పై కృతజ్ఞత కలిగి ఉండాలి

ఇస్తెమాలో ప్రసంగిస్తున్న మత పెద్దలు

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అల్లాహ్ మన పట్ల చూపుతున్న కృపకు ప్రతి ఒక్కరూ కృతజ్ఞత కలిగి ఉండాలని ముస్లిం మతపెద్దలు సూచించారు. గత రెండు రోజులుగా కదిరి మండల పరిధిలోని సున్నపుగుట్ట తండా బాహ్యవలయ రహదారి సమీపంలో జరుగుతున్న ఇస్తెమా ఆదివారం ముగిసింది. రెండోరోజు పెద్ద ఎత్తున ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు ఆధ్యాత్మిక బోధనలు చేశారు. ఇస్లాం ధర్మాలను, అల్లాహ్‌పై విశ్వాసంతో పాటు ఇతరుల పట్ల సోదరభావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన మత పెద్ద హాజీ ఫారుఖ్ సాహెబ్‌తో పాటు పలువురు స్థానిక మత పెద్దలు పాల్గొన్నారు. ప్రార్థనలకు ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కడప, అన్నమయ్య, చిత్తూరు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. వారందరికీ భోజన సదుపాయం కల్పించారు. మెప్మా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వైద్యులు ఆజాద్, ముస్తఫా, బాబాఫకృద్దీన్, అష్రఫ్ అలీ, సిబ్బంది, మెప్మా సభ్యులు ఖాదర్‌బాషా, జాఫర్, సాదిక్, ఎహసాన్ పాల్గొన్నారు.

ఆలయ సమాచారం

కదిరి: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా నేడు (సోమవారం) వేకువజామునే పూజలు మొదలవుతాయి. ఉదయం 5 నుంచి 7 గంటల వరకు, 8 గంటల నుంచి 10 గంటల వరకు రెండు పర్యాయాలు అభిషేకం. తర్వాత పది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం ఉంటుంది.

సదరన్ స్ట్రైక్స్, మయూక అకాడమీ జట్ల విజయభేరి

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న గీతిక

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: ఏఎస్ఏ ఆహ్వాన టీ20 క్రికెట్ పోటీల్లో సదరన్ స్ట్రైక్స్, బెంగళూరు సంప్రసిద్ధి అకాడమీ జట్లు విజయ పరంపర కొనసాగిస్తున్నాయి. ఆదివారం అనంత క్రీడాగ్రామంలో జరిగిన పోటీల్లో పలు జట్లు అవలీలగా గెలిచాయి. ఉదయం జరిగిన పోటీలో సదరన్ జట్టు ఏఎస్ఏ జట్టుపై 3 వికెట్ల తేడాతో నెగ్గింది. ఏఎస్ఏ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 3 వికెట్లకు 145 పరుగులు చేసింది. బి.నేహా చక్కటి బ్యాటింగ్‌తో అర్ధశతకం సాధించింది. తర్వాత బ్యాటింగ్ చేసిన సదరన్ జట్టు 19.2 ఓవర్లలో ఏడు వికెట్లకు లక్ష్యాన్ని ఛేదించింది. కె.గీతిక (43) అద్భుత బ్యాటింగ్‌తో జట్టును గెలిపించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకుంది. ఈ అవార్డును సీనియర్ మహిళా క్రికెటర్లు లతాదేవి, రాధిక, గౌసియా, మంజుల అందజేశారు. మరో పోటీలో మయూక అకాడమీ జట్టు 4 వికెట్ల తేడాతో కడప జట్టుపై నెగ్గింది. బ్యాటింగ్‌లో రాణించిన ఎస్.ముబీనాకు అవార్డు అందజేశారు. ఇంకో పోటీలో బెంగళూరు సంప్రసిద్ధి అకాడమీ జట్టు విజయవాడ జట్టుపై ఏడు వికెట్ల తేడాతో నెగ్గింది. బ్యాటింగ్‌లో రాణించిన సలోనికి అవార్డును ప్రదానం చేశారు. ఇంకో పోటీలో చిత్తూరు జట్టు అనంతపురం జట్టుపై 19 పరుగుల తేడాతో నెగ్గింది. ఈ పోటీలు సోమవారం కూడా జరుగుతాయని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి యుగంధర్‌రెడ్డి తెలిపారు.

తాడిపత్రి కుర్రాళ్లు అదుర్స్

క్రికెట్‌లో అత్యుత్తమ ఆట తీరు

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రిలోని ఆర్డీటీ క్యాంపులో శిక్షణ పొందుతున్న పలువురు క్రీడాకారులు క్రికెట్‌లో అద్భుత ఆట తీరుతో సత్తా చాటుతున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిత్యం సాధన చేస్తూ విజయాలు సాధిస్తున్నారు. ఇప్పటికే జిల్లా, రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుల్లో స్థానం సంపాదిస్తూ దూసుకెళ్తున్నారు.

బరిలో దిగితే ఓడించడం కష్టమే!

బురానుద్దీన్

తాడిపత్రిలోని మెయిన్‌బజార్‌కు చెందిన హాజీబాషా, కరిష్మా దంపతుల కుమారుడు బురానుద్దీన్. హాజీబాషా బంగారు దుకాణంలో పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుమారుడి ఇష్టమైన క్రికెట్‌లో పదేళ్లుగా శిక్షణ ఇప్పిస్తున్నాడు. తండ్రి ప్రోత్సాహంతో రోజూ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో సాధన చేస్తున్నాడు. గతేడాది ఏపీ స్కూల్ గేమ్స్‌లో జిల్లా జట్టులో స్థానం సాధించి ప్రతిభ కనబరిచాడు. ఐదేళ్లుగా జిల్లా, జోన్, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి జట్టు విజయానికి కీలక పాత్ర పోషించాడు. విద్యార్థి ఇప్పటి వరకు అన్ని రకాల మ్యాచ్‌లలో 9 శతకాలు, 27 అర్ధ శతకాలతో సత్తా చాటాడు. బరిలోకి వెళ్తే అవుట్ చేయడమనేది బోలర్‌కు కష్టంతో కూడుకున్నదే. ప్రస్తుతం తీసుకుంటున్న శిక్షణతో పాటు అన్ని రకాల మెలకువలు నేర్చుకొని భారత జట్టులో స్థానం సంపాదించాలన్నదే తన లక్ష్యంగా పెట్టుకున్నట్లు బురానుద్దీన్ చెబుతున్నాడు.

అన్ని ఫార్మాట్లలో వినయ్ విజేత

వినయ్

తాడిపత్రిలోని సుంకులమ్మపాళెంకు చెందిన భాస్కర్, జ్ఞానసుందరమ్మ కుమారుడు వినయ్‌కుమార్. భాస్కర్ మెకానిక్ పనిచేసుకుంటూ కుమారుడి ఉన్నతికి కృషి చేస్తున్నాడు. చదువు, అతనికి ఇష్టమైన క్రికెట్‌లో కుమారుడికి శిక్షణ ఇప్పిస్తున్నాడు. 12 ఏళ్లుగా ఆర్డీటీ క్రికెట్ శిబిరంలో శిక్షణ పొందుతున్నాడు. ఇంటర్ క్రికెట్‌లో జిల్లా టోర్నీలో వినయ్ ప్రాతినిధ్యం వహించి విజయం సాధించాడు. సౌత్ ఇండియా, ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి జట్టులో రాణించాడు. బెళగావిలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ సౌత్‌జోన్‌లో జేఎన్‌టీయూ క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. సీనియర్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి విజయానికి దోహద పడ్డారు. గతంలో అనంతపురం జిల్లా జట్టుకు స్కోరర్, ఎంపైర్‌గా పనిచేశారు. ఏసీఏ ఎంపైర్ ప్యానల్ పరీక్షల్లో ఉత్తీర్ణ సాధించారు. ఇప్పటి వరకు 40కి పైగా స్కోరర్‌గా చేసి ఐసీసీ మహిళా క్రికెట్ ప్రపంచ కప్ మ్యాచ్‌లో స్కోరర్‌గా పనిచేసి ప్రతిభ చాటారు. భవిష్యత్తులో భారత జట్టులో స్థానం సంపాదించాలన్నదే తన లక్ష్యంగా పెట్టుకున్నట్లు వినయ్ తెలిపారు.

ఎంపికైన క్రీడాకారులతో సంఘం సభ్యులు

బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్టులో చోటు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయిలో జరగనున్న అండర్-19 బాస్కెట్‌బాల్ పోటీల్లో తలపడనున్న రాష్ట్ర జట్టుకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్లు ఉమ్మడి అనంత బాస్కెట్‌బాల్ సంఘం అసోసియేట్ కార్యదర్శి జయచంద్రారెడ్డి తెలిపారు. నవంబరులో విజయవాడలో జరిగిన జిల్లా జట్ల ఎంపిక పోటీలో పట్టణానికి చెందిన విజయ్‌తరుణ్, కిరణ్మయి సత్తాచాటారన్నారు. రాజస్థాన్‌లో జనవరి 1 నుంచి 6వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు వీరు ఆడతారని ఆయన చెప్పారు. క్రీడాకారులు ఆదివారం సాయంత్రం రాజస్థాన్‌కు బయలుదేరారు. వారికి అసోసియేషన్ అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి హిదయతుల్లా, కోచ్ సంజయ్, ఆత్మీయ ట్రస్టు సభ్యులు హర్షిత్, ప్రణవ్ అభినందనలు తెలిపారు.

సంతల ఆదాయం రూ.3.42 లక్షలు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతల్లో మొత్తం రూ.3,42,700 ఆదాయం వచ్చింది. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతలో రూ.2,04,100 ఆదాయం రాగా ఆదివారం పశువుల సంతలో రూ.1,38,600 ఆదాయం వచ్చిందని యార్డు ఎంపికశ్రేణి ఇన్‌ఛార్జి కార్యదర్శి, జిల్లా మార్కెటింగ్‌శాఖ సహాయ సంచాలకులు రాఘవేంద్రకుమార్ తెలిపారు.

'గ్రామానికో కృష్ణ మందిరం అవసరం'

మాట్లాడుతున్న వెంగళరావు, చిత్రంలో సంఘం ప్రతినిధులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రతి గ్రామంలో ఒక కృష్ణ మందిరం నిర్మించాలని యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు యాదవ్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప యాదవ్ ఆధ్వర్యంలో అఖిల భారత యాదవ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా వెంగళరావు మాట్లాడుతూ కృష్ణ మందిరాల నిర్మాణానికి యాదవులతో పాటు రాజకీయ నాయకులు కృషి చేయాలన్నారు. బీసీ జనాభాలో 25 శాతమున్న యాదవులు ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీల్లోని ఇతర కులాలను కలుపుకుని రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు. ఇందుకు రాజకీయ, ఆర్థిక, విద్యాపరంగా ఎదగాలని సూచించారు. రాష్ట్రంలో 70లక్షల మంది యాదవులు ఉన్నారని, తమకు 25 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. తిరుమలలో శరభయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం దృష్టికి తెచ్చినట్లు యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ తెలిపారు. ప్రభుత్వం త్వరలో యాదన్న పథకం అమలు చేయనుందన్నారు. మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు, జాతీయ ఉపాధ్యక్షుడు రామచంద్రయాదవ్ సంఘం బలోపేతానికి బలరామకృష్ణుల్లా పనిచేశారని కొనియాడారు. సమ్మేళనంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, యాదవ సంఘం జిల్లా కార్యదర్శి ఉమాపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు భార్గవి

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరు మండలం చిన్నహోతూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి భార్గవి అండర్-18 జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఈనెల 19, 20, 21 తేదీల్లో ప్రకాశం జిల్లా పంగనూరులో జరిగిన ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపారు. ఈనెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు బెంగళూరులో జరిగే జాతీయస్థాయి పోటీల్లో భార్గవి పాల్గొననున్నట్లు హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, పీడీ ప్రభాకర్ తెలిపారు.

ప్రాచీన కట్టడాలు, సంస్కృతిని కాపాడుకోవాలి

హెరిటేజ్ వాక్‌ను ప్రారంభిస్తున్న పురావస్తు శాఖ ఏడీ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: వారసత్వ కట్టడాలు, మన చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగాలంటే ప్రజల్లో చైతన్యం తేవాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ పి.పద్మశ్రీ పిలుపునిచ్చారు. చారిత్రాత్మక స్థలాల ప్రాధాన్యత తెలుసుకోవాలంటే స్వయంగా సందర్శించాలని ఆమె సూచించారు. ఆదివారం పురావస్తు శాఖ ఆధ్వర్యంలో హెరిటేజ్ వాక్ నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి గడియార స్తంభం, జిల్లా జైలు కార్యాలయం, జిల్లా కోర్టు సముదాయం, పీస్ మెమోరియల్ మీదుగా పురావస్తు ప్రదర్శనశాల వరకు ఈ నడక నిర్వహించారు. ఈ వాక్ ప్రారంభానికి ఆమెతోపాటు పురావస్తు శాఖ ఏడీ స్వామినాయక్ హాజరై ప్రసంగించారు. వారసత్వ కట్టడాలను మరింత మంది తెలుసుకోవాలన్న లక్ష్యంతోనే ఈ వాక్ నిర్వహించామన్నారు. జిల్లాలో అనేక వారసత్వ కట్టడాలు ఉన్నాయని వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని ఆయన గుర్తుచేశారు. ఉద్యోగులు, కార్మికులు మానసిక ఒత్తిడి నుంచి బయటపడాలంటే చారిత్రాత్మక కట్టడాలను సందర్శించి వాటి చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. వాకర్స్ సంఘం సభ్యులు శ్రీనివాసులు, సుధాకర్, బాలస్వామి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు జయంతి, మహిళా క్లబ్ కార్యదర్శి పద్మనారాయణరెడ్డి, ఇంటాక్ సభ్యులు కృష్ణమూర్తి నడకలో పాల్గొన్నారు.

గోల్‌షాట్ బాల్‌లో మూడో స్థానం

తమిళనాడులోని తిరుచ్చిలో జరిగిన జాతీయ గోల్‌షాట్ బాల్ పోటీల్లో రాష్ట్ర బాలికల జట్టు మూడో స్థానం సాధించింది. ఈమేరకు గోల్‌షాట్ బాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సభ్యులు అభినందించారు. -న్యూస్‌టుడే, కదిరి గ్రామీణం

గుప్త నిధుల తవ్వకాలపై ఫిర్యాదు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని పాత కోట కాలనీలో గుప్త నిధుల కోసం తవ్వుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేయడంతో వారిని పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాలనీకి చెందిన దుర్గాదేవి ఈ విధంగా చేస్తోందని సమాచారం అందడంతో ఆమెను, తవ్వే కూలీలను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆమె తన కుటుంబం అనారోగ్యాల పాలవుతోందని, కొందరు స్వామీజీలు తన స్థలంలో ఉన్న పాత మట్టిని తొలగించి కొత్త మట్టిని వేయాలని చెప్పడంతో తవ్వుతున్నానని చెప్పారన్నారు. నిధుల కోసం ఎలాంటి తవ్వకాలు చేయకూడదని వారికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపినట్లు పోలీసులు తెలిపారు.

మెకానిక్ దుర్మరణం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో విద్యుత్తు ప్రమాదంలో మోటారు మెకానిక్ వేణు(25) దుర్మరణం పాలయ్యాడు. వేణు బంధువులు, రెడ్డిపల్లి గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వేణు వ్యవసాయ మోటార్ల మెకానిక్‌గా పనిచేసేవాడు. ఆదివారం మరో మెకానిక్ షబ్బీర్ మరమ్మతుల నిమిత్తం తీసుకెళ్లాడు. షబ్బీర్ అధికారుల నుంచి ఎల్‌సీ తీసుకోలేదు. అయినా మరమ్మతులు ప్రారంభించడంతో వేణుకు విద్యుత్తు షాక్ తగిలింది. 108లో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మృతదేహంతో కుటుంబసభ్యుల ధర్నా

రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న బాధితులు

సాయికుమార్‌నాయక్

కదిరి పట్టణం, కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల ఏర్పాటు పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. కదిరి మండలం రాచువారిపల్లితండాకు చెందిన సాయికుమార్‌నాయక్ (26)తో పాటు మరికొందరు పట్నం సమీపంలో విద్యుత్తు లైన్ల ఏర్పాటు పనులకు దిన కూలీలుగా వచ్చారు. సాయికుమార్‌నాయక్ స్తంభంపై ఉన్న సమయంలో విద్యుత్తు సరఫరా జరగడంతో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం తగలడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. తోటి కూలీలు, స్థానికులు బాధితుడిని చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. చేతికొచ్చిన కొడుకు విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువుల ఆర్తనాదాలతో ఆసుపత్రి ప్రతిధ్వనించింది. పనులు చేయిస్తున్న గుత్తేదారుడు, లైన్‌మెన్ నిర్లక్ష్యంతో తమ బిడ్డ చనిపోయాడని తల్లిదండ్రులు, బంధువులు ఆరోపించారు. మృతదేహాన్ని ఆసుపత్రి ఎదురుగా ఉన్న కదిరి-హిందూపురం ప్రధాన రహదారిపై ఉంచి ధర్నా చేశారు. మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు డిమాండ్ చేశారు. వాహనాల రాకపోకలకు ఆటంకం కలగడంతో అక్కడికి చేరుకున్న సీఐలు నారాయణరెడ్డి, నిరంజన్‌రెడ్డి న్యాయం జరిగేలా చూస్తామని ఆందోళనకారులకు నచ్చచెప్పడంతో ధర్నా విరమించారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేస్తామని సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

13 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం నుంచి ఆటోలో కర్ణాటకకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం లక్ష్మీచెన్నకేశవ పురం వద్ద ఒకటో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. సీఐ నాగేంద్రప్రసాద్, పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుబడింది. మొత్తం 13 క్వింటాళ్ల బియ్యం పట్టుబడిందని, నిందితుడు బాబావలిపై కేసు నమోదు చేసి, ఆటోను సీజ్ చేశామని సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

'కలిసి పనిచేద్దాం.. పార్టీని బలోపేతం చేద్దాం'



ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న పూలనాగరాజు, శ్రీధర్‌చౌదరి

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: జిల్లాలో తెదేపాను బలోపేతం చేయాలంటే అందరం కలిసి పనిచేయాలని అనంతపురం పార్లమెంటు సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. నూతనంగా నియమించిన తెదేపా జిల్లా అధ్యక్షుడు పూలనాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, మీడియా కోఆర్డినేటర్ కుమారస్వామి నాయుడు, ఇతర సభ్యులంతా కలిసి అనంతపురం నగరంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, బండారు శ్రావణి, సురేంద్రబాబు క్యాంపు కార్యాలయాలకు వెళ్లారు. వారందరినీ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. పుష్ప గుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. వారంతా నూతన, అధ్యక్ష, కార్యదర్శులను పూలనాగరాజు, శ్రీధర్ చౌదరిలను శాలువాలతో సత్కరించారు. పార్టీ పటిష్ఠతకు అందరం కలిసి పనిచేద్దామని అధ్యక్షుడు పూలనాగరాజు ఎంపీ, ఎమ్మెల్యేలను కోరారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రాబోయే మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు తెదేపా క్యాడర్ సన్నద్ధం కావాలన్నారు.

కరాటేలో మరింత సత్తాచాటాలి

మెలకువలు బోధిస్తున్న అఖిల భారత కరాటే టెక్నికల్ డైరెక్టరు అల్తాఫ్

గుంతకల్లు, న్యూస్‌టుడే : ఇతరులు దాడులు చేసిన సమయంలో కరాటే వారి నుంచి కాపాడుతుందని అఖిలభారత కరాటే టెక్నికల్ డైరెక్టరు అల్తాఫ్ అన్నారు. ఆదివారం గుంతకల్లు పట్టణంలో కరాటే మాస్టర్ దినేశ్ నిర్వహిస్తున్న ఎఎస్ నొజిరియో కరాటే శిక్షణ కేంద్రంలో తర్ఫీదు పొందిన బాలబాలికలకు పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కరాటే నేర్చుకుంటే ఆత్మవిశ్వాసంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. ముఖ్యంగా బాలికలకు ప్రస్తుత పరిస్థితిలో ఇది చాలా అవసరమని పేర్కొన్నారు. పరీక్షను నిర్వహించి విజేతలకు బ్లూ, ఆరెంజ్, బ్రౌన్ బెల్టులతో పాటు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ బ్లాక్‌బెల్టు, బంగారు మెడల్ గ్రహీత ఫిరోజ్, కసాపురం ఎస్సై వెంకటస్వామి, ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఆర్.ఎన్. శ్రీనివాసులు పాల్గొన్నారు.

(c) eenadu

బహుమతులు అందుకున్న విద్యార్థులతో సీఐ మహానంది తదితరులు

క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలకు

ఉరవకొండ, న్యూస్‌టుడే: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఇష్టమైన క్రీడల్లో రాణించడం అలవాటు చేసుకోవాలని సీఐ మహానంది పేర్కొన్నారు. జడ్పీ పాఠశాలలో ఆదివారం జోనల్ స్థాయి జూడో లీగ్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన బాలబాలికలు 20 మందిని ఎంపిక చేశామని ఉరవకొండ జూడో క్లబ్ బాధ్యురాలు, పీడీ హలీమా చెప్పారు. జూడో శిక్షకుడు పురుషోత్తం, పీడీలు రాఘవేంద్ర, మంజునాథ్, నాగేంద్ర, కృష్ణ, జనార్దన్, శివకుమార్, అనిత పాల్గొన్నారు.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

హిందువులు సంఘటితం కావాలి

మాట్లాడుతున్న స్వామి కల్యాణస్వామి

ఉరవకొండ, న్యూస్‌టుడే: హిందువులు కుల భేదాలకు అవకాశం ఇవ్వకుండా సంఘటితం కావాలని బళ్లారి జిల్లా కమ్మరచేడు మఠం స్వామి కల్యాణస్వామి, ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యవాహ వేణుగోపాల్ నాయుడు, ఉరవకొండ జగదీశ్వరమ్మ మఠం శ్యామలమ్మ మాత పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని పోలీసు మైదానంలో ఏర్పాటు చేసిన హిందూ సమ్మేళనంలో వారు మాట్లాడారు. అంతకు ముందు విద్యార్థులు, బృందావన కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: పట్టణంలోని గౌడ లేఅవుట్, ఎంసీపీ లే అవుట్‌లలో మురుగు కాల్వలు, సిమెంటు రోడ్లు, తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. **- తిప్పేస్వామి, రాజశేఖర్, గౌడలేఅవుట్, ఎంసీపీ లేఅవుట్, రాయదుర్గం**

సమాధానం: ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసింది. త్వరలో అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం.

- వి.దివాకర్‌రెడ్డి, కమిషనర్

సమస్య: పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీలోని బీసీ బాలికల వసతి గృహం వద్ద మురుగు కాలవలో వ్యర్థాలతో దోమలు వృద్ధి చెందుతున్నాయి.

- లక్ష్మీదేవి, మాధవి, రాయదుర్గం

సమాధానం: త్వరలో పైపు ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- వి.దివాకర్‌రెడ్డి, కమిషనర్

సమస్య: పట్టణంలోని కృష్ణాశ్రమం వద్ద వీధి దీపాలు లేక రాత్రుల్లో చీకట్లు నెలకొంటున్నాయి. **- రేణుక, లక్ష్మీదేవి, కృష్ణాశ్రమం**

సమాధానం: త్వరలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. **- నరసింహులు, ఏఈ, రాయదుర్గం**

- న్యూస్‌టుడే, రాయదుర్గం

అంత్యక్రియలకు ఆపద్బాంధవులు

నూస్‌టుడే, రాయదుర్గం పట్టణం, ఉరవకొండ, కళ్యాణదుర్గం

రాయదుర్గం పట్టణానికి చెందిన దంపతులు గంగాధర- జయమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వీరిలో ఇద్దరికి ఇప్పటికే వివాహాలు చేశారు. గంగాధర గ్రామాల్లో తిరుగుతూ జండుబామ్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ సందర్భంలో పలు ఊర్లలో అనారోగ్యం, ఆకలి, ఎవరూ లేని అనాథలను చూసిన ఆయన మనసు చలించిపోయింది. భార్యతో చర్చించి మూడేళ్ల కిందట 'సేవా భారత్ ట్రస్ట్' ఏర్పాటు చేసి తద్వారా వారికి భోజనం, అనారోగ్యంతో ఉన్న వారికి చికిత్స చేయించడం, దుప్పట్లు పంపిణీ చేయడం తదితరాలు చేస్తున్నాడు. ఈ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే ఆరు అనాథ శవాలకు అంత్యక్రియలు సైతం నిర్వహించాడు. పలువురు వృద్ధులకు కోసం చిన్నపాటి రేకుల షెడ్ నిర్మించి వారికి ఆశ్రయం కల్పించారు. ఉన్నత కుటుంబీకులు జన్మదినం, జయంతి, వర్ధంతులు చేసుకునే వారిని ఒప్పించి వారితో ఈ అనాథలకు అన్నదానం చేయిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

బాధ్యత భుజాలపై వేసుకుని...

ఉరవకొండకు చెందిన 'ఆపద్బాంధవ స్వచ్ఛంద సంస్థ'లోని యువకులు ఒకవైపున తమ పనులను చేసుకొంటూనే మరోవైపు సామాజిక సేవలో ముందుకు సాగుతున్నారు. అనాథలు, గుర్తుతెలియని వ్యక్తులు మృతిచెందినప్పుడు ఆ మృతదేహాలకు అంతిమ సంస్కారాలను నిర్వహిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. పోలీసు, పంచాయతీ అధికారుల సహకారాన్ని అందిపుచ్చుకుని ఇప్పటివరకు సుమారు 12 మృత దేహాలకు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. వీరు చేస్తున్న సేవలకు జిల్లా ఉన్నతాధికారుల నుంచి వివిధ రూపాల్లో అవార్డులు, సత్కారాలను అందుకున్నట్లు ఈ సంస్థకు అధ్యక్షత వహిస్తున్న పెయింటర్ వేల్పుల మురళితోపాటు మిత్రబృందం సభ్యులు పేర్కొన్నారు.

మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దంపతులు

నవ్వులు పండించిన హాస్యభారతి

అనంత సాంస్కృతికం: హాస్యం పండించడం పూర్వజన్మ సుకృతమేనని ప్రతిభా రాజీవ్ పురస్కార్ గ్రహీత రచయిత అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని శిర్డీనగర్ వివేకానంద యోగా భవన్‌లో ఉత్సాహ భరితంగా జరిగిన 'హాస్యభారతి' కార్యక్రమంలో పలుప్రాంతాల విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు హాజరై ఆనందాన్ని ఆస్వాదించారు. వివేకానంద యోగా కేంద్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు రాజశేఖర్, దివాకర్, మానవత కో కన్వీనర్ సలీం మాలిక్, తరిమల అమరనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పలు విభాగాల హాస్య కళాకారులు పాల్గొని తమ హాస్య చతురత చూపించారు. రచనలు, కవితా సంపుటిలో దిట్టగా పేరుగాంచిన ఏలూరు ఎంగన్న హాస్యం పండించారు. రియాజుద్దీన్ పద్యాలను హాస్యభరితంగా పాడి నవ్వులు పండించారు.

ఎట్టకేలకు తొలగిన మురుగు

స్పందనకు వందనం

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని ఓబుళాపురం గ్రామం జనతా కాలనీలో రోడ్లపైన, మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో ఈనెల 22న ఈనాడు 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన పంచాయతీ అధికారులు, గ్రామంలోని తెదేపా నాయకులు కలిసి జేసీబీ సాయంతో డ్రైనేజీ మురుగు, చెత్తను తొలగించినట్లు తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు తాయప్ప, సీనియర్ నాయకులు బి.బసవరాజు పేర్కొన్నారు.

మురడి అంజన్నకు వెన్న అలంకరణ

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని మురడిలో వెలసిన శ్రీఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి వెన్నతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు పవన్ స్వామి, రామాంజనేయస్వామిలు రాతిబావిపాడ్ శ్రీపాదరావ స్వామివారికి కుంకుమార్చన, ప్రత్యేక వెన్నాలంకరణ గావించారు.

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరు మండలం వజ్రకరూరులోని శ్రీ జనార్దన వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 30న ముక్కోటి ఏకాదశి సందర్భంగా దేవాదాయశాఖ, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో లక్ష దీపారాధన మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఈవో క్రిష్ణయ్య పేర్కొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

ఉరవకొండ, న్యూస్‌టుడే: అయ్యప్పస్వామి ఆలయంలో మాలధారులకు ఆదివారం గన్నేరు అంజలి, ఆమె కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. దాతను అన్నదాన సేవా సమితి అభినందించింది.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా ఉద్యోగ ఉపాధ్యాయుల సంఘం సభ్యులను బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు సవితమ్మ సన్మానించారు. ఆదివారం కనక దాస కళ్యాణ మండపంలోని జరిగిన ఈ కార్యక్రమాని ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యోగ ఉపాధ్యాయుల సంఘం సభ్యులు ఇరాలప్ప, శ్రీనివాసులు, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

డి.హీరేహాళ్‌లో ఉపాధ్యాయులకు జ్ఞాపిక అందిస్తున్న మంత్రి సవితమ్మ

తెదేపా నేతలకు దుర్గం ఎమ్మెల్యే...

కళ్యాణదుర్గం గ్రామీణం: తెలుగుదేశం పార్టీ జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు పూల నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వడ్డే వెంకటేష్‌లను ఆదివారం పార్టీ కార్యాలయంలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సత్కరించారు.

పూల నాగరాజు, శ్రీధర్‌చౌదరిలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ఆర్గనైజింగ్ కార్యదర్శికి...

కుందుర్పి: కుందుర్పి మండలం కెంచంపల్లి గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ గోనిమానుతోట రవి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎంపికైనట్లు తెదేపా నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. మండలం, నియోజకవర్గం వ్యాప్తంగా తెదేపా అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పెర్కొన్నారు.

హామీలు నెరవేర్చాలని డిమాండ్

ఆర్కేనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని గణే నాయక్ భవనంలో ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ.. ఇళ్లు నిర్మించుకొనే పేదలకు నగరంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చి, ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చిందన్నారు. తదుపరి ఆచరణలో పెట్టడంలో విఫలమైందని విమర్శించారు. అర్హులైన వారికి పింఛన్లు, రేషన్‌కార్డులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికి యాభై ఏళ్ల వయసు నిండిన వారికి పింఛను ఇస్తామనే హామీని విస్మరించారని వాపోయారు. ఆరోగ్యబీమాను మరిచారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నగర కార్యదర్శి రామిరెడ్డి, మసూద్, బాలరంగయ్య, వెంకటనారాయణ, ముర్తుజా, ఇర్ఫాన్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

గేటు ఇలా.. విద్యార్థుల భద్రత ఎలా..?

కుందుర్పి మండలంలోని అపిలేపల్లి ఉన్నత పాఠశాల గేటు(ప్రధాన ద్వారం) ఏడాదిన్నర కిందట విరిగిపోయినా.. నేటికీ ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. దీంతో విద్యార్థులకు భద్రత కరవైంది. గేటు ముందటే కుందుర్పి- కళ్యాణదుర్గం రెండు వరసల దారి ఉండటంతో నిత్యం రద్దీగా వాహనాల రాకపోకలు ఉంటాయి. విరామ సమయంలో విద్యార్థులు రోడ్డుపైకి వచ్చినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వెంటనే గేటుకు మరమ్మతులు చేయించి విద్యార్థులకు భద్రత కల్పించాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కుందుర్పి**

కాలువకు మరమ్మతులు చేయండి



రాయదుర్గం పట్టణంలోని 17వ వార్డులోని గుగ్గిరహట్టిలో రోడ్డు పక్కన తవ్విన కాలవకు వెంటనే మరమ్మతులు చేయాలని ఆ వార్డు ప్రజలు విజ్ఞప్తి చేశారు. గుగ్గిరహట్టి, వేంకటేశ్వరమాన్యంకు రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై మున్సిపల్ డీఈ సురేష్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ త్వరలో కాలవ మరమ్మతునకు చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, రాయదుర్గం

మూలకు చేరిన చెత్తబండి

విడపనకల్లు మండలం పెద్ద కొట్టాలపల్లి గ్రామ సచివాలయం వద్ద స్వచ్ఛ సంకల్ప చెత్తబండి మూలకు చేరింది. ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛ సంకల్పంపై ప్రచారం చేస్తున్నప్పటికీ... ఆచరణలోకి మాత్రం ఆ పరిస్థితులు కానరావడం లేదు. కొన్ని నెలలుగా చెత్తను సేకరించే బండిని సచివాలయం పక్కన ముళ్ల చెట్లమధ్య వృథాగా మూలకు పడేశారు. సంబధిత అధికారులు ప్రతిరోజు గ్రామంలో చెత్తను సేకరించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, విడపనకల్లు

నిర్మించారు.. మరిచారు

ఉరవకొండలో జగనన్న కొలిమి కాలనీకి వెళ్లే దారిలో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వెనుక ఉన్న బహుళ సౌకర్య గోదాం పరిశీలిస్తే ఎటు చూసినా ఖాళీ మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లు సంబంధించిన వ్యర్థాలు దర్శనం ఇస్తున్నాయి. అక్కడ రెండు పెద్ద గోదాములను రూ.70 లక్షలు ఖర్చు చేసి నిర్మించి వినియోగం మరిచారు. దీంతో కొన్నాళ్లుగా అవి వృథాగా మారాయి. దీంతో అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయి. పోలీసులు గుర్తించి అక్కడ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఉరవకొండ

సీఐటీయూ సభల జయప్రదానికి పిలుపు

కణేకల్లు, న్యూస్‌టుడే: జనవరి 4న విశాఖపట్నంలో జరిగే ఆల్ ఇండియా మహా సభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, కణేకల్లు మండల కార్యదర్శి కోరి నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం జీపు జాత కణేకల్లుకు చేరుకున్న సందర్భంగా వారు మాట్లాడారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, కార్మికులు విశేషంగా తరలిరావాలన్నారు. నాయకులు ఆర్‌వీ నాయుడు, నాగమణి, హమాలీ, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఇడుగంజి వినాయకుడు

అనంత సాంస్కృతికం: నగరంలోని శాంతి థియేటర్ రహదారిలో యలకంటి స్వగృహ పురుష్ మిఠాయి దుకాణంలో ఏర్పాటైన ఇడుగంజి వినాయకుడి కేక్ ఖాతాదారులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కర్ణాటక రాష్ట్రంలో ఇడుగంజి వినాయకుడు ప్రసిద్ధి పొందారు. స్థానిక యలకంటి కుటుంబం ఇడుగంజి వినాయకుడిని పూజించడం అనాదిగా వస్తోంది.

ప్రమాదాలకు నిలయంగా కల్వర్టు

బెళుగుప్ప తగ్గుపర్తి గ్రామాల ప్రధాన రహదారిలో ఉన్న పెద్ద వంక కల్వర్టు దెబ్బతిన డంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గత సంవత్సరం 8 వ నెలలో కురిసిన భారీ వర్షాలకు పెద్ద వంక ఉధృతంగా ప్రవహించడంతో ఒకవైపు కల్వర్టు కొట్టుకునిపోయింది. రాకపోకలు సాగించడానికి వీలుగా స్థానిక తెదేపా నాయకులు తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. రాత్రి సమయాల్లో ద్విచక్రవాహనాల్లో ప్రయాణించే వారుప్రమాదాలకు గురవుతున్నారు. నూతన కల్వర్టు నిర్మించేంతవరకు ఆ ప్రాంతంలో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, బెళుగుప్ప**

నూతన ఎస్సైకి సన్మానం

కుందుర్పి, న్యూస్‌టుడే: కుందుర్పి మండల పోలీస్ స్టేషన్‌లో కొత్తగా ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన మహేష్‌ను ఆదివారం మండల తెదేపా సీనియర్ నాయకులు, మాజీ సర్పంచి పెద్దనరసింహప్ప, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు హనుమంతరాయుడు, శ్రీరాములు, వీరారెడ్డి, శ్రీనివాసులు, మల్లా వెంకటేశులు తదితరులు సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం కొట్టాలపల్లి వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడటంతో గుంతకల్లుకు చెందిన శికారీ మల్లయ్య గాయాలయ్యాయి. యువకుడి స్థానికులు అత్యవసర వాహనంలో ఉరవకొండ ఆసుపత్రికి తీసుకొచ్చి వైద్యం అందిస్తున్నారు.

ఘర్షణ పునరావృతం

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ మండలం రేణుమాకుపల్లిలో శనివారం గణపం విషయంలో ఇరు వర్గాలకు చెందిన గొర్రెల కాపరులు ఘర్షణ పడిన విషయం తెలిసిందే. ఈ ఘర్షణ ఆదివారం కూడా పునరావృతమైంది. కొందరు వైకాపా మద్దతుదారులు తెదేపా మద్దతుదారులపై దాడిచేయగా ఒకరికి తీవ్ర గాయాలైనట్లు ఆ పార్టీ శ్రేణులు ఫిర్యాదు చేసినట్లు సీఐ మహానంది చెప్పారు.

30 నుంచి భగవద్గీత బోధన

కణేకల్లు, న్యూస్‌టుడే: స్థానిక స్వయంభేశ్వర ఆలయ ఆవరణలో ఈనెల 30న వైకుంఠ ఏకాదశి నుంచి ప్రతిరోజు 5 గంటలకు భగవద్గీత బోధన ఉంటుందని విశ్వహిందూ పరిషత్తు, హిందూ సమ్మేళన సమితి నిర్వాహకులు పేర్కొన్నారు. ఈమేరకు చిక్కణ్ణేశ్వర ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జడ్పీటీసీ మాజీ సభ్యురాలి మృతికి సంతాపం

బ్రహ్మసముద్రం: బ్రహ్మసముద్రం మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యురాలు కురబ గంగమ్మ(75) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందగా... తెదేపా మండల పార్టీ కన్వీనర్ శ్రీరాములు, నాయకులు పలువురు సంతాపం ప్రకటించారు.

లీకేజీలకు మరమ్మతు కరవు

● పల్లెల్లో తాగునీటి ఇక్కట్లు

న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం: కళ్యాణదుర్గం పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు బీఏపీఆర్ నుంచి పేస్-1, 2, 3, 4 విభాగాల్లో సరఫరా అయ్యే శ్రీరామిరెడ్డి నీటి పథకం తరచుగా ఆగిపోతుండటంతో ప్రజలకు నీటి కష్టాలు మొదలయ్యాయి. ప్రధాన పైప్‌లకు తరచుగా లీకేజీలు ఏర్పడటం.. వాటికి అధికారులు సరైన సమయంలో మరమ్మతు చేయకపోవడంతోపాటు వారంలో రెండు మూడు సార్లు నీటి సరఫరాను ఆపివేస్తున్నారు.

చెర్లోపల్లి వద్ద పగిలిన ప్రధాన పైపు

తల్లడిల్లుతున్న ప్రజలు

పేస్-1, పేస్-3 పరిధిలో ఏదో కారణ వల్ల నియోజకవర్గాలైన కళ్యాణదుర్గం 191, రాయదుర్గం 114, హిందూపురంలో 164, మడకశిరర, పెనుగొండ 359 మొత్తం 828 గ్రామాలకు నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఈ మార్గంలో కళ్యాణదుర్గం పట్టణ సమీపాన, గరుడాపురం, పాపంపల్లి, చెర్లోపల్లి గ్రామాల వద్ద పది రోజుల నుంచి ఏదో ఒకచోట పైప్‌లు లీకేజీలు అవుతున్నా... మరమ్మతు కరవయ్యాయి. గుత్తేదారు, సూపర్‌వైజర్ మధ్య మనస్పర్థలు, దీనికితోడు నీటి సరఫరా ఆపితే బిల్లులు వస్తాయనే స్వార్థంతో ప్రజలకు నీటి కష్టాలు తెస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నీటి సమస్య పరిష్కరించేలా చూస్తా

కొన్నిచోట్ల పైప్‌లు లీకవుతున్నట్లు క్షేత్రస్థాయి సిబ్బంది మా దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే పైపులకు మరమ్మతు చేయించి ప్రజల దాహార్తి తీర్చేలా కృషి చేస్తాం.

- శిరీష, డీఈ

మాజీ క్రికెటర్ల మరణం తీరనిలోటు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: నెల వ్యవధిలో అకాల మరణం చెందిన మాజీ క్రికెటర్లకు ఘన నివాళి అర్పించారు. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించి వారి సేవలను గుర్తుచేశారు. అనంత క్రికెట్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు శ్రీనాథ్, కార్యదర్శి ఎ. యుగంధర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి సర్దార్, కోశాధికారి మురళీకృష్ణ, క్రికెట్ కౌన్సిలర్ అన్సర్, మాజీ రంజీ క్రికెటర్లు ఎల్ఎన్ ప్రసాద్‌రెడ్డి, షాబుద్దీన్, సంఘం మాజీ అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, మాజీ కార్యదర్శి భీమలింగారెడ్డి, సీనియర్లు సీతారామరావు, టీవీ చంద్రమోహన్‌రెడ్డి, మచ్చా రామలింగారెడ్డి, ఆర్డీటీ డైరెక్టర్ నాగప్ప, మహిళా క్రికెటర్లు హాజరయ్యారు. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శిగా 10 ఏళ్లపాటు పనిచేసి ఎంతోమందిని తీర్చిదిద్దిన శ్రీనివాసులు, సీనియర్ క్రికెటర్లు కిరణ్‌కుమార్, మధుసూదన్‌లు నెల వ్యవధిలో మరణించారు. వీరి సేవలను గుర్తుచేస్తూ సంతాపసభ నిర్వహించారు. జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి శ్రీనివాసులు పునాది వేశారని ఆయన సేవలు జిల్లా క్రికెటర్లు ఎప్పటికీ మరువలేమని తెలిపారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన జట్టుకు సన్మానం

ఉపాధ్యాయ జట్టును సన్మానిస్తున్న ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు సిబ్బంది

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'లీప్ క్రికెట్ పోటీ'ల్లో జిల్లాస్థాయి విజేతగా నిలిచిన బ్రహ్మసముద్రం ఉపాధ్యాయుల జట్టును.. కళ్యాణదుర్గం పట్టణంలోని ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బద్దే నాయక్ ఆదివారం ఘనంగా సన్మానించారు. తదుపరి కుందుర్పి ఎంఈఓ తిప్పేస్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన జట్టు సభ్యులకు జ్ఞాపికలు ఇచ్చి ఘనంగా సన్మానించారు. కెప్టెన్ హరికృష్ణ నాయకత్వంలో సభ్యులు సమష్టి కృషితో పోరాడి రాష్ట్రస్థాయికి చేరుకోవడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్ కుమార్ ట్రస్టు వైస్ ఛైర్మన్ సురేష్‌కుమార్, సభ్యులు తిప్పేస్వామి, లక్ష్మన్న, మురళి, అజయ్, శివలింగ పాల్గొన్నారు.

ఉపకారాగారంలో రెవెన్యూ దస్త్రాలు!

ఉప కారాగారంలో భద్రపరిచిన దస్త్రాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ మహబూబ్‌బాషా

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయం పాత భవనంలో ఉండి. దీని మరమ్మతులకు చర్యలు తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ దస్త్రాలన్ని రెండు రోజులుగా తహసీల్దార్ మహబూబ్‌బాషా పర్యవేక్షణలో సిబ్బంది ఉప కారాగారం గదుల్లో భద్ర పరుస్తున్నారు. నిందితుల సంఖ్య తక్కువగా ఉండటంతో 2017 నుంచి జైళ్లశాఖ గదులు తెరచుకోవడం లేదు. దీంతో రెవెన్యూ రికార్డులను ఇక్కడ భద్రపరుస్తున్నామని తహసీల్దార్ చెప్పారు.

అటకెక్కిన చెత్త సేకరణ!

● నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు

43ఉడేగోళంలో నిరుపయోగంగా చెత్త సంపద తయారీ కేంద్రం

న్యూస్‌టుడే, కణేకల్లు

కణేకల్లు మండల వ్యాప్తంగా ఇంటింటా చెత్త సేకరణ, తరలింపు కొన్నాళ్లుగా ఆటకెక్కింది. వీధుల్లో, రోడ్ల పక్కన చెత్త దిబ్బలు దర్శనం ఇస్తున్నాయి. దీంతో ఎక్కడ చూసినా అపరిశుభ్రత నెలకొంటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో చెత్త నుంచి ఎరువు తయారు చేసి, పంచాయతీల ఆదాయం పెంపొందించాలన్న ప్రభుత్వ లక్ష్యం సైతం నీరుగారుతోంది.

దారుల్లో ఎక్కడపడితే అక్కడే..

మండల వ్యాప్తంగా 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అన్ని గ్రామాలలో రూ.4 కోట్లకు పైగా వ్యయం చేసి సంపద తయారీ కేంద్రాలు నిర్మించారు. చెత్తతో ఎరువు తయారు చేసి గ్రామాల శుభ్రత, పంచాయతీ ఆదాయం పెంపొందించేలా హరిత రాయబారులను నియమించి, చెత్త సేకరణకు మూడు చక్రాల రిక్షాలు సమకూర్చారు. చాలావరకు రిక్షాలు మరమ్మతుకు గురయ్యాయి. మేజర్ పంచాయతీ మినహా చాలా గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. దీంతో చెత్త వీధుల్లో ప్రధాన రోడ్ల పక్కన చేరి, అపరిశుభ్రత తాండవిస్తోంది. నిప్పు కాల్చివేస్తుండటంతో సంపద కాలి బూడిద అవుతోంది. దీంతో లక్షలాది రూపాయలు వ్యయం చేసి నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. అధికారులు స్పందించి పరిస్థితిని చక్కదిద్దేలా చర్యలు చేపట్టి, గ్రామాల శుభ్రతకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తగు చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో పారిశుద్ధ్య సిబ్బంది సాయంతో చెత్త సేకరణ, తరలింపునకు తగు చర్యలు తీసుకుంటాం. కేంద్రాలోంల సంపద తయారు చేసేలా ఏర్పాట్లు చేస్తాం. ఈ దిశగా గ్రామాల్లో చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తాం.

-: చంద్రమౌళి, ఈఓఆర్డీ

సైబర్ మోసాలపై అవగాహన తప్పనిసరి

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: సైబర్ మోసాలు, పోక్సో చట్టాలు, బాల్య వివాహాలు గురించి సమాజంలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మురడిలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించి గొడవలకు పోకుండా మెలగాలని ఆదేశించారు.

మాట్లాడుతున్న ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి

CHANGE OF NAME

I, **PUJARI RUPENDRA** S/o **PUJARI SIVALINGAPPA,** Employed as School Asst. (Mathematics Teacher), MPUP School, Mucharlapalli, Settur Mandal, Anantapur Dt, Government of Andhra Pradesh, R/o 3/19, New Housing Colony, Settur, Anantapur, Andhra Pradesh - 515767. Have Changed My Name as **PUJARI RUPESH.**

(c) eenadu

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

కాషాయసేన నిరసన

ర్యాలీ నిర్వహిస్తున్న కాషాయసేన సభ్యులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : బంగ్లాదేశ్‌లో మైనార్టీలైన హిందువులపై దాడులు చేయడం ఆపాలని కాషాయసేన జిల్లా అధ్యక్షుడు మంజులా వెంకటేశ్, కార్యదర్శి కేశవ అన్నారు. ఆదివారం సాయంత్రం కాషాయసేన ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ దాడులను ఆపేవిధంగా చూడాలని కోరారు. నిరసన ర్యాలీ బీరప్ప ఆలయం కూడలి నుంచి పాతగుంతకల్లు మీదుగా ఎన్టీఆర్ కూడలి వరకు సాగింది. కార్యక్రమంలో కాషాయసేన సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అశ్వర్థ ఆలయంలో విశేష పూజలు

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: మండలంలో ప్రసిద్ధి చెందిన అశ్వర్థ ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అశ్వర్థనారాయణస్వామి, శ్రీచక్రభీమలింగేశ్వరస్వామికి వేద పండితులు అభిషేక పూజలు, అర్చనలు నిర్వహించి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

గార్లదిన్నె, న్యూస్‌టుడే: గార్లదిన్నె సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం త్రుటిలో భారీ ప్రమాదం తప్పింది. అనంతపురం నుంచి గుత్తి వైపు వెళ్తున్న కారును అదే వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో కారు రోడ్డు పక్కకు వెళ్లింది. అదే సమయంలో ప్రైవేటు బస్సు కారును పక్క నుంచి ఢీకొట్టి వెళ్లింది. కారు పూర్తిగా దెబ్బతిన్నా అందులో ప్రయాణికులు సురక్షితంగా బయటపడినట్లు పోలీసులు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: గుంతకల్లులో మున్సిపల్ కూరగాయల మార్కెట్‌లో మట్టికుండలు అమ్మేచోట సిమెంటు రోడ్డు దెబ్బతినింది

-రాజు, వాహన చోదకుడు

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం

-హరికృష్ణ, ఏఈ

–న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

ఆకలి తీర్చే నాథుడే లేడా..!

నిరాశ్రయుల వసతి గృహంలో అలంకారప్రాయంగా కుళాయిలు

గుంతకల్లు, న్యూస్‌టుడే : నిరాశ్రయుల వసతి గృహాన్ని మున్సిపల్ అధికారులు గాలికొదిలేయడంతో ఇక్కడ ఉండే నిరాశ్రయులు ఎవరైనా పట్టెడన్నం పెడతారా అని ఎదురుచూసే పరిస్థితి ఏర్పడింది. మున్సిపల్ అధికారులు ఏడేళ్ల కిందట తిలక్‌నగర్‌లో ప్రారంభించారు. ఈ గృహాన్ని నిర్వహించే బాధ్యతను అధికారులు గతంలో ఓ స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. నాలుగేళ్లుగా బిల్లులు చెల్లించకపోవడంతో సంస్థ నిర్వాహకులు బాధ్యత నుంచి తప్పుకున్నారు. ప్రస్తుతం ఈ గృహంలో 11 మంది తలదాచుకుంటున్నారు. మున్సిపల్ అధికారులు వారికి అల్పాహారం, భోజనాన్ని అందించడం లేదు.

అన్నం కోసం ఎదురుచూపు

వసతిగృహంలో తలదాచుకుంటున్న వారికి ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడు మురళీమోహన్, ఆయన స్నేహితులు, నర్సింగ్ హోంకు చెందిన వైద్యురాలు రమణమ్మ అందరూ కలిసి అల్పాహారం, భోజనాన్ని అందిస్తున్నారు.

ఇళ్లలోని వారు పట్టించుకోకపోవడంతో వయసు మళ్లిన వారు, అనారోగ్యంతో బాధపడేవారు వసతి గృహంలో ఉంటున్నారు. పట్టణానికి చెందిన దాతలు వృద్ధాశ్రమం, బాలుర శరణాలయంలో అన్నదానాన్ని నిర్వహిస్తున్నారు. అలాగే తమ గురించి కొంచెం ఆలోచించాలని నిరాశ్రయులు కోరుతున్నారు. వీరికి తాగునీటి సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు తమకు సౌకర్యాలు కల్పించి తమను ఆదుకోవాలని నిరాశ్రయులు కోరుతున్నారు.

స్వచ్ఛంద సంస్థకు అప్పగిస్తాం

ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగియడంతో ప్రస్తుతం నిరాశ్రయుల వసతిగృహానికి మున్సిపాలిటీ నిధులను కేటాయించడం లేదు. అయితే నిర్వహించడానికి స్వచ్ఛంద సంస్థ కోసం అన్వేషిస్తున్నాం. నిర్వహణ బాధ్యతను స్వచ్ఛంద సంస్థకు అప్పగించి నిరాశ్రయులను ఆదుకుంటాం. **-మోహన్, పట్టణ ప్రాజెక్టు అధికారి**

నేడు ప్రజాసమస్యల పరిష్కారవేదిక

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు పుణ్యవతి తెలిపారు. ప్రజలు తమ రెవెన్యూ సమస్యలు ఉంటే వినతులు ఇవ్వాలన్నారు. భూములకు సంబంధించిన మ్యుటేషన్, ఆర్ఓఆర్, ఎఫ్‌లైన్ తదితర సమస్యలను పరిష్కరిస్తామని వివరించారు. ప్రజలు ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

'మండల స్థాయి అధికారులు హాజరుకండి'

యల్లనూరు, న్యూస్‌టుడే: తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదులు విభాగానికి అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని ఆదివారం తహసీల్దార్ రాము తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10గంటలకు మండలస్థాయి అధికారులు అందరరూ రావాలని స్పష్టంచేశారు. ప్రజల అర్జీలు స్వీకరించి ఆయా శాఖల అధికారులు పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల విషయంలో క్షేత్ర స్థాయిలో అధికారులు ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని హెచ్చరించారు.

'రెవెన్యూ సమస్యలను గ్రీవెన్స్‌డేలోనే పరిష్కరిస్తాం'

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మండల పరిధిలో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారని తహసీల్దారు శ్రీధరమూర్తి తెలిపారు. రైతులు ఇకపై భూ సమస్యల పరిష్కారం కోసం మండలంలోనే వీఆర్‌వోలు, ఆర్‌లు, సర్వేయర్లు అందరూ అందుబాటులో ఉంటారన్నారు. సమస్యలున్న వారు సోమవారం జరిగే గ్రీవెన్స్‌కు వచ్చి సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

నేడు మన ఊరు-మన శుభ్రత కార్యక్రమం

యాడికి, న్యూస్‌టుడే: తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి సోమవారం యాడికిలో 'మన ఊరు-మన శుభ్రత' కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెదేపా పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు వేలూరు రంగయ్య, మండల కన్వీనర్ ఆది తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, పలు అభివృద్ధి పనులను పరిశీలించనున్నట్లు తెలిపారు.

మానవత్వం చాటుకున్న యువకులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు పట్టణం భాగ్యనగర్‌లోని సెయింట్ ఆడ్రూస్ చర్చి (గంటచర్చి)కి చెందిన యువకులు మానవత్వాన్ని చాటుకున్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని చర్చి యువజన సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని నిరుపేదలకు మాంసాహార, శాకాహార పదార్థాలను పంపిణీ చేశారు. అలాగే రైల్వే జంక్షన్ రోడ్డు, జంక్షన్ కూడలి, రైల్వే సామాజిక భవనం, పాతగుంతకల్లు దర్గాల వద్ద ఉండే పేదలకు భోజనం అందజేశారు. కార్యక్రమం చర్చి యువజన సంఘం నాయకులు అవినాశ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ

గుంతకల్లు, న్యూస్‌టుడే : కొత్త సంవత్సరంలో అందరికీ శుభం జరగాలని కోరుకుంటున్నానని తెదేపా గుత్తి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ అన్నారు. ఆదివారం ఆయన గుంతకల్లులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముద్రించిన క్యాలెండర్లను తన మిత్రులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నామని వివరించారు. అనంతరం కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచారు.

క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న తెదేపా నాయకుడు ఈశ్వర్, మిత్రులు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: పెద్దవడుగూరు, చిన్నవడుగూరు గ్రామాల్లో ఉన్న ఐఎన్ఐసీ చర్చిలో ఆదివారం 2026 నూతన క్యాలెండర్లను ఆవిష్కరించారు. చర్చి పాస్టర్ జాన్‌డేవిడ్ ఆధ్వర్యంలో సభ్యులు ఆనంద్‌రాజ్, శోభారాణి, వసంత, ఇమ్మాన్యుల్, ఏస్తేరురాణి, రామలక్ష్మీ, డేవిడ్, రిషీ, నాగేశ్వరమ్మ, శారదమ్మ, సంజీవ, జయన్న తదితరులు పాల్గొని కాలమాన పట్టికలను ఆవిష్కరించి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

ట్యాంకర్ల కుదింపుతో తాగునీటి కష్టాలు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి పురపాలికలో తాగునీటి సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. అధికారులు ట్యాంకర్లను సక్రమంగా నిర్వహించలేకపోతున్నారు. పురపాలికలోని చెట్నేపల్లి, సూరశింగనపల్లి, గుత్తి, గుత్తిఆర్.ఎస్‌లతోపాటు గుంతకల్లు గ్రామీణంలో 22గ్రామాలకు ఈ సమస్య ఉంది. కొన్ని కాలనీలకు వైటీచెరువు, సత్యసాయి పథకాల నుంచి వారం, 15రోజులకోసారి తాగునీరు సరఫరా అవుతోంది. అంతవరకు స్థానికంగా అందుబాటులో ఉన్న బోర్లనీటితో ట్యాంకర్లను నింపుకుని ప్రజలకు సరఫరా చేయాల్సిఉంది. 6నెలల కిందట వరకు 12ట్యాంకర్లు ఉండగా ఇప్పుడు కేవలం నాలుగు మాత్రమే ఉన్నాయి. ఒక్కో ట్యాంకర్‌కు ట్రిప్పునకు రూ.350 చెల్లిస్తున్నారు. పురపాలికకు సొంతంగా ట్యాంకర్లు లేకపోవడంతో అద్దెకు తీసుకుని ప్రజలకు తాగునీటిని అందిస్తున్నారు. ట్యాంకర్ల యజమానులకు పురపాలిక అధికారులు రూ.లక్షల్లో బకాయి పడ్డారు. అందరికీ కలిపి ఇప్పటి వరకు రూ.కోటి బకాయి ఉన్నారు. దీంతో అధికారులు ప్రైవేట్ ట్యాంకర్లను పూర్తిగా తగ్గించారు. వైటీచెరువు పథకం పైపులైన్ల మార్పు జరుగుతుండటంతో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గుత్తిలోని ఓబోరు వద్ద ఆగి ఉన్న ట్యాంకర్లు

మరపురాని జ్ఞాపకాలు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో శ్రీ సరస్వతీ విద్యానికేతన్ పాఠశాలలో 2005-06 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న వారంతా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల తరువాత కలిసిన పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో బాల్య జ్ఞాపకాలు తలచుకుని మురిసిపోయారు. పూర్వ విద్యార్థులు ప్రభాకర్‌రెడ్డి, మనోజ్, సుధీర్, నాగరాజు, భారతి, పద్మ, నల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: తాడిపత్రిలోని శ్రీవాణీ ఉన్నతపాఠశాల 2000 సంవత్సరం 10వ తరగతి విద్యార్థులు కలయిక అపూర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు నీలకంఠ, ఫాజిల్‌బాష, ఓబులేసు, జ్యోతి, విజయలక్ష్మీలను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

గుంతకల్లు పూర్వ విద్యార్థులు

స్నేహ సంబంధాలు బలహీనపడుతున్న ప్రస్తుత తరుణంలో నాలుగు దశాబ్దాల పూర్వపు విద్యార్థులు ఆత్మీయ కలయిక ఎంతగానో ఆనందంగా నిలిచింది. ఆదివారం ఎన్జీఓ హోమ్‌లో గుంతకల్ ఎస్‌జేపీ హైస్కూల్‌లో 1986-87 సం.లో పదోతరగతి ఎ సెక్షన్ విద్యార్థులు ఆత్మీక కలయిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆత్మీయ సమ్మేళనం ద్వారా ఐక్యతోపాటు జ్ఞాపకాలు పంచుకునే సదవకాశం కలుగుతుందన్నారు. రియాజ్ బాషా, దాదా ఖలందర్, మహమ్మద్ యాసిన్, నిర్మల రెడ్డి, లోకేశ్వరి దేవి, సూరయ్య బేగం, జయభారతి, అరుణాదేవి పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, రుద్రంపేట**

గార్లదిన్నె: నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

తాడిపత్రిలో..

రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం: ఎమ్మెల్యే

రైతులతో కలిసి వరినాట్లు వేస్తున్న బండారు శ్రావణిశ్రీ

శింగనమల, న్యూస్‌టుడే: రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో శ్రీ రంగరాయల చెరువు కింద సాగు చేస్తున్న వరి పొలాల్లో రైతులతో కలిసి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వరినాట్లు వేశారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లడుతూ చెరువు ఆయకట్టు కింద 1300 ఎకరాల్లో రైతులు నాట్లు వేశారని ఇబ్బంది లేకుండా నీరు అందుబాటులో ఉంచుతామన్నారు. పొలాలకి వెళ్లేందుకు రహదారి లేని కారణంగా చాల సంవత్సరాల నుంచి ఇబ్బందిపడుతున్నారని, స్థానిక శివాలయం నుంచి పెద్ద కాలువ వరకు త్వరలోనే రహదారి నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు..

శింగనమల, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే అన్నారు. మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి మాట్లాడారు. ప్రజలు, అంగడి యజమానులు చెత్త బిన్నులు ఏర్పాటు చేసుకొని పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని కోరారు. అదేవిధంగా వారానికి రెండు సార్లు డ్రైనేజీలను శుభ్రం చేయాలని అధికారులు ప్రజలకు వాటి మీద అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అభాగ్యులకు దుప్పట్ల పంపిణీ

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలో పలుచోట్ల ఉన్న యాచకులకు ఉద్యోగ ఉపాధ్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుతం చలి ఎక్కువగా ఉందని దీంతో ఆర్టీసీ బస్టాండు, చింతలరాయుడు, బుగ్గరామలింగేశ్వరుని ఆలయాలు, రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న యాచకులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. వారికి దుప్పట్లు అందించినట్లు తెలిపారు. అంతేకాకుండా నందలపాడులో సౌభాగ్య సింధు అనాథ ఆశ్రమ విద్యార్థులకు కూడా దుప్పట్లను అందించారు. కార్యక్రమంలో పలువురు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని వెంకటాంపల్లి తండాలో ఆదివారం బెల్టుషాపుపై గ్రామీణం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్సై బాలముని తెలిపిన వివరాల మేరకు... గ్రామంలో ఒక వ్యక్తి బయట మద్యం సీసాలు విక్రయిస్తుండగా అతన్ని పట్టుకుని పది బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

లారీ డ్రైవర్ బలవన్మరణం

యాడికి, న్యూస్‌టుడే: మండలంలోని గుడిపాడులో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన కోటపాటి శ్రీనివాసులు(35) లారీ డ్రైవరుగా పనిచేస్తున్నాడు. తాగివచ్చి భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో మద్యం తాగి ఇంటికి రావొద్దని భర్తను మందలించింది. దీనిని అవమానంగా భావించి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.శ్రీనివాసులు తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

పామిడి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని జి.కొట్టాల, పాళ్యంతండా గ్రామాల్లో ఆదివారం సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పామిడి, గుత్తి మండలాల బాధ్యుడు గుమ్మనూరు ఈశ్వర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఎన్‌జీఆర్ఎస్ నిధుల ద్వారా జి.కొట్టాలకు రూ.26 లక్షలు, పాళ్యంతండాకు రూ.30లక్షలతో పలు పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మండల ఎంపీడీవో తేజోత్స్న, మండల ఇంజనీరు హేమ్లానాయక్, పట్టణ, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ముస్తాబు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులో రాజేంద్రనగర్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయంలో 30న జరిగే వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం ఆలయంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, ఉపాధ్యక్షులు రమేశ్‌రెడ్డి, కోశాధికారి సుధాకర్ గుప్తా, సభ్యులు వెంకటేశ్వర్లు, సుదర్శన్ బాబు, జయంతి వెంకట్ తదితరులు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి కరపత్రాలను విడుదల చేశారు. 30న ఉదయం 7గంటల నుంచి ఉత్తర ద్వారంలో సర్వదర్శనం ప్రారంభమై రాత్రి 11 గంటలకు వరకు దర్శనం ఉంటుందన్నారు. అలాగే 31 వరకూ కొనసాగుతుందని తెలిపారు. ఈసారి ప్రత్యేకంగా ఆరోగ్య ప్రదాత ధన్వంతరి విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తికోటలోని చారిత్రక లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 30న వైకుంఠ ఏకాదశి ఉత్సవానికి ఏర్పాట్లు చేశారు. ఏకాదశి సందర్భంగా ఆలయం ఉత్తర వాకిలి తెరుస్తామన్నారు. భక్తులు స్వామివారికి పూజలు చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాల్లో స్వామివారి సేవకు భక్తులు తరలిరావాలని కోరారు.

'హిందూ సంప్రదాయం ప్రాచీనమైనది'

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: సనాతన హిందూ ధర్మం ప్రాచీనమైనదని దత్త పీఠాధిపతి సురేంద్ర మహారాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సనాతన ధర్మం, దేవాలయాలు, వాటి ఆస్తులను రక్షించడం ప్రతి హిందువు కర్తవ్యమన్నారు. తల్లిదండ్రులను దైవసమానంగా గౌరవించి ఆదరించాలని తెలిపారు. హిందువులంతా ఐక్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు చౌడయ్య, నాగరాజు, రామాంజనేయులు, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సురేంద్రమహారాజు

వనిత.. వ్యాపారంలో వడివడిగా!

మిఠాయిల తయారీతో...

తాడిపత్రిలోని గాంధీనగర్‌కు చెందిన హసీనా అనే మహిళా స్వయంగా మిఠాయిలు తయారు చేసి స్వయం ఉపాధి పొందుతోంది. గత పదేళ్లగా స్వయం ఉపాధి సంఘంలో ఉంటోంది. ప్రస్తుతం రూ.15లక్షలు రుణం తీసుకుని స్వయంగా మిఠాయిలు తయారు చేసి అమ్ముతోంది. స్వయంగా మహిళ లడ్డు, ఖాజా పలు రకాల మిఠాయిలు తయారు చేసి ఆటోలో పెట్టుకుని విక్రయిస్తోంది. అంతేకాకుండా వీటిని పలు దుకాణాలకు సరఫరా చేసి డబ్బులు సంపాదిస్తోంది. ఈమె ప్రతి నెల సుమారు రూ.25వేలకు పైగానే సంపాదిస్తూ, మరో ముగ్గురు మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. తన ముగ్గురు పిల్లలను చదివిస్తూ భవిష్యత్తులో వ్యాపారం విస్తరించి పెద్ద దుకాణం తెరిచి మరింత మంది మహిళలకు ఉపాధి కల్పిస్తానంటోంది హసీనా.

స్వయం ఉపాధి దిశగా రాణింపు

తాడిపత్రి, గుంతకల్లు, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘంలో రుణాలు తీసుకుని ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు కొందరు మహిళలు. తీసుకున్న రుణంతో స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకుని కుటుంబ పోషణలో సాయపడుతున్నారు. పలు వ్యాపారాలను ఏర్పాటు చేసుకుని మరి కొంతమందికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

పొదుపు సభ్యురాలిగా ఉంటూ...

తాడిపత్రిలోని కాలువగడ్డ వీధికి చెందిన సలీమా స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉంటోంది. గత 15 సంవత్సరాలుగా రుణాలు తీసుకుంటూ పలు వ్యాపారాలు చేసింది. ప్రస్తుతం ఆటోలో సొంతంగా పండ్ల వ్యాపారం నిర్వహిస్తోంది. వాటిని అమ్ముతూ స్వయం ఉపాధి పొందుతోంది. మహిళ నెలకు సుమారు రూ.20వేలకు పైగానే సంపాదిస్తోంది. అంతేకాకుండా మరో ఇద్దరికి కూడా ఉపాధి కల్పిస్తోంది. వచ్చిన ఆదాయంతో కుటుంబానికి తోడ్పాటునిస్తూ, కుమారుడిని ప్రైవేటు పాఠశాలలో చదివిస్తోంది.

చీరల వ్యాపారం..

గుంతకల్లులోని నాగప్ప కాలనీలో ఉంటున్న లావణ్య సంపంగి స్వశక్తి మహిళ సంఘంలో సభ్యురాలు. 16 సంవత్సరాలుగా సంఘంలో ఉంటూ బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి రుణాలుతో ఇంట్లో చీరల వ్యాపారం ప్రారంభించింది. ఆదోని పట్టణానికి వెళ్లి చీరలు, లైనింగ్ క్లాత్ తీసుకొస్తానంటోంది. ఒకసారి వెళ్తితే రూ.లక్ష దాకా సరుకును కొంటోంది. మధ్యలో స్త్రీనిధి రుణం రూ.50వేల వరకు రూపాయి వడ్డీతో తీసుకొని వ్యాపారాన్ని అభివృద్ధి చేస్తున్నానని అంటోంది లావణ్య.

మద్యం దుకాణాల మూసివేతకు వినతి

సీఐ మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా మహిళ సంఘం సభ్యులు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: ఈనెల 31న, జనవరి 1తేదీన గుంతకల్లులో మద్యం దుకాణాలను మూసేయాలని ఐద్వా మహిళ సంఘం సభ్యులు ఆదివారం ఒకటో పట్టణ సీఐ మనోహర్‌కు వినతిపత్రంను అందజేశారు. ఐద్వా పట్టణ అధ్యక్షురాలు జ్యోతి, కార్యదర్శి రంగమ్మ మాట్లాడుతూ కొత్త ఏడాది వస్తున్నందున కొందరు మద్యం మత్తులో రోడ్లపై బైకులతో విచ్చలవిడిగా నడపుతుంటారని వివరించారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని రెండు రోజుల పాటు మద్యం దుకాణాలు, బెల్టుషాపులను బంద్ చేయించడానికి చర్యలు తీసుకోవాలని సీఐను కోరినట్లు వారు పేర్కొన్నారు.

ప్రమాదకరంగా ప్రహరీ

బుక్కరాయసముద్రం మండల పరిధిలోని కొర్రపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీగోడ ప్రమాదకరంగా మారింది. గేటుకు ఇరువైపులా నెర్రలు బారి కూలడానికి సిద్ధంగా ఉంది. ప్రస్తుతం 30 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. కూలక ముందే విద్యాశాఖ అధికారులు మరమ్మత్తులు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం**

మురుగు పారదు.. దుర్వాసన పోదు

బొమ్మలాటపల్లి గ్రామ సచివాలయం వీధిలో మురుగునీరు రోజుల తరబడి నిలవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో సచివాలయ ఉద్యోగులు, గ్రామ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దోమలు వ్యాప్తి ఎక్కువై వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు మురుగునీటి దిగువకు ప్రవహించేలా ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం**

ఆదమరిస్తే అంతే!

తాడిపత్రి పట్టణంలోని చింతల వెంకటరమణస్వామి ఆలయ సమీపంలో సీసీ రోడ్డు దెబ్బతిని ప్రమాదకరంగా ఉంది. మలుపులో రహదారి దెబ్బతిని గొయ్యి ఏర్పడింది. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తాడిపత్రి పట్టణం**

పనులు పూర్తి చేయండి

యాడికి మండలంలోని నిట్టూరులో సచివాలయం భవన నిర్మాణం ఆగిపోయింది. గత ప్రభుత్వంలో అధికారులు జడ్పీ ఉన్నత పాఠశాల స్థలంలో నిర్మాణం చేపట్టారు. కొన్ని కారణాలతో పాటు గుత్తేదారుకి నిధులు చెల్లించకపోవడంతో మధ్యలోనే ఆగింది. అధికారులు స్పందించి నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, యాడికి**

CHANGE OF NAME

I, NARAYANA RAJ KUMAR S/o NARAYANA RAGHURAM GUPTA, resident of D.No. 16/306, Crown Talkis Road, P.O - Guntakal, Anantapuram District, Andhra Pradesh State. As per my Aadhaar Card No. 8564 1263 4550, my father's name is entered as NARAYANA RAGHURAM GUPTA in my Aadhaar Card whereas in my Secondary School Certificate, issued by Board of Secondary Education, my father's name is entered as NARAYANA RAGHURAM. I declare that both the said names NARAYANA RAGHURAM and NARAYANA RAGHURAM GUPTA are same for all purposes vide AFFIDAVIT dated 27-12-2025 sworn before Notary P.BABU, Guntakal.

NARAYANA RAJ KUMAR S/o NARAYANA RAGHURAM GUPTA, Cell No. 7989424254

(c) eenadu

అనంతపురం
• అనంతపురం • రాప్తాడు

హామీలు నెరవేర్చాలని డిమాండ్

ఆర్కేనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని గణేనాయక్ భవనంలో ఆ పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ.. ఇళ్లు నిర్మించుకునే పేదలకు నగరంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చి, ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చిందని అయితే ఆచరణలో విఫలమైందన్నారు. అర్హులైన వారికి పింఛన్లు, రేషన్‌కార్డులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికి యాభై ఏళ్ల వయసు నిండిన వారికి పింఛను ఇస్తామనే హామీని విస్మరించారన్నారు. నాయకులు నగర కార్యదర్శి రామిరెడ్డి, మసూద్, బాలరంగయ్య, వెంకటనారాయణ, ముర్తుజా, ఇర్ఫాన్, గోపాల్ పాల్గొన్నారు.

లలిత కళాపరిషత్ మాజీ కార్యదర్శికి నివాళి

అనంత సాంస్కృతికం: లలిత కళాపరిషత్ అభివృద్ధికి కృషి చేసి కళల పట్ల నగరం పేరు దశదిశలా వ్యాపింప చేసిన పరిషత్ మాజీ కార్యదర్శి, నటుడు, దర్శకుడు గాజుల నారాయణ స్వామి కళారంగంలో ఆయన పేరు నేటికీ చిరస్థాయిగా ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పరిషత్ ప్రధాన కార్యాలయంలో ప్రస్తుత కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది పద్మజ ఆధ్వర్యంలో ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని జరిపారు. నారాయణస్వామి కృష్ణుడు, దుర్యోధనుడు, బిల్వ మంగళుడు, యముడి పాత్రల్లో రాణించారన్నారు. 2017లో సతీసావిత్రి నాటకంలో యముడి పాత్రకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి మూడు బంగారు నంది అవార్డులు, మరో ముగ్గురికి మూడు అవార్డులు (పరిషత్‌కు మొత్తం 6అవార్డులు) అందుకున్నారన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అశోక్‌నగర్ : 9440247485
తపోవనం: 8008573010
రుద్రంపేట: 8008550310

సమస్య: రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి గ్రామపంచాయతీ ఆడిటర్స్ కాలనీ కాలువల్లో మురుగు నిల్వఉండి దుర్వాసన వస్తూ దోమలకు నిలయంగా ఉంది.
- **శీనా, చిన్మయనగర్**

సమాధానం: కార్మికులను పంపి కాలువల్లో మురుగు నిల్వ లేకుండా చూస్తాం. - **మమత, పంచాయతీ కార్యదర్శి, ప్రసన్నాయపల్లి** – న్యూస్‌టుడే: రాప్తాడు

సమస్య: రాంనగర్ సిద్ధార్థ ఉద్యానవనం పడమర వైపున కల్వర్టు దెబ్బతిని కడ్డీలు కన్పిస్తున్నాయి. వాహనాల్లో వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది. - **ప్రసన్నకుమార్**

సమాధానం: మరమ్మతు పనులు చేపట్టి సమస్య తీర్చుతాం.

(పై ప్రశ్నలకు నగరపాలక ఈఈ షాకీర్ సమాధానాలు ఇచ్చారు.)
– న్యూస్‌టుడే, అశోక్‌నగర్

విద్యాసంస్థలు.. సమస్యలమయం

ఎస్కేయూ వద్ద ఉన్న బస్‌బే ఇది. ధర్మవరం వైపు నుంచి అనంతపురం వెళ్లే బస్సుల కోసం ప్రయాణికులు వేచి ఉండటానికి బస్‌బే నిర్మించారు. ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు కూర్చోడానికి మాత్రమే అవకాశముంది. చాలామంది ఎండలో నిల్చుకోవాల్సిన పరిస్థితి. ఉదయం వేళ ఎక్కువమంది అక్కడ నిలుచునేందుకు ఇబ్బందులు వస్తున్నాయి.

న్యూస్‌టుడే: ఎస్కేయూ, జేఎన్‌టీయూ

విద్యాలయాల్లో మౌలిక సమస్యలు నెలకొన్నాయి. ఎస్కేయూలో గత ఉపకులపతి కమీషన్ల కోసం కక్కుర్తిలో అవసరం లేని చోట నాలుగు వరసల రహదారులు నిర్మించారు. కంకరతేలి, గుంతలు పడిన రోడ్లను బాగు చేయకుండా వదిలేశారు. వర్సిటీ అభివృద్ధి అంటే అన్ని రహదారులు సుందరంగా ఏర్పాటు చేయాలి. గత పాలకులు కొన్ని రోడ్లను గాలికి వదిలేశారు. ట్రాఫిక్ సమస్య లేకపోయినా ఉన్నరోడ్లు బాగు చేయకపోవడం దారుణం. జాతీయ రహదారి పక్కన ఉన్న బస్‌బే చిన్నగా ఉండటంతో ఇతర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు ఎండలో వేచి ఉండాల్సిన పరిస్థితి. వర్సిటీ ముఖద్వారం సమీపంలో రోడ్డు పక్కన ముళ్ల చెట్లు పెరిగాయి. వర్సిటీలో కూడా చాలా చోట్ల గడ్డి పెరిగిపోయింది. విషపురుగులు చేరకుండా వ్యర్థమైన గడ్డి, ముళ్ల చెట్లు శుభ్రం చేయాలి. పాలిటెక్నిక్ కళాశాలలో కూడా ఇదే పరిస్థితి. పిచ్చిమొక్కలు, గడ్డి పేరుకుపోయింది. విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలి.

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లే రోడ్డు ఇలా అధ్వానంగా ఉంది. వర్సిటీలో విద్యార్థులు ఎక్కువ ప్రవేశాలు ఇంజినీరింగ్ కళాశాలలోనే ఉన్నాయి. ద్విచక్రవాహనాలు, కార్లు ఈ మార్గంలోనే కళాశాలకు వెళ్తాయి. గత ప్రభుత్వ హయాంలో వర్సిటీలో అవసరం లేని చోట రోడ్లు నిర్మించారు. గుంతలు పడిన ఈ రోడ్డు బాగు చేయలేదు.

రాప్తాడు: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రమాదకరంగా ఉన్న ట్యాంకు ఇది. ట్యాంకు దిమ్మెలకున్న ఇనుప కడ్డీలు బయటకు కనిపిస్తున్నాయి. ట్యాంకు కూలడానికి సిద్ధంగా ఉంది. ట్యాంకు కూలిదే ప్రమాదాలు తప్పవు

పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరం

చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: ప్రతి పేదవాడికి సకాలంలో వైద్యసేవలు అందించాలన్నదే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో వివిధ రకాల జబ్బులకు శస్త్రచికిత్సలు చేయించుకున్న పేదలను ఆర్థికంగా చేయూత అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరమని ఎమ్మెల్యే పునరుద్ఘాటించారు. ఆదివారం అనంతపురం అర్బన్ తెదేపా కార్యాలయంలో 31 మంది లబ్ధిదారులకు రూ.21 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఏడాదిన్నర కాలంలో మొత్తం 22 విడతలుగా సీఎంఆర్ఎఫ్ కింద చెక్కులు మంజూరు కాగా, ఇప్పటివరకు మొత్తం 402 మందికి రూ.4 కోట్ల వరకు చెక్కులు పంపిణీ చేశామన్నారు. వాటిలో ముస్లిం, మైనారిటీలకే అత్యధిక శాతం సాయం అందజేశామన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారన్నారు. నగరంలో ఇప్పటికే రూ.120 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని తెలియజేశారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యం

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. తేజ జూనియర్ కళాశాలలో ఆదివారం తేజోత్సవ్-2025 ముగింపు వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథులుగా ఏపీఎస్ మల్లికార్జునవర్మ, ఏపీడీఎస్‌పీ ప్రసాద్‌రెడ్డి, సీఐ ప్రతాప్‌రెడ్డి, ఎస్‌బీ రాజాబాబు హాజరయ్యారు. చదువులతో పాటు సాంస్కృతిక, క్రీడా రంగాల్లో ప్రతిభ ప్రదర్శించినప్పుడే సమగ్ర వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, విలువలు విద్యార్థులకు అత్యంత అవసరమన్నారు. చిన్నారి ఆసుపత్రి హరిప్రసాద్, చేనేత, జౌళిశాఖ నరసింహారెడ్డి, బీఎస్ఎన్ఎల్ రాజశేఖర్‌రెడ్డి, సీఆర్ఐటీ చిరంజీవిరెడ్డి, విద్యా సంస్థల అధినేత తేజేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఇంటి గొడవల్లో పోలీసు పంచాయితీలా?

వైకాపా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, మేయర్ వసీం

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసులు తమ బాధ్యతలు విస్మరించి ఇంటి గొడవల్లో తలదూర్చి పంచాయితీలు చేస్తున్నారని వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి విమర్శించారు. ఆదివారం తెదేపా నుంచి వైకాపా తీర్థం పుచ్చుకున్న నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్‌ను వైకాపా కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. అనంతపురంలో అరాచక ప్రజా ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని తెదేపా నేతలే ఆస్తులు కాజేస్తున్నారని ఆ పార్టీ నేతలే బహిరంగంగా దౌర్జన్యాలను ప్రశ్నిస్తున్నారంటే ఇంత కంటే సిగ్గుచేటు మరొకటి ఉండదన్నారు. అధికార పార్టీ నేతల దౌర్జన్యాలు రోజు ఏదో ఒకటి బయటకు వస్తుంటే డైవర్టు చేయడానికి గుల్జార్ పేటలో దిమ్మె తొలగింపు పేరుతో వైకాపా నాయకుడిని అరెస్టు చేశారని విమర్శించారు. పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లిన వైకాపా నాయకులను సీఐ నోటికి వచ్చినట్లు మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమ కేసులు పెడితే భయపడే ప్రసక్తే లేదని హెచ్చరించారు. హిందూపురంలో బాలకృష్ణ ఫొటోకు పొట్టేళ్ల తలలు వేలాడదీస్తే చర్యలు తీసుకోలేదని వైకాపా కార్యకర్తలను మాత్రం అరెస్టు చేస్తున్నారని విమర్శించారు.

బల్లాపల్లవి నియామకం హర్షణీయం

పల్లవిని సత్కరిస్తున్న నాగన్న, సూర్యనారాయణ, తిమ్మప్ప

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్‌గా బల్లాపల్లవిని నియమించడంపై అనంతపురం జిల్లా కమ్మ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం బల్లాపల్లవిని రాంనగర్‌లోని కమ్మ సంఘం భవనంకు ఆహ్వానించారు. ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాంబేడైయింగ్ నాగన్న ఆధ్వర్యంలో ఇతర సంఘం సభ్యులంతా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. అధ్యక్షుడు నాగన్న మాట్లాడుతూ.. కమ్మ కులంలో బల్లాపల్లవి సేవలకు గుర్తింపుగా అనంతపురం ఏఎంసీ ఛైర్‌పర్సన్ పదవిలో నియమించినందుకు గర్వపడుతున్నామని, ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నెల 8న అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగే పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి కమ్మ సంఘం నాయకులంతా రావాలని బల్లాపల్లవి కోరారు. కమ్మ సంఘం సీనియర్ నాయకులు సరిపూటి సూర్యనారాయణ, తిమ్మప్ప, వెంకటసుబ్బయ్య, మందల శంకర్, రామకృష్ణ, జీపీ రామన్న, డాక్టర్ కొండయ్య, కేశన్న, శ్రీరాములు, మాజీ కార్పొరేటర్ సరిపూటి రమణ పాల్గొన్నారు.

అమరనాథ్‌రెడ్డి హాస్యపూరిత ప్రసంగం

నవ్వులు పండించిన హాస్యభారతి

అనంత సాంస్కృతికం: హాస్యం పండించడం పూర్వజన్మ సుకృతమేనని ప్రతిభా రాజీవ్ పురస్కార్ గ్రహీత రచయిత అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని శిర్డీనగర్ వివేకానంద యోగా భవన్‌లో ఉత్సాహ భరితంగా జరిగిన 'హాస్యభారతి' కార్యక్రమంలో పలుప్రాంతాల విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు హాజరై ఆనందాన్ని ఆస్వాదించారు. వివేకానంద యోగా కేంద్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు రాజశేఖర్, దివాకర్, మానవత కో కన్వీనర్ సలీం మాలిక్, తరిమల అమరనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పలు విభాగాల హాస్య కళాకారులు పాల్గొని తమ హాస్య చతురత చూపించారు. రచనలు, కవితా సంపుటిలో దిట్టగా పేరుగాంచిన ఏలూరు ఎంగన్న హాస్యం పండించారు. విశ్రాంత హెచ్ఎం రియాజుద్దీన్ పౌరాణిక పద్యాలను హాస్యభరితంగా పాడి నవ్వులు పండించారు.

రోడ్డు పక్కనే ఇనుపకడ్డీలు

ఆదిమూర్తి నగర్ బీసీ బాలుర వసతి గృహం వద్ద అపరిశుభ్రంగా ఉంది. నిత్యం వందల మంది విద్యార్థులు రాకపోకలు సాగించే ప్రాంతంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. మూడు నెలల ఇనుప కడ్డీ స్తంభాలను వసతి గృహం వద్ద ఉంచటంతో చెత్తాచెదారం గుప్పలుగా ఉంది. రాత్రిళ్లు పాములు సంచరిస్తున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇనుప కడ్డీ స్తంభాలను తరలించి, పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థులు కోరుతున్నారు.
- **న్యూస్‌టుడే, కమలానగర్**

కంప చెట్లు గీసుకుంటే గాయాలే

హంద్రీనీవా నీటి రాకతో అనంతపురం గ్రామీణం కక్కలపల్లిలో చెరువు నిండుకుండలా మారింది. చెరువుల్లో నీరు పుష్కలంగా రావడంతో సెలవు రోజుల్లో చిన్నారులు చెరువు దగ్గరకు వెళ్లి ఈత కొడుతున్నారు. అయితే చుట్టూ కంపచెట్లు ఉండటం, కాస్త ముందుకెళ్తే లోతు ఎక్కువ ఉండడం గమనించకుండానే ఈత కొడుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో పిల్లలను విడిచిపెట్టడం అంత క్షేమదాయకం కాదు. చిన్నారులు అక్కడికి వెళ్లకుండా సమీపాన హెచ్చరిక బోర్డులు, కంచె ఏర్పాటు చేయాల్సి ఉంది. - **న్యూస్‌టుడే:, రుద్రంపేట**

చెత్త కుండీ నిరుపయోగం

కోవూర్ నగర్ సాయిబాబా టెంపుల్ సమీపంలో చెత్త వేసేందుకు ఏర్పాటు చేసిన కుండీ ఖాళీగా దర్శనమిస్తోంది. అందులో వేయాల్సిన చెత్త పక్కనే పడేస్తున్నందున వ్యర్థాలు ఇళ్ల ముందుకు వస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. - **న్యూస్‌టుడే, రుద్రంపేట**

సీఐ శ్రీకాంత్‌కు మంత్రి పరామర్శ

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే : అనంతపురంలో కత్తితో దాడి చేసిన కేసులో గాయపడిన సీఐ శ్రీకాంత్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పరామర్శించారు. ఆదివారం అనంతపురం నగరానికి విచ్చేసిన మంత్రి శ్రీకాంత్‌ను దాడి జరిగిన తీరును, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని శ్రీకాంత్‌కు మంత్రి సూచించారు.

విద్యారంగాన్ని పరిరక్షించడమే లక్ష్యం

అనంతపురం విద్య: విద్యారంగాన్ని పరిరక్షించడమే ఏఐడీఎస్‌ఓ లక్ష్యమని ఆ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హరీష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఏఐడీఎస్‌ఓ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థి సంఘం జెండా ఆవిష్కరించారు. భగత్ సింగ్, నేతాజీ సుభాష్‌చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, ఈశ్వరచంద్రవిద్యాసాగర్ తదితర మహనీయుల ఆశయాలు కొనసాగిస్తూ, విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాలన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనందడోలిక

స్నేహ సంబంధాలు బలహీనపడుతున్న ప్రస్తుత తరుణంలో నాలుగు దశాబ్దాల పూర్వపు విద్యార్థులు ఆత్మీయ కలయిక ఎంతగానో ఆనందంగా నిలిచింది. ఆదివారం ఎన్జీఓ హోమ్‌లో గుంతకల్ ఎస్‌జేపీ హైస్కూల్ లో 1986-87 సం.లో పదోతరగతి ఎ సెక్షన్ విద్యార్థులు ఆత్మీక కలయిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆత్మీయ సమ్మేళనం ద్వారా ఐక్యతోపాటు జ్ఞాపకాలు పంచుకునే సదవకాశం కలుగుతుందన్నారు. రియాజ్ బాషా, దాదా ఖలందర్, మహమ్మద్ యాసిన్, నిర్మల రెడ్డి, లోకేశ్వరి దేవి, సూరయ్య భేగం, జయభారతి, అరుణాదేవి పాల్గొన్నారు. - **న్యూస్‌టుడే, రుద్రంపేట**

ఆస్తి బదలాయింపు రద్దు

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగరపాలకలో స్థిరాస్తి యజమాని పేరు మార్పు చేసి మరొకరి పేరు మీద బదలాయించిన ఆస్తిని రద్దు చేసి అసలైన యజమాని పేరు ఉంచారు. నగరంలోని శారదా నగర్ ఆస్తి బదలాయించి మ్యుటేషన్ చేయడంపై 'కనికట్టు.. చూసీ చూడనట్లు!' శీర్షికన ఈనాడులో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సుసర్ల కనకదుర్గ పేరు మీద ఉన్న స్థిరాస్తిని జీపీఏ ద్వారా ఈ. శేఖర్ పేరు మీద బదలాయించి ఆయన పేరుతో ఆన్‌లైన్‌లో పేరు గతంలో ఉంచారు. ఈనాడులో కథనం ప్రచురించిన అనంతరం ఆ పేరును తొలగించి సుసర్ల కనకదుర్గ పేరు మీద ఆస్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఏవిధమైన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లేకుండానే కేవలం జీపీఏ ద్వారానే మ్యుటేషన్ చేయడాన్ని తీవ్రంగా పరిగణించారు. ఆస్తి పన్ను రికార్డులు మార్పు చేయడంపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నివేదిక సిద్ధం చేశారు.

ఈనాడు కథనానికి స్పందన

'జగన్ ఫ్లెక్సీల వద్ద జంతు బలి ఇస్తే తప్పా?'

అనంత నగరపాలక: జగన్ జన్మదినం సందర్భంగా ఫ్లెక్సీల వద్ద యువకులు, అభిమానులు పొట్టేళ్లు కొడితే పెద్ద నేరమా? అని మాజీ మంత్రి శైలజానాథ్ విమర్శించారు. ఆదివారం అనంతపురంలోని వైకాపా జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ పొట్టేళ్లు కొట్టడం వల్ల సమాజం నాశనం అయిపోతున్నట్లు, రాష్ట్ర బహిష్కరణ చేస్తామంటూ ముఖ్యమంత్రి, హోంమంత్రి అర్థం లేకుండా మాట్లాడుతున్నారన్నారు. జాతరలు, గ్రామోత్సవాల్లో జంతు బలులు ఇస్తున్నారని వాటిని తప్పు పడుతారా అని ప్రశ్నించారు.

పరువు హత్యల నివారణ ముఖ్యం

రుద్రంపేట, న్యూస్‌టుడే: రాబోయే పార్లమెంట్ సమావేశాలలో పరువు హత్యల నివారణకు బిల్లు పెట్టాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్జీఓ హోమ్‌లో ఆయన మాట్లాడారు,

ముక్కోటి ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు

అనంత సాంస్కృతికం: నగరంలోని పలు ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ప్రతి ఆలయం విద్యుద్దీపాలంకరణలో వెలుగొందుతున్నాయి. ఉత్తర ద్వారాలు తెరచి వాటిని ప్రత్యేక అలంకరణ చేసి భక్తులను ఆకట్టుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. పాతూరు చెన్న కేశవస్వామి ఆలయంలో అర్ధరాత్రి 1కు, ఆర్ఎఫ్ రోడ్డు, రాంనగర్, హౌసింగ్ బోర్డు వెంకటేశ్వరాలయాల్లో తెల్లవారుజాము 4 గంటలకు, అశోక్‌నగర్ రమా సత్యదేవాలయంలో 3.30కు వైకుంఠ ద్వార దర్శనం ప్రారంభమవుతుంది. ఆలయాల్లో భక్తులకు ప్రసాదం పంపిణీ చేసేందుకు లడ్లు తయారయ్యాయి.

విద్యుద్దీపాలంకరణలో రాంనగర్ వేంకటేశ్వరాలయం

అయ్యప్ప స్వామికి పుష్ప కైంకర్యం

అనంత సాంస్కృతికం: అలంకార ప్రియుడు అయ్యప్పస్వామిని రంగు రంగుల పుష్పాలతో ముంచెత్తారు. రాంనగర్ 80 ఫీట్ రోడ్డు అయ్యప్పస్వామి దేవాలయంలో వైభవంగా జరిగిన పుష్పాభిషేక మహోత్సవం కనువిందు చేసింది. అనంతరం మూలమూర్తి ముంగిట పుష్పాలు ఉంచి వాటికి ప్రత్యేక పూజ చేశారు.

భక్తిశ్రద్ధలతో సౌమనస్క యాగం

అనంత సాంస్కృతికం: నగరంలోని రెండో రోడ్డు శర్మ ఆవరణలో శ్రీజ్ఞాన పీఠం (గుహానంద మండలి) ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న 'సౌమనస్క యాగం' ఆదివారం భక్తశ్రద్ధలతో ముగిసింది. పీఠం వ్యవస్థాపకుడు హెచ్‌కె మధుసూదన రావు ఆధ్వర్యంలో ఈ ధార్మిక కార్యక్రమాలు హైదరాబాద్ గుహానంద మండలి శ్రీవిద్యా ఉపాసన పూర్ణ దీక్షాపరులు శ్రీనివాసరావు నిర్వహణలో జరిగాయి. ఆదివారం ఉదయం ఆదిత్య అర్చనలు, అరుణ పారాయణం, సూర్య నమస్కారాలు, సుబ్రహ్మణ్య స్తోత్రంతో హోమం, మహామంగళ హారతులు వైభవంగా జరిగాయి.

ఇడుగంజి వినాయకుడు

అనంత సాంస్కృతికం: నగరంలోని శాంతి థియేటర్ రహదారిలో ఓ మిఠాయి దుకాణంలో ఏర్పాటైన ఇడుగంజి వినాయకుడి కేక్ ఖాతాదారులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కర్ణాటక రాష్ట్రంలో ఇడుగంజి వినాయకుడు ప్రసిద్ధి. అక్కడి నుంచి అనంతపురం వచ్చి స్థిరపడిన ఓ కుటుంబం కొత్త సంవత్సరం నేపథ్యంలో ఇలా వినాయకుడిని మిఠాయి రూపంలో ప్రతిష్ఠించి ప్రదర్శనకు ఉంచడంతో విశేషంగా ఆకర్షిస్తోంది

ద్విచక్ర వాహనంపైకి దూసుకెళ్లిన టిప్పర్

రాప్తాడు: అనంతపురం రూరల్ పంగల్ రోడ్డులో ఓ ద్విచక్ర వాహనంపై టిప్పర్ దూసుకెళ్లింది. ద్విచక్ర వాహనం చోదకుడు తప్పించుకోవడంతో ప్రమాదం తప్పింది. ఆకుతోటపల్లి నుంచి కంకర టిప్పర్ రాప్తాడు వైపు వెళ్తుండగా పంగల్ రోడ్డులోని మలుపులో ద్విచక్రవాహనంపై దూసుకెళ్లింది. తృటిలో ప్రణాపాయం నుంచి బయటపడ్డాడు.

- రాప్తాడు మండలం హంపాపురం సమీపంలోని జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. పెనుగొండ వైపు నుంచి అనంతపురానికి జాతీయ రహదారిపై బొలెరో వాహనంలో బీరకాయలు తరలిస్తుండగా హంపాపురం వద్ద వాహనంలో నుంచి మూట కిందపడింది. వెనుకే వస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి ఇద్దరు కిందపడ్డారు. ఒకరికి కాలు విరగగా, మరొకరికి గాయాలయ్యాయి.

ప్రమాదవశాత్తు గాయపడిన ఆర్టీసీ మెకానిక్

అనంతపురం ఆర్టీసీ, న్యూస్‌టుడే: అనంతపురం డిపో గ్యారేజీలో ప్రమాదవశాత్తు అసిస్టెంట్ మెకానిక్ క్రిష్టారెడ్డి గాయపడ్డారు. డిపోలో ఉంచిన బస్సు కింద ఉండి గేర్‌బాక్స్ నట్లు తీసి కనెక్షన్ తప్పిస్తుండగా బస్సు కొద్దిగా కదిలి ట్రాలీకి ఆనుకోవడంతో ఈ కారణంగా నడుముకు తగిలింది. గాయపడిన కృష్టారెడ్డిని అధికారులు, తోటి ఉద్యోగులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స చేయించారు.

తెరపై ఈనాడు

అనంతపురం (కమలానగర్): గౌరి: **అఖండ-2..** గాయత్రి : **ఈషా,** గౌతమి : **పతంగ్,** నీలిమ : **అవతార్ ఫైర్ అండ్ యాష్,** త్రివేణి : **శంబాల,** తరంగిణి : **బ్యాడ్ గర్ల్జ్,** ఎస్వీ సినిమా : **ధురంధర్,** శాంతి : **ఛాంపియన్,** సుధా : **దండోరా.**

సరిహద్దు.. అభివృద్ధికి దూరం

జిల్లా పంచాయతీ కార్యాలయం రోడ్డు పక్కన చెత్త

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే : అనంతపురం గ్రామీణం రుద్రంపేట పంచాయతీ పరిధిలో జిల్లా పంచాయతీ కార్యాలయం భవనం వస్తోంది. కార్యాలయం తూర్పు దిక్కులో అనంతపురం నగరం 37 డివిజన్ రాంనగర్‌లో పరిధిలోకి వస్తోంది. కార్యాలయం భవనం వరకే సీసీ రహదారి వేశారు. ఆ తర్వాత గుంతలు పడిన మట్టి రహదారి ఉంది. ఖాళీ స్థలాలు ఉండడం. సరిహద్దు కావడంతో కొన్నేళ్ల నుంచి నగరపాలక కార్పొరేషన్ అధికారులు సీసీ రహదారి వేయలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి ఇరువైపులా ఖాళీస్థలాలకు సిమెంట్ పలకలతో తాత్కాలికంగా గోడలు నిర్మించుకున్నారు. రహదారి పొడవునా మట్టికుప్పలు, కంపచెట్లు విపరీతంగా పెరిగిపోయాయి. జిల్లా పంచాయతీ కార్యాలయం తూర్పు దిక్కులో రహదారి అవతలవైపు పెద్ద మట్టిదిబ్బలు ఉన్నాయి. పక్కనే చెత్త పడేశారు. ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా ఉంది. కొన్నేళ్ల నుంచి సీసీ రహదారి వేయాలని అడుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. రుద్రంపేట పంచాయతీతోపాటు రాంగనర్ అనంతపురం నియోజకవర్గంలోనే ఉంది. సీసీ రహదారితోపాటు కంపచెట్లు, మట్టి దిబ్బలు, పడేసిన చెత్తలేకుండా ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారి దుస్థితి

మాజీ క్రికెటర్ల మరణం తీరనిలోటు

నివాళులు అర్పిస్తున్న చిన్నారులు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: నెల వ్యవధిలో అకాల మరణం చెందిన మాజీ క్రికెటర్లకు ఘన నివాళి అర్పించారు. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించి వారి సేవలను గుర్తుచేశారు. అనంత క్రికెట్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు శ్రీనాథ్, కార్యదర్శి ఎ.యుగంధర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి సర్దార్, కోశాధికారి మురళీకృష్ణ, క్రికెట్ కౌన్సిలర్ అన్సర్, మాజీ రంజీ క్రికెటర్లు ఎల్ ఎన్ ప్రసాద్‌రెడ్డి, షాబుద్దీన్, సంఘం మాజీ అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, మాజీ కార్యదర్శి భీమలింగారెడ్డి, సీనియర్లు సీతరామరావు, టీవీ చంద్రమోహన్‌రెడ్డి, మచ్చా రామలింగారెడ్డి, ఆర్డీటీ డైరెక్టర్ నాగప్ప, మహిళా క్రికెటర్లు హాజరయ్యారు. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శిగా 10 ఏళ్లపాటు పనిచేసి ఎంతో మందిని తీర్చిదిద్దిన శ్రీనివాసులు, సీనియర్ క్రికెటర్లు కిరణ్‌కుమార్, మధుసూదన్‌లు నెల వ్యవధిలో మరణించారు. వీరి సేవలను గుర్తుచేస్తూ సంతాపసభ నిర్వహించారు. జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి శ్రీనివాసులు పునాది వేశారని ఆయన సేవలు జిల్లా క్రికెటర్లు ఎప్పటికీ మరువలేమని తెలిపారు. అనంతరం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి సంతాపం ప్రకటించారు.

(c) eenadu

గని ఊట.. సాగు బాట

ఓబులవారిపల్లె మండలం మంగంపేట ముగ్గురాయి గని నుంచి నిత్యం ఊట నీటిని అయిదు వేల హెచ్‌పీ సామర్థ్యం గల విద్యుత్తు మోటార్లతో వెలికి తీస్తున్నారు. ఈ నీటిని గోవిందమ్మ చెరువు, సురభికుంటలకు మళ్లిస్తున్నారు. నిత్యం నీటిని తోడి పంపడం ద్వారా ఆయా చెరువులు నీటితో కళకళలాడుతుండగా పంట పొలాలకు సాగు నీటి సమస్య తీరుతోంది. ఆ చిత్రమే ఇది. - న్యూస్‌టుడే, ఓబులవారిపల్లె

అందెల సవ్వడి.. అలరించిన కూచిపూడి

ఒంటిమిట్ట కోదండ రామాలయం సీతారాముల కల్యాణ వేదిక ప్రాంగణంలో ఆదివారం కొత్తమాధవరంలోని వేద నృత్యాలయం నిర్వాహకులు సౌమ్య ఆధ్వర్యంలో కూచిపూడి, భరత నాట్యంతో పిల్లలు భళా అనిపించారు. - న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

మదనపల్లె వద్దు.. రాయచోటే ముద్దు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిని అన్నమయ్య జిల్లా కేంద్రంగా కొనసాగించాలని కోరుతూ ఆదివారం ఆందోళనలు ఉద్ధృతంగా కొనసాగాయి. ఉదయం ఆరు గంటలకే నిరసనకారులు రోడ్లపైకి వచ్చారు. నేతాజీ కూడలిలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై బైఠాయించి మదనపల్లె వద్దు.. రాయచోటే ముద్దు అంటూ నినదించారు. ఎన్నికల ప్రచార సభలో సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. ఆ నమ్మకంతోనే వైకాపా జిల్లా కేంద్రం ఇచ్చినప్పటికీ ఇక్కడి ప్రజలు ఓడించి తెదేపాకు పట్టం కట్టారని వారు గుర్తు చేస్తూ నినాదాలు చేశారు. అనంతరం పుర వీధుల్లో నిరసన ర్యాలీ చేశారు. వ్యాపార సంస్థలు, హోటళ్లు, ఇతర చిల్లర దుకాణాల వారు స్వచ్ఛందంగా దుకాణాలకు తాళాలు వేసి బంద్ పాటించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని పునః పరిశీలించి రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని, అప్పటి వరకు ఆందోళనలు కొనసాగిస్తామని వారు తెలియజేశారు. నిరసన కార్యక్రమాలలో జేఏసీ నాయకులు, వైకాపా మినహా తెదేపా, భాజపా ఇతర పార్టీల నాయకులు, యువజన సంఘాలు, ఎన్జీవో, వ్యాపార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేతాజీ కూడలిలో జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలియజేస్తున్న ఐకాస, వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు

3 జిల్లాల్లో అన్నమయ్య విలీనం!

- మదనపల్లె జిల్లాలోకి చేరనున్న రాయచోటి
- తిరుపతిలోకి రైల్వేకోడూరు నియోజకవర్గం

ఈనాడు, కడప

అన్నమయ్య జిల్లాను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం దాదాపు నిర్ణయించింది. విభజిత జిల్లాలో మిగిలిన రాజంపేట, రాయచోటి, రైల్వే కోడూరు నియోజకవర్గాలను మూడు జిల్లాల్లో కలపాలని సూత్రప్రాయ నిర్ణయానికి వచ్చింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు స్పష్టత ఇచ్చింది. వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు చెరుకూరి శ్రీధర్, నిశాంత్ కుమార్‌లను అమరావతికి ఆదివారం పిలిపించారు. తుది ఉత్తర్వులు ఇవ్వడానికి వీలుగా సోమవారం కూడా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ మేరకు ఇద్దరు కలెక్టర్లు అమరావతిలోనే మకాం వేశారు. ● మదనపల్లె జిల్లా ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ అమలు దిశగా ఒకట్రెండు రోజుల్లో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి.

రాయచోటి బంద్‌తో మూతపడిన దుకాణాలు

● ఈ మేరకు తిరుపతి జిల్లా నుంచి గూడూరును నెల్లూరులో కలుపుతున్న నేపథ్యంలో రైల్వేకోడూరును తిరుపతి జిల్లాకు, ప్రతిపాదిత మదనపల్లె జిల్లాలోకి రాయచోటి, కడపలోకి రాజంపేట నియోజకవర్గాన్ని కలపాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

● రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల విలీనాన్ని ఆయా నియోజకవర్గాల ప్రజల్లో సంతోష వాతావరణం కనిపిస్తోంది. పెనగలూరు, చిట్వేలి మండలాలకు తిరుపతి కాస్త దూరంగా ఉండనుంది. రాయచోటి నియోజకవర్గ ప్రజలు మాత్రం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు కనిపిస్తోంది.

● అన్నమయ్య జిల్లాలో మూడు నియోజకవర్గాలు మాత్రమే మిగిలిపోయాయి. మూడు నియోజకవర్గాలతో జిల్లా నిర్వహణపై ప్రభుత్వం పునరాలోచనలో పడింది. నిర్వహణ భారం, రాజంపేట కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమాలు, మరో వైపు రాయచోటిలోనే కొనసాగించాలనే డిమాండ్ల నేపథ్యంలో మధ్యేమార్గంగా కీలక నిర్ణయం తీసుకుంది.

● రాజంపేట నియోజకవర్గంలోని సుండుపల్లి, వీరబల్లి మండలాలను సైతం కడప జిల్లాలోకి కలపాలనే నిర్ణయించారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చొరవ తీసుకున్నారు. ఈ రెండు మండలాలను మదనపల్లెలో కలిపే పక్షంలో ప్రయాణ దూరం 15 కి.మీ పెరుగుతుందని ప్రభుత్వానికి వివరించారు. హేతబద్ధంగా ఉన్నట్లు తేల్చారు.

● రైల్వేకోడూరుతో పాటు రాజంపేటను కూడా తిరుపతి జిల్లాలో కలపాలని భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, ఖాదీ బోర్డు ఛైర్మన్ కె.కె. చౌదరి ప్రభుత్వానికి విన్నవించారు. వీరితో పాటు పలువురు ఈ ప్రతిపాదన చేశారు.

పేరు అన్నమయ్య జిల్లానే

జిల్లా కేంద్రం మదనపల్లె అయినప్పటికీ అన్నమయ్య పేరుతోనే కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. అన్నమయ్య పేరును రద్దు చేశారనే అపఖ్యాతి లేకుండా ఆ పేరునే కొనసాగించాలని భావిస్తున్నట్లు తెలిసింది. మదనపల్లె జిల్లాకు కలెక్టర్, ఎస్పీలుగా నిశాంత్‌కుమార్, ఎస్పీగా ధీరజ్ కనుబిల్లి వ్యవహరించనున్నారు.

జాంబవంతుడికీ ఓ ఆలయం

శ్రీమద్రామాయణ మహాకావ్యంలో జాంబవంతుడి పాత్ర అద్వితీయమైనది. సీతాన్వేషణ, రామసేతు నిర్మాణంలో ఆయన మేధస్సును రామాయణం ప్రస్తుతింపజేస్తుంది. త్రేతాయుగం నుంచి ద్వాపర యుగం దాకా జీవించి రాముడు, కృష్ణులకు భక్తుడిగా నిలిచారు. అంతటి మహనీయుడికి ప్రత్యేక కోవెల ఉండటం మీరెప్పుడైనా చూశారా.. రైల్వేకోడూరులో ఆయనకు ప్రత్యేకంగా ఓ ఆలయాన్ని నిర్మించారు. పట్టణంలోని అంకమ్మనగర్‌లో జాంబవంతుని శిలా విగ్రహం వేప చెట్టు కింద లభించడంతో సుమారు పదేళ్ల క్రితమే ప్రతిష్ఠ నోచుకుంది. ఈ ఆలయం ఎప్పుడు నిర్మించారన్నది స్పష్టమైన ఆధారాలేవీ లేవు. కాలక్రమంలో ఈ ప్రాంతం మురికి గుంటగా మారడంతో ఆయుదేళ్ల కిందట తలో చెయ్యి వేసి అయిదేళ్ల క్రితం అందమైన ఆలయాన్ని నిర్మించారు. ఆలయ కమిటీ నిత్య పూజలు నిర్వహిస్తుంది. - న్యూస్‌టుడే, రైల్వేకోడూరు

వెలిగల్లు.. కృష్ణా జలాల పరవళ్లు

ఎట్టకేలకు వెలిగల్లు జలాశయానికి కృష్ణా నదీ జలాలు అనుసంధానం చేశారు. ఆదివారం హంద్రీ-నీవా కాలువ ద్వారా నీటిని విడుదల చేయడంతో దీర్ఘకాలంగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించింది. వెలిగల్లు జలాశయాన్ని పాపఘ్ని నదిపై నిర్మించారు. శ్రీసత్యసాయి జిల్లా నంబులపూలికుంట మండలం మీదుగా హంద్రీ-నీవా కాలువను నిర్మించారు. ఈ కాలువ నీటిని సరఫరా చేయడంతో వెలిగల్లు కోసం ప్రత్యేకంగా తీసిన కాలువకు రెగ్యులేటర్‌ను ఎత్తి ప్రయోగాత్మకంగా నీటిని వదిలారు. ఎలాంటి ఆటంకం లేకుండా జలాశయంలోకి ప్రవహిస్తున్నాయి. వెలిగల్లు గరిష్ఠ సామర్థ్యం 4.64 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.23 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. హంద్రీ-నీవా జలాల రాకతో జలాశయంలో పుష్కలంగా నీటి నిల్వలు పెరుగుతాయని ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

కళకు శ్రీకారం.. కల సాకారం!

చిత్రాలు గీయడంలో మెలకువలు నేర్పుతున్న ఆనంద్‌రాజు

రామాపురం మండలంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు చిత్రలేఖనంలో హవా కొనసాగిస్తున్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, ప్రకృతి, పర్యావరణం, పరిసరాలు ఇలా కంటికి కన్పించే అందమైన దృశ్యాలన్నీ వారు కుంచె పట్టుకుంటే చిత్రంగా మారిపోవాల్సిందే. జీవం ఉట్టిపడేలా వీరు చిత్రాలు గీస్తుండడం చూస్తే ఇదెలా సాధ్యం అన్న అనుమానం రాకమానదు. దీనంతటికీ కారణం ఆర్ట్ ఉపాధ్యాయుడు ఆనంద్ రాజు.. ఆయన ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు నిత్యం సాధన చేయిస్తుండడం, ఉపాధ్యాయుల ప్రోత్సాహం కళలో ఆరితేరేలా చేసింది. పెన్సిల్ నుంచి జాలువారిన ఈ చిత్రాలకు బంగారు పతకాలు కూడా సాహో అన్నాయి.

- న్యూస్‌టుడే, రాయచోటి, రామాపురం

బాల్యం నుంచే ఆసక్తి



చిన్ననాటి నుంచే స్వాతంత్ర్య సమర యోధులంటే చాలా ఇష్టం. వారి చిత్రాలు గీయడానికి చేసిన సాధన ఫలించింది. ఆ చిత్రాలే నాకు ప్రశంసలు రావడానికి కారణమయ్యాయి. బంగారు పతకం కూడా అందుకున్నా. దీనంతటికీ మా ఆనంద్ రాజు మాస్టారే కారణం. ఆయన ఇచ్చే శిక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాను. నాలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంతో ఇప్పుడు చక్కగా రాణిస్తున్నా.

- సమర, 7వ తరగతి

ప్రకృతికి ప్రణామం

ప్రకృతి, పర్యావరణంపై ఆసక్తి ఎక్కువ.. మొదటి నుంచీ వాటిపై చిత్రాలు గీయడం అలవాటు చేసుకున్నా.. మొదట కష్టపడితే ఆ తర్వాత కల నెరవేరినట్లే. పలుమార్లు ప్రశంసా పత్రాలు అందుకున్నాను. ప్రకృతిపై గీసిన చిత్రానికి బంగారు పతకం సాధించాను. నా చుట్టూ ఉన్న పరిసరాలే నా చిత్రాలకు స్ఫూర్తి. కళ్లకు కనిపించిన వాటిని చిత్రించి జీవం ఉట్టిపడేలా రూపమివ్వడానికి సాధన చేస్తుంటాను.

- విష్ణువర్ధన్, 7వ తరగతి

చిత్రం.. దైవ స్వరూపం

దేవుళ్ల పేరు చెబితే చాలు. నా చిత్రాల్లో వారిని అందంగా చిత్రీకరించి చూపడంపై నాకు ఆసక్తి. గురుకులంలో చేరిన తరువాత నా మిత్రులు చిత్రలేఖనంపై దృష్టి సారించి అందమైన చిత్తరువులు వేస్తుంటే చూసి ఇష్టం పెంచుకున్నా. సాధనతో దేవుళ్ల చిత్రాలకు జీవం పోశాను. పతకాలు సాధించా.

- నవీన్, 7వ తరగతి

సత్తా చాటాలి

నాకు సంగీతం అంటే మక్కువ.. పాటలు వినడం అలవాటుగా మారింది. గురుకులంలో చేరిన తర్వాత నా దృష్టి చిత్రలేఖనంపై పడింది. బొమ్మలు గీయడం సాధన చేశాను. చేయి తిరగడంతో పాటు మంచి గుర్తింపు తెచ్చింది. జాతీయ స్థాయిలో ప్రదర్శనలకు ఎంపిక కావాలన్నది నా ఆశయం.

- భరత్ సింహారెడ్డి, 7వ తరగతి

నాటి రాచవీడే నేటి రాయచోటి

పరమశివుని జటాజూటం నుంచి ఉద్భవించిన ప్రళయ కాళ రుద్రుడు వీరభద్రుడు. శివుని ఆజ్ఞ మేరకు దక్ష యజ్ఞం ధ్వంసం గావించి దక్ష సంహారమొనర్చాడు. తన కర్తవ్యం ముగియగానే భూ లోకంలో పరమేశ్వరుని పుణ్య క్షేత్రాలను దర్శిస్తూ చిట్ట చివరన మహా మహిమాన్వితమైన మాండవ్య మహా ముని తపోబలంతో పునీతమైన మాండవ్య నదీ తీరాన భద్రకాళీ సమేతుడై అర్చా మూర్తిగా అవతార సమాప్తి పొందారు. పురాణ పురుషుడైన వీరభద్ర స్వామి ఆలయాన్నింటికీ రాయచోటిలో వెలసిన ఈ ఆలయం మూలస్థానంగా ప్రసిద్ధిగాంచింది. రాజాధిరాజులెందరో విడిది చేసి వీరఖడ్గములర్పించి నిత్య రాజోపచారాలతో సేవింపబడిన వీరభద్ర స్వామి 'రాచ రాయుడి'గా చరిత్ర పుటలకెక్కాడు. రాచరాయుడి నివాసమైన ఈ ప్రాంతం తొలుత రాచవీడుగా, కాలాంతమున 'రాచీడు' 'రాచోటి' రాయచోటిగా నామాంతరం చెందింది. నేటికీ కన్నడ భక్తులు ఇక్కడి వీరభద్రుడిని రాచోటి వీరభద్రుడని పిలుస్తుండడం నాటి చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. - న్యూస్‌టుడే, రాయచోటి

పీజీ... యువతులకు వసతి ఈజీ

కడప నగరపాలక, న్యూస్‌టుడే: అయితే పది .. . కాదంటే ఇంటర్ అనే కాలం పోయింది! మగవారికి ఏ మాత్రం తగ్గకుండా ఉన్నత చదువులు చదివించడానికి అమ్మాయిల తల్లిదండ్రులు వారిని మహానగరాల నుంచి పట్టణాల వరకు ఎక్కడికైనా పంపడానికి సిద్ధపడిపోతున్నారు. కోరిన కోర్సులు పూర్తి చేసిన వెంటనే కూతురి పెళ్లి చేసి అత్తారింటికి పంపే సంప్రదాయానికి భిన్నంగా పెద్దలు ఆలోచిస్తున్నారు. అమ్మాయికీ ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని కోరుకుంటూ ఉద్యోగాలకు పంపిస్తున్నారు. పల్లె గడప నుంచి చదువులు ఉద్యోగాల కోసం నగరాలక బాట పట్టే యువతులకు మహిళలకు వసతి కల్పించడానికి 'పీజీ' హాస్టళ్లు వెలుస్తున్నాయి.

నాగరాజుపేటలోని మహిళల వసతి గృహం

నగరంలో ఇలా...

● కడప నగరంలో అమ్మాయిలకు 40 పేయింగ్ గెస్ట్ హాస్టళ్లు ఉన్నాయి. ఒక్కో వసతి గృహంలో 10 నుంచి 60 మంది వరకు ఉంటున్నారు. అక్కడ ఇంటికి ఏ మాత్రం తీసిపోని రీతిలో వసతులు కల్పిస్తున్నారు. 24 గంటలూ వైఫై, మూడు పూటలా ఆహారం, సీసీ కెమెరాల పర్యవేక్షణ, మహిళా వార్డన్ల ఆలనా పాలనా ఉండడం వల్ల అమ్మాయిలను పీజీల్లో చేర్చడానికి తల్లిదండ్రులు ఏ మాత్రం సందేహించడం లేదు.

● నగరంలోని నాగరాజుపేట, పాతబస్టాండు రోడ్డు, ఎన్జీవో కాలనీ, కో ఆపరేటివ్ కాలనీ తదితర ప్రాంతాల్లో పీజీలున్నాయి. నర్సింగ్ కోర్సులు అభ్యసించేవారు, వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవడానికి వచ్చిన వారు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న ఆడవారికి పీజీలు చక్కటి వసతి కల్పిస్తున్నాయి.

● ప్రతి పీజీలో ఇద్దరు, ముగ్గురు, నలుగురు, ఐదు మంది ఒక గదిలో ఉండడానికి వేర్వేరు ఛార్జీలను వసూలు చేస్తున్నారు. కడపలో రూ.4 వేల నుంచి రూ.7. వేల వరకు ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

● అమ్మాయిల పట్ల తల్లిదండ్రుల దృక్పథం మారడంతో వందల మంది నచ్చిన కోర్సుల్లో చేరుతూ మెచ్చిన ఉద్యోగాలు చేసుకుంటున్నారు. మహిళల వసతి కేంద్రాలు పెరగడంతో వాటిలో పనిచేయడానికి మహిళా వార్డన్లు, వంట మాస్టర్లు, సెక్యూరిటీ సిబ్బంది, పారిశుద్ధ్య నిర్వహణ రంగాల్లో వందల మందికి ఉపాధి లభిస్తోంది. కడప నగరానికి కొత్త కళ వస్తోంది.

అక్రమాల కోట.. జోగికీ వాటా

ఎక్సైజ్ కస్టడీలో ఒప్పుకొన్న నిందితులు

ఈనాడు, కడప, న్యూస్‌టుడే- ములకలచెరువు: ములకలచెరువు నకిలీ మద్యం తయారీకి కింగ్‌పిన్‌గా వ్యవహరించిన అద్దేపల్లి జనార్దన్‌రావుతో పాటు ఐదుగురు నిందితుల కస్టడీ ఆదివారం ముగిసింది. కేసులో ఏ-1గా ఉన్న జనార్దన్‌రావుతో పాటు జగన్మోహన్‌రావు, తిరుమలశెట్టి శ్రీనివాస్‌రావు, రమేష్, అల్లాబక్షులను ఎక్సైజ్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. 3వ రోజూ జనార్దన్‌రావు సోదరులను ఎక్సైజ్ అధికారులు విచారించారు. ములకలచెరువు నకిలీ మద్యం తయారీకి నకిలీ మద్యం సీసాలకు అంటించిన లేబుళ్లను హైదరాబాద్‌లో పలువురు సాయంతో ముద్రించి శ్రీనివాసరావు తీసుకొచ్చారని విచారణలో నిందితులు ఒప్పుకున్నారు.

● **వాటాలు పంచుకున్నారిలా.. :** 'జనార్దన్‌రావుకు నకిరేకంటి రవితో ఎప్పటి నుంచో పరిచయం ఉందని, 2023లో జనార్దన్‌రావును గోవాకు తీసుకెళ్లి బాలాజీతో పరిచయం చేయించాడు. బాలాజీ సరఫరా చేసిన ముడి పదార్థాలతో ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ ప్రారంభించాడు. శ్రీనివాస్‌రావు సాయంతో నకిలీ మద్యం లేబుళ్లను హైదరాబాద్‌లో ముద్రించి వీటిని రవి ములకలచెరువుకు పంపేవాడు. సీసాలకు మూతలు, అవసరమైన ఇతర సామగ్రిని సమకూర్చుకునేందుకు పలువురిని ఏ-1కు రవి పరిచయం చేయించాడు. వీరిద్దరి పరిచయంతో నకిలీ మద్యం తయారీ ఊపందుకుంది. ఎక్కువ లాభాల కోసం బాలాజీ ఇబ్రహీంపట్నం, ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేంద్రాలకు వారానికి ఒక్క రోజు స్పిరిట్‌ను తెచ్చారు. వచ్చిన ఆదాయాన్ని మాజీ వైకాపా మంత్రి జోగి రమేష్‌తో పాటు మిగిలిన వారు పంచుకున్నట్లు' నిందితులు వాంగ్మూలం ఇచ్చారు.

త్వరలో జోగి సోదరుల వంతు

వైకాపాకు చెందిన మాజీ మంత్రి జోగి రమేష్ ఆయన సోదరుడు జోగి రాములను కస్టడీకి ఇవ్వాలని తంబళ్లపల్లె కోర్టులో కస్టడీ పిటిషన్ ఎక్సైజ్ అధికారులు దాఖలు చేశారు. అయితే వారు నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి విజయవాడ జైలుకు వెళ్లడంతో మళ్లీ పిటిషన్ దాఖలు చేయనున్నారు.

మిగిలింది ఇక ఇద్దరే

ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఇప్పటి వరకు 33 మందిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు 31 మందిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. అయితే తెదేపా నుంచి సస్పెండ్ అయిన ఆ పార్టీ మాజీ ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి, ఆయన బామర్ది గిరిధర్‌రెడ్డిలు పరారీలో ఉన్నారు. వారి కోసం ఎక్సైజ్ పోలీసులు గాలిస్తూనే ఉన్నారు. రెడ్ కార్నర్ నోటీసు జారీకి ఎక్సైజ్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

మరాఠాల కోట.. యువ సేవకుల వేట

వీరంతా యువ ఇంజినీర్లు.. ఎన్‌సీసీ క్యాడెట్లు కూడా.. ఇటీవల మహారాష్ట్రలోని కోల్హాపూర్‌లో జరిగిన ఆల్ ఇండియా ట్రెక్కింగ్ ఎక్స్‌పెడిషన్- శివాజీ ట్రైల్ ట్రెక్-2025లో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 1000 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ ఇందులో పాల్గొనగా మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయం నుంచి 16 మంది హాజరయ్యారు. వీరు 63 కిలోమీటర్లు విజయవంతంగా ట్రెక్కింగ్ పూర్తి చేశారు. పన్హాలా కోట వద్ద తీసుకున్న చిత్రమిది. - న్యూస్‌టుడే, మదనపల్లె విద్య

నేడు డయల్ యువర్ ఎస్ఈ

రాయచోటి, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29వ తేదీ సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ సోమశేఖర్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. 9440817449 ఫోన్ నంబరుకు కాల్ చేసి సమస్య తెలియచేయవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కొండలు ఎక్కేస్తాం.. ఆరోగ్యం పట్టేస్తాం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : ఆదివారం వస్తే చాలా మంది సమయాన్ని వృథా చేస్తూ గడిపేస్తారు. అయితే మదనపల్లెకు చెందిన కొందరు యువత దానిని ఆహ్లాదం, ఆనందం, ఆరోగ్యం, ఉల్లాసం, ఉత్సాహాన్ని కలిగించేలా మలుచుకుంటున్నారు. వారం మొత్తం పని ఒత్తిడితో విసిగి వేసారిపోయే యువత వారాంతంలో తమ స్నేహితులతో కలిసి సరదాగా గడిపేందుకు కొండలను ఎక్కుతూ ఆరోగ్యాన్ని పట్టేస్తున్నారు. తాము కొండల్లో చూసిన అద్భుతాలను కెమెరాల్లో బంధించి స్నేహితులతో పాటు ప్రపంచానికి పరిచయం చేస్తూ కొత్త ధోరణికి శ్రీకారం చుడుతున్నారు. ఉదయాన్నే ఓ జట్టుగా బయలుదేరి తాము ముందుగా ఎంచుకున్న కొండకు వెళ్లి అక్కడ ట్రెక్కింగ్ చేసి మధ్యాహ్నం వరకు ఆహ్లాదంగా గడుపుతున్నారు. ఈ ట్రెక్కింగ్ గ్రూపుల్లో ఎంతోమంది ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

మదనపల్లె సమీప కొండపై ట్రెక్ విషర్స్ బృందం

ట్రెక్కింగ్‌కు ఆసక్తి పెరిగిందిలా..

● వెల్‌విషర్స్ రక్త దాతల సంఘం నిర్వాహకుడు గిరీష్ 2019లో కొవిడ్ సమయంలో ట్రెక్ విషర్స్ గ్రూపును ఏర్పాటు చేశారు. మొదట గిరీష్, అరుణ్, జ్ఞానేంద్ర, వెంకట కిషోర్, నరేష్, హరిబాబు, మంజునాథ్‌లుతో ఏర్పాటు అయిన ఈ బృందం ఇప్పుడు వంద మంది వరకు సభ్యులయ్యారు. ● మదనపల్లెకు చెందిన నాగరాజు, బాలు, అనంత్, చంద్రశేఖర్, సురేష్, శివరాం ఈ ఏడాది ఫిబ్రవరిలో మదనపల్లె ట్రెక్కింగ్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. మొదట ఆరుగురితో ప్రారంభమైన ఈ జట్టు ప్రస్తుతం 60 మంది సభ్యులయ్యారు. వీరంతా ఇప్పటి వరకు 55 కొండలను ఎక్కి అక్కడి అద్భుతాలను తిలకించడంతో పాటు మదనపల్లె ట్రెక్ క్లబ్ పేరుతో వాట్సప్ గ్రూపు, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేస్తున్నారు.

మూగవని.. అడగలేవని

● సకాలంలో సరఫరా కాని ఔషధాలు



ఇది ఒంటిమిట్ట ప్రాంతీయ పశువైద్యశాల.. ప్రతి మూడు నెలలకు ఒకసారి మందులు రావాల్సి ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ 17న వచ్చాయి. అది కూడా గతేడాది కోటాలోనివి. ఆ తర్వాత సరఫరా చేయలేదు. ఇప్పటికీ ఎనిమిది నెలలైంది. అందుబాటులో ఉన్న ఔషధాలను పశు పోషకులకు సర్దుబాటు చేస్తున్నారు. నాలుగు రకాలు అడిగితే రెండు చేతులు పెట్టి పంపిస్తున్నారు. మిగతావి ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేసుకోవాలని పశువైద్యాధికారులు చిటీలు రాయిస్తున్నారు.

రాయచోటి, ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: పాడి-పంట రైతుకు రెండు కళ్లలాంటివి. వాతావరణంలో అనూహ్య మార్పులు రావడంతో వ్యాధులు పంజా విసురుతున్నాయి. జబ్బుల నివారణకు కీలకమైన మందులు సరిపడా నిల్వల్లేవు. ప్రాణప్రాయ స్థితిలో అత్యవసర ఔషధాలు అరకొరగా అందుబాటులో ఉన్నాయి. సకాలంలో వైద్యం అందక ఖరీదైన పశువుల ప్రాణాలు కడతేరిపోతున్నాయి. మూగ జీవాలు నోరు తెరిచి బాధను చెప్పలేవు. మౌన వేదన విని పాడి రైతులు గుర్తించి పశువైద్యశాలలకు వెళ్తున్నారు. రోగాల నివారణకు అవసరమైన అన్నీ రకాలు అందుబాటులో లేవని పశువైద్యులు, సిబ్బంది చెబుతున్నారు. బయట కొనుగోలు చేసుకోవాలని చీటీలు రాయిస్తున్నారు.

గుర్రాలు	09
గాడిదలు	14
కుందేళ్లు	83
కుక్కలు	7071
పందులు	1415
ఆవులు	2,53,900
గేదెలు	67,943
మేకలు	3,25,377
గొర్రెలు	15,89,233
కోళ్లు	60,15,201

● **త్వరలో సరఫరా చేస్తాం:** పశువైద్యశాలల్లో మందుల కొరత ఉన్నట్లు మా దృష్టికి కూడా వచ్చింది. ఇప్పటికే క్షేత్రస్థాయి నుంచి సమాచారాన్ని సేకరించాం. ఔషధాలు సరఫరా చేయడానికి అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నాం. త్వరలో అనుమతి రానుంది. ఉన్నత స్థాయి నుంచి ఆమోదం లభించగానే మందులను తెప్పించి అందజేస్తాం. జబ్బులు సోకిన పశువులు, జీవాలు, కోళ్లకు మెరుగైన వైద్యం అందించడానికి చర్యలు తీసుకుంటాం.

- గుణశేఖర్ పిళ్లై, జిల్లా అధికారి పశుసంవర్ధకశాఖ, కడప

ఆసుపత్రుల వివరాలు							
ప్రాంతీయ పశువైద్యశాలలు	15	పశువైద్య చికిత్సాలయాలు	70	గ్రామీణ పశువైద్యశాలలు	63	గోశాల మిత్ర కేంద్రాలు	96



(c) eenadu

ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఫైనల్స్‌కు చేరిన శ్రీవిద్య కళాశాల జట్టు

జూనియర్స్ విభాగంలో జరిగిన సెమీ ఫైనల్-1లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేపట్టిన కేవోఆర్ఎం డిప్లొమా కళాశాల జట్టు పది ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 95 పరుగులు చేసింది. జట్టులో దినేష్ 30 (6-ఫోర్లు), చరణ్, వినయ్ చెరో 15 పరుగులు చేశారు. శ్రీవిద్య జూనియర్ కళాశాల (ప్రొద్దుటూరు) బౌలర్లు సాయిసాకేత్, గైబు చెరో రెండు వికెట్లు తీసుకోగా.. కృష్ణకు ఒక వికెట్ దక్కింది. అనంతరం శ్రీవిద్య జట్టు బ్యాటింగ్ చేపట్టి 7 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 97 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. జట్టులో సాయి సాకేత్ అజేయంగా 29 పరుగులు (4-ఫోర్లు), కృష్ణ 27 పరుగులు (3-ఫోర్లు, 1-సిక్స్) గైబ్ అజేయంగా 20 పరుగులు (3-ఫోర్లు, 1-సిక్స్) చేశారు. ఈ మ్యాచ్‌లో సాయిసాకేత్, గైబు, కృష్ణ ఆల్‌రౌండ్ ప్రదర్శన చేశారు.

చెలరేగిన నవీన్.. గెలిచిన అన్నమాచార్య

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేపట్టిన అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల (కడప) జట్టు పది ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. జట్టులో నవీన్ అజేయంగా 62 పరుగులు (11-ఫోర్లు), మహేష్ 36 పరుగులు (7-ఫోర్లు) చేశారు. అనంతరం మేధా కళాశాల (మైదుకూరు) జట్టు పది ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 86 పరుగులు మాత్రమే చేయగలిగింది. జట్టులో ధర్మ తేజ, షాహిద్ చెరో 12 పరుగులు చేశారు. అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల బౌలర్లలో రవి, సూర్య చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. ఈ మ్యాచ్‌లో అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల జట్టు 67 పరుగుల తేడాతో గెలుపొందింది.

క్రికెటర్ల జోరు.. పరుగుల హోరు

ఉత్కంఠగా కొనసాగుతున్న ఈనాడు క్రికెట్ పోటీలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: అత్యంత ఆసక్తికరంగా జరుగుతున్న ఈనాడు క్రికెట్ పోటీల్లో యువ క్రికెటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడుతున్నారు. బ్యాట్, బంతితో చక్కటి ప్రతిభ కనబరుస్తున్నారు. బ్యాటర్లు బంతులను బౌండరీ లైన్‌ను దాటిస్తుండగా.. బౌలర్లు తామేమీ తగ్గేదే లేదంటూ వికెట్లు పడగొడుతున్నారు. ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రెజెంట్స్ ఈనాడు స్పోర్ట్స్ లీగ్-2025 క్రికెట్ పోటీలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. జూనియర్స్ విభాగంలో ఆదివారం జరిగిన సెమీ ఫైనల్స్‌లో ఆర్‌జీయూకేటీ, శ్రీవిద్య కళాశాల జట్లు గెలుపొంది ఫైనల్స్‌కు చేరాయి. కడప నగర శివారులోని కేఎస్ఆర్ఎం, కేవోఆర్ఎం క్రికెట్ మైదానాల్లో జరుగుతున్న ఈ పోటీల్లో ఆదివారం స్టార్ ఆఫ్ ది క్రికెటర్లగా నవీన్, అజయ్‌సింహారెడ్డి, ఇమ్రాన్‌ఖాన్ నిలిచారు.

శ్రీసాయి కళాశాలదే విజయం

శ్రీసాయి కళాశాల (రాయచోటి) జట్టు పది ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 116 పరుగులు చేసింది. జట్టులో మన్సూర్ అలీ 42 పరుగులు (2-ఫోర్లు, 5-సిక్సులు), పుష్పరాజ్ అజేయంగా 32 పరుగులు (6-ఫోర్లు) చేశారు. ఎంఐటీఎస్ (మదనపల్లె) జట్టు బౌలర్లు జ్ఞానేశ్వర్ 3 తీసుకోగా. . శ్రీనివాసులు, సిద్ధార్థ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. ఎంఐటీఎస్ జట్టు 9.4 ఓవర్లలో 81 పరుగులకు ఆలౌట్ అయ్యింది. పిలిప్స్ కుమార్ 19 (2-ఫోర్లు, 1-సిక్స్), బన్నీ 13 పరుగులు చేశారు. శ్రీసాయి కళాశాల బౌలర్లలో ఫవాస్, ఫుమైద్‌ఖాన్, ముదస్సార్, ఇబ్రహీం తలా రెండు వికెట్లు తీశారు. శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాల జట్టు 35 పరుగుల తేడాతో గెలుపొందింది.

'ధనిక్ భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

నవీన్ (62 పరుగులు నాటౌట్)

'ధనిక్ భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

అజయ్‌సింహారెడ్డి (57 పరుగులు నాటౌట్, 3 వికెట్లు)

'ధనిక్ భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

ఇమ్రాన్‌ఖాన్ (49 పరుగులు నాటౌట్, మూడు వికెట్లు)

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Regional Sponsor: MITS DEEMED TO BE UNIVERSITY MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner: ఈనాడు.నెట్ ETV BHARAT
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు ఈతరం క్లబ్

★ నేటి మ్యాచ్‌లు (29-12-2025): కేఎస్ఆర్ఎం గ్రౌండ్ (సీనియర్ మెన్స్): ◆ ఉదయం 8.00 గంటలకు: కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజ్ (కడప) - ఎస్ఎస్ఎన్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల (ప్రొద్దుటూరు) ◆ ఉదయం 10.00 గంటలకు: లయోలా డిగ్రీ కళాశాల (పులివెందుల) - గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ (రిమ్స్) (కడప) ◆ మధ్యాహ్నం 1 గంటకు: ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజ్(మదనపల్లె) - శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్(ప్రొద్దుటూరు) కేఓఆర్ఎం గ్రౌండ్ (సీనియర్ మెన్స్): ◆ ఉదయం 8.00 గంటలకు: శ్రీ వేద వ్యాస డిగ్రీ కాలేజ్ (ప్రొద్దుటూరు) - శ్రీవైష్ణవి డిగ్రీ కాలేజ్ (రాజంపేట) ◆ ఉదయం 10.00 గంటలకు: సీబీఐటీ ఇంజినీరింగ్ కాలేజ్ (ప్రొద్దుటూరు) - సీవీఎస్ఆర్ అండ్ ఎస్ఆర్‌కేపీఎం డిగ్రీ కాలేజ్ (కమలాపురం) ◆ మధ్యాహ్నం 1 గంటకు: ఎస్ఆర్ఎస్‌వీ డిగ్రీ కళాశాల (బద్వేలు) - గవర్నమెంట్ డిగ్రీ (ఆర్ట్స్) కాలేజ్ (కడప)

ఇమ్రాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శన.. గెలుపొందిన శ్రీనివాస కళాశాల

శ్రీనివాసా డిగ్రీ కళాశాల (మదనపల్లె) జట్టు పది ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసింది. జట్టులో ఇమ్రాన్‌ఖాన్ అజేయంగా 49 పరుగులు (7-ఫోర్లు), పురుషోత్తం 20 (3-ఫోర్లు, 1-సిక్స్) చేశారు. అనంతరం వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల (ప్రొద్దుటూరు) జట్టు బ్యాటింగ్ చేసి పది ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసింది. జట్టులో ఉదయ్ అజేయంగా 27 పరుగులు (4-ఫోర్లు) చేశాడు. శ్రీనివాస డిగ్రీ కళాశాల బౌలర్లు విష్ణు, ఇమ్రాన్‌ఖాన్ చెరో మూడు వికెట్లు తీసుకున్నారు. శ్రీనివాస డిగ్రీ కళాశాల జట్టు 37 పరుగుల తేడాతో గెలుపొందింది.

అజయ్ జోరు.. శ్రీహరి గెలుపు

మొదట బ్యాటింగ్ చేసిన ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల (ప్రొద్దుటూరు) జట్టు పది ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 85 పరుగులు చేసింది. జట్టులో మంజునాథ 28 పరుగులు (3-ఫోర్లు, 2-సిక్సులు), శామ్యూల్ అజేయంగా 20 పరుగులు చేశారు. శ్రీహరి డిగ్రీ కళాశాల బౌలర్ అజయ్ సింహారెడ్డి మూడు పరుగులు మాత్రమే ఇచ్చి 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రీహరి డిగ్రీ కళాశాల జట్టు 6.3 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో అజయ్‌సింహారెడ్డి అజేయంగా 57 పరుగులు (6-ఫోర్లు, 3-సిక్సులు) చేశాడు. శ్రీహరి డిగ్రీ కళాశాల జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

ఆర్‌జీయూకేటీ విజయపరంపరతో ఫైనల్స్‌కు..

జూనియర్స్ విభాగంలో జరిగిన రెండో సెమీ ఫైనల్‌లో 44 పరుగుల తేడాతో ఆర్‌జీయూకేటీ, ఆర్‌కే వ్యాలీ జట్టు ఘన విజయం సాధించి ఫైనల్స్‌కు చేరింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్‌జీయూకేటీ, ఆర్‌కే వ్యాలీ జట్టు పది ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేసింది. జట్టులో హుస్సేన్ పీరా 41 (4-ఫోర్లు, 3-సిక్సులు), శివప్రసాద్ 37 పరుగులు (3-ఫోర్లు, 2-సిక్సులు) చేశారు. అనంతరం ఎస్ఆర్ఐటీ డిప్లొమా (ప్రొద్దుటూరు) జట్టు పది ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 60 పరుగులు మాత్రమే చేసింది. ఆర్‌జీయూకేటీ, ఆర్‌కే వ్యాలీ బౌలర్ ధనుష్ 3 వికెట్లు తీసుకున్నాడు.

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

సుండుపల్లి, న్యూస్‌టుడే : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ఆకాంక్షలను నెరవేరుస్తుందని ఉద్యోగులు వారి కుటుంబాలు ఎదురు చూస్తున్నాయని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎన్. రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం 30 శాతానికి తక్కువ లేకుండా మధ్యంతర భృతి ప్రకటించి ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాల ఆకాంక్షలు నెరవేర్చాలని కోరారు. ఆదివారం సుండుపల్లిలో నిర్వహించిన ఎస్టీయూ ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. పండితులకు పదోన్నతుల ఇవ్వాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివారెడ్డి, ఎస్. ఆరీఫుల్లా, జిల్లా సంఘ మైనారిటీ కన్వీనర్ మున్వర్‌బాషా, మండల అధ్యక్ష, కార్యదర్శులు భీమ్లానాయక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న స్టేట్ కౌన్సిలర్ రవీంద్రనాథరెడ్డి

హార్సిలీహిల్స్‌కు ప్రత్యేక బస్సులు

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: నూతన ఏడాదిన ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌కు 24 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామని 1వ డిపో మేనేజరు ఎం. వెంకటరమణారెడ్డి ఆదివారం తెలిపారు. ఈ బస్సులు జనవరి 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచి రాత్రి వరకు రద్దీని బట్టి బస్సులు నడుస్తాయన్నారు. బస్సులు మదనపల్లె ఆర్టీసీ బస్టాండు నుంచి 10, కాండ్లమడుగు దేవళం క్రాస్ వద్ద 9, అంగళ్లులో 2, బి.కొత్తకోట నుంచి 3 బస్సులు చొప్పున నడుపుతామని తెలిపారు. మరో 2 బస్సులు సైతం ఈ నెల 31 మధ్యాహ్నం 3గంటల నుంచి రాత్రి వరకు కూడా హార్సిలీహిల్స్‌కు బస్సులు నడుపుతామని డీఎం తెలిపారు. కాగా అనంతపురం, కదిరి పరిసర ప్రాంతాల వారి కోసం కాండ్లమడుగు దేవళం క్రాస్ వద్ద, కడప, రాయచోటి వాసులకు అంగళ్లులో, పీటీఎం, బి.కొత్తకోట వారి కోసం బి.కొత్తకోట నుంచి బస్సు సౌకర్యం కల్పించామన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండను నూతన ఏడాదిన దర్శించే వారి కోసం, మదనపల్లె నుంచే కాక తంబళ్లపల్లెలోని రాగిమాను కూడలి నుంచి రెగ్యులర్ బస్సులతో పాటు అదనంగా మరో ఆరు బస్సులను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఆయా ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు పర్యాటకులు ఆర్టీసీ బస్సులను ఉపయోగించుకోవాలని డీఎం విజ్ఞప్తి చేశారు.

ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి

ఆలయ అభివృద్ధికి కృషి

సంబేపల్లె, న్యూస్‌టుడే : ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని రాయచోటి తెదేపా నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం సంబేపల్లె గ్రామంలోని సుప్రసిద్ధ ఆలయమైన శ్రీదేవర రాయి నల్లగంగమ్మ ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్ల గంగమ్మ ఆలయానికి రూ. కోటికి పైన నిధులతో సిమెంటు రోడ్లు నిర్మించామన్నారు. రానున్న రోజుల్లో ఆలయం వద్ద భక్తుల సౌకర్యం కోసం వసతిగృహాలు, ఆలయానికి ప్రహరీ నిర్మిస్తామన్నారు. రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ నాగేశ్వర నాయుడు మాట్లాడారు. ఆలయ నూతన కమిటీ ఛైర్మన్‌గా కూనాసి సుబ్బరాజు యాదవ్, కమిటీ సభ్యులుగా రెడ్డెమ్మ, రఘునాథ, బుజ్జమ్మ, వెంకటరమణ, ఆంజనేయులు, అంజనమ్మ, నాగరాజ శర్మ ప్రమాణ స్వీకారం చేశారు. ఛైర్మన్ సుబ్బరాజు మాట్లాడారు. నూతన కమిటీ సభ్యులను శాలువాతో సన్మానించారు.

చిరు ధాన్యం.. ఆరోగ్యం.. ఆదాయం

● ఉప ఉత్పత్తులపై మహిళలకు శిక్షణ

రాయచోటి, వీరబల్లి, న్యూస్‌టుడే: బెల్లం, చిరుధాన్యాలతో ఆహార ఉత్పత్తుల తయారీపై మహిళా రైతులకు శిక్షణ ఇవ్వాలని వ్యవసాయ పరిశోధన సంస్థలు సిఫార్సు చేస్తున్నాయి. వీటితో తయారైన పలు ఉత్పత్తులను ఇప్పటికే స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఐసీడీఎస్, మహిళ రైతులు ఇటీవల నిర్వహించిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో ప్రదర్శించారు. వీటి వివరాలు తెలుసుకున్న ఉన్నతాధికారులు బెల్లం, జొన్నలతో తయారు చేసిన బిస్కెట్లు రుచి చూశారు. వీటి తయారీలో మహిళా రైతులకు శిక్షణ ఇస్తే మరింత ప్రోత్సాహంగా ఉండడమే కాకుండా వారికి ఆదాయ వనరులుగా మారే అవకాశం ఉంది. వినియోగదారులకు ఆరోగ్యకరమైన ఆహారం లభించడంతో పాటు రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని ఇటీవల సీఎం చెప్పడం మరింత బలాన్ని చేకూరుస్తోంది. జిల్లాలోని మహిళా రైతులకు పిండి పదార్థాల తయారీపై శిక్షణ ఇవ్వాలని శాస్త్రవేత్తలు నిర్ణయించారు. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తులపై తర్ఫీదు ఇచ్చి, వారు సొంతంగా తయారు చేసి అమ్మకాలు చేసుకునే విధంగా నేర్పుతామని జిల్లా వ్యవసాయ అధికారి శివన్నారాయణ తెలిపారు.

రాయితీతో రుణాలు

మహిళలు సొంతంగా లేదా బృందంగా ఏర్పడి ఉప ఉత్పత్తులు తయారీ చేసుకుంటే బ్యాంకులు రాయితీతో కూడిన రుణాలు అందిస్తాయి. ఇప్పటికే పాడి, ఇతర వ్యాపారాలు చేసుకొనేందుకు స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులు మహిళలు విరివిగా రుణాలు ఇస్తున్నారు. వ్యాపార సామర్థ్యాన్ని బట్టి వ్యక్తిగతంగా రూ. 10 లక్షలు, బృందానికి రూ. 50 లక్షల వరకు రుణాలు ఇస్తారు. మూడేళ్ల పాటు యూనిట్ విజయవంతంగా నిర్వహిస్తే 35 శాతం రాయితీగా లభిస్తుందని డీఆర్‌డీఏ అధికారులు తెలియజేస్తున్నారు.

ఉప ఉత్పత్తులపై దృష్టి

జిల్లాలోని అధిక శాతం మంది రైతులు వ్యవసాయ ఉత్పత్తులను నేరుగానే అమ్మకాలు చేస్తున్నారు. దీని వల్ల ఆశించిన ఆదాయం రావడం లేదు. వ్యాపారులు వీటిని కొనుగోలు చేసి ఉప ఉత్పత్తులుగా మార్చి అధిక లాభాలు పొందుతున్నారు. అందుకే గ్రామీణ స్థాయిలోనే వ్యవసాయ ఉత్పత్తులు రూపొందించి విక్రయిస్తే మంచి లాభాలు వస్తాయని ఆర్థిక శాస్త్రవేత్తలు తరుచూ చెబుతున్నారు. ఇటీవల కాలంలో చిరుధాన్యాలు కలిపి చేసే బిస్కెట్లు, అరిసె, చాక్‌లెట్లు, కేక్, జెల్లీ, గవ్వలు వంటి వాటి తయారీపై శిక్షణ ఇస్తారు. ఇడ్లీ, దోసె పిండి తయారీ విధానం, వాటి ప్యాకింగ్, మార్కెటింగ్ గురించి శిక్షణ ఇవ్వనున్నారు.

కలెక్టరేట్‌లో విక్రయిస్తున్న చిరు ధాన్యాల ఆహార పదార్థాలు

వేకువజాము నుంచే భక్తులకు దర్శనం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈ నెల 30న వేకువజామున 1.35 గంటల నుంచే భక్తులకు దర్శనం కోసం అనుమతి ఇస్తామని ఆలయ తనిఖీ అధికారి నవీన్‌కుమార్ ఆదివారం తెలిపారు. సందర్శకుల విన్నపం మేరకు ఈసారి ఆలయ ప్రవేశ వేళలను మార్పు చేశామని వివరించారు. ఉత్తర ద్వారం నుంచి సందర్శకులను రాములోరి సన్నిధికి అనుమతి ఇస్తామని చెప్పారు. ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రసాదాల వితరణ, అన్నదాన కేంద్రం వద్ద రద్దీ నియంత్రణకు క్యూలైన్లు, బారికేడ్లు సిద్ధం చేసినట్లు వివరించారు.

ప్రజల్లో సమానత్వం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగంలోని మౌలిక సుత్రాలను మార్చే హక్కు ఎవరికీ లేదని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ తెలిపారు. సీపీఐ శతజయంతి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం మదనపల్లెలో భారత రాజ్యాంగం- పరిరక్షణ అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రజలంతా సమానమేనన్న భావన కల్పించే విధంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ప్రతి ఒక్కరికి ఓటుహక్కును కల్పించారన్నారు. అనంతరం సీపీఐ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ కె. నారాయణ, రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను అడగటం నేర్పించింది కమ్యూనిస్టు పార్టీనే అని అన్నారు. భారత రాజ్యాంగానికి ఆర్ఎస్ఎస్, భాజపా వల్లనే పెను ప్రమాదమని దేశంలోని సంపదను కార్పొరేట్ ముసుగు వేసుకున్న దొంగలకు అప్పగిస్తున్నారన్నారు. స్వాతంత్రోద్యమంలో ఎంతోమంది కమ్యూనిస్టు నాయకులు ప్రాణాలు అర్పించారన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మహేశ్, సహాయ కార్యదర్శి టి. కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

మాజీ సర్పంచిపై యువకుల దాడి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: మాజీ సర్పంచిపై కొంతమంది యువకులు దాడి చేసి గాయపర్చిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని కోటవారిపల్లెకు చెందిన మాజీ సర్పంచి రాజా కారులో మదనపల్లెకు వస్తుండగా ఈశ్వరమ్మకాలనీ వద్ద ఎదురుగా మరో కారు వచ్చింది. రహదారి పనులు జరుగుతుండటంతో ఎదురుగా వచ్చిన కారును కొంత పక్కకు వెళ్లాలని ఆయన కోరారు. అయితే మద్యం మత్తులో ఉన్న ఆ యువకులు కిందకు దిగి రాజాతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీయడంతో మాజీ సర్పంచిపై యువకులు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశామన్నారు.

గుర్రంకొండలో గంజాయి ముఠా అరెస్టు

గుర్రంకొండ, న్యూస్‌టుడే: చిట్టిబోయనపల్లె సమీపంలో జాతీయ రహదారిపై గంజాయి విక్రయించే ముఠాను ఆదివారం అరెస్టు చేసినట్లు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ చెప్పారు. స్థానిక పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పరిసరాల్లో నలుగురు యువకులు, మరో బాలుడు కలిసి గంజాయి విక్రయిస్తుంటే పట్టుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ. లక్ష విలువ చేసే 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎల్లుట్ల పంచాయతీ పసలవాళ్లపల్లెకు చెందిన తనగాని వెంకట్రమణ(40), గుర్రంకొండ ఇందిరమ్మకాలనీ గుటం సమ్మి సమీర్(20), స్థానిక పట్టణంలోని ఎస్ఎల్‌టీ వీధికి చెందిన షేక్ మొహమ్మద్‌సేఫ్(19), తరిగొండకు చెందిన అరుణ్‌కుమార్(19),లను రిమాండుకు తరలిస్తున్నట్లు చెప్పారు. బాలుడిని జువైనల్‌కు పంపుతున్నామన్నారు.

మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణమోహన్, సీఐ రాఘవరెడ్డి తదితరులు

EENADU Classifieds
BUSINESS SERVICES
JOBS
BUSINESS OFFER
Wanted US IT Recruiters Qualifications: Inter/ Degree, Good Communications skills in English. Ph: 93462 61610/ 90325 61551 or sivaram24@gmail.com
© 7382114647
9688888179
TO LET
COMMERCIAL
© 77309 58410
© 7019632854
9949741939
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ. 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620

హిందువులు ఐక్యంగా ఉండాలి

మాట్లాడుతున్న చిదానందస్వామి

సుండుపల్లి, న్యూస్‌టుడే : హిందువులందరూ సనాతన ధర్మం పాటించి కలిసికట్టుగా ఉండాలని కలిచర్ల గీతాశ్రమం పిఠాధిపతి చిదానందగిరి స్వామి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పెద్దినేనికాలువ కస్తూరమ్మ ఆలయంలో హిందూధర్మ సమ్మేళనంలో పిఠాధిపతి మాట్లాడారు. సృష్టిలో జీవరాసులన్నీ సుఖంగా ఉండాలని హిందూ ధర్మం చెబుతుందన్నారు. కులం ఇంటివరకేనని ఇల్లు దాటితే ప్రతి ఒక్కరూ హిందువేనని అన్నారు. సనాతన ధర్మం పాటిస్తూ హిందువులంతా కలిసిమెలిసి ఉండాలన్నారు. సనాతనంగా వస్తున్న దేవాలయ వ్యవస్థను సంరక్షించుకోవాలన్నారు.

అండర్-12 జిల్లా స్థాయి క్రికెట్ ఎంపికలకు స్పందన

కడప క్రీడలు, న్యూస్‌టుడే : వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియంలోని క్రికెట్ నెట్స్‌లో ఆదివారం జరిగిన అండర్-12 జిల్లాస్థాయి ఎంపికలకు విశేష స్పందన లభించింది. జిల్లా నలు మూలల నుంచి 163 మంది హాజరైనట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి రెడ్డి ప్రసాద్ తెలిపారు. సెలెక్షన్ కమిటీ సభ్యులుగా రెహమాన్, శ్రీకాంత్‌రెడ్డి, అశోక్ చక్రవర్తి వ్యవహరించారు. కార్యదర్శి రెడ్డిప్రసాద్ పర్యవేక్షణలో స్టేడియం కమిటీ కన్వీనర్ సంజయ్‌కుమార్‌రెడ్డి, డీసీఏ ఖాజామొహిద్దీన్, అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి పృథ్వీ ఎంపికలు నిర్వహించారు. ముందుగా చిన్నారుల అర్హత పత్రాలు పరిశీలించారు. అనంతరం బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఎంపికలు చేపట్టారు. 80 మందిని ప్రాబబుల్స్‌కు ఎంపిక చేసినట్లు రెడ్డిప్రసాద్ తెలిపారు. వీరికి త్వరలోనే ప్రాబబుల్స్ మ్యాచ్‌లను నిర్వహించి అందులో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని చెప్పారు.

ఎంపికలకు హాజరైన చిన్నారులు

ఇండియన్ ట్రేడ్ సర్వీస్‌కు ఎంపిక

కొండాపురం, న్యూస్‌టుడే: కొండాపురం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆంధ్ర వెంకట నాయుడు, ప్రభావతి దంపతుల కుమారుడు లక్ష్మీ వెంకట సాయికృష్ణ యూపీఎస్సీ నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024లో 'ఇండియన్ ట్రేడ్ సర్వీస్ గ్రూప్-ఏ' ఉద్యోగం సాధించారు. మద్రాస్ ఐఐటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వెంకటసాయికృష్ణ ముంబయిలోని ప్రైవేటు సంస్థలో ఉద్యోగం సాధించారు. యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఉద్యోగానికి రాజీనామా చేసి పరీక్ష రాశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదలైన ఫలితాల్లో ర్యాంకు వచ్చింది. ప్రస్తుతం రిజర్వ్ జాబితా విడుదల చేయగా అందులో ఇండియన్ ట్రేడ్ సర్వీస్ గ్రూప్-ఏకు ఎంపికయ్యారు. సివిల్స్‌లో మెరుగైన ర్యాంకు సాధించి ఐఏఎస్ కావాలన్నదే తన ధ్యేయమని వెంకటసాయికృష్ణ స్పష్టం చేశారు.

రైలు కిందపడి యువకుడి మృతి

నందలూరు, న్యూస్‌టుడే : నందలూరు రైల్వేస్టేషన్‌కు రెండు కిలోమీటరు దూరంలో ప్రమాదవశాత్తు రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. కర్నూలు జిల్లా, ఆస్పరి మండలానికి చెందిన శ్రీనివాసులు (35) తిరుమలకు తన కుమారుడితో కలసి దర్శనం చేసుకొని కన్యాకుమారి నుంచి పుణే వెళ్లే జయంతి ఎక్స్‌ప్రెస్ రైల్లో తిరిగి వస్తుండగా నందలూరు రైల్వేస్టేషన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నందలూరు జీఆర్‌పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధార్‌కార్డ్ ఆధారంగా మృతుని బంధువులకు సమాచారం ఇవ్వడంతో రైల్లో నిద్రిస్తున్న కుమారుడు (11) ఎర్రగుంట్లలో బంధువులు దింపుకొన్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు జీఆర్‌పీ కానిస్టేబుల్ సుబాన్ తెలిపారు.

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మహాల్(కలికిరి), (న్యూస్‌టుడే): కలికిరి మండలం మహల్ తెలుగు ఉన్నత పాఠశాలలో 2006-07 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అక్కడకి వచ్చిన పూర్వవిద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పరస్పరం తమ విషయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో హసన్‌వల్లీ, సురేష్‌కుమార్, శ్రీనివాస్, ధన, రెడ్డిఈశ్వర్‌రెడ్డి, నరేష్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

వృత్తి వికాస ప్రదర్శనలో ప్రథమ స్థానం

విద్యార్థిని దీపిక తయారు చేసిన ప్రాజెక్టు ఇదే

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: రాయచోటిలో ఈనెల 27న జరిగిన జిల్లా స్థాయి వృత్తి వికాస ప్రదర్శనలో కురబలకోట కేజీబీవీ పాఠశాల విద్యార్థిని దీపిక తయారు చేసిన ప్రాజెక్టుకు ప్రథమ స్థానం లభించినట్లు ప్రిన్సిపల్ ఎస్.ఎం.రఫియా పర్వీన్ ఆదివారం తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి 200 మందికి పైగా విద్యార్థులు హాజరుకాగా ఇందులో తమ విద్యార్థిని తయారు చేసిన 'డిఫరెంట్ ప్రొఫెసన్స్ ఇన్ హాస్పిటల్' ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థినిని డీఈఓ సుబ్రహ్మణ్యం, సమగ్రశిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ అనురాధ, ఎంఈఓ ద్వారకనాథ్, సెక్టోరియల్ అధికారులు అభినందించారు.

మేమున్నాం... మీకు తోడుగా... (10 AM to 1 PM)
మదనపల్లె : 8008574955
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 7989663199

స్పందనకు వందనం

– న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

✶ మండలంలోని చీకలబైలు గ్రామంలో పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ నెల 17న 'ఈనాడు'లో సమస్యను ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సర్పంచి ప్రభాకర్, ఎంపీడీవో తాజ్ మస్రూర్‌లు పారిశుద్ధ్య కార్మికులను పంపి పనులు చేయించారు.

✶ ఇసుకనూతీపల్లె గ్రామంలో కార్మికులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇక్కడి సమస్యను గ్రామస్థులు 'ఈనాడు' దృష్టికి తీసుకురావడంతో ఈ నెల 17న 'మేమున్నాం...మీకుతోడుగా'లో ప్రచురించడంతో డిప్యూటీ ఎంపీడీవో భారతి స్పందించారు. పంచాయతీ కార్మికులతో చర్యలు చేపట్టారు.

✶ గౌతమినగర్, చీకలగుట్టల్లో పురపాలక సంఘం కార్మికులు కాలువలో పూడికలను తీశారు. కాలనీలోని సమస్యలపై ప్రజలు 'మేమున్నాం...మీకుతోడుగా'కు సమాచారం ఇచ్చారు. దీనిపై ఈ నెల17న 'ఈనాడు'లో సమస్యను ప్రచురించడంపై పురపాలక సంఘం కమిషనర్ ప్రమీల స్పందించి చర్యలు తీసుకున్నారు.

✶ గొల్లపల్లె రింగ్‌రోడ్డు వద్ద పారిశుద్ధ్య కార్మికులు మురుగు కాలువలను శుభ్రం చేశారు. ఈ ప్రాంతంలో కాలువల్లో చెత్త నిలిచి మురుగు రహదారులపై పారుతుండటంతో స్థానికులు 'ఈనాడు'దృష్టికి తీసుకొచ్చారు. సమస్య ఈ నెల 17న 'మేమున్నాం..మీకుతోడుగా'లో ప్రచురితం కావడంతో పురపాలక సంఘం అధికారులు స్పందించారు.

✶ మండలంలోని బసినికొండ గ్రామంలో పంచాయతీ కార్మికులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలో రహదార్లపై చెత్త దిబ్బలు పేరుపోవడంతో ప్రజలు 'మేమున్నాం...మీకుతోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ఈ నెల 17న 'ఈనాడు'లో ప్రచురితం కావడంతో పంచాయతీ సర్పంచి, ఉపసర్పంచి రమణ, బావాజాన్, కార్యదర్శి నవాజ్‌లు స్పందించి చర్యలు చేపట్టారు.

– న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

?: మండలంలోని బెంగళూరు రోడ్డు వేంపల్లె క్రాస్ వద్ద చెత్తదిబ్బలు పేరుకుపోయి దోమలకు నిలయంగా మారింది. స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారు. - రఘురాం, బెంగళూరురోడ్డు

✓: వెంటనే పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయిస్తాం. - తాజ్‌మస్రూర్, ఎంపీడీవో, మదనపల్లె

?: మండలంలోని సత్యసాయి కాలనీలోని పలు వీధుల్లో వీధి దీపాలు వెలగడం లేదు. - రమేశ్‌బాబు, సత్యసాయి కాలనీ

✓: వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. - తిరుపాల్‌నాయక్, డిప్యూటీ ఎంపీడీవో, మదనపల్లె

?: కొత్తవారిపల్లె పంచాయతీ కేంద్రంలో కాలువలు లేక రహదారిపై మురుగు పారుతోంది. దుర్వాసనతో గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - రమణ, కొత్తపల్లె

✓: గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయించి శుభ్రం చేస్తాం. - భారతి, డిప్యూటీ ఎంపీడీవో, మదనపల్లె

?: చిన్నతిప్పసముద్రం గ్రామంలోని తిరుపతి మార్గంలో చెత్తదిబ్బలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. రైల్వేట్రాక్ పక్కనే చెత్తను వేస్తున్నారు. - సుబ్రహ్మణ్యం, తిరుపతి రోడ్డు

✓: పారిశుద్ధ్య పనులు చేయించి చెత్తదిబ్బలు లేకుండా చర్యలు తీసుకుంటాం.- పవన్‌కుమార్, కార్యదర్శి, సీటీఎం గ్రామం, మదనపల్లె

ఆసనాలు వేసి.. పతకాలతో మురిసి

యోగా చేస్తున్న విద్యార్థులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: ఆరోగ్యం కోసం యోగా చేస్తారు. అయితే మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు యోగా చేస్తూ పోటీల్లో బహుమతులు సాధిస్తున్నారు. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పోటీల వరకు వెళ్లి సత్తా చాటారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు జలజ సహకారంతో యోగాలో శిక్షణ తీసుకుంటున్నారు. ఇటీవల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి అందరి చేత ప్రశంసలు అందుకుంటున్నారు.

సైన్యంలో చేరుతా..

చిన్నప్పటి నుంచి భారత సైన్యంలో చేరాలన్నదే లక్ష్యం. అందుకే చదువుతో పాటు యోగ, హాకీలో శిక్షణ తీసుకుంటున్నాను. ఇటీవల చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపిక అయ్యాను. గత నెల చివరి వారంలో బాపట్లలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా తరపున పాల్గొన్నాను. అక్కడ ఆరోస్థానంలో నిలిచి ప్రశంసా పత్రం అందుకున్నాను. వచ్చే ఏడాది జాతీయ స్థాయిలో రాణించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నాను. - చరణ్‌తేజ, 8వ తరగతి

అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తా..

యోగాలో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నాను. అందుకే ఉదయం, సాయంత్రం ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాను. ఇటీవల బంగారుపాళ్యంలో జరిగిన జిల్లా స్థాయి, బాపట్లలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లాను. అక్కడ జాతీయ స్థాయికి వెళ్లే అవకాశం చేజారిపోయింది. ప్రశంసా పత్రం మాత్రమే వచ్చింది. వచ్చే ఏడాది ఎలాగైనా యోగాలో రాణించి దేశ జట్టులో స్థానం సంపాదించాలనుకుంటున్నాను. - లక్ష్మీప్రసన్న, 9వ తరగతి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అయ్యప్పస్వామికి అంబలం పూజ నిర్వహిస్తున్న గురుస్వాములు

గుర్రంకొండ, న్యూస్‌టుడే: మండలంలోని చెర్లోపల్లె సమీపంలో వెలిసిన శ్రీ రెడ్డెమ్మదేవత ఆలయంలో సంతానార్థి మహిళలు వరపడు పూజ చేశారు. భక్తులు ఆదివారం అమ్మవారి పుష్కరిణిలో స్నానాదులు ఆచరించి, పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాల్లో ఛైర్మన్ లంకిపల్లె రాజన్ననాయుడు, ఈవో మంజుల పాల్గొన్నారు.

వాల్మీకిపురం : పట్టణంలోని తిరుపతి రోడ్డులో ఉపసర్పంచి కేశవరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్పస్వామి వారికి అంబలం పూజను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా మాల దీక్షాపరులకు భిక్షను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వామి రామచంద్ర, నిర్వాహకులు రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏకాదశి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

కొలువుదీరిన స్వామివారు

రామసముద్రం, న్యూస్‌టుడే: రామసముద్రంలోని లక్ష్మీజనార్దనస్వామి ఆలయంలో మంగళవారం జరగనున్న ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధిబట్టర్ ఆదివారం తెలిపారు. ఉదయం ఆలయంలో స్వామివారికి విశేష పూజలు చేస్తామన్నారు. అనంతరం స్వామివారిని సతీసమేతంగా పుష్పపల్లకిపై ప్రాకారోత్సవం చేపట్టి ఆలయ ఉత్తరద్వారం ద్వారా ఊంజల్‌సేవ నిర్వహిస్తామన్నారు.

కలికిరి, న్యూస్‌టుడే: కలికిరి మండలం చక్కెరవాండ్లపల్లెలో వెలసిన శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. మంగళవారం ఉదయం 5:30 గంటలకు సుప్రభాత సేవ, 6 గంటలకు మూలవిరాట్, ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకం, 7:30 గంటలకు మహా హారతి వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హిందువులు ఐక్యతతో ముందుకు సాగాలి

గర్నిమిట్టలో ర్యాలీగా వస్తున్న హిందువులు

కంభంవారిపల్లి (న్యూస్‌టుడే) : సమాజంలో కుల, వర్గ, ప్రాంత తేడాలు లేకుండా రాజకీయాలకు అతీతంగా హిందువులంతా ఐక్యం కావాలని చిదానందగిరి స్వామీజీ అన్నారు. ఆదివారం కంభంవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడపాలని అన్నారు. కార్యక్రమంలో హిందూ చైతన్య వేదిక ప్రాంత సహ సంయోజక్ బండి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువు, న్యూస్‌టుడే: హిందువులంతా ఐక్యతతో ముందుకు సాగాలని శ్రీశ్రీశ్రీ శ్రీరాములు సిద్ధాంతి, ఉమ్మడి చిత్తూరు జిల్లా విభాగ్ కార్యవాహ రాజేంద్ర అన్నారు. ఆదివారం ములకలచెరువు మూడు రోడ్ల కూడలి నుంచి క్రికెట్ గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి హిందువుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరాములు సిద్ధాంతి మాట్లాడుతూ.. నేటి హిందూ సమాజం మేలుకుని మన సంస్కృతిని కాపాడి అందరికి ఆదర్శంగా నిలవాలన్నారు.

బి.కొత్తకోట,న్యూస్‌టుడే: భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు హిందువులు కలసికట్టుగా ముందుకు సాగాలని వక్తలు పిలుపునిచ్చారు. బి.కొత్తకోటలోని కొండాకళ్యాణ మండపంలో ఆదివారం హైందవ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హజరైన స్వామిజీ కృష్ణానంద సరస్వతి మాట్లాడుతూ కులాలు వేరైనప్పటికీ మనమంతా హిందువులమన్న విషయాన్ని గుర్తుంచుకుని ఐకమత్యంతో ధర్మాన్ని కాపాడుకుందామని సూచించారు. గతంలో దేశంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా జనాభా నియంత్రణను అమలు చేశారని, ఇప్పుడు హిందువులు సంతానాన్ని పెంచుకోవడంపై దృష్టి పెట్టాలని కోరారు. ముందుగా దిగువ బస్టాండు నుంచి సమావేశ వేదిక వరకు హిందువులు ద్విచక్రవాహనాలతో ర్యాలీని నిర్వహించారు.

బి.కొత్తకోటలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులు

సమావేశానికి హాజరైన హిందువులు

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వినతి

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి (వీఆర్ఎస్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు పొదల నరసింహులు అన్నారు. ఆదివారం ఆ సంఘం నాయకులు ర.భ.శాఖ అతిథిగృహం ఆవరణలో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. అనంతరం అధ్యక్షుడు విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంటులో ఎస్టీ రిజర్వేషన్ బిల్లు పెట్టించాలని పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నపాలు చేసినా స్పందించలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు వాల్మీకులకు ఇచ్చిన హామీని విస్మరించవద్దని కోరారు. ప్రభుత్వం ఈ సమస్యపై స్పందించకుంటే ఐక్యపోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షుడు పొదల నరసింహులు

మానవత సేవలు అభినందనీయం

పీలేరు, న్యూస్‌టుడే: మానవత సేవలు అభినందనీయమని పీలేరు రౌద్రాల అంకాళమ్మ ఛైర్మన్ కోడి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం నిర్వహించిన ఆసంస్థ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజిక సేవా చేయాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన మానవత సంస్థ ఫ్రీజర్ బాక్సు, శాంతి రథం అంతిమయాత్రకు వినియోగిస్తున్నారన్నారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ, పేద వ్యాధిగ్రస్తులకు ఆర్థికసహాయం అందించడం ఆదర్శనీయమన్నారు. సంస్థకు తనవంతు ఆర్థికసహాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మానవత ఛైర్మన్ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: తాగునీటి సమస్యతో 20 రోజులుగా అల్లాడిపోతున్నామని బి.కొత్తకోట బైపాస్‌రోడ్డులోని భగవాన్ సాయిరాం పాఠశాల పరిసర ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఈ విషయంపై బాధితులు మాట్లాడుతూ కుళాయిల ద్వారా నీరు సరఫరా కాకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. ఈ విషయంపై నగర పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు కురిసి భూగర్భజలాలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ నీటి సరఫరాలో కోత విధించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ కమిషనరు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం

కేకు తినిపిస్తున్న బాలిరెడ్డి

చింతపర్తి(వాల్మీకిపురం),న్యూస్‌టుడే: దేశంలో ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, లౌకికతత్వం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాలిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చింతపర్తి గాంధీ బస్టాండులో కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గడప, గడపకూ కాంగ్రెస్ పార్టీ అనే నినాదంతో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీకి మద్దుతు ఇవ్వాలని కోరారు. అనంతరం గాంధీబస్టాండులో కేక్‌కోసి పిల్లలతో పాటు కాంగ్రెస్ నాయకులకు పంచి పెట్టారు. అనంతరం బాలిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత భాజపా పాలనలో దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల తదితర సమస్యలతో ప్రజలు సతమతమౌతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ దారిపోయినవి

టి.అరుణ, భర్త పి.రామక్రిష్ణ, డి.నెం. 13-9, మెరవపల్లి, బసినికొండ పోస్టు, మదనపల్లి టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా, A.P. నాకు సంబంధించిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్స్ 09.12.2025 తేదీన మా స్వగృహం నుండి మదనపల్లికి వెళ్ళుతున్న సమయంలో దారి పోయినవి. ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్స్ నెం. 1592/2020, 13404/2019, 1279/1995 ఎవరికైనా దొరికినచో ఈ నెంబర్‌కు తెలియజేయగలరు.

Cell : 7801045194

రాష్ట్ర స్థాయి పోటీల్లో అన్నమయ్యకు మూడో స్థానం

పతకాలు చూపిస్తున్న బాలికలు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: నెల్లూరు జిల్లా కావలిలో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ షూటింగ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో అన్నమయ్య జిల్లా మహిళల జట్టుకు మూడో స్థానం వచ్చినట్లు షూటింగ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గౌతమి ఆదివారం తెలిపారు. మహిళల విభాగంలో అన్నమయ్య జట్టు కాకినాడ జట్టుపై 21-15 పాయింట్లు సాధించి మూడోస్థానం కైవసం చేసుకుందన్నారు. మూడో స్థానంలో నిలిచిన అన్నమయ్య జట్టును కోచ్‌లు యూసఫ్, మేనేజర్ సుజాతను అసోసియేషన్ ఛైర్మన్ జునైద్ అక్బరీ, అధ్యక్షుడు సిద్ధప్ప, కార్యనిర్వాహక కార్యదర్శి నరేష్‌బాబు తదితరులు అభినందించారు.

కార్మిక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ర్యాలీ

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి, కోశాధికారులు హరీంద్రనాథ్ శర్మ, ప్రభాకర్‌రెడ్డిలు కోరారు. ఆదివారం పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. జనవరి 18న ఛలో విశాఖ, సీఐటీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేయకూడదన్నారు. కార్మిక సమస్యల పోరాటాలతో పాటు, ప్రజాచైతన్యాన్ని పెంపొందించేందుకు జనవరి 4న బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: అరబిందో ఫార్మా సంస్థ సౌజన్యంతో కంభంవారిపల్లె మండలానికి చెందిన శ్రీనివాసా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పీలేరు పట్టణంలో ఆదివారం క్యాన్సర్‌పై అవగాహన, ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. తిరుపతికి చెందిన మెడిగో ఆసుపత్రి పర్యవేక్షణలో అయ్యపురెడ్డికాలనీ సరస్వతి శిశు మందిర్‌లో నిర్వహించిన ఈ శిబిరంలో 120 మంది రోగులకు చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలి

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయిలో నిర్వహించనున్న సంతోష్ పుట్‌బాల్ ట్రోఫీలో ప్రతిభ చూపి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని జనసేనపార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఏపీఐఐసీ డైరెక్టర్ మహేశ్ అన్నారు. ఆంధ్ర పుట్‌బాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్న మహేంద్రను ఆదివారం ఆయన సన్మానించారు.

ప్రకటన

అన్నమయ్య జిల్లా, కలికిరి మండలం, కలికిరి గ్రామ పంచాయతీ, కె.రెడ్డివారిపల్లి గ్రామం నందు వెలసివున్న శ్రీ కోదండరామస్వామి దేవాలయంను, దేవాదాయశాఖ నందు రిజిష్టరు చేయుటకు ఏదైనా అభ్యంతరము ఉన్న యెడల ఈ ప్రకటన ప్రచురితమైన 15 దినములలోపు జిల్లా దేవాదాయశాఖ అధికారి, అన్నమయ్య జిల్లా వారికి తెలుపవలసినదిగా దేవస్థానం నిర్వాహకులు తెలుపుకొనుచున్నారు.

This is to certify that Sri Kodanda Ramalayam is existing in Sy.No.556 at K.Reddyvaripalli Village, Kalikiri Panchayati, Kalikiri Mandal, Annamaiah District. Which is classified as settlement patta land as per a Register and the Temple is having following.

Lands/does not hold any landed properties and the age of the Temple is 100 years as per Revenue ending.

ఆలయ కమిటీ

జాబితాలో ఓటర్లు.. ఎక్కడున్నారో!

ఇప్పటి వరకు నియోజకవర్గంలో 43 శాతం గుర్తింపు

మండలం	మొత్తం ఓటర్లు	మ్యాపింగ్ అయిన వారు
గుర్రంకొండ	35,033	17,518
కలకడ	28,025	12,020
కంభంవారిపల్లె	31,939	14,632
వాల్మీకిపురం	36,780	17,536
కలికిరి	40,864	17,505
పీలేరు	63,122	22,732
మొత్తం	2,35,763	1,01,943

పీలేరులో ఓటర్లను విచారిస్తున్న బీఎల్వోలు, ఏఎస్‌వో రెడ్డెప్ప

పీలేరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేసేందుకు ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేయడంతో పాటు మ్యాపింగ్ చేయాలని సంకల్పించింది. ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు నవీకరణ చేసేందుకు ఓటర్లు నివాసం ఉన్నారా లేదా అని విచారించేందుకు నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి అమరనాథరెడ్డితో పాటు సహాయ అధికారిగా ఉన్న తహసీల్దారు శివకుమార్ తదితరులు క్షేత్రస్థాయిలో వారి ఆచూకీ కనుగోనేందుకు జల్లెడ పడుతున్నారు.

అత్యధికంగా వలసలు వెళ్లిన వారే..

పీలేరు నియోజకవర్గంలోని ఓటరు జాబితా మేరకు సర్వే చేసే విషయంలో గ్రామీణ ప్రాంతాల్లో కన్నా పట్టణ ప్రాంతాల్లో ఇబ్బందిగా ఉంది. ఎన్నికల సమయంలో ఓటర్లు ఎక్కడికి వెళ్లినా తిరిగి పోలింగ్‌లో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటారు. మళ్లీ ఓటర్లు తమ జీవనోపాధికి ఇతర ప్రాంతాలకు తాత్కాలికంగా వలసలు వెళ్తుంటారు. ఓటర్లకు కేంద్రప్రభుత్వం ఇస్తున్న కార్డులను తీసుకున్న తరవాత వలసలు, ఉద్యోగులు బదిలీలపై వెళ్తుండటంతో జాబితాలో ఉన్న అడ్రస్సుల్లో వారు ఉండడం లేదు. నియోజకవర్గంలో కొందరు పేదలు జీవనోపాధికి ఇతర దేశాలకు, రాష్ట్రాలకు వెళ్లారు. ఓటర్లు ఇచ్చిన అడ్రస్సుల్లో వృద్ధులు మాత్రమే ఉంటున్నందున సర్వే మ్యాపింగ్ గగనమవుతుంది. దీంతో ప్రభుత్వం ఆశించినట్లు ఈ ప్రక్రియ జాప్యం అవుతోంది. పీలేరు నియోజకవర్గంలో మొత్తం 2,35,763 మంది ఓటర్లు ఉండగా ఇప్పటి వరకు 43.24 శాతం ఓటర్లను మాత్రమే గుర్తించారు. తక్కువగా పీలేరు మండలంలో 36.01శాతం మాత్రమే మ్యాపింగ్ అవడం గమనార్హం. ఇక్కడ ఎక్కువగా వివిధ పనుల మీద తాత్కాలిక వలసలు వెళ్లినవారు అధికంగా ఉండడంతో మ్యాపింగ్ ఆలస్యం అవుతోంది. ఓటరు జాబితాలో ఉన్న అడ్రస్సు నుంచి మరో చోటుకు బదిలీ అయినా తరవాత వారు ఎక్కడ నివాసం ఉన్నారన్న విషయం ఎవరూ ఖచ్చితంగా చెప్పడం లేదు. ఆధార్ అనుసంధానం మ్యాపింగ్ మండలాల వారిగా దిగువన పేర్కొన్న విధంగా ఉన్నాయి.

ఆచూకీ లభ్యం కావడం లేదు..

ఓటర్ల జాబితా మేరకు అందరిని మ్యాపింగ్ చేయాలని క్షేత్రస్థాయిలో సిబ్బంది వెళ్లి విచారిస్తున్నారు. నియోజకవర్గంలో పీలేరు, కలికిరి, వాల్మీకిపురం పట్టణాలున్నాయి. వీటిల్లో నివాసం ఉంటున్న వారు ఎక్కువగా అద్దెలకు ఉంటున్నారు. వీరు ఎక్కువగా ఇళ్లను మారుస్తుండడంతో కనుక్కోవడం ఇబ్బంది అవుతోంది. మ్యాపింగ్ అన్నది నిరంతర ప్రక్రియ కాబట్టి సర్వే కొంత ఆలస్యం అవుతుంది. - శివకుమార్, తహసీల్దారు, (సహాయ ఓటర్ల నమోదు అధికారి), మదనపల్లె

ఉచిత వైద్య శిబిరాలకు స్పందన

కంభంవారిపల్లి (న్యూస్‌టుడే): మండలంలోని కుమ్మరపల్లెలోని వృద్ధాశ్రమంలో శ్రీనివాస చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన వారికి వైద్యులు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు బ్రహ్మా రెడ్డి, కంటి వైద్య నిపుణులు ప్రసన్న కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు గ్రామీణ: పీలేరుకు చెందిన మాధవి ఆసుపత్రి ఆధ్వర్యంలో తలపులలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంతో స్త్రీల వైద్య నిపుణులు మాధవి 100 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆసుపత్రి డైరెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి

కంభంవారిపల్లి (న్యూస్‌టుడే): సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వన్నె రెడ్డి, వన్నెకుల క్షత్రియ కులాలను ప్రభుత్వం ఆదుకోవాలని వన్నె రెడ్డి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సురేష్ బాబు అన్నారు. ఆదివారం మండలంలోని మహల్‌రాజుపల్లెలో వన్నెరెడ్డి సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్నెరెడ్డి సంఘానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, మహల్‌రాజుపల్లెలో ఎన్నో ఏళ్లుగా గ్రామస్థులు శ్మశాన వాటిక లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వన్నెరెడ్డి, వన్నెకుల క్షత్రియ నాయకులు పాల్గొన్నారు.

చేపల అక్రమ వేటపై ఫిర్యాదు

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన పీటీఎం పెద్ద చెరువులో అక్రమంగా చేపలు పడుతున్నారని పేర్కొంటూ ఎంపీడీవోకు చరవాణి ద్వారా ఫిర్యాదు చేసినట్లు బూర్లపల్లె, పోతుపేట గ్రామస్థులు ఆదివారం తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆ చెరువు వేలం ముగిసి నాలుగేళ్లయినా, గుత్తేదారు గుట్టు చప్పుడు కాకుండా రాత్రుల్లో చేపలు పడుతున్నాడని, పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద చెరువులో చేపల వేట నిషేధించినా, గుత్తేదారు ఏ మాత్రం ఖాతరు చేయకుండా చేపలు పట్టడం కొనసాగిస్తున్నారని చెరువు సంఘం అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి తెలిపారు. చెరువును వేలం వేసి, పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చూడాల్సిన అధికారులే గుత్తేదారుతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు..

జూదరుల అరెస్టు

పెద్దమండ్యం, న్యూస్‌టుడే: జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ శ్రావణి ఆదివారం తెలిపారు. మండలంలోని పెద్దూరు సమీపంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు వారిపై దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు చెప్పారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

8వ వర్ధంతి
మంచికి మారుపేరుగా నిలిచి, మాకు ఆప్యాయత, ప్రేమానురాగాలు పంచి మా కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన కీ॥శే॥ ఆర్.సి.మోహన్ గారు మా నుండి దూరమై 8 సం॥లు గడిచినను మీ మధురస్మృతులు మా హృదయాలలో మెదులుతూనే ఉన్నాయి.
★ మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..
భార్య: ఆర్.మల్లమ్మ
కీ॥శే॥ ఆర్.సి.మోహన్ గారు
Retd. H.M.
జననం 09-03-1947
మరణం 29-12-2017

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

పుల్లంపేట వాసులకు పదవులు

సీడీ గోపీనాథ్ నూకల హరి పి.వెంకటేశ్వర్లు

పుల్లంపేట, న్యూస్‌టుడే : ఏపీ పద్మశాలి సంఘం రాష్ట్ర కమిటీలో పుల్లంపేటకు చెందిన ముగ్గురికి చోటు కల్పించినట్లు అఖిల భారత పద్మశాలి సంఘం కార్యదర్శి నూకల శ్రీరాములు తెలిపారు. ఆదివారం తిరుపతిలో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఏపీ పద్మశాలి సంఘం ప్రచార కార్యదర్శిగా పోలిచెర్ల వెంకటేశ్వర్లు, అనుబంధ విభాగమైన చేనేత విభాగం సహాయ కార్యదర్శులుగా సీడీ గోపీనాథ్, నూకల శ్రీహరిలను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. వీరి ఎంపికపై పలువురు చేనేత సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

వాహనాల పార్కింగ్ అడ్డాగా.. ప్రభుత్వ ఆసుపత్రి

ఆసుపత్రి వద్ద అంబులెన్స్ కూడా వెళ్లలేని విధంగా ఉన్న వాహనాల పార్కింగ్

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే : రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారిపోయింది. నిత్యం రోగులతో కిటకిటలాడే ఈ ఆసుపత్రికి అత్యవసరంలో అంబులెన్సులు కూడా వెళ్లలేని పరిస్థితి. ఆసుపత్రి ప్రాంగణంలో ఆటో వాలాలు తమ ఆటోలు నిలుపుకొని పిచ్చాపాటి మాట్లాడుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. అంబులెన్సుకు కూడా దారి ఇవ్వరు. కొందరు ద్విచక్ర వాహనదారులైతే తమ వాహనాలకు ఇక్కడ పార్క్ చేసి వారి పనులకు వెళ్తున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో ప్రైవేటు వాహనాల పార్కింగ్ వలన రోగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర కేసులను ఇతర ప్రాంతాలకు తరలించేటప్పుడు అంబులెన్స్ సిబ్బందికి ఇబ్బందిగా ఉంటోంది. అధికారులు స్పందించి ఆసుపత్రి ప్రాంగణంలో ప్రైవేటు వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని రోగులు, అంబులెన్స్ సిబ్బంది కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 9703572572

?: పట్టణంలో నివాసాల నుంచి సేకరించిన చెత్తను డంప్‌యార్డుకు వాహనాల్లో తరలించే క్రమంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో వాహనాల్లోని చెత్తంతా రోడ్లపై పడి అపరిశుభ్రంగా మారుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి. - వెంకట శివ, స్థానికుడు

✓: వాహనాల్లో చెత్తను తరలించేటప్పుడు చెత్త రోడ్లపై పడకుండా చర్యలు తీసుకుంటాం. సిబ్బందికి తగిన సూచనలు చేస్తాం.
- రవి, పురపాలక కమిషనర్ రాయచోటి

?: పట్టణంలో చాలా ప్రాంతాల్లో మురుగు కాలువల్లోని పూడికను ఎత్తి రోడ్ల పక్కన కుప్పలుగా వేశారు. వారాలు గడుస్తున్నా ఆ పూడికను తొలగించలేదు. దీంతో తిరిగి కాలువల్లో పూడిక పడుతోంది. అధికారులు స్పందించి తొలగించాలి. - రమణ, స్థానికుడు

✓: వెంటనే సిబ్బందిని పంపి పూడిక తరలింపునకు చర్యలు తీసుకుంటాం.
- రవి పురపాలక కమిషనర్, రాయచోటి

- న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

అమాత్యా.. ప్రజా రవాణా మిథ్య!

* తిరుమలకు వెళ్లాలన్నా ఇబ్బందే
* మెరుగు పడని రవాణాతో ఇక్కట్లు

మండల కేంద్రమైన గాలివీడు

గాలివీడు, న్యూస్‌టుడే: వాణిజ్య కేంద్రమైన గాలివీడు నుంచి పట్టణాలను కలుపుతూ నడిచే బస్సు సర్వీసులు లేక ఇబ్బందులు పడుతున్నారు. రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించే రాయచోటి నియోజక వర్గంలోని గ్రామీణ ప్రాంతమైన గాలివీడు నుంచి గతంలో బెంగళూరు, శ్రీకాళహస్తి, చెన్నై, విజయవాడ, హైదరాబాదు పట్టణాలకు సర్వీసులు నడిపే వారు. క్రమంగా వాటిని రద్దు చేశారు.

ఈ సర్వీసులు పునరుద్ధరణ కలేనా!

● హిందూపురం డిపో నుంచి గాలివీడు మీదుగా కడపకు నాలుగు సర్వీసులు నడిపే వారు. ఆ సమయంలో రవాణాకు ఇనుకూలంగా ఉండేది. వాటిని నిలిపేశారు. ప్రస్తుతం రాయచోటి-బళ్లారి సర్వీసును మాత్రం నడుపుతున్నారు. ● ఈ ప్రాంతం నుంచి బెంగుళూరులో ఉద్యోగం చేసేవారు అధికంగా ఉన్నారు. ఇతర పట్టణాల్లో పిల్లలను చదివిస్తున్నారు. నేరుగా సర్వీసులు లేకపోవడంతో చాలా అవస్థలు పడతున్నామని ప్రయాణికులు అంటున్నారు. రోగులు పట్టణ ఆసుపత్రులకు వెళ్లాలంటే మరింత అవస్థలు పడుతున్నారు. ● గాలివీడు నుంచి 60 కి.మీ దూరంలోని మదనపల్లెకు వెళ్లి బెంగళూరుకు, 30 కి.మీ దూరంలోని రాయచోటికి వెళ్లి విజయవాడ, తిరుపతి, తిరుమల, హైదరాబాదుకు వెళ్లాల్సి ఉంది.

● వెలిగల్లు జలాశయం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందింది. సమీపంలోని సౌర విద్యుత్తు ప్లాంట్లు, తూముకుంట పెద్దగొడుగు, గండిమడుగు క్షేత్రం ఆదనపు ఆకర్షణగా ఉండటంతో సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు, భక్తులు వస్తుంటారు. మంత్రి ప్రత్యేక దృష్టిసారించి పట్టణాలకు బస్సు సర్వీసులను ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

అర కొర సిబ్బందితో ప్రజల అవస్థలు

సచివాలయానికి తాళంవేసి ఉండటంతో వెనుదిరుగుతున్న అర్జీదారులు

జనాభా ఎక్కువగా ఉండటంతో గాలివీడు గ్రామ పంచాయతీ పరిధిలో మూడు సచివాయాలను ఏర్పాటు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు భవన సముదాయాలు నిర్మించారు. వాటిలో మూలపల్లెలకు అనుకూలంగా గంగబోయినవడ్డిపల్లి వద్ద సచివాలయం-3, రైతు సేవా కేంద్రంతోపాటు హెల్త్ క్లీనిక్ భవనాలకు రూ.లక్షలు వెచ్చించారు. కార్యాలయాల్లో ఆరుగురు సిబ్బంది ఉండాల్సి ఉండగా ఇంజినీరు అసిస్టెంటు, అగ్రికల్చర్ అసిస్టెంటును మాత్రమే నియమించారు. వారు సర్వేలు, పథకాల అమలు కోసం క్షేత్రస్థాయిలో వెళ్తుండటంతో వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు.. సిబ్బంది కానరాక.. పనులు జరగక.. నిరాశతో వెనుదిరుగుతున్నారు. ధ్రువపత్రాల కోసం సచివాలయానికి పలుమార్లు వెళ్లినా ప్రయోజనం లేదని బాధితులు పేర్కొంటున్నారు. గాలివీడు-2లో డిజిటల్ అసిస్టెంట్, ఇతర సిబ్బంది కొరత ఉంది. ఇలాంటి వ్యవహారం మండలంలో పలు సచివాలయాల్లో నెలకొంది. మండల వ్యాప్తంగా ఉన్న సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గాలివీడు

శీతల శవ పేటికల వితరణ

గాలివీడు: గాలివీడు మండల మానవత సేవా సంస్థ శాఖకు జయరాంరెడ్డి, రామకృష్ణారెడ్డి దాతలు రెండు శీతల శవ పేటికలు వితరణ చేశారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నెలవారీ సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు ఐదు శీతల శవ పేటికలు అందుబాటులో ఉన్నాయని, వాటిని గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని కమిటీ సభ్యులు కోరారు.

రూ.లక్ష విరాళం అందజేత

రాజంపేట, న్యూస్‌టుడే : మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు దాత శంకర్‌నాయుడు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఆయన్ను సంస్థ ప్రతినిధులు ఆదివారం సత్కరించి అభినందించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించే వివిధ సామాజిక సేవా కార్యక్రమాల కోసం విరాళం ఇవ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు.

విరాళం ఇచ్చిన దాత శంకర్‌నాయుడును సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

కరుణించవమ్మా గంగమ్మతల్లి

గంగమ్మ, సత్యమ్మకు పూజలు చేస్తున్న పుత్తనవారిపల్లె వాసులు

పుల్లంపేట, న్యూస్‌టుడే : మండలంలోని పుత్తనవారిపల్లెలో పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన గంగమ్మ, సత్యమ్మ అమ్మవార్లకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రాతి విగ్రహం బహూకరణ

ముదుంపాడు (సుండుపల్లి), న్యూస్‌టుడే : ఆరోగ్యపురం పరిధిలోని బీడీ ఎన్.జె.ఆర్. కాలనీ కూడలిలోని స్థానిక శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ప్రతిష్ఠ నిమిత్తం మండలంలోని చిన్నబిడికి చెందిన సుంకేనాయక్ కుటుంబం ఆంజనేయ స్వామి రాతి విగ్రహాన్ని బహూకరించారని ఆలయ అర్చకులు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి దాతల చేయూత

సంబేపల్లె, న్యూస్‌టుడే : సంబేపల్లె మండలంలోని దుద్యాలలో కొలువై ఉన్న శ్రీకొత్తపురమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి దాతలు రూ.50,116 నగదు ఆదివారం వితరణ చేసినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ సాదు రాజగోపాల్ రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా చిట్వేలు మండలం కేకే వడ్డేపల్లెకు చెందిన రేవూరి శ్రీహరి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి పనులకు నగదు ఆలయ కమిటీకి వితరణ చేశారన్నారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ముమ్మర ఏర్పాట్లు

ముక్కోటి సందర్భంగా భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్

సౌమ్యనాథస్వామి ఆలయం

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే : ముక్కోటి ఏకాదశి సందర్భంగా రాజంపేట మండలం బోయనపల్లి అన్నమయ్య విగ్రహం వద్ద ఉన్న శ్రీవారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున తితిదే అధికారులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద క్యూలైన్లు, ప్రత్యేకంగా ఉత్తర ద్వారం ఏర్పాటు చేశారు. అదే విధంగా దాదాపు ఐదు వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

నందలూరులో ట్రాఫిక్ ఆంక్షలు

నందలూరు, న్యూస్‌టుడే : జిల్లాలో చారిత్రాత్మక, సుప్రసిద్ధ వైష్ణవ దేవాలయమైన నందలూరు శ్రీసౌమ్యనాథస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం తెల్లవారుజామున 1.30 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామి వారిని దర్శించుకోవచ్చని ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ట్రాఫిక్ మళ్లింపు చర్యలు ఎస్పీ ఆదేశాల మేరకు చేపట్టినట్లు తెలిపారు. రాజంపేట మండలంలోని పొత్తపి, లేబాక, టంగుటూరు, నందిమండలం, ఆడపూరు గ్రామ పంచాయతీల నుంచి వచ్చే ప్రజలు సౌమ్యనాథస్వామి ఆలయ దారిలో కాకుండా ఈదరపల్లె దారి గుండా వెళ్లాలని సూచించారు. నాగిరెడ్డిపల్లె వైపు నుంచి దర్శనానికి వచ్చే ప్రజలు నందలూరు షాదిఖాన వద్ద వాహనాలు ఉంచి నడక మార్గాన వచ్చి స్వామి వారిని దర్శించుకోవాలని ఆయన కోరారు.

విశ్రాంత ఉద్యోగులు పోరాటాలకు సిద్ధం కావాలి

రాజంపేట, న్యూస్‌టుడే : ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాల కోసం అవసరమైతే పోరాటానికి అందరూ సిద్ధంగా ఉండాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగ పెన్షనర్ల సంఘం రాష్ట్ర నాయకుడు గురురాజావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక తోట కళ్యాణ మండపంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 72 సంవత్సరాలు దాటిన 65 మంది సీనియర్ పెన్షనర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు వేణుగోపాలనాయుడు, నాయకులు పి.వి.రమణ, శ్రీనివాసులు, కె.ఆర్.శంకర్, రామచంద్రయ్య, ఆర్.ఎన్.ఉమామహేశ్వరరావు, శంకర్‌నాయుడు, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులను సత్కరిస్తున్న ఆ సంఘ నాయకులు

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి, న్యూస్‌టుడే : రాయచోటిలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. అర్జీదారులు అర్జీలను మీకోసం.ఏపీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను పరిగణించి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు. మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారం కాని అర్జీలను కలెక్టరేట్‌కు తీసుకురావచ్చన్నారు. గతంలో ఇచ్చిన అర్జీల పరిష్కార స్థితిని తెలుసుకొనేందుకు నం:1100కు కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు

రక్తదానం చేస్తున్న దాత

రాజంపేట, న్యూస్‌టుడే : రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో అది ఎంతోమంది ప్రాణాలను కాపాడుతుందని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు తెలిపారు. రాజంపేట పట్టణం ఉస్మానగర్‌లోని ఫ్యూచర్‌మైండ్ పాఠశాలలో ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో రక్తదానం నిర్వహించారు. యువకులు, పెద్దలు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి చొరవతో వెలిగల్లుకు కృష్ణా జలాలు

మాట్లాడుతున్న తెదేపా యువ నాయకుడు చెన్నకృష్ణారెడ్డి, నాయకులు

రామాపురం, న్యూస్‌టుడే : హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా వెల్లిగల్లు జలాశయంలోని ఆదివారం కృష్ణా జలాలు చేరడంతో నియోజకవర్గంలోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెదేపా యువ నాయకుడు చెన్నకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి సాగునీరు లేక అన్నదాతలు అనేక ఇబ్బందులు పడుతున్న సమయంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఫలితంగా నీటి పారుదల శాఖ అధికారులు హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువలో స్వల్ప అడ్డంకులు తొలగించుకుంటూ ప్రయోగాత్మకంగా ఆదివారం హంద్రీనీవా ప్రధాన కాలువ 482.50 కి.మీ. నుంచి లాకులు తీసుకుంటూ వెల్లిగల్లు ప్రాజెక్టులోకి 100 క్యూసెక్కుల నీరు విడుదల చేశారన్నారు. ఈ రోజు నియోజకవర్గంలోని రైతులకు శుభ దినమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ నాయుడు, సుజాత, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

అధికారులు న్యాయం చేయాలని బాధితుల విన్నపం

మాట్లాడుతున్న స్థలాల కొనుగోలుదారులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వ అధికారులు తమకు న్యాయం చేయాలని పట్టణ పరిధిలోని లక్ష్మీనగర్‌లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసిన వారు కోరారు. తులసీ ఎడ్యుకేషనల్ అకాడమీ పాఠశాల యజమాని తులసి ఆధ్వర్యంలో కొనుగోలుదారులందరూ ఆదివారం స్థానిక బత్యాల భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని సర్వే నం: 5, 7, 13లో ఉన్న స్థలాలను 110 మంది కొన్నారని చెప్పారు. 2017 సంవత్సరం నుంచి కొందరు ఆ భూమిలో తమకూ హక్కు ఉందంటూ రావడం మొదలు పెట్టారని తెలిపారు. ఈ విషయాలపై రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆశ్రయిస్తూనే ఉన్నా ఇప్పటికీ తమ సమస్య పరిష్కారం కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికారులను కలిసి తమ సమస్యను చెప్పుకోవడంతో రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి తమకు భూములు చూపెట్టారని తెలిపారు. అక్కడ పనులు చేపడితే ఊరంతా కలిసి దౌర్జన్యం చేసి తమపై దాడులకు తెగబడుతున్నారని, చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం కలగజేసుకుని సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

అన్నమయ్య.. నీ పేరును కాపాడుకో!

బోయనపల్లి అన్నమయ్య విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నేతలు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే : అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేట ప్రకటించాలని, అన్నమయ్య జిల్లా లేకుండా చేయడం మంచిది కాదని రాజంపేట జేఏసీ నేతలు, ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం రాజంపేట మండలంలో పరిధిలోని అన్నమయ్య విగ్రహం వద్ద మోకాళ్లపై కూర్చొని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ అన్నమయ్య నీ పేరుతో ఉన్న జిల్లాను కాపాడుకో అంటూ నినాదాలు చేశారు. రాజంపేట జిల్లా కేంద్రంగా ప్రకటిస్తే రాజంపేట, రాయచోటి, రైల్వే కోడూరు నియోజకవర్గాల ప్రజలకు అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రాజంపేట జేఏసీ నేతలు, విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగుల రిలే దీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర జనసేన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర

దివ్యాంగుల రిలే దీక్ష..

రైల్వేకోడూరు: రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం రైల్వేకోడూరు అధ్యక్షుడు నెల్లూరు ధనుంజయ డిమాండు చేశారు. ఆయనతోపాటు సంఘం సభ్యులు సుబ్బనరసారెడ్డి, సుబ్బరాయుడు, తిరుమలరెడ్డి, నరసయ్య, వెంకటేశ్వర్లు తదితరులు రైల్వేకోడూరులో జరుగుతున్న జిల్లా సాధన రిలే నిరాహార దీక్షలో ఆదివారం పాల్గొన్నారు. దీక్షకు రాష్ట్ర జనసేన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రాజంపేట పార్లమెంటు తెదేపా ఉపాధ్యక్షుడు కొమ్మా శివకుమార్ హాజరై తమ మద్దతు తెలిపారు.

సీఎం దృష్టికి ప్రజల మనోభావాలు

రాయచోటి: రాయచోటిని అన్నమయ్య జిల్లా కేంద్రంగా కొనసాగించాలని సీఎం చంద్రబాబునాయుడు కోరుతామని తెదేపా రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. రాయచోటి ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవిస్తూ రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం ఇచ్చిన హామీతో ఈ ప్రాంత ప్రజలు గత ఎన్నికల్లో తెదేపాకు ఓట్లేసి గెలిపించారన్నారు. విజయవాడకు వెళ్లి తాను సీఎం చంద్రబాబుతో మాట్లాడి ప్రజల మనోభావాలు తెలియజేసి కొనసాగింపు కోసం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

రాయచోటి బంద్ ప్రశాంతం

రాయచోటి: రాయచోటిని జిల్లా కేంద్రంగా ఉంచాలని కోరుతూ ఆదివారం సాయంత్రం తెదేపా ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ కొనసాగింది. తెదేపా నియోజకవర్గ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీగా కదిలారు. రాయచోటి జిల్లా కేంద్రంగా కొనసాగడానికి అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. సీఎం ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటారని ఎవరూ ఆందోళన చెందవద్దని ఆయన తెలియజేశారు. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితిని అదుపు చేశారు. కార్యక్రమంలో ఐకాస నాయకులు శ్రీనివాసరాజు, పి.మదన్‌మోహన్‌రెడ్డి, ఖాదర్‌వలీ, రవీంద్రారెడ్డి, ఎన్జీవో సంఘ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకోని రోళ్ల మడుగు నీటి పథకం

● గ్రామాలకు తాగునీటి కష్టాలు

రోళ్లమడుగు సంపు

వీరబల్లి, న్యూస్‌టుడే : రోళ్లమడుగు నీటి పథకం మరమ్మతులకు గురై పది రోజులు కావస్తోంది. ఫలితంగా ఆ నీటిపై ఆధారపడి ఉన్న గ్రామాల ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. చెయ్యేరు నదిలో పైపులైన్, మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. వాటిని త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామాల్లో మాత్రం నీటి పథకంలో సమృద్ధిగా నీరు ఉన్నప్పటికీ కేవలం అరకొర మరమ్మతుల కారణంగా నీరందించలేని పరిస్థితి నెలకొంది. వీరబల్లి మండలంతో పాటు రాయచోటికి, రామాపురం వరకు ఈ పథకం ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని త్వరితగతిన మరమ్మతులు చేసి నీటిని సరఫరా చేసేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు

పుల్లంపేట, న్యూస్‌టుడే : పుల్లంపేట పంచాయతీలో వెలగని వీధి దీపాలకు ఆదివారం పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు రాత్రి వేళ ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి కరణశ్రీ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందితో వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు. కాలిపోయిన దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించారు. పంచాయతీ పరిధిలో ఎక్కడైనా వీధి దీపాలు వెలగకపోతే తమ దృష్టికి తెస్తే మరమ్మతులు చేయిస్తామని కార్యదర్శి కరణశ్రీ తెలిపారు. సర్పంచి శ్రీనివాసులరెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

కేకు కోసి సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే : దేశం అభివృద్ధి పథంలో పయనించాలంటే కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని డీసీసీ అధికార ప్రతినిధి పఠాన్ మన్సూర్ అలీఖాన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో నాయకులు కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ప్రజల మధ్య మత విద్వేశాలు రెచ్చగొట్టి, రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి పూర్వ వైభవం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు అమీర్, బాబా సర్దార్, దర్బార్ బాష, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవే పరమావధి

మొక్క నాటుతున్న మానవతా సభ్యులు

సుండుపల్లి, న్యూస్‌టుడే : సర్వేజనా సుఖినోభవంతు అన్న సూక్తిని ఆదర్శంగా తీసుకుని తమ సంస్థ సేవా కార్యక్రమాలు చేపడుతోందని మానవతా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సుండుపల్లి మానవతా సంస్థ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవతా సభ్యులు సేవా భావంతో అవసరమైన వారికి ఆపద సమయంలో అండగా ఉండటం, ఆత్మీయ, నైతిక సహకారం అందించడం, విద్యార్థులలో నైతిక విలువల పెంపు, ప్రతిభా ప్రోత్సాహం వంటి పలు వినూత్న కార్యక్రమాల ద్వారా తనదైన ముద్ర వేస్తున్నారన్నారు. సంస్థ ప్రస్తుతం 120 శాఖలతో దాదాపు 90వేల మంది సభ్యులతో కొనసాగుతోందన్నారు. కుల, మత, ప్రాంత విభేదాలకు తావు లేకుండా సేవే పరమావధిగా ముందుకు నడవాలన్నారు. సుండుపల్లి శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కాలమానిని ఆవిష్కరించారు. సుండుపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కనాటారు. సంస్థ మండల గౌరవ సలహాదారు జె.రవీంద్రనాయుడు రహదారి ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకుని ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమాలలో సంస్థ కేంద్ర డైరెక్టరు ఎస్.సహదేవరెడ్డి, ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, కోశాధికారి జె.హరికుమార్, సుండుపల్లి, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి సంస్థల అధ్యక్షుడు ఎస్.లక్షుమయ్యనాయుడు, ఎ.జయచంద్రారెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, సుండుపల్లి ఛైర్మన్ ఎం.గంగిరెడ్డి, కన్వీనరు ఆర్.కృష్ణమరాజు, కో కన్వీనరు ఆర్.నాగేశ్వరావు, డైరెక్టర్లు ఎన్.రవీంద్రనాథరెడ్డి, ఎస్.ఆరీఫుల్లా, వై.శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదం.. శీతాకాలంలో రోగులకు వరం

భారతీదేవి, వైద్యురాలు

పుల్లంపేట, న్యూస్‌టుడే: పొగమంచుతో చలి-పులి చంపేస్తోంది. రోజురోజుకు జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలిగాలుల ప్రభావంతో శ్వాసకోశ, చర్మవ్యాధులు, కీళ్లు, వాత నొప్పులు వంటి సమస్యలు ఎక్కువగా తలెత్తుతున్నాయి. చిన్నారులు, వృద్ధులు ఆరోగ్యపరంగా ఇబ్బంది పడుతున్నారు. చిన్నపాటి జాగ్రత్తలు తీసుకోవడం, ఆహార శైలిని మార్చుకుంటే చలికాలంలో వచ్చే రుగ్మతల బారి నుంచి తప్పించుకోవచ్చని ఆయుష్ విభాగం ఆయుర్వేద వైద్యాధికారిణి భారతీదేవి సూచిస్తున్నారు. వివిధ ఆరోగ్య సమస్యలకు ఆమె ఆయుర్వేద పరిష్కారం చూపారు. ఆ వివరాలివి.

సమస్య: చలిగాలులతో జలుబు, దగ్గు, ఉబ్బసం, న్యుమోనియా తదితర శ్వాసకోశ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి.

పరిష్కారం: శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారు ఉదయం లేచిన వెంటనే గోరు వెచ్చటి నీరు తాగాలి. అందుబాటులో ఉంటే నిమ్మరసం కలిపి తీసుకోవడం ఉత్తమం. టీలో అల్లం, మిరియాలు, తులసి వంటివి వేసుకుని తాగినా కొంత ఉపశమనం కల్గుతుంది. ఐస్‌క్రీమ్, చల్లని పానీయాలు, ఫ్రిజ్‌లో నిల్వచేసే ఆహార పదార్థాలను దూరం పెట్టాలి. ఉదయం, సాయంత్రం పొగమంచు కురిసే సమయాల్లో బయటకు రాకపోవడమే మంచిది. మాస్కులు, వెచ్చదనం ఇచ్చే వస్త్రాలు దరించాలి.

?: చర్మం పొడిబారి, పొలుసులుదేరిపోతుంటుంది. పెదాలు, కాళ్లు, చేతులు పగళ్లుదేరుతుంటాయి.

✓: శరీరం తేమగా ఉండేందుకు నెయ్యి, వెన్న, నువ్వుల నూనె, కొబ్బరినూనె, గ్లిజరిన్ ఉండే సబ్బులు వంటివి ఉపయోగించాలి. శరీరానికి కొబ్బరి నూనె, వెన్న, నెయ్యి పూసుకోవడంతో కొంతమేర పగుళ్లను నివారించుకోవచ్చు.

?: కీళ్ల నొప్పులు ఎక్కువగా ఇబ్బంది పెడుతున్నాయి.

✓: ఒంటికి నూనె రాసుకుని అరగంట తర్వాత గోరు వెచ్చని నీటితో స్నానం చేస్తే ఉపశమనం కల్గుతుంది. మందులు వాడుతూనే నిత్యం యోగా, వ్యాయామాల ద్వారా కూడా కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

ఈనాడు
ఏలూరు
సోమవారం డిసెంబరు 29, 2025

మహిళల మద్దతుతోనే ప్రగతి

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

ఈనాడు డిజిటల్, భీమవరం: 'పీఎం లంక గ్రామాన్ని నేను దత్తత తీసుకోలేదు. ఆ గ్రామ ప్రజలే నన్ను దత్తత తీసుకున్నారు. ఇక్కడి మహిళల మద్దతుతోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. పదేళ్ల కిందట తుపాను, వరదల సమయంలో సముద్రం కోత నుంచి ఈ ప్రాంతాన్ని ఎలా రక్షించా లనే ఆలోచన ఉండేది. ఇప్పుడు ఏఐలో శిక్షణ ఇచ్చే కేంద్ర బిందువుగా మారింది.' అని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆదివారం ఆమె పశ్చిమగోదావరి జిల్లా పీఎం లంకలో పర్యటించారు. స్థానిక డిజిటల్ భవనంలో సైయెంట్ సంస్థ ఆధ్వర్యంలో నెలకొల్పిన ఏఐ, ఫ్యూచర్ స్కిల్ హబ్, జడ్పీ ఉన్నత పాఠశాలలో యూనియన్ బ్యాంకు సహకారంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లను ప్రారంభించారు. విజినెట్ బార్డర్, డిజిటల్ ఇండియా చిత్రలేఖన పోటీలు సందర్శించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధాన మంత్రి మన్ కీ బాత్ వీక్షణ అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. 146 మత్స్యకార కుటుంబాలకు పీఎం ఆవాస్ యోజనలో ఇళ్లు మంజూరు చేసి, పూర్తిచేయాలని కలెక్టర్‌కి సూచించారు. అనంతరం రామకృష్ణ మఠం (రాజమహేంద్రవరం) సహకారంతో మత్స్యకార లబ్ధిదారులకు బోట్లు అందజేశారు.

విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు

రాష్ట్రానికి ఆర్థిక భరోసా.. రాష్ట్రానికి ఆర్థిక భరోసా కల్పించేలా నిర్మలా సీతారామన్ కృషి చేస్తున్నారని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. విశాఖ రైల్వే జోన్‌ను కూటమి ప్రభుత్వంలోనే సాధించారని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆలోచనలను నిర్మలా సీతారామన్ ఆచరణలోకి తెస్తున్నారన్నారు. 2014లో బియ్యపుతిప్ప వద్ద హార్బర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభం కాలేదని, దీని నిర్మాణానికి, నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే నాయకర్ కోరారు. సైయెంట్ లిమిటెడ్ వ్యవస్థాపక ఛైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధాకృష్ణ, పులపర్తి రామాంజనేయులు మాట్లాడారు.

★ దేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా తీర్చిదిద్దడంతోపాటు గ్రామీణ జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా కేంద్రం కృషి చేస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి, ఎస్పీ అద్నాన్ నయిం అస్మి, కూటమి నాయకులు మంతెన రామరాజు, కొత్తపల్లి సుబ్బారాయుడు, కొవ్వలి యతిరాజా రామ్మోహన్‌నాయుడు, పోతుర్తి రామరాజు, బోగిరెడ్డి ఆదిలక్ష్మి, అయినపూడి శ్రీదేవి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో 5 వేల మందికి ఉపాధి కల్పించేలా ఆక్వా, హస్తకళలు, ఇతర రంగాల్లో శిక్షణ ఇచ్చేలా 'మేవ్‌హబ్' సంస్థతో ఎంవోయూ చేసుకున్నారు.

నేడు యథావిధిగా 'మీ కోసం'

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీ కోసం) నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వరరావు తెలిపారు. ఈ నెల 30న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఏర్పాట్ల పరిశీలనకు కలెక్టర్ వెట్రిసెల్వి ద్వారకాతిరుమల వెళ్లనున్నందున 'మీ కోసం'కు హాజరు కానున్నారు. జేసీ అభిషేక్ గౌడ, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. మండల, పురపాలక, డివిజన్ కార్యాలయాల్లోనూ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం

ద్వారకాతిరుమలలో ప్రత్యేక ఏర్పాట్లు

క్యూ లైన్లు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ద్వారకాతిరుమల శ్రీనివాసుడు ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ నెల 30న ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

మార్గదర్శకాలు
- ☛ స్వామివారి ఉత్తర ద్వార దర్శనం చేసుకోవడానికి రూ.500 టికెట్టు తీసుకున్న వారు జంట గోపురాల నుంచి ప్రారంభమై నూతన క్యూకాంప్లెక్స్ నుంచి దక్షిణ రాజగోపురం గుండా వెళ్తారు.
- ☛ ఉచిత, రూ.100, రూ.200 టికెట్టు తీసుకున్న భక్తులకు షాపింగ్ కాంప్లెక్స్ వెనుక నుంచి ప్రారంభమై తాత్కాలిక క్యూకాంప్లెక్స్ నుంచి ఉత్తర ద్వారం నుంచి స్వామి దర్శనం చేసుకుంటారు.
- ☛ ఆన్‌లైన్‌లో, మన మిత్ర యాప్ ద్వారా రూ.100, రూ.200 టికెట్లు బుక్ చేసుకున్న భక్తులకు తూర్పు వైపున అన్నదాన విగ్రహం వద్ద నుంచి ప్రారంభమై ఉత్తర ద్వారం గుండా వెళ్తారు.

భక్తులకు సౌకర్యాలు
- ➤ దర్శన క్యూలైన్లలోనే మొబైల్ టికెట్టు కౌంటర్లు ఏర్పాటు చేశారు.
- ➤ భక్తుల రద్దీ దృష్ట్యా పోలీస్ సహకారంతో ప్రత్యేక బందోబస్తు, ప్రైవేటు సెక్యూరిటీని విధుల్లో ఉంచుతున్నారు.
- ➤ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స కేంద్రాల్ని తెరిచారు.
- ➤ దీక్షా విరమణ చేసే గోవింద స్వాములకు ప్రసాదాల కౌంటర్ల పక్కన హోమ గుండం ఏర్పాటు చేశారు.
- ➤ క్యూలైన్లలో పిల్లలకు పాలు, భక్తులకు మంచినీరు, అల్పాహారం అందిస్తారు.

ఆకలా.. తిను అడగొద్దు మెనూ!

సంక్షేమ వసతి గృహాల్లో అమలవ్వని ఆహార పట్టిక

పరిశీలన

పెదవేగి గురుకుల పాఠశాలలో అయిదో తరగతి నుంచి ఇంటర్ వరకు 650 మంది విద్యార్థులున్నారు. ఆదివారం 50 మంది మాత్రమే ఉండగా.. వారికి ఉదయం బన్సీరవ్వ ఉప్మా, పంచదార, మధ్యాహ్నం తెల్లన్నం, బంగాళదుంప కూర, సాంబారు, మజ్జిగ వడ్డించారు. అన్నం ముద్దగా ఉండటంతో తినేందుకు విద్యార్థులు అవస్థలు పడ్డారు.

ఉంగుటూరు, ఏలూరు వన్‌టౌన్, పోలవరం, కొయ్యలగూడెం గ్రామీణ, పెదపాడు- న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ఎక్కువగా పేద కుటుంబాల పిల్లలే చదువుకుంటున్నారు. వారికి వారానికోసారైనా కడుపు నిండా, పోషకాహారంతో భోజనం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఆదివారం ప్రత్యేక ఆహార పట్టిక అమలు చేస్తోంది. జిల్లాలో ఈ పట్టిక ఎక్కడా సక్రమంగా అమలు కావడం లేదు. క్రిస్మస్ సెలవులకు వెళ్లిన విద్యార్థులు చాలా మంది ఇంకా వసతి గృహాలకు రాలేదు. ఉన్న కొద్ది మందికే అరకొర మెనూ అమలు చేసి చేతులు దులుపుకొంటున్నారు. జిల్లాలోని పలు సంక్షేమ వసతి గృహాలను 'న్యూస్‌టుడే' బృందం పరిశీలించింది.. అసలు విషయం వెలుగు చూసింది.

పోలవరం ఎస్సీ బాలుర వసతి గృహంలో 30 మందికి ఆరుగురు పిల్లలు మాత్రమే ఉన్నారు. బిర్యానీ ఊసే లేదు. తెల్లన్నం, కోడి కూర, చట్నీతో సరిపెట్టేశారు.

ఏలూరు ఆమీనాపేట బీసీ బాలికల వసతి గృహం-1లో మొత్తం 84 మంది విద్యార్థినులున్నారు. ఆదివారం 46 మంది మాత్రమే వసతి గృహంలో ఉన్నారు. వారికి మధ్యాహ్నం వడ్డించిన వెజ్ బిర్యానీ ఉప్పగా తేలిపోయింది. కొద్దిగా కోడి కూర వండారు. పెరుగు చట్నీ నీళ్లను తలపించింది. సగం మంది పిల్లలకు కడుపు నిండా భోజనం పెట్టలేదు. ఆర్‌ఓ ప్లాంటు పని చేయకపోవడంతో పిల్లలు ఇబ్బంది పడ్డారు.

ఉంగుటూరు మండలం బొమ్మిడి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో 51 మంది విద్యార్థినులున్నారు. చాలా మంది క్రిస్మస్ సెలవులకు ఇళ్లకెళ్లారు. ప్రస్తుతం 10 మంది మాత్రమే వసతి గృహంలో ఉన్నారు. వారికి ఆదివారం ఉదయం ఇడ్లీ.. మధ్యాహ్నం తెల్లన్నం, కోడిగుడ్డు పులుసు, చారుతో మమ అనిపించారు.

ఆహార పట్టిక ప్రకారం ఆదివారం వడ్డించాల్సిన వంటకాలు
ఉదయం(అల్పాహారం): పూరి, బంగాళదుంప, బొంబాయి చట్నీ, ఉడక పెట్టిన గుడ్డు
మధ్యాహ్నం(భోజనం): కోడి కూర, బిర్యానీ, పెరుగు చట్నీ, గోంగూర చట్నీ

'నాణ్యతలో రాజీ పడకుండా ఆహార పట్టికను విధిగా అమలు చేయాల్సిందే. ఎక్కడైనా ఇబ్బందులుంటే పరిశీలించి చర్యలు తీసుకుంటాం' అని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు విశ్వమోహనరెడ్డి తెలిపారు.

వసతి గృహాల వివరాలు ఇలా..

స్థాయి	ఎస్సీ	బీసీ
పాఠశాల	44	12
కళాశాల	17	16
విద్యార్థులు	5,464	2,280

పక్షుల కేంద్రంలో కుటుంబ సభ్యులతో హైకోర్టు న్యాయమూర్తి

కొల్లేరు అందాలు అద్భుతం

జస్టిస్ దుర్గాప్రసాద్

ఆటపాక(కైకలూరు), న్యూస్‌టుడే: కొల్లేరు సహజసిద్ధ ప్రకృతి అందాలు అద్భుతంగా, ఆహ్లాదకరంగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్ అన్నారు. ఆదివారం ఆటపాక పక్షుల సందర్శన కేంద్రాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. బోటు షికారు చేసి చెట్ల, గట్లపై సేదతీరుతున్న పలు జాతుల విదేశీ విహంగాలను దగ్గర నుంచి వీక్షించారు. అనంతరం పక్షుల మ్యూజియాన్ని సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన కొల్లేరు మ్యాప్‌ను తిలకించి ఆటపాక ఆవిర్భావం నుంచి కొల్లేరు విస్తీర్ణం, పరిధిలోని మండలాలు, గ్రామ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కృత్రిమ నమూనా పక్షులు, మత్స్యకారులు, తాటి దోనెలను పరిశీలించి చరవాణితో చిత్రాలు తీసుకున్నారు. పార్కులో కుటుంబ సభ్యులతో సందడిగా గడిపారు. ఆయన వెంట కైకలూరు సివిల్ కోర్టు సీనియర్ న్యాయమూర్తి వీవీఎన్‌వీ లక్ష్మి తదితరులు ఉన్నారు.

ఈ-ఆటో కదల్లేదు

'ఈ' ఆటో కదలడం లేదు. వైకాపా ప్రభుత్వ హయాంలో క్లాప్ కార్యక్రమంలో భాగంగా జంగారెడ్డిగూడెం పురపాలక సంఘానికి 9 ఆటోలు ఇచ్చారు. పురపాలక నిధులు వీటి కోసం రూ.50 లక్షల వరకు వెచ్చించారు. అయినా కొన్ని నాటి నుంచి ఇవి చెత్త సేకరణకు ఉపయోగపడ లేదు. ప్రారంభంలోనే రెండింటికి సాంకేతిక సమస్య వచ్చి కదలలేదు. మిగిలినవి కొన్ని నెలలు పనిచేసినా.. ఆ తర్వాత మరమ్మతులు మొదలయ్యాయి. ఆటోలు సరఫరా చేసిన సంస్థలు ఒక్కసారి కూడా సర్వీసింగ్ చేసేందుకు వచ్చిన దాఖలాలు లేవు. మళ్లీ ప్రజా ధనంతోనే ఛార్జింగ్ కిట్‌లు కొని, మరమ్మతులు చేయించారు. అయినా ఇవి రోడ్డు ఎక్కలేదు. దీంతో వాటిని పురపాలక కార్యాలయంలో ఇలా పార్కు చేశారు. **- న్యూస్‌టుడే, జంగారెడ్డిగూడెం**

ఆధ్యాత్మికత విరిసింది.. హేలాపురి మురిసింది

పవరుపేట: మేడలో అమ్మవార్లకు ఊరేగింపుగా తీసుకొస్తున్న సారె

ఏలూరు గంగానమ్మ జాతరలో అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. మేడల వద్ద భక్తులు బారులు తీరడంతో నగరంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఏలూరు తూర్పు, పడమర, దక్షిణ వీధులతోపాటు పవరుపేటలోని పలు ప్రాంతాల్లో జాతర సంబరాలు అంబరాన్నంటాయి. ఉదయం నుంచే పలు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణల మధ్య నైవేద్యాలు, సారెలను మహిళలు నగర వీధుల్లో ఊరేగించారు. అనంతరం వాటిని అమ్మవార్లకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా జాతర కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. **- న్యూస్‌టుడే, ఏలూరు ఆధ్యాత్మికం**

యువతా మేలుకో.. హక్కు దక్కించుకో

మూణ్నెల్లకోసారి కొత్త ఓటర్ల నమోదు

ఏటా జనవరి 1 నాటికి పద్దెనిమిదేళ్లు నిండిన వారికి ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. దీన్ని సవరిస్తూ ఏడాదిలో నాలుగు సార్లు అవకాశం కల్పిస్తోంది కేంద్ర ఎన్నికల సంఘం. జనవరి 1తోపాటు ఏప్రిల్ 1, జులై 1, అక్టోబరు 1 నాటికి 18 ఏళ్ల వయసు నిండిన వారంతా ప్రతి మూణ్నెల్లకోసారి దరఖాస్తు చేసుకునే అవకాశం వినియోగించుకోవచ్చు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

పెరగనున్న పోలింగ్ కేంద్రాలు.. జిల్లాలో పోలింగ్ కేంద్రాలు పెరగనున్నాయి. ప్రస్తుతం 1,744 ఉండగా.. ఓటర్ల సంఖ్య పెరగడంతో కొత్తగా మరో 137 కేంద్రాలు ఏర్పాటు చేసేలా జిల్లా అధికారులు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపారు. వీటితో కలిపితే మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 1,881 వరకు పెరగనుంది. ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూలు ప్రకారం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. వచ్చే ఏడాది జనవరిలో తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు.

- న్యూస్‌టుడే, ఏలూరు కలెక్టరేట్

దూసుకుపోతున్నారు..!

మైనర్ల డ్రైవింగ్‌తో పెరుగుతున్న ప్రమాదాలు

- ➠ నూజివీడుకు చెందిన పదిహేనేళ్ల బాలుడు వారం రోజుల కిందట ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్తూ.. మరో వాహనాన్ని ఢీకొట్టాడు. అదృష్టవశాత్తు స్వల్ప గాయాలతో బయట పడ్డారు.
- ➠ ఆగిరిపల్లికి చెందిన 13 ఏళ్ల బాలుడు పది రోజుల కిందట ద్విచక్ర వాహనంపై వెళ్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఆ బాలుడితోపాటు వారి తల్లిదండ్రులను పోలీసులు మందలించి, కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.
- ➠ అడవినెక్కలంకు చెందిన ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ఇటీవల ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో మరణించాడు.

నూజివీడు, న్యూస్‌టుడే: ఇటీవల జిల్లాలో రహదారి ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఆయా ఘటనల్లో బాధితులుగా మైనర్లు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. బాధితుల కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. పిల్లలు అడిగారని వారిపై ఉన్న అతి ప్రేమ, గారాబంతో తల్లిదండ్రులు వాహనాలు ఇస్తూ.. పరోక్షంగా ప్రమాదాలకు కారణమవుతున్నారు. కొందరు ద్విచక్ర వాహనాలపై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ ప్రజలకు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. సైలెన్సర్‌తో పెద్దపెద్ద శబ్దాలు చేస్తూ హడావుడి చేస్తున్నారు.

నుజ్జునుజ్జయిన ద్విచక్ర వాహనం

చర్యలు ఇలా..
- ● బాలలు వాహనాలు తీస్తే పోలీసులు తీవ్రంగా పరిగణించి భారీగా జరిమానా విధిస్తున్నారు.
- ● వారితోపాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు.
- ● బండి యజమానిపై కేసు నమోదు చేస్తారు.
- ● లైసెన్సుల రద్దు, వాహనం సీజ్ తదితర చర్యలకు అవకాశం ఉంది.
- ● బీమా సంస్థలు నష్టపరిహారం కూడా చెల్లించవు.

అవగాహన కల్పిస్తున్నాం.. మోటారు వాహనాల చట్టం ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా లైసెన్సు పొందాలి. వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తి మైనర్ అయితే వాహన యజమానులే బాధ్యులవుతారు. **- కేవీవీఎన్‌వీ ప్రసాద్, డీఎస్పీ, నూజివీడు**

పట్టిసీమ.. పెదరావిగూడెం

2027 పుష్కరాల్లో జిల్లాలో ఇవే రద్దీ ఘాట్లుగా గుర్తింపు

కుక్కునూరు, జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పుష్కరాల ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు. జిల్లాలో 43 స్నాన ఘట్టాలను గుర్తించారు. ఇందులో అత్యధికంగా పోలవరం మండలంలో 35 ఘాట్లు ఏర్పాటు చేస్తున్నారు. 2015 పుష్కరాల్లో ఎక్కడైతే స్నాన ఘట్టాలు ఉన్నాయో, వచ్చే పుష్కరాల్లో కూడా అదే ప్రాంతాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇక్కడే అత్యధికంగా.. ప్రధానంగా పోలవరం మండలం పట్టిసీమ రేవుకు అత్యధికంగా భక్తుల తాకిడి ఉంటుందని అధికారుల అంచనా. ఆ తర్వాత కుక్కునూరు మండలం పెదరావిగూడెం స్నాన ఘట్టానికి అత్యధికంగా వస్తారని అంచనా వేస్తున్నారు. వేలేరుపాడు మండలం కటుకూరు రేవుకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మొత్తం 43 స్నాన ఘట్టాలు ఏర్పాట్లు చేస్తున్నా.. వీటికి ప్రాధాన్యం ఎక్కువగా ఇవ్వాల్సి ఉంటుంది. రాజమహేంద్రవరం, కొవ్వూరు రేవులలో రద్దీ అధికంగా ఉన్న రోజుల్లో భక్తులు పట్టిసీమ ఎంచుకుంటారు. అంతేగాక పట్టిసీమలో ప్రసిద్ధ వీరేశ్వరస్వామి ఆలయం ఉండటం కూడా ఇక్కడకు ఎక్కువ మంది రావడానికి మరో ప్రధాన కారణం.

కుక్కునూరు మండలం పెదరావిగూడెంలో 2015 పుష్కరాలలో భక్తుల రద్దీ

ప్రత్యామ్నాయంగా.. ఇక పెదరావిగూడెం స్నాన ఘట్టం, భద్రాచలం సమీపంలో, ఆంధ్రా-తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ఉంది. భద్రాచలంలో భక్తుల తాకిడి ఎక్కువైన సమయంలో, ప్రత్యామ్నాయంగా పెదరావిగూడెం స్నాన ఘట్టానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వస్తుంటారు.

ఏర్పాట్లకు ప్రణాళికలు.. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 2015లో నిర్మించిన స్నాన ఘట్టాల మెట్లు, మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకొనే గదులు, జల్లు స్నానాల ఏర్పాట్లు అన్నీ పాడయ్యాయి. వీటికి మరమ్మతులు చేయడంతోపాటు, కొత్త నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

సిరిమువ్వ.. సిరులొలికే నవ్వా!

ఏలూరు వైఎంహెచ్ఏ హాలులో మూడ్రోజులపాటు సాగిన అభినయ నృత్య భారతి వార్షికోత్సవం, జాతీయ స్థాయి నృత్యోత్సవాలు, నృత్య పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి కూచిపూడి, జానపద, బృంద నృత్య పోటీల్లో కళాకారులు ప్రదర్శనలిచ్చారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. సంస్థ తరపున వారికి నృత్య కౌముది అవార్డులు ప్రదానం చేశారు. కూచిపూడి నృత్య గురువు డాక్టర్ పసుమర్తి శేషుబాబును భరత కళాప్రపూర్ణ కోరాడ నరసింహారావు మెమోరియల్ నృత్య రంగ సేవా తపస్వి అవార్డుతో సత్కరించారు. **- న్యూస్‌టుడే, ఏలూరు గ్రామీణ**

ముగిసిన అతిరుద్ర మహా యజ్ఞం

నిడమర్రు, న్యూస్‌టుడే: మందలపర్రులోని ఉమా నీలకంఠేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో వారం రోజులపాటు కొనసాగిన అతిరుద్ర మహా యజ్ఞం ఆదివారం పూర్ణాహుతితో సమాప్తమైంది. 66 మంది వేద పండితులు క్రతువులో భాగస్వాములయ్యారు. చివరి రోజు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. బ్రహ్మశ్రీ వెంకట చాగంటి(యూఎస్ఏ) ఆశీస్సులతో.. యజ్ఞ దాత అక్కిన ప్రగడ రాఘవేంద్ర సాయిశర్మ, పూడి పెద్ది నరసింహశర్మ, వింజమూరి సత్యనారాయణ పర్యవేక్షణలో క్రతువు సాగింది. యజ్ఞంలో 35 టన్నుల రావి సమిధలు, 110 రకాలున్న 400 కిలోల సుగంధ ద్రవ్యాలు, 800 కిలోల ఆవు నెయ్యి, 15 క్వింటాళ్ల బియ్యంతో తయారు చేసిన అవిసు వినియోగించారు. యజ్ఞం సందర్భంగా వారం రోజులపాటు మందలపర్రులో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

వారేం చేస్తారు.. బయటకే రాస్తారు..

చింతలపూడిలో గర్భిణులకు స్కానింగ్ సేవలు దూరం

'ప్రగడవరం గ్రామానికి చెందిన ఎం.మౌనిక చింతలపూడి ప్రాంతీయ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్నారు. మౌనిక గర్భంలో బిడ్డ ఎదుగుదల, అవయవాల పనితీరు తెలుసుకొనేందుకు ఇక్కడి గైనకాలజిస్ట్ స్కానింగ్‌కు జిల్లా ఆసుపత్రికి సిఫార్సు చేశారు. ఏలూరులో ఖాళీ లేకపోవడంతో రూ.2 వేలు ఖర్చు పెట్టి ప్రైవేటు సెంటర్‌లో స్కానింగ్ చేయించుకున్నారు.'

చింతలపూడి, న్యూస్‌టుడే: చింతలపూడి ప్రాంతీయ ఆసుపత్రిగా వర్గోన్నతి పొందినా.. టిఫా స్కానింగ్ లేక గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. వారికి 18 నుంచి 22 వారాల మధ్యలో తప్పనిసరిగా స్కానింగ్ చేయించాల్సి ఉంటుంది. ఇక్కడ అందుబాటులో లేక.. ఏలూరు, జంగారెడ్డిగూడెం, సత్తుపల్లి ప్రైవేటు కేంద్రాలకు వెళ్లి రూ.1500 నుంచి రూ.2 వేలు సొంత ఖర్చుతో స్కానింగ్ తీయించుకుంటున్నారు.

సాధారణ వాటికే పరిమితం.. చింతలపూడి ఆసుపత్రిలో కొద్ది నెలల నుంచి రేడియాలజిస్ట్ సేవలందిస్తున్నారు. ఆయన టిఫా స్కానింగ్ చేసే అవకాశం ఉన్నా.. యంత్రాలు లేవు. ఫలితంగా కేవలం సాధారణ స్కానింగ్‌లకే పరిమితమవుతున్నారు.

మందులు తీసుకుంటున్న మహిళలు

పెరిగిన కేసులు.. గతంలో చింతలపూడి ఆసుపత్రిలో గైనకాలజిస్టులు లేక బయటిఆసుపత్రులకు వెళ్లేవారు. కూటమి ప్రభుత్వం రాకతో ఇద్దరు గైనకాలజిస్టులు, ఇద్దరు మత్తు వైద్యులను నియమించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో దోపిడీ తట్టుకోలేక గర్భిణులు ఏరియా ఆసుపత్రికి వెళ్తున్నారు. ఈ ఏడాది ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు 125 జరిగితే, మరో 64 మందికి శస్త్రచికిత్స ద్వారా డెలివరీ చేశారు. టిఫా స్కానింగ్ అందుబాటులోకి తేవాలని గర్భిణులు చెబుతున్నారు. 'మరికొన్ని నెలల్లో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తవుతుంది. టిఫా స్కానింగ్ సేవలు అక్కడ అందుబాటులోకి వస్తాయి.' అని సూపరింటెండెంట్ నారాయణరావు తెలిపారు.

శ్రామికుల వేతన వెతలు..!

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: ఉపాధి శ్రామికులు వేతనాల కోసం నాలుగు నెలలుగా ఎదురు చూస్తున్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి కూలీలకు వేతనాలు అందడం లేదు. రెక్కాడితేనేకాని డొక్కాడని తమకు కూలి సొమ్ములు చెల్లించాలని వారు వేడుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటికి రూ.1.29 కోట్లకు బకాయిలు పెరిగిపోయాయి. ఇవిగాక సామగ్రి కింద ఇవ్వాల్సిన బకాయిలు రూ.29.68 కోట్లు ఉన్నాయి. మొత్తం రూ.30.97 కోట్లు మేర చెల్లించాల్సి ఉంది.

2006లో ప్రారంభమైన ఉపాధి హామీ పథకం అమలు పారదర్శకం చేసేందుకు కూటమి ప్రభుత్వం పనులకు వచ్చే శ్రామికులను ఈకేవైసీ చేయడం, రెండు సార్లు మస్తర్లు వేయడం, గరిష్ఠ వేతనం రూ.307గాను, కనీసం వేతనం రూ.245గా నిర్ణయించారు. ఇప్పటి వరకు ఉన్న వంద రోజుల పని దినాలను 125 రోజులకు పెంచారు.

తగ్గిన కూలీలు.. ఉపాధి పనులకు రోజుకు కనీసం 1500కు తగ్గకుండా శ్రామికులు పనులు చేయాలని జిల్లా యంత్రాంగం లక్ష్యం సూచించగా ప్రస్తుతం కొయ్యలగూడెం మండలంలో 300 మంది వరకు మాత్రమే వస్తున్నారు. కేవలం బకాయిలు రాకపోవడం వల్లే పనులు చేసేందుకు ఆసక్తి చూపడం లేదని వేతన జీవులు చెబుతున్నారు. గతంలో వారం రోజులకు వేతనాలు వచ్చేవని ఇటీవల మరీ జాప్యం పెరిగిపోయిందని పేర్కొంటున్నారు. ఈ పరిస్థితిపై ఏపీడీ దామోదరరావు మాట్లాడుతూ ఉపాధి బకాయిలు విడుదలయ్యాయి. రెండు రోజులుగా కొన్ని గ్రామాల్లో కూలీలకు చెల్లిస్తున్నారని బ్యాంకుల వారీగా వచ్చే వారంలోగా కూలీలకు చెల్లింపులు పూర్తి అవుతుందన్నారు.

3.74 లక్షలు	జిల్లాలో జాబ్‌కార్డులు
3.19 లక్షలు	ఏక్టివ్ జాబ్‌కార్డులు
6.72 లక్షలు	వేతన జీవులు
5.52 లక్షలు	ఏక్టివ్ వేతన జీవులు

(c) eenadu

రాష్ట్ర స్థాయికి ఎంపిక

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో వర్చువల్ విధానంలో నిర్వహించిన సైన్స్ నమూనాల తయారీ పోటీల్లో జిల్లా నుంచి మూడు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయని జిల్లా సైన్స్ అధికారి సోమయాజులు తెలిపారు. పెదపాడు మండలం వట్లూరు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ నుంచి ఒకటి, ఏలూరు సీఆర్ఆర్ పబ్లిక్ స్కూలు నుంచి రెండు ప్రాజెక్టులు అర్హత సాధించినట్లు చెప్పారు. సోమ, మంగళవారాల్లో వర్చువల్ విధానంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తారని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భవన్స్ అంతర్ పాఠశాలల ఆటల పోటీలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భారతీయ విద్యాభవన్స్ అంతర్ పాఠశాలల ఆటల పోటీలు భీమవరంలో శనివారం జరిగాయి. భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, జిన్నూరు, రాజమహేంద్రవరం బ్రాంచులకు చెందిన 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, పరుగుపందెం తదితర పోటీలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, భారతీయ విద్యాభవన్స్ ఛైర్మన్ యు.కె.విశ్వనాథరాజు, కార్యదర్శి ఎస్.శ్రీరామరాజు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సృజన విరబూసింది..
తూడు, గుర్రపు డెక్క తొలగింపునకు కట్టర్ బోటు
అద్భుతం ఆవిష్కృతమైంది..

మండవల్లి, న్యూస్‌టుడే: ఆలోచనను ఆచరణలో పెడితే అద్భుతాలను సృష్టించవచ్చు.. పెద్ద పెద్ద సమస్యలకు తక్కువ ఖర్చుతో పరిష్కారాన్ని తీసుకురావచ్చు అనడానికి నిదర్శనం కైకలూరులో తయారు చేసిన తూడు, గుర్రపు డెక్క కట్టర్ బోటే. డెల్టా ప్రాంతంలో వరదకు ప్రధాన కారణం మంచి నీటి కాలువలు, డ్రెయిన్లు, కొల్లేరు, ఉప్పుటేరులో గుర్రపు డెక్క, తూడు నీటికి అడ్డుగా మారడమే. తూడును కత్తిరిస్తే ప్రవాహంతో పాటే కిందకు వెళ్లిపోతుంది. ఏటా రూ.లక్షలు ఖర్చుచేసి పెద ఎడ్లగాడి వంతెన, ఉప్పుటేరు, పోల్‌రాజ్ డ్రెయిన్‌ల వద్ద యంత్రం సహాయంతో తూడు తొలగిస్తున్నారు. తక్కువ వ్యయంతో ఎక్కువ సమర్థంగా పని చేసేలా డిజైన్ చేయడంతో ప్రత్యామ్నాయంగా మారింది.

ఆలోచన ఇలా.. వరదల సమయంలో కొల్లేరు గ్రామాల్లో ఎమ్మెల్యే కామినేని పర్యటించేటప్పుడు పోలీసు పర్యవేక్షణ అవసరమయ్యేది. దీన్ని తగ్గించేందుకు దిల్లీలో ఉన్న ఓ కట్టర్ బోటు వీడియోను ఎస్పీ శివ కిశోర్ ఎమ్మెల్యే కామినేనికి పంపారు. ధర చూస్తే రూ.90 లక్షల వరకు ఉంది. దాన్ని కొనుగోలు చేసే శక్తి లేక ఇంజినీరు గన్నమనేని సుధాకర్, ఫౌండ్రీ మేస్త్రీ మునగాల రాము కలిసి రూ.10 లక్షలతో బోటుకు ప్రాణం పోశారు.

తూడును కోస్తున్న బోటు

ఎస్పీ, ఎమ్మెల్యే ప్రోత్సాహం

ఎస్పీ శివకిశోర్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రోత్సాహంతోనే ఆలోచనకు ప్రాణం పోశాం. వారిద్దరు నిత్యం ప్రత్యేక గ్రూప్ ద్వారా సందేశాలు పంపి బోటు నిర్మాణంలో ప్రత్యేక పాత్ర పోషించారు. ప్రభుత్వ సహకారం అందిస్తే మరింత సమర్థమైన బోటు తయారు చేస్తాం. **- గన్నమనేని సుధాకర్, ఇంజినీరు**

అపజయం నుంచి విజయం బోటును ముందుకు నడిపేందుకు, కటింగ్ మిషన్ తిరిగేందుకు రెండు 13 హెచ్‌పీ జపాన్ మిత్సుబిషీ డీజిల్ ఇంజిన్లు ఏర్పాటు చేశారు. ఇంజిన్ కట్టర్లను తిప్పేందుకు ఏర్పాటు చేసిన రబ్బర్ బెల్టు స్లిప్పై కటింగ్ సరిగ్గా జరగలేదు. బోటును ముందుకు తోసే ఇంజిను సామర్థ్యం సరిపోలేదు. లోపాలను సరిదిద్దేందుకు మరో రెండు నెలలపాటు తీవ్రంగా శ్రమించి ప్రధాన ఇంజిన్‌ను ఐసర్ వ్యానుకు చెందిన 22 హెచ్‌పీ మోటారును ఏర్పాటు చేశారు. కోయంబత్తూర్ నుంచి ప్రత్యేకంగా చేయించిన కత్తులను ముందరి భాగంలో అమర్చారు. బెల్టు స్థానంలో గేర్ బాక్స్‌ను ఏర్పాటు చేసి చైన్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయడంతో బోటు ఎటువంటి ఆటంకం లేకుండా ముందుకు సాగింది.

అంతర్జాతీయ ఈత పోటీల్లో ప్రతిభ

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: దుబాయ్‌లో జరిగిన యూత్ స్విమ్మింగ్ పోటీల్లో జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన స్విమ్మర్ బుడిగిన రవి వీర వెంకట భవాని కార్తీక్ ఆరు పతకాలు సాధించి మన దేశ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింపజేశారని ఇన్నోవేటివ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. కార్తీక్‌ను ఆదివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గన్ని మాట్లాడుతూ.. కార్తీక్ ఆరు స్వర్ణ పతకాలు సాధించారన్నారు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో విజయం సాధించాలన్నారు. సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ.. కార్తీక్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వద్దకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. క్రీడలకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం అందిస్తోందన్నారు.

కార్తీక్‌ను సత్కరిస్తున్న గన్ని, రోషన్‌కుమార్

2009 బ్యాచ్ ఎస్సైల ఆత్మీయ సమ్మేళనం

బాధిత కుటుంబాలకు రూ.8.20 కోట్ల ఆర్థిక సాయం

కడియం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: వారంతా ఒకేసారి ఉద్యోగం సాధించారు.. శిక్షణ పొందారు.. ఎస్సైలుగా స్థిరపడ్డారు. అంతా కలుసుకుని ఆత్మీయ ఆలింగనాలు, సరదా కబుర్లు, స్వీయచిత్రాలు తీసుకుని సందడి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో ఎస్సై(సివిల్) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కడియంలో జరిగింది. వాళ్ల స్నేహబంధం ఎప్పటికీ కొనసాగేలా 2021లో ఏపీ, తెలంగాణ ఎస్సై 2009 బ్యాచ్ పేరిట సంక్షేమ సంఘాన్ని స్థాపించారు. నాటి నుంచి నేటి వరకూ ఏటా డిసెంబరు రెండో వారంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుంటున్నారు. 2014లో ఆంధ్ర, తెలంగాణ విడిపోయిన తర్వాత కూడా సమ్మేళనాలు నిర్వహించుకుంటున్నారు. సుమారు 1,140 మంది ఎస్సైలుగా తర్ఫీదు పొందగా, అందులో 400 మంది ఆదివారం రాజమహేంద్రవరంలో కలిశారు. వీరిలో 80 మంది ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్నారు. వీరంతా ప్రస్తుతం సీఐలుగా పదోన్నతి పొందారు. వీరంతా కలిసి నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. ఇప్పటి వరకూ ఈ బ్యాచ్‌లో మృతిచెందిన వారికి సంబంధించిన కుటుంబాలకు రూ.8.20 కోట్ల సాయం చేసినట్లు తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు బ్యాచ్ అడ్మిన్‌గా ఉన్న హైదరాబాద్ బేగంపేట పీఎస్ రేంజ్ సీఐ జి. శ్రీనివాసరావు వివరించారు. సమ్మేళనానికి కడియం, ధవళేశ్వరం, రాజానగరం, అనపర్తి సీఐల సహకారం మరువలేనిదన్నారు.

కడియంలో ఒక్కటైన 2009 ఎస్సై (సివిల్) బృంద సభ్యులు

ఆ ఘనత కూటమి ప్రభుత్వానిదే: చింతమనేని

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ కొలువులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేసిన ఘనత కూటమి సర్కారుదేనని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల లోని విడిది కార్యాలయంలో ఏపీ స్టేట్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) నూతన సంవత్సర కాలమానిని ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు జీజేఏ స్టీవెన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరమణ, టి.ప్రసాద్, గౌరవాధ్యక్షుడు పి.పెట్రిక్‌బాబు, కోశాధికారి గంధర్వరావు, గౌరవ సలహాదారు జి.గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలమానినిని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్, సంఘ నాయకులు

శ్రీవారి గిరి ప్రదక్షిణకు సర్వం సిద్ధం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమలలో సోమవారం జరిగే శ్రీవారి గిరి ప్రదక్షిణకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీవారి మాలధారులు, భక్తులు కొండ చుట్టూ సుమారు 6 కిలోమీటర్ల మేర తిరిగే సమయంలో వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టామని ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఆలయ తొలి మెట్టు వద్ద నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు. గిరి ప్రదక్షిణ మార్గంలో పండ్లు, మంచినీరు, తేనీరు, పాలు అందించేందుకు టెంట్లు ఏర్పాటు చేశారు. దొరసానిపాడు టోల్‌గేట్ దగ్గర నుంచి రాళ్లకుంట సెయింట్ గ్జేవియర్ పాఠశాల వరకు ఉన్న మట్టి రోడ్డును వట్టి గడ్డితో కప్పారు. ముందస్తుగా దారి పొడవునా.. విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు.

ఏర్పాటు చేసిన టెంట్లు

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో ఆదివారం డీఆర్‌డీఏ ఆధ్వర్యాన పత్సమట్ల పెరటి కోళ్లు పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు మాట్లాడుతూ.. జిల్లాలో 5 వేలు యూనిట్ల పెరటి కోళ్లు అందించడమే ధ్యేయమన్నారు. ఒక్కో యూనిట్‌లో రూ.5 వేలు విలువైన 10 కోళ్లు, 25 కిలోల మేత, మెడికల్ కిట్, కోళ్ల రవాణా పెట్టెలు ఉంటాయని ఆయన వివరించారు. డీపీఎం పార్థసారథి, ఏపీఎం ప్రభావతి, సర్పంచి బండారు సింధు, భాజపా నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెరటి కోళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఏఐ, ఎంఎల్‌పై అవగాహన అవసరం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: కృత్రిమ మేధస్సు(ఏఐ), మెషీన్ లెర్నింగ్(ఎంఎల్) పైన అవగాహన పెంపొందించడమే టెక్‌జైట్ 25-2.0 హ్యాకథాన్ లక్ష్యమని ఎర్లీ ఇంటర్వెన్షన్ ట్రైనింగ్ ప్రోగ్రాం(ఈఐటీపీ) డీన్ శ్యామ్ తెలిపారు. ఆది, సోమవారాల్లో ఏబీ-2 వేదికగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ఆలోచనలు సృజనాత్మకత పరిష్కారాలను ప్రోత్సహించడమే ఈ హ్యాకథాన్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీ అధ్యాపకులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ విద్యార్థులు వివిధ బృందాలుగా ఏర్పడి వాస్తవ ప్రపంచ సమస్యలను ఏఐ, ఎంఎల్ ఆధారిత పరిష్కారాలను రూపొందిస్తున్నారన్నారు. సాంకేతిక విజ్ఞానంపై ఆసక్తి పెంచడం, ఆత్మవిశ్వాసాన్ని మరింత బలపర్చడమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేకే సింగ్, శ్యామ్, పావని, భవాని పాల్గొన్నారు. డైరెక్టర్, ఏవోలు, డీన్‌లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

హ్యాకథాన్‌ను ప్రారంభిస్తున్న కళాశాల అధ్యాపకుడు శ్యామ్

పశ్చిమ కలెక్టర్ నాగరాణికి కార్యదర్శి హోదా

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వం 2010 బ్యాచ్‌కి చెందిన ఐదుగురు ఐఏఎస్ అధికారులకు సూపర్ టైమ్‌స్కేల్(లెవెల్-14) ఉద్యోగోన్నతి కల్పించింది. వారిలో పశ్చిమ గోదావరి కలెక్టర్ నాగరాణి కూడా ఉన్నారు. ఆమెకు కార్యదర్శి హోదా కల్పించినా పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గానే కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉద్యోగోన్నతి 1 జనవరి 2026 నుంచి అమల్లోకి రానుంది.

సంక్రాంతికి రండి.. సందడి చేద్దామండి..!

✪ సంక్రాంతికి వరంగల్ నుంచి స్నేహితులు వస్తున్నారని హోటల్‌లో ఓ గది తీసుకుందామంటే డిసెంబరులోనే మొత్తం నిండిపోయాయని నరసాపురానికి చెందిన వాసు వాపోయారు. దీంతో దర్భరేవులో తన పాత పెంకుటిల్లును శుభ్రం చేయించి అతిథుల కోసం సిద్ధం చేసినట్లు తెలిపారు.

✪ కోనసీమ జిల్లా సరిహద్దు వద్ద దిండిలో పర్యాటకశాఖ అతిథి గృహాల్లో 32 గదులుండగా జనవరి 11 నుంచి 20వ తేదీ వరకు బుకింగ్‌లు పూర్తయ్యాయి. జాతీయ రహదారి సమీపాన దొంగరావిపాలెం వద్ద ప్రయివేటు అతిథి గృహాల్లో గదులు కూడా పండగ రోజుల్లో అందుబాటులో లేవు.

పాలకొల్లు, న్యూస్‌టుడే: సంక్రాంతి రోజుల్లో జిల్లాకు వచ్చే అతిథుల సంఖ్య ఏటేటా పెరుగుతూనే ఉంది. యలమంచిలి, కలగంపూడి, పూలపల్లి, ఉండి, అయిభీమవరం, కాళ్ల, పెదఅమిరం, తణుకు, దువ్వ, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో జరిగే సంక్రాంతి సంబరాలు, కోడి పందేలు తెలుగు రాష్ట్రాల్లో పేరు గాంచాయి. పండగ మూడు రోజుల్లో ఆయా ప్రాంతాల్లో గడిపేందుకు లక్షలాది మంది ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ఈ ఏడాది సంక్రాంతికి అన్నిరకాల రిసార్టులు, హోటల్స్‌లో గదులకు నెల రోజుల ముందే బుకింగ్‌లు పూర్తయ్యాయి.

యలమంచిలిలో మండువా లోగిలి ఇల్లు

అతిథుల కోసం ఏర్పాట్లు.. 50 మంది వచ్చినా సరిపోయే మండువా లోగిళ్లకు జిల్లాలో కొదవలేదు. పల్లెల్లో ఉన్న ఇలాంటి ఇళ్లను దులిపేసి అవసరమైతే రంగులేసి అతిథుల కోసం ముస్తాబు చేస్తున్నారు. పండగ రోజుల్లో ఎక్కడున్నా వేడివేడిగా విందు భోజనం అందించేందుకు భారీసైజు క్యారేజీలను సిద్ధం చేస్తున్నారు. పండక్కి ఎంతమంది వస్తారో రండి.. ఏర్పాట్లన్నీ మేం చూసుకుంటాం అంటూ నగరాల్లో, పట్టణాల్లో అతిథులను చరవాణుల్లో ప్రేమగా ఆహ్వానించే మాటలే ప్రస్తుతం జిల్లాలో ప్రతిచోటా వినబడుతున్నాయంటే అతిశయోక్తిలేదు.

ప్రత్యేక ప్యాకేజీలు

సంక్రాంతి సందర్భంగా లాడ్జీలు, హోటళ్లలో బస చేసే వారి కోసం ప్రత్యేక ప్యాకేజీలు ప్రవేశపెట్టారు. సాధారణ రోజుల్లో గది అద్దె రోజుకు రూ.2 వేల నుంచి 3 వేల వరకు ఉంటుంది. పండగ మూడు రోజులు కలిపి ప్రత్యేక ప్యాకేజీ రూ.15 వేలుగా నిర్ణయించారు. అతిథులు ఒక్క రోజు ఉన్నా మొత్తం చెల్లించాల్సిందే. ప్రయివేటు రిసార్టుల్లోనూ గది అద్దెలను రెండింతలు చేశారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా కమిటీ ఏకగ్రీవం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ కార్యదర్శుల నూతన సంఘాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వైయూఎం సూర్యకుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా డి.శ్రీనివాస్ చౌదరి, ఉపాధ్యక్షులుగా ఎం.ఎస్.ఇ.జి.ఎన్.వి.వెంకట్రావు, కేవీఎల్ తనూజ, ఎన్.మణి కుమారి, ప్రధాన కార్యదర్శిగా బీహెచ్ కృష్ణంరాజు, కోశాధికారిగా పి.ధర్మ గోవిందు తదితరులను ఎన్నుకున్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)
వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 152, 161, 172 చికెన్ విత్ స్కిన్ - 294 చికెన్ స్కిన్‌లెస్ - 304.

గంజాయి పట్టివేత
ఇద్దరు వ్యక్తుల అరెస్టు

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: గంజాయి రవాణా చేస్తున్న ఇద్దర్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. జీలుగుమిల్లిలో జంగారెడ్డిగూడెం- అశ్వారావుపేట జాతీయ రహదారిపై ఎస్సై క్రాంతికుమార్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తున్నారు. ఇది గమనించి ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు యత్నించారు. అనుమానం వచ్చి వారిని ఆపి తనిఖీ చేయగా.. ద్విచక్రవాహనం సీటు లోపల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఒడిశా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 10.15 కిలోల గంజాయిని కొనుగోలు చేసి, తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డికి తీసుకెళ్తున్నట్లు తెలుసుకున్నారు. గంజాయి, ఒక ద్విచక్రవాహనం, రెండు చరవాణులు స్వాధీనం చేసుకుని, కామారెడ్డి జిల్లా ఎల్పీపూర్ గ్రామానికి చెందిన రాజ్‌పుత్ కమల్ సింగ్, గొట్టిముక్కల గ్రామానికి చెందిన ఆకుల వంశీకృష్ణ అనే ఇద్దర్ని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

ప్రాజెక్టు రూప శిల్పులు.. భవిష్యత్తు నిర్మాణకర్తలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఈ రోజు తరగతి గదులు కేవలం పాఠాలకే పరిమితం కాదు. ఆలోచనలకు రూపం ఇచ్చే ప్రయోగశాలలుగా మారుతున్నాయి. వీటి నుంచే పుట్టుకొస్తున్నారు వివిధ ప్రాజెక్టుల రూప శిల్పులైన ఈ విద్యార్థులు. సమస్యను గమనించడం నుంచి పరిష్కారాన్ని కనుగొనడం వరకు ప్రతి దశలో వీరి ఆలోచన శక్తి కనిపిస్తుంది. సమస్యకు సరళమైన పరిష్కారం తక్కువ ఖర్చుతో కూడిన నమూనాలు సాంకేతికతను సామాజిక అవసరాలకు అనుసంధానించే అప్లికేషన్లు విద్యార్థుల సృజనాత్మకతకు నిదర్శనంగా ఉంటున్నాయి. గురువుల మార్గ నిర్దేశం, తల్లిదండ్రుల ప్రోత్సాహం సంస్థల సహకారంతో ఈ విద్యార్థుల ఆలోచనలు సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలుగా మారుతున్నాయి. చిన్న ప్రాజెక్టుగా మొదలైన ప్రయత్నం రేపు పెద్ద మార్పునకు బీజం కావచ్చు. భవిష్యత్తును నిర్ణయించే శిల్పులు ఇటుకలతో కాదు.. ఆలోచనలతో నిర్మిస్తున్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో టెక్‌జైట్‌లో పలు ప్రాజెక్టులను ప్రదర్శించిన ఈ విద్యార్థులే రేపటి నాయకులు, ఆవిష్కర్తలు.. వారేమంటున్నారంటే...

వైర్‌లెస్ కెమెరాలను గుర్తించడం సాధ్యమే

మహిళల గోప్యతకు భంగం కల్గిస్తూ ఎవరైనా కెమెరాలు ఏర్పాటు చేస్తే అవి ఎక్కడ ఉన్నాయో ఈ వైర్‌లెస్ కెమెరా గుర్తిస్తుంది. వెంటనే హెచ్చరికలను జారీ చేస్తుంది. గోప్యత భద్రతను పరిరక్షించేందుకు ఇళ్లు, కార్యాలయాలు, హోటళ్లు, పరీక్షా హాళ్లలో ఉపయోగిస్తే గుర్తించడం సులభమవుతుంది. **- నందిని భవ్యశ్రీ, అస్మిత, యాస్మిన్, శశి**

క్యాంపస్ నిఘా కోసం రోబో

క్యాంపస్ నిఘా కోసం ఈ ప్రాజెక్ట్‌లో నాలుగు కాళ్ల స్వయం ప్రతిపత్తి కల రోబోను అభివృద్ధి చేశాం. కేటాయించిన ప్రాంతాల్లో గస్తీ తిరుగుతూ అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించి వెంటనే సమాచారం పంపిస్తుంది. దీర్ఘకాలిక నిఘా కోసం దీనిని వినియోగించుకుంటే ప్రయోజనం ఉంటుంది. **- కార్తీక్, దుర్గాప్రకాశ్, రూప్‌చంద్, ఫణీంద్ర, వరలక్ష్మి**

లేజర్‌తో 360 డిగ్రీల మ్యాపింగ్

న్యూక్లియర్ ప్లాంట్‌లు, మైనింగ్, పరిశ్రమలకు ఇది ఉపయోగకరం. లేజర్ ద్వారా 360 డిగ్రీల మ్యాపింగ్ సాధ్యం. ఇండోర్, ఔట్‌డోర్‌లో ఉపయోగించుకోవచ్చు. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు ప్రయోజనకరం. అవసరమైతే డైరెక్షన్‌లను మార్చుకుని ఆయా ప్రదేశాలకు చేరుతుంది. అక్కడి పరిస్థితులను చిత్రాల ద్వారా చేరవేస్తుంది. **- సుబ్రహ్మణ్యం, గౌతమ్, కాలీషా, సరిత**

అమ్మవారికి హారతిస్తున్న అర్చకుడు

మమ్మేలమ్మా.. రాట్నాలమ్మా..!

రాట్నాలకుంట(పెదవేగి), న్యూస్‌టుడే: రాట్నాలకుంట రాట్నాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు ఉదయం అమ్మవారిని అభిషేకం, అర్చన తదితరాలు నిర్వహించి పట్టువస్త్రాలు, ఆభరణాలు, విశేష పుష్పాలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని రాట్నాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పూజా ద్రవ్యాలు, ప్రసాదాల విక్రయాలతో రూ.57,285 ఆదాయం వచ్చిందని ఆలయ ఛైర్మన్ మన్నే శ్రీనివాసరావు, ఈవో సతీశ్‌కుమార్ తెలిపారు.

ఫైనల్స్‌లో కప్ అందుకున్న విశాఖ జట్టు క్రీడాకారులు

రాష్ట్రస్థాయి 'పురోహిత క్రికెట్ కప్' విజేతగా విశాఖ జట్టు
కప్‌తో పాటు రూ. లక్ష నగదు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: భీమవరంలో గన్నాబత్తులవారి క్రీడా మైదానంలో 8 రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ లీగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్స్‌లో హైదరాబాద్ జట్టుపై విశాఖ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు 101 పరుగులు చేయగా.. విశాఖ 102 పరుగులతో విజయం సాధించి కప్ సొంతం చేసుకుంది. వారికి దాత సాగిరాజు అప్పలరాజు తరపున డీఎన్నార్ కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు రూ.లక్ష పారితోషికం అందించారు. రన్నర్స్‌గా నిలిచిన హైదరాబాద్ జట్టుకు దాత డాక్టర్ సిరియాల గౌతమ్ కుమార్ రూ.50 వేలు అందించారు. పోటీల నిర్వాహకుల తరపున అతిథుల చేతులమీదుగా వారికి కప్‌లు అందించారు.

సెమీ ఫైనల్స్‌లో.. తొలి మ్యాచ్‌లో కాకినాడ జట్టు 82 పరుగులు చేయగా హైదరాబాద్ జట్టు 83 పరుగులు చేసి విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో విశాఖ జట్టు 99 పరుగులు సాధించగా రాజమహేంద్రవరం జట్టు 93 పరుగులకే ఓటమి పాలైంది. ఈ సందర్భంగా ఆర్గనైజర్లు బ్రహ్మజోశ్యుల సుబ్రహ్మణ్యశర్మ, బ్రహ్మజోశ్యుల సత్యప్రసాదశర్మ, చందూరి కామేశ్వరశర్మ, ఆహ్వాన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ పోటీలో 20 జట్లు పోటీలో పాల్గొన్నాయని తెలిపారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

JOBS

Wanted B.Com/M.Com/MBA Finance/CA IPCC Dropouts to be Work as Field Executive in Bhimavaram in a Reputed Audit Firm. Interested Persons (Male Only) ✆ 70135 11502 or mail: kowthahr@gmail.com.

నిడదవోలు శంకరాపురం గ్రామంలో హృదయాలయం ఆశ్రమంలో పనిచేయుటకు వంటపని చేయుటకు వంటవారు కావలెను. స్త్రీలు మాత్రమే. ఫోన్: 94409 42148, 94418 76034.

భీమవరం ప్రముఖ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ నందు పనిచేయుటకు లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. సంప్ర: 94823 11796.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.65 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

రోడ్డు ప్రమాదంలో అక్కాతమ్ముడు దుర్మరణం

సత్తుపల్లి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో అక్కాతమ్ముడు దుర్మరణం చెందిన ఘటన ఆదివారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపూడి మండలం అల్లిపల్లి పంచాయతీ కంద్రికగూడేనికి చెందిన తోట మధుకు పెనుబల్లి మండలం సూరయ్యబంజర్‌కు చెందిన పుచ్చా కృష్ణయ్య, రమాదేవి దంపతుల కుమార్తె తేజస్విని(18)ఇచ్చి ఐదు నెలల కిందట వివాహం చేశారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులను చూసి వెళ్లేందుకు తేజశ్విని తన భర్త మధుతో కలిసి శనివారం సూరయ్యబంజర్‌కు వచ్చారు. దమ్మపేట మండలం చీపురుగూడెం ఆశ్రమ పాఠశాలలో తేజశ్విని తమ్ముడు దేవేందర్(13) చదువుతున్నాడు. తమ్ముడిని తనతోపాటు అత్తగారింటికి తీసుకెళ్లి సోమవారం తిరిగి పాఠశాలకు పంపాలనే ఉద్దేశంతో ఆమె భర్తతో కలిసి తమ్ముడిని వెంట తీసుకుని బయలుదేరారు. వీరు ముగ్గురు ద్విచక్ర వాహనంపై కంద్రికగూడెం వెళ్తుండగా మార్గం మధ్యలోని సత్తుపల్లి శివారు తమ్మిలేరు వంతెన వద్ద వెనుక నుంచి లారీ వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తేజస్విని, దేవేందర్ పై నుంచి లారీ వెళ్లడంతో వారు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తీవ్రంగా గాయపడిన మధును ఖమ్మం వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తోట తేజస్విని, పుచ్చా దేవేందర్ (పాత చిత్రాలు)

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తోట మధు

పదేళ్ల తర్వాత పుట్టిన సంతానం.. పుచ్చా కృష్ణయ్య, రమాదేవి దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. వారికి పెళ్లైన పదేళ్ల తర్వాత కుమార్తె తేజస్విని, కుమారుడు దేవేందర్ పుట్టారు. ఇద్దర్నీ ఎంతో అల్లారుముద్దుగా పెంచారు. ఆదివారం మధ్యాహ్నం వరకు కుమార్తె, కుమారుడు సందడిగా తమతో గడిపి అంతలోనే విగతజీవులుగా మారడంతో వారు కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఆర్టీసీ డ్రైవర్, ప్రయాణికుడిపై దాడి
గుర్తు తెలియని ముగ్గురిపై కేసు

ఉండి, న్యూస్‌టుడే: ఆర్టీసీ డ్రైవర్‌తోపాటు అడ్డువెళ్లిన ప్రయాణికుడిపై గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీనిపై ఉండి పోలీసు స్టేషన్‌లో ఆదివారం రాత్రి కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. భీమవరం ఆర్టీసీ డిపో డ్రైవర్ బొలిశెట్టి శృతిబాబు ఈ నెల 26న ఏలూరు నుంచి బస్సు నడుపుతూ వస్తున్నారు. ఉండి రైల్వే గేటు వద్ద ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని అడ్డంగా నిలిపి బస్సు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగినట్లు చెబుతున్నారు. ఆపై డ్రైవర్‌పై దాడి చేస్తుండగా ప్రశ్నించిన ప్రయాణికుడిపై సైతం దాడి చేశారు. డ్రైవర్ శృతిబాబు ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఉద్యమ్ ఆధార్
వ్యాపారులకూ ఓ గుర్తింపు కార్డు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే :

✦ ఆధార్ కార్డు గురించి అందిరికీ తెలిసిందే. అయితే చిరు వ్యాపారులు, కుటీర పరిశ్రమల వ్యవస్థాపకుల కోసం కేంద్ర ప్రభుత్వం అందించే గుర్తింపు కార్డే ఉద్యమ ఆధార్.

✦ నూతనంగా వ్యాపారాలు చేసే వారితోపాటు ఇప్పటికే ఆ రంగంలో ఉన్న వారికి మరింత అండగా ఉండేందుకు కేంద్రం కొన్నేళ్ల కిందట ఉద్యమ ఆధార్‌ను ప్రవేశపెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై విస్తృత అవగాహన కల్పిస్తున్నారు.

✦ కార్డు కావాల్సిన వారు దగ్గరలోని మీ-సేవా కేంద్రాల ద్వారా నిర్దేశించిన రుసుం చెల్లించి నమోదు చేసుకోవచ్చు.

✦ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వారికి (ఎంఎస్ఎంఈ) కింద ఈ కార్డు అందిస్తారు. ఆధార్ తరహాలోనే ఇది 12 అంకెలతో ఉంటుంది. ఇందులో క్యూఆర్ కోడ్ ఉంటుంది. దీన్ని స్కాన్ చేస్తే వ్యాపారుల పూర్తి వివరాలు వస్తాయి.

✦ జిల్లాలో 41,553 స్వయం సహాయక సంఘాల్లో 4,06,660 మంది సభ్యులు ఉన్నారు.

వ్యాపార విస్తరణకు దోహదం.. చిరు వ్యాపారం చేసేవారిని గుర్తించడంతోపాటు స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు తోడ్పాటుగా రుణాలు అందిస్తున్నాం. ఉద్యమ్ ఆధార్ రిజిస్ట్రేషన్ వారి వ్యాపార విస్తరణకు బ్యాంకు రుణాలు పొందడానికి దోహదపడుతుంది. **- దయాల రాజశేఖర్, ఏపీఎం, డీఆర్‌డీఏ.**

ఏలూరు

• ఏలూరు • దెందులూరు • ఉంగుటూరు

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: స్థానిక రామచంద్రరావుపేటలోని వేంకటేశ్వరస్వామి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలోని కళా వేదికపై ఆదివారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. పాల రామాంజనేయులు భాగవతార్ భక్త ప్రహ్లాద హరికథ, కె.రాజేశ్వరి గాత్ర కచేరిలు శ్రోతలను అలరించాయి. అనంతరం పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శనలిచ్చారు.

ధర్మ సంస్థాపనార్థం జీవిద్దాం

పూళ్ల(భీమడోలు), న్యూస్‌టుడే: హిందూ సమాజం వ్యక్తిగతం కోసం కాకుండా ధర్మ సంస్థాపనార్థం జీవించాలని శ్రీకాకుళం జిల్లా బహడపల్లి శ్రీకృష్ణ గీతాశ్రమాధిపతి మాతా దీక్షితానందభారతి స్వామి అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా.. పూళ్లలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. గంజి వెంకటగిరిధర్ అధ్యక్షత వహించారు. మాతాజీ మాట్లాడుతూ.. ధర్మ పరిరక్షణతో హిందూ సమాజంపై గౌరవ భావం పెరుగుతుందని.. అప్పుడే దేశం విశ్వ గురువుగా రూపుదిద్దుకుంటుందని చెప్పారు. ప్రస్తుత దేశ కాల పరిస్థితులకు అనుగుణంగా హిందువులు జాగృతం కావాలని పిలుపునిచ్చారు. ప్రధాన వక్త, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి శివగణేశ్ మాట్లాడుతూ.. సమాజ వికాసంతోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని తెలిపారు. అంతకు ముందు చిన్నారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ? వంగాయగూడెం నుంచి గొల్లాయగూడెం వెళ్లే రోడ్డులోని డ్రెయిన్‌లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. పూడిక తీయకపోవడంతో.. దోమలకు నిలయంగా మారింది. **- గోవర్ధన్, స్థానికుడు**

✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి పూడిక తీయిస్తాం. దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తాం. **- శివారెడ్డి, ఉప కమిషనర్**

దెందులూరు: ? ఆర్టీసీ కాలనీలో వీధి దీపం వెలగడం లేదు. రాత్రివేళ బయటకు వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు. విష పురుగులు, సర్పాలు ఇళ్లలోకి వచ్చేస్తున్నాయి. **- రంగారావు**

✔ సిబ్బందిని పంపి దీపానికి మరమ్మతు చేయిస్తాం. అవసరమైతే కొత్తవి అమరుస్తాం. **- స్టానిష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి**

తొలగిన పూడిక.. ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డులోని తంగెళ్లమూడి వద్ద సమాధులతోట ఎదురు వీధి మురుగు కాలువలో తీసిన పూడికను రోడ్డుపై పడేశారు. దీనిపై 'పూడిక తీసి.. గుట్టలా పోసి' శీర్షికన ఈ నెల 26న 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. దీనికి నగరపాలక సంస్థ అధికారులు స్పందించి, పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తొలగింపజేశారు.

రక్షణ పెట్టె ఏర్పాటు.. దెందులూరు: గోపన్నపాలెం రక్షిత నీటి పథకం వద్ద ప్రమాదకరంగా మారిన విద్యుత్తు నియంత్రిక ఫ్యూజు బోర్డుకు సిబ్బంది రక్షణ పెట్టె ఏర్పాటు చేశారు. 'నియంత్రిక.. రక్షణ లేక' శీర్షికన ఈ నెల 27న 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర వార్తకు అధికారులు స్పందించి సమస్య పరిష్కరించారు.

నియంత్రిక మార్పు.. నిడమర్రు గ్రామీణం: పెదనింద్రకొలను ఎస్సీ కాలనీలో ఇళ్ల ముందు ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రికను ఎట్టకేలకు మరో చోటుకు మార్చారు. 'ఇంటి ఆవరణ... ప్రమాదం చెంతన' శీర్షికన ఈ నెల 8న 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి విద్యుత్తు ఏఈ ప్రసాద్ స్పందించారు. సిబ్బందిని పంపి నియంత్రికను మరో చోటుకు మార్పించారు.

వెంకన్న.. చెరువేదన్నా!

ఉనికి కోల్పోతున్న జల వనరు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే

నగరంలోని జలవనరులు కనుమరుగవుతున్నాయి. ఘన వ్యర్థాలు, ముళ్ల చెట్లు, పొదలు, మట్టి దిబ్బలతో నిండిపోయి ఆనవాళ్లు కోల్పోతున్నాయి. రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారుతున్నాయి. ముఖ్యంగా ఒకటో పట్టణం దక్షిణపువీధిలో సుమారు ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలోని వెంకన్న చెరువుకు ఎంతో ప్రాముఖ్యం ఉండేది. ఒకప్పుడు తాగు, సాగునీటి వనరుగా అలరారేది. చెరువు సమీప రుద్రభూమికొచ్చిన వారు.. అక్కడే స్నానాలు చేసే వారు. పశువుల దాహార్తి తీర్చేది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనత కారణంగా క్రమంగా ఉనికి కోల్పోతూ వస్తోంది.

చేపల పెంపకంతో ఆదాయం.. దీనికితోడు చెరువులో చేపల పెంపకానికి అప్పట్లో ఏలూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో వేలం నిర్వహించి రూ.లక్షలు ఆదాయం గడించేవారు. దీని నిర్వహణను అధికారులు విస్మరించడంతో.. చెరువుకు నీరు రావడం లేదు. ఘన వ్యర్థాలు, మట్టి దిబ్బలతో డంపింగ్ యార్డులా మారింది. పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లు ఏపుగా పెరిగిపోయి చిట్టడివిని తలపిస్తోంది.

మట్టి దిబ్బలు, ముళ్లచెట్లతో నిండిపోయిందిలా..

నిబంధనలకు విరుద్ధంగా.. గత వైకాపా ప్రభుత్వం చెరువు పరిరక్షణను పూర్తిగా విస్మరించింది. నిబంధనలకు విరుద్ధంగా సుమారు రూ.కోటి అంచనా వ్యయంతో.. 2022లో సంపద కేంద్రం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికీ ఆ పనులు పునాదుల దశలోనే కునారిల్లుతోంది. దీనికితోడు చెరువు పరిసరాలను మందుబాబులు అడ్డాగా చేసుకున్నారు. కొందరు యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. అప్పట్లో నగరానికి చెందిన ఓ దాత చెరువును ప్రజా ప్రయోజనార్థం సుందరంగా, ఆహ్లాదంగా మార్చేందుకు రూ.కోటి ప్రకటించారు. నాటి ప్రజాప్రతినిధుల అనాలోచిత నిర్ణయాలతో ఆయన ఆశయం నెరవేరలేదు. ఇకనైనా నగరపాలక అధికారులు స్పందించి చెరువును బాగు చేయించి, పునర్వైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

'చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపుతాం' అని కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం: చింతమనేని

దుగ్గిరాల(పెదవేగి) న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. స్థానిక దుగ్గిరాల విడిది కార్యాలయంలో అనారోగ్య కారణాలతో బాధపడుతున్న సుమారు 50 మందికి రూ.49 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆదివారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కూటమి పేదల పక్షపాతి ప్రభుత్వమన్నారు. మెరుగైన విద్యా, వైద్య సేవలందిస్తూ.. వారికి అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవలతో పేదలకు మెరుగైన చికిత్సనందిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ స్థాయిలోనూ ప్రజలకు ఉత్తమ వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎన్టీఆర్ వైద్య సేవలకు అవకాశం లేక ప్రైవేటులో చికిత్స పొందిన వారికి సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థిక చేయూతనిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

కూటమి ప్రభుత్వ పాలనకు ప్రజాదరణ

ఉంగుటూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనకు ప్రజాదరణ నానాటికీ పెరుగుతోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. వెల్లమిల్లి పంచాయతీకి చెందిన వైకాపా నాయకులు, కార్యకర్తలు ఆదివారం జనసేనలో చేరారు. వారికి విడిది కార్యాలయంలో ధర్మరాజు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు నచ్చి పలువురు స్వచ్ఛందంగా జనసేనలో చేరుతున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జనసేనలో చేరిన వారిలో మాజీ సర్పంచి మెడంకుల రత్తయ్య, అల్లంశెట్టి సాయికిరణ్, కిక్కిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పార్టీలో చేరిన వారితో ధర్మరాజు

కార్మిక హక్కులు రక్షించుకుందాం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: సమరశీల పోరాటాలతో కార్మిక హక్కులు రక్షించుకుందామని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు అన్నారు. స్థానిక మర్చంట్ ఛాంబర్ హాలులో ఇఫ్టూ అనుబంధ ఏలూరు జట్టు కార్మిక సంఘం వార్షికోత్సవ సభ ఆదివారం నిర్వహించారు. సంఘ కార్యదర్శి గడసాల రాంబాబు అధ్యక్షత వహించారు. అంతకుముందు వైఎంహెచ్‌ఏ హాలు వద్ద హమాలి ముఠా అధ్యక్షుడు వీరినాయుడు జెండావిష్కరణ చేశారు. అనంతరం నగరంలో ప్రదర్శన చేపట్టారు. ఏలూరు మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ అధ్యక్షుడు రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వమైనా కార్మిక వర్గం అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. సంఘ నాయకులు బి.సోమయ్య, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకట్రావు

వివక్షకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాటం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సమాజంలో నానాటికీ పెరుగుతున్న వివక్షకు వ్యతిరేకంగా కాంగ్రెస్ శ్రేణులు పోరాడాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామమోహనరావు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని రామమోహనరావు ఎగురవేసి మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో కాంగ్రెస్ నాయకులు జైలుకెళ్లారని గుర్తుచేశారు. దేశంలో మత రాజకీయాలు రోజురోజుకూ పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు.

మరమ్మతు చేయక

ఏలూరు ఆర్ఆర్ పేటలోని ఎన్టీఆర్ పురపాలక ఉద్యానంలో పిల్లలు ఆటలాడే పరికరాలు దెబ్బతిన్నాయి. కొన్ని ఉయ్యాలలకు లింకులు తెగిపోగా, మరికొన్ని విరిగిపోయాయి. వాటిని అలాగే వదిలేయడంతో.. పిల్లలు ప్రమాదకరంగా ఊగుతున్నారు. అధికారులు స్పందించి ఆట పరికరాలకు మరమ్మతులు చేయాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, ఏలూరు**

నాణ్యత పాటించక

గణపవరం మండలం వెలగపల్లి రహదారి నుంచి ప్రాథమిక పాఠశాల, కాలనీకి వెళ్లే సీసీ రోడ్డు దెబ్బతింది. నాణ్యతా లోపంతో దారి మధ్యలో పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో సైకిళ్లు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు అదుపు తప్పి పడుతున్నారు. మరమ్మతులకు అంచనాలు రూపొందిస్తామని పంచాయతీ కార్యదర్శి ఆర్.నారాయణ తెలిపారు. **- న్యూస్‌టుడే, గణపవరం**

వినియోగంలోకి తేక!

పెదవేగి మండలం అంకన్నగూడెంలో సంపద కేంద్రం నిరుపయోగంగా మారింది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కేంద్రాన్ని ఏళ్లుగా వినియోగంలోకి తేకపోవడంతో.. పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ఇక్కడ రాత్రివేళ మందుబాబులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. **-న్యూస్‌టుడే, అంకన్నగూడెం(పెదవేగి)**

పాదులు తొలగక

గణపవరం మండలం ముప్పర్తిపాడు శివారులోని సామూహిక మరుగుదొడ్ల సమీప విద్యుత్తు పరివర్తకం చుట్టూ పిచ్చిమొక్కలు, పాదులు ఏపుగా పెరిగిపోయాయి. చిన్నపాటి గాలి వీచినా, విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని విద్యుత్తు ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. **- న్యూస్‌టుడే, గణపవరం**

'చెత్త'గించక!

ఏలూరు ఒకటో పట్టణం 13వ డివిజన్‌లోని 46వ వార్డు సచివాలయ ప్రాంగణంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఇక్కడికి రోజూ వివిధ పనుల నిమిత్తం పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. సచివాలయ పరిసరాలు అధ్వానంగా ఉండటం, దుర్వాసన వస్తుండటంతో ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు**

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	ఈషా
అంబిక మినీ	వృషభ
సాయి బాలాజీ	ఛాంపియన్
బాలాజీ	శంబాల
సత్యనారాయణ 1	అవతార్3
సత్యనారాయణ 2	అఖండ2
సత్యనారాయణ 3	పతంగ్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	దండోర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	అనకొండ
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	బ్యాడ్ గర్ల్స్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	ఛాంపియన్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	అఖండ 2
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	శంబాల

సమస్యలిలా.. నివాసమెలా!

విష పురుగులు, దోమలతో ఇక్కట్లు

వట్లూరు(పెదపాడు), న్యూస్‌టుడే

పెదపాడు మండలంలో వట్లూరు మేజర్ పంచాయతీ. ఏలూరు నగరానికి ఆనుకొని ఉన్న గ్రామంలో.. సుమారు 15 వేల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. నగరంలో కలిసిపోయి ఉండటంతో.. ఇక్కడ స్థలాలు కొనుగోలు చేసేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ప్లాట్లు కొని ఏళ్లుగా వదిలేశారు. అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు.

వట్లూరులో నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో పెరిగిన ముళ్లచెట్లు

భయం భయంగా జీవనం.. ఈ స్థలాల్లో నాలుగు మీటర్ల ఎత్తున ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు, తుంగ గుబురుగా పెరిగిపోయాయి. దాంతో సమీప నివాసితులు భయం భయంగా జీవనం సాగిస్తున్నారు. ఈ పొదల్లో విషపురుగులు, సర్పాలు చేరి.. ఇళ్లలోకి వస్తున్నాయి. స్థలాల్లో మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. దోమల బెడద ఎక్కువై స్థానికులు మలేరియా, డెంగీ, విష జ్వరాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి లోతట్టు ప్రాంతాలకు మురుగు చేరకుండా చర్యలు చేపట్టాలని, వర్షాలకు నీరు నిలవకుండా కచ్చా డ్రెయిన్లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. పిచ్చిమొక్కలు తొలగించి దోమల నివారణ మందును పిచికారీ చేయించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

నోటీసులిచ్చాం..

'గ్రామంలోని ఖాళీ స్థలాల్లో నీరు నిలవకుండా చదును చేయించుకోవాలని స్థల యజమానులకు నోటీసులు ఇచ్చాం. పిచ్చిమొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. అందుబాటులో లేని స్థలాల యజమానులకు ఫోన్‌లోనూ సమాచారం ఇస్తాం. ఇప్పటికే పలు కాలనీల్లో మురుగునీరు బయటకెళ్లేలా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేశాం' అని వట్లూరు పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి మేకా శ్రీనివాస్ తెలిపారు.

గంగానమ్మ.. కరుణించమ్మా

అమ్మవారి ఘటాలకు పూజలు చేస్తున్న చింతమనేని, భానుప్రకాశ్ కుటుంబ సభ్యులు

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: స్థానిక తూర్పువీధి గంగానమ్మ జాతర నేత్రపర్వంగా సాగుతోంది. జాతర కమిటీ కన్వీనర్ వంకినేని భానుప్రకాశ్ ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవార్ల ఘటాలకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుటుంబ సమేతంగా పూజలు చేశారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని జాతరలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. ఆర్టీసీ విజయవాడ ప్రాంతీయ ఛైర్మన్ అప్పలనాయుడు, ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, భాజపా జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, భక్తులు పాల్గొన్నారు.

సూర్యభగవానుడికి అభిషేకం

పవరుపేట(ఏలూరు నగరం): పవరుపేటలోని సూర్యభగవానుడి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేకాభిషేకం, అర్చన, పూజలు చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలు, తులసీ దళాలతో నేత్రపర్వంగా అలంకరించారు. భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

ముక్కోటి మహోత్సవాలు ప్రారంభం

గోపీనాథపట్నం(ఉంగుటూరు): గోపీనాథపట్నం భక్తాంజనేయస్వామి ఆలయంలో ముక్కోటి మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకాభిషేకాలు, పూజలు చేసి సుందరంగా అలంకరించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

భీమడోలు, న్యూస్‌టుడే: పూళ్ల పంచాయతీ ఎం.ఎం.పురంలోని సుమారు 150 మంది పేదలు, వృద్ధులకు మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. దివంగత వట్టి వీరవెంకట సత్యనారాయణ జయంతి సందర్భంగా ఆయన కుమారుడు వట్టి సుగుణాకర్ వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. సమాజ హితానికి దాతలు ముందుకురావడం అభినందనీయమని కొనియాడారు. సంస్థ ప్రతినిధులు రామిశెట్టి గంగాధరరావు, పసుపులేటి సాంబశివరావు, సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు, వట్టి పవన్‌కుమార్, పులిచర్ల వెంకటకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచిపై దాడి.. కేసు

పెదపాడు, న్యూస్‌టుడే: ఏపూరు సర్పంచి చోడగిరి రామకృష్ణ ఈ నెల 27న వ్యక్తిగత పనులపై నూజివీడు మండలం దేవరకుంటకు ద్విచక్ర వాహనంలో వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి వస్తుండగా.. మార్గం మధ్యలో ఆయన్ను పెదవేగి మండలం పెదకడిమి గ్రామానికి చెందిన కొసరాజు వంశీకృష్ణ, మట్టా వినయ్ అడ్డుకున్నారు. ద్విచక్ర వాహనం వెనుక నంబరు ప్లేటుపై మాజీ సీఎం జగన్, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఫొటోలుండటం గమనించారు. దాంతో రామకృష్ణను దూషిస్తూ దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కట్టా శారదా సతీశ్ తెలిపారు.

జూద స్థావరంపై.. ఏలూరు గ్రామీణ: పోణంగిలోని జూద స్థావరంపై గ్రామీణ పోలీసులు ఆదివారం దాడి చేశారు. అయిదుగురు జూదరులను అరెస్టు చేసి.. వారి నుంచి రూ.3,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాల స్వాధీనం

ఏలూరు గ్రామీణ: పవరుపేటకు చెందిన హరికుమార్ స్థానిక మిలటరీ క్యాంటీన్ నుంచి అక్రమంగా తీసుకెళ్తున్న 16 మద్యం సీసాలను రెండో పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేశారు.

అప్పలరాజుపై పీడీ యాక్ట్ నమోదు హేయం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజుపై ప్రభుత్వం పీడీ యాక్ట్ నమోదు చేయడం హేయమని, దాన్ని వెంటనే ఉపసంహరించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక అన్నే భవన్‌లో సంఘ ముఖ్య నాయకులతో ఆదివారం సమావేశమయ్యారు. జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతులు, మత్స్యకారులు, ప్రజల హక్కులపై పోరాడే అప్పలరాజును అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఆయన్ను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న శ్రీనివాస్

రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు

నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనింద్రకొలను, నిడమర్రు ప్రజల దారి కష్టాలు ఎట్టకేలకు తీరనున్నాయి. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో 1.6 కిలోమీటర్ల అధ్వాన మార్గాన్ని తారు రోడ్డుగా నిర్మించనున్నారు. గత వైకాపా ప్రభుత్వం రహదారి నిర్వహణను పూర్తిగా విస్మరించింది. ఫలితంగా అయిదేళ్లపాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పత్తేపురం నుంచి పెదనింద్రకొలను శివారు వరకు రూ.3 కోట్లతో రోడ్డు నిర్మించింది. మిగతా 1.6 కి.మీ. రహదారి ఏర్పాటుకు తాజాగా నిధులు కేటాయించింది.

నేడు రెవెన్యూ క్లినిక్

భీమడోలు, న్యూస్‌టుడే: మండలంలో భూ సమస్యల పరిష్కారానికి స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో సోమవారం రెవెన్యూ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు బి.రమాదేవి తెలిపారు. మండలంలోని భూ సమస్యలు, పట్టాదారు పాసుపుస్తకాలు, డీ పట్టా, అండగల్ సవరణ, ఆక్రమణలు, మ్యుటేషన్, రీ సర్వే, సబ్ డివిజన్, ఎల్‌పీఎంల విభజన తదితరాలకు రైతులు దరఖాస్తులు ఇవ్వొచ్చని ఆమె ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నిడమర్రు గ్రామీణం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో భాగంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ దుర్గాప్రసాద్ తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెదపాడు: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు రెవెన్యూ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఎ.కృష్ణజ్యోతి తెలిపారు. ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా తెలియజేస్తే.. వాటిని పరిశీలించి త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత

భీమడోలు, న్యూస్‌టుడే: అంబరుపేట విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో కొత్తగా తీగలు ఏర్పాటు చేస్తున్నందున సోమవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ కె.ఎం.అంబేడ్కర్ తెలిపారు. జి.కండ్రిక ఫీడర్‌లోని గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు సరఫరా ఉండదని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నిస్వార్థ సమాజ సేవే ధ్యేయం

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: సమాజ హితమే ధ్యేయంగా నిస్వార్థ ఫౌండేషన్ పని చేస్తోందని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ కె.ప్రశాంత్ అన్నారు. స్థానిక ఇండోర్ స్టేడియం సమీప లేడీస్ క్లబ్ ప్రాంగణంలో ఆదివారం ఫౌండేషన్ ఎనిమిదో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పలువురిని సంస్థ సభ్యులు సత్కరించారు. ప్రశాంత్ మాట్లాడుతూ.. సమాజంలోని ప్రతి ఒక్కరూ సేవే అభిమతంగా ముందుకు సాగాలన్నారు. మున్ముందు తమ సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తామని పేర్కొన్నారు. అనంతరం పిల్లల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సభ్యులు పి.లావణ్య, సౌజన్య, విశాల జ్యోతి, నరేశ్, కేశవ్, బాలాజీ, మహేశ్, చిన్నా, కార్తి, రవీంద్ర, బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌కు జ్ఞాపిక ఇస్తున్న ప్రముఖులు

సహకార రంగంలో సంస్కరణలు: గన్ని

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: సహకార రంగంలో చంద్రబాబు నాయుడు ఎన్నో సంస్కరణలు తెచ్చారని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. జంగారెడ్డిగూడెం పీఏసీఎస్ శత వసంత వేడుకలు ఆదివారం నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు మాణికల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సహకార వ్యవస్థలో పలు సంస్కరణలు వచ్చాయన్నారు. కంప్యూటరీకరణ నుంచి ఈ ఆడిట్ వరకు ఎన్నో జరిగాయన్నారు. భవిష్యత్తులో యూపీఏ సేవలు కూడా రానున్నాయన్నారు. ఈ సందర్భంగా గతంలో సొసైటీ అధ్యక్షులుగా చేసిన పరిమి సత్యనారాయణ, గూడపాటి రాధాకృష్ణ, సురేంద్ర తదితరులను సత్కరించారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, సొసైటీ కార్యదర్శి బోడ ఆనంద్, డైరెక్టర్లు పాతూరి అంబేడ్కర్, కొంచాడ దుర్గాప్రసాద్, తెదేపా పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ పాల్గొన్నారు.

మీ సేవలు మరువలేం

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: తోకలపల్లిలో 20 ఏళ్లపాటు ఏఎన్ఎంగా పని చేసి.. ప్రజలకు విశేష సేవలందించి.. ఇటీవల బదిలీపై వెళ్లిన పెదనింద్రకొలను పీహెచ్‌సీ ఏఎన్ఎం ఝాన్సీలక్ష్మిని ఆదివారం గ్రామస్థులు సన్మానించారు. పెదనింద్రకొలను పీహెచ్‌సీ వైద్యాధికారి వర్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామ ప్రజలంతా ఏకమై ఏఎన్ఎంను సత్కరించడం.. ఆమె చేసిన నిస్వార్థ సేవలకు నిదర్శనమని కొనియాడారు.

ఝాన్సీలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న గ్రామస్థులు

శ్రీనివాసరాజుకు జీవిత కాల సాఫల్య పురస్కారం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సమాజ సేవలో విశేష సేవలందించిన డాక్టర్ చింతా శ్రీనివాసరాజుకు డాక్టర్ జ్యోతిప్రసాద్ జీవితకాల సాఫల్య పురస్కారం దక్కింది. ఇటీవల అహ్మదాబాద్ వేదికగా నిర్వహించిన ఐఎంఏ జాతీయ వార్షిక సదస్సులో ఐసీసీ ఛైర్మన్ జైషా, గుజరాత్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ శంకర్ చౌదరి, ఐఎంఏ జాతీయ అధ్యక్షుడి నుంచి శ్రీనివాసరాజు అవార్డు అందుకున్నారు. ఆయన్ను పలువురు నగర ప్రముఖులు అభినందించారు.

తెగులు.. దిగులు!

మినుము పంటను ఆశిస్తున్న పల్లాకు

పెదపాడు, న్యూస్‌టుడే

ఖరీఫ్‌లో వరుసగా ప్రకృతి వైపరీత్యాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులు.. రబీలో చేపట్టిన అపరాల సాగుతోనైనా నష్టాలు తగ్గించుకోవాలని తపన పడుతున్నారు. పైరు గుబురుగా ఎదుగుతోంది. కానీ, పంటను పల్లాకు తెగులు ఆశించడంతో.. కర్షకులు ఆందోళన చెందుతున్నారు. పూత, పిందె దశకొస్తున్న మినుము పైరుపై పల్లాకు తెగులు తీవ్ర ప్రభావం చూపుతోంది. పెదపాడు మండలంలో దాదాపు 9 వేల ఎకరాల్లో మినుము వేశారు. పెదపాడు, వట్లూరు గ్రామాల పరిధిలోనే దాదాపు వెయ్యి ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

అప్రమత్తమైతేనే..

ప్రస్తుతం పల్లాకు తెగులు ఆరంభ దశలో ఉందని.. మరింత విస్తరించకుండా వ్యవసాయాధికారులు అప్రమత్తమై కర్షకులకు సూచనలు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. మరో 20 రోజులు తెగులు ఎలాంటి ప్రభావం చూపకపోతే పూత, పిందెలు వస్తాయని చెబుతున్నారు. వ్యవసాయ శాఖాధికారులు ముందుగానే గుర్తించి తెగులు నివారణకు సూచనలు, సలహాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. 'క్షేత్రస్థాయిలో పైరును పరిశీలించాం. ఈ విషయాన్ని వ్యవసాయ శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లాం. వారు క్షేత్రస్థాయిలో పైరును పరిశీలించి తగిన సూచనలు, సలహాలు ఇస్తారు' అని మండల వ్యవసాయాధికారి షేక్ ఖాసిం తెలిపారు.

(c) eenadu

పోలవరం

•పోలవరం •చింతలపూడి

వైభవంగా హనుమద్ హోమం

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో శ్లోకోచ్ఛారణ చేపట్టిన పూజాదికాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో ఆర్వీ చందన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గవరవరం ఉప కేంద్రంలో మరమ్మతులు, ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం కన్నాపురం, కన్నాయగూడెం, పవర్ గ్రిడ్ ఫీడర్లపై ఉన్న ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఉప కేంద్రం ఏఈ ఎస్.వి.రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా హిందూ సమ్మేళనం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శత వసంతాల సందర్భంగా బయ్యనగూడెంలో నిర్వహించిన హిందూ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో కామయ్యపాలెంలోని దత్తాత్రేయ నవగ్రహ పాదుకా పీఠాధిపతి స్వామి అనుపానంద భక్తులకు అభివాదం చేశారు. మండలం నలుమూలల నుంచి సంప్రదాయ వస్త్రధారణతో భక్తులు హాజరయ్యారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

టి.నరసాపురం, న్యూస్‌టుడే: ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా బొర్రంపాలెంలోని రామాలయం వద్ద సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవాన్ని భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయం వద్ద హనుమాన్ చాలీసా పఠనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

గుబ్బల మంగమ్మ గుడికి తరలివచ్చిన భక్తులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం కామవరం అడవిలోని గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

పశు వైద్యం.. అందక దైన్యం

• శిథిల భవనాల్లోనే దశాబ్దాలుగా సేవలు

బుట్టాయగూడెం, వేలేరుపాడు, పోలవరం, న్యూస్‌టుడే: మన్యం గ్రామాల్లోని పశు వైద్యశాలలను దశాబ్దాల కాలం నాటి భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. అవి శిథిలస్థితికి చేరి పశు పోషకులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి కూడా శ్లాబ్‌లు కారుతూ, గోడలు చెమ్మగిల్లి ఆందోళన కలిగిస్తున్నాయి. పశువులకు వైద్య సేవలు అందించేందుకు, మందులు, దస్త్రాలు భద్రపరిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త భవనాల మంజూరు కోసం పట్టించుకున్న నాథుడు లేడని పశు పోషకులు వాపోతున్నారు. పశు వైద్యులు, సిబ్బంది కొరత కూడా తీవ్రంగా వేధిస్తోంది.

బుట్టాయగూడెం పశు వైద్యశాలను 57 ఏళ్ల కిందట నిర్మించిన భవనంలోనే నిర్వహిస్తున్నారు. అప్పట్లో గానుగ సున్నంతో గోడలు నిర్మించి, పెంకులతో పైకప్పును ఏర్పాటు చేశారు. కొన్నేళ్ల తరువాత శ్లాబ్ వేశారు. నేటికీ అందులోనే నిర్వహిస్తున్నారు. శ్లాబ్ వర్షం కారుతూ, గోడలు చెమర్చి ఆందోళన కలిగిస్తున్నాయి. వైద్యశాల ఆవరణలో పశువులకు వైద్యం అందించేందుకు వేసిన షెడ్డు పైకప్పు రేకులు పగిలిపోయాయి. దొరమామిడిలో సొంత భవనం లేక పూర్వం నుంచి పాత భవనంలోనే తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు.

వేలేరుపాడులో 30 ఏళ్ల కిందట నిర్మించిన పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గోడలు బీటలు వారడంతో పాటు తలుపులు, కిటికీలు విరిగిపోయాయి. చిన్నపాటి వర్షం కురిసినా మందులు, దస్త్రాలు తడిచి ముద్దవుతున్నాయి. కొన్నేళ్లుగా వైద్యాధికారితో పాటు ఎల్ఎస్ఏ, వెటర్నరీ సహాయకుడు, అటెండరు పోస్టులు భర్తీ చేయకపోవడంతో మండలంలోని 11 సచివాలయాల్లో గల పశుసంవర్ధక శాఖ సహాయకులు వంతుల వారీగా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, కొయ్యలగూడెం పశు వైద్యాధికారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించినప్పటికీ ఎప్పుడూ విధులకు హాజరైన దాఖలాలు లేవు.

పోలవరం మండలం రేపల్లెవాడ పశు వైద్యశాల భవనాన్ని దశాబ్దాల కిందట దాతలు ఇచ్చిన స్థలంలో నిర్మించారు. వర్షాకాలంలో నిర్వహణకు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి కూడా శ్లాబ్ కారుతూ గదులు వర్షపు నీటితో నిండుతున్నాయి. మందులు, దస్త్రాలను ఒక గదిలోకి సర్దాల్సి వస్తోంది. గతంలో శ్లాబ్‌కు మరమ్మతులు చేసినా.. ప్రయోజనం లేదు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ? చింతలపూడి పట్టణం ప్రధాన రహదారి నుంచి మోడల్ కాలనీకి వెళ్లే రహదారి మొత్తం గుంతలు పడి అధ్వానంగా మారింది.
- శ్రీకాంత్ నాయుడు, స్థానికుడు

✔ రహదారికి మరమ్మతులు చేసి సమస్య పరిష్కరిస్తాం.
- రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్

పేదలను ఆదుకోవడమే నిజమైన సేవ

దుప్పట్లు పంపిణీ చేస్తున్న శ్రీనివాసులు

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: పేదలను ఆదుకోవడమే నిజమైన సేవని ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఎల్ఎస్ఎం సంస్థ ఆధ్వర్యంలో 400 మంది వృద్ధులు, వితంతువులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంస్థ, దేవ సహాయాన్ని అభినందించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి పరామర్శ

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం పంచాయతీ పరిధి రామయ్యపేట పునరావాస కాలనీ ఎదురుగా స్థలంలో కాలిపోయిన షెడ్డును ట్రైకార్ సంస్థ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, సీఐ బాలసురేష్‌బాబు ఆదివారం పరిశీలించి కుటుంబాన్ని పరామర్శించారు. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా సామగ్రి మొత్తం కాలిపోవడంతో అభిమళ్ల సత్యనారాయణ కుటుంబం వీధిన పడింది. వారికి బొరగంతో పాటు నీటి సంఘం అధ్యక్షుడు పాదం ప్రసాద్ రూ.2వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఛైర్మన్ తహసీల్దార్‌కు ఫోన్ చేసి కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ముఖద్వారానికి రంగులు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆర్చీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అల్లిన దత్తాత్రేయ రూ.2 లక్షలు వెచ్చించి రంగులు వేయిస్తున్నారు. ఆలయ ప్రవేశ మార్గం వద్ద సుమారు 20 ఏళ్ల కిందట దత్తాత్రేయ సొంతంగా ఆర్చిని నిర్మించారు. దీనిని కట్టిన సమయంలో ఆయన వేయించిన రంగులు ప్రస్తుతం వెలిసిపోయాయి. కొద్ది రోజుల్లో ముక్కోటి ఏకాదశి కావడంతో అభివృద్ధి కమిటీకి కూడా దత్తాత్రేయ జీవిత అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ఆయన తన వ్యక్తిగత నిధులతో మళ్లీ రెండో పర్యాయం రంగులు వేయిస్తున్నారు.

పారిజాతగిరిలో ముక్కోటికి ఏర్పాట్లు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 30న జరగనున్న ముక్కోటి ఏకాదశి పర్వదినం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు శ్రీవారు ఉత్తర ద్వార దర్శనం ఇవ్వనున్నారు. దీని కోసం ఆలయంలో ప్రత్యేకంగా ఉత్తర ద్వారాన్ని ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో కలగర శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు తెలిపారు.

పెద్దింట్లమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేటికోటలో కొలువుదీరిన పెద్దింట్లమ్మ దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాలతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. చలువ పందిళ్లలో పాల పొంగళ్లు వండి మంగళ వాయిద్యాలు, మేళతాళాలతో పెద్దింట్లమ్మ సన్నిధికి చేరి మొక్కులు చెల్లించుకున్నారు.

సహకార రంగంలో మరిన్ని సంస్కరణలు: గన్ని

మాట్లాడుతున్న వీరాంజనేయులు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: సహకార రంగంలో చంద్రబాబు నాయుడు ఎన్నో సంస్కరణలు తెచ్చారని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. జంగారెడ్డిగూడెం పీఏసీఎస్ శత వసంత వేడుకలు ఆదివారం నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు మాణికల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సహకార వ్యవస్థలో పలు సంస్కరణలు వచ్చాయన్నారు. కంప్యూటరీకరణ నుంచి ఈ ఆడిట్ వరకు ఎన్నో జరిగాయన్నారు. భవిష్యత్తులో యూపీఏ సేవలు కూడా రానున్నాయన్నారు. ఈ సందర్భంగా గతంలో సొసైటీ అధ్యక్షులుగా చేసిన పరిమి సత్యనారాయణ, గూడపాటి రాధాకృష్ణ, సురేంద్ర తదితరులను సత్కరించారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, సొసైటీ కార్యదర్శి బోడ ఆనంద్, డైరెక్టర్లు పాతూరి అంబేడ్కర్, కొంచాడ దుర్గాప్రసాద్, తెదేపా పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ నాయకులు పాల్గొన్నారు.

'కుంతలగూడెంలో పంచాయతీ భవనం నిర్మించడం తగదు'

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఇచ్చిన హామీలను విస్మరించి కుంతలగూడెంలో పంచాయతీ భవనాన్ని నిర్మించడం తగదని కనకాద్రిపురం గ్రామస్థులు పోలవరం శాసనసభ్యుడు చిర్రి బాలరాజుకు విన్నవించారు. కుంతలగూడెం పర్యటనకు వెళుతున్న సందర్భంలో ఆదివారం ఆయనను ఆపి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిబంధనల మేరకు భవనాన్ని అక్కడే నిర్మించాల్సి ఉందని వారికి వివరించారు. ప్రత్యామ్నాయంగా కనకాద్రిపురంలో అభివృద్ధి పనులకు సహకరిస్తామని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి హామీ ఇచ్చారు. దీనిపై ఆ గ్రామస్థులు మాట్లాడుతూ.. పంచాయతీ కేంద్రానికి వెళ్లాలంటే 5 కి.మీ.లు వెళ్లాలని, రవాణా సౌకర్యం లేకపోవడంతో తమకు సాధ్యం కాదని తెలిపారు. ఇకపై తమను ఆ పంచాయతీలో కొనసాగించవద్దని, యర్రంపేట లేదా పొంగుటూరు పంచాయతీల్లో విలీనం చేయాలని కోరారు. దీనిపై గల అవకాశాలను పరిశీలించాలని ఎంపీడీవోకు సూచిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

పల్లెల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బాలరాజు, జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: పల్లెల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. కుంతలగూడెంలో రూ.32 లక్షలతో చేపట్టనున్న పంచాయతీ భవన నిర్మాణ పనులను జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలతో పాటు అనేక అభివృద్ధి పనులను నియోజకవర్గంలో చేపట్టామన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ.. ఈ గ్రామాభివృద్ధికి రూ.20 లక్షలు జడ్పీ నిధులు డ్రెయిన్లు, సీసీ రహదారుల నిర్మాణానికి మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన డ్రెయిన్‌లను, రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన శుద్ధి నీటి ప్లాంటును ప్రారంభించారు. ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు పారేపల్లి రామారావు, గెడా మురళీఅజిత్‌కుమార్, సర్పంచి పులి సీతారత్నం, తెదేపా మండలాధ్యక్షుడు పారేపల్లి నరేశ్, జనసేన మండల అధ్యక్షుడు తోట రవి తదితరులు పాల్గొన్నారు. • యర్రంపేటలో పలువురు దళిత యువకులు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పార్టీలోకి చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. • బయ్యనగూడెం సొసైటీ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరంలో గుర్తించిన పలువురికి కళ్లజోళ్లను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పంపిణీ చేశారు.

వైద్య శిబిరానికి స్పందన

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: తిరుమలంపాలెంలో భీమడోలు, ద్వారకాతిరుమల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. శ్రీకృష్ణ చిల్డ్రన్స్ ఆసుపత్రి వైద్యులు రవీంద్ర, రోషిణి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది చిన్నారులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు.

అదనపు పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు పునరావాస గ్రామాల కోసం ప్రారంభంలో భూములిచ్చిన రైతులు నేడు కూలీలుగా మారారని, వీరిని ఆదుకోవాలని డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు నరసాపురం మండలం పెదమైనవానిలంకకు ఆదివారం విచ్చేసిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. 2006 ప్రాంతంలో రైతులు ఎకరం రూ.90వేల నుంచి రూ.1.20 లక్షలకు ఆర్అండ్ఆర్ కోసం ఇచ్చారన్నారు. పరిహారం అతి తక్కువగా ఉండటంతో అప్పట్లో పొలాలు ఇచ్చిన పలువురు రైతులు పండించుకునే భూములు లేక ఏజెన్సీలో కూలీలుగా మారారన్నారు. ప్రస్తుతం ఎకరానికి రూ.12లక్షల వరకు పరిహారం వస్తోందన్నారు. గతంలో భూములు ఇచ్చిన రైతులకు అదనపు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కరాటం కోరారు.

శ్రీవారి క్షేత్రంలో రద్దీ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడిని దర్శించుకుని తరించారు. సామాన్య భక్తులు స్వామిని దర్శించుకోవడానికి సుమారు 3 గంటల సమయం పట్టింది. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తొళక్కం వాహనంపై గ్రామోత్సవం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ధనుర్మాసం సందర్భంగా ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి తొళక్కం వాహనంలో గ్రామంలో విహరించారు.

ఏమైంది.. ఎందుకాగింది?

రెండేళ్లుగా మారని విద్యా డివిజన్

జడ్పీ ఉన్నత పాఠశాలలో కార్యాలయం కోసం కేటాయించిన భవనం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం ఉప విద్యాశాఖాధికారి (డీవైఈవో) కార్యాలయం బోర్డుకే పరిమితమైంది. రెండేళ్ల నాడే కొయ్యలగూడెంలోని డీవైఈవో కార్యాలయాన్ని డివిజన్ కేంద్రమైన జంగారెడ్డిగూడేనికి మార్చారు. దీంతో కొయ్యలగూడెం విద్యా డివిజన్ కాస్తా జంగారెడ్డిగూడెం విద్యా డివిజన్‌గా మారింది. ప్రభుత్వ ఆదేశాలతో దస్త్రాల్లో ఊరు పేరు మార్పులు జరిగినా.. అధికారికంగా కార్యాలయం మారలేదు. రెండేళ్ల నాడే జంగారెడ్డిగూడెంలో కార్యాలయం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలోని వృత్తి విద్యా కోర్సులు నిర్వహించే భవనంలోని కొన్ని తరగతి గదులను దీని కోసం కేటాయించారు. ఫర్నిచర్, ఇతర సామగ్రి ఏర్పాటు చేశారు. సుందరంగా కార్యాలయాన్ని తీర్చి దిద్దారు. జంగారెడ్డిగూడెం డీవైఈవో కార్యాలయంగా బోర్డు ఏర్పాటు చేశారు. అయితే కారణాలేమోకాని కార్యాలయం మాత్రం నేటికీ మారలేదు. కార్యకలాపాలు కొత్త డివిజన్ ప్రకారమే జరుగుతున్నాయి. కానీ కార్యాలయం విషయంలో మాత్రం అయోమయం కొనసాగుతోంది.

సాంకేతిక సమస్య

అయితే దీనికి ప్రస్తుతం సాంకేతిక సమస్య ఉందని చెబుతున్నారు. జంగారెడ్డిగూడెం డివిజన్ పేరుతో జీత భత్యాలు చెల్లించేందుకు డీడీవోలో మారలేదు. దీని వల్లే డివిజన్ మారలేదని ఇన్‌ఛార్జి డీవైఈవో రామన్నదొర తెలిపారు. కొత్త డివిజన్ ప్రకారం మారాలంటే ఇందుకు తగిన ఆదేశాలు రావాలంటున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు 2023 లోనే పంపినట్లు ఆయన చెప్పారు.

ఇన్‌ఛార్జితో సరి..

డీవైఈవోగా తూర్పుగోదావరి జిల్లా రాజానగరం ఎంఈవో రామన్నదొర కొన్నేళ్లుగా వ్యవహరిస్తున్నారు. అయితే కొత్త డివిజన్‌కు అధికారులతో పాటు కొత్త ప్యాట్రన్‌లో ఇతర సిబ్బంది నియామకం కూడా జరగాలి. ప్రస్తుతం, డీవైఈవో, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు మాత్రమే ఉన్నాయంటున్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా

చింతలపూడి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా లభిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎలీజా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో అప్పటి పరిస్థితుల దృష్ట్యా రాష్ట్ర విభజన జరిగిందన్నారు. తర్వాత తెదేపా, వైకాపా అధికారంలోకి వచ్చాక ప్రత్యేక హోదా సాధించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. అనంతరం కేక్ కోసి నాయకులకు పంచారు.

కమిటీని రద్దు చేయాలి

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: ఇటీవల వేలేరుపాడులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ మండల కమిటీని వ్యతిరేకిస్తున్నట్లు మాజీ మండలాధ్యక్షుడు కొక్కెరపాటి ఇసాక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాదిగ సామాజిక వర్గంలో అందరికీ సమాచారం ఇవ్వకుండా నలుగుర్ని నిలబెట్టి కమిటీ ఏర్పాటు చేయడం సరికాదన్నారు. కమిటీని రద్దు చేసి.. నూతన కమిటీని అందరి సమక్షంలో ఎన్నుకోవాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, దేవదాయ ధర్మదాయ శాఖ
స్వయంభూః శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి దేవస్థానం
గురవాయిగూడెం గ్రామము, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా, ఫోన్: 94910 00677
ఇ-ప్రొక్యూర్‌మెంటు / సీల్డు టెండర్లు / బహిరంగ వేలం ప్రకటన

ఆర్.సి. సంఖ్య 114/2025 తేదీ: 28-12-2025

వ. నెం.	ఐటమ్ వివరములు	ఇ-ప్రొక్యూర్‌మెంటు సీల్డు టెండర్లు/ బహిరంగ వేలము	కాలపరిమితి	ధరావతు రూ.	టెండరు షెడ్యూలు ఖరీదు
1.	దేవస్థానమునకు అవసరమగు కిరాణా సామాగ్రి సప్లయ్ చేయుట	ఇ-ప్రొక్యూర్‌మెంటు	ది. 01-04-2026 నుండి ది. 31-03-2027 వరకు (1 సంవత్సరము)	3,00,000/-	--
2.	దేవస్థానమునకు వచ్చు భక్తుల బ్యాగులు సూట్ కేసులు భద్రపరచు హక్కు	బహిరంగ వేలం	- డిటో -	5,000/-	--
3.	శ్రీ స్వామివారి దేవస్థానము నందు ఖాళీగా ఉన్న నూనె, నేతి డబ్బాలను, ఖాళీ సంచులను తీసుకొను హక్కునకు	సీల్డు టెండరు కమ్ బహిరంగ వేలం	- డిటో -	5,000/-	1,000/-
4.	కొబ్బరియలు, అరటిపళ్ళు, తమలపాకులు సప్లయి చేయుటకు	సీల్డు టెండరు	- డిటో -	10,000/-	1,000/-
5.	పూలు & పూలదండలు సప్లయి చేయుటకు	సీల్డు టెండరు	- డిటో -	50,000/-	1,000/-
6.	టిక్కట్ల పుస్తకములు, పాంప్లెట్లు, ఫ్లెక్సులు వగైరాల ముద్రణ & సప్లయి చేయుటకు	సీల్డు టెండరు	- డిటో -	10,000/-	1,000/-
7.	శానిటరీ ఐటమ్స్ ముగ్గు, చీపుర్లు, బ్లీచింగు ఫినాయిల్ వగైరా సప్లయి చేయుటకు	సీల్డు టెండరు	- డిటో -	10,000/-	1,000/-
8.	పాలు & పెరుగు సప్లయి చేయుటకు	ఇ-ప్రొక్యూర్‌మెంటు/ సీల్డు టెండరు	- డిటో -	50,000/-	1,000/-
9.	కూరగాయలు సప్లయి చేయుటకు	సీల్డు టెండరు	- డిటో -	10,000/-	1,000/-
10.	శ్రీ స్వామి వారి దేవస్థానమునకు అరటి ఆకులు సప్లయి చేయుటకు	సీల్డు టెండరు	- డిటో -	10,000/-	1,000/-
11.	శ్రీ స్వామి వారి దేవస్థానమునకు పుల్లలు (వంట చెరకు) సప్లయి చేయుటకు	సీల్డు టెండరు	- డిటో -	10,000/-	1,000/-
12.	లడ్డూ మరియు పులిహోర ప్రసాదములు తయారుచేసి అప్పగించుటకు	సీల్డు టెండరు	- డిటో -	50,000/-	1,000/-
13.	లడ్డూ & పులిహోర ప్రసాదములకు కవర్లు సప్లయి చేయుటకు	సీల్డు టెండరు	- డిటో -	10,000/-	1,000/-
14.	మేన్ పవర్ సప్లయి చేయుటకు	సీల్డు టెండరు	- డిటో -	10,000/-	1,000/-
15.	అభిషేక ద్రవ్యములు సప్లయి చేయుటకు	సీల్డు టెండరు	- డిటో -	5,000/-	1,000/-
16.	శ్రీ స్వామి వారికి మరియు ఇతర నూతన వస్త్రములు సప్లయి చేయుటకు	సీల్డు టెండరు	- డిటో -	10,000/-	1,000/-

1. ఇ-టెండరు దాఖలు చేయువారు www.apeprocurement.gov.in ద్వారా లాగాన్ అయి టెండరు దాఖలు చేయవచ్చును. 2. A) టెండర్ షెడ్యూలు జారీ చేయు తేదీ: 02-01-2026 నుండి ది. 12-01-2026 సా.గం. 5-00ల వరకూ, B) సీల్డు టెండర్లు దాఖలు చేయు తేదీ: 13-01-2026 ఉదయం. గం. 9-00ల నుండి ఉదయం గం. 11-00ల వరకు, C) ది. 13-01-2026 ఉ.గం. 11-30లకు ముందుగా బహిరంగ వేలం తరువాత సీల్డ్ టెండర్లు తెరచి, అటు పిమ్మట ఇ-టెండర్లు తెరువబడును. D) టెండర్లు దాఖలు చేయువారు ధరావతు సొమ్మును DD/నగదు రూపములో EO, Sri Maddi Anjaneya Swamy Temple పేరు మీద తీసుకొని టెండరు షెడ్యూల్‌కు జతచేసి టెండరు బాక్సు నందు వేయవలెను. E) మరిన్ని వివరములకు దేవస్థానం కార్యాలయము పనివేళలలో సంప్రదించగలరు.

శ్రీ స్వామి వారి సేవలో...
సం/- R.V.చందన, సహాయ కమిషనరు మరియు కార్యనిర్వహణాధికారి

చూస్తే పచ్చని మైదానం.. అడుగేస్తే తటాకం

విశాలంగా, పచ్చగా ఆహ్లాదంగా కనిపిస్తున్న ఈ మైదానం ఆటలకు అనుకూలంగా ఉన్నట్టుంది కదూ. కానీ కొయ్యలగూడెం మండలం కుంతలగూడెం వద్ద మూడు రోడ్ల కూడలిలోని ఊరచెరువు ఇది. చేపల పెంపకంలో భాగంగా కలుపుతున్న మందులతో సుమారు నాలుగెకరాల విస్తీర్ణం కలిగిన ఈ చెరువు నిండా నాచు అలుముకుందని స్థానికులు చెబుతున్నారు. చెరువులో ప్రమాదకరంగా తయారైన నాచును తొలగించమని సంబంధిత వ్యక్తులను ఆదేశించినట్లు ఎంపీడీవో కిరణ్‌కుమార్ తెలిపారు. - న్యూస్‌టుడే, కొయ్యలగూడెం గ్రామీణ

రగ్గులు, కంచాల పంపిణీ

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామమైన గోగుమిల్లిలో కొండరెడ్డి తెగ గిరిజన కుటుంబాలకు లయన్స్ క్లబ్ ఏలూరు శాఖ ప్రతినిధి, వ్యాపారవేత్త శీలంశెట్టి కిశోర్ ఆదివారం రగ్గులు, చిన్నారులకు స్టీల్ కంచాలు, రాత పుస్తకాలు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి రెండు చొప్పున రగ్గులు ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రానికి స్టీల్ కంచాలు, రాత పుస్తకాలు అందజేశారు. పులిరాముడుగూడెం మాజీ ఎంపీటీసీ సభ్యుడు, సీనియర్ న్యాయవాది ఏసుబాబు, లయన్స్ క్లబ్ ప్రతినిధి రాఘవులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసీమ గ్రామానికి చెందిన మాదేపల్లి సూర్యనారాయణ ఫైలేరియాతో కొన్ని సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్నారు. అతనికి మండల మానవత యూనిట్ సభ్యులు ఆదివారం రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. సభ్యులు కె.వెంకటేశ్వరరావు, చంద్రయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మోసగించిన వ్యక్తి అరెస్టు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ఓ కంపెనీని మోసగించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై వీరప్రసాద్ కథనం మేరకు.. జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఓ ప్రైవేటు కంపెనీ (ఐఎఫ్ఎల్ గ్రీన్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్)లో ఛైర్మన్‌గా బొమ్మగాని బాలకృష్ణ, సభ్యులుగా తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టకు చెందిన వీరంకి శ్రీరాములు, వంకాయల సతీశ్, జంగారెడ్డిగూడేనికి చెందిన మండపాక వినోద్‌కుమార్ ఉన్నారు. అయితే సదరు సభ్యులు కంపెనీ నుంచి బయటకు వచ్చి అదే తరహాలో పేరు వచ్చేలా మరో ప్రైవేటు కంపెనీ ఏర్పాటు చేసుకుని బాలకృష్ణకు చెందిన ఖాతాదారులను మోసగించి వసూళ్లకు పాల్పడ్డారు. ప్రశ్నించిన బాలకృష్ణను బెదిరించడంతో ఆయన గతంలో జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా. . కేసు నమోదు చేశారు. కాగా సభ్యులు వంకాయ సతీశ్, మండపాక వినోద్‌కుమార్‌లను అక్టోబర్ నెలలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే అప్పటి నుంచి ప్రధాన నిందితుడు శ్రీరాములు పరారీలో ఉండగా.. ఆదివారం జీలుగుమిల్లి చెక్‌పోస్టు వద్ద ఆయన్ను పోలీసులు అరెస్టు చేశారు. కాగా నిందితుడు శ్రీరాములును న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

వాహన తనిఖీలు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ఏటిగట్టు సెంటర్‌లో ఎస్సై పవన్‌కుమార్ సిబ్బందితో కలిసి ఆదివారం వాహన తనిఖీలు చేశారు. కొన్ని వాహనాలకు అపరాధ రుసుం విధించినా.. నేటికీ కట్టని ఆరు వాహనాలను గుర్తించి యజమానుల నుంచి చలనాలు కట్టించారు. మరో ఆరు వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో కేసులు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరానికి చెందిన ఓ మహిళ కొన్ని నెలలుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. ఆ బాధ తట్టుకోలేక ఆదివారం పురుగుమందు తాగారు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యుడు శ్రీకాంత్ ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తీసుకెళ్లారు.



నూజివీడు
•నూజివీడు •కైకలూరు

పెద్దింట్లమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేటికోటలో కొలువుదీరిన పెద్దింట్లమ్మ దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. చలువ పందిళ్లలో పాలు పొంగళ్లు వండి మంగళ వాయిద్యాలు, మేళతాళాలతో పెద్దింట్లమ్మ సన్నిధికి చేరి మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు పరమేశ్వర శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఏర్పాట్లను ఈవో కూచిపూడి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలెం-పేరూరుపాలెం సెంటరులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రీతికరమైన ఆదివారం కావడంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఆయన దర్శనానికి పోటెత్తారు. అధిక సంఖ్యలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, పుట్టలో పాలు పోసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. మహిళలు పాల పొంగళ్లు స్వామివారికి సమర్పించారు. అన్నదానంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు :80085 74698	ఆగిరిపల్లి: 9121229090
ముసునూరు :93983 81268	చాట్రాయి: 8008574700
కైకలూరు :73060 88555	మండవల్లి: 8106099008
కలిదిండి :90594 84862	ముదినేపల్లి: 8008574693

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు దానగూడెం నుంచి కరకట్ట వెళ్లే మార్గంలో పంచాయతీ వీధి దీపాలు కొన్నిరోజులుగా సక్రమంగా వెలగక స్థానికులు చీకట్లో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. దీనిపై స్థానికుడు విక్రమ్ 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో వి.పవిత్రకుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆమె కొత్త దీపాలు ఏర్పాటు చేయించారు.

స్తంభాన్ని నిలబెట్టారు.. ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం వలసపల్లిలో రహదారి పక్కన విద్యుత్తు స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా మారింది. దీనిపై గ్రామస్థుడు నవీన్ కుమార్ 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను రమణక్కపేట ఏఈ రాజ్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించి ఏఈ స్తంభాన్ని నిలబెట్టి సమస్యను పరిష్కరించారు.

కాగితాలపైనే ఇళ్లు.. నిరీక్షణ ఇంకెన్నాళ్లు

స్థలాల కోసం ఏడేళ్లుగా ఎదురు చూపులు

లోకుమూడిలో స్థలాలకు కేటాయించిన భూమి ఇదే

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం లోకుమూడిలో 2018 కేటాయించిన ప్రభుత్వ లేఅవుట్లో ఇళ్లు నేటికీ కాగితాలపైనే మూలుగుతున్నాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో 5 ఎకరాల విస్తీర్ణంలో 120 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి.. పట్టాలు పంపిణీ చేశారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. కేటాయించిన స్థలం లో లెవల్లో ఉండటంతో చిన్నపాటి వర్షానికి నీట మునిగిపోయి కనీసం నివాస యోగ్యంగా లేదు. మెరక చేయక పోవడంతో పాటు తమ స్థలాలు ఎక్కడున్నాయో తెలియక లబ్ధిదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. లేఅవుట్లో రోడ్లు, స్థలాలకు హద్దులు ఏర్పాటు చేయక పోవడంతో ఏళ్లుగా ఇళ్ల స్థలాలున్నా అద్దె ఇళ్లలోనే మగ్గిపోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

అద్దె భారంతో ఇబ్బందులు

ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అద్దెలు చెల్లించలేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. ఈ ఏడేళ్లలో చెల్లించిన అద్దెతో నూతన భవనాలు కట్టుకునే వాళ్లం. అధికారులు చర్యలు తీసుకుని లబ్ధిదారులకు న్యాయం చేయాలి. - లక్ష్మి, లబ్ధిదారు, లోకుమూడి

కాళ్లరిగేలా తిరిగినా..

గత ప్రభుత్వ హయాంలో కాళ్లరిగేలా తిరిగినా అప్పటి ఎమ్మెల్యే కాని, నాయకులు కాని లబ్ధిదారులను పట్టించుకున్న పాపాన పోలేదు. పైగా తెదేపా హయాంలో ఇచ్చిన స్థలాలు మేమెందుకు అభివృద్ధి చేయాలని ఎదురు ప్రశ్నలు వేసే వారని లబ్ధిదారులు వాపోయారు. తెదేపా ప్రభుత్వం ఇచ్చిన స్థలాలు మళ్లీ ఆ పార్టీతో కూడిన ఈ ప్రభుత్వమే అభివృద్ధి చేసి ఆదుకోవాలని ఇటీవల ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌ను లబ్ధిదారులు కోరారు.

దీనిపై ఇన్‌ఛార్జి తహసీల్దారు గోపాలరావును వివరణ కోరగా.. మెరక చేసేందుకు హౌసింగ్ విభాగం నుంచి ఇప్పటికే అంచనాలు పంపామన్నారు. త్వరలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు చూపిస్తామని తెలిపారు.

'నారా లోకేశ్ విద్యామృతం' అమలు అభినందనీయం

విద్యార్థులకు ఆహారం అందిస్తున్న నాయకులు

ముసునూరు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో పోషకాహారం లోపం రానివ్వకుండా, మంచి ఫలితాలు సాధించేందుకు మంత్రి కొలుసు పార్థసారథి తండ్రి పెద్ద రెడ్డయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా పదో తరగతి విద్యార్థులకు రోజూ సాయంత్రం అల్పాహారం అందించేందుకు 'నారా లోకేశ్ విద్యామృతం' పేరుతో శ్రీకారం చుట్టడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు నాగబాబు అన్నారు. ఆదివారం ముసునూరు మండలం గుడిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో నాయకులు, ఉపాధ్యాయులు విద్యామృతం పథకాన్ని ప్రారంభించారు. రాయపాటి లక్ష్మణరావు, గద్దె రాము, నూర్ బాషా పాల్గొన్నారు.

రామాంజనేయులును సత్కరిస్తున్న తెదేపా నాయకులు

జనార్దనవరం యువకుడి పరిశోధన పత్రానికి బహుమతి

చాట్రాయి, న్యూస్‌టుడే: జనార్దనవరం గ్రామానికి చెందిన బోరిగోర్ల రామాంజనేయులు అంతర్జాతీయ సదస్సులో గుర్తింపు పొందారు. డెహ్రాడూన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో క్లైమేట్-స్మార్ట్ రీజనరేటివ్ ఫార్మింగ్ అప్రోచెస్ అనే అంశంపై అండర్ గ్రాడ్యుయేట్ కేటగిరీలో సమర్పించిన పరిశోధన పత్రానికి ప్రథమ బహుమతి లభించింది. ఈ సదస్సు అక్టోబరు 30-31 తేదీల్లో నిర్వహించారు. రామాంజనేయులు దిల్లీలో జేజీ గోయెంకా కళాశాలలో బీఎస్సీ(ఆనర్స్) చదువుతున్నారు. శనివారం రాత్రి స్వగ్రామం చేరుకోగా రామాంజనేయులును తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు మాదాసు చంద్రకళ, నాయకులు మాదాసు పుల్లయ్య, వంగల సుబ్బారావు, రఘుబాబు తదితరుల ఆధ్వర్యంలో సత్కరించారు.

మూడు రోజులుగా తాగునీటికి అవస్థలు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో మూడు రోజులగా తాగునీరు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారు. బ్రాహ్మణ వీధి, యాదవుల వీధి తదితర ప్రాంతాల్లో తాగునీరు రాక పోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సమస్యను పరిష్కరించి తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామని డిప్యూటీ ఎంపీడీవో బి.ఆనంద్‌బాబు తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కైకలూరు, న్యూస్‌టుడే: మండలంలోని వరహాపట్నం విద్యుత్తు ఉప కేంద్రంలో అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో సోమవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతోందని విద్యుత్తుశాఖ ఈఈ జీబీ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 9.00.గంటల నుంచి మధ్యాహ్నం 2.గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

ఎట్టకేలకు గుంతల రహదారులకు మోక్షం

కొన్నకుంట - విజయవాడ రోడ్డు మరమ్మతులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో గుంతలమయమైన రహదారులను బాగు చేసేందుకు కూటమి ప్రభుత్వానికి ఏడాదిన్నర పైగా సమయం పట్టింది. ఒక్కో రహదారికి నిధులు సమకూర్చుకుంటూ గుంతల రహదారులకు మోక్షం కలిగిస్తున్నారు. దీంతో వాహనదారులు హమ్మయ్య. . అని ఊపిరి పీల్చుకుంటున్నారు. నూజివీడు నుంచి కొత్తూరు, కొన్నకుంట మీదుగా విజయవాడ వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా తయారైంది. అడుగుకో గుంతతో కార్ల నుంచి ద్విచక్ర వాహనదారుల వరకు నానా ఇబ్బందులు పడ్డారు. తాజాగా ఈ రహదారి పైన పడిన గుంతలను ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో పూడుస్తున్నారు. మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో రహదారులకు కొంతమేర మోక్షం లభిస్తుంది. రహదారులను వెడల్పు చేయడంతో పాటు నూతన రహదార్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముక్కోటి ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: వడాలిలోని చిన్న పూరీ జగన్నాథస్వామి ఆలయంలో, గురజలోని వేణుగోపాలస్వామి గుడిలో ఈ నెల 30న ముక్కోటి ఏకాదశి వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాస రావు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున ప్రత్యేక గరుడ వాహనంపై స్వామివార్లు ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిస్తారని చెప్పారు. అనంతరం వీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తామని , భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

క్రీడాకారుల కలలసౌధానికి పునరుజ్జీవం

34 ఏళ్ల తర్వాత ఇండోర్‌స్టేడియం పనులకు కదలిక

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: క్రీడాకారుల కలల సౌధం నూజివీడులోని ఇండోర్ స్టేడియం(ఎన్నెస్పీ కాలనీ) పునర్నిర్మాణం పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. వాగ్దానాల నుంచి కార్యాచరణ దిశగా మంత్రి కొలుసు పార్థసారథి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుని రూ. 1,39,56,134 నిధులను మంజూరు చేయించారు. 1991లో అప్పటి పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్న పాలడుగు వెంకటరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డిని తీసుకుని వచ్చి శంకుస్థాపన చేయించారు. తరువాత ప్రభుత్వాలు మారిపోయాయి. వైకాపా హయాంలోను ఈ స్టేడియం పునర్నిర్మించాలన్న ఆలోచన పాలకులకు రాలేదు. కేవలం కులం వ్యక్తిగత రాజకీయ కక్షతో అడ్డుపడ్డారు. వీటన్నింటికి మంత్రి కొలుసు చెక్ పెట్టారు. కూటమి లక్ష్యం క్రీడల అభివృద్ధి పైన దృష్టి పెట్టి ఇండోర్ స్టేడియంను ఆధునిక సౌకర్యాలతో పునర్నిర్మించేందుకు నిర్ణయం తీసుకోవడం విశేషం.

పరిశీలిస్తున్న డీఎస్‌డీవో సయ్యద్ అబ్దుల్ అజీజ్

☛ ఏలూరు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి సయ్యద్ అబ్దుల్ అజీజ్ ఈ స్టేడియం పనుల పురోగతిని ఆదివారం పరిశీలించారు. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి అయితే జిల్లా నుంచే జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు వెలువడే అవకాశాలు మెరుగు అవుతాయని చెప్పారు.

☛ 34 సంవత్సరాల తరువాత క్రీడాకారులకు మళ్లీ మంచి రోజులు వస్తున్నాయని నూజివీడు బాస్కెట్ బాల్ కోచ్ వాకా నాగరాజు అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని హర్షం వ్యక్తం చేశారు. వివిధ క్రీడల నిర్వహణకు నేర్చుకునేందుకు ఈ స్టేడియం ఉపయోగకరమని తెలిపారు.

బోర్వంచలో వాలంటీర్లతో ఏవో లక్ష్మణరావు తదితరులు

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరాలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: వారం రోజుల పాటు నిర్విరామంగా నూజివీడు ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు యూనిట్ 1 బోర్వంచ, యూనిట్ 2 రావిచర్ల, యూనిట్ 4 గొడుగువారిగూడెం, యూనిట్ 8 యానాదికాలనీ, యూనిట్ 9 యనమదలలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా ప్రాంతాలను శుభ్రం చేయడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. వాలంటీర్లు చేసిన పని, చూపిన చొరవకు ఆయా గ్రామాల ప్రజలు వారిని అభినందించారు. ఆఖరి రోజున ప్రదర్శనలు నిర్వహించారు. సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆదివారంతో ఆయా శిబిరాల నిర్వహణను యూనిట్ ఆఫీసర్లు ముగించారు. వాలంటీర్లను ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్ర కుమార్, ఏవో లక్ష్మణరావు, అకడమిక్ డీన్ చిరంజీవి అభినందించారు.



ఏసు మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ప్రసాద్, సీఐ రామకృష్ణ

హోంగార్డ్ కుటుంబానికి అండగా ఉంటాం: డీఎస్పీ

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్లో హోంగార్డ్‌గా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందిన పోతర్లంక ఏసు కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్వీ ప్రసాద్ భరోసా కల్పించారు. పోతవరప్పాడులోని ఏసు ఇంటికి ఆదివారం వెళ్లిన డీఎస్పీ, సీఐ కె. రామకృష్ణ, ఎస్సై కె.శుభశేఖర్ నివాళి అర్పించారు.

పరామర్శ.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఇటీవల రహదారి ప్రమాదంలో మృతి చెందిన దంపతులు పల్లెపు వెంకన్న, గృహలక్ష్మి కుటుంబాన్ని ఆదివారం వైద్యుడు అంబుల మనోజ్ పరామర్శించారు. కానుకొల్లులోని వారి నివాసంలో వారి కుమారుడు, కుమార్తెను పరామర్శించి ఓదార్చారు. తల్లిదండ్రుల మృతికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి తరఫున రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని వారికి అందించారు.

సాయం చేయడమే క్రైస్తవ్యం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న పేదలకు సాయం చేసి భరోసా కల్పించడమే నిజమైన క్రైస్తవ్యమని పాస్టర్లు కాటూరి జాన్ సునీల్, రమేశ్ పాల్, ఖాదేశ్‌బాబు తెలిపారు. ఆగిరిపల్లి మండలం సగ్గూరులో ఎం.ఎం.చర్చి, క్రౌన్ గాస్పల్ మినిస్ట్రీస్ ఛారిటబుల్ ట్రస్ట్, మదర్ థెరిసా ప్రేయర్ మినిస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 100 నిరుపేద వృద్ధులకు, ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

విద్యార్థినుల చదువుకు చేయూత

చాట్రాయి, న్యూస్‌టుడే: చనుబండ శివారు కరుణాపురం గ్రామానికి చెందిన పిల్లి ప్రకాశరావు ఇటీవల మృతి చెందగా కుమార్తెలు జయశ్రీ, ఉదయశ్రీల చదువు తల్లి మేరీకి భారమైంది. వీరి పరిస్థితి చూసిన భాజపా జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు బుర్రి శ్రీకర్ ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన 'కిట్స్' సంస్థ కార్యదర్శి జంగం కస్తూరి దృష్టికి తీసుకు వెళ్లారు. ఆమె తెలంగాణ విద్యుత్తు శాఖలో ఎస్ఈగా పని చేస్తున్న బూరుగు విజయ భాస్కర్‌కు తెలిపారు. ఆయన స్పందించి ఆదివారం కరుణాపురం వచ్చి వారి చదువు కోసం రూ.50 వేలు నగదు అందించారు. చదువుల్లో మరింత రాణిస్తే తాను అండగా నిలుస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు.

నేడు రీ సర్వే గ్రామ సభలు

కలిదిండి, న్యూస్‌టుడే : రైతుల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రీ సర్వే గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు రామకృష్ణ ఆదివారం తెలిపారు. ఈ నెల 29న ఉదయం 11 గంటలకు పెదలంక, సాయంత్రం 3 గంటలకు కోరుకొల్లులో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రీ సర్వేపై రైతులు అవలంబించాల్సిన అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

నాలుగో రోజుకు చేరిన నిరసన

ట్రిపుల్ ఐటీలో ఆందోళన చేస్తున్న సహాయ ఆచార్యులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పని చేస్తున్న అధ్యాపకుల వేతనాలు పెంచాలని కోరుతూ చేస్తున్న నిరసన దీక్ష నాలుగో రోజుకు చేరింది. ఆదివారం మధ్యాహ్న సమయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు నిరసనకు దిగారు. వీరికి కొందరు మెంటార్లు మద్దతు ప్రకటించారు. చింతయ్య నాయుడు, సతీశ్, మధుసూదనరెడ్డి, వేణుగోపాల్, భరత్, సుబ్బారావు, కృష్ణ, విజయశ్రీ, భవాని, దీప్తి సాహు, బాపిరాజు, గణేశ్, వెంకటేశ్వర్లు, విజయకుమార్ మిశ్రా, లక్ష్మణరావు, మధు, అమరేంద్రదాస్ వి. నాయుడు, సీతాపతిరావు నిరసన దీక్షలో పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో కాపా జన్మదిన వేడుకలు

పండ్లు, మిఠాయిలు పంచుతున్న శ్రీనివాసరావు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: తెదేపా సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ ఛైర్మన్, రావిచర్ల సర్పంచి కాపా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో, నూజివీడులో నిర్వహించారు. తుక్కులూరులోని జేబీఎల్ హోంలో వృద్ధులతో కలిసి కేసు కోశారు. అనంతరం వారికి పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. వెంకటాద్రిపురంలో, కొత్తూరు తోటలో, నూజివీడు ఎన్టీఆర్ భవన్ వద్ద పలు గ్రామాల్లో కేక్‌లు కోసి సందడి చేశారు. ఏపీపీ వాకా రాజకుమార్, వివిధ గ్రామాల నాయకులు వంకాయల నరసింహారావు, పామర్తి వెంకట నాగేంద్రరావు, కాపా సాంబశివరావు, డి. గురవయ్య, వరుగు రఘునాథ బాబు, వరుగు నీలిమ, వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు హాజరై పుష్పగుచ్ఛాలు ఇచ్చి శ్రీనివాసరావును అభినందించారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి

మండవల్లి, న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణకు హిందూ బంధువులంతా ఐక్యతతో కృషి చేయాలని పలువురు హిందూ ప్రచారకులు పేర్కొన్నారు. ఈ మేరకు మండవల్లి శివాలయం ప్రాంగణంలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ హిందువులు, వారికి చెందిన దేవాలయాలపై ఇటీవల అనేక దాడులు జరుగుతున్నాయని తెలిపారు. తిరుమల తిరుపతి పరపతిని తగ్గించాలనే దురుద్దేశంతో సామాజిక మాధ్యమాల్లో కొందరు అసత్య ప్రచారాలను చేస్తున్నారని వారిపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దేవాలయాలను పరిరక్షించాలని కోరారు. అంతకుముందు సభా వేదికపై పలువురు చిన్నారులు చేసిన భరత నాట్య ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.

చిన్నారుల భరతనాట్య ప్రదర్శన

యువజనోత్సవాల్లో జానపద బృందానికి తృతీయ స్థానం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన యువజనోత్సవాల్లో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ప్రతిభ కనబర్చడంతో జానపద బృందానికి తృతీయ స్థానం దక్కింది. విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ట్రిపుల్ ఐటీ సంగీత విభాగం విద్యార్థినులు కె.మౌనిక, హరిత, జ్యోతిర్మయి, భార్గవి, వాణి, విష్ణువర్దన్‌లు కలిసి పాడారు. ప్రణీత్, రేవంత్ వాద్య సహకారం అందించారు. సంగీత విభాగం హెచ్‌వోడీ జి.చంద్రమౌళి, అధ్యాపకులు ఎం.శ్రీధర్, బి.విద్యాసాగర్, డైరెక్టర్, ఏవో, అకడమిక్ డీన్‌లు విద్యార్థులను అభినందించారు.

చికిత్స పొందుతూ మృతి

కలిదిండి, న్యూస్‌టుడే : కళ్లు తిరిగి కింద పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కోరుకొల్లుకు చెందిన గుడిసె వెంకటేశ్వరరావు (40) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 21న ఉదయం 9.30 సమయంలో ఇంటి పక్కన రోడ్డు మీద నిలబడి ఉండగా ఆకస్మికంగా కళ్లు తిరిగి పడిపోయారు. తలలో రాయి దిగడంతో రక్త స్రావమైంది. దీంతో కుటుంబ సభ్యులు తొలుత కైకలూరు ఆ తరువాత ఏలూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అనంతరం గుంటూరులో వైద్యం చేయించి ఇంటికి తీసుకొచ్చారు. 24న మరోసారి తలకు తగిలిన గాయం వల్ల ఆరోగ్య సమస్య రావడంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటి నుంచి అక్కడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఏఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. దీనిపై ఆయన భార్య మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై ఆదివారం కేసు నమోదు చేశామన్నారు.

సీఐ కార్యాలయం వద్ద మహిళల రాస్తారోకో

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లా మధిరకు చెందిన సరోజ అనే మహిళ తనకు న్యాయం చేయాలంటూ మరికొందరు మహిళలతో కలిసి నూజివీడు రూరల్ సీఐ కార్యాలయం వద్ద ఆదివారం రాత్రి రాస్తారోకో నిర్వహించారు. దీనికి సంబంధించి రూరల్ ఎస్ఐ జ్యోతిబాసు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మధిరకు చెందిన సరోజకు నూజివీడు మండలంలోని పోతురెడ్డిపల్లికి చెందిన ఒక యువకుడికి 2016లో గుజరాత్‌లో పరిచయం ఏర్పడింది. తరువాత ఈ మహిళకు మరో వ్యక్తితో పెళ్లి అయ్యింది. మధ్యలో ఏమి జరిగిందో ఏమో ఆ మహిళ తన భర్తతో గొడవ పడి దూరంగా ఉంటోంది. కొన్నాళ్ల క్రితం భర్తే కావాలంటూ న్యాయస్థానంలో పిటిషన్ వేసింది. తాజాగా తాను గుజరాత్‌లో ఉండగా తనను ప్రేమించిన వ్యక్తి అమెరికా నుంచి వచ్చి మరో మహిళను పెళ్లి చేసుకుంటున్నాడని, ఆ పెళ్లి నిలిపేయాలంటూ రాద్ధాంతం చేస్తోందని ఎస్సై తెలిపారు. ఈ వ్యవహారంపై విచారణ చేస్తున్నామని, చట్ట ప్రకారం చర్యలుంటాయని స్పష్టం చేశారు. నూజివీడు మైలవరం రహదారిపై పలువురు మహిళలతో బైఠాయించి నిరసన తెలపడంతో వాహనాలు బారులు తీరాయి. స్పందించిన పట్టణ, రూరల్ పోలీసులు ఆందోళన చేస్తున్న మహిళలను అక్కడి నుంచి పంపించేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేస్తామని రూరల్ ఎస్ఐ పేర్కొన్నారు.

పేదలకు అండగా 'మానవత'

మండవల్లి, న్యూస్‌టుడే: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పేదవర్గాలకు అండగా ఉంటూ భరోసా కల్పిస్తుందని ఆ సంస్థ కెరీర్ గైడెన్స్ ఛైర్మన్ సుధా బత్తుల విజయ్‌కుమార్ అన్నారు. మండల శాఖ అధ్యక్షుడు గుడివాడ గణేశ్ ఆధ్వర్యంలో మండలంలోని అయ్యవారి రుద్రవరంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పరసా గోపాలకృష్ణ ఆయన తండ్రి రామయ్య జ్ఞాపకార్థం రూ. 72 వేలు విలువ చేసే మార్చురీ బాక్స్‌ను మానవతా సంస్థకు అందజేశారు. ఈ క్రమంలో గోపాలకృష్ణ కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న గ్రామస్థురాలు సీతమ్మకు సంస్థ తరపున నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఇందులో బొల్లంపల్లి కృష్ణారావు, శివయ్య, కిన్నెబాబు, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

చేపల పట్టుబడి నిలిపివేత

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం పెనుమాకలంక మంచినీటి చెరువు చేపలను పట్టుకునే నిమిత్తం వేలంపాట నిర్వహించకుండా సర్పంచి అనుయాయులకు కేటాయించారు. దీనిపై గ్రామస్థుల నుంచి పెద్దఎత్తున విమర్శలు తలెత్తడంతో ఈ విషయాన్ని ఎంపీడీవో రమణబాబు, ఈవోపీఆర్డీ నారాయణ దృష్టికి తీసుకువెళ్లడంతో చేపల పట్టుబడిని నిలిపివేశారు. 2500 వరకు జనాభా కలిగిన పెనుమాకలంకలో తాగునీటి కోసం 12 ఎకరాల మంచినీటి చెరువు ఉంది. గత సంవత్సరం ఇదే చెరువును రూ.1.35 లక్షలకు వేలంపాటలో దక్కించుకున్నారు. కానీ ఈసారి పంచాయతీ కార్యదర్శి నిబంధనలకు విరుద్ధంగా రూ.50 వేలకే సర్పంచి బంధువులకు అప్పగించారు. అప్‌సెట్ ధర కంటే తక్కువ ధరకు ఎలా వేలం పాటను తగ్గించారో తెలియలేదు. పాటను నిర్వహిస్తే పలువురు యువకులు పాడుకునేందుకు సిద్ధంగా ఉండటంతో ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో నారాయణ కేటాయింపును రద్దుచేసి త్వరలో వేలంపాట నిర్వహించాలని కార్యదర్శికి ఈవోపీఆర్డీ సూచించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము దేవదాయ ధర్మదాయ శాఖ
శ్రీ పెద్దింటి అమ్మ వారి దేవస్థానము, కొల్లేటికోట, కైకలూరు మండలం, ఏలూరు జిల్లా.
సీల్డ్ టెండర్ /కొటేషన్ల ప్రకటన

ఏలూరు జిల్లా, కైకలూరు మండలం, కొల్లేటికోట గ్రామంలో వేంచేసియున్న శ్రీ పెద్దింటి అమ్మవారి దేవస్థానం నందు శ్రీ అమ్మవారి జాతర ఉత్సవములు ది. 18-02-2026 తేదీ నుండి ది. 03-03-2026 తేదీ వరకు జరుగు సందర్భంగా ఈ క్రింది తెలిపిన షెడ్యూల్ ప్రకారంగా సీల్డ్ టెండర్స్ / కొటేషన్స్ కోరడమైనది. ఆసక్తిగల వారు సదరు టెండర్లలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

వ. నెం.	టెండర్ వివరములు	టెండర్ కాలపరిమితి	ధరావతు మొత్తం రూ.	టెండర్ షెడ్యూల్ ఖరీదు
1	ఎలక్ట్రికల్ లైటింగ్ డెకరేషన్ చేయుటకు	ది. 18-02-2026 నుండి ది. 20-03-2026 వరకు	10,000/-	200/-
2	స్టేజి మరియు చాందిని డెకరేషన్ చేయుటకు	ది. 18-02-2026 నుండి ది. 20-03-2026 వరకు	5,000/-	200/-
3	తాటియాకు పందిర్లు వేయుటకు మరియు క్యూలైన్లు ఏర్పాటు చేయుటకు	ది. 18-02-2026 నుండి ది. 20-03-2026 వరకు	10,000/-	200/-
4	టెంపరరీ స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయుటకు	ది. 18-02-2026 నుండి ది. 20-03-2026 వరకు	5,000/-	200/-
5	సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు చేయుటకు	ది. 18-02-2026 నుండి ది. 20-03-2026 వరకు	5,000/-	200/-
6	దేవాలయం పరిసరములు మరియు రోడ్లు వాటరింగు చేయుటకు	ది. 18-02-2026 నుండి ది. 03-03-2026 వరకు	2,000/-	200/-
7	వంట సామగ్రి, లేబర్‌తో సహా అన్నదానం వంటలు, ప్రసాదములు తయారు చేయుటకు	ది. 18-02-2026 నుండి ది. 03-03-2026 వరకు	2,000/-	200/-
8	శ్రీ అమ్మవారి జాతర ఉత్సవములలో అన్నదానం వంటలకు కూరగాయలు సప్లయి చేయుటకు	ది. 18-02-2026 నుండి ది. 03-03-2026 వరకు	2,000/-	200/-
9	రంగులు, సున్నాలు వేయుటకు లేబర్ ఛార్జి నిమిత్తం	ది. 20-01-2026 నుండి ది. 15-02-2026 వరకు	2,000/-	200/-
10	రంగులు, సున్నాలు వగైరా సప్లయి చేయుటకు	ది. 20-01-2026 నుండి ది. 15-02-2026 వరకు	2,000/-	200/-
11	శ్రీ అమ్మవారి జాతర ఉత్సవములలో సెక్యూరిటీ గార్డ్స్ ఏర్పాటు చేయుటకు	ది. 18-02-2026 నుండి ది. 03-03-2026 వరకు	1,000/-	200/-
12	శ్రీ గోకర్ణేశ్వర స్వామి వారి దేవస్థానం గోకర్ణపురం నందు మహాశివరాత్రి సందర్భంగా ఎలక్ట్రికల్ లైటింగ్	ది. 13-02-2026 నుండి ది. 25-03-2026 వరకు	10,000/-	200/-
13	దేవస్థానం ముఖమండపం చుట్టూ ఉన్న పాత అయిరన్ గేటులు, పాత అయిరన్ వగైరా టెండర్ కం బహిరంగ వేలం పాట ది. 09-01-2026 తేదీ మధ్యాహ్నం గం. 3.00లకు సదరు దేవస్థానము వద్ద నిర్వహించబడును. ఆసక్తి గలవారు పాల్గొనగలరు.			ధరావతు రూ. 3,000/-

గమనిక: ఈ క్రింది తెలిపిన షెడ్యూల్ ప్రకారంగా ది. 07-01-2026వ తేదీ ఉదయం గం. 10.00ల నుండి ది. 08-01-2026 తేదీ సాయంత్రం గం. 5.00ల వరకు టెండరు షెడ్యూల్ అమ్మకము మరియు ది. 09-01-2026వ తేదీ ఉదయం గం. 10.00ల నుండి మధ్యాహ్నం గం. 1.00ల వరకు టెండర్ షెడ్యూల్ తీసుకున్న వారు పూర్తి చేసిన టెండర్లను దేవస్థానం వారు ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో వేయుట, తదుపరి మధ్యాహ్నం గం. 2.00లకు హాజరయిన టెండర్ దారుల సమక్షంలో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో సదరు సంస్థ కార్యనిర్వహణాధికారి వారిచే టెండర్ బాక్స్‌ను తెరచి అందు వచ్చిన టెండర్లను / కొటేషన్స్ తీసుకొనబడును. ఆసక్తిగల హిందువులు మాత్రమే సదరు టెండర్లలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము. టెండర్లు తీసుకున్న వారు ముందుగా పైన తెలిపిన విధముగా ధరావతు సొమ్ము డి.డి. రూపముగా లేదా నగదును టెండర్ కవర్లో పెట్టి, పూర్తి చేసిన టెండర్లను దేవస్థానం వారు ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో వేయవలెను. ఇతర వివరములు కొరకు దేవస్థానం వారి కార్యాలయము పనివేళలలో స్వయంగా గాని, ఫోన్ ద్వారా గాని అడిగి తెలుసుకొనగలరు.

శ్రీ అమ్మ వారి సేవలో

కొల్లేటికోట సం/- **కె.శ్రీనివాసు,** కార్యనిర్వహణాధికారి
ది. 27-12-2025 సెల్: 91771 45150

(c) eenadu

త్యాగరాజ కీర్తన.. భక్తిభావన

కాకినాడలో ౬౦౦ మందితో స్వరార్చన

వేదికపై కళాకారుల నడుమ ప్రవచనం చేస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి

గాంధీనగర్(కాకినాడ), న్యూస్‌టుడే: త్యాగరాజస్వామి పంచరత్న కీర్తనల్లో భక్తిభావం ఉట్టిపడుతుందని, పాడిన, విన్న వారి జన్మ ధన్యమని భావిస్తారని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కాకినాడలోని సరస్వతి గానసభ 122 ఏళ్ల వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం స్థానిక ఆనందభారతి మైదానంలో వేదికపై త్యాగరాజస్వామి 178వ వర్ధంతిని పురస్కరించుకుని 600 మంది సంగీత విద్వాంసులతో త్యాగరాజ పంచరత్న సేవ, స్వరార్చన నిర్వహించారు. కాకినాడ ఎమ్మెల్యే కొండబాబు, సంస్థ గౌరవాధ్యక్షురాలు పెద్దాడ సూర్యకుమారి, అధ్యక్షులు డా.నాగేశ్వరరావు, జీవితకాల అధ్యక్షుడు శ్రీరామనర్సింగరావు, కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షులు టిక్కు, మురళి తదితరులతో కలిసి చాగంటి ప్రారంభించారు. బ్రహ్మశ్రీ చాగంటి మాట్లాడుతూ సరస్వతీ గానసభ మంచి కార్యక్రమం నిర్వహించిందన్నారు. సంగీత విద్వాంసులను సూర్యకుమారి, సుధాకర్, పద్మశ్రీ యల్లా వెంకటేశ్వరరావు, జయభాస్కర్, లోకేశ్, ఏడుకొండలు, శారదాసుబ్రహ్మణ్యం, శేషరాణి తదితరులతోకలిసి సత్కరించారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర ఛైర్మన్ రామారావు, జేఎన్‌టీయూకే వీసీ ప్రసాద్, డాక్టర్ ఐవీరావు తదితరులు పాల్గొన్నారు.

అతిథులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వనమాడి తదితరులు

ఆలోచన అదిరింది.. ప్రతిభ ఫలించింది..

జాతీయ, సౌత్ జోన్‌కు అయిదు ప్రాజెక్టుల ఎంపిక

☛ ప్రాజెక్టు
● విద్యార్థులు
❖ పాఠశాల
■ ప్రత్యేకత
✓ ఎంపిక

న్యూస్‌టుడే, కరప, రమణయ్యపేట

కరప మండలానికి చెందిన విద్యార్థులు తమ ఆలోచనలతో తయారు చేసిన ప్రాజెక్టులు ప్రత్యేకత చాటాయి. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో అబ్బురపరిచాయి. కాకినాడ జిల్లానుంచి మొత్తం అయిదు ప్రాజెక్టులు ఎంపిక కాగా.. అన్నీ కరప మండలం నుంచే కావడం విశేషం.

☛ మస్కిటో కిల్లింగ్ విండో(దోమల్ని చంపే కిటికీ)
● ఆశాజ్యోతి, నవ్యశ్రీ వాణిదేవి, గైడ్ టీచర్ గౌస్ జానీ
❖ కరప జడ్పీ ఉన్నత పాఠశాల

■ అల్యూమినియం మెష్, నీలం రంగు ఎల్ఈడీ లైట్లు, బ్యాటరీ, గమ్, కార్డ్ బోర్డులతో నాలుగు అడుగుల ఎత్తు, ఒక అడుగు వెడల్పు ఉండే కిటికీకి రూ.900 ఖర్చుతో రక్షణ కవచం తయారు చేసి 50 వోల్టుల విద్యుత్తు ప్రవాహాన్ని ఇస్తారు. నీలం రంగు వెలుగుకు దోమలు ఆకర్షితమై మెష్‌పై వాలగానే చనిపోతాయి.
✓ జాతీయస్థాయి రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన, సౌత్ ఇండియా సైన్స్ ఫెస్టివల్-2026లకు

☛ సోలార్ ట్రాకర్
● వినయ్ తేజ, గైడ్ టీచర్ బెహరా మూర్తి
❖ గొర్రిపూడి జడ్పీ ఉన్నత పాఠశాల

■ సాధారణం కంటే 40 నుంచి 50 శాతం సోలార్ విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు ఈ సోలార్ ట్రాకర్ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. ప్యానళ్లు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలంటే సూర్యకిరణాలు వాటిపై లంబ దిశలో పడాలి. కానీ పొద్దు వాలే పరిస్థితుల్లో అలా జరగదు. సూరీడు గమనాన్ని పసిగట్టి సోలార్ ప్యానళ్లను అటుగా తిప్పుతూ ఉండేలా చేసి అధిక విద్యుదుత్పత్తి చేయడం దీని ప్రత్యేకత.
✓ సౌత్ ఇండియా సైన్స్ ఫెస్టివల్-2026కు

☛ నెక్స్ట్ జనరేషన్ ఇంట్రాక్టివ్ ప్రోగ్రెస్ అనాలసిస్ (విద్యార్థుల సమగ్ర నివేదిక)
● ఉపాధ్యాయుడు: వెలుగుబంట్ల వెంకటరమణమూర్తి
❖ గురజనాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల
■ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థి చదువులో చూపుతున్న ప్రతిభ గురించి తెలుసుకునేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. అప్లికేషన్‌లో విద్యార్థి పేరు టైప్ చేయగానే రాసిన పరీక్షలు, వచ్చిన మార్కులు, వెనుకబాటున్న పాఠ్యాంశాలు, హాజరు శాతం తదితరాలను విశ్లేషించి సమగ్ర నివేదికను తెలుగులోనే వివరిస్తుంది.
✓ సౌత్ ఇండియా సైన్స్ ఫెస్టివల్-2026కు

☛ రివర్ క్లీనింగ్ బోట్ ప్రాజెక్టు(నదీ జల ప్రక్షాళన)
● పల్లవిలాస్య, శన్మంత, గైడ్ టీచర్ నాగరాజేశ్వరి
❖ పెద్దాపురప్పాడు జడ్పీ ఉన్నత పాఠశాల

■ నీటి వనరుల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో కలుషిత సమస్యను నివారించేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. బ్లూటూత్ డివైజ్ ద్వారా సెల్‌ఫోన్ ఉపయోగించి సులభంగా వ్యర్థాలు తొలగించేలా రివర్ క్లీనింగ్ బోట్ ప్రాజెక్టు రూపొందించారు. బోటుకు డ్రమ్ అమర్చి, దానికి మోటారు బిగించి కంప్యూటర్ ద్వారా కోడింగ్ ఇచ్చారు. దానికి ఇచ్చే సంకేతాల ఆధారంగా వ్యర్థాలు సేకరించి ఒడ్డుకు చేరుస్తుంది.
✓ జాతీయస్థాయి రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనలకు

పండగ సంతోషం ఆవిరి

టిక్కెట్ ధరలు పెంచేసిన ప్రైవేట్ ట్రావెల్స్

ఈనాడు, రాజమహేంద్రవరం: ఒకరి అవసరం.. మరొకరికి అవకాశం అన్నట్లుగా ఉంది ప్రైవేట్ రవాణా సంస్థల వ్యవహారం.. ఉద్యోగాలు, వివిధ వృత్తుల రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉంటూ సంక్రాంతి పండుగకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని స్వస్థలాలకు వచ్చేవారిని దృష్టిలో పెట్టుకొని టికెట్ ధరలు భారీగా పెంచేశారు. ఆన్‌లైన్ వేదికగా ముడింతలు పెంచి విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు కిమ్మనడంలేదు.

భారీ దోపిడీకి తెర..

ఉమ్మడి జిల్లాకు చెందినవారు ఎక్కువగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల్లో ఉన్నారు. ఉద్యోగస్థులే గాక వివిధ కూలి పనులకు వెళ్లినవారూ అధికమే. బస్సుల రద్దీ, టికెట్ ధరలు భరించలేక ద్విచక్ర వాహనాలపై వస్తుంటారు. ఈ క్రమంలో ప్రమాదాలకు గురైన సంఘటనలు గతంలో చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం పలు ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థలు ఏసీ, నాన్ ఏసీ, స్లీపర్, సిట్టింగ్‌కు సంబంధం లేకుండా భారీగా ధరలు పెంచేశాయి. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, రాజోలు ప్రాంతాల నుంచి సుమారు 150 వరకు ప్రైవేటు ట్రావెల్స్ ఉండగా, దూర ప్రాంతాల నుంచి జిల్లా మీదుగా వెళ్లేవీ అధికమే. పండగ రోజుల్లో ఒక వైపు ఖాళీగా వెళ్లాల్సి ఉంటుందని, అందుకే దాదాపు రెండు వైపుల ఛార్జీలు వసూలు చేస్తున్నారంటూ ఓ నిర్వాహకుడు సమర్థించుకునే ప్రయత్నం చేశారు.

డిసెంబరు 30, జనవరి 13 మధ్య ధరల వ్యత్యాసం ఇలా..

● ప్రస్తుతం హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి ఏసీ స్లీపర్ రూ.729 నుంచి రూ.1731. సిట్టింగ్ రూ.509 ఉండగా సంక్రాంతి రోజుల్లో రూ.3549, సిట్టింగ్‌కు రూ.1709 వసూలు చేస్తున్నారు.
● హైదరాబాద్ నుంచి అమలాపురానికి సాధారణ రోజుల్లో రూ.769 నుంచి రూ.1440 ఉండగా, సిట్టింగ్‌కు రూ.550 ధర ఉంది. పర్వదినానికి స్లీపర్ రూ.2109 నుంచి రూ.3389, సిట్టింగ్‌కు రూ.1899-2099గా తీసుకుంటున్నారు.
● హైదరాబాద్-కాకినాడకు ఇప్పుడు రూ.759 నుంచి రూ.1466, సిట్టింగ్ రూ.499 టిక్కెట్ ధర ఉంది. పండగ మూడు రోజుల్లో రూ.2399 నుంచి రూ.3712, సిట్టింగ్ రూ.1749 చెబుతున్నారు.

అందుబాటులో ఎరువులు

ముఖాముఖి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: జిల్లాలో రైతులు రబీ వరి సాగు చేపట్టారు. మార్చి 31కి పంట కాలం పూర్తి చేస్తారని, ఈ దశలో రైతుల అవసరాలపై 'న్యూస్‌టుడే'తో జిల్లా వ్యవసాయాధికారి డా.విజయకుమార్ మాట్లాడారు.

✦ రబీ వరి సాగు 1,77,490 ఎకరాలు. 1,10,007 ఎకరాల్లో వెదజల్లే విధానం పాటించేలా రైతులను ప్రోత్సహిస్తున్నాం.
✦ రబీలో 1,77,490 ఎకరాలకుగాను 1,16,112.5 ఎకరాల్లో ఎంటీయూ 3626, 1125, 1156 రకాల వంగడాలు వేస్తున్నారు. 61,367.5 ఎకరాల్లో కేఎస్ఎల్ 7715, ఆర్ఎన్ఆర్ 14058, సాధన, ఓంసాయి విత్తనాలు సాగు చేస్తారు.
✦ అన్నిరకాల పంటకు 61,271 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం. ఇప్పటికి 11,483 మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చారు. ఇంకా జిల్లాలో 6,048 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. నిర్ణీత ధరకంటే ఎక్కువకు అమ్మితే చర్యలు తప్పవు.
✦ నానో యూరియా, నానో డీఏపీలు అందుబాటులో ఉంచాం. ప్రస్తుతం 722 లీటర్ల నానో యూరియా ఆర్ఎస్‌కేల్లో ఉంది.
✦ జిల్లాలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తునాం. ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నాం.

రూ.12 కోట్ల నిధులు.. ప్రారంభం కాని పనులు

రమణయ్యపేట రోడ్డుకు వీడని గ్రహణం

భారీ వాహనాలతో దుమ్ము రేగుతున్న రహదారి

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ నిర్వాకం.. నేటికి వెంటాడుతూనే ఉంది. కాకినాడ - అల్లూరి సీతారామరాజు జిల్లావాసుల పాలిట శాపంగా మారింది. రూ.కోట్లు విడుదలైనా.. రహదారి పనులు నిర్మాణానికి నోచుకోవడం లేదు. దీంతో రోజూ ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ రోడ్డుకి సంబంధించి గతంలో నిర్మాణ దిన పనులకు ఇప్పటివరకు లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. వర్షాలు కురిస్తే రోడ్డు సెలయేరులను తలపిస్తూ ప్రమాదాలకు చిరునామాగా మారుతోంది. ప్రస్తుత సమయంలో వాహనాల రాకపోకలతో వచ్చే దుమ్ముతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు.

✦ రహదారి: రమణయ్యపేట - జె.అన్నవరం రోడ్డు
✦ నిధులు: రూ.12 కోట్లు (ఎన్‌డీబీ)
✦ దూరం: 13 కి.మీ
✦ శాఖ: రహదారులు, భవనాలు
✦ జిల్లాలు: ఏఎస్ఆర్ జిల్లా, కాకినాడ జిల్లా వాసులు
✦ ఇబ్బందులు పడేవారు: సుమారు 50 వేల మంది

దుమ్ము ధూళితో వెతలు

రెండు జిల్లా పరిధిలోని రమణయ్యపేట, తూర్పులక్ష్మీపురం, గొంటువానిపాలెం, కిమ్మూరు, జె.అన్నవరం తదితర గ్రామాలకు చెందిన వేల మంది ప్రయాణికులు రోజూ ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తారు. భారీ వాహనాలు టిప్పర్లు, లారీలు, ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించే వేళ దుమ్ము ఎగసిపడుతోంది. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఇప్పటికే రోడ్డు సమస్యపై ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులకు వినతిపత్రాలు అందించారు. ప్రభుత్వం స్పందించి రెండు జిల్లాలకు చెందిన రహదారిని పునర్నిర్మించాల్సి ఉంది.

ప్రస్తుత పరిస్థితిని నివేదించాం

జె.అన్నవరం - రమణయ్యపేట రహదారి ప్రస్తుత స్థితి గురించి వివరిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాం. గుత్తేదారుకు నోటీసులు ఇస్తున్నారు. ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మా వంతు ప్రయత్నాలు చేస్తున్నాం. - సాయి కిరణ్, ఇన్‌ఛార్జి జేఈ, ర.భ.శాఖ, ఏలేశ్వరం

పెదాలు పాడే.. పాదాలు ఆడే..

కాకినాడలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం సందడి నెలకొంది. విద్యార్థులే కళాకారులై ప్రతిభ చాటారు. బృంద నృత్యాలతో హోరెత్తించారు. పలు గీతాలకు పెదాలు కదుపుతూ.. పాదాలు మెదుపుతూ స్టెప్పులేసి అదరగొట్టారు. ఎస్ఎఫ్ఐ కల్చరల్ ఫెస్ట్‌లో నెలకొందీ హంగామా.
- న్యూస్‌టుడే, గాంధీనగర్(కాకినాడ)

బండెద్దుల బలం.. అశ్వాల శౌర్యం..



రంగంపేట, న్యూస్‌టుడే: ఓవైపు జోడు ఎద్దులు రంకెలు వేస్తుంటే.. మరోవైపు గుర్రాలు పరుగులు పెడుతుంటే.. ఉమ్మడి జిల్లాకు ముందే సంక్రాంతి వచ్చిందా అన్న అనుభూతి కలిగింది. రంగంపేట-వడిశలేరు మధ్య గన్ని వారి తోటలో ఆదివారం జరిగిన పందేలు చూసేందుకు జనాలు తరలివచ్చారు. జీఎస్ఎల్ ఛైర్మన్ గన్ని భాస్కరరావు ఏడేళ్లుగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. ఏటా ఎద్దులకే పెట్టగా ఈసారి గుర్రాలకు సైతం పెట్టారు. మంత్రి దుర్గేష్ ప్రారంభించగా ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, చిత్రంలో జీఎస్ఎల్ ఛైర్మన్ భాస్కరరావు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రైతులతో పాటు వివిధ వృత్తుల వారు పాల్గొనడం అందర్నీ ఆకర్షింపజేసింది. డీఎస్పీ దివ్య ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఏడీబీ రోడ్డుపై ఓవైపు మాత్రమే రాకపోకలు సాగేలా చర్యలు చేపట్టారు. దీంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.

విజేతలు వీరే

● గుర్రం పరుగు పందెంలో ఎల్లపు జగదీష్ (యలమంచిలి), విక్రమ్ (రామన్నపాలెం)కు చెందిన గుర్రాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ● జూనియర్స్ ఎద్దుల పందెం విభాగంలో కొండేటి పద్మ(కంకటపాలెం), మురుకుర్తి శంకరరావు(జి.కొత్తూరు, అనకాపల్లి జిల్లా)కు చెందిన ఎడ్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ● సీనియర్స్ విభాగంలో కోరా శృతి చౌదరి (గుమ్మిలేరు, మండపేట)కు చెందిన ఎద్దులే ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవడం విశేషం.

ముందే కత్తులు దూస్తున్నాయ్!

కోడిపందేల ఏర్పాట్లకు ఒప్పందాలు

ఈనాడు, కాకినాడ; గండేపల్లి, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగకు ముందే జిల్లాలో కోళ్ల కత్తులు దూస్తున్నాయ్. నేతల అండదండలతో నిర్వాహకులు బరిలోకి దిగుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం 200 పైచిలుకు కోడి కత్తులను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసులు పెట్టారు. జగ్గంపేట సమీపంలో శుక్రవారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుగులో భారీ స్థాయిలో కోడి పందేలు నిర్వహించారు. ఓ నేత సన్నిహితుల కోసం నిర్వహించినట్లు సమాచారం. ఆరుగురిపై పోలీసులు కేసు నమోదుచేసి చేతులు దులిపేసుకున్నారు.

అంతా కమిటీ కుర్రాళ్లేనండి..

ఏటా ఉమ్మడి జిల్లాలోని మెజారిటీ గ్రామాల్లో సంక్రాంతికి నెల ముందు నుంచే యువత, పెద్దలు కమిటీలుగా ఏర్పడుతున్నారు. కోళ్ల బరులు సిద్ధం చేయడం నుంచి పండగ ముగిసే వరకు ఏర్పాట్లలో ఒక్కొక్కరిది ఒక్కో బాధ్యత. గుండాటలు, పందేల నిర్వాహకులతో ఒక్కో బరికి స్థాయిని బట్టి రూ.లక్షల్లోనే ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో వేలం నిర్వహించారు. రాత్రి వేళల్లోనూ జరిగేలా ఫ్లడ్ లైట్ల ఏర్పాటు, జూదరులను ఆకర్షించేలా డీజేలు, నృత్యాలు ఏర్పాటుచేసుకుంటున్నారు.

భారీ స్థాయిలో బహుమతులు

కోడి పందేల్లో గెలిచిన విజేతలకు ఈదఫా సైతం రూ.లక్షల్లో నగదుతో పాటు ద్విచక్రవాహనాలు (బుల్లెట్లు) ఇవ్వనున్నట్లు సమాచారం. జగ్గంపేట, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, తుని, అన్నవరం, కాకినాడ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహణకు లోపాయికారి ఏర్పాట్లు జరిగాయి. జగ్గంపేట మండలంలో మల్లిశాల, గోవిందపురం, రాజపూడి, జగ్గంపేట, కాట్రావులపల్లి, మామిడాడలో భారీ పందేలు జరగనున్నాయి. గండేపల్లి పరిధిలో నాయకంపల్లి, గండేపల్లితో పాటు కిర్లంపూడి పరిధిలో కిర్లంపూడి, గోనేడ తదితర గ్రామాల్లో జరగనున్నాయి. పండగలో రోజుకు రెండు, మూడు ఓడిపోయిన కోడి పుంజులను పోలీస్ స్టేషన్‌కు అప్పగించి, ఒకరిద్దరిపై కేసులు నమోదు చేసుకునేలా ఒప్పందాలు చేసుకుంటున్నట్లు తెలిసింది. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు వద్ద ప్రస్తావించగా కోడి పందేలు ఎక్కడ నిర్వహించినా కేసులు నమోదు చేస్తామని, బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు. గుండాటలకు సంబంధించి వేలం పాటలు తమ దృష్టికి రాలేదన్నారు.

నేడు కలెక్టరేట్‌లో అర్జీలు ఇవ్వవచ్చు

సాంబమూర్తినగర్(కాకినాడ): కాకినాడలోని కలెక్టరేట్‌లో ఈ నెల 29న సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు ఇవ్వవచ్చని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శత వసంతాల సేవా శిఖరం

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: వైద్య రంగానికి డాక్టర్ శివరామకృష్ణారావు చేసిన సేవలు అజరామరమని ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ వైద్యులు, వక్తలు పేర్కొన్నారు. వైద్యుడిగా ఎందరికో సేవలందించి ప్రొఫెసర్‌గా ఎందరినో ఉత్తమ వైద్యులుగా తీర్చిదిద్దిన డాక్టర్ పట్నం శివరామకృష్ణారావు వందో జన్మదిన వేడుకలు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఓ హోటల్‌లో శిష్యబృందం, కుటుంబ సభ్యుల మధ్య ఆదివారం ఘనంగా జరిగాయి. విశాఖపట్టణం, గుంటూరు, కాకినాడ వైద్య కళాశాలల పూర్వ విద్యార్థులైన ప్రముఖ వైద్యనిపుణులు, హైదరాబాద్, కర్నూలు, విజయవాడ, రాజమహేంద్రవరం నగరాలకు చెందిన శిష్యులు పెద్ద ఎత్తున హాజరై శివరామకృష్ణారావును సత్కరించి పాదాభివందనం చేశారు. ఆయన నెల్లూరులో జన్మించినా రాజమహేంద్రవరంలో మనమరాలు వద్ద స్థిరపడ్డారు.

కుటుంబ సభ్యులతో డాక్టర్ శివరామకృష్ణారావు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

బయటకొస్తే భౌ బోయ్!

పెరుగుతున్న కుక్కకాటు బాధితులు

న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

● కాకినాడ గ్రామీణానికి చెందిన ఓ వ్యక్తి నెల రోజుల కిందట ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కుక్క వెంబడించింది. దీంతో భయపడి వేగం పెంచడంతో అదుపుతప్పి కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడ్డాడు.
● కాకినాడ సాంబమూర్తినగర్‌కు చెందిన 54 ఏళ్ల మహిళను కుక్క కరిచింది. పూర్తిస్థాయిలో వ్యాక్సిన్ వేయించుకోకపోవడంతో ఆమె రేబిస్ బారిన పడింది. జీజీహెచ్‌లో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

పల్లెలు, పట్టణాలు, నగరాలనే తేడా లేకుండా ఏ వీధిలో చూసిన గుంపులుగా వీధి శునకాలు తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పలువురిపై దాడి చేస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న సమయంలో వెంటపడుతుండటంతో కిందపడి గాయపడుతున్నారు. దీంతో ఏటా కేసులు పెరుగుతున్నాయి. వీటి సంతతి పెరగకుండా శస్త్రచికిత్సలు చేస్తున్నామని, అధికారులు చెబుతున్నా పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు.

కాకినాడలోని ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి ఏటా వేల సంఖ్యలో కుక్కకాటు బాధితులు వస్తుంటారు. రేబిస్ బారిన పడిన వారినీ ఇక్కడకు తీసుకొస్తున్నారు. వీరిలో కొందరు మృత్యువాత పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది ఇప్పటివరకూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం అన్ని పీహెచ్‌సీల్లో సుమారు 6,450 మంది కుక్కకాటు బాధితులు చికిత్స పొందారు. ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించేవారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది.

జీజీహెచ్‌లో ఇలా..

సంవత్సరం	బాధితులు	రేబిస్ కేసులు	మరణాలు
2020	6942	11	10
2021	6031	8	7
2022	6364	6	6
2023	6523	3	2
2024	8372	12	11
2025	8457	3	3

నగరంలోని ఓ రహదారిపై

తర్వాత ఆసుపత్రులకు వచ్చినా పరిస్థితి చేయి దాటిపోయి మృతి చెందుతున్నారు. కుక్కల నియంత్రణపై ఇటీవల సుప్రీం కోర్టు ప్రత్యేక ఆదేశాలిచ్చింది. ఉన్నతాధికారులు వీటిపై దృష్టిసారించి అమలుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

వెంటనే చికిత్స అవసరం

కుక్క కరిచిన వెంటనే గాయాన్ని సబ్బు నీటితో శుభ్రంగా కడగాలి. వెంటనే క్రమం తప్పకుండా వైద్యుడు నిర్దేశించిన ప్రకారం యాంటీ రేబిస్ టీకాలు వేయించుకోవాలి. చాలా మంది నిర్లక్ష్యంతో పట్టించుకోకపోవడంతో వ్యాధి బారిన పడుతున్నారు.

అందుబాటులో టీకా..

కుక్కకాటు బాధితులు వెంటనే టీకా వేయించుకోవాలి. కాకినాడ జీజీహెచ్‌కు అధిక సంఖ్యలో వస్తున్నారు. వీరికి టీకా వేస్తున్నాం. ప్రస్తుతం జీజీహెచ్‌లో 20,510 నిల్వలు అందుబాటులో ఉన్నాయి.
- డా.లావణ్యకుమారి, సూపరింటెండెంట్, జీజీహెచ్

తవ్వండి.. తినండి..!

● అడ్డూ అదుపూ లేని మట్టి విక్రయాలు
● నేతల కనుసన్నల్లో దోపిడీ.. ఖజానాకు గండి

న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

అయినవారికి ఏదో ఒకటి చేయాలంటే నేతలకు సహజవనరులే కళ్ల ముందు సాక్షాత్కరిస్తాయి. ఇందులో మట్టి తవ్వకాలకే తొలి ప్రాధాన్యం. మట్టి, గ్రావెల్ గుట్టను చూపడం..ఇద్దరు,ముగ్గురికి అప్పగించడం.. తవ్వుకుని విక్రయించుకోవడం మెట్ట అంతటా 'మామూలు' వ్యవహారంగా మారింది. ఇటీవల పోలవరం మట్టి వేలాది క్యూబిక్ మీటర్లు కైంకర్యం చేశారు. సాదాసీదా వ్యక్తులు కాస్తా శ్రీమంతులవుతున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో మట్టి మేతకు అడ్డూ అదుపూ లేదు. వేసవిలో చెరువుల పని 'పట్టగా' ఇపుడు పోలవరం మట్టి కొల్లగొడుతున్నారు. టిప్పరు రూ.3500 నుంచి రూ.6 వేల వరకూ అమ్ముతున్నారు. పోలవరం కాలువ తవ్వినపుడు తీసిన మన్ను గట్టు వెంబడి 25 కి.మీ పొడవున 15 నుంచి 20 మీటర్ల ఎత్తులో కొండలా వేశారు. దీనికి సమాంతరంగానే పుష్కర కాలువ వెళ్లింది. పాలకులు ఎవరైనా ఈ కొండను తలా కొంత లాగిస్తున్నారు.

టి.రాయవరం దారిలో పొక్లెయిన్లతో తవ్వకం.. టిప్పర్‌తో తరలింపు

తాజాగా ప్రత్తిపాడు పరిధిలోనూ...

ప్రత్తిపాడు సమీపం టి.రాయవరం దారిలో శరవేగంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. 24 గంటలూ పది టిప్పర్లు, మూడు పొక్లెయిన్లు ఇక్కడ గత కొద్దిరోజులుగా పనిచేస్తున్నాయి. ధర్మవరం సమీపంలోని పోలవరం వంతెన వద్ద 150 చ.మీ.గుట్ట ఖాళీ అయింది. రూ.రెండు కోట్ల మేర మట్టి వ్యాపారం జరిగినట్లు బహిరంగంగా వినిపిస్తుంది. సూత్రధారులు, పాత్రధారులు బహిరంగ రహస్యమే కావడంలో యంత్రాంగం చోద్యం చూడటం తప్ప ఏమీ చేయలేక పోతోంది. విజిలెన్స్ అధికారులు అడపాదడపా తనిఖీలు చేయడం తప్ప దందా ఆగదు. తవ్విన మట్టిని స్థలాలు, ఫామ్ హౌస్‌లు చదును చేసుకోవడానికి, ఇటుక బట్టీలు, పట్టణాల్లోని స్థలాల చదునుకు విక్రయిస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో లక్షల పైగా క్యూబిక్ మీటర్ల మన్ను మండలంలో కాలువల వెంబడి పలుచోట్ల స్వాహా చేసినట్లు తెలుస్తోంది..

ఇలా లేదే..!

మట్టి, గ్రావెల్ తవ్వకాలకు రెవెన్యూ, గనులు, పంచాయతీ, రవాణా, పోలీసు శాఖల నుంచి అనుమతులు ఉండాలి. రాయల్టీ ద్వారా స్థానిక సంస్థల నుంచి పైవరకూ ఆదాయంగా మారాలి. తవ్వకానికి అనుమతులు పొందాకే యంత్రాలు దిగాలి. ఎక్కడో ఒకచోట అనుమతి పొందడం.. అంతటా తవ్వేయడమే ఆచరణగా ఉంది. దారులు ధ్వంసం చేయడం, పరిమితికి మించి మట్టిని తరలించడం సాధారణమైంది. ఏడాదిలో 200కి పైగా కేసులు రవాణాశాఖ రాసినా, అపరాధ రుసుము విధించినా మట్టి విక్రేతలకు అది లెక్కలోని అంశమే కాదు. మట్టి తవ్వకాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి నిర్దిష్టమైన విధానాలను అమలు చేస్తే తప్ప సహజవనరులు ప్రైవేటుపరమే అవుతాయని అంటున్నారు. తాజా తవ్వకాలపై అధికారులను సంప్రదించగా స్పష్టమైన వివరణ ఇవ్వలేకపోయారు.

(c) eenadu

బౌండరీల మోత... సిక్సర్ల కూత..!

● ఉత్కంఠభరితంగా 'ఈనాడు క్రికెట్' పోటీలు

రాజానగరం, శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: బ్యాటర్లు సిక్సర్ల మోత మోగించారు. బంతి బంతికి బౌండరీలతో అభిమానులను అలరించారు. అంతర్జాతీయ క్రికెట్‌ను తలపించేలా ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ప్రెజెంట్స్) ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్) 2025 క్రికెట్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. అప్పటివరకు గెలుపు అంచుల వరకు వెళ్లిన జట్లు ఒక్క బంతితో ఓటమిపాలైంది. ఓటమి దరిలో ఉన్న జట్లు చివరకు విజయతీరాలకు చేరాయి. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఈఎస్‌ఎల్ పోటీలు రెండో రోజైన ఆదివారం జట్లు హోరా హోరీగా తలపడ్డాయి.

ఆఖరి బంతికి అదృష్టం వరించి

విజయానందంలో కేరింతలు కొడుతున్న బీవీసీ కళాశాల జట్టు

మైదానం - 1లో ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ (కాకినాడ) - బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల కోనసీమ (భట్లపాలెం) మధ్య జరిగిన మ్యాచ్ ప్రేక్షకులను రంజింప చేసింది. తొలుత టాస్ గెలిచి బీవీసీ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఆదిత్య కళాశాల జట్టు నిర్ణీత 10ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన బీవీసీ జట్టు ఎనిమిది వికెట్లు కోల్పోయి 96 పరుగులు సాధించి విజయం సాధించింది. ఆట చివరలో 12 బాల్స్‌లో 20 పరుగులు చేయాల్సి రావడంతో బీవీసీ జట్టు ఒత్తిడికి గురై త్వరత్వరగా వికెట్లు కోల్పోయింది. చివరికి ఒక బంతికి రెండు పరుగుల లక్ష్యంతో విజయం సాధించాల్సి ఉంది. ఆ సమయంలో అందరూ ఊపిరి బిగపట్టి చూస్తున్న సమయంలో ఆఖరి బంతికి రెండు పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. దీంతో విజయానందంతో బీవీసీ జట్టు మైదానంలో ఆనందంతో కేరింతలు కొట్టారు..

● ఆదివారం మధ్యాహ్నం ఐడియల్ కళాశాల ఆర్ట్స్ (కాకినాడ) x వికాస్ ఫార్మాస్యూటికల్ జట్లు తలపడాల్సి ఉండగా వికాస్ కళాశాల జట్టు రాకపోవడంతో న్యాయనిర్ణేతలు వాకోవర్ ఇచ్చి ఐడియల్ కళాశాల జట్టును విజయం సాధించినట్లుగా ప్రకటించారు.

వాకోవర్‌లో విజయం సాధించిన ఐడియల్ కళాశాల జట్టు

వాకోవర్‌తో విజయం సాధించిన చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కాకినాడ)

● మైదానం-2లో ఉదయం 8 గంటలకు చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, రంగరాయ వైద్య కళాశాల జట్టు మధ్య జరగాల్సిన మ్యాచ్‌లో రంగరాయజట్టు రాకపోవటంతో న్యాయనిర్ణేతలు వాకోవర్ ఇచ్చి చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీని విజేతగా ప్రకటించారు.

మ్యాచ్‌ను మలుపు తిప్పిన ఆ ఇద్దరు

విజయం సాధించిన జీఎస్‌ఎల్ కళాశాల జట్టు

మైదానం-1లో జీఎస్‌ఎల్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ (రాజమహేంద్రవరం), ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల జట్లు తలపడ్డాయి. జీఎస్‌ఎల్ జట్టు టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకుని నాలుగు వికెట్ల నష్టానికి 108 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రగతి కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 91 పరుగులు చేసింది. 17 పరుగుల ఆధిక్యంతో జీఎస్‌ఎల్ జట్టు విజయం సాధించింది. ఈ జట్టులో మధు 33 పరుగులు సాధించగా చంద్ర 6 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

33 పరుగులు సాధించి స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే గా నిలిచిన మధు

3 వికెట్లు సాధించి స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే గా నిలిచిన చంద్ర

ఆది నుంచి తడబడి.. ఓటమిపాలై..

ఇదే క్రీడామైదానంలో ఉదయం 10గంటలకు ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల (సూరంపాలెం), ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పీజీ (రాజమహేంద్రవరం) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఆదిత్య ఇంజినీరింగ్ జట్టు నిర్ణీత 10 ఓవర్లకు 8 వికెట్ల నష్టానికి 78పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నన్నయ యూనివర్సిటీ జట్టు మొదటి ఓవర్ నుంచే వికెట్లు కోల్పోవటం ప్రారంభించింది. 5 ఓవర్లు అయ్యే సమయానికి ఏకంగా 5 వికెట్లు కోల్పోయి కేవలం 30 పరుగులు మాత్రమే చేసి పీకల్లోతు కష్టాల్లో పడింది. తర్వాత వచ్చిన బ్యాటర్లు మ్యాచ్‌ను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంలో కేవలం 56 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలయ్యారు.

విజయం సాధించిన ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల జట్టు (సూరంపాలెం)

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR Shopping Mall, The joy of life
Gift Partner: KL University (Deemed to be University)
Regional Sponsor: GGU Godavari Global University, Rajamahendravaram, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
Digital Partner: ఈనాడు.నెట్, ETV Bharat
Medical Partner: GSR
FM Partner: ఈ FM Mee FM
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
Organised by ఈనాడు

నేటి మ్యాచ్‌లు (29.12.2025)

గ్రౌండ్ - 1

ఉదయం 8 గంటలకు: కిట్స్ కళాశాల దివిలి (కాకినాడ) x ఐడియల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (కాకినాడ). ● ఉదయం 11 గంటలకు: జీఎస్‌ఎల్ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం) x బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల (అమలాపురం). ● మధ్యాహ్నం 2 గంటలకు: కైట్ ఇంజినీరింగ్ కళాశాల (కాకినాడ) x ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పెరుమాళ్లపురం (కాకినాడ).

గ్రౌండ్ - 2

ఉదయం 8 గంటలకు: జీఎస్‌ఎల్ వైద్య కళాశాల (రాజమహేంద్రవరం) x ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల (కాకినాడ). ● ఉదయం 11 గంటలకు: స్వెసెస్ డిగ్రీ కళాశాల (కాకినాడ) x గైట్ ఇంజినీరింగ్ కళాశాల (రాజమహేంద్రవరం).

రేపటి మ్యాచ్‌లు (30.12.2025)

గ్రౌండ్ - 1

ఉదయం 8 గంటలకు: ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాల (చేబ్రోలు, కాకినాడ) x ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం). ● ఉదయం 11 గంటలకు: ఎస్‌ఏవీఎం డిగ్రీ కళాశాల(సఖినేటిపల్లి, కోనసీమ) x ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం యూజీ (రాజమహేంద్రవరం). ● మధ్యాహ్నం 2 గంటలు: జేఎన్‌టీయూ(కాకినాడ) x వీఎస్‌ఎం ఇంజినీరింగ్ కళాశాల(రామచంద్రపురం).

గ్రౌండ్ - 2

ఉదయం 8 గంటలు: ప్రభుత్వ డిగ్రీ కళాశాల (తుని) x ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (రాజమహేంద్రవరం) ● ఉదయం 11 గంటలు: పైడా ఇంజినీరింగ్ కళాశాల(కాకినాడ) x బీహెచ్ఎస్‌ఆర్, వీఎల్‌ఎం డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం).

▲ గోరంట్ల శాంతారావు ఫౌండేషన్ (జీఎస్‌ఆర్) వారు అంబులెన్స్ సమకూర్చారు.

2009 బ్యాచ్ ఎస్సైల ఆత్మీయ సమ్మేళనం

● సహచరులు కుటుంబాలకు రూ.8.20 కోట్ల ఆర్థిక సాయం

కడియంలో ఒక్కటైన 2009 ఎస్సై (సివిల్) బ్యాచ్ సభ్యులు

కడియం, న్యూస్‌టుడే: వారంతా ఒకేసారి ఉద్యోగం సాధించారు.. శిక్షణ పొందారు.. ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. అంతా కలుసుకుని ఆత్మీయ ఆలింగనాలు, సరదా కబుర్లు, స్వీయచిత్రాలు తీసుకుని సందడి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో ఎస్సై(సివిల్) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కడియంలో కొనసాగింది. వాళ్ల స్నేహ బంధం ఎప్పటికీ కొనసాగేలా 2021లో ఏపీ, తెలంగాణ ఎస్సై 2009 బ్యాచ్ పేరిట సంక్షేమ సంఘాన్ని స్థాపించారు. నాటి నుంచి నేటి వరకూ ఏటా డిసెంబరు రెండోవారంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుంటున్నారు. 2014లో ఆంధ్ర, తెలంగాణ విడిపోయిన తర్వాత కూడా సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. సుమారు 1,140 మంది ఎస్సైలుగా తర్ఫీదు పొందగా, అందులో 400 మంది ఆదివారం రాజమహేంద్రవరంలో కలిశారు. వీరిలో 80 మంది ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్నారు. వీరంతా ప్రస్తుతం సీఐలుగా పదోన్నతి పొందారు. వీరంతా నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. ఇప్పటి వరకూ ఈ బ్యాచ్‌లో మృతిచెందిన వారికి సంబంధించిన కుటుంబాలకు రూ. 8.20కోట్ల సాయం చేసినట్లు తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు బ్యాచ్ అడ్మిన్ జి.శ్రీనివాసరావు వివరించారు. సమ్మేళనానికి కడియం, ధవళేశ్వరం, రాజానగరం, అనపర్తి సీఐల సహకారం మరువలేనిదన్నారు.

సమగ్ర సామాజిక అభివృద్ధే లక్ష్యం

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను బ్రహ్మంచౌదరి చేతుల మీదుగా అందిస్తున్న ప్రతినిధులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సాంఘిక సంక్షేమం, సమగ్ర సామాజిక అభివృద్ధి లక్ష్యంగా కమ్మ కార్పొరేషన్ విశేషంగా కృషి చేస్తోందని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మంచౌదరి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం కాకినాడలోని కమ్మ కల్యాణ మండపంలో ఉమ్మడి తూగో జిల్లా కమ్మ మహాజన సంఘ సర్వసభ్య సమావేశాన్ని జాస్తి మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏపీ కాకతీయ సమాఖ్య అధ్యక్షకార్యదర్శులు కొడాలి వెంకట సుబ్బారావు, బెజవాడ వెంకట్రావు మాట్లాడుతూ సమాజంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. కార్యదర్శి నెక్కంటి శ్రీనివాస్, కాటూరి ప్రసాద్, గారపాటి రాయుడు తదితరులు జిల్లాలో కమ్మ సంఘ కార్యక్రమాలపై చర్చించారు. మధ్యాహ్నం శ్రీచారిటబుల్ సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన ఇంజినీరింగ్, మెడికల్ విద్యార్థులు 82 మందికి రూ.17 లక్షల ఉపకార వేతనాలు అందించారు. బ్రహ్మంచౌదరి మాట్లాడుతూ కమ్మ సామాజికవర్గ సంక్షేమంతోపాటు, రాష్ట్రంలో బలహీన వర్గాలకు కూడా చేయూత నివ్వడమే కమ్మ కార్పొరేషన్ ధ్యేయమన్నారు. గారపాటి కల్యాణ్, చందలాడ పద్మరాజు, గుణ్ణం వెంకట్రావు, గరికిపాటి సూర్యనారాయణ, వంటిపల్లి పాపారావు, రిమ్మలపూడి నారాయణ, మేకా లక్ష్మణమూర్తి, బోళ్ల కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బ్రహ్మంచౌదరితోపాటు సంఘాల ప్రతినిధులు

ర్యాలిలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

ఆత్రేయపురం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈ నెల 30న ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో స్వామివారు ఉత్తర ద్వారం నుంచి దర్శనమిస్తారని దేవస్థానం ఛైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి తెలిపారు.

శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానము, అన్నవరం
ఈ-ప్రొక్యూర్మెంటు టెండరు ప్రకటన
టెండర్ నోటీసు నెం. F1/49274/2025, 26-12-2025
శ్రీ స్వామివారి దేవస్థానము నందు వివిధ సివిల్, విద్యుత్ మరియు వాటర్ వర్క్స్ పనులు కొరకు ఈ-టెండరులు కోరబడుచున్నవి. మిగిలిన వివరముల కొరకు www.tender.apeprocurement.gov.in నందు చూడవచ్చును. మరిన్ని వివరముల కొరకు Ph: 9171456789, 9948188123, 9247296699, 8374445065 సంప్రదించండి.
VENDRA TRINADHARAO
JOINT COMMISSIONER & EXECUTIVE OFFICER

రమణ ఆశ్రమం..అరుణాచలమంతై..!

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు

● రేపు మహర్షి జయంతికి ఏర్పాట్లు పూర్తి

ఆసియా ఖండంలోనే రెండో అరుణాచలేశ్వర క్షేత్రం ఉన్న రాచపల్లి శ్రీరమణ సేవాశ్రమం మహర్షి జయంతి మహోత్సవానికి సిద్ధమైంది. రోజూ భక్తులతో అలరారే ఈ ఆశ్రమం, రమణుల తత్వాన్ని బోధిస్తూ, పరమశివుని పరివార వైభవాన్ని కళ్లకు కడుతుంది. ఏటా డిసెంబరు 30న తిరునాళ్లలా జరిగే రమణమహర్షి జయంతికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రత్తిపాడు మండలం జాతీయ రహదారికి సమీపంలో రాచపల్లి వెళ్లే మార్గంలో పచ్చని పొలాల మధ్య అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి క్షేత్రం.. అందులోని 63 నాయనార్ల శిలా,లోహ విగ్రహాలు తమిళనాడులోని తిరువణ్ణామలై నమూనాలోనే ఉండటం ప్రత్యేకత. రాచపల్లికి చెందిన స్వామి రామానంద, లక్ష్మణానంద బ్రహ్మాచారులు వంగలపూడి సద్గురు సేవాశ్రమంలో సాధనకు వెళ్లినపుడు రమణ తత్వానికి ఆకర్షితులవ్వగా 1990 ఆగస్టు 15న శ్రీరమణ సేవాశ్రమాన్ని స్థాపించినప్పటి నుంచి ధ్యానం, గోసేవ, సత్సంగాలు, అన్నదానం..వృద్ధాశ్రమం, పేద విద్యార్థులకు చేయూత, వైద్యం సేవలందిస్తోంది. ఆంధ్రా అరుణాచలంగా శైవక్షేత్రంలో నిత్యపూజలు, అభిషేకాలు విశిష్ట వేడుకలతో ఆశ్రమం రాష్ట్ర నలుమూలలకూ తెలిసింది.

జయంతి కార్యక్రమాలు

డిసెంబరు 30 శ్రీరమణ మహర్షి 146వ జయంతి సందర్భంగా ఆ రోజు ఉదయం ప్రణవపతాక ఆవిష్కరణ, గోపూజ, శ్రీరమణ అష్టోత్తర శతనామ అర్చన, అరుణాచలేశ్వరునికి విశేష పూజలు అనంతరం వివిధ ఆశ్రమాల పీఠాధిపతులతో ఆధ్యాత్మిక సభ జరుగుతుంది. భక్తులకు అన్నదానం చేస్తారు.

రాచపల్లి శ్రీరమణసేవాశ్రమం (అంతర చిత్రం) మందిరంలో రమణ మహర్షి

ఆధ్యాత్మిక పథం.. బాధ్యతాయుత జీవనం

స్వామి రామానంద, ఆశ్రమ వ్యవస్థాపకులు యాంత్రిక జీవనంలో మనిషి ఆధ్యాత్మిక తోవలోనే ప్రశాంతత ఉంటుంది. అలా అక్కున చేర్చుకునేందుకు శ్రీరమణ సేవాశ్రమంలోని ప్రతి విశేషం దోహదపడుతుంది. 'నేను ఎవరు' అనే సాధనలో ఉండాలని యువత వికాసానికి, సేవా మార్గానికి స్ఫూర్తిని చ్చేలా చేయడంతో పాటు బాధ్యతాయుత జీవనానికి మార్గదర్శనం చేయడం ఆశ్రమ లక్ష్యం.

యాంకరేజ్ పోర్టులో స్వచ్ఛతా కార్యక్రమం

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: కాకినాడ యాంకరేజ్ పోర్టులో కోకనాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఏపీ మారిటైమ్ బోర్డు సహకారంతో ఆదివారం స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. ఛాంబర్ అధ్యక్షుడు గాదం చంద్రశేఖర్(మహేష్) మాట్లాడుతూ పోర్టులో ఎక్కడ చూసినా అపరిశుభ్రత నెలకొందని, దీంతో స్వచ్ఛతా కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామన్నారు. కస్టమ్స్ బ్రోకర్స్ అసోసియేషన్, స్టీవెడోర్స్ అసోసియేషన్, స్టీమర్ ఏజంట్లు, షోర్ వర్కర్స్ యూనియన్, హెచ్ఎంఎస్ బార్జ్ వర్కర్స్ యూనియన్ తదితర సభ్యులు పాల్గొన్నారు.

మహాసభల ప్రచార జాతా ప్రారంభం

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: విశాఖలో ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సీఐటీయూ అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆటో ప్రచార జాతాను జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జీ ఆదివారం కలెక్టరేట్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఉపాధ్యక్షులు ఎరుబండి చంద్రావతి, సహాయ కార్యదర్శి చంద్రమళ్ల పద్మావతి మాట్లాడుతూ జనవరి 4న చలో విశాఖకు వేలాదిగా తరలిరావాలన్నారు. ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, కోశాధికారి రమణ, ఉపాధ్యక్షులు సత్తిరాజు, సభ్యులు వీరబాబు, వెంకటరమణ, రాజా, అప్పారావు పాల్గొన్నారు.

ఐ బ్యాంకు సేవలు గర్వకారణం

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరసింహానాయక్

గాంధీనగర్: తెలుగు రాష్ట్రాల్లోని నాలుగు ప్రధాన ఐ బ్యాంకుల్లో బాదం బాలకృష్ణ ఐబ్యాంకు ఉండటం గర్వకారణమని డీఎంహెచ్‌వో నరసింహానాయక్ అన్నారు. ఆదివారం ఐ బ్యాంకు 19వ వార్షికోత్సవం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ డీపీఎం డాక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ పూర్తిస్థాయి సిబ్బంది, పరికరాలతో పనిచేస్తుండడం విశేషమన్నారు. ఐ బ్యాంకు ద్వారా చూపు పొందిన కొందరు కార్నియా గ్రహీతలను కార్యదర్శి బాలకృష్ణ సభకు పరిచయం చేయగా నేత్రదాతల కుటుంబసభ్యులు వారిలో తమ వారి నేత్రాలు చూసుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఐ బ్యాంకు ఛైర్మన్ డాక్టర్ దామెర విజయలక్ష్మి, కోశాధికారి దాసరి సాయికృష్ణ, ట్రస్టీలు పాపారావు, కనకరాజు, డాక్టర్ రావుల శ్రీరామ్, సూర్యారావు, పైడా వెంకటనారాయణ, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మనప్పురం ఏ ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి, ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 9849138626.

శ్రీసాయిగోల్డ్: తాకట్టులో ఉన్న బంగారం, ఏబ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి, ఆరోజు మార్కెట్ రేట్‌కి కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 94933 38823.

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL

రాజమండ్రి, గాడాల లోరల్ స్కూల్‌కు ఎదురుగా E/F 2BHK ఇండిపెండెంట్ హౌస్ రెడిటు ఆక్యూపై 37 లక్షలు మాత్రమే. 90% బ్యాంక్‌లోన్. Note: IT రిటర్న్స్, శాలరీ స్లిప్స్ అవసరం లేదు. ✆89190 84655, 98850 28899

TO LET

కోనసీమ జిల్లా, అమలాపురం- P.గన్నవరం మెయిన్‌రోడ్ పేసింగ్ 20x90=1800 Sft. బిల్డింగ్ Showroom, Banksకు అద్దెకు. ✆ 9949328440, 8919131853

JOBS

Wanted Civil Engineers & Supervisors, 3-5 yrs Exp in Buildings & CC Road Works. @ Gokavaram (A.P). Ph No:8888838677, 9422135347.

Wanted B.Com/ M.Com/ MBA Finance/CA IPCC Dropouts to be Work as Field Executive in Tuni in a Reputed Audit Firm. Interested Persons (Male Only) ✆ 70135 11502 or mail: kowthahr@gmail.com.

కొత్తగా ఇంటర్నెట్ బాక్సులు వేయుటకు 10 మంది ఫీల్డ్ స్టాఫ్ కావలెను. నెలకు 15K (12+3). వేద నెట్, సత్యవతినగర్, కొవ్వూరు, కాంటాక్ట్ సెల్: 99899 55770.

నిడదవోలు శంకరాపురం గ్రామంలో హృదయాలయం ఆశ్రమంలో పని చేయుటకు వంటపని చేయుటకు వంటవారు కావలెను. స్త్రీలు మాత్రమే. ఫోన్: 94409 42148, 94418 76034.

డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్‌లలో వర్క్ చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీ: 23000 టు 29000. వ:18-35. ✆ 77309 58410.

మా ఆఫీసు నందు టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్, ఇన్‌ఛార్జీలు, క్యాషియర్స్, Male, Female కావలెను. Ph. No: 96423 75791.

రాజమండ్రి, అనకాపల్లిల్లో ప్రా॥కం॥ & ప్రాజెక్టుల్లో సె॥గార్డ్స్, సూపర్‌వైజర్స్, ఆయాలు స్త్రీ/పు॥, జీ: 12 to 15 వేలు, రూం+బో॥. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, RJY, ✆ 9392269369.

కడియపులంకలో కొత్తగా నిర్మించిన BPCL పెట్రోలుబంక్‌లో చేయుటకు ఆఫీస్ స్టాఫ్ (M/F), అర్హత: డిగ్రీ/ ఇంటర్ + కంప్యూటర్ పరిజ్ఞానం, పంప్ బాయ్స్ కావలెను. అనుభవమున్న వారికి ప్రాధాన్యత. ఇంటర్వ్యూ: ది.30-12-25 మంగళవారం 11 am to 3:30 pm ఒరిజినల్ సర్టిఫికేట్స్, ఆధార్ కార్డు, పాన్‌కార్డు, బయోడేటాతో బంకువద్దకు రావలెను. ✆ 83095 49958.

వర్క్‌ఫ్రంహోమ్ డేటాఎంట్రీ: ఇంటి వద్ద ఉండి పార్ట్ / ఫుల్ టైంప్రాజెక్ట్ వర్క్ చేయుటకు Laptop/ Desktop, స్మార్ట్‌ఫోన్ ఉన్నవారు కావలెను. ✆ 95534 29994.

MARKETING/ SALES

360 Clean Company - FMCG Field Sales Executive, min. exp. 2 years - Call: 91009 40494.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-65 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	17,000
పాతకాయ: గండేరా	27,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,000-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	135-00
రిటైల్ లైవ్	162-00
డ్రెస్డ్	235-00
స్కిన్‌లెస్	267-00

శాంతి ఆశ్రమ పీఠాధిపతిగా వినమ్రానంద సరస్వతి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని తోటపల్లిలోని శ్రీశాంతి ఆశ్రమం పీఠాధిపతిగా స్వామిని వినమ్రానంద సరస్వతి వ్యవహరిస్తారు. పీఠాధిపతిగా ఉండే జ్ఞానేశ్వరి మాతాజీ పరమపదించాక ఆశ్రమ బాధ్యతలు వినమ్రానంద స్వీకరించారు. ఏటా జనవరి 21న జరిగే ఆశ్రమ వ్యవస్థాపకులు ఓంకారస్వామి జయంతికి వచ్చే రుషికేశ్ చిదానంద స్వామీజీ ఆశీస్సులు కోసం తన తండ్రితో భువనేశ్వర్ నుంచి వచ్చేవారు. జ్ఞానేశ్వరి మాతాజీకి చేరువయ్యారు. ఆమె మార్గదర్శనంలో చిత్తూరులోని చిన్మయ మిషన్ శారదాప్రియానంద సరస్వతి వద్ద సన్యాసాశ్రమానికి సంబంధించిన శిక్షణ పొందారు. పదేళ్ల కిందటే ఉత్తరాధికారిగా ఆశ్రమ నిర్వహణలో మాతాజీకి అన్నింటా చేదోడుగా ఉండేవారు. ఆరు శాఖలు ఉన్న మాతృఆశ్రమానికి పీఠాధిపతిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

పట్టు పరిశ్రమ కేంద్రంలో సెలవు వివాదం

గొల్లప్రోలు: చేబ్రోలులోని పట్టు పరిశ్రమ కేంద్రంలో ఏఎస్‌వో, ఇన్‌ఛార్జి మార్కెటింగ్ అధికారి కె.సత్యనారాయణ సెలవు విషయమై వివాదం నెలకొంది. అనారోగ్య కారణంగా సెలవు మంజూరు చేయాలని కోరగా ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ గీతారాణి తిరస్కరించడంతో ఆత్మహత్య చేసుకుంటానంటూ ఆయన ఈనెల 26వ తేదీ సాయంత్రం కార్యాలయం నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. శనివారం విధులకు హాజరుకాకపోవడం, అతని గురించి ఎలాంటి సమాచారం తెలియకపోవడంతో డిప్యూటీ డైరెక్టర్ అదే రోజు రాత్రి గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. సత్యనారాయణ ఆవేశంతో ఆత్మహత్య చేసుకుంటానని తనను బెదిరించి వెళ్లిపోయారని పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు ఆమె వివరించారు.

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

అపూర్వం.. ఆత్మీయం

● కాకినాడ మెక్లారిన్‌లో 51 ఏళ్లకు కలిసిన విద్యార్థులు

గాంధీనగర్: చిన్ననాటి సంగతులు గుర్తు చేసుకుంటూ వారంతా బాల్య స్నేహితులతో ఆనందంగా గడిపారు. కాకినాడలోని మెక్లారిన్ పాఠశాలలో 1973-74లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలోనే నిర్వహించారు. దేశవిదేశాల్లో స్థిరపడినవారంతా, వివిధ వృత్తుల్లో ఉద్యోగ విరమణ చేసినవారు ఒకచోట చేరి సందడి చేశారు. నాటి ఉపాధ్యాయుడు సూర్యప్రకాశరావు, పూర్వ విద్యార్థులు చొల్లంగి వీరబాబు, డాక్టర్ మెట్ట వెంకటేష్, సీతాపతి మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలలో మళ్లీ కలుసుకునేందుకు రెండేళ్లుగా ప్రయత్నించామన్నారు. గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించుకున్న ఏకైక బ్యాచ్ తమదన్నారు. పాఠశాలను ప్రభుత్వం అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లను కోరారు. మహమ్మద్, బలరామ్, రవి, నాగేశ్వరరావు, సయ్యద్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

1973-74లో పదో తరగతి చదివిన విద్యార్థుల బృందం

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

నగదును అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కరప: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న స్నేహితుడి కుటుంబానికి ఆర్థికంగా చేయూతనిచ్చి ఆదర్శంగా నిలిచారు కరపకు చెందిన సహచర మిత్రులు. కరప జడ్పీ ఉన్నత పాఠశాలలో 1990-91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులలో ఒకరైన బత్తుల వీర వెంకటసత్యనారాయణకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె కిడ్నీ సమస్యతో మూడేళ్ల క్రితం మృతి చెందింది. చిన్నకుమార్తె కూడా అదే సమస్యతో బాధపడుతుంది. తనకు డయాలసిస్ చేయిస్తూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సత్యనారాయణకు తన స్నేహితులంతా రూ.3.58 లక్షలు సేకరించి ఆదివారం స్థానిక పాఠశాలలో అందజేశారు. కార్యక్రమంలో కె.వల్లిబాబు, పెదిరెడ్డి శ్రీరామకృష్ణ, దేవు వెంకటేశ్వరరావు, కూనపురెడ్డి వీర్రాజు, పెంకే సత్తిబాబు, ప్రసన్నకుమార్, పడాల బాబి తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్: టమాటా- 38, 40, వంకాయలు- 20, 30, 34, 40, బెండకాయలు- 52, పచ్చి మిర్చి- 40, 44, 45, కాకరకాయలు- 60, బీర- 56, 60, క్యాలీఫ్లవర్- 25, 30, క్యాబేజీ- 32, క్యారెట్- 32, దొండకాయలు- 36, 40, బంగాళాదుంపలు- 22, 25, ఉల్లి- 28, 32, దోసకాయలు- 34, చిక్కుళ్లు- 26, చేమదుంపలు- 30, బీట్‌రూట్- 26, కీరదోస- 30, బీన్స్‌కాయలు- 70, అల్లం- 68, క్యాప్సికం- 52, బొబ్బర్లు- 32, చిలకడదుంపలు- 38, ఒకటి చొప్పున అనపకాయ- 25, 30, పొట్లకాయ- 25, 30, అరటికాయ- 5, 7, మునగకాడ- 10, 12, మామిడికాయ- 15, 20, నిమ్మకాయలు(డజన్) - 18, 24.

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్- ఈషా, అనకొండ, అవతార్ ఫైర్ అండ్ యాష్, గుర్రం పాపిరెడ్డి, దురంధర్, దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్- ఛాంపియన్, అనకొండ, పతంగ్, లక్ష్మి- ఈషా, సత్యగౌరి- అవతార్ ఫైర్ అండ్ యాష్, తిరుమల- వృషభ, సీఅండ్‌సీ 1- శంబాల, సీఅండ్‌సీ 2- దండోరా, శ్రీప్రియ- ఛాంపియన్, పద్మప్రియ- అఖండ 2, సూర్య1(వాకలపూడి)- ఛాంపియన్(ఉ, సా), ఈషా(మ, రా), సూర్య 2.- శంబాల.

వంతెనల తీరు.. హడలిపోయేరు..

భానుగుడి వద్ద రెయిలింగ్ కూలిన వంతెన
పిచ్చి మొక్కలు మొలిచి బీటలువారిన గోడలు

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ నగరంలోని పలు వంతెనల రెయిలింగ్‌లు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. వాటిలో అత్యంత ముఖ్యమైనవి భానుగుడికూడలి నుంచి టూటౌన్ కూడలి వరకున్న వంతెన, జగన్నాథపురం కొత్త వంతెనలు. ఈ రెండింటి మీదుగా వివిధ ప్రాంతాల నుంచి వాహనాలు నగరంలోని రావాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం వేల సంఖ్యలో వాహనాలతో ఈ రెండు వంతెనలు కిటకిటలాడుతూ ఉంటాయి. కానీ ప్రస్తుతం అధ్వానంగా మారాయి. భానుగుడి వద్ద రెయిలింగ్ కూలిపోయి వాహనదారులు పడిపోయేలా ఉంది. ఇరువైపులా రావి, ఇతర పిచ్చిమొక్కలు మొలిచాయి. దాంతో వాటి పటిష్టత రోజురోజుకీ బలహీనంగా మారుతోంది. రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దీంతో కొన్నిచోట్ల పెచ్చులూడి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

కాలనీ సమస్యలు.. పరిష్కరిస్తే నమస్సులు

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

వైద్యనగర్ దారిలో కాలువలో అడ్డుగా విద్యుత్తు స్తంభం

కాకినాడ ఒకటి, రెండు డివిజన్‌ల పరిధిలో గల ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రధానంగా రమణయ్యపేట, వైద్యనగర్ తదితర ప్రాంతాల్లో సమస్యలు వేధిస్తున్నాయి. ఏళ్ల గడుస్తున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా విద్యుత్తు స్తంభాలు కాలువల్లో కనిపిస్తున్నాయి. వైద్యనగర్ ప్రధాన దారిలో రెండుమూడు చోట్ల స్తంభాలు కాలువల్లోనే ఉన్నాయి. సంవత్సరాలు గడుస్తున్నా తొలగించకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు మురుగు ముందుకు కదలక ఇక్కట్లకు గురవుతున్నారు. ఇక రమణయ్యపేట రామాలయం వీధిలో పలు భవనాల నిర్మాణాలు సాగుతున్నాయి. ఇసుక, కంకర వంటి సామగ్రిని కాలువలపై వేసి వదిలేయడంతో అవి పూడుకుపోయి మురుగు పారుదలకు ఆటంకం ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు. సచివాలయ సిబ్బందికి చెబుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకోండి..

భవన నిర్మాణ వ్యర్థాలను కాలువల్లో వేసి వదిలేయడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతోంది. పారిశుద్ధ్య సిబ్బంది వచ్చినా రాళ్లు, ఇసుక వల్ల కాలువలు శుభ్రం చేయలేకపోతున్నారు. ఇక ఏళ్ల తరబడి విద్యుత్తు స్తంభాలు కాలువల్లోనే ఉంటున్నాయి. వాటిని ఇంతవరకు తొలగించలేదు. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – రాంబాబు, వైద్యనగర్

విధిగా శిరస్త్రాణం ధరించాలి

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రమేష్

మసీదు సెంటర్(కాకినాడ): ద్విచక్ర వాహనదారులంతా విధిగా హెల్మెట్ ధరించాలని కాకినాడ ట్రాఫిక్-1 సీఐ రమేష్ అన్నారు. ఆదివారం స్థానిక కల్పనా సెంటర్ వద్ద వాహనదారులకు, పాదచారులకు ట్రాఫిక్ నియమనిబంధనలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలన్నారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ రుణాలు, ఆన్‌లైన్ ఉద్యోగాలు, డిజిటల్ అరెస్ట్, 112, 100, 1930, 1972 టోల్‌ఫ్రీ కాల్స్ గురించి వివరించారు.

సాహిత్య పోటీల్లో పతకాలు

జ్ఞాపికలు అందుకున్న నాగమల్లిక, విద్యార్థినులు

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: విద్యుత్తునగర్ శాంతి ఆశ్రమంలో సాహిత్య సాంస్కృతిక కళారంగాల ప్రోత్సాహక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పలు సాహిత్య పోటీల్లో కాకినాడ జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డా.పసుపులేటి నాగమల్లిక, విద్యార్థినులు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, పతకాలు అందుకున్నారు. తెలుగు మహాసభలు-2025 వ్యవస్థాపక అధ్యక్షులు దాడి చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఈ పతకాలు అందుకున్నారు. ప్రిన్సిపల్ డా.అనంతలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ డా.సువర్చల, అధ్యాపకులు డా.కృష్ణగాయత్రి, డా.శ్యామల తదితరులు వీరిని అభినందించారు.

స్పందనకు వందనం

తీగలు తొలగించారు..

మసీదుసెంటర్: కాకినాడ శ్రీనగర్ ప్రధాన రహదారి పక్కన విద్యుత్తు స్తంభానికి పిచ్చి మొక్కలు, తీగలు అల్లుకున్నాయి. 'ఈనాడు'లో చిత్ర కథనం రావడంతో అధికారులు స్పందించి తొలగించడంతో సమస్య పరిష్కారమైంది.

ముగిసిన సాంస్కృతికోత్సవం

అంబేడ్కర్ భవన్‌లో యోగాతో డ్యాన్స్, జానపద గీతాలకు నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు కాకినాడలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన కల్చరల్ ఫెస్ట్ ఆదివారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి, తెలుగు ప్రొఫెషనల్ వింగ్ జిల్లా అధ్యక్షుడు వనమాడి మోహనవర్మ హాజరై మాట్లాడుతూ విద్యార్థుల్లో ఒత్తిడిని దూరం చేసి, సృజనను వెలికితీసేందుకు ఇలాంటి ఉత్సవాలు ఎంతగానో సహకరిస్తాయన్నారు. ఆటలు, పాటలు, నృత్యాల పోటీల్లో విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొనడంతో వారిని అభినందించారు. అతిథులుగా యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోనీ, జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి రాజా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జానపద, దేశభక్తి గీతాలకు, సినీ పాటలతోపాటు, యోగా సమ్మేళనంతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లోవరాజు, గంగా సూరిబాబు తదితరులతోపాటు, నగర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పట్టించుకుంటేనే పరిశుభ్రం

కాకినాడ వెంకట్‌నగర్‌లోని ఓ వీధిలో రహదారి పక్కన చెట్టుకొమ్మలను నరికి అక్కడే వదిలేశారు. కొన్నాళ్లుగా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. దోమలు వ్యాప్తి చెందుతున్నాయని, రోగాల బారినపడే ఆస్కారం ఉందని చెబుతున్నారు. అధికారులు స్పందించి వాటిని తొలగించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మసీదుసెంటర్

అవోగా నూతన కార్యవర్గం ఎన్నిక

మురళిని సత్కరిస్తున్న గ్రంధి బాబ్జీ

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్(అవోగా) కాకినాడ 53వ సర్వసభ్య సమావేశాన్ని వార్ఫు రోడ్డులోని కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ పారిశ్రామికవేత్త నారాయణం మురళి, విశిష్ట అతిథిగా అక్బూ ప్రొఫెసర్ ఉదయభాస్కర్, పి.కనకరాజు, గ్రంధి బాబ్జీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా 20 మంది నిరుపేదలకు బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. మాజీ అధ్యక్షుడు చెన్నా మాధవరావు అవోగాకు రూ.50 వేల విరాళం అందించారు. హాస్టల్ విద్యార్థులకు రగ్గులు పంపిణీ చేశారు. అనంతరం అవోగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంకాయల లక్ష్మణమూర్తి, కార్యదర్శిగా అద్దేపల్లి లక్ష్మణ్, సహాయ కార్యదర్శిగా మట్టపల్లి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా కొత్త వెంకట్రావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో భాగంగా 60 సంవత్సరాల వయసు పైబడిన సభ్యులను సత్కరించారు.

30న భోగి గణపతి పీఠంలో శ్రీవారి విగ్రహ ప్రతిష్ఠ

గాంధీనగర్, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి సందర్భంగా కాకినాడ సూర్యారావుపేటలోని స్వయంభూ భోగి గణపతి పీఠంలో ఈ నెల 30న మంగళవారం సుప్రభాత వేళలో తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం జరుగుతుందని పీఠం వ్యవస్థాపకులు రమణరాజు తెలియజేశారు. పీఠం ఆవిర్భవించి 18 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా ఉగాది వరకు 100 రోజులపాటు నిత్య గణపతి హోమం, ధనుర్మాసం సందర్భంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం శ్రీవారి పాదాల వద్ద దీపాలంకరణ సేవ జరుగుతాయన్నారు. లోక కల్యాణార్థం స్వయంభూ పీఠంలో శ్రీవారి పాదాలతో పాటు, శ్రీనివాసుడి విగ్రహం ఏర్పాటు అదృష్టమని శ్రీవారి సేవాసమాజం భక్తులు పేర్కొన్నారు.

ఆకాశ నేత్రాలు.. చూస్తున్నాయ్

పైనుంచి చూస్తే కాకినాడ రెవెన్యూకాలనీ ఇలా..

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ జిల్లాలో అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో నిఘా కొనసాగిస్తున్నామని ఎస్పీ బిందుమాధవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. నేరాలు అరికట్టేందుకు బహిరంగ మద్యపానం, తాగి బండి నడపడం, వేధింపులకు పాల్పడే అసాంఘిక వ్యక్తులపై కట్టుదిట్ట చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలైన కాకినాడ పోర్టు పరిధి, రెవెన్యూ కాలనీ, ఇంద్రపాలెం, సర్పవరం, తిమ్మాపురం, తొండంగి, సామర్లకోట, ప్రత్తిపాడు, అన్నవరం, పెద్దాపురం తదితర పోలీసుస్టేషన్‌ల పరిధిలో మహిళలు, బాలికలకు భద్రత కల్పిస్తున్నామన్నారు.

మట్టి.. మనిషి బంధం అమోఘం

నాటకంలో ఆకట్టుకునే సన్నివేశం

గాంధీనగర్, న్యూస్‌టుడే: తరాలు మారుతున్నకొద్దీ రైతుకు దూరమైపోతున్న భూమి కబ్జాకు గురవుతున్న తీరు, పతనమవుతున్న నైతిక విలువల గురించి తెలియజేస్తూ ప్రదర్శితమైన 'మట్టి మనిషి' నాటకం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది. ది యంగ్‌మెన్స్ హ్యాపీక్లబ్, అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలోని కాకినాడ దంటు కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి మట్టిమనిషి నాటకం ప్రదర్శించారు. క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి పి.వి.రావు, అరసం జిల్లా అధ్యక్షుడు పి.సుబ్బరాజు తదితరులు జ్యోతి వెలిగించి నాటక ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం వాసిరెడ్డి సీతాదేవి రచించిన మట్టిమనిషి నవలను అరసం జాతీయ అధ్యక్షుడు వల్లూరి శివప్రసాద్ నాటకీకరణ చేయగా, మిత్రా క్రియేషన్స్ హైదరాబాద్‌వారు ప్రముఖ దర్శకుడు ఎస్ఎం.బాషా దర్శకత్వ పర్యవేక్షణలో ప్రదర్శించారు. మట్టికి, మనిషికి సామాజికంగా ఉండే సంబంధాలను, తరాలుమారేకొద్దీ ఆ సంబంధాల్లో వస్తున్న మార్పులు తెలియజేస్తూ ఆసక్తికరంగా 50 మంది కళాకారులు కళ్లకు కట్టారు. క్లబ్ సాంస్కృతిక కార్యదర్శి కెర్ల పుల్లారావు, కార్యదర్శి రవిఆనంద్, సహాయ కార్యదర్శి జానకిరామ్‌చౌదరి, ఉపాధ్యక్షులు సీతారాం, విశ్వేశ్వరరావు, కోశాధికారి నాని, మాజీ కార్యదర్శి ప్రభుదాస్, కట్టా కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి..

కాకినాడ వెంకట్‌నగర్‌లోని ఓ వీధిలో రహదారి పగిలిపోయి అధ్వానంగా మారి గుంతలా ఏర్పడింది. రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రమాదాల బారినపడిపోతున్నామని వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మసీదుసెంటర్

వీధి దీపాలు.. వెలగక చీకట్లు

కాకినాడ భాస్కర్‌నగర్ ప్రధాన రహదారి పక్కన వీధి దీపాలు వెలగడం లేదు. దాంతో ఆ దారిలో చీకట్లు అలముకున్నాయి. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని చెబుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మసీదుసెంటర్

ముళ్లపొదలు తొలగించండి

కాకినాడ వెంకటేశ్వరనగర్ నుంచి సూర్యనారాయణపురం రైల్వే గేటుకు వెళ్లే దారిలో ఇరువైపులా ముళ్లపొదల కారణంగా ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ముళ్లు గుచ్చుకుని ప్రమాదాలకు గురవుతున్నామని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, భానుగుడిసెంటర్

వదిలేస్తే ఎలా చెప్పండి

కాకినాడ జయేంద్రనగర్‌లోని ఓ వీధిలో చెట్ల కొమ్మలు నరికి రోడ్డుపై వేసి వదిలేశారు. రోజులు గడుస్తున్నా వాటిని తొలగించకపోవడంతో రాకపోకలు సాగించేవారు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ఎండు కొమ్మలను వెంటనే తొలగించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. – న్యూస్‌టుడే, భానుగుడిసెంటర్

ప్రమాదాన్ని తప్పించండి

కాకినాడ మూడో డివిజన్ పరిధిలోని సిద్ధార్థనగర్ 9వ మలుపు సమీపంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద మ్యాన్‌హోల్‌పై ఏర్పాటు చేసిన ఇనుపచట్రం శిథిలమైంది. రాత్రిళ్లు మలుపులో అజాగ్రత్తగా వెళ్తే ప్రమాదం బారినపడే ఆస్కారం ఉంది. అధికారులు ఇనుప చట్రానికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

31న నాచోరే నృత్య పోటీలు

కాకినాడ నగరం: అశోక్‌నగర్ ఎంఎస్ఎన్ పాఠశాల ఆధ్వర్యంలో నాచోరే నృత్య పోటీలను ఈ నెల 31న నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల డైరెక్టర్ శ్రీవిజయ్, ఛైర్మన్ లక్ష్మీతులసి పేర్కొన్నారు. ఆ రోజు స్థానిక సూర్యకళామందిర్‌లో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. తెలుగు సంస్కృతీసంప్రదాయాలకు అనుగుణంగా 22 ఏళ్లుగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. నృత్య కళపై ఆసక్తి ఉన్న అందరూ పాల్గొనాలని కోరారు. పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

విద్యుత్తుతో ముప్పు..

నియంత్రిక.. రక్షణ కనిపించక..

కాకినాడ పెద్దమార్కెట్ మార్గంలోని విద్యుత్తు నియంత్రిక వద్ద రక్షణగోడ లేకపోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న విద్యుత్తు వైర్లు చేతికి అందేంత తక్కువ ఎత్తులో ఉండటంతో రాకపోకలు సాగించే వాహనచోదకులు హడలిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే రక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, భానుగుడిసెంటర్

తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయ్..

కాకినాడ మూడో డివిజన్ పరిధిలోని సురేష్‌నగర్ నగరపాలక ఉద్యానంలోని నడక దారిలో వీధి దీపాల స్తంభాలున్నాయి. వాటిలో కొన్ని స్తంభాలకు స్విచ్‌లు, వాటికున్న విద్యుత్తు తీగలు బయటకు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. పొరపాటున చిన్నారులు ఎవరైనా తాకితే ప్రాణాలు దక్కే పరిస్థితి ఉండదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

అపాయం తెలిసీ.. అలుసా..?

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

శాంతినగర్ మార్గంలో చిన్నారులతో..

గూడ్స్ వ్యాన్‌లు.. గూడ్స్ ఆటోలు.. సాధారణ ఆటోల్లో లెక్కకు మించి ప్రయాణికులకు ఎక్కించుకుని వెళ్తున్న తీరు నగరంలో నిత్యం కనిపిస్తూనేఉంటుంది. అటు రవాణాశాఖ అధికారులు, ఇటు ట్రాఫిక్ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నామని చెబుతున్నా.. చాలామంది నేటికీ నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా తమకు సంబంధం లేదన్నట్లుగా ప్రమాదకర ప్రయాణాలను సాగిస్తూనేఉన్నారు. సరకులు తీసుకెళ్లాల్సిన వ్యాన్‌లలో కిక్కిరిసి జనాలు నిల్చుని ప్రయాణించడం, బడి పిల్లల ఆటోల్లో వెనకవైపు వేలాడుతూ ప్రయాణించడం ఆందోళన కలిగిస్తోంది. అధికారులు తూతూమంత్రంగా కేసులు నమోదుచేసి వదిలేస్తుండటంతో ఇష్టారాజ్యంగా మారింది.

నగర పరిధిలోని పాఠశాలలకు..

దుమ్ములపేట ప్రధాన రహదారిలో ఇలా..

నగర పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు పిల్లల్ని తీసుకువెళ్లే ఆటోలు వందలాదిగా ఉన్నాయి. ఇందులో ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పిల్లలే అధిక సంఖ్యలో ఆటోల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీగా ఉన్న ప్రాంతాల్లో వీరు ఆటోల్లో వెనకవైపు వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. కొన్ని ప్రధాన రహదారులు అత్యంత రద్దీగా ఉంటున్నాయి. ట్రాఫిక్‌ను తప్పించుకుని వెళ్లే క్రమంలో ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లినా, ఉన్నట్టుండి బ్రేక్ వేసినా ప్రమాదానికి గురయ్యే ఆస్కారం ఉంటుంది. ఇక సరకు రవాణా చేసే వాహనాల్లోనూ వెనక కిక్కిరిసి జనాలను ఎక్కించుకుని వెళ్తున్న తీరు భయం గొల్పుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాహనదారులు నిబంధనలు పాటించేలా కఠిన చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

ఉద్యానం.. సమస్యలతో సతమతం

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: నగరంలోని పలు ప్రాంతాల్లో ఆహ్లాదాన్ని పంచాల్సిన నగరపాలక సంస్థ ఉద్యానాలు సమస్యలతో సతమతమవుతుండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తాచెదారం పేరుకుపోయి క్రీడా పరికరాలు లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. కాకినాడ డీమార్ట్ సమీపంలోని శ్రీవిద్యాకాలనీ నగరపాలక సంస్థ పార్కు మొక్కలతో ఆహ్లాదకరంగా ఉన్నా పలు సమస్యలు వేధిస్తున్నాయి. ఆవరణలో తుప్పుపట్టి ఆడుకునేందుకు వీలులేకుండా ప్రమాదకరంగా, నిరుపయోగంగా క్రీడా పరికరాలు దర్శనమిస్తున్నాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రాంగణంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాల వద్ద తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. పార్కు ఆవరణలో ఎండుటాకులు, చెత్తాచెదారం కారణంగా సందర్శకులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

పార్కు ఆవరణలో గుట్టలా ఎండు టాకులు, చెత్తాచెదారం

శ్రీవిద్యాకాలనీ పార్కులో నిరుపయోగంగా క్రీడా పరికరాలు

ఆడుకునే వీల్లేని దుస్థితి..

శ్రీవిద్యాకాలనీ ఉద్యానంలో సమస్యలు తొలగడం లేదు. ఉద్యానంలో క్రీడా పరికరాలు అధ్వానంగా ఉన్నాయి. తుప్పుపట్టినా వాటితోనే పిల్లలు ఆడటంతో ప్రమాదాలకు గురయ్యేలా ఉంది. అధికారులు కొత్తవి ఏర్పాటు చేయాలి.

– వీరబాబు, స్థానికుడు

ఘనంగా తెలుగు మహాసభలు-2025

శాంతి ఆశ్రమంలో కళాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ

సర్పవరం, న్యూస్‌టుడే: తెలుగు భాషా, సాహిత్య పరిరక్షణ అందరి బాధ్యతా అని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అన్నారు. కాకినాడ శాంతి ఆశ్రమంలో ఆదివారం సాంస్కృతిక, సాహిత్య రంగాల ప్రోత్సాహక వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో తెలుగు మహాసభలు-2025 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ హాజరయ్యారు. సాంస్కృతిక నృత్యాలు ప్రదర్శించిన కళాకారులను ఆమె అభినందించారు. గొట్టుముక్కల వెంకటనరసింహశాస్త్రి, జానా మల్లికార్జున, బొల్లే శశివర్మ, పెద్ది సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

600 మందికి అన్నదానం

సేవాకార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ జీజీహెచ్ ఎదురుగా ప్రేరణ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. మధ్యాహ్నం ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు, ప్రజలకు కలిపి 600 మందికి అన్నవితరణ చేశారు. సభ్యులు మాట్లాడుతూ దాతల సహాయసహకారాలతో అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. మూర్తి, బాలాజీ, సుబ్రహ్మణ్యం, నాగభూషణం, లోకారెడ్డి, సతీష్, బాబూరావు, రాజేష్, గోపాలకృష్ణ, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకార మహోత్సవ శుభాకాంక్షలు
మా మిత్రులు, శ్రేయోభిలాషులు
శ్రీ కొల్లుబోయిని శ్రీనివాస్ యాదవ్ గారు
నేడు వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులుగా ప్రమాణస్వీకారం చేయుచున్న శుభసందర్భంగా వారికివే మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
శ్రీ కొల్లుబోయిని శ్రీనివాస్‌యాదవ్ గారు
వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, రంపచోడవరం నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు
R.R.PROPERTIES
MD: కొల్లు శ్రీనివాసరావు
గాంధీనగర్, కాకినాడ

(c) eenadu

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

ఆటోడ్రైవర్లు స్నేహభావంతో మెలగాలి

పిఠాపురం, న్యూస్‌టుడే: ఆటోడ్రైవర్లు స్నేహభావంతో మెలగాలని మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ ఆకాంక్షించారు. ఆదివారం పిఠాపురంలోని శ్రీపాదవల్లభ మహాసంస్థానం సమీపంలో ఓం కనకమహాలక్ష్మీ ఆటోఓనర్స్, డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్యతిథిగా హాజరై కేకు కోశారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు అండగా నిలుస్తూ ఏడాదికి రూ.15 వేలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో దవులూరి లచ్చబాబు, గుమ్మడి నాగభూషణం, బొజ్జా సతీష్, కొరుప్రోలు శ్రీను, కొండేపూడి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భావనారాయణస్వామి ఆలయ పూర్వవైభవానికి కృషి

సర్పవరం, న్యూస్‌టుడే: సర్పవరం రాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి ఆలయం కీర్తి నలుదిశలు వ్యాపించేలా పూర్వవైభవం తీసుకువస్తామని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. ఆదివారం ఈవో ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేపట్టిన టికెట్ కౌంటర్, ఊంజల్ సేవ, సుదర్శన హోమశాల, గోశాల, ప్లాంటేషన్, కార్యాలయాలు, జయగంట, తులాభారం తదితర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికి వేద ఆశీర్వచనం అందించారు. గుడి భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామన్నారు. ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, కార్పొరేషన్ డైరెక్టర్ శిరంగు శ్రీనివాసరావు, పుల్ల శ్రీరాములు, మామిడాల శ్రీనివాసరావు, దినవాహి పేర్రాజు, బస్వా చంటిబాబు, మానేపల్లి బాబ్జీ, పాండ్రంకి రాజు పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

తిమ్మాపురంలో కార్యాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం: కాకినాడ గ్రామీణం తిమ్మాపురంలో జనసేన అధ్యక్షుడు మాదారపు తాతాజీ ఆధ్వర్యంలో నిర్మించిన జనసేన కార్యాలయాన్ని ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భూఆక్రమణలపై ఫిర్యాదులు వస్తున్నాయని వాటి రక్షణకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేషన్ డైరెక్టర్లు కడలి ఈశ్వరి, శిరంగు శ్రీనివాసరావు, కూటమి నాయకులు బోళ్ల కృష్ణమోహన్, చిల్లపల్లి గణపతి, ఇంద్ర పాల్గొన్నారు.

యువత సమాజాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలి

సామర్లకోట, న్యూస్‌టుడే: యువత నేటి సమాజాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు అన్నారు. ఆదివారం సామర్లకోట పట్టణంలో ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు సీఐ కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ సైకిల్ తొక్కడం ద్వారా యువతలో ఆరోగ్యం, శరీర దృఢత్వం పెరుగుతుందన్నారు.

వెంకన్నరాయచౌదరికి సత్కారం

కరప, న్యూస్‌టుడే: తెదేపా కాకినాడ పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా నియామకమైన చంద్రు వెంకన్నరాయచౌదరిని వేళంగి గ్రాడ్యుయేట్స్ యూత్ సభ్యులు ఆదివారం సత్కరించారు. మండలంలోని వేళంగిలో ఆయన నివాసంలో వీజేవై ప్రతినిధులు ఎర్రా విక్రమ్, డేగల శ్రీనివాస్, ఖండవిల్లి గుణ, లాలిబాబు అభినందించి సన్మానించారు.

దేవు వెంకన్నకు సన్మానం

సర్పవరం: తెదేపాలో కష్టపడి పనిచేసిన వారిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ గుర్తించి కార్పొరేషన్, పార్టీ పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డా.చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం చీడిగలో తెదేపా పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి దేవు వెంకన్నను ఆయన సన్మానించారు. మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, నాయకులు బాబూరావు, శ్రీనివాసరావు, కృష్ణారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

తెదేపాతోనే బీసీల అభ్యున్నతి

పిఠాపురం, న్యూస్‌టుడే: తెదేపాతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని కౌన్సిలర్ రాయుడు శ్రీనుబాబు అన్నారు. ఆదివారం పిఠాపురం సూర్యరాయ గ్రంథాలయంలో తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన పిల్లి శివరామసాయి ప్రసాద్ (చిన్న)ను సత్కరించారు. పార్టీ నేత శ్రీనుబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు కాకి అబ్బులు, నాళం స్వామి, చింతపల్లి రాజు, సూరిబాబు, కాళ్ల నాని, నాగేశ్వరరావు, మట్టా గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు

'న్యూస్‌టుడే' ముఖాముఖిలో డీఎస్పీ

పెద్దాపురం, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబరు 31న రాత్రి యువత ద్విచక్రవాహనాలపై తిరిగి శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పెద్దాపురం **డీఎస్పీ డి.శ్రీహరి రాజు** అన్నారు. మద్యం సేవించి ఇష్టానుసారంగా వాహనాలు నడిపి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే దారి దోపిడీ కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. ఈమేరకు పెద్దాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో నేర కేసుల విషయమై ఆయనతో న్యూస్‌టుడే ముఖాముఖి జరిపింది.

నేరాలు	2024	2025
దొంగతనాలు	347	386
దోపిడీలు	04	02
రహదారి ప్రమాదాలు	448	376
హత్యలు	08	08
అత్యాచారాలు	28	22
గంజాయి కేసులు	20	24
ఎస్సీ, ఎస్టీ మహిళలపై అత్యాచారాలు	36	17
సారా కేసులు	262	27

గంజాయి నిర్మూలిస్తాం..

గంజాయిని సమూలంగా ఉక్కుపాదంతో నిర్మూలించడానికి నిఘా విభాగాన్ని పటిష్టపర్చడం జరిగింది. గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు ఎవరైనా సమాచారం ఇచ్చినట్లయితే వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. ఇందుకు ప్రజల సహకారం ఎంతో అవసరం.

యువత ప్రాణాలు తీసుకోవద్దు..

దేశానికి ఎంతో ఉపయోగపడాల్సిన 17 నుంచి 25 సంవత్సరాలలోపు యువత ద్విచక్రవాహనంపై ముగ్గురేసి అతివేగంగా నడుపుతున్నారు. ఆసమయంలో ప్రమాదవశాత్తు మృత్యువాత పడుతున్నారు. దీంతో వారిపైనే ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు శోకాన్ని మిగుల్చుతున్నారు. జాతీయ రహదారుల్లో రహదారి ప్రమాదాలు జరగకుండా సూచికలు ఏర్పాటుచేసి.. అప్రమత్తం చేస్తున్నాం.

సమాచారం ఇస్తే నిఘా పెడతాం..

ఇళ్లల్లో దొంగతనాల కేసుల విషయంలో ప్రజలంతా అప్రమత్తతతో ఉండాలి. ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇస్తే నిఘా పెడతాం. ● మహిళలు రాత్రుళ్లు ఒంటరిగా గుళ్లకు, బజార్లకు వెళ్లి వస్తున్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ జనసంచారం లేని ప్రాంతాల నుంచి వెళ్లకూడదు. సాధ్యమైనంత వరకు ఒంటరిగా వచ్చినప్పుడు బంగారు ఆభరణాలు ధరించడం మానేయాలి.

యాదవుల ఐక్యత చాటుదాం

యాదవ సంఘ నూతన కార్యవర్గం

పిఠాపురం, న్యూస్‌టుడే: యాదవ కులస్థుల ఐక్యతను చాటేలా కృషిచేస్తామని సంఘం నూతన అధ్యక్షుడిగా నియమితులైన వియ్యపు రామన్నరాజు తెలిపారు. ఆదివారం పిఠాపురం రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో యాదవ పెద్దలతో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అఖిల భారత యాదవ మహాసభ నాయకులు అల్లు రాజుబాబు, బీజేఎస్ అధ్యక్షుడు రామకృష్ణ యాదవ్, పిఠాపురం యాదవ సంఘం నాయకుడు జోగా వెంకటరమణ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా పల్లా సింహాద్రి యాదవ్, అధ్యక్షుడిగా వియ్యపు రామన్నరాజు, ప్రధాన కార్యదర్శిగా ఈగల శ్రీనివాసరావు, కోశాధికారిగా అల్లుబోయిన అప్పలస్వామి, ఉపాధ్యక్షులుగా మోరుకుర్తి సూరిబాబు, అల్లుబోయిన సూరిబాబు, సహాయ కార్యదర్శులుగా మఠం వీరబాబు, వీపు శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా లొండా త్రిమూర్తులు, నైదన వేణుగోపాల్, గొర్ల అనిల్‌ను నియమించారు.

వైభవంగా సుదర్శన వ్రతం

వ్రతం చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: తాళ్లరేవు భూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా సుదర్శన వ్రతం నిర్వహించారు. అర్చకులు, వేద పండితుల సమక్షంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పూలమాలలతో వేంకటేశ్వరస్వామి వారిని అలంకరించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల స్వాధీనం

కొత్తపల్లి: తుని మండలం నామవరం నుంచి హనుమాన్ జంక్షన్‌లోని కబేళాకు అక్రమంగా తరలిస్తున్న పశువులను ఆదివారం కొత్తపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యు.కొత్తపల్లి మండలం రామన్నపాలెం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో పశువులు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ వాహనాన్ని స్టేషన్‌కు తరలించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదుచేసి పది పశువులను వేమవరంలోని గో సంరక్షణ శాలకు తరలించినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పిఠాపురం: పిఠాపురం అగ్రహారంలోని ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారని ఎస్సై మణికుమార్ తెలిపారు. స్థానిక భద్రాచలంవీధికి చెందిన కారుడ్రైవర్ సిరిగినీడి నరేష్‌కుమార్ (38)కు 13 ఏళ్ల క్రితం పాయకరావుపేటకు చెందిన రాజేశ్వరితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. శనివారం మరో మారు గొడవ జరగడంతో రాజేశ్వరి పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం సాయంత్రం ఇంటికొచ్చి చూసేసరికి భర్త ఫ్యానుకు ఉరివేసుకుని వేలాడుతున్న స్థితిలో కనిపించడంతో గట్టిగా కేకలు వేసింది. స్థానికులు వచ్చి పరిశీలించగా అప్పటికే నరేష్‌కుమార్ మృతిచెందినట్లు గుర్తించారు. భార్య ఫిర్యాదుతో మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ప్రకటన

మా క్లయింట్లు అయిన కాకినాడ కాపురస్తులు శ్రీ ASB Reddy and ASS Reddy గార్లు క్రింది వివరించబడిన స్థిరాస్తిని Vantipalli veera venkata Nageswararao, vantipalli Bharathi, Kethineni sarala గార్ల నుండి కొనుగోలు చేయుటకు ఉద్దేశించినారు.

ప్రతిపాదిత విక్రేతలు పై ఆస్తిపై సంపూర్ణ హక్కు, స్వాధీనము మరియు ఆసక్తి కలిగి ఉన్నారని ప్రకటించుచున్నారు. అందువల్ల, పై షెడ్యూల్ ఆస్తిపై ఎవరైనా వ్యక్తులు లేదా సంస్థలు హక్కు, టైటిల్, ఆసక్తి, బాకీ, తాకట్టు, లీజు, ఒప్పంద విక్రయం, కోర్టు కేసులు, నిషేధాజ్ఞలు (ఇంజంక్షన్), Lease లేదా ఏ ఇతర అభ్యంతరాలు కలిగి ఉంటే, వారు తమ అభ్యంతరాలను సంబంధిత పత్రాలతో సహా ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 15 (పదిహేను) రోజుల్లోపు క్రింద సంతకం చేసిన న్యాయవాదికి తెలియజేయవలసిందిగా కోరడమైనది.

పైన పేర్కొన్న గడువు లోపు ఎటువంటి అభ్యంతరాలు అందనిచో, పై ఆస్తిపై ఎటువంటి హక్కులు లేదా అభ్యంతరాలు లేవని భావించి, మా క్లయింట్లు ఆస్తి కొనుగోలు ప్రక్రియను కొనసాగిస్తారు. అనంతరం కలిగే ఏ విధమైన క్లెయిమ్స్‌కు మా క్లయింట్లు బాధ్యత వహించరు అని తెలియచేయడమైనది.

షెడ్యూల్: కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం, సర్పవరం సబ్ రిజిస్ట్రారులో చేరిన వాకలపూడి గ్రామపంచాయితీకి చెందిన, వాకలపూడి గ్రామం తాలూకు జిరాయితీ పల్లం సర్వే నెం. 95/2లో య.2.01 ట్లు లో య.0.71 ట్లు లో చ.గ.3193.38లు స్థలములో చ.గ 300లు స్థలమును ఇతరులకు విక్రయించగా ఇంకనూ మిగిలిన సుమారు చ.గ.2400 ఖాళీ స్థలమునకు కొలతలు, హద్దుల వివరం: **తూర్పు:** అ.126 లు 80 feet Road; **పడమర:** అ.127 లు ఉమ్మడి దారి ఇతరుల కాలువ ఆస్తి; **ఉత్తరం:** అ.166 లు డాక్టర్ గారి, శివ నిలయం; **దక్షిణం:** అ.167అ. 20 feet Road

R.V.Ramana Rao,
Advocate and Notary,
Near Varalakshmi Hospital, Pithapuram
Cell: 9247478463

హిందువుల ఐక్యత చాటుదాం

హిందూ సమ్మేళనంలో పాల్గొన్న అనంత శేషదాస్

పిఠాపురం: హిందువుల ఐక్యతను చాటేందుకు కృషిచేయాలని ఆర్ఎస్ఎస్ పిఠాపురం శాఖ బాధ్యుడు పెమ్మరాజు రామచంద్రరావు పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పిఠాపురం గోపాలబాబా ఆశ్రమంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అనంత శేషదాస్ మాట్లాడుతూ హిందూ సమాజంలో ఉన్నవారంతా సంస్కృతి, సంప్రదాయలు కాపాడేందుకు కృషిచేయాలన్నారు. నియో విద్యా సంస్థల డైరెక్టర్ డా.బుర్రా దివ్యరాజ్, బాదం ఉదయ సూర్యప్రకాష్, కొండేపూడి శంకరరావు, తోలేటి శిరీష, అల్లవరపు నగేష్ పాల్గొన్నారు.

కాజులూరు: ప్రతి ఒక్కరూ హిందూ ఐక్యతను కాపాడాలని ఇస్కాన్ అనంత శేషదాస్ అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం గొల్లపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంత శేషదాసు పాల్గొని మాట్లాడారు. హిందువులందరూ ఐకమత్యంగా ఉన్నప్పుడే మన సనాతన ధర్మాన్ని కాపాడుకోగలమన్నారు. బెల్లపుకొండ వీరభద్రరాజు, శీలామంతుల వీరభద్రరావు, అంగర చిన్నబాబు, చెల్లుబోయిన పద్మ పాల్గొన్నారు.

మాండవ్య నారాయణస్వామి ఆలయంలో 30న ఉత్తర ద్వార దర్శనం

సామర్లకోట: సామర్లకోటలోని అతి పురాతనమైన మాండవ్య నారాయణస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈనెల 30న ఉత్తర ద్వార దర్శన పూజలు నిర్వహిస్తున్నామని ఈవో చౌదరి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆలయంలో తెల్లవారుజామున గోపూజ, స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు.

శ్రీరామునికి కలశాభిషేకం

పెదపూడి: పెదపూడి జనార్దనస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే శ్రీరామ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా కలశాభిషేకం నిర్వహించారు. స్థానిక లక్ష్మీసరస్వతీ సహిత విఘ్నేశ్వరాలయం నుంచి మహిళలు 108 కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

కెనాల్ రోడ్డులో కొండచిలువ

సామర్లకోట: అడవుల్లో ఉండే కొండచిలువ సామర్లకోట కెనాల్ రోడ్డులో కనిపించింది. సామర్లకోట నుంచి కాకినాడకు వెళ్లే గోదావరి కాలువ ప్రధాన రహదారి వద్ద ఆదివారం రాత్రి రోడ్డుపై పాకుతూ వాహనదారుల కంట పడింది.

రోడ్డు దాటుతున్న కొండచిలువ

వాహనాల శబ్దానికి వెనుతిరిగి గోదావరి కాలువ వైపునకు వెళ్లిపోయింది. సుమారు 10 అడుగుల ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

గిన్నిస్ రికార్డ్సలో సామర్లకోట నృత్య కళాకారులు

సామర్లకోట: గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో సామర్లకోట నృత్య కళాకారులు స్థానం సంపాదించారు. శనివారం హైదరాబాద్‌లో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో కూచిపూడి కళావైభవం బృందం నిర్వహించిన ఈ ప్రదర్శనలో 4,608 మంది కళాకారులు నృత్య ప్రదర్శన చేసి రికార్డు నెలకొల్పారు. ఈ బృందంలో సామర్లకోటకు చెందిన బేత సత్యనారాయణ చేత తర్ఫీదు పొందిన శిష్యబృందం చేరిష్య, నమ్రత, దీప్తి, కీర్తిలతో కలిపి 30 మంది కళాకారులు పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడి

పెద్దాపురం: మండలంలోని ఆర్బీ కొత్తూరు గ్రామంలో ఆదివారం కోడి పందేలపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వి.మౌనిక తెలిపారు. వారి నుంచి రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, నాలుగు ద్విచక్రవాహనాలు, రూ.4,900 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం నిర్మాణాన్ని నిలిపివేయాలి

పెద్దాపురం: గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామ పరిధిలోని రామేశంమెట్ట వద్ద జిందాల్ కంపెనీ చేపట్టిన విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని ఆదివారం పెద్దాపురం మండలం ఆనూరు గ్రామంలో ఏపీ రైతు కూలీ, ఏఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారని అభిప్రాయాలు తెలుసుకోకుండా ఏకపక్షంగా ఆ కంపెనీకి అనుమతులు ఎలా ఇచ్చారన్నారు. పంచాయతీ తీర్మాణం తీసుకోకుండా పవర్ ప్లాంట్‌ను ఏ విధంగా ఏర్పాటు చేస్తారన్నారు. దీని వల్ల ఆ ప్రదేశం కలుషితమై ప్రజలకు హాని కలుగుతుందన్నారు.



లోవకు భక్తుల తాకిడి

లోవలో చెట్లకింద వంట చేసుకుంటున్న భక్తులు

తుని గ్రామీణం: తలుపులమ్మ లోవ దేవస్థానం ఆదివారం భక్తుల తాకిడితో నిండిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. దర్శనం, ప్రసాదం టిక్కెట్లు పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ చేయడం ద్వారా భక్తులు ఫోన్‌పే ద్వారా చెల్లించాలని సిబ్బంది సూచించడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఒక్కరోజే 7 వేల మంది పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో రూ.2.60 లక్షల ఆదాయం సమకూరినట్లు దేవస్థానం డిప్యూటీ కమిషనర్ విశ్వనాథరాజు తెలిపారు.

ఘనంగా సత్యదేవుని రథ సేవ

అన్నవరం: అన్నవరం సత్యదేవుని రథసేవ ఆదివారం ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఆసీనులను చేసి అర్చకులు పూజలు నిర్వహించారు. ఛైర్మన్ ఐ.వి.రోహిత్ సేవను ప్రారంభించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ స్వామివారి రథ సేవలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే సత్యదేవుని దర్శించుకుని పూజలాచరించారు. వేదపండితులు ఆశీర్వచనం గావించారు.

రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ, ఛైర్మన్ రోహిత్

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ఉ. 10 - మ. 1
తుని: 9100020946
ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

పూడిక తీయించరూ..

సమస్య: మండలంలోని కత్తిపూడి పాత కొత్తూరులో పూడికతీయక దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నాం. – శ్రీను, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం. – సుధాకర్, కార్యదర్శి, కత్తిపూడి

సమస్య: వేమవరం సచివాలయం పక్కనే ఉన్న తుపాను పునరావాస భవనం శిథిలమైంది. పాఠశాల విరామ సమయంలో విద్యార్థులు ఈ భవనం పరిసరాల్లో ఆటలు ఆడుతున్నారు. అధికారులు స్పందించి శిథిలభవనాన్ని తొలగించాలి. **– బాబూరావు, గ్రామస్థుడు**

సమాధానం: విషయం ఉన్నతాధికారులకు నివేదించి శిథిల భవనాన్ని తొలగించే పనులు చేపడతాం. **– అప్పారావు, పంచాయతీ కార్యదర్శి**

తాగునీటి వృథా అరికట్టాలి

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండల కేంద్రం జగ్గంపేట ఎస్సీకాలనీలో పైపులైనుకు రంధ్రం ఏర్పడి అధికమొత్తంలో తాగునీరు వృథాగాపోతోంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌తో మాట్లాడగా సమస్య తన దృష్టికి వచ్చిందని ట్రాక్టర్ తొక్కేయడంతో పైపు పగిలింది. సోమవారం ఉదయం సిబ్బందిని సమకూర్చి పైపుకు ఏర్పడిన రంధ్రాన్ని సరి చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

చెత్త తొలగించరూ..!

సమస్య: తిరుమాలి కాలనీలో ర.భ.శాఖ రోడ్డుచెంత చెత్త వేస్తున్నారు. రహదారి అంచులు అధ్వానంగా మారుతున్నాయి. చెత్త తొలగింపు పనులు చేయాలి. **– కృష్ణ, తిరుమాలి**

సమాధానం: రోడ్డు మార్జిన్లల్లో ఉన్న చెత్తను తరలించేందుకు అవసరమైన పనులు చేయిస్తాం. నిర్దేశిత ప్రాంతాల్లోనే చెత్త వేసేలా ప్రజలకు అవగాహన కల్పిస్తాం. - సూతి కృష్ణ ప్రసాద్, సర్పంచి, తిరుమాలి

- న్యూస్‌టుడే, శంఖవరం, తొండంగి, .జగ్గంపేట గ్రామీణం , ఏలేశ్వరం

రాజముద్రతో పాస్‌పుస్తకాలు సిద్ధం

గ్రామసభలకు రెవెన్యూ అధికారులు సమాయత్తం

న్యూస్‌టుడే, తొండంగి, రౌతులపూడి, శంఖవరం, కోటనందూరు

గత ప్రభుత్వం ప్రచారయావతో పాస్ పుస్తకాలను సైతం వదల్లేదు. జగన్ చిత్రపటంతో పాస్‌పుస్తకాలు రైతులకు అందించారు. దీంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. అయిదు దశాబ్దాల కిందట రైతులకు పాస్‌పుస్తకాలు అందించారు. రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో రీ సర్వే పేరుతో ప్రభుత్వం రైతుల భూములను సర్వే చేసి సక్రమమైన కొలతలతో పట్టాదారు పాస్‌పుస్తకాలు అందించేందుకు రెవెన్యూశాఖ చర్యలు చేపట్టింది. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ముద్రతో ప్రస్తుతం పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తుంది. తుని ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో రీ సర్వే చేయాల్సిన గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాల్లో కూడా రీసర్వే చేసి పాస్‌పుస్తకాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

మండలాల్లో పరిస్థితి

తొండంగి మండలంలో 22 పంచాయతీలు ఉన్నాయి. 10 గ్రామాల్లో రీ సర్వే పూర్తయింది. ప్రస్తుతం కృష్ణాపురం, బెండపూడి గ్రామాల్లో రీ సర్వే జరుగుతుంది. 12 గ్రామాల్లో రీ సర్వే జరగాల్సి ఉంది. రౌతులపూడి మండలంలో 44 గ్రామాలుండగా 16 గ్రామాల్లో సర్వే పూర్తయింది. 28 గ్రామాల్లో సర్వే చేయాల్సి ఉంది. 3,288 పాస్‌పుస్తకాలు రావాల్సి ఉండగా 882 పాస్‌పుస్తకాలు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎగువశివాడ, ధారపల్లి, దిగువధారపల్లి గ్రామాల్లో రీ సర్వే జరుగుతుంది. కోటనందూరు మండలంలో 15 రెవెన్యూ గ్రామాలకు గాను 9 గ్రామాల్లో రీ సర్వే పూర్తయింది. 6 గ్రామాల్లో రీ సర్వే జరగాల్సి ఉంది. 4,459 పాస్‌పుస్తకాలకు గాను 496 పాస్‌పుస్తకాలు వచ్చాయి. ప్రస్తుతం బీమవరపు కోటలో రీ సర్వే జరుగుతుంది. శంఖవరం మండలంలో 32 రెవెన్యూ గ్రామాలకు గాను 28 గ్రామాల్లో రీ సర్వే పూర్తయింది. 4 గ్రామాల్లో రీ సర్వే జరగాల్సి ఉంది. 6,632 పాస్‌పుస్తకాలకు గాను 5,800 పాస్‌పుస్తకాలు వచ్చాయి.

అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో

జనవరి 2 నుంచి గ్రామసభలు

ప్రభుత్వ రాజముద్రతో అందించిన పట్టాదారు పాస్‌పుస్తకాలు జనవరి 2 నుంచి గ్రామ సభలు నిర్వహించి రైతులకు అందిస్తాం. తొండంగి మండలంలో రీ సర్వే పూర్తయిన 10 గ్రామాలకు గాను 4 గ్రామాల రైతులకు సంబంధించిన 1,697 పాస్‌పుస్తకాలు మాత్రమే వచ్చాయి. మిగిలినవి రావాల్సి ఉంది. ఎలాంటి తప్పులు లేకుండా పాస్‌పుస్తకాలు అందించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం.
– టి.కాంతారావు, తహసీల్దార్, తొండంగి

కూచిపూడిలో గిన్నిస్ రికార్డు

కార్యక్రమంలో పాల్గొన్న తుని ప్రాంత కళాకారిణులు

న్యూస్‌టుడే – తుని

తుని, అన్నవరం ప్రాంత విద్యార్థినులు అనేక మంది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో 27న జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 4,608 మంది కళాకారిణులు ఒకేసారి కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. పట్టణంలోని కావ్యశ్రీ నృత్య కళాశాల ద్వారా శిక్షకురాలు ఏలూరి దీపిక ఆధ్వర్యంలో పాల్గొన్న విద్యార్థినులు ఈ అరుదైన రికార్డులో భాగస్వాములయ్యారు. తుని, అన్నవరం, పాయకరావుపేట నుంచి 80 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రశంసలు అందుకున్నారు.

జీవితంలో మరపురానిది

పెద్ద సంఖ్యలో కూచిపూడి కళాకారిణులు హాజరైన ఇలాంటి అరుదైన కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది. గిన్నిస్‌బుక్ రికార్డు దక్కించుకోవడం జీవితంలో మరపురాని సంఘటన. ఇప్పటి వరకూ హైదరాబాద్‌తో పాటు రామేశ్వరం, షిరిడి తదితర ప్రాంతాల్లో వేదికపై ప్రదర్శనలు ఇచ్చాను.
– ఎ.శ్వేత సాయి,విద్యార్థిని, తుని

ఎంతో ఉత్సాహం నింపింది

నాలుగేళ్లలో హైదరాబాద్, తిరుపతి, చిదంబరం తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చాను. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధిచడం నాలో ఎంతో ఉత్సాహాన్ని నింపింది. భవిష్యత్తులో మరింత రాణించి కూచిపూడి నృత్యం దేశ, విదేశాల్లో ప్రదర్శన ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నాను.
– కిరణ్మయి, విద్యార్థిని, తుని

పశువులకు బీమా.. రైతుకు ధీమా

బీమా చేసిన పశువులకు గుర్తింపు సంఖ్య

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పాడి రైతులకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వాలు పశు బీమా పథకం అమలు చేస్తోందని కాట్రావులపల్లి పశువైద్యాధికారి వినోద్ చెబుతున్నారు. రైతుల పశువులు ప్రమాదాలకు, వ్యాధుల వల్ల చనిపోతే రైతు నష్టపోకుండా కొంత పరిహారం లభిస్తుంది. రైతులు స్వల్ప ప్రీమియం రూ.384 చెల్లించడం ద్వారా రూ. 30 వేలు వరకు బీమా పొందవచ్చు. పశువుల మార్కెట్ విలువలో 4 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉన్నప్పటికి ప్రభుత్వం ప్రీమియం చెల్లింపులో రాయితీలు అందిస్తున్నాయి. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి పాడిరైతు కుటుంబానికి గరిష్ఠంగా పది పశువులకు పశుబీమా వర్తిస్తుంది. ఒకసారి బీమా చేస్తే మూడేళ్ల వరకు వర్తిస్తుందని బీమా చేసిన పశువులకు చెవుకు చెవిపోగు వేయించి గుర్తింపు పొందాలి. ఒకవేళ పశువులు మృత్యువాత పడితే ఆరోగ్య ధ్రువపత్రం, ఫొటోలు, ఆధార్ వంటి పత్రాలతో పశుసంవర్ధకశాఖ అధికారులను సంప్రదించాలి. పత్రాలను పరిశీలించిన తర్వాత సంబంధిత రైతులకు బీమా అందజేస్తారు.

నవీన్‌కు టీఎన్‌టీయూసీ నాయకుల అభినందనలు

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపా జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన జ్యోతుల నవీన్‌కు టీఎన్‌టీయూసీ అధ్యక్షులు పసుమర్తి కృష్ణ, పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. రావులమ్మనగర్ కాలనీలో పార్టీ కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, నగరపంచాయతీ కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, గండేపల్లి సొసైటీ డైరెక్టర్ గొల్లపల్లి అన్నవరం తదితరులు ఉన్నారు.

ఘనంగా యూత్ క్రిస్మస్ వేడుకలు

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక ఎస్సీకాలనీలో అంబేడ్కర్ యూత్ క్రిస్మస్ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. పలువురు క్రీస్తు జననం, క్రిస్మస్ సందేశాలు, ప్రార్థనలు యువతను ఉత్తేజపరిచాయి. యువత డాన్సులు, పాటలు, స్కిట్‌లు, సందేశాలతో అలరించారు.

గీతాలు ఆలపిస్తున్న యువత

దుర్గమ్మకు పూజలు

గండేపల్లి: గండేపల్లి మండలం మురారి దుర్గమ్మ అమ్మవారి తోటకు ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. మొక్కులు చెల్లించుకుని, కుటుంబాలతో వంటా వార్పు చేసుకుని, ఆహ్లాదంగా గడిపి వెళ్లారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై శివనాగబాబులు బందోబస్తు నిర్వహించారు.

బలరామపురంలో వైద్య శిబిరం

రౌతులపూడి, న్యూస్‌టుడే: బలరామపురం గ్రామంలో సహకార సంఘ అధ్యక్షుడు పైల పైడిరాజు సమక్షంలో స్ఫూర్తిప్రసాద్, కాకినాడ టైమ్స్ గ్రూప్ సహకారంతో ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. సత్రం ఛైర్మన్ సోమ రౌతు చంద్రమౌళి, తెదేపా మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, సర్పంచి పైల సీత, ఎంపీటీసీ సభ్యుడు సోమరౌతు రవి శిబిరాన్ని ప్రారంభించారు. 200 మంది రోగులకు వైద్యులు కూంద్రపు శివ ఆధ్వర్యంలో బృందం పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు.

డ్రగ్స్ వద్దు బ్రో అంటూ ప్రచారం

రౌతులపూడి, న్యూస్‌టుడే: డ్రగ్స్ వద్దు బ్రో అంటూ రౌతులపూడిలో పోలీసులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. మత్తు పదార్థాల బారిన పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్సై వెంకటేశ్వరరావు కోరారు. సైకిల్ తొక్కుతూ..పోలీసులు మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ప్రచారం చేశారు.

ప్రదర్శనలో రౌతులపూడి పోలీసులు

అధికార ప్రతినిధికి సత్కారం

శంఖవరం: తెదేపా జిల్లా పార్లమెంటరీ కమిటీ అధికార ప్రతినిధిగా నియమితులైన నెల్లిపూడికి చెందిన బద్ది వెంకటరమణను వివిధ గ్రామాల పార్టీ శ్రేణులు ఆదివారం అయన్ని కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పాకల ప్రసాద్, మహేష్, తోట అప్పారావు తదితరులు వారిలో ఉన్నారు.

పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని నిలిపేయాలి

గండేపల్లి, న్యూస్‌టుడే: జిందాల్ పవర్‌ప్లాంట్ నిర్మాణాన్ని నిలిపివేసి పర్యావరణాన్ని రక్షించాలని ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. రామేశ్వరంపేటలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్ మాట్లాడుతూ.. పేదలకు ఇచ్చిన స్థలాల్లో సమీప గ్రామాల ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా చెత్త నుంచి విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించడం ఖండిస్తున్నామన్నారు. ఏపీఆర్సీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజబాబు, ఏఐఎఫ్‌టీయు కార్యదర్శి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీచ్ మార్గం గుంతలమయం..

దానవాయిపేట- అద్దరిపేట వరకు ఉన్న బీచ్ మార్గం గుంతలమయంగా మారింది. యల్లయ్యపేట, అన్నయ్యపేట గ్రామాల వద్ద పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గం మీదుగా రోజూ వందల సంఖ్యలో వాహనాలు, రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి సమయాల్లో ఆ గుంతలతో గాయపడుతున్నామని వాహనచోదకులు వాపోతున్నారు. ర.భ.శాఖ అధికారులు స్పందించి రహదారిని మెరుగుపరచాలని వారు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తొండంగి

కదలని మురుగు.. తీరని సమస్య

తాళ్లూరు గ్రామంలో సచివాలయ కార్యాలయం పక్కనే ఉన్న మురుగు కాలువలోని నీరు ముందుకు సాగే పరిస్థితి లేదు. దీంతో దోమలు వ్యాప్తిచెందడంతోపాటు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తుని గ్రామీణం

రేయింబవళ్లు వెలుగులే..!

గ్రామ పంచాయతీల్లో విద్యుత్తు బిల్లులు రూ.లక్షల్లో వస్తున్నాయి. వాటిని నియంత్రించాల్సిన అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. గండేపల్లి మండలం రామయ్యపాలెం గ్రామంలో వీధి దీపాలు పగలు,రాత్రి తేడా లేకుండా వెలుగుతున్నాయి. సంబంధిత అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై పంచాయతీ పాలకవర్గం చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గండేపల్లి

ఏలేశ్వరంలో లలితను సన్మానిస్తున్న తెదేపా కౌన్సిలర్లు, నాయకులు

కష్టపడి పనిచేసేవారికి తెదేపాలో గుర్తింపు

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: కష్టపడి పనిచేసే వారికి తెదేపాలో మంచి గుర్తింపు ఉంటుందని కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణస్వామి అన్నారు. ఏలేశ్వరానికి చెందిన మామిడి లలిత తెదేపా పార్లమెంటరీ కమిటీ నిర్వహణ కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా ఆమెను ఆదివారం ప్రజాప్రతినిధులు సన్మానించారు. తెదేపా బలోపేతానికి మరింతగా కృషి చేయాలని వారు కోరారు. అనంతరం లలిత మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, పట్టణ నాయకుల సహకారంతో తనకు తెదేపాలో గుర్తింపు లభించిందని అన్నారు. కౌన్సిలర్ పెంద్ర శ్రీను, నాయకులు సామంతుల గోపీ, వాగు రాజేష్ పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థాన పురోహితుడు ఆకస్మిక మృతి

అన్నవరం, న్యూస్‌టుడే : అన్నవరం దేవస్థానం పురోహితుడు సవితాల వీర వెంకట రమణ (వీరబాబు) (38) ఆకస్మికంగా ఆదివారం మృతి చెందారు. ఆయన తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందినట్లు తెలిసింది. ఛైర్మన్ ఐ.వి. రోహిత్, ఉద్యోగులు, సిబ్బంది నివాళి అర్పించారు.

కబేళా నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు

తొండంగి, న్యూస్‌టుడే: గోపాలపట్నంలో అనధికారకంగా కబేళా నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎస్సై జగన్‌మోహన్‌రావు సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. సామర్లకోటకు చెందిన మహ్మద్ రఫీ నాలుగేళ్లుగా గోపాలపట్నంలో నివాసముంటున్నారు. సామర్లకోటకు చెందిన మరో వ్యక్తి మహమద్ కలీమ్, విశాఖపట్టణానికి చెందిన మహమద్ అమిర్‌లతో కలిసి కొంతకాలంగా గ్రామ శివారులోని ఓ రేకుల షెడ్డులో గోమాంసం విక్రయిస్తున్నారు. ఆదివారం మూడు ఎద్దులను గ్రామ శివారులో కత్తులతో నరుకుతుండగా పెద్ద పెద్ద శబ్దాలు రావడంతో స్థానికులు కొందరు ఆగ్రహానికి గురై పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై జగన్‌మోహన్‌రావు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకోవడంతో పాటు గో మాంసాన్ని, చర్మాలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కోడిపందేలు నిర్వహిస్తున్న వ్యక్తుల అరెస్టు

జగ్గంపేట గ్రామీణం: గొల్లలగుంటలో కోడిపందేలు నిర్వహిస్తున్న జూదశిబిరంపై దాడిచేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు. పందేలు నిర్వహిస్తున్న ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు, రెండు కోడి పుంజులు, రూ. 5060 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జూద శిబిరాలపై దాడులు.. కేసు నమోదు

ప్రత్తిపాడు, జగ్గంపేట గ్రామీణం: పోతులూరు గ్రామంలో జూద శిబిరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. గ్రామ శివారున జూదమాడుతున్నారనే సమాచారంతో దాడి చేయగా ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారని, వారి నుంచి రూ. 3250లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మీకాంతం తెలిపారు. జూదాలు ఇతర అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడ జరిగినా 94407 96570, 94407 96530 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ● స్థానిక టవర్ కాలనీలో జూదశిబిరంపై దాడిచేసి ఐదుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు. స్టేషన్‌కు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి ఐదుగురు వ్యక్తులను, రూ. 5,600 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జగ్గంపేటలో సైకిల్ తొక్కుతూ అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సైకిల్ తొక్కండి.. ఆరోగ్యంగా ఉండండి

జగ్గంపేట గ్రామీణం, గండేపల్లి, న్యూస్‌టుడే: రోజూ సైకిల్ తొక్కడంతో జీవనశైలిలో ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ అన్నారు. 'ఫిట్ ఇండియా'లో భాగంగా ఆదివారం సర్కిల్ కార్యాలయం నుంచి చిన్నారులు, పోలీసు సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్సై రఘునాథరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ● ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామం తప్పనిసరి అని ఎస్సై శివ నాగబాబు తెలిపారు. ఆదివారం గండేపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద 'ఫిట్ ఇండియా'లో భాగంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ.. పరిసరాల శుభ్రత ఎంత ముఖ్యమో శరీర ఆరోగ్యానికి వ్యాయమం అంతే అవసరం అని అందుకే రోజూ 30 నిమిషాలైనా వ్యాయామం చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి జాతీయ రహదారిపై సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

చెత్తకు నిప్పుపెట్టడంతో వస్తున్న పొగ

నదీ గర్భంలో టన్నుల కొద్దీ చెత్త

పురవీధుల్లో రోజూ ఉత్పత్తి అయ్యే టన్నుల కొద్దీ చెత్త విభజనకు సరైన డంపింగ్ యార్డులేక తాండవ నది గర్భంలో వేస్తున్నారు. రోజూ పట్టణంలోని 30 వార్డుల్లో సుమారు 56 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. దీన్ని ట్రాక్టర్ల ద్వారా ఇసకలపేట వద్ద తాండవ నదిలో పడేస్తున్నారు. పలువురు ఈ చెత్తకు నిప్పు పెట్టడంతో వ్యర్థాల్లో ఉన్న ప్లాస్టిక్, దుస్తులు, పరుపులు వంటివి కాలిపోయి పొగ, దుర్వాసనతో చుట్టుపక్కల వారు అవస్థలు పడుతున్నారు. దశాబ్దకాలంగా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా పురపాలక అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, తుని పట్టణం

కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రత్తిపాడు, జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ప్రత్తిపాడులో జరిగింది. పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాశరావు, పార్టీ నాయకులు కొప్పన కోటేశ్వరరావు, సోమరాజు, నారాయణ తదితరులు కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. ● కాంగ్రెస్‌పార్టీ 140వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జగ్గంపేటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మరోతి శివ గణేష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ నగర్‌లో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. శివగణేష్ మాట్లాడుతూ.. అన్ని మతాలకు సమాన హక్కును కల్పించే లౌకికవాదం కాంగ్రెస్ పార్టీ విధానమన్నారు. మిఠాయిలు పంచి సంబరాలు చేశారు. పీసీసీ సభ్యులు వత్సవాయి బాబు, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి నక్కా సత్తిబాబు, బ్లాక్‌వన్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు చంద్రమౌళి వెంకటరత్నం, ఎస్సీసెల్ కార్యదర్శి జోడ చైతన్య, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జెండా ఎగురవేస్తున్న నాయకులు శ్రీను, సూర్యప్రకాశరావు తదితరులు

భవన నిర్మాణ కార్మిక సంఘ నూతన కార్యవర్గం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ఏలేశ్వరంలో అల్లూరి సీతారామరాజు భవన నిర్మాణ కార్మిక సంఘ నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటైంది. సంఘానికి సంబంధించి 200 మంది కార్మికులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాండ్రింకి సూర్యప్రసాద్, కార్యదర్శిగా పలికెల శ్రీను, ఉపాధ్యక్షుడిగా మజ్జి శ్రీను, సహ కార్యదర్శిగా డి.అప్పారావు, కోశాధికారిగా ఎస్‌ఎస్ శంకర్ తదితరులు నియమితులయ్యారు. వైఆర్సీ కాలనీ నుంచి బాలాజీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి సంఘీభావం ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా నందకూరి నాగశంకర్ ఎన్నికయ్యారు.

నెలాఖరులోగా పన్నులు చెల్లించాలి

తుని, న్యూస్‌టుడే: పురపాలక సంఘానికి చెల్లించాల్సిన వివిధ పన్నులు ఈ నెలాఖరుకు చెల్లించాలని కమిషనర్ ఎ.వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. కార్యాలయంలోని కౌంటర్‌తోపాటు సీడీఎంఏ వెబ్‌సైట్, పురమిత్ర యాప్ ద్వారా కూడా చెల్లించవచ్చునన్నారు.

అంతిమయాత్ర.. అవస్థలు

శ్మశానవాటికల్లో కనీస వసతులు మృగ్యం ● 'ఉపాధి' నిధులు కోరుతూ వినతులు

న్యూస్‌టుడే, తుని గ్రామీణం

దశాబ్దాలుగా గ్రామాల్లోని శ్మశానవాటికల్లో కనీస వసతులు కరవయ్యాయి. దీంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వీటి నిర్వహణను పంచాయతీ అధికారులు నిధుల కొరతను సాకుగా చూపి పట్టించుకోవడం లేదు.

ఇదీ పరిస్థితి...

తుని నియోజకవర్గంలో సుమారు 53 పంచాయతీలు ఉన్నాయి. ఒక్కొక్క పంచాయతీకి రెండు నుంచి నాలుగు శివారు గ్రామాలు ఉన్నాయి. గత తెదేపా పాలనలో ప్రతి మండలంలో పంచాయతీల్లో శ్మశానవాటికల అభివృద్ధికి ఉపాధి నిధులు కేటాయించడంలో నీళ్లట్యాంకు, బోరు, షెల్టర్ తదితర వాటిని ఏర్పాటు చేశారు. దీంతో సుమారు 20 పంచాయతీల్లో వాటికలు మెరుగుపడ్డాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా వీటి అభివృద్ధిని గాలికి వదిలేశారు.

కనీస వసతులు లేని తాళ్లూరు శ్మశానవాటిక

దీంతో ఎండ, వర్షంలోనే అంత్యక్రియ కార్యక్రమాలు నిర్వహించి ఊరుశివారులో ఉన్న బావులవద్దకు వచ్చి స్నానాలు చేసే పరిస్థితి నెలకొంది. తుని మండలం రేఖవానిపాలెం, మరువాడ, నందిఒంపు, సీతయ్యపేట, తాళ్లూరు, లోవకొత్తూరు తదితర గ్రామాల్లోని శ్మశాన వాటికలో కనీసం నీళ్లు సైతం లేవు. ఎన్‌ఎస్వీ నగరం, కొలిమేరు గ్రామాలకు చెందిన శ్మశాన వాటికలు స్థలాలు అక్రమణకు గురికావడంతోపాటు ఆ ప్రాంతానికి వెళ్లేందుకు సరైన మార్గం లేదు. హంసవరం క్రైస్తవ శ్మశాన వాటికకు ప్రహరితోపాటు ఇతర వసతులు లేకపోవడంతో శవపేటికలకు రక్షణ లేదు. దీంతోపాటు కోటనందూరు, తొండంగి మండలాలల్లో పలు గ్రామాల పరిస్థితి ఇదేవిధంగా నెలకొంది. ఈ సమస్యపై ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

(c) eenadu

యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : యూరియాను అధిక ధరలకు విక్రయించినా.. ఇతర ఎరువులకు లింక్ పెట్టి అమ్మినా.. సదరు దుకాణదారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారిణి పీఎల్ వరలక్ష్మి హెచ్చరించారు. కల్లూరు మండల పరిధిలోని ఎరువుల దుకాణాలను ఆదివారం ఆమె తనిఖీ చేశారు. కొత్త బస్టాండు సమీపంలోని సాయికృప ఏజెన్సీ, విజయలక్ష్మి ఏజెన్సీస్ ఎరువుల దుకాణాల్లో యూరియా నిల్వ వివరాలు, రిజిస్టర్లు, ఈ-పోస్ స్టాక్ గ్రౌండ్ బ్యాలెన్సులను పరిశీలించారు. నిల్వలు, రిజిస్టర్లలో వ్యత్యాసాలు ఉండటంతో రూ.2.93 లక్షల విలువ చేసే యూరియా, ఇతర ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. అనంతరం కర్నూలు మండల పరిధిలోని మన గ్రోమోర్ సెంటర్‌ను తనిఖీ చేశారు. కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, కల్లూరు మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి పీఎల్ వరలక్ష్మి, అధికారులు

ఆటతో మురిపించి.. విజయాలు వరించి..

కర్నూలు నగరంలో ఈఎస్ఎల్ క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రెజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్- 2025' క్రికెట్ పోటీలు ఆదివారంతో ఆరో రోజుకు చేరింది. బౌలర్లు తమ సత్తా చాటారు. ఎక్కువ పరుగులు ఇవ్వకుండా కట్టడి చేశారు. కొందరు బ్యాటర్లు సైతం ప్రతిభ చాటి జట్టు విజయానికి కృషి చేశారు. – ఈనాడు, కర్నూలు

శిరస్త్రాణమే శ్రీరామ రక్ష

☛ రేపటి నుంచి హెల్మెట్ ఉంటేనే పెట్రోలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : రహదారి ప్రమాదాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. మృత్యువాత పడుతున్న వారిలో ఎక్కువమంది ద్విచక్ర వాహనదారులే ఉంటున్నారు. వీరిలోనే అధికంగా యువకులే ఉంటున్నారు. చాలామంది శిరస్త్రాణం ధరించకపోవడంతోనే ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహనదారుల్లో శిరస్త్రాణంపై అవగాహన పెంపొందించి.. తప్పనిసరిగా ధరించేలా చూసేందుకు జిల్లా పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ఈనెల 30వ తేదీ నుంచి జిల్లాలో 'నో హెల్మెట్.. నో పెట్రోల్' విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. శిరస్త్రాణం ధరించని ద్విచక్ర వాహనదారులకు పెట్రోలు పోయరు. ఈ మేరకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేశారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

గాల్లో ప్రాణాలు

ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 280 మంది మృతి చెందారు. కర్నూలు నగరంలోనే 42 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఎక్కువమంది ద్విచక్ర వాహనదారులే ఉన్నారు. శిరస్త్రాణం ధరించకపోవడంతోనే మృత్యువాత పడినట్లు పోలీసు అధికారులు గుర్తించారు.

■ ఈనెల 2న సంతోష్‌నగర్ వద్ద ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. తీవ్రంగా గాయపడిన మరో యువకుడు ఆస్పత్రిలో చనిపోయారు.

■ అక్టోబరు 24న ఓ ద్విచక్ర వాహనదారు మద్యం మత్తులో చెట్లమల్లాపురం వద్ద డివైడర్‌ను ఢీకొని ప్రాణాలు కోల్పోయారు. బైక్ రహదారికి అడ్డంగా పడిపోగా ప్రైవేటు బస్సు ఢీకొని ఈడ్చుకెళ్లింది. బస్సుకు మంటలు వ్యాపించి 19 మంది సజీవ దహనమైన విషయం తెలిసిందే. బైకర్ శిరస్త్రాణం ధరించి ఉంటే ఈ ఘోర ప్రమాదం జరిగేది కాదని పలువురు భావిస్తున్నారు.

సాగు.. కాడిన పడక

● రబీలో తగ్గిన పంటల విస్తీర్ణం

రబీ సీజన్‌లో పంటల సాగు అంతంత మాత్రంగానే ఉంది. మూడు నెలలవుతున్నా పురోగతి కానరావడం లేదు. తుంగభద్ర జలాశయం నుంచి నీరు వదలడం లేదని జలవనరుల శాఖ అధికారులు తేల్చి చెప్పడంతో కర్నూలు జిల్లా పరిధిలో పలువురు రైతులు వరి సాగుకు వెనకడుగు వేస్తున్నారు. గతంలో రబీ సీజన్‌లో వేరుసెనగ విత్తన కాయలను రాయితీపై ఇచ్చేవారు. ఈసారి ఇవ్వకపోవడంతో సాగుపై ప్రభావం చూపింది. – న్యూస్‌టుడే, కర్నూలు, నంద్యాల వ్యవసాయం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రబీలో 2.81 లక్షల హెక్టార్ల సాధారణ సాగు కాగా 1.96 లక్షల హెక్టార్లలోనే వివిధ పంటలు సాగయ్యాయి. 83,315 హెక్టార్లలో రైతులు సాగు చేపట్టలేదు. ఖరీఫ్‌లో అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతిన్నాయి. గిట్టుబాటు ధరలు అందక పెట్టుబడులు పెరిగిపోవడంతో.. 'కాడి' గాడిన పడలేదు.

28,737 హెక్టార్లలో విత్తు పడక..

● రబీ పంట కాలం మరో నెలలో ముగియనుంది. వర్షాధారం కింద సాగుకు అవకాశం లేకుండా పోయింది.. ఉమ్మడి జిల్లాలో పప్పుశనగ ప్రధానంగా సాగవుతుంది. ఈ సీజన్‌లో కర్నూలులో 38,239, నంద్యాలలో 52,518 కలిపి మొత్తం 90,757 హెక్టార్లలో సాగైంది. 1.19 లక్షల హెక్టార్ల సాధారణ సాగు కాగా.. 28,737 హెక్టార్లలో విత్తు పడకపోవడం గమనార్హం.

● గతంలో 1.70 లక్షల హెక్టార్లలో పప్పుశనగ సాగవగా.. ఈసారి దారుణంగా పడిపోవడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాలో రబీలో సాగు వివరాలు (హెక్టార్లలో..)

జిల్లా	సాధారణ సాగు	సాగైంది	శాతం
కర్నూలు	1,07,894	56,053	52
నంద్యాల	1,73,410	1,37,936	91

సాధారణంకన్నా పడిపోయి..

● రబీలో రెండో ప్రధాన పంట జొన్న. కర్నూలులో 4,017, నంద్యాలలో 27,534 హెక్టార్లలో కలిపి ఉమ్మడి జిల్లాలో 31,551 హెక్టార్లలో సాగవుతోంది. నంద్యాలలో 94 శాతం మేర సాగు చేయగా.. కర్నూలులో 41 శాతం మాత్రమే రైతులు పంట వేశారు.

● వరి సాగు సైతం అంతంతమాత్రంగానే ఉంది. నంద్యాల జిల్లాలో 29,084 హెక్టార్ల సాధారణ సాగు కాగా కేవలం 10,891 హెక్టార్లలో మాత్రమే నాటారు. కర్నూలులో సాధారణ సాగు 4,314 హెక్టార్లకు గాను కేవలం 40 హెక్టార్లలో మాత్రమే సాగవుతోంది.

● రబీ సీజన్‌లో రాయితీపై వేరుసెనగ విత్తనాలు ఇవ్వలేదు. ఈ ప్రభావం సాగుపై పడింది. కర్నూలులో 15,499 హెక్టార్లు సాధారణం కాగా.. బోరుబావుల కింద కేవలం 2,642 (17 శాతం), నంద్యాలలో 3,058 హెక్టార్లు సాధారణం కాగా కేవలం 1,455 హెక్టార్లలో మాత్రమే విత్తు పడింది.

మొక్కజొన్నపై మక్కువ

ఉమ్మడి జిల్లాలో మొక్కజొన్న సాగు అనూహ్యంగా పెరిగింది. సాధారణానికి మించడం విశేషం. ఉమ్మడి జిల్లాలో 18,590 హెక్టార్ల సాధారణ సాగుకు గాను కర్నూలు 7,426, నంద్యాల 22,936 కలిపి ఉమ్మడి జిల్లాలో 30,362 హెక్టార్లలో సాగవుతుండటం విశేషం. ఖరీఫ్‌లో గిట్టుబాటు ధరలు రాక పోయినా చాలామంది రైతులు రబీలో అత్యధికంగా సాగు చేయడం విశేషం.

ఉత్తర ద్వారం.. నిత్య దర్శనం

వైకుంఠ ఏకాదశి రోజున వైష్ణవ క్షేత్రాల్లో ఉత్తర ద్వారంలో ప్రవేశించి స్వామివారిని దర్శించుకునే అవకాశాన్ని భక్తులకు కల్పిస్తారు. ఉత్తర ముఖద్వారంలోనే వెలసిన ఆలయాలు చాలా అరుదుగా ఉంటాయి. అలాంటి వాటిల్లో చాగలమర్రి మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ కోవెలను 16వ శతాబ్దంలో నిర్మించారు. శ్రీశైలం, అహోబిలం క్షేత్రాలకు శ్రీకృష్ణదేవరాయలు వెళ్లే సమయంలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని రెండు సార్లు సందర్శించి అభివృద్ధి చేశారని గ్రామస్థులు చెబుతున్నారు. గతంలో ఈ ఆలయంలోనే వివాహాలు కూడా జరిగేవి. దేవాలయం పరిధిలో దాదాపు 60 ఎకరాల మాన్యం ఉంది. వైకుంఠ ఏకాదశి రోజు ఉమ్మడి జిల్లాలోని నలుమూలల నుంచి భక్తులు వేల సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుంటారు.

– న్యూస్‌టుడే, మద్దూరు (చాగలమర్రి)

అక్కడందరూ సిద్ధప్పలు, సిద్ధమ్మలే

హాళగుందలోని కొండ గుహలో కొలువైన సిద్ధేశ్వరస్వామిని అక్కడి ప్రజలు తమ ఇలవేల్పుగా కొలుస్తుంటారు. హాళగుందలోనేకాక కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు సైతం తమ ఆరాధ్య దైవంగా భావించి పూజలు చేస్తుంటారు. అంతేకాదు.. పుట్టిన పిల్లలకు సిద్ధప్ప, సిద్ధలింగప్ప, సిద్ధార్థ్, సిద్ధమ్మ తదితర పేర్లు పెట్టుకుంటూ తమ భక్తిని చాటుకుంటున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, కురుగోడు, శిరిగేరి, శ్రీధరగడ్డ తదితర ప్రాంతాలకు చెందినవారు సైతం స్వామి పేరు వచ్చేలా పేర్లు పెట్టుకుంటుంటారు. ధనుర్మాసం, కార్తిక మాసంలో నిత్య పూజలు జరుగుతాయి. ఏటా మాఘ మాసంలో సిద్ధేశ్వరస్వామి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహిస్తారు. మరుసటి రోజు లంకా దహన కార్యక్రమం ఘనంగా జరుపుతారు. – న్యూస్‌టుడే, హొళగుంద

కన్నీటి సుడిలో కొట్టుకుపోయారు

ఇద్దరు పిల్లలతో సహా కాల్వలో దూకేసిన మహిళ ● కానరాని ఆచూకీ

చిన్నారి ప్రాణం విలవిల్లాడితే..
తల్లి తల్లడిల్లిపోయింది.
బాధ్యత పంచుకోవాల్సిన భర్తే..
వదిలించుకోవాలనుకున్నాడు.
చిన్నారి ఆరోగ్యం విషమించింది..
నాన్న మనసు కనికరించనంది.
చికిత్సకు చిక్కులు చుట్టుముట్టాయి..
ఆ తల్లికి కన్నీటి సుడులే దిక్కయ్యాయి.
కష్టాల కడలి కళ్లెదుటే కదలాడింది..
కన్నపేగును కాపాడుకోలేనని కుంగిపోయింది.
బుజ్జాయికి పాలిచ్చి బొజ్జనింపింది..
ఇద్దరు పిల్లలతో జలప్రవాహంలో కొట్టుకుపోయింది.

ఎల్లా లక్ష్మి (పాత చిత్రం)

గడివేముల మండలం ఒండుట్ల గ్రామానికి చెందిన బుగ్గానిపల్లె ఎల్లా లక్ష్మి (23), రమణయ్య నాలుగేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కుటుంబ సభ్యులు వ్యతిరేకించడంతో పాణ్యం మండలం పిన్నాపురం గ్రామంలో నివాసం ఉంటున్నారు. కొంత కాలం తర్వాత కుటుంబ సభ్యులు వారిని స్వగ్రామానికి తీసుకొచ్చారు. వారికి పెద్ద కుమార్తె వైష్ణవి (2), చిన్న కుమార్తె సంగీత (4 నెలలు) ఉన్నారు. నాలుగు రోజుల కిందట ఎల్లా లక్ష్మి పుట్టింటి నుంచి మెట్టినింటికి వెళ్లారు. భర్తతో పాటు అత్తామామలు ఆదరించలేదని తెలిసింది. చిన్న కుమార్తె సంగీతకు వాంతులు, విరేచనాలు కావడంతో వైద్యం చేయించాలని లక్ష్మి కోరారు. భర్త, అత్తింటి వారు డబ్బు ఇవ్వలేదని తెలిసింది. దీంతో ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో లక్ష్మి తన ఇద్దరు పిల్లలతో కలిసి బస్సులో గని గ్రామానికి చేరుకుని గ్రామీణ వైద్యుడి వద్ద చికిత్స చేయించినట్లు సమాచారం.

వారిద్దరూ ప్రేమించుకున్నారు.. పెద్దలు కాదన్నా పెళ్లి చేసుకున్నారు.. మొదట వీరి ప్రేమను పెద్దలు అంగీకరించకపోయినా ఆ తర్వాత వారి మనసు మారింది.. ఆనందంగా జీవనం సాగించారు.. ఆ తర్వాత కాపురంలో కలహాలు మొదలయ్యాయి.. చిన్నారికి చికిత్స అందించలేనంతగా నాన్న మనసు కఠినమైంది.. తల్లి మనసు కలత చెందింది. చిన్నారికి పాలిచ్చి ఆకలి తీర్చింది.. తన ఇద్దరు పిల్లలతో సహా కాల్వలోకి దూకి గల్లంతైన ఘటన ఆదివారం జరిగింది. – న్యూస్‌టుడే, గడివేముల

చివరిసారిగా పాలిచ్చి..

పాపకు వైద్యం చేయించిన ఎల్లా లక్ష్మి తిరిగి బస్సు ఎక్కారు. అనంతరం గడివేముల మండలం మంచాలకట్ట గ్రామ సమీపంలో ఎస్సార్బీసీ పక్కనున్న సచివాలయం వద్ద దిగారు. అక్కడి నుంచి కాల్వ గట్టున కూర్చొని చిన్నారి సంగీతకు పాలిచ్చారు. అనంతరం ఇద్దరు పిల్లలను ఒక్కసారిగా కాల్వలోకి తోసేసి ఆమె సైతం దూకేశారు. గమనించిన కొందరు రైతులు వెంటనే ఆమెను రక్షించేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. కాల్వలోకి తాడు వేసినా ఆమె పట్టుకోలేదని.. తాను చావాలనుకుంటున్నట్లు చెప్పిందని వారు తెలిపారు. కాల్వ ఒడ్డున ప్లాస్టిక్ కవర్ వదిలి వెళ్లారు. అందులో ఆధార్ కార్డు నకలు, ఆమెతోపాటు భర్త ఫొటోలు లభించాయి. వెంటనే రైతులు బాధితురాలి కుటుంబ సభ్యులతో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ముమ్మర గాలింపు

గాలింపు చర్యలను పరిశీలిస్తున్న ఎస్సై, సిబ్బంది

సమాచారం అందుకున్న ఎస్సై నాగార్జున రెడ్డి, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఎస్సార్బీసీలో గల్లంతైన తల్లీబిడ్డల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. వంతెన వద్ద అడ్డుగా వలలు వేశారు. చీకటి పడటంతో వెనుదిరిగారు. కాగా తల్లి తన ఇద్దరు పిల్లలతో కాల్వలోకి దూకేయడంతో ఒండుట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పునాది కదులుతోంది.. వారధి కూలుతుంది

కర్నూలు నగర పరిధిలోని కల్లూరులో వక్కెర వాగుపై దశాబ్దాల కిందట నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఉన్న రాతి కట్టడాలు శిథిలావస్థకు చేరాయి. దీనిపై ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెన కిందిభాగంలో కట్టడం దెబ్బతినడంతో ఎప్పుడు కూలిపోతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ

వైభవంగా లక్ష పుష్పార్చన



ఆదోని పాత పట్టణం, న్యూస్‌టుడే : ఆదోని పట్టణంలోని నగరేశ్వరస్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని లక్ష్మీజనార్దనస్వామికి వివిధ రకాల పూలతో పుష్పార్చన చేశారు. సంఘం అధ్యక్షులు మిరియాల రాంప్రసాద్, కార్యదర్శి బింగి మనోహర్‌రావు, కోశాధికారి జేపీ వాసు, ఉపాధ్యక్షులు టీజీ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఎస్పీ ఎవరో!

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు ఎస్పీగా ఎవరిని నియమిస్తుందన్న జిల్లా ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుత ఎస్పీగా ఉన్న విక్రాంత్‌పాటిల్ శనివారం డీఐజీగా పదోన్నతి పొందారు. ఈయనకు త్వరలోనే ప్రభుత్వం స్థానం కేటాయించనుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి దాదాపు 11 నెలల పాటు ఎస్పీగా పనిచేసిన విక్రాంత్‌పాటిల్ స్థానం ఖాళీ అవుతున్న నేపథ్యంలో కొత్త ఎస్పీ ఎవరన్న చర్చ మొదలైంది. ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు పలువురు ఐపీఎస్‌ల పేర్లపై చర్చించుకుంటున్నారు. కొద్ది రోజుల కిందట అదనపు ఎస్పీ స్థాయి నుంచి ఎస్పీలుగా పదోన్నతి పొందిన వారి పేర్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి.

నెలల వ్యవధిలోనే స్థాన చలనం

గత కొన్నేళ్లుగా కర్నూలు ఎస్పీలుగా ఏ అధికారి కూడా సుదీర్ఘకాలం పనిచేసిన దాఖలాలు లేవు. గతంలో పలువురు పోలీసు ఉన్నతాధికారులు జిల్లా ఎస్పీలుగా మూడేళ్లు పైబడి పనిచేశారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకు పరిశీలిస్తే జిల్లా ఎస్పీలంతా నెలల వ్యవధిలోనే బదిలీ అవుతున్నారు. కనీసం రెండేళ్లు పూర్తి చేసుకున్న ఎస్పీ ఒక్కరూ కూడా లేకపోవడం గమనార్హం. 2021లో ఎస్పీగా నియమితులైన సుధీర్‌కుమార్‌రెడ్డి 11 నెలలు మాత్రమే పనిచేశారు. తర్వాత వచ్చిన ఎస్పీ సిద్ధార్థకౌశల్ 9, ఎస్పీ కృష్ణకాంత్ 15, ఎస్పీ బిందుమాధవ్ 6 నెలలు, ప్రస్తుత ఎస్పీ విక్రాంత్‌పాటిల్ దాదాపు 11 మాసాలు పనిచేశారు.

ఇంటింటికి సేవలు

● అందుబాటులో సర్వీస్ ప్రొవైడర్ల వ్యవస్థ

పట్టణవాసులకు ఇంటి వద్దే సేవలందించడం.. అవసరమైనవారికి ఉపాధి చూపాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. సర్వీసు ప్రొవైడర్ల వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. వివిధ వృత్తుల్లో నిపుణులైనవారికి ప్రతి నెలా ఆదాయం సమకూరేలా ప్రణాళికలు రూపొందించింది. పట్టణ స్వయం సహాయక పొదుపు మహిళలు, వారి కుటుంబ సభ్యులకు జీవనోపాధి కల్పించడంతోపాటు ఆదాయాన్ని పెంచేందుకు సరికొత్త పద్ధతుల్లో ముందుకు సాగుతోంది.

–న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

నిపుణులను గుర్తించేలా..

కర్నూలు జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 850, నంద్యాల జిల్లాలో ఆరు పురపాలక సంఘాల పరిధిలో 600 మంది నిపుణులను గుర్తించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. ఈ ఏడాది జనవరి నెలాఖరులోగా వివిధ వృత్తుల్లో నైపుణ్యం కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మార్చి రెండో వారం నాటికి శిక్షణ పూర్తి చేయాలని మెప్మా ఉన్నతాధికారులు ఆదేశించారు.

మున్సిపాలిటీల పరిధిలో శిక్షణ పూర్తై రిజిస్ట్రేషన్లు చేసుకున్నవారు

జిల్లా	లక్ష్యం	మొత్తం
కర్నూలు	850	322
నంద్యాల	600	230

కొందరికే శిక్షణ

వివిధ వృత్తుల్లో నిపుణులైన వారిని గుర్తించడంతోపాటు వారి వివరాలు హోం ట్రయాంగిల్ యాప్‌లో నమోదు చేయించడం.. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటరు ద్వారా 60 గంటల పాటు వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించడంలో ఉమ్మడి జిల్లాలకు చెందిన మెప్మా అధికారులు విఫలమయ్యారు. నిర్దేశించిన లక్ష్యంలో కొందరినే గుర్తించి శిక్షణ ఇప్పించారు. మెప్మా ఉన్నతాధికారులు ఏడాది కిందట లక్ష్యం నిర్దేశిస్తే.. ఇప్పటివరకు కేవలం 40 శాతం మంది వృత్తి నిపుణులకు మాత్రమే శిక్షణ ఇప్పించి రిజిస్ట్రేషన్లు చేయించడం గమనార్హం.

మొత్తం 30 రకాలు..

● ఎలక్ట్రికల్, కార్పెంటర్, శానిటరీ, పెయింటింగ్, ఏసీ, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్లు, చరవాణుల మరమ్మతులు, వాటర్ ప్యూరిఫయర్, బ్యూటీషియన్ తదితర మొత్తం 30 రకాల సేవలందించే ఉద్దేశంతో మెప్మా చర్యలు చేపట్టింది.

● ఎలక్ట్రీషియన్లు, కార్పెంటర్లు, ప్లంబర్లు, గృహోపకరణాలు తదితర మరమ్మతుదారుల్లో నైపుణ్యాలు పెంపొందించడంతోపాటు వారి వివరాలు మెప్మా హోం ట్రయాంగిల్ అనే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో నమోదు చేసి.. ప్రతి నెలా రూ.20 వేల నుంచి రూ.30 వేలు సంపాదించేలా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ హోం ట్రయాంగిల్ యాప్ ద్వారా విజయవాడ, విశాఖపట్నంలో ఇప్పటికే వృత్తి నిపుణులు ఉపాధి పొందుతున్నారు. త్వరలో రాష్ట్రంలో అన్ని పట్టణ ప్రాంతాలకు ప్లాట్‌ఫామ్‌ను విస్తరించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మగువ.. ఆటల్లో తెగువ

● వైజాగ్ మారథాన్‌లో ఆదోని మహిళల ప్రతిభ

వారంతా సాధారణ గృహిణులు.. ఇంటి పనులతో తీరిక లేకుండా గడిపేవారు. ఫలితంగా పలు రకాల రుగ్మతలు చుట్టుముట్టాయి. వీటి నుంచి బయటపడేందుకు మైదానం బాట పట్టారు. వీరి మధ్య 'ఆరోగ్యకర' స్నేహం కుదిరింది. సీనియర్ వెటరన్ క్రీడాకారిణి ఏలిగే సీమ సహకారం తోడవడంతో అంతా ఒక జట్టుగా ఏర్పడ్డారు. వ్యాయామం, నడక, యోగా, ప్రాణాయామం, క్రీడల్లో సాధన చేయడం ప్రారంభించారు. ఈనెల 14న వైజాగ్‌లో జరిగిన మారథాన్‌లో మొట్టమొదటిసారిగా జట్టు సభ్యులంతా పాల్గొన్నారు. 5, 10 కి.మీ. పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు.

– న్యూస్‌టుడే, ఆదోని పాత పట్టణం

మమతారామ్ విజయపథం

ఇటీవల వైజాగ్‌లో జరిగిన మారథాన్‌లో 40+ మహిళల విభాగంలో 10 కి.మీ. పరుగులో మమతారామ్ పాల్గొని బంగారు పతకం సాధించారు. భర్త ప్రోత్సాహంతో పోటీల్లో పాల్గొన్నారు. ఈమె కుమార్తె సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కాగా.. అబ్బాయి ఎంబీబీఎస్ చదువుతున్నారు. గతంలో మమతారామ్ వెన్నునొప్పి సమస్యతో బాధపడేవారు. ఈ నేపథ్యంలో రోజువారీ నడకతో దినచర్య ప్రారంభించారు. నిత్యం రెండు గంటల పాటు వ్యాయామానికి సమయం కేటాయిస్తున్నారు. ఫలితంగా ఆరోగ్యం మెరుగైంది. ఇటీవల జరిగిన వివిధ పోటీల్లోనూ ఆమె ప్రతిభ చాటారు.

ఉమాసింహ.. పసిడితో మెరిసి

మారథాన్‌లో 25+ విభాగంలో.. ఐదు కి.మీ. పరుగు పందెంలో ఉమాసింహ ప్రతిభ చాటి పసిడి పతకం అందుకున్నారు. ఆమె ఇంటి పనులతోపాటు తీవ్రమైన ఒత్తిడితో ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో రోజూ గంటన్నర పాటు మైదానంలో సాధన చేయడం ప్రారంభించారు. ఓవైపు ఇంటి పనులు పూర్తి చేసుకుంటూనే మరోవైపు వివిధ పోటీల్లో సాధన చేస్తున్నారు. ఫలితంగా ఒత్తిడి దూరమైంది. ఆరోగ్యం గాడిన పడింది. క్రీడల్లో మెలకువలు నేర్చుకుంటూ ముందుకు సాగుతున్నారు. త్వరలో జరిగే పోటీలకు సన్నద్ధమవుతున్నారు.

కస్తూరి.. విజయభేరి

వైజాగ్‌లో జరిగిన మారథాన్ 45+ విభాగంలో పది కి.మీ. పరుగులో కస్తూరి హోసూరు సైతం బంగారు పతకం సాధించారు. ఆమెకు చిన్ననాటి నుంచే క్రీడలంటే ఎంతో మక్కువ. ఈ నేపథ్యంలో పాఠశాల, కళాశాల స్థాయిలో త్రోబాల్, పరుగు పోటీల్లో పాల్గొని పలు పతకాలు సొంతం చేసుకున్నారు. వివాహమైన తర్వాత ఇంటి పనులు, పిల్లలను చూసుకోవడంతోనే సమయం గడిచిపోయింది. ఆమె ఇద్దరబ్బాయిలు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, కుమార్తె జర్మనీలో ఉద్యోగం చేస్తోంది. ఈ నేపథ్యంలో సమయం లభించడంతో క్రీడల వైపు దృష్టి పెట్టారు. ప్రతిభ చాటి పతకాలు అందుకుంటున్నారు.

గుంతలకల్లు రహదారి

■ వాహనదారులకు తప్పని ఇబ్బందులు

ఆలూరు-గుంతకల్లు రహదారి అధ్వానంగా మారింది. ఫలితంగా వాహనదారులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. రాకపోకలు సాగించాలంటే హడలుతున్నారు. 32 కి.మీ. పొడవైన ఈ మార్గంలో అడుగడుగునా గుంతలున్నాయి. ఈ మార్గంలో ప్రతిరోజూ 500కుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నిబంధనల ప్రకారం ఈ రోడ్డుపై 25 టన్నుల బరువు కలిగిన వాహనాలు మాత్రమే నడవాల్సి ఉంది. కానీ 40 టన్నుల బరువైన వాహనాలు సైతం తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

- న్యూస్‌టుడే, చిప్పగిరి

రెండుసార్లు పనులు చేపట్టినా..

ఆదోని-గుత్తి రహదారి గుంతలు పడి అధ్వానంగా మారడంతో చాలా వాహనాలు ఆదోని, ఆలూరు, గుంతకల్లు మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. 10, 12, 14 చక్రాల లారీలు సైతం తిరుగుతున్నాయి. వాహనాల బరువుతో రహదారి రూపు కోల్పోయింది. పలు ప్రాంతాల్లో కంకర తేలి ప్రమాదకరంగా మారింది. ఫలితంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై 'ఈనాడు'లో కథనాలు రావడంతో రహదారులు, భవనాల శాఖ అధికారులు స్పందించారు. రెండుసార్లు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. దీనికోసం సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోయింది.

శాశ్వత మరమ్మతులు అవసరం

● ఆలూరు-గుంతకల్లు మార్గంలో బెంగళూరు, తిరుపతి, అమరావతి తదితర ప్రాంతాలకు నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అధిక లోడుతో లారీలు తిరుగుతుండటంతో చాలా ప్రాంతాల్లో రోడ్డు దెబ్బతింది. రాత్రివేళలో వందలాది లారీలు నడుస్తున్నా చర్యలు కానరావడం లేదు.

● నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వాహనదారులు విన్నవిస్తున్నారు.

(c) eenadu

బౌలర్ల జోరు.. బ్యాటర్ల హుషారు

☛ ఉత్కంఠగా సాగుతున్న ఈఎస్ఎల్ క్రికెట్ పోటీలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ప్రెజెంట్స్) 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్- 2025' పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. పలు జట్లు నువ్వానేనా అన్నట్లు తలపడుతున్నాయి. ఆదివారం జరిగిన మ్యాచ్‌లలో కూడా బౌలర్లు తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు. బ్యాటర్లు పరుగుల సాధనకు కష్టపడాల్సి వచ్చింది. మొదట బ్యాటింగ్ చేసిన జట్లు భారీ స్కోర్లు సాధించాయి. తర్వాత బ్యాటింగ్ చేసిన జట్లు లక్ష్య ఛేదనలో తడబడి తక్కువ పరుగులకే కుప్పకూలాయి. విజేతలుగా నిలిచిన ఎనిమిది జట్ల మధ్య నేడు సెమీఫైనల్ మ్యాచ్‌లు జరుగనున్నాయి.

కేఎంసీ మైదానంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ముఖ్యఅతిథి, కర్నూలు ఆయుష్మాన్ నర్సింగ్ కళాశాల డైరెక్టర్ జి.నలిని

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

★ సతీష్ (2 ఓవర్లలో 4 పరుగు లిచ్చి హ్యాట్రిక్‌తో 4 వికెట్లు తీశాడు)

కేఎంసీ జట్టు వీరవిహారం

కర్నూలు మెడికల్ కళాశాల మైదానంలో.. ఉదయం మొదటి మ్యాచ్ డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం (కర్నూలు), కర్నూలు మెడికల్ కళాశాల జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన కేఎంసీ జట్టు 4 వికెట్లు కోల్పోయి 130 పరుగులు చేసింది. గోకుల్ 14 బంతుల్లో 7 ఫోర్లతో 34 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఉర్దూ వర్సిటీ జట్టు 7 వికెట్ల నష్టానికి 88 పరుగులే చేసింది. గణేశ్ 17 బంతుల్లో 9 ఫోర్లతో 41 పరుగులు చేశాడు. కేఎంసీ బౌలర్లు గోకుల్ 3, నితిన్ 2, శ్రీనాథ్ 2 వికెట్లు తీశారు. కర్నూలు వైద్య కళాశాల జట్టు 42 పరుగుల తేడాతో విజేతగా నిలిచింది.

కర్నూలు మెడికల్ కళాశాల ఆటగాళ్ల ఆనందం

తిరుగులేని జి.పుల్లారెడ్డి కళాశాల

రెండో మ్యాచ్.. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల (కర్నూలు), మహానంది వ్యవసాయ కళాశాల జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన వ్యవసాయ కళాశాల జట్టు 6 వికెట్ల నష్టానికి 52 పరుగులు చేసింది. పుల్లారెడ్డి జట్టు బౌలర్ సాయికుమార్ 12 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల జట్టు 2 వికెట్లు కోల్పోయి విజయానికి కావాల్సిన 53 పరుగులు చేసింది. అహ్మద్ 15 బంతుల్లో 4 ఫోర్లతో 26 పరుగులు చేశాడు. ప్రత్యర్థి జట్టు బౌలర్ సాయి 4 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల జట్టు 8 వికెట్ల తేడాతో గెలుపొందింది.

విజేతగా నిలిచిన జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల జట్టు

శ్రీ సాయికృష్ణ డిగ్రీ కళాశాల క్రీడాకారుల ఆనంద క్షణాలు

శ్రీ సాయికృష్ణ జట్టు సత్తా

పుల్లారెడ్డి కళాశాల మైదానంలో మూడో మ్యాచ్.. శ్రీ సాయికృష్ణ డిగ్రీ కళాశాల (కర్నూలు), ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల (నంద్యాల) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 4 వికెట్ల నష్టానికి 88 పరుగులు చేసింది. మహేంద్ర 16 బంతుల్లో 3 ఫోర్లతో 23 పరుగులు చేశాడు. ప్రత్యర్థి జట్టు బౌలర్ తిరుమలేశ్ 18 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రీ సాయికృష్ణ డిగ్రీ కళాశాల జట్టు 3 వికెట్లు కోల్పోయి 90 పరుగులు చేసింది. మహేశ్ 12 బంతుల్లో 3 ఫోర్లతో 27 పరుగులు చేశాడు. శ్రీ సాయికృష్ణ డిగ్రీ కళాశాల జట్టు 7 వికెట్ల తేడాతో గెలిచింది.

శ్రీ సుధ కళాశాల జట్టు దూకుడు

కర్నూలు మెడికల్ కళాశాల మైదానంలో.. ఉదయం మొదటి మ్యాచ్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల (డోన్), శ్రీ సుధ జూనియర్ కళాశాల (డోన్) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన శ్రీ సుధ కళాశాల జట్టు 2 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. లోహిత్ 36 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో 75 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ప్రభుత్వ ఐటీఐ కళాశాల (డోన్) జట్టు 7 వికెట్లు కోల్పోయి 44 పరుగులే చేయగలిగింది. ప్రత్యర్థి జట్టు బౌలర్ లోహిత్ 10 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. శ్రీ సుధ జూనియర్ కళాశాల జట్టు 78 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది.

శ్రీ సుధ జూనియర్ కళాశాల క్రీడాకారుల సంబరాలు

ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల పట్టు

కేఎంసీ మైదానంలో రెండో మ్యాచ్.. ఎస్వీఆర్ డిప్లొమా కళాశాల (నంద్యాల), ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (నంద్యాల) జట్ల మధ్య జరిగింది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ఎస్వీఆర్ జట్టు బ్యాటర్లు 58 పరుగులకే ఆలౌట్ అయ్యారు. సాహిద్ 15 బంతుల్లో 2 ఫోర్లతో 20 పరుగులు చేశాడు. ప్రత్యర్థి జట్టు బౌలర్ రామ్‌చరణ్ 18 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల జట్టు ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. నవీన్ 12 బంతుల్లో 3 ఫోర్లతో 19 పరుగులు చేశాడు. ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు 9 వికెట్ల తేడాతో విజేతగా నిలిచింది.

నంద్యాల ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆటగాళ్ల విజయోత్సాహం

నేటి సెమీఫైనల్ మ్యాచ్‌లు

జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో..

☛ ఉదయం 8 గంటలకు : శ్రీ సుధ జూనియర్ కళాశాల (డోన్) Vs ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (నంద్యాల)

☛ ఉదయం 10 గంటలకు : జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల (కర్నూలు) Vs కర్నూలు వైద్య కళాశాల, కర్నూలు

కర్నూలు వైద్య కళాశాల మైదానంలో..

☛ ఉదయం 8 గంటలకు : ప్రభుత్వ టౌన్ జూనియర్ కళాశాల (కర్నూలు) Vs కేవీ సుబ్బారెడ్డి పాలిటెక్నిక్ కళాశాల (దూపాడు)

☛ ఉదయం 10 గంటలకు : శ్రీ సాయికృష్ణ డిగ్రీ కళాశాల (కర్నూలు) Vs శాంతిరాం మెడికల్ కళాశాల (నంద్యాల)

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR Shopping Mall The joy of life
Regional Sponsor: MITS Deemed to be University, Madanapalle Institute of Technology & Science
Gift Partner: KL (Deemed to be University)
Digital Partner: ఈనాడు.నెట్
TV Partner: ETV Bharat, ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

చెలరేగిన శాంతిరామ్ మెడికల్ కళాశాల

మూడో మ్యాచ్ సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల (కర్నూలు), శాంతిరామ్ మెడికల్ కళాశాల (నంద్యాల) జట్ల మధ్య జరిగింది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన శాంతిరామ్ మెడికల్ కళాశాల జట్టు 112 పరుగులు చేసింది. జయవర్ధన్ 16 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్సర్‌తో 35 పరుగులు చేశాడు. ప్రత్యర్థి జట్టు బౌలర్ సురేందర్ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల జట్టు 9 వికెట్ల నష్టానికి 53 పరుగులే చేసింది. అభిషేక్ 30 బంతుల్లో 3 ఫోర్లతో 24 పరుగులు చేశాడు. శాంతిరామ్ జట్టు బౌలర్ సతీష్ 4 పరుగులిచ్చి హ్యాట్రిక్‌తో 4 వికెట్లు తీశాడు. శాంతిరామ్ మెడికల్ కళాశాల జట్టు 59 పరుగులతో విజయం సాధించింది.

విజయం సాధించిన నంద్యాల శాంతిరామ్ మెడికల్ కళాశాల జట్టు

రౌడీషీటర్ సోదరుల జిల్లా బహిష్కరణ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని శరీన్ నగర్‌కు చెందిన అన్నదమ్ములైన రౌడీషీటర్లు వడ్డె రేవంత్‌కుమార్, వడ్డె శివకుమార్‌పై జిల్లా బహిష్కరణ వేటు పడింది. వీరి తండ్రి వడ్డె రామాంజనేయులు అలియాస్ వడ్డె అంజి, అన్న వడ్డె తులసీకుమార్‌లు కూడా జిల్లా బహిష్కరణకు గురైన సంగతి విదితమే. వడ్డె రేవంత్‌కుమార్, వడ్డె శివకుమార్‌లు ఈనెల మార్చిలో జరిగిన శరీన్‌నగర్‌కు చెందిన తెదేపా నాయకుడు సంజన్న హత్య కేసులో తండ్రి, అన్నతో పాటు జైలుకు వెళ్లారు. హత్య, దోపిడీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలపై దాడులు, దౌర్జన్యం తదితర నేరాలకు సంబంధించి వీరిపై ఐదు కేసులున్నాయి. కర్నూలు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో వీరిపై రౌడీషీట్లు ఉన్నాయి. నేర ప్రవృత్తి కొనసాగిస్తున్న నేపథ్యంలో ఎస్పీ విక్రాంత్‌పాటిల్ వీరి జిల్లా బహిష్కరణ కోసం ప్రతిపాదనలు పంపగా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో కలిసి జిల్లాలో జిల్లా బహిష్కరణకు గురైన వారి సంఖ్య ఐదుకు చేరింది.

HIGH COURT OF ANDHRA PRADESH: AMARAVATHI
W.P. NO. 4780 OF 2022

Between:
M. Hari Shankara Narayana, S/o Padmanabhaiah Setty ...Appellants
And
The Commissioner Appeals & Others ...Respondents

This is to inform you that my client M. Hari Shankara Narayana, S/o Padmanabhaiah Setty, R/o Kurnool Town has filed WP No.4780 of 2022 questioning the orders in proceedings No.ASSN.1/651/2021, dated 25-01-2022 passed by the Commissioner Appeals, CCLA, Vijayawada.

Notices to the following addresses who were shown as Respondents No.13, 14 & 15 in W.P.No.4780/2022, since not served, the Hon'ble High Court at AMARAVATHI was pleased to order Paper Publication in KURNOOL DISTRICT EDITION vide it's order dated 22-12-2025. The WP No. 4780/2022 is directed to be listed on 27-01-2026.

1. **P. Eswaramma,** D/o Late P Venkat Reddy, R/o L.I.G.-II, 143, Housing Board Colony, KURNOOL CITY & DISTRICT.
2. **P. Bala Venkat Reddy,** S/o Late P Venkat Reddy, R/o L.I.G.-II, 143, Housing Board Colony, KURNOOL CITY & DISTRICT.
3. **P. Prasanna,** D/o Late P Venkat Reddy, R/o L.I.G.-II, 143, Housing Board Colony, KURNOOL CITY & DISTRICT.

You the above addresses are hereby informed to appear before Hon'ble High Court at AMARAVATHI on 27-01-2026 either in person or through an Advocate to put forth your contention, failing which matter will be heard and decided in your absence.

By order of the Court.
Sd/- J.U.M.V. PRASAD
ADVOCATE
HIGH COURT AT AMARAVATHI
Cell: 9440046133

తుంగభద్రకు నిలిచిన వరద ప్రవాహం

హొలహర్వి, న్యూస్‌టుడే: తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం పూర్తిగా నిలిచిందని టీబీ డ్యాం బోర్డు అధికారులు తెలిపారు. ఆదివారం ఎలాంటి ఇన్‌ఫ్లో కొనసాగలేదన్నారు. ప్రస్తుతం జలాశయం నుంచి వివిధ కాల్వలకు, నదికి కలిపి 8,999 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయ నీటిమట్టం 1,611.15 అడుగులకు గాను 39.89 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు. జనవరి 10వ తేదీన వివిధ కాల్వలకు నీరు నిలిపివేసి, గేట్లకు మరమ్మతులు చేపట్టేందుకు బోర్డు అధికారులు చర్యలు చేపట్టారు. పాత గేట్లు తొలగించేందుకు కార్మికులు రంగంలోకి దిగారు.

క్రీడలతో ఒత్తిడి దూరం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : క్రీడలతో ఒత్తిడి దూరమై మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎస్పీ విక్రాంత్‌పాటిల్, ఏపీఎస్పీ రెండో పటాలం దళాధిపతి దీపికాపాటిల్ పేర్కొన్నారు. నగరంలోని ఏపీఎస్పీ రెండో పటాలం మైదానంలో సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్, ఏపీఎస్పీ పోలీసులకు ఆదివారం నిర్వహించిన స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌లను వారు ప్రారంభించారు. సివిల్, ఏఆర్ పోలీసు జట్లకు ఎస్పీ, ఏపీఎస్పీ పోలీసు జట్టుకు దళాధిపతి కెప్టెన్‌గా వ్యవహరించారు. ఎస్పీ కాసేపు క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. ఏపీఎస్పీ జట్టు విజేతగా, జిల్లా పోలీసు జట్టు రన్నర్‌గా నిలిచాయి. కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్, సహాయ దళాధిపతులు మహబూబ్‌బాషా, సుధాకర్‌రెడ్డి, వెంకటరమణ, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందితో ఎస్పీ విక్రాంత్‌పాటిల్, దళాధిపతి దీపికాపాటిల్

నేడు డయల్ యువర్ ఎస్ఈ

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కర్నూలు జిల్లా విద్యుత్తు వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించే లక్ష్యంతో ఈనెల 29న డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వినియోగదారులు సోమవారం ఉదయం 8.30 నుంచి 9.30 గంటల మధ్య 7382614308 నంబరుకు ఫోన్‌చేసి తమ సమస్యలను నేరుగా ఎస్ఈ ఆర్.ప్రదీప్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

ఆదోని జిల్లా సాధించే వరకు పోరాటం ఆగదు

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా సాధించే వరకు పోరాటం ఆగదని ఆదోని జిల్లా సాధన సమితి ఐకాస నాయకులు రఘురామయ్య, కృష్ణమూర్తిగౌడు, లలితమ్మ, టి.వీరేశ్, నూర్‌అహ్మద్, అశోకానందరెడ్డి, దస్తగిరినాయుడు, కోదండ, కుంకునూరు వీరేశ్ తదితరులు పేర్కొన్నారు. ఆదోని జిల్లా కోసం ఆదోని ఐకాస ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 43వ రోజుకు చేరాయి. ఆదోని పట్టణానికి చెందిన ఆదోని మోటర్ వెహికల్ మెకానిక్స్ అసోసియేషన్ నాయకులు ఆదివారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. నాయకులు గోపాలకృష్ణ, నూరు, ఖలీల్, ఇమ్రాన్, రహీం, ఎజాజ్, చిరంజీవి, దత్తు, గోరా బాషా, దాదు, మహబూబ్‌బాషా, నాగరాజు తదితరులు దీక్షలో కూర్చొని తమ మద్దతు తెలిపారు.

రిలే దీక్షలో ఆదోని మోటారు వెహికల్స్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు

● అమరావతిలో రాష్ట్ర మంత్రుల ఉపసంఘం సభ్యులను కలిసేందుకు ఐకాస నాయకులు ఆదివారం తరలివెళ్లారు. సోమవారం మంత్రులతో తమ వాణి వినిపిస్తామని పేర్కొన్నారు.

గిరిజన కుటుంబాల ఇంటి వద్దకే వైద్యసేవలు

నంద్యాల పట్టణం: నంద్యాల జిల్లాలోని చెంచు గిరిజన కుటుంబాలకు వైద్య సేవలందించేందుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 'మీ ఇంటికి.. మీ డాక్టర్' కార్యక్రమాన్ని ఫిబ్రవరి ఒకటవ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు జి.రాజకుమారి వెల్లడించారు. ఆర్ఈసీ ఫౌండేషన్, రెడ్‌క్రాస్ ఆర్థిక సహకారంతో జిల్లాలో అమలు చేయనున్నట్లు ఆమె ఆదివారం తెలిపారు. జిల్లాలో ప్రాజెక్టును రూ.1.2కోట్లతో మూడేళ్ల పాటు అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. చెంచు కాలనీవాసులకు మొబైల్ హెల్త్ క్లినిక్స్ ద్వారా ఇంటి వద్దకే ప్రాథమిక వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. మొబైల్ హెల్త్ క్లినిక్ నిర్వహణ కోసం వైద్యులు, నర్స్, ఫార్మసిస్ట్, డ్రైవర్ పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు.

31న ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేయాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఈనెల 31వ తేదీన లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని కలెక్టర్ డా.ఎ.సిరి అధికారులను ఆదేశించారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పింఛన్ల పంపిణీ అధికారులతో ఆదివారం ఆమె టెలీకాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి 1న పంపిణీ చేయాల్సిన పింఛన్లను డిసెంబరు 31వ తేదీనే పింఛనుదారులకు అందజేయాలని చెప్పారు. పింఛనుదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని, ఇంటికే వెళ్లి పంపిణీ చేయాలన్నారు. ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పింఛన్ల పంపిణీ సజావుగా జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. టెలీకాన్ఫరెన్సులో డీఆర్డీఏ పీడీ రమణారెడ్డి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అతివేగంతో ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బస్సు

● ఒకరి దుర్మరణం, మరో ఇద్దరికి తీవ్రగాయాలు

ఆస్పరి, న్యూస్‌టుడే: అతివేగంతో నాపరాతి బండల లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను ఓ ప్రైవేటు బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆస్పరి మండలం నగరూరు గ్రామ క్రాస్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. బనగానపల్లె మండలం యనకండ్ల గ్రామానికి చెందిన చిన్నమద్దిలేటి, లక్ష్మీనరసింహులు నాపరాతి బండలను కౌతాళంలో విక్రయించడానికి ట్రాక్టర్‌లో లోడు వేసుకుని బయలుదేరారు. నగరూరు గ్రామ బస్టాండు సమీపంలో బెంగళూరు నుంచి మంత్రాలయానికి దాదాపు 35 మంది ప్రయాణికులతో వెళుతున్న ఓ ప్రైవేటు బస్సు ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టి పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తాపడి చిన్నమద్దిలేటి (35) అక్కడికక్కడే మృతిచెందాడు. లక్ష్మీనరసింహ, ట్రాక్టర్ డ్రైవర్ నాగేశ్వరరావు కిందపడటంతో వారిపై నాపరాతి బండల పడి, తీవ్రగాయాలయ్యాయి. బాధితులను బినిగేరి గ్రామస్థులు ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడు లక్ష్మీనరసింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. బస్సు బోల్తాపడి ఉంటే ప్రాణనష్టం అధికంగా ఉండేదని స్థానికులు తెలిపారు.

బండలను తొలగిస్తున్న బినిగేరి గ్రామస్థులు

పల్లవించిన విజయం

◆ పవర్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్న యువతి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: పవర్ లిఫ్టింగ్ వంటి కఠినమైన పోటీల్లో రాణించాలంటే క్రమశిక్షణ, నిరంతర శ్రమ, పట్టుదల, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో పాటు మంచి శిక్షణ అవసరం. ఇలాంటి ఆటల్లో జాతీయ స్థాయిలో రాణిస్తూ ప్రత్యేక గుర్తింపు సాధించి ప్రశంసలు పొందుతోంది నంద్యాలకు చెందిన పల్లవి. పోటీల్లో పాల్గొంటూనే మహిళా జిమ్‌లో శిక్షకురాలిగా పనిచేస్తూ అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు సాధన చేస్తుంది.

పల్లవి

◆ నంద్యాల పట్టణం గుడిపాటిగడ్డకు చెందిన కృష్ణయ్య, రాజ్యలక్ష్మి దంపతుల కుమార్తె పల్లవి డిగ్రీ పూర్తి చేసి ప్రభుత్వ, రైల్వే ఉద్యోగాలకు సిద్ధమవుతోంది. ఆమె బంధువులు పవర్ లిఫ్టింగ్ సాధన చేస్తుంటే చూసి పల్లవి కూడా మక్కువ పెంచుకుని 8వ తరగతి నుంచి పలు పవర్ లిఫ్టింగ్ క్రీడా పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో బహుమతులు అందుకుంది. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు పల్లవి పేర్కొన్నారు.

సాధించిన పతకాలు

- 2020లో ఛత్తీస్‌గఢ్ జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని 43 కిలోల విభాగంలో బంగారు పతకం.
- 2021లో మహారాష్ట్రలో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 43 కిలోల విభాగంలో బంగారు, వెండి పతకాలు.
- 2023లో తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం.
- 2023 వైజాగ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో బంగారు, వెండి పతకాలు.
- 2024 అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు వెండి పతకాలు అందుకుని జాతీయ స్థాయికి ఎంపిక.
- 2024 అక్టోబరులో గోవాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రాణించింది.
- 2025 గుడివాడలో జరిగిన 18వ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ పోటీల్లో బంగారు పతకాలు.
- 2025 కోల్హాపూర్‌లో జరిగిన జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 5వ స్థానం.
- 2026 జనవరి 7 నుంచి 11వ తేదీ వరకు హరియాణాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతోంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బనవాసి ఫారం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలకృష్ణ(35) అనే వ్యక్తి మృతి చెందగా వెంకటేష్ అనే మరో వ్యక్తి గాయపడినట్లు హెడ్‌కానిస్టేబుల్ బీరప్ప తెలిపారు. ఎమ్మిగనూరులో జాతర సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఆడి ద్విచక్ర వాహనంపై ఆదోనికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. డివైడర్‌ను ఢీకొని బాలకృష్ణ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. గాయపడిన వెంకటేష్‌ను చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలకృష్ణకు భార్య ఇద్దరు కుమార్తెలు సంతానం. ఎల్ఐసీ ఏజెంటు పని చేస్తున్నట్లు బంధువులు తెలిపారు. ప్రమాదంపై గ్రామీణ పోలీసులు విచారణ జరుపుతున్నారు.

బాలకృష్ణ (పాత చిత్రం)

రైలు కిందపడి యువకుడి దుర్మరణం

నందలూరు, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా నందలూరు రైల్వేస్టేషన్‌కు రెండు కిలోమీటరు దూరంలో ప్రమాదవశాత్తు రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. కర్నూలు జిల్లా ఆస్పరి మండలానికి చెందిన శ్రీనివాసులు (35) తిరుమలకు తన కుమారుడితో కలసి దర్శనం చేసుకొని కన్యాకుమారి నుంచి పుణే వెళ్లే జయంతి ఎక్స్‌ప్రెస్ రైలులో తిరిగి వస్తుండగా నందలూరు రైల్వేస్టేషన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నందలూరు జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అతని ఆధార్‌కార్డ్ ఆధారంగా మృతుని బంధువులకు సమాచారం ఇవ్వడంతో రైల్లో నిద్రిస్తున్న కుమారుడు (11) ఎర్రగుంట్లలో బంధువులు దింపుకొన్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు జీఆర్పీ కానిస్టేబుల్ సుబాన్ తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

కొత్తగా ప్రారంభించిన కంపెనీ ఆన్‌లైన్ అవకాశం. వీక్లీ 5K to 10K. ఆదాయం సంపాదించుకొనే అవకాశం.Q: డిగ్రీ గృహిణులు, స్టూడెంట్స్. ✆ 99859 37461.

బెంగుళూరులో పనిచేయుటకు ప్రముఖ వస్త్ర దుకాణంలో అనుభవం గల సేల్స్‌మెన్స్ కావలెను. Age: 18-45Y, ESI+PF+ జీ-17K ✆ 70196 32854.

YAC- వారి ముందడుగు మీడియాలో పనిచేయుటకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా అభ్యర్థులు కావలెను. తేది: 3/1/26 సంప్ర: కాంకర్ కాలేజీ, సి-క్యాంప్, కర్నూలు. ✆ 73309 24873, 98854 85281.

REAL ESTATE

FLAT FOR SALE
నంద్యాల చెక్ పోస్ట్ దగ్గరలో మేము కొత్తగా నిర్మించబోయే అపార్ట్ మెంటులో ఫుల్ పేమెంట్ తో 3 flats (1400 Sft, 3 BHK, 1100 Sft, 2 BHK) Cost to Cost అమ్మబడును. ఆసక్తి గలవారు సంప్రదించండి. ✆ 72078 97528, 96189 22589.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

JOBS
Wanted Male Marketing Staff and Male Administrative staff qualification any Degree, Age Limit: 30 to 45 years. Salary upto: 20000/-, Working Location: Master Minds College, Kurnool, Contact: 92487 33342.

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్, HDFC/AXIS బ్యాంక్ క్లర్క్స్, లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆ 9703971968.

కర్నూలు నగరంలో స్కార్పియో వాహనం నడుపుటకు అనుభవం గల కారు డ్రైవర్ కావలెను. సంప్ర: 73309 24873, 98854 85281.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పవర్‌గ్రిడ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మజీద్‌పుర గ్రామ రైతులను భయభ్రాంతులకు గురిచేసి, వారి భూములను చౌకగా కొట్టేయాలని యత్నిస్తున్న పవర్‌గ్రిడ్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. మజీద్‌పుర గ్రామంలో ఆదివారం బాధిత రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సారవంతమైన భూములను కంపెనీకి అప్పగించిన కలెక్టర్, ఆర్డీవోలకు బాధిత రైతులు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదన్నారు. ప్రస్తుత డీపీఆర్‌ను మార్పులు చేసి మరోచోట గ్రిడ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు, రైతులు నాగరాజు, కృష్ణ, ఈరన్న, చిన్న అంజినేయ, దేవేంద్ర, ప్రకాష్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు ధరలు

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పలికిన వివిధ పంట దిగుబడుల ధరలు. పత్తి క్వింటాలు కనిష్ఠం రూ.4259, గరిష్ఠం రూ.7849, మధ్య ధర రూ.7389. వేరుసెనగ రూ.3799-7046-6429, ఆముదాలు రూ.6096-6140-6096, కందులు రూ.6116-6705-6369 పలికాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: ఆదోని పట్టణంలోని చందన దర్గా వద్ద వాణిజ్య దుకాణాల సముదాయం ముందు మురుగు కాల్వలో సిల్ట్ తీసి దుకాణాల ముందు ఉంచారు. దీని వల్ల ఇబ్బందులు తప్పడం లేదు. **- రాజు, ఆదోని**

✔: ప్రజారోగ్యం విభాగం ద్వారా సమస్య పరిష్కరిస్తాం. **- కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం**

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: తిమ్మాపురంలో ట్యాంకు నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నాం. గ్రామంలో పైపు లైన్లు వేసి ఇంటింటికీ నీటి సరఫరా చేయాలి. **- చంద్రశేఖర్, ఖాజీపురం**

✔: జల్‌జీవన్ పథకం నిధులతో భూగర్భ ట్యాంకు నిర్మాణం చేపట్టాం. త్వరలో ఇంటింటికీ తాగునీరు అందిస్తాం. **- వెంకట్ రమణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, చిప్పగిరి**

మద్దికెర, న్యూస్‌టుడే: ?: పెరవలి నుంచి బసినేపల్లి వెళ్లే దారిలోని ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద ఉన్న పశువుల తొట్టి అపరిశుభ్రంగా ఉంది. **-రామాంజనేయులు, పెరవలి**

✔: పరిశీలించి శుభ్రం చేయిస్తాం. **- సుధాకర్, పంచాయతీ కార్యదర్శి, పెరవలి**

చిప్పగిరి, న్యూస్‌టుడే: ఆలూరు ఉప కాల్వ (ఏబీసీ) కంపచెట్లు, పూడికతో నిండిపోయింది. ప్రధాన కాలువతో పాటు, పంట కాలువనూ ఆధునికీకరించాలి. **- నగరడోణ క్రిష్టప్ప, ఏబీసీ డీసీ అధ్యక్షుడు ఆలూరు**

✔: ఆలూరు ఉప కాలువ ఆధునికీకరణకు ప్రభుత్వానికి నివేదిక పంపాం. కాలువకు నీళ్లు నిలిచిన తర్వాత నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. **- శ్రీనివాసనాయక్, ఈఈ గుంతకల్లు డివిజన్**

యడవలి, (మద్దికెర), న్యూస్‌టుడే: ?: మండలంలోని యడవలి నుంచి హంద్రీనీవా కాలువ వెళ్లే ప్రధాన రహదారిపై మురుగు పారుతోంది. **- రాము, యడవలి**

✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- పరమేశ్వరప్ప, పంచాయతీ కార్యదర్శి, యడవలి**

రెప్పవాల్చిన నిఘా నేత్రం

■ ఆదోని పట్టణంలో సీసీ కెమెరాల తీరు
■ కేసులు ఛేదించడంలో పోలీసులకు సవాళ్లు

★ ఆదోని పట్టణ శివారులోని బసవేశ్వర సర్కిల్ వద్ద గత వారం ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. నిందితుడు ఆటోలో వచ్చి వెళ్లినట్లు తెలుస్తోంది. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో పోలీసులు నిందితుడిని గుర్తించేందుకు ఆధారాలు లభ్యం కావడం లేదు.

★ ఆదోని పట్టణంలోని విక్టోరియాపేటలో సెప్టెంబరు 20న కౌతాళం మండలం కుంటనహాళ్ గ్రామానికి చెందిన ఓ రైతు తన ద్విచక్ర వాహనంలో పెట్టుకున్న రూ.7 లక్షల నగదును ఓ గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించాడు. ప్రధాన రహదారిపై సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నిందితుడిని గుర్తించేందుకు పోలీసులు విఫలమయ్యారు.

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో నేరాలు అదుపు చేసేందుకు.. దొంగల ఆటకట్టించేందుకు.. ట్రాఫిక్ నియంత్రణకు.. నిందితులను గుర్తించు కీలకంగా ఉండాల్సిన నిఘా నేత్రాలు (సిసి కెమెరాలు) రెప్పవాల్చాయి. పురపాలక సంఘం సహకారంతో ఆదోని పట్టణంలో పోలీసు శాఖ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. నిర్వహణ సరిగా లేక 75 శాతం కెమెరాలు పనిచేయడం లేదు. దీంతో నేర పరిశోధనలో పోలీసులకు సవాళ్లు తప్పడం లేదు.

నిధులు వెచ్చించి.. నిర్వహణ మరచి

ఆదోని పట్టణంలో నిరంతరం నిఘా ఉంచేందుకు 2017 సంవత్సరంలో పురపాలక సాధారణ నిధులు రూ.90 లక్షలతో పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రహదారులపై 60 ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కెమెరాలను పరిశీలించేందుకు పోలీసు కంట్రోల్ రూమ్‌లో రెండు పెద్ద టీవీలు ఏర్పాటు చేసి, సిబ్బందిని సైతం నియమించారు. వీటి ఆధారంగా గతంలో ఎన్నో కేసులు ఛేదించారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ సీసీ కెమెరాలు గత ఏడాదిగా పనిచేయడం లేదు. ఇటీవల డీఎస్పీ మర్రిపాటి హేమలత పురపాలక సంఘం సహకారంతో రూ. లక్షలు వెచ్చించి మరమ్మతు చేయించి పునరుద్ధరించారు. గత కొన్ని నెలలుగా పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. కెమెరాలు ఏర్పాటు చేసిన సంస్థ రెండేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు చూసింది. తర్వాత వాటి హార్డ్‌డిస్క్ చెడిపోవడంతో అవి కూడా పనిచేయకుండా పోయాయి. పురపాలక సంఘం అధికారులు పట్టించుకోకపోవడం, పోలీసు అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కెమెరాలు ఉన్నా.. ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయాయి. ప్రస్తుతం 54 కెమెరాల్లో 10 మాత్రమే పనిచేస్తున్నాయి.

ఆదోని పట్టణంలోని పోలీసు కంట్రోల్ రూమ్‌లో కనిపించని సీసీ కెమెరాల దృశ్యాలు

ఇదీ పరిస్థితి..

★ పట్టణంలోకి ప్రవేశించేందుకు నాలుగు ప్రధాన రహదారులు ఉన్నాయి. ఇందులో ఎమ్మిగనూరు బసవేశ్వర సర్కిల్, శిరుగుప్ప సర్కిల్, ఆలూరు రహదారిపై ఉన్న లక్ష్మమ్మవ్వ ఆర్చి, ఆస్పరి బైపాస్ ప్రధాన కూడళ్ల వద్ద ఒక్క సీసీ కెమెరా కూడా ఏర్పాటు చేయలేదు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న కెమెరాలు పని చేయడంలేదు. ఫలితంగా నిందితులను గుర్తించేందుకు పోలీసు శాఖకు పెద్ద సవాల్‌గా మారింది.

దుకాణాల్లోనూ అలంకార ప్రాయమే

ఆదోని పట్టణంలోని ప్రధాన కూడళ్లు, వ్యాపార కేంద్రాల వద్ద ఆయా దుకాణాల నిర్వాహకులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గతంలో పోలీసు శాఖ అధికారులు తాఖీదులు జారీ చేశారు. దీంతో కొన్ని కొందరు ఏర్పాటు చేసుకున్నారు. కానీ దృశ్యాలు నిక్షిప్తం కావడంలేదని పోలీసులు పేర్కొంటున్నారు.

కన్నడ భాషాభివృద్ధికి కృషి చేయాలి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: కన్నడ భాషాభివృద్ధికి కృషి చేయాలని కన్నడ సాహిత్య పరిషత్తు అధ్యక్షుడు రుద్రప్ప, నాయకులు సూగూరప్ప, శరణప్ప, మరుళరాధ్య, కృష్ణమూర్తిగౌడు తదితరులు అన్నారు. ఆదోని పట్టణంలోని మల్లికార్జున విద్యాలయంలో ఆదివారం గడినాట కన్నడ సంఘం ఆధ్వర్యంలో కన్నడ పాఠశాలల అభివృద్ధికి కృషి చేసిన దాతలు, ఇటీవల డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన 58 నూతన ఉపాధ్యాయులను సన్మానించారు. వారు మాట్లాడుతూ..ఆదోని డివిజన్ పరిధిలో కన్నడ భాష చదువుతున్న విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గిరిజాపతి, వెంకటేశు, భీమన్న, కబీర్ సాబ్, భీమన్న, గోపాల్‌రెడ్డి, విజయకుమార్, శోభారాణి, హనుమంతప్ప, శివకుమార్‌గౌడ, పాండురంగ, నాగరాజుశెట్టి, ఓంకార్, సిద్ధప్ప, అరుణజ్యోతి, సుబ్రహ్మణ్యం, అయ్యప్ప, అయ్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దస్తగిరయ్య స్వామి ఉరుసు

తుగ్గలి, న్యూస్‌టుడే: కోతికొండ గ్రామంలో దస్తగిరయ్య స్వామి ఉరుసులో భాగంగా స్వామి పూల చాదర్‌ను ఆదివారం గుర్రంపై ఊరేగించారు. దస్తగిరయ్య స్వామి దర్గాను వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. గ్రామస్థులు స్వామి వారికి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకొన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో కోతికొండ గ్రామం సందడిగా మారింది.

◆ పట్టణంలోని వెంకటసాయి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాల సందర్భంగా ఆదివారం కల్పవృక్ష, హనుమంత గరుడ వాహన సేవ వైభవంగా నిర్వహించారు. రథంపై ఉత్సవ మూర్తిని ఉంచి వెంకటసాయి దేవాలయం నుంచి సోమప్ప కూడలి వరకు ఊరేగించారు. మహిళలు రథం ముందు కోలాటం ఆడుతూ ముందుకు సాగారు.

కైరుప్పలలో ఉచిత వైద్య శిబిరం

ఆస్పరి, న్యూస్‌టుడే: మండలంలోని కైరుప్పల గ్రామంలో ఆదివారం బండమీద వెంకటేశ్వర్లు సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య తెలిపారు. శాంతిరాం కంటి ఆస్పత్రి సహకారంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు వందమందికి డా.వెంకటరాముడు, డా.అబ్దుల్లా, డా.షాషావలి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి, నాయకులు రమేష్, వీరేష్, శేఖర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను ఒత్తిడికి దూరం చేయాలి

ఆదోని విద్య, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక వంటి వివిధ రకాల కార్యక్రమాల పేరుతో ఉపాధ్యాయులను మానసిక ఒత్తిడికి గురిచేయడం తగదని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడు మహదేవప్ప పేర్కొన్నారు. ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొత్త కొత్త నిబంధనలతో భయాందోళనకరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారని, ఇలాంటివి మానుకోవాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు రామాంజనేయులు, సూర్యుడు, లక్ష్మన్న, చింతకుం రామకృష్ణ, షేక్షావలి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దిలీప్‌ఢోకా, పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీరావు, దేవిశెట్టి వీరేశ్, శ్రీనిత్, రామకృష్ణారెడ్డి, రఫిక్‌అహ్మద్, నిసార్‌అహ్మద్, మాణిక్యరాజు, రామన్నయాదవ్, తాయన్న, హనుమంతు పాల్గొన్నారు.

తెదేపా నాయకుడి మృతికి నివాళి

లక్ష్మన్న(పాతచిత్రం)

దేవనకొండ, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన తెదేపా నాయకుడు మండల డీలర్ సంఘం అధ్యక్షుడు బత్తిన లక్ష్మన్న(54) గుండెపోటుతో ఆదివారం మృతిచెందారు. ఆదివారం ఉదయం పని నిమిత్తం దేవనకొండ బస్టాండులో ఆర్టీసీ బస్సులో కర్నూలుకు బయల్దేరారు. కర్నూలు బస్టాండులో తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆటోలో ఆస్పత్రికి వెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. ఏడాది కిందటే మొదటి కుమారుడు అనారోగ్యంతో మృతిచెందారు. రెండో కుమారుడు దేవనకొండలో పదో తరగతి చదువుతున్నాడు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, జనసేన ఆలూరు ఇన్‌ఛార్జి వెంకప్ప సంతాపం వ్యక్తం చేశారు.

యువకులకు తీవ్ర గాయాలు

దూదేకొండ(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: పత్తికొండ- కర్నూలు ప్రధాన రహదారిలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడటంతో చంద్రశేఖర్, చితంబరం తీవ్రంగా గాయపడ్డారు. దూదేకొండ గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై పత్తికొండకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన వీరిని బంధువులు చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వారిని కర్నూలుకు తరలించారు.

జూదరుల అరెస్టు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని కల్లుబావి ప్రాంతంలో ఆదివారం జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు రెండో పట్టణ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.47 వేలు నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వాగు పరిసరాల్లో కాలనాగు

పగిడిరాయి గ్రామంలో పెద్ద వాగు గట్టుపై ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. పారిశుద్ధ్య కార్మికులు సేకరించిన చెత్త అంతా వాగు పరిసరాల్లో వేస్తున్నారు. గాలికి వాగునీటిలో పడుతోంది. నీరంతా కలుషితమవుతోంది. గ్రామంలో చెత్త సంపద కేంద్రం లేదు. సేకరించిన చెత్త వాగులో పడేయకుండా తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, తుగ్గలి**

విద్యుత్తు వెలుగుల్లో ఉత్తర ద్వారం

పెరవలి రంగనాథస్వామి వారి ఉత్తర ద్వార దర్శనానికి ఆలయం ముస్తాబైంది. ఉత్తరం వైపు ఉన్న రాజగోపురం ద్వారాన్ని విద్యుద్దీపాలతో సుందరీకరించారు. ధనుర్మాస పూజల్లో భాగంగా 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం కోసం ఆకట్టుకునేలా అలంకరించారు. **– న్యూస్‌టుడే, పెరవలి (మద్దికెర)**

రహదారిపై గుంతలు.. ప్రయాణానికి గండాలు

పత్తికొండ నుంచి కర్నూలుకు వెళ్లే ప్రధాన రహదారి పలు చోట్ల ప్రమాదకరంగా మారింది. కనకదిన్నె, దూదేకొండ గ్రామాల సమీపంలో కల్వర్టుల వద్ద రహదారులు దెబ్బతిన్నాయి. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దూదేకొండ సమీపంలోని ఓ కల్వర్టు వద్ద రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలు పడ్డాయి. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణం**

ప్రజాధనం మట్టిపాలు

తుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామంలో శివాలయం దగ్గర ప్రధాన రహదారి పక్కనే ఉన్న చేతి పంపు మట్టిలో కూరుకుపోయింది. చేతి పంపు ఉన్న ప్రదేశంలో వర్షం నీరు నిలిచి అపరిశుభ్రంగా ఉండడంతో గ్రామ పంచాయతీ అధికారులు మట్టి వేయించడంతో పూడిపోయింది. రూ.లక్షలు ప్రభుత్వ నిధులు వెచ్చించి ఏర్పాటు చేసిన బోరు నిరుపయోగంగా మారడంతో ప్రజాధనం మట్టిపాలైంది. చేతి పంపు వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, తుగ్గలి**

దీక్షలో పాల్గొన్న సీపీఐ నాయకులు

జిల్లా సాధనకు అన్నివర్గాలు ఏకమవ్వాలి

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా సాధనకు అన్నివర్గాలు ఏకమై పోరాటం చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు భూపేష్ పిలుపునిచ్చారు. ఆలూరులో ఆదివారం సీపీఐ నాయకులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ. . వెనుకబడిన ఆలూరు అభివృద్ధి చెందాలంటే ఆదోని జిల్లాగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామాంజినేయులు, ఎర్రిస్వామి, చంద్రకాంత్‌రెడ్డి, చాపలగోపాల్, సిద్ధలింగ, రాముడు, కాంతారావు, రవికుమార్, పెద్దఈరప్ప, నాగరాజులు, ఆలూరు జేఏసీ నాయకుడు కత్తిరామాంజినేయులు పాల్గొన్నారు.

పెద్దహరివాణంలో విలీనం చేయొద్దు

◆ రెండో రోజుకు చేరిన నిరాహార దీక్ష

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలంలోని 16 గ్రామాలను కొత్తగా ఏర్పాటు చేయనున్న పెద్దహరివాణం మండలంలో విలీనం చేయొద్దని గ్రామాల ప్రజలు దీక్ష చేపట్టారు. ఆదోని పట్టణం అంబేడ్కర్ విగ్రహం వద్ద చిన్నగోనేహళ్ గోపాల్‌రెడ్డి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష రెండో రోజుకు చేరింది. వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, మహిళలు తరలివచ్చి మద్దతు పలికారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నాయకులు రామస్వామి, వీరేష్, వీరేష్‌రెడ్డి, వెంకటేష్, పంపాపతి, వెంకటరెడ్డి, ప్రసాద్, మణి, సుజ్ఞానమ్మ, అయ్యాళప్ప తదితరులు పాల్గొన్నారు.

దీక్షకు మద్దతుగా బైఠాయించిన మహిళలు

దీక్షను భగ్నం చేస్తున్న పోలీసులు, అడ్డుకుంటున్న గ్రామస్థులు

ఆమరణ నిరాహారదీక్ష భగ్నం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో తెదేపా సీనియర్ నాయకుడు గోనేహాలు వేణుగోపాల్‌రెడ్డి చేపట్టిన ఆమరణ నిరాహారదీక్షను పోలీసులు ఆదివారం అర్ధరాత్రి దీక్షను భగ్నం చేశారు. వేణుగోపాల్‌రెడ్డి ఆరోగ్యం క్షీణించడంతో అర్ధరాత్రి 12:15గంటల సమయంలో ఆదోని డీఎస్పీ మర్రిపాటి హేమలత ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోలీసులు దీక్షా శిబిరానికి చేరుకున్నారు. వేణుగోపాల్‌రెడ్డిని ఆస్పత్రికి తరలించేందుకు పోలీసులు ప్రయత్నించగా.. శిబిరం వద్ద ఉన్న నాయకులు, గ్రామస్థులు పోలీసులను అడ్డుకున్నారు. సుమారు అరగంట పాటు వారి మధ్య వాగ్వాదం జరిగింది.

నీటి వృథాకు అడ్డుకట్ట

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారులోని బసాపురం రహదారిలో లీకేజీ బారిన పడిన ప్రధాన పైపులైన్‌కు పురపాలక సంఘం నీటి విభాగం అధికారులు మరమ్మతు చేపట్టారు. పట్టణంలో తాగునీటి పైపులైన్ల లీకేజీపై ఈ నెల 13న ‘ఈనాడు’లో ప్రచురితమైన ‘పురంలో నిధుల లీకేజీ’ అనే కథనానికి పురపాలక అధకారులు స్పందించారు. పురపాలక కమిషనర్ కృష్ణ, డీఈ గోపినాథ్, రామ్మూర్తి నీటి విభాగం సిబ్బందితో మరమ్మతు పనులు చేయించారు.

హిందూ ధర్మ పరిరక్షణ అందరిది

మాట్లాడుతున్న సోమప్పస్వామి

పి.కోటకొండ (దేవనకొండ) న్యూస్‌టుడే: హిందూ ధర్మం, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని హిందూ సమ్మేళన నిర్వహణ సమితి నాయకుడు రామంజనేయులుస్వామి, సోమప్పస్వామి పేర్కొన్నారు. పి.కోటకొండలోని శివాలయం ఆలయ ఆవరణలో ఆదివారం వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, భాజాపా ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. గుడిమిరాళ్ల కౌలుట్ల, తిప్పన్న, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చండి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని మండలం బిల్లెకల్ గ్రామంలో తాగునీటి సమస్య తీర్చాలని సీపీఎం మండల కార్యదర్శి లింగన్న, కార్యదర్శి వర్గ సభ్యుడు వీరారెడ్డి డిమాండు చేశారు. బిల్లెకల్ గ్రామంలో ఆదివారం సీపీఎం నాయకులు పర్యటించి, సమస్యలు తెలుసుకున్నారు. అధికారుల పనితీరును నిరసిస్తూ సీపీఎం నాయకులు, మహిళలు నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ..గ్రామంలో 75 శాతం వరకు పైపులైన్ సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరేష్, శ్రీకృష్ణ, ఉరుకుందు, రమేష్, రవి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు, మహిళలు

పత్రాల్లో సంతకాలకు లంచం

ఆస్పరి, న్యూస్‌టుడే: ఆస్పరి మండలం ములుగుందం మజరా గ్రామమైన పలుకూరుబండ గ్రామస్థులు కొత్త పంచాయతీ ఏర్పాటుకు చేస్తున్న ప్రయత్నాలు విఫలమయ్యాయి. తాము తయారు చేసుకున్న దరఖాస్తును కూడా మండల అధికారులు తీసుకునేందుకు కూడా సుముఖంగా లేరని, జిల్లా అధికారులకు మొరపెట్టుకునేందుకు ఇటీవల కర్నూలుకు వెళ్లామని గ్రామస్థులు ఈరన్న, శ్రీనివాసులు అన్నారు. ములుగుందం నుంచి పలుకూరుబండను వేరుచేసేందుకు పత్రాలపై సంతకాలు, ఇతర ప్రక్రియను పూర్తి చేసేందుకు రూ.2.50 లక్షలు ఇవ్వాలని ఎంపీడీవో, ఈవోఆర్డీ, పంచాయతీ కార్యదర్శి డిమాండ్ చేశారన్నారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 22 చివరి రోజు కాగా, ఆ రోజంతా సమయం వృథా చేసి, వెనక్కి పంపారని చెప్పారు. పంచాయతీ ఏర్పాటుకు సర్పంచి శ్యామలమ్మ సంతకాలు చేశారని, అయితే ఈవోఆర్డీ మాత్రం ‘డబ్బులు లేకుండా పనులు ఎలా సంతకాలు చేస్తారంటూ’ వ్యంగ్యంగా మాట్లాడటం సరికాదన్నారు. గ్రామస్థులంతా కలిసికట్టుగా ఈ నెల 29న కలెక్టరుకు వినతిపత్రం అందచేస్తామని తెలిపారు. ఈ అంశంపై డీపీవో భాస్కర్ మాట్లాడుతూ.. ఈ నెల 22వ తేదీకి గడువు ముగిసిందని, ప్రభుత్వం గడువు పొడిగిస్తే తీసుకుంటామని చెప్పారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆలూరు ఎస్సై మన్మధవిజయ్ సూచించారు. ఆలూరులోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం అస్మిత్ సెపక్‌తక్రా లీగ్‌ను ఎస్సై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో పీఈటీలు చిన్నబాబు, హనుమంతు, ఈరన్న, ఉపాధ్యాయుడు నాగరాజు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో మండలంలోని సెపక్‌తక్రా క్రీడాకారులు పాల్గొన్నారు.

పోటీలు ప్రారంభిస్తున్న ఎస్సై, పక్కన పీఈటీలు

మాళమల్లేశ్వరునికి ప్రత్యేక పూజలు

హొళగుంద, న్యూస్‌టుడే: హొళగుంద మండలం దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామికి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, బండారు అర్చన, ప్రత్యేక పుష్పాలంకరణ, అమ్మవారికి, కుంకుమార్చన, ఆకు పూజ, మహామంగళ హారతిని ఆలయ అర్చకులు ఇచ్చారు. కర్ణాటక, చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభ లిఖితం

లిఖిత

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (బీసీసీఐ) అండర్-15 విభాగం మహిళా జట్టు జాబితాలో పత్తికొండకు చెందిన ఎస్.లిఖిత స్థానం సంపాదించింది. పత్తికొండ పట్టణానికి చెందిన రాఘవేంద్ర దంపతుల కుమార్తె లిఖిత యశోదగార్డెన్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. తండ్రి ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. చిన్నతనం నుంచే క్రికెట్‌పై ఆసక్తిని గమనించిన తండ్రి క్రీడలో ప్రోత్సహించారు. నిత్య సాధనతో పట్టు సాధించింది. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పలు పోటీల్లో ప్రతిభ చాటి బహుమతులు, ప్రశంసలు అందుకుంది. ఈ నెల 13 నుంచి 19 వరకు నెల్లూరులో జరిగిన ఏపీ స్టేట్ ప్రాబబుల్స్ పోటీల్లో డి-జట్టుకు లిఖిత ప్రాతినిధ్యం వహించింది. ఈ పోటీల్లో ఎ-జట్టుపై 55 పరుగులు, బి-జట్టుపై 24 పరుగులు చేసి, సత్తా చాటింది. బాలిక ప్రతిభను మెచ్చి ఏపీ ఎ-జట్టుకు ఎంపిక చేశారు. జనవరి 1 నుంచి విశాఖలో జరిగే పోటీల్లో పాల్గొంటుందని ఆమె తండ్రి రాఘవేంద్ర తెలిపారు. ఎప్పటికైనా భారత జట్టులో స్థానం దక్కించుకోవటమే తన లక్ష్యమని చెబుతోంది లిఖిత.

అబాకస్.. విద్యార్థులు శభాష్

ప్రశంసాపత్రాలతో ఎఫ్ఆర్ పాఠశాల విద్యార్థులు

దేవనకొండ, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి అబాకస్ వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో దేవనకొండకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎమ్మిగనూరులో ఆదివారం జిల్లాస్థాయి అబాకస్ వేదిక్ మ్యాథ్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎఫ్ఆర్ పాఠశాల విద్యార్థులు సాధిక్‌అలీ, రెహనా, దర్శన్ పాల్గొని మొదటి స్థానంలో నిలిచారు. పాఠశాల యాజమాన్యం రఘునాథ్, ఉచ్చీరప్ప విద్యార్థులను అభినందించారు. సరస్వతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ఆసిఫ్, ఉషారాణి రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం కృష్ణమూర్తి, ముజిబుర్ రెహమాన్ తెలిపారు.

రాష్ట్ర స్థాయికి మద్దికెర విద్యార్థులు

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెరలోని వశిష్ఠ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో ఆదివారం ఎమ్మిగనూరులో విశ్వం ఎడ్యుటెక్ వారు నిర్వహించిన పోటీల్లో మద్దికెరలో ఏడో తరగతి విద్యార్థులు మధుసూదన్, మాధవ తేజ, రెండో తరగతి విద్యార్థిని సుజాత ప్రతిభ చాటారు. వీరు త్వరలో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల నిర్వాహకులు పక్కీరప్ప తెలిపారు.

వేరుసెనగ ధర ధగధగ

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: వేరుసెనగ ధర పెరిగి సాగు చేసిన రైతులకు ఊరటనిస్తోంది. వేరుసెనగ ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.7,263. మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.1,400 వరకు అధిక ధర పలుకుతోంది. ఆదివారం వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా గరిష్ఠ ధర రూ.8,700, మధ్యస్థ ధర రూ.8,091, కనిష్ఠ ధర రూ.3,511లకు వ్యాపారులు కొన్నారు. మార్కెట్‌కు 107మంది రైతులు 2,450 వేరుసెనగ బస్తాలను అమ్మకానికి తెచ్చారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ రూ.6,144, కనిష్ఠ ధర రూ.5,786 పలికింది.

(c) eenadu

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

వేరుసెనగ ధర ధగధగ

మార్కెట్‌లో వేరుసెనగ దిగుబడులు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వేరుసెనగ ధర పెరిగి సాగు చేసిన రైతులకు ఊరటనిస్తోంది. వేరుసెనగ ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.7,263. మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.1,400 వరకు అధిక ధర పలుకుతోంది. ఆదివారం వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా గరిష్ఠ ధర రూ.8,700, మధ్యస్థ ధర రూ.8,091, కనిష్ఠ ధర రూ.3,511లకు వ్యాపారులు కొన్నారు. మార్కెట్‌కు 107మంది రైతులు 2,450 వేరుసెనగ బస్తాలను అమ్మకానికి తెచ్చారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ రూ.6,144, కనిష్ఠ ధర రూ.5,786 పలికింది.

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలో ఆదివారం నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేసి గాంధీజీ విగ్రహానికి పూలమాల వేశారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు మోనె శ్రీరాములును సన్మానించారు. నియోజకవర్గ సమన్వయకర్త కాశీంవలి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్, షబ్బీర్, నరసప్ప, జైపాల్, లోకేశ్ పాల్గొన్నారు.

హాల్వి‌లో క్రికెట్ పోటీలు ప్రారంభం

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: కౌతాళం మండలంలోని హాల్వి గ్రామంలో వెలసిన సిద్దేశ్వర స్వామి జాతర సందర్భంగా ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు ఉలిగయ్య, కూటమి నాయకులు కురువ నాగేష్, ఈడిగ హనుమంతుగౌడు, మెహబూబ్, సోము, చిన్నసిద్దయ్యలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడలను సామరస్యంగా నిర్వహించాలని, ఎలాంటి అవకతవకలు లేకుండా చూసుకోవాలన్నారు. క్రీడల వల్ల యువకుల్లో ఉత్సాహం, స్నేహబంధం బలపడుతుందని అన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఉలిగయ్య తదితరులు

సాంకేతికత లేక.. యువత దూరం

☛ డిజిటల్ లైబ్రరీ ఏర్పాటులో నిర్లక్ష్యం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: గ్రంథాలయాలన్నీ డిజిటల్ చేస్తామని గతంలో వైకాపా ప్రభుత్వం హామీ ఇచ్చింది. హామీల అమల్లో వైకాపా ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత, పుస్తకాలు చదివేందుకు వచ్చిన పాఠకులు నిరాశ చెందుతున్నారు. సాంకేతికత జోడిస్తే పోటీ పరీక్షలకు సులభంగా ఉంటుందని భావించారు. ఎమ్మిగనూరు పట్టణంలో గ్రంథాలయానికి వందలాది మంది యువత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తరలివస్తున్నారు. ప్రధానంగా గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలతో పిల్లలు, పెద్దలు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. గతంలో తెదేపా ప్రభుత్వం హయాంలో నిర్మించిన గ్రంథాలయాలకు ఏర్పాటు చేసిన వసతులు తప్ప వైకాపా హయాంలో అసలు పుస్తకాలను సరిగా కొనుగోలు చేయలేదు.

జనాభా: 1.35 లక్షలు
ప్రతిరోజు వచ్చే పాఠకులు: 200-300 మంది
వార్డులు: 34 పుస్తకాలు: 24వేలు
సభ్యత్వం తీసుకున్న వారి సంఖ్య: 3836
తరలివచ్చే పాఠకులు: ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం, పెద్దకడబూరు మండలాల నుంచి
అవసరం: ఫర్నీచర్, అదనపు కుర్చీలు, ర్యాకులు, బెంచీలు, తాగునీరు
సిబ్బంది: ఇద్దరు రెగ్యులర్

విప్లవాత్మకమైన మార్పులు అవసరం

డిజిటల్ గ్రంథాలయంగా మార్పు చేస్తే మూడు కంప్యూటర్లు, టేబుల్స్, అదనపు పుస్తకాలు సరఫరా చేస్తారు. వీటితో పాటు ప్రింటింగ్ యంత్రాలు, వార్త పత్రికలు, స్కానర్, ఇంటర్నెట్ సౌకర్యం లభిస్తాయి. వీటిని అందుబాటులో తెస్తే సాంకేతికంగా విప్లవాత్మకమైన మార్పులు వస్తాయి. కొన్ని పుస్తకాలు లేకపోవడంతో పాఠకులు తగ్గారు. ప్రభుత్వం స్పందించి డిజిటల్ గ్రంథాలయంగా మార్చాలని అవసరం ఉంది.

కొత్త పుస్తకాలు అందుబాటులోకి రాక

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత

ఎమ్మిగనూరు పట్టణంలో జనాభాకు అనుగుణంగా గ్రంథాలయాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. వాస్తవంగా 1.35లక్షల జనాభాకు కనీసం రెండు గ్రంథాలయాలు ఉండాలి. కానీ ఒకటే ఉండడంతో విద్యార్థులు, యువత దూరమవుతున్నారు. పాఠకులకు అవసరమైన కొత్త పుస్తకాలను ప్రభుత్వం కొనుగోలు చేసుకోలేని పరిస్థితి. మున్సిపాలిటీ పరిధిలోని ఆదాయంలో దాదాపు 8% గ్రంథాలయం సెస్సు కింద జమ చేస్తోంది. ఏటా ఇంటి పన్నులు దాదాపు రూ.8.90 కోట్లు ఉండగా వీటిలో 8% సెస్సును గ్రంథాలయానికి కేటాయిస్తున్నారు. అయితే గ్రంథాలయ అభివృద్ధిని పట్టించుకోవడం లేదు. పట్టణంలో 34 వార్డులతో పాటు, మంత్రాలయం, నందవరం, పెద్దకడబూరు, గోనెగండ్లకు చెందిన యువకులు ప్రతి రోజూ గ్రంథాలయానికి తరలివస్తున్నారు. ఇక్కడ చదివిన 10 మంది ఉపాధ్యాయ, ఆరుగురు పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. మండల కేంద్రంలో వేలాది మంది పాఠకులు చదివేందుకు రావడంతో ఇక్కడ రద్దీగా ఉంటోంది. గ్రేడ్-2 కింద గ్రంథాలయం ఉన్నా వసతులు మరిచారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కౌతాళం 8008574913

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: ?: పట్టణంలోని గొల్ల వీధిలోని బీరప్పస్వామి ఆలయం సమీపంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. -రమేష్, స్థానికుడు

✔: పారిశుద్ధ్య కార్మికులను పంపించి చర్యలు తీసుకుంటాం. -రాఘవేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

కోసిగి, న్యూస్‌టుడే: ?: కోసిగి మండలం తుంబిగనూరు గ్రామంలో డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో రాత్రి సమయాల్లో దోమల తీవ్రత ఎక్కువగా ఉంది. -బసవరాజ్, తుంబిగనూరు

✔: గ్రామంలో ఉండే డ్రైనేజీ కాలువల్లో మురుగు శుభ్రం చేయించి బ్లీచింగ్, ఫాగింగ్ చేయిస్తాం. -ఈరన్న, సర్పంచ్, తుంబిగనూరు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో చాలా రోజుల నుంచి మురుగు కాల్వలు శుభ్రం చేయడం. రాత్రిపూట దోమల బెడద ఎక్కువైంది. -రంగన్న, హెచ్.మురవణి.

✔: గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రత సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్తాం. - ప్రభావతిదేవి, ఎంపీడీవో, పెద్దకడబూరు.

నందవరం, న్యూస్‌టుడే: ?: మాచపురం గ్రామంలో తాగునీరు రెండు రోజులకు ఒక్కసారి సరఫరా అవుతోంది. -నాగేష్, మాచపురం గ్రామం

✔: రోజువారీగా తాగునీరు సరఫరా అయ్యేలా చూస్తాం. -బాలకృష్ణ, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: క్లబ్ ఏరియాలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకోవాలి. -ఆంజనేయులు, ఉపాధ్యాయుడు

✔: కొత్త పైపులైన్ కోసం త్వరలో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పెడతాం - నీరజా, డీఈ

?: మహబూబ్‌నగర్ కాలనీలో ఇళ్ల ముందు మురుగు కుంటతో దుర్వాసన వస్తోంది. -మునిస్వామి

?: రాఘవేంద్ర కాలనీలో ఇంటింటా చెత్త సేకరణకు సిబ్బంది సరిగా రావడం లేదు - లక్ష్మన్న, కాలనీవాసి

✔: స్థల యజమాని శుభ్రత పాటించేలా చర్యలు తీసుకుంటాం. చెత్త సేకరణకు పారిశుద్ధ్య సిబ్బందిని పంపిస్తాం. -శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

సి.బెళగల్, న్యూస్‌టుడే : ?: ఈర్లదిన్నె గ్రామంలో రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మించండి. -వెంకటేశ్వర్‌రెడ్డి, ఈర్లదిన్నె గ్రామం.

✔: జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే చర్యలు తీసుకుంటాం. -గోవిందు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

?: సంగాల గ్రామంలో పునరావాస కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించండి. -హరి, సంగాల గ్రామం.

?: సి.బెళగల్ గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ఉన్నత పాఠశాల ప్రహరీని పూర్తి చేయండి. -వీరన్న,

?: కస్తూర్బా పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిన 7అదనపు గదుల భవనాలు పూర్తి చేయండి. -రాఘవ

✔: అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. -రాణెమ్మ, ఎంపీడీవో, సి.బెళగల్.

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం

హిందూ సమ్మేళనంలో మాట్లాడుతున్న వక్త హారిక, హాజరైన జనం

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: హైందవ, సనాతన ధర్మాన్ని కాపాడుకుందామని బెంగళూరుకు చెందిన వక్త హారిక మంజునాథ్ అన్నారు. ఆనాడు ఛత్రపతి శివాజీ మహారాజ్ లేకుంటే భారతదేశంలో హైందవ ధర్మం మిగిలేది కాదని అన్నారు. ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కౌతాళంలో హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఆర్లబండ మఠం పీఠాధిపతి మరిస్వాములు, రౌడుకుంద మఠం పీఠాధిపతి శివయోగి శివాచార్య, ఆర్ఎస్ఎస్ సంఘం నాయకుడు రామకృష్ణ, హారిక మంజునాథ్ జ్యోతి వెలిగించారు. వక్తలు మాట్లాడుతూ.. హైందవ సనాతన ధర్మం కోసం ప్రజలను జాగృతం చేస్తున్నట్లు తెలిపారు. మన ఆచారాలు, పండగలను నిర్వహించుకోవాలన్నారు. హైందవ ధర్మ పరిరక్షణకు హిందువులంతా పార్టీలకతీతంగా సంఘటితం కావాలన్నారు. కార్యక్రమానికి సుమారు 3వేల మందికి పైగా జనం తరలివచ్చారు. సమితి నాయకులు మారుతీ మోహన్, భాజపా జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ, వెంకటపతిరాజు, రాజానందు, బుజ్జి స్వామి, గురుగౌడు, వీరసేనారెడ్డి పాల్గొన్నారు.

తెదేపాలో చేరిన 50 కుటుంబాలు

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పాలన, అభివృద్ధిని చూసి కోసిగి మండలం కందుకూరు గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైకాపా నుంచి తెదేపాలో చేరాయి. ఆదివారం మంత్రాలయం తెదేపా బాధ్యుడు రాఘవేంద్ర రెడ్డి, రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తెదేపా కండువాలు వేసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దూరదృష్టిని చూసి పార్టీలో చేరామని అన్నారు. పార్టీలో చేరిన వారిలో నాయకులు నారాయణ, జగదీష్, రాజోలిబండ రాజ్‌కుమార్, దేవేంద్ర తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కోసిగి మండల తెదేపా నాయకులు ముత్యరెడ్డి, మండలాధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ నర్సిరెడ్డి, జ్ఞానేష్, అయ్యన్న, అరివి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కండువాలు కప్పుతున్న రాఘవేంద్రరెడ్డి

ఆదోని జిల్లాతోనే పశ్చిమ ప్రాంతం అభివృద్ధి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పశ్చిమ ప్రాంతాల్లో వ్యవసాయం, విద్య, ఇతర రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ఆదోని జిల్లా కేంద్రం ఏర్పడాలని ప్రజాసంఘాల నాయకులు గణేష్ డిమాండు చేశారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు గణేష్ మాట్లాడుతూ ఆదోని జిల్లా కేంద్రం చేసే వరకు ఉద్యమాలు ఆపేది లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచినా స్పందించలేదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరి ప్రాంతంగా కనిపిస్తోందని అన్నారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టు నిధులు విడుదల చేయలేదన్నారు. ఆదోని జిల్లా కేంద్రం అయితే ఆర్థిక, సామాజిక, విద్య పరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ఎల్లప్ప, నాగరాజు, బసవరాజు, లింగన్న, ఎస్కేస్వామి, చంద్రశేఖర్, తులసిరామ్, రాముడు, బాలరాజు, సత్యన్న, జేవీసీ నాయకులు ఆఫ్రిది, బాలరాజ్, ఉదయ్, ప్రసాద్, సత్యనారాయణరెడ్డి, సత్యన్న, రము, కృష్ణ, ఖాజా, ఉదయ్ పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న ప్రజా సంఘాల నాయకులు

రోగులకు తాగునీటి ఇబ్బందులు

గోనెగండ్లలోని ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు తాగునీటి కోసం ప్రత్యేక నీటిశుద్ధి యంత్రం ఏర్పాటు చేశారు. వైద్యశాలకు రోజు 100-150 మంది వైద్య పరీక్షల కోసం వస్తున్నారు. ప్రతి శుక్రవారం పరీక్షల నిమిత్తం గర్భిణులు హాజరవుతున్నారు. నెలల తరబడి ఈ నీటిశుద్ధి యంత్రం పనిచేయక పోవడంతో రోగులకు తాగునీటి కష్టాలు ఎదురవుతున్నాయి. తాగునీటి కోసం దుకాణాలు, హోటల్స్‌పై ఆధారపడుతున్నారు. తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గోనెగండ్ల

చేతికందే ఎత్తులో ప్రమాదం

వ్యవసాయ మార్కెట్‌లో విద్యుత్తు తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. మార్కెట్‌కు వాహనాల్లో దిగుబడులను తెస్తే తీగలు తగిలి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. తీగలు వేలాడుతున్న రహదారి నుంచి వాహనాలు కూరగాయల టోకు మార్కెట్‌కు ఎక్కువగా వెళ్తాయి. ప్రమాదకరంగా మారిన తీగలను సరి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం

నిలిచిన పనులు.. పెరిగిన పొదలు

అమడగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు గతంలో నిలిచిపోవటంతో ప్రమాదకరంగా మారింది. కేవలం పిల్లర్లు వేసి వదిలేశారు. దాంతో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. పశువులు సంచరిస్తున్నాయి. మరో పక్క ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు పెరిగి విష పురుగులకు ఆవాసంగా మారాయి. ప్రహరీ గోడ పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, కోడుమూరు గ్రామీణం

మూలకు చేరిన ఫాగింగ్ యంత్రాలు

పట్టణంలో దోమల బెడదతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఫాగింగ్ యంత్రాలు కార్యాలయానికే పరిమితమవుతున్నాయి. మూడు ఉన్నప్పటికీ రాత్రివేళ ఫాగింగ్ చేయడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. శివారు ప్రాంతాల్లో దోమలతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. మురికివాడల్లో పర్యటించి రోజూ రాత్రివేళ ఫాగింగ్ చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. -న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

వాచ్‌మెన్లకు జీతాలు పెంచక ఇబ్బందులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల వాచ్‌మెన్లు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని.. తక్షణమే జీతాలు పెంచి పంపిణీ చేయాలని వాచ్‌మెన్ల సంఘం ఎమ్మిగనూరు అధ్యక్షులు నారాయణస్వామి డిమాండు చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. నారాయణస్వామి మాట్లాడుతూ దాదాపు 8 ఏళ్లుగా కేవలం రూ.6వేలతో పని చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వాలు మారిన జీతాలు పెంచడం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చే వేతనాలతో కనీసం 15రోజులకు సరకులు రావడం లేదని అన్నారు. పురపాలక సంఘంలో కార్మికులకు 4 నెలలుగా జీతాలు బకాయి పడ్డారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాముడు, మునిస్వామి, బాషా, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెరువు నిండి.. సాగు పెరిగి

పలుకుదొడ్డి (సి.బెళగల్), న్యూస్‌టుడే: మండలంలోని పలుకుదొడ్డి గ్రామంలో బడేఖాన్ చెరువు నిండింది. దీంతో రబీకి 250 ఎకరాల్లో వరి పంట సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. వరినారు పెంపకం పనుల్లో నిమగ్నమయ్యారు. ఆరేళ్ల అనంతరం భారీగా వర్షాలు కురవడంతో చెరువు నిండింది. దీంతో వరి సాగుకు సిద్ధమవుతున్నట్లు రైతులు తెలిపారు. గతంలో చెరువులో కొద్ది నీరు ఉండటంతో భూములను తెలంగాణ రైతులకు కౌలుకు ఇచ్చే వారమని.. చెరువు నిండటంతో కూలీలకు చేతినిండా పని దొరుకుతోందని ఆనందం వ్యక్తం చేశారు.

పల్లె కబుర్లు

సి.బెళగల్, న్యూస్‌టుడే: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారి మిథున్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీహెచ్‌వో ఉమామల్లేశ్వరీ తెలిపారు. గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

సి.బెళగల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాణెమ్మ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వరీ తెలిపారు. సమస్యలు ఉంటే వినతులు ఇచ్చి పరిష్కారం చేసుకోవాలి.

పోలకల్ : సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పురోహితుడు రామయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేక పూజలు జరుపుతున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభరెడ్డి తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గూడూరు శివారులో లచ్చమ్మ గుడి సమీపంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై రాజ కుళ్లాయప్ప తెలిపారు. గూడూరు పట్టణం నుంచి కర్నూలు వెళ్లే రహదారిలో జొన్న పంట వేసిన వ్యవసాయ పొలంలో ఆదివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. గత కొన్ని రోజులుగా దుర్వాసన వస్తుండడం గమనించిన రైతులు గూడూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్సై రాజ కుళ్లాయప్ప సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

జూదరుల అరెస్ట్

నందవరం, న్యూస్‌టుడే: నందవరం మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై తిమ్మారెడ్డి సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కనకవీడు గ్రామ సమీపంలో జూదం ఆడుతున్న 10 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.4100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

తెదేపాతోనే అభివృద్ధి సాధ్యం

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గత ఐదేళ్ల వైకాపా పాలనలో కుంటుపడిన గ్రామాల అభివృద్ధి తెదేపాతోనే సాధ్యమైందని మండల కన్వీనర్ తిరుపతయ్యానాయుడు, సింగిల్‌విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, రమణాచౌదరి, రంగస్వామి నాయుడు అన్నారు. ఆదివారం గ్రామంలో ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి సహకారంతోనే రూ.30 లక్షల నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. అలాగే మండలంలో అధ్వానస్థితిలో ఉన్న పెద్దమర్రివీడు, తిప్పనూరు, ఐరన్‌బండ రోడ్లకు రూ.9కోట్ల నిధులు విడుదల చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు రాజేశ్‌నాయుడు, అబూబకార్, పెద్దయ్య, నైమురాజు,రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులను ప్రారంభించిన నాయకులు

హామీలు నెరవేర్చాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ డివిజన్ నాయకులు రాముడు డిమాండు చేశారు. ఆదివారం కార్మికుల సమావేశాన్ని నిర్వహించి కరపత్రాలను విడుదల చేశారు. రాముడు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు కనీస వసతులు సమకూర్చడం లేదన్నారు. ఐదేళ్లుగా నూనె, సబ్బులు, ఇతర పరికరాలు అందించడం లేదన్నారు. కార్మికులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారని ఆరోపించారు. గత వైకాపా ప్రభుత్వంలో మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 17 రోజుల పాటు సమ్మె జరిగిందని.. అప్పట్లో కూటమి నేతలు స్పందించి హామీలు నెరవేరుస్తామన్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావస్తున్నా.. స్పందన లేదన్నారు. ఈ కార్యక్రమంలో మునీంద్ర, ఖాజా, గోర్బాషా, సుశీలమ్మ, మాబాషా పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేసిన సీఐటీయూ నాయకులు

బడుగుల హక్కుల సాధనకు పోరాటం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేసి హక్కులు సాధించడం సీపీఐ పార్టీకే సాధ్యమని ఎస్టీయూ రాష్ట్ర మాజీ కార్యదర్శి నాగరాజు అన్నారు. సీపీఐ శతాబ్ది వేడుకల్లో భాగంగా ఆదివారం పట్టణంలో గాంధీనగర్‌లో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగరాజు మాట్లాడుతూ భూస్వాముల వద్ద ఉన్న భూములను పేదలకు పంపిణీ చేసేందుకు పోరాటాలు చేసిందన్నారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, రైతులకు గిట్టుబాటు ధరలు అందకపోవడం వంటి సమస్యలను పరిష్కరించేందుకు పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు నిర్వహించి హక్కులు సాధించిందన్నారు. సాగునీరు, విద్యుత్తు వంటి సమస్యలను పరిష్కరించిన ఘనత సీపీఐకే దక్కిందని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ప్రసన్నరాజు, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అడివన్న, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, ఎస్టీయూ బసవరాజు, వెంకటేశ్వర్లు, ఎల్లప్ప, విజయేంద్ర, ఎర్రిస్వామి, బాబయ్య, తులసిరామ్, చంద్రశేఖర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ జెండా ఆవిష్కరించిన ఎస్టీయూ నాయకులు

వైభవంగా గరుడవాహన సేవ

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని వెంకటసాయి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాల సందర్భంగా ఆదివారం కల్పవృక్ష, హనుమంత గరుడ వాహన సేవ వైభవంగా నిర్వహించారు. రథంపై ఉత్సవ మూర్తిని ఉంచి వెంకటసాయి దేవాలయం నుంచి సోమప్ప కూడలి వరకు ఊరేగించారు. మహిళలు రథం ముందు కోలాటం ఆడుతూ ముందుకు సాగారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రథోత్సవంలో కోలాటం ఆడుతున్న మహిళలు

రహదారులకు మహర్దశ

● ఎమ్మిగనూరు - కంబళదిన్నె రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్లు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉప విభాగంలో రహదారులకు మహర్దశ పట్టనుంది. వైకాపా హయాంలో రహదారుల నిర్మాణానికి రూ.కోట్లు మంజూరైనా నిర్మించకుండా వదిలేశారు. దీంతో ప్రయాణికులు ఐదేళ్లకు పైగా నరకం చూస్తున్నారు. ఇటీవల రహదారి నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయింది. కొద్ది నెలల్లో రహదారి నిర్మాణం పూర్తవనుంది. ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి.

ఆరు నెలల్లో పూర్తి

ఎమ్మిగనూరు-కంబళదిన్నె మధ్య 11కి.మీ. రహదారి నిర్మాణానికి ప్లాన్ నిధుల కింద రూ.5కోట్లతో టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది. తారు రోడ్డు నిర్మాణ పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయిన ఆరు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది. పనులను దక్కించుకున్న గుత్తేదారు ఒప్పందం చేసుకొని త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కంబళదిన్నె వంక నుంచి జాలవాడికి కిలోమీటరు సీసీ రహదారి నిర్మాణానికి రూ.2.04కోట్లతో టెండర్ పిలిచారు. బిడ్స్ తెరవాల్సి ఉంది. మరో మూడు, నాలుగు నెలల్లో రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యి రహదారి అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు యత్నిస్తున్నారు.

కంకర తేలిన ఎమ్మిగనూరు-కంబళదిన్నె రహదారి

త్వరలో నిర్మాణ పనులు -విజయ్‌నరేశ్, ఆర్‌అండ్‌బీ ఏఈ, ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు-కంబళదిన్నె మధ్య రహదారి నిర్మాణ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది. త్వరలో రహదారి నిర్మాణం చేపడతాం. ఈ రహదారిలోనే కిలోమీటరు మేర సీసీ రహదారి, పెద్దకడబూరు-ఆదోని రహదారికి సంబంధించి టెండర్‌కు పిలిచారు. వీటికి సంబంధించి టెండర్ ప్రక్రియ త్వరలో పూర్తి కానుంది.

పెద్దకడబూరు -ఆదోని మార్గానికి

ఉప విభాగంలోని పెద్దకడబూరు-ఆదోని రహదారి నుంచి బైచిగేరి క్రాస్ జాతీయ రహదారి వరకు 13కి.మీ. రూ.6.04కోట్లకు టెండర్ పిలిచారు. ఈ పనులకు సంబంధించి బిడ్స్ తెరవాల్సి ఉంది. త్వరలో బిడ్స్ తెరిచి రహదారి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ రెండు రహదారుల నిర్మాణం పూర్తయితే ఎమ్మిగనూరు, మంత్రాలయం మండలాల్లోని దాదాపు 40గ్రామాల ప్రజల రహదారి కష్టాలు తీరనున్నాయి. ఈ రెండు రహదారులకు వైకాపా హయాంలో రూ.49కోట్లతో 2021లో టెండర్ ప్రక్రియ నిర్వహించినా పనులు మాత్రం చేపట్టలేదు. రహదారి మరమ్మతులు చేయక, నిర్మించక పోవడంతో దాదాపు ఆరేళ్లుగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకపై అవస్థలు తప్పనున్నాయి.

రూ.20 లక్షలతో ఫిల్టర్ బెడ్‌కు మరమ్మతులు

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: కౌతాళం మండలంలోని హాల్వి నీటి శుద్ధీకరణ కేంద్రం పథకంలో ఫిల్టర్ బెడ్డు మరమ్మతులకు ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది. ప్రస్తుతం మరమ్మతు పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తయితే సుమారు 12 గ్రామాల ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు సరఫరా అవుతాయి. మరో వారం రోజుల్లో పనులు పూర్తవుతాయని నిర్వాహకులు తెలిపారు. సుమారు 12 ఏళ్ల తర్వాత ఫిల్టర్ బెడ్డు మరమ్మతుకు నిధులు మంజూరు కావడం విశేషం. 3 ఫిల్టర్ బెడ్లకు ప్రస్తుతం ఒక దానికి మరమ్మతులు చేయడానికి మాత్రమే నిధులు మంజూరయ్యాయి.

పనులు చేస్తున్న కూలీలు

(c) eenadu

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

ముగిసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

విజేత కాకినాడ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అతిథులు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : పంచలింగాల గ్రామంలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. తుది పోరులో కాకినాడ జట్టు పశ్చిమ గోదావరి జట్టుపై విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. విజేతలకు ముఖ్యఅతిథులు శ్రీకాంత్, రవిప్రకాశ్ తదితరుల చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరంలోని ఎస్పీవై కాలనీలో ఉన్న నగరపాలక సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ ఆర్జీవీ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి వినతిపత్రాలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణ : 85010 05408, పత్తికొండ : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ?: చింతలమునినగర్, కృష్ణారెడ్డినగర్‌లో మురుగు కాలువలు పూడిపోయాయి. - వికాస్, స్థానికుడు

?: నిర్మల్‌నగర్, బాబాబుడావన్ నగర్‌లో దోమల బెడద అధికమైంది. - స్థానికులు

✔: కాలువలు శుభ్రం చేయిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేస్తాం. - నగరపాలక అధికారులు

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (అపుస్మా) వ్యవస్థాపకుడు జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. అపుస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో విజేతలకు నగరంలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో ఆదివారం బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు విలువలతో కూడిన విద్య నేర్పించాలన్నారు. విద్యార్థి నిత్యం బడికి వచ్చే విధంగా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అపుస్మా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వాసుదేవయ్య, సంఘటిత పీటీవీ సుబ్బయ్య, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో అపుస్మా సభ్యులు

పర్యవేక్షణ శూన్యం.. ముక్కబడి భోజనం

◆ విద్యార్థులకు మెనూ ప్రకారం అందని ఆహారం◆ ఆర్‌యూలో గాడితప్పిన వసతిగృహాల నిర్వహణ

500 మందికి తెప్పించిన 52 కేజీల చికెన్

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : రాయలసీమ విశ్వవిద్యాలయంలో వసతిగృహాల నిర్వహణ గాడితప్పిందని విద్యార్థులు వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో.. పలు సమస్యలు తిష్టవేశాయని.. మౌలిక వసతుల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదని సంబంధిత వార్డెన్‌కు ఫిర్యాదు చేసినా పరిస్థితిలో మార్పు లేదంటున్నారు. ప్రతినెలా ఒక్కో విద్యార్థి నుంచి రూ.వేలల్లో వసూలు చేస్తున్నా.. నాణ్యమైన భోజనం, వసతి కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదివారం అరకొర చికెనే.. పరిశీలన

ఆర్‌యూ క్యాంపస్‌లోని పురుషుల వసతిగృహంలో 500, మహిళల హాస్టల్‌లో 400 మంది విద్యార్థులు ఉంటున్నారు. మెస్ బిల్లు కింద ప్రతినెలా ఒక్కో విద్యార్థి రూ.2500, విద్యార్థిని రూ.2 వేల వరకు చెల్లిస్తున్నారు. వీరికి మెనూ ప్రకారం ఆహారం అందడం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయి. నాణ్యమైన భోజనం వడ్డించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు.

◆ పురుషుల హాస్టల్‌లోని 500 మంది విద్యార్థులకు 80 కిలోల వరకు చికెన్ వండిపెట్టాలి. ప్రతి విద్యార్థికి 150 గ్రాముల చికెన్ తగ్గకుండా ఇవ్వాలన్న నిబంధన ఉంది. ఇక్కడ మాత్రం ఆదివారం 500 మంది విద్యార్థులకు 52 కిలోల చికెన్ మాత్రమే తెప్పించారు. నంద్యాల చెక్‌పోస్టులోని ఓ దుకాణం నుంచి కొనుగోలు చేశారు. పేపర్ రేట్‌కన్నా రూ.40 తక్కువకు కొనుగోలు చేయాల్సి ఉంది. కాని బహిరంగ మార్కెట్ ధరకే కిలో రూ.250తో కొనుగోలు చేశారు. మహిళల వసతిగృహంలో కూడా ఇదే పరిస్థితి. కొన్నేళ్ల నుంచి టెండర్ లేకుండానే ఇక్కడ చికెన్ సరఫరా చేస్తుండటంతో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. తక్కువ చికెన్ తెప్పించడంతో పాటు ఎక్కువ ధర చెల్లిస్తున్నట్లు చూపి డబ్బు మిగిల్చుకుంటున్నారని విమర్శిస్తున్నారు.

పగిలిన కిటికీ అద్దాలకు అడ్డుగా కట్టిన దుప్పట్లు

చలికి వణకాల్సిందే..

పురుషుల వసతిగృహం సమస్యల నిలయంగా మారింది. నిర్వహణ నిమిత్తం ప్రతి విద్యార్థి నుంచి నెలకు రూ.300 వసూలు చేస్తున్నారు. ఈ సొమ్ముతో వసతిగృహం అభివృద్ధి, మరుగుదొడ్ల శుభ్రత, మరమ్మతు పనులు చేపట్టాలి. భవనాల కిటికీ అద్దాలు పగిలిపోయి మూడేళ్లు గడుస్తున్నా అద్దాలు మార్చడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చలికాలం కావడంతో రాత్రి చలి నుంచి రక్షణ కోసం కిటికీ దుప్పట్లు అడ్డుగా కట్టుకున్నారు. దోమల బెడద కూడా ఎక్కువగా ఉంది. తమ నుంచి ప్రతినెలా రూ.1.5 లక్షలు వసూలు చేస్తున్నా కనీస మరమ్మతులు కూడా చేయించడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

హక్కుల సాధనకు పోరాడుదాం

కర్నూలు వి.క్యాంపు, న్యూస్‌టుడే : హక్కుల సాధన కోసం వడ్డెరలంతా ఐక్యంగా పోరాటం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య పిలుపునిచ్చారు. బళ్లారి చౌరస్తాలోని వీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం వడ్డెర సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 4వ తేదీన జిల్లా పరిషత్ సమావేశ భవనంలో వడ్డెర హక్కుల సాధన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జంపాల శివయ్యగారి, బాలగంగాధర్ తిలక్‌నగర్, బృందావన్‌నగర్ కాలనీలోని వడ్డెర ఇళ్ల వద్దకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వడ్డెర సంఘం నాయకులు చల్లా వెంకటేష్, రవి, ఎల్ల శివుడు, రామకృష్ణ, వెంకటరమణ, దండుగల సాంబశివుడు, చిరంజీవి, మద్దిలేటి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE II ND ADDITIONAL DISTRICT JUDGE KURNOOL AT ADONI
I.A.No. 393 of 2025 IN O.S.No. 16 of 2025
BETWEEN:
Shree Mahayogi Lakshmamma Co-operative Bank Ltd, Adoni Rep by its Assistant Chief Executive Officer, Thallam Madhava Rao S/o.Thallam Srinivasulu, aged about 47 years, Resident of Adoni. - Petitioner
-V/s-
Suman T.V.Network, Represented by its Chief Executive Officer, Hyderabad and another - Respondents
NOTICE
To,
S.Kiran S/o. not Known, Suman T.V.Reporter, Kurnool.
I Have filed a petition for Interim Injuction in the above matter. If you have got any objection you may appear before this Court at 10.30AM on 23rd JANUARY 2026 either in person or through an Advocate and file your objection. If you fail to do so, the matter will be decided exparte.
HEARING DATE: 23rd JANUARY 2026.
Sd/- K.V.BADRINATH, M.A.,LLB,
K.AJAY KUMAR, B.TECH., LLB,
ADVOCATES FOR PETITIONER, ADONI.
CELL: 94911 69860/ 94402 93997.

నీతికథలతో నైతిక విలువల పెంపు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : నీతి కథలు విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందిస్తాయని నగరానికి చెందిన విద్యావేత్త వావిలాల కృష్ణమూర్తి పేర్కొన్నారు. డా.హరికిషన్ రచించిన 'గాడిద సలహా' పుస్తకాన్ని నగర శివారులోని వీకేఎం లీడర్స్ పాఠశాలలో ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. పుస్తక పఠనం ద్వారా ఎంతో విజ్ఞానం పెరుగుతుందని, భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. రచయిత డా.హరికిషన్ మాట్లాడుతూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పుస్తకాలు రచించినట్లు తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు అనన్య, యశస్విని, డింపుల్ లక్ష్మీప్రియ, చరిత తదితరులు పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం కార్యదర్శి యాగంటీశ్వరప్ప, రచయిత్రి కల్యాణదుర్గం స్వర్ణలత, ప్రజా గాయకుడు బసవరాజు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వావిలాల కృష్ణమూర్తి, డా.హరికిషన్, యాగంటీశ్వరప్ప తదితరులు

నాటక ప్రదర్శనకు అవకాశం

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన కళాకారులకు నాటక ప్రదర్శనలు నిర్వహించేందుకు టీజీవీ కళాక్షేత్రంలో అవకాశం కల్పిస్తున్నట్లు అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. కాకినాడకు చెందిన ఎస్వీ రంగారావు కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి ఆచమనం సాంఘిక నాటక ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఓబులయ్య మాట్లాడుతూ కళాక్షేత్రంలో ప్రతి ఆదివారం ప్రదర్శనలు ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన కళాకారులను ప్రోత్సహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఇటీవల డాక్టరేట్ అందుకున్న గాయకురాలు పడాల జోత్స్న, నాటక రచయిత వెంకన్నబాబు, కళాకారులను కళాక్షేత్రం సభ్యులు సత్కరించారు. కళాక్షేత్రం సభ్యులు యాగంటీశ్వరప్ప, గాండ్ల లక్ష్మన్న, శ్రీనివాసరెడ్డి, రాజారత్నం, కేవీ రమణ, శివయ్య, చిన్నరాముడు తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వం.. ఉన్నతికి మార్గం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : విద్యార్థి దశ నుంచే పోటీతత్వం అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ప్రిన్సిపల్ జలీల్ సాహెబ్ పేర్కొన్నారు. నగరంలోని విజన్ జూనియర్ కళాశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు జరిగాయి. విజేతలైన దిలీప్ కుమార్, అజీజ్ సూరజ్, అర్షియాకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు యాసిన్, జాకీర్ హుస్సైన్, పర్వీన్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విజన్ కళాశాల విద్యార్థులు

విజేతలతో అధ్యాపకులు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా నారాయణ ఆంగ్ల మాధ్యమం పాఠశాల (ఎంఎన్ శాఖ)లో క్విజ్ పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టి. శ్రీమత్విశ్వక్ (ఏడో తరగతి), ఎ. నిఖిల్ (ఎనిమిదో తరగతి), బి. జగదీష్‌నాయుడు (ఏడో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ ఆర్ఎండీ అల్తాఫ్, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

పోటీల్లో పాల్గొన్న నారాయణ పాఠశాల విద్యార్థులు

బహుమతులు అందుకున్న విజేతలు

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL DISTRICT JUDGE, KURNOOL.
E.P.No. 213/2021 in O.S.No. 102/2017
M.Srinivasa Reddy ... Decree Holder/Plaintiff
-Versus-
V.Ram Gopal Reddy ...Judgement Debtor/Defendant
GENERAL NOTICE
Notice is hereby given that, under Rule 64 of Order XXI of the Code of Civil procedure, 1908, an order has been passed by this Court for the sale of the attached property mentioned in the annexed schedule, in satisfaction of the claim of the decree-holder in the above suit (1) mentioned in the margin, amounting with costs and interest up to date of sale to the sum of Rs.33,06,519-00 as on the date of filing of EP with subsequent interest as per decree @ 6% per annum.
The sale will be by public auction, and the property will be put up for sale in the lots specified in the schedule. The sale will be of the property of the judgement-debtor above-named as mentioned in the schedule below: subject to mortgage of Rs. 18,00,000-00 with 12% per annum from 2/11/2015 Infavour of K.Pulla Reddy.
The sale will be held by Hon'ble I Additional District judge, Kurnool at 10:30 AM on 20/1/2026.
At the sale the public generally are invited to bid, either personally or by duly authorized agent.
SCHEDULE: Plot No.22 to 24 of Chandra Sekhar Nagar in Sy. No. 660/A2 of Kallur within Kallur Sub Registration and Kurnool District and bounded as follows:
East: Land of Yella goudu and others, West: 40 feet wide road, North: Plot No. 27and 28, South: Plot No.21.
Approximate market value Rs. 30,00,000/- as on the date of getting attachment.
ADDRESS FOR SERVICES
A.Rama Subba Reddy, Advocate, Kurnool.
Cell: 98490 36050.

శిరస్త్రాణంతోనే ప్రాణాలకు రక్షణ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించడం ద్వారా ప్రాణాలకు రక్షణ లభిస్తుందని కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ పేర్కొన్నారు. యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని కొత్తపేటలో ఉన్న ట్రాఫిక్ పోలీసుస్టేషన్ నుంచి విలేకర్లు, ట్రాఫిక్ పోలీసులు శిరస్త్రాణంపై నిర్వహించిన అవగాహన ర్యాలీని సీఐ ప్రారంభించారు. ఈనెల 30వ తేదీ నుంచి కర్నూలులో నో హెల్మెట్- నో పెట్రోల్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

ర్యాలీలో సీఐ, ట్రాఫిక్ పోలీసులు, విలేకరులు

మానవత సేవలు విస్తరిస్తాం

కర్నూలు నగరం : మానవత సంస్థ సేవలను విస్తరిస్తామని జిల్లా కన్వీనర్ మనోహర్‌రెడ్డి చెప్పారు. నగరంలోని వెంకటరమణ కాలనీలో ఉన్న సంస్థ కార్యాలయంలో ఆదివారం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. నగర అధ్యక్షుడు సీవీ రమణ, సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నందికొట్కూరు గ్రామీణం : పాములపాడు మండలం కంబాలపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలు మండలం బి.తాండ్రపాడుకు చెందిన అమీర్‌బాషా తీవ్రంగా గాయపడ్డారు. ఆత్మకూరు నుంచి బైక్‌పై స్వగ్రామానికి వస్తూ ముందు వెళ్తున్న ఎడ్ల బండిని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కార్మికులు ఐకమత్యంతో పోరాడి సమస్యలు పరిష్కరించుకోవాలని ఇండియన్ బ్యాంకు మేనేజర్ శ్రుతి, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ నిర్మల, సామాజిక ఉద్యమ కార్యకర్త ఆర్జ ఉష సూచించారు. స్థానిక లక్ష్మీనగర్‌లోని వికాస్ పాఠశాలలో మెప్మా ఆర్పీల సంఘం కార్యదర్శి ఉమాదేవి అధ్యక్షతన ఆదివారం వారు నూతన సంవత్సరం కాలమానిని ఆవిష్కరించారు. ఈ

నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరిస్తున్న ఇండియన్ బ్యాంకు మేనేజర్ శ్రుతి తదితరులు

సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన కాలాన్ని బేరీజు వేసుకొని.. భవిష్యత్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటేశ్వర్లు, ఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షురాలు రుద్రమ్మ, సుజాత, షహనాజ్, వాణిశ్రీ, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందూ సమ్మేళనం

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని నన్నూరు గ్రామంలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాంతానంద ఆశ్రమ నిర్వాహకుడు గురుసేవానంద స్వామీజీ హాజరై ధార్మిక ఉపన్యాసం చేశారు. హిందూ ధర్మ రక్షణకు కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి కాశీభట్ల శివప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న స్వామీజీ గురుసేవానంద

వివేకానందుడి జీవిత చరిత్రపై పోటీలు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : నగరంలోని ఆవోపా భవన్‌లో ఆదివారం 'స్వామి వివేకానంద-భారతీయ సంస్కృతి' అనే అంశంపై ఇంటర్మీడియట్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జనవరి 12న వివేకానందుడి జయంతి ఉన్న నేపథ్యంలో పోటీలు నిర్వహించినట్లు ఆవోపా ప్రతినిధులు తెలిపారు. విజేతలకు వచ్చేనెల 11న ఆవోపా భవన్‌లో బహుమతులు అందచేస్తామన్నారు.

వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సాహిత్య అకాడమీని గుప్పిట్లో పెట్టుకోవడం తగదు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : సాహిత్య అకాడమీని కేంద్ర ప్రభుత్వం తన గుప్పెట్లో పెట్టుకునేందుకు ప్రయత్నించడం సరికాదని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ పేర్కొన్నారు. స్థానిక మద్దూరు నగర్‌లోని తెలుగుతోటలో ఆదివారం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం పేరు మార్పు, కేంద్ర సాహిత్య అకాడమీ అంశాలపై చర్చించేందుకు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. గాడిచెర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ కల్కూర, ఆచార్య మన్సూర్ రహమాన్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేపీ నారాయణ మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకం కూలీలకు అన్యాయం జరగకుండా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పట్టణ పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు ఇరిగినేని పుల్లారెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కేజీ గంగాధరరెడ్డి, రచయితలు ఇనాయతుల్లా, అజీజ్, నాగేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా, నా క్లయింటు అయినటువంటి కర్నూలు నగర వాస్తవ్యులు టి.హరికృష్ణారెడ్డినకు చెందినటువంటి క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తులను కొంతమంది వ్యక్తులు అన్యాక్రాంతం చేయదలచి క్రయ, విక్రయాలు జరుపుటకు ప్రయత్నించుచున్నారని తెలిసినది. కావున క్రింద తెలిపిన స్థిరాస్తులకు సంబంధించి ఎవరైనా ఎటువంటి క్రయ, విక్రయాలు జరిపిన అవి చట్టపరిధిలో చెల్లనేరవు మరియు వారిపైన సివిల్ మరియు క్రిమినల్ దావాలు కూడా జరుపబడునని తెలియజేయుచున్నాము.

షెడ్యూలు

1. కర్నూలు డి., కర్నూలు సబ్.డి., కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన జొహరాపురం గ్రామ పొలములోని స.నెం.70U2 పైకి భూమిలో వేయబడిన ప్లాట్లను L.P.No.8/2000/ATP గా అప్రూవల్ కాబడిన ప్లాట్లపైకి నెం.9, 10 గల ప్లాట్లు ఇందుకు ఒకే చెక్కుబంది. **తూర్పు**: 11వ నెంబరు ప్లాటు, **పడమర** : 8వ నెంబరు ప్లాటు, **ఉత్తరం** : 18, 17 నెంబరుగల ప్లాట్లు, **దక్షిణం** : 40 అడుగుల వెడల్పు రోడ్డు - ఈ దిశలకులోనైనా ప్లాట్ల కొలతలు. **తూర్పు-పడమర** : 72 అడుగులు, **ఉత్తరం-దక్షిణం** : 50 అడుగులు గల ప్లాట్ల విస్తీర్ణం 3600 చ.అ.లేక 400 చ.గ. కలదు.
2. కర్నూలు డి., కర్నూలు సబ్.డి., లక్ష్మీపురం గ్రామ పంచాయతీ, లక్ష్మీపురం గ్రామ పొలములోని స.నెం.679 పైకి భూమిలో వేయబడిన ప్లాట్లను L.Dis.No.25/71 గా అప్రూవల్ కాబడిన మయూరి గ్రీన్ ల్యాండ్స్ నందలి ప్లాట్లపైకి నెం.656 గల ప్లాటు ఇందుకు చెక్కుబంది. **తూర్పు** : 40 అడుగుల వెడల్పు రోడ్డు, **పడమర** : 615 నెంబరు గల ప్లాటు, **ఉత్తరం** : 655 నెంబరు గల ప్లాటు, **దక్షిణం** : 657 నెంబరు గల ప్లాటు - ఈ దిశలకు లోనైన ప్లాటు కొలతలు. **తూర్పు-పడమర** : 80 అడుగులు, **ఉత్తరం-దక్షిణం** : 50 అడుగులు గల ప్లాటు విస్తీర్ణం 4000 చ.అ.లేక 444.44 చ.గ. కలదు.

ఇట్లు: సం/- బి.గోపాలకృష్ణుడు, అడ్వకేటు, కర్నూలు.
ఫోన్ నెం. 90309 04043, 94405 22625.

రక్షణలేని వంతెనలు.. గ్రామీణులకు గుబులు

కర్నూలు గ్రామీణ, ఓర్వకల్లు, న్యూస్‌టుడే : కర్నూలు రూరల్, ఓర్వకల్లు మండలాల్లోని పలు గ్రామీణ రహదారుల్లో వంతెనలు, కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. దశాబ్దాల కిందట నిర్మించిన వారధులు శిథిలావస్థకు చేరాయి. వీటికి ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించలేదు. ఇవి చాలా ఇరుకుగా ఉండటంతో వాహనాలు ఎదురెదురుగా వచ్చిన సందర్భాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చోదకులు వాహనాన్ని రహదారి అంచులకు తీసుకెళ్లిన సందర్భంలో ఏమాత్రం అదుపుతప్పినా వంకల్లోకి పడిపోయే ప్రమాదం ఉంది. దీంతో ఈ మార్గాల్లో ప్రయాణించేందుకు ప్రజలు భయపడుతున్నారు. రాత్రిళ్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వంతెనలు, కల్వర్టులకు ఇరువైపులా రక్షణ గోడలు, దిమ్మెలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కర్నూలు మండలం గొందిపర్ల నుంచి దేవమాడకు వెళ్లే ప్రధాన రహదారిలో పెద్ద ఈదుల వాగుపై ఉన్న ఇరుకు వంతెన ప్రమాదకరంగా మారింది. గొందిపర్ల నుంచి పూలతోట, దొడ్డిపాడు, దేవమాడ, సింగవరం గ్రామాలకు నిత్యం వందలాది మంది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెనపై రక్షణ గోడలు లేవు. దారికి ఇరువైపులా ఇసుక మేట వేసింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇది కర్నూలు నుంచి సుంకేసుల రహదారిలో నిడ్జూరు వద్ద ఉన్న వంతెన. దీనికి ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో ఇక్కడ వంక ఉన్నట్లు తెలియదు. ఈ ఇరుకు వంతెనపై రక్షణ దిమ్మెలు కూడా లేకపోవడంతో వాహనదారులు ఏమరపాటుగా వెళ్తే వంకలో పడిపోయే ప్రమాదం ఉంది. ఇదే రహదారిలో జి.సింగవరం, అర్.కొంతలపాడు సమీపంలో ఉన్న వంతెనలపై కూడా రక్షణ గోడలు లేవు. ఈ రహదారి నిడ్జూరు, బావాపురం, జి.సింగవరం, ఎదురూరు, ఆర్కే.దుద్యాల, అర్.కొంతలపాడు, సుంకేసుల మీదుగా సి.బెళగల్, గూడూరు మండలాలతో పాటు తెలంగాణ రాష్ట్రం రాజోలి మీదుగా పలు గ్రామాలకు నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గంలోని వంతెనలపై రక్షణ గోడలు నిర్మించాల్సిన ఆవశ్యకత ఉంది.

ఓర్వకల్లు నుంచి ఎన్.కొంతలపాడు వెళ్లే మార్గంలో గుట్టపాడు వద్ద పాత కల్వర్టు భయపెడుతోంది. చాలా తగ్గులో ఉన్న ఈ కల్వర్టు ఒకవైపు పూడిపోయింది. మరోవైపు గుంత ఉంది. ఎగువ నుంచి వేగంగా వచ్చే వాహనదారులు అదుపుతప్పితే గుంతలోపడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారిలో ఓర్వకల్లు, గుట్టపాడు, ఎన్.కొంతలపాడు, ఉప్పలపాడు, ఉయ్యాలవాడ, రామళ్లకోట, వెల్దుర్తి తదితర గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ వంతెన నిర్మించి రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు విన్నవిస్తున్నారు.

నిత్య సాధనతో పతకాలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : నిత్య సాధనతోనే క్రీడాకారులకు పతకాలు వస్తాయని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన చిన్నారులకు నగరంలోని తన స్వగృహంలో ఆదివారం ఆయన ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించాలన్నారు. టీజీవీ, టీజీబీ తైక్వాండో కేంద్రం వ్యవస్థాపకుడు టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీల్లో వివిధ విభాగాల్లో 300 మంది పాల్గొన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తైక్వాండో స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అజయ్, శిక్షకులు అశ్విని, లత, తేజ తదితరులు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన చిన్నారులతో టీజీ వెంకటేష్

సంక్షిప్త సమాచారం

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : కల్లూరు పట్టణ పరిధిని 16 వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.5 కోట్ల కుడా నిధులకు పరిపాలన ఉత్తర్వులు మంజూరు చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరంలోని కిసాన్‌ఘాట్‌ను నగరపాలక ఆధ్వర్యంలో అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేఖ రాశారు. ఆ వినతిని పరిశీలించిన రాష్ట్ర మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు పనులు ప్రారంభించాలని నగరపాలక కమిషనర్‌ను ఆదేశించారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం స్థానిక దామోదరం సంజీవయ్య భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించి కేకు కోశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ సభ్యుడు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

SUMMONS (O5 r1, 5C.P.C)
IN THE COURT OF THE HON'BLE II ND ADDITIONAL DISTRICT JUDGE KURNOOL AT ADONI.
O.S.No. 16 of 2025
BETWEEN:
Shree Mahayogi Lakshmamma Co-operative Bank Ltd, Adoni Rep by its Assistant Chief Executive Officer, Thallam Madhava Rao S/o.Thallam Srinivasulu, aged about 47 years, Resident of Adoni. - Plaintiff
-V/s-
Suman T.V.Network, Represented by its Chief Executive Officer, Hyderabad and another - Defendants
SUMMONS
To,
S.Kiran S/o. not Known, Suman T.V.Reporter, Kurnool.
WHEREAS the Plaintiff has instituted a suit against you for Suit For Damages, For Defamation, Slander, and for Permanent Injuction and other Reliefs. You are hereby summoned to appear in the Court in person or by a Pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some other person able to answer all such questions on the day of 23rd JANUARY 2026 at 10.30AM in the forenoon to answer the claim and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of defence. TAKE notice that, in default of you appearance on the day before mentioned, the suit will be heard and determined in your absence.
HEARING DATE: 23rd JANUARY 2026.
Sd/- K.V.BADRINATH, M.A., LLB,
K.AJAY KUMAR, B.TECH., LLB,
ADVOCATES FOR PLAINTIFFS, ADONI.
CELL: 94911 69860/ 94402 93997

(c) eenadu

ఇంటింటికి సేవలు

● అందుబాటులో సర్వీస్ ప్రొవైడర్ల వ్యవస్థ

పట్టణవాసులకు ఇంటి వద్దే సేవలందించడం.. అవసరమైనవారికి ఉపాధి చూపాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. సర్వీసు ప్రొవైడర్ల వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. వివిధ వృత్తుల్లో నిపుణులైనవారికి ప్రతి నెలా ఆదాయం సమకూరేలా ప్రణాళికలు రూపొందించింది. పట్టణ స్వయం సహాయక పొదుపు మహిళలు, వారి కుటుంబ సభ్యులకు జీవనోపాధి కల్పించడంతోపాటు ఆదాయాన్ని పెంచేందుకు సరికొత్త పద్ధతుల్లో ముందుకు సాగుతోంది.

–న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

నిపుణులను గుర్తించేలా..

కర్నూలు జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 850, నంద్యాల జిల్లాలో ఆరు పురపాలక సంఘాల పరిధిలో 600 మంది నిపుణులను గుర్తించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. ఈ ఏడాది జనవరి నెలాఖరులోగా వివిధ వృత్తుల్లో నైపుణ్యం కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మార్చి రెండో వారం నాటికి శిక్షణ పూర్తి చేయాలని మెప్మా ఉన్నతాధికారులు ఆదేశించారు.

మున్సిపాలిటీల పరిధిలో శిక్షణ పూర్తై రిజిస్ట్రేషన్లు చేసుకున్నవారు

జిల్లా	లక్ష్యం	మొత్తం
కర్నూలు	850	322
నంద్యాల	600	230

కొందరికే శిక్షణ

వివిధ వృత్తుల్లో నిపుణులైన వారిని గుర్తించడంతోపాటు వారి వివరాలు హోం ట్రయాంగిల్ యాప్‌లో నమోదు చేయించడం.. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటరు ద్వారా 60 గంటల పాటు వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించడంలో ఉమ్మడి జిల్లాలకు చెందిన మెప్మా అధికారులు విఫలమయ్యారు. నిర్దేశించిన లక్ష్యంలో కొందరినే గుర్తించి శిక్షణ ఇప్పించారు. మెప్మా ఉన్నతాధికారులు ఏడాది కిందట లక్ష్యం నిర్దేశిస్తే.. ఇప్పటివరకు కేవలం 40 శాతం మంది వృత్తి నిపుణులకు మాత్రమే శిక్షణ ఇప్పించి రిజిస్ట్రేషన్లు చేయించడం గమనార్హం.

మొత్తం 30 రకాలు..

● ఎలక్ట్రికల్, కార్పెంటర్, శానిటరీ, పెయింటింగ్, ఏసీ, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మిషన్లు, చరవాణుల మరమ్మతులు, వాటర్ ప్యూరిఫయర్, బ్యూటీషియన్ తదితర మొత్తం 30 రకాల సేవలందించే ఉద్దేశంతో మెప్మా చర్యలు చేపట్టింది.

● ఎలక్ట్రీషియన్లు, కార్పెంటర్లు, ప్లంబర్లు, గృహోపకరణాలు తదితర మరమ్మతుదారుల్లో నైపుణ్యాలు పెంపొందించడంతోపాటు వారి వివరాలు మెప్మా హోం ట్రయాంగిల్ అనే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో నమోదు చేసి.. ప్రతి నెలా రూ.20 వేల నుంచి రూ.30 వేలు సంపాదించేలా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ హోం ట్రయాంగిల్ యాప్ ద్వారా విజయవాడ, విశాఖపట్నంలో ఇప్పటికే వృత్తి నిపుణులు ఉపాధి పొందుతున్నారు. త్వరలో రాష్ట్రంలో అన్ని పట్టణ ప్రాంతాలకు ప్లాట్‌ఫామ్‌ను విస్తరించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రెవెన్యూ సమస్యలకు సత్వర పరిష్కారం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్‌లను కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. వినతులను నేరుగా స్వీకరించి నమోదు చేయడంతోపాటు సమస్యల స్వరూపాన్ని బట్టి అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపడుతామని పేర్కొన్నారు.

ఆటతో మురిపించి.. విజయాలు వరించి..

కర్నూలు నగరంలో ఈపీఎల్ క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ధనిక భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ప్రెజెంట్స్) 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్- 2025' క్రికెట్ పోటీలు ఆదివారంతో ఆరో రోజుకు చేరింది. బౌలర్లు తమ సత్తా చాటారు. ఎక్కువ పరుగులు ఇవ్వకుండా కట్టడి చేశారు. కొందరు బ్యాటర్లు సైతం ప్రతిభ చాటి జట్టు విజయానికి కృషి చేశారు. – ఈనాడు, కర్నూలు

సాగు.. కాడిన పడక

● రబీలో తగ్గిన పంటల విస్తీర్ణం

రబీ సీజన్‌లో పంటల సాగు అంతంత మాత్రంగానే ఉంది. మూడు నెలలవుతున్నా పురోగతి కానరావడం లేదు. తుంగభద్ర జలాశయం నుంచి నీరు వదలడం లేదని జలవనరుల శాఖ అధికారులు తేల్చి చెప్పడంతో కర్నూలు జిల్లా పరిధిలో పలువురు రైతులు వరి సాగుకు వెనకడుగు వేస్తున్నారు. గతంలో రబీ సీజన్‌లో శనగ విత్తన కాయలను రాయితీపై ఇచ్చేవారు. ఈసారి ఇవ్వకపోవడంతో సాగుపై ప్రభావం చూపింది.

– న్యూస్‌టుడే, కర్నూలు, నంద్యాల వ్యవసాయం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రబీలో 2.81 లక్షల హెక్టార్ల సాధారణ సాగు కాగా ఇప్పటివరకు 1.96 లక్షల హెక్టార్లలోనే వివిధ పంటలు సాగయ్యాయి. 83,315 హెక్టార్లలో రైతులు సాగు చేపట్టలేదు. ఖరీఫ్‌లో అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతినడం, పెట్టుబడులు పెరిగిపోవడం.. గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో 'కాడి' గాడిన పడటం లేదు.

ఉమ్మడి జిల్లాలో రబీలో సాగు వివరాలు (హెక్టార్లలో..)

జిల్లా	సాధారణ సాగు	సాగైంది	శాతం
కర్నూలు	1,07,894	56,053	52
నంద్యాల	1,73,410	1,37,936	91

28,737 హెక్టార్లలో విత్తు పడక..

● రబీ పంట కాలం మరో నెలలో ముగియనుంది. వర్షాధారం కింద సాగుకు అవకాశం లేకుండా పోయింది. ఉమ్మడి జిల్లాలో పప్పుశనగ ప్రధానంగా సాగవుతుంది. ఈ సీజన్‌లో కర్నూలులో 38,239, నంద్యాలలో 52,518 కలిపి మొత్తం 90,757 హెక్టార్లలోనే సాగైంది. 1.19 లక్షల హెక్టార్ల సాధారణ సాగు కాగా.. 28,737 హెక్టార్లలో విత్తు పడకపోవడం గమనార్హం.

● గతంలో 1.70 లక్షల హెక్టార్లలో పప్పుశనగ సాగవగా.. ఈసారి దారుణంగా పడిపోవడం గమనార్హం.

సాధారణంకన్నా పడిపోయి..

● రబీలో రెండో ప్రధాన పంట జొన్న. కర్నూలులో 4,017, నంద్యాలలో 27,534 హెక్టార్లలో కలిపి ఉమ్మడి జిల్లాలో 31,551 హెక్టార్లలో సాగవుతోంది. నంద్యాలలో 94 శాతం మేర సాగు చేయగా.. కర్నూలులో 41 శాతం మాత్రమే పంట వేశారు.

● వరి సాగు సైతం అంతంతమాత్రంగానే ఉంది. నంద్యాల జిల్లాలో 29,084 హెక్టార్ల సాధారణ సాగు కాగా కేవలం 10,891 హెక్టార్లలో మాత్రమే నాటారు. కర్నూలులో సాధారణ సాగు 4,314 హెక్టార్లకు గాను కేవలం 40 హెక్టార్లలో మాత్రమే సాగవుతోంది.

● రబీ సీజన్‌లో రాయితీపై వేరుసెనగ విత్తనాలు ఇవ్వలేదు. ఈ ప్రభావం సాగుపై పడింది. కర్నూలులో 15,499 హెక్టార్ల సాధారణ సాగుకు.. బోరు బావుల కింద కేవలం 2,642 (17 శాతం), నంద్యాలలో 3,058 హెక్టార్ల సాధారణ సాగుకు కేవలం 1,455 హెక్టార్లలో మాత్రమే విత్తు పడింది.

మొక్కజొన్నపై మక్కువ

ఉమ్మడి జిల్లాలో మొక్కజొన్న సాగు అనూహ్యంగా పెరిగింది. సాధారణానికి మించడం విశేషం. ఉమ్మడి జిల్లాలో 18,590 హెక్టార్ల సాధారణ సాగుకు గాను కర్నూలు 7,426, నంద్యాల 22,936 కలిపి ఉమ్మడి జిల్లాలో 30,362 హెక్టార్లలో సాగవుతుండటం విశేషం. ఖరీఫ్‌లో గిట్టుబాటు ధరలు రాక పోయినా చాలామంది రైతులు రబీలో అత్యధికంగా సాగు చేయడం విశేషం.

ఉత్తర ద్వారం.. నిత్య దర్శనం

వైకుంఠ ఏకాదశి రోజున వైష్ణవ క్షేత్రాల్లో ఉత్తర ద్వారంలో ప్రవేశించి స్వామివారిని దర్శించుకునే అవకాశాన్ని భక్తులకు కల్పిస్తారు. ఉత్తర ముఖద్వారంలోనే వెలసిన ఆలయాలు చాలా అరుదుగా ఉంటాయి. అలాంటి వాటిల్లో చాగలమర్రి మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ కోవెలను 16వ శతాబ్దంలో నిర్మించారు. శ్రీశైలం, అహోబిలం క్షేత్రాలకు శ్రీకృష్ణదేవరాయలు వెళ్లే సమయంలో ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని రెండు సార్లు సందర్శించి అభివృద్ధి చేశారని గ్రామస్థులు చెబుతున్నారు. గతంలో ఈ ఆలయంలోనే వివాహాలు కూడా జరిపేవారు. దేవాలయం పరిధిలో దాదాపు 60 ఎకరాల మాన్యం ఉంది. వైకుంఠ ఏకాదశి రోజు ఉమ్మడి జిల్లాలోని నలుమూలల నుంచి భక్తులు వేల సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుంటారు.

– న్యూస్‌టుడే, మద్దూరు (చాగలమర్రి)

అక్కడందరూ సిద్ధప్పలు, సిద్ధమ్మలే

హొళగుందలోని కొండ గుహలో కొలువైన సిద్ధేశ్వరస్వామిని అక్కడి ప్రజలు తమ ఇలవేల్పుగా కొలుస్తుంటారు. హొళగుందలోనేకాక కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు సైతం తమ ఆరాధ్య దైవంగా భావించి పూజలు చేస్తుంటారు. అంతేకాదు.. పుట్టిన పిల్లలకు సిద్ధప్ప, సిద్ధలింగప్ప, సిద్ధార్థ్, సిద్ధమ్మ తదితర పేర్లు పెట్టుకుంటూ తమ భక్తిని చాటుకుంటున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, కురుగోడు, శిరిగేరి, శ్రీధరగడ్డ తదితర ప్రాంతాలకు చెందినవారు సైతం స్వామి పేరు వచ్చేలా పేర్లు పెట్టుకుంటుంటారు. ధనుర్మాసం, కార్తిక మాసంలో నిత్య పూజలు జరుగుతాయి. ఏటా మాఘ మాసంలో సిద్ధేశ్వరస్వామి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహిస్తారు. మరుసటి రోజు లంకా దహన కార్యక్రమం ఘనంగా జరుపుతారు. – న్యూస్‌టుడే, హొళగుంద

కన్నీటి సుడిలో కొట్టుకుపోయారు

చిన్నారి ప్రాణం విలవిల్లాడితే..
తల్లి తల్లడిల్లిపోయింది.
బాధ్యత పంచుకోవాల్సిన భర్తే..
వదిలించుకోవాలనుకున్నాడు.
చిన్నారి ఆరోగ్యం విషమించింది..
నాన్న మనసు కనికరించనంది.
చికిత్సకు చిక్కులు చుట్టుముట్టాయి..
ఆ తల్లికి కన్నీటి సుడులే దిక్కయ్యాయి.
కష్టాల కడలి కళ్లెదుటే కదలాడింది..
కన్నపేగును కాపాడుకోలేనని కుంగిపోయింది.
బుజ్జాయికి పాలిచ్చి బొజ్జనింపింది..
ఇద్దరు పిల్లలతో జలప్రవాహంలో కొట్టుకుపోయింది.

ఎల్లా లక్ష్మి (పాత చిత్రం)

ఇద్దరు పిల్లలతో సహా కాల్వలో దూకేసిన మహిళ ● కానరాని ఆచూకీ

గడివేముల మండలం ఒండుట్ల గ్రామానికి చెందిన బుగ్గానిపల్లె ఎల్లా లక్ష్మి (23), రమణయ్య నాలుగేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కుటుంబ సభ్యులు వ్యతిరేకించడంతో పాణ్యం మండలం పిన్నాపురం గ్రామంలో నివాసం ఉంటున్నారు. కొంత కాలం తర్వాత కుటుంబ సభ్యులు వారిని స్వగ్రామానికి తీసుకొచ్చారు. వారికి పెద్ద కుమార్తె వైష్ణవి (2), చిన్న కుమార్తె సంగీత (4 నెలలు) ఉన్నారు. నాలుగు రోజుల కిందట ఎల్లా లక్ష్మి పుట్టింటి నుంచి మెట్టినింటికి వెళ్లారు. భర్తతో పాటు అత్తామామలు ఆదరించలేదని తెలిసింది. చిన్న కుమార్తె సంగీతకు వాంతులు, విరేచనాలు కావడంతో వైద్యం చేయించాలని లక్ష్మి కోరారు. భర్త, అత్తింటి వారు డబ్బు ఇవ్వలేదని తెలిసింది. దీంతో ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో లక్ష్మి తన ఇద్దరు పిల్లలతో కలిసి బస్సులో గని గ్రామానికి చేరుకుని గ్రామీణ వైద్యుడి వద్ద చికిత్స చేయించినట్లు సమాచారం.

వారిద్దరూ ప్రేమించుకున్నారు.. పెద్దలు కాదన్నా పెళ్లి చేసుకున్నారు.. మొదట వీరి ప్రేమను పెద్దలు అంగీకరించకపోయినా ఆ తర్వాత వారి మనసు మారింది.. ఆనందంగా జీవనం సాగించారు.. ఆ తర్వాత కాపురంలో కలహాలు మొదలయ్యాయి.. చిన్నారికి చికిత్స అందించలేనంతగా నాన్న మనసు కఠినమైంది.. తల్లి మనసు కలత చెందింది. చిన్నారికి పాలిచ్చి ఆకలి తీర్చింది.. తన ఇద్దరు పిల్లలతో సహా కాల్వలోకి దూకి గల్లంతైన ఘటన ఆదివారం జరిగింది.

– న్యూస్‌టుడే, గడివేముల

చివరిసారిగా పాలిచ్చి..

పాపకు వైద్యం చేయించిన ఎల్లా లక్ష్మి తిరిగి బస్సు ఎక్కారు. అనంతరం గడివేముల మండలం మంచాలకట్ట గ్రామ సమీపంలో ఎస్సార్బీసీ పక్కనున్న సచివాలయం వద్ద దిగారు. అక్కడి నుంచి కాల్వ గట్టున కూర్చొని చిన్నారి సంగీతకు పాలిచ్చారు. అనంతరం ఇద్దరు పిల్లలను కాల్వలోకి తోసేసి ఆమె సైతం దూకేశారు. గమనించిన కొందరు రైతులు ఆమెను రక్షించే ప్రయత్నం చేశారు. కాల్వలోకి తాడు వేసినా ఆమె పట్టుకోలేదని.. తాను చావాలనుకుంటున్నట్లు చెప్పిందని వారు తెలిపారు. కాల్వ ఒడ్డున ప్లాస్టిక్ కవర్ వదిలి వెళ్లారు. అందులో ఆధార్ కార్డు నకలు, ఆమెతోపాటు భర్త ఫొటోలు లభించాయి. వెంటనే రైతులు బాధితురాలి కుటుంబ సభ్యులతో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ముమ్మర గాలింపు

సమాచారం అందుకున్న ఎస్సై నాగార్జునరెడ్డి, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఎస్సార్బీసీలో గల్లంతైన తల్లీబిడ్డల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. వంతెన వద్ద అడ్డుగా వలలు వేశారు. చీకటి పడటంతో వెనుదిరిగారు. కాగా తల్లి తన ఇద్దరు పిల్లలతో కాల్వలోకి దూకేయడంతో ఒండుట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గాలింపు చర్యలను పరిశీలిస్తున్న ఎస్సై, సిబ్బంది

కానాల.. మరమ్మతులు కానరాలా

మండల పరిధిలోని పుసులూరు నుంచి కానాలకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. సుమారు 2 కిలోమీటర్ల మేర తారు మొత్తం లేచిపోయి రూపు కోల్పోయింది. వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. కంకర తేలడంతో వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మల సత్రం

శ్రీశైల క్షేత్రంలో నెల్లూరుకు చెందిన సిద్ధేంద్ర యోగి కళాక్షేత్రం సభ్యులు నృత్యాలు చేశారు. – న్యూస్‌టుడే, శ్రీశైలం, నంది సర్కిల్

పవన వెలుగులు

● రూ.1,150 కోట్లతో మూడు ప్రాజెక్టుల ఏర్పాటు

సిద్ధమవుతున్న రెక్కలు

జిల్లాలో ఎర్రమల కొండల కేంద్రంగా పవన విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. డోన్ నియోజకవర్గ పరిధిలోని ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో ఇవి ఏర్పాటవుతున్నాయి. డోన్ నియోజకవర్గంలో 349.80 మెగావాట్ల లక్ష్యంతో ఎకోరెన్ సంస్థ పవన విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టింది. రూ.250 కోట్ల వ్యయంతో పనులు జరుగుతున్నాయి. బేతంచెర్ల మండలంలోని పెండేకల్లు, కొలుములపల్లె, గూటుపల్లి, రంగాపురం, బుక్కాపురం ప్రాంతాల్లో ఈ పనులు చేపట్టారు. ప్యాపిలి మండలంలోని కలుచెట్ల, చిన్నపూదెళ్ల, పెద్దపూదెళ్ల గ్రామాల వద్ద కొండలపై ఫ్యాన్ల (టవర్ల) ఏర్పాటు పనులు సాగుతున్నాయి. ఒక్కో ఫ్యాన్ నుంచి 3.5 మెగావాట్ విద్యుదుత్పత్తి జరుగుతుంది. రెండేళ్లలో ప్రాజెక్టు పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. బుక్కాపురం వద్ద 123 కేవీ సామర్థ్యంతో సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ఇటీవలే ప్రారంభమయ్యాయి. ఈ ప్రాజెక్టు ఉత్పాదక విద్యుత్‌ను నేరుగా సెంట్రల్ గ్రిడ్‌కు అనుసంధానం చేయనున్నారు. టవర్ పరికరాల కోసం బేతంచెర్ల మండలం కొమ్మరు కొట్టాల గ్రామం వద్ద సదరు సంస్థ భూములను కౌలుకు తీసుకుంది.

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం, బేతంచెర్ల

రూ.900 కోట్లతో మరో రెండు..

డోన్ మండల పరిధిలో రెన్యూ విక్రమ్ శక్తి ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.600 కోట్లతో 600 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టును నిర్మించనుంది. రెన్యూ యోమాన్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 300 మెగావాట్లతో మరొకటి ఏర్పాటు చేయనుంది. 900 మెగావాట్ల విద్యుత్తు లక్ష్యంగా ఈ రెండు ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నారు. ఈ రెండింటికి ఏపీ శుద్ధ ఇంధన విధానం-2024 ప్రకారం ఎకరా భూమికి రూ.31 వేల రుసుమును ఏటా చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి రెండేళ్లకు లీజు రుసుమును 5 శాతం పెంచుతారు.

2 వేల మందికి ఉపాధి

ఈ మూడు పవన విద్యుత్తు ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 వేల మందికి ఉపాధి కలగనుంది. ఇప్పటికే డోన్ పశ్చిమ ప్రాంతంలో, బేతంచెర్ల మండలంలో జరుగుతున్న పనులతో ప్రత్యక్షంగా 600 మంది వరకు ఉపాధి పొందుతున్నారు. డోన్ ప్రాంతంలో విండ్ ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభమైతే ఒక్కోదాని ద్వారా 700 మంది వరకు ఉపాధి లభించే అవకాశముంది.

మగువ.. ఆటల్లో తెగువ

● వైజాగ్ మారథాన్‌లో ఆదోని మహిళల ప్రతిభ

వారంతా సాధారణ గృహిణులు.. ఇంటి పనులతో తీరిక లేకుండా గడిపేవారు. ఫలితంగా పలు రకాల రుగ్మతలు చుట్టుముట్టాయి. వీటి నుంచి బయటపడేందుకు మైదానం బాట పట్టారు. వీరి మధ్య 'ఆరోగ్యకర' స్నేహం కుదిరింది. సీనియర్ వెటరన్ క్రీడాకారిణి ఏలిగే సీమ సహకారం తోడవడంతో అంతా ఒక జట్టుగా ఏర్పడ్డారు. వ్యాయామం, నడక, యోగా, ప్రాణాయామం, క్రీడల్లో సాధన చేయడం ప్రారంభించారు. ఈనెల 14న వైజాగ్‌లో జరిగిన మారథాన్‌లో మొట్టమొదటిసారిగా జట్టు సభ్యులంతా పాల్గొన్నారు. 5, 10 కి.మీ. పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు.

– న్యూస్‌టుడే, ఆదోని పాత పట్టణం

మమతారామ్ విజయపథం

ఇటీవల వైజాగ్‌లో జరిగిన మారథాన్‌లో 40+ మహిళల విభాగంలో 10 కి.మీ. పరుగులో మమతారామ్ పాల్గొని బంగారు పతకం సాధించారు. భర్త ప్రోత్సాహంతో పోటీల్లో పాల్గొన్నారు. ఈమె కుమార్తె సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కాగా.. అబ్బాయి ఎంబీబీఎస్ చదువుతున్నారు. గతంలో మమతారామ్ వెన్నునొప్పి సమస్యతో బాధపడేవారు. ఈ నేపథ్యంలో రోజువారీ నడకతో దినచర్య ప్రారంభించారు. నిత్యం రెండు గంటల పాటు వ్యాయామానికి సమయం కేటాయిస్తున్నారు. ఫలితంగా ఆరోగ్యం మెరుగైంది. ఇటీవల జరిగిన వివిధ పోటీల్లోనూ ఆమె ప్రతిభ చాటారు.

ఉమాసింహ.. పసిడితో మెరిసెన్

మారథాన్‌లో 25+ విభాగంలో.. ఐదు కి.మీ. పరుగు పందెంలో ఉమాసింహ ప్రతిభ చాటి పసిడి పతకం అందుకున్నారు. ఆమె ఇంటి పనులతోపాటు తీవ్రమైన ఒత్తిడితో ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో రోజూ గంటన్నర పాటు మైదానంలో సాధన చేయడం ప్రారంభించారు. ఓవైపు ఇంటి పనులు పూర్తి చేసుకుంటూనే మరోవైపు వివిధ పోటీల్లో సాధన చేస్తున్నారు. ఫలితంగా ఒత్తిడి దూరమైంది. ఆరోగ్యం గాడిన పడింది. క్రీడల్లో మెలకువలు నేర్చుకుంటూ ముందుకు సాగుతున్నారు. త్వరలో జరిగే పోటీలకు సన్నద్ధమవుతున్నారు.

కస్తూరి.. విజయభేరి

వైజాగ్‌లో జరిగిన మారథాన్ 45+ విభాగంలో పది కి.మీ. పరుగులో కస్తూరి హోసూరు సైతం బంగారు పతకం సాధించారు. ఆమెకు చిన్ననాటి నుంచే క్రీడలంటే మక్కువ. ఈ నేపథ్యంలో పాఠశాల, కళాశాల స్థాయిలో త్రోబాల్, పరుగు పోటీల్లో పాల్గొని పలు పతకాలు సొంతం చేసుకున్నారు. వివాహమైన తర్వాత ఇంటి పనులు, పిల్లలను చూసుకోవడంతోనే సమయం గడిచిపోయింది. ఆమె ఇద్దరబ్బాయిలు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, కుమార్తె జర్మనీలో ఉద్యోగం చేస్తోంది. ఈ నేపథ్యంలో సమయం లభించడంతో క్రీడల వైపు దృష్టి పెట్టారు. ప్రతిభ చాటి పతకాలు అందుకుంటున్నారు.

మర ఆడించి.. విలువ జోడించి

● బియ్యంగా చేసి అమ్ముతున్న అన్నదాతలు

మిల్లులో సిద్ధమైన బియ్యం

ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం అమ్మితే రైతులకు గిట్టుబాటు కావడం లేదు. అదే బియ్యంగా మార్చి విక్రయిస్తే అధిక ఆదాయం వస్తుంది. ఈ విధానంతో దళారుల బెడద, వ్యాపారుల మోసాల బారిన పడకుండా తప్పించుకోవచ్చు. దీనినే పలువురు రైతులు గత కొన్నేళ్లుగా అనుసరిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. కల్తీ లేని బియ్యం కొనేందుకు వినియోగదారులు సైతం అధిక ధర చెల్లించేందుకు వెనకాడటం లేదు. విలువ ఆధారిత ఉత్పత్తులతో అదనపు ఆదాయం లభిస్తోంది.

– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు, ఎమ్మిగనూరు వ్యవసాయం

దళారుల బెడద దూరం

బియ్యంగా మార్చి విక్రయించడం ద్వారా దళారుల బెడద ఉండదు. తూకాల్లో మోసం, కొందరు వ్యాపారులు డబ్బు ఎగ్గొట్టడం వంటివి ఉండవు. పశ్చిమ ప్రాంతంలోని గుడేకల్, నదీ తీర ప్రాంతాలైన గురుజాల, నాగలదిన్నె, కాచాపురం తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు కొన్నేళ్లుగా ఈ విధానాన్ని అనుసరించి ఆదాయం పొందుతున్నారు.

రూ.20 వేల అదనపు ఆదాయం

ఈ ఏడాది అధిక వర్షాలతో ఎకరాకు 20 క్వింటాళ్ల వరి ధాన్యం వచ్చింది. క్వింటా రూ.2 వేల నుంచి రూ.2,100 వరకు పలుకుతోంది. ఈ లెక్కన రూ.42 వేలు వస్తుంది. మర ఆడిస్తే క్వింటాకు 68-70 కిలోల బియ్యం వస్తుంది. ఎకరాకు 14 క్వింటాళ్ల బియ్యం వస్తుంది. మార్కెట్లో క్వింటా రూ.4 వేలు అమ్ముడుపోతోంది. రైతులు నేరుగా అమ్ముతుండటంతో పలువురు క్వింటా రూ.500 అధిక ధర చెల్లించి తీసుకుంటున్నారు. మర ఆడించడంతో రూ.63 వేలు వస్తుంది. విలువ ఆధారిత ఉత్పత్తితో ఎకరాకు రూ.20 వేల వరకు అదనపు ఆదాయం పొందుతున్నారు.

ఐదేళ్లుగా అమ్ముతున్నా

– యేసేపు, హాలహర్వి, నందవరం మండలం

రెండు ఎకరాల్లో వరి సాగు చేయగా 60 బస్తాల దిగుబడి వచ్చింది. క్వింటా రూ.2,100కు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఐదేళ్లుగా మర ఆడించి అమ్ముతున్నా. వినియోగదారులు బియ్యం క్వింటాకు రూ.500 వరకు అధికంగా చెల్లించి తీసుకుంటున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాలలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు ఆమె ఆదివారం తెలిపారు. జిల్లా అధికారులందరూ హాజరుకావాలని చెప్పారు. జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లోనూ వినతులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులు పరిష్కారం కాకున్నా.. పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు ఆన్‌లైన్ ద్వారాగానీ.. టోల్‌ఫ్రీ నంబరు 1100ను సంప్రదించి తెలుసుకోవచ్చని చెప్పారు.

దయాలసిస్ చూపాలి

● 108 సేవలు అందక ఇబ్బందులు

ఉయ్యాలవాడ మండలం మాయలూరుకు చెందిన ఓ వ్యక్తి మూత్రపిండాలు దెబ్బతిన్నాయి. డయాలసిస్ చేయించుకునేందుకు 108లో నంద్యాల వెళ్లేవారు. గతేడాది చివరి నుంచి సేవలు రద్దవడంతో ఇబ్బందులు పడుతున్నారు. తన భార్యను వెంట తీసుకెళ్లాల్సి వస్తోంది. మాయలూరు నుంచి కోవెలకుంట్లకు చేరుకుని 30 కి.మీ. దూరంలో ఉన్న నంద్యాల వెళ్లాల్సి వస్తోంది.

నంద్యాల ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రం

మూత్రపిండాల పనితీరు మందగించి డయాలసిస్ (రక్త శుద్ధి) చేసుకునే రోగులకు గతంలో 108 ద్వారా ఉచిత రవాణా సేవలందేవి. గతేడాది నవంబరు నుంచి బాధితులకు ఈ సేవలు అందడం లేదు. ఫలితంగా రోగులే వ్యయప్రయాసలకోర్చి డయాలసిస్ కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

పదుల సంఖ్యలో బాధితులు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు సర్వజన ఆసుపత్రి, ఆదోని, నంద్యాల ప్రభుత్వ వైద్యాలయాల్లో డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 108 వాహనాలు 54 వరకు ఉన్నాయి. ప్రతిరోజూ సుమారు 30 నుంచి 40 మంది బాధితులు రక్త శుద్ధి చేయించుకుంటుంటారు. 108 అందుబాటులో ఉంటే వాహనంలో ఆక్సిజన్ అందించి రోగికి సాంత్వన చేకూర్చి తీసుకెళ్తుంటారు. ప్రస్తుతం సేవలు ఆగిపోవడంతో రోగుల పరిస్థితి దయనీయంగా మారింది.

ఇబ్బందులు తొలగించాలి

ఉచిత ప్రయాణ సౌకర్యం ఆగిపోవడంతో రోగులు నరక యాతన అనుభవిస్తున్నారు. ప్రభుత్వం బాధితులకు ప్రతి నెలా రూ.10 వేలు అందజేస్తోంది. ఇది మందులకే సరిపోతోంది. ఈ పరిస్థితుల్లో డయాలసిస్ కోసం జిల్లా ఆసుపత్రులకు వెళ్లడం కష్టంగా మారుతోంది. కూటమి ప్రభుత్వం స్పందించి 108 వాహనాలను బాధితులకు అందుబాటులోకి తీసుకొస్తే వారి ఇబ్బందులు తొలగుతాయి.

ఆసుపత్రి	బాధితులు
కర్నూలు సర్వజన	210
ఆదోని ప్రభుత్వ	80
నంద్యాల వైద్యాలయం	98

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
పదవీ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
జీఎస్‌టీ 5% అదనం
ప్రకటనల కొరకు 99899 97628

బౌలర్ల జోరు.. బ్యాటర్ల హుషారు

☛ ఉత్కంఠగా సాగుతున్న ఈఎస్ఎల్ క్రికెట్ పోటీలు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

★ సతీష్
(2 ఓవర్లలో 4 పరుగులిచ్చి హ్యాట్రిక్‌తో 4 వికెట్లు తీశాడు)

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ప్రెజెంట్స్) 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్- 2025' పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. పలు జట్లు నువ్వానేనా అన్నట్లు తలపడుతున్నాయి. ఆదివారం జరిగిన మ్యాచ్‌లలో కూడా బౌలర్లు తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు. బ్యాటర్లు పరుగుల సాధనకు కష్టపడాల్సి వచ్చింది. మొదట బ్యాటింగ్ చేసిన జట్లు భారీ స్కోర్లు సాధించాయి. తర్వాత బ్యాటింగ్ చేసిన జట్టు లక్ష్య ఛేదనలో తడబడి తక్కువ పరుగులకే కుప్పకూలాయి. విజేతలుగా నిలిచిన ఎనిమిది జట్ల మధ్య నేడు సెమీఫైనల్ మ్యాచ్‌లు జరుగనున్నాయి.

కేఎంసీ మైదానంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ముఖ్యఅతిథి, కర్నూలు ఆయుష్మాన్ నర్సింగ్ కాలేజ్ డైరెక్టర్ జి.సలోమి

కేఎంసీ జట్టు వీరవిహారం

పుల్లారెడ్డి కళాశాల మైదానంలో.. ఉదయం మొదటి మ్యాచ్ డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం (కర్నూలు), కర్నూలు మెడికల్ కళాశాల జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన కేఎంసీ జట్టు 4 వికెట్లు కోల్పోయి 130 పరుగులు చేసింది. గోకుల్ 14 బంతుల్లో 7 ఫోర్లతో 34 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఉర్దూ వర్సిటీ జట్టు 7 వికెట్ల నష్టానికి 88 పరుగులే చేసింది. గణేశ్ 17 బంతుల్లో 9 ఫోర్లతో 41 పరుగులు చేశాడు. కేఎంసీ బౌలర్లు గోకుల్ 3, నితిన్ 2, శ్రీనాథ్ 2 వికెట్లు తీశారు. కర్నూలు వైద్య కళాశాల జట్టు 42 పరుగుల తేడాతో విజేతగా నిలిచింది.

కర్నూలు మెడికల్ కళాశాల ఆటగాళ్ల ఆనందం

తిరుగులేని జి.పుల్లారెడ్డి కళాశాల

రెండో మ్యాచ్.. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల (కర్నూలు), మహానంది వ్యవసాయ కళాశాల జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన వ్యవసాయ కళాశాల జట్టు 6 వికెట్ల నష్టానికి 52 పరుగులు చేసింది. ప్రత్యర్థి జట్టు బౌలర్ సాయికుమార్ 12 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల జట్టు 2 వికెట్లు కోల్పోయి విజయానికి కావాల్సిన 53 పరుగులు చేసింది. అహ్మద్ 15 బంతుల్లో 4 ఫోర్లతో 26 పరుగులు చేశాడు. ప్రత్యర్థి జట్టు బౌలర్ సాయి 4 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల జట్టు 8 వికెట్ల తేడాతో గెలుపొందింది.

విజేతగా నిలిచిన జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల జట్టు

శ్రీ సాయికృష్ణ డిగ్రీ కళాశాల క్రీడాకారుల ఆనంద క్షణాలు

శ్రీ సాయికృష్ణ జట్టు సత్తా

పుల్లారెడ్డి కళాశాల మైదానంలో మూడో మ్యాచ్.. శ్రీ సాయికృష్ణ డిగ్రీ కళాశాల (కర్నూలు), ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల (నంద్యాల) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్టు 4 వికెట్ల నష్టానికి 88 పరుగులు చేసింది. మహేంద్ర 16 బంతుల్లో 3 ఫోర్లతో 19 పరుగులు చేశాడు. ప్రత్యర్థి జట్టు బౌలర్ తిరుమలేశ్ 18 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రీ సాయికృష్ణ డిగ్రీ కళాశాల జట్టు 3 వికెట్లు కోల్పోయి 90 పరుగులు చేసింది. మనోజ్ 12 బంతుల్లో 3 ఫోర్లతో 27 పరుగులు చేశాడు. శ్రీ సాయికృష్ణ డిగ్రీ కళాశాల జట్టు 7 వికెట్ల తేడాతో గెలిచింది.

శ్రీ సుధ కళాశాల జట్టు దూకుడు

కర్నూలు మెడికల్ కళాశాల మైదానంలో.. ఉదయం మొదటి మ్యాచ్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల (డోన్), శ్రీ సుధ జూనియర్ కళాశాల (డోన్) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన శ్రీ సుధ కళాశాల జట్టు 2 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. లోహిత్ 36 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 75 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ప్రభుత్వ ఐటీఐ కళాశాల (డోన్) జట్టు 7 వికెట్లు కోల్పోయి 44 పరుగులే చేయగలిగింది. ప్రత్యర్థి జట్టు బౌలర్ లోహిత్ 10 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. శ్రీ సుధ జూనియర్ కళాశాల జట్టు 78 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది.

శ్రీ సుధ జూనియర్ కళాశాల క్రీడాకారుల సంబరాలు

ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల పట్టు

కేఎంసీ మైదానంలో రెండో మ్యాచ్.. ఎస్వీఆర్ డిప్లొమా కళాశాల (నంద్యాల), ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (నంద్యాల) జట్ల మధ్య జరిగింది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ఎస్వీఆర్ జట్టు బ్యాటర్లు 58 పరుగులకే ఆలౌట్ అయ్యారు. సాహిద్ 15 బంతుల్లో 2 ఫోర్లతో 20 పరుగులు చేశాడు. ప్రత్యర్థి జట్టు బౌలర్ రామ్‌చరణ్ 18 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఈఎస్‌సీ పాలిటెక్నిక్ కళాశాల జట్టు ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. నవీన్ 12 బంతుల్లో 3 ఫోర్లతో 19 పరుగులు చేశాడు. ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు 9 వికెట్ల తేడాతో విజేతగా నిలిచింది.

నంద్యాల ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆటగాళ్ల విజయోత్సాహం

చెలరేగిన శాంతిరామ్ మెడికల్ కళాశాల

మూడో మ్యాచ్ సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల (కర్నూలు), శాంతిరామ్ మెడికల్ కళాశాల (నంద్యాల) జట్ల మధ్య జరిగింది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన శాంతిరాం మెడికల్ కళాశాల జట్టు 112 పరుగులు చేసింది. జయవర్ధన్ 16 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 35 పరుగులు చేశాడు. ప్రత్యర్థి జట్టు బౌలర్లు సురేందర్, సుప్రీత్‌లు చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల జట్టు 9 వికెట్ల నష్టానికి 53 పరుగులే చేసింది. అభిషేక్ 30 బంతుల్లో 3 ఫోర్లతో 24 పరుగులు చేశాడు. శాంతి రామ్ జట్టు బౌలర్ సతీష్ 4 పరుగులిచ్చి హ్యాట్రిక్‌తో 4 వికెట్లు తీశాడు. శాంతిరాం మెడికల్ కళాశాల జట్టు 59 పరుగులతో విజయం సాధించింది.

విజయం సాధించిన నంద్యాల శాంతిరామ్ మెడికల్ కళాశాల జట్టు

నేటి సెమీఫైనల్ మ్యాచ్‌లు

జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో..

- ☛ ఉదయం 8 గంటలకు : శ్రీ సుధ జూనియర్ కళాశాల (డోన్) Vs ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (నంద్యాల)
- ☛ ఉదయం 10 గంటలకు : జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల (కర్నూలు) Vs కర్నూలు వైద్య కళాశాల, కర్నూలు

కర్నూలు వైద్య కళాశాల మైదానంలో..

- ☛ ఉదయం 8 గంటలకు : ప్రభుత్వ టౌన్ జూనియర్ కళాశాల (కర్నూలు) Vs కేవీ సుబ్బారెడ్డి పాలిటెక్నిక్ కళాశాల (దూపాడు)
- ☛ ఉదయం 10 గంటలకు : శ్రీ సాయికృష్ణ డిగ్రీ కళాశాల (కర్నూలు) Vs శాంతిరాం మెడికల్ కళాశాల (నంద్యాల)

Title Sponsor
Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Protein Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) NECC "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner
CMR SHOPPING MALL The joy of life
Regional Sponsor
MITS DEEMED TO BE UNIVERSITY www.mits.ac.in MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner ఈనాడు.నెట్ ETV BHARAT
TV Partner ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు ఛాంపియన్ క్లబ్

కార్యకర్తలే పార్టీకి అసలైన అధినేతలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీలో ప్రతి కార్యకర్త అధినేతతో సమానమని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. తెదేపా కార్యాలయంలో ఆదివారం ఉత్తమ కార్యకర్తల సమన్వయ సమావేశం నిర్వహించారు. కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం శ్రమించే వారిని గుర్తించి గౌరవించుకోవడం మన బాధ్యత అన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్యకర్తలను సత్కరించారు.



ఉత్తమ కార్యకర్తకు ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి ఫరూక్

పేదల పెన్నిధి ముఖ్యమంత్రి సహాయనిధి

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. తన కార్యాలయంలో మంత్రి ఆధ్వర్యంలో 91మంది లబ్ధిదారులకు రూ.41 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఏడాదిన్నరలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 484 మంది లబ్ధిదారులకు రూ.3.78 కోట్ల ఆర్థిక సాయం అందించామన్నారు. కూటమి ప్రభుత్వం పేదల పక్షాన ఉంటుందన్నారు. నిరుపేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనంతరం బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. స్థానిక మంత్రి కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

రజకుల సంక్షేమానికి కృషి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం రజకుల సంక్షేమానికి కృషి చేస్తోందని నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి అన్నారు. సంజీవనగర్ గేటు నుంచి ఆర్‌కే ఫంక్షన్‌హాల్ వరకు ఆదివారం రజక సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర రజక కార్పొరేషన్ ఛైర్మన్ సావిత్రి అధ్యక్షతన జరిగిన రజక ఆకాంక్ష సభకు ముఖ్య అతిథిగా బైరెడ్డి శబరి, కర్నూలు జిల్లా తెదేపా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ హాజరయ్యారు. శబరి మాట్లాడుతూ..రజకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సావిత్రి మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా రజకులు అన్ని రంగాల్లో రాణించే విధంగా చైతన్య పరుస్తున్నామన్నారు. రామాంజనేయులు, చంద్రశేఖర్, సతీష్‌కుమార్, దుర్గారావు, చంద్ర, ఏపీఎస్ఎస్‌సీప బోర్డు సభ్యుడు రామ మద్దిలేటి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ డా.బైరెడ్డి శబరి

రాష్ట్రస్థాయిలో జిల్లా విద్యార్థుల ప్రతిభ

నంద్యాల విద్య, న్యూస్‌టుడే: తిరుపతిలోని జాతీయ సంస్కృత యూనివర్సిటీలో ఈనెల 27న నిర్వహించిన రాష్ట్రస్థాయి కౌశల్ క్విజ్, పోస్టర్ ప్రదర్శన, రీల్స్ వంటి ప్రతిభా పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి, జిల్లా కౌశల్ సమన్వయకర్త సుబ్బారెడ్డి, సంయుక్త సమన్వయకర్త నాగేంద్ర కుమార్ తెలిపారు. శ్రీశైలం సున్నిపెంట ఏపీఆర్ఐఈఎస్ పాఠశాలకు చెందిన సాయికృష్ణ, బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన శరణ్య పోటీల్లో నాల్గొవ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారన్నారు. వారికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి చేతులమీదుగా బహుమతులు, జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేశారన్నారు.

మంత్రి సత్యకుమార్‌యాదవ్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న విద్యార్థి

గిరిజన కుటుంబాల ఇంటి వద్దకే వైద్యసేవలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని చెంచు గిరిజన కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 'మీ ఇంటికి.. మీ డాక్టర్' కార్యక్రమాన్ని ఫిబ్రవరి ఒకటవ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు జి.రాజకుమారి వెల్లడించారు. కార్యక్రమాన్ని ఆర్ఈసీ ఫౌండేషన్, రెడ్‌క్రాస్ ఆర్థిక సహకారంతో జిల్లాలో అమలు చేయనున్నట్లు ఆమె ఆదివారం తెలిపారు. జిల్లాలో ప్రాజెక్టును రూ.1.2కోట్లతో మూడేళ్ల పాటు అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. చెంచు కాలనీవాసులకు మొబైల్ హెల్త్ క్లినిక్స్ ద్వారా ఇంటి వద్దకే ప్రాథమిక వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. మొబైల్ హెల్త్ క్లినిక్ నిర్వహణ కోసం వైద్యులు, నర్స్, ఫార్మసిస్ట్, డ్రైవర్ పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు.

హిందువులు ఐకమత్యంగా ఉండాలి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: హిందువులు ఐకమత్యంగా ఉండాలని శ్రీశైలం దత్త పీఠాధిపతి శివానంద సరస్వతి స్వామిజీ పిలుపునిచ్చారు. కోటా వీధిలోని బ్రహ్మనందీశ్వర స్వామి ఆలయం వద్ద ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని పరిరక్షించేందుకు పాటుపడాలన్నారు. భరతమాత, శివాజీ విగ్రహాలకు పూలమాల వేశారు. శేషఫణి, శ్రీనివాసులు, కృష్ణలింగమ్మ, అరుణ, శిరీషా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.4.44 లక్షల విరాళం

డోన్, న్యూస్‌టుడే: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమానికి పట్టణానికి చెందిన కోరి తిమ్మక్క కుమారులు పెద్దఆంజనేయులు, చిన్నఆంజనేయులు రూ.4,44,444 నగదు విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. నిత్యాన్నదాన కార్యక్రమానికి తమవంతుగా ఈ సాయం అందిస్తున్నామన్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గురుస్వాములు పాల్గొన్నారు.

నిర్వాహకులకు నగదు అందిస్తున్న దాతలు

మహానందీశునికి ప్రముఖుల పూజలు

కుటుంబ సభ్యులతో తెలంగాణ సమాచార కమిషనర్ పీవీ శ్రీనివాసరావు

మహానంది, న్యూస్‌టుడే: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం మహానంది ఆలయాన్ని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ పీవీ శ్రీనివాసరావు తన కుటుంబ సభ్యులతో, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామివార్లకు అభిషేకాలు, కుంకుమార్చనలు, గోపూజ, నామార్చనలు చేసుకున్నారు. వారికి దేవస్థానం నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం ఏఈవో ఎర్రమల మధు జ్ఞాపికను అందజేయగా వేదపండితులు రవిశంకరఅవధాని, నాగేశ్వరశర్మలు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

మద్దిలేటిస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

స్వామి పూజల్లో ఈవో రామాంజనేయులు, అర్చకులు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మద్దిలేటయ్య క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో కలశస్థాపనతోపాటు వివిధ అభిషేకాలు, పూజలు, హారతులు ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులను ఊరేగించారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, అర్చకులు పాల్గొన్నారు.

'విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెట్టేస్తున్న పాలకులు'

నంద్యాల విద్య, న్యూస్‌టుడే: సంస్కరణల పేరుతో విద్యారంగాన్ని పాలకవర్గాలు సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయని యూటీఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షుడు సురేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు పీవీ ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో ఆదివారం యూటీఎఫ్ నాల్గొవ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధన సమయాన్ని హరిస్తూ బోధనేతర కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తున్నారన్నారు. విద్యను ప్రవేటీకరిస్తున్నారని విమర్శించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పూర్వ గౌరవాధ్యక్షుడు నరసింహుడు, నాయకులు సుబ్బారెడ్డి, సుబ్బరాయుడు, సత్యప్రకాశం, ఐజయ్య, నాగస్వామినాయక్, సుజాత, రాంమోహన్, రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సురేష్‌కుమార్

పల్లవించిన విజయం

◆ పవర్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్న యువతి

పల్లవి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: పవర్ లిఫ్టింగ్ వంటి కఠినమైన పోటీల్లో రాణించాలంటే క్రమశిక్షణ, నిరంతర శ్రమ, పట్టుదల, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో పాటు మంచి శిక్షణ అవసరం. ఇలాంటి ఆటల్లో జాతీయ స్థాయిలో రాణిస్తూ ప్రత్యేక గుర్తింపు సాధించి ప్రశంసలు పొందుతోంది నంద్యాలకు చెందిన పల్లవి. పోటీల్లో పాల్గొంటూనే మహిళా జిమ్‌లో శిక్షకురాలిగా పనిచేస్తూ అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు సాధన చేస్తుంది.

◆ నంద్యాల పట్టణం గుడిపాటిగడ్డకు చెందిన కృష్ణయ్య, రాజ్యలక్ష్మి దంపతుల కుమార్తె పల్లవి డిగ్రీ పూర్తి చేసి ప్రభుత్వ, రైల్వే ఉద్యోగాలకు సిద్ధమవుతోంది. ఆమె బంధువులు పవర్ లిఫ్టింగ్ సాధన చేస్తుంటే చూసి పల్లవి కూడా మక్కువ పెంచుకుని 8వ తరగతి నుంచి పలు పవర్ లిఫ్టింగ్ క్రీడా పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో బహుమతులు అందుకుంది. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు పల్లవి పేర్కొన్నారు.

సాధించిన పతకాలు

- ◆ 2020లో ఛత్తీస్‌గఢ్ జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని 43 కిలోల విభాగంలో బంగారు పతకం.
- ◆ 2021లో మహారాష్ట్రలో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 43 కిలోల విభాగంలో బంగారు, వెండి పతకాలు.
- ◆ 2023లో తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం.
- ◆ 2023 వైజాగ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో బంగారు, వెండి పతకాలు.
- ◆ 2024 అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు వెండి పతకాలు అందుకుని జాతీయ స్థాయికి ఎంపిక.
- ◆ 2024 అక్టోబరులో గోవాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రాణించింది.
- ◆ 2025 గుడివాడలో జరిగిన 18వ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్ పోటీల్లో బంగారు పతకాలు.
- ◆ 2025 కోల్హాపూర్‌లో జరిగిన జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 5వ స్థానం.
- ◆ 2026 జనవరి 7 నుంచి 11వ తేదీ వరకు హరియాణాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతోంది.

క్రీడల్లో గెలుపోటములు సహజం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: క్రీడల్లో గెలుపోటములు సహజమని రాయలసీమ విశ్వవిద్యాలయం ఉపకులపతి వి.వెంకట బసవరావు, రిజిస్ట్రార్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాయలసీమ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. పురుషుల 100 మీటర్ల రన్నింగ్‌లో జోసెఫ్, దీవెన్‌కుమార్, 200 మీటర్ల పరుగులో మహేశ్, జోసెఫ్, జీవన్‌కుమార్ వరుస స్థానాల్లో నిలిచారు. 400మీటర్ల పరుగులో రాముడు ఉపేంద్ర, రంగస్వామిలు, పురుషుల జావెలిన్‌త్రోలో వెంకట శ్రీనాథ్, ఎస్.షరీఫ్ అహ్మద్, గాబ్రియల్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మహిళల 1500 మీటర్ల రన్నింగ్‌లో ప్రసన్న, మానస, తేజస్విని మొదటి స్థానాల్లో నిలిచారు. షార్ట్‌పుట్‌లో కీర్తన, జయశ్రీ, మహిళల డిస్కస్ త్రోలో ప్రసన్న, మహేశ్వరి గెలుపొందారు. పురుషుల 1500 మీటర్ల పరుగులో శివలింగప్ప, బషీర్ ఉపేంద్రలు, 400 మీటర్ల పరుగులో పరుశురాముడు, సుదర్శన్, రంగస్వామిలు వరుసగా నిలిచారు. స్పోర్ట్స్ బోర్డ్స్ కార్యదర్శి కేవీ శివకిషోర్, ప్రిన్సిపల్ డా.శశికళ, కార్యనిర్వాహక కార్యదర్శి కె.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో ఉపకులపతి వి.వెంకటబసవరావు

క్రీడాకారులకు కిట్ల అందజేత

నంద్యాల పట్టణం: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని రాయలసీమ విశ్వవిద్యాలయం ఉప కులపతి వెంకట బసవరావు పేర్కొన్నారు. విజయవాడ, రాజమండ్రిల్లో జనవరి 5 నుంచి ప్రారంభంకానున్న దక్షిణభారత అంతర్ విశ్వవిద్యాలయాల షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే రాయలసీమ విశ్వవిద్యాలయం జట్లకు రామకృష్ణ కళాశాలలో స్పోర్ట్ కిట్లను రిజిస్ట్రార్ విజయకుమార్‌తో కలిసి అందజేశారు. విశ్వవిద్యాలయం ఫిజికల్ అసిస్టెంట్ డైరెక్టర్ డా.కేవీ శివకిశోర్, రామకృష్ణ విద్యాసంస్థల సంచాలకుడు జి.హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

కొత్తగా ప్రారంభించిన కంపెనీ ఆన్‌లైన్ అవకాశం. వీక్లీ 5K to 10K. ఆదాయం సంపాదించుకొనే అవకాశం.Q: డిగ్రీ గృహిణులు, స్టూడెంట్స్.✆ 99859 37461.

బెంగుళూరులో పనిచేయుటకు ప్రముఖ వస్త్ర దుకాణంలో అనుభవం గల సేల్స్‌మెన్స్ కావలెను. Age: 18-45Y, ESI+PF+ జీ-17K ✆ 70196 32854.

YAC- వారి ముందడుగు మీడియాలో పనిచేయుటకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా అభ్యర్థులు కావలెను. తేది: 3/1/26 సంప్ర: కాంకర్ కాలేజీ, సి-క్యాంప్, కర్నూలు. ✆ 73309 24873, 98854 85281.

REAL ESTATE

FLAT FOR SALE

నంద్యాల చెక్ పోస్ట్ దగ్గరలో మేము కొత్తగా నిర్మించబోయే అపార్ట్ మెంటులో ఫుల్ పేమెంట్ తో 3 flats (1400 Sft, 3 BHK, 1100 Sft, 2 BHK) Cost to Cost అమ్మబడును. ఆసక్తి గలవారు సంప్రదించండి. ✆ 72078 97528, 96189 22589.

JOBS

Wanted Male Marketing Staff and Male Administrative staff qualification any Degree, Age Limit: 30 to 45 years. Salary upto: 20000/-, Working Location: Master Minds College, Kurnool, Contact: 92487 33342.

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్, HDFC/AXIS బ్యాంక్ క్లర్క్స్, లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆ 9703971968.

కర్నూలు నగరంలో స్కార్పియో వాహనం నడుపుటకు అనుభవం గల కారు డ్రైవర్ కావలెను. సంప్ర: 73309 24873, 98854 85281.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

నంద్యాల

•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

తెదేపాకు కార్యకర్తలే అధినేతలు

వెల్పనూరు(వెలుగోడు), మహానంది, న్యూస్‌టుడే:

కార్యకర్తలకు అవార్డు, ధ్రువపత్రాలు అందించిన ఎమ్మెల్యే

తెదేపాకు కార్యకర్తలే అధినేతలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వెల్పనూరులో ఆదివారం ఉత్తమ కార్యకర్తల సమన్వయ సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 18నెలల్లో చేపట్టిన పథకాల గురించి వివరించారు. కార్యకర్తల అభివృద్ధి, సంక్షేమం కోసం పార్టీ చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్యకర్తలను సత్కరించి, అవార్డులను అందజేశారు. వైకాపా అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని సూచించారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

పగిడ్యాల: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ముచ్చుమర్రి ఎస్సై నరేంద్ర హెచ్చరించారు. పగిడ్యాలలో ఆదివారం డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించాలని, కారు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: ?: అంజుమాన్ వీధి, ఫారూక్‌నగర్‌లో కాల్వలు వ్యర్థాలతో నిండిపోయి ఇబ్బందులు పడుతున్నాం. దోమలు, దుర్వాసన అధికమైంది. -సలీం, సురేష్ ?: పట్టణంలోని చిత్తులూరివారి వీధిలో కుక్కలు అధికమయ్యాయి. - ప్రియ ✔: సిబ్బంది దిన పంపి కాల్వలు శుభ్రం చేయిస్తాం. దోమల మందు పిచికారీ చేసి సమస్య పరిష్కరిస్తాం. కుక్కలను పట్టిస్తాం. - శివప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?:పాత బస్టాండులో చేతిపంపు పని చేయటం లేదు. వ్యాపారులు నీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - సాయిప్రసాద్, వ్యాపారి ✔:చేతిపంపునకు మరమ్మతులు చేయిస్తాం. - షాహీర్‌బాషా, పురపాలక ఏఈ

?:తోటగేరిలోని మురుగు కాల్వల్లో పూడిక, వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన వెదజల్లుతోంది. - రబ్బానీ, స్థానికుడు ✔: సిబ్బందితో కాల్వల్లో పూడిక తొలగిస్తాం. - జీవన్, శానిటరీ ఇన్‌స్పెక్టరు

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ?: నాగటూరు గ్రామంలో ఎంపీయూపీ పాఠశాల సమీపంలో రహదారిపై చెత్త వేస్తున్నారు. -రాముడు ✔: రహదారిపై చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. - జావిద్, పంచాయతీ కార్యదర్శి

క్విజ్‌లో రాణించి.. విజేతలుగా నిలిచి

పరీక్షలో పాల్గొన్న రోటరీ పాఠశాల విద్యార్థులు

బహుమతులు అందుకున్న విద్యార్థులు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణం శ్రీనివాసనగర్‌లో ఉన్న రోటరీ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇస్లాముద్దీన్, భవానిదీక్షిత, వసుంధర మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి ప్రిన్సిపల్ నిజాముద్దీన్ బహుమతులు అందజేశారు.

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: ప్రతిభా పోటీలతో విద్యార్థుల మెదడుకు పదును పెట్టవచ్చని బాల అకాడమీ రవీంద్ర ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. చరిత, త్రివేణి, మెహతాబ్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి ఉపాధ్యాయులు సుదర్శన్, సురేష్‌బాబు, బాబాఫక్రుద్దీన్, రేష్మ బహుమతులు అందజేశారు.

పరీక్ష రాస్తున్న బాల అకాడమీ విద్యార్థులు

గెలిచిన వారితో ఉపాధ్యాయులు

సక్రమానికి సదవకాశం

★ 'బీపీఎస్'తో అనుమతులు, ప్రయోజనాలు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో అనుమతుల్లేకుండా నిర్మించిన అక్రమ కట్టడాలు, భవనాలు, దుకాణాలు, వ్యాపార సముదాయాలపై పట్టణ ప్రణాళిక అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీంను(బీపీఎస్) అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ పథకం కింద పట్టణంలో అనుమతుల్లేని నిర్మాణాల యజమానులకు నోటీసులు జారీ చేసి, గోడలపై బీపీఎస్ అని ముద్రిస్తున్నారు. బీపీఎస్ విధానంలో నిర్మాణాలకు అనుమతులు తీసుకోవాలని, దీంతో ప్రయోజనాలను పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయం సిబ్బంది వివరిస్తున్నారు.

అనుమతుల్లేని భవనంపై నంబరు రాస్తున్న సిబ్బంది

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

పురపాలక సంఘంలో పట్టణ ప్రణాళిక అనుమతులు తీసుకోకుండా ఇళ్లు, దుకాణాలు, వ్యాపార సముదాయాలు నిర్మించుకున్నారు. దీంతో ఆదాయానికి గండిపడుతుందని గుర్తించిన ప్రభుత్వం అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించుకునేందుకు 'బీపీఎస్'ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విధానంలో భవన యజమానులు అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు పరిశీలించిన పట్టణ ప్రణాళిక అధికారులకు చలానా చెల్లిస్తే క్రమబద్ధీకరించనున్నారు. పట్టణంలో ఇప్పటి వరకు దాదాపు వంద మందికి నోటీసులు జారీ చేసి, మిగిలిన అక్రమ కట్టడాల గుర్తింపు పనిలో నిమగ్నమయ్యారు.

అవసరమైన ధ్రువపత్రాలు

- రిజిస్ట్రేషన్ పత్రాలు
- లింకు డాక్యుమెంట్
- నకలు ఈసీ
- మార్కెట్ వాల్యూ
- నిర్మాణ స్థిరత్వ పత్రం
- రహదారి వెడల్పు పత్రం
- పాత ప్లానింగ్, ప్రొసీడింగ్స్
- ఆధార్ కార్డు, పాస్ ఫొటో
- భవనం ఫొటోలు

ఉపయోగాలు ఇలా..

చట్టబద్ధత: ఇళ్లు, భవన నిర్మాణాలకు చట్టబద్ధత లభిస్తుంది. అనధికార నిర్మాణాలపై సర్వేలు, తనిఖీలు చేపట్టిన సమయంలో ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు.

ఆస్తి విలువ పెరుగుదల: అనధికార నిర్మాణాలకు మార్కెట్ విలువ తక్కువ ఉంటుంది. అనుమతులు తీసుకుంటే ఆన్‌లైన్‌లో విలువ పెరుగుతుంది.

ఆస్తులు రికార్డుల్లోకి: అనుమతి తీసుకోవడంతో ఆస్తుల వివరాలు పురపాలక రికార్డుల్లో భద్రంగా ఉంటాయి. భవిష్యత్తులో వివాదాలకు ఆస్కారం ఉండదు.

మౌలిక వసతుల కల్పన: కుళాయి, విద్యుత్తు, మురుగు కాల్వలు, అంతర్గత రహదారులు వంటి మౌలిక వసతులు అధికారికంగా పొందవచ్చు. అనధికార నిర్మాణాలకు మౌలిక వసతులు కల్పించరు.

నిర్మాణాలకు పెనాల్టీలు దూరం: అక్రమ కట్టడాలకు అనుమతుల ఫీజులు ఆస్తి పన్నులో పెనాల్టీల రూపంలో వసూలు చేస్తున్నారు. అనుమతులు తీసుకునేంత వరకు పెనాల్టీ విధిస్తూనే ఉంటారు.

బ్యాంకులో రుణం: అనుమతుల్లేని భవనాలు, వ్యాపార సముదాయాలకు బ్యాంకుల్లో రుణాలు మంజూరు చేయరు.

ప్రసంగిస్తున్న శ్రీపద్మానంద యోగి

ఐక్యత చాటేందుకే హిందూ సమ్మేళనం

పగిడ్యాల, న్యూస్‌టుడే: హిందువుల ఐక్యతను చాటడమే హిందూ సమ్మేళనం ముఖ్య ఉద్దేశమని హిందూమత ప్రచారకులు పద్మానంద యోగి, బి.చంద్రమౌళీశ్వరరెడ్డి అన్నారు. పగిడ్యాలలోని లక్ష్మీ చెన్నకేశవ ఆలయ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన హిందూ సమ్మేళనానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా. . సనాతన ధర్మం, సంప్రదాయాలు, ఆచారాలు, కళలు, సంస్కృతులు, ఇతిహాసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్యాల నాగిరెడ్డి, సత్యంరెడ్డి, రాజశేఖర్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా అసోసియేషన్ ఇండియా అధ్యక్షుడికి సన్మానం

నందికొట్కూరు, న్యూస్‌టుడే: సెపక్‌తక్రా అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసులను ఘనంగా సన్మానించారు. స్థానిక శ్రీనవనంది పాఠశాల ఆవరణలో ఆదివారం క్రీడాకారులకు దుస్తుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆయన్ను సన్మానించారు. రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శిగా పనిచేసిన ఆయన అనతి కాలంలోనే ఇండియా అధ్యక్షుడిగా ఎంపికైనట్లు వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సెపక్‌తక్రా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీధర్, వ్యాయామోపాధ్యాయుడు శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా?

బ్రాహ్మణకొట్కూరులో రోడ్డు పక్కన గుంతలు తీసి వదిలేయడంతో అటుగా రాకపోకలు సాగించే వారికి ముప్పు తప్పడం లేదు. ఏడాది క్రితం ముచ్చుమర్రి నుంచి ఒర్వకల్లు హబ్‌కు కృష్ణాజలాలు తీసుకెళ్లేందుకు పైప్‌లైను పనులు చేశారు. పలుచోట్ల పైప్‌లైను లీక్ చేసుకునేందుకు గుంతలు పూడ్చకుండా వదిలేశారు. ఆరు నెలల క్రితం ఆ గుంతలో ఓ వ్యక్తి పడి మృతి చెందాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నందికొట్కూరు గ్రామీణం

రోడ్డు ఛిద్రం.. ప్రయాణం ఇబ్బందికరం

నంద్యాల పట్టణంలోని సంజీవనగర్‌గేట్ సిమెంటు రోడ్డు ఛిద్రమై ప్రమాదకరంగా మారింది. నిత్యం వాహనదారులతో రద్దీగా ఉండే రహదారిలో రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

నిండుగా ఇసుక.. ప్రయాణికుల అవస్థ

నంద్యాల పట్టణంలో ట్రాక్టర్ ట్రాలీలో నిండుగా ఇసుక నింపుకొని.. పైన పట్టాలు లేకుండా వేగంగా ప్రయాణిస్తున్నారు. దీంతో గాలికి ఇసుక రేణువులు లేచి వెనకాల వచ్చే ప్రయాణికుల కళ్లలో పడి ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలో ట్రాక్టర్లు నిత్యం ఇలానే రాకపోకలు సాగిస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

పేరుకున్న చెత్త.. తరలించక చింత

మండల కేంద్రమైన గడివేములలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అమలు కావడం లేదు. గ్రామ శివార్లలో చెత్తనిల్వలు పేరుకుపోతున్నాయి. దీంతో రహదారి వెంట దుర్వాసన వస్తోందని గ్రామస్థులు తెలిపారు. చెత్తకు నిప్పంటుకోవడంతో చెత్తతోపాటు వాటిని నిల్వచేసే సంచులు కాలిపోతున్నాయి. అధికారులు చర్యలు తీసుకొని చెత్తబుట్టలో ఉన్న చెత్తను తరలించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గడివేముల

సంక్షిప్త సమాచారం

మహానంది: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని మహానందిలోని సీతాకోదండ రామాలయంలో మంగళవారం దేవస్థానం ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన నిర్వహించనున్నారు. ఏటా ఈ రోజున భక్తులకు ఉత్తర ద్వారం నుంచి దర్శనాన్ని కల్పిస్తున్నామని పండితులు తెలిపారు.

నందికొట్కూరు: మండలంలోని 10 బొల్లవరం గ్రామ శివారులో వెలసిన అలివేలు మంగమ్మ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని వైకుంఠ ఏకాదశికి సిద్ధం చేశారు. 10 సంవత్సరాలుగా వైకుంఠ దర్శనం కోసం ఉత్తర ద్వారం నిర్మాణం చేయాలని సంకల్పించారు. ఈ ఏడాది పూర్తి చేశారు.

మసీదుపురం(మహానంది): మండలంలోని మసీదుపురం గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త ఆవుల చిన్నపుల్లన్న(65) మృతి చెందారు. దీంతో ఆయన అంత్యక్రియలకు తెదేపా మండల క్లస్టర్ ఇన్‌ఛార్జ్ నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

నంద్యాల రైతునగరం: కర్నూలు జిల్లా కార్యాలయంలో జనవరి 4న జరగబోతున్న వడ్డెర హక్కుల సదస్సును జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీకాంతయ్య, కార్యదర్శి వెంకటేశ్ ప్రకటనలో పేర్కొన్నారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, చట్టసభల్లో అవకాశం కల్పించాలని కోరారు.

నంద్యాల పట్టణం: జిల్లా తెదేపా మీడియా కో-ఆర్డినేటర్‌గా ఎన్నికైన డండే వెంకటనరేశ్‌ను బలిజ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. వర్ధంశెట్టి రాజారాం, పసుపులేటి జనార్దన్, కొమ్మ శ్రీహరి, గద్వాల ఆదినారాయణ, హర్ష, వేణు, శివశంకర్, శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం గ్రామీణం: జిల్లా స్థాయి మహిళల కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు సోమవారం పాణ్యంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి, ఎంఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. విజయానికేతన్ పాఠశాలలో పోటీల్లో జిల్లాలోని మహిళలు పాల్గొనవచ్చన్నారు.

పాణ్యం గ్రామీణం: ఎస్ కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు.

పాణ్యం గ్రామీణం: పాణ్యం గ్రామంలో ప్రతి ఆదివారం నిర్వహించే సంతలో వసతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం సంతను సందర్శించి పలు సమస్యలను పరిశీలించారు. వ్యాపారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రహదారిపైనే కూరగాయలు పెట్టుకుంటున్నామని సందు చిన్నగా ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ప్రతి సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

పాణ్యం గ్రామీణం: డిసెంబర్ 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే 18వ అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, జిల్లా నాయకులు వెంకట లింగం, మండల కార్యదర్శి భాస్కర్ అన్నారు. సీఐటీయూ చైతన్య జీపుజాత ఆదివారం పాణ్యం మండల కేంద్రానికి చేరుకుని సభను జయప్రదం చేయాలని కోరారు.

పుస్తకావిష్కరణలో అతిథులు

జీవన వ్యవహారాల్లో తెలుగు వినియోగం పెంచాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జీవన వ్యవహారాల్లో తెలుగు వినియోగాన్ని పెంపొందించడానికి అందరూ కృషి చేయాలని మాతృభాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు డా.దీవి హయగ్రీవాచార్యులు పేర్కొన్నారు. శ్రీశైల పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం మాతృభాషా పరిరక్షణ సమితి 20వ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులు చంద్రశేఖర కల్కూర, జేఎస్ఆర్.శర్మ మాట్లాడుతూ.. తెలుగు భాష, సంస్కృతి, సాహిత్య విశిష్టతను మననం చేసుకోవాలన్నారు. కర్నూలుకు చెందిన సాహితీవేత్త జేఎస్ఆర్.శర్మ రచించిన 'రాయలసీమ కావ్య సముద్ర మథనం', 'పింగళి సూరన సాహితీ వైభవం' పుస్తకాలను ఆవిష్కరించారు. విశ్రాంత శాస్త్రవేత్త డా.రవీంద్రనాథ్, సమితి కార్యదర్శి అన్నెం శ్రీనివాసరెడ్డి, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డండెబోయిన పార్వతి, డా.గెల్వి సహదేవుడు, డా.కోడెకుమార్, దేశం సులోచన పాల్గొన్నారు.

ఓర్పు, నేర్పుతో సద్గుణాలు అలవర్చుకోవాలి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో భగవత్ సేవా సమాజ్, నంది రైతు సమాఖ్య, తితిదే దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారి సహకారంతో నిర్వహిస్తున్న తిరుప్పావై ప్రవచనాలు ఆదివారం కొనసాగించారు. ప్రవచన కర్త డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు ప్రసంగిస్తూ ఓర్పు, నేర్పుతోనే ప్రతి ఒక్కరూ సద్గుణాలు అలవర్చుకోవాలన్నారు.

మైనార్టీల రక్షణకు చట్టాన్ని రూపొందించాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: మైనార్టీల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని ముస్లిం జేఏసీ గౌరవాధ్యక్షుడు అబులైస్, క్రిస్టియన్ జేఏసీ పాస్టర్ జానయ్య అన్నారు. పట్టణంలోని గాంధీచౌక్‌లో ఆదివారం ముస్లిం, క్రిస్టియన్ ఐకాస, ఎస్సీ, ఎస్టీ, బీసీ నేతలు, వామపక్ష, కాంగ్రెస్ పార్టీల నాయకులు పాల్గొని మౌన దీక్ష చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, నాయకులు అబ్దుల్ సమద్, బాషా, మౌలానా అబ్దుల్లా, ఏజాస్ హుస్సేన్, చింతల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీచౌక్‌లో నిరసన దీక్షలో నాయకులు

అండర్-14 క్రికెట్ ఎంపిక పోటీలు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణం కాంతినగర్ సబ్ సెంటర్‌లో అండర్-14 క్రికెట్ ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించారు. కర్నూలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గోవింద్‌రెడ్డి, సెక్రటరీ దేవేంద్ర గౌడ్, ఏవో రమేష్ బాబు క్రీడాకారులను ఎంపిక చేశారు. కర్నూలు జిల్లా క్రికెట్ అసోసియేషన్, నంద్యాల కోచ్ ప్రసన్న, ఫిట్‌నెస్ ట్రైనర్ శేఖర్ పాల్గొన్నారు.

కాలమానిని ఆవిష్కరణ

నంద్యాల విద్య, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని పుల్లారెడ్డి భవన్‌లో రెడ్డి సంఘం నూతన క్యాలెండర్లను ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుహాసినిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, రాయలసీమ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, జిల్లాల అధ్యక్షులు రామేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హక్కు పరిరక్షణకు ఉద్యమించాలి

నంద్యాల రైతునగరం: ఉపాధి హక్కు పరిరక్షణకు కార్మికులంతా ఉద్యమించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ నంద్యాల డివిజన్ కార్యదర్శి శంకర్ పిలుపునిచ్చారు. ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఐఎఫ్‌టీయూ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం పేరు మార్చడం దుర్మార్గమన్నారు. నాయకులు చౌడప్ప, రఫీ, పఠాన్, యాకూబ్, రాంబాబు పాల్గొన్నారు.

సమావేశంలో నాయకులు

ఉత్తరద్వార దర్శనంతో మోక్షప్రాప్తి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: సంజీవనగర్‌లోని కోదండ రామాలయంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీన వైకుంఠ ఏకాదశిని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు భగవత్ సేవా సభ్యులు తెలిపారు. ఆలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆ రోజు స్వామివారిని ఉత్తరద్వార దర్శనం చేసుకుంటే సకల పాపాలు తొలగిపోయి, మోక్షప్రాప్తి లభిస్తుందన్నారు. సమావేశంలో అధ్యక్షుడు సూరయ్య, మధుసూదన్‌రావు, గురుప్రసాద్, దేవరశెట్టి శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలల వైద్యంలో ఆధునిక విధానాలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో 'బాలల వైద్యంలో ఆధునిక విధానాలు' అంశంపై ఆదివారం వైద్య సదస్సు నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ అధ్యక్షుడు డా.శ్రీనివాసరావు అధ్యక్షతన హైదరాబాద్ రెయిన్‌బో చిల్డ్రన్ ఆసుపత్రి వైద్యులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. 'బాలలో న్యూరో సర్జరీ చికిత్సలు' అంశంపై న్యూరో సర్జన్ డా.విశాఖ జసవరాజ్, బాలల్లో నాళరహిత గ్రంథుల్లో వచ్చే జబ్బులపై ఎండోక్రైనాలజిస్ట్ డా.జక్కిడి లీనాథ వివరించారు. అనంతరం 'బాలల్లో న్యూరాలజీ అత్యవసర చికిత్సలపై' క్రిటికల్ కేర్ స్పెషలిస్టు డా.ఎర్రా అనుపమ సమన్వయకర్తగా నిర్వహించిన చర్చా కార్యక్రమంలో న్యూరాలజిస్ట్ డా. బండి రమ్య, నంద్యాల చిన్న పిల్లల వైద్య నిపుణులు డా.నయన్ బాబా వివరించారు. ఐఎంఏ పూర్వ అధ్యక్షుడు డా.మధుసూదనరావు, డా. సహదేవుడు, రవికృష్ణ, డా.పనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని రాజీవ్ భవన్, కల్పనా సెంటర్‌లో పార్టీ జెండా ఎగురవేసి సంబరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు మస్తాన్‌ఖాన్, బాలకృష్ణ, అహ్మద్, సలాం, ఆనందరావు, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పార్టీ నాయకులు

వ్యాసాలు రాస్తూ.. పతకాలు సాధిస్తూ

★ రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్న బాలిక

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: చదువుతోపాటు వ్యాస రచన పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు అందుకుంటుంది హారిక. మిడుతూరు మండలం నాగలూటి గ్రామానికి చెందిన కురువ రామకృష్ణ, శాంతమ్మ దంపతుల కుమార్తె హారిక. మండలంలోని ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. పాఠశాల, మండల, జిల్లా స్థాయిలో ఎక్కడ వ్యాస రచన పోటీలు జరిగినా పాల్గొంటూ ప్రతిభ కనబరుస్తుంది. ఎంబీబీఎస్ చదవడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు హారిక పేర్కొంటుంది.

హారిక

● ఇటీవల వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ అధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం 2025 సందర్భంగా విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు. డిజిటల్ న్యాయ పాలన ద్వారా ప్రజలకు ప్రభుత్వం ద్వారా సమర్థవంతంగా, సత్వర పరిష్కారం లభిస్తుందనే అంశాలను క్షుణ్ణంగా వివరిస్తూ వ్యాసాన్ని రాసి అందరి దృష్టిని ఆకర్షించింది. రాష్ట్రస్థాయిలో రాణించి ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాకు పేరు తీసుకు రావడంతో ఉన్నతాధికారులు, కలెక్టర్, సబ్ కలెక్టర్, విద్యాశాఖ అధికారులు అభినందించినట్లు ప్రిన్సిపల్ దినేష్‌బాబు, సమన్వయకర్త, ఉపాధ్యాయురాలు పరిద తెలిపారు.

సాధించిన విజయాలు

● నంద్యాలలో ఈనెల 22వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని ప్రత్యేకత చాటుతూ విజేతగా నిలిచి నగదు బహుమతి అందుకుంది.

● విజయవాడలో ఈనెల 24వ తేదీన నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో హారిక విజేతగా నిలిచి మొదటి బహుమతి గెలుపొందడంతోపాటు నగదు, ప్రశంసాపత్రం, మెమోంటో అందుకుంది.

● గ్రంథాలయాల వారోత్సవాల నేపథ్యంలో నవంబర్ 22వ తేదీన నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతి అందుకుని పలువురి ప్రశంసలు అందుకుంది.

● పాఠశాలలో క్రీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రాం సైన్స్ ఫెయిర్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపింది.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

నందికొట్కూరు, న్యూస్‌టుడే: గతనెలలో ఒంగోలులో జరిగిన రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జాతీయస్థాయికి వెళ్తున్నటు సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బద్దుల శ్రీధర్ తెలిపారు. ఈనెల 31నుంచి జనవరి 5వ తేదీ వరకు పంజాబ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. శ్రీనవనంది పాఠశాల ఆవరణలో ఆదివారం క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఇండియా సెపక్‌తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, విశ్రాంత పీడీ శంకరరెడ్డి, జువ్వాజీ సుంకన్నగౌడ్ సేవా సమితి అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, స్కాలర్స్ పాఠశాల కరస్పాండెంట్ ప్రసాదు పాల్గొన్నారు.

బాలుడి వీరంగం

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కరివేన గ్రామానికి చెందిన బాలుడు ఎర్రగూడూరు నీళ్ల ట్యాంకు సమీపంలో మద్యం తాగుతుండగా వాచ్‌మెన్ వెంకటేశ్వర్లు మందలించారు. దీంతో బాలుడు ఆయనపై దాడి చేయబోయాడు. స్థానికులు ఆ బాలున్ని అడ్డుకున్నారు. బాలుడి వద్ద బ్యాగ్‌లో పంక్చర్ వేసేందుకు ఉపయోగించే పేస్ట్ ట్యూబ్‌లు గుర్తించి.. పోలీసులకు అప్పగించారు. బాలుడికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై తిరుపాలు తెలిపారు.

భాజపా మండలాధ్యక్షుడి మృతి

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: భాజపా ఆత్మకూరు మండల అధ్యక్షుడు వెంకట రామిరెడ్డి(43) ఆదివారం రహదారి ప్రమాదంలో మృతి చెందాడు. శ్రీపతిరావుపేటకు చెందిన వెంకటరామిరెడ్డి, పాములపాడు మండలం ఎర్రగూడూరుకు చెందిన నాగేశ్వరరెడ్డిలు ద్విచక్ర వాహనంపై శ్రీశైలం వెళ్తుండగా పెద్దదోర్నాల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. వారిద్దరికి తీవ్ర గాయాలు కావటంతో 108 వాహనంలో దోర్నాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటరామిరెడ్డికి తీవ్ర గాయాలు కావటంతో కర్నూలుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఆయన మృతికి రెడ్డి సంక్షేమ సంఘం, భాజపా నాయకులు సంతాపం తెలిపారు.

వెంకట రామిరెడ్డి (పాత చిత్రం)

వాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

సీతారామాపురం, (మహానంది), న్యూస్‌టుడే: మండలంలోని సీతారామాపురం గ్రామం వద్ద నంద్యాల- గిద్దలూరు ప్రధాన రహదారిపై ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. కూలీలతో వెళుతున్న ఆటోను ఆదివారం ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో కళావతి, సాయి గాయపడ్డారు. వారిని చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఘటనపై పోలీసులు విచారించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి..

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా బి.తాండ్రపాడుకు చెందిన అమీర్‌బాషా పనిమీద ద్విచక్రవాహనంపై ఆత్మకూరు వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా పాములపాడు మండలంలోని కంబాలపల్లి సమీపంలో ముందుగా వెళ్తున్న ఎడ్ల బండిని ఢీ కొనడంతో కింద పడి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) నందికొట్కూరు వారి కోర్టులో
E.P.No: 21/2024 in O.S.No 35/2021
కాటంరెడ్డి కిశోర్ కుమార్ రెడ్డి, వయస్సు 35 సం॥లు, S/o జనార్ధన్ రెడ్డి, హిందువు, సాఫ్ట్‌వేర్ ఎంప్లాయ్, R/o H.No.28/809/B, N.G.O's కాలనీ, నంద్యాల టౌన్ మరియు జిల్లా, ఆంధ్రప్రదేశ్ - D.Hr
- Vs -
యర్రం అమర్నాథ్ రెడ్డి, వయస్సు 65 సం॥లు S/o జయరామి రెడ్డి, హిందువు, ఎంప్లాయ్, R/o H.No.87/574, మాధవ నగర్, B.Camp Post, కర్నూలు సిటీ & జిల్లా, ఆంధ్రప్రదేశ్ - J.Dr
వేలం ప్రకటన
పై నంబర్ డిక్రీ బాకీ రాబట్టుకొనుటకై ఋణగ్రస్తుడు యొక్క షెడ్యూల్ తాలూకా స్థిరాస్తి పై కోర్టు వారి ఎదుట తేది. 23-01-2026న ఉదయం 10.30 గంటలు నుండి పబ్లిక్ వేలం వేయబడును. కొనదలచిన సవాలుదారులు వేలం వాయిదా రోజు అనగా 23-01-2026వ తేదీన పై కోర్టు వారి ఎదుట హాజరై వేలం పాటలో పాల్గొనవచ్చును.
షెడ్యూల్
కర్నూలు జిల్లా రిజిస్ట్రేషన్, నందికొట్కూరు సబ్- రిజిస్ట్రేషన్ పరిధిలో గల పగిడ్యాల గ్రామము మరియు మండలము నందు గల స్థిరాస్తి వివరములు.
1) సర్వే నెంబర్. 551-1 పైకి విస్తీర్ణం ఎ.0-62 సెంట్లు
2) సర్వే నెంబర్. 550 పైకి విస్తీర్ణం ఎ.2-29 సెంట్లు
3) సర్వే నెంబర్. 549 పైకి విస్తీర్ణం ఎ.1-74 సెంట్లు
4) సర్వే నెంబర్. 526-5 పైకి విస్తీర్ణం ఎ.0-40 సెంట్లు
5) సర్వే నెంబర్. 526-4 పైకి విస్తీర్ణం ఎ.0-34 సెంట్లు
6) సర్వే నెంబర్. 526-3 పైకి విస్తీర్ణం ఎ.0-17 సెంట్లు
7) సర్వే నెంబర్. 526-2 పైకి విస్తీర్ణం ఎ.0-18 సెంట్లు
8) సర్వే నెంబర్. 552 పైకి విస్తీర్ణం ఎ.1-52 సెంట్లు
9) సర్వే నెంబర్. 551-3 పైకి విస్తీర్ణం ఎ.1-16 సెంట్లు
10) సర్వే నెంబర్. 551-2 పైకి విస్తీర్ణం ఎ.0-68 సెంట్లు
11) సర్వే నెంబర్. 526-1 పైకి విస్తీర్ణం ఎ.1-99 సెంట్లు
పూర్తి విస్తీర్ణం ఎ. 11-09 సెంట్లు
పైన పేర్కొన్న అన్ని సర్వే నెంబర్లు ఒకే సింగల్ ప్లాట్ మరియు కామన్ సరిహద్దును కలిగి ఉన్నది.
తూర్పు: ట్రాక్ రస్తా భూమి, పడమర: రోడ్డు, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: ఎర్రం మధుసూదన్ రెడ్డి భూమి.
Market Value: Rs. 22,00,000/-
Ameena Value: Rs. 30,00,000/-
S.R.O Value: Rs. 46,76,000/-
కోర్టువారి ఉత్తర్వుల మేరకు
వేలం వాయిదా తేదీ: 23-01-2026
కె.హుస్సేన్ బాషా, యస్.ఓబుల రెడ్డి, రహంతుల్లా బేగ్
DHr వారి అడ్వకేట్స్, నంద్యాల. Cell: 94402 51292

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

మహాసభలను జయప్రదం చేయండి

డోన్, ప్యాపిలి, కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు జరుగనున్న సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభల విజయవంతం కోసం ప్రజా చైతన్య జాతాలను నిర్వహిస్తున్నామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏల్లయ్య, సహాయ కార్యదర్శి శివరాం తదితరులు అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయం వద్ద నుంచి ప్రజా చైతన్య యాత్రను జెండా ఊపి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో మూడు ప్రాంతాల నుంచి ఈ జాతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ గ్రామాన తిరిగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలని కోరనున్నట్లు తెలిపారు. నాయకులు రామాంజనేయులు, భాస్కర్ రెడ్డి, నాగమద్దయ్య, నక్కి శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమస్యలపై నేడు అర్జీల స్వీకరణ

శిరివెళ్ల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప పేర్కొన్నారు. గ్రామాల్లో వివిధ సమస్యలపై కార్యాలయంలో అర్జీలను స్వీకరించి నిర్ణీత వ్యవధిలో పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574316
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లి: 80085 73763

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ?: నల్లగట్ల గ్రామంలో బీసీ కాలనీలో నీటి ట్యాంకుపై మూత లేకపోవడంతో నీరు అపరిశుభ్రమవుతున్నాయి. -ఓబులేసు

✔: మూత ఏర్పాటు చేయిస్తాం. -నూర్జహాన్, ఎంపీడీవో.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: మండలంలోని శిరివెళ్ల రాముని మాన్యం కాలనీలో సీసీ రహదారులు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేయాలి. - లక్ష్మీనరసమ్మ.

✔: మౌలిక వసతుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. -అశ్విన్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ?: కర్నూలు రోడ్డు వైపు గ్యాస్ కార్యాలయం ప్రాంతంలో మురుగు కాల్వలను శుభ్రం చేయడం లేదు. - రాముడు, శ్రీనివాసనగర్.

✔: సిబ్బందితో వ్యర్థాలను తొలగించి పరిశుభ్రం చేయిస్తాం. - సునీల్, శానిటరీ ఇన్‌చార్జి అధికారి.

?: శ్రీనివాసనగర్ శివారులో విద్యుత్తు స్తంభాలకు దీపాలు అమర్చలేదు. - ఎల్లయ్య, శ్రీనివాసనగర్.

✔: కొత్త విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయిస్తాం. - సురేష్, మున్సిపల్ ఏఈ.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: ?: బెలుం గ్రామంలోని బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. - పుల్లన్న

✔: వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - చంద్రమౌళేశ్వరగౌడ్, డిప్యూటీ ఎంపీడీవో

భక్తులకు సౌకర్యాల ఏర్పాటు

ఆర్ఎస్ రంగాపురం(బేతంచెర్ల), న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశి బ్రహ్మోత్సవాల సందర్భంగా మద్దిలేటయ్య క్షేత్రానికి వచ్చే భక్తులు ఇబ్బందులకు గురి కాకుండా అన్ని సౌకర్యాలు కల్పించి దర్శనం సజావుగా జరిగేలా చూడాలని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఈవో, ఉప కమిషనర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారికి ఎమ్మెల్యే పట్టువస్త్రాలు సమర్పించారు. మద్దిలేటిస్వామి, అమ్మవారిని ఆదివారం ఆయన దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. ప్రజలందరికీ స్వామి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ ఉన్నం ఎల్లనాగయ్య, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి బుగ్గన ప్రసాదరెడ్డి, సర్పంచి శ్రీనివాసులు యాదవ్, ఇద్రుస్ ముల్లా, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే కోట్ల

నిఘా నేత్రం.. అంతంతమాత్రం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పోలీసుల ముఖ్య లక్ష్యం శాంతిభద్రతలను కాపాడడం. ఇందుకోసం వారు అహర్నిశలు శ్రమిస్తుంటారు. ఈ ప్రయత్నాలకు సాంకేతిక సాయం ఉంటే వారి విధి నిర్వహణ సులభతరం అవుతుంది. పోలీసు పరిభాషలో చెప్పే మూడో కన్ను(సీసీ కెమెరా), డ్రోన్ కెమెరాల ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ రెండు విషయాల్లో ఆళ్లగడ్డ పోలీసు శాఖ వెనుకబడిందనే చెప్పవచ్చు.

సీసీ కెమెరాలు లేని పడకండ్ల వంతెన మార్గం

పట్టించుకోని యంత్రాంగం

★ ఆళ్లగడ్డ పట్టణంలోకి అధిక వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగించే మార్గాల్లో ఇది ఒకటి. ఈ మార్గంలో ప్రవేశ, నిష్క్రమణలను పరిశీలించేందుకు కెమెరాలు లేవు. ఏవీ గోడౌను వద్ద జాతీయ రహదారి ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో సీసీ కెమెరా లేకుండాపోయింది.

★ సీసీ కెమెరాల ఏర్పాటు కోసం పురపాలక శాఖ, మరికొన్ని చోట్ల ప్రజల విరాళాలు తీసుకున్నారు. రూ.లక్షలు పెట్టి ఏర్పాటు చేసిన కెమెరాలను సక్రమంగా నిర్వహించినప్పుడే సత్ఫలితాలు వస్తాయి. క్షేత్రస్థాయిలో మాత్రం చాలా చోట్ల నిర్వహణ సక్రమంగా లేక సీసీ కెమెరాలు పనిచేయడం లేదు.

దాతల సాయంతో ఏర్పాటైనా..

★ ఆళ్లగడ్డ పురపాలక పరిధిలో గత పదేళ్లుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. అయితే వీటిలో నాణ్యత సక్రమంగా లేకపోవడంతో చిన్నపాటి గాలివానకే దెబ్బతింటున్నాయి. 2022లో దాతల సాయంతో 43 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇందులో దాదాపు ఏవీ పనిచేయడం లేదు. ముఖ్యంగా జాతీయ రహదారుల కూడళ్ల వద్ద కూడా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు.

★ ఆళ్లగడ్డ పట్టణానికి కేటాయించిన రెండు డ్రోన్‌లలో ఒకటి మరమ్మతులకు గురైంది.

★ గత ఏడాది సెప్టెంబరు 23వ తేదీన మండలూరుకు ఒక వ్యక్తి కారులో వెళ్తుండగా నాలుగు రహదారుల కూడలిలో ద్విచక్ర వాహనదారుడు నిర్లక్ష్యంగా వచ్చి కారును ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయాడు. బాధిత వ్యక్తి పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఢీకొన్న వ్యక్తిని గుర్తించలేని స్థితి నెలకొంది.

పెరుగుతున్న నేర ఘటనలు

★ టిడ్కో గృహాల సీసీ కెమెరాల అవసరం ఉంది. కొందరు దొంగలు రెండు రోజుల క్రితం టిడ్కో గృహాల్లో రెండు బృందాలుగా విడిపోయి కొట్టుకున్నారు. సీసీ కెమెరా లేకపోవడంతో దాడి చేసిన, దాడికి కారణాలు గుర్తించడం కష్టంగా మారింది.

★ ఆళ్లగడ్డలో తరచూ ద్విచక్రవాహన చోరీలు జరుగుతున్నాయి. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో చోరీలు చేస్తున్న వారిని గుర్తించలేని స్థితి నెలకొంది.

★ పట్టణంలో సీసీ కెమెరాల లేని విషయాన్ని పోలీసులు గుర్తించి అదనంగా 12 కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. త్వరలోనే వాటిని ఏర్పాటు చేయనున్నారు.

దేశ ప్రజల అభ్యున్నతే ధ్యేయం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: దేశ ప్రజల అభ్యున్నతే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్యేయమని భాజపా కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. హేమసుందర్‌రెడ్డి, భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు సందు వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌లు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక భాజపా కార్యాలయంలో 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని టీవీ ద్వారా భాజపా నాయకులు వీక్షించారు.

ఘనంగా అధ్యయనోత్సవాలు

ఆళ్లగడ్డ గ్రామీణం,న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా దిగువ అహోబిలం ఆలయ ఆవరణలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆళ్వార్‌లను ప్రత్యేకంగా అలంకరించి కొలువుంచారు. రాపత్తు ఉత్సవంలో భాగంగా ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవారిని విశేషంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చి తిరువీధుల్లో ఊరేగించారు.

యాగంటిలో భక్తుల సందడి

యాగంటి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో వాహనాల్లో తరలివచ్చిన భక్తులు కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారికి, నందికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయాధికారి పాండురంగారెడ్డి ఆదివారం తెలిపారు.

డంప్ యార్డు కాదు.. సర్వీసు రోడ్డు

ఆళ్లగడ్డ మండలంలోని నల్లగట్ల గ్రామంలో సర్వీస్ రోడ్డు డంప్ యార్డును తలపిస్తోంది. జడ్పీ ఉన్నత పాఠశాల ప్రవేశ ద్వారం నుంచి వరుసగా రోడ్డుపై పేడ దిబ్బలు, గడ్డివాములు నిల్వ చేశారు. రైతులు పంట దిగుబడులను ఆరేయడమే గాక ఏకంగా గడ్డివాములు, పశువుల పేడ వేస్తుండటంతో రోడ్డు అధ్వానంగా మారింది. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దిబ్బలను తొలగించి ఇబ్బందులు లేకుండా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, నల్లగట్ల(ఆళ్లగడ్డ గ్రామీణం)

ప్రమాదాల నివారణకు సూచికల ఏర్పాటు

బేతంచెర్ల మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో మద్దిలేటిస్వామి, పెద్దరాజుస్వామికి వెళ్లే కూడలిలో 340బి జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు సీఐ వెంకటేశ్వరరావు ప్రమాద సూచిక డ్రమ్ములను రంగాపురం, హెచ్‌కొట్టాల, కొలుములపల్లె తదితర కూడళ్లలో ఏర్పాటు చేశారు. తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో ఇకపై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

– న్యూస్‌టుడే, ఆర్ఎస్ రంగాపురం(బేతంచెర్ల)

కూరగాయల సంతలో పశుసంచారం

ఇక్కడున్న మేకలు, పశువులను చూస్తే ఇదేదో పశువుల సంత అనుకుంటారు. నిజానికి ఇది కూరగాయల మార్కెట్. ఆళ్లగడ్డ మార్కెట్‌లో మేకలు, ఎద్దులు, ఆవుల సంచారం విపరీతంగా పెరిగిపోయింది. వీటి కట్టడికి ఎమ్మెల్యే అఖిలప్రియ ఆదేశాలు ఇచ్చినా ఫలితాలు కన్పించడం లేదు. తూతూమంత్రంగా చర్యలు తీసుకోవడం, వాటిని మళ్లీ వదిలేయడం జరుగుతోంది. అధికారులు స్పందించి పశుసంచారం లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

కాలిబాట ఇలా.. నడిచేదెలా..

డోన్ పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డుకు ఇరువైపులా పాదచారులు నడిచేందుకు వీలుగా ఫుట్‌పాత్‌ను నిర్మించారు. కొందరు దుకాణదారులు వీటిపై వస్తువులను ఉంచేస్తున్నారు. దీంతో పాదచారులకు నడిచేందుకు అవస్థలు పడుతున్నారు. దీనిపై పలువురు మున్సిపల్ అధికారులు విన్నవించినా పట్టించుకోలేక పోతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి కాలిబాటపై దుకాణదారులు సామగ్రి ఉంచకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, డోన్ పట్టణం

సంక్షిప్త సమాచారం

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం మఠం అర్చకుడు చెన్నైకు చెందిన కిడాంబి లక్ష్మీనరసింహాచార్య(63) గుండెపోటుతో మృతి చెందారు. పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆయన అంత్యక్రియలకు మర్యాదలను అందజేశారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: మహదేవపురం గ్రామానికి చెందిన మధుసూదన్, సర్వనరసింహస్వామి ఆలయ ఇన్‌ఛార్జి ఈవో సాయిజయచంద్రారెడ్డి కులంపేరుతో దూషించినట్లు బాధితుడు నాగరాజు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లో రైతులు భూసార పరీక్షలపై అవగాహనను కలిగి ఉండాలని ఏవో సుధాకర్ ఆదివారం పేర్కొన్నారు. రైతులు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: డోన్ శివారులోని దత్తాత్రేయ స్వామి గుడి వద్ద ఆదివారం ఆటో బోల్తాపడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి.

డోన్, న్యూస్‌టుడే: పట్టణ శివారు ఉడుములపాడు సమీపంలో శనీశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన మద్దిలేటిరెడ్డి రూ.30 వేల నగదు విరాళం అందజేశారు.

డోన్, న్యూస్‌టుడే: నూర్‌బాషా దూదేకుల సంఘం క్యాలెండర్లను కర్నూలు అడిషనల్ ఎస్పీ పి.హుసేన్ పీరా, డోన్ పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషాలు ఆదివారం ఆవిష్కరించారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని కడప రోడ్డులోని గని గుంతల వద్ద కొన్ని పందులు అనుమానాస్పదంగా మృతి చెందాయి.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: సిమెంట్‌నగర్ గ్రామానికి చెందిన షేక్‌జాన్ అహ్మద్(68) అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 26న అపస్మారక స్థితిలో చేరుకోవడంతో చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మృతిపై అహ్మద్ కుమార్తె అనుమానం వ్యక్తం చేస్తూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: రహదారి నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మర్రిపల్లెకు చెందిన గఫార్ బాషా చాగలమర్రి పట్టణంలో ఆటో యాత్ర నిర్వహించారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: పట్టణంలోని కూరపాటి వీధిలో కోదండ రామాలయంలో ఆదివారం ధనుర్మాస పూజలను నిర్వహించారు.

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: హిందూ ధర్మాన్ని రక్షించుకోవాలని పేరుసోముల కంబగిరిస్వామి ఆశ్రమం నిర్వాహకులు రామ్మోహన్‌స్వామిజీ చెప్పారు. చింతలాయపల్లె గ్రామంలో ఆదివారం హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బనగానపల్లి గ్రామీణం, సంజామల, న్యూస్‌టుడే: సంజామల మండలం విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కొలిమిగండ్ల, న్యూస్‌టుడే: అంకిరెడ్డిపల్లె, ఇటిక్యాల గ్రామాల్లో దాడులు చేసి జూదం ఆడుతున్న 13 మందిని అరెస్టు చేసినట్లు సీఐ రమేష్ బాబు ఆదివారం చెప్పారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి దళితులను ఆదుకోవాలని మాలమహానాడు రాష్ట్ర నాయకులు దస్తగిరి పేర్కొన్నారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: నందివర్గం ఎస్సైగా భూపాలుడు ఆదివారం బాధ్యతలు చేపట్టారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి ముఖేశ్‌కుమార్ పేర్కొన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికి ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తిరుగుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లోని పాడిరైతులు పశువైద్య అధికారుల సూచనలు పాటించి గాలికుంటు టీకాలు వేయించాలని మండల పశువైద్య అధికారి దస్తగిరి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పశువుల ఆరోగ్యాన్ని దృష్టి ఉంచుకుని అన్ని గ్రామాల్లో పశువైద్య శిబిరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుందన్నారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిన్నసుబ్బయ్య యాదవ్ పేర్కొన్నారు.

ముక్కోటి ఉత్సవాలకు సర్వం సిద్ధం

ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి కొండపేటలోని వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ముక్కోటి ఏకాదశికి భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి ఇందిరమ్మ పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీన నిర్వహించే ఉత్సవ ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. సుమారు రూ.కోటికి పైగా నిధులు వెచ్చించి పాత వెంకటేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా స్వామిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెదేపా విభాగం వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు టంగుటూరి శీనయ్య పాల్గొన్నారు.

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఈ నెల 30వ తేదీ మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉత్తర ద్వారంలో బారికేడ్లు, మండపాలు వేసి అలంకరించారు. భక్తులకు వైకుంఠ ద్వారం దర్శనంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టినట్లు మఠం ప్రతినిధులు తెలిపారు.

దిగువ అహోబిలంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ధనుర్మాసం పురస్కరించుకుని ఆళ్లగడ్డలో గోదాదేవి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. పట్టణంలోని శిల్పా వెంచర్‌లో జరిగిన కార్యక్రమంలో అమ్మవారిశాలకు చెందిన అర్చకులు

ఆళ్లగడ్డ: అలంకరణలో ఉత్సవ మూర్తులు

భాగవతం వెంకట రంగాచార్యులు వేదమంత్రాలు పఠిస్తూ శ్రీరంగనాథ స్వామి, గోదాదేవి కల్యాణోత్సవం జరిపించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నందవరం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం నందవరం గ్రామంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయాభివృద్ధికి కడప నగరానికి చెందిన చెందిన కమలాకర్, రమాదేవి దంపతులు రూ.50వేల విరాళాన్ని ఆలయ సిబ్బంది, అర్చకులకు ఆదివారం అందజేశారు. అంతకుముందు దాతలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆళ్లగడ్డ గ్రామీణం, దొర్నిపాడు, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ మండలం ఆర్.కృష్ణాపురంలోని రామతీర్థం పుట్టాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి పుట్టాలమ్మ, పరశురామేశ్వర, లక్ష్మీనృసింహస్వామి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు. డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో ఆదివారం మూల పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

డోన్: పూజల్లో పాల్గొన్న అర్చకులు, ధర్మకర్తలు

ఆధ్యాత్మికం

డోన్, న్యూస్‌టుడే: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస పూజల్లో భాగంగా ఆదివారం అన్నకూటోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయమే స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ అన్నకూటోత్సవ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పాతాళం సుబ్బారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బనగానపల్లి గ్రామీణం: ఆలయ సిబ్బందికి విరాళం అందజేస్తున్న దాతలు

సనాతన ధర్మం గొప్పది

బేతంచెర్ల, న్యూస్‌టుడే: హిందువులంతా ఐకమత్యంతో భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కౌలాసగిరి రిషికేషి పీఠం అధ్యక్షులు శంకరానందగిరి స్వామి, ఆర్ఎస్ఎస్ కర్నూలు విభాగ్ పినాకపాణి పేర్కొన్నారు. ఆదివారం ఆర్ఎస్ రంగాపురం

బేతంచెర్ల: మాట్లాడుతున్న శంకరానందగిరి స్వామి

గ్రామంలోని లక్ష్మీవెంకటేశ్వర కల్యాణ మండపంలో హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశ సంస్కృతిని, సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, లక్ష్మీరంగయ్య, శివయ్య, తిమ్మారెడ్డి, రాముడు, శేఖర్, రామమద్దయ్య పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: సనాతన ధర్మం కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని కొలిమిగుండ్ల మండలం ఇటిక్యాల ఆశ్రమ నిర్వాహకుడు జయదేవానందగిరి స్వామి

ఉయ్యాలవాడ: ప్రసంగిస్తున్న జయదేవానందగిరి స్వామి

అన్నారు. ఉయ్యాలవాడలో ఆదివారం ఏర్పాటైన హిందూ సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి భారతీయుడు హిందువుల్లో చైతన్య దీప్తిని రగిలించాలన్నారు. నంద్యాల జిల్లా వీహెచ్‌పీ ప్రధాన కార్యదర్శి మూసాని విశ్వనాథరెడ్డి, మోహనకృష్ణ, గంగాధర్ పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి కృషి చేయాలి

ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నంద్యాల జిల్లా కాపు రాక్స్ సంఘం అధ్యక్షుడు చెన్నంశెట్టి శ్రీనివాసులు అన్నారు. ఉయ్యాలవాడలో ఆదివారం బలిజ సంఘం సభ్యులతో ఏర్పాటైన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆర్థికంగా, సామాజిక, రాజకీయంగా బలిజలు ఎదగాలని ఆళ్లగడ్డ నియోజకవర్గం బలిజ సంఘం ప్రధాన కార్యదర్శి అర్జిగారి నరసింహులు అన్నారు. నంద్యాల జిల్లా కాపు రాక్స్ కో-ఆర్డినేటర్ మల్లికార్జున, ఐటీ కో-ఆర్డినేటర్ రామమోహన్, ఉయ్యాలవాడ కేసీ కెనాల్ నీటి సంఘం అధ్యక్షుడు ఎ.చిన్నవెంకటసుబ్బయ్య, నాయకులు ఆకుల నడిపి వెంకటసుబ్బయ్య, చిన్నరాముడు, వెంకటస్వామి పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్య సేవలే లక్ష్యం

బనగానపల్లి గ్రామీణం, సంజామల, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు ఉత్తమ వైద్య సేవలందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ఛారిటబుల్ మెమోరియల్ ట్రస్ట్ డైరెక్టర్ పెద్దిరెడ్డి మౌలాలిరెడ్డి అన్నారు. మండలంలోని మంగపల్లెలో ఆదివారం ట్రస్ట్ ఆధ్వర్యంలో 63వ మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తన సొంత నిధులు వెచ్చించి ప్రతి నెలా పేద రోగులకు కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. శిబిరాలకు వచ్చే వారికి మందులతో పాటు మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెలా వేలాదిగా రోగులు తరలివచ్చి వైద్యం చేయించుకుని వ్యాధుల నుంచి విముక్తి పొందటం ఆనందంగా ఉందన్నారు. దాదాపు వెయ్యి మందికి పైగా వైద్య శిబిరానికి హాజరయ్యారని చెప్పారు. మరిన్ని వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

శిబిరానికి హాజరైన వివిధ గ్రామాల ప్రజలు

అపూర్వ కలయిక.. ఆనంద వేడుక

ఇల్లూరుకొత్తపేట(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం ఇల్లూరుకొత్తపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-03 సంవత్సరంలో పదో తరగతి విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు చదువు చెప్పిన గురువులను సన్మానించి గత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వేదికపై సమావేశమైన పూర్వ విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయులు

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పాత కేసుల్లో నిందితులుగా ఉన్న రౌడీషీటర్లు మళ్లీ నేరాలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ ఇచ్చారు. ఏడాది కాలంలో తప్పులు చేయకుండా ఉంటే వారి పేర్లను రౌడీషీటర్ల జాబితా నుంచి తొలగించేందుకు కృషి చేస్తామన్నారు. నేరప్రవృత్తిని మానుకోవాలని, వివాదాలు, ఘర్షణకు పాల్పడవద్దని సూచించారు. ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు శాంతిభద్రతల సమస్య సృష్టిస్తే చూస్తూ ఊరుకోమని ఎస్సై నగీనా అన్నారు. ఆదివారం పట్టణ పోలీసు స్టేషన్లో వీరికి కౌన్సెలింగ్ నిర్వహించారు. క్రమశిక్షణతో ఉంటేనే బావుంటుందని లేని పక్షంలో తగిన రీతిలో బుద్ధి చెబుతామని ఆమె హెచ్చరించారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ హనుమంతనాయక్ అన్నారు. కోవెలకుంట్లలోని పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం మంత్రణం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల శాంతియుత జీవనానికి ఎవరైనా భంగం కలిగిస్తే సహించేది లేదన్నారు.

దారులు అధ్వానం.. రాకపోకలకు నరకం

డోన్ పట్టణం, బేతంచెర్ల, న్యూస్‌టుడే: పట్టణాల్లో అంతర్గత రహదారులు పలుచోట్ల వాహన చోదకుల్ని బెంబేలెత్తిస్తున్నాయి. సీసీ రోడ్ల బీటలు వారి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వాహనాలు రాకపోకలు సాగించే ఈ దారుల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమస్య విన్నవిస్తున్నా స్పందించడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. తక్షణం ఈ దారులకు మరమ్మతులు చేయించాలని పుర ప్రజలు కోరుతున్నారు.

డోన్ మున్సిపాలిటీలో..

★ డోన్ మున్సిపల్ పరిధిలోని కొండపేటలో శేగు లాడ్జి సమీపం కట్టెలడిపో వీధిలో సీసీ రహదారి ధ్వంసమైంది. నాసిరకం నిర్మాణం చేపట్టడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. సీసీ రహదారి మధ్యలో నీటి గొట్టం ఏర్పాటు కోసం తవ్వి దాన్ని సరిగా పూడ్చకపోవడంతో అధ్వానంగా మారింది.

★ శ్రీనివాస థియేటర్ సమీపంలో 14వ ఆర్థిక సంఘం కింద ఎనిమిదేళ్ల కిందట రూ.10 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. నాసిరకం పనులతో కొన్నేళ్లకే సిమెంటు పూత పోయి కంకర లేచి.. గుంతలు ఏర్పడ్డాయి. ఎస్కేపీ ఉన్నత పాఠశాల పక్కనున్న వీధిలోనూ రహదారికి బీటలు వారి, కంకర లేచిపోయే స్థితికి చేరింది. పోచా ప్రభాకర్‌రెడ్డి నగర్‌లో బైపాస్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ఒక చోట గుంతలు ఏర్పడి అధ్వాన స్థితికి చేరుకుంది.

డోన్ పట్టణం కొండపేటలో దెబ్బతిన్న సీసీ రహదారి

బేతంచెర్ల పట్టణంలో..

★ బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలోని ఎస్సీ కాలనీలో మాలపేటలో సీసీ రోడ్డు గుంతలు పడి కంకర తేలి అధ్వానంగా తయారైంది. చాకలిపేట నుంచి మాలపేట వరకు రహదారి గుంతలు పడి కంకర తేలి శిథిలావస్థకు చేరింది. బేతంచెర్ల పట్టణంలోని చాకలిపేట నుంచి రేగిమానుపేట వరకు బాగా ఉన్న రోడ్డును సీసీ రోడ్డు వేస్తామని తొలగించి నేటికీ సీసీ రోడ్డు వేయక పోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

★ సంతమార్కెట్ చుట్టూ ఉన్న సీసీ రోడ్డు దెబ్బతింది. అలాగే శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఎదురువీధి, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డు శిథిలావస్థకు చేరడంతో ఆయా కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

★ పాతబస్టాండు నుంచి అంగళ్ల బజారు నుంచి పాత తహసీల్దార్ కార్యాలయం నుంచి పీర్ల చావిడి వరకు సీసీ రోడ్డు దెబ్బతినడంతో ద్విచక్ర వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు.

★ రెడ్డిహోటల్ ఎదురు వీధి, శ్రీధర్ మెడికల్ షాపు లైను, గోడౌన్ లైను సీసీ రోడ్డు దెబ్బతినడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి మరమ్మతులు చేపట్టాలని పురవాసులు కోరుతున్నారు.

(c) eenadu

ఈనాడు
పల్నాడు
సోమవారం డిసెంబరు 29, 2025

నిర్లక్ష్యం పరుచుకుంది..
నీరు కదలనంటోంది

నరసరావుపేట రూరల్ పరిధిలోని గోవిందపురం మేజర్ కాలువ కింద సుమారు 6 వేల ఎకరాల్లో పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలను రైతులు సాగు చేస్తున్నారు. కాలువలో గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు పెరగడంతో చివరి భూములకు నీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత పెరిగితే మిర్చి పంటలకు వారానికోసారి సాగు నీరు అందించాల్సిన అవసరం ఉంటుందని కాలువలో నీరు పారకుంటే పంట దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి గుర్రపుడెక్క తొలగించి పొలాలకు నీరందేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ శాఖ ఏఈఈ ప్రియాంక దృష్టికి తీసుకెళ్లగా సాగు నీటి కాలువల మరమ్మతుల విషయమై ఉన్నతాధికారులకు నివేదిక పంపామని, వారి నుంచి అనుమతులు వచ్చి నిధులు మంజూరు కాగానే కాలువలో పిచ్చిమొక్కలు తొలగించి చివరి భూములకు నీరందేలా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, కాకతీయనగర్ (నరసరావుపేట)

ఫొటోగ్రఫీ, ఏసీ సర్వీసింగ్‌లో ఉచిత శిక్షణ

గుంటూరు: యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సందీప్‌బాబు తెలిపారు. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ కోర్సు జనవరి 16, కంప్యూటర్ ట్యాలీ కోర్సు జనవరి 19, రిఫ్రిజిరేటర్, ఏసీ సర్వీసింగ్ కోర్సు జనవరి 29 నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 19 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసున్న గ్రామీణ ప్రాంత యువత, మహిళలు శిక్షణకు అర్హులని వెల్లడించారు. వివరాలకు 0863-2336912, 97034 05066.

“ నాడు-నేడుతో ప్రభుత్వ ఆసుపత్రులను ఉద్ధరించినట్లు వైకాపా ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో చేసిన ప్రతిపాదనల్ని అటూ ఇటూ మార్చి రెండో పీహెచ్‌సీల నిర్మాణం చేపడుతున్నట్లు హడావుడి చేసింది. తీరా అయిదేళ్లు దాటినా రెండో పీహెచ్‌సీలు సాకారం లేదు. కాగితాల్లో నిధులు.. గడప దాటని పనుల తీరుగా పరిస్థితి ఉంది. గతంలో నిధులు మంజూరై అర్ధంతరంగా ఆగిన పనుల్ని పూర్తి చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ”

కాగితాల్లో నిధులు..
గడప దాటని పనులు

న్యూస్‌టుడే, ముప్పాళ్ల, క్రోసూరు (అచ్చంపేట), సత్తెనపల్లి, రాజుపాలెం

ప్రతి 25 నుంచి 30 వేల జనాభాకు ఒక పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలనేది రెండో పీహెచ్‌సీల ఏర్పాటు లక్ష్యం. మండల కేంద్రాలతో పాటు వివిధ గ్రామాల్లో ఎప్పటినుంచో నడుస్తున్న పీహెచ్‌సీలు కాకుండా జనాభాతోపాటు ఎక్కువ గ్రామాలకు దగ్గర్లో ఉన్నచోట కొత్త పీహెచ్‌సీల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

క్రోసూరు : దొడ్లేరులో రెండో పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు

❖ రెండో పీహెచ్‌సీలు లేకపోవడంతో ప్రస్తుతమున్న పీహెచ్‌సీలపై ఒత్తిడి పెరగడమే కాకుండా వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమాల అమలు సక్రమంగా జరగట్లేదు. గ్రామీణులు ఆర్ఎంపీ, పీఎంపీల వద్దకు వెళ్లాల్సి వస్తోంది.

❖ పనుల పూర్తికి చర్యలు.. క్రోసూరు మండలం దొడ్లేరులో రెండో పీహెచ్‌సీ భవన నిర్మాణానికి రూ.2.70 కోట్లు మంజూరయ్యాయి. ఎన్నికలకు ముందు పనుల్ని వైకాపా ప్రభుత్వం నిలుపుదల చేసింది. తాజాగా పనుల పూర్తికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అచ్చంపేట మండలంలోని మాదిపాడుకు మంజూరైన రెండో పీహెచ్‌సీ భవన నిర్మాణం చేపట్టకుండానే వైద్యులు, సిబ్బందిని కేటాయించారు. వారు అచ్చంపేటలో పనిచేస్తున్నారు. మాదిపాడులో భవన నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రెండో పీహెచ్‌సీల నిర్మాణాలు పూర్తిచేసి ప్రజలకు వైద్య సేవలు దగ్గర చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ రవి తెలిపారు.

➡ సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో ముప్పాళ్ల, రాజుపాలెం, సత్తెనపల్లి, బెల్లంకొండ మండలాల్లో రెండో పీహెచ్‌సీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ మండలాల పరిధిలోని మాదల, గణపవరం, నందిగామ, బెల్లంకొండలో స్థలాలు ఎంపికచేసినా భవన నిర్మాణాలకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు.

అనుమతులు గోరంత..
తవ్వకాలు కొండంత

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, నకరికల్లు

కరిగిపోతున్న నకరికల్లు, త్రిపురారం కొండలు

సత్తెనపల్లి నియోజకవర్గం నకరికల్లు, త్రిపురారం కొండల్లో ఎర్రమట్టిని అక్రమంగా తవ్వుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్రీయ రహదారి పక్కనే ఉన్న త్రిపురారం కొండల సముదాయంలో కొన్నిటిని ఇప్పటికే కరిగించేశారు. ఇక్కడ 6.07 హెక్టార్లకే మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నారు. కానీ విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయి. మరోవైపు నకరికల్లు కొండల్లో అనుమతుల్లేకుండా భారీగా మట్టిని తరలించుకుపోతున్నారు.

భారీయంత్రాలతో.. త్రిపురారం కొండవద్ద భారీ పొక్లెయిన్లు, పదుల సంఖ్యలో టిప్పర్లతో 24 గంటలూ ఎర్రమట్టిని కొల్లగొడుతున్నారు. భారీ టిప్పర్ల రాకపోకలతో రోడ్డు గుంతమయం అయితే దాన్ని ఆ ఎర్రమట్టితోనే పూడ్చి సరిచేశారు. ఎర్రమట్టి లారీల రాకపోకలతో సమీప గ్రామ ఇళ్లు, పంటచేలు దుమ్ముతో నిండిపోయాయి. రాష్ట్రీయ రహదారి కూడా ఎర్రమట్టితో నిండిపోయింది. అంటే ఎంతలా మట్టిని కొల్లగొడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. కొండమోడు-పేరేచర్ల జాతీయ రహదారి పనుల నిమిత్తం ఎర్రమట్టిని తరలిస్తామని అనుమతులు తీసుకున్నారు. అయితే జాతీయ రహదారికి పది టిప్పర్లు తోలితే.. మిగతా టిప్పర్లను ఇతర వెంచర్లకు తోలుతూ సొమ్ము చేసుకుంటున్నారు.

త్రిపురారం కొండ వద్ద ఇలా..

రెవెన్యూ, పోలీసులకు నగదు ఇస్తూ..

అక్రమ మట్టి తవ్వకాలు పోలీసులు, రెవెన్యూ అధికారులకే కనపడనట్లుగా ఉన్నారంటే నమ్మగలరా? మట్టి తవ్వకాలకు సంబంధించిన సమాచారాన్ని రెవెన్యూ అధికారికి అడిగామంటే.. తర్వాత రోజు కొండ వద్ద ఒక్కలారీ కనిపించదు. ముందస్తుగానే మాఫియాకు సమాచారం రెవెన్యూ అధికారే ఇస్తున్నట్లు సమాచారం. అందుకు ప్రతిఫలంగా నెలకు రూ. 5లక్షలు ముట్టజెబుతున్నారు. ఎవరైనా వస్తే అడ్డుకునేందుకు రోడ్డుపై ఒక వ్యక్తిని కాపలా ఉంచి కొండకు వెళ్లే మార్గం వద్ద కొందరు ఉంటూ గుర్తిస్తే వారికి కాపలాదారు సమాచారం ఇస్తున్నారు. నకరికల్లు కొండల్లో మాత్రం ప్రతి ఆదివారం తవ్వకాలు చేపడుతున్నారు. సెలవురోజు మేము చూడం అని స్థానిక రెవెన్యూ అధికారే చెప్పి తవ్వకాలకు అండగా ఉంటున్నాడని సమాచారం. 'త్రిపురారం కొండల్లో 6 హెక్టార్లలో మాత్రమే అనుమతులున్నాయి. నేను కొత్తగా వచ్చాను. చూసి చర్యలు తీసుకుంటాను' అని మైనింగ్‌శాఖ ఏడీ నాగయ్య బదులిచ్చారు.

న్యూ గుంటూరుకు కొత్త శోభ

రూ.4.68 కోట్లతో అభివృద్ధి

ఈనాడు, అమరావతి

రైల్వేపరంగా గుంటూరు కీలక ప్రాంతం. 22 ఏళ్ల క్రితం డివిజన్‌గా మారింది. ప్రధాన రైల్వేస్టేషన్ మీదుగా నిత్యం 90కు పైగా రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. 10వేల మందికిపైగా ప్రయాణిస్తుంటారు. ఎగుమతులు, దిగుమతులూ పెరిగాయి. రద్దీని తట్టుకునేందుకు దశాబ్దాల క్రితం గుంటూరు న్యూ రైల్వేస్టేషన్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. ఎరువులు, సిమెంటు అవసరాల కోసం గోదాములు ఏర్పాటు చేశారు. క్రమేణా ప్రయాణికుల రాకపోకలకు అవకాశం కల్పించారు.

న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ కొత్తరూపు సంతరించుకోనుంది. ఏళ్ల తరబడి పీడించిన అసౌకర్యాల బాధ తప్పించేందుకు రూ.4.68 కోట్లతో పనులు చేపట్టాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ప్లాట్‌ఫామ్స్ విస్తరణతోపాటు మౌలిక సౌకర్యాలు కల్పించనున్నారు.

ఇదీ పరిస్థితి.. ✦ నగరానికి 3 కిలోమీటర్ల దూరంలో నెహ్రూనగర్‌లో ఈ స్టేషన్ ఉంది. ✦ గతంలో ఇక్కడికెళ్లి రైలెక్కాలంటే ప్రయాణికులు భయపడేవారు. ✦ క్రమేణా నగరం విస్తరించడం, ఈ ప్రాంతానికి రాకపోకలు పెరగడంతో మార్పు వచ్చింది. ✦ 2022-23లో వార్షిక ప్రయాణికుల సంఖ్య ఆధారంగా ఎన్ఎస్‌జీ 5 స్టేషన్ జాబితాలోకి చేరింది. 12 రైళ్లు ఈ మార్గంలో వెళ్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. పండగ సమయాల్లో ప్రత్యేక రైళ్ల రద్దీ ఉంటోంది. ✦ దేశంలో రద్దీగా ఉండే 1,195వ స్టేషన్‌గా రైల్వేశాఖ గుర్తించింది. ✦ విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్, జనశతాబ్ది, అండమాన్ ఎక్స్‌ప్రెస్, సర్కార్, లఖ్‌నవూ ఎక్స్‌ప్రెస్.. ఈ స్టేషన్ మీదుగా వెళ్తున్నాయి.

ఇబ్బందులివీ....

రద్దీకి తగ్గట్టుగా సౌకర్యాల్లేవు. ఒకటే ప్లాట్‌ఫామ్, ఒకే విద్యుత్తు లైన్ ట్రాక్ ఉన్నాయి. ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్లు, లిఫ్టులు లేవు. 2019 ఏప్రిల్‌లో రూ.30 లక్షలతో కొంతమేర అప్‌గ్రేడ్ చేయడానికి అవకాశం ఏర్పడింది. గత ఆగస్టులో ఆధునికీకరణకు రూ.4.68 కోట్లు మంజూరయ్యాయి. ఈ నెల 16న పనులకు పచ్చజెండా ఊపుతూ రైల్వేశాఖ ఉత్తర్వులిచ్చింది.

ఏమేం చేస్తారంటే..

❖ ఇంజినీరింగ్ విభాగానికి రూ.3.88 కోట్లు... ❖ రూ.44 లక్షలు ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్‌కు, రూ.36 లక్షలు టెలికాం అనుబంధ అంశాలకు కేటాయించారు. ❖ ప్లాట్‌ఫామ్, అప్రోచ్‌రోడ్డు విస్తరిస్తారు. ❖ దివ్యాంగులకు ర్యాంపులు సహా ఇతర సదుపాయాలు కల్పిస్తారు. ❖ చుట్టుపక్కల వీధిదీపాలు, క్లాక్‌రూములు, పార్కింగ్ ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు.

ఆ సంస్థకు నగదే కావాలంట!

మార్టూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ భాగస్వామ్యంతో వందలాది మంది సిబ్బందిని ఏర్పాటుచేసుకుని మైనింగ్ రాయల్టీ వసూలుకు జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు నిర్వహిస్తున్న ఓ సంస్థ తీరుపై ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. నిత్యం భారీగా టన్నేజీని తరలించే వాహన యజమానులు చెల్లించాల్సిన నగదు మొత్తాలను ఫోన్ లేదా ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తామన్నా ఒప్పుకోవడంలేదని, వాహనాల్లో సరకు తరలించకుండా నిలువరించడంతో విలువైన లోడ్లు గమ్యస్థానాలకు చేరక వినియోగదారులతో పాటు యజమానులు మాటపడాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. మార్టూరు ప్రాంతంలో లభించే గ్రావెల్, కంకర, గ్రానైట్‌ను సుదూర ప్రాంతాలకు తరలించడం పరిపాటి. వీటి రవాణాపై ప్రభుత్వానికి చెల్లించాల్సిన మైనింగ్ రాయల్టీని చెల్లిస్తే వాహనదారులు నిరభ్యంతరంగా సంబంధిత లోడును తీసుకెళ్లొచ్చు. కానీ ఇటీవల ఓ సంస్థ ఏర్పాటుచేసిన రుసుం కేంద్రాల ద్వారా ప్రజలకు, వాహన యజమానులకు తల బొప్పి కట్టేలా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం బ్యాంకులకు సెలవు కావడంతో నగదు చెల్లింపులు ఫోన్‌పే, గూగుల్ పే వంటి ద్వారా చెల్లిస్తామన్నా ససేమిరా అనడంతో సకాలంలో సరకును తీసుకెళ్లి, పనులు చేపట్టలేక ఇబ్బందులు పడుతున్నామని యజమానులు, ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

ఆసనం.. అదిరింది విన్యాసం

రాష్ట్ర యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో బాపట్ల మండలం జిల్లెళ్లమూడి అమ్మ ఆశ్రమంలో నిర్వహిస్తున్న జాతీయ యోగాసన పోటీలు అబ్బురపరుస్తున్నాయి. విద్యార్థులు వివిధ రకాల ఆసనాలతో అదరగొడుతున్నారు.

–న్యూస్‌టుడే, బాపట్ల, బాపట్ల వెస్ట్

అమరావతి వేదిక.. అమ్మభాషకు వేడుక

ఈనాడు, అమరావతి: అమరావతి వేదికగా అమ్మభాష వేడుకకు అంతా సిద్ధమవుతోంది. గుంటూరులో మూడో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహిస్తుండడం గర్వంగా ఉందని ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ **గజల్ శ్రీనివాస్** చెప్పారు. మహాసభల నిర్వహణకు కేవలం వారం గడువు ఉండటంతో యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా 'ఈనాడు'తో ప్రత్యేకంగా ముచ్చటించారు.

తెలుగు పరిరక్షణకు కృషి చేస్తున్న వారందరినీ స్మరించుకుంటూ ఈ తెలుగు మహాసభలను విజయవంతం చేయడానికి సమష్టిగా అడుగులేస్తున్నాం. గుంటూరు శివారులోని శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక నగరం ఇందుకు వేదికవుతోంది. 20 ఎకరాల విస్తీర్ణంలో 5 వేదికలను రూపొందిస్తున్నాం. 50 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్నారు. మారిషస్‌లో 40 శాతం తెలుగువారు నివసిస్తున్నందున ఆ దేశ అధ్యక్షుడిని ఆహ్వానించామన్నారు. ఏడాదిగా అన్ని జిల్లాల్లోనూ తెలుగు సాహిత్యంలో లఘు చిత్రాలు, వ్యంగ్య చిత్రాలు, పద్యగాన పోటీలు నిర్వహించాం. పిల్లల్లో భాషపై మక్కువ పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. మహాసభల్లో 23 సదస్సులు నిర్వహిస్తామన్నారు.

సీఎం వరమిచ్చినా..
కరుణించని అధికారులు

ఏడాదైనా అమలుకు నోచుకోని పలు హామీలు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి నరసరావుపేట మండలానికి వచ్చి ఏడాది అవుతోంది. ఈ సందర్భంగా ఇచ్చిన పలు హామీలు ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. గతేడాది డిసెంబరు 31న సీఎం నరసరావుపేట మండలం యలమంద గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈసందర్భంగా 'పేదల సేవలో' సభలో మాట్లాడుతూ పలు హామీలు ఇచ్చారు. ఆరునెలల్లో పూర్తిచేయాలని గడువిచ్చినా, వాటిలో మూడు మాత్రమే పూర్తవడం.. మిగతావి అడుగు కూడా ముందుకు కదలకపోవడం గమనార్హం.

ఇచ్చిన హామీలు... ❖ వితంతు పింఛను లబ్ధిదారు శారమ్మ ఇంటికి సూర్యఘర్ పథకం కింద సోలార్ పలకలు 100 శాతం సబ్సిడీతో ఏర్పాటు, అలాగే ఆమె కుమారుడు రాము సెల్‌పాయింట్ దుకాణం పెట్టుకోవడానికి ఎస్సీ కార్పొరేషన్ కింద రుణం మంజూరు, కుమార్తె చదువుకు ఆర్థికసాయం వంటి హామీలు ఇచ్చారు.

❖ వృద్ధాప్య పింఛను లబ్ధిదారు ఏడుకొండలు కుటుంబానికి ఇంటి నిర్మాణం, అందుకయ్యే ఖర్చు సగం పార్టీ భరిస్తుంది. మిగతా సగం ప్రభుత్వం చెల్లిస్తుంది. మొత్తం రూ.5 లక్షలు. ఏడుకొండలు కుమారుడు సురేశ్ ఎలక్ట్రికల్ షాపు ఏర్పాటుకు బీసీ కార్పొరేషన్ కింద సబ్సిడీ రుణం మంజూరు. ❖ మరో వితంతు పింఛను లబ్ధిదారు రేణుకకు సొంతిల్లు నిర్మాణానికి అయ్యే ఖర్చుతో పాటు కుమార్తె చదువు బాధ్యత.

❖ గ్రామంలో కమ్యూనిటీ కల్యాణ మండపం సగంలో ఆగిపోయింది. నిర్మాణం పూర్తికి అంచనాలు రూపొందించి ఇస్తే నిధులు మంజూరు.

అసంపూర్తిగా ఏడుకొండలు ఇల్లు

❖ సగంలో ఆగిపోయిన కమ్యూనిటీ కల్యాణ మండపం పూర్తికి అంచనాలు రూపొందించి ఎంపీ, ఎమ్మెల్యేలకు అందజేశారు. కానీ నిధులు మంజూరు కాలేదు. 'సోలార్‌ప్యానెల్స్ ఏర్పాటు అనేది తమ పరిధికాదని, నెడ్‌క్యాప్ సంస్థ బిగించాలని విద్యుత్తుశాఖ అధికారులు సమాధానమిచ్చారు. ఏడుకొండల ఇంటి నిర్మాణ బిల్లులు ఉన్నతాధికారులకు పంపించామని హౌసింగ్‌శాఖ అధికారి చెప్పారు.

ఏమేం పూర్తయ్యాయంటే..

❖ పంక్చర్ దుకాణం నడిపే ఏడుకొండలకు రూ.6 లక్షలతో గాలియంత్రం అప్పటి కలెక్టర్ అరుణ్ బాబు చేతులమీదుగా ఇప్పించారు. ఇంటి నిర్మాణం ఇప్పటికీ పూర్తికాలేదు. పార్టీ తరఫున రూ.2.50 లక్షలు రావాల్సి ఉండగా.. కేవలం రూ.లక్ష మాత్రమే ఇచ్చారు. హౌసింగ్ శాఖ తరఫున బిల్లులు పైకి పంపారు. ఇంతవరకు మంజూరు కాలేదు. అలాగే, అతని కుమారుడు సురేశ్‌కు ఎలక్ట్రికల్ షాపు ఏర్పాటుకు బీసీకార్పొరేషన్ రుణం రూ.3 లక్షలు మంజూరు కాలేదు.

❖ వితంతు పింఛను లబ్ధిదారు శారమ్మ సూర్యఘర్ పథకం కింద దరఖాస్తు చేసినా సూర్య పలకలు బిగించలేదు. ఆమె కుమారుడు రాము సెల్‌పాయింట్ దుకాణం ఏర్పాటుకు రెండు నెలల కిందట ఎస్సీ కార్పొరేషన్ కింద రూ.3 లక్షలు మంజూరు చేశారు.

❖ మరో వితంతు పింఛను లబ్ధిదారు రేణుకకు మాత్రం ఆరునెలలకు ఇంటి నిర్మాణం పూర్తిచేశారు. గృహప్రవేశం కూడా చేశారు. ఆమె కుమార్తె ఇంటర్ పూర్తిచేసి బీటెక్‌లో జాయిన్ అయితే ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందలేదు.

పల్లెలకు ఆరోగ్య యోగం

❖ ఆరోగ్య సంరక్షణ కేంద్రాలకు నిధులు
❖ 65 చోట్ల శాశ్వత భవనాల నిర్మాణాలు

నరసరావుపేట, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. పీహెచ్‌సీల తరహాలో గ్రామాల్లోని ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు (హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు) నడవనున్నాయి. జిల్లాలో 65 చోట్ల నూతన భవనాల నిర్మాణాలు, 30 చోట్ల వివిధ దశల్లో ఆగిపోయిన పనుల పూర్తికి నిధులు మంజూరయ్యాయి. తద్వారా పల్లెలకు ఆరోగ్య యోగం కలగనుంది.

జిల్లాలోని 28 మండలాల పరిధిలో 361 ఆరోగ్య సంరక్షణ కేంద్రాలున్నాయి. ఒకరిద్దరు ఆరోగ్య కార్యకర్తలతో ఇవి మొక్కుబడిగా నడుస్తున్నాయి. సగానికి పైబడి కేంద్రాలకు భవనాలు లేనందున పరాయి పంచన సేవలు అందిస్తున్నారు.

నిధులు సరిపోక.. పనులు సాగక.. వైకాపా ప్రభుత్వంలో ఉపాధి హామీ నిధులతో ఆరోగ్య సంరక్షణ కేంద్రాల నిర్మాణం చేపట్టారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.20.80 లక్షలు కేటాయించడంతో అవి సరిపోవని పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకురాలేదు. కొందరు పనులు చేసినా ప్రభుత్వం సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో వాటిని అర్ధంతరంగా నిలిపివేశారు.

✦ 15వ ఆర్థిక సంఘం నిధులతో 51 చోట్ల కొత్తగా భవనాలు నిర్మించనున్నారు. ఒక్కో భవనానికి రూ.36 లక్షల చొప్పున కేటాయించారు. నిధులు పెంచడంతో పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు వస్తున్నారు.

ఫణిదంలో హెల్త్ వెల్‌నెస్ కేంద్ర నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం వద్ద అధికారులు

✦ ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ కింద 14 చోట్ల నూతన భవనాల నిర్మాణాల్ని చేపట్టనున్నారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.42 లక్షలు కేటాయించారు. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ నడుస్తోంది.
✦ వివిధ దశల్లో ఆగిపోయిన 30 ఆరోగ్య సంరక్షణ కేంద్రాల నిర్మాణాల పూర్తికి జాతీయ ఆరోగ్య మిషన్ కింద నిధులు మంజూరై పనులు ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఆరోగ్య సంరక్షణ కేంద్రాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు పీఆర్ జిల్లా పర్యవేక్షకాధికారి కె.ముత్తయ్య 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

ఉద్యోగుల ఆర్థిక అంశాలపై సానుకూల నిర్ణయం

బాపట్ల: ఉద్యోగుల అర్థికపర అంశాలపై ప్రభుత్వం త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. బాపట్లలో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ, మహిళా ఉద్యోగులు చైల్డ్ కేర్ సెలవులు సర్వీస్ మొత్తంలో ఎప్పుడైనా వినియోగించుకునేలా ఉత్తర్వులు ఇచ్చారన్నారు. కిందిస్థాయి ఉద్యోగుల పేర్లను మార్చటానికి శాఖాధిపతుల నుంచి ప్రతిపాదనలు కోరారన్నారు. ఆర్థిక శాఖ అధికారులు ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశమై చర్చించి ఉద్యోగుల పదవీ విరమణ అనంతరం ప్రయోజనాలన్నీ ఒకే సారి ఆన్‌లైన్లో వచ్చేలా త్వరలో ఉత్తర్వులు జారీ చేయటానికి అంగీకారం తెలిపారన్నారు. విజయవాడలో ఫిబ్రవరి 5న ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జేఏసీ సహ ఛైర్మన్ టీవీ ఫణి పేర్రాజు మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని అరవై రోజుల్లో వినియోగంలోకి తేవటానికి సీఎం అంగీకరించి మంత్రులు, ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నేతలతో రాష్ట్ర స్థాయి కమిటీని ఇటీవల నియమించారని తెలిపారు.

మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

అత్యవసర సమయాల్లో ఆదుకునేలా..

ప్రమాద బాధితుల కోసం హైవేలపై క్యూఆర్ కోడ్ సైన్ బోర్డులు

న్యూస్‌టుడే, సత్తెనపల్లి

జాతీయ రహదారులపై రయ్‌రయ్‌మంటూ దూసుకెళ్లేటప్పుడు రాత్రి వేళ ఊహించని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ మార్గంలో ప్రయాణించడం కొత్త కావడంతో అత్యవసర వైద్య సేవలకు ఆసుపత్రులు ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవడం చాలామందికి కష్టమవుతోంది. క్షతగాత్రులకు ఉపయుక్తంగా ఇక నుంచి హైవేలపై క్యూఆర్ కోడ్ సైన్ బోర్డులు ఏర్పాటు కానున్నాయి. వాహన మరమ్మతులు, టైర్ పంక్చర్ దుకాణాలు, పెట్రోలు బంకుల వివరాలకు ఎవరిని అడగకుండా అత్యవసర సేవల సమాచారాన్ని తెలియజేయనున్నాయి. ❖ జిల్లాలో కొండమోడు-పేరేచర్ల(ఎన్‌హెచ్-167ఏజీ), వాడరేవు-పిడుగురాళ్ల, అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) జాతీయ రహదారులు ఉన్నాయి. విస్తరణ, అభివృద్ధి పనులతో అవి కొత్తరూపు సంతరించుకుంటున్నాయి. జిల్లా పరిధిలోని పట్టణాలు, మండలాల నుంచి ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్-544డీ రోడ్లు వెళ్తున్నాయి. హైవేలపై ప్రయాణించే సమయంలో వాహన చోదకులు, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందుల్ని తొలగించేలా క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలు చేయనున్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే క్షణాల్లో సేవల సమాచారం ప్రత్యక్షం కానుంది. సాంకేతిక పరిజ్ఞానంతో రోడ్డు ప్రమాద మరణాల్ని సగానికి పైబడి తగ్గించాలని కేంద్రం భావిస్తోంది.

జాతీయ రహదారులపై ఏర్పాటు చేయనున్న క్యూఆర్ కోడ్ బోర్డులు

ఏయే సమాచారం తెలుసుకోవచ్చంటే..

అత్యవసర హెల్ప్‌లైన్ల నంబర్లు, జాతీయ రహదారి వివరాలు, హైవే నంబరు దాని పొడవు, చైనేజ్(స్థాన గుర్తులు), ఎన్‌హెచ్ఏఐ ఫీల్డ్ కార్యాలయం, హైవే గస్తీ, టోల్‌ప్లాజాలు, పెట్రోలు బంకులు, ఆసుపత్రులు, పోలీసు స్టేషన్లు, ఈ-ఛార్జింగ్ స్టేషన్లు, మెకానిక్ షాపులు, రెస్టారెంట్లు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదుల సమాచారం తెలుసుకోవచ్చు. జిల్లా పరిధిలో బ్లాక్‌స్పాట్లు, ముఖ్య ప్రదేశాలు, కూడళ్లు, ఇతర కీలక ప్రదేశాల వద్ద క్యూఆర్ కోడ్ సైన్‌బోర్డులను ఏర్పాటు చేయబోతున్నట్లు ఎన్‌హెచ్ఏఐ ఏఈఈ ప్రకాశం తెలిపారు.

ఉపాధ్యాయులపై పెత్తనం చేసే ధోరణి తగదు

వినుకొండ, న్యూస్‌టుడే: అధికార వికేంద్రీకరణతో పాలనలో నాణ్యత పెరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా చెబుతుంటే పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు విమర్శించారు. ఆ సంఘం పల్నాడు జిల్లా మహాసభ ఆదివారం వినుకొండలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన ప్రదర్శనలో ఆయన మాట్లాడుతూ మండలం నుంచి జిల్లా విద్యాశాఖధికారి వరకు ఉపాధ్యాయులకు సెలవు ఇచ్చే పరిస్థితి లేదని అన్నింటికి రాష్ట్ర విద్యా కమిషనర్ కార్యాలయం అనుమతి తీసుకోవాల్సి వస్తోందని ఆరోపించారు. మెగా పీటీఎం, వంద రోజుల ప్రణాళిక వంటి కార్యక్రమాలతో ఉపాధ్యాయులు బోధనకు దూరంగా ఉంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. పాఠశాల విద్యాశాఖ కేంద్రీకృత విధానాలు మానుకోవాలని, ఉపాధ్యాయులపై పెత్తనం చేసే ధోరణి మారాలని ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీనియర్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలన్నారు. లేని పక్షంలో వచ్చే ఏడాది జనవరి 10, 11 తేదీల్లో గుంటూరులో నిర్వహించనున్న తమ సంఘం రాష్ట్ర మహాసభల్లో పోరాటాలకు పిలుపు ఇవ్వనున్నట్లు చెప్పారు. 2026ను పోరాటాలు, హక్కుల సాధన సంవత్సరంగా యూటీఎఫ్ ప్రకటిస్తుందన్నారు. ర్యాలీలో రాష్ట్ర కార్యదర్శి కె.మనోహర్, రాష్ట్ర కౌన్సిలర్ లింగయ్య, జిల్లా కోశాధికారి రవిబాబు, రాష్ట్ర, జిల్లా ఆడిట్ కన్వీనర్లు మల్లేశ్వరరావు, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ప్రదర్శనలో ఉపాధ్యాయులు



(c) eenadu

నేడు సెమీస్ పోరు

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్

EENADU SPORTS LEAGUE 2025
Aster Ramesh HOSPITALS We'll Treat You Well

గుంటూరు క్రీడలు, తాడికొండ, న్యూస్‌టుడే: ఈనాడు ఆధ్వర్యంలో మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలోని హిల్‌వ్యూ స్టేడియంలో ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజంట్స్ ఈనాడు స్పోర్ట్స్ లీగ్(ఈఎస్ఎల్)-2025 క్రికెట్ టోర్నమెంట్‌లో జూనియర్ విభాగంలో జరిగిన మ్యాచ్‌ల్లో వివిధ కళాశాలల జట్లు తలపడ్డాయి. పలు జట్లు సెమీఫైనల్స్‌కు చేరాయి. కొందరు క్రీడాకారులు ఆల్ రౌండర్లుగా రాణించి తమ జట్లను విజయపథంలో నడిపించారు.

యూనివర్సల్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు విజయ భేరి

గ్రౌండ్-1

మొదటి మ్యాచ్ యూనివర్సల్ పాలిటెక్నిక్ కళాశాల(డోకిపర్రు)-శ్రీగౌతమి జూనియర్ కళాశాల(చీరాల) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన శ్రీగౌతమి కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన యూనివర్సల్ కళాశాల జట్టు 10 ఓవర్లకు 2 వికెట్లు కోల్పోయి 102 పరుగులు చేసింది. బరిలోకి దిగిన శ్రీగౌతమి కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో 69 పరుగులు మాత్రమే చేసి ఆల్‌అవుట్ అయ్యింది. 33 పరుగుల తేడాతో యూనివర్సల్ కళాశాల జట్టు విజయభేరీ మోగించింది. భార్గవ్ 3 కీలక వికెట్లు తీసి జట్టును విజయతీరాల వైపు నడిపించాడు.

సత్తా చాటిన ఎన్నారైటీ

రెండో మ్యాచ్ ఎన్నారైటీ కళాశాల(విశదల)-శ్రీచైతన్య జూనియర్ కళాశాల(గుంటూరు) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన ఎన్నారైటీ బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 108 పరుగులు చేసింది. బరిలోకి దిగిన శ్రీచైతన్య కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 99 పరుగులు మాత్రమే చేసింది. 9 పరుగుల తేడాతో ఎన్నారైటీ జట్టు గెలిచింది. చరణ్ 18 బంతుల్లో రెండు ఫోర్లు ఒక సిక్స్‌తో 30 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించాడు.

'సెయింట్ ఆన్స్'దే పైచేయి

మూడో మ్యాచ్ సెయింట్ ఆన్స్ డిప్లొమా కళాశాల(చీరాల)-ఏఎం రెడ్డి కళాశాల(నరసరావుపేట) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన సెయింట్ ఆన్స్ కళాశాల జట్టు బౌలింగ్‌ను ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఏఎంరెడ్డి కళాశాల జట్టు 10 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. బరిలోకి దిగిన సెయింట్ ఆన్స్ కళాశాల జట్టు 8.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసి లక్ష్యాన్ని అవలీలగా ఛేదించింది. రాహుల్ అద్భుతంగా బౌలింగ్ చేసి మూడు ప్రధాన వికెట్లు తీసి జట్టును గెలిపించాడు.

విజయపథంలో కేఎల్‌యూ

గ్రౌండ్-2

నాలుగో మ్యాచ్ కె.ఎల్.విశ్వవిద్యాలయం(వడ్డేశ్వరం)-కళ్లం హరనాథ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(దాసరిపాలెం) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన కేఎల్‌యూ జట్టు మొదట బ్యాటింగ్ చేసి 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. బరిలోకి దిగిన కేహెచ్ఐటీ జట్టు నిర్ణీత ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసింది. 17 పరుగుల తేడాతో కేఎల్‌యూ జట్టు విజయాన్ని దక్కించుకుంది. కెప్టెన్ గౌతమ్ 21 బంతుల్లో మూడు ఫోర్లు, ఒక సిక్స్ కొట్టి 26 పరుగులు చేశాడు. రెండు ఓవర్లు బౌలింగ్ చేసి మూడు వికెట్లు తీశాడు. జట్టును విజయపథంలో నడిపించాడు.

హిందూ జూనియర్ కళాశాల జట్టు గెలుపు

అయిదో మ్యాచ్ హిందూ జూనియర్ కళాశాల(గుంటూరు)- ఆక్స్‌ఫర్డ్ జూనియర్ కళాశాల(పిడుగురాళ్ల)జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన హిందూ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఆక్స్‌ఫర్డ్ కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 62 పరుగులు చేసింది. బరిలోకి దిగిన హిందూ కళాశాల జట్టు 4 ఓవర్లకే లక్ష్యాన్ని ఛేదించింది. శశాంక్ 2 వికెట్లు తీసి 11 పరుగులు చేశాడు. జట్టు కెప్టెన్ నాయుడు 9 బంతుల్లో 5 ఫోర్లు కొట్టి 23 పరుగులు చేశాడు. ఇందులో మూడు వరుస ఫోర్లు కొట్టి జట్టుకు విజయాన్ని అందించాడు.

Title Sponsor
Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Protein Partner
NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor
CITY Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor
CITY Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Beverage Partner
CMR SHOPPING MALL The joy of life ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా | కర్ణాటక
Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner ఈనాడు.నెట్ ETV BHARAT
TV Partner ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్ వీరే..

భార్గవ్ చరణ్ రాహుల్ గౌతమ్ శశాంక్ ఆరిఫ్

చలపతి ఇంజినీరింగ్ కళాశాల జట్టు జయకేతనం

ఆరో మ్యాచ్ చలపతి ఇంజినీరింగ్ కళాశాల(మోతడక)-యూనివర్సల్ పాలిటెక్నిక్ కళాశాల(డోకిపర్రు)జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన చలపతి కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన యూనివర్సల్ కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 73 పరుగులు చేసింది. బరిలోకి దిగిన చలపతి కళాశాల జట్టు 8.2 ఓవర్లకే 4 వికెట్లు కోల్పోయి 76 పరుగులతో లక్ష్యాన్ని ఛేదించింది. ఆరిఫ్ బాజీ 14 బంతుల్లో 3 సిక్స్‌లు, రెండు ఫోర్లు కొట్టి 35 పరుగులు చేసి జట్టుకు చక్కటి విజయాన్ని అందించాడు.

నేడు జరిగే మ్యాచ్‌లు.. వేదిక: చలపతి హిల్‌వ్యూ స్టేడియం

గ్రౌండ్-1, జూనియర్స్ సెమీఫైనల్స్ ★ ఉదయం 8 గంటలకు ఎన్నారైటీ (విశదల)- చలపతి కళాశాల(మోతడక) ★ ఉదయం 11 గంటలకు సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల(చీరాల)- హిందూ జూనియర్ కళాశాల(గుంటూరు) ★ మధ్యాహ్నం 2 గంటలకు వీవీఐటీ(నంబూరు)- విజ్ఞాన్ యూనివర్సిటీ(వడ్లమూడి)మహిళల మ్యాచ్...

గ్రౌండ్-2, సీనియర్స్ సెమీఫైనల్స్... ★ ఉదయం 11 గంటలకు కేబీఆర్ డిగ్రీ కళాశాల(నరసరావుపేట)- జేసీ లా కళాశాల(గుంటూరు) ★ మధ్యాహ్నం 2 గంటలకు ఆర్వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల(గుంటూరు)- కేఎల్ యూనివర్సిటీ (వడ్డేశ్వరం)

అన్నదమ్ముల హత్య కేసులో ముగ్గురికి రిమాండు

దుర్గి, న్యూస్‌టుడే: దుర్గి మండలం అడిగొప్పలలో ఈనెల 21న రాత్రి అన్నదమ్ములు కొత్త శ్రీరామమూర్తి, హనుమంతు హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితులు యాగంటి నరేష్, ముత్యాల శివ, రామలింగంను శనివారం రాత్రి నాగార్జునసాగర్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. వీరిని ఆదివారం మాచర్ల న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా 14 రోజులు రిమాండు విధించినట్లు సీఐ శ్రీనివాసరావు, ఎస్సై సుధీర్‌కుమార్ తెలిపారు. మరో నలుగురిని కూడా అదుపులోకి తీసుకున్నామని, వారిని సోమవారం కోర్టుకు హాజరు పెట్టనున్నట్లు సీఐ పేర్కొన్నారు.

REPLY PUBLIC NOTICE

The attention of my client Mr. Kanneganti Muralidhar Rao, S/o. Late Kanneganti Kotaiah, aged 79 years, R/o. Shivani Plaza, Flat No.303, 3rd Floor, H.No.8-2-293/82/NG/40/3, Plot No.40, Nandagiri Hills, Jubilee Hills, Hyderabad-500 033, Telangana, has been drawn to a Public Notice published in Eenadu in Bapatla, Amaravati Guntur, and Visakhapatnam Editions on 21st December, 2025 issued by Ms. Kanneganti Umakumari D/o. Late Kanneganti Kotaiah R/o. Kuchipudi village through her Advocate Sri. Pannam Ravindra Babu, D.No.3-76, I Floor, Opposite Amaravathi Rythu Bazar, JKC College Road, Guntur. The contention of Ms. Kanneganti Umakumari is that she is the Lessee of Agricultural and other properties belonging to Dr. Kanneganti Kamalakar Rao S/o. Late Kanneganti Kotaiah is false and baseless. She has been falsely proclaiming herself as the Lessee of the said properties with the object of making monetary gains. Dr. Kanneganti Kamalakar Rao has never leased out any of his properties to Ms. Kanneganti Umakumari at any point of time. There is no document evidencing the creation of Lease in favour of Ms. Kanneganti Umakumari by Dr. Kanneganti Kamalakar Rao.

The allegation that due to an alleged injury sustained by Dr. Kanneganti Kamalakar Rao on his head, his health condition was not good is firmly denied. His mental condition was sound and stable. Dr. Kanneganti Kamalakar Rao executed a General Power of Attorney (GPA) in favour of my client on 27th May, 2023 in the presence of witnesses and the Power of Attorney has been duly notarized by a Notary Public State of Washington, namely, OK HEE KIM, County of Pierce, USA. Dr.Kanneganti Kamalakar Rao has also executed a letter of cancelling the Will dated 26th April, 2013 in favour of Ms. Kanneganti Umakumari.

My client Mr. Kanneganti Muralidhar Rao has got the General Power of Attorney validated in India after following the due procedure. The said GPA executed in favour of my client perfectly valid in eye of law. My client states that the GPA executed by Mr. Kanneganti Kamalakar Rao was shared with Ms. Kanneganti Umakumari on 04-12-2024 by Speed Post and Registered Post to her two addresses i.e. at Nadimpalle and another at Guntur. She did not object to the same then, but she has issued the public notice dated 21-12-2025 with some malafide motives.

My client states that Ms. Kanneganti Umakumari is the younger sister of Dr. Kanneganti Kamalakar Rao, and she has been illegally leasing the agricultural properties and collecting the lease amounts of the agricultural properties mentioned in the schedule of the Public Notice dated 21st December, 2025. She has not accounted for the amounts she has illegally collected so far. She has borrowed huge amounts of money from Dr. Kanneganti Kamalakar Rao and has not bothered to repay the amounts borrowed by her. It is precisely for this reason Dr.Kanneganti Kamalakar Rao has executed a GPA in favour of my client.

My client after obtaining GPA in his favour from his brother, Dr. Kanneganti Kamalakar Rao, has opened NRO account in the name of Dr. Kanneganti Kamalakar Rao and paid capital gains tax to the extent of Rs.1.1 Crore to the Income Tax Department by obtaining his PAN number during 2025.

My client is looking after payment of Dr. Kanneganti Kamalakar Rao's statutory dues payable by him, for the apartments belonging to him at West Wind Apartments in Visakhapatnam.

The General public are advised not to believe any of such baseless allegations made against Mr. Kanneganti Muralidhar Rao and his family published in 21st December, 2025 by Ms. Kanneganti Umakumari in the form of public notice. The said Public Notice has defamed my client & his family and has lowered his image in the eyes of his relatives, friends, and society at large.

My client calls upon Ms. Kanneganti Umakumari to account all the amounts that she has so far collected in respect of agricultural properties of Dr. Kanneganti Kamalakar Rao within 48 hours of the publication of this Reply Public Notice failing which criminal and civil action will be initiated against her acts of criminal misappropriation and breach of trust.

My client calls upon Ms. Uma Kumari to withdraw the Public Notice dated 21st December, 2025 published in Eenadu in Bapatla, Amaravathi Guntur and Visakhapatnam Editions within 48 hours of the publication of this Reply Public Notice, failing which my client will be initiating appropriate legal action both Civil and Criminal against Ms. Kanneganti Umakumari for civil and criminal defamation, breach of trust and recovery of money.

Sd/- KARUNA RAWAL, P.V.G. NIKITHA, NEMANI SAI CHARAN
Advocates
Office at Flat No.101, Sai Ridah Jeevan Residency, H. No.6-1- 318/1, Walker Town, Padmarao Nagar, Secunderabad-500020. Mobile: 9966897702

91.9FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

సంప్రదాయ క్రీడలకు ప్రాణం పోద్దాం

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: మరుగున పడుతున్న సంప్రదాయ క్రీడలైన ఎద్దుల పోటీలను భారీ ఎత్తున నిర్వహించడం ఎంతో సంతోషకరమని, పోటీల్లో గెలుపోటములను క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. నరసరావుపేటలోని కోడెల శివప్రసాద్ స్టేడియంలో జరుగుతున్న అఖిల భారత ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలను ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నాలుగు పళ్ల విభాగంలో పోటీలు ప్రారంభించారు. తెలుగు ప్రజల సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే క్రీడల్లో ఎడ్ల పందేలు ఒకటన్నారు. ప్రస్తుత కాలంలో ఎద్దుల పోషణ, నిర్వహణ ఎంతో కష్టంతో కూడుకున్నదని వాటిని తట్టుకుని పోషిస్తున్న రైతులు అభినందనీయులన్నారు. ఎడ్ల బల ప్రదర్శన పోటీలు చూస్తుంటే సంక్రాంతి ముందే వచ్చినట్లు ఉందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వ్యవసాయ, పశుగణాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటికి రెండు ఆవులను పెంచితే ఒంగోలు జాతిని సంరక్షించిన వాళ్లం అవుతామన్నారు.

హోరా హోరీగా ఎడ్ల పోటీలు

మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పక్కన ఎమ్మెల్యేలు

ఎడ్ల సంరక్షణకు కృషి: ఎంపీ లావు.. దేశీయంగానే కాక విదేశాల్లోనూ ప్రత్యేక గుర్తింపు కలిగిన ఒంగోలు జాతి ఎడ్లను కాపాడుకోవటానికి కృషి చేస్తున్నామని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఎడ్ల బండలాగుడు పోటీలను ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో పశువులను బిడ్డల్లా సాకుతున్నారని తెలిపారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి జిలానీ, కొల్లి బ్రహ్మయ్య తదితరులతో కలిసి తొలుత ఎడ్ల యజమానులకు జ్ఞాపిక, త్రికోటేశ్వరస్వామి ప్రసాదాన్ని అందించారు. పోటీలను తిలకించటానికి వివిధ ప్రాంతాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

'పరువు కన్నా ప్రాణం ముఖ్యం కాదు'

ఓ మహిళ ఆత్మహత్యాయత్నం ✦ సీఐ వేధిస్తున్నారని ఆరోపణ

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, పిడుగురాళ్ల: పొద్దున్న వస్తానని చెప్పినా వినిపించుకోకుండా బలవంతంగా రాత్రివేళ పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారని.. మహిళ అని కూడా చూడకుండా సీఐ వెంకట్రావు వేధిస్తున్నారని, పరువు కన్నా ప్రాణం ముఖ్యం కాదంటూ ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఇది. శనివారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన కోడూరి శ్రీనివాసరావు ధాన్యం సిండికేట్ వ్యాపారి. కొంతమంది భాగస్వాముల నుంచి ఆయన సుమారు రూ.14 కోట్లు అప్పు తీసుకుని, తీర్చలేక ఐపీ పెట్టారు. పెద్ద మనుషుల ఒప్పందం మేరకు ఆస్తుల్ని అమ్మి రూ.10 కోట్ల వరకు చెల్లించి.. మిగతా సొమ్ముకు మరో 5 నెలల గడువు తీసుకున్నారు. మరోవైపు అప్పు ఇచ్చిన జూలకంటి సురేశ్, కనమర్లపూడి రామకృష్ణ సీఐ వెంకట్రావు ద్వారా శ్రీనివాసరావుపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో వ్యాపారి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో వ్యాపారి భార్య జ్యోతిని స్టేషన్‌కు రావాలని కొన్నిరోజులుగా సీఐ ఒత్తిడి చేస్తున్నారు. ఈ నెల 27న రాత్రి 7.30 గంటలకు ఓ మహిళా కానిస్టేబుల్, హోంగార్డు ఆమె ఇంటికి వెళ్లి, సీఐ రమ్మంటున్నారు. వస్తావా రావా అని నిలదీశారు. తనపై కేసులేమీ లేవని, రేపు ఉదయం వస్తానని చెప్పారు. మహిళను రాత్రిపూట స్టేషన్‌కు తీసుకెళ్తారా అని అడుగుతున్నా వినకుండా ఆమెను బలవంతంగా స్టేషన్‌కు తీసుకెళ్లారు. దాంతో పరువు పోయిందని ఆమె తనవెంట తెచ్చుకున్న చాకుతో ఠాణాలోనే చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. వెంటనే పోలీసులు ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. దీనిపై సీఐని వివరణ కోరగా.. జూలకంటి సురేశ్ ఫిర్యాదు మేరకు ఆమెను విచారణకు పిలిపించానని, ఎలాంటి వేధింపులకూ గురిచేయలేదని చెప్పారు.

ఆసుపత్రిలో బాధితురాలు జ్యోతి

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్

నేడు ప్రారంభించనున్న కలెక్టర్

నరసరావుపేట అర్బన్: జిల్లాలో భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో రెవెన్యూ క్లినిక్‌ను ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. 29న ప్రారంభించే రెవెన్యూ క్లినిక్‌లు ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌తో పాటు కొనసాగుతాయని వెల్లడించారు. జిల్లాలోని ఆర్డీవోలు, అన్ని మండలాల తహసీల్దార్లు, ల్యాప్‌టాప్, కంప్యూటర్ ఆపరేటర్లు, అవసరమైన రెవెన్యూ రికార్డులతో పాటు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక యథా ప్రకారం కొనసాగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. అర్జీదారులు కలెక్టరేట్‌కు రాకుండానే ఆన్‌లైన్ ద్వారా కూడా అర్జీలు పంపవచ్చని పేర్కొన్నారు. అర్జీల పరిస్థితిని 1100 కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా వెబ్‌సైట్ Meekosam.ap.gov.in కు ఫిర్యాదులు పంపవచ్చన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 142, రిటైల్ ధర - 169, చికెన్ విత్‌స్కిన్ - 245, చికెన్ స్కిన్‌లెస్ - 279.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 147, 156, 167 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం : శ్రీటవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్‌ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ కార్యాలయం : శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైను, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు-522034.
కార్యాలయ చిరునామా : పిడుగురాళ్ళ. వెబ్‌సైట్: http://www.shriramfinance.in./auction

శ్రీ మద్ది శ్రీనివాసరావు కి చెందిన స్థిరాస్తులకు సంబంధించి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని నిబంధన 8(6) ప్రకారం స్థిరాస్తుల విక్రయానికి ఈ-వేలం విక్రయ నోటీసు.

సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీత మరియు హామీదారు/తనఖాదారులకు తెలియజేయునది ఏమనగా, సెక్యూర్డ్ క్రెడిటర్ (శ్రీరామ్ ఫైనాన్స్) వద్ద తాకట్టు పెట్టబడిన ఈ క్రింద వివరించిన స్థిరాస్తిని, "ఎక్కడ ఉంటే అక్కడ", "ఏ స్థితిలో ఉంటే ఆ స్థితిలో" మరియు "ఏమి ఉంటే అది" ప్రాతిపదికన **30.01.2026** నాడు ఉదయం **11.00** గంటల నుండి మధ్యాహ్నం **01.00** గంట వరకు విక్రయించబడును. SARFAESI చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (సెక్యూర్డ్ క్రెడిటర్) వారు రుణగ్రహీత/హామీదారు(ల)కు జారీ చేసిన **24-01-2023 తేదీనాటి డిమాండ్ నోటీసు తేదీ ప్రకారం, 24-01-2023 నాటికి బాకీ ఉన్న రూ.2,49,36,117/-** మరియు 25-01-2023 నుండి తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు రాబట్టుకొనుట కొరకు ఈ వేలం నిర్వహించబడుతుంది.

అగ్రిమెంట్ నెం. **PIDUUTF1801300007**

రుణగ్రహీత/హామీదారుల పేర్లు మరియు చిరునామాలు:

1. **విజయ సాయి ఫెర్టిలైజర్స్, ప్రొప్రైటర్: మద్ది శ్రీనివాస రావు,** డోర్ నం: 14-1-170/A, వినుకొండ రోడ్, నరసరావుపేట - గ్రామం & మండలం, పల్నాడు జిల్లా-522601.
2. **మద్ది శ్రీనివాస రావు, తండ్రి: వెంకట నరసింహారావు,** డోర్ నం: 14-1-170/A, వినుకొండ రోడ్, నరసరావుపేట - గ్రామం & మండలం, పల్నాడు జిల్లా-522601.
3. **మద్ది V.K.L.S. సంధ్యా రాణి, భర్త: శ్రీనివాస రావు,** డోర్ నం: 14-1-170/A, వినుకొండ రోడ్, నరసరావుపేట - గ్రామం & మండలం, పల్నాడు జిల్లా-522601.
4. **కోలిశెట్టి అమ్మాజీ, తండ్రి: రామాంజనేయులు,** డోర్ నం: 1-5-29, బర్మాపేట ఆశ్రమ్ బజార్, ఆంజనేయస్వామి టెంపుల్ స్ట్రీట్, నరసరావుపేట - గ్రామం & మండలం, పల్నాడు జిల్లా-522601.

స్థిరాస్తి యొక్క వివరణ:

(ఆస్తి మద్ది శ్రీనివాస రావుకు చెందినది): పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట సబ్-డిస్ట్రిక్ట్, నరసరావుపేట మున్సిపాలిటీ, గుంటూరు రోడ్డుకు దక్షిణ భాగంలో, క్రిస్టియన్‌పాలెం ప్రక్కన, నరసరావుపేట మున్సిపల్ పాత వార్డు నం 2, కొత్త వార్డు నం 12, ప్రస్తుత వార్డు నం.5, పాత సర్వే నం 367/1A, మొత్తం ఎకరా 2.35 సెంట్లలో, T.S.నెం.105/1, బ్లాక్ నం 2/3, అసెస్మెంట్ నం 14558, డోర్ నం .17-4-20/1, ఎకరా 1.17 సెంట్ల లో 484 చదరపు గజాలు లేదా 404.68 చదరపు మీటర్ల విస్తీర్ణం గల ఖాళీ ఇంటి స్థలం. **దీనికి సరిహద్దులు: తూర్పు:** మర్రిపూడి వెంకయ్య నుండి రెడ్డి కొనుగోలు చేసిన స్థలం. 167 అడుగులు, **దక్షిణం:** తాళ్లూరి హనుమయ్య స్థలం. 26.9½ అడుగులు, **పడమర:** కొమ్ము ప్రభుదాస్ ఆస్తి. 163 అడుగులు, **ఉత్తరం:** రోడ్డు. 26 అడుగులు. **పైన పేర్కొన్న సరిహద్దుల లోపల 484 చదరపు గజాలు లేదా 404.68 చదరపు మీటర్ల విస్తీర్ణం గల ఖాళీ ఇంటి స్థలం మాత్రమే. (ఈ ఆస్తి నరసరావుపేట S.R.O యొక్క డాక్యుమెంట్ నం.9397/2008 కి సంబంధించినది).**

ఆస్తిపై ఉన్న రుణభారాలు: ఏమీ లేవు.

అగ్రిమెంట్ నెం.	ఆస్తి రిజర్వ్ ధర	EMD మొత్తము:	EMD చెల్లింపు విధానం	బిడ్ పెంపుదల మొత్తం	వేలం తేదీ	EMD చెల్లించడానికి చివరి తేదీ	ఆస్తి తనిఖీ తేదీ.
PIDUUTF1801300007	రూ.1,30,68,000/- (అక్షరాల ఒక కోటి ముప్పై లక్షల అరవై ఎనిమిది వేల రూపాయలు మాత్రమే)	రూ.13,06,800/- (అక్షరాల పదమూడు లక్షల ఆరు వేల ఎనిమిది వందల రూపాయలు మాత్రమే)	డిడి రూపంలో "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్" పేరిట తీయవలెను	రూ. 25,000/-	30.01.2026	29.01.2026	28.01.2026

ఆసక్తి గల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్ సృష్టించుకోవడం, డేటా అప్‌లోడ్ చేయడం, బిడ్ సమర్పించడం, ఈ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణ మొదలైన వాటి కోసం M/s.**శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, కాంటాక్ట్ పర్సన్: శ్రీ గౌరవ్ నంబూదిరి ఫోన్: 9833922941,** ఈమెయిల్: శ్రీ గౌరవ్ నంబూదిరి <gaurav.n@samil.in> వారిని సంప్రదించవచ్చు. ఆస్తికి సంబంధించిన సందేహాల కోసం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆథరైజ్డ్ ఆఫీసర్, **శ్రీ కాశీ వీరాంజనేయులు, ఫోన్: 9885888929** నంబరులో ఆఫీసు వేళల్లో మరియు పని దినాలలో సంప్రదించవచ్చు.
ఎటువంటి కారణం చూపకుండా ఏవైనా లేదా అన్ని బిడ్లను తిరస్కరించే హక్కు అధీకృత అధికారికి ఉంది. ఆన్‌లైన్ వేలం మా ఏజెన్సీ అయిన శ్రీరామ్ ఆటో మాల్ ఇండియా లిమిటెడ్ వారి వెబ్‌సైట్ **(https://eauctions.Samil.in/home)** లో నిర్వహించబడుతుంది. టెండర్ సమర్పణ, బిడ్ ఫారం పొందడం మరియు పూర్తి నిబంధనల కోసం **https://eauctions.Samil.in/home** లేదా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లోని **https://www.shriramfinance.in/auction** లింక్‌ను చూడగలరు.
గమనిక: NCLT, చెన్నై వారి ఆదేశాల మేరకు శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌లో విలీనం చేయబడింది అని దీని ద్వారా తెలియజేయడమైనది. తదుపరి, పేరు మార్పుకు సంబంధించి 30-11-2022 నాడు జారీ అయిన సర్టిఫికేట్ ఆఫ్ ఇన్‌కార్పొరేషన్ ప్రకారం, 30.11.2022 తేదీ నుండి అమలులోకి వచ్చేలా శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ పేరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా మార్చబడింది.

ప్రదేశము: గుంటూరు, తేది: 27.12.2025 **సం/-అధీకృత అధికారి**

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

JOBS

Wanted Civil Engineers & Supervisors, 3-5 yrs Exp in Buildings & CC Road Works. @ Gokavaram (A.P). Ph No:8888838677, 9422135347.

భారతదేశ అగ్రగామి సంస్థలో పార్ట్/ఫుల్ టైం బిజినెస్ పార్టనర్‌గా చేరండి అధిక కమిషన్ పొందండి. అ: 10th, వ: 30-65 సం||. ✆ 79892 46788.

తెనాలి దగ్గర దుగ్గిరాలలోని ప్రముఖ కాఫీ పరిశ్రమలో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ మరియు ప్యాకింగ్ బాయ్స్ కావలెను. రూమ్ మరియు క్యాంటీన్ సౌకర్యం కలదు. ✆ 92980 11777, 8096161777.

'మహానాడు మీడియా'లో వీడియో ఎడిటర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ, యువకులు కావలెను. కాల్: 73372 22004.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజీ నందు Acdemic Incharge గా పనిచేయుటకు వివాహితులైన లోకల్ పురుషులు కావలెను. జీతము: 25000/- నుండి 30000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: డిగ్రీ నుండి పి.జి వరకు, వయస్సు: 30 నుండి 45 సంవత్సరాలు. సంప్ర: ✆ 92487 22217.

గుంటూరు 2వీలర్ షోరూంలో పనిచేయుటకు సేల్స్ మేనేజర్ (Exp 3+), సేల్స్ ఎగ్జిక్యూటివ్ (M/F 2+), అకౌంటెంట్ 3+ CA Inter ప్రాధాన్యత, మెకానిక్స్, సర్వీస్ అడ్వైజర్స్ కావలెను. ✆ 83416 22655.

గుంటూరులో నివాసము ఉంటున్న పేషంట్స్‌ను చూసుకొనుటకు బార్య & భర్త మరియు ఆయాలు అర్జంట్‌గా కావలెను. సంప్ర|| ✆ 7842845772.

గుంటూరు, ఆటోనగర్‌లో HP పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మేనేజర్, పంపు బాయ్స్/ గర్ల్స్ కావలెను. పార్ట్ టైమ్/ ఫుల్ టైమ్. 7799689889, 8074546302.

ఉద్యోగం చేస్తూనే అదనపు ఆదాయం కోసం చూస్తున్నారా? నిరుద్యోగులు, మహిళలు పార్ట్‌టైమ్ లేక ఫుల్‌టైమ్ ఖాళీ సమయాల్లో పనిచేస్తూ డబ్బు సంపాదించాలని అనుకుంటున్నారా? సంప్ర: 85003 53577.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జ్‌స్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకొరకు సంప్ర. ✆ 89784 80429.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు క్లాసు ఇన్‌ఛార్జ్‌స్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌స్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీ: 14000/- నుండి 21000/- వరకు. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు, వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. వివరముల కొరకు సంప్ర. ✆ 9248713335.

వాచ్‌మెన్ కావలెను. గుంటూరు లోని కమర్షియల్ కాంప్లెక్స్ నందు పనిచేయుటకు 40 సం||ల లోపు భార్యాభర్తలు కావలెను. ఒ.సి.లకు ప్రాధాన్యత. వేతనం: రూ.15,000/-, గృహవసతి కలదు. ✆ 98499 83681.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

నరసరావుపేట
•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

భట్రాజులకు రాయితీ రుణాలు

రొంపిచర్ల, న్యూస్‌టుడే: వెనుకబడిన భట్రాజు సామాజిక వర్గ బలోపేతానికి కృషి చేస్తున్నానని భట్రాజు కార్పొరేషన్ ఛైర్మన్ సరికొండ వెంకటేశ్వరరాజు అన్నారు. ఆదివారం రొంపిచర్ల వచ్చిన ఆయనను భట్రాజులు ఘనంగా సన్మానించారు. అనంతరం రాజుల కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భట్రాజుల్లో పేదలు, ఆర్థికంగా వెనుకబడిన వారికి కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు అందజేస్తామన్నారు. శ్రీశైలంలో భట్రాజుల సత్రం ఏర్పాటుకు స్థల సేకరణకు ప్రయత్నాలు ప్రారంభించామన్నారు. జనవరి 5న సత్తెనపల్లిలో బాధ్యతలు స్వీకరిస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు రొంపిచర్లలో భట్రాజులకు శ్మశాన వాటిక సమస్య పరిష్కరించాలని ఆయనను కోరారు. ఆయన వెంట భట్రాజు సంఘం రాష్ట్ర కార్యదర్శి తిమ్మరాజు, రమేష్‌రాజు తదితరులు ఉన్నారు.

మసీదుమాన్యంలో విద్యుత్తు చౌర్యంపై ఆరా

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని మసీదు మాన్యంలో అనధికార విద్యుత్తు కనెక్షన్లపై ఆ శాఖ ఉన్నతాధికారులు దృష్టిసారించారు. ఈ మేరకు జిల్లా ఎస్‌ఈ విజయ్‌కుమార్, డీఈ ఎస్‌ఈ మూర్తి స్వయంగా కాలనీని పరిశీలించారు. కాలనీలో వెయ్యికి పైగా ఇళ్లు ఉండగా వాటిల్లో వంద ఇళ్లకు మాత్రమే మీటర్లు ఉన్నాయి. మరో 200 వరకు గృహాలకు అనధికారికంగా కరెంట్ వినియోగిస్తున్నట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు పట్టణ ఏఈ పిచ్చయ్య తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు చెప్పారు. కాలనీకి కరెంట్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కొత్త మీటరు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలో సీఆర్ కాలనీ పార్కు పక్కన సిమెంటు రోడ్డు పగుళ్లిచ్చింది. రాత్రి సమయంలో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఒక్కోసారి కిందపడి గాయాలపాలవుతున్నారు. - శ్రీనివాసరావు ✔ పరిశీలించి రహదారికి మరమ్మతులు చేయిస్తాం. - మణికుమార్, పురపాలక సంఘ ఏఈ – న్యూస్‌టుడే, గాంధీపేట (చిలకలూరిపేట పట్టణం)

నగదు అందిస్తున్న కళాశాల అధ్యాపకులు

విద్యార్థికి ఆర్థిక సాయం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ద్వితీయ బీకాం చదువుతున్న విద్యార్థి కుటుంబానికి విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల కలిసి సేకరించిన రూ.1.20 లక్షలు నగదు ఆదివారం అందజేశారు. రెండు వారాల క్రితం విద్యార్థి అభిలాష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి రెండు కాళ్లు కోల్పోయాడు. పేద కుటుంబం కావడంతో అతన్ని ఆదుకునేందుకు సామాజిక బాధ్యతతో విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు అన్నారు. వైస్ ప్రిన్సిపల్ ఎం.సతీష్, డాక్టర్ యోగేశ్వరరావు, తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

ఆమెకు అభయం

మహిళల్లో ధైర్యం నింపేందుకు జీఆర్‌సీ కేంద్రాలు

ఎన్జీవో కాలనీ (నరసరావుపేట సెంట్రల్, వ్యవసాయం), స్తూపం సెంటర్ (వినుకొండ), పండరీపురం (చిలకలూరిపేట గ్రామీణ), కారుమంచి (శావల్యాపురం), న్యూస్‌టుడే : గృహహింస, కట్నం, లైంగిక వేధింపులు ఎదుర్కొనే గ్రామీణ మహిళలకు బాసటగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మండలానికో జెండర్ రిసోర్స్ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించింది. తొలి విడతలో భాగంగా జిల్లాలో శావల్యాపురం, నాదెండ్ల, అమరావతి, మాచవరం మండలాల్లో ఏర్పాటు చేశారు. నరసరావుపేట, సత్తెనపల్లి, మాచర్ల, బొల్లాపల్లి మండలాల్లో త్వరలో నెలకొల్పేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇటీవల అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న పీడీ ఝాన్సీరాణి

జిల్లాలో మండలాలు:	28
మండల సమాఖ్యలు:	28
గ్రామ సంఘాలు:	1056
జిల్లాలో స్వయం సహాయక సంఘాలు:	36,620
సభ్యులు:	3,66,215

కేంద్రం ఏం చేస్తుంది.. మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తుంది. ప్రభుత్వ పథకాలు, చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తుంది. మహిళా ప్రతినిధులతో నడిచే ఈ కేంద్రం మహిళలను మరింత శక్తివంతంగా తీర్చిదిద్దే సమగ్ర వేదికగా నిలుస్తుంది. ప్రస్తుతం వసతి సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం ఒక్కొక్క కేంద్రానికి రూ.5 లక్షల నిధులు వెచ్చిస్తుంది.

అవసరమైతే తాత్కాలిక వసతి

ఇటీవల శావల్యాపురం మండలంలోని ఓ మహిళ కుటుంబపరమైన సమస్యతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుర్తించి జీఆర్‌సీ కేంద్రం ద్వారా పరిష్కరించారని డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి తెలిపారు. గృహహింస, కట్నం, లైంగిక వేధింపులతో పాటు బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేస్తారన్నారు. బాధితుల్లో ధైర్యం నింపి అవసరం మేరకు తాత్కాలిక వసతి కల్పిస్తారన్నారు. వసతి సౌకర్యాలున్న ప్రాంతాల్లో ఇప్పటికే నాలుగు చోట్ల జీఆర్‌సీలు ఏర్పాటు చేశామని, మరో నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ప్రతినిధుల నియామకం ఇలా..

స్వయం సహాయక సంఘాల్లో విద్యావంతులు, మహిళా సమస్యలపై అవగాహన కలిగి చురుగ్గా ఉన్న వారిని జీఆర్‌సీ కేంద్రం ప్రతినిధులుగా ఎంపిక చేస్తున్నారు. ఎంపికైన వారికి శిక్షణ ఇస్తున్నారు. గ్రామ సమాఖ్య నుంచి ముగ్గురిని ఎంపిక చేసి గ్రామస్థాయిలో సామాజిక కార్యాచరణ కమిటీలను ఎంపిక చేశారు. ఈ కమిటీల నుంచి అయిదుగురు సభ్యులతో మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నారు. వీరే జీఆర్‌సీ ప్రతినిధులుగా కొనసాగుతారు. మండల కమిటీ వారానికోసారి సమావేశమై గ్రామ కమిటీల ద్వారా గుర్తించిన ఆర్థిక, సామాజిక, చట్టపరమైన సమస్యల పరిష్కారంపై దృష్టిసారిస్తుంది.

'పేట'లో దుర్గమ్మ కల్యాణం

శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం

చిలకలూరిపేట పట్టణం: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం చిలకలూరిపేటలోని నన్నపనేని వెంకటరత్నం కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విజయవాడ శ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానంలోని ఉత్సవ మూర్తులకు దేవస్థాన అర్చకులు కల్యాణ మహోత్సవ పూజలు చేశారు. ఈ వేడుకలో పెద్ద ఎత్తున దంపతులు పాల్గొన్నారు. ముందుగా జరిగిన నగరోత్సవంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. శ్రీవినాయక ట్రస్ట్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రెవెన్యూ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నరసరావుపేట డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని అసోసియేషన్ భవనంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా సీహెచ్ వెంకటేశ్వర్లు (డీటీ, చిలకలూరిపేట), కార్యదర్శులుగా మురళి (డీటీ, వినుకొండ) ఎస్కే సైదా (ఆర్ఐ, బొల్లాపల్లి) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా అనురాధ (డీటీ, యడ్లపాడు), శ్రీహరి (సీనియర్ అసిస్టెంట్, వినుకొండ), సంయుక్త కార్యదర్శులుగా కిశోర్, చెంచురాజు, రామకోటయ్య, ధనుంజయను ఎంపిక చేశారు. ఎన్నికల అధికారిగా ఎస్కే బాషా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు వీరికి అభినందనలు తెలిపారు.

తెదేపాకు కార్యకర్తలే బలం.. ధైర్యం

రూ.5 కోట్లతో సంక్షేమ నిధి ఏర్పాటు
ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, న్యూస్‌టుడే: తెదేపా బలోపేతానికి కష్టపడిన కార్యకర్తలను ఆదుకోవడానికి తాను సొంతంగా రూ.5కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. సుపరిపాలన - తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డులకు ఎంపికైన 85 మంది తెదేపా కార్యకర్తలను సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ కష్టపడిన కార్యకర్తను తాను గుర్తుంచుకుంటానని ప్రజల వద్ద డబ్బు కోసం చెయ్యి చాచే వారిని తన గడప తొక్కనివ్వనని హెచ్చరించారు. ఇబ్బంది వస్తే తనను నేరుగా కలవాలని సూచించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ వైద్య కళాశాలలపై వైకాపా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. రాష్ట్రంలో పీపీపీ విధానంలో అమలవుతున్న 104, 108కు లేని అభ్యంతరాలు వీటికి ఎందుకో అర్థం కావడం లేదన్నారు. దిల్లీ, ఉత్తరప్రదేశ్, కర్ణాటకలో ఈవిధానం అమల్లో ఉందన్నారు. వైకాపా మొదలు పెట్టిన 15 వైద్య కళాశాలలో కేంద్రం నిధులిచ్చిన మూడు తప్ప మిగిలినవన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయని చెప్పారు. త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వైద్యసేవలు అందాలంటే పీపీపీ విధానంలో తప్ప రాష్ట్ర నిధులతో సొంతంగా పూర్తి చేసే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ విధానాలను అధ్యయనం చేసి ప్రతిపక్ష పార్టీకి దీటుగా సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో జీడీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జునరావు, అయిదు మండలాల తెదేపా నాయకులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట: ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందుకున్న కార్యకర్తలతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

వినుకొండ: కార్యకర్తను సన్మానిస్తున్న జీవీ ఆంజనేయులు, ఎంపీ కృష్ణదేవరాయలు, మక్కెన మల్లికార్జునరావు

చిలకలూరిపేట పట్టణం: చిలకలూరిపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పుల్లారావు 40 మంది కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ అందరికీ న్యాయం చేస్తున్నారన్నారు. ఉత్తమ కార్యకర్తలుగా ఎంపికైన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యార్డు ఛైర్మన్ షేక్ కరీముల్లా, తెదేపా నాయకులు పఠాన్ సమద్‌ఖాన్, జవ్వాజి మదన్‌మోహన్, కామినేని సాయిబాబా, ముద్దుమాల రవి, గంగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భక్తుల విరాళాలు

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలో పోలేరమ్మ గుడి పునర్నిర్మాణానికి భక్తులు రూ.7,53,224 విరాళాలు అందజేశారు. వాటి వివరాలను నిర్మాణ కమిటీ సభ్యులు వెల్లడించారు. గొడవర్తి కిషోర్, జాదవ్ అర్జున్, సనిశెట్టి గురవయ్య ఒక్కొక్కరు రూ.1,11,116 చొప్పున, గొడవర్తి వెంకటరత్నం, గొడవర్తి మల్లికార్జునరావు, గుడివాడ మనోజ్ రూ.51,116 వంతున విరాళం ఇచ్చారు. వినుకొండ భాగ్యలక్ష్మి రూ.65,600, గర్రె సుబ్బారావు, గర్రె భాస్కర్, పొత్తూరి రవీంద్ర, గుంటకల శంకర శివప్రసాద్, పువ్వాడ వెంకటేశ్వరరావు, వినుకొండ ఆంజనేయులు, తాతా సాంబశివరావు, పెరుమాళ్ల అమర్‌నాథ్ ఒక్కొక్కరు రూ.25,116 వంతున నగదు అందజేశారని నిర్మాణ కమిటీ సభ్యులు నల్లూరి పద్మ, భాగ్యలక్ష్మి, నాగలక్ష్మి తదితరులు తెలిపారు.

విరాళం అందిస్తున్న భక్తులు

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఆటలు దోహదం

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి క్రీడలు ఎంతో దోహదపడతాయని ఏఎంరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలో పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి స్మారక ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఏఎంఆర్ ఇగ్నైటెడ్ మైండ్స్ 2కె క్రీడోత్సవాలు ఆదివారం ముగిశాయి. పోటీల విజేతలకు ఈనెల 30న బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని ఆమె వివరించారు.

ఇంజినీరింగ్ విభాగంలో విజేతలు.. వాలీబాల్ పోటీలో సి.ఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ విజేతగా నిలవగా, బీవీసీ ఇంజినీరింగ్ కాలేజీ ద్వితీయ స్థానంలో నిలిచింది. కబడ్డీ పోటీలో విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కాలేజీ, ఏఎంరెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ జట్టు వరుసగా తొలి రెండు స్థానాలు దక్కించుకున్నాయి. 100 మీటర్ల పరుగు పందెంలో ఎన్ఈసీ కాలేజీకి చెందిన కె.వెంకటేష్ ప్రథమ, చలపతి లాం ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థి ఎన్.చంద్రశేఖర్ ద్వితీయ స్థానం సాధించారు. మహిళా విభాగంలో నిర్వహించిన త్రోబాల్ పోటీలో ఏఎంరెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ మహిళా జట్టు ప్రథమ, ఈశ్వర్ ఇంజినీరింగ్ కాలేజీ జట్టు ద్వితీయ స్థానం సొంతం చేసుకున్నాయి.

డిప్లొమా విభాగంలో.. కబడ్డీ పోటీలో ఈశ్వర్ కాలేజీ మొదటి స్థానం, లిథమ్ కాలేజీ రెండో స్థానం సొంతం చేసుకున్నాయి. వాలీబాల్ పోటీలో యూనివర్సల్ కాలేజీ ప్రథమ, అద్దంకి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ రెండో స్థానం సాధించాయి. త్రోబాల్ పోటీలో ఏఎంరెడ్డి కాలేజీ, ఈశ్వర్ కాలేజీ వరుసగా తొలి రెండు స్థానాలు దక్కించుకున్నాయి. ఖోఖో పోటీలో ఈశ్వర్ కాలేజీ, ఏఎంరెడ్డి కళాశాల జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాలను సొంతం చేసుకున్నాయి.

అవీ ఇవీ

ప్రజారోగ్య రక్షణకు మరిన్ని సేవలందించాలి

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: తెదేపా వైద్య విభాగం ప్రజారోగ్య రక్షణకు మరిన్ని సేవలందించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. చిలకలూరిపేట తూర్పుమాలపల్లి చంద్రమౌళి పార్కులో తెదేపా వైద్య విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కంటి, గుండె, క్యాన్సర్ బాధితులకు వైద్యులు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి సేవలు నిరుపమానం

చిలకలూరిపేట గ్రామీణ: అంకితభావం, క్రమశిక్షణతో విద్యార్థులను తీర్చిదిద్దిన ఉత్తమ హెచ్‌ఎంగా విజయభారతి నిలిచారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కొనియాడారు. యడ్లపాడు జడ్పీహెచ్ఎస్ (బాలికలు) హెచ్‌ఎంగా పనిచేస్తూ ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న ఆమె వీడ్కోలు సభ చిలకలూరిపేట శ్రీనివాస సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ మూడు దశాబ్దాలకు పైగా విద్యాబోధనలో ఆమె సేవలు నిరుపమానమని కొనియాడారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో పాటు డీఈవో రామారావు ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో పురపాలక ఛైర్మన్ రఫాని, జనసేన ఇన్‌ఛార్జి తోట రాజారమేష్, రాష్ట్ర, జిల్లా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిరస్త్రాణ ధారణ తప్పనిసరి

గణపవరం(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: నాదెండ్ల మండలం గణపవరం వద్ద ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. శిరస్త్రాణం ధరించకుండా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారు, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపే వారికి, ద్విచక్రవాహనం నెంబరు లేకుండా తిరిగే వారికి అపరాధ రుసుం విధించారు. నిబంధనలపై వారికి అవగాహన కలిగించారు.

వైద్య శిబిరానికి స్పందన

యడ్లపాడు: పీఆర్ విజ్ఞాన కేంద్రంలో బాసట ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం బాధితులు 260 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి రెండు నెలలకు సరిపడా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు గుంటుపల్లి దివ్యతేజ, భవ్యతేజ, ఎడ్ల రన్విత, మౌనిక చౌదరి, శొంఠినేని నవ్యశ్రీ, ఎస్.కావ్య వైద్య సేవలు అందించారు. బాసట అధ్యక్షుడు నూతలపాటి కాళిదాసు, కోశాధికారి కేతా రామబ్రహ్మం, సభ్యులు ముత్తవరపు రవీంద్రబాబు, వేణు, రావూరి సుమన్, పోపూరి శ్రీనివాసరావు, గోనుగుంట్ల కిరణ్ తదితరులు పర్యవేక్షించారు.

పేదలకు అండగా సీపీఐ

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: పోరాటాల ద్వారానే పేద, బడుగు, బలహీన వర్గాలకు సంబంధించిన ఎన్నో సమస్యలు పరిష్కరించామని పేదలకు అండగా ఉన్నది సీపీఐ అని నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు అన్నారు. విఠంరాజుపల్లి పంచాయతీ పరిధిలోని వయ్యకంటి శివప్రసాద్ కాలనీలో ఆదివారం మండల శాఖ సమావేశం నిర్వహించారు. ఉద్యమాలకు పురిటిగడ్డ వినుకొండ అని పార్టీ సిద్ధాంతాలను ఇంటింటికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కొప్పరపు మల్లికార్జున, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ

రొంపిచర్ల: ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రొంపిచర్లలో రెండు, విప్పర్లరెడ్డిపాలెంలో ఓ మద్యం దుకాణంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ డి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం ఆకస్మిక తనిఖీ చేసి మద్యం నిల్వలు పరిశీలించారు. ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం సీసాలు తనిఖీలు చేసి వాటి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా సిబ్బందికి విధులు కేటాయిస్తున్నామన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యపానం చేయడం చట్ట రీత్యా నేరమని, చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.

వైకాపా అక్రమాలకు అధికారుల వత్తాసు!

వినుకొండ: వైకాపా అక్రమాలకు రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారని భాజపా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మేడం రమేష్ ఆరోపించారు. ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని జాలలపాలెం గ్రామ పరిధిలో సర్వేనెంబరు 113/3లో 3.63, 60/17-1ఎలో 1.20 ఎకరాల భూమి 1995లో మూల్పూరి అగ్రోటెక్‌కు రిజిస్టర్ అయినట్లు తెలిపారు. అదే భూమిని గత ప్రభుత్వంలో అధికార పార్టీ నాయకులు పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వానికి ఎకరం రూ.18లక్షలు వంతున విక్రయించినట్లు ఆరోపించారు. దీనిపై రెవెన్యూశాఖ ప్రత్యేక కార్యదర్శికి ఫిర్యాదు చేయగా, విచారణ చేయాలని స్థానిక రెవెన్యూ అధికారులకు ఆదేశాలు అందినా ఇప్పటి వరకు పట్టించుకోలేదన్నారు. వారు స్పందించకుంటే పార్టీ అనుమతితో ఆందోళన చేస్తానని తెలిపారు.

యూరియాకు కొరత లేదు

ఈపూరు: రబీ అవసరాలకు అవసరమైన యూరియా నిల్వలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి రామినేని రామారావు తెలిపారు. మండలంలో ఇనిమెళ్ల, ముప్పాళ్ల ఎరువుల దుకాణాలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ముప్పాళ్ల సొసైటీలో 20 టన్నుల నిల్వ ఉందని అంగలూరుకు 40, ఈపూరు 20, కొండ్రముట్లకు 40టన్నుల వంతున కేటాయించారని ఆయన తెలిపారు. ప్రైవేటు వ్యాపారులు అధిక ధరకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంజాయితో అనర్థం

ఈపూరు: గంజాయి తాగడం ఆరోగ్యానికి ప్రమాదమని గ్రామీణ సీఐ బ్రహ్మయ్య తెలిపారు. మండలంలోని బొమ్మరాజుపల్లెతండాలో ఆదివారం గ్రామస్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులకు బ్యాంకు ఖాతా నెంబర్లు చెప్పొద్దని సూచించారు. ద్విచక్రవాహనదారులు తలకు శిరస్త్రాణం ధరించాలని, మహిళలు, బాలల రక్షణ అందరి బాధ్యత అని చెప్పారు. ఎస్సై వేణుగోపాల్, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

టిడ్కో ఇళ్ల వద్ద నూతన సబ్‌స్టేషన్

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలో వెల్లటూరు రోడ్డులో టిడ్కో ఇళ్ల వద్ద నూతనంగా 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.2.85కోట్లు మంజూరయ్యాయని సీపీడీసీఎల్ డీఈఈ శ్రీనివాసరావు తెలిపారు. ఇది పూర్తయితే నాణ్యమైన విద్యుత్తు సరఫరా అవుతుందని చెప్పారు.

సర్వీసు రోడ్డు నిర్మించాలని నిరసన

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: బొప్పూడి వద్ద బైపాస్ రహదారి పక్కన ప్రభ వెళ్లేందుకు వీలుగా సర్వీసు రోడ్డు వేయాలని గ్రామస్థులు ఆదివారం నిరసన చేపట్టారు. రోడ్డు నిర్మాణ సమయంలోనే ముందుగా తాము ఈ విషయాన్ని అధికారులకు చెప్పామన్నారు. ఆ రోజు మాట ఇచ్చి ప్రస్తుతం సర్వీసు రోడ్డు వేయకుండా పనులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వీసు రోడ్డు వెంటనే వేయకపోతే మిగిలిన పనులు నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ విషయం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దృష్టికి వెళ్లడంతో ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సర్వీసు రోడ్డు వేసేలా చర్యలు తీసుకుంటామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: చిలకలూరిపేట మండలం పసుమర్రు నుంచి గుదేవారిపాలెం వెళ్లే మార్గంలో చిలకలూరిపేట - వాడరేవు నూతన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. గ్రామీణ ఎస్సై అనిల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం యనమదల గ్రామానికి చెందిన కొలసాని శివరామప్రసాద్ (76) మోపెడ్‌పై చిలకలూరిపేట వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో కొత్తగా నిర్మిస్తున్న 167ఎ చిలకలూరిపేట - వాడరేవు జాతీయ రహదారిపై గుదేవారిపాలెం జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా చీరాల వైపు నుంచి వస్తున్న వాహనం ఢీకొట్టింది. గాయాలైన శివరామప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య వీరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శావల్యాపురం మండలం కారుమంచికి చెందిన గన్నవరపు శివరావు, యరమాసు శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంపై వినుకొండ వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తున్నారు. వేగంగా వెళ్తున్న బొలెరో వాహనం విఠంరాజుపల్లి వద్ద ఎలాంటి సిగ్నల్ లేకుండా ఒక్కసారిగా పక్కకు తిప్పాడు. వెనుక వస్తున్న ద్విచక్ర వాహనం ఆ వాహనాన్ని ఢీకొని ఇద్దరూ కిందపడ్డారు. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. శివరావును మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాంబాబు తెలిపారు.

ఉరేసుకొని ఇంటర్ విద్యార్థి..

చప్పిడి తేజ (పాత చిత్రం)

సంతగుడిపాడు(రొంపిచర్ల): మండలంలో సంతగుడిపాడు గ్రామానికి చెందిన చప్పిడి శ్రీనివాసరావు అలంకరణ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు, ఇంటర్ విద్యార్థి చప్పిడి తేజ (17) ఈనెల 13వ తేదీ నుంచి కనిపించడం లేదని మృతుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం అదే గ్రామంలో అలంకరణ వస్తువులు ఉన్న గది వద్ద పరిసరాలను శుభ్రం చేయటానికి శ్రీనివాసరావు తదితరులు వెళ్లిన సమయంలో దుర్వాసన రావటంతో చూడగా ఫ్యాన్ కొక్కేనికి ఉరేసుకొన్న స్థితిలో తేజను గుర్తించారు. సమాచారం అందుకున్న రొంపిచర్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. గదిలో మృతుడికి సంబంధించిన వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఎప్పుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు? కారణాలేమిటి? అనే కోణంలో రొంపిచర్ల ఎస్సై లోకేశ్వరరావు విచారణ చేపట్టారు.

ఆట నేర్పిన ఆచార్యుడికి సత్కారం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే

చిన్నతనంలో ఆటలో నైపుణ్యాలు నేర్పి తమ ఉన్నతికి కారణమైన శిక్షకుడిని వారంతా గౌరవించుకున్నారు. పట్టణంలోని పీఎన్‌సీ కేఆర్ కళాశాలలో 1980 నుంచి 2016 వరకు వ్యాయామ సంచాలకుడిగా 36 ఏళ్ల పాటు పలువురు క్రీడాకారులను తీర్చిదిద్దిన అబ్బూరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఆయన వద్ద శిక్షణ పొంది డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న కె.శ్రీనివాస్, జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు జాగర్లమూడి సింగారావు, చావా శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ క్రీడా రంగానికి చేసిన సేవలను కొనియాడారు. వందలాది మందిని క్రీడాకారులుగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. అప్పట్లో రాణించిన క్రీడాకారులు తమ అభిప్రాయాలు ఇలా పంచుకున్నారు.

గురువుతో శిష్యుల ఆనందహేల

క్రీడాకారులే శిక్షకులు కావాలి



ప్రభుత్వం క్రీడలకు అందిస్తున్న ప్రోత్సాహం చాలదు. కేవలం బీపీడీ, ఎన్ఐఎస్ శిక్షణ పొందితే ఉపయోగం లేదు. క్రీడాకారులుగా రాణించిన వారికి అవకాశాలు ఇవ్వాలి. మంచి క్రీడాకారులు ఎక్కడున్నా ప్రోత్సహించే నైజం అబ్బూరిది. ఆయన ఇచ్చిన ప్రోత్సాహంతో అయిదు సార్లు జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాను భారత వాలీబాల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశం దక్కింది. ప్రస్తుతం విజయవాడలో ఏజీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాను. మంచి క్రీడాకారులు కావాలంటే తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. ఖర్చు లేని గ్రామీణ క్రీడలు కబడ్డీ, ఖోఖో వంటికి కూడా మంచి గుర్తింపు వస్తుంది.

– జాగర్లమూడి సింగారావు, జాతీయ వాలీబాల్ జట్టు మాజీ కెప్టెన్

క్రీడల అవసరం గుర్తించాలి



చాలా మందిలో క్రీడలు వృథా అనే భావన ఉంది. కానీ క్రీడలు మానసిక స్థైర్యాన్ని పెంచుతాయి. మంచి ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. నలుగురితో ఎలా మెలగాలో తెలుస్తుంది. 1981-83 వరకు కళాశాలలో ఇంటర్మీడియట్ చదివాను. పీడీ లక్ష్మీనారాయణ ప్రోత్సాహంతో వాలీబాల్‌లో జూనియర్, సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాను. క్రీడల కోటాలోనే రైల్వేలో ఉద్యోగం సాధించాను. గతేడాది ఉద్యోగ విరమణ చేశాను. ప్రతి ఒక్కరి జీవితంలో ఆటలు అవసరం. – చావా శ్రీనివాసరావు, విశాఖపట్నం

జాతీయ స్థాయిలో రాణించా..



కళాశాలలో 1985-87 మధ్య ఇంటర్ చదివా. ఆ సమయంలోనే అబ్బూరి నుంచి బ్యాడ్మింటన్ ఆటలో మెలకువలు నేర్చుకునే అవకాశం కలిగింది. అప్పుడే రెండుసార్లు జాతీయస్థాయి పోటీల్లో ఉమ్మడి రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించా. క్రీడా కోటాలోనే ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్‌గా ఉద్యోగం సాధించా. ఇపుడు ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్నా. ఆటల్లో ఓటమి కూడా గురువే. తప్పులు సరి చేసుకుని రాణించేందుకు వీలుంటుంది.

– షేక్ కరీముల్లా, ఏఆర్ ఎస్సై, నరసరావుపేట

సీనియర్లకు టెట్ నుంచి మినహాయింపు కోరుతున్నాం

వినుకొండ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల్లో 90శాతం బాగా పనిచేస్తున్నారని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కితాబిచ్చారు. వినుకొండ వెల్లటూరు రోడ్డులోని శంకర్‌హిల్ కౌంటీలో ఆదివారం నిర్వహించిన యూటీఎఫ్ జిల్లా మహాసభకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వాల్యానాయక్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎంపీ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం-2008కి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు వెసులుబాటు ఉందని ఈ అంశాన్ని తాను పార్లమెంటులో ప్రస్తావించానని దీనిపై ఉపాధ్యాయులు మనోవేదనకు గురికాకుండా కృషి చేస్తానన్నారు. బోధనేతర పనుల భారం తగ్గించాలన్న డిమాండ్‌ను తాను అంగీకరించనని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులపై ఉండే ఒత్తిడి కంటే ఇది పెద్ద భారం కాదన్నది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్‌జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డీఏ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. సంఘం నాయకులు ఎ.నాగేశ్వరరావు, బి.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి

శ్రీనివాసరెడ్డి

మోహన్‌రావు

ఇదే మహాసభలో యూటీఎఫ్ పల్నాడు జిల్లా నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా కె.శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.మోహన్‌రావు, కోశాధికారిగా ఎం.రవిబాబు ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా ఆడిట్ కమిటి కన్వీనర్ మల్లేశ్వరరావు పరిశీలకులుగా వ్యవహరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాడతామని నూతన కమిటీ ప్రకటించింది.

(c) eenadu

సత్తెనపల్లి

క్విజ్ పోటీల్లో ప్రతిభ

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో మాచర్లలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ధనుష్, నాగవర్ధిని, జీవన నాగచందన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ హనుమంతరావు, శివరాజు, శ్రీలక్ష్మి, లక్ష్మీదేవి బహుమతులు అందజేశారు.

విజేతలతో ఉపాధ్యాయులు

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఆపద సమయాల్లో పేదలకు సీఎం సహాయనిధి అండగా ఉంటుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం వెల్దుర్తిలోని తెదేపా క్యాంపు కార్యాలయంలో 31 మంది లబ్ధిదారులకు రూ.28.70 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. అనంతరం తెదేపా సోషల్‌మీడియా జిల్లా సమన్వయకర్తగా ఎంపికైన వెంకటలక్ష్మణ్‌ను అభినందించారు.

లబ్ధిదారులతో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? కొత్త అంబాపురంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగు నీరు ఇళ్ల ముందు నిల్వ ఉంటోంది. దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నాం. - గ్రామస్థులు
✔ త్వరలో మురుగు కాలువలు నిర్మిస్తాం. - సైదావలి, పంచాయతీ కార్యదర్శి
- న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ

నేటి నుంచి వైకుంఠ ఏకాదశి వేడుకలు

దాచేపల్లి, న్యూస్‌టుడే: కృష్ణానది ఒడ్డున స్వయంభువుగా వెలసిన మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకుడు జానపాటి సీతారామశాస్త్రి, ఈవో జ్యోతి మాట్లాడుతూ సోమవారం సాయంత్రం వేదమంత్ర పఠనం, నృసింహనామ సంకీర్తనలతో ఉత్సవాలు ఆరంభం అవుతాయన్నారు. మంగళవారం తెల్లవారుజామున సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం నిర్వహించనున్నారు. ఉదయం 5.30 గంటల నుంచి రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీనృసింహస్వామి ఉత్తర ద్వార దర్శనం భక్తులకు కల్పించనున్నారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.

ముస్తాబైన ఆలయం

మహిళాభ్యుదయానికి అడుగులు

నందిగామ, రఘురామ్‌నగర్ (సత్తెనపల్లి), న్యూస్‌టుడే

మహిళాభ్యుదయానికి కృషిలో భాగంగా జిల్లాకు ఒక మహిళా స్నేహపూర్వక పంచాయతీ (ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ)ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంపిక చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా 26 పంచాయతీలను ఎంపిక చేయగా, అందులో సత్తెనపల్లి మండలం నందిగామ ఉంది. ఈ గ్రామంలో మహిళల సంపూర్ణ వికాసానికి ప్రభుత్వాలు తోడ్పాటు అందిస్తూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. మరిన్ని పనులకు కనబర్చిన పంచాయతీలకు ప్రోత్సాహక నిధులు అందజేస్తామని కేంద్రం ప్రకటించింది.

ప్రత్యేక కార్యక్రమాలు ఇలా..

నందిగామ గ్రామ జనాభా 6,626 కాగా, అందులో మహిళలు 52 శాతం ఉన్నారు. విద్య, వైద్యం, స్వయం ఉపాధి, ప్రభుత్వాలు అమలుచేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేరువయ్యేలా మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బాల్య వివాహాలతో అనర్థాలపై చైతన్యం పెంపొందించడమే కాకుండా శిశు మరణాల నియంత్రణకు చర్యలు చేపట్టారు. మహిళల ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చేందుకు ఉచిత కుట్టు శిక్షణ ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రక్తహీనత, పోషకాహారలేమి సమస్యలతో బాధపడుతున్న వారికి పౌష్టికాహారం అందజేస్తున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థినులు పుష్టిగా ఉండేలా చొరవ చూపిస్తున్నారు. శానిటరీ ప్యాడ్లను విద్యార్థినులకు అందించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై పోలీసుశాఖ ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాభివృద్ధి పనుల్లోనూ మహిళలను భాగస్వామ్యుల్ని చేస్తున్నారు. ఇళ్ల నుంచి విధిగా చెత్త సేకరణ, ఘనవ్యర్థాల నిర్వహణ, చెత్తతో సంపద సృష్టిలో మహిళల భాగస్వామ్యంతో ఈ పంచాయతీ జిల్లాలోనే ఆదర్శంగా నిలిచింది.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన

ప్రజాప్రతినిధులంతా మహిళలే..

నందిగామ పంచాయతీ ప్రజాప్రతినిధులందరూ మహిళలే కావడం విశేషం. సర్పంచిగా బలిజేపల్లి రమాదేవి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఎంపీటీసీ సభ్యురాలు సయ్యద్ షేమా, రెంటపాళ్ల ప్రియదర్శి వార్డు సభ్యుల్లో సగం మంది మహిళలే ఉన్నారు. సత్తెనపల్లి మండల సమాఖ్య అధ్యక్షురాలిగా గద్దె అనూరాధ వ్యవహరిస్తున్నారు. నందిగామ పంచాయతీని రాష్ట్రంలో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు డీపీవో నాగేశ్వరరావునాయక్ చెప్పారు.

సబ్‌కోర్టు ఏపీపీగా జానీబాషా

గురజాల, న్యూస్‌టుడే: గురజాల సబ్‌కోర్టు ఏపీపీగా షేక్ జానీబాషా నియమితులయ్యారు. సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు. గత 29 ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో ఉన్నారు. గతంలో ప్రభుత్వ న్యాయవాదిగా పని చేశారు. తనకు పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఆయనను అభినందించారు.

పింఛనుదారులకు సన్మానం

గురజాల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పింఛనుదారుల దినోత్సవం స్థానిక పెన్షన్ హోమ్‌లో ఆదివారం నిర్వహించారు. గురజాల, రెంటచింతల, కారంపూడి మండలాల్లో 75 ఏళ్లు నిండిన పింఛనుదారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదెయ్య, కోశాధికారి ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు మంగయ్య, గురజాల అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టెం వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎం.జోసఫ్‌బాబు, కోశాధికారి డి.కోటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సత్రశాల అభివృద్ధి చేస్తాం

రెంటచింతల, న్యూస్‌టుడే: పురాతన పుణ్యక్షేత్రం సత్రశాల అభివృద్ధి చేస్తామని, దీనిపై చర్చించేందుకు త్వరలో సమావేశం జరుగుతుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి స్పష్టం చేశారు. ఆలయ పునర్నిర్మాణానికి దేవాదాయశాఖ రూ.3.33 కోట్లు కేటాయించింది. భక్తుల నుంచి సుమారు రూ.1.77 కోట్లు విరాళంగా పోగు చేసి, రూ.5 కోట్లతో పనులు చేపట్టాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రూ.1.77 కోట్ల విరాళం వసూలు సాధ్యం కాదని ఆలయ కమిటీ ఛైర్మన్ గుండా శివయ్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో చర్చించి విరాళాలు లేకుండా రూ.5 కోట్లు మంజూరు అయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్రోద్యమంతోపాటు దేశాభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ కీలక భూమిక పోషించిందని వక్తలు చెప్పారు. పార్టీ జెండాను ఎగురవేశారు. నాయకులు జ్ఞాన్‌రాజ్‌పాల్, ఛాన్‌బాషా, ఆనంద్, శంకర్, శేఖర్, లక్ష్మయ్య, అంతోని పాల్‌రాజ్, హైదర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

చూసిన కనులదే భాగ్యం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారు ఆదివారం మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు.

మోహినీ అవతారంలో శ్రీవారు

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: జంగమహేశ్వరపురంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధనుర్మాసం పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ప్రత్యేక తులసీదళాలతో పూజలు చేశారు. స్వామిని విశేషంగా అలంకరించారు. ముక్కోటి ఏకాదశికి సంబంధించి ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షించారు.

'పది' విద్యార్థులకు ఆకలి బాధ

అచ్చంపేట, న్యూస్‌టుడే: మండలంలోని కొండూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళికలో భాగంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన తరగతులకు 35 మంది హాజరయ్యారు. వీరికి మధ్యాహ్న భోజనం అందించలేదు. విద్యార్థులు ఆకలిలో ఇళ్లకు వెళ్లారు. గత రెండు ఆదివారాల్లోనూ భోజనం అందించడం లేదని విద్యార్థులు తెలిపారు. హాజరు పట్టీలో మాత్రం నమోదు చేశారన్నారు. ఈ విషయమై ఎంఈవో ప్రసాదరావు మాట్లాడుతూ నిర్వాహకురాలికి ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో భోజనం అందించలేదన్నారు.

ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థినులు

సనాతన ధర్మాన్ని కాపాడాలి

రెంటచింతల, న్యూస్‌టుడే: సనాతన ధర్మాన్ని రక్షించటమే ధ్యేయంగా ఆర్ఎస్ఎస్ పనిచేస్తుందని కాశీవిశ్వనాథ స్వామిజీ అన్నారు. ఆదివారం రెంటచింతలలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. తొలుత పురవీధుల్లో చిన్నారుల కోలాటాలు, జై శ్రీరామ్ నినాదాలతో వాసవి ఆలయం నుంచి కల్యాణ మండపం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీరాముడు తనయుడు లవుడు నిర్మించిన ప్రాంతమే పాకిస్థాన్‌లోని లాహోర్ అన్నారు. అయోధ్యలో రామాలయం నిర్మించేందుకు 500 ఏళ్లు పోరాటం చేశామన్నారు. హిందువులంతా ఐక్యంగా ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. గోవుల సంరక్షణ, ఆలయాల శుభ్రత, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుంటూరు విభాగ్ బౌద్ధిక్ శ్రీనివాస్, నాగభారతి, ప్రమీలా, నరసింహారావు, మల్లికార్జునరావు, రాజశేఖరరెడ్డి, సైదారెడ్డి, కేదార్ తదితరులు పాల్గొన్నారు.

పురవీధుల్లో ప్రదర్శన

'అప్పులు ఎగ్గొట్టేందుకు డ్రామాలు'

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: రైతులు, వ్యాపారులకు రెండేళ్ల నుంచి అప్పులు ఇవ్వకుండా ధాన్యం వ్యాపారి కోడూరి శ్రీనివాసరావు ఇబ్బంది పెడుతున్నారు. అప్పులు ఎగ్గొట్టడానికి కొత్త డ్రామాలు ఆడుతున్నారని బాధితులు జూలకంటి సురేష్, ముడెం పెదసత్యం, భవనాసి రాంబాబు ఆరోపించారు. ధాన్యం వ్యాపారికి అప్పులు ఇచ్చిన 35 మంది బాధితులు ఆదివారం రాత్రి పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కల్యాణ మండపంలో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని రోజుల నుంచి వ్యాపారి కనిపించడం లేదని, ఫోన్ చేసినా ఎత్తడం లేదన్నారు. దీంతో పట్టణ సీఐ వెంకట్రావుకు ఫిర్యాదు చేశామన్నారు. వ్యాపారి భార్యను స్టేషన్‌కు పిలిపించి అతడి ఆచూకీ తెలుసుకోవాలని కోరామన్నారు. మహిళా కానిస్టేబుల్ వెళ్లి వ్యాపారి భార్యను స్టేషన్‌కు తీసుకురాగా, ముందస్తు ప్రణాళికలో భాగంగానే ఆమె కత్తితో చేతిపై కోసుకున్నారని బాధితులు ఆరోపించారు.

రైతులకు మేలు చేయండి

పెదకూరపాడు, న్యూస్‌టుడే: కష్టాలకు ఓర్చి మిర్చి సాగు చేసిన అన్నదాతలకు మేలు చేసే పథకాలను అమలు చేయాలని ఇటీవల నియమితులైన గుంటూరు మిర్చి యార్డు ఛైర్మన్ కుర్రా అప్పారావును మండల తెదేపా నాయకులు కోరారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో అప్పారావును జిల్లా తెదేపా కార్యదర్శి అర్తిమళ్ల రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, ఎమ్ఎస్ఎమ్ఈ రాష్ట్ర డైరెక్టర్ చిన రాజు, నేతలు ప్రసాద్, అప్పారావు, గల్లాబాబు, రత్నకుమార్, సత్యం, ముంతాజ్, సాగర్ తదితరులు ఆయనను సత్కరించారు.

★ రైతు పక్షపాతిగా పనిచేయాలని, మేలైన సంస్కరణలతో వారిని ఆదుకోవాలని జీడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ వరప్రసాద్ కోరారు. అప్పారావుకు పదవి లభించడం అభినందనీయమన్నారు. ఆయను సత్కరించారు. నేతల శివరామకృష్ణయ్య, శ్రీనివాసరావు, రమేష్, సైదారావు, సాంబిరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రైల్వే వంతెన పనులు

రెంటచింతల, న్యూస్‌టుడే: నడికూడి-మాచర్ల జాతీయ రహదారి (167ఏడీ) పాలువాయిగేటు వద్ద బైపాస్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైల్వేట్రాక్‌పై ఆరు గడ్డర్లు క్రేన్ ద్వారా ఏర్పాటు చేశారు. మాచర్లలో (128 కి.మీ) దగ్గర ఇటీవల పూర్తి చేశారు. మిగిలిన వంతెన పనులు ముగిస్తామని రైల్వే డీఈ శేషు వెల్లడించారు. వంతెనపై కాంక్రీట్ నిర్మాణ పనులు త్వరగా చేసి మార్చికి వంతెనపై వాహనాలు వెళ్లేలా చేస్తామన్నారు. మాచర్ల రైల్వే వంతెన ట్రాక్‌పై 31 మీటర్లు కాగా, గేటు వంతెన 37 మీటర్లు ఉందన్నారు. ట్రైన్ రాకపోకలకు ఇబ్బంది లేకుండా పనులు చేస్తామన్నారు. మాచర్ల నుంచి శ్రీశైలం వెళ్లేందుకు యాత్రికులు పట్టణంలోకి వెళ్లే పనిలేకుండా బైపాస్‌లో వెళ్లవచ్చన్నారు. వీరి వెంట సహాయ డీఈ శ్రీనివాస్, సెక్షన్ ఇంజినీర్ బిడ్జిస్ ఇతర అధికారులున్నారు.

బయ్యవరం చెరువు బాగుపడేనా?

క్రోసూరు (అచ్చంపేట) న్యూస్‌టుడే: ఊర్లో వ్యర్థాలతో క్రోసూరు మండలం బయ్యవరం చెరువు నిండిపోయింది. పశువులు తాగేందుకు పనికిరాకుండా నీరు పచ్చగా మారింది. ఆక్రమణలతోపాటు, ఎరువులు దిబ్బలతో చెరువు అధ్వానంగా మారింది. ఊర్లోని బోర్లకు ఈ చెరువే ఆధారమని, శుభ్రపరచి కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోడ్డుపైనే వ్యర్థాలు

దొడ్లేరు(క్రోసూరు, అచ్చంపేట) న్యూస్‌టుడే: క్రోసూరు మండలం దొడ్లేరు మేజరు గ్రామపంచాయతీలోని గ్రామాల్లో సేకరించిన వ్యర్థాలు రోడ్డుపక్కనే పడేస్తున్నారు. ఆర్అండ్‌బీ రహదారి వెంట పోసిన చెత్త మురిగి దుర్వాసన వెదజల్లుతోంది. కుక్కలు, పందులు ఇతర జంతువులు వ్యర్థాలను చెల్లాచెదరం చేస్తున్నాయి. గతంలో డంపింగ్‌యార్డు నిర్మాణానికి నిర్ణయించినప్పటికీ స్థల సేకరణ చేయకపోవటంతో నిర్మించలేదని ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరరావు తెలిపారు. వ్యర్థాలు తొలగిస్తామన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి

కారంపూడి, న్యూస్‌టుడే: మండలంలో జనవరి 2 నుంచి నిర్వహించనున్న నాలుగో విడత రీసర్వే ప్రక్రియకు రైతులు సహకరించాలని తహసీల్దార్ వెంకటేశ్వనాయక్ అన్నారు. ఆదివారం చినగార్లపాడులో రీసర్వే ప్రక్రియపై గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. తొలుత గ్రామంలో ర్యాలీ చేపట్టారు. సర్వేయర్ ఖాన్, ఆర్ఐ శ్రీనివాసరావు, దేవాదాయశాఖ ఈవో నరసింహారావు పాల్గొన్నారు.

నేడు యార్డు పాలకమండలి ప్రమాణం

దుర్గి: దుర్గి మిర్చియార్డు పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం స్థానిక యార్డులో నిర్వహించనున్నారు. ఛైర్మన్ లింగా బ్రహ్మయ్యతోపాటు మరో 17 మంది సభ్యులతో అధికారులు ప్రమాణం చేయించనున్నారు.

రహదారి ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రెంటచింతల, న్యూస్‌టుడే: మాచర్ల-నడికుడి జాతీయ రహదారిపై రెంటచింతల సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. మాచర్ల నుంచి చీరాలకు వెళుతున్న కారును రెంటాలకు చెందిన ద్విచక్ర వాహనదారుడు దుర్గాప్రసాద్ ఢీకొట్టాడు. దీంతో ప్రసాద్‌తోపాటు కారులో ప్రయాణిస్తున్న చిన్నారి రిషితకు గాయాలయ్యాయి. ఇద్దరిని నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. ప్రమాద సమయంలో కారులో అయిదుగురు ఉన్నారు.

కుక్కల దాడిలో 32 గొర్రెలు మృతి

తాడువాయి(అచ్చంపేట): కుక్కల దాడిలో మందలోని గొర్రెలు మృతి చెందిన ఘటన ఇది. తాడువాయి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు(చిన్నోడు) తన గొర్రెల మందను దొడ్డిలో ఉంచాడు. ఆదివారం ఉదయం అటవీప్రాంతం నుంచి వచ్చిన కుక్కల గుంపు మందపై దాడిచేశాయి. దీంతో 32 గొర్రెలు ప్రాణాలు కోల్పోయాయి. గాయపడిన గొర్రెలకు పశువైద్య సిబ్బంది చికిత్స అందించారు. వీఆర్వో ఆదిలక్ష్మి, పోలీసులు పరిశీలించారు. సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

పుస్తక పఠనం.. భవితకు సోపానం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పుస్తక పఠనం.. బంగారు భవిష్యత్తుకు సోపానం అవుతుందని పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు. స్థానిక వావిలాల పార్కులో అమరావతి సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఓపెన్ బుకింగ్ రీడింగ్ సెషన్‌ను ఆదివారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఒక పుస్తకం పదిమంది మంచి స్నేహితులతో సమానమన్నారు. యువత చెడు స్నేహాలు, అలవాట్లతో పెడదారి పట్టకుండా పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకుని ఉన్నత లక్ష్యాల్ని సాధించాలని సీఐ చెప్పారు. పుస్తకాల్ని ప్రజలకు చేరువ చేస్తున్న యువజన సంఘం బాధ్యుల్ని ఆయన అభినందించారు. సేవాసమితి బాధ్యులు వీరాంజనేయులు, షారోన్‌కుమార్, గోపి, ఉత్తేజ్, అంకమ్మరావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐ నాగమల్లేశ్వరరావు

ద్విచక్ర వాహనం ఢీకొని మృతి

నాగేశ్వరరావు (పాత చిత్రం)

భృగుబండ(సత్తెనపల్లి గ్రామీణ): భృగుబండ సమీపంలో ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. భృగుబండ గ్రామానికి చెందిన చిమట నాగేశ్వరరావు(68) రోజు మాదిరిగానే పశువులను మేపుకొని ఇంటికి తిరుగుముఖం పట్టాడు. ఎదురుగా దూసుకొచ్చిన ద్విచక్ర వాహనదారుడు అదుపుతప్పి ఆయనను ఢీకొట్టాడు. రోడ్డుపై పడిన ఆయన తలకు తీవ్ర గాయాలై దుర్మరణం చెందాడు. ద్విచక్ర వాహనదారుల్లోని ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను సత్తెనపల్లిలో ఆసుపత్రికి తరలించారు. గ్రామీణ సీఐ ఎం.హైమారావు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

అందుబాటులో యూరియా

మాచవరం, న్యూస్‌టుడే: మాచవరం రైతు సేవా కేంద్రానికి యూరియా వచ్చిందని గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రియాంక తెలిపారు. 440 బస్తాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ నకలతో రావాల్సిందిగా ఆమె కోరారు.

వేధింపులు అరికట్టి.. ధైర్యం నింపి

జీఆర్‌సీ కేంద్రాలతో మహిళలకు అభయం

మాచర్ల, గురజాల, న్యూస్‌టుడే : గృహ హింస, కట్నం, లైంగిక వేధింపులు ఎదుర్కొనే గ్రామీణ మహిళలకు బాసటగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మండలానికో జెండర్ రిసోర్స్ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించింది. తొలి విడతలో భాగంగా జిల్లాలో శావల్యాపురం, నాదెండ్ల, అమరావతి, మాచవరం మండలాల్లో ఏర్పాటు చేశారు. నరసరావుపేట, సత్తెనపల్లి, మాచర్ల, బొల్లాపల్లి మండలాల్లో త్వరలో నెలకొల్పేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇటీవల అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న పీడీ ఝాన్సీరాణి

జిల్లాలో మండలాలు:	28
మండల సమాఖ్యలు:	28
గ్రామ సంఘాలు:	1056
జిల్లాలో స్వయం సహాయక సంఘాలు:	36,620
సభ్యులు:	3,66,215

కేంద్రం ఏం చేస్తుంది..

మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తుంది. ప్రభుత్వ పథకాలు, చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తుంది. మహిళా ప్రతినిధులతో నడిచే ఈ కేంద్రం మహిళలను మరింత శక్తివంతంగా తీర్చిదిద్దే సమగ్ర వేదికగా నిలుస్తుంది.

సమస్యలకు పరిష్కారం

మహిళల కుటుంబపరమైన సమస్యలను గుర్తించి జీఆర్‌సీ కేంద్రం ద్వారా పరిష్కరిస్తారని డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి తెలిపారు. గృహహింస, కట్నం, లైంగిక వేధింపులతో పాటు బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేస్తారన్నారు. బాధితుల్లో ధైర్యం నింపి అవసరం మేరకు తాత్కాలిక వసతి కల్పిస్తారన్నారు. వసతి సౌకర్యాలున్న ప్రాంతాల్లో ఇప్పటికే నాలుగు చోట్ల జీఆర్‌సీలు ఏర్పాటు చేశామని, మరో నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ప్రస్తుతం వసతి సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం ఒక్కొక్క కేంద్రానికి రూ.5 లక్షల నిధులు వెచ్చిస్తుంది.

ప్రతినిధుల నియామకం ఇలా..

స్వయం సహాయక సంఘాల్లో విద్యావంతులు, మహిళా సమస్యలపై అవగాహన కలిగి చురుగ్గా ఉన్న వారిని జీఆర్‌సీ కేంద్రం ప్రతినిధులుగా ఎంపిక చేస్తున్నారు. ఎంపికైన వారికి శిక్షణ ఇస్తున్నారు. గ్రామ సమాఖ్య నుంచి ముగ్గురిని ఎంపిక చేసి గ్రామస్థాయిలో సామాజిక కార్యాచరణ కమిటీలను ఎంపిక చేశారు. ఈ కమిటీల నుంచి అయిదుగురు సభ్యులతో మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నారు. వీరే జీఆర్‌సీ ప్రతినిధులుగా కొనసాగుతారు. మండల కమిటీ వారానికోసారి సమావేశమై గ్రామ కమిటీల ద్వారా గుర్తించిన ఆర్థిక, సామాజిక, చట్టపరమైన సమస్యల పరిష్కారంపై దృష్టిసారిస్తుంది.

ఎదురుచూపులు.. ఇంకెన్నాళ్లు!

☛ **అందని వ్యవసాయ రాయితీ పరికరాలు**

మాచవరం, న్యూస్‌టుడే: వ్యవసాయ శాఖ పంపిణీ చేసే రాయితీ పరికరాల కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా, ఇంతవరకు ఆ ఊసే ఎత్తడం లేదు. ఖరీఫ్ సీజను వెళ్లి రబీ వచ్చినా పట్టించుకునే పరిస్థితి లేదు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన 'రైతన్న.. మీకోసం'లో ఎక్కువ మంది రైతులు వ్యవసాయ పరికరాల కోసం విజ్ఞప్తి చేశారు. దీనిపై అధికారులు ఏ సమాధానం చెప్పాలో తెలియక ఇబ్బంది పడ్డారు. వైకాపా ప్రభుత్వంలో కొన్ని అందజేసినా, ఆ పార్టీ నేతలు, కార్యకర్తలకే సరిపోయాయి. 2014-19 మధ్య కాలంలో తెదేపా ప్రభుత్వం రాయితీపై తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్లు, సిల్పాలిన్ పట్టలు, విద్యుత్తు మోటార్లు, రొటావేటర్లు, బొచ్చెలు, గొర్రులు, సీడ్ డ్రమ్స్ తదితర పరికరాలు పెద్ద ఎత్తున పంపిణీ చేశారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ఎక్కువ ధర చెల్లించి వాటిని కొనుగోలు చేయలేకపోతున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి పరికరాలు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

తైవాన్ స్ప్రేయర్‌తో పురుగుమందు పిచికారీ

పూర్వ విద్యార్థి కుటుంబానికి చేయూత

అచ్చంపేట, న్యూస్‌టుడే: అచ్చంపేట మండలం తాళ్లచెరువుకు చెందిన పరిటాల వెంకటకృష్ణ (54) కుటుంబానికి ఆదివారం గుంటూరు నాయీబ్రాహ్మణ వసతి గృహం పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు రూ.2.26 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. వెంకటకృష్ణ ఈ నెల 14న రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆ కుటుంబానికి సంఘం ప్రతినిధులు అండగా నిలిచారు.

వెంకటకృష్ణ చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయీబ్రాహ్మణ వసతి గృహం పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు

వైద్య శిబిరానికి స్పందన

ఆకులగణపవరం(రాజుపాలెం), న్యూస్‌టుడే: రెండు రోజులు దాటి జ్వరంతో బాధపడుతుంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని కాటూరి ఆసుపత్రి వైద్యులు పేర్కొన్నారు. తెదేపా ఆధ్వర్యంలో ఆదివారం ఆకులగణపవరంలో నిర్వహించిన మెగా వైద్యశిబిరంలో 350 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎక్స్‌రే, ఈసీజీ, ఎకో వంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. నియోజకవర్గ తెలుగు యువత నాయకుడు వడ్డెంపూడి పవన్‌కుమార్, కాటూరి ఆసుపత్రి ప్రతినిధి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ప్రశ్నపత్రాల పంపిణీ

అమరావతి, న్యూస్‌టుడే: మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూపూడిలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ ప్రశ్నపత్రాలను పంపిణీ చేశారు. విద్యార్థులు ఇష్టంగా చదివి, చక్కటి ఫలితాలు సాధించాలని ఫౌండేషన్ ప్రతినిధులు కృష్ణారావు, కిరణ్, తెదేపా నాయకులు కోటయ్య, వెంకట్రావు తెలిపారు.

ఘనంగా 60 ఏళ్ల వేడుకలు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: జూలకల్లు జడ్పీ ఉన్నత పాఠశాల 60 ఏళ్ల వేడుకలు రెండోరోజు ఆదివారం కొనసాగాయి. పూర్వవిద్యార్థులు హాజరై నాటి తీపిగుర్తులను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన సుమారు 90 మంది ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. బ్యాచ్‌ల వారీగా పూర్వ విద్యార్థులు వేదికపై ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కృష్ణారెడ్డి, స్థలదాత నంద్యాల ధనుంజయరెడ్డి, ఎంపీపీ అనసూర్య, ప్రధానోపాధ్యాయుడు సుబ్బరామయ్య, కమిటీ అధ్యక్షులు సుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరావు, కోటిరెడ్డి, ఏడుకొండలు, శేషాద్రి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల నృత్య ప్రదర్శన

విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

(c) eenadu

కందికొత్తలు
గిరిసీమలో సంబరాలు

డప్పు వాయిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా మండలంలోని హెచ్ గ్రౌండులో ఆదివారం గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కందికొత్తలు ఉత్సవాలు అంబరాన్నంటాయి. ఏటా కంది పంట చేతికొచ్చే సమయంలో జరిపే ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా కలెక్టర్ ప్రభాకరరెడ్డి దంపతులు హాజరయ్యారు. తొలుత కొండపై వెలసిన జాకారమ్మ, గొడ్లమ్మ, చెతరమ్మలను దర్శించుకున్నారు. కలెక్టర్ సతీమణి గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేశారు. ఏఎంసీ ఛైర్మన్ కళావతి, ఎస్టీ కమిషన్ సభ్యుడు మల్లేశ్వరరావు, ఎంపీడీవో లక్ష్మి, తహసీల్దారు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళలు, సంఘాల నాయకుల నృత్య ప్రదర్శన

పండగకు ప్రయాణమా?

వాట్సప్‌లో ఆర్టీసీ టికెట్లు బుక్ చేసుకోండి

న్యూస్‌టుడే, గరివిడి

సంక్రాంతికి ప్రయాణికుల రద్దీ తీవ్రంగా ఉంటుంది. వివిధ ప్రాంతాల్లో ఉన్నవారు సొంతూళ్లు, బంధువుల ఇళ్లకు వెళ్తుంటారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు అదనంగా 200 బస్సులను ఆర్టీసీ నడపనుంది. టికెట్ బుకింగ్ కోసం బస్టాండ్, నెట్ సెంటర్‌కు వెళ్లి సమయం వృథా చేసుకోవాల్సిన అవసరం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన మిత్ర-వాట్సప్ గవర్నెన్స్ ద్వారా సులువుగా టికెట్ పొందే అవకాశం కల్పించారు. సంక్రాంతి సీజన్‌తో పాటు సాధారణ సమయాల్లోనూ ఈ సేవలను పొందొచ్చని జిల్లా రవాణా అధికారి వరలక్ష్మి తెలిపారు.

ఇలా చేయాలి..

- వాట్సప్ ద్వారా ఆర్టీసీ బస్సు టికెట్లు బుక్ చేసుకోవడానికి ప్రభుత్వం ఇచ్చిన 95523 00009 నంబరును సేవ్ చేసుకోవాలి. అనంతరం దీనికి వాట్సప్‌లో హాయ్ అని సంక్షిప్త సందేశం పంపి.. ఆర్టీసీ సేవలను క్లిక్ చేస్తే టికెట్ బుకింగ్ ఐచ్ఛికం వస్తుంది.
- ప్రయాణ వివరాలు, బయలుదేరే ప్రదేశం, చేరాల్సిన గమ్యం, తేదీ, వివరాలు నమోదు చేయాలి. ఏఏ సమయంలో ఏ బస్సులు ఉన్నాయో వివరాలు చూపిస్తుంది. బస్సు ఎంపిక చేసుకుని, ఖాళీగా ఉన్న సీటును బుకింగ్ చేసుకోవచ్చు.
- ఆన్‌లైన్‌లో నగదు చెల్లిస్తే నిర్ధారణ సందేశం మీ వాట్సప్‌కే వస్తుంది.
- ప్రయాణికులు బస్సు ఎక్కిన తర్వాత కూడా కండక్టర్‌తో పని లేకుండా టికెట్‌ను వాట్సప్‌లోనే పొందవచ్చు.
- బస్టాండ్లలో అతికించిన క్యూఆర్ కోడ్‌ను మీ చరవాణిలో స్కాన్ చేయడం ద్వారానూ టికెట్ బుకింగ్ చేసుకోవచ్చు.

మన్యమే మార్గదర్శి

పార్వతీపురం మన్యం.. రాష్ట్రంలో చిటారుకొమ్మకు వేలాడుతున్నట్లు కనిపించే చిన్న జిల్లా. కొండలు, వాగులు, వంకలు తప్ప అభివృద్ధికి మరే వనరులు లేని ప్రాంతం. అటువంటి చోటు ఇప్పుడు రాష్ట్రానికి మార్గదర్శిగా నిలుస్తోంది. ప్రతి సంక్షోభాన్నీ అవకాశంగా మార్చుకోవాలన్న సీఎం చంద్రబాబు మాటలను అందిపుచ్చుకొని అధికార యంత్రాంగం కార్యక్రమాలు రూపొందిస్తోంది. ఇక్కడ పురుడు పోసుకున్నవి రాష్ట్రంలో ప్రతి జిల్లాలో అమలుచేసేలా ప్రభుత్వమే చొరవ చూపించి, ఆదేశాలిస్తోంది. – న్యూస్‌టుడే, పార్వతీపురం

అంగన్‌వాడీ కేంద్రంలో బాలిక ముస్తాబు

వినూత్న ఆలోచనలతో ముందుకు..

'ముస్తాబు'తో మొదలు పెట్టి..

జిల్లాలోని కురుపాం గురుకుల పాఠశాలలో విద్యార్థులు అనారోగ్యంతో ఆసుపత్రులపాలైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఆ పరిస్థితి నుంచి పిల్లలను ఆరోగ్యంగా తీర్చిదిద్దేందుకు జిల్లాలో 'ముస్తాబు' కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రభాకరరెడ్డి ప్రారంభించారు. భామిని మోడల్ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశానికి వచ్చినప్పుడు పిల్లలు సీఎం చంద్రబాబుకు ఈ కార్యక్రమం ప్రయోజనాన్ని తెలిపారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అమలుకు ఆయన ఆదేశాలిచ్చారు. ఇప్పుడు రాష్ట్రంలో ప్రతి పాఠశాల, అంగన్‌వాడీ, వసతి గృహాల్లో ఈ కార్యక్రమం అమలవుతోంది.

కొత్త ఏడాది నుంచి 'రెవెన్యూ క్లినిక్'లు

పీజీఆర్ఎస్‌లో వచ్చే రెవెన్యూ సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి, చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో మొదలుపెట్టిన 'రెవెన్యూ క్లినిక్' ఆలోచన జిల్లాలోనే మొగ్గ తొడిగింది. సబ్‌కలెక్టర్లు, తహసీల్దార్లు, సర్వే అధికారులు ఒకేచోట కూర్చొని వచ్చిన సమస్యలను పరిశీలిస్తున్నారు. అన్నీ సానుకూలంగా ఉంటే పరిష్కారం చూపి, అర్జీదారుని సంతృప్తిస్థాయిని కూడా ఐవీఆర్ఎస్ విధానంలో తెలుసుకుంటున్నారు. ఈ విధానాన్ని రాష్ట్రమంతటా కొత్త ఏడాది నుంచి ప్రారంభించాలని రాష్ట్ర రెవెన్యూ పరిపాలన, భూ రికార్డుల ప్రత్యేక కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

ఇక్కడ్నుంచే క్లిక్కర్

విద్యార్థుల అభ్యాసన స్థాయిని తెలుసుకోవడం, తక్షణ మూల్యాంకనం చేపట్టడానికి విద్యాశాఖ 'క్లిక్కర్' విధానాన్ని తీసుకొచ్చింది. ఈ కార్యక్రమం ప్రారంభానికి కూడా మన్యం జిల్లాయే వేదికగా నిలిచింది. భామిని మోడల్ పాఠశాలలో మొదటిసారి క్లిక్కర్ సాయంతో విద్యార్థులు విషయాన్ని ఏ మేరకు ఆకళింపు చేసుకుంటున్నారనే అంశాలను అంచనా వేశారు. ప్రస్తుతం తొమ్మిదో తరగతి పాఠ్యాంశాల బోధన, ప్రశ్నావళి, మూల్యాంకనకు ఈ విధానాన్ని అవలంబిస్తున్నారు. జిల్లాలో మరో రెండు బడులకు విస్తరించనున్నారు. ఆపై రాష్ట్రంలో దీన్ని అమలు చేసే దిశగా చర్యలు ప్రారంభం అవుతాయి.

ఇదో ముందడుగు

రాష్ట్రంలో తొలిసారిగా 'గోబాల సంబరాల'కు జిల్లా వేదికైంది. పశుపోషణ, పాడి పరిశ్రమలో లాభాలు తదితర విషయాలను విద్యార్థి దశలోనే పిల్లలకు వివరించడం ద్వారా భవిష్యత్తులో ఈ పరిశ్రమ అభివృద్ధికి వీరు దోహదపడతారనే లక్ష్యంతో 'గోబాల సంబరాలు' ప్రారంభించారు. దూడల ప్రదర్శన, వైద్య శిబిరాలు, వాటి సంరక్షణ తదితరాలు నిర్వహించి నేరుగా పిల్లలకు వివరిస్తారు.

అరటి.. ఇలాగెల

సీతంపేట, న్యూస్‌టుడే: సాధారణంగా అరటి చెట్టుకు పై భాగంలో గెల కాస్తుంది. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం దోనుబాయి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఒక అరటి చెట్టుకు ఇలా మధ్య భాగం నుంచి గెల వచ్చింది. విషయాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి(పీహెచ్‌వో) ఎస్.వి.గణేష్ వద్ద ప్రస్తావించగా సూక్ష్మ పోషకాలు, జన్యుపరమైన లోపాల కారణంగా ఇలా అరుదుగా వస్తుంటాయన్నారు.

అన్న.. పల్లెకూ వస్తున్నాయి క్యాంటీన్లు

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

అయిదుచోట్ల శరవేగంగా నిర్మాణాలు

పట్టణాల్లో ఓ పూటకు రూ.5కే ఆహారం అందిస్తూ అన్నార్తుల ఆకలి తీరుస్తున్నాయి అన్న క్యాంటీన్లు. రెండో విడత గ్రామీణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఉమ్మడి జిల్లాలో చీపురుపల్లి, కొత్తవలస, గజపతినగరం, కురుపాం, సీతంపేటలలో భవన నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయని ప్రజారోగ్య సాంకేతిక శాఖ డీఈలు బి.ఈశ్వరరావు, వంశీ చెప్పారు.

కురుపాంలో సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్

నియోజక వర్గానికి ఒకటి చొప్పున అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తొలి విడతలో అర్బన్ ప్రాంతాలైన విజయనగరం నగర పాలక సంస్థలో మూడు, నెల్లిమర్ల, బొబ్బిలి, రాజాంలలో ఒక్కొక్కటి ఏర్పాటయ్యాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం, సాలూరు, పాలకొండలలో ఒక్కొక్కటి నిర్వహిస్తున్నారు. వీటికి ఆదరణ లభిస్తోంది. పలు వర్గాలవారు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నారు.

■ విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి, కొత్తవలసలో భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. టైల్స్, ప్రహరీ నిర్మాణం జరగాల్సి ఉంది. ఈ రెండింటిని జనవరి 15 నాటికి పూర్తి చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

■ గజపతినగరంలో భవన నిర్మాణం జనవరి నెలాఖరునాటికి పూర్తికానుంది. ఇక్కడ స్లాబు డీసెంట్రింగ్ జరగాల్సి ఉంది. స్థల సేకరణ విషయంలో ఇబ్బందితో కాస్త జాప్యమైంది.

రెండుచోట్ల పండగనాటికి..

ఉమ్మడి జిల్లాల్లోని అన్న క్యాంటీన్ల నిర్మాణ పనులు ప్రజారోగ్య సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఒక్కొక్క భవనం రూ.61 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు.

■ పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాంలోని అన్న క్యాంటీన్ పనులు తుది దశకు చేరాయి. ఎలివేషన్, ఫ్లోరింగ్, గ్లాసు పనులు జరుగుతున్నాయి.

■ సీతంపేటలో భవనం స్లాబ్ పనులు ఈనెల 20న జరిగాయి. 15 రోజులు క్యూరింగ్ అనంతరం ఇతర నిర్మాణాలు ప్రారంభించనున్నారు. జనవరి నెలాఖరునాటికి దీన్ని అందుబాటులోకి తెచ్చేలా సన్నాహాలు చేస్తున్నారు.

ఆనంద ఆదివారం

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట మన్యంలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ఎన్టీఆర్ సాహస ఉద్యాన పార్కులో ఆనంద వేదిక వద్ద నృత్యం చేస్తూ.. పలు క్రీడలు, బోటింగ్‌తో ఆనందంగా గడిపారు. మెట్టుగూడ, దోనుబాయి దరి సున్నపుగెడ్డ జలపాతం, బెనరాయి, మల్లి, ఆడలి జలపాతాల వద్ద సందర్శకులు జలకాలాడారు. జగతిపల్లి, ఆడలి వ్యూ పాయింట్ వద్ద పర్యాటకుల సందడి కనిపించింది.

దొరికిన కాడికి దోచుకో!

మక్కువ, న్యూస్‌టుడే: మండలంలోని చెముడు గ్రామ సమీపంలో ఉన్న గోముఖి నదిలో ఇసుక తవ్వకాలు పట్టపగలే యథేచ్ఛగా సాగుతున్నాయి. అధిక సంఖ్యలో లోడ్‌లను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఆదివారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో ఇసుక తవ్వకాలు జరిపి, ట్రాక్టర్ లోడ్‌కు రూ.800 వరకు వసూలు చేశాడు. ఈ పరిస్థితి గత కొంత కాలంగా ఉన్నా అధికారులకు మాత్రం పట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. చెముడు, శంబర గ్రామాల మధ్య ఉన్న వంతెనకు 300 మీటర్ల దూరంలో నిత్యం అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నాయి.

సంకేతాలు అందవని.. సంచిలో పెట్టేశారు!

విద్యార్థులకు సాంకేతిక ఫలాలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూటర్లు, సిమ్‌లను అందించింది. ఏజెన్సీ గ్రామాల్లో సంకేతాలు అందక చాలావరకూ ఇలా మూలపడి ఉన్నాయి. 2024-25 విద్యా సంవత్సరం మార్చిలో పరికరాలు అందించారు. వీటిని పాఠశాల్లో అమర్చడం ద్వారా అంతర్జాల సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. తద్వారా పాఠశాలల్లో ఉన్న టెలివిజన్‌లో వివిధ అంశాలను విద్యార్థులకు బోధించేందుకు, ఉపాధ్యాయులు వివిధ యాప్‌లలో వివరాల నమోదుకు ఉపయుక్తంగా ఉంటుందని భావించారు. సాలూరు పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో కలిపి 173 పాఠశాలలున్నాయి. ఇందులో పట్టణ ప్రాంతంలో కేవలం 25 మాత్రమే ఉన్నాయి. మిగతావి గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. ప్రభుత్వం నుంచి 173 పాఠశాలలకు రూటర్లు వచ్చాయి. సంకేతాలు అందని శిఖరాగ్ర, మారుమూల ప్రాంతాల్లో విద్యాలయాలకు వీటిని పంపిణీ చేయలేదు. దీంతో అవన్నీ ప్రస్తుతం బస్తాలలో ఎంఆర్సీలోనే ఉండిపోయాయి.

– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

విజ్ఞానం.. పదిమంది మేలు కోరాలి.. పర్యావరణహితమై సాగాలి. అదే తలంపు.. ఈ విద్యార్థులు, ఉపాధ్యాయులకు గుర్తింపు తెచ్చిపెట్టింది. రాష్ట్రస్థాయి దాటి దక్షిణభారత, జాతీయ పోటీలకు అవకాశం కల్పించింది. ఇంతకీ వీరేం చేశారంటే..

– న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, గ్రామీణం

వృత్తిదారులకూ నైపుణ్యం

విజ్ఞాన ప్రాజెక్టుకు రూపునిచ్చిన ఉపాధ్యాయిని

ప్రస్తుత పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో ఆధునిక సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతోంది. ఈక్రమంలో వృత్తిదారులూ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉంది. దీన్ని వివరిస్తూ ప్రాజెక్టు రూపొందించి ఆకట్టుకున్నారు వీరఘట్టం మండలం ఎంపీ.పురం ప్రాథమికోన్నత పాఠశాల గణితం ఉపాధ్యాయిని సంతోషికుమారి. రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక విందులో ప్రదర్శించి, హైదరాబాద్‌లో జరగనున్న దక్షిణ భారతస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఉపయోగాలివీ..

★ డిజిటల్ మీడియా, గేమింగ్, ఇతర సాంకేతిక రంగాల్లో టెస్సలేషన్ ఒక కీలకమైన అంశం

★ సాఫ్ట్‌వేర్ రంగంలో అల్గారిథమ్స్ రూపొందించే వారికి కంప్యూటేషనల్ జియోమెట్రీపై పట్టుండాలి. ప్రధానంగా సీ ప్లస్ ప్లస్, పైథాన్ వంటి భాషలతో పాటు దీనిని ఉపయోగిస్తారు.

★ గేమ్ గ్రాఫిక్స్ వేగంగా లోడ్ అవ్వడానికి, వాస్తవికంగా కనిపించడానికి గేమ్ డెవలపర్ పద్ధతి ఉపయోగపడుతుంది.

★ ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాలను భవనాల ముఖ భాగాలు, రూఫ్ డిజైన్లను సులువుగా తెలుసుకోవడానికి వాడవచ్చు.

★ ఇంటీరియల్ డిజైన్, స్ట్రక్చరల్ ఇంజినీర్ అంశాలు వివిధ విభాగాల్లో పనికొస్తాయి.

★ టెక్స్‌టైల్ డిజైనర్, గ్రాఫిక్స్, ప్యాకేజింగ్ తదితర విభాగాలు టెస్సలేషన్ ప్రాజెక్టులో కీలకమని సంతోషికుమారి తెలిపారు. ఈ కొత్త అంశాలతో విద్యుత్తు ఖర్చులు తగ్గుతాయన్నారు. డేటా కూడా తక్కువ సరిపోతుందని చెప్పారు.

వ్యర్థానికీ అర్థాన్నిచ్చారు

కాలంతో సంబంధం లేకుండా ప్రస్తుతం వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం పరిసరాల శుభ్రత లోపించడమే. చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడం, మురుగు కదలకపోవడంతో ఈ పరిస్థితి కనిపిస్తోంది. వాటి పునర్వినియోగంతో ప్రకృతితో పాటు మానవాళికి మేలు జరుగుతుందని చెబుతున్నారు పార్వతీపురం మండలం నర్సిపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన రిషీంద్రనాయుడు, గుణవర్ధన్. 'గ్రామ ముస్తాబు- విజన్ ఫర్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టును రూపొందించి, గుర్తింపు పొందారు.

★ పెద్ద పట్టణాలతో పాటు పల్లెల్లో సాంకేతికతతో చెత్త సేకరణ ప్రక్రియను సులువుగా నిర్వహించవచ్చు

★ స్మార్ట్ డస్ట్‌బిన్ సెన్సార్ల సాయంతో వ్యర్థాల స్థితి, బరువును తెలుసుకుని, ఆటోమెటిక్‌గా మూత తెరుచుకుంటుంది. నిండిపోతే సమాచారం ఇస్తుంది. దీనివల్ల సకాలంలో తరలించేందుకు అవకాశం లభిస్తుంది.

★ పొడి చెత్తను మండించి శక్తిగా మార్చే అవకాశం ఏర్పడుతుంది. దీని నుంచి విద్యుత్తును తయారు చేయొచ్చు.

★ తడి చెత్త, మొక్కల అవశేషాలతో సహజమైన పురుగు మందులను తయారు చేస్తారు. ఇవి పంటలకు హానిచేయవు.

ఉద్దేశమిదీ..

★ వ్యవసాయ వ్యర్థాలను తక్కువ ఆక్సిజన్‌లో మండించి, తిరిగి పంటకే ఉపయోగించవచ్చు. దీంతో దిగుబడులు పెరుగుతాయి. రసాయనాలను దూరం చేయొచ్చని గైడ్ టీచర్ మురళీకృష్ణ తెలిపారు. రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చూపి జనవరిలో హైదరాబాద్‌లో జరగనున్నదక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు, మార్చిలో దిల్లీలో జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు చెప్పారు.

మూడున్నరేళ్లైంది.. ఇంకెన్నాళ్లు కడతారు!

జిల్లాలో అటు ఏజెన్సీ, ఇటు మైదాన ప్రాంత పేద ప్రజలకు జిల్లా ఆసుపత్రి ఎంతో కీలకం. కానీ దానికి సరిపడా సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. అదనపు భవనాల నిర్మాణం నాలుగేళ్లుగా సాగుతూనే ఉంది. మరోపక్క ప్రధాన విభాగానికి చెందిన పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. **సోమవారం ఆసుపత్రి అభివృద్ధి సలహా సంఘం సమావేశం నిర్వహించనున్నారు.** కలెక్టర్ ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే విజయచంద్ర, డీసీహెచ్ఎస్ నాగభూషణరావు హాజరు కానున్న నేపథ్యంలో ఈ సమస్యలపై దృష్టి సారిస్తే సేవలు మరింత మెరుగయ్యే అవకాశం ఉంటుంది. గుత్తేదారు నత్తనడక పనులతో రోగులకు అవస్థలు తప్పడం లేదు.

అసంపూర్తిగా భవనం

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

పార్వతీపురం ప్రాంతీయాసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా నాలుగేళ్ల క్రితం అప్‌గ్రేడ్ చేశారు. నాటి నుంచి రోగుల సంఖ్య పెరిగింది. ఆ స్థాయిలో సౌకర్యాల కల్పన జరగలేదు. ప్రస్తుత భవనం వంద పడకల సామర్థ్యంతోనే ఉంది. పెంచిన 50 పడకలకు సంబంధించి నాలుగేళ్ల క్రితం రూ.21 కోట్లు నాబార్డు నిధులు మంజూరు చేశారు. ఇందులో పాత భవనం ఆధునికీకరణకు రూ.3 కోట్లు, 50 పడకల భవన

జిల్లా ఆసుపత్రిలో పూర్తికాని అదనపు భవన నిర్మాణం

నిర్మాణానికి రూ.18 కోట్లు కేటాయించారు. భవన నిర్మాణం మూడున్నరేళ్ల క్రితం ప్రారంభమైనా.. నేటికీ పూర్తి కాలేదు. 60 శాతం పనులు మాత్రమే జరిగాయి. అది పూర్తయితే కానీ పడకల ఇబ్బంది తప్పదు. ప్రస్తుతం రోజుకు ఇన్‌పేషెంట్లుగా సుమారు 250 మంది వరకు ఉంటున్నారు. ఒక్కో పడకపై ఇద్దరికి సేవలు అందిస్తున్నారు.

రేడియాలజిస్ట్ పోస్టు ఖాళీ..

జిల్లా ఆసుపత్రికి ప్రసవాల విషయంలో గుర్తింపు ఉంది. నెలకు 300 వరకు జరుగుతుండగా ఇందులో 60-70 శాతం సాధారణమే. గర్భస్థ శిశువు ఆరోగ్యం తెలియజేసే స్కానింగ్‌కు ఇబ్బంది తప్పడం లేదు. రేడియాలజిస్ట్ పోస్టు ఖాళీగా ఉంది.

(c) eenadu

ఐక్యంగా పోరాడితే ఏదైనా సాధ్యం

ఆత్మీయ సమ్మేళనంలో వంగవీటి ఆశాకిరణ్

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఐక్యంగా పోరాటం చేస్తే ఏదైనా సాధించగలమని మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధ కుమార్తె ఆశాకిరణ్ అన్నారు. బొబ్బిలిలోని ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన తెలగ సామాజిక వర్గీయుల ఆత్మీయ సమ్మేళనానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తండ్రి రాధ తన స్ఫూర్తి అని, ఆయన పట్టుదల తనలో ఉందన్నారు. జాతి అభివృద్ధికి వంగవీటి కుటుంబ సభ్యురాలిగా ముందుంటానని భరోసానిచ్చారు. కేరళ, తమిళనాడు, కర్ణాటకలో రిజర్వేషన్లు పక్కాగా అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా న్యాయం చేస్తారన్నారు. తెలగ, కాపు రిజర్వేషన్ల పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ సీహెచ్.ప్రసాదరావు మాట్లాడుతూ పది లక్షల మందితో ఒక సంఘం ఏర్పాటు కావాలన్నారు. నాయకులు శాంతన్ కుమార్, గాదెం బాలాజీ, జి.శ్రీనివాసరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


బొబ్బిలిలో ఆశాకిరణ్‌కు స్వాగతం పలుకుతున్న తెలగ సంఘం నాయకులు

సెమీస్‌కు మిరాకిల్, ఎంవీజీఆర్ జట్లు

ఉత్కంఠభరితంగా ఈఎస్ఎల్-2025 క్రికెట్ ఛాంపియన్‌షిప్

విజయనగరం బాబామెట్ట న్యూస్‌టుడే: ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ప్రజెంట్స్- ఈనాడు స్పోర్ట్స్ లీగ్(ఈఎస్ఎల్)-2025 క్రికెట్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆదివారం జరిగిన మ్యాచ్‌లను సుఖీభవ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఎ.శరత్‌కుమార్ పాత్రో టాస్ వేసి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల(చింతలవలస), మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాల(భోగాపురం), సీతం ఇంజినీరింగ్ కళాశాల(విజయనగరం), శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల(మన్యం) జట్ల మధ్య ఉత్కంఠ పోరు సాగింది. కృష్ణవేణి, మృత్యుంజరావు, కేదార్, రాజేష్, చిరంజీవి, పుష్కర్ అంపైర్లుగా వ్యవహరించారు.

SUKHIBHAVA Hospitals CARING FOR LIVES 17-15-90, Jonnaguddi Road, Beside Reliance Mall, BALAJI JUNCTION, VIZIANAGARAM AP 535002 Contact : 7901224433

టాస్ వేస్తున్న సుఖీభవ ఆసుపత్రి సంచాలకుడు డా.ఎ.శరత్‌కుమార్ పాత్రో

అంత దూరం నుంచి వికెట్లను కొడుతున్న క్రీడాకారుడు

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Protein Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా | కర్ణాటక
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner: ఈనాడు.నెట్ ETV BHARAT
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు ఉత్సవ్ క్లబ్

29.12.2025 నేడు — సీనియర్ విభాగంలో.. (విజ్జీ స్టేడియం)

★ ఉదయం 9.00 గంటలకు: ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల(విజయనగరం) V/s మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాల(భోగాపురం)

★ ఉదయం 11.30 గంటలకు: అవంతీస్ రీసెర్చ్ అండ్ టెక్నలాజికల్ అకాడమీ(భోగాపురం) V/s శ్రీ జీసీఎస్ఆర్ కళాశాల- జీఎంఆర్(రాజాం)

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వీరే

పి.పాపారావు

కె.డేవిడ్

వికెట్లు పడగొట్టి విజయ కేతనం

నగరంలోని విజ్జీ మైదానంలో జరిగిన తొలి పోరులో టాస్ ఓడిన మిరాకిల్ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత ఓవర్లలో 67 పరుగులకు ఆలౌట్ అయ్యింది. డి.ప్రవీణ్ 14 పరుగులు చేయగా.. 20 పరుగులు ఎక్స్‌ట్రాల రూపంలో వచ్చాయి. అనంతరం బరిలోకి దిగిన సీతం జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 61 మాత్రమే చేయగల్గి, ఆరు పరుగుల తేడాతో ఓటమి పాలైంది. మిరాకిల్ బౌలర్ పాపారావు 14 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. అందులోనూ వరుస బంతుల్లో 4 వికెట్లు తీశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

పరుగులతో గెలుపు బాట

ఇదే మైదానంలో జరిగిన రెండో మ్యాచ్‌లో శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల(మన్యం)పై ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల(చింతలవలస) 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన వెంకటేశ్వర నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 72 పరుగులు చేసింది. డి.సతీష్ 9 బంతుల్లో 18 పరుగులు, వాసు 13 పరుగులు చేశారు. అనంతరం బరిలో దిగిన ఎంవీజీఆర్ క్రీడాకారులు సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించారు. ఈ జట్టులో కార్తీక్ 7 బంతుల్లో 17 పరుగులు, డేవిడ్ నాలుగు ఫోర్లు, ఒక సిక్సర్ సహాయంతో 27 పరుగులు చేసి జట్టును సెమీస్‌కు చేర్చారు. డేవిడ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

జనసేనలో వర్గ విభేదాలుండవు

జమ్ము శ్రీనును సత్కరిస్తున్న శివశంకర్, యశస్వి, పడాల అరుణ తదితరులు

అయ్యన్నపేట, న్యూస్‌టుడే: మిగిలిన పార్టీల్లా జనసేనలో వర్గాలు, విభేదాలు ఉండవని, కేవలం జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు మాత్రమే ఉంటాయని ఎంఎస్ఎంఈ ఛైర్మన్, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ అన్నారు. వైకాపా నేత నడిపేన శ్రీనివాసరావు(జమ్ము శ్రీను), ఆయన కుమార్తె, ఎంపీపీ మాజీ ఛైర్‌పర్సన్ శశిభూషణ్, పలువురు ఆదివారం జనసేనలో చేరారు. ఆదివారం విజయనగరంలో జరిగిన కార్యక్రమంలో కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ.. శ్రీను చేరికతో జిల్లాలో పార్టీ మరింత బలోపేతమవుతుందన్నారు. తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్మన్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో విజయనగరం అభివృద్ధికి నోచుకోలేదని, కేవలం సొంత లాభం కోసమే వైకాపా నాయకులు పనిచేశారని విమర్శించారు. పార్టీ పీఏసీ సభ్యురాలు, మాజీ మంత్రి పడాల అరుణ, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ పరిషత్ అధ్యక్షుడిగా సూర్యనారాయణరాజు

అయ్యన్నపేట: విజయనగరంలో క్షత్రియ పరిషత్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇందుకూరి సూర్యనారాయణ రాజు, కార్యదర్శిగా రాయవరపు సంతోష్‌రాజు, కోశాధికారిగా పీకేఎల్. వర్మతో పాటు 22 మంది సభ్యులతో కొత్త కార్యవర్గం ఏర్పాటైంది. పెనుమత్స సీతారామరాజు, శేఖర్‌రాజు, లక్ష్మీపతివర్మ, సాగి సీతారామరాజు, రాంబాబు రాజు, శివాజీరాజు, రామరాజు, కేఆర్‌కే.రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిషత్ నూతన కార్యవర్గ సభ్యులు

వనిత అందుకో చేయూత

సీతంపేట, న్యూస్‌టుడే

మన్యం ప్రాంతంలో లభించే అటవీ ఉత్పత్తులు వినియోగించుకొని ఆదాయం పొందుతున్నారు గిరి మహిళలు. ఇక్కడ పండే పంటలను విలువ ఆధారిత వస్తువులుగా తయారు చేసేందుకు చిన్న పరిశ్రమలు నెలకొల్పి జీవనోపాధి పెంచుకుంటున్నారు. ఇప్పటికీ చాలామంది చిరుధాన్యాలతో బిస్కెట్లు, స్నాక్స్, ఇతర ఆహార పదార్థాలు, వెదురుతో గృహోపకరణాలు తయారు చేస్తూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు.

స్వయం ఉపాధి పథకాలు.. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, సీబీఎఫ్, స్త్రీనిధి, ఉన్నతి తదితర పథకాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయం పొందవచ్చు. పీఎంఎఫ్ఎంఈ ద్వారా సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలకు ఆర్థిక, సాంకేతిక సహాయం అందిస్తారు. లబ్ధిదారు పెట్టుబడి పది శాతం, బ్యాంకు రుణం 90 శాతం, రుణంపై రాయితీ 35 శాతం ఇస్తారు. స్థానిక వెలుగు కార్యాలయాలు, ఐటీడీఏలను సంప్రదిస్తే పూర్తిస్థాయి సమాచారం అందిస్తారు.

సీతంపేట మండలం పెదరామలో చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు తయారు చేస్తున్న మహిళలు

యూనిట్ల ఏర్పాటు... పెదరామలో ఆర్ట్స్, వాసన్ సంస్థలు, నాబార్డు సహకారంతో పది మంది మహిళలు చిరుధాన్యాలతో వివిధ ఆహార పదార్థాలు తయారు చేసి మార్కెటింగ్ చేస్తున్నారు. వాసన్ ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లోని భారతీయ మిల్లెట్ పరిశోధన కేంద్రం, హైదరాబాద్‌లో శిక్షణ తీసుకున్నారు. అవసరమైన మెటీరియల్ సమకూర్చడంతో ఆర్ట్స్ సంస్థ అండతో దేవనాపురం, మేకవ తదితర గ్రామాల్లో వెదురుతో గృహోపకరణ, అలంకరణ వస్తువులు తయారు చేస్తున్నారు. ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. 72 రంగాలకు సంబంధించి ప్రభుత్వ సహాయం కోసం 495 మంది నమోదు చేసుకున్నారు.


దేవనాపురంలో వెదురుతో సోఫాలు, కుర్చీల తయారీ

ఖాళీ సమయాల్లో.. చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయిస్తున్నాం. పది మందిమి బృందంగా ఏర్పడి ఖాళీ సమయాల్లో దీన్ని చేసుకుంటున్నాం. నెలకు ఒక్కొక్కరికి రూ.10 వేలపైనే ఆదాయం వస్తోంది. కుటుంబ పోషణ సులువవుతోంది. - సుజాత, పెదరామ

వినియోగించుకోవాలి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న రాయితీలు, దరఖాస్తు చేసుకొనే విధానాన్ని లబ్ధిదారులకు తెలియజేస్తున్నాం. వివిధ రకాల వ్యాపారాలు చేసుకునేందుకు అవకాశం ఉంది. సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందొచ్చు. - ఆర్.వి.రమణ, డీపీఎం

ఒత్తిడితో కూడిన విద్యావిధానం తగదు

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కరరావు, శ్రీనివాసరావు

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకునేందుకు సామాజిక బాధ్యతగా కలిసి ఉపాధ్యాయులంతా ప్రభుత్వంతో కలిసి ఉద్యమించాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు పిలుపునిచ్చారు. ఆదివారం విజయనగరంలోని సంఘ కార్యాలయంలో 51వ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై పోరాటం కొనసాగిస్తామన్నారు. ఒత్తిడిని ఆపేసే విద్యార్థులకు మెరుగైన బోధన సాగుతుందన్నారు. పండగల సమయంలోనూ బదులు తెరవడం సరికాదన్నారు. అనంతరం జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతా భాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా కోరాడ శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడిగా మీసాల అప్పలనాయుడు, సహాధ్యక్షులుగా ప్రసన్నకుమార్, జి.పార్వతి, కోశాధికారిగా తిరుపతినాయుడు ఎన్నికయ్యారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

అయ్యన్నపేట, న్యూస్‌టుడే: కె.కోటపాడులో ఆదివారం జరిగిన బ్రాహ్మణ అర్చక పురోహిత రాష్ట్రస్థాయి సమావేశంలో జిల్లా కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా అధికార ప్రతినిధిగా వాడ్రేవు నాగరాజుశర్మ, అధ్యక్షుడిగా మర్ల రవికుమార్, ప్రత్యేక సలహాదారుడిగా ఎనగంటి సురేష్‌శర్మ, ప్రధాన కార్యదర్శిగా ఎల్.రమేష్‌శర్మ, కోశాధికారిగా జీఎంఎస్. అగస్త్య శర్మ, ఉపాధ్యక్షుడిగా నరెడ్ల వెంకటప్రసాద్‌శర్మ, సహాయ కార్యదర్శిగా గిరి సంతోష్‌కుమార్‌శర్మ, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.సిద్ధార్థ శర్మ, కార్యవర్గ సభ్యులుగా దొంతికుర్తి సాయిశర్మ, కె.సూర్యతేజ శర్మకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామశాస్త్రి ఎంపిక పత్రాలను అందించారు.

నియామకపత్రాలతో జిల్లా కమిటీ సభ్యులు

జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో ఫైనల్స్‌కు బొండపల్లి

బ్యాటింగ్ చేస్తున్న ఎస్సై మహేష్

బొండపల్లి, న్యూస్‌టుడే: బొండపల్లి మండలం గొల్లుపాలెం గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆదివారం భూదేవిపేట, బొండపల్లి జట్లు తలపడ్డాయి. బొండపల్లి పోలీస్- రెవెన్యూ జట్టు తుదిపోరుకు అర్హత సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బొండపల్లి నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 85 పరుగులు సాధించింది. ఛేదనలో భూదేవిపేట 51 పరుగులకే పరిమితమైంది. ఎస్సై మహేష్ బ్యాటు పట్టి సందడి చేశారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	270	280

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

ప్రీమియం ఒగోటాముష సాకి (బెన్నిన్) ముడి జీడిపప్పు (RCN) అత్యుత్తమ నాణ్యత, సరసమైన ధర, నేరుగా సరఫరా. బిజినెస్ వీసా, వసతి సౌకర్యాలు మేము ఏర్పాటు చేస్తాం. సంప్ర॥ 7893732377.

REAL ESTATE

FLAT FOR SALE

2BHK Flat 2nd Floor at UDA Colony, Paul Nagar, 7th Lane, Near Muchalamma Gudi, Vizianagaram. Contact: 9778527106.

JOBS

ప్రముఖ సంస్థ నందు OMS కేటగిరిలో వర్క్ చేయుటకు 25సం॥లోపు యువతి, యువకులు కావలెను. Q:7th - డిగ్రీ (PF) స్టైఫండ్ 10Kto35K ఫ్రీ రూం, ఫీజు లేదు. ✆ 9398756906.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే హక్కు మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

వైజాగ్ ప్రముఖ షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువకులు కావలెను. జీతం.10,000-12,000+ఫుడ్ రూము. ✆ 9030588502/9704637370.

పైడిభీమవరం, పరవాడ ఫార్మా కంపెనీలోకి సూపర్‌వైజర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, R&D, మేనేజర్స్, ఫైర్&సేఫ్టీ హెల్పర్స్, సెక్యూరిటీ. Qlf:10th-డిగ్రీ, MBA, M. ఫార్మా. జీ: 18K-35K. 9573635594, 9121044796

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

తెల్లారిన బతుకులు.. మిన్నంటిన రోదనలు

చెట్టును ఢీకొన్న వ్యాన్: ఇద్దరి దుర్మరణం

ఘటనాస్థలంలో దెబ్బతిన్న వాహనం

వినయ్‌కుమార్ (పాతచిత్రం)

దినేష్ (పాతచిత్రం)

గజపతినగరం, మాధవధార, న్యూస్‌టుడే: రెక్కల కష్టంతో బతుకుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఇద్దరిని తమ బతుకు బండే బలితీసుకుంది. పని ముగించుకుని మరి కొన్ని గంటల్లో ఇళ్లకు చేరుకుంటారనే లోపే రోడ్డు ప్రమాదం వారిని శాశ్వతంగా ఈ లోకం నుంచి దూరం చేసింది. గజపతినగరం రైల్వే స్టేషన్ రహదారి సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఓ వ్యాన్ చెట్టును ఢీకొన్న ఘటనలో విశాఖ నగరానికి చెందిన ఇద్దరు దుర్మరణం చెందారు. ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు వివరాల ప్రకారం.. జీవీఎంసీ 49వ వార్డు ఎన్‌జీజీఓఎస్ కాలనీలో నివాసముంటున్న పి.వినయ్ కుమార్(35) తినుబండారాల వ్యాపారం నిర్వహిస్తుంటాడు. బర్మా క్యాంప్ దరి జైభారత్‌నగర్‌కు చెందిన యల్లబిల్లి దినేష్(25)తో కలిసి సరకుల కోసం శనివారం రాయగడ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గజపతినగరం సమీపంలో వ్యాన్ అదుపు తప్పి రహదారి పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పెద్దదిక్కు కోల్పోయిన కుటుంబం..

వినయ్‌కుమార్ భార్య వాసవి గృహిణి. వీరికి కుమార్తె లాత్విక(5), కుమారుడు జయదీప్(3) ఉన్నారు. 18 ఏళ్ల నుంచి బేకరి వస్తువులను విక్రయించే వ్యాపారం నిర్వహిస్తున్నాడు. రాయగడలో సరకు కొనుగోలు చేసి నగరంలోని పలు దుకాణాలకు హోల్‌సేల్‌గా విక్రయించేవాడు. ఇంటిపెద్ద మృతితో వాసవి కన్నీరుమున్నీరవుతోంది.

జనవరి 1న పుట్టినరోజు..

దినేష్ జీవీఎంసీ శానిటేషన్ విభాగంలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. భార్య లయ గృహిణి. రెండేళ్ల పాప, ఎనిమిది నెలల బాబు ఉన్నారు. తల్లిదండ్రులు కాంట్రాక్ట్ వర్కర్లుగా పనిచేస్తున్నారు. దినేష్ సెలవు దినాల్లో డ్రైవింగ్ చేస్తుంటాడు. జనవరి 1న పుట్టినరోజు. బయటకు వెళ్తే డబ్బులు వస్తాయని, ఆ రోజు ఖర్చులకు ఉపయోగపడతాయని వినయ్‌కుమార్‌తో కలిసి రాయగడ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ప్రాణాలు కోల్పోయాడు.

లారీ, ఆటో ఢీ: ముగ్గురికి గాయాలు

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: దత్తిరాజేరు మండలంలోని కోమటిపల్లి రహదారి కూడలి వద్ద ట్యాంకర్ లారీ, ఆటో ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పెదమానాపురం ఎస్సై జయంతి తెలిపిన వివరాల ప్రకారం.. పెదమానాపురం నుంచి గొభ్యాం వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న ట్యాంకర్ లారీ ఢీకొనడంతో ఆటోలో ఉన్న చొక్కాపు అప్పలనాయుడు, అల్లు గౌరమ్మ, చోదకుడు మామిడి నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి, చికిత్స నిమిత్తం గజపతినగరం ప్రాంతీయాసుపత్రికి 108 వాహనంలో తరలించారు. క్షతగాత్రుల స్వస్థలం రామభద్రపురం మండలం కొత్తరేగ గ్రామం. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కాలేయం, మూత్రపిండాలు దానం చేసిన కుటుంబీకులు

అప్పలమ్మ (పాతచిత్రం)

భామిని, సీతంపేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన భామిని మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సతివాడకు చెందిన ఎం.అప్పలమ్మ(55) ఈనెల 23న ప్రధాన రహదారిపై ఉన్న గ్రామదేవత ఆలయానికి వెళ్లి వస్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలవడంతో స్థానికంగా చికిత్స అందించి.. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. మూత్ర పిండాలు, కాలేయాన్ని రాగోలులోని జెమ్స్‌కు దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం పోస్టుమార్టం జరిపి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. ఆమెకు భర్త అప్పారావు, వివాహమైన ఇద్దరు కుమారులున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అప్పారావు తెలిపారు.

విషపూరిత ద్రావణం తాగించి హత్యాయత్నం

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, సీతానగరం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని ఆపి.. దుండగులు హత్య చేసేందుకు ప్రయత్నించిన ఘటన పార్వతీపురం మండలంలో చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసుల వివరాల మేరకు.. సీతానగరం మండలం పెదంకలాం గ్రామానికి చెందిన చింతాడ సతీష్ వ్యక్తిగత పనిపై పార్వతీపురం వచ్చాడు. ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెళ్తుండగా జనహిత పాఠశాల సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆపాడు. ఈక్రమంలో వెనుక నుంచి వచ్చిన మరొకడు దాడి చేశాడు. ఇంతలో మరొకడు చేరుకున్నాడు. ముగ్గురూ కలిసి విషపూరిత ద్రావణం తాగించే ప్రయత్నం చేశారు. ఇంతలో అటుగా ఇద్దరు వ్యక్తులు రావడంతో పరారయ్యారు. బాధితుడు వెంటనే సీతానగరం పీహెచ్‌సీకి వెళ్లాడు. ప్రథమ చికిత్స అనంతరం పార్వతీపురం, ఆపై విజయనగరం ఆసుపత్రికి తరలించారు. గ్రామీణ పోలీసులు వివరాలు సేకరించారు. సతీష్ వద్ద అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అప్పు తీసుకున్నాడని, ఆ విషయమై ఇటీవల గొడవలు జరిగాయని, కుటుంబీకులు చెబుతున్నారు. అప్పు తీసుకున్నవారే ఇలా చేశారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

చోదకుడి నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి

నెల్లిమర్ల(డెంకాడ), న్యూస్‌టుడే: లారీ చోదకుడి నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలిగింది. పోలీసుల వివరాల మేరకు.. డెంకాడ మండలం బొడ్డవలసకు చెందిన అట్టాడ పైడినాయుడు(60) కూలి పనులు చేసుకునేవారు. శనివారం పనికెళ్లి రాత్రి తిరిగొస్తూ గ్రామ కూడలి వద్ద రహదారి దాటుతుండగా విశాఖ నుంచి విజయనగరం వెళ్తున్న లారీ ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో మహారాజా ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య బంగారమ్మ, ఇద్దరు కుమార్తెలున్నారు. పైడినాయుడు మృతితో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పే అండ్ అకౌంట్స్ ఉద్యోగులకు అండ

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: రాష్ట్రంలో పే అండ్ అకౌంట్స్ ఉద్యోగులకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ పే అండ్ అకౌంట్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సర్వీస్ రూల్స్, రేషియో ఫిక్సేషన్, పదోన్నతులు, అడిషనల్ ఛార్ట్ తదితర దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.హరనాథ్ మాట్లాడుతూ.. నూతన జిల్లాల్లో ఎన్నికలు నిర్వహించి, సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. అనంతరం కోఆప్షన్ ద్వారా నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పమ్మి శ్రీనివాస్(విశాఖపట్నం), కార్యదర్శులుగా జల్లేపల్లి స్వామి(విజయవాడ), మోహనరావు(విజయనగరం) ఎన్నికయ్యారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

రెండోరోజూ పూల అలంకరణ

గజపతినగరం, న్యూస్‌టుడే: గజపతినగరంలోని బజారు కూడలిలో గల వేంకటేశ్వర ఆలయంలో శ్రీనివాస స్వామిని రెండో రోజైన ఆదివారం అర్చకుడు శ్రీనివాసాచార్యులు పూలతో అలంకరించారు. ధనుర్మాసం నేపథ్యంలో భక్తులు దర్శించుకున్నారు.

వెంకన్నకు పూజలు

రింగురోడ్డు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామికి ఆదివారం పుష్పయాగ ఉత్సవం అత్యంత భక్తిశ్రద్ధల నడుమ జరిగింది. వివిధ రకాల పుష్పాలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో స్వామివారు దర్శనమిచ్చారు. - న్యూస్‌టుడే, కంటోన్మెంట్

నేడు గ్రామానికి పెద పోలమాంబ

మక్కువ, న్యూస్‌టుడే: మన్యంలో అత్యంత వైభవంగా జరిగే శంబర పోలమాంబ ఉత్సవాల్లో తొలి ఘట్టమైన పెదపోలమాంబ జాతర ప్రారంభం కానుంది. సీబిల్లిపెద్దవలస మార్గంలో ఉన్న ఆలయ సమీపంలో కొలువుదీరిన పోలమాంబ మేనత్త అయిన పెద పోలమాంబని కొలిచి ఆహ్వానిస్తారు. అక్కడ నుంచి అమ్మవారి ఘటాన్ని సోమవారం చదురుగుడికి తీసుకువచ్చి వారం రోజుల పాటు ప్రత్యేక పూజలు చేయనున్నారు.

చివరి దశలో వదిలేస్తారా?

మండల కేంద్రం జియ్యమ్మవలసలో గ్రామ సచివాలయ నిర్మాణ పనులు సగంలో ఆగిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో రూ.32లక్షలతో నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. బిల్లుల సమస్యతో పనులు చివర్లో నిలిచాయి. ప్రస్తుతం పాత పంచాయతీ భవనంలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

చెత్త తీయరు.. ఇబ్బందులు కనరు

పట్టణంలోని సారిక వీధి కూడలి నుంచి రెడ్డి వీధి, కృష్ణపల్లి, మరికి గ్రామాలకు వెళ్లే రహదారిలో శంకావీధి కూడలి వద్ద వ్యర్థాలు తొలగించకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. అక్కడ రోడ్డుపై వేస్తున్న చెత్త చెల్లాచెదురై పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. పశువులు, పందులు చేరి.. మరింత పాడు చేస్తున్నాయి. దుర్వాసనతో ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెత్తని తొలగించి పారిశుద్ధ్యం మెరుగు పరుస్తామని పారిశుద్ధ్య అధికారి కె.పకీరురాజు అన్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం పురపాలక

దారి ఇలా.. వెళ్లేదెలా?

పాలకొండలోని వడమ రోడ్డుపై వాడుక నీరు నిలిచిపోతోంది. వీధి కుళాయిలు వినియోగించే సమయంలో నీరు రోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీంతో గుంతలు ఏర్పడి, నీరు నిలుస్తోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రక్షితనీరు వృథా కాకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తామని, రోడ్డు బాగుకు చర్యలు తీసుకుంటామని ఏఈ దేవీవరప్రసాద్ చెప్పారు. –న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

మూణ్నాళ్లకే మూలకు..

ప్రజల వ్యాధుల బారిన పడకుండా దోమల నియంత్రణకు గ్రామ పంచాయతీలకు గతంలో ఫాగింగ్ యంత్రాలను సరఫరా చేశారు. బలిజిపేట సచివాలయానికి నాలుగేళ్ల క్రితం ఇచ్చిన యంత్రం కొన్ని రోజులకే మరమ్మతులకు గురైంది. దీంతో ఒక మూలన పడేశారు. ఫాగింగ్ చేసేందుకు వేరే చోట నుంచి పరికరాన్ని తీసుకువస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీన్ని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తదుపరి చర్యలు చేపడతామని సర్పంచి రాగలత అన్నారు. – న్యూస్‌టుడే, బలిజిపేట

మరమ్మతులు చేయరూ..

తురాయి మిడి గ్రామ రామ మందిరం సమీపంలో ఉన్న బోరుబావి చాలా కాలం క్రితం మరమ్మతులకు గురైంది. దీన్ని బాగు చేయకుండా వదిలేయడంతో మురుగులో దర్శనమిస్తోంది. తాగునీటి కుళాయిలు సైతం పలుచోట్ల మరమ్మతులకు గురవ్వడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బాగు చేయాలని కోరుతున్నారు. దీనిపై సర్పంచి రెడ్డి కృష్ణంనాయుడు మాట్లాడుతూ.. చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, మక్కువ

శ్రీ సినిమా(ఎస్‌వీబీ): ఛాంపియన్, ఈషా

టీబీఆర్: అఖండ–2, అనకొండ, వృషభ

తెరపై ఈనాడు

కూరగాయల ధరలు

పార్వతీపురం రైతు బజారు: ఆదివారం సాయంత్రానికి కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. (కిలో రూపాయల్లో.) టమాటా: 47, వంకాయలు: 32, బెండ: 48, బీర: 48, దొండ: 40, చిక్కుడు: 37, పచ్చిమిర్చి: 58, కాకర: 34, క్యారెట్: 56, బీట్‌రూట్: 48, ఉల్లి: 23, బంగాళాదుంపలు: 20, అల్లం: 77, వెల్లుల్లి: 76, క్యాప్సికం: 83, అరటి కాయ: 5, ఆనపకాయ: 15 – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? తుమరాడ సచివాలయం నుంచి వెంగాపురం ఎస్టీ కాలనీకి వెళ్లే రహదారి ఏడాది మొత్తం మురుగుతో నిండి ఉంటోంది. కాలనీలో కాలువలు నిర్మించాలి. - **స్థానికులు**

● కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం.

- వెంకటినాయుడు, వెంగాపురం పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, బలిజిపేట

కష్టార్జితం ఎండుతోంది..
తీపి చేదైంది!

ఓపక్క ఆరుగాలం కష్టించి పండించిన చెరకు పంట చేతికొచ్చే సమయంలో తెగుళ్ల సోకి ఎండిపోతోంది.. మరోవైపు గానుగ నిమిత్తం పంటను కర్మాగారానికి తరలించేందుకు రోజుల తరబడి యార్డులో నిరీక్షించాల్సి రావడంతో రైతులు కుంగిపోతున్నారు. 70శాతం ఈ వాణిజ్య పంటను నమ్ముకుని ఆర్జించిన కుదుసుకున్న వారంతా మూడేళ్లుగా ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నారు. చిన్న సన్నకారు రైతులు చెరకును వదల్లేక.. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించక ఆవేదన చెందుతున్నారు. – న్యూస్‌టుడే, సీతానగరం

కామందొరవలస తూనిక కేంద్రం వద్ద వాహనాల్లో చెరకు

తెగుళ్ల బెడద

గతంలో లేనివిధంగా ఈ ఏడాది తెగుళ్లు సోకి పొలంలోనే చెరకు ఎండిపోతోంది. ఏళ్లుగా సాగు చేస్తున్నామని, ఇంతవరకు ఇలాంటి తెగుళ్లు చూడలేదని రైతులు వాపోతున్నారు. నివారణ చర్యలు అంతుపట్టక పోవడంతో ఆవేదన చెందుతున్నారు. ఎకరాకు 40 మెట్రిక్ టన్నుల చెరకు దిగుబడి వచ్చే పరిస్థితి నుంచి.. 20 టన్నులకు తగ్గిపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరకు త్వరితగతిన కర్మాగారానికి తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోజుల తరబడి పడిగాపులు

ఎన్నో ఏళ్లుగా సీతానగరం, లచ్చయ్యపేటలోని చక్కెర కర్మాగారానికి చెరకు తరలించి రైతులు ఆర్థికంగా పరిపుష్టి సాధించారు. ఆర్థిక ఇబ్బందులతో లచ్చయ్యపేటలోని ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం మూతపడటంతో సంకిలి కర్మాగారానికి తరలిస్తున్నారు. జిల్లాలో ఏటా 90 వేల టన్నుల దిగుబడి అందుతోంది. ఈ మేరకు కర్మాగార యాజమాన్యం సీతానగరం మండలం లక్ష్మీపురం, బూర్జ, కామందొరవలస, నిడగల్లు, కృష్ణరాయపురం గ్రామాల సమీపంలో తూనిక కేంద్రాలను ఏర్పాటు చేశారు. చెరకు సాగు విస్తీర్ణం ఆధారంగా కేంద్రాలకు రోజుకు 11 లారీలను కేటాయించారు. గత మూడు రోజులుగా కర్మాగారం నుంచి వచ్చే లారీల సంఖ్య తగ్గడంతో.. చెరకును నరికి బండ్లలో యార్డుకు తరలించిన రైతు రోజుల తరబడి ఎండలో పంటను ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో గెడల బరువు తగ్గిపోతోంది.

అవగాహన కల్పిస్తున్నాం

కర్మాగారంలోని యంత్రాలు మరమ్మతులకు గురికావడంతో చెరకు సేకరణ నిలిపివేస్తున్నట్లు రైతులకు సమాచారం అందించాం. అయినప్పటికీ యార్డులకు పంట తరలిస్తున్నారు. దీంతో సమస్య ఏర్పడింది. ప్రస్తుతం అన్ని కేంద్రాలకు లారీలను అందుబాటులో ఉంచాం. ఏడెనిమిది ఏళ్లుగా ఒకే విత్తనాన్ని సాగు చేస్తుండటంతో తెగుళ్లు సోకుతున్నాయి. ప్రత్యామ్నాయ రకాలను రైతులు ఎంపిక చేసుకోవాలి. మేలు రకం విత్తనాలపై అవగాహన కల్పించాం. – **లక్ష్మణరావు, సీడీవో, సంకిలి చక్కెర కర్మాగారం**

కేరళ తరహాలో తీర్చిదిద్దాలి

ఉద్యోగులకు సూచనలిస్తున్న ప్రభాకరరెడ్డి

గరుగుబిల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: తోటపల్లి జలాశయాన్ని కలెక్టరు ప్రభాకరరెడ్డి ఆదివారం సందర్శించారు. మండలంలోని సుంకి వద్ద ఐటీడీఏ ఉద్యాన క్షేత్రం, పార్కులను పరిశీలించారు. కేరళ స్థాయిలో దీనికి గుర్తింపు తీసుకురావాలన్నారు. బోటు షికారుతోపాటు నాగావళి నది పిల్ల కాలువలో పడవలు, ఈత కొలనులు, కొలనులు, కాలువ గట్లపై ఉద్యానవనాలు సిద్ధం చేయాలని సూచించారు. రానున్న కొత్త సంవత్సరం, సంక్రాంతి వేళల్లో ఆహ్లాదకరమైన వాతావరణంతో ఆకట్టుకునేలా ఉండాలన్నారు.

ఆదివాసీల హక్కుల పరిరక్షణే ధ్యేయం

ప్రసంగిస్తున్న లక్ష్మణమూర్తి, సభ్యులు

పార్వతీపురం, న్యూస్‌టుడే: ఆదివాసీలు వేర్వేరు సంఘాలుగా పనిచేస్తుండడం వల్ల హక్కులను పరిరక్షించుకోలేకపోతున్నారని, అన్ని సంఘాల్లో పనిచేస్తున్న వారి ఐక్యవేదికగా ఆదివాసీ రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ పేరుతో ముందుకు వెళ్లేందుకు కార్యాచరణ రూపొందించినట్లు రాష్ట్ర కమిటీ ఛైర్మన్ కోలక లక్ష్మణమూర్తి అన్నారు. ఆదివారం గిరిజన భవన్‌లో గిరిజన సంఘాల నేతలతో సమావేశమై రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా యూనిట్‌ను ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా కె.సుబ్బారావును ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా వి.ముత్యాలు, బి.తమ్మయ్య, రమణ, కార్యదర్శులుగా సీహెచ్ సీతారాం, డి.సీతారాం, పి.రంజిత్‌కుమార్, ఎ.చంద్రశేఖర్, పి.సురేష్ నియమితులయ్యారు.

జోరుగా.. హుషారుగా..

గరుగుబిల్లి మండలం తోటపల్లి జలాశయం పరిసరాలు ఆదివారం పర్యాటకులతో కళకళలాడాయి. సుంకి వద్ద ఐటీడీఏ ఉద్యాన క్షేత్రం, చిన్నారుల పార్కులో ఆటపాటలతో సందడి చేశారు. నాగావళిపై బోటుషికారుతో యువత కేరింతలు కొట్టారు. ప్రకృతి అందాలను వీక్షించారు. – న్యూస్‌టుడే, గరుగుబిల్లి గ్రామీణం

గంటేడకు ‘శ్రమ’ పురస్కారం

జ్ఞాపిక అందిస్తున్న నర్సింగరావు, తెలకపల్లి రవి, ఎంవీఎస్ శర్మ తదితరులు

పార్వతీపురం, న్యూస్‌టుడే: పార్వతీపురానికి చెందిన కవి, రచయిత గంటేడ గౌరునాయుడికి సీఐటీయూ ఆధ్వర్యంలో ‘శ్రమ’ పురస్కారాన్ని ఆదివారం అందజేశారు. విశాఖలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నర్సింగరావు, తెలకపల్లి రవి, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ తదితరుల చేతులమీదుగా ఈ పురస్కారం ప్రదానం చేశారు. ఉత్తరాంధ్ర వెనుకబాటు, రైతు సమస్యలు, అడవి బిడ్డల వెతలు కవితా వస్తువుగా సాగిన ఆయన రచనలను కొనియాడారు. గౌరునాయుడిని పార్వతీపురం, కురుపాం స్నేహ కళా సాహితీ సభ్యులు అభినందించారు.

అపూర్వ కలయిక.. ఆనంద వేదిక

నాలుగున్నర దశాబ్దాల తర్వాత బాల్య మిత్రులు తిరిగి కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1977-78లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం పట్టణంలోని సాయిదుర్గానగర్‌లో కలిశారు. కె.మౌళి, బి.అప్పన్న, బి.చక్రవర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

భక్తితో కందికొత్తలు

టీకేజమ్ములో గొడ్లమ్మ ఊరేగింపు

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: ఏటా డిసెంబరు చివరి వారంలో గిరిజనులు కందికొత్తలు పండగను నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఆదివారం జియ్యమ్మవలస మండలంలోని టీకేజమ్ము, వీటీమండ, కొండచిలకాం, అలమండ పంచాయతీల్లోని గ్రామాల్లో గొడ్లమ్మ, జాకారమ్మ, సత్రమ్మను ఊరేగించారు. మహిళలు నృత్యాలు చేస్తూ.. తల్లిని కీర్తించారు. ప్రత్యేక పూజలు చేశారు. యువత, మహిళలు పాల్గొన్నారు.

పనులు చేస్తే.. పైసలివ్వరా!

సాలూరు, న్యూస్‌టుడే: కొన్నేళ్ల తర్వాత జరిగిన శ్యామలాంబ పండగలో పారిశుద్ధ్య పనులు చేసిన కార్మికులకు 6 నెలలుగా అధికారులు కూలి డబ్బులు ఇవ్వలేదు. 15 లక్షలకు పైగా భక్తులు వచ్చిన పండగలో ఎటువంటి పారిశుద్ధ్య సమస్య రాకుండా వ్యర్థాలను తొలగించారని కార్మికులను పాలకులు ప్రశంసించారు. కానీ నేటికీ వారికి కూలి డబ్బులు ఇవ్వకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు సిద్ధం చేశామని, త్వరలో కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని పుర డీఈ ప్రసాద్ తెలిపారు.

దుకాణంలో అగ్ని ప్రమాదం

పార్వతీపురం పురపాలక: పట్టణంలోని కొత్తవలస ప్రధాన రహదారిలో ఉన్న పండ్ల దుకాణంలో ఆదివారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. నిర్వాహకురాలు బి.శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై ఎం.గోవిందు తెలిపారు.

ఉత్సాహంగా హిందూ సమ్మేళనం

సీతంపేట, భామిని, పాచిపెంట, బలిజిపేట, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరిలో హిందూ భావజాలం పెరగాలని ఆర్ఎస్ఎస్ మూడు జిల్లాల ప్రచారక్ భానుప్రకాష్ అన్నారు. భామిని మండలం ఘనసరలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. సనాతన హైందవ ధర్మం కోసం పాటుపడాలన్నారు. పిల్లలకు నైతికత విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. గ్రామీణ వికాస్ కేంద్రం విద్యార్థులు, భామిని కేజీబీవీ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, దేశభక్తి గేయాలు, కోలాటం ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎస్ఎస్ఎఫ్ జిల్లా ప్రతినిధి బృందావతి, కిశోర్ కుమార్ పాత్రో, వై.అప్పలనాయుడు, ఎన్.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. ● పాచిపెంట మండలం అమ్మవలస గిరిజన గ్రామ రామాలయం ఆవరణలోనూ హిందూ సమ్మేళనం నిర్వహించారు. ● ప్రజలు హిందూ ధర్మాన్ని పాటించాలని హిందూ ధర్మ ప్రచారకుడు కె.జగన్నాథం కోరారు. బలిజిపేట శ్రీ వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమ్మేళనంలో మాట్లాడారు. సమరసత సేవా ఫౌండేషన్ డివిజన్ ధర్మ ప్రచారకుడు ధూపంవాసు తదితరులు పాల్గొన్నారు.

ఘనసరలో థింసా నృత్యం చేస్తున్న విద్యార్థులు

పాచిపెంట: మహిళల కోలాటం

బస్సులు పెంచండి.. బాధలు తీర్చండి

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధి, విద్య, వివిధ అవసరాల నిమిత్తం ఇతర రాష్ట్రాలకు వెళ్లిన ప్రజలంతా సంక్రాంతికి కుటుంబ సభ్యులతో కలిసి సొంతూళ్లకు వస్తుంటారు. వీరంతా ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లోనే రాకపోకలు సాగిస్తుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం, విజయవాడ తదితర ప్రాంతాలకు, సాధారణ రూట్లలోనూ అదనపు బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద రద్దీ

స్త్రీశక్తితో పెరిగిన ఆదరణ

ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి స్త్రీశక్తి పథకం అమలు చేస్తోంది. దీంతో సాధారణ రోజుల్లోనూ ఆర్టీసీలో మహిళా ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. పండగ సమయంలో రెట్టింపు స్థాయిలో రాకపోకలు సాగుతాయి. సంక్రాంతి నేపథ్యంలో సుమారు 15 రోజులపాటు రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. దూర ప్రాంతాల్లోని వారు స్వగ్రామాలకు రావడానికి వరుస కడతారు. దీంతో బస్సుల్లో రద్దీ పెరిగి, ఇబ్బంది పడకముందే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నిత్యం.. 70 వేలకు పైగానే..

మన్యం జిల్లాలోని మూడు డిపోల పరిధిలో నిత్యం 70 వేల మందికిపైగా ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. మొత్తం 91 వేల కిలోమీటర్ల వరకు నడుస్తున్నాయి. పాలకొండ, పార్వతీపురం, సాలూరు డిపోల పరిధిలో 264 బస్సులు ఉన్నాయి. ఈ వాహనాలు సరిపోక విద్యార్థులు, ఉద్యోగులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ప్రమాదకరంగా వేలాడుతూ ప్రయాణిస్తున్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు

గతంతో పోలిస్తే ఆర్టీసీకి ఆదరణ భారీగా పెరిగింది. ప్రయాణికుల సంఖ్య పెరిగింది. గత ఏడాది జిల్లాలో మూడు డిపోల పరిధిలో 30 వరకు బస్సులు అదనంగా నడిపారు. ఈ ఏడాది 40 బస్సులు అదనంగా నడిపేందుకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకుంటాం. ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం.

- పి.వెంకటేశ్వరరావు, జిల్లా రవాణా అధికారి

బాబోయ్.. ధాన్యం దొంగలు

భామిని, న్యూస్‌టుడే: ధాన్యం బస్తాలను చోరీ చేసిన ఘటన మండలంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. వడ్డంగి గ్రామానికి చెందిన ఎం.పోలినాయుడు, కె.మోహనరావు, బి.ప్రదీప్ కుమార్‌కు సంబంధించిన ధాన్యం బస్తాలను రవాణా చేసేందుకు గురండి-వడ్డంగి రహదారిలోని శివాలయం సమీపంలో ఉంచారు. ట్రక్‌షీట్ రాకపోవడంతో ఆపగా.. ఎవరో దొంగిలించారు. వీటి విలువ రూ.60 వేలు ఉంటుందని బత్తిలి పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా నేరడి-బి, బత్తిలి తదితర ప్రాంతాలకు చెందిన రైతుల ధాన్యం బస్తాలు చోరీకి గురవుతున్నట్లు చెబుతున్నారు.

వ్యాను ఢీకొని తీవ్ర గాయాలు

సీతానగరం, న్యూస్‌టుడే: సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని వ్యాను ఢీకొనడంతో తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బొబ్బిలి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన బి.వెంకటరమణ సైకిల్‌పై సీతానగరం వైపు వస్తున్నాడు. లచ్చయ్యపేట సమీపంలో వెనుక నుంచి వ్యాను ఢీకొని రహదారిపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

ఆర్టీసీ కాంప్లెక్సుకు హంగులు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్సుకు ఎట్టకేలకు పలు సౌకర్యాలు సమకూరాయి. కాంప్లెక్సులో సమస్యలపై ‘ఈనాడు’లో ఈ నెల 1న కథనం ప్రచురితమైంది. స్పందించిన డిపో మేనేజరు మూర్తి ఉన్నతాధికారులకు సమస్యలను నివేదించారు. సుమారు రూ.2 లక్షలతో మరమ్మతులు చేపట్టారు.

స్పందనకు వందనం

వైద్య నిపుణురాలి నియామకం

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రి జనరల్ మెడిసిన్ వైద్య నిపుణురాలిగా ఎస్.రాజేశ్వరి ఇటీవల విధుల్లో చేరారు. ఆసుపత్రిలో నిపుణులు లేకపోవడంతో రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. దీనిపై ‘ఈనాడు’లో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రజలు సేవలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కె.చిరంజీవి తెలిపారు.

కదిలిన యంత్రాంగం

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ పట్టణంలో ఆక్రమణలపై అధికార యంత్రాంగం కదిలింది. ‘ఈనాడు’లో ఈ నెల 26న ‘ఆస్తులెంతో ఎవరికెరుక?’ శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ ప్రభాకరరెడ్డి ఆక్రమణలు పరిశీలించాలని ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణమూర్తి సూచనల మేరకు వీఆర్వో బి.రాజా, మండల సర్వేయర్ వెంకటరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పూర్తి నివేదిక సిద్ధం చేసిన తర్వాత ఉన్నతాధికారులకు పంపుతామని తహసీల్దార్ తెలిపారు.

కోనేర్లు... నిర్లక్ష్యానికి ఆనవాళ్లు

పాలకొండ పట్టణం చుట్టూ కోనేర్లు, చెరువులు పుష్కలంగా ఉన్నాయి. రాయుడుకోనేరు, వెంకటరాయుడు కోనేరు, కల్యాణి, బత్తులవాని, కిష్టప్ప చెరువులు, కూర్మనాథసాగరం ఉన్నాయి. కానీ ప్రస్తుతం ఇవన్నీ నిర్వహణకు దూరంగా ఉన్నాయి. పిచ్చి మొక్కలు, తూటు పెరిగి ఎందుకూ పనికిరాకుండా మారాయి. గతంలో ఉపాధిహామీ పథకంలో వీటిని వేతనదారులు బాగుచేసేవారు. నగర పంచాయతీగా స్థాయి పెరిగిన తర్వాత నిర్వహణ పట్టించుకునేవారే కరవయ్యారు. ప్రస్తుతం ఈ చెరువులను బాగుచేసి కనీసం చేపల పెంపకానికి ఇచ్చినా కొంత ఆదాయంతోపాటు చెరువులు బాగుపడతాయి. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. పాలకవర్గంతో చర్చించి చెరువులు బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ రత్నరాజ్ తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ

రూపుకోల్పోయిన రాయుడు కోనేరు

పూడికతో నిండిన వెంకటరాయుడు చెరువు

గణితంపై ఆసక్తి పెంచాలి

సాలూరు, న్యూస్‌టుడే: విద్యార్థులలో గణితం పట్ల భయాన్ని పోగొట్టి ఆసక్తి పెంపొందించేలా యూసీ మాస్ గణిత తరగతులు నిర్వహించడం అభినందనీయమని విశ్రాంత ఎస్పీ ఉప్పాడ రవిప్రకాష్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఆర్యవైశ్య ధర్మశాలలో యూసీ మాస్ ఎనిమిదో వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ద్రాక్షాయణి, జె.ఈశ్వరరావు, కె.రామ్మూర్తి, ఎం.స్వప్న, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విశ్రాంత ఎస్పీ రవిప్రకాష్

రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలి

పోటీలకు బయలు దేరిన విద్యార్థులు, అధికారులు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి వృత్తి విద్యా నైపుణ్య పోటీల్లో సత్తా చాటాలని సమగ్ర శిక్షా ఏపీసీ రెడ్డి తేజేశ్వరరావు కోరారు. ఆదివారం జిల్లా నుంచి 47 మంది బృంద సభ్యులు విజయవాడ బయలుదేరి వెళ్లారు. సోమవారం అక్కడి మురళీ రిసార్ట్స్‌లో రాష్ట్రస్థాయి వృత్తి విద్యా నైపుణ్య పోటీలు జరగనున్నాయి. జిల్లా కేంద్రంలో నవంబరు 29న జిల్లాస్థాయి పోటీలు సాంకేతికత, ఐటీ, బ్యూటీ, వెల్‌నెస్, ఎలక్ట్రికల్, ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయం తదితర విభాగాల్లో జరిగాయి. ప్రతిభ చాటిన విద్యార్థులు, జీసీడీవో భారతి, వృత్తి విద్యా ట్రైనర్స్, ఏఎన్ఎంలు, పీఈటీలు బయలు దేరి వెళ్లారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పోరాటాలతోనే హక్కులను సాధించుకోవచ్చని ఏపీటీఎఫ్ సంఘ సీనియర్ నాయకులు బి.గుంపస్వామి, ఆర్.తవిటినాయుడు అన్నారు. ఆదివారం ఎన్జీవో హోంలో సంఘం డైరీ, క్యాలెండర్‌ను ప్రధాన కార్యదర్శి ఎన్.బాలకృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆవిష్కరించారు. ఎన్నో త్యాగాలు చేసి పోరాటాల ద్వారా ఉపాధ్యాయ హక్కులను సాధించిన పూర్వ నాయకులు ఆదర్శప్రాయులన్నారు. బాధ్యతగా సేవలు అందించి.. హక్కుల కోసం పోరాటం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలమానిని, డైరీని ఆవిష్కరిస్తున్న నాయకులు

పీఆర్‌టీయూ ఆత్మీయ సమావేశం

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

వీరఘట్టం, వీరఘట్టం గ్రామీణం, న్యూస్‌టుడే: తూడి మామిడి తోటలో పీఆర్‌టీయూ సంఘ ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఆ సంఘం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.సూర్యనారాయణ, ఉప విద్యాశాఖాధికారి పి.కృష్ణమూర్తినాయుడు, వీరఘట్టం, కొమరాడ, సీతంపేట ఎంఈవోలు డి.గౌరునాయుడు, జామి నారాయణస్వామి, దిబ్బ సూర్యచంద్రరావు, పార్వతీపురం, పాలకొండ, వీరఘట్టం మండలాలకు చెందిన సంఘ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మండలస్థాయి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ పేదల పక్షం

పార్వతీపురం పట్టణం, సాలూరు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పేదల పక్షమని, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ సక్రమంగా అందించిన చరిత్ర తమ పార్టీదని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.మోహనరావు అన్నారు. ఆదివారం పార్వతీపురం బైపాసు రోడ్డులో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. కేకు కోసి నాయకులకు పంచారు. గౌరీశంకరరావు, సీహెచ్ వెంకటరమణ, పి.రవికుమార్, శ్రీనివాసరావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. సాలూరు పట్టణంలో పార్టీ నాయకుడు జి.రామకృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. సీనియర్ నేత ఎస్.బంగారయ్యను సత్కరించారు. డి.పుండరీకాంక్షయ్య, బుచ్చయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కేకు కోస్తున్న మోహనరావు, నాయకులు

(c) eenadu

భూ సమస్యలకు ప్రత్యేక వైద్యం

నేటి నుంచి కలెక్టరేట్‌లో 'రెవెన్యూ క్లినిక్' సేవలు

కలెక్టరేట్ పీజీఆర్ఎస్ మందిరంలో అర్జీల స్వీకరణకు ఏర్పాటు చేసిన కౌంటర్లు

చిన్నపాటి భూ సమస్య తలెత్తినా మండలం నుంచి జిల్లా కార్యాలయాల చుట్టూ ఏళ్ల తరబడి తిరగాల్సిందే. కాగితాల్లో పరిష్కరించినట్లు చూపినా క్షేత్రస్థాయిలో అర్జీలు అలాగే ఉంటున్నాయి. దీంతో పదే పదే అవే అర్జీలు వస్తున్నాయి. ఈ విషయమై ప్రజల్లో అసంతృప్తిని గమనించిన ప్రభుత్వం... భూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 29 నుంచి ప్రత్యేకంగా 'రెవెన్యూ క్లినిక్' విధానాన్ని అమల్లోకి తెస్తోంది. – న్యూస్‌టుడే, ఒంగోలు కలెక్టరేట్

కాగితాల్లోనే పరిష్కారం... జిల్లా కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ డివిజన్, మండల తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వస్తున్న అర్జీల్లో 75 శాతానికి పైగా భూ సమస్యలే ఉంటున్నాయి. క్షేత్రస్థాయిలో వాటిని పరిష్కరించకుండానే పరిష్కరించినట్లు చూపడం, లేదంటే ఏదో కొర్రీ పెట్టి అర్జీలను తిరస్కరించడం రెవెన్యూ అధికారులకు పరిపాటిగా మారింది. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం ఐవీఆర్ఎస్ విధానంలో ప్రతి రోజూ అర్జీదారుల అభిప్రాయాలు సేకరిస్తోంది. సంతృప్తి స్థాయిలు ఆశాజనకంగా లేకపోవడంతో భూ సమస్యల పరిష్కారానికి 'రెవెన్యూ క్లినిక్' పేరిట ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది.

'రెవెన్యూ క్లినిక్‌'లో భాగంగా జిల్లాలోని తహసీల్దార్లందరినీ పీజీఆర్ఎస్ మందిరంలోనే అందుబాటులో ఉంచి... చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చూపేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఇప్పటికే ఈ విధానం అమలు చేస్తున్నారు. సోమవారం నుంచి జిల్లాలోనూ అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

కొత్త విధానం ఇలా... ఇప్పటి వరకు పీజీఆర్ఎస్‌లో వచ్చే సమస్యలను ఆడిట్ చేసి... అర్జీదారుల సంతృప్తి పెంచకున్నా, సంబంధిత అధికారుల పనితీరులో లోపమున్నా సంజాయిషీ నోటీసులతో సరిపెడుతున్నారు. దీంతో పరిస్థితిలో మార్పులేక పదే పదే అవే వినతులు వస్తున్నాయి. రెవెన్యూ క్లినిక్ విధానంలో సదరు మండల తహసీల్దార్ అర్జీ బాధ్యత తీసుకుంటారు. డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు పర్యవేక్షిస్తారు. అన్ని వినతులు ఒకే చోట కాకుండా అంశాల వారీగా సేకరించేందుకు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. అర్జీదారుల ఎదుటే సంబంధిత సిబ్బందికి సమాచారం ఇచ్చి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటారు.

గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల రీసర్వే లోపాలు, ఎస్ఎల్ఆర్ పిటిషన్లు, వెబ్‌ల్యాండ్‌లో విస్తీర్ణం తగ్గడం, డి-పట్టా భూముల ఆక్రమణ, మ్యుటేషన్, తప్పుగా మ్యుటేషన్ చేయడం, ప్రభుత్వ భూముల ఆక్రమణ, 22ఏ నుంచి భూముల తొలగింపు, ఆర్వోఎఫ్ఆర్ మంజూరు, సంయుక్త ఎల్పీఎంలు, అసైన్డ్ భూములు, హద్దుల సవరణ తదితర సమస్యలపై అర్జీలు స్వీకరిస్తారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక...	పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీలు: 29,573	పరిష్కరించినట్లు చూపినవి: 27,214	పురోగతిలో ఉన్నవి: 2,359

నేడు వార్షిక నేర సమీక్షా సమావేశం

ఒంగోలు, న్యూస్‌టుడే: జిల్లా వార్షిక నేర సమీక్షా సమావేశం వల్లూరు సమీపంలోని రైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, న్యాయాధికారులు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో పాటు డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు హాజరుకానున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాలు, రహదారి ప్రమాదాల నియంత్రణ; మహిళలు, చిన్నారుల రక్షణ తదితర అంశాలపై చర్చించనున్నారు.

పీజీఆర్ఎస్ రద్దు: ఈ సమావేశం కారణంగా జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను రద్దు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

వైకాపా అక్రమాన్ని కొనసాగిస్తున్నారు!

న్యూస్‌టుడే – యర్రగొండపాలెం పట్టణం

యథేచ్ఛగా అనుమతి లేని ప్లాట్ల అమ్మకం

వాగు పోరంబోకు అన్యాక్రాంతమైనా పట్టని వైనం

గత వైకాపా పాలనలో అక్రమాలకు అండగా నిలిచిన అధికారులే రియల్ వ్యాపారానికి సహకరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఈ వ్యవహారం కొనసాగుతోంది. అనుమతి లేని వెంచర్లలో ప్లాట్ల అమ్మకాలు సాగుతున్నాయి. కొనుగోలుదారులకు భవిష్యత్తులో సమస్య తప్పదని తెలిసినా సంబంధిత అధికారులెవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.

పార్కు మధ్యలోంచి వెంచర్ కోసం వేసిన దారి

నిబంధనలు కాదని వత్తాసు... యర్రగొండపాలెం సర్వే నంబరు 28-1ఏలో ఇరిగేషన్ శాఖకు చెందిన వాగు పోరంబోకు భూములున్నాయి. దీనిని ఆనుకుని ఉన్న రిజిస్టర్డ్ భూముల్లో కొందరు వైకాపా నాయకులు ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్‌లు వేశారు. ఈ స్థలం మిల్లంపల్లి పంచాయతీ పరిధిలోకి వస్తుంది. అప్పటి ప్రజాప్రతినిధి ఆ వెంచర్ల విలువ పెంచేందుకు... వాగు పోరంబోకు భూమిలో రూ.1.50 కోట్ల ప్రభుత్వ నిధులతో ప్రత్యేకంగా పార్కు ఏర్పాటు చేయించారు. నిబంధనలకు విరుద్ధంగా దాని మధ్యలోంచి లేఅవుట్‌కు దారి ఇప్పించారు. అంతటితో ఆగకుండా కాలువపై ప్రైవేటుగా వంతెన నిర్మాణానికీ అనుమతులు మంజూరు చేయించారు. ఇందుకు ప్రతిఫలంగా సదరు ప్రజాప్రతినిధికి విలువైన నాలుగు ప్లాట్లతో పాటు మరికొంత సొమ్ము ముట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరిగినా జలవనరుల శాఖ అధికారులు మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు.

కానరాని చర్యలు... అక్కడి లేఅవుట్లకు, భవన నిర్మాణాలు చేపట్టేందుకు పంచాయతీ అనుమతులు లేవని గతంలో అక్కడ పనిచేసిన మిల్లంపల్లి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ప్రస్తుత కార్యదర్శి ఎలకా శ్రీనివాస్ తెలిపారు. అయినప్పటికీ అక్కడ రూ.కోట్లలో వ్యాపారం సాగిస్తున్నారు. ఇటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా... అటు వాగు పోరంబోకు అన్యాక్రాంతమవుతున్నా సంబంధిత యంత్రాంగం పట్టించుకోవడం లేదు. నాయకులంతా కుమ్మక్కై వ్యవహారం సాగిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా అధికారులైనా దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కమనీయం... శ్రీవారి కల్యాణం

ఒంగోలులోని శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణోత్సవాన్ని ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాత సేవ, ప్రత్యేక పూజల అనంతరం... వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర భక్త బృందం, ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు సాంస్కృతికం

తాబేళ్ల మృత్యుఘోషకు అడ్డుకట్ట వేద్దాం!

తీరంలో మృత్యువాతపడిన ఓ తాబేలు

సముద్ర తాబేళ్ల (ఆలివ్ రిడ్లే) మృత్యుఘోషకు అడ్డుకట్ట పడడం లేదు. చినగంజాం నుంచి పాకల తీరం మధ్య ఎక్కడికక్కడ దర్శనమిస్తున్న కళేబరాలే ఇందుకు నిదర్శనం. వాస్తవానికి గుడ్డు దశ నుంచే ఇవి ముప్పును ఎదుర్కొంటున్నాయి. వెయ్యిలో ఒకటి పెరిగి పెద్దదవుతున్నట్లు అంచనా. అవీ వలలు, మరపడవలకు చిక్కి ప్రాణాలు కోల్పోతుండడంతో అస్థిత్వ ముప్పును ఎదుర్కొంటున్నాయి.

–న్యూస్‌టుడే, టంగుటూరు

అడుగడుగునా ముప్పు

ఏటా జనవరి - మార్చి మధ్య కాలంలో గుడ్లు పెట్టేందుకు ఆంధ్రా, ఒడిశా తీరానికి ఎక్కువగా వస్తాయి. జిల్లా వరకు పల్లెపాలెం, ఈతముక్కల, పాకల, బాపట్ల పరిధిలోని చినగంజాం పరిసర ప్రాంతాలకు చేరతాయి. గుంతలు తవ్వి గుడ్లు పెట్టాక ఇసుకతో కప్పి తిరిగి వెళ్లిపోతాయి. మార్చి - ఏప్రిల్ మధ్య ఆ గుడ్లు పిల్లలుగా మారి సముద్రంలోకి చేరతాయి. ఇంతవరకు బాగానే ఉన్నా ఆ గుడ్లను కొందరు సేకరించి ఆహారంగా వినియోగిస్తున్నారు. కుక్కలు, నక్కలు సైతం వాటిని తినేస్తున్నాయి. కొన్ని పిల్లలుగా మారినా తిరిగి సముద్రంలోకి వెళ్లేలోపే పక్షులకు ఆహారంగా మారుతున్నాయి. లోపలకు చేరినా ఇతర జలచరాల నుంచి ముప్పు తప్పడం లేదు. దీంతో వెయ్యిలో ఒకటి మాత్రమే పెరిగి పెద్దదవుతున్నట్లు అంచనా.

ప్రభుత్వ శాఖల సమన్వయంతో స్వచ్ఛంద సంస్థ కృషి

వలలే ఉరితాళ్లు... ఆలివ్ రిడ్లేలు గుడ్లు పెట్టేందుకు వచ్చే క్రమంలోనూ అడుగడుగునా ముప్పు ఎదుర్కొంటున్నాయి. మర పడవల బ్లేడ్లు; గిల్‌నెట్, స్క్విడ్, టేకు వలలకు చిక్కి తీవ్రంగా గాయపడి మృత్యువాత పడుతున్నాయి. తిరిగి వెళ్లే క్రమంలోనూ ఇదే రీతిలో ప్రాణాపాయాన్ని ఎదుర్కొంటున్నాయి. ఇలా గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా దాదాపు మూడు వేల కళేబరాలు తీరానికి కొట్టుకు వచ్చాయని.. లెక్కకు అందనవి ఇంతకు రెండింతలు ఉంటాయని ట్రీ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. సముద్ర కాలుష్యమూ వాటిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నట్లు వివరించారు.

సంరక్షణకు ప్రత్యేకంగా కృషి... సముద్ర తాబేళ్ల ప్రాధాన్యం దృష్ట్యా ట్రీ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ... ఇండియన్ కోస్ట్‌గార్డ్, అటవీ, మెరైన్, మత్స్యశాఖల సహకారంతో వాటి సంరక్షణకు కృషి చేస్తోంది. వాలంటీర్ల ద్వారా గుడ్లను సేకరించి... ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హేచరీల్లో భద్రపరుస్తోంది. పిల్లలుగా మారాక ఆయా శాఖల సమన్వయంతో జాగ్రత్తగా తిరిగి సముద్రంలోకి విడిచి పెడుతోంది. ఈ ఏడాది చిన్నమ్మగారి పట్టపుపాలెం, చింతాయగారి పాలెం, పిన్నికవారిపాలెం, పోతయ్యగారి పాలెం, ఈతముక్కల, పాకల తదితర ప్రాంతాల్లో హేచరీలు ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

పిన్నికవారిపాలెంలో ఏర్పాటు చేసిన ఓ హేచరీ

జీవవైవిధ్య పరిరక్షణలో కీలకం... సముద్రంలో భారీగా నాచు పెరిగి సూర్యకిరణాలు అడుగు వరకు ప్రసరించక... ఆ వాతావరణంలో మాత్రమే పెరిగే జీవజాలానికి ముప్పు వాటిల్లుతుంది. మరోవైపు జెల్లీ ఫిష్‌ల ఉద్ధృతి పెరిగినా మత్స్యసంపద తగ్గిపోతుంది. తాబేళ్లు ఈ నాచు, జెల్లీ ఫిష్‌లను ఆహారంగా తీసుకోవడంతో పాటు... సముద్రంలో జీవవైవిధ్యాన్ని పరిరక్షించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నాయి.

లక్ష్యానికి గురిపెడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఇతర అధికారులు

లక్ష్యంపైనే గురి..!

ఉత్సాహంగా పోలీసుల ఫైరింగ్ సాధన

చీమకుర్తి, న్యూస్‌టుడే: పోలీసులు తమ విధుల్లో వినియోగించే ఆయుధాలపై పూర్తిస్థాయి పరిజ్ఞానం కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. చీమకుర్తి మండలం పల్లామల్లిలో ఫైరింగ్ ప్రాక్టీస్ రేంజిలో అధికారులు, సిబ్బంది చేస్తున్న సాధనను ఆదివారం పరిశీలించారు. పోలీసు శాఖలోకి కొత్తగా వచ్చిన ఆయుధాలపై పూర్తిస్థాయిలో పట్టు సాధించాలన్నారు. ఏవైనా సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకుని ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలందించాలని పేర్కొన్నారు. ఫైరింగ్ సాధనలో డీఎస్పీలు బి.లక్ష్మీనారాయణ (దర్శి), సాయి ఈశ్వర్ యశ్వంత్ (కనిగిరి), వి.వి.రమణకుమార్ (మహిళ), జి.గురునాథబాబు (డీటీసీ), కె.శ్రీనివాసరావు (ఏఆర్), జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

బడి... బాగుపడి!

ఉపాధ్యాయిని చొరవతో పెరిగిన విద్యార్థులు

చిన్నారులు, వారి తల్లులతో ఉపాధ్యాయిని అనంతలక్ష్మి

తాళ్లూరు మండలం వెలుగువారిపాలెం పంచాయతీ రెడ్డిసాగర్ ప్రాథమిక పాఠశాల... మొన్నటి వరకు ముగ్గురు పిల్లలు మాత్రమే ఉండేవారు. ప్రాంగణమూ అధ్వానంగా ఉండేది. ఉపాధ్యాయుడు సెలవు పెడితే ఆ రోజు అంతే సంగతి. దాదాపుగా మూత పడే పరిస్థితి. ప్రస్తుతం అదే బడిలో 29 మంది విద్యార్థులున్నారు. విద్యాలయం రూపురేఖలూ మారాయి. కొద్ది నెలల వ్యవధిలోనే చోటుచేసుకున్న ఈ మార్పు వెనుక ఓ ఉపాధ్యాయిని కృషి ఉంది. పేరు వజ్జా అనంతలక్ష్మి. జూన్‌లో జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా సి.ఎస్.పురం మండలం నుంచి ఇక్కడకు వచ్చారు. పాఠశాల దుస్థితిని గమనించిన ఆమె... ముందుగా బడి బాగుకు శ్రీకారం చుట్టారు. రూ.60 వేలకు పైగా సొంత నిధులు వెచ్చించి బడి భవనం, ప్రహరీకి రంగులు వేయించారు. ఆవరణను శుభ్రం చేయించి... బోధన, నిర్వహణకు అవసరమైన సామగ్రి తెప్పించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పిల్లలను స్థానిక ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని కోరారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించి విద్యాబుద్ధులు నేర్పిస్తానని హామీ ఇచ్చారు. అప్పటికే బడి బాగుకు ఆమె చేసిన కృషిని గమనించిన స్థానికులు ఆ నమ్మకంతో పిల్లలను చేర్పించారు. గ్రామ పెద్దలూ తోడ్పాటు అందించారు. అలా కొద్ది రోజుల వ్యవధిలోనే ముగ్గురున్న పిల్లల సంఖ్య 29కి చేరింది. వచ్చే ఏడాదికి ఈ సంఖ్య మరింత పెంచేందుకు కృషి చేస్తానని ఉపాధ్యాయిని అనంతలక్ష్మి తెలిపారు. – న్యూస్‌టుడే, తాళ్లూరు

కూడళ్లలో పుస్తక పెట్టెలు

ప్రజల్లో పఠనాసక్తి పెంచేందుకు వినూత్న యత్నం

చీమకుర్తి ప్రయాణ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం పెట్టె

ప్రజల్లో పుస్తక పఠనం పెంచాలన్న లక్ష్యంతో చీమకుర్తి లయన్స్ క్లబ్ వారు పట్టణంలోని పలు ప్రాంతాల్లో సార్వత్రిక గ్రంథాయాలు (ఓపెన్ లైబ్రరీ) ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం, పాత బస్టాండ్ కూడలి, బాలికల వసతి గృహాల్లో... పిల్లలు, సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలతో కూడిన పెట్టెలు అందుబాటులో ఉంచారు. బస్సుల కోసం నిరీక్షించేవారు వీటిని చదివేలా వసతులు కల్పించారు. అవసరమైన వారు వీటిని ఇళ్లకు తీసుకెళ్లి మళ్లీ ఆ పెట్టెలో ఉంచవచ్చని చెబుతున్నారు. ఔత్సాహికులు ఎవరైనా తమ వద్ద ఉన్న పుస్తకాలను ఇందులో పెట్టవచ్చని సూచిస్తున్నారు. చరవాణి వచ్చాక ప్రజల్లో తగ్గిపోతున్న పుస్తక పఠనంపై మళ్లీ ఆసక్తి పెంచేలా ఈ ఏర్పాట్లు చేసినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు.

– న్యూస్‌టుడే, చీమకుర్తి

సి.ఎస్.పురం పాఠశాలలో ప్రత్యేక తరగతుల నిర్వహణ

పదిలో వంద శాతమే లక్ష్యం

మెరుగైన ఉత్తీర్ణతకు విద్యాశాఖ కసరత్తు

న్యూస్‌టుడే, సి.ఎస్.పురం, పామూరు

పదిలో మంచి ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఈ నెల 6న ప్రారంభమైన కార్యక్రమం వచ్చే ఏడాది మార్చి 15 వరకు కొనసాగనుంది. ఇందులో భాగంగా రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులు, జిల్లా నోడల్ అధికారి ఎ.సుబ్బారెడ్డి ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

గ్రేడ్లుగా విభజన...: ఇప్పటికే విద్యార్థులను వారి స్థాయిని బట్టి నాలుగు గ్రేడ్లుగా విభజించారు. సీ, డీలో ఉన్నవారిని రైజింగ్ స్టార్స్‌గా; ఏ, బీలోని వారిని షైనింగ్ స్టార్స్‌గా పేర్కొంటూ... వారి స్థాయిలను బట్టి ప్రత్యేకంగా ప్రశ్నపత్రాలు తయారు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో మొత్తం 352 ప్రభుత్వ పాఠశాలల్లో 16,802 మంది పదో తరగతి విద్యార్థులుండగా... వీరిలో 5,373 మంది రైజింగ్, 9,707 మంది షైనింగ్ స్టార్లుగా ఉన్నారు.

ప్రతి రోజూ పరీక్ష...: ఏ రోజు ఏం చెప్పాలన్నది ప్రణాళికలో పేర్కొన్నారు. ఆ మేరకు తరగతులు నిర్వహించి... రోజూ సాయంత్రం 20 మార్కులకు స్లిప్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. వెంటనే మూల్యాంకనం చేసి ఆ మరుసటి రోజే లీప్ యాప్‌లో మార్కులు నమోదు చేస్తున్నారు. 'నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేస్తున్నామని... రాష్ట్ర స్థాయిలోనూ తొలి మూడు స్థానాల్లో జిల్లా ఉండేలా కసరత్తు చేస్తున్నామ'ని నోడల్ అధికారి సుబ్బారెడ్డి వివరించారు.

టిడ్కో ఇళ్లకు వీడిన గ్రహణం

పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కల సాకారం చేసేందుకు అప్పటి తెదేపా ప్రభుత్వం 2018లో... ఒంగోలు నగరం చింతల సమీపంలో చేపట్టిన టిడ్కో గృహ సముదాయాలివి. పనులు తుదిదశకు చేరిన తరుణంలో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం అయిదేళ్ల పాటు వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కనీస నిర్వహణా చేపట్టకపోవడంతో నిండా చిల్లచెట్లు పెరిగి ఆ ప్రాంగణం చిట్టడవిలా మారింది. కిటికీలు, ద్వారబంధాలు దెబ్బతిన్నాయి. కొన్ని పరికరాలు సైతం చోరుల పాలయ్యాయి. మరోవైపు తమ వాటా మొత్తం చెల్లించిన లబ్ధిదారులు వాటికి వడ్డీ కట్టలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వీటిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. నిధులు కేటాయించి.. మిగతా పనులను గుత్తేదారుకు అప్పగించింది. మార్చి నాటికి అందుబాటులోకి తెచ్చేలా కార్యాచరణ రూపొందించింది. –ఈనాడు, ఒంగోలు

జంబో యంత్రం... బయటకు తెస్తేనే జలం!

వెలిగొండలో టీబీఎం తొలగింపునకు సన్నాహాలు

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో ప్రధాన నిర్మాణ పనులు జూన్ నాటికి పూర్తిచేసి నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలు తరలించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ప్రధానంగా రెండో సొరంగం.. ఫీడర్ కాలువ లైనింగ్, రక్షణ గోడ నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. మరీ ముఖ్యంగా సొరంగంలో ఉన్న టన్నెల్ బోరింగ్ యంత్రం (టీబీఎం)ను బయటకు తీయాల్సి ఉంది. అది పూర్తయితేనే కృష్ణా జలాల ప్రవాహానికి అవకాశం ఉన్నందున ఈ అంశంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. –న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

రెండో సొరంగంలో ఉన్న టన్నెల్ బోరింగ్ యంత్రం ఇదే

నిపుణుల కమిటీ నివేదిక... దోర్నాల మండలం కొత్తూరు నుంచి కృష్ణానదిలోని కొల్లం వాగు వరకు 9.2 మీటర్ల వ్యాసంతో 18.89 కి.మీ. మేర నల్లమల గర్భంలో సొరంగం తవ్వేందుకు అమెరికా నుంచి టీబీఎంను దిగుమతి చేసుకున్నారు. 160 మీటర్ల పొడవు, వెయ్యి టన్నులకు పైగా బరువున్న ఈ యంత్రాన్ని రూ.120 కోట్లకు కొనుగోలు చేశారు. 2009 సెప్టెంబరులో తవ్వకం పనులు చేపట్టారు. 11.847 కి.మీ. తవ్వకం పూర్తయ్యాక తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో... మాన్యువల్‌గా మిగతా పూర్తి చేశారు. ప్రస్తుతం లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో యంత్రాన్ని బయటకు తెచ్చేందుకు ప్రభుత్వం అయిదు మంది నిపుణులతో కూడిన కమిటీని జూన్‌లో నియమించింది. ఇటీవల ఆ కమిటీ సభ్యులు ప్రభుత్వానికి నివేదిక అందించారు.

చిక్కులు వీడితేనే... సొరంగం లోపలే విడి భాగాలను కోసి ఒక్కొక్కటిగా బయటకు తీసుకురావాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తికి ఆరు నెలలు పట్టే అవకాశం ఉందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. మరోవైపు యంత్రం తమకే చెందుతుందని పాత గుత్తేదారులు కోర్టును ఆశ్రయించారు. వారితో చర్చించి సమస్యను పరిష్కరించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తేనే నిర్దేశిత సమయానికి అది బయటకు వచ్చే అవకాశం ఉంది.

అంకాలమ్మ ఆలయంలో కుటుంబసభ్యులతో శ్రీలీల

అభినయ లీల

ప్రముఖ సినీ హీరోయిన్ శ్రీలీల... ముండ్లమూరు మండలం కెల్లంపల్లిలో ఆదివారం సందడి చేశారు. ఆమె తాతయ్య, క్విస్ విద్యా సంస్థల అధినేత నిడమానూరి నాగేశ్వరరావు జన్మదినోత్సవం సందర్భంగా స్వగ్రామానికి వచ్చారు. నాగార్పమ్మ, అంకాలమ్మ ఆలయాల్లో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులతో కలిసి సరదాగా బ్యాడ్మింటన్ ఆడారు. స్థానికులను ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆమెతో ఫొటోలు దిగేందుకు అభిమానులు పోటీపడ్డారు.– న్యూస్‌టుడే, ముండ్లమూరు

రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీలకు 16 మంది

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో విజయవాడలో సోమవారం జరగనున్న రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీ (స్కిల్ కాంపిటేషన్)లకు జిల్లా నుంచి 16 మంది వృత్తి విద్య విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లాలో మొత్తం 71 ఒకేషనల్ పాఠశాలలున్నాయి. వీటిలోని విద్యార్థులకు అకడమిక్ కోర్సులతో పాటు వృత్తి విద్యలో శిక్షణ ఇస్తున్నారు. వీరికి పొదిలిలో జిల్లా స్థాయి పోటీలు ఏర్పాటు చేశారు. పిల్లలు తమ ఆలోచనలకు పదును పెడుతూ రూపొందించిన వివిధ నమూనాలను ప్రదర్శించారు. పది విభాగాల్లో ప్రతిభ చాటిన పదహారు మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు జీసీడీవో హేమలత తెలిపారు. దర్శి, వెలిగండ్ల, కారుమూడివారిపాలెం (మద్దిపాడు), ఉప్పలపాడు (పొదిలి), ముండ్లపాడు (గిద్దలూరు), దేవరపాలెం (చీమకుర్తి), మర్లపాడు (టంగుటూరు) పాఠశాలలు; కె.బిట్రగుంట, వెలిగండ్ల, పుల్లలచెరువు కేజీబీవీ విద్యార్థులు వీరిలో ఉన్నారు.

(c) eenadu

అదుపు తప్పిన బౌలర్లు.. బౌండరీలు దాటిన బంతులు!

క్రీడాకారులకు గెలుపోటములు సహజమని, ఈనాడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇలాంటి పోటీలను ఉపయోగించుకోవాలని శ్రీహర్షిణి విద్యా సంస్థల అధినేత గొరంట్ల రవికుమార్ క్రీడాకారులకు సూచించారు. ఆదివారం సంతనూతలపాడులోని ట్రిపుల్ ఐటీ కళాశాల మైదానంలో జరుగుతున్న ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్(ఈఎస్ఎల్)-2025 పోటీలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. క్రీడా స్ఫూర్తితో మెలగాలని సూచించారు. ముందుగా ఆటగాళ్లను పరిచయం చేసుకుని టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్(వల్లూరు), పేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్(వల్లూరు), ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల(ఒంగోలు) జట్లు గెలుపొందాయి.

- న్యూస్‌టుడే, సంతనూతలపాడు

Medical Partner: వెంకటరమణ

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శ్రీహర్షిణి విద్యాసంస్థల అధినేత గొరంట్ల రవికుమార్

Title Sponsor: Dhanik Bharat Educational Institutions – The Lloyd Group Initiative
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (NECC)
Beverage Partner: CMR Shopping Mall
Gift Partner: KL University
Regional Sponsor: City Chalapathi Institute of Technology, Autonomous, Mothadaka Campus
District Sponsor: QIS Educational Institutions, Ongole
Digital Partner: ఈనాడు.net
TV Partner: ETV
Organised by: ఈనాడు

భారీ ఆధిక్యంతో విజయం..

తొలి మ్యాచ్‌లో రైజ్ కృష్ణసాయి ప్రకాశం (గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్(వల్లూరు) జట్టు క్రీడాకారులు పరుగుల వరద పారించి 83 పరుగుల భారీ తేడాతో విజయకేతనం ఎగురవేసింది. జి.ఆర్.కె డిగ్రీ కళాశాల జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన రైజ్ క్రీడాకారుడు విష్ణు 26 బంతుల్లో 42 పరుగులు, శ్రీకాంత్ 7 బంతుల్లో 16 పరుగులు, రాధాకృష్ణ 8 బంతుల్లో 15 పరుగులు రాబట్టారు.. 10 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 125 పరుగులు చేశారు. బౌలింగ్‌లో సూర్యప్రకాష్ 2 వికెట్లు తీసుకున్నాడు. జి.ఆర్.కె డిగ్రీ కళాశాల జట్టు 10 మందితో బ్యాటింగ్‌కు దిగి 8.5 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 42 పరుగులు మాత్రమే చేసింది. బౌలింగ్‌లో దినేష్, ఎస్.ఎస్.శ్రీనివాస్ తలో 3 వికెట్లు తీశారు. ఎస్.విష్ణు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

గెలుపొందిన రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్(వల్లూరు)జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా

ఎస్.విష్ణు

నిరాశపర్చిన టాప్ ఆర్డర్..

రెండో మ్యాచ్‌లో పేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్(వల్లూరు) జట్టు నాగార్జున రెడ్డి(క్యూ) అండ్ సైన్స్ కళాశాల(ఒంగోలు) జట్టుపై 11 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత నాగార్జున కళాశాల జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన పేస్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేసింది. బ్రహ్మతేజ 17 బంతుల్లో 23, ఇబ్రహీం 22 బంతుల్లో 19, ఎన్.అఖిల్ 7 బంతుల్లో 13 పరుగులు చేశారు. బౌలింగ్‌లో సందీప్, మహేష్‌లు చెరో 2 వికెట్లు తీశారు. వెంటనే బ్యాటింగ్‌కు దిగిన నాగార్జున కళాశాల జట్టు 10 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 73 పరుగులు చేసింది. ఆనంద్ 13 బంతుల్లో 12, శ్రీకాంత్ 6 బంతుల్లో 11 పరుగులు చేశారు. ఎన్.అఖిల్ 2 ఓవర్లకు 6 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీశాడు. 2 వికెట్లు తీసి 13 పరుగులు చేసిన ఎన్.అఖిల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు.

విజయానందంలో పేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్(వల్లూరు) జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా

ఎన్.అఖిల్

బౌలింగ్‌తో కట్టడి చేసి..

ఎస్.ఎస్.ఎన్ డిగ్రీ కళాశాల జట్టు బౌలింగ్, బ్యాటింగ్‌లోనూ రాణించి రైజ్ కృష్ణసాయి గాంధీ (గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్) జట్టుపై 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచిన ఎస్.ఎస్.ఎన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన రైజ్ జట్టు 10 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 54 పరుగులు మాత్రమే చేసింది. సుదర్శన్ 15 బంతుల్లో 23, రాజేష్ 14 బంతుల్లో 10 పరుగులు చేశారు. ఎస్.ఎస్.ఎన్ క్రీడాకారులు బాల్‌తోను, ఫీల్డింగ్‌లోను చెలరేగి ప్రత్యర్థి రైజ్ జట్టును కట్టడి చేశారు. కేవలం 4 అదనపు పరుగులు ఇచ్చి 4 రనౌట్‌లను చేశారు. బ్యాటింగ్‌కు దిగిన ఎస్.ఎస్.ఎన్ జట్టు 4.5 ఓవర్లకు 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 56 పరుగులు చేసి విజయం సాధించింది. సుధాకర్ 8 బంతుల్లో 13, రాజేష్ 8 బంతుల్లో 15, మహేష్ 7 బంతుల్లో 14 పరుగులు చేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా సుధాకర్ నిలిచాడు.

ఎస్.ఎస్.ఎన్ డిగ్రీ కళాశాల(ఒంగోలు)జట్టు విజయకేతనం

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా

సుధాకర్

రేపటి మ్యాచ్‌లు (30.12.2025) ఉదయం 9 గంటలకు..పేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్(వల్లూరు) V/s ఎస్.ఎస్.ఎన్ డిగ్రీ కళాశాల(ఒంగోలు), 11 గంటలకు జూనియర్స్ విభాగంలో పేస్ పాలిటెక్నిక్ జూనియర్ కళాశాల V/s ఆంధ్రకేసరి విద్యాకేంద్రం జూనియర్ కళాశాల(ఒంగోలు) మధ్యాహ్నం ఒంటి గంటకు చాణిక్య జూనియర్ కళాశాల(కొండపి) V/s విన్నర్ ఆఫ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల(కొండపి) V/s గౌతమి జూనియర్ కళాశాల(యర్రగొండపాలెం) జట్లు తలపడనున్నాయి.

పిల్లలతో చాకిరీ చేయిస్తే ఎంతటివారైనా శిక్షార్హులే..

తర్లుపాడు, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో పిల్లలతో వెట్టిచాకిరి చేయిస్తే ఎంతటి వారైనా శిక్షార్హులేనని జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు అదనపు సమన్వయకర్త అనిల్ కుమార్ హెచ్చరించారు. తర్లుపాడు మండలంలోని కలుజువ్వలపాడు కస్తూర్బా పాఠశాలలో బాలికలతో చపాతీలు చేయిస్తున్నట్లు కథనాలు రావడంతో స్పందించిన జిల్లా అధికారులు ఆదివారం క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించిన అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఎంతటి సమస్య అయినా నేరుగా తనకు ఫోన్ చేయాలని లేదా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్సులో ఉత్తరం వేస్తే ప్రతి వారం నేనే స్వయంగా వచ్చి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన జీసీడీవో హేమలత, ఎంఈవో సుబ్బారావులతో కలిసి మీడియాతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదుతోపాటు పత్రికల్లో వచ్చిన కథనానికి స్పందించి కలుజువ్వలపాడు కేజీబీవీ పాఠశాలను సందర్శించినట్టు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం విద్యార్థినులతో మమేకమై వారు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు సిబ్బంది పెడుతున్న ఇబ్బందులను, మౌలిక వసతులను సవివరంగా పరిశీలించి రిపోర్టు తయారు చేస్తామన్నారు.

అధిక లోడు వాహనాలపై చర్యలు తప్పవు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో లారీలు, టిప్పర్లు, ట్రాలీలు నిబంధనలకు విరుద్ధంగా అధికలోడుతో నడిపితే సహించేది లేదనీ, చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని ఉపరవాణా కమిషనర్ సుశీల, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ హెచ్చరించారు. ఒంగోలులోని డీటీసీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. చీమకుర్తి, రామతీర్థం, మర్రిచెట్లపాలెం ప్రాంతాల నుంచి భారీ లోడ్లతో ప్రయాణిస్తున్న గ్రానైట్, కంకర లారీలతో రహదారులు దెబ్బతింటున్నాయన్నారు. ఆయా వాహనాలకు నిర్దేశించిన లోడుతో మాత్రమే ప్రయాణాలు సాగించాలని స్పష్టం చేశారు. కంకరలోడుతో వెళ్తున్న వాహనాలకు తప్పనిసరిగా పట్టకప్పి తరలించాలని సూచించారు. నిబంధనలు పాటించని ట్రాన్స్‌పోర్టర్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో గనులశాఖ టెక్నికల్ అసిస్టెంట్ సురేష్‌బాబు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌ప్రభాకర్, రామచంద్రరావు, సురేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్లలో తెలుగు శాసనం లభ్యం

కొనకనమిట్ల, న్యూస్‌టుడే: కొనకనమిట్ల మండలంలోని వెలిగండ్లలో తెలుగు శాసనం బయటపడింది. గ్రామానికి చెందిన నర్సయ్య పొలంలో రాతిపై ఉన్న అక్షరాలను గుర్తించి దానిని ఫొటో తీసి పురావస్తు నిపుణులు శ్రీనివాస ప్రసాద్ బృందానికి పంపించారు. వారు వెలిగండ్ల గ్రామం వచ్చి పరిశీలించారు. దానిపై 13వ శతాబ్దపు తెలుగు లిపి ఉంది. క్రీశ 1229 నాటి కాలానికి చెందివని వివరించారు. కాకతీయ గణపతిదేవ మహారాజుల వద్ద సామంతునిగా పనిచేసిన సిద్దదేవ మహారాజులు దానం ఇచ్చినట్లు ఉందన్నారు.

తెలుగు శాసనం వద్ద పురావస్తు నిపుణుల బృందం



యువతకు ఉపాధి.. రైతులకు లాభాలే లక్ష్యం

మేదరమెట్ల, న్యూస్‌టుడే: యువతకు ఉపాధి.. రైతులకు లాభాలు అందించడమే లక్ష్యంగా శర్వాణి బయో ఫ్యూయల్స్ పరిశ్రమను స్థాపించినట్లు ఆ ఫ్యాక్టరీ ఎండీ పి.గోపాల్‌రెడ్డి అన్నారు. కొరిశపాడు మండలం తమ్మవరంలో ఏర్పాటు చేసిన ఇథనాల్ పరిశ్రమను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజుకు రెండు లక్షల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యంతో రూ.297 కోట్లతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ ద్వారా 400 మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా రైతుల నుంచే పంట కొనుగోలు చేస్తామని వెల్లడించారు. విశ్రాంత ఐఏఎస్ కె.ప్రభాకర్‌రెడ్డి, కెనరా బ్యాంక్ ఏజీఎంలు ఆనంద్, అనుపమ, ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ సోమనాథ్ చౌదరి, జయదీప్, ఏజీఎం మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ ప్రారంభోత్సవంలో ఎండీ గోపాల్‌రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ ప్రభాకర్‌రెడ్డి

వైకాపా ప్రభుత్వంలో ఉద్యోగులకు తీవ్ర నష్టం

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఫిబ్రవరి 5న నిర్వహించనున్న ఏపీ జేఏసీ అమరావతి ఆవిర్భావ మహాజన సభను జయప్రదం చేయాలని రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఆదివారం ఏపీజేఏసీ అమరావతి జిల్లా సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత వైకాపా ప్రభుత్వంలో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగుల సమస్యలను పలు సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీర్ఘకాలంగా రావాల్సిన ఐఆర్, పీఆర్సీ, డీఏ తదితర ఆర్థిక పరమైన సమస్యలను తీర్చే విధంగా ప్రభుత్వానికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో ఏపీజేఏసీ అమరావతి జిల్లా ఛైర్మన్ పి.మధుసూదనరావు, నాయకులు కృష్ణమోహన్, జేపీఎస్.కుమార్, బెజవాడ రవి, వి.తిరుపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వరరావు

సిమెంట్, ఐరన్ వ్యాపారుల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు

జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు కలెక్టరేట్: జిల్లా సిమెంట్ అండ్ ఐరన్ వ్యాపారుల సంక్షేమ సంఘం నూతన కమిటీ కార్యవర్గాన్ని స్థానిక గుంటూరు రోడ్డులోని గోల్డెన్ వెన్యూ హాలులో ఆదివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కందుల శ్రీనివాసరావు (కనకదుర్గా ఐరన్ డిపో ఒంగోలు), ఉపాధ్యక్షుడిగా బి.వెంకట కృష్ణారెడ్డి (అద్దంకి), కార్యదర్శిగా కుంచాల శంకర్(ఒంగోలు), కోశాధికారిగా బొలినేని శ్రీనివాసరావు (ఒంగోలు), సంయుక్త కార్యదర్శిగా ఎం.రవిశంకర్‌రెడ్డి (కనిగిరి)తోపాటు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో బి.తిరుపతి స్వామి, బి.వెంకట సుబ్రహ్మణ్యం, వై.చెంచయ్య, సాయిన అంజయ్య పాల్గొన్నారు.

30న ఉద్యోగ మేళా

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక పాత రిమ్స్‌లోని కార్యాలయంలో ఈ నెల 30న ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రమాదేవి తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగి, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసినవారు అర్హులన్నారు. ఆసక్తి కలిగినవారు తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని ఆమె ఓ ప్రకటనలో కోరారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)
వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 142, రిటైల్ లైవ్ - 169, చికెన్ విత్ స్కిన్ - 245, చికెన్ స్కిన్‌లెస్- 279

ఆర్థిక బకాయిలపై రూట్ మ్యాప్ ప్రకటించాలి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక బకాయిలు చెల్లించే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం రూట్ మ్యాప్ ప్రకటించాలని యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక తితిదే కల్యాణమండపంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 12వ పీఆర్సీని వెంటనే నియమించాలని, 11వ పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయులు ఒక గంట అదనంగా పనిచేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలన్నారు. తల్లికి వందనం ప్రభుత్వ పాఠశాలలకే వర్తింప జేయాలన్నారు. పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు సమాంతరంగా అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రకాశం, మార్కాపురం జిల్లాలకు వేర్వేరుగా కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ప్రకాశం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కిలారి వెంకటేశ్వర్లు, షేక్ అబ్దుల్‌హై, మార్కాపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా షేక్ ఖాజా రహమతుల్లా, ఓవీ వీరారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు

ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్ జిల్లాశాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం స్థానిక రంగా భవన్‌లో జరిగాయి. ఉపాధ్యక్షుడు సుబ్బారాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా షేక్ నాయబ్‌రసూల్, ప్రధాన కార్యదర్శిగా బి.శేషారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సుబ్బారాయుడు, పి.హనుమంతరావు, లివీప్రసాద్, కె.తిరుమల, రమేష్‌బాబు, కార్యదర్శులుగా జె.ఆనందరావు, మల్లికార్జునరావు, సీహెచ్ శివరామకృష్ణ, పి.శేఖరరెడ్డి, జి.రామకృష్ణ, షేక్ బషీరున్నీసాలను ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా డి.శ్రీనివాసులు, కె.శ్రీనివాసరావు, నారాయణరెడ్డి, అనురాధ, రాజ్‌కుమార్, ఎ.శ్రీనివాసరావు, టి.శ్రీనివాసులు, గోపాలరెడ్డి, రామానాయుడు, మంజుల తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గంతో రాష్ట్ర సంఘం నాయకులు

పే అండ్ అకౌంట్స్ ఉద్యోగులకు అండగా ఉంటాం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: రాష్ట్రంలో పే అండ్ అకౌంట్స్ ఉద్యోగులకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ తెలిపారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ పే అండ్ అకౌంట్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సర్వీస్ రూల్స్, రేషియో ఫిక్సేషన్, పదోన్నతులు, అడిషనల్ ఛార్ట్ తదితర దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.హరనాథ్ మాట్లాడుతూ.. నూతన జిల్లాల్లో ఎన్నికలు నిర్వహించి, సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరాయకొండ రైల్వే స్టేషను సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (55) మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. ఒంగోలు జీఆర్పీ ఎస్సై మధుసూదనరావు వెల్లడించిన వివరాల ప్రకారం.. రెండో ప్లాట్‌ఫాం వద్ద నెల్లూరు వైపు వెళ్లే మార్గంలో ఓ వ్యక్తి మృతదేహం పడి ఉందన్న సమాచారం మేరకు ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, శరీరం ఛిద్రమై ఉందన్నారు. శరీరంపై పచ్చ రంగు చొక్కా, బులుగు, పచ్చ రంగు గళ్ల లుంగీ ఉన్నాయి. కుడి చేతిపై శ్రీరామ అని, ఎడమ చేతిపై పట్టపు వీరయ్య అనే పచ్చబొట్టు ఉన్నాయి. అనంతరం మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రైలులో గంజాయి చాక్లెట్లు!

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: అలప్పుజా ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలు నుంచి సింగరాయకొండ వరకు శనివారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో గంజాయి చాక్లెట్లను పోలీసులు గుర్తించారు. గంజాయి, మత్తుపదార్థాల నిర్మూలన చర్యల్లో భాగంగా మహిళా పీఎస్ ఇన్‌స్పెక్టర్ యు.సుధాకర్ నేతృత్వంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. 11.5 కేజీల గంజాయి, 37 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి తమిళనాడు రాష్ట్రం నాగపట్నం జిల్లాకు చెందిన ఆషిక్ అనే యువకుడిని అరెస్టు చేసినట్లు జీఆర్పీ డీఎస్పీ మురళీధర్, సీఐ మౌలాషరీఫ్, ఎస్సై మధుసూదన్ తెలిపారు.

లారీ ఢీకొని.. ఇద్దరికి గాయాలు

అర్ధవీడు, న్యూస్‌టుడే: లారీ, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన గన్నేపల్లి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. గన్నేపల్లి గ్రామానికి చెందిన షేక్.ఖాసిం, రసూల్ ద్విచక్ర వాహనంపై రంగాపురం వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఖాసింకు, రసూల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. ఘటనపై ఎస్సై శివనాంచారయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మరణంలోనూ వీడని స్నేహం

తాళ్లూరు, గుంటూరు రూరల్, న్యూస్‌టుడే : వారిద్దరూ ప్రాణ స్నేహితులు. పక్క పక్క ఇళ్లు కావడంతో ఎక్కడికి వెళ్లాలన్నా కలిసే బయలుదేరేవారు. మృత్యువు కూడా వారిని విడదీయలేకపోయింది. దైవ ప్రార్థనలకు వెళ్లి తిరిగొస్తూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోవడం విషాదం నింపింది. ఈ సంఘటన గుంటూరు సమీపంలోని దాసరిపాలెం వద్ద చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. నల్లపాడు పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం తూర్పు గంగవరంలోని ఎస్సీ కాలనీకి చెందిన చాట్ల అభిషేక్ (18), చాట్ల నాని (17) ప్రాణమిత్రులు. నాని గత కొంతకాలంగా స్థానికంగా ఉన్న షామియానాల దుకాణంలో పనిచేస్తుండగా, అభిషేక్ హైదరాబాద్‌లో బేల్దారి మేస్త్రిగా పని చేస్తున్నాడు. క్రిస్మస్ పండుగ కోసం అతను ఇటీవల హైదరాబాద్ నుంచి వచ్చాడు. ఇద్దరూ కలసి ఆదివారం ఒంగోలు వద్ద కల్వరి టెంపుల్‌కు వెళ్లాలని నిర్ణయించుకొని కుటుంబ సభ్యులకు చెప్పి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గం మధ్యలో మనసు మార్చుకుని గుంటూరు సమీపాన కల్వరీ టెంపుల్‌లో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం సొంతూరికి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. దాసరిపాలెం సమీపంలో వారి వాహనం అదుపు తప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చాట్ల అభిషేక్ నాని

మాతృమూర్తితో మాట్లాడిన కొద్ది క్షణాలకే..

తామిద్దరం పెదకాకాని నుంచి బయలుదేరుతున్నామని, నాలుగు గంటలకు తూర్పు గంగవరం చేరుకుంటామంటూ అభిషేక్ తన తల్లి ఝాన్సీతో చరవాణిలో మాట్లాడాడు. అనంతరం కొన్ని క్షణాలతో ఆయన మృత్యువాత పడటంతో తల్లి కన్నీరుమున్నీరయ్యారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

REAL ESTATE

FLAT FOR SALE

B.K. ఎన్‌చాంటింగ్ ఎన్‌క్లేవ్ (గేటెడ్ కమ్యూనిటీ), రాంనగర్ ఒంగోలులో 3-BHK ఫ్లాట్, 1705Sft, NE కార్నర్ అమ్మకమునకు కలదు. సంప్ర: 99499 11577

JOBS

Wanted Civil Engineers & Supervisors, 3-5 yrs Exp in Buildings & CC Road Works. @ Gokavaram (A.P). Ph No:8888838677, 9422135347.

Wanted: Administration Staff - 2, Food Products Marketing Executives - 2. Contact: 97034 02722

ఫీల్డ్ ఆఫీసర్, టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్ శ్రీరామ్/ ముత్తూట్/ మణప్పురం స్టాఫ్, HDFC/AXIS బ్యాంక్ క్లర్క్స్, లోన్ రికవరీ బాయ్స్ కావలెను. ✆ 76599 88728

కేర్‌టేకర్ ముస్లిం మహిళ కావలెను. సీనియర్ సిటిజన్‌ని చూసుకోవటానికి & సర్వీసు చేయటానికి మాత్రమే కావలెను. కందుకూరు. Ph: 9398058081

ఉద్యోగం చేస్తూనే అదనపు ఆదాయం కోసం చూస్తున్నారా? నిరుద్యోగులు, మహిళలు పార్ట్‌టైమ్ లేక ఫుల్‌టైమ్ ఖాళీ సమయాల్లో పనిచేస్తూ డబ్బు సంపాదించాలని అనుకుంటున్నారా? సంప్ర: 85003 53577.

ఒంగోలు, మంగమూరురోడ్డులోని నారాయణ పబ్లిక్ స్కూలు నందు 6 to 8th వరకు తెలుగు & కంప్యూటర్ టీచర్ కావలెను. ✆9704363262. సమతా నగర్‌లోని శ్రీ గాయత్రి గ్రామర్ స్కూలు నందు 3rd to 5th వరకు గ్రాడ్యుయేట్ లేడీ టీచర్లు కావలెను. ✆9014404155

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జ్‌స్, వార్డెన్స్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్ర. ✆ 89784 80429.

DRIVERS

బాక్స్ ఆటోకి- 2 డ్రైవర్లు కావలెను. అనుభవం, లైసెన్స్, బ్యాడ్జ్ కలిగి ఉండవలెను. ✆ 97034 02722

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మ రియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మార్కాపురం

•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

పార్టీ బలోపేతానికి సహకరించండి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పార్లమెంటు నూతన కమిటీ సభ్యులు

గిద్దలూరు పట్టణం: పార్టీ బలోపేతానికి సహకరించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కోరారు. ఇటీవల పార్లమెంటు కమిటీ సభ్యులుగా ఎన్నికైన పలువురు పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్లమెంటు నూతన కమిటీ ఉపాధ్యక్షులు బిజ్జల కిషోర్, కోశాధికారి అంబవరం శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి గుర్రం దానియేలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ ఛైర్మన్లు, మూడు మండలాల పార్టీ అధ్యక్షులు, మండలాల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో వసతుల మెరుగుకు కృషి

పొదిలి, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్యశాలల్లో వసతుల మెరుగుకు కృషిచేస్తానని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పొదిలి ప్రభుత్వ వైద్యశాలను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పొదిలి ఆసుపత్రిలో కొంత వసతుల కొరత ఉందన్నారు. వైద్యఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి వసతులు మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ సయ్యద్ ఇమాంసాహెబ్, తెదేపా నాయకులు గునుపూడి భాస్కర్, ఖుద్దూస్, వెంకటేశ్వర రెడ్డి, యల్లమంద, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

◗ మార్కాపురం పట్టణం: మార్కాపురం జిల్లాతో ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మార్కాపురం జిల్లాగా ప్రకటించనున్న సందర్భంగా ఆదివారం రాత్రి పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో ఉద్యమాలు, నిరసన, దర్నాలు చేసినా ఈ ప్రాంతాన్ని విస్మరించి జిల్లా విషయంలో మొండి చేయి చూపారన్నారు. నాయకులు గఫార్, ఖాన్ పాల్గొన్నారు.

తెదేపా కుటుంబ సభ్యులకు పార్టీ అండ

ఆసుపత్రి వద్ద చిన్నారులతో మంత్రి డోలా, ఎమ్మెల్యే కందుల

పొదిలి, న్యూస్‌టుడే: మర్రిపూడి మండలం గుండ్లసముద్రం మాజీ సర్పంచి కొల్లా శ్రీరాములు కుమారుడు నాగార్జున(33) ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహాన్ని పొదిలి సామాజిక వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదివారం సీహెచ్‌సీకి వచ్చి నాగార్జున భౌతికకాయం వద్ద నివాళ్లర్పించారు. ఆపదలో ఉన్న తెదేపా కుటుంబ సభ్యులకు పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు. వెంట పొదిలి ఏఎంసీ ఛైర్మన్ ఇమాంసాహెబ్, తెదేపా నాయకులు అంజిరెడ్డి, ఖుద్దూస్ పాల్గొన్నారు.

◗ పొదిలి సీహెచ్‌సీకి వచ్చిన మంత్రి వద్దకు అక్కడే ఆడుకుంటున్న చిన్నారులు వచ్చారు. మంత్రి వారితో మాట్లాడారు. బృందచిత్రం దిగారు.

ఐక్యతతోనే భారత్‌కు విశ్వగురువు స్థానం

కంభం, న్యూస్‌టుడే: హిందువుల ఐక్యతతోనే భారత్‌కు విశ్వగురువు స్థానం వస్తుందని విజయవాడ స్వయం సేవక్ సంఘ్ సహస యోజక్ ముద్దు సాయిరామ్ అన్నారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు గుండెపూడి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో ఆదివారం హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజం పట్ల ఆత్మీయ భావనతో ఉండాలని చెప్పారు.

మాట్లాడుతున్న ముద్దు సాయిరామ్

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి ప్రాంతీయ యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం మర్రిపూడి మండల యూటీఎఫ్ సర్వ సభ్య సమావేశం జరిగింది. సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఎస్కే. మహబుబ్‌సుభాని, అధ్యక్షులుగా చిట్టెం లింగయ్య, సహాధ్యక్షులుగా పేర్ల కోటేశ్వరరావు, మహిళా సహాధ్యక్షురాలుగా ఎస్. లీలావతి, ప్రధాన కార్యదర్శిగా చేత కోటేశ్వరరావు, కోశాధికారిగా జి.ఏడుకొండలు, కుటుంబ సంక్షేమ కన్వీనర్‌గా వి. భాస్కరరావులను ఎన్నుకున్నారు.

జాతీయ మారథాన్ పోటీలకు ఎంపిక

షేక్.నాయబ్ రసూల్

కొమరోలు గ్రామీణం: ఈ నెల 24న ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-16 మారథాన్ పోటీల్లో నల్లగుంట్లకు చెందిన ఇంటర్ విద్యార్థి షేక్.నాయబ్ రసూల్ తృతీయ స్థానం సాధించాడు. జనవరి నెల 28న జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడు.

మిరపకు తెగులు.. రైతన్నకు దిగులు

☛ పంట రక్షణకు అధికారుల పర్యటనలు, సూచనలు అవసరం

న్యూస్‌టుడే, మార్కాపురం పట్టణం

ముడతతో కాపులేకుండా పోయిన మిరప పంట

పశ్చిమ ప్రకాశంలో మిరప రైతులకు కష్టాలు తప్పడంలేదు. ఎంతో ఆశతో మిరప సాగు చేపడితే తెగుళ్ల బెడద నిద్ర పోనివ్వడంలేదు. నవంబర్ వరకు కురిసిన వర్షాలతో ఆనందంగా ఉన్న రైతులు ఆ తరువాత వచ్చిన తెగుళ్లతో దిగాలు పడాల్సి వస్తోంది. దాదాపు నెల రోజులుగా ముడుత, ఎదుగుదల లోపంతో మిర్చి పంట పూర్తిగా దెబ్బతింటోంది. అధికారులు సరైన సూచనలు ఇవ్వక పోవడం మరిన్ని కష్టాలకు గురి చేస్తోంది.

సబ్ డివిజన్ పరిధిలో 3,777 ఎకరాలు

మార్కాపురం ఉద్యాన శాఖ సబ్ డివిజన్ పరిధిలోని మార్కాపురం, కొనకనమిట్ల, దొనకొండ, తర్లుపాడు మండలాల పరిధిలో ఈ ఏడాది 3,777 ఎకరాలు రైతులు మిర్చి పంటను సాగు చేసినట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కొన్నిచోట్ల సర్వే చేయాల్సి ఉంది.

గిద్దలూరులో కేవలం 1,500 ఎకరాలే..

గిద్దలూరు పట్టణం: గిద్దలూరు డివిజన్ పరిధిలో ఖరీఫ్, రబీ సీజన్లలో సహజంగా 6,000 ఎకరాల్లో మిరప సాగు చేపడతారు. ఈసారి కేవలం 1,500 ఎకరాలకే పరిమితమైంది. పంటకు కాయకుళ్లు, నల్లి, ఎండుకొమ్మ తెగుళ్లతోపాటు, తామర పురుగు, తెల్ల, పచ్చదోమ సోకి రైతన్న తీవ్రంగా నష్ట పోవాల్సి వస్తోంది.

ఉద్యాన అధికారులు స్పందించాలి

ప్రస్తుతం మిర్చి పంటలో నల్లి, ముడుత తెగులు ఎక్కువగా ఉంది. నెలలోనే 6సార్లు మందులు పిచికారీ చేశాను. అయినా తెగుళ్లు తగ్గడం లేదు. వీటి నివారణ చర్యలకు ఉద్యానశాఖ అధికారులు స్పందించి ప్రతి గ్రామంలో పర్యటించి సూచనలు ఇవ్వాలి.

– ఆర్.శ్రీనివాసులు, రైతు, సీతానాగులవరం, తర్లుపాడు

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

మిర్చి తెగుళ్లపై మండలాల్లో పర్యటించి రైతులకు సూచనలు అందజేస్తున్నాం. సలహాల కోసం రైతు సేవా కేంద్రాల్లోని ఉద్యానశాఖ అసిస్టెంట్‌ను సంప్రదించవచ్చు. ముఖ్యంగా తెల్లదోమతోనే ముడుత వస్తుంది. ఈ దోమను అరికట్టేందుకు జిగురు అట్టలు పంటలో పెట్టుకోవాలని చెబుతున్నాం.

– డి.రమేష్, ఉద్యానశాఖ అధికారి, మార్కాపురం

గోడ పత్రాలను ఆవిష్కరిస్తున్న పట్టణ ఎస్సై సైదుబాబు, సంస్థ ప్రతినిధులు

మత్తు పదార్థాలకు బానిస కావద్దు

మార్కాపురం, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని మార్కాపురం పట్టణ ఎస్సై ఎం.సైదుబాబు అన్నారు. ఆదివారం ఐడియల్ యూత్ మూమెంట్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వ్యతిరేక ఉద్యమంలో భాగంగా ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు యువత పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో రియా వైద్యశాల డాక్టర్ దస్తగిరి, జమాతె జిల్లా అధ్యక్షుడు అశ్రఫ్‌అలీ, ఐడియల్ యూత్ మూమెంట్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఇస్మాయిల్, నాయకులు సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం వాసికి సెల్యూట్ అచీవర్స్ అవార్డ్

మార్కాపురం పట్టణం: మార్కాపురం పట్టణానికి చెందిన ఎస్‌కె.మహబూబ్‌వలీకి దిల్లీకి చెందిన సెల్యూట్ హానరబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎచీవర్స్ అవార్డు లభించింది. సమాజ మార్పు కోసం ఈయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు వరించింది. ఫౌండేషన్ ఈనెల 27వ తేదీన దిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును పద్మశ్రీ గ్రహీత, హనీబీ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన డాక్టర్ రామ్ చందర్‌సింగ్, మిస్ ఇండియా గ్లోబల్ దీప్తితోరియా తదితరులు అవార్డును అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

కుటుంబ వ్యవస్థలో సనాతన ధర్మం గొప్పది

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: భారతీయ సనాతన ధర్మంలో కుటుంబ వ్యవస్థ ఎంతో గొప్పదని శ్రీశైలం దత్తసాయి మౌన ఆశ్రమ పీఠాధిపతి శ్రీశైల శివ స్వామి అన్నారు. మండలంలోని పి.అన్నసముద్రంలో ఆదివారం జరిగిన హిందూ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ప్రపంచ దేశాలకు మన కుటుంబ వ్యవస్థ మార్గదర్శనంగా నిలిచిందన్నారు. ఆర్ఎస్ఎస్ నెల్లూరు జిల్లా రీజనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్.నవీన్ మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మం ద్వారా శాంతి లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో యువత ఆధ్వర్యంలో ర్యాలీ చేసి కోలాటం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్.శ్రీనివాసరావు, ముని కుమారి, విశ్వంజీ, రామ్‌చరణ్, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం : 8008574135
యర్రగొండపాలెం : 8008552658

?: మైదుకూరు-తాటిచెర్ల రాష్ట్రీయ రహదారి మార్గంలోని పామూరిపల్లె వద్ద ఉన్న కల్వర్టు గోడ పూర్తిగా పడిపోయింది. దాంతో రాత్రి వేళ వేగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పి కల్వర్టు లోపలకు పడే అవకాశం ఉంది. గోడ నిర్మాణం త్వరగతిన చేపట్టి ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలి.

పాండురంగా రెడ్డి, వాహనదారుడు.

✓: కల్వర్టు గోడ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. సుధాకర్, ఏఈ, ఆర్అండ్‌బీ.

?: పట్టణంలోని ప్రెస్‌క్లబ్ వద్ద సైడు కాలువ వ్యర్థాలతో పేరుకుపోయి అధ్వానంగా తయారైంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. సమస్యను పరిష్కరించాలి. –జె.శ్రీనివాసులు, పట్టణవాసి

✓: సమస్య మా దృష్టికి రాలేదు. వెంటనే అక్కడకు పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి కాలువను శుభ్రం చేయిస్తాం. డీవీఎస్.నారాయణరావు, మున్సిపల్ కమిషనర్

?: ఇందిరానగర్‌లో కొన్ని చోట్ల సాగర్ పైపులు లీకులై, మరి కొన్ని చోట్ల కుళాయిలు పాడైయి పోయి నీరంతా వృథాగా పోతుంది.

ప్రసాద్, స్థానికుడు

✓: లీకులు అయిన పైపులకు మరమ్మతులు చేయిస్తాం. పాడైపోయిన కుళాయిల దగ్గర కొత్త కుళాయిలు ఏర్పాటుచేస్తాం.

జెడ్సన్‌పాల్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

?: మండలంలోని తురిమెళ్ల గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలను పూడ్చి రహదారిని బాగు చేయించాలి.

– శ్రీనివాసులు, వాహనదారుడు

✓: తురిమెళ్ల వద్ద ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్పించేందుకు చర్యలు తీసుకుంటాం. – పాపారావు, రహదారులు భవనాల శాఖ జేఈ, కంభం

?: గ్రామంలోని వ్యర్థాలను మొత్తం మా నివాసాల సమీపంలో వేస్తున్నారు. దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సమస్యను పరిష్కరించాలి. – పి.రాజయ్య, సుంకేసుల.

✓: వ్యర్థాలను తొలగించి, స్థానికులకు అవగాహన కల్పిస్తాం.

– గుడ్డెపోగు రమేష్, సర్పంచి

కొమరోలు గ్రామీణం, మార్కాపురం పట్టణం, యర్రగొండపాలెం పట్టణం, కంభం, పెద్దారవీడు, న్యూస్‌టుడే

కోతులు బాబోయ్.. కోతులు

అడవుల్లో ఉండాల్సిన కోతులు ఆహారం కోసం జనావాసాల్లోకి రావడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కొనకనమిట్ల మండల పరిధిలోని గ్రామాల్లో ఇళ్ల గోడలపై సేద తీరుతున్నాయి. గృహాల్లోకి చొరబడి చిన్న చిన్న వస్తువులను తీసుకెళ్తున్నాయి. వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ చిన్నారులు, వృద్ధుల వెంట పడుతున్నాయి. గాయాలపాలు చేస్తున్నాయి. ఒంటరిగా ప్రయాణించే వారి చేతుల్లోని సంచులను లాక్కుని పరుగులు తీస్తున్నాయి. వానరాల చేష్టలతో మండలంలోని వింజవర్తిపాడు, గార్లదిన్నె, కొనకనమిట్ల, చినారికట్ల, సలనూతల, నాగిరెడ్డిపల్లె గ్రామాల వాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

కొనకనమిట్ల, న్యూస్‌టుడే

పేరుకే కాలనీ.. రోడ్లూ కరవే..

వై.పాలెంలోని జగనన్న కాలనీలో కనీసం రోడ్డు సౌకర్యమూ సక్రమంగా లేక నివాసితులకు కష్టాలు తప్పడం లేదు. గతంలో వేసిన రోడ్లు వర్షాలకు కోసుకుపోయి గుంతలుగా ఏర్పడ్డాయి. కాలనీ ముఖ ద్వారం రహదారి నుంచి అన్ని రోడ్లు గుంతలు గా మారడంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గతంలో తూతూ మంత్రంగా మట్టి రోడ్లు వేసి చేతులు దులిపేసుకున్నారు. వర్షాలకు మట్టింతా కొట్టుకు పోయి గుంతలు పడి రాకపోకలు ఇబ్బందిగా ఉంటోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లు బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే

సచివాలయం.. నిరుపయోగ శౌచాలయం

చినమనగుండం, గార్లదిన్నె, పెదారికట్ల, గరిమినపెంట తదితర సచివాలయాల ఆవరణలో ఉద్యోగులు, అక్కడికి వచ్చే ప్రజల కోసం స్వచ్ఛ భారత్ మిషన్ కింద రూ.3లక్షల చొప్పున కేటాయించి శౌచాలయాలు ఏర్పాటు చేశారు. అప్పట్లో హడావుడిగా నిర్మాణాలు పూర్తి చేసినా ఇంత వరకు వినియోగంలోకి తీసుకురాలేదు. ప్రస్తుతం చాలా వరకు తాళం వేసి కనిపిస్తున్నాయి. కార్యాలయ మహిళా సిబ్బంది, అక్కడకు వచ్చే ప్రజలు శౌచాలయం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఎండీవో ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

కొనకనమిట్ల, న్యూస్‌టుడే

ముద్దసానమ్మకు పూజా వైభవం

ఆధ్యాత్మికం

మార్కాపురం గ్రామీణం: మండలంలోని కోలభీమునిపాడు గ్రామశివారులో వెలసిన ముద్దసానమ్మతల్లి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు విశేష పుష్పాలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

రూ.1.24లక్షల వెండి చెంబు బహూకరణ

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ అమ్మవారికి రూ.1.24 లక్షల విలువ చేసే వెండి చెంబును హైదరాబాద్‌కు చెందిన నూకల మురళీకృష్ణ, సుజాత దంపతులు ఆదివారం ఆలయానికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డికి అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం వీరికి పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షులు డి.పవనకుమార్‌శర్మ, వెంకటేశ్వర్లు, వి.శ్రీధర్‌రెడ్డి, శివరంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

◗ మార్కాపురం పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పూలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు.

సత్యమాంబదేవికి కుంకుమార్చనలు

కంభం, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని కోటా సత్యమాంబదేవికి ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని పసుపు, చందనం, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మ నామస్మరణతో ఆ ప్రాంతం మారుమోగింది.

జాతీయ సేవతో ప్రజలకు ఎంతో మేలు

ప్రచారంలో ప్రిన్సిపల్ సోని, విద్యార్థులు

కంభం, న్యూస్‌టుడే: ఎన్ఎస్ఎస్ సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జి.సోని అన్నారు. జాతీయ సేవా పథకంలో భాగంగా మండలంలోని పెద్దనల్లకాలువ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపు ఆదివారం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వారం రోజుల పాటు నిర్వహించిన సేవా కార్యక్రమాలతో గ్రామస్థులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ప్రోగ్రాం అధికారి శ్రీనివాసులు, అధ్యాపకుడు పూర్ణచంద్రుడు, సిబ్బంది రమణ యాదవ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం..

కొమరోలు గ్రామీణం: కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన 1988-93 సంవత్సరాల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా ఆ విద్యార్థులంతా కలుసుకుని తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వీరందరికీ విద్యా బుద్ధులు చెప్పిన దప్పిలి బలరామి రెడ్డి, నారాయణ మాస్టార్లను ఘనంగా శాలువ, పూలమాలలతో సన్మానించి జ్ఞాపికను అందించారు. వారి ఆశీర్వాదం పొందారు. అనంతరం అప్పటి తరగతి గదుల్లో చేసిన చిలిపి పనులు, ఉపాధ్యాయుల దండింపులను ఈ సందర్భంగా నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరికీ జ్ఞాపికలను అందించారు.

కష్టించే వారికి గుర్తింపు తథ్యం

రాచర్ల, న్యూస్‌టుడే : కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు లభిస్తుందని ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కుప్పా రంగనాయకులు అన్నారు. మండలంలోని ఆకవీడు జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన బెల్లంకొండ రాధ కృష్ణమూర్తి సన్మాన సభ ఆదివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయుడిగా సేవలను పలువురు కొనియాడారు. పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తురిమెళ్ల మాజీ సర్పంచి నారిశెట్టి వీరమ్మ పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి

బేస్తవారపేట: బేస్తవారపేటకు చెందిన ముప్పూరి రాము జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం సంఘ రాష్ట్ర అధ్యక్షులు నీలూరి రుషింగప్ప నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ చేనేత కార్మికుల, సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. వారికి రావాల్సిన హక్కుల సాధనకు అండగా ఉంటానన్నారు.

ఉచిత వైద్యశిబిరం

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: స్థానిక రంగ మల్టీ స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో నరసరావుపేటకు చెందిన శ్రేయ వైద్యశాల, (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్)ఐవీఎఫ్ ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. వైద్యురాలు వసంత 150 మంది రోగులను పరీక్షించారు. మహిళలకు స్కానింగ్, పురుషులకు వీర్యకణాల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కాశీరావు, వైద్యసిబ్బంది, పాల్గొన్నారు.

పొదిలి-దర్శి మార్గంలో తోళ్లమడుగు వద్ద దెబ్బతిన్న రహదారి

పట్టణంలో మార్కాపురం అడ్డరోడ్డు సమీపంలో కంకరలేచిన తారురోడ్డు

మరమ్మతులకు నోచుకోని రహదారులు

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి పట్టణంలోని ఒంగోలు - కర్నూలు ప్రధాన రహదారి పలుచోట్ల గుంతలు పడి ప్రమాదకరంగా తయారయ్యింది. రహదారిపై గుంతలు పడ్డాయి. కంకర లేచి ప్రమాదకరంగా మారింది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గం మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పొదిలి-దర్శి మార్గంలోను తోళ్లమడుగు వద్ద రహదారి కూడా కంకరలేచి గుంతలమయంగా మారింది. పెద్ద ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి ప్రధాన రహదారులకు మరమ్మతులకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతిలేని కట్టడం.. క్రమబద్ధీకరణకు అవకాశం

☛ గిద్దలూరు పురపాలికకు ఎల్ఆర్ఎస్‌తో రూ.60లక్షల ఆదాయం

న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కట్టడాలు, అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకొనేందుకు అవకాశం కల్పించింది. 1985 జనవరి 1 నుంచి ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ వరకు నిర్మాణం చేపట్టిన అక్రమ కట్టడాలు, అనధికార లే అవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని పురపాలకశాఖ అధికారులు తెలియజేస్తున్నారు.

గత పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో..

గిద్దలూరు పురపాలికలో గత పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు వేశారు. ప్రధానంగా గిద్దలూరు - రాచర్ల, గిద్దలూరు - కొమరోలు, గిద్దలూరు - ఒంగోలు రహదారి, గిద్దలూరు-ముండ్లపాడు, గిద్దలూరు - నంద్యాల రహదారిలోని జగనన్న లేఅవుట్ వెనుక వైపు అనుమతి లేకుండా స్థిరాస్తి వ్యాపారులు లే అవుట్లు వేసి ప్లాట్ల విక్రయాలు చేపట్టారు. పలు భవన నిర్మాణ యజమానులు రహదారులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినప్పటికీ రాజకీయ జోక్యంతో పురపాలక అధికారులు మిన్నకుండిపోయారు.

918 అక్రమ భవనాల గుర్తింపు..

గిద్దలూరు పురపాలకంలో ఇప్పటి వరకు పురపాలక, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు 918 భవనాల యజమానులు అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించారు. ఇప్పటికే 218 మంది భవన యజమానులకు క్రమబద్ధీకరించుకోవాలని నోటీసులు అందజేశారు. అలాగే గతంలో అనధికార లేఅవుట్లను 68 గుర్తించారు. ఇప్పటి వరకు 57 లేఅవుట్లను క్రమబద్ధీకరించగా పురపాలకానికి రూ.60లక్షల మేర ఆదాయం సమకూరింది.

భవన యజమాని సంతకం తీసుకుంటున్న కమిషనర్, పురపాలక సిబ్బంది

2026 మార్చి 11 నాటికి దరఖాస్తు చేసుకోవాలి

గిద్దలూరు పురపాలకంలోని అక్రమ భవన నిర్మాణదారులు క్రమబద్ధీకరించుకోవడానికి 2026 మార్చి 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం ఉంది. ఇప్పటికే అక్రమ భవనాలను గుర్తించి యజమానులకు నోటీసులు అందించాం. ఆయా యజమానులు తప్పనిసరిగా బీపీఎస్‌కు ప్రాథమికంగా రూ.10 వేలు రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి.

– ఎం.వి.రమణబాబు, కమిషనర్, గిద్దలూరు

అసిస్టెంట్ లైన్‌మన్ మృతదేహం లభ్యం

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: మార్కాపురం మండలం చెరువు తండాకు చెందిన శివానాయక్ (35) అనే విద్యుత్తు అసిస్టెంట్ లైన్‌మన్ పుల్లల చెరువులో ఉద్యోగం చేస్తున్నాడు. అతను మార్కాపురం భగత్‌సింగ్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. పోలీసుల కథనం మేరకు ఈ నెల 24న విధులకు హాజరయ్యేందుకు తన ద్విచక్రవాహనంపై మార్కాపురం ఇంటి నుంచి పుల్లలచెరువుకు శివానాయక్ బయలు దేరాడు. అప్పటి నుంచి అతను కనిపించ లేదు. దీంతో తన సోదరుడు మంత్రునాయక్ మార్కాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆదివారం యర్రగొండపాలెంకు కొంత దూరంలో మార్కాపురం రోడ్డులోని శేషాద్రి ప్రైవేటు పాలకేంద్ర దగ్గర పైపుల కోసం తీసిన సైడు కాలువలో శివానాయక్, అతని ద్విచక్రవాహనం పడి ఉండడం పశువుల కాపరి చూశాడుజ సమాచారం తెలుసుకున్న ఎస్సై చౌడయ్య ఆ ప్రాంతానికి వెళ్లి కాలువలో పడి ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. అదృశ్యమైన శివానాయక్‌గా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గేదెలు ఢీకొని చోదకుడికి తీవ్ర గాయాలు

మార్కాపురం, న్యూస్‌టుడే: గేదెలు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు అయిన సంఘటన శనివారం రాత్రి దరిమడు- దేవరాజుగట్టు గ్రామల మధ్య చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మార్కాపురం పట్టణంలోని గొర్లగడ్డకు చెందిన షేక్ సత్తార్ తన ద్విచక్ర వాహనంపై మార్కాపురం పట్టణంలోకి రాసాగారు. ఏ-1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోకి రాగానే రహదారిపై గేదెలు అడ్డురావడంతో వాటిని ఢీ కొట్టి కిందపడి పోయినట్లు చెప్పారు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గుర్తించి మార్కాపురం సర్వజన వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

(c) eenadu

కనిగిరి

• కనిగిరి • దర్శి • కొండపి

గణిత పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

తాళ్లూరు, న్యూస్‌టుడే : ఒంగోలు పట్టణంలో ఆదివారం విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యాన ఒంగోలు జోనల్‌స్థాయిలో నిర్వహించిన జిల్లాస్థాయి అబాకస్, వేదిక్ గణిత పోటీల్లో తూర్పుగంగవరంలోని గంగా ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. అబాకస్ పోటీల్లో పాఠశాలకు చెందిన వేమా ప్రవీణ్, కె.ప్రేమ్‌కుమార్ ప్రథమస్థానంలో నిలిచారు. ఇదే పాఠశాలకు చెందిన ఎం.వైష్ణవి వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో మొదటి బహుమతి సాధించింది. పాఠశాల ఆవరణలో ఆదివారం కరస్పాండెంట్ ఆర్.లక్ష్మీనారాయణ, కార్యదర్శి సీహెచ్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది వారిని అభినందించారు.

ఖోఖో క్రీడాకారిణులు సత్తా చాటాలి

కనిగిరి, న్యూస్‌టుడే: జిల్లా ఖోఖో మహిళా జట్టు సభ్యులందరు కనిగిరి క్రీడాకారిణులే కావడం అభినందనీయమని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. ఈనెల 24 నుంచి 26 వరకు గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి మహిళా ఖోఖో జట్టు ఫైనల్స్‌లో ఆతిథ్య కృష్ణా జట్టుపై విజయం సాధించి విజేతగా నిలవడంపై వారిని అభినందించారు. వారు జాతీయస్థాయిలో మరింత సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యేను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కోచ్, వెలిగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ కాశీవిశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో విజేత జట్టుతో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

జేసీబీతో చెత్త తొలగింపు

పాత చెరువు పరిసరాలు శుభ్రం

పామూరు: ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పాత చెరువు వద్ద స్థానికులు వ్యర్థాలు తెచ్చి పారబోస్తుండడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో ఈ నెల 27న 'వ్యర్థాలు పేరుకుపోయాయ్' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి అరవింద రెడ్డి స్పందించి రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను జేసీబీతో తొలగింపజేయించారు.

అదుపు తప్పితే జలసమాధి

❖ ప్రమాదకరంగా సాగర్ వంతెనలు

రెడ్డిసాగరు వద్ద దెబ్బతిన్న రెయిలింగ్

న్యూస్‌టుడే, తాళ్లూరు :

నాగార్జునసాగరు ప్రాజెక్టు పరిధిలోని ప్రధాన, చిన్న కాలువలపై వంతెనలు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. ఏ మాత్రం అదుపుతప్పినా చోదకులు జలసమాధి అయ్యే ముప్పు పొంచి ఉంది. ఈ వారధులు దశాబ్దాల కాలం క్రితం నిర్మించినవి కావడం గమనార్హం. ఏళ్లు గడుస్తున్నా కనీసం మరమ్మతుల ఊసే లేదు.

దర్శి-కురిచేడు ప్రధాన రహదారిలో ఓబీసీ ప్రధాన కాలువపై వంతెన రక్షణ గోడల రెయిలింగ్ దెబ్బతిని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దర్శి-పొదిలి ప్రధాన రహదారిలో దర్శి శివారున ఓబీసీ కాలువ వద్ద కూడా కాజ్‌వే అధ్వానంగా తయారైంది. గతేడాది రాత్రివేళ ఓ ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు రక్షణ గోడను ఢీకొంది. 24 గంటలూ వాహనాల రాకపోకలతో ఈ మార్గం రద్దీగా ఉంటుంది. తూర్పుగంగవరం-బొద్దికూరపాడు ప్రధాన రహదారిలో రెడ్డిసాగరు వద్ద ఓబీసీ ప్రధాన కాలువపైన బ్రిడ్జి రక్షణ గోడ రెయిలింగ్ శిథిలమైంది. వాహనాలు అదుపు తప్పితే నేరుగా కాలువలో పడిపోయే ప్రమాదముంది. తాళ్లూరు-అద్దంకి రహదారిలో కుంకుపాడు సమీపాన రజానగరం మేజరు కాలువపై కల్వర్టు పూర్తిగా కోతకు గురైంది. ఈవిషయమై దర్శి, చీమకుర్తి డివిజన్లకు చెందిన అధికారులను సంప్రదించగా త్వరలో పరిశీలించి మరమ్మతులు చేయిస్తామన్నారు.

దర్శి సమీపాన కాలువపై రక్షణ గోడ ఇలా..

ఆలయంలో భక్తుల సందడి

నారాయణస్వామికి పల్లకి సేవ

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలు నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలతో స్వామి వారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నారాయణస్వామి మూలవిరాట్టును వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. దేవస్థానంలో అర్చకులు గోపూజ చేశారు. ఆలయంలో నారాయణ స్వామికి అభిషేక పూజలు, మహానివేదన, హారతి పూజలు జరిగాయి. నారాయణస్వామి పల్లకి సేవ, రథోత్సవం నిర్వహించారు. భక్తులు ఉత్సాహంగా పల్లకీ మోసి రథాన్ని లాగారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. పూజలు, అన్నదానం వద్ద సిబ్బంది పర్యవేక్షించారు.

గుంటిగంగలో...

తాళ్లూరు: గుంటిగంగ ఆలయంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఇక్కడ ప్రఖ్యాతిగాంచిన గంగాభవాని అమ్మవారికి వేకువజామునే పూజారులు కామేశ్వరశర్మ, ప్రకాశరావు, బాలరాజు తదితరులు కలిసి అభిషేకాలు, అష్టోత్తర, సహస్ర నామార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాదిమంది భక్తులు విచ్చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తిని చాటారు. దేవాలయ పాలకవర్గ కమిటీ మాజీ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, కార్యదర్శి మల్లీశ్వరి, సొసైటీ అధ్యక్షుడు వి.సుబ్బయ్య, వర్తకసంఘ నాయకులు ఎం.ప్రసన్న, ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు : పూజలు చేస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు దంపతులు

ఒంగోలుకు తరలిన ఉపాధ్యాయులు

తాళ్లూరు, న్యూస్‌టుడే : ఏపీటీఎఫ్ సంఘం పిలుపుమేరకు తాళ్లూరు మండలం నుంచి ఉపాధ్యాయులు ఒంగోలు తరలివెళ్లారు. ఆదివారం అక్కడ జరిగిన జిల్లా నూతన కౌన్సిల్ సమావేశంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మండలశాఖ గౌరవాధ్యక్షుడు ఎస్.రవిచంద్రారెడ్డి, అధ్యక్షుడు జి.నాగరాజు, ప్రధాన కార్యదర్శి నారిపెద్ది శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్లు పోలంరెడ్డి సుబ్బారెడ్డి, పోకూరి శ్రీదేవి, ఎస్కే.బాజీవలి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న తాళ్లూరు ఏపీటీఎఫ్ సంఘ నాయకులు

చిత్తశుద్ధితో బాధ్యతల నిర్వహణ

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: యూటీఎఫ్ జిల్లా కుటుంబ సంక్షేమ డైరెక్టర్‌గా జనంగుల వెంకట్రావు ఎన్నికయ్యారు. సి.ఎస్.నాగులవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన యూటీఎఫ్‌లో చురుగ్గా పనిచేస్తున్నారు. ఒంగోలులో ఆదివారం జరిగిన యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన యూటీఎఫ్ జిల్లా కుటుంబ సంక్షేమ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానన్నారు.

యూటీఎఫ్ కురిచేడు కమిటీ ఎన్నిక

కురిచేడు, న్యూస్‌టుడే: యూటీఎఫ్ కురిచేడు మండల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా షేక్ ఖాదర్‌వలీ, అధ్యక్షుడిగా అన్నెం శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీనివాసరావు, సహ అధ్యక్షులుగా జాన్‌బాబు, హిల్డా నైటింగేల్ ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

కురిచేడును ప్రకాశంలోనే కొనసాగించాలి

కురిచేడు, న్యూస్‌టుడే: కురిచేడు మండలాన్ని ప్రకాశం జిల్లాలోనే కొనసాగించాలని తెదేపా మండల అధ్యక్షుడు నెమలయ్య అన్నారు. ఆదివారం కురిచేడులోని పార్టీ కార్యాలయంలో మండల నాయకుల సమావేశంలో మాట్లాడారు. స్థానికుల సూచనల మేరకు కురిచేడును ప్రకాశంలోనే కొనసాగించాలని మండల తెదేపా నిర్ణయం తీసుకుందన్నారు. మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కాట్రాజు నాగరాజు మాట్లాడుతూ...మార్కాపురం జిల్లాలో కురిచేడు మండలాన్ని కలిపితే సహించేది లేదని, దీనివల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. నాగరాజు, వలీ, రవి, చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ భవితవ్యంపై..: దొనకొండ: దొనకొండ మండలాన్ని మార్కాపురం జిల్లాలో కలుపుతారా, లేదా ప్రకాశం జిల్లాలో ఉంచుతారా అన్న దానిపై స్పష్టత రాలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాల దొనకొండ, కురిచేడు మండలాల పరిస్థితిపై మంత్రులతో చర్చించారు. ఈ ప్రాంతంలో ఎక్కువ ప్రభుత్వ భూములు ఉండటంతో పారిశ్రామిక అభివృద్ధికి ఊతం లభిస్తుంది. ఈ మేరకు ఆచితూచి అడుగులేస్తున్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న తెదేపా నాయకులు

కోతుల సమస్య పరిష్కరిస్తాం

❖ డీపీవో హామీ

తాళ్లూరు, న్యూస్‌టుడే: తూర్పుగంగవరం, సోమవరప్పాడు, గుంటిగంగల వద్ద కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలను వెంటాడి కరుస్తుండటంతో కొందరు గాయాలపాలై ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయమై ఆదివారం గుంటిగంగకు వచ్చిన డీపీవో వెంకటేశ్వరరావును కొందరు పెద్దలు, ప్రముఖులు కలిసి సమస్య తీవ్రతను వివరించారు. సమస్య త్వరితగతిన పరిష్కరించాలని వారు విన్నవించడంతో ఆయన వెంటనే స్పందించారు. సమస్యపై విచారించి వీలైనంత త్వరలోనే వాటిని పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలే విధంగా చూస్తామన్నారు. కార్యదర్శి మల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఏకాదశి ప్రత్యేక పూజలు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈ నెల 30వ తేదీ నుంచి జనవరి ఒకటో తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ప్రత్యేక ఉప కలెక్టర్, వ్యవస్థాపక ధర్మకర్త పిడుగు బాబూరావు తెలిపారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

ఉపాధ్యాయులది కీలకపాత్ర

టంగుటూరు, న్యూస్‌టుడే: తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలవీరాంజనేయ స్వామి తూర్పునాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, విద్యా రంగ అభివృద్ధికి తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మన్నం శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చెరుకూరి పూర్ణచంద్రరావు, జిల్లా అధ్యక్షులు అబ్రిబోయిన రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి యనమల ఆంజనేయులు, బొట్లగుంట పూర్ణచంద్రరావు, రేహమాన్, మండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

మర్రిపూడి: తంగెళ్ల గ్రామానికి చెందిన జడ రాజేష్, మాతంగి రాఖీ అనే యువకులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మంత్రి బాలవీరాంజనేయ స్వామి ఆదివారం వారి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు బాధితులు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు మాతంగి అచ్చమ్మ, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల నగదు విడుదల

తాళ్లూరు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకం ద్వారా లబ్ధిదారులకు అందించేందుకు రూ. 2.69 కోట్ల నగదు విడుదలైందని ఎంపీడీవో అజిత తెలిపారు. మండలంలోని పదహారు గ్రామ పంచాయతీల్లో 6,149 మందికి ఆ నగదును ఈ నెల 31 తేదీనే పంపిణీ చేస్తామన్నారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశామని, కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు ఆరోజు ఉదయం నుంచే పంపిణీ చేయాలన్నారు.

వైకాపా నాయకులు తెదేపాలో చేరిక

హనుమంతునిపాడు. న్యూస్‌టుడే: మండలంలోని దాసరిపల్లి గ్రామానికి చెందిన వైకాపా నాయకులు కార్యకర్తలు తెదేపాలో చేరారు. ఆదివారం మండల తెదేపా అధ్యక్షుడు ఎస్.తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో కనిగిరిలోని అమరావతి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో పెండెం వెంకయ్య, ఉస్తేల కొండయ్య, రాయుడు తదితరులు పార్టీ తీర్థం తీసుకున్నారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అభివృద్ధే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేయాలని హితవు పలికారు.

కార్యకర్తలకు ప్రశంసాపత్రాల అందజేత

హనుమంతునిపాడు: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో చురుగ్గా బాధ్యతలు నిర్వర్తించిన కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ మేరకు మంత్రి లోకేశ్ పంపించిన ప్రశంసాపత్రం, జ్ఞాపికను కార్యకర్తలు గాయం కృష్ణారెడ్డి, గాయం తిరుపతిరెడ్డి, వెలనాటి బలరామ్‌లకు ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, మండల తెదేపా అధ్యక్షులు తిరుపతిరెడ్డి అందజేశారు.

మృతదేహం లభ్యం

యర్రగొండపాలెం పట్టణం: మార్కాపురం మండలం చెరువు తండాకు చెందిన శివానాయక్ (35) అనే విద్యుత్తు అసిస్టెంట్ లైన్‌మన్ పుల్లలచెరువులో ఉద్యోగం చేస్తున్నాడు. అతను మార్కాపురం భగత్‌సింగ్ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. పోలీసుల కథనం మేరకు ఈ నెల 24న విధులకు హాజరయ్యేందుకు తన ద్విచక్రవాహనంపై మార్కాపురంలోని ఇంటి నుంచి పుల్లలచెరువుకు శివానాయక్ బయలు దేరాడు. అప్పటి నుంచి అతను కనిపించ లేదు. దీంతో తన సోదరుడు మంత్రునాయక్ మార్కాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆదివారం యర్రగొండపాలేనికి కొంత దూరంలో మార్కాపురం రోడ్డులోని శేషాద్రి ప్రైవేటు పాలకేంద్రం దగ్గర పైపుల కోసం తీసిన సైడు కాలువలో శివానాయక్, అతని ద్విచక్రవాహనం పడి ఉండడం పశువుల కాపరి చూశాడు. ఆ మృతదేహాన్ని అదృశ్యమైన శివానాయక్‌గా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాలేరులోకి విష రసాయనాలు

బిట్రగుంట సమీపంలోని పాలేరు నదీ పరివాహక ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళ విష రసాయనాలను కుమ్మరించారు. భారీ లారీ ట్యాంకర్‌లో తీసుకొచ్చి పడేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అక్కడి మొక్కలు, చెట్లు పూర్తిగా మాడిపోయాయి. పాలేరు చెంత భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని వారంటున్నారు. బాధ్యులపై చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, జరుగుమల్లి

సింగరాయకొండలో నీరందక కలత

సింగరాయకొండలో తాగునీటి ఇక్కట్లు మొదలయ్యాయి. పంచాయతీ కుళాయిల ద్వారా వారానికో సారి నీరు అరకొరగా వస్తున్నాయి. ఇది చాలదన్నట్లు మధ్యమధ్యలో పైపులు ధ్వంసమై సరఫరా నిలిచిపోతోంది. గ్రామంలో చేతిపంపులున్నా చాలా వరకూ మరమ్మతులకు గురవ్వడంతో వాడుక నీటికీ ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్థిక స్థోమత కలిగిన వారు ట్యాంకరు రూ.700కు కొనుగోలు చేస్తున్నారు. కనీసం చేతిపంపులకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్‌ను వివరణ కోరగా..సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులతో బోర్లకు మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

ప్రమాదకర స్తంభంతో బిక్కుబిక్కు

విద్యుత్తు లైన్ ప్రమాదకరంగా ఉండటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. నాగంబొట్లపాలెం వద్ద విద్యుత్తు స్తంభం ఒరిగిపోవడంతో వారంతా బిక్కుబిక్కుమంటున్నారు. నాగంబొట్లపాలెం - అయ్యలవారిపాలెం వైపు వెళ్లే లైన్‌లో ఓ స్తంభం ఓ వైపునకు వాలిపోయి తీగలు కిందకు వేలాడుతున్నాయి. సంబంధిత అధికారులు తక్షణం విద్యుత్తు స్తంభాన్ని సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే,తాళ్లూరు

రన్‌వే నిర్మాణం నిలిపివేయించరూ !

రన్‌వే నిర్మాణం నిలుపుదల చేయించాలని మూలగుంటపాడు, కలికవాయ, కనుమళ్ల గ్రామాల రైతులు ఆదివారం మంత్రి స్వామికి విన్నవించారు. ఈ మేరకు వారు తూర్పునాయుడు పాలెంలోని మంత్రి నివాసంలో వినతిపత్రం అందజేశారు. రన్ వే నిర్మిస్తే తాము రోడ్డున పడతామన్నారు. దీనిపై ఆయన స్పందిస్తూ రైతుల సమస్యను కలెక్టర్‌కు తెలియజేస్తానన్నారు. కార్యక్రమంలో న్యాయవాది శ్రీనివాసులు, కరుణాకరరెడ్డి, నారాయణ, రామ్మూర్తి, శ్రీను పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

రేపు విశ్రాంత పోలీసు అధికారుల సమావేశం

సి.ఎస్ పురం, న్యూస్‌టుడే: ఒంగోలు పోలీసు కల్యాణ మండపంలో విశ్రాంత పోలీసు అధికారుల జిల్లా సర్వసభ్య సమావేశం ఈ నెల 30వ తేదీన ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు, విశ్రాంత సీఐ జిలకల రామమూర్తి తెలిపారు. సమావేశంలో సీనియర్ సభ్యులను ఎస్పీ సన్మానిస్తారని చెప్పారు. అధికారుల ఇబ్బందులు పరిశీలిస్తారన్నారు. ఇతర అంశాలపై చర్చిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి విశ్రాంత పోలీసు అధికారులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

శ్మశానానికి దారి ఏర్పాటు

దర్శి, న్యూస్‌టుడే: దర్శి మున్సిపాలిటీ పరిధిలోని శివరాజ్‌నగర్‌లో శ్మశానానికి వెళ్లే మార్గంలో మురుగు కాలువ ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సమస్యపై 'కన్నీటి అడుగు..కళ్లెదుటే మడుగు' శీర్షికన ఈ నెల 16న కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మున్సిపల్ అధికారులు దారిలో పైపులు ఏర్పాటు చేసి మట్టితో కప్పారు. సమస్య పరిష్కారమవ్వడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

శివరాజ్‌నగర్‌లో ఏర్పాటైన దారి

మాతృభాషతో మానసిక వికాసం

పీసీపల్లి, న్యూస్‌టుడే: మాతృభాషతో ప్రతి ఒక్కరిలో మానసిక వికాసం చేకూరుతుందని రాష్ట్ర ఆర్‌ఎస్‌ఎస్ శారీరక్ ప్రముఖ్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం రాత్రి గోపవరపువారిపల్లిలో గౌరవ అధ్యక్షుడు జి. చెన్నారెడ్డి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. మాతృభాష వల్ల భారతీయ సంస్కృతి, నాగరికతలను లోతుగా అవగాహన చేసుకునే శక్తి పెరుగుతుందన్నారు. సనాతన ధర్మం, హిందుత్వ పరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి భారతీయుడు సామాజిక సమరతను పాటిస్తూ, స్వదేశీ వస్తువుల వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామస్థులు వేసిన కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది.

కురిచేడులో..: కురిచేడు: హిందువులంతా ఒక్కటేనన్న ఐక్య భావంతో ఉండాలని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత ప్రౌఢ ప్రముఖ్ ఓలేటి సత్యనారాయణ అన్నారు. ఆదివారం కురిచేడులో నిర్వహించిన 'హిందూ సమ్మేళనం'లో పాల్గొని మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. దర్శి ఖండ కార్యవాహ్ లక్ష్మీనారాయణరెడ్డి, సిద్ధజ్ఞానాశ్రమ నిర్వాహకుడు సుద్ధ చైతన్యానంద స్వామి స్థానికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ్ చంద్రశేఖర్

కొంగొత్త పంచాయతీలు

❖ II ఏర్పాటు చేయాలని వినతులు

న్యూస్‌టుడే, తాళ్లూరు :

పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించనుంది. ఇందుకోసం వీలున్న పంచాయతీల వివరాలను పంపించాలని ఆదేశించింది. ఒకే పంచాయతీలో దూరంగా ఉండే గ్రామాలను గుర్తించి కొత్తవి ఏర్పాటుకు వీలు కల్పించాలని నిర్ణయించారు. దర్శి నియోజకవర్గ పరిధిలోని అయిదు మండలాల్లో ప్రస్తుతం 95 గ్రామ పంచాయతీలుండగా కొత్తగా మరో పదకొండు గ్రామ పంచాయతీల ఏర్పాటు కోసం మండలస్థాయి అధికారులు జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. వారు పరిశీలన చేసిన తదుపరి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. వాటికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపితే కొత్త వాటికి మార్గం సుగమం అవుతుంది.

అధికారుల సూచన మేరకు..

జనాభాతోపాటు ఓటర్లు, పోలింగు కేంద్రాల వివరాలను పరిగణనలోకి తీసుకొని పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ కోవలో మండలస్థాయిలోని మండల పరిషత్, తహసీల్దారు కార్యాలయాలకు చెందిన ఉన్నతాధికారుల సూచనల మేరకు పలువురు అధికారులు, సిబ్బంది కలిసి కొత్త పంచాయతీల ఏర్పాటుకు వీలున్న గ్రామాలను గుర్తించి ప్రతిపాదించారు. కొన్ని గ్రామాల్లో ఏకంగా గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు.

ఇవే ప్రతిపాదనలు

దర్శి మండలంలోని తిమ్మాయిపాలెం, అబ్బాయిపాలెం, తుమ్మెదలపాడు పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదించారు. కురిచేడు మండలంలో మర్లపాలెంతోపాటు కాటంవారిపల్లె మరో పంచాయతీగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపారు. కాటంవారిపల్లె, పేరంబొట్లపాలెం గ్రామాలను కురిచేడులోనే కొనసాగించాలని తీర్మానం కూడా చేసి అధికారులకు సమర్పించారు. దీంతో దీని ఏర్పాటులో సందిగ్ధత నెలకొంది. దొనకొండ మండలంలో పెదగుడిపాడు, ముండ్లమూరు మండలంలో పెదరావిపాడు, కొమ్మువరం, చింతలపూడి ప్రత్యేక గ్రామ పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదించారు. తాళ్లూరు మండలంలో సోమవరప్పాడు, దారంవారిపాలెం పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు.

రాచమార్గంలో శిథిల చప్టా

దర్శి, న్యూస్‌టుడే: దర్శి - పొదిలి ఆర్ అండ్ బి ప్రధాన మార్గంలో కాటేరు వాగు చప్టా అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇరవై సంవత్సరాల క్రితం ఏర్పాటుచేయడంతో ఇది కాస్తా శిథిలమైంది. నిత్యం ఈ రాచబాటలో వాహనాల తాకిడి ఎక్కువగా ఉండటంతో రోజురోజుకీ దెబ్బతింటోంది. ఇరువైపులా ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేవు. దీంతో వాహనాలు అదుపుతప్పితే కాలువలో పడిపోయే ప్రమాదముంది. ఎంతో కాలంగా వాగుపై చప్టా స్థానంలో వంతెన నిర్మించాలని ప్రణాళికలు వేసినా కార్యరూపం దాల్చలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు పైప్రాంతం నుంచి వచ్చిన నీటి తాకిడికి ఇది పూర్తిగా దెబ్బతింది. అధికారులు స్పందించి వంతెన నిర్మించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. దీనిపై నగర పంచాయతీ అధికారులను వివరణ కోరగా, ఇప్పటికే వంతెన నిర్మాణంపై కౌన్సిల్ సమావేశంలో చర్చించామని త్వరలో కార్యరూపం దాల్చుతుందని తెలిపారు.

పూర్తిగా దెబ్బతిన్న కాటేరు వాగు చప్టా

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
కనిగిరి : 8008574114, దర్శి: 9848 671678, కొండపి: 96424 56296
మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

(c) eenadu

ఒంగోలు
•ఒంగోలు • సంతనూతలపాడు

పది పరీక్షలపై అవగాహన

ఒంగోలు నగరం: నగరంలోని రైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సంఘం పూర్వ అధ్యక్షుడు జాలిరెడ్డి మాట్లాడుతూ.. గత ఏడాది నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులే రాష్ట్ర, జిల్లా టాపర్లుగా నిలిచారన్నారు. వందకు వంద మార్కులు సాధించడానికి అవసరమైన మెలకువలను నిపుణులతో చెప్పించడం జరిగిందన్నారు. సంఘం పట్టణ అధ్యక్షురాలు ఈవీఎస్ లక్ష్మి, సబ్జెక్టు టీచర్లు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటు

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు చదువుతోపాటు, వైద్య విషయాల్లోనూ ఆర్థిక తోడ్పాటు అందించనున్నట్లు పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దొంతు సోమయ్య తెలిపారు. పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ జిల్లా సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంజయ్యరోడ్డులోని పద్మశాలి ఆరామక్షేత్రంలో ఆదివారం ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

పాలిటెక్నిక్ కళాశాలలో క్రీడా పోటీలు

కొత్తపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని ఈతముక్కల ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 29, 30 తేదీల్లో రీజనల్ స్థాయి మహిళా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ వి. యేసుప్రసాదరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఒంగోలు గ్రామీణం: నగర పరిధిలోని కర్నూలు రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, ప్రకాశం వైద్యశాల రోడ్డు తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ పాండు రంగారావు తెలిపారు.

నేడు

రౌండ్ టేబుల్ సమావేశం

ఒంగోలు గ్రామీణం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్ట సవరణపై సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవన్‌లో సోమవారం ఉదయం 10.30 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ మాబు తెలిపారు.

ప్రసంగిస్తున్న పరిపూర్ణ సిద్ధానందస్వామి, హిందూ సమ్మేళనానికి హాజరైన నగరవాసులు

అందరూ ఐకమత్యంగా జీవించాలి

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ధర్మానికి ఎప్పుడైతే ఆపద వస్తుందో అప్పుడు పరమాత్మ ప్రత్యక్షమవుతాడని పరిపూర్ణ సిద్ధానంద స్వామి తెలిపారు. ఆదివారం సాయంత్రం హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ఆధ్వర్యంలో గాంధీ రోడ్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గడప లోపలే కులం అని, గడప దాటితే కులం మర్చిపోయి హిందువులంతా సోదరులుగా కలిసి ఉండాలని సూచించారు. హిందూ సమాజమే ఆర్ఎస్ఎస్ అని పేర్కొన్నారు. సర్వేజనా సుఖినోభవంతు అనేది ఆర్ఎస్ఎస్ నినాదమని వివరించారు. మగపిల్లలను శివాజీలుగా, ఆడపిల్లలను ఝాన్సీ లక్ష్మీబాయ్, రుద్రమదేవిలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ముందుగా హనుమాన్‌చాలీసా, భగవద్గీత పారాయణం, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వీ. సత్యనారాయణ, సురేఖ, నాగేశ్వరరావు, అధిక సంఖ్యలో హిందువులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక అన్నవరప్పాడు నాలుగో లైన్‌లోని లక్ష్మణరావు నివాసంలో ఏసీ గ్యాస్ పేలి సంభవించిన అగ్ని ప్రమాదంలో మంటలు చెలరేగి సామగ్రి దగ్ధమయ్యాయి. సమాచారం తెలుసుకున్న తెదేపా నాయకులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, నగర పార్టీ అధ్యక్షుడు బండారు మదన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం స్థానిక డీసీసీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. సైదా మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. సీనియర్ నాయకులను సత్కరించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాష్, రసూల్, ప్రసన్నరాజు తదితరులు పాల్గొన్నారు. ● మద్దిపాడు: కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మద్దిపాడులో ఆ పార్టీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నట్టే సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. గంగిశెట్టి నరసింహారావు, కాకుమాను సుబ్బారావు, ఈమని సుబ్బారావు పాల్గొన్నారు.

నవోదయలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలోని జవహర్ నవోదయ విద్యాలయ పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివిన వివిధ బ్యాచ్‌ల పూర్వవిద్యార్థులు.. పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తుచేసుకున్నారు. తరగతిగది, హాస్టల్‌లో అనుభవాలను నెమరువేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ప్రిన్సిపల్ శివరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పూర్వవిద్యార్థి రత్నాకర్, డాక్టర్ పీవీ రవీంద్రరెడ్డి, వైవీ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో కలుసుకున్న పూర్వవిద్యార్థులు

ఆటే ప్రాణం.. గెలుపే లక్ష్యం!

యువ

క్రికెట్ ఆటంటే వీరికి ఎంతో ఇష్టం.. మరో మాటలో చెప్పాలంటే ప్రాణం. పోటీలు ఎక్కడున్నా తమ సత్తా చాటేందుకు వెనుకంజ వేయరు. అందుకు గాను నిత్యం తమ తరగతులు అయిన వెంటనే ప్రత్యేక సాధన చేస్తూ ఆటపై పట్టు సాధిస్తున్నారు. బౌలర్‌గా, బ్యాట్స్‌మేన్‌గా, ఆల్‌రౌండర్‌గా రాణిస్తూ పలువురి మన్ననలు అందుకుంటున్నారు. ఎస్ఎన్‌పాడులోని ట్రిపుల్‌ఐటీ కళాశాలలో జరుగుతున్న 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్‌లో పాల్గొనేందుకు వచ్చిన వీరు.. తమ అభిప్రాయాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారిలా. –న్యూస్‌టుడే, ఒంగోలు కర్నూలు రోడ్డు, సంతనూతలపాడు

క్రికెట్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

బౌలర్‌గా రాణిస్తూ..

నా పేరు **సూర్యప్రకాశ్.** జీఆర్‌కే డిగ్రీ కళాశాలలో చదువుతున్నా. క్రికెట్ అంటే నాకు చాలా ఇష్టం. అందులోనూ బౌలింగ్ వేయడం మరీ ఆసక్తి. ఎంతో కాలం నుంచి క్రికెట్ ఆడుతున్నా. ఇప్పటికే చాలా మ్యాచ్‌ల్లో బౌలింగ్‌తో జట్టును గెలిపించా. ఈ పోటీల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక కావడమే నా లక్ష్యం. అందుకు మరింత సాధన చేస్తాను.

ఆల్‌రౌండర్‌గా ప్రతిభ..

నా పేరు **మహేష్.** మాది ఒంగోలు. నాగార్జున డిగ్రీ కళాశాలలో చదువుతున్నా. అయిదేళ్ల నుంచి క్రికెట్‌పై ఎక్కువ శ్రద్ధ పెట్టాను. ఎన్నో టోర్నమెంట్లలో ఆడాను. చాలా పోటీల్లో మా జట్టు విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించా. బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో రాణిస్తూ ఆల్‌రౌండర్‌గా పేరుతెచ్చుకున్నా. క్రికెట్‌లో మంచి స్థానం సంపాదించడమే నా ధ్యేయం.

జాతీయ స్థాయిలో ఆడాలని..

నా పేరు **సునీల్.** రైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నా. ఇప్పటి వరకు చాలా క్రికెట్ పోటీల్లో తలపడ్డాను. బ్యాట్స్‌మేన్‌గా రాణిస్తున్నా. మా కళాశాలలో అధ్యాపకుల ప్రోత్సాహంతో ఎక్కడ క్రికెట్ పోటీలు నిర్వహించినా.. తప్పని సరిగా పాల్గొంటా. జాతీయ స్థాయిలో సత్తా చాటడమే నా లక్ష్యం.

పాఠశాల స్థాయి నుంచే ఆసక్తి..

నా పేరు **షేక్ ముహింబాషా.** చదువుతో పాటు సమానంగా క్రికెట్‌పై కూడా దృష్టి పెడుతున్నా. నేను పాఠశాల స్థాయి నుంచే ఆటలపై ఆసక్తి పెంచుకున్నాను. ఇప్పుడు క్రికెట్‌లో బ్యాట్స్‌మేన్‌గా బరిలోకి దిగుతున్నాను. చాలా పోటీల్లో జట్టును గెలిపించిన సందర్భాలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం కూడా ఈనాడు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడం మాకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం : 8008574135
యర్రగొండపాలెం : 8008552658

?: మద్దిపాడు మండలం గుండ్లాపల్లి సచివాలయం పక్కనున్న ఎస్సీ కాలనీలోని మురుగు కాలువలు పూడికతో నిండిపోయాయి. దోమలతో పాటు దుర్వాసన వెదజల్లుతుంది. కాలువలు శుభ్రపరిచి దోమల నివారణ చర్యలు తీసుకోవాలి. –వల్లెపు శివరామయ్య, గుండ్లాపల్లి

✓: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి మురుగు కాలువలను శుభ్రం చేయించి, దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. –సురేష్, పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి

?: మద్దిపాడు మండలం గార్లపాడు కాలనీలోని పశువైద్యశాల ఆవరణలో కంప చెట్లు మొలిచాయి. పరిసరాలు చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా మారాయి. –కోటు రామారావు, గ్రామస్థుడు

✓: పశువైద్యశాల ఆవరణతో పాటు పరిసరాల్లోని కంప చెట్లు, చెత్త చెదారం తొలగిస్తాం. –జాన్సన్, పశుసంవర్ధక శాఖ సహాయకుడు

?: చీమకుర్తి పురపాలక సంఘం పరిధిలోని గాంధీనగర్ రెండో వీధి శివారులో 100 మీటర్ల పరిధిలో సిమెంటు రహదారి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. –బి.వేణుగోపాలాచారి, పట్టణవాసి

✓: రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. –వై.రామకృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్

–న్యూస్‌టుడే, మద్దిపాడు, చీమకుర్తి

సమర్థ భారత్‌పై ర్యాలీ

ఒంగోలు గ్రామీణం: సమదృష్టి, క్షమతా వికాసం, అనుసంధాన్ మండలి ఆధ్వర్యంలో 'సక్షమ్ భారత్-సమర్థ భారత్'పై ఒంగోలు నగరంలో ఆదివారం దివ్యాంగులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక సుందరయ్య భవన్ రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీ కర్నూలురోడ్డు, లంబాడీ డొంక మీదుగా కొనసాగింది. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.విజయ రామారావు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సక్షమ్ చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో సక్షమ్ జిల్లా అధ్యక్షుడు కె. పూర్ణచంద్రరావు, నాయకులు మారెళ్ల సుబ్బారావు, సాయి జనార్దన్, కోటా ప్రభు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఒంగోలు గ్రామీణం: ఒంగోలు నగరంతోపాటు, జిల్లాలోని అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. మోహన్ డిమాండ్ చేశారు. స్థానిక మాదాల నారాయణస్వామి భవన్‌లో ఆదివారం జిల్లా అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌ల సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా టి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా జీవీ. నరసింహారావుతో పాటు 13 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఆదర్శనీయుడు వాజ్‌పేయీ

చీమకుర్తి: బడుగు, బలహీనవర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రధానమంత్రిగా అనేక కార్యక్రమాలు అమలు చేసిన అటల్‌బిహారీ వాజ్‌పేయీ జీవితం నేటి తరానికి ఆదర్శ ప్రాయమని జిల్లా భాజపా అధ్యక్షుడు శ్రీనివాసరావు పేర్కొన్నారు. రామతీర్థంలో గుండా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన భాజపా సుశాసన్ సమ్మేళన్ కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. వాజ్‌పేయీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అమరసింహం, మహిళా మోర్చా అధ్యక్షురాలు తీగల సత్యవతి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

బాల చిత్రకారుడికి బంగారు పతకం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఒంగోలుకు చెందిన బాల చిత్రకారుడు షణ్ముఖ సింహ పదో ఆలిండియా చిల్డ్రన్స్ పెయింటింగ్ పోటీలో బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. నెల్లూరులోని అమీర్ ఆర్ట్ అకాడమి నిర్వహించిన పోటీలో నగరంలోని బీఆర్ ఒలంపియాడ్ స్కూలులో అయిదో తరగతి చదువుతున్న తిమ్మిరి షణ్ముఖ సింహకు జాతీయ స్థాయిలో బంగారు పతకం లభించింది. విద్యార్థితో పాటు శిక్షణ ఇచ్చిన సృష్టి ఆర్ట్ అకాడమి కార్యదర్శి టి. రవీంద్రను కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు అభినందించారు.

బంగారు పతకం అందుకుంటున్న షణ్ముఖ సింహ

స్పందనకు వందనం

వీధి దీపం నిర్వహణ

కొత్తపట్నం, న్యూస్‌టుడే: కొత్తపట్నంలోని పోస్టాఫీసు రోడ్డు నుంచి రంగాయపాలేనికి వెళ్లే మార్గంలో పగలు, రాత్రి అని తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయి. దీంతోపాటు స్తంభానికి పిచ్చి మొక్కలు అల్లుకుపోయాయి. ఈ సమస్యపై 'ఈనాడు'లో ఆదివారం 'అల్లుకున్న తీగలు.. ఆగని వెలుగులు' అనే శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన విద్యుత్తు అధికారులు స్తంభానికి అల్లుకున్న పిచ్చి మొక్కలు తొలగింపజేయించి, పగటి పూట వెలుగులను నియంత్రించారు.

బురదనీరే సరఫరా!

కొత్తపట్నం మండలం ఆలూరులో మంచి నీళ్లు బురదతో వస్తున్నాయి. ఎంతో కాలం నుంచి ఇదే పరిస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. వీటిని ఎలా తాగాలని వారు వాపోతున్నారు. దీంతో కొందరు బయట ప్లాంట్ల వద్ద కొనుగోలు చేస్తుండగా.. మిగతా వారు ఈ నీటినే తేటగా మార్చి తాగాల్సి వస్తుంది. దీనివల్ల అనారోగ్యానికి గురికావాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. అనేక సార్లు పంచాయతీ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా దృష్టి సారించి ట్యాంకును శుభ్రం చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, కొత్తపట్నం**

నడకదారి.. అంధకారంగా మారి



ఒంగోలు నగరంలోని రంగారాయుడు చెరువు కట్ట వాకింగ్ ట్రాక్‌పై వేసిన విద్యుత్తు దీపాల్లో చాలా వరకు వెలగడం లేదు. నడక వ్యాయామానికి వచ్చిన వారు చీకట్లో తిరగడానికి ఇబ్బంది పడాల్సి వస్తుంది. రెండు రోజులుగా వీధి లైట్లు వెలగక తీవ్ర అవస్థలు పడుతున్నట్లు వాకర్లు తెలిపారు. ఈ సమస్యను మున్సిపల్ ఇంజినీర్ ఏసయ్య దృష్టికి తీసుకెళ్లగా.. సోమవారం విద్యుద్దీపాలకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తామన్నారు. **-న్యూస్‌టుడే, ఒంగోలు నగరం**

ప్రమాదమని తెలిసినా..!

మద్దిపాడు మండలం వెల్లంపల్లి వద్ద 16వ జాతీయ రహదారిని దాటేమార్గం లేక కొందరు ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదకరంగా వెళ్తున్నారు. తాళ్లూరు నుంచి ఒంగోలు వెళ్లడానికి ఈ మార్గంలోని గ్రామాల వాహనదారులు వెల్లంపల్లి వద్ద రోడ్డును దాటాలి. వెల్లంపల్లి కూడలిలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నందున దానిని సిమెంట్ దిమ్మెలతో మూసివేశారు. దీంతో ద్విచక్రవాహనాలు, కార్లు, బస్సులు గుండ్లాపల్లి మీదుగా తిరిగి రావాల్సి వస్తుంది. కొందరు ద్విచక్ర వాహన చోదకులు డివైడర్‌లు ఎక్కి మరీ ఇలా ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్నారు. **-న్యూస్‌టుడే, మద్దిపాడు**

ఏడు నెలలకే మొరాయింపు

ఒంగోలు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం చల్లని శుద్ధజలం అందించేందుకు యంత్రాన్ని ఏర్పాటు చేశారు. లీటరు నీటిని రూ.5కే ఇవ్వాలి. అయిదేళ్లపాటు నిర్వహించేలా ఈ ఏడాది మేలో దాని బాధ్యతను గుత్తేదారుడికి అప్పగించారు. ఏడు నెలలకే అది నిరుపయోగంగా మారింది. శుద్ధ జల యంత్రం చూసి ప్రయాణికులు ఆసక్తిగా వెళ్లినా అది పని చేయకపోవడంతో వెనుదిరుగుతున్నారు. రూ.20 ఉన్న లీటరు బాటిల్‌ను స్టేషన్ ఆవరణలో రూ.25కు విక్రయించడంతో ప్రయాణికుల జేబుకు చిల్లు పడుతుంది. దీనిపై రైల్వే అధికారులను వివరణ కోరగా.. తక్షణమే వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. **-న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం**

నీటి ప్రవాహంపై నిఘా!

సాగర్ కాలువలపై నీటి ప్రవాహాన్ని గుర్తించేందుకు సీసీ కెమెరాలు, రీడింగ్ బాక్సులను ఏర్పాటు చేశారు. ఓబీసీపై కొప్పోలు, ఈతమొక్కల, త్రోవగుంట మేజర్ల వద్ద మూడు ప్రదేశాల్లో మూడు కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎగువ నుంచి ఎంత నీటి ప్రవాహం వస్తుంది, దిగువకు ఎంత విడుదలవుతుందనే అంశాలను ఆన్‌లైన్‌లో చూసుకొనేలా వీటిని ఏర్పాటు చేశారు. మనిషి దగ్గర లేకుండా ఎక్కడి నుంచైనా నీటి ప్రవాహం తెలుసుకొనేలా ఇవి ఉపయోగపడతాయని ఎన్నెస్పీ అధికారులు తెలిపారు. **-న్యూస్‌టుడే, సంతనూతలపాడు**

మనస్తాపంతో ఆత్మహత్య

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మనస్తాపానికి గురై ప్రియురాలు ఇంటికెళ్లి ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన స్థానిక వెంకటేశ్వరనగర్‌లో శనివారం రాత్రి జరిగింది. తాలూకా పోలీసుల కథనం ప్రకారం.. ప్రకాశం కాలనీకి చెందిన మస్తాన్‌బాషాకు వెంకటేశ్వరనగర్‌కి చెందిన మహిళతో సాన్నిహిత్యం ఉంది. నెలరోజులుగా వారిమధ్య విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో మస్తాన్‌బాషా శనివారం రాత్రి ఆమె ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో వారిమధ్య మాటామాటా పెరిగింది. దీంతో ఆగ్రహించిన అతడు ఆమెపై అలిగి ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు. హుటాహుటిన వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందాడు. అతడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్సై హరిబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేలా శిబిరంపై దాడి

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని చెరువుకొమ్ముపాలెం శివారులో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌ఛార్జి సీఐ యు. సుధాకర్ ఆధ్వర్యంలోని బృందం అక్కడ పందేలు నిర్వహిస్తున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుంచి ఒక కోడి, రూ.3,520 నగదు స్వాధీనం చేసుకుంది. ● కొప్పోలు పరిధిలో కోతముక్క ఆడుతున్న వారిని పట్టుకుని వారి నుంచి రూ.అయిదు వేలు స్వాధీనం చేసుకుని తాలూకా పోలీసులకు అప్పగించారు. ఎస్సై సుదర్శన్, ఏఎస్సై మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఏసీలో మంటలు.. దగ్ధమైన వస్తువులు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలులో శనివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. స్థానిక అన్నవరప్పాడు కాలనీ నాలుగోలైనులో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికంగా నివశించే పాశం లక్ష్మణ్‌కు చెందిన ఇంటిలో ఏసీ ఆన్ చేయగానే ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఇంటిలోని ఏసీ, రిఫ్రిజరేటర్, మంచం, బీరువా, ఇతర పరికరాలు దగ్ధమయ్యాయి. సమాచారం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి గాయాలు

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి ప్రధాన రహదారిలో ఇసుకవాగు శివాలయం సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో స్థానిక గరికమిట్టకు చెందిన చంద్రశేఖర్, నితిన్‌లు గాయపడగా.. 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. చంద్రశేఖర్ ప్రస్తుతం అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్రస్థాయి కౌశల్ పోటీల్లో సత్తా

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: తిరుపతిలోని సంస్కృత విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన రాష్ట్రస్థాయి కౌశల్ పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపి రెండు బహుమతులు సాధించారు. క్విజ్ పోటీలో రంగాపురం జడ్పీ హైస్కూలు విద్యార్థిని షేక్ అఫ్రీన్, సంతనూతలపాడు ఉన్నత పాఠశాల విద్యార్థిని లక్ష్మీసాయి ప్రియాంక, మార్కాపురం జడ్పీబాలుర ఉన్నతపాఠశాల విద్యార్థి టి.వెంకటహరికిరణ్ బృందం రాష్ట్రస్థాయిలో నాలుగోస్థానం సాధించి కన్సోలేషన్ బహుమతి పొందారు. గొట్లగట్టు స్కూలు విద్యార్థిని కె.కావ్య పోస్టర్ ప్రజంటేషన్‌లో ద్వితీయ బహుమతి సాధించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. డీఈవో రేణుక, ఉప విద్యాశాఖ అధికారి చంద్రమౌళీశ్వర్, జిల్లా సైన్స్ అధికారి రమేష్‌లు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

30న విశ్రాంత పోలీసు అధికారుల సంఘ సమావేశం

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: విశ్రాంత పోలీసు అధికారుల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం ఈ నెల 30న నగరంలోని పోలీసు కల్యాణ మండపంలో జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు జి.రామ్మూర్తి తెలిపారు. ఉదయం పదిగంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ముఖ్యఅతిథిగా హాజరువుతారన్నారు.

గ్రామ పాలన.. సేవలకు యాతన!

–న్యూస్‌టుడే, మంగమూరు (సంతనూతలపాడు)

సంతనూతలపాడు జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న మండలం. కానీ చాలా గ్రామాల్లో ఇన్‌ఛార్జిల పాలనే కొనసాగుతుంది. మొత్తం 18 పంచాయతీలు ఉండగా వీటిలో సగానికి పైగా ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శులతోనే కాలం వెల్లదీస్తున్నారు. పెద్ద పంచాయతీలకు సైతం ఇన్‌ఛార్జిలే కావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నాయి. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ పరంగా సమస్యలు తీవ్రతరమవుతున్నాయి.

నియోజకవర్గ కేంద్రంలోనూ అంతే..

నియోజకవర్గ కేంద్రం సంతనూతలపాడుకు సైతం ఇన్‌ఛార్జిలే దిక్కు. మొన్నటి వరకు మంగమూరు పంచాయతీ కార్యదర్శి ఇన్‌ఛార్జిగా ఉండగా, ప్రస్తుతం మద్దులూరు కార్యదర్శికి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఎండ్లూరు, మైనంపాడుకు ఒకరు, గుమ్మళంపాడు, ఎనికపాడు, తక్కెళ్లపాడుకు ఒకరు, చంద్రపాలెం, బొడ్డువారిపాలెంకు ఒకరు, ఇలా ప్రతి రెండు, మూడు పంచాయతీలకు ఒక కార్యదర్శి ఉండడంతో ప్రజలకు సేవలు సరిగా అందడం లేదు. సంబంధిత కార్యదర్శులపై అదనపు భారం పడటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో వైపు జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న మంగమూరు వాసులకు సైతం ఇన్‌ఛార్జిల పాలనతో అవస్థలు తప్పడం లేదు. ఇక్కడి గ్రామ సచివాలయ సిబ్బంది నుంచి రెవెన్యూ సిబ్బంది సైతం ఇన్‌ఛార్జిలే కావడం గమనార్హం. ఏ పని ఉన్న అధికారులు ఎప్పుడు వస్తారోనని ఎదురు చూడాల్సి వస్తోందని గ్రామస్థులు చెబుతున్నారు. కొద్ది నెలలుగా వీఆర్వో పోస్టు ఇన్‌ఛార్జిలతోనే నడుస్తుంది. తొలుత సంతనూతలపాడు-2 వీఆర్వోకు ఇన్‌ఛార్జిగా అప్పగించగా అతను ఎప్పుడు వస్తాడో కూడా తెలియక, పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో కొద్దిరోజుల క్రితం మరో వీఆర్వోకు ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు. ఉన్న డిజిటల్ సహాయకులను డిప్యుటేషన్‌పై డీపీవో కార్యాలయానికి పంపారు. కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకుందామన్న సదరు అధికారి ఎప్పుడు వస్తారో కూడా తెలియని పరిస్థితి. దీనిపై ఎంపీడీవో సురేష్‌బాబు మాట్లాడుతూ.. ఇన్‌ఛార్జిలతో గ్రామ పాలన నడుస్తున్నతీరుపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామన్నారు. ఇప్పటి వరకు పూర్తి స్థాయి అధికారులను ఇవ్వకపోవడంతో ఉన్న వారితోనే పనులు చేపడుతున్నామని తెలిపారు.

మంగమూరు సచివాలయ భవనం

శ్రద్ధాంజలి



కీ॥శే॥ శ్రీ అనుబ్రోలు కోటేశ్వరరావుగారు
మరణం : 15-12-2025
భార్య : కీ.శే. అనుబ్రోలు సత్యవతి గారు
అనుబ్రోలువారి పాలెం

మంచితనానికి మారుపేరుగా నిలిచి, ప్రేమానురాగాలు, ఆప్యాయతను పంచి, మమ్మల్ని ఉన్నత స్థాయిలో నిలిపినారు. మీరు చూపిన మార్గము మాకెంతో ఆదర్శము. మీ మధుర స్మృతులు ఎల్లప్పుడు మా మదిలో మెదులుతూనే ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ.. బాధాతప్త హృదయాలతో

కుమార్తె : నల్లూరి మాధవిలత అల్లుడు : నల్లూరి వెంకటేశ్వర్లు
మనుమడు : నల్లూరి మోహన్ చందు (USA) మనుమరాలు : నల్లూరి పూజిత
మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు.

కార్యస్థలం: పెద్దకర్మ తేది.29-12-2025 సోమవారం రోజున మా స్వగృహం అనుబ్రోలు వారి పాలెం, కొరిశపాడు మండలం, బాపట్ల జిల్లా నందు జరుపబడును.

(c) eenadu

సండే.. సండదే సండది.. నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఎన్టీఆర్‌నగర్‌లో ఆదివారం 'హ్యాపీ సండే' నిర్వహించారు. అందులో భాగంగా టగ్ ఆఫ్ వార్‌లో అధికారులు, సిబ్బంది, ప్రజలు, ఆర్ఎస్ఆర్ స్కూలు విద్యార్థులు సందడి చేశారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

అంగరంగ వైభవం.. నగరోత్సవం.. నెల్లూరు నగరం వేదాయపాలెంలో కొలువుదీరిన అయ్యప్ప స్వామి నగరోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. ఆలయం నుంచి ప్రారంభమై రంగనాథస్వామి దేవస్థానంవరకు చేరుకుంది. అక్కడ నుంచి మహిళాభక్తులు పెద్దసంఖ్యలో బారులుదీరి దీపాలు చేతపట్టుకుని ముందుకుసాగారు. – న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)

తాగునీరందక.. పైపులు పరులపాలు

ట్రాక్టర్‌లో తీసుకెళుతున్న పైపు

న్యూస్‌టుడే, కావలి: మంచినీటి పథకానికి తీసుకొచ్చిన పైపులు ఉపయోగపడకపోగా.. దొంగల పాలవుతున్నాయి. సంగం బ్యారేజ్ నుంచి కావలి పట్టణ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు పైపులైన్ ద్వారా నీటిని తీసుకొచ్చేందుకు 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో పనులకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో డీఐ పైపులను 70 కి.మీ. దూరం వరకు తీసుకొని క్షేత్రస్థాయిలో డంప్ చేశారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా పాలనలో పైపుల అమరిక పనులు విస్మరించారు. ప్రస్తుత కూటమి పాలనలో దృష్టిసారించలేదు. ఇదే అదనుగా భావించి రైతులు వాటిని అపహరిస్తున్నారు.

● కావలివాసుల దాహార్తి తీర్చేందుకు సోమశిల జలాశయం నుంచి సంగం బ్యారేజీ వరకు పెన్నానది ద్వారా ప్రవాహం చేరుకుంటుంది. సంగం నుంచి బీరాపేరు వాగు ద్వారా కావలి కాలువ ద్వారా జలదంకి మండలం చిన్నక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు చేరుతాయి. అక్కడ విడుదల చేసిన నీటికి, ఇక్కడికి చేరుకునేసరికి పరిమాణంలో సరిపోలేని స్వల్పంగా ఉంటోంది. కాలువలో ప్రవాహం ప్రహసనంగా మారుతుండటంతో పైపులైన్లతో పూర్తి స్థాయిలో నీటిని తీసుకురావాలని నిర్ణయించారు. అందుకు రూ. 127 కోట్లు మంజూరయ్యాయి. గుత్తేదారు పైపులకు బిల్లులు చేసుకుని వెళ్లిపోయాడు. అంతటితో పనులు ఆగాయి. దీంతో ఖరీదైన పైపులు పరులపాలవుతున్నాయి.

నైపుణ్యం కొలువుల నేస్తం

కోర్సులపై దృష్టి పెట్టాలంటున్న నిపుణులు

"విద్యార్థులకు కొలువుల కల్పనకు ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రాంగణ ఎంపికలు జరుగుతున్నాయి. ఆసక్తిగా హాజరవుతున్న వారు.. ముఖాముఖికి వచ్చే సమయానికి 20 శాతం మంది కూడా మిగలడం లేదు. ఇందుకు ప్రధాన కారణం అదనపు నైపుణ్యాలు లేకపోవడమే. వాస్తవంగా వీటిని కళాశాల స్థాయిలోనే నేర్పించాలి. చాలాచోట్ల అలా జరగడం లేదు."

న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

జిల్లాలో 17 ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా 16 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఏటా నిర్వహిస్తున్న ప్రాంగణ ఎంపికల్లో ఎక్కువ మంది ప్రతిభ చూపలేకపోతున్నారు. కారణం ఉద్యోగాల సాధనకు అవసరమైన నైపుణ్యాలు లేకపోవడం, అదనపు కోర్సులు చేయకపోవడం, ఇతర అంశాల్లో వెనుకబాటే నని నిపుణులు అంటున్నారు. ఇంజినీరింగ్‌లో మొదటి సంవత్సరం నుంచే గ్లోబల్ సర్టిఫికేషన్, కోడింగ్, హ్యాకథాన్ ఇతర సర్టిఫికెట్ కోర్సుల్లో చేరితే ఉద్యోగాల సాధన సాధ్యమంటున్నారు.

ఆన్‌లైన్‌లో అందుబాటులో..

ప్రస్తుతం సామాజిక మాధ్యమాలు, సాంకేతికతను వినియోగించుకుని విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవచ్చు. గ్లోబల్ సర్టిఫికేషన్ కోసం అమెజాన్, మైక్రోసాఫ్ట్, పెగా, సాఫ్ట్ ల్యాబ్, సిస్కో నెట్‌వర్క్స్ తదితర సంస్థలు వివిధ వెబ్‌సైట్ల ద్వారా కోర్సులు అందిస్తున్నాయి. కొన్ని కళాశాలలు ఆయా సంస్థలతో ఎంవోయూ కుదుర్చుకుని కోర్సులు అందిస్తున్నాయి.

కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న యువత

వీటిపై పట్టు అవసరం

కోడింగ్, క్వాంటమ్ కంప్యూటింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించడంతోపాటు పలు కంపెనీలు నిర్వహించే హ్యాకథాన్‌లో పాల్గొనడంతో మెరుగైన అవకాశాలు పొందొచ్చు. ఎలక్ట్రానిక్స్ మైక్రో కంట్రోలర్, సెన్సార్‌పై దృష్టి పెట్టాలి. సివిల్, మెకానికల్ విద్యార్థులు థర్మోడైనమిక్స్, స్ట్రెంత్ ఆఫ్ మెటీరియల్స్‌పై పట్టు పెంచుకోవాలి. కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు అల్గారిథం, ఆపరేటింగ్ సిస్టమ్స్, కంప్యూటర్ నెట్‌వర్క్ తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ఉచితంగా నేర్చుకోవచ్చు

కొన్ని వెబ్‌సైట్లలో ఆన్‌లైన్ వేదికగా ఉచిత కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పరీక్షకు సంబంధించిన ఫీజు మాత్రమే చెల్లించి వాటిని నేర్చుకోవచ్చు.

● Rmit ocw :- ఈ వెబ్‌సైట్‌లో వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన వీడియోలు, ప్రాథమిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన కోర్సులు అందుబాటులో ఉంటాయి.

● nptel swayam :- ఇంజినీరింగ్‌తో పాటు డిగ్రీ, ఇతర కోర్సులు చదివే వారికి ఉపయోగపడే కామర్స్, ఆర్ట్స్, గణితం తదితర అంశాలపై శిక్షణ ఉంటుంది.

● coursera :- వివిధ విశ్వవిద్యాలయాలు, సంస్థలకు సంబంధించిన కోర్సులు, ప్రాజెక్టులు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

సఖి సురక్ష.. ఆరోగ్య పరీక్ష

రెండో విడతలో 10 వేల మంది ఎంపిక

నెల్లూరు(పొదలకూరు రోడ్డు), న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం దృష్టి సారించింది. సఖి సురక్ష పథకం కింద 35 ఏళ్లు పైబడిన మహిళలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు వైద్య సేవలు అందిస్తారు. జాతీయ అర్బన్ ఆరోగ్య మిషన్ (ఎన్‌యూహెచ్‌ఎం) సహకారం, ఈ-వైద్య ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారు. తొలి విడతలో 5,102 మందికి పరీక్షలు నిర్వహించాలని లక్ష్యం నిర్దేశించగా.. 6,247 మందికి సేవలు అందించారు. రెండో విడత 10వేల మంది మహిళలకు పథకాన్ని చేరువ చేయాలని అధికారులు చర్యలు చేపడుతున్నారు. శిబిరాలను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఎన్నో సేవలు.. మహిళలకు రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, కొలెస్ట్రాల్, గుండె జబ్బులు, అనీమియా, బ్రెస్ట్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ తదితర 16 రకాల వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షలు పూర్తయ్యాక 48 గంటల్లోపు రిపోర్టును వారి ఆధార్ అనుసంధాన ఫోన్ నంబరుకు పంపిస్తున్నారు. రెండో విడత సఖి సురక్ష శిబిరాల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు మెప్మా పీడీ లీలారాణి తెలిపారు.

యూపీఐ చెల్లింపుల్లో పొరపాట్లా..

యూపీఐ ద్వారా చెల్లింపులు చేసినప్పుడు ఒక్కోసారి పొరపాటున వేరొకరి ఖాతాకు నగదు జమవుతుంటాయి. లేకుంటే పెండింగ్‌లో ఉండిపోతాయి. ఇలాంటి సమయంలో ఆందోళన చెందకుండా వినియోదారులు ఇలా చేస్తే పోయిన డబ్బులు తిరిగి రాబట్టుకోవచ్చు. లావాదేవీకి సంబంధించిన స్క్రీన్ షాట్ తీసుకొని ఈ నంబర్లకు కాల్ చేయాలి.

సంప్రదించాల్సి నంబర్లు..

● గూగుల్‌పే	: 1800 419 0517
● ఫోన్‌పే	: 0806 872 7374
● పేటీఎం	: 0120 445 6456
● భీమ్	: 1800 120 1740

● ఎన్‌పీసీఐ వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదు చేయొచ్చు.

– న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

పైసలిస్తేనే.. పనులు!

కందుకూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ తీరుపై విమర్శలు

కందుకూరు మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల వృద్ధురాలు మృతిచెందింది. ఆమెకు ముగ్గురు వారసులు. తల్లి ఆస్తిని వారు విక్రయించగా.. కొనుగోలుదారులకు సదరు ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఏదో ఒక పత్రం లేదని సాకు చూపి రూ.40వేలు డిమాండ్ చేశారు. తెలిసిన వారి సిఫార్సుతో రూ.15 వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయాల్సి వచ్చిందని వారంతా వాపోయారు.

● ఈ ఒక్క ఘటనే కాదు.. ఇలాంటివి తరచూ జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

కందుకూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో కందుకూరు పట్టణంతో పాటు గుడ్లూరు, కందుకూరు, వలేటివారిపాలెం, లింగసముద్రం, పొన్నలూరు మండలాలు ఉన్నాయి. ఆ ప్రాంత ప్రజలు ఆస్తుల క్రయ విక్రయాలు చేసుకున్నపుడు రిజిస్ట్రేషన్లు, రిజిస్టర్ లీజు, వివాహ రిజిస్ట్రేషన్ తదితరాల కోసం కార్యాలయానికి వస్తుంటారు. రోజుకు సుమారు 25 నుంచి 30 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు అవుతుంటాయి. కొన్ని డాక్యుమెంట్లకు కార్యాలయ సిబ్బంది కొందరు మామూళ్లు వసూలు చేస్తున్నట్లు విమర్శలున్నాయి. చిన్న డాక్యుమెంట్‌కు రూ.5వేలు, పెద్దవి లేదా ఏదైనా సమస్యాత్మక రిజిస్ట్రేషన్లకు భారీగా వసూలు చేస్తున్నట్లు సమాచారం. అలాగే అధికార పార్టీ నాయకుల పేరు చెప్పి కొంతమొత్తం వసూలు చేస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

గతంలో అనిశా దాడులు

కార్యాలయంపై గతంలోనూ అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఏకంగా అనిశా సోదాలు జరిగాయి. అనంతరం కార్యాలయంలో పని చేసే అధికారితో పాటు సిబ్బందిని మార్చేసిన పరిస్థితి చోటుచేసుకుంది. డాక్యుమెంట్లకు పర్సంటేజీలు వసూలు చేస్తున్న విషయంలో డాక్యుమెంట్ రైటర్లు కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. పర్సంటేజీ పేరు చెప్పి భారీగా దండుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. దీనిపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

నా దృష్టికి రాలేదు

డాక్యుమెంట్లకు పర్సంటేజీలు వసూలు చేస్తున్నారన్న విషయం నా దృష్టికి రాలేదు. కార్యాలయంలో వసూళ్లపై ఆరా తీసి చర్యలు తీసుకుంటాం.
– రామకోటయ్య, సబ్‌రిజిస్ట్రార్

పులి సంచారం గుర్తింపునకు ట్రాప్ కెమెరాలు.. ఉదయగిరి అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరించిన ఆనవాళ్లున్న ప్రాంతాల్లో ఆదివారం ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా పెద్దపులి సంచారాన్ని గుర్తించేందుకు అవకాశముంటుందని అటవీ అధికారులు తెలిపారు. ఉదయగిరి- బండగానిపల్లి ఘాట్ రోడ్డులో కనుమ బావి, జి.చెరువుపల్లి సమీపంలో ఉదయగిరి దుర్గం, కోర్స కొండ ప్రాంతంలో రేంజ్ అధికారి బీఎస్ కుమార రాజా సిబ్బందితో వీటిని ఏర్పాటు చేయించారు. దుత్తలూరు డీఆర్వో మురళీ, ఎఫ్ఎస్‌వో చిన్నవెంకటయ్య, ఏబీవో బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఉదయగిరి

ఇక వాహనం భద్రమే!

హెచ్ఎస్ఆర్‌పీ నంబరు ప్లేట్లు అమర్చుకోవాలన్న కేంద్ర రవాణా శాఖ

న్యూస్‌టుడే, నెల్లూరు(వేదాయపాలెం)

హై సెక్యూరిటీ నంబరు ప్లేట్(హెచ్ఎస్ఆర్‌పీ)లు వాహనాలకు కవచమే. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఇవి నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి. వాహనాల చోరీ, నకిలీ నంబరు ప్లేట్లతో నేరాలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో వీటి కట్టడికి కేంద్ర రవాణా శాఖ ప్రతి వాహనానికి ఈ హెచ్ఎస్ఆర్‌పీని తప్పనిసరి చేసింది. 2019 ఏప్రిల్ 1వ తేదీకి ముందు రిజిస్ట్రేషన్ చేసిన వాహనాలకు కూడా వీటిని అమర్చుకోవాలని కేంద్రం ఇటీవలే ఆదేశాలు జారీ చేసింది. ప్రధానంగా 15 ఏళ్లలోపు రిజిస్ట్రేషన్ చేసిన వాహనాలకు వెబ్‌సైట్ ద్వారా ఈ తరహా నంబరు ప్లేట్లు పొందేలా అవకాశం కల్పించింది.

ప్రత్యేకతలు..

● **ట్యాంపర్ ప్రూఫ్:** రిఫ్లెక్టివ్ షీటింగ్‌తో అల్యూమినియంతో తయారుచేసిన దీన్ని నకిలీ చేయడం కష్టం.

● **లేజర్ కోడ్ :** ప్రతి ప్లేటుపై యూనిక్ లేజర్ ఐడీ ఉంటుంది.

● **నాన్ రిమూవబుల్ స్నాప్ లాక్ :** ఒకసారి అమర్చితే ఇక తొలగించడం సాధ్యం కాదు.

● **ప్రత్యేక ఐడీ :** 10 అంకెల లేజర్ చెక్కబడిన సీరియల్ నంబరు వాహన రిజిస్ట్రేషన్‌కు లింక్ చేస్తుంది. నేర విచారణలో పోలీసులకు పూర్తి సమాచారం అందుతుంది.

ఇలా పొందవచ్చు..

bookmyhsrp.com లేదా www.siam.in వెబ్‌సైట్‌లో పేరు, మెయిల్ ఐడీ, రాష్ట్రం, వాహన రిజిస్ట్రేషన్ నంబరు, ఫోన్ నంబరు, జిల్లా వివరాలు నమోదు చేయాలి. ఆపై వాహనం నంబరు, ఇంజిన్ నంబరు వివరాలు నింపాలి. కంపెనీలను బట్టి నంబరు ప్లేట్లు ద్విచక్ర వాహనాలకు రూ.320 నుంచి రూ.500 వరకు, నాలుగు చక్రాల వాహనాలకు రూ.600 నుంచి రూ.3వేల వరకు ఉన్నాయి. వీటిలో కావల్సింది ఎంపిక చేసుకుని ఓటీపీ ద్వారా ఆన్‌లైన్‌లో నగదు చెల్లించాలి. 15 రోజుల తర్వాత ఎంపిక చేసిన షోరూమ్‌కు వెళితే ఈ ప్లేటు అమర్చుతారు.

జీవితంలో ఓడిపోవద్దు

● పాఠశాలలో బాలుడి వేధింపులో.. ఇతర కారణమో తెలియదుగానీ నగరంలో పదో తరగతి చదివే ఓ బాలిక ఇటీవల ఇంట్లో బలవన్మరణానికి పాల్పడింది.

● ఇటీవల రైలు పట్టాలపై బీటెక్ విద్యార్థి మృతదేహం లభ్యమైంది. ప్రేమ విఫలం కావడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది.

● కారణం ఏదైనా రెండు నెలల కాలంలో ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇద్దరు వైద్య విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు.



సమస్యకు పరిష్కారం ఆత్మహత్య కాదు..

న్యూస్‌టుడే, నెల్లూరు(వేదాయపాలెం)

ఆత్మహత్యలకు పాల్పడిన వారి తల్లిదండ్రులు మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు. తమ పిల్లల జీవితాలు బాగుండాలని నిరంతరం కష్టపడుతున్నారు. పిల్లలు చిన్నపాటి విషయంలో మనస్తాపంతో, క్షణికావేశంతో తీసుకుంటున్న నిర్ణయాలు వారికి తీరని శోకం మిగిలిస్తున్నాయి. తమ కోసం తల్లిదండ్రులు పడుతున్న కష్టాల గురించి ఒక్కసారి ఆలోచిస్తే ఇలాంటి నిర్ణయాలు తీసుకోరు. భావిభారత పౌరులుగా ఎదగాల్సిన వీరు.. సగం జీవితంలోనే ఓడిపోతున్నారు.

జిల్లాలో వివరాలిలా..

నెల	ఆత్మహత్యలు
జూన్	12
జులై	11
ఆగస్టు	09
సెప్టెంబరు	08
అక్టోబరు	11
నవంబరు	09
డిసెంబరు (ఇప్పటి వరకు)	08

● వీటిలో 75 శాతం వరకు యువత ఉన్నారు.

ఆ ఆలోచన రాకూడదు

తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తుంటే చచ్చిపోవాలనే ఆలోచన ఎందుకు వస్తుంది? ఏదైనా సమస్య వస్తే మేమున్నాం. ఒక్క ఫిర్యాదు చేస్తే చాలు. ధైర్యంగా ఎదుర్కొంటేనే భవిష్యత్తులో ఎలాంటి సమస్య వచ్చినా నిలబడగలం. చచ్చిపోయిన తర్వాత ఏం చేయలేం. బతికి ఉండి తల్లిదండ్రులను ఆదుకోండి.
– చిట్టెం కోటేశ్వర రావు, ఇన్‌స్పెక్టర్

కౌన్సెలింగ్‌తోనే మార్పులు.

తమ బిడ్డల బాగోగుల గురించి నిత్యం తల్లిదండ్రులు పర్యవేక్షిస్తూ ఉండాలి. వారిలో వస్తున్న మార్పులు, ఇతర విషయాలపై పరిశీలన చేయాలి. ప్రేమ వ్యవహారాలు, పరీక్షల్లో తప్పిదాలు, స్నేహితులు, ఇతర అలవాట్లపై ఆరా తీస్తుండాలి. వారి మనస్తత్వాన్ని బట్టి మమేకం అవుతుంటే.. పిల్లలు ప్రతి విషయాన్ని పంచుకుంటారు. ఆత్మహత్యకు పాల్పడే లక్షణాలు ఉన్నవారికి, ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వారికి కౌన్సెలింగ్ అవసరం. చిన్నారుల్లో చదువు ఒత్తిడి అధికంగా ఉంటుంది. వారి సమస్యలను గుర్తించి తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా మెలగాలి. ఎక్కువగా బాధ కలిగినప్పుడు, ఆత్మహత్య చేసుకోవాలని ఆలోచన వచ్చిన సమయంలో స్నేహితులు, ఆత్మీయులతో కొంత సమయం గడపడం ద్వారా ఆలోచనా విధానం మారుతుంది. – డాక్టర్ సురేష్ బాబు, మనోవికాస నిపుణులు

ప్రతి సోమవారం డయల్ యువర్ ఎస్ఈ

నెల్లూరు (విద్యుత్తు), న్యూస్‌టుడే : వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం 'డయల్ యువర్ ఎస్ఈ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు విద్యుత్తు శాఖ అధికారులు వెల్లడించారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు వినియోగదారులు 0861 2320427 నంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలిపితే పరిష్కరిస్తామని సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.రాఘవేంద్రం తెలిపారు.

మందుల్లేవ్.. చీటి రాసిస్తాం!

పశుపోషకులకు తప్పని భారం

● జిల్లా పశుసంవర్ధక శాఖ ప్రధాన కార్యాలయ ఆవరణంలోని బహువిధ పశువైద్యశాలకు నెల్లూరు గ్రామీణ ప్రాంతానికి చెందిన శీనయ్య అనారోగ్యంతో ఉన్న తన మేకను తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు మందులు ఇచ్చారు. ఇంజెక్షన్ లేకపోవడంతో బయట కొనుక్కోవాలని మందుల చీటి రాసిచ్చారు.

● వైద్యశాలలకు కొన్ని నెలలుగా మందుల సరఫరా జరగడం లేదు. పశువులు ప్రాథమిక చికిత్సకు అవసరమైన మందులు సైతం దొరకని పరిస్థితి నెలకొంది.

న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో అధిక శాతం మంది చిన్న, సన్నకారు రైతులు పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నారు. పశువైద్యం నిమిత్తం ఆసుపత్రులకు 120 నుంచి 140 రకాల మందులు సరఫరా అవుతాయి. ప్రతి ఆసుపత్రికి సంవత్సరంలో మూడు నెలలకోసారి రూ. 45వేల నుంచి రూ. 1.20లక్షల విలువజేసే మందులు సరఫరా చేయాల్సి ఉంది. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా ఏడాదికి రూ.2కోట్ల నుంచి రూ.2.50కోట్లు ఖర్చవుతుంది. యాంటీబయోటిక్స్, జ్వరానికి సంబంధించి కొన్ని రకాలు మందులు, బి కాంప్లెక్స్ వంటి ప్రాథమిక దశలో వినియోగించే మందులు లేవు. గతేడాది నుంచి మందుల సరఫరా సక్రమంగా లేదు. రైతు సేవా కేంద్రాలలో అసలు ఇవ్వడం లేదనే మాటలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి పూర్తిగా సరఫరా నిలిచిపోయినట్లు తెలుస్తోంది. దీంతో రూ.2వేల వరకు అదనపు భారం పడుతున్నట్లు పశుపోషకులు తెలిపారు.

జిల్లాలో తెల్ల పశువులు	57,774
నల్ల పశువులు	6.46లక్షలు
గొర్రెలు, మేకలు	14 లక్షలు
ప్రాంతీయ పశువైద్య శాలలు	19
వెటర్నరీ డిస్పెన్సరీలు	89
గ్రామీణ పశుగణ కేంద్రాలు	61
రైతు సేవా కేంద్రాలు	544

రూ.2కోట్లకు ఇండెంట్ పెట్టాం

మందుల కొరత లేకుండా చర్యలు చేపట్టాం. ఎక్కడైనా ఆసుపత్రుల్లో నిల్వలుంటే వాటిని సర్దుబాటు చేస్తున్నాం. మందుల ఇండెంట్ పెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. రూ.2కోట్లకు పెట్టాం. త్వరలోనే వస్తాయి.
– రమేష్‌నాయక్, జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ

సంగమేశ్వరాలయం పునర్నిర్మాణానికి కృషి: ఆనం

వాటర్‌ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి ఆనం, బొల్లినేని కృష్ణయ్య తదితరులు

సంగం, న్యూస్‌టుడే: సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయ పునర్నిర్మాణానికి కృషి చేస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్యనాయుడి తల్లి వెంకమ్మ జ్ఞాపకార్థం భక్తులకు తాగునీటి సదుపాయం కోసం నిర్మించిన వాటర్ ప్లాంట్‌ని ఆదివారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన కృష్ణయ్యనాయుడితో ఆలయ అభివృద్ధి గురించి చర్చించారు. గతంలో రాజగోపుర నిర్మాణం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కృష్ణయ్యనాయుడు చేయించారని తెలుసుకున్న మంత్రి ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టాలని, తాను సహకరిస్తానని తెలిపారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, ఆత్మకూరు ఆర్డీవో బి.పావని, నాయకులు గిరినాయుడు, కె.రవీంద్రరెడ్డి, కె.మధుసూదన్ యాదవ్, బి.శ్రీనివాసులురెడ్డి, జి.శ్రీనివాసులు యాదవ్ తదితరులు హాజరయ్యారు.

ఏ దేశమేగినా.. జన్మభూమి సేవలో..

న్యూస్‌టుడే, మర్రిపాడు

జన్మభూమికి ఏదో ఒకటి చేయాలనే తపనతో సంపాదనలో కొంత మొత్తాన్ని అభివృద్ధి కార్యక్రమాలకు, విద్యా దానానికి వెచ్చిస్తున్నారు. 2006లో సుజాతమ్మ ఛారిటబుల్ ట్రస్టు, రామిరెడ్డి రామలక్ష్మమ్మ-గంగిరెడ్డి ట్రస్టులు స్థాపించారు. తల్లిదండ్రులు లేని, ఆర్థికంగా ఇబ్బందిపడుతూ చదువులకు దూరమవుతున్న విద్యార్థుల వివరాలను సేకరించి, వారికి చేయూతనిస్తున్నారు. 2006 నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.3 కోట్లకు పైగా నగదును విరాళంగా అందజేశారు.

డైనింగ్ హాలులో భోజనం చేస్తున్న విద్యార్థులు

జన్మభూమి సేవలో తరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రవాస భారతీయులుగా ఉన్న ముగ్గురు అన్నదమ్ములు. మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లికి చెందిన రామిరెడ్డి రామలక్ష్మమ్మ, గంగిరెడ్డి దంపతులకు నలుగురు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. వీరిది వ్యవసాయ కుటుంబం. మగపిల్లలు గ్రామంలోనే ప్రాథమిక విద్యనభ్యసించారు. రామిరెడ్డి ఓబుల్‌రెడ్డి డాక్టర్‌గా, శ్రీనివాసులురెడ్డి, చార్టెడ్ అకౌంటెంట్‌గా, కేశవరెడ్డి, గుండె డాక్టర్‌గా అమెరికాలో స్థిరపడ్డారు. రాధాకృష్ణారెడ్డి గ్రామంలోనే ఉన్నారు.

ఉన్నత పాఠశాలల అభివృద్ధికి..

2006 నుంచి కదిరినాయుడుపల్లి కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో ఏటా విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు అందజేస్తున్నారు. ఇందుకు సంవత్సరానికి సుమారు రూ.7 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. 10వ తరగతిలో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఇంటర్ నుంచి ఇంజినీరింగ్ వరకు కార్పొరేట్ కళాశాలల్లో చదివిస్తున్నారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమయ్యే సమయంలో ప్రతి సంవత్సరం ఉదయం, సాయంత్రం అల్పాహారం అందజేస్తున్నారు. పాఠశాలలో రూ.3 లక్షలతో సరస్వతి దేవి విగ్రహం ఏర్పాటు చేయించారు. రూ.70 వేలు వెచ్చించి టీవీ, ప్రింటర్ అందజేశారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేటప్పుడు కోతుల బెడద వల్ల ఇబ్బంది పడుతుండటంతో రూ.26 లక్షల ఖర్చుతో నూతనంగా డైనింగ్ హాల్ నిర్మించారు. విద్యా వాలంటీర్‌ను నియమించి రూ.10 వేలు జీతం ఇస్తున్నారు.

గ్రామానికి చేయూత..

కదిరినాయుడుపల్లిలో రూ.6 లక్షలతో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు. వేంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. ఆసుపత్రిని స్థాపించారు. కుంటనీళ్లపాడులో గుండె వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి రూ.10 లక్షలు ఆర్థిక సాయం చేశారు.

దశదినకర్మలు
మా తండ్రిగారైన
శ్రీ కనుపర్తి రాధాకృష్ణమూర్తి గారు
స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సర పుష్యమాసం శుద్ధ పాడ్యమి తేది: 21-12-2025 ఆదివారం తెల్లవారుఝాము 2-15 గం॥లకు స్వర్గస్తులైనారు.
తేది: 29-12-2025 సోమవారం నుండి తేది: 31-12-2025 బుధవారం వరకు దశదినకర్మ కార్యక్రమాలు నెల్లూరు, ట్రంకురోడ్డులోని టి.వి.ఎస్. బ్రాహ్మణ కర్మక్రతువుల సత్రము నందు జరుగును.
కావున తెలియజేయడమైనది.
కీ॥శే॥ కనుపర్తి రాధాకృష్ణమూర్తి గారు
రిటైర్డ్ పోస్టుమాస్టర్
ఇట్లు : కె.డి. కృష్ణకుమార్ (పెద్ద కుమారుడు)
Cell: 99635 17910

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
పదవీ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి: 800 800 1790

(c) eenadu

ఈనాడు క్రికెట్ సమరానికి సై

నేటి నుంచి పోటీలు ప్రారంభం

నెల్లూరు(క్రీడా విభాగం), న్యూస్‌టుడే: క్రీడాకారులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది. ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్- 2025' జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానం వేదికగా ప్రారంభం కానున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు 'ఈఎస్ఎల్' వేదికగా నిలుస్తోంది. ఇప్పటికే అతి పెద్ద టోర్నీగా 'గిన్నిస్ రికార్డ్స్'లో చోటు సాధించిన మెగా ఈవెంట్‌లో భాగస్వాములయ్యేందుకు జిల్లాకు చెందిన యువ క్రికెటర్లు సత్తా చాటుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ప్రతిభ చూపి ప్రత్యర్థులపై పైచేయి సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నాకౌట్ పద్ధతిలో ఈ నెల 29 నుంచి జనవరి 8వ తేదీ వరకు జిల్లాస్థాయిలో క్రికెట్ సమరం జరగనుంది. ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలోని రెండు మైదానాల్లో పోటీలు జరుగుతాయి. గ్రౌండ్-1లో సీనియర్ జట్లకు, గ్రౌండ్-2లో జూనియర్ జట్లకు పోటీలు ఉంటాయి.

నారాయణ మెడికల్ కాలేజీ & హాస్పిటల్ చింతారెడ్డిపాళెం, నెల్లూరు.

మ్యాచ్‌ల వివరాలు (29-12-2025)

సీనియర్స్ A.C. Stadium (Ground-1)

- విక్రమ సింహపురి యూనివర్సిటీ, కావలి X ఆదిశంకర ఇంజినీరింగ్ కాలేజీ, నార్తురాజుపాళెం 8.30 A.M.
- కృష్ణ చైతన్య డిగ్రీ కాలేజీ, నెల్లూరు X శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీ, నార్తురాజుపాళెం 11.00 A.M.
- శ్రీ వై.కె.ఆర్.&కె ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, కోవూరు X డి.బి.ఎస్. ఇంజినీరింగ్ కాలేజీ, కావలి 2.00 P.M.

జూనియర్స్ A.C. Stadium (Ground-2)

- బి.ఎస్.ఆర్. జూనియర్ కళాశాల, ఆత్మకూరు X వివేకానంద జూ॥ కళాశాల, స్టోన్‌హౌస్‌పేట 8.30 A.M.
- విజ్ఞాన్ జూనియర్ కళాశాల, పొదలకూరు X శ్రీ వివేకా జూ॥ కళాశాల, కందుకూరు. 11.00 A.M.
- ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వెంకటేశ్వరపురం X ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆత్మకూరు 2.00 P.M.

Title Sponsor
Dhanik Bharat Educational Institutions
— The Lloyd Group Initiative —
Protein Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ
NECC (Non-Govt. Public Charitable Trust)
"Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner
CMR SHOPPING MALL
The joy of life
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా | కర్ణాటక
Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)
Regional Sponsor
City Chalapathi Institute of Technology
AUTONOMOUS
MOTHADAKA CAMPUS
District Sponsor
RAO'S EDUCATIONAL INSTITUTIONS NELLORE
Digital Partner
ఈనాడు.నెట్
ETV BHARAT
TV Partner
ETV ఆంధ్రప్రదేశ్
Organised by
ఈనాడు

కనీస అభ్యసన సామర్థ్యం పెరిగేలా సాధన

న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం

పాఠశాల విలీనాల పేరుతో ప్రాథమిక విద్యను నిర్లక్ష్యం చేసిన వైకాపా ప్రభుత్వంలో ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలు తగ్గాయి.. కనీసం మాతృభాషలో కూడా చదవడం, రాయడం రావడం లేదని కూటమి ప్రభుత్వం గుర్తించి సర్కారు పాఠశాలల్లో జీఎఫ్ఎల్ఎన్ (గ్యారంటీడ్ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ) ప్రవేశపెట్టింది.. సర్కారు పాఠశాలల్లో విజయవంతమైతే ప్రాథమిక దశలోనే నాణ్యమైన విద్య అందుతుంది. ఉన్నత తరగతుల్లో వారు ఎదుర్కొనే అభ్యసన ఇబ్బందులు దూరమవుతాయి.

● ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు కొంతమంది తమ పేరు తప్ప కుటుంబ సభ్యుల పేర్లు తెలుగులో సైతం తప్పులు రాస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా ప్రాథమిక స్థాయిలో చదవడం, రాయడం రావడం లేదు. ప్రాథమిక అంశాలపై పట్టులేక బడి వారికి భారంగా భావించి మానేస్తున్న సంఘటనలు కోకొల్లలు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం జీఎఫ్ఎల్ఎన్ ప్రవేశపెట్టింది. ఇప్పటికే విద్యాశాఖ ప్రత్యేక బోధనోపకరణాలు, చార్టులు, ప్రతి పాఠశాలకు అందించగా బోధన చేస్తున్నారు.

బోధిస్తున్న ఉపాధ్యాయిని

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు	2291
విద్యార్థులు	73730
ప్రత్యేక బోధన	75 రోజులు

ప్రాథమిక నైపుణ్యాల సాధన..

● 1 నుంచి 5 తరగతుల్లో చదువుతున్న విద్యార్థులందరూ కనీస అక్షరాస్యత(చదవడం, రాయడం) గణితంలో పట్టు సాధించేలా చేయడం ప్రధాన లక్ష్యం. ● డిసెంబరు నుంచి మార్చి 2026 వరకు 75 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నారు. ● కేంద్ర ప్రభుత్వ 'నిపుణ్ భారత్' మార్గదర్శకాలకు అనుగుణంగా, ప్రతి బిడ్డ వయస్సుకు తగ్గ అభ్యసన సామర్థ్యాలను పొందేలా చూడడం. ● పాఠశాలలో ఉదయం రెగ్యులర్ సిలబస్ బోధిస్తూ, మధ్యాహ్నం సెషన్లను పూర్తిగా జీఎఫ్ఎల్ఎన్ కృత్యాల కోసం కేటాయించారు. ● విద్యార్థుల నైపుణ్యానికి అనుగుణంగా స్ట్రీమ్, మౌంటెన్, స్కై అనే మూడు స్థాయిలుగా విభజించి శిక్షణ ఇస్తున్నారు. భాషా సామర్థ్యాలను పెంపొందించేలా చేస్తున్నారు.

☛ ఎంఈవో **దిలీప్‌కుమార్** మాట్లాడుతూ... ప్రతి పాఠశాలలో 1 నుంచి 5 తరగతుల లోపు పిల్లలకు జీఎఫ్ఎల్ఎన్ 75 రోజుల కార్యక్రమాన్ని చక్కగా జరిపించాలన్నారు. మార్చి నాటికి కనీస అభ్యసన స్థాయి విద్యార్థులు అందుకోవాలని తెలిపారు.

పే అండ్ అకౌంట్స్ ఉద్యోగులకు అండగా ఉంటాం

విజయవాడ : రాష్ట్రంలో పే అండ్ అకౌంట్స్ ఉద్యోగులకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్‌లో ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సర్వీస్ రూల్స్, రేషియో ఫిక్సేషన్, పదోన్నతులు, అడిషనల్ ఛార్జ్ తదితర దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. హరనాథ్ మాట్లాడుతూ.. నూతన జిల్లాల్లో ఎన్నికలు నిర్వహించి, సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. విద్యాసాగర్‌ను సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. కోఆప్షన్‌ద్వారా నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పమ్మి శ్రీనివాస్ (విశాఖపట్నం), కార్యదర్శులుగా జె. స్వామి (విజయవాడ), మోహనరావు(విజయనగరం) ఎన్నికయ్యారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

దర్గా వద్ద భక్తుల యాతన

అనుమసముద్రంపేట : జిల్లాలోనే ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన ఏఎస్ పేట దర్గాకు వివిధ రాష్ట్రాల నుంచి నిత్యం భక్తులు వస్తుంటారు. సెలవు రోజుల్లో బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాలు వందల సంఖ్యలో వస్తుండడంతో రద్దీ ఎక్కువగా ఉంటోంది. దర్గాకు వెళ్లే రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తోంది. రెండేళ్ల క్రితం గ్రామంలో ఆక్రమణలు తొలగించి అండర్ పైపులైన్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా అధికారులు పూర్తి చేయకుండా వదిలేశారు. నగారఖానా నుంచి దర్గా రెండో గేటు వరకు పైపులు వేసి మధ్యలో వాల్వులు ఏర్పాటు చేశారు. వాటిని సక్రమంగా కొలతల మేరకు చేయనందున తరచూ వాల్వులు వ్యర్థాలతో నిండి మురుగు నీరు రోడ్డుపైకి వస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, గ్రామస్థులు దుర్వాసనతో నరకయాతన పడుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ.. వాల్వుల వద్ద చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పడేస్తుంటారని, పలుమార్లు పారిశుద్ధ్య సిబ్బందితో తీయించామని, దర్గా రోడ్డులో పరిశీలించి వాల్వుల వద్ద పూడిక తీయిస్తామన్నారు.

దాతల సహకారంతో తరగతి గది నిర్మాణం

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నెల్లూరు రూరల్‌లోని కొండ్లపూడి గ్రామంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఇప్పటికే రూ.75 లక్షలు అభివృద్ధి పనులకు కేటాయించారని తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఈ గ్రామంలోని సంగం గిరిజన కాలనీలో దాతల సహకారంతో నిర్మించిన తరగతి గదిని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

నెల్లూరు, హరినాధపురం, 2వ వీధి నాగసాయి మందిరం రోడ్డు దగ్గర 3 అంతస్తుల బిల్డింగ్ అమ్మకమునకు కలదు. నెలకు 80 వేలు అద్దె వచ్చును. ✆ 98490 54028, 80950 83977.

PLOT FOR SALE

ఆత్మకూరు బస్టాండ్ Opp: అల్లీపురం కొత్త కాలువ సెంటర్ 3వ మైలు, పొదలకూరు దగ్గర నుడా అప్రూవ్డ్ ప్లాట్స్ అం॥ లక్ష, స్పాట్ రి॥, బ్యాంకు లోన్. ✆9121459131

JOBS

Wanted B.com/ M.com/ MBA Finance/ CA IPCC Droupouts to be Work as Field Executive in Nellore in a Reputed Audit Firm. Interested Persons (Male only) ✆ 70135 11502. or mail: kowthahr@gmail.com

ఫీల్డ్ సూపర్‌వైజర్స్ కావలెను. సెక్యూరిటీ ఏజెన్సీ నందు పనిచేయుటకు. వ॥30-40, ఏదైనా డిగ్రీ, టూవీలర్ మస్ట్. (రిటైర్డ్ ఆర్మీ) జీ॥ 15-20వేలు. ✆ 72880 04466

లేడీ / జెంట్స్ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. నెల్లూరు టౌన్‌లో పనిచేయుటకు 12Hr డ్యూటీ, జీతం: 13,000/-. Contact ✆ 72880 04466-77

కేర్‌టేకర్ ముస్లిం మహిళ కావలెను. సీనియర్ సిటిజన్‌ని చూసుకోవటానికి & సర్వీసు చేయటానికి మాత్రమే కావలెను. కందుకూరు. Ph: 9398058081

ప్రముఖ సోలార్ సంస్థలో పనిచేయుటకు మార్కెటింగ్ మేనేజర్లు, లేడి టెలీకాలర్స్, టెక్నీషియన్స్ కావలెను. జీతం+ PF. సెల్: 90007 31560.

ఉద్యోగం చేస్తూనే అదనపు ఆదాయం కోసం చూస్తున్నారా? నిరుద్యోగులు, మహిళలు పార్ట్‌టైమ్ లేక ఫుల్‌టైమ్ ఖాళీ సమయాల్లో పనిచేస్తూ డబ్బు సంపాదించాలని అనుకుంటున్నారా? సంప్ర: 85003 53577.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జీస్, వార్డెన్స్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకొరకు సంప్ర. ✆ 89784 80429.

FACULTY/ TEACHERS

Wanted Teachers Part / full time for HS English, Biology, Sciences for 1 to X Salary negotiable. Sadhana School Nellore. Contact ✆ 8143000001

DRIVERS

గూడ్స్ ఆటోకి అనుభవం, లైసెన్స్, బ్యాడ్జ్ కలిగిన డ్రైవర్లు కావలెను. శ్రీ దుర్గా ఫుడ్స్, నెల్లూరు. Contact ✆ 88854 23099

ACCOUNTING

GST ఫైలింగ్, ట్యాలీ 5 సం॥ అనుభవం కల్గిన లేడీ అకౌంటెంట్ కావలెను. మంచి జీతం. కనకమహల్ సెంటర్, నెల్లూరు. ✆ 93471 02660, 74163 96773

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటన కర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
వివరాలకు..
నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 600
Colour : రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

వాలిన గేట్లు.. వాహనదారుల ఇక్కట్లు

కోవూరు మండలం పడుగుపాడులో ప్రధాన రోడ్డుపై ఇనుప గేట్లు ఏర్పాటుచేశారు. కొద్ది రోజులకు అవి ఓ వైపునకు ఒరిగిపోయాయి. దీంతో వాహనదారులు ఏ సమయంలోనైనా గేట్లు పడిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, విడవలూరు

కూలితేనే స్పందిస్తారా..!

మండల పరిధిలోని పోతిరెడ్డిపాలెంలో శిలాఫలకం ప్రమాదకరంగా ఉంది. విరిగి విద్యుత్తు స్తంభంపై ఒరిగిపోయింది. ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

నాడు నిర్లక్ష్యం.. నేడు వేగవంతం

బుచ్చి వాసులకు తాగునీరందించే అమృత్ 2.0 పనుల్లో ముందడుగు

సంగం కొండపై జరుగుతున్న జలశుద్ధి కేంద్రం నిర్మాణ పనులు

న్యూస్‌టుడే, సంగం, బుచ్చి

బుచ్చి పురపాలక ప్రజలు దాహార్తి తీర్చేందుకు రూ.85 కోట్ల వ్యయంతో జరుగుతున్న అమృత్ 2.0 తాగునీటి పథకం పనుల్లో భాగంగా సంగంలో తిరమనతిప్పపై 11 ఎంఎల్‌డీ సామర్థ్యం గల జలశుద్ధి కేంద్రం నిర్మాణ పనులు గత పాలనలో కొంత వరకు చేసి వదిలేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి వీటి పనులపై సమీక్షించారు. అనంతరం పనులు వేగంగా జరుగుతున్నాయి. భవిష్యత్తు తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పథకానికి 2023 అక్టోబరు నెల 31న భూమి పూజ చేశారు. ప్రజారోగ్యశాఖ ఆధ్వర్యంలో 18 నెలల కాలపరిమితితో పూర్తవ్వాలి. అయితే ఈ ఏడాది ప్రారంభం నుంచి కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో పనులు వేగవంతం చేశారు.

ఎస్ఎస్సార్ తాగునీటి పథకం వివరాలు..
పథకం.. అమృత్ 2.0
అంచనా విలువ.. రూ.85 కోట్లు

పనులు ముమ్మరం..

సంగం బ్యారేజి నుంచి సుమారు 1500 మీటర్ల దూరంలోని తిరమనతిప్పపై 11 ఎంఎల్‌డీ సామర్థ్యం గల కేంద్రంలో శుద్ధి చేయాలి. అందుకు అవసరమైన ఏరియేటర్, మిక్సర్ ఛాంబర్, క్లారిఫిల్ క్యూరేటర్, క్లియర్ వాటర్ సంపు నిర్మాణ పనులు 50 శాతానికి పైగా పూర్తయి ముమ్మరంగా జరుగుతున్నాయి. ఫిల్టర్ హౌస్ పునాదులకే పరిమితం కాగా, గ్రౌండ్ లెవల్ సర్వీసు రిజర్వాయర్ ఆకృతులు లభించలేదు. త్వరలో మిగిలిన పనులు పూర్తయ్యేందుకు చర్యలు చేపట్టామని గుత్త సంస్థ ప్రతినిధులు తెలిపారు.

చేయాల్సిన పనులిలా..

- సంగం బ్యారేజీ వద్ద ఇన్‌టెక్ వెల్ నిర్మాణం పూర్తిచేయడం.
- అక్కడి నుంచి జలశుద్ధి కేంద్రం వరకు 1500 మీటర్ల పొడవునా పైపులైను ఏర్పాటు.
- సంగంలో తిరమనతిప్పపై 11 ఎంఎల్‌డీ సామర్థ్యంగల జలశుద్ధి కేంద్రం నిర్మాణం.
- పురపాలక పరిధిలో తాగునీటి పథకాల వరకు 20 కి.మీ గొట్టాలేర్పాటు.
- బుచ్చిలో వెయ్యి కిలోలీటర్లతో మూడు, 600, 300 కిలో లీటర్ల సామర్థ్యంతో ట్యాంకుల నిర్మాణం.
- వాటి నుంచి ప్రధాన సరఫరా వ్యవస్థకు, అక్కడి నుంచి ఇళ్ల వద్దకు 100 కి.మీ పొడవునా పైపులైన్ ఏర్పాటు
- 10,650 నివాస గృహాల్లో కుళాయిల ఏర్పాటు, అనుసంధానం చేయడం.

ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

కూచిపూడిలో గిన్నిస్ రికార్డు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన శ్రీ నటరాజ నాట్య మండలి ఆధ్వర్యంలో నాట్య గురువు టి.వి.దత్తేశ్వరి శిష్య బృందం హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన కూచిపూడి నాట్య ప్రదర్శనలో పాల్గొని ప్రతిభ చూపారు. 4,608 మంది కళాకారులు పాల్గొన్న ఈ ప్రదర్శన గిన్నిస్ రికార్డు సాధించింది. ఈ సందర్భంగా దత్తేశ్వరి మాట్లాడుతూ 16 మంది చిన్నారులు మా సంస్థ తరఫున ప్రదర్శన ఇచ్చారన్నారు. హెచ్ఆర్‌సీ శాఖ సౌత్ జోనల్ ఇన్‌ఛార్జి కె.ప్రేమ్‌కుమార్ అందించిన సహకారం మరువలేనిదన్నారు.

ముఫ్తీ అబ్దుల్ వహాబ్ మృతి.. సీఎం చంద్రబాబు సంతాపం



నెల్లూరు (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరంలో ప్రముఖ ఇస్లామియా పండితుడు, ఫిఖా (ఇస్లామియా న్యాయ నిపుణుడు), సమాజానికి మార్గదర్శకుడిగా పేరుగాంచిన హజ్రత్ మౌలానా ముఫ్తీ అబ్దుల్ వహాబ్ ఖాసిమీ రషాది (రహిమహుల్లాహ్) ఆదివారం మృతి చెందగా.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంతాపం తెలిపారు. ఆయన దూరమయ్యారని తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యాయని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆయన జీవితంలో ఆరు దశాబ్దాలకు పైగా ఇస్లామియా విద్య, ఖురాన్-హదీస్ బోధన, జామియా నూరుల్ హుదా మదర్సా సేవకు అంకితం చేశారన్నారు. తబ్లీక్-ఎ- జమాత్ రాష్ట్ర అధ్యక్షుడిగా 50 ఏళ్లకు పైగా పనిచేశారు. 2008 నుంచి రాష్ట్ర జమాతే ఉలేమా గౌరవాధ్యక్షుడిగా కొనసాగారు. మూలాపేట జామియా నూరుల్ హుదా అరబిక్ కాలేజీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా కీలకపాత్ర పోషించారు. ● ఆయన మృతికి విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఎక్స్‌లో సంతాపం వ్యక్తం చేశారు.

● అబ్దుల్ వహాబ్ మృతికి మాజీ ముఖ్యమంత్రి జగన్ విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం తీరనిలోటని పేర్కొన్నారు. ఇస్లామియా పండితుడు, న్యాయ నిపుణుడైన అబ్దుల్ వహాబ్ జీవితమంతా ఇస్లాం మత ప్రబోధకుడిగా పనిచేశారని తెలిపారు. ఆయన మృతి సమాజానికి, తనకు వ్యక్తిగతంగా తీరని లోటని వక్ఫ్ బోర్డు రాష్ట్ర ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు.

కామాక్షితాయికి బంగారు లక్ష్మీ కాసుల హారం

బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడ కామాక్షితాయికి నెల్లూరుకు చెందిన పొండ్ల రాజేశ్వరి 36.770 గ్రాముల బంగారు లక్ష్మీ కాసుల హారాన్ని ఆలయ అధికారి మురళీకృష్ణకు ఆదివారం అందించారు. అధికారులు దాతలకు ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు చేయించారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర: (3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	రూ. 13,333
సవర ధర:	రూ. 1,06,664
వెండి గ్రాము :	రూ. 258.00

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	160
లేయర్	110
బ్రాయిలర్స్	278
బ్రాయిలర్స్‌స్కిన్‌లెస్	306
లేయర్ మాంసం	187

మీ పల్లె ప్రగతి తెలుసుకోండి?

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

పల్లెసీమలు ప్రగతికి పట్టుగొమ్మలు... గ్రామాలు బాగుంటేనే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుంది. మీ గ్రామంలో జరుగుతున్న పనులు వాటికి ప్రభుత్వం కేటాయించిన నిధులు. దేనికి ఎంత ఖర్చు చేశారో మీకు తెలుసా..? ఈ వివరాలు తెలుసుకోవాలనే ప్రయత్నం చేసినా ఎవరూ చెప్పరు. అలాగని నిరాశ చెందాల్సిన పని లేదు. చరవాణి ద్వారా మీ గ్రామ ఆర్థిక పరిస్థితి.. ప్రగతి వివరాలు సులువుగా తెలుసుకోవచ్చు.

జనాభా ప్రాతిపదికన..

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో అభివృద్ధి, ప్రగతి కార్యక్రమాలను నిర్వహించడానికి ఏటా నిధులు కేటాయిస్తోంది. పంచాయతీలో జనాభా ప్రాతిపదికన తలసరి లెక్కించి విడుదల చేస్తారు. ఈ మొత్తంలో ప్రజల అవసరాలు తీర్చేలా పనులు చేపట్టడం పంచాయతీల బాధ్యత. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుద్దీపాలకు ఎక్కువగా వెచ్చిస్తుంటారు.

స్వరాజ్ యాప్‌లో వివరాలు..

ఊరి సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు '2020'లో కేంద్ర ప్రభుత్వం 'గ్రామ స్వరాజ్య' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్లే-స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీలను వరుసగా ఎంచుకోవాలి. అనంతరం అప్రూవ్డ్ యాక్టివిటీస్‌పై క్లిక్ చేస్తే పంచాయతీల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, ఇతర పనులకు ఎంత వెచ్చించారో తెలుసుకోవచ్చు.

● కొన్ని సందర్భాల్లో యాప్‌లోనూ సమాచారం ఉండకపోవచ్చు. అప్పుడు వెనక్కివచ్చి ఫైనాన్షియల్ ప్రోగ్రెస్‌ను తెరవాలి. ఇందులో ఆర్థిక సంవత్సరాన్ని ఎంపిక చేసుకుంటే పంచాయతీకి ఎన్ని నిధులు వచ్చాయి..? ఎంత ఖర్చయింది. ఏయే పనులకు ఎంత ఖర్చు చేశారనే సమాచారం తెలుస్తుంది.

క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

విజేతలకు బహుమతులు అందజేత

నెల్లూరు (వేదాయపాలెం): మనోహర్‌రెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం బహుమతి ప్రదానం జరిగింది. అపస్మా ఆధ్వర్యంలో జిల్లా నుంచి ఆరు నియోజకవర్గాల్లోని పాఠశాలల విద్యార్థులకు 16 రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు మనోహర్‌రెడ్డి మెమోరియల్ ట్రస్టు ఛైర్మన్ దశరథరామిరెడ్డి, ట్రెజరర్ శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి మైథిలి, ట్రస్టు సభ్యులు బహుమతులు అందజేశారు.

2009 బ్యాచ్ ఎస్సైల ఆత్మీయ సమ్మేళనం

బాధిత కుటుంబాలకు రూ.8.20కోట్ల ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: వారంతా ఒకేసారి ఉద్యోగం సాధించారు.. శిక్షణ పొందారు.. ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. అంతా కలుసుకుని ఆత్మీయ ఆలింగనాలు, సరదా కబుర్లు, స్వీయచిత్రాలు తీసుకుని సందడి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో ఎస్సై(సివిల్) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కడియంలో జరిగింది. వాళ్ల స్నేహబంధం ఎప్పటికీ కొనసాగేలా 2021లో ఏపీ, తెలంగాణ ఎస్సై 2009 బ్యాచ్ పేరిట సంక్షేమ సంఘాన్ని స్థాపించారు. నాటి నుంచి నేటి వరకూ ఏటా డిసెంబరు రెండోవారంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుంటున్నారు. 2014లో ఆంధ్ర, తెలంగాణ విడిపోయిన తర్వాత కూడా సమ్మేళనాలు నిర్వహించుకుంటున్నారు. సుమారు 1,140 మంది ఎస్సైలుగా తర్ఫీదు పొందగా, అందులో 400 మంది ఆదివారం రాజమహేంద్రవరంలో కలిశారు. వీరిలో 80 మంది ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్నారు. వీరంతా ప్రస్తుతం సీఐలుగా పదోన్నతి పొందారు. మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. ఇప్పటి వరకూ ఈ బ్యాచ్‌లో మృతిచెందిన వారికి సంబంధించిన కుటుంబాలకు రూ.8.20కోట్ల సాయం చేసినట్లు తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు బ్యాచ్ అడ్మిన్, బేగంపేట పీఎస్ రేంజ్ సీఐ జి.శ్రీనివాసరావు వివరించారు.

ఆత్మీయ సమ్మేళనంలో 2009 బృంద సభ్యులు

తహసీల్దారుతో మాట్లాడుతున్న నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి

అక్రమ లేఅవుట్లకు ఎల్ఆర్ఎస్ తప్పనిసరి

కలువాయి: మండలంలో ఎక్కడైనా అక్రమ లేఅవుట్లు ఉంటే వాటిపై చర్యలు తప్పవని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కలువాయిలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం తహసీల్దార్ కృష్ణారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్, పంచాయతీ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ అనధికార లేఅవుట్లు వెంటనే ఎల్ఆర్ఎస్ చేయించుకోవాలన్నారు. వెంకటరెడ్డిపల్లిలో హెచ్ఎంగా పనిచేస్తూ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న గురుబ్రహ్మేశ్వరరావుకు కలువాయిలోని ప్రైవేట్ కల్యాణ మండపంలో సన్మాన కార్యక్రమం నిర్వహించగా నుడా ఛైర్మన్ పాల్గొన్నారు.

స్త్రీ నిధికి అర్హత కోల్పోయి అయిదేళ్లు..!

న్యూస్‌టుడే, కలువాయి, మనుబోలు

అయిదేళ్లుగా కలువాయి మండలంలో పొదుపు సంఘాలకు స్త్రీనిధి అందక అవస్థలు పడుతున్నారు.. కొన్ని గ్రామాల్లో నగదు చెల్లించకపోవడం.. సంబంధిత అధికారులు, సిబ్బంది నిత్యం పర్యవేక్షించాల్సిన వారు పట్టించుకోకపోవడంతో మహిళలు ఆర్థిక పురోగతిలో వెనుకబడ్డారు.. డీఆర్‌డీఏ పీడీ, కలెక్టర్‌కు గతంలో విన్నవించామని.. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని స్త్రీ నిధి నిధులు పునరుద్ధరించేలా చూడాలని విన్నవిస్తున్నారు.

కలువాయిలోని మహిళా సమాఖ్య కార్యాలయం

రికవరీ చేయాల్సిన వారు పట్టించుకోరా..

జిల్లాలో మారుమూల మెట్ట ప్రాంతమైన కలువాయి మండలంలో ఎక్కువమంది వర్షాధారిత పంటలపై ఆధారపడి జీవిస్తున్నారు. గతంలో ఎక్కువ మంది పొదుపు సంఘాల్లో చేరి రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక వృద్ధి సాధిస్తున్నారు. మండలంలో 1025 సంఘాల్లో 12500 మంది సభ్యులు ఉన్నారు. కేవలం దాచూరులోని 12 సంఘాల సభ్యులు నగదు సరిగ్గా కట్టకపోవడంతో వెయ్యికిపైగా సంఘాలకు స్త్రీనిధి మంజూరు చేయకుండా నిలిపేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిత్యం పర్యవేక్షించాల్సిన ఏపీఎం, సీసీ, వీవోఏలు ఇతర సిబ్బంది సరిగా చేయకుండా సంఘాలన్నింటిని ఎలా బాధ్యులను చేస్తారని ప్రశ్నిస్తున్నారు. రూ.8.5 లక్షలు చెల్లించాల్సి ఉండగా ఇటీవలి కాలంలో రూ.5 లక్షల వరకు రికవరీ చేశారు. కేవలం రూ.3.5 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. వీవోఏలు నిర్లక్ష్యంగా వ్యవహరించారని వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరుతున్నారు. ఏపీఎం రవి మాట్లాడుతూ వారం రోజుల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులు స్త్రీ నిధి రుణాలు పొందేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

(c) eenadu

కావలి

• కావలి • ఉదయగిరి • కందుకూరు

నూతనంగా ఎంపికైన కమిటీ ప్రతినిధులు

వృద్ధుల్ని ఆదరించాలి

కావలి, న్యూస్‌టుడే: వృద్ధుల్ని ఆదరించాలని కావలి ఎల్డర్స్‌క్లబ్ ప్రతినిధులు కోరారు. ఆదివారం క్లబ్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకొండయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు వృద్ధులయ్యాక వారి పోషణ బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలపై ఉంటుందన్నారు. కమిటీ అధ్యక్షులుగా పార్వతి, ఉపాధ్యక్షులుగా శారద, వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా గోపికృష్ణ, సహాయకార్యదర్శులుగా సింగయ్య, బాబురావు, విద్యాసాగర్‌లను ఎన్నుకున్నారు.

బస్సులు.. స్టేషన్‌లోకి రాకుంటే జరిమానా

కలిగిరి: స్థానిక బస్‌స్టేషన్‌లోకి రాని బస్సుల సిబ్బందికి జరిమానాలు విధిస్తున్నట్లు నెల్లూరు-1 డిపో స్క్వాడ్ అధికారి శ్రీనువాసులు తెలిపారు. ఆదివారం బస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డ్రైవర్లు, కండెక్టర్లతో మాట్లాడారు. ప్రతి బస్సు తప్పక ప్రాంగణంలోకి రావాలని, ప్రయాణికులను ఎక్కించుకోవడం, దించడం చేయాలన్నారు. తొమ్మిది బస్సులకు సంబంధించి జరిమానాలు విధించామన్నారు. ఎస్టీఐ మధుసూదన్‌రావు, టీటీఐ జైశంకర్‌లు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: లింగసముద్రంలో దోమల బెడద అధికంగా ఉంది. -ఆంజనేయులు, గ్రామస్థుడు
సమాధానం: దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. – కె.శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి ఈవో పీఆర్డీ – న్యూస్‌టుడే, లింగసముద్రం

? కలిగిరి మెయిన్ రోడ్డుపై ఉదయం, సాయంత్రం వేళల్లో దుకాణాల ఎదుట సరకుల రవాణా వాహనాలు ఆగుతున్నాయి. ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.–రంగారావు, కలిగిరి
✓ సమస్య లేకుండా చూస్తాం. – ఉమాశంకర్, ఎస్సై – న్యూస్‌టుడే, కలిగిరి

? గుడ్లూరులోని పాఠశాల ఎదురు వీధిలో సిమెంటు రహదారిపై మురుగు నీరు ప్రవహిస్తోంది. – యువరాజు, స్థానికుడు
✓ పారిశుద్ధ్య సిబ్బందికి తెలిపి సమస్య పరిష్కరిస్తాం. – చిన్నయ్య, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, గుడ్లూరు

? పట్టణంలోని కెనరా బ్యాంకు ఎదురు వీధి నుంచి 12వ సచివాలయానికి వెళ్లే దారిలో సీసీ రోడ్డు కుంగడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. – వెంకటేశ్వర్లు, స్థానికుడు.
✓ వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. – గణపతి, డీఈ
– న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

పూర్తిగా కూలేదాక పట్టించుకోరా?

బిట్రగుంట, న్యూస్‌టుడే: బోగోలు మండలం ముంగమూరు సమీపంలోని పిల్లివాగు వంతెన ప్రమాదకర స్థితిలో ఉంది. సుమారు 60ఏళ్ల కిందట నిర్మించిన ఈ వంతెన ఏటా వచ్చే వరదల ధాటికి పిల్లర్ల రాళ్లు జారిపోయి బలహీన పడుతుంది. ఇటీవల వచ్చిన వరదలకు ఒకవైపు భద్రత గోడ రాళ్లు కూడా జారిపోయాయి. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నుంచి ముంగమూరు జాతీయ రహదారి వరకు వయా ముంగమూరు మీదుగా భారీ వాహనాల రాకపోకల తాకిడి ఎక్కువగా ఉండడమూ ఒక కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇలాగే వదిలేస్తే కూలే ప్రమాదం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై కావలి ర.భ ఏఈ భరత్‌కుమార్‌రెడ్డి స్పందిస్తూ.. పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తానన్నారు.

ఆశాజనకంగా సపోటా ధరలు

ఉలవపాడు, న్యూస్‌టుడే: ఉలవపాడు మండల పరిధిలో సపోటా కాయలకు మంచి ధర పలుకుతోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 50 కిలోల పాలరకం బస్తాకు రూ. 900, ఫారిన్ రకానికి రూ.1000 ధర ఉంది. మండలంలోని తోటల్లోని కాయలను కోసి అంతర్రాష్ట్ర మార్కెట్‌గా ఉన్న ఉలవపాడుకు తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి దళారుల ద్వారా చెన్నై, హైదరాబాద్, ఇతర నగరాలకు నిత్యం 500 నుంచి 700 బస్తాలు ఎగుమతి చేస్తున్నారు. మంచి ధర పలకడంతో రోజుకు సుమారు రూ.7లక్షల వ్యాపారం జరుగుతున్నట్లు స్థానిక వ్యాపారులు తెలిపారు.

అదే పంథా.. ఆగని దందా

ట్రాక్టరు ఇసుక రూ. అయిదు వేలు

న్యూస్‌టుడే, కందుకూరు

ఇసుక కొరత కారణంగా ఇళ్లు, భవన నిర్మాణాలు ఆగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచిత ఇసుక విధానానికి శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో స్థానిక అవసరాలకు ఎడ్ల బండ్లతో పాటు ట్రాక్టర్ల ద్వారా తీసుకువెళ్లేందుకు అవకాశం కల్పించింది. దీన్ని ఆసరాగా తీసుకుని కొందరు రాత్రి, పగలు తేడా లేకుండా తరలిస్తున్నారు. కుటీరపరిశ్రమగా మార్చుకుని లాభాలు గడిస్తున్నారు.

గుడ్లూరులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక

ఇదీ పరిస్థితి

కందుకూరు నియోజకవర్గంలో అన్ని మండలాల పరిధిలో ఉప్పుటేరు, మన్నేరులు ప్రవహిస్తుంటాయి. అక్రమార్కులు వీటిని గుల్ల చేస్తున్నారు. గుడ్లూరు మండలం గుండ్లపాలెం, గుడ్లూరు,రాళ్లపాడు, లింగసముద్రం మండలం పెదపవని, వీఆర్ కోట, వలేటివారిపాలెంలో కళవళ్ల, ఉలవపాడు మండలం బద్దిపూడి ప్రాంతాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా యంత్రాల సాయంతో తవ్వి తరలిస్తున్నారు. స్థానిక అవసరాలకు కూలీల ద్వారా ఇసుకను లోడు చేయాలి. కానీ అలా జరగడం లేదు. రోజుకు వంద ట్రాక్టర్ల చొప్పున కందుకూరు, కావలి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

ట్రాక్టర్ ట్రక్కు ఇసుక రూ.4 వేల నుంచి రూ.అయిదు వేల వరకు పలుకుతోంది. ఆ మేరకు నియోజకవర్గంలో రోజుకు రూ. నాలుగు లక్షల వరకు అక్రమ వ్యాపారం జరుగుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అనుమతులు లేకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా ఎక్కడా దాడులు చేసి స్వాధీనం చేసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

గనులశాఖ అధికారులకు తెలియజేస్తాం

బాలకిశోర్, తహసీల్దారు

ఇసుక తరలింపు విషయాన్ని గనుల శాఖ అధికారులకు తెలియజేస్తాం. అక్రమంగా తరలించకుండా నిరోధిస్తాము. నిబంధనల ప్రకారం తీసుకుని వెళ్లడానికి వీలుంది.

బస్తా యూరియా రూ.400

కావలి, న్యూస్‌టుడే: సేద్యానికి అవసరమైన రీతిలో యూరియాను సిద్ధం చేయడంతోపాటు, అధిక ధరలను విక్రయించే విషయమై వ్యవసాయశాఖ వైఫల్యం చెందిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈదఫా భారీ వర్షాల కారణంగా నాలుగైదు రోజులపాటు పొలాల్లో నీరు నిలబడిపోవడంతో తొలిగా వేసిన వరి నాట్లన్నీ చాలా వరకు దెబ్బతిన్నాయి. దీంతో మరలా నాట్లు వేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ క్రమంలో యూరియా అందుబాటులో లేక రైతులంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే అదనుగా భావించిన కొందరు ప్రైవేటు వ్యాపారులు అధిక ధరలకు విక్రయాలు చేపడుతున్నారు. కావలి పట్టణంతోపాటు మండల పరిధిలో బస్తా యూరియా రూ.266.50కాగా, రవాణా వ్యయంతో కలిపి రూ.300వరకు విక్రయించేలా ప్రైవేట్ దుకాణదారులకు అనుమతించారు. కాగా ప్రస్తుతం రూ.400కు విక్రయిస్తున్నారని రైతులు చెబుతున్నారు.

అధిక ధరలకు అమ్ముతున్నారు

– వెంకయ్య, రైతు, కావలి

కావలిలో వ్యాపారులు యూరియాను అధిక ధరలకు అమ్ముతున్నారు. అవసరం లేకున్నా డీఏపీ, ఇతర రసాయనాలను అంటగడుతున్నారు. ఖర్చులు అధికం అవుతున్నాయి. అధికారులు స్పందించి రైతులందరికీ అసలు ధరకే అందించేలా చర్యలు తీసుకోవాలి.

రూ.300కు మించి విక్రయిస్తే చర్యలు :

– సత్యవాణి, జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి

జిల్లాలో యూరియాకు ఎలాంటి ఇబ్బంది లేదు. బస్తా రూ.300మించి విక్రయించరాదు. అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం 19వేల మెట్రిక్ టన్నుల వరకు అందుబాటులో ఉంది. మరో రెండువేల టన్నుల వరకు రానుంది. ఎక్కడా కొరత లేకుండా చూస్తున్నాం.

అపూర్వ సమ్మేళనం.. ఆనందమయం

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: చిన్ననాటి స్నేహబంధాన్ని గుర్తుచేసుకుంటూ వారందరూ ఒక చోట కలుసుకున్నారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. విందు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకున్నారు.

బసినేనిపల్లి ఉన్నతపాఠశాలలో..

● మాచవరం ఉన్నత పాఠశాలలో 2000- 2005 విద్యాసంవత్సరంలో 6 నుంచి పదో తరగతి వరకు కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఉన్నతపాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు.

సీతారామపురం: బసినేనిపల్లి ఉన్నత పాఠశాలలో 1992-93లో పదోతరగతి చదివిన విద్యార్థులు పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.40వేలు విలువచేసే సౌండ్ సిస్టంను పాఠశాలకు అందజేశారు.

వేడుకల పేరుతో హల్‌చల్ చేస్తే చర్యలు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల పేరుతో డిసెంబరు 31 రాత్రి రోడ్లపై హల్ చల్ చేస్తే చర్యలు తప్పవని డీఎస్పీ సీహెచ్.బాలసుబ్రహ్మణ్యం హెచ్చరించారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్ల మీద కేకులు కోయడం, అనుమతి లేకుండా డీజేలు పెట్టడం, మద్యం తాగి వాహనాలు నడపడం, సైలెన్సర్లు లేకుండా వాహనాలు తిప్పితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాతో నిఘా ఉంటుందన్నారు. ఉత్సవాలు, ఊరేగింపులు నిషేధమన్నారు. డిసెంబరు 31 రాత్రి తమ పిల్లలు ఏం చేస్తున్నారో గమనించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఆయన వెంట సీఐలు అన్వర్‌బాషా, మంగారావు ఉన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

ఉదయగిరి, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోకుండా వాటికి దూరంగా ఉండాలని వైద్యులు కె.వేణుగోపాల్, తాహిల్‌లు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో చేస్తున్న మత్తు పదార్థాల వ్యతిరేక ఉద్యమంలో భాగంగా గోడ పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐవైఎం రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్‌మునాఫ్, స్థానిక నాయకులు తారీఖ్‌అజీజ్, హఫీజుల్లా, అజరుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆళ్వార్ల దర్శన భాగ్యం కల్పించరూ!

బిట్రగుంట, న్యూస్‌టుడే: బిలకూటక్షేత్రం కొండబిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఈశాన్యంలో ఉన్న ఆళ్వార్లను దర్శించుకునే భాగ్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.. ఈ విషయమై ఈవో రాధాకృష్ణ స్పందిస్తూ స్వామి అలంకారాలకు మందిరం ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందని, సాధ్యమైనంత త్వరలోనే నిత్యం ఆళ్వార్ల దర్శనం చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు.

ఘనంగా షహీదీ సమాగం

నెల్లూరు (మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: ధన్‌ధన్ శ్రీ గురు గోవింద్ సింగ్, ధర్మ పరిరక్షణ కోసం వీర మరణం పొందిన సాహిబ్‌జాదేల త్యాగాన్ని స్మరించుకుంటూ హరనాథపురం సాగసాయినగర్‌లో ఆదివారం పంజాబీయులు షహీదీ సమాగం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్నవారికి పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

చెత్తను తొలగించండి!

స్థానిక గంగమిట్ట వద్ద నేరేడుపల్లి రోడ్డు పక్కన వ్యర్థాలు పేరుకుపోయి డంపింగ్ యార్డును తలపిస్తోంది. వ్యర్థాలు కూడా వేస్తుండటంతో దుర్వాసన వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం, సీహెచ్‌సీలకు వెళ్లేందుకు ప్రజలు ఈ రోడ్డులోనే నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వెంటనే చెత్తను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి కె.రామారావు స్పందిస్తూ పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, వింజమూరు

ప్రమాదకరం..విద్యుత్తు పరివర్తకం

మండలంలోని చుండి ఆదర్శ పాఠశాల పక్కన విద్యుత్తు పరివర్తకానికి చుట్టూ కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాని చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్రంగా మారిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వలేటివారిపాలెం

రహదారి.. గుంతలు పడి!

వెంగళాపురం- జంగంరెడ్డిపాలెం మధ్య ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలు పడటంతో అధ్వానంగా మారింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని వాహనదారులు చెబుతున్నారు. అధికారులు స్పందించి తాత్కాలికంగానైనా మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, లింగసముద్రం

అంధకారంలో శ్యామీర్‌పాలెం

మున్సిపాలిటీ పరిధిలోని శ్యామీర్‌పాలెంలో పలు అంతర్గత రోడ్లలో వీధి దీపాలు లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలో ఎనిమిదేళ్ల క్రితమే విలీనమైనా.. నేటికీ మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నారు. స్తంభాలు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఏళ్ల తరబడి వేడుకుంటున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
–న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

లీకేజీలు.. ఇంకెన్నాళ్లు

బోగోలు పంచాయతీ కార్యాలయం ఎదుట రాజావీధిలో పలు చోట్ల మంచినీటి పథకం పైపులు, అక్కడ నుంచి ఇళ్లల్లోకి సరఫరా చేసే పైపులు పలు చోట్ల లీకై నీరు రోడ్డుపై వృథాగా పోతోంది. ప్రజలు రాకపోకలు చేసేందుకు అసౌకర్యంగా మారింది. ఎంపీడీవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సమన్వయంతో సమస్యను పరిష్కరించేలా కృషిచేస్తానన్నారు. – న్యూస్‌టుడే, బిట్రగుంట

వ్యవసాయ పనులు చేస్తుండగా.. కూలీ మృతి

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయ పనులకు వెళ్లి అక్కడే కుప్పకూలి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థుల వివరాల మేరకు మోపాడుకు చెందిన తోకల శ్రీను (42) లింగసముద్రం మండలం చినపవనిలో వరి నాట్ల పనులకు ఆటోలో కూలీలను తీసుకుని వెళ్లారు. పొలంలో వరినారు మోస్తూ ఒక్కసారిగా బురదలో పడిపోయారు. కూలీలు ఆయనను బయటకు తీసుకువచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

భార్యపై కత్తితో దాడి

ఉదయగిరి, న్యూస్‌టుడే: భార్యపై భర్త కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన పట్టణంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. చీపినాపి గురవయ్య, తిరుపతమ్మ దంపతులు. భర్త స్థానిక ఎంఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, భార్య పలు నివాసాల్లో పనులు చేస్తూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో ఆమెపై అనుమానం పెంచుకున్న గురవయ్య తరచూ గొడవ పడుతుండేవాడు. శనివారం అర్ధరాత్రి పూటుగా మద్యం తాగి గొడవకు దిగాడు. అనంతరం కూరగాయల కత్తితో ఆమె గొంతుపై దాడి చేసి గాయపరిచాడు. గురవయ్య తల్లి గట్టిగా కేకలేయడంతో చుట్టుపక్కల వారు అడ్డుతీసి పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని ఆమెను చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. హత్యాయత్నం కేసు నమోదుచేశామని ఎస్సై ఆల శ్రీను తెలిపారు.

కావలిలో మామపై అల్లుడు..

కావలి, న్యూస్‌టుడే: మామపై అల్లుడు దాడి చేసిన ఘటన ఆదివారం పట్టణంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని వడ్డిపాలెం కనకదుర్గ ఆలయం వద్ద యామల రామయ్య నివాసం ఉంటున్నారు. తన కుమార్తెను మద్యం తాగి ఎందుకు వేధిస్తున్నావంటూ ఆయన అల్లుడైన రాంబాబును ప్రశ్నించారు. ఆ క్రమంలో వారి మధ్య నెలకొన్న వివాదం దాడికి దారి తీసింది. ఆ మేరకు ఫిర్యాదు అందడంతో కావలి ఒకటో పట్టణ ఎస్సై ఎస్.సుమన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పలుకూరు సమీపంలో జూదస్థావరంపై గ్రామీణ పోలీసులు దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. రెండురోజుల క్రితం ఇక్కడ జూదం నిర్వహిస్తున్నారన్న సమాచారం రావడంతో ఈ దాడి చేసినట్లు ఎస్సై బాలమహేంద్రనాయక్ తెలిపారు. వారి నుంచి రూ.మూడువేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

సీతారామపురం, న్యూస్‌టుడే: పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ.సురేంద్రరెడ్డి డిమాండ్ చేశారు. సీతారామపురం కోటవీధిలోని స్పెషల్ పాఠశాలలో ఆదివారం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా 2026 సంవత్సర క్యాలెండర్, సీఎల్ పుస్తకాలను ఆవిష్కరించారు. సభ్యులు జుల్ఫికర్ అలీ, శిగె కొండయ్య, రవిచంద్ర,రామకృష్ణరాజు, వెంకటేశ్వర్లు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ చూపుతున్న ఉపాధ్యాయులు

వినియోగంలోకి తీసుకురారూ!

అల్లూరు, న్యూస్‌టుడే: అల్లూరు నగర పంచాయతీకి మంజూరయిన సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేసే ట్యాంకర్ వాహనం గత కొన్ని సంవత్సరాలుగా వినియోగానికి నోచుకోలేదు. ప్రస్తుతం అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచారు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పు పట్టే స్థితికి చేరుకుంది. అల్లూరు ప్రాంతంలో అవసరమైన వారు ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్నారు. పంచాయతీకి ఈ వాహనం ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు, స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

శాస్త్రీయ దృక్పథం పెరగాలి

కావలి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరిలోనూ శాస్త్రీయ దృక్పథం పెరగాల్సిన అవసరం ఉందని జన విజ్ఞాన వేదిక కావలి పట్టణ కమిటీ అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం 2026 నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. జేవీవీ గౌరవాధ్యక్షుడు బెజవాడ రవికుమార్, సభ్యులు పాల్గొన్నారు.

కాలమానిని ఆవిష్కరిస్తున్న జేవీవీ ప్రతినిధులు

పూడిక తీశారు.. రోడ్డుపై వదిలేశారు!

జలదంకి, న్యూస్‌టుడే: బ్రాహ్మణక్రాక అగ్రహారం సమీపంలో పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి, మట్టిని రోడ్డుపైనే వదిలేశారు. తొమ్మిదోమైలు సెంటర్ నుంచి బ్రాహ్మణక్రాక మీదుగా బిట్రగుంట, గుడ్లదొన్నకు నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఎదురెదురుగా వచ్చినప్పుడు చోదకులు అవస్థలు పడుతున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా..కాలువలో పడే అవకాశాలుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మట్టిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

బ్రాహ్మణక్రాక రోడ్డుపై వేసిన పూడిక మట్టి ఇలా..

రేపు గండిపాళెంలో హిందూ సమ్మేళనం

ఉదయగిరి, న్యూస్‌టుడే: మండలంలోని గండిపాళెం కోదండరామ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం హిందూ సమ్మేళన కార్యక్రమం జరుగుతుందని ఆదివారం నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ శుద్ధ చైతన్యానందగిరి స్వామీజీ తదితరులు పాల్గొంటారన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు.

కాలువ అధ్వానం.. రైతులకు కష్టం

దగదర్తి, న్యూస్‌టుడే: దగదర్తిలోని చెరువుకు అనుసంధానంగా తవ్విన ఎల్లవ కాలువ మూడు వేల ఎకరాలకు నీరందిస్తుండగా.. ప్రస్తుతం పూడికతో నిండిపోయింది. పిచ్చి మొక్కలు భారీ స్థాయిలో పెరగడంతో చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. ఉన్నత పాఠశాల సమీపంలోని కాలువపై నిర్మించిన వంతెన కుంగడంతో ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి జమ్ము, పిచ్చి మొక్కలు తొలగించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వెంకటేశ్వర్లును వివరణ కోరగా ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పిచ్చి మొక్కలతో నిండిన కాలువ

చదువుతోపాటు క్రీడలూ అవసరమే: ఎమ్మెల్యే

బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, న్యూస్‌టుడే: క్రీడలతో ఏకగ్రాత, మానసిక ఉల్లాసం అలవరుతుందని ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి అన్నారు. కావలి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుతోపాటు క్రీడలపై కూడా పట్టు సాధించాలన్నారు. నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

మలుపు.. సూచిక బోర్డులు కరవు

న్యూస్‌టుడే, కలిగిరి

కలిగిరి నుంచి గుంపర్లపాడు మీదుగా ఏ.ఎస్.పేటకు వెళ్లే మార్గంలో కొత్తపేట వద్ద మలుపు ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరగా వచ్చే వరకు కనబడడం లేదు. ప్రమాదకర పరిస్థితిని చోదకులు గుర్తించేలా సూచిక బోర్డులు లేవు. దీంతో వేగంగా వచ్చే వారు ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.



ధ్యానంతో ఆరోగ్యం

వింజమూరు, న్యూస్‌టుడే: ధ్యానంతోనే ఆరోగ్యమని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం వింజమూరులోని వేదవ్యాస వశిష్ఠ పిరమిడ్ ధ్యాన మహా శక్తి కేంద్రంలో ఆత్మజ్ఞానం కార్యక్రమం నిర్వహించారు. పిరమిడ్ మాస్టర్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రోజుకు మూడు గంటలు ధ్యానం చేస్తే రోగాలు మాయమై సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. అనంతరం ధ్యానం, శాకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

నిత్యావసరాల అందజేత

కావలి: పట్టణంలో మీకోసం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లెస్డ్‌హోంకు ఆదివారం స్మిత సందీప్ నిత్యావసరాలను అందజేశారు. సంస్థ గురించి తెలుసుకుని హైదరాబాద్ నుంచి వచ్చి 40 మంది విద్యార్థులకు నెలకు సరిపడ సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీకోసం సంస్థ నిర్వాహకులు రాయపాటి దిలీప్ ఆయనను అభినందించారు. కార్యక్రమంలో విశ్రాంత వసతిగృహ సంక్షేమాధికారి ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుకు ఊతం.. పాల ఉత్పత్తి అధికం

ట్రిపుల్ ఎస్ ఇంజెక్షన్లతో పెయ్య దూడలు

న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

పాడి రైతులకు అండగా నిలిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. పాల ఉత్పత్తి పెంచడంతోపాటు ఆదాయం పెరిగేలా పశువులకు లింగ నిర్ధారిత వీర్యం(ఎస్ఎస్ఎస్) ఇంజెక్షన్లు రాయితీపై అందజేస్తున్నారు. వీటి వల్ల 90శాతం కచ్చితత్వంతో ఆడ దూడలు ఆరోగ్యకరంగా పుడుతున్నాయని పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు.

తక్కువ ధరకే పంపిణీ

ఇప్పటికే పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో గర్భకోశవ్యాధులపై అవగాహన కల్పిస్తుండగా.. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా ప్రస్తుతం ట్రిపుల్ ఎస్ ఇంజెక్షన్లపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు అందించే లింగనిర్ధారిత వీర్యం ఇంజెక్షను గతంలో రాయితీపై రూ.500లకు అందించేవారు. కూటమి ప్రభుత్వం వీటిని రూ.150లకే అందిస్తుంది. మూడేళ్ల కాలంలో పాల దిగుబడులు 15-20శాతం పెరగడంతోపాటు రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని పశువైద్యులు చెబుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

కందుకూరు నియోజకవర్గంలో అయిదు మండలాలు ఉన్నాయి. 84,343 గేదెలు, 3,382 ఆవులు ఉన్నాయి. కాగా కందుకూరు మండలానికి 295, లింగసముద్రం 100, వలేటివారిపాలెం 95, ఉలవపాడు 200, గుడ్లూరు 200 చొప్పున ట్రిపుల్ ఎస్ ఇంజెక్షన్లను పంపిణీ చేశారు. ఇప్పటివరకు మొత్తంగా వ్యాప్తంగా 110 డోస్‌లను మాత్రమే వేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

జి.శ్రీధర్‌రావు, ఉపసంచాలకులు, పశుసంవర్ధకశాఖ, కందుకూరు

ఈ ఇంజెక్షన్ల ద్వారా 90శాతం మేలుజాతి ఆడ దూడలు పుడతాయి. తద్వారా పాలదిగుబడులు అధికంగా వస్తాయి. డివిజన్‌లో టార్గెట్ ప్రకారం రైతులకు అందిస్తున్నాం. మార్చి కల్లా లక్ష్యాలను చేరుకునేలా కృషి చేస్తున్నాం. పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలి.

(c) eenadu

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

హిందువులపై దాడులు ఆపాలి

రాపూరు, ఇందుకూరుపేట, ముత్తుకూరు, ఆత్మకూరు, న్యూస్‌టుడే: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు తగవని రాపూరు, ముత్తుకూరులో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అలాగే దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. హిందూ సమాజంపై గౌరవభావం, ఏకాత్మతా భావన, స్వధర్మం కలిగి ఉండాలని దయానంద స్వామి అన్నారు. ఇందుకూరుపేటలోని కొత్తూరులో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ సమ్మేళనం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. భాజపా మండల నాయకులు కైలాసం శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆత్మకూరులో జనవరి 4వ తేదీ నిర్వహించే హిందూ సమ్మేళనం విజయవంతానికి కృషి చేయాలని వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు అన్నారు. నిర్వహణకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

మూడు పంచాయతీల విభజనకు ప్రతిపాదన

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరు మండలంలో మూడు పంచాయతీలను ప్రతిపాదిస్తూ ఉన్నతాధికారులకు నివేదిక అందించామని జిల్లా అధికారులు తెలిపారు. మండల పరిధిలో 30 గ్రామ పంచాయతీలు 36 రెవెన్యూ గ్రామాలున్నాయి. వావింటపర్తి పంచాయతీలోని ఊచపల్లి, బత్తులపల్లిలో ఉన్న భోగసముద్రం, తాటిపర్తి పంచాయతీలో ఉన్న నల్లపాళెం, ఆనాటికండ్రిక, వరదాపురం గ్రామాలను ఒక పంచాయతీగా చేయాలని ప్రతిపాదనలు పంపారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య : మర్రిపాడు మండల పరిధిలోని ఖాదర్‌పూర్‌లో చెత్తసేకరణ రిక్షాలు నిరుపయోగంగా ఉన్నాయి. **– ఆది, స్థానికుడు**

సమాధానం : పరిశీలించి వినియోగంలోకి తీసుకొస్తాం. **– నాగేశ్వర ప్రసాద్, ఎంపీడీవో**

? ఏఎస్‌పేట మండలం చౌటభీమవరం గ్రామం నుంచి వింజమూరు, ఆత్మకూరు ప్రధాన రోడ్డు వరకు ఉన్న మూడు కిలోమీటర్లు దూరం గోతులతో నిండింది. రోడ్డుపై ద్విచక్రవాహనదారులు అవస్థలు పడుతూ వెళ్లాల్సి వస్తోంది.
– వెంకటరమణయ్య, స్థానికుడు.

✓ నిధులు మంజూరు కాగానే తాత్కాలిక మరమ్మతులు చేసి సమస్య పరిష్కరిస్తాం.
– నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి.

? అనంతసాగరంలోని ప్రభుత్వ లేఅవుట్, పూసల కాలనీల్లో కొన్ని రోజులుగా తాగునీరు సక్రమంగా రావడం లేదు. **– షౌకత్**

✓ సమస్య పరిశీలించి చర్యలు చేపడతాం.
– ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి

? తోటపల్లిగూడూరు మండల పరిధిలోని కొత్తపాలెంలో మురుగు కాలువలు అపరిశుభ్రంగా ఉన్నాయి. కనీసం శుభ్రం చేయడం లేదు. **– చంద్రశేఖర్, స్థానికుడు**

✓ సిబ్బందితో మురుగు కాలువలు శుభ్రం చేయిస్తాం. **– పద్మావతి, సర్పంచి**

? తోటపల్లిగూడూరు మండలం ఇస్కపాలెం వద్ద దొరువు పక్కనే వ్యర్థాలు పడేస్తున్నారు. దీనివల్ల దుర్గంధం వెదజల్లుతోంది. చెత్త నిల్వ చేరకుండా చర్యలు తీసుకోవాలి. **– మోహన్**

✓ పరిశీలించి చెత్త నిల్వ చేరకుండా చూస్తాం. **– చైతన్య, సర్పంచి**

? పొదలకూరు రూరల్ పరిధిలోని తోకంచి రహదారిలోని నివాసాల వద్ద గల కాలువలు నిండిపోయి మురుగు రోడ్డుపైకి ప్రవహిస్తోంది. **– పుల్లయ్య, స్థానికుడు**

✓ పంచాయతీ సిబ్బందికి చెప్పి శుభ్రం చేయిస్తాం. **– నరసింహారావు, ఎంపీడీవో**

? సంగం మండలం చెర్లోవంగల్లులో తూర్పు వైపు పొలాలకు వెళ్లే రహదారి దెబ్బతినడంతో రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. **– శ్రీనివాసులు, చెర్లోవంగల్లు**

✓ వెంటనే మరమ్మతులకు ప్రతిపాదిస్తాం. **– వినయ్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ**

? పొదలకూరులోని సంగం ప్రధాన రహదారికి ఇరువైపుల చెత్త పేరుకు పోయి దుర్గంధం వెదజల్లుతోంది. వెంటనే చెత్త తొలగించాలి. **– శ్రీరాములు, స్థానికుడు**

✓ పంచాయతీ కార్యదర్శులకు చెప్పి చెత్తను తొలగిస్తాం. **– నరసింహారావు, ఎంపీడీవో**

? మనుబోలు మండలంలోని పిడూరు గ్రామంలో పట్టపగలే వీధిదీపాలు వెలుగుతున్నాయి. పలు వీధుల్లో రాత్రిళ్లు సక్రమంగా వెలగడం లేదు. పరిశీలించి మరమ్మతులు చేపట్టాలి. **– రమణయ్య, స్థానికుడు**

✓ సమస్య పరిశీలించి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో

మెట్ట ప్రాంత అభివృద్ధికి కృషి

చేజర్ల, ఆత్మకూరు, న్యూస్‌టుడే: తమ కుటుంబాన్ని ఆదరిస్తూ ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పిస్తున్న మెట్ట ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉంటానని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. చేజర్ల మండలం నడిగడ్డ అగ్రహారానికి రూ.60 లక్షల వ్యయంతో మంజూరైన సిమెంటు రోడ్డు పనులకు ఆయన ఆదివారం భూమిపూజ చేశారు. మాముడూరులో నిర్వహించిన సభలో నియోజకవర్గంలోని 430 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు చరవాణులు అందించారు. కార్యక్రమంలో బొల్లినేని సోదరులు, ఆర్డీవో పావని, డీఎల్‌డీవో రమణయ్య, ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి, తెదేపా నాయకులు సిరాజుద్దీన్, మాజీ ఎంపీపీలు పెంచలరెడ్డి, శ్రీనివాసులు నాయుడు, మండల అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు. ● ఆత్మకూరు నియోజకవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల ద్వారా రూ.144 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి ఆనం తెలిపారు. ఆత్మకూరు మండలం వాసిలిలో సీసీ రోడ్లకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జలజీవన్ మిషన్ పరిధిలో 336 పనులు రూ.65 కోట్లతో మంజూరు చేసినట్లు తెలిపారు. ఆత్మకూరు మండలంలోనే రూ.19 కోట్లతో 76 పనులను చేపడుతున్నట్లు వివరించారు. వాసిలిలో ముంబయి రహదారి నుంచి గ్రామంలోకి రూ.49 లక్షలతో సీసీరోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు. అయిదు ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేసేందుకు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 200 గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆమోదించిందన్నారు. 761 పనులు రూ.30.72 కోట్లతో చేపడుతున్నట్లు తెలిపారు. వాసిలి ఎస్సీ కాలనీలో రూ.69.3లక్షలతో తాగునీటి పథకం నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు పద్మజకుమారి, ఎంపీడీవో రఫీఖాన్, తెదేపా నాయకులు కేశవచౌదరి తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకలి చదువులు... దాతలపైనే భారం

న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం, తోటపల్లిగూడూరు

విద్యార్థి జీవితంలో కీలకమైన మలుపు పదోతరగతి... పరీక్షల్లో విద్యార్థులంతా ఉత్తీర్ణులు కావాలని విద్యాశాఖ ఈ ఏడాది సరికొత్త సంస్కరణలు తీసుకొచ్చింది. గతంలో 45 రోజులు నిర్వహిస్తుండగా ఈ ఏడాది వంద రోజుల కార్యక్రమంగా మార్చడంతో ఉత్తమ ఫలితాల సాధనకు దోహదపడుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. విద్యార్థులను రెండు విభాగాలుగా రైజింగ్ స్టార్స్, షైనింగ్‌స్టార్స్‌గా విభజించారు.. అందరినీ షైనింగ్‌స్టార్స్‌గా తయారు చేసేలా బోధకులు కృషి చేస్తున్నారు.

● కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో 92 ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలల పరిధిలో 4236 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయనున్నారు.

రేబంటపాడులో విద్యార్థులకు అల్పాహారం ఇస్తున్న ఉపాధ్యాయులు

ఉదయం 8 నుంచి సాయంత్రం 5 వరకు..

ఉదయం 8 గంటలకే విద్యార్థులు వంద రోజుల ప్రణాళికలో భాగంగా పాఠశాలకు హాజరై సాయంత్రం అయిదు వరకూ అక్కడే ఉంటున్నారు. ఉదయం ఎంతో మంది విద్యార్థులు సక్రమంగా అల్పాహారం చేసి రావడం లేదని ఉపాధ్యాయులు గుర్తించారు. సాయంత్రం 5 వరకు పిల్లలు పాఠశాలలోనే ఉండడం మధ్యాహ్న భోజనంపైనే ఆధారపడుతున్నారు. దీంతో సాయంత్రం పిల్లలు నీరసిస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉదయం అల్పాహారం, సాయంత్రం అల్పాహారం ఏర్పాటు చేస్తే ఆకలి లేకుండా చక్కగా చదువుకుంటారని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో 99 శాతం పేదపిల్లలే విద్యనభ్యసిస్తున్నారు.

దాతలు, ఉపాధ్యాయుల ఔదార్యం...

పలుచోట్ల గ్రామాల్లోని దాతలు స్పందించి వారానికి ఒకటి, రెండు రోజులు విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం ఏర్పాటుచేస్తున్నారు. ఉపాధ్యాయులు సైతం కొన్ని పాఠశాలల్లో రోజుకొకరు అందిస్తుండగా.. కొన్ని చోట్ల సరిగా జరగడం లేదు. ఎంఈవో వసంతకుమారి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆదివారాలు, సెలవు రోజుల్లో మధ్యాహ్నభోజనం పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటుచేసిందని తెలిపారు. ఉపాధ్యాయులు, దాతలు స్పందించి అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట న్యూస్‌టుడే: ఇందుకూరుపేట మండల పరిధిలోని పల్లిపాడులోని గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. నెల్లూరు కమిటీ సభ్యుడు రవీంద్రారెడ్డి, కొత్తూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పీవీ శేషయ్య గాంధీ విగ్రహానికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆశ్రమ స్థల దాత పొనకా కనకమ్మ కమిటీ సభ్యురాలు గంపల మంజుల పట్టు, నూలు వస్త్రాలు సమర్పించారు. అనంతరం విద్యార్థులకు గాంధీ జీవిత విశేషాలను వివరించారు.

నివాళులర్పిస్తున్న విద్యార్థులు

బైకు అదుపుతప్పి యువకుడి దుర్మరణం

కోవూరు, న్యూస్‌టుడే: బైకు అదుపుతప్పి యువకుడు మృతి చెందిన ఘటన కోవూరులో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు కథనం మేరకు.. కోవూరు మండలం స్టౌబీడీ కాలనీకి చెందిన యువకుడు సమీర్(20) బుచ్చి నుంచి బైకుపై వస్తుండగా కోవూరులోని షుగర్ ఫ్యాక్టరీ సమీపంలోని శనేశ్వర ఆలయం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై ముత్యాలరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పంచనామాకు తరలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కుమారుడు మృతి విషయం తెలిసిన తల్లిదండ్రుల రోదన చూసి స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.

అధికారిక ప్రకటన వచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తాం

రాపూరు, కలువాయి, న్యూస్‌టుడే: రాపూరు, సైదాపురం, కలువాయి మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగిస్తామని అధికారిక ప్రకటన వచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని ఐకాస నాయకులు పేర్కొన్నారు. ఆదివారం రాపూరులో రిలే దీక్ష కొనసాగింది. కలువాయిలో 20వ రోజు జరిగిన రిలే దీక్షలో ఐకాస నాయకులు పాల్గొన్నారు.

కలువాయి: దీక్షలో పాల్గొన్న ఐకాస సభ్యులు

భార్యను కత్తితో పొడిచిన భర్త

దిక్కుతోచని స్థితిలో కుటుంబ సభ్యులు
అండగా నిలిచిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: కట్టుకున్న భర్తే కాలయముడయ్యాడు.. కోపంతో ఒక్కసారిగా కత్తితో భార్యను మూడు చోట్ల పొడిచిన ఘటన బుచ్చిలోని రామవరెడ్డి కాలనీలో జరిగింది. సీఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు.. పంచేడు రోడ్డులో నివసిస్తున్న హసీనాకు ఆత్మకూరుకు చెందిన సుభానీతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. కొంత కాలంగా వివాదాలు పొడచూపడంతో రెండేళ్ల క్రితం బుచ్చిలోని పుట్టింటికి వచ్చి ఇద్దరు పిల్లలతో కూలీపనులు చేసుకుంటూ జీవిస్తోంది. భర్త అప్పుడప్పుడు వచ్చి వెళుతున్నాడు. శనివారం రాత్రి వివాదం జరగడంతో భర్త ఒక్కసారిగా కత్తితో మూడు సార్లు పొడిచాడు. ఆమె కేకలు వేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా బుచ్చి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు లేరని ఒక కార్పొరేట్ వైద్యశాలకు తీసుకెళ్లగా రూ.2 లక్షలు చెల్లించాలని కోరారు. నిరుపేద కుటుంబ సభ్యులు ఏం చేయాలో తెలియక కన్నీటి పర్యంతమయ్యారు. బుచ్చి సీఐ శ్రీనివాసులురెడ్డి జరిగిన విషయం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి చెప్పారు. వెంటనే ఖర్చులు తానే భరిస్తానని మెరుగైన సేవలందించాలని నాయకులు కమలాకర్‌రెడ్డి, ఓవనేడి పెంచలరెడ్డిని ఆదేశించారు. వారు వైద్యశాల యాజమాన్యంతో మాట్లాడి శస్త్రచికిత్స చేయించగా ప్రాణాపాయం తప్పింది. వైద్య ఖర్చులు భరించి ప్రాణాలు కాపాడిన ఎమ్మెల్యేకు ఆ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్లపై వేడుకలు నిర్వహిస్తే ఊరుకోం

కోవూరు: రోడ్లపై నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. పోలీసు స్టేషన్‌లో ఎస్సై ముత్యాలరావుతో కలిసి ఆయన ఆయన మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

ఏపీటీఎఫ్ కాలమానిని ఆవిష్కరణ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 2026 సంవత్సరం క్యాలెండర్, డైరీలను శనివారం ఆర్డీవో పావని ఆవిష్కరించారు. రానున్న పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పీ4 పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ జిల్లా కమిటీ బాధ్యులు వెంగయ్య, రామసుబ్బారెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించండి

బుచ్చిరెడ్డిపాళెం, అనంతసాగరం, ముత్తుకూరు, న్యూస్‌టుడే: పదోతరగతిలో మంచి మార్కులు సాధించాలని మండల ప్రత్యేకాధికారిణి లీలారాణి తెలిపారు. బుచ్చి మండలంలోని దామరమడుగు, రేబాల, మినగల్లు, పెనుబల్లి, డీవీఎస్ఆర్ ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు, సిలబస్, వంద రోజుల కార్యక్రమంలో పరీక్షల ఇతర వివరాలు తీసుకున్నారు. ముత్తుకూరులో అధికారులు మాట్లాడుతూ వంద శాతం ఉత్తీర్ణతతో పాటు ఉత్తమ మార్కులు సాధించేలా ప్రయత్నం చేయాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళిక రూపొందించుకోవాలని ఎంఈవో-2 ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం పదోతరగతి వంద రోజుల ప్రణాళికలో భాగంగా అనంతసాగరం, మంచాలపల్లి, ఉప్పలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలను ఆయన పరిశీలించారు.

రోడ్డు అధ్వానం.. రాకపోకలకు అవస్థలు

కోవూరు మండలం నెల్లూరు బ్యారేజీ నుంచి పోతిరెడ్డిపాలెం వెళ్లే మార్గం ముఖ ద్వారం వద్ద రోడ్డు గుంతల మయంగా ఉంది. రాళ్లు తేలి అధ్వానంగా మారింది. రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు పరిశీలించి రోడ్డు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, కోవూరు**

చూస్తున్నారే తప్ప పట్టించుకోరా..

సాలుచింతల నుంచి కోవూరు వెళ్లే మార్గంలో స్టౌబీడీ కాలనీ వద్ద ఎండు చేపలు విక్రయించే చోట కొందరు ప్రైవేట్ లేఅవుట్ వేసి వదిలేశారు. పిచ్చిమొక్కలు పెరిగి విషసర్పాలు తిరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సమీపంలో దర్గాకు వెళ్లే భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. పంచాయతీ, మండల అధికారులకు ఫిర్యాదు చేసినా తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. **– న్యూస్‌టుడే, కోవూరు**

రోడ్డు ఇలా.. రాకపోకలెలా?

రాపూరు నుంచి సైదాపురం వెళ్లే రహదారిలోని జోరేపల్లికి వెళ్లే మలుపు సమీపంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు ధ్వంసమై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో రాకపోకల సమయంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురెదురుగా ప్రయాణించే సమయాల్లో వాహనాలు ఏ కొంచెం అదుపు తప్పినా ప్రమాదం జరిగే అవకాశముంది. అధికారులు స్పందించి గుంతలను తాత్కాలికంగా మట్టితోనైనా పూడ్చాలని విన్నవిస్తున్నారు. **– న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్**

ఏడేళ్లుగా అసంపూర్తిగా..

వివిధ పనుల నిమిత్తం ఏఎస్‌పేట మండల రెవెన్యూ కార్యాలయానికి, సచివాలయాలకు వచ్చే వారు అత్యవసరానికి ఉపయోగించే మరుగుదొడ్ల నిర్మాణాలు ఏడేళ్లుగా అసంపూర్తిగా ఉన్నాయి. గత పాలనలో ఒక్కోదానికి రూ.3 లక్షలు వెచ్చించగా తహసీల్దారు కార్యాలయం వద్ద ఒకటి, పశువైద్య కేంద్రం వద్ద మరొకటి నిర్మించాల్సి ఉన్నా ఎక్కడా పూర్తికాలేదు. నిధులు చాలక తలుపులు, నీటి వసతి ఏర్పాటు చేయలేదు. ఏఈ ఖాదర్‌మస్తాన్ మాట్లాడుతూ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. **– న్యూస్‌టుడే, ఏఎస్‌పేట**

పరిసరాలు శుభ్రం చేయరూ

కోవూరు మండలం పోతిరెడ్డిపాలెంలోని కమ్యూనిటీ భవనం చుట్టూ అపరిశుభ్రంగా మారింది. కొన్ని నెలలుగా వినియోగించకపోవడంతో అధ్వానంగా మారి పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. పంచాయతీ సిబ్బంది పరిశీలించి భవన ప్రాంగణం శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. **– న్యూస్‌టుడే, కోవూరు**

కొరవడిన పర్యవేక్షణ.. ప్రమాదాలతో యాతన

జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైన పొట్టు ట్రాక్టర్

● నెల్లూరు నుంచి ముత్తుకూరు మండలంలోని పరిశ్రమలకు వరి పొట్టు లోడుతో వెళుతున్న ట్రాక్టర్లు వెంకటాచలం మండలం గొలగమూడి రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రహదారిపై పడ్డ పొట్టు కారణంగా అయిదు వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరు గాయపడగా... నాలుగు వాహనాలు ధ్వంసమయ్యాయి. పొట్టు ట్రాక్టర్ల కారణంగా తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి.

న్యూస్‌టుడే, వెంకటాచలం

సురక్షిత ప్రయాణానికి మారుపేరుగా నిలవాల్సిన జాతీయ రహదారులు.. ప్రమాదాలకు నిలయాలుగా మారాయి.. పరిమితికి మించి వాహనాల్లో గ్రానైట్, ఇసుక, పొట్టు, ఇతర సరకులు నిబంధనలు పట్టించుకోకుండా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.. కనీసం ప్రమాదం జరిగిన తరువాత కూడా పర్యవేక్షించకపోవడంతో వాహనదారులు మృత్యువాత పడుతున్నారు. ● చెన్నై-కోల్‌కత, నెల్లూరు-ముంబయి జాతీయ రహదారులపై ఈ ఏడాది ప్రమాదాలు అధికంగా జరిగాయి. నిబంధనల ప్రకారం వెళ్లాల్సిన వాహనాలు నిబంధనలు పట్టించుకోకపోవడం, చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మిన్నకుండి పోవడంతో ప్రయాణికులు హడలిపోతున్నారు. రహదారిపై నిత్యం పదుల సంఖ్యలో నెల్లూరు నుంచి ముత్తుకూరు మండలంలోని పరిశ్రమలకు పొట్టు ట్రాక్టర్లు వెళుతున్నాయి. గాలికి వెనుక వస్తున్న ప్రయాణికుల కళ్లలో పడి ఒక్కసారిగా అదుపుతప్పి పడిపోతున్నారు. రహదారిపై పొట్టు ట్రాక్టర్లు నిషేధమున్నా పోలీసులు మాత్రం పట్టించుకోవడం లేదు. పొట్టు ట్రాక్టర్ల కారణంగా ప్రయాణికులు హడలిపోతున్నారు.

చెత్త తరలింపుతో దుర్వాసన

నెల్లూరు నగరం నుంచి చెత్తను నిత్యం వందలాది లారీలు, ఆటోల్లో వెంకటాచలం సమీపంలోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అయితే చెత్త తరలించే చాలా వాహనాలకు వెనుకవైపు డోర్లు ఉండడం లేదు. డోర్లు లేకపోవడం, చెత్తపై ఎలాంటి పట్టలు కప్పకపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. ప్రజలు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. రహదారిపై డోర్లు లేకుండా వెళుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ వాహనాలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి రహదారిపై ఇలాంటి వాహనాలను నిరోధించాలని కోరుతున్నారు.

తెదేపా బలోపేతానికి కృషి

మనుబోలు, ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని తిరుపతి పార్లమెంటు తెదేపా అధికార ప్రతినిధి అమీర్‌బాషా పేర్కొన్నారు. కాగితాలపూరు అడ్డరోడ్డు సమీపంలో మండల నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తెదేపా మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, నాయకులుమస్తాన్‌నాయుడు, రామిరెడ్డి, కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ● నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా ఎంపికైన చెంచు కిశోర్ బాబును పలువురు తెదేపా నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు. కోవూరు, ఇందుకూరుపేట నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, పవన్ రెడ్డి, పీఎల్ రావు తదితరులు పాల్గొన్నారు. ● నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గ తెదేపా ఉపాధ్యక్షుడు బొర్రాబాబును నెల్లూరుపాళెం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువా కప్పి సన్మానించారు

ఇందుకూరుపేటలో తెదేపా నాయకులను సన్మానిస్తున్న కార్యకర్తలు

రైతుల సమక్షంలో విచారణకు సిద్ధమా..

మనుబోలు, న్యూస్‌టుడే : పార్టీకలకతీతంగా రైతుల సమక్షంలో ఇరిగేషన్ పనులపై విచారణకు సిద్ధమా అని కనుపూరు కాలువ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ వద్దినేని మస్తాన్ నాయుడు అన్నారు. మండల పరిధిలోని కాగితాలపూరు అడ్డరోడ్డు సమీపంలో ఆదివారం ఆయన మాట్లాడారు. వైకాపా హయాంలో ఇరిగేషన్ పనుల్లో అవినీతి జరిగిందని తెలిసి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇటీవల బండేపల్లి బ్రాంచి కాలువను పరిశీలించారన్నారు. ఆ సమయంలో ఆయనకు ఆ పనుల గురించి చెప్పామన్నారు. అయితే మాజీ మంత్రి కాకాణి రాజకీయ విమర్శలు కాకుండా వైకాపా నాయకులతో వ్యక్తిగత విమర్శలకు చేయించడం సిగ్గుచేటన్నారు.

జలాశయానికి 4,407 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయంలో ఆదివారానికి ఎగువ ప్రాంతాల నుంచి 4,407 క్యూసెక్కులు వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 77.988కి 74.139 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 328.264 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 50, క్రస్ట్‌గేట్ల లీకేజీల ద్వారా 50, పవర్ టన్నల్ ద్వారా 2,600 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన కండలేరు వరద కాలువకు 2,000, దక్షిణ కాలువకు 200, ఉత్తర కాలువకు 100 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రోజుకు సగటున 275 క్యూసెక్కులు ఆవిరవుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు వివరించారు.

వైకాపా నాయకుల ఆరోపణలు తగవు

పొదలకూరు, న్యూస్‌టుడే: వైకాపా నాయకులు తమ నాయకుడు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డిపై ఆరోపించిన ఆరోపణలను నిరూపించాలని తెదేపా నాయకులు మస్తాన్‌బాబు, మల్లికార్జున్‌నాయుడు, ప్రభాకర్‌రెడ్డిలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం సాయంత్రం పొదలకూరు తెదేపా కార్యాలయంలో వారు మాట్లాడారు. వైకాపా పాలనలో చిట్టేపల్లి తిప్ప నుంచి అక్రమంగా గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకొన్న వారే తమపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వైకాపా నాయకుడికి ప్రభుత్వం రూ.20 లక్షల రికవరీ కూడా విధించిన సంగతి గుర్తు చేశారు.

ఇసుక మేట..వాహనదారుల తంటా

కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం రీచ్ నుంచి అనుమతి లేకుండా పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుక భారీగా తరలిస్తున్నారు. పెన్నానదిలో నుంచి వస్తున్న ఇసుక వాహనాలు నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై ఉన్న మలుపు వద్దకు వచ్చే సమయంలో వేగంగా తిప్పడంతో ఇసుక మొత్తం రోడ్డుపై పడుతోంది. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు గమనించక అదుపుతప్పి పడి తీవ్రగాయాలపాలవుతున్నారు. ఎన్‌హెచ్ అధికారులు, ఎంవీఐ, రెవెన్యూ అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.– **న్యూస్‌టుడే, కోవూరు**

బ్రీత్ అనలైజర్ వితరణ

సంగం, న్యూస్‌టుడే: మద్యం తాగిన వారిని తనిఖీ చేసేందుకు ఉపయోగపడే బ్రీత్ అనలైజర్‌ను మల్లి మిల్క్‌ప్రొడక్ట్స్ ఎండీ. మల్లికార్జుననాయుడు, ఈడీ బాణా శ్రీనివాసులురెడ్డి సంగం పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ వేణుగోపాల్‌కి అందించారు. రూ.40 వేల విలువైన పరికరాన్ని అందించడంతో వారిని అభినందించారు. సంగం సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్సై రాజేష్ ఉన్నారు.

సీఐటీయూ మహాసభలు జయప్రదం చేయండి

అనంతసాగరం, తోటపల్లిగూడూరు, కోవూరు, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 14వ తేదీ వరకు జరిగే సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు అన్వర్ బాషా కోరారు. అనంతసాగరంలోని బద్వేల్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు సీఐటీయూ నాయకులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. జ.వి.వే జిల్లా నాయకులు వేము పెంచలయ్య, సీఐటీయూ నాయకులు జక్రయ్య, మీరా మొహిద్దీన్, నాగమణి, సునీత, వసంత తదితరులు పాల్గొన్నారు. తోటపల్లిగూడూరు మండలం పేడూరు గ్రామం నుంచి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. టీపీ గూడూరు శ్రామిక ఉత్సవ్ పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కోవూరులోని సీతాపోలయ్య భవనంలో సీఐటీయూ మండల మహాసభలో విశాఖలో జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభలో కార్మికులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు మోహన్‌రావు పిలుపునిచ్చారు.

నరుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

తెదేపా నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

రాపూరు, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి నువ్వుల శివరామకృష్ణను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదివారం పరామర్శించారు. కండలేరులో కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతుండగా ఇంటి వద్దకెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని పేర్కొన్నారు.

పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వేలం ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, చేజర్ల మండలం, పాతపాడు గ్రామపంచాయతీ నందు గల పాతపాడు చెరువు నందు 1435వ ఫసలీకి సంబంధించి చేపలు పెంచుకొని పట్టుకొనుటకు పాతపాడు చెరువును ప్రభుత్వం ఉత్తర్వులను అనుసరించి చేపల చెరువు బహిరంగ వేలం పాటను **తేది 03-01-2026న ఉదయం 11.00 గంటలకు** గ్రామ పంచాయతీ ఆఫీసునందు నిర్వహించబడును. కావున వేలం పాటలో పాల్గొనదలచిన వారు ప్రభుత్వం వారు నిర్ణయించిన ధరావత్తు **రూ.25,000/-లను** చెల్లించి ప్రభుత్వ నిబంధనలను, షరతులను అనుసరించి వేలంపాటలో పాల్గొనవలసినదిగా పత్రికాముఖంగా తెలియజేయడమైనది.

సం/- పంచాయతీ కార్యదర్శి
పాతపాడు గ్రామ పంచాయతీ, చేజర్ల మండలం.

వేలం ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, చేజర్ల మండలం, ఓబులాయపల్లి గ్రామపంచాయతీ నందు గల ఓబులాయపల్లి చెరువు నందు 1435వ ఫసలీకి సంబంధించి చేపలు పెంచుకొని పట్టుకొనుటకు ఓబులాయపల్లి చెరువును ప్రభుత్వం ఉత్తర్వులను అనుసరించి చేపల చెరువు బహిరంగ వేలం పాటను **తేది 03-01-2026న మధ్యాహ్నం 3.00 గంటలకు** గ్రామ పంచాయతీ ఆఫీసు నందు నిర్వహించబడును. కావున వేలం పాటలో పాల్గొనదలచిన వారు ప్రభుత్వం వారు నిర్ణయించిన ధరావత్తు **రూ.25,000/-లను** చెల్లించి ప్రభుత్వ నిబంధనలను, షరతులను అనుసరించి వేలంపాటలో పాల్గొనవలసినదిగా పత్రికాముఖంగా తెలియజేయడమైనది.

సం/- పంచాయతీ కార్యదర్శి
ఓబులాయపల్లి గ్రామ పంచాయతీ, చేజర్ల మండలం.

(c) eenadu

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

ఆనందమానందమాయె!

నెల్లూరు(నగరపాలకసంస్థ): నగరవాసులు ఆదివారం ఆటపాటలతో ఆనందంగా గడిపారు. వీరికోసం ప్రభుత్వం 'హ్యాపీ సండే' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ నగర్‌లో నిర్వహించారు. శ్రీను మ్యాజిక్ షో, మిమిక్రీ, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్, లెమన్-స్పూన్ తదితర వాటిలో అధికారులు, సిబ్బంది, ప్రజలు, ఆర్ఎస్ఆర్ స్కూలు విద్యార్థులు ఆడిపాడారు. చిన్నారులు, పెద్దలు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో కమిషనర్ నందన్, అదనపు కమిషనర్ హిమబిందు, ఆరోగ్యాధికారి డాక్టర్ కనకాద్రి, కార్పొరేటర్ అరుణ పాల్గొన్నారు.

ఘనంగా పంజాబీయుల షష్ఠీ సమాగం

నెల్లూరు (మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: శ్రీ గురు గోవింద్ సింగ్, ధర్మ పరిరక్షణ కోసం వీర మరణం పొందిన సాహిబ్‌జాదేల త్యాగాన్ని స్మరించుకుంటూ హరనాథపురం నాగసాయినగర్‌లో ఆదివారం పంజాబీయులు షష్ఠీ సమాగం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

కష్టపడి చదివితే ఉన్నత స్థానం

కార్యక్రమంలో పాల్గొన్న నందన్, అధికారులు, అధ్యాపకులు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకుంటారని నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్ వై.ఒ.నందన్ ఉద్బోధించారు. నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ వసతి గృహానికి సోలార్ సిస్టమ్ అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థినులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్ఐవో డి.వి.పద్మజ, వృత్తి విద్యాశాఖాధికారి కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ రమణారెడ్డి, పూర్వ విద్యార్థినుల సంఘం కార్యదర్శి కుసుమకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాళీయమర్దనుడిగా రంగనాథ స్వామి

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: నగరంలోని రంగనాథస్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం కాళీయమర్దనుడి అలంకరణలో స్వామి దర్శనమిచ్చారు. ఉభయకర్తలతో పాటు అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈవో శ్రీనివాసులురెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వేదాయపాలెం.. రైళ్లు ఆగితే వరం

న్యూస్‌టుడే, నెల్లూరు (రైల్వే)

నగరంలోని వేదాయపాలెం రైల్వే స్టేషన్‌కు ఆదరణ బాగున్నా, రైళ్లు మాత్రం ఆగడం లేదు. దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ప్రధానస్టేషన్‌కు పరుగులు తీస్తున్నారు. వేదాయపాలెం స్టేషన్ సమీప ప్రాంతాలు విస్తరిస్తున్నాయి. వారంతా దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఎక్కువగా రైళ్లనే ఆశ్రయిస్తుంటారు. ఈ స్టేషన్‌లో టిక్కెట్ కౌంటర్, ప్లాట్‌ఫారాలు ఉన్నా పరిమిత సంఖ్యలోనే రైళ్లు ఆగుతున్నాయి. గూడూరు- సికింద్రాబాద్ మధ్య నడిచే సింహపురి సూపర్ ఫాస్ట్, తిరుపతి- ఆదిలాబాద్ మధ్య నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఉండగా, మిగిలినవి గూడూరు- విజయవాడ, నెల్లూరు- సూళ్లూరుపేట, చెన్నై- బిట్రగుంట మధ్య నడిచే పాసింజర్ రైళ్లే ఆగుతున్నాయి.

స్టేషన్‌లో రైలు ఎక్కుతున్న ప్రయాణికులు

దూర ప్రాంతాలకు వెళ్లాలంటే..

దూరప్రాంతాలకు వెళ్లే వారు ప్రధాన స్టేషన్‌కు వెళ్లాల్సి వస్తోంది. వేదాయపాలెంలో ఉదయం కృష్ణా, సాయంత్రం సింహపురి మాత్రమే ఆగుతున్నాయి. ఇక్కడి నుంచి వెళ్లే ప్రయాణికులు ఉన్నా ఆగడం లేదు. తిరుపతి, చెన్నై, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లే రైళ్లు నిలుపుదల లేకపోవడంతో ప్రయాణికులు ప్రధాన స్టేషన్‌కు వెళ్తున్నారు. విక్రమ సింహపురి, చెన్నై- విజయవాడ మధ్య నడిచే పినాకిని, చెన్నై- హైదరాబాద్ మధ్య నడిచే హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు తిరుపతి వైపు వెళ్లే వాటిని ఆపాలని ఈప్రాంత ప్రజలు కోరుతున్నారు.

తిరుపతి పాసింజరును పునరుద్ధరించాలని..

జిల్లా నుంచి తిరుపతికి నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో గుంటూరు, కాకినాడ నుంచి తిరుపతికి పాసింజర్ రైళ్లు నడిచేవి. వీటిలో పేద, మధ్యతరగతి ప్రజలు వెళ్లేవారు. కరోనా మహమ్మారి ప్రబలిన సమయంలో వీటిని నిలిపేశారు. తిరిగి ప్రారంభించకపోవడంతో తిరుపతి వెళ్లే వారికి బస్సుల్లో ప్రయాణం భారంగా మారింది. ఈనేపథ్యంలో వీటిని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

నడకతో ఆరోగ్యం

నగరంలో ప్రదర్శన చేస్తున్న వాకర్స్ సంఘం సభ్యులు

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నడకతో ఆరోగ్యం కలుగుతుందని పలువురు సూచించారు. దీని ప్రాధాన్యాన్ని వివరిస్తూ మైపాడు రోడ్డులోని శ్రీరామ్‌నగర్‌లో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. దివ్యాంగులకు వీల్‌చైర్లు, రగ్గులు పంపిణీ చేశారు. అనంతరం అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోహన్ రావు, కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా సుబ్బారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా మోహన్‌నాయుడు, కోశాధికారిగా బాలకోటయ్య, జిల్లా వాకర్స్ రేంజ్ సుధాకర్, మహిళా కార్యదర్శిగా లక్ష్మి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ డిస్ట్రిక్ట్ ఆర్‌సీ వెంకటాద్రిరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం

నెల్లూరు (జడ్పీ), న్యూస్‌టుడే: నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. పార్టీ పతాకాన్ని ఆ పార్టీ నాయకులు బాలసుధాకర్ తదితరులు ఆవిష్కరించారు. ఏఐసీసీ శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పతాకావిష్కరణలో నాయకులు

బైకు అదుపుతప్పి యువకుడి దుర్మరణం

కోవూరు, న్యూస్‌టుడే: బైకు అదుపుతప్పి యువకుడు మృతి చెందిన ఘటన కోవూరులో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కోవూరు మండలం స్టౌబీడీ కాలనీకి చెందిన యువకుడు సమీర్(20) బుచ్చి నుంచి బైకుపై వస్తుండగా కోవూరులోని షుగర్ ఫ్యాక్టరీ సమీపంలోని శనేశ్వర ఆలయం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న ఎస్సై ముత్యాలరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పంచనామాకు తరలించి వివరాలు సేకరించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలల చిత్రలేఖన పోటీలు

నెల్లూరు(జడ్పీ): సూక్ష్మ చిత్రకారుడు అమీర్ జాన్‌కు చెందిన అమీర్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నగరంలో జాతీయ స్థాయి బాలల చిత్రలేఖన పోటీలు ఆదివారం జరిగాయి. నెల్లూరు టౌన్‌హాల్‌లో జరిగిన ఈ పోటీలకు వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. పోటీల్లో జి.హరినాథ్, హర్షిత, ఎస్.జే.పాయల్, బి.సూర్యవెంకటచరణ్ వరుస స్థానాల్లో నిలిచారు. ముఖ్యఅతిథులుగా 25 కళాసంఘాల అధ్యక్షులు అమరావతి కృష్ణారెడ్డి, ధర్మాల హరిబాబు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. గుంటూరు, తిరుపతికి చెందిన విజయకుమార్, డాక్టర్ వెంకటేశ్వర్లుతోపాటు ఎన్నీఆర్ పాఠశాల అధినేత డాక్టర్ శ్రీనివాసులును సత్కరించారు.

విజేతలతో విజయభాస్కర్‌రెడ్డి తదితరులు

రోడ్లపై వేడుకలు నిర్వహిస్తే ఊరుకోం

కోవూరు: రోడ్లపై నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. పోలీసు స్టేషన్‌లో ఎస్సై ముత్యాలరావుతో కలిసి ఆయన ఆయన మాట్లాడారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

అగ్నికుల క్షత్రియ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

సమావేశంలో క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

నెల్లూరు(జడ్పీ): అగ్నికుల క్షత్రియ సంఘం క్యాలెండర్‌ను ఆసంఘం సభ్యులు ఆవిష్కరించారు. కార్యవర్గ సభ్యులు ఆదివారం నగరంలోని కామాటి వీధిలో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో సమావేశమయ్యారు. చేయాల్సిన సేవా కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు శివశంకర్, రాము, వేణుగోపాల్, చంద్రశేఖర్, హరిత, భాస్కర్ పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలపై అవగాహన

నెల్లూరు (మార్కెట్ సెంటర్): బ్యాంకులు తక్కువ వడ్డీతో ఇచ్చే రుణాలను వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని ఆడిటర్ సత్యనారాయణగుప్తా సూచించారు. నగరంలోని క్లాత్ మర్చంట్స్ భవనంలో ఆదివారం ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఆడిటర్, సభ్యులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి సుబ్బారావు, మురళీకృష్ణ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణగుప్తాను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

విద్యుత్తు నియంత్రిక.. మృత్యుఘంటిక

నగరంలోని మినీ బైపాస్ రోడ్డులో అన్నమయ్య సర్కిల్ వద్ద విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. దీని దిమ్మె ఒక వైపునకు ఒరిగింది. దీంతో నియంత్రిక పడిపోయే పరిస్థితుల్లో ఉంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు.- న్యూస్‌టుడే, నెల్లూరు (పద్మావతి సెంటర్)

కాలువ కోత.. ప్రయాణికుల కలత

నెల్లూరు నగరంలో రైల్వే స్టేషన్ ఎదురుగా సర్వేపల్లి కాలువ కట్ట కోతకు గురవుతోంది. గతంలో స్వల్పంగా ఉన్న కోత ఇటీవల కురిసిన వర్షానికి అధికమైంది. ఫలితంగా ప్రధాన రోడ్డు సైతం కుంగిపోయింది. కాలువ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో కట్ట బలహీన పడుతోంది. అధికారులు స్పందించి కోత పడిన ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, నెల్లూరు(రైల్వే)

ముఖద్వారం కట్టారు.. ప్రహరీ మరిచారు

నగరంలోని బారాషహీద్ దర్గాకు ముఖద్వారాన్ని నిర్మించారు. కానీ ఇరువైపులా ప్రహరీ గోడలు నిర్మించలేదు. దీంతో వాహనదారులు కొందరు ముఖద్వారంలో నుంచి వెళుతుండగా మరికొందరు ఇరువైపులా రాకపోకలు సాగిస్తున్నారు. ప్రహరీ నిర్మించాలని భక్తులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

పండగల సమయం.. ట్రాఫిక్ కష్టం

పండగల నేపథ్యంలో నగరంలో రద్దీ పెరిగింది. స్టోన్ హౌస్‌పేట, సండే మార్కెట్, మద్రాసు బస్టాండు, వీఆర్సీ సెంటరు, కనకమహల్ సెంటరు, గాంధీబొమ్మ, కాపు వీధి, చిన్నబజారు తదితర ప్రాంతాలు జనసంచారంతో నిండిపోతున్నాయి. రోడ్డుపైనే కార్లు, ద్విచక్రవాహనాలు నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయాలు నెలకొంటున్నాయి. - న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

తవ్వారు.. వదిలేశారు

నగరంలోని ఫత్తేఖాన్‌పేట రమేష్‌రెడ్డి నగర్‌లో మూడు నెలల క్రితం పైపు లైను నిర్మాణం కోసం రోడ్డును తవ్వారు. అప్పటి నుంచి పనులు చేయలేదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇదే ప్రాంతంలో స్కూళ్లు ఉండటంతో నిత్యం విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. - న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

మరమ్మతులైనా చేయరా?

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: నెల్లూరు గ్రామీణ పరిధిలో హరనాథపురం మీదుగా వెళ్లే ధనలక్ష్మీపురం మార్గం గుంతలమయంగా మారింది. ఈ ప్రాంతంలో కొంత భాగం నెల్లూరు కార్పొరేషన్, మరికొంత మార్గం ర.భ. శాఖ పరిధిలో ఉంది. ఆ మార్గంలో నారాయణ ఆసుపత్రి నుంచి అపోలో ఆసుపత్రి, ప్రముఖ విద్యాసంస్థలు, హాస్టళ్లు, మత్స్య కళాశాల వివిధ సంస్థల కార్యాలయాలు ఉన్నాయి. వీటికి కేవలం హరనాథపురం రోడ్డు మీదుగానే ప్రయాణికులు రాకపోకలు సాగించాల్సి ఉంది. నవంబరులో కురిసిన వర్షాలకు గుంతలమయంగా మారింది.

దారుణంగా అపోలో వైద్యశాలకు వెళ్లే మార్గం

లక్షలాదిమంది ఈ మార్గాల్లో వెళ్తుంటారు. నిత్యం రద్దీ కొనసాగుతూనే ఉంటోంది. అత్యవసరం వైద్యం కోసం పరుగులు తీయాలన్నా, గుంతల వల్ల రోగులు విలవిలలాడుతున్నారు. కొంతభాగం కార్పొరేషన్ రోడ్డు, మరికొంత భాగం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన రహదారులు ఈ మార్గంలో ఉన్నా ఇరు శాఖల అధికారులు స్పందించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇందుకు సంబంధించి నగర పాలక అధికారులు వెంటనే స్పందించి ఆర్అండ్‌బీ అధికారులతో సమావేశం నిర్వహించి కేవలం ప్యాచ్‌పనులైనా పూర్తిచేసి గుంతలు పూడ్చాలని నగర ప్రజానీకం కోరుతున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్న పోలీసులు

నగరంలో సీసీ కెమెరాలు ఏర్పాటు

నెల్లూరు (వేదాయపాలెం), న్యూస్‌టుడే: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం జెండా వీధిలో అయిదు సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ పోలీసుస్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలను సీసీ కెమెరాల నిఘాలోకి తీసుకొస్తున్నామన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్థుల కదలికలపై నిత్యం నిఘా ఉంటుందన్నారు. ఆయన వెంట ఎస్సై రజాక్, సిబ్బంది ఉన్నారు.

పెన్నమ్మా.. మన్నించమ్మా!

మురుగునీటితో కలుషితం

న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

జిల్లాకు ప్రధాన నీటి వనరు పెన్నా నది. లక్షలాది ఎకరాల సాగుతో పాటు నెల్లూరు, ఎన్నో గ్రామాలకు తాగునీరు అందిస్తున్న సహజ వనరు. ఇది కలుషితమై గరళంగా మారుతోంది. జిల్లాలో జరిగే పండగలకు వేలాది మంది ప్రజలకు పెన్నాతీరం ఆతిథ్యమిస్తోంది. ఏటా ప్రత్యేకంగా ఏటి పండగను నగరంలోని బ్యారేజి ప్రాంతంలో నిర్వహిస్తున్నారు. నెల్లూరులోని తొమ్మిది లక్షల మంది, నది చుట్టుపక్కల గ్రామాల్లోని మరో 10 లక్షల మంది గ్రామీణులకు తాగునీరు అందిస్తోంది. అలాంటి పెన్నమ్మ 15 ఏళ్లుగా కాలుష్య కోరల్లో చిక్కుకుంది. జనావాసాల్లోని మురుగు కాలువలను నదికి అనుసంధానం చేశారు. నెల్లూరు నగరంలోని వేలాది ఇళ్లలో నుంచి వచ్చే మురుగునీరు, వ్యర్థాలను నదిలో వదిలేస్తున్నారు. కోవూరు, విడవలూరు, సంగం, బుచ్చిరెడ్డిపాలెం, నెల్లూరు నగరం, కొడవలూరు తదితర

నదిలో కలుస్తున్న మురుగునీరు

ప్రాంతాల నుంచి కోళ్లు, రొయ్యల వ్యర్థాలు తీసుకొచ్చి ఇందులోనే వేస్తున్నారు. పశువుల కళేబరాలను వేస్తుండడంతో దుర్వాసన వస్తోంది. చెత్తను దహనం చేస్తుండడంతో కాలుష్య కోరల్లో చిక్కుకుంటుంది. కలుషితమైన ఈ నీరు తాగిన ప్రజలు వ్యాధులకు గురవుతున్నారు. పంటలు విషతుల్యంగా మారుతున్నాయి. అధికారులు స్పందించి నదిని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

In the Court of the Principal Senior Civil Judge : Nellore

S.O.P.No. 94 / 2025

Poondla Kamakshi, W/o P.V.Jagan Mohan, Resident of D.No. 24-6-141, Saraswathi Nagar, Dargamitta, Nellore City - Petitioner

Vs

1. Naidu Vineela W/o Late Naidu Hemantha Reddy
2. Naidu Sathvika, D/o Late Naidu Hemantha Reddy, Being Minor, rep. by her mother and guardian Naidu Vineela
3. Naidu Samhitha, D/o Late Naidu Hemantha Reddy, Being Minor, rep. by her mother and guardian Naidu Vineela
4. Naidu Girijamma, W/o Late Dasaradharami Reddy, R1, R2, R3 & R4 are resident of D.No. 25-2-433, Near Lilly Little Flower School, Vedayapalem, Nellore - Respondents

జనరల్ నోటీసు

పై నెంబరున పిటిషనరుకు తల్లిగారైన పూండ్ల మస్తానమ్మ గారు తే 20-05-2019 దిన చనిపోయి నందున, ఆమెకు రావలసిన ఈ క్రింది షెడ్యూలులో చూపిన మొత్తములను వసూలు చేసుకొనుటకుగాను పిటిషనరును ఆమె వారసురాలిగా గుర్తించి వారసత్వపు సర్టిఫికేట్ మంజూరు చేయమని కోరుతూ పై పిటిషనరు పై తెలిపిన కోర్టులో S.O.P.No. 94/2025 ను దాఖలు చేసియున్నందున, సదరు పిటిషన్‌పై ఎవ్వరికైనను ఆక్షేపణలు ఉన్న యెడల తే 21-01-2026 దిన ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినదిగా యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

SCHEDULE

Amount dues under the promissory notes dated 1-6-2017 and 2-6-2017 executed by Naidu Hemantha Reddy in favour of Poondla Masthanamma as shown in the suit in O.S.No. 18/2020 on the file of Hon'ble Prl. District Judge, Nellore as on the date of filing succession O.P. is shown here under:

1. The amount shown in suit in O.S.No. 18/2020	Rs. 77,29,000/-
Subsequent interest on Prl. Amount of Rs. 45,00,000/- at 24% p.a. from the date of suit i.e, 1-10-2020 to 4-7-2025	Rs. 51,39,000/-
	Rs.1,28,68,000

పి.ఉమామహేశ్వర్, B.Com., B.L.,
పిటిషనరు తరపు అడ్వకేట్, నెల్లూరు

మేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: నగరంలోని మెక్లిన్స్ రోడ్డు వీబీఎస్ కల్యాణ మండపం, ఖతీజా మసీదు, హబీబుల్లా తదితర వీధుల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గుంపులుగా తిరుగుతూ చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. - అబ్దుల్‌వహాబ్

సమాధానం: కుక్కలను పట్టించేందుకు వెంటనే చర్యలు చేపడతాం.
- డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? నగరంలోని పోస్టల్ కాలనీలో కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. దోమలు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయి - రమణి

✓ కాలువలను వెంటనే శుభ్రం చేయిస్తాం.
- డాక్టర్ కనకాద్రి, ఆరోగ్యాధికారి
- న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

సప్తగిరి.. కష్టాల బరి

న్యూస్‌టుడే, నెల్లూరు (పద్మావతి సెంటర్)

నగరంలోని సప్తగిరి కాలనీలో దాదాపు 1200 కుటుంబాలు ఉన్నాయి. వీరంతా తాగునీరు దొరకక అల్లాడిపోతున్నారు. కార్పొరేషన్ ఈ ప్రాంతానికి పైపు లైను కూడా వేయని పరిస్థితి ఉంది. దీంతో ఇళ్లలో బోర్లు వేసుకొని ఆ నీటితోనే కాలం గడుపుతున్నారు. క్యాను రూ.20లు పెట్టి కొనుగోలు చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కొత్త పథకానికి పైపు లైను వేసినా ఇప్పటివరకు నీరు విడుదల చేసిన పరిస్థితులు కనబడడం లేదు. నీటి కష్టాలపై కాలనీ వాసులు కలెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్‌కు అర్జీలు ఇచ్చినా పట్టించుకోలేదు. వేసవికాలంలో బోర్లలో చుక్క కూడా రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు అంటున్నారు.

ఇంట్లో ఏర్పాటు చేసుకున్న మోటారు

నాయకులు పట్టించుకోరే: వీరాస్వామి

నీటికి ఎన్నో కష్టాలు పడుతున్నాం. అధికారులు, నాయకులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. మరో నెలలో వేసవి కాలం మొదలవుతుంది. భూగర్భ జలం అడుగంటితే చుక్క నీరు దొరకడం లేదు.

రెండు నెలలుగా ఇంతే!

నెల్లూరు నగరం ఆచారివీధిలోని పాత జడ్పీ కూడలిలో ఇటీవల కురిసిన వర్షాలకు వరదనీరు వెళ్లేలా సిమెంట్‌రోడ్డు అంచును తవ్వడంతో పెద్ద గొయ్యి ఏర్పడింది. గుంతలో ఇనుప చువ్వలు ఉండటంతో ఎవరైనా ఆదమరిచి అందులో పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రద్దీగా ఉండే ప్రాంతంలో రెండు నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

గ్యాస్ లీకై మంటలు.. వృద్ధురాలికి తీవ్ర గాయాలు

నెల్లూరు (వేదాయపాలెం): గ్యాస్ లీకై మంటలు అంటుకోగా వృద్ధురాలికి తీవ్ర గాయాలైన వైనమిది. పోలీసుల కథనం మేరకు.. కుమ్మర వీధిలో షేక్ నజీనా బేగం, రెండో కుమారుడు ముత్తహర్‌తో కలిసి ఉంటున్నారు. ఆదివారం కుమారుడు బయటకు వెళ్లగా.. ఆమె వంట చేసి గ్యాస్ ఆపడం మర్చిపోవడంతో లీకవుతోంది. ఈ విషయం గుర్తించని బాధితురాలు సాయంత్రం టీ పెట్టేందుకు స్టౌ వెలిగించగా ఒక్కసారిగా మంటలు రేగాయి. ఆమె కిందపడిపోగా అంటుకోవడంతో గాయాలయ్యాయి. స్థానికులు ఆమె కుమారుడికి సమాచారం అందించారు.

పార్వీ సినిమాస్ (ఎం.ఐ) షెడ్యూల్ : స్క్రీన్ 1..అవతార్ ఫైర్ అండ్ యాష్ ..3డి (తెలుగు) స్క్రీన్ 2.. ఛాంపియన్ (తెలుగు) స్క్రీన్ 3 ..అఖండ 2 (తెలుగు) పార్వీ సినిమాస్ (స్పైస్) : స్క్రీన్..1 . వృషభ (తెలుగు), అఖండ 2 (తెలుగు) స్క్రీన్ 2. దురంధర్ (హిందీ), దండోరా (తెలుగు), ఈషా (తెలుగు) స్క్రీన్ 3 అనకొండ (తెలుగు, ఇంగ్లీష్), శంబాల (తెలుగు) స్క్రీన్.4.. ఈషా (తెలుగు), అవతార్ ఫైర్ అండ్ యాష్ ..3డి (తెలుగు) స్క్రీన్.5..ఛాంపియన్ (తెలుగు) రెయిన్ సినిమా: స్క్రీన్..1..అవతార్ ఫైర్ అండ్ యాష్ ..3డి, శంబాల (తెలుగు) స్క్రీన్..2. . ఛాంపియన్ , అఖండ 2 (తెలుగు) స్క్రీన్..3. . వృషభ, అనకొండ, ఈషా (తెలుగు) స్క్రీన్ 4. .దండోరా, ఈషా, వృషభ (తెలుగు)

తెరపై ఈనాడు

పేదల ఇళ్ల నిర్మాణంపై చంద్రబాబు కట్టు కథలు

నెల్లూరు (వేదాయపాలెం), న్యూస్‌టుడే: పేదల ఇళ్ల విషయంలో చంద్రబాబు చెప్పినవన్నీ అబద్ధాలే అని జిల్లా వైకాపా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు 18 నెలల ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణం జరగలేదని, జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జరిగిన వాటినన్నీ తన ఖాతాలో వేసుకొని ప్రచారం చేసుకుంటున్నారని వివరించారు.

రోడ్డు సరే.. హెచ్చరికలేవీ?

అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదాలు

రోడ్డుపై కానరాని సిగ్నల్, బార్డర్ గీతలు

న్యూస్‌టుడే, నెల్లూరు (నవాబుపేట)

నగరంలో మినీబైపాస్ రోడ్డుకు ఇరువైపులా అభివృద్ధి చెందడంతో వాహన రాకపోకలు పెరిగాయి. వ్యాపార, వాణిజ్య సంస్థల ఏర్పాటుతో కొనుగోలుదారులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇటీవల ఈమార్గానికి మరమ్మతులు చేశారు. శెట్టిగుంట రోడ్డు నుంచి ఆత్మకూరు బస్టాండ్, పులే విగ్రహం, ముత్తుకూరు గేటు వంతెన, అన్నమయ్య సర్కిల్, బీవీ నగర్, పడారుపల్లి ఫ్లైఓవర్ వెళ్లే వరకు రూ.14.69 కోట్లతో బాగు చేశారు.

కానరాని బోర్డులు

రద్దీ పెరిగిన నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాలను నివారించడానికి రహదారి చిహ్నాలు, బార్డర్ లైన్స్, జీబ్రా క్రాసింగ్ గీతలు వేయించాలి. సిగ్నళ్లు ఏర్పాటు చేయాలి. పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా ఎక్కడా ఇలాంటివి వేయలేదు. సరిహద్దు గీతలు లేకపోవడంతో ఆక్రమణలు ఎక్కువైపోయాయి. పలుచోట్ల వేగనియంత్రణ కోసం ఏర్పాటుచేసిన స్పీడ్ బ్రేకర్లు కనిపించేలా పెయింట్ వేయలేదు. దగ్గరకు వచ్చే వరకు కనపడక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

(c) eenadu

ముక్కోటి ఏకాదశికి ముస్తాబు

కదిరి, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. మంగళవారం వేకువజామున 3.30 గంటలకు వైకుంఠ ద్వారంలో స్వామివారి దర్శనం ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా ఏర్పాట్లు మొదలుపెట్టారు. ఆలయ వీధిలో బారికేడ్లు పెట్టారు. లోపలి భాగంలో పుష్పాలంకరణ, ఉత్తరగోపుర వైకుంఠ ద్వారాన్ని టెంకాయ మట్టలు, పూలతో తీర్చిదిద్దే పనులు చేపట్టారు. విద్యుత్తు దీపాలు, రంగుల పుష్పాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సోమవారం సాయంత్రానికల్లా అలంకరణ, ఏర్పాట్లు పూర్తయ్యేలా పనులు శరవేగంగా చేస్తున్నారు.

ఆలయంలో పుష్పాలంకరణ

భూసమస్యలకు రెవెన్యూ క్లినిక్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాలో భూ సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ క్లినిక్ ప్రారంభిస్తున్నట్లు కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నేడు (సోమవారం) జిల్లా కేంద్రంలో రెవన్యూ క్లినిక్‌ను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్లతో ఆదివారం ఆయన జూమ్ సమావేశంలో మాట్లాడి దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ క్లినిక్‌తో అడంగల్ సవరణ, మ్యుటేషన్, వన్‌బీ మంజూరు, పట్టాదారు పాసుపుస్తకాలు, అసైన్‌మెంట్ సమస్యలు, చుక్కలభూమి, సెక్షన్ 22ఎ తొలగింపు, ఇంటి స్థలాల మంజూరు, రస్తా సమస్యలు, భూసేకరణకు పరిహారం, శ్మశాన సమస్యలు, సర్వే కొలతలు, జాయింట్ ఎల్‌పీఎం వంటి సమస్యలపై డివిజన్ల వారి కౌంటర్లను ఏర్పాటు చేయాలని వివరించారు. సమస్యలను అదే రోజు పరిష్కరించాలని ఆదేశించారు. కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీని జనవరి 2 నుంచి 9 వరకు జిల్లావ్యాప్తంగా ప్రజాప్రతినిధుల సమక్షంలో చేపట్టాలన్నారు.

ఎకరా తోట.. ఆరోగ్య బాట

రొద్దం, న్యూస్‌టుడే: అభిరుచి, ఆలోచన ఉంటే ఏ రంగంలోనైనా విజయాలు అందుకోవచ్చు. ఈకోవలోనే రొద్దం పంచాయతీ పరిధిలోని కందుకూర్లపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు రమాదేవి వ్యవసాయంలో రాణిస్తున్నారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు సాగు చేస్తున్నారు. తన వ్యవసాయ బోరుబావి కింద ఎకరా పొలాన్ని కేటాయించి డ్రిప్ సాయంతో 30 రకాల కూరగాయలు పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.

● అందులో ఆకుకూరలు, క్యారెట్, ముల్లంగి, దోస, బెండ, వంకాయలు, చిక్కుడు, బీరకాయ, కాకర, గోరుచిక్కుడు తదితర 30 రకాల పంటలు పండిస్తున్నారు. పూర్తిగా రసాయనాలు మందులు తగ్గించి.. దిబ్బ ఎరువులతో పాటు సేంద్రియ విధానంతో సాగు చేస్తున్నారు.

● ఇటీవల 10 సెంట్ల స్థలంలో తీసిన రెండు క్వింటాళ్ల క్యారెట్ దిగుబడికిగాను రూ.8 వేలు ఆదాయం వచ్చింది.. ఇలా.. ఎకరా పొలంలో 30 రకాలకు చెందిన కూరగాయల దిగుబడి తీస్తున్నట్లు ఆమె చెబుతున్నారు. ప్రస్తుతం తన కుటుంబ అవసరాలతో పాటు బ్యాంకులో తీసుకున్న రుణానికి నెలసరి కంతు చెల్లిస్తున్నట్లు వివరించారు.

ముల్లంగి దిగుబడిని చూపిస్తున్న రమాదేవి

అలా వస్తారు.. ఇలా వెళ్తారు!

సచివాలయాల ఉద్యోగుల హాజరుపై నీలినీడలు

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల పనితీరు అధ్వానంగా ఉంది. చాలా మంది విధులకు డుమ్మా కొడుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. ఇలా అయితే ప్రజల సమస్యలు ఎవరు తీర్చేది? - ఈనెల 17, 18న జరిగిన కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు అసంతృప్తి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల పనితీరు అధ్వానంగా.. దయనీయంగా మారింది. అంకిత భావం, బాధ్యతగా పనిచేసే ఉద్యోగులు కొంతమేర ఉన్నా.. అధిక శాతం విధులకు డుమ్మా కొడుతున్నారు. రోజువారి 'హాజరు' నమోదు వారి పనితీరుకు అద్దం పడుతోంది. ముప్పై శాతం మంది దాకా నిర్దేశిత వేళల కంటే ఆలస్యంగా విధులకు వస్తున్నట్లు హాజరు యాప్ ద్వారా తేటతెల్లమవుతోంది. చాలా మంది ఉదయం వచ్చి.. మధ్యాహ్నమే వెళ్లిపోతున్నారు.

★ సమస్యల పరిష్కారం, కుల, ఆదాయ, 1బీ, అడంగల్.. ఇలా ప్రతి ధ్రువీకరణ పత్రం జారీ సచివాలయాల ద్వారానే కొనసాగుతోంది. మున్సిపల్, ఎంపీడీఓ, తహసీల్దారు, ఎంఈఓ, ఏఓ.. ఇలా ప్రతి మండల కార్యాలయాల ద్వారా పొందే సేవలన్నీ సచివాలయాల ద్వారానే నడుస్తున్నాయి. ఇంతటి కీలకమైన సచివాలయాల్లో ఉద్యోగుల హాజరు, పనితీరు దయనీయంగా ఉండటం విచారకరం.

జిల్లా ఉద్యోగుల హాజరు నమోదు శాతం

జిల్లా	శ్రీసత్యసాయి
22న (సోమవారం)	
గ్రామ	72
వార్డు	76
27న (శనివారం)	
గ్రామ	62
వార్డు	65



గైర్హాజరుపై చర్యలేవీ!

★ అనంత జిల్లాలో ఈనెల 22న పరిశీలించగా.. ఉద్యోగులు సమయానికి హాజరు కాలేదు. ఆ రోజు జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో 2,275 మంది సకాలంలో రాగా.. 733 మంది ఆలస్యంగా విధులకు వెళ్లారు. సాయంత్రం కేవలం 2,139 మంది మాత్రమే హాజరు నమోదు చేసుకోగా.. 205 మంది బయోమెట్రిక్ వేయలేదు. పట్టణ ప్రాంతాల్లోనూ అంతే. ఉదయం 1,068 మంది సకాలంలో వచ్చారు. 144 మంది ఆలస్యంగా వెళ్లారు. 27వ తేదీ సగానికి సగం మంది బయోమెట్రిక్ నమోదు చేసుకోలేదు.

★ శ్రీసత్యసాయి జిల్లాలో మరీ దారుణం. ఈనెల 22న గ్రామ సచివాలయాల్లో 1,748 మంది సకాలంలో విధులకు హాజరు కాగా.. 602 మంది ఆలస్యంగా వచ్చారు. పట్టణ ప్రాంతాల్లో కేవలం 610 మంది నిర్దేశిత సమయానికి రాగా 101 మంది ఆలస్యంగా వెళ్లారు. ఆలస్యంగా, విధులకు డుమ్మా కొడుతున్న వారిపై ఎలాంటి చర్యలు లేవు.

50 శాతం మించొద్దు..

ఈనెల 27వ తేదీన (శనివారం) రెండు జిల్లాల్లోనూ హాజరు శాతం చాలా తక్కువ నమోదైంది. అనంత జిల్లా కంబదూరు మండలం కంబదూరు సచివాలయం-1లో ఇద్దరు ఉంటే ఒకరూ హాజరు కాలేదు. ఇదే మండలం తిమ్మాపురం-1 సచివాలయంలో ఏడుగురు ఉంటే ఒక్కరూ హాజరు వేసుకోలేదు. వీరందరూ సెలవు పెట్టినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం మొత్తం సంఖ్యలో 50 శాతానికి మించకుండా సెలవులో వెళ్లకూడదు. శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం ఓదులపల్లి సచివాలయంలో 9మంది ఉంటే ఒక్కరూ హాజరు కాలేదు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లో నేడు సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కదిరి, పెనుకొండ, ధర్మవరం ఆర్డీవో కార్యాలయాలతో పాటు మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లోనూ సంబంధిత అధికారులు వినతులు స్వీకరిస్తారన్నారు. మరింత సమాచారం కోసం కాల్ సెంటర్ 1100కు సంప్రదించవచ్చన్నారు. ఫిర్యాదుదారుడు తప్పనిసరిగా ఆధార్‌కార్డు తీసుకురావాలని కోరారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

రైల్వే స్టేషన్లలో క్విక్ వాటరింగ్ సిస్టం

● బోగీల్లో తీరనున్న నీటికష్టాలు

గుంతకల్లు, న్యూస్‌టుడే: రైలులోని అన్ని బోగీలకు ఒకటి, రెండు నిమిషాల్లో నీటిని నింపే క్విక్ వాటర్‌రింగ్ సిస్టంను అధికారులు అమలు చేస్తున్నారు. సాధారణంగా బోగీల్లోని ట్యాంకులకు నీటిని నింపడానికి ఎక్కువ సమయం పట్టేది. ఒక్కోసారి నీరు లేకపోయినా రైళ్లను నడుపుతుంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడేవారు. ఇక నుంచి ఈ సమస్యలు ఉండవు. గుంతకల్లు డివిజన్‌లో గుంతకల్లు, గుత్తి, ధర్మవరం, కృష్ణ, రేణిగుంట, కొండాపురం, తిరుపతి స్టేషన్‌లలో కొత్త విధానాన్ని అమలు చేయడానికి అధికారులు టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. ప్రతి స్టేషన్‌కు రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్లు కేటాయించారు. గుంతకల్లు రైల్వేస్టేషన్‌కు మాత్రం రూ.9 కోట్లు కేటాయించారు. ఎస్ఎస్‌ట్యాంకు నుంచి స్టేషన్ వరకు పైప్‌లైన్ ఏర్పాటు, ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం, విద్యుత్తు మోటార్లు, టైమర్లను ఏర్పాటు చేయనున్నారు. బోగీల్లోని ట్యాంకులు నీటితో నిండగానే విద్యుత్తు మోటార్లు ఆటోమేటిక్‌గా ఆగిపోయే విధంగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. రైలు వచ్చి స్టేషన్‌లో ఆగగానే ట్యాంకులకు నింపి సకాలంలో రైళ్లు బయలుదేరి వెళ్లేలా చూడడానికి పనులు చేపడుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

విద్య, ఐక్యతతోనే కురబల అభివృద్ధి : మంత్రి సవిత

సోమందేపల్లి, న్యూస్‌టుడే: కురబలు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించడంతో పాటు కలిసికట్టుగా ఉన్నప్పుడే అన్నిరంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని బీసీ సంక్షేమ, చేనేత-జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. తన తండ్రి, మాజీ మంత్రి ఎస్.రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం అందించిన భక్త కనకదాస విగ్రహాన్ని ఆదివారం మండలంలోని రూకలపల్లిలో ప్రారంభించారు. మహిళలతో కలిసి జ్యోతుల ప్రదక్షిణ చేపట్టిన అనంతరం మంత్రి, నాయకులు విశేష పూజలు చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కురబల ఆరాధ్య దైవం కనకదాస జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు జీవో జారీ చేసిందని, గుడికట్ల పూజారుల గౌరవ వేతనం, ఆలయాల్లో దూప, దీప నైవేద్యాలకు సాయం అందించేందుకు దేవాదాయ శాఖ ద్వారా వివరాలు సేకరిస్తున్నట్లు మంత్రి చెప్పారు. గౌరవయ్యల నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సర్పంచి క్రిష్టప్ప, నాయకులు నంజప్ప, ఆంజనేయులు, తిప్పన్న, హనుమంతు, నాగరాజు, రామాంజనేయులు, సిద్ధలింగప్ప, రామకృష్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

కనకదాస విగ్రహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత, కురబ సంఘం నాయకులు

వరి విత్తనోత్పత్తి క్షేత్రంలో.. అక్రమాలపై చర్యలేవీ?

■ రూ.10 కోట్లు పక్కదారి పట్టినా ..

కణేకల్లు, న్యూస్‌టుడే: జిల్లాకే తలమానికమైన కణేకల్లు వ్యవసాయ వరి విత్తనోత్పత్తి క్షేత్రంలో రెండేళ్ల కిందట వెలుగు చూసిన అక్రమాలపై నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత క్షేత్రాధికారి కోట్ల రూపాయలు పక్కదారి పట్టించినా అధికారులు కనీస చర్యలకు ఉపక్రమించకపోవడం విమర్శలకు తావిస్తోంది. 2011లో స్థానిక విత్తనోత్పత్తి క్షేత్రం ఏడీఏగా బాధ్యతలు చేపట్టిన అధికారి కార్యకలాపాలు నడిపించారు. అనంతరం కళ్యాణదుర్గంకు బదిలీ అయినా కణేకల్లుకు ఎవరూ రాకుండా జాగ్రత్తలు పాటించి డిప్యుటేషన్ వేయించుకొని ఇన్‌ఛార్జిగా కొనసాగుతూ అక్రమాలకు తెరలేపారు. 140 ఎకరాల్లో ఏర్పాటైన క్షేత్రాన్ని తన సొంత జాగీరుగా మార్చుకొని, ప్రభుత్వానికి సొమ్మును చెల్లించకుండా పక్కదారి పట్టించాడు.

ప్రభుత్వ ఆదాయం పక్కదారి: వాస్తవానికి క్షేత్రం సాగుకు ప్రభుత్వం రివాల్వింగ్ ఫండ్ ఇస్తుంది. దిగుబడుల ద్వార వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వానికి చెల్లించాలి. ఇది ఏటా జరిగే ప్రక్రియ. కాని ఇవేమి చేయకుండా, క్షేత్రాన్ని ప్రైవేటు వ్యక్తులతో సాగు చేయించాడు. వచ్చిన దిగుబడులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాలకు సరఫరా అయ్యేవి. వాటిని అమ్మగా వచ్చిన సొమ్మును ఏటలు క్షేత్రం ఖాతాకు జమ చేస్తే.. ఇతర ఖాతాల ద్వార తన కుటుంబసభ్యుల ఖాతాలోకి మళ్లించుకున్నట్లు తెలుస్తోంది. కనిష్ఠంగా ఏటా రూ.కోటి లెక్కన పదేళ్లలో రూ.10 కోట్లు పక్కదారి పట్టించినట్లు అధికారుల అంచనా.

రెండేళ్లుగా ఉదాసీనత

ప్రభుత్వం నుంచి రివాల్వింగ్ ఫండ్ రాలేదని క్షేత్రం సాగుకు రూ.1.18 కోట్లు అప్పులు చేసినట్లు తెరపైకి తీసుకొచ్చాడు. ఈ నేపథ్యంలో క్షేత్రం సాగు ప్రశ్నార్థకంగా మారడంతో 'ఈనాడు' పలు దఫాలుగా ప్రచురించిన కథనాల ద్వార అక్రమాలు వెలుగులోకి రావడంతో అధికారులు స్పందించారు. అప్పటికే పుట్టపర్తికి బదిలీ అయిన సదరు అధికారిని పిలిపించి అప్పటి కమిషనరేట్ జేడీఏ కృపాదాస్ విచారణ చేపట్టారు. ఓటీఎస్ కింద అప్పులు రూ.78.36 లక్షలకు తీర్మానించి చెల్లించేశారు. అధికారి అక్రమాలపై విచారణ కొనసాగుతుందని చెప్పి, ఆడిట్ నిర్వహించారు. రూ.5 కోట్లకు సంబంధించి బిల్లులు లేనట్లు ప్రాథమికంగా గుర్తించారు. నేటికీ ఆడిట్ నివేదికను బహిర్గతం చేయలేదు. రెండేళ్లు కావస్తున్నా ఉన్నతాధికారులు అక్రమాలను తేల్చకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై జేడీఏ ఉమామహేశ్వరమ్మ వివరణ కోరగా అక్రమాలపై ప్రాథమిక విచారణ, ఆడిట్ నివేదిక ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది. తుది విచారణ పూర్తికాగానే సదరు అధికారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు.

రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌గా గాజుల ఆదెన్న



రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే : రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌గా జిల్లాకు చెందిన న్యాయవాది గాజుల ఆదెన్న నియామకం దాదాపు ఖరారైంది. గవర్నర్ ఆమోదం ముద్ర వేయాల్సి ఉంది. గాజుల ఎర్రమ్మ, గాజుల గోవిందప్ప కుమారుడు గాజుల ఆదెన్న. స్వస్థలం రాయదుర్గం మండలం కెంచానపల్లి. న్యాయవాది వృత్తిలో కొనసాగుతున్నారు. తన పేరును ప్రతిపాదించి, గవర్నర్ ఆమోదానికి పంపడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా ఆదెన్న కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో యోగివేమన సంతర్పణ

గాండ్లపెంట, న్యూస్‌టుడే: గాండ్లపెంట మండలం కటారుపల్లిలోని యోగివేమన ఆలయంలో ఆదివారం సంతర్పణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేమన సమాధికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో వేమన గొడుగులను ఊరేగించారు. గొడుగుల ముందు భాగంలో భక్తులు పొర్లుదండాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నందవేమారెడ్డి, కదిరి నరసింహస్వామి ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, గాండ్లపెంట ఎంపీపీ సోమశేఖర్‌రెడ్డి, వాల్మీకి విద్యాసంస్థ అధినేత పవన్‌కుమార్‌రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొడుగుల ప్రదర్శన నిర్వహిస్తున్న భక్తులు

విల్లు ఎక్కుపెడితే పతకాలే!

■ ఆర్చరీలో రాణిస్తున్న విద్యార్థినులు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: వారంతా రైతు కుటుంబాలకు చెందినవారు. ఆర్చరీ క్రీడలో అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. గత నెల అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి రెండో స్థానంలో నిలిచి పతకాలు, ప్రశంసలు అందుకున్నారు. సంకల్పం గట్టిదైతే విజయం వరిస్తుందని నిరూపిస్తున్నారు ముదిగుబ్బ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థినులు.

ఆర్మీలో ఉద్యోగం లక్ష్యం..

మాది యర్రగుంటపల్లి గ్రామం. అమ్మ లక్ష్మీ, నాన్న నారాయణస్వామి. వ్యవసాయమే ఆధారం. మొదట నేను పరుగు పందెం, లాంగ్‌జంప్ క్రీడల్లో పాల్గొన్నాను. ఆరో తరగతి చదివే సమయం నుంచి ఆర్చరీపై ఆసక్తి పెరిగింది. ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో జిల్లాస్థాయిలో రాణించాను. అండర్-17 విభాగంలో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో రాష్ట్రస్థాయి పోటీల్లో రెండో స్థానంలో నిలిచాను. ఆర్మీలో ఉద్యోగం సాధించడమే లక్ష్యం. **- మహిత**

మానసిక ఏకాగ్రత పెరుగుతుంది

లక్ష్యానికి గురిపెట్టి బాణం వేసేటప్పుడు మానసిక ఏకాగ్రత ఎంతో ముఖ్యం. ఆర్చరీ క్రీడతో మానసిక ఏకాగ్రతతోపాటు పోటీతత్వం, శారీరక బలం పెరుగుతోంది. మాది ముదిగుబ్బ. నాన్న పుల్లయ్య బొలెరో డ్రైవర్, అమ్మ గృహిణి. ఆరో తరగతిలో షూటింగ్‌బాల్, ఏడో తరగతిలో కబడ్డీలో జిల్లాస్థాయిలో రాణించాను. ఆర్చరీలో రాష్ట్రస్థాయిలో రాణించి రెండోస్థానం సాధించాను. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేలా శిక్షణ తీసుకుంటున్నాను. భవిష్యత్తులో క్రీడాకోటాలో ఉద్యోగం సాధిస్తా. **- వైష్ణవి**

జాతీయస్థాయిలో గెలవాలని..

ఆర్చరీ క్రీడలో జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నా. మాది ముదిగుబ్బ. నాన్న నల్లప్ప వీఆర్వో, అమ్మ సువర్ణ గృహిణి. మొదట షూటింగ్‌బాల్, ఫ్లోర్‌బాల్ క్రీడల్లో పాల్గొన్నా. గతేడాది అండర్-17 విభాగంలో ఫ్లోర్ బాల్ నర్సరావుపేటలో రాష్ట్రస్థాయిలో పాల్గొని రెండోస్థానంలో నిలిచాను. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. అల్లూరిసీతారామరాజు జిల్లా పాడేరులో రాష్ట్రస్థాయిలో రాణించి రెండోస్థానం సాధించాను. భవిష్యత్తులో జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలని శిక్షణ తీసుకుంటున్నాను. **- యశ్వంతకుమారి**

రెవెన్యూ సర్వీసెస్ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

పట్టణంలోని కలెక్టరేట్‌లో ఆదివారం ఏపీ రెవెన్యూ సర్వీసెస్ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఆర్.ఎన్.దివాకర్‌రావు తెలిపారు. అధ్యక్షుడిగా హిందూపురం డిప్యూటీ తహసీల్దారు ఎస్‌హెచ్‌ఎం మైనుద్దీన్, అసోసియేట్ అధ్యక్షుడిగా పెనుకొండ సబ్-కలెక్టరు ఆఫీసు డిప్యూటీ తహసీల్దారు వి.గిరిధర్, కార్యదర్శిగా పుట్టపర్తి డిప్యూటీ తహసీల్దార్ బి.వి.కల్యాణ్ చక్రవర్తి, కోశాధికారిగా కుర్ర శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు ఎన్నికైన వారిలో ఉన్నారు.

- న్యూస్‌టుడే, పుట్టపర్తి

బోగస్ వయసు ధ్రువీకరణ పత్రాలకు చెక్

■ క్రికెట్ జట్ల ఎంపికలో ప్రతిభకే పెద్దపీట

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే

ఆరోపణలు, విచారణ ఒక క్రికెటర్ వయసు 16 ఏళ్లు అయితే ఆ అబ్బాయి 14 ఏళ్ల వయోపరిమితి విభాగంలో ఆడాలని బోగస్ వయసు ధ్రువీకరణ పత్రాలు రెండు సృష్టించాడు. దీనిపై జిల్లా క్రికెట్ సంఘం సమగ్ర విచారణ చేయగా. .నకిలీవని తేలింది.

సిఫార్సులు, అందలం అండర్-14 విభాగంలో ఒక కుర్రాడు సెలెక్షన్ పోటీల్లో ఎక్కువ పరుగులు చేశాడు. వాస్తవానికి భిన్నంగా స్కోరు నమోదు చేసి ఆటగాడి అవకాశాలకు గండి కొట్టారు. కొన్ని విభాగాల్లో క్రికెటర్లకు ప్రతిభ, పరిజ్ఞానం లేకున్నా రాజకీయ సిఫార్సులతో అందలమెక్కుతుండటమే దీనికి కారణం. అనుభవజ్ఞులను పక్కన బెట్టి మిడిమిడి జ్ఞానం ఉన్నవారికే అవకాశాలుంటే ఇలాంటి వైనాలు పునరావృతమవుతాయి.

ప్రణాళిక, పారదర్శకత పై విధమైన ఆరోపణలు ఇకపై రాకుండా జిల్లా క్రికెట్ సంఘం ప్రణాళిక సిద్ధం చేసింది. పారదర్శకత తీసుకొచ్చేందుకు నూతన కార్యవర్గ సభ్యులు కొత్త విధానాలు తీసుకొచ్చారు.

కొత్త విధానాలు ఇలా..

1. అంతర్ జిల్లా క్రికెట్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఎంపిక చేసే సెలక్ట్ కమిటీల నియామకంలో రంజీ, రాష్ట్రస్థాయిలో ఆడిన సీనియర్ క్రికెటర్లకు తొలి ప్రాధాన్యం ఇస్తారు. ప్రైవేటు అకాడమీలు, రాజకీయాలతో అంటకాగుతున్న మాజీ క్రికెటర్లకు ఇకపై చోటుండదు.
2. సెలెక్షన్ కమిటీల ద్వారా అండర్-12, 14, 16, 19, 23, సీనియర్స్ విభాగాల్లో పురుషుల, మహిళల జట్లను ఎంపిక చేస్తారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అంశాలతోపాటు ప్రవర్తన కూడా చూస్తారు. సెలెక్షన్ మ్యాచ్‌ల్లో వికెట్లు, స్కోర్లు, క్యాచ్‌లే కొలమానంలో ప్రాధాన్యం.
3. తల్లిదండ్రులు, బయటి వ్యక్తులు నిరాధార ఆరోపణలు చేస్తే కేసులు నమోదు చేస్తారు. జట్ల ఎంపికలో లంచం అడిగినా, తీసుకున్నట్లు రుజువు చేసినా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేస్తారు. క్రికెటర్ల తల్లిదండ్రులకు కూడా ఈ నిబంధనలే వర్తిస్తాయి.
4. బోగస్ వయసు ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన వారిని ఒకటి లేదా రెండేళ్ల నిషేధం ఉంటుంది. వయసు నిర్ధారణకు చేయిస్తున్న ఎముకల పరీక్షలు కొన్ని అసంబద్ధంగా ఉన్నాయి. ఫలితాలు కొన్ని తప్పుగా ఉంటున్నాయి. ఇలాంటి విషయంలో అన్యాయం జరిగిన వారు న్యాయస్థానానికి వెళ్లే వెసులుబాటు కల్పించారు.

క్రీడ బలోపేతమే ముఖ్యం

శ్రీనాథ్, యుగంధర్‌రెడ్డి
జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు

ఉమ్మడి జిల్లాలో క్రికెట్‌ను బలోపేతం చేసి ప్రతిభావంతులను గుర్తించడానికి మండల క్రికెట్ సంఘాలకు పదును పెడుతున్నాం. నిధుల వినియోగం, జట్ల ఎంపిక, సెలెక్షన్ కమిటీల నియామకంలో ఏమాత్రం అలసత్వం లేని విధంగా, లొసుగులు లేని విధానాన్ని తీసుకువస్తాం.

పీపీపీ విధానంపై జగన్‌వి అర్థంలేని ఆరోపణలు: భాజపా

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: పీపీపీ విధానంపై మాజీ సీఎం జగన్ అర్థం లేని ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని భాజపా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు కె.రాజేష్ విమర్శించారు. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్య విధానం రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి అమలవుతున్న విషయాన్ని ఆయన గుర్తించకుండా గుడ్డిగా విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆదివారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో వారు మాట్లాడుతూ.. పీపీపీ విధానం మన రాష్ట్రంలోనే కాదని దేశవ్యాప్తంగా అమలవుతోందని తెలిపారు. వైకాపా హయాంలో మొదలుపెట్టిన వైద్య కళాశాలల నిర్మాణంలో కేవలం పులివెందుల మాత్రమే పూర్తయిందని, దీనినే చూపిస్తూ ప్రజల్లో విషబీజాలు నాటుతున్నారని విమర్శించారు. వైద్య కళాశాలల భవనాల నిర్మాణానికి టెండర్లు పిలవగా.. వాటిని అడ్డుకోవడానికి చూడటం హేయమన్నారు. అధికారంలోకి వస్తే వాటిని రద్దు చేస్తామని జగన్ హెచ్చరికలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన అధికారంలోకి రావడం కలని, కూటమి ప్రభుత్వమే మరోసారి అధికారంలోకి వస్తుందన్నారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆంజనేయులు, రాష్ట్ర మైనార్టీ నాయకుడు జి.మహమ్మద్ రఫీ, జిల్లా నాయకులు సోమన్న, శివశంకర్ పాల్గొన్నారు.



(c) eenadu

సామాజిక సేవలో మేముసైతం

డిపాజిట్ చెక్కును అందిస్తున్న స్వధర్మ సేవా సమితి సభ్యులు, సీఐ జయనాయక్

కళ్యాణదుర్గం గ్రామీణం, రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే : బళ్లో అక్షరాలు నేర్చుకొనే వయస్సులో ఏర్పడిన స్నేహం నేడు ఎంతో మందికి సేవలు చేసేస్థాయికి తీసుకొచ్చింది. ఆపదలో ఉన్నవారికి మేమున్నామంటూ సేవలందిస్తున్నారా యువకులు. యూనియన్ బ్యాంకులో ఉద్యోగం చేస్తునంన కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన లోకేష్ శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాల్లో పదోతరగతి చదువుతున్న 500 మందికి రూ.40 వేలు ఖర్చుచేసి మోడల్ పేపర్స్, పుస్తకాలు అందజేశారు. కొత్తూరు ఉన్నత పాఠశాలలో రేకుల షెడ్ నిర్మాణం, బొచ్చుపల్లి పాఠశాలకు టీవీని, కుందుర్పి పాఠశాలలో రూ.35 వేలతో సామాగ్రి అందించారు. గుండ్లపల్లి మండలం కెంచానపల్లితో క్యాన్సర్ బాధితుడు మృతిచెందగా ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. కళ్యాణదుర్గంలో ఓ పేద విద్యార్థి బీఫాం చదువుకు రూ.40 వేలు, దొడగట్టలో నర్సింగ్ విద్యార్థిని చదువుకు రూ.25 వేలు అందించారు.

స్నేహితులతో కలిసి...

గుమ్మఘట్ట మండలం కలుగోడు గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ కుమారుడు మనోజ్‌కుమార్ 2019లో 'స్వధర్మ సేవా సమితి' సంస్థను స్థాపించి ఆపదలో ఉన్న వారిని ఆదుకొంటున్నారు. గుమ్మఘట్ట మండలం చెరువుదొడ్డిలో మూర్ఛవ్యాధి బాధపడుతున్న ఓ బాలుడికి 'రాయదుర్గం ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ క్రికెట్ టీమ్' సభ్యులతో కలిసి రూ.57 వేలు ఆర్థిక సాయం చేశారు. రాయదుర్గంలోని కోటవీధిలోని ఓ యువతి వివాహానికి రూ.30 వేలు విలువైన వస్త్రాలు అందించారు. గుమ్మఘట్ట మండలం కలుగోడుకు చెందిన కూలీ మల్లికార్జున వైద్యానికి, మురడికి చెందిన దివ్యాంగుల దంపతులకు నగదుతోపాటు సరకులు అందించాం. కణేకల్లు, కళ్యాణదుర్గంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న మహిళలను ఐసీడీఎస్ అధికారుల సాయంతో ఆశ్రమాల్లో చేర్పించారు. పదుల సంఖ్యలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేమగా.. మనోజ్‌కుమార్ ఇప్పటికే 30 సార్లు రక్తదానం చేయడం గమనార్హం.

విధి నిర్వహణలో మానవీయ విలువలు ముఖ్యం

జ్ఞాపికలు అందజేస్తున్న మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఉద్యోగాల్లో చేరిన ఉద్యోగులు విధి నిర్వహణ సక్రమంగా నిర్వర్తించడంతో పాటు మానవీయ విలువలను జోడించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పిలుపు నిచ్చారు. ఆదివారం నగరం శివారులో ఉన్న కనకదాస కళ్యాణ మండపంలో కొత్తగా ఉద్యోగాల్లో చేరిన కురుబ ఉద్యోగులకు సన్మానం, 2026 సంవత్సరం నూతన కాలమానిని ఆవిష్కరణ కార్యక్రమం జిల్లా కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పద్మావతి, నాగరాజుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఎంతో క్రమశిక్షణతో ఆటుపోట్లను ఎదుర్కొని ప్రభుత్వ ఉద్యోగం సాధించడం అన్నది అంత సులభతరం కాదన్నారు. ఈ సందర్భంగా ఏడుగురు ఎస్సైలు, 30 మంది కానిస్టేబుళ్ల, మెగా డీఎస్సీ-2025లో 50 మంది ఉపాధ్యాయులుకు, ఎంబీబీఎస్, జేఈఈలో మంచి ర్యాంకులు సాధించిన వారికి జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగం కోల్పోయిన జేఎన్‌టీయూలో పర్యవేక్షకులు ఎండీ నాగభూషణం పునర్నియామకానికి కృషి చేయడంపై మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. హిందూపురం ఎంపీ బీకే.పార్థసారథి, భాజపా జిల్లా అధ్యక్షుడు రాజేశ్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్లు ఆవుల కృష్ణయ్య, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ మేయర్ రాగే పరశురాం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, పెనుకొండ నాగార్జున పాల్గొన్నారు.

నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

ఆజాద్‌నగర్(అనంతపురం), న్యూస్‌టుడే: అనంతపురం నగరంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపునకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. నేటి (సోమవారం) సాయంత్రం 5 గంటల నుంచి మంగళవారం మధ్య రాత్రి 12 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపు కొనసాగుతుంది.● కళ్యాణదుర్గం, బళ్లారి వైపు నుంచి ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాలు నగరంలోకి వచ్చే క్రమంలో సుభాష్‌రోడ్డు, రాజు రోడ్డు మీదుగా శ్రీకంఠం కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండుకు చేరుకోవాలి.● అలాగే తాడిపత్రి వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు ఎన్టీఆర్ మార్గ్ లేదా చెరువుకట్ట, కలెక్టరేట్ మీదుగా వాహనాలు వెళ్లాల్సి ఉంటుంది. కావున వాహనదారులు సహకరించాలని డీఎస్పీ శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

అనంతలో శంబాల చిత్ర బృందం సందడి

ఆది, అర్చన అయ్యార్, నటుడు సాయికుమార్‌తో బైకు ర్యాలీలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే : ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ తనయుడు ఆది హీరోగా నటించిన 'శంబాల' చిత్ర బృందం అనంత నగరంలో సందడి చేసింది. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో మాసినేని గ్రాండ్ హోటల్ నుంచి శ్రీకంఠం కూడలి మీదుగా వీ మెగా టాకీస్ వరకు చిత్ర బృందం ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. చిత్ర బృందం హీరో ఆది, హీరోయిన్ అర్చన అయ్యార్, నటుడు సాయికుమార్, మధు, ఇంద్రనీల్, రవి, రాజేష్ బైకు ర్యాలీలో అభిమానులను ఉత్సాహపరిచారు. హీరో, హీరోయిన్, నటుడు సాయికుమార్‌తో ఫొటోలు, సెల్ఫీలు దిగటానికి యువత పోటీ పడ్డారు. చిత్ర విజయానికి తోడ్పడిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంత రుచులైన ఓలిగ, నన్నారి వంటి ఆహార పదార్థాలను కచ్చితంగా రుచి చూడాలని ఎంతో అభిమానంతో మాకు చెబుతుంటే ఇక్కడి వారి ప్రేమ, అభిమానం అర్థమవుతుందన్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. హీరో ఆదికి విజయం అందించిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. 50 ఏళ్లుగా సినీ చరిత్రలో సాయికుమార్ ఎంతోమందికి డబ్బింగ్ చెబుతూ గుర్తింపు తెచ్చుకుని నటుడిగా పేరు ప్రఖ్యాతులు గడించారన్నారు. ఆది మరిన్ని విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చిత్ర బృందాన్ని సన్మానించి జ్ఞాపిక అందించారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

REAL ESTATE

అనంతపురం టౌన్‌లో టవర్‌క్లాక్ దగ్గర కమలానగర్ నందు DCMS రోడ్లో 5 అంతస్తుల కమర్షియల్ బిల్డింగ్ అమ్మకానికి కలదు. స్థలం 10 సెంట్లు. 17,000 Sqf షెల్లార్ పార్కింగ్ కలదు. బాడుగలు నెలకు 5 లక్షలు. ✆ 9948266888

FLAT FOR SALE

నూతన సంవత్సర స్పెషల్ ఆఫర్ 3 BHK, 2 BHK ఫ్లాట్స్ ఆధునిక సౌకర్యాలతో అనంతపురం నడిబొడ్డున గల మీనాక్షి అపార్ట్‌మెంట్ నందు కొన్ని ఫ్లాట్స్ మాత్రమే కలవు. సెల్: 7416560179, 9515651111.

PLOT FOR SALE

హిందూపురంలో వెల్‌డెవలప్ ఓపెన్ ప్లాట్స్ బెంగళూరు రోడ్‌లో, లేపాక్షి రోడ్‌లో, సేవమందిర్ రోడ్‌లో కావాలనుకునే వారు 8143917999కి కాల్ చేయ్యండి.

JOBS

Wanted Audit Assistants for CA Firm Qul: B.Com with Computer Knowledge Send Resume to vukpra@rediffmail.com

బెంగుళూరులో పనిచేయుటకు ప్రముఖ వస్త్ర దుకాణంలో అనుభవం గల సేల్స్‌మెన్స్ కావలెను. Age: 18-45Y, ESI+PF+ జీ-17K ✆ 7019632854

కావలెను: M.G.B Mobiles (మహీంద్రా కార్ షోరూమ్) నందు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్‌గా పని చేయుటకు డిగ్రీ పూర్తి చేసినవారు కావలెను. ఆటోమొబైల్ సేల్స్ నందు అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఫ్రెషర్స్ కూడా దరఖాస్తు చేసుకొనవచ్చును. సంప్ర: 8333929186.

అనంతపురంలోని ప్రముఖ కంపెనీలో పని చేయడానికి "కార్ డ్రైవర్స్" కావాలి. క్రమశిక్షణ మరియు నిబద్ధత కలిగి కష్టపడే వారు మరియు దీర్ఘకాలం పనిచేయగలిగే వారికి ఆకర్షణీయమైన జీతం. ఇతర సదుపాయాలు కల్పించబడును. వయస్సు 25 నుండి 40 మధ్య వారికి ప్రాధాన్యత. సంప్రదించండి: 7799888354

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS

5 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు

8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

అల్లాహ్‌పై కృతజ్ఞత కలిగి ఉండాలి

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అల్లాహ్ మన పట్ల చూపుతున్న కృపకు ప్రతి ఒక్కరూ కృతజ్ఞత కలిగి ఉండాలని ముస్లిం మతపెద్దలు సూచించారు. గత రెండు రోజులుగా కదిరి మండల పరిధిలోని సున్నపుగుట్ట తండా బాహ్యవలయ రహదారి సమీపంలో జరుగుతున్న ఇస్తెమా ఆదివారం ముగిసింది. రెండోరోజు పెద్ద ఎత్తున ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు ఆధ్యాత్మిక బోధనలు చేశారు. ఇస్లాం ధర్మాలను, అల్లాహ్‌పై విశ్వాసంతో పాటు ఇతరుల పట్ల సోదరభావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన మత పెద్ద హజ్రత్ ఫారూక్ సాహెబ్‌తో పాటు పలువురు స్థానిక మత పెద్దలు పాల్గొన్నారు. ప్రార్థనలకు ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కడప, అన్నమయ్య, చిత్తూరు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. వారందరికీ భోజన సదుపాయం కల్పించారు. మెప్మా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వైద్యులు ఆజాద్, ముస్తఫా, బాబాఫక్రుద్దీన్, అష్రఫ్ అలీ, సిబ్బంది, మెప్మా సభ్యులు బాదరీబాషా, జాఫర్, సాదిక్, మహాసేన్ పాల్గొన్నారు.

ఇస్తెమాలో ప్రసంగిస్తున్న మత పెద్దలు

ఆలయ సమాచారం

కదిరి: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా నేడు (సోమవారం) వేకువజామునే పూజలు మొదలవుతాయి. ఉదయం 5 నుంచి 7 గంటల వరకు, 8 గంటల నుంచి 10 గంటల వరకు రెండు పర్యాయాలు అభిషేకం. తర్వాత పది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామివారి సర్వదర్శనం ఉంటుంది.

సదరన్ స్ట్రైక్స్, మయూక అకాడమీ జట్ల విజయభేరి

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న గీతిక

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ ఆహ్వాన టీ20 క్రికెట్ పోటీల్లో సదరన్ స్ట్రైక్స్, బెంగళూరు సంప్రదిత్ అకాడమీ జట్లు విజయ పరంపర కొనసాగిస్తున్నాయి. ఆదివారం అనంత క్రీడాగ్రామంలో జరిగిన పోటీల్లో పలు జట్లు తలపడ్డాయి. ఉదయం జరిగిన పోటీలో సదరన్ జట్టు ఏసీఏ జట్టుపై 3 వికెట్ల తేడాతో నెగ్గింది. ఏసీఏ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 3 వికెట్లకు 145 పరుగులు చేసింది. బి.నేహా చక్కటి బ్యాటింగ్‌తో అర్ధశతకం సాధించింది. తర్వాత బ్యాటింగ్ చేసిన సదరన్ జట్టు 19.2 ఓవర్లలో ఏడు వికెట్లకు లక్ష్యాన్ని ఛేదించింది. కె.గీతిక (43) అద్భుత బ్యాటింగ్‌తో జట్టును గెలిపించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకుంది. ఈ అవార్డును సీనియర్ మహిళా క్రికెటర్లు లతాదేవి, రాధిక, గౌసియా, మంజుల అందజేశారు. మరో పోటీలో మయూక అకాడమీ జట్టు 4 వికెట్ల తేడాతో కడప జట్టుపై నెగ్గింది. బ్యాటింగ్‌లో రాణించిన ఎస్.మహీనాజ్ అవార్డు అందుకుంది. ఇంకో పోటీలో బెంగళూరు సంప్రదిత్ అకాడమీ జట్టు విజయవాడ జట్టుపై ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. బ్యాటింగ్‌లో రాణించిన సలోనికి అవార్డును ప్రదానం చేశారు. ఇంకో పోటీలో చిత్తూరు జట్టు అనంతపురం జట్టుపై 19 పరుగుల తేడాతో నెగ్గింది. ఈ పోటీలు సోమవారం కూడా జరుగుతాయని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి యుగంధర్‌రెడ్డి తెలిపారు.

తాడిపత్రి కుర్రాళ్లు అదుర్స్

క్రికెట్‌లో అత్యుత్తమ ఆట తీరు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని ఆర్డీటీ క్యాంపులో శిక్షణ పొందుతున్న పలువురు క్రీడాకారులు క్రికెట్‌లో అద్భుత ఆట తీరుతో సత్తా చాటుతున్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిత్యం సాధన చేస్తూ విజయాలు సాధిస్తున్నారు. ఇప్పటికే జిల్లా, రాష్ట్రస్థాయి క్రికెట్ జట్లలో స్థానం సంపాదించి దూసుకెళ్తున్నారు.

బరిలో దిగితే ఓడించడం కష్టమే!

బురానుద్దీన్

తాడిపత్రిలోని మెయిన్‌బజార్‌కు చెందిన హాజీబాషా, కరీష్మా దంపతుల కుమారుడు బురానుద్దీన్. హాజీబాషా బంగారు దుకాణంలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుమారుడికి ఇష్టమైన క్రికెట్‌లో పదేళ్లుగా శిక్షణ ఇప్పిస్తున్నాడు. తండ్రి ప్రోత్సాహంతో రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో సాధన చేస్తున్నాడు. ఇటీవల ఏపీ స్కూల్ గేమ్స్‌లో జిల్లా జట్టులో స్థానం సాధించి ప్రతిభ కనబరిచాడు. ఐదేళ్లుగా జిల్లా, జోన్, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి జట్టు విజయానికి కీలక పాత్ర పోషించాడు. విద్యార్థి ఇప్పటి వరకు అన్ని రకాల మ్యాచ్‌లలో 9 శతకాలు, 27 అర్ధ శతకాలతో సత్తా చాటాడు. బరిలోకి వెళ్తే అవుట్ చేయడమనేది బోలర్‌కు కష్టంతో కూడుకున్నదే. ప్రస్తుతం తీసుకుంటున్న శిక్షణతో పాటు అన్ని రకాల మెలకువలు నేర్చుకొని భారత జట్టులో స్థానం సంపాదించాలన్నదే తన లక్ష్యంగా పెట్టుకున్నట్లు బురానుద్దీన్ చెబుతున్నాడు.

అన్ని ఫార్మాట్లలో వినయ్ విజేత

వినయ్

తాడిపత్రిలోని సుంకులమ్మపాలెంకు చెందిన బాస్కర్, జ్ఞానసుందరమ్మ కుమారుడు వినయ్‌కుమార్. బాస్కర్ మెకానిక్ పనిచేసుకుంటూ కుమారుడి ఉన్నతికి కృషి చేస్తున్నాడు. చదువు, ఆటలో ఇష్టమైన క్రికెట్‌లో కుమారుడికి శిక్షణ ఇప్పిస్తున్నాడు. 12 ఏళ్లుగా ఆర్డీటీ క్రికెట్ శిబిరంలో శిక్షణ పొందుతున్నాడు. ఇంటర్ క్రికెట్‌లో జిల్లా జట్టులో వినయ్ ప్రాతినిధ్యం వహించి విజయం సాధించాడు. సౌత్ ఇండియా, ఎస్ రాష్ట్రస్థాయి జట్లలో రాణించాడు. బెంగళూరులో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ సౌత్‌జోన్ జేఎన్‌టీయూ క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. సీనియర్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి విజయానికి దోహద పడ్డారు. గతంలో అనంతపురం జిల్లా జట్టుకు స్కోరర్, ఎంపైర్‌గా పనిచేశారు. ఏసీఏ ఎంపైర్ ప్యానల్ పరీక్షల్లో ఉత్తీర్ణ సాధించారు. ఇప్పటి వరకు 40కి పైగా స్కోరర్‌గా చేసి ఐసీసీ మహిళా క్రికెట్ ప్రపంచ కప్ మ్యాచ్‌లో స్కోరర్‌గా పనిచేసి ప్రతిభ చాటారు. భవిష్యత్తులో భారత జట్టులో స్థానం సంపాదించాలన్నదే తన లక్ష్యంగా పెట్టుకున్నట్లు వినయ్ తెలిపారు.

ఎంపికైన క్రీడాకారులతో సంఘం సభ్యులు

బాస్కెట్‌బాల్ రాష్ట్ర జట్టులో చోటు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయిలో జరగనున్న అండర్-19 బాస్కెట్‌బాల్ పోటీల్లో తలపడనున్న రాష్ట్ర జట్టుకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్లు ఉమ్మడి అనంత బాస్కెట్‌బాల్ సంఘం అసోసియేట్ కార్యదర్శి జయచంద్రారెడ్డి తెలిపారు. నవంబరులో విజయవాడలో జరిగిన జిల్లా జట్ల ఎంపిక పోటీలో పట్టణానికి చెందిన విజయ్‌తరుణ్, కిరణ్మయి సత్తాచాటారన్నారు. రాజస్థాన్‌లో జనవరి 1 నుంచి 6వ రకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు వీరు ఆడతారని ఆయన చెప్పారు. క్రీడాకారులు ఆదివారం సాయంత్రం రాజస్థాన్‌కు బయలుదేరారు. వారికి అసోసియేషన్ అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి హిదయతుల్లా, కోచ్ సంజయ్, ఆత్మీయ ట్రస్టు సభ్యులు హర్షిత్, ప్రణవ్ అభినందనలు తెలిపారు.

సంతల ఆదాయం రూ.3.42 లక్షలు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతల్లో మొత్తం రూ.3,42,700 ఆదాయం వచ్చింది. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతలో రూ.2,04,100 ఆదాయం రాగా ఆదివారం పశువుల సంతలో రూ.1,38,600 ఆదాయం వచ్చిందని యార్డు ఎంపికశ్రేణి ఇన్‌ఛార్జి కార్యదర్శి, జిల్లా మార్కెటింగ్‌శాఖ సహాయ సంచాలకులు రాఘవేంద్రకుమార్ తెలిపారు.

'గ్రామానికో కృష్ణ మందిరం అవసరం'

మాట్లాడుతున్న వెంగళరావు, చిత్రంలో సంఘం ప్రతినిధులు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: ప్రతి గ్రామంలో ఒక కృష్ణ మందిరం నిర్మించాలని యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు యాదవ్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప యాదవ్ ఆధ్వర్యంలో అఖిల భారత యాదవ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా వెంగళరావు మాట్లాడుతూ కృష్ణ మందిరాల నిర్మాణానికి యాదవులతో పాటు రాజకీయ నాయకులు కృషి చేయాలన్నారు. బీసీ జనాభాలో 25 శాతమున్న యాదవులు ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీల్లోని ఇతర కులాలను కలుపుకుని రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు. ఇందుకు రాజకీయ, ఆర్థిక, విద్యాపరంగా ఎదగాలని సూచించారు. రాష్ట్రంలో 70లక్షల మంది యాదవులు ఉన్నారని, తమకు 25 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. తిరుమలలో శరభయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం దృష్టికి తెచ్చినట్లు యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ తెలిపారు. ప్రభుత్వం త్వరలో యాదన్న పథకం అమలు చేయనుందన్నారు. మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు, జాతీయ ఉపాధ్యక్షుడు రామచంద్రయాదవ్ సంఘం బలోపేతానికి బలరామకృష్ణుల్లా పనిచేశారని కొనియాడారు. సమ్మేళనంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, యాదవ సంఘం జిల్లా కార్యదర్శి ఉమాపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు భార్గవి

వజ్రకరూరు, న్యూస్‌టుడే: వజ్రకరూరు మండలం చిన్నహోతూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి భార్గవి అండర్-18 జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఈనెల 19, 20, 21 తేదీల్లో ప్రకాశం జిల్లా పంగనూరులో జరిగిన ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపారు. ఈనెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు బెంగళూరులో జరిగే జాతీయస్థాయి పోటీల్లో భార్గవి పాల్గొననున్నట్లు హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, పీడీ ప్రభాకర్ తెలిపారు.

ప్రాచీన కట్టడాలు, సంస్కృతిని కాపాడుకోవాలి

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: వారసత్వ కట్టడాలు, మన చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగాలంటే ప్రజల్లో చైతన్యం తేవాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ పి.పద్మశ్రీ పిలుపునిచ్చారు. చారిత్రాత్మక స్థలాల ప్రాధాన్యత తెలుసుకోవాలంటే స్వయంగా సందర్శించాలని ఆమె సూచించారు. ఆదివారం పురావస్తు శాఖ ఆధ్వర్యంలో హెరిటేజ్ వాక్ నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి గడియార స్తంభం, జిల్లా జైలు కార్యాలయం, జిల్లా కోర్టు సముదాయం, పీస్ మెమోరియల్ మీదుగా పురావస్తు ప్రదర్శనశాల వరకు ఈ నడక నిర్వహించారు. ఈ వాక్ ప్రారంభానికి ఆమెతోపాటు పురావస్తు శాఖ ఏడీ స్వామినాయక్ హాజరై ప్రసంగించారు. వారసత్వ కట్టడాలను మరింత మంది తెలుసుకోవాలన్న లక్ష్యంతోనే ఈ వాక్ నిర్వహించామన్నారు. జిల్లాలో అనేక వారసత్వ కట్టడాలు ఉన్నాయని వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని ఆయన గుర్తుచేశారు. ఉద్యోగులు, కార్మికులు మానసిక ఒత్తిడి నుంచి బయటపడాలంటే చారిత్రాత్మక కట్టడాలను సందర్శించి వాటి చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. వాకర్స్ సంఘం సభ్యులు శ్రీనివాసులు, సుధాకర్, బాలస్వామి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు జయంతి, మహిళా క్లబ్ కార్యదర్శి పద్మనారాయణరెడ్డి, ఇంటాక్ సభ్యులు కృష్ణమూర్తి నడకలో పాల్గొన్నారు.

హెరిటేజ్ వాక్‌ను ప్రారంభిస్తున్న పురావస్తు శాఖ ఏడీ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్

గోల్‌షాట్ బాల్‌లో మూడో స్థానం

తమిళనాడులోని తిరుచ్చిలో జరిగిన జాతీయ గోల్‌షాట్ బాల్ పోటీల్లో రాష్ట్ర బాలికల జట్టు మూడో స్థానం సాధించింది. ఈమేరకు గోల్‌షాట్ బాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సభ్యులు అభినందించారు. -న్యూస్‌టుడే, కదిరి గ్రామీణం

గుప్త నిధుల తవ్వకాలపై ఫిర్యాదు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని పాత కోట కాలనీలో గుప్త నిధుల కోసం తవ్వుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేయడంతో వారిని పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాలనీకి చెందిన దుర్గాదేవి ఈ విధంగా చేస్తోందని సమాచారం అందడంతో ఆమెను, తవ్వే కూలీలను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆమె తన కుటుంబం అనారోగ్యాల పాలవుతోందని, కొందరు స్వామీజీలు తన స్థలంలో ఉన్న పాత మట్టిని తొలగించి కొత్త మట్టిని వేయాలని చెప్పడంతో తవ్వుతున్నానని చెప్పారన్నారు. నిధుల కోసం ఎలాంటి తవ్వకాలు చేయకూడదని వారికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపినట్లు పోలీసులు తెలిపారు.

మెకానిక్ దుర్మరణం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో విద్యుత్తు ప్రమాదంలో మోటారు మెకానిక్ వేణు(25) దుర్మరణం పాలయ్యాడు. వేణు బంధువులు, రెడ్డిపల్లి గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వేణు వ్యవసాయ మోటార్ల మెకానిక్‌గా పనిచేసేవాడు. ఆదివారం మరో మెకానిక్ షబ్బీర్ మరమ్మతుల నిమిత్తం తీసుకెళ్లాడు. షబ్బీర్ అధికారుల నుంచి ఎల్‌సీ తీసుకోలేదు. అయినా మరమ్మతులు ప్రారంభించడంతో వేణుకు విద్యుత్తు షాక్ తగిలింది. 108లో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మృతదేహంతో కుటుంబసభ్యుల ధర్నా

రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న బాధితులు

సాయికుమార్‌నాయక్

కదిరి పట్టణం, కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల ఏర్పాటు పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. కదిరి మండలం రాచువారిపల్లితండాకు చెందిన సాయికుమార్‌నాయక్ (26)తో పాటు మరికొందరు పట్నం సమీపంలో విద్యుత్తు లైన్ల ఏర్పాటు పనులకు దిన కూలీలుగా వచ్చారు. సాయికుమార్‌నాయక్ స్తంభంపై ఉన్న సమయంలో విద్యుత్తు సరఫరా జరగడంతో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం తగలడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. తోటి కూలీలు, స్థానికులు బాధితుడిని చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. చేతికొచ్చిన కొడుకు విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువుల ఆర్తనాదాలతో ఆసుపత్రి ప్రతిధ్వనించింది. పనులు చేయిస్తున్న గుత్తేదారుడు, లైన్‌మెన్ నిర్లక్ష్యంతో తమ బిడ్డ చనిపోయాడని తల్లిదండ్రులు, బంధువులు ఆరోపించారు. మృతదేహాన్ని ఆసుపత్రి ఎదురుగా ఉన్న కదిరి-హిందూపురం ప్రధాన రహదారిపై ఉంచి ధర్నా చేశారు. మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు డిమాండ్ చేశారు. వాహనాల రాకపోకలకు ఆటంకం కలగడంతో అక్కడికి చేరుకున్న సీఐలు నారాయణరెడ్డి, నిరంజన్‌రెడ్డి న్యాయం జరిగేలా చూస్తామని ఆందోళనకారులకు నచ్చచెప్పడంతో ధర్నా విరమించారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేస్తామని సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

13 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ధర్మవరం, న్యూస్‌టుడే: ధర్మవరం నుంచి ఆటోలో కర్ణాటకకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం లక్ష్మీచెన్నకేశవ పురం వద్ద ఒకటో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. సీఐ నాగేంద్రప్రసాద్, పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుబడింది. మొత్తం 13 క్వింటాళ్ల బియ్యం పట్టుబడిందని, నిందితుడు బాబావలిపై కేసు నమోదు చేసి, ఆటోను సీజ్ చేశామని సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

'కలిసి పనిచేద్దాం.. పార్టీని బలోపేతం చేద్దాం'

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: జిల్లాలో తెదేపాను బలోపేతం చేయాలంటే అందరం కలిసి పనిచేయాలని అనంతపురం పార్లమెంటు సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. నూతనంగా నియమించిన తెదేపా జిల్లా అధ్యక్షుడు పూలనాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, మీడియా కోఆర్డినేటర్ కుమారస్వామి నాయుడు, ఇతర సభ్యులంతా కలిసి అనంతపురం నగరంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, బండారు శ్రావణి, సురేంద్రబాబు క్యాంపు కార్యాలయాలకు వెళ్లారు. వారందరినీ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. వారంతా నూతన, అధ్యక్ష, కార్యదర్శులను పూలనాగరాజు, శ్రీధర్ చౌదరిలను శాలువాలతో సత్కరించారు. పార్టీ పటిష్ఠతకు అందరం కలిసి పనిచేద్దామని అధ్యక్షుడు పూలనాగరాజు ఎంపీ, ఎమ్మెల్యేలను కోరారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రాబోయే మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు తెదేపా క్యాడర్ సన్నద్ధం కావాలన్నారు.

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న పూలనాగరాజు, శ్రీధర్‌చౌదరి

కరాటేలో మరింత సత్తాచాటాలి

మెలకువలు బోధిస్తున్న అఖిల భారత కరాటే టెక్నికల్ డైరెక్టరు అల్తాఫ్

గుంతకల్లు, న్యూస్‌టుడే : ఇతరులు దాడులు చేసిన సమయంలో కరాటే వారి నుంచి కాపాడుతుందని అఖిలభారత కరాటే టెక్నికల్ డైరెక్టరు అల్తాఫ్ అన్నారు. ఆదివారం గుంతకల్లు పట్టణంలో కరాటే మాస్టర్ దినేశ్ నిర్వహిస్తున్న ఎఎస్ నొజిరియో కరాటే శిక్షణ కేంద్రంలో తర్ఫీదు పొందిన బాలబాలికలకు పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కరాటే నేర్చుకుంటే ఆత్మవిశ్వాసంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. ముఖ్యంగా బాలికలకు ప్రస్తుత పరిస్థితిలో ఇది చాలా అవసరమని పేర్కొన్నారు. పరీక్షను నిర్వహించి విజేతలకు బ్లూ, ఆరెంజ్, బ్రౌన్ బెల్టులతో పాటు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ బ్లాక్‌బెల్టు, బంగారు మెడల్ గ్రహీత ఫిరోజ్, కసాపురం ఎస్సై వెంకటస్వామి, ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఆర్.ఎన్. శ్రీనివాసులు పాల్గొన్నారు.

(c) eenadu

హిందూపురం

•హిందూపురం •పెనుకొండ •మడకశిర

యాదవ సంఘం ర్యాలీ

ర్యాలీలో పాల్గొన్న సభ్యులు

గోరంట్ల, న్యూస్‌టుడే: మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గోరంట్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. పుట్టపర్తిలో నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశానికి తరలివెళ్లడానికి కదిరి రహదారిలోని పెట్రోల్‌బంకు వద్ద నుంచి బస్టాండు వరకు ర్యాలీగా వెళ్లి అక్కడి నుంచి వాహనాల్లో తరలివెళ్లారు.

వైభవంగా రంగనాథుడి కల్యాణం

కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీమాత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అశేష భక్త జన సమూహం నడుమ రంగనాథుని కల్యాణమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు భక్తిగీతాలు ఆలపిస్తూ స్వామి వారికి హారతులు సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జేపీకే రాము, కార్యదర్శి కేవీ శ్రీకాంత్, ట్రెజరర్ రవీంద్రుడు, ఆర్యవైశ్య అనుబంధ మహిళా సంఘాల నిర్వాహకురాళ్లు కే రూప, కావలమ్మ, కేవీ గీత పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం: 91548 46650
పెనుకొండ: 91000 20922
మడకశిర: 76759 19016

సమస్య: ఎం.బీరేపల్లి నుంచి భైరాపురం వెళ్లే రోడ్డులో కంపచెట్లు పెరిగాయి. -శ్రీనివాసరెడ్డి
సమాధానం: సర్పంచితో మాట్లాడి తొలగించేలా చూస్తాం. -దామోదరమ్మ, ఎంపీడీవో
-న్యూస్‌టుడే, హిందూపురం గ్రామీణం

సమస్య: కేశేపాళ్యం బీసీ కాలనీలో వీధి దీపాలు లేక అంధకారంలో ఉన్నాం. సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం. -పుట్టన్న, స్థానికులు
సమాధానం: వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. -అమరీష్, పంచాయతీ కార్యదర్శి, ముత్తుకూరు

సమస్య: రామయ్యనహట్టిలో బోరు ద్వారా నీరు వృథా అవుతోంది. -చిక్కీరప్ప, స్థానికుడు
సమాధానం: నీటి వృథాను అరికట్టి సమస్యను పరిష్కరిస్తాం. -నరసమ్మ, సర్పంచి, జమ్మలబండ
-న్యూస్‌టుడే, గుడిబండ

సమస్య: పట్టణంలోని పెనుకొండ రోడ్డు నుంచి ఆర్టీసీ రహదారిలో షాపింగ్ నర్సింగ్ హోం ముందు భూగర్భ కాలువలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురికి నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. - సందీప్‌కుమార్
సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయిస్తా. - శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, హిందూపురం
-న్యూస్‌టుడే, హిందూపురం సాంస్కృతికం

చకచకా విద్యుత్తు ఉపకేంద్రం పనులు

☛ తీరనున్న ఎనిమిది గ్రామాల సమస్య ☛ రూ.3 కోట్లతో నిర్మాణం

రంగనపల్లి గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న విద్యుత్తు ఉపకేంద్రం

రొళ్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రంగనపల్లి గ్రామం వద్ద రూ.3 కోట్ల వ్యయంతో కొత్తగా చేపట్టిన 33-11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రం పనులు వేగంగా సాగుతున్నాయి. దొడ్డేరి, పిల్లిగుండ్లు, రంగనపల్లి, వెంకటంపల్లి, కొత్తపల్లి, గొట్టిగుర్కి, జి.ఎన్.పాళ్యం, దాసప్పపాళ్యం తదితర గ్రామాల్లో అల్ప విద్యుత్తు సమస్య పరిష్కారంతో పాటు ఆయా గ్రామాలకు సక్రమ విద్యుత్తు త్రీఫేస్‌లో సరఫరాకు మార్గం సుగమమయింది. ● మండల మొత్తానికి గతంలో రొళ్ల, బీ.జీ.హళ్లి, రత్నగిరి మూడు విద్యుత్తు ఉపకేంద్రాలు ఏర్పాటు చేయించారు. పెరుగుతున్న జనాభా, వ్యవసాయ బోరు బావుల సర్వీసుల కారణంగా వ్యవసాయం, గృహాలకు విద్యుత్తు సరఫరా అయ్యేది. దీంతో మూడు కేంద్రాలకు అదనపు భారం పడి తరచూ సరఫరాలో అంతరాయం ఏర్పడేది. దీంతో పాటు రత్నగిరి విద్యుత్తు కేంద్రం నుంచి సరఫరా అయ్యే ప్రాంతాలకు అల్ప విద్యుత్తు సమస్య తీవ్రంగా ఉండేది. ఇప్పుడా సమస్య తీరనది.

కూటమి ప్రభుత్వం రాకతో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిల చొరవతో విద్యుత్తు ఉపకేంద్రం పనులను రంగనపల్లి వద్ద త్వరితగతిన ప్రారంభించారు. గుత్తేదారు నిర్ణీత గడువులోనే ఉప కేంద్రం నిర్మాణ పనులను పూర్తి చేయిస్తున్నారు. దీని పరిధిలో దొడ్డేరి, గుడ్డుగుర్కి, జి.ఎన్.పాళ్యం, కొత్తపల్లి చొప్పున నాలుగు ఫీడర్లు ఉన్నాయి. ఇప్పటికే ఉప కేంద్రం వద్ద విద్యుత్తు లైన్ పనులు దాదాపూ 90శాతం పనులు పూర్తయ్యాయి.

త్వరలో కేంద్రాన్ని ప్రారంభిస్తాం

విద్యుత్తు ఉపకేంద్రం పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రస్తుతం మిగిలిన పనులన్నీ వారంలోపు పూర్తి చేసి ఉప కేంద్రం పరిధిలో గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన విద్యుత్తు సరఫరా చేస్తాం. దీంతో రత్నగిరిలో ఉన్న ఉపకేంద్రంపై భారం తగ్గుతుంది. గ్రామీణ ప్రాంతాలకు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేస్తాం. - నిజాముద్దీన్, విద్యుత్తు ఏఈ, రొళ్ల

విద్యారంగం అభివృద్ధికి కృషి చేయండి

పెనుకొండలో ఏపీటీఎఫ్ కాలమానిని విడుదల చేస్తున్న మంత్రి సవిత, నాయకులు

పెనుకొండ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యార్థులకు చక్కటి విద్యాబుద్ధులు నేర్పి రాష్ట్ర విద్యారంగంలో పురోభివృద్ధి సాధించడానికి కృషిచేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. ఆదివారం మంత్రి నివాసంలో ఏపీటీఎఫ్(ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) 2026 కాలమానిని, డైనందినిలను మంత్రి సవిత ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈకార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసులు, ఆర్.చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అక్కంపల్లి రహదారికి మోక్షం

రూ.1.80 కోట్లతో పనులు

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే : గత 50 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని రహదారికి మోక్షం కలిగింది. ఇదివరకు ఊటుకూరు నుంచి అక్కంపల్లికి వెళ్లే రహదారి ఎటువంటి అభివృద్ధికి నోచుకోక దుస్థితిలో ఉండేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత చొరవ తీసుకుని రహదారి పునరుద్ధరణకు అవసరమైన రూ.1.80 కోట్లు మంజూరు చేయించారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయి. ఈ రహదారి పూర్తి అయితే దశాబ్దాల కల నెరవేరినట్లు అవుతుందని గ్రామానికి చెందిన చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ రహదారి నిర్మాణంతో పాటు మండలంలో తిరుమలదేవరపల్లి నుంచి విట్టాపల్లి వరకు, శిర కొడికొండ జాతీయ రహదారి నుంచి యు.బసవపల్లి వరకు, చిన్నపల్లి రహదారి నుంచి మూడిండ్లపల్లికి వెళ్లేందుకు, అలాగే పరిగి నుంచి బోరెడ్డిపల్లి వరకు చేపట్టిన రహదారుల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన గుత్తేదారు మహేశ్వరరావు పూర్తి చేయించారు. తర్వాలోనే పరిగి నుంచి శ్రీరంగరాజుపల్లి, ముళ్లమోతుకపల్లి, మోదా వరకు రహదారి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఊటుకూరు నుంచి అక్కంపల్లికి వెళ్లే రహదారిలో సాగుతున్న రహదారి పనులు

12వ పీఆర్సీ కమిషన్ నియమించాలి

పెనుకొండ, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్‌టీపీ (స్కూల్ టీచర్స్ అసోసియేషన్) రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్‌టీపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 జూన్ 1వ తేదీన 11వ పీఆర్సీ ముగిసిందని, అప్పటి నుంచి 12వ పీఆర్సీ అమలు చేయాల్సి ఉందన్నారు. రెండున్నరేళ్లుగా కమిషన్‌ను నియమించకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికే 3 డీఏల బకాయిలు ఉన్నాయన్నారు. 2026 జనవరిలో మరో డీఏ ఇవ్వాల్సి ఉందన్నారు. ఉపాధ్యాయులకు న్యాయంగా పీఆర్సీ, డీఏలు సకాలంలో ఇవ్వకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. గత 3 ఏళ్లుగా సరెండర్ లీవ్ బిల్లు చెల్లించలేదని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు, యాప్‌ల భారం తగ్గించాలన్నారు. పదవీ విరమణ పొందిన రోజునే బెనిఫిట్స్ చెల్లించాలన్నారు. అనంతరం ఎస్‌టీపీ 2026 కాలమానిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీపీ జిల్లా ప్రధానకార్యదర్శి జయకృష్ణ, ఇతర నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌టీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు

సమస్యలు పరిష్కారం

స్పందనకు వందనం

గుడిబండ: మండలంలో నెల కొన్న వివిధ సమస్యలపై 'ఈనాడు'లో మేమున్నాం.. మీకుతోడుగా శీర్షికన ప్రచురించగా బాధ్యులు స్పందించారు. మండలంలోని పీఎన్‌పాళ్యం కుళాయిల వద్ద ఉన్న అపరిశుభ్రతను దేవరహట్టి సర్పంచి సతీశ్‌బాబు, కేకాతి ఎస్సీ కాలనీలో సర్పంచి నరసమ్మ, గుణేమోరుబాగల్ ఎస్సీకాలనీలో హరితరాయబారుల ద్వారా తొలగించారు. కేకాతి ఎస్సీకాలనీలో సర్పంచి నరసమ్మ, పూజారిపల్లి ఇందిరమ్మ కాలనీలో సర్పంచి కవిత, మోరుబాగల్ ఇందిరమ్మ సర్పంచి తిప్పేస్వామి, వడ్రహట్టిలో కార్యదర్శి అమరీశ్ వీధి దీపాలు ఏర్పాటు చేశారు. కల్లురొప్పం బీసీ కాలనీలో ఉన్న తాగునీటి సమస్యను సర్పంచి లక్ష్మీనారాయణ పరిష్కరించారు. దీంతో ఈనాడుకు, స్పందించిన బాధ్యులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

గోరంట్ల, న్యూస్‌టుడే: స్థానిక ఒకటోవార్డులోని శ్రీకన్యకపరమేశ్వరీ ఆలయం వెనుక భాగంలో ఓ విద్యుత్తు స్తంభం ఒంగిపోయి ప్రమాదకరంగా ఉన్న నేపథ్యంలో 22వ తేదీ 'ఒరిగిన స్తంభం - ప్రమాదకరం' శీర్షికన 'ఈనాడు'లో చిత్ర కథనం వెలువడింది. మండల ఏఈ శ్రీనివాస్ స్పందించి శనివారం పొక్లెయిన్, సిబ్బందిని పంపి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయించారు.

29న పశువైద్య శిబిరం

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గుండుమల గ్రామంలో ఈనెల 29న ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ అమర్ తెలిపారు. పశువులకు సంబంధించిన సాధారణ వ్యాధులు, గర్భకోశ చికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా కనకదాస జయంతి వేడుకలు

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే : మండల పరిధిలోని కొడిగెనహళ్లి పంచాయతీ కాలువపల్లి, పరిగిలో ఆదివారం కనకదాస జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా పరిగిలో కరుబల ఆరాధ్యదైవం కనకదాస జయంతి సందర్భంగా మహిళలు పురవీధుల గుండా కలశాలతో స్థానిక భీరలింగేశ్వర స్వామి వారి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి అక్కడి స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలక్రిష్ణ పీఏ బాలాజీ, జగదీష్, అంజినప్ప, జనసేన నాయకుడు అశ్వర్థ పలువురు తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, తదితరులు

☛ కాలువపల్లిలో నిర్వహించిన కనకదాస జయంతి కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, తెదేపా నాయకులు తిలక్, మారుతీ, తదితరులు పాల్గొన్నారు.

మలుగూరులో...

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే : మలుగూరులో భక్తకనకదాస జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరిమళ, ప్రతినిధులు అంజనేయులు, శ్రీనివాసులు, జగదీశ్, నటరాజ్, సింగిల్ విండో అధ్యక్షుడు శంకరప్ప, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

రొద్దం, జడ్చర్ల, న్యూస్‌టుడే: అప్పుల బాధ భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో చోటు చేసుకుంది. ఎస్సై మల్లేష్ కథనం ప్రకారం.. ఏపీ రాష్ట్రం సత్యసాయి జిల్లా రొద్దం మండలం వెంపర్లపల్లి గ్రామానికి చెందిన చాకలి సురేష్ బాబు(23) జడ్చర్ల మండలం పోలేపల్లిలోని ప్రైవేటు పరిశ్రమలో 10 నెలలుగా పనిచేస్తున్నారు. జడ్చర్లలోని గంగాపూర్ రోడ్డులో అద్దె ఇంట్లో ఉంటున్నారు. అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురై శనివారం అర్ధరాత్రి దాటాక ఇంట్లో ఉరివేసుకున్నారు. స్నేహితులు వచ్చి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తల్లి దుర్గమ్మ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

హిందూపురం గ్రామీణం,న్యూస్‌టుడే: పట్టణంలోని ఎంఎఫ్‌రోడ్డులోని శ్రీలక్ష్మీ హయగ్రీవ ఆలయంలో నిర్వహిస్తున్న ధను సంక్రమణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి భ్రుంగి నాట్యాలయ నిర్వాహకురాలు సుప్రియా ఆధ్వర్యంలో రామాయణం, భాగవతం, శ్రీకృష్ణుడిపై విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి.

చిన్నారులతో నృత్య శిక్షకురాలు

ముగిసిన ఓపెన్ టెన్నిస్ పోటీలు

హిందూపురం, న్యూస్‌టుడే : పట్టణం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెండు రోజుల పాటు జరిగిన ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. తొలి సారిగా చేపట్టిన సౌత్ ఇండియా టూర్‌లో భాగంగా ఈ టోర్నమెంట్ పోటీలు ఏర్పాటు చేశారని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో 45, 55, 65, 70 ప్లస్ క్రీడాకారులు పాల్గొని డబుల్స్ ఆడారు. వివిధ విభాగాల్లో రాణించిన వారికి రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్ కుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మోహన్‌కుమార్, నాగేశ్, నాగరాజు, సురేశ్‌కుమార్, శివశంకర్, నెట్టప్ప, శీనా తదితరులు పాల్గొన్నారు

విజేతలకు బహుమతులు అందిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్

తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శికి సత్కారం

హిందూపురం, న్యూస్‌టుడే : తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన హనుమప్పను ఆదివారం శ్రీకంఠపురంలో వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. వడ్డెర సామాజిక వర్గాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి ఇవ్వటం ఎంతో అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారాలోకేశ్, సవితమ్మలకు వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు అశ్వర్థప్ప, నవీన్, నాగరాజు, జి.వెంకటేశ్, అక్కులప్ప, సునీల్, శివ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

హనుమప్పను సత్కరిస్తున్న వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: హైందవ ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలు, సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువులపై ఉందని ఆదినారాయణస్వామి ధ్యానమందిరం అవధూత సహజానందగిరి స్వామి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్వీడీ రోడ్డులో ఉన్న వాసవీధర్మశాలలో ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి నూరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ సహప్రాంత సంపర్క ప్రముఖ్ రాఘవేంద్ర, సరస్వతి విద్యామందిరం ఉపాధ్యాయురాలు పుష్పావతి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జేపీకే రాము, వాల్మీకి సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో హిందువులు పాల్గొన్నారు.

హిందువులనుద్దేశించి మాట్లాడుతున్న సహజానందగిరి స్వామిజీ

● బాలాజీనగర్‌లో హిందూసమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించి సంస్కృతి, సంప్రదాయాలు గురించి తెలియజేశారు.

లేపాక్షి, న్యూస్‌టుడే : ప్రపంచంలోనే హిందూ ధర్మం పురాతనమైనదని దత్తానందగిరి స్వామి, సుధా స్రవంతి పేర్కొన్నారు. ఆదివారం కోడిపల్లిలో జరిగిన హిందూ సమ్మేళనంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హిందూ మతంలో ఆచరించాల్సిన అంశాలు చెప్పి పరమత దూషణ చేయరాదని సూచించారు. ప్రతి హిందువూ తమ ధర్మాన్ని తప్పకుండా ఆచరిస్తూ తల్లిదండ్రులను వృద్ధాప్యంలో కంటికిరెప్పలా కాపాడుకోవాలని తెలిపారు.

వృథాగా పశువుల నీటి తొట్టె

మండలంలోని రేకులకుంటకు వెళ్లే రహదారిలో రోడ్డు పక్కన పశువుల దాహార్తిని తీర్చేందుకు తొట్టె నిర్మించారు. ఇప్పటి వరకు పైపులైన్ సౌకర్యం కల్పించి నీరు నింపకపోవడంతో నిరుపయోగంగా మారింది. సత్వరమే తొట్టెకు నీరు నింపాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి అశోక్ ఉపాధిహామీ అధికారులతో మాట్లాడుతూ తొట్టెకు నీరు నింపుతామన్నారు.
-న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం

మట్టి రోడ్డు బాగుపడేదెన్నడు?

మండలంలోని దిన్నేహట్టి, కురుబరపల్లి మధ్య ఏళ్లుగా మట్టి రోడ్డే ఉంది. చిన్నపాటి వాన కురిసినా నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. తారురోడ్డు వేయాలంటూ గ్రామస్థులు ఎన్నిమార్లు మొర పెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. దీనిపై డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజునాయక్ మాట్లాడుతూ తారురోడ్డు అంచనాకు ఇంజినీరుల ద్వారా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. **-న్యూస్‌టుడే, గుడిబండ**

వేమన విగ్రహ ఏర్పాటుకు విరాళాలు

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల- హిందూపురం రహదారిలో ఏర్పాటు చేస్తున్న వేమన విగ్రహ ఏర్పాటుకు మండలంలోని పలుకుటుంబాల సభ్యులు ఆదివారం విరాళాలు అందజేశారు. గోరంట్ల మాజీ సర్పంచి సుబ్బిరెడ్డి కుమారులు, మేరెడ్డిపల్లికి చెందిన వనం గోవిందరెడ్డి కుమారులు రూ.లక్ష చొప్పున, పుట్టగుండ్లపల్లికి చెందిన విజయలక్ష్మీ, వెంకటశివారెడ్డి దంపతులు రూ.50వేలు నిర్వాహకులకు అందజేశారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

గోరంట్ల, న్యూస్‌టుడే : పాలసముద్రం కూడలికి సమీపంలో ఆదివారం ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులిద్దరూ పాలసముద్రం పంచాయతీ పరిధిలోని సాములపల్లికి చెందిన వారు. వీరి వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీ కొన్నాయి.

నేత్రపర్వంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

హిందూపురం సాంస్కృతికం, పరిగి, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని గొర్రిపల్లిలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, పసుపు, కుంకుమ అలంకరణ చేశారు. ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికలో వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించిన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తులను ఉంచి వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల, దంపతుల నడుమ ఘనంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

అలంకరణలో లక్ష్మీనరసింహుడు

ఎస్పీ, అదనపు ఎస్పీ లేపాక్షి ఆలయ సందర్శన

లేపాక్షి, న్యూస్‌టుడే : లేపాక్షి దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయాన్ని ఆదివారం సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, అదనపు ఎస్పీ అంకితలు వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలోని పురాతన కట్టడాలు, చారిత్రక నిర్మాణాలు, వేలాడే స్తంభం, ఏడు శిరస్సుల నాగేంద్రుడు, నాట్యమండపం, ఏకశిలా నంది విగ్రహం తదితర ఆలయ చరిత్రను వారికి వివరించారు. వీరభద్రస్వామి, దుర్గాదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్, గ్రామీణ మండల సీఐ జనార్దన్, ఎస్సై నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ఎస్పీ సతీష్‌కుమార్, కుటుంబ సభ్యులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హిందూపురం, న్యూస్‌టుడే : ఎంజీఎం పాఠశాలలో 2000 సంవత్సరం అంటే పాతికేళ్ల ముందు పదోతరగతి చదివి ఉన్నత విద్య కోసం వెళ్లి జీవితంలో స్థిరపడిన పూర్వవిద్యార్థులు ఆదివారం మళ్లీ చదువులమ్మ ఒడిలో కలిశారు. గత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. నాడు పాఠాలు బోధించి, ప్రస్తుతం పాఠశాల హెచ్‌ఎంగా ఉన్న రంగనాయకులును సత్కరించారు. పూర్వ విద్యార్థులు సంతోశ్, క్రాంతి బాషా, ఆసీఫ్, ఇలియాజ్, వంశీ, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : ఎంజీఎం పాఠశాలలో

లేపాక్షి: నవోదయ విద్యాలయాలు సర్వ ప్రగతి కేంద్రాలని పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు వేమనారాయణ, వినోద్‌కుమార్, రాజారెడ్డి, శ్రీనివాసరెడ్డిలు పేర్కొన్నారు. నవోదయ అలూమిని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం (2000-2007) 14వ బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ప్రస్తుత ప్రిన్సిపల్ నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

లేపాక్షి: నవోదయ విద్యాలయంలో

గోరంట్ల : స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు అదే పాఠశాల ఆడిటోరియంలో ఆదివారం అపూర్వ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. ఆనాటి ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, భాస్కరరెడ్డి, శ్రీధర్, జయచంద్రారెడ్డి, లక్ష్మీనరసింహుడు, జనార్దన రెడ్డి, ప్రకాష్, కుళ్లాయిరెడ్డి, అమీర్, లక్ష్మీపతిరెడ్డి, రఘునాథరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, బాలకృష్ణ, మాధవీలత, శంకర పాల్గొన్నారు.

గోరంట్ల: అనాటి గురువులతో..

'ఉపాధ్యాయుల పనిభారం తగ్గించారు'

మడకశిర, న్యూస్‌టుడే : గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులను వివిధ పనులకు వాడుకోవడంతో ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనిభారం తగ్గించి బోధనకు ప్రాధాన్యమిచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టారని, నెల నెలా వేతనాలు ఇవ్వకుండా వేధించిందన్నారు. ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారన్నారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు కె.భూతన్న, జిల్లా నాయకులు జయచంద్రారెడ్డి, ఎస్ఎస్‌నాయుడు, సుధాకర్, మండల అధ్యక్షుడు మాలింగప్ప, జోగప్ప, మూడ్లగిరియప్ప, నరసింహప్ప పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

(c) eenadu

పుట్టపర్తి
•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని తొగట వీధిలోని శాంతకళా చౌడేశ్వరిదేవి ఆలయ ఆవరణంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. ఉదయం క్యాంపు ఛైర్మన్ దాసరి వెంకటేశులు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం వైద్యులు వివిధరకాల పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో క్యాంపు దాత పి.వి.శ్రీనివాసులు, వైద్యులు వివేక్, విట్టల్, వెంకటేశ్వర్లు, జయదీప్, సతీష్‌కుమార్, ప్రణయ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి ఉద్యోగులకు సన్మానం

కదిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో పనిచేస్తూ పదోన్నతులు పొందిన ఉద్యోగులకు ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో ఆదివారం ఘన సత్కారం జరిగింది. డిపోలో ఏడీసీలుగా పనిచేస్తున్న బి.ఉత్తన్న, సాయినాథ్‌లకు గ్రేడ్-3 ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లుగా, జూనియర్ సహాయకుడు సుబ్బారెడ్డికి సీనియర్ సహాయకుడిగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల అంకితభావం, సేవా నిరతికి పదోన్నతులు దక్కాయన్నారు. భవిష్యత్తులోనూ ఉత్తమ సేవల ద్వారా మరింత గుర్తింపు, గౌరవ పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ నాయకులు ఎన్వీరమణ, భైరిశెట్టి, రామకృష్ణ, అశ్వర్థమయ్య, శ్రీనివాసులు, హరిమోహన్, సురేంద్రరెడ్డి, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: చెన్నేకొత్తపల్లి మండలం ఎన్ఎస్‌గేట్ సమీపంలో రామగిరి మండల సరిహద్దు గ్రామమైన శ్రీహరిపురం మలుపు వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పలువురు మృత్యువాత పడగా, మరికొందరు క్షతగాత్రులయ్యారు. - **ఆంజనేయులు, శేషంపల్లి, రామగిరి మండలం**

సమాధానం: ప్రమాద పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదించిన పరిష్కారానికి కృషి చేస్తాం. - **చెన్నేకొత్తపల్లి పోలీసులు**

సమస్య: చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామం నుంచి బసంపల్లి గ్రామం వరకు ఉన్న దారిపై పలు చోట్ల తారు చెదిరి గుంతలు ఏర్పడ్డాయి. మరమ్మతులకు చర్యలు తీసుకోగలరు. - **మల్లికార్జున, మేడాపురం**

సమాధానం: రహదారిని పరిశీలించి మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. అనుమతులు వస్తే పనులు ప్రారంభిస్తాం. - **అబ్దుల్ ఖాదర్, పంచాయతీరాజ్ ఇన్‌ఛార్జి మండల ఏఈ**

– న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి

అసంపూర్తి రోడ్లు.. ప్రయాణ కష్టాలు

నత్తనడక పనులపై పర్యవేక్షణేదీ?

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరాలంటే రహదారులు సక్రమంగా ఉండాలి. ముదిగుబ్బ మండలంలోని రోడ్లు అధ్వానంగా మారడంతో చోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. ముదిగుబ్బ-దొరిగల్లు రోడ్డు నుంచి అడవిబ్రాహ్మణపల్లి మీదుగా యోగి వేమన జలాశయం వరకు 3 కిలోమీటర్లు తారు రోడ్డు నిర్మించాలని ఏప్రిల్ నెలలో పనులు మొదలుపెట్టారు. రూ.1.17 కోట్లతో రోడ్డును చదును చేశారు. అడవిబ్రాహ్మణపల్లితండా దగ్గర రెండు, జలాశయానికి వెళ్లే మార్గంలో ఒకటి చొప్పున కల్వర్టులు నిర్మించారు. తర్వాత పనులు ఆగిపోవడంతో చదును చేసిన రోడ్డంతా గుంతలమయంగా మారింది. ఈ మార్గంలో 14 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రివేళల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. చిన్నపాటి వానలకే గుంతల్లో నీరు నిలబడుతుండటంతో చిన్నాపెద్దా వాహనాలు ఇరుక్కుంటున్నాయి. ఆరునెలల్లోపు పనులు పూర్తిచేయాల్సిన గుత్తేదారు నిర్లక్ష్యానికి వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణాలోపంతోనే తాము నరక ప్రయాణం చేస్తున్నామని బాధిత ప్రజలు, వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాత్కాలిక పనులతో సరి: మల్లేపల్లి, తిమ్మనేనిపాళ్యం గ్రామాలకు వెళ్లే ఈ మార్గంలో ఈదులవంక కల్వర్టు నాలుగేళ్ల కిందట తెగిపోయింది. నేటికీ తాత్కాలిక పనులతో సరిపెడుతున్నారు. అక్టోబరులో మళ్లీ తెగిపోవడంతో రాళ్లు, మట్టివేసి వదిలేశారు. ఏమాత్రం అదుపుతప్పినా ప్రాణాలు పోయే అవకాశముంది. ఈ నేపథ్యంలో భారీ వాహనాలు సైతం దొరిగల్లు లేదా మలకవేముల క్రాస్ మీదుగా చుట్టూ ప్రయాణం చేయాల్సి వస్తోంది.

నేటికీ మట్టిరోడ్డే దిక్కు: మండలంలోని నాగలగుబ్బల, పెద్దచిగుళ్లరేవు, గుట్టకిందపల్లి గ్రామాలకు నేటికీ మట్టి రోడ్డే ఉన్నాయి. జొన్నలకొత్తపల్లి తండాకు రోడ్డే లేదు. ఒడ్డుకిందతండాలో తారురోడ్డు నిర్మాణానికి నిధులు రాకపోవడంతో చదును చేసి వదిలేసిన మట్టి దారిపైనే రాకపోకలు సాగుతున్నాయి. గుంజేపల్లి నుంచి కన్యకలగొందికి, గాండ్లవారిపల్లి నుంచి ఎస్.బ్రాహ్మణపల్లికి తారురోడ్లు వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అడవిబ్రాహ్మణపల్లితండాలో ఇది పరిస్థితి

త్వరగా పూర్తిచేయిస్తాం

గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్డు నిర్మాణ పనుల్లో కొంత జాప్యం జరిగిన మాట వాస్తవమే. రాకపోకలకు ఇబ్బందిలేకుండా పనులు త్వరగా పూర్తిచేయాలని గుత్తేదారులను ఆదేశిస్తాం. దెబ్బతిన్న, అధ్వానంగా మారిన మట్టిరోడ్ల స్థానంలో తారు రోడ్లు వేయడానికి అవసరమైన నిధుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే తారురోడ్లు నిర్మిస్తాం.

-పాండురంగారెడ్డి, పీఆర్ డీఈ, ధర్మవరం

సుంకులమ్మకు విశేష పూజలు

తాడిమర్రిలోని సుంకులమ్మ తల్లి ఆలయ మూడో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని రకరకాల అభిషేకాలు జరిపి సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంచారు. అనంతరం అన్నదానం చేశారు.

–న్యూస్‌టుడే, తాడిమర్రి

గ్రామాల్లో వీధిదీపాల ఏర్పాటు

కదిరి గ్రామీణం: మండలంలోని కుమ్మరవాండ్లపల్లి, యర్రదొడ్డి గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది కొత్త వీధిదీపాలు వేశారు. పనిచేయని వాటిని తొలగించారు. మొత్తం 65 వీధిదీపాలు వేసినట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

ఎన్‌పీకుంటకు నూతన ఎస్సై

నంబులపూలకుంట: మండల పోలీస్‌స్టేషన్ కొత్త ఎస్సైగా కృష్ణమూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో బుక్కపట్నంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతకుమునుపు పనిచేస్తున్న ఎస్సై వలీబాష బదిలీపై అమరాపురం వెళ్లారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ గ్రామస్థులు, ప్రజాప్రతినిధుల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

తాగు నీటి సమస్య రాకుండా చర్యలు

కనగానపల్లి, న్యూస్‌టుడే: తాగు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబా ఫక్రుద్దీన్, మార్కెట్ యార్డు ఛైర్మన్ సుధాకర్ నాయుడు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వేపకుంటలో ఓసీ కాలనీకు ఏర్పాటు చేసిన బోరుబావి నుంచి వస్తున్న తాగు నీటిని పరిశీలించారు. గ్రామాల్లో తాగు నీటి సమస్యకు తావివ్వకుండా అవసరమైన ప్రాంతాల్లో బోరుబావులు తవ్వించి తద్వార ప్రజలకు తాగు నీటిని అందిస్తామన్నారు.

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుడు తుంపర్తి పరమేష్ ఆధ్వర్యంలో కార్యకర్తలు గాంధీనగర్‌లోని కార్యాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు దేశ ఆర్థికాభివృద్ధికి ఎన్నో సంస్కరణలు తెచ్చిందని గుర్తు చేశారు. భాజపా రాజ్యాంగాన్ని, వ్యవస్థలను నాశనం చేస్తోందని ఆరోపించారు. సుభిక్ష పాలనకు కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు యుగంధర్, బాషా, నారాయణస్వామి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

రౌడీషీటర్లకు పోలీసు కౌన్సెలింగ్

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణ ఒకటో పోలీసుస్టేషన్‌లో ఆదివారం సీఐ నాగేంద్రప్రసాద్ రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రశాంతంగా జీవించాలని, ఎలాంటి గొడవలకు వెళ్లకూడదని హెచ్చరించారు. దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడితే చట్టపర తప్పవన్నారు. రాబోయే పంచాయతీ, పురపాలక ఎన్నికలను దృష్టిలో వుంచుకొని రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందని, నేరాలకు పాల్పడితే తీవ్ర చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు గ్రామీణ ఎస్సై రాజశేఖర్ కౌన్సెలింగ్ నిర్వహించారు.

సూచనలు చేస్తున్న సీఐ నాగేంద్రప్రసాద్

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

కదిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి భవనంలో ఆదివారం ఆయన ఎస్టీయూ-2026 నూతన కాలమానిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి తమపై పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏసీయూ సేవా కార్యక్రమాల్లో ముందుంటుందన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధితో పేదలకు నాణ్యమైన విద్యనందించేలా కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రవీంద్ర, లక్ష్మీప్రసాద్, జాఫర్‌హుసేన్, రవినాయక్, రామాంజనేయులు, వీరమహేశ్వర, ప్రసాద్, ఖలీల్‌రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

కాలమానిని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట, ఎస్టీయూ నాయకులు

బీజేవైఎం యువజన జిల్లా అధ్యక్షుడి నియామకం

కుళ్లాయప్ప

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ముదిగుబ్బకు చెందిన కుళ్లాయప్ప యాదవ్‌ను బీజేవైఎం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు భాజపా జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా కుళ్లాయప్ప మాట్లాడుతూ తనపై పార్టీ నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ప్రజా సమస్యలపై పోరాడి వారికి న్యాయం చేస్తానని తెలిపారు.

పెద్దచెరువుకు నిలిచిన నీటి మళ్లింపు

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: హంద్రీనీవా కాలువ ద్వారా మండలంలోని చెరువులను కృష్ణా జలాలతో నింపుతున్నారు. ఈక్రమంలో పెద్ద చెరువుకు కాలువ నుంచి నీటిని మళ్లించడానికి డీఈ రెడ్డెప్పరెడ్డి గ్రామ పెద్దలతో వెళ్లి పరిశీలిస్తుండగా రైతులు అడ్డుకున్నారు. తమ భూముల వద్ద కాలువ తీస్తే మడి కయ్యలు దెబ్బతింటాయని, బావులు పూడిపోతాయని, పొలం గుంతలమయంగా మారుతుందని వాపోయారు. దీంతో పెద్దచెరువుకు నీటి మళ్లింపు ఆపి, మల్లిరెడ్డి కుంట, దేవర చెరువుకు మళ్లించారు. కుంటకు పైభాగాన కాలువను తెంపారు. డీఈ రెడ్డెప్పరెడ్డి మాట్లాడుతూ కుంటలు నిండేలోగా పెద్దచెరువుకు నీటి మళ్లింపునకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి ముందుకు వెళతామన్నారు.

రైతులతో మాట్లాడుతున్న డీఈ రెడ్డెప్పరెడ్డి

ఆర్యవైశ్య సంఘం కాలమానిని విడుదల

కదిరి పట్టణం: పట్టణంలోని ఆర్యవైశ్య వసతి మందిరంలో ఆర్యవైశ్య యువజన విభాగం ఆదివారం కొత్త కాలమానిని ఆవిష్కరించింది. విభాగం అధ్యక్షుడు వరప్రసాద్, సభ్యులు చెన్నరాయశెట్టి, మురళీమోహన్, అశ్విన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఏడాది యువజన సంఘం పలు సేవా కార్యక్రమాలకు ప్రణాళిక రూపొందించినట్లు సభ్యులు తెలిపారు.

రైతు సేవా కేంద్రం పూర్తి చేయరా?

మండలంలోని పాముదుర్తిలో మూడేళ్లుగా రైతు సేవా కేంద్రం నిర్మాణ పనులు ఆగిపోయాయి. పాముదుర్తితో పాటు పరిసర పది గ్రామాలకు ఈ కేంద్రమే దిక్కు. పనులు పూర్తయ్యేదెన్నడు, తమకు సేవలు అందేదెన్నడంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు అసంపూర్తి భవనం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. దీనిపై ఏఓ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చామని, నిధులు విడుదలైన వెంటనే పూర్తిచేస్తామన్నారు.

–న్యూస్‌టుడే, బుక్కపట్నం

భవనాల వ్యర్థాలతో రాకపోకలకు తిప్పలు

ధర్మవరం చెరువుకట్ట కింద ప్రధాన రహదారి పక్కన భవనాల వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయాయి. పాత భవనాల వ్యర్థాలను ట్రాక్టర్లలో తెచ్చి పడేస్తున్నారు. దీనివల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎదురుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇచ్చే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ధర్మవరం

2 నుంచి పట్టా పాసుపుస్తకాల పంపిణీ

కొత్తచెరువు, న్యూస్‌టుడే: మండలంలో మొదటి విడతలో రీసర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాల్లోని రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుబుక్కులు జనవరి 2 నుంచి పంపిణీ చేస్తామని ఇన్‌ఛార్జి తహసీల్దారు బాలాంజినేయులు తెలిపారు. 2న ఉదయం ఐగారపల్లి, మధ్యాహ్నం వంగపల్లి, 3న లింగారెడ్డిపల్లి, 6న మైలసముద్రం, 7న ఉదయం తిరుమలదేవరపల్లి, మధ్యాహ్నం పుట్టపర్తి రూరల్, 8న పక్కీరుపల్లి రెవెన్యూ గ్రామాల్లో సంబంధిత రైతులకు పాసుపుస్తకాలు అందజేస్తామని చెప్పారు.

నిరంతరాయ విద్యుత్తు సరఫరాకు కృషి

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో నిరంతరాయ విద్యుత్తు సరఫరా చర్యలు తీసుకుంటున్నట్లు ఆ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం పట్టణంలో జరుగుతున్న విద్యుద్దీకరణ పనులను పరిశీలించి మాట్లాడారు. గృహ, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. సరఫరా లోపాలను గుర్తించి పరిష్కార చర్యలకు ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టి మెరుగైన విదుత్తు సరఫరా జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో డీఈఈలు శ్రీధర్‌రెడ్డి, శివరాం, ఏడీఈ లక్ష్మీనరసింహారెడ్డి, విద్యుత్తు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి స్నేహం ఎంతో మధురం

గురువులతో పూర్వ విద్యార్థులు

నల్లచెరువు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆదివారం 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి వేదికైంది. పాఠశాలకు వచ్చిన పూర్వ విద్యార్థులు నాటి ముచ్చట్లను గుర్తు చేసుకొని మురిసిపోయారు. ఒకరినొకరు కౌగిలించుకొని యోగక్షేమాలు విచారించుకున్నారు. తాము చదివిన తరగతి గదుల్లోని బెంచీలపై కూర్చొని చిన్న పిల్లలుగా మారిపోయి సందడి చేశారు. అనంతరం తమకు విద్యా బుద్ధులు చెప్పిన అప్పటి గురువులు సత్యానందం, కొండారెడ్డి, శంకర్ బాబు, నారాయణ, బాలు, శకుంతల, ప్రమీలమ్మకు మేళతాళాలతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. పాఠశాలలో సీసీ కెమెరాలకు రూ.1.60 లక్షలు వితరణ చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నాగేంద్రబాబు, లక్ష్మీపతిరెడ్డి, శ్రీనివాసులు, విశ్వేశ్వర, భారతి, వసంత రామరాజు, షాకీర్, చంద్ర విజయ లక్ష్మి, రాధిక, ప్రమీల, భాస్కర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నాటి బంధం.. గొప్ప సాయం

రామగిరి, న్యూస్‌టుడే: రామగిరి మండల పరిధి కుంటిమద్ది ఉన్నత పాఠశాలలో 2005-06 విద్యా సంవత్సరంలోని అప్పటి పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. సమావేశానికి అప్పటి ఉపాధ్యాయులు నారాయణప్ప, ఓబులేష్, సురేష్, రామాంజనేయులు, పద్మావతి, వెంకటస్వామిలు పాల్గొన్నారు. వీరిని పాఠశాల పూర్వ విద్యార్థులు ఘన స్వాగతం పలుకుతూ అందరినీ సత్కరించారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను, తోటి విద్యార్థులను 20 ఏళ్ల తరువాత కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం తమ మిత్రుడు కుంటిమద్ది నరేష్ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న వారు.. ఉపాధ్యాయుల చేతులు మీదుగా రూ.90 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

రామగిరిలో...

నీటి శుద్ధి పరికరం మూలకు

గత ప్రభుత్వ హయాంలో పాఠశాలలకు అందించిన నీటి శుద్ధి పరికరాలు మరమ్మతులకు గురయ్యాయి. విద్యార్థులు కుళాయి నీటిని లేదా ఇళ్ల నుంచి సీసాలలో తెచ్చుకుని తాగాల్సిన దుస్థితి నెలకొంది. చెన్నేకొత్తపల్లి మండలం నాగసముద్రం ప్రాథమిక పాఠశాలకు నాడు నేడు ద్వారా రూ. 3.7 లక్షల విలువ చేసే ఆర్వో ప్లాంట్ పరికరాలు అందించారు. ప్రారంభించిన 3 నెలలకే మరమ్మతులకు గురై వినియోగంలో లేకుండా పోయింది. పాఠశాలల్లోని 59 మంది చిన్నారుల ఇళ్ల నుంచి సీసాల్లో నీటిని తెచ్చుకుంటున్నారు. విషయాన్ని రెండో ఎంఈఓ ప్రసూన్‌కుమార్ నాయుడు దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్ల గురించి జిల్లా విద్యాధికారులకు తెలియజేశామన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి

ముళ్లకంపతో రాకపోకల అడ్డగింత!

పొలాలకు వెళ్లే దారి వెంబడి సంబంధిత రైతులు, గ్రామస్థులు వెళ్లకుండా ముళ్లకంపలను అడ్డంగా వేయడంతో ఆదివారం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని పక్కీరమ్మ కట్ట నుంచి తిరుమళ దేవరగుట్ట వరకు 2 కిలోమీటర్ల మేర రెవెన్యూ దస్త్రాల ఆధారంగా ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు వెళ్లేందుకు అనువుగా రస్తా కేటాయించారు. గుంతలు పడి అధ్వానంగా మారిన ఆ మార్గానికి మట్టి రోడ్డు వేయించాలని ఎమ్మెల్యే పరిటాల సునీతను రైతులు, గ్రామస్థులు కోరగా...ఎమ్మెల్యే సొంత సొమ్ము రూ.2 లక్షలను కేటాయించడంతో వారం నుంచి గుంతలు పడిన దారికి ట్రాక్టర్ల సహాయంతో మట్టిని తోలి చదును చేస్తున్నారు. కొందరు తమ పొలానికి ఆనుకొని ఉన్న దారి వెంబడి పొలాలకు వెళ్లేందుకు రస్తా లేదని అడ్డుకోవడంతో రెవెన్యూ అధికారులు పరిశీలించి దారిని కేటాయించాలని రైతులు, గ్రామస్థులు కోరారు. –న్యూస్‌టుడే, కనగానపల్లి

నాలుగేళ్లుగా ట్యాంకులు నిరుపయోగం

పైపులైన్లతో నేరుగా తాగునీటి సరఫరా

కొత్తచెరువు, న్యూస్‌టుడే: గత పంచాయతీ ఎన్నికల్లో నెలకొన్న గ్రూపు రాజకీయాలతో గ్రామ నడిబొడ్డున పాఠశాల పక్కనున్న 20వేల లీటర్ల ట్యాంక్‌కు నీటి సరఫరా నిలిపేశారు. మరోవైపు 20వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంకులో లీకేజీతో నీరు నిలబడటం లేదు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ రెండు ట్యాంకులు నాలుగేళ్లుగా నిరుపయోగంగా మారడంతో గ్రామస్థులు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఇది కొడపగానిపల్లి పంచాయతీ వేములేటిపల్లి పరిస్థితి. గ్రామంలో 150 ఇళ్లుండగా, 500 మంది నివసిస్తున్నారు. గత పంచాయతీ ఎన్నికల్లో వైకాపాలోని ఇద్దరు అభ్యర్థుల మధ్య పోరు ట్యాంక్‌కు శాపంగా మారింది. ట్యాంకు నుంచి వచ్చే వృథా నీరు, దాన్ని శుభ్రం చేసిన తర్వాత వదిలే నీరు బయటకు వెళ్లేందుకు ఒక వర్గం వారు ఆటంకాలు కలిగించారు. ఇదే సమయంలో ఓవర్‌హెడ్ ట్యాంకు లీకేజీకి గురైంది. అధికారులు మరమ్మతులు చేయించడం లేదు. దీనివల్ల రెండు ట్యాంకులకు నీటి సరఫరా ఆగిపోయింది. ఇప్పటికీ ఓవర్‌హెడ్ ట్యాంకు దగ్గర పైపులైను దెబ్బతిని పాడుబడ్డ బావిలోకి నీరు వృథాగా వెళుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు.

అధికారుల బాధ్యతారాహిత్యం: నాలుగేళ్లుగా పంచాయతీ బోరు, సత్యసాయి నీటి పథకం నుంచి నేరుగా పైపులైనుకు సరఫరా చేస్తుండటం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిలువెత్తు నిదర్శనం. సత్యసాయి పథకం నుంచి నీరు విడుదల చేసినప్పుడు, విద్యుత్తు ఉన్నప్పుడు పంచాయతీ బోరు నుంచి పైపుల ద్వారా నీరందుతోందని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. నేరుగా పైపులైన్లకు నీటిని సరఫరా చేస్తుండటంతో ఒత్తిడికి కుళాయిలు, పైపులు దెబ్బతింటున్నాయి. విద్యుత్తు కోతల సమయంలో నీరు లభించదని, ఇప్పటికైనా అధికారులు మేల్కొని రెండు ట్యాంకులకు నీటి సరఫరా పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. సమస్యను ఎంపీడీవో నటరాజ్ దృష్టికి తేగా, గ్రామానికి వెళ్లి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

నీటి సరఫరా లేని ట్యాంకు

పైపులైను దెబ్బతినడంతో వృథా అవుతున్న నీటిని చూపుతున్న స్థానికుడు

ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

బుక్కపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని గూనిపల్లి సమీపంలో ఎన్‌హెచ్ 342 రోడ్డుపై ఆదివారం సాయంత్రం ఐచర్, కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ముదిగుబ్బ నుంచి బుక్కపట్నంకు వస్తున్న కారును ఎదురుగా వస్తున్న ఐచర్ ఢీకొంది. నిమ్మలకుంటకు చెందిన కారు డ్రైవరు అశోక్ తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న జనం 108 సిబ్బంది సమాచారం అందించారు. వారు ఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు.

రోడ్డు నిబంధనలు పాటించాల్సిందే

నల్లమాడ, న్యూస్‌టుడే: వాహన చోదకులు కచ్చితంగా రోడ్డు నిబంధనలు పాటించాల్సిందేనని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆయన ఆదివారం నల్లమాడ క్రాస్‌లో వాహనచోదకులు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించి రికార్డులు వెంట ఉంచుకోవాలని, పోలీసులు అడిగినప్పుడు చూపించాలన్నారు. మద్యం తాగి, చరవాణిలో మాట్లాడుతూ బండ్లు నడిపితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధించడంతో పాటు అరెస్టు చేస్తామని స్పష్టం చేశారు. ఆయన వెంట పోలీసులు వెంకటేష్, చంద్రనాయక్ ఉన్నారు.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు

బత్తలపల్లి, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని ప్రోగ్రాం మేనేజర్ నవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం బత్తలపల్లిలోని ప్రకృతి వ్యవసాయ రైతులు ఈశ్వరమ్మ, పార్వతి పొలంలో పండించిన ఏటీఎం, ఏగ్రేడ్, పీఎండీఎస్ మోడల్ పంటలను ఆయన సందర్శించారు. ఐసీఆర్పీలకు పొలంలో సేంద్రియ సాగు విధానాలపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలన్నారు. గ్రామాల్లో సహజంగా దొరికే ఆవు పేడ, మూత్రంతో తయారు చేసిన జీవామృతం, ఘన జీవామృతం వాడితే పంట దిగుబడులు పెరిగి ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. ఆయన వెంట ఎంటీ హరికుమార్, డీటీటీ రవీంద్ర, ఎల్1 నరసింహులు తదితరులున్నారు.

సాగు విధానాలపై అవగాహన కల్పిస్తున్న నవీన్

(c) eenadu

ఈనాడు
శ్రీకాకుళం
సోమవారం డిసెంబరు 29, 2025

కంట పడింది.. కుంటలా మారింది..!

మందస మండలం పిడిమందస రెవెన్యూ పరిధి భల్లో కగిరి కొండను ఇష్టానుసారం కొల్లగొట్టేస్తున్నారు. సమీపంలోని స్టోన్ క్రషర్ల నిర్వాహకులు ఈ కొండ నుంచి అనుమతికి మించి బండలను బాంబులతో పేల్చి రాళ్ల ముక్కలను తరలిస్తున్నారు. పేలుళ్ల ధాటికి ఆ ప్రదేశంలో పది అడుగుల లోతున భారీ గుంత ఏర్పడింది. అందులో ప్రస్తుతం వర్షపు నీరు నిలిచి ఇలా కుంటలా మారింది. పరిశీలించి చర్యలు తీసుకుంటామని మందస ఎస్సై కె.కృష్ణప్రసాద్ తెలిపారు.
– న్యూస్‌టుడే, హరిపురం (మందస)

అంగరంగ వైభవంగా రథసప్తమి వేడుకలు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: అరసవల్లిలో రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆదేశించారు. శ్రీకాకుళం నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే నెల 25న రథసప్తమి సందర్భంగా వారం ముందు నుంచి ఉత్సవాలు పక్కాగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆఖరి మూడు రోజులు ఆధ్యాత్మిక, క్రీడా, సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు ఉండాలని సూచించారు. ఆహ్వాన పత్రిక మొదలుకుని.. అన్నీ ప్రణాళిక ప్రకారం జరగాలని స్పష్టం చేశారు.

అధికారులతో చర్చిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

మూడో కన్ను చూస్తోంది..!

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసు

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తా విభాగం, కాశీబుగ్గ

కొందరు వాహనదారులు సిగ్నల్ దాటి ముందుకెళ్తుంటారు. కూడళ్లలో పోలీసులు కనిపించకపోతే వేగం పెంచుతారు. మైనర్ల చేతికి బండి దొరికితే వారికివేమీ కనిపించవు. అతిక్రమణలకు అడ్డుకట్ట వేయడానికి పోలీసులు అధునాతన సాంకేతికతను అనుసంధానిస్తున్నారు. జిల్లా కేంద్రం సహా పట్టణాల్లో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా కెమెరాలను అమర్చి నిఘా పెంచారు. ఉల్లంఘనలకు అవకాశం లేకుండా..సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టారు.

కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలిలో ద్విచక్ర వాహనంపై నలుగురు ప్రయాణం

శ్రీకాకుళం నగరంలో ఏడు రోడ్ల కూడలి, డే అండ్ నైట్ కూడలి, పొట్టి శ్రీరాములు కూడలి, ఆర్టీసీ కాంప్లెక్సు పరిసరాలు, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, ఆమదాలవలస పట్టణాల పరిధిలో అమర్చారు.

★ ద్విచక్ర వాహనాలపై ముగ్గురు లేక అంతకంటే ఎక్కువ మంది ప్రయాణించడం.. శిరస్త్రాణం లేకుండా నడపడం, నో పార్కింగ్ స్థలాల్లో నిలపడం. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే అపరాధంగా పరిగణిస్తారు.

★ సిగ్నళ్లను అతిక్రమిస్తే విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులు గుర్తించి అపరాధ రుసుం వసూలు చేస్తున్నారు. సిబ్బంది పరిమితంగా ఉండటంతో పలు కూడళ్లలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో సాంకేతికతను అనుసంధానం చేశారు.

★ జాతీయ రహదారిపై అమర్చిన ఆటోమేటిక్ నంబరు ప్లేట్ రికగ్నైజేషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాలను పట్టణ ప్రాంతాల్లోని కూడళ్లలో అమర్చి ట్రాఫిక్ నియంత్రణకు వినియోగిస్తున్నారు.

★ పోలీసులు అందుబాటులో లేకపోయినా నిబంధనలను ఉల్లంఘించే వారిని గుర్తించడానికి ఉపయోగపడుతున్నాయి.

రద్దీగా ఉండే కూడళ్లలో నిబంధనలు ఉల్లంఘించిన వాహనాల నంబరు ప్లేట్ల ఆధారంగా జరిమానా విధిస్తారు. అపరాధ రుసుం చెల్లించాలంటూ వారి సెల్‌ఫోన్లకు సందేశాలు వెళ్తాయి. ట్రాఫిక్ నియమాలు అనుసరించకుంటే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ ఎం.రామారావు (శ్రీకాకుళం) స్పష్టం చేశారు. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పలు కూడళ్లలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

ఇచ్ఛాపురం, పలాస, ఆమదాలవలస, శ్రీకాకుళం పరిధిలో ఉల్లంఘనలు

తేదీ	కేసులు
22	42
23	38
24	39
25	41
26	31
27	36

ఆగండి.. ఇంటిని చూడండి..!

న్యూస్‌టుడే పరిశీలన

ఆస్తి పన్ను చెల్లింపుల్లో మాయాజాలం

న్యూస్‌టుడే, పలాస, ఇచ్ఛాపురం, ఆమదాలవలస పట్టణం, శ్రీకాకుళం నగరం

జిల్లాలోని పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థ పరిధిలో కొందరు గృహాలను గోదాంలుగా వినియోగిస్తూ వ్యాపారం చేస్తున్నారు. పన్నుల చెల్లింపు సమయంలో ఇళ్ల కింద చూపుతుండటంతో ఖజానాకు గండి పడుతోంది. ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస, శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో సాగుతున్న అక్రమ వ్యవహారంపై 'న్యూస్‌టుడే' కథనం.

◆ పలాస-కాశీబుగ్గ
❑ 17,597 ✦ 15,171
● 1,674 ☆ 752

జంట పట్టణాల్లో లెక్కకు మించి..

కాశీబుగ్గ పరిధి నిత్యానందనగర్, అక్కుపల్లి కూడలి, గాలిమేడ, అన్నపూర్ణ థియేటర్ రోడ్డు, గాంధీనగర్, వివేకానంద మార్గ్, పలాసలో ఇందిరా చౌక్ నుంచి పెద్ద వీధి, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో గృహాల్లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. జంట పట్టణాల్లోని చాలా ఇళ్లను జీడి పరిశ్రమలుగా వినియోగిస్తున్నా పురపాలక అధికారులు సాధారణ గృహాలుగానే పరిగణిస్తున్నారు.

అంతా సాధారణమే..

చాలా వీధుల్లో ఇళ్లలోనే దుకాణాలు నిర్వహిస్తున్నా పురపాలక సిబ్బంది సాధారణ పన్నులే వసూలు చేస్తున్నారు. ఇంటి ముందు బడ్డీ కొట్టు పెట్టుకుంటే ఆక్రమణ పన్ను విధిస్తున్నారు.

◆ ఇచ్ఛాపురం
❑ 9,732 ✦ 8,589
● 1,093 ☆ 50

సర్వేకే పరిమితం

వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్న గృహాలను వార్డు సచివాలయ ఉద్యోగులు సర్వే చేసి గుర్తించారు. ఇప్పటికీ పాత పద్ధతిలోనే ఆస్తి పన్ను వసూలు చేస్తుండటంతో పుర ఆదాయానికి గండి పడుతోంది. ఈ విషయం అధికారులకు తెలిసినా సమీక్షించకపోవడం గమనార్హం.

◆ ఆమదాలవలస
❑ 15,921 ✦ 14,321
● 1,600 ☆ 600

సరకు నిల్వ కేంద్రాలు

శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో చాలా వరకు ఇళ్లలోనే సరకులు నిల్వ చేయడానికి అద్దెకిచ్చి రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. ఆస్తి పన్ను చెల్లింపు సమయంలో గృహంగా చూపుతున్నారు.

◆ నగరపాలక సంస్థ శ్రీకాకుళం
❑ 47,432 ✦ 46,852
● 5,480 ☆ 1,500

◆ పురపాలక సంఘం ❑ అసెస్‌మెంట్లు ✦ గృహాలు ● వ్యాపార సంస్థలు ☆ వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఇళ్లు

కౌశలం.. కొలువుకు అభయం!

న్యూస్‌టుడే, పొందూరు

కొందరు బాగా చదువుకున్నా కుటుంబ పరిస్థితులు, ఇతర ప్రాంతాలకు వెళ్లలేక, ఇతర కారణాలతో నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. కూటమి ప్రభుత్వం వారి నైపుణ్యానికి అనుగుణంగా ఉపాధి కల్పించడానికి కౌశలం పేరిట ఓ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇంటి వద్ద ఉద్యోగం చేసుకునే అవకాశాన్ని కల్పించింది. జిల్లాలో దీనికి సంబంధించిన ప్రక్రియ మొదలైంది. సర్వేలో ఆసక్తి చూపిన అభ్యర్థులు ఈ నెల 2 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో పరీక్షలకు హాజరవుతున్నారు. ఉత్తీర్ణులైన వారికి ఇంటి నుంచి పని చేసే అవకాశం కల్పించనున్నారు.

సద్వినియోగం చేసుకుంటున్న నిరుద్యోగులు

ఎంపిక ఇలా

★ జిల్లాలోని 30 మండలాల్లో 732 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో రెండు విడతల్లో నిరుద్యోగుల ఎంపికకు సచివాలయ సిబ్బంది రెండు విడతల్లో ఇంటింటా సర్వే చేపట్టారు.

★ 1.37 లక్షల మంది వివరాలు ఆరా తీయగా తొలి దశలో 93,362 మంది ఇంటి నుంచి పనికి ముందుకొచ్చారు.

★ రెండో విడతలో 29,500 మంది ఆసక్తి చూపారు.

★ రోజుకు ఇద్దరు చొప్పున సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో పరీక్షకు హాజరవుతున్నారు.

జి.సిగడాం గ్రామ సచివాలయంలో ఆన్‌లైన్ పరీక్షకు హాజరైన అభ్యర్థి

రీషెడ్యూల్‌కు అవకాశం

కౌశలం యాప్‌లో దరఖాస్తు చేసిన కొందరు స్థానికంగా లేకపోవడం.. ఆన్‌లైన్‌లో సమస్యలు తలెత్తడం, పరీక్షకు గైర్హాజరు కావడం, ఇతర కారణాలతో మందకొడిగా సాగుతోంది. ఇలాంటి వారికి ఆధార్ సంఖ్య ద్వారా పరీక్ష తేదీ రీషెడ్యూల్ చేసుకునే అవకాశం కల్పించారు.

3 నెలల్లో పూర్తి

కౌశలం పేరిట సచివాలయాల్లో పరీక్షలు జరుగుతున్నాయి. మరో 3 నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నాం. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి.
– ఉదయ్‌కుమార్, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా సమన్వయకర్త, శ్రీకాకుళం

★ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు నిర్వహిస్తున్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే ప్రక్రియ మొదలవుతుంది.

అయ్యో.. ఆలివ్‌రిడ్లే..!

తీరంలో ఆలివ్‌రిడ్లే తాబేళ్ల మృత్యువాత పడుతున్నాయి. మత్స్యకారుల వలలకు చిక్కుకుని చనిపోతుండటంతో తీరానికి చేరిన తర్వాత ఒడ్డున పడేస్తున్నారు. ఎక్కువగా ఇంజిన్ బోట్లకు తగిలి గాయపడి మృతి చెందుతున్నాయి. సంతానోత్పత్తికి తీరానికి వచ్చిన సమయంలో కళేబరాలుగా మారుతున్నాయి. ఈ విషయమై అటవీ శాఖ టెరిటోరియల్ సెక్షన్ అధికారి టి.శ్రీనివాసరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఆలివ్‌రిడ్లే తాబేళ్లు వలలకు చిక్కినప్పుడు సురక్షితంగా సముద్రంలోకి విడిచిపెట్టాలని మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించామని చెప్పారు. బుడగట్లపాలెంలో సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా గుడ్లు కనిపిస్తే సమాచారమివ్వాలని.. సంరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అల్లివలస తీరంలో మృతి చెందిన ఆలివ్‌రిడ్లే తాబేళ్లను చిత్రంలో చూడొచ్చు.
– న్యూస్‌టుడే, రణస్థలం

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

లావేరు, న్యూస్‌టుడే: రణస్థలం మండలం అల్లివలస, సూరంపేట తదితర గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని శ్రీకాకుళానికి అక్రమంగా తరలిస్తుండగా లావేరు ఎస్సై కె.అప్పలసూరి రేగపాలెం సమీపంలో పట్టుకున్నారు. ఆదివారం నిర్వహించిన దాడుల్లో వాహనంలోని 45 బస్తాల్లో సుమారు 20 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చామని తెలిపారు. పోలీసుస్టేషన్‌లో బియ్యాన్ని సీఎస్‌డీటీ వై.అరుణ పరిశీలించి 6ఏ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అల్లినగరం గ్రామానికి చెందిన జామి కూర్మారావు, డ్రైవర్ జి.గణేశ్‌లపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు.

లావేరు పోలీసుస్టేషన్‌లో రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న సీఎస్‌డీటీ అరుణ

కాలువలు కప్పేసి.. భవనాలు కట్టేసి!

సోంపేటలో యథేచ్ఛగా భూదందా

న్యూస్‌టుడే, సోంపేట

సోంపేటలో ప్రధాన రహదారి, కవిటి రోడ్డు పక్కన కాలువలు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ మార్గంలో చదరపు అడుగు స్థలం రూ.3 లక్షల నుంచి, రూ.4 లక్షల వరకు పలుకుతుండటంతో జిరాయితీ భూమి పక్కనే ఉన్న కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే వరద నీరు బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో పలు వీధులు ముంపునకు గురవుతున్నాయి.

ఇదీ పరిస్థితి

★ చదంబాల చెరువు పక్కన కాలువ రోడ్డు దాటిన తర్వాత దారి మళ్లించే ప్రక్రియ ప్రారంభించడంతో వరద నీరు వెళ్లడానికి అవకాశం లేని పరిస్థితి తలెత్తింది. ఇక్కడ అడుగు స్థలం రూ.4 లక్షలకు పైగా ధర పలుకుతుండటంతో మధ్యలో ఉన్న కాలువ మూసివేయడానికి ప్రయత్నిస్తున్నారు.

★ ఇటీవల 30 అడుగుల వరకు వదిలి ఇరువైపులా కంకర వేసి చదును చేశారు. ఆ తర్వాత కాలువను కప్పేసి ప్రధాన రహదారి పక్క నుంచి ఉత్తరం వైపు నాలుగైదు అడుగుల వెడల్పుతో మళ్లించే ప్రయత్నం చేశారు. వ్యతిరేకత రావడంతో దక్షిణం వైపు మళ్లించడానికి ఉత్తరం వైపు మూసివేశారు.

కవిటి రోడ్డులో కాలువను కప్పేసి ఉత్తరం వైపు మళ్లించారిలా..

★ కాలువ ఆక్రమణ కారణంగా రాజుగారిపేట, చీకటిబంగళా వీధి, కోర్టుపేటలో వరద నీరు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని కొందరు ప్రభుత్వ విప్ అశోక్, మాజీ మంత్రి శివాజీ దృష్టికి తీసుకెళ్లారు.

★ సోంపేట-కంచిలి మార్గంలో పైవంతెన పరిధిలో కాలువ ప్రాంతం సగానికి పైగా ఆక్రమణకు గురైంది. 30 అడుగులకు పైగా వెడల్పు ఉండగా కొందరు ఇష్టానుసారం మారుస్తుండటంతో రోడ్డు మీదుగా వరద పారుతోంది. చిన్నపాటి వర్షానికే ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు.

★ సోంపేట-కవిటి రోడ్డులో పోలీసు చెరువు మూడో వంతు ఆక్రమణకు గురికాగా దీనికి సంబంధించిన కాలువ పూర్తిగా మాయమైంది. వరద రహదారి మీదుగా పారుతోంది. ఆయకట్టు భూములు సాగుకు నోచుకోలేని పరిస్థితి నెలకొంది.

★ కవిటి రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన పెట్రోలు బంకు పరిధిలో పెద్ద కాలువ రూపురేఖలు మారిపోయాయి. ఇక్కడ 30 అడుగుల వెడల్పుతో ఉండగా ప్రస్తుతం 10 అడుగులు కూడా లేదు. కల్వర్టు దగ్గరకు వచ్చేసరికి పూర్తిగా మాయమైంది. గొల్లవాని చెరువు నుంచి మండపల్లి వరకు పంట పొలాలకు నీరందించే కాలువ మూతపడటంతో రైతులు సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖరీఫ్‌లో వరి పండించలేని పరిస్థితి నెలకొంది. కాలువ స్థలాన్ని కొందరు సొంత భూమిగా చూపి విక్రయించడంతో రిజిస్ట్రేషన్లు జరిగాయి.

చర్యలు తీసుకుంటాం..

ప్రధాన రహదారుల పక్కన కాలువల ఆక్రమణలను పరిశీలిస్తాం. ఇప్పటికే అందిన ఫిర్యాదులను సర్వేయర్‌కు అప్పగిస్తాం. కాలువలు, చెరువుల రూపురేఖలు మారినట్లు గుర్తిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.
-బి.అప్పలస్వామి, తహసీల్దారు, సోంపేట

పేదలకు గృహ యోగం..!

న్యూస్‌టుడే, కాశీబుగ్గ

గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి ప్రజలకు సొంత ఇళ్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) 2.0 కింద నుంచి ఇటీవల దరఖాస్తులు స్వీకరించింది. ఈ నెల 14 వరకు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకున్నారు. గృహ నిర్మాణ సంస్థ సిబ్బంది దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించి అర్హతను ధ్రువీకరించే ప్రక్రియ పూర్తి చేశారు.

శత శాతం ధ్రువీకరణ పూర్తి

75,117 దరఖాస్తులు

★ జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలో 924 గ్రామ పంచాయతీల నుంచి 75,117 దరఖాస్తులు అందాయి.

★ వాటిని జంబ్లింగ్ పద్ధతిలో గృహ నిర్మాణ సంస్థ మండల స్థాయి సిబ్బంది పరిశీలించారు.

★ 31,726 దరఖాస్తులు రెండోసారి పరిశీలించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలొచ్చాయి.

★ ఈ ప్రక్రియను గృహ నిర్మాణ సంస్థ అధికారులు పూర్తి చేసి శత శాతం పరిశీలన చేపట్టారు.

★ సొంత స్థలం ఉన్నా, లేకున్నా ఆర్థికంగా వెనకబడిన, తక్కువ ఆదాయం కలిగిన, మధ్య తరగతి వర్గాలు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

★ ప్రస్తుతం సొంత స్థలం ఉన్న వారికే ప్రాధాన్యమిస్తున్నట్లు సమాచారం. ఒక్కో యూనిట్‌కు రూ.2.89 లక్షలు మంజూరు చేయనున్నారు.

దరఖాస్తుదారు వివరాలు నమోదు చేస్తున్న గృహ నిర్మాణ సంస్థ సిబ్బంది

ఆన్‌లైన్‌లో పొందుపరిచాం..

ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద గ్రామీణ ప్రాంతాల నుంచి అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. ఆయా వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.
– రమాకాంత్, పీడీ, గృహ నిర్మాణ సంస్థ, శ్రీకాకుళం

వనరులు అపారం.. వినియోగించుకుంటే ఆదాయం!

● అటవీ ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తే సత్ఫలితాలు

న్యూస్‌టుడే, హరిపురం (మందస)

అడవిని నమ్ముకుని బతికే గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా యంత్రాంగం పని చేయాలి. వారి ఆదాయ మార్గాలు పెంచాలి. అందుకు తగినట్లు ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి.
– ఇటీవల సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు

జిల్లాలోని అడవుల్లో సుగంధ ద్రవ్యాలు, వివిధ రకాల పండ్లు, పలు రకాల ఉత్పత్తులు సమృద్ధిగా లభిస్తున్నాయి. కొన్ని మాత్రమే మార్కెట్‌కు వెళ్తున్నాయి. మిగిలిన వాటికి గిట్టుబాటు లేక గిరిజనులు నష్టపోతున్నారు. గతంలో తెదేపా హయాంలో సెర్ప్ సౌజన్యంతో వనమూలికలు సేకరించేవారు. రూ.లక్షల విలువ చేసే వనమూలికలు బహుళ జాతి కంపెనీలకు ఎగుమతి అయ్యేవి. పదేళ్ల కిందట ఈ ప్రక్రియ నిలిచిపోయింది.

● ఈ మొక్క పేరు శతావరి. మహేంద్రగిరుల్లో విస్తారంగా లభించే వనమూలికల్లో ఇదొక రకం. తిప్పతీగ, అడ్డసారం, ముషిడికి, నరమామిడి వంటి జాతులకు తూర్పు కనుమలు పుట్టినిల్లు. గతంలో వెలుగు ఆధ్వర్యంలో పేదరిక నిర్మూలన సంస్థ సౌజన్యంతో గిరిజన ప్రాంతాల్లోని మహిళలు సేకరించే వారు. నెలకు సుమారు 10 టన్నులు ఎగుమతి చేసేవారు. మంచి ఆదాయం వచ్చేది.

● అటవీ ఉత్పత్తుల్లో కుంకుడు కాయలు ప్రధానమైనవి. సీకాయలు, కరక్కాయలు, కాగు పిక్కలు, ముషిడికి పిక్కలు వంటి అనేక జాతులు కొండ ప్రాంతాల్లో లభిస్తాయి. వీటిని గిరిజనులు సేకరించి మార్కెట్ చేసి ఆదాయం పొందేవారు. కొన్నేళ్ల కిందట ఈ ప్రక్రియ ఆగిపోవడంతో గిరిజనులకు ఉపాధి భారంగా మారింది.

చిరుధాన్యాలు సాగు చేసి దళారులను నమ్మి మోసపోతున్నారు. ప్రభుత్వమే కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తే సాగు విస్తీర్ణం పెరుగుతుంది. గిరిజన రైతుల ఆదాయం పెరుగుతుంది.

అవగాహన లోపం

గిరిజన యువతకు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోంది. అటవీ ఉత్పత్తులు, పంటల సేకరణకు కొన్ని గ్రామాలను యూనిట్‌గా చేసి రూ.15 లక్షలతో భవనం నిర్మించారు. చాలా చోట్ల అవి అలంకారప్రాయంగా మారాయి. తండాల్లో 300 మందిని భాగస్వాములను చేస్తూ వన్‌ధన్ వికాస కేంద్రాలను నెలకొల్పారు. ఒక్కో సభ్యుడికి రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం చేశారు. అవగాహన లేక చాలా కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి.

మండలం	జనాభా	కుటుంబాలు
హిరమండలం	8,389	1,487
కొత్తూరు	11,978	2,508
మందస	12,038	2,592
మెళియాపుట్టి	14,990	2,774
పాతపట్నం	10,388	2,164
నందిగాం, కంచిలి, సోంపేట	5,064	972

ప్రణాళికలు రూపొందిస్తున్నాం

ఐటీడీఏ పరిధిలో పథకాల నిర్వహణ, ఫలితాలపై గిరిజనులకు అవగాహన కల్పిస్తాం. అటవీ ఉత్పత్తుల సేకరణ, వన్‌ధన్ కేంద్రాలు సక్రమంగా నడిచేలా యువతలో చైతన్యం తీసుకొస్తాం. పంటలకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకుంటాం. పక్కాగా అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం.
స్వప్నిల్ జగన్నాథ్, ఐటీడీఏ పీవో, సీతంపేట

ఆసక్తికరంగా హ్యాకథాన్

టెక్కలి, న్యూస్‌టుడే: టెక్కలి సమీపంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఆవిష్కార్ సీజన్-3లో 48 గంటల హ్యాకథాన్ కార్యక్రమం ఆసక్తికరంగా సాగుతోంది. ఆదివారం విద్యార్థి బృందాలు వినూత్న ప్రాజెక్టులు రూపొందించడంపై దృష్టి సారించాయి. కళాశాల అధ్యాపకులు, మెంటార్లు సూచనలు చేశారు.

ప్రాజెక్టులు రూపొందిస్తున్న విద్యార్థులు

మూగజీవాల అక్రమ రవాణా

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలో మూగజీవాల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. వ్యవసాయ పనులు పూర్తికావడంతో రైతులు దుక్కి ఎద్దులు, దేశవాళీ ఆవుల్ని అమ్మేస్తున్నారు. కొందరు దీన్ని వ్యాపారంగా మలుచుకుని కబేళాలకు తరలిస్తున్నారు. సాయంత్రం వాహనాల్లో లోడు చేసి రాత్రి వేళ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆదివారం దామోదర్‌సాగర్ జలాశయం సమీపంలో వాహనంలోకి ఎక్కిస్తున్న మూగజీవాలను చిత్రంలో చూడొచ్చు. మూగజీవాల్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మందస ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపారు.
– న్యూస్‌టుడే, మందస

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు నేరుగా లేదా, **meekosam.ap.gov.in**లో దరఖాస్తులు సమర్పించొచ్చని సూచించారు. నమోదైన అర్జీల స్థితి తెలుసుకోవడానికి 1100కు ఫోన్ చేయాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

(c) eenadu

బంగారు భవితకు విద్యాశక్తి..!

● 262 ప్రభుత్వ బడుల్లో ఐఐటీ నిపుణులతో పాఠాలు

– న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

పిల్లల్ని ఐఐటీ, ఎన్ఐటీల్లో చదివిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందని తల్లిదండ్రులు భావిస్తారు. వాటిల్లో ప్రవేశాలు పొందేలా రూ.లక్షలు ఖర్చు చేసి శిక్షణ ఇప్పిస్తుంటారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అంత ఆర్థిక స్థోమత లేక సీట్ల సాధనలో వెనుక బడుతున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి.. సర్కారు బడుల్లో 'విద్యాశక్తి' కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టింది. పాఠశాల స్థాయి నుంచి ఐఐటీ నిపుణులతో పాఠాలు బోధించేలా కార్యాచరణ రూపొందించింది.

పొన్నాడ కేజీబీవీలో ఆన్‌లైన్ తరగతికి హాజరైన విద్యార్థినులు

జిల్లాలో తొలి విడతగా 262 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యాశక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. తొమ్మిదో తరగతి వరకు, ఇంటర్ విద్యార్థులకు మద్రాసు ఐఐటీతో ఒప్పందం కుదుర్చుకుని నిపుణులతో ఆయా చోట్ల బడుల్లో ప్రత్యక్షప్రసారం ద్వారా పాఠాలు బోధిస్తున్నారు. దీంతో పాటు రికార్డు చేసిన అంశాలను కూడా ప్రదర్శిస్తున్నారు.

రోజూ సాయంత్రం గంటసేపు..

ప్రతి పాఠశాలలో రోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు తెరపై విద్యార్థులు తరగతులు వినేలా ఏర్పాట్లు చేశారు. నిత్యం ఒక్కో తరగతికి రెండు సబ్జెక్టులు ఎంపిక చేసి ఐఐటీ మద్రాస్ నిపుణులు బోధిస్తున్నారు. నేర్చుకుంటున్న అంశాలపై ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేస్తున్నట్లు సమగ్ర శిక్షా ఏఎంవో సీహెచ్ సుధాకర్ తెలిపారు.

ప్రయోజనాలివీ..

● సైన్సు, గణితం, ఆంగ్ల పాఠ్యాంశాల్లో పట్టు సాధించేందుకు ఈ తర్ఫీదు దోహదపడుతుంది. ● ప్రాథమిక స్థాయి నుంచి నేర్చుకోవడంతో పోటీ పరీక్షలను సులువుగా ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది. ● ఐఐటీ, ఎన్ఐటీలపై అవగాహన రావడంతో కచ్చితంగా సీటు సాధించే అవకాశాలు పెరుగుతాయి.

ఎంపికైన బడులు.. ● రెసిడెన్షియల్: 40 ● నాన్ రెసిడెన్షియల్: 222

తుది పోరుకు సై..!

● నేడు ఈఎస్ఎల్-2025 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్' ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ -2025' క్రికెట్ టోర్నమెంట్ పోటీలు చివరి దశకు చేరుకున్నాయి. రెండు రోజుల పాటు సెమీఫైనల్స్ హోరాహోరీగా జరిగాయి. సీనియర్ విభాగంలో ఐతమ్ ఇంజినీరింగ్ (టెక్కలి), శ్రీశివానీ ఇంజినీరింగ్(చిలకపాలెం) కళాశాలల జట్లు, జూనియర్ విభాగంలో పద్మావతి జూనియర్ కళాశాల(నరసన్నపేట), ఆర్‌జీయూకేటీ(ఎచ్చెర్ల) జట్లు తుది పోరుకు అర్హత సాధించాయి.

జెమ్స్‌హాస్పిటల్ రాగోలు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆదిత్యాలయం ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్

'ఈనాడు' ప్రయత్నం.. అభినందనీయం

శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన పోటీలను అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయ ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేటి క్రీడాకారులను వెలికితీసేందుకు 'ఈనాడు' చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మెరిసేలా శ్రమించాలని ఆయన ఆకాంక్షించారు.

శ్రీ శివానీ భారీ గెలుపు...

విజేతగా నిలిచిన శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

అయిదో రోజు శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాల(చిలకపాలెం), శ్రీసాయి దంత వైద్య కళాశాల(శ్రీకాకుళం) జట్ల మధ్య సెమీఫైనల్ మ్యాచ్ జరిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీ శివానీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు తీసి. . 83 పరుగుల లక్ష్యాన్ని ప్రత్యర్థుల ముందుంచింది. రెండో బ్యాటింగ్‌కు దిగిన శ్రీసాయి దంత వైద్య కళాశాల జట్టు లక్ష్యఛేదనలో చేతులెత్తేసింది. కేవలం 44 పరుగులకే బ్యాటర్లు ఆల్ అవుట్ అయిపోవడంతో శివానీ జట్టు 50 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించి తుది పోటీలకు అర్హత సాధించింది. ఇరు జట్ల బౌలర్లు చక్కగా రాణించి బ్యాటర్లను కట్టడి చేశారు. శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాల జట్టు ఆటగాడు ఎస్.కృష్ణకాంత్ 2 ఓవర్లలో 10 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. బ్యాటింగ్‌లో నాలుగు బంతుల్లో 6 పరుగులు చేశాడు. ఆల్‌రౌండర్ ప్రతిభ కనబర్చి జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా

కె.కృష్ణకాంత్

హోరాహోరీగా జరుగుతున్న ఆట

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) NECC "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner: ఈనాడు.నెట్ TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

ఫైనల్స్‌లో తలపడేది వీరే..

వేదిక: శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం

● ఉదయం 9:30 గంటలకు (జూనియర్ విభాగం) పద్మావతి జూనియర్ కళాశాల, నరసన్నపేట v/s ఆర్‌జీయూకేటీ, ఎచ్చెర్ల(శ్రీకాకుళం క్యాంపస్)

● మధ్యాహ్నం 12:30 (సీనియర్ విభాగం) శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాల, చిలకపాలెం v/s ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాల, టెక్కలి

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం

● సెలవుల నుంచి తిరిగి వస్తుండగా దుర్ఘటన

ప్రణీత్ (పాత చిత్రం)

కంచిలి, న్యూస్‌టుడే: కంచిలి గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థి క్రిస్మస్ సెలవులకు ఇంటికి వెళ్లి తిరిగి వస్తూ లారీ ఢీ కొనడంతో మృతి చెందాడు. ప్రమాదంలో బాలుడి తండ్రి తీవ్రగాయపడ్డారు. ఈ ఘటన కంచిలి మండలం పరిధి జలంత్రకోట జాతీయ రహదారి వద్ద చోటుచేసుకుంది. స్థానికులు, బంధువుల వివరాల ప్రకారం. . సోంపేట మండలం మామిడిపల్లికి చెందిన మట్ట హేమంత్, సరస్వతి దంపతుల చిన్న కుమారుడు ప్రణీత్ కుమార్(15) క్రిస్మస్ సెలవులకు ఇంటికి వచ్చి ఆదివారం తిరిగి వసతిగృహానికి తండ్రి హేమంత్‌తోపాటు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. జలంత్రకోట జాతీయ రహదారిపై ఓ లారీ వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ప్రణీత్ తల శరీర భాగాలు నుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రికి తీవ్ర గాయాలవ్వగా సోంపేట సామాజిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం తరలించారు. బాలుడి అన్నయ్య ఇంటర్మీడియట్ వరకు చదివి హైదరాబాద్ వలస వెళ్లాడు. వీరి స్వస్థలం సోంపేట మండలం పాత్రకొండ గ్రామం. ప్రస్తుతం మామిడిపల్లిలో స్థిరపడి.. అక్కడే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను నడుపుతూ జీవనోపాధి పొందుతున్నారు. కంచిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

పొందూరు ఖాదీని విశ్వవ్యాప్తం చేద్దాం



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడిని సత్కరిస్తున్న ఆంధ్రా ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘ సభ్యులు

కలెక్టరేట్(శ్రీకాకుళం), పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు ఖాదీని విశ్వవ్యాప్తం చేద్దామని, జీఐ ట్యాగ్‌తో పూర్వవైభవం సాధించడం చాలా సులభమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఆంధ్రా ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘ సభ్యులు, పలువురు నేతలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రితో మాట్లాడుతూ జీఐ ట్యాగ్ మంజూరుకు కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచ ఖ్యాతిని ఆర్జించిన పొందూరు ఖాదీని మళ్లీ ప్రాచుర్యంలోకి తీసుకురావాలని కేంద్ర మంత్రి ఈ సందర్భంగా వారికి సూచించారు. ఆంధ్రా ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘ అధ్యక్షుడు జి.కామేశ్వరప్రసాద్, కార్యదర్శి డి.వెంకటరమణ, ఉపాధ్యక్షుడు కొండలరావు, తెదేపా నాయకులు శ్రీరంగనాయకులు, డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామోపాధ్యాయురాలి భర్తపై కేసు

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: బందపల్లి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది జనవరి 26న గిరిజన బాలికలపై దాడికి పాల్పడిన వ్యాయామోపాధ్యాయురాలి భర్త రామచంద్రరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.రమేష్‌బాబు ఆదివారం పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రశాంతికుమారి ఫిర్యాదు మేరకు.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఇదే ఘటనలో వ్యాయామోపాధ్యాయురాలిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

ఆదిత్యాలయానికి భక్తుల తాకిడి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన వారు కేశఖండన శాలలో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజాము నుంచి క్యూలైన్లు కిటకిటలాడాయి. దర్శనం టికెట్లు, ప్రసాదాల విక్రయాలు, ప్రత్యేక పూజల ద్వారా రూ.4.12 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ తెలిపారు.

సూపర్ స్పెషాలిటీ వైద్యమే లక్ష్యం

● జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్

– న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

'నిరుపేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. అందులో భాగంగానే వైద్యుల నియామకంతో పాటు మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై దృష్టి సారించాం. ఇందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశాం' అని శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాసుపత్రి(జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్ తెలిపారు. ఆసుపత్రి ఆసుపత్రి అభివృద్ధికి, సమస్యల పరిష్కారం దిశగా తీసుకుంటున్న చర్యలను 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో ఆయన వివరించారు.



ముఖాముఖి

సాధారణ ప్రసవాలు పెంచుతాం..

మాతా, శిశు సంరక్షణ విభాగానికి ఓపీ ఎక్కువగానే ఉంటోంది. ప్రత్యేక గదులు లేకపోవడంతో ప్రసవాల సంఖ్య తగ్గుతోంది. ఎన్టీఆర్ వైద్య సేవ అందుబాటులో ఉండటంతో గర్భిణుల కుటుంబ సభ్యులు డెలివరీలు ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారు. సాధారణ ప్రసవాల సంఖ్య పెంచడంతో పాటు మౌలిక వసతులు మెరుగుపరుస్తాం.

ఓపీల పర్యవేక్షణకు కమిటీ..

అవుట్ పేషెంట్స్(ఓపీ) సేవలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. విభాగాల వారీగా ఓపీలో ఉండాల్సిన వైద్యుల జాబితా తయారుచేశాం. ఆ మేరకు ఆయా రోజుల్లో సంబంధిత వైద్యులు సేవలందించాలి. దీనిపై పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేశాం. పారిశుద్ధ్య నిర్వహణను గాడిలో పెట్టి ఓపీలు మరింత పెరిగేలా కృషి చేస్తాం.

క్షయ రోగులకు ప్రత్యేకంగా..

ఆసుపత్రి మధ్యలో క్షయ విభాగం ఉండటంతో ఇతర రోగులు ఇబ్బంది పడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై దీనిపై ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలోనూ చర్చించాం. ప్రత్యేకంగా మల్టీ డ్రగ్ రెసిడెంట్ భవనం నిర్మించి అక్కడ వారికి చికిత్స అందించాలని నిర్ణయించాం. త్వరలోనే కార్యాచరణ ప్రారంభిస్తాం.

ట్రామాకేర్ యూనిట్‌ను ఆధునికీకరిస్తాం..

కొన్ని అత్యవసర పరిస్థితులు, తలకు తీవ్రగాయాలైన సమయాల్లోనే రోగులను విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నాం. ట్రామా కేర్ యూనిట్‌ను ఆధునికీకరించి అత్యవసర కేసులకు ఇక్కడే వైద్యం అందించేందుకు సామగ్రిని కొద్ది నెలల్లో సమకూరుస్తాం. ప్రస్తుతం కార్డియాలజిస్ట్, సీటీవీ సర్జన్, న్యూరాలజిస్టు తదితర వైద్యనిపుణులు అందుబాటులో ఉన్నారు. అవసరమైన పరికరాల్లేక పోవడంతో సూపర్ స్పెషాలిటీ సేవలందించలేకపోతున్నారు. ఫిబ్రవరి నాటికి ఆ సమస్యలను అధిగమిస్తాం.

సిబ్బంది కొరత అధిగమిస్తాం..

జీజీహెచ్‌లో 900 పడకలున్నాయి. ఆ మేరకు ఎఫ్ఎన్‌వోలు, ఎంఎన్‌వోలు, జీడీఏలు లేరు. 321 మందికి కేవలం 109 మంది మాత్రమే ఉన్నారు. సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులకు నివేదించాం. అనుమతులు వచ్చిన వెంటనే నియామకాలు చేపడతాం.

సందడిగా కళింగ సామాజికవర్గ సమావేశం

ఐక్యత చాటుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్, మాజీ సభాపతి తమ్మినేని సీతారాం, ఎమ్మెల్సీ దువ్వాడ తదితరులు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్లలోని కేశవరెడ్డి స్కూల్‌కు ఎదురుగా చౌదరి సత్యనారాయణ తోటలో ఆదివారం రాష్ట్రస్థాయి కళింగ సామాజిక వర్గ ఆత్మీయ కలయిక జరిగింది. ఈ సమావేశానికి జిల్లాతోపాటు విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు, గుడివాడ, బ్రహ్మపుర, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఆ సామాజిక వర్గ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళింగ సామాజిక వర్గ అభివృద్ధి, ఐక్యతా చాటుతూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విశ్రాంత ఏపీ పరిపాలన ట్రైబ్యునల్ ఛైర్మన్, జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులు, ఎమ్మెల్యే కూన రవికుమార్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు, జడ్పీ అధ్యక్షురాలు పిరియా విజయ, కృష్ణా విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కూన రామ్‌జీ, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, డీసీఎంఎస్ అధ్యక్షుడు చౌదరి అవినాష్, తెదేపా జిల్లా అధ్యక్షుడు మొదలవలస రమేష్, పూర్వ జిల్లా పార్టీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, మాజీ కేంద్ర సహాయ మంత్రి కిల్లి కృపారాణి, సామాజిక వర్గ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

అరకు చూశారు.. ఇరుక్కుపోయారు!

● విశాఖ తిరుగు ప్రయాణంలో పాట్లు

పోలీసు ఆంక్షలతో ఆర్టీసీ బస్సులు నిలిపేయడంతో రద్దీగా అరకులోయ బస్టాండ్

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకు అందాలు చూసి మధురానుభూతులతో తిరుగు ప్రయాణమైన వారికి ఆదివారం చుక్కలు కనిపించాయి. ఉదయం బస్టాండుకు వచ్చినవారు సాయంత్రం వరకు అరకు దాటలేకపోయారు. విపరీతమైన ట్రాఫిక్ కారణంగా పోలీసులు రాకపోకలపై ఆంక్షలు విధించడంతో పర్యాటకులు ఆపసోపాలు పడ్డారు. వరుస సెలవులు, వారాంతం, నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో అరకులోయకు సందర్శకుల తాకిడి విపరీతంగా పెరిగింది. అరకులోయ సందర్శనకు ఆదివారం పర్యాటకులు బారులుతీరారు. పెద్దసంఖ్యలో ఉదయం నుంచి వందలాది వాహనాలతో తరలిరావడంతో విశాఖ- అరకు ఘాట్‌రోడ్డు, మాడగడ వ్యూపాయింట్, స్థానిక సందర్శిత ప్రాంతాలు జనజాతరగా మారాయి. విశాఖ నుంచి అరకు ఘాట్‌రోడ్డులో కాఫీ తోటలు, ఉడెన్ బ్రిడ్జి, బొర్రా మార్గంలో ప్రకృతి అందాలను తిలకించేందుకు వాహనాలు నిలిపివేయడంతో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో రద్దీ నివారణకు పోలీసులు ఆంక్షలు విధించారు. ఉదయం నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల అనంతరం కాఫీతోటల సందర్శనకు వీలు కల్పించేలా చర్యలు తీసుకున్నారు.

● విశాఖ నుంచి అరకు వచ్చేందుకు మాత్రమే వాహనాలకు అనుమతించారు. వన్‌వేకు మాత్రమే అవకాశం కల్పించి.. అరకు నుంచి విశాఖకు తిరుగు ప్రయాణానికి పాడేరు మీదుగా వెళ్లేలా సూచనలు చేశారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో ఈ చర్యలు తీసుకోవడంతో అప్పటికే అరకులోయ వచ్చిన వాహనాలు విశాఖకు తిరిగి వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో అరకులోయ పరిసరాల్లోనే ఆగిపోవాల్సి వచ్చింది. విశాఖ, శృంగవరపుకోట నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సులకు తిరిగి వెళ్లేందుకు అవకాశం కల్పించకపోవడంతో అరకులోయ బస్టాండ్‌లోనే నిలిచిపోయాయి. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత బయల్దేరినా.. స్థానిక డిగ్రీ కళాశాల వద్ద వాహనాలను ఘాట్‌రోడ్డు ప్రయాణానికి అనుమతించకపోవడంతో 3.30 గంటల వరకు రాకపోకలకు అంతరాయం కలిగింది.

● లోతేరు మార్గంలో బొర్రా మీదుగా షార్ట్‌కట్‌లో ప్రయాణికులను తీసుకువెళ్తామని ప్రైవేటు వాహనదారులు ఒక్కో ప్రయాణికుడి వద్ద రూ.750 వరకు వసూలు చేశారు. వాటికీ వాహనాలకు అవకాశం కల్పించకపోవడంతో అరకులోయకు తిరిగి వచ్చాయి. మధ్యాహ్నం 3.30 గంటల అనంతరం వాహనాలను విడిచిపెట్టారు. అరకులోయ అందాలను ఆస్వాదిద్దామనుకున్న పర్యాటకులకు అధిక రద్దీ.. సమాచార లేమి, పోలీసు ఆంక్షలు ప్రయాసకు గురిచేశాయి.

EENADU e Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

శ్రీకాకుళం, నరసన్నపేట షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువతీయువకులు కావలెను. జీతం- 10,500-12,000. Ph: 9154296345, 9030588502

ప్రీమియం ఒగోబాముష సాకి (బెన్నిన్) ముడి జీడిపప్పు (RCN) అత్యుత్తమ నాణ్యత, సరసమైన ధర, నేరుగా సరఫరా. బిజినెస్ వీసా, వసతి సౌకర్యాలు మేము ఏర్పాటు చేస్తాం. సంప్ర॥ 7893732377.

పైడిభీమవరం, పరవాడ ఫార్మా కంపెనీలోకి సూపర్‌వైజర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, R&D, మేనేజర్స్, ఫైర్&సేఫ్టీ హెల్పర్స్, సెక్యూరిటీ. Qlf:10th-డిగ్రీ, MBA, M. ఫార్మా. జీ: 18K-35K. 9573635594, 9121044796

JOBS

HYD పుప్పాలగూడలో సెక్యూరిటీ గార్డ్స్, సె.సూపర్‌వైజర్స్, SO, ఫీల్డ్ ఆఫీసర్స్ & లేడీ గార్డ్స్ కావలెను. రూం ఫ్రీ. మెట్రో మేనేజ్‌మెంట్. © 9885657755, 9963077722

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రూ.100 కోట్లతో తాగునీటి ట్యాంకుల నిర్మాణం

టెక్కలి, న్యూస్‌టుడే: టెక్కలి నియోజకవర్గంలో రూ.100 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయి. వచ్చే నెలలో పనులు ప్రారంభించడానికి అధికారులు కార్యాచరణ ప్రారంభించారు. టెక్కలి మండలంలో 60 ట్యాంకులు నిర్మించనున్నారు. పట్టణంలో 1.50 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకును, పంచాయతీ పరిధిలో మరో నాలుగు ఏర్పాటు చేయనున్నారు. ముఖలింగాపురం, నర్సింగపల్లి, గూడెం, శాసనాం, అయోధ్యపురం, పాతనౌపడా, లింగాలవలస, మేఘవరం పంచాయతీల్లో ప్రతి గ్రామంలోనూ ట్యాంకులు నిర్మించనున్నారు. కోటబొమ్మాళి మండలంలో 79 ఓవర్ హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేయనున్నారు. విశ్వనాథపురం పంచాయతీకి 8 మంజూరయ్యాయి. శ్రీజగన్నాథపురం, చిట్టివలస, సౌడాం, యలమంచిలి, లఖందిడ్డి, హరిశ్చంద్రపురం పంచాయతీల్లోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేయనున్నారు. సంతబొమ్మాళి మండలంలో 54 నిర్మించనున్నారు. కొల్లిపాడు, హెచ్ఎన్‌పేట, గోవిందపురం, మలగాం, ఆకాశలఖవరం, ఇజ్జువరం, ఉమిలాడ సహా అన్ని పంచాయతీల్లో ప్రతి గ్రామంలోనూ ట్యాంకులు నిర్మించనున్నారు. నందిగాం మండలానికి 66 మంజూరయ్యాయి. బడగాం, హర్షబాడ, శివరాంపురం, కల్లాడ, బెజ్జిపల్లి సహా అన్ని గ్రామాల్లోనూ ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించనున్నారు. 2026 ఆఖరు నాటికి పనులు పూర్తి చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	165	285	305

అసలే ఇరుకు.. ఆపై భారీ వాహనాలు

సారవకోట మండలం బుడితి రోడ్డు ఆక్రమణలతో ఇరుకుగా మారింది. దీనిపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ధాన్యం మిల్లుల నుంచి ఊకను తరలించే లారీ వల్ల ట్రాఫిక్ 30 నిమిషాల పాటు నిలిచిపోయింది. ఆర్టీసీ బస్సు వెనక్కి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. మిల్లు, లారీ యజమానులను గుర్తించి నోటీసులు ఇస్తామని పోలీసు వర్గాలు తెలిపాయి. – న్యూస్‌టుడే, సారవకోట

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

వైద్యారోగ్యశాఖలో ఆరోపణలపై విచారణకు ఆదేశం

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లా వైద్యారోగ్యశాఖలో అవకతవకలు జరిగినట్లు ఇటీవల ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో పని చేసిన కొందరు అధికారులు, సిబ్బందిని సోమవారం విశాఖపట్నం డీఎంహెచ్‌వో కార్యాలయానికి రావాలని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేశారు. పూర్వ డీఎంహెచ్‌వో, పరిపాలన అధికారి, అకౌంట్స్ ఆఫీసర్, సీనియర్ అసిస్టెంట్, హెల్త్ అసిస్టెంట్‌తో సహా మొత్తం 10 మందిని విచారణకు పిలిచారు. వారిలో కొందరు ప్రస్తుతం పక్క జిల్లాల్లో పని చేస్తున్నారు. విచారణలో భాగంగా వారిపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన వివరాలు, పత్రాలను సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మురపాకలో నిరుపయోగంగా వదిలేసిన మరుగుదొడ్లు

మరుగునపడిన లక్ష్యం..!

– న్యూస్‌టుడే, లావేరు

గ్రామీణ ప్రాంతాలు స్వచ్ఛంగా ఉండాలనే లక్ష్యంతో గతంలో రూ.కోట్లు వెచ్చించి వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. అప్పట్లో లక్ష్యాలను పూర్తి చేసేలా హడావుడిగా గుత్తేదారులతో ఆగమేఘాలపై పనులు చేయించారు. కొన్ని చోట్ల వసతులు కల్పించకపోవడంతో అవి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని వీటిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రస్తుతం ఎలా ఉన్నాయంటే..

● చాలా చోట్ల శిథిలావస్థకు చేరాయి. ● కొన్నింటికి తలుపులు బిగించలేదు. ● మరికొన్నిచోట్ల చేసి నీటి సౌకర్యం కల్పించలేదు. ● చుట్టూ ముళ్లపొదలు పెరిగిపోయాయి.

ఎక్కడో ఊరికి దూరంగా..

గ్రామానికి సుదూరంగా సామూహిక మరుగుదొడ్లు నిర్మించడంతో స్థానికులు వినియోగించేందుకు ఆసక్తి చూపట్లేదు. దీనికి తోడు గతంలో విద్యుత్తు సౌకర్యం, స్థల ఎంపిక వంటి విషయాలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టడంతో ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరైందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో సర్వే చేయిస్తాం...

గ్రామాల్లోని సామూహిక మరుగుదొడ్ల పరిస్థితిపై క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులతో సర్వే చేయిస్తాం. గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్ల వినియోగంపై ఎప్పటికప్పుడు ప్రచారం చేస్తున్నాం.

– భారతీసౌజన్య, డీపీవో, శ్రీకాకుళం

ఉమ్మడి జిల్లా వివరాలిలా...

● మండలాలు: 38 ● నిర్మించిన మరుగుదొడ్లు: 2.74 లక్షలు ● ఖర్చు: రూ.38.65 కోట్లు

(c) eenadu

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

మెట్లెక్కి ఇంట్లోకి రండి..

విర్ణంగిలో ఓ వీధిలో సుమారు 50 ఇళ్లు 10 నుంచి 15 అడుగుల ఎత్తులో దర్శనమిస్తాయి. ఈ ఇళ్లకు వెళ్లాలంటే మెట్లు ఎక్కాల్సిందే. ఇక్కడ ఎలాంటి సమస్యలు లేకపోయినప్పటికీ పూర్వీకులు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు ఎత్తులో నేటికీ కొనసాగిస్తున్నారు. కొత్తగా కిందికి మార్చుకుందామంటే ఇక్కట్లే కలిసి ఉండటంతో ఎవరు మార్చినా వారికే ఇబ్బందులు ఏర్పడతాయనే ఉద్దేశంతో మార్చడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. అటుగా వెళ్లేవారు ఇలా ఎత్తయిన గడపలను చూసి ఎందుకు ఇలా కట్టారా అని స్థానికులను ప్రశ్నిస్తున్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

సాగర తీరం.. జనసంద్రం

కవిటి, బారువ, దోమలపాడు, అక్కుపల్లి శివసాగర తీరాలు ఆదివారం కళకళలాడాయి. సరుపాయలు లేక సందర్శకులు ఇబ్బందులు పడ్డారు. సమీప తోటల్లో వన భోజనాలు చేసి, తీరాల్లో సేదతీరారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం, సోంపేట, వజ్రపుకొత్తూరు

క్రీడలతో మానసిక ఉల్లాసం

మకరాంపురం క్రీడా మైదానంలో బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలతో మానసిక ఉల్లాసం, స్నేహభావం ఏర్పడతాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ఆదివారం మకరాంపురం క్రీడా మైదానంలో శ్రీవ్యక్త, పిజ్జా విద్యాసంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర టీ-20 క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ బ్యాటింగ్ చేసి అలరించారు. మొదటి రోజు పాలకొండ, కళికోట(ఒడిశా) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కళికోట జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 140 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన పాలకొండ జట్టు 14.1 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 141 పరుగులు చేసింది. నాలుగు వికెట్ల తేడాతో పాలకొండ జట్టుకు చెందిన నాని 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికయ్యారు. మైదానం చుట్టూ రక్షణ గోడ ఏర్పాటుకు సహకరించాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు శోభనాబాబు అశోక్‌ను కోరారు. పిజ్జా విద్యాసంస్థల రాష్ట్ర డైరెక్టర్ సుకుమార్‌రెడ్డి, శ్రీవ్యక్త విద్యాసంస్థల అధినేత బి.రమణమూర్తి, టీపీ రమణ, బి.జోగేశ్, బి.తిలక్, బి.కామేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

అడిగేవారు లేరని నిర్లక్ష్యమా..?

బొడ్డపాడులోని ప్రభుత్వ పశువైద్యశాలకు ఆదివారం ఉద్యోగులెవరూ రాలేదు. ప్రతి వారం ఇలాగే జరుగుతోందని, మిగిలిన రోజులూ సేవలు అంతంతమాత్రంగానే ఉంటాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆదివారం ఆసుపత్రి తెరవాల్సి ఉన్నా పట్టించుకునే వారు లేకపోవడంతో మూసేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయం పలాస పశువైద్యశాఖ సహాయ సంచాలకులు రవికృష్ణ దృష్టికి తీసుకెళ్లగా ఆసుపత్రిని తప్పనిసరిగా తెరవాలని, పూర్తి వివరాలు తెలుసుకుని బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

పద్మవ్యూహం.. బయటకు రావడం కష్టం

– న్యూస్‌టుడే, కాశీబుగ్గ

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలోని పలు ప్రాంతాలు పద్మవ్యూహాన్ని తలపిస్తున్నాయి. కొత్తగా ఎవరైనా ఆ ప్రాంతాలకు వస్తే అక్కడి నుంచి బయట పడాలంటే ఇబ్బందులు తప్పవు. ఇళ్ల నిర్మాణాలు అడ్డదిడ్డంగా ఉండటంతో మౌలిక సదుపాయాల కల్పన జరగడం లేదు. సరైన రహదారులు, కాలువలు లేవు. దీంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

★ పుర పరిధి 20వ వార్డులోని శివాజీనగర్ అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అధిక శాతం మంది ఇక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. గత 25 ఏళ్లగా నిర్మాణాలు పెరుగుతూ వస్తున్నాయి. ఇక్కడ సుమారు 3,000 మంది జనాభా ఉంటారు. ఆరంభం నుంచి ఇళ్ల నిర్మాణాలు అడ్డదిడ్డంగా చేపట్టడంతో ఇప్పుడు ఒక వీధి నుంచి మరో వీధికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. 8 అడుగుల వెడల్పు ఉన్న రహదారులు ఒక్కటీ లేదు.

శివాజీనగర్‌లో అధ్వానంగా ప్రధాన రహదారి

★ ఈ ప్రాంతం నుంచి పురపాలక సంఘానికి రూ.లక్షల్లో పన్నులు వస్తున్నా సగం ప్రాంతాలకు రహదారులు, కాలువల వంటి మౌలిక సదుపాయాల కల్పన జరగలేదు. వాడుక నీరంతా ఇళ్ల పరిసరాల్లోనే దర్శనమిస్తోంది. దీంతో దోమల బెడద అధికంగా ఉంటోంది. పారిశ్రామికవాడ రహదారి నుంచి శివాజీనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి పనులు చేపట్టకపోవడంతో చిన్నపాటి వర్షం పడితే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

పురపాలక సంఘం	పలాస కాశీబుగ్గ	వార్డులు	31	జనాభా	64వేల మంది

★ పలు వీధులకు విద్యుత్తు సౌకర్యం కూడా ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. ఈ ప్రాంతంలో కర్మాగారాలు సైతం ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న ఇలాంటి ప్రాంతాలపై పాలకులు, అధికారులు దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. దీనిపై పుర డీఈ కణకాల స్పందిస్తూ శివాజీనగర్ తదితర ప్రాంతాల్లోని పలు వీధుల్లో రహదారుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 8008574279 9063144707

? ఇచ్ఛాపురం పుర పరిధి సంతపేట కాలనీలో రెండు వీధులకు కాలువలు లేవు. మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. – జి.సత్యబాబు, ఇచ్ఛాపురం

★ ప్రజల సహకారంతో సమస్య పరిష్కరిస్తాం. – ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

? పలాస మండలం బొడ్డపాడు కాలనీలో మూడు వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. – స్థానికులు

★ వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టి రాత్రి పూట వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – సుధాకర్, పంచాయతీ కార్యదర్శి, బొడ్డపాడు – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

? కంచిలి మండలం మకరాంపురం రజక వీధి వద్ద చెత్త పేరుకుపోతోంది. – జి.జగదీశ్, మకరాంపురం

★ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. – తులసయ్య, పంచాయతీ కార్యదర్శి – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

? వజ్రపుకొత్తూరు మండలం బెండిగేటు నుంచి పూండి మధ్య రహదారికి ఇరువైపులా బెర్ములు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చర్యలు తీసుకోండి. – కోనేటి రాజు, మాజీ సైనికుడు, పీఎంపురం

★ రహదారికి నిధులు మంజూరయ్యాయి.. జీవో విడుదల కావాల్సి ఉంది. ప్రస్తుతం తాత్కాలిక బెర్మలు ఏర్పాటు చేస్తాం. – జగదీశ్, జేఈ, ఆర్‌అండ్‌బీ శాఖ, పలాస – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

ఇదేనా.. అభివృద్ధి?

పూండినౌపడా రోడ్డు నుంచి పీఎంపురం, రెయ్యిపాడు మీదుగా మంచినీళ్లపేట వరకు ఉన్న ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలతో అధ్వానంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాత్కాలిక మరమ్మతుల కింద రూ.80లక్షల నిధులు మంజూరు చేశారు. ఏడాది కిందట పలు చోట్ల గ్రావెల్ వేసి వదిలేశారు. దీనిపై ఆర్ అండ్‌బీ శాఖ జేఈ జగదీష్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

వృథాగా వర్మీ కంపోస్టు తొట్టె

కవిటి మేజర్ పంచాయతీలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రానికి సమీపంలో సేంద్రియ ఎరువుల తయారీ కోసం నిర్మించిన వర్మీ కంపోస్టు తొట్టె పనికిరాని మొక్కలతో వృథాగా ఉంది. తొట్టెను శుభ్రం చేసి ఎరువులు తయారు చేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ ఈవో ఎం.రవిని వివరణ కోరగా పరిశీలించి వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

సగం.. సగం పనులు

ఎగువ ప్రాంతాల నుంచి వాడుక, వర్షపునీరు కంద్రవీధి వద్ద ఉన్న కోమటి చెరువుకు చేరాలి. అందుకు కంద్రవీధి కూడలి నుంచి కంద్రకాలనీ వరకు సిమెంటు కాలువ నిర్మించి సగంలో వదిలేశారు. దీంతో ఎగువ నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. కాలువను పాత జాతీయ రహదారి వరకు పూర్తిగా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. పుర కమిషనర్ రమేష్‌ను వివరణ కోరగా.. పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

కాలువ అడ్డదిడ్డం.. చెత్త అడ్డం

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో డాక్టర్ కణితీస్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ సమీపంలో కాలువ నిర్మాణం అడ్డదిడ్డంగా చేపట్టడంతో చెత్త ముందుకు కదలడం లేదు. దీంతో మురుగునీరు నిల్వ ఉంటోంది. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కార్మికుల్ని పంపించి మురుగునీరు కదిలేలా చర్యలు తీసుకుంటామని పారిశుద్ధ్య విభాగ ఇన్‌ఛార్జి ఉదయ్ తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస

గుంత.. రాకపోకలకు చింత

బెనుగానిపేట సమీపంలో ప్రధాన రహదారి పక్కనే నాలుగు అడుగుల గుంత ప్రయాణికులను భయపెడుతోంది. ఇక్కడ నుంచి సమీప ప్రాంతాలకు తాగునీరు పంపించేందుకు మ్యాన్ హోల్ నిర్మించారు. చాలా కాలంగా దానికి పలకలు వేయడం లేదు. దీంతో అటుగా వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై గ్రామీణ నీటి పారుదల శాఖ ఏఈ విష్ణుమూర్తికి వివరణ కోరగా సరిచేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

సత్తా చాటిన జక్కర క్రీడాకారిణి

ట్రోఫీతో బసవ శ్యామల

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: జక్కర గ్రామానికి చెందిన క్రీడాకారిణి బసవ శ్యామల గోల్ షాట్ బాల్ పోటీల్లో సత్తా చాటింది. తమిళనాడు తిరుచ్చిలో ఈనెల 25 నుంచి 28 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి గోల్ షాట్ బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ మహిళ జట్టు విజేతగా నిలిచింది. ఇందులో శ్యామల తన ఆట తీరుతో ఆకట్టుకుంది. కవిటిలో ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి విజయనగరంలో పీఈటీ కోర్సు చేస్తున్న సమయంలో ఈ క్రీడలో ప్రావీణ్యం పొందినట్లు ఆమె తెలిపారు. శ్యామల తల్లిదండ్రులు తులసి, తరిణి వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు.

టైప్ రైటింగ్ పోటీల్లో భళా

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం కాదా లక్ష్మీకాంతమ్మ పుర బాలికోన్నత పాఠశాల విద్యార్థిని పాలేపు జ్యోతిక రాష్ట్రస్థాయి టైప్ రైటింగ్ పరీక్షలో జూనియర్ విభాగంలో స్వర్ణ పతకం సాధించింది. రాష్ట్ర టైపింగ్ అండ్ షార్ట్‌హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2022, 2023, 2024 సంవత్సరాల్లో జరిగిన పరీక్షల ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. 2024 సెప్టెంబరులో జరిగిన పరీక్షలో రెండు పేపర్లలోనూ 98 చొప్పున మార్కులు సాధించిన జ్యోతిక ప్రథమ స్థానంలో నిలిచింది. బాలిక తల్లిదండ్రులు లక్ష్మణరావు, రోజా ప్రోత్సాహంతో ఏడాదిన్నర కాలంగా శకుంతలాబాయి స్థాపించిన పద్మ టైపు ఇన్‌స్టిట్యూట్‌లో టైపింగ్ నేర్చుకుంది. 2022లో శివ మహరణ మూడో స్థానం, 2023లో రామప్రసాద్ బెహరా రెండో స్థానంలో నిలిచారని వీరికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను ఇక్కడికి పంపించినట్లు పద్మ టైపు ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు తెలిపారు. వాటిని సంస్థ ప్రతినిధులు మోహన్‌కృష్ణ, బైరాగి వంశీకృష్ణ, బైరాగి మాధుర్, ఎన్.కోటి, ధర్మ, శ్రీను, రాము విజేతలకు అందించి అభినందించారు.

విజేతలకు పతకం, ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రముఖులు

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

కమిషనర్ శ్రీనివాసులుతో చర్చిస్తున్న డీఎస్పీ షేక్ షహబాజ్

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ షేక్ షహబాజ్ అహ్మద్ పేర్కొన్నారు. కేటీ రహదారి గుండా పుర కమిషనర్ శ్రీనివాసులు, సీఐ వై.రామకృష్ణతో కలిసి ఆదివారం పరిశీలించారు. సీసీ కెమెరాలు అవసరం, జీబ్రా క్రాసింగ్, ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు.

మహిళకు గాయాలు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గ దరి చిన్న బాడాం వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సు నుంచి జారి పడి ఓ మహిళ గాయాలపాలైంది. కాశీబుగ్గలో బస్సు ఎక్కి చిన్నబాడాం వద్ద దిగుతుండగా జారి పడటంతో కాలికి గాయమైంది. ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు.

జిల్లాస్థాయి గణిత ప్రతిభా పాటవ పోటీలు

ఇచ్ఛాపురంలో పరీక్షలు పర్యవేక్షిస్తున్న ఎంఈవో విశ్వనాథం

ఇచ్ఛాపురం, సోంపేట, న్యూస్‌టుడే: ఒడియా మాధ్యమ గణిత ప్రతిభా పాటవ పోటీలు ప్రశాంతంగా, ఉత్సాహంగా సాగాయి. ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ, సోంపేటలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (అపోటా) ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఇచ్ఛాపురంలో 8వ తరగతి విభాగంలో ఈదుపురం కంద్ర వార్డు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి డిల్లేశ్వర బెహరా, 9వ తరగతి విభాగంలో ఇదే పాఠశాలకు చెందిన అశ్విని బెహరా, పదో తరగతి విభాగంలో కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మిక్కి బెహరా ప్రథమ స్థానాల్లో నిలిచారు. పరీక్షల పరిశీలకుడిగా ప్రశాంత్ పాఢి, కో ఆర్డినేటర్‌గా ప్రశాంత్ లిమ్మయి వ్యవహరించగా, ఎంఈవో ఎస్.విశ్వనాథం, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రఘునాథగౌడో పర్యవేక్షించారు. ఉత్తరాంధ్ర ఒడియా డీఐ డీపీ చౌదరి, అపోటా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్ పాఢి, బృందావన్ దొళాయి, ఒడియా లాంగ్విస్టిక్ మైనార్టీ సంఘ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

సోంపేట, కవిటి, న్యూస్‌టుడే: సోంపేట మండలం అంబుగాం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో మరమ్మతు పనుల నిమిత్తం సోమవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో పలాస ఈఈ జి. యజ్ఞేశ్వరరావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తాళ్లభద్ర, రాణిగాం తదితర గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. ★ కవిటి మండలం బొరివంక ఉపకేంద్రం పరిధిలో మరమ్మతు పనుల నిమిత్తం మంగళవారం బొరివంక, బెజ్జిపుట్టుగ, పిరియా వీధి, బార్లవీధి గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, గృహ, వ్యవసాయ వినియోగదారులు సహకరించాలని యజ్ఞేశ్వరరావు కోరారు.

వచ్చే నెల 12న ఎకువూరులో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

సోంపేట, న్యూస్‌టుడే: ఎకువూరులో జనవరి 12న జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో జరగనున్న ఈ పోటీలకు 6 నుంచి 10 తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు జట్టుకు నలుగురు చొప్పున హాజరు కావాలని కోరారు. ఆసక్తి ఉన్న వారు 83743 73947, 70938 02360, 79816 00163 నంబర్లల్లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం అభినందనీయం

మృతి చెందిన పూర్వ విద్యార్థులకు నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

సోంపేట, న్యూస్‌టుడే: వైద్య సేవలు అందుకోలేక తమ స్నేహితులు మృత్యువాత పడిన నేపథ్యంలో పూర్వ విద్యార్థులు చేపట్టిన మెగా వైద్యశిబిరం ఆదర్శనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. సోంపేట ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో 1995-96లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో 388 మంది సేవలందుకున్నారు. ప్రభుత్వ విప్ శిబిరాన్ని ప్రారంభిస్తూ యువత సేవాదృక్పథంతో ఇలాంటి కార్యక్రమాలు చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వైద్య నిపుణులు ఎం.ఫణీంద్ర, పి.దుర్యోధన, టి.వెంకటేశ్, కె.నాగేంద్ర, బి.వెంకటసూర్యమాణిక్యం తదితరులు సేవలందించారు. అనారోగ్యంతో మృతి చెందిన 9 మంది స్నేహితులకు నివాళులర్పించారు. ఎంపీపీ ఎన్.దాసు, జడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు శ్రీను, చంద్రమోహన్, కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

హైందవ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి

మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ మానవీయ సంఘ జిల్లా సంచాలకులు రమణమూర్తి

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: హైందవ ధర్మాన్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యతని ఆర్‌ఎస్‌ఎస్ మానవీయ సంఘ జిల్లా సంచాలకులు పీవీ రమణమూర్తి అన్నారు. రాష్ట్ర స్వయంసేవక్ సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సన్యాసిపుట్టుగలో పైడిపల్లి మోహన్‌రావు ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సర్పంచి డిల్లీరావు, మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు, శ్యాంసుందర్ సిద్ధాంతి, జయపతి, వీరస్వామి, వెంకటేశ్వరస్వామి పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షకు విశేష స్పందన

కవిటిలోని కల్యాణి కాలేజీలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఇందులో మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 350 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష ఫలితాలను త్వరలో ప్రకటించి విజేతలకు బహుమతులు అందజేస్తామని ప్రిన్సిపల్ తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

ధనుర్మాసం వేళ.. రంగవల్లికల మేళా

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ధనుర్మాసం ప్రారంభం నుంచి ప్రతి హైందవ ఇంటి ముంగిట రంగవల్లికలు స్వాగతం పలుకుతాయి. రోజుకో రకం ముగ్గులు వేస్తూ పడతులు తమ ఆనందాన్ని చాటుకుంటారు. మకర సంక్రాంతి వరకు చుక్కలు, బొమ్మలు, ఆహ్వానం, నినాదాలు తదితర ముగ్గులు వేస్తుంటారు.

విక్రయానికి సిద్ధం చేసిన రంగులు

★ గతంలో సున్నపురాయితో ముగ్గులు వేసి, వాటిలో పసుపు, కుంకుమ పరిచేవారు. ఇప్పుడు 18 రకాల రంగులు బజారులో అందుబాటులో ఉండటంతో తమకు నచ్చిన వాటిని తెచ్చుకుని వాటితో చక్కటి రంగవల్లికలు వేస్తున్నారు. గతంలో ఒక రంగు ఉంటే, దానిలోనే లేత, ముదురు, కాస్త ముదురు, కాస్త లేత.. ఇలా మార్పులు చేసి, వ్యాపారులు అందిస్తున్నారు.

★ ఇటీవల గణిత దినోత్సవంలో రంగవల్లికల్లో గణితాన్ని ఇమిడ్చి బాలికలు ఆకట్టుకున్నారు. వివిధ సందర్భాల్లో రంగవల్లికల పోటీలు నిర్వహించి, బహుమతులు అందించే సంస్థలూ ఉన్నాయి. ముఖ్యంగా శివానందగిరిపై ఏటా భోగిరోజు రంగవల్లికల పోటీ నిర్వహిస్తుంటారు. సంక్రాంతి రోజున 12 ద్వారాల ముగ్గు, రథం ముగ్గు వేయడం సంప్రదాయంగా భావిస్తుంటారు. అన్ని విష్ణు ఆలయాల్లోనూ రంగవల్లిక శోభ కనువిందు చేస్తోంది. అతివల ప్రావీణ్యాన్ని చాటిచెప్పే రంగవల్లికల మాసంగా ధనుర్మాసాన్ని గుర్తించొచ్చు.

మురుగునీటికి అడ్డుకట్ట

పలాస పట్టణ శివారులో రహదారిపై మురుగునీటికి అడ్డుకట్ట వేశారు. పరిశ్రమ నుంచి రహదారిపైకి మురుగునీరు విడిచిపెడుతుండటంతో శనివారం 'మురుగు చేరుతోంది' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. మురుగునీరు విడిచిపెడుతున్న యజమానులను పిలిపించి హెచ్చరించారు. అనంతరం సిబ్బందితో పరిసరాలు శుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, పలాస

స్పందనకు వందనం

శివాలయం రహదారికి మోక్షం

పల్లిసారథిలో పరమేశ్వర ఆలయం, అసిరిపోలమ్మ గ్రామ దేవత మందిరానికి వెళ్లే రహదారి అభివృద్ధికి నోచుకోవడం లేదు. దీనిపై 'ఈనాడు'లో ప్రచురితమైన పలు కథనాలకు అధికారులు స్పందించారు. ఎమ్మెల్యే శిరీష ప్రత్యేక చొరవతో మంజూరైన దాదాపు రూ.50 లక్షలతో ప్రధాన వరద కాలువతోపాటు సీసీ రోడ్డు పనులకు చర్యలు చేపట్టారు. తొలుత కాలువ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

వలలో చిక్కుకుని కొండచిలువ మృతి

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: బెండి సమీప తోటలో ఆదివారం సుమారు 7 అడుగుల పొడవైన కొండచిలువ వలలో చిక్కుకుని మృతి చెందింది. బెండికొండ పరిసరాల్లో కొండచిలువలు సంచారం అధికంగా ఉంటుంది. రైతులు జీడి మొక్కల రక్షణగా ఏర్పాటు చేసిన వలకు ఓ కొండచిలువ చిక్కుకుని అందులోంచి తప్పించుకోలేక మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు.

సొండికుల కార్యవర్గ ఎన్నిక

సొండికుల కంచిలి మండల సామాజిక వర్గం కార్యవర్గాన్ని ఆదివారం ఆ సామాజికవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాహుకారి రామారావు, ఉపాధ్యక్షుడిగా లాభాల డిల్లీరావు, కార్యదర్శిగా నల్లాని జోగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా ఎస్.అనీల్, కోశాధికారులుగా ఆర్.ఉపేంద్ర, సేనాపతి రుషి, కన్వీనర్లుగా ఆర్.ప్రవీణ్, ఆర్.వెంకటరావు, ఎన్.రవి ఎంపికయ్యారు. సామాజిక వర్గ అభివృద్ధికి కృషి చేస్తామని కార్యవర్గ సభ్యులు తెలిపారు. – న్యూస్‌టుడే, కంచిలి

మామిడిపల్లి సమస్యలు పరిష్కరించండి

సోంపేట, న్యూస్‌టుడే: మామిడిపల్లి పంచాయతీ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు రామకృష్ణ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ ఆర్.కోదండకృష్ణ కోరారు. ఆదివారం ఎంపీ క్యాంపు కార్యాలయంలో తెదేపా స్థానిక నాయకులతో కేంద్రమంత్రిని కలిసి సామాజిక భవనం, గ్రంథాలయం, ఆసుపత్రిలకు భవనాలు సమకూర్చాలని, లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలని విన్నవించుకున్నారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు కోదండకృష్ణ తెలిపారు.

వివక్ష తగదు

సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: ప్రత్యేక ప్రతిభావంతులు (దివ్యాంగుల) పట్ల వివక్ష తగదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ అన్నారు. ప్రపంచ ప్రత్యేక ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా కాశీబుగ్గలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2016 దివ్యాంగుల హక్కుల చట్టం అమలు చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేసి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. సంక్షేమ పథకాలు మంజూరు చేయాలన్నారు. లక్ష్మి, పితాంబరం, జగన్నాథరావు, ఎర్రన్నాయుడు, రమణయ్య పాల్గొన్నారు.

కోట నుంచి కదిలిన ఎక్సైజ్ కార్యాలయం

ఇచ్ఛాపురంలో దశాబ్దంన్నర కాలంగా సురంగిరాజావారి కోటలో కొలువుదీరిన ఎక్సైజ్ శాఖ కార్యాలయం అదే ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన రేకుల భవనంలోకి మారింది. అంతకుముందు భారతీయ స్టేట్ బ్యాంకు శాఖ, న్యాయస్థానాన్ని ఇక్కడే నిర్వహించేవారు. పట్టణానికి దూరం కావడంతో ఎస్‌బీఐని తొలుత బ్రాహ్మణవీధికి... అక్కడ నుంచి వీకే పేటకు మార్పు చేశారు. న్యాయస్థానం గొల్లవీధి మార్గంలో ఉన్న సొంత భవనంలోకి మారింది. ప్రస్తుతం రాజావారి కుటుంబీకుల ఆధీనంలో భవనం ఉంది. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

దుప్పట్లు, దుస్తుల పంపిణీ

సోంపేట, న్యూస్‌టుడే: బారువ ఫెయిత్ హోమ్ చర్చిలో ఆదివారం పాస్టర్ ఎ.జాన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పేదలకు దుస్తులు, దుప్పట్ల పంపిణీ చేపట్టారు. సోంపేటకు చెందిన డాక్టర్ ఆశిష్ బెనర్జీ సహకారంతో వంద మంది పేదలకు వీటిని అందజేశారు.

రాజా దాతృత్వంతోనే విద్యావికాసం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురంలో ఉన్నత విద్యను అందించిన మహనీయులు రాజా కీర్తిచంద్రదేవ్ అని, నేటికీ సురంగిరాజావారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలగా గుర్తింపు ఉందని పాఠశాల ఎస్‌ఎంసీ కో ఆప్షన్ సభ్యులు ఆశి గౌరీశంకర్‌రెడ్డి అన్నారు. పాఠశాల ఆవరణలోని రాజావారి విగ్రహాన్ని దుండగులు బకెట్‌తో మూయడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ దుశ్చర్యను ఖండిస్తూ, ఆదివారం పదో తరగతి విద్యార్థులతో కలిసి విగ్రహానికి అభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూర్వవిద్యార్థులు, ప్రముఖులు స్పందిస్తూ విద్యాలయంలో పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటివి జరుగుతున్నాయని, ఉన్నతాధికారులు స్పందించి ఆకతాయిలను కట్టడి చేయాలని కోరారు.

(c) eenadu

టెక్కలి

●టెక్కలి ●నరసన్నపేట ●పాతపట్నం

దారి కాస్తాయి.. దాడి చేస్తాయి

టెక్కలి పట్టణంలో కుక్కల స్వైర విహారానికి నిదర్శనం ఈ చిత్రం. నిత్యం రద్దీగా ఉండే పాత జాతీయ రహదారి, ఇతర ప్రధాన కూడళ్లలో శునకాలు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఒంటరిగా వెళ్తే దాడిచేస్తున్నాయని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని అంతా కోరుతున్నారు. సమస్యపై పంచాయతీ కార్యదర్శి వెంకటశ్రీనివాసరావు మాట్లాడుతూ.. పశుసంవర్ధకశాఖ అధికారులతో మాట్లాడతామన్నారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

దేశాభివృద్ధికి తోడ్పడాలి

గెలుపొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ఉపాధ్యాయులు వెలికి తీసి దేశాభివృద్ధికి తోడ్పడాలని పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు అన్నారు. మండలంలోని పెద్దసీది ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మదర్ థెరీసా సేవాసంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.15 వేలు నగదు ప్రోత్సాహకాలు అందించారు. కూటమి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామ్మోహన్‌నాయుడితో కలమట భేటీ

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఆదివారం కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడిని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడిగా బాధ్యతల నుంచి తప్పుకొన్న అనంతరం కేంద్రమంత్రితో ఆయన భేటీ అవడం ప్రాధాన్యం సంతరించుకుంది. పాతపట్నం నియోజకవర్గంలోని వివిధ సమస్యలపై చర్చించినట్లు కలమట పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

జలుమూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రం సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రహదారి ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జలుమూరు మండలం రాణా పంచాయతీ గొలియాపుట్టి గ్రామానికి చెందిన బగ్గు దాలినాయుడు, ఆయన కోడలు బగ్గు రాధారమ ద్విచక్రవాహనంపై చల్లవానిపేట వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. శ్రీముఖలింగం నుంచి వస్తున్న కారు వీరిని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మన సొమ్ము కాదు.. మనకెందుకు..?

– న్యూస్‌టుడే, సారవకోట, పోలాకి, నరసన్నపేట గ్రామీణం, జలుమూరు,

ట్రక్కులు లేక వృథాగా ట్రాక్టర్లు

సారవకోట సచివాలయం వద్ద నిరుపయోగంగా ట్రాక్టర్

పెద్ద గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య నిత్యం వెంటాడుతోంది. హరిత రాయబారులు సేకరించిన చెత్తను మూడు చక్రాల బండ్లతో గ్రామాలకు దూరంగా ఉండే సంపద తయారీ కేంద్రాలకు తరలించడం కష్టతరమవుతోంది. దీంతో కొన్ని చోట్ల చెత్తకుప్పలు దర్శనమిస్తుండగా, మరి కొన్ని ప్రదేశాల్లో నిర్వహణ లోపాలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం చూపాలనే ఆలోచనతో ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ పథకం ద్వారా ఏడాది కిందట రూ.లక్షలు వెచ్చించి ట్రాక్టర్లు సరఫరా చేసింది. ఒక్కొక్క దానికి రూ.6 లక్షలు వరకు ఖర్చు చేసినట్లు అంచనా. వాహనాలు ఇచ్చిన ప్రభుత్వం సుమారు రూ.2.5 లక్షలు విలువైన ట్రక్కులు మంజూరు చేయడం మరిచింది. దీంతో ఇవి నిరుపయోగంగా ఉన్నాయి. గుర్రం కొనుగోలు చేసి కళ్లెం కొనడానికి వెనకడుగు వేసిన చందంగా పరిస్థితి మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు.

బుడితి గ్రామంలో సాగునీటి చెరువు పక్కనే వ్యర్థాలు

నరసన్నపేట నియోజకవర్గంలో పరిస్థితి		
మండలం	మంజూరైన ట్రాక్టర్లు	గ్రామాలు
సారవకోట	3	సారవకోట, బుడితి, అలుదు
నరసన్నపేట	2	ఉర్లాం, మడపాం
పోలాకి	2	పోలాకి, మబుగాం
జలుమూరు	1	శ్రీముఖలింగం

చర్యలు తీసుకుంటే మేలు

ప్రభుత్వం ట్రక్కులు మంజూరు చేయడమో, కొనుగోలుకు పంచాయతీలకు అవకాశం ఇవ్వడమో చేయాలని పలువురు కోరుతున్నారు. పంచాయతీల తరపున కొనుగోలు చేసి, ట్రాక్టర్లు వినియోగంలోకి తెస్తామని సర్పంచులు చెబుతున్నారు. కానీ అధికారుల నుంచి స్పందన రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వచ్చే నెల 4వ తేదీ వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. జనవరి 5న గ్రామసభలు ఏర్పాటు చేసి ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా ప్రకటించాలని నిర్ణయించింది. ఈ తరుణంలో ట్రక్కులు మంజూరు చేస్తే మేలు జరుగుతుందని ప్రజలు భావిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం: ట్రక్కులు కావాలని పలుమార్లు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. దీనిపై ఆదేశాలు రావాలి. త్వరలోనే వచ్చే అవకాశం ఉంది.

– మోహన్‌కుమార్, ఎంపీడీవో సారవకోట

– పద్మావతి, రమేష్, ఉమామహేశ్వరరావు ఈవో పీఆర్డీలు, పోలాకి, నరసన్నపేట, జలుమూరు

తెల్లవానిపేట ఆలయంలో చోరీ

పోలాకి, న్యూస్‌టుడే: తెల్లవానిపేటలోని అమ్మవారి ఆలయంలో శనివారం రాత్రి దొంగతనం జరిగింది. గ్రామస్థులు, ఎస్ఐ రంజిత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పూజారి రాజు ఆదివారం ఉదయం ఆలయం తలుపులు తీసి చూసే సరికి అమ్మవారికి అలంకరించిన ఇత్తడి కిరీటం, ఇతర వస్తువులు కనపడకుండా పోయాయి. వెంటనే ఆయన గ్రామస్థులకు సమాచారమందించారు. వారు పోలీసులకు తెలియజేశారు. దీనిపై ఫిర్యాదు అందిందని ఎస్ఐ చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యులదృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: నందిగాం మండలం రథజనబొడ్డపాడు పంచాయతీ సవరనీలాపురం గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం మోటారు మరమ్మతులకు గురైంది. దీంతో 2 నెలలుగా తాగునీరుకు ఇక్కట్లు ఎదుర్కొంటున్నాం. సంబంధిత అధికారులు స్పందించాలి. **- ఉమాశంకర్, స్థానికుడు**

● క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తెలియజేస్తాం. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి, రథజనబొడ్డపాడు**

– న్యూస్‌టుడే, నందిగాం

వైద్య శిబిరానికి స్పందన

పాతపట్నం, న్యూస్‌టుడే: స్థానిక మహేంద్ర జూనియర్ కళాశాల ఆవరణలో చేపట్టిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 536 మందికి పరీక్షలు చేసి, మందులు అందించారు. శాసనపూరి కామేశ్వరరావు మాస్టార్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలన్నారు. జెమ్స్, కిమ్స్ వైద్యశాలలకు చెందిన వైద్య నిపుణులు సేవలందించారు. శాసనపురి మధుసూదనరావు, కళాశాల ప్రిన్సిపల్ ఎం.ఆంజనేయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నామరూపాలు కరవు..!

పోలాకి మండలం ఉరజాం నుంచి నందిగాం వెళ్లే పీఆర్ రహదారి అధ్వానంగా మారింది. తెదేపా హయాంలో దీన్ని నిర్మించారు. సుమారు ఆరేళ్లుగా నిర్వహణను పట్టించుకోక పోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని ప్రయాణికులు వాపోతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని మండల ఇంజినీర్ గోవిందరావు వద్ద ప్రస్తావించగా.. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పోలాకి

మురుగు కదలదు.. చింత తీరదు

నందిగాం మండలం కవిటిఅగ్రహారంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. కాలువలు లేకపోవడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. కొన్నేళ్లుగా పరిస్థితి ఇలాగే ఉన్నా పట్టించుకునే వారే లేకుండా పోయారని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ పేర్కొన్నారు – న్యూస్‌టుడే, నందిగాం

ఏళ్లుగా.. నిర్లక్ష్యంగా..!

కొత్తూరు సామాజిక ఆసుపత్రి ఆవరణలో కాలం చెల్లిన వాహనాలతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. 104, 108 పాత వాహనాలను కొన్నేళ్లుగా అలాగే వదిలేశారు. దీంతో స్థలాభావ సమస్య నెలకొందని ఉద్యోగులు చెబుతున్నారు. వీటిని జిల్లా కేంద్రానికి తరలించి, కొత్త వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ లీలాకృష్ణ దీనిపై మాట్లాడుతూ.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

రోడ్డుపై వదిలేస్తే రాకపోకలెలా

కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ మాల్కొదార్‌వీధిలో కాలువలు నిర్మించారు. వాటిపైన వేసేందుకు పలకలు తయారు చేసి రహదారి మీదనే వదిలేయడంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితిలోనూ వాహనాలు రాలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యంత్రాంగం స్పందించాలని కోరుతున్నారు. సంబంధిత సిబ్బందితో మాట్లాడి, ఇబ్బందులేకుండా చూస్తామని పీఆర్ ఏఈ అంజిత్‌కుమార్ స్పష్టంచేశారు. – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

రూ.కోటి నిధులతో పనులు

స్పందనకు వందనం

ఎల్ఎన్‌పేట మండలం సిద్ధాంతం మార్గానికి మోక్షం లభించింది. ఈ రోడ్డు రాళ్లు తేలి, అధ్వానంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు వచ్చాయి. ఆమదాలవలస, పాతపట్నం ఎమ్మెల్యేల దృష్టికి సమస్య రావడంతో రూ.కోటి నిధులు మంజూరు చేయించారు. దీంతో బీటీ రోడ్డు పనులు ప్రారంభించారు. త్వరితగతిన పూర్తి చేయిస్తామని పంచాయతీరాజ్ శాఖ డీఈఈ శామ్యూల్‌రాజ్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు అగమ్యగోచరం

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యుడు ఎం.వి.ఆర్.రాజు

పాతపట్నం, న్యూస్‌టుడే: గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగంతో యువత భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతోందని ఆంధ్రా విశ్వవిద్యాలయం ఆచార్యుడు ఎం.వి.ఆర్.రాజు అన్నారు. పాతపట్నంలో ఆదివారం ప్రముఖ మానసిక నిపుణుడు జి.రాజేశ్వరరావు రెండో పీహెచ్‌డీ సాధించిన నేపథ్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. యువత ఉన్నత లక్ష్యాలపై దృష్టి సారించి దేశాభివృద్ధికి పాటుపడాలని వక్తలు సూచించారు. ఎంఈవో రాంబాబు, అధ్యాపకుడు కె.చక్రపతి, శంకర్ నారాయణ, పి.అప్పారావు, కాళ్ల రాజు, జి.వేణుగోపాల్ పాల్గొన్నారు

కోటబొమ్మాళిలో దాహం దాహం

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

కరణాల వీధిలో దిష్టిబొమ్మలా మిగిలిన కుళాయి

కోటబొమ్మాళి మేజర్ పంచాయతీలోని కరణాల, శివాలయం వీధి (కొంతభాగం), మాల్కొదార్, మంగళవీధులతో పాటు పలు ప్రాంతాల్లో నెలరోజులుగా తాగునీటికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువలు నిర్మించే సమయంలో కుళాయి పాయింట్లు తొలగించారు. పనులు పూర్తయినా నేటికీ వాటిని పునరుద్ధరించే చర్యలు చేపట్టలేదు. ఫలితంగా సుమారు 350కు పైగా కుటుంబాలు నెల రోజులుగా అవస్థలు పడుతున్నాయి.

ప్రణాళిక లేకుండా పనులు

పంచాయతీ పరిధిలో దాదాపు 1,400 మంది ప్రజలు ఉంటున్నారు. ప్రస్తుతం ట్యాంకర్లతో సరఫరా చేస్తున్న నీరు తాగేందుకు వారు ఆసక్తి చూపడం లేదు. ముందస్తు ప్రణాళిక లేకుండా పనులు చేపట్టడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. పంచాయతీ, గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారుల మధ్య సమన్వయ లోపమే దీనికి కారణమని ప్రజలు పెదవి విరుస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం: మురుగు కాలువల నిర్మాణం సమయంలో పైపులైన్లు, కుళాయిలు తొలగించారు. పునరుద్ధరణపై గ్రామ పంచాయతీ అధికారులను అడిగితే నిధుల సమస్య ఉన్నట్లు తెలియజేశారు. మేజర్ పంచాయతీలో జల్‌జీవన్ మిషన్ కింద పనులు చేపట్టేందుకు రూ.1.83 కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండరు ప్రక్రియ పూర్తయింది. గుత్తేదారుతో మాట్లాడి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తాం. **- గౌతమి, జేఈఈ, గ్రామీణ నీటిసరఫరా విభాగం, కోటబొమ్మాళి**

అహంకారాన్ని దరిచేరనీయొద్దు

సారవకోట, న్యూస్‌టుడే: అహంకారాన్ని జీవితంలో ఎవరూ దరిచేరనీయొద్దని, అది పతనానికి దారితీస్తుందని పాలకొండకు చెందిన ప్రవచనకర్తలు ఎస్.త్రినాథరావు, ఎల్.వి.రమణలు పేర్కొన్నారు. బుడితి ఆధ్యాత్మిక విజ్ఞానపీఠం ఆధ్వర్యంలో బగాది రామారావు అధ్యక్షతన స్థానిక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో ఆదివారం సత్సంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నంనాయుడు, సింహాచలం, రామయ్య, మోహనరావు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి దృష్టికి సమస్యలు

హిరమండలం, న్యూస్‌టుడే: కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడిని జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు శ్రీకాకుళంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మండల కేంద్రంలో చెవిటమ్మతల్లి ఆలయం వద్ద క్రీడా స్థలంలో ఇండోర్ స్టేడియం మంజూరు చేయాలని, గొట్టా బ్యారేజీ కూడలిలో ప్రయాణికుల విశ్రాంతి భవనం నిర్మించాలని కోరారు. పునరావాస కాలనీల్లో వంశధార నిర్వాసితుల ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చేలా కృషి చేయాలని వినతిపత్రం అందించారు. సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ ఇచ్చినట్లు బుచ్చిబాబు చెప్పారు.

సంక్షిప్త సమాచారం

శ్రేయ మిశ్రో ప్రతిభ

పాతపట్నం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో భరత్ ఆర్ట్స్ అకాడమీ వారు నిర్వహించిన కూచిపూడి కళావైభవం కార్యక్రమంలో పాల్గొని పాతపట్నంకు చెందిన శ్రేయ మిశ్రో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. దీంతో పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమెరికా, ఆస్ట్రేలియా, యుఏఈ, యుకే దేశాల నుంచి 7 వేల మందికి పైగా నర్తకీమణులు పాల్గొన్నారు.

సందడిగా పద్మశాలి సామాజికవర్గ సమ్మేళనం

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో ఉత్తరాంధ్ర పద్మశాలి సామాజిక వర్గ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘ ఐక్యత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంతబొమ్మాళి మండల పీఏసీఎస్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కూచెట్టి కాంతారావును సత్కరించారు. పప్పు కృష్ణారావు, కూచెట్టి భానుప్రకాశ్, ఆనంద్, శంకర్, రాము, భాస్కరరావు పాల్గొన్నారు.

సందడిగా ఆత్మీయ కలయిక

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలని ఆ సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం సంఘ ఆత్మీయ కలయిక నిర్వహించారు. 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బ్రాహ్మణ సంక్షేమానికి కృషిచేశారని, ప్రస్తుతం జిల్లాలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌ను నియమించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కోటబొమ్మాళికి చెందిన వేద పండితుడు సుసరాపు చంద్రశేఖరశర్మను సన్మానించారు. సంఘ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వడుగూరి రాజేష్, నియోజకవర్గ అధ్యక్షుడు మామిడి శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

చంద్రశేఖరశర్మను సన్మానిస్తున్న సంఘ ప్రతినిధులు

కళాకారుల సంక్షేమానికి కృషి

మెట్టూరులో కాలమానిని ఆవిష్కరిస్తున్న కళాకారులు

కొత్తూరు, న్యూస్‌టుడే: కళాకారుల సంక్షేమానికి ఐక్యంగా కృషి చేయాలని గుర్రం జాషువా కళాపీఠం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గేదెల సుందరనారాయణ, పి.గోవిందరావు కోరారు. మండలంలోని మెట్టూరు గ్రామంలో కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం పద్యనాటక పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. అనంతరం కాలమానిని ఆవిష్కరించారు. మెట్టూరు బిట్-3 సర్పంచి కొయిలాపు శ్రీనివాసరావు, పలు మండలాలకు చెందిన కళాకారులు, నాయకులు పాల్గొన్నారు.

సాహిత్యంతో సమాజానికి మేలు

కవులను సత్కరించిన కొత్తూరు రచయితల వేదిక సభ్యులు

కొత్తూరు, న్యూస్‌టుడే: సాహిత్యంతో సమాజానికి ఎంతో మేలు చేకూరుతుందని కొత్తూరు రచయితల వేదిక (కొరవే) సభ్యులు తెలిపారు. స్థానిక విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం కొరవే సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు ఎల్.తాతబాబునాయుడు, రామరాజుమాస్టార్, పారిశెల్లి రామరాజు, పెద్దిన కులశేఖర్‌ఆళ్వార్, పొరిగి రవి మాట్లాడుతూ సాహిత్యం నైతిక విలువలకు కట్టుబడి ఉంటుందన్నారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఆవిర్భావ వేడుకలు

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఏపీఎస్ఆర్టీసీ(పీటీడీ) అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధం) ఆవిర్భావ వేడుకలు సోమవారం నిర్వహించనున్నట్లు సంఘ ప్రతినిధులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉదయం 9 గంటలకు కార్యక్రమం జరుగుతుందని, పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

కొత్తూరులో అరుణ్‌కుమార్, బైరాగినాయుడిని సన్మానిస్తున్న తెదేపా నాయకులు, అభిమానులు

కొత్తూరు, న్యూస్‌టుడే: తెదేపా కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని, సమస్యలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని తెదేపా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి అగతముడి అరుణ్‌కుమార్ అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం కార్యకర్తలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్‌ను తెదేపా మండలాధ్యక్షుడు ఎ.మాధవరావు, సీనియర్ నాయకుడు ఎ.బైరాగినాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు మాతల గాంధీ, కొత్తూరు, కర్లెమ్మ సర్పంచులు పడాల కృష్ణవేణి, ఎల్.భగవాన్‌దాస్‌నాయుడు, గోగుల వరప్రసాద్, కుంచాల నూకరాజు సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పోలాకి, న్యూస్‌టుడే: మండలంలోని ప్రియాగ్రహారం సమీపంలో ఆదివారం బెలమర వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపుతప్పి పడిపోయారు. ఈ ఘటనలో ఆయనకు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. దీనిపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రంజిత్ చెప్పారు.

పల్లె పండగ.. నిధులు దండిగా..!

గ్రామీణ రహదారులకు మోక్షం

– న్యూస్‌టుడే, జలుమూరు

గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పల్లె పండగ- 2.0 కింద ఉపాధిహామీ పథకం నిధులతో అనుబంధ మార్గాలతో పాటు, గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రోడ్ల నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించి సుమారు రూ.40 కోట్ల అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోనున్నారు. దీంతో అధ్వాన మార్గాల రూపురేఖలు మారుతాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి చేయనున్న రావిపాడు- ఏనేటికొత్తూరు మార్గం

వివరాలు ఇలా..

మండలం	గుర్తించిన పనులు	అంచనా వ్యయం (రూ.కోట్లలో)
నరసన్నపేట	72	11.08
పోలాకి	43	2.85
జలుమూరు	110	13.87
సారవకోట	67	12

మౌలిక వసతులకే ప్రాధాన్యం

ఉపాధిహామీ పథకం కింద ఏటా కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించేందుకు ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. వేతనదారులకు ఇచ్చే బడ్జెట్‌లో 40 శాతం మెటీరియల్ కాంపొనెంట్ నిధులు రానున్నాయి. 2014- 19 మధ్య తెదేపా ప్రభుత్వం ఈ నిధులను గ్రామాల్లో అభివృద్ధి పనులకు కేటాయించి సీసీ రహదారులు, మురుగు కాలువలు, శ్మశాన వాటికలను అభివృద్ధి చేసింది. ఇప్పుడూ అదే తరహాలో కూటమి ప్రభుత్వం గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోంది.

త్వరితగతిన చేపడతాం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె పండగ- 2.0 కార్యక్రమం కింద రోడ్ల నిర్మాణానికి అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చిన వెంటనే త్వరితగతిన పనులు చేపడతాం. **- జి.సత్యంనాయుడు, డీఈ, పంచాయతీరాజ్ శాఖ**

రెండేళ్లుగా ఎదురుచూపులే..!

ముఖలింగాపురం పంచాయతీ డమర గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా వేసిన బోరు ఇది. గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ వేసిన కుళాయిలు నేటికీ అలంకారప్రాయంగానే ఉన్నాయి. రెండేళ్లుగా తాగునీటి కోసం ఎదురుచూస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సమస్యపై గ్రామీణ నీటిసరఫరా విభాగం ఏఈ మోహన్ మాట్లాడుతూ లీకేజీల కారణంగా ఇబ్బంది ఎదురైందని, త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు

పిల్లలపై తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయొద్దని ఉత్తరాంధ్ర తెలగ సంక్షేమ ఉద్యమనేత పల్లంట్ల వెంకటరామారావు యువతకు సూచించారు. ఆదివారం కోటబొమ్మాళిలో సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, సారవకోట మండలాల తెలగ సామాజిక వర్గ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా కురుడు పంచాయతీ చౌదరికొత్తూరుకు చెందిన మనీషా వైద్య విద్య పూర్తిచేసిన నేపథ్యంలో ఆమెతో పాటు తల్లిదండ్రులు నీలకంఠేశ్వరరావు, జయలక్ష్మిలను సత్కరించారు. వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. మధుబాబు, లాలిశెట్టి గోవిందరావు, నాళ్ల చిన్నిఆదినారాయణ, దాసరి వెంకటేష్, యర్నాగుల వాసు, నరసింగరావు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

(c) eenadu

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

బిల్లులు రాక...పనులు జరగక

సరుబుజ్జిలి మండలం మూల సవలాపురంలో అంగన్‌వాడీ భవనం నిర్మాణ పనులు నిలిచి అసంపూర్తిగా దర్శనమిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో బిల్లులు సకాలంలో అందకపోవడంతో గుత్తేదారులు పనులు నిలుపుదల చేశారు. దీంతో ఈ భవనంలో అసాంఘిక కార్యక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయంపై బూర్జ ఐసీడీఎస్ పీవో గీత వద్ద ప్రస్తావించగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని నిధులు మంజూరు కాగానే పనులు పూర్తిచేస్తామన్నారు. - న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

3 నుంచి ప్రపంచ తెలుగు మహాసభలు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సాహితీ సంస్థల ప్రతినిధులు

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం ప్రపంచ తెలుగు మహాసభల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 3, 4, 5 తేదీల్లో జరిగే మహాసభల్లో భాగంగా రవి కుమార్ సారథ్యంలో వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు కరపత్రాలను ఆవిష్కరించారు. విశ్వసాహితీ కళా వేదిక రాష్ట్ర కన్వీనర్ ఈ-వేమన, శంకరరావు, ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

వన్‌వే ట్రాఫిక్ రహదారిని విస్తరిస్తాం

నగరంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు

శ్రీకాకుళం నగరం, గార, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలో డే అండ్ నైట్ నుంచి రామలక్ష్మణ కూడలి వరకు ఉన్న వన్‌వే ట్రాఫిక్ రహదారిని 80 అడుగుల మేర విస్తరిస్తామని కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఎల్‌బీఎస్ కాలనీ, పరంకుశనగర్ ప్రాంతాల్లో సీసీ రహదారులు, కాలువల పనులను ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వన్‌వే ట్రాఫిక్ రహదారి విస్తరణకు స్థలాలు ఇచ్చేందుకు స్థానికులు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు, తెదేపా నాయకులు పాల్గొన్నారు. ● గార, శ్రీకూర్మంలలో రూ.కోటితో నిర్మించిన రెండు ఆరోగ్య కేంద్ర భవనాలు, రూ.2.6 కోట్లతో నిర్మించిన బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ప్రారంభించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు అవగాహన కల్పించాలి

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: పిల్లలకు ఆధ్యాత్మికతపై అవగాహన కల్పించాలని జిల్లా సత్యసాయి సేవా సమితుల విద్యా జ్యోతి ఇన్‌ఛార్జి ఎం.జనార్దనరావు అన్నారు. ఆదివారం మండలంలోని అక్కులపేట-వేణమ్మపేట సత్యసాయి సేవా సమితిలో బాలవికాస్ పిల్లలకు ఆధ్యాత్మికత కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పద్యాలు చదివించడం వల్ల జ్ఞానం పెరుగుతుందని తెలిపారు.

పొదుపు బాట.. అతివకు భరోసా!

మండలం	సంఘాలు	రుణాలు (రూ.కోట్లు)
జి.సిగడాం	1,406	46.00
లావేరు	1,844	66.37
రణస్థలం	2,447	90.00
శ్రీకాకుళం గ్రామీణం	1,739	54.20

-న్యూస్‌టుడే, జి.సిగడాం, లావేరు, శ్రీకాకుళం గ్రామీణం

పొదుపు సంఘాల్లో సభ్యులుగా చేరి బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన మహిళలు సొంతంగా ఆర్థిక స్వావలంబన సాధించారు. వచ్చిన ఆదాయంతో కుటుంబాలకు చేదోడుగా ఉంటున్నారు. అనుభవం ఉన్న వాటిలో వ్యాపారాలు సాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

● జి.సిగడాం మండలం వెంకయ్యపేట గ్రామానికి చెందిన కాయల సరోజిని శ్రీమంజునాథ గ్రామైక్య సంఘంలో సభ్యురాలిగా ఉన్నారు. బ్యాంకు లింకేజీ నుంచి రూ.2 లక్షలు రుణం తీసుకొని గ్రామంలో పేపర్ ప్లేట్స్ యూనిట్ పెట్టారు. ఇద్దరికి ఉపాధి కల్పించడంతో పాటు నెలకు రూ.20 వేలు వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు.

● లావేరు మండలం తాళ్లవలస గ్రామానికి చెందిన దేవరశెట్టి లక్ష్మి ఝాన్సీలక్ష్మీబాయి సంఘంలో సభ్యురాలిగా ఉన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.లక్ష వరకు రుణం తీసుకొని ఇంటి వద్ద కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. నెలకు రూ.10 వేలు వరకు సంపాదిస్తున్నారు.

● శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలుకు చెందిన పెద్దిని ధనలక్ష్మి స్త్రీనిధి ద్వారా జిరాక్స్ దుకాణం ప్రారంభించారు. వ్యాపార విస్తరణలో భాగంగా పీఎంఈజీపీ పథకం కింద రూ.7 లక్షల పెట్టుబడితో ఒక ఫొటో స్టూడియో ఏర్పాటు చేసుకున్నారు. నెలకు సుమారు రూ.18 వేలు ఆదాయం పొందుతున్నారు.

● రణస్థలం మండలం గొర్లెపేటకు చెందిన మహంతి సరస్వతి శ్రీదేవి గ్రామైక్య సంఘం సభ్యురాలు. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.2 లక్షలు తీసుకొని ఇంటి వద్ద పచ్చళ్లు తయారుచేసి విక్రయిస్తున్నారు. నెలకు రూ.15 వేలు వరకు ఆదాయం సంపాదిస్తున్నారు. కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం.. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఇతర రుణాలు తీసుకొని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. సభ్యులు సొంతంగా వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా బలపడేలా పర్యవేక్షిస్తున్నాం. - రెడ్డి రామకృష్ణ, సుబ్బయ్యనాయుడు, మాధవీలత, కుప్పిలి రజని ఏపీఎంలు

తెరపై ఈనాడు

కిన్నెర: వృషభ కీర్తన: అనకొండ కీర్తిక: దండోరా మారుతి: శంబల సూర్య: అవతార్ పన్ మ్యాక్స్: ఈషాఎస్‌డీస్(రామలక్ష్మణ): అఖండ-2 సరస్వతి: ఛాంపియన్ - న్యూస్‌టుడే, పాతబస్టాండ్

దోమల బెడద

జి.సిగడాం మండలం నిద్దాం గ్రామంలో కాలువలో మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్వాసన భరించలేకపోతున్నామని, రాత్రివేళల్లో దోమల బెడద అధికంగా ఉందని స్థానికులు అంటున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో రామకృష్ణతో ప్రస్తావించగా కార్యదర్శితో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.- న్యూస్‌టుడే, జి.సిగడాం

పెచ్చులూడి పడుతున్నాయ్..

ఆమదాలవలస మండలంలోని దూసి పశువైద్య కేంద్రం శిథిలం కావడంతో రైతులు, సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 30 ఏళ్ల కిందట నిర్మించిన ఈ కేంద్రంలో శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయని భయాందోళన చెందుతున్నారు. వర్షాలు కురిస్తే భవనం కారిపోవడంతో దస్త్రాలు, మందులు తడిసి ముద్దవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రతిపాదనలు పంపించాం, నిధులు మంజూరైన మరుక్షణమే నిర్మాణం చేపడతామని ఏడీ డాక్టర్ నారాయణరావు తెలిపారు. -న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

మురుగుతో అవస్థలు..!

శ్రీకాకుళం నగరంలోని కోడిరామ్మూర్తి స్టేడియానికి సమీపంలో మురుగు కాలువ శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు పూడిక పేరుకుపోయింది. దీంతో రోడ్డుపై నుంచి మురుగు ప్రవహిస్తోంది. స్టేడియానికి వచ్చే క్రీడాకారులు, ఉదయం, సాయంత్రం నడకకు వచ్చే ప్రజలు, ఆ మార్గంలో రాకపోకలు చేసేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు తెలిపారు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

సమస్యకో దారి చూపండి..

పొందూరు మండలం తాడివలస జగనన్న కాలనీలో సీసీ రహదారులు లేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్లలోని వాడుకనీరు మట్టి రోడ్డుపైకి చేరడంతో అవస్థలు తప్పడంలేదని వారు వాపోతున్నారు. అధికారులు స్పందించి వీటి నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్దకి సమస్యను తీసుకెళ్లగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, పొందూరు

ఎక్కలేం.. శుభ్రం చేయలేం..

బూర్జ మండలం టీడీఆర్‌రాజుపేటలో రక్షిత మంచి నీటి పథకం మెట్లు శిథిలావస్థకు చేరడంతో శుభ్రం చేసేందుకు సిబ్బంది ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. తాగునీరు నాచు, చెత్తాచెదారంతో కలుషితమయ్యే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో ఆర్. తిరుపతిరావుతో ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటున్నామన్నారు. - న్యూస్‌టుడే, బూర్జ

రాకపోకలకు ఇక్కట్లు

రణస్థలం మండలం లంకపేటలోని ప్రధాన వీధిలో మురుగు కాలువలు లేక రహదారిపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై డిప్యూటీ ఎంపీడీవో ప్రసాదరావును తెలుపగా ప్రతిపాదనలు పంపామని మంజూరైన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, రణస్థలం

పోరాటాలకు సిద్ధంగా డీటీఎఫ్

డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: పోరాటాల డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) అన్ని వేళలా సిద్ధంగా ఉంటుందని సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షులు కె.దర్మారావు, అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న పేర్కొన్నారు. నగరంలోని విశ్రాంత ఉద్యోగుల భవనం ఆవరణలో నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను ఆదివారం ఆవిష్కరించారు. సంఘ ప్రతినిధులు రమణమూర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘ క్యాలెండర్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆవిష్కరించినట్లు సంఘ అధ్యక్షుడు కె.పూర్ణచంద్రరావు తెలిపారు.

అఖిల భారత మహాసభలకు రండి

ఎచ్చెర్ల: ప్రతులను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

ఎచ్చెర్ల, కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జనవరి 4న విశాఖలో నిర్వహించే సీఐటీయూ అఖిల భారత మహాసభలను కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్. అమ్మన్నాయుడు అన్నారు. ఎచ్చెర్ల మండలం అరిణాంఅక్కివలస పంచాయతీలోని నాగార్జున అగ్రికెం పరిశ్రమ ఆవరణలో ఆదివారం మహాసభల ప్రచారంలో భాగంగా ప్రతులను ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు ఎల్.రామప్పడు, పి.సుధాకర్, సత్యనారాయణ పాల్గొన్నారు. ● శ్రీకాకుళం నగరంలో కళాసీ కార్మిక సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిన్నారావు, ఆర్.ప్రకాశరావు నిరసన ప్రదర్శన, బహిరంగ సభ ఉంటాయన్నారు. కార్యక్రమంలో బి.త్రినాథరావు, మల్లేశ్, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సేవలో జస్టిస్ శిందే

జస్టిస్ శంభాజీ శివాజీ శిందేకు ఆదిత్యుని చిత్రపటాన్ని బహూకరిస్తున్న ప్రధాన అర్చకుడు శంకరశర్మ తదితరులు

శ్రీకాకుళం నగరం, గార(శ్రీకూర్మం), న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామిని రాజస్థాన్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శంభాజీ శివాజీ శిందే ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు ఆయనను ఆశీర్వదించి.. తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ స్వామి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం గార మండలం శ్రీకూర్మంలోని కూర్మనాథ క్షేత్రాన్ని సందర్శించారు. ఇన్‌ఛార్జి ఈవో వాసుదేవరావు, వైదిక సిబ్బంది పాల్గొన్నారు.

మంచు దుప్పటి

గత కొద్ది రోజులుగా మంచు విస్తారంగా కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిరప, ఉల్లి, జీడి మామిడి పూతలు, తదితర వాణిజ్య పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోందని రైతులు వాపోతున్నారు. ఆదివారం ఉదయం 9 గంటల వరకు మంచు తెర కమ్మేసింది. దీంతో చలి తీవ్రత అధికంగా ఉండటంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లావేరు మండలంలో జాతీయ రహదారిపై పొగ మంచు పడటంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు.- న్యూస్‌టుడే, లావేరు

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

పార్టీ జెండాకు వందనం చేస్తున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. జిల్లా ఇన్‌ఛార్జి గాదం వెంకటరావు ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం, స్వాతంత్య్ర పోరాటంలో కీలకంగా వ్యవహరించిన తీరును వివరించారు. డీసీసీ ఉపాధ్యక్షురాలు కేవీఎల్ఎస్ ఈశ్వరి, నాయకులు అంబటి కృష్ణారావు, ఇజ్జురోతు రమణ, మామిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపనిషన్మందిరంలో ఆధ్యాత్మిక ప్రవచనం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని కోదండరామాలయం ప్రాంగణంలో ఉన్న ఉపనిషన్మందిరంలో ఆదివారం రమణ మహర్షి జయంతి, వైకుంఠ ఏకాదశి విశిష్టత అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. రమణ మహర్షి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఆయన జీవిత విశేషాలను తెలియజేశారు. కార్యక్రమంలో డా.సనపల నారాయణమూర్తి, నిష్టల నరసింహమూర్తి, సాయిబాబా, డా.కోమలరావు, ఉపనిషన్మందిరం ప్రతినిధులు పాల్గొన్నారు.

పశువుల వాహనం పట్టివేత

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: జాతీయ రహదారి మండలం నవభారత్ వద్ద అనుమతులు లేకుండా పశువులు తరలిస్తున్న వాహనాన్ని ఎచ్చెర్ల పోలీసులు ఆదివారం అడ్డుకున్నారు. వాటిని నరసన్నపేటలోని నారాయణవలస సంత నుంచి అనకాపల్లి తీసుకెళ్తుండగా పట్టుకుని గుజ్జింవలస గోశాలకు తరలించామని ఎస్సై జి.లక్ష్మణరావు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తిపై దాడి

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం శ్రీశయన వీధిలో నివాసముంటున్న శరత్‌భూషణ్‌పై స్థానికులు కొందరు దాడి చేసి గాయపరిచారు. ప్రస్తుతం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన అవుట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి రెండో పట్టణ పోలీసులకు పంపించారు.

ప్రారంభానికి ఎదురుచూపులు

ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా రూ.కోట్లు ఖర్చుచేసి నిర్మించిన పౌరసరఫరా గోదాం ప్రారంభానికి నోచుకోవడం లేదు. పౌరసరఫరా సరకులు నిల్వ చేసేందుకు అధునాతన సాంకేతిక సౌకర్యాలతో సుమారు ఎనిమిదేళ్ల కిందట నిర్మించారు. అధికారులు స్పందించి గోదాంను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్యను జిల్లా పౌర సరఫరాశాఖ మేనేజర్ టి.వేణుగోపాల్ దృష్టికి న్యూస్‌టుడే తీసుకెళ్లగా క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

లీకులు అరికట్టండి..

సరుబుజ్జిలి మండలం డకరవలస గ్రామంలో వీధి కుళాయిల ప్రధాన పైపుల నుంచి లీకై తాగునీరు వృథాగా పోతోంది. రెండు చోట్ల పైపులు తుప్పు పట్టి పాడైందని స్థానికులు చెబుతున్నారు. ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఎండీ అబాష్ వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

నేడు వేడుకలు

బలగ(శ్రీకాకుళం): ఏపీఎస్ఆర్టీసీ(పీటీడీ) అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధం) ఆవిర్భావ వేడుకలు సోమవారం నిర్వహించనున్నట్లు సంఘ ప్రతినిధులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉదయం 9 గంటలకు కార్యక్రమం జరుగుతుందని, పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ముళ్ల పొదలు తొలగించరూ..!

గార మండలం శ్రీకూర్మంలో దల్లాం చెరువు గట్టు మీదుగా ఉన్న మట్టి దారిని ఇరువైపులా ముళ్లపొదలు పెరిగిపోయాయి. అయ్యవారిపేట, రాళ్లపేట, మెండపేట పంచాయతీల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల రహదారి నిర్మాణానికి రూ.2.30 కోట్లు మంజూరైనా ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కె.ఈశ్వరమ్మ మాట్లాడుతూ పొదలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, గార(శ్రీకూర్మం)

సీసీ రోడ్డుకు మోక్షం

పొందూరు, పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం రాపాక గ్రామంలో రూ.8.50 లక్షలతో సీసీ రహదారి నిర్మాణ పనుల చేపడుతున్నట్లు తెదేపా నాయకులు ఖండాపు శ్రీను, బలగ శంకర్‌భాస్కర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాలతో గ్రామంలో సీసీ రహదారి, కాలువలు నిర్మిస్తున్నట్లు చెప్పారు.

అధ్వాన మార్గం..

ఆమదాలవలస మండలం బొబ్బిలిపేట-వెదళ్లవలస రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. భయంతో ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆమదాలవలస నుంచి బొబ్బిలిపేట, వెదళ్లవలస, తురకపేట, నెల్లిపర్తి గ్రామాలకు ఇదే ప్రధాన రోడ్డు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదని, అధికారులు తక్షణమే స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. ఇప్పటికే మార్గంలో ఇరువైపులా ఉన్న ముళ్లపొదలు తొలగించాం. పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.
-న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

దాహం తీరదు.. అధికారులకు పట్టదు

న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

ఆమదాలవలస వాసులను వెంటాడుతున్న తాగునీటి సమస్య

చింతాడలో ట్యాంకు ద్వారా తాగునీరు పట్టుకుంటున్న మహిళలు

ఆమదాలవలస పురపాలికలో తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పురలో మొత్తం 23 వార్డులకుగాను ఆరుచోట్ల తాగునీరు సరఫరా జరగక స్థానికులు అష్టకష్టాలు పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వం సమస్యకు పరిష్కారం చూపలేకపోయిందని ఆవేదన చెందుతున్నారు. నీటి కొరత ఉన్న వార్డుల్లో పూర్తి స్థాయిలో తాగునీరందించాలని కోరుతున్నారు.

● పట్టణానికి దూరంగా ఉన్న 1వ వార్డు తిమ్మాపురం, పార్వతీశంపేట, జగ్గుశాస్త్రులపేట, 4వ వార్డు గేదెలవానిపేట, కొసింవలసపేట, 5వ వార్డు రెడ్డిపేట, సొట్టవానిపేట, పంతులపేట, 6వ వార్డు సప్తపురాలు, నందగిరిపేట, పంతులపేట, తురకపేట, టి.మన్నయ్యపేట, కె.మన్నమ్మపేట, 7వ వార్డు చింతాడ, చింతాడ కాలనీ, 21 వార్డు కుద్దిరాంతో పాటు మెట్టక్కివలసలో కొన్ని ప్రాంతాలనికి తాగునీటి పైపు లైన్ లేకపోవడంతో అక్కడ ప్రజలకు పురాధికారులు ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు.

● ఆరు వార్డుల్లో రోజూ నీటిని అందించాల్సి ఉండగా వారంలో రెండు, మూడు రోజులు మాత్రమే ఆయా గ్రామాలకు ట్యాంకులు ద్వారా అందిస్తున్నారు. అయితే చాలక పోవడంతో సమీపంలో ఉన్న పొలాల్లోని బోరు బావిల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు. అధికారులు తక్షణమే స్పందించి మంచినీరు అందేలా చర్యలుతీసుకోండి అని స్థానికులు కోరుతున్నారు.

శంకుస్థాపనకే పరిమితం

23 వార్డుల్లోనూ తాగునీరు అందించేందుకు ఏపీ ప్రభుత్వం, ఏఐబీ సంయుక్త నిధులు రూ.61.38 కోట్లు అంచనా వ్యయంతో 2022లో అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాం శంకుస్థాపన చేసినా పనులు పూర్తి కాలేదు.

● ప్రస్తుతం ఉన్న పైపులైన్లు మరమ్మతులకు గురికావడంతో ఎక్కడికక్కడే నీరు వృథాగా పోతోంది. మరోవైపు కాలువలు ద్వారా అమర్చిన పైపులు మరమ్మతులకు గురై కలుషితమైన నీరు వస్తోందని, వ్యాధుల బారిన పడతామని ఆందోళన చెందుతున్నారు.

తాగునీరందిస్తాం..

పురపాలక పరిధిలో ప్రతి వార్డుకు పూర్తి స్థాయిలో తాగునీరందిస్తాం. సమస్యను ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వ ఆదేశాలతో అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకులు నిర్మించి నీటి సదుపాయం కల్పించేలా చర్యలు చేపడతాం.
- టి.రవి, పురపాలక కమిషనర్, ఆమదాలవలస

గుంతల గండం..దారికో దండం

ఎచ్చెర్ల మండలం జాతీయ రహదారి అల్లినగరం కూడలి నుంచి లావేరు మండలం ఆరంగిపేట, పెద్దరావుపల్లి, మీదుగా సుమారు 20 గ్రామాలకు వెళ్లే 12 కి.మీ మేర రహదారిలో అడుగుకో గుంత ఏర్పడటంతో వాహనదారులు రాకపోకలు అష్టకష్టాలు పడుతున్నారు. ఆరంగిపేట కొండ సమీపంలో రోడ్డు సగానికిపైగా మరమ్మతులకు గురికావడంతో రాత్రి సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పంచాయతీరాజ్‌శాఖ పీఐయూ విభాగం ఏఈఈ పోలినాయుడు మాట్లాడుతూ నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, లావేరు

(c) eenadu

క్వాంటం ధ్యానం..

వారసత్వ గానం

■ తిరుపతిలో వైభవంగా 7వ భారతీయ విజ్ఞాన సమ్మేళనం

ఈనాడు డిజిటల్, తిరుపతి: తిరుపతి (విద్య, నగరపాలిక), న్యూస్‌టుడే: సప్తగిరుల పాదాల చెంత జరుగుతున్న వైజ్ఞానిక యజ్ఞం మూడోరోజూ సరికొత్త పుంతలు తొక్కింది. ప్రాచీన భారతీయ విజ్ఞానానికి ఆధునిక సాంకేతికతను జోడిస్తూ.. వికసిత్ భారత్ దిశగా అడుగులు వేయాలన్న సంకల్పం ఆదివారం నాటి చర్చల్లో స్పష్టంగా కనిపించింది. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ వేదికగా జరుగుతున్న '7వ భారతీయ విజ్ఞాన సమ్మేళనం'లో ఒకవైపు భవిష్యత్ సాంకేతికత (ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీ) అయిన సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్‌పై మేధోమథనం జరగ్గా.. మరోవైపు మన మనసైన వారసత్వ సంపదపై విద్యార్థుల ప్రదర్శనలు ఆహూతులను కట్టిపడేశాయి.

మనమే మేటి కావాలి..

సెమీకండక్టర్లు, పాత్ టెక్నాలజీపై జరిగిన సదస్సులో ఐఐటీ రూర్కీ ప్రొఫెసర్ బలుసు ఆనంద్ కీలకోపన్యాసం చేశారు. ఐఐటీ భువనేశ్వర్, రోపార్ సంస్థల ఆచార్యులు రోడ్ మ్యాప్‌ను వివరించారు. 'క్వాంటం కంప్యూటింగ్ అప్లికేషన్ల'పై అమృత విశ్వవిద్యాలయ ఆచార్యులు డా. మృత్యుంజయ్ గుహ మజుందార్ నేతృత్వంలో నిపుణులు దిశానిర్దేశం చేశారు.

రీల్స్ రూపంలో వైభవం..

'నీ వారసత్వ సంపదని తెలుసుకో' పేరుతో నిర్వహించిన పోటీ.. ప్రదర్శన ఆకర్షణగా నిలిచింది. 240 మంది విద్యార్థులు తమ ప్రాంతాల్లోని విశిష్టతను పోస్టర్లు, రీల్స్ ద్వారా అద్భుతంగా ప్రదర్శించారు. వారణాసి నుంచి వచ్చిన గురుకుల విద్యార్థులు మల్లార్ భైరవ ఆలయాన్ని ఎలా సంరక్షిస్తున్నారో వివరించి ప్రశంసలు అందుకున్నారు.

ఆర్యభట్ట మొదలు..

భూమి స్థిరంగా లేదు.. తన చుట్టూ తాను తిరుగుతుంది అని ఆధునిక శాస్త్రవేత్తలు చెప్పకముందే.. వేల ఏళ్ల క్రితమే ఆ నిజాన్ని ప్రపంచానికి చాటిన మేధావి ఆర్యభట్ట. కేవలం పురుషులే కాదు.. స్త్రీలు కూడా వేదాల్లో, పాండిత్యంలో శిఖరాగ్రాలు తాకగలరు అని నిరూపించిన వేద విదుషీమణి 'అపాల'. ఇలా అనే అంశాలతో 'సెన్స్ ఎక్స్‌పో-2'. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన 'ఆర్ష భారత్ - వీర భారత్' చిత్రాలు భారతీయ విజ్ఞాన మూలాలను కళ్లకు కడుతున్నాయి.

మన గ్రంథాలు అపూర్వ సంపద

మహాభారతం, రామాయణ చరిత్రలతోపాటు చరిత్ర ఘటనలు, వాస్తవికతను కళ్ల ముందుంచారు. ఎగ్జిబిషన్ చాలా బాగుంది. దాదాపు 135 మంది పురాతన స్కాలర్లు, ప్రాచీనకాలంలోనే వారు రచించిన గ్రంథాలు వెలకట్టలేని వారసత్వ సంపద. నేను ఇంతవరకు ఎక్కడా ఇలాంటి ప్రదర్శన చూడలేదు.
- లోకేశ్వర్ కుమార్, బీటెక్, ఎంబీయూ

ఘనత తెలిసేలా

శాస్త్రసాంకేతిక అంశాలపై ఎగ్జిబిషన్ తిలకించడం వల్ల సమీపంలోనే భారతదేశ పుట్టుక, గ్రంథాలు, ఇతిహాసాలు, వేద, పురాణాలకు సంబంధించిన ఎగ్జిబిషన్ చూసిన తర్వాత నేను డాక్టర్‌నన్న విషయాన్ని మర్చిపోయా. నిజంగా నేను ఈ దేశంలో పుట్టడం అదృష్టంగా భావిస్తున్నా.
- టి.జాహ్నవి, ఎంబీబీఎస్, ఎస్వీ వైద్య కళాశాల

నేటితో ముగింపు

సమగ్రవికాసానికి భారతీయ చింతన అనే నినాదంతో ప్రారంభమైన సమ్మేళనం సోమవారంతో ముగియనుంది. ప్రసంగాలకే పరిమితం కాకుండా 'సైన్స్ ఎక్స్‌పో' ద్వారా దృశ్యరూప విజ్ఞానాన్ని వేలాది విద్యార్థులకు అందించడం విశేషం.

భారతీయ కోణంలోనే బోధన..

● విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, డైరెక్టర్లతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో 'సైన్స్ అండ్ టెక్నాలజీని భారతీయ దృక్పథంలో ఎలా బోధించాలనే' అంశంపై చర్చించారు. కేవలం పాశ్చాత్య విజ్ఞానమే కాకుండా, మన మూలాల్లో ఉన్న గణిత, ఖగోళ, వైద్య శాస్త్రాలను పాఠ్యాంశాల్లో చేర్చాలని నిర్ణయించారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక వేడుకలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.

దేవుడి పరిహారంలోనూ కోత..!

◗ రూ.3 కోట్ల ఆస్తికి రూ.6 లక్షలతో సరి
◗ చేతులు దులుపుకొన్న హైవే అధికారులు

నగరి కొండచుట్టు మండపం నిర్మించి 600 సంవత్సరాలు అవుతోంది. ఇన్నేళ్లుగా ఏటా సంక్రాంతి సందర్భంగా కనుమ రోజున ఇక్కడ దేవతామూర్తులను పెద్దఎత్తున కొలువుదీర్చి కొండచుట్టు ఉత్సవం నిర్వహిస్తారు. ఈ మండపాన్ని తిరుపతి- చెన్నై జాతీయ హైవే అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగించనున్నారు. ప్రస్తుతం అక్కడ ఒక్క అడుగు భూమి మార్కెట్ ధర ప్రకారం రూ. 8 వేలు పలుకుతోంది. అయితే జాతీయ రహదారి అభివృద్ధి అధికారులు కేవలం పరిహారం కింద రూ. 6 లక్షలు ఇవ్వడం గమనార్హం.

పుత్తూరు, నగరి, న్యూస్‌టుడే : కార్వేటినగరం రాజుల పాలనలో పుత్తూరులో ఆరు శతాబ్దాల క్రితం కార్వేటినగరం రోడ్డు కల్యాణపురం, నగరి మండపం వద్ద కొండ చుట్టు మండపాలు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది.. వాటిని కాపాడాల్సిన అధికార యంత్రాంగం తొలగించేందుకు సిద్ధం కావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పుత్తూరు-చిత్తూరు రోడ్డులోని కల్యాణపురం వద్ద ఉన్న కొండచుట్టు మండపాన్ని 2010లో పుత్తూరు-చిత్తూరు రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించారు. సమీపానే నూతన మండపాన్ని నిర్మిస్తామన్న హామీ నేటికీ నెరవేరలేదు.

ఇప్పుడు నగరి మండపం వంతు..

ప్రస్తుతం నగరిలోని మండపాన్ని తిరుపతి-చెన్నై రహదారి విస్తరణలో భాగంగా కూల్చేందుకు సిద్ధం చేశారు. ఇప్పటికే నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు. రానున్న కొండచుట్టు ఉత్సవం వరకు గడువు ఇవ్వాలని, అసలు తొలగింపు ఆలోచనే విరమించుకోవాలని ఆర్డీవో నుంచి ఉన్నతాధికారుల వరకు నివేదించారు. మండపం నిర్మించాలంటే ఖర్చు తడిసి మోపెడవుతోందని చెబుతున్నారు. మండపం తొలగించకుండా దీనికి పశ్చిమాన ఉన్న ప్రభుత్వ భూమిలో సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మిస్‌టీన్ ఆంధ్రాగా దివ్య

మిస్‌టీన్ ఏపీ-2025 కిరీటాన్ని వరదయ్యపాళెం మండలానికి చెందిన దివ్య దక్కించుకుంది. ఈమె గుత్తేదారు పరిటాల నరేష్, సుజాత దంపతుల కుమార్తె. జైపూర్‌లో ఫరెవర్ స్టార్ ఇండియా అవార్డ్స్ ఆధ్వర్యంలో ఇటీవల మిస్ టీన్ ఇండియా అందాల పోటీలు జరిగాయి. దేశవ్యాప్తంగా ఆయా విభాగాల్లో పదివేలమంది వరకు పాల్గొనగా 101 మంది విజేతలుగా నిలిచారు. అందులో మిస్‌టీన్ ఏపీ కేటగిరీలో పరిటాల దివ్య నిలిచింది. ధైర్యం, విశ్వాసం, తెలివితేటలు, విభిన్న గుణాలు - ఆధునిక భారతీయ స్త్రీతత్వం అనే అంశంలో ఆమె ప్రతిభ చూపారు.

- న్యూస్‌టుడే, వరదయ్యపాళెం

సైబర్ ఫిర్యాదులు తగ్గినా దోచేసింది ఎక్కువే

నేరాల కట్టడికి ఉత్తమ పోలీసింగ్ : ఎస్పీ

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: 'భక్తులు, పర్యాటకులు, ప్రజలతో స్నేహపూర్వక పోలీసింగ్ ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించగలిగాం. గత ఏడాది కంటే స్వల్పంగా 0. 71 శాతం నేరాలు పెరిగాయి. సైబర్ నేరస్థులు 2024లో 241 కేసుల ద్వారా రూ. 12. 31 కోట్లు దోచుకున్నారు. ఈ ఏడాది 186 కేసుల్లో రూ. 14. 45 కోట్లు దోచుకోగా రూ. 3. 53 కోట్లు రికవరీ చేయగలిగాం. అత్యాచారాలకు పాల్పడాలంటే భయపడేలా నిందితులపై కేసులు.. పీడీ యాక్టు ప్రయోగించాం. పీజీఆర్ఎస్‌లో 4,639కు గాను 4,501 కేసుల్లో పరిష్కారం చూపామ'ని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఆదివారం 2025 జిల్లా వార్షిక నివేదికను ఆయన మీడియాకు వెల్లడించారు.

రహదారుల రక్త దాహం

ఏడాది	ఘటనలు	మృతులు	క్షతగాత్రులు
2024	1143	541	1303
2025	1148	513	1384

(మృతుల్లో 5.41% పెరుగుదల)

మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు, చిత్రంలో ఏఎస్పీలు రవిమనోహరాచారి, శ్రీనివాసరావు, నాగభూషణరావు

భక్తులకు సాంత్వన

మొబైల్ హంట్ అప్లికేషన్ భక్తులకు ఊరటనిస్తోంది. 2024లో రూ. 4 కోట్ల విలువైన 2003 చరవాణులు, 2025లో రూ. 4. 97 కోట్ల విలువైన 2485 చరవాణులు బాధితులకు అప్పగించి రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచారు.

మొత్తం కేసుల నమోదు

ఏడాది	మొత్తం
2024	9,118
2025	9,253

23 కేసుల్లో నిందితులు జైలుకు

పోక్సో, అత్యాచారం, హత్యానేరాల ఫిర్యాదులను చట్టప్రకారం విచారించి జైలు శిక్షతోపాటు జరిమానా పడేలా కోర్టు మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. 23 కేసుల్లో నిందితులకు ఐదేళ్ల నుంచి జీవితకాల జైలుశిక్ష పడేలా చేశారు. శ్రీకాళహస్తి రూరల్‌లో డబ్బు కోసం చేసిన హత్య కేసు.. గాజులమండ్యం పీఎస్‌లో అనుమానాస్పద హత్య కేసును సాంకేతికత సహకారంతో ఛేదించి నిందితులను అరెస్టు చేశారు.

కేసుల వివరాలు

పోక్సో, రేప్	10
హత్య	10
హత్యాయత్నాలు	3
పీడీ యాక్టు	16
సస్పెక్ట్ షీట్లు	258
పోక్సో షీట్లు	187

ఈగల్ దూకుడు

68 కేసులు నమోదు చేసి 762 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని 179 మందిని రిమాండ్‌కు పంపారు. 784 కమిటీలు ఏర్పాటు చేసి డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. సీసీ కెమెరాలతో 187 నేరాలు గుర్తించి 58 ఛేదించారు.

● ఉల్లంఘనలపై 29,001 మంది వాహన చోదకులతోపాటు 1,65,930 వాహనాలకు ఈ-చలానా విధించారు.

'మనమిత్ర'.. తెలియదండి

మనమిత్ర వాడారా? (శాతంలో)

జిల్లా	అవును	లేదు
చిత్తూరు	22.5	77.5
తిరుపతి	22.7	77.3

సేవల గురించి తెలుసా? (శాతంలో)

జిల్లా	తెలుసు	తెలియదు
చిత్తూరు	29.6	70.4
తిరుపతి	29.2	70.8

■ వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన కరవు

ఈనాడు- తిరుపతి, చిత్తూరు: తక్కువ సమయంలో అవినీతి రహితంగా పౌరులకు ప్రభుత్వ సేవలు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ క్రమంలోనే ప్రజలు.. కార్యాలయాల గడప తొక్కకుండా లంచాల సంస్కృతి రూపుమాపాలనే ఉద్దేశంతో 'వాట్సప్ గవర్నెన్స్'కు శ్రీకారం చుట్టింది. ఈ విప్లవాత్మక కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేసి ప్రజల నుంచి ఆదరణ పెరిగేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెబుతోన్నా క్షేత్రస్థాయిలో మార్పు రావడం లేదు. కీలకమైన రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్తు శాఖలు నిస్తేజంగా ఉంటూ 'మనమిత్ర' గురించి ప్రజలకు చేరువచేయడం లేదు.

700 వరకు సేవలున్నా..

ఈ ఏడాది జనవరి చివర్లో రాష్ట్ర ప్రభుత్వం వాట్సప్ 'మనమిత్ర' సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. తొలిదశలో 161 ప్రస్తుతం 700 వరకు సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండానే దాదాపు 80 శాతం సేవలు వాట్సప్ ద్వారానే పొందే అవకాశం ఉంది.

పట్టింపులేని సచివాలయ సిబ్బంది

ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయం సేకరించింది. ఈ సేవల గురించి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాల్సి ఉంది. అయితే చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 4,594 మంది ఉద్యోగులకుగాను 2,971 మంది, తిరుపతిలో 5,258 మందికిగాను 3,512 మంది మాత్రమే అవగాహనలో పాల్గొన్నారు. ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌లో వచ్చేవారికి అవగాహన కల్పించినా ఎక్కువమందికి వాట్సప్ గవర్నెన్స్ చేరువ అవుతుంది.

సేవలకు 95523 00009

వాట్సప్ నుంచి పై నంబరుకు హాయ్ అని మెసేజ్ చేస్తే ప్రభుత్వ సేవలు పొందవచ్చు. దరఖాస్తు నుంచి చివరగా సేవలు పొందేవరకు అంతా ఈ మాధ్యమం ద్వారానే సాధ్యమవుతుంది.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి టోకెన్లు లేని భక్తులకు 10 గంటల్లో, రూ. 300 ఎస్ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. శనివారం శ్రీవారిని అత్యధికంగా 91,147 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ. 4. 31 కోట్ల హుండీ కానుకలు లభించాయి. తిరుమలలో చలి తీవ్రత కొనసాగుతోంది.

నేడు పోలీస్ పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేస్తున్నట్లు పోలీసు శాఖ ప్రకటనలో పేర్కొంది. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్ల సందర్భంగా రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది.

ఒకే గూడు.. సమగ్ర కార్డు

● యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేకు ఏర్పాట్లు

పుత్తూరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో కుటుంబ గణన (హౌస్‌హోల్డ్ సర్వే) చేసి మ్యాపింగ్ పూర్తిచేశారు. అయితే గ్రామ, వార్డు, వాలంటీర్ల భాగస్వామ్యంతో ఈ సర్వే హడావుడిగా చేపట్టారు. దీంతో మ్యాపింగ్‌లో తప్పిదాలు జరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక విషయంలో నాడు చేసిన తప్పిదాలతో నేటికీ ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వాటిని సరి చేయడానికి రంగంలోకి దిగింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఎఫ్‌బీఎంఎస్)ను తీసుకొచ్చింది. ఇందుకు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే (యూఎఫ్ఎస్-2025)కు శ్రీకారం చుట్టింది. తిరుపతి నగరపాలక సంస్థ, పుత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీలతోపాటు 34 మండలాల్లో ఈనెల 26న సర్వే ప్రారంభమైంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు, వీఆర్వోలకు సమగ్ర శిక్షణ ఇచ్చారు. జనవరి 12లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించగా సర్వర్ సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో సోమవారం నుంచి ఈ సర్వే ఊపందుకొనే అవకాశం ఉంది.

అన్ని వివరాలు నమోదు..

ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో మరణించిన, శాశ్వత వలస వెళ్లిన వారు ఉంటే వారి పేర్లు తొలగిస్తారు. యాప్‌లో వ్యక్తిగత, కుటుంబ స్థాయిలో వివరాలు కొత్తగా నమోదు చేస్తారు. తదనంతరం కుటుంబ ప్రయోజన కార్డు అందజేయనున్నారు. కార్యక్రమం క్షేత్రస్థాయిలో నమోదయ్యే పక్కా గణాంకాలపైనే ఆధారపడి ఉంటుంది.

కొక్కొరోకో.. ధర అదరహో

సాధారణంగా పందెం కోళ్లు అధిక ధరకు పలకడం చూశాం.. కానీ ఈ 'ప్యారెట్ బీక్' రకం కోడిపుంజును కేవలం ఆకర్షణ కోసం పెంచుతారు. చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన హర్షద్ అనే యువకుడు బెంగళూరులో ఈ రకం కోడిపిల్లను రెండు నెలల కిందట రూ. 5వేలకు కొనుగోలు చేసి తీసుకువచ్చాడు. ప్రస్తుతం రూ. 35 వేలకు అడుగుతున్నారని తెలిపారు. సజ్జ, శనగ, గోధుమలు మేతగా ఇస్తున్నట్లు పేర్కొన్నాడు.- **న్యూస్‌టుడే, పుంగనూరు**

విద్యుత్తు సమస్యలా.. ఫోన్ చేయండి

■ నేడు డయల్ యువర్ ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు సోమవారం డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి తెలిపారు. వినియోగదారులు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చునన్నారు.

చరవాణి నెంబరు: 89777 16661

మట్టికి లేని వివక్ష.. మనుషులకెందుకో..?

రెక్కాడితే కాని డొక్కాడని జీవితాలు వారివి..కన్నబిడ్డ మృతి చూసి ఆ తల్లి విలవిల్లాడిపోయింది.

గుప్పెడు మట్టిలో కలిసిపోవడానికి మనుషుల చూపు కరవైంది

కన్నుమూసిన జీవానికి కన్నీళ్లే నివాళి
ఈ కటిక దారిద్ర్యం కడసారి చూపునకు అడ్డుగోడై నిలుస్తోంది.

చౌడేపల్లె, న్యూస్‌టుడే: కట్టుకున్న భార్య కాదంది.. కన్నతండ్రి చిన్నతనంలోనే దూరమయ్యారు. చివరకు ఊరుకాని ఊరు వచ్చి ఆకస్మికంగా మృతిచెందారు. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే బోయకొండ వద్ద.. కుమారుడు మృతిచెందిన విషయం బంధువులకు తెలుపలేక.. అంత్యక్రియలు చేయలేక దీనమైన పరిస్థితిలో ఉన్న ఓ తల్లి గాథ ఇది. పెద్దపంజాణి మండలం రాయలపేటకు చెందిన గౌరీశంకర్ (45) యానాది. భార్య వదిలేయడంతో తల్లి లక్ష్మమ్మ వద్ద ఉంటున్నారు. తోటకు కాపలా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో నాటుమందు కోసం రెండురోజుల కిందట బోయకొండ వద్దకు వచ్చారు. అయితే ఆదివారం ఉదయం 10 గంటలకు మృతిచెందారు. కళ్లముందే కన్నబిడ్డ మృతి చెందడం చూసిన తల్లి విలవిల్లాడిపోయింది. మృతదేహాన్ని ఊరికి తీసుకెళ్లేందుకు డబ్బులు లేకపోవడంతో దీనంగా కూర్చుండిపోయింది. సుమారు ఆరు గంటలసేపు భక్తులు వస్తూ పోతున్నా.. ఏమైంది అని అడిగేవారు కరవయ్యారు. చివరకు కానిస్టేబుల్ దేవేంద్ర వృద్ధురాలిని విచారించి బంధువులకు సమాచారం అందించారు. సాయంత్రం మృతదేహాన్ని సొంతూరు తీసుకెళ్లారు.

బిడ్డ మృతదేహం వద్ద నిరీక్షిస్తున్న తల్లి

బాలాజీ రైల్వే డివిజన్ సాధనకు ర్యాలీ

రాయలసీమకు ఎంతగానే ఉపయోగపడే తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ ప్రకటించేంతవరకు ఉద్యమం ఆగదని ఆ డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ స్పష్టం చేశారు. తిరుపతిని బాలాజీ రైల్వే డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్వీయూ స్టేడియం నుంచి బస్టాండ్ మీదుగా రైల్వే స్టేషన్ వరకు ద్విచక్ర వాహనాలు, ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. సభ్యులు బుజ్జిబాబు నాయుడు, వేణుగోపాల్‌రెడ్డి, శేషగిరిరావు, ప్రసాద్‌రావు, కె. వి. చౌదరి, విశ్వనాథ్‌రెడ్డి, కూటమి నేతలు పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, తిరుపతి (రైల్వే)

30న జడ్పీ 'స్థాయీ' సంఘ సమావేశాలు.. చిత్తూరు : జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 30న నిర్వహించనున్నట్లు సీఈవో రవి కుమార్ నాయుడు తెలిపారు. ఒకటి, ఏడు, రెండు సంఘ సమావేశాలు ఛైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన, మిగిలినవి ఆయా కమిటీల ఛైర్మన్ల అధ్యక్షతన నిర్వహిస్తామని చెప్పారు.

104FM Tirupati
ఈ FM 104 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

పింఛనుకు ప్రాణం.. జీవన ప్రమాణ్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ శాఖల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పింఛను పొందాలంటే ఏటా జీవన ప్రమాణ పత్రాలు అందజేయాల్సి ఉంది.. జనవరి ఒకటో తేదీ నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుంది..

సమర్పణ ఇలా.. జీవన్ ప్రమాణ్ అప్లికేషన్ ద్వారా పింఛను తీసుకునే వ్యక్తి జీవించి ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం (డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్) పొందే అవకాశాన్ని కల్పించారు. ఈ యాప్ ద్వారా ప్రభుత్వ పింఛనర్లు బయోమెట్రిక్ వేలిముద్ర లేదా ఐరిస్ విధానంలో ధ్రువీకరించవచ్చు. లేదంటే సమీప ఖజానా, తపాలా, మీసేవా కేంద్రాలకు వెళ్లి పత్రాల్ని ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు. సమస్యలున్నవారు ఉపఖజానా కార్యాలయాల్లో నేరుగా అందజేయాలి.

తిరుమల మలుపుల్లో.. జాగ్రత్త

వైకుంఠ రద్దీ నేపథ్యంలో అప్రమత్తత తప్పనిసరి

వైకుంఠ ఏకాదశి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు, వ్యక్తిగత వాహనాలు, ద్విచక్ర వాహనాల్లో తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య భారీగా ఉంది. తిరుమలకు వెళ్లేందుకు రెండో ఘాట్, కిందకు దిగేందుకు మొదటి ఘాట్‌రోడ్డు అందుబాటులో ఉండగా వాహనదారులు తరచూ బోల్తా కొడుతున్నారు. మలుపులపై అవగాహన లేక కొందరు.. వేగంగా వచ్చి మరికొందరు ప్రమాదాల బారిన పడుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా గమ్యస్థానాలు చేరుకోవాలని తితిదే అధికారులు సూచిస్తున్నారు.
- న్యూస్‌టుడే, తిరుమల



ఘాట్‌రోడ్డులో ఇటీవల జరిగిన ప్రమాదం

ప్రమాదాల తీవ్రత ఇలా..

2023లో 60 మంది వరకు గాయపడగా, ముగ్గురు భక్తులు మృతిచెందారు. 2024లో మొదటిఘాట్‌లోని మలుపుల వద్ద రెండు ద్విచక్రవాహన ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. 2025లో 28 ప్రమాద కేసులు నమోదయ్యాయి. గాయపడినవారు 17 మంది ఉండగా, ఐదుగురు భక్తులు మృతిచెందారు. డ్రంకన్ డ్రైవ్ కేసులు 40, పెట్టీ కేసులు 1090 నమోదైన నేపథ్యంలో అధికారులు సైతం తనిఖీలు పెంచాల్సిన అవసరం ఉంది.

వీటిని మరువొద్దు

■ తిరుమలకు వెళ్లే మొదటి ఘాట్‌రోడ్డు పొడవు 19 కిలోమీటర్లు ఉండగా తిరుమల నుంచి తిరుపతికి 58 మలుపులు ఉన్నాయి. వాహనాలు కిందకు దిగేందుకు కనీసం 40 నిమిషాల వ్యవధిని తప్పనిసరిగా తీసుకోవాలి. రెండో ఘాట్ రోడ్డు 18 కి. మీ. ఉండగా ఆరు మలుపులు ఉన్నాయి. ఈ దారిలో కనీసం 28 నిమిషాల సమయం పాటించాలి.
■ వేగ నియంత్రణకు అలిపిరి, తిరుమలలో టోల్‌గేట్లను తితిదే ఏర్పాటు చేసింది. నైపుణ్యం కలిగిన డ్రైవర్లు మాత్రమే ఈ మార్గంలో సురక్షితంగా వాహనాన్ని నడపగలరు. ■ సుదూర ప్రాంతాల నుంచి వాహనాల్లో వచ్చే చోదకులకు మలుపులపై అవగాహన ఉండదు. అందుకే కనీస వేగంలో వెళ్లేలా చూసుకోవాలి. ■ నిద్రమత్తులో ఉంటున్నవారు తగిన విశ్రాంతి తీసుకున్నాకే తిరుగు ప్రయాణం కావడం, కొండపైకి రావడం చేయాలి. ■ ద్విచక్ర వాహనదారులు విధిగా శిరస్త్రాణం ధరించాలి. ■ స్థానికంగా కార్లు, జీపులు నడిపే డ్రైవర్లు నిబంధనలు పాటించాలి. వేగంగా వెళ్లి టోల్‌గేట్లకు ముందు ఆపడం వంటివాటిని మానుకోవాలి.

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలపండి



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు, ఆకాంక్షించండి వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు...
పూర్తి వివరాలకు:
80085 13290

ఆలయ దర్శిని

కాణిపాకం వరసిద్ధుడి వినాయక ఆలయంలో

నిజరూప దర్శనం: ఉ.: 7-7.30, 8.30-9.00, 10.30-11.00, సా. 4.30- 5.00

సర్వదర్శనం: ఉ: 6- 7, 8-8.30, 9.30 -10.30, మధ్యాహ్నం: 12.00 సాయంత్రం: 4.30, రాత్రి: 7-9 గంటలు.

నిత్య సేవలు

సుప్రభాతసేవ, గోపూజ: వేకువజామున 4.00 బిందుతీర్థ అభిషేకం: 4.30 పంచామృతాభిషేకాలు: ఉ.5.30 ప్రథమ, 9.00 ద్వితీయ, 11.00 తృతీయ కాలాభిషేకాలు క్షీరాభిషేకం: ఉదయం 7.30, సాయంత్రం 5.45 ప్రమాణం: సాయంత్రం 5.00 గంటలు. నిత్య కల్యాణం: 11.00 గంటలకు (ప్రత్యేక మండపంలో)

– న్యూస్‌టుడే, కాణిపాకం

తిరుమల శ్రీవారి ఆలయంలో

నిత్యోత్సవాలు

రోజూ తెల్లవారు జామున 3 గంటలకు తిరుప్పావై పారాయణం నిర్వహిస్తారు. మంగళ, బుధ, గురువారం ఉ.3.45కు తోమాలసేవ, 4.45కు అర్చన, మ.12కు కల్యాణోత్సవం, 2 డోలోత్సవం, 3 ఆర్జిత బ్రహ్మోత్సవం, సా.5 సహస్ర దీపాలంకార సేవ నిర్వహిస్తారు.

సర్వదర్శనం: తెల్లవాజామున 3.30-5.45, ఉ.8-9.30 గంటలకు, మధ్యాహ్నం 12 నుంచి రాత్రి వరకు సర్వదర్శనానికి అనుమతిస్తారు.

వారోత్సవాలు

ప్రతి సోమవారం విశేషపూజ (ఏకాంతం), మంగళవారం అష్టదళ పాదపద్మారాధన సేవను ఉదయం 9 గంటలకు నిర్వహిస్తారు. బుధవారం సహస్ర కలశాభిషేకాన్ని తితిదే రద్దు చేసింది. గురువారం ఉదయం 6.30 గంటలకు తిరుప్పావడ సేవ, శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు శ్రీవారికి అభిషేకం నిర్వహిస్తారు.

– న్యూస్‌టుడే, తిరుమల

ముక్కంటి ఆలయంలో

ఉదయం: 3.00: పురవీధుల్లో జేగంట, 4.00: మంగళవాయిద్యాలు, 4.15: గోమాత పూజ, తిరుమంజనం, 5.00: ప్రథమకాల అభిషేకం (ఏకాంతం), 6.00: ద్వితీయ కాలాభిషేకం, 7.00: పరివార దేవతలకు నివేదన, 7.30: గొబ్బిదేవత పురవీధుల ఉత్సవం, 10.30: ఉచ్చికాల అభిషేకం

సాయంత్రం: 5.00:ప్రదోష కాలాభిషేకం 6.30: నీరాజన మంత్రపుష్పం

సర్వదర్శనం: ఉదయం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు.

రాహు, కేతు పూజలు

ఉ. 6 నుంచి సా.5 గంటల వరకు

అభిషేకాలు: శ్రీమృత్యుంజయ శివలింగానికి (సోమవారం), కాలభైరవునికి (మంగళవారం), శ్రీమేధా దక్షిణామూర్తికి (గురువారం), శనిభగవానునికి (శనివారం), సూర్యనారాయణమూర్తికి (ఆదివారం). **శుక్రవారం:** మనోన్మణికి ఊంజల్‌సేవ

● 30న శేష, యాళీ వాహనాలపై సోమస్కందమూర్తి, జ్ఞానాంబికల పురవీధుల ప్రదర్శన ● జనవరి 3న మూలమూర్తులకు వేడినీళ్ల అభిషేకాలు, రాత్రి అరికట్ల ఉత్సవం.

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

బ్యాటుతో బౌండరీలు.. బంతితో గింగిరాలు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ప్రజెంట్స్) 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్'(ఈఎస్ఎల్)-2025 క్రికెట్ పోటీలు యువతలో హుషారు నింపుతున్నాయి. తిరుపతిలోని ఎస్వీ హై స్కూల్ క్రికెట్ మైదానం, ఎస్వీయూ మైదానం వేదికగా సీనియర్స్ విభాగంలో జరుగుతున్న పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పలు కళాశాలలకు చెందిన జట్లు బరిలో నువ్వా నేనా అంటూ పోటీపడుతున్నాయి. సిక్సర్లు, ఫోర్లతో బంతిని బౌండరీల వైపు పరుగులు పెట్టిస్తున్నారు. నాకౌట్ పద్ధతిలో జరుగుతున్న మ్యాచ్‌ల్లో గెలుపొందుతున్న జట్లు తదుపరి మ్యాచ్‌లో మరింత సత్తాచాటేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఆదివారం జరిగిన 'ఈనాడు' క్రికెట్ మ్యాచ్‌ల వివరాలు ఇలా ఉన్నాయి.

-న్యూస్‌టుడే, తిరుపతి(క్రీడలు)

గ్రౌండ్-1: ఎస్వీ హై స్కూల్ మైదానం

వాక్ ఓవర్‌తో విజయం

వాక్ ఓవర్‌తో తదుపరి మ్యాచ్‌కు అర్హత సాధించిన విజయం చిత్తూరు జట్టు

తొలి మ్యాచ్‌లో చిత్తూరు విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ చిత్తూరు, సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పుత్తూరు జట్ల మధ్య పోటీ జరగాల్సి ఉండగా, సిద్ధార్థ జట్టు గైర్హాజరు కావడంతో విజయం జట్టుకు వాక్ ఓవర్ ఇచ్చారు. దీంతో విజయం జట్టు తదుపరి మ్యాచ్‌కు అర్హత సాధించింది.

రసవత్తరంగా రెండో మ్యాచ్

విజేత పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కె.ఆదిత్య

ది అపోలో యూనివర్సిటీ చిత్తూరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పుత్తూరు జట్ల మధ్య రెండో మ్యాచ్ రసవత్తరంగా జరిగింది. ముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల పుత్తూరు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 73 పరుగులు చేసింది. 74 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ది అపోలో జట్టు చివరి 30 బంతుల్లో 26 పరుగులతో లక్ష్యాన్ని ఛేదించే అవకాశం ఉన్నప్పటికీ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 67 పరుగులతో మ్యాచ్‌ను చేజార్చుకుంది. దీంతో 6 పరుగుల తేడాతో పుత్తూరు డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించింది. జట్టులో ఆదిత్య బ్యాటింగ్‌లో(11 బంతుల్లో 4×1) 10 పరుగులు, బౌలింగ్‌లో 2 ఓవర్లలో 2 వికెట్లు, 5 పరుగులు ఇచ్చి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

శ్రీరామ కళాశాల అసాధారణ ప్రతిభ

విజయం సాధించిన శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా వినోద్

సెవెన్ హిల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ తిరుపతి, శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల మధ్య జరిగిన మూడో మ్యాచ్‌లో శ్రీరామ కళాశాల అసాధారణ ప్రతిభ కనబరిచింది. టాస్ గెలిచిన సెవెన్ హిల్స్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 50 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌లో బరిలోకి దిగిన శ్రీరామ కళాశాల జట్టు కేవలం 4.1 ఓవర్లలో 54 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో మ్యాచ్ గెలుపొందింది. జట్టులో వినోద్ (16 బంతుల్లో 4×6, 6×1) 36 పరుగులతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions – The Lloyd Group Initiative
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL
Regional Sponsor: MITS DEEMED TO BE UNIVERSITY – MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner: ఈనాడు.నెట్ FM Partner TV Partner
Organised by ఈనాడు

నేడు 29.12.2025

గ్రౌండ్-1: ఎస్వీ ఉన్నత పాఠశాల మైదానం (సీనియర్స్)

- ఉదయం8:00: కేజీసీ హోమియోపతిక్ మెడికల్ కళాశాల, పుత్తూరు × సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, పుత్తూరు
- ఉదయం 10:30 : గేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్, తిరుపతి × శ్రీవిద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి
- మధ్యాహ్నం 2:00 : విజ్ఞానసుధ డిగ్రీ కళాశాల, చిత్తూరు × అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, తిరుపతి

గ్రౌండ్-2: ఎస్వీయూ స్టేడియం (సీనియర్స్)

- ఉదయం 8:00 : ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కుప్పం × శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, చిత్తూరు
- ఉదయం 10:30 : గోకులకృష్ణ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సూళ్లూరుపేట × ఎవీకేకేఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, విద్యానగర్
- మధ్యాహ్నం 2:00 : శ్రీవిద్య డిగ్రీ కళాశాల, పుత్తూరు × కృష్ణతేజ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, తిరుపతి

రేపు 30.12.2025

గ్రౌండ్-1: ఎస్వీ ఉన్నత పాఠశాల మైదానం (సీనియర్స్)

- ఉదయం 8:00 : వేదవ్యాస డిగ్రీ కళాశాల, పుత్తూరు × ఎస్‌డీహెచ్ఆర్ డిగ్రీ కళాశాల, తిరుపతి
- ఉదయం 10:30 : ఆదిశంకర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, గూడూరు × పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చిత్తూరు
- మధ్యాహ్నం 2:00 : బీఎస్ఆర్ డిగ్రీ కళాశాల, తిరుపతి × విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, చిత్తూరు

గ్రౌండ్-2: ఎస్వీయూ స్టేడియం (సీనియర్స్)

- ఉదయం 8:00 : ఎస్వీ ఎస్ఎస్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సూళ్లూరుపేట × ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, తిరుపతి.
- ఉదయం 10:30 : మోహన్‌బాబు యూనివర్సిటీ, రంగంపేట × సిద్ధార్థ ఎడ్యుకేషనల్ అకాడమీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, సి.గొల్లపల్లి
- మధ్యాహ్నం 2:00 : విజయం డిగ్రీ కళాశాల, చిత్తూరు × ఎస్వీయూ కాలేజ్స్, తిరుపతి.

గ్రౌండ్-2: ఎస్వీయూ మైదానం

ఎస్వీయూ విజయకేతనం

గెలుపొందిన ఎస్వీయూ కళాశాల జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా జె.చిన్న

తొలి మ్యాచ్‌లో ఎస్వీ ఓరియంటల్ కళాశాల తిరుపతి, ఎస్వీయూ కళాశాలల తిరుపతి జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్వీ ఓరియంటల్ 9.4 ఓవర్లలో 35 పరుగులకు ఆలౌటైంది. 36 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఎస్వీయూ జట్టు కేవలం 2.4 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించి 10 వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. జట్టులో జె.చిన్న 2 ఓవర్లలో 14 పరుగులు ఇచ్చి, 3 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

వేము ఇన్‌స్టిట్యూట్ సత్తా

విజయం సాధించిన వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా జశ్వంత్

రెండో మ్యాచ్‌లో వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పి.కొత్తకోట, ఎస్వీ కాలేజ్ ఆఫ్ కామర్స్ తిరుపతి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఎస్వీ కామర్స్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేసిన వేము ఇన్‌స్టిట్యూట్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 90 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన ఎస్వీ కామర్స్ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 72 పరుగులతో సరిపెట్టుకుంది. దీంతో వేము ఇన్‌స్టిట్యూట్ 18 పరుగుల తేడాతో విజయాన్ని కైవసం చేసుకుంది. జట్టులో జశ్వంత్(17 బంతుల్లో 4×3, 6×3) 34 పరుగులతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

వాక్ ఓవర్‌తో నారాయణ గెలుపు

వాక్ ఓవర్‌తో తదుపరి మ్యాచ్‌కు అర్హత సాధించిన నారాయణ ఇంజినీరింగ్ కళాశాల జట్టు

మూడో మ్యాచ్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాల గూడూరు, విజయం బిజినెస్ స్కూల్ చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉండగా, విజయం బిజినెస్ స్కూల్ చిత్తూరు జట్టు గైర్హాజరు కావడంతో వాక్ ఓవర్ ఇచ్చారు. దీంతో నారాయణ ఇంజినీరింగ్ కళాశాల జట్టు తదుపరి మ్యాచ్‌కు అర్హత సాధించింది.

శ్రీవారి సేవలో దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల: శ్రీవారిని దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మిని పుష్కర్ణ దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తిరుపతి(కలెక్టరేట్): మండల కార్యాలయాలు, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, కలెక్టరేట్ ఆవరణలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ తెలిపారు.

ముక్కంటి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజీవ్‌సింగ్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పవన్‌కుమార్ ద్వివేదీలు వేర్వేరుగా వాయులింగేశ్వరుని ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో దర్శనార్థం వచ్చిన వీరికి ఆలయ ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, మోహన్ దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాదం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉద్యోగోన్నతులు వెంటనే అమలు చేయాలి

శ్రీనివాసరావును సత్కరిస్తున్న నాయకులు

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: ఆర్టీసీలో నియామకాలు భర్తీ చేయాలని, నిలిపివేసిన డ్రైవర్, కండక్టర్, మెకానికల ఉద్యోగోన్నతులు వెంటనే అమలు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ఎంయూఏ) రాష్ట్ర అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా జిల్లాకు విచ్చేయగా.. తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జిల్లా కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ నెల 30, 31వ తేదీల్లో జోన్ వ్యాప్తంగా ఎర్ర బ్యాడ్జీలతో నిరసన తెలియజేయాలని, జనవరి 2, 3 తేదీల్లో ఎమ్మెల్యేలకు వినతులు సమర్పించాలని తీర్మానించినట్లు తెలిపారు. ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డీవీఆర్ కుమార్, బీఎస్ బాబు, రాష్ట్ర కార్యదర్శి చెంచులయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాస రాజు, సంయుక్త కార్యదర్శి రాజేష్, జోనల్ అధ్యక్షుడు వినోద్ బాబు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సుస్థిర భవిష్యత్తుకు ప్లాస్మా సింపోజియం

జ్యోతి వెలిగిస్తున్న ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్ సత్యనారాయణ, ఉత్కల్ వర్సిటీ విశ్రాంత వీసీ ఏకే దాస్

ఏర్పేడు, న్యూస్‌టుడే: సుస్థిర భవిష్యత్తుకు ప్లాస్మా సింపోజియం సదస్సు ఎంతగానో దోహదపడుతుందని ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్ సత్యనారాయణ తెలిపారు. తిరుపతి ఐఐటీలో జరుగుతున్న 40వ జాతీయ ప్లాస్మా సైన్స్ అండ్ టెక్నాలజీ సింపోజియం కార్యక్రమానికి రెండోరోజు ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తిరుపతి ఐసర్, ప్లాస్మా సైన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా, సెంటర్ ఫర్ అటామిక్, మాలిక్యులర్ ఆప్టికల్ సైన్సెస్, టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో వివిధ సాంకేతిక పురోగతులపై చర్చించడం అభినందనీయమన్నారు. ఫ్యూజన్ ఎనర్జీ, స్పేస్, తక్కువ ఉష్ణోగ్రత ప్లాస్మాలు, మెటీరియల్ తయారీ గురించి చర్చించారు. ఉత్కల్ వర్సిటీ విశ్రాంత వీసీ ఏకే దాస్, ఎస్.కె దుత్తా, కార్తికేయ పాల్గొన్నారు.

ఈ-పంటలో ఉంటేనే యూరియా

ఐదు మండలాల్లో ముందస్తు పరిశీలన

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: యూరియా పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. వెబ్‌ల్యాండ్ ఆధారంగా పంపిణీకి ప్రత్యేక యాప్ సిద్ధం చేశారు. సమగ్ర ఎరువుల యాజమాన్య (ఐఎఫ్ఎంఎస్) విధానంలో యూరియా పంపిణీ, వినియోగం ఎంత..? తదితర అంశాలు ఈ యాప్ ద్వారా రైతులకు అందుబాటులోకి రానున్నాయి. తొలుత వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పది జిల్లాల్లో వెబ్‌ల్యాండ్ ఆధారంగా (ఈ-పంట నమోదు) ఎరువుల పంపిణీపై ముందస్తు పరిశీలన చేపట్టారు. ఈ ప్రక్రియ విజయవంతమైందని, సమగ్ర వివరాలు ప్రభుత్వానికి నివేదించామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

'నూతన' వేడుకలు ప్రశాంతంగా చేసుకోండి: ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: కుటుంబం, స్నేహితులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. హోటల్ నిర్వాహకులు తప్పక అనుమతులు తీసుకుని వేడుకలు నిర్వహించాలని చెప్పారు. ఎక్కడా డీజేలు పెట్టరాదని హెచ్చరించారు. ప్రజలకు అభ్యంతరకరంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రతి స్టేషన్ పరిధిలో బ్రీత్ అనలైజర్ల ద్వారా మద్యం తాగి వాహనాలు నడిపే వారిని గుర్తించి జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

రెండ్రోజులు కట్టుదిట్టమైన భద్రత

తిరుపతి(నగరం), తిరుమల, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో తిరుపతి, తిరుమలలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం తిరుపతిలోని ప్రైవేటు కల్యాణ మండపంలో పోలీసు అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షించారు. తిరుమలలో దాదాపు 2 వేల మంది, తిరుపతిలో 1500 మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణ, సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా పెట్టామన్నారు. తిరుమల ఆస్థాన మండపంలో జిల్లా పోలీసులతో ఎస్పీ సమీక్షించారు. అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి, రామకృష్ణ, శ్రీనివాసులు, నాగభూషణరావు, తిరుమల డీఎస్పీ విజయ్‌శేఖర్, క్రైమ్ డీఎస్పీలు, భక్తవత్సలం పాల్గొన్నారు.

దివ్యానుభూతి కలిగేలా వైకుంఠ ద్వార దర్శనం



మాట్లాడుతున్న అదనపు ఈవో వెంకయ్యచౌదరి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం భక్తులకు దివ్యానుభూతి కలిగేలా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి పిలుపునిచ్చారు. స్థానిక ఆస్థాన మండపంలో ఆదివారం డిప్యుటేషన్ విధులకు విచ్చేసిన తితిదే ఉద్యోగులు, పోలీసులకు దిశానిర్దేశం చేశారు. భక్తుల భద్రత, రద్దీ నిర్వహణకు అత్యాధునిక ఏఐ సాంకేతికత వినియోగిస్తున్నట్లు చెప్పారు. తితిదే జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్‌వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు, డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విలువల రతన్‌కు నివాళి

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: రతన్ టాటా జయంతి సందర్భంగా ఆదివారం తిరుపతిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు రతన్ టాటా సేవలను కొనియాడారు. రతన్‌టాటా సేవా సమితి సభ్యులు, విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్లు, నగరవాసులు పాల్గొన్నారు.

సంవత్సరాంతం.. తగ్గని జనం

శీఘ్ర దర్శనం కౌంటర్ వద్ద బారులు తీరిన జనం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ తగ్గుముఖం పట్టడం లేదు. సంవత్సరాంతం కావడం, అందులోనూ వరుస సెలవుల దృష్ట్యా నాలుగు రోజులుగా రద్దీ కొనసాగుతూనే ఉంది. ఆదివారం ముప్పై వేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇక రాహు, కేతు పూజలతో పాటు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు భారీగా అమ్ముడుపోయాయి.

టికెట్టు లేని దర్శనాలు నిలుపుదల..: రద్దీ దృష్ట్యా ఈవో బాపిరెడ్డి ఆదేశాల మేరకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా మహద్వారం, స్వామి, అమ్మవార్ల ఆలయాల్లో ద్వితీయశ్రేణి అధికారులను ఉంచడం, టికెట్టు ఉన్న వాళ్లనే అంతరాలయ దర్శనానికి అనుమతించడంతో సామాన్య భక్తులు సత్వరం దర్శనం చేసుకున్నారు. ఓ దళారీ డబ్బులు తీసుకుని అంతరాలయ దర్శనం చేయిస్తామని చెప్పాడంటూ భక్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.

నిశిరాత్రి పొలాల్లో దొంగలు పడ్డారు

58 విద్యుత్తు స్టార్టర్లు ధ్వంసం



ఖాళీగా కనిపిస్తున్న స్టార్టర్ పెట్టె

తొట్టంబేడు, న్యూస్‌టుడే: పంటలకు గిట్టుబాటు ధరలేక ఇబ్బందులు పడుతున్న అన్నదాతలను పొలాల్లోని విద్యుత్తు పరికరాల చోరీలు మరింత కుంగదీస్తున్నాయి. మండల పరిధిలో విద్యుత్తు స్టార్టర్లను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసి రాగితీగలు ఎత్తుకెళ్లిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. గుర్రప్పనాయుడుకండ్రిగ, చిన్నకన్నలి, పెద్దసింగమాల గ్రామాల్లో 58 స్టార్టర్లు చోరీకి గురయ్యాయి. దుండగులు విద్యుత్తు కేబుళ్లను కత్తిరించి అపహరించారు. ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు ఈ దృశ్యాలు చూసి ఆందోళనకు గురై ఫిర్యాదు చేశారు. గత ఆగస్టులోనూ పరికరాలు చోరీకి గురయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

← ధ్వంసం చేసి కింద పడవేసిన విద్యుత్తు స్టార్టర్

మనస్తాపంతో భార్య బలవన్మరణం

సత్యవేడు, న్యూస్‌టుడే: భర్త తిట్టాడని మనస్తాపంతో భార్య బలవన్మరణానికి పాల్పడింది. ఎస్ఐ సాయినాథ్ చౌదరి కథనం మేరకు. . నాగలాపురం మండలంలోని బీరకుప్పం ఎస్టీ కాలనీకి చెందిన మారయ్య, జమున దంపతుల పెద్ద కుమార్తె మంజుల మండలంలోని రాజగోపాలపురం పంచాయతీ బాలగోపాలపురం ఎస్టీ కాలనీ చెందిన దేశయ్య రెండేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇటీవల భర్త తరచూ మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడుతుండటంతో కుటుంబ సభ్యులు దేవుడి మాల వేయించారు. దేశయ్య శనివారం రాత్రి మాల తీసి మద్యం తాగి భార్యతో మళ్లీ గొడవపడ్డారు. మనస్తాపానికి గురైన ఆమె గుళికల మందు తిని ఆత్మహత్యాయత్నం చేసింది. చికిత్స కోసం స్థానిక సీహెచ్‌సీ తరలించారు. ఆమె చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం శ్రీకాళహస్తి ఆసుపత్రిలో మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

EENADU e Classifieds

HEALTH & CARE
PAEDIATRIC
శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పురిటి బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

JOBS
డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్‌లలో వర్క్‌చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీః 23000 టు 29000. వ: 18-35. ✆ 77309 58410.
బెంగుళూరులో పనిచేయుటకు ప్రముఖ వస్త్ర దుకాణంలో అనుభవం గల సేల్స్‌మెన్స్ కావలెను. Age: 18-45Y, ESI+ PF+ జీ-17K ✆ 7019632854
ప్రభుత్వ ఆఫీసులలో అవుట్ సోర్సింగ్ కింద పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్స్, ITI మెకానిక్స్ కావలెను. ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగాలకు. 9849848817.
తిరుచానూరు మెయిన్‌రోడ్డు లాడ్జి నందు పనిచేయుటకు (Male) రిసెప్షనిస్ట్, రూమ్‌బాయ్స్ కావలెను. Cont: 91105 50998.
తిరుపతిలో ప్రీమియం UniSex సెలూన్ పనిచేయుటకు అనుభవంగల హెయిర్‌డ్రెస్సర్ & బ్యూటీషియన్ కావలెను. Exp.1-3 Yrs. Ph: 95662 29917, 93915 45570.

THE EENADU CLASSIFIEDS WAY
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు... 80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600 Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

చిన్నారుల భరతనాట్య ప్రదర్శన

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన చిన్నారుల భరతనాట్య ప్రదర్శన కనువిందు చేసింది. ఆదివారం తిరుపతికి చెందిన ఐశ్వర్య, సురేష్ బృందం కళాకారుల నృత్య ప్రదర్శన జరిగింది. పలు సంకీర్తనలకు కళాకారులు చేసిన నృత్యాలు సందర్శకులను అలరించాయి. ఏవో సుధాకర్, కార్యక్రమాల ఏవో ఖాదర్‌వల్లీ, ఏఈ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రతన్‌టాటా సేవా పురస్కారాలు

పాల్గొన్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

పాకాల, న్యూస్‌టుడే: స్వచ్ఛంద సంస్థల ద్వారా సమాజసేవ చేస్తున్న 23 జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులకు రతన్‌టాటా బెస్ట్ సర్వీస్ అవార్డులను ప్రదానం చేశారు. రతన్‌టాటా జయంతి పురస్కరించుకుని దామలచెరువు పంచాయతీ పత్తిపాటివారిపల్లి వద్ద మహాప్రస్థాన ట్రస్ట్, ఎంఏకేఎస్ ఫౌండేషన్, శ్రీవారి ట్రస్ట్‌లు సంయుక్తంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ నాగరాజ, ప్రధాన కార్యదర్శి డి.రమేష్, వైద్యాధికారి ఏ.సుధాకర్, మహాప్రస్థాన ట్రస్టు గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్‌నాయుడు, రమాదేవి పాల్గొన్నారు.

ఎవరూ చూడరులే.. రోడ్డు నిర్మించేయ్

యంత్రాలతో అక్రమార్కులు నిర్మిస్తున్న రహదారి

చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరి-తిరుపతి మార్గంలోని తొండవాడ రెవెన్యూ లెక్కదాఖల సర్వే నంబరు 32లో రూ.లక్షల విలువైన ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేశారు. ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో అక్రమార్కులు ఏకంగా తమ పొలానికి 30 అడుగుల రోడ్డు మార్గం నిర్మాణానికి పూనుకున్నారు. విషయం సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగులోకి రావడంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. ఆక్రమిత రోడ్డు నిర్మాణంపై హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. గతంలో పట్టణంలోని నూకలగుంట, నాయీబ్రాహ్మణకాలనీ, పత్తిగుట్ట, ఇందిరమ్మకాలనీ ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణల విషయంలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా ఆక్రమణల పరంపర కొనసాగుతుండటం గమనార్హం.

పాపవినాశనం డ్యామ్ శుభ్రం

తిరుమల, న్యూస్‌టుడే: పాపవినాశనం డ్యామ్‌ను సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. ఇటీవల వర్షాలకు డ్యామ్ గేట్లు తెరచి నీటికి కిందకు విడుదల చేశారు. దీంతో ఆ ప్రాంతంలో ఏర్పడిన పాచిని హైప్రెజర్ వాటర్ పంప్ ద్వారా శుభ్రం చేస్తున్నారు. డ్యామ్ నిర్వహణలో భాగంగా శుభ్రం చేస్తున్నట్లు తితిదే అధికారులు తెలిపారు.

జాతీయ మహాసభలకు సీఐటీయూ నాయకులు

తిరుపతి(నగరం): విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి ఐదు రోజుల పాటు జరగనున్న సీఐటీయూ జాతీయ మహాసభల్లో పాల్గొనేందుకు తిరుపతికి చెందిన నాయకులు ఆదివారం అక్కడకు చేరుకున్నారు. కార్యక్రమ ఏర్పాట్లలో భాగస్వామ్యులు అయ్యేందుకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జయచంద్ర, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ బృందం విశాఖపట్నం చేరుకుంది.



కార్యాచరణతో పదిలో మెరుగైన ఫలితాలు

పాకాల, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలంటే ప్రభుత్వం నిర్దేశించిన 100 రోజుల కార్యాచరణ చక్కని మార్గమని ఎంఈవో బాబ్జీ పేర్కొన్నారు. ఆదివారం దామలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన ప్రత్యేక తరగతులను పరిశీలించి విద్యార్థులకు సూచనలిచ్చారు. ఉపాధ్యాయుడు మధుసూదన్, నారాయణరెడ్డి, సీఆర్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన అతిథులు

అంతర్జాతీయ లయన్స్ క్లబ్ జిల్లా సమావేశం

పాకాల, న్యూస్‌టుడే: అంతర్జాతీయ లయన్స్ క్లబ్-317ఇ జిల్లా సమావేశాన్ని రీజినల్ ఛైర్మన్ రామయ్య అధ్యక్షతన పాకాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బెంగుళూరు నుంచి లయన్స్ క్లబ్ గవర్నర్ అశ్వత్థ నారాయణ, మాజీ గవర్నర్లు ప్రసాద్, భానుమూర్తిరెడ్డి, కోశాధికారి శ్రీనివాసులు, అదనపు కార్యదర్శులు రాజారెడి, రాజేంద్రప్రసాద్, గౌతంరెడ్డి, మహమ్మద్‌అలీ, గురుస్వామినాయుడు తదితరులు హాజరై సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. లయన్స్ క్లబ్‌కు ఆర్థిక సహకారమందించిన వారిని సత్కరించిన అనంతరం గ్రంథాలయానికి పుస్తకాలు, పేదలకు దుప్పట్లు పంచిపెట్టారు.

సహజ వనరులు కాపాడుకుందాం

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: సహజ వనరులను కాపాడుకుందామని కడప ప్రభుత్వ కళాశాల ఆచార్యులు నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్-6 యూనిట్ ఆధ్వర్యంలో వేదాంతపురం గ్రామంలో ఆదివారం పర్యావరణ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వనరులను కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారిణి సంధ్య, వాలంటీర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న నాగేశ్వరరెడ్డి

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి(ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్‌లో డిగ్రీ విద్యార్థులకు రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించారు. వాటి ఫలితాలను ఆదివారం ప్రకటించారు.

పశువులు నీరు తాగేదెలా?

పశువుల తాగునీటి సౌకర్యం కోసం రామచంద్రాపురం మండలంలో ప్రతి పంచాయతీలో తొట్టెలు నిర్మించారు. కుప్పంబాదూరులో నిర్మించిన తొట్టెలో నీటిని శుభ్రం చేయకపోవడంతో పాచిపట్టి అపరిశుభ్రంగా మారింది. దీంతో మూగజీవాలకు పాచిపట్టిన నీటిని ఎలా తాపేదని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తొట్టెలను శుభ్రం చేయించి, మూగజీవాల దాహం తీర్చడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, రామచంద్రాపురం**

వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక బస్సులు

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి సందర్భంగా అప్పలాయగుంటలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు చేరుకోవడానికి మంగళం ఆర్టీసీ డిపో ప్రత్యేకంగా బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సుధాకరయ్య ఆదివారం తెలిపారు. డిసెంబరు 30 నుంచి జనవరి ఒకటో తేదీ వరకు మంగళం నుంచి తిరుపతి మీదుగా అప్పలాయగుంట వరకు నాలుగు ప్రత్యేక బస్సులు నడుపుతామని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: తిరుపతి గ్రామీణ మండలం వేదాంతపురం మార్క్సనగర్‌లో ఆదివారం సీపీఐ 101 ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆ పార్టీ నాయకులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, నదియా, విశ్వనాథ్, చిన్నం కాళయ్య, నాగరాజ్, బలరామ్, పద్మనాభరెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురవీధుల్లో ఊరేగిన గొబ్బిదేవత

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: గొబ్బిదేవతగా పూజలందుకునే మనోన్మణి అమ్మవారు చతుర్మాడ వీధుల్లో ఊరేగారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య పట్టణ వీధుల్లో ఊరేగారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

ఏర్పేడు, న్యూస్‌టుడే: తిరుపతికి చెందిన డీఎన్ఆర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ముసలిపేడులో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 120 రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మనోహర్‌నాయుడు, అంకయ్య, రాజారెడ్డి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

నాగలాపురం, న్యూస్‌టుడే: **సమస్య:** భద్రావతీవీధిలో మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. వ్యర్థాలు పేరుకుపోయాయి. రహదారి పక్కనే చెత్త పడేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నాం. **- శరవణ, స్థానికుడు**

సమాధానం: వెంటనే పరిశీలించి పారిశుద్ధ్య పనులు చేయిస్తా. **- చిన్నదురైసుధ, సర్పంచి**

రేణిగుంట, న్యూస్‌టుడే: **సమస్య:** మండలంలోని కరకంబాడి పంచాయతీలో రైల్వేగేటు ఎదురు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. **- కుమార్, స్థానికుడు**

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి, కరకంబాడి

వీధి దీపాల పునరుద్ధరణ

నాగలాపురం: మండలంలోని ఎస్ఎస్‌పురంలో కొత్త వీధి దీపాలను సర్పంచి కృష్ణయ్యశెట్టి ఆదివారం వేయించారు. పాఠశాల సమీపంలో దీపాలు నెల రోజులుగా వెలగకపోవడంపై ఈనెల 28న సమస్య ప్రచురితమైంది. సర్పంచి వెంటనే స్పందించి పనులు చేయించారు.

స్పందనకు వందనం

చెత్త తొలగించి.. కష్టాలు తీర్చి

శ్రీ కాళహస్తి: పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలను పురపాలిక కమిషనర్ భవానీప్రసాద్ ఆదేశాల మేరకు అధికారులు పరిష్కరించారు. 'మేమున్నాం మీకు తోడుగా'లో వచ్చిన సమస్యలను అధికారులు తీర్చారు. ● పట్టణంలోని ప్రాజెక్టు వీధిలో కాల్వ గట్లపైన మొక్కలు తొలగించారు. ● మిట్టకండ్రిగ వద్ద మురుగు కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించారు. ● ఎ.ఎం.పుత్తూరు కాల్వలో వ్యర్థాలు శుభ్రం చేశారు.

పింఛనుదారులకు మెరుగైన సేవలు

పింఛనుదారులను సత్కరిస్తున్న దృశ్యం

రేణిగుంట, న్యూస్‌టుడే: పింఛనుదారులకు ఎల్లప్పుడు సేవలు అందిస్తామని శెట్టిపల్లి ఎస్బీఐ చీఫ్ మేనేజర్ నాగార్జున తెలిపారు. ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో రైల్వే పింఛనుదారుల సంఘం రేణిగుంట బ్రాంచి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అందులో ఆయన పాల్గొని మాట్లాడారు. రూపే ఏటీఎం కార్డులు తీసుకుంటే రూ.10 లక్షల వరకు ప్రమాద బీమా ఉంటుందని తెలిపారు. 75 ఏళ్లు నిండిన పింఛనుదారులను సన్మానించారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ కామరాజు, సీఆర్ఎస్ పింఛన్‌దారుల సంఘం నాయకులు సురేంద్రరెడ్డి, గజపతినాయుడు పాల్గొన్నారు.

చెంచయ్యనాయుడును సత్కరిస్తున్న కూటమి నేతలు

మార్కెట్ కమిటీ ఛైర్మన్‌కు సత్కారం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన చెంచయ్యనాయుడును ఎన్డీఏ కూటమి నేతలు ఘనంగా సత్కరించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమ బోర్డు డైరెక్టర్ రవితో పాటు పలువురు నేతలు ఘనంగా సత్కరించారు. రమేష్, ఉమేష్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి భూమిపూజ

పిచ్చాటూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని గంగమ్మ ఆలయం నుంచి శ్మశానం నుంచి వరకు రూ.12 లక్షల అంచనా వ్యయంతో కంకర, గ్రావెల్ రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం భూమిపూజ చేసి మాట్లాడారు. రహదారుల ఆధునికీకరణను వేగవంతం చేస్తున్నామన్నారు. టెండర్ల దశలోని అన్ని రహదారులను పూర్తి చేయిస్తామన్నారు. ఎంపీడీవో మహమ్మద్‌రఫీ, పీఆర్ డీఈ గోపాల్, ఏఈ మోహన్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి పాల్గొన్నారు.

కంకర వేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, అధికారులు, నేతలు

కరుగుతున్న వ్యర్థాల గుట్టలు

చెత్తశుద్ధితో.. సత్ఫలితాలు

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా చెత్త నిల్వలను క్రమపద్ధతిలో అమర్చుతున్న యంత్రాలు

గణాంకాలు
పట్టణ జనాభా: 97,640
వార్డులు: 35
రోజువారీ చెత్త ఉత్పత్తి: 90 మెట్రిక్ టన్నులు
సేకరణ: 80 మెట్రిక్ టన్నులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తిలో ఏళ్లుగా గుట్టల్లా పేరుకుపోయిన వ్యర్థాలు ఇప్పుడిప్పుడే కరుగుతున్నాయి. చెత్త శుద్ధీకరణను గత ప్రభుత్వం గాలికొదిలేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యర్థాల గుట్టలన్నీ కరిగించి ఉద్యానాలుగా అభివృద్ధి చేయాలని సంకల్పించింది. దీంతో ఏళ్లుగా పేరుకుపోయిన వ్యర్థాల గుట్టలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది.

యంత్రాలతో శ్రీకారం..

పురపాలక సంఘ పరిధిలోని వ్యర్థాలను ఖాళీ స్థలాల్లో నిల్వ ఉంచడం, గుట్టలుగా పేరుకుపోయిన వీటిని క్రమేణ శుద్ధి చేయడాన్ని లెగసీ వేస్ట్ ప్రాసెసింగ్ (వారసత్వ వ్యర్థాల శుద్ధీకరణ)గా పిలుస్తారు. ఇక్కడి పురపాలక సంఘ పరిధికి సంబంధించి తంగేళ్లపాళెం సమీపంలోని డంపింగ్ యార్డులో ఏళ్ల తరబడి సేకరించిన వ్యర్థాలు గుట్టలుగా పోసి నిల్వ చేశారు. ప్రస్తుతం వీటిని శుద్ధి చేసి సేంద్రియ ఎరువులుగా మార్చి రైతులకు అందుబాటులోనికి తీసుకువచ్చేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా కార్యాచరణ ప్రణాళికకు శ్రీకారం చుట్టారు.

ప్లాస్టిక్‌తోనూ సంపద..

వ్యర్థాలతో పాటు ప్లాస్టిక్ సంబంధిత వస్తువులు కలిసిపోయాయి. ప్రస్తుతం యంత్రాల సాయంతో వ్యర్థాల నుంచి ప్లాస్టిక్‌ను వేరు చేయడం, అలా వచ్చిన ప్లాస్టిక్‌ను సిమెంటు సంబంధిత పరిశ్రమలకు విక్రయించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ● మట్టి సంబంధిత వ్యర్థాలు వేరు చేసి ఎరువులుగా మారుస్తారు. ● ప్లాస్టిక్ సంబంధిత వస్తువులను యంత్రాల ద్వారా వేరుచేసి పరిశ్రమలకు అవసరమైన రీతిలో సిద్ధం చేసి విక్రయిస్తున్నారు. ● వ్యర్థాల నుంచి సంపదను సృష్టించుకునే రీతిలో ప్రస్తుతం పురపాలక సంఘం అడుగులు వేస్తోంది. ● చెత్తశుద్ధీకరణ ద్వారా కొన్నాళ్లకు ఇక్కడున్న వ్యర్థాల గుట్టలన్నీ ఖాళీ అయ్యే అవకాశముంది. ● వీటి స్థానంలో ఉద్యానాలు అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుండటం విశేషం.

నియామకం..

నాగలాపురం: పద్మశాలి సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారుగా నాగలాపురానికి చెందిన న్యాయవాది నెల్లూరు సురేష్‌బాబును ఎంపిక చేసినట్లు జిల్లా పద్మశాలి సంఘ అధ్యక్షుడు సందాల జయపెరుమాళ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంఘం చేనేత విభాగం కార్యనిర్వాహక కార్యదర్శిగా అచ్చుకట్ల హరి, ప్రచార కార్యదర్శిగా కందల విజయకుమార్ ఎన్నికయ్యారన్నారు.

నెల్లూరు సురేష్‌బాబు

నిర్వాహకుల నుంచి డాక్టరేట్ అందుకుంటున్న కేబీ గురుదేవ్

కేబీ గురుదేవ్‌కు గౌరవ డాక్టరేట్

వరదయ్యపాళెం : మండలంలో కేబీ గురుదేవ్ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. విద్యాభివృద్ధికి, పేదల ప్రగతికి కృషి చేసినందుకు అంతర్జాతీయ తమిళ సాంస్కృతిక విశ్వవిద్యాలయం ఆదివారం చెన్నైలో జరిగిన అవార్డుల ప్రదానం కార్యక్రమంలో డాక్టరేట్ అందించారు. ఆయన్ను పలువులు అభినందిచారు.

శబరిగిరీశునికి అభిషేకాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ముక్కంటి ఆలయం అచ్యుతరాయ మండపంలో కొలువుదీరిన శబరిగిరీశునికి విశేష అభిషేకాలు జరిపారు. గోక్షీరం, పూజా ద్రవ్యాలతో ఆదివారం అభిషేకాలు జరిపాక విశేష అలంకరణలు చేపట్టారు. ధూప, దీప, నివేదనలు చేపట్టారు. అయ్యప్పస్వాములు ఇక్కడి హరిహరసుతునికి విశేష పూజలు జరిపారు.

అభిషేకం చేస్తున్న అర్చకుడు

తెదేపా నేత మృతి బాధాకరం

నారాయణవనం, న్యూస్‌టుడే: తెదేపా సీనియర్ నేత, రాష్ట్ర బీసీ సెల్ మాజీ కార్యదర్శి, సింగిరికోన ఆలయ ఛైర్మన్ పి.గుణవంతరావు మృతి బాధాకరమని తిరుపతి పార్లమెంట్ తెదేపా అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, నియోజకవర్గ కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నాగిలేరులో జరిగిన గుణవంతరావు సంతాప సభలో వారు పాల్గొని నివాళి అర్పించి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ పాల్గొన్నారు.

గుణవంతరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పనబాక లక్ష్మి, శంకర్ రెడ్డి, నాయకులు

శ్రీ పరశురామేశ్వరస్వామి సేవలో కలెక్టర్

ఏర్పేడు: గుడిమల్లంలో వెలిసిన శ్రీ పరశురామేశ్వరస్వామిని అన్నమయ్య కలెక్టర్ నిశాంత్ కుమార్, కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ఆదివారం ఆలయానికి చేరుకున్న వారికి ఛైర్మన్ గిరినాయుడు స్వాగతం పలికి శ్రీ ఆనందవల్లీదేవి సమేత శ్రీ పరశురామేశ్వరస్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణలతో ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆలయ ఆవరణలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, కుటుంబ సభ్యులు

గ్యాస్ లీకేజీ.. స్పందించిన పోలీసులు

రేణిగుంట, న్యూస్‌టుడే: నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారిలోని తూకివాకం సమీపంలో ఓ కార్ల షోరూం పక్కన కల్వర్టు వద్ద పనులు జరుగుతున్న క్రమంలో గ్యాస్ పైప్‌లైన్‌కు క్రేన్ తగలడంతో గ్యాస్ లీకేజీ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. విషయం తెలిసిన వెంటనే గాజులమండ్యం పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది, సంబంధిత గ్యాస్ అథారిటీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా పరిసర ప్రాంతాన్ని ఖాళీ చేయించి, ట్రాఫిక్ నియంత్రించారు. పోలీస్, అగ్నిమాపక సిబ్బంది గ్యాస్ లీకేజీని నియంత్రించారు.

రహదారి ఛిద్రం

గుమ్మిడిగుంట ఎస్టీ కాలనీకి వెళ్లే రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా భారీ బండరాళ్లు ఏళ్లగా ఉన్నాయి. ప్రయాణ సమయంలో కాస్తంత అదుపుతప్పినా బండరాళ్లను ఢీకొనాల్సిన పరిస్థితి. అలాగే రహదారి గుంతలమయమైంది. ఇసుక కమ్మేయడంతో ట్రాక్టర్లు తిరగడంతో రహదారి ప్రమాదకరంగా మారింది. బండరాళ్లు తొలగించి, రహదారి మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తొట్టంబేడు**

బోర్డు పెడితే.. మాకేంటి..?

ఇచ్చట వాహనాలు నిలుపరాదని బోర్డు పెట్టినా ద్విచక్రవాహనదారులకు పట్టడంలేదు. రేణిగుంట ఆర్పీఎఫ్ పోలీసుస్టేషన్ పక్కనే.. వారి వాహనాలు పార్కింగ్ చేసే షెడ్డు ఎదుట వరసగా బైకులు నిలిపేస్తున్నారు. ఆర్పీఎఫ్ అధికారులు నో పార్కింగ్ బోర్డు పెట్టినా వాహనదారులు పట్టించుకోవడం లేదు. దీనికి తోడు ఆర్పీఎఫ్ పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆ ప్రాంతం ద్విచక్రవాహనాలతో ప్రైవేట్ పార్కింగ్ కేంద్రంగా మారింది. ఇక్కడ రైల్వేస్టేషన్ లోపల నుంచి పార్సిల్ కార్యాలయం మీదుగా బయటకు వచ్చే ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. అధికారులు పట్టించుకోవాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, రేణిగుంట**

తవ్వారు.. మరిచారు

మండలంలోని కారణిమిట్ట గ్రామం వద్ద రహదారి అంచులో మట్టి కుప్ప ప్రమాదకరంగా మారింది. గతంలో పైపులైను మరమ్మతుల కోసం రహదారి పక్కన గుంత తవ్వి మట్టిని రహదారిపై కుప్పగా పోశారు. ఆ తర్వాత అధికారులు గొయ్యిని పూడ్చడం మరిచారు. రాత్రివేళ వాహన రాకపోకల సమయంలో ఇబ్బందిగా మారింది. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం తప్పదు. మట్టి తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, బీఎన్‌కండ్రిగ**

పాఠశాల ప్రాంతం.. వేగనిరోధకం అవసరం

కరకంబాడి జడ్పీ ఉన్నత పాఠశాల ఎదుట ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. కరకంబాడి- తిరుపతి ప్రధానరోడ్డు కావడంతో నిత్యం వాహన రద్దీ అధికంగా ఉంటుంది. ప్రస్తుతం వైకుంఠ ఏకాదశి కావడంతో ఇతర ప్రాంతాల నుంచి వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. వేగ నిరోధకం లేక రాకపోకల సమయంలో రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వేగ నిరోధకం ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకున్న పాపాన పోలేదు. అధికారులు స్పందించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రేణిగుంట**

ఊటనీటితో తప్పని తిప్పలు

మండలంలోని అముదూరులో ఊటనీరు ప్రవహిస్తుండటంతో వీధులన్నీ బురదమయంగా మారుతున్నాయి. గ్రామానికి ఆనుకుని చెరువు ఉండటంతో కట్ట కింద భాగంలోని వీధుల్లో ఇలా నిరంతరాయంగా నీరు ప్రవహిస్తోంది. దీంతో వేసవికాలం వచ్చేంత వరకు స్థానికులు ఊటనీటిలో తిరుగుతూ అవస్థలు పడుతున్నారు. ఊటబావుల్ని పంటకాలువలకు మళ్లించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏర్పేడు**

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట ఆగ్రోసర్వీస్ సంస్థ నుంచి కల్తీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోయిన రైతులకు పరిహారం చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా కన్వీనరు సుధాకర్‌రెడ్డి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మావిళ్లపాడు, కళత్తూరు, కువ్వాకుల్లి, మరదవాడ, అంబూరు, సాతంబేడులో వారు పర్యటించి పంటలు పరిశీలించారు. బాధిత రైతులతో వివరాలు తెలుసుకున్నారు.

పంటను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

బహుజనులతో సమాజం బలోపేతం

రేణిగుంట, న్యూస్‌టుడే: రానున్న రోజుల్లో బహుజన సమాజం దేశవ్యాప్తం బలోపేతం అవుతుందని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది చింతమాకుల పుణ్యమూర్తి తెలిపారు. ఆదివారం స్థానిక కేఆర్‌సీ కళాశాల మైదానంలో ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురిని సన్మానించి చిత్రపటాలు అందజేశారు. సుబ్రహ్మణ్యం, పద్మనాభం పాల్గొన్నారు.

వర్తక సంఘ నూతన కార్యవర్గం

నాగలాపురం, న్యూస్‌టుడే: స్థానిక వర్తక సంఘం అధ్యక్షుడిగా ఆర్.డి.నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వర్తక సంఘ కల్యాణ మండపంలో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా ఎల్.సోమసుందరం, ఉపాధ్యక్షులుగా జె.సుబ్రహ్మణ్యంశెట్టి, ఎస్.దురై, పి.సుగుణరాముడు, కార్యదర్శిగా ఎస్.శ్రీనివాసులు, కోశాధికారిగా బి.కుమరన్ తదితరులు ఎంపికయ్యారు.

కాలమానిని ఆవిష్కరణ

వరదయ్యపాళెం: దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర కాలమానిని ఆదివారం ఆవిష్కరించారు. సంఘం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవి, రఘు ఆధ్వర్యంలో స్థానిక బీవీకే కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత గ్రామీణ బ్యాంకు మేనేజరు బొప్పన మోహనమురళి ఆవిష్కరించారు. ఉప సర్పంచి చంద్రబాబు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల అభ్యర్థన మేరకు రోడ్డు నిర్మాణం

తొట్టంబేడు: మండలంలోని బసవయ్యపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణం స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు చేపడుతున్నట్లు పీఆర్ ఏఈ ప్రీతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి విద్యార్థులతో పాటు గర్భిణులు, బాలింతలు సౌకర్యంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా సీసీ రహదారి నిర్మించాలని వచ్చిన స్థానికులు విన్నవించుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు జడ్పీ నిధులను వినిమోగించి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మరణంపై విచారణ చేయాలి

తిరుపతి(భవానీనగర్) : సత్యవేడు నియోజకవర్గం కేవీబీ పురం మండలం కళత్తూరు హరిజనవాడకు చెందిన కిశోర్ మరణానికి సంబంధించి వాస్తవాలు వెలుగులోకి రావాలంటే ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని న్యాయవాది కె. విజయ్ కిరణ్ కోరారు. ఆదివారం తిరుపతిలో ఆయన మాట్లాడారు. కిశోర్ నివాస ప్రాంతానికి సమీపంలో అగ్రకుల బాలికను ప్రేమించాడని, ఈ ఏడాది ఆగస్టు 11వ తారీఖున ఆ అమ్మాయి కనిపించలేదని, 12న విద్యుత్ వైర్లకు వేలాడుతూ కిశోర్ విగత జీవిగా కనిపించారని దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదన్నారు. దీనిపై ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేయగా.. పోలీసులను సమగ్ర దర్యాప్తునకు ఆదేశించినా వారు స్పందించలేదన్నారు.

అధిక ప్రాధాన్యం అభినందనీయం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఎస్టీయూ కార్యవర్గంలో శ్రీకాళహస్తి డివిజన్‌కు అధిక ప్రాధాన్యం కల్పించడంపై ఆ సంఘం ఉపాధ్యాయులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షులు సుధాకర్‌యాదవ్, రాష్ట్ర కౌన్సిలర్‌గా హరికృష్ణ, యువశ్రీమురళితో పాటు పలువురు ఉపాధ్యాయులకు అవకాశం లభించింది. వీరికి పలువురు ఉపాధ్యాయులు వీరికి అభినందనలు తెలిపారు.

జాతీయ స్థాయికి విద్యార్థినుల ఎంపిక

రేణిగుంట, న్యూస్‌టుడే: గోల్ షాట్ బాల్ జాతీయ జట్టుకి రేణిగుంటకు చెందిన తపస్య పాఠశాల విద్యార్థినులు సాత్విక, షాలిని ఎంపికయ్యారు. పాఠశాల కరస్పాండెంట్ విక్రమ్ షాలీ మాట్లాడుతూ ఆదివారం కేరళలోని తిరుచురాపల్లిలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటినట్లు తెలిపారు. విద్యార్థులను, వ్యాయమ ఉపాధ్యాయులను, అందుకు సహకరించిన తల్లిదండ్రులను అభినందిస్తున్నట్లు తెలిపారు.

సాత్విక, షాలిని

చలి బాధితులకు దుప్పట్ల వితరణ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పేదలు, యాచకులు, అభాగ్యులకు పట్టణంలోని శ్రీసత్యసాయి అన్నప్రసాద, ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు రగ్గులు వితరణగా ఇచ్చారు. ఆదివారం వేకువజామున రోడ్లపై తిరుగుతూ చలికి ఇబ్బందులు పడుతున్న వాళ్లకు రగ్గులు కప్పారు. చిన్నమిట్టకండ్రిగలో పేదలకు దుప్పట్లు అందజేశారు. ట్రస్టు నేతృత్వంలో మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ప్రారంభించారు. క్యాలండర్లను ఆవిష్కరించినట్లు ట్రస్టు సమన్వయకర్త పాండురంగయ్యశెట్టి తెలిపారు.

కేకు కోసి సంబరాలు జరుపుకొంటున్న పార్టీ శ్రేణులు

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ఆవిర్భావాన్ని పురస్కరించుకుని వేడుకలు ఘనంగా జరిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో ఆదివారం కేకు కోసి చేసి సంబరాలు జరుపుకొన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులును ఘనంగా సత్కరించారు. పార్టీ నియోజక వర్గ సమన్వయకర్త దామోదరంరెడ్డి, తిరుపతి జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు జ్యోతీశ్వర్ పాల్గొన్నారు.

ఏపీ ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడు రాము గుప్తాను అభినందిస్తున్న రాష్ట్ర నేతలు

ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడిగా అవకాశం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని అరుణ మెడికల్స్ అధినేత రాము గుప్తా రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ సభ్యులుగా ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో శ్రీకాళహస్తికి చెందిన ఆయన 12,798 ఓట్ల ఆధిక్యంతో విజేతగా నిలిచారు. ఈయనతో పాటు ఏపీ డ్రగ్గిస్టు ప్యానల్ తరపున బరిలో దిగిన ఆరుగురు ఘన విజయం సాధించారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

పల్లె పిల్లలు.. ఆటల్లో పిడుగులు

జాతీయ స్థాయిలో రాణింపు

సత్యవేడు, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు ఈ చిన్నారులు. క్రీడ ఏదైనా సత్తా చాటుతూ పతకాలు సాధిస్తున్నారు. అరకొర సౌకర్యాల మధ్య సాధన చేస్తూ గెలుపే ధ్యేయంగా ప్రతిభ చూపిస్తున్నారు. మంచి వసతులు, సరైన శిక్షణ అందిస్తే ఆకాశమే హద్దుగా చేలరేగుతామని దీమా వ్యక్తం చేస్తున్నారు. వరదయ్యపాళెం మండలం బత్తలవల్లం జడ్పీ ఉన్నత పాఠశాల పీఈటీ కుమార్ శిక్షణలో రాటుదేలుతున్నారు.

జాతీయ పతకమే లక్ష్యం



పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. తండ్రి రమేష్ కూలీ పనులు చేస్తారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆటలపై దృష్టి పెట్టాను. రగ్బీలో ప్రతిభ చూపుతున్నా. ఇటీవల కృష్ణా జిల్లా గన్నవరంలో జరిగిన అండర్-14 రగ్బీ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికయ్యా. రాష్ట్రం తరఫున భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయ పోటీలకు అర్హత సాధించా. జాతీయ స్థాయిలోనూ సత్తా చాటి పతకం సాధిస్తా. **- సుబ్రహ్మణ్యం**

క్రీడలంటే మక్కువ

నా పేరు గౌతమి, పది చదువుతున్నాను. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. రగ్బీలో శిక్షణతో రాటుదేలాను. ఇటీవల నెల్లూరు జిల్లా పొదలకూరులో జరిగిన అండర్-17 రగ్బీ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని విజయం సాధించా. జాతీయ స్థాయికి ఎంపికయ్యా. భువనేశ్వర్‌లో జరిగే పోటీల్లో రాష్ట్రానికి పతకం తీసుకువచ్చి, పాఠశాలకు గుర్తింపు తెస్తా. **-గౌతమి**

క్రీడా కోటాలో కొలువు సాధిస్తా

మా తల్లిదండ్రులు దినేష్, కుమారి వ్యవసాయ కూలీలు. స్థానిక పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నా. అండర్-17 బాలికల ఉమ్మడి చిత్తూరు జిల్లా బేస్‌బాస్ జట్టుకు ఎంపికయ్యా. కర్నూల్ జిల్లా అహోబిళలంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటా. జాతీయ స్థాయి క్రీడాకారుడికి ఎదగాలని కఠోర సాధన చేస్తున్నా. క్రీడా కోటాలో ప్రభుత్వ కొలువు సాధిస్తా. **-నాజ్‌మీ**

జాతీయ జట్టుకు ఎంపికవుతా

నాకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే మక్కువ. తండ్రి రాజేంద్ర ప్రోత్సహం ఉంది. స్థానిక ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-14 బెస్‌బాల్‌కు ఎంపికైయ్యా. పలమనేరులో జరగనున్న రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి, జాతీయ జట్టు ఎంపిక కావడమే లక్ష్యం. **-అశ్వంత్**

కబడ్డీలో రాణిస్తూ..

వరదయ్యపాళెం మండలం చిలమత్తూరు గ్రామానికి చెందిన మునస్వామి కుమార్తె అఖిల స్థానిక స్కూల్‌లో 9వ తరగతి చదువుతుంది. గత నెలలో తమ పాఠశాలలో జరిగిన కబడ్డీలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి అండర్-14 బాలికల జట్టుకు ఎంపికైంది. మచిలీపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననుంది. **-అఖిల**

(c) eenadu

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

క్యాలెండర్ల ఆవిష్కరణ

క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ, వివిధ సంఘాల నాయకులు

వెంకటగిరి, న్యూస్‌టుడే: రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గత వైకాపా ప్రభుత్వం ఛిన్నాభిన్నం చేసిందని ఎమ్మెల్యే కె.రామకృష్ణ అన్నారు. తెదేపా కార్యాలయంలో ఆదివారం ఆయన టగిరి పోలేరమ్మ, కొలిశెట్టిలోని చెంచమ్మ తల్లి దేవస్థానం, పద్మశాలీ ఉద్యోగుల సంఘం క్యాలెండర్లను ఆవిష్కరించారు. నాయకులు ఎ.శ్రీనివాసులురెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ విశ్వనాథం, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

గూడూరులో నిమ్మ ధరలు
మొదటి రకం: కేజీ రూ. 16 నుంచి రూ. 20 వరకు
రెండో రకం: కిలో రూ. 10 నుంచి రూ. 15 వరకు

రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పురపాలక సంఘంలోని చెన్నూరు అరుంధతీయపాలెంలో రూ.20 లక్షలతో మూడు సీసీ రోడ్లు, కాలువ నిర్మాణానికి తెదేపా మహిళా నేత ప్రవణి ఆదివారం భూమిపూజ చేశారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఇచ్చిన హామీ మేరకు పనులకు శ్రీకారం చుట్టామన్నారు. నాయకులు కరుణాకర్‌రెడ్డి, మురళి, గిరిప్రసాద్‌రెడ్డి, రత్నయ్య, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

కాగడాలతో ర్యాలీ చేస్తున్న జేఏసీ నాయకులు

స్పష్టత వచ్చేవరకు పోరాటం

కోట, న్యూస్‌టుడే: గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని కోటలో జేఏసీ నాయకులు ఆదివారం రాత్రి కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. గోపాలకృష్ణ విగ్రహం నుంచి పాత బస్టాండ్ వరకు స్వచ్ఛంద సంస్థల సభ్యులు, వ్యాపారులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. అధికారిక ప్రకటన వచ్చే వరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు. నాయకులు జనార్దన్, మాధవ్, ప్రసాద్, మల్లికార్జునరావు, హేమంత్, పాలెంమల్లి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. **గూడూరు పట్టణం:** గూడూరును నెల్లూరులో విలీనం చేసే గెజిట్ ప్రకటనపై స్పష్టత వచ్చేవరకు పోరాటం సాగిస్తామని జేఏసీ నాయకులు తెలిపారు. 22వ రోజు రిలే దీక్షలు కొనసాగించారు.

చేపా.. చేపా.. ఆదాయమేదీ..?

వేలం జాప్యంతో నష్టం

నాయుడుపేట, న్యూస్‌టుడే: చేపల చెరువుల వేలం పాటల నిర్వహణలో జాప్యంతో గ్రామ పంచాయతీలు ఆదాయం కోల్పోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా జలవనరుల శాఖ పరిధిలోని చెరువులను మత్స్యశాఖ పంచాయతీలు, గిరిజన సహకార సంఘాలకు లీజుకు ఇస్తుంది. అనంతరం తీర్మానాల మేరకు బహిరంగ వేలం నిర్వహిస్తారు. అయితే ఈ ఏడాది ప్రక్రియ సక్రమంగా జరగకపోవడంతో మత్స్యసంపదను కొందరు దోచుకుంటున్నారు.

వైకాపా పాలనలో పరులకు..

గత అయిదేళ్ల వైకాపా పాలనలో చెరువుల నిర్వహణను మత్స్యశాఖ, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోలేదు. దీంతో ఆదాయం పక్కదారి పట్టింది. పాలకవర్గాలు ఏకగ్రీవ కావడంతో నాయకులు మత్స్యశాఖకు లీజు చెల్లించకుండా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి ఆదాయం పక్కదారి పట్టించారు. పెళ్లకూరు మండలంలో చెంబేడు, శిరసనంబేడు, పునబాక, పెళ్లకూరు, ఓజిలి మండలంలో తిరుమలపూడి, మాచవరం, నాయుడుపేట మండలంలో పూడేరు, పండ్లురులో చేపలు పెంచిన పంచాయతీల ఖాతాల్లో నిధులు జమకాలేదు.

చెంబేడు చెరువు కలుజు వద్ద అధికార వలను తొలగిస్తున్న అధికారులు

మద్దతు ధరపై తేల్చరా..

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువుల్లో చేపలు పెరిగే అవకాశం ఉంది. దీనిలో భాగంగా ఇప్పటికే లీజుకు చెరువులు కేటాయించాల్సి ఉంది. కానీ ఆ దిశగా అడుగులు పడలేదు. కనీస లీజు ధర నిర్ణయించక పోవడంతో ఈ ఏడాది కూడా ఆదాయం కోల్పోయే ప్రమాదం కనిపిస్తోంది. ఓజిలి మండలంలోని ఇనుగుంట, కర్లపూడిలు, సగుటూరు, మాచవరం, కుడుగొండ, తిరుమలపూడి, పెళ్లకూరు మండలంలో చెంబేడు, పునబాక, చిల్లమూరు మండలంలో మల్లాంచకొరిగి, నాయుడుపేట మండలంలో తిమ్మాజీకండ్రిగ, పూడేరు, పండ్లురులో ఇప్పటికే అనధికారికంగా చేపలు పెంచుతున్నట్లు తెలుస్తోంది. పంచాయతీలు తీర్మానాలు చేసి కేటాయిస్తామని డీపీవో జాలిరెడ్డి తెలిపారు.

మత్స్య సంపద వివరాలు	పంచాయతీలు: 773	సాగునీటి చెరువులు: 599	రాబడి: సుమారు రూ.5.02 కోట్లు

మురుగు ముప్పు.. జ్వరాల భయం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట పట్టణంలో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. అపరిశుభ్ర వాతావరణంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. జ్వరాల ఓ చిన్నారికి జ్వరం రావడంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు చేయడంతో డెంగీ లక్షణాలు బయటపడ్డాయి. అపరిశుభ్ర వాతావరణంతో సమస్యలు ఎదురవుతున్నట్లు పలువురు వాపోతున్నారు.

శ్రీరామ్‌నగర్ దారిలో దుస్థితి

ఇవీ వివరాలు..
పురపాలిక: నాయుడుపేట
కాలువల పొడవు: 30 కిలోమీటర్లు
పారిశుద్ధ్య సిబ్బంది: 200 మంది
నెలకు ఖర్చు: సుమారు రూ.10లక్షలు

రోగుల తాకిడి..

నాయుడుపేట ఆరోగ్య కేంద్రానికి కొన్ని రోజులుగా జ్వర బాధితుల తాకిడి ఎక్కువైంది. రోజుకు 300 నుంచి 400 మంది వరకు ఆసుపత్రికి వెళ్తున్నారు. వీరిలో సగం మంది వరకు జ్వరాలతో బాధ పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. మరి కొందరు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వ పైపులైన్ల నుంచి భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

కాలువలో పైపులు..

ఖాళీ స్థలాల్లో పనికిరాని మొక్కలు, చెట్లు పెరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మురుగు నిలిచిపోయి ఉండటంతో దోమలు పెరుగుతున్నాయి. కాలువలు సక్రమంగా లేకపోవడంతో, మురుగు దొడ్డ పైపులు నేరుగా కాలువలోకి కనెక్షన్ ఇవ్వడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. విషయం కమిషనర్ ఎస్‌కే ఫజులుల్లా దృష్టికి తీసుకెళ్లగా.. వారంలో రెండు రోజులు శుభ్రత పనులు చేపట్టనున్నామని చెప్పారు. పూడిక తొలగించి ఫాగింగ్ చేయిస్తామన్నారు.

ఆదమరిస్తే.. అంతే సంగతి

సూళ్లూరుపేట పట్టణంలోని షార్ బస్టాండ్ వద్ద కల్వర్టు పాడైంది. రంధ్రం పడటంతో ఈ చెక్కను అడ్డంగా ఉంచి రాళ్లు పెట్టారు. నిత్యం ఈ మార్గంలో పాఠశాలలు, షార్ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తాయి. రాళ్లు ఉండటంతో చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సూళ్లరుపేట గ్రామీణం**

ఎస్‌ఎస్‌పురంలో దుర్గంధం

శ్యాంసుందరపురంలో కొన్ని రోజులుగా వ్యర్థాలను ఇష్టం వచ్చినట్టు వేస్తున్నారు. రోజుల తరబడి తొలగించకపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. దీనికి తోడు దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. పారిశుద్ధ్య పనులు చేయించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కోట**

గోతిలో దిగితేనే.. గొంతు తడిసేది

సూళ్లూరుపేట మండలంలోని పెద్ద పడవ గ్రామానికి తాగునీటి కొళాయి నిప్పల్లి నుంచి సరఫరా చేస్తున్నారు. అక్కడ గేట్‌వాల్వు ఆపేయడంతో పెద్దపడవకు నీరు సక్రమంగా రావడం లేదు. తక్కువగా వస్తున్నది గోతుల్లోకి వెళ్లడంతో స్థానికులు ఇలా డ్రమ్ములు ఏర్పాటు చేసుకొని గోతుల్లో దిగి పట్టుకుంటున్నారు. సరఫరా సక్రమంగా చేయాలని కోరుతున్నారు. **- సూళ్లూరుపేట గ్రామీణం**

ఇక్కడ.. ముక్కు మూసుకోవాల్సిందే

కారూరు పంచాయతీ కారూరుమిట్ట జాతీయ రహదారి పక్కనే మురుగు చేరింది. ఇక్కడ కాలువ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఈ సమస్య ఏర్పడుతోంది. ఎన్‌హెచ్‌ఏఐ, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో మురుగు ఇళ్లు, దుకాణాల ముందుకు చేరుతోంది. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, తడ**

వీధుల్లో వ్యర్థాలు.. కానరాని చర్యలు

సూళ్లూరుపేట పట్టణంలోని పార్కు వీధి నుంచి బాపూజీ వీధికి వెళ్లే మార్గం అధ్వానంగా మారింది. వీధి లోనే వ్యర్థాలు వేయడంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోజులు గడుస్తున్నా శుభ్రత పనులు చేపట్టడం లేదని వాపోతున్నారు. పుర అధికారులు స్పందించి చెత్త తొలగించే పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట**

వేడుకగా ముగ్గుల పోటీలు

వెంకటగిరి: పట్టణంలోని త్రిభువని కూడలి వద్ద ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. లక్ష్మీప్రసన్న ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం, సంక్రాంతి పండగలను పురస్కరించుకుని పోటీలు చేపట్టారు. పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన మహిళలు పదుల సంఖ్యలో పాల్గొని ముగ్గులు వేశారు. వారిలో ధనలక్ష్మి, స్వాతి, హరిత, సుమతి బహుమతులు గెలుచుకున్నట్లు న్యాయ నిర్ణేతలు రాధ, గీతాంజలి, ట్రస్ట్ అధ్యక్షుడు ధనుంజయ తెలిపారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

వరదయ్యపాలెం, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట ఆగ్రోసర్వీస్ సంస్థ నుంచి కల్తీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోయిన రైతులకు పరిహారం చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా కన్వీనరు సుధాకర్‌రెడ్డి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మావిళ్లపాడు, కళత్తూరు, కువ్వాకుల్లి, మరదవాడ, అంబూరు, సాతంబేడులో వారు పర్యటించి పంటలు పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

శబరిగిరీశునికి అభిషేకాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ముక్కంటి ఆలయం అచ్యుతరాయ మండపంలో కొలువుదీరిన శబరిగిరీశునికి విశేష అభిషేకాలు జరిపారు. గోక్షీరం, పూజా ద్రవ్యాలతో ఆదివారం అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణలు చేపట్టారు. ధూప, దీప, నివేదనలు చేపట్టారు. అయ్యప్ప స్వాములు ఇక్కడి హరిహరసుతునికి విశేష పూజలు జరిపారు.

పురవీధుల్లో ఊరేగిన గొబ్బిదేవత

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: గొబ్బిదేవతగా పూజలందుకునే మనోన్మణి అమ్మవారు చతుర్మాడ వీధుల్లో ఊరేగారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య పట్టణ వీధుల్లో ఊరేగారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

వాహన చోదకుడు ఆత్మహత్య

పెళ్లకూరు, న్యూస్‌టుడే: వాహన చోదకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పాలచ్చూరు సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కొనేటిరాజుపాళెం రోడ్డు సమీపంలో చిత్తూరు జిల్లా గుడిపాల మండలం రామాపురానికి చెందిన పి.గుణశేఖర్ (40) రెండు రోజుల క్రితం చెట్టుకు ఉరేసుకున్నాడు. ఆయన పాలచ్చూరు సమీపంలో జరుగుతున్న పరిశ్రమల నిర్మాణ పనులకు తీసుకొచ్చిన ఓ వాహనానికి చోదకుడిగా పనిచేస్తూ స్థానికంగా అద్దెకు ఉంటున్నాడు. శుక్రవారం ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. స్థానికులు శనివారం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై నాగరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఆయన మృతిపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కర్రసాములో సత్తా

పతకాలు సాధించిన క్రీడాకారులు

తడ, న్యూస్‌టుడే: మండలంలోని వాటంబేడు కుప్పానికి చెందిన విద్యార్థులు కర్రసాములో ప్రతిభ చూపారు. నెల్లూరులో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఛాంపియన్ షిప్ పోటీల్లో పలు విభాగాల్లో పతకాలు సాధించారు. 14 మంది పాల్గొనగా అయిదుగురు స్వర్ణాలు, ఇద్దరు రజతాలు, ఏడుగురు కాంస్యాలు గెలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులు రోహిత్ రుద్ర, అహల్య, నిషా, కోకిల, కవినయ, జ్యోష్ని, మనీష్, రోహిత్, రోషిద, నాగవర్ధన్, ఉగన్, రేష్మ, హిమవర్ధన్‌కుమార్, యువశ్రీ, శిక్షకులు బాలరాజు, కె.ఎమ్.నందన్‌ను పలువురు అభినందించారు.

ప్లాస్టిక్ నిల్వలు.. ప్రమాద సంకేతాలు

పెళ్లకూరు మండలంలోని తాళ్వావాయిపాడు సమీపంలో 71వ నంబరు జాతీయ రహదారి పక్కన తుక్కు, ప్లాస్టిక్ వ్యర్థాలను వేస్తున్నారు. అవి రోడ్డుపైకి వస్తుండటంతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నాళ్లపాటు సమస్య ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇక్కడ చెత్త వాహనాలు నిరంతరం నిలిపేస్తుండటంతో ప్రమాద జోన్‌గా మారింది. వ్యర్థాలు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నాయుడుపేట

మోటార్ల చోరీపై దర్యాప్తు

వాకాడు, న్యూస్‌టుడే: మండలంలోని ముట్టెంబాకలో ఇటీవల వ్యవసాయ పంట పొలాల వద్ద మోటార్లను కొందరు చోరీ చేశారు. ఇద్దరు నిందితులను బాధితులు గుర్తించి పోలీసులకు శనివారం అప్పగించారు. వారిని ఆదివారం విచారించామని, మరి కొందరిపై నిఘా ఉంచామని ఎస్సై నిఖిల్‌బాబు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
గూడూరు: 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966
సమయం 10 AM TO 1 PM

? కోటలోని మండల కార్యాలయాలకు వెళ్లే సిమెంటు రోడ్డు ఇరువైపులా కోతకు గురైంది. మలుపు వద్ద వాహన చోదకులు అదుపుతప్పి పడిపోతున్నారు. – ఎస్.కె. హుస్సేన్ ✔ పరిశీలించి రోడ్డు బాగు చేయిస్తాం. – కిరణ్, ఇన్‌ఛార్జి ఏఈ – న్యూస్‌టుడే, కోట

విద్య, ఉద్యోగాల్లో చేయూత

సమావేశంలో పాల్గొన్న నాయకులు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట పట్టణంలోని గాయత్రి బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఏపీ సమాఖ్య కార్యవర్గ సభ్యులు సమావేశమయ్యారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా విద్య, ఉద్యోగాలకు చేయూత ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఇ.కామేశ్వరప్రసాద్, జి.శ్రీనివాస్‌రావు, ఉమామహేశ్వరరావు, జగన్, సుబ్బారావు, కె మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కొత్త దారులు కలేనా..?

మారిన నిబంధనలతో అడ్డంకులు

అసంపూర్తిగా కమ్మవారిపాళెం రహదారి పనులు

నాయుడుపేట, న్యూస్‌టుడే: మండలంలోని నాలుగు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలుగా చేపట్టిన విన్నమాల- పెరికిలింపాటికండ్రిగ రహదారి పనులు ముందుకు కదలడం లేదు. గతంలో రోడ్డు అధ్వానంగా ఉండటంతో కమ్మవారిపాళెం గ్రామస్థులు సార్వత్రిక ఎన్నికలను బహిష్కరించి నిరసన తెలిపారు. కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పక్కారోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.4.30 కోట్లు మంజూరు చేయించారు.

ఆరు నెలలుగా అసంపూర్తి..

రోడ్డు పనులు దక్కించుకున్న గుత్తేదారు గతంలో ఉన్న రోడ్డును చదును చేసి గ్రావెల్ వేసి వదిలేశారు. బిల్లుల చెల్లింపులో జాప్యంతో ఆరు నెలలుగా పనులు చేపట్టలేదు. దీంతో రోడ్డు చాలా చోట్ల పాడైంది. రాళ్లు తేలడంతో వాహనాలు పాడవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం ఉపాధి మెటీరియల్ కాంపొనెంట్ ద్వారా చేసే ఒక్కో పనికి రూ.50 లక్షలు మాత్రమే చెల్లించేలా కేంద్రం నిబంధన విధించింది. దీంతో ఈ పనుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.

రెండు, మూడుగా విభజించి..

మండలంలో ఇదే తరహాలో ఉపాధి హామీ పథకం ద్వారా చిగురుపాడుకు రూ.1.80 కోట్లు, తడ మండలంలోని భీమువలవారి పాళెంకు రూ.63 లక్షలతో రోడ్లు వేశారు. వీటికి కొంత మేర చెల్లింపులు జరిగాయి. రూ.50 లక్షల పరిమితితో బిల్లులను రెండు, మూడుగా విభజించి కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకునేందుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. విషయం పీఆర్ ఈఈ రమణయ్య వద్ద ప్రస్తావించగా.. బిల్లులను పరిశీలించి చెల్లించేలా చూస్తామన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కోట, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మక్కకండ్రిగకు చెందిన జగదీశ్ (28) చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇటీవల ఇంట్లో వారిని బెదిరించేందుకు గడ్డి మందు తాగాడు. అస్వస్థతకు గురైన యువకుడిని కుటుంబ సభ్యులు చెన్నై తరలించారు. అక్కడ ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

అనుమానాస్పదంగా.. సూళ్లూరుపేట గ్రామీణం: సూళ్లూరుపేట పట్టణంలోని హోలీక్రాస్ కూడలి వద్ద యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ముక్కు నుంచి రక్తం కారుతోందని, ఎలాంటి గాయాలు కాలేదని ఎస్‌ఐ బ్రహ్మానాయుడు చెప్పారు.

తమిళనాడు జాలర్ల ప్రవేశంపై విచారణ

క్రైం కార్నర్

చిల్లకూరు, న్యూస్‌టుడే: మండలంలోని గుమ్మళ్లదిబ్బ సమీపంలో సముద్రంలోకి ఆదివారం తమిళనాడు జాలర్లు అక్రమంగా ప్రవేశించడంపై దుగరాజపట్నం మెరైన్ పోలీసులు విచారణ చేస్తున్నారని సీఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. తమిళనాడుకు చెందిన రెండు బోట్లు స్థానిక జలాల్లోకి రావడంతో మత్స్యకారులు ఏర్పాటు చేసిన వలలు తెగిపోయాయి. దీంతో వివాదం చెలరేగింది. ఈ క్రమంలో బోట్ల డ్రైవర్ల సాయంతో కొందరు పనివాళ్లను అదుపులోకి తీసుకుని వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు.

తెదేపా నేతపై దాడి

బాలాయపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పల్లిపాడు మాజీ సర్పంచి, మండల తెదేపా మాజీ అధ్యక్షుడు బి.కల్యాణిరామిరెడ్డిపై ఆదివారం దాడి చేశారు. ఎస్సై గోపి వివరాల మేరకు.. పొక్లెయిన్ సాయంతో గ్రామంలో రోడ్డు విస్తరణ పనులు చేయిస్తుండగా కల్యాణిరామిరెడ్డిపై అదే గ్రామానికి చెందిన బి.మునికృష్ణ దాడి చేశాడు. తన స్థలం రోడ్డులో కలిపేస్తున్నారని వాగ్వాదానికి దిగి రాయితో గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కోట, న్యూస్‌టుడే: కోట అడ్డరోడ్డు సమీపంలో కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. విద్యానగర్‌కు చెందిన రామకృష్ణకు గాయాలయ్యాయి. ఆయనను కోట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ చెప్పారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

వెంకటగిరి, న్యూస్‌టుడే: మండలంలోని తిమ్మాయిగుంట సమీపంలో ఆదివారం రాత్రి కోడి పందేల స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై ఏడుకొండలు తెలిపారు. శివారు ప్రాంతంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు గుర్తించి 25 ద్విచక్ర వాహనాలు, రెండు కోళ్లు, ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వాహనాలను ఆర్టీసీ డిపోలో ఉంచామని, ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

పరుల చేతుల్లో.. విలువైన స్థలాలు

గడియారం సెంటరు వద్ద పురపాలిక స్థలం

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణంలో పురపాలిక సంఘం ఆధీనంలో ఉన్న విలువైన స్థలాలను వేలం వేసి ప్రైవేటు పాటదారులు గదులు నిర్మించేలా సన్నాహాలు చేస్తున్నారు. ఈ వ్యవహారంలో ఇద్దరు కౌన్సిలర్ల జోక్యం ఎక్కువగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.

నిధులు పక్కదారి..

పట్టణంలో గడియారం సెంటర్, పోలీసు ఠాణా పక్కన, సీఎస్ తేజా సెంటరు ఎదురుగా రూ.కోట్ల విలువైన స్థలాలు ఉన్నాయి. నాయుడుపేట పట్టణం వ్యాపార కూడలి కావడంతో వాణిజ్య గదులకు డిమాండు ఉంది. కానీ పురపాలిక సంఘం మాత్రం ఖాళీ స్థలాల్లో దుకాణాలు నిర్మించి, ఆదాయం సంపాదించే ప్రయత్నాలు చేయడం లేదు. సాధారణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే నిధులను నాయకుల జోక్యంతో కొందరు అడ్డగోలుగా పక్కదారి పట్టించారు. ప్రస్తుతం మరోసారి గుడ్‌విల్ పేరుతో నాయకులే సొమ్ములు వసూలు చేసేందుకు చూస్తున్నారు.

గదుల నిర్మాణంలో అక్రమాలు..

వైకాపా పాలనలో ఆ పార్టీ నాయకులు వ్యాపారుల నుంచి గుడ్‌విల్ సొమ్ము వసూలు చేసి దర్గావీధిలో ఎన్‌జేఆర్ వాణిజ్య గదులను నిర్మించారు. దీనిలో ఇంజినీరింగ్ శాఖ ప్రమేయం, సాంకేతిక అనుమతులు లేకుండా పనులు చేపట్టారు. అప్పట్లో రూ.లక్షల్లో వసూలు చేసినా నిర్మాణాలు మాత్రం అసంపూర్తిగా వదిలేశారు. పనుల్లో కూడా నాణ్యత లేకుండా పోయింది. గుడ్‌విల్ గడువు దాటినప్పటికీ వారి ఆధీనంలోనే గదులున్నాయి. ఇదే తరహాలో గడియారం, సీఎస్ తేజా సెంటర్లలోనూ ఖాళీ స్థలాల్లో మళ్లీ అడ్డగోలుగా గదుల నిర్మాణానికి సిద్ధం అవుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇక్కడ నిర్మాణాల అంశం కౌన్సిల్ పరిశీలనలో ఉందని పుర కమిషనర్ ఫజులుల్లా తెలిపారు.

తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలి

మాట్లాడుతున్న ప్రణవాత్మానంద సరస్వతి

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ సద్గుణాలతో సమాజాభివృద్ధికి పాటుపడటమే హిందుత్వమని ఆర్షా విద్యాపీఠం శ్రీకృష్ణగీతాశ్రమం పీఠాధిపతి ప్రణవాత్మానంద సరస్వతి పేర్కొన్నారు. తాళ్వాయిపాడులోని వీర్లయ్య స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం హిందూ సమ్మేళన సభ నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆంధ్ర ప్రాంత సేవా ప్రముఖ్ మనోహర్ మాట్లాడుతూ.. కుటుంబం, పర్యావరణం, సామాజిక సమరసత, స్వధర్మం గురించి వివరించారు. విశిష్ట అతిథి ఎ.విజయలక్ష్మి, తిరుపతి రామకృష్ణ మఠానికి చెందిన యచ్చితానంద స్వామి, సీవీ రామన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.గోపి, గోకులకృష్ణ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు జి.బసవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్లు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు పట్టణంలోని శివాలయం వీధిలో రెడ్ సంస్థ, రాజినేని రామానాయుడు ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చలికాలంలో దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించి దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెడ్‌సంస్థ ప్రతినిధులు సుధీర్, రాజేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు. **నాయుడుపేట పట్టణం:** తుమ్మూరు సమీప గిరిజన కాలనీలో అయిదు కుటుంబాలకు మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరకులను జనసేన నాయకుడు ఎ.కృష్ణారావు, నాయకులు సుబ్బు, అయ్యప్ప, రోహిణి, రమ, సుజాత అందజేశారు. **సూళ్లూరుపేట:** పట్టణంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కార్యదర్శి డాక్టర్ సాయిబాబా 68 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. టి.శేషగిరిరావు, ప్రతిమ, శాంతకుమారి, నరసింహారావు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

వెంకటగిరి: నూతన సంవత్సరం సందర్భంగా ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ వెంకటరమణ హెచ్చరించారు. అర్ధరాత్రి వేళ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం, డీజేలు వినియోగించొద్దని సూచించారు. పురపాలిక, వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లోనూ నిబంధనలు వర్తిస్తాయన్నారు.

చెల్లాతమ్మకు సారె

తడ మండలంలోని చేనిగుంటలో ఓంశక్తి మాలధారులు ఆదివారం గ్రామ దేవత చెల్లాతమ్మకు సారె సమర్పించారు. బాణసంచా వేడుకల మధ్య అమ్మవారిని ఊరేగించారు. చీరలు, పసుపు, కుంకుమ చూపించి మొక్కు చెల్లించారు. **– న్యూస్‌టుడే, తడ**

(c) eenadu

చదువు

■ e-mail: edc@eenadu.in

సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకూ హుందాగా, ఆకర్షణీయంగా కనిపించడానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకోసం దుస్తులు, వస్తువుల ఎంపికపై శ్రద్ధ వహిస్తున్నారు. ఈ పరిణామాలు పేరున్న సంస్థల్లో ఫ్యాషన్ కోర్సులు పూర్తిచేసినవారికి మేటి అవకాశాలు అందిస్తున్నాయి. అలాంటి వాటిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్)లు ముఖ్యమైనవి. వీటిలో పలు కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

ఫ్యాషన్ కోర్సుల్లోకి నిఫ్ట్‌ల ఆహ్వానం!

ఇంజినీరింగ్ చదవడానికి ఐఐటీలు, వైద్యవిద్య కోసం ఎయిమ్స్ ఉన్నట్లుగానే ఫ్యాషన్ ప్రపంచంలో రాణించాలనుకునేవారికి నిఫ్ట్‌లు జాతీయ స్థాయిలో పేరున్న సంస్థలు. దేశంలో హైదరాబాద్ సహా 20 కేంద్రాల్లో నిఫ్ట్‌లు ఉన్నాయి. ఇవి నాలుగేళ్ల యూజీ... ఫ్యాషన్ టెక్నాలజీతోపాటు యాక్సెసరీ డిజైన్, నిట్‌వేర్ డిజైన్, ఫ్యాషన్ కమ్యూనికేషన్, లెదర్ డిజైన్, ఫ్యాషన్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్ కోర్సులు అందిస్తున్నాయి. రెండేళ్ల పీజీలో.. డిజైన్, ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులు ఉన్నాయి. సృజనాత్మకత, డిజైన్‌పై ఆసక్తి, ఊహలకు రూపమివ్వగలిగే నైపుణ్యం, స్కెచింగ్ ప్రావీణ్యం ఉన్నవారు ఫ్యాషన్ టెక్నాలజీ, ఫ్యాషన్ డిజైన్ కోర్సుల్లో చేరడానికి ప్రాధాన్యమివ్వొచ్చు.

కోర్సు: బ్యాచిలర్ ఆఫ్ డిజైన్

అర్హత: ఇంటర్మీడియట్ లేదా సమాన స్థాయి కోర్సు

కోర్సు: బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ

అర్హత: మ్యాథ్స్, ఫిజిక్స్‌తో ఇంటర్ లేదా మూడేళ్ల డిప్లొమా.

పై రెండు కోర్సులకూ చివరి ఏడాది విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు ఆగస్టు 1, 2026 నాటికి 24 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఐదేళ్లు మినహాయింపు.

పరీక్ష

ఎంచుకున్న కోర్సు ప్రకారం ప్రశ్నపత్రం మారుతుంది. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు. తప్పు జవాబుకు పావు మార్కు తగ్గిస్తారు.

బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో సీటు పొందడానికి జనరల్ ఎబిలిటీ టెస్ట్ (జీఏటీ), క్రియేటివ్ ఎబిలిటీ టెస్టు(సీఏటీ), సిచ్యుయేషన్ టెస్టుల్లో ప్రతిభ చూపాలి. జీఏటీ ఆన్‌లైన్‌లో వంద మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. పరీక్ష వ్యవధి 2 గంటలు. పరీక్షలో ఐదు ప్రశ్నలుంటాయి. వీటిలో క్వాంటిటేటివ్ ఎబిలిటీ 20, కమ్యూనికేషన్ ఎబిలిటీ అండ్ ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ 40, అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీ 15, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ 25 ప్రశ్నలు వస్తాయి. ఈ పరీక్షకు 30 శాతం వెయిటేజీ.

సీఏటీ ద్వారా డిజైనింగ్‌లో సృజనాత్మకత ఎలా ఉందో పరిశీలిస్తారు. వ్యవధి 3 గంటలు. 3 ప్రశ్నలు వస్తాయి. పేపర్‌పై సమాధానాలు రాయాలి. ఈ విభాగానికి 50 శాతం వెయిటేజీ.

జీఏటీ, సీఏటీల్లో ప్రతిభ చూపినవారికి సిచ్యుయేషన్ టెస్టు ఉంటుంది. ఇందులో అభ్యర్థిలోని సృజన, 3డీ మోడలింగ్ నైపుణ్యం పరిశీలిస్తారు. దీనికి 20 శాతం వెయిటేజీ.

బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (బీఎఫ్‌టెక్) కోర్సులకు జనరల్ ఎబిలిటీ టెస్టు (జీఏటీ)లో ప్రతిభ చూపితే సరిపోతుంది. ఇందులో రెండు సెక్షన్ల నుంచి 150 ప్రశ్నలు వస్తాయి. వీటిని మూడు గంటల్లో పూర్తిచేయాలి.

పరీక్షలో: క్వాంటిటేటివ్ ఎబిలిటీ 35, కమ్యూనికేషన్ ఎబిలిటీ అండ్ ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ 40, అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీ 30, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ నుంచి 25 ప్రశ్నలు అడుగుతారు. కేస్ స్టడీకి 20 మార్కులు.

అధిక మార్కులకు..

- నోటిఫికేషన్‌లోని సిలబస్ వివరాలు శ్రద్ధగా చదవాలి.
- అందులోని విభాగాలు/ అంశాల వారీ సన్నద్ధత ప్రారంభించాలి. ఇందుకోసం ఇంటర్మీడియట్, హైస్కూల్ పాఠ్యపుస్తకాల్లోని సమాచారం కొంత వరకు ఉపయోగపడుతుంది.
- ఏదైనా ఒక ప్రామాణిక పుస్తకాన్నే తీసుకుని, పూర్తిగా అధ్యయనం చేయాలి. అందులోని మాదిరి ప్రశ్నలన్నీ పూర్తిగా సాధన చేయాలి.
- గత పరీక్ష ప్రశ్నపత్రాలు నిశితంగా పరిశీలించాలి. విభాగాల వారీ ఎలాంటి ప్రశ్నలు వస్తున్నాయి, ఏ స్థాయిలో అడుగుతున్నారు. వాటి కోసం ఏం చదవాలో అవగాహన ఏర్పడుతుంది.
- పరీక్షకు ముందు కనీసం పది మాక్ టెస్టులు రాసి, ఫలితాలు సమీక్షించుకుని, తప్పులు పునరావృతం కాకుండా చూసుకోగలిగితే నిఫ్ట్‌లో సీటు ఖాయమైనట్టే.

ఉద్యోగాలిలా..

నిఫ్ట్‌లో కోర్సులు పూర్తిచేసుకున్నవారిని బహుళ జాతి సంస్థలు ప్రాంగణ నియామకాల్లో ఎంపిక చేసుకుంటున్నాయి. దీంతో నైపుణ్యం ఉన్నవారు సులువుగానే అవకాశాలు అందుకుంటున్నారు. ప్రతి సందర్భాన్నీ వేడుకగా నిర్వహించే సంస్కృతీ పెరుగుతోంది. కార్యక్రమం ప్రకారం దుస్తులు, యాక్సెసరీస్ ఉపయోగిస్తున్నారు. అందువల్ల ఆకట్టుకునేలా, వైవిధ్యం ఉట్టిపడేలా.. డిజైన్ చేయగలిగే నైపుణ్యం ఉన్నవాళ్లు లక్షల్లో సంపాదిస్తున్నారు. సొంతగా బొటిక్ నిర్వహించుకోవచ్చు. వెండితెర, బుల్లితెర, ఓటీటీల వేదికల్లోనూ అవకాశాలు అందుకోవచ్చు.

వివరాలు

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 6. రూ.5000 ఫైన్‌తో జనవరి 10.

పరీక్ష ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.500. మిగిలిన అందరికీ రూ.2000. రెండు కోర్సులకైతే.. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.750, మిగిలిన అందరికీ రూ.3000.

ప్రవేశ పరీక్ష తేదీ: ఫిబ్రవరి 8

వెబ్‌సైట్: https://www.nift.ac.in/admission

ఏసీసీఏ కోర్సు ఎంత మేలు?

మా అబ్బాయి ఇంటర్మీడియట్ (ఎంఈసీ) రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఏసీసీఏ కోర్సుతో ఎలాంటి ప్రయోజనం ఉంటుంది? - కేవీఆర్ రావు

■ అసోసియేషన్ ఆఫ్ చార్టర్డ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్ (ఏసీసీఏ) లండన్ కేంద్రంగా ఉన్న ప్రసిద్ధ ప్రొఫెషనల్ అకౌంటింగ్ సంస్థ. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో ఏసీసీఏకు గుర్తింపు ఉంది. మనదేశంలోనూ ఈ కోర్సు ప్రాధాన్యం పెరుగుతోంది. గ్లోబల్ కెరియర్ లక్ష్యంగా ఉన్నవారికి ఏసీసీఏ ఒక మంచి ఉపాధి అవకాశం.

◗ ఈ కోర్సులో మొత్తం 13 పేపర్లు ఉంటాయి. వీటిలో ఫైనాన్షియల్ అకౌంటింగ్, మేనేజ్‌మెంట్ అకౌంటింగ్, ట్యాక్సేషన్, ఆడిటింగ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ బిజినెస్ లీడర్‌షిప్ లాంటివి ముఖ్యమైనవి. ఏసీసీఏ పరీక్షల ఉత్తీర్ణతతో పాటు 36 నెలల ప్రాక్టికల్ అనుభవం కూడా పూర్తిచేయాలి.

◗ మన దేశంలో ఏసీసీఏ అర్హతతో బహుళ జాతి సంస్థలు, బిగ్ ఫోర్ ఆడిట్ ఫర్మ్‌లు (డెలాయిట్, ఈవై, కేపీఎంజీ, పీడబ్ల్యూసీ), ఆర్థిక సేవలు అందించే సంస్థలు, కార్పొరేట్ కంపెనీల్లో ఎక్కువ ఉద్యోగాలుంటాయి. ఫైనాన్షియల్ అకౌంటెంట్, ఆడిటర్, ట్యాక్స్ కన్సల్టెంట్, ఫైనాన్షియల్ అనలిస్ట్, రిస్క్ మేనేజర్ లాంటి హోదాలు లభిస్తాయి. ప్రారంభ వార్షిక వేతనం సాధారణంగా ఆరు లక్షల నుంచి పది లక్షల రూపాయల వరకు ఉంటుంది. వీరికి గ్లోబల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ స్టాండర్డ్స్‌పై లోతైన అవగాహన ఉండటం వల్ల అంతర్జాతీయ సంస్థల్లో అధిక వేతనంతో ఉద్యోగాలు సులభంగా లభిస్తాయి.

◗ మన దేశ సీఏ కోర్సుతో పోలిస్తే ఏసీసీఏ కోర్సు ప్రపంచ దృక్పథంతో రూపొందించారు. సీఏ ప్రధానంగా భారతదేశ నిబంధనలు, టాక్స్ చట్టాలపై దృష్టి పెడుతుంది. ఏసీసీఏ అంతర్జాతీయ అకౌంటింగ్ ప్రమాణాలపై అవగాహన కలిగిస్తుంది. ఉత్తీర్ణత శాతం పరంగా ఏసీసీఏ కొంత మెరుగ్గా ఉండటం వల్ల, ఏదైనా డిగ్రీ కోర్సు చదువుతూ పూర్తి చేయవచ్చు. అయితే భారతదేశంలో ప్రైవేట్ ప్రాక్టీస్ చేయాలంటే సీఏకి చట్టపరమైన అధికారాలు ఎక్కువగా ఉంటాయి. అకౌంటింగ్, ఫైనాన్స్, ఆడిట్ రంగాల్లో విశ్వవ్యాప్త అవకాశాలు పొందాలనుకునేవారికి ఏసీసీఏ సరైన మార్గం.

ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఏసీసీఏను వెంటనే ప్రారంభించవచ్చు. ముఖ్యంగా బీకామ్, బీబీఏ, బీబీఎం, ఎంబీఏ చదువుతోన్న లేదా పూర్తిచేసిన వారికి ఎక్కువ పేపర్ల మినహాయింపు లభిస్తుంది. మ్యాథ్స్, అకౌంటింగ్‌పై ప్రాథమిక అవగాహన ఉన్నవారికి ఈ కోర్సు సులువుగానే అనిపిస్తుంది. వయసు నిబంధన లేకపోవడం ఏసీసీఏ ప్రత్యేకత.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఎన్‌సీఈఆర్‌టీలో..

నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెయినింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ), న్యూదిల్లీ.. గ్రూప్- ఏ, బీ, సీ విభాగాల్లో 173 నాన్ అకడమిక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- గ్రూప్-ఏ: 09 పోస్టులు
- గ్రూప్-బీ: 26 పోస్టులు
- గ్రూప్-సీ: 138 పోస్టులు

అర్హతలు: పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్, సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

ఎంపిక: పోస్టుల ప్రకారం రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూలతో.

దరఖాస్తు ఫీజు: గ్రూప్-ఏ పోస్టులకు రూ.1,500. గ్రూప్-బీ పోస్టులకు రూ.1,200. గ్రూప్-సీ పోస్టులకు రూ.1,000. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 16.01.2026.

వెబ్‌సైట్: https://ncert.nic.in/

అప్రెంటిస్‌షిప్

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ 501 అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, టెలికమ్యూనికేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెషినిస్ట్, డేటా ఎంట్రీ, సివిల్, ఫిట్టర్.. మొదలైనవి..

అర్హత: సంబంధిత విభాగంలో పదో తరగతి, ఐటీఐ, డిగ్రీ ఉండాలి.

వయసు: 31.12.2025 నాటికి 18 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 12.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.

వెబ్‌సైట్: https://iocl.com/apprenticeships

నాబార్డ్‌లో యంగ్ ప్రొఫెషనల్స్

నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్), ముంబయి.. ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- యంగ్ ప్రొఫెషనల్: 44 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: నవంబరు 1, 1995 - నవంబరు 1, 2004 మధ్య జన్మించినవారు అర్హులు.

వేతనం: నెలకు రూ.70,000.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 12.

దరఖాస్తు ఫీజు: రూ.150.

ఎంపిక: విద్యార్హతల్లో సాధించిన మెరిట్, ఇంటర్వ్యూలతో.

వెబ్‌సైట్: https://www.nabard.org/careers-notices1.aspx?cid=693&id=26

రన్‌వే కాదండోయ్.. అలిపిరి తనిఖీ కేంద్రం

నిత్యం తిరుమలకు వెళ్లే వాహనాలతో రద్దీగా ఉండే తిరుపతిలోని అలిపిరి తనిఖీ కేంద్రం ఆదివారం సాయంత్రం కర్ఫ్యూను తలపించింది. వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో తితిదే శ్రీవారి భక్తులకు తిరుపతిలో అందజేసే ఉచిత సర్వదర్శన టోకెన్ల జారీని నిలిపివేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. **-ఈనాడు, తిరుపతి**

ఓటీపీ చెప్పాడు.. రూ.4 లక్షలు మాయం

చంద్రగిరి, న్యూస్‌టుడే: పట్టణంలో సైబర్ నేరగాళ్ల ఉచ్చుకు ఓ వ్యాపారవేత్త బలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణానికి చెందిన ఓ వ్యాపారవేత్తకు సైబర్ మోసగాళ్లు ఆదివారం ఫోన్ చేశారు. ఫ్లిప్‌కార్ట్‌లో ఆర్డర్ పెట్టారని, డెలివరీ పూర్తయ్యిందని చెప్పి బాధితుడిని నమ్మించారు. డెలివరీ నిర్ధారణ కోసం ఓటీపీ చెప్పాలని కోరడంతో వారి మాటలను నమ్మిన వ్యాపారవేత్త ఓటీపీ వివరాలు వెల్లడించాడు. నిమిషాల వ్యవధిలోనే బాధితుడి ఖాతా నుంచి రూ.4 లక్షలు మాయమయ్యాయి. మోసం జరిగినట్లు గుర్తించిన బాధితుడు వెంటనే చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును సైబర్ క్రైమ్ పోలీసులకు బదిలీ చేసి దర్యాప్తు ప్రారంభించారు.

విద్యుదాఘాతంతో మద్యం దుకాణం దగ్ధం

చంద్రగిరి, న్యూస్‌టుడే: తొండవాడ బస్టాండు ప్రాంతంలోని వీబీ వైన్స్ దుకాణంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో రూ.లక్షల విలువైన మద్యం ఆహుతైంది. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా దుకాణంలోని మీటర్‌బోర్డు కాలిపోవడంతో మంటలు చెలరేగి దుకాణం దగ్ధమైంది. ఆదివారం ఉదయం యజమాని విజయభాస్కర్‌రెడ్డి దుకాణం తెరచి చూడగా అగ్ని ప్రమాదం జరిగినట్లు గుర్తించాడు. విషయాన్ని ఎక్సైజ్ శాఖ, పోలీసుశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. సంబంధిత అధికారులు సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: పశువులు మేపుతున్న మహిళ మెడలోని బంగారు గొలుసుని దుండగులు లాక్కెళ్లారు. పోలీసుల వివరాల మేరకు.. ఉదయమాణిక్యం పంచాయతీ రాజులపల్లికి చెందిన సావిత్రమ్మ(62) ఆదివారం స్థానిక శివాలయం సమీపంలో పశువులను మేపుతోంది. ద్విచక్ర వాహనంలో వచ్చిన ఇద్దరు యువకులు ఆమెని మాటల్లో పెట్టి మెడలోని గొలుసును లాక్కుని పరారయ్యారని ఎస్సై లోకేశ్ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు

పెరటి కోళ్ల పెంపకం.. లాభదాయకం

మహిళా సంఘాలకు రాయితీపై అందజేత

తిరుపతి(గ్రామీణం), న్యూస్‌టుడే: పొదుపు సంఘాల మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోంది. బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తూ, వాటిని తిరిగి చెల్లించడానికి మహిళలు ఇబ్బంది పడకుండా ఉండడానికి ఆదాయ మార్గాలను చూపుతోంది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు పెరటి కోళ్లు పంపిణీ చేసి ఇంటి వద్దే వాటిని సంరక్షించి, ఆరోగ్యంతో పాటు ఆదాయం పొందడానికి తోడ్పాటు అందిస్తోంది. చంద్రగిరి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 450 యూనిట్లు (4950 పెరటి కోళ్లు) పంపిణీ చేయడం గమనార్హం.

మండలం	మంజూరైన యూనిట్లు
తిరుపతి గ్రామీణం	116
పాకాల	100
రామచంద్రాపురం	100
చంద్రగిరి	34
ఎర్రావారిపాళెం	100

ఐదు మండలాల్లో పంపిణీ

నియోజకవర్గంలో తిరుపతి గ్రామీణం, చంద్రగిరి, పాకాల, రామచంద్రాపురం, ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో ప్రధానంగా వ్యవసాయంపై 70 శాతం కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రభుత్వం రాయితీపై పెరటి కోళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 450 యూనిట్లు పంపిణీ చేశారు. లబ్ధిదారులు రూ.3100 చెల్లిస్తే ఒక్కో మహిళకు 8 పెట్ట కోళ్లు, 3 పుంజులు(1 యూనిట్) పంపిణీ చేస్తారు. ఒక్కో కోడి సుమారు కిలో నుంచి 1.25 కిలోల బరువు ఉంటుంది. మార్కెట్లో నాటుకోడి కిలో రూ.550 నుంచి రూ.600 వరకు పలుకుతోంది. చిన్నగొట్టిగల్లు మినహా ఐదు మండలాల్లోని మహిళలు పెరటికోళ్ల పెంపకానికి దరఖాస్తు చేసుకున్నారు.

కోళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి సుధారెడ్డి

ఆరోగ్యంతో పాటు ఆదాయం

రైతులు తాము పండించే ధాన్యాలతోనే ఇళ్ల వద్దే వీటిని పెంచుకుని వీటి ద్వారా కోడిగుడ్లు పొందొచ్చు. కోళ్లను విక్రయించుకోవచ్చు. కోడిగుడ్డు మంచి ప్రొటీన్ కావడంతో ఎక్కువ మంది వీటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. మార్కెట్లో నాటు కోడి గుడ్డు రూ.10 విక్రయిస్తున్నారు. ఈ లెక్కన మహిళలు కోడిగుడ్ల ద్వారా మంచి ఆదాయం పొందొచ్చు. వీటిని ఆహారంగా తీసుకోవడం వల్ల మంచి ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చు.

గరుడ కూడలిలో ఏకాదశి శోభ

వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని తితిదే అధికారులు తిరుపతి గరుడ కూడలిలో కనువిందు చేస్తూ విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. అలిపిరి కాలినడక మార్గం పాదాల మండపం వద్ద విద్యుద్దీపాలంకరణ వెలుగులు ఇల వైకుంఠాన్ని తలపిస్తున్నాయి. దేవాతామూర్తుల నమూనాలు ఆకట్టుకుంటున్నాయి. **-ఈనాడు, తిరుపతి**

నేటి పవన్‌కల్యాణ్ పర్యటన రద్దు?

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరుగుతున్న భారతీయ విజ్ఞాన సమ్మేళనం ముగింపు కార్యక్రమానికి సోమవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాల్గొనాల్సి ఉంది. అయితే ఆయన హాజరు కావడం లేదని సమాచారం.

‘సమానత్వం చూపిన ఘనత కాంగ్రెస్‌దే’

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: ప్రజలకు సమానత్వాన్ని ఇచ్చి, అంటరానితనాన్ని రూపుమాపిన ఘనత కాంగ్రెస్‌దేనని డీసీసీ మాజీ అధ్యక్షురాలు తేజోవతి, నాయకురాలు మునిశోభ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని పాత నగరపాలిక కార్యాలయం వద్ద ఆ పార్టీ నేతలు వేడుకలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశంలోని మారుమూల గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, రోడ్లు, వీధి దీపాలు, ఇంటింటికి విద్యుత్తు ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అని స్పష్టం చేశారు.

సంబరాల్లో నాయకురాళ్లు, నాయకులు

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: మొక్కలు నాటి సంరక్షించడంతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్-1 యూనిట్ ప్రోగ్రాం అధికారిని విశాలి పేర్కొన్నారు. ఆదివారం పాతకాల్వ గ్రామంలో గ్రామస్థులకు మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం వాలంటీర్లతో కలిసి గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వాలంటీర్లు, గ్రామస్థులు

మట్టి కుప్పల తొలగింపు

స్పందనకు పందనం

తిరుపతి(గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని రాయలచెరువు ప్రధానో రోడ్డు మధ్యలోని మట్టి కుప్పలు తొలగించారు. సమస్యపై ఈనాడులో ఇటీవల వార్త వెలువడింది. స్పందించిన పంచాయతీ అధికారులు మట్టి కుప్పలు తొలగించారు.

మళ్లీ ఏనుగుల సంచారం

చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: శేషాచల అటవీ సమీప గ్రామాల్లోని రైతులు ఏనుగుల రాకతో భయాందోళనకు లోనవుతున్నారు. కొద్ది రోజులకు ముందు రంగంపేట, నాగపట్ల సమీపంలోకి వచ్చిన ఏనుగులు శనివారం అర్ధరాత్రి మళ్లీ వచ్చాయి. సుమారు 11 పెద్ద ఏనుగులు, 3 గున్న ఏనుగులు సంచరించాయి. రైతులు మునిరెడ్డి, సిద్ధప్పకు చెందిన సుమారు మూడు ఎకరాల పచ్చగడ్డిని, కొబ్బరి చెట్లు, మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. రైతులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఏనుగులను దట్టమైన అటవీ ప్రాంతంలోకి తరిమేశారు. అవి కళ్యాణి డ్యాం పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నాయని, మళ్లీ వచ్చే అవకాశం ఉందని డీఆర్‌వో చైతన్య తెలిపారు. ఎఫ్‌బీవో రవి బేస్ క్యాంపు సిబ్బందితో రెండు బృందాలుగా ఏర్పడి ఏనుగులు అడవి నుంచి బయటకు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

ధ్వంసమైన పంటను చూపుతున్న రైతు

పొంచి ఉన్న పెను ప్రమాదం

ఆర్‌ఎఫ్ రోడ్డు మార్గంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన గేటు సమీపంలో రోడ్డు పక్కన వేప, నీలగిరి తైలం చెట్ల కొమ్మలు 33 కేవీ విద్యుత్తు తీగలపై ఒరిగిపోయి ప్రమాద భరితంగా ఉన్నాయి. ఇదే మార్గంలో నిత్యం విద్యార్థులు, పాదచారులు, వాహనచోదకులు ప్రయాణాలు చేస్తున్నారు. పెనుగాలులు వీచినా.. పెద్దపాటి వర్షం వచ్చినా చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్తు తీగలపై పడే అవకాశాలు ఉన్నాయి. పెనుప్రమాదం చోటుచేసుకోకముందే కొమ్మలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, చంద్రగిరి**

గ్రామీణ క్రీడ కబడ్డీని ప్రోత్సహించాలి

తిరుపతి(గ్రామీణం), న్యూస్‌టుడే: గ్రామీణ క్రీడ కబడ్డీని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పెరుమాళ్లపల్లి యంగ్‌మెన్స్ రీక్రియేషన్ క్లబ్ నిర్వాహకులు పేర్కొన్నారు. గ్రామీణ మండలం పెరుమాళ్లపల్లి గ్రామంలో జనవరి 25, 26 తేదీల్లో నిర్వహించనున్న అంతరాష్ట్ర కబడ్డీ పోటీలకు సంబంధించి ఆదివారం సన్నాహక సమావేశాన్ని కమిటీ సభ్యులు నిర్వహించారు. సభ్యులు మాట్లాడుతూ రిపబ్లిక్ డేని పురస్కరించుకుని జనవరి 25, 26వ తేదీలలో గ్రామంలో కబడ్డీపోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లాతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి కబడ్డీ జట్లు పాల్గొంటాయని తెలిపారు. క్రీడాకారులకు వసతి, భద్రత ఏర్పాట్లు, బహుమతుల పంపిణీ తదితర అంశాలపై చర్చించారు.

సమావేశానికి హాజరైన నిర్వాహకులు

ఆధ్యాత్మిక మార్గదర్శనం భగవద్గీత

చంద్రగిరి, న్యూస్‌టుడే: సమకాలిన జీవితంలో ఆధ్యాత్మిక మార్గదర్శకంగా భగవద్గీత నిలుస్తుందని విశ్రాంత కో ఆపరేటివ్ డిప్యూటీ రిజిస్ట్రార్ పరంధామ పిళ్లై అన్నారు. రాయలపురం పంచాయతీ వెంకటంపేటలోని వైఎస్‌ఎంఆర్ కల్యాణమండపంలో ఆదివారం కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌కి చెందిన విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో చిత్తూరుకి చెందిన విశ్రాంత కోఆపరేటివ్ డిప్యూటీ రిజిస్ట్రార్ పరంధామపిళ్లై భగవద్గీతను సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించిన గ్రంథాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ధర్మం చేయడం మనధర్మమని, ఫలితాన్ని భగవంతుని అర్పించడం మనశ్శాంతి అనే గీత సందేశాన్ని కేంద్రంగా చేసుకుని భావితరాలకు ఉపయోగపడేలా శ్రీమద్భగవద్గీతను తెలుగు భాషలోకి అనువదించామన్నారు. పరంధామపిళ్లై దంపతులను సహచర విశ్రాంత ఉద్యోగులు సత్కరించారు. విశ్రాంత ఉద్యోగులు యారాశి మదన్‌మోహన్‌రెడ్డి, కె.మదన్‌మోహన్‌రెడ్డి, క్షేత్రపాళ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

(c) eenadu

ఈనాడు విశాఖపట్నం
సోమవారం 29 డిసెంబరు 2025 సిటీ 5

ఉత్తర ద్వారంలో కనులారా స్వామిని దర్శించుకునేలా..!

సింహాచలం, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సింహాద్రి అప్పన్న స్వామి దర్శనానికి సుమారు 50 వేల మంది భక్తులు వస్తారనే అంచనాతో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా వివరాలను ఆదివారం ఈవో సుజాత విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

ఉత్తర రాజగోపురం వద్ద జరుగుతున్న పనులు

★ 'ఈ ఏడాది ఆన్‌లైన్ ద్వారా 9వేల టికెట్లు విక్రయిస్తున్నారు. సోమవారం సాయంత్రం వరకు అవి అందుబాటులో ఉంటాయి. ఉత్తర ద్వారంలో కొలువైన స్వామిని భక్తులు క్యూలైన్ల ద్వారా పది నిమిషాల పాటు దర్శించుకునేలా ఏర్పాట్లు చేశాం. ఉదయం 11గంటల వరకే ఈ దర్శనం ఉంటుంది. తర్వాత వచ్చిన భక్తులకు సాధారణ దర్శనాలు ఉంటాయి. 30న కేవలం లడ్డూ ప్రసాదం మాత్రమే విక్రయిస్తాం. ఆ మేరకు లక్ష లడ్డూలు తయారు చేయిస్తున్నాం. 20వేల మంది భక్తులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు పొంగలి, పులుసు సిద్ధం చేస్తున్నాం.

★ వాహనాల రద్దీ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు. వివిధ ప్రభుత్వశాఖల సమన్వయంతో పాటు దేవాదాయశాఖ నుంచి అదనపు సిబ్బంది రప్పించేలా చర్యలు తీసుకున్నాం. స్వచ్ఛంద సేవకుల సహకారం తీసుకుంటున్నాం. 29న సాయంత్రం 6 గంటలకు స్వామివారి దర్శనాలు నిలిపివేస్తాం. ఈ సందర్భంగా కొండ కింద నుంచి బస్సులు ఉండవు. 30వ తేదీ వేకువజామున 4 గంటల నుంచి సింహగిరికి బస్సులు ప్రారంభమవుతాయి' అని ఈవో పేర్కొన్నారు.

★ ఏఈవోలు తిరుమలేశ్వరరావు, రమణమూర్తి, ఈఈ సీహెచ్.రమణ, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

అరకు పర్యాటకులకు అదనపు రైలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: పండగ రోజుల్లో ప్రయాణికులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాల గురించి తెలుసుకునేందుకు వాల్తేర్ డీఆర్ఎం లలిత్ బోహ్రా ఆదివారం విశాఖ రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్లాట్‌ఫామ్‌ల పరిశుభ్రత, ప్రయాణికుల భద్రతకు సంబంధించిన అంశాలపై ఆరా తీశారు. విశాఖ - కిరండూల్ రైలుకు అరకు ప్రయాణికుల తాకిడి అమాంతం పెరగడంతో తలెత్తుతున్న ఇబ్బందులపై 'ఈనాడు'లో వరుసగా ప్రచురితమైన కథనాలకు ఆయన స్పందించారు. రద్దీ రోజుల్లో విశాఖ-అరకు మధ్య ప్రత్యేక రైలు నడపడంతో పాటు, ప్రస్తుతం నడుస్తున్న రైలుకు ఒక సాధారణ రెండో తరగతి బోగీని అదనంగా జత చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 29 నుంచి జనవరి 20 వరకు విశాఖ - కిరండూల్ రైలుకు, ఈనెల 30 నుంచి జనవరి 21 వరకు కిరండూల్-విశాఖ రైలుకు ఒక అదనపు సాధారణ బోగీ జత చేయనున్నట్లు తెలిపారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 29న విశాఖ-అరకు(08525/08526) ప్రత్యేక రైలు నడపనున్నట్లు ప్రకటించారు.

అత్యవసర వేళ ఆపసోపాలు..!

★ పర్యాటక ప్రాంతాల్లో అరకొరగా మరుగుదొడ్లు
★ తీవ్ర ఇబ్బందులు పడుతున్న సందర్శకులు

పరిశీలన

రుషికొండలో నిర్మాణ దశలోనే..

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, సాగర్‌నగర్, పెదవాల్తేరు: గమ్యనగరిగా పేరుగాంచిన విశాఖకు ఇటీవల పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆర్కేబీచ్, కైలాసగిరి, వుడా పార్కు, రుషికొండ వంటి ప్రాంతాలు ప్రస్తుతం సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. అయితే అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించడంలో వీఎంఆర్డీఏ యంత్రాంగం విఫలమవుతోందనే విమర్శలు వస్తున్నాయి. ఆదివారం నగరంలోని పలు ప్రాంతాలను 'ఈనాడు' పరిశీలించగా పర్యాటకులు పడుతున్న ఇబ్బందులు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా మరుగుదొడ్లు అందుబాటులో లేక, ఎక్కడికి వెళ్లాలో తెలియక మహిళలు అవస్థలు పడటం కనిపించింది.

రుషికొండలో కేవలం రెండు మరుగుదొడ్లు: బ్లూఫ్లాగ్ గుర్తింపు పొందిన రుషికొండ బీచ్‌ను నిత్యం 10వేల మందికి పైగా సందర్శిస్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో కేవలం రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉండటం గమనార్హం. దీంతో పర్యాటకులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. జీవీఎంసీ నిధులు రూ.55 లక్షలతో 22 మరుగుదొడ్ల నిర్మాణానికి జులైలో శంకుస్థాపన చేశారు. ఆయా పనులు నత్తనడకన సాగుతున్నాయి. సాగర్‌నగర్ బీచ్‌లో గతంలో ఉన్న కంటైనర్ మరుగుదొడ్లను తొలగించేశారు.

★ బీచ్ రోడ్డులో వుడా పార్కు నుంచి కోస్టల్‌బ్యాటరీ వరకు నాలుగు చోట్ల జీవీఎంసీ ఆధ్వర్యంలో నడిచే ప్రజామరుగుదొడ్లు ఉన్నాయి. కోస్టల్‌బ్యాటరీ నుంచి ఆర్‌కే బీచ్ వరకు ప్రస్తుతం ఒకటి ఉండగా మరో రెండు ఏర్పాటు చేయాల్సి ఉంది. వుడా పార్కు నుంచి కోస్టల్‌బ్యాటరీ మధ్య ప్రస్తుతం నాలుగు ఉండగా, వాటిని రెట్టింపు చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజా మరుగుదొడ్లు ఉన్న ప్రాంతాలు..

కోస్టల్‌బ్యాటరీ: 2	తెన్నేటి పార్క్: 1
ఆర్‌కే బీచ్: 2	పాండురంగాపురం: 1
వైఎంసీఏ: 1	రుషికొండ కూడలి: 1
జోడుగుళ్ల పాలెం: 1	

ఇతర ప్రాంతాల్లో ఇలా..: వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో కురుసురా జలాంతర్గామి, టీయూ-142, సీహారియర్ యుద్ధ విమానం, యూహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం ఉన్నాయి. వీటి నుంచి ఏటా రూ.5 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా మరుగుదొడ్లు లేకపోవడం గమనార్హం. ★ ఆర్‌కేబీచ్ కాళీమాత ఆలయం సమీపంలోని మరుగుదొడ్లు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని అదనంగా రెండు యూనిట్లు ఏర్పాటు చేయాలి. ★ దీనిపై వీఎంఆర్డీఏ కార్యదర్శి మురళీకృష్ణను సంప్రదించగా పర్యాటక ప్రాంతాలను పరిశీలించి అవసరమైన చోట అదనపు మరుగుదొడ్లు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు.

పాత రూపు చెదరకుండా ఆధునికంగా తీర్చిదిద్దిన ఇల్లు

మెచ్చేలా.. ఆపాతమధురం గుర్తుకు తెచ్చేలా..!

లోపలి గదులు ఇలా..

వివాహాల ట్రెండ్ మారుతోంది.. భారీ కల్యాణమండపాలు, అత్యాధునిక హంగులను ఇష్టపడేవారు కొందరైతే.. కొందరు ఆహ్లాదం.. సంప్రదాయ వాతావరణంపై మక్కువ చూపుతుంటారు. ఇలాంటి వారి కోసమే నగరంలో కొత్త తరహా వెడ్డింగ్ డెస్టినేషన్ సంస్థలు వెలుస్తున్నాయి. అమ్మమ్మ...నానమ్మ ఇళ్లల్లో పెళ్లి చేసుకున్న అనుభూతి కలిగించేలా విశాఖ మహానగరంలో కల్యాణ మండపాలను ముస్తాబు చేస్తున్నారు. కొమ్మాది వెళ్తే ఆపాతమధురాలు దర్శనమిస్తాయి. – ఈనాడు, విశాఖపట్నం

మలి వయసులో మేటి అథ్లెట్..!

పరుగులో లతాదాస్ అద్భుతాలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: మలి వయసులోనూ అద్భుతాలు చేస్తున్నారు ఏయూపీఈ కాలనీకి చెందిన కె.లతాదాస్ (72). ప్రపంచంలో ఎక్కడ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు జరిగినా పాల్గొని పతకాలు కైవసం చేసుకుంటున్నారు. ఇటీవల చెన్నైలో జరిగిన ఆసియా స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటి ప్రశంసలు అందుకున్నారు.

★ లతాదాస్ ఏయూపీఈ కాలనీలోని ఆశ్వార్ దాస్ పబ్లిక్ స్కూల్‌లో 28ఏళ్లుగా వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. 15ఏళ్ల వయసు నుంచే పరుగు పోటీల్లో పాల్గొనడం ప్రారంభించారు. వివాహమైన తర్వాత కూడా పరుగును ఆపలేదు. 1996 నుంచి మాస్టర్స్ అథ్లెటిక్స్‌పై దృష్టి పెట్టారు. పరుగు, హర్డిల్స్, ట్రిపుల్‌జంప్ విభాగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తూ దూసుకెళ్తున్నారు. అంతేకాదండోయ్ మూడుసార్లు హిమాలయ పర్వతాలపై ట్రెక్కింగ్ చేశారు. వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూనే యోగా కోర్సులో పీజీ డిప్లమో పూర్తి చేశారు.

సాధించిన విజయాలు: 1995లో ఇండోనేషియా జకార్తాలో జరిగిన ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్ 10వేల మీటర్ల పరుగులో పాల్గొని కాంస్య పతకం సాధించారు. 2010 కౌలాలంపూర్, 2013 బ్రెజిల్, 2014 జపాన్, 2018 స్పెయిన్, 2019 ఫిన్‌లాండ్, 2024 స్వీడన్ దేశాల్లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు కొల్లగొట్టారు.

ఇదీ ఆరోగ్య రహస్యం: 'ప్రతిరోజు రాత్రి 10గంటలకల్లా నిద్ర పోతా.. తెల్లవారుజామున 4గంటలకు నిద్ర లేస్తా.. 4.45 నుంచి 5.45గంటల వరకు జాగింగ్ చేస్తా. ఉదయం రాగిజావ, పాలు, స్వల్పంగా అల్పాహారం తీసుకుంటా. అనంతరం విధులకు హాజరవుతా. సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత గంట సమయం యోగా చేస్తా'నని లతాదాస్ తెలిపారు. 2026 జూన్‌లో దక్షిణ కొరియాలో జరిగే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

సాధించిన పతకాలు	స్వర్ణం	రజతం	కాంస్యం
అంతర్జాతీయ	8	12	10
జాతీయ	150	50	320

ర్యాంప్‌వాక్ భలే.. ఉత్సాహం ఉరకలేసే..!

ద్వారకానగర్ సెంట్రల్ పార్కు వద్ద ఓ ప్రయివేటు సంస్థ ఆదివారం మోడలింగ్‌పై ఉచిత కార్యశాల ఏర్పాటు చేసింది. దీంతో ఆసక్తి ఉన్న వారు అప్పటికప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. చిన్నారులు, యువతకు ర్యాంప్‌పై ఎలా నడవాలి, మోడలింగ్ ఎలా చేయాలి, ఆకట్టుకునేలా ఎలాంటి దుస్తులు ధరించాలి అంశాలపై నిర్వాహకులు మెలకువలు నేర్పించారు. అనంతరం పిల్లలు, యువతులు వేదికపై ఉత్సాహంగా ర్యాంప్‌వాక్ చేసి అలరించారు. – ఈనాడు, విశాఖపట్నం

దిల్లీ వేదికపై గళం విప్పే అవకాశం..!

జాతీయ యువజనోత్సవానికి ఏయూ విద్యార్థి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం జాగ్రఫీ పరిశోధక విద్యార్థి పి.శ్యామ్‌కుమార్‌కు దిల్లీ వేదికపై గళం విప్పే అవకాశం లభించింది. జాతీయ యువజనోత్సవాలలో భాగంగా జనవరి 9 నుంచి 12వరకు దిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించనున్న 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. 'ప్రజాస్వామ్యం - వికసిత్ భారత్ ప్రయాణంలో యువత పాత్ర' అంశంపై తన గళం వినిపించనున్నారు.

థీమ్ ఇదీ...: యంగ్ లీడర్స్ డైలాగ్‌లో పది రకాల థీమ్‌లు నిర్దేశించారు. అందులో శ్యామ్‌కుమార్ 'ప్రజాస్వామ్యం - వికసిత్ భారత్ ప్రయాణంలో యువత పాత్ర' ఎంచుకున్నారు. ఈ థీమ్‌కు దేశవ్యాప్తంగా 30 మంది పోటీ పడనున్నారు. అందులో శ్యామ్‌కుమార్ విజయం సాధించి ఏయూకు పేరు తీసుకురావాలని వీసీ ఆచార్య రాజశేఖర్ ఆకాంక్షించారు.

ఆన్‌లైన్‌లో శోధించి...: ఏయూలో ఎమ్మెస్సీ జాగ్రఫీ చేసిన పి.శ్యామ్‌కుమార్ 2024లో అదే విభాగంలో పరిశోధక విద్యార్థిగా చేరారు. జాతీయ స్థాయిలో జరిగే వివిధ పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉండేది. ఈ ఏడాది సెప్టెంబరులో ఆన్‌లైన్‌లో భారత ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రకటన ఒకటి ఆతన్ని ఆకర్షించింది. అందులో జాతీయ యువజనోత్సవాలలో భాగంగా 'యంగ్ లీడర్స్ డైలాగ్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉంది. వెంటనే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దేశవ్యాప్తంగా 30లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, వారికి ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు నిర్వహించారు. అందులో 4లక్షల మంది ఉత్తీర్ణులయ్యారు. తర్వాత ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించగా మన రాష్ట్రం నుంచి 750మంది ఎంపికయ్యారు. వారికి ఆచార్య నాగార్జున వర్సిటీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఏర్పాటు చేయగా 45మంది మాత్రమే ఎంపికయ్యారు. వారిలో విశాఖపట్నం నుంచి శ్యామ్‌కుమార్ ఉన్నారు.

స్పీడు బోటుకు ట్రాక్టర్ సాయం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్‌లో విన్యాసాలు చేసే టూరిజం స్పీడు బోట్లను స్థానిక తీరంలో ఉంచిన సురక్షిత ప్రదేశం నుంచి ట్రాక్టర్ సహాయంతో రోజూ ఉదయం సముద్రం వద్దకు, తదనంతరం సాయంత్రం తిరిగి అదే చోటుకు చేర్చుతున్నారు. ఇక్కడ పర్యాటకశాఖకు చెందిన రెండు బోట్లతో పాటు ప్రైవేటు సంస్థలకు చెందిన నాలుగు బోట్లను నడుపుతున్నారు. తీరంలో సురక్షిత ప్రాంతం నుంచి వీటిని గతంలో మనుషులే మోసుకుంటూ వెళ్లేవారు. దీంతో వ్యయప్రయాసలతో పాటు పలు ఇబ్బందికర పరిణామాలు తలెత్తేవి. ఈ నేపథ్యంలో సమకూర్చుకున్న ట్రాక్టర్ ద్వారా వీటిని తరలిస్తున్నారు. దీంతో అన్ని విధాలుగా ప్రయోజనం చేకూరుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

కొండ చుట్టూ గోడ... స్థలాలు కొట్టేయడానికేనా?

★ ఎంపీ నిధులతో నిర్మాణంపై ఆడిట్ అభ్యంతరం
★ గత ప్రభుత్వంలో అధికారుల నిర్వాకం
★ పట్టించుకోని ప్రస్తుత యంత్రాంగం

ఈనాడు, విశాఖపట్నం: గత ప్రభుత్వ హయాంలో సింహాచలం కొండ చుట్టూ ప్రహరీ నిర్మించడంపై ఆడిట్ అభ్యంతరాలు రావడం చర్చనీయాంశమైంది. ఈ గోడ కోసం అప్పటి ఎంపీ విజయసాయిరెడ్డి ఎంపీ ల్యాడ్స్ నిధుల రూ.5కోట్లు కేటాయించారు. ఇప్పటివరకు సుమారు రూ.3 కోట్లు ఖర్చు చేశారు. ఎవరికీ ఉపయోగం లేని ఆయా పనులు చేపట్టడంపై ఆడిట్ అభ్యంతరం తలెత్తింది. అయినా అధికారులు ముందుకు వెళ్తుండడంపై విమర్శలు వస్తున్నాయి.

ఆరోపణలొచ్చినా..: గత ప్రభుత్వంలో ఎంపీ ల్యాడ్స్ నిధులను ఇష్టానుసారంగా కేటాయించారు. అవసరం లేకున్నా సింహాచలం కొండ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టారు. కొండపై విలువైన ఔషధ మొక్కలు, ఫలసాయం ఉండడం, అవి పరులపాలు కాకుండా ఉండాలంటే ప్రహరీ నిర్మించాలని వీఎంఆర్‌డీఏ అధికారులు నివేదిక తయారు చేసి అంచనాలు రూపొందించారు. టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. కొండ చుట్టూ ఉన్న స్థలాలు ఆక్రమించడానికే గోడ నిర్మాణాన్ని తెరపైకి తెచ్చారనే ఆరోపణలు వచ్చాయి. ఈ ప్రాజెక్టుపై సింహాచలం దేవస్థానం ముందు నుంచి ఆసక్తి చూపకపోవడం గమనార్హం.

చినగదిలిలో కొండ వద్ద నిర్మించిన ప్రహరీ

ఆగని పనులు...: గోడ నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నిధులు ఎలా కేటాయిస్తారని ఆడిట్ అధికారులు అభ్యంతరం తెలిపారు. ఆ సమయంలో నిధులు ఎలా కేటాయించారు, పనులు ఎలా చేపట్టారని ప్రశ్నించారు. దీనిపై జిల్లా అధికారులు నివేదిక సిద్ధం చేశారు. అప్పటి కలెక్టర్ మల్లికార్జున ఆయా పనులకు అనుమతులిచ్చారని నివేదికలో పేర్కొన్నారు. ఆ తర్వాత వచ్చిన కలెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్లు ప్రహరీ పనులను అడ్డుకోకపోవడం గమనార్హం.

మూడు ప్రాంతాల్లో నిర్మాణం: ప్రభుత్వం మారిన తర్వాత కొద్ది రోజులు పనులు ఆపినప్పటికీ తర్వాత కొందరు అధికారులు ఒత్తిడి తెచ్చి పనులు చేయించారు. ప్రస్తుతానికి అడివివరం, చినగదిలి, హనుమంతువాక వద్ద ప్రహరీ నిర్మాణం పూర్తయింది. ఇందుకోసం రూ.2.70 కోట్లు వరకు ఖర్చు చేశారు. మిగతా ప్రాంతాల్లో నిర్మించాలంటే మరో రూ.2 కోట్లు అవసరం. ఆడిట్ అభ్యంతరాలు వచ్చినా ఆయా పనులు పూర్తి చేయాలని ప్రస్తుత అధికారులు ముందుకు సాగుతుండటంపై విమర్శలొస్తున్నాయి. ఇప్పటికైనా నిధుల ఖర్చుపై పునరాలోచించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కలెక్టరేట్‌లో రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలపై వచ్చే వినతులను ప్రత్యేకంగా స్వీకరించేందుకు కలెక్టరేట్‌లో రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేశారు. దీని సేవలు ఈనెల 29వ తేదీ సోమవారం నుంచి అందుబాటులోకి వస్తాయని జేసీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక నుంచి ప్రతీ సోమవారం రెవెన్యూ క్లినిక్ సేవలందిస్తుందని, విశాఖ జిల్లాలో ఉన్న ఆర్డీఓలు, తహసీల్దార్లు ఇతర అధికారులు ఇక్కడ అందుబాటులో ఉంటారన్నారు. భూ సంబంధిత సమస్యలు, 22ఏ మినహాయింపులు, టైటిల్ డీడ్‌కు సంబంధించిన అంశాలు, రీసర్వే, భూ సరిహద్దుల నిర్ణయం వంటి సమస్యలపై ఇక్కడ బాధితులు ఫిర్యాదులు అందజేయవచ్చు. ఆయా సమస్యలను అక్కడికక్కడే అధికారులు పరిశీలన చేసి తగు చర్యలు తీసుకోనున్నారు.

బతుకుదారిలో తెల్లారిన జీవితాలు..!

చెట్టును ఢీకొన్న వ్యాన్: ఇద్దరి దుర్మరణం

మాధవధార, గజపతినగరం, న్యూస్‌టుడే: రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషించుకుంటున్న ఇద్దరిని బతుకు బండే బలితీసుకుంది. పని ముగించుకుని మరి కొన్ని గంటల్లో ఇళ్లకు చేరుకుంటామనే లోపే రోడ్డు ప్రమాదం వారిని శాశ్వతంగా ఈ లోకం నుంచి దూరం చేసింది. విజయనగరం జిల్లా గజపతినగరం రైల్వే స్టేషన్ రహదారి సమీపంలో ఆదివారం తెల్లవారుజామున వ్యాన్ చెట్టును ఢీకొట్టిన ప్రమాదంలో విశాఖ నగరానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. గజపతినగరం ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు, మృతుల బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. జీవీఎంసీ 49వ వార్డు ఎన్‌జీజీఓఎస్ కాలనీలో నివాసముంటున్న పొట్నూరు వినయ్‌కుమార్(35) తినుబండారాల వ్యాపారం నిర్వహిస్తుంటారు. బర్మా క్యాంప్ దరి జైభారత్‌నగర్‌కు చెందిన యల్లబిల్లి దినేష్(25)తో కలిసి సరకుల కోసం శనివారం వ్యానులో విశాఖ నుంచి రాయగడ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటలకు గజపతినగరం సమీపంలో వ్యాన్ అదుపు తప్పి రహదారి పక్కనున్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదన: పొట్నూరు వినయ్‌కుమార్‌కు భార్య వాసవి, కుమార్తె లాత్విక(5), కుమారుడు జయదీప్(3) ఉన్నారు. 18ఏళ్ల నుంచి ఒడిశా రాష్ట్రం రాయగడలో బేకరి సామగ్రిని కొనుగోలు చేసి నగరంలోని పలు దుకాణాలకు హోల్‌సేల్‌గా విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు.

★ యల్లబిల్లి దినేష్ జీవీఎంసీ శానిటేషన్ విభాగంలో తాత్కాలిక ఉద్యోగిగా పని చేస్తున్నారు. అతనికి భార్య లయ, రెండేళ్ల పాప, ఎనిమిది నెలల బాబు ఉన్నారు. దినేష్ సెలవు దినాల్లో డ్రైవింగ్ చేస్తుంటారు. జనవరి 1న అతని జన్మదినం. డ్రైవింగ్‌కు వెళ్తే మరింత డబ్బులు వస్తాయని, ఆ రోజు ఖర్చులకు ఉపయోగపడతాయని వినయ్‌కుమార్‌తో కలిసి రాయగడ వెళ్లారు. క్షేమంగా ఇంటికి తిరిగి వస్తారనుకుంటే తిరిగిరాని లోకాలకు చేరుకోవడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. చిన్న పిల్లలతో ఎలా బతకాలంటూ మృతుల భార్యలు చేసిన రోదన చుట్టుపక్కల వారిని కంటతడి పెట్టించింది.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

వన్‌టౌన్, కార్పొరేషన్, న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను ఈనెల 29న సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో, జీవీఎంసీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, మేయర్ పీలా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పీజీఆర్ఎస్ ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫిర్యాదుల స్థితిని తెలుసుకొనేందుకు కాల్ సెంటర్ 1100ను సంప్రదించాలన్నారు. జీవీఎంసీ జోనల్ కార్యాలయాల్లోనూ ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు.

ఉద్యోగావకాశాలు
రిటైర్డ్/ గృహిణులు/ నిరుద్యోగులకు అవకాశము.
Full Timers/Part Timers/ Work From Home
నెలకు రూ. 2 లక్షల నుండి రూ. 3 లక్షల వరకు ఆదాయము పొందే అవకాశము.
ఇంటర్వ్యూలు: తేది 29 మరియు 30 డిసెంబర్.
స్థలము: డాక్టర్స్ కోలనీ, సీతమ్మధార, వైజాగ్.
Con: M. RAMANAIDU- GM
Ph: 7981588758

'అల'వాటు.. గతి తప్పితే గ్రహపాటు..!

సెలవు వచ్చిందంటే జాలరిపేటలో తీరంలో పలువురు బాలలు అలలపై సర్ఫింగ్ చేస్తున్నారు. చిన్న చెక్కలపై నిల్చుని, పడుకుని విన్యాసాలు ప్రదర్శిస్తున్నారు. కెరటాల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు ఇలాంటి సరదాలు ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. – ఈనాడు, విశాఖపట్నం

మూడు గ్రామాలు.. ఇంటికో సైనికుడు..!

దేశసేవలో చిప్పాడ, మూలకుద్దు, గుడివాడ యువత

చిప్పాడ (తగరపువలస), న్యూస్‌టుడే: భీమిలి మండలం తగరపువలస, చిట్టివలస సమీప చిప్పాడ, మూలకుద్దు, గుడివాడ ప్రధాన గ్రామాల్లో ప్రతి కుటుంబం నుంచి ఓ వ్యక్తి సైన్యంలో చేరుతున్నారు. ఇక్కడి యువత పది, ఇంటర్, డిగ్రీ పూర్తి కాగానే ఆర్మీలో చేరడమే లక్ష్యంగా ముందుకు సాగుతుండటం విశేషం.

సైనికుల గ్రామంగా పేరొందిన చిప్పాడ గ్రామం

1956 నుంచి ఇప్పటి వరకూ..

గ్రామం	సైన్యంలో పనిచేసిన వారు	ప్రస్తుతం విధుల్లో..
చిప్పాడ	279	123
మూలకుద్దు	203	98
గుడివాడ	255	87
మొత్తం	737	308

★ ఇప్పటి వరకు ఈ మూడు గ్రామాల నుంచి దాదాపు 700 మందికి పైగా సిపాయి, నాయక్, హవల్దారు, జూనియర్ కమాండింగ్ అధికారి, సుబేదార్, లెఫ్టినెంట్ కెప్టెన్, మేజరు, తదితర ఉద్యోగాల్లో పనిచేశారు.

తొలి సైనికులు వీరే: చిప్పాడకు చెందిన కొయ్య అప్పారావురెడ్డి తొలిసారిగా 1956లో సైన్యంలో చేరారు. ఆయన ఐదేళ్ల కిందట మృతి చెందారు. ఆయన స్ఫూర్తితో వందల మంది సైన్యంలో చేరారు. ఆయన కుమారులు సుబేదార్ కొయ్య నాగేశ్వరరావు, ఈశ్వరరావు దేశానికి సేవలందించి ఉద్యోగ విరమణ చేశారు. మూలకుద్దు నుంచి 1985లో కొయ్య గురయ్యరెడ్డి మొదటిసారిగా సైన్యంలోకి వెళ్లారు. 'చిప్పాడ పరిధి పాతపాలేనికి చెందిన ఉప్పాడ గోవిందరెడ్డి ఆర్మీ కమాండింగ్ అధికారిగా ఐక్యరాజ్యసమితి శాంతి దళంలో ఉంటూ పలుదేశాల్లో విధులు నిర్వహించి రాష్ట్రపతి నుంచి పతకాలు అందుకున్నార'ని మాజీ సైనికుల సంఘం భీమిలి నియోజకవర్గ శాఖ అధ్యక్షులు కొయ్య గురయ్యరెడ్డి తెలిపారు.

ఐక్యరాజ్యసమితి శాంతి దళంలో పనిచేసిన ఆర్మీ అధికారి ఉప్పాడ గోవిందరెడ్డి

తీరంలో తొలిసారి 'కల్చర్ రన్'

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ట్రైనేషన్ క్లబ్ ఆధ్వర్యంలో జనవరి 11న బీచ్ రోడ్డులో కల్చర్ రన్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికను ఎంపీ శ్రీభరత్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. 'ఈ సందర్భంగా పిల్లల కోసం 1కె రన్, పెద్దల కోసం 5కె రన్ నిర్వహించనున్నాం. పిల్లలు తమ అభిరుచులకు తగ్గట్టుగా దుస్తులు వేసుకుని పాల్గొనవచ్చు. పెద్దలు మాత్రం వృత్తుల వారీగా దుస్తుల ధరించి రావాలి. నగరంలో తొలిసారిగా ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తున్నామ'ని ట్రైనేషన్ క్లబ్ నిర్వాహకుడు పరవాడ కృష్ణ తెలిపారు. ఇతర దేశాలకే పరిమితమైన ఈ రన్ ప్రస్తుతం విశాఖలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందులో పాల్గొనేవారికి బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్

(c) eenadu

బంతితో తిప్పేసి.. బ్యాటుతో బాదేసి..

ఉత్సాహంగా 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025'

క్రీడాకారులను ఉత్సాహ పరుస్తున్న ప్రభుత్వ ఛాతి, అంటువ్యాధుల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్, ఏఎంసీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎస్.ఎన్. పాత్రుడు తదితరులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రా మెడికల్ కళాశాల మైదానంలో 'ఈనాడు - ఈతరం క్లబ్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ధనిక్‌భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్' ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్(ఈఎస్ఎల్)-2025' టోర్నీలో ఆదివారం బ్యాటర్లు పరుగులు తీసి ఆకట్టుకున్నారు. వారిని అవుట్ చేసేందుకు ఫీల్డర్లు నానా తంటాలు పడ్డారు. పోటీలను ప్రభుత్వ ఛాతి, అంటువ్యాధి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ పీడీ డాక్టర్ ఎం.ఎస్.ఎన్. పాత్రుడు తదితరులు పాల్గొన్నారు. 'ధనిక్‌భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డేగా ఆంధ్రా మెడికల్ కళాశాల క్రీడాకారుడు ఎల్.మనోజ్ (29 పరుగులు, 2 వికెట్లు) ఎంపికయ్యాడు.

■ **ఆంధ్రా మెడికల్ కాలేజ్ వర్సెస్ డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు:** మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా మెడికల్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 87 పరుగులు చేసింది. జట్టులో ఎల్.మనోజ్ 29, జె.అజయ్ 18 పరుగులు చేశారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు బౌలర్లు వి.ప్రసాద్, ఆర్.సాయి చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు 9.3 ఓవర్లలో 49 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. సీహెచ్.డేవిడ్ 14 పరుగులు చేశాడు. ఏఎంసీ జట్టు బౌలర్లు యోగి 3 వికెట్లు తీయగా, దివాన్స్, మనోజ్ చెరో 2 వికెట్లు తీశారు.

గెలుపొందిన ఆంధ్రా మెడికల్ కళాశాల జట్టు

'ధనిక్ భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

ఎల్.మనోజ్ (29 పరుగులు, 2 వికెట్లు)

■ **రఘు ఇంజినీరింగ్ కాలేజ్ వర్సెస్ డాక్టర్ లంకపల్లి బుల్లయ్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల:** డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ డిగ్రీ అండ్ పీజీ జట్టు 5 వికెట్ల తేడాతో రఘు ఇంజినీరింగ్ జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన రఘు ఇంజినీరింగ్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 74 పరుగులు చేసింది. జి.హర్షిత్ 25, పి.వి.ఎస్.సుహాస్ 21 పరుగులు చేశారు. బుల్లయ్య కాలేజ్ బౌలర్లు జి.రిత్విక్ 3, శ్రీవర్ధన్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బుల్లయ్య కాలేజ్ జట్టు 8.5 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసింది. జట్టులో బస్వంత్ 34, రిత్విక్ 12 పరుగులు చేశారు. రఘు కాలేజ్ బౌలర్లు మౌళి 2, దిలీప్ ఒకట వికెట్ తీశారు.

ప్రతిభ చూపిన డాక్టర్ లంకపల్లి బుల్లయ్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల జట్టు

■ **ఆదిత్య డిగ్రీ కాలేజ్(గాజువాక) వర్సెస్ అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్:** అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ జట్టు 38 పరుగులు తేడాతో ఆదిత్య డిగ్రీ కాలేజ్‌పై గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన అనిల్ నీరుకొండ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 105 పరుగులు చేసింది. జట్టులో కె.రాకేష్ 29 పరుగులు చేశాడు. ఆదిత్య డిగ్రీ కాలేజ్ బౌలర్లు దుర్గ, జయంత్ తలో వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆదిత్య డిగ్రీ కాలేజ్ జట్టు 8 ఓవర్లలో 67 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జి.జయంత్ 31 పరుగులు చేశాడు. అనిల్‌నీరుకొండ జట్టు బౌలర్లు ఆర్.గగన్ 3, ఎం.సిద్ధార్థ 2 వికెట్లు తీశారు.

విజయం సాధించిన అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ జట్టు

Title Sponsor
Dhanik Bharat Educational Institutions
The Lloyd Group Initiative
Protein Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ
NECC
(Non-Govt. Public Charitable Trust)
"Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner
CMR SHOPPING MALL
The joy of life
Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)
Regional Sponsor
GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P.
Call: 994 999 3483 | www.ggu.edu.in
TV Partner
ETV ఆంధ్రప్రదేశ్
Digital Partner
ఈనాడు.నెట్ ETV BHARAT
Dolphin Diagnostic Services
District Sponsor
TIRUMALA విద్యాసంస్థలు
Organised by ఈనాడు ఈతరం క్లబ్

నేటి మ్యాచ్‌లు

● **ఉదయం 8 గంటలకు: సీనియర్స్ విభాగంలో** శ్రీకశ్యప్ డిగ్రీ కాలేజ్ × వీడీప డిగ్రీ కాలేజ్ (గాజువాక) ● **ఉదయం 10 గంటలకు: జూనియర్స్ విభాగంలో** కైట్స్ జూనియర్ కాలేజ్ × గవర్నమెంట్ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ● **మధ్యాహ్నం 12 గంటలకు: జూనియర్స్ విభాగంలో..** గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజ్ × మిసెస్ ఏవీఎన్ జూనియర్ కాలేజ్

30-12-25 నాటి మ్యాచ్‌లు...

● **ఉదయం 8 గంటలకు: సీనియర్ విభాగంలో** డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ × గీతం డీమ్డ్ యూనివర్సిటీ ● **ఉదయం 10 గంటలకు: సీనియర్ విభాగంలో** ఎన్ఎస్ఆర్ఐటీ(శొంఠ్యాం) × గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కాలేజ్(రుషికొండ) ● **మధ్యాహ్నం 12 గంటలకు:** జూనియర్స్ విభాగంలో శ్రీకశ్యప్ జూనియర్ కాలేజ్ × విశాఖ పాలిటెక్నిక్ కాలేజ్

సమీక్షలో పాల్గొన్న మంత్రి నారాయణ, కమిషనర్ కేతన్‌గార్గ్, పీవీవీ సత్యనారాయణరాజు

ఇంజినీరింగ్ పనులపై సమీక్ష

కార్పొరేషన్ న్యూస్‌టుడే: మహా విశాఖ నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ పనులపై రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ఆదివారం రాత్రి బీచ్‌రోడ్డులోని స్మార్ట్ సిటీ గెస్ట్ హౌస్‌లో సమీక్షించారు. మధురవాడలో చేపట్టబోయే మంచినీటి సరఫరా, భూగర్భ మురుగు నీటి వ్యవస్థ ప్రాజెక్టుల వివరాలను మంత్రి తెలుసుకున్నారు. సమావేశంలో కమిషనర్ కేతన్‌గార్గ్, ప్రధాన ఇంజినీర్ పీవీవీ సత్యనారాయణరాజు ఉన్నారు. మేయర్, ఇతర పాలకవర్గం సభ్యులకు ఈ సమావేశం గురించి తెలియకపోవడం గమనార్హం.

మద్యం మత్తులో నేవీ ఉద్యోగి దాడి

పోలీసు సిబ్బందిపై దాడికి పాల్పడ్డ నేవీ ఉద్యోగి రాహుల్‌కృష్ణ

సింధియా, న్యూస్‌టుడే: పైపులైను జంక్షన్ వద్ద ఆదివారం తెల్లవారుజామున విధుల నిర్వహిస్తున్న మల్కాపురం ట్రాఫిక్ ఎస్.ఐ. శ్రీనివాసరావుపై నేవీ ఉద్యోగి ఒకరు దాడికి పాల్పడ్డారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచి పైపులైను జంక్షన్ వద్ద ఐవోసీ పైపులైను పనులు చేపట్టారు. పనులు జరిగే సమయంలో ఆ మార్గంలో రాకపోకలను నిషేధించారు. దీంతో ట్రాఫిక్ పర్యవేక్షణకు ఎస్.ఐ. శ్రీనివాసరావు, సిబ్బంది అక్కడ విధుల్లో ఉన్నారు. రాకపోకల నిషేధం ఉన్నా అటుగా వచ్చిన నేవీ ఉద్యోగి రాహుల్‌కృష్ణ వెళ్లేందుకు ప్రయత్నించగా.. ఎస్.ఐ., సిబ్బంది అడ్డుకున్నారు. మద్యం మత్తులో ఉన్న రాహుల్‌కృష్ణ వారిపై దాడిచేశారు. లా అండ్ ఆర్డర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేజీహెచ్‌లో విద్యుత్తు ఇబ్బందులకు చెక్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేజీహెచ్‌లో తరచూ తలెత్తుతున్న విద్యుత్తు సమస్యలను పరిష్కరించి రోగులకు సాంత్వన చేకూర్చేందుకు అదనంగా మరొక 323 కేవీ సామర్థ్యంతో కూడిన మొబైల్ జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. రెండు నెలల క్రితం తీవ్రమైన విద్యుత్తు అంతరాయం ఏర్పడి ఏకంగా 8 గంటల సేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. ఇక మీదట అటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయంగా జనరేటర్ సేవలను విస్తరించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదేశాల మేరకు తక్షణ చర్యలు చేపట్టామని ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ ఐ.వాణి, అడ్మిన్ బి.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రస్తుతం కేజీహెచ్‌లో పది జనరేటర్లు ఉన్నాయి. వీటిలో 1690 కేవీ సామర్థ్యంతో కూడిన జనరేటర్లు ఆరు, 323 కేవీ సామర్థ్యంతో కూడినవి మూడు ఉన్నాయి. నాన్ ఐసీయూ వార్డులైన రాజేంద్రప్రసాద్, భావనగర్, పీడియాట్రిక్ వార్డులకు ఇక మీదట విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగితే వెంటనే జనరేటర్ల ద్వారా విద్యుత్తు పునరుద్ధరించవచ్చున'ని వివరించారు.

రాజేంద్రప్రసాద్ వార్డు వద్ద ఏర్పాటు చేసిన జనరేటర్

ముగిసిన జూబ్లీ వేడుకలు

చిన్నారులతో విశాఖ అగ్ర పీఠాధిపతి ఉడుముల బాలశౌరి

జ్ఞానాపురం న్యూస్‌టుడే: చారిత్రాత్మక నిరీక్షణ యాత్రికుల జూబ్లీ వేడుకలను 2025 జనవరి 1వ తేదీ నుంచి డిసెంబరు 28వ వరకు నిర్వహించినట్లు విశాఖ అగ్రపీఠాధిపతి ఉడుముల బాలశౌరి పేర్కొన్నారు. జ్ఞానాపురం దరి పునీత పేతురు ప్రధాన దేవాలయంలో ఈ ముగింపు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశాఖ అగ్రపీఠాధిపతి ఉడుముల బాల మాట్లాడుతూ క్రీస్తు ప్రభువు జన్మించి 2025 సంవత్సరాలు పూర్తయినట్లు చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులపై భౌతిక దాడులు, ఆస్తుల విధ్వంసం పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవులంతా సంఘటితమై ప్రభువు ప్రేమను పంచడానికి వెనుకడుగు వేయరాదని ఉద్బోధించారు. విచారణకర్తలు ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్, ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్ కోన జయరాజు, ఫాదర్ ప్రేమ్‌కుమార్, ఫాదర్ సిరికి థామస్ తదితరులు పాల్గొన్నారు.

REPLY PUBLIC NOTICE

The attention of my client Mr. Kanneganti Muralidhar Rao, S/o. Late Kanneganti Kotaiah, aged 79 years, R/o. Shivani Plaza, Flat No.303, 3rd Floor, H.No.8-2-293/82/NG/40/3, Plot No.40, Nandagiri Hills, Jubilee Hills, Hyderabad-500 033, Telangana, has been drawn to a Public Notice published in Eenadu in Bapatla, Amaravati Guntur, and Visakhapatnam Editions on 21st December, 2025 issued by Ms. Kanneganti Umakumari D/o. Late Kanneganti Kotaiah R/o. Kuchipudi village through her Advocate Sri. Ponnam Ravindra Babu, D.No.3-76, I Floor, Opposite Amaravathi Rythu Bazar, JKC College Road, Guntur.

The contention of Ms. Kanneganti Umakumari is that she is the Lessee of Agricultural and other properties belonging to Dr. Kanneganti Kamalakar Rao S/o. Late Kanneganti Kotaiah is false and baseless. She has been falsely proclaiming herself as the Lessee of the said properties with the object of making monetary gains. Dr. Kanneganti Kamalakar Rao has never leased out any of his properties to Ms. Kanneganti Umakumari at any point of time. There is no document evidencing the creation of Lease in favour of Ms. Kanneganti Umakumari by Dr. Kanneganti Kamalakar Rao.

The allegation that due to an alleged injury sustained by Dr. Kanneganti Kamalakar Rao on his head, his health condition was not good is firmly denied. His mental condition was sound and stable. Dr. Kanneganti Kamalakar Rao executed a General Power of Attorney (GPA) in favour of my client on 27th May, 2023 in the presence of witnesses and the Power of Attorney has been duly notarized by a Notary Public State of Washington, namely, OK HEE KIM, County of Pierce, USA. Dr.Kanneganti Kamalakar Rao has also executed a letter of cancelling the Will dated 26th April, 2013 in favour of Ms. Kanneganti Umakumari.

My client Mr. Kanneganti Muralidhar Rao has got the General Power of Attorney validated in India after following the due procedure. The said GPA executed in favour of my client perfectly valid in eye of law. My client states that the GPA executed by Mr. Kanneganti Kamalakar Rao was shared with Ms. Kanneganti Umakumari on 04-12-2024 by Speed Post and Registered Post to her two addresses i.e. at Nadimpalle and another at Guntur. She did not object to the same then, but she has issued the public notice dated 21-12-2025 with some malafide motives.

My client states that Ms. Kanneganti Umakumari is the younger sister of Dr. Kanneganti Kamalakar Rao, and she has been illegally leasing the agricultural properties and collecting the lease amounts of the agricultural properties mentioned in the schedule of the Public Notice dated 21st December, 2025. She has not accounted for the amounts she has illegally collected so far. She has borrowed huge amounts of money from Dr. Kanneganti Kamalakar Rao and has not bothered to repay the amounts borrowed by her. It is precisely for this reason Dr.Kanneganti Kamalakar Rao has executed a GPA in favour of my client.

My client after obtaining GPA in his favour from his brother, Dr. Kanneganti Kamalakar Rao, has opened NRO account in the name of Dr. Kanneganti Kamalakar Rao and paid capital gains tax to the extent of Rs.1.1 Crore to the Income Tax Department by obtaining his PAN number during 2024-25.

My client is looking after payment of Dr. Kanneganti Kamalakar Rao's statutory dues payable by him, for the apartments belonging to him at West Wind Apartments in Visakhapatnam.

The General public are advised not to believe any of such baseless allegations made against Mr. Kanneganti Muralidhar Rao and his family published in 21st December, 2025 by Ms. Kanneganti Umakumari in the form of public notice. The said Public Notice has defamed my client & his family and has lowered his image in the eyes of his relatives, friends, and society at large.

My client calls upon Ms. Kanneganti Umakumari to account all the amounts that she has so far collected in respect of agricultural properties of Dr. Kanneganti Kamalakar Rao within 48 hours of the publication of this Reply Public Notice failing which criminal and civil action will be initiated against her acts of criminal misappropriation and breach of trust.

My client calls upon Ms. Uma Kumari to withdraw the Public Notice dated 21st December, 2025 published in Eenadu in Bapatla, Amaravathi Guntur and Visakhapatnam Editions within 48 hours of the publication of this Reply Public Notice, failing which my client will be initiating appropriate legal action both Civil and Criminal against Ms. Kanneganti Umakumari for civil and criminal defamation, breach of trust and recovery of money.

Sd/- KARUNA RAWAL, P.V.G. NIKITHA, NEMANI SAI CHARAN
Advocates
Office at Flat No.101, Sai Ridah Jeevan Residency, H. No.6-1- 318/1, Walker Town, Padmarao Nagar, Secunderabad-500020. Mobile: 9966897702

దరఖాస్తు చేస్తే... అనుమతులొస్తాయ్..!

'ఈనాడు- డయల్ యువర్ సీసీపీ' కార్యక్రమానికి స్పందన

కార్పొరేషన్, న్యూస్‌టుడే

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీపీఎస్ (భవన క్రమబద్ధీకరణ పథకం), ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులైజేషన్ స్కీం)పై నగర ప్రజల సందేహాలు నివృత్తి చేసేందుకు నిర్వహించిన 'ఈనాడు- డయల్ యువర్ సీసీపీ' కార్యక్రమానికి స్పందన వచ్చింది. పలువురు అడిగిన ప్రశ్నలకు జీవీఎంసీ ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి ఏ.ప్రభాకరరావు సమాధానాలు ఇచ్చారు. అదనపు అంతస్తులకు, అక్రమ లేఅవుట్లకు సంబంధించి దరఖాస్తులు చేసుకుని, అనుమతులు పొందాలని సూచించారు.

ఈనాడు తోడు

ప్రశ్న : యూఎల్‌సీ భూముల్లో బీపీఎస్ వర్తిస్తుందా..? –గౌరీశంకర నారాయణ, మర్రిపాలెం. - కె.బ్రహ్మయ్య, **పంజాబ్ హోటల్ కూడలి.** ✓: యూఎల్‌సీ నుంచి ఎన్ఓసీ తీసుకున్న తర్వాతే బీపీఎస్‌కు దరఖాస్తు చేయాలి. లేకపోతే కుదరదు.

?: 1987లో కొనుగోలు చేసిన స్థలంలో అనధికార లేఅవుట్‌లో ఉంది. ఇప్పుడు అక్కడకు వెళ్తే, రైతులు అడ్డుకుంటున్నారు. ఎల్ఆర్ఎస్‌లో దరఖాస్తు చేయొచ్చా..? - **శరగడం సూర్యప్రభ, దేశపాత్రునిపాలెం.** ✓: ముందుగా రైతులతో వివాదాన్ని పరిష్కరించుకుని, ఆ తర్వాత సరైన దస్త్రాలతో దరఖాస్తు చేయండి.

?: వేపగుంట– పినగాడి మార్గంలోని లక్ష్మీపురంలో ప్రస్తుతం ఉన్న 60 అడుగుల రహదారి పక్కన మాకు స్థలం ఉంది. నిర్మాణానికి అనుమతులు ఇస్తారా..? - **శ్రీరామ చంద్రరాజు, సబ్బవరం.** ✓: మాస్టర్‌ప్లాన్‌లో 150 అడుగుల రహదారి ఉంది. ప్రస్తుతం ఉన్న 60 అడుగుల రహదారికి సమీపంలో మీ స్థలం ఉంటే ప్లాన్ ఇవ్వరు.

?: 2014–15లో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేశా. ఇప్పటికీ ప్రొసీడింగ్ ఇవ్వలేదు. - **సుబ్రహ్మణ్యం, కూర్మన్నపాలెం.** ✓: దరఖాస్తు నెంబర్ తీసుకుని వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ కార్యాలయాల్లో సంప్రదించండి.

?: నేరెళ్లవలసలో మా స్థలానికి గతంలో ఎల్ఆర్ఎస్ చేస్తే, సీఆర్‌జెడ్ నిబంధనలతో తిరస్కరించారు. తాజాగా అదే సర్వే నెంబర్‌లో ఓ ప్రైవేటు వెంచర్‌కు ఎల్ఆర్ఎస్ చేశారు. మేమూ దరఖాస్తు చేసుకోవచ్చా..? - **ఎన్‌టీవీ రమణ, ఎన్ఏడీ** ✓: 2006లో ఉన్న సీఆర్‌జెడ్ నిబంధనలను 2011లో సవరించారు. ఇప్పుడు మీరూ దరఖాస్తు చేసుకోవచ్చు.

?: అగనంపూడిలో ఓ అపార్ట్‌మెంట్‌కు వీఎల్టీ చెల్లించలేదు. నివాస ధ్రువీకరణపత్రం కావాలంటే ఏం చేయాలి.? - **అప్పారావు, అగనంపూడి. - రాధాకృష్ణకుమార్, ఎన్ఏడీ.** ✓: బీపీఎస్‌లో దరఖాస్తు చేయండి.

?: తిమ్మాపురంలో 600 గజాల స్థలం ఉంది. పన్ను వేయాలని కోరుతున్నా... అధికారులు పట్టించుకోవడం లేదు. - **భాస్కర్‌రెడ్డి, బుచ్చిరాజుపాలెం** ✓: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ ఉప కమిషనర్‌ను సంప్రదించండి.

?: ద్వారకానగర్‌లో 20 ఏళ్ల క్రితం ఓ భవనంలో ఫ్లాట్ తీసుకున్నాం. దానికి ప్లాన్ లేదు. క్రమబద్ధీకరించుకోవచ్చా.? అదనపు అంతస్తుకు బీపీఎస్ వర్తిస్తుందా.? - **సమీర్ ప్రతాప్, విశాఖ (అమెరికా నుంచి వాట్సప్ కాల్). - శేఖర్, చినవాల్తేరు.** ✓: 'బీపీఎస్'కు దరఖాస్తు చేసుకోవచ్చు.

?: పినగాడిలో 175 గజాల స్థలానికి ఎల్ఆర్ఎస్ దరఖాస్తు ఎలా చేయాలి.? - **శ్రీనివాసరావు, అక్కయ్యపాలెం.** ✓: సమీపంలో ఉన్న ఎల్టీపీ (లైసెన్స్ టెక్నికల్ పర్సన్)ని సంప్రదించి, యాజమాన్య హక్కు పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయండి.

?: 1995 కంటే ముందు నిర్మించిన భవనానికి సంబంధించి 2008లో బీపీఎస్ దరఖాస్తు చేసి, రూ.10 వేలు చెల్లించాం. కాని క్రమబద్ధీకరణ కాలేదు. మళ్లీ బీపీఎస్‌కు దరఖాస్తు చేయొచ్చా..? - **పి.శివానందం, పెదవాల్తేరు.** ✓: గతంలో మంజూరు చేసిన ప్లాన్‌తో పాటు, రసీదులతో కలిపి దరఖాస్తు చేస్తే.. ఇప్పుడు బీపీఎస్ ఫీజులో 25 శాతం రాయితీ వస్తుంది.

?: దేవస్థానానికి చెందిన భూముల్లో నివాసాలకు బీపీఎస్ వర్తిస్తుందా..? - **రవికృష్ణ, గోపాలపట్నం.** ✓: దేవాదాయశాఖ నుంచి ఎన్ఓసీ తీసుకుని బీపీఎస్ దరఖాస్తు చేయాలి.

కార్మికుల సంక్షేమానికి సీఐటీయూ ఎనలేని కృషి

'శ్రామిక ఉత్సవ్'లో వీఎంఆర్డీఏ కమిషనర్

మాట్లాడుతున్న వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్‌భరత్

ఆకట్టుకున్న కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన

సీతంపేట, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు అధికంగా ఉన్న విశాఖ నగరంలో కార్మిక శక్తి కూడా అధికంగా ఉందని వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్‌భరత్ అన్నారు. కార్మిక కర్షక ఐక్యత వర్ధిల్లాలి అనే థీమ్‌తో బీచ్ రోడ్డులోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎగ్జిబిషన్ మైదానంలో ఆదివారం జరిగిన 'శ్రామిక ఉత్సవ్'లో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. కార్మికుల కష్టాలు తీర్చడంలో సీఐటీయూ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇక్కడ కార్మిక శక్తి అధికంగా ఉన్నందున ప్రభుత్వం విశాఖలో ఎన్నో అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. వివిధ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయన్నారు. తర్లువాడలో గూగుల్ డేటాసెంటర్, కాపులుప్పాడ, మధురవాడలలో ఐటీ కంపెనీల రాకతో విశాఖ రూపురేఖలు మారనున్నాయన్నారు. త్వరలో మధ్య తరగతి, దిగువ తరగతుల వారి కోసం వీఎంఆర్డీఏ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తుందన్నారు. కార్మికుల సామాజిక భద్రత, శిక్షణ, నైపుణ్యాభివృద్ధికి లేబర్ సంస్కరణలు తోడ్పడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కళాకారుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

క్రీడాకారులు దేశానికి ప్రాతినిధ్యం వహించాలి

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) కేంద్రంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు దేశానికి ప్రాతినిధ్యం వహించాలని విశాఖ పశ్చిమం, ఉత్తరం ఎమ్మెల్యేలు పి.గణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. క్రీడాకారుడు చరణ్ ఐఎస్ఎఫ్ ప్రపంచ వాలీబాల్ పోటీల్లో కాంస్యం గెలుపొందిన సందర్భంగా పోర్టు స్టేడియంలోని శాప్ కేంద్రంలో అతడిని సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ నగరంలోని శాప్ కేంద్రంలో శిక్షణ పొందిన ఎంతో మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు గెలుపొందారన్నారు. ప్రస్తుతం అన్నిరకాల సౌకర్యాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ క్రీడాకారులకు తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. క్రీడాకారుల విజయం వెనుక వారి తల్లిదండ్రులు కృషి ఎంతో ఉందని ఈ సందర్భంగా తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో శాప్ కేంద్రం ఇన్‌ఛార్జి సత్యనారాయణ, కోచ్‌లు పాల్గొన్నారు.

చరణ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు పి.గణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు

అరకు చూశారు.. ఇరుక్కుపోయారు!

★ విశాఖ తిరుగు ప్రయాణంలో పాట్లు
★ ఎప్పుడూలేనివిధంగా ఘాట్‌లో వన్‌వే ఆంక్షలు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకు అందాలు చూసి మధురానుభూతులతో తిరిగి ప్రయాణమైన వారికి ఆదివారం చుక్కలు కనిపించాయి. ఉదయం బస్టాండుకు వచ్చినవారు సాయంత్రం వరకు అరకు దాటలేకపోయారు. విపరీతమైన ట్రాఫిక్ కారణంగా పోలీసులు రాకపోకలపై ఆంక్షలు విధించడంతో పర్యాటకులు ఆపసోపాలు పడ్డారు. వరుస సెలవులు, వారాంతం, నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో అరకులోయకు సందర్శకుల తాకిడి విపరీతంగా పెరిగింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో రద్దీ నివారణకు పోలీసులు ఆంక్షలు విధించారు. ఉదయం నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల అనంతరం కాఫీతోటల సందర్శనకు వీలు కల్పించేలా చర్యలు తీసుకున్నారు. ★ విశాఖ నుంచి అరకు వచ్చేందుకు మాత్రమే వాహనాలకు అనుమతించారు. వన్‌వేకు మాత్రమే అవకాశం కల్పించి.. అరకు నుంచి విశాఖకు తిరుగు ప్రయాణానికి పాడేరు మీదుగా వెళ్లేలా సూచనలు చేశారు. అప్పటికే అరకులోయ వచ్చిన వాహనాలు విశాఖకు తిరిగి వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో అరకులోయ పరిసరాల్లోనే ఆగిపోవాల్సి వచ్చింది.

బస్సులు నిలిపివేయడంతో రద్దీగా మారిన అరకులోయ ఆర్టీసీ బస్టాండ్

వీఎస్‌సీడీఏ కార్యవర్గం ఎన్నిక

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: విశాఖపట్నం స్టీల్ అండ్ సిమెంట్ డీలర్స్ అసోసియేషన్(వీఎస్‌సీడీఏ) నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం దసపల్లా హోటల్‌లో నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా గ్రంధి రాంజీ, ఎం.ఆర్.ప్రసాద్‌తో పాటు మరికొంత మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాంజీ, ప్రసాద్ మాట్లాడుతూ సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. అసోసియేషన్ ఛైర్మన్ ఎం.త్రినాథరావు, కోశాధికారి వి.గిరీష్, సభ్యులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ అండ్ సిమెంట్ డీలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులు

కోళ్ల వ్యర్థాలు తరలిపోకుండా పటిష్ఠ చర్యలు

కార్పొరేషన్ న్యూస్‌టుడే: నగరంలో మాంసం దుకాణాల నుంచి సేకరిస్తున్న కోళ్ల వ్యర్థాలను ఇతర జిల్లాలకు తరలించకుండా జీవీఎంసీ పటిష్ఠ చర్యలు చేపట్టింది. సేకరించిన వ్యర్థాలన్నీ కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు తీసుకెళ్లాలని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించడంతో పాటు, ఆయా బాధ్యతలను వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయం సిబ్బందికి అప్పగించారు. జీవీఎంసీ ద్వారా టెండరు పొందినవారు కాకుండా, ఇతరులు కొంత మంది వ్యర్థాలు సేకరించి వాటిని ఇతర జిల్లాల్లోని చేపల చెరువుల యజమానులకు విక్రయిస్తున్నారు. దీనిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి టెండరు పొందినవారు మాత్రమే కోళ్ల వ్యర్థాలను సేకరించాలి. ఆ ప్రక్రియను సంబంధిత వార్డు కార్యదర్శులు వెళ్లి ఫొటోలు తీయాల్సి ఉంటుంది. అనంతరం కాపులుప్పాడ తీసుకెళ్లిన తరువాత మరో చిత్రం తీసి జీవీఎంసీ వాట్సాప్ గ్రూపులో అప్‌లోడ్ చేయాలి.

కోళ్ల వ్యర్థాల సేకరణను పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు సచివాలయం సిబ్బంది

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	131	130
లైవ్	158	150
డ్రెస్డ్	229	270
స్కిన్‌లెస్	261	280

EENADU e Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

REAL ESTATE

GENERAL

సిటీ లిమిట్స్‌లో గల బిల్డింగ్స్ పై గల ఓపెన్ స్పేస్ అమ్మదలచినవారు సంప్రదించండి మరియు మా కన్‌స్ట్రక్షన్ కంపెనీకి కొలేటరల్ సెక్యూరిటీ కావలెను. వివరాలకై : 9963585556.

LAND FOR SALE

GENERAL

పూసపాటిరేగ మం గోవిందపురం రోడ్డు, హైవేకి ½km తార్రోడ్డు ఫేసింగ్ 9ఎకరాలు కొబ్బరితోట & 4 ఎకరాలు కొబ్బరితోట అమ్మకం. 9440255187.

PLOT FOR SALE

KURMANNAPALEM

గాజువాకకిచేరువలో దేశపాత్రునిపాలెం విలేజ్‌లో వెంటనే ఇల్లు కట్టుకోవడానికి VMRDA ఓపెన్ ప్లాట్లు గజం కేవలం 13,500/- ఫెస్టివల్ ఆఫర్. 9703900583

MADHURAWADA

మధురవాడ, హౌసింగ్ బోర్డు కాలనీలో 40ఫీట్ రోడ్డు కలిగిన 35'x60' = 233.33Sq.yds వెస్ట్ ఫేసింగ్ ప్లాట్ అమ్మకంనకు కలదు. ✆ 9177119944.

COMMERCIAL SPACE FOR SALE

GENERAL

3280 sft office space fully furnished space at Seethamapeta main road, beside central Bank. Ph: 8886756222

JOBS

Job Mela : ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ యొక్క వైజాగ్ మెయిన్ బ్రాంచ్ కొరకు మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. సంప్ర: 8883375999.

వైజాగ్‌సిటీలో సెక్యూరిటీగార్డులు- M, క్లీనింగ్ వర్కర్స్- F కావలెను. జీ: 12 గం॥- 15K, 8 గం॥- 10K. బయోడేటా వాట్సాప్ చేసి కాల్ చేయండి. 7306582829

సేల్స్‌బాయ్స్, గర్ల్స్ కావలెను. జీ: 10,000– కమీషన్+ 4రోజులు= 13,000/- పవన్ ఫ్యామిలీ ఆఫర్ మాల్, 5వ లైన్, ద్వారకానగర్, వైజాగ్. 8142863533, 9533691515, 9440802452

ప్రముఖ కార్పొరేట్ సంస్థకు మేనేజర్స్ కావలెను. M/F హౌస్‌వైఫ్స్. Rtd, VRS టీచర్స్ కావలెను. F/P టైం శాలరీ & ఇన్సెంటివ్స్ కలవు. ✆ 9676595920.

వైజాగ్ ప్రముఖ షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువకులు కావలెను. జీతం. 10,000-12,000–ఫుడ్ రూము. ✆ 9030588502/9704637370.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పెందుర్తి

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ స్క్రీన్-1: **శంబాలా** (మార్నింగ్, ఫస్ట్ షో), **ఈషా** (మ్యాట్నీ, సెకెండ్ షో)
స్క్రీన్-2: **ఛాంపియన్**

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

వేపగుంట (పెందుర్తి), న్యూస్‌టుడే: 11కేవీ సింహాద్రినగర్ ఫీడర్‌పై నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ బి.సింహాచలంనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. దీనివల్ల ఫీడర్ పరిధిలోని సింహాద్రినగర్, బొబ్బిలివారి వీధి, దత్తసాయినగర్, తదితర ప్రాంతాల్లో ఆయా సమయాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం మరిశవానిపాలెం చెరువు వద్ద రహదారి అంచులు దెబ్బతిని తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. -శ్రీనివాస్, కలపాక ✓: రహదారికి త్వరలో మరమ్మతులు చేపడతాం. -లలిత, ఏఈ, ఆర్‌అండ్‌బి

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: గొట్టివాడ కాలనీ చర్చి సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెంటాడుతోంది. -వై.అప్పలనాయుడు, సబ్బవరం ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే సమస్య పరిష్కరిస్తాం. -సాలాపు మీన, సర్పంచి, గొట్టివాడ

?: సబ్బవరం పీహెచ్‌సీకి వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలకు రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. -మామిడి శంకరరావు, బల్జిపాలెం ✓: వైద్య ఆరోగ్య శాఖ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. -పి.పద్మజ, ఎంపీడీవో, సబ్బవరం

పెందుర్తి, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెం సమీప ఎన్‌ఏడీ లేఅవుట్‌లోని 32ఎ/4 వీధిదీపం రెండు వారాలుగా వెలగడం లేదు. -ఇ.వెంకటేశ్వరరావు, ఎన్‌ఏడీ లేఅవుట్ ✓: మీ ప్రాంతంలో వెలగని వీధి దీపానికి త్వరలో మరమ్మతులు చేపట్టి వెలిగేలా చర్యలు తీసుకుంటాం. -సోమేశ్, వీధి దీపాల నిర్వహణ ఏఈ, 95వ వార్డు

ద్రోణంరాజుకు నివాళి

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: మాజీ రాజ్యసభ సభ్యుడు దివంగత ద్రోణంరాజు సత్యనారాయణ వర్ధంతి చినముషిడివాడలోని ఆయన నివాసంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కా రామునాయుడు, నాయకులు కుమార్, కనకారావు, ముత్యాలరావు, తదితరులు ద్రోణంరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సమాజానికి అందించిన సేవలను కొనియాడారు.

ఉచిత వైద్య శిబిరాలకు ఏర్పాట్లు

సబ్బవరం, న్యూస్‌టుడే: ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 29న సబ్బవరం దుర్గామాంబ ఆలయ ప్రాంగణంలో, 30న రాచకీతం వినాయకుడి గుడి సమీపంలో, 31న తాళ్లపాలెం కూడలి వద్ద ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయా శిబిరాల్లో ఉచితంగా రక్తపోటు, మధుమేహం తదితర పరీక్షలు చేస్తారని తెలిపారు. సంబంధిత శిబిరాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం రావులమ్మపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-1994 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం దేవీపురంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కోసి, సినిమా పాటలకు నృత్యం చేస్తూ ఆనందంగా గడిపారు. ఒక సంఘంగా ఏర్పడి వివిధ సేవా కార్యక్రమాలు చేయాలని, ఏటా డిసెంబరులో ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. మహిళలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

రావులమ్మపాలెం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

సింహగిరిపై ధనుర్మాస వైభవం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం అర్చకులు దేవతామూర్తుల తిరువీధి వేడుకగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి బంగారు తొళక్కియాన్ పల్లకిలో కొలువుదీర్చారు. వేద పారాయణలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లను ఆలయ బేడామండపంలో చతుర్గతి నడకలతో ఊరేగించారు. తిరుప్పావై సేవాకాలంలో భాగంగా అమ్మవారి సేవ, పాశుర విన్నపం, తీర్థ గోష్ఠి సంప్రదాయబద్ధంగా జరిగింది.

దూసుకొస్తున్న బూడిద

కాలుష్యం బెడదతో స్థానికులకు నిత్యం అవస్థలే..

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ పరిసర గ్రామాల ప్రజలను బూడిద, బొగ్గులారీల కాలుష్యం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. లారీల నుంచి బొగ్గు, బూడిద కిందికి రాలి... దుమ్ము, ధూళి ఎగరడంతో ద్విచక్రవాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సంబంధిత వాహనాల కారణంగా రహదారులు దెబ్బతిని ఈ సమస్య రోజురోజుకు మరింత జటిలమవుతోంది. ఓవర్‌లోడ్, సరకుపై టార్పాలిన్లు సరిగా కట్టని కారణంగా ఈ పరిస్థితి ఏర్పడుతోంది. పరవాడ మండల పరిధిలో రోజుకు 700లకు పైగా బొగ్గు, బూడిద లారీలు రాకపోకలు చేస్తుంటాయి. వీటి కారణంగా కాలుష్యం బెడద వెంటాడుతూ, తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పీసీబీ, రవాణా, ఆర్‌అండ్‌బి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

■ బొగ్గు, బూడిద లారీల కాలుష్యం వల్ల రహదారుల వెంబడి ఉన్న మొక్కలు, చెట్లు నల్లగా మారిపోయాయి. చెట్ల ఆకులపై పేరుకుపోయిన దుమ్ము, ధూళి పేరుకుపోయిందంటే ఇక్కడ కాలుష్యం తీవ్రత ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. నివాసాలు, దుకాణాలు, వసతిగృహాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉన్న మొక్కలు పనికిరాకుండా పోతున్నాయి. ముఖ్యంగా లంకెలపాలెం నుంచి పరవాడ, ఊటగెడ్డకూడలి, సోమునాయుడుపాలెం, కలపాక, పిట్టవానిపాలెం మీదుగా పాలవలస వరకు ఏ మొక్క చూసినా నల్లగా మాడిపోతున్నాయి. దీనికితోడు ఎన్టీపీసీ సర్వీసు రోడ్డులోని పిట్టవానిపాలెం నుంచి దేశపాత్రునిపాలెం మీదుగా లంకెలపాలెం ఏలేరు కాలువ వరకు మొత్తం చెట్లు బూడిదతో నిండిపోయి పర్యావరణం దెబ్బతింటోంది. ఈ మార్గంలో బూడిద ఎక్కడికక్కడ మేటలు వేయడంతో బిక్కుబిక్కుమంటూ పయనించాల్సిన పరిస్థితి నెలకొంది.

లంకెలపాలెం ఏలేరు కాలువ సమీపంలో ఇలా..

దుకాణదారులు, నివాసితుల ఆందోళన: కాలుష్యం వల్ల రహదారి పక్కనున్న నివాసితులు, దుకాణదారులు పడరాని ఇబ్బందులు పడుతున్నారు. బూడిద ఇళ్లు, దుకాణాలపైకి ఎగిరి పడడంతో వ్యాపారాలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ దుకాణాల వద్దకు కొనుగోలుదారులు రావడం లేదని.. గంట గంటకు దుమ్ము, ధూళి శుభ్రం చేసుకోవాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ఈ కారణంగా తరచూ దుకాణాలు మూసుకోవాల్సి వస్తోందని, తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై ఓ లారీ ప్రయాణించినపుడు దాని వెనుక వెళ్లాలంటే భయమేస్తోందని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు వెంటనే స్పందించి ఈ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నిఘా నేత్రాలున్నాయ్ జాగ్రత్త..

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడ సంతబయలు ప్రాంతంలో ఇటీవల పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా ఇక్కడ సంబంధిత కెమెరాలు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో ఇక్కడ నాలుగు దుకాణాలు కాలిపోయినపుడు పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. కొందరు దుండగులు ఉద్దేశపూర్వకంగానే నిప్పు పెట్టారని అప్పట్లో కొందరు ఆరోపించారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో నిందితులను గుర్తించలేని పరిస్థితి నెలకొంది. అలాగే ప్రమాదాలు జరిగినపుడు వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు దర్యాప్తులో పోలీసులకు కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు ఇక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల ఎవరు తప్పు చేసినా, నేరాలు, ప్రమాదాలు జరిగినపుడు ఇకపై నిఘా నేత్రాలు గుర్తు పట్టేస్తాయి. పోలీసులు వీటిని ఏర్పాటు చేయడంతో స్థానికులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరవాడ సంతబయలు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

దీపాంజలినగర్‌లో ఘనంగా ఆనంద మేళా..

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్ సాధన క్రీడామైదానంలో ఆదివారం రాత్రి దీపికా లేడీస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆనందమేళా సందడిగా జరిగింది. దక్షిణ ప్రాంత దీపాంజలి మహిళా సమితి అధ్యక్షురాలు రుపాలిసిన్హా, రెన్యూవబుల్ ఎనర్జీ సీఈవో పండా, సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ, దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు నీతూశర్మ తదితరులు జ్యోతి వెలిగించి మేళాను ప్రారంభించారు. తొలుత గాల్లోకి బెలూన్లు విడిచిపెట్టి.. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక ఆలయ నమూనా, విద్యుత్తు దీపాలంకరణ, పూల మొక్కల ప్రదర్శన కనువిందు చేశాయి. ఈఏడాది మేలో జరిగిన బాలికా సాధికారత కార్యక్రమంలో ప్రతిభ చాటిన 20మంది బాలికలకు ఉచితంగా సైకిళ్లు, మరో అయిగురు దివ్యాంగులకు సోలార్ ట్రైసైకిళ్లు అందజేశారు. ఈ మేళాలో వేర్వేరు అంశాలపై ఏర్పాటు చేసిన 30 స్టాల్స్ ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అలరించాయి. మేళా ద్వారా వచ్చిన ఆదాయాన్ని పేదల సేవా కార్యక్రమాలకు వినియోగిస్తామని క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. సంస్థ జీఎంలు, హెచ్‌ఆర్ అధికారులు, దీపికా లేడీస్ క్లబ్ సభ్యులు, ఎన్టీపీసీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

స్టాల్ తిలకిస్తున్న దక్షిణ దీపాంజలి మహిళా సమితి అధ్యక్షురాలు రుపాలి సిన్హా, ఎన్టీపీసీ అధికారులు పండా, సమీర్‌శర్మ తదితరులు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

తిరుప్పావై సేవాకాలం.. ఆధ్యాత్మిక వైభవం

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా తిరుప్పావై సేవాకాలం ఆధ్యాత్మిక వైభవాన్ని చాటుతోంది. ఆలయ ప్రధానార్చకులు మహర్షి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు ఆదివారం వేకువజామున శ్రీవారికి ప్రాతఃకాల పూజలు చేశారు. ఆభరణాలు, పూలమాలలతో అలంకరించి ధూపదీప సేవలు చేపట్టారు. తిరుప్పావై సేవాకాలంలో భాగంగా 13వ పాశురాన్ని విన్నపం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక పాశుర పారాయణం చేశారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని సబ్బవరం మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, నగర సంకీర్తనలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం సబ్బవరంలో వేకువజామున 4 గంటల నుంచి సాయిబాబా భక్తులు వీధుల్లో అన్నమయ్య సంకీర్తనలు పాడుతూ ప్రజలను మేల్కొలుపుతున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పెద్దాడ రమణమ్మ, దంగేటి నాగేశ్వరరావు, కోరాడ శ్రీను, ధనిమిరెడ్డి పాప, ద్వారపూడి శ్రీను, గెద్దం కృష్ణవేణి, సత్యనారాయుడు, కొల్లి గంగునాయుడు, ముర్రె కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

వేంకటాద్రిపై పూజలందుకున్న వేంకటేశ్వర స్వామి, హారతి స్వీకరిస్తున్న భక్తులు

సబ్బవరంలో భక్తుల నగర సంకీర్తన

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ఈ.బోనంగి ఫార్మాసిటీ పునరావాసకాలనీ కొండపై కొలువైన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఈనెల 30వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీహరికృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్వామివారి ఉత్తర ద్వార దర్శనం, భక్తులకు ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

★ పరవాడ జేఎన్ ఫార్మాసిటీలోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీన శ్రీకోదండ సీతారామచంద్రస్వామి వారి ఉత్తరద్వార దర్శనం ఉంటుందని ఆలయ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు ఉంటాయని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ సమీప హరిహర క్షేత్రంలో కొలువైన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం పాశుర విన్నపం సంప్రదాయబద్ధంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు ముప్పిరాల అనంతాచార్యులు నేతృత్వంలో అర్చకులు తిరుప్పావై సేవాకాలం, 13వ పాశుర విన్నపం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఈ.బోనంగిలో శ్రీవేంకటేశ్వరస్వామి

ఫార్మాసిటీలో పంచముఖ ఆంజనేయస్వామి

సుజాతనగర్‌లో..

ఉత్తర ద్వార దర్శనానికి ఆలయాల ముస్తాబు

పెందుర్తి, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 30న తేదీన భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు పెందుర్తి మండలంలోని పలు ఆలయాలు విస్తృత ఏర్పాట్లు చేశాయి. ఈ నేపథ్యంలో సంబంధిత మందిరాలను విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు.

విద్యుద్దీపాలంకరణలో హరిహర క్షేత్రం

★ వేంకటాద్రిపై కొలువైన శ్రీనివాసుడు 30న వేకువజామున 3.30 గంటల నుంచి ఉత్తర ద్వారంలో భక్తులను అనుగ్రహిస్తారని ఆలయ ప్రధానార్చకులు మహర్షి రామానుజాచార్యులు తెలిపారు. సుమారు 35వేల మంది భక్తులు దర్శనానికి వస్తారని అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఆ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు 8 బస్సులు కొండపైకి కిందకి భక్తులను ఉచితంగా రవాణా చేస్తాయని తెలిపారు. రెండు మార్గాలను తెరిచి వేర్వేరుగా రాకపోకల సదుపాయం కల్పిస్తామన్నారు. ఉచిత ప్రసాద వితరణ, క్యూలైన్ల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం 95 మంది సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పెందుర్తి సీఐ కె.వి.సతీష్ కుమార్ తెలిపారు. భక్తులు సంయమనంతో వ్యవహరించి తోపులాట లేకుండా స్వామిని దర్శించుకోవాలని కోరారు. ★ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగాదేవి ఆలయంలో ఆరోజు ఉదయం 6గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. ★ సుజాతనగర్ హరిహర క్షేత్రంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. ఉదయం 5 గంటల నుంచి తిరుమల, వైకుంఠ ద్వార దర్శనం ఉంటుందని అర్చకులు పేర్కొన్నారు. చోడవానిపాలెం గోవిందరాజు స్వామి ఆలయంతోపాటు పలు రామాలయాల్లోనూ వైకుంఠ ఏకాదశి ఉత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

వైద్య రంగానికి డా॥ శివరామకృష్ణారావు సేవలు ఎనలేనివి

ఘనంగా శత వసంత జన్మదిన వేడుకలు

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: వైద్య రంగానికి డాక్టర్ శివరామకృష్ణారావు చేసిన సేవలు అజరామరమని ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ వైద్యులు, వక్తలు పేర్కొన్నారు. వైద్యుడిగా ఎందరికో సేవలందించి ప్రొఫెసర్‌గా ఎందరినో ఉత్తమ వైద్యులుగా తీర్చిదిద్దిన డాక్టర్ పట్నం శివరామకృష్ణారావు వందో జన్మదిన వేడుకలు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఓ హోటల్‌లో శిష్యబృందం, కుటుంబ సభ్యుల మధ్య ఆదివారం ఘనంగా జరిగాయి. విశాఖపట్నం ఆంధ్రా వైద్యకళాశాల, గుంటూరు, కాకినాడ వైద్య కళాశాలల పూర్వ విద్యార్థులైన ప్రముఖ వైద్యనిపుణులు, హైదరాబాద్, కర్నూలు, విజయవాడ, రాజమహేంద్రవరం నగరాలకు చెందిన ఆయన శిష్యులు పెద్ద ఎత్తున హాజరై శివరామకృష్ణారావును సత్కరించి పాదాభివందనం చేశారు. శివరామకృష్ణారావు నెల్లూరులో జన్మించినా రాజమహేంద్రవరంలో ఉంటున్న తన మనుమరాలు(కుమార్తె కూతురు) వద్ద స్థిరపడ్డారు. ఆయన కుమార్తెలు, బంధువులు అంతా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన వైద్య ప్రముఖులు డాక్టర్ సోమరాజు, డాక్టర్ ఐవీరావు, డాక్టర్ బాబ్జీ, డాక్టర్ ఎస్‌కే అప్పారావు, డాక్టర్ పెదవీర్రాజు, డాక్టర్ గోలు రామారావు తదితరులు మాట్లాడారు. 28 ఏళ్లపాటు వైద్య విద్యబోధన, 70 ఏళ్లకు పైగా క్లినికల్ అనుభవంతో ఆయన ఎన్నో మైలురాళ్లు దాటారన్నారు. ఆయన రాసిన 'డిఫరెన్షియల్ డయాగ్నోసిస్ అండ్ మెడికల్ థెరాపెటిక్స్' పుస్తకం యువ వైద్యులకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు.

ఈ పుస్తకం మొదటి ఎడిషన్ 2001లో విడుదల చేసినా.. దానికి అనుబంధంగా అయిదో ఎడిషన్‌ను ఈ ఏడాది సెప్టెంబరులో విడుదల చేశారన్నారు. ఇది జాతీయ, అంతర్జాతీయంగా వైద్యరంగంలో సంచలనం సృష్టించిన పుస్తకమన్నారు. ఆయన శిష్యులు ఇప్పుడు దేశ విదేశాల్లో ప్రముఖ వైద్యులుగా రాణిస్తున్నారంటే అప్పట్లో ఆయన చేసిన దిశానిర్దేశమే కారణమన్నారు.

డాక్టర్ శివరామకృష్ణారావుతో వేర్వేరు ప్రాంతాలకు చెందిన వైద్యులు

'పురోహిత క్రికెట్ కప్' విజేత విశాఖ జట్టు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: భీమవరంలో గన్నాబత్తులవారి క్రీడా మైదానంలో 8 రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ లీగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్స్‌లో హైదరాబాద్ జట్టుపై విశాఖ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు 101 పరుగులు చేయగా.. విశాఖ 102 పరుగులతో విజయం సాధించి కప్ సొంతం చేసుకుంది. వారికి దాత సాగిరాజు అప్పలరాజు తరపున డీఎన్నార్ కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు రూ.లక్ష పారితోషికం అందించారు. రన్నర్స్‌గా నిలిచిన హైదరాబాద్ జట్టుకు దాత డాక్టర్ సిరియాల గౌతమ్‌కుమార్ రూ.50 వేలు అందించారు. పోటీల నిర్వాహకుల తరపున అతిథుల చేతులమీదుగా వారికి కప్‌లు అందించారు.

సెమీ ఫైనల్స్‌లో.. : తొలి మ్యాచ్‌లో కాకినాడ జట్టు 82 పరుగులు చేయగా హైదరాబాద్ జట్టు 83 పరుగులు చేసి విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో విశాఖ జట్టు 99 పరుగులు సాధించగా రాజమహేంద్రవరం జట్టు 93 పరుగులకే ఓటమి పాలైంది. ఈ సందర్భంగా ఆర్గనైజర్లు బ్రహ్మజోశ్యుల సుబ్రహ్మణ్యశర్మ, బ్రహ్మజోశ్యుల సత్యప్రసాద్ శర్మ, చందూరి కామేశ్వరశర్మ, ఆహ్వాన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ పోటీలో 20 జట్లు పోటీలో పాల్గొన్నాయని తెలిపారు.

కప్ అందుకున్న విశాఖ జట్టు క్రీడాకారులు

వెలమ సంఘం ఆత్మీయ సమావేశం

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు పరిధి సుజాతనగర్‌కు చెందిన రంగరాయ వెలమ సంఘం ఆత్మీయ సమావేశం చినముషిడివాడ వుడాకాలనీలోని వీఎంఆర్డీఏ కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఏపీ ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్, పెందుర్తి మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ అవగడ్డ జ్యోతి, కింజరాపు ప్రభాకర్ నాయుడు, చుక్కా చిన్నబాబు, నరవ రాంబాబు, చొక్కాకుల వెంకటరావు, తదితరులు పాల్గొని వెలమల ఐక్యతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు లగుడు శ్రీనివాస్, కార్యదర్శి త్రైనాల మహేశ్, ఉపాధ్యక్షుడు రంభ ఆనందరావు, కోశాధికారి పోతుల వెంకటరమణ, అధిక సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరిస్తున్న గండి బాబ్జీ, సంఘ నాయకులు

అప్పికొండలో 'జిప్సా' విహారయాత్ర

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే: గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేటు పాఠశాలల సంక్షేమ సంఘం(జిప్సా) ఆధ్వర్యంలో ఆదివారం అప్పికొండ బీచ్‌లో విహారయాత్ర జరిగింది. ఈ సందర్భంగా సంఘ పటిష్టతకు, పాఠశాలల సమస్యలపై చర్చించినట్లు సంఘ గౌరవ అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు పేర్కొన్నారు. సంఘ ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, షణ్ముఖరావు, బాబూరావు, మురళీ సుందర్, జగన్, రాము, సభ్యులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు ప్రతివారం స్టేషన్‌కు రావాల్సిందే

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐలు జిలానీ, లక్ష్మీ

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు ప్రతి వారం తప్పనిసరిగా స్టేషన్‌కు వచ్చి కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని ఎస్‌ఐలు జిలానీ, లక్ష్మీ పేర్కొన్నారు. స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారి ప్రస్తుత స్థితిపై ఎస్‌ఐలు ఆరా తీశారు. కార్యకలాపాలు అడిగి తెలుసుకున్నారు. నేర సంబంధిత వ్యవహారాల్లో పాల్గొనవద్దని హెచ్చరించారు.

వృద్ధుడి నేత్రాలు దానం

పెందుర్తి, న్యూస్‌టుడే: భీమిలి ప్రాంతానికి చెందిన ఓ వృద్ధుడి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఇందుకు సంబంధించి పెందుర్తి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీను తెలిపిన వివరాలిలా.. చిప్పాడ గ్రామానికి చెందిన రవ్వా రామారావు (69) శనివారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానం చేయాలని నిర్ణయించుకుని ట్రస్ట్ ప్రతినిధులను సంప్రదించారు. ఈ మేరకు నగరానికి చెందిన మోహిసిన్ నేత్రనిధి కేంద్రం టెక్నీషియన్ కృష్ణ మృతుడి నేత్రాల నుంచి కార్నియా సేకరించారు. ట్రస్టు ప్రతినిధులు సంబంధిత కుటుంబ సభ్యులకు నేత్రదానం ధ్రువీకరణ పత్రం అందజేశారు.

మృతుడి కుటుంబ సభ్యులకు ధ్రువపత్రం అందిస్తున్న టెక్నీషియన్ కృష్ణ

గ్రేటర్‌లో గ్రామాల విలీనానికి కదలిక

పెందుర్తి, న్యూస్‌టుడే: విశాఖ మహా నగరాన్ని ఆనుకుని ఉన్న గ్రామీణ మండలాల్లోని పంచాయతీలను గ్రేటర్‌లో విలీనం చేసేందుకు చర్యలు మొదలయ్యాయి. ఈ మేరకు పెందుర్తి మండలంలోని 15, భీమిలి నియోజకవర్గంలోని 64 పంచాయతీలను జీవీఎంసీలో విలీనం చేయాలని ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, గంటా శ్రీనివాసరావు ఈ ఏడాది అక్టోబరులో సీఎంను ఓ లేఖ ద్వారా కోరారు. ఆ మేరకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.

★ ఇందులో భాగంగా గ్రామ పంచాయతీలను గ్రేటర్‌లో విలీనం చేసేందుకు తొలి అడుగు పడింది. పెందుర్తి మండలంలో 15, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో 64 పంచాయతీలకు సంబంధించిన వివరాలు తెలియజేయాలని జీవీఎంసీ కమిషనర్ జిల్లా పంచాయతీ అధికారిని కోరారు. ఆయా పంచాయతీలకు సంబంధించిన జనాభా, రెవెన్యూ గ్రామాల విస్తీర్ణం, ఇతర వివరాలను ఈ నెలాఖరులోగా అందజేయాలన్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో వాడీవేడి చర్చ జరుగుతోంది. గ్రామీణ నాయకులు కలిసిన ప్రతిచోటా ఇదే సంభాషణ.

★ అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని సబ్బవరం మండలంలో కూడా విలీనానికి అనుకూల సంకేతాలున్నాయి. ఇప్పటికే కొన్ని గ్రామ పంచాయతీలు తమ గ్రామాలను గ్రేటర్‌లో విలీనం చేయాలని ప్రతిపాదించినట్లు సమాచారం. ఈ క్రమంలో పరవాడ మండలం కూడా గ్రేటర్‌లో కలిసే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.

★ **స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం:** మరో ఆరు నెలల్లో జీవీఎంసీ ఎన్నికలు జరగాల్సి ఉంది. అదే సమయంలో గ్రామ పంచాయతీల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. జిల్లా, మండల ప్రాదేశిక పాలకవర్గాలకు వచ్చే ఏడాది నవంబరు వరకు గడువు ఉంది. ఈ నేపథ్యంలో విలీనం ప్రతిపాదనలు స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపనున్నాయి. ప్రభుత్వం ఈ విలీనంపై ముందుకు వెళ్తే ఎన్నికలు వాయిదా పడే అవకాశం ఉందని నాయకులు అభిప్రాయపడుతున్నారు. పెందుర్తి, భీమిలి నియోజకవర్గాల్లోని గ్రామ పంచాయతీలు జీవీఎంసీలో విలీనమైతే విశాఖ జిల్లా మొత్తం నగర ప్రాంతంగా అవతరించి జిల్లా, మండల పరిషత్‌లు కనుమరుగవుతాయి.

ప్రమాదకర మలుపులతో బెంబేలు

తానాం మార్గంలోని ఊరచెరువు వద్ద ఇలా..

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడ నుంచి తానాం, భరణికం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన మార్గాల్లోని మలుపులు ప్రమాదకరంగా మారాయి. వాహనాలు దగ్గరికొచ్చే వరకు కానరాకపోవడంతో పాదచారులు, వాహన చోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు అతి వేగంతో వాహనాలు నడపడం వల్ల మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా మార్గాల్లో విద్యుత్తు దీపాలు లేకపోవడం వల్ల రాత్రి వేళ మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంటున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

(c) eenadu

భీమిలి

సినిమాలు
చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే
గణేశ్- **అవతార్**
రాములమ్మ- **శంబాలా**
తాతా- **ఈషా**
సప్తగిరి- **ఛాంపియన్**

దాకమర్రిలో ధనుర్మాసోత్సవాలు

దాకమర్రి (తగరపువలస), న్యూస్‌టుడే: విజయనగరం-తగరపువలస రోడ్డులోని భీమిలి మండలం దాకమర్రి లక్ష్మీ వల్లభ నారాయణ స్వామి (విష్ణుమూర్తి) ఆలయంలో ధనుర్మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా వచ్చే నెల 14వ తేదీ వరకూ ఆలయానికి వచ్చే భక్తులకు ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం అన్నసమారాధన చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సంకురుభుక్త ప్రకాశ్ చెప్పారు. రోజూ ఉదయం 4 గంటలకు అభిషేకం, నగర సంకీర్తన, ఏడు నుంచి హోమం, రాత్రికి ఆధ్యాత్మిక భజన ఉంటుందన్నారు.

మహాసభల విజయవంతానికి పిలుపు

కొమ్మాది, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది జనవరి 4న నగరంలో జరగనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని మధురవాడ జోన్ అధ్యక్షుడు డి.అప్పలరాజు పిలుపునిచ్చారు. ఆదివారం సాయిరాం కాలనీ(కొమ్మాది) కూడలి వద్ద శ్రీకృష్ణ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కె.లక్ష్మణ సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. భవిష్యత్తులో చేపట్టబోయే ఉద్యమాల రూపకల్పన మహాసభల వేదికగా జరుగుతుందన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మున్సిపల్ స్టేడియం వరకు తొలుత జరగనున్న భారీ ర్యాలీలో పాల్గొనాలన్నారు. నాయకులు పి.రాజ్‌కుమార్, కోరాడ రమణ, సీహెచ్.లక్ష్మణరావు, ఎం.సత్యం తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: మిథిలాపురి వుడాకాలనీ(మధురవాడ)లో శివాలయం దగ్గర రహదారి గోతులమయంగా ఉంది. - **రామారావు** ✓:పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. - **శ్రీనివాస్, ఏఈ**

?: రుషికొండ తారకరామానగర్ పరిసరాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. - **తారకరామానగర్** ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - **సాయిరామ్, విద్యుత్ ఏఈ**

?: సాగర్‌నగర్ నుంచి బీచ్‌కు వెళ్లే దారిలో ఎక్కడికక్కడ వాహనాలు నిలిపేస్తున్నారు. - **కల్పన** ✓: రాకపోకలకు అంతరాయం లేకుండా చూస్తాం. - **ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు**

?: ఎండాడ-రుషికొండ మార్గంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. - **నాయుడు** ✓: వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం. - **రాజా రవికుమార్, ఆరోగ్య అధికారి**

?: పీఎంపాలెం ప్రధాన దారిలో ఇటీవల తొలగించిన ఆక్రమణల్లో భాగంగా నిర్మాణ వ్యర్థాలను ఎక్కడికక్కడ వదిలేస్తున్నారు. - **పట్నాయక్** ✓: వ్యర్థాలను తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. - **అయ్యప్పనాయుడు, జెడ్సీ**

ఈ మార్గాల్లో ప్రయాణమంటే.. ఒళ్లు హూనమే

తగరపువలస, గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భీమిలి మండలంలోని పలు రోడ్లు గుంతలతో అధ్వానంగా ఉన్నాయి. ఈ మార్గాల్లో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ప్రధాన మార్గాలు కావడంతో ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలతో పాటు భారీ వాహనాలు ఇదే మార్గం నుంచి భారీ సంఖ్యలో వెళ్తుంటాయి. గత ప్రభుత్వం ఈ రోడ్ల వైపు కన్నెత్తి చూడలేదు. ఈసారైన తమ కష్టాలు తీరుతాయని భావించిన ప్రజలకు ఇప్పటికీ ఉపశమనం లభించక ఆవేదన చెందుతున్నారు.

గొల్లల తాళ్లవలస మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల సమీపంలో గుంతల రోడ్డు

★ భీమిలి దొరతోట రోడ్డు నుంచి పీహెచ్‌సీ వైపు నుంచి తగరపువలస జాతీయరహదారికి వెళ్లే గొల్లల తాళ్లవలస బీటీ రోడ్డు పూర్తిగా శిథిలమైంది. దాదాపు కిలోమీటరున్నర మేర అడుగడుగునా గుంతలు ఉండటంతో ఒళ్లు హూనం అవుతోందని వాహనదారులు వాపోతున్నారు. ★ భీమిలి మండలం కొత్తవలస నుంచి గారిపేట వరకూ గుంతలమయంగా ఉంది. ★ భీమిలి కుమ్మరిపాలెం నుంచి తాళ్లవలస జాతీయరహదారి యాతపేట, చిన్నిపేట, ఎస్సీకాలనీలకు పోయే బీటీ రోడ్డు మూడు కిలోమీటర్ల మేర గుంతలు పడి ఉండటంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ★ ఇక టి.నగరపాలెం నుంచి గోస్తనీ నది సమీపంగా తాటితూరు వైపు పోయే రోడ్డు, తాటితూరు కూడలి నుంచి తాటితూరు ప్రధాన గ్రామంలోకి వెళ్లే మార్గంలో పలుచోట్ల గుంతలు ఉన్నాయి.

శివారు గ్రామాల్లోనూ ఇదే దుస్థితి..: విజయనగరం రోడ్డులోని బోడమెట్టపాలెం, రామునాయుడుపేట గ్రామాల ప్రధాన రోడ్లు ఇప్పటికీ తారురోడ్లకు నోచుకోక స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్త మూలకుద్దు రోడ్డులోనూ ఇదే పరిస్థితి. ఇక అన్నవరం నుంచి తగరపువలస అవంతి కళాశాల వరకూ ఉన్న పది కిలోమీటర్ల రోడ్డు మాస్టర్‌ప్లాన్ రోడ్డుగా విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ మార్గంలో గోతులు ఉండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పెదనాగమయ్యపాలెం, చిననాగమయ్యపాలెం గ్రామాలకు పోయే బీటీ రోడ్లు పాడైపోయాయి. మజ్జివలస నుంచి నారాయణరాజుపేటకి, రేవిడి వెంకటాపురం నుంచి మజ్జిపేటకి వెళ్లే రహదారి, చిప్పాడ నుంచి అమనాం గ్రామానికి పోయే రెండు జిల్లాలను కలిపే బీటీ రోడ్డు, రేఖవానిపాలెం ప్రధానమార్గాలు అధ్వానంగా ఉన్నాయి.



రహదారులను బాగు చేస్తాం..: రహదారుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. కొన్నిరోడ్లు రహదారులు భవనాలశాఖ పరిధిలోనూ, మిగిలినవి పంచాయతీరాజ్‌లో ఉన్నాయి. వీటిని త్వరలోనే బాగు చేయనున్నాం. ఇక కొత్త రోడ్ల నిర్మాణానికి సైతం అంచనాలను తయారు చేస్తున్నాం.
- జగదీశ్‌బాబు (పంచాయతీరాజ్ ఉప కార్యనిర్వాహక ఇంజినీరింగ్ అధికారి, భీమిలి సబ్ డివిజన్)

యూజీడీ సమస్యకు శాశ్వత పరిష్కారం

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ 5వ వార్డులో పలు కాలనీల్లో భూగర్భ మురుగునీటి వ్యవస్థ (యూజీడీ)ను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కొమ్మాది వైఎస్‌ఆర్‌నగర్, మారికవలస రాజీవ్‌గృహకల్ప కాలనీల్లో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో లీకులు ఏర్పడి వ్యర్థాలు బయటకు వచ్చేవి. దుర్వాసనతో ఇళ్లల్లో ఉండలేని దుస్థితి. అయినా గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. దీనిపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు రావడంతో కార్పొరేటర్ మొల్లి హేమలత యూజీడీ సమస్యపై కౌన్సిల్‌లో ప్రస్తావించడంతో కూటమి ప్రభుత్వం రూ.1.89 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు ఆయా కాలనీల్లో పైపులైన్ల పనులు చేపడుతున్నారు. 2026 ఫిబ్రవరి చివరినాటికి పనులు పూర్తి చేస్తామని యూజీడీ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

వైఎస్‌ఆర్‌కాలనీలో యూజీడీ పనులు చేపడుతున్న దృశ్యం

95 మందికి హోమియో వైద్య పరీక్షలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఛైర్మన్ కె.శ్రీరామ్ ఆధ్వర్యంలో హోమియో వైద్యులు డా.మోహనరావు, డా.జగన్నాథరావు 95 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఎం.శంకరరావు, పి.బాల, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక

ఆనందపురం, న్యూస్‌టుడే: గండిగుండం ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి రగ్బీ పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర పోటీలకు అర్హత సాధించారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మురళి తెలిపారు. రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29, 30 తేదీల్లో కర్నూల్‌లో జరగనున్న పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా తరఫున విద్యార్థులు బి.జయశ్రీ, పి.పూజిత, జి.యశ్వంత్, జి.ప్రసన్నకుమార్ ఆడనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం అక్కడకు బయలుదేరారు. ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణ, విద్యాకమిటీ ఛైర్మన్ కుమారి వీరికి అభినందనలు తెలిపారు.

ఎంపికైన వారితో ఉపాధ్యాయులు

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

ఆనందపురం, న్యూస్‌టుడే: గుడిలోవ విజ్ఞాన విహార ఆవాస విద్యాలయంలోని శ్రీసరస్వతీ విద్యా విహార్ విద్యాలయం వార్షికోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థుల యోగాసనాలు, అగ్ని గోళం నుంచి దూకడం, మల్లకంబ, పిరమిడ్ తదితర ఆసనాలను ప్రదర్శించిన తీరు ఆకట్టుకుంది. లఘునాటికలు, జానపద నృత్యాలు, పౌరాణిక పాత్రలు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో విశాఖపట్నం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆళ్ల శ్రీనివాస గణేష్ రెడ్డి, ఎంఈవో జోగేంద్ర, ఎంపీడీవో వి.జానకి, మండల పశు వైద్యాధికారి పి.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నోటి నుంచి అగ్నికీలలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రేపు ఉత్తర ద్వార దర్శనం

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభంలోని శ్రీఅనంతపద్మనాభ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు పి.సీతారామాంజనేయ స్వామి తెలిపారు. మంగళవారం ఉదయం 4 గంటలకు విశేష అభిషేకాలు, 5 గంటలకు నిత్య ఆరాధన అనంతరం స్వామివారి ఉత్తర ద్వార దర్శనం ఉంటుందన్నారు. సాయంత్రం పద్మనాభం గ్రామంలో స్వామివారి ఉత్సవమూర్తులను ఊరేగించి లక్ష పూలతో అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు.

జాతరలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ శిల్పారామం (జాతర)లో ఆదివారం కళావేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శ్రీ సిద్ధేంద్రయోగి నృత్యాలయం చిన్నారులు సుమదా, మోహన, ఆశ్రీత, జస్విత, లలిత, లక్ష్మీ, త్రివేణి, సౌమ్య వారి హావభావాలతో నర్తించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు ఆకట్టున్నాయి. ఈ నృత్యాలకు మోహనలక్ష్మీ దర్శకత్వం వహించారు. స్థానిక పరిపాలనాధికారి రమేష్ రెడ్డి చిన్నారులను అభినందించారు.

నేడు దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం

కొమ్మాది, న్యూస్‌టుడే: చంద్రంపాలెం జాతర గట్టుపై వెలిసిన దుర్గాలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలను ఈ నెల 29వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు తెలిపారు. 29న పంచముఖ ఆంజనేయస్వామికి, 30న దుర్గాదేవి అమ్మవారికి, 31న శ్రీ సాయినాథునికి ప్రత్యేక పూజలు చేపడుతున్నామన్నారు. 30న మధ్యాహ్నం జగుపిల్లి కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో అన్నసమారాధన ఉంటుందన్నారు.

అభయారణ్యంలో కాలభైరవుడు

పూజలందుకుంటున్న కాలభైరవస్వామి

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం పరిధి హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలోని కంబాల కొండ అభయారణ్యంలో కాలభైరవస్వామి విగ్రహాన్ని ఇటీవల స్థానికులు గుర్తించారు. దట్టమైన చెట్ల మధ్య అడవిలో రాతిపై చెక్కిన శిల్పంలా స్వామి కనువిందు చేస్తున్నారు. దీంతో చెట్టు, చేమ, విష జంతువులను సైతం లెక్క చేయకుండా భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేస్తున్నారు. అక్కడికి వెళ్లేందుకు సరైన మార్గం లేకపోయినా ప్రతి నెలా అమావాస్య నాడు తెల్లవారుజామున భద్రత కోసం చేతి కర్రలు పట్టుకుని స్వామి సన్నిధికి వెళ్లి పసుపు, కుంకుమ, విబూధితో పూజలు చేస్తున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి అక్కడ విగ్రహం ఉందని, గతంలో స్థానికులు పూజలు చేసే వారని పలువురు చెబుతున్నారు. అడివివరం సమీపంలో విశేష పూజలందుకుంటున్న కాలభైరవస్వామి ఆలయం అభయారణ్యంలో ఉండటం, ఇక్కడ అదే మాదిరిగా స్వామి విగ్రహం కనిపించడంతో భక్తుల రాకపోకలు పెరుగుతున్నాయి.

మిత్రుని కుటుంబానికి చేయూత

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: తగరపువలసలో ఇటీవల మృతిచెందిన తమ మిత్రుడు తమ్మిన శ్రీను కుటుంబానికి ఆయన స్నేహితులు చేయూతనందించారు. తాము సేకరించిన రూ.22 వేల నగదు, బియ్యం, నిత్యావసరాలను ఆయన భార్య, కుటుంబీకులకు ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు వాండ్రాసి సతీశ్, బండారు విద్యాసాగర్, శీరపు రమేశ్, నర్సింగ్, నానాజీ, మైథిలీ, గంగాధర్, శ్రీను, నాగరాజు, శంకర్ పాల్గొన్నారు

మిత్రుని కుటుంబానికి ఆర్థికసాయం, నిత్యావసరాలను అందిస్తున్న తగరపువలస హెల్పింగ్ హ్యాండ్స్ యువత

అడిగినంత ఇస్తేనే ధాన్యం తరలింపు

జీపీఎస్ వాహనదారుల తీరుతో రైతులకు అవస్థలు

ఆనందపురం, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్‌లో భాగంగా ఆనందపురం మండలంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సేకరణ కేంద్రంగా బోని రైతు సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు అక్కడకు తీసుకెళ్లగా అధికారుల సూచన మేరకు పాండ్రంగి, బాకురపాలెం, శొంఠ్యాం గ్రామాల్లోని రైస్ మిల్లులకు తరలించాలి. ఇంత వరకు బాగానే ఉంది. అయితే ఇలా ధాన్యాన్ని తరలించేందుకు జీపీఎస్ ట్రాకింగ్ విధానం కలిగిన వాహనాల్లోనే తరలించాలనే నిబంధన విధించడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. వారు అడిగినంత ఇచ్చుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

దోపిడీ ఇలా: రైతు పండించిన ధాన్యాన్ని బియ్యం మిల్లుకు తరలించాలంటే మొదట మద్ది గ్రామంలో ఏర్పాటు చేసిన కాటా వద్ద ఖాళీ జీపీఎస్ కలిగిన వాహనాన్ని తూకం వేయాలి. అక్కడి నుంచి రైతుల పొలాలకు వెళ్లి లోడు చేసుకుని మళ్లీ అదే కాటాకు వచ్చి ధాన్యం తూకం వేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత లోడుని బియ్యం మిల్లుకు తీసుకెళ్లి మిల్లు యజమాని కాటాపై మరోసారి తూకం వేయాలి. అనంతరం ధాన్యం దింపాలి. దీని ఆధారంగా పౌరసరఫరాల శాఖ ఆన్‌లైన్ చేస్తే రైతు బ్యాంక్ ఖాతాలోకి భారత ఆహార సంస్థ నగదు జమ చేస్తుంది. కేవలం బోని గ్రామంలోని 10 ట్రాక్టర్ వాహనాలకే జీపీఎస్ ట్రాకింగ్ అనుమతి ఇవ్వడంతో వీరంతా కలిసి రైతులను దోపిడీ చేస్తున్నారు. భారీగా నగదు డిమాండ్ చేస్తున్నారు. ఇది అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. దూరా భారం కలిగిన రైతులు ప్రభుత్వానికి ధాన్యాన్ని అమ్మకం చేయాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసినా వారికే ఇచ్చుకునే పరిస్థితి నెలకొందని అన్నదాతలు వాపోతున్నారు.

➡ జీపీఎస్ వాహనదారుడి డిమాండ్ ఇలా..: ఆనందపురం సచివాలయం పరిధిలో ఓ రైతు తన 26 బస్తాల ధాన్యాన్ని కేంద్రానికి తరలించేందుకు ఓ ట్రాక్టర్ యజమానిని సంప్రదించగా పాండ్రంగి మిల్లుకు రూ.3,500.. బాకురపాలేనికి రూ.3,500.. శొంఠ్యాంకు రూ.6,000 ఇవ్వాలని అధికారుల సమక్షంలోనే చెప్పుకొచ్చారు. అయితే పాండ్రంగి, బాకురపాలెం బియ్యం మిల్లులకు బ్యాంక్ గ్యారెంటీ ముగియడంతో కేవలం శొంఠ్యాంకు మాత్రమే అవకాశం ఉండటంతో రైతుల నుంచి మరింత దోపిడీకి పాల్పడుతున్నారు. ఈ విషయమై వ్యవసాయ అధికారిణి ఏవో సంధ్యారత్నప్రభ వద్ద ప్రస్తావించగా జీపీఎస్ వాహనంలోనే తీసుకెళ్లాలనే ప్రభుత్వ నిబంధన ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రుషికొండ బీచ్ కిటకిట

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ బీచ్‌కు ఆదివారం అధిక సంఖ్యలో సందర్శకులు తరలి రావడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. బోటింగ్ కేంద్రం, మత్స్యదర్శని పార్కు, మెరైన్ పోలీసు టవర్, ఆంటీ భూమిలు వంటి ఆకర్షణీయ ప్రదేశాల్లో ఉత్సాహంగా గడిపారు. సముద్ర స్నానాలు చేసేవారిని బీచ్‌లోని వెళ్లరాదంటూ జీవీఎంసీ, టూరిజం లైఫ్‌గార్డులు, పోలీసులు ప్రచార మాధ్యమాల ద్వారా అప్రమత్తం చేశారు.

తీరంలో సందర్శకులు

హరేరామ.. హరేకృష్ణ

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఇస్కాన్ మందిరం (సాగర్‌నగర్)లో హరేరామ..హరేకృష్ణ నామస్మరణతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాధాకృష్ణులు, సుభద్ర బలభద్ర జగన్నాథస్వామి మహిమల్ని అభివర్ణిస్తూ భక్తులు భజనలు, గీతా లాపనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ సమక్షంలో అన్నసమారాధన చేపట్టారు.

క్రీడా పోటీల్లో ప్రతిభ

కొమ్మాది, న్యూస్‌టుడే: పీఎంపాలెం సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాల వేదికగా ఆదివారం నిర్వహించిన అంతర పాఠశాలల క్రీడా పోటీల్లో చంద్రంపాలెం విద్యార్థులు ప్రతిభ చాటారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ట్రోఫీలు అందజేసి అభినందించారు. ప్రధానోపాధ్యాయులు మొలుగు వెంకటరావు, ఫిజికల్ డైరెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో ప్రధానోపాధ్యాయులు వెంకటరావు, శిక్షకులు

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ బాలకృష్ణ తదితరులు

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది క్రికెట్ మైదానం వేదికగా మధురవాడ సూపర్ లీగ్ క్రికెట్ సీజన్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ, ఎస్ఐ డి.రాము పాల్గొన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు పోతిన ఆనంద్, పిళ్లా క్రాంతి తెలిపారు. విజేతలకు ట్రోఫీతో పాటు నగదు బహుమతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో భార్గవ్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: 'హోమ్ కమింగ్' పేరిట గీతం డీమ్డ్ వర్సిటీలో రెండు రోజులుగా జరుగుతున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారంతో ముగిసింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వీసీ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా, ప్రో-వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, స్టూడెంట్ లైఫ్ సహాయ డీన్ అరుణ్‌కార్తీక్, పూర్వ విద్యార్థుల సంబంధాల విభాగం డిప్యూటీ డైరెక్టర్ పి.నవీన్ మాట్లాడారు. దేశ విదేశాల్లో ఉంటున్న పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో అధిక సంఖ్యలో విచ్చేయడంతో సందడి వాతావరణం నెలకొంది. నగరంలోని పలు ఆలయాలు, పర్యాటక ప్రదేశాలను సందర్శించారు.

నృత్యం చేస్తున్న యువత

అన్నప్రసాదానికి కూరగాయల వితరణ

దాత కనకమహాలక్ష్మికి ప్రసాదం అందిస్తున్న పర్యవేక్షకుడు పాలూరి నరసింగరావు

సింహాచలం, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి సందర్భంగా సింహగిరిపై భక్తులకు పంపిణీ చేసే అన్న ప్రసాదం నిమిత్తం హనుమంతువాకకు చెందిన కె.కనకమహాలక్ష్మి అనే భక్తురాలు ఆదివారం కూరగాయలు వితరణ చేశారు. 500 కిలోల గుమ్మడి కాయలు, 200 కిలోల చింతపండు, 200 కిలోల క్యాబేజీ, 15 కిలోల వంకాయలు, 30 కిలోల ముల్లంగి, 50 కిలోల చిలగడ దుంపలు అన్నప్రసాద విభాగం పర్యవేక్షకుడు పాలూరి నరసింగరావుకు అందజేశారు. అధికారులు దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

ఘనంగా సాంకేతిక కళాశాల వార్షికోత్సవం

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెంలోని సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాల 16వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆళ్వార్‌దాస్ గ్రూప్ కార్యదర్శి ఎస్.వి.హెచ్.రాజేంద్ర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుంకరి రాహుల్ ఆళ్వార్‌దాస్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సాంకేతిక ప్రదర్శన, క్రీడా పోటీల్లో వివిధ పాలిటెక్నిక్ కళాశాలల జట్లు పాల్గొని ప్రతిభ చాటాయని ప్రిన్సిపల్ ఎ.రామకృష్ణ తెలిపారు. విజేత జట్లకు కళాశాల చీఫ్ అడ్మిషన్స్ అధికారి రవి తేజ ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. 'ఆళ్వార్‌దాస్ టోర్నమెంట్' పేరుతో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో చంద్రంపాలెం, ఆనందపురం తదితర పాఠశాలల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కళాశాలల ఎగ్జిక్యూటివ్ అధికారిణి (ఐఐటీడీఎం) సుంకరి సునీతరాహుల్‌ఆళ్వార్‌దాస్, ఎగ్జిక్యూటివ్ అధికారిణి మధుభట్, అకడమిక్ డైరెక్టర్ వి.శివరాంప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎ.నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

ఘనంగా హిందూ సమ్మేళనం

మాట్లాడుతున్న యుగంధర్

ఆనందపురం, న్యూస్‌టుడే: సర్వేజనా సుఖినోభవంతు అంటూ విశ్వ మానవాళి ఆయురారోగ్యంతో ఉండాలనేది హిందువుల తత్వమని ఆర్ఎస్ఎస్ ఆంధ్ర ప్రాంత కార్యకారిణి యుగంధర్ అన్నారు. ఆదివారం శొంఠ్యాం గ్రామంలో హిందూ సమ్మేళనం వైభవంగా నిర్వహించారు. సరిపల్లి వారాహి పీఠం సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ.. హిందువు అంటే మతం కాదని అది ఒక జీవన విధానమన్నారు. వివిధ కుల వృత్తుల ప్రతినిధులను సన్మానించారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ క్షేత్ర సంఘ్‌చాలక్ దూసి రామకృష్ణ, విశాఖ జిల్లా సహ కార్యవాహ తమ్మిన నరసింగరావు, సమరసత ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ కోరుకొండ రామలక్ష్మి, మూర్తి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

భీమిలి ఎన్జీవో సంఘం ఎన్నిక ఏకగ్రీవం

ప్రమాణ స్వీకారం చేస్తున్న భీమిలి ఎన్జీవో సంఘం కార్యవర్గం ప్రతినిధులు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి తాలూకా యూనిట్ ఎన్జీవో సంఘం కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. భీమిలిలోని ఎన్జీవో సంఘం భవనంలో భీమునిపట్నం, ఆనందపురం, పద్మనాభం మండలాలకు సంబంధించిన ఈ సంఘానికి శనివారం నామపత్రాలను ఆహ్వానించారు. ప్రతీ పదవికి ఒక్కొక్కరు మాత్రమే దాఖలు చేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. సంఘం అధ్యక్షునిగా కె.వి.ఎ.ఎస్.నారాయణరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్.ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కె.సాయిబాబా, కోశాధికారిగా పి.వరహామూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శిగా బి.ప్రసాద్‌తో పాటు పదిమంది సభ్యులు ఎన్నికయ్యారు. పి.అప్పలరాజు, సుబ్రహ్మణ్యం ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఈ మేరకు నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. వీరిని జిల్లా ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, కార్యదర్శి కె.రవిశంకర్, భీమిలి డిప్యూటీ ఎంపీడీఓ కె.రమేష్‌నాయుడు, తదితరులు అభినందించారు.

ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

పద్మనాభం, న్యూస్‌టుడే: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చిన్నాపురం, కొయ్యపేట గ్రామాల్లో ఆదివారం భగవద్గీత ప్రచారం నిర్వహించారు. భోగి, సంక్రాంతి విశిష్టతలను తెలుపుతూ ఉత్తరాయణం, దక్షణాయణ పుణ్య కాలాల గురించి ప్రజలకు వివరించారు. ఆధ్యాత్మిక అంశాలపై అవగాహన కల్పించారు. కె.త్రినాథరావు, వి.భవాని, మంగమ్మ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత ప్రచారంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు

బీచ్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: రుషికొండ కూడలి నుంచి శ్రీవారి ఆలయం ముఖద్వారం వరకు బీచ్‌రోడ్డులో ఆదివారం తలెత్తిన ట్రాఫిక్ సమస్యతో వాహనచోదకులు ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా బీచ్‌రోడ్డు పరిసరాల్లోని పర్యాటక ప్రదేశాలకు వివిధ ప్రాంతాల నుంచి వాహనాల ద్వారా ఎక్కువ మంది సందర్శకులు తరలివచ్చారు. వీరిలో అధిక శాతం మంది రహదారిలోనే వాహనాలు నిలపడంతో ఈ సమస్య ఏర్పడిందని పేర్కొన్నారు.

సింహగిరిపై ధనుర్మాస వైభవం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా అర్చకులు దేవతామూర్తుల తిరువీధి వేడుకగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి బంగారు తొళక్కియాన్ పల్లకిలో కొలువుదీర్చారు. వేద పారాయణలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లను ఆలయ బేడా మండపంలో చతుర్గతి నడకలతో ఊరేగించారు. తిరుప్పావై సేవాకాలంలో భాగంగా అమ్మవారి సేవ, పాశుర విన్నపం, తీర్థగోష్ఠి సంప్రదాయబద్ధంగా జరిగింది.

తిరువీధిలో కళాకారుల నాదస్వర మంగళవాయిద్యాలు

(c) eenadu

విశాఖ తూర్పు

సింహగిరిపై ధనుర్మాస వైభవం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా అర్చకులు దేవతామూర్తుల తిరువీధి వేడుకగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి బంగారు తొళక్కియాన్ పల్లకిలో కొలువుదీర్చారు. వేద పారాయణలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లను ఆలయ బేడామండపంలో ఘనంగా ఊరేగించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769

మద్దిలపాలెం: 9912120229

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ పరిధి 15వ వార్డు సింహాద్రిపురం ప్రాంతంలో కాలువల్లో పూడికలు తొలగించడం లేదు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. – రాజేంద్ర, సింహాద్రిపురం ✓: తక్షణమే సంబంధిత సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తాం. – కిషోర్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ?: జోడుగుళ్లపాలెం కూడలి నుంచి హనుమంతువాక వరకు ప్రధాన రహదారి మధ్యలో పలుచోట్ల గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. –నల్ల రవికుమార్, సంజీవ్‌నగర్ కాలనీ ✓: నివేదిక పంపించాం. అనుమతులు రాగానే సమస్య పరిష్కరిస్తాం. –వెంకటరావు, డీఈ

ఇందిరానగర్ (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ?: రాజీవ్‌నగర్, ఇందిరానగర్‌లలో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. –ఆంజనేయులు, ఇందిరానగర్ ✓: ఆయా ప్రాంతాలకు వీధి కుక్కల నియంత్రణ సిబ్బందిని పంపించి తక్షణమే చర్యలు చేపడతాం. –డాక్టర్ రాజా రవి కుమార్, సంబంధిత విభాగాధికారి

స్పందనకు వందనం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ పరిధి 20వ వార్డు చినవాల్తేరు ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలోని గెడ్డలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుందని ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ స్పందించారు. సిబ్బందితో వ్యర్థాలు తీయించారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: పెదవాల్తేరు పరిధిలోని రాజీవ్‌నగర్ ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రోజువిడిచి రోజు కూడా నీరు అందించడంతో స్థానికులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. దార కూడా చాలా సన్నగా రావడంతో సమస్య మరింత జటిలమైంది. ఈ సమస్యను స్థానికులు 'ఈనాడు మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకురావడంతో ఏఈ శ్రీనివాస్ స్పందించారు. సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు ప్రారంభం

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు ఆదివారం ఏయూలోని బాక్సింగ్ హాల్లో ప్రారంభమయ్యాయి. పోటీలను రాష్ట్ర కిక్ బాక్సింగ్ సంఘం గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది జిల్లాల నుంచి సుమారు రెండొందల మంది క్రీడాకారులు తలపడనున్నారన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఫిబ్రవరిలో దిల్లీలో జరగనున్న అంతర్జాతీయ ఓపెన్ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆనందకుమార్, జోగారావు, కోచ్‌లు సునీల్, శరత్, అనిల్, నర్సింహారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అన్నక్యాంటీన్లు.. మరింత సమర్థమంతంగా..!

ఆరిలోవ, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేద ప్రజలు, రోజూ కూలీలు, కార్మికుల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు పునరుద్ధరించి అందుబాటులోకి తీసుకువచ్చారు. అన్న క్యాంటీన్ల నిర్వహణ, శుభ్రత, రుచిని మరింత మెరుపరచాలనే ఉద్దేశంతో పర్యవేక్షణ కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది.

తూర్పు నియోజకవర్గంలో మూడు క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. ఎంవీపీ కాలనీ రైతు బజారు దగ్గర, హనుమంతువాక కూడలి సమీపంలో విమ్స్ ఆసుపత్రి ఎదురుగా, ఆరిలోవ కాలనీలో మరొక క్యాంటీను ఉన్నాయి. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు చేస్తున్నవారు మూడు క్యాంటీన్లలో ప్రతి రోజు సుమారు మూడు వేల మందికి పైగా ఉన్నారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న అన్న క్యాంటీన్లపై మరింత పర్యవేక్షణ పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది.

★ ప్రస్తుతం నగరంలో వీటి పర్యవేక్షణ జోనల్ కమిషనర్లు చూస్తున్నారు. పాలనా పరమైన పనులతో సమయం సరిపోక వీరు అప్పుడప్పుడు క్యాంటీన్లను సందర్శిస్తున్నారు. దీంతో క్షేత్ర స్థాయిలో సమస్యలు తెలియడం లేదు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో క్యాంటీన్లలో శుభ్రత, ఇతర అంశాలపై ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్‌లో పలువురు ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో నిరంతర పర్యవేక్షణకు కమిటీలను ఏర్పాటు చేయనున్నారు.

అన్న క్యాంటీన్‌లో ఏర్పాటు చేసిన టీవీ (వృత్తంలో)

విమ్స్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్

పర్యవేక్షణ కమిటీ సభ్యులు: అన్న క్యాంటీన్ల నిర్వహణ సలహాల కమిటీ ఛైర్మన్‌గా వార్డు కార్పొరేటర్ వ్యవహరిస్తారు. సచివాలయ పారిశుద్ధ్య కార్యదర్శి, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి, ఎన్జీవో ప్రతినిధి, డ్వాక్రా మహిళలు, నోడల్ అధికారి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ సభ్యులు నిత్యం ఆహార నాణ్యత, శుభ్రత, మెనూ అమలును పర్యవేక్షించడంతో పాటు క్యాంటీన్ పరిసరాల పరిశుభ్రత, ప్లేట్ల శుభ్రత, ఆహార నాణ్యత, సీసీటీవీ ఫుటేజి పరిశీలన, భోజనాలు చేసేవారి నుంచి అభిప్రాయాలు సేకరిస్తారు. లోపాలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు చేపడతారు.

అన్న క్యాంటీన్లలో కొత్తగా టీవీలు ఏర్పాటు చేశారు. వీటిలో భోజనం చేస్తున్నవారు తీసుకునే జాగ్రత్తలు, పాటించాల్సిన శుభ్రత నియమాలు, పనిచేసేవారికి సూచనలు ప్రసారం అవుతున్నాయి.

మీ ప్రాంతంలోని సమస్యలు విన్నవిస్తారా?

నేడు జెడ్సీతో 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఫోన్‌ఇన్'

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: తూర్పు జోన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల్ని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు 'ఈనాడు-మీతోడు' ఆధ్వర్యంలో సోమవారం 'ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహిస్తోంది. వీధి దీపాలు, యూజీడీ, పారిశుద్ధ్యం, రహదారులు, మంచినీటి సరఫరా, కుక్కలు, ఇంటి పన్నులు తదితర సమస్యలతోపాటు ప్రభుత్వ స్థలాల ఆక్రమణలను ఫోన్ ద్వారా జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకురావచ్చు. తూర్పుజోన్‌లో కొత్తగా కలిసిన 9నుంచి 13వ వార్డుల ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

తేదీ:	సమయం:	ఫోన్ నంబరు:
29-12-25 (సోమవారం)	ఉదయం 11 నుంచి 12 గంటల వరకు	89780 77876

భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాల్లో నిలవాలని శ్రీ చైతన్య కళాశాలల ఎగ్జిక్యూటివ్ ఏ.జి.ఎం. కె.వి.రమణ అన్నారు. ఆదివారం మద్దిలపాలెంలో ఉన్న కాకతీయ కన్వెన్షన్ సెంటర్‌లో శ్రీ చైతన్య కళాశాలల సక్సెస్ మీట్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో నిలవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ఐఐటీ, ఐఐఐటీ, ఎన్ఐటీ (450), నీట్‌లో సీట్లు పొందిన 348 మంది విద్యార్థులకు కళాశాల యాజమాన్యం సత్కరించింది. ఈ కార్యక్రమంలో కళాశాలల ఎగ్జిక్యూటివ్ డీన్స్ ఎస్.రఘుకుమార్, బంగారుబాబు, వాసుబాబు, ఏజీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సక్సెస్ మీట్‌లో పాల్గొన్న శ్రీ చైతన్య కళాశాలల విద్యార్థులు, ఎ.జి.ఎం. కె.వి.రమణ తదితరులు

ప్రయివేట్ ఐటీఐ పరీక్షలు రాసేందుకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం, న్యూస్‌టుడే: వివిధ ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయివేటు సంస్థలలో పనిచేస్తున్న అభ్యర్థులకు ఐటీఐ వివిధ ట్రేడ్‌లలో పరీక్షలు రాసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కంచరపాలెంలోని ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపల్ ఎన్.సోలమన్ తెలిపారు. సంబంధిత ట్రేడ్‌నందు అభ్యర్థులు మూడేళ్ల పైబడిన సర్వీసు కలిగి ఉండాలన్నారు. సంబంధిత సంస్థ ధ్రువీకరణ పత్రం, ఎంప్లాయి గుర్తింపు కార్డుతో పాటు పరీక్ష ఫీజు రూ.500 చెల్లించి దరఖాస్తులను వచ్చే నెల 28 తేదీలోగా అందజేయాలన్నారు.

తవ్వారు..అవస్థలు పెంచారు..

పార్వతీనగర్‌లో ఇలా..

దర్పణం

ఆరిలోవ, న్యూస్‌టుడే: జీవీఎంసీ పరిధి పార్వతీనగర్ వీధుల్లో మంచి నీటి పైపు లైను వేసేందుకు నాలుగు నెలల క్రితం గోతులు తవ్వారు. పైపులైను వేసిన తరువాత మట్టితో పూడ్చారు. నెల రోజులు కావస్తున్నా ఇంతవరకు మరమ్మతులు చేపట్టలేదు. గోతుల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు త్వరగా వీధి రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గెడ్డల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఎంవీపీ కాలనీ సెక్టార్-6 రాజీవ్ పార్కు దరి పెద్ద గెడ్డలో పూడికలు పేరుకుపోయి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు నిలిచిపోయి పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. కొంత కాలంగా చెత్త తొలగించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గెడ్డల్లో పూడికలు తొలగించాలని కోరుతున్నారు.

రాజీవ్ పార్కు సమీప గెడ్డలో నిలిచిన మురుగు

అడుగుకో గుంత.. రాకపోకలకు చింత

టీబీ పాయింట్ వద్ద రోడ్డుపై పడిన గుంత

ఆరిలోవ, న్యూస్‌టుడే: తోటగరువు నుంచి ఆరిలోవ ఆఖరి బస్టాప్‌నకు వెళ్లే ప్రధాన రహదారి దెబ్బతింది. ఈ రోడ్డు వేసి చాలా కాలమైంది, గోతులు పడిన దారిలో ప్రయాణించడంతో ఆటోలు పాడవుతున్నాయని ఆటో యూనియన్ సభ్యులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు త్వరగా మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

కర్ర.. ప్రమాదాన్ని ఆపేనా..

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 16వ వార్డు కృష్ణా కళాశాల మార్గంలో ఇసుకతోట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైపు వెళ్లే మలుపు మార్గంలో రహదారి మధ్యలో గుంత పడింది. ప్రమాదాలు జరగకుండా స్థానికులు అందులో కర్ర ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

క్లిక్ క్లిక్

హక్కుల సాధన కోసం బస్సు యాత్ర

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: వెలమ కులస్థుల హక్కుల సాధన కోసం జనవరి 1 నుంచి ఉత్తరాంధ్రలో బస్సుయాత్ర చేపడుతున్నట్లు రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు గుంట్రెడ్డి గోవిందరావు తెలిపారు. బీచ్‌రోడ్డులోని తాండ్ర పాపారాయుడు విగ్రహం వద్ద ఆదివారం క్యాలెండరును ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక సామాజిక రంగాల్లో వెలమలు వెనుకబడి ఉన్నారని అన్నారు. పలు డిమాండ్ల సాధన కోసం బస్సు యాత్ర నిర్వహించి ఆయా ప్రాంతాలలో ప్రజలను చైతన్యపరుస్తామని తెలిపారు. వెలమ సామాజిక వర్గానికి చెందిన వారికి నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని అన్నారు. విద్య, వైద్య రంగాల్లో కూడా ప్రోత్సాహించాలని కోరారు. వెలమ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పదిరెడ్డి సత్యం, జిల్లా ఇన్‌ఛార్జి రెడ్డి ఈశ్వరరావు, అనకాపల్లి ఇన్‌ఛార్జి బర్ల పైడినాయుడు పాల్గొన్నారు.

క్యాలెండరును ఆవిష్కరిస్తున్న వెలమ సంక్షేమ సంఘం ప్రతినిధులు

హిందూ ధర్మ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

హెచ్‌బీకాలనీ, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలని ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షులు, ఆనందాశ్రమ పీఠాధిపతి స్వామి శ్రీనివాసానంద సరస్వతి అన్నారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు గడిచిన నేపథ్యంలో ఆదివారం 15వ వార్డు హెచ్‌బీకాలనీలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆయన హిందూ ధర్మాన్ని ప్రచారం చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మపరిరక్షణ యువత నడుంబిగించాలని కోరారు. ఉడిపి పీఠాధిపతులు కమలానంద తీర్థ స్వామీజీ మాట్లాడుతూ మన మంతా హిందువులం అనే భావనతో ముందుకుసాగితే దేశాన్ని, ధర్మాన్ని, ఆలయాలను పరిరక్షించుకోవడం సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ తెలుగు రాష్ట్రాల నాయకుడు బలరామ్, 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, తెదేపా, భాజపా నాయకులు పాల్గొన్నారు.

హిందూ ధర్మప్రచార ర్యాలీలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి, తదితరులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: విశాలాక్షినగర్‌లోని బీవీకే పాఠశాల క్రీడామైదానంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ, ఆధ్యాత్మిక భజన, శ్రీరామనామ జపం, నగర సంకీర్తన, ప్రసాద వితరణ చేపట్టారు. విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి.

ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

వేడుకగా గోపూజ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: రామ్‌నగర్ విశాఖ సేవాసదన్ పాఠశాలలో ఆదివారం ఉదయం హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అదిక సంఖ్యలో మహిళలు కలశాలు పట్టుకొని వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామి లోకేశ్వరానంద మహరాజ్ హిందూ ధర్మం గురించి ప్రసంగించారు. కె.వి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమ్మేళనంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు కందర్ప విశ్వనాథం, సభ్యులు పల్లా జగన్నాథం, పల్లా దుర్గారావు పాల్గొన్నారు.

గోపూజలో పాల్గొన్న మహిళలు

మూలకు చేరిన చేతి బోరు..

ఆరిలోవ, న్యూస్‌టుడే: 12వ వార్డు పెదగదిలి కొండవాలు ప్రాంతంలో కొన్ని చేతి బోర్లు పనిచేయడం లేదు. వాడుక నీటి కోసం ఇబ్బంది పడుతున్నామని, నీటి సరఫరా విభాగం అధికారులు పరిశీలించి బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుపయోగంగా మారిన బోరు

ఆహ్లాదం కరవాయే..

ఇందిరానగర్, (విశాలాక్షినగర్) న్యూస్‌టుడే

పార్కులు ఆహ్లాదానికే కాదు చిరుమాల, ఇంటి పని, కార్యాలయ పని ఒత్తిడి నుంచి ఉపశమనం కల్గించే ప్రదేశాలు. నడక, యోగా, లాంటి వ్యాయామాలు చేసేందుకు అనువైన ప్రదేశాలు. పార్కులో వైద్యులు, వ్యాయామ నిపుణులు సూచిస్తున్నారు. కానీ కొన్నిచోట్ల ఉన్న పార్కులు మాత్రం దానికి భిన్నంగా ఉంటున్నాయి. గ్రామీణ తహసీల్దారు కార్యాలయం ఎదురుగా వెటర్నరీ కాలనీలోని కత్తి ఆకార పార్కు, సాయిబాబా ఆలయానికి ఆనుకుని రెండు పార్కులు ఉన్నాయి. వాటి నిర్వహణ గాలికి వదిలేయటంతో పిచ్చిమొక్కలు, ఏర్పడ్డాయి. సరదాగా తిరిగే విషయం పక్కన పెడితే పార్కులోకి వెళ్లడానికే అనుకూలంగా లేదని స్థానికులు వాపోతున్నారు.

వెటర్నరీ కాలనీలో అధ్వానంగా ఉన్న పార్కు

పదోవార్డు పరిధిలోని కాలనీలు	: 11
జనాభా	: సుమారు 50,000
పార్కులు	: 3
క్రీడా పరికరాలు ఉన్నవి	: 1
పచ్చదనం, అందమైన మొక్కలు లేని పార్కులు	: 3

రోడ్లపై నడకకు వెళ్తున్నాం: జీవీఎంసీ పాలనమండలి పార్కు నిర్వహణ పట్టించుకోవటంతో ఆకతాయిలకు నిలయంగా మారింది. దీంతో పార్కులోకి కనీసం నడవటానికి కూడా వెళ్లలేకపోతున్నాం. చాలా మంది నడకకు రోడ్లపైకి వెళ్తుండటంతో వాహనాలు ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. సచివాలయాలు, జీవీఎంసీ కార్యాలయంలో ఎన్నిసార్లు చెప్పినా అధికారులు స్పందించడం లేదు.

– శివరామ రాజు, వెటర్నరీ కాలనీ

నివేదిక పంపించాం: పదోవార్డు పరిధిలోని మూడు పార్కులలో మొక్కలు, క్రీడా పరికరాల ఏర్పాటుకు నివేదిక పంపించాం. అధికారులు నివేదికను అంగీకరించారు. గుత్తేదారును ఎంపిక చేసి త్వరలో అభివృద్ధి పనులు చేపడతాం.

– దామోదర్, ఉద్యానవన విభాగ ఏడీ

బరువు తక్కువ ఉన్న పిల్లల్లో ఆరోగ్య సమస్యలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: శస్త్ర చికిత్స పితామహుడు ఆచార్య జేవీ సేన్ జయంతిని పురస్కరించుకొని సిరిపురం కూడలి వద్ద గల లోటస్ ఆసుపత్రిలో ఆదివారం ఉదయం జాతీయ బాలల శస్త్ర చికిత్స డే నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డాక్టర్ ముక్కువెల్లి శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.శేషగిరి మాట్లాడుతూ బరువు తక్కువగా ఉన్న పిల్లల్లో సమస్యలు అధికంగా ఉంటాయని తెలిపారు. అలాంటి వారిని ముందుగానే గుర్తించి సరైన వైద్యం అందించాలని సూచించారు.

నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ

సీతంపేట, న్యూస్‌టుడే: సీతమ్మధార శిష్టకరణాల అసోసియేషన్ 2026 నూతన సంవత్సర డైరీను ఆదివారం విశాఖ పౌర గ్రంథాలయంలో ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు గొడబ ప్రభాకర్ దాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని డైరీని ఆవిష్కరించారు. మొదటి డైరీని అల్లెన రమేశ్‌కు అందించారు. కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్, కోటిపాం రామశంకరరావు, సాలూరు మోహనరావు, రేగులవలస వెంకట రవికుమార్, వసుంధర, డబ్బీరు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రాంతీయ అంతర్ పాలిటెక్నిక్ క్రీడలు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ప్రాంతీయ స్థాయి అంతర్ పాలిటెక్నిక్ క్రీడలు సోమవారం నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ తెలిపారు. పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన 24 ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల జట్లు పాల్గొంటాయన్నారు. మొత్తం సుమారు 816 మంది క్రీడాకారులు వివిధ క్రీడల్లో వారి ప్రతిభను నిరూపించుకుంటారన్నారు. క్రీడాకారులకు మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు, వైద్య సదుపాయాలు, తాగునీరు, వసతి, భోజన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

సేవా సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ విద్య, ఉద్యోగుల సంఘం 2026 క్యాలెండరును ఆదివారం పిఠాపురం కాలనీలో ఉన్న ఇంటర్ బోర్డు కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ విద్య ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు చిట్టి సుధాకర్, జిల్లా సంఘం అధ్యక్షుడు జి.వి.అప్పారావు, సంఘం నాయకులు, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఎన్.ఈశ్వరమ్మ, ఎన్.మురళీమోహన్, బంకుపల్లి రామారావు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఇంటర్మీడియట్ విద్య ఉద్యోగులు

భజన చేస్తున్న భక్తులు

అలరించిన భజన

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు అన్నమయ్య విగ్రహం వద్ద ఆదివారం సాయంత్రం హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో సంకీర్తన, భజన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ శాంతిని కోరుతూ వాయిద్యాలతో భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ జిల్లా అధ్యక్షులు నిష్కించిన భక్తదాస ప్రసంగించారు.

ఆకట్టుకున్న శ్రీనివాస కల్యాణం నృత్యరూపకం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ (కళాభారతి) ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించిన నృత్యోత్సవాలు ఆదివారం సాయంత్రంతో ఘనంగా ముగిశాయి. చివరిరోజున బెంగళూరుకు చెందిన భరతనాట్య కళాకారుడు ప్రవీణ్‌కుమార్ ప్రదర్శన ఆకట్టుకుంది. అలాగే కూర్మన్నపాలెం నృత్యానికేతన్ విద్యార్థుల శ్రీనివాస కల్యాణం కూచిపూడి ప్రదర్శన ఆహూతులను అలరించింది. కార్యక్రమంలో కళాభారతి నిర్వాహకులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ జీఆర్కే ప్రసాద్ (రాంబాబు), పైడా కృష్ణాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస కల్యాణ ఘట్టంలో ఓ సన్నివేశం

ప్రవీణ్‌కుమార్ భరతనాట్యం

ప్రతి పిల్లవాడికి సురక్షిత శస్త్ర చికిత్స - పీడియాట్రిక్ సర్జన్లు దీన్ని సాధ్యం చేస్తారు

మనం ప్రతిసంవత్సరం డిసెంబరు 29న 1966లో ఐఎపిఎస్ ఆవిర్భావానికి గుర్తుగా పీడియాట్రిక్ సర్జరీ దినోత్సవం జరుపుకుంటాం. ఈ సంవత్సరపు ఇతివృత్తం ప్రతి శిశువుకు సురక్షిత శస్త్రచికిత్స. రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్, విశాఖపట్నంలో డా.ఆర్. హిమజ నేతృత్వంలోని పీడియాట్రిక్ సర్జరీ విభాగం పిల్లలకు శస్త్రచికిత్సలు సురక్షితంగా చేయుటకు కట్టుబడి ఉన్నది మరియు క్లిష్టమైన కేసులను చేపట్టడానికి ప్రత్యేక వైద్యం అందుబాటులో ఉన్నది. 3000 నుండి 4000 మంది నవజాత శిశువుల్లో 1 శిశువు వైకల్యంతో జన్మిస్తారు, వారికి శస్త్ర చికిత్స అవసరమౌతుంది, వీరు పిల్లల శస్త్రచికిత్స కేసులలో 50% ఉంటారు మరియు మిగతావి తర్వాత సంక్రమించినవి అయి ఉంటాయి. మా కేంద్రంలో ఇప్పటి వరకు దాదాపు 1000 మంది పిల్లల శస్త్రచికిత్స కేసులు నిర్వహించాం, వీటిలో అధునాతన లాపరోస్కోపిక్ ప్రక్రియలు మరియు నెలలు నిండకుండానే పుట్టిన శిశువులకు చేసిన శస్త్ర చికిత్సలూ ఉన్నవి.

పిల్లలకు శస్త్రచికిత్స చేయడానికి ప్రత్యేక శ్రద్ధ అవసరం. ఎందుకంటే వారి శరీర నిర్మాణం మరియు శరీర ధర్మాలు ప్రత్యేకంగా ఉంటాయి. సురక్షిత పీడియాట్రిక్ సర్జరీ అనేది ప్రమాదాలను, సమస్యలను తగ్గించడం మరియు పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరచడంపై దృష్టిపెడుతుంది. పిల్లలే కేంద్ర బిందువుగా పీడియాట్రిక్ సర్జన్లు సురక్షితమైన, ప్రభావవంతమైన శస్త్రచికిత్స సంరక్షణను అందించడంలో కీలక పాత్రను పోషిస్తారు.

Rainbow® Children's Hospital
It takes a lot to treat the little.

పీడియాట్రిక్ సర్జరీలో ప్రసవానంతర దశ నుండి కౌమారదశ వరకు శస్త్రచికిత్స సంరక్షణ అందించబడుతున్నది. ఇందులో ప్రసవానంతర శస్త్రచికిత్స- పీడియాట్రిక్ గ్యాస్ట్రోయింటెస్టినల్ సర్జరీ- పీడియాట్రిక్ యూరాలజి- పీడియాట్రిక్ థొరాసిక్ సర్జరీ - పీడియాట్రిక్ ఆంకాలజి సర్జరీ - పీడియాట్రిక్ ట్రామా సర్జరీవంటి ఉపవిభాగాలు ఉన్నవి. మా కేంద్రంలో ఒక ప్రత్యేక పీడియాట్రిక్ సర్జికల్ బృందం ఉన్నది, ఇందులో పీడియాట్రిక్ సర్జన్, పీడియాట్రిక్ అనస్థీషియాలజిస్ట్ మరియు శిక్షణ పొందిన నర్సింగ్ సిబ్బంది ఉంటారు. వారు వయస్సుకు తగిన అనస్థీషియా మరియు ప్రక్రియల సమయంలో స్థిరమైన ప్రాణాధార లక్షణాల నిర్వహణను పర్యవేక్షించుటకు సుశిక్షితులైయున్నారు. శిశువులు మరియు చిన్న పిల్లల్లో శరీర ఉష్ణోగ్రతను నిర్వహించడం మరియు ద్రవ నిర్వహణ చాలా ముఖ్యం.

మావద్ద సమర్థవంతమైన నొప్పినివారణ మరియు శస్త్రచికిత్స తర్వాత సురక్షితంగా కోలుకునేలా వైద్యం ఉన్నది. తల్లిదండ్రులు మరియు సంరక్షకులతో స్పష్టమైన సమాచార మార్పిడి అనేది అవగాహనను పెంచుతుంది, ఆందోళనను తగ్గిస్తుంది మరియు డిశ్చార్జి తర్వాత సరియైన సంరక్షణకు దోహదపడుతుంది. పిల్లలకు సురక్షిత శస్త్రచికిత్స అనేది ప్రత్యేక శిక్షణ, జాగ్రత్తతోకూడిన ప్రణాళిక మరియు బృందం ఆధారిత విధానంపై ఆధారపడి ఉంటుంది. రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లోని మేము వైద్య సంరక్షణలోని ప్రతిదశలో భద్రతకు ప్రాధాన్యత ఇస్తాం, ఇక పీడియాట్రిక్ సర్జన్లు చిన్న వయస్సు రోగులకు విజయవంతమైన ఫలితాలు సాధించటం మరియు త్వరితంగా కోలుకొనుటలో సహాయపడతారు.

డా॥ రవి హిమజ
కన్సల్టెంట్ పీడియాట్రిక్ సర్జన్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్,
హెల్త్ సిటీ, విశాఖపట్నం.
ఫోన్: 18002122

ADVERTISEMENT

(c) eenadu

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

12 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: నగర సీపీ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు మహారాణిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆంతోనినగర్‌లో సీఐ దివాకర్ యాదవ్ తనిఖీలు చేపట్టగా ఎటువంటి పత్రాలు లేని 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796
విశాఖ దక్షిణం: 8008574977

గురుద్వారా, న్యూస్‌టుడే: ?: టీపీటీకాలనీ ఎస్‌ఎంజీహెచ్ పాఠశాల వెనుక వీధిలో విద్యుత్తు స్తంభానికి ఉన్న దీపం వెలగడం లేదు. రాత్రుళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - రాజశేఖర్ ✓: దీపానికి మరమ్మతులు చేయిస్తాం. - 24వ వార్డు సచివాలయ కార్యదర్శి

అల్లిపురం, న్యూస్‌టుడే: ?: నగరంలోని అల్లిపురం ప్రధాన రహదారి ఆనుకుని ఉన్న కాలువల్లో వ్యర్థాలు తొలగించడం లేదు. - రాంబాబు ✓: సకాలంలో వ్యర్థాలు తొలగించేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం. - డాక్టర్ కృష్ణంరాజు, ఎంహెచ్‌వో

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 51వ వార్డు రాజీవ్‌నగర్‌లో కాలువలు వ్యర్థాలతో నిండిపోయి మురుగు నిలిచిపోతోంది. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. - ఎం.శ్రీనివాస్ ✓: సిబ్బందిని పంపించి వ్యర్థాలను శుభ్రం చేయిస్తాం. - వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

అధికారులు చూడరు.. వెతలు తీరవు..

గురుద్వారా, న్యూస్‌టుడే

జీవీఎంసీ జోన్-3 పరిధి 24వ వార్డులోని పలు ప్రాంతాల్లో ఏళ్ల కాలంగా సమస్యలు తిష్ఠ వేశాయి. మౌలిక వసతుల కల్పనలో గత ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజావసరాలపై జీవీఎంసీ అధికారులు శీతకన్ను వేయడంతో ఆయా ప్రాంతాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. రహదారులు, కాలువలు, వీధి దీపాలు వంటి వెతలతో సతమతమవుతున్నారు. వార్డులో అభివృద్ధి జాడలేకపోయినా.. పట్టించుకునే నాథుడే కరవయ్యారంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యటనలే తప్ప పరిష్కార మార్గం చూపడం లేదంటూ వాపోతున్నారు.

■ **దెబ్బతిన్న రహదారులు:** వార్డులో రహదారులు అధ్వానంగా మారాయి. ఈ ఏడాది కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. నక్కవానిపాలెం శివాలయం వెనుక, శారదా పాఠశాల ఎదురుగా, అభయాంజనేయస్వామి ఆలయం ఎదురు మార్గం, రేసపువానిపాలెం ఆరోగ్య కేంద్రం పక్కన మార్గాలు కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఓ చోట గతుకులమయం, మరో చోట పైపులైన్ పనుల కోసం తవ్వేయడంతో అటుగా ప్రయాణమంటే సంకోచించాల్సి వస్తోంది. కొంతకాలంగా ఇదే దుస్థితి నెలకొన్నా.. అధికారులు కన్నెత్తి చూడటం లేదని ఆయా కాలనీల వాసులు ఆరోపిస్తున్నారు.



అభయాంజనేయ స్వామి ఆలయం వెనుక వీధిలో అలముకున్న చీకట్లు

■ **మరమ్మతులకు నోచుకోని డ్రైనేజీలు:** డ్రైనేజీలు మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకున్నాయి. మురుగు సక్రమంగా ప్రవహించక రహదారిపై పొంగి పొర్లుతోంది. పీఅండ్‌టీ కాలనీ రహదారి నెంబర్-4 మార్గం అభయాంజనేయస్వామి ఆలయం వెనుక, వసంతబాల పాఠశాల ఎడమవైపు కాలువలది ఇదే దుస్థితి. గట్లు విరిగిపోయి చెత్త పేరుకుపోతుంది. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. వానాకాలంలో మురుగు ఇళ్ల ముందుకు చేరి అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

■ **రాత్రుళ్లు గాఢాంధకారం:** వీధి దీపాలు వెలగక పలు వీధులు చీకటిమయంగా మారుతున్నాయి. కొన్ని చోట్ల ఒక రోజు వెలిగితే మరుసటి రోజు వెలగడం లేదు. ఇంకొన్ని చోట్ల కాంతి అంతంతమాత్రం కావడంతో ఉన్నా లేనట్లే అనిపిస్తోంది. గాంధీనగర్ శ్రీ విశ్వ కళాశాల మార్గం, ఎన్ఎంసీహెచ్ పాఠశాల వెనుక, తపాలా కార్యాలయం దరి సక్రమంగా వెలగడం లేదు. దీంతో చీకటిపడితే స్థానికులు ఆయా మార్గాల్లో వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. ఫిర్యాదులు చేసిన తర్వాత మరమ్మతులు చేస్తున్నా మూన్నాళ్ల ముచ్చటగానే వెలిగి ఆగిపోతున్నాయి.

ధ్వంసమైన కాలువ

అలరించిన జానపద నృత్య పోటీలు

నృత్యం చేస్తున్న విద్యార్థులు

గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాలలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాలల 11వ క్రీడా, సాంస్కృతిక పోటీల్లో భాగంగా జానపద నృత్య పోటీలు నిర్వహించారు. త్రియం పోరియా-2025 పేరిట నృత్య, ఏక పాత్రాభినయం పోటీలు, గ్రామీణ ఉత్సవాలు స్థానిక సామాజిక పరిస్థితులకు అద్దం పట్టాయి. ప్రధానంగా వరకట్నం వేధింపులు, రైతుల ఆత్మహత్యలు, సెల్‌ఫోన్ వాడకం, విపరీత ధోరణులు, ఆత్మారాలు వంటి సామాజిక స్థితిగతులను నృత్య రూపంలో తెలియజేశారు. గిరిజన, రాజస్థాని, తెలంగాణ జానపద నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోటీల్లో ప్రథమ బహుమతి గాజువాక ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాల, సీతమ్మధార సీబీఎస్‌ఈ ద్వితీయ, ఎన్ఏడీ ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాల తృతీయ బహుమతులను గెలుచుకున్నాయి. డాక్టర్ పప్పు సాయికుమార్, తాళ్లపాక సందీప్‌కుమార్, శిరీషా రాణి, ఎం.శివప్రీత్, ఎం.నాగేశ్వరరావు, కె.వినయ్ ప్రకాశ్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పాఠశాల ప్రిన్సిపల్ రెవరెండ్ ఫాదర్ మనోజ్, సీబీఎస్‌ఈ విభాగం ప్రిన్సిపల్ రెవరెండ్ ఫాదర్ విజయ్ విజేతలకు బహుమతులు అందజేశారు.

పొంచివున్న ప్రమాదం

కంచరపాలెం, న్యూస్‌టుడే

కంచరపాలెం నుంచి మర్రిపాలెం వెళ్లే ప్రధాన రహదారి మధ్యలోని కల్వర్టు వద్ద పెద్ద గొయ్యి ఏర్పడటంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం ఆదమరిచి ప్రయాణించినా గెడ్డలోకి పడి భారీ మూల్యం చెల్లించుకోవాలని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు కొందరు హెచ్చరికగా గొయ్యి చుట్టూ రాళ్లు, కొమ్మలు, ప్లాస్టిక్ గొట్టం వంటివి పెట్టారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రయివేట్ ఐటీఐ పరీక్షలు రాసేందుకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం, న్యూస్‌టుడే: వివిధ ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయివేటు సంస్థలలో పనిచేస్తున్న అభ్యర్థులకు ఐటీఐ వివిధ ట్రేడ్‌లలో పరీక్షలు రాసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కంచరపాలెంలోని ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపల్ ఎస్.సోలమన్ తెలిపారు. సంబంధిత ట్రేడ్ నందు అభ్యర్థులు మూడేళ్ల పైబడిన సర్వీసు కలిగి ఉండాలన్నారు. సంబంధిత సంస్థ ధ్రువీకరణ పత్రం, ఎస్సెస్సీ గుర్తింపు కార్డుతో పాటు పరీక్ష ఫీజు రూ.500 చెల్లించి దరఖాస్తులను వచ్చే నెల 28 తేదీ లోగా అందజేయాలన్నారు.

తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న గీత కులాల నాయకులు

వనసమారాధనకు ఆహ్వానం

సీతంపేట, న్యూస్‌టుడే: జనవరి నాలుగో తేదీన వనసమారాధనకు హాజరుకావాల్సిందిగా కోరుతూ తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును గీత కులాల సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి అప్పారి గిరిబాబు, సంపంగి శ్రీనివాస్ రాజేంద్రనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. కొల్లి సింహాచలం, బత్తిన నవీన్, అంగటి రమణ, కమ్మ మల్లికార్జునరావు, వెల్లటియిన గోవింద్, కొప్పిశెట్టి శేఖర్ తదితరులు ఉన్నారు.

■ హద్దు మీరితే చర్యలు తప్పవు

గురుద్వారా, న్యూస్‌టుడే: హద్దు మీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ద్వారకా పోలీస్‌స్టేషన్ సీఐ డి.వి.రమణ హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఉదయం కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీసుల నిఘాను దృష్టిలో పెట్టుకుని మెలగాలన్నారు. మద్యం మత్తులో ఈగోలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. సమాజంలో మంచి వ్యక్తులుగా జీవనం సాగించాలని సూచించారు.

రౌడీషీటర్లను హెచ్చరిస్తున్న సీఐ రమణ

కంకర తేలి.. ప్రమాదకరంగా మారి..

గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాల వెనుక నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహానికి వెళ్లే రహదారి మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా మారింది. మార్గమంతా కంకర పైకి తేలడంతో అటుగా ప్రయాణించే వాహనాల చక్రాలు జారి ప్రమాదాల బారిన పడుతున్నారు. చాలా రోజులుగా ఇలానే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు దృష్టిసారించి రహదారి బాగు చేయాలని కోరుతున్నారు.

బస్సును ప్రారంభిస్తున్న ఖారవేల సంఘం అధ్యక్షుడు పి.నర్సింగరావు, కమిటీ సభ్యులు

ఆత్మీయ సమావేశానికి తరలిన కాళింగులు

మాధవధార, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల వద్ద ఆదివారం నిర్వహించిన కాళింగుల ఆత్మీయ సమావేశానికి జీవీఎంసీ 50, 51 వార్డుల్లోని మాధవధార, కళింగనగర్ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కాళింగులు సమావేశానికి తరలివెళ్లారు. ఇక్కడి నుంచి బయలుదేరిన ఐదు బస్సులు, సుమారు 20 కార్లను జిల్లా ఖారవేల సంఘం అధ్యక్షుడు పేడాడ నర్సింగరావు జెండా ఊపి ప్రారంభించారు. పలువురు కాళింగ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై మంచు దుప్పటి

మాధవధార, న్యూస్‌టుడే: ఉత్తర నియోజకవర్గంలోని కొండవాలు ప్రాంతాలైన మాధవధార, మురళీనగర్, కప్పరాడ, తాటిచెట్లపాలెం, ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం పొగ మంచు కమ్మేసింది. బస్సులు, వాహనచోదకులు దీపాల వెలుతురులో రాకపోకలు సాగించారు. ఉదయం 8 గంటల వరకు ఇళ్లు, రహదారులు పూర్తిగా పొగమంచు కమ్మేయడంతో రాకపోకలు సాగించే వారికి, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. పలు కాలనీల్లో చలి మంటలు వేసుకున్నారు.

ఉదయం 8 గంటల వరకు కానరాని వాహనాలు

రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న కరణంరెడ్డి నర్సింగరావు తదితరులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు ఆదివారం ఏయూలోని బీచ్ బ్యాంకింగ్ హాల్‌లో ప్రారంభమయ్యాయి. పోటీలను రాష్ట్ర కిక్ బాక్సింగ్ సంఘం గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది జిల్లాల నుంచి సుమారు రెండొందల మంది క్రీడాకారులు తలపడనున్నారన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఫిబ్రవరిలో దిల్లీలో జరగనున్న అంతర్జాతీయ ఓపెన్ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్‌బాలు, జోగారావు, కోచ్‌లు సునీల్, శరత్, అనిల్, నర్సింహారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ 36వ వార్డు రెల్లివీధి కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద తెదేపా దక్షిణ నియోజకవర్గ బాధ్యుడు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలు ఆసుపత్రులకు చెందిన వైద్యులు శిబిరంలో పాల్గొన్నారు. శిబిరానికి వచ్చిన వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ రక్తపోటు, మధుమేహం, 2డీ ఎకో పరీక్షలు చేశామన్నారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని ఆసుపత్రులకు పంపించి మెరుగైన వైద్యం అందేలా చూస్తామన్నారు. తెదేపా నాయకులు కేదారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో పాల్గొన్న తెదేపా దక్షిణ నియోజకవర్గ బాధ్యుడు సీతంరాజు సుధాకర్

నేటి నుంచి ప్రాంతీయ అంతర్ పాలిటెక్నిక్ క్రీడలు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ప్రాంతీయ స్థాయి అంతర్ పాలిటెక్నిక్ క్రీడలు సోమవారం నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ తెలిపారు. పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన 24 ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల జట్లు పాల్గొంటాయన్నారు. మొత్తం సుమారు 816 మంది క్రీడాకారులు వివిధ క్రీడల్లో వారి ప్రతిభను నిరూపించుకుంటారన్నారు. క్రీడాకారులకు మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు, వైద్య సదుపాయాలు, తాగునీరు, వసతి, భోజన ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

గిరిజన ప్రజలకు చేయూత

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతాల ప్రజలకు చేయూత అందించేందుకు రోటరీ క్లబ్ కృషి చేస్తోందని రోటరీ క్లబ్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్ గవర్నర్ వై. కల్యాణ్ చక్రవర్తి అన్నారు. గిరిజన ప్రాంతాల్లో నివాసముంటున్న వారికి వస్త్రాలు, నిత్యావసర వస్తువులను ఆర్టీసీ కాంప్లెక్సు వద్దనున్న రోటరీ క్లబ్‌లో ఆదివారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోటరీ విశాఖపట్నం పరిధిలో 89 క్లబ్‌లు ఉన్నాయన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివాసముంటున్న నిరక్షరాస్యులు, మహిళల అభ్యున్నతికి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. సమావేశంలో క్లబ్ అధ్యక్షులు ఆర్‌టీఎన్‌పీవీ రఘుపతి, కార్యదర్శి జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుడికి సామగ్రి అందజేస్తున్న రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై.కల్యాణ్ చక్రవర్తి

నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ

సీతంపేట, న్యూస్‌టుడే: సీతమ్మధార శిష్టకరణాల అసోసియేషన్ 2026 నూతన సంవత్సర డైరీను ఆదివారం విశాఖ పౌర గ్రంథాలయంలో ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు గొడబ ప్రభాకర్ దాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని డైరీని ఆవిష్కరించారు. మొదటి డైరీని అల్లెన రమేశ్‌కు అందించారు. ఆయన మాట్లాడుతూ శిష్టకరణాలు రాజకీయంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్, కోటిపాం రామశంకరరావు, సాలూరు మోహనరావు, రేగులవలస వెంకట రవికుమార్, వసుంధర, డబ్బీరు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి రాజశేఖర్, సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ దాస్ ప్రతినిధులు

వివేకానందుడి సాహిత్యంపై క్విజ్ పోటీలు

మురళీనగర్, న్యూస్‌టుడే: జాతీయ యువజన దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మురళీనగర్ ప్రశాంతి పార్కు అసోసియేషన్, వివేకానంద యువ మహా మండల్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద సాహిత్యంపై విద్యార్థులకు ఆదివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి 100 మంది పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి జనవరి 12 జరిగే వివేకానందుడి జయంతి నాడు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్కు ఉపాధ్యక్షురాలు ఉప్పలపాటి శుభ, నాగేశ్వరరావు, జి.వి.రత్నం, పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉత్సాహంగా కిక్ బాక్సింగ్ పోటీలు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం, వంగవీటి మోహనరంగా వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో కిక్ బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ స్పోర్ట్స్ సెల్ ఛైర్మన్ జీవీఎస్ కమలాకర్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ర్యాంబో కిక్ బాక్సింగ్ కోచ్ జి.కనకరాజు, నూకరాజు, పి.దుర్గా, ప్రవీణ్‌కుమార్, సతీష్, సీహెచ్ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ స్పోర్ట్స్ సెల్ ఛైర్మన్ జీవీఎస్ కమలాకర్

పేదలకు దుస్తులు అందజేస్తున్న ప్రతినిధులు

ద్రోణంరాజు సేవలు నిరుపమానం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ, దక్షిణం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు ద్రోణంరాజు సత్యనారాయణ సేవలు నిరుపమానమని వక్తలు పేర్కొన్నారు. పాతనగరంలోని స్వామి వివేకానంద సేవా సంస్థ ఆవరణలో ఆదివారం ద్రోణంరాజు వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పేదలకు ఉచితంగా వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ, వుడా మాజీ ఛైర్మన్ పీఎస్ఎన్ రాజు, సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై ధనుర్మాస వైభవం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా అర్చకులు దేవతామూర్తుల తిరువీధి వేడుకగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి బంగారు తొళక్కియాన్ పల్లకిలో కొలువు దీర్చారు. వేద పారాయణలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లను ఆలయ బేడామండపంలో చతుర్గతి నడకలతో ఊరేగించారు. తిరుప్పావై సేవాకాలంలో భాగంగా అమ్మవారి సేవ, పాశుర విన్నపం, తీర్థగోష్ఠి సంప్రదాయ బద్ధంగా జరిగింది.

స్వామి, అమ్మవార్లు

'2020 ఆర్డినెన్స్ అమలు చేసేందుకు కుట్ర'

సీతంపేట, న్యూస్‌టుడే: భారత ప్రభుత్వం సహకార సంఘాలకు సంబంధించి 2020లో తీసుకొచ్చిన ఆర్డినెన్సును చట్టంగా మార్చి అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విశాఖపట్నం సహకార బ్యాంకు లిమిటెడ్ అధ్యక్షుడు జేవీ సత్యనారాయణ మూర్తి ఆరోపించారు. నగరంలోని రామాటాకీస్ రోడ్డులో గల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం బ్యాంకు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ సహకార సంస్థల పాలకవర్గ పదవీకాలం పరిమితిని నిర్దేశించడం, పాలకవర్గ సభ్యులు పదవులు రద్దుకు ఆదేశించే అధికారాలను రిజర్వు బ్యాంకుకు దఖలు పరిచిందని పేర్కొన్నారు. బ్యాంకు ఉపాధ్యక్షుడు చలసాని రాఘవేంద్రరావు, బ్యాంకు పూర్వ అధ్యక్షుడు మానం ఆంజనేయులు మాట్లాడుతూ సహకార చట్ట సవరణలు సహకార సంఘాల స్వయం ప్రతిపత్తిని హరించే విధంగా ఉన్నాయన్నారు. సహకార సంస్థల రక్షణకు కృషి చేయాలని పాలకవర్గం తీర్మానించింది.



సమావేశంలో మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణమూర్తి

'సర్' రద్దు చేయాలని ఆందోళన

కార్పొరేషన్ న్యూస్‌టుడే: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)ను రద్దు చేయాలని, లేకుంటే మానవ హక్కులకు ప్రమాదం కలిగే అవకాశం ఉందని పౌర చైతన్య వేదిక నగర అధ్యక్షుడు ఆచార్య కొలవెన్ను చాంద్ అన్నారు. సర్‌కు వ్యతిరేకంగా ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పౌర సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిహార్‌లో సర్ వల్ల 47 లక్షల మంది ఓటుహక్కు కోల్పోయారన్నారు. సంఘం కార్యదర్శి సీహెచ్ ప్రమీల మాట్లాడుతూ 2003 తరువాత ఓటర్లుగా చేరిన వారంతా ఈ దేశ పౌరులుగా నిరూపించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. పౌరహక్కుల నాయకులు వై. సత్యవతి, సీహెచ్ సూర్యనారాయణ, ఎస్.అబ్దుల్ మునీర్, తారకరామ్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

వెలమ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

మాధవధార, న్యూస్‌టుడే: మురళీనగర్-మాధవధార వెలమ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బోకం శ్రీనివాస్, అధ్యక్షుడిగా పి. సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా ఎల్.జానకిరామ్, ఏ.ప్రసాద్, కార్యదర్శులుగా వి.సూర్యనారాయణ, డి. దేముడు, కోశాధికారులుగా సి. ప్రసాద్, సి.గోవింద్‌తో పాటు పలువురు అడ్వయిజరీ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు, కమిటీ కన్వీనర్ రొంగలి జగన్నాథరావు, చొక్కాకుల వెంకటరావు, బి.దేముడు, పి.సన్యాసిరావు, ఆర్.లక్ష్మి, బి.సూర్యనారాయణ పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

హిందూ సమాజ ఐక్యత దేశానికి బలం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: హిందూ సమాజ ఐక్యత దేశానికి బలమని శ్రీకృష్ణ చైతన్య మఠం ప్రతినిధి కేశవ స్వామిజీ అన్నారు. హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం డాబాగార్డెన్స్‌లో 'హిందూ సమ్మేళనం' నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కేశవ స్వామీజీ పాల్గొని హిందూధర్మం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, మనోబలం తదితర అంశాలపై మాట్లాడారు. మహిళలు పలు భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, భాజపా నాయకులు పీలా వెంకట చినఅప్పలనాయుడు, విజయగోపాల్, పి.వి. నారాయణ, విజయానందరెడ్డి, లక్ష్మినారాయణ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కేశవ స్వామిజీ

ప్రముఖ వైద్యులతో డాక్టర్ శివరామకృష్ణారావు

వైద్య రంగంలో శివరామకృష్ణారావు సేవలు ఎనలేనివి

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: వైద్య రంగానికి డాక్టర్ శివరామకృష్ణారావు చేసిన సేవలు అజరామరమని ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ వైద్యులు, వక్తలు పేర్కొన్నారు. వైద్యుడిగా ఎందరికో సేవలందించి ప్రొఫెసర్‌గా ఎందరినో ఉత్తమ వైద్యులుగా తీర్చిదిద్దిన డాక్టర్ పట్నం శివరామకృష్ణారావు వందో జన్మదిన వేడుకలు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఓ హోటల్‌లో శిష్యబృందం, కుటుంబ సభ్యుల మధ్య ఆదివారం ఘనంగా జరిగాయి. విశాఖపట్టణం ఆంధ్రా వైద్యకళాశాల, గుంటూరు, కాకినాడ వైద్య కళాశాలల పూర్వ విద్యార్థులైన ప్రముఖ వైద్యనిపుణులు, హైదరాబాద్, కర్నూలు, విజయవాడ, రాజమహేంద్రవరం నగరాలకు చెందిన ఆయన శిష్యులు పెద్ద ఎత్తున హాజరై శివరామకృష్ణారావును సత్కరించి పాదాభివందనం చేశారు. శివరామకృష్ణారావు నెల్లూరులో జన్మించినా రాజమహేంద్రవరంలో ఉంటున్న తన మనమరాలు(కుమార్తె కూతురు) వద్ద స్థిరపడ్డారు. ఆయన కుమార్తెలు, మనమలు అంతా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన వైద్య ప్రముఖులు డాక్టర్ సోమరాజు, డాక్టర్ ఐవీరావు, డాక్టర్ బాబ్జీ, డాక్టర్ ఎస్‌కే అప్పారావు, డాక్టర్ పెదవీర్రాజు, డాక్టర్ గోలు రామారావు తదితరులు మాట్లాడారు. 28 ఏళ్లపాటు వైద్య విద్యాబోధన, 70 ఏళ్లకు పైగా క్లినికల్ అనుభవంతో ఆయన ఎన్నో మైలురాళ్లు దాటారన్నారు. ఆయన రాసిన 'డిఫరెన్షియల్ డయాగ్నోసిస్ అండ్ మెడికల్ థెరాపెడిక్స్' పుస్తకం యువ వైద్యులకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు.

(c) eenadu

శాంతినగర్ ఆలయంలో ప్రత్యేక పూజలు

అగనంపూడి, న్యూస్‌టుడే: అగనంపూడి పరిధి శాంతినగర్ కాలనీలోని శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. గోదాదేవికి 13వ పాశురం చదివి వినిపించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పూజల్లో పాల్గొన్న భక్తులు

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కరస, న్యూస్‌టుడే: జీవీఎంసీ 56వ వార్డు, రామ్మూర్తిపంతులపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 1991-1992 బ్యాచ్ పూర్వ విద్యార్థులంతా సందడి చేశారు. 33 సంవత్సరాల తర్వాత మళ్లీ తాము చదువుకున్న పాఠశాలలో కలిశారు. ఆటపాటలతో సరదాగా గడిపారు. అప్పటి తమ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల బృంద చిత్రం

అమృత్ నిధులతో.. రయ్..రయ్

వేగంగా సింహాచలం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు

సిద్ధమవుతున్న నడకవంతెన

గోపాలపట్నం, న్యూస్‌టుడే: సింహాచలం రైల్వేస్టేషన్ ప్రయాణికుల అవసరాలు తీరేలా సింహాచలం పుణ్యక్షేత్రం రైలు నిలయం ఆధునికీకరణ పనులు వేగంగా సాగుతున్నాయి. గతేడాది ఫిబ్రవరి 26న ప్రధానమంత్రి మోదీ వర్చువల్ విధానంలో రూ.19.98 కోట్లతో పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పనులు జోరుగా సాగుతున్నాయి.

★ ప్రధానంగా రైల్వేస్టేషన్ భవనం శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని పోలిన ముఖద్వారం, ప్లాట్‌ఫాం పెంపు, కొత్తగా పాదచారి వంతెన పనులు పూర్తిచేశారు. దీనికి లిఫ్ట్ సౌకర్యం కల్పిస్తున్నారు.

★ స్టేషన్ వద్ద వాహనాల రాకపోకలకు రోడ్డు నిర్మాణం జరుగుతోంది.

★ ఉత్తర ముఖద్వారం బయట నుంచి దక్షిణలోకి వెలుపల వరకు ర్యాంప్ విధానంలో పాదచారి వంతెన నిర్మించాలని అందరూ కోరుతున్నారు.

★ రెండు ప్లాట్‌ఫాంలపైనా కొత్త షెల్టర్లు నిర్మించారు. తాగునీటి సదుపాయం, పాత విశ్రాంతి గదులు, పాతటికెట్టు విక్రయాల కేంద్రాలను కొత్త భవనంలోకి కలుపుతున్నారు.

స్టేషన్ దక్షిణ వైపు నరవ, కొత్తపాలెం, సబ్బవరం తదితర 20 గ్రామాలు ఉన్నాయి. వీరికి అనువైన కౌంటర్లు అవసరమని స్థానికులు కోరుతున్నారు. త్వరలో అందుబాటులోకి చందనగర్ నడక వంతెన.. సింహాచలం రైల్వేస్టేషన్- చందనగర్ నడకవంతెన నిర్మాణం రూ.12.69 కోట్ల నిధులతో నిర్మించారు. 3 మీటర్ల వెడల్పు, 115 మీటర్ల పొడవుతో వంతెన నిర్మించి ప్రజలకు త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నారు.

కొనసాగుతున్న ప్రధాన భవనం పనులు

ప్రజాదర్బార్‌తో సమస్యలు పరిష్కారం

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే: ప్రజాదర్బార్‌లో ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను తెలియజేస్తే వాటి పరిష్కారానికి కృషిచేస్తానని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం గాజువాక తెదేపా కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. బాధితులతో నేరుగా మాట్లాడి... వారి నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. కార్యక్రమంలో పలువురు బాధితులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించి వినతిపత్రాలు అందజేశారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ఉపాధ్యాయులకు చేతి రాతపై శిక్షణ

ఎన్ఏడీకూడలి (బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని మండల ప్రాథమిక పాఠశాలలో మై హ్యాండ్ బ్యూటిఫుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు దస్తూరిపై రెండురోజుల శిక్షణ నిర్వహించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వి.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు దస్తూరిపై పట్టు సాధిస్తే.. విద్యార్థులను కూడా తీర్చిదిద్దుతారన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం టి.శ్రీధర్, సామాజిక కార్యకర్త ఐ.భూషణం, ఫౌండేషన్ వ్యవస్థాపకులు టి.జగన్నాథం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
గాజువాక: 98494 65088
పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

గాజువాక, న్యూస్‌టుడే: సమస్య: గాజువాక అజీమాబాద్‌లో కాలువలో తీసిన పూడిక తరలించకపోవడంతో చెత్తతో ఇబ్బంది పడుతున్నాం. – ప్రసాద్, ముర్తుజా, సమాధానం: సిబ్బందితో శుభ్రతా పనులు చేపడతాం. – కిరణ్‌కుమార్, ఎ.ఎం.ఒ.హెచ్.

గోపాలపట్నం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 52వ వార్డు మధురానగర్‌లో అపరిశుభ్ర పరిస్థితులు ఉన్నాయి. – రాజేష్, మధురానగర్, ✔: ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడతాం. – మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ?: జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్.బ్లాక్‌లో వీధిదీపాలు వెలగడం లేదు. – లక్ష్మీప్రసన్న, లక్ష్మీనగర్, ✔: దీపాల మరమ్మతులు చేపడతాం. – గోవిందరావు, వీధిదీపాల నిర్వాహకులు

పచ్చదనానికి మొక్కల పెంపకం తప్పనిసరి

అక్కిరెడ్డిపాలెం, పెదగంట్యాడ, న్యూస్‌టుడే: పచ్చదనానికి మొక్కల పెంపకం తప్పనిసరని.. దానిని సామాజిక బాధ్యతగా భావించాలని వాసవీ సేవా ట్రస్టు వ్యవస్థాపక ఛైర్మన్ సుంకరి జగన్నాథరావు అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు స్వతంత్రనగర్‌లో నిర్మాణంలో ఉన్న పుణ్యక్షేత్రం ఆవరణ, పరిసరాల్లో ఆదివారం మొక్కలు నాటడం, స్వచ్ఛభారత్ కార్యక్రమాలు వాసవీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రాంగణం పరిసరాల్లో తుప్పలను తొలగించి చెత్తను శుభ్రం చేశారు. అనంతరం కొబ్బరి మొక్కలతో పాటు వివిధ రకాల పండ్ల, పూల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు కలుకూరి మంగరాజు, కేశర్ల శ్రీను రమేష్, సింగంశెట్టి సతీశ్‌కుమార్, బండి రాజశేఖర్, కోట పెద వెంకటేశ్వర్లు, ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న వాసవీ సేవా ట్రస్టు ప్రతినిధులు, సభ్యులు

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

దుర్గాదేవి వర్తక సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: షీలానగర్ పెట్రోల్ బంకు ఆవరణలో ఆదివారం దుర్గాదేవి వర్తక సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత బంకు ప్రాంగణంలోని గౌతు లచ్చన్న విగ్రహానికి శిరీష, సంఘ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎం.నాగరాజు, డి.అప్పారావు, కె.రాధాకృష్ణ, కె.శ్రీనివాస్, వి.నాగేశ్వరరావు, ఎస్.శ్రీనివాస్, బంకు ప్రతినిధి యార్లగడ్డ రవిచంద్ర, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఏసు మార్గం అనుసరణీయం: గణబాబు

గోపాలపట్నం, న్యూస్‌టుడే: క్రీస్తు వేడుక ప్రేమ, త్యాగం, శాంతికి చిహ్నమని ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆదివారం గోపాలపట్నంలోని ఆయన నివాసంలో వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గంలోని పాస్టర్లు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు, ఏసుక్రీస్తు సందేశాలను వినిపించారు. క్రైస్తవ సోదరులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కేక్ కోస్తున్న ఎమ్మెల్యే గణబాబు

అప్పికొండలో 'జిప్సా' విహారయాత్ర

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే: గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేటు పాఠశాలల సంక్షేమ సంఘం(జిప్సా) ఆధ్వర్యంలో ఆదివారం అప్పికొండ బీచ్‌లో విహారయాత్ర జరిగింది. సంఘ పటిష్టతకు, పాఠశాలల సమస్యలపై చర్చించుకున్నామని సంఘ గౌరవ అధ్యక్షులు పాలవలస భాస్కరరావు పేర్కొన్నారు. సంఘ ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, షణ్ముఖరావు, బాబూరావు, మురళీ సుందర్, జగన్, రాము, సభ్యులు పాల్గొన్నారు.

దువ్వాడ రైల్వేస్టేషన్లో అభివృద్ధి పనుల పరిశీలన

కూర్మన్నపాలెం, (అగనంపూడి), న్యూస్‌టుడే: దువ్వాడ రైల్వేస్టేషన్లో చేపట్టిన అభివృద్ధి పనులను తూర్పు కోస్తా రైల్వే వాల్తేరు డివిజన్ అదనపు డివిజనల్ మేనేజర్ ఇ.శాంతారాం ఆదివారం పరిశీలించారు. అమృత భారత్ పథకం కింద జరుగుతున్న పునర్నిర్మాణ పనులను సమీక్షించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. జోనల్ రైల్వే కన్సల్టేటివ్ కమిటీ ప్రతినిధి స్టేషన్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రైల్వే అధికారులు నవీన్‌రాజు, జి.వి.ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

నోటీసు

మహారాజశ్రీ ఒంగోలు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో I.P No. 35/2024

గొలుగూరి శ్రీనివాసరెడ్డి ...పిటీషరు
మరియు
గుంజి తిరుపతమ్మ మరియొకరు ..రెస్పాండెంట్స్

టు: R2: కుంచాల శ్రీను తండ్రి సుబ్బారావు, డోరునెం. 10-209, సాయినగర్, చర్చిదగ్గర, పెదమడక, అగనంపూడి గ్రామము, గాజువాక మండలం, విశాఖపట్టణం జిల్లా.

పై నెంబరున పిటీషరు మీ పై IP దాఖలు చేసి ఎన్ని పర్యాయములు నోటీసు పంపినను మీకు జారీ కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా పై నంబరు IPలో మీకు నోటీసు నిమిత్తం తేది: 7-01-2026న వాయిదా అయిఉన్నది. కావున సదరు తేదిన ఉదయం గం.10-30ని.లకు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హైకోర్టు వారి ఎదుట హాజరై మీఆక్షేపణలు తెలుపుకొనవలసినది లేనియెడల మీపరోక్షమునందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
వాయిదా తేది: 07-01-2026
ఇట్లు/- గల్లా గాంధీ
పిటీషరు తరపున్యాయవాది, ఒంగోలు

పర్యావరణ హిత సంచులతో మేలు

అగనంపూడి, న్యూస్‌టుడే: ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణ హిత సంచులను వినియోగించాలని తిరుమలనగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. ఆదివారం వడ్లపూడి దరి కాలనీలో సంఘం ప్రతినిధులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీల్‌బాక్సులు, వస్త్రసంచులను వాడాలని కాలనీ వాసులకు సూచించారు. ఇళ్ల వద్ద నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలను తవ్వుకోవాలని కోరారు. సంఘం ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమానందం, సన్యాసిరావు, వసంత్‌రెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సంఘం ప్రతినిధులు

రావులచెరువులో వనసేన శ్రమదానం

కూర్మన్నపాలెం, (అగనంపూడి), న్యూస్‌టుడే: కూర్మన్నపాలెంలోని సాయిబాబా ఆలయం వద్ద రావులచెరువు ప్రాంతంలో వనసేన బృంద సభ్యులు ఆదివారం శ్రమదానం చేశారు. చెరువు పరిసరాల్లో పేరుకున్న వ్యర్థాలను తొలగించి పరిశుభ్రం చేశారు. స్థానిక వాకర్స్ క్లబ్ ప్రతినిధులు వారికి సహకారం అందించారు. స్వచ్ఛందంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో వనసేన వ్యవస్థాపకుడు ముప్పిన ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానం చేసిన వనసేన బృంద సభ్యులు

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం పాత గాజువాక కూడలిలో గాజువాక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగింది. కూడలిలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహానికి నాయకులు నివాళులు అర్పించారు. పీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఉరుకూటి అచ్చిబాబు, యరబాల భూలోక, ఎం.రాజబాబు, వీరరావు, హరిబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ఆ పార్టీ జెండాలతో..

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

అగనంపూడి, న్యూస్‌టుడే: దువ్వాడ దరి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఆదివారం ఎ.ప్లస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఆసుపత్రి ఎండీ చైతన్యరాజు శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య సిబ్బంది రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించారు. స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ద్రోణంరాజు సత్యనారాయణకు ఘన నివాళులు

చీరలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు

సింధియా, న్యూస్‌టుడే: సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దివంగత ద్రోణంరాజు సత్యనారాయణ 20వ వర్ధంతిని ఆదివారం 61వ వార్డులో కార్యకర్తలు నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులు మూగి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ద్రోణంరాజు సత్యనారాయణ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం పేదలకు చీరలు, దుప్పట్లను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు ప్రియాంక దండి, హసీనా వర్మ, జీవీ రమణ, రామారావు, రజియాబేగం, గాయత్రి, అష్రఫ్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్లకు పవర్‌బ్యాంకుల అందజేత

సింధియా, న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం గాజువాక డిపోలో ఆదివారం కండక్టర్లకు టిమ్స్ వినియోగంలో ఛార్జింగ్ సమస్య తలెత్తకుండా పవర్ బ్యాంకులను ఏపీటీడీ-ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ అప్పలనాయుడు అందజేశారు. 250 పవర్ బ్యాంకులను ఈ సందర్భంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపో యూనియన్ కార్యదర్శి పిల్లా శంకరరావు, సీఎంఈ గంగాధర్, డిపో యూనియన్ నాయకులు సన్యాసిరావు, చిట్టిబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక డిపోలో కండక్టర్లకు పవర్ బ్యాంకులను అందిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

ఉత్సాహంగా వనసమారాధన

వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్‌ని సత్కరిస్తున్న దృశ్యం

మల్కాపురం (యారాడ): యారాడ బీచ్‌లో ఆదివారం ఇండస్ట్రియల్ విభాగ కుటుంబ సభ్యుల వనసమారాధన జరిగింది. ఈ కార్యక్రమానికి వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశాఖ వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ కుటుంబ సభ్యులు, నిర్వాహకులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గాజువాక 13వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
E.P. 2/2025 in O.S.60/2018
Between:
శ్రీ నాగోతి పైడారావు. ...డిక్రీ హోల్డర్
మరియు:
శ్రీమతి S. కిరణ్మయి మరియు ఇతరులు ...జడ్జిమెంట్ డెట్టర్స్

వేలం ప్రకటన

పై నెంబరు అమలు పిటిషన్‌లో డిక్రీ బాకీ, వడ్డీ మరియు ఖర్చులు రాబట్టు నిమిత్తం పై జడ్జిమెంట్ డెట్టర్స్ యొక్క ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని తేదీ : 20.01.2026 న వేలం వేయుటకు మహారాజశ్రీ పై కోర్టు వారు ఉత్తర్వులు జారీ చేసి ఉన్నారు. కావున వేలం తేదీ 20.01.2026 ఉదయం 10:30 a.m. నిమిషాల నుండి సాయంత్రం 05:00 p.m. మధ్య సమయంలో వేలం వేయుదురు. సదరు వేలంపాటలో పాల్గొనదలచిన ఆసక్తి గలవారు పై తేదీన పై తెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలం షరతులకు లోబడి పాల్గొనవచ్చునని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం అయినది.

షెడ్యూల్

Greater Visakhapatnam Municipal Corporation Visakhapatnam Dt. Gajuwaka Registration - Gajuwaka Mandal Thunglam Village RCC Flat No.403, in an extent of 980 sq.ft (including common areas) in an extent of 37sq. yds or 30.94 sq. mts being the undivided and unspecified area out of 800 sq.yds bearing Plot Nos. 120,121 & 122 in S.No. 101/P bounded as follows:
EAST : 33 Feet Road.; **SOUTH:** Plot No. 123 & 133; **WEST** :33 Feet Road; **NORTH** :40 Feet Road.
Measurements: **EAST:** 60 Feet or 18.29mts.; **WEST:** 60 Feet or 18.29mts.; **SOUTH:** 120 Feet or 36.58mts. **NORTH:** 120 Feet or 36.58mts.
Boundaries for Flat No. 403, III Floor, Pavan Residency in an extent of 980 sq.ft including common areas:
EAST: Common wall of Flat No. 402. **South:** Open to Sky; **West:** 6.5 Feet Common Corridor and Staircase **NORTH:** 5 Feet Common Corridor.
DHr value: 12,00,000/-
Ameen value: 20,00,000/-

(By order of the Honourable Court)
B. YASODHARA VEDAMANI,
Advocates, Visakhapatnam
Phone Nos: **9246621519, 9248809471**

అభివృద్ధి పనుల పరిశీలన

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 69వ వార్డులోని పలు కాలనీల్లో ఆదివారం వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పర్యటించారు. కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. నాణ్యతతో సకాలంలో పనులు పూర్తి చేయాలని గుత్తేదార్లకు సూచించారు. అనంతరం హరిజన జగ్గయ్యపాలెంలో పర్యటించి కాలనీలో సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, జీవీఎంసీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

రేపు 'సుపరిపాలనలో తొలి అడుగు'

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే: 'సుపరిపాలనలో తొలి అడుగు' బహిరంగ సభను ఈనెల 30న బాజీకూడలి వద్ద నిర్వహించనున్నట్లు పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధులు ఆదివారం పేర్కొన్నారు. క్లస్టర్, కోక్లస్టర్, వార్డు, బూత్ నాయకులు, తెదేపా అనుబంధ కమిటీలు, పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

హద్దులు దాటితే చర్యలు తప్పవు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు

సింధియా, న్యూస్‌టుడే: తమపై ఉన్న కేసులను మరిచి హద్దులు దాటితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు హెచ్చరించారు. ఆదివారం స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చట్టపరమైన నిబంధనలను పాటిస్తూనే సమాజంలో తగిన గుర్తింపు దక్కేలా నడుచుకోవాలని సూచించారు. అనవసర విషయాల్లో జోక్యం తగదన్నారు.

వైకుంఠ ఏకాదశికి చురుగ్గా ఏర్పాట్లు

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనానికి పారిశ్రామిక ప్రాంత దేవాలయాల్లో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముఖ్యంగా షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో టెంట్లు, పెండ్యాల్స్ వేశారు. ప్రజల దర్శనానికి ఇబ్బంది లేకుండా బారికేడ్లు నిర్మించారు. ఆలయానికి ప్రత్యేక విద్యుత్తు దీపాలంకరణ చేశారు. ఉదయం 6 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామన్నారు. బీహెచ్‌పీవీ కూడలిలోని ప్రసన్నగిరిపై ప్రసన్న వెంకటేశ్వర ఆలయంలో, నాతయ్యపాలెం సత్యన్నారాయణస్వామి ఆలయంలో, తుంగ్లాం రామాలయంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన టెంట్లు

ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు

గోపాలపట్నం (ఆర్.ఆర్.వి.పురం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 92వ వార్డు ఆర్.ఆర్.వి.పురంలోని శ్రీసీతారామ గణపతి సహిత ఆంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నగర సంకీర్తనలు, ధనుర్మాస వ్రతాలు చేశారు. ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిరుప్పావై 13వ పాసురాన్ని పఠించారు. ఆలయ అర్చకులు ఇ.నరసింహం, స్వామిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామప్రజలు పాల్గొన్నారు.

ధనుర్మాసవ్రతంలో పాల్గొన్న భక్తులు

కాలువ నిర్మాణ పనుల పరిశీలన

అగనంపూడి, న్యూస్‌టుడే: అగనంపూడి పరిధి గల్లవానిపాలెంలో జరుగుతున్న కాలువ నిర్మాణ పనులను జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని గుత్తేదారుడిని ఆదేశించారు. వార్డు తెదేపా అధ్యక్షుడు కరణం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపునకు కృషిచేస్తా: ఎమ్మెల్యే గణబాబు

సింధియా, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్త కళింగ కోమటి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో ప్రత్యేక నిధుల కేటాయింపునకు కృషిచేస్తానని ఏపీ ప్రభుత్వ విప్ గణబాబు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయనను క్యాంపు కార్యాలయంలో కలిసిన ఏపీ కళింగ వైశ్యుల అభివృద్ధి కార్పొరేషన్ పాలకవర్గం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి తమ సమస్యలను నివేదించారు. కార్పొరేషన్‌కు ప్రత్యేకంగా నిధులు కేటాయించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానని భరోసా ఇచ్చారు. కార్పొరేషన్ డైరెక్టర్ కోరాడ శ్రీనివాసరావు, కార్పొరేషన్ ఛైర్మన్ బోయిన గోవిందరాజు, డైరెక్టర్లు తంగుడు సంతోష్, పొట్నూరు అప్పారావు, జామి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

'సిటూ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి'

కరపత్రాలను పంపిణీ చేస్తున్న సిటూ నాయకులు

అక్కిరెడ్డిపాలెం, గాజువాక, న్యూస్‌టుడే: విశాఖలో ఈనెల 31 నుంచి నాలుగు రోజులపాటు జరిగే సిటూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిటూ సీనియర్ నాయకులు ఎం.రామారావు పిలుపునిచ్చారు. ఆదివారం గాజువాకలో సిటూ ఆధ్వర్యంలో కవాతు జరిగింది. కవాతును రామారావు జెండా ఊపి ప్రారంభించారు. ఉక్కు ఎంప్లాయిస్ యూనియన్ సిటూ నాయకులు అయోధ్యరామ్,నాయకులు ఎం.రాంబాబు, రామస్వామి, ప్రసాద్, లోకేశ్వరరావు, రమణ, బంగారునాయుడు, అప్పారావు, రమణ, తౌడన్న, వెంకటరావు, నాయకులు, కార్మికులు, యువత పాల్గొన్నారు.

సింధియా, న్యూస్‌టుడే: శ్రీహరిపురంలో సిటూ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. కార్మిక వ్యతిరేక శక్తుల పట్ల సిటూ పోరుని ఉద్ధృతం చేయక తప్పదని మల్కాపురం జోన్ సీఐటీయూ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి అన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు యూఎస్ఎల్ రాజు, నరేష్, వాసు, శ్రీను, పి.పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: విశాఖలో ఈ నెల 31 నుండి వచ్చే నెల 4వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 18వ జాతీయ సిటూ మహాసభలను జయప్రదం చేయాలని సిటూ నాయకులు లోకేశ్ కోరారు. జీవీఎంసీ 68, 69వ వార్డులోని పలు కాలనీల్లో ఆదివారం సిటూ నాయకులు కరపత్రాల పంపిణీ, నిధి వసూళ్లు, మహాసభల ప్రాధాన్యత తెలియజేస్తూ ఇంటింట ప్రచారం నిర్వహించారు.

శ్రీహరిపురంలో కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

దివ్యాంగుల సంక్షేమానికి కృషిచేయాలి

సింధియా, న్యూస్‌టుడే: దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమానికి ప్రాధాన్యతను పెంచేలా ప్రభుత్వ పథకాలను మరింత విస్తృతం చేయాల్సి ఉందని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారిణి ఈపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. ఆదివారం 60, 61 వార్డుల్లో సెయింట్ ఆన్స్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ల ప్రత్యేక శిబిరాన్ని ఆమె సందర్శించారు. ఆర్కేపురం, జనతాకాలనీల్లో సామాజిక అంశాలపై వాలంటీర్లు అవగాహన ర్యాలీలు చేపట్టారు. దివ్యాంగుల సంఘ నాయకులు శ్రీనివాసరావు, గ్రంథాలయ అధికారి అజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణులు అంజలిదేవి, అనసూయాదేవి, సంధ్యారాణిలు పర్యవేక్షించారు.

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

కార్యదీక్ష దక్షుడై, ఏకోన్ముఖుడై అందర్నీ నడిపించు మా ఆత్మీయుడు శ్రీ రాళ్ళపల్లి భీమ ప్రసాద్ గారు తేది. 31-12-2025న ఉద్యోగ విరమణ చేయుచున్న సందర్భంగా వారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు. మీ భావిజీవితం ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, వర్ధిల్లాలని కోరుకొనే..

శ్రీమతి & శ్రీ ఆర్. భీమ ప్రసాద్ - రమాదేవి గారు
Dy. Manager, L&D.C / Hostels, RINL Vizag Steel Plant

మీ.. మిత్రబృందం

శ్రీమతి & శ్రీ ఎమ్.యస్.ఎన్. రాజు - విజయ కుమారి
శ్రీమతి & శ్రీ ఎమ్.యస్. రాయుడు - దేవి
శ్రీమతి & శ్రీ బి. అప్పారావు - పద్మావతి
శ్రీమతి & శ్రీ పి.వి.రావు - సుబ్బలక్ష్మి
శ్రీమతి & శ్రీ కె.వి. రామకృష్ణ - రామలక్ష్మి
శ్రీమతి & శ్రీ జి. శ్రీనివాస్ (DGM) - చందన
శ్రీమతి & శ్రీ పి.వి. రమణ - ఉషా
శ్రీమతి & శ్రీ డి. రవీంద్రకుమార్ - పద్మలత
శ్రీమతి & శ్రీ కె. శ్రీనివాసరావు - సుబ్బలక్ష్మి
శ్రీమతి & శ్రీ టి. ప్రభాకర్ - సంధ్యాదేవి
శ్రీమతి & శ్రీ బి. గంగాధరరావు - సూర్యకుమారి
శ్రీమతి & శ్రీ సిహెచ్. విశ్వేశ్వరరావు - శ్రీలక్ష్మి
శ్రీమతి & శ్రీ కె. చంద్ర శేఖరం - విజయ నిర్మల
శ్రీమతి & శ్రీ కె. హనుమంతరావు - శ్రీదేవి

(c) eenadu

పండుగకు ప్రయాణమా?

న్యూస్‌టుడే, గరివిడి

సంక్రాంతికి ప్రయాణికుల రద్దీ తీవ్రంగా ఉంటుంది. వివిధ ప్రాంతాల్లో ఉన్నవారు సొంతూళ్లకు, బంధువుల ఇళ్లకు వెళ్తుంటారు. ఈ పరిస్థితి దృష్టిలో పెట్టుకుని జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు అదనంగా 200 బస్సులను ఆర్టీసీ నడపనుంది. టికెట్ బుకింగ్ కోసం బస్టాండ్, నెట్ సెంటర్‌కు వెళ్లే సమయం వృథా చేసుకోవాల్సిన అవసరం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన మిత్ర- వాట్సప్ గవర్నెన్స్ ద్వారా సులువుగా టికెట్ పొందే అవకాశం కల్పించారు. సంక్రాంతి సీజన్‌తో పాటు సాధారణ సమయాల్లోనూ ఈ సేవలను పొందొచ్చని జిల్లా రవాణా అధికారి వరలక్ష్మి తెలిపారు.

వాట్సప్‌లో ఆర్టీసీ టికెట్లు బుక్ చేసుకోండి

హాయ్ అంటే చాలు..

- వాట్సప్ ద్వారా ఆర్టీసీ బస్సు టికెట్లు బుక్ చేసుకోవడానికి ప్రభుత్వం ఇచ్చిన 95523 00009 నంబరును సేవ్ చేసుకోవాలి. అనంతరం దీనికి వాట్సప్‌లో హాయ్ అని సంక్షిప్త సందేశం పంపి.. ఆర్టీసీ సేవలను క్లిక్ చేస్తే టికెట్ బుకింగ్ ఐచ్ఛికం వస్తుంది.
- ఆన్‌లైన్‌లో నగదు చెల్లిస్తే నిర్ధారణ సందేశం మీ వాట్సప్‌కే వస్తుంది.
- బస్టాండ్‌లో అతికించిన క్యూఆర్ కోడ్‌ను మీ ఫోన్‌లో స్కాన్ చేయడం ద్వారానూ టికెట్ బుకింగ్ చేసుకోవచ్చు.
- ప్రయాణ వివరాలు, బయలుదేరే ప్రదేశం, చేరాల్సిన గమ్యం, తేదీ, వివరాలు నమోదు చేయాలి. ఏఏ సమయంలో ఏ బస్సులు ఉన్నాయో వివరాలు చూపిస్తుంది. బస్సు ఎంపిక చేసుకుని, ఖాళీగా ఉన్న సీటును బుకింగ్ చేసుకోవచ్చు.
- ప్రయాణికులు బస్సు ఎక్కిన తర్వాత కూడా కండక్టర్‌తో పని లేకుండా టికెట్లను వాట్సప్‌లోనే పొందవచ్చు.

ఈనాడు విజయనగరం

సోమవారం డిసెంబరు 29, 2025

శ్రీకృష్ణుని లీలలు నృత్య రూపకం

సీతానగరం మండలం అజ్జాడ బాలికల చెక్కభజన

కనులనిండా కళోత్సవం

తప్పెటగుళ్లతో కళాకారులు మోతమోగించారు.. జానపద గీతాలకు బాలలు పదం కలిపారు.. కృష్ణుడు, రాధా వేషధారణలతో చిన్నారుల నృత్యం.. బాలికల చెక్కభజనలతో వేడుక పండగను తలపించింది. 'బొబ్బిలి కళోత్సవం- 2025' ఆదివారం కోటలో ఉత్సాహంగా ఎమ్మెల్యే బేబినాయన సహకారంతో ప్రాచీన జానపద కళల ప్రదర్శనలు నిర్వహించారు. బొబ్బిలి యుద్ధం, ఖ్యాతిపై సినీనటుడు షకలక శంకర్ వినిపించిన పద్యం ఆకట్టుకుంది. – న్యూస్‌టుడే, బొబ్బిలి

గోవిందం.. పరమానందం

ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా విజయనగరంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వేంచేసియున్న మురళీకృష్ణ స్వామి వారి సన్నిధిలో స్వామివారికి ఆదివారం తిరుప్పావడ సేవ జరిగింది. పులిహోర, పండ్లు, పూలు, మిఠాయిలు నైవేద్యంతో అలంకరించారు. అంతకుముందు పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు సాగాయి.
– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

నాయీబ్రాహ్మణులూ.. ఉచిత విద్యుత్తు పొందండిలా..

రాజాం, చీపురుపల్లి, న్యూస్‌టుడే: నాయీబ్రాహ్మణుల దుకాణాలకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పొందేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇప్పటికే చాలా మంది లబ్ధి పొందుతున్నారు. దరఖాస్తు ఎలా చేయాలో తెలియని వారు లబ్ధిని కోల్పోతున్నారు. అర్హులైన వారు స్థానిక ఈపీడీసీఎల్ ఏఈకి దరఖాస్తు చేయాలి. దాన్ని పాలనాధికారులకు పంపిస్తారు. అక్కడ ఆమోదించాక ఉచిత విద్యుత్తు పథకం వర్తిస్తుందని సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.లక్ష్మణరావు చెప్పారు. అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కావాల్సిన పత్రాలు..

- ఆధార్, రేషన్ కార్డు నకలు
- దుకాణం అద్దె ఒప్పంద పత్రం
- సొంత భవనం అయితే అఫిడవిట్
- దుకాణ లేబర్ లైసెన్స్
- దుకాణం ఎదుట లబ్ధిదారులు నిల్చున్న ఫొటో
- తాజా విద్యుత్తు బిల్లు నకలు
- కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం.

జనరిక్ దుకాణాల ఏర్పాటుకు సాయం

విజయనగరం మయూరి కూడలి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జన ఔషధి పథకం కింద జనరిక్ దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించనున్నారు. వీటి కొనుగోళ్లపై 20 శాతం వరకు ప్రోత్సాహకం ఉంటుందని ఫార్మాస్యూటికల్స్, మెడికల్ డివైసెస్ బ్యూరో ఆఫ్ ఇండియా మార్కెటింగ్ అధికారి ఆర్.రాజేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారికి రుణ సదుపాయం కూడా అందిస్తామని, జిల్లాలోని అన్ని మండలాల్లో కేంద్రాలు ప్రారంభించుకోవచ్చన్నారు. తగిన అర్హతలు కలిగినవారు 79891 52612ను సంప్రదించాలని సూచించారు.

వీరు వ్యవసాయ వైద్యులు

క్రాప్ డాక్టర్ రూపకర్తలు

ఉద్దేశమిదీ.. రైతులకు అండగా నిలవడం, తగిన సూచనలు అందించడం, వెనకుండి మార్గదర్శకంగా మారడమే క్రాప్ డాక్టర్ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. పంటలో తెగుళ్ల గుర్తింపు, మట్టి నమూనాల సేకరణ, ఫలితాలు, ఎరువులు, పురుగు మందుల వినియోగం, సేంద్రియ సాగు, విత్తనాల వారీగా దిగుబడి, విత్తనశుద్ధి.. అంశాలన్నీ ఏఐ పరిజ్ఞానంతో కూడిన యాప్‌లో ఉంటాయి. దీనికి 'క్రాప్ డాక్టర్' అని పేరు పెట్టారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి.. తద్వారా జాతీయ, సౌత్ ఇండియా పోటీలకు ఈ ప్రాజెక్టు అర్హత సాధించింది.

విజ్ఞానం.. పదిమంది మేలు కోరాలి.. పర్యావరణహితమై సాగాలి. అదే తలంపు.. ఆ విద్యార్థులు, ఉపాధ్యాయులకు గుర్తింపు తెచ్చిపెట్టింది. రాష్ట్రస్థాయి దాటి దక్షిణభారత, జాతీయ పోటీలకు అవకాశం కల్పించింది. ఇంతకీ వారేం చేశారంటే..
– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

వారంతా గ్రామీణ ప్రాంత పిల్లలు. రైతన్న కష్టనష్టాలను విన్నారు. ఆ పరిస్థితి నుంచి వారిని గట్టెక్కించేందుకు, లాభాల బాట పట్టించేందుకు తామేం చేయగలమో ఆలోచించారు. ఈ క్రమంలో కృత్రిమ మేధతో కూడిన సుస్థిర వ్యవసాయంపై ప్రాజెక్టు చేసి అబ్బురపరిచారు. చీపురుపల్లి జడ్పీ బాలికల పాఠశాల విద్యార్థినులు **కె.లిఖితా స్వరాజ్, సి.హెచ్.మనస్విని** రూపొందించిన 'క్రాప్ డాక్టర్' ప్రదర్శనకు గుర్తింపు దక్కింది.

పనిచేసే విధానం..

- యాప్ కోసం పార్టీరాక్ ప్లాట్‌ఫాంను ఉపయోగించారు. గూగుల్ లేదా క్యూఆర్ కోడ్ సాయంతో దీన్ని తెరవచ్చు.
- అడిగిన సమాచారమిస్తే రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తుంది.
- నిరక్షరాస్యులైతే మాతృభాషలో వాయిస్ రూపంలో వినొచ్చు.
- ఫొటోలను అప్‌లోడ్ చేయడం ద్వారా తెగుళ్లు, నివారణ చర్యలను తెలియజేస్తుంది.
- పొలంలో మట్టిరకం, నీరు, భూమి విస్తీర్ణాన్ని బట్టి సాగుకయ్యే ఖర్చు, ఎంత విస్తీర్ణంలో పండించొచ్చు, పెట్టుబడి, దిగుబడి వివరాలను క్షణాల్లో ముందుంచుతుందని గైడ్ టీచర్ డి.అనురాధ వెల్లడించారు.

మొక్కలకూ ఉందో ల్యాబ్

పాఠశాలల పరిసరాలను అందంగా, ఆకర్షణీయంగా, మొక్కలతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దితే చదువుపై బాలలు ఆసక్తి చూపుతారని చెబుతున్నారు కొట్టాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని స్వప్న. ఇందులో భాగంగానే 'పెడగోజికల్ స్కూల్ గ్రీన్ ల్యాబ్' ప్రాజెక్టును రూపొందించారు. ఆమె పనిచేస్తున్న పాఠశాలలో ఇప్పటికే మొక్కల పెంపకం, వృథా నీటి వినియోగంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా ప్రారంభించిన కొత్త ప్రక్రియకు గుర్తింపు దక్కింది.

ఉద్దేశమిదీ..

- పాఠశాలలో పచ్చదనాన్ని ప్రయోగశాలగా మార్చడం దీని ఉద్దేశం. మొక్కలకు నీరు తక్కువైతే ఏమవుతుంది.. ఎక్కువేస్తే ఎలా.. బంగాళదుంపల సాగులో సులువైన విధానాలు తదితర అంశాలను ప్రయోగాత్మకంగా తెలియజేస్తారు.
- మొక్కలను ప్రత్యేక విధానంలో(మాయిశ్చర్ ఇరిగేషన్) నాటి, తేమ రూపంలో నీటిని అందించవచ్చు. కొన్నింటి నుంచి వచ్చే వృథా నీటిని లిక్విడ్ బయో ఫెర్టిలైజర్లగా మార్చవచ్చు. ఆకులు, ఇతర భాగాలను సద్వినియోగం చేసుకుని, ఎరువు చేయొచ్చు. విడి భాగాలు, బెల్లంతో మైక్రో ఆర్గాన్ల సృష్టి, కొత్త రకాల మొక్కల తయారీకి ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమంగా నిలిచి, హైదరాబాద్‌లో జరిగే దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనకు ఇది ఎంపికైంది.

స్కూల్ గ్రీన్ ల్యాబ్ ప్రాజెక్టుతో స్వప్న

అతివకు ఆర్థిక భరోసా.. డిజి-లక్ష్మి

కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

మహిళల ఆర్థిక స్వావలంబనకు డిజి-లక్ష్మి లాంటి పథకాలు దోహదపడతాయని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ధర్మపురంలో శ్రీలక్ష్మీ మహిళా పొదుపు సంఘానికి చెందిన ఎల్.నిరీష ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. లబ్ధిదారునికి సేవలకు సంబంధించిన తొలి రసీదు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మెప్మా ద్వారా ఏర్పాటయ్యే ఈ కేంద్రాలతో అతివలకు ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. విజయనగరంలో 60 వరకు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. 44 రకాల సేవలు అందనున్నాయని పేర్కొన్నారు. మెప్మా పీడీ జీవీ చిట్టిరాజు, ఏఎంసీ ఛైర్మన్ కర్రోతు నరసింగరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే,విజయనగరం పట్టణం

అన్నపూర్ణమ్మ.. అందుకున్నారు పురస్కారం

రామభద్రపురంలోని కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సెంటర్(సీడీసీ- స్వచ్ఛంద సంస్థ) పీడీ డా.శతపతి అన్నపూర్ణమ్మ చేస్తున్న సమాజ సేవ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు గుర్తింపు లభించింది. నేపాల్ రాజధాని కాఠ్‌మండూలో ఆదివారం జరిగిన అంతర్జాతీయ సదస్సులో ప్రాజెక్ట్- 100 సంస్థ ఎస్‌డీజీ ఛాంపియన్ ప్రైజ్- 2025ను అందించింది. సుస్థిర గ్రామాభివృద్ధికి క్షేత్రస్థాయిలో పనిచేసినందుకు గానూ ఈ పురస్కారాన్ని ఆ దేశ స్త్రీ, శిశు సంక్షేమ, వయో వృద్ధుల సంక్షేమ శాఖ మాజీ మంత్రి భగవతి చౌదరి, ఇతర ప్రముఖుల సమక్షంలో ఆమెకు అందజేశారు. పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని ఆమె పేర్కొన్నారు.
–ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే, రామభద్రపురం

అన్న.. పల్లెకూ వస్తున్నాయి క్యాంటీన్లు

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

తుది దశలో చీపురుపల్లి అన్న క్యాంటీన్

అయిదుచోట్ల శరవేగంగా నిర్మాణాలు

పట్టణాల్లో ఓ పూటకు రూ.5కే ఆహారం అందిస్తూ అవసరార్థుల ఆకలి తీరుస్తున్నాయి అన్న క్యాంటీన్లు. రెండో విడత గ్రామీణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటునకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఉమ్మడి జిల్లాలో చీపురుపల్లి, కొత్తవలస, గజపతినగరం, కురుపాం, సీతంపేటలలో భవన నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయని ప్రజారోగ్య సాంకేతిక శాఖ డీఈలు బి.ఈశ్వరరావు, వంశీ చెప్పారు. నియోజక వర్గానికి ఒకటి చొప్పున అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తొలి విడతలో అర్బన్ ప్రాంతాలైన విజయనగరం నగర పాలక సంస్థలో మూడు, నెల్లిమర్ల, బొబ్బిలి, రాజాంలలో ఒక్కొక్కటి ఏర్పాటయ్యాయి. పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం పురపాలక సంఘం, పాలకొండలలో ఒక్కొక్కటి నిర్వహిస్తున్నారు. వీటికి ఆదరణ లభిస్తోంది. పలు వర్గాలవారు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నారు.

- విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి, కొత్తవలసలలో భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. టైల్స్, ప్రహరీ నిర్మాణం జరగాల్సి ఉంది. ఈ రెండింటిని జనవరి 15 నాటికి పూర్తి చేయనున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.
- గజపతినగరంలో భవన నిర్మాణం జనవరి నెలాఖరునాటికి పూర్తికానుంది. ఇక్కడ స్లాబు డీసెంట్రింగ్ జరగాల్సి ఉంది. స్థల సేకరణ విషయంలో ఇబ్బందితో కాస్త జాప్యమైంది.

రెండుచోట్ల పండగనాటికి..
ఉమ్మడి జిల్లాల్లోని అన్న క్యాంటీన్ల నిర్మాణ పనులు ప్రజారోగ్య సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఒక్కొక్క భవనం రూ.61 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు.

- పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాంలోని అన్న క్యాంటీన్ పనులు తుది దశకు చేరాయి. ఏసీపీ క్లాడింగ్, గ్లాసు పనులు జరుగుతున్నాయి.
- సీతంపేటలో భవనం స్లాబ్ పనులు ఈనెల 20న జరిగాయి. 15 రోజులు క్యూరింగ్ అనంతరం ఇతర నిర్మాణాలు ప్రారంభించనున్నారు. జనవరి నెలాఖరునాటికి దీన్ని అందుబాటులోకి తెచ్చేలా సన్నాహాలు చేస్తున్నారు.

అరకెళ్లి.. అవస్థల్లో చిక్కి..

న్యూస్‌టుడే, శృంగవరపుకోట

బస్టాండులో ప్రయాణికుల నిరీక్షణ

బస్సులు నిలిచి ప్రయాణికులకు యాతన

క్రిస్మస్ పండగ, సంవత్సరాంతపు, వారాంతపు సెలవులతో ఆంధ్రా ఊటీ అరకు పర్యాటకులతో కిటకిటలాడుతోంది. ఈక్రమంలో వేలాది వాహనాలతో ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీంతో పోలీసులు ఆదివారం నుంచి వన్ వే విధించారు. విశాఖ నుంచి శృంగవరపుకోట మీదుగా వెళ్లేవారు తిరిగి రాకుండా రాకపోకలు నిలిపేశారు. పాడేరు, చోడవరం మీదుగా కిందకు దిగాలని స్పష్టం చేశారు.

రూ.లక్షల నష్టం..

ఎస్.కోట డిపో నుంచి నిత్యం ఏడు డీలక్స్, తొమ్మిది పల్లెవెలుగు బస్సులు అరకుకు వెళ్తున్నాయి. ఈ రూట్లోనే డిపోనకు ఆదాయం ఎక్కువ. ముందస్తు సమాచారం లేకపోవడంతో ఆదివారం ఉదయం వెళ్లిన ఏడు డీలక్స్, ఆరు పల్లెవెలుగులు అక్కడ చిక్కుకున్నాయి. కొండ కిందకు అనుమతించడం లేదన్న విషయం డిపో మేనేజరు సుదర్శనరావుకు సిబ్బంది అందించారు. రీజనల్ ఛైర్మన్ దొన్నుదొర విజ్ఞప్తి మేరకు సాయంత్రం 5 గంటల ప్రాంతంలో విడతల వారీగా కిందకు పంపారు. జనవరి 5 వరకు ఘాట్ రోడ్డులో వన్‌వే రాకపోకలు మాత్రమే ఉంటాయని పోలీసులు ప్రకటించారు. దీనివల్ల ఆర్టీసీ ఆదాయానికి గండి పడే అవకాశం ఉంది. ఆదివారం ఒక్కరోజే రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు కోల్పోయినట్లు తెలుస్తోంది.

టిమ్‌లు పనిచేయవు..

పోలీసుల సూచన మేరకు పాడేరు, చోడవరం మీదుగా బస్సులు కొండ దిగాలి. ఈ రూటులో వెళ్తే టిమ్‌లు పనిచేయవు. అందువల్ల అరకులోనే ఉండిపోవాల్సి వచ్చిందని డిపో మేనేజరు తెలిపారు.

శ్రద్ధాంజలి

జననం 01-07-1953
మరణం 18-12-2025

కీ॥శే॥ శ్రీమతి తెంటు సత్యవతి గారు
ముగడ, బాడంగి మండలం
విజయనగరం జిల్లా

మీ కీర్తి ప్రతిష్ఠలు, జీవితం మానవ సమాజానికి ఒక ఆదర్శం! మీరు నడిచిన బాటే మాకు బంగారుబాట మీ అండ మీ నీడే మాకు మేరుగ పర్వతంలాంటింది. దివంగత శాసనసభ్యులు శ్రీ తెంటు జయప్రకాష్ గారి సతీమణిగా మీరు అందించిన ఆదర్శాలు చరిత్రలో శిలాక్షరాలు., బాధ్యత గల కుటుంబసభ్యులుగా మీరు చూపించిన ప్రేమ వాత్సల్యం, ఆప్యాయత మేమెప్పటికీ మరువలేము, మీ చిరునవ్వుతో కూడిన జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచే ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ...

కుమారుడు - కోడలు
తెంటు లక్ష్మునాయుడు - డా॥ మంతిని రేష్మ
మాజీ శాసనసభ్యులు
బొబ్బిలి అర్బన్ డెవలప్మెంట్ ఛైర్మన్

కుమార్తెలు - అల్లుళ్లు
శ్రీమతి ఉమాదేవి (లేటు) - **బంటు వెంకటేశ్వరరావు**, M.Sc., (AG)
Asst Director, Telangana
డా॥ టి. ఉషారాణి - డా॥ టి. వంశీచరణ్
మనుమలు : ఆదిత్య, అభినవ్, మనుమరాండ్రు : శ్రీనిజ, ధరణి
మరియు కుటుంబసభ్యులు, బంధుమిత్రులు

పెద్దకర్మ : తేది 29-12-2025 బాడంగి మండలం ముగడ న్యూకోలనీ రైస్‌మిల్ ప్రక్కన జరుపబడును.

మధురమే..మధురమే..మధురమే..
ఈ క్షణములు ఇంకా మధురమే..
పదవీ విరమణ శుభాకాంక్షలు

మీ కుటుంబసభ్యులు, మీ బంధుమిత్రులు,
మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా!
అయితే వారికి అందించండి, అభినందన చందనాలు.
వారి భావి జీవితం సుఖమయంగా సాగాలని ఆకాంక్షిస్తూ,
ఈనాడు ద్వారా వారికి అందించండి,
పదవీ విరమణ శుభాకాంక్షలు.

మరిన్ని వివరాలకు :
9000866020
8008597609

ముక్కోటికి ముస్తాబు

రామతీర్థంలో రేపు గిరిప్రదక్షిణ

న్యూస్‌టుడే, జరజాపుపేట (నెల్లిమర్ల)

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానం ముక్కోటి ఏకాదశి పర్వదినానికి ముస్తాబవుతోంది. ఈ నెల 30న ఉత్తర ద్వార దర్శనం, మెట్లోత్సవం, గోపూజ, గిరిప్రదక్షిణ నిర్వహించేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఉదయం 3 గంటలకు స్వామివారి ఆరాధన, 4 గంటలకు తిరుప్పావై సేవా కాలం, మంగళాశాసనం, తీర్థగోష్ఠి, 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం, 7.30 గంటలకు స్వామివారి తిరువీధి, 8 గంటలకు మెట్లోత్సవం, గోపూజ, గిరి ప్రదక్షిణ ఉంటుందన్నారు.

10 వేల మంది హాజరవుతారని అంచనా

గిరి ప్రదక్షిణకు సుమారు 10 వేల మంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనాలు వేస్తున్నారు. క్యూలైన్ల ద్వారా వెళ్లేందుకు బారికేడ్లు సిద్ధం చేస్తున్నారు. నీలాచలం కొండ చుట్టూ 8 కిలోమీటర్లు మేర నడిచేందుకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. రహదారి మధ్యలో తాగునీరు, బిస్కెట్లు అందజేస్తారు. స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకీలో కొండ చుట్టూ ఊరేగింపుగా తీసుకెళ్తారు. సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టనున్నారు. భక్తులకు స్వామివారి ఉత్తర ద్వార దర్శనాలు సకాలంలో కల్పిస్తామని ఈవో వై. శ్రీనివాసరావు తెలిపారు.

ప్రజాధనమేగా.. పక్కన పడేయ్!

రాజాం మండలంలోని రామానుజులపేట ప్రాథమిక పాఠశాల వద్ద సిమెంటు బస్తాలు గడ్డకట్టి వృథాగా పడిఉన్నాయి. వీటిని గతంలో గ్రామంలోని రహదారులు, కాలువల నిర్మాణాల కోసం తెచ్చారు. పనులు పూర్తవ్వగా మిగిలిన వాటిని ఇక్కడకు చేర్చారు. చాలా రోజుల నుంచి వీటిని ఇలాగే వదిలేయడంతో గడ్డకట్టాయి. ప్రజాధనం వృథాగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ఎంపీడీవో ఆనందరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం

(c) eenadu

ఐక్యంగా పోరాడితే ఏదైనా సాధ్యం

ఆత్మీయ సమ్మేళనంలో వంగవీటి ఆశాకిరణ్

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఐక్యంగా పోరాటం చేస్తే ఏదైనా సాధించగలమని మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధ కుమార్తె ఆశాకిరణ్ అన్నారు. బొబ్బిలిలోని ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన తెలగ సామాజిక వర్గీయుల ఆత్మీయ సమ్మేళనానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తండ్రి రాధ తన స్ఫూర్తి అని, ఆయన పట్టుదల తనలో ఉందన్నారు. జాతి అభివృద్ధికి వంగవీటి కుటుంబం సభ్యురాలిగా ముందుంటానని భరోసానిచ్చారు. కేరళ, తమిళనాడు, కర్ణాటకలో రిజర్వేషన్లు పక్కాగా అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా న్యాయం చేస్తారన్నారు. తెలగ, కాపు రిజర్వేషన్ల పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ సీహెచ్.ప్రసాదరావు మాట్లాడుతూ పది లక్షల మందితో ఒక సంఘం ఏర్పాటు కావాలన్నారు. నాయకులు శంకర్ కుమార్, గాదెం బాలాజీ, జి.శ్రీనివాసరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో ఆశాకిరణ్‌కు స్వాగతం పలుకుతున్న తెలగ సంఘం నాయకులు

సెమీస్‌కు మిరాకిల్, ఎంవీజీఆర్ జట్లు

ఉత్కంఠభరితంగా ఈఎస్ఎల్-2025 క్రికెట్ ఛాంపియన్‌షిప్

EENADU SPORTS LEAGUE 2025

విజయనగరం బాబామెట్ట, న్యూస్‌టుడే: ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్- ఈనాడు స్పోర్ట్స్ లీగ్(ఈఎస్ఎల్)-2025 క్రికెట్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆదివారం జరిగిన మ్యాచ్‌లను సుఖీభవ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఎ.శరత్‌కుమార్ పాత్రో టాస్ వేసి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల(చింతలవలస), మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాల(భోగాపురం), సీతం ఇంజినీరింగ్ కళాశాల(విజయనగరం), శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల(మన్యం) జట్ల మధ్య ఉత్కంఠ పోరు సాగింది. కృష్ణవేణి, మృత్యుంజయరావు, కేదార్, రాజేష్, చిరంజీవి, పుష్పరాజ్ అంపైర్లుగా వ్యవహరించారు.

SUKHIBHAVA Hospitals CARING FOR LIVES 17-15-90, Jonnaguddi Road, Beside Reliance Mall, BALAJI JUNCTION, VIZIANAGARAM AP 535002 Contact: 7901224433

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR Shopping Mall
Regional Sponsor: GGU Godavari Global University Rajamahendravaram, A.P. Call: 194 999 3483 | www.ggu.edu.in
Gift Partner: KL University
Digital Partner: ఈనాడు.net
TV Partner: ETV Bharat, ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

టాస్ వేస్తున్న సుఖీభవ ఆసుపత్రి సంచాలకుడు డా.ఎ.శరత్‌కుమార్ పాత్రో

అంత దూరం నుంచి వికెట్లను కొడుతున్న క్రీడాకారుడు

29.12.2025 నేడు సీనియర్ విభాగంలో.. (విజ్జి స్టేడియం)

★ ఉదయం 9.00 గంటలకు: ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల(విజయనగరం) V/s మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాల(భోగాపురం)

★ ఉదయం 11.30 గంటలకు: అవంతీ రీసెర్చ్ అండ్ టెక్నలాజికల్ అకాడమీ(భోగాపురం) V/s శ్రీ జీసీఎస్ఆర్ కళాశాల- జీఎంఆర్(రాజాం)

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వీరే

పి.పాపారావు

కె.డేవిడ్

వికెట్లు పడగొట్టి విజయ కేతనం

నగరంలోని విజ్జి మైదానంలో జరిగిన తొలి పోరులో టాస్ ఓడిన మిరాకిల్ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత ఓవర్లలో 67 పరుగులకు ఆలౌట్ అయ్యింది. డి.ప్రవీణ్ 14 పరుగులు చేశారు.. 20 పరుగులు ఎక్స్‌ట్రాల రూపంలో వచ్చాయి. అనంతరం బరిలోకి దిగిన సీతం జట్టు నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 61 మాత్రమే చేయగల్గి, ఆరు పరుగుల తేడాతో ఓటమి పాలైంది. మిరాకిల్ బౌలర్ పాపారావు 14 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. అందులోనూ వరుస బంతుల్లో 4 వికెట్లు తీశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

పరుగులతో గెలుపు బాట

ఇదే మైదానంలో జరిగిన రెండో మ్యాచ్‌లో శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల(మన్యం)పై ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల(చింతలవలస) 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన వెంకటేశ్వర నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 72 పరుగులు చేసింది. డి.సతీష్ 9 బంతుల్లో 18 పరుగులు, వాసు 13 పరుగులు చేశారు. అనంతరం బరిలో దిగిన ఎంవీజీఆర్ క్రీడాకారులు సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించారు. ఈ జట్టులో కార్తీక్ 7 బంతుల్లో 17 పరుగులు, డేవిడ్ నాలుగు ఫోర్లు, ఒక సిక్సర్ సహాయంతో 27 పరుగులు చేసి జట్టును సెమీస్‌కు చేర్చారు. డేవిడ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

జనసేనలో వర్గ, విభేదాలుండవు

జమ్ము శ్రీనును సత్కరిస్తున్న శివశంకర్, యశస్వి, పడాల అరుణ తదితరులు

అయ్యన్నపేట, న్యూస్‌టుడే: మిగిలిన పార్టీల్లా జనసేనలో వర్గాలు, విభేదాలు ఉండవని, కేవలం జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు మాత్రమే ఉంటాయని ఎంఎస్ఎంఈ ఛైర్మన్, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ అన్నారు. వైకాపా నేత నడిపేన శ్రీనివాసరావు(జమ్ము శ్రీను), ఆయన కుమార్తె, ఏఎంసీ మాజీ ఛైర్‌పర్సన్ శశిభార్గవి, పలువురు అనుచరులు జనసేనలో చేరగా.. ఆదివారం విజయనగరంలో జరిగిన కార్యక్రమంలో కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ.. శ్రీను చేరికతో జిల్లాలో పార్టీ మరింత బలోపేతమవుతుందన్నారు. తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో విజయనగరం అభివృద్ధికి నోచుకోలేదని, కేవలం సొంత లాభం కోసమే వైకాపా నాయకులు పనిచేశారని విమర్శించారు. పార్టీ పీఏసీ సభ్యురాలు, మాజీ మంత్రి పడాల అరుణ, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ పరిషత్ అధ్యక్షుడిగా సూర్యనారాయణరాజు

అయ్యన్నపేట: విజయనగరంలో క్షత్రియ పరిషత్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇందుకూరి సూర్యనారాయణ రాజు, కార్యదర్శిగా రాయవరపు సంతోష్‌రాజు, కోశాధికారిగా పీకేఎల్.వర్మతో పాటు 22 మంది సభ్యులతో కొత్త కార్యవర్గం ఏర్పాటైంది. పెనుమత్స సీతారామరాజు, శేఖర్‌రాజు, లక్ష్మీపతివర్మ, సాగి సీతారామరాజు, రాంబాబు రాజు, శివాజీరాజు, రామరాజు, కేఆర్‌కే.రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిషత్ నూతన కార్యవర్గ సభ్యులు

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నియామకపత్రాలతో జిల్లా కమిటీ సభ్యులు

అయ్యన్నపేట, న్యూస్‌టుడే: కె.కోటపాడులో ఆదివారం జరిగిన బ్రాహ్మణ అర్చక పురోహిత రాష్ట్రస్థాయి సమావేశంలో జిల్లా కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా అధికార ప్రతినిధిగా వాడ్రేవు నాగరాజుశర్మ, అధ్యక్షుడిగా మర్ల రవికుమార్, ప్రత్యేక సలహాదారుడిగా ఎనగంటి సురేష్‌శర్మ, ప్రధాన కార్యదర్శిగా ఎల్.రమేష్‌శర్మ, కోశాధికారిగా జీఎంఎస్.అగస్త్య శర్మ, ఉపాధ్యక్షుడిగా నరెడ్ల వెంకటప్రసాద్‌శర్మ, సహాయ కార్యదర్శిగా గిరి సంతోష్‌కుమార్‌శర్మ, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.సిద్ధార్థ శర్మ, కార్యవర్గ సభ్యులుగా దొంతికుర్తి సాయిశర్మ, కె.సూర్యతేజ శర్మకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామశాస్త్రి ఎంపిక పత్రాలను అందించారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో ఫైనల్స్‌కు బొండపల్లి

బ్యాటింగ్ చేస్తున్న ఎస్సై మహేష్

బొండపల్లి, న్యూస్‌టుడే: బొండపల్లి మండలం గొల్లుపాలెం గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆదివారం భూదేవిపేట, బొండపల్లి జట్లు తలపడ్డాయి. బొండపల్లి పోలీస్- రెవెన్యూ జట్టు తుదిపోరుకు అర్హత సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బొండపల్లి నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 85 పరుగులు సాధించింది. ఛేదనలో భూదేవిపేట 51 పరుగులకే పరిమితమైంది. ఎస్సై మహేష్ బ్యాటు పట్టి సందడి చేశారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	270	280

EENADU e Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

ప్రీమియం ఒగోబాముష సాకి (బెన్నిన్) ముడి జీడిపప్పు (RCN) అత్యుత్తమ నాణ్యత, సరసమైన ధర, నేరుగా సరఫరా. బిజినెస్ వీసా, వసతి సౌకర్యాలు మేము ఏర్పాటు చేస్తాం. సంప్ర॥ 7893732377.

REAL ESTATE

FLAT FOR SALE

2BHK Flat 2nd Floor at UDA Colony, Paul Nagar, 7th Lane, Near Muchalamma Gudi, Vizianagaram. Contact: 9778527106.

JOBS

ప్రముఖ సంస్థ నందు OMS కేటగిరిలో వర్క్ చేయుటకు 25సం॥లోపు యువతి, యువకులు కావలెను. Q:7th - డిగ్రీ (PF) స్టైఫండ్ 10Kto35K ఫ్రీ రూం, ఫీజు లేదు. ✆ 9398756906.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

వైజాగ్ ప్రముఖ షాపింగ్ మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువకులు కావలెను. జీతం.10,000-12,000+ఫుడ్ రూము. ✆ 9030588502/9704637370.

పైడిభీమవరం, పరవాడ ఫార్మా కంపెనీలోకి సూపర్‌వైజర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, R&D, మేనేజర్స్, ఫైర్&సేఫ్టీ హెల్పర్స్, సెక్యూరిటీ. Qlf:10th-డిగ్రీ, MBA, M. ఫార్మా. జీ: 18K-35K. 9573635594, 9121044796

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

వనిత అందుకో చేయూత

సీతంపేట, న్యూస్‌టుడే

మన్యం ప్రాంతంలో లభించే అటవీ ఉత్పత్తులు వినియోగించుకొని ఆదాయం పొందుతున్నారు గిరి మహిళలు. ఇక్కడ పండే పంటలను విలువ ఆధారిత వస్తువులుగా తయారు చేసేందుకు చిన్న పరిశ్రమలు నెలకొల్పి జీవనోపాధులు పెంచుకుంటున్నారు. ఇప్పటికే చాలామంది చిరుధాన్యాలతో బిస్కెట్‌లు, స్నాక్స్, ఇతర ఆహార పదార్థాలు, వెదురుతో గృహోపకరణాలు తయారు చేస్తూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు.

స్వయం ఉపాధి పథకాలు..

పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, సీఐఎఫ్, స్త్రీనిధి, ఉన్నతి తదితర పథకాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయం పొందవచ్చు. పీఎంఎఫ్ఎంఈ ద్వారా సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలకు ఆర్థిక, సాంకేతిక సహాయం అందిస్తారు. లబ్ధిదారు పెట్టుబడి పది శాతం, బ్యాంకు రుణం 90 శాతం, రుణంపై రాయితీ 35 శాతం ఇస్తారు. స్థానిక వెలుగు కార్యాలయాలు, ఐటీడీఏలను సంప్రదిస్తే పూర్తిస్థాయి సమాచారం అందిస్తారు.

యూనిట్ల ఏర్పాటు... పెదరామలో ఆర్ట్స్, వాసన్ సంస్థలు, నాబార్డు సహకారంతో పది మంది మహిళలు చిరుధాన్యాలతో వివిధ ఆహార పదార్థాలు తయారు చేసి మార్కెటింగ్ చేస్తున్నారు. వాసన్ ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లోని భారతీయ మిల్లెట్ పరిశోధన కేంద్రం, హైదరాబాద్‌లో శిక్షణ తీసుకున్నారు. అవసరమైన మెటీరియల్ సమకూర్చడంతో ఆర్ట్స్ సంస్థ అండతో దేవనాపురం, మేకవ తదితర గ్రామాల్లో వెదురుతో గృహోపకరణ, అలంకరణ వస్తువులను తయారు చేస్తున్నారు. ఇటీవల పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అవగాహన సదస్సు నిర్వహించారు. 72 రంగాలకు సంబంధించి ప్రభుత్వ సహాయం కోసం 495 మంది నమోదు చేసుకున్నారు.

దేవనాపురంలో వెదురుతో సోఫాలు, కుర్చీల తయారీ

ఖాళీ సమయాల్లో..

చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు తయారు చేసి విక్రయిస్తున్నాం. పది మందిమి బృందంగా ఏర్పడి ఖాళీ సమయాల్లో దీన్ని చేసుకుంటున్నాం. నెలకు ఒక్కొక్కరికి రూ.10 వేలకుపైగానే ఆదాయం వస్తోంది. కుటుంబ పోషణ సులువవుతోంది. **– సుజాత, పెదరామ**

వినియోగించుకోవాలి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న రాయితీలు, దరఖాస్తు చేసుకొనే విధానాన్ని లబ్ధిదారులకు తెలియజేస్తున్నాం. వివిధ రకాల వ్యాపారాలు చేసుకునేందుకు అవకాశం ఉంది. సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందొచ్చు. **– ఆర్.వి.రమణ, డీపీఎం**

సీతంపేట మండలం పెదరామలో చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు తయారు చేస్తున్న మహిళలు

ఒత్తిడితో కూడిన విద్యావిధానం తగదు

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కరరావు, శ్రీనివాసరావు

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకునేందుకు సామాజిక బాధ్యత కలిగిన ఉపాధ్యాయులంతా ప్రజలతో కలిసి ఉద్యమించాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు పిలుపునిచ్చారు. ఆదివారం విజయనగరంలోని సంఘ కార్యాలయంలో 51వ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై పోరాటం కొనసాగిస్తామన్నారు. ఒత్తిడిని ఆపితేనే విద్యార్థులకు మెరుగైన బోధన సాగుతుందన్నారు. పండగల సమయంలోనూ బడులు తెరవడం సరికాదన్నారు. అనంతరం జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతా భాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా కోరాడ శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడిగా మీసాల అప్పలనాయుడు, సహాధ్యక్షులుగా ప్రసన్నకుమార్, జి.పార్వతి, కోశాధికారిగా తిరుపతినాయుడు ఎన్నికయ్యారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

తెల్లారిన బతుకులు.. మిన్నంటిన రోదనలు

చెట్టును ఢీకొన్న వ్యాన్: ఇద్దరి దుర్మరణం

గజపతినగరం, మాధవధార, న్యూస్‌టుడే: రెక్కల కష్టంతో బతుకుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఇద్దరిని తమ బతుకు బండే బలితీసుకుంది. పని ముగించుకుని మరి కొన్ని గంటల్లో ఇళ్లకు చేరుకుంటారనే లోపే రోడ్డు ప్రమాదం వారిని శాశ్వతంగా ఈ లోకం నుంచి దూరం చేసింది. గజపతినగరం రైల్వే స్టేషన్ రహదారి సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఓ వ్యాన్ చెట్టును ఢీకొన్న ఘటనలో విశాఖ నగరానికి చెందిన ఇద్దరు దుర్మరణం చెందారు. ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు వివరాల ప్రకారం.. జీవీఎంసీ 49వ వార్డు ఎన్‌జీజీఓఎస్ కాలనీలో నివాసముంటున్న పి.వినయ్‌కుమార్(35) తినుబండారాల వ్యాపారం నిర్వహిస్తుంటాడు. బర్మా క్యాంప్ దరి జైభారత్‌నగర్‌కు చెందిన యల్లబిల్లి దినేష్(25)తో కలిసి సరకుల కోసం శనివారం రాయగడ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో గజపతినగరం సమీపంలో వ్యాన్ అదుపు తప్పి రహదారి పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఘటనాస్థలంలో దెబ్బతిన్న వాహనం

వినయ్‌కుమార్ (పాతచిత్రం)

దినేష్ (పాతచిత్రం)

పెద్దదిక్కు కోల్పోయిన కుటుంబం..

వినయ్‌కుమార్ భార్య వాసవి గృహిణి. వీరికి కుమార్తె లాత్విక(5), కుమారుడు జయదీప్(3) ఉన్నారు. 18 ఏళ్ల నుంచి బేకరి వస్తువులను విక్రయించే వ్యాపారం నిర్వహిస్తున్నాడు. రాయగడలో సరకు కొనుగోలు చేసి నగరంలోని పలు దుకాణాలకు హోల్‌సేల్‌గా విక్రయించేవాడు. ఇంటిపెద్ద మృతితో వాసవి కన్నీరుమున్నీరవుతోంది.

జనవరి 1న పుట్టినరోజు..

దినేష్ జీవీఎంసీ శానిటేషన్ విభాగంలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. భార్య లయ గృహిణి. రెండేళ్ల పాప, ఎనిమిది నెలల బాబు ఉన్నారు. తల్లిదండ్రులు కాంట్రాక్ట్ వర్కర్లుగా పనిచేస్తున్నారు. దినేష్ సెలవు దినాల్లో డ్రైవింగ్ చేస్తుంటాడు. జనవరి 1న పుట్టినరోజు. బయటకు వెళ్తే డబ్బులు వస్తాయని, ఆ రోజు ఖర్చులకు ఉపయోగపడతాయని వినయ్‌కుమార్‌తో కలిసి రాయగడ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ప్రాణాలు కోల్పోయాడు.

లారీ, ఆటో ఢీ: ముగ్గురికి గాయాలు

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: దత్తిరాజేరు మండలంలోని కోమటిపల్లి రహదారి కూడలి వద్ద ట్యాంకర్ లారీ, ఆటో ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పెదమానాపురం ఎస్సై జయంతి తెలిపిన వివరాల ప్రకారం.. పెదమానాపురం నుంచి గొభ్యాం వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న ట్యాంకర్ లారీ ఢీకొనడంతో ఆటోలో ఉన్న చొక్కాపు అప్పలనాయుడు, అల్లు గౌరమ్మ, చోదకుడు మామిడి నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి, చికిత్స నిమిత్తం గజపతినగరం ప్రాంతీయాసుపత్రికి 108 వాహనంలో తరలించారు. క్షతగాత్రుల స్వస్థలం రామభద్రపురం మండలం కొత్తరేగ గ్రామం. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కాలేయం, మూత్రపిండాలు దానం చేసిన కుటుంబీకులు

అప్పలమ్మ (పాతచిత్రం)

భామిని, సీతంపేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన భామిని మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సతివాడకు చెందిన ఎం.అప్పలమ్మ(55) ఈనెల 23న ప్రధాన రహదారిపై ఉన్న గ్రామదేవత ఆలయానికి వెళ్లి వస్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలవడంతో స్థానికంగా చికిత్స అందించి.. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. మూత్ర పిండాలు, కాలేయాన్ని రాగోలులోని జెమ్స్‌కు దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం పోస్టుమార్టం జరిపి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. ఆమెకు భర్త అప్పారావు, వివాహమైన ఇద్దరు కుమారులున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అప్పారావు తెలిపారు.

విషపూరిత ద్రావణం తాగించి హత్యాయత్నం

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, సీతానగరం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని ఆపి.. దుండగులు హత్య చేసేందుకు ప్రయత్నించిన ఘటన పార్వతీపురం మండలంలో చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసుల వివరాల మేరకు.. సీతానగరం మండలం పెదంకలాం గ్రామానికి చెందిన చింతాడ సతీష్ వ్యక్తిగత పనిపై పార్వతీపురం వచ్చాడు. ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వెళ్తుండగా జనహిత పాఠశాల సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆపాడు. ఈక్రమంలో వెనుక నుంచి వచ్చిన మరొకడు దాడి చేశాడు. ఇంతలో మరొకడు చేరుకున్నాడు. ముగ్గురూ కలిసి విషపూరిత ద్రావణం తాగించే ప్రయత్నం చేశారు. ఇంతలో అటుగా ఇద్దరు వ్యక్తులు రావడంతో పరారయ్యారు. బాధితుడు వెంటనే సీతానగరం పీహెచ్‌సీకి వెళ్లాడు. ప్రథమ చికిత్స అనంతరం పార్వతీపురం, ఆపై విజయనగరం ఆసుపత్రికి తరలించారు. గ్రామీణ పోలీసులు వివరాలు సేకరించారు. సతీష్ వద్ద అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అప్పు తీసుకున్నాడని, ఆ విషయమై ఇటీవల గొడవలు జరిగాయని, కుటుంబీకులు చెబుతున్నారు. అప్పు తీసుకున్నవారే ఇలా చేశారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

చోదకుడి నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి

నెల్లిమర్ల(డెంకాడ), న్యూస్‌టుడే: లారీ చోదకుడి నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలిగింది. పోలీసుల వివరాల మేరకు.. డెంకాడ మండలం బొడ్డవలసకు చెందిన అట్టాడ పైడినాయుడు(60) కూలి పనులు చేసుకునేవారు. శనివారం పనికెళ్లి రాత్రి తిరిగొస్తూ గ్రామ కూడలి వద్ద రహదారి దాటుతుండగా విశాఖ నుంచి విజయనగరం వెళ్తున్న లారీ ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో మహారాజా ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య బంగారమ్మ, ఇద్దరు కుమార్తెలున్నారు. పైడినాయుడు మృతితో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పే అండ్ అకౌంట్స్ ఉద్యోగులకు అండ

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: రాష్ట్రంలో పే అండ్ అకౌంట్స్ ఉద్యోగులకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ పే అండ్ అకౌంట్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సర్వీస్ రూల్స్, రేషియో ఫిక్సేషన్, పదోన్నతులు, అడిషనల్ ఛార్ట్ తదితర దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.హరనాథ్ మాట్లాడుతూ.. నూతన జిల్లాల్లో ఎన్నికలు నిర్వహించి, సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. అనంతరం కోఆప్షన్ ద్వారా నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పమ్మి శ్రీనివాస్(విశాఖపట్నం), కార్యదర్శులుగా జల్లేపల్లి స్వామి(విజయవాడ), మోహనరావు(విజయనగరం) ఎన్నికయ్యారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

రెండోరోజూ పూల అలంకరణ

గజపతినగరం, న్యూస్‌టుడే: గజపతినగరంలోని బజారు కూడలిలో గల వేంకటేశ్వర ఆలయంలో శ్రీనివాస స్వామిని రెండో రోజైన ఆదివారం అర్చకుడు శ్రీనివాసాచార్యులు పూలతో అలంకరించారు. ధనుర్మాసం నేపథ్యంలో భక్తులు దర్శించుకున్నారు.

వెంకన్నకు పూజలు

రింగురోడ్డు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామికి ఆదివారం పుష్పయాగ ఉత్సవం అత్యంత భక్తి శ్రద్ధల నడుమ జరిగింది. వివిధ రకాల పుష్పాలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో స్వామి వారు దర్శనమిచ్చారు.

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

నేడు గ్రామానికి పెద పోలమాంబ

మక్కువ, న్యూస్‌టుడే: మన్యంలో అత్యంత వైభవంగా జరిగే శంబర పోలమాంబ ఉత్సవాల్లో తొలి ఘట్టమైన పెదపోలమాంబ జాతర ప్రారంభం కానుంది. సీబిల్లిపెద్దవలస మార్గంలో ఉన్న ఆలయ సమీపంలో కొలువుదీరిన పోలమాంబ మేనత్త అయిన పెద పోలమాంబని కొలిచి ఆహ్వానిస్తారు. అక్కడ నుంచి అమ్మవారి ఘటాన్ని సోమవారం చదురుగుడికి తీసుకువచ్చి వారం రోజుల పాటు ప్రత్యేక పూజలు చేయనున్నారు.

బొబ్బిలి
●బొబ్బిలి ●రాజాం ●గజపతినగరం ●చీపురుపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి- 80085 74348

?: రాజాం పట్టణంలోని పొనుగుటివలస వార్డు పరిధి రాజాం- సంతకవిటి ప్రధాన రహదారి పక్కన చెత్త పేరుకుపోయింది. దోమలతో ఇబ్బంది పడుతున్నాం.- **స్థానికులు** ★ వ్యర్థాలు తొలగింపజేస్తాం. - **ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్** – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

?: మర్రివలసలో కాలువల్లో తుప్పలు పెరిగాయి. వర్షం వస్తే నీరు వీధుల్లో ప్రవహిస్తుంది. - **స్థానికులు** ★ చర్యలు తీసుకుంటాం. - **రమేష్, ఏఈ** – రామభద్రపురం

?: ఉద్దవోలులోని పలు వీధి కాలువలు పూడికలతో నిండిపోయాయి. దుర్వాసన, దోమల బెడద అధికంగా ఉంది. - **యువత** ★ పూడికలు తొలగించాలని కార్యదర్శిని ఆదేశించాం. - **ఆర్.నీలిమ, డిప్యూటీ ఎంపీడీవో** – తెర్లాం

?: పెదమజ్జిపాలెం సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన బోరును పలువురు సొంత అవసరాలకు దుర్వినియోగం చేస్తున్నారు. - **స్థానికులు** ★ పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. - **విజయ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో** – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

వేణుగోపాలుడికి ప్రత్యేక పూజలు

బొబ్బిలి, న్యూస్‌టుడే: ధనుర్మాసం సందర్భంగా ఆదివారం బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. వేణుగోపాలుడు ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. పెద్ద సంఖ్యలో తరలివచ్చి, పూజలు చేశారు.

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో ఆదివారం కూరగాయల ధరలు (కి.లో రూ.లలో) ★ టమాటా: 55 ★ వంకాయలు: 40 ★ దొండ: 40 ★ బీర: 60 ★ బెండ: 60 ★ కాకర: 50 ★ చిక్కుడు: 50 ★ ఆనపకాయ (ఒకటి): 30 ★ అరటి (జత): 20 ★ మునగ: 100 ★ ఉల్లి: 35 ★ బంగాళదుంపలు: 25 ★ అల్లం: 80 ★ వెల్లుల్లి: 120 ★ పచ్చిమిర్చి: 70 ★ క్యాబేజీ: 30/40– రాజాం, న్యూస్‌టుడే

తెరపై ఈనాడు

❖ ఎస్‌వీసీ సీతారామా: **శంబాల** ❖ ఎస్‌వీసీ సీతారామా మినీ: **ఛాంపియన్** ❖ ఎస్‌వీసీ అప్సర: **అఖండ-2** – న్యూస్‌టుడే, రాజాం

బొబ్బిలి.. ❖ లక్ష్మీ థియేటర్: **ఛాంపియన్** ❖ వాసవి: **ఈషా** ❖ టీవీఆర్ స్క్రీన్-1: **అఖండ- 2** ❖ టీవీఆర్ స్క్రీన్–2: **అనకొండ** – న్యూస్‌టుడే, బొబ్బిలి

అంగన్‌వాడీ.. అరకొర వసతులే నండీ

న్యూస్‌టుడే– గరివిడి

చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంరక్షణే లక్ష్యంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాల సమస్య వెంటాడుతోంది. పౌష్టికాహారం, ఆటపాటలతో చదువును అందించేందుకు ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రభుత్వాలు చెబుతున్నా.. పక్కా భవనాలపై దృష్టి సారించకపోవడంతో మహిళలు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు.

చీపురుపల్లి మండలంలో 49, గరివిడిలో 33, మెరకముడిదాంలో 46, గుర్లలో 33 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. పలుచోట్ల మరుగుదొడ్ల సదుపాయం లేక చిన్నారులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఆరుబయటకు వెళ్తున్నారు. ఇరుకుగదుల్లో గాలి, వెలుతురు లేక ఇబ్బందులు పడుతున్నారు.

గుర్ల మండలం గోషాడలో నిలిచిపోయిన అంగన్‌వాడీ నిర్మాణం

అసంపూర్తిగా పనులు..

కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని ఉపాధి హామీ పథకంలో ఫేజ్-1 కింద 84 భవనాలు మంజూరు చేయగా.. 42 మాత్రమే పూర్తయ్యాయి. 34 అసంపూర్తిగా నిలిచిపోయాయి. 8 పనులు ప్రారంభం కాలేదు. ఫేజ్-2లో 80 మంజూరు కాగా.. 61 పనులు ప్రారంభం కాలేదు. మూడు పూర్తయ్యాయి. 16 అసంపూర్తిగా ఉన్నాయి. చేసినవాటికి బిల్లులు రాకపోవడంతో మధ్యలోనే నిలిపివేస్తున్నారు.

లబ్ధిదారుల వివరాలు ఇలా..: ★ 7 నెలలు నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు: **4,715** మంది ★ 3- 6 ఏళ్ల చిన్నారులు: **2,506** మంది ★ గర్భిణులు: **978** ★ బాలింతలు: **1,034**

సరకులు రావడంలేదు..

గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను నివారించేందుకు బాలసంజీవని, 6 నెలల నుంచి 3 ఏళ్ల లోపు పిల్లలకు బాలామృతం కింద సరకులు అందించాలి. 3 నుంచి 6 ఏళ్ల చిన్నారులకు ప్రీస్కూల్ విద్యను బోధిస్తూ రోజూ కేంద్రంలోనే ఒక కోడిగుడ్డుతో పాటు 100 మి.లీ పాలు, సాంబారు, ఆకుకూర పప్పు, కూరగాయలతో మధ్యాహ్న భోజనం అందించాలి. ఇందుకు సంబంధించిన సరకులు ప్రతినెలా సక్రమంగా సరఫరా కావడంలేదని నిర్వాహకులు వాపోతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం..

బాల సంజీవని కిట్ల సరఫరాలో కొంతవరకు కొరత ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. మిగతా సరకులు సరిపడా వస్తున్నాయి. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి, కొరత లేకుండా చూస్తాం. సొంత భవనాల నిర్మాణాలు పూర్తికి చర్యలు తీసుకోవాలని కోరాం.
– ఆరుద్ర, సీడీపీవో, ఐసీడీఎస్ ప్రాజెక్టు, గరివిడి

★ ఐసీడీఎస్ ప్రాజెక్టులు: **గరివిడి, చీపురుపల్లి** ★ అంగన్‌వాడీ కేంద్రాలు: **352** ★ సొంత భవనాలు ఉన్నవి: **111** ★ ప్రభుత్వ, ఇతర భవనాల్లో ఉన్నవి: **80** ★ అద్దె గదుల్లో: **161**

కోటలో జానపద కళల సందడి

సినీనటుడు షకలక శంకర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి కోట ఆదివారం జానపద కళల ప్రదర్శనలతో మార్మోగింది. ఎమ్మెల్యే బేబినాయన సహకారంతో కళోత్సవం- 2025 నిర్వహించారు. సినీనటుడు షకలక శంకర్, రేలా రే రేలా కళాకారుడు జానకిరాం ఉర్రూతలూగించారు. బాడంగి మండలం జీకేఆర్‌పురానికి చెందిన నీలబోను సత్యం బృందం తప్పెటగుళ్లు, ఆరికతోటకు చెందిన చిన్నారుల లవకుశ నృత్యరూపకం, సీతానగరం మండల జగ్గునాయుడుపేట చిన్నారుల జాలారిబాగోతం ప్రదర్శనలు కట్టిపడేశాయి. బొబ్బిలి మండలం మెట్టవలస చిన్నారుల బుర్రకథ ఆలోచింపజేసింది. బొబ్బిలి మండలం నారసింహునిపేట చిన్నారులు మరాఠీ నృత్యం, చింతాడ చిన్నారులు నృత్య, బిందెల డాన్సులు ప్రదర్శించారు. శంకర్, జానకీరామ్‌లను ఎమ్మెల్యే సత్కరించారు. నిర్వాహకులు కరుణాకరన్, రవిశంకర్‌ను అభినందించారు. వ్యాఖ్యాతగా రచయిత మీసాల చినగౌరునాయుడు వ్యవహరించారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు.. రామభద్రపురం: నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రామభద్రపురం, నాయుడువలస గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సత్యనారాయణ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రహదారి చింత తీరింది

సంతకవిటి: సంతకవిటి మండలం కావలి, పొందూరు మండలం తాడివలస గ్రామాల మధ్య రోడ్డు గుంతలతో అధ్వానంగా ఉండేది. చోదకులకు నరకప్రాయంగా మారింది. దీనిపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. ప్రభుత్వం స్పందించి రూ.56 లక్షలు మంజూరు చేయడంతో కొత్త రోడ్డు నిర్మించారు.

రైతులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి మండలం కలవరాయి, కోమటిపల్లి, కృష్ణాపురం గ్రామాల్లోని ధాన్యం మిల్లులను తహసీల్దారు శ్రీను, సీఎస్‌డీటీ సాయికృష్ణ తనిఖీ చేశారు. 'అయిదు రోజులుగా ఇదే వరుస' శీర్షికతో ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించారు. ట్రాక్టర్లు బారులు తీరడంపై ఆరా తీశారు. మిల్లు యజమానితో మాట్లాడారు. వచ్చిన వెంటనే అన్‌లోడ్ చేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కల్వర్టులతో కలవరం..!

బొబ్బిలి ర.భ.శాఖ డివిజన్ పరిధిలోని పలు కల్వర్టులు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి. కల్వర్టులు పాడైనచోట ప్రమాదాలు జరుగుతున్నాయి. అంచున గోడలు కట్టి వదిలేశారు. మరికొన్ని గోడల వద్ద స్టాపర్లు పెట్టారు. రామభద్రపురం నుంచి రాయగడ వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిపై బొబ్బిలి- రామభద్రపురం మధ్య పలుచోట్ల గోడలు కట్టారు. వాటిని ఢీకొని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల జీసీఆర్‌పురం వద్ద ఓ లారీ గోడను ఢీకొని ప్రమాదానికి గురైంది. గతంలో ఓ వ్యాన్ అలానే ఢీకొట్టింది. పండగ రోజులు కావడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇరువైపులా రేడియం స్టిక్కర్లైనా అతికిస్తే కొంతవరకు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందంటున్నారు. ఇటీవల రహదారి మరమ్మతులకు రూ.4.50 కోట్లు మంజూరైనా.. కల్వర్టుల పనులు చేపట్టలేదు. అంచనాలు తయారు చేసి నివేదించామని ర.భ.శాఖ ఏఈ అప్పలరాజు అన్నారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి

ధర్మ పరిరక్షణకు కృషి

వంగర, న్యూస్‌టుడే: ప్రతి హిందువు భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు కృషి చేయాలని తెర్లాం మండలం బూర్జివలస గీతాశ్రమానికి చెందిన స్వామీ తారకానందభారతీ, శివ స్వామీజీ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం వంగర మండలం అరసాడలో హిందూ ధర్మ సమ్మేళనం జరిగింది. హిందూ ధర్మం ప్రపంచ దేశాల్లో గొప్పదని, దాని పరిరక్షణకు అందరూ పాటుపడాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సేవా ప్రముఖ్ శ్రీకాంత్ శ్రీనివాస్, జి.శ్రీనివాసరావు, ఎల్.కృష్ణమూర్తి తదితరులు సత్కరించారు ★ రాజాం గ్రామీణం: సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బూర్జివలస గీతాశ్రమం స్వామీజీలు విసుద్ధనంద, భారతీ స్వామి అన్నారు. కంచరాం గ్రామంలో జరిగిన హిందూ సమ్మేళన మహాసభలో మాట్లాడారు. హిందూ సమ్మేళన జెండాను ఆవిష్కరించి, గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు.

కళావైభవంలో బొబ్బిలివాసులు

బొబ్బిలి, న్యూస్‌టుడే: భారత్ ఆర్ట్స్ అకాడమి శనివారం సాయంత్రం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన 'కూచిపూడి- 2 కళావైభవం'లో బొబ్బిలి కళాకారులు ప్రతిభ కనబర్చారు. కూచిపూడి మహాబృంద నాట్య ప్రదర్శనలో పది దేశాలు, పలు రాష్ట్రాల నుంచి 7,209 మంది కళాకారులు పాల్గొన్నారు. ఇందులో బొబ్బిలికి చెందిన ఎ.గౌరునాయుడు, పి.నమస్తని, ఎంబీపీ మాధురి, ఎం.మానస వీణ పాల్గొన్నారు. మొత్తం బృందం గంట సేపు ఆపకుండా ప్రదర్శన ఇచ్చి, గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైనట్లు నాటాచార్య ఆమ్రపాలి సంగీత నాట్యకళాసమితి నిర్వాహకుడు కోన రవి తెలిపారు.

రూ.లక్షల వ్యయం.. నిరుపయోగం

గత తెదేపా హయాంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ మరుగుదొడ్లు మంజూరుచేశారు. స్థలం లేనివారి కోసం సామూహికంగా ఓ చోట ఏర్పాటుచేశారు. ఒక్కో దానికి రూ.6 లక్షలు కేటాయించి, నిర్మాణాలు పూర్తిచేశారు. గొర్లెసీతారాంపురం, శివడవలస, మెట్టవలస, పిరిడి, ఎం.బూర్జివలస గ్రామాల్లో వీటిని నిర్మించారు. వినియోగించకపోవడంతో చుట్టూ తుప్పలు పెరిగాయి. పరిశీలించి, వినియోగంలోకి తీసుకొస్తామని డీఈ ఢిల్లేశ్వరరావు తెలిపారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

వాహనాలు మూలకు.. చెత్త రోడ్డుపైకి

రేగిడి మండలం సోమరాజుపేట గ్రామంలో చెత్త సేకరణ వాహనాలు మూలన మూలుగుతున్నాయి. మరమ్మతులకు గురవ్వడంతో వినియోగంలో లేవు. దీంతో గ్రామంలో చెత్త కుప్పలుగా పేరుకుపోతోందని, అనారోగ్యాల బారిన పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు బాగు చేసి, వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. సమస్యను ఎంపీడీవో శ్యామలాకుమారి వద్ద ప్రస్తావించగా.. చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, రేగిడి

మురుగు నిలిచి.. రోగం తెచ్చి



రాజాం పట్టణంలోని ఆదర్శనగర్ వార్డు పరిధిలోని రాజాం- గోపాలపురం ప్రధాన రహదారి పక్కన మురుగు నిల్వ ఉంటోంది. స్థానికులు సమస్యలతో సతమతమవుతున్నారు. కాలువలు లేకపోవడంతో వాడుకనీరంతా ఇక్కడే నిలిచిపోతోంది. దీని మీదుగా గోపాలపురం, కొత్తవలస గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దోమలతో అనారోగ్యాల బారిన పడుతున్నామని, దుర్వాసన భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు నిర్మించాలని కోరుతున్నారు. సమస్యను కమిషనర్ రామచంద్రరావు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

దివ్యాంగుల వనరుల కేంద్రానికి బీరువా వితరణ

బాడంగి, న్యూస్‌టుడే: రామభద్రపురానికి చెందిన ఉపాధ్యాయుడు కర్రి శ్రీనివాసరావు బాడంగిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉన్న దివ్యాంగుల వనరుల కేంద్రానికి రూ.15 వేలు విలువైన బీరువాను ఆదివారం అందజేశారు. ఆయనకు ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

అర్చక సంఘం ఉపాధ్యక్షుడి ఎన్నిక

గంట్యాడ, న్యూస్‌టుడే: అర్చక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా తాటిపూడి పురోహితుడు దంతుకుర్తి సాయికుమార్ శర్మ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం కే.కోటపాడులో ఎన్నిక జరిగింది. అర్చక సంఘ రాష్ట్ర నాయకుడు వేమూరి ఆనంద సూర్య, అధ్యక్షుడు డి.రామశాస్త్రి ఆధ్వర్యంలో బాధ్యతలు చేపట్టారు.

రతన్‌టాటాకు నివాళి

గరివిడి, న్యూస్‌టుడే: ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్ టాటా జయంతిని ఆదివారం గరివిడిలో సహాయ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు నిర్వహించారు. స్థానికంగా ఓ కన్వెన్షన్ ప్రాంగణంలో ఉన్న రతన్‌టాటా విగ్రహానికి జడ్పీటీసీ సభ్యుడు వి.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. సభ్యులు బి.కార్తిక్, ఎస్.కాంతారావు, బి.సీతారాం, తెలుగు ఉపన్యాసకుడు ఆర్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

రేగిడి, న్యూస్‌టుడే: మండలంలోని అంబాడ పంచాయతీ పరిధిలోని వెంకటాపురంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య ఆదివారం ఆవిష్కరించారు. సర్పంచి సీహెచ్ వెంకటనాయుడు, జిల్లా విజిలెన్స్, మోనటరింగ్ సభ్యుడు ఎమ్.గణపతి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిరావు కుటుంబానికి పరామర్శ

రామభద్రపురం, న్యూస్‌టుడే: బూసాయవలస గ్రామానికి చెందిన సాలూరు సమితి మాజీ అధ్యక్షుడు గంట తిరుపతిరావు ఇటీవల మృతిచెందారు. ఆదివారం మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, ఎమ్మెల్యే బేబినాయన, తెదేపా నాయకులు చింతల రామకృష్ణ, మడక తిరుపతిరావు తదితరులు తిరుపతిరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

గొర్రె పందేలు నిర్వాహకుల అరెస్టు

బాడంగి, న్యూస్‌టుడే: బాడంగి మండలం పాల్తేరు గ్రామ శివారులో ఆదివారం గొర్రె పందేలు నిర్వహిస్తున్న ఏడుగురిపై కేసులు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు ఎస్సై తారకేశ్వరరావు తెలిపారు. వారి వద్ద రెండు గొర్రె పోతులు, రూ.23,160 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా గొర్రె, కోడి పందేలు, జూదం వంటివి ఆడినా, నిర్వహించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాడంగిలో వరుస అగ్ని ప్రమాదాలు

బాడంగి, న్యూస్‌టుడే: బాడంగి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం తెర్లి అప్పలస్వామికి చెందిన గడ్డివాము దగ్ధమైంది. ఇదే ప్రదేశంలో శనివారం సాయంత్రమూ ఒక గడ్డివాము దగ్ధమైంది. ఆకతాయిలు సిగరెట్ కాల్చి పడివేయడంతో ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని అగ్నిమాపక శాఖ అధికారి రామసూర్యరావు తెలిపారు.

ఆఖరి మజిలీకీ అవస్థలే..!

రాజాం పట్టణం పరిధి బుచ్చింపేట వార్డులోని శ్మశానవాటిక నిర్మాణం గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. పునాదుల వరకు పనులు చేసి, నిలిపివేశారు. దారి మధ్యలో కల్వర్టు లేకపోవడంతో వర్షం సమయంలో మోకాలు లోతు వరకు నీరు నిలిచిపోతుంది. ఆ సమయంలో మృతుల బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. చర్యలు తీసుకుంటామని కమిషనర్ రామచంద్రరావు అన్నారు. – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

కుళాయి.. ఇదేమి తీరోయి..!

గంట్యాడ మండలం గింజేరులో అంగన్‌వాడీ కేంద్రానికి ఏర్పాటుచేసిన తాగునీటి కుళాయి గోతిలో ఉంది. నీరు పట్టుకునేందుకు అవకాశంలేక సమీపంలోని నేలబావులు, బోర్ల నుంచి నీటిని తెచ్చుకొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విషయం గంట్యాడ ఐసీడీఎస్ పీవో ఉమాభారతి వద్ద ప్రస్తావించగా.. తక్షణమే సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

సత్యనారాయణను సత్కరిస్తున్న సభ్యులు

గరివిడి, న్యూస్‌టుడే: పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆదివారం గరివిడి ప్రగతినగర్‌లో ఆవిష్కరించారు. యూటీఎఫ్ గరివిడి మండల శాఖ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఐ.సత్యనారాయణను సంఘం సభ్యులు సత్కరించారు. సంఘ జిల్లా శాఖ అధ్యక్షుడు బి.అప్పారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.బంగార్రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఆనందరావు, సీహెచ్ పైడితల్లి పాల్గొన్నారు.

'అమెరికాలో అరంగేట్రం' పుస్తకావిష్కరణ



రాజాం, న్యూస్‌టుడే: రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం రచించిన 'అమెరికాలో అరంగేట్రం' పుస్తకాన్ని విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ హాలులో నిర్వహించిన 'శ్రమకవనం' వేదికపై ఆదివారం ఆవిష్కరించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తెలకపల్లి రవి, కార్యదర్శి సీహెచ్.దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలు తొలగేలా.. పరిశుభ్రత పెరిగేలా

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చెత్త రహిత గ్రామ పంచాయతీలే లక్ష్యంగా పంచాయతీరాజ్ శాఖ పది రోజుల ప్రణాళికతో పంచాయతీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. వచ్చే నెల 5న నిర్వహించే ప్రత్యేక గ్రామసభల్లో ఆయా గ్రామ పంచాయతీలను చెత్తరహిత పంచాయతీలుగా ప్రకటించేలా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీనిలో భాగంగా చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని గ్రామ పంచాయతీల్లో ఎంపీడీవో స్థాయి నుంచి పంచాయతీ కార్యదర్శి వరకు ప్రతిరోజు పర్యటించి, పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్నారు.

రామలింగాపురంలో చెత్త సేకరణ

ఇదీ ప్రణాళిక..

ఈ నెల 26 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు అన్ని పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టేలా గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ ఆదేశాలిచ్చింది. దీనిలో భాగంగా రోజువారి వ్యర్థాలను సేకరించి తడి, పొడి చెత్తను వేరు చేయాలి. దాన్ని సమీపంలోని సంపద తయారీ కేంద్రాలకు తరలించి ప్రోసెస్ చేయాలి. చెత్త సంపద తయారీ కేంద్రాల్లో తయారైన సేంద్రియ ఎరువును 50:50 నిష్పత్తిలో గ్రామ పంచాయతీ, రైతులు వినియోగించుకునేలా ఒప్పందం చేసుకోవాలి.

సిబ్బందికి ఆదేశాలిచ్చాం..

సబ్ డివిజన్ పరిధిలో ఎనిమిది మండలాల్లో ఆయా గ్రామ పంచాయతీలను చెత్త రహిత పంచాయతీలుగా ప్రకటించేందుకు క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలిచ్చాం. సేంద్రియ ఎరువు తయారీకి దూరంగా ఉన్న కేంద్రాలను అందుబాటులోకి తెస్తాం. సబ్ డివిజన్ పరిధిలో 243 గ్రామ పంచాయతీలు ఉండగా.. 173 గ్రామాల్లో చెత్త సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. మొత్తంగా 542 మంది హరిత రాయబారులు పనిచేస్తున్నారు.
– కె.హేమసుందర్, డీడీవో

మర్యాదపూర్వక కలయిక

బొబ్బిలి, న్యూస్‌టుడే: తెదేపా అరకు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షురాలిగా ఇటీవల నియమితులైన ఎం.తేజోవతి ఆదివారం బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబినాయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలని శాఖా గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం గంట్యాడ శాఖాగ్రంథాలయం ఆధ్వర్యంలో 'చదవడం మాకిష్టం' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు సెలవుల్లో గ్రంథాలయాల్లోని పుస్తకాలను వినియోగించుకోవాలన్నారు.

చెత్తకు నిప్పు.. ఆరోగ్యానికి ముప్పు

బొండపల్లి, న్యూస్‌టుడే: దేవుపల్లిలో సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించకుండా రహదారి పక్కన పడేసి నిప్పు పెడుతున్నారు. దీంతో దట్టంగా పొగ అలుముకుని, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కనిమెరక రహదారి పక్కన ఇలానే చేస్తున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ఎంపీడీవో రఘుపతిరావు చెప్పారు.

ఉపాధ్యాయుడికి పురస్కారం

పురస్కారం ప్రదానం చేస్తున్న జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు

రాజాం, గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయిలో ఉత్తమ భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు ఇచ్చే సర్ సీవీ రామన్- మేడమ్ క్యూరీ పురస్కారానికి రాజాం మండలం కంచరాం ఉన్నత పాఠశాలకు చెందిన పండూరు వేణుగోపాల్ ఎంపికయ్యారు. గుంటూరులో కేవీఆర్, జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. హెచ్‌ఎం పి.వసంతకుమార్, ఏపీటీఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.మదన్‌మోహన్ తదితరులు అభినందించారు.

సాగునీరు అందక అవస్థలు

బొండపల్లి మండలం దేవుపల్లి, చినతామరాపల్లి, బీరాజేరు, గొల్లుపాలెం గ్రామాల పంట పొలాలకు ఆంధ్ర జలాశయం నుంచి ఎంఎన్ ఛానల్ ద్వారా సాగునీరు అందజేయాల్సి ఉంది. దేవుపల్లి ఘనరాజు సాగునీటి కాలువ పూడిపోవడంతో కాలువ స్థలాన్ని కొందరు ఆక్రమించారు. దీంతో నీరు సక్రమంగా రాక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కాలువల్లోని ఆక్రమణలపై దృష్టిసారించి, పూడిక తొలగించాలని కోరుతున్నారు. విషయం ఏఈ ఏ.సూరీడు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, బొండపల్లి

గోదాము ప్రారంభించేదెన్నడో?

మెంటాడలో ఏడాది కిందట నాబార్డు సహాయంతో నిర్మించిన బహుళ ప్రయోజన గోదాము ఏడాది కిందట పూర్తయింది. నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. తుపానులు, వర్షాకాలాల్లో పంటను భద్రపర్చేందుకు, గిట్టుబాటు ధర వచ్చేంతవరకు రైతులకు అద్దెకు ఇచ్చేందుకు రూ.40 లక్షల అంచనా వ్యయంతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించారు. వెంటనే వినియోగంలోకి తీసుకొంచేందుకు చర్యలు తీసుకుంటామని మెంటాడ పీఏసీఎస్ సీఈవో ప్రసాద్ అన్నారు. – న్యూస్‌టుడే, మెంటాడ

(c) eenadu

?: మూడులాంతర్లు సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దోమల సమస్య ఎక్కువైంది. - **స్థానికులు** ★ సిబ్బందిని పంపించి తొలగిస్తాం. - **నల్లనయ్య, కమిషనర్** – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

?: దుప్పాడ శివారు ప్రాంతాల్లో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. - **స్థానికులు** ★ పరిశీలించి, బాగు చేస్తాం. - **శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ** – న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
విజయనగరం పట్టణం- 80089 02900
విజయనగరం గ్రామీణం-80085 74317
ఎస్.కో - 80085 74326
భోగాపురం - 70959 54646

తెరపై ఈనాడు

★ ఎన్సీఎస్: **ఛాంపియన్** ★ శ్రీకృష్ణ: **ఈషా** ★ ఆదిత్య: **దండోరా** ★ లీలామహల్: **వృషభం** ★ రంజనీ స్క్రీన్- 1: **ఛాంపియన్, అవతార్** ★ శివరంజనీ స్క్రీన్-2: **వృషభం, అఖండ 2, అనకొండ** ★ హిమగిరి : **శంబాల** ★ సప్తగిరి: **అఖండ 2**
– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

విజయనగరం

● విజయనగరం ● నెల్లిమర్ల ● ఎస్.కోట

రబీ సాగుకు సమస్యలా.. ఇదిగో పరిష్కార మార్గం

ఈనాడు ఫోన్ ఇన్ కార్యక్రమం

రబీ సీజన్‌లో నెల్లిమర్ల మండలం పరిధిలోని గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా..? అన్నదాత సుఖీభవ, రబీ సీజన్‌లో పంటల సమస్యలు, మొక్కజొన్న సాగులో పాటించాల్సిన పద్ధతులు.. సకాలంలో యూరియా అందడం లేదా? ఇతర సమస్యలుంటే మండల వ్యవసాయాధికారిణి శ్రీలక్ష్మి దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని 'ఈనాడు' మీకు కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా ఫోన్ చేయడమే. – న్యూస్‌టుడే, నెల్లిమర్ల

★ తేదీ: 30.12.25(మంగళవారం) ★ సమయం: ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు..

★ ఫోన్ నంబర్: 83310 56304

హిందువులంతా ఐకమత్యంగా ఉండాలి

మాట్లాడుతున్న రెవెన్యూ శాఖ విశ్రాంత అధికారి గణపతిరావు

జామి, న్యూస్‌టుడే: హిందూ సంప్రదాయం గొప్పదని, హిందువులంతా ఐకమత్యంగా ఉండి రక్షించుకోవాలని రెవెన్యూ శాఖ విశ్రాంత అధికారి ఎం.గణపతిరావు అన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భీమసింగి వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళనంలో మాట్లాడారు. అతిథిగా నిత్యదైవ నామస్మరణ సమితి వ్యవస్థాపకుడు నారాయణ స్వామిజీ హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వడలి విశ్వనాథం, హిందూ సమ్మేళనం అధ్యక్ష, ఉపాధ్యక్షులు సారిక గౌరినాయుడు, హరికృష్ణ, జిల్లా ధర్మప్రచారక్ భవానీ ప్రసాద్, మండల కన్వీనర్ ఎం.జనార్దనరావు, ఎస్ఎస్ఎఫ్ గౌరవ అధ్యక్షుడు బి.అప్పలరాజు పాల్గొన్నారు. * **ఎస్.కోట:** భర్తాపురంలో జరిగిన కార్యక్రమంలో బొడ్డవర యూపీ పాఠశాల హెచ్ఎం ఇ.అశోక్‌రాజు దిశానిర్దేశం చేశారు. ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు ఎ.సూరప్పారావు, ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు తిరుపతిరావు, వేంకటేశ్వర ఆలయ ధర్మకర్త జయవిష్ణు, ఎస్ఎస్ఎఫ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యువతదే దేశ భవిత

కంటోన్మెంట్: యువతే దేశ భవిష్యత్తని ఎస్‌బీఐ కార్మిక సంఘం సహాయ ముఖ్య కార్యదర్శి నాగుల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం విజయభావన 557వ సాహిత్యసభ స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగింది. గోపాలరావు, సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

త్వరపడండి.. సాకారం చేసుకోండి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే

ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం), బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం) ద్వారా చట్టబద్ధంగా ప్రజలు సొంతింటి కల సాకారానికి చర్యలు చేపడుతోంది. ఎల్ఆర్ఎస్‌కు వచ్చే నెల 23, బీపీఎస్‌కు వచ్చే ఏడాది మార్చి 11తో గడువు ముగియనుంది. ఈ మేరకు నగరవాసులు వెంటనే పూర్తి చేసుకునేందుకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

చట్టబద్ధ గుర్తింపు..

క్రమబద్ధీకరణ ద్వారా చట్టబద్ధ గుర్తింపు కలుగుతుంది. భవన నిర్మాణ అనుమతుల సమయంలో 14శాతం ఓపెన్ స్పేస్, బెటర్మెంట్ ఛార్జీలు చెల్లించక్కర్లేదు. ఆస్తి విలువ పెరుగుతుంది. సులువుగా బ్యాంకు రుణం పొందవచ్చు. 2025 జూన్ 30 లోపు రిజిస్ట్రేషన్ జరిగిన ప్లాటుదారులు దరఖాస్తు చేసుకోవాలి. ఎల్ఆర్ఎస్‌కు 2020లో 609 దరఖాస్తులు రాగా 417కి అనుమతిచ్చారు. 101 తిరస్కరించారు. షార్ట్‌ఫాల్ కింద 48 మందికి నోటీసులు ఇచ్చారు. 43 పెండింగ్‌లో ఉన్నాయి. అపరాధ రుసుము రూ.10.71 కోట్లు వసూలైంది. ఈ సారి 242 దరఖాస్తులు రాగా 12కు మాత్రమే అనుమతిచ్చారు. రెండు తిరస్కరించగా, షార్ట్‌ఫాల్ కింద 90 మందికి నోటీసులిచ్చారు. 14 మందికి డబ్బులు చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. అపరాధ రుసుము రూ.1.04 కోట్లు వసూలు చేయగా, పెండింగ్‌లో 124 ఉన్నాయన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సొంతింటి కోసం ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తులు

సద్వినియోగం చేసుకోవాలి

ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. వీటిపై అవగాహనకు విస్తృత ప్రచారం చేశాం. త్వరలో వీటి గడువు ముగియనుంది.
– పి.నల్లనయ్య, కమిషనర్, నగర పాలక సంస్థ

పేదలకు ఉపయోగం..

అనుమతుల్లేని, ప్లాన్‌కి విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలకు బీపీఎస్ తప్పనిసరి. 1985 జనవరి నుంచి 2025 ఆగస్టు 31 మధ్య కట్టిన నిర్మాణాలకు ఇది వర్తిస్తుంది. ఇప్పటివరకు రూ.10 వేల రుసుము చెల్లించి 218 మంది దరఖాస్తు చేసుకున్నారు. 1997 డిసెంబర్‌లోపు ఉన్నవారికి 25 శాతం, మురికివాడల్లోని వారికి 50 శాతం తగ్గింపు ఉంటుంది. 2019లో బీపీఎస్‌కు 1,198 దరఖాస్తులు రాగా 1,182 పరిష్కరించారు. రూ.10.97 కోట్లు అపరాధ రుసుం వసూలు చేశారు. 16 దరఖాస్తులు తిరస్కరించారు. బ్యాంకు రుణాలు పొందవచ్చు. ఇంటి పన్నుపై పెనాల్టీ తగ్గుతుంది. అమ్మకాలు చేసుకోవచ్చు. మార్టుగేజ్ రిలీజు చేస్తారు. గత ఐదేళ్లలో ప్లాన్ ఉల్లంఘనలు, అనుమతులు లేని నిర్మాణాలు జోరుగానే సాగాయి. ఈ లెక్కన ఆదాయం ఎక్కువ వచ్చే అవకాశం ఉంది.

వేణుగోపాలుడికి విరుల సోయగం

జామి, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేణుగోపాలస్వామి, గోదాదేవి అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పల్లకీలో గోదాదేవిని వీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నగరంలో ఈనాడు

★ ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు కలెక్టరేట్, నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక ★ కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటలకు రెవెన్యూ క్లినిక్‌ల నిర్వహణ ★ తహసీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ క్లినిక్‌ల నిర్వహణ ★ ఉదయం 10.30 గంటల నుంచి ఎస్పీ కార్యాలయంలో పీజీఆర్ఎస్
– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

పునాదులకే పరిమితం

విజయనగరం మండలం బియ్యాలపేటలో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు పునాదులకే పరిమితమయ్యాయి. మూడున్నర సంవత్సరాలుగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. స్థానికులు వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్తున్నారు. అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ సమస్యపై ఇన్‌ఛార్జి ఎంపీడీవో మోహన్ కుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. మండల సర్వసభ్య సమావేశంలో చర్చించి, పనుల వేగవంతానికి చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

రైలింగ్ శిథిలం.. ప్రమాదం ఖాయం

ఎల్.కోట మండలంలోని వీరభద్రపేట గ్రామంలోకి వెళ్లే మార్గంలో గెడ్డపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెన పైభాగంలో రెండువైపులా నిర్మించిన రక్షణ గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం ఆదమరిచినా గెడ్డలోకి పడిపోయే ప్రమాదం ఉంది. దీనిపై ఆర్.అండ్.బి. శాఖ ఇంజినీరింగ్ అధికారిణి ఎల్లమ్మను వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.
– న్యూస్‌టుడే, లక్కవరపుకోట

పైపులైన్ నిర్మాణంపై రైతుల ఆందోళన

నిరసన తెలుపుతున్న పూసపాటిరేగ రైతులు

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: మండలంలోని కొప్పెర్ల పంచాయతీ కొత్త కాలనీ వెళ్లే రహదారి పక్కన చేపట్టిన పైపులైన్ నిర్మాణంపై పూసపాటిరేగకు చెందిన రైతులు ఆందోళనకు దిగారు. దీనివల్ల కుమిలి కాలువ నీరు సక్రమంగా ప్రవహించక పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో దీనిపై ఉన్న కల్వర్టును తొలగించేశారని, ఇప్పుడు తక్కువ వెడల్పుతో ఏర్పాటు చేస్తుండడంతో ముప్పు తప్పదన్నారు. దీన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. స్పందించిన పంచాయతీ ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు వెనుదిరిగారు.

మహాసభల విజయవంతానికి పిలుపు

మయూరి కూడలి, ఎస్.కోట, న్యూస్‌టుడే: అన్నివర్గాల వారికీ సీఐటీయూ అండగా నిలుస్తోందని సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వి.రమణ అన్నారు. ఆదివారం విజయనగరంలోని కోట కూడలి నుంచి ఎంజీరోడ్డు, గంటస్తంభం కూడలి వరకు కార్మికులు, నాయకులతో ర్యాలీ చేపట్టారు. మహిళలు కోలాట ప్రదర్శనలతో విప్లవ గీతాలు పాడారు. రమణ మాట్లాడుతూ వచ్చే నెలలో జరిగే సిటూ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. జగన్మోహన్‌రావు, పి.రమణమ్మ, అనసూయ పాల్గొన్నారు. ఎస్.కోటలో జిల్లా కార్యదర్శి ఎం.రమణ ప్రచార జాతాను ప్రారంభించారు. నాయకులు జగన్, ముత్యాలు, నీలిమ, నాని, పి.సత్యమ్మ, వై.అప్పలకొండ, మహేష్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల(డెంకాడ), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో మరింత అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. ఆదివారం అకులపేట గ్రామంలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సీసీ కాలువ నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి పెద్దపీట వేశామని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జనసేన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం.. మార్కెట్ నిరుపయోగం

వ్యాపారుల ఇక్కట్లు

మార్కెట్‌లో శిథిలమైన షెడ్లు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే

నియోజకవర్గ కేంద్రం శృంగవరపుకోట పట్టణంలో పంచాయతీ కార్యాలయం సమీపంలోని ప్రకాశం మార్కెట్ వినియోగంలో లేక శిథిలావస్థకు చేరుకుంటోంది. 20 ఏళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం గ్రామీణ మాల్స్ పేరుతో నిధులు మంజూరు చేయడంతో దీన్ని నిర్మించారు. మొదట్లో రోజూ వ్యాపారాలు సాగేవి. క్రమేణా వారపు సంతగా మారిపోయింది. కరోనా కారణంగా వ్యాపారాలు ఆగిపోయాయి. తర్వాత దీన్ని వినియోగించడం మానేశారు. నిర్వహణ లేక ఇక్కడ నిర్మించిన షెడ్ల కిటికీలు పాడయ్యాయి. రేకులు తుప్పు పట్టాయి. స్తంభాలు, గోడలు బీటలు వారుతున్నాయి. కూలిపోయేలా ఉన్నాయి. అటువైపు వెళ్లేందుకు వ్యాపారులు భయాందోళన చెందుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు విమర్శిస్తున్నారు.

పాతబస్టాండు కూడలిలో రద్దీ..

బజారు లేకపోవడంతో పాతబస్టాండు కూడలిలో గ్రామీణ ప్రాంత రైతులు కూరగాయలు తీసుకొచ్చి విక్రయాలు జరుపుతున్నారు. ఎక్కువ మంది ప్రజలు వస్తుండడంతో రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారు. రద్దీ పెరిగి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆనుకొని ఉన్న మాంసం దుకాణాల వల్ల దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వీటిని తరలించాలని కోరుతున్నారు. ఈ మేరకు మార్కెట్ బాగు చేసి ఇక్కడి దుకాణాలను అక్కడికి తరలిస్తే సమస్యలు పరిష్కారమవుతాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ ఈవో చంద్రశేఖర్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా కార్యవర్గంతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.

సంఘం అభివృద్ధికి కృషి

మయూరి కూడలి: భట్రాజు సంక్షేమ సంఘ అభివృద్ధికి అన్నివిధాలా కృషి చేస్తామని అధ్యక్షుడు హరినాథ్ రాజు అన్నారు. ఆదివారం విజయనగరంలో జరిగిన ఉత్తరాంధ్ర సమైక్య కమిటీ సభ్యుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యక్షుడు సతీష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు నారీ- భేరి

కంటోన్మెంట్: పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు జయంత్యుత్సవాలను పురస్కరించుకుని సోమవారం విజయనగరంలో 'నారీ భేరి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు భాగ్యలక్ష్మి, రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు.

30న మెగా ఉద్యోగ మేళా

జామి, న్యూస్‌టుడే: మండలంలోని భీమసింగి బాలాజీ జూనియర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 30న మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంతకుమార్, కరస్పాండెంట్ కొత్తలి సూర్యారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 -35 వయసున్న పది, ఇంటర్, ఐ.టి.ఐ., డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ ఉత్తీర్ణత పొందినవారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 96187 92572, 99888 53335ను సంప్రదించగలరు.

చెత్తకుండీల ఏర్పాటు

ఎస్.కోట: పట్టణంలో రెడ్‌క్రాస్ సొసైటీ సబ్ యూనిట్ బ్రాంచి ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాన కూడళ్లలో చెత్తకుండీలు ఏర్పాటు చేసినట్లు సొసైటీ ఛైర్మన్ డాక్టర్ పి.వరలక్ష్మి తెలిపారు. వైస్ ఛైర్మన్ ఎ.మల్లేశ్వరరావు, జిల్లా ఎంసీ సభ్యుడు సూర్యారావు, కోశాధికారి వెంకన్నబాబు, కార్యదర్శి జి.ధనంజయ్, గోవిందరావు, లైఫ్ మెంబర్లు డాక్టరు గణేష్, డాక్టరు మౌనిక, శ్రీనివాస్ హాజరయ్యారు.

ఉత్తర్వులు అందిన వెంటనే భూముల్లోకి వెళ్తాం

శృంగవరపుకోట: హైకోర్టు ఉత్తర్వులు అందిన వెంటనే తమ భూముల్లోకి ప్రవేశిస్తామని జిందాల్ నిర్వాసితులు ధీమా వ్యక్తం చేశారు. బొడ్డవరలో నిరసన శిబిరం వద్ద మాట్లాడుతూ 197 రోజులుగా చేస్తున్న సుదీర్ఘ పోరాటం కీలక ఘట్టానికి చేరుకుందన్నారు. విజయం సాధించామని, కోర్టు నుంచి అధికారిక ఉత్తర్వుల కోసం వేచి చూస్తున్నామన్నారు. ఇక్కడ చెట్లు కూల్చిన వారిని శిక్షించాలన్నారు.

రామాలయానికి యువత సాయం

జామి: అట్టాడకు చెందిన యువత జై హనుమాన్ సేవాదళం పేరుతో రామాలయానికి రూ.2లక్షలు విలువైన సోలార్ ప్యానెళ్లు అందించారు. అంతకుముందు చదువుకుని పోటీ పరీక్షలకు సిద్ధమతున్న వారికోసమని శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారు.

రేపు లక్ష తులసి, పుష్పార్చన

లక్కవరపుకోట: కొత్యాడలోని విజయ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం లక్ష తులసి పత్రార్చన, పుష్పార్చన నిర్వహించనున్నామని, భక్తులు తరలి రావాలని ఆలయ ధర్మకర్త కొత్యాడ దేవి మహేష్ కోరారు.

పేదలకు దుప్పట్ల అందజేత

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ పేదలకు అండగా నిలిచింది. ఆదివారం అయ్యన్నపేట నడక మైదానంలో 150 మందికి రూ.30 వేల విలువైన దుప్పట్లను అందించింది. క్లబ్ వ్యవస్థాపకుడు త్యాడ రామకృష్ణారావు, అధ్యక్షుడు సి.హెచ్.రమణ, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ ఎ.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యాపారాలపై దృష్టిసారించాలి

మాట్లాడుతున్న ఉప కులపతి శ్రీనివాసన్

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: యువత వ్యాపారాలు చేయాలని, అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకెళ్లాలని గిరిజన విశ్వవిద్యాలయం ఉప కులపతి శ్రీనివాసన్, ప్రముఖ ఆడిటర్ సోమయాజులు అన్నారు. ఆదివారం విజయనగరంలోని ఇన్‌స్పైరో పాఠశాలలో బిజినెస్ బై బ్రాహ్మిన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయనగరం చాప్టర్ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవి కె.మందా, కార్యదర్శిగా దూసి రాజేశ్వరరావు, అయిదుగురు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విజయనగరంలో అయిదుగురిపై కేసులు

అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని అయ్యన్నపేట గ్రామ శివారు, కలెక్టరేట్ కార్యాలయం, పీజీఆర్ ఆసుపత్రి, ఇతర ప్రాంతాల్లో ఆదివారం డ్రోన్ రైడ్‌లు నిర్వహించినట్లు ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. బహిరంగంగా మద్యం తాగుతున్న అయిదుగురిపై కేసులు పెట్టామన్నారు.

ముక్కోటి ఏకాదశికి బందోబస్తు

ఆలయ కమిటీతో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానంలో ఈనెల 30న ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని ఆలయంలో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహిస్తామని భోగాపురం గ్రామీణ సీఐ జి.రామకృష్ణ అన్నారు. ఆదివారం దేవస్థానాన్ని పరిశీలించారు. గిరి ప్రదక్షిణ, ఉత్తర ద్వార దర్శనాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. సుమారు 60 మంది సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంటుందని వివరించారు. ఎస్సై బి.గణేష్, ఈవో వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ ఎప్పుడూ ప్రజల పక్షమే

విజయనగరం మయూరి కూడలి, న్యూస్‌టుడే: అధికారం ఉన్నా, లేకపోయినా కాంగ్రెస్ ఎప్పుడూ ప్రజల పక్షమేనని డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం విజయనగరంలోని కార్యాలయ ఆవరణలో జెండా ఆవిష్కరించారు. దేశ, రాష్ట్రస్థాయిలో పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు శ్రీనివాసరావు, కరీమ్ తదితరులు పాల్గొన్నారు. * **జరజాపుపేట(నెల్లిమర్ల):** జరజాపుపేటలో మండలాధ్యక్షుడు కనకల పద్మనాభం జెండా ఎగుర వేశారు. అనంతరం నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

జెండా ఆవిష్కరిస్తున్న డీసీసీ అధ్యక్షుడు విద్యాసాగర్ తదితరులు

శ్మశానవాటిక బాగు

విజయనగరం పట్టణం: నగరంలోని అయ్యన్నపేట శివారులో ఉన్న శ్మశానవాటిక పరిసరాలు అధ్వానంగా ఉండడంపై 'ఈనాడు'లో 'ఆఖరి మజిలీకి అవస్థలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి నగరపాలిక అధికారులు స్పందించి, బాగు చేశారు.

బాలాజీనగర్‌లో వ్యర్థాల తరలింపు

విజయనగరం పట్టణం: నగరంలోని బాలాజీనగర్ శ్రీనివాస కళాశాల దారిలో వ్యర్థాలు పేరుకుపోవడంపై 'ఈనాడు'లో ఈనెల 26న 'బాలాజీనగర్‌లో సమస్యల కుప్పలు' శీర్షికన ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించి, తొలగింపజేశారు.

జాకేరు-దబ్బిరాజుపేట రోడ్డు మరమ్మతులు

వేపాడ: జాకేరు -దబ్బిరాజుపేట రోడ్డు మరమ్మతులు చేపట్టారు. సమస్యపై ఈనాడులో వార్త వెలువడడంతో స్పందించిన అధికారులు నిర్వహణ నిధులు రూ.90 వేలు మంజూరు చేయడంతో పనులు చేస్తున్నట్లు జేఈ స్వామి తెలిపారు. బల్లంకి -బానాది రహదారికి రూ.60 వేలు ఖర్చు చేసినట్లు చెప్పారు.

తైక్వాండో ఎంపికలు

బాబామెట్ట: రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ తైక్వాండో పోటీలు జనవరి 3, 4వ తేదీల్లో శ్రీకాకుళంలో జరుగుతాయని తైక్వాండో సంఘం జిల్లా అధ్యక్షుడు డి.వామనాచారి తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో ఆదివారం ఎంపిక పోటీలు జరిగాయి. డిప్యూటీ మేయర్ కె.శ్రావణి ప్రారంభించారు.

విజ్జీలో క్రికెట్..

బాబామెట్ట: జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో విజ్జీ మైదానంలో ట్యాలెంట్ హంట్ ప్రక్రియ కింద ఆదివారం క్రికెట్ ఎంపికలు నిర్వహించారు. అండర్-16, 19 విభాగాల్లో బ్యాటింగ్, బౌలింగ్‌లో పలువురి క్రీడాకారుల సామర్థ్యాన్ని పరీక్షించారు.

రాష్ట్రస్థాయికి కబడ్డీ జట్టు సిద్ధం

విజయనగరం బాబామెట్ట, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి స్త్రీల కబడ్డీ టోర్నమెంటు పశ్చిమ గోదావరి జిల్లాలో జనవరి 2 నుంచి 4 వరకు జరగనుంది. ఆదివారం విజయనగరంలోని కస్పా మైదానంలో జిల్లా జట్టు ఎంపికకు పోటీలు నిర్వహించినట్లు జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి కె.ప్రభావతి తెలిపారు. 14 మందితో పాటు మరో ముగ్గురిని స్టాండ్ బైలుగా ఎంపిక చేసినట్లు ప్రకటించారు. రాజీవ్ క్రీడా మైదానంలో సోమవారం నుంచి శిక్షణ శిబిరం ఉంటుందని చెప్పారు.

జిల్లాస్థాయి పోటీలు ప్రారంభం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: సతివాడ గ్రామంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను గ్రామపెద్దలు ఆదివారం ప్రారంభించారు. సతివాడ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 28 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. భాజపా నాయకుడు ఆల్తి నల్లిబాబు, ఎంపీటీసీ రెడ్డి సత్యనారాయణ, కోరాడ శ్రీను, చింతపల్లి శ్రీనివాసరావు, చందక సత్యం, నరసింహులు, మీసాల చిన్న పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సమన్వయంతో మెలగాలి

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: రానున్న స్థానిక ఎన్నికల్లో అంతా సమన్వయంతో మెలగాలని జనసేన పార్టీ ఎస్.కోట నియోజకవర్గ సమన్వయకర్త ఒబ్బిన సత్యనారాయణ, సీనియర్ నాయకుడు ఎస్.కొండలరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఎల్.కోటలో నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అయిదు మండలాల నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు. అధినేత పవన్‌కల్యాణ్ సూచనలు పాటించాలన్నారు. మండలాల అధ్యక్షులు ఫిరోజ్, సుంకరి అప్పారావు, పీవీఎస్ వర్మరాజు, తాండ్రంగి చంటి, గొరపల్లి రవికుమార్, నాయకులు సన్యాసినాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

పంట పండినా.. పండగ లేదాయే..!

జామి, వేపాడ, న్యూస్‌టుడే

అప్పన్నపాలెంలో కల్లం వద్ద ధాన్యం బస్తాలు

ఆరుగాలం శ్రమించిన పంట అమ్ముకునేందుకు అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు. కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నా ట్రక్కు షీట్లు జారీ కాని పరిస్థితి. జామి మండలం పరిధిలో 17 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 10,684 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. రైతుల వద్ద 5వేలు టన్నులు పైబడే నిల్వలు ఉన్నాయి. గత 10 రోజుల కిందట ట్రక్‌షీట్ల జారీ గంట్యాడ, కోరుకొండ మిల్లులకు నిలిపివేశారు. చీపురుపల్లిలోని మిల్లులకు ఇస్తామంటున్నారు. ఇది 70కి.మీ. దూరంలో ఉండడంతో ధాన్యం తరలించేందుకు రవాణా ఖర్చు పెరుగుతోంది. కొందరి ధాన్యం ట్రాక్టర్లలో ఉండిపోవడంతో వాహన యజమానులు అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. చేసేది లేక తక్కువ ధరకు దళారులకు అమ్ముకుంటున్నారు. కొన్నిచోట్ల గుట్టుచప్పుడు కాకుండా దళారులు, ప్రైవేటు వ్యక్తులకు ట్రక్కుషీట్లు జారీ చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. గంట్యాడ మిల్లుకు రెండు రోజుల్లో అనుమతులు వస్తాయని, అంతవరకు చీపురుపల్లికి తీసుకెళ్లాలని రైతులకు సూచించామని మండల వ్యవసాయాధికారి పూర్ణిమ తెలిపారు. వేపాడ మండలంలోనూ పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి. ఆర్ఎస్‌కేలకు వెళ్తున్నా బ్యాంకు గ్యారంటీలు లేవని పంపించేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

(c) eenadu

జ్ఞాపికలు అందుకున్న విద్యార్థులతో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు

● దేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా తీర్చిదిద్దడంతోపాటు గ్రామీణుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా కేంద్రం కృషి చేస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీఎన్వీ మాధవ్ పేర్కొన్నారు.

● సైయెంట్ లిమిటెడ్ వ్యవస్థాపక ఛైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 120కి పైగా ప్రభుత్వ పాఠశాలల్లో 35 వేల మంది విద్యార్థులకు డిజిటల్ అక్షరాస్యత చేరువైందన్నారు. కార్యక్రమంలో జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి, ఎస్పీ అద్నాన్ నయిం అస్మి, కూటమి నాయకులు మంతెన రామరాజు, కొత్తపల్లి సుబ్బారాయుడు, కొవ్వలి యతిరాజా రామ్మోహన్‌నాయుడు, పొత్తూరి రామరాజు, భోగిరెడ్డి ఆదిలక్ష్మి, అయినంపూడి శ్రీదేవి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మహిళల మద్దతుతోనే ప్రగతి

ఏఐ శిక్షణ కేంద్రంగా పీఎంలంక

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి

ఈనాడు డిజిటల్, భీమవరం: ‘పీఎంలంక గ్రామాన్ని నేను దత్తత తీసుకోలేదు. ఆ గ్రామస్థులే నన్ను దత్తత తీసుకున్నారు. ఇక్కడి మహిళల మద్దతుతోనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. దీంతో ప్రస్తుతం ఏఐలో శిక్షణ ఇచ్చే కేంద్ర బిందువుగా మారింది.’ అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆదివారం ఆమె పీఎం లంకలో పర్యటించారు. స్థానిక డిజిటల్ భవనంలో సైయెంట్ సంస్థ ఆధ్వర్యంలో నెలకొల్పిన ఏఐ, ఫ్యూచర్ స్కిల్ హబ్, జడ్పీ ఉన్నత పాఠశాలలో యూబీఐ సహకారంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లను ప్రారంభించారు. వికసిత్ భారత్, డిజిటల్ ఇండియా చిత్రలేఖన పోటీలు సందర్శించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధాన మంత్రి మన్ కీ బాత్ వీక్షణ అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. 146 మత్స్యకార కుటుంబాలకు పీఎం ఆవాస్ యోజనలో ఇళ్లు మంజూరు చేసి, పూర్తిచేయాలని కలెక్టర్ నాగరాణికి సూచించారు. అనంతరం రామకృష్ణ మఠం (రాజమహేంద్రవరం) సహకారంతో మత్స్యకార లబ్ధిదారులకు బోట్లు అందజేశారు.

రాష్ట్రానికి ఆర్థిక భరోసా.. రాష్ట్రానికి ఆర్థిక భరోసా కల్పించేలా నిర్మలా సీతారామన్ కృషి చేస్తున్నారని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. విశాఖ రైల్వే జోన్‌ను కూటమి ప్రభుత్వంలోనే సాధించారని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆలోచనలను నిర్మలా సీతారామన్ ఆచరణలోకి తెస్తున్నారన్నారు. 2014లో బియ్యపుతిప్ప వద్ద హార్బర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభం కాలేదని, దీని నిర్మాణానికి, నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే నాయకర్ కోరారు. ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, ఆరిమిల్లి రాధాకృష్ణ, పులపర్తి రామాంజనేయులు మాట్లాడారు.

● జిల్లాలో 5 వేల మందికి ఉపాధి కల్పించేలా ఆక్వా, హస్తకళలు, ఇతర రంగాల్లో శిక్షణ ఇచ్చేలా గేమ్‌హబ్ సంస్థతో ఎంవోయూ చేసుకున్నారు.

సభకు హాజరైన గ్రామస్థులు

గోదాదేవీ.. మనసా స్మరామి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : ధనుర్మాసోత్సవాల సందర్భంగా ఆదివారం అత్తిలి మండలం ఈడూరులోని వరాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారిని వివిధ ఆభరణాలు, రకరకాల పూలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

పండ్లు..పిండి వంటకాలతో ఆలయ అలంకరణ

పంజావేమవరం (వీరవాసరం), న్యూస్‌టుడే: పంజావేమవరం గ్రామ దేవతలు అష్టపద్దాలవెంకమ్మ, సత్తెమ్మ జాతర సందర్భంగా ఆదివారం భక్తులు అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. సంప్రదాయంలో భాగంగా శనివారం సాయంత్రం గ్రామ ఆడపడుచులు అమ్మవారి ఆలయాన్ని పిండి వంటలు, అరటి గెలలతో అలంకరించారు.

రేపు శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం

ద్వారకాతిరుమలలో ప్రత్యేక ఏర్పాట్లు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ద్వారకాతిరుమల శ్రీనివాసుడు ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ నెల 30న ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

మార్గదర్శకాలు

☛ స్వామివారి ఉత్తర ద్వార దర్శనం చేసుకోవడానికి రూ.500 టికెట్లు తీసుకున్న వారు జంట గోపురాల నుంచి ప్రారంభమై నూతన క్యూకాంప్లెక్స్‌లో నుంచి దక్షిణ రాజగోపురం గుండా వెళ్తారు.

☛ ఉచిత, రూ.100, రూ.200 టికెట్లు తీసుకున్న భక్తులకు షాపింగ్ కాంప్లెక్స్ వెనుక నుంచి ప్రారంభమై తాత్కాలిక క్యూకాంప్లెక్స్ నుంచి ఉత్తర ద్వారం నుంచి స్వామి దర్శనం చేసుకుంటారు.

☛ ఆన్‌లైన్‌లో, మన మిత్ర యాప్ ద్వారా రూ.100, రూ.200 టికెట్లు బుక్ చేసుకున్న భక్తులకు తూర్పు వైపున అన్నమయ్య విగ్రహం వద్ద నుంచి ప్రారంభమై ఉత్తర ద్వారం గుండా వెళ్తారు.

క్యూ లైన్లు

భక్తులకు సౌకర్యాలు

➤ దర్శన క్యూలలోనే మొబైల్ టికెట్టు కౌంటర్లు ఏర్పాటు చేశారు.

➤ భక్తుల రద్దీ దృష్ట్యా పోలీస్ సహకారంతో ప్రత్యేక బందోబస్తు, ప్రైవేటు సెక్యూరిటీని విధుల్లో ఉంచుతున్నారు.

➤ వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సా కేంద్రాల్ని తెరిచారు.

➤ దీక్షా విరమణ చేసే గోవింద స్వాములకు ప్రసాదాల కౌంటర్ల పక్కన హోమ గుండం ఏర్పాటు చేశారు.

➤ క్యూలైన్లలో పిల్లలకు పాలు, భక్తులకు మంచినీరు, అల్పాహారం అందిస్తారు.

మేమింతే... మారమంతే

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పెచ్చుమీరుతున్న అవినీతి

● లేఅవుట్ వేసిన 266.6 చ॥గ॥ల మా స్థలాన్ని వేరొకరు వారి కుటుంబ సభ్యుల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, న్యాయం చేయాలని 2022లో జిల్లా రిజిస్ట్రారు కార్యాలయంలో ఫిర్యాదు చేశాను. 2023లో మళ్లీ ఫిర్యాదు చేయగా పరిశీలిస్తున్నామన్నారు. ఇటీవల వెళ్లి అడగ్గా మీ దరఖాస్తు కనిపించడం లేదు, మళ్లీ ఫిర్యాదు చేయాలన్నారు. **- జోగి నర్సింహులు, పాలకొల్లు**

● నా భార్య ఇటీవల కాలం చేసింది. ఆమె నుంచి సంక్రమించిన ఆస్తిని కుమార్తె, కుమారుడు పేరిట రాసేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లగా రూ.35 వేలు వసూలు చేశారు. **- కూనపురెడ్డి వీర వెంకట విజయరంగా రావు, నరసాపురం**

● పెదకాకాని మండలం నంబూరు గ్రామంలో వేర్వేరు సర్వే నంబర్లలో 0.56 సెంట్లు, 0.49 1/2 సెంట్లు 45 ఏళ్లగా అనుభవంలో ఉన్న వ్యవసాయ భూమిని నిబంధనలకు వ్యతిరేకంగా ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వేరొకరి పేరు మీద నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేశారు. **- తమ్మా శివరామిరెడ్డి, గుంటూరు జిల్లా**

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అవినీతి పెచ్చుమీరుతోందనడానికి ఈ ఉదంతాలే నిదర్శనం. జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై మూడేళ్లలో 357 ఫిర్యాదులు వచ్చాయంటే అక్రమార్కుల హవా ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మొగల్తూరు, ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సిబ్బందిపై చర్యలు తీసుకొని అనిశా సోదాలు చేస్తున్నా వసూళ్ల పర్వం ఆగడం లేదు. సమస్యలు పరిష్కారం కావడం లేదు.

ఈనాడు డిజిటల్, తాడేపల్లిగూడెం, న్యూస్‌టుడే, అత్తిలి గ్రామీణ, నరసాపురం

ఇదే అవకాశమని..

సామాన్యులకు ఇబ్బందులు లేకుండా వారసత్వ ఆస్తిని కుటుంబ సభ్యుల పేరిట నామమాత్రపు ఖర్చుతో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కూటమి ప్రభుత్వం కల్పించింది. ఇదే అదనుగా కొందరు వసూళ్లకు తెరతీశారు. లేనిపోని కొర్రీలు సృష్టిస్తూ ఆస్తి విలువ ఆధారంగా ఒక్కో డాక్యుమెంటుకు రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు.

ప్రైవేటు వ్యక్తుల హవా

తాడేపల్లిగూడెం, నరసాపురం, పెనుగొండ తదితర సబ్ రిజిస్ట్రారు కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తుల హవా కొనసాగుతోందని, చేతులు తడిపితే గానీ పనులు కావడం లేదనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ అధికారిపై పలు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఆస్తి విలువను బట్టి రిజిస్ట్రేషన్ విలువలో రెండు శాతం వరకు డిమాండ్ చేయడంతో పంచాయితీ ఎమ్మెల్యే వరకు వెళ్లింది. దీనిపై జిల్లా ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు రోజులకోసారి సబ్ రిజిస్ట్రార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామని.. ఫిర్యాదులపై తక్షణం విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

కలెక్టర్ నాగరాణికి కార్యదర్శి హోదా

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వం 2010 బ్యాచ్‌కి చెందిన ఐదుగురు ఐఏఎస్ అధికారులకు సూపర్ టైమ్‌స్కేల్(లెవెల్-14) ఉద్యోగోన్నతి కల్పించింది. వారిలో జిల్లా కలెక్టర్ నాగరాణి కూడా ఉన్నారు. ఆమెకు కార్యదర్శి హోదా కల్పించినా పశ్చిమగోదావరి కలెక్టర్‌గానే కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉద్యోగోన్నతి 1 జనవరి 2026 నుంచి అమల్లోకి రానుంది.

సిరిమువ్వ.. సిరులొలికే నవ్వా!

ఏలూరు వైఎంహెచ్‌ఏ హాలులో మూడ్రోజులపాటు సాగిన అభినయ నృత్య భారతి వార్షికోత్సవం, జాతీయ స్థాయి నృత్యోత్సవాలు, నృత్య పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి కూచిపూడి, జానపద, బృంద నృత్య పోటీల్లో కళాకారులు ప్రదర్శనలిచ్చారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. సంస్థ తరఫున వారికి నృత్య కౌముది అవార్డులు ప్రదానం చేశారు. **- న్యూస్‌టుడే, ఏలూరు గ్రామీణ**

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: సోమవారం పీజీఆర్ఎస్ యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మున్సిపల్, మండల కార్యాలయాల్లోను పీజీఆర్ఎస్ జరుగుతుందని వెల్లడించారు. 1100 కాల్‌సెంటర్, ఆన్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కప్ అందుకున్న విశాఖ జట్టు క్రీడాకారులు

భారీ వాహనాలు ఇటు రావొద్దు 6లో

రాష్ట్రస్థాయి ‘పురోహిత క్రికెట్ కప్’ విజేతగా విశాఖ జట్టు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: భీమవరంలో గన్నాబత్తులవారి క్రీడా మైదానంలో 8 రోజులుగా కొనసాగుతున్న రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ లీగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్స్‌లో హైదరాబాద్ జట్టుపై విశాఖ జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు 101 పరుగులు చేయగా.. విశాఖ 102 పరుగులతో విజయం సాధించి కప్ సొంతం చేసుకుంది. వారికి దాత సాగిరాజు అప్పలరాజు తరఫున డీఎన్నార్ కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగ రాజు రూ.లక్ష పారితోషికం అందించారు. రన్నర్స్‌గా నిలిచిన హైదరాబాద్ జట్టుకు దాత డాక్టర్ సిరియాల గౌతమ్‌కుమార్ రూ.50 వేలు అందించారు.

సెమీ ఫైనల్స్‌లో.. తొలి మ్యాచ్‌లో కాకినాడ జట్టు 82 పరుగులు చేయగా హైదరాబాద్ జట్టు 83 పరుగులు చేసి విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో విశాఖ జట్టు 99 పరుగులు సాధించగా రాజమహేంద్రవరం జట్టు 93 పరుగులకే ఓటమి పాలైంది. ఈ సందర్భంగా ఆర్గనైజర్లు బ్రహ్మజోశ్యుల సుబ్రహ్మణ్యశర్మ, బ్రహ్మజోశ్యుల సత్యప్రసాద్‌శర్మ, చందూరి కామేశ్వరశర్మ, ఆహ్వాన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ పోటీలో 20 జట్లు పోటీలో పాల్గొన్నాయని తెలిపారు.

కర్రలు కాస్తాయా..? బస్తాలు ఆపుతాయా..?

ఉండి మండలం యండగండి నుంచి భీమవరం వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. పంట కాలువల చెంత రహదారి రెండు చోట్ల కోతకు గురైంది. ఇక్కడ కాంక్రీటుతో రక్షణగోడ కట్టాల్సి ఉండగా సరుగుడు కర్రలు, ఇసుక బస్తాలతో తాత్కాలికంగా నిర్మించారు. రహదారి కుంగిపోవడంతో ఎత్తుపల్లాలుగా మారింది. వేగంగా వచ్చిన వాహనాలు ఇక్కడ కుదుపులకు గురై ఒరిగిపోతున్నాయి. దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ శ్రీహరి మాట్లాడుతూ శాశ్వత రక్షణ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదని, అందుకే తాత్కాలిక పనులు చేశామని, రహదారి ఎత్తుపల్లాలు లేకుండా గ్రావెల్‌తో బాగుచేయిస్తామన్నారు. **-ఈనాడు, ఉండి**

పంటకాలువ చెంత కర్రలు, ఇసుకబస్తాలతో వేసిన రక్షణగోడ చెంత ప్రమాదకరంగా వాహనాల రాకపోకలు

మీరు తవ్వుకెళ్లండి.. మేం కళ్లప్పగిస్తాం

● యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

● ప్రేక్షక పాత్రలో యంత్రాంగం

ఆకివీడులో ట్రక్కులో ఎత్తుగా మట్టిని ఎగుమతి చేసి రవాణా చేస్తున్న ట్రాక్టర్

ఆకివీడు, న్యూస్‌టుడే: ఉండి, భీమవరం నియోజకవర్గాల్లో మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ట్రక్కుల్లో పరిమితికి మించి మట్టిని లోడు చేస్తూ పైన బరకం కప్పకుండా ట్రాక్టర్లు, లారీల్లో తరలించేస్తున్నారు. ప్రైవేటు లేఅవుట్లు, ఇళ్ల స్థలాల్లో చదును పనులు పెరగడంతో మట్టికి గిరాకీ పెరిగింది. దీంతో అక్రమార్కులు సిండికేటుగా ఏర్పడి భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం ఇది మంచి లాభదాయక వ్యాపారంగా మారడంతో ఈ దందా మూడు ట్రక్కులు.. ఆరు లారీలుగా సాగుతోంది. అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

దారులు.. జర్రున జారేలా.. ట్రాక్టర్లు, లారీల్లో ఇష్టారాజ్యంగా మట్టి అక్రమ రవాణా సాగిస్తుండటంతో ఆయా ప్రాంతాల్లో నామమాత్రంగా ఉన్న రహదారులు పూర్తిగా పాడవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఎక్కువ లోడ్లు తిప్పాలనే లక్ష్యంతో అతివేగంగా రవాణా చేస్తుండటంతో రహదారులపై అనేక చోట్ల మట్టి పెళ్లలు జారీ పడుతున్నాయి. అనంతరం అవి వాహనాల రాకపోకలకు అతుక్కుపోయి జారుడు బల్లలా మారుతున్నాయి. దీంతో వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతూ గాయాలపాలవుతున్నారు. ప్రస్తుతం ఆకివీడు మండలంలోని ఆకివీడు, మాదివాడ, కోళ్లపర్రు, తరటావ, గుమ్ములూరు తదితర గ్రామాల పరిధిలో మట్టి రవాణా యథేచ్ఛగా సాగుతోంది. దీనిపై తహసీల్దార్ ఫరూక్ వద్ద ‘న్యూస్‌టుడే’ ప్రస్తావించగా నిబంధనలకు విరుద్ధంగా మట్టి రవాణా చేసే వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్‌లు

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. దీనిలో భాగంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్‌ల పేరిట ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను ఉపయోగించుకోవాలని సూచించారు. పీజీఆర్ఎస్‌కు సమాంతరంగా ప్రతి రెవెన్యూ సమస్యను క్షుణ్ణంగా ఇక్కడ పరిశీలిస్తారని వెల్లడించారు.

24 గ్రామాలు 68,740 ఎకరాలు

2 నుంచి నాలుగో విడత రీసర్వే

ఈనాడు డిజిటల్, పెంటపాడు: జిల్లాలో నాలుగో విడత రీసర్వే జనవరి 2 నుంచి ప్రారంభం కానుంది. 24 గ్రామాల్లో 68,740 ఎకరాల భూమి రీసర్వే చేసేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జిల్లాలో మొత్తంగా 293 గ్రామాల్లో రీసర్వే లక్ష్యం కాగా మొదటి మూడు విడతల్లో 243 గ్రామాల్లో పూర్తయింది. నాలుగో విడతలో 24 గ్రామాలను 75 పని దినాల్లో రీసర్వే పూర్తిచేసేలా ప్రణాళిక చేశారు. అయిదో విడతలో 26 గ్రామాలు చేస్తే మొత్తంగా రీసర్వే పూర్తి కానుంది.

ఇలా చేస్తున్నారు: ఎవరి భూమినైతే సర్వే చేస్తున్నామో సంబంధిత రైతుకు ఏ తేదీన, ఏ సమయంలో సర్వే చేస్తామనే సమాచారాన్ని ముందుగానే తెలియజేస్తున్నారు. రైతు సమక్షంలోనే భూమి కొలతలు తీస్తున్నారు. విస్తీర్ణం పరంగా అభ్యంతరాలుంటే పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నారు. 9(2) నోటీసు ఇవ్వడం ద్వారా వాస్తవ విస్తీర్ణం తెలియజేస్తున్నారు. అందులో అభ్యంతరాలుంటే రెండు సార్లు అప్పీలు చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. విలేజ్ సర్వేయర్, మండల టీమ్(మొబైల్ మేజిస్ట్రేట్)లకు ఫిర్యాదు చేయొచ్చు.

ఈ మండలాల్లో: జిల్లాలో పాలకోడేరు, పెనుగొండ, అత్తిలి మండలాల్లో రీసర్వే పూర్తి కాగా మిగిలిన మండలాల్లోనూ చేపట్టనున్నారు. ఆచంట, యలమంచిలి, పాలకొల్లు, ఉండి, నరసాపురం, పెంటపాడు, మొగల్తూరు,గణపవరం, ఇరగవరం, తాడేపల్లిగూడెం రెండేసి చొప్పున, పెనుమంట్రలో 3, భీమవరంలో ఒక గ్రామం చొప్పున సర్వే చేయనున్నారు. మొత్తంగా 12 రోవర్లు అవసరమని గుర్తించారు. రీసర్వే సమస్యలు పరిష్కరించేందుకు పక్కాగా ప్రణాళిక చేశామని, ఇబ్బందులుంటే సిబ్బందికి తెలియజేయాలని జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి సూచించారు.

ఆటిజం చిన్నారులకు భరోసా

● కొత్తగా అయిదు చికిత్స కేంద్రాలు

● రూ. 1.35 కోట్లతో భవన నిర్మాణాలు

పోడూరు, న్యూస్‌టుడే: మూడేళ్ల వయసు దాటినా మాటలు రాకపోవడం, వినికిడి లోపం, శారీరక, మానసిక సమస్యలతో ఉన్న చిన్నారుల సంఖ్య పెరుగుతోంది. దీన్ని ఆటిజం (మానసిక సమస్య)గా వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి చిన్నారులకు తగిన చికిత్స అందించేందుకు ప్రభుత్వం సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో కొత్తగా ఆటిజం కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. జిల్లాలో పాలకొల్లు, భీమవరం, తణుకు, పెంటపాడు, ఆకివీడులలో ఈ కేంద్రాల ఏర్పాటుకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. రూ.1.35 కోట్లతో భవన నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

నిపుణుల పర్యవేక్షణలో..

వైకల్య బాధిత చిన్నారుల కోసం జిల్లాలో ఇప్పటికే 19 చోట్ల భవిత కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటికి అదనంగా ఆటిజం కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రాల్లో స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, ఇతర విభాగాలను నిపుణులను నియమిస్తారు. తొలి దశలో అయిదు కేంద్రాలను ప్రారంభిస్తామని, రాబోయే రోజుల్లో వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉందని సమగ్ర శిక్షా సహిత విలీన విద్య జిల్లా సమన్వయకర్త టి.శ్రీనివాసరావు తెలిపారు.

పండక్కి రండి.. విడిది సిద్ధమండి

✪ సంక్రాంతికి వరంగల్ నుంచి స్నేహితులు వస్తున్నారని హోటల్‌లో ఓ గది తీసుకుందామంటే డిసెంబరులోనే మొత్తం నిండిపోయాయని నరసాపురానికి చెందిన వాసు వాపోయారు. దీంతో దర్భరేవులో తన పాత పెంకుటిల్లును శుభ్రం చేయించి అతిథుల కోసం సిద్ధం చేసినట్లు తెలిపారు.

✪ కోనసీమ జిల్లా సరిహద్దు వద్ద దిండిలో పర్యాటకశాఖ అతిథి గృహాల్లో 32 గదులుండగా జనవరి 11 నుంచి 20వ తేదీ వరకు బుకింగ్‌లు పూర్తయ్యాయి. జాతీయ రహదారి సమీపాన దొంగరావిపాలెం వద్ద ప్రయివేటు అతిథి గృహాల్లో గదులు కూడా పండగ రోజుల్లో అందుబాటులో లేవు.

పాలకొల్లు, న్యూస్‌టుడే: సంక్రాంతి రోజుల్లో జిల్లాకు వచ్చే అతిథుల సంఖ్య ఏటేటా పెరుగుతూనే ఉంది. యలమంచిలి, కలగంపూడి, పూలపల్లి, ఉండి, అయిభీమవరం, కాళ్ల, పెదఅమిరం, తణుకు, దువ్వ, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో జరిగే సంక్రాంతి సంబరాలు, కోడి పందేలు తెలుగు రాష్ట్రాల్లో పేరుగాంచాయి. పండగ మూడు రోజుల్లో ఆయా ప్రాంతాల్లో గడిపేందుకు లక్షలాది మంది ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ఈ ఏడాది సంక్రాంతికి అన్నిరకాల రిసార్టులు, హోటల్స్‌లో గదులకు నెల రోజుల ముందే బుకింగ్‌లు పూర్తయ్యాయి.

యలమంచిలిలో మండువా లోగిలి ఇల్లు

అతిథుల కోసం ఏర్పాట్లు.. 50 మంది వచ్చినా సరిపోయే మండువా లోగిళ్లకు జిల్లాలో కొదవలేదు. పల్లెల్లో ఉన్న ఇలాంటి ఇళ్లను దులిపేసి అవసరమైతే రంగులేసి అతిథుల కోసం ముస్తాబు చేస్తున్నారు. పండగ రోజుల్లో ఎక్కడున్నా వేడివేడిగా విందు భోజనం అందించేందుకు భారీసైజు క్యారేజీలను సిద్ధం చేస్తున్నారు. పండక్కి ఎంతమంది వస్తారో రండి.. ఏర్పాట్లన్నీ మేం చూసుకుంటాం అంటూ నగరాల్లో, పట్టణాల్లో అతిథులను చరవాణుల్లో ప్రేమగా ఆహ్వానించే మాటలే ప్రస్తుతం జిల్లాలో ప్రతిచోటా వినబడుతున్నాయంటే అతిశయోక్తిలేదు.

ప్రత్యేక ప్యాకేజీలు

సంక్రాంతి సందర్భంగా లాడ్జీలు, హోటళ్లలో బస చేసే వారి కోసం ప్రత్యేక ప్యాకేజీలు ప్రవేశపెట్టారు. సాధారణ రోజుల్లో గది అద్దె రోజుకు రూ.2 వేల నుంచి 3 వేల వరకు ఉంటుంది. పండగ మూడు రోజులు కలిపి ప్రత్యేక ప్యాకేజీ రూ.15 వేలుగా నిర్ణయించారు. అతిథులు ఒక్క రోజు ఉన్నా మొత్తం చెల్లించాల్సిందే. ప్రయివేటు రిసార్టుల్లోనూ గది అద్దెలను రెండింతలు చేశారు.

పక్షుల కేంద్రంలో కుటుంబ సభ్యులతో హైకోర్టు న్యాయమూర్తి

కొల్లేరు అందాలు అద్భుతం

జస్టిస్ దుర్గాప్రసాద్

ఆటపాక(కైకలూరు), న్యూస్‌టుడే: కొల్లేరు సహజసిద్ధ ప్రకృతి అందాలు అద్భుతంగా, ఆహ్లాదకరంగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్ అన్నారు. ఆదివారం ఆటపాక పక్షుల సందర్శన కేంద్రాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. బోటు షికారు చేసి చెట్లు, గ్రిల్స్‌పై సేద తీరుతున్న పలు జాతుల విదేశీ విహంగాలను దగ్గర నుంచి వీక్షించారు. అనంతరం పక్షుల మ్యూజియాన్ని సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన కొల్లేరు మ్యాప్‌ను తిలకించి అటవీ అధికారుల నుంచి కొల్లేరు విస్తీర్ణం, పరిధిలోని మండలాలు, గ్రామాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కృత్రిమ నమూనా పక్షులు, మత్స్యకారులు, తాటి దోనెలను పరిశీలించి చరవాణిలో చిత్రాలు తీసుకున్నారు. పార్కులో కుటుంబ సభ్యులతో సందడిగా గడిపారు. ఆయన వెంట కైకలూరు సివిల్ కోర్టు సీనియర్ న్యాయమూర్తి వీవీఎన్‌వీ లక్ష్మి తదితరులు ఉన్నారు.



(c) eenadu

రాష్ట్ర స్థాయికి ఎంపిక

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో వర్చువల్ విధానంలో నిర్వహించిన సైన్స్ నమూనాల తయారీ పోటీల్లో జిల్లా నుంచి మూడు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయని జిల్లా సైన్స్ అధికారి సోమయాజులు తెలిపారు. పెదపాడు మండలం వట్లూరు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ నుంచి ఒకటి, ఏలూరు సీఆర్ఆర్ పబ్లిక్ స్కూలు నుంచి రెండు ప్రాజెక్టులు అర్హత సాధించినట్లు చెప్పారు. సోమ, మంగళవారాల్లో వర్చువల్ విధానంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తారని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భవన్స్ అంతర్ పాఠశాలల ఆటల పోటీలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భారతీయ విద్యాభవన్స్ అంతర్ పాఠశాలల ఆటల పోటీలు భీమవరంలో శనివారం జరిగాయి. భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, జిన్నూరు, రాజమహేంద్రవరం బ్రాంచులకు చెందిన 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, పరుగుపందెం తదితర పోటీలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, భారతీయ విద్యాభవన్స్ ఛైర్మన్ యు.కె.విశ్వనాథరాజు, కార్యదర్శి ఎస్.శ్రీరామరాజు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సృజన విరబూసింది..

అద్భుతం ఆవిష్కృతమైంది..

తూడు, గుర్రపు డెక్క తొలగింపునకు కట్టర్ బోటు

మండవల్లి, న్యూస్‌టుడే: ఆలోచనను ఆచరణలో పెడితే అద్భుతాలను సృష్టించవచ్చు.. పెద్ద పెద్ద సమస్యలకు తక్కువ ఖర్చుతో పరిష్కారాన్ని తీసుకురావచ్చు అనడానికి నిదర్శనం కైకలూరులో తయారు చేసిన తూడు, గుర్రపు డెక్క కట్టర్ బోటే. డెల్టా ప్రాంతంలో వరదకు ప్రధాన కారణం మంచి నీటి కాలువలు, డ్రెయిన్లు, కొల్లేరు, ఉప్పుటేరులో గుర్రపు డెక్క, తూడు నీటికి అడ్డుగా మారడమే. తూడును కత్తిరిస్తే ప్రవాహంతో పాటే కిందకు వెళ్లిపోతుంది. ఏటా రూ.లక్షలు ఖర్చుచేసి పెద ఎడ్లగాడి వంతెన, ఉప్పుటేరు, పోల్‌రాజ్ డ్రెయిన్‌ల వద్ద యంత్రం సహాయంతో తూడు తొలగిస్తున్నారు. తక్కువ వ్యయంతో ఎక్కువ సమర్థంగా పని చేసేలా డిజైన్ చేయడంతో ప్రత్యామ్నాయంగా మారింది.

ఆలోచన ఇలా.. వరదల సమయంలో కొల్లేరు గ్రామాల్లో ఎమ్మెల్యే కామినేని పర్యటించేటప్పుడు పోలీసు పర్యవేక్షణ అవసరమయ్యేది. దీన్ని తగ్గించేందుకు దిల్లీలో ఉన్న ఓ కట్టర్ బోటు వీడియోను ఎస్పీ శివ కిశోర్ ఎమ్మెల్యే కామినేనికి పంపారు. ధర చూస్తే రూ.90 లక్షల వరకు ఉంది. దాన్ని కొనుగోలు చేసే శక్తి లేక ఇంజినీరు గన్నమనేని సుధాకర్, ఫౌండ్రీ మేస్త్రీ మునగాల రాము కలిసి రూ.10 లక్షలతో బోటుకు ప్రాణం పోశారు.

తూడును కోస్తున్న బోటు

ఎస్పీ, ఎమ్మెల్యే ప్రోత్సాహం

ఎస్పీ శివకిశోర్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రోత్సాహంతోనే ఆలోచనకు ప్రాణం పోశాం. వారిద్దరు నిత్యం ప్రత్యేక గ్రూప్ ద్వారా సందేశాలు పంపి బోటు నిర్మాణంలో ప్రత్యేక పాత్ర పోషించారు. ప్రభుత్వ సహకారం అందిస్తే మరింత సమర్థమైన బోటు తయారు చేస్తాం. - గన్నమనేని సుధాకర్, ఇంజినీరు

అపజయం నుంచి విజయం

బోటును ముందుకు నడిపేందుకు, కటింగ్ మిషన్ తిరిగేందుకు రెండు 13 హెచ్‌పీ జపాన్ మిత్సుబిషీ డీజిల్ ఇంజిన్లు ఏర్పాటు చేశారు. ఇంజిన్ కట్టర్లను తిప్పేందుకు ఏర్పాటు చేసిన రబ్బర్ బెల్టు స్లిప్పై కటింగ్ సరిగ్గా జరగలేదు. బోటును ముందుకు తోసే ఇంజిను సామర్థ్యం సరిపోలేదు. లోపాలను సరిదిద్దేందుకు మరో రెండు నెలలపాటు తీవ్రంగా శ్రమించి ప్రధాన ఇంజిన్‌ను ఐసర్ వ్యానుకు చెందిన 22 హెచ్‌పీ మోటారును ఏర్పాటు చేశారు. కోయంబత్తూర్ నుంచి ప్రత్యేకంగా చేయించిన కత్తులను ముందరి భాగంలో అమర్చారు. బెల్టు స్థానంలో గేర్ బాక్స్‌ను ఏర్పాటు చేసి చైన్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయడంతో బోటు ఎటువంటి ఆటంకం లేకుండా ముందుకు సాగింది.

అంతర్జాతీయ ఈత పోటీల్లో ప్రతిభ

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: దుబాయ్‌లో జరిగిన యూత్ స్విమ్మింగ్ పోటీల్లో జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన స్విమ్మర్ బుడిగిన రవి వీర వెంకట భవాని కార్తీక్ ఆరు పతకాలు సాధించి మన దేశ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింపజేశారని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. కార్తీక్‌ను ఆదివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గన్ని మాట్లాడుతూ.. కార్తీక్ అనితర సాధ్యమైన విజయాలు సాధించారన్నారు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో విజయం సాధించాలన్నారు. సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ.. కార్తీక్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వద్దకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. క్రీడలకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం అందిస్తోందన్నారు.

కార్తీక్‌ను సత్కరిస్తున్న గన్ని, రోషన్‌కుమార్

శ్రీవారి గిరి ప్రదక్షిణకు సర్వం సిద్ధం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమలలో సోమవారం జరిగే శ్రీవారి గిరి ప్రదక్షిణకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీవారి మాలధారులు, భక్తులు కొండ చుట్టూ సుమారు 6 కిలోమీటర్ల మేర తిరిగే సమయంలో వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టామని ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఆలయ తొలి మెట్టు వద్ద నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందన్నారు. గిరి ప్రదక్షిణ మార్గంలో పండ్లు, మంచినీరు, తేనీరు, పాలు అందించేందుకు టెంట్లు ఏర్పాటు చేశారు. దొరసానిపాడు టోల్‌గేట్ దగ్గర నుంచి రాళ్లకుంట సెయింట్ గ్జేవియర్ పాఠశాల వరకు ఉన్న మట్టి రోడ్డును వట్టి గడ్డితో కప్పారు. ముందస్తుగా దారి పొడవునా.. విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు.

ఏర్పాటు చేసిన టెంట్లు

2009 బ్యాచ్ ఎస్సైల ఆత్మీయ సమ్మేళనం

బాధిత కుటుంబాలకు రూ.8.20 కోట్ల ఆర్థిక సాయం

కడియం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: వారంతా ఒకేసారి ఉద్యోగం సాధించారు.. శిక్షణ పొందారు.. ఎస్సైలుగా స్థిరపడ్డారు. అంతా కలుసుకుని ఆత్మీయ ఆలింగనాలు, సరదా కబుర్లు, స్వీయచిత్రాలు తీసుకుని సందడి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో ఎస్సై(సివిల్) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కడియంలో జరిగింది. వాళ్ల స్నేహబంధం ఎప్పటికీ కొనసాగేలా 2021లో ఏపీ, తెలంగాణ ఎస్సై 2009 బ్యాచ్ పేరిట సంక్షేమ సంఘాన్ని స్థాపించారు. నాటి నుంచి నేటి వరకూ ఏటా డిసెంబరు రెండో వారంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుంటున్నారు. 2014లో ఆంధ్ర, తెలంగాణ విడిపోయిన తర్వాత కూడా సమ్మేళనాలు నిర్వహించుకుంటున్నారు. సుమారు 1,140 మంది ఎస్సైలుగా తర్ఫీదు పొందగా, అందులో 400 మంది ఆదివారం రాజమహేంద్రవరంలో కలిశారు. వీరిలో 80 మంది ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్నారు. వీరంతా ప్రస్తుతం సీఐలుగా పదోన్నతి పొందారు. వీరంతా కలిసి నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. ఇప్పటి వరకు ఈ బ్యాచ్‌లో మృతిచెందిన వారికి సంబంధించిన కుటుంబాలకు రూ.8.20 కోట్ల సాయం చేసినట్లు తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు బ్యాచ్ అడ్మిన్‌గా ఉన్న హైదరాబాద్ బేగంపేట పీఎస్ రేంజ్ సీఐ జి.శ్రీనివాసరావు వివరించారు. సమ్మేళనానికి కడియం, ధవళేశ్వరం, రాజానగరం, అనపర్తి సీఐల సహకారం మరువలేనిదన్నారు.

కడియంలో ఒక్కటైన 2009 ఎస్సై (సివిల్) బ్యాచ్ సభ్యులు

ఆధ్యాత్మికత విరిసింది.. హేలాపురి మురిసింది

ఏలూరు గంగానమ్మ జాతరలో భాగంగా అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. మేడల వద్ద భక్తజనం బారులు తీరడంతో నగరంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఏలూరు తూర్పు, పడమర, దక్షిణ వీధులతోపాటు పవరుపేటలోని పలు ప్రాంతాల్లో జాతర సంబరాలు అంబరాన్నంటాయి. ఉదయం నుంచే పలు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణల మధ్య నైవేద్యాలు, సారెలను మహిళలు నగర వీధుల్లో ఊరేగించారు. అనంతరం వాటిని అమ్మవార్లకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా జాతర కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. - న్యూస్‌టుడే, ఏలూరు ఆధ్యాత్మికం

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో ఆదివారం డీఆర్‌డీఏ ఆధ్వర్యాన పత్సమట్ల పెరటి కోళ్లు పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు మాట్లాడుతూ.. జిల్లాలో 5 వేలు యూనిట్ల పెరటి కోళ్లు అందించడమే ధ్యేయమన్నారు. ఒక్కో యూనిట్‌లో రూ.5 వేలు విలువైన 10 కోళ్లు, 25 కిలోల మేత, మెడికల్ కిట్, కోళ్ల రవాణా పెట్టెలు ఉంటాయని ఆయన వివరించారు. డీపీఎం పార్థసారథి, ఏపీఎం ప్రభావతి, సర్పంచి బండారు సింధు, భాజపా నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెరటి కోళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

నేడు భీమవరం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో.. 'మీకోసం'

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరంలో జిల్లా పోలీసు కేంద్రంలో సోమవారం నిర్వహించాల్సిన 'మీకోసం' కార్యక్రమాన్ని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తామని జిల్లా పోలీసు కార్యాలయం తెలిపింది. గొల్లలకోడేరులో ప్రధాన కార్యాలయానికి వెళ్లే దారి నిర్మాణంలో ఉందన్నారు. ఫిర్యాదుదారులకు ఇబ్బంది కలగకుండా ఈ మార్పు చేశామని ప్రకటనలో తెలిపారు.

ఏఐ, ఎంఎల్‌పై అవగాహన అవసరం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: కృత్రిమ మేధస్సు(ఏఐ), మెషీన్ లెర్నింగ్(ఎంఎల్) పైన అవగాహన పెంపొందించడమే టెక్‌జైట్ 25-2.0 హ్యాకథాన్ లక్ష్యమని ఎర్లీ ఇంటర్వెన్షన్ ట్రైనింగ్ ప్రోగ్రాం(ఈఐటీపీ) డీన్ శ్యామ్ తెలిపారు. ఆది, సోమవారాల్లో ఏబీ-2 వేదికగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ఆలోచనలు సృజనాత్మకత పరిష్కారాలను ప్రోత్సహించడమే ఈ హ్యాకథాన్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీ అధ్యాపకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ విద్యార్థులు వివిధ బృందాలుగా ఏర్పడి వాస్తవ ప్రపంచ సమస్యలను ఏఐ, ఎంఎల్ ఆధారిత పరిష్కారాలను రూపొందిస్తున్నారన్నారు. సాంకేతిక విజ్ఞానంపై ఆసక్తి పెంచడం, ఆత్మవిశ్వాసాన్ని మరింత బలపర్చడమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేకే సింగ్, శ్యామ్, పావని, భవాని పాల్గొన్నారు. డైరెక్టర్, ఏవోలు, డీన్‌లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

హ్యాకథాన్‌ను ప్రారంభిస్తున్న కళాశాల అధ్యాపకుడు శ్యామ్

భారీ వాహనాలు ఇటు రావద్దు..!

చిలుకూరు (ఉండి), న్యూస్‌టుడే: చిలుకూరు బీసీ కాలనీకి సమీపంలో ఆర్‌అండ్‌బీ రహదారికి అడ్డుగా ఒక వాహనాన్ని నిలిపి దానిపై 'భారీ వాహనాలకు ఇక్కడ ప్రవేశం లేదు' అనే ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. తాడేపల్లిగూడెం - భీమవరం మార్గంలో బ్రిటిష ప్రభుత్వ హయాంలో నిర్మించిన గరగపర్రు వంతెన శిథిలావస్థకు చేరడంతో భారీ వాహనాల రాకపోకలను నెల రోజుల కిందటే నిలిపివేశారు. ఇదే అంశాన్ని తెలియజేస్తూ పిప్పర, యండగండి, కేశవరం, భీమవరం, గరగపర్రు తదితర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గరగపర్రు వంతెన పైభాగంలో ఇనుప గడ్డర్లు బిగించారు. దీంతో పిప్పర - భీమవరం మీదుగా రాకపోకలు సాగించే 20-45 టన్నుల మధ్య బరువుండే టిప్పర్లు, కంటైనర్లు, ఇతర భారీ వాహనాలన్నింటినీ కొన్ని రోజులుగా గరగపర్రు- చిలుకూరు గ్రామీణ ప్రాంతాల మీదుగా మహదేవపట్నం, మహదేవపట్నం సత్రం వద్ద 165 జాతీయ రహదారిలోకి మళ్లిస్తున్నారు. అసలే అంతంతమాత్రంగా ఉండే గరగపర్రు- చిలుకూరు మధ్య వ్యవసాయ భూములు, కాలువ గట్ల వెంబడి ఉన్న ఈ మార్గం కొన్నిచోట్ల దిగబడిపోతుండటాన్ని స్థానికులు గుర్తించారు. ఇటీవలే అభివృద్ధి చేసిన ఈ మార్గం దెబ్బతింటే ప్రత్యామ్నాయం లేదని ఆందోళన చెందిన స్థానికులు సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అత్యవసర చర్యల్లో భాగంగా గరగపర్రు, చిలుకూరు ప్రాంతాల మధ్య భారీ వాహనాలకు ప్రవేశం లేదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. తాడేపల్లిగూడెం, పిప్పర నుంచి వచ్చే భారీ వాహనదారులు గణపవరం, ఆరేడు, కోలమూరు ఉండి మీదుగా భీమవరం చేరుకోవాలని సూచిస్తున్నారు.

వాహనంపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఎస్‌జీపీఏ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ తణుకు తాలూకా యూనిట్ సంఘ భవనంలో పశ్చిమ గోదావరి జిల్లా బ్రాంచి అధ్యక్షులు బి.హరికుమార్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు బి. హరికుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హరికుమార్ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ముఖ్యమంత్రి ప్రకటించిన ప్రకారం 60 రోజుల్లోగా వైద్యసేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘ కోశాధికారి వంగపండు రామమోహనరావు, జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి వై.వి.ఎస్.మూర్తి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హరికుమార్

ఆకట్టుకున్న సైతక శిల్పం

నరసాపురం, గ్రామీణ, న్యూస్‌టుడే: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటన సందర్భంగా నరసాపురం మండలం పీఎంలంక సముద్ర తీరంలో ఆదివారం కళాకారులు ఆమె సైకత శిల్పాన్ని రూపొందించి స్వాగతం పలికారు.

గంజాయి పట్టివేత

ఇద్దరు వ్యక్తుల అరెస్టు

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: గంజాయి రవాణా చేస్తున్న ఇద్దర్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. జీలుగుమిల్లిలో జంగారెడ్డిగూడెం- అశ్వారావుపేట జాతీయ రహదారిపై ఎస్సై క్రాంతికుమార్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తున్నారు. ఇది గమనించి ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు యత్నించారు. అనుమానం వచ్చి వారిని ఆపి తనిఖీ చేయగా.. ద్విచక్రవాహనం సీటు లోపల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఒడిశా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 10.15 కిలోల గంజాయిని కొనుగోలు చేసి, తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డికి తీసుకెళ్తున్నట్లు తెలుసుకున్నారు. గంజాయి, ఒక ద్విచక్రవాహనం, రెండు చరవాణులు స్వాధీనం చేసుకుని, కామారెడ్డి జిల్లా ఎల్బీపూర్ గ్రామానికి చెందిన రాజ్‌పుత్ కమల్ సింగ్, గొట్టిముక్కల గ్రామానికి చెందిన ఆకుల వంశీకృష్ణ అనే ఇద్దర్ని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 152, 161, 172 చికెన్ విత్ స్కిన్ - 294 చికెన్ స్కిన్‌లెస్ - 304.

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact

9000180626, 9989993175

ప్రాజెక్టు రూప శిల్పులు.. భవిష్యత్తు నిర్మాణకర్తలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఈ రోజు తరగతి గదులు కేవలం పాఠాలకే పరిమితం కాదు. ఆలోచనలకు రూపం ఇచ్చే ప్రయోగశాలలుగా మారుతున్నాయి. వీటి నుంచే పుట్టుకొస్తున్నారు వివిధ ప్రాజెక్టుల రూప శిల్పులైన ఈ విద్యార్థులు. సమస్యను గమనించడం నుంచి పరిష్కారాన్ని కనుగొనడం వరకు ప్రతి దశలో వీరి ఆలోచన శక్తి కనిపిస్తుంది. సమస్యకు సరళమైన పరిష్కారం తక్కువ ఖర్చుతో కూడిన నమూనాలు సాంకేతికతను సామాజిక అవసరాలకు అనుసంధానించే అప్లికేషన్లు విద్యార్థుల సృజనాత్మకతకు నిదర్శనంగా ఉంటున్నాయి. గురువుల మార్గ నిర్దేశం, తల్లిదండ్రుల ప్రోత్సాహం సంస్థల సహకారంతో ఈ విద్యార్థుల ఆలోచనలు సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలుగా మారుతున్నాయి. చిన్న ప్రాజెక్టుగా మొదలైన ప్రయత్నం రేపు పెద్ద మార్పునకు బీజం కావచ్చు. భవిష్యత్తును నిర్ణయించే శిల్పులు ఇటుకలతో కాదు.. ఆలోచనలతో నిర్మిస్తున్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో టెక్‌జైట్‌లో పలు ప్రాజెక్టులను ప్రదర్శించిన ఈ విద్యార్థులే రేపటి నాయకులు, ఆవిష్కర్తలు.. వారేమంటున్నారంటే...

వైర్‌లెస్ కెమెరాలను గుర్తించడం సాధ్యమే

మహిళల గోప్యతకు భంగం కల్గిస్తూ ఎవరైనా కెమెరాలు ఏర్పాటు చేస్తే అవి ఎక్కడ ఉన్నాయో ఈ వైర్‌లెస్ కెమెరా గుర్తిస్తుంది. వెంటనే హెచ్చరికలను జారీ చేస్తుంది. గోప్యత భద్రతను పరిరక్షించేందుకు ఇళ్లు, కార్యాలయాలు, హోటళ్లు, పరీక్షా హాళ్లలో ఉపయోగిస్తే గుర్తించడం సులభమవుతుంది. - నందిని భవ్యశ్రీ, అస్మిత, యాస్మిన్, శశి

క్యాంపస్ నిఘా కోసం రోబో



క్యాంపస్ నిఘా కోసం ఈ ప్రాజెక్ట్‌లో నాలుగు కాళ్ల స్వయం ప్రతిపత్తి కల రోబోను అభివృద్ధి చేశాం. కేటాయించిన ప్రాంతాల్లో గస్తీ తిరుగుతూ అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించి వెంటనే సమాచారం పంపిస్తుంది. దీర్ఘకాలిక నిఘా కోసం దీనిని వినియోగించుకుంటే ప్రయోజనం ఉంటుంది. - కార్తీక్, దుర్గాప్రకాశ్, రూప్‌చంద్, ఫణీంద్ర, వరలక్ష్మి

లేజర్‌తో 360 డిగ్రీల మ్యాపింగ్

న్యూక్లియర్ ప్లాంట్‌లు, మైనింగ్, పరిశ్రమలకు ఇది ఉపయోగకరం. లేజర్ ద్వారా 360 డిగ్రీల మ్యాపింగ్ సాధ్యం. ఇండోర్, ఔట్‌డోర్‌లో ఉపయోగించుకోవచ్చు. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు ప్రయోజనకరం. అవసరమైతే డైరెక్షన్‌లను మార్చుకుని ఆయా ప్రదేశాలకు చేరుతుంది. అక్కడి పరిస్థితులను చిత్రాల ద్వారా చేరవేస్తుంది. - సుబ్రహ్మణ్యం, గౌతమ్, కాలీషా, సరిత

అమ్మవారికి హారతిస్తున్న అర్చకుడు

మమ్మేలమ్మా.. రాట్నాలమ్మా..!

రాట్నాలకుంట(పెదవేగి), న్యూస్‌టుడే: రాట్నాలకుంట రాట్నాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు ఉదయం అమ్మవారిని అభిషేకం, అర్చన తదితరాలు నిర్వహించి పట్టువస్త్రాలు, ఆభరణాలు, విశేష పుష్పాలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని రాట్నాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పూజా ద్రవ్యాలు, ప్రసాదాల విక్రయాలతో రూ.57,285 ఆదాయం వచ్చిందని ఆలయ ఛైర్మన్ మన్నే శ్రీనివాసరావు, ఈవో సతీశ్‌కుమార్ తెలిపారు.

ఆ ఘనత కూటమి ప్రభుత్వానిదే: చింతమనేని

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ కొలువులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేసిన ఘనత కూటమి సర్కారుదేనని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాలలోని విడిది కార్యాలయంలో ఏపీ స్టేట్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) నూతన సంవత్సర కాలమానిని ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు జీజేఏ స్టీవెన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరమణ, టి.ప్రసాద్, గౌరవాధ్యక్షుడు పి.పెట్రిక్‌బాబు, కోశాధికారి గంధర్వరావు, గౌరవ సలహాదారు జి.గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలమానినిని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్, సంఘ నాయకులు

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

JOBS

Wanted B.Com/M.Com/MBA Finance/CA IPCC Dropouts to be Work as Field Executive in Bhimavaram in a Reputed Audit Firm. Interested Persons (Male Only) ✆ 70135 11502 or mail: kowthahr@gmail.com.

నిడదవోలు శంకరాపురం గ్రామంలో హృదయాలయం ఆశ్రమంలో పనిచేయుటకు వంటపని చేయుటకు వంటవారు కావలెను. స్త్రీలు మాత్రమే. ఫోన్: 94409 42148, 94418 76034.

భీమవరం ప్రముఖ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ నందు పనిచేయుటకు లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. సంప్ర: 94823 11796.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.65 పైః తణుకు ఆఫీసు: 08819-224254

రోడ్డు ప్రమాదంలో అక్కాతమ్ముడు దుర్మరణం

సత్తుపల్లి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో అక్కాతమ్ముడు దుర్మరణం చెందిన ఘటన ఆదివారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపూడి మండలం అల్లిపల్లి పంచాయతీ కండ్రిఖగూడేనికి చెందిన తోట మధుకు పెనుబల్లి మండలం సూరయ్యబంజర్‌కు చెందిన పుచ్చా కృష్ణయ్య, రమాదేవి దంపతుల కుమార్తె తేజస్విని(18) ఇచ్చి ఐదు నెలల కిందట వివాహం చేశారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులను చూసి వెళ్లేందుకు తేజస్విని తన భర్త మధుతో కలిసి శనివారం సూరయ్యబంజర్‌కు వచ్చారు. దమ్మపేట మండలం చీపురుగూడెం ఆశ్రమ పాఠశాలలో తేజస్విని తమ్ముడు దేవేందర్(13) చదువుతున్నాడు. తమ్ముడిని తనతోపాటు అత్తగారింటికి తీసుకెళ్లి సోమవారం తిరిగి పాఠశాలకు పంపాలనే ఉద్దేశంతో ఆమె భర్తతో కలిసి తమ్ముడిని వెంట తీసుకుని బయలుదేరారు. వీరు ముగ్గురు ద్విచక్ర వాహనంపై కండ్రిఖగూడెం వెళ్తుండగా మార్గం మధ్యలోని సత్తుపల్లి శివారు తమ్మిలేరు వంతెన వద్ద వెనుక నుంచి లారీ వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తేజస్విని, దేవేందర్ పై నుంచి లారీ వెళ్లడంతో వారు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తీవ్రంగా గాయపడిన మధును ఖమ్మం వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తోట తేజస్విని, పుచ్చా దేవేందర్ (పాత చిత్రాలు)

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తోట మధు

పదేళ్ల తర్వాత పుట్టిన సంతానం.. పుచ్చా కృష్ణయ్య, రమాదేవి దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. వారికి పెళ్లైన పదేళ్ల తర్వాత కుమార్తె తేజస్విని, కుమారుడు దేవేందర్ పుట్టారు. ఇద్దర్నీ ఎంతో అల్లారుముద్దుగా పెంచారు. ఆదివారం మధ్యాహ్నం వరకు కుమార్తె, కుమారుడు సందడిగా తమతో గడిపి అంతలోనే విగతజీవులుగా మారడంతో వారు కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఆర్టీసీ డ్రైవర్, ప్రయాణికుడిపై దాడి

గుర్తు తెలియని ముగ్గురిపై కేసు

ఉండి, న్యూస్‌టుడే: ఆర్టీసీ డ్రైవర్‌తోపాటు అడ్డువెళ్లిన ప్రయాణికుడిపై గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. దీనిపై ఉండి పోలీసు స్టేషన్‌లో ఆదివారం రాత్రి కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. భీమవరం ఆర్టీసీ డిపో డ్రైవర్ బొలిశెట్టి శృతిబాబు ఈ నెల 26న ఏలూరు నుంచి బస్సు నడుపుతూ వస్తున్నారు. ఉండి రైల్వే గేటు వద్ద ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని అడ్డంగా నిలిపి బస్సు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగినట్లు చెబుతున్నారు. ఆపై డ్రైవర్‌పై దాడి చేస్తుండగా ప్రశ్నించిన ప్రయాణికుడిపై సైతం దాడి చేశారు. డ్రైవర్ శృతిబాబు ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ప్రతి వ్యాపారికీ ఉద్యమ్ ఆధార్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రతి పౌరుడికీ ఆధార్ కార్డు ఉన్నట్లే ప్రతి వ్యాపారికీ ఉద్యమ్ ఆధార్ కార్డులను ప్రభుత్వం ఇస్తోంది. గతంలోనే ప్రారంభించినా దీన్ని ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దానిపై దృష్టి సారించి ప్రతి వ్యాపారీ ఈ కార్డు పొందేలా చర్యలు చేపట్టింది. ఉద్యమ్ ఆధార్ ఉంటే కలిగే ప్రయోజనాలపై పరిశ్రమల శాఖ - డీఆర్‌డీఏ సంయుక్తాధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఆధార్‌లో ఉన్నట్టే ఈ కార్డులోనూ 12 అంకెలుంటాయి. ఇందులో ఉండే క్యూఆర్‌కోడ్ స్కాన్ చేయగానే సంబంధిత వ్యాపారి పూర్తి వివరాలు వస్తాయి.

ఎవర్ని సంప్రదించాలి?

ఆధార్, పాన్ లింకైన చరవాణితో వెలుగు కార్యాలయానికి వెళ్తే సిబ్బంది వెంటనే వివరాలను ఆన్‌లైనులో నమోదు చేస్తారు. ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. తగిన రుసుము చెల్లిస్తే మీసేవా కేంద్రాల్లోనూ నమోదు చేస్తారు. సచివాలయాల్లోను ఈ సేవలు పొందొచ్చని అధికారులు చెబుతున్నారు.

ఎన్నో ప్రయోజనాలు

ఈ కార్డు వల్ల చాలా ప్రయోజనాలున్నాయి. అందుకే ఉద్యమ్ ఆధార్‌లో దాన్ని నమోదు చేసి ఇస్తున్నాం. వ్యాపారాల విస్తరణకు, బ్యాంకుల నుంచి రుణం పొందేందుకు ఈ కార్డులు ఉపయోగపడతాయి. ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చేలా అవగాహన కల్పిస్తున్నాం. - వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ

నిలకడగా కూరగాయల ధరలు

పెనుగొండ గ్రామీణ, పెనుమంట్ర, న్యూస్‌టుడే: కొన్ని రకాలు మినహా కూరగాయల ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. గత వారంతో పోలిస్తే కొన్ని రకాల ధరలు స్వల్పంగా తగ్గాయని పెనుగొండ మండల దొంగరావిపాలెం వద్ద హోల్‌సేల్ మార్కెట్ వ్యాపారులు తెలిపారు. ఆదివారం నాటి ధరలు (10 కిలోలకు రూపాయల్లో) ఇలా ఉన్నాయి. దొండ- 300, దోస- 400, నల్ల వంకాయ- 400, తెల్ల వంకాయ- 300, బెండ- 600, నాటు చిక్కుడు- 150, చిన్న చిక్కుడు- 200 బీట్‌రూట్- 300, క్యారెట్- 250, బంగాళాదుంప- 200, పచ్చిమిర్చి- 320, క్యాబేజీ- 200, ముల్లంగి- 800, ఉల్లి- 200 నుంచి 250, టామాటా- 400.

(c) eenadu

భీమవరం

•భీమవరం •ఉండి

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం: 80085 74471	భీమవరం గునుపూడి: 80085 74474
భీమవరం మండలం: 80085 74533	వీరవాసరం: 80085 74475
పాలకోడేరు: 80085 74467	ఉండి: 80085 74526
ఆకివీడు: 80085 74525	కాళ్ల: 94401 04042

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: ? రెండో పట్టణం 37వ వార్డులో డాక్టర్ రంగనాథరాజు వీధిలో ఉన్న కల్వర్టుకు ఇరువైపులా ఉన్న ఆప్రోచ్ రోడ్డు శిథిలావస్థకు చేరాయి. **- వి.సాయి**
✔ చర్యలు తీసుకుంటాం. **-టి.శరత్, పురపాలక ఏఈ**

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ? ఆరోవార్డు పరిధి విస్సాకోడేరు వంతెన దిగువన పైపులైను మరమ్మతులు చేసినా నీటి వృథా ఆగలేదు. గుంత ఏర్పడి ఇబ్బందిగా ఉంది **- ఎస్.వి.సుబ్బరాజు, విశ్రాంత ఉద్యోగి**
? భీమవరం బస్టాండు ఎదురుగా ఉన్న రహదారి మధ్యలో పైపులైను పగిలింది. నీరు డ్రెయిన్‌లోకి చేరుతోంది. **- రహీం, ప్రైవేటు ఉద్యోగి**
✔ నీటి వృథా, కలుషితం కాకుండా పనులు చేయిస్తా. **- పి.త్రినాథరావు, ఎం.ఇ**

పాలకోడేరు, న్యూస్‌టుడే: ? కొత్తపేట సిమెంట్ రోడ్డు వీధిలో వారం రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. **-ఎం.నాగేశ్వరరావు**
✔ చర్యలు తీసుకుంటాం. **-బి.గోపి, కార్యదర్శి**

చెత్త తొలగింపు

ఉండి, న్యూస్‌టుడే: ఉండి ప్రధాన పంట కాలువలో రైల్వే పైవంతెన (ఆర్వోబీ) ప్రాంతంలో చెత్త తొలగింపు పనులు ఎట్టకేలకు చేపట్టారు. ఈనెల ఎనిమిదో తేదీన 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. ఆదివారం పారిశుద్ధ్య కార్మికులతో చెత్తను తొలగింపజేసి వాహనాలపై దూరంగా తరలించారు.

3న సామాజిక తనిఖీ ప్రజావేదిక

పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరు మండల పరిషత్తు కార్యాలయం వద్ద వచ్చే నెల 3న జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.రెడ్డియ్య తెలిపారు. 2024-25లో మండలంలో జరిగిన ఉపాధి పనులపై ఇటీవల నిర్వహించిన సామాజిక తనిఖీల నివేదికలపై సమీక్ష జరుగుతుందన్నారు.

భీమవరంలో రయ్.. రయ్..

రూ.కోట్లతో ప్రగతి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం భీమవరంలో రహదారుల నిర్మాణం వేగంగా జరుగుతోంది. సంక్రాంతి వేడుకలను చూసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి స్వస్థలాలకు వచ్చేవారికి రహదారులు స్వాగతం పలుకుతున్నాయి. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఆదేశాలతో గత కొంత కాలం నుంచి నిలిచిన పనులను పూర్తి చేయించామని అధికారులు తెలిపారు. పనులు నాణ్యత ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, విస్తరణకు అడ్డంకులు తొలగించి నిర్మాణాలు చేయడంతో రహదారులు విశాలంగా కనిపిస్తున్నాయి.

● రామలక్ష్మణ్ నగర్ నుంచి లోసరి-గుట్లపాడు కాలువ గట్టును వెడల్పు చేసి చేపట్టిన రూ.కోటితో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు పూర్తికావచ్చాయని డీఈ వై.శ్రీను తెలిపారు. బలుసుమూడి రహదారిని రూ.20 లక్షలతో పూర్తి చేశామన్నారు. పట్టణంలోని ప్రతి రహదారిని సిమెంటు దారులుగా నిర్మాణం చేస్తున్నామన్నారు.

● భీమవరం ప్రాంతీయ ఆసుపత్రి రహదారి కొన్నేళ్లుగా విస్తరణ లేదు. అభివృద్ధి జరగకపోవడంతో ఆ ప్రభావం పట్టణ ట్రాఫిక్‌పై కనిపించేది. అలాంటి రహదారిని రూ.97 లక్షలతో సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారు. దీంతో పాటు మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీలో రూ.65 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టామని ఏఈ మణి తెలిపారు.

● భీమవరం రెండో పట్టణంలోని శ్రీరామపురం రహదారి గుంతలు పూడ్చడంలో సైతం గత వైకాపా ప్రభుత్వం అలసత్వం వహించడంతో ప్రయాణికులు నరకం చూశారు. పట్టణం నుంచి భీమవరం గ్రామీణ ప్రాంతాలకు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేందుకు ఇది ప్రధాన రహదారి. నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ గుంతల్లో పడి కొందరు గాయపడ్డారు. స్థానిక నివాసితులు, దుకాణాల యజమానులు ఖాళీ చేసేవారు. అలాంటి రహదారిని జువ్వలపాలెం రోడ్డు నుంచి బలుసుమూడి వరకు రూ.1.70 కోట్లతో సీసీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. డ్రెయిన్ పనులు కూడా చేపడతామని కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు.

సంతల్లో వసతులు లేక చింత

శృంగవృక్షంలో వ్యాపారులు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న పందిళ్లు

పాలకోడేరు, న్యూస్‌టుడే: మండలంలో పంచాయతీల పరిధిలో నిర్వహించే డైలీ, వారాంతపు సంతల్లో షెడ్లు, సౌకర్యాలు లేకపోవడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● శృంగవృక్షంలో ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న డైలీ మార్కెట్‌లో నిత్యం కూరగాయలు, నిత్యావసర సరకులు, చేపలు, మాంసం, పండ్లు, పూలు తదితర దుకాణాలు సుమారు 30కి పైగా ఉన్నాయి. కానీ అక్కడ షెడ్లు నిర్మించకపోవడంతో తాత్కాలిక పందిర్లు, పాకలు వేసుకుని దుకాణాలు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో విలువైన సామగ్రి, వస్తువులు తడిచిపోవడంతో వ్యాపారులు నష్టపోతున్నారు. మరో పక్క ఎండాకాలంలో సరైన నీడ లేక కొనుగోలుదారులు కూడా అవస్థలు పడుతున్నారు.

● వేండ్ర, మోగల్లులో వారాంతపు సంతలు సైతం ప్రధాన రహదారులపై నిర్వహిస్తున్నారు. ఆయా ప్రదేశాల్లో స్థలాలు ఉన్నా ఎటువంటి షెడ్లు నిర్మించకపోవడంతో రోడ్డు పక్కనే దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమై వాహనదారులు, కొనుగోలుదారులు ఇక్కట్లు పడుతున్నారు. స్థానిక పంచాయతీలు దుకాణాల వద్ద పన్నులు వసూలు చేయడం తప్ప ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. పరిశీలించి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఈవోపీర్డీ రామప్రసాద్ తెలిపారు.

విజేతలకు నగదు ప్రోత్సాహకాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఈనెల 12, 13 తేదీల్లో ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన బాలోత్సవంలో 'భువన విజయం సాహిత్య రూపకం' ప్రదర్శించిన గూట్లపాడు ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఆదివారం నగదు బహుమతులు అందించారు. రెండో పట్టణంలోని కస్తూరిబా భవనంలో వసుధ ఫౌండేషన్ అందించిన నగదు ప్రోత్సాహక బహుమతులను రూపకంలో పాల్గొన్న 11 మంది విద్యార్థినులకు రూ.వేయి చొప్పున రూ.11 వేలు మానవత సంస్థ ప్రతినిధులు అందించారు. వారికి శిక్షణ ఇచ్చిన గురువులను సంస్థ ఛైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజు సత్కరించారు. సంస్థ అధ్యక్షుడు సీహెచ్.రామకృష్ణంరాజు, కో-ఛైర్మన్ కె.నరసింహమూర్తి, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

అధ్వాన దారికి మరమ్మతులు

కాళ్లకూరు(కాళ్ల), న్యూస్‌టుడే: నిత్యం రద్దీగా ఉండే కాళ్ల మండలం కాళ్లకూరు మలుపులో జాతీయ రహదారికి ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ నెల 24న 'ఈనాడు'లో 'ఇక్కడ డొక్కు రోడ్డు ఉంది' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు రహదారిపై ఏర్పడిన భారీ గొయ్యిని పూడ్చారు.

వెలిగిన దీపాలు.. భీమవరం గ్రామీణ: తాడేరు-బేతపూడి ప్రధాన మార్గంలో వీధి దీపాలు వెలగక రాత్రివేళలో అంధకారంగా ఉంటుందని ఈనెల 25న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి పార్వతి స్పందించారు. దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నారు. ● రాయలం బైపాస్‌రోడ్డు వెంబడి చెత్తతో ఇబ్బందిగా ఉందంటూ ఈ నెల 24న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి వీర్రాజు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను దూరంగా తరలించారు.

మాట్లాడుతున్న శ్రీనివాస్

తెదేపా బలోపేతానికి శ్రమిస్తా

మహదేవపట్నం (ఉండి), న్యూస్‌టుడే: తెదేపా బలోపేతానికి తన కుటుంబం అహర్నిశలు శ్రమిస్తోందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వనిమా శ్రీనివాస్ తెలిపారు. మహదేవపట్నంలోని ఆయన నివాసంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. గత 25 సంవత్సరాల నుంచి తమ కుటుంబమంతా తెదేపాలో ఉందన్నారు. పదేళ్ల నుంచి గ్రామ పార్టీ అధ్యక్షునిగా వ్యవహరిస్తున్న తనను ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, ఆయన తనయుడు భరత్, మండల పార్టీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజుల సహకారంతో జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారని తెలిపారు.

'పనులు అడ్డుకోవడం సరికాదు'

సమావేశంలో ఏఎంసీ ఛైర్మన్ వెంకట్రావు, తెదేపా నాయకులు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ జామి హైమావతి ప్రొటోకాల్ పేరుతో ఆకివీడులో జరిగే అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదని ఏఎంసీ ఛైర్మన్ బొల్లా వెంకట్రావు, తెదేపా సీనియర్ నాయకుడు మోటుపల్లి రామవరప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు గంధం ఉమా అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక తెదేపా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఛైర్‌పర్సన్ తాను కొబ్బరికాయ కొట్టకుండానే సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడంపై అధికారులపై ఆగ్రహించి పనులను నిలుపుదల చేయించడం, మరో ప్రాంతంలో నిర్మాణ సామగ్రి రాకుండానే పనులకు శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శాంతినగర్‌లో జరిగిన అభివృద్ధి పనులకు జగన్‌మోహన్‌రెడ్డి, పీవీఎల్ నరసింహరాజు కృషేనని చెప్పడం మరింత విడ్డూరంగా ఉందన్నారు. వైకాపా పాలనలో కూడా అప్పటి ఎమ్మెల్యే మంతెన రామరాజు, నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణరాజు నిధులు మంజూరు చేశారనే విషయాన్ని వైకాపా నాయకులు గుర్తుంచుకోవాలని తెదేపా నాయకులు ఘాటుగా విమర్శించారు. కార్యక్రమంలో కొల్లి వెంకన్నబాబు, మోపిదేవి శ్రీనివాస్, బత్తుల రవి, బొల్లా శేషబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉప సభాపతి, కలెక్టర్ తదితరులు

మానవతావాది రతన్‌టాటా

పెదఅమిరం(కాళ్ల), న్యూస్‌టుడే: రతన్‌టాటా గొప్ప మానవతావాది అని ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. టాటా జయంతి సందర్భంగా ఆదివారం పెదఅమిరంలో ఆయన విగ్రహానికి కలెక్టర్ నాగరాణితో కలిసి నివాళులర్పించారు. దేశ అభివృద్ధిలో టాటా కీలకపాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో కొత్తపల్లి నాగరాజు, రామాంజనేయులు, కృష్ణమూర్తి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్య పరిష్కరించిన రఘురామ

పెదఅమిరం(కాళ్ల), న్యూస్‌టుడే: డీఎస్సీ 2025 ద్వారా ఉపాధ్యాయ పోస్టులు సాధించిన 15 మంది సమస్యలు పరిష్కరించిన ఉప సభాపతి రఘురామకృష్ణరాజుకు నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు. వారు విధుల్లో చేరాల్సిన తేదీలో సమస్య తలెత్తడంతో ఇప్పటి వరకూ జీతాలు జమకాని విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఏలూరు కలెక్టర్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో స్వయంగా మాట్లాడి పరిష్కరించారని సంఘ నాయకులు తెలిపారు.

కాలువలు ఇలా.. నీరు అందేదెలా?

భీమవరం మండలంలోని లోసరి పంట కాలువ పొడవు 20 కి.మీ. దీని ద్వారా 18 వేల మందికి తాగునీరు, 16 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. దీని పరిధిలోకి గొల్లవానితిప్ప, గూట్లపాడు, కొత్తపూసలమూరు, దొంగపిండి, లోసరి, పాతపూసలమూరు తదితర గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుతం ఇలా గుర్రపుడెక్క, తూడుతో నిండిపోయింది.

అధ్వానంగా మారిన జల వనరులు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: వైకాపా ఐదేళ్ల పాలనలో దారుణంగా మారిన కాలువల రూపురేఖలు కూటమి ప్రభుత్వంలో మారతాయని ప్రజలు ఆశించారు. కానీ ఇప్పటికీ నియోజకవర్గంలో ప్రధాన కాలువలు అధ్వానంగా ఉన్నాయి. ఏటా ఓ అండ్ ఎం పనుల్లో తూతూమంత్రంగా తూడు తీయడం తప్ప నిర్వహణను పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. తాగు, సాగునీరు అందించే కాలువల అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యం వీడాలని కోరుతున్నారు.

● భీమవరం రెండో పట్టణం మీదుగా మండలంలోకి వెళ్లే కొమరాడ పంట కాలువ 8 వేల మందికి తాగునీరు, 4 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. పట్టణ పరిధిలో ఇలా అధ్వానంగా మారిపోయింది.

● భీమవరం మండలంలో లోసరి, కాళీపట్నం, కొమరాడ, అనాకోడేరు, వెంప కాలువల పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. ఈ మండలంలో 25 వేల ఎకరాల్లో ఆక్వా, 8 వేల ఎకరాల్లో వరి సాగు విస్తరించి ఉంది. వీరవాసరం మండలంలో మత్స్యపురి, బాలేపల్లి, బొబ్బనపల్లి, మెంటేపూడి ఉపకాలువలు అధ్వానంగా ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 4,850 ఎకరాల ఆయకట్టు ఉంది.

ప్రతిపాదనలు పంపాం.. 'కొన్ని కాలువల ప్రక్షాళనకు ప్రతిపాదనలు పంపించాం. కొన్నింటిని గత ఏడాది శుభ్రం చేయించాం. మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం' అని జలవనరులశాఖ ఏఈ ప్రసాదరాజు తెలిపారు.

చెత్తతో అవస్థ

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: రాయలం పంచాయతీ మంచినీటి చెరువు గట్టున చెత్త పేరుకుపోతోంది. దీన్ని ఆనుకుని కాలువ కూడా ఉంది. ఈ రెండింటి మధ్య ఉన్న ఖాళీ స్థలంలో కొందరు నిర్లక్ష్యంగా చెత్త వేస్తున్నారు. స్థానిక ఉద్యోగులు దీన్ని తొలగించడంపై శ్రద్ధ చూపడం లేదు. దీంతో పాటు గ్రామంలో పలు చోట్ల చెత్త సమస్యగా మారిందని గ్రామస్థులు వాపోతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వీర్రాజును సంప్రదించగా చెత్త తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఆదివారమైనా తప్పని రద్దీ

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ఆదివారం సెలవు రోజు కావడంతో విద్యార్థులు, ఉద్యోగుల రాకపోకలు ఉండవు. దీంతో బస్సులు ఖాళీగా ఉండేవి. స్త్రీశక్తి పథకం పేరుతో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించాక సెలవు రోజుల్లోను రద్దీ ఎక్కువగా ఉంటుంది. బస్సులన్నీ కిటకిటలాడుతున్నాయి. అప్పటి వరకు నిరీక్షించిన ప్రయాణికులు బస్సులు రాగానే వాటిలోకి ఎక్కేందుకు పోటీ పడుతున్నారు. జిల్లా కేంద్రమైన భీమవరం ఆర్టీసీ బస్‌స్టేషనులో రద్దీ మరింత ఎక్కువగా ఉంటోంది.

ఈ చెరువును అభివృద్ధి చేయరూ?

చినఅమిరం(భీమవరం గ్రామీణ), న్యూస్‌టుడే: భీమవరం మండలం చినఅమిరం పంచాయతీలోని ప్రజలకు తురకవాని చెరువు దశాబ్దాల కిందట ప్రధాన నీటి వనరు. కాలక్రమంలో ఇది మరుగున పడింది. గ్రామం నడిబొడ్డున ఉన్న ఈ చెరువును వినియోగంలోకి తేవడానికి పాలకులు శ్రద్ధ చూపడం లేదు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న రెండు చెరువులు ఇక్కడ పెరిగిన జనాభాకు తగినట్లుగా లేవు. తురకవాని చెరువును అభివృద్ధి చేసి నీటితో నింపితే సమస్య పరిష్కారమవుతుంది. దీనిపై పంచాయతీ విస్తరణాధికారి రామాంజనేయప్రసాద్‌ను సంప్రదించగా పరిశీలించి తగిన చర్యలు చేపడతామన్నారు.

నీటి వృథా

పెర్కిపాలెం (వీరవాసరం), న్యూస్‌టుడే: పెర్కిపాలెంలో పలు చోట్ల పైపులైన్లు దెబ్బతినడంతో తాగునీరు వృథాగా పోతోంది. దెబ్బతిన్న ప్రాంతాల్లో కుళాయిల నుంచి మురుగు నీరు వస్తోందని స్థానికులు వాపోతున్నారు. పైపులైన్లకు మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికట్టడంతోపాటు రక్షిత తాగునీరు సరఫరా చేయాలని కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ పైపులైన్లకు మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

రాష్ట్రస్థాయి పురస్కారం స్వీకరణ

ఇరగవరం, న్యూస్‌టుడే: జాతీయ సహకార అభివృద్ధి సంస్థ(ఎన్‌సీడీసీ) ఆధ్వర్యంలో గుంటూరు నాగార్జునా విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎఫ్‌పీవో కో-ఆపరేటివ్ విభాగంలో రాష్ట్రస్థాయి అవార్డును రేలంగి సొసైటీ అందుకుంది. ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, జాతీయ సహకార అభివృద్ధి సంస్థ రీజనల్ డైరెక్టర్ స్నేహాసు గోస్వామి చేతుల మీదుగా జ్ఞాపిక, రూ.35వేల నగదు పురస్కారం అందుకున్నట్లు సంఘ కార్యదర్శి బలుసు శ్రీనివాసులు, పీఏసీ అధ్యక్షుడు అడ్డాల మెంటారావు చెప్పారు.

ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు

కాళ్లకూరు(కాళ్ల), న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఛైర్మన్ అడ్డాల శివరామరాజు, ఈవో అరుణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి భక్తులు స్వామివారిని ఉత్తరద్వార దర్శనం చేసుకోవచ్చన్నారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు

ఉండి, న్యూస్‌టుడే: ఉండి- చేబ్రోలు రాష్ట్రీయ మార్గంలో కోలమూరు- ఆరేడు గ్రామాల మధ్య పూర్తిగా ఛిద్రమైపోయిన రహదారి అభివృద్ధి పనులకు రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఆ శాఖ ఏఈ కె.శ్రీహరిరాజు తెలిపారు. ఈనెల 25న 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. కోలమూరు, ఆరేడు ప్రాంతాల్లో రాష్ట్రీయ రహదారిని ఏఈ శ్రీహరిరాజు ఆదివారం పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఆయన వివరించారు.

సభ విజయవంతానికి పిలుపు

భీమవరం గ్రామీణ, ఉండి, న్యూస్‌టుడే: విశాఖలో జనవరి 4న జరిగే బహిరంగసభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్ కోరారు. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం తోకతిప్ప, నాగిడిపాలెం, నాగేంద్రపురం, దొంగపిండి, కొత్తపూసలమూరు తదితర గ్రామాల్లో మోటారుసైకిళ్ల ప్రదర్శన నిర్వహించారు. ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలపై పోరాడేందుకు సన్నద్ధంకావాలని సీఐటీయూ మండల కన్వీనర్ ధనికొండ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఉండి ప్రధాన వంతెన కూడలిలో ద్విచక్ర వాహనాలు, ఆటో ప్రదర్శనను ఆదివారం నిర్వహించారు. మండల కో-కన్వీనర్ కొట్టాడ వెంకటేశ్వరరావు, సభ్యులు వీరవల్లి మాదవరావు, రామకూరి వెంకటరత్నం, ఇర్రింకి శ్రీరామ్మూర్తి, కొట్టాడ భాను తదితరులు పాల్గొన్నారు.

భీమవరం: జెండాలతో ప్రదర్శన చేస్తున్న నాయకులు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలను పురస్కరించుకొని జనవరి 4న నిర్వహించే బహిరంగ సభలో వేలాదిగా ప్రజలు పాల్గొనాలని జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భీమవరం పురపాలక కార్మికవాడలో 18 అడుగుల సీఐటీయూ జెండాతో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో నీలాపు రాజు, బంగారు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా శ్మశాన వాటిక నిర్మాణ పనులు

వెలివర్రు (ఉండి), న్యూస్‌టుడే: వెలివర్రు శ్మశాన వాటికలో భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చిలుకూరు వెళ్లే మార్గంలో హిందూ శ్మశాన వాటికలో 20 రోజుల కిందట ఈ పనులు ప్రారంభించారు. నాటి ఎంపీ, కనుమూరు రఘు రామకృష్ణ రాజు మంజూరు చేసిన నిధులు రూ.10 లక్షలతో హిందూ శ్మశానవాటిక పనులు వేగంగా జరుగుతున్నాయని గ్రామ సర్పంచి పెన్మెత్స అంజనీదేవి తెలిపారు.

గణనాథుని సన్నిధిలో గొబ్బిళ్ల పూజలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ధనుర్మాసం సందర్భంగా గునుపూడి విద్యాగణపతి ఆలయం ఎదుట చిన్నారులతో గౌరీ పూజ, గొబ్బిళ్ల వేడుకలు ఆదివారం రాత్రి నిర్వహించారు. ఉమాసోమేశ్వర గునుపూడి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో చిన్నారులతో గొబ్బిళ్ల పూజలు, ఆట, పాటలు సమాఖ్య మహిళ సభ్యులు నిర్వహించి మాట్లాడారు. మన పండగలు, మన సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసి చిన్నారులను ఆశీర్వదించారు.

చిన్నారులతో నిర్మలా సీతారామన్

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిత

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: బాల్య దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకొని కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చిన్నారులనుద్దేశించి అన్నారు. పెదమైనవానిలంకలో పర్యటన సందర్భంగా ఆదివారం డిజిటల్ భవనం వద్ద సభ అనంతరం ఆమె కోత నివారణకు సముద్ర తీరం వెంబడి నిర్మిస్తున్న గోడను పరిశీలించేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆమెను చూసేందుకు వచ్చిన చిన్నారులతో మాట్లాడారు. ఏం చదువున్నారంటూ ఆరా తీశారు. బాగా చదువుకుని ప్రయోజకులు కావాలని, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. చిన్నారులను ఆశీర్వదించి వారితో ఫొటోలు తీయించుకున్నారు.

ఘన స్వాగతం.. పెదమైనవానిలంకలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఘన స్వాగతం లభించింది. ఉదయం 11 గంటల తర్వాత గ్రామానికి చేరుకున్న ఆమెపై గ్రామస్థులు పూల వర్షం కురిపించారు.

అద్దె భవనాల్లోనే అంగన్‌వాడీలు

వీరవాసరం, న్యూస్‌టుడే: నాడు- నేడుతో వైకాపా ప్రభుత్వం విద్యా రంగం అభివృద్ధికి కృషి చేస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుంది. కానీ చాలా చోట్ల ప్రభుత్వ పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులకు సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో గుత్తేదారులు పనులు నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి సారించి అసంపూర్తిగా ఉన్న పాఠశాల, అంగన్‌వాడీ భవనాల పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

	భీమవరం	ఉండి
మొత్తం కేంద్రాలు	192	241
సొంతవి	38	67
అద్దెవి	80	112
పాఠశాలలు, సామాజిక భవనాల్లో నిర్వహించేవి	74	62

మత్స్యపురి పిప్పళ్ళవారితోట, స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఐదేళ్ల క్రితం నుంచి భవనాల నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. ఆయా ప్రాంతాల్లో కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు.

తోలేరులో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు ఐదేళ్ల కిందట నిలిచిపోయాయి. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటికే నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీలకు నిధులు కేటాయించకపోవడంతో ఎక్కడికక్కడ పనులు ఆగిపోయాయి.

మౌలిక సౌకర్యాలు కరవు.. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేసే పోషకాహారం, గుడ్లు, పాలు, బియ్యం, కందిపప్పు, నూనె వంటి సామగ్రిని నిల్వ చేసేందుకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో సిబ్బంది నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా అసంపూర్తి భవనాల పురోగతిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఐసీడీఎస్ సీడీపీవో టీకే లక్ష్మీకాంతం మాట్లాడుతూ ఇటీవల సంబంధిత శాఖ అధికారులు భీమవరం సెక్టార్ పరిధిలో అసంపూర్తి భవనాలు, అద్దె భవనాల సమాచారం తీసుకున్నట్లు తెలిపారు.

డీఎన్నార్ వాకర్స్ కార్యవర్గం ఎన్నిక

సత్కారం అందుకున్న సత్యనారాయణమూర్తి, నాగేశ్వరరావు, సభ్యులు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: భీమవరం డీఎన్నార్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు డీఎన్నార్ కళాశాల గ్రంథాలయ భవనంలో ఆదివారం నిర్వహించారు. 2026-2027 సంవత్సరాలకు గాను అధ్యక్షుడిగా కారుమూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శిగా లింగం నాగేశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా ఆర్.రామకృష్ణంరాజు, ఉపాధ్యక్షులుగా ఆర్.లక్ష్మీపతిరాజు, అడపా బాబ్జీ, సహాయ కార్యదర్శులుగా ఎస్ఎస్ఎన్.రాజు, పి.నరసింహరాజు, కోశాధికారిగా ఎస్.త్యాగరాజు, పీఆర్వోగా భట్టిప్రోలు శ్రీనివాసరావు, జాలీ వాకర్‌గా జి.అప్పలరాజు పలువురు సభ్యులు ఎన్నికయ్యారు. వారిని పలువురు సభ్యులు పూలమాలలతో సత్కరించి అభినందించారు. ఎన్నికల అధికారులుగా కె.ఆర్.కె.రాజు, వబిలిశెట్టి వెంకటేశ్వరరావు వ్యవహరించారు.

శాంతి రథాల ఛైర్మన్ మృతికి సంతాపం

ఉండి, న్యూస్‌టుడే: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ శాంతి రథాల ఛైర్మన్ రాంబాబు ఆకస్మిక మృతి తమ సంస్థకు తీరని లోటని ఉండి మండల అధ్యక్షుడు గాదిరాజు రంగరాజు అన్నారు. ఉండి ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రాంబాబు సేవలను పలువురు కొనియాడారు. మండల కో-ఛైర్మన్, ఎంపీటీసీ సభ్యుడు దంగేటి రామలింగేశ్వరరావు, మండల కన్వీనర్ కొమ్మన నాగబాబు, సభ్యులు మాట్లాడారు.

ఒరిజినల్ లింకు దస్తావేజులు పోయినవి

కుకునూరి రుక్మిణి W/o.శ్రీనివాసరావు, ఉంగుటూరు గ్రామం, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా, అను నేను తెలియజేయునది ఏమనగా నా యొక్క ఇంటికి సంబంధించి ఒరిజినల్ లింకు దస్తావేజులు నెం. 1403/1966, 1352/1990 లను ఒక కవరులో పెట్టుకుని మా ఇంటి వద్ద నుండి ఉండి రిజిష్టారు వారి ఆఫీసుకు వస్తుండగా ఉండి బస్టాండ్ రిజిష్టారు వారి ఆఫీసుకు వెళ్ళు మార్గమధ్యలో నా యొక్క ఒరిజినల్ ఇంటి లింకు దస్తావేజులు పెట్టిన కవరు జారిపడి పోయినవి. నేను మరలా మార్గమధ్యలో పరిసర ప్రాంతాల్లో ఎంత వెదికననూ దొరకలేదు. కావున దొరికినవారు పై అడ్రస్ కు తెలియచేయగలరు.

కుకునూరి రుక్మిణి W/o. శ్రీనివాసరావు
ఉంగుటూరు, సెల్: 99089 23644

(c) eenadu

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

నగరేశ్వరస్వామికి రుద్రాభిషేకం

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండలోని వాసవీశాంతిధాంలో కొలువైన నగరేశ్వరస్వామికి ఆదివారం రుద్రాభిషేకం చేశారు. బెంగళూరు నుంచి వచ్చిన భక్తులతో అర్చకులు సామూహికంగా పూజలు, వాసవీ హోమం చేయించారు.

సూర్య భగవానుడికి అభిషేకాలు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు సర్వోదయపురంలో ఉన్న సూర్య దేవాలయంలో ఆదివారం అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని రజత ఆభరణాలు, పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

ఉడిపి కృష్ణయ్య రూపంలో లక్ష్మీనారాయణుడు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లు అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం స్వామిని ఉడిపి కృష్ణుడి రూపంలో, అమ్మవార్లను ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

పాడేరు డీఎస్పీగా పాలకొల్లు వాసి

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణానికి చెందిన రావూరి అభిషేక్ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టినట్లు ఆయన కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు. ఆయన తండ్రి రావూరి చాచా న్యాయవాదిగా, తల్లి శ్రీదేవి ఉపాధ్యాయినిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు పట్టణ ప్రముఖులు, న్యాయవాదులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

అభిషేక్‌కు అభినందనలు తెలుపుతున్న అధికారులు

ఆక్రమణలే అవరోధాలు!

క్షీరపురిలో ట్రాఫిక్ ఇక్కట్లు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు పరిసర గ్రామాల ప్రజలు పలు అవసరాల నిమిత్తం నిత్యం పట్టణానికి వస్తుంటారు. క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులు, విద్యాసంస్థలకు వచ్చే విద్యార్థులతో పట్టణంలో అన్ని మార్గాల్లో రద్దీ పెరిగిపోతోంది. దీనికి తోడు పలు మార్గాల్లో ఆక్రమణలు, ప్రచార బోర్డుల కారణంగా తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

పాలకొల్లు న్యూ క్లాత్ మార్కెట్ రహదారి ఇది. దుకాణాల ముందు వాహనాలు, ప్రచార బోర్డులు ఉంచడంతో ఈ మార్గం ఇరుగ్గా మారి పాదచారులు కూడా రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఆక్రమణల కారణంగా డ్రెయిన్లను శుభ్రం చేసే పరిస్థితి లేదు.

ఇదీ పరిస్థితి.. బస్టాండ్ నుంచి వచ్చే ప్రయాణికులు, స్థానికులు విద్యా సంస్థలకు, బ్యాంకులు, వ్యాపార కూడళ్లకు వెళ్లేవారు న్యూ క్లాత్ మార్కెట్ మార్గంలో రాకపోకలు సాగిస్తారు. ఈ మార్గంలో దుకాణదారులు డ్రెయిన్లను కూడా మూసి ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తున్నారు. ప్రచార బోర్డులు, వాహనాలను దుకాణాల ఎదురుగా ఉంచడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలు కూడా రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడుతోంది.

☛ అన్నదాన సమాజం రోడ్డులో కొందరు వ్యాపారులు రహదారిపై తాళ్లు కట్టి వస్త్రాలను ప్రదర్శనగా పెట్టడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

☛ మరోపక్క ఇరుకు సందుల్లోనే వాహనాలు నిలిపి దుకాణాలకు సరకుల ఎగుమతులు, దిగుమతులు చేస్తుండటంతో ట్రాఫిక్ నిలిచిపోతోంది. షావుకారుపేట, బ్యాంకు వీధి, కారుమూరి వారి వీధి, లయన్స్ సామాజిక భవనం ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది.

చర్యలు తీసుకుంటాం.. ఈ అంశంపై పురపాలక కమిషనర్ బి.విజయసారథి స్పందిస్తూ రహదారుల వెంబడి ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కరాటేలో అదరగొట్టి

పోడూరు, పాలకొల్లు, న్యూస్‌టుడే: ఆత్మరక్షణ విద్య కరాటేలో సత్తాచాటుతోంది పాలకొల్లుకు చెందిన విద్యార్థిని జె.శ్రీలాస్య. పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఈమె ఇటీవల ఏలూరులో జరిగిన జపాన్ షోటోకాన్ కరాటే ఛాంపియన్ పోటీల్లో బ్లాక్ బెల్ట్ ఫస్ట్‌డాన్ విభాగంలో ప్రతిభ చూపి స్వర్ణ పతకం సాధించింది. 4వ ఏట నుంచి కరాటేలో శిక్షణ పొందుతున్న ఈమె జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి కరాటే పోటీల్లో 18 స్వర్ణ, 6 రజత పతకాలు సాధించింది. కరాటేతో పాటు కూచిపూడి నృత్యంలోనూ ప్రావీణ్యం సాధించడం ఈ బాలిక ప్రత్యేకత. చదువులో రాణించి ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని శ్రీలాస్య చెబుతోంది.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం	: 80085 74504	ఆచంట	: 90631 44737
పాలకొల్లు	: 80085 74510	పెనుగొండ	: 80085 74469
పోడూరు	: 90631 44741	పెనుమంట్ర	: 91212 29087

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? పేరుపాలెం కూడలిలో రహదారి పక్కనే చెత్తవేయడంతో పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. **- వీరబాబు**

✔ ఆ ప్రాంతంలో చెత్త వేయకుండా చర్యలు చేపడతాం. **- ఎం.నవీన్‌కిరణ్, డిప్యూటీ ఎంపీడీవో**

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? పార్కు రోడ్డులో చెత్తను సక్రమంగా తొలగించడం లేదు. **- మోహన్‌రావు**

✔ చర్యలు తీసుకుంటాం. **- పాత్రుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

మహిళలు, చిన్నారులకు పోటీలు

పెనుగొండ, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా పెనుగొండ పరిధి రాజగూడెం లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులు, మహిళలకు ఆటల పోటీలు, బైబిల్ పరీక్ష నిర్వహించారు. లూథరన్ చర్చి సభ్యుడు ఉందిర్తి సందీప్ మాట్లాడుతూ విజేతలకు ఈ నెల 31న బహుమతులు అందిస్తామన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ప్రముఖులు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పట్టణంలోని పురపాలక అతిథి గృహంలో ఆదివారం మధ్యాహ్నం బస చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆమె కలిసి పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన యర్రంశెట్టి హైమావతి, బంగారు హరికృష్ణ కుటుంబ సభ్యులు రూ.55 వేల విరాళాన్ని ఆదివారం అందజేశారు. వీరికి స్వామివారి చిత్రపటం అందజేసి దేవస్థానం ప్రతినిధి అభినందించారు.

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే: పాలకొల్లులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత నాయకులు పార్టీ జెండా ఎగురవేసి మాట్లాడారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు జి.భాస్కరరావు, సమన్వయ కర్త హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా..!

జిన్నూరు సొసైటీకి రాష్ట్రస్థాయి అవార్డు

అవార్డు అందుకుంటున్న సొసైటీ ఛైర్‌పర్సన్ ప్రసాద్

జిన్నూరు(పోడూరు), న్యూస్‌టుడే: జిన్నూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి రాష్ట్ర స్థాయి ఉత్తమ పురస్కారం లభించింది. రైతులకు వ్యవసాయ, బంగారు ఆభరణాలపై రుణాల మంజూరు, ఏటా సంక్రాంతి వేళ మహిళలకు తక్కువ వడ్డీకి పెద్ద ఎత్తున రుణాలు అందించడం, ఎరువులు, పురుగుల మందుల విక్రయాలు, అత్యధికంగా డిపాజిట్ల సేకరణతో పాటు ఏసీ ఫంక్షన్ హాలు ద్వారా సొసైటీని లాభాల బాటలో నడిపినందుకు ఈ అవార్డు లభించింది. ఆదివారం గుంటూరు సమీపాన నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు నుంచి సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్‌పర్సన్ దేవళ్ల ప్రసాద్, కార్యదర్శి రామకృష్ణ అవార్డు, రూ.25 వేల చెక్కు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఏఎంసీ వైస్ ఛైర్మన్ దాసరి రత్నంరాజు, తెదేపా నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు పాలవలస తులసీరావు, నీటి సంఘాల అధ్యక్షులు దేవళ్ల శ్రీరామకోటిమోహన్, కుక్కల సత్యనారాయణ తదితరులు అభినందించారు.

ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత

మాట్లాడుతున్న స్వామి సత్యానంద గిరి

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: ధర్మ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా పేరూరులోని సద్గురు గీతాశ్రమానికి చెందిన స్వామి సత్యానందగిరి స్వామి అన్నారు. మొగల్తూరులోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో అయోధ్య సమితి అధ్యక్షుడు పొన్నపల్లి శ్రీనివాస్ వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హిందూధర్మ సమ్మేళన కార్యదర్శి తణుకుల రామకృష్ణ, ముఖ్యవక్త చింతోజు ప్రసాద్, చల్లా దామోదర్, ఉప సర్పంచి బోణం నరసింహారావు, కలిదిండి గణేష్‌బహదూర్, పాలా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ధర్మ పరిరక్షణకు అంతా కృషిచేయాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. పాలకొల్లు క్షత్రియ కల్యాణ వేదిక వద్ద ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం ఆదివారం జరిగింది. తొలుత సుదర్శన హోమాలు, ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం జరిగిన సభలో వీర్రాజు మాట్లాడుతూ గతంలో పరాయి పాలన నుంచి విముక్తి పొందేందుకు ఏర్పడిన ఆర్‌ఎస్‌ఎస్ ఇప్పుడు భారత్‌కు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తోందన్నారు.

రహదారి అంచుల్లో వ్యర్థాల తొలగింపు

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట నియోజకవర్గ పరిధిలోని ప్రధాన రహదారుల అంచుల్లో పేరుకుపోయిన మట్టి, వ్యర్థాలు, పిచ్చి మొక్కల తొలగింపు పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. ఆచంట- పాలకొల్లు మార్గంలో రెండేళ్లుగా పిచ్చిమొక్కలు తొలగించకపోవడంతో అవి రహదారిని కమ్మేశాయి. ఇదే మార్గంలో పలు చోట్ల పంటబోదెల్లో పూడిక తీసి మట్టిని రోడ్డు అంచుల్లో గుట్టలుగా పెట్టారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో గతంలో కథనాలు ప్రచురితమయ్యాయి. ఇటీవల ఈ మార్గాల వెంబడి పొక్లెయిన్‌తో వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టడంతో వాహనదారులకు ఊరట లభించింది.

అసలే మలుపు.. ఆపై అడ్డంకులు

నత్తారామేశ్వరం- మామిడూరు మార్గంలో రేలంగి కాలువకు అనుసంధానంగా ఉన్న కల్వర్టు మలుపు ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈ మార్గంలో పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగిస్తారు. ఈ కల్వర్టుకు రక్షణ గోడలు లేకపోవడంతో పాటు మలుపు వద్ద రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. దీనికి తోడు ఈ ప్రాంతంలో రహదారిపైకి ఇరువైపులా పిచ్చిమొక్కలు దట్టంగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సమస్యను ఆర్అండ్‌బీ ఏఈ యశ్వంత్ దృష్టికి తీసుకెళ్లగా ఈ రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు పంపామని, నిధుల మంజూరైతే కల్వర్టును కూడా పునర్నిర్మిస్తామని పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే, పెనుమంట్ర**

ఒరిగినవి కూలితే.. పెనుముప్పే!

గ్రామాల్లో విద్యుత్తు స్తంభాల నిర్వహణ పట్టించుకోకపోవడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. పెనుమంట్ర మండలంలో జుత్తిగ- మల్లిపూడి- అర్జునుడిపాలెం కాలువ గట్టు మార్గంలో ఓ స్తంభం పక్కకు ఒరిగి కూలిపోయే స్థితికి చేరింది. సమీపాన కాలువ పక్కన ఉన్న మరికొన్ని స్తంభాల వద్ద గట్టు కోతకు గురైంది. భట్లమగుటూరు పీహెచ్‌సీ సమీపాన కొన్ని స్తంభాలు ఒరిగిపోయాయి. వీటి వల్ల ఎప్పుడు ఏ ముప్పు ముంచుకొస్తుందోనని ఆయా ప్రాంతాల వాసులు భయపడుతున్నారు. ఈ అంశంపై విద్యుత్తు ఏఈ నాగరాజు స్పందిస్తూ స్తంభాలను పరిశీలించి సరిచేయిస్తామని చెప్పారు. **- న్యూస్‌టుడే, పెనుమంట్ర**

ఫ్లెక్సీల ఏర్పాటుపై నిషేధం

ఆచంట కూడలిలో అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేస్తూ పోలీసు అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ కూడలిలో అన్ని పార్టీల నాయకులు పోటీ పడి భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిపై ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఆరు నెలల క్రితం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. దీంతో అప్పట్లో ఆ ప్రాంతంలో ఫ్లెక్సీలన్నీ తొలగించారు. కొద్ది రోజులుగా మళ్లీ పాత పరిస్థితి ఏర్పడటంతో పాటు స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో పోలీసులు తాజాగా హెచ్చరిక బోర్డు పెట్టారు. అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని ఆచంట ఎస్సై కె.వెంకటరమణ తెలిపారు. **- న్యూస్‌టుడే, ఆచంట**

శిథిల భవనాల తొలగింపు

పోడూరు, న్యూస్‌టుడే: పోడూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శిథిల భవనాలను ఆదివారం తొలగించారు. ఈ పాఠశాల ప్రాంగణంలో పాత భవనాలు చాలా ఏళ్లుగా ఖాళీగా ఉన్నాయి. దీంతో విద్యార్థులు సైకిళ్లు పెట్టుకొనే స్థలం కరవైంది. ఈ సమస్యపై గతంలో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు ఇటీవల పాత భవనాల తొలగింపునకు వేలం నిర్వహించారు. దీని ద్వారా సమకూరిన రూ.18,200 నగదును జిల్లా పరిషత్తు జమ చేసినట్లు హెచ్ఎం సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఖాళీ అయిన స్థలంలో దాతల సహకారంతో వంట షెడ్డు, సైకిల్ స్టాండు నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

సమష్టి కృషితో ఆలయాల అభివృద్ధి

భట్లమగుటూరు: కమిటీ సభ్యులతో వెంకట్

పెనుమంట్ర, న్యూస్‌టుడే: ఆలయాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని తెదేపా యువ నాయకుడు పితాని వెంకట్ పిలుపునిచ్చారు. భట్లమగుటూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కేశవస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవం ఆలయ ప్రాంగణంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఛైర్మన్‌గా వి.దుర్గాప్రసాద్‌రాజు, సభ్యులుగా వి.శ్రీనివాసరావు, జి.చిట్టిబాబు, జి.వెంకన్న, సి.నాగమణి, ఎం.వెంకటరమణ, జె.సీతామహాలక్ష్మి, ఇ.మహాలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడిగా అగ్నిహోత్రం చక్రపాణి ప్రమాణ స్వీకారం చేశారు. ★ భట్లమగుటూరు, కొయ్యేటిపాడు గ్రామాల్లో పీఎంఏజీవై నిధులు రూ.40 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణాలకు వెంకట్ శంకుస్థాపన చేశారు.

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం.. పోడూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని తెదేపా యువ నాయకుడు పితాని వెంకట్ చెప్పారు. గుమ్మలూరు పరిధి దక్షిణపాలెంలో జడ్పీ నిధులు రూ.15 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. పల్లె పండగ, పంచాయతీరాజ్ ప్రత్యేక ప్యాకేజీ నిధులతో గొలుసు రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు.

జోరుగా రబీ నాట్లు

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: వ్యవసాయాధికారుల సూచనల మేరకు అన్ని ప్రాంతాల్లో రబీ సాగు పనులు జోరందుకున్నాయి. పెనుగొండ మండలంలో 12,200 ఎకరాల్లో సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. పలు గ్రామాల్లో ఇప్పటికే నాట్లు వేసే పనులు మొదలుపెట్టారు.

బీచ్‌లో పర్యాటకుల సందడి

మొగల్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని పేరుపాలెం సౌత్, కేపీపాలెంసౌత్‌లలోని బీచ్‌లో ఆదివారం పర్యాటకులతో సందడి నెలకుంది. ఉదయం నుంచే తరలివచ్చిన పర్యాటకులు సాయంత్రం వరకు తీరంలో అహ్లాదంగా గడిపారు. పలువురు సముద్ర అలల్లో స్నానాలు చేస్తూ సేదతీరారు.

అభిమానుల సేవలు అభినందనీయం

ఆచంట, న్యూస్‌టుడే: జనసేన, ఎన్టీఆర్ అభిమానులు సమాజ సేవల్లో ముందుండటం అభినందనీయమని వక్తలు కొనియాడారు. ఆచంట మండలం వల్లూరులో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పితాని వెంకట్ ప్రారంభించారు. 50 మంది యువకులు రక్తదానం చేశారు. కూటమి నాయకులు తాళం శ్రీనివాసరావు, తోట ఆదినారాయణ, చిట్టూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆచంట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని పితాని వెంకట్ అన్నారు. ఆచంట మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిత

చిన్నారులతో నిర్మలా సీతారామన్

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: బాల్య దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకొని కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చిన్నారులనుద్దేశించి అన్నారు. పెదమైనవానిలంకలో పర్యటన సందర్భంగా ఆదివారం డిజిటల్ భవనం వద్ద సభ అనంతరం ఆమె కోత నివారణకు సముద్ర తీరం వెంబడి నిర్మిస్తున్న గోడను పరిశీలించేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆమెను చూసేందుకు వచ్చిన చిన్నారులతో మాట్లాడారు. ఏం చదువున్నారంటూ ఆరా తీశారు. బాగా చదువుకుని ప్రయోజకులు కావాలని, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. చిన్నారులను ఆశీర్వదించి వారితో ఫొటోలు తీయించుకున్నారు.

ఘన స్వాగతం.. పెదమైనవానిలంకలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఘన స్వాగతం లభించింది. ఉదయం 11 గంటల తర్వాత గ్రామానికి చేరుకున్న ఆమెపై గ్రామస్థులు పూల వర్షం కురిపించారు. మేళతాళాలతో ఘన స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

సోమేశ్వరాలయంలో పూజలు

పోడూరు, న్యూస్‌టుడే: కవిటంలో కొలువైన శ్రీ పార్వతీ సమేత సోమేశ్వరస్వామిని నిర్మలా సీతారామన్ ఆదివారం సాయంత్రం దర్శించుకొని పూజలు చేయించుకున్నారు. కవిటంలో రూ.1.96 కోట్లతో ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించి నిధుల మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ఆమె సిఫార్సు చేశారు. ఆమెకు సర్పంచి చుట్టుగుళ్ల పూర్ణిమ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ ఆలయాన్ని పూర్వం పరకాల కుటుంబ సభ్యులు ప్రతిష్ఠించినట్లు గ్రామపెద్దలు చెబుతున్నారు.

బ్యాంకుల విరాళం

నరసాపురం, గ్రామీణ, న్యూస్‌టుడే: పీఎంలంక గ్రామ అభివృద్ధికి పలు జాతీయ బ్యాంకులు విరాళాలు అందించాయి. గ్రామ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎస్‌బీఐ అధికారులు రూ.50 లక్షల విరాళం చెక్కు అందించారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో యూనియన్ బ్యాంకు నిధులు రూ.18 లక్షలతో అభివృద్ధి చేసిన ప్రయోగశాలను ఆమె ప్రారంభించారు.

వంతెనలపై ముప్పుతిప్పలు!

పోడూరు, పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాల్లో పంట, మురుగు కాలువలపై వంతెనలు శిథిలావస్థకు చేరి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. పోడూరు- మినిమించిలిపాడు గ్రామాల మధ్య తాడేరు డ్రెయిన్‌పై వంతెన పూర్తిగా శిథిలమైపోయింది. మినిమించిలిపాడు వైపు రెండు రక్షణ గోడలు విరిగి డ్రెయిన్‌లోకి కూలిపోయాయి. పోడూరు వైపు ఒక గోడ కూలిపోయింది. దీనికి తోడు భారీ గుంతలు గోతులు పడ్డాయి. ఆచంట, పోడూరు మండలాల పరిధిలో పలు గ్రామాలకు గొలుసు రహదారిగా ఉన్న ఈ మార్గంలో నిత్యం పాఠశాల బస్సులు, ఆటోలు, ఆక్వా, కొబ్బరి, ధాన్యం లారీలు, ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ అంశంపై ఆర్అండ్‌బీ ఏఈ మూర్తి స్పందిస్తూ తాడేరు డ్రెయిన్‌పై కొత్త వంతెన నిర్మాణానికి ప్రతిపాదించినట్లు తెలిపారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు.

పాలకొల్లు గ్రామీణ పంచాయతీ పరిధి పెద గరువు వద్ద దిగమర్రు పంటకాలువపై ఉన్న వంతెన ఇది. రక్షణ గోడలు కూలిపోవడంతో రాత్రి వేళ వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

సమాజ సేవలే లక్ష్యం

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: సమాజ సేవలే లయన్స్ క్లబ్ లక్ష్యమని ఆ క్లబ్ జోన్ ఛైర్‌పర్సన్ పొన్నాడ పద్మావతి సుబ్రహ్మణ్యం అన్నారు. నరసాపురం పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో ఆ క్లబ్ సేవా అవార్డుల ప్రదానోత్సవం శిరిగినీడి రాజ్యలక్ష్మి, పి.ఎస్.ఎన్ మూర్తి ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. నరసాపురం పట్టణ, మండల, పాలకొల్లు, మొగల్తూరు మండలాల క్లబ్ సభ్యులకు సేవా అవార్డులు అందజేశారు. క్లబ్ ఎంసీసీ శ్రీరామ్ సురేశ్, గవర్నర్ పాపారావు నాయుడు, చినిమిల్లి సత్యనారాయణ, త్సవటపల్లి సత్యనారాయణ, కిశోర్ కుమార్ పాల్గొన్నారు.

అమృతమూర్తికి అశ్రునివాళి

జననం 13-01-1941

శ్రీమతి మండెల ఆండాళ్ గారు

నిర్యాణం 19-12-2025

W/o. మండెల వెంకట రామ్ (లేటు)

పాలకొల్లు

ఆప్యాయతానురాగాలతో మమ్ములను పెంచి మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మహోన్నతమూర్తి **శ్రీమతి మండెల ఆండాళ్ గారి** మరణం మాకు తీరనిలోటు.

వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమార్తెలు: మంగెన విమల మంగతాయారు, దాసరి పుష్పవల్లితాయారు, పోలిశెట్టి భానుమతి (లేటు), శానం పూర్ణిమ, శానం రమాదేవి

అల్లుళ్ళు: రంగనాథరావు, విశ్వేశ్వరరావు, అనంత రత్నకుమార్, డా॥ నారాయణమూర్తి, మిహిర్ మోహన్

మనుమరాండ్రు: బెల్లంకొండ సౌమ్య - ప్రమోద్, సానా దివ్య - లెనిన్, కాళ్ళ దీప్తి - నరేష్, నరహరిశెట్టి నవ్య - నవీన్, ముత్యాల శ్రావ్య - పాండు, శానం సంధ్యా వినీత

మనుమలు: పోలిశెట్టి ఆదిత్య, శానం జయవినయ్‌చంద్ర, శానం సురేన్ శేఖర్ మరియు మునిమనుమలు, ముని మనుమరాండ్రు

ఆప్తులు: డా॥ Ch. సత్యనారాయణమూర్తి (బాబ్జీ), వట్టి రమేష్, మండెల నారాయణరావు, మండెల వెంకటేశ్వరరావు మరియు బంధుమిత్రులు

పెదకార్యం: ది. 29-12-2025 సోమవారం పాలకొల్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనం నందు జరుగును

(c) eenadu

బాలవికాస్ పిల్లల గొబ్బిళ్ల పూజ

తాడేపల్లిగూడెంఅర్బన్, న్యూస్‌టుడే: స్థానిక సుబ్బారావుపేటలో ఉన్న సత్యసాయి సేవా సమితిలో ఆదివారం సాయంత్రం బాల వికాస్ పిల్లలతో గొబ్బిళ్లపూజ నిర్వహించారు. సుమారు 50 మంది బాలికలు ఈ పూజలో పాల్గొన్నారు. బాలవికాస్ గురువులు శ్రీలక్ష్మి, కళావతి, పార్వతి, ధనలక్ష్మి, లక్ష్మీదుర్గ, లక్ష్మీ పమిడేశ్వరి, పుష్పావతి తదితరులు బాలికలతో గొబ్బిళ్లపూజ చేయించారు. సేవాదళ్ సభ్యులు అనంతలక్ష్మి, సుధ, కుమారి తదితరులు వారికి సహాయసహకారాలు అందించారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్తు నియంత్రికలకు తీగజాతి మొక్కలు అల్లుకోవడంతో గాలి వీచినప్పుడల్లా తీగలు విద్యుత్తు తీగలను తాకి విద్యుత్తు నిలిచిపోతోంది.. అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం గ్రామంలో, ఇరగవరం మండలం గవరపాలెంలో విద్యుత్తు నియంత్రికలకు తీగజాతి మొక్కలు అల్లుకున్నాయి. గాలి వీచినప్పుడు అవి విద్యుత్తు తీగలను తాకడంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోతోంది. దీనిపై విద్యుత్తు ఏఈ సురేశ్ మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

కరపత్రాలు చూపుతున్న నాయకులు

మహాసభలకు తరలిరావాలి

తణుకు, న్యూస్‌టుడే: విశాఖలో జనవరి 4న నిర్వహించనున్న సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలకు కార్మికులు, ఉద్యోగులు తరలిరావాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి వీవీ.ప్రతాప్ పిలుపునిచ్చారు. మహాసభలు విజయవంతం కోరుతూ ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలను రద్దు చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత లేకుండా ప్రభుత్వ రంగ సంస్థలను సైతం నాశనం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు గోపి, ఆదినారాయణ బాబు తదితరులు పాల్గొన్నారు.

వాడుక సులభం.. నిర్వహణ జటిలం

వేధిస్తున్న ప్లాస్టిక్ సమస్య

వేల్పూరు (తణుకు గ్రామీణం),న్యూస్‌టుడే: తణుకు పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్‌ను యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. ఏ వస్తువు అయినా పాలిథిన్ కవర్లలో తీసుకెళ్తున్నారు. ఆఖరికి టీ కూడా ప్లాస్టిక్ సంచుల్లో ప్యాక్ చేయించుకుంటున్నారు. అదేవిధంగా కర్రీ పాయింట్లలో వేడి కూరలు ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేయించుకుంటున్నారు. ఇలా వాడటంతో ఏడాదికి టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగి పోతున్నాయి. పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయి.

తేతలి జాతీయ రహదారి అంచుల్లో

దశాబ్ద కాలం నుంచి

గత దశాబ్దం కాలంగా పాలిథిన్ కవర్ల వినియోగం ఎక్కువైంది. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, బహిరంగ మల విసర్జన నిర్మూలనతో పాటు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించటానికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది. అయినప్పటికీ ప్రజల నిత్యవసరాల్లో భాగంగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం మానడం లేదు. తణుకు పట్టణంలో రోజుకు సగటున 40 టన్నుల వరకు చెత్త ఉత్పత్తి కాగా వాటిలో 50 శాతానికి పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నట్లు అధికారులు అంచనా వేశారు.

అడుగడుగునా వ్యర్థాలే

కిరాణా దుకాణాలతో పాటు మాంసం, మద్యం, సంతలు, పాన్ మసాలా, ఫాస్ట్‌ఫుడ్స్ సెంటర్లు, మిఠాయి దుకాణాలు, వివిధ తినుబండారాల ప్యాకింగ్‌లో సైతం ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నారు. ఆ వ్యర్థాలు డ్రెయిన్లు, పంట కాలువల్లో పడేయటంతో వాటిల్లో పేరుకుపోతున్నాయి. మురుగు ముందుకెళ్లని పరిస్థితి నెలకొంటోంది. శుభకార్యాల్లో భోజనాల వద్ద తాగే నీటికి ఇతర అవసరాలకు ప్లాస్టిక్ గ్లాసులు, గిన్నెలు, టీ గ్లాసులు వినియోగిస్తున్నారు. ఒకసారి వాడిపారేసే ప్లాస్టిక్‌పై నిషేధం ఉన్నా అమలు మాత్రం జరగడం లేదు. మద్యం తదితర దుకాణాల వద్ద వినియోగించిన ప్లాస్టిక్ గ్లాసులు, తాగునీటి సంచులను గుట్టగా పోసి తగలబెడుతున్నారు. తద్వారా వెలువడే విష వాయువులు పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నాయి. స్వచ్ఛాంధ్ర పేరిట ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని, వచ్చే ఏడాది జూన్‌కల్లా రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దే దిశగా పనిచేస్తోందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	99488 53114
తణుకు	85558 50851
తణుకు గ్రామీణం	63005 79402
అత్తిలి	91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? డీఎస్ చెరువు సమీపంలోని సత్యసాయి ఆలయం వెనుక రోడ్డులో పురపాలక వీధి దీపాలు వెలగక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు - **రామకృష్ణ**

✔ చర్యలు చేపడతాం - **ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్**

? యాగర్లపల్లి వసతిగృహం ఎదురుగా భూగర్భ మురుగుబోదె లీకేజీతో రహదారి ఛిద్రంగా మారుతోంది. - **రాఘవ, స్థానికుడు.**

✔ భూగర్భ మురుగుబోదె లీకేజీని అరికట్టేలా చర్యలు చేపడతాం - **సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్.**

పాల్గొన్న భాజపా నాయకులు

కళలను గుర్తించేలా మన్ కీ బాత్

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: కళా సాంస్కృతిక, సేవ, సృజనాత్మకతను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు ప్రధాన మంత్రి మన్ కీ బాత్ ద్వారా నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని భాజపా తాడేపల్లిగూడెం నియోజకవర్గ బాధ్యుడు ఈతకోట భీమశంకర రావు(తాతాజీ) కొనియాడారు. ఆదివారం తన నివాసంలో నాయకులు కార్యకర్తలతో కలిసి మన్‌కీబాత్ 129వ కార్యక్రమాన్ని వీక్షణ అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలోని వివిధ వృత్తుల వారిని గుర్తించి వారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నారని వివరించారు. తద్వారా ఎంతో మందికి ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే కాకుండా వారి ఉత్పత్తులకు గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా కన్వీనర్ కరెడ్ల సోమేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్, అల్పసంఖ్యాక వర్గాల జిల్లా కో కన్వీనర్ రామగని సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్టాల రాంబాబు, బూత్ ఇన్‌ఛార్జి సీతారం విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని నిరసన

తణుకు, న్యూస్‌టుడే: ఇరగవరం నుంచి గొల్లగుంట మీదుగా ఏలేటిపాడు వెళ్లే రహదారి ప్రమాదాలకు నిలయంగా ఉందని, తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఎం పార్టీ ఇరగవరం మండల కన్వీనర్ మునిస్వామి డిమాండ్ చేశారు. రహదారి నిర్మాణం చేపట్టాలంటూ ఆదివారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా కనీస అవసరాలను తీర్చలేకపోవడం శోచనీయమన్నారు. రహదారి నిర్మాణం చేపట్టకుంటే ప్రజలే ఉద్యమకారులుగా మారి సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు త్రిమూర్తులు, రామాంజనేయులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ దారుల నిర్మాణానికి శంకుస్థాపన

ఇరగవరం, న్యూస్‌టుడే: మండలంలో రూ.34లక్షలతో నిర్మించనున్న నాలుగు సీసీ రహదారుల పనులకు ఆదివారం కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. రేలంగి శివారు బొజ్జరాజపాలెం, చుక్కావారి తోట, గుమ్మళ్లపాడు గ్రామాల్లో రూ.30లక్షలతో సీసీ రహదారులు నిర్మిస్తారు. అలాగే పేకేరులో రూ.4లక్షలతో నిర్మించనున్నారు. కార్యక్రమంలో రేలంగి, పేకేరు గ్రామాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉజ్వల యోజన గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో పేదలకు ఉచితంగా ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందజేస్తోందని తెదేపా బల్లిపాడు అధ్యక్షుడు గారపాటి అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం బల్లిపాడు గ్రామానికి 20 మంది పేదలకు కూటమి నాయకులు ఉజ్వల యోజన గ్యాస్ కనెక్షన్లు అందజేశారు.

కూరగాయల మార్కెట్ సంఘం అధ్యక్షుడి ఎన్నిక

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా లయన్. ఎస్.వి.సి. సత్తిబాబు ఎన్నికయ్యారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా కూసంపూడి పెద్దిరాజు, ఉపాధ్యక్షునిగా ఎల్.కె.ఆర్.నాగబాబు, కార్యదర్శిగా సూరిబాబు, సహాయ కార్యదర్శిగా సోంబాబు, కోశాధికారిగా ఎస్ వివిఎస్ మెహెర్‌సాయి ఎన్నికయ్యారు.

బహుమతులు అందజేస్తున్న బాబ్జీ

కార్యకర్తలకు జ్ఞాపికల అందజేత

భాగ్యలక్ష్మిపేట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: మండలంలోని సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉత్తమ కార్యకర్తలకు ఆదివారం ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ తన విడిది కార్యాలయంలో జ్ఞాపికలు అందజేశారు. తెదేపాలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరి సమస్య పరిష్కారమే విధిగా కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మండల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులు, తదితరులు పాల్గొన్నారు.

సంచార శకటంతో ఇంటింటికీ ఉచిత వైద్యం

తణుకు, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం సంచారశకటం ద్వారా ఇంటింటికీ వైద్యం కార్యక్రమం నిర్వహించారు. నేత్ర వైద్యులు డా హుస్సేన్ అహ్మద్, ఎముకల వైద్య నిపుణులు డా సిమ్మగడ్డ అచ్యుత రామయ్య పట్టణంలోని వివిధ ప్రాంతాలు పర్యటించి మంచానికే పరిమితమైన 10 మంది వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించారు. చలసాని కృష్ణ ప్రసాద్ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. ఈ ఉచిత వైద్య సేవలు కావాల్సిన వారు సెల్: 998 534 3530, 905 929 0717 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అభ్యుదయ భావాలు పెంచేందుకు బాలోత్సవం : ఆరిమిల్లి

తణుకు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దేశభక్తి అభ్యుదయ భావాలు పెంపొందించడానికి బాలోత్సవం పిల్లల సంబరాలు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో బాలోత్సవం గోడపత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. జనవరి 23వ నుంచి 25 తేదీల వరకు జరిగే ఈ కార్యక్రమంలో తణుకు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలోని సుమారు 4వేల మంది పైగా విద్యార్థులు పాల్గొంటారని అన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న రాధాకృష్ణ తదితరులు

తణుకు, న్యూస్‌టుడే: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటనలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదివారం పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా నరసాపురం మండలంలోని దత్తత తీసుకున్న పెదమైనవానిలంక గ్రామాన్ని మంత్రి సీతారామన్ ఆదివారం సందర్శించారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ పర్యటనలో రాధాకృష్ణ భాగస్వామ్యమయ్యారు.

డిమాన్ పవన్‌కు సత్కారం.. తణుకు, న్యూస్‌టుడే: బిగ్ బాస్ సీజన్ 9లో అంచలంచెలుగా తన ప్రతిభ చూపించి తృతీయ స్థానంలో నిలిచిన డిమాన్ పవన్‌ను తణుకు ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కొనియాడారు. తణుకు పట్టణానికి చెందిన డిమాన్ పవన్ ఆదివారం రాధాకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు.

విద్యారంగంలో బుల్డోజర్ సంస్కరణలు: ఎమ్మెల్సీ

పెంటపాడు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: విద్యారంగంలో వస్తున్న మార్పులు బుల్డోజర్ సంస్కరణల లాగా ఉన్నాయని ఉభయగోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఆది ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేసే విధంగా ఉన్నాయని విమర్శించారు. పెంటపాడు మండలం గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం యూనియన్ జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు అధ్యక్షతన నిర్వహించిన యూటీఎఫ్ జిల్లా 51వ కౌన్సిల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావుతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ కేవీ సత్యనారాయణ మూర్తి, జిల్లా కార్యదర్శి శివప్రసాద్, సంఘరాష్ట్ర నాయకులు ఎస్.జ్యోతిబసు జిల్లా నాయకులు, సంఘసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో గోపీమూర్తి

మలుపు.. ప్రమాదాలకు పిలుపు

కె.ఇల్లిందలపర్రు నుంచి ఇరగవరం వెళ్లే ప్రధాన రహదారికి చేరే మార్గంలో ఉన్న మలుపులు ప్రమాదాలకు తావిస్తున్నాయి. కిలో మీటర్ పరిధిలోనే నాలుగు మలుపులున్నాయి. మలుపు తిరిగే సయయంలో రహదారి పక్కనున్న చెట్లు గుబురుగా ఉండటంతో వాహనచోదకులు ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేకపోతున్నారు. ఈ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మలుపుల్లో వేగ నియంత్రికలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఇరగవరం**

కూలేదాకా... కూల్చరా?

పెంటపాడు మండల పరిధిలోని పెభైరవ పెంటపాడులో తాగునీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. దశాబ్దాల క్రితం గ్రామస్థులకు తాగు నీరందించేందుకు ఈ ట్యాంకు నిర్మించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరి వాడుకలో లేకపోవడంతో అధ్వాన స్థితికి చేరింది. అధికారులు స్పందించి దాన్ని కూల్చివేసి తదుపరి చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తాడేపల్లిగూడెం టూటౌన్**

తూడు నిలిచి.. మురుగు వెనక్కి

తణుకు మండలం కొమరవరం గ్రామంలో మురుగు కాలువ గుర్రపు డెక్క, తూడుతో పూడుకుపోయింది. దీంతో మురుగు ముందుకు పారక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. కొమరవరం గ్రామం, లక్ష్మీగణేష్ నగర్, శివబాలాజి కాలనీ వంటి తదితర ప్రాంతాల డ్రైన్లు ఈ మురుగు కాలువలోనే కలుస్తాయి. దీనికి తోడు మురుగు నీటి సమస్యతో దోమలు విజృంభించి తరచు విష జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆ శాఖ ఏఈ వివేకానంద స్పందిస్తూ. పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, తణుకు గ్రామీణం**

శౌచాలయాలు.. అపరిశుభ్రతకు నిలయాలు

మండలంలోని వేల్పూర్ గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసింది. ప్రధానంగా శౌచాలయాల వద్ద అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. గ్రామంలో సేకరించిన చెత్తను సామూహిక మరుగు దొడ్ల వద్ద వేయడంతో మరింత దుర్గంధం వ్యాపిస్తోంది. బురద, తుప్పలు, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తోంది. దీంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. ఇదిలాఉంటే గ్రామంలో కొన్ని ప్రాంతాల్లో పూడికతీత చేపట్టకపోవడంతో ఎక్కడ మురుగు అక్కడే పేరుకుపోవడంతో కంపు కొడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, వేల్పూర్ (తణుకు గ్రామీణం)**

గణేశ్ సుధీర్ వర్మతో నిర్వాహకులు

భారత్‌ను విశ్వగురువుగా చేయడమే లక్ష్యం

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: భారతదేశాన్ని విశ్వగురువుగా చేయడమే ఆర్ఎస్ఎస్ సంఘం లక్ష్యమని తణుకు మండలం పైడిపర్రుకు చెందిన శ్రీవిద్య ఉపాసకులు, జ్యోతిష సిద్ధాంతి పొన్నా గణేశ్ సుధీర్ వర్మ అన్నారు. ఆదివారం అత్తిలి మండలం ఆరవల్లి గ్రామం కొవ్వూరి లక్ష్మీ గంగిరెడ్డి మెమోరియల్ కల్యాణ మండపంలో నిర్వహించిన హిందూ సమ్మేళనం లో పాల్గొని మాట్లాడారు. హిందూ ధర్మం, హిందూ సంస్కృతిని రక్షించి, హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి మన దేశాన్ని విశ్వగురువుగా నిర్మాణం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంచిలి, దంతుపల్లి, ఉనికిలి, లక్ష్మీనారాయణపురం, స్కిన్నెరపురం, కంచుమర్రు, ఈడూరు, కొమ్మరకు చెందిన హిందూ బంధువులు పాల్గొన్నారు.

తెదేపా బలోపేతానికి శ్రమిస్తా: వనమా

మహదేవపట్నం (ఉండి), న్యూస్‌టుడే: తెదేపా బలోపేతానికి తన కుటుంబం అహర్నిశలు శ్రమిస్తోందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వనిమా శ్రీనివాస్ తెలిపారు. మహదేవపట్నంలోని ఆయన నివాసంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. గత 25 సంవత్సరాల నుంచి తమ కుటుంబమంతా తెదేపాలో ఉందన్నారు. పదేళ్ల నుంచి గ్రామ పార్టీ అధ్యక్షునిగా వ్యవహరిస్తున్న తనను ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, ఆయన తనయుడు భరత్, మండల పార్టీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజుల సహకారంతో జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారని తెలిపారు.

మైనింగ్ మాఫియాపై స్థానికుల ఆగ్రహం

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తూరులో మైనింగ్ మాఫియాపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యథేచ్ఛగా గ్రామం నుంచి మట్టి తోలకాలు జరగడంతో గ్రామస్థులు దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నామని లారీలు నిలుపుదల చేయాలన్నారు. వారు వినకుండా యథావిధిగా రాత్రులు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఆగ్రహం చెందిన గ్రామస్థులు ఇనుప రాడ్డును రహదారికి అడ్డంగా పెట్టారు. దాన్ని ఆదివారం తెల్లవారు జామున లారీతో ఢీ కొట్టడంతో ఆగ్రహావేశాలకు లోనయ్యారు.

నలుగురు జూదరుల అరెస్టు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : జూద శిబిరంపై దాడి చేసి నలుగురిని ఆదివారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అత్తిలి మండలం ఉనికిలి గ్రామ శివార్లో జూద శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.3100 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రేమరాజు తెలిపారు.

రాష్ట్రస్థాయి పురస్కారం స్వీకరణ

ఇరగవరం, న్యూస్‌టుడే: జాతీయ సహకార అభివృద్ధి సంస్థ(ఎన్‌సీడీసీ) ఆధ్వర్యంలో గుంటూరు నాగార్జునా విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎఫ్‌పీవో కో-ఆపరేటివ్ విభాగంలో రాష్ట్రస్థాయి అవార్డును రేలంగి సొసైటీ అందుకుంది. ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, జాతీయ సహకార అభివృద్ధి సంస్థ రీజనల్ డైరెక్టర్ స్నేహాసు గోస్వామి చేతుల మీదుగా జ్ఞాపిక, రూ.35వేల నగదు పురస్కారం అందుకున్నట్లు సంఘ కార్యదర్శి బలుసు శ్రీనివాసులు, పీఏసీ అధ్యక్షుడు అడ్డాల మెంటారావు చెప్పారు. కార్యక్రమంలో అదనపు రిజిస్ట్రార్ ఆనందబాబు, ఆప్కాబ్ ఎండీ ఆర్‌వీ రామకృష్ణ, రేలంగి సొసైటీ పీఏసీ సభ్యులు మంగెన శ్రీనివాసరావు, కోడెల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న శ్రీనివాసులు, మెంటారావు

ఆ రోజులు మళ్లీ వచ్చాయి

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: మండలంలోని జగన్నాథపురంలో ప్రాథమిక పాఠశాల నంబర్-2లో 2003 నుంచి 2010 మధ్య చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చాలా కాలం తరువాత కలుసుకున్న వారు కుటుంబ సభ్యులతో కలిసి ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. ముందుగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. వారి చిన నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమ గురువులు నేర్పిన విద్యాబుద్ధులే ఈ రోజు తమ ఉన్నతికి బాటలు వేశాయన్నారు.

పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల బృంద చిత్రం

ప్రాణ త్యాగాలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది

తణుకు, న్యూస్‌టుడే: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఆ పార్టీ తణుకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దిర్శిపో రామకృష్ణ పేర్కొన్నారు. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం తణుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక స్వాతంత్ర్య పార్కులోని గాంధీ, ఇందిరా గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో కనీస పాత్రలేని కొంతమంది గాంధీ, నెహ్రూల మీద తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు వరలక్ష్మి, రామకృష్ణంరాజు, లక్ష్మీ, శాంతారావు, రాజ్యలక్ష్మి, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న రామకృష్ణ

రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు

నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనింద్రకొలను, నిడమర్రు ప్రజల దారి కష్టాలు ఎట్టకేలకు తీరనున్నాయి. ఈ రోడ్డు నిర్మాణానికి రూ. 80 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో 1.6 కిలోమీటర్ల అధ్వాన మార్గాన్ని తారు రోడ్డుగా నిర్మించనున్నారు. గత వైకాపా ప్రభుత్వం రహదారి నిర్వహణను పూర్తిగా విస్మరించింది. ఫలితంగా అయిదేళ్లపాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పత్తేపురం నుంచి పెదనింద్రకొలను శివారు వరకు రూ.3 కోట్లతో రోడ్డు నిర్మించింది. మిగతా 1.6 కి.మీ. రహదారి ఏర్పాటుకు తాజాగా నిధులు కేటాయించింది.

కాలనీ.. కష్టాల కహానీ

తాడేపల్లిగూడెంఅర్బన్, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని హౌసింగ్ బోర్డు కాలనీ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. 34, 35 వార్డుల్లోని ప్రజలు కనీస అవసరాలు లేక ఇబ్బంది పడుతున్నారు. కాలనీలో మూడు భాగాల్లో 700కు పైగా గృహాలు ఉన్నాయి. కానీ డ్రెయినేజీ, రోడ్ల నిర్మాణాలు చేయకపోవడంతో కష్టాలు వెంటాడుతున్నాయి.

వర్షాకాలం వచ్చిందంటే వారి బాధలు వర్ణనాతీతం. గోతులు నిండిపోయి, మురుగు నీరు పారకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో సాయంత్రమైతే ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి. వీటి వల్ల చిన్నారులు, వృద్ధులు తరచూ విషజ్వరాల బారిన పడుతున్నారు.

కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి స్థాయిలో జరగలేదు. కొంత కాలం క్రితం నిట్ కాలేజీకి వెళ్లే రోడ్డు నిర్మాణం కోసం రహదారిని తవ్వేశారు. ఆ తర్వాత దానిని పూర్తిగా వదిలేశారు. దీంతో దుమ్మురేగి కనీసం నడవలేని పరిస్థితి నెలకొంది. వర్షాకాలం వస్తే ప్రజలు నరకయాతన పడుతున్నారు. లారీలు ఇటు వైపు సమయం సందర్భం లేకుండా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో మిగతా వాహనాలకు ఇబ్బంది తప్పడంలేదు.

అధ్వానంగా మట్టి రోడ్డు

40 సంవత్సరాల క్రితం ఏర్పడిన కాలనీకి ఇప్పటికి కూడా మౌలిక సదుపాయాలు లేవు. ఏ సౌకర్యాలు లేకపోయినా ఇంటిపన్ను, కుళాయి పన్ను కట్టవలసి వస్తోందని, ఇంటిపై ఆదాయం రాక ఇంటి పన్ను కట్టలేక అనేక కష్టాలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని వేడుకొంటున్నారు.

మొదటి అడుగు అదుర్స్

ఆర్థికంగా ఆదుకుంటే మరిన్ని ఫలితాలు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : పురుషులతో సమానంగా వ్యాపారాల్లో రాణిస్తున్నారు మహిళామణులు. వివిధ రకాల వ్యాపారాలను నిర్వహిస్తూ కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకుంటూ కుటుంబానికి బాసటగా నిలుస్తున్నారు. వేన్నీళ్లకు చన్నీళ్లలా భర్త సంపాదనకు కుటుంబ నిర్వహణలో తమ బాధ్యత, భాగస్వామ్యాన్ని నిర్వహిస్తున్నారు. కుటుంబ యజమానికి సాయమందిస్తూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. ప్రభుత్వం వ్యక్తిగత రుణాలు అందిస్తే మరింత ప్రగతి వైపు అడుగులు వేస్తామని చెబుతున్నారు.

టైలరింగ్‌తో కుటుంబ పోషణ

డ్వాక్రా ద్వారా వచ్చిన ఆర్థిక సాయానికి తోడు నేను దాచుకున్న కొంత సొమ్ముతో టైలరింగ్ మిషన్లను కొనుగోలు చేశా. స్థానికంగా ఉన్న యువతులకు, టైలరింగ్‌పై మక్కువ గల వారికి శిక్షణనిస్తూ, నేనూ టైలరింగ్ చేస్తూ కుటుంబ పోషణ చేసుకుంటున్నా. డ్వాక్రాతో వచ్చిన ఆర్థిక సాయం నన్ను నా కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టింది. వ్యక్తిగత రుణాలు అందిస్తే మరింత మందికి శిక్షణనిచ్చి ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం కల్పించండి. **- ఎం.దానేశ్వరి.**

వ్యక్తిగత రుణాలతో ప్రయోజనం

గత తొమ్మిదేళ్లుగా పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్నా. భర్త సహకారంతో ఇంటి వద్దనే జనపనార తాళ్లు , ఇతర వస్తువుల వ్యాపారం చిన్నగా ప్రారంభించా. ప్రభుత్వం నుంచి అందిస్తున్న రుణం గ్రూపు సభ్యులతో పాటు నేనూ అందుకున్నా. రాజమండ్రి, ఏలూరు, విజయవాడ ప్రాంతాల నుంచి వస్తువులు తీసుకొచ్చి స్థానికంగా విక్రయిస్తున్నా. ఖర్చులు పోగా రూ.15వేలు వరకు ఆదాయం వస్తోంది. ప్రభుత్వం వ్యక్తిగత రుణాలు అందిస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి అవకాశం ఉంటుంది. **- కొండా రోజా రమణి,**

సేంద్రియ కూరగాయలు పండించా

కుటుంబానికి తోడుగా ఉండాలనే ఉద్దేశంతో అరెకరం పొలంలో రకరకాల కూరగాయలు పండించి అమ్మకాలు చేస్తున్నా. వచ్చిన ఆదాయంతో కుటుంబానికి సహకరిస్తున్నా. ప్రభుత్వం నుంచి సాయమందిస్తే మందులు వాడకుండా సేంద్రియ కూరగాయలు పండించి ప్రజలకు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన కూరగాయలు ప్రజలకు అందిస్తా. **- బొక్కా వరలక్ష్మి**

(c) eenadu

కడపలో ఛాంపియన్

ఛాంపియన్ చిత్ర బృందం కడప నగరంలో ఆదివారం సందడి చేసింది. చిత్ర హీరో, హీరోయిన్ రోషన్, అనశ్వర రాజన్ తదితరులు ఆ చిత్రం ప్రదర్శితమవుతున్న కడప నగరంలోని థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి చిత్రాన్ని వీక్షించారు. అనంతరం పలువురితో ముచ్చటించారు. - న్యూస్‌టుడే, బిల్టప్

సాంస్కృతిక సమరోత్సాహం

ఒంటిమిట్ట కోదండ రామాలయం సీతారాముల కల్యాణ వేదిక ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళనంలో కళాకారులు సాంస్కృతిక సమరోత్సాహంతో ప్రదర్శన చేశారు. కొత్తమాధవరంలోని వేద నృత్యాలయం నిర్వాహకులు సౌమ్య ఆధ్వర్యంలో కూచిపూడి, భరత నాట్యంతో పిల్లలు భళా అనేలా మెప్పించారు. చిన్నకొత్తపల్లికి చెందిన గురువు దాస్ పర్యవేక్షణలో చిన్నారుల కోలాటం విశేషంగా అలరించింది. మలకాటిపల్లె పిల్లలు, అతివలు కోలాటం చేశారు. రామకృష్ణ పాఠశాల విద్యార్థులు భగవద్గీత శ్లోకాలు చదివారు. పలుకూరి ఖ్యాతి యూన్సీ లక్ష్మీబాయి వేషాధారణతో ఆకట్టుకున్నారు. - న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

కబ్జాకు సిద్ధంగా నగరపాలక సంస్థ స్థలం

ఇలా వదిలేస్తే.. అంగుళం కూడా మిగలదు

కడప నగరపాలక, న్యూస్‌టుడే: దొంగచేతికిచ్చినా ఈ స్థలానికి రూ.2 కోట్లు ఇస్తారు! కానీ కడప నగరపాలక సంస్థ ఆ స్థలం మాది కాదన్నట్టు వ్యవహరిస్తోంది. దేవుని కడప రోడ్డులో మాచుపల్లి బస్టాండుకు అత్యంత సమీపంలో ప్రధాన రహదారికి పక్కన నగరపాలక సంస్థ పాఠశాల ఉండేది. కొన్నేళ్ల క్రితం పాఠశాల లోపలి గోడను పగలగొట్టి తరగతి గదులను ఆక్రమించడం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో పాఠశాల భవనాన్ని కూల్చి చేపల మార్కెట్టు కట్టాలని తీర్మానించారు. దీనికి కావాల్సిన నిధులు కూడా విడుదలయ్యాయి. కానీ ఆ ప్రతిపాదన కాగితాలకే పరిమితమయింది. ఇంతలో ఈ స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది.

- పాఠశాల భవన శిథిలాలన్నింటినీ తొలగించి నేలను చదును చేశారు. ఆ స్థలంలో ప్రాథమికంగా తాత్కాలిక దుకాణాలను ఏర్పాటు చేసి తదనంతరం పూర్తి స్థాయిలో స్వాధీనంలోకి తీసుకోవడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి.
- పదేళ్లుగా బడి స్థలాన్ని ఇలా వదిలేస్తే కబ్జా చేయకుండా ఉంటారా అని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. కార్పొరేషన్‌కు చెందిన ఈ స్థలంలో మత్స్యకారుల కోసం చేపల మార్కెట్టు కట్టాలని లేదా ఇతర ప్రజాప్రయోజన పనులకు వినియోగించాలని కోరుతున్నారు.

మూడు జిల్లాల్లో అన్నమయ్య విలీనం!

- రాయచోటి ప్రతిపాదిత మదనపల్లె జిల్లాలోకి
- తిరుపతిలోకి రైల్వేకోడూరు నియోజకర్గం
- కడపలోకి రాజంపేటలోని ఆరు మండలాలు

ఈనాడు, కడప : అన్నమయ్య జిల్లాను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం దాదాపు నిర్ణయించింది. విభజిత జిల్లాలో మిగిలిన రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు నియోజకవర్గాలను మూడు జిల్లాల్లో కలపాలని సూత్రప్రాయ నిర్ణయానికి వచ్చింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు స్పష్టత ఇచ్చింది. వైఎస్‌ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు చెరుకూరి శ్రీధర్, నిశాంత్ కుమార్‌లను అమరావతికి ఆదివారం పిలిపించారు. తుది ఉత్తర్వులు ఇవ్వడానికి వీలుగా సోమవారం కూడా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ మేరకు ఇద్దరు కలెక్టర్లు అమరావతిలోనే మకాం వేశారు.

రాయచోటిలో జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలియజేస్తున్న ఐకాస, వివిధ సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు

- సుండుపల్లి, వీరబల్లి సైతం కడపలోకి : రాజంపేట నియోజకవర్గంలోని సుండుపల్లి, వీరబల్లి మండలాలను సైతం కడప జిల్లాలోకి కలపాలనే నిర్ణయించారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చొరవ తీసుకున్నారు. ఈ రెండు మండలాలను మదనపల్లెలో కలిపే పక్షంలో ప్రయాణ దూరం 15 కి.మీ పెరుగుతుందని, కడపలో కలపడం ద్వారా రాజంపేట నియోజకవర్గంలోనే ఆరు మండలాలుంటాయని ప్రభుత్వానికి వివరించారు. ఈ మేరకు హేతబద్ధంగా ఉన్నట్లుగా ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంది.
- మదనపల్లె జిల్లా ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ అమలు దిశగా ఒకట్రెండు రోజుల్లో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నాయి. ముందుగా నిర్ణయించిన మేరకు మదనపల్లె జిల్లాలో పుంగనూరు, తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె నియోజవర్గం చేర్చాలని నిర్ణయించింది.
- అన్నమయ్య జిల్లాలో మూడు నియోజకవర్గాలు మాత్రమే మిగిలిపోయాయి. మూడు నియోజకవర్గాలతో జిల్లా నిర్వహణపై ప్రభుత్వం పునరాలోచనలో పడింది. నిర్వహణ భారం, రాజంపేట కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమాలు, మరో వైపు రాయచోటిలోనే కొనసాగించాలనే డిమాండ్ల నేపథ్యంలో మధ్యమార్గంగా కీలక నిర్ణయం తీసుకుంది.
- ఈ మేరకు తిరుపతి జిల్లా నుంచి గూడూరును నెల్లూరులో కలుపుతున్న నేపథ్యంలో రైల్వేకోడూరును తిరుపతి జిల్లాకు, ప్రతిపాదిత మదనపల్లె జిల్లాలోకి రాయచోటి, కడపలోకి రాజంపేట నియోజకవర్గాన్ని కలపాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.
- రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల విలీనాన్ని ఆయా నియోజకవర్గాల ప్రజల్లో సంతోష వాతావరణం కనిపిస్తోంది. పెనగలూరు, చిట్వేలి మండలాలకు తిరుపతి కాస్త దూరంగా ఉండనుంది. రాయచోటి నియోజకవర్గ ప్రజలు మాత్రం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు కనిపిస్తోంది.
- జిల్లా కేంద్రం మదనపల్లె అయినప్పటికీ అన్నమయ్య పేరుతోనే కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. అన్నమయ్య పేరును రద్దు చేశారనే అపఖ్యాతి లేకుండా ఆ పేరునే కొనసాగించాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు అధికార యంత్రాంగానికి సంకేతాలిచ్చారు.

బాల రామాయణం

వారంతా బాలలు.. శ్రీరాముడు, భరతుడు, లక్ష్మణుడు, శత్రుఘ్నుడు, సీతమ్మ, ఆంజనేయుడు, దశరథుడు ఇలా రామాయణంలోని పాత్రదారుల్లా సందడి చేశారు... వినుడు.. వినుడు రామాయణ గాథ అంటూ లవకుశులు రామాయణ గానామృతం చేశారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా హిందూ సమ్మేళనాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని పాటిస్తూ, పరిరక్షణకు పాటుపడాలని వక్తలు సూచించారు. పులివెందులలో జరిగిన హిందూ సమ్మేళనంలో సందడి చేస్తున్న బాలలే వీరు. - న్యూస్‌టుడే, పులివెందుల

బావి భారత పౌరులకు ప్రమాదం

బద్వేలు సమీపంలోని చిన్నగోపవరంలో రోడ్డు పక్కనే బావి ప్రమాదకరంగా ఉంది. దగ్గరగా వెళ్తేగాని అక్కడ నుయ్యి ఉందన్న సంగతి తెలియదు. బావి పక్కనే అంగన్‌వాడీ కేంద్రం కూడా ఉంది. పిల్లలు ఆడుకుంటూ వెళ్లి అందులోకి వెళ్లినా గుర్తించే పరిస్థితి లేదు. ఇదే మార్గంలో బేతాయపల్లె, బేడుసుపల్లె గ్రామాల వద్ద బావులు రోడ్డు పక్కనే నోరు తెరిచి ఉన్నాయి. అప్పట్లో వ్యవసాయానికి తవ్విన ఈ బావులు నీటి లభ్యత లేకపోవడంతో ఇలా వదిలేశారు. కనీసం రక్షణ గోడలు ఏర్పాటు చేసి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు. - ఈనాడు, కడప, న్యూస్‌టుడే, బద్వేలు

శిశు గృహ అండగా.. అనాథలకు అమ్మగా!

- ఇటీవల చింతకొమ్మదిన్నె మండలంలోని జె.నారాయణపురంలో పుట్టిన బిడ్డన ముళ్లకంపల్లో పడేశారు. ఆ తల్లి మనసెలా వచ్చిందో తెలియదు కానీ మృత శిశువును చూసి అందరూ కన్నీటి పర్యంతమయ్యారు. అదే పాప ప్రాణంతో ఉండి ఉంటే అధికారులు అక్కున చేర్చుకుని ఆరేళ్ల వరకు పెంచి పోషించి దత్తత ఇచ్చి నిండు నూరేళ్లు బతికేలా చేసేవారు.
- కడప నగరానికి చెందిన ఓ తల్లి అప్పుడే పుట్టిన బిడ్డను చెత్తలో పడేసి వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులు ఆ పసిబిడ్డను అక్కున చేర్చుకుని ఆలనాపాలనా చూసి బిడ్డల్లేని తల్లికి అప్పజెప్పారు. ప్రస్తుతం ఆ బిడ్డ సంతోషంగా విదేశాల్లో ఎంచక్కా చదువుకుంటోంది. రేపటి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండేలా ప్రభుత్వం కల్పించింది.

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: పొత్తిళ్లల్లో అమ్మ ప్రేమ దూరమవుతున్న వారు ఎంతో మంది ఉన్నారు. వారిని రోడ్డు పక్కన, చెత్త కుప్పల మధ్య, ముళ్ల కంపల మధ్య వదిలేసి వెళ్లిపోతున్నారు. ఇలాంటి దయనీయ స్థితిలో ఉన్న చిన్నారులను స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని శిశు గృహ అక్కున చేర్చుకుంటోంది. ఇక్కడ చిన్నారులకు వైద్యంతో పాటు పౌష్టికాహారం అందిస్తూ బిడ్డలు కావాలనుకునే వారికి చట్టబద్ధంగా చేర్చి వారి జీవితాలకు బంగారు భవిష్యత్తు అందిస్తున్నారు.

కడప నగరంలో అందంగా ఉన్న శిశు గృహ

- 2012లో కొండాయపల్లెలో ఏర్పాటు చేసిన శిశు గృహ సుమారు వంద మందిని అక్కున చేర్చుకుంది. కొంతమంది పాప బతికుండగానే తాము సాకలేమని చెప్పి వదిలేసిన వారు కొందరైతే బిడ్డను ఇళ్ల వద్ద, స్వచ్ఛంద సంస్థల వద్ద వదిలేసి దూరం నుంచి చూస్తూ కన్నీరు పెట్టుకున్నవారు కొందరు. వారి వివరాలను గోప్యంగా ఉంచి బిడ్డలను పెంచేసి పంచుతూ ఉన్నారు.
- బిడ్డల ఆలనాపాలన చూడలేని వారు, ఆర్థిక లేమితో బిడ్డలను వద్దనుకున్న వారు పిల్లల సంరక్షణకు స్త్రీ, శిశు సంక్షేమశాఖ శిశుగృహ కట్టుబడి ఉంది. పిల్లలు కనిపిస్తే మాకు అప్పగిస్తేమీ కంటే మీ బిడ్డ వందరెట్లు సంతోషంగా జీవించేలా చేస్తామని స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా పథక సంచాలకులు రమాదేవి తెలిపారు.

ఏమేం చేస్తున్నారంటే..

ప్రతి వారం వైద్య సేవలందిస్తున్నారు. వైద్యుల సూచన మేరకు చిన్నారులకు శిశుగృహలో భోజనం అందిస్తున్నారు. ఆరు నెలల పిల్లలకు పాలు, ఆపై ఉన్న చిన్నారులకు పాలు, గుడ్లు, ఇడ్లీ, కూరగాయలు, పండ్లు అందిస్తున్నారు. ఆర్థిక లేమి, అవాంఛిత గర్భం ఇలా ఏదైనా సమస్యల్లో కొట్టుమిట్టాడుతూ బిడ్డలను వదిలించుకునే తల్లులు తమ బిడ్డల కోసం శిశుగృహలో వదిలేస్తే బిడ్డ సంరక్షణ, దత్తత తామే చూసుకుంటామని బాలల పరిరక్షణ అధికారి సుభాష్ యాదవ్ తెలిపారు.

- శిశు గృహాలో ప్రస్తుతం ఉన్న పిల్లలు : నలుగురు (బాలికలు ముగ్గురు, బాలుడు ఒకరు)
- దత్తతల సంఖ్య: 100
- దేశవ్యాప్తంగా ఉన్నది : 91 మంది (బాలికలు 46, బాలురు 45)
- ఇతర దేశాల్లో.. 9 మంది (బాలికలు 7, బాలురు 2)
- జిల్లా బాలల పరిరక్షణ అధికారి 8331821098

మురుగులో ముంచేస్తారా.. మరుజన్మకైనా చోటిస్తారా!

కడప నగర శివారులోని అలంఖాన్‌పల్లిలో ఆరు నెలలుగా శ్మశానం మురుగులో ఉంది. ఊరంతటి నుంచి వచ్చే మురుగు నీటితో పాటు వర్షం నీరు అక్కడికి చేరుకుని వెళ్లేదారి లేక శ్మశానాన్ని ముంచెత్తింది. అక్కడి నుంచి ముందుకు వెళ్లే మార్గం కుంటలా మారిపోయాయి. ఈ కాలనీలో ఎవరైనా చనిపోతే దహన కార్యక్రమాలు ఎక్కడ చెయ్యాలో తెలియని పరిస్థితి. ఇప్పటికే అక్కడున్న సమాధులన్నీ జలాధివాసం చేస్తున్నాయి. పెద్దల పండగకు పూజలు చేద్దామన్నా అడుగు వేయలేని పరిస్థితి. అసలే విషాదంలో మునిగిన బాధిత కుటుంబాలు నీట మునిగిన శ్మశానంలో అంత్యక్రియలు చేయలేక ముప్పుతిప్పలు పడుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. - ఈనాడు, కడప

పీజీ... యువతులకు వసతి ఈజీ

కడప నగరంలోని ఓ మహిళల వసతి గృహం

కడప నగరపాలక, న్యూస్‌టుడే: అయితే పది .. . కాదంటే ఇంటర్ అనే కాలం పోయింది! మగవారికి ఏ మాత్రం తగ్గకుండా ఉన్నత చదువులు చదివించడానికి అమ్మాయిల తల్లిదండ్రులు వారిని మహానగరాల నుంచి పట్టణాల వరకు ఎక్కడికైనా పంపడానికి సిద్ధపడిపోతున్నారు. కోరిన కోర్సులు పూర్తి చేసిన వెంటనే కూతురి పెళ్లి చేసి అత్తారింటికి పంపే సంప్రదాయానికి భిన్నంగా పెద్దలు ఆలోచిస్తున్నారు. అమ్మాయికీ ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని కోరుకుంటూ ఉద్యోగాలకు పంపిస్తున్నారు. పల్లె గడప నుంచి చదువులు ఉద్యోగాల కోసం నగరాలక బాట పట్టే యువతులకు మహిళలకు వసతి కల్పించడానికి 'పీజీ' హాస్టళ్లు వెలుస్తున్నాయి.

- నగరంలో ఇలా.. కడప నగరంలో అమ్మాయిలకు 40 పేయింగ్ గెస్ట్ హాస్టళ్లు ఉన్నాయి. ఒక్కో వసతి గృహంలో 10 నుంచి 60 మంది వరకు ఉంటున్నారు. అక్కడ ఇంటికి ఏ మాత్రం తీసిపోని రీతిలో వసతులు కల్పిస్తున్నారు. 24 గంటలూ వైఫై, మూడు పూటలా ఆహారం, సీసీ కెమెరాల పర్యవేక్షణ, మహిళా వార్డన్ల ఆలనా పాలనా ఉండడం వల్ల అమ్మాయిలను పీజీల్లో చేర్చడానికి తల్లిదండ్రులు ఏ మాత్రం సందేహించడం లేదు.

నగరంలోని నాగరాజుపేట, పాతబస్టాండు రోడ్డు, ఎన్జీవో కాలనీ, కో ఆపరేటివ్ కాలనీ తదితర ప్రాంతాల్లో పీజీలున్నాయి. నర్సింగ్ కోర్సులు అభ్యసించే వారు, వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవడానికి వచ్చిన వారు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న ఆడవారికి పీజీలు చక్కటి వసతి కల్పిస్తున్నాయి.

- ప్రతి పీజీలో ఇద్దరు, ముగ్గురు, నలుగురు, ఐదు మంది ఒక గదిలో ఉండడానికి వేర్వేరు ఛార్జీలను వసూలు చేస్తున్నారు. కడపలో రూ.4 వేల నుంచి రూ.7. వేల వరకు ఛార్జీలు వసూలు చేస్తున్నారు.
- మహిళల వసతి కేంద్రాలు పెరగడంతో వాటిలో పనిచేయడానికి మహిళా వార్డన్లు, వంట మాస్టర్లు, సెక్యూరిటీ సిబ్బంది, పారిశుద్ధ్య నిర్వహణ రంగాల్లో వందల మందికి ఉపాధి లభిస్తోంది.

పెద్ద ప్లానే ఇది!

- రూ.లక్షలిస్తే ఇవన్నీ మామూలే
- నగరంలో పెరుగుతున్న అక్రమ నిర్మాణాలు

కడప నగరపాలక, న్యూస్‌టుడే: రెడ్డి కాలనీ... కడప నగరం మద్రాసు రోడ్డుకు - మినీ బైపాస్ రోడ్డుకు మధ్య ఉన్న ఈ ప్రాంతంలో ఓ భారీ నిర్మాణం మొదలయ్యింది. భారీ నిర్మాణం అన్నారు కదా మరి ప్లాను గ్రట్రా ఉంటుందని అనుకుంటున్నారా.. అలాంటివేవీ ఉండవండీ! నగరపాలక సంస్థకు పైసా చెల్లించకుండా.. భవన నిర్మాణ నిబంధనలను పాటించకుండా బహుళ అంతస్తుల భవనాలను కట్టేయడం ఒక్క కడప నగరపాలక సంస్థలోనే సాధ్యమవుతోంది. ప్రణాళిక విభాగం అధికారులకు ఈ వ్యవహారం తెలియదనుకుంటే పొరబాటే. అధికారుల సూచనలు, సలహాలు వారిచ్చిన ప్రణాళికతోనే అక్రమ నిర్మాణాలు ముందుకు సాగుతున్నాయని సమాచారం. ప్రణాళిక విభాగంలోని అధికారులిచ్చే అనధికారిక ప్రణాళికకు రూ.2 లక్షల నుంచి రూ.20 లక్షల దాకా వసూలు చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్లాన్ అప్రూవల్ లేకుండా మొదలైన నిర్మాణం

జరుగుతోందిలా.. నగర శివార్లలో ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వెళ్లే మార్గంలో నిర్మించిన ఓ భారీ నివాస సముదాయంలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన డూప్లెక్స్ తరహా నిర్మాణాలను అడ్డదారిలో క్రమబద్ధీకరించడానికి కుడా, నగరపాలక ప్లానింగ్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

◆ ప్లాన్‌ను అతిక్రమించి చేపట్టిన నిర్మాణాలు కంటికి కనిపిస్తున్నా వాటికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు ఇవ్వడం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ అంశం బయటపడడంతో బీపీఎస్‌ను తెరపైకి తీసుకువస్తున్నారు. ◆ దాదాపు 15 నిర్మాణాలను క్రమబద్ధీకరించడానికి రంగం సిద్ధం చేసినట్టు సమాచారం. యర్రముక్కపల్లి - అంగడి వీధి మధ్య గల ఒక నివాస సముదాయంలో అనుమతి లేకుండా దాదాపు 10 నిర్మాణాలను చేపట్టటడం వివాదాస్పదంగా మారింది. ◆ టౌన్ ప్లానింగ్ నిబంధనల్లోని లొసుగులను అనువుగా మార్చుకుని అధికారులు సచివాలయ స్థాయి ఉద్యోగులు, లైసెన్స్‌డ్ ప్లానర్లతో కలిసి ప్రణాళిక విభాగానికి సమాంతరంగా సొంత వ్యవస్థ నడుపుతున్నారు.

కూలితే గండం.. కరెంటోళ్లకో దండం

మైదుకూరు పట్టణానికి సమీపంలో పంట పొలాలకు నీరందించే కాలువ పక్కన విద్యుత్ స్తంభాలు ఒకవైపునకు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు కూలుతాయో అన్నట్లుగా ఉన్నాయి. వ్యవసాయ పొలాలు కావడంతో నేల తడికి స్తంభాలు ఒకవైపునకు ఒరిగాయి. సాధారణంగా ఇలాంటి ప్రాంతాల్లో గుంతలు తవ్వి సిమెంటు దిమ్మెలపై స్తంభాలు వేయాల్సి ఉండగా నిర్లక్ష్యంగా వదిలేశారు. - ఈనాడు, కడప

గండికోటకు 902 ఏళ్లు

గండికోటది శతాబ్దాల చరిత్ర. సామాన్య శకం 1123 జనవరి 9వతేదీన కల్యాణి చాళుక్య రాజైన అహవమల్ల సామంతుడైన కాకరాజు కోట నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అనంతరం కాయస్థ, కాకతీయ, విజయనగర, పెమ్మసాని, కుతుబ్ షాహీల పాలనలో గండికోట అభివృద్ధి చెందుతూ శత్రు దుర్భేద్యమైన కోటగా మారింది. 1650లో కుతుబ్‌షాహీల మంత్రి మీర్‌జుమ్లా ఈ కోటను స్వాధీనం చేసుకున్నారు. 1800 తర్వాత ఆంగ్లేయులు ఈ కోటను స్వాధీనం చేసుకున్నారు. - న్యూస్‌టుడే, కడప

కొత్త విధానంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు

చిన్న ఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నమూనా పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కడప విద్య, న్యూస్‌టుడే : ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష విధానంలో మార్పులొచ్చాయి. ప్రశ్నపత్రం రూపొందించే తీరు మారింది. పరీక్షల షెడ్యూలును ఇంటర్ బోర్డు ఇప్పటికే విడుదల చేసింది. కొత్త పద్ధతి విద్యార్థులకు ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రిన్సిపళ్లు, అధ్యాపకులకు సమావేశం ఏర్పాటు చేసిన అవగాహన కల్పించారు.

జిల్లాలో ఇలా..
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలు : 20
- హైస్కూల్‌ప్లస్ : 9
- కేజీబీవీ లు : 17
- ఆదర్శ : 3
- ప్రైవేట్ ఎయిడెడ్ : 5
- ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ : 79
- సాంఘికసంక్షేమ : 11
- ఒకేషనల్ : 7
- జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 17,600
- బాలురు - 7,957
- బాలికలు - 9,643

- మార్పులు ఇలా.. భౌతిక, రసాయన శాస్త్రాలకు 85 మార్కుల ప్రశ్నపత్రం ఇస్తారు. ప్రస్తుత విధానంలో 1, 2, 4, 8 మార్కుల ప్రశ్నలకు జవాబులు రాయాలి.
- గణిత, భౌతిక, రసాయన శాస్త్రం, చరిత్ర, కామర్స్, రాజనీతి శాస్త్రం, ఎకనామిక్స్ పరీక్ష రాసే వారికి 32 పేజీలతో కూడిన బుక్‌లెట్ ఇస్తారు. గతంలో 24 పేజీలే ఉండేవి. ప్రశ్నల సంఖ్య పెరగడంతో ఈ మార్పు చేశారు.
- భౌతిక, రసాయన, జీవశాస్త్రాల్లో 29 (85) మార్కులు వస్తే ఉత్తీర్ణత సాధించినట్లే.
- గణితం 100 మార్కులకే.. గణితం పేపర్ గతంలో 150 మార్కులకు ఉండేది. ఆ తరువాత దీన్ని గణితం-1ఏ, 1బీగా మారుస్తూ ఒక్కో పేపరు 75 మార్కులు చొప్పున రెండు పేపర్ల విధాన్ని ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అమలు చేశారు. గణితంలో ఒకే పేపరు విధానానికి శ్రీకారం చుట్టారు.

మూగవని.. అడగలేవని

- పశువైద్యశాలల్లో మందుల కొరత
- సకాలంలో సరఫరా కాని ఔషధాలు

ఇది ఒంటిమిట్ట ప్రాంతీయ పశువైద్యశాల.. ప్రతి మూడు నెలలకు ఒకసారి మందులు రావాల్సి ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ 17న వచ్చాయి. అది కూడా గతేడాది కోటాలోనివి. ఆ తర్వాత సరఫరా చేయలేదు. ఇప్పటికీ ఎనిమిది నెలలైంది. అందుబాటులో ఉన్న ఔషధాలను పశు పోషకులకు సర్దుబాటు చేస్తున్నారు. నాలుగు రకాలు అడిగితే రెండు చేతులు పెట్టి పంపిస్తున్నారు. మిగతావి ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేసుకోవాలని పశువైద్యాధికారులు చిటీలు రాయిస్తున్నారు.

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: పాడి-పంట రైతుకు రెండు కళ్లలాంటివి. వాతావరణంలో అనూహ్య మార్పులు రావడంతో వ్యాధులు పంజా విసురుతున్నాయి. జబ్బుల నివారణకు కీలకమైన మందులు సరిపడా నిల్వల్లేవు. ప్రాణప్రాయ స్థితిలో అత్యవసర ఔషధాలు అరకొరగా అందుబాటులో ఉన్నాయి. సకాలంలో వైద్యం అందక ఖరీదైన పశువుల ప్రాణాలు కడ తేరిపోతున్నాయి. మూగ జీవాలు నోరు తెరిచి బాధను చెప్పలేవు. మౌన వేదన విని పాడి రైతులు గుర్తించి పశువైద్యశాలలకు వెళ్తున్నారు. రోగాల నివారణకు అవసరమైన అన్నీ రకాలు అందుబాటులో లేవని పశువైద్యులు, సిబ్బంది చెబుతున్నారు. బయట కొనుగోలు చేసుకోవాలని చీటీలు రాయిస్తున్నారు.

- జిల్లాలో పశువైద్యశాలల్లో మందుల కొరత తీవ్రంగా ఉంది. ఆరు నెలలుగా ఔషధాలు సరఫరా కాలేదు. గేదెలను గొంతువాపు, ఆవుల్లో ముద్ద చర్మం, మేకల్లో ముసర, కాలి, నోటి పుండ్లు జబ్బులు కనిపిస్తున్నాయి. కోళ్లను కొక్కెర వ్యాధి సోకింది. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో మైదాన భూముల్లో తేమ ఎక్కువగా ఉంది. మంచు కురుస్తోంది. వాతావరణంలో మార్పులు రావడంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. గొర్రెల్లో నీలి నాలుక రోగం ప్రబలింది. తెల్ల, నల్ల జాతి పశువుల్లో దూడలు, గేదెలు ప్రాణాలు కోల్పోతున్నాయి. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడింది. అమృత ఘడియల్లో సకాలంలో వైద్యం అందటం లేదు. మరణ మృదంగం మోగుతుంది. జీవనాధారమైన గేదెలు, ఆవులు, జీవాలు, కోళ్ల మృత్యువాత పడుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమై ఇప్పటికే తొమ్మిది నెలలైంది. ఇంతవరకు మందుల సరఫరా ఊసే లేదు.

త్వరలో సరఫరా చేస్తాం

పశువైద్యశాలల్లో మందుల కొరత ఉన్నట్లు మా దృష్టికి కూడా వచ్చింది. ఔషధాలు సరఫరా చేయడానికి అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నాం. త్వరలో అనుమతి రానుంది. మందులు తెప్పించి అందజేస్తాం. చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాసులు, జిల్లా అధికారి పశు సంవర్ధకశాఖ

జిల్లాలో పశు వైద్యశాలల వివరాలు	సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి	బహుళార్థక వ్యాధి నిర్ధారణ శాల	నియోజకవర్గ స్థాయి వ్యాధి నిర్ధారణశాలలు	ప్రాంతీయ పశు వైద్యశాలలు	పశువైద్య చికిత్సాలయాలు	గ్రామీణ పశు వైద్యశాలలు	గోపాలమిత్ర కేంద్రాలు
	1	1	6	17	79	78	58



(c) eenadu

ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఫైనల్స్‌కు చేరిన శ్రీవిద్య కళాశాల జట్టు

జూనియర్స్ విభాగంలో జరిగిన సెమీ ఫైనల్-1లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేపట్టిన కేఓఆర్ఎం డిప్లొమా కళాశాల జట్టు పది ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 95 పరుగులు చేసింది. జట్టులో దినేష్ 30 (6-ఫోర్లు), చరణ్, వినయ్ చెరో 15 పరుగులు చేశారు. శ్రీవిద్య జూనియర్ కళాశాల (ప్రొద్దుటూరు) బౌలర్లు సాయిసాకేత్, గైబు చెరో రెండు వికెట్లు తీసుకోగా.. కృష్ణకు ఒక వికెట్ దక్కింది. అనంతరం శ్రీవిద్య జట్టు బ్యాటింగ్ చేపట్టి 7 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 97 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. జట్టులో సాయి సాకేత్ అజేయంగా 29 పరుగులు (4-ఫోర్లు), కృష్ణ 27 పరుగులు (3-ఫోర్లు, 1-సిక్స్) గైబ్ అజేయంగా 20 పరుగులు (3-ఫోర్లు, 1-సిక్స్) చేశారు. ఈ మ్యాచ్‌లో సాయిసాకేత్, గైబు, కృష్ణ ఆల్‌రౌండ్ ప్రదర్శన చేశారు.

చెలరేగిన నవీన్.. గెలిచిన అన్నమాచార్య

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేపట్టిన అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల (కడప) జట్టు పది ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. జట్టులో నవీన్ అజేయంగా 62 పరుగులు (11-ఫోర్లు), మహేష్ 36 పరుగులు (7-ఫోర్లు) చేశారు. అనంతరం మేధా కళాశాల (మైదుకూరు) జట్టు పది ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 86 పరుగులు మాత్రమే చేయగలిగింది. జట్టులో ధర్మతేజ, షాహిద్ చెరో 12 పరుగులు చేశారు. అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల బౌలర్లలో రవి, సూర్య చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. ఈ మ్యాచ్‌లో అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల జట్టు 67 పరుగుల తేడాతో గెలుపొందింది.

యువ జోరు.. ఉత్కంఠ పోరు

ఉత్సాహంగా కొనసాగుతున్న ఈనాడు క్రికెట్ పోటీలు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: అత్యంత ఆసక్తికరంగా జరుగుతున్న ఈనాడు క్రికెట్ పోటీల్లో యువ క్రికెటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడుతున్నారు. బ్యాట్, బంతితో చక్కటి ప్రతిభ కనబరుస్తున్నారు. బ్యాటర్లు బంతులను బౌండరీ లైన్‌ను దాటిస్తుండగా.. బౌలర్లు తామేమీ తగ్గేదే లేదంటూ వికెట్లు పడగొడుతున్నారు. ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రెజెంట్స్ ఈనాడు స్పోర్ట్స్ లీగ్-2025 క్రికెట్ పోటీలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి.

జూనియర్స్ విభాగంలో ఆదివారం జరిగిన సెమీ ఫైనల్స్‌లో ఆర్‌జీయూకేటీ, శ్రీవిద్య కళాశాల జట్లు గెలుపొంది ఫైనల్స్‌కు చేరాయి. కడప నగర శివారులోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాల్లో జరుగుతున్న ఈ పోటీల్లో ఆదివారం స్టార్ ఆఫ్ ది క్రికెటర్లుగా నవీన్, అజయ్‌సింహారెడ్డి, ఇమ్రాన్‌ఖాన్ నిలిచారు.

శ్రీసాయి కళాశాలదే విజయం

శ్రీసాయి కళాశాల (రాయచోటి) జట్టు పది ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 116 పరుగులు చేసింది. జట్టులో మన్సూర్ అలీ 42 పరుగులు (2-ఫోర్లు, 5-సిక్స్‌లు), పుష్పరాజ్ అజేయంగా 32 పరుగులు (6-ఫోర్లు) చేశారు. ఎంఐటీఎస్ (మదనపల్లె) జట్టు బౌలర్లు జ్ఞానేశ్వర్ 3 తీసుకోగా. శ్రీనివాసులు, సిద్ధార్థ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. ఎంఐటీఎస్ జట్టు 9.4 ఓవర్లలో 81 పరుగులకు ఆలౌట్ అయ్యింది. పిలిఫ్స్ కుమార్ 19 (2-ఫోర్లు, 1-సిక్స్), బన్నీ 13 పరుగులు చేశారు. శ్రీసాయి కళాశాల బౌలర్లలో పవాస్, ఫుమైద్‌ఖాన్, ముదస్సార్, ఇబ్రహీం తలా రెండు వికెట్లు తీశారు. శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాల జట్టు 35 పరుగుల తేడాతో గెలుపొందింది.

'ధనిక్ భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

నవీన్ (62 పరుగులు నాటౌట్)

'ధనిక్ భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

అజయ్‌సింహారెడ్డి (57 పరుగులు నాటౌట్, 3 వికెట్లు)

'ధనిక్ భారత్' స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే

ఇమ్రాన్‌ఖాన్ (49 పరుగులు నాటౌట్, మూడు వికెట్లు)

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Regional Sponsor: MITS Deemed to be University — MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
Gift Partner: KL (Deemed to be University)
Digital Partner: ఈనాడు.నెట్ TV Partner: ETV Bharat, ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

★ **నేటి మ్యాచ్‌లు (29-12-2025):** కేఎస్ఆర్ఎం గ్రౌండ్ (సీనియర్ మెన్స్): ◆ ఉదయం 8.00 గంటలకు: కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజ్ (కడప) - ఎస్ఎస్ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ (ప్రొద్దుటూరు) ◆ ఉదయం 10.00 గంటలకు: యోగివేమ డిగ్రీ కళాశాల (పులివెందుల) - గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ (రిమ్స్) (కడప) ◆ మధ్యాహ్నం 1 గంటకు: ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజ్(మదనపల్లె) - శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కాలేజ్ (ప్రొద్దుటూరు) కేఓఆర్ఎం గ్రౌండ్ (సీనియర్ మెన్స్): ◆ ఉదయం 8.00 గంటలకు: శ్రీ వేదవ్యాస డిగ్రీ కాలేజ్ (ప్రొద్దుటూరు) - శ్రీవైష్ణవి డిగ్రీ కాలేజ్ (రాజంపేట) ◆ ఉదయం 10.00 గంటలకు: సీబీఐటీ ఇంజినీరింగ్ కాలేజ్ (ప్రొద్దుటూరు) - సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కాలేజ్ (కమలాపురం) ◆ మధ్యాహ్నం 1 గంటకు: ఎస్ఆర్ఐటీ డిగ్రీ కళాశాల (బద్వేలు) - గవర్నమెంట్ డిగ్రీ (ఆర్ట్స్) కాలేజ్ (కడప)

ఇమ్రాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శన.. గెలుపొందిన శ్రీనివాస కళాశాల

శ్రీనివాస డిగ్రీ కళాశాల (మదనపల్లె) జట్టు పది ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసింది. జట్టులో ఇమ్రాన్‌ఖాన్ అజేయంగా 49 పరుగులు (7-ఫోర్లు), పురుషోత్తం 20 (3-ఫోర్లు, 1-సిక్స్) చేశారు. అనంతరం వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల (ప్రొద్దుటూరు) జట్టు బ్యాటింగ్ చేసి పది ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసింది. జట్టులో ఉదయ్ అజేయంగా 27 పరుగులు (4-ఫోర్లు) చేశాడు. శ్రీనివాస డిగ్రీ కళాశాల బౌలర్లు విష్ణు, ఇమ్రాన్‌ఖాన్ చెరో మూడు వికెట్లు తీసుకున్నారు. శ్రీనివాస డిగ్రీ కళాశాల జట్టు 37 పరుగుల తేడాతో గెలుపొందింది.

అజయ్ జోరు.. శ్రీహరి గెలుపు

మొదట బ్యాటింగ్ చేసిన ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల (ప్రొద్దుటూరు) జట్టు పది ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 85 పరుగులు చేసింది. జట్టులో [illegible] 28 పరుగులు (3-ఫోర్లు, 2-సిక్స్‌లు), శామ్యూల్ అజేయంగా 20 పరుగులు చేశారు. శ్రీహరి డిగ్రీ కళాశాల బౌలర్ అజయ్ సింహారెడ్డి మూడు పరుగులు మాత్రమే ఇచ్చి 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రీహరి డిగ్రీ కళాశాల జట్టు 6.3 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో అజయ్‌సింహారెడ్డి అజేయంగా 57 పరుగులు (6-ఫోర్లు, 3-సిక్స్‌లు) చేశాడు. శ్రీహరి డిగ్రీ కళాశాల జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

ఆర్‌జీయూకేటీ విజయపరంపరతో ఫైనల్స్‌కు..

జూనియర్స్ విభాగంలో జరిగిన రెండో సెమీ ఫైనల్‌లో 44 పరుగుల తేడాతో ఆర్‌జీయూకేటీ, ఆర్‌కే వ్యాలీ జట్టు ఘన విజయం సాధించి ఫైనల్స్‌కు చేరింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్‌జీయూకేటీ, ఆర్‌కే వ్యాలీ జట్టు పది ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేసింది. జట్టులో హుస్సేన్ పీరా 41 (4-ఫోర్లు, 3-సిక్స్‌లు), శివప్రసాద్ 37 పరుగులు (3-ఫోర్లు, 2-సిక్స్‌లు) చేశారు. అనంతరం ఎస్ఆర్ఐటీ డిప్లొమా (ప్రొద్దుటూరు) జట్టు పది ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 60 పరుగులు మాత్రమే చేసింది. ఆర్‌జీయూకేటీ, ఆర్‌కే వ్యాలీ బౌలర్ ధనుష్ 3 వికెట్లు తీసుకున్నాడు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్న కృషి విజ్ఞాన్ కేంద్రం సిబ్బంది

కడప చిన్నచౌకు, సీకేదిన్నె, న్యూస్‌టుడే: సీకేదిన్నె మండలం ఇప్పెంట పంచాయతీ ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంటలను ఎలా కాపాడుకోవాలో వివరించారు. భూమిలో సారవంతాన్ని కాపాడే ప్రకృతి వ్యవసాయ విధానాలను తెలియజేశారు. రైతులకు వివిధ రకాల పంటలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

నూరుబాషా (పాత చిత్రం)

ప్రొద్దుటూరు, రాజుపాలెం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి రాజుపాలెం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు కొర్రపాడుకు చెందిన నూరుబాషా (22) ద్విచక్రవాహనంపై చాగలమర్రి మండలం పెద్ద వంగలి గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైకు, ఆర్టీసీ బస్సు ఢీకొన్నాయి. ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. అయితే కొన్ని నెలల కిందట ప్రమాదానికి గురైన తన సోదరుడిని చూసేందుకు నూరుబాషా, ఆయన తల్లి అయూసా సౌదీ నుంచి కొర్రపాడు గ్రామానికి వచ్చారు. ఈ నేపథ్యంలో సొంత పని నిమిత్తం పెద్దవంగలికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కె.వి.రమణ తెలిపారు.

హిందూ సమాజం సంఘటితం కావాలి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: భారతీయ సనాతన సంస్కృతి, ధర్మం ప్రమాదంలో పడకుండా సంరక్షించడానికి హిందూ సమాజం సంఘటితం కావాలని బ్రహ్మంగారిమఠం మండలం తోటపల్లి అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి పిలుపునిచ్చారు. ఒంటిమిట్ట సీతారాముల కల్యాణ వేదిక ప్రాంగణంలో ఆదివారం హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. విరజానందస్వామి ప్రసంగిస్తూ ప్రపంచమంతా మన దేశం వైపు చూస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇల్లు సంస్కార లోగిలి కావాలని హితవు పలికారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు మాట్లాడుతూ.. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ బలహీనంగా కాకుండా బలపడాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాలను కలుపుకొనిపోయే సమర్థ నాయకత్వం హిందూ మతానికి ఉందన్నారు. వైసీ సుబ్బరాయుడు, వీణా రాఘవాచార్యులు, పద్మజ ఉపన్యాసం చేశారు.

ప్రసంగిస్తున్న అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి

గండికోటలో పర్యాటకుల సందడి



జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: పర్యాటక ప్రాంతమైన గండికోటలో కొద్దిరోజులుగా పొగమంచు పర్యాటకులను కనువిందు చేస్తోంది. శనివారం రాత్రి వివిధ ప్రాంతాల నుంచి గండికోటలోని పెన్నా వ్యూ పాయింట్ వద్దకు చేరుకుని గుడారాల్లో నిద్రించారు. ఉదయం సూర్య కిరణాలను తిలకించారు.

వ్యూ పాయింట్ వద్ద పెన్నా లోయను వీక్షిస్తున్న సందర్శకులు

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కడప విద్య, న్యూస్‌టుడే: తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలలో కడప నగరంలోని చెమ్ముమియాపేట జిల్లాపరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. కౌశల్ సైన్స్ క్విజ్ విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని మమత, 8వ తరగతి విద్యార్థిని తనిష్క మూడో బహుమతి సాధించారు. దీంతో మంత్రి సత్యకుమార్ నుంచి వారు పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయిని ఉమాదేవి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

దువ్వూరు: దువ్వూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అందె వంశిక రాష్ట్రస్థాయి కౌశల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటి తృతీయ స్థానంలో నిలిచింది. మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించి బహుమతులు అందజేశారు.

మంత్రి సత్యకుమార్ నుంచి పురస్కారం అందుకుంటున్న విద్యార్థినులు

విజయవాడకు తరలిన జిల్లా విద్యార్థులు

కడప విద్య, న్యూస్‌టుడే: కడప నగరపాలక ప్రధాన ఉన్నత పాఠశాల వద్ద నుంచి ఆదివారం రాత్రి విజయవాడలో సోమవారం జరగనున్న రాష్ట్ర స్థాయి ఒకేషన్ స్కిల్ కాంపిటీషన్స్‌కు జిల్లా నుంచి 10 ట్రేడ్స్ నుంచి 55 మంది విద్యార్థులు బయలుదేరి వెళ్లారు. విద్యార్థులందరినీ సమన్వయం చేసుకుని జిల్లా సమగ్ర శిక్ష జీసీడీవో రూతు ఆరోగ్యమేరీ వారి వెంట వెళ్లారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి దేవదత్తం, ప్రధానోపాధ్యాయిని ముబీనా పాల్గొన్నారు.

జిల్లాపై మూడో కన్ను నిఘా

సీసీ కెమెరాలు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా నేరాలపై పోలీసు వ్యవస్థ మూడో కన్ను నిఘా పెట్టింది. దీని వల్ల నేరాలను ఎక్కడికక్కడే కట్టడి చేస్తున్నాయి. నేరం చేసిన వ్యక్తి మూడో కన్ను నుంచి తప్పించుకోలేకుండా జిల్లాలో పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 477 మ్యాట్రిక్ సీసీ కెమెరాలు, 346 పోలీసుల కెమెరాలు, 1217 ప్రజలు ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికే సీసీ కెమెరాల ద్వారా 70 కేసులను ఛేదించారు. రూ.40,24,000 రికవరీ చేశారు. కడపలో 250, ప్రొద్దుటూరులో 124, మైదుకూరు 40 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇవీ కాకుండా 360 డిగ్రీల కెమెరాలు కూడా నేరస్థులపై గురి పెడుతున్నాయి.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నేడు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: కడప కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణంలోని సభాభవనంలో ఉదయం పది గంటలకు అర్జీల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఇందులో జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. అన్ని మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా అర్జీలు స్వీకరిస్తారన్నారు. సుదూర ప్రాంతాల నుంచి రాలేని ప్రజలు డయల్ యువర్ కలెక్టర్ ద్వారా 08562244437 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు వివరించవచ్చని ఆయన స్పష్టం చేశారు.

అండర్-12 జిల్లా స్థాయి క్రికెట్ ఎంపికలకు స్పందన

ఎంపికలకు హాజరైన చిన్నారులు

కడప క్రీడలు, న్యూస్‌టుడే : వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియంలోని క్రికెట్ నెట్స్‌లో ఆదివారం జరిగిన అండర్-12 జిల్లాస్థాయి ఎంపికలకు విశేష స్పందన లభించింది. జిల్లా నలు మూలల నుంచి 163 మంది హాజరైనట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి రెడ్డి ప్రసాద్ తెలిపారు. సెలెక్షన్ కమిటీ సభ్యులుగా రెహమాన్, శ్రీకాంత్‌రెడ్డి, అశోక్ చక్రవర్తి వ్యవహరించారు. కార్యదర్శి రెడ్డిప్రసాద్ పర్యవేక్షణలో స్టేడియం కమిటీ కన్వీనర్ సంజయ్‌కుమార్‌రెడ్డి, డీసీవో ఖాజామొహిద్దీన్, అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి పృథ్వీ ఎంపికలు నిర్వహించారు. ముందుగా చిన్నారుల అర్హత పత్రాలు పరిశీలించారు. అనంతరం బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఎంపికలు చేపట్టారు. 80 మందిని ప్రాబబుల్స్‌కు ఎంపిక చేసినట్లు రెడ్డిప్రసాద్ తెలిపారు. వీరికి త్వరలోనే ప్రాబబుల్స్ మ్యాచ్‌లను నిర్వహించి అందులో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని చెప్పారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

JOBS

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ గోల్డెన్ ట్రేడింగ్ కం॥ ✆ 7382114647.

Wanted US IT Recruiters Qualifications: Inter/Degree, Good Communications skills in English. Ph: 93462 61610/ 90325 61551 or sivaram24@gmail.com

కడప శ్రీ సత్యాగ్రీన్ సిటీ రియల్ ఎస్టేట్ ఆఫీసులో వర్క్ చేయుటకు టెలీకాలర్స్, అకౌంటెంట్స్ యువతీ యువకులు కావలెను. Cont: 9688888179

TO LET

COMMERCIAL

సిద్దవటం కోర్టు సమీపమున మెయిన్ రోడ్డులో ఉషా గార్డెన్, ఫంక్షన్ హాలు, రూములు బాడుగకు గానీ లీజుకు ఇవ్వబడును. Cell : 9949741939.

డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్‌లలో వర్క్‌చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీ: 23000 టు 29000. వ:18-35. ✆ 77309 58410.

బెంగుళూరులో పనిచేయుటకు ప్రముఖ వస్త్ర దుకాణంలో అనుభవం గల సేల్స్‌మెన్స్ కావలెను. Age: 18-45Y, ESI+PF+ జీ-17K ✆ 7019632854

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

రైతు సంఘం జిల్లా కార్యదర్శిపై పీడీ యాక్ట్ తగదు

కడప చిన్నచౌకు, సీకే.దిన్నె, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే అనకాపల్లి రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలరాజుపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైల్లో పెట్టడాన్ని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి ఖండించారు. ఆయనపై పెట్టిన పీడీ యాక్ట్‌ను తక్షణం రద్దు చేయాలని కోరుతూ ఆదివారం సీకేదిన్నె మండలంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కలెక్టర్ల సమావేశంలో భూసేకరణకు అడ్డుపడే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయమని ప్రకటించారు. అందులో భాగంగానే అప్పలరాజుపై పీడీ యాక్ట్ నమోదు చేశారని.. తక్షణం దీన్ని రద్దు చేయాలన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య, చిన్నసిద్దయ్య, శ్రీనివాసులురెడ్డి తదితరులున్నారు.

గోడపత్రాలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కమిషనర్ వైఖరిలో మార్పు రాకపోతే ఉద్యమిస్తాం

మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

కడప విద్య: ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేసేలా వ్యవహరిస్తున్న రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ వైఖరిలో మార్పు రాకపోతే భవిష్యత్తులో ఉద్యమిస్తామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా అన్నారు. స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ అధ్యక్షతన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీరాజా మాట్లాడుతూ.. ఉపాధ్యాయులను యంత్రాలుగా భావిస్తూ నిరంతరం బోధనేతర కార్యక్రమాలతో బోధనకు దూరం చేస్తూ వేధింపులకు గురిచేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ముస్తాబు కార్యక్రమం పేరుతో ఉపాధ్యాయులపై మరింత ఒత్తిడి పెంచడం తగదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, జిల్లా గౌరవాధ్యక్షుడు నాగార్జునరెడ్డి, జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, సుజాతరాణి, కోశాధికారి నరసింహారావు పాల్గొన్నారు.

ఇండియన్ ట్రేడ్ సర్వీస్‌కు ఎంపిక

వెంకట సాయికృష్ణను అభినందిస్తున్న ప్రముఖులు

కొండాపురం, న్యూస్‌టుడే: కొండాపురం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆంద్ర వెంకటనాయుడు, ప్రభావతి దంపతుల కుమారుడు లక్ష్మీ వెంకట సాయికృష్ణ యూపీఎస్సీ నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024లో 'ఇండియన్ ట్రేడ్ సర్వీస్ గ్రూప్-ఏ' ఉద్యోగం సాధించారు. మద్రాస్ ఐఐటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వెంకటసాయికృష్ణ ముంబయిలోని ప్రైవేటు సంస్థలో ఉద్యోగం సాధించారు. యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఉద్యోగానికి రాజీనామా చేసి పరీక్ష రాశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదలైన ఫలితాల్లో ర్యాంకు వచ్చింది. ప్రస్తుతం రిజర్వ్ జాబితా విడుదల చేయగా అందులో ఇండియన్ ట్రేడ్ సర్వీస్ గ్రూప్-ఏకు ఎంపికయ్యారు. సివిల్స్‌లో మెరుగైన ర్యాంకు సాధించి ఐఏఎస్ కావాలన్నదే తన ధ్యేయమని వెంకటసాయికృష్ణ స్పష్టం చేశారు.

వేకువజాము నుంచే భక్తులకు దర్శనం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈ నెల 30న (మంగళవారం) వేకువజామున 1.35 గంటల నుంచే భక్తులకు దర్శనం కోసం అనుమతిస్తామని ఆలయ తనిఖీ అధికారి నవీన్‌కుమార్ ఆదివారం తెలిపారు. సందర్శకుల విన్నపం మేరకు ఈసారి ఆలయ ప్రవేశ వేళలను మార్పు చేశామని వివరించారు. ఉత్తర ద్వారం నుంచి సందర్శకులను రాములోరి సన్నిధికి అనుమతి ఇస్తామని చెప్పారు. ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రసాదాల వితరణ, అన్నదాన కేంద్రం వద్ద రద్దీ నియంత్రణ కోసం క్యూలైన్లు, బారికేడ్లు సిద్ధం చేసినట్లు వివరించారు.

గాండ్ల కులస్థులు ఐకమత్యంతో మెలగాలి

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో గాండ్ల కులస్థుల పాత్ర ఎంతో ఉందని పుంగనూరు మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ అన్నారు. కడపలోని శ్రీరాజరాజేశ్వరి దేవస్థానంలో ఆదివారం నిర్వహించిన అఖిల గాండ్ల తెలికుల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంక్షేమ సంఘాల ఆత్మీయ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వైకాపా నేతల దౌర్జన్యాలను శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వరకు ప్రజలకు తెలియజేశామన్నారు. కూటమి ప్రభుత్వం గాండ్ల కులాల కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. మాజీ శాసనమండలి సభ్యులు బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గాండ్ల కులస్థులకు రావాల్సిన రాయితీలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఏర్పాటుకు సంబంధించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో అఖిల గాండ్ల తెలికుల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు విజయభాస్కర్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే గోపాల్, వేదికపై నాయకులు

(c) eenadu

ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌తో మైనార్టీ నాయకులు

ఎమ్మెల్యే పుట్టాకు సత్కారం

దువ్వూరు, న్యూస్‌టుడే: తెదేపా పార్లమెంటరీ కమిటీ కార్యదర్శిగా మైదుకూరు మండలం వనిపెంట గ్రామానికి చెందిన పరిదిబాయ్ గారి ఇస్మాయిల్ ఎంపికైన మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మైనార్టీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో మైదుకూరు మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కె.నాయబ్‌రసూల్, తెదేపా పట్టణ అధ్యక్షుడు పాలబాబు, నాయకులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

విశ్రాంత ఉపాధ్యాయుడికి పురస్కారం

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు డాక్టర్ మూలె రామమునిరెడ్డికి అమెరికా తెలుగు సంఘం (ఆటా) ఎక్స్‌లెన్స్ అవార్డును హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం అందజేశారు. సాహితీ, విద్యారంగానికి చేసిన సేవలకు ఈ పురస్కారం వచ్చింది. కార్యక్రమంలో ఆటా అధ్యక్షులు చల్లా జయంత్, కార్యవర్గ సభ్యులు ముదిరెడ్డి జయప్రకాష్, సతీష్‌రెడ్డిలు పాల్గొన్నారు.

రామమునిరెడ్డికి అవార్డు అందజేస్తున్న ఆటా ప్రతినిధులు

శ్రీకృష్ణ గీతాశ్రమంలో ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పట్టణం శ్రీకృష్ణగీతాశ్రమంలో ఆదివారం లలిత కోటినామ యజ్ఞ లక్షార్చనలతో నిర్వహించారు. ఆశ్రమం మైదానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై లలితాదేవి ఉత్సవమూర్తిని కొలువు తీర్చారు. లోక కళ్యాణార్థం సామూహికంగా లలితా సహస్రనామ పారాయణం చేశారు. భక్తులకు అన్నప్రసాద పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పూజలకు హాజరైన మహిళలు

ఉపాధి పథకం పేరు మార్చడం అన్యాయం

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం పేరు మార్చి రాష్ట్ర ప్రభుత్వాలపై భారం మోపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి గాలిచంద్ర తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఎర్రగుంట్లలో ఆయన మాట్లాడుతూ వీబీ- జీ రామ్ జీ చట్టంతో రాష్ట్ర ప్రభుత్వాలకు గతంలో కన్నా అధికంగా భారం పడుతుందన్నారు.

ఆహ్లాదం... ఆవిరి

• పార్కులపై అధికారుల నిర్లక్ష్యం • పురపాలక పరిధిలో దుస్థితి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలో పార్కుల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆధునికీకరణ పేరుతో పార్కులకు రూ.లక్షలు వెచ్చించినా పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజలకు ఆహ్లాదం కరవైంది. ● సుందరాచార్యులవీధిలో మహిళా పార్కు 12 ఏళ్ల కిందట 15 సెంట్ల స్థలంలో రూ.90లక్షలతో గడ్డి, జిమ్ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంలో పార్కు నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. మూత్రశాల తలుపులను అల్లరి మూకలు

వైఎంఆర్‌కాలనీ పార్కులో అసంపూర్తిగా మూత్రశాల

పచ్చిక లేని సుందరాచార్యుల ఉద్యాన వనం

ధ్వంసం చేశారు. అర్ధరాత్రి వరకు అల్లరిమూకలకు అడ్డాగా మారింది. ● వైఎంఆర్‌కాలనీలో పార్కు ఆధునికీకరణ పనులు రెండేళ్ల కిందట ప్రారంభమైనా పూర్తి కాలేదు. మూత్రశాల నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో బయటే మూత్రవిసర్జన చేస్తున్నారు. ● 2023 జులైలో రూ.4 కోట్లతో గాంధీపార్కులో ఆధునికీకరణ పనులు చేశారు. నిర్వహణ లేకపోవడంతో గడ్డి అంతా వెళ్లిపోయింది. తాగునీటి వసతి లేదు. ఉయ్యాళ్ల వద్ద సిమెంటు దిమ్మెలు దెబ్బతినడంతో ప్రమాదకరంగా మారింది. వాకింగ్‌ట్రాక్ అస్తవ్యస్తంగా ఉంది. పురపాలక సెక్యూరిటీ విభాగ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. రెండో కాలనీలోని పార్కు వేళల్లో సమయపాలన పాటించలేదని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

తాగునీటి సౌకర్యం లేదు

ఒక ప్రాంతంలోనే పార్కు ఉండడంతో అధిక సంఖ్యలో ప్రజలు వస్తున్నారు. గాంధీ పార్కులాగా పట్టణంలోని అనిబిసెంటు పురపాలక మైదానంలో పార్కు ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. శ్రీరాములపేటలో పార్కు గతంలో ఉండేది ప్రస్తుతం పార్కు ఆనవాలే లేదు. తాగునీటి సౌకర్యం లేదు. - రాజశేఖర్, శ్రీరాములుపేట

నిర్వహణ అస్తవ్యస్తం

గాంధీపార్కులో నిర్వహణ లేకపోవడంతో గడ్డి అంతా పోయింది. వీధి కుక్కలు పార్కులోకి వస్తున్నాయి. పిల్లలు ఆడుకున్న ప్రాంతంలో సరైన భద్రత లేదు. పార్కులో వసతులు కల్పించాలి. - రఫీ, స్థానికుడు

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ఈ నెల 30న తేదీ మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా నారాపుర వేంకటేశ్వర ఆలయంలో వేకువజామున 1.35 గంటలకు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నారు. తితిదే అధికారులు అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే భక్తులు వరుసలో నిలబడేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇదే ఏడాదిలో జనవరి తేదీన ఏకాదశి రాగా అప్పుడు 17,837 మంది భక్తులు నారాపుర వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సారి భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉండటంతో తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నామని తితిదే అధికారులు వివరించారు.

బద్వేలు గ్రామీణ: బద్వేలు మండలంలోని లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ చాటకొండు సంజీవకుమార్ తెలిపారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ సీనియర్ నాయకుడు పాముల బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి, కేకు కోసి నినాదాలు చేశారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు రమేష్, మద్ది ప్రకాశం పాల్గొన్నారు.

జెండా వందనం చేస్తున్న పార్టీ నాయకులు

గణిత ప్రతిభా పరీక్షల్లో విద్యార్థుల సత్తా

ప్రొద్దుటూరులో పరీక్షకు హాజరైన విద్యార్థులు

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరులోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో గణిత ఫోరం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఆచార్య నరసింహారెడ్డి అధ్యక్షతన జాతీయ గణిత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదోతరగతి విద్యార్థులకు గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. 90 పాఠశాలల నుంచి 170 మంది హాజరయ్యారు. నిరంజన్ (దొమ్మర నంద్యాల), సుమంత్ (వేపరాల), చౌడేశ్వరపూర్ణ (దొమ్మరనంద్యాల) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి ముఖ్య అతిథులుగా హాజరైన ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, గణిత ఫోరం పుస్తక రచయిత రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా నగదు బహుమతులు అందించారు. మరో ఐదుగురు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ● గణిత ఫోరం జిల్లా నూతన శాఖను ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రావు, గౌరవ సలహాదారులుగా ఎల్లారెడ్డి, నరసింహారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, తులసీలక్ష్మి, అధ్యక్షుడిగా సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకటసుబ్బయ్య, కోశాధికారిగా సంజీవరెడ్డి, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

కలసపాడు: మండలకేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1992-1993 పదో తరగతి చదివిన విద్యార్థులు సమావేశమయ్యారు. ఉద్యోగ, వ్యాపారాలు, ఇతర రంగాల్లో స్థిరపడిన వారు వచ్చారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, పూర్వ ఉపాధ్యాయులు బి.సిద్దయ్య, టి.మాలకొండయ్య, ఎం.ఏసురాజు, పూర్వ విద్యార్థులు కె.వెంకటరామిరెడ్డి, పి.రమణారెడ్డి, బి.వి.రాజశేఖర్, కె.చెన్నారెడ్డి పాల్గొన్నారు.

పూర్వ ఉపాధ్యాయులతో విద్యార్థులు


ఎర్రగుంట్లలో మాట్లాడుతున్న అభినవ శంకరానంద స్వామీజీ

బద్వేలులో ప్రసంగిస్తున్న అచలానంద ఆశ్రమ నిర్వాహకులు విరజానందస్వామి

సనాతన ధర్మ పరిరక్షణకు కృషి

సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని స్వామీజీలు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఎర్రగుంట్ల, బద్వేలు, వనిపెంట, ఖాజీపేట, గుడిపాడు, పోరుమామిళ్ల ప్రాంతాల్లో హిందూ సమ్మేళనాలు నిర్వహించారు. హిందువులంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో అభినవ శంకరానంద స్వామీజీ, శ్రీపల్లి అచలానంద ఆశ్రమ నిర్వాహకులు విరజానందస్వామి, కడప భువనేశ్వరీదేవి పీఠాధిపతి నాగేంద్ర మహాదర స్వామి, చైతన్యానంద, మాజీ ఎమ్మెల్యే శివరామకృష్ణారావు, ఆర్‌ఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, బద్వేలు, మైదుకూరు, ఖాజీపేట, ఎర్రగుంట్ల, పోరుమామిళ్ల, దువ్వూరు

మైదుకూరు: వనిపెంటలో మహిళల ప్రదర్శన

పోరుమామిళ్ల: శోభాయాత్రలో పాల్గొన్న ప్రజలు

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టేది?

విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం పేరుతో పెన్నా నదిలో ఇసుక అమ్ముకుంటున్నారని ఇటీవల గ్రామస్థులు కలెక్టరుకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. నదీ తీరంలో ఏళ్లుగా సాగు భూములు చేసుకుంటున్నామని ఇసుక తరలింపుతో అవి కోతకు గురవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకపోయినా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. - న్యూస్‌టుడే, చాపాడు

ఆదమరిస్తే ప్రమాదమే

ప్రొద్దుటూరు-మైదుకూరు రహదారిలోని కొత్తపల్లె కూడలి సమీపంలో డివైడర్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్, రేడియం స్టిక్కర్లు లేకపోవడంతో వాహనదారులు రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. లక్ష్మీనగర్ సమీపంలో ఏర్పాటైన డివైడర్ వద్ద ఎలాంటి దీపాలు లేవు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ డీఈ లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ ఇక్కడ ఎరుపు రంగు రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ

నీటి వృథా.. తప్పని వ్యథ

పెన్నానది సమీపంలో నుంచి రాజుపాళెం మండల పరిధిలోని కొర్రపాడుకు తాగు నీటి పైపులైన్ వేశారు. ఇది పాతది కావడంతో తరచూ పైపులైన్ అక్కడక్కడ లీకేజీ కావడంతో నీరు వృథా అవుతోంది. అధికారులకు సమస్య తెలిపినా పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి నీరు వృథా కాకుండా సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రాజుపాళెం

నడవలేం.. బండి నడపలేం!

ఈ చిత్రంలోని రహదారి కొండాపురం మండలం బెడుదూరు గ్రామంలోనిది. గ్రామంలోని దారి అధ్వానంగా ఉండటంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈవిషయమై ఎంపీడీవో నాగప్రసాద్ మాట్లాడుతూ వెంటనే గ్రామాన్ని పరిశీలించి పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, కొండాపురం

మాజీ కౌన్సిలర్ మృతికి సంతాపం

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: మాజీ కౌన్సిలర్, తెదేపా సీనియర్ నాయకుడు షేక్ అమీర్‌బాషా (72) అనారోగ్య కారణాలతో ఆయన స్వగృహంలో ఆదివారం మృతి చెందారు. తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి, నాయకులు ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

అదుపు తప్పి కారు బోల్తా

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాల వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. జమ్మలమడుగుకు చెందిన దంపతులు తమ ఇద్దరు పిల్లలతో ఆదివారం సాయంత్రం బెంగళూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో రోజా టవర్స్ వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను తప్పించే క్రమంలో కాలువను ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

తపాలా కార్యాలయంలో గోల్‌మాల్!

ఖాజీపేట: మండల పరిధిలోని దుంపలగట్టు గ్రామంలోని తపాలా కార్యాలయంలో ఆర్థికంగా గోల్‌మాల్ జరిగినట్లు బాధితులు వాపోతున్నారు. ఇక్కడి ఉద్యోగి అనారోగ్య కారణాలతో విధులకు సక్రమంగా రాకపోవడంతో అతని కుమారుడు అనధికారికంగా విధులు నిర్వర్తిస్తున్నాడు. చెన్నూరు నుంచి రోజూ వచ్చే పోస్టల్ బ్యాగ్‌ను కూడా సదరు వ్యక్తి తీసుకురావడంతో అక్రమాలకు అవకాశం ఏర్పడినట్లు సమాచారం. ఖాతాదారుల నుంచి డిపాజిట్లు తదితర పథకాల కింద వసూలు చేసిన సూమారు రూ.10 లక్షలకు పైగా ఖాతాలో జమ కాకుండా కాజేసినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకోలేదనే విమర్శలున్నాయి. ప్రస్తుతం ఉద్యోగి కుమారుడు పరారీలో ఉన్నాడు.

వాల్మీకి సంఘం కార్యవర్గం ఎన్నిక

పోరుమామిళ్ల: వాల్మీకి సంఘం బద్వేలు నియోజకవర్గం నూతన కార్యవర్గాన్ని ఆదివారం పోరుమామిళ్లలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మానం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా పుల్లయ్య, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

నూతన ఆంగ్ల సంవత్సర కాలమానిని ఆవిష్కరణ

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు శ్రీరాములపేటలో ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల సమన్వయవేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, న్యాయవాది సీవీ సురేష్, జనార్దన్‌రెడ్డిలు ఆవిష్కరించారు.

ప్రొద్దుటూరు గ్రామీణ : స్థానిక బలిజ కల్యాణ మండపంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించినట్లు ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు గుమ్మటమయ్య ఆదివారం తెలిపారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి ప్రసాదు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తెదేపా జిల్లా అధికార ప్రతినిధిగా ఎంపికైన వెంకటేశ్వర్లను ఘనంగా సత్కరించారు.

కాలమానిని ఆవిష్కరిస్తున్న డాక్టర్ వరుణ్‌రెడ్డి, ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, సీవీ సురేష్, జనార్దన్‌రెడ్డి, తదితరులు

ప్రొద్దుటూరు వైద్యం: బీసీ ప్రజాచైతన్య సమాఖ్య నూతన క్యాలెండర్లను అధ్యక్షులు బొర్రా రామాంజనేయులు, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, నాయకులు ఆదివారం ఆవిష్కరించారు.


కృష్ణ కిషోర్ యాదవ్‌ను సత్కరిస్తున్న ఉప్పుగుంటపల్లె వాసులు

తెదేపా పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీకి సన్మానం

మైదుకూరు, న్యూస్‌టుడే : తెదేపా కడప పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన ఉప్పుగుంటపల్లెకు చెందిన చాగనబోయిన కృష్ణ కిషోర్ యాదవ్‌ను ఎస్సీ కాలనీకి చెందిన నాయకులు ఆదివారం శాలువాకప్పి పూలమాల వేసి సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుధాకర్‌రెడ్డి, సుబ్బరాయుడు, అబ్బులయ్య, చింతకాయల రాజు, పాలరమణ, నారాయణ, కుల్లాయప్ప పాల్గొన్నారు.

పౌరహక్కుల సంఘం రాష్ట్ర మహాసభలు 10న

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: పౌరహక్కుల సంఘం రాష్ట్ర మహాసభలు జనవరి 10న తిరుపతిలో నిర్వహిస్తున్నట్లు ప్రజాసంఘం నేతలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని హోమస్‌పేట సృజన సామాజిక వేదిక కార్యాలయంలో ఇందుకు సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, సురేష్‌బాబు, ఎల్లయ్య, మురళి, రాజేష్, పద్మ, వరలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని దిగువపట్నం కాలనీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 150 మంది పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కో ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున, ఆవుల వినయ్, వైద్యులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరించిన ఎంపీ

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: బద్వేలు మండలం బయనపల్లెలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిలు హాజరయ్యారు. ప్రజా సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం వైకాపా నాయకులతో మాట్లాడారు. వచ్చే ఏడాదిలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు.

CHANGE OF NAME

I, **PEDDI VISWAVARDHAN** (Old Name), S/o PEDDI BABU REDDY, resident of D.No. 5/120, Dorasanipalli Village, Jambulamma Temple Street, Proddatur Mandal, Kadapa Dist., AP hereby declare that I have changed my name as **PEDDI VISWAVARDHAN REDDY** (New Name) for all future purposes.

కష్టాల సాగు.. నష్టాలే మిగులు

● దిగుబడి తగ్గడంతో దిక్కుతోచని స్థితిలో మినుము రైతులు

రాజుపాళెం, పెద్దముడియం, న్యూస్‌టుడే: అరుగాలం శ్రమించినా రైతులకు నష్టాలే మిగులుతున్నాయి. దిగుబడి, గిట్టుబాటు ధరలు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో సాగుదారులున్నారు. రబీలో కొండంత ఆశలతో మినుము పంట వేసిన రైతులకు నిరాశ తప్పడం లేదు. పెట్టుబడి వ్యయం పెరగడం, దిగుబడి తగ్గడంతో ఆందోళన చెందుతున్నారు.

● ప్రస్తుతం పంట నూర్పిడి దశలో ఉంది. ఎకరాకు రూ.35,000 నుంచి రూ.50,000 పెట్టుబడి వ్యయం అవుతోంది. కౌలు రైతులకు ఈ వ్యయం పెరుగుతుంది. దీనికి తోడు మినుము పంట దిగుబడులు తగ్గాయి. ఎకరాకు క్వింటా నుంచి 3 క్వింటాల వరకు మాత్రమే వస్తోంది. క్వింటా ధర రూ. 7200 ఉంది. దీంతో నష్టం వస్తోంది. కౌలు రైతులకు ఈ భారం ఎక్కువగా ఉంటుంది. రాజుపాళెం మండలంలో 3 వేల ఎకరాలు, పెద్దముడియం మండలంలో 1400 ఎకరాల్లో రైతులు మినుము పంట సాగు చేశారు.


సాగులో మినుము పంట

ప్రభుత్వమే ఆదుకోవాలి

నేను 3 ఎకరాల్లో మినుము పంట సాగు చేశాను. ఎకరాకు ఒక క్వింటా చొప్పున 3 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. దీంతో లక్షకు పైగా నష్టం వచ్చింది. ప్రభుత్వమే తమను ఆదుకోవాలి. - కె.వెంకటసుబ్బారెడ్డి, రైతు, కొర్రపాడు

పెట్టుబడి వ్యయం రాలేదు

ఆరు ఎకరాల్లో మినుము పంటను సాగు చేశాను. ఎకరాకు రూ.35 వేల చొప్పున రూ.రెండు లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాను. వర్షాలు, తెగుళ్ల ధాటికి పంట దెబ్బతింది. ఎకరాకు 2 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చే అవకాశం ఉంది. దీంతో పెట్టుబడి వ్యయం కూడా వచ్చే అవకాశం లేదు. - మధుసూదన్‌రెడ్డి, పెద్దపసుపుల



(c) eenadu

కడప
•కడప •పులివెందుల •కమలాపురం

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న కేంద్ర ప్రభుత్వం

కేక్ కోస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, పక్కన నాయకులు

మారుతీనగర్, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర విమర్శించారు. సీపీఐ వందేళ్ల వారోత్సవాల్లో భాగంగా సీపీఐ నగర కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుల అధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం కేకు కోసి పంచి పెట్టారు. కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కాలమానిని ఆవిష్కరణ

బిల్టప్, కడప న్యూస్‌టుడే: నగరంలోని పద్మశాలీయ సంఘం కార్యాలయంలో ఆదివారం 2026 నూతన సంవత్సర కాలమానిని ఆ సంఘం అధ్యక్షుడు అవ్వారు సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్యలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. సమాజ సంక్షేమానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, యానాదయ్య, గునిశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాలమానిని ఆవిష్కరిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

సీమలో మేటి పరిశోధకుడు పేటశ్రీ

జయప్రకాష్‌ను సన్మానిస్తున్న డాక్టర్ చింతకుంట శివారెడ్డి, రచయితలు

వైవీయూ, న్యూస్‌టుడే: యోగివేమన విశ్వ విద్యాలయం అధ్యయనంలోని సీపీబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శ్రీనివాసరెడ్డి జీవితం-సాహిత్యం అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. సీమ సాహిత్యంలో భాగంగా నిర్వహించిన సదస్సులో తెలుగు అధ్యాపకుడు డా.కోడూరు జయప్రకాష్ ప్రసంగిస్తూ.. ఆచార్య పేట శ్రీనివాసరెడ్డి కథా రచయితగా, జానపద పరిశోధకులు, విమర్శకులుగా తనదైన శైలిలో సాహితీ వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నారన్నారు. అనంతరం జయప్రకాష్‌ను పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా.చింతకుంట శివారెడ్డి, రచయితలు సన్మానించారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, సహాయకులు హరిభూషణరావు, వెంకటరమణ, సుబ్బరాయుడు, రామాంజనేయులురెడ్డి పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి చేయూత

వేంపల్లె, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే మానవతా సేవా సంస్థ లక్ష్యమని ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు డాక్టర్ యోగీశ్వరబాబు అన్నారు. వేంపల్లెలోని నాలుగు రోడ్ల కూడలి ప్రాంతంలో ఆదివారం మతిస్థిమితం లేని ఓ వ్యక్తిని గుర్తించి మానవతా సేవా సంస్థ వారు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సనాతన ధర్మమే భవితకు రక్ష

కడప: మాట్లాడుతున్న రామకృష్ణమిషన్ స్వామి సంకర్షణానంద

కడప విద్య, న్యూస్‌టుడే: కుటుంబ వ్యవస్థ బలోపేతానికే హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని వక్తలు అన్నారు. స్థానిక వివేకానందనగర్‌లో నగర అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన హిందూ సమ్మేళనం నిర్వహించారు. రామకృష్ణమిషన్ స్వామి సంకర్షణానంద మాట్లాడుతూ హిందువుల్లో జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత ప్రచారక్ విజయాదిత్య, మైథిలి, పద్మనాభరెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

చెన్నూరు: సమాజహితం కోసం సామరస్య జీవనంతోనే అందరిలోనూ సమానత్వాన్ని సాధించవచ్చని బ్రహ్మశ్రీ కృష్ణమాచార్య గురూజీ అన్నారు. చెన్నూరులో ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేవాలయాల పరిరక్షణ మనందరి బాధ్యతని, సామాజిక సమరసత చాటాలని, కుటుంబ వ్యవస్థ బలోపేతానికి కట్టుబడి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హిందూ సభ కమిటీ జి.ఎన్ భాస్కర్‌రెడ్డి, కల్లూరి విజయ భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధవటం: హిందూ ధర్మాన్ని కాపాడడానికి అందరు బాధ్యతగా తీసుకోవాలని శివదర్శనానంద సరస్వతీ మాతాజీ పిలుపునిచ్చారు. సిద్ధవటం మండలం మాధవరం-1 గ్రామంలోని శ్రీ బ్రహ్మంగారి ఆలయంలో ఆదివారం హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. సరస్వతీ మాతాజీ ముఖ్యఅతిథిగా వచ్చి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చిన్నారుల నాట్య ప్రదర్శన, గీతా పారాయణ పఠనం ఆకట్టుకున్నాయి.

పులివెందుల: ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని పాటిస్తూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని శ్రీమన్నారాయణ పీఠాధిపతి శ్రీకమలానందభారతి స్వామి అన్నారు. ఆదివారం పులివెందులలో నిర్వహించిన హిందూ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానవత్వాన్ని కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అనంతపురం విభాగ్ కార్యవాహ జగదీశ్వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి : హిందూ ధర్మాన్ని అందరూ ఆచరించి కాపాడుకుందామని శ్రీ హరి నారాయణ స్వామి అన్నారు. ఆదివారం ఎం.చౌటపల్లెలో రామాలయం వద్ద హిందూ సమ్మేళనం నిర్వహించారు. హిందువుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడానికి జాతీయ భావాలను నిర్మిస్తూ హిందూ సమాజాన్ని జాగృతం చేయాలన్నారు.

కమలాపురం: కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్‌ఎస్‌ఎఫ్ జోన్ ధర్మ ప్రచారక్ ఈశ్వర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) నూరేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక వెన్నెల ఫ్లై పాఠశాల సమీపంలో విశ్రాంత ఉపాధ్యాయుడు నాగసుబ్బారాయుడు అధ్యక్షతన హిందూ సమ్మేళనాన్ని నిర్వహించారు.

సింహాద్రిపురం: హిందువులంతా ఐకమత్యంగా ఉండాలని కమలానంద భారతీసరస్వతి అన్నారు. సింహాద్రిపురంలోని మార్కెట్ యార్డు వద్ద హిందూ పరిషత్ చేపట్టిన హిందూ సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

కమలాపురంలో మాట్లాడుతున్న ఎస్ఎస్ఎఫ్ రాయలసీమ జోన్ ధర్మ ప్రచారక్ ఈశ్వర్‌రెడ్డి

కమలాపురంలో హాజరైన ప్రజలు

రామ నామం.. తారకమంత్రం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: పవిత్ర ధనుర్మాసంలో భాగంగా పదో రోజైన ఆదివారం ఒంటిమిట్ట కోదండ రామాలయంలో అధ్యయనోత్సవాలు శాస్త్రోక్తంగా సాగాయి. తొలుత రంగ మండపంలో సీతారామ లక్ష్మణ మూర్తులను పట్టు వస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. రుత్వికులు రుగ్వేదం, యజుర్వేదం, సామ వేదం, అధర్వణ వేదాలను పారాయణం చేశారు. అర్చకులు వీణా రాఘవాచార్యులు, వి.మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తులకు దర్శనమిచ్చిన సీతారామలక్ష్మణమూర్తులు

డయల్ యువర్ విద్యుత్తు ఎస్ఈ నేడు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి తన కార్యాలయంలో నేడు డయల్ యువర్ విద్యుత్తు ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 10 వరకు వినియోగదారులు ఫోన్ నెంబరు 08562-242457ను సంప్రదించవచ్చని చెప్పారు. కరెంటోళ్ల జనబాట కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వైకాపా నేతల దుష్ప్రచారం తగదు

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: తెదేపా నేతలు సరదాగా మాట్లాడుకునే మాటలను వైకాపా వక్రీకరించి దుష్ప్రచారం చేస్తోందని ఆ పార్టీ నగర అధ్యక్షుడు మన్సూర్ అలీ, నగర ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డిలు ఆరోపించారు. కడప నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు మాట్లాడారు. స్వర్ణ కడప కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారి సమక్షంలో శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి పార్టీ నాయకులతో సరదాగా మాట్లాడుకుంటుంటే అందులో తప్పులు వెతికి వైకాపా సోషల్ మీడియా అసత్య ప్రచారం చేస్తోందన్నారు. నాయకులు శ్రీధర్, శిలాస్, వెంకటేశ్, ఆచారి, సుబ్బరాయుడు, జియావుద్దీన్, అఫ్జల్, వెంకటరమణ, తౌసిఫ్‌హుసేన్ పాల్గొన్నారు.

రోబోటిక్ సదస్సులో కడప వాసి సత్తా

మారుతీనగర్, న్యూస్‌టుడే: నగరానికి చెందిన ప్రముఖ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ జహంగీర్ బాషా హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ఓనస్ రోబోకాన్ 3.0లో ప్రత్యేకంగా నిలిచారు. రోబోటిక్ కాన్ఫరెన్స్‌కు హాజరై ఉత్తమ ప్రతిభను చాటారు. ఆయన ప్రదర్శించిన కీళ్ల మార్పిడి టెక్నిక్‌పై సీనియర్ వైద్యులు ప్రశంసలు కురిపించారు. క్లిష్టమైన రోబోటిక్ కీళ్ల మార్పిడి సర్జరీలను సులువుగా చేసే విధానాన్ని చూపించి ప్రముఖుల నుంచి ఆయన ప్రశంసా పత్రం అందుకున్నారు.

రోబోటిక్ సదస్సుకు హాజరై ప్రశంసా పత్రం అందుకుంటున్న జహంగీర్ బాషా

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

కమలాపురం, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశి నాడు దర్శించుకుంటే 365 రోజులు దేవాలయానికి వచ్చి దర్శించుకున్నంత మహా పుణ్య ఫలితం ఉంటుందని ఆలయ వ్యవస్థాపకులు, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. స్థానిక రైల్వే గేట్ సమీపంలోని రాధాకృష్ణ మందిరంలో ఈ నెల 30వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శన ఏర్పాట్లను ఆయన ఆదివారం పరిశీలించారు. నాయకులు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఉత్తరద్వారాన్ని, ఆలయాన్ని, పరిసరాలను పరిశీలించారు. మండల కన్వీనర్ రాఘవరెడ్డి, తెదేపా జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, వాసుదేవరెడ్డి, సుబ్బారెడ్డి, నారాయణ, మస్తానయ్య పాల్గొన్నారు.

ఉత్తర ద్వారాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

చోరీలపై అప్రమత్తత అవసరం

మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీకే దిన్నె సీఐ బాల మద్దిలేటి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రస్తుతం జరుగుతున్న చోరీలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని సీకే దిన్నె సీఐ బాలమద్దిలేటి సూచించారు. కడప శివారులోని రాఘవేంద్ర అపార్టుమెంట్ వద్ద ఆదివారం స్థానిక మహిళలకు చోరీలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లేటప్పుడు సంబంధిత ఠాణాలో సమాచారం ఇవ్వాలన్నారు. నివాసాలకు తాళాలు వేసి వెళ్తే పోలీసులకు సమాచారం ఇస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలను నివాసాల్లో ఉచితంగా అమర్చుతామని చెప్పారు.

రోడ్డు ప్రమాదాల నివారణ బాధ్యత ప్రభుత్వాలదే

మాట్లాడుతున్న అభ్యుదయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గంగా సురేష్

కడప విద్య, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నివారణ బాధ్యత ప్రభుత్వాలదే అని అభ్యుదయ వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హైదర్‌వల్లి, గంగాసురేష్‌లు అన్నారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో ఆదివారం అఖిల భారత అభ్యుదయ వేదిక జిల్లా శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రమాదాల్లో మరణించిన, గాయపడిన వారికి తగిన నష్ట పరిహాన్ని అందివ్వాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వాలపై ఉందన్నారు. ఇటీవల కాలంలో విపరీతంగా రోడ్డు, రైలు ప్రమాదాలు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంటితుడుపు చర్యలు చేపట్టడం తప్ప ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర కార్యదర్శి సురేష్‌బాబు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుతం ఉన్న రవాణా చట్టాలను మార్చాల్సిన అవసరం ఉందన్నారు.

జాతీయ మహాసభల జయప్రదానికి పిలుపు

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

మారుతీనగర్, న్యూస్‌టుడే: ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ 18వ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఇండియన్ ట్రేడ్ యూనియన్ జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ 18వ జాతీయ మహాసభలకు కార్మిక వర్గం పెత్త ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, శ్రీనివాసులురెడ్డి, లక్ష్మీదేవి, సత్యనారాయణ, భైరవప్రసాద్, సాల్మన్, విజయ్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం

వేంపల్లె, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులు ఉద్యమించాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు బల్లారపు రామాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బాదుల్లాలు పిలుపునిచ్చారు. వేంపల్లెలో ఆదివారం జనవరి 25 నుంచి మూడు రోజుల పాటు కడపలో నిర్వహించే ఏఐటీయూసీ జిల్లా మహాసభల గోడపత్రాలను ఆవిష్కరించారు. కార్మికులకు పనిభారం పెంచే ఆలోచనను విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ గురుకుల పాఠశాలల యూనియన్ జిల్లా కార్యదర్శి బ్రహ్మం, భవన నిర్మాణ కార్మిక సంఘం యూనియన్ నాయకులు బాలాజి, నాగేశ్వరరావు, బాబాఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు

తాగు నీటి సమస్య పరిష్కారానికి కృషి

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందులలో నాలుగు దశాబ్దాలుగా పెత్తనం చెలాయించిన పలువురు నేతలు పులివెందుల ప్రజల తాగునీటి సమస్యను తీర్చలేకపోయారని తెదేపా నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి విమర్శించారు. పులివెందులలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. పులివెందుల మండలం యర్రబల్లె చెరువుకు నీరందిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చామన్నారు. ఇటీవల తాగునీటి సమస్య పరిష్కరించాలని పురపాలక ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు ఆర్డీవోకు వినతిపత్రం ఇవ్వడం తన దృష్టికి వచ్చిందన్నారు. గత ప్రభుత్వంలో శాశ్వత పరిష్కారం చూపకనే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్ అమర్నాథ్‌యాదవ్, తెదేపా నేతలు సంజీవరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, జోగిరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

అపారిశుద్ధ్యంతో అవస్థలు

కడప నగరంలోని ప్రకాశ్‌నగర్ నుంచి ఎల్ఐసీ కార్యాలయం మీదుగా కలెక్టరేట్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. సుమారు 400 మీటర్ల ప్రయాణంలో ఇరువైపులా మురుగు కాల్వలు కంపుతో నిండి ఉంది. రహదారిపై ఉన్న మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు రోడ్డుపై పారుతోంది. రాకపోకలకు ఇబ్బందిగా మారింది. నగరపాలక అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.- **న్యూస్‌టుడే, అరవిందనగర్ (కడప)**

దేశానికి కాంగ్రెస్ పాలన అవసరం

మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: దేశానికి ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ పాలన అవసరమని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాజ్యాంగ విలువలు కాపాడేందుకు తమ పార్టీ ముందుంటుందన్నారు. పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నాయకులు అలీఖాన్, గౌస్‌పీర్, బాబు, బాషా, రహంతుల్లా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం : వేంపల్లె, న్యూస్‌టుడే: కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీ, రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కాంగ్రెస్ జెండా వద్ద నేతలతో కలిసి నినాదాలు చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, వేంపల్లె, చక్రాయపేట మండలాల నేతలు రామకృష్ణ, రామాంజనేయరెడ్డి, ఉత్తన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప కాగితాలపెంట వంతెనపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని హుటాహుటిన ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. దీంతో వంతెనపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. కడప రామరాజుపల్లెకు చెందిన మునికృష్ణ, భార్గవిలు ద్విచక్ర వాహనంలో కడప వచ్చారు. తిరిగి కాగితాలపెంట వంతెన పైనుంచి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న నాలుగు చక్రాల వాహన డ్రైవర్ వీరిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వాహనంలో వెళ్తున్న ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. మునికృష్ణకు కాలు, చెయ్యి విరిగాయి. ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 సిబ్బంది నాగేంద్ర, రమణయ్యలు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: రాచగుడిపల్లె శివారులో పీవోబీలో ఉన్న ప్రభుత్వ భూమిపై కన్నేసిన కొంతమంది ఆదివారం యంత్రాలను తెప్పించి భూ ఆక్రమణలకు పాల్పడినట్లు రెవెన్యూ అధికారులకు తెదేపాలోని ఓ వర్గం నాయకులు ఫిర్యాదు చేశారు. సెలవు కావడంతో ఎవరు ఇటువైపు వచ్చే పరిస్థితి లేదని పొక్లెయిన్ తెప్పించి చదును పనులను చేపట్టారు.

కొత్త మాధవరంలో చోరీ

కొత్తమాధవరం(ఒంటిమిట్ట), న్యూస్‌టుడే: మండలంలో కొత్తమాధవరంలో ఆదివారం తెల్లవారుజామున రెండిళ్లలో దొంగలు పడ్డారు. చౌక ధరల దుకాణం నిర్వాహకుడు మేరువ నరసింహ ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ. 2,500 నగదు తీసుకెళ్లారు. పంచాయతీ పాత కార్యాలయం వెనుక వీధిలోని గౌడ వెంకటసుబ్బయ్య గృహం ప్రధాన తలుపును కొందరు ధ్వంసం చేసి బీరువాను పగులగొట్టారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

వేంపల్లె, న్యూస్‌టుడే: వేంపల్లె పంచాయతీలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటామని ఈవో నాగభూషణ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వినాయకనగర్, కడపరోడ్డు, పాతపేట, ఇతర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. మురుగు కాలువలు సరిగాలేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

ఐకమత్యమే సంఘానికి బలం

పులివెందుల, న్యూస్‌టుడే: కుల సంఘాలు ఐకమత్యంతో మెలగాలని తద్వారా సమస్యలను పరిష్కరించుకుని అన్ని విధాలా విజయం సాధించాలని ఈడిగ గౌడ సంక్షేమ సంఘం పులివెందుల తాలూకా అధ్యక్షుడు కొండయ్య గౌడ్ అన్నారు. పులివెందులలోని శ్రీమిట్టమల్లేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఈడిగ గౌడ కులస్థుల ఆదివారం సమావేశం నిర్వహించారు. అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సూర్యనారాయణగౌడ్, గౌరవాధ్యక్షులు వెంకటసుబ్బయ్య గౌడ్, గౌరవ సలహాదారు మురళి, సంఘ నాయకులు పాల్గొన్నారు.

కార్గో విజేతలకు బహుమతులు

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో గెలుపొందిన విజేతలకు ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ కార్గో కార్యాలయంలో ఆర్ఎం గోపాల్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20 నుంచి జనవరి 19 వరకు కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆర్టీసీ కార్గో అధికారి జనార్దన్, గురుప్రసాద్, సురేంద్ర ఉన్నారు.

సుగవాసికి సత్కారం

మారుతీనగర్, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా తెదేపా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబును కడప నగరం సాయిపేట మాజీ కార్పొరేటర్ సుగవాసి పవన్ కుమార్ (చిరంజీవి), సుగవాసి పృథ్వీరాజ్‌లు ఆయన కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ పదవి దక్కడంపై ఆయనకు అభినందనలు తెలిపారు.

సుగవాసి ప్రసాద్‌బాబుతో పవన్‌కుమార్

కాలువలో నీటి ప్రవాహం సాగేదెట్లా!

పీబీసీలో కాలువ కనుచూపు మేర పెరిగిన జమ్ము

లింగాల, న్యూస్‌టుడే: లింగాల కుడి కాలువ 20 నుంచి 56 కి.మీ వరకు పులివెందుల బ్రాంచి కాలువలో పూడికతీతలు చేపట్టకపోవడంతో జమ్ము, కంపచెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి నీటి ప్రవాహం సాగట్లేదని రైతులు వాపోతున్నారు. వీటిని తొలగించి పంటలకు కృష్ణా జలాలు సవ్యంగా అందేలా చూడాలని కోరుతున్నారు. సమస్యను ఈఈ మధుసూదనరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా కాలువలో వ్యర్థాలను తొలగిస్తామని చెప్పారు.

నేడు కెరీర్ గైడెన్స్‌పై కార్యశాల

కడప విద్య, న్యూస్‌టుడే: కడప నగరంలోని కోటిరెడ్డి మహిళా కళాశాలలో ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షణ అభియాన్ (పీఎం ఉష) ఆధ్వర్యంలో వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో సంయుక్తంగా సాఫ్ట్ కాంపొనెంట్ విభాగం కింద కెరీర్ గైడెన్స్ అండ్ రెజుమ్ బిల్డింగ్ స్కిల్స్ అనే కార్యశాలను ఈ నెల 29వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు ప్రధానాచార్యులు డాక్టర్ సలీంబాషా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యాక్సిస్ పాయింట్ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ విజయవాడ వారు శిక్షణ ఇస్తారని తెలిపారు.

రైతుబజారులో కూరగాయల ధరలు

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతుబజారులో కూరగాయల ధరలు కిలో (నిన్నటివి) ఇలా... బంగాళదుంప-40, క్యాబేజీ-30, క్యారెట్-50, బీన్స్-60, బీట్‌రూట్-40, కీర-40, దోస-40, దొండకాయలు-55, ముల్లంగి-35, అల్లం-80, కాలీఫ్లవర్-30, క్యాప్సికం-70, టమాట-38, మిరపకాయలు 38, వంకాయలు-25, బెండకాయలు-40, బీర-40, నాటుకాకర-50, హెచ్‌బి కాకర-38, మటిక్కాయ-40, చిక్కుడు-30, అలసందకాయలు-40, అనపకాయలు-45, ఉల్లిపాయలు-25.

నీరు రోడ్డు పాలు.. జనం కష్టాల పాలు

రిమ్స్ ఠాణా వద్ద పైప్‌లైన్ లీకేజీ కావడంతో వృథాగా పోతున్న తాగునీరు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: నగరంలో పలు చోట్ల మంచినీటి పైప్‌లైన్లు, భూగర్భ డ్రైనేజీలు లీకేజీలు కావడంతో మంచి నీరు, మురుగు నీరు రోడ్లపై పారుతున్నాయి. ఇదీ ఇప్పటి సమస్య కాదు. దాదాపు కొన్ని నెలల నుంచి లీకవుతున్నప్పటికీ నగరపాలక సిబ్బంది పట్టించుకోవడం లేదు. కడప రిమ్స్ ఠాణా వద్ద గత కొన్ని నెలల నుంచి మంచినీటి పైప్‌లైన్ లీకేజీ కావడంతో నీరంతా ఠాణా ముందు నుంచే పారుతోంది. రోజూ వేల లీటర్ల నీరు రోడ్డు పాలవుతోంది. పైగా ఠాణా ముందు నుంచే నీరు వెళ్లడంతో ఫిర్యాదుదారులు, పోలీసులు ఇబ్బంది పడుతున్నారు. బ్రహ్మయ్య షెడ్ నుంచి శ్రీనగర్‌కు వెళ్లే దారిలో కొన్ని నెలల నుంచి భూగర్భ డ్రైనేజీ నీరు లీకేజీ కావడంతో మురుగు నీరంతా రోడ్డుపై పారడంతో పాటు నిల్వ ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నగరపాలక సిబ్బంది దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీనగర్‌కు వెళ్లే రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

లేబాక.. ఆ రోడ్డుపై పోబాక
చోదకులకు అవస్థలు

వల్లూరు, న్యూస్‌టుడే: కడప-తాడిపత్రి ప్రధాన రహదారి నుంచి లేబాక గ్రామానికి వెళ్లే తారురోడ్డు పూర్తిగా దెబ్బతింది. కిలో మీటరుకు పైగా ఉన్న తారు రహదారి గుంతలు ఏర్పడి పూర్తిగా తారు లేచి పోయింది. వర్షం వస్తే ఈ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే తిప్పలు తప్పట్లేదని స్థానికులు వాపోతున్నారు. రోడ్డంతా గుంతలమయంగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని చోదకులు చెబుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. లేబాక, పెద్దలేబక, రాకిమాకులపల్లె, గొల్లబాయపల్లె గ్రామాల ప్రజలు ఈ మార్గంలోనే ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో రఘురామ్‌ను వివరణ కోరగా నిధుల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తాన్నారు.

తారు రోడ్డు పూర్తిగా పాడైపోయి ప్రమాదాలు జరుగుతున్న మలుపు...

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

జనహితం.. సేవల నేస్తం

మనమిత్రతో ఎన్నో ప్రయోజనాలు

న్యూస్‌టుడే, బాపట్ల

మన మిత్ర యాప్ జనహితంగా మారి నేస్తంలా సేవలందిస్తోంది. పాలనలో డిజిటలీకరణకు ప్రాధాన్యం ఇస్తున్న కూటమి ప్రభుత్వం ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆయా శాఖల సేవలన్నీ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఒక్క క్లిక్‌తో పొందవచ్చు. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. ముందుగా 95523 00009 నంబరును ఫోన్లో సేవ్ చేసుకుని వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పెడితే సెల్‌ఫోన్ తెరపై కనిపించే సేవల్లో మనకు కావాల్సింది ఎందుకోవాలి.

బస్టాండుకు రాకుండానే.. ఆర్టీసీ టికెట్ బుక్ చేయటానికి బస్టాండు వరకు రావాల్సిన పని లేదు. ఆర్టీసీ వెబ్‌సైట్‌లో టికెట్ బుక్ చేసుకునే సౌలభ్యం ఉన్నా చాలామందికి అవగాహన లేదు. మనమిత్రలో ఇలాంటి సేవలన్నీ సులువుగా పొందొచ్చు. టికెట్ బుకింగ్, రద్దు ఆప్షన్లు ఉన్నాయి.

రేషన్ సమస్యలపై.. పౌరసరఫరాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవటంతో పాటు చౌక దుకాణాల్లో అక్రమాలపై ఫిర్యాదు చేయొచ్చు. ధాన్యం విక్రయాల్లో ఇబ్బందులు, మిల్లర్ల అవకతవకలపై ఫిర్యాదు చేయొచ్చని పౌరసరఫరాల అధికారులు సూచించారు.

మెప్మాలోనూ.. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో పొదుపు సంఘాలకు మంజూరు చేసిన అన్నిరకాల రుణాల వివరాలు తెలుసుకోవచ్చు. ఈ సంస్థ సిబ్బంది సమాచారంతో పాటు ఆడిట్ నివేదికలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సభ్యులు తమ పొదుపు, రుణాలు తదితర అన్నింటినీ చూసుకునే అవకాశం ఉందని మెప్మా అధికారులు తెలిపారు. ఇవే కాకుండా పోలీస్‌స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పారదర్శక సేవల కోసం క్యూఆర్ కోడ్‌లు అందుబాటులో ఉన్నాయి.

నేడు పీజీఆర్‌ఎస్ రద్దు

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన పీజీఆర్‌ఎస్‌ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ డీపీవోలో జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. వివిధ సమస్యలపై అర్జీలు ఇవ్వటానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు విషయాన్ని గమనించాలన్నారు. ఎవరూ డీపీవోకు రావద్దని సూచించారు.

ఉపాధికి కొత్త రూపు

అక్రమాలకు ఇక అడ్డుకట్ట

బాపట్ల, న్యూస్‌టుడే: గ్రామీణ ఉపాధి హామీ పథకం.. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవిక మిషన్ (వీబీ జీరామ్‌జీ) పథకంగా మారింది. పథకం అమల్లో సమూల మార్పులు తీసుకొస్తూ కేంద్రం పార్లమెంటులో నూతన చట్టాన్ని ఆమోదించింది. కొత్త మార్గదర్శకాలను జిల్లా వారీగా జారీ చేయగానే రాష్ట్రాల సీఈసీలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలని స్పష్టం చేసింది.

వైకాపా ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకంలో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయి. క్షేత్ర సహాయకులు, ఏపీవోలు, ఇంజినీరింగ్ సిబ్బంది కుమ్మక్కై నిధులు స్వాహా చేశారు. చేయని పనులు చేసినట్లు దొంగ మస్తర్లు వేయడం, నాయకులకు అనుకూలురు పేర్లు అప్‌లోడ్ చేసి వారి ఖాతాల్లో వేతనాలు జమ చేయించడం, కొంత మొత్తం వారికిచ్చి మిగిలింది కాజేయడం వంటి వర్గులతో నిధులు పక్కదారి పట్టించారు.

జిల్లాలో జాబ్ కార్డులు	వేతనదారులు	రోజుకు సగటున పనికి హాజరయ్యేవారు
2.40 లక్షలు	3.20 లక్షలు	8 వేలు

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఇక నుంచి ఇలా చేస్తారు.. మస్తర్ల వివరాలను రియల్‌టైమ్‌లో జియోట్యాగ్ ఫొటోలతో అప్‌డేట్ చేస్తారు. ఇప్పటికే శ్రామికుల జాబ్ కార్డుతో ఈకేవైసీని అనుసంధానించారు. పని ప్రదేశంలో ఉదయం, సాయంత్రం శ్రామికుల ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. ఎవరైనా బినామీ పేర్లతో పనిచేసినా, ఫొటోలు తీసినా ప్రత్యేక యాప్ గుర్తించి తిరస్కరిస్తుంది. గ్రామసభలు నిర్వహించి నూతన చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని డ్వామా పీడీ విజయలక్ష్మి తెలిపారు. కూలీలకు అదనంగా ఉపాధి కల్పిస్తామన్నారు.

ప్రమాదాలకు అడ్డేది..
ప్రజల ప్రాణాలకు భద్రతేది

న్యూస్‌టుడే, బాపట్ల

జిల్లాలో 2025లో రహదారులు రక్తసిక్తమయ్యాయి. రోడ్డు ప్రమాదాలు 18 శాతం పెరిగాయి. ప్రజల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. ప్రమాదాల నివారణపై పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై కొరడా ఝుళిపించటానికి ప్రత్యేక పోలీసు బృందాలను నియమించారు.

బాపట్ల జిల్లాలో ఎన్‌హెచ్ 216ఎ, 16, 167ఎ, నామ్ ఎక్స్‌ప్రెస్ వే, జీబీసీ రోడ్డు, తెనాలి-వేమూరు-కొల్లూరు రోడ్లలో ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అతి వేగం, నిద్రమత్తు, తాగి వాహనాలు నడపటం ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా గుర్తించారు. ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించే ప్రయత్నంలో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొని ప్రయాణికులు మృత్యువాత పడుతున్నారు. జిల్లాలో రోడ్డుకు రెండు వైపులా పెద్ద కాలువలు ఉన్నాయి. వేగంగా వస్తున్న సరకు వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్తున్నాయి. ఇటీవల కొల్లూరు సమీపంలో కొబ్బరి బోండాల లోడుతో వస్తున్న ఆటో బోల్తాపడి ముగ్గురు చనిపోయారు.

బ్లాక్ స్పాట్ వద్ద ప్రమాదాల నివారణపై పోలీసు అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్

- రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు గుర్తించిన బ్లాక్ స్పాట్లు: 99
- బహిరంగ మద్యపానంపై నమోదు చేసిన కేసులు: 9306
- డ్రంకెన్ డ్రైవ్ కేసులు: 1379
- రోడ్డు భద్రత నిబంధనల ఉల్లంఘనలపై జరిమానాలు: 60,765

ఎన్‌హెచ్‌లు, రాష్ట్ర రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను ఎస్పీ ఉమామహేశ్వర్ ఇటీవల పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. ప్రమాదాల నివారణపై డీఎస్పీ, సీఐలు, ఎస్సైలతో సమీక్ష నిర్వహించి ప్రమాదాల నివారణ చేపట్టాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. ప్రమాదాలు సాయంత్రం ఆరు నుంచి రాత్రి తొమ్మిది గంటల మధ్య ఎక్కువ సంభవిస్తున్నట్లు గుర్తించారు. నిద్రమత్తులో ప్రమాదాల నివారణకు అర్ధరాత్రి 12 నుంచి వేకువన 4 గంటల వరకు పోలీసు శాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. శిరస్త్రాణాలు ధరిస్తేనే ద్విచక్ర వాహనదారులను ఎన్‌హెచ్‌పైకి అనుమతిస్తామని నిబంధన అమలు చేస్తున్నారు.

✷ గ్రామాల నుంచి జాతీయ రహదారులపైకి ప్రవేశించే అప్రోచ్ రోడ్ల వద్ద వాహనదారులు అవగాహన లేకుండా వేగంగా వచ్చి వాహనాలు ఢీకొని చనిపోతున్నారు. చందోలు, చెరుకుపల్లి, సూర్యలంక బైపాస్, చీరాల బైపాస్‌లో ఈ తరహా ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఇంజినీరింగ్ తప్పిదాలు సైతం ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

న్యూ గుంటూరుకు కొత్త శోభ

రూ.4.68 కోట్లతో అభివృద్ధి

ఈనాడు, అమరావతి

రైల్వేపరంగా గుంటూరు కీలక ప్రాంతం. 22 ఏళ్ల క్రితం డివిజన్‌గా మారింది. ప్రధాన రైల్వేస్టేషన్ మీదుగా నిత్యం 90కు పైగా రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. 10వేల మందికిపైగా ప్రయాణిస్తుంటారు. ఎగుమతులు, దిగుమతులూ పెరిగాయి. రద్దీని తట్టుకునేందుకు దశాబ్దాల క్రితం గుంటూరు న్యూ రైల్వేస్టేషన్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. ఎరువులు, సిమెంటు అవసరాల కోసం గోదాములు ఏర్పాటు చేశారు. క్రమేణా ప్రయాణికుల రాకపోకలకు అవకాశం కల్పించారు.

ఇదీ పరిస్థితి.. ✦ నగరానికి 3 కిలోమీటర్ల దూరంలో నెహ్రూనగర్‌లో ఈ స్టేషన్ ఉంది. ✦ గతంలో ఇక్కడికెళ్లి రైలెక్కాలంటే ప్రయాణికులు భయపడేవారు. ✦ క్రమేణా నగరం విస్తరించడం, ఈ ప్రాంతానికి రాకపోకలు పెరగడంతో మార్పు వచ్చింది. ✦ 2022-23లో వార్షిక ప్రయాణికుల సంఖ్య ఆధారంగా ఎన్‌ఎస్‌జీ 5 స్టేషన్ జాబితాలోకి చేరింది. 12 రైళ్లు ఈ మార్గంలో వెళ్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. పండగ సమయాల్లో ప్రత్యేక రైళ్ల రద్దీ ఉంటోంది. ✦ దేశంలో రద్దీగా ఉండే 1,195వ స్టేషన్‌గా రైల్వేశాఖ గుర్తించింది. ✦ విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్, జనశతాబ్ది, అండమాన్ ఎక్స్‌ప్రెస్, సర్కార్, లఖ్‌నవూ ఎక్స్‌ప్రెస్.. ఈ స్టేషన్ మీదుగా వెళ్తున్నాయి.

న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ కొత్తరూపు సంతరించుకోనుంది. ఏళ్ల తరబడి పీడించిన అసౌకర్యాల బాధ తప్పించేందుకు రూ.4.68 కోట్లతో పనులు చేపట్టాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ప్లాట్‌ఫామ్స్ విస్తరణతోపాటు మౌలిక సౌకర్యాలు కల్పించనున్నారు.

ఇబ్బందులివీ....

రద్దీకి తగ్గట్టుగా సౌకర్యాల్లేవు. ఒకటే ప్లాట్‌ఫామ్, ఒకే విద్యుత్తు లైన్ ట్రాక్ ఉన్నాయి. ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్లు, లిఫ్టులు లేవు. 2019 ఏప్రిల్‌లో రూ.30 లక్షలతో కొంతమేర అప్‌గ్రేడ్ చేయడానికి అవకాశం ఏర్పడింది. గత ఆగస్టులో ఆధునికీకరణకు రూ.4.68 కోట్లు మంజూరయ్యాయి. ఈ నెల 16న పనులకు పచ్చజెండా ఊపుతూ రైల్వేశాఖ ఉత్తర్వులిచ్చింది.

ఏమేం చేస్తారంటే..

❖ ఇంజినీరింగ్ విభాగానికి రూ.3.88 కోట్లు... ❖ రూ.44 లక్షలు ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్‌కు, రూ.36 లక్షలు టెలికాం అనుబంధ అంశాలకు కేటాయించారు. ❖ ప్లాట్‌ఫామ్, అప్రోచ్‌రోడ్డు విస్తరిస్తారు. ❖ దివ్యాంగులకు ర్యాంపులు సహా ఇతర సదుపాయాలు కల్పిస్తారు. ❖ చుట్టుపక్కల వీధిదీపాలు, క్లాక్‌రూములు, పార్కింగ్ ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు.

ఆ సంస్థకు నగదే కావాలంట!

మార్టూరు: ప్రభుత్వ భాగస్వామ్యంతో వందలాది మంది సిబ్బందిని ఏర్పాటుచేసుకుని మైనింగ్ రాయల్టీ వసూలుకు జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు నిర్వహిస్తున్న ఓ సంస్థ తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం భారీగా టన్నేజీని తరలించే వాహన యజమానులు చెల్లించాల్సిన నగదు మొత్తాలను ఫోన్ లేదా ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తామన్నా ఒప్పుకోవడంలేదని, వాహనాల్లో సరకు తరలించకుండా నిలువరించడంతో విలువైన లోడ్లు గమ్యస్థానాలకు చేరక వినియోగదారులతో పాటు యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. మార్టూరు ప్రాంతంలో లభించే గ్రావెల్, కంకర, గ్రానైట్‌ను సుదూర ప్రాంతాలకు తరలిస్తుంటారు. వీటి రవాణాపై ప్రభుత్వానికి చెల్లించాల్సిన మైనింగ్ రాయల్టీని చెల్లిస్తే వాహనదారులు నిరభ్యంతరంగా సంబంధిత లోడును తీసుకెళ్లొచ్చు. కానీ ఇటీవల ఓ సంస్థ ఏర్పాటు చేసిన రుసుం కేంద్రాల ద్వారా ప్రజలకు, వాహన యజమానులకు తల బొప్పి కట్టేలా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అమరావతి వేదిక.. అమ్మభాషకు వేడుక

'ఈనాడు'తో ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్

ఈనాడు, అమరావతి: అమరావతి వేదికగా అమ్మభాష వేడుకకు అంతా సిద్ధమవుతోంది. గుంటూరులో మూడో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహిస్తుండడం గర్వంగా ఉంది. అంబరాన్ని తాకేలా సంబరం నిర్వహించబోతున్నాం. మారిషస్ అధ్యక్షుడు ధరమ్‌గోకుల్ సహా పలువురు ప్రముఖులు ఈ సభల్లో భాగస్వాములు కానున్నారని ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ చెప్పారు. మహాసభల నిర్వహణకు కేవలం వారం రోజులే గడువు ఉండటంతో యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా 'ఈనాడు'తో ప్రత్యేకంగా ముచ్చటించారు.

తెలుగు పరిరక్షణకు కృషి చేస్తున్న వారందరినీ స్మరించుకుంటూ ఈ తెలుగు మహాసభలను విజయవంతం చేయడానికి సమష్టిగా అడుగులేస్తున్నాం. గుంటూరు శివారులోని శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక నగరం ఇందుకు వేదికవుతోంది. 20 ఎకరాల విస్తీర్ణంలో 5 వేదికలను రూపొందిస్తున్నాం. 50 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్నారు. మారిషస్‌లో 40 శాతం తెలుగువారు నివసిస్తున్నందున ఆ దేశ అధ్యక్షుడిని ఆహ్వానించాం.

ఏడాదిగా ఎన్నో కార్యక్రమాలు.. గత ఏడాదిగా అన్ని జిల్లాల్లోనూ తెలుగు సాహిత్యంలో లఘు చిత్రాలు, వ్యంగ్య చిత్రాలు, పద్యగాన పోటీలు నిర్వహించాం. పిల్లల్లో భాషపై మక్కువ పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. మహాసభల్లో 23 సదస్సులు నిర్వహిస్తాం. 5న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు 'నా తెలుగు భాష.. అమృత భాష' అంశంపై మాట్లాడతారు. అదే రోజు సాయంత్రం సీఎం చంద్రబాబు, సుప్రీంకోర్టు పూర్వ సీజేఐ ఎన్వీ రమణ హాజరవుతారు.

ఎవరి దారి వారిదే!

జీజీహెచ్‌లో మొక్కుబడిగా సీసీ కెమెరాల వ్యవస్థ

వైద్యులేమో బయటకు... అపరిచితులు ఆసుపత్రిలోకి

గుంటూరు జీజీహెచ్‌లో నిఘా నేత్రం నిద్దరోతోంది. సీసీ కెమెరాల వ్యవస్థ మొక్కుబడిగా మారుతోంది. ఇప్పటికే ఏర్పాటు చేసిన వాటిలో అనేకం మూలకు చేరుతున్నాయి. ఆసుపత్రిలోకి అపరిచితుల రాకపోకలు ఓ సమస్య కాగా.. వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోతుండడం ఇబ్బందిగా మారింది.

ఈనాడు, అమరావతి

జీజీహెచ్‌లో నిత్యం 5 వేలమందికిపైగానే రోగులు చికిత్స పొందుతుంటారు. ఇందులో 3,500 మందికిపైగా అవుట్ పేషెంట్లుగా నమోదవుతున్నారు. ఇంతటి కీలకమైన ఆసుపత్రిలో 280 సీసీ కెమెరాలు అమర్చారు. ఇందులో 40కుపైగా మూలకు చేరాయి. కొన్నిచోట్ల భవనాల నిర్మాణం.. మరికొన్నిచోట్ల మరమ్మతులు. ఇలా అనేక కారణాలతో ఈ పరిస్థితి ఏర్పడింది. మిగిలినవాటిని సరైన రీతిలో వినియోగించకపోవడంతో అవి ఉండీ లేనట్టుగా పరిస్థితి తయారైంది.

వైద్యులూ... ఇదేం పని?

జీజీహెచ్‌లో అనేక కీలక విభాగాల వైద్యులు సమయపాలన పాటించడం లేదు. ప్రభుత్వం ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్ (ఎఫ్‌ఆర్‌ఎస్)ను ఏర్పాటు చేశాక కూడా పరిస్థితిలో మార్పు రావడం లేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో హాజరు సమయానికి ఠంచనుగా జీజీహెచ్‌లోకి వాలిపోతున్న కొంతమంది.. మిగిలిన సమయాల్లో ప్రైవేటు వైద్యశాలల్లో ప్రాక్టీసులకు, సొంత ఆసుపత్రులు, క్లినిక్‌లకు వెళ్లిపోతున్నారు. వైద్యుల విభాగాల వద్ద సీసీ కెమెరాలున్నా అవి నామమాత్రంగా తయారయ్యాయి. వైద్యులపై పర్యవేక్షణ.. అటు గుంటూరు ప్రభుత్వ వైద్యకళాశాల.. ఇటు జీజీహెచ్.. ఇలా రెండింటికీ సంబంధించిన అంశం కావడంతో ఎవరికీ పట్టని పరిస్థితి. కొంతమంది సిబ్బంది తీరూ ఇదే రీతిగా ఉంది.

అపరిచితులొస్తే.... అపరిచిత వ్యక్తులు జీజీహెచ్ వార్డుల్లో కలియదిరుగుతున్నారు. నకిలీ వైద్యులు పట్టుబడిన ఉదంతాలూ గతంలో బయటపడ్డాయి. ప్రసూతి, పీడియాట్రిక్ వార్డుల్లో 2023, 2024 సంవత్సరాల్లో పసి పిల్లలను ఎత్తుకెళ్లిన ఘటనలు నమోదయ్యాయి. అప్పట్లో చిన్నారులను సురక్షితంగా తల్లుల వద్దకు చేర్చడంలో సీసీ కెమెరాలే అక్కరకొచ్చాయి.

ఇలా చేస్తే... ✦ ఫేస్ రికగ్నేషన్ కెమెరాలను ప్రధాన ద్వారాలు, ప్రాంగణంలో విరివిగా ఏర్పాటు చేయాలి. వైద్యులు సమయపాలన పాటించేలా ఉన్నతాధికారులు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ✦ బయట వ్యక్తుల రాకపోకలపై నిఘా పెంచాలి.

పట్టలే జీవనాధారం

వి.కొప్పెరపాడులో వందకుపైగా కుటుంబాలకు బతుకుదెరువు

వి.కొప్పెరపాడు (బల్లికురవ, అద్దంకి), న్యూస్‌టుడే

బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు ఎస్టీ కాలనీకి చెందిన 100 కుటుంబాల వారు పరదా పట్టలు అద్దెకిస్తూ జీవనం సాగిస్తున్నారు. పంట నూర్పిళ్ల సమయంలో రైతులకు ఇవి అవసరం. వీరు ఉభయ తెలుగు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో వ్యాపారం చేస్తుంటారు. పదేసి కుటుంబాలు ఒక జట్టుగా ఉండి వీటిని అద్దెకిస్తుంటారు.

వి.కొప్పెరపాడు, కొత్తూరు- అరుణగిరి తండాల్లో పరదా పట్టలు కుట్టేవారు అధికం. పల్నాడు రాష్ట్రంలోని యల్లమంద, తురకపాలెంలోనూ ఈ తరహా పరదాలు తయారు చేసే కుటుంబాలు ఉన్నాయి. రాష్ట్రంలోని నెల్లూరు, వైజాగ్‌తో పాటు తమిళనాడులోని కడలూరు, చెన్నై, తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్, నిజామాబాద్, మెదక్.. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, రాయచూర్, బెంగళూరు వంటి ప్రాంతాల్లో పరదా పట్టల వ్యవహారం కొనసాగుతోంది. ఒక్కో పరదా అద్దె రూ.25. కల్లాల్లోకి, గింజలు ఆరబెట్టుకునేందుకు ఇవి ఉపయోగిస్తారు. వలస వెళ్లిన వారిలో పురుషులు పట్టలు అద్దెకిస్తుండటం, వాటి రుసుం వసూలు చేస్తుండగా.. మహిళలు ముడిసరకు(గోతాలు) బాగు చేయడం, పరదాలు కుట్టడం వంటి పనులు ఆయా ప్రాంతాల్లోని అద్దె ఇళ్ల వద్దనే చేస్తుంటారు. దసరా పండగ జరుపుకొన్న మరుసటి రోజు నుంచి వివిధ ప్రాంతాలకు వలసలు వెళతారు. ప్రతి పండగకు తిరిగి స్వగ్రామం వచ్చి వెళుతుంటారు.

పరదా పట్టల పనిలో మహిళ

తల్లిదండ్రులు కష్టపడి ఇలాంటి వలస పనులు నిర్వహిస్తుంటారు. బిడ్డలను మాత్రం చదువులో బాగా ముందుండేలా చేస్తున్నారు. ఈ కుటుంబాల్లో బ్యాంక్ ఉద్యోగి, వైద్యులు, ఉపాధ్యాయులు ఉన్నారు. ఇపుడిపుడే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు రాబోతున్నారు. దీంతోపాటు ఆసక్తి ఉన్న వారికి ప్రభుత్వం వరికోత, నూర్పిడి యంత్రాలను రాయితీపై అందించిందని వి.కొప్పెరపాడు గ్రామానికి చెందిన శ్రీనునాయక్ తెలిపారు.

అదిరింది ఆసనం

బాపట్ల: జిల్లెళ్లమూడి అమ్మ ఆశ్రమంలో నిర్వహిస్తున్న జాతీయ యోగాసన పోటీలు అబ్బురపరుస్తున్నాయి. వివిధ రకాల విన్యాసాలతో విద్యార్థులు అలరిస్తున్నారు.

ఉద్యోగుల ఆర్థిక అంశాలపై సానుకూల నిర్ణయం

బాపట్ల, న్యూస్‌టుడే: ఉద్యోగుల ఆర్థికపర అంశాలపై ప్రభుత్వం త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. బాపట్లలో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ, మహిళా ఉద్యోగులు చైల్డ్‌కేర్ సెలవులు సర్వీస్ మొత్తంలో ఎప్పుడైనా వినియోగించుకునేలా ఉత్తర్వులు ఇచ్చారన్నారు. కింది స్థాయి ఉద్యోగుల పేర్లను మార్చటానికి శాఖాధిపతుల నుంచి ప్రతిపాదనలు కోరారన్నారు. ఆర్థిక శాఖ అధికారులు ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశమై చర్చించి ఉద్యోగుల పదవీ విరమణ అనంతరం ప్రయోజనాలన్నీ ఒకేసారి ఆన్‌లైన్లో వచ్చేలా త్వరలో ఉత్తర్వులు జారీ చేయటానికి అంగీకారం తెలిపారన్నారు. విజయవాడలో ఫిబ్రవరి 5న ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జేఏసీ సహ ఛైర్మన్ టీవీ ఫణి పేర్రాజు మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని అరవై రోజుల్లో వినియోగంలోకి తేవటానికి సీఎం అంగీకరించి మంత్రులు, ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నేతలతో రాష్ట్ర స్థాయి కమిటీని ఇటీవల నియమించారని తెలిపారు. మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి, ఏపీ వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోన ఆంజనేయకుమార్, ప్రధాన కార్యదర్శి జి.అనుపమ, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు, ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్షుడు గరికిపాటి బ్రహ్మయ్య, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి టి.రజనీకాంత్, సహ ఛైర్మన్ బీటీ వలి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పి.రజని తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

రంగు పడిందో.. దొరికేసినట్టే

రాయితీ బియ్యం అక్రమాలకు చెక్

న్యూస్‌టుడే, కలెక్టరేట్

పేదలకు రాయితీపై ఇస్తున్న బియ్యాన్ని అక్రమార్కులు దారి మళ్లిస్తున్నారు. టన్నుల్లో జిల్లా దాటిస్తున్నారు. మరికొందరు జిల్లాలోని మిల్లులకు అమ్ముతున్నారు. ఎక్కడైనా పట్టుబడ్డా.. అది రేషన్ బియ్యమా.. లేదా మిల్లుకు చెందిందా? అన్నది స్టాకు రిజిస్టరును బట్టి తేల్చి చెప్పేవారు. ఒక్కోసారి అలా గుర్తించడం కష్టమవుతోంది. ఇకపై ఇబ్బంది లేకుండా బియ్యం గుట్టు పట్టేయొచ్చు. కూటమి ప్రభుత్వం ఎఫ్‌ఆర్‌కే ఐరన్ స్పాట్ కిట్లను పంపించింది. వీటితో పరీక్షిస్తే.. రేషన్ బియ్యమా? కాదా? అన్నది పసిగట్టేయొచ్చు.

ఎఫ్‌ఆర్‌కే ఐరన్ స్పాట్ టెస్ట్ కిట్


పరీక్షించిన తర్వాత ఇలా ఎరుపు రంగులోకి మారితే అవి రేషన్ బియ్యం

ఎఫ్‌ఆర్‌కే అంటే..

☛ ఫోర్టిఫైడ్ రైస్‌లో ఇనుము ఉందో లేదో త్వరగా తెలుసుకోవడానికి ఉపయోగించే పరికరం. ☛ ఈ కిట్‌లోని రసాయనాలు బియ్యంపై వేసినప్పుడు అవి ఐరన్ అయాన్లతో చర్య జరిపి రంగు మారుస్తాయి. ☛ ఐరన్ ఉంటే బియ్యం గింజలు ఎరుపు రంగులోకి మారతాయి.

ఇలా గుర్తిస్తారు..

☛ పట్టుబడిన బియ్యం నమూనా తీసుకుంటారు. ☛ తొలుత హెచ్‌సీఎల్ (హైడ్రో క్లోరిక్ యాసిడ్) ద్రావణాన్ని బియ్యం పూర్తిగా తడిచే వరకు పోస్తారు. ☛ వెంటనే కేఎస్‌సీఎన్ (పొటాషియం థియోసైనేట్) ద్రావణాన్ని కలుపుతారు. ఐరన్ ఉన్న గింజలు వెంటనే ఎరుపు రంగులోకి మారతాయి. ☛ తద్వారా అవి రేషన్ బియ్యంగా గుర్తిస్తారు. సంబంధిత వ్యక్తులపై 6ఏ కేసు నమోదు చేస్తారు.

ప్రతి ఇంటికి కొళాయి నీరు అందేలా..

న్యూస్‌టుడే, ఆర్ట్స్ కళాశాల (బాపట్ల)

జిల్లా కేంద్రం బాపట్లలో ప్రతి ఇంటికి కొళాయి ద్వారా తాగునీరు అందించటానికి ప్రభుత్వం అమృత్ 2.0 పథకం కింద రూ.20.23 కోట్లు కేటాయించింది. కొత్తగా ఓవర్ హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. త్వరగా టెండర్లు పిలిచి గుత్తేదారుని ఎంపిక చేస్తే వేసవి నుంచి నిర్మాణ పనులు ప్రారంభించటానికి అవకాశం ఉంటుంది. పనులు పూర్తయితే నీటి ఎద్దడి కాలనీల్లో సమస్య తీరుతుంది.

☛ పట్టణంలోని రైలుపేట ప్రాంతంలో ఎనిమిది వార్డులు, 28 వేల మంది జనాభా ఉన్నారు. ఉప్పరపాలెం, రెడ్డిపాలెం, శాంతినగర్, శారదాపురి కాలనీ, వెన్నెలకంటి నగర్, భావరాజుతోట, రామకృష్ణాపురం ఎస్టీ కాలనీ ప్రాంతాలకు కొళాయిల ద్వారా నీరు అందటం లేదు. కొళాయిలకు పంపులు బిగించి కొడితేనే నీరు వస్తోంది. 2016లో గత తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.2 కోట్లతో ఉప్పరపాలెం వద్ద ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించారు. వైకాపా ప్రభుత్వం దీనిని వినియోగంలోకి తీసుకురాలేదు. మూలపాలెం పీఎంఏవై-ఎన్టీఆర్ కాలనీలో కొత్తగా 348 ఇళ్లు నిర్మించారు. 695 గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. కాలనీకి నీరు అందించటానికి జల్‌జీవన్ మిషన్ నుంచి రూ.4 కోట్లు కేటాయించారు. ఉప్పరపాలెం ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి కాలనీకి పైప్‌లైన్లు వేసే పనులు అసంపూర్తిగా చేపట్టారు.

- ✶ జిల్లా కేంద్రం బాపట్ల జనాభా: లక్ష
- ✶ రోజూ సరఫరా చేస్తున్న తాగునీరు: 6.5 ఎంఎల్‌డీ
- ✶ కొళాయిల ద్వారా నీరందని కాలనీలు: 14
- ✶ ప్రస్తుతం ఓవర్‌హెడ్ ట్యాంకులు: అయిదు
- ✶ కొత్తగా నిర్మాణానికి ప్రతిపాదిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకులు: నాలుగు

ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న శివారు వాసులు

☛ కేంద్రం అమృత్ 2.0 పథకం కింద రూ.20.23 కోట్లను పురపాలక సంఘానికి కేటాయించింది. ఈ నిధులతో పట్టణంలో కొత్తగా ప్యాడిసన్‌పేట, పెయింటర్స్ కాలనీ, బేతనీకాలనీ, డ్రైవర్స్ కాలనీలో నాలుగుచోట్ల కొత్తగా 500 కేఎల్ సామర్థ్యంతో నాలుగు ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించాలని ప్రతిపాదించారు. ఉప్పరపాలెంలో ఇప్పటికే నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకును పైప్‌లైన్ల ద్వారా అనుసంధానం చేయటానికి కొత్తగా పైప్‌లైన్లు వేయనున్నారు. కొత్త కాలనీలకు పైప్‌లైన్లు నిర్మించి ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా తాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయితే పనులు పూర్తి చేయటానికి రెండేళ్ల సమయం పడుతుంది.

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు
శుభాకాంక్షలు తెలపండి



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో సహోద్యోగులు
ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు,
ఆకాంక్షించండి వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు
తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు...
పూర్తి వివరాలకు:
8008510541

(c) eenadu

నేడు సెమీస్ పోరు

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్

Aster Ramesh HOSPITALS We'll Treat You Well

గుంటూరు క్రీడలు, తాడికొండ, న్యూస్‌టుడే: ఈనాడు ఆధ్వర్యంలో మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలోని హిల్‌వ్యూ స్టేడియంలో ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ ఈనాడు స్పోర్ట్స్ లీగ్(ఈఎస్ఎల్)-2025 క్రికెట్ టోర్నమెంట్‌లో జూనియర్ విభాగంలో జరిగిన మ్యాచ్‌ల్లో వివిధ కళాశాలల జట్లు తలపడ్డాయి. పలు జట్లు సెమీఫైనల్స్‌కు చేరాయి. కొందరు క్రీడాకారులు ఆల్ రౌండర్లుగా రాణించి తమ జట్లను విజయపథంలో నడిపించారు.

యూనివర్సల్ పాలిటెక్నిక్ కళాశాల జట్టు విజయ భేరి

గ్రౌండ్-1

మొదటి మ్యాచ్ యూనివర్సల్ పాలిటెక్నిక్ కళాశాల(డోకిపర్రు)-శ్రీగౌతమి జూనియర్ కళాశాల(చీరాల) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన శ్రీగౌతమి కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన యూనివర్సల్ కళాశాల జట్టు 10 ఓవర్లకు 2 వికెట్లు కోల్పోయి 102 పరుగులు చేసింది. బరిలోకి దిగిన శ్రీగౌతమి కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో 69 పరుగులు మాత్రమే చేసి ఆల్‌అవుట్ అయ్యింది. 33 పరుగుల తేడాతో యూనివర్సల్ కళాశాల జట్టు విజయభేరీ మోగించింది. భార్గవ్ 3 కీలక వికెట్లు తీసి జట్టును విజయతీరాల వైపు నడిపించాడు.

సత్తా చాటిన ఎన్నారైటీ

రెండో మ్యాచ్ ఎన్నారైటీ కళాశాల(విశదల)-శ్రీచైతన్య జూనియర్ కళాశాల(గుంటూరు) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన ఎన్నారైటీ బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 108 పరుగులు చేసింది. బరిలోకి దిగిన శ్రీచైతన్య కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 99 పరుగులు మాత్రమే చేసింది. 9 పరుగుల తేడాతో ఎన్నారైటీ జట్టు గెలిచింది. చరణ్ 18 బంతుల్లో రెండు ఫోర్లు ఒక సిక్స్‌తో 30 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించాడు.

సెయింట్ ఆన్స్‌దే పైచేయి

మూడో మ్యాచ్ సెయింట్ ఆన్స్ డిప్లొమా కళాశాల(చీరాల)-ఏఎం రెడ్డి కళాశాల(నరసరావుపేట) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన సెయింట్ ఆన్స్ కళాశాల జట్టు బౌలింగ్‌ను ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఏఎంరెడ్డి కళాశాల జట్టు 10 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. బరిలోకి దిగిన సెయింట్ ఆన్స్ కళాశాల జట్టు 8.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసి లక్ష్యాన్ని అవలీలగా ఛేదించింది. రాహుల్ అద్భుతంగా బౌలింగ్ చేసి మూడు ప్రధాన వికెట్లు తీసి జట్టును గెలిపించాడు.

విజయపథంలో కేఎల్‌యూ

గ్రౌండ్-2

నాలుగో మ్యాచ్ కె.ఎల్.విశ్వవిద్యాలయం(వడ్డేశ్వరం)-కళ్లం హరనాథ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(దాసరిపాలెం) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన కేఎల్‌యూ జట్టు మొదట బ్యాటింగ్ చేసి 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. బరిలోకి దిగిన కేహెచ్ఐటీ జట్టు నిర్ణీత ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసింది. 17 పరుగుల తేడాతో కేఎల్‌యూ జట్టు విజయాన్ని దక్కించుకుంది. కెప్టెన్ గౌతమ్ 21 బంతుల్లో మూడు ఫోర్లు, ఒక సిక్స్ కొట్టి 26 పరుగులు చేశాడు. రెండు ఓవర్లు బౌలింగ్ చేసి మూడు వికెట్లు తీశాడు. జట్టును విజయపథంలో నడిపించాడు.

హిందూ జూనియర్ కళాశాల జట్టు గెలుపు

అయిదో మ్యాచ్ హిందూ జూనియర్ కళాశాల(గుంటూరు)- ఆక్స్‌ఫర్డ్ జూనియర్ కళాశాల(పిడుగురాళ్ల)జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన హిందూ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఆక్స్‌ఫర్డ్ కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 62 పరుగులు చేసింది. బరిలోకి దిగిన హిందూ కళాశాల జట్టు 4 ఓవర్లకే లక్ష్యాన్ని ఛేదించింది. శశాంక్ 2 వికెట్లు తీసి 11 పరుగులు చేశాడు. జట్టు కెప్టెన్ నాయుడు 9 బంతుల్లో 5 ఫోర్లు కొట్టి 23 పరుగులు చేశాడు. ఇందులో మూడు వరుస ఫోర్లు కొట్టి జట్టుకు విజయాన్ని అందించాడు.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor: Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: Chalapathi Institute of Technology MOTHADAKA CAMPUS
Beverage Partner: CMR SHOPPING MALL
Gift Partner: KL UNIVERSITY
Digital Partner: ఈనాడు.net
TV Partner: ETV Bharat, ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్ వీరే..

చలపతి ఇంజినీరింగ్ కళాశాల జట్టు జయకేతనం

ఆరో మ్యాచ్ చలపతి ఇంజినీరింగ్ కళాశాల(మోతడక)-యూనివర్సల్ పాలిటెక్నిక్ కళాశాల(డోకిపర్రు)జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన చలపతి కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన యూనివర్సల్ కళాశాల జట్టు నిర్ణీత ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 73 పరుగులు చేసింది. బరిలోకి దిగిన చలపతి కళాశాల జట్టు 8.2 ఓవర్లకే 4 వికెట్లు కోల్పోయి 76 పరుగులతో లక్ష్యాన్ని ఛేదించింది. ఆరిఫ్ బాజీ 14 బంతుల్లో 3 సిక్సర్లు, రెండు ఫోర్లు కొట్టి 35 పరుగులు చేసి జట్టుకు చక్కటి విజయాన్ని అందించాడు.

నేడు జరిగే మ్యాచ్‌లు.. **వేదిక: చలపతి హిల్‌వ్యూ స్టేడియం**

గ్రౌండ్-1, జూనియర్స్ సెమీఫైనల్స్ ★ ఉదయం 8 గంటలకు ఎన్నారైటీ(విశదల)- చలపతి కళాశాల(మోతడక) ★ ఉదయం 11 గంటలకు సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల(చీరాల)- హిందూ జూనియర్ కళాశాల(గుంటూరు) ★ మధ్యాహ్నం 2 గంటలకు వీవీఐటీ(నంబూరు)- విజ్ఞాన్ యూనివర్సిటీ(వడ్లమూడి)మహిళల మ్యాచ్...

గ్రౌండ్-2, సీనియర్స్ సెమీఫైనల్స్... ★ ఉదయం 11 గంటలకు కేబీఆర్ డిగ్రీ కళాశాల(నరసరావుపేట)- జేసీ లా కళాశాల(గుంటూరు) ★ మధ్యాహ్నం 2 గంటలకు ఆర్వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల(గుంటూరు)- కేఎల్ యూనివర్సిటీ (వడ్డేశ్వరం)

కలెక్టర్ చిత్రంతో నకిలీ ఖాతా సృష్టి

ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతా ఇలా..

బాపట్ల, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు. ఏకంగా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ప్రొఫైల్ చిత్రంతో ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతా సృష్టించారు. దీని ద్వారా అధికారులు, ఉద్యోగులకు సందేశాలు పంపిస్తున్నారు. కలెక్టర్ స్నేహితుడైన సీఆర్‌పీఎఫ్ అధికారి సంతోష్ కుమార్‌కు బదిలీ అయిందని, ఇంటి ఫర్నిచర్, గృహోపకరణాలు చాలా తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లుగా మోసపూరిత సందేశాలు పంపించారు. విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లటంతో ఆదివారం రాత్రి ఆయన స్పందించారు. సామాజిక మాధ్యమాల్లో తన చిత్రం, పేరుతో నకిలీ ఖాతాలు సృష్టించారని వాటిని చూసి ప్రజలు మోసపోవద్దని వినోద్ కుమార్ తెలిపారు. ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతాల ద్వారా మోసపూరిత సందేశాలు పంపుతున్నవారిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

JOBS

Wanted Civil Engineers & Supervisors, 3-5 yrs Exp in Buildings & CC Road Works. @ Gokavaram (A.P). Ph No:8888838677, 9422135347.

భారతదేశ అగ్రగామి సంస్థలో పార్ట్/ఫుల్ టైం బిజినెస్ పార్టనర్‌గా చేరండి అధిక కమిషన్ పొందండి. అ: 10th, వ: 30-65 సం॥. ✆ 79892 46788.

తెనాలి దగ్గర దుగ్గిరాలలోని ప్రముఖ కాఫీ పరిశ్రమలో పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ మరియు ప్యాకింగ్ బాయ్స్ కావలెను. రూమ్ మరియు క్యాంటీన్ సౌకర్యం కలదు. ✆ 92980 11777, 8096161777.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

'మహానాడు మీడియా'లో వీడియో ఎడిటర్లుగా పనిచేయుటకు ఉత్సాహ వంతులైన యువతీ, యువకులు కావలెను. కాల్: 73372 22004.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు Acdemic Incharge గా పనిచేయుటకు వివాహితులైన లోకల్ పురుషులు కావలెను. జీతము: 25000/- నుండి 30000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: డిగ్రీ నుండి పి.జి వరకు, వయస్సు: 30 నుండి 45 సంవత్సరాలు. సంప్ర: ✆ 92487 22217.

గుంటూరు 2వీలర్ షోరూంలో పనిచేయుటకు సేల్స్ మేనేజర్ (Exp 3+), సేల్స్ ఎగ్జిక్యూటివ్ (M/F 2+), అకౌంటెంట్ 3+ CA Inter ప్రాధాన్యత, మెకానిక్స్, సర్వీస్ అడ్వైజర్స్ కావలెను. ✆ 83416 22655.

గుంటూరులో నివాసము ఉంటున్న పేషంట్స్‌ను చూసుకొనుటకు భార్య & భర్త మరియు ఆయాలు అర్జంట్‌గా కావలెను. సంప్ర॥ ✆ 7842845772.

గుంటూరు, ఆటోనగర్‌లో HP పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు మేనేజర్, పంపు బాయ్స్/ గర్ల్స్ కావలెను. పార్ట్ టైమ్/ ఫుల్ టైమ్. 7799689889, 8074546302.

ఉద్యోగం చేస్తూనే అదనపు ఆదాయం కోసం చూస్తున్నారా? నిరుద్యోగులు, మహిళలు పార్ట్‌టైమ్ లేక ఫుల్‌టైమ్ ఖాళీ సమయాల్లో పనిచేస్తూ డబ్బు సంపాదించాలని అనుకుంటున్నారా? సంప్ర: 85003 53577.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జీస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకొరకు సంప్ర. ✆ 89784 80429.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు క్లాసు ఇన్‌ఛార్జీస్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జీస్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీ: 14000/- నుండి 21000/- వరకు. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు, వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. వివరముల కొరకు సంప్ర. ✆ 9248713335.

వాచ్‌మెన్ కావలెను. గుంటూరులోని కమర్షియల్ కాంప్లెక్స్ నందు పనిచేయుటకు 40 సం॥ల లోపు భార్యాభర్తలు కావలెను. ఒ.సి.లకు ప్రాధాన్యత. వేతనం: రూ.15,000/-, గృహవసతి కలదు. ✆ 98499 83681.

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

బాపట్ల చేరుకున్న గవర్నర్

పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

బాపట్ల: మూడ్రోజుల వ్యక్తిగత పర్యటన నిమిత్తం గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ కుటుంబ సభ్యులతో కలిసి బాపట్లలోని రిసార్ట్స్‌కు ఆదివారం చేరుకున్నారు. తొలుత పోలీసు సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. గవర్నర్‌కు మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జేసీ భావన, ఆర్డీవో గ్లోరియా, డీఎంహెచ్‌వో విజయమ్మ స్వాగతం పలికారు. ఈ నెల 30న ఆయన తిరిగి విజయవాడ వెళ్లనున్నారు.

యువతకు ఉపాధి.. రైతులకు లాభాలే లక్ష్యం

మేదరమెట్ల, న్యూస్‌టుడే: యువతకు ఉపాధి.. రైతులకు లాభాలు అందించడమే లక్ష్యంగా శర్వాణి బయో ఫ్యూయల్స్ పరిశ్రమను స్థాపించినట్లు ఆ ఫ్యాక్టరీ ఎండీ పి.గోపాల్ రెడ్డి అన్నారు. కొరిశపాడు మండలం తమ్మవరంలో ఏర్పాటు చేసిన ఇథనాల్ పరిశ్రమను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజుకు రెండు లక్షల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యంతో రూ.297 కోట్లతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ 400 మందికి ఉపాధి కల్పిస్తుందని తెలిపారు. ఆరు రకాల ఉప ఉత్పత్తులు తయారు చేయనున్నట్లు చెప్పారు. స్థానిక మొక్కజొన్న సాగుదారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా రైతుల నుంచే పంట కొనుగోలు చేస్తామని వెల్లడించారు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. వాతావరణ కాలుష్య నియంత్రణకు ఆధునిక సాంకేతిక యంత్రాలు ఉపయోగించామన్నారు. ఇథనాల్ ప్రయోజనాలను వివరించారు. విశ్రాంత ఐఏఎస్ కె.ప్రభాకర్‌రెడ్డి, కెనరా బ్యాంక్ ఏజీఎంలు ఆనంద్, అనుపమ, ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ సోమనాథ్ చౌదరి, జయదీప్, ఏజీఎం మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ ప్రారంభోత్సవంలో ఎండీ గోపాల్‌రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ ప్రభాకర్‌రెడ్డి

తెలుగు వెలుగు దివ్వె ఎన్టీఆర్

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: నందమూరి తారక రామారావు తెలుగువెలుగు దివ్వెలాంటి వారని రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ పి.తేజస్వి అన్నారు. ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరణ, ఎన్టీఆర్ పురస్కార ప్రదాన సభ ఆదివారం స్థానిక ఎల్వీఆర్ క్లబ్, రీడింగ్ రూమ్ ప్రాంగణంలో జరిగాయి. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని కాలమానినిని ఆవిష్కరించి ప్రసంగించారు. అనంతరం తెలుగు అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.త్రివిక్రమరావు(విక్రమ్)కు ఎన్టీఆర్ పురస్కారాన్ని అందించి సత్కరించారు. ఆతరువాత సుఖమంచి కోటేశ్వరరావు, కావూరి సత్యనారాయణ, వేముల మోహనరావు, పలమాని శ్రీనివాసరావు, వరకూటి శివప్రసాదు, కేవీజే మురళీకృష్ణలకు రంగస్థల పురస్కారాలు అందజేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

విల్లులా వంచి.. అబ్బుర పరిచి

జాతీయ యోగాసన పోటీల్లో త్రిపుర హవా

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: రాష్ట్ర యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని జిల్లెళ్లమూడి అమ్మ ఆశ్రమంలో నిర్వహిస్తున్న జాతీయ యోగాసన పోటీల్లో త్రిపుర రాష్ట్ర విద్యార్థులు ప్రతిభ చాటారు. మూడు విభాగాల్లో విజేతలుగా నిలిచి పసిడి పతకాలు సాధించారు. పోటీల్లో రెండో రోజు క్రీడాకారులు విల్లులా శరీరాన్ని వంచుతూ యోగాసనాలు ప్రదర్శించారు. వారి విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అండర్-18 బాలుర విభాగంలో త్రిపురకు చెందిన దేబార్‌పాన్ కుందు ప్రథమ, దేబాంతర్ భద్రత ద్వితీయ, ఏపీకి చెందిన లయవర్ధన్ తృతీయ స్థానాలు సాధించారు. అండర్-18 బాలికల విభాగంలో పశ్చిమబెంగాల్ క్రీడాకారిణులు అన్నాష భౌమిక్ ప్రథమ, శ్వేతాషా ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారు. త్రిపుర క్రీడాకారిణి శ్రేష్ఠాదాస్ మూడో స్థానం సాధించింది. అండర్-14 బాలుర విభాగంలో తన్‌మోయ్ సర్కార్(త్రిపుర) విజేతగా నిలిచాడు. ఆర్ఘా మండల్(పశ్చిమబంగాల్) ద్వితీయ, తిరతన్‌కర్ భౌమిక్ (త్రిపుర) మూడో స్థానం సాధించారు. అండర్-14 బాలికల విభాగంలో త్రిపుర క్రీడాకారిణి నిహారిక దే ప్రథమ, పశ్చిమబెంగాల్ క్రీడాకారిణి రూప్సా మండల్ ద్వితీయ, కేరళకు చెందిన ఉమ జింజుట్ తృతీయ స్థానంలో నిలిచారు. అండర్-21 పురుషులు, మహిళల తుది పోరు సోమవారం జరుగనున్నది. ఇండియన్ యోగా ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్, ప్రధాన కార్యదర్శి మృణాల్ చక్రవర్తి, ఏపీ యోగా అసోసియేషన్ రాష్ట్ర ఛైర్మన్ కళ్లం హరినాథరెడ్డి, అధ్యక్షుడు కూన కృష్ణదేవరాయలు, ప్రధాన కార్యదర్శి అల్లాడి రవికుమార్, వివేక సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళీకృష్ణ, ప్రతినిధులు గురజాల శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణ, శీలం శ్రీనివాసరావు, రెడ్డి నాగరాజు పాల్గొన్నారు.

బాలికల యోగాసన ప్రదర్శనలు

బాలుర యోగాసనాలు

జనవరి 25న రాజ్యాంగ పరిరక్షణ సదస్సు

గుంటూరు విద్య: జనవరి 25న విజయవాడ ఎంబీవీకేలో నిర్వహించనున్న రాజ్యాంగ పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్.లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు.

బండి అదుపుతప్పి యువకుడి మృతి

బల్లికురవ, అద్దంకి, న్యూస్‌టుడే: బల్లికురవ-చెన్నుపల్లి రహదారిలో జరిగిన ప్రమాదంలో ఎస్సీ కాలనీకి చెందిన యువకుడు ఎ.ప్రశాంత్(18) మృతిచెందాడు. ఎస్సై వై.నాగరాజు అందించిన సమాచారం మేరకు.. ఎస్సీ కాలనీకి చెందిన ప్రశాంత్‌కు సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలేనికి చెందిన యువతితో ఐదు నెలల క్రితం వివాహమైంది. శనివారం రాత్రి బల్లికురవ నుంచి అత్తగారింటికి వెళ్లేందుకు ప్రశాంత్ ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. గ్రామ సమీపంలోని గుంత వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. అతనిపై బండి పడి ఉంది. ఆదివారం బహిర్భూమికి వెళ్లిన వారు గుర్తించి 108కు సమాచారం ఇచ్చారు. పరిశీలించిన వారు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కొన ఊపిరి ఉందనే అనుమానంతో నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

అమర్తపూడి ప్రశాంత్ (పాత చిత్రం)

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: చిలకలూరిపేట మండలం పసుమర్రు నుంచి గుదేవారిపాలెం వెళ్లే మార్గంలో చిలకలూరిపేట - వాడరేవు నూతన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. గ్రామీణ ఎస్సై అనిల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం యనమదల గ్రామానికి చెందిన కొలసాని శివరామప్రసాద్ (76) మోపెడ్‌పై చిలకలూరిపేట వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో కొత్తగా నిర్మిస్తున్న 167ఎ చిలకలూరిపేట - వాడరేవు జాతీయ రహదారిపై గుదేవారిపాలెం జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా చీరాల వైపు నుంచి వస్తున్న వాహనం ఢీకొట్టింది. గాయాలైన శివరామప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య వీరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

శివరామప్రసాద్ (పాతచిత్రం)

బేస్‌బాల్ విజేత ఆర్వీఆర్ జట్టు

గ్రామీణ గుంటూరు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అంతర కళాశాలల బేస్ బాల్ టోర్నమెంట్‌లో ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజేతగా నిలిచి కప్ అందుకుంది. గుంటూరు శివారు చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (చిప్స్) కళాశాలలో టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. విశ్వవిద్యాలయం పరిధిలోని 10 కళాశాలల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 142, రిటైల్ ధర - 169, చికెన్ విత్‌స్కిన్ - 245, చికెన్ స్కిన్‌లెస్ - 279.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 147, 156, 167 చికెన్ విత్ స్కిన్ - 284 చికెన్ స్కిన్‌లెస్ - 294.

10, 11 తేదీల్లో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

గుంటూరు విద్య: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) రాష్ట్ర 51వ కౌన్సిల్ సమావేశాలు జనవరి 10, 11 తేదీల్లో గుంటూరులో నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం యూటీఎఫ్ హాల్‌లో జిల్లా కార్యవర్గం సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు.

REPLY PUBLIC NOTICE

The attention of my client Mr. Kanneganti Muralidhar Rao, S/o. Late Kanneganti Kotaiah, aged 79 years, R/o. Shivani Plaza, Flat No.303, 3rd Floor, H.No.8-2-293/82/NG/40/3, Plot No.40, Nandagiri Hills, Jubilee Hills, Hyderabad-500 033, Telangana, has been drawn to a Public Notice published in Eenadu in Bapatla, Amaravati Guntur, and Visakhapatnam Editions on 21st December, 2025 issued by Ms. Kanneganti Umakumari D/o. Late Kanneganti Kotaiah R/o. Kuchipudi village through her Advocate Sri. Ponnam Ravindra Babu, D.No.3-76, I Floor, Opposite Amaravathi Rythu Bazar, JKC College Road, Guntur.

The contention of Ms. Kanneganti Umakumari is that she is the Lessee of Agricultural and other properties belonging to Dr. Kanneganti Kamalakar Rao S/o. Late Kanneganti Kotaiah is false and baseless. She has been falsely proclaiming herself as the Lessee of the said properties with the object of making monetary gains. Dr. Kanneganti Kamalakar Rao has never leased out any of his properties to Ms. Kanneganti Umakumari at any point of time. There is no document evidencing the creation of Lease in favour of Ms. Kanneganti Umakumari by Dr. Kanneganti Kamalakar Rao.

The allegation that due to an alleged injury sustained by Dr. Kanneganti Kamalakar Rao on his head, his health condition was not good is firmly denied. His mental condition was sound and stable. Dr. Kanneganti Kamalakar Rao executed a General Power of Attorney (GPA) in favour of my client on 27th May, 2023 in the presence of witnesses and the Power of Attorney has been duly notarized by a Notary Public State of Washington, namely, OK HEE KIM, County of Pierce, USA. Dr.Kanneganti Kamalakar Rao has also executed a letter of cancelling the Will dated 26th April, 2013 in favour of Ms. Kanneganti Umakumari.

My client Mr. Kanneganti Muralidhar Rao has got the General Power of Attorney validated in India after following the due procedure. The said GPA executed in favour of my client perfectly valid in eye of law. My client states that the GPA executed by Mr. Kanneganti Kamalakar Rao was shared with Ms. Kanneganti Umakumari on 04-12-2024 by Speed Post and Registered Post to her two addresses i.e. at Nadimpalle and another at Guntur. She did not object to the same then, but she has issued the public notice dated 21-12-2025 with some malafide motives.

My client states that Ms. Kanneganti Umakumari is the younger sister of Dr. Kanneganti Kamalakar Rao, and she has been illegally leasing the agricultural properties and collecting the lease amounts of the agricultural properties mentioned in the schedule of the Public Notice dated 21st December, 2025. She has not accounted for the amounts she has illegally collected so far. She has borrowed huge amounts of money from Dr. Kanneganti Kamalakar Rao and has not bothered to repay the amounts borrowed by her. It is precisely for this reason Dr.Kanneganti Kamalakar Rao has executed a GPA in favour of my client.

My client after obtaining GPA in his favour from his brother, Dr. Kanneganti Kamalakar Rao, has opened NRO account in the name of Dr. Kanneganti Kamalakar Rao and paid capital gains tax to the extent of Rs.1.1 Crore to the Income Tax Department by obtaining his PAN number during 2024-25.

My client is looking after payment of Dr. Kanneganti Kamalakar Rao's statutory dues payable by him, for the apartments belonging to him at West Wind Apartments in Visakhapatnam.

The General public are advised not to believe any of such baseless allegations made against Mr. Kanneganti Muralidhar Rao and his family published in 21st December, 2025 by Ms. Kanneganti Umakumari in the form of public notice. The said Public Notice has defamed my client & his family and has lowered his image in the eyes of his relatives, friends, and society at large.

My client calls upon Ms. Kanneganti Umakumari to account all the amounts that she has so far collected in respect of agricultural properties of Dr. Kanneganti Kamalakar Rao within 48 hours of the publication of this Reply Public Notice failing which criminal and civil action will be initiated against her acts of criminal misappropriation and breach of trust.

My client calls upon Ms. Uma Kumari to withdraw the Public Notice dated 21st December, 2025 published in Eenadu in Bapatla, Amaravathi Guntur and Visakhapatnam Editions within 48 hours of the publication of this Reply Public Notice, failing which my client will be initiating appropriate legal action both Civil and Criminal against Ms. Kanneganti Umakumari for civil and criminal defamation, breach of trust and recovery of money.

Sd/- KARUNA RAWAL, P.V.G. NIKITHA, NEMANI SAI CHARAN
Advocates
Office at Flat No.101, Sai Ridah Jeevan Residency, H. No.6-1- 318/1, Walker Town, Padmarao Nagar, Secunderabad-500020. Mobile: 9966897702

(c) eenadu

ఆంజనేయస్వామికి ఆభరణాలు అందజేత

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : బస్టాండు సెంటరులో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయానికి దాతలు గొడవర్తి మల్లికార్జునరావు, దాసరి భాస్కరరావు, పడమటి రాజకుమారి, రామారావు, కార్తీక్ కలిసి రూ.80 వేలు విలువగల ఇత్తడి ఆభరణాలను ఆదివారం అందించారు. అర్చకులు బృందావనం సత్యనారాయణచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ మోర్ల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు

భగవద్గీత పఠనం చేస్తున్న చిన్నారులు

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని భావనారాయణ స్వామి, పాత బస్టాండ్, టీనగర్, అగ్రహారం వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మూలవిరాట్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులు పూజలు చేశారు. వారణాసి సతీష్ సంఘం ఆధ్వర్యంలో చిన్నారులు భగవద్గీత శ్లోకాలు పఠించి అర్థాన్ని వివరించారు. భాగవతం నాటక రూపం ఆకట్టుకుంది. తిరుప్పావై ప్రవచనాలు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

? రేపల్లెలో పైపులైను ఏర్పాటు దృష్ట్యా ప్రధాన రహదారిపై తీసిన గుంతలను కంకర డస్ట్‌తో పూడ్చారు. గాలికి దుమ్ము లేచి వాహన చోదకులు, బాటసారులు అసౌకర్యానికి గురవుతున్నారు. -నాగేశ్వరరావు రేపల్లె. ✔ పైపులైను పనులు పూర్తయిన తరువాత కంకర, సిమెంటుతో పూడుస్తాం. -శామ్యూల్, మున్సిపల్ ఏఈ. ? రేపల్లె 17వ వార్డులో మూడు చోట్ల విద్యుత్తు వీధి దీపాలు వెలగడంలేదు. -వెంకట్రావు, స్థానికుడు. ✔ వెంటనే వెలగని దీపాలను గుర్తించి ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం. -శామ్యూల్, మున్సిపల్ ఏఈ రేపల్లె. – న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

స్పందనకు వందనం.. పిచ్చి మొక్కల తొలగింపు..

కర్లపాలెం, న్యూస్‌టుడే: పెదగొల్లపాలెం పంచాయతీ గాంధీనగర్‌లో విద్యుత్తు స్తంభంతో పాటు తీగలకు పిచ్చి మొక్కలు అల్లుకున్నాయి. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని ఈనాడులో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. విద్యుత్తు శాఖ ఇన్‌ఛార్జి ఏఈ దుర్గాప్రసాద్ సిబ్బందిని పంపి పిచ్చి మొక్కలు తొలగింపజేశారు.

చిట్టి బుర్రలు.. గట్టి ఆలోచనలు

★ వాహన, అగ్ని ప్రమాదాలు నివారించే ప్రాజెక్టుల రూపకల్పన

పెదపులివర్రు (భట్టిప్రోలు), న్యూస్‌టుడే

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొనే విద్యార్థులు సైన్సు ప్రాజెక్టుల ప్రదర్శనలో అబ్బుర పరిచారు. వారు తయారు చేసిన ప్రాజెక్టులు మండల, జిల్లా స్థాయి ప్రదర్శనల్లో ప్రథమ స్థానాలు సాధించి రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. ఇటీవల కాలంలో బస్సుల్లో అగ్నిప్రమాదాలు, రహదారులపై ద్విచక్ర వాహనాలు, కార్లు ప్రమాదాలను చూసి పెసర్లంక, పెదపులివర్రు, టీఎంరావు ఉన్నత పాఠశాలల విద్యార్థులు చలించారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలతో స్ఫూర్తి పొంది వాహన ప్రమాదాలు నివారించేందుకు ప్రాజెక్టులు రూపొందించారు. ఉన్న వనరులు సద్వినియోగం చేసుకుంటూ రూపొందించిన ప్రాజెక్టులు అబ్బుర పరుస్తున్నాయి.

లైట్లు డిమ్ అయ్యేలా..

రోడ్లపై జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు టీఎంరావు ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టు ఇటీవల ప్రదర్శనలో జిల్లాలో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఎదురుగా వాహనం వచ్చేటప్పుడు లైట్లు డిమ్ అయ్యేలా ప్రాజెక్టు తయారు చేశారు. రాత్రి సమయాల్లో ఈ విధానం ద్వారా ఎదురుగా వచ్చే వాహనాన్ని గుర్తించి నెమ్మదిగా పోనీవచ్చు. ఈ లైట్లను వాహనాలకు ప్రత్యేక ట్రాన్సిస్టర్ అమర్చి ఏర్పాటు చేసుకుంటే చాలావరకు ప్రమాదాలను నివారించవచ్చు. ప్రస్తుత శీతాకాలంలో మంచు కురుస్తున్న సమయంలో లైట్లు వాడుతుంటారు. వీటికి ఈ విధానం అవలంబిస్తే చాలా వరకు ప్రయోజనం చేకూరుతుంది.

హీటింగ్ సెన్సార్ ఎలా పనిచేస్తుందంటే

ఇటీవల కాలంలో చోటుచేసుకున్న వాహన ప్రమాదాలపై పెసర్లంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కలత చెందారు. హీటింగ్ సెన్సార్‌తో ప్రమాదాలను నివారించవచ్చని గుర్తించి ప్రాజెక్టు రూపొందించారు. ప్రతి బస్సులో ఇంజిన్‌కు సెన్సార్ విధానం అమర్చితే సాధారణ టెంపరేచర్ కంటే వేడి ఎక్కువ అనిపిస్తే మోటారుకు అమర్చిన సెన్సార్ ద్వారా ఇంజిన్ ఆగిపోతుంది. కార్బన్‌డై ఆక్సైడ్ బస్సుల్లో వచ్చే మంటలను ఆర్పి వేస్తుంది. దీనిద్వారా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఉంటుంది. రాత్రి సమయంలో అగ్నిప్రమాదాలు జరిగితే ఈ విధానం ద్వారా ముందుగానే ప్రయాణికులకు సమాచారం అందించవచ్చు. ఆ సమయంలో బస్సును నిలుపుదల చేసి ప్రయాణికులను కిందకు దించితే సురక్షితంగా బయటపడతారు. ఈ ప్రాజెక్టు ఇటీవల జిల్లాస్థాయి ప్రదర్శనలో బహుమతి సాధించింది.

రూ.40 లక్షలతో రహదారుల నిర్మాణం

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అనగాని శివప్రసాద్

ఉల్లిపాలెం (నగరం), న్యూస్‌టుడే: పల్లెసీమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెదేపా నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు. సజ్జావారిపాలెం గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న పలు అంతర్గత రహదారులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ పల్లె పండుగ 2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని అంతర్గత రహదారులు, అనుసంధాన రహదారుల నిర్మాణాలు చేపట్టామన్నారు. అలానే ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పీడీ విజయలక్ష్మి, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

వాణిజ్య కేంద్రంగా ఎదిగేలా వసతులు

దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల: జిల్లా కేంద్రం బాపట్ల వాణిజ్య కేంద్రంగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పట్టణంలోని పోలేరమ్మ ఆలయం వద్ద రామ్‌రాజ్ కాటన్ వస్త్ర దుకాణాన్ని ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. వ్యాపారాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. తొలి వస్త్రాన్ని సత్యం సాయి కుటుంబసభ్యులు కొనుగోలు చేశారు. పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి, తెదేపా పట్టణాధ్యక్షుడు శ్రీనివాసరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

గాలిబ్ రచనలు సమాజానికి ఉపయుక్తం

బాపట్లటౌన్: ఉర్దూ భాషకు ప్రపంచఖ్యాతిని తెచ్చినకవి గాలిబ్ అని సాహితీ భారతి అధ్యక్షుడు ఆర్.నరసింహవర్మ అన్నారు. పట్టణంలోని జమీందారుపేటలోని సాహితీ భారతి కార్యాలయంలో కవి గాలిబ్ జయంతి సభ ఆదివారం జరిగింది. ఈసందర్భంగా నరసింహవర్మ మాట్లాడుతూ గాలిబ్ గీతాలను ప్రముఖ నటులు అక్కినేని నాగేశ్వరరావుకు అంకితం ఇచ్చినట్లు ఆయన చెప్పారు. ఆయన రచనలు సమాజానికి ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జాకబ్, ఎం.శ్రీనివాసరావు, శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సోషలిజం

బాపట్ల, బాపట్ల వెస్ట్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేస్తామని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎ.శేఖర్‌బాబు అన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి పీడీ సోషలిజం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నిబద్ధతతో పని చేస్తామన్నారు. సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించకుంటే పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా ఎ.శేఖరబాబు, ఉపాధ్యక్షులుగా కిషోర్, ఈర్షద్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, రవి, ప్రధాన కార్యదర్శిగా సోషలిజం, కార్యదర్శులుగా నారాయణ, శ్రీనివాసరావు, కృష్ణవేణి, శ్రీనివాస్, చెన్నకేశవులు, వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లుగా శ్రీనివాసరావు, రామయ్య, పద్మావతి, శ్రీనివాస్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా నాగాంజనేయులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సయ్యద్ చాంద్‌బాషా, పరిశీలకులుగా జిలాని వ్యవహరించారు.

తెదేపా బలోపేతానికి పని చేద్దాం

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల పార్లమెంటు నియోజకవర్గంలో తెదేపా బలోపేతానికి నేతలు, కార్యకర్తలు కలిసి పని చేద్దామని పార్టీ పార్లమెంటు అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు అన్నారు. నూతనంగా పార్లమెంటు ఉపాధ్యక్షులుగా నియమితులైన మద్దాల ముసలయ, అల్లం గోపీకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి చుక్కా పాల్ రాజ్, కార్యదర్శి కూచిపూడి జాన్సీరాణి, అధికార ప్రతినిధి సౌపాటి గ్లోరీలు సలగలను ఆయన గృహంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. రాజశేఖరబాబు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించేలా కృషి చేయాలన్నారు.

నూతన ఆవిష్కరణలు సాధించేలా ప్రోత్సాహం

కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐఈటీఈ అధ్యక్షుడు సునీల్, బీఈఎస్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి నాగేశ్వరరావు

బాపట్ల, న్యూస్‌టుడే: ఈసీఈ విద్యార్థులు పరిశోధనలు చేసి నూతన ఆవిష్కరణలు సాధించేలా ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్(ఐఈటీఈ) ప్రాంతీయ ఉపకేంద్రం ప్రోత్సహిస్తుందని సంస్థ అధ్యక్షుడు సునీల్ అన్నారు. ఐఈటీఈ ప్రాంతీయ ఉపకేంద్రాన్ని బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బీఈఎస్ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. ఉపకేంద్రం ద్వారా సెమినార్లు, సాంకేతిక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారని, దీని వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగం ఉంటుందని వివరించారు. కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రాక్టికల్, పరిశోధన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. సమాచార సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఐఈటీఈ దక్షిణ విభాగం ప్రతినిధి జ్ఞానేశ్వరరావు, నిపుణులు సీతా రాంబాబు, విజయవాడ ప్రాంతీయ ఛైర్మన్ సూర్యప్రసాదరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: కళాకారులను ప్రోత్సహించి పట్టణవాసులు ఆనందంగా గడపటానికి ఆనంద ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పురపాలిక కమిషనర్ రఘునాథరెడ్డి అన్నారు. పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహ కూడలిలో ఆనంద ఆదివారం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు, కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రతిభకు పట్టం

విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల డైరెక్టర్ అభినవ్

బాపట్ల, న్యూస్‌టుడే: ఈనాడు ఆధ్వర్యంలో పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు సాత్విక ప్రథమ, లీలా రవీంద్రనాథ్ ద్వితీయ, దిలీప్ తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ అభినవ్ బహుమతులు అందజేశారు.

రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం

బాపట్ల, న్యూస్‌టుడే: రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి అంకితభావంతో కృషి చేస్తానని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నూతన అధ్యక్షుడు సీహెచ్ సురేష్‌బాబు అన్నారు. కలెక్టరేట్ ఆవరణలోని రెవెన్యూ భవన్‌లో జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా సీహెచ్ సురేష్‌బాబు, సహాధ్యక్షురాలిగా ఎస్‌కే సలీమా, ఉపాధ్యక్షులుగా బి.వెంకటేశ్వర్లు, ఎం.మాధవిలత, జి.నాగరాజు, జి.గీతారాణి, ప్రధాన కార్యదర్శిగా ఎం.ఓంకార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎం.సత్యనారాయణ, క్రీడలు, సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా డి.శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శులుగా కేఆర్ శోభారాణి, ఎస్‌కే హజారా బేగం, కోశాధికారిగా కె.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా కిరణ్, వెంకట్రావు వ్యవహరించారు. నూతన కార్యవర్గ సభ్యులను ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, సహకార ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టీవీ ఫణి పేర్రాజు అభినందించారు.

నీటి వృథా అరికట్టండి

కర్లపాలెం మండలం పేరలి పంచాయతీ పాతపాలెం అంబేడ్కర్ కాలనీలో మూడేళ్లనుంచి పైపు లీకై పంచాయతీ నీళ్లు వృథాగా పోతున్నాయి. గ్రామంలో ప్రజలకు అందించే తాగునీరు కలుషితం అవుతున్నా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడంలేదు. మరమ్మతులు నిర్వహించి నీటి వృథాను అరికాట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి కార్యదర్శి కాగిత అరుణ్‌బాబు మాట్లాడుతూ వెంటనే పైపుకు మరమ్మతులు నిర్వహిస్తామని తెలిపారు. –న్యూస్‌టుడే, బాపట్లటౌన్

పురాతన వంతెన.. ప్రమాదం అంచున

పెదపూడి గ్రామం వెలుపల ఎల్‌జీ చానల్‌పై బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెన కింద ఊతంగా వేసిన ఇనుప గడ్డర్లు పట్టుతప్పి జారిపోయాయి. వంతెనకు ఒకవైపున రక్షణగా ఏర్పాటుచేసిన ఇనుప బద్దెలు కూలిపోయాయి. ఇటుగా నిత్యం మూల్పూరు గ్రామస్థులు మండల కేంద్రం అమృతలూరు రాకపోకలు సాగిస్తుంటారు. పెదపూడి గ్రామ రైతులు వ్యవసాయ ఉత్పత్తులు తరలిస్తుంటారు. భట్టిప్రోలు నుంచి చుండూరు వెళ్లు వాహనాలు, చిన్నకార్లు ఇటుగా వెళుతుంటాయి. బరువైన వాహనాలు వచ్చిన సమయంలో కూలిపోయే ప్రమాదముందని ప్రయాణికులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ డీఈ అరుణ మాట్లాడుతూ వంతెన పరిస్థితి పరిశీలించామని, ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపామని చెప్పారు. నిధులు మంజూరయ్యాక మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. –న్యూస్‌టుడే, మూల్పూరు, (అమృతలూరు)

దాతల సహకారం.. షెల్టర్ నిరుపయోగం

భవనంవారిపాలెంలో దాతల సహకారంతో నిర్మించిన బస్‌షెల్టరు నిరుపయోగంగా ఉంది. బస్‌షెల్టరు ముందు డ్రైనేజీ కాలువ తీసి తూములు వేయకపోవడంతో ప్రమాదకారంగా మారింది. బస్‌షెల్టరులోకి వెళ్లేందుకు సరైన సౌకర్యం లేక పోవడంతో దాతలు నిర్మించిన షెల్టరు ప్రయాణికులకు ఉపయోగం లేకుండా పోయిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం

ఖాళీస్థలం.. విషపురుగులకు నిలయం

రేపల్లె 21వ వార్డు నిమ్మగడ్డ వారివీధిలోని ఖాళీ స్థలంలో ముళ్లు, పిచ్చి చెట్లు పెరిగి విష సర్పాలకు నిలయంగా మారింది. రాత్రివేళ పాములు రోడ్డుపైకి రావడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అక్కడ పడేసిన వ్యర్థాలు పేరుకుని పరిసరాల్లో దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. పెరిగిన చెట్లు, వ్యర్థాలను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

శ్రీనివాసరావుకు సేవా రత్న అవార్డు

భట్టిప్రోలు: విద్యారంగ అభివృద్ధి, పలు సేవా కార్యక్రమాలు చేసిన అద్దేపల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బొలిశెట్టి శ్రీనివాసరావు ఆదివారం హైదరాబాద్‌లో మనం ఫౌండేషన్ ద్వారా భారత సేవా రత్న అవార్డు అందుకొన్నారు. ఈసందర్భంగా శ్రీనివాసరావును ఆర్యవైశ్య సంఘ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందనలు తెలిపారు.

కొల్లూరులో ఉచిత వైద్య సేవలు

కొల్లూరు, న్యూస్‌టుడే: తెదేపా మండల కన్వీనర్ మైనేని మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం స్థానికంగా ఎరుకలపూడికి చెందిన స్వాతి న్యూరో సైక్రియాటిక్ క్లినిక్ వైద్యులు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 50 మంది రోగులకు అవసరమైన పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్యులు చందు సునీల్‌కుమార్, యనమల సాయిసుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

31న పింఛన్ల పంపిణీ

చుండూరు, న్యూస్‌టుడే:ఈనెల 31న చుండూరు మండలం పెదగాదెలవర్రులో పింఛన్‌ల పంపిణీలో ఎమ్మెల్యే ఆనందబాబు పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. తెదేపా కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ప్రకృతి వ్యవసాయ రైతుకు సత్కారం

నడింపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయం చేస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్న చెరుకుపల్లి మండలం, నడింపల్లికి చెందిన గోగినేని సురేష్‌ను అధికారులు ఉత్తమ రైతుగా సత్కరించారు. శనివారం గుంటూరులో రైతుసాధికార సంస్థ, రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ, ప్రకృతి వ్యవసాయం - ఆర్గానిక్ సాగు ప్రాంతీయ కేంద్రం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో రైతుల సందేహాలు, అందులో రాణిస్తున్న ఆదర్శ రైతులతో సమావేశ కార్యక్రమాల సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా ఉత్తమ ప్రకృతి వ్యవసాయ రైతుగా సత్కారం అందుకున్నారు. ప్రాంతీయ కేంద్రం జూనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రవీణ్‌కుమార్ వోల్గా, ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ అజయ్ సింగ్ రాజ్‌పుత్ చేతుల మీదుగా జ్ఞాపిక, ధ్రువపత్రం అందుకున్నారు. ఆదివారం అవార్డు అందుకున్న రైతుకు ప్రకృతి వ్యవసాయం జిల్లా ఏడీపీ హుస్సేన్, ఏవో ఫరూక్, రేపల్లె మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ గోగినేని వసుధ, నీటి సంఘం అధ్యక్షుడు గోగినేని రామంజనేయులు, నేతలు అభినందనలు తెలిపారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

విశేష అలంకరణలో స్వామి వారు

అమృతలూరు, న్యూస్‌టుడే: ధనుర్మాసం సందర్భంగా అమృతలూరు శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానంలో పూజలు కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా స్వామివారికి అభిషేకం, పలురకాల పుష్పాలతో విశేష అలంకరణ చేశారు. గోదాదేవి, రంగనాయక స్వామి పూజలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

పిట్టలవానిపాలెం, చెరుకుపల్లి: చెరుకుపల్లి శ్రీ చెన్నకేశవస్వామి, వేణుగోపాలస్వామి, చందోలు శ్రీచెన్నకేశవస్వామి, అల్లూరు శ్రీలక్ష్మీ నరసింహస్వామి, జంపనిలోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయాల్లో ఈనెల 30న ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉత్తర ద్వారదర్శనానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మహాశక్తిదేవతగా బండ్లమ్మ

చందోలు (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: చందోలు బండ్లమ్మ అమ్మవారికి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సువర్ణమాతృకా బంగారు కాసులహారం, రజత కవచంతో అలకంరించగా 'మహాశక్తిదేవత'గా భక్తులకు దర్శనమించారు. పిట్టలవానిపాలెం, గోకరాజు నల్లిబోయినవారిపాలెంలోని బండ్లమ్మ వార్లకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా గజవాహన సేవ

అల్లూరు (పిట్టలవానిపాలెం): ధనుర్మాసం సందర్భంగా పిట్టలవానిపాలెం మండలం అల్లూరు శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో వైభవంగా పూజలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గజవాహన సేవలు నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

శ్రీనివాసశర్మ కుటుంబ సభ్యులకు పరామర్శ

చెరుకుపల్లి: గోవాడ బాలకోటేశ్వరస్వామి దేవాలయ ప్రధానార్చకుడు స్వర్ణ శ్రీనివాస శర్మ మృతిపట్ల పలువురు ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. అనారోగ్య కారణంగా హైదరాబాద్‌లో మృతి చెందిన శ్రీనివాసశర్మ అంత్యక్రియలు ఆదివారం గుళ్లపల్లిలో జరిగాయి. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, నిజాంపట్నం మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, ఏపీ బ్రాహ్మణ సేవాసంఘాల సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి రావూరి ఆంజనేయులు, జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ, మండల అర్చకసేవా సంఘం అధ్యక్షుడు చావలి శ్రీధర్ శర్మ, ఆర్ఎస్ఎస్ నాయకులు నూతలపాటి భాను, మండల పరశురామా సేవాసమితి నాయకులు ఆర్వీఎస్, దేవాదాయశాఖ అధికారులు అశోక్‌కుమార్, వర్మ పరామర్శించారు. అంతిమ యాత్రలో వందలాదిగా పాల్గొన్నారు.

తెదేపా కార్యకర్తల మృతికి సంతాపం

చుండూరు,చెరుకుపల్లి: తెదేపా సీనియర్ కార్యకర్త దాసరి మాణిక్యారావు(70) అనారోగ్య కారణంగా చెరుకుపల్లిలోని ఆయన స్వగృహంలో ఆదివారం మృతి చెందారు. అనగాని శివప్రసాద్ సంతాపం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకొన్న మంత్రి అనగాని సత్యప్రసాద్ స్థానిక నాయకుల ద్వారా మృతుని కుటుంబానికి రూ.10 వేలు, మండల నాయకుడు కొనకాల రవికిరణ్ మరో రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. తాతా ఏడుకొండలు, శౌంరి సుబ్బారావు, ఎమ్మార్కే మూర్తి, దివి రాంబాబు, మల్లాది రామకృష్ణయ్య, దివి శ్రీనివాసరావులు సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ★ చుండూరు మండలం కేఎన్‌పల్లెకు చెందిన తెదేపా కార్యకర్త కూరపాటి గోపి(39) అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే ఆనందబాబు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

శ్వాస ఆడదు.. ధూళి వీడదు..!

మూడేళ్లుగా విద్యానగర్ వాసుల అవస్థలు ★ ఆస్తమా, చర్మ, కళ్ల వ్యాధులతో ఇక్కట్లు

ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల (బాపట్లటౌన్), రైలుపేట, న్యూస్‌టుడే

పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లను తవ్వి అలానే వదిలేశారు. అటుగా వెళ్లే వాహనాలు వేగానికి దుమ్ము, ధూళి పైకిలేచి ఇళ్లు, వస్తువులు, ప్రజలపై పడుతున్నాయి. గాలి కాలుష్యంతో స్థానికులు తరచూ అనారోగ్యం పాలు అవుతున్నారు. పట్టణంలోని విద్యానగర్, పారిశ్రామిక కారిడార్ రోడ్డు, ఆసోదివారిపాలెం రోడ్డు, మరుప్రోలువారిపాలెం-పేరలి రోడ్లుకు ఇరువైపుల నివాసం ఉంటున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు అటుగా వెళ్లాలంటే హడలిపోతున్నారు. విద్యానగర్ వాసులు మూడేళ్లుగా దుమ్మూధూళితో శ్వాసకోశ సమస్యలతో అవస్థలు పడుతున్నారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల ఎదురుగా ఉన్న రోడ్డుపై అధికారులు నిర్లక్ష్యం చూపడంపై విమర్శలు వస్తున్నాయి.

దుమ్ము, ధూళిలో ప్రమాదకరమైన నైట్రోజన్ రేణువులు డస్టు అలర్జీని కలిగిస్తాయి. కాలుష్య గాలిని పీల్చటం వల్ల ఊపిరితిత్తుల్లో దుమ్ము పేరుకుపోయి ఆస్తమా లాంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఎక్కువ. చర్మసంబంధ వ్యాధులు, కళ్ల వ్యాధులు వచ్చే అవకాశం ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వాహనం వెళ్లేటప్పుడు పైకి లేచిన దుమ్ము

★ ఈ విషయమై మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డిని వివరణ కోరగా.. విద్యానగర్ 3వ లైన్ నిర్మాణం త్వరగా చేపట్టాల్సి ఉందన్నారు. సమస్యను ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు సానుకూలంగా స్పందించారని, త్వరలో రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు.

తరచూ అనారోగ్యం

మూడేళ్ల నుంచి నూతన రోడ్డు నిర్మించలేదు. అప్పటినుంచి వాహనాల రద్దీ వల్ల దుమ్ము, ధూళిలోనే కాలం వెళ్లదీస్తున్నాం. ఇళ్లల్లో వృద్ధులకు శ్వాస సక్రమంగా అందటం లేదు. స్థానికులు నిత్యం అనారోగ్యంతో ఆసుపత్రులకు వెళుతున్నారు. స్థానికంగా ఉండే పాఠశాలకు వెళ్లే విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలి. -జయరాణి, విద్యానగర్

ఆహారపదార్థాలపైనా పడుతోంది

విద్యానగర్‌లో రోడ్డుకు ఇరువైపుల ఇళ్లు, దుకాణాలు ఉన్నాయి. రోడ్డు నిర్మించక పోవటంతో అంతా దుమ్ముతో నిండింది. ఇంట్లో వస్తువులు ఆహారపదార్థాలు నిండుతున్నాయి. తారు రోడ్డు నిర్మించి సమస్య పరిష్కరించాలి. -విజయనిర్మల, విద్యానగర్

ద్విచక్ర వాహనాల ఢీ.. వృద్ధుడి మృతి

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : జాతీయ రహదారిలో ఐలవరం గ్రామం వద్ద ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. గ్రామానికి చెందిన వీరంకి సాంబశివరావు(75) ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై జాతీయ రహదారి పైకి వెళుతుండగా భట్టిప్రోలు నుంచి కనగాల వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న బాజీ పరస్పరం ఢీకొన్నారు. సాంబశివరావు అక్కడికక్కడే మృతిచెందాడు. బాజీ తలకి తీవ్రగాయం కావడంతో భట్టిప్రోలు ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేసి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివయ్య తెలిపారు.

బైకు అదుపుతప్పి యువకుడికి తీవ్రగాయాలు

గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: అనగానివారిపాలేనికి చెందిన అనగాని బానుచందర్ ఆదివారం ఉదయం చెరుకుపల్లి వచ్చి ఇంటికి వెళుతున్నాడు. గుళ్లపల్లి శివాలయం సమీపంలో జాతీయ రహదారిపై వెనుక వైపు వేగంగా వస్తున్న వాహనాన్ని చూసి పక్కకు తిరిగాడు. బైకు డివైడర్‌ను ఢీకొని తలకు తీవ్రగాయమైంది. స్థానికులు 108లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అతడు కోమాలో ఉన్నట్లు సమాచారం. రెండేళ్ల క్రితం బానుచందర్ తండ్రి రోడ్డు ప్రమాదంలో మరణించాడు. విషయం తెలిసి తల్లి, చెల్లి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఈ యువకుడు బంధువు. చెరుకుపల్లి పోలీసులు ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.

(c) eenadu

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

సామూహికంగా భగవద్గీత పఠనం

వేటపాలెం, న్యూస్‌టుడే: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని రావూరిపేటలోని చెన్నకేశవస్వామి ఆలయంలో వాసవీ మహిళా సంఘంచే ఆదివారం సామూహికంగా భగవద్గీత పఠించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త శ్రీనివాసరావు, అనుమాలశెట్టి సురేష్, కోశాధికారి దోగుపర్తి బాలకృష్ణ, గట్టా రమేష్, భక్తులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

కారంచేడు, న్యూస్‌టుడే: కారంచేడులోని శ్రీ జగజ్జననీ గంగా భవానీ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పసుపుతో అమ్మవారి పాదాకృతులను తీర్చిదిద్ది, పొంగళ్ల నైవేద్యాలు, సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి దేవాలయ ఆవరణలో అమ్మవారి నామకీర్తన భజనలు చేశారు.

పూజలు చేస్తున్న మహిళా భక్తులు

అసంపూర్తి కాలువలతో అవస్థలు

వైకుంఠపురం, పేరాల, ముంతావారికూడలి (చీరాల), న్యూస్‌టుడే: పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భవనాలు, బహుళ అంతస్థులు వెలుస్తున్నాయి. దీంతో ఇంట్లో చెత్త నుంచి మురుగు నీరు వరకు ప్రతీది బయటకు పంపాల్సిన పరిస్థితి. ప్రస్తుతం పట్టణంలోని చాలా ప్రాంతాల్లో మురుగు కాలువల నిర్మాణం జరగలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా ప్రాంతాల్లో రహదారిపైకే మురుగు వస్తుంది.

పట్టణంలోని వైకుంఠపురం, జయంతిపేట, పాపరాజుతోట, పేరాల, ఇలా అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల ప్రధాన రహదారికి అనుబంధంగా కాలువలు నిర్మించారు. కానీ అంతర్గత రోడ్లకు కాలువల నిర్మాణం జరగలేదు. మరికొన్ని ప్రాంతాల్లో అస్సలు కాలువలే లేవు. కొన్ని చోట్ల రహదారికి ఒకవైపు కాలువ నిర్మించారు. దీంతో అవతలివైపు వారు మురుగు బయటకు పంపే మార్గం కోసం రోడ్లను తవ్వి, పైపులు వేస్తున్నారు. దీనివల్ల పైపు వేసిన చోట సిమెంటుతో రోడ్డును పూడ్చడం వల్ల ఎత్తుగా తయారై, వేగ నిరోధకాలుగా మారుతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో మురుగునీరు రహదారిపైకి వస్తుండటంతో చుట్టుపక్కల ఇళ్లవాళ్లు తరచూ ఘర్షణలు పడుతున్నారు. ఇలా పట్టణంలోని చాలా చోట్ల రోడ్లు మరమ్మతులకు గురవుతున్నాయి.

జిల్లాలోనే ముఖ్యమైన పట్టణంలో ఇటువంటి పరిస్థితి ఉండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

ఈ జలం.. ఎంత సురక్షితం?

కొత్తపేట(వేటపాలెం), న్యూస్‌టుడే: ఆర్వో ప్లాంట్ల ద్వారా నీటిని నేరుగా సీసాలో పోసి విక్రయిస్తున్నారు. ఈ అక్రమ నీటి వ్యాపారం రూ.లక్షల్లో సాగుతోంది. అయినా అధికారులు ఆవైపు కన్నెత్తి చూడని స్థితి నెలకొంది. ప్రారంభంలో ఎవరైనా చూస్తారనే ఉద్దేశంతో చాటుమాటున దుకాణాలకు వీటిని నిర్వాహకులు సరఫరా చేసేవారు. ప్రస్తుతం బహిరంగంగానే ఆటోల్లో తరలిస్తున్నారు. ప్రధానంగా కొత్తపేట చుట్టుపక్కల అనుమతుల్లేకుండా వీటిని విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారు. గతంలో వీరందరు 20 లీటర్ల క్యాన్ల ద్వారా నీటిని విక్రయించేవారు. ప్రస్తుతం లీటరు సీసాల్లో ఆ నీటినే నింపి, దానికి సీల్‌తో పాటు వివిధ రకాల పేర్లతో రంగు రంగుల లేబుల్స్ వేసి మార్కెట్‌లోకి పంపుతున్నారు. ఇవి దాదాపు రెండు వారాలుపైనే ఇలా దుకాణాల్లో నిల్వ ఉంటున్నాయి. ఇలా నీటిని సీసాల్లో నింపి విక్రయించాలంటే తప్పనిసరిగా ఐఎస్ఐ అనుమతి ఉండాలి. దీంతో పాటు ప్యాకింగ్, నిల్వ ఉండే తేదీలను దానిపై ముద్రించాలి. ఇటువంటివి ఏమీ లేకుండా దర్జాగా వీటిని తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. అన్ని అర్హతలున్న కంపెనీలు తయారు చేసిన లీటరు సీసా ఖరీదు మార్కెట్‌లో రూ.20 ఉండగా ఎటువంటి అనుమతుల్లేకుండా తయారు చేసిన వాటిని రూ.10 విక్రయిస్తున్నారు. కొనుగోలుదారులు తక్కువ ధరకు వస్తుందని చూస్తున్నారే తప్ప దీనివల్ల కలిగే హానిని గుర్తించలేకపోతున్నారు. ఇందులో నీరు నిల్వ ఉండడంతో వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. వీటిపై సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఇటువంటి వాటిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

కాస్త తారు పోసి బాగు చేయరూ

చినగంజాం, న్యూస్‌టుడే: చిన గంజాం విద్యుత్తు ఉప కేంద్రం ఎదురుగా మహాలక్ష్మి ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలో ఉన్న రైల్వే గేటు వద్ద రెండు రైల్వే ట్రాక్‌ల మధ్య కంకర రాళ్లు లేచాయి. ఇవి వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారాయి. రాళ్లు లేచిన ప్రాంతంలో గుంతలు ఉండటంతో ముఖ్యంగా ద్విచక్ర వాహనచోదకులు అక్కడికి వచ్చేసరికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత రైల్వేశాఖ అధికారులు గేటు మధ్య లేచిన కంకర రాళ్లపై తారు పోసి, బాగు చేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.

రెండు రైల్వేట్రాక్‌ల మధ్య ఇలా..

సముద్రంలో లోతుకు వెళ్లి స్నానాలు చేయవద్దు

వేటపాలెం, న్యూస్‌టుడే: సముద్ర స్నానం కోసం వచ్చే పర్యాటకులకు చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం కఠారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం తీర ప్రాంతాల్లో అవగాహన కల్పించారు. నీళ్లలో లోతుకు వెళ్లి స్నానాలు చేయడం ప్రమాదంతో కూడుకున్నదని కానిస్టేబుల్ సుబ్బారావు వారికి వివరించారు. యువత మద్యం తాగి లోపలికి వెళ్లడమంటే ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నట్లేనని.. ఎంతో దూరం నుంచి వచ్చారని...సురక్షితంగా ఇళ్లకు చేరాలని వివరించారు. లగేజీలపై జాగ్రత్త వహించాలని సూచించారు.

పర్యాటకులకు జాగ్రత్తలు చెబుతున్న కానిస్టేబుల్ సుబ్బారావు

సమస్యల వలయంలో కాలనీలు

గాంధీనగర్, జాండ్రపేట (చీరాల గ్రామీణం), న్యూస్‌టుడే: చీరాల మండలం గాంధీనగర్, జాండ్రపేట పంచాయతీలలో పలు కాలనీలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. నిధుల లేమితో అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. ముఖ్యంగా రహదారులు నాణ్యంగా లేవు. గాంధీనగర్‌లోని ఆర్యే కాలనీ ప్రధాన రహదారి రూపుమారింది. పాదచారులు, వాహన చోదకులు దీని అభివృద్ధి కోసం ఎదురు చూస్తున్నారు. ఇదే గ్రామంలో అంగన్‌వాడీ భవనం దెబ్బతింది. చిన్నారులు ఊడుతున్న పెచ్చులు భయపెడుతున్నాయి.

అభివృద్ధికి నోచని రహదారి

గ్రామం గతంలో పారిశుద్ధ్యపరంగా ఉత్తమ స్థాయిలో నిలిచింది. వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఉన్నా.. గతంలోలాగా పనిచేయడం లేదు. ఎరువు తయారీకి ఎనిమిది తొట్టెలు ఉండగా.. ఆరు ఖాళీగా ఉంటున్నాయి. ఇక్కడ కొన్ని చోట్ల ఉన్న గుంతలు వర్షాకాలంలో నిండి క్రమంగా జల కాలుష్యానికి కారణం అవుతున్న కారణంగా వ్యర్థాల కేంద్రంలో నీటి వినియోగం తగ్గి, నిర్వహణ భారంగా మారినట్లు సిబ్బంది చెబుతున్నారు. జాండ్రపేట పరిధిలోని బీవీ సుబ్బయ్య కాలనీ, ఎస్సీ కాలనీలు సైతం అపరిశుభ్రత, పటిష్ఠమైన రహదారులు లేక వెలవెల బోతున్నాయి. ప్రజాప్రతినిధులు తక్షణం వీటిపై దృష్టి సారించాలని ఆయా కాలనీల వాసులు కోరుతున్నారు.

తెదేపా బలోపేతానికి పనిచేద్దాం

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల పార్లమెంటు నియోజకవర్గంలో తెదేపా బలోపేతానికి నేతలు, కార్యకర్తలు కలిసి పని చేద్దామని పార్టీ పార్లమెంటు అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు అన్నారు. నూతనంగా పార్లమెంటు ఉపాధ్యక్షులుగా నియమితులైన మద్దు ముసలయ్య, అల్లం గోపీకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి ముక్కా పాల్‌రాజ్, కార్యదర్శి కూచిపూడి జాస్మిన్‌రాజ్, అధికార ప్రతినిధి సాపాటి గోరీలు సలగలను ఆయన గృహంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

సంతమాగులూరు, న్యూస్‌టుడే: ? స్థానిక బీసీ కాలనీలో మూడు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. పంచాయతీ అధికారులు స్పందించి వాటికి మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తేవాలి. స్థానికులు, ముక్కెనవారిపాలెం

✔ తక్షణం పరిశీలిస్తాం. వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తెస్తాం. ఈవోఆర్డీ, శివరామప్రసాద్, సంతమాగులూరు

వెలిగిన వీధి దీపాలు

సంతరావూరు (చినగంజాం), న్యూస్‌టుడే: సంతరావూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంతంలోని వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రుల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, సమస్యను పరిష్కరించాలని ఈ నెల 24న 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి స్థానికులు తెచ్చారు. దీనికి స్పందించిన గ్రామ కార్యదర్శి కె.కృపారావు పంచాయతీ విద్యుత్తు ఉద్యోగి కార్మికులు దేవతోటి జోషి, పోతాబత్తులను ఆదివారం పంపించి, వీధి దీపాలు మరమ్మతులు చేయించారు. దీపాలు వెలిగేలా చేసి, సమస్యను పరిష్కరించారు.

స్పందనకు వందనం

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ తగదు

అద్దంకి, జె.పంగులూరు, బల్లికురవ, న్యూస్‌టుడే: కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ నేతలు సీహెచ్.మజుందార్, వసంతరావు అన్నారు. అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ కూడలి, పంగులూరు, బల్లికురవ నాలుగురోడ్ల కూడలిలో ఆదివారం నిర్వహించిన సీఐటీయూ జాతీయ మహాసభల ప్రచార జాతా సభలో వారు మాట్లాడారు. విశాఖపట్నంలో జనవరి 4న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. నేతలు తంగిరాల వెంకటేశ్వర్లు, తిరుపతిరెడ్డి, తల్లపనేని రామారావు, వినోద్‌బాబు, వసంతరావు వై.సింగయ్య, ఎలిజబెత్, వీరయ్య పాల్గొన్నారు.

ఇంకొల్లులో: జాతాలో మాట్లాడుతున్న వసంతరావు

మార్టూరు, ఇంకొల్లు, న్యూస్‌టుడే: కార్మిక ఉద్యమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేస్తున్నాయని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ దిశగా నడిపించడం కేంద్రానికి తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వసంతరావు, నేత బత్తుల హనుమంతరావు అన్నారు. మార్టూరు, ఇంకొల్లులో ఆదివారం కళాజాతా నిర్వహించారు. కళాకారులు కార్మిక గీతాలతో అలరించారు..మజుందార్, వసంతరావు, సూరిబాబు, వెంకట్రావు, గంగయ్య, అంజయ్య, యేసయ్య, కిరణ్‌కుమార్, రేఖ, రంగారావు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య రక్షణకు భారీగా నిధులు

ఇసుకదర్శి(మార్టూరు), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రజల ఆరోగ్య రక్షణకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తోందని, కార్పొరేట్ వైద్యసేవలను చేరువచేసేలా ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఇసుకదర్శి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏలూరి సిఫార్సు మేరకు మంజూరైన సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన పేద రోగులు 67 మందికి రూ.36,85,956 నగదు చెక్కులు, పత్రాలను అందజేశారు. అనంతరం రోగుల కుటుంబీకులతో మాట్లాడారు. తదనంతరం తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి నక్కల రాఘవ, ఉపాధ్యక్షుడు రాచిపాటి సీతయ్య తదితరులు ఏలూరికి పుష్పగుచ్ఛాలు అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. మార్టూరు పట్టణ సీనియర్ బార్ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

సీఎంఆర్ఎఫ్ పత్రాలు, చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఏలూరి, తెదేపా నేతలు

కించపరిచే వ్యాఖ్యలు, సందేశాలపై చర్యలు

ఇంకొల్లు, న్యూస్‌టుడే: కించపరిచే వ్యాఖ్యలు, సందేశాలు పంపేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ రమణయ్య హెచ్చరించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కులం, మతం, వర్గం, రాజకీయ పార్టీలను అవమానించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం, పంచుకోవడం లాంటి చర్యలు నిషిద్ధమన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారి గురించి పోలీసులకు తెలియజేయాలన్నారు. గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకునేవారు పంచాయతీ, పోలీసు శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

ముక్కోటికి చురుగ్గా ఏర్పాట్లు

అద్దంకి, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశి పర్వదినానికి ఆలయాలను సిద్ధం చేస్తున్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి, అద్దంకి రంగనాయకస్వామి ఆలయాల వద్ద ఉత్తరద్వార దర్శనం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. 30వ తేదీ ఉదయం 5.30 గంటల నుంచి ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనం ప్రారంభమవుతుందని ఆయా దేవాలయాల అధికారులు వెల్లడించారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి గుడి వద్ద ఉత్తర రాజగోపురాన్ని నీళ్లతో శుభ్రం చేస్తున్నారు. ఉత్తర

ఆంజనేయస్వామికి వేస్తున్న రంగులు

అద్దంకి కాకానిపాలెం రంగనాయకస్వామి ఆలయం దగ్గర రంగులు వేస్తున్నారు. విద్యుద్దీపాలంకరణ చేశారు. ధేనువకొండ, బొమ్మనంపాడులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల వద్ద ఏర్పాట్లు జరుగుతున్నాయి. ధేనువకొండ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయానికి నూతన ద్వారాలను ఔత్సాహికులు తుళ్లూరి వెంకటేశ్వర్లు-సుబ్బాయమ్మ దంపతులు రూ.లక్షతో ఏర్పాటు చేయించారు. 30న రెండు దేవాలయాల ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం చేయనున్నారు.

మా వీధిలో కుళాయిలు ఏర్పాటు చేయరూ

తిమ్మరాజుపాలెం(పర్చూరు), న్యూస్‌టుడే: తమ వీధిలోని గృహాలకు కుళాయిలు ఏర్పాటు చేయాలని మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన ప్రజలు కోరుతున్నారు. జలజీవన్ మిషన్ కింద గ్రామంలో ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేస్తుండటంతో తమ నీటి కష్టాలు తీరాయని ఆనందించామని, గ్రామంలోని ఒకటో వార్డు బస్టాండ్ పక్క వీధిలో మంచి నీటి పైపులైను కోసం గుంతలు తవ్వి, మళ్లీ పూడ్చారని ఆ ప్రాంతానికి చెందిన గోరంట్ల శ్రీనివాసరావు, చెన్నుపాటి రాధాకృష్ణ తెలిపారు. డ్రైనేజీలను సాకుగా చూపి తమకు మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయకపోతే రాబోయే కాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటామని, అధికారులు స్పందించి కుళాయిలు ఏర్పాటు చేయాలని సీహెచ్ కౌశిక్‌నారాయణ కోరారు. వృద్ధాప్యంలో

కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు

ఉన్న తాము చెరువు వద్దకు వెళ్లి మంచినీరు తెచ్చుకోలేమని అధికారులు, పాలకులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని జి.సుశీల, నాగేంద్రం కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగరాజును ఫోన్‌లో వివరణ కోరగా ఆ వీధిలోని వారు డ్రైనేజీ నిర్మించుకుంటామని తెలపడంతో వేసిన మంచినీటి పైపులైనును తొలగించామని చెప్పారు. నిబంధనల ప్రకారం రెండూ పక్కపక్కన ఉండకూడదన్నారు.

రోజుకో మొక్క.. ఇంటికో చెట్టు

అద్దంకి, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి వ్యక్తి ముందుకు నడవాలని ఆ నలుగురు చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు రాచుమల్లు శివాంజనేయులు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీ పక్కన మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. రోజుకో మొక్క.. . ఇంటికో చెట్టు అనే నినాదంతో చిన్నారులతో కలిసి మొక్కలు నాటిస్తున్నట్లు చెప్పారు. తొలి ప్రయత్నంగా సత్యనారాయణ కళామందిర్ పక్క బజారులో మొక్కలు నాటినట్లు చెప్పారు. దివంగత సంఘ సేవకులు పంతంగి పెద్దజ్యోతయ్య, టీకొట్టు కాశయ్యతో కలిసి పట్టణంలో మొక్కలు నాటేందుకు శ్రీకారం పలికినట్లు చెప్పారు. పూర్వపు వార్డు సభ్యులు రంగిశెట్టి సాంబశివరావు(లహరి), చిట్యాల శ్రీనివాసరావు, వడ్డవల్లి జనార్దనరావు, రాము పాల్గొన్నారు,

ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన మొక్కలు నాటుతున్న చిన్నారులు

ఎమ్మెల్యే ఏలూరిని కలిసిన డీఆర్‌డీఏ పీడీ

మార్టూరు, న్యూస్‌టుడే: డీఆర్‌డీఏ పీడీగా నూతనంగా నియమితులైన బత్తిన సింగయ్య ఆదివారం మార్టూరు మండలం ఇసుకదర్శి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఏలూరికి పుష్పగుచ్ఛం అందించగా సింగయ్యని శాలువాతో సత్కరించారు.

నాగవరపమ్మకు కంచు గంట వితరణ

వేటపాలెం, న్యూస్‌టుడే: కనక నాగవరపమ్మ అమ్మవారి ఆలయానికి సాబినేని పుష్పావతి జ్ఞాపకార్థం భర్త సుబ్బారావు, కుమారుడు లలితబాబు దంపతులు రూ.20 వేలు విలువ చేసే కంచు గంటను ఆదివారం బహూకరించారు. ఆలయ ఛైర్మన్ వలేటి ఆంజనేయులకు దీన్ని అందించారు. కమిటీ సభ్యులు గుత్తి వీరప్రసాద్, ఈవో శ్రీనివాసరావు ఉన్నారు.

హనుమాన్‌చాలీసా పారాయణం

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే: స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అద్దంకి పట్టణానికి చెందిన స్వర్ణ వెంకటసుబ్బారావు శిష్య బృందం 108మంది మహిళా భక్తులు పాల్గొన్నారు. స్వామివారి గుడిలో చాలీసా పారాయణం జరిపిస్తామని భక్తులు నేరెళ్ల వెంకట శేషగిరిరావు సోదరులు మొక్కు మేరకు ఇది ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మహిళా భక్తులతో పాటు శ్రీనివాసరావు, నాగసూరి రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

పర్చూరు, న్యూస్‌టుడే: కొల్లా సాకేత్ ఫౌండేషన్ ఆర్థిక సాయంతో రోటరీక్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్, చీరాల అపోలో స్పెక్ట్రా వైద్యశాల ఆధ్వర్యంలో స్థానిక రోటరీభవన్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు డి.రవికిరణ్, నిరుపమ, రవికిరణ్‌తోపాటు పలు విభాగాల్లో నిపుణులైనవారు సుమారు 248 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు టి.కృష్ణమోహన్, అసిస్టెంట్ గవర్నర్ ఎన్.శ్రీనివాసరావు, సభ్యుడు కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా

అద్దంకి, : జిల్లాలో మూడు రోజుల పాటు నాకాబందీ నిర్వహిస్తున్నట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. నూతన సంవత్సరం వేడుకలను దృష్టిలో ఉంచుకొని ఎస్పీ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, పరిమితికి మించి ప్రయాణిస్తున్నా, అనుమతి లేకుండా ఆయుధాలు కలిగి ఉన్నా తక్షణ చర్యలు ఉంటాయన్నారు. ఈనెల 31న నూతన సంవత్సర వేడుకల పేరుతో ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

మేదరమెట్ల, న్యూస్‌టుడే: గంజాయి, మత్తుపదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ మల్లికార్జునరావు అన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్లలో ఆయన ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ.. గంజాయి రవాణా చేయకుండా ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వాహనాన్ని నిలిపి సోదా చేసినట్లు వెల్లడించారు. ఎస్సై మహమ్మద్ రఫి, సిబ్బంది పాల్గొన్నారు.

మేదరమెట్ల: వాహనం తనిఖీ చేస్తున్న సీఐ మల్లికార్జునరావు, ఎస్సై మహమ్మద్ రఫి

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లులోని ప్రధాన రహదారుల్లో ఆదివారం పోలీసులు నాకా బందీ నిర్వహించారు. ఎస్సై సురేష్ తన సిబ్బందితో పాతచెన్నై, కడవకుదురు రహదారుల్లో వాహనాలను తనిఖీ చేశారు.

గాలిబ్ రచనలు సమాజానికి ఉపయుక్తం

బాపట్లటౌన్: ఉర్దూ భాషకు ప్రపంచకీర్తిని తెచ్చినకవి గాలిబ్ అని సాహితీ భారతి అధ్యక్షుడు ఆర్.నరసింహవర్మ అన్నారు. పట్టణంలోని జమేదారుపేటలోని సాహితీ భారతి కార్యాలయంలో కాలిబ్ జయంతి సభ ఆదివారం జరిగింది. ఈసందర్భంగా నరసింహవర్మ మాట్లాడుతూ గాలిబ్ గీతాలను ప్రముఖ నటులు అక్కినేని నాగేశ్వరరావుకు అంకితం ఇచ్చినట్లు ఆయన చెప్పారు. ఆయన రచనలు సమాజానికి ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జాకబ్, ఎం.శ్రీనివాసరావు, శ్రీరామచద్రమూర్తి పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

చీరాల : దండుబాట వద్ద విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీ-2 ఏఈ బి.శంకర్ తెలిపారు. దండుబాట, పాలేటినగర్, ప్రకాష్‌నగర్, జాలమ్మగుడి ప్రాంతాల్లో 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

బల్లికురవ, న్యూస్‌టుడే: బల్లికురవలోని పోలేరమ్మ తల్లి ఆలయంలో ఆదివారం విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. భక్తులు పొంగలి నైవేద్యాలతో మొక్కులు చెల్లించుకున్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

స్వర్ణ(కారంచేడు) : గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద నూతనంగా సుమారు రూ.7లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రహదారి పనులకు ఆదివారం ఎంపీడీవో కె.నేతాజీ, తెదేపా నేత టి.శ్రీహరి, నాయకులు భూమి పూజ చేశారు.

త్రిమూర్తులుకు 'విశిష్ట సేవారత్న' పురస్కారం

అద్దంకి, న్యూస్‌టుడే: పట్టణంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న మన్నం త్రిమూర్తులకు 'విశిష్ట సేవారత్న' పురస్కారం అందిస్తున్నట్లు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పీసీహెచ్.కోటయ్య అన్నారు. అద్దంకి బంగ్లారోడ్డు చిన్ని శాంతయ్య భవన్‌లో ఆదివారం ప్రతిభామూర్తులు మధురస్మృతులు కార్యక్రమం నిర్వహించారు. సినీ దర్శకుడు కె.బాలచందర్ జీవిత విశేషాలను విశ్లేషకులు ఆర్‌వీ.రాఘవరావు వివరించారు. చప్పిడి వీరయ్య, డాక్టర్ యు.దేవపాలన, గాడేపల్లి దివాకర్‌దత్తు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, వారణాశి రఘురామశర్మ, సూదనగుంట రామకృష్ణ, గోవాడ శ్రీకాంత్, చేబ్రోలు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సత్కారం అందుకుంటున్న మన్నం

రతన్ టాటాకు ఘన నివాళి

మార్టూరు, న్యూస్‌టుడే: పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా అడుగు జాడల్లో యువత పయనించాలని జె.పంగులూరు తహసీల్దార్ పోపూరి శింగారావు కోరారు. రతన్ టాటా జయంతిని పురస్కరించుకుని మార్టూరు సాయినగర్‌లో కేకుకోసి, మిఠాయిలు పంచారు. ముందుగా టాటా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఓ వీధికి రతన్ టాటా రోడ్డుగా నామకరణం చేశారు. గ్రానైట్ వ్యాపారి చెన్నుపాటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు మురకొండ ఈశ్వరప్రసాద్, చెన్నుపాటి శ్రీనివాసరావు, పుచ్చకాయల సుబ్బరామయ్య పాల్గొన్నారు.

మార్టూరులో కేకు కోస్తున్న అధికారులు, అభిమానులు, పారిశ్రామికవేత్తలు

ఉద్యోగ విరమణ సన్మానం

జె.పంగులూరు, న్యూస్‌టుడే: ముప్పవరం ఆదర్శ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న పూసల రామారావు ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం పంగులూరు ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుర్రం లక్ష్మీప్రసాద్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో నాగభూషణం, కాంప్లెక్సు ఛైర్మన్ ఇమ్మడి అనిత, ప్రధానోపాధ్యాయుడు పుచ్చకాయల ప్రసాద్ మాట్లాడారు. అనంతరం రామారావును సత్కరించారు. బాచిన పూర్ణావతి, శోభారాణి, మీరాబి, పాపారావు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత షేక్ సర్దార్‌బాషాను స్థానిక ప్రముఖులు ఆదివారం సన్మానించారు. విద్యారణ్య ఆవాస విద్యాలయంలో 30 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా, హెచ్‌ఎంగా సర్దార్ బాషా సేవలు అందిస్తున్నారు. బడి స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన స్వర్ణోత్సవ వేడుకల్లో బాషాను పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఆదివారం స్వగ్రామం ఇంకొల్లు వచ్చిన సర్దార్‌బాషాను ఎంఈవో శ్రీనివాసరావు యూటీఎఫ్ కార్యదర్శి మస్తాన్‌వలి, చెంచయ్య స్థానిక ప్రముఖులు సత్కరించారు.

సర్దార్ బాషాను సన్మానిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు తదితరులు

సాంబయ్య సేవలు మరువలేం

వేటపాలెం, న్యూస్‌టుడే: బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి అనేక పోరాటాలు చేసిన పల్లపోలు సాంబయ్య సేవలు మరువలేమని వక్తలు పేర్కొన్నారు. సాంబయ్య వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విశ్రాంత శాస్త్రవేత్త అందె మురళీ వరప్రసాద్, ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి, పల్లపోలు నాగమనోహర్ లోహియా, రమేష్ బాబు, ఎం.సుభాషిణి, గుర్రాల శేషకుమారి, పసుపులేటి వసంతకుమారి, విజయనిర్మల, సుబ్బారావు, మానస పాల్గొన్నారు.

పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలి

పర్చూరు : వైకాపా పటిష్ఠతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదనరెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సోషల్‌మీడియా విభాగంతో సమావేశం నిర్వహించారు. గాదె యశ్వంత్‌రెడ్డి, చందు పాల్గొన్నారు.

(c) eenadu

క్వాంటం ధ్యానం.. వారసత్వ గానం

■ తిరుపతిలో వైభవంగా 7వ భారతీయ విజ్ఞాన సమ్మేళనం

ఈనాడు డిజిటల్, తిరుపతి; తిరుపతి (విద్య, నగరపాలక), న్యూస్‌టుడే: సప్తగిరుల పాదాల చెంత జరుగుతున్న వైజ్ఞానిక యజ్ఞం మూడోరోజు సరికొత్త పుంతలు తొక్కింది. ప్రాచీన భారతీయ విజ్ఞానానికి ఆధునిక సాంకేతికతను జోడిస్తూ.. వికసిత్ భారత్ దిశగా అడుగులు వేయాలన్న సంకల్పం ఆదివారం నాటి చర్చల్లో స్పష్టంగా కనిపించింది. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ వేదికగా జరుగుతున్న '7వ భారతీయ విజ్ఞాన సమ్మేళనం'లో ఒకవైపు భవిష్యత్ సాంకేతికత (ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీ) అయిన సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్‌పై మేధోమథనం జరగ్గా.. మరోవైపు మన ఘనమైన వారసత్వ సంపదపై విద్యార్థుల ప్రదర్శనలు ఆహూతులను కట్టిపడేశాయి.

మనమే మేటి కావాలి..

సెమీకండక్టర్లు, ఫాబ్ టెక్నాలజీపై జరిగిన సదస్సులో ఐఐటీ రూర్కీ ప్రొఫెసర్ బులుసు ఆనంద్ కీలకోపన్యాసం చేశారు. ఐఐటీ భువనేశ్వర్, రోపార్ సంస్థల ఆచార్యులు రోడ్ మ్యాప్‌ను వివరించారు. 'క్వాంటం కంప్యూటింగ్' అప్లికేషన్లపై అమృత విశ్వవిద్యాలయ ఆచార్యులు డా.మృత్యుంజయ్ గుహ మజుందర్ నేతృత్వంలో నిపుణులు దిశానిర్దేశం చేశారు.

రీల్స్ రూపంలో వైభవం..

'నీ వారసత్వ సంపదని తెలుసుకో' పేరుతో నిర్వహించిన పోటీ.. ప్రధాన ఆకర్షణగా నిలిచింది. 240 మంది విద్యార్థులు తమ ప్రాంతాల్లోని విశిష్టతను పోస్టర్లు, రీల్స్ ద్వారా అద్భుతంగా ప్రదర్శించారు. వారణాసి నుంచి వచ్చిన గురుకుల విద్యార్థులు మల్హర్ భైరవ ఆలయాన్ని ఎలా సంరక్షిస్తున్నారో వివరించి ప్రశంసలు అందుకున్నారు.

ఆర్యభట్ట మొదలు..

భూమి స్థిరంగా లేదు.. తన చుట్టూ తాను తిరుగుతుంది అని ఆధునిక శాస్త్రవేత్తలు చెప్పకముందే.. వేల ఏళ్ల క్రితమే ఆ నిజాన్ని ప్రపంచానికి చాటిన మేధావి ఆర్యభట్ట. కేవలం పురుషులే కాదు.. స్త్రీలు కూడా వేదాల్లో, పాండిత్యంలో శిఖరాగ్రాలు తాకగలరు అని నిరూపించిన వేద విదుషీమణి 'అపాల'. ఇలా అనే అంశాలతో 'సెన్స్ ఎక్స్‌పో-2'. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన 'ఆర్ష భారత్ - వీర భారత్' చిత్రాలు భారతీయ విజ్ఞాన మూలాలను కళ్లకు కడుతున్నాయి.

మన గ్రంథాలు అపూర్వ సంపద

మహాభారత, రామాయణ చరిత్రలతోపాటు చరిత్ర ఘటనలు, వాస్తవికతను కళ్ల ముందుంచారు. ఎగ్జిబిషన్ చాలా బాగుంది. దాదాపు 135 మంది పురాతన స్కాలర్లు, ప్రాచీనకాలంలోనే వారు రచించిన గ్రంథాలు వెలకట్టలేని వారసత్వ సంపద. నేను ఇంతవరకు ఎక్కడా ఇలాంటి ప్రదర్శన చూడలేదు.

- లోకేశ్వర్ కుమార్, బీటెక్, ఎంబీయూ

నేటితో ముగింపు

సమగ్రవికాసానికి భారతీయ చింతన అనే నినాదంతో ప్రారంభమైన సమ్మేళనం సోమవారంతో ముగియనుంది. ప్రసంగాలకే పరిమితం కాకుండా 'సైన్స్ ఎక్స్‌పో' ద్వారా దృశ్యరూప విజ్ఞానాన్ని వేలమంది విద్యార్థులకు అందించడం విశేషం.

ఘనత తెలిసేలా

శాస్త్రసాంకేతిక అంశాలపై ఎగ్జిబిషన్ తిలకించేందుకు వచ్చా. సమీపంలోనే భారతదేశ పుట్టుక, గ్రంథాలు, ఇతిహాసాలు, వేద, పురాణాలకు సంబంధించిన ఎగ్జిబిషన్ చూసిన తర్వాత నేను డాక్టర్‌నన్న విషయాన్ని మర్చిపోయా. నిజంగా నేను ఈ దేశంలో పుట్టడం అదృష్టంగా భావిస్తున్నా.

- టి.జాహ్నవి, ఎంబీబీఎస్, ఎస్వీ వైద్య కళాశాల

భారతీయ కోణంలోనే బోధన..

● విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, డైరెక్టర్లతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో 'సైన్స్ అండ్ టెక్నాలజీ'ని భారతీయ దృక్పథంతో ఎలా బోధించాలనే అంశంపై చర్చించారు. కేవలం పాశ్చాత్య విజ్ఞానమే కాకుండా, మన మూలాల్లో ఉన్న గణిత, ఖగోళ, వైద్య శాస్త్రాలను పాఠ్యాంశాల్లో చేర్చాలని నిర్ణయించారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక వేడుకలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.

దేవుడి పరిహారంలోనూ కోత..!

■ రూ.3 కోట్ల ఆస్తికి రూ.6 లక్షలతో సరి
■ చేతులు దులుపుకొన్న హైవే అధికారులు

నగరి కొండచుట్టు మండపం నిర్మించి 600 సంవత్సరాలు అవుతోంది. ఇన్నేళ్లుగా ఏటా సంక్రాంతి సందర్భంగా కనుమ రోజున ఇక్కడ దేవతామూర్తులను పెద్దఎత్తున కొలువుదీర్చి కొండచుట్టు ఉత్సవం నిర్వహిస్తారు. ఈ మండపాన్ని తిరుపతి - చెన్నై జాతీయ హైవే అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగించనున్నారు. ప్రస్తుతం అక్కడ ఒక్క అడుగు భూమి మార్కెట్ ధర ప్రకారం రూ.8 వేలు పలుకుతోంది. అయితే జాతీయ రహదారి అభివృద్ధి అధికారులు కేవలం పరిహారం కింద రూ.6 లక్షలు ఇవ్వడం గమనార్హం.

పుత్తూరు, నగరి, న్యూస్‌టుడే: కార్వేటినగరం రాజుల పాలనలో పుత్తూరులో ఆరు శతాబ్దాల క్రితం కార్వేటినగరం రోడ్డు కల్యాణపురం, నగరి మండలం వద్ద కొండ చుట్టు మండపాలు నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది.. వాటిని కాపాడాల్సిన అధికార యంత్రాంగం తొలగించేందుకు సిద్ధం కావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పుత్తూరు-చిత్తూరు రోడ్డులోని కల్యాణపురం వద్ద ఉన్న కొండచుట్టు మండపాన్ని 2010లో పుత్తూరు-చిత్తూరు రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించారు. సమీపానే నూతన మండపాన్ని నిర్మిస్తామన్న హామీ నేటికీ నెరవేరలేదు.

ఇప్పుడు నగరి మండపం వంతు..

ప్రస్తుతం నగరిలోని మండపాన్ని తిరుపతి-చెన్నై రహదారి విస్తరణలో భాగంగా కూల్చేందుకు సిద్ధం చేశారు. ఇప్పటికే నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు. రానున్న కొండచుట్టు ఉత్సవం వరకు గడువు ఇవ్వాలని, అసలు తొలగింపు ఆలోచనే విరమించుకోవాలని ఆర్డీవో నుంచి ఉన్నతాధికారుల వరకు నివేదించారు. మండపం నిర్మించాలంటే ఖర్చు తడిసి మోపెడవుతోందని చెబుతున్నారు. మండపం తొలగించకుండా దీనికి పశ్చిమాన ఉన్న ప్రభుత్వ భూమిలో సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కొక్కొరోకో.. ధర అదరహో

సాధారణంగా పందెం కోళ్లు అధిక ధరకు పలకడం చూశాం.. కానీ ఈ 'ప్యారెట్ బీక్' రకం కోడిపుంజును కేవలం ఆకర్షణ కోసం పెంచుతారు. పుంగనూరుకు చెందిన హర్షద్ బెంగళూరులో ఈ రకం కోడిపిల్లను రెండు నెలల కిందట రూ.5వేలకు కొనుగోలు చేసి తీసుకువచ్చాడు. ప్రస్తుతం దాన్ని రూ.35 వేలకు అడుగుతున్నారని తెలిపారు. సజ్జ, శనగ, గోధుమలు మేతగా ఇస్తున్నట్లు పేర్కొన్నాడు.

- న్యూస్‌టుడే, పుంగనూరు

ఒకే గూడు.. సమగ్ర కార్డు

యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేకు ఏర్పాట్లు

పుత్తూరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో కుటుంబ గణన (హౌస్‌హోల్డ్ సర్వే) చేసి మ్యాపింగ్ పూర్తిచేశారు. అయితే గ్రామ, వార్డు, వాలంటీర్ల భాగస్వామ్యంతో ఈ సర్వే హడావుడిగా చేపట్టారు. దీంతో మ్యాపింగ్‌లో తప్పిదాలు జరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక విషయంలో నాడు చేసిన తప్పిదాలతో నేటికీ ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వాటిని సరిచేయడానికి రంగంలోకి దిగింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఎఫ్‌బీఎంఎస్)ను తీసుకొచ్చింది. ఇందుకు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే (యూఎఫ్ఎస్-2025)కు శ్రీకారం చుట్టింది.

తిరుపతి నగరపాలక సంస్థ, పుత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీలతోపాటు 34 మండలాల్లో ఈనెల 26న సర్వే ప్రారంభమైంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు, వీఆర్వోలకు సమగ్ర శిక్షణ ఇచ్చారు. జనవరి 12లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది.

అన్ని వివరాలు నమోదు.. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో మరణించిన, శాశ్వత వలస వెళ్లినవారు ఉంటే వారి పేర్లు తొలగిస్తారు. యాప్‌లో వ్యక్తిగత, కుటుంబ స్థాయిలో వివరాలు కొత్తగా నమోదు చేస్తారు. తదనంతరం కుటుంబ ప్రయోజన కార్డు అందజేయనున్నారు. కార్యక్రమం క్షేత్రస్థాయిలో నమోదయ్యే పక్కా గణాంకాలపైనే ఆధారపడి ఉంటుంది.

78వేల పాసుపుస్తకాల పంపిణీకి సిద్ధం



చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీకి ముహూర్తం కుదిరింది. రైతుల కష్టాలను తీర్చేలా రాజముద్రతో కూడిన నూతన పాసు పుస్తకాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని చిత్తూరు, కుప్పం, పలమనేరు, నగరి రెవెన్యూ డివిజన్లకు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. అక్కడి నుంచి మండలాలకు వాటిని చేరవేస్తారు. చిత్తూరు డివిజన్‌కు 28 వేల పాసు పుస్తకాలు, కుప్పం డివిజన్‌కు 14 వేలు, నగరికి 10 వేలు, పలమనేరు డివిజన్‌కు 26 వేల పాసు పుస్తకాలు వచ్చాయి. వీటి ముద్రణ పూర్తయినా పంపిణీ కార్యక్రమం 8 నెలలుగా వాయిదా పడుతూ వస్తోంది. ఈ జాప్యం కారణంగా రైతులు ఇబ్బంది పడుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో ముద్రణ పూర్తయిన పుస్తకాలు సత్వరమే రైతులకు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గ్రామసభల్లో పంపిణీ.. గ్రామసభల ద్వారా జనవరి 2 నుంచి 9వ తేదీ వరకు రైతులకు పంపిణీకి కార్యాచరణ రూపొందించారు. గతంలో వారికి పంపిణీ చేసిన భూహక్కు పత్రాలు వెనక్కి తీసుకుని కొత్తవి ఇవ్వనున్నారు. రైతుకు అందినట్లుగా నిర్ధారించేందుకు బయోమెట్రిక్ నమోదు చేయనున్నారు. వివరాలు వెబ్‌ల్యాండ్‌లో వివరాల ప్రకారం సరిపోల్చి ఎలాంటి తప్పులు లేని పాసు పుస్తకాల్ని అందజేయనున్నారు.

'మనమిత్ర'.. తెలియదండి

మనమిత్ర వాడారా? (శాతంలో)

జిల్లా	అవును	లేదు
చిత్తూరు	22.5	77.5
తిరుపతి	22.7	77.3

సేవల గురించి తెలుసా? (శాతంలో)

జిల్లా	తెలుసు	తెలియదు
చిత్తూరు	29.6	70.4
తిరుపతి	29.2	70.8

■ వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన కరవు

ఈనాడు- తిరుపతి, చిత్తూరు: తక్కువ సమయంలో అవినీతి రహితంగా పౌరులకు ప్రభుత్వ సేవలు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ క్రమంలోనే ప్రజలు.. కార్యాలయాల గడప తొక్కకుండా లంచాల సంస్కృతి రూపుమాపాలనే ఉద్దేశంతో 'వాట్సప్ గవర్నెన్స్'కు శ్రీకారం చుట్టింది. ఈ విప్లవాత్మక కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేసి ప్రజల నుంచి ఆదరణ పెరిగేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెబుతోన్నా క్షేత్రస్థాయిలో మార్పు రావడం లేదు. కీలకమైన రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్తు శాఖలు నిస్తేజంగా ఉంటూ 'మనమిత్ర' గురించి ప్రజలకు చేరువచేయడం లేదు.

700 వరకు సేవలున్నా..

ఈ ఏడాది జనవరి చివర్లో రాష్ట్ర ప్రభుత్వం వాట్సప్ 'మనమిత్ర' సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. తొలిదశలో 161 ప్రస్తుతం 700 వరకు సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండానే దాదాపు 80 శాతం సేవలు వాట్సప్ ద్వారానే పొందే అవకాశం ఉంది.

పట్టింపులేని సచివాలయ సిబ్బంది

ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయం సేకరించింది. ఈ సేవల గురించి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాల్సి ఉంది. అయితే చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 4,594 మంది ఉద్యోగులకుగాను 2,971 మంది, తిరుపతిలో 5,258 మందికిగాను 3,512 మంది మాత్రమే అవగాహనలో పాల్గొన్నారు. ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌లో వచ్చేవారికి అవగాహన కల్పించినా ఎక్కువమందికి వాట్సప్ గవర్నెన్స్ చేరువ అవుతుంది.

సేవలకు 95523 00009

వాట్సప్ నుంచి పై నంబరుకు హాయ్ అని మెసేజ్ చేస్తే ప్రభుత్వ సేవలు పొందవచ్చు. దరఖాస్తు నుంచి చివరగా సేవలు పొందేవరకు అంతా ఈ మాధ్యమం ద్వారానే సాధ్యమవుతుంది.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి టోకెన్లు లేని భక్తులకు 10 గంటల్లో, రూ.300 ఎస్ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. శనివారం శ్రీవారిని అత్యధికంగా 91,147 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.4.31 కోట్ల హుండీ కానుకలు లభించాయి. తిరుమలలో చలి తీవ్రత కొనసాగుతోంది.

విద్యుత్తు సమస్యలా.. కాల్ చేయండి

నేడు డయల్ యువర్ ఎస్ఈ

చిత్తూరు (మిట్టూరు): నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తు సరఫరా, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం నుంచి 'డయల్ యువర్ ఎస్ఈ' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామని ఎస్ఈ ఇస్మాయిల్ తెలిపారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. విద్యుత్తు సమస్యలు, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ అములులో ఎదురవుతున్న సమస్యలు తెలియజేస్తే పరిష్కరిస్తామని చెప్పారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ కోరారు.

సంప్రదించాల్సి నంబరు : 79931 47979

30న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

చిత్తూరు జడ్పీ, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 30న నిర్వహించనున్నట్లు సీఈవో రవికుమార్ నాయుడు తెలిపారు. ఒకటి, ఏడు, రెండు నాలుగు స్థాయీ సంఘ సమావేశాలు ఛైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన నూతన సమావేశ మందిరంలో జరుగుతాయన్నారు. మూడు, ఐదు, ఆరు స్థాయీ సంఘ సమావేశాలు ఆయా కమిటీ ఛైర్మన్ల అధ్యక్షతన జడ్పీ పాత సమావేశ మందిరంలో నిర్వహిస్తామని చెప్పారు.

నేడు చిత్తూరులో గ్రీవెన్స్

చిత్తూరు కలెక్టరేట్, క్రైమ్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా చిత్తూరులోని కలెక్టరేట్, ఏఆర్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్‌డూడి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మట్టికి లేని వివక్ష.. మనుషులకెందుకో..?

రెక్కాడితే కాని డొక్కాడని జీవితాలు వారివి..కన్నబిడ్డ మృతిచూసి ఆ తల్లి విలవిల్లాడిపోయింది.

గుప్పెడు మట్టిలో కలిసిపోవడానికి మనుషుల చూపు కరవైంది

కన్నుమూసిన జీవానికి కన్నీళ్లే నివాళి ఈ కటిక దారిద్ర్యం కడసారి చూపునకు అడ్డుగోడై నిలుస్తోంది.

చౌడేపల్లె, న్యూస్‌టుడే: కట్టుకున్న భార్య కాదంది.. కన్నతండ్రి చిన్నతనంలోనే దూరమయ్యారు. చివరకు ఊరుకాని ఊరు వచ్చి ఆకస్మికంగా మృతిచెందారు. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే బోయకొండ వద్ద.. కుమారుడు మృతిచెందిన విషయం బంధువులకు తెలుపలేక.. అంత్యక్రియలు చేయలేక దీనమైన పరిస్థితిలో ఉన్న ఓ తల్లి గాథ ఇది. పెద్దపంజాణి మండలం రాయలపేటకు చెందిన గౌరీశంకర్(45) యానాది. భార్య వదిలేయడంతో తల్లి లక్ష్మమ్మ వద్ద ఉంటున్నారు. తోటకు కాపలా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో నాటు మందు కోసం రెండురోజుల కిందట బోయకొండ వద్దకు వచ్చారు. అయితే ఆదివారం ఉదయం 10 గంటలకు మృతిచెందారు. కళ్లముందే కన్నబిడ్డ ఆకస్మిక మృతి చూసిన తల్లి విలవిల్లాడిపోయింది. మృతదేహాన్ని ఊరికి తీసుకెళ్లేందుకు డబ్బులు లేకపోవడంతో దీనంగా కూర్చుండిపోయింది. సుమారు ఆరు గంటల సేపు భక్తులు వస్తూ పోతున్నా.. ఏమైంది అని అడిగేవారు కరవయ్యారు. చివరకు కానిస్టేబుల్ దేవేంద్ర వృద్ధురాలిని విచారించి బంధువులకు సమాచారం అందించారు. సాయంత్రం మృతదేహాన్ని సొంతూరు తీసుకెళ్లారు.

బిడ్డ మృతదేహం వద్ద తల్లి

రెండ్రోజులు కట్టుదిట్టమైన భద్రత

తిరుమల, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో తిరుపతి, తిరుమలలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం తిరుపతిలోని ప్రైవేటు కల్యాణ మండపంలో పోలీసు అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షించారు. తిరుమలలో దాదాపు 2 వేల మంది, తిరుపతిలో 1500 మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణ, సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా పెట్టామన్నారు. తిరుమల ఆస్థాన మండపంలో జిల్లా పోలీసులతో ఎస్పీ సమీక్షించారు. అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి, రామకృష్ణ, శ్రీనివాసులు, నాగభూషణరావు పాల్గొన్నారు.

బాలాజీ డివిజన్ సాధనకు ర్యాలీ

రాయలసీమ రైతులకు, యువతకు, వ్యాపారులకు, శ్రీవారి భక్తులకు ఎంతగానో ఉపయోగపడే తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ ప్రకటించేంతవరకు ఉద్యమం ఆగదని ఆ డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ స్పష్టం చేశారు. తిరుపతిని బాలాజీ రైల్వే డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్వీయూ స్టేడియం నుంచి బస్టాండ్ మీదుగా రైల్వేస్టేషన్ వరకు ద్విచక్ర వాహనాలు, ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. **- న్యూస్‌టుడే, తిరుపతి (రైల్వే)**

పింఛనుకు ప్రాణం.. జీవన ప్రమాణ్

ప్రభుత్వ శాఖల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పింఛను పొందాలంటే ఏటా జీవన ప్రమాణ పత్రాలు అందజేయాల్సి ఉంది.. ప్రతి సంవత్సరం జనవరి ఒకటో తేదీ నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుంది.. నిర్ణీత గడువు లోగా ఖజానా కార్యాలయాల్లో అందించని వారికి పింఛను నిలిచిపోనుంది. **- న్యూస్‌టుడే, చిత్తూరు కలెక్టరేట్**

బయోమెట్రిక్ నమోదు చేస్తున్న పింఛనరు

సమర్పణ ఇలా.. జీవన్ ప్రమాణ్ అప్లికేషన్ ద్వారా పింఛను తీసుకునే వ్యక్తి జీవించి ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం(డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్) పొందే అవకాశాన్ని కల్పించారు. ఈ యాప్ ద్వారా ప్రభుత్వ పింఛనర్లు బయోమెట్రిక్ వేలిముద్ర లేదా ఐరిస్ విధానంలో ధ్రువీకరించవచ్చు. లేదంటే ఆధార్ కార్డు, చరవాణితో సమీప ఖజానా, తపాలా, మీసేవా కేంద్రాలకు వెళ్లి పత్రాల్ని ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు. సాంకేతిక సమస్యలున్నవారు గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన పత్రాలను ఉపఖజానా కార్యాలయాల్లో అందజేయాలి. అనారోగ్యంతో మంచానికే పరిమితమైనవారు సమీప ఉపఖజానా కార్యాలయంలో తెలియజేస్తే సిబ్బంది ఇంటికి వస్తారు.

జిల్లాలో 12 వేలమంది

ఆరు ఉప ఖజానా కార్యాలయాల పరిధిలో 12 వేల మందికి పైగా పింఛనర్లు ఉన్నారు. అధికంగా చిత్తూరు ఉపఖజానా పరిధిలో ఎనిమిది వేల మందికి పైగా ఉన్నారు. మిగిలినవారు బంగారుపాళ్యం, పలమనేరు, పుంగనూరు, నగరి, కుప్పం ప్రాంతాల పరిధిలో ఉన్నారు. పింఛనర్లు, వారి కుటుంబ సభ్యులు నిర్ణీత గడువులోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని, లేకుంటే పింఛను నిలిచిపోయే ప్రమాదం ఉందని, ఫిబ్రవరి వరకు గడువు ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజ తెలిపారు.

104FM Tirupati
ఈ FM 104 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

తిరుమల మలుపుల్లో.. జాగ్రత్త

వైకుంఠ రద్దీ నేపథ్యంలో అప్రమత్తత తప్పనిసరి

తిరుమల, న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు, వ్యక్తిగత వాహనాలు, ద్విచక్ర వాహనాల్లో తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య భారీగా ఉంది. తిరుమలకు వెళ్లేందుకు రెండో ఘాట్, కిందకు దిగేందుకు మొదటి ఘాట్‌రోడ్డు అందుబాటులో ఉండగా వాహనదారులు తరచూ బోల్తా కొడుతున్నారు. మలుపులపై అవగాహన లేక కొందరు.. వేగంగా వచ్చి మరికొందరు ప్రమాదాల బారిన పడుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా గమ్యస్థానాలు చేరుకోవాలని తితిదే అధికారులు సూచిస్తున్నారు.

ఘాట్‌రోడ్డులో ఇటీవల జరిగిన ప్రమాదం

ప్రమాదాల తీవ్రత ఇలా..

2023లో 60 మంది వరకు గాయపడగా, ముగ్గురు భక్తులు మృతిచెందారు. 2024లో మొదటిఘాట్‌లోని మలుపుల వద్ద రెండు ద్విచక్రవాహన ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. 2025లో 28 ప్రమాద కేసులు నమోదయ్యాయి. గాయపడినవారు 17 మంది ఉండగా, ఐదుగురు భక్తులు మృతిచెందారు. డ్రంకన్ డ్రైవ్ కేసులు 40, పెట్టీ కేసులు 1090 నమోదైన నేపథ్యంలో అధికారులు సైతం తనిఖీలు పెంచాల్సిన అవసరం ఉంది.

వీటిని మరువొద్దు

■ తిరుమలకు వెళ్లే మొదటి ఘాట్‌రోడ్డు పొడవు 19 కిలోమీటర్లు ఉండగా తిరుమల నుంచి తిరుపతికి 58 మలుపులు ఉన్నాయి. వాహనాలు కిందకు దిగేందుకు కనీసం 40 నిమిషాల వ్యవధిని తప్పనిసరిగా తీసుకోవాలి. ■ రెండో ఘాట్‌రోడ్డు 18 కి.మీ. ఉండగా ఆరు మలుపులు ఉన్నాయి. ఈ దారిలో కనీసం 28 నిమిషాల సమయం పాటించాలి. ■ వేగనియంత్రణకు అలిపిరి, తిరుమలలో టోల్‌గేట్లను తితిదే ఏర్పాటు చేసింది. నైపుణ్యం కలిగిన డ్రైవర్లు మాత్రమే ఈ మార్గంలో సురక్షితంగా వాహనాన్ని నడపగలరు. ■ సుదూర ప్రాంతాల నుంచి సొంత వాహనాల్లో వచ్చే చోదకులకు మలుపులపై అవగాహన ఉండదు. అందుకే కనీస వేగంలో వెళ్లేలా చూసుకోవాలి. ■ నిద్రమత్తులో ఉంటున్నవారు తగిన విశ్రాంతి తీసుకున్నాకే తిరుగు ప్రయాణం కావడం, కొండపైకి రావడం చేయాలి. ■ ద్విచక్ర వాహనదారులు విధిగా శిరస్త్రాణం ధరించాలి. ■ స్థానికంగా కార్లు, జీపులు నడిపే డ్రైవర్లు విధిగా నిబంధనలు పాటించాలి. వేగంగా వెళ్లి టోల్‌గేట్లకు ముందు ఆపడం వంటి వాటిని మానుకోవాలి.

ఈ-పంటలో ఉంటేనే యూరియా

ఐదు మండలాల్లో ముందస్తు పరిశీలన

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: యూరియా పక్కదారి పట్టడం, విచక్షణారహిత వినియోగానికి త్వరలో అడ్డుకట్ట పడనుంది.. యూరియా పంపిణీలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. వెబ్‌ల్యాండ్ ఆధారంగా పంపిణీకి ప్రత్యేక యాప్ సిద్ధం చేశారు. సమగ్ర ఎరువుల యాజమాన్య (ఐఎఫ్ఎంఎస్) విధానంలో యూరియా పంపిణీ, వినియోగం ఎంత..? తదితర అంశాలు ఈ యాప్ ద్వారా రైతులకు అందుబాటులోకి రానున్నాయి. తొలుత వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పది జిల్లాల్లో వెబ్‌ల్యాండ్ ఆధారంగా (ఈ-పంట నమోదు) ఎరువుల పంపిణీపై ముందస్తు పరిశీలన చేపట్టారు. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లాలోని కుప్పం, బైరెడ్డిపల్లె, గుడిపల్లె, రొంపిచెర్ల, నింద్ర మండలాల్లో పరిశీలించారు. ఈ ప్రక్రియ విజయవంతమైందని, వివరాలు ప్రభుత్వానికి నివేదించామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. త్వరలో నూతన విధానం అమల్లోకి రానున్నదని ఆయన పేర్కొన్నారు.

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు శుభాకాంక్షలు తెలపండి



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి అభినందన చందనాలు, ఆకాంక్షించండి వారి భావి జీవిత, సుఖమయ ఆనందాలు తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు...
పూర్తి వివరాలకు:
80085 13290

(c) eenadu

బ్యాటుతో బౌండరీలు.. బంతితో గింగిరాలు

ధనిక్‌ భారత్‌ ఎడ్యుకేషనల్‌ ఇన్‌స్టిట్యూషన్స్‌ ప్రజెంట్స్‌ ‘ఈనాడు స్పోర్ట్స్‌ లీగ్‌(ఈఎస్‌ఎల్‌)-2025’ క్రికెట్‌ పోటీలు యువతలో హుషారు నింపుతున్నాయి. తిరుపతిలోని ఎస్వీ హై స్కూల్‌ క్రికెట్‌ మైదానం, ఎస్వీయూ మైదానం వేదికగా సీనియర్స్‌ విభాగంలో జరుగుతున్న పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పలు కళాశాలలకు చెందిన జట్లు బరిలో నువ్వా నేనా అంటూ పోటీపడుతున్నాయి. సిక్సులు, ఫోర్లతో బంతిని బౌండరీల వైపు పరుగులు పెట్టిస్తున్నారు. నాకౌట్‌ పద్ధతిలో జరుగుతున్న మ్యాచ్‌ల్లో గెలుపొందుతున్న జట్లు తదుపరి మ్యాచ్‌లో మరింత సత్తాచాటేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఆదివారం జరిగిన ‘ఈనాడు’ క్రికెట్‌ మ్యాచ్‌ వివరాలు ఇలా ఉన్నాయి.

-న్యూస్‌టుడే, తిరుపతి(క్రీడలు)

గ్రౌండ్‌-1: ఎస్వీ హై స్కూల్‌ మైదానం

వాక్‌ ఓవర్‌తో విజయం

వాక్‌ ఓవర్‌తో తదుపరి మ్యాచ్‌కు అర్హత సాధించిన విజయం చిత్తూరు జట్టు

తొలి మ్యాచ్‌లో చిత్తూరు విజయం ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ చిత్తూరు, సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ పుత్తూరు జట్ల మధ్య పోటీ జరగాల్సి ఉండగా, సిద్ధార్థ జట్టు గైర్హాజరు కావడంతో విజయం జట్టుకు వాక్‌ ఓవర్‌ ఇచ్చారు. దీంతో విజయం జట్టు తదుపరి మ్యాచ్‌కు అర్హత సాధించింది.

రసవత్తరంగా రెండో మ్యాచ్‌

విజేత పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు

ధనిక్‌ భారత్‌ ఎడ్యుకేషనల్‌ ఇన్‌స్టిట్యూషన్స్‌ మ్యాన్‌ ఆఫ్‌ ది మ్యాచ్‌ కె.ఆదిత్య

ది అపోలో యూనివర్సిటీ చిత్తూరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పుత్తూరు జట్ల మధ్య రెండో మ్యాచ్‌ రసవత్తరంగా జరిగింది. మొదట టాస్‌ గెలిచి బ్యాటింగ్‌ చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల పుత్తూరు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 73 పరుగులు చేసింది. 74 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ది అపోలో జట్టుకు చివరి 30 బంతుల్లో 26 పరుగులతో లక్ష్యానికి చేరువైన అవకాశం ఉన్నప్పటికీ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 67 పరుగులతో మ్యాచ్‌ను చేజార్చుకుంది. దీంతో 6 పరుగుల తేడాతో పుత్తూరు డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించింది. జట్టులో ఆదిత్య బ్యాటింగ్‌లో(11 బంతుల్లో 4×1) 10 పరుగులు, బౌలింగ్‌లో 2 ఓవర్లలో 2 వికెట్లు, 5 పరుగులు ఇచ్చి మ్యాన్‌ ఆఫ్‌ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

శ్రీరామ కళాశాల అసాధారణ ప్రతిభ

విజయం సాధించిన శ్రీరామ ఇంజినీరింగ్‌ కళాశాల జట్టు

ధనిక్‌ భారత్‌ ఎడ్యుకేషనల్‌ ఇన్‌స్టిట్యూషన్స్‌ మ్యాన్‌ ఆఫ్‌ ది మ్యాచ్‌గా వినోద్‌

సెవెన్‌ హిల్స్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఫార్మసీ తిరుపతి, శ్రీరామ ఇంజినీరింగ్‌ కళాశాల మధ్య జరిగిన మూడో మ్యాచ్‌లో శ్రీరామ కళాశాల అసాధారణ ప్రతిభ కనబరిచింది. టాస్‌ గెలిచిన సెవెన్‌ హిల్స్‌ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు నష్టపోయి 50 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌లో బరిలోకి దిగిన శ్రీరామ కళాశాల జట్టు కేవలం 4.1 ఓవర్లలో 54 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో మ్యాచ్‌ గెలుపొందింది. జట్టులో వినోద్‌ (16 బంతుల్లో 4×6, 6×1) 36 పరుగులతో మ్యాన్‌ ఆఫ్‌ ది మ్యాచ్‌గా నిలిచాడు.

గ్రౌండ్‌-2: ఎస్వీయూ మైదానం

ఎస్వీయూ విజయకేతనం

గెలుపొందిన ఎస్వీయూ కళాశాల జట్టు

ధనిక్‌ భారత్‌ ఎడ్యుకేషనల్‌ ఇన్‌స్టిట్యూషన్స్‌ మ్యాన్‌ ఆఫ్‌ ది మ్యాచ్‌గా జె.చిన్న

తొలి మ్యాచ్‌లో ఎస్వీ ఓరియంటల్‌ కళాశాల తిరుపతి, ఎస్వీయూ కళాశాల తిరుపతి జట్లు పోటీపడ్డాయి. టాస్‌ గెలిచి బ్యాటింగ్‌ ఎంచుకున్న ఎస్వీ ఓరియంటల్‌ 9.4 ఓవర్లలో 35 పరుగులకు ఆలౌటైంది. 36 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఎస్వీయూ జట్టు కేవలం 2.4 ఓవర్లలో పరుగులు చేసి 10 వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. జట్టులో జె.చిన్న 2 ఓవర్లలో 14 పరుగులు ఇచ్చి, 3 వికెట్లు తీసి మ్యాన్‌ ఆఫ్‌ ది మ్యాచ్‌గా నిలిచాడు.

వేము ఇన్‌స్టిట్యూట్‌ సత్తా

విజయం సాధించిన వేము ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ జట్టు

ధనిక్‌ భారత్‌ ఎడ్యుకేషనల్‌ ఇన్‌స్టిట్యూషన్స్‌ మ్యాన్‌ ఆఫ్‌ ది మ్యాచ్‌గా జశ్వంత్‌

రెండో మ్యాచ్‌లో వేము ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ పి.కొత్తకోట, ఎస్వీ కాలేజ్‌ ఆఫ్‌ కామర్స్‌ తిరుపతి జట్లు తలపడ్డాయి. టాస్‌ గెలిచిన ఎస్వీ కామర్స్‌ జట్టు బౌలింగ్‌ ఎంచుకుంది. బ్యాటింగ్‌ చేసిన వేము ఇన్‌స్టిట్యూట్‌ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 90 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌ చేసిన ఎస్వీ కామర్స్‌ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 72 పరుగులతో సరిపెట్టుకుంది. దీంతో వేము ఇన్‌స్టిట్యూట్‌ 18 పరుగుల తేడాతో విజయాన్ని కైవసం చేసుకుంది. జట్టులో జశ్వంత్‌(17 బంతుల్లో 4×3, 6×3) 34 పరుగులతో మ్యాన్‌ ఆఫ్‌ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

వాక్‌ ఓవర్‌తో నారాయణ గెలుపు

వాక్‌ ఓవర్‌తో తదుపరి మ్యాచ్‌కు అర్హత సాధించిన నారాయణ ఇంజినీరింగ్‌ కళాశాల జట్టు

మూడో మ్యాచ్‌ నారాయణ ఇంజినీరింగ్‌ కళాశాల గూడూరు, విజయం బిజినెస్‌ స్కూల్‌ చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్‌ జరగాల్సి ఉండగా, విజయం బిజినెస్‌ స్కూల్‌ చిత్తూరు జట్టు గైర్హాజరు కావడంతో వాక్‌ ఓవర్‌ ఇచ్చారు. దీంతో నారాయణ ఇంజినీరింగ్‌ కళాశాల జట్టు తదుపరి మ్యాచ్‌కు అర్హత సాధించింది.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: నేషనల్‌ ఎగ్‌ కో-ఆర్డినేషన్‌ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Regional Sponsor: MITS DEEMED TO BE UNIVERSITY — MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner FM Partner TV Partner
Organised by

గ్రౌండ్‌-1: ఎస్వీ ఉన్నత పాఠశాల మైదానం (సీనియర్స్‌) — నేడు 29.12.2025

- **ఉదయం 8:00 :** కేజేస్‌ హోమియోపతిక్‌ మెడికల్‌ కళాశాల, పుత్తూరు × సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ అండ్‌ టెక్నాలజీ, పుత్తూరు
- **ఉదయం 10:30 :** గేట్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ అండ్‌ మేనేజ్‌మెంట్‌ స్టడీస్‌, తిరుపతి × శ్రీవిద్యానికేతన్‌ ఇంజినీరింగ్‌ కళాశాల, తిరుపతి
- **మధ్యాహ్నం 2:00 :** విజ్ఞానసుధ డిగ్రీ కళాశాల, చిత్తూరు × అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ అండ్‌ సైన్స్‌, తిరుపతి

గ్రౌండ్‌-2: ఎస్వీయూ స్టేడియం (సీనియర్స్‌)

- **ఉదయం 8:00 :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కుప్పం × శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ అండ్‌ మేనేజ్‌మెంట్‌ స్టడీస్‌, చిత్తూరు
- **ఉదయం 10:30 :** గోకుల్‌కృష్ణ కాలేజ్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌, సూళ్లూరుపేట × ఎన్‌బీకేఆర్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌, విద్యానగర్‌
- **మధ్యాహ్నం 2:00 :** శ్రీవిద్య డిగ్రీ కళాశాల, పుత్తూరు × కృష్ణతేజ కాలేజ్‌ ఆఫ్‌ ఫార్మసీ, తిరుపతి

గ్రౌండ్‌-1: ఎస్వీ ఉన్నత పాఠశాల మైదానం (సీనియర్స్‌) — రేపు 30.12.2025

- **ఉదయం 8:00 :** వేదవ్యాస డిగ్రీ కళాశాల, పుత్తూరు × ఎస్‌డీహెచ్‌ఆర్‌ డిగ్రీ కళాశాల, తిరుపతి
- **ఉదయం 10:30 :** ఆదిశంకర కాలేజ్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ అండ్‌ టెక్నాలజీ, గూడూరు × పీవీకేఎన్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చిత్తూరు
- **మధ్యాహ్నం 2:00 :** బీఎస్‌ఆర్‌ డిగ్రీ కళాశాల, తిరుపతి × విజయం ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ, చిత్తూరు

గ్రౌండ్‌-2: ఎస్వీయూ స్టేడియం (సీనియర్స్‌)

- **ఉదయం 8:00 :** ఎన్వీ ఎస్‌వీఎస్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సూళ్లూరుపేట × ఎస్వీ ఆర్ట్స్‌ కళాశాల, తిరుపతి.
- **ఉదయం 10:30 :** మోహన్‌బాబు యూనివర్సిటీ, రంగంపేట × సిద్ధార్థ ఎడ్యుకేషనల్‌ అకాడమీ గ్రూప్‌ ఆఫ్‌ ఇన్‌స్టిట్యూషన్స్‌, సి.గొల్లపల్లి
- **మధ్యాహ్నం 2:00 :** విజయం డిగ్రీ కళాశాల, చిత్తూరు × ఎస్వీయూ కాలేజ్‌, తిరుపతి.

రూ.1.35 కోట్ల విద్యుత్తు బిల్లుల వసూలు

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఆదివారం ఎప్పటిలానే విద్యుత్తు బిల్లులు వసూళ్ల కేంద్రాలు పనిచేశాయి. ఒక్కరోజే 11,200 మంది వినియోగదారులు రూ.1.35 కోట్లు చెల్లించారని చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎస్‌ఈలు ఇస్మాయిల్‌ అహ్మద్‌, చంద్రశేఖర్‌ తెలిపారు. సకాలంలో బిల్లులు చెల్లించి అపరాధ రుసుం నుంచి మినహాయింపు పొందాలని వారు కోరారు.

వరసిద్ధుడి సన్నిధిలో ఉపాధి హామీ డైరెక్టర్‌

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని ఉపాధి హామీ పథకం రాష్ట్ర డైరెక్టర్‌ షణ్ముఖకుమార్‌ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ పాలకమండలి ఛైర్మన్‌ ఎం.మణినాయుడు, ఏఈవో రవీంద్రబాబు, అర్చకులు రాజగోపురం వద్ద ఆయనకు స్వాగతం పలికారు. దర్శన అనంతరం వారికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. సూపరింటెండెంట్‌ వాసు, ఇన్‌స్పెక్టర్‌ బాలాజీనాయుడు, యాదమరి మండల తెదేపా అధ్యక్షుడు మురార్జీయాదవ్‌ పాల్గొన్నారు.

‘చర్చి స్థలం క్రయ, విక్రయాలు చెల్లవు’

పుత్తూరు: గోవిందపాళెం లెక్కదాఖలాలోని సౌత్‌ ఆంధ్ర లూథరన్‌ చర్చికి సంబంధించిన సర్వే నంబరు 238/3లోని 5.28 ఎకరాల భూమికి సంబంధించి క్రయవిక్రయాలు చెల్లవని ఆ చర్చి ప్రతినిధులు ఆదివారం పేర్కొన్నారు. దీన్ని ప్రస్తుతం ఆట స్థలంగా ఉపయోగించుకుంటున్నారన్నారు. క్రయవిక్రయాలు చేయరాదని గతంలోనే కోర్టు స్పష్టం చేసిందన్నారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి 2012లో 1.98 ఎకరాల భూమి కొనుగోలు చేశారన్నారు. చర్చి భూమి రిజిస్ట్రేషన్‌ చేయడం కుదరని దాన్ని కోర్టు రద్దు చేసిందన్నారు. 2024 ఎన్నికల సమయంలో ఎన్‌వోసీ తీసుకుని నెల్లూరులో రిజిస్ట్రేషన్‌ చేశారన్నారు. దీనిపై కోర్టులో కేసు నడుస్తుండగా కొద్దిరోజులుగా స్థలాన్ని శుభ్రం చేస్తున్నారని, దీన్ని తాము అడ్డుకున్నామన్నారు.

బోధన ప్రత్యేకం.. సేవలు అమూల్యం

- దివ్యాంగులకు భరోసా
- అండగా ఉపాధ్యాయులు

చిత్తూరు(సంతపేట), విద్య, న్యూస్‌టుడే: ‘ప్రత్యేక విద్య’.. దివ్యాంగులైన విద్యార్థుల్లో మానసిక స్థైర్యం నింపడం, వారి విజయానికి అవసరమైన నిర్దిష్ట సహాయాన్ని పొందేలా రూపొందించిన విద్యాసేవ.. విద్యా వాతావరణానికి అనుగుణంగా విద్యార్థిని ప్రేరేపించడం, శారీరక/భావోద్వేగ ప్రవర్తనా పరిస్థితుల ద్వారా అభ్యాసం చేయించడం ఓర్పుతో కూడుకున్న వృత్తి.. సహనానికి మారుపేరైన మహిళలు.. సహిత విద్య ఉపాధ్యాయినులుగా సేవల్ని అందిస్తూ శెభాష్‌ అనిపిస్తున్నారు.

ఎవరిపై ఆధారపడకుండా..

ప్రత్యేక అవసరాల పిల్లలు భవిష్యత్తులో ఎవరిపై ఆధారపడకుండా తమ పనులు తామే చేసుకునేలా చేయడం తన ఉద్యోగ లక్ష్యమని అంటున్నారు నగరిలో పనిచేస్తున్న సహిత ఉపాధ్యాయిని **భవాని**. 2014 నుంచి పూతలపట్టు, వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లో పనిచేసిన ఆమె.. స్పీచ్‌ థెరపీ ద్వారా పిల్లలు మాట్లాడగలిగేలా శిక్షణ అందించారు. 2023లో ఉత్తమ ఉపాధ్యాయినిగా జిల్లా యంత్రాంగం నుంచి అవార్డును సైతం స్వీకరించారు. దాతల ద్వారా భవిత కేంద్రాల బలోపేతానికి కృషిచేశారు.

నమోదు పెంచి..

ఇంటి వద్దనే ఉంటున్న దివ్యాంగుల తల్లిదండ్రుల్లో చైతన్యం నింపి.. వారిని బడి బాట పట్టించడంలో సఫలీకృతులయ్యారు **హేమలత**. 17 ఏళ్లుగా సహిత విద్య ఉపాధ్యాయినిగా ఆమె నిరాటంకంగా విస్తృత సేవలందిస్తున్నారు. ప్రస్తుతం చిత్తూరులోని భవిత కేంద్రంలో పనిచేస్తున్న ఆమె. . బంగారుపాళ్యం, యాదమరి మండలాల్లో అధిక మంది విద్యార్థుల్ని నమోదు చేయించి శిక్షణ ఇచ్చారు. ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా 2018లో ఉత్తమ ఉపాధ్యాయినిగా గణతంత్ర దినోత్సవం సందర్భంగా అప్పటి కలెక్టర్‌ నుంచి పురస్కారాన్ని స్వీకరించారు. ఆపై పలువురి ప్రశంసలు అందుకున్నారు.

పిల్లలకు అనుగుణంగా..

సహిత విద్యలో పిల్లలకు అనుకూలంగా మనల్ని మార్పు చేసుకుంటే మంచి ఫలితాలు రాబడతామని అంటున్నారు ఉపాధ్యాయిని **లావణ్య**. పూతలపట్టు భవిత కేంద్రంలో పనిచేస్తున్న ఆమె.. 2008లో విధుల్లో చేరారు. శిబిరాలు నిర్వహించడం పిల్లలకు కరెక్టివ్‌ సర్జరీలకు మార్గదర్శకం ఇవ్వడం, సహాయక ఉపకరణాలను సూచించడం ద్వారా పిల్లల్లో వికాసాల వృద్ధికి తనవంతుగా ఎంతో దోహదపడ్డారు. ఆమె అందించిన సేవలకుగాను 2014లో అప్పటి జిల్లా కలెక్టర్‌ చేతుల మీదుగా, 2018లో తిరుపతిలో జరిగిన నిడ్జమ్‌ కార్యక్రమంలో ఉత్తమ కృత్యానికి అవార్డు సైతం అందుకున్నారు.

మృత్యుంజయేశ్వరస్వామి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

ఆలయంలోకి వెళ్తున్న జస్టిస్‌ సరస వెంకటనారాయణ భట్టి

చౌడేపల్లె, న్యూస్‌టుడే: స్థానిక అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ సరస వెంకటనారాయణ భట్టి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా చౌడేపల్లెలోని తమ పొలంలో నాగదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. స్నేహితులు చెన్నరాజశెట్టి, రాణాదారు నాగరాజు, రెడ్డిప్రకాష్‌, రాజన్న, రఘుస్వామి పాల్గొన్నారు.

గణనాథుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

జస్టిస్‌ హేమలేఖకు జ్ఞాపిక అందజేస్తున్న ఏఈవో రవీంద్రబాబు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ హేమలేఖ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఏఈవోలు రవీంద్రబాబు, ధనపాల్‌, అర్చకులు రాజగోపురం వద్ద వారికి స్వాగతం పలికారు. దర్శన అనంతరం న్యాయమూర్తికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. సూపరింటెండెంట్‌ కోదండపాణి, చిత్తూరు న్యాయస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

టవర్‌క్లాక్‌ వద్ద మానవహారంలో అఖిలపక్ష ప్రతినిధులు

ఆ మూడు మండలాలు తిరుపతిలో కలపాలి

నగరి, న్యూస్‌టుడే: నగరి, నిండ్ర, విజయపురం మూడు మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని డిమాండ్‌ చేస్తూ ఆదివారం నగరిలో ర్యాలీ నిర్వహించారు. మూడు మండలాల రైతులు, అఖిలపక్ష పార్టీల ప్రతినిధులు, ఉపాధ్యాయులు సంఘ ప్రతినిధులు కలిసి బైపాస్‌ రోడ్డు నుంచి టవర్‌క్లాక్‌ వరకు ర్యాలీ చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకుని మూడు మండలాలు తిరుపతి జిల్లాలో కలపాలని డిమాండ్‌ చేశారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నగరి బహిరంగ సభలో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. గతంలోనే అన్ని మండలాల ప్రజాప్రతినిధులు సమ్మతి పత్రాలు కలెక్టర్‌కు పంపారని, విలీనం చేయకపోవడానికి కారణాలు ఏమిటో అర్థం కావడం లేదన్నారు. టవర్‌ క్లాక్‌ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ర్యాలీలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్‌, తెదేపా, వైకాపాల ప్రతినిధులు, రైతులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పుత్తూరు నడక సంఘానికి అరుదైన గౌరవం

డాక్టర్‌ రవిరాజు, కోశాధికారి మునికృష్ణయ్యను సత్కరిస్తున్న ప్రతినిధులు

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు నడక సంఘానికి దక్కిన గౌరవం ఎనలేనిదని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్‌ శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. పుత్తూరు నడక సంఘ భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ నడక సంఘం అధ్యక్షుడిగా డాక్టర్‌ రవిరాజు, కోశాధికారిగా మునకృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికైన నేపథ్యంలో వీరిని ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ నడక సంఘం అధ్యక్షుడిగా రవిరాజు ఎన్నికవడం శుభపరిణామమన్నారు. రవిరాజు మాట్లాడుతూ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామన్నారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు మాట్లాడుతూ పుత్తూరు శల్య వైద్యం, వక్కపొడికి ప్రసిద్ధి అని, అంతర్జాతీయ నడక సంఘంలో పుత్తూరుకు చెందినవారు ఎన్నికవడం గర్వకారణమన్నారు. ఈ ఏడాది ఉత్తమ అసోసియేషన్‌గా గుర్తింపు పొంది అవార్డులు అందుకోవడం ప్రశంసనీయమన్నారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేఎల్‌ఎల్‌మూర్తి, ఉపాధ్యక్షుడిగా వెంకట్రామయ్య, కార్యదర్శిగా రఫీ, ఉప కార్యదర్శిగా రఘునాథరెడ్డి, కోశాధికారిగా గుణశేఖర్‌రెడ్డి, జాలి వాకర్‌గా గోపీకృష్ణను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. అసోసియేషన్‌ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

వడమాలపేట, న్యూస్‌టుడే: అక్రమంగా నిల్వ ఉంచిన ఎర్రచందనం దుంగలను అటవీ అధికారులు తట్నేరి గొల్లపల్లి సమీప నేరేడు చలం వద్ద ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. డీఎఫ్‌వో సాయిబాబా సమాచారం మేరకు నేరేడు చలం వద్ద ఎఫ్‌ఆర్‌వో సుదర్శన్‌రెడ్డి, బీట్‌ ఆఫీసర్‌ మునియానాయక్‌.. సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఆ ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన 32 ఎర్రచందనం దుంగలు గుర్తించారు. వీటి బరువు 165 కిలోలు ఉందని, విలువ లక్ష రూపాయలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ దాడుల్లో బేస్‌క్యాంప్‌ వాచర్లు రాము, మధు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించండి

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్‌

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: చిత్తూరు డివిజన్‌ పరిధిలోని కాలనీల్లో మౌలిక వసతులపై నగరపాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్‌ అన్నారు. సీపీఐ శత జయంతి సందర్భంగా స్థానిక లెనిన్‌నగర్‌లో పార్టీ జెండా ఆవిష్కరించి, ప్రజా సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు డివిజన్‌ పరిధిలోని లెనిన్‌నగర్‌, హౌసింగ్‌ కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో సీసీ రోడ్లు, వీధిదీపాలు, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక సమస్యలపై పలుమార్లు నగరపాలక సంస్థ అధికారులకు వినతులు అందించినా స్పందించక పోవడం దారుణమన్నారు. నాయకులు మణి, రమాదేవి, విజయగౌరీ, చంద్ర పాల్గొన్నారు.

పల్లెకు ముందుగా పండుగొచ్చింది

కాలు దువ్విన వృషభాల రాజసం

సందర్శకుల వైపు దూసుకొస్తున్న ఎద్దు

వెదురుకుప్పం: పచ్చికాపల్లం పంచాయతీ చిన్నపోడుజేనులో ఆదివారం గ్రామస్థులు పశువుల పండుగను కోలాహలంగా నిర్వహించారు. సాధారణంగా జనవరిలో సంక్రాంతి వేళ మూడు, నాలుగు రోజుల పాటు పశువుల పండుగ నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో చిన్నపోడుజేను వాసులు పండుగను ముందుగా చేశారు. పరిసర గ్రామాల నుంచి యువకులు గ్రామానికి చేరుకోవడంతో సందడి మొదలైంది. వేగంగా పరుగులు తీస్తున్న పశువులను నిలువరించడానికి వారు పడిన పాట్లు వర్ణనాతీతం. చూపరుల పైకి పశువులు దూసుకురావడంతో వాటి కింద పడి పలువురు గాయపడ్డారు. సీఐ హనుమంతప్ప, ఎస్సైలు నవీన్‌బాబు, సుమన్‌ బందోబస్తు నిర్వహించారు. పండుగను తిలకించడానికి వచ్చిన ప్రజలకు గ్రామస్థులు భోజన వసతి కల్పించారు.

పి.కొత్తకోటలో వారపు సంత

- హైవేలో పైవంతెన పక్కనే ఏర్పాటు

సంత ఏర్పాటుకు చదునుచేసిన స్థలం

పూతలపట్టు, న్యూస్‌టుడే: నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిలో కీలక ప్రాంతమైన పి.కొత్తకోటలో కూటమి ప్రభుత్వ చొరవ, ఎమ్మెల్యే సహకారంతో వారపు సంత త్వరలో ఏర్పాటు కానుంది.. ఈ మేరకు నిర్మాణ పనులకు సంబంధించి సన్నాహాలు శరవేగంగా జరుగుతున్నాయి.. జాతీయ రహదారి పక్కన ఉన్న గ్రామ పంచాయతీ స్థలంలో సంత ఏర్పాటుకు దాదాపుగా పనులు పూర్తయ్యాయి.. దీంతో దశాబ్దాల తరబడి ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న అవస్థలు తీరనున్నాయి.

పి.కొత్తకోట గ్రామ పంచాయతీ ఏర్పాటైనప్పటి నుంచి అక్కడ వారపు సంత ఏర్పాటు చేయలేదు. దీంతో ఈ ప్రాంత ప్రజలు సమీపంలో ఉన్న తిరుపతి జిల్లా పాకాల సహా పూతలపట్టు, పెనుమూరు, పోలవరం, బండపల్లె గ్రామాల్లో వారపు సంతలు నిర్వహించేరోజు వెళ్లి కూరగాయలు, తదితర వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. ఇదంతా వారికి ఎంతో వ్యయప్రయాసలతో కూడినది కావడం, ప్రత్యామ్నాయం లేకపోవడంతో చేసేదేమీలేక అలానే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ పంచాయతీ పరిధిలో 24 గ్రామాలు ఉన్నాయి. జనాభా కనీసం 20 వేల పైమాటే. దీనికి సమీపంలోనే చిటిపిరాళ్ల, వేనూతనపల్లె, గొడుగు చింత, పోటుకనుమ, వేపనపల్లె తదితర గ్రామ పంచాయతీల్లోని గ్రామాలకు సైతం ఇక్కడ ఏర్పాటు చేయనున్న సంత ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గ్రామ పంచాయతీ పరిధిలో నాలుగు వేల మందికి పైగా జనాభా ఉన్నారు. పంచాయతీ కేంద్రంలో సంత ఏర్పాటు చేయాలని గత కొన్నేళ్లుగా ప్రయత్నాలు సాగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ప్రక్రియ వేగవంతమైంది. ఎమ్మెల్యే డాక్టర్‌ కలికిరి మురళీమోహన్‌ దృష్టికి స్థానిక నేతలు తీసుకెళ్లడంతో ఆయన ఉన్నతాధికారులతో చర్చించి వారపు సంత ఏర్పాటుకు మార్గం సుగమం చేశారు. ఫలితంగా రైతులు తాము పండించిన కూరగాయలు, ఆకుకూరలు తదితర వాటిని నేరుగా వచ్చి ఇక్కడ విక్రయించవచ్చు. దీంతో వారు లాభసాటి వ్యాపారం చేసుకునే వెసులుబాటు. ప్రజలకు తాజా కూరగాయలు చౌక ధరలకే లభిస్తుంది. గ్రామ పంచాయతీలో ఆర్థిక వనరుల పెరుగుదలకు వారపు సంత దోహదపడుతుంది.

EENADU eClassifieds

HEALTH & CARE
PAEDIATRIC
శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్‌: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పురిటి బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్‌ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

JOBS
డొమెస్టిక్‌ కార్గో కొరియర్‌ సర్వీసెస్‌లలో వర్క్‌చేయుటకు కస్టమర్‌ సర్వీసెస్‌ సూపర్‌వైజర్స్‌ కావలెను. జీ: 23000 టు 29000. వ: 18-35. ✆ 77309 58410.
బెంగుళూరులో పనిచేయుటకు ప్రముఖ వస్త్ర దుకాణంలో అనుభవం గల సేల్స్‌మెన్స్‌ కావలెను. Age: 18-45Y, ESI+PF+ జీ-17K ✆ 7019632854
ప్రభుత్వ ఆఫీసులలో అవుట్‌సోర్సింగ్‌ కింద పనిచేయుటకు కంప్యూటర్‌ ఆపరేటర్లు, అటెండర్స్‌, ITI మెకానిక్స్‌ కావలెను. ప్రభుత్వ కాంట్రాక్ట్‌ ఉద్యోగాలకు. 9849848817.
తిరుచానూరు మెయిన్‌రోడ్డు లాడ్జి నందు పనిచేయుటకు (Male) రిసెప్షనిస్ట్‌, రూమ్‌బాయ్స్‌ కావలెను. Cont: 91105 50998.
తిరుపతిలో ప్రీమియం UniSex సెలూన్‌ పనిచేయుటకు అనుభవంగల హెయిర్‌డ్రెస్సర్‌ & బ్యూటీషియన్‌ కావలెను. Exp.1-3 Yrs. Ph: 95662 29917, 93915 45570.

THE EENADU WAY CLASSIFIEDS — B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే అన్ని రకాల బిజినెస్‌ వ్యవహారాలు. వివరాలకు... 80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి B/W: రూ. 600 Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్‌ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

చిత్తూరు

•చిత్తూరు •పూతలపట్టు •గంగాధరనెల్లూరు •నగరి

వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక బస్సులు

తిరుపతి(మంగళం): వైకుంఠ ఏకాదశి సందర్భంగా అప్పలాయగుంట శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి మంగళం ఆర్టీసీ డిపో ప్రత్యేకంగా నాలుగు ప్రత్యేక బస్సులు నడపనుందని డీఎం సుధాకరయ్య ఆదివారం తెలిపారు. ఈ నెల 30 నుంచి జనవరి ఒకటి వరకు మంగళం నుంచి తిరుపతి మీదుగా అప్పలాయగుంట వరకు నడుపుతామని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాలమానిని ఆవిష్కరణ

పాలసముద్రం: యాదవ ఉద్యోగుల సంక్షేమానికి యాదవ ఎంప్లాయిస్ సొసైటీ కృషిచేస్తుందని సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేంద్ర యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం శ్రీకృష్ణ మందిర ఆవరణలో 2026 సొసైటీ నూతన కాలమానిని ఆవిష్కరించారు. నియోజకవర్గ అధ్యక్షులు గురుమూర్తి యాదవ్, మండల అధ్యక్షులు ఉమాపతి, రమయాదవ్, న్యాయవాది వెంకటకృష్ణ పాల్గొన్నారు.

మొక్కల పెంపకం ప్రతిఒక్కరి బాధ్యత

వడమాలపేట: మొక్కలు పెంచడం ప్రతిఒక్కరి బాధ్యతని నెహ్రూ యువజన సేవా సంఘం అధ్యక్షురాలు జ్యోతిలక్ష్మి అన్నారు. యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అంజేరమ్మ ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత వెంకమరాజు, సంఘం సభ్యులు రమణరాజు, మురళి, నాదముని, తులసి, సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.

శరవేగంగా అన్న క్యాంటీన్ నిర్మాణం

పేదలకు రూ.5కే భోజనం అందజేయాలనే సత్సంకల్పంతో కూటమి ప్రభుత్వం తాజాగా చేపట్టిన అన్న క్యాంటీన్ పూతలపట్టులోనూ నిర్మాణంలో ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటులో భాగంగా స్థానికంగా దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. పూతలపట్టులో జాతీయ రహదారి పక్కన అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.65 లక్షలతో పనులు చేపట్టారు. ప్రస్తుతం గోడలు పూర్తయ్యాయి. శ్లాబ్ వేసేందుకు సిద్ధం చేశారు. తెదేపా అధిష్ఠాన నిర్ణయానుసారం ఈ నిర్మాణం శరవేగంగా సాగుతోంది. త్వరలో పనులు పూర్తి చేసి పేదలకు భోజన వసతి కల్పించేందుకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

- న్యూస్‌టుడే, పూతలపట్టు

క్రీడాకారులతో శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే మురళీమోహన్

వాలీబాల్ ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు వినతి

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: బంగారుపాళ్యంలో వాలీబాల్ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మురళీమోహన్, శాప్ ఛైర్మన్ రవినాయుడికి క్రీడాకారులు విన్నవించారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం బంగారుపాళ్యం విచ్చేసిన వారిని క్రీడాకారులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని సందర్శించారు. అక్కడి వసతులు పరిశీలించి క్రీడాకారులతో మాట్లాడారు. తెదేపా మండల అధ్యక్షుడు ధరణిప్రసాద్ నాయుడు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ మాజీ కోచ్ సుదర్శన్ నాయుడు, వాలీబాల్ క్రీడాకారులు తులసిరెడ్డి, మాజీ సర్పంచి కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

అలరించిన సంగీత, నృత్య పోటీలు

నృత్యం చేస్తున్న విద్యార్థిని

యాదమరి, న్యూస్‌టుడే: పీఆర్ఎస్ పబ్లిక్ పాఠశాలలో ఆదివారం కళాతరంగిణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 181వ సంగీత, నృత్య పోటీలు అలరించాయి. 20 సంగీత, నృత్య అకాడమీల నుంచి 200 మందికి పైగా విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ వై.వి.కృష్ణబాబు, కళా తరంగిణి వ్యవస్థాపకులు రాజేష్‌బాబు, సమన్వయకర్త మస్తాన్‌వలి, న్యాయనిర్ణేతలు బాలాజీ, సిద్ధయ్య పాల్గొన్నారు.

'విజిబుల్ పోలీసింగ్'కు అడుగులు

- అరాచక శక్తులపై నిఘా
- ఉక్కుపాదం మోపుతున్న వైనం
- చిత్తూరులో పోలీసుల రూట్‌మ్యాప్

చర్చివీధిలో దుకాణదారులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

నిత్యం రద్దీగా ఉండే వీధుల్లో ఆక్రమణలు పాల్పడితే అడ్డుకునేదెవరు..? వాహనాలను అడ్డదిడ్డంగా పెడితే ప్రశ్నించేది ఎవరు..? గుంపులు గుంపులుగా ఉంటే ఎవరు చూసేది..? ఇష్టానుసారంగా ఉన్న కొందరికి విజిబుల్ పోలీసింగ్‌లో షాక్ తగిలింది.. ఉన్నపళంగా 30 మంది పోలీసులు చిత్తూరు నగరంలో రద్దీగా ఉండే పలు వీధుల్లో కలియతిరిగి అలా అడ్డదిడ్డంగా వ్యవహరించేవారికి ఆకస్మికంగా చెమటలు పట్టించారు. ఫుట్‌పాత్‌పై ఉన్న ఆక్రమణలు తొలగించి గుంపులుగా ఉన్నవారికి ఇలా కూడదని హెచ్చరిక చేశారు. ప్రజల్లో ఒకింత ధైర్యాన్ని కల్పించారు.. ఇకపై నిత్యం ఇలానే ఉంటామని 'విజిబుల్ పోలీసింగ్' ద్వారా భరోసా ఇచ్చారు.

న్యూస్‌టుడే, చిత్తూరు(నేరవార్తలు)

చిత్తూరు నగరంలో పోలీసు అధికారులు విజిబుల్ పోలీసింగ్‌కు అడుగులు వేశారు.. శాంతిభద్రతలు పరిరక్షిస్తూ.. నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో ధైర్యాన్ని నింపడానికి రోడ్డెక్కారు.. విజిబుల్ పోలీసింగ్ ఎప్పటి నుంచో ఉన్నా ఇకపై పక్కాగా అమలుకు రంగంలోకి దిగారు.. ఎస్పీ తుషార్‌డూడి ఆదేశాలు, ప్రత్యేక చొరవతో వన్‌టౌన్, టూటౌన్ పోలీసులు సమాయత్తమయ్యారు.. జిల్లా వ్యాప్తంగా దీన్ని పటిష్ఠంగా అమలుచేసి అసాంఘిక శక్తులు, అరాచకవాదులపై ఉక్కుపాదం మోపనున్నారు.

ప్రత్యేక బృందాలతో..

చిత్తూరు వన్‌టౌన్ సీఐ మహేశ్వర్, టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య ఆధ్వర్యంలో చిత్తూరు నగరంలో 30 మంది సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటయ్యాయి. వీరి పరిధిలోని ప్రాంతాల్లో అడుగడుగునా జల్లెడ పడుతున్నారు.

ప్రధానంగా నిత్యం రద్దీగా ఉండే చర్చివీధి సహా పలుచోట్ల కాలినడకన పర్యటించిన బృందాలు స్థానిక సమస్యలు తెలుసుకుంటూనే అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టారు. ముఖ్యంగా ఆక్రమణలపై దృష్టి సారించి వాటిని తొలగిస్తే సగం ట్రాఫిక్ సమస్య పరిష్కారమైనట్లేనని తలచి ఆ దిశగా అడుగులేస్తున్నారు అధికారులు. ఈ బృందాల పర్యటన నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించారు. ఇష్టానుసారంగా వాహనాలు నిలిపిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పునరావృతం కావొద్దని హెచ్చరించారు. ఎప్పుడు చూసినా తీవ్ర రద్దీతో కనిపించే చర్చివీధి విజిబుల్ పోలీసింగ్ పుణ్యమాని కనీసం నిర్దేశిత సమయంలోనైనా సుఖంగా కనిపిస్తోంది.

పోలీసులు వచ్చి వెళ్లాక ఫుట్‌పాత్‌పై తొలగిన ఆక్రమణలు

అవగాహన.. ఆపై కేసులు

పోలీసు అధికారులు ప్రస్తుతం ఆక్రమణలు తొలగించి, దుకాణదారులకు కొన్ని హెచ్చరికలు చేసి అవగాహన కల్పించారు. అయినా మార్పు రాకుంటే 15 రోజుల తరవాత కేసులు నమోదు చేస్తామని ఇప్పటికే వారికి స్పష్టీకరించారు. తదనుగుణంగా అనుసరించాలని సిబ్బందిని సైతం ఆదేశించారు. ఇలా అడుగడుగునా విజిబుల్ పోలీసింగ్ నగరంలో ముమ్మరం కానుంది.

ఇకపై నిరంతర పర్యవేక్షణ..

విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేయడానికి ఇకపై నిత్యం పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయనున్నారు. నగరంలోని శేషాపిరాన్ వీధి, బజారు వీధి, ఎంజీఆర్ వీధి, ఓటీకే రోడ్డు, కట్టమంచి కూడలి, గిరింపేట కూడలి సహా మరిన్ని ప్రాంతాల్లో తిరుగుతూ అక్కడి పరిస్థితులపై దృష్టి పెట్టనున్నారు. ఆకతాయిలు, మద్యం మత్తులో ఉన్నవారు, రౌడీమూకలు అనుమానాస్పదంగా కనిపిస్తే తమదైన శైలిలో హెచ్చరిస్తూ సాధారణ పౌరులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నారు.

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

శస్త్రచికిత్సకు 49 మంది ఎంపిక

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: జైన్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జైన్ ప్రార్థనా మందిరంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 147 మంది కంటి పరీక్షలు చేయించుకోగా 49 మంది శస్త్రచికిత్సకు ఎంపికయ్యారు. వీరికి తిరుపతిలోని ఎస్వీ అరవింద కంటి ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్స చేయనున్నట్లు సంఘం కార్యదర్శి సుభాష్‌జైన్ తెలిపారు. రోగులకు రవాణా, భోజన సౌకర్యాలతో పాటు కంటి అద్దాలు ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు. సభ్యులు ప్రేమ్‌చంద్, సాగర్, ప్రవీణ్, లలిత్, తదితరులు పాల్గొన్నారు.

కాలమానిని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యురాలు కవిత

జనసేన పార్టీ కాలమానిని ఆవిష్కరణ

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: కూటమి పార్టీల కలయికతోనే రాష్ట్ర అభివృద్ధి సాకారమవుతోందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ కమిటీ సభ్యురాలు ఆరణి కవిత పేర్కొన్నారు జనసేన పార్టీ చిత్తూరు నగరం రెండో డివిజన్ ఇన్‌ఛార్జి గుణశేఖర్ రూపొందించిన పార్టీ కాలమానిని స్థానిక మురకంబట్టులో ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తలకు అందజేశారు. నాయకులు గోపి, కోటి, విజయ్, కార్తీకేయన్ తదితరులు ఉన్నారు.

మా ఇష్టం.. అడిగేదెవరు..?

పట్టణ పరిధిలో ఎల్‌సీ నంబరు 55 మరాఠీగేటు వద్ద నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులే. రేణిగుంట-చెన్నై రైల్వే మార్గం కావడంతో నిత్యం పదుల సంఖ్యలో రైళ్లు వెళ్తుంటాయి. ఒక్కోసారి గేటు వేస్తే మూడు, నాలుగు రైళ్లు వెళ్తుంటాయి. ఈ సమయంలో భారీగా ఇరువైపులా అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపేస్తున్నారు. దీంతో నిత్యం వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం అక్కడ ట్రాఫిక్ నియంత్రించేందుకు పోలీసులు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంటోంది. ఒక్కోసారి సిగ్నల్ వ్యవస్థ పనిచేయకపోవడంతో రైళ్లు కొద్దిసేపు నిలిచిన సందర్భాలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు ఈ సమస్యపై దృష్టి సారిస్తే రాకపోకలు సజావుగా సాగే వీలుంది.

- న్యూస్‌టుడే, పుత్తూరు

మత్తు జోలికెళ్తే చిత్తు

యాదమరి, న్యూస్‌టుడే: మత్తు జోలికెళ్తే యువత చిత్తయిపోతారని డీఎస్పీ సాయినాథ్ హెచ్చరించారు. ఆదివారం బుడితిరెడ్డిపల్లిలో సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్సై ఈశ్వర్, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు, వారి ఇళ్లలో సోదాలు చేశారు. గంజాయి, మత్తు ఇంజెక్షన్లు వాడితే యువత జీవితం నాశనమవుతుందని, అలా ఎవరైనా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇకపై ఎవరైనా గంజాయి విక్రయించినా, తాగినా సమాచారం ఇస్తామని అక్కడి వారితో ప్రమాణం చేయించారు. **బంగారుపాళ్యం:** స్థానిక ఎస్సీ కాలనీలో సీఐ శ్రీనివాసులు నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. ఇళ్లలో సోదాలు చేసి గంజాయి క్రయవిక్రయాలు నేరమని తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

కాలినడకన చిత్తూరు-కాణిపాకం ఆధ్యాత్మిక యాత్ర

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం జిల్లాలోనే ప్రధాన పుణ్యక్షేత్రం. చిత్తూరు నగరానికి చెందిన వాకర్స్ బృందం.. స్వామివారిపై భక్తి విశ్వాసాల్ని చాటుకుంటూ శీతాకాలంలో ఏటా డిసెంబరు 28న కాలినడకన ఆధ్యాత్మిక యాత్ర నిర్వహిస్తున్నారు. గత 20 ఏళ్లుగా చిత్తూరు నుంచి కాణిపాకం వరకు ఈ యాత్ర నిర్వహిస్తున్నారు. ఆదివారం చిత్తూరు నుంచి కాణిపాకం వెళ్లి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కరాటేలో ప్రతిభ

నగరి, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరులో ఆదివారం జరిగిన కరాటే పోటీల్లో నగరి పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారని కరాటే మాస్టర్ రాజ్‌కోటి తెలిపారు. పది మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో పోటీపడగా, ఐదుగురు ప్రథమ, ఇద్దరు ద్వితీయ, ముగ్గురు తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు.

అబాకస్ పోటీల్లో..

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: పుణెలో ఆదివారం జరిగిన అబాకస్ పోటీల్లో నగరంలోని తమ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని పల్లవి అకాడమి సమన్వయకర్త హేమ తెలిపారు. ఇంటర్నేషనల్, నేషనల్ అబాకస్, మ్యాథ్స్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులను మోనిష్, భువనేష్, పవన్ సాయి, తేజేస్ సాధించారన్నారు. ఎనిమిది మందికి గ్రాడ్యుయేషన్ బహుమతులు లభించాయని, వీరిని పలువురు అభినందించారని పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కార్వేటినగరం, న్యూస్‌టుడే: డీఎంపురంలో గీతాగోవిందం సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. తిరుపతికి చెందిన వైద్య నిపుణలు పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గీతా గోవిందం సేవా సమితి అధ్యక్షుడు బాలగురప్ప వైద్య నిపుణులు శ్రీధర్, నాగలక్ష్మి, సుబ్బారావు, సర్పంచి తులసి, సేవా సమితి ఉపాధ్యక్షుడు వెంకటరమణ, వ్యవస్థాపక అధ్యక్షుడు దామోధరం, కార్యదర్శి గుణశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మునీంద్ర పాల్గొన్నారు.

● **బంగారుపాళ్యం:** చిత్తూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నారాయణాద్రి ఆస్పత్రి సహకారంతో బంగారుపాళ్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్‌రాజా, ఉపసర్పంచి కామరాజు, మాజీ సర్పంచి కృష్ణమూర్తి పాల్గొన్నారు. ● **చిత్తూరు గ్రామీణ:** తుమ్మిందలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ చెన్నకేశవులు నాయుడు తెలిపారు. జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్, బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో 240 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశామని చెప్పారు. వైదేహి ఆసుపత్రి సమన్వయకర్త లోకేష్ భరణి, నాయకులు మోహన్‌రాజ్, ఉదయ్‌కుమార్, రఘు పాల్గొన్నారు.

చిత్తూరు గ్రామీణ: రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

అన్నదానం చేస్తున్న సింగిల్ విండో అధ్యక్షుడు జనార్దన్‌రాజు

వృద్ధుల సంక్షేమానికి చేయూత

కార్వేటినగరం, న్యూస్‌టుడే: వృద్ధుల సంక్షేమానికి తమవంతు చేయూతనందిస్తామని సింగిల్ విండో అధ్యక్షుడు జనార్దన్‌రాజు అన్నారు. గాంధీ భవన్ వృద్ధాశ్రమంలో తెదేపా నేత మురళీకృష్ణ కుమార్తె నిఖిత జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వృద్ధాశ్రమం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో దుష్యంత్, తెదేపా చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మురళి, తెదేపా నాయకులు ప్రసాద్, సుమన్, పర్యవేక్షకుడు ప్రకాష్ పాల్గొన్నారు.

విజయ్‌కాంత్‌కు నివాళి

నగరి : తమిళ సినీనటుడు, డీఎండీకే పార్టీ వ్యవస్థాపకుడు విజయ్‌కాంత్ వర్ధంతిని నగరిలో ఆదివారం ఆయన అభిమానులు నిర్వహించారు. నగరి, పుదుపేట, ఏకాంబరకుప్పం, చింతలపట్టడలో ఆయన చిత్రపటాలు ఆవిష్కరించి నివాళులర్పించారు. అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మురుగన్‌కు ఉత్తమ అవార్డు

పాలసముద్రం, న్యూస్‌టుడే: తమిళ మాధ్యమ ఉపాధ్యాయుడిగా ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు ఆముదాల ప్రాథమిక పాఠశాల తమిళ ఉపాధ్యాయుడు మురుగన్‌కు లభించింది. తమిళ ఉపాధ్యాయల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరి మండలం పుదుపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన్ను ఘనంగా సత్కరించి సేవలు ప్రస్తుతించారు. సంఘం జిల్లా అధ్యక్షులు జాన్, ఎంఈవో రాజేంద్రప్రసాద్, గిరిజ పాల్గొన్నారు.

వాహన చోదకుడి ఆత్మహత్య

పెళ్లకూరు: కొనేటిరాజుపాళెం రోడ్డు సమీపంలో చిత్తూరు జిల్లా గుడిపాల మండలం రామాపురానికి చెందిన పి.గుణశేఖర్ (40) శుక్రవారం చెట్టుకు ఉరేసుకున్నాడు. ఆయన పాలచ్చూరు సమీపంలో జరుగుతున్న పరిశ్రమల నిర్మాణ పనులకు తీసుకొచ్చిన ఓ వాహన చోదకుడిగా పనిచేస్తూ స్థానికంగా అద్దెకు ఉంటున్నాడు. ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. స్థానికులు శనివారం గుర్తించి తమకు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేశామని ఎస్సై నాగరాజు తెలిపారు. ఆయన మృతిపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

బరిలో దిగితే పతకమే

రాణిస్తున్న భావి ఇంజినీర్లు

పూతలపట్టు, న్యూస్‌టుడే: కృషి, పట్టుదల, శిక్షణ, అందివచ్చిన ప్రోత్సాహంతో జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు పలువురు యువ క్రీడాకారులు.. పాఠశాల స్థాయి నుంచే చదువుతో పాటు తమకు ఇష్టమైన క్రీడలు ఎంపిక చేసుకుని జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు మండలంలోని పి.కొత్తకోట వేము ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు.. ఖోఖో, ఫుట్‌బాల్, క్రికెట్‌లో చక్కగా రాణిస్తూ సహచరులకు స్ఫూర్తిగా నిలిచారు.

ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

ఫుట్‌బాల్ అంటే ప్రాణం..

చిత్తూరులోని గంగనపల్లెకి చెందిన అబ్దుల్ సదీష్, రిజ్వానా(హోటల్ నిర్వాహకులు) కుమారుడు అబ్దుల్ మజీద్ బీబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుట్‌బాల్ అండర్-19 పోటీల్లో తమ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. జాతీయ స్థాయిలో రాష్ట్ర జట్టు తరఫున రైట్ డిఫెన్స్ క్రీడాకారుడిగా పాల్గొన్నాడు. భారత జట్టు తరఫున పాల్గొనాలనే లక్ష్యంతో శ్రమిస్తున్నాడు.

ఖోఖోలో సత్తా..

అనంతపురం జిల్లా మండ్రేవుకు చెందిన సాయికుమార్ ఖోఖోపై మక్కువతో రాష్ట్ర, సౌత్ జోన్ స్థాయిల్లో చక్కగా రాణిస్తున్నాడు. బీటెక్ సీఎస్ఈ చివరి సంవత్సరం చదువుతున్నాడు. తల్లిదండ్రులు శివమ్మ, లక్ష్మీనారాయణ రైతులు. సాయికుమార్ ఏడు, తొమ్మిది, పది తరగతుల్లోనే రాష్ట్ర, సౌత్ జోన్ స్థాయి పోటీల్లో చక్కగా రాణించాడు. ఇటీవల కేరళలో నిర్వహించిన సౌత్ జోన్ పోటీల్లో జేఎన్‌టీయూ అనంతపురం జట్టుకు ప్రాతినిధ్యం వహించి తన ప్రతిభ చూపాడు.

కబడ్డీలో మేటి..

నెల్లూరు జిల్లా చిట్టమూరుకు చెందిన సుబ్రహ్మణ్యం నాయుడు, లావణ్య కుమారుడు వివేక్‌చౌదరి బీటెక్ సీఎస్ఈ చివరి సంవత్సరం చదువుతున్నాడు. పాఠశాల స్థాయిలో కబడ్డీ, క్రికెట్‌లో చక్కగా రాణించాడు. ఇటీవల సౌత్‌జోన్ స్థాయి పోటీల్లో జేఎన్‌టీయూ అనంతపురం జట్టు తరఫున సత్తా చాటాడు. క్రికెట్‌లో ఆల్‌రౌండర్‌గా బౌలింగ్, బ్యాటింగ్‌లో తన ప్రతిభ చూపుతున్నాడు.

ఆటల్లో పోటీ.. రాణిస్తున్న విద్యార్థులు
పతకాల్లో మేటి

న్యూస్‌టుడే, ఐరాల, కాణిపాకం

నిరంతర కృషి, పట్టుదల, మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగి రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకొస్తున్నారు పలువురు గ్రామీణ విద్యార్థులు.. గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో చదువుతున్నా పట్టణ పాఠశాలలకు దీటుగా క్రీడా పోటీల్లో పాల్గొని మేటి పతకాలు సాధిస్తున్నారు.. తద్వారా అందరి ప్రశంసలు అందుకుంటున్నారు ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు.

అంతర్జాతీయ స్థాయిలో ..

మండలంలోని గోవిందరెడ్డిపల్లెకు చెందిన రైతు జి.శంకర్‌రెడ్డి, గృహిణి చిన్నిల కుమారుడు దినేష్‌రెడ్డి చదువుతో పాటు క్రీడల్లో మంచిపేరు సాధించాడు. క్రీడలపై ఆసక్తితో ఫెన్సింగ్‌లో తర్ఫీదు పొంది అన్నమయ్య జిల్లా గుర్రంకొండ, చిత్తూరు, కాణిపాకంలో జరిగిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పతకాలు సాధించాడు. బిహార్‌లో జరిగిన జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. నంద్యాల, బీఆర్‌అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో స్థానంలో నిలిచాడు. అంతర్జాతీయ క్రీడల్లో రాణించడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు.

ఉన్నత శిఖరాలు చేరుకుంటా..

మండలంలోని చిన్నవెంకటంపల్లెకు చెందిన పార్వతీశేష, సరితల కుమారుడు చరణ్‌తేజ. చదువుతో పాటు క్రీడల్లో చాలా చురుకు. బేస్‌బాల్ క్రీడల్లో ఉత్తమ శిక్షణ పొందాడు. కాకినాడ, నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాడు. క్రీడలతో ఉన్నత శిఖరాలు చేరుకుంటా నని ఆశాభావం వ్యక్తం చేశాడు.

అందివచ్చిన ప్రోత్సాహం..

నెల్లిమందలపల్లెకు చెందిన పి.అశోక్, స్వప్నల కుమారుడు జశ్వంత్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. క్రీడలపై మక్కువతో ఉపాధ్యాయుల వద్ద సాఫ్ట్‌బాల్‌పై ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. రోజువారీ పాఠశాలలో శిక్షణతో అందివచ్చిన ప్రోత్సాహంతో విశాఖపట్నం, నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని పతకాలు కైవసం చేసుకున్నాడు. గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండో స్థానంలో నిలిచి పాఠశాలకు గుర్తింపు తెచ్చాడు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడమే తన ధ్యేయమని చెబుతున్నాడు.

కంటెయినర్-బస్సు ఢీ

గుడిపాల, న్యూస్‌టుడే: చిత్తూరు-వేలూరు మార్గంలో ఓరియన్ పరిశ్రమ వద్ద ఆదివారం కంటెయినర్, బస్సు ఢీకొన్న ప్రమాదంలో కంటెయినర్ డ్రైవర్ వీరకుమార్(40)కి తీవ్రగాయాలయ్యాయి. అయ్యప్ప స్వాములతో శబరిమల నుంచి వస్తున్న బస్సు.. తమిళనాడు వెళ్తున్న కంటెనర్‌ను ఢీకొనడంతో తమిళనాడు తెన్‌కాశి గ్రామానికి చెందిన డ్రైవర్ వీరకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో అతడిని చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. బస్సులో కొందరు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కేసు నమోదు చేశామని ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

సారా తయారుచేస్తే కఠిన చర్యలు

కార్వేటినగరం, న్యూస్‌టుడే: సారా తయారీ, విక్రయాలకు పాల్పడితే పీడీ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని సీఐ హనుమంతప్ప హెచ్చరించారు. కొటార్వేడులో నిర్బంధ తనిఖీ చేపట్టి 15 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశామన్నారు. 200 లీటర్ల ఊట సారా ధ్వంసం చేశామన్నారు. ఎస్సైలు, ఎస్‌టీఎఫ్‌లు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు
తిరుమలకుప్పం గ్రామస్థుల ధర్నా

పుత్తూరు, న్యూస్‌టుడే: తిరుమలకుప్పం గ్రామానికి చెందిన శివలింగం(44), అయిగేషన్(40) ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా కేబీఆర్‌పురం నుంచి వస్తున్న టిప్పర్ ఢీకొని వెళ్లిపోయింది. వీరికి తీవ్ర గాయాలవడంతో గ్రామస్థులు వారిని నగరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం తిరుమలకుప్పం వద్ద మండల వైకాపా అధ్యక్షుడు అన్నా లోకనాథం ఆధ్వర్యంలో గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించారు. వారు మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం పళ్లిపట్టు తాలూకా పరిధిలోని కొళ్లత్తూరు నుంచి నిత్యం వందలాది టిప్పర్లు గ్రావెల్, కంకర డస్ట్ తరలిస్తున్నాయన్నారు. నేరుగా తమిళనాడు నుంచి నగరి మీదుగా వెళ్లే అవకాశం ఉన్నా ఇటుగా వస్తున్నారని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. గనులు, పోలీసు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా సమాచారం తెలిసిన పోలీసులు వచ్చి వారితో మాట్లాడి విరమింపజేశారు.

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



సీఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న దినేష్

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని బాధితులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను పట్టణ తెదేపా నాయకుడు దినేష్ ఆదివారం పంపిణీ చేశారు. దీక్ష అనే చిన్నారికి రూ.2.20 లక్షలు, జరీనాబీకి రూ.1.12లక్షలు, లోహిత్‌కు రూ.20వేల చెక్కులను అందించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, వెంకటేష్, మంజు, హరినాథరెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

వాలీబాల్ ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు వినతి

బంగారుపాళ్యం: బంగారుపాళ్యంలో వాలీబాల్ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మురళీమోహన్, శాప్ ఛైర్మన్ రవినాయుడికి క్రీడాకారులు విన్నవించారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం బంగారుపాళ్యం విచ్చేసిన వారిని క్రీడాకారులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని సందర్శించారు. అక్కడి వసతులు పరిశీలించి క్రీడాకారులతో మాట్లాడారు. తెదేపా మండల అధ్యక్షులు ధరణీప్రసాద్ నాయుడు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ మాజీ కోచ్ సుదర్శన్ నాయుడు, వాలీబాల్ క్రీడాకారుడు తులసిరెడ్డి, మాజీ సర్పంచి కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన జిల్లా ఉపాధ్యక్షురాలు

ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంజులమ్మ

పలమనేరు, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా తెదేపా ఉపాధ్యక్షురాలిగా ఎంపికైన మంజులమ్మ ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని ఆదివారం కలిశారు. తనపై పెట్టిన బాధ్యతను అంకితభావంతో నిర్వహిస్తానని చెప్పారు.

మృతికి సంతాపం

పెద్దపంజాణి మండలం వి.ఎ.కొత్తూరుకు చెందిన తెదేపా సీనియర్ నాయకుడు మునస్వామి ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళి తెలిపారు. అలాగే సైనిగుంట శ్రీనివాసులు మృతికి సంతాపం ప్రకటించారు.

గోశాలలో మరిన్ని అభివృద్ధి పనులు

✦ రోడ్లు, ఇతర వసతుల కల్పనకు శ్రీకారం
✦ సర్వే ప్రారంభించిన అధికారులు

గోశాలలో పశువులు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణానికి 8 కి.మీ దూరంలోని గోసంరక్షణ శాలలో తితిదే వారు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం అక్కడున్న పశు సంపదను వృద్ధి చేయడమే కాకుండా కేంద్రంలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. పశుపరిశోధనా కేంద్రం నుంచి తీసుకున్న 450 ఎకరాల భూమిలో వంద ఎకరాల్లో దివ్యవృక్ష పెంపకానికి చర్యలు చేపట్టారు. మిగిలిన భూమిలో సిమెంటు రోడ్లు, ఇతర సదుపాయాలను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం సర్వే చేసి వృక్ష సంపదను వృద్ధి చేయడానికి పనులు ప్రారంభించారు.

ఎన్ని పశువులు ఉన్నాయి..?

ప్రస్తుతం గోసంరక్షణ శాలలో అన్ని రకాల పశువులు కలిపి 540 ఉన్నాయి. వీటి సంఖ్యను పెంచడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఒక పశువుకు ఒకరోజుకు రెండు కిలోల దాణా ఇవ్వాల్సి ఉంటుంది. ఇక పచ్చిగడ్డి కోసం 30 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నారు.

నీటి వసతి..

వ్యవసాయం చేయడానికి, పశువులకు నీటిని అందించడానికి మొత్తం 11 బోర్లు ఉన్నాయి. పశువులను ఉంచడానికి 17 షెడ్లు ఏర్పాటు చేశారు.

పశువుల రకాలు..

ఒంగోలు, గిర్, సాహివాల్, కాంగ్రెజ్ రకాలు

పెంచనున్న వృక్షజాతులు

దివ్యవృక్షాల పేరిట టేకు, ఆగిశ, ఇండియన్ కినో, టెర్మినేలియా, షోరియా జాతులు.. తిరుమల దేవస్థానంతో పాటు తితిదే ఆధీనంలోని 60 ఆలయాలకు ధ్వజస్తంభాల కొరత తీర్చడానికి మొక్కలు పెంచనున్నారు.

ఆలయానికి పంపిస్తాం

పలమనేరు గోసంరక్షణ శాలలో వృద్ధి చేస్తున్న పాడి ఆవులను తిరుపతి గోశాలకు పంపిస్తాం. పాలిచ్చే వరకు ఇక్కడ పెంచి చూడి అయిన తర్వాత అక్కడికి పంపి పాలను ఆలయానికి సరఫరా చేస్తాం.
- శివకుమార్, తితిదే గోశాల డైరెక్టర్

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని గుడిసెబండ ప్రాథమిక పాఠశాల పరిసరాల్లోని మురుగు కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. **- నాగ, గుడిసెబండ**

సమాధానం: గ్రామంలో పర్యటించి కాలువలను శుభ్రం చేసి సమస్య పరిష్కరిస్తాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. **- లోకేశ్, కార్యదర్శి**

పలమనేరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని రంగాపురంలో మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నాం. **- చంద్ర**

సమాధానం: కాలువలు శుభ్రం చేయడానికి చర్యలు తీసుకుంటాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం. **- ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్**

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: దళవాయికొత్తపల్లె చెరువు కట్టపై వినియోగించిన ఇంజెక్షన్లు, మందులను దగ్ధం చేశారు. **- రమణ, కుప్పం**

సమాధానం: పరిశీలించి తొలగించేలా సిబ్బందిని ఆదేశిస్తాం. **- శ్రీనివాసరావు, కమిషనర్**

సోమల, న్యూస్‌టుడే: సమస్య: దిగువకొత్తూరులో మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. దుర్వాసన వస్తోంది. **- స్థానికులు**

సమాధానం: పారిశుద్ధ్య పనులు చేసేందుకు చొరవ తీసుకుంటాం. **- మునికుమార్, ఇన్‌ఛార్జి కార్యదర్శి**

కాలనీలో శుభ్రత పనులు

పలమనేరు: పట్టణంలోని సూరప్పవీధిలో మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధిలో మురుగు పేరుకుపోయి అధ్వానంగా ఉండటంతో 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు శుభ్రత చర్యలు చేపట్టారు.

స్పందనకు వందనం

మానవత్వంతో సేవలందించాలి

మాట్లాడుతున్న నందీశ్వరయ్య

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మానవత్వంతో సేవలందించాలని మానవత పుంగనూరు శాఖ ఛైర్మన్ నందీశ్వరయ్య తెలిపారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అంతిమ యాత్ర కోసం ఉచితంగా ఫ్రీజర్లు, శాంతిరథం అందిస్తున్నామన్నారు. మాజీ అధ్యక్షుడు గణేశ్, సభ్యులు భక్తవత్సలంరాజు, వెంకటేశు, నరసింహారెడ్డి, భార్గవ్ పాల్గొన్నారు.

చల్లాను కలిసిన నాగిశెట్టి కుటుంబ సభ్యులు

చల్లా రామచంద్రారెడ్డికి చిత్రాన్ని బహూకరిస్తున్న నాగిశెట్టి సోదరులు

రొంపిచెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని మిట్టమీదపల్లెకు చెందిన నాగిశెట్టి రవికుమార్, భాస్కర్, శ్రీరాములు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డిని ఆదివారం కలిసి సత్కరించారు. ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేకంగా తయారు చేయించిన ఫొటోను ఆయనకు బహూకరించారు.

డాక్టరేట్ ప్రదానం



శైలేంద్రకుమార్

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన న్యాయవాది శైలేంద్రకుమార్‌కు ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఉచిత న్యాయ సహాయం కేసులను చేయడం, న్యాయ సేవలను అందించడం, ఏపీ భూమి హక్కు చట్టం-2023కు వ్యతిరేకంగా నిరసన నిర్వహించడాన్ని వర్సిటీ గుర్తించి డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు.

వీపీఎల్ విజేత పీఆర్‌టీ జట్టు

ట్రోఫీ అందుకుంటున్న పీఆర్‌టీ జట్టు

వి.కోట, న్యూస్‌టుడే: మండలంలో ప్రతి ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ వీపీఎల్ సీజన్-2 విజేతగా పీఆర్‌టీ జట్టు నిలిచింది. పాముగానిపల్లె మైదానంలో నిర్వహించిన టోర్నమెంటులో 10 జట్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతి రూ.లక్ష నగదుతో పాటు, ట్రోఫీని మండల పరిధిలోని పడిగలకుప్పం పీఆర్‌టీ జట్టు కైవసం చేసుకుంది. రెండో స్థానంలో రూత్‌లెస్ జట్టు రూ.50వేలు. మూడో బహుమతి ఏజేట్యాటో రూ.25వేలు బహుమతిని సొంతం చేసుకున్నారు. నిర్వాహకులు జైశంకర్, తమీమ్‌ఖాన్ పాల్గొన్నారు.

సమష్టి కృషితో మరింత బలం

షణ్ముగం రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ మునిరత్నం

కుప్పం పట్టణం: ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం చంద్రబాబు సారథ్యంలో తెదేపాను గ్రామీణ స్థాయి నుంచి మరింత బలోపేతానికి కృషి చేద్దామని తెదేపా చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి పేర్కొన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడిని సత్కరించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, పీకేఎం ఉడా ఛైర్మన్ సురేష్, ఏఎంసీ ఛైర్మన్ జీఎం రాజు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

సోమల, న్యూస్‌టుడే: మండలంలోని కందూరు ఉన్నత పాఠశాలలో 1981-82 పదో తరగతి పూర్వ విద్యార్థులు, అప్పటి గురువులు పాఠశాలలో ఆదివారం సమావేశమయ్యారు. అప్పటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అనంతరం గురువులను సత్కరించారు.

సమావేశమైన విద్యార్థులు, గురువులు

సనాతన ధర్మాన్ని కాపాడండి

మాట్లాడుతున్న జనార్దనరాజు ✦ చౌడేపల్లెలో ర్యాలీ ✦ శాంతిపురంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ జనార్దన్

రామకుప్పం, న్యూస్‌టుడే: సనాతన ధర్మాన్ని కాపాడాలని సహప్రాంత భౌద్ధిక్ జనార్దనరాజు పేర్కొన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం(ఆర్ఎస్ఎస్) ఆవిర్భవించి వందేళ్లైన సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం మండల కేంద్రంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. మండల కేంద్రంలో పాటు గ్రామాల నుంచి హిందువులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం జైశ్రీరాం నామస్మరణలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సీతాపతి, పురోహితుడు భాస్కర్ శర్మ, నాయకులు వెంకటరమణ, హరీశ్, రాణి జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. **చౌడేపల్లె, న్యూస్‌టుడే:** స్థానిక కల్యాణ గంగమ్మ ఆలయం వద్ద ఆదివారం హిందూ సమ్మేళన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో నిర్వహించిన ర్యాలీలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బస్టాండు, హైస్కూలు వీధి, బజారు వీధి, సంతగేటు ప్రాంతాల్లో ప్రదర్శనలు చేశారు. ఆర్ఎస్ఎస్ నాయకుడు మల్లికార్జున, భాజపా నాయకులు మనోహర్, నానబాల కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రహదారంతా గోతులే..!

కల్లూరు-సదుం వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా కల్లూరు బస్టాండు నుంచి పెద్దమసీదు వరకు వెళ్లే మార్గంలో గుంతలు అధికంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై పుంగనూరు ఆర్అండ్‌బీ డీఈ వెంకటయ్యను వివరణ కోరగా.. పరిశీలించి గుంతలను పూడుస్తామన్నారు.
- న్యూస్‌టుడే, కల్లూరు

పేరుకే పురపాలిక.. వసతులు శూన్యం

కుప్పం పురపాలిక పరిధిలోని కృష్ణగిరి-పలమనేరు జాతీయ రహదారి తంబిగానిపల్లె వద్ద శాశ్వత మురుగు కాలువలు లేకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపైనే మురుగు ప్రవహించడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై కమిషనర్ శ్రీనివాసరావును వివరణ కోరగా.. పరిశీలించి మురుగు రోడ్లపై ప్రవహించకుండా చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, కుప్పం పట్టణం**

విష పురుగుల బెడద తొలగించండి..?

పుంగనూరు మండలంలోని బండ్లపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పిల్లలకు విష పురుగుల బెడద తప్పడం లేదు. చుట్టూ పిచ్చిమొక్కలు విపరీతంగా ఉండటంతోనే ఈ పరిస్థితి ఉందని విద్యార్థులు చెబుతున్నారు. ఈ విషయమై ఎంఈవో-2 రెడ్డెన్నశెట్టి మాట్లాడుతూ.. త్వరలో ప్రహరీ నిర్మాణం చేపడుతామన్నారు.
- న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ

రూ.12 లక్షల భవనం అలంకారప్రాయం..!

పెద్దపంజాణి మండలంలోని తుర్లపల్లెలో వైకాపా పాలనలో రూ.12 లక్షలతో జగనన్న పాలవెల్లువ మహిళా డెయిరీ సహకార సంఘం భవనం నిర్మించారు. ఈ భవనాన్ని 2024లో అప్పటి ఎమ్మెల్యే వెంకటే గౌడ ప్రారంభించారు. అయితే నేటికీ పాలవెల్లువ భవనంలో చుక్క పాలను సేకరించలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ భవనాన్ని ఇతర ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకోవడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పెద్దపంజాణి**

కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం

శాంతిపురం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. కుప్పం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆవుల గోపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాయకులు నంజప్ప, సుబ్రహ్మణ్యం, మునస్వామి, రోహిణప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అభినందన

పలమనేరు, న్యూస్‌టుడే: భాజపా సోషల్ మీడియా జిల్లా కో-కన్వీనర్‌గా నియమితులైన శివకుమార్‌ను పట్టణ భాజపా నాయకులు ఆదివారం సత్కరించారు. పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా భాజపా కార్యదర్శి ప్రభాకర్ నేతృత్వంలో నాయకులు శాలువా కప్పి అభినందనలు తెలిపారు.

శివకుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

షణ్ముగరెడ్డికి సత్కారం

శాంతిపురం, న్యూస్‌టుడే: తెదేపా చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి ఆదివారం శాంతిపురంలో పర్యటించారు. బస్టాండు కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, నాయకులు విశ్వనాథనాయుడు, జనార్దన్‌రెడ్డి, గోపాల్ ఆయన్ను సత్కరించారు.

30న వైకుంఠ ఏకాదశి పూజలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: కడపనత్తంలోని శ్రీనలగుండ్రాయ స్వామి ఆలయంలో ఈ నెల 30న వైకుంఠ ఏకాదశి పూజలు వేడుకగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మురళీధర్ తెలిపారు. 30న సుప్రభాతసేవ, అభిషేకం, అలంకారసేవ, సప్తద్వారపూజ, ఉత్తర ద్వారంలో స్వామివారి దర్శనం, అన్నదానం, 31న కల్యాణోత్సవం, జనవరి 1న ఆంగ్ల సంవత్సరాది వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. **పుంగనూరు:** స్థానిక కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో ఆదివారం క్యూలైన్లు, చలువ పందిళ్లు, పుష్పాలంకరణ పనులు చేశారు. మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు అవసరమైన వసతులు కల్పించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయ ఈవో కృష్ణమూర్తి, సీఐ సుబ్బరాయుడు వసతులను పరిశీలించారు.

మద్యం స్వాధీనం

పుంగనూరు గ్రామీణ: స్థానిక భగత్ సింగ్ కాలనీలో పోలీసులు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. రవి అనే వ్యక్తి నుంచి 10 లీటర్ల సారా, 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా సీపీఐ శతజయంతి

పలమనేరు, న్యూస్‌టుడే: సీపీఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని టవర్‌క్లాక్ వద్ద ఆ పార్టీ నాయకులు జెండాను ఆవిష్కరించారు. నాయకులు చెన్నకేశవులు, బుర్రా మంజునాథ్‌బాబు, నాగరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి

సమస్యలు పరిష్కరించాలి

పుంగనూరు, న్యూస్‌టుడే: పురపాలికల్లో ఉన్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పారిశుద్ధ్య కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి కోరారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు శ్రీరాములు, గణేశ్, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మణకుమార్ పాల్గొన్నారు.

అపరిచితులతో జాగ్రత్త

సోమల, న్యూస్‌టుడే: వారపు సంతల్లో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రమేష్ సూచించారు. మండలంలోని వారపు సంతలో ఆదివారం పర్యటించి స్థానికులకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

ఒంటరి ఏనుగు దాడి

కల్లూరు: ఒకటిన్నర నెలగా కనిపించని ఒంటరి ఏనుగు మళ్లీ పులిచెర్ల మండలం పాళెం పంచాయతీలో శనివారం రాత్రి హల్‌చల్ చేసింది. స్థానిక రైతులకు చెందిన మామిడి చెట్లను ధ్వంసం చేసింది. అటవీ అధికారి మధుసూదన్ చెట్లను పరిశీలించారు.

గోశాలకు గడ్డి సరఫరా

పలమనేరు: పట్టణానికి 8 కి.మీ దూరంలో ఉన్న తితిదే గోసంరక్షణ శాలకు తితిదే పాలకవర్గ సభ్యుడు, జక్కంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఉచితంగా గడ్డి సరఫరా చేశారు. శ్రీనివాస ట్రస్టు, జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ సంయుక్తంగా 8 లారీల్లో గడ్డిని పంపారు. వీటిని పలమనేరు గోశాల వ్యవసాయ విభాగం ప్రతినిధి ఆనంద్ స్వాధీనం చేసుకున్నారు.

రింగులో దిగితే.. పతకాలే

✦ కరాటేలో రాణిస్తున్న చిన్నారులు

పుంగనూరు, న్యూస్‌టుడే: వారంతా పదేళ్లలోపు చిన్నారులు. కానీ కరాటే రింగులో దిగితే ప్రత్యర్థిని మట్టికరిపించే వరకు వెనుదిరగరు. ఆత్మరక్షణ విద్యలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తూ పతకాలు సొంతం చేసుకుంటున్నారు.

అన్నదమ్ముల సత్తా..

పుంగనూరు పట్టణానికి చెందిన వెంకటేశ్, సుస్మితల కుమారులు **విరాజ్, ప్రజ్వల్.** విరాజ్ నాలుగో తరగతి, ప్రజ్వల్ అయిదో తరగతి చదువుతున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కరాటేలో సత్తా చాటుతున్నారు. రెండో తరగతి నుంచే కుమితే, కటా విభాగాల్లో శిక్షణ పొందుతున్నారు. హైదరాబాద్, కర్నూలు, బెంగళూరు, మచిలీపట్నం, గౌరీబింద పట్టణాల్లో నిర్వహించిన జాతీయ, రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని స్వర్ణాలు, రజతాలు సాధించారు. అంతర్జాతీయ స్థాయిలోనూ బంగారు పతకాలను సాధించడమే ధ్యేయమని చెబుతున్నారు.

మట్టికరిపిస్తున్న మనస్విని

పుంగనూరులోని లైన్‌మ్యాన్ ఉపేంద్రబాబు, నీల కుమార్తె మనస్విని. టీవీలో కరాటే చూసినప్పుడు బాలిక ఆసక్తి చూపడంతో తల్లిదండ్రులు గుర్తించి మాస్టర్ సదాశివ వద్ద శిక్షణకు చేర్పించారు. ఇప్పటివరకు హైదరాబాద్, తిరుపతి, కర్నూలు, చిలకలూరిపేట, గుంటూరు నగరాల్లో జరిగిన కరాటే పోటీల్లో కుమితే, కటా విభాగాల్లో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించింది. అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు సాధన చేస్తోంది.

క్రీడాకారుల సంక్షేమానికి సహకరిస్తా

పలమనేరు, న్యూస్‌టుడే: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. పలమనేరు బాయ్స్ ఆఫ్ క్రికెట్ అకాడమీ నిర్వాహకులు, పలువురు క్రీడాకారులు ఎమ్మెల్యేని ఆదివారం ఆయన కార్యాలయంలో కలిశారు. వారు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

అక్రమ నిర్మాణంపై గ్రామస్థుల ఆక్షేపణ

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: పాతపేటలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన స్థలంలో ఓ వ్యక్తి అక్రమ నిర్మాణం చేపట్టడంపై గ్రామస్థులు ఆక్షేపిస్తున్నారు. వైకాపా ప్రభుత్వంలో పక్కా గృహాల నిర్మాణం కోసం కొందరికి పట్టాలు, ఇళ్లు మంజూరు చేశారు. ఈ స్థలంలో ఓ వ్యక్తి ఎలాంటి అనుమతి లేకుండా రెండు రోజుల కిందట నిర్మాణం చేపట్టినట్లు వాపోయారు. గ్రామస్థుల ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు నిర్మాణ పనులు ఆపాలని హెచ్చరించారు. అయినా ప్రహరీ నిర్మాణం చేపట్టారు. అక్రమ నిర్మాణంపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేస్తామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనకు రూ.50లక్షల మంజూరు

రొంపిచెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని 17 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు, మెరుగైన సౌకర్యాల కల్పనకు రూ.50లక్షలు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు.

మునిరాజపురం తాగునీటి సమస్యకు పరిష్కారం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మునిరాజపురంలో తెదేపా మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు చొరవతో అధికారులు తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు. పంచాయతీ బోరు మోటారు తరచూ మరమ్మతుకు గురికావడంతో ప్రజలు సమస్యను కిశోర్‌గౌడు దృష్టికి తీసుకెళ్లడంతో నూతన మోటారు, స్టార్టరు, కేబుల్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. అధికారులు ఆదివారం బోరుకు కొత్త మోటారు అమర్చి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ

చిత్తూరు(మిట్టూరు): పుణేలో ఆదివారం జరిగిన అబాకస్ పోటీల్లో నగరంలోని తమ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని పల్లవి అకాడమి సమన్వయకర్త హేమ తెలిపారు. ఇంటర్నేషనల్, నేషనల్ అబాకస్, మ్యాథ్స్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులను మోనిష్, భువనేష్, పవన్‌సాయి, తేజేస్ సాధించారన్నారు. ఎనిమిది మందికి గ్రాడ్యుయేషన్ బహుమతులు లభించాయని, వీరిని పలువురు అభినందించారని పేర్కొన్నారు.

ఇలా శిథిలమవ్వాల్సిందేనా..?

పలమనేరులోని పశు వైద్యశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఒకప్పుడు పెచ్చులు ఊడటం మొదలుపెట్టి ఇప్పుడు ఏకంగా గోడలు కూలే పరిస్థితి నెలకొంది. భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతో చిట్టడవిని తలపిస్తోంది. భవనం చుట్టూ ఇప్పటికే పలువురు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. కొందరు దుకాణాలను సైతం నిర్మించుకోవడానికి యత్నిస్తున్నారు. ఈ విషయమై పలమనేరు పశువైద్య కేంద్రం అధికారిణి సుజాతను వివరణ కోరగా శిథిల భవనాన్ని గిడ్డంగిగా మార్చుకోవడానికి యత్నిస్తున్నామని వివరించారు. **- న్యూస్‌టుడే, పలమనేరు**

(c) eenadu

600 గళాలతో పంచరత్న పరవశం

కాకినాడలో ఘనంగా త్యాగరాజ స్వరార్చన

వేదికపై కళాకారుల నడుమ ప్రవచనం చేస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి

గాంధీనగర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఎందరో మహానుభావులు.. అందరికీ వందనములు అంటూ త్యాగరాజస్వామి పంచరత్న కీర్తనలు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 600 మంది ప్రముఖ సంగీత వాగ్గేయకారుల గళాల నుంచి వెలువడుతుండగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆధ్యాత్మిక ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు త్యాగరాజ వైభవం గురించి వివరించారు. త్యాగరాజస్వామి వర్ధంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం కాకినాడలోని ఆనందభారతి మైదానంలో స్వరార్చన జరిగింది. సరస్వతి గానసభ సంస్థ గౌరవాధ్యక్షురాలు పెద్దాడ సూర్యకుమారి, అధ్యక్షుడు డాక్టర్ ముళ్లపూడి నాగేశ్వరరావు, జీవితకాల అధ్యక్షుడు కొమ్మిరెడ్డి శ్రీరామనర్సింగరావు, కార్యదర్శి పేపకాయల రామకృష్ణ, ఉపాధ్యక్షులు టిక్కు, నారాయణం మురళి తదితరుల పర్యవేక్షణలో గానసభ 122 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహించారు. నగరవాసులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో హాజరయ్యారు.

నిర్లక్ష్యం ఖరీదు నిండుప్రాణాలు

పెరుగుతున్న ద్విచక్ర వాహన ప్రమాదాలు

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

జిల్లాలో ఇటీవల జరుగుతున్న ద్విచక్ర వాహన ప్రమాదాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. బైకులు పరస్పరం ఢీకొని ఇద్దరుముగ్గురు మృతి చెందుతున్న ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. మృతులు, క్షతగాత్రుల్లో మైనర్లు, యువతే ఎక్కువ. తగిన అనుభవం లేకపోవడం, నిర్లక్ష్యంగా నడపడం, మితిమీరిన వేగం, మద్యం మత్తులో ఉండటం, రహదారి నిబంధనలు తెలియకపోవడం, తెలిసినా అతిక్రమించడం తదితర కారణాలతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అదుపులేని వేగం

గంటకు 150 కి.మీ. నుంచి 250 కి.మీ. వేగం వెళ్లే వాహనాలు కొందరు యువత చేతుల్లో ప్రస్తుతం ఉంటున్నాయి. 150 సీసీ నుంచి 1000 సీసీ సామర్థ్యం ఉన్న ఈ వాహనాలతో సెకన్ల వ్యవధిలో 100 కి.మీ.వేగం అందుకుంటున్నారు. వీటిని నడుపుతున్న సమయంలో యువత వేగానికి కళ్లెం ఉండటం లేదు. అస్తవ్యస్తంగా ఉన్న రహదారులు, మలుపులు, కోతకు గురైన అంచుల వద్ద, ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో బండిపై అదుపు కోల్పోతున్నారు.

గాయాలు కాదు.. ప్రాణాలే..

గతంలో ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నా, నియంత్రణ కోల్పోయి పడిపోయినా గాయాలతో బయటపడే వారు. ఎదురుగా భారీ వాహనం బలంగా ఢీకొన్న ఘటనల్లో మాత్రమే మరణాలు నమోదయ్యేవి. ప్రస్తుతం ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొంటున్న ఘటనల్లో అతివేగంతో ఘటనాస్థలంలోనే మృతి చెందుతున్నారు. మొత్తం ప్రమాదాల్లో ఇవే మూడో వంతు. మృతుల్లో ప్రతి ముగ్గురిలో ద్విచక్ర వాహన చోదకులే ఉండటం ప్రమాదాల తీవ్రతకు నిదర్శనం.

అమలాపురం పరిధిలో ప్రమాదకరంగా ద్విచక్ర వాహనాలు నడుపుతూ..

కొన్ని ఘటనలు..

- ఇటీవల పి.గన్నవరం మండలం రాజవరం-పొదలాడ రహదారిలో స్పోర్ట్స్ బైక్‌పై అతివేగంగా వెళ్లిన యువకుడు(23) విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని మృతిచెందాడు.
- ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను రాజోలు మండలం కడలి కూడలి వద్ద మరో బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి.
- తాళ్లరేవు మండలం కోరింగ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

జనవరి నుంచి ఇప్పటివరకు మైనర్లు నడుపుతున్న 56 వాహనాలను స్వాధీనం చేసుకొని వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించాం. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులకు కూడా జైలు శిక్ష పడే అవకాశం ఉంది. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపినవారిపై చట్టపరమైన చర్యలు తప్పవు.

-శ్రీనివాసరావు, జిల్లా రవాణా శాఖ అధికారి

ఈ ఏడాది ద్విచక్ర వాహన ప్రమాదాలు:	93
మృతులు:	93
క్షతగాత్రులు:	43
మైనర్ డ్రైవింగ్‌లో సీజ్ చేసిన వాహనాలు:	56

అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీనివాసం.. భక్తజన సందోహం

వాడపల్లి (ఆత్రేయపురం): కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం ఆదివారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తిరుప్పావై సేవ, లక్ష్మీఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

భక్తిశ్రద్ధలతో తిరుమంజన సేవ

ఈ నెల 30న వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ఆదివారం ఆలయ శుద్ధి చేశారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని దేవస్థానం సిబ్బంది, అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీవారి సన్నిధి నుంచి మహాద్వారం వరకు, మందిరంలో ఉప ఆలయాలు, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను శుద్ధి చేశారు. స్వామివారికి పూజాది నివేదనల అనంతరం దర్శనాలు యథావిధిగా కొనసాగించారు. ఈవో ఎన్ఎస్ చక్రధరరావు పర్యవేక్షించారు.

నిధులు.. మార్గదర్శకాలు

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

గ్రామ పంచాయతీలకు విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధుల ఖర్చుపై పంచాయతీ రాజ్‌శాఖ కమిషనర్ మార్గదర్శకాలు జారీ చేశారు.. మరో మూడు నెలల్లో సర్పంచుల పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇటీవల విడుదలైన నిధులను దారి మళ్లించేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దీని కట్టడి కోసం నిబంధనలు విడుదల చేసింది.

అయినవిల్లిలో ఇంటింటి నుంచి చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

జనవరిలో ప్రత్యేక గ్రామ సభలు

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై ఏటా జనవరి 2న ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తారు. వీటిని వచ్చే నెల 5న నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గ్రామాల్లో శాస్త్రీయ విధానంలో ఘన వ్యర్థాల నిర్వహణ విధానాలు అమలు చేయడం ద్వారా పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు ఈ నెల 26 నుంచి ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఇది వచ్చేనెల 4వ తేదీ వరకు కొనసాగుతుంది. 5న నిర్వహించే గ్రామ సభల్లో చెత్త రహిత గ్రామాలుగా ప్రకటిస్తారు.

ఇవీ కార్యక్రమాలు

జనవరి 4 వరకు రోజూ గ్రామాల్లో రహదారులు, ఇతర పరిసరాల్లో పేరుకుపోతున్న చెత్త కుప్పలను తొలగించాలి. ● చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలి. ● ఎక్కడైనా ఈ కేంద్రాలు లేకుంటే జనవరి 4 లోపు కచ్చితంగా ప్రారంభించాలి. ● చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పంచాయతీ- రైతు భాగస్వామ్యంతో అభివృద్ధి చేయాలి. ● ఎల్లప్పుడూ చెత్త నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి రెడ్ స్పాట్‌లుగా గుర్తించాలి.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ

ఇటీవల విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధుల ఖర్చుపై మండల స్థాయిలో ఎంపీడీవోలు పంచాయతీల బిల్లులను నిరంతరం పర్యవేక్షించాలి. రోజువారీ పంచాయతీల వారీగా చేపట్టిన పనులు, ఆన్‌లైన్‌లో పొందుపరిచిన బిల్లులను పర్యవేక్షించాలి. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తిస్తే తక్షణం నిలుపుదల చేయాలి. గతంలో ఖర్చు చేసిన ఏ పనికీ బిల్లులు పెట్టేందుకు అనుమతులు లేవు.

పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు

నిధుల ఖర్చు ఇలా

- రాష్ట్ర ప్రభుత్వం పేర్కొన్న పనులకు మాత్రమే ఇటీవల విడుదలైన నిధులను ఖర్చు చేయాలి.
- గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలు తొలగించేందుకు..
- ఈ నెల వరకు గ్రీన్ అంబాసిడర్లకు ఉన్న వేతన బకాయిల చెల్లింపులు.
- విద్యుత్తు బకాయిలు, వీధి దీపాల బిల్లుల చెల్లింపు కోసం వాడొచ్చు.
- పంచాయతీల్లో తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ ఖర్చుల చెల్లింపు.
- మండల పరిషత్తు పరిధిలోని లింక్ రహదారులు, చేతిపంపుల నిర్వహణ..
- సీపీడబ్ల్యూ తాగునీటి పథకాలు, విద్యుత్తు బిల్లుల చెల్లింపు, లింక్ రహదారుల అభివృద్ధికి నిధులు వెచ్చించవచ్చు.

జోడు ఎద్దుల జోరు.. గెలుపు గుర్రాల స్వారీ

రంగంపేట, న్యూస్‌టుడే: ఓవైపు జోడు ఎద్దులు రంకెలు వేస్తుంటే.. మరోవైపు గుర్రాలు పరుగులు పెడుతుంటే.. ఉమ్మడి జిల్లాకు ముందే సంక్రాంతి వచ్చిందా అన్న అనుభూతి కలిగింది. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట-వడిశలేరు మధ్య గన్నివారి తోటలో ఆదివారం జరిగిన పందేలు చూసేందుకు జనాలు తరలివచ్చారు. జీఎస్ఎల్ ఛైర్మన్ గన్ని భాస్కరరావు ఏడేళ్లుగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. ఏటా ఎద్దులకే పెట్టగా ఈసారి గుర్రాలకు సైతం పెట్టారు. మంత్రి దుర్గేష్ ప్రారంభించగా ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి పాల్గొన్నారు. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. డీఎస్పీ దివ్య ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

విజేతలు వీరే

- గుర్రాల పరుగు పందెంలో యల్లపు జగదీష్ (యలమంచిలి), విక్రమ్ (రామన్నపాలెం)కు చెందిన గుర్రాలు ద్వితీయ, తృతీయ స్థానాలో నిలిచాయి.
- జూనియర్స్ ఎద్దుల పందెం విభాగంలో కొండేటి పద్మ(కంకటపాలెం), మురుకుర్తి శంకరరావు(జి.కొత్తూరు, అనకాపల్లి జిల్లా)కు చెందిన ఎడ్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.
- సీనియర్స్ విభాగంలో కోరా శృతిచౌదరి (గుమ్మిలేరు, మండపేట)కు చెందిన ఎద్దులే ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవడం విశేషం.

5 వేల మంది సేవలో..

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు ఆదరణ

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

ఒకప్పుడు నిండు గర్భిణులు ఆసుపత్రికి వెళ్లాలన్నా, ప్రసవం తర్వాత ఇంటికి రావాలన్నా ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. హైరిస్క్ గర్భిణులతోపాటు ప్రభుత్వ ఆసుపత్రులు, సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పురుడు పోసుకున్న మహిళలతోపాటు పిల్లలను ఈ వాహనాలు జాగ్రత్తగా ఇంటికి చేరుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఈ సేవలను పలువురు అందిపుచ్చుకుంటున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి మొదలుకుని డిసెంబర్ 27 వరకు 5వేల మంది సద్వినియోగం చేసుకున్నారు.

జిల్లాలో ఇలా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురంలో ప్రాంతీయ ఆసుపత్రులు ఉన్నాయి. వీటికి రెండేసి చొప్పున తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను గతంలో కేటాయించారు. అల్లవరం, ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలు, ఆలమూరు, కపిలేశ్వరపురం, మండపేట, కొత్తపేట సామాజిక ఆసుపత్రులు, లక్కవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒక్కొక్కటి చొప్పున వాహనాలు న్నాయి. వీటి ద్వారా తల్లీబిడ్డలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది 5,000 మంది ఈ సేవలు పొందగా.. ప్రాంతీయ ఆసుపత్రుల పరిధిలోనే రెండువేల మంది ఉన్నారు. సేవలు మరింత విస్తృతం చేయనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ జి.ఆదిత్యరామ్ తెలిపారు.

జిల్లా వివరాలు

మండలాలు	22
ప్రాంతీయ ఆసుపత్రులు	2
సామాజిక ఆసుపత్రులు	9
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	47
తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు:	13

వాహనంలో తల్లీబిడ్డ ప్రయాణం

పండగ సంతోషం ఆవిరి

టిక్కెట్ ధరలు పెంచేసిన ప్రైవేట్ ట్రావెల్స్

ఈనాడు, అమలాపురం: ఒకరి అవసరం.. మరొకరికి అవకాశం అన్నట్లుగా ఉంది ప్రైవేట్ రవాణా సంస్థల వ్యవహారం.. ఉద్యోగాలు, వివిధ వృత్తుల రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉంటూ సంక్రాంతి పండగకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని స్వస్థలాలకు వచ్చేవారిని దృష్టిలో పెట్టుకొని టిక్కెట్ ధరలు భారీగా పెంచేశాయి. ఆన్‌లైన్ వేదికగా మూడింతలు పెంచి విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు కిమ్మనడం లేదు.

భారీ దోపిడీకి తెర..

ఉమ్మడి జిల్లాకు చెందినవారు ఎక్కువగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల్లో ఉన్నారు. ఉద్యోగస్తులే గాక వివిధ కూలి పనులకు వెళ్లినవారూ అధికమే. బస్సుల రద్దీ, టిక్కెట్ ధరలు భరించలేక ద్విచక్ర వాహనాలపై వచ్చేవారెందరో. ఈ క్రమంలో ప్రమాదాలకు గురైన సంఘటనలూ గత యేడాది చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం పలు ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థలు ఏసీ, నాన్ ఏసీ, స్లీపర్, సిట్టింగ్‌కు సంబంధం లేకుండా టిక్కెట్‌పై భారీగా పెంచేశారు. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, రాజోలు ప్రాంతాల నుంచి సుమారు 150 వరకు ప్రైవేటు ట్రావెల్స్ ఉండగా, దూర ప్రాంతాల నుంచి జిల్లా మీదుగా వెళ్లేవీ అధికమే. పండగ రోజుల్లో ఒక వైపు ఖాళీగా వెళ్లాల్సి ఉంటుందని, అందుకే దాదాపు రెండు వైపుల ఛార్జీలు వసూలు చేస్తున్నారంటూ ఓ నిర్వాహకుడు సమర్థించుకునే ప్రయత్నం చేశారు.

డిసెంబరు 30, జనవరి 13న మధ్య ధరల వ్యత్యాసం ఇలా..

- ప్రస్తుతం హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి ఏసీ స్లీపర్ రూ.729 నుంచి రూ.1731.. సిట్టింగ్ రూ.509 ఉండగా సంక్రాంతి రోజుల్లో రూ.3549, సిట్టింగ్‌కు రూ.1709 వసూలు చేస్తున్నారు.
- హైదరాబాద్ నుంచి అమలాపురానికి సాధారణ రోజుల్లో రూ.769 నుంచి రూ.1440 ఉండగా, సిట్టింగ్‌కు రూ.550 ధర ఉంది. పర్వదినానికి స్లీపర్ రూ.2109 నుంచి రూ.3389, సిట్టింగ్‌కు రూ.1899-2099గా తీసుకుంటున్నారు.
- హైదరాబాద్-కాకినాడకు ఇప్పుడు రూ.759 నుంచి రూ.1466, సిట్టింగ్ రూ.499 టిక్కెట్ ధర ఉంది. పండగ మూడు రోజుల్లో రూ.2399 నుంచి రూ.3712, సిట్టింగ్ రూ.1749 చెబుతున్నారు.

శత వసంతాల సేవా శిఖరం

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: వైద్య రంగానికి డాక్టర్ శివరామకృష్ణారావు చేసిన సేవలు అజరామరమని ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ వైద్యులు, వక్తలు పేర్కొన్నారు. వైద్యుడిగా ఎందరికో సేవలందించి ప్రొఫెసర్‌గా ఎందరినో ఉత్తమ వైద్యులుగా తీర్చిదిద్దిన డాక్టర్ పట్నం శివరామకృష్ణారావు వందో జన్మదిన వేడుకలు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఓ హోటల్‌లో శిష్యబృందం, కుటుంబ సభ్యుల మధ్య ఆదివారం ఘనంగా జరిగాయి. విశాఖపట్టణం, గుంటూరు, కాకినాడ వైద్య కళాశాలల పూర్వ విద్యార్థులైన ప్రముఖ వైద్యనిపుణులు, హైదరాబాద్, కర్నూలు, విజయవాడ, రాజమహేంద్రవరం నగరాలకు చెందిన శిష్యులు పెద్ద ఎత్తున హాజరై శివరామకృష్ణారావును సత్కరించి పాదాభివందనం చేశారు. ఆయన నెల్లూరులో జన్మించినా రాజమహేంద్రవరంలో మనమరాలు వద్ద స్థిరపడ్డారు.

కుటుంబ సభ్యులతో డాక్టర్ శివరామకృష్ణారావు

శంకరగుప్తం డ్రెయిన్ పనులకు 30న శంకుస్థాపన

మలికిపురం, న్యూస్‌టుడే: శంకరగుప్తం మేజరు డ్రెయిన్ పనులకు ఈ నెల 30న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ డ్రెయిన్ మరమ్మతుల విషయాన్ని ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో గతనెల 26న కేశనపల్లి వచ్చి తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. మేజర్ డ్రెయిన్‌లో డ్రెడ్జింగ్ పనులు చేయడానికి, రెండు వైపులా గట్లను పటిష్ఠం చేయడానికి రూ.22.62 కోట్లు మంజూరయ్యాయి. పవన్‌కల్యాణ్ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.

చేనేతకు బకాయిల బెంగ

ఆప్కో కనికరించక కష్టాల్లో సంఘాలు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

చేనేతకు సహకారం కొరవడింది. నేత పనిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న కార్మికులు పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. సహకార సంఘాలకు ఆప్కో నుంచి బకాయిలు విడుదల కావడం లేదు. థ్రిఫ్ట్ పథకం పరిస్థితి ఇదే మాదిరిగా ఉంది. జిల్లాలోని 19 సంఘాల పరిధిలో రూ.5.28 కోట్ల బకాయిలు ఉండగా. . ఇటీవల రూ.42.03 లక్షలు మాత్రమే విదిల్చి సరిపెట్టారు. ఇంకా రూ.4.86 కోట్ల బకాయి విడుదల కావాల్సి ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

చేనేత కార్మికులు సంఘాల ద్వారా యార్న్ తీసుకుని వస్త్రాలను తయారు చేసి చేనేత సహకార సంఘాలకు అప్పగిస్తారు. వారు ఆప్కో ద్వారా విక్రయిస్తారు. ఆప్కో నుంచి ఏటా బకాయిలు పేరుకుపోతున్నాయి. ఒక్క రామచంద్రపురం మండలం హసనబాద చేనేత సహకార సంఘానికి రూ.కోటి వరకు చెల్లించాలి. శివల సంఘానికి రూ.75.93 లక్షలు, అంగర సంఘానికి రూ.78.71 లక్షలు, అద్దంపల్లి, నల్లూరు సంఘాలకు రూ.45 లక్షలకు పైగా, ఆదివారపుపేట రూ.24.40 లక్షలు బకాయిలు ఉన్నాయి. ఇలా జిల్లాలోని అన్ని సంఘాలకు డబ్బులు విడుదల కావాల్సి ఉంది.

మగ్గంపై నేత నేస్తున్న చేనేత కార్మికుడు

జిల్లాలో వివరాలు ఇలా..

చేనేత సహకార సంఘాలు:	23
పనిచేస్తున్నవి:	19
క్లస్టర్లు:	2
కార్మికులు:	4,280 మంది

థ్రిఫ్ట్ ఫండ్‌దీ అదే పరిస్థితి..

చేనేత సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్న కార్మికులు తమ నెలవారీ సంపాదనలో 8 శాతాన్ని పొదుపు చేస్తే.. ప్రభుత్వం థ్రిఫ్ట్ ఫండ్ నుంచి 16 శాతం వారి ఖాతాల్లో జమ చేయాలి. గతంలో వైకాపా ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేయగా.. కూటమి అధికారంలోకి వచ్చాక పునరుద్ధరించింది. బకాయిలు మాత్రం పూర్తి స్థాయిలో విడుదల చేయలేదు. జిల్లాలో రూ.2.55 కోట్లు థ్రిఫ్ట్ ఫండ్ పథకంలో కార్మికులకు చెల్లించాలి. అందులో రూ.80 లక్షలు మాత్రమే విడుదల చేశారు. ఆర్థిక శాఖ క్లియరెన్స్ లేక కార్మికులకు ఇంకా చేరలేదు. థ్రిఫ్ట్ ఫండ్‌కు రూ.60 లక్షలు బిల్లులు పెట్టామని.. మరో రూ.20 లక్షలు వచ్చే జనవరికి సీఎఫ్ఎంఎస్‌కు వస్తాయని చేనేత సహకార ఏడీ శ్రీనివాస్ తెలిపారు.

గడువు ముగుస్తోంది.. తూడు వెక్కిరిస్తోంది

పూడికతీత పనులు పక్కనపెట్టిన సాగునీటి సంఘాలు

ఈనాడు అమలాపురం, న్యూస్‌టుడే, రావులపాలెం పట్టణం: పంట పొలాల్లోని అదనపు, వృథా జలాలు బయటకు వెళ్లేందుకు వీలుగా డ్రెయిన్ల నిర్వహణ (ఓఅండ్ఎం)కు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు సకాలంలో పూర్తి చేయలేదు. ఈనెల 31వ తేదీలోగా గుర్రపుడెక్క, తూడు తొలగింపు వంటివి చేపట్టకపోతే నిధులు గంగపాలైనట్టే. ఈ దిశగా సాగునీటి సంఘాలు దృష్టిసారించడంలేదు.

వెదిరేశ్వరం సమీపంలో జగ్గిరెడ్డి కాలనీ వద్ద కాలువ పరిస్థితి

అక్కడక్కడ మొక్కుబడిగా..

కొన్నిచోట్ల పనులు తూతూమంత్రంగా చేయగా.. మెజార్టీ ప్రాంతాల్లో కనీసం తొంగిచూడలేదు. సాధారణంగా జూన్ నుంచి ఆగస్టు వరకు గుర్రపుడెక్క, తూడుకాడపై రసాయనాలు చల్లాలి. ఎండిన తరువాత తొలగించాలి. అక్టోబరు-డిసెంబరు మధ్య పూర్తిగా నిర్మూలించాలి.

పనులపై నీలినీడలు...

ప్రభుత్వం ఈ పనులకు ఒక్కో నియోజకవర్గానికి రూ.కోటి నుంచి రూ.50 లక్షల వరకు కేటాయించింది. జిల్లాలో మరో మూడురోజుల్లో పనులు చేస్తారంటే అనుమానాస్పదమే. కొందరు చేయకుండానే బిల్లులు పెడతారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

☛ కొత్తపేట నియోజకవర్గంలోని రావులపాలెం, కొత్తపేట, ఆత్రేయపురం, ఆలమూరులో సుమారు 50 కి.మీ మేర భారీ, చిన్న, మధ్యతరహా కాలువలు ఉన్నాయి. వీటిలో రెండు పంటల కాలంలో రెండుదఫాలు పనులు చేయాలి. మొదటి పంట సమయంలో గుర్రపుడెక్క, చిన్నచిన్న పాదులు చనిపోవడానికి రసాయనాలు పిచికారీ చేస్తారు. రెండో పంట సమయంలో మనుషులు, జేసీబీ యంత్రాలతో నీటికి ఎక్కడా అడ్డంకులు లేకుండా శుభ్రం చేయాలి. నియోజకవర్గానికి సుమారు రూ.60 లక్షల వరకు కేటాయించగా, పనులను రూ.5 లక్షల్లోపు విభజించి అప్పగించారు. ఎక్కడా పురోగతి లేదని రైతులు చెబుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

రైతులకు ఎక్కడెక్కడ ఇబ్బందులు ఉన్నాయో ఆయా కాలువలు పరిశీలిస్తాం. వెంటనే గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టి నీటికి ఎటువంటి అడ్డంకులు లేకుండా చూస్తాం.

- మోహన్‌కృష్ణ, డీఈఈ, డ్రెయిన్ల శాఖ, రాజోలు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

అమృతమూర్తికి అశ్రునివాళి

ప్రేమ, ఆప్యాయతలకు మారుపేరుగా, మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించి, మా జీవితాలకు బంగారు బాటలు వేసి, మా హృదయాలలో సుస్థిరస్థానం సంపాదించిన శ్రీ గట్టి సత్యనారాయణ గారి అకాల మరణానికి చింతిస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
భార్య : శ్రీమతి గట్టి సుబ్బలక్ష్మి
కుమారుడు: గట్టి వెంకట జయవర్ధన్ - కోడలు: శ్రీమతి మాధురి
కుమార్తె: మీసాల పావని - అల్లుడు: వెంకటరమణ కుమార్
తమ్ముడు: గట్టి బ్రహ్మాజీ - మరదలు: శ్రీమతి వీరవేణి
మనుమలు, మనుమరాండ్రు: G.లిఖిల్, M.సత్యమురారి, M.ప్రణవ్‌సాయి
చెల్లెళ్లు, బావలు, మేనల్లుళ్లు, మేనకోడళ్లు మరియు కుటుంబసభ్యులు
పెద్దకార్యం: ది. 31-12-2025 బుధవారం ర్యాలి గ్రామంలోని మా స్వగృహము నందు జరుగును. 7702460955, 7989241077

(c) eenadu

బౌండరీల మోత... సిక్సర్ల కూత..!

● ఉత్కంఠభరితంగా 'ఈనాడు క్రికెట్' పోటీలు

రాజానగరం, శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: బ్యాటర్లు సిక్సర్ల మోత మోగించారు. బంతి బంతికి బౌండరీలతో అభిమానులను అలరించారు. అంతర్జాతీయ క్రికెట్‌ను తలపించేలా ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (వైజాగ్) ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) 2025 క్రికెట్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. అప్పటివరకు గెలుపు అంచుల వరకు వెళ్లిన జట్టు ఒక్క బంతితో ఓటమిపాలైంది. ఓటమి దరిలో ఉన్న జట్టు చివరకు విజయతీరాలకు చేరాయి. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఈఎస్ఎల్ పోటీలు రెండో రోజైన ఆదివారం జట్లు హోరాహోరీగా తలపడ్డాయి.

ఆఖరి బంతికి అదృష్టం వరించి

విజయానందంలో కేరింతలు కొడుతున్న బీవీసీ కళాశాల జట్టు

మైదానం - 1లో ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ (కాకినాడ) - బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల కోనసీమ (భట్లపాలెం) మధ్య జరిగిన మ్యాచ్ ప్రేక్షకులను రంజింపచేసింది. తొలుత టాస్ గెలిచి బీవీసీ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఆదిత్య కళాశాల జట్టు నిర్ణీత 10ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన బీవీసీ జట్టు ఎనిమిది వికెట్లు కోల్పోయి 96 పరుగులు సాధించి విజయం సాధించింది. ఆట చివరలో 12 బాల్స్‌లో 20 పరుగులు చేయాల్సి రావడంతో బీవీసీ జట్టు ఒత్తిడికి గురై త్వరత్వరగా వికెట్లు కోల్పోయింది. చివరికి ఒక బంతికి రెండు పరుగుల లక్ష్యంతో విజయం సాధించాల్సి ఉంది. ఆ సమయంలో అందరూ ఊపిరి బిగపట్టి చూస్తున్న సమయంలో ఆఖరి బంతికి రెండు పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. దీంతో విజయానందంతో బీవీసీ జట్టు మైదానంలో ఆనందంతో కేరింతలు కొట్టారు..

● ఆదివారం మధ్యాహ్నం ఐడియల్ కళాశాల ఆర్ట్స్ (కాకినాడ) X వికాస్ ఫార్మాస్యూటికల్ జట్టు తలపడాల్సి ఉండగా వికాస్ కళాశాల జట్టు రాకపోవడంతో న్యాయనిర్ణేతలు వాకోవర్ ఇచ్చి ఐడియల్ కళాశాల జట్టును విజయం సాధించినట్లుగా ప్రకటించారు.

వాకోవర్‌లో విజయం సాధించిన ఐడియల్ కళాశాల జట్టు

వాకౌర్‌తో విజయం సాధించిన చైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కాకినాడ)

● మైదానం-2లో ఉదయం 8 గంటలకు చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, రంగరాయ వైద్య కళాశాల జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్‌లో రంగరాయజట్టు రాకపోవటంతో న్యాయనిర్ణేతలు వాకౌర్ ఇచ్చి చైతన్య ఇనిస్టిట్యూట్ ఇఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీని విజేతగా ప్రకటించారు.

మ్యాచ్‌ను మలుపు తిప్పిన ఆ ఇద్దరు

మైదానం-1లో జీఎస్ఎల్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ (రాజమహేంద్రవరం), ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల జట్లు తలపడ్డాయి. జీఎస్ఎల్ జట్టు టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకుని నాలుగు వికెట్ల నష్టానికి 108 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రగతి కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 91 పరుగులు చేసింది. 17 పరుగుల ఆధిక్యంతో జీఎస్ఎల్ జట్టు విజయం సాధించింది. ఈ జట్టులో మధు 33 పరుగులు సాధించగా చంద్ర 6 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

విజయం సాధించిన జీఎస్ఎల్ కళాశాల జట్టు

33 పరుగులు సాధించి స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే గా నిలిచిన మధు

3 వికెట్లు సాధించి స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే గా నిలిచిన చంద్ర

ఆది నుంచి తడబడి.. ఓటమిపాలై..

ఇదే క్రీడామైదానంలో ఉదయం 10గంటలకు ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల (సూరంపాలెం), ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పీజీ (రాజమహేంద్రవరం) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఆదిత్య ఇంజినీరింగ్ జట్టు నిర్ణీత 10 ఓవర్లకు 8 వికెట్ల నష్టానికి 78పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నన్నయ యూనివర్సిటీ జట్టు మొదటి ఓవర్ నుంచే వికెట్లు కోల్పోవటం ప్రారంభించింది. 5 ఓవర్లు అయ్యే సమయానికి ఏకంగా 5 వికెట్లు కోల్పోయి కేవలం 30 పరుగులు మాత్రమే చేసి పీకల్లోతు కష్టాల్లో పడింది. తర్వాత వచ్చిన బ్యాటర్లు మ్యాచ్‌ను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంలో కేవలం 56 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలయ్యారు.

విజయం సాధించిన ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల జట్టు (సూరంపాలెం)

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL
Gift Partner: KL UNIVERSITY
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
Digital Partner: ఈనాడు.నెట్ ETV BHARAT
Medical Partner: GSR
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
FM Partner: ఈ FM Mee FM
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

▲ గోరంట్ల శాంతారావు ఫౌండేషన్ (జీఎస్ఆర్) వారు అంబులెన్స్ సమకూర్చారు.

నేటి మ్యాచ్‌లు (29.12.2025)

గ్రౌండ్ - 1

ఉదయం 8 గంటలకు: కిట్స్ కళాశాల దివిలి (కాకినాడ) X ఐడియల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (కాకినాడ). ● ఉదయం 11 గంటలకు: బీఎస్ఎల్ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం) X బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల (అమలాపురం). ● మధ్యాహ్నం 2 గంటలకు: క్రైట్ ఇంజినీరింగ్ కళాశాల (కాకినాడ) X ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పెరుమాళ్లపురం (కాకినాడ).

గ్రౌండ్ - 2

ఉదయం 8 గంటలకు: జీఎస్ఎల్ వైద్య కళాశాల (రాజమహేంద్రవరం) X ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల (కాకినాడ). ● ఉదయం 11 గంటలకు: స్వేచ్ఛ డిగ్రీ కళాశాల (కాకినాడ) X గైట్ ఇంజినీరింగ్ కళాశాల (రాజమహేంద్రవరం).

రేపటి మ్యాచ్‌లు (30.12.2025)

గ్రౌండ్ - 1

ఉదయం 8 గంటలకు: ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాల (సూరంపాలెం, కాకినాడ) X ఎస్కేవీటీ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం). ● ఉదయం 11 గంటలకు: ఎస్ఏపీఎం డిగ్రీ కళాశాల(సవినేపల్లి, కోనసీమ) X ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం యూజీ (రాజమహేంద్రవరం). ● మధ్యాహ్నం 2 గంటలకు: జీఎన్‌టీయూ(కాకినాడ) X వీఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాల(రామచంద్రపురం).

గ్రౌండ్ - 2

ఉదయం 8 గంటలు: ప్రభుత్వ డిగ్రీ కళాశాల (తుని) X ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (రాజమహేంద్రవరం) ● ఉదయం 11 గంటలు: పైడా ఇంజినీరింగ్ కళాశాల(కాకినాడ) X బీహెచ్ఎస్ఆర్, వీఎల్ఎం డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం).

2009 బ్యాచ్ ఎస్సైల ఆత్మీయ సమ్మేళనం

● బాధిత కుటుంబాలకు రూ.8.20 కోట్ల ఆర్థిక సాయం

కడియంలో ఒక్కటైన 2009 ఎస్సై (సివిల్) బృంద సభ్యులు

కడియం, న్యూస్‌టుడే: వారంతా ఒకేసారి ఉద్యోగం సాధించారు.. శిక్షణ పొందారు.. ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. అంతా కలుసుకుని ఆత్మీయ ఆలింగనాలు, సరదా కబుర్లు, స్వీయచిత్రాలు తీసుకుని సందడి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో ఎస్సై(సివిల్) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కడియంలో జరిగింది. వాళ్ల స్నేహబంధం ఎప్పటికీ కొనసాగేలా 2021లో ఏపీ, తెలంగాణ ఎస్సై 2009 బ్యాచ్ పేరిట సంక్షేమ సంఘాన్ని స్థాపించారు. నాటి నుంచి నేటి వరకూ ఏటా డిసెంబరు రెండోవారంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుంటున్నారు. 2014లో ఆంధ్ర, తెలంగాణ విడిపోయిన తర్వాత కూడా సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. సుమారు 1,140 మంది ఎస్సైలుగా తర్ఫీదు పొందగా, అందులో 400 మంది ఆదివారం రాజమహేంద్రవరంలో కలిశారు. వీరిలో 80 మంది ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్నారు. వీరంతా ప్రస్తుతం సీఐలుగా పదోన్నతి పొందారు. వీరంతా నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. ఇప్పటి వరకూ ఈ బ్యాచ్‌లో మృతిచెందిన వారికి సంబంధించిన కుటుంబాలకు రూ.8.20కోట్ల సాయం చేసినట్లు తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు బ్యాచ్ అడ్మిన్ జి.శ్రీనివాసరావు వివరించారు. సమ్మేళనానికి కడియం, ధవళేశ్వరం, రాజానగరం, అనపర్తి సీఐల సహకారం మరువలేనిదన్నారు.

సమగ్ర సామాజిక అభివృద్ధే లక్ష్యం

గాంధీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సాంఘిక సంక్షేమం, సమగ్ర సామాజిక అభివృద్ధి లక్ష్యంగా కమ్మ కార్పొరేషన్ విశేషంగా కృషి చేస్తోందని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం కాకినాడలోని కమ్మ కల్యాణ మండపంలో ఉమ్మడి తూగో జిల్లా కమ్మ మహాజన సంఘ సర్వసభ్య సమావేశాన్ని జాస్తి మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏపీ కాకతీయ సమాఖ్య అధ్యక్షకార్యదర్శులు కొడాలి వెంకట సుబ్బారావు, బెజవాడ వెంకట్రావు మాట్లాడుతూ సభ్యులంతా కలిసిమెలిసి ఉండాలన్నారు. కార్యదర్శి నెక్కంటి శ్రీనివాస్, కాటూరి ప్రసాద్, గారపాటి రాయుడు తదితరులు జిల్లాలో కమ్మ సంఘ కార్యక్రమాలపై చర్చించారు. మధ్యాహ్నం శ్రీచారిటబుల్ సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన ఇంజినీరింగ్, మెడికల్ విద్యార్థులు 82 మందికి రూ.17 లక్షల ఉపకార వేతనాలు అందించారు. బ్రహ్మంచౌదరి మాట్లాడుతూ కమ్మ సామాజికవర్గ సంక్షేమంతోపాటు, రాష్ట్రంలో బలహీన వర్గాలకు కూడా చేయూత నివ్వడమే కమ్మ కార్పొరేషన్ ధ్యేయమన్నారు. గారపాటి కల్యాణ్, చందలాడ పద్మరాజు, గుణ్ణం వెంకట్రావు, గరికిపాటి సూర్యనారాయణ, వంటిపల్లి పాపారావు, రిమ్మలపూడి నారాయణ, మేకా లక్ష్మణమూర్తి, బోళ్ల కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బ్రహ్మంచౌదరితోపాటు సంఘాల ప్రతినిధులు

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు బ్రహ్మంచౌదరి చేతుల మీదుగా అందిస్తున్న ప్రతినిధులు

ముగిసిన రుగ్వేద సభలు

ముంగండలో రుగ్వేద పారాయణం చేస్తున్న పండితులు

పి.గన్నవరం, న్యూస్‌టుడే: ముంగండ గ్రామంలో ఆశ్వలాయన రుగ్వేద పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుగ్వేద సభలు ఆదివారంతో ముగిశాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి సుమారు 80 మంది రుగ్వేద పండితులు అయిదు రోజులపాటు రుగ్వేద పారాయణం చేశారు. రుగ్వేదంలోని 10,500 సూక్తలకు సంబంధించి తొలిరోజు అగ్నిసూక్తం నుంచి మొదలైన పారాయణ చివరిరోజు ఐకమత్యం సూక్తంతో సభలు ముగిశాయని రుగ్వేద పరిషత్ ఛైర్మన్ గోదావరి వెంకటసుబ్బారావు వెల్లడించారు. చివరిరోజు కంచి పీఠ నుంచి రత్నాకర్‌భట్ పండితుడు తీసుకొచ్చిన పూజ అక్షితలు, కుంకుమ భక్తులకు అందజేశారు. పండితులను సత్కరించారు.

శ్రీవారి క్షేత్రం.. ప్రగతి పథం

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

▲ పాలక మండలి ప్రమాణ స్వీకారం నేడు

కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేశారు. ఛైర్మన్‌గా ఆత్రేయపురానికి చెందిన ముదునూరి వెంకటరాజుతోపాటు 18 మంది సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ట్రస్టు బోర్డులో తెలంగాణ, రాయలసీమ లోని జిల్లాలకు కూడా స్థానం కల్పించారు. ఒంగోలు, పశ్చిమ, తూర్పు, కాకినాడ తదితర జిల్లాలతోపాటు తెలంగాణ తదితర ప్రాంతాలకు చెందిన పలువురు ప్రముఖులు రానున్నారు. ఛైర్మన్ పదవికి రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు ముమ్మర ప్రయత్నాలు చేశారు. గతంలో ఛైర్మన్లు ముదునూరి రాజగోపాలరాజు, నంబూరి రామరాజు, చిలువూరి రామకృష్ణంరాజు, కూనాదిరాజు రంగరాజు, చేకూరి కృష్ణంరాజు, పచ్చిమట్ల రాజగోపాల్‌రాజు, తోటకూర సుబ్బరాజు, కరుటూరి నరసింహారావు, రుద్రరాజు రమేష్‌రాజు తదితరులు ఆలయ అభివృద్ధికి పాటుపడ్డారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరగా రూ.7 కోట్లు మంజూరు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా రాకపోకలకు ఇబ్బంది లేకుండా కొత్త వంతెన నుంచి నాలుగు వరుసల రహదారిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే పలు పనులు జరుగుతున్నాయి. ఆలయానికి సంబంధించి బృహత్తర ప్రణాళిక అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు.

తిరుపతి తరహాలో అభివృద్ధికి కృషి



భవిష్యత్తులో భక్తులకు ఎటువంటి ఇబ్బందు ల్లేకుండా పాలక మండలి సభ్యులతోపాటు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, సంబంధిత మంత్రి, అధికారుల సహకారంతో ఆలయాన్ని తిరుపతి తరహాలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా. ముఖ్యంగా వసతి గదులు, డార్మిటరీ, కంపార్టుమెంట్ సౌకర్యం, రోడ్డు విస్తరణ వంటి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– ముదునూరి వెంకటరాజు, ఛైర్మన్

శాంతి ఆశ్రమం పీఠాధిపతిగా వినమ్రానంద సరస్వతి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు మండలంలోని తోటపల్లిలోని శ్రీశాంతి ఆశ్రమం పీఠాధిపతిగా వినమ్రానంద సరస్వతి వ్యవహరిస్తారు. పీఠాధిపతిగా ఉండే జ్ఞానేశ్వరి మాతాజీ పరమపదించాక ఆశ్రమ బాధ్యతలు వినమ్రానంద స్వీకరించారు. ఏటా జనవరి 21న జరిగే ఆశ్రమ వ్యవస్థాపకులు ఓంకారస్వామి జయంతికి వచ్చే రుషికేశ్ చిదానంద స్వామీజీ ఆశీస్సులు కోసం తన తండ్రితో భువనేశ్వర్ నుంచి ఆమె వచ్చేవారు. జ్ఞానేశ్వరి మాతాజీకి చేరవయ్యారు. ఆమె మార్గదర్శనంలో చిత్తూరులోని చిన్మయ మిషన్ శారదాప్రియానంద సరస్వతి వద్ద సన్యాసాశ్రమానికి సంబంధించిన శిక్షణ పొందారు. పదేళ్ల కిందటే ఉత్తరాధికారిగా ఆశ్రమ నిర్వహణలో మాతాజీకి అన్నింటా చేదోడుగా ఉండేవారు. ఆరు శాఖలు ఉన్న మాతృఆశ్రమానికి పీఠాధిపతిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మణప్పురం ఏ ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి, ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 9849138626.

శ్రీసాయిగోల్డ్: తాకట్టులో ఉన్న బంగారం, ఏబ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి, ఆరోజు మార్కెట్ రేట్‌కి కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 94933 38823.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

రాజమండ్రి గాడాల లోరల్ స్కూల్‌కు ఎదురుగా E/F 2BHK ఇండిపెండెంట్ హౌస్ రెడిటు ఆక్యూపై 37 లక్షలు మాత్రమే. 90% బ్యాంక్‌లోన్. Note: IT రిటర్న్స్, శాలరీ స్లిప్స్ అవసరం లేదు. ✆89190 84655, 98850 28899

TO LET

కోనసీమ జిల్లా, అమలాపురం- P.గన్నవరం మెయిన్‌రోడ్ ఫేసింగ్ 20x90=1800 Sft. బిల్డింగ్ Showroom, Banksకు అద్దెకు. ✆ 9949328440, 8919131853

JOBS

Wanted Civil Engineers & Supervisors, 3-5 yrs Exp in Buildings & CC Road Works. @ Gokavaram (A.P). Ph No:8888838677, 9422135347.

EENADU e Classifieds

Wanted B.Com/ M.Com/ MBA Finance/CA IPCC Dropouts to be Work as Field Executive in Tuni in a Reputed Audit Firm. Interested Persons (Male Only) ✆ 70135 11502 or mail: kowthahr@gmail.com.

కొత్తగా ఇంటర్నెట్ బాక్సులు వేయుటకు 10 మంది ఫీల్డ్ స్టాఫ్ కావలెను. నెలకు 15K (12+3). వేద నెట్, సత్యవతినగర్, కొవ్వూరు, కాంటాక్ట్ సెల్: 99899 55770.

నిడదవోలు శంకరాపురం గ్రామంలో హృదయాలయం ఆశ్రమంలో పని చేయుటకు వంటపని చేయుటకు వంటవారు కావలెను. స్త్రీలు మాత్రమే. ఫోన్: 94409 42148, 94418 76034.

డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్ లలో వర్క్ చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీః 23000 టు 29000. వ:18-35. ✆ 77309 58410.

మా ఆఫీసు నందు టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్, ఇన్‌ఛార్జీలు, క్యాషియర్స్, Male, Female కావలెను. Ph. No: 96423 75791.

రాజమండ్రి, అనకాపల్లిల్లో ప్రాకం॥ & ప్రాజెక్టుల్లో సె॥గార్డ్స్, సూపర్‌వైజర్స్, ఆయాలు స్త్రీ/పు॥, జీ: 12 to 15 వేలు, రూం+బో॥. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, RJY, ✆ 9392269369.

కడియపులంకలో కొత్తగా నిర్మించిన BPCL పెట్రోలుబంకులో చేయుటకు ఆఫీస్ స్టాఫ్ (M/F), అర్హత: డిగ్రీ/ఇంటర్ + కంప్యూటర్ పరిజ్ఞానం, పంప్ బాయ్స్ కావలెను. అనుభవమున్న వారికి ప్రాధాన్యత. ఇంటర్వ్యూ: ది.30-12-25 మంగళవారం 11 am to 3:30 pm ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు, పాన్‌కార్డు, బయోడేటాతో హాజరు కావలెను. ✆ 83095 49958.

వర్క్‌ఫ్రంహోమ్ డేటాఎంట్రీ: ఇంటి వద్ద ఉండి పార్ట్ / ఫుల్ టైంప్రాజెక్ట్ వర్క్ చేయుటకు Laptop/ Desktop, స్మార్ట్‌ఫోన్ ఉన్నవారు కావలెను. ✆ 95534 29994.

MARKETING/ SALES

360 Clean Company - FMCG Field Sales Executive, min. exp. 2 years - Call: 91009 40494.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-65 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)		ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):		17,000
పాతకాయ:	గండేరా	27,000
	గటగట	25,000
కొత్తకాయ:	గండేరా	26,000
	గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):		
పాత (ముక్కుడు) కాయ		14,000-15,000
కొత్త (పచ్చి) కాయ		13,000-14,000
కొబ్బరినూనె మార్కెట్:		
15 కిలోలు		6,000
కిలో		400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	135-00
రిటైల్ లైవ్	162-00
డ్రెస్డ్	235-00
స్కిన్‌లెస్	267-00

అపర భగీరథుడు కాటన్ మహనీయుడు: సుభాష్

మసకపల్లిలో కాటన్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్, చిత్రంలో ఎమ్మెల్సీ రాజశేఖరం, సునీల్‌కుమార్, రామస్వామి

పామర్రు, న్యూస్‌టుడే: పూర్వ ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసేందుకు ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి అపర భగీరథుడిగా నిలిచిన ఘనత సర్ ఆర్థర్ కాటన్‌కే దక్కుతుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కె.గంగవరం మండలం గోదావరి తీరం మసకపల్లిలో కాటన్ విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. భవిష్యత్ తరాల ఇంజినీర్లకు కాటన్ ఆలోచనలు, పనితనం ప్రేరణగా నిలుస్తుందన్నారు. అనంతరం డెల్టా ప్రాజెక్టు కమిటీ వారు రూపొందించిన 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, గోదావరి డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, తెదేపా, జనసేన అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, చిర్రా రాజకుమార్, స్వచ్ఛాంధ్ర రాష్ట్ర డైరెక్టర్ సలాది రమేష్, సీనియర్ నాయకులు పప్పుల మసేను వెంకన్న, కాటే సుబ్రహ్మణ్యం, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు వినతుల స్వీకరణ

అమలాపురం కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వారి సమస్యలపై వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ మహేష్‌కుమార్‌తో పాటుగా అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటరన్నారు.

ర్యాలిలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

ఆత్రేయపురం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈ నెల 30న ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో స్వామివారు ఉత్తర ద్వారం నుంచి దర్శనమిస్తారని దేవస్థానం ఛైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి తెలిపారు. తెల్లవారుజాము 3 గంటలకు పంచామృతాభిషేకం, ధూపసేవ, పంచహారతులు, వేదపారాయణం, ఉదయం 9 గంటలకు కోలాట ప్రదర్శన, 11 గంటలకు విష్ణు లలిత మణిద్వీప పారాయణం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు.

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

అంతర్వేది అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయం

అంతర్వేది, న్యూస్‌టుడే: నవనారసింహ క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, పరిసర ప్రాంతాల అభివృద్ధికి రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, దేవాదాయ శాఖ అధికారులు బృహత్తర ప్రణాళిక రూపొందించారు. 15 ఏళ్ల కిందట సరైన రవాణా సౌకర్యాలు, భోజనం, వసతి లేకపోవడంతో భక్తుల రాక అంతంతమాత్రంగా ఉండేది. ఈ క్షేత్రంపై ప్రభుత్వాలు దృష్టి సారించి వసతులు కల్పించడంతో భక్తుల రాక క్రమేపీ పెరిగింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆలయంతోపాటు పరిసర ప్రాంతాల్లోని వనరులను వినియోగించుకుని టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేయడానికి సంకల్పించింది. ఆలయ తూర్పు భాగంలో ఉన్న 34 ఎకరాల భూమిని రూ.25.60 కోట్లతో ఎత్తు చేయడం, రూ.2.40 కోట్లతో రిటైనింగ్‌వాల్, ప్రహరీ నిర్మాణం, పుష్కరాల నాటికి రూ.2 కోట్లతో యాత్రికులకు విశ్రాంతి భవనం, రథశాల, గుర్రాలక్కమ్మ గుడి నిర్మాణం. రూ.4 కోట్లతో కల్యాణ మండపాలు, ప్రసాదం తయారీ, విక్రయశాలలు, గోశాల, మరుగుదొడ్లు, స్నానాల గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసి ప్రభుత్వానికి పంపారు. 34 ఎకరాల్లో 60 గదులతో వసతి, కల్యాణ మండపం, దుకాణ సముదాయాలు, హోటల్ నిర్మాణాలు చేపట్టేలా ప్రణాళిక తయారుచేశారు. రాజోలు, అమలాపురం, పాలకొల్లు తదితర ప్రదేశాల నుంచి బస్సులు వచ్చి వెళ్లేలా బస్ స్టేషన్ నిర్మించి, దాని పైభాగంలో సందర్శకులు బస చేసేలా వసతి గదుల ఏర్పాటు, స్వామివారి కల్యాణోత్సవాలను రాష్ట్ర ఉత్సవంగా చేయడం వంటివి ప్రణాళికలో పొందుపరిచారు. దీనిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు తెలియజేశామని, త్వరలో నిధులు మంజూరవుతాయని ఎమ్మెల్యే వరప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం రూ.4 కోట్లతో అన్నదాన సత్రం, రూ.2 కోట్లతో రహదారుల నిర్మాణం జరుగుతోందన్నారు. వచ్చే మూడేళ్లలో ఆలయ అభివృద్ధికి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాటిచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మురమళ్లలోని భైరాజు ఫౌండేషన్ ప్రాంగణంలో కిమ్స్ ఆసుపత్రి, అమలాపురం మెడ్ యునైటెడ్ ఆసుపత్రి, గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్, అవగాహన కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదివారం ప్రారంభించారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను అవగాహన, ముందుగానే గుర్తించడం ద్వారా వాటిని జయించవచ్చన్నారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, కిమ్స్ గ్రూపు సంస్థల ఛైర్మన్ సత్యనారాయణరాజు, ఆనంద్ గ్రూపు ఛైర్మన్ యు.విశ్వనాథరాజు, జిల్లా తెదేపా అధ్యక్షుడు గుత్తుల సాయి, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, చెల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరంలో ఆరోగ్య ఉప కేంద్రానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

పల్లె వాసులకు అందుబాటులో వైద్యం

అల్లవరం, న్యూస్‌టుడే: పల్లె ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆనందరావు తెలిపారు. అల్లవరం పంచాయతీ పరిధిలో మంజూరైన గ్రామ ఆరోగ్య ఉప కేంద్రాలకు ఆయన ఆదివారం భూమి పూజ చేశారు. గత వైకాపా ప్రభుత్వం ఆరంభ శూరత్వం ప్రదర్శించిందే తప్ప ఎక్కడా పూర్తి స్థాయిలో నిర్మాణాలను పూర్తి చేయలేకపోయిందన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడి సోంబాబు, నాయకులు ముత్యాల బాబి, ఏడుకొండలు, వీరబాబు, కంకిపాటి గోపి, కొల్లు విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

30న సూర్యబలిజ సంఘం వెబ్‌సైట్ ప్రారంభం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: సామర్లకోటలో మంగళవారం రాష్ట్రీయ సూర్యబలిజ సంఘం వెబ్‌సైట్ ప్రారంభిస్తామని సామాజికవర్గ నాయకులు తరలిరావాలని అమలాపురం సంఘం అధ్యక్షుడు భాస్కర రామకృష్ణ ఆదివారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉభయ రాష్ట్రాల్లో సూర్యబలిజ కులస్థుల గణాంక వివరాలను తెలియజేసేందుకు ప్రారంభిస్తున్నారని అన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ముమ్మిడివరం : మండలంలో 28వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ కె.రాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ముమ్మిడివరం, కొత్తలంక, కర్రివానిరేవు, గాడిలంక, అన్నంపల్లి, చింతపల్లిలంక, చినకొత్తలంక, గేదెల్లంక, కొమానపల్లి, వరగల్లంక, వడ్డిగూడెం, గోదశివారిపాలెం గ్రామాల్లో విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

రైతుబజార్‌లో నిన్నటి ధరలు (కిలోకు)

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: టమాటా- 44, వంకాయలు నలుపు- 34, తెలుపు - 30, బెండకాయలు - 48, పచ్చిమిర్చి - 43, కాకరకాయలు - 44, బీరకాయలు - 52, కాలీఫ్లవర్ - 26, క్యాబేజీ - 32, క్యారెట్ - 24, 34, దొండకాయలు - 38, బంగాళదుంపలు - 20, ఉల్లిపాయలు - 20, 30, గోరుచిక్కుళ్లు - 45, దోసకాయలు - 26, చిక్కుడుకాయలు - 26, చేమదుంపలు - 43, కంద - 45, బీట్‌రూట్ - 36, కీరదోసకాయలు - 35, అల్లం - 75, క్యాప్సికం - 65, చిలకడదుంపలు - 40, గుమ్మడి - 30, ముల్లంగి -45, ఉసిరి -80, నిమ్మకాయలు -30, ఆనబకాయ -28, పొట్లకాయ -25, అరటికాయ -6, మునగకాయ -20, ఆకుకూరలు కట్ట -10, 15, కొత్తిమీర కట్ట - 15, కొబ్బరికాయ -25.

పూడ్చేసి.. పాగావేసి..

డ్రెయిన్లు, పంట కాలువల ఆక్రమణలు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

పంట చేలకు సాగునీరు సక్రమంగా అందాలన్నా.. తుపానులు, భారీ వర్షాలకు ముంపు లాగాలన్నా.. పంట కాలువలు, డ్రెయిన్లు సక్రమంగా ఉండేనే సాధ్యం. పంట కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. డ్రెయిన్లను పూడ్చేసి పాకలతో పాగా వేస్తున్నారు. దీంతో రైతులకు సక్రమంగా సాగునీరు అందడం లేదు. ముంపు సమయాల్లో నీరు దిగక తీవ్ర నష్టం వాటిల్లుతోంది. పంట కాలువలు, డ్రెయిన్లపై ఆక్రమణల్ని గుర్తించినా.. వాటిని తొలగించలేని పరిస్థితి నెలకొంది.

అయినాపురంలో నక్కలకాలువ డ్రెయిన్ వద్ద ఆక్రమణలు

ఇదీ పరిస్థితి..

ముమ్మిడివరం నియోజకవర్గంలో 32 వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. 20 కిలో మీటర్ల మేర ప్రధాన పంట కాలువలు, 45 కిలోమీటర్ల మేర బ్రాంచి కెనాల్స్ ఉన్నాయి. మురుగు గోదావరిలోకి దిగడానికి 52 కిలోమీటర్ల మేర మేజర్, మైనర్ డ్రెయిన్లు ఉన్నాయి. ఇవి ఆక్రమణల కారణంగా బక్కచిక్కిపోయాయి. ప్రధాన రహదార్ల చెంతన ఉన్న ఉన్న కాలువలను ఆక్రమించుకుని పక్కా భవనాలు నిర్మించడంతో నీటి ప్రవాహానికి అడ్డుకట్టపడుతోంది. శివారు ప్రాంత భూములకు సక్రమంగా సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. బొబ్బర్లంక- పల్లంకుర్రు ప్రధాన పంటకాలువ, ఐ.పోలవరం, ఎదుర్లంక ప్రధాన పంటకాలువలను ఆనకుని వందల సంఖ్యలో ఆక్రమ నిర్మాణాలు ఉన్నాయి.

ఆక్రమణలు	పక్కా భవనాలు	ఇళ్లు,పాకలు	ఆలయాలు	చర్చిలు	విగ్రహాలు
ముమ్మిడివరం	12	197	32	0	32
కాట్రేనికోన	15	175	16	2	09
ఐ.పోలవరం	02	270	25	13	58

డ్రెయిన్ల పరిస్థితి మరీ దారుణం..

వరి సాగులో మురుగుకాలువల పాత్ర కీలకం. డ్రెయిన్లను ఆక్రమించి పాకలు వేసేస్తున్నారు. ఆక్వా సాగులో వ్యర్థాలను డ్రెయిన్లలోకి తోడేయడంతో అవి పూడిపోయి ముంపు సమయాల్లో నీరు దిగని పరిస్థితి నెలకొంటోంది. కొన్నిచోట్ల డ్రెయిన్లను నామరూపాల్లేకుండా పూడ్చేసి తమ భూముల్లో కలిపేసుకున్న పరిస్థితులు ఉన్నాయి. ఆక్రమణలపై గతంలో అధికారులు సర్వే చేసి నోటీసులు సైతం ఇచ్చారు. తర్వాత చర్యలు లేవు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: భోగరాజువీధిలో దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. నివారణా చర్యలు తీసుకోవాలి. **-భరత్, స్థానికుడు**

సమస్య: గాంధీనగర్ ప్రధాన రహదారి పక్కన ఎండిన పిచ్చికొమ్మలను పడేశారు. దీంతో పురుగులు, క్రిమికీటకాలు పెరిగి ఇబ్బందులు పడుతున్నాం. **- శేఖర్, వ్యాపారి**

సమస్య: అశోక్‌నగర్ మురుగుకాలువలో తూడు పేరుకుపోయింది. మురుగు ముందుకు కదలక ఇబ్బందులు పడుతున్నాం. **-సందీప్, వ్యాపారి**

సమస్య: కె.అగ్రహారంలో రోడ్డుపై చెత్తవ్యర్థాలు పడేస్తున్నారు. ఇక్కడ పడవేయకుండా చర్యలు తీసుకోవాలి. **-సత్యనారాయణ, స్థానికుడు**

పరిష్కారం: భోగరాజువీధి, గాంధీనగర్, అశోక్‌నగర్, కె.అగ్రహారంలో సమస్యలపై సచివాలయ కార్యదర్శులు స్పందించారు. మున్సిపల్ సిబ్బందితో వాటిని అక్కడ తొలగించడమే కాకుండా దోమల మందు చల్లించారు. **–న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం**

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948
అల్లవరం: 91548 46718 , ముమ్మిడివరం: 80085 74166
కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

శ్రీనివాసరాజుకు నివాళి

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: తెదేపా నాయకుడు దివంగత నడింపల్లి శ్రీనివాసరాజు వర్ధంతిని మురమళ్లలో ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, కిమ్స్ గ్రూపు సంస్థల ఛైర్మన్ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, జిల్లా తెదేపా అధ్యక్షుడు గుత్తుల సాయి, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానందలు శ్రీనివాసరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ ముమ్మిడివరం మండల అధ్యక్షుడు దివి వెంకన్నబాబు అధ్యక్షతన ఆదివారం ముమ్మిడివరంలో జరిగింది. పోలమ్మచెరువుగట్టు వద్ద పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పాలెపు ధర్మారావు, వడ్డి నాగేశ్వరరావు కాంగ్రెస్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంటీ ప్రసాద్, గోడి భాస్కరరావు, మెండి కొండబాబు పాల్గొన్నారు.

రెండో బెటాలియన్ ఏర్పాటు చేయాలి

యానాం : పుదుచ్చేరిలో భద్రత కోసం వెయ్యి మందితో రెండో రిజర్వ్ బెటాలియన్ ఏర్పాటుకు కేంద్ర హోంశాఖ అనుమతించాలని పుదుచ్చేరి హోంమంత్రి ఎ.నమశ్శివాయం కోరారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సమీక్ష నిర్వహించేందుకు ఆదివారం పుదుచ్చేరి పర్యటనకు వచ్చిన కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు

రన్నింగ్ ట్రాక్ తయారీ

యానాం, న్యూస్‌టుడే: జీఎంసీ బాలయోగి స్టేడియంలో ప్రజా ఉత్సవాలు, ఫల, పుష్ప ప్రదర్శన జనవరి ఆరు నుంచి నిర్వహించనున్న నేపథ్యంలో మహాత్మగాంధీ బాలుర హైస్కూల్ క్రీడాప్రాంగణాన్ని సాధన కోసం యుద్ధప్రాతిపదికన సిద్ధం చేసే ప్రక్రియ ఆదివారం మొదలైంది. పుదుచ్చేరి పోలీసుశాఖ ఫిబ్రవరిలో కానిస్టేబుల్, మార్చిలో ఎస్సై పోస్టుల భర్తీకి రాత, దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించడానికి చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సొంత ఖర్చుతో పొక్లయినర్ ఏర్పాటు చేసి క్రీడామైదానం చదును చేయించారు.

ఎప్పుడు ఏర్పాటు చేస్తారో..?

కొన్ని నెలలుగా పట్టణంలోని నల్లవంతెన, ఎర్రవంతెన మధ్య ఉన్న రహదారిలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. దీంతో విద్యుత్తుశాఖ అధికారులు స్తంభాలను తీసుకొచ్చి అక్కడి రహదారి పక్కనే ఉంచేశారు. అటుగా వెళ్లే వాహనదారులకు ప్రమాదానికి గురయ్యే ప్రమాదం ఉంది. రాత్రివేళలో ఎక్కువ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఎలాంటి సూచికలు లేవు. అధికారులు స్పందించి స్తంభాలను రహదారి పక్కనుంచి తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

దారి.. అధ్వానంగా మారి

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని చిప్పలపాలెం నుంచి మాగాం- అయినాపురం పంట కాలువకు వచ్చే రహదారి ఇది. పూర్తిగా రాళ్లు లేచిపోయి ఛిద్రంగా మారింది. ఈ రహదారిలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ముమ్మిడివరం

అసంపూర్తిగా వదిలేశారు

బ్రహ్మసమేధ్యం పంచాయతీ పరిధి బలుసుతిప్పలో గ్రామ సచివాలయ భవన నిర్మాణం చివరి దశలో నిలిచింది. మూడేళ్ల క్రితం చేపట్టిన ఈ నిర్మాణం ప్లాస్టరింగ్ పనులు పూర్తయ్యాక నిలిచింది. ఇంకా విద్యుత్తు సరఫరా, తలుపులు, టైల్స్ వంటి పనులు మిగిలాయి. సచివాలయాలు ఏర్పడిన నుంచి కార్యాలయాన్ని స్థానిక జడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న తుపాను రక్షిత భవనంలో నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి మిగిలిన భవన పనులు పూర్తయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కాట్రేనికోన

రెయిలింగ్ విరిగి.. రక్షణ కొరవడి

ఐ.పోలవరం మండలం సముద్రతీర ప్రాంత గ్రామం భైరవపాలెంలో వంతెన పరిస్థితి ఇది. ఇనుప రెయిలింగ్ విరిగిపోవడంతో ప్రజలు ప్రమాదకర స్థితిలో ప్రయాణిస్తున్నారు. అసలే ఇరుకుగా ఉండడం.. రెయిలింగ్ పాడవ్వడంతో భయపడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి వంతెనకు రెయిలింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఐ.పోలవరం

దేశాభివృద్ధిలో కాంగ్రెస్‌ది కీలక పాత్ర

కాంగ్రెస్ జెండా వద్ద పార్టీ నాయకులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి దేశ అభివృద్ధిలో సమర్థపాత్ర పోషించిందని పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. అమలాపురం పట్టణ అధ్యక్షుడు వంటెద్దు బాబి ఆధ్వర్యంలో జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. పార్టీ నాయకులు స్థానిక గడియారస్తంభం ప్రాంగణంలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి, ముషిణి రామకృష్ణారావు, షకీలా, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు అన్నారు. అమలాపురం విశ్వబ్రాహ్మణ సంఘ మందిరంలో ఆవుపాటి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ శంఖారావం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో సీట్లు కేటాయించాలన్నారు. అనంతరం సంఘ నాయకులు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును కలిసి తమ సమస్యలను వివరించారు. వరద సత్యనారాయణ, ర్యాలీ రాజశేఖర్, మణిశ్రీకాంత్, రాధాకృష్ణ, చిదంబరాచారి తదితరులు పాల్గొన్నారు.

హనుమంతరావుతో సంఘ నాయకులు

సాకారం కానున్న కల

డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి అడుగులు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ముమ్మిడివరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు ఇక్కడి విద్యార్థుల చిరకాల కోరిక. 2022లో కళాశాలను ఏర్పాటు చేశారు. స్థానిక డా.ఎంజీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులు ప్రారంభించారు. తొలి ఏడాదే ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఇక్కడి మౌలిక వసతులు లేమి, శిథిల గదుల్లో చదువులతో విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు చొరవతో కళాశాలకు నూతన భవన నిర్మాణానికి చర్యలు ప్రారంభమయ్యాయి.

భవన నిర్మాణాలకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎంపీ హరీష్‌మాథుర్

ఏర్పాటు చేసి వదిలేశారు..

గతంలో కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చినా.. సిబ్బంది నియామకం.. మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టలేదు. స్థలం కేటాయింపు, భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు వెళ్లినా గత పాలకులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు చొరవతో డిగ్రీ కళాశాలకు 3.20 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వం జీవో 84ను విడుదల చేసింది.

రూ.కోటి నిధుల మంజూరు..

డిగ్రీ కళాశాల నిర్మాణానికి సీఎస్‌ఆర్‌లో రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో భవన నిర్మాణానికి అడుగులు పడ్డాయి. కళాశాల భవన నిర్మాణం పూర్తయితే ఇక్కడ విద్యనభ్యసించే విద్యార్థులకు ఇక్కట్లు తొలగనున్నాయి. శిథిల స్థితిలో ఉన్న భవనంలో ప్రస్తుతం తరగతులు నిర్వహిస్తున్నారు.

అభివృద్ధికి కృషి చేస్తా..

ముమ్మిడివరం: ముమ్మిడివరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. ముమ్మిడివరంలో కెనరా బ్యాంకు సీఎస్ఆర్ నిధులు రూ.కోటితో నిర్మించనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణాలకు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌తో కలిసి ఆదివారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కళాశాల నిర్మాణానికి అవసరమైన ప్రక్రియను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో పూర్తి చేసి స్థలం కేటాయించామన్నారు. పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఈ కళాశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలన్నారు. ఎంపీ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆనంద్ గ్రూపు ఛైర్మన్ విశ్వనాథరాజు కళాశాల నిర్మాణానికి రూ.25 లక్షలు విరాళం ప్రకటించారు. ఆయనను ఎమ్మెల్యే, ఎంపీలు అభినందించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, తెదేపా జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి, ప్రిన్సిపల్ డా.ప్రభాకర్, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, దొమ్మేటి రమణకుమార్, తాడి నరసింహారావు, నడింపల్లి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు. ● ముమ్మిడివరం నగర పంచాయతీ 8వ వార్డులో ఎంపీ నిధులు రూ.32 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రహదారికి ఎంపీ, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

నేడు పుదుచ్చేరిలో ఉపరాష్ట్రపతి పర్యటన

యానాం, న్యూస్‌టుడే: భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ సోమవారం పుదుచ్చేరి రానున్నారు. పాండిచ్చేరి యూనివర్సిటీ 30వ స్నాతకోత్సవ వేడుకలో పాల్గొంటారు. యూనివర్సిటీలో నిర్మించిన కాన్ఫరెన్స్ భవనాన్ని, 100 అడుగుల స్తంభంపై ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. కంబన్ కళైరంగంలో అపార్టుమెంట్ల పంపిణీలో పాల్గొంటారు. ఉపరాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లుపై సీఎం ఎన్.రంగసామి మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. మూడంచెల భద్రత కోసం నాలుగు కంపెనీల పారామిలటరీ దళాల్ని వినియోగిస్తున్నారు. డ్రోన్లు ఎగురవేతను నిషేధిస్తున్నట్లు కలెక్టర్ కులోత్తుంగన్ తెలిపారు.

కవితా విజేతలకు సన్మానం

కాట్రేనికోన, న్యూస్‌టుడే: దాడి చంద్రశేఖరరావు సాహిత్య, సాంస్కృతిక కళారంగాల ప్రోత్సాహక వేదిక కాకినాడలో నిర్వహించిన తెలుగు మహాసభలు కార్యక్రమంలో కాట్రేనికోనకు చెందిన కవులు చింతా రాంబాబు, మల్లాడి శ్రీనివాస్ ప్రతిభ చూపారు. సాహిత్య సదస్సులు, శతక పద్యధారణ, కవి సమ్మేళనం, స్వీయ కథాపఠనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన రాంబాబు, శ్రీనివాస్‌ను నిర్వాహకులు సన్మానించారు.

సమాజ సేవలో ముందుండాలి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందువులు సమాజాభివృద్ధికి కృషి చేయాలని ప్రజ్ఞానంద సరస్వతిస్వామిజీ సూచించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్థాపించి వందేళ్లు అయిన సందర్భంగా అమలాపురం భూపయ్యఅగ్రహారం శ్రీరామ్‌నగర్ బస్తీ కళా ప్రాంగణంలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో 'హిందూ సమ్మేళనం' ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీప్రజ్ఞానంద సరస్వతి స్వామిజీ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, అబ్బిరెడ్డి చంటి, రుద్రరాజు నానిరాజు, కూచిమంచి కృష్ణ, జవ్వాది తాతాబాబు, చిరువూరి రంగరాజు తదితరులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న ప్రజ్ఞానంద సరస్వతి స్వామిజీ

పేరూరులో హిందూ సమ్మేళనం

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : పేరూరులోని రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో హిందూ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. రాజాశ్రమ పీఠాధిపతులు డాక్టర్ కృష్ణచరణానంద భారతీస్వామి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. హిందువులు తమ ఐక్యంగా ఉండాలన్నారు. హిందూ సమ్మేళన నిర్వహణ సమితి గౌరవాధ్యక్షుడు పేరి విశ్వనాథశర్మ, అధ్యక్షుడు మంథా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బొంతు నాగభూషణం, కార్యదర్శి కడలి సుభాష్ పాల్గొన్నారు.

భరతమాత చిత్రపటానికి పూజ చేస్తున్న భారతీస్వామి

లక్ష్మీప్రసన్నకు డీటీవో అభినందన

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే : బండారులంకకు చెందిన లక్ష్మీప్రసన్న ఇటీవల జాతీయ తైక్వాండో పోటీల్లో గ్రీన్ బెల్ట్ సాధించింది. ఈ నేపథ్యంలో జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆదివారం బండారులంకలోని లక్ష్మీప్రసన్న ఇంటికి వెళ్లి ఆమెను సత్కరించారు. జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. లక్ష్మీప్రసన్న తల్లిదండ్రులు, కోచ్‌ను ప్రశంసించారు.

లక్ష్మీప్రసన్నను సత్కరిస్తున్న శ్రీనివాసరావు

కాలువలో గుర్రపుడెక్క తొలగింపు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: రబీలో సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నీటి సంఘం ఆధ్వర్యంలో అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. చెయ్యేరులో పంట కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు పనులను చేపట్టారు. ఈ పనులను నీటిసంఘం అధ్యక్షుడు యనమదల బాలాజీ, కొంకి శ్రీను, ముత్యాలరావు తదితరులు పర్యవేక్షిస్తున్నారు. శివారు ఆయకట్టు వరకు నీరు అందించేలా కూటమి ప్రభుత్వంలో పంటకాలువలో పనులు చేపట్టామన్నారు.

ముగ్గులు, చిత్రలేఖనం పోటీలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: సంప్రదాయాలు, సంస్కృతి నేటి తరం చిన్నారులకు తెలియజేయాలని ముగ్గులు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించామని శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ నూలు సుబ్బారావు తెలిపారు. గాంధీబజార్‌లో సంక్రాంతి ముందస్తు వేడుకలు ఆదివారం నిర్వహించారు. బాలికలు అందమైన రంగవల్లులు అద్దగా, బాలురు చిత్రలేఖనం గీశారు. అనంతరం విజేతలకు సేవా సమితి సభ్యులు బహుమతులు అందజేశారు.

అమలాపురంలో ముగ్గుల వద్ద చిన్నారులు

ముందస్తు సంక్రాంతి వేడుకలు

యానాం : మెట్టకూరు వార్డులోని రమాబాయినగర్‌లో కాలనీవాసులు ఆదివారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. యూత్ సభ్యులు గ్రామపెద్దలను ఘనంగా సత్కరించారు. యాళ్ల వెంకట్‌కుమార్, కొత్రాల రోహిత్, జగదీష్, అఖిల్ బృందం నిర్వహించారు.

వేడుకల్లో రమాబాయినగర్ గ్రామస్థులు

'టిడ్కో ఇళ్లకు తాళాలు వేయడం దారుణం'

అల్లవరం, న్యూస్‌టుడే: టిడ్కో గృహాల లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి మంజూరు చేయించిన రుణాలను తక్షణం మాఫీ చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు టిడ్కో గృహాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. వాయిదాలు చెల్లించడం లేదనే కారణంతో ఇళ్లకు బ్యాంకు అధికారులు తాళాలు వేయడం దారుణమన్నారు. కారెం వెంకటేశ్వరరావు, తులసీరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, లబ్ధిదారులు

ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

రావులపాలెం పట్టణం: జడ్పీ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను సెలవు రోజుల్లో కూడా పనిచేయాలని ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు కె.వి.శేఖర్ అన్నారు. ఆదివారం రావులపాలెంలో ఆయన మాట్లాడుతూ సంబంధంలేని పనులకు ఉపాధ్యాయులను బాధ్యులను చేయ్యడం తగదన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

పేర్లు నమోదు చేసుకుంటున్న నిరుద్యోగులు

యానాం, న్యూస్‌టుడే: యానాం నియోజకవర్గ పరిధిలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతోనే మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు పుదుచ్చేరి ప్రభుత్వ దిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఆదివారం యానాం ఓల్డేజ్ హోం, వికాస సంస్థ ఆధ్వర్యంలో స్థానిక యర్రా గార్డెన్‌లో మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. సుమారు 33 కంపెనీలను రప్పించి జాబ్ మేళా నిర్వహించామన్నారు. ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వికాస సంస్థ అధికారి లచ్చారావు, ఓల్డేజ్‌హోమ్ అధ్యక్షుడు పెండెం సూర్యప్రకాష్ ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి సామ్యూల్, గిడ్ల చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

కాట్రేనికోన, న్యూస్‌టుడే: కాట్రేనికోనలోని మొండిపోరలో విద్యుదాఘాతం కారణంగా తాటాకిల్లు దగ్ధమైన ఘటనలో బాధితులు జగడం నానిబాబు కుటుంబ సభ్యులను తెదేపా రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. ప్రభుత్వం తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గుబ్బల చంద్రరావు, చక్రధర్, ఏసుబాబు, మట్టా రమేష్, సత్యప్రసాద్, రాంబాబు, చెంచలరావు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

కోటిపల్లి-ముక్తేశ్వరం రోడ్డు వంతెన నిర్మాణమే శరణ్యం

రామచంద్రపురం: రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడలో విలీనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోని కారణంగా జనసేన గోదావరి నదిపై కోటిపల్లి-ముక్తేశ్వరానికి రోడ్డు వంతెన వేయాలని భాజపా నాయకులు కొట్టువాడ హరిబాబు, యాండ్ర బుజ్జిబాబు, సతీష్‌నాయుడు తదితరులు పేర్కొన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ ప్రస్తుతం 80 శాతం పనులు పూర్తయిన రైల్వే వంతెనను త్వరితగతిన పూర్తి చేయాలని రోడ్డు వంతెన నిర్మించేలా కృషి చేయాలని వారు విన్నవించారు.

30న సూర్యబలిజ సంఘం వెబ్‌సైట్ ప్రారంభం

అమలాపురం: సామర్లకోటలో మంగళవారం రాష్ట్రీయ సూర్యబలిజ సంఘం వెబ్‌సైట్ ప్రారంభానికి సామాజికవర్గం నాయకులు తరలిరావాలని అమలాపురం సంఘం అధ్యక్షుడు రాయుడు ఆదినారా పిలుపునిచ్చారు. ఉభయ రాష్ట్రాల్లో సూర్యబలిజ కులస్తుల వివరాలు తెలియజేసేందుకు ప్రారంభిస్తున్నారని అన్నారు.

మండపేట

•మండపేట •రామచంద్రపురం

విజయదుర్గాపీఠంలో 30న ఉత్తర ద్వార దర్శనం

రాయవరం, న్యూస్‌టుడే: వెదురుపాక విజయదుర్గాపీఠంలో ఈ నెల 30న ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామిని భక్తులు దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పీఠ పర్యవేక్షకుడు వీవీ బాపిరాజు తెలిపారు. వేదపండితులు వేంచేసిన శ్రీవారికి మంగళ వారం తెల్లవారుజామునే తిరుప్పావై పారాయణం, తులసీదళార్చన, అష్టోత్తర పూజలు నిర్వహించనున్నామన్నారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) ఆధ్వర్యంలో భక్తులకు ఉత్తర దర్శనం కల్పించనున్నామన్నారు. స్వామిని దర్శించి తీర్థప్రసాదాలు తీసుకోవాలని ఆయన భక్తులకు సూచించారు.

పరశురామావతారంలో 'వేంకటేశుడు'

రాయవరం, న్యూస్‌టుడే: రాయవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న దశావతార మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు అంగర వెంకట కృష్ణ శోభనాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వైఖానస ఆగమం ప్రకారం పూజలనంతరం పరశురామావతారంలో వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

మండపేట, న్యూస్‌టుడే: ఈనెల 30న ముక్కోటి ఏకాదశి మహా పర్వదినం పురస్కరించుకుని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో, జనార్దన స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఐఎస్‌డీ ఫౌండేషన్ సౌజన్యంతో కంచికామకోటి పీఠం, కాంచీపురం ఆస్థాన విద్వాంసులు వారణాశి వెంకటేశ్వర శర్మ కళాకారుల బృందంచే సంగీత విభావరి నిర్వహించనున్నారు.

నవజనార్దన ఆలయాలకు పెరిగిన భక్తుల తాకిడి

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలంలోని నవ జనార్ధన క్షేత్రాల్లో ధనుర్మాసం సందర్భంగా ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. 'నవ జనార్ధన పారిజాతాల సందర్శని' పేరుతో ఆర్టీసీ ప్రత్యేక సర్వీసుల్ని నడపడంతో రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు కోరుమిల్లి, మాచర, కపిలేశ్వరపురంలోని జనార్దన స్వామి ఆలయాలను దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు.

రహదారిపై నీటి ప్రవాహం

ద్రాక్షారామ నుంచి నెలపర్తిపాడు వెళ్లే మార్గంలో వెలంపాలెం సీపీడబ్ల్యూఎస్ పథకానికి సంబంధించిన చెరువు వద్ద నీటి గొట్టాల నుంచి రక్షిత నీరు లీకై సిమెంటు రహదారిపై ప్రవహిస్తోంది. ఈ ప్రవాహం వాహన చోదకులకు ప్రాణసంకటంగా మారింది. ఇదే ప్రాంతంలో రహదారికి మలుపు ఉండటంతో వాహనాలు బ్రేకు వేసే సరికి నీటిపై జారిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. ఆదివారం ఇదే తరహాలో ముచ్చెరువుకు చెందిన ఓ వ్యక్తి జారిపడి చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాహుల్‌ని వివరణకోరగా రెండు రోజులుగా రెండు రోజుల్లో మరమ్మతులు చేసి లీకేజీ అరికడతామన్నారు. – న్యూస్‌టుడే, ద్రాక్షారామ

జీవన ధ్రువీకరణ పత్రం సమర్పించండిలా..!

రాయవరం, న్యూస్‌టుడే: విశ్రాంత ఉద్యోగుల పింఛను పునరుద్ధరణకు ఏటా జీవన ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. నిర్దేశిత సమయంలోగా సంబంధిత పత్రాన్ని సమర్పించకపోతే పింఛను నిలిచిపోతుంది. గతంలో మాదిరిగా ఖజానా శాఖా కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సాంకేతిక సహాయంతో జీవన ధ్రువపత్రం (లైఫ్ సర్టిఫికేట్) సమర్పించొచ్చు. యాప్, పోర్టల్, ఆన్‌లైన్ సేవాకేంద్రాల ద్వారా సులువుగా ఎక్కడి నుంచైనా వీటిని సమర్పించే వెసులుబాటుంది. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని ఉపఖజానాల్లో 982 మంది విశ్రాంత ఉద్యోగులు వివిధ బ్యాంకు శాఖల ద్వారా పింఛను పొందుతున్నారు.

మీ కోసం

యాప్ ద్వారా ఇలా..

స్మార్ట్‌ఫోన్‌లో ప్లేస్టోర్ నుంచి జీవన్‌ప్రమాణ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి.. ఆధార్, చరవాణి, ఈమెయిల్ ఐడీ నమోదు చేయాలి. చరవాణికి వచ్చిన ఓటీపీని నమోదు చేయగానే ముఖ ఆధారిత నిర్ధారణ రిజిస్ట్రేషన్ అవ్వాలి. తర్వాత ఆధార్, చరవాణి, ఈ మెయిల్ నమోదు చేయాలి. అనంతరం పింఛనుదారుడి వివరాలన్నీ ప్రత్యక్షమవుతాయి. గతంలో జీవన పత్రం పొందనివారు.. వారి వివరాలను కొత్తగా నమోదు చేయాలి. పేరు, పీపీవో నంబరు, బ్యాంకు, ప్రభుత్వ శాఖ, పింఛను మంజూరు సంస్థ తదితర వివరాలు ఇచ్చి సబ్మిట్ చేయాలి. ముఖ నిర్ధారణ చేసి చిత్రం తీసుకుంటే జీవన్ ప్రమాణ పత్రం సమర్పించే ప్రక్రియ పూర్తవుతుంది.

తపాలా శాఖ, మీ సేవా కేంద్రాల్లోనూ..

జీవన్ ప్రమాణ్ పోర్టల్, పోస్టాఫీసు, మీ సేవా కేంద్రాల్లోనూ జీవన ప్రమాణ ధ్రువపత్రం సమర్పించవచ్చు. మీ వెంట ఆధార్, మొబైల్, పీపీవో నంబరు, బ్యాంకు ఖాతా నంబరు తీసుకెళ్లాలి. వచ్చే 2026 జనవరి ఒకటి నుంచి ఫిబ్రవరి 28 లోగా పత్రాలను సమర్పించాలని రాయవరం ఖజానా శాఖ అధికారి ఎ.చిత్తరంజన్ తెలిపారు. ★ పెన్షనర్ పాన్-ఆధార్ లింక్ చేసుకునేందుకు గడువు ఈ నెల 31తో ముగుస్తుందని ప్రతిఒక్కరూ వీటిని పూర్తిచేసుకోవాలని ఖజానాశాఖాధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఎర్రకంకరతో సరిపెట్టేశారు..

రామచంద్రపురం పట్టణంలో అభివృద్ధికి నోచుకోని శ్మశానవాటికలు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం పట్టణంలో అంతిమ సంస్కారాలు నిర్వహించే శ్మశానవాటికలు అభివృద్ధి లేకుండా పోయిందని సర్వత్రా విమర్శలొస్తున్నాయి. పట్టణంలో కాకినాడ రోడ్డులో ఉన్న హిందూ శ్మశానవాటిక, తోటపేట వీధిలో ఉన్న ముస్లిం రుద్రభూమిని అభివృద్ధి చేయాలని కౌన్సిల్ సమావేశాల్లో కౌన్సిలర్లు పలుమార్లు ప్రస్తావించారు. అప్పట్లో కౌన్సిల్ సమావేశానికి ఎక్స్‌అఫిషియో సభ్యుడి హోదాలో వచ్చిన మంత్రి సుభాష్ శ్మశానవాటికల అభివృద్ధితోనే పనులు ప్రారంభిస్తామని కౌన్సిల్‌లో చెప్పారు. కొన్ని చోట్ల ఎర్రకంకర వేసి సరిపెట్టేశారు. కాని ఆ పనులు నెలలు సమీపిస్తున్నా నేటికీ పూర్తికాలేదని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు.

అభివృద్ధికి నోచుకోని హిందూ శ్మశానవాటిక

రెండోసారి నిధులు కేటాయించినా..

కాకినాడ రోడ్డులో ఉన్న హిందూ శ్మశానవాటిక అభివృద్ధి కోసం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.20 లక్షలు కేటాయించారు. గతంలో రూ.25 లక్షలు నిధులు కేటాయించినా అవికాస్త బుట్టదాఖలయ్యాయి. మరలా రెండో సారి నిధులు కేటాయించారు. పనులు చేపట్టలేదు. తాత్కాలికంగా 3 నెలల క్రితం మెరక పనులు ప్రారంభించారు. కాలువల్లో తవ్విన మట్టిని తెచ్చి తొలుత పూడ్చారు. ఆ తర్వాత ఎర్రకంకరతో శ్మశానవాటికను మెరక చేశారు. ఇది జరిగి 3 నెలలు కావస్తున్నా తర్వాత ఎటువంటి పనులు ముందుకు సాగలేదు.

ముస్లింల రుద్రభూమి పరిస్థితి అంతే..

పట్టణ 11వ వార్డు పరిధి కృత్తివెంటి పేర్రాజుపంతులు క్రీడా ప్రాంగణం పక్కనే ఉన్న ముస్లిం కబ్రస్తానం అభివృద్ధికి పురపాలక సంఘం నిధులు రూ. 9.75 లక్షలు కేటాయించారు. ఐదు నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించలేదు. ఇదే విషయాన్ని ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో కో ఆప్షన్ సభ్యుడు మస్తాన్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా స్పందించి ఆయా రుద్రభూములను అంతిమ సంస్కారాలకు వీలుగా తయారుచేయాలని 11వ వార్డు కౌన్సిలర్ అమలదాసు లోవరాజు కోరుతున్నారు.

అనుమతులకు ఎదురుచూస్తున్నాం

శ్మశానవాటికల అభివృద్ధి కోసం నిధులు మంజూరైనా పనులు చేపట్టేందుకు రాష్ట్ర పురపాలక సంచాలకుల కార్యాలయానికి అనుమతులు కోరుతూ రెండు నెలల క్రితమే లేఖ రాశాం. అనుమతుల కోసమే ఎదురుచూస్తున్నాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. త్వరితగతిన అభివృద్ధి చేసేలా చర్యలు చేపడతాం.
– కె.వి.ఆర్.ఆర్.రాజు, కమిషనర్, రామచంద్రపురం

ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ఎంఈవో ఆంజనేయులు

హాజరు శాతాన్ని పెంచాలి

పామర్రు, న్యూస్‌టుడే: పదోతరగతి ఉత్తీర్ణతలో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపడానికి జిల్లా విద్యాశాఖ చేస్తున్న కృషికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కూడా చిత్తశుద్ధితో కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి చోడిశెట్టి ఆంజనేయులు సూచించారు. ఆదివారం సత్యవాడ, కూళ్ల, పామర్రు ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. హాజరు శాతం తక్కువగా ఉందని ఇక నుంచి వంద శాతం విద్యార్థులు వచ్చేలా చేయాలన్నారు. ఉపాధ్యాయులు సిహెచ్.వి.వి.చౌదరి, రామచంద్రారెడ్డి, కామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

తెదేపాకు కార్యకర్తలే పునాదులు: మంత్రి సుభాష్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి పునాదులని, కష్టపడుతూ చురుకుగా పనిచేసే కార్యకర్తలకు తగిన ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉత్తమ కార్యకర్తలకు ప్రశంసాపత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమాలను ప్రజల్లోకి తీసుకెళ్లినందుకుగాను ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు ప్రశంసాపత్రాలు ఇచ్చి ప్రోత్సహించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగానే పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాసంశెట్టి సత్యం, రామచంద్రపురం, కాజులూరు, కె.గంగవరం మండలాల తెదేపా అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, చవ్వాకుల నారాయణమూర్తి, మేడిశెట్టి రవికుమార్, నాయకులు గరిగిపాటి సూర్యనారాయణ, స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, బల్లం నాని, సలాది నాయుడు, పెంకే సాంబశివరావు, కోట తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

తెదేపాలో అసెంబ్లీ, పార్లమెంట్ పదవులు పొందిన నాయకులతో మంత్రి సుభాష్

కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు ఉంటుంది

మండపేట, న్యూస్‌టుడే: పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ నిర్వహించిన సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జిల సేవలను గుర్తించి తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ ఉత్తమ కార్యకర్తగా ప్రశంసాపత్రాలను విడుదల చేశారు. ఆదివారం తెదేపా కార్యాలయంలో వాటిని కార్యకర్తలకు అందజేసి అభినందించారు. మండపేట నియోజకవర్గ తెదేపా నాయకులు, క్లస్టర్, వార్డు నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందుకున్న క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జిలతో ఎమ్మెల్యే వేగుళ్ల

ఎమ్మెల్యే వేగుళ్లను కలిసిన మీనా

మండపేట: అమలాపురం పార్లమెంట్ మెయిన్ కమిటీ కార్యదర్శిగా నియమితులైన మాజీ జడ్పీటీసీ సభ్యురాలు పిల్లి మీనా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. తెదేపా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండల మాజీ తెదేపా అధ్యక్షుడు మరగతపు బాబ్జి, గ్రామ అధ్యక్షుడు సత్తి సత్యనారాయణ, జడ్‌మేడపాడు సొసైటీ ఛైర్మన్ సలాది బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వేడుకలో పాల్గొన్న కామన ప్రభాకరరావు కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

మండపేట, న్యూస్‌టుడే: భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 140వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండపేటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో స్థానిక కలువపువ్వు సెంటరులో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. 1885వ సంవత్సరం డిసెంబర్ 28న ముంబయి నగరంలో కాంగ్రెస్ పార్టీ తొలి సమావేశం జరిగిందన్నారు. ఉమేష్ చంద్ర బెనర్జీ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో 72 మంది ప్రతినిధులు పాల్గొన్నారని వివరించారు. కాంగ్రెస్ నాయకులు పాడిశెట్టి సత్యనారాయణ, గేదెల శ్రీనివాస్, ఆలమండ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వెదజల్లే పద్ధతితో సమయం ఆదా

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ఖరీఫ్ పంటను విజయవంతంగా పూర్తిచేసుకున్న రైతులు రబీ పంటను కూడా మార్చి నెలాఖరుకు పూర్తిచేసుకుంటే కాలువల ఆధునికీకరణ పనులకు అవకాశం ఉంటుంది. దీనికోసం డిసెంబరు నెలాఖరు నాటికి వరినాట్లు పూర్తిచేయాలని నీటి పారుదల శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వివరిస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 51వేలు, మండపేట నియోజకవర్గంలో 46వేల ఎకరాల్లో ఈఏడాది రబీలో వరిసాగు జరుగుతోంది. నియోజకవర్గంలోని కాజులూరు, కె.గంగవరం మండలంలోని కొన్ని గ్రామాలకు రబీ చివరి కాలంలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. కాలువల ఆధునీకరణ పనులకు సంబంధించి మార్చి నెలాఖరు నాటికి పంటకాలువలు మూసేస్తారు కాబట్టి రైతులు సాధ్యమైనంత వరకు వెదజల్లే పద్ధతిలో సాగు చేసుకోవడం మేలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

తోటపేటలో వెద జల్లుతున్న రైతు

కలుపు నివారణకు మందులు ఉన్నాయి

రైతులకు నాట్లు వేసే పద్ధతికన్నా వెదజల్లే పద్ధతి మేలు. కలుపు నివారణకు కూడా మార్కెట్లో అనేక మందులు సిద్ధంగా ఉన్నాయి. నాట్లు వేయడం వల్ల మొక్క వారం రోజులు ఆలస్యంగా కోతకు వస్తుంది. వెదజల్లడం ద్వారా పొలం వారం రోజులు ముందుగానే కోతకు వస్తుంది. వెదజల్లడం వల్ల మొక్క వేళ్లకు గాయాలు కావు. ముఖ్యంగా కాండానికి కుళ్లు తెగులు రాదు. దిగుబడి విషయంలో కూడా 4-6 బస్తాల దిగుబడి అధికంగా వస్తుంది.
– బి.నాగకుమార్, ఏడీఏ రామచంద్రపురం

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

మండపేట: 80085 74183 రామచంద్రపురం: 80085 74191
కపిలేశ్వరపురం: 97044 16418 పామర్రు: 80085 74228
ద్రాక్షారామ : 80085 74192 ద్వారపూడి : 91543 96553

సమస్య: మండపేట మండలం పాలతోడు గ్రామం రామాలయం వీధిలో రహదారి పక్కన వ్యర్థాలు పోస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది.
– జె.కృష్ణతేజ, పాలతోడు

పరిష్కారం: రహదారి పక్కన వ్యర్థాల సమస్యను పంచాయతీ కార్యదర్శి కె.వరప్రసాద్‌కు తెలియజేయగా స్పందించారు. సిబ్బందిని పంపించి వ్యర్థాలు తొలగింపజేశారు.
– న్యూస్‌టుడే, ద్వారపూడి

ఆగని సాగునీటి వృథా

కపిలేశ్వరపురంలో వృథాగా సాగునీరు

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం ప్రధాన పంటకాలువ నుంచి కొండయ్య కాలువకు నీటిని విడుదల చేసే సర్‌ప్లస్ వియర్ వద్ద తలుపు విరిగిపోవడంతో గత కొన్ని రోజులుగా సాగునీరు వృథాగా పోతుంది. దీనిపై శనివారం ఇరిగేషన్ అధికారులు స్పందించి, ఇసుకబస్తాలు, సర్వే కర్రలతో వృథాను అరికట్టే ప్రయత్నం చేసినా ఫలించలేదు. నీటి తాకిడికి అవి కూడా కొట్టుకుపోవడంతో పరిస్థితి మొదటికొచ్చింది. దీనిపై ఆదివారం నీటి సంఘాల నాయకులు అక్కడి పరిస్థితిని పరిశీలించారు. సర్‌ప్లస్ మరమ్మతుల కోసం సుమారు రూ.లక్షతో రెండు గడ్డర్లు, తలుపుల ఏర్పాటుకు మూడు షీట్లు, మూడు అంగుళాల ఛానల్‌కు ఆరుబార్లు ఏర్పాటుచేసి, సమస్యను పరిష్కరించనున్నట్లు కూళ్ల డీసీ ఛైర్మన్ గోపాలకృష్ణ తెలిపారు. ప్రస్తుతం రైతులకు సాగునీటి అవసరం అధికంగా ఉన్న కారణంగా రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించడానికి అధికారులు, నీటి సంఘాల ఆధ్వర్యంలో చర్యలు చేపట్టినట్లు వివరించారు. సర్పంచ్ సాకా శ్రీనివాస్, నీటి సంఘాల అధ్యక్షులు కొరపాటి రాంబాబు, త్రిపురశెట్టి నాని, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరి కవికి సత్కారం

శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ

రామచంద్రపురం, న్యూస్‌టుడే: డిజిటల్ యుగంలో వచన కవిత్వం అనే అంశంపై చేసిన ప్రసంగానికి ప్రశంసలు అందుకున్నట్లు రామచంద్రపురం పట్టణానికి చెందిన గోదావరి కవి, డా.ర్యాలి శ్రీనివాస్ పేర్కొన్నారు. కాకినాడలో జరిగిన తెలుగు మహా సభల ప్రారంభంలో ఆయన కీలక ఉపన్యాసం చేసినందుకు ముఖ్యఅతిథి ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ చేతుల మీదుగా సత్కారం, జ్ఞాపికను అందుకున్నట్లు తెలిపారు. దాడి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన తెలుగు మహా సభల్లో కవిత్వ రచనకు సామాజిక మాధ్యమాలు ఏవిధంగా దోహద పడతాయో వివరించానన్నారు. ఆర్.వి.వి.రాజా, గరగ రామకృష్ణ, కాకరపర్తి దుర్గా ప్రసాద్, శశివర్మ పాల్గొన్నారు.

ఉజ్వల్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్ ఇస్తున్న అధికారులు, కూటమి నాయకులు

పామర్రు, న్యూస్‌టుడే: పేద మహిళలకు అండగా కేంద్ర ప్రభుత్వం ఉజ్వల్ పథకాన్ని అమలు చేస్తోందని ఇందులో భాగంగా అందించే గ్యాస్ కనెక్షన్‌ను సద్వినియోగం చేసుకోవాలని అనకాపల్లి భాజపా సమన్వయకర్త కర్రి చిట్టిబాబు అన్నారు. ఆదివారం కె.గంగవరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి నాయకుడు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ పేద ప్రజల అవసరాలకు తగినట్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలు అమలుచేస్తున్నాయన్నారు. కొప్పిశెట్టి చంద్రరావు, చిర్రా రాజకుమార్, మేడిశెట్టి రవికుమార్, గ్రామ సర్పంచి కోటి వెంకట నర్సమ్మ, స్వచ్ఛాంధ్ర రాష్ట్ర డైరెక్టర్ సలాది రమేష్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉచిత హోమియో వైద్యం

ఈకే ఆశయ సాధనలో శిష్య బృందం

పామర్రు, న్యూస్‌టుడే: భారతదేశ ఆర్థిక పరిస్థితికి హోమియో వైద్యం చక్కగా సరిపోతుంది. మానవుల సంపూర్ణ ఆరోగ్యం ఈ విధానంలోనే పొందగలుగుతారని జగద్గురుపీఠం (వరల్డ్ టీచరు ట్రస్టు) వ్యవస్థాపకుడు, జగద్గురువు, ఆధ్యాత్మికవేత్త డా.ఎక్కిరాల కృష్ణమాచార్య(ఈకే) చెప్పేవారు. అందులో భాగంగానే ఎంతో మంది శిష్యులను తయారు చేశారు. దేశంలో సుమారు వంద వరకూ ఉచిత హోమియో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆయన ఆశయ సాధనకు ఇప్పుడు ఈ శిష్య బృందం విశేష కృషి చేస్తోంది.

అమ్మమ్మది కోటగ్రామం కావడంతో..

కృష్ణమాచార్య అమ్మమ్మగారి స్వగ్రామం కోనసీమ జిల్లా కె.గంగవరం మండలంలోని మారుమూల పల్లెటూరైన కోట గ్రామం. చిన్ననాడు ఆయన ఇక్కడ తిరిగేవారు. అప్పట్లో ఆయన గ్రామానికి వచ్చి ఉచితంగా హోమియో వైద్యం అందించేవారు. వారికి వంశపారంపర్యంగా వచ్చిన సుమారు ఎకరం స్థలం కోటలో ఉంది. 40 సంవత్సరాల కిందటే స్వర్గస్థులైనా ఆయన స్మృతికి చిహ్నంగా శిష్యబృందం ఈకే ఆశయసాధనకు పూనుకొంది.

కోటలో ఈకే శిష్యబృందం నిర్మించిన హోమియో వైద్యశాల

శబల పేరుతో భవనం..

గ్రామంలో ఉన్న ఎకరం స్థలంలో శిష్యబృందం అంతా కలిసి కె.పార్వతి కుమార్, బి.ఆర్.కే.రాజుల నిర్వహణలో సుమారు రూ.10లక్షలతో పక్కా భవనం నిర్మించారు. 'శబల' పేరుతో పూర్తయిన ఈ భవనంలో ప్రతి 15 రోజులకొకసారి ప్రముఖ హోమియో వైద్యులు పి.వి.రాఘవరావు(కాకినాడ), జీఆర్ఎస్ఎస్.శర్మ(రాజమహేంద్రవరం)లు వచ్చి పేదలకు ఉచితంగా వైద్యం చేస్తూ మందులు ఇస్తున్నారు. ఇక్కడకు వచ్చే రోగులు, వారికి సహాయకులుగా వచ్చిన వారికి అల్పాహారాన్ని కూడా ఇస్తున్నారు. ఓపీ సుమారు 150కి పైగా ఉంటోంది.

ఎంత మంది వచ్చినా వైద్యం చేస్తాం..

ఎంత మంది వచ్చినా వైద్యం చేస్తామని, ఇది నిరంతరం కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని ఎక్కువ మంది సద్వినియోగం చేసుకోవాలని డా.రాఘవరావు చెప్పారు. దీనితో పాటే సేవాకార్యక్రమాలను కూడా విస్తరించాలని ట్రస్టు వారు ఆలోచన చేస్తున్నారని, గ్రామీణ మహిళలకు ఉచితంగా ఈ కేంద్రంలో కుట్టుశిక్షణ, ఎంబ్రాయిడరీ లాంటివి నేర్పడానికి కూడా ప్రణాళికలు వేసారని త్వరలో అవి అమల్లోకి వస్తాయని తెలిపారు. తమకు వైద్యం చేయడంలో డా.పి సాత్విక, పెమ్మి రెడ్డి నాగేశ్వరరావు, రాజు తదితరులు సహకరిస్తున్నారన్నారు.

వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు

రాయవరం, న్యూస్‌టుడే: రాయవరం మండలం మాచవరం కెనాల్ రహదారిలో వాహనాలను పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఎస్సై డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో వాహనదారుల వద్ద బీమా, పర్యావరణ, వాహన చోదక పత్రాలను పరిశీలించారు. సక్రమ పత్రాలు లేని 17 మంది వాహనదారులకు రూ.3,145 జరిమానా విధించారు. శిరస్త్రాణం తప్పనిసరిగా ధరించాలని వాహనదారులకు ఎస్సై సూచించారు.

సైలెన్సర్ లేని బైక్ యజమానికి రూ.11,500 జరిమానా

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం పట్టణంలో సైలెన్సర్ లేకుండా వేగంగా వెళ్లిన బైక్‌ను చేజ్ చేసి పట్టుకుని రూ.11,500లు జరిమానా విధించినట్లు ఎస్.ఐ నాగేశ్వరరావు తెలిపారు. సైలెన్సర్ మార్చినా, తొలగించినా, వేగంగా బైక్ నడిపినా, ప్రజలకు ఇబ్బందులు కల్గించే ఎటువంటి కార్యకలాపాలు తలపెట్టినా సంబంధిత బైక్‌లను సీజ్ చేసి వాటి యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దేశాభివృద్ధికి సనాతన హిందూ ధర్మమే ఆయువుపట్టు

మాట్లాడుతున్న ఆధ్యాత్మికవేత్త పోలిశెట్టి వెంకట్రావు

పామర్రు, న్యూస్‌టుడే: దేశాభివృద్ధికి సనాతన హిందూ ధర్మమే ఆయువుపట్టు అని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త పోలిశెట్టి వెంకట్రావు అన్నారు. కె.గంగవరం మండలం అముజూరులో ఆదివారం హిందూ సమ్మేళనం జరిగింది. దీనికి ఆర్ఎస్ఎస్ పామర్రు మండల కార్యప్రముఖ్ అవసరాల రామకృష్ణ అధ్యక్షత వహించారు. దేశం విశ్వగురువుగా మారేందుకు ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలుగా కృషి చేస్తోందన్నారు. కోట మహిళా బృందం చేసిన భజన, కె.గంగవరం శరణ్య పాఠశాలకు చెందిన చిన్నారుల బృంద భరతనాట్యం అందరినీ ఆకట్టుకున్నాయి. మరివాడ సూర్యనారాయణ, రాంబాబు, ఎ.వి.రమణమూర్తి, నారాయణమూర్తి, మహిళా వక్త ఆరాధ్వి సాయి కిరణ్, భాజపా అధ్యక్షుడు కె.చంద్రరావు పాల్గొన్నారు.

సమ్మేళనంలో చిన్నారుల భరతనాట్యం

(c) eenadu

బౌండరీల మోత... సిక్సర్ల కూత..!

● ఉత్కంఠభరితంగా 'ఈనాడు క్రికెట్' పోటీలు

రాజానగరం, శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: బ్యాటర్లు సిక్సర్ల మోత మోగించారు. .బంతి బంతికి బౌండరీలతో అభిమానులను అలరించారు. అంతర్జాతీయ క్రికెట్‌ను తలపించేలా ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రెజెంట్స్ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) 2025 క్రికెట్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. అప్పటివరకు గెలుపు అంచుల వరకు వెళ్లిన జట్లు ఒక్క బంతితో ఓటమిపాలైంది. ఓటమి దరిలో ఉన్న జట్లు చివరకు విజయతీరాలకు చేరాయి. గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ (జీజీయూ) క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఈఎస్ఎల్ పోటీలు రెండో రోజైన ఆదివారం జట్లు హోరా హోరీగా తలపడ్డాయి.

EENADU SPORTS LEAGUE 2025

ఆఖరి బంతికి అదృష్టం వరించి

విజయానందంలో కేరింతలు కొడుతున్న బీవీసీ కళాశాల జట్టు

మైదానం - 1లో ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ (కాకినాడ) - బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల కోనసీమ (భట్లపాలెం) మధ్య జరిగిన మ్యాచ్ ప్రేక్షకులను రంజింప చేసింది. తొలుత టాస్ గెలిచి బీవీసీ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఆదిత్య కళాశాల జట్టు నిర్ణీత 10ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన బీవీసీ జట్టు ఎనిమిది వికెట్లు కోల్పోయి 96 పరుగులు సాధించి విజయం సాధించింది. ఆట చివరలో 12 బాల్స్‌లో 20 పరుగులు చేయాల్సి రావడంతో బీవీసీ జట్టు ఒత్తిడికి గురై త్వరత్వరగా వికెట్లు కోల్పోయింది. చివరికి ఒక బంతికి రెండు పరుగుల లక్ష్యంతో విజయం సాధించాల్సి ఉంది. ఆ సమయంలో అందరూ ఊపిరి బిగపట్టి చూస్తున్న సమయంలో ఆఖరి బంతికి రెండు పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. దీంతో విజయానందంతో బీవీసీ జట్టు మైదానంలో ఆనందంతో కేరింతలు కొట్టారు..

● ఆదివారం మధ్యాహ్నం ఐడియల్ కళాశాల ఆర్ట్స్ (కాకినాడ) X వికాస్ ఫార్మాస్యూటికల్ జట్లు తలపడాల్సి ఉండగా వికాస్ కళాశాల జట్టు రాకపోవడంతో న్యాయనిర్ణేతలు వాకోవర్ ఇచ్చి ఐడియల్ కళాశాల జట్టును విజయం సాధించినట్టుగా ప్రకటించారు.

వాకోవర్‌లో విజయం సాధించిన ఐడియల్ కళాశాల జట్టు

వాకోవర్‌తో విజయం సాధించిన చైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కాకినాడ)

● మైదానం-2లో ఉదయం 8 గంటలకు చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, రంగరాయ వైద్య కళాశాల జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్‌లో రంగరాయజట్టు రాకపోవటంతో న్యాయనిర్ణేతలు వాకోవర్ ఇచ్చి చైతన్య ఇనిస్టిట్యూట్ ఇఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీని విజేతగా ప్రకటించారు.

మ్యాచ్‌ను మలుపు తిప్పిన ఆ ఇద్దరు

మైదానం-1లో జీఎస్ఎల్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ (రాజమహేంద్రవరం), ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల జట్లు తలపడ్డాయి. జీఎస్ఎల్ జట్టు టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకుని నాలుగు వికెట్ల నష్టానికి 108 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రగతి కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 91 పరుగులు చేసింది. 17 పరుగుల ఆధిక్యంతో జీఎస్ఎల్ జట్టు విజయం సాధించింది. ఈ జట్టులో మధు 33 పరుగులు సాధించగా చంద్ర 6 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

విజయం సాధించిన జీఎస్ఎల్ కళాశాల జట్టు

33 పరుగులు సాధించి స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే గా నిలిచిన మధు

3 వికెట్లు సాధించి స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డే గా నిలిచిన చంద్ర

ఆది నుంచి తడబడి.. ఓటమిపాలై..

ఇదే క్రీడామైదానంలో ఉదయం 10గంటలకు ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల (సూరంపాలెం), ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పీజీ (రాజమహేంద్రవరం) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఆదిత్య ఇంజినీరింగ్ జట్టు నిర్ణీత 10 ఓవర్లకు 8 వికెట్ల నష్టానికి 78పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నన్నయ యూనివర్సిటీ జట్టు మొదటి ఓవర్ నుంచే వికెట్లు కోల్పోవటం ప్రారంభించింది. 5 ఓవర్లు అయ్యే సమయానికి ఏకంగా 5 వికెట్లు కోల్పోయి కేవలం 30 పరుగులు మాత్రమే చేసి పీకల్లోతు కష్టాల్లో పడింది. తర్వాత వచ్చిన బ్యాటర్లు మ్యాచ్‌ను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంలో కేవలం 56 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలయ్యారు.

విజయం సాధించిన ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల జట్టు (సూరంపాలెం)

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ NECC (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా | కర్ణాటక
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
Digital Partner: ఈనాడు.నెట్ ETV BHARAT
Medical Partner: GSR GORANTLA SANTHARAO FOUNDATION
FM Partner: ఈ FM Mee FM
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
Organised by ఈనాడు ఉత్సాహం క్లబ్

▲ గోరంట్ల శాంతారావు ఫౌండేషన్ (జీఎస్ఆర్) వారు అంబులెన్స్ సమకూర్చారు.

నేటి మ్యాచ్‌లు (29.12.2025)

గ్రౌండ్ - 1

ఉదయం 8 గంటలకు: కిట్స్ కళాశాల దివిలి (కాకినాడ) X ఐడియల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (కాకినాడ). ● ఉదయం 11 గంటలకు: బీఎస్ఎల్ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం) X బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల (అమలాపురం). ● మధ్యాహ్నం 2 గంటలకు: కైట్ ఇంజినీరింగ్ కళాశాల (కాకినాడ) X ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పెరుమాళ్లపురం (కాకినాడ).

గ్రౌండ్ - 2

ఉదయం 8 గంటలకు: జీఎస్ఎల్ వైద్య కళాశాల (రాజమహేంద్రవరం) X ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల (కాకినాడ). ● ఉదయం 11 గంటలకు: స్పెసెస్ డిగ్రీ కళాశాల (కాకినాడ) X గైట్ ఇంజినీరింగ్ కళాశాల (రాజమహేంద్రవరం).

రేపటి మ్యాచ్‌లు (30.12.2025)

గ్రౌండ్ - 1

ఉదయం 8 గంటలకు: ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాల (చేబ్రోలు, కాకినాడ) X ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం). ● ఉదయం 11 గంటలకు: ఎస్ఏవీఎం డిగ్రీ కళాశాల(సఖినేటిపల్లి, కోనసీమ) X ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం యూజీ (రాజమహేంద్రవరం). ● మధ్యాహ్నం 2 గంటలు: జేఎన్‌టీయూ(కాకినాడ) X వీఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాల(రామచంద్రపురం).

గ్రౌండ్ - 2

ఉదయం 8 గంటలు: ప్రభుత్వ డిగ్రీ కళాశాల (తుని) X ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (రాజమహేంద్రవరం) ● ఉదయం 11 గంటలు: పైడా ఇంజినీరింగ్ కళాశాల(కాకినాడ) X బీహెచ్ఎస్ఆర్, వీఎల్ఎం డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం).

ర్యాలిలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈ నెల 30న ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో స్వామి వారు ఉత్తర ద్వారం నుంచి దర్శనమిస్తారని దేవస్థానం ఛైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి తెలిపారు. తెల్లవారుజాము 3 గంటలకు పంచామృతాభిషేకం, ధూపసేవ, పంచహారతులు, వేదపారాయణం, ఉదయం 9 గంటలకు కోలాట ప్రదర్శన, 11 గంటలకు విష్ణు లలిత మణిద్వీప పారాయణం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

శ్రీవారి క్షేత్రం.. ప్రగతి పథం

▲ పాలక మండలి ప్రమాణ స్వీకారం నేడు

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేశారు. ఛైర్మన్‌గా ఆత్రేయపురానికి చెందిన ముదునూరి వెంకటరాజుతోపాటు 18 మంది సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ట్రస్టు బోర్డులో తెలంగాణ, రాయలసీమ లోని జిల్లాలకు కూడా స్థానం కల్పించారు. ఒంగోలు, పశ్చిమ, తూర్పు, కాకినాడ తదితర జిల్లాలతోపాటు తెలంగాణ తదితర ప్రాంతాలకు చెందిన పలువురు ప్రముఖులు రానున్నారు. ఛైర్మన్ పదవికి రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు ముమ్మర ప్రయత్నాలు చేశారు. గతంలో ఛైర్మన్లు ముదునూరి రాజగోపాల రాజు, నంబూరి రామరాజు, చిలువూరి రామకృష్ణంరాజు, కూనాదిరాజు రంగరాజు, చేకూరి కృష్ణంరాజు, పచ్చమట్ల రాజగోపాల్‌రాజు, తోటకూర సుబ్బరాజు, కరుటూరి నరసింహారావు, రుద్రరాజు రమేష్‌రాజు తదితరులు ఆలయ అభివృద్ధికి పాటుపడ్డారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరగా రూ.7 కోట్లు మంజూరు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా రాకపోకలకు ఇబ్బంది లేకుండా కొత్త వంతెన నుంచి నాలుగు వరుసల రహదారిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే పలు పనులు జరుగుతున్నాయి. ఆలయానికి సంబంధించి బృహత్తర ప్రణాళిక అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు.

తిరుమల తరహాలో అభివృద్ధికి కృషి



భవిష్యత్తులో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా పాలకమండలి సభ్యులతోపాటు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, సంబంధిత మంత్రి, అధికారుల సహకారంతో ఆలయాన్ని తిరుపతి తరహాలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా. ముఖ్యంగా వసతి గదులు, డార్మిటరీ, కంపార్టుమెంట్ సౌకర్యం, రోడ్డు విస్తరణ వంటి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– ముదునూరి వెంకటరాజు, ఛైర్మన్

నిత్య సాధనతో ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి

రావులపాలెం గ్రామీణం: క్రీడాకారులు నిత్యం సాధన చేస్తూ పట్టు సాధించి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని జిల్లా వైకాపా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెం మండలం వెదిరేశ్వరం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న 10వ రాష్ట్రస్థాయి దండు సాయి ఆకాష్‌వర్మ మెమోరియల్ సీనియర్ అంతర్ జిల్లాల నెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. దండు సుబ్రహ్మణ్యవర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 13 జిల్లాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. పురుషుల విభాగంలో తూర్పుగోదావరి ప్రథమ, విశాఖపట్నం ద్వితీయ, కృష్ణా జిల్లా తృతీయ స్థానం సాధించాయి. మహిళల విభాగంలో కృష్ణా ప్రథమ, విశాఖ ద్వితీయ, తూర్పుగోదావరి తృతీయ, పశ్చిమ గోదావరి నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ ఇజ్రాయెల్, మాజీ ఎంపీ భరత్ తదితరులు బహుమతులు అందజేశారు.

తూర్పుగోదావరి జట్టుకు బహుమతి అందిస్తున్న నాయకులు

సామాన్యులను నాయకులుగా చేయడమే లక్ష్యం

రావులపాలెం పట్టణం, ఆలమూరు: సామాన్య కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దడమే తెదేపా లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం రావులపాలెంలోని శ్రీకృష్ణదేవరాయ, ఆలమూరు మండలం చెముడులంక కల్యాణ మండపాల్లో జరిగిన ఆయా మండలాల తెదేపా విస్తృత స్థాయి సమావేశాల్లో ఆయన మాట్లాడారు. పదవులు పొందిన నాయకులను సత్కరించారు. తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులకు ప్రశంసాపత్రాలు అందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను కూటమి గెల్చుకోవాలని దిశానిర్దేశం చేశారు. సమావేశాల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, డీసీఎమ్మెస్ మాజీ అధ్యక్షుడు కె.వి.సత్యనారాయణరెడ్డి, తెదేపా యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, మండల తెదేపా అధ్యక్షుడు కొప్పిశెట్టి ప్రసాద్, ఆలమూరు మండల తెదేపా అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వర్రావు, నాగిరెడ్డి వెంకటరత్నం, వంటిపల్లి సతీష్, అనుసూరి నాగరత్నం, కేతా రాంబాబు, దునే స్వామినాయుడు, లంక వినయ్, కొమ్ము నారాయుడు, సాలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు అందజేసిన ఎమ్మెల్యే బండారు

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మనప్పురం ఏ ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి, ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 9849138626.

శ్రీసాయిగోల్డ్: తాకట్టులో ఉన్న బంగారం, ఏబ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి, ఆరోజు మార్కెట్ రేట్‌కి కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 94933 38823.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

రాజమండ్రి, గాడాల లోరల్ స్కూల్‌కు ఎదురుగా E/F 2BHK ఇండిపెండెంట్ హౌస్ రెడిటు ఆక్యూపై 37 లక్షలు మాత్రమే. 90% బ్యాంక్‌లోన్. Note: IT రిటర్న్స్, శాలరీ స్లిప్స్ అవసరం లేదు. ✆89190 84655, 98850 28899.

TO LET

కోనసీమ జిల్లా, అమలాపురం-P.గన్నవరం మెయిన్‌రోడ్ ఫేసింగ్ 20x90=1800 Sft. బిల్డింగ్ Showroom, Banksకు అద్దెకు. ✆ 9949328440, 8919131853

JOBS

Wanted Civil Engineers & Supervisors, 3-5 yrs Exp in Buildings & CC Road Works. @ Gokavaram (A.P). Ph No:8888838677, 9422135347.

EENADU Classifieds

Wanted B.Com/ M.Com/ MBA Finance/CA IPCC Dropouts to be Work as Field Executive in Tuni in a Reputed Audit Firm. Interested Persons (Male Only) ✆ 70135 11502 or mail: kowthahr@gmail.com.

కొత్తగా ఇంటర్నెట్ బాక్సులు వేయుటకు 10 మంది ఫీల్డ్ స్టాఫ్ కావలెను. నెలకు 15K (12+3). వేద నెట్, సత్యవతినగర్, కొవ్వూరు, కాంటాక్ట్ సెల్: 99899 55770.

నిడదవోలు శంకరాపురం గ్రామంలో హృదయాలయం ఆశ్రమంలో పని చేయుటకు వంటపని చేయుటకు వంటవారు కావలెను. స్త్రీలు మాత్రమే. ఫోన్: 94409 42148, 94418 76034.

డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్ లలో వర్క్ చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీ: 23000 టు 29000. వ:18-35. ✆ 77309 58410.

మా ఆఫీసు నందు టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్, ఇన్‌ఛార్జీలు, క్యాషియర్స్, Male, Female కావలెను. Ph. No: 96423 75791.

రాజమండ్రి, అనకాపల్లిల్లో ప్రా॥కం॥ & ప్రాజెక్టుల్లో సె॥గార్డ్స్, సూపర్‌వైజర్స్, ఆయాలు స్త్రీ/పు॥, జీ: 12 to 15 వేలు, రూం+బో॥. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, RJY, ✆ 9392269369.

కడియపులంకలో కొత్తగా నిర్మించిన BPCL పెట్రోలుబంకులో చేయుటకు ఆఫీస్ స్టాఫ్ (M/F), అర్హత: డిగ్రీ/ ఇంటర్ + కంప్యూటర్ పరిజ్ఞానం, పంప్ బాయ్స్ కావలెను. అనుభవమున్న వారికి ప్రాధాన్యత. ఇంటర్వ్యూ: ది.30-12-25 మంగళవారం 11 am to 3:30 pm ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు, పాన్‌కార్డు, బయోడేటాతో బంకువద్దకు రావలెను. ✆ 83095 49958.

వర్క్‌ఫ్రంహోమ్ డేటాఎంట్రీ: ఇంటి వద్ద ఉండి పార్ట్ / ఫుల్ టైంప్రాజెక్ట్ వర్క్ చేయుటకు Laptop/ Desktop, స్మార్ట్‌ఫోన్ ఉన్నవారు కావలెను. ✆ 95534 29994.

MARKETING/ SALES

360 Clean Company - FMCG Field Sales Executive, min. exp. 2 years - Call: 91009 40494.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-65 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తైక్వాండో కలర్ గ్రేడింగ్ పరీక్షలు

అంబాజీపేట: అంబాజీపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సంఘం కార్యదర్శి బి.అర్జునరావు ఆదివారం క్రీడాకారులకు కలర్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. అంబాజీపేట, రాజోలు, అమలాపురం, పి.గన్నవరం, ఇరుసుమండ నుంచి 120 మంది క్రీడాకారులు వచ్చారు. జిల్లా తైక్వాండో కార్యదర్శి త్రిమూర్తులు, కోచ్‌లు సత్యనారాయణ, భార్గవి, భూషణం, ఖుషీవీర్, మణికుమార్ పాల్గొన్నారు.

నదిలో జారిపడి వృద్ధుడి మృతి

మామిడికుదురు: పెదపట్నంలంకకు చెందిన గెద్దం సంజీవరావు(65) ఆదివారం కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ సమీపంలోని నదిలో జారిపడి మృతి చెందినట్లు నగరం ఎస్సై చైతన్యకుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, అతడి కుమారుడు రాజారావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇనుప పందిరిని ఢీకొట్టి కారు బోల్తా

అంతర్వేది: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చిన భక్తుల కారు డోలా మండపం ఎదుట ఉన్న రామాలయం ఇనుపరేకుల పందిరిని, దానిలో నిలిపి ఉంచిన రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టి బోల్తాపడింది. డ్రైవర్ గాయాలు కాకుండా బయటపడటంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన భక్తులు ఆలయం లోపలకు వెళ్లిన తరువాత డ్రైవర్ కారులో గుర్రాలక్కమ్మ ఆలయ రూట్‌లో ఉన్న బంకు వద్దకు వెళ్తుండగా మార్గమధ్యలో రామాలయం ఇనుప రేకుల పందిరిని ఢీకొట్టాడు. స్థానికులు వెంటనే తలుపు తీసి డ్రైవర్‌ను బయటకు లాగారు. దెబ్బతిన్న ద్విచక్ర వాహనాలు, ఇనుప పందిరికి నష్టపరిహారం ఇవ్వడానికి కారు యజమానులు ఒప్పుకున్నట్లు సమాచారం.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	17,000
పాతకాయ: గండేరా	27,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,000-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	135-00
రిటైల్ లైవ్	162-00
డ్రెస్డ్	235-00
స్కిన్‌లెస్	267-00

రాజోలు
• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

సుధాకరరావు సేవలు అభినందనీయం

అంబాజీపేట: ఏపీ ఆయిల్‌ఫెడ్ సంస్థలో మూడున్నర దశాబ్దాలకుపైగా వివిధ హోదాల్లో పనిచేసిన ఆయిల్‌ఫెడ్ మేనేజర్ ఉప్పాడ సుధాకరరావు కోనసీమ కొబ్బరి రైతులకు అందించిన సేవలు అభినందనీయమని కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ సంస్థ సీఈవో అడ్డాల గోపాలకృష్ణ, ప్రతినిధి ముత్యాల జమ్మీలు, ఉభయగోదావరి జిల్లా కొబ్బరి ఉత్పత్తుల ఎగుమతుల సంఘం అధ్యక్షుడు మద్దాల తమ్మారావు అన్నారు. అంబాజీపేటలోని సంస్థ కార్యాలయంలో సుధాకరరావు ఉద్యోగ విరమణ సన్మానసభను కృషీవల సంస్థ ఛైర్మన్ గణపతి వీరరాఘవులు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఏపీ నాఫెడ్ మేనేజర్ నాగేశ్వరశర్మ, అంబాజీపేట సొసైటీ త్రిసభ్యకమిటీ ఛైర్మన్ అరిగెల సూరిబాబు, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు, కూటమినేతలు మహిపాల తాతాజీ, గుత్తుల చంటి, సొసైటీ సీఈవో కుంపట్ల అయ్యప్పనాయుడు పాల్గొని ఆయనను సత్కరించారు.

ముగిసిన రుగ్వేద సభలు

పి.గన్నవరం, న్యూస్‌టుడే: ముంగండ గ్రామంలో ఆశ్వలాయన రుగ్వేద పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుగ్వేద సభలు ఆదివారంతో ముగిశాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి సుమారు 80 మంది రుగ్వేద పండితులు అయిదు రోజులపాటు రుగ్వేద పారాయణం చేశారు. రుగ్వేదంలోని 10,500 సూక్తలకు సంబంధించి తొలిరోజు అగ్నిసూక్తం నుంచి మొదలైన పారాయణ చివరిరోజు ఐకమత్యం సూక్తంతో సభలు ముగిశాయని రుగ్వేద పరిషత్ ఛైర్మన్ గోదావరి వెంకటసుబ్బారావు వెల్లడించారు. చివరిరోజు కంచి పీఠ నుంచి రత్నాకర్‌భట్ పండితుడు తీసుకొచ్చిన పూజ అక్షితలు, కుంకుమ భక్తులకు అందజేశారు. పండితులను సత్కరించారు.

సెలవు రోజుల్లో పని ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

రావులపాలెం పట్టణం: జడ్పీ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను సెలవు రోజుల్లో కూడా పనిచేయాలని ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు కె.వి.శేఖర్ అన్నారు. ఆదివారం రావులపాలెంలో నిర్వహించిన మండలం ఎస్టీయూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ప్రవేశపెట్టిన వంద రోజుల ప్రణాళిక భారంగా ఉందన్నారు. పండుగ రోజుల్లో కూడా పనిచేయాలని, రోజూ పరీక్షలు పెట్టి మార్కులను ఆన్‌లైన్ చేయమనడం, విద్యార్థులు హాజరుకాకపోతే ఉపాధ్యాయుడిని బాధ్యుడిని చేయడం తగదన్నారు. ఎస్టీయూ అధికార మాసపత్రికకు జిల్లా నుంచి ఛీఫ్ ఎడిటర్‌గా ఎంపికైన శేఖర్‌ను సత్కరించారు. పి.శ్రీనివాస్, రాజు, కింగ్, నాగేశ్వరరావు, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొసళ్లను బంధించేందుకు ఏర్పాట్లు

అయినవిల్లి: ముక్తేశ్వరం రేవు సమీపంలోని గుంతల్లో ఉన్న మొసళ్లను పట్టుకుని అటవీ ప్రాంతానికి తరలించేందుకు అటవీశాఖ అధికారులు బోను ఏర్పాటు చేయగా ఎంతకీ చిక్కలేదు. ఆదివారం ఇంజిన్ల సాయంతో కొంత నీటిని బయటకు తరలించి వలల సహాయంతో బంధించేందుకు ప్రయత్నిస్తున్నారు. సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ గుంతల్లో పది అడుగుల మేర నీటిని ఇంజిన్ ఏర్పాటు చేసి బయటకు తోడుతున్నారు.

అందని పింఛన్లు.. నిరుపేదల కన్నీళ్లు

న్యూస్‌టుడే, అంబాజీపేట, రావులపాలెం పట్టణం

అన్ని అర్హతలున్నా ఇంకా కొందరికి పింఛన్లు రాకపోవటంతో వారికి కష్టాలు, కన్నీళ్లే మిగులుతున్నాయి. వితంతు, దివ్యాంగ, వృద్ధాప్య పింఛన్లు మంజూరుకాక పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు 200 పింఛన్లు మంజూరు చేసే అవకాశాన్ని జిల్లా కలెక్టర్లకు కల్పిస్తూ ఇటీవల కూటమి సర్కారు ఆదేశాలు జారీ చేసింది. కలెక్టర్ పరిశీలించి అర్హతలున్న వారికి పింఛన్లు ఇవ్వాలని బాధితులు వేడుకుంటున్నారు.

తల్లి వితంతువు.. కుమార్తె దివ్యాంగురాలు

గంగలకుర్రు గ్రామంలో మోరంవారిపాలేనికి చెందిన మోరం కనకదుర్గ, దివ్యాంగురాలైన వెంకటలక్ష్మి తల్లీకూతుళ్లు. కనకదుర్గకు భర్త చనిపోవడంతో వితంతు పింఛను వచ్చేది. కనకదుర్గ కుమారుడు నాగేశ్వరరావు స్థానిక మార్కెట్ కమిటీలో పొరుగు సేవల పద్ధతిలో చిన్నపాటి ఉద్యోగం చేస్తున్నారనే కారణంతో అప్పటి వైకాపా పాలనలో అధికారులు 2022 ఆగస్టు నుంచి వీరి పింఛన్లను నిలుపుదల చేశారు. వెంకటలక్ష్మికి నూరుశాతం వైకల్యం ఉన్నట్టు సదరన్ శిబిరంలో అధికారులు ధ్రువపత్రం ఇచ్చారు. పింఛను నగదుపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

గంగలకుర్రుకు చెందిన మోరం కనకదుర్గ, కుమార్తె వెంకటలక్ష్మి

వితంతు, వృద్ధాప్య పింఛనుకు అర్హత ఉన్నా..

పుల్లేటికుర్రుకు చెందిన బీర మహాలక్ష్మికి ఇప్పుడు 74 ఏళ్లు. ఆమె భర్త 2023 సెప్టెంబరులో గుండెపోటుతో మరణించారు. అప్పట్లో పుల్లేటికుర్రు సచివాలయం-2లో వితంతు పింఛనుకు దరఖాస్తు చేసుకున్నారు. పూరిగుడిసెలో నివసిస్తున్న ఆమెకు ఇప్పటి వరకు పింఛను మంజూరు కాలేదు. వితంతు, వృద్ధాప్య పింఛన్లకు అర్హురాలైనప్పటికీ మంజూరు కాలేదు. పలుమార్లు ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకపోయింది. తన భర్త చనిపోయిన నెల రోజుల వ్యవధిలోనే పింఛను మంజూరు చేయాల్సి ఉన్నప్పటికీ ఇప్పటికీ రాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన తనకు పింఛను ఇప్పించాలని కోరుతున్నారు.

పుల్లేటికుర్రుకు చెందిన బీర మహాలక్ష్మి

కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా..

కొత్తపేటకు చెందిన కొత్తా అర్జున్ అనారోగ్యం కారణంగా చిన్నతనం నుంచి మంచం మీదే ఉన్నారు. ప్రస్తుతం 23 ఏళ్ల వయసున్న ఈ యువకుడికి దివ్యాంగ పింఛను వస్తోంది. లేవలేని స్థితిలో మంచం మీద ఉండే వారికి ప్రభుత్వం రూ.15 వేలు ఇస్తోంది. ఇది వర్తింపజేయాలని రెండేళ్లుగా తండ్రి విశ్వనాథం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి, అమలాపురం డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయానికి, ఎంపీడీవోలకు దరఖాస్తులు చేస్తున్నా తిరస్కరిస్తున్నారు. ఏ అధికారిని అడిగినా ఫోన్ చేస్తామని చెబుతున్నారే తప్ప సరైన సమాధానం చెప్పడం లేదు. సదరన్ ధ్రువపత్రాన్ని రద్దు చేసుకొని కొత్తది పెట్టుకోవాలని అంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయానికి కూడా పోస్టు చేశానని, తన కుమారుడి పరిస్థితి చూసి అధికారులు స్పందించాలని ఆ తండ్రి వేడుకుంటున్నారు.

లేవలేని స్థితిలో కొత్తా అర్జున్

నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, న్యూస్‌టుడే: రాజోలు నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్ మార్క్‌లో నియోజకవర్గ విలేకర్లతో ఆదివారం జరిగిన ఇష్టాగోష్ఠి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్తు, రహదారులు, తాగునీటి రంగాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధిలో ముందడుగు వేశామన్నారు. శంకరగుప్తం మేజర్ డ్రెయిను ప్రక్షాళనకు రూ.22.62 కోట్ల మంజూరుపై త్వరలో స్పష్టత వస్తుందన్నారు. వచ్చే 30 సంవత్సరాల వరకు విద్యుత్తు సమస్యలు లేని విధంగా రూ.కోట్ల వ్యయంతో 32/11 కేవీ, 220/32 కేవీ ఉపకేంద్రాల ఏర్పాటుతో త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా చేసే విధంగా కృషి చేసినట్లు తెలిపారు. రూ.1,650 కోట్లతో చేపట్టిన వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును నియోజకవర్గంలో ప్రతి ఇంటికి రోజూ తాగునీరిచ్చేలా పైలట్ ప్రాజెక్టుగా రూపొందించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. అంతర్వేది పుణ్యక్షేత్రాన్ని టెంపుల్ టూరిజంలో అభివృద్ధి చేయడం ద్వారా నియోజకర్గ అభివృద్ధికి బాటలు వేయడానికి కృషి చేస్తున్నానన్నారు. పురాణ ప్రాశస్త్యం ఉన్న అంతర్వేది కల్యాణ తీర్థ మహోత్సవాలను రాష్ట్ర ఉత్సవాలుగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని చెప్పారు. అంతర్వేది ఆలయం అసిస్టెంట్ కమిషనరు ప్రసాద్, రాజోలు సీఐ టి.వి.నరేశ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ నుంచి శ్యామ్, ఏపీఈపీడీసీఎల్ ఏడీఈ బి.వి.కృష్ణరాజా, ఏఈ బి.ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బీసీల రక్షణ చట్టం అమలుచేయాలి

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: బీసీల రక్షణ చట్టం వెంటనే అమలులోకి తీసుకువచ్చి స్థానిక సంస్థల్లో 52 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు వీరవెల్లి శ్రీనివాస్ కోరారు. ఈతకోటలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి చంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల బీసీ చైతన్య వేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, కవురు శ్రీనివాస్, మాజీ ఎంపీ భరత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మట్టపర్తి సూర్యనారాయణ హాజరయ్యారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా, మామిడికుదురు మండలం, నగరం కాపురస్థులు ప్రస్తుతము ఉద్యోగము రీత్యా హైదరాబాద్‌లో నివాసము ఉంటున్న మీర్జా మహమ్మద్ ఆలీ మాజింద్రాణీ, S/o మహమ్మద్ హాదీ గారికి మామిడికుదురు సబ్ రిజిస్ట్రార్ పరిధిలో మామిడికుదురు గ్రామంలో సర్వే నెంబర్ 126లో య.0.8 1/2 సెంట్లు మెరక భూమి ది 19-09-2017 సంగలో డాక్యుమెంట్ నెంబరు 1568/2017గా మామిడికుదురు సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయములో రిజిస్టర్ పొందిన దస్తావేజు ద్వారా పొంది నా క్లయింట్ స్వాధీన హక్కు భుక్తముతో ఏవిధమయిన ఆటంకము లేకుండా అనుభవించుచున్నారు.

ఇది ఇలా ఉండగా సదరు గ్రామ కాపురస్థులు ప్రస్తుతము కాకినాడ మరియు బెంగళూరులో నివాసము ఉంటున్న నర్ జీస్ ఖాతూన్, W/o సాబెర్ హుస్సేన్ మాజింద్రాణీ వగైరాలు కలసి కొన్ని నకిలీ దస్తావేజులు సృష్టించి సదరు ఆస్తిని అన్యాక్రాంతము చేయుటకు ప్రయత్నం చేయుచున్నారు, అట్టి అన్యాక్రాంతము చెల్లనేరవు అని ఈ ప్రకటన ద్వారా నా క్లయింట్ తరపున తెలియజేయుచున్నాను.

ఆస్తి వివరము: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా, మామిడికుదురు సబ్ రిజిస్ట్రార్ పరిధిలో, మామిడికుదురు గ్రామంలో సర్వే నెంబర్ 126లో య.0.8 1/2 సెంట్లు మెరక భూమికి హద్దులు. **తూర్పు:** అబ్బాస్ హుస్సేన్ మాజింద్రాణీ; **దక్షిణం:** 2వ ప్రతి భూమి; **పడమర:** మెహిది అబ్బాస్ మాజింద్రాణీ వారి భూమి; **ఉత్తరం:** రోడ్డు

చెల్లింగి వెంకటేశ్వర్లు
అడ్వకేట్, రాజోలు

ప్రభల ఉత్సవాల్లో ట్రాఫిక్ సమస్యలా..

అంబాజీపేట: 'ఈనాడు' ఆధ్వర్యంలో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజుతో 'ఫోన్ ఇన్' కార్యక్రమం జరగనుంది. జనవరి 16న నిర్వహించే అంబాజీపేట మండలం జగ్గన్నతోట, ఇతర ప్రాంతాల్లో ప్రభల ఉత్సవాల్లో ట్రాఫిక్, తదితర సమస్యలు ఉత్పన్నమవుతుంటాయి. ఈ సమస్యలను వారిద్దరికీ వివరించి.. సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. పలు సూచనలు, సలహాలు ఇవ్వొచ్చు.

తేదీ: ఈ నెల 30 (మంగళవారం)
సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు
డీఎస్పీ, కొత్తపేట : 87126 92109
సీఐ, పి.గన్నవరం : 87126 92105

సమర్థ నాయకత్వంతోనే సంఘం బలోపేతం

రెడ్డి సుబ్రహ్మణ్యాన్ని సత్కరించిన శెట్టిబలిజ సంఘ సభ్యులు

కొత్తపేట, న్యూస్‌టుడే: క్రమశిక్షణతో కూడిన నాయకత్వంతోనే సంఘం మరింత బలోపేతం అవుతుందని, తద్వారా సామాజిక న్యాయం సాధ్యమవుతుందని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం కొత్తపేటలోని ఆయన గృహంలో శెట్టిబలిజ యువజన సంఘ నూతన కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు. కేవలం ఉత్సవాలకు మాత్రమే పరిమితం కాకుండా పేద విద్యార్థులకు సహాయం, రక్తదాన శిబిరాలు, సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. సంఘ అధ్యక్షుడు శీలం కొండబాబు, ఉపాధ్యక్షుడు జోగి మురళి, కార్యదర్శి రాయుడు కార్తీక్, సభ్యులు కొప్పిశెట్టి వాసు, ముసిని వెంకటరమణ, కడలి భీమా, కముజు తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

అయినవిల్లి, న్యూస్‌టుడే: వివేకానంద జయంతి సందర్భంగా నేదునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రజ్ఞ-2026 పేరిట రావి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వ్యాసరచన, నృత్యం, చిత్రలేఖనం, క్విజ్, సాంకేతిక ప్రదర్శనల్లో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు జనవరి 12న బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కొయ్యపు రామకృష్ణ, ఫౌండేషన్ కార్యదర్శి పి.వెంకటకృష్ణ, శారద, ఎ.శివసాయిగౌడ్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

(c) eenadu

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

రాజోలు, మామిడికుదురు, సఖినేటిపల్లి, అయినవిల్లి, పి.గన్నవరం, న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని శృంగవృక్షం పీఠాధిపతి సాయి దత్తనాగానంద సరస్వతిస్వామి, తితిదే వేదార్థ పండితుడు గుళ్లపల్లి దత్తాత్రేయఘనాపాఠి అన్నారు. రాజోలు మండలం సోంపల్లిలో ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళనంలో వారు మాట్లాడుతూ సనాతన ధర్మం, సంస్కృతి సంప్రదాయాలను అనుసరించాలన్నారు. భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి కె.లోవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ● మామిడికుదురు శివాలయ ప్రాంగణంలో జరిగిన హిందూ సమ్మేళనంలో ప్రపంచ వాసవీ మహా పీఠాధీశ్వర శ్రీధర్‌స్వామీజీ మాట్లాడుతూ ధర్మాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, అదే అందర్నీ అన్ని వేళలా కాపాడుతుందన్నారు. చెన్నై నుంచి వచ్చిన అఖిలభారత ధర్మ జాగరణ సహ సంయోజక్ ఆలే శ్యామ్‌కుమార్ ప్రధాన వక్తగా హైందవ వైభవాన్ని విశదం చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.వేమా, ఎంఈవో మోకా వెంకన్నబాబు, నిర్వాహణ సమితి అధ్యక్షుడు కనుమూరి వెంకటపతిరాజు, ఉపాధ్యక్షుడు కారుపర్తి కోటేశ్వరరావుసిద్ధాంతి, జాలెం సుబ్బారావు, రుద్రా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి, కోలాట, గరగ నృత్యాలు అలరించాయి. ● అంతర్వేదిపాలెం మదనగోపాలస్వామి ఆలయంలో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో భాస్కరేంద్ర సరస్వతీ మహరాజ్ మాట్లాడుతూ హిందూ మతం గొప్పదనాన్ని వివరించారు. ● ముక్తేశ్వరం పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన హిందూ సమ్మేళనంలో తాళ్లూరు మఠాధిపతి సత్యనారాయణప్రసాద్ ఆచార్యులు మాట్లాడుతూ సనాతన ధర్మం ఆచరణతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆర్‌ఎస్‌ఎస్ గోదావరి విభాగ్ సహకార్యవాహ కామవరపు మోహన్‌కృష్ణ, ఆర్‌ఎస్‌ఎస్ మహిళా సమన్వయ ప్రాంత సంయోజిక ఇరగవరపు పద్మావతి, సర్పంచులు పాల్గొన్నారు. ● సనాతనధర్మ పరిరక్షణకు అందరూ పాటుపడాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి ప్రయాగ నరసింహమూర్తి అన్నారు. పి.గన్నవరం మండలం ముంగండలోని ముత్యాలమ్మతల్లి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన హిందూ సమ్మేళనానికి అంబటి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు.

రాజోలులో ప్రదర్శన

అంతర్వేదిపాలెంలో మాట్లాడుతున్న భాస్కరేంద్ర సరస్వతీ

మామిడికుదురులో ప్రసంగిస్తున్న శ్రీధర్‌స్వామీజీ

ముక్తేశ్వరంలో మాట్లాడుతున్న పీఠాధిపతి సత్యనారాయణప్రసాద్ ఆచార్యులు

లక్షతులసిపూజ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

అంబాజీపేట: అంబాజీపేట శివారు కొర్లపాటివారిపాలెంలోని వేంకటేశ్వరస్వామి వార్షిక లక్షతులసిపూజ ఆహ్వాన పత్రికలను కమిటీ ఛైర్మన్ మేడిద శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సభ్యులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 30 నిర్వహించే ముక్కోటితోపాటు జనవరి 6న జరిపే లక్షతులసిపూజను విజయవంతం చేయాలని కోరారు. కమిటీ సభ్యులు నైనాల ప్రభాకర్, వీరా సతీష్, పరసా సుబ్బారావు, మేడిద బుచ్చియ్య, బాబీ, ఏడుకొండలు, బాబ్జి, రవణం విజయ్ పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన యర్రంశెట్టి హైమావతి, బంగారు హరికృష్ణ కుటుంబ సభ్యులు రూ.55 వేలు విరాళాన్ని ఆదివారం అందజేశారు. స్వామివారి చిత్రపటం అందజేసి దేవస్థానం ప్రతినిధి అభినందించారు.

రహదారి పనులు ప్రారంభం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: మండలంలో మొండెపులంక లాకు నుంచి వశిష్ఠ ఎడమ ఏటిగట్టుపై ఉపాధి నిధులు రూ.29 లక్షలతో రహదారి పనులను ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి ఆదివారం ప్రారంభించారు. దీర్ఘకాలంగా అధ్వానంగా తయారైన ఈ రహదారిని అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ నిధులు మంజూరు చేయించారని ఆమె తెలిపారు. సర్పంచి గుడాల రామారావు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, వాసంశెట్టి కుమార్, గిడుగు ప్రసాద్, యల్లమెల్లి చిట్టిబాబు పాల్గొన్నారు.



మొక్క ఒకటి.. పూలు గంపెడు

కనువిందు చేస్తున్న విభిన్న రంగుల చామంతి మొక్కలు

రోజురోజుకూ చలి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కడియం నర్సరీలు అతి విశిష్ట అతిథులు వచ్చాయి. పచ్చదనంతో విరులను ప్రకాశింపజేసే మొక్కలు మధ్యన అబ్బురపరచే సీజనల్ మొక్కలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం ఏ నర్సరీలో చూసినా గంపెడు పూలతో దర్శనమిస్తున్నాయి. వివిధ రంగుల్లో హైబ్రిడ్ చామంతి రకాలు కనువిందు చేస్తున్నాయి. రూ. 300 నుంచి రూ. 2వేల వరకూ అందుబాటులో ఉన్నాయని రైతులు చెబుతున్నారు. - న్యూస్‌టుడే, కడియం

ఉద్యోగ మేళా రేపు

రాజానగరం: రాజానగరం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని స్త్రీశక్తిహాలులో ఈనెల 30 ఉదయం 10.30కు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.హరిశ్చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.డి.జి. మురళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి, నైపుణ్యాభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రాణం తీస్తున్న కూడళ్లు..

రాజానగరం, కడియం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై పలు కూడళ్ల వద్ద సరైన ట్రాఫిక్ వ్యవస్థ లేకపోవడం.. కొంతమంది నిబంధనలు పాటించకుండా వేగంగా ప్రయాణించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాజానగరం, దివాన్‌చెరువు, లాలాచెరువు, ఏవీ అప్పారావు రోడ్డు, కవలగొయ్యి సెంటర్, హుకుంపేట, బొమ్మూరు, వేమగిరి జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. లాలాచెరువు, ఏవీ అప్పారావు రోడ్డు కూడళ్లల్లో మాత్రమే ట్రాఫిక్ సిబ్బంది కనిపిస్తారు. సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేస్తుంది. మిగిలిన చోట్ల లేవు. ఉన్నా పనిచేయట్లేదు.

అపసవ్య మార్గంలో..

బొమ్మూరు, హుకుంపేట కూడళ్ల సమీపంలో ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాలు జరుగుతున్నా అపసవ్య దిశలో విభాగినిని దాటుతున్నారు. తాజాగా ఓ ప్రమాదం జరగడంతో అక్కడ సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేశారు.

వేమగిరి కూడలిలో నచ్చినట్లుగా ప్రయాణం

ఈనాడు పరిశీలన

ఇష్టారీతిన రాకపోకలు..

కడియం మండలంలో పొట్టిలంక నుంచి కడియపులంక, బుర్రిలంక, మీదుగా జాతీయ రహదారిపై ఇదే పరిస్థితి. ఈ సంవత్సరం వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు బ్లాక్ స్పాట్లను గుర్తించి నివేదిక సిద్ధం చేశారు. వేమగిరి నుంచి ధవళేశ్వరం, పొట్టిలంక, బొమ్మూరు కూడళ్లలో అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. హుకుంపేట, బొమ్మూరు కూడళ్లలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ, సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

18 కి.మీ. పరిధిలో..

రాజానగరం పరిధిలో విశ్వవిద్యాలయం, ఇంజినీరింగ్, వైద్య, దంత కళాశాలలు ఉన్నాయి. వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వీరు ఇక్కడకు వస్తుంటారు. లాలాచెరువు నుంచి తూర్పుగోనగూడెం వరకు 18 కి.మీ మేర విస్తరించిన రహదారిలో ఈ కూడళ్లు ఉన్నాయి. అందులో ఏడీబీ రోడ్డు, నరేంద్రపురం, సూర్యారావుపేట, జీఎస్ పాయింట్, గైట్ కళాశాల, దివాన్‌చెరువు వద్ద రెండు కూడళ్లు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత 11 నెలల్లో ఈ ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాలలో 8 మంది మృతిచెందగా, 22 మంది గాయపడ్డారు.

వీటిపై దృష్టి పెడితేనే..

◆ పలు రద్దీ ప్రమాదకర కూడళ్లలో ట్రాఫిక్ సిబ్బంది ఉండట్లేదు. ◆ ట్రాఫిక్ సిగ్నల్స్, సూచికలు లేవు. ◆ లారీలు, లోడు వాహనాలు నిబంధనలు పాటించట్లేదని ఆరోపణలు ఉన్నాయి. ◆ సర్వీసు రోడ్డులో నుంచి నిర్లక్షంగా జాతీయ రహదారిపైకి రావడం. ◆ రోడ్డుపై పశువుల సంచారం. ◆ యువత, మైనర్ రాష్ డ్రైవింగ్.

అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీనివాసం.. భక్తజన సందోహం

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం ఆదివారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తిరుప్పావై సేవ, లక్ష్మీఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శత నామావళి, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

భక్తిశ్రద్ధలతో తిరుమంజన సేవ: ఈ నెల 30న వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ఆదివారం ఆలయ శుద్ధి చేశారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని దేవస్థానం సిబ్బంది, అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీవారి సన్నిధి నుంచి మహాద్వారం వరకు, మందిరంలో ఉప ఆలయాలు, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను శుద్ధి చేశారు. స్వామి వారికి పూజాది నివేదనల అనంతరం దర్శనాలు యథావిధిగా కొనసాగించారు. ఈవో ఎన్ఎస్ చక్రధరరావు పర్యవేక్షించారు.

జోడు ఎద్దుల జోరు.. గెలుపు గుర్రాల స్వారీ

రంగంపేట, న్యూస్‌టుడే: ఓవైపు జోడు ఎద్దులు రంకెలు వేస్తుంటే.. మరోవైపు గుర్రాలు పరుగులు పెడుతుంటే.. ఉమ్మడి జిల్లాకు ముందే సంక్రాంతి వచ్చిందా అన్న అనుభూతి కలిగింది. రంగంపేట-వడిశలేరు మధ్య గన్ని వారి తోటలో ఆదివారం జరిగిన పందేలు చూసేందుకు జనాలు తరలివచ్చారు. జీఎస్ఎల్ ఛైర్మన్ గన్ని భాస్కరరావు ఏడేళ్లుగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. ఏటా ఎద్దులకే పెట్టగా ఈసారి గుర్రాలకు సైతం పెట్టారు. మంత్రి దుర్గేష్ ప్రారంభించగా ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రైతులతో పాటు వివిధ వృత్తుల వారు పాల్గొనడం అందర్నీ ఆకర్షింపజేసింది. డీఎస్పీ దివ్య ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఏడీబీ రోడ్డుపై ఓవైపు మాత్రమే రాకపోకలు సాగేలా చర్యలు చేపట్టారు.

పరుగులు పెడుతున్న గుర్రం

విజేతలు వీరే

★ గుర్రం పరుగు పందెంలో ఎల్లపు జగదీష్ (యలమంచిలి), విక్రమ్ (రామన్నపాలెం)కు చెందిన గుర్రాలు ద్వితీయ, తృతీయ స్థానాలో నిలిచాయి. ★ జూనియర్స్ ఎద్దుల పందెం విభాగంలో పద్మ(కంకటపాలెం), శంకరరావు(జి.కొత్తూరు, అనకాపల్లి జిల్లా)కు చెందిన ఎద్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ★ సీనియర్స్ విభాగంలో శృతిచౌదరి (గుమ్మిలేరు, మండపేట)కు చెందిన ఎద్దులే రెండు స్థానాల్లో నిలవడం విశేషం.

పోటీలు ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, చిత్రంలో జీఎస్ఎల్ ఛైర్మన్ భాస్కరరావు

చారిత్రక వారధి.. వెలుగులు కొరవడి

కొవ్వూరు పట్టణం: రోడ్‌కం రైలు వంతెన ప్రాభవాన్ని కాపాడటంలో నిర్లిప్త ధోరణి ప్రస్ఫుటమవుతోంది. వంతెనపై విద్యుద్దీపాలు పూర్తి స్థాయిలో వెలగని పరిస్థితి. కొవ్వూరు నుంచి రాజమహేంద్రవరం వరకు 180 విద్యుద్దీపాలను (90 ఒల్టులు) అమర్చగా, అవన్నీ పూర్తిగా వెలిగిన సందర్భాలు ఎప్పుడూ లేవు. దీంతో వాహనాల వెలుగులే దిక్కవుతున్నాయి. బస్సులు, ఆటోలు, లారీలు దూసుకొస్తుంటే ద్విచక్ర వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. తనిఖీలు చేశామని, దీపాలు వెలుగుతున్నాయని వంతెన విద్యుత్తు విభాగ అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు.

ట్రైనింగ్ కళాశాల ఆవరణలోని నాయకుల విగ్రహాలు

అపూర్వ స్ఫూర్తి.. భావి దీప్తి!

దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయులు కొందరు.. సాహిత్యంతో సుసంపన్నం చేసిన విద్యావంతులు మరికొందరు.. వీరందరి ఔన్నత్యాన్ని భావి తరానికి అవగాహన కలిగించేలా రాజమహేంద్రవరం మంగళవారపుపేటలోని ట్రైనింగ్ కళాశాల ఆవరణలోని ప్రభుత్వ బాలుర పాఠశాల పూర్వవిద్యార్థులు వినూత్న ప్రయత్నం చేశారు. చరిత్ర అర్థమయ్యే విధంగా పాఠశాల ఆవరణలో వరుసగా విగ్రహాలు ఏర్పాటు చేశారు. ధవళేశ్వరం ఆనకట్ట నిర్మించి ఉభయ గోదావరి జిల్లాలను అన్నపూర్ణగా మార్చిన సర్ ఆర్థర్ కాటన్, యువతకు మార్గదర్శనం చేసిన అబ్దుల్ కలాం, మహాభారతాన్ని తెలుగులో అనువదించిన ఆదికవి నన్నయ, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య, రాజ్యాంగం రూపొందించిన అంబేడ్కర్, ఆధ్యాత్మికవేత్త వివేకానంద, స్వాతంత్ర్య సమరయోధుడు గరిమెళ్ల సత్యనారాయణ, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, మదర్ థెరిసా విగ్రహాలు ఏర్పాటు చేశారు. -న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం, కంబాల చెరువు

నన్నయ

పండగ సంతోషం ఆవిరి

టిక్కెట్ ధరలు పెంచేసిన ప్రైవేట్ ట్రావెల్స్ — భారీ దోపిడీకి తెర

ఈనాడు, రాజమహేంద్రవరం: ఒకరి అవసరం.. మరొకరికి అవకాశం అన్నట్లుగా ఉంది ప్రైవేట్ రవాణా సంస్థల వ్యవహారం.. ఉద్యోగాలు, వివిధ వృత్తుల రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉంటూ సంక్రాంతి పండగకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని స్వస్థలాలకు వచ్చేవారిని దృష్టిలో పెట్టుకొని టిక్కెట్ ధరలు భారీగా పెంచేశాయి. ఆన్‌లైన్ వేదికగా మూడింతలు పెంచి విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు కిమ్మనడంలేదు.

ఉమ్మడి జిల్లాకు చెందినవారు ఎక్కువగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల్లో ఉన్నారు. బస్సుల రద్దీ, టిక్కెట్ ధరలు భరించలేక ద్విచక్ర వాహనాలపై వచ్చేవారెందరో. ప్రస్తుతం పలు ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థలు ఏసీ, నాన్ ఏసీ, స్లీపర్, సిట్టింగ్‌కు సంబంధం లేకుండా అత్యధికంగా ధరలు పెంచారు. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, రాజోలు ప్రాంతాల నుంచి సుమారు 150 వరకు ప్రైవేటు ట్రావెల్స్ ఉండగా, దూర ప్రాంతాల నుంచి జిల్లా మీదుగా వెళ్లేవీ అధికమే. పండగ రోజుల్లో ఒక వైపు ఖాళీగా వెళ్లాల్సి ఉంటుందని, అందుకే దాదాపు రెండు వైపుల ఛార్జీలు వసూలు చేస్తున్నారంటూ ఓ నిర్వాహకుడు మర్థించుకునే ప్రయత్నం చేశారు.

డిసెంబరు 30, జనవరి 13 మధ్య ధరల వ్యత్యాసం ఇలా..

☛ హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి ఏసీ స్లీపర్ రూ. 729 నుంచి రూ. 1731.. సిట్టింగ్ రూ. 509 ఉండగా సంక్రాంతి రోజుల్లో రూ. 3549, సిట్టింగ్‌కు రూ. 1709 వసూలు చేస్తున్నారు. ☛ హైదరాబాద్ నుంచి అమలాపురానికి రూ. 769 నుంచి రూ. 1440 ఉండగా, సిట్టింగ్‌కు రూ. 550 ధర ఉంది. పర్వదినానికి స్లీపర్ రూ. 2109 నుంచి రూ. 3389, సిట్టింగ్‌కు రూ. 1899-2099గా తీసుకుంటున్నారు. ☛ హైదరాబాద్-కాకినాడకు ఇప్పుడు రూ. 759 నుంచి రూ. 1466 ఉంది. పండగ మూడు రోజుల్లో రూ. 2399 నుంచి రూ. 3712, సిట్టింగ్ రూ. 1749 చెబుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

కలెక్టరేట్: జిల్లాలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) సోమవారం యథావిధిగా జరుగుతుందని ఆదివారం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించే జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు.

◆ భూసంబంధ ఫిర్యాదులు వేగంగా పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లో సోమవారం ప్రత్యేక రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంతో పాటు ఇకపై ప్రతి సోమవారం రెవెన్యూ క్లినిక్ నిర్వహిస్తామన్నారు. ఆర్డీవోలతోపాటు జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు రెవెన్యూ క్లినిక్‌కు ల్యాప్‌టాప్, కంప్యూటర్ ఆపరేటర్, అవసరమైన రెవెన్యూ దస్త్రాలతో తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

అమ్మో జాగిలం.. పిక్కలు భద్రం..!

జీజీహెచ్‌కు బాధితుల తాకిడి

న్యూస్‌టుడే, కంబాలచెరువు (రాజమహేంద్రవరం)

జిల్లాలో కుక్కలు ఎక్కడపడితే అక్కడ దాడులు చేస్తున్నాయి. చిన్నారులే లక్ష్యంగా పిక్కలు లాగేస్తున్నాయి. కొన్ని రోజుల నుంచి కుక్కకాటు బాధితులు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ), ర్యాపిడ్ ఇమ్యునోగ్లోబిన్(రిగ్) టీకాలకు రాజమహేంద్రవరం సర్వజన ఆసుపత్రికి ఎక్కువగా వస్తున్నారు. నిత్యం 150కు పైగా వివిధ రకాల డోసులు వేయించుకుంటున్నారు. రోజుకు 30 మందికి పైగా మొదటి టీకా వేయించుకుంటున్నవారు ఉంటుండటం గమనార్హం. సాధారణంగా వీరికి 0, 3, 7, 28 రోజుల చొప్పున ఏఆర్‌వీ లేదా రిగ్ టీకాలు వేస్తారు.

టీకాల కోసం బారులుదీరిన బాధితులు

ఇక్కడ అధికం..

రాజమహేంద్రవరం నగరం, గ్రామీణంలోని ధవళేశ్వరం, కొంతమూరు, కోలమూరు, కాతేరు, తొర్రేడు ప్రాంతాలతో పాటు కోరుకొండ, రాజానగరం నుంచే ఎక్కువగా బాధితులు జీజీహెచ్‌కు వస్తున్నారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు 9,467 కొత్త డోసులు వేశారు. అన్ని డోసులు కలిపి 35 వేలకు పైగా టీకాలు జీజీహెచ్‌లో వేశారు.

పెరుగుతున్న కొత్త డోసుల సంఖ్య

నెలకు సగటున 900కు పైగా కొత్తగా డోసులు వేయించుకుంటుంటే అందులో దాదాపు 75 శాతం మంది చిన్నారులే ఉన్నారు. నగరంలోని సీతంపేటకు చెందిన పదేళ్ల బాలుడు ఆదివారం ఇంటి బయట ఆడుకుంటుండగా వీధి కుక్క తీవ్రంగా దాడి చేసింది. అతడికి రిగ్ టీకాలు వేసి వార్డులో చేర్చి చికిత్స చేశారు.

కొత్త డోసులు ఇలా..	
జులై	805
ఆగస్టు	702
సెప్టెంబర్	669
అక్టోబర్	901
నవంబర్	975
డిసెంబర్ (25 వరకు)	726

అందుబాటులో టీకాలు..

జీజీహెచ్‌లో ఏఆర్‌వీ, రిగ్ టీకాలు అందుబాటులో ఉన్నాయి. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం వరకు 0, 3, 7, 28 డోసులు వేస్తున్నారు. కుక్క గోళ్లతో గీరడం, రక్తపు గాయాలు కాకపోతే ఏఆర్‌వీ వేసి పంపేస్తున్నారు. తీవ్రంగా గాయపడితే ర్యాపిడ్ ఇమ్యునోగ్లోబిన్(రిగ్) టీకాలు వైద్యుడి సలహా మేరకు వేస్తున్నారు. ఏఆర్‌వీ అన్ని ఆసుపత్రిల్లో ఉంటున్నా.. రిగ్ మాత్రం జీజీహెచ్‌లో మాత్రమే ఉంటుంది. ప్రైవేటులో దీనిని కొనుగోలు చేయాలంటే సుమారు రూ.5 వేలకు పైగా వెచ్చించాలి. జీజీహెచ్‌లో నాలుగు డోసులు దీనిని ఉచితంగా వేస్తున్నారు.

మేమింతే..!

సింగిల్ టెండర్లకే అధికారుల మొగ్గు

న్యూస్‌టుడే, నిడదవోలు

నిడదవోలు పురపాలక సంఘ పరిధిలో అభివృద్ధి పనులకు టెండర్ల ప్రక్రియకు సంబంధించి అధికారుల తీరు మారడం లేదు. గత నెల 29న జరిగిన కౌన్సిల్ సమావేశంలో సింగిల్ టెండర్ల విధానంపై పలువురు కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా సోమవారం జరిగే కౌన్సిల్ సమావేశ అజెండాలో సింగిల్ టెండర్ల ఆమోదానికి ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

పోటీపడితే ఇలా..: నిడదవోలు పురపాలక సంఘానికి బీపీఎస్-2019, ఎల్ఆర్ఎస్-2020 గ్రాంట్ల నుంచి 11వ వార్డు రైల్వేస్టేషన్ మార్గంలో సీసీ రహదారి నిర్మాణానికి రూ. కోటి మంజూరు చేశారు. దీని అంచనా విలువ రూ. 76,99,199. ఈ పనికి 13 మంది గుత్తేదారులు పోటీపడి టెండర్లు దాఖలు చేశారు. 27.99 శాతం తక్కువకు టెండర్ దాఖలు కావడంతో రూ. 55,44,193లకే పని పూర్తికానుంది.

నిబంధనల ప్రకారమే..

టెండర్ల ప్రక్రియ ఆన్‌లైన్‌లో చేపడతారు. నిబంధనల ప్రకారమే సాగుతుంది. సింగిల్ టెండర్లు అంచనా విలువ కన్నా ఎక్కువకు వేస్తే రద్దు చేసి మళ్లీ పిలుస్తారు. తక్కువ వేసిన సందర్భంలో ఉన్నతాధికారుల సాంకేతిక నిర్ణయం మేరకు ఉంటుంది.

-సత్యనారాయణ, డీఈ, నిడదవోలు పురపాలక సంఘం

ఒక్కొక్కటే దాఖలైతే ఇలా...

● పురపాలక సంఘ కార్యాలయ పరిధిలోని మరుగుదొడ్లకు మరమ్మతులు చేసి, ఎదురుగా ప్రహరీ నిర్మించి షెడ్ ఏర్పాటుకు రూ. 6.50 లక్షలు మంజూరు చేయగా, అంచనా విలువ రూ. 5,19,695. దీనికి టెండర్ పిలవగా కేవలం 3 శాతం తక్కువకు ఒకటే దాఖలైంది. అంటే రూ. 5,04,104 పని జరుగుతుంది. ఈ మొత్తం అంచనా విలువ కంటే రూ. 15,591 మాత్రమే తక్కువ.

● పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో కార్పెట్ లాన్, మొక్కలతో పచ్చదనం పెంచి ఫ్లాగ్‌పోల్, మార్బుల్ విగ్రహంతో సుందరీకరణ పనులకు రూ. 9.80 లక్షలు మంజూరు చేశారు. ఈ పనుల అంచనా విలువ రూ. 7,81,318. దీనికి కూడా కేవలం 3 శాతం తక్కువకు సింగిల్ టెండర్ దాఖలైంది. అంటే అంచనా విలువ కన్నా తగ్గేది కేవలం రూ. 23,440 మాత్రమే.

కాకినాడలో ఘనంగా త్యాగరాజ స్వరార్చన

600 గళాలతో పంచరత్న పరవశం

గాంధీనగర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఎందరో మహానుభావులు.. అందరికీ వందనములు అంటూ త్యాగరాజ స్వామి పంచరత్న కీర్తనలు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 600 మంది ప్రముఖ సంగీత వాగ్గేయకారుల గళాల నుంచి వెలువడుతుండగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆధ్యాత్మిక ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు త్యాగరాజ వైభవం గురించి వివరించారు. త్యాగరాజస్వామి వర్ధంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం కాకినాడలోని ఆనందభారతి మైదానంలో భారీగా స్వరార్చన జరిగింది. సరస్వతి గాన సభ సంస్థ గౌరవాధ్యక్షురాలు పెద్దాడ సూర్యకుమారి, అధ్యక్షులు డాక్టర్ ముళ్లపూడి నాగేశ్వరరావు, జీవితకాల అధ్యక్షుడు కొమ్మిరెడ్డి శ్రీరామనర్సింగరావు, కార్యదర్శి వేపకాయల రామకృష్ణ, ఉపాధ్యక్షులు టిక్కు, నారాయణం మురళి తదితరుల పర్యవేక్షణలో గానసభ 122 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహించారు.

నకిలీ వే బిల్లులతో ఇసుక రవాణా

రెండు లారీల సీజ్

తాళ్లపూడి: నకిలీ వే బిల్లు ద్వారా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న రెండు లారీలను పట్టుకున్నట్లు భూగర్భ గనులశాఖ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. తాళ్లపూడి మండలం ప్రక్కిలంక వద్ద జిల్లా టాస్క్‌ఫోర్సు బృందంతో ఆదివారం తనిఖీలు చేపట్టామన్నారు. ఇసుక తరలిస్తోన్న వాహన డ్రైవర్లు చూపించిన వేబిల్లులపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను విజిలెన్స్ యాప్ ఫర్ సాండ్ బిల్లు ద్వారా స్కాన్ చేశామని, దీనికి సంబంధించి రాష్ట్రంలో ఇసుక నిర్వహణ వ్యవస్థ పోర్టల్‌లోనూ ఎటువంటి వివరాలు నమోదు ప్రదర్శించలేదన్నారు. దీంతో నకిలీ వే బిల్లులుగా నిర్ధరణ అయిందన్నారు. దీంతో రెండు ఇసుక లారీలను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌లో అప్పగించామన్నారు. శ్రీ గణేష్ బోట్స్‌మెన్ సాండ్ వర్కర్స్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఏపీఎస్ఎంఎస్ పోర్టల్ నుంచి ఆ సొసైటీని బ్లాక్ చేశామన్నారు. జిల్లా గనులు, భూగర్భశాఖ సర్వేయర్ పట్నాల శ్రీనివాసు, టాస్క్‌ఫోర్సు ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.

శత వసంతాల సేవా శిఖరం

డాక్టర్ శివరామకృష్ణారావును సత్కరిస్తున్న వైద్యులు, కుటుంబసభ్యులు

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: వైద్య రంగానికి డాక్టర్ శివరామకృష్ణారావు చేసిన సేవలు అజరామరమని ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ వైద్యులు, వక్తలు పేర్కొన్నారు. వైద్యుడిగా ఎందరికో సేవలందించి ప్రొఫెసర్‌గా ఎందరినో ఉత్తమ వైద్యులుగా తీర్చిదిద్దిన డాక్టర్ పట్నం శివరామకృష్ణారావు వందో జన్మదిన వేడుకలు రాజమహేంద్రవరంలోని ఓ హోటల్‌లో శిష్యబృందం, కుటుంబ సభ్యుల మధ్య ఆదివారం ఘనంగా జరిగాయి. విశాఖపట్టణం ఆంధ్రా వైద్యకళాశాల, గుంటూరు, కాకినాడ వైద్య కళాశాలల పూర్వ విద్యార్థులైన ప్రముఖ వైద్యనిపుణులు, హైదరాబాద్, కర్నూలు, విజయవాడ, రాజమహేంద్రవరం నగరాలకు చెందిన ఆయన శిష్యులు పెద్ద ఎత్తున హాజరై శివరామకృష్ణారావును సత్కరించారు. శివరామకృష్ణారావు నెల్లూరులో జన్మించినా రాజమహేంద్రవరంలో ఉంటున్న తన మనుమరాలు వద్ద స్థిరపడ్డారు. వివిధ ప్రాంతాలకు చెందిన వైద్య ప్రముఖులు డాక్టర్ సోమరాజు, డాక్టర్ ఐవీ రావు, డాక్టర్ బాబ్జీ, డాక్టర్ ఎస్‌కే అప్పారావు, డాక్టర్ పెదవీర్రాజు, డాక్టర్ గోలు రామారావు తదితరులు మాట్లాడారు. ఆయన శిష్యులు ఇప్పుడు దేశ విదేశాల్లో ప్రముఖ వైద్యులుగా రాణిస్తున్నారంటే అప్పట్లో ఆయన చేసిన దిశానిర్దేశమే కారణమన్నారు. డాక్టర్ వేదమణి, డాక్టర్ రామచంద్ర, డాక్టర్ నేమాని, ఆదాయ పన్నులశాఖ అధికారి పీవీ రామారావు, రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శోభనాథశాస్త్రి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, రౌతు వరుణ్, అడపా శ్రీహరి, మేడిశెట్టి తిరుమల కుమార్, ఎం.తాతారావు, శ్రీకన్య సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధనే విజయ మంత్రం

ఐఈఎస్‌లో మెరిసిన ఉదయభాను

శ్యామలా సెంటర్: ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీస్ (ఐఈఎస్)లో రాజమహేంద్రవరానికి చెందిన ఉదయభాను సాయి మాచరాజు మెరిశారు. 52వ ర్యాంకు సాధించి ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా ఆయన న్యూస్‌టుడేతో మాట్లాడారు. 'బీటెక్ పూర్తి చేసిన అనంతరం ఏపీట్రాన్స్‌కోలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా (మల్లయ్యపేట) కొలువు సాధించా. ఐఈఎస్‌కు సంబంధించి గతేడాది ఇంటర్వ్యూ వరకు వెళ్లా. నిరాశ చెందకుండా ఈ సారి కూడా ప్రయత్నించాను. ప్రతిరోజు కార్యాలయానికి వెళ్లి వచ్చిన తర్వాత కొంతసేపు సాధన చేశా. అయితే ఈసారి ఇంటర్వ్యూలో ఎలాగైనా విజయం సాధించాలనే కాంక్షతో మాక్ ఇంటర్వ్యూలు పదే పదే సాధన చేసి విజయం పొందా. ఇండియన్ రైల్వేస్ లేదా సెంట్రల్ పవర్ ఇంజినీరింగ్ సర్వీసెస్ (సీపీఈఎస్) విభాగంలో ఉద్యోగ అవకాశం రావచ్చు' అని పేర్కొన్నారు.

(c) eenadu

బౌండరీల మోత... సిక్సర్ల కూత..!

● ఉత్కంఠభరితంగా 'ఈనాడు క్రికెట్' పోటీలు

రాజానగరం, శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: బ్యాటర్లు సిక్సర్ల మోత మోగించారు. బంతి బంతికి బౌండరీలతో అభిమానులను అలరించారు. అంతర్జాతీయ క్రికెట్‌ను తలపించేలా ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ప్రెజెంట్స్) ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) 2025 క్రికెట్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. అప్పటివరకు గెలుపు అంచుల వరకు వెళ్లిన జట్లు ఒక్క బంతితో ఓటమిపాలైంది. ఓటమి దరిలో ఉన్న జట్లు చివరకు విజయతీరాలకు చేరాయి. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఈఎస్ఎల్ పోటీలు రెండో రోజైన ఆదివారం జట్లు హోరా హోరీగా తలపడ్డాయి.

ఆఖరి బంతికి అదృష్టం వరించి

మైదానం - 1లో ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ (కాకినాడ) - బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల కోనసీమ (భట్లపాలెం) మధ్య జరిగిన మ్యాచ్ ప్రేక్షకులను రంజింప చేసింది. తొలుత టాస్ గెలిచి బీవీసీ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఆదిత్య కళాశాల జట్టు నిర్ణీత 10ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన బీవీసీ జట్టు ఎనిమిది వికెట్లు కోల్పోయి 96 పరుగులు సాధించి విజయం సాధించింది. ఆట చివరలో 12 బాల్స్‌లో 20 పరుగులు చేయాల్సి రావడంతో బీవీసీ జట్టు ఒత్తిడికి గురై త్వరత్వరగా వికెట్లు కోల్పోయింది. చివరికి ఒక బంతికి రెండు పరుగుల లక్ష్యంతో విజయం సాధించాల్సి ఉంది. ఆ సమయంలో అందరూ ఊపిరి బిగపట్టి చూస్తున్న సమయంలో ఆఖరి బంతికి రెండు పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. దీంతో విజయానందంతో బీవీసీ జట్టు మైదానంలో ఆనందంతో కేరింతలు కొట్టారు.

విజయం సాధించిన బీవీసీ కళాశాల జట్టు

● ఆదివారం మధ్యాహ్నం ఐడియల్ కళాశాల ఆర్ట్స్ (కాకినాడ) X వికాస్ ఫార్మాస్యూటికల్ జట్లు తలపడాల్సి ఉండగా వికాస్ కళాశాల జట్టు రాకపోవడంతో న్యాయనిర్ణేతలు వాకోవర్ ఇచ్చి ఐడియల్ కళాశాల జట్టును విజయం సాధించినట్లుగా ప్రకటించారు.

వాకోవర్‌లో విజయం సాధించిన ఐడియల్ కళాశాల జట్టు

● మైదానం-2లో ఉదయం 8 గంటలకు చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, రంగరాయ వైద్య కళాశాల జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్‌లో రంగరాయజట్టు రాకపోవటంతో న్యాయనిర్ణేతలు వాకోవర్ ఇచ్చి చైతన్య ఇనిస్టిట్యూట్ ఇఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీని విజేతగా ప్రకటించారు.

వాకోవర్‌తో విజయం సాధించిన చైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కాకినాడ)

మ్యాచ్‌ను మలుపు తిప్పిన ఆ ఇద్దరు

మైదానం-1లో జీఎస్ఎల్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ (రాజమహేంద్రవరం), ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల జట్టు తలపడ్డాయి. జీఎస్ఎల్ జట్టు టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకుని నాలుగు వికెట్ల నష్టానికి 108 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రగతి కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 91 పరుగులు చేసింది. 17 పరుగుల ఆధిక్యంతో జీఎస్ఎల్ జట్టు విజయం సాధించింది. ఈ జట్టులో మధు 33 పరుగులు సాధించగా చంద్ర 6 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

విజయం సాధించిన జీఎస్ఎల్ కళాశాల జట్టు

33 పరుగులు సాధించి స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డేగా నిలిచిన మధు

3 వికెట్లు సాధించి స్టార్ క్రికెటర్ ఆఫ్ ది డేగా నిలిచిన చంద్ర

ఆది నుంచి తడబడి.. ఓటమిపాలై..

ఇదే క్రీడామైదానంలో ఉదయం 10గంటలకు ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల (సూరంపాలెం), ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పీజీ (రాజమహేంద్రవరం) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ఆదిత్య ఇంజినీరింగ్ జట్టు నిర్ణీత 10 ఓవర్లకు 8 వికెట్ల నష్టానికి 78పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నన్నయ యూనివర్సిటీ జట్టు మొదటి ఓవర్ నుంచే వికెట్లు కోల్పోవటం ప్రారంభించింది. 5 ఓవర్లు అయ్యే సమయానికి ఏకంగా 5 వికెట్లు కోల్పోయి కేవలం 30 పరుగులు మాత్రమే చేసి పీకల్లోతు కష్టాల్లో పడింది. తర్వాత వచ్చిన బ్యాటర్లు మ్యాచ్‌ను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంలో కేవలం 56 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలయ్యారు.

విజయం సాధించిన ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల జట్టు (సూరంపాలెం)



▲ గోరంట్ల శాంతారావు ఫౌండేషన్ (జీఎస్ఆర్) వారు అంబులెన్స్ సమకూర్చారు.

నేటి మ్యాచ్‌లు (29.12.2025)

గ్రౌండ్ - 1

ఉదయం 8 గంటలకు: కిట్స్ కళాశాల దివిలి (కాకినాడ) X ఐడియల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (కాకినాడ) ● ఉదయం 11 గంటలకు: బీవీసీ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం) X బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల (అమలాపురం). ● మధ్యాహ్నం 2 గంటలకు: కైట్ ఇంజినీరింగ్ కళాశాల (కాకినాడ) X ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పెరుమాళ్లపురం (కాకినాడ).

గ్రౌండ్ - 2

ఉదయం 8 గంటలకు: జీఎస్ఎల్ వైద్య కళాశాల (రాజమహేంద్రవరం) X ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల (కాకినాడ). ● ఉదయం 11 గంటలకు: సైన్స్ డిగ్రీ కళాశాల (కాకినాడ) X గైట్ ఇంజినీరింగ్ కళాశాల (రాజమహేంద్రవరం).

రేపటి మ్యాచ్‌లు (30.12.2025)

గ్రౌండ్ - 1

ఉదయం 8 గంటలకు: ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాల (జేగురుపాడు, కాకినాడ) X ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం). ● ఉదయం 11 గంటలకు: ఎస్ఏపీఎం డిగ్రీ కళాశాల(సఖినేటిపల్లి, కోనసీమ) X ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం యూజీ (రాజమహేంద్రవరం) ● మధ్యాహ్నం 2 గంటలకు: జేఎన్‌టీయూ(కాకినాడ) X బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల(రామచంద్రపురం).

గ్రౌండ్ - 2

ఉదయం 8 గంటలు: ప్రభుత్వ డిగ్రీ కళాశాల (తుని) X ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (రాజమహేంద్రవరం) ● ఉదయం 11 గంటలు: పైడా ఇంజినీరింగ్ కళాశాల(కాకినాడ) X బీహెచ్ఎస్ఆర్, వీఎల్ఎం డిగ్రీ కళాశాల (రాజమహేంద్రవరం).

2009 బ్యాచ్ ఎస్సైల ఆత్మీయ సమ్మేళనం

● సహచరుల కుటుంబాలకు రూ.8.20 కోట్ల ఆర్థిక సాయం

కడియం, న్యూస్‌టుడే: వారంతా ఒకేసారి ఉద్యోగం సాధించారు.. శిక్షణ పొందారు.. ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. అంతా కలుసుకుని ఆత్మీయ ఆలింగనాలు, సరదా కబుర్లు, స్వీయచిత్రాలు తీసుకుని సందడి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో ఎస్సై(సివిల్) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కడియంలో జరిగింది. వాళ్ల స్నేహబంధం ఎప్పటికీ కొనసాగేలా 2021లో ఏపీ, తెలంగాణ ఎస్సై 2009 బ్యాచ్ పేరిట సంక్షేమ సంఘాన్ని స్థాపించారు. నాటి నుంచి నేటి వరకూ ఏటా డిసెంబరు రెండోవారంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుంటున్నారు. 2014లో ఆంధ్ర, తెలంగాణ విడిపోయిన తర్వాత కూడా సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. సుమారు 1,140 మంది ఎస్సైలుగా తర్ఫీదు పొందగా, అందులో 400 మంది ఆదివారం రాజమహేంద్రవరంలో కలిశారు. వీరిలో 80 మంది ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్నారు. వీరంతా ప్రస్తుతం సీఐలుగా పదోన్నతి పొందారు. వీరంతా నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. ఇప్పటి వరకూ ఈ బ్యాచ్‌లో మృతిచెందిన వారికి సంబంధించిన కుటుంబాలకు రూ. 8.20కోట్ల సాయం చేసినట్లు తెలిపారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు బ్యాచ్ అడ్మిన్ జి.శ్రీనివాసరావు వివరించారు. సమ్మేళనానికి కడియం, ధవళేశ్వరం, రాజానగరం, అనపర్తి సీఐల సహకారం మరువలేనిదన్నారు.

కడియంలో సమావేశమైన 2009 ఎస్సై (సివిల్) బృంద సభ్యులు

సమగ్ర సామాజిక అభివృద్ధే లక్ష్యం

గాంధీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సాంఘిక సంక్షేమం, సమగ్ర సామాజిక అభివృద్ధి లక్ష్యంగా కమ్మ కార్పొరేషన్ విశేషంగా కృషి చేస్తోందని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి పేర్కొన్నారు. ఆదివారం ఉదయం కాకినాడలోని కమ్మ కల్యాణ మండపంలో ఉమ్మడి తూగో జిల్లా కమ్మ మహాజన సంఘ సర్వసభ్య సమావేశాన్ని జాస్తి మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏపీ కాకతీయ సమాఖ్య అధ్యక్షకార్యదర్శులు కొడాలి వెంకట సుబ్బారావు, బెజవాడ వెంకట్రావు మాట్లాడుతూ సభ్యులంతా కలిసిమెలిసి ఉండాలన్నారు. కార్యదర్శి నెక్కంటి శ్రీనివాస్, కాటూరి ప్రసాద్, గారపాటి రాయుడు తదితరులు జిల్లాలో కమ్మ సంఘ కార్యక్రమాలపై చర్చించారు. మధ్యాహ్నం శ్రీచారిటబుల్ సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన ఇంజినీరింగ్, మెడికల్ విద్యార్థులు 82 మందికి రూ.17 లక్షల ఉపకార వేతనాలు అందించారు. బ్రహ్మంచౌదరి మాట్లాడుతూ కమ్మ సామాజికవర్గ సంక్షేమంతోపాటు, రాష్ట్రంలో బలహీన వర్గాలకు కూడా చేయూత నివ్వడమే కమ్మ కార్పొరేషన్ ధ్యేయమన్నారు. గారపాటి కల్యాణ్, చందలాడ పద్మరాజు, గుణ్ణం వెంకట్రావు, గరికిపాటి సూర్యనారాయణ, వంటిపల్లి పాపారావు, రిమ్మలపూడి నారాయణ, మేకా లక్ష్మణమూర్తి, బోళ్ల కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.


కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బ్రహ్మంచౌదరితోపాటు సంఘాల ప్రతినిధులు

విద్యార్థులకు ఉపకార వేతనాలు బ్రహ్మంచౌదరి చేతుల మీదుగా అందిస్తున్న ప్రతినిధులు

ఐ బ్యాంకు సేవలు గర్వకారణం

గాంధీనగర్: తెలుగు రాష్ట్రాల్లోని నాలుగు ప్రధాన ఐ బ్యాంకుల్లో బాదం బాలకృష్ణ ఐబ్యాంకు ఉండటం గర్వకారణమని డీఎంహెచ్‌వో నరసింహనాయక్ అన్నారు. ఆదివారం ఐ బ్యాంకు 19వ వార్షికోత్సవం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ డీపీఎం డాక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ పూర్తిస్థాయి సిబ్బంది, పరికరాలతో పనిచేస్తుండడం విశేషమన్నారు. ఐ బ్యాంకు ద్వారా చూపుపొందిన కొందరు కార్నియా గ్రహీతలను కార్యదర్శి బాలకృష్ణ సభకు పరిచయం చేయగా నేత్రదాతల కుటుంబసభ్యులు వారిలో తమ వారి నేత్రాలు చూసుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఐ బ్యాంకు ఛైర్మన్ డాక్టర్ దామెర విజయలక్ష్మి, కోశాధికారి దాసరి సాయికృష్ణ, ట్రస్టీలు పాపారావు, కనకరాజు, డాక్టర్ రావుల శ్రీరామ్, సూర్యారావు, పైడా వెంకటనారాయణ, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరసింహనాయక్

శ్రీవారి క్షేత్రం.. ప్రగతి పథం

▲ పాలక మండలి ప్రమాణ స్వీకారం నేడు

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేశారు. ఛైర్మన్‌గా ఆత్రేయపురానికి చెందిన ముదునూరి వెంకటరాజుతోపాటు 18 మంది సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ట్రస్టు బోర్డులో తెలంగాణ, రాయలసీమ లోని జిల్లాలకు కూడా స్థానం కల్పించారు. ఒంగోలు, పశ్చిమ, తూర్పు, కాకినాడ తదితర జిల్లాలతోపాటు తెలంగాణ తదితర ప్రాంతాలకు చెందిన పలువురు ప్రముఖులు రానున్నారు. ఛైర్మన్ పదవికి రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు ముమ్మర ప్రయత్నాలు చేశారు. గతంలో ఛైర్మన్లు ముదునూరి రాజగోపాలరాజు, నంబూరి రామరాజు, చిలువూరి రామకృష్ణంరాజు, కూనాదిరాజు రంగరాజు, చేకూరి కృష్ణంరాజు, పచ్చమట్ల రాజగోపాల్‌రాజు, తోటకూర సుబ్బరాజు, కరుటూరి నరసింహారావు, రుద్రరాజు రమేష్‌రాజు తదితరులు ఆలయ అభివృద్ధికి పాటుపడ్డారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరగా రూ.7 కోట్లు మంజూరు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా రాకపోకలకు ఇబ్బంది లేకుండా కొత్త వంతెన నుంచి నాలుగు వరుసల రహదారిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే పలు పనులు జరుగుతున్నాయి. ఆలయానికి సంబంధించి బృహత్తర ప్రణాళిక అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు.

తిరుపతి తరహాలో అభివృద్ధికి కృషి



భవిష్యత్తులో భక్తులకు ఎటువంటి ఇబ్బందు లేకుండా పాలక మండలి సభ్యుల తోపాటు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, సంబంధిత మంత్రి, అధికారుల సహకారంతో ఆలయాన్ని తిరుపతి తరహాలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా. ముఖ్యంగా వసతి గదులు, డార్మిటరీ, కంపార్టుమెంట్ సౌకర్యం, రోడ్డు విస్తరణ వంటి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– ముదునూరి వెంకటరాజు, ఛైర్మన్

శాంతి ఆశ్రమం పీఠాధిపతిగా వినమ్రానంద సరస్వతి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు మండలంలోని తోటపల్లిలోని శ్రీశాంతి ఆశ్రమం పీఠాధిపతిగా వినమ్రానంద సరస్వతి వ్యవహరిస్తారు. పీఠాధిపతిగా ఉండే జ్ఞానేశ్వరి మాతాజీ పరమపదించాక ఆశ్రమ బాధ్యతలు వినమ్రానంద స్వీకరించారు. ఏటా జనవరి 21న జరిగే ఆశ్రమ వ్యవస్థాపకులు ఓంకారస్వామి జయంతికి వచ్చే రుషికేశ్ చిదానంద స్వామీజీ ఆశీస్సులు కోసం తన తండ్రితో భువనేశ్వర్ నుంచి ఆమె వచ్చేవారు. జ్ఞానేశ్వరి మాతాజీకి చేరవయ్యారు. ఆమె మార్గదర్శనంలో చిత్తూరులోని చిన్మయ మిషన్ శారదాప్రియానంద సరస్వతి వద్ద సన్యాసాశ్రమానికి సంబంధించిన శిక్షణ పొందారు. పదేళ్ల కిందటే ఉత్తరాధికారిగా ఆశ్రమ నిర్వహణలో మాతాజీకి అన్నింటా చేదోడుగా ఉండేవారు. ఆరు శాఖలు ఉన్న మాతృఆశ్రమానికి పీఠాధిపతిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph: 81422 92071.

బంగారం బ్యాంకులలో, ముత్తూట్, మనప్పురం ఏ ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి, ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 9849138626.

శ్రీసాయిగోల్డ్: తాకట్టులో ఉన్న బంగారం, ఏబ్యాంక్/ ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి, ఆరోజు మార్కెట్ రేట్‌కి కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 94933 38823.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

రాజమండ్రి గాడాల లోరల్ స్కూల్‌కు ఎదురుగా E/F 2BHK ఇండిపెండెంట్ హౌస్ రెడిటు ఆక్యూపై 37 లక్షలు మాత్రమే. 90% బ్యాంక్‌లోన్. Note: IT రిటర్న్స్, శాలరీ స్లిప్స్ అవసరం లేదు. ✆89190 84655, 98850 28899

TO LET

కోనసీమ జిల్లా, అమలాపురం- P.గన్నవరం మెయిన్‌రోడ్ ఫేసింగ్ 20x90=1800 Sft. బిల్డింగ్ Showroom, Banksకు అద్దెకు. ✆ 9949328440, 8919131853

JOBS

Wanted Civil Engineers & Supervisors, 3-5 yrs Exp in Buildings & CC Road Works. @ Gokavaram (A.P). Ph No:8888838677, 9422135347.

EENADU eClassifieds

Wanted B.Com/ M.Com/ MBA Finance/CA IPCC Dropouts to be Work as Field Executive in Tuni in a Reputed Audit Firm. Interested Persons (Male Only) ✆ 70135 11502 or mail: kowthahr@gmail.com.

కొత్తగా ఇంటర్నెట్ బాక్సులు వేయుటకు 10 మంది ఫీల్డ్ స్టాఫ్ కావలెను. నెలకు 15K (12+3). వేద నెట్, సత్యవతినగర్, కొవ్వూరు, కాంటాక్ట్ సెల్: 99899 55770.

నిడదవోలు శంకరాపురం గ్రామంలో హృదయాలయం ఆశ్రమంలో పని చేయుటకు వంటపని చేయుటకు వంటవారు కావలెను. స్త్రీలు మాత్రమే. ఫోన్: 94409 42148, 94418 76034.

డొమెస్టిక్ కార్గో కొరియర్ సర్వీసెస్ లలో వర్క్ చేయుటకు కస్టమర్ సర్వీసెస్ సూపర్‌వైజర్స్ కావలెను. జీ: 23000 టు 29000. వ:18-35. ✆ 77309 58410.

మా ఆఫీసు నందు టెలికాలర్స్, సిస్టమ్ ఆపరేటర్స్, ఇన్‌ఛార్జీలు, క్యాషియర్స్, Male, Female కావలెను. Ph. No: 96423 75791.

రాజమండ్రి, అనకాపల్లిల్లో ప్రా॥కం॥ & ప్రాజెక్టుల్లో సె॥గార్డ్స్, సూపర్‌వైజర్స్, ఆయాలు స్త్రీ/పు॥, జీ: 12 to 15 వేలు, రూం+బో॥. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, RJY. ✆ 9392269369.

కడియపులంకలో కొత్తగా నిర్మించిన BPCL పెట్రోలుబంకులో చేయుటకు ఆఫీస్ స్టాఫ్ (M/F), అర్హత: డిగ్రీ/ ఇంటర్ + కంప్యూటర్ పరిజ్ఞానం, పంప్ బాయ్స్ కావలెను. అనుభవమున్న వారికి ప్రాధాన్యత. ఇంటర్వ్యూ: ది.30-12-25 మంగళవారం 11 am to 3:30 pm ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు, పాన్‌కార్డు, బయోడేటాతో బంపవద్దకు రావలెను. ✆ 83095 49958.

వర్క్‌ఫ్రంహోమ్ డేటాఎంట్రీ: ఇంటి పట్ల ఉండి పార్ట్ / ఫుల్ టైంప్రాజెక్ట్ వర్క్ చేయుటకు Laptop/ Desktop, స్మార్ట్‌ఫోన్ ఉన్నవారు కావలెను. ✆ 95534 29994.

MARKETING/ SALES

360 Clean Company - FMCG Field Sales Executive, min. exp. 2 years - Call: 91009 40494.

EENADU for Advertisement Contact: 8008597607

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-65 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	17,000
పాతకాయ: గండేరా	27,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి): పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,000-14,000
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	135-00
రిటైల్ లైవ్	162-00
డ్రెస్డ్	235-00
స్కిన్‌లెస్	267-00

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

కరప: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న స్నేహితుడి కుటుంబానికి ఆర్థికంగా చేయూతనిచ్చి ఆదర్శంగా నిలిచారు కరపకు చెందిన సహచర మిత్రులు. కరప జడ్పీ ఉన్నత పాఠశాలలో 1990-91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులలో ఒకరైన బత్తుల వీరవెంకట సత్యనారాయణకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె కిడ్నీ సమస్యతో మూడేళ్ల క్రితం మృతి చెందింది. చిన్నకుమార్తె కూడా అదే సమస్యతో బాధపడుతుంది. తనకు డయాలసిస్ చేయిస్తూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సత్యనారాయణకు తన స్నేహితులంతా రూ.3.58 లక్షలు సేకరించి ఆదివారం స్థానిక పాఠశాలలో అందజేశారు. కార్యక్రమంలో కె.వల్లిబాబు, పెదిరెడ్డి శ్రీరామకృష్ణ, దేవు వెంకటేశ్వరరావు, కూనపురెడ్డి వీర్రాజు, పెంకే సత్తిబాబు, ప్రసన్నకుమార్, పడాల బాబి తదితరులు పాల్గొన్నారు.

నగదును అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ర్యాలిలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

ఆత్రేయపురం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఈ నెల 30న ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో స్వామివారు ఉత్తర ద్వారం నుంచి దర్శనమిస్తారని దేవస్థానం ఛైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి తెలిపారు. తెల్లవారుజాము 3 గంటలకు పంచామృతాభిషేకం, ధూపసేవ, పంచహారతులు, వేదపారాయణం, ఉదయం 9 గంటలకు కోలాట ప్రదర్శన, 11 గంటలకు విష్ణు లలిత మణిద్వీప పారాయణం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు.

కిమ్స్‌లో క్రిస్మస్ వేడుకలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలోని కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో ఆదివారం సాయంత్రం క్రిస్మస్ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఆసుపత్రి సీఈవో డాక్టర్ ఎస్ఎస్ రామరాజు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వర్ణ రామ్మోహన్ తదితరులు కేకు కోసి సంబరాలు నిర్వహించుకున్నారు. యంగ్ హోలీ టీం డైరెక్టర్ జాన్ వెస్లీ క్రిస్మస్ సందేశాన్నిచ్చారు. ఆసుపత్రి ప్రతినిధులు, వైద్యులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత డీఎస్పీ నామగిరి బాబ్జీ, సామాజిక వేత్త సాల్మన్‌రాజు, పీసీసీ సభ్యుడు జి.జాన్సన్, ఏఈఎల్‌సీ సభ్యులు, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

వేడుకల్లో డాక్టర్ రామరాజు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వర్ణ రామ్మోహన్ తదితరులు

92.7 FM Rajamahendravaram
92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

అపూర్వం.. ఆత్మీయం

● కాకినాడ మెక్లారిన్‌లో 51 ఏళ్లకు కలిసిన విద్యార్థులు

గాంధీనగర్: చిన్ననాటి సంగతులు గుర్తు చేసుకుంటూ వారంతా బాల్య స్నేహితులతో ఆనందంగా గడిపారు. కాకినాడలోని మెక్లారిన్ పాఠశాలలో 1973-74లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలోనే నిర్వహించారు. దేశవిదేశాల్లో స్థిరపడినవారంతా, వివిధ వృత్తుల్లో ఉద్యోగ విరమణ చేసినవారు ఒకచోట చేరి సందడి చేశారు. నాటి ఉపాధ్యాయుడు సూర్యప్రకాశరావు, పూర్వ విద్యార్థులు చొల్లంగి వీరబాబు, డాక్టర్ మెట్ట వెంకటేష్, సీతాపతి మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలలో మళ్లీ కలుసుకునేందుకు రెండేళ్లుగా ప్రయత్నించామన్నారు. గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించుకున్న ఏకైక బ్యాచ్ తమదన్నారు. పాఠశాలను ప్రభుత్వం అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లను కోరారు. మహమ్మద్, బలరామ్, రవి, నాగేశ్వరరావు, సయ్యద్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

1973-74లో పదో తరగతి చదివిన విద్యార్థుల బృందం

మోసగించిన వ్యక్తి అరెస్టు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ఓ కంపెనీని మోసగించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై వీరప్రసాద్ కథనం మేరకు.. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఓ ప్రైవేటు కంపెనీ (ఐఎఫ్ఎల్ గ్రీన్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్)లో ఛైర్మన్‌గా బొమ్మగాని బాలకృష్ణ, సభ్యులుగా తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టకు చెందిన వీరంకి శ్రీరాములు, వంకాయల సతీశ్, జంగారెడ్డిగూడేనికి చెందిన మండపాక వినోద్‌కుమార్ ఉన్నారు. అయితే సదరు సభ్యులు కంపెనీ నుంచి బయటకు వచ్చి అదే తరహాలో పేరు వచ్చేలా మరో ప్రైవేటు కంపెనీ ఏర్పాటు చేసుకుని బాలకృష్ణకు చెందిన ఖాతాదారులను మోసగించి వసూళ్లకు పాల్పడ్డారు. ప్రశ్నించిన బాలకృష్ణను బెదిరించడంతో ఆయన గతంలో జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. కాగా సభ్యులు వంకాయ సతీశ్, మండపాక వినోద్‌కుమార్‌లను అక్టోబర్ నెలలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే అప్పటి నుంచి ప్రధాన నిందితుడు శ్రీరాములు పరారీలో ఉండగా.. ఆదివారం జీలుగుమిల్లి చెక్‌పోస్టు వద్ద ఆయన్ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

(c) eenadu

రాజమహేంద్రవరం

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ నరసింహకిశోర్ హెచ్చరించారు. కోడి పందేలు, జూదం, గుండాట తదితర జూద క్రీడలపై ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే సీతానగరం, కొవ్వూరు, నల్లజర్ల పోలీసుస్టేషన్ల పరిధిలో జూద శిబిరాలపై దాడులు చేసి 23 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. 200 కోడి కత్తులు, వాటి తయారీకి వినియోగించిన యంత్రాలను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశామన్నారు.

జనార్దనస్వామికి గరుడవాహనం అందజేత

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: ధవళగిరిపై కొలువైన జనార్దన స్వామి వారికి శీలంశెట్టి సత్యనారాయణమూర్తి జ్ఞాపకార్థం ఆయన భార్య సత్యవతి ఆదివారం గరుడవాహనం అందజేశారు. రూ.1.25లక్షల విలువైన ఇత్తడి గరుడ వాహనాన్ని ఆలయ అధికారులకు అందించారు. సంప్రోక్షణ చేసి ఉత్సవమూర్తులను ఆశీనులను చేసి పూజలు నిర్వహించారు. శీలంశెట్టి నారాయణమూర్తి దంపతులు, ఆలయ ఛైర్మన్ దాసరి చిన్న తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ఉ. 10 - మ. 1
83282 39927, 80089 02897
95735 25987, 83416 88010

సమస్య: క్వారీ ఏరియా నుంచి కంబాలచెరువు వరకూ ప్రధాన కాలువలో చెత్త పేరుకుపోవడం వల్ల నీరు రోడ్లపై చేరుతోంది. - రఘురాం

సమాధానం: ప్రధాన కాలువల్లో తరచూ పూడిక తీసే ప్రక్రియ చేపడతాం. కాలువల్లో చెత్త వేయడం వల్ల ఇబ్బంది ఏర్పడుతుంది. - వినూత్న, ఎంహెచ్‌వో

సమస్య: ఇన్నీసుపేటలో కాలువల్లో పూడిక పేరుకుపోయింది. దుర్వాసనతో ఇబ్బంది ఏర్పడుతుంది. - సునీత

సమాధానం: సిబ్బంది పంపి శీలించి, పూడిక తొలగిస్తాం. - వినూత్న, ఎంహెచ్‌వో

మూత ఏర్పాటు — స్పందనకు వందనం

సీతంపేట మున్సిపల్ పాఠశాల రోడ్డులో ప్రధాన రహదారి మలుపులో మూతలేని మ్యాన్‌హోల్‌తో పాదచారులు, వాహనదారులు భయాందోళనకు గురయ్యేవారు. దీనిపై ఈ నెల 19న 'ఈనాడు'లో 'మూతలేని మ్యాన్‌హోల్' శీర్షికన చిత్ర వార్త ప్రచురితమైంది. సంబంధిత శాఖ వారు స్పందించి నూతన మూత ఏర్పాటు చేశారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

అర్ధశతాబ్ది.. ఆత్మీయతే లబ్ధి

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గురువుకు సత్కారం చేస్తున్న పూర్వ విద్యార్థులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఓనమాలు నేర్పిన బడి.. వారి భవితకు చుక్కాని అయింది. ఇక్కడే చదివి.. వ్యాపార, ఉద్యోగాల్లో దేశ విదేశాల్లో రాణిస్తున్నారు. అర్ధశతాబ్దమైనా తమ ఉన్నతికి బాట వేసిన బడిని మరవలేదు వీరు. ఆంగ్లేయుల కాలంలో రాజమహేంద్రవరం నగరంలోని మంగళవారపుపేటలో ప్రారంభించిన ప్రభుత్వ బాలుర పాఠశాల గోదావరి తీరానికి చేరింది. 1971 - 1976 ఏడాదిలో విద్యనభ్యసించిన పూర్వవిద్యార్థులు మూడురోజులపాటు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి సందడి చేశారు.

బడి రుణం తీర్చుకోలేనిది



రాజమహేంద్రవరం ప్రభుత్వ బాలుర పాఠశాలలో చదువుకున్నా. మూడేళ్లపాటు ముంబయిలో ఓఎన్‌జీసీలో పనిచేశా. 17 ఏళ్లుగా యూఎస్ ఫెడరల్ గవర్నమెంట్‌కు అడ్వైజర్‌గా పనిచేస్తున్నా. ప్రస్తుతం ఏతకామ్ ఫెడరల్ ప్రోగ్రామ్ కోసం కాలుష్య కారకాలకు సంబంధించిన ప్రాజెక్టుకు వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నాను. నా భవితకు చక్కటి బాటలు వేసిన బడి రుణం ఎప్పటికీ తీర్చుకోలేను. పాఠశాల అభివృద్ధిలో భాగస్వామి అవుతున్నందుకు సంతోషంగా ఉంది.
- మాడభూషి శ్రీరామ్, భూవిజ్ఞాన శాస్త్రవేత్త, అమెరికా

మార్గదర్శకంగా నిలిచిన గురువులు

ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవడం అదృష్టమని చెప్పాలి. ఉపాధ్యాయులు ఎంతో చక్కటి విద్యను నేర్పించి మా భవితకు మార్గదర్శకంగా నిలిచారు. వైద్యవిద్యను ఇష్టంతో గుంటూరులో ఎంబీబీఎస్, చండీఘర్‌లో పీజీ పూర్తి చేసి 32ఏళ్లుగా వైద్య సేవలో నిమగ్నమై వేలాది మందికి సేవలందించాను. నా వృత్తి పట్ల బాధ్యతగా మెలగడానికి పాఠశాలలో నేర్చుకున్న క్రమశిక్షణే కారణం. ఇదే పాఠశాలలో చదువుకున్న వేలాది మంది విద్యార్థులు నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి చెందారు.
- డాక్టర్ కె.వి.రామకృష్ణ ప్రసాద్, ఛండీగఢ్

పాఠశాల అభివృద్ధికి సహకారం

ఫార్మసీ విద్యారంగం ఉన్నతంగా ఉండాలనే ఆకాంక్షతో కృషి చేసి విజయం సాధించా. 2008లో రాజమహేంద్రవరంలో వికాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌ను స్థాపించి గ్రామీణ, నగర విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించాం. ప్రభుత్వ బాలుర పాఠశాలలో నేర్చుకున్న క్రమశిక్షణ, చక్కటి విద్య నా ఉన్నతికి మార్గదర్శకంగా నిలిచాయి. పాఠశాల అభివృద్ధికి మా వంతు సహకారం అందిస్తున్నాం.
- టి.వి.నారాయణరావు, బెంగళూరు

పునాది పడింది ఇక్కడే

నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ బాలుర పాఠశాల ఉపాధ్యాయుల ఘనత. నేను ఉన్నత స్థానంలో రాణించడానికి పునాది పడింది ఇక్కడే. ఫ్రాన్స్‌లో పోస్ట్ డాక్టోరల్ పరిశోధన చేశా. డైమండ్ ఆధారిత, ఎలక్ట్రానిక్ పదార్థాలపై దృష్టి సారించి క్వాంటమ్ మెటీరియల్స్ అంశంలో పని చేస్తున్నా. గోదావరి తీరంలో ఎప్పుడూ మా పాఠశాల ప్రత్యేకం. 50ఏళ్ల మా స్నేహం ఇలా టికే భద్రంగా ఉంది.
- ఎం.ఎస్.రామచంద్రరావు, చెన్నై

సౌకర్యాలు కల్పిస్తాం

ప్రభుత్వ బాలుర పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేశాక జూనియర్ కళాశాలలో ఇంటర్, కాకినాడ జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ చేశా. ఉద్యోగరీత్యా ఎక్కడ పనిచేస్తున్నా చిన్నతనంలో చదువుకున్న బాలుర పాఠశాల గురించే ఆలోచించేవాణ్ని. పాఠశాలకు ఆర్‌ఓ ప్లాంట్ ఇచ్చా. 1971 - 76 బ్యాచ్ ద్వారా 50బెంచీలు అందజేశాం. పాఠశాలలో అవసరమైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నాం.
- పి.పి.బి.ఆనంద్, హైదరాబాద్

సమష్టిగా ముందుకెళ్లాలి

సత్కారం పొందిన దేవాంగ సంఘం సభ్యులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అల్లంకి మణికంఠ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ మండల పరిషత్ పాఠశాల వద్ద గణపతి ఆలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. దేవాంగ సంఘం నుంచి ఇటీవల ఉన్నత పదవులు పొందిన సభ్యులకు చిరుసత్కారం చేశారు. సంఘం గౌరవ సలహాదారు నల్లా రామారావు, అధ్యక్షుడు అల్లంకి మణికంఠ మాట్లాడారు. సంఘ సభ్యులంతా సమష్టిగా ముందుకెళ్లాలన్నారు. డాక్టర్ బళ్లా శ్రీనివాసరావు రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులుగా, కాలెపు సాయిరామ్ భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, పిచ్చుక అనిల్ కుమార్ ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాజమహేంద్రవరం యూనిట్ అధ్యక్షులుగా, ఆశపు శ్రీనివాస్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా, కొండపల్లి శ్రీదేవి జాంపేట ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ డైరెక్టర్‌గా పదవులు చేపట్టడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

హుకుంపేట సొసైటీకి పురస్కారం

బొమ్మూరు(హుకుంపేట): హుకుంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి అవార్డు లభించింది. ఆదివారం గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పురస్కారాలు ప్రదానం చేశారు. సంఘ ఛైర్మన్ బొప్పన శ్రీనివాస్, సీఈవో బొడ్డేడ రాంబాబు తీసుకున్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఎన్.రఘురాం, అడిషనల్ రిజిస్ట్రార్ ఆనంద్‌బాబు, సొసైటీ సభ్యుడు ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు. ఆ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ హుకుంపేట సొసైటీకి అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.

హారతి వైభోగం

గోదారమ్మకు హారతి సమర్పిస్తున్న పండితులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిత్యహారతి వేడుక వైభవంగా జరిగింది. ఆదివారం సాయంత్రం గోదారమ్మకు 14 రకాల హారతులను శాస్త్రోక్తంగా సమర్పించారు. సెలవు రోజు కావడంతో నగరవాసులు పెద్ద సంఖ్యలో హాజరై తిలకించారు.

ముగిసిన కార్నివాల్

పాటలు పాడుతున్న గాయకులు జయంత్, స్వాతి, మమన్, వైష్ణవి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, ఏవీఏ రోడ్డు: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య మైదానంలో కార్నివాల్ వేడుకలు ముగిశాయి. మ్యూజిక్ ఫన్ గేమ్స్ విధానంలో కార్నివాల్ నిర్వహించారు. ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు తరలిరావడంతో మైదానం సందర్శకులతో నిండిపోయింది. కాగా సాయంత్రం మ్యూజికల్ హంగామా సాగింది. సరిగమ ఫేమ్ స్వాతి, పాడుతాతీయగా ఫేమ్ మమన్, ఇండియన్ ఐడిల్ ఫేమ్ వైష్ణవి, జయంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీ గానాలతో అలరించారు. అలనాటి మేటి పాత చిత్రాల్లో పాటలను ఇప్పటి సంగీత నైపుణ్యంతో చక్కగా పాటి వినిపించారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా పిండి వంటల స్టాల్స్ ఏర్పాటు చేశారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఇంటి వంటల పేరుతో ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. కమిషనర్ రాహుల్ మీనా నేతృత్వంలో అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. నగర ప్రముఖులు వేడుకల్లో పాల్గొని సందడి చేశారు.

నగర అభివృద్ధికి ప్రణాళిక : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్

టి.నగర్, న్యూస్‌టుడే: నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం 9వ డివిజన్‌లో రూ 65 లక్షలతో తలపెట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక నగరంలో సమస్యలపై దృష్టి సారించామన్నారు. ముంపు సమస్యతోపాటు, రోడ్ల విస్తరణ, పార్కుల ఆధునికీకరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో హంగులు, ఆర్భాటాలకు ప్రజల సొమ్మును వృథా చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని రక్షించాలి

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: ధర్మాన్ని రక్షిస్తే ధర్మం మనల్ని రక్షిస్తుందని ఇస్కాన్ మాజీ ఛైర్మన్ పరవస్తు సత్యగోపీనాథ్‌దాస్ ప్రభూజీ పేర్కొన్నారు. ఆదివారం ధవళేశ్వరం రథం వీధిలో జరిగిన హిందూ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించాలని సూచించారు. చిన్నారులకు మన సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చాలని, రాముడు, కృష్ణుడులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, వేషధారణలు ఆకట్టుకున్నాయి. అధ్యక్షుడు వేగిశెట్టి కోదండ రామారావు, పండూరి అప్పారావు, ఒండెద్దు స్వామి, గుర్రాల వెంకటరావు, సాధనాల శివ తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల శ్రమదానం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం, యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సభ్యులతో కలిసి కాతేరు ఇండస్ట్రియల్ కాలనీ సచివాలయంలో స్వచ్ఛభారత్, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఉదయం జరిగిన కార్యక్రమంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి చెత్త, గడ్డి మొక్కలను తొలగించారు. సచివాలయ ప్రాంగణంలో పది అడుగుల ఎత్తైన 20 మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ అధికారులు జి.వి.ఎస్. నాగేశ్వరరావు, పోలుకొండ సాయి, బి.విమల, బి.రమాదేవి నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో స్థానిక నాయకులు జక్కంపూడి నాగ కొండలరావు, మాచిరెడ్డి చిన అప్పలనాయుడు, సుధాకర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నవతేజకు ఉద్భవ్‌రత్న అవార్డు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: యూత్ గేమ్స్ కౌన్సిల్ ఇండియా (వైజీసీఐ) ఆధ్వర్యంలో ఈనెల 24 దిల్లీలో జరిగిన వైజీసీఐ జాతీయ క్రీడల అవార్డ్సులో రాజమహేంద్రవరానికి చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు అనసూరి నవతేజ ఉద్భవ్ రత్న అవార్డును అందుకున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచినందుకు ఈ అవార్డు వచ్చిందన్నారు.

అరకొర వైద్యసేవలతో సరి

ఈఎస్ఐ ఆసుపత్రిలో తప్పని వెతలు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం : రాజమహేంద్రవరం నగరంలోని ప్రభుత్వ కార్మిక రాజ్య బీమా ఆసుపత్రి(ఈఎస్ఐ)లో వైద్య సేవలు మెరుగుపడటంలేదు. వంద పడకల స్థాయిలో ఆధునిక భవనం అందుబాటులోకి వచ్చినా దానికనుగుణంగా సిబ్బంది, అత్యాధునిక వైద్యపరికరాలు మాత్రం సమకూరడం లేదు. చందాదారులైన కార్మికులు, వారి కుటుంబ సభ్యులు కలిపి లక్షలాది మందికి వైద్య సేవలందించాల్సిన ఈ ఆసుపత్రిలో కనీసం 50 పడకల స్థాయిలో ఉండాల్సిన వైద్యసిబ్బంది కూడా లేకపోవడంతో రోగులకు అరకొర వైద్యసేవలే అందుతున్నాయి. ఇప్పటికీ అత్యావసర కేసులను రిఫరల్ ఆసుపత్రులకు పంపించాల్సిన పరిస్థితి.

ఈఎస్ఐ ఆసుపత్రిలో ఓపీ రాయించుకుంటున్న చందాదారులు

ప్రారంభానికి నోచుకోని ఆపరేషన్ థియేటర్

మూడేళ్ల కిందట మూతపడిన ఆపరేషన్ థియేటర్ నేటికీ పునఃప్రారంభం కాలేదు. ఈ ఏడాది జులై నుంచి కొత్త భవనంలోనే ఓపీ, ఐపీ వైద్యసేవలు కొనసాగుతున్నా.. శస్త్రచికిత్సలు మాత్రం జరగడం లేదు. సిబ్బంది కొరత.. కొత్త ఆపరేషన్ థియేటర్‌కు కొన్ని కొత్త వైద్యపరికరాలు సమకూరకపోవడం దీనికి కారణమని సిబ్బంది చెబుతున్నారు. దీంతో ఏటా 600కుపైగా కేసులను రిఫరల్ ఆసుపత్రులకు పంపించేస్తున్నారు. ప్రత్యామ్నాయ భవనాల్లోంచి కొత్త భవనంలోకి ఆసుపత్రిని తరలించి ఈ ఏడాది జులై నుంచి వైద్యసేవలను కొనసాగిస్తుండగా క్రమేణా ఓపీ కూడా పెరుగుతోంది. దానికనుగుణంగా వైద్య సిబ్బందిని, ఆధునిక వైద్యపరికరాలను సమకూర్చాల్సి ఉంది.

ఏళ్ల తరబడి ఇన్‌ఛార్జులతోనే...

ఆసుపత్రి పూర్తిస్థాయి పర్యవేక్షణకు కనీసం రెగ్యులర్ మెడికల్ సూపరింటెండెంట్ కూడా లేరు. ఏళ్ల తరబడి ఇన్‌ఛార్జులతోనే నెట్టుకొస్తున్నారు. పేపరుమిల్లు ఎదురుగా శ్రీరామ్‌నగర్‌లో 50 పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని 1988లో ప్రారంభించారు. తొలుత ఇక్కడ మెడికల్ సూపరింటెండెంట్‌గా మల్లికార్జునరావు, తర్వాత రామకృష్ణారావు ఆ తర్వాత విజయకుమార్ పూర్తిస్థాయి బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత గత పదేళ్లకు పైగా ఇన్‌ఛార్జులతోనే కొనసాగిస్తున్నారు తప్ప రెగ్యులర్ సూపరింటెండెంట్ పోస్టు భర్తీ చేయడం లేదు. కొన్నేళ్లుగా ఇన్‌ఛార్జులను మారుస్తున్నారేతప్ప రెగ్యులర్ సూపరింటెండెంట్ పోస్టు మాత్రం భర్తీ చేయడం లేదు.

ఇలా వెళ్తే ప్రమాదమే..!

చరవాణి మాట్లాడుతూ వాహనం నడుపుతూ..

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే : అసలే జాతీయ రహదారులు, దానికి తోడు నగరం మీదుగా ఉండే రహదారిలో భారీ వాహనాలతో రోజంతా పయనిస్తూనే ఉంటాయి. ఈ రహదారిలో వెళ్లే ద్విచక్ర వాహనదారులు తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. శిరస్త్రాణం ధరించాలి. ట్రాఫిక్ నియమాలు పాటించాలి. కానీ కొందరు ద్విచక్ర వాహనదారుల ఇవేమీ పట్టకుండా రద్దీగా ఉండే జాతీయ రహదారుల్లో చరవాణి మాట్లాడుతూ వాహనం నడుపుతున్నారు. అపసవ్యదిశలోనూ వేగంగా ప్రయాణం చేస్తున్నారు.

విభాజకంపై నుంచి ఇలా...

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే జీవితంలో అత్యున్నతస్థాయికి చేరుకోవచ్చని మాజీ ఐఆర్ఎస్ అధికారి, విశ్రాంత ఆదాయపన్నుల శాఖ అధికారి ఎం.తిరుమలకుమార్ అన్నారు. సమతా సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వై.జంక్షన్ వద్ద ఉన్న కళాశాల బాలుర బీసీ సంక్షేమ వసతిగృహంలో వ్యక్తిత్వ వికాసం, సత్ప్రవర్తన, కెరీర్ గైడెన్స్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలకుమార్ వసతి గృహ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సమాజంలో అట్టడుగు వర్గాల నుంచి వచ్చి ఉన్నతశిఖరాలను చేరుకున్న మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు చెడు మార్గాలవైపు వెళ్లకుండా చదువుపైనే దృష్టి సారించాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజమహేంద్రవరం సహాయ బీసీ సంక్షేమాధికారి ముత్యాల సుబ్బారావు, వసతి గృహ సంక్షేమాధికారి అబ్దుల్ సుకూర్, గంగాధర్, అధ్యాపకుడు మదీనా, ఎల్ఐసీ ఏవో శ్రీరామ్‌కుమార్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సూచనలు చేస్తున్న తిరుమలకుమార్

జిత్‌మోహన్‌మిత్రకు సత్కారం

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: సీనియర్ నటుడు, గాయకుడు, ఆర్కెస్ట్రా పితామహుడు శ్రీపాద జిత్ మోహన్ మిత్రకు ఆదివారం మిత్ర బృందం ఆధ్వర్యంలో గోకవరం బస్టాండ్ ప్రాంతంలో అభినందన సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో సినీ చిత్రీకరణల్లో దాదాపు ఏడువందల చిత్రాలకు సహకారం అందించి, 210 చిత్రాలలో ఆయన నటించడం నగరానికే గర్వకారణమన్నారు. హిందీ పాటలు ఆలపించి, ఆంధ్రకిషోర్ కుమార్‌గా పేరు తెచ్చుకున్న ఆయన మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. విశ్వనాథ్, సోమరాజు నాయుడు, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

జెండా ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి

దేవీచౌక్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తల సమక్షంలో పార్టీ జెండా ఆవిష్కరించి కేకు కోసి, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ లేకపోతే దేశానికి స్వాతంత్ర్యం వచ్చేది కాదన్నారు. ఎందరో త్యాగధనులు తమ ప్రాణాలు అర్పించి, స్వాతంత్ర్యం తీసుకొచ్చారన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చడాన్ని నిరసిస్తూ జనవరి 5 నుంచి ఉద్యమం చేపడతామన్నారు.

అనంతరం పార్టీకి అంకిత భావంతో పనిచేసిన సీనియర్ నాయకులను సత్కరించారు. బాలేపల్లి మురళీధర్, మార్టిన్ లూథర్, అరిగెల అరుణకుమారి, రఫీ ఉల్లా బేగ్, కాకర్ల హరిబాబు, మోతా శారద, చామర్తి లీలావతి, డాక్టర్ వడయార్ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా రెవెన్యూ ఉద్యోగుల సంఘ ఎన్నికలు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా యూనిట్ ఎన్నికలు ఆదివారం రాజమహేంద్రవరంలోని రెవెన్యూ భవన్‌లో జరిగాయి. నూతన కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వరుసగా రెండవసారి జిల్లా అధ్యక్షుడిగా గొలుగూరి బాపిరాజు (డిప్యూటీ తహసీల్దారు), సహాధ్యక్షుడిగా ఎం.కాంతిప్రసాద్(డీటీ), కార్యదర్శిగా సి.హెచ్.సురేష్‌బాబు(డీటీ), కోశాధికారిగా ఎస్.కె.ఎం.డి.లాల్‌అహ్మద్(డీటీ), కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కాకినాడ కలెక్టరేట్ ఏవో ఎం.రామ్మోహన్, పరిశీలకుడిగా కపిలేశ్వరపురం డిప్యూటీ తహసీల్దారు జి.శ్రీనివాస్ వ్యవహరించారు. నూతన కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారి ప్రమాణస్వీకారం చేయించారు. నూతన కార్యవర్గం పదవీకాలం 2028 వరకు ఉంటుందని తెలిపారు.



పందులతో వెతలు

నగరంలో పలు ప్రాంతాల్లో పందులు గుంపులుగా సంచరిస్తూ వాహనదారులను, పాదచారులను భయపెడుతున్నాయి. మల్లయ్యపేట, వి.ఎల్ పురం, ఏవీఏ రోడ్డు ప్రాంతాల్లో పందుల సంచారంతో స్థానికులకు అవస్థలు తప్పడం లేదు. ఇవి అకస్మాత్తుగా రోడ్లపైకి వచ్చేస్తుండటంతో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

మార్గం.. అధ్వానం

రాజమహేంద్రవరంలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఒకటి వి.ఎల్ పురం రైతు బజారు రోడ్డు. ఇక్కడ రోడ్డు అంతా గుంతలమయంగా మారింది. ప్రయాణం ప్రమాదభరితంగా ఉంది. వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలోనే రైతు బజారు, మాంసాహార మార్కెట్ ఉంది. దీంతో వినియోగదారులతో రద్దీగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని నగర ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

మహారాజశ్రీ 3వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) రాజమహేంద్రవరం కోర్టులో
O.S.No.1056/2025
Between:
1) Palli Satyaveni
2) Palli Lalitha ... Plaintiff
And
Nil ... Defendant

ప్రకటన

పైన తెలిపిన వాదులు తమను పల్లి రాధాకృష్ణ, Son of తాతయ్యకు వారు తప్ప మరెవరు వారసులు లేరని, వారిని వారసులుగా ధృవీకరించమని కోరుచూ పై తెలిపిన కోర్టులో దావా దాఖలు చేసినారు. సదరు దావాలో ఎవరికైనను ఏవిధమైన అభ్యంతరములున్నచో ది.05-01-2026న ఉదయం గం.10.30 ని.లకు పై తెలిపిన కోర్టులో స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని, హాజరై తమ ఆక్షేపణలను తెలుపుకోవలెనని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

బి.వి.రమణారావు, టి.చక్రధర్
న్యాయవాదులు, రాజమహేంద్రవరం.

ప్రకటన

తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి అర్బన్ మండలం, వీరభద్రపురం, స్వర్ణమందిరం వీధి కాపురస్తులు అయిన నా క్లయింట్ మరియు లేట్ అంకం సూర్యచంద్రరావు గారి కుమారుడు అంకం వెంకట మణి విశ్వనాథం నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియచేయునది ఏమనగా :

ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని ది.09-03-2002న క్రయ దస్తావేజు రీత్యా D.No.23-11-11/2A రామకృష్ణరావుపేట, శ్రీరామ్‌నగర్, రాజమండ్రి అర్బన్ కాపురస్తులైన లేట్ తాళ్ళూరి వెంకట్రాయుడు గారి కుమారుడు అయిన తాళ్ళూరి సుబ్బరావు గారు క్రయము పొంది, క్రయ దస్తావేజును రాజమండ్రి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో 936/2002గా రిజిష్టర్ చేయించుకొని యున్నారు.

ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని తాళ్ళూరి సుబ్బారావు గారి నుంచి నా క్లయింట్ కొనుగోలు చేయుటకు నిశ్చయించుకొని ఒప్పందము చేసికొనియున్నారు. కావున ఈ షెడ్యూల్ ఆస్తి అమ్మకము విషయములో ఎవరికైనను, ఎట్టి అభ్యంతరములు గాని, కోర్టు వారి జప్తులు గాని, క్రయ అగ్రిమెంట్లు గానీ, హామీలు గాని, తనఖాలు గాని మరియు ఇతర లావాదేవీలు ఏమైనా ఉన్న ఎడల ఈ నోటీస్ ప్రకటించిన తేదీ లగాయతు ఒక వారము రోజులలో నాకు గాని, నా క్లయింట్‌కు గాని తెలియపరచవలెను, లేని యెడల ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని నిర్వివాద, నిష్పేచి ఆస్తిగా భావించి నా క్లయింట్ క్రయమును పొందుదురు.

క్రయ ఆస్తి షెడ్యూల్: తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి జిల్లా రిజిస్ట్రార్ వారి ఆఫీసులో చేరిని రాజమండ్రి కార్పొరేషన్ లోని వీవర్సు కాలనీ లోని రివిజన్ సర్వే నెం.93 రు పూరా య. 14.02 ట్లు భూమిలో తూర్పువైపు దక్షిణముగా ఏకప్రతిగా వున్న చ.గ.470లు స్థలములో మా తాలూకా ఉత్తరం వైపు మాకు క్రయ పర్చిన చ.గ. 186 లు స్థలం ఇందలి డోరు నెం. 24-1-91 ర్లు గల రేకుల షెడ్డుకు హద్దులు:
తూర్పు: అ.22 లు గంగుల చంద్రవతి గారి స్థలము; **దక్షిణం:** అ.76లు చీడ అనంతరామ్ గారి ఇల్లు కొంతవరకును, గంగుల చంద్రావతి గారి స్థలము కొంతవరకు; **పడమర:** అ.22 లు ముప్పది అడుగుల వెడల్పు గల రోడ్; **ఉత్తరం:** అ.76లు కొమ్ము విజయకుమార్ గారి స్థలము కొంతవరకును, ఆకుల మాణిక్యం గారి స్థలం కొంతవరకును.

ఈ హద్దుల చ॥గ॥ 186లు లేక 155.496 చ॥మీటర్లు స్థలం ఇందలి పై నంబర్లు గల రేకులషెడ్డు, ఇందలి తలుపులు ద్వారబంధములు, పైకప్పుతో సహాయును ఇందలి కరెంటు సర్వీసు నెం 74904రుతో సహా ఇందలి లోగడ నుండి రివాజుగా వున్న సమస్త ఈజుమెంటు హక్కులతో.

రాజమండ్రి,
28-12-2025

D.V.కృష్ణారావు, అడ్వకేట్
ఫ్లాట్ నెం.102, D.No.25-1-45 కంబాలచెరువు.
రాజమండ్రి, సెల్: 94901 78358

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

బహిరంగ ప్రదేశాల్లో పార్టీలు నిషేధం

ముఖాముఖి

కోరుకొండ, న్యూస్‌టుడే: ఓవైపు నూతన సంవత్సర వేడుకలు మొదలవుతున్నాయి. మరోవైపు సంక్రాంతికి కోడి పందేల బరులు సిద్ధం అవుతున్నాయి. ఇంకోవైపు చలి, మంచు కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పండగల వేళ బహిరంగ ప్రదేశాల్లో పార్టీలు నిషేధం అని కోరుకొండ సీఐ ఎస్.వి.వి.ఎస్.మూర్తి హెచ్చరించారు. కోరుకొండ స్టేషను సర్కిల్ పరిధిలోని కోరుకొండ, గోకవరం, సీతానగరం మండలాల్లో తీసుకుంటున్న చర్యలు, ట్రాఫిక్, గంజాయి, కేసులు వంటి విషయాలపై ఆయన పలు విషయాలను 'న్యూస్‌టుడే'కి వివరించారు

కోడి కత్తులు స్వాధీనం..

కొత్త సంవత్సరం వేళ, సంక్రాంతి సమయాల్లో యువత పార్టీలను బయట ఎక్కడా నిర్వహించుకోరాదు. బహిరంగ ప్రదేశాల్లో పార్టీలను నిషేధించాం. యువత వారి కుటుంబ సభ్యులతో సంతోషంగా పండగలు జరుపుకోవాలి. సంక్రాంతిని అడ్డుపెట్టుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. జూదం, కోడిపందేలు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. గోకవరంలో ఇటీవల 200కు పైగా కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నాం. కత్తులు తయారీ చేసేవారిపైనా చర్యలు తప్పవు. ఇప్పటికే 10 చోట్ల దాడులు చేశాం.

రోజూ గస్తీ..

చలి తీవ్రత నేపథ్యంలో రాత్రిపూట మంచు ఎక్కువగా ఉంటోంది. ఈ కారణంగా దారి సరిగా కనిపించక ప్రమాదాలకు అవకాశం ఉంది. దీనిపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. రాజమహేంద్రవరం- రంపచోడవరం ప్రధాన రహదారిలో వాహనాల రద్దీ బాగా పెరిగింది. రోజూ క్రమం తప్పకుండా ప్రమాదాల నివారణకు గస్తీ నిర్వహిస్తున్నాం.

వారిపై ప్రత్యేక నిఘా..

గంజాయి రవాణాపై పూర్తిగా దృష్టి పెట్టాం. ఇందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఇటీవల 3 కేసులు నమోదు చేశాం. గోకవరం పరిసర ప్రాంతాల్లోని చోరీలకు పాల్పడే ఓ బృందంపై ప్రత్యేక నిఘా పెట్టాం. 20 మంది జైల్లో ఉన్నారు. మరో 20 మంది కార్యకలాపాలపై దృష్టి సారించాం. ఆయా మండలాల్లోని గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా ఆయా పోలీసు స్టేషన్లకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరుతున్నాం.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

ధవళేశ్వరం: 91212 29057,
కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947

వ్యర్థాలతో ఇక్కట్లు..

శాటిలైట్ సిటీ సి-బ్లాక్ ప్రధాన రహదారి పక్కనే చెత్త పేరుకుపోయింది. పశువులు వాటిని రోడ్డు మధ్యలోకి లాగడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొందని స్థానికులు వాపోతున్నారు. తీవ్ర దుర్వాసన వస్తోందని, సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మోరంపూడి

మరమ్మతులు చేయాలి..

సమస్య: బొమ్మూరు రామచంద్రనగర్‌లో వీధి కొళాయి నుంచి నీరు రావడం లేదు. పైపులను రంధ్రం పడటం వల్ల నీరు వృథా అవుతుంది. - గిరిజ, స్థానికురాలు

సమాధానం: మరమ్మతులు చేసి నీటి వృథా నియంత్రిస్తాం. - కాశీ, గ్రామ కార్యదర్శి, బొమ్మూరు

- న్యూస్‌టుడే, బొమ్మూరు

శ్రీరామునికి కలశాభిషేకం

పెదపూడి: పెదపూడి జనార్దనస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించే శ్రీరామ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం కలశాభిషేకం నిర్వహించారు. స్థానిక లక్ష్మీసరస్వతీ సహిత విఘ్నేశ్వరాలయం నుంచి మహిళలు 108 కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీరాముని ఉత్సవ విగ్రహాలకు భక్తులు తీసుకువచ్చిన కలశాలతో అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు.

రక్తదాతలు.. బృందంగా సేవలు

కోరుకొండ, రాజానగరం, కడియం, న్యూస్‌టుడే: ప్రమాదాల్లో గాయపడినా, శస్త్రచికిత్సల సమయంలో రక్తం అత్యవసరం. సరైన సమయానికి అందకపోతే ప్రాణాలు పోయే పరిస్థితి ఉంటుంది. ఎప్పుడైనా రక్తం ఇచ్చేలా కొన్ని బృందాలు పనిచేస్తున్నాయి. ఆపదలో అండగా నిలుస్తున్నాయి. కోరుకొండ కేంద్రంగా బ్లడ్ డోనర్స్ స్టేటస్ వాట్సాప్, కోరుకొండ ఇన్‌స్పిరేషన్ బృందాలు 2014 నుంచి తమ సేవలను విస్తరిస్తున్నారు. ఎవరైనా రక్తం అవసరమని గ్రూపుల్లో సందేశం పెడితే అక్కడకు దగ్గరలో ఉన్న రక్తదాతలకు సమాచారం అందుతుంది. వారు ఆ బాధితులకు బాసటగా నిలుస్తారు. ఇలా సుమారు 500 మంది సభ్యులు రక్తదానం చేసేందుకు బృందాలుగా ఏర్పడి ఆదుకుంటున్నారు.

రక్తదానం చేస్తున్న శివ సర్కిల్ సభ్యులు

11 ఏళ్లుగా నిరంతరాయంగా

11 ఏళ్లుగా నిరంతరాయంగా సేవలు అందిస్తున్నాం. ఇప్పటివరకు 20సార్లకు పైగా అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఇచ్చాను. ఎప్పుడూ సహచర సభ్యులతో కలిసి ఇచ్చేందుకు సమయానుకూలంగా అందుబాటులో ఉంటాను. మన సాయంతో ఒకరి ప్రాణం నిలుస్తుందంటే ఎంతో సంతృప్తిని ఇస్తుంది.

- చిన్ని, రక్తదానం గ్రూపు సభ్యుడు

ఎప్పుడూ సిద్ధమే..

రక్తదానం చేసేందుకు సుమారు 500 మంది సభ్యులు నిత్యం సిద్ధంగా ఉంటారు. కరోనా తర్వాత నుంచి ఇప్పటి వరకు 8 సార్లు రక్తదానం చేశాను. మా గ్రూపు ద్వారా రక్తదానం వివరాలతో ఉన్న ఫేస్‌బుక్ గ్రూపును సుమారు 10 వేల మంది అనుసరిస్తుంటారు. వీటితో సుమారు 3 వేల మందికి పైగా రక్తదానం చేసే అవకాశం దక్కింది.

- బొండాడ కిరణ్, కోరుకొండ

రక్తదానమే సేవానిరతిగా...

సామాజిక మాధ్యమాలే వేదికగా రక్తదాన సేవలను అందించడం పరిపాటిగా మారింది. కడియం మండలం కడియపులంకకు చెందిన చిరు సేవా సమితి ఆధ్వర్యంలో శివసర్కిల్ పేరిట ఓ బృందంగా రక్తదానం చేస్తున్నాం. రాజమహేంద్రవరం గ్రామీణం, నగరం పరిసర ప్రాంతాల్లో వారికి చేయూతగా నిలుస్తున్నాం. ఈ గ్రూపులో ఉన్న నా స్నేహితులు, సభ్యుల ద్వారా సుమారు 22వేలు మందికి రక్తదానం చేశాం.

- గెడ్డం శివ, సమితీ అధ్యక్షుడు

జనార్దనస్వామికి గరుడవాహనం సమర్పణ

ధవళేశ్వరం: ధవళగిరిపై కొలువైన జనార్దన స్వామి వారికి శీలంశెట్టి సత్యనారాయణమూర్తి జ్ఞాపకార్థం ఆయన భార్య సత్యవతి ఆదివారం గరుడవాహనం అందజేశారు. రూ1.25లక్షల విలువైన ఇత్తడి గరుడ వాహనాన్ని ఆలయ అధికారులకు అందించారు. సంప్రోక్షణ చేసి ఉత్సవమూర్తులను ఆశీనులను చేసి పూజలు నిర్వహించారు. శీలంశెట్టి నారాయణమూర్తి దంపతులు, ఆలయ ఛైర్మన్ దాసరి చిన్న తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా ముందుకెళ్లాలి

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజేంద్రనగర్ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అల్లంకి మణికంఠ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ మండల పరిషత్ పాఠశాల వద్ద గణపతి ఆలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. దేవాంగ సంఘం నుంచి ఇటీవల ఉన్నత పదవులు పొందిన సభ్యులకు చిరుసత్కారం చేశారు. సంఘం గౌరవ సలహాదారు నల్లా రామారావు, అధ్యక్షుడు అల్లంకి మణికంఠ మాట్లాడారు. సంఘ సభ్యులంతా సమష్టిగా ముందుకెళ్లాలన్నారు. డాక్టర్ బళ్లా శ్రీనివాసరావు రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులుగా, కాలెపు సాయిరామ్ భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, పిచ్చుక అనిల్ కుమార్ ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాజమహేంద్రవరం యూనిట్ అధ్యక్షులుగా, ఆశపు శ్రీనివాస్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా, కొండపల్లి శ్రీదేవి జాంపేట ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ డైరెక్టర్‌గా పదవులు చేపట్టడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యం

బిక్కవోలు, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ త్రిమూర్తుల్లా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బిక్కవోలు మండలం ఇల్లపల్లిపాకలు గ్రామంలో రూ.54 లక్షలతో అభివృద్ధి చేసిన సీసీరోడ్లను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మోదీ పాలనలో రాష్ట్రానికి నిధులు విపరీతంగా వస్తున్నాయన్నారు. గత వైకాపా నాయకులు రోడ్లను గాలికి వదిలేసిందని, నీటిపారుదల వ్యవస్థను నిర్వీర్యం చేశారని, మెట్ట ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలను పాడు చేశారని ఆరోపించారు. వైకాపా పాలనలో చేసిన తప్పిదాలను సరిచేస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని మేళవించి సుపరిపాలన అందించే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ సూర్యచంద్రరావు, కూటమి నాయకులు రావాడ నాగు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

జనసేన పార్టీలో చేరిక

రాజానగరం: మండలంలోని శ్రీకృష్ణపట్నం గ్రామంలో వేర్వేరు పార్టీల నాయకులు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమక్షంలో ఆదివారం జనసేన పార్టీలో చేరారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాలనాదక్షత, నిత్యం ప్రజాసంక్షేమం గురించి ఆలోచించే విధానం, రాజానగరం నియోజకవర్గ అభివృద్ధిని చూసి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కృషికి ఆకర్షితులమై చేరినట్లు వివరించారు. సర్పంచి కమిడి శ్రీరామ్ ఆధ్వర్యంలో జనసేనలో చేరామని కొట్టి రామకృష్ణ, ప్రసాద్, వీర్రాజు, వికాస్ తదితరులు తెలిపారు. వీరికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే బత్తుల సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

చేరిన వారికి కండువా వేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

హుకుంపేట సొసైటీకి పురస్కారం

బొమ్మూరు(హుకుంపేట), న్యూస్‌టుడే: హుకుంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి అవార్డు లభించింది. ఆదివారం గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పురస్కారాలు ప్రదానం చేశారు. సంఘ ఛైర్మన్ బొప్పన శ్రీనివాస్, సీఈవో బొడ్డేడ రాంబాబు తీసుకున్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఎన్. రఘురాం, అడిషనల్ రిజిస్ట్రార్ ఆనంద్‌బాబు, సొసైటీ సభ్యుడు ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు. ఆ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ హుకుంపేట సొసైటీకి అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.



అవార్డు అందుకుంటున్న సొసైటీ ఛైర్మన్ శ్రీనివాస్

ఏకగ్రీవంగా రెవెన్యూ ఉద్యోగుల సంఘ ఎన్నికలు

వి.ఎల్.పురం: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా యూనిట్ ఎన్నికలు ఆదివారం రాజమహేంద్రవరంలోని రెవెన్యూ భవన్‌లో జరిగాయి. నూతన కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వరుసగా రెండవసారి జిల్లా అధ్యక్షునిగా గొలుగూరి బాపిరాజు (డిప్యూటీ తహసీల్దారు), సహాధ్యక్షుడిగా ఎం.కాంతిప్రసాద్(డీటీ), కార్యదర్శిగా సి.హెచ్. సురేష్‌బాబు(డీటీ), కోశాధికారిగా ఎస్.కె.ఎ.డి. లాల్‌అహ్మద్(డీటీ), కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కాకినాడ కలెక్టరేట్ ఏవో ఎం.రామ్మోహన్, పరిశీలకుడిగా కపిలేశ్వరపురం డిప్యూటీ తహసీల్దారు జి.శ్రీనివాస్ వ్యవహరించారు. నూతన కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారి ప్రమాణస్వీకారం చేయించారు. నూతన కార్యవర్గం పదవీకాలం 2028 వరకు ఉంటుందని తెలిపారు.

సంప్రదాయ పోరు.. సంతోషాల జోరు

రంగంపేట, న్యూస్‌టుడే: రంగంపేట-వడిశలేరులో ఎద్దుల, గుర్రాల పరుగు పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వారు ఇందులో పాల్గొన్నారు. సంప్రదాయాలను కాపాడుకునేలా ఇలాంటివి నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు పోటీదారులు తమ అభిప్రాయాలు పంచుకున్నారిలా..

గుర్రపు పందేలంటే ఇష్టం..

నేను వృత్తిరీత్యా ఆటో చోదకుడిని. నాకు చిన్నప్పటి నుంచి ఎద్దులు, పాడిపశువులు, గుర్రాలను పెంచడం ఇష్టం. దాంతోనే ఇందులో పాల్గొన్నా. ఇటీవల పిఠాపురంలో జరిగిన గుర్రపు పందేల పోటీల్లో విజయం సాధించాను. ఇలాంటి పోటీలతో తమలాంటి వారిని ఉత్సాహపరచడం బాగుంది.

- కొల్లిమళ్ల మణి, చేనుల అగ్రహారం

సోదరుల ఆసక్తి..

మేము ఇద్దరం సోదరులం. వడ్రంగి పని చేసుకుంటూనే గుర్రాలను పెంచుతుంటాం. వాటికి పరుగుపైనా శిక్షణను సరదాగా ఇస్తుంటాం. ఎక్కడ పోటీలు జరిగినా తీసుకెళ్తాం. చాలాచోట్ల బహుమతులు గెలుచుకున్నాం. ఇటీవల నర్సీపట్నంలో జరిగిన పోటీలోనూ మా గుర్రం విజయం సాధించింది. మన ఆచారాలను కాపాడుకునేలా ఇలాంటివి నిర్వహిస్తూ ఉండాలి.

- ఎల్లపు దిలీప్, జగదీష్, సోదరులు, సోమలింగపాలెం

బాలకృష్ణ సినిమాలో నటించింది..

డాకు మహారాజ్‌లో హీరో బాలకృష్ణ ఎక్కిన గుర్రం నాదే. అందుకే నా గుర్రాన్ని డాకు మహారాజ్ అనే పిలుస్తాం. ఈ గుర్రాన్ని చాలా శ్రద్ధతో పెంచుతున్నాం. కుటుంబంలోని సభ్యునిగా చూసుకుంటాం. చాలా పోటీల్లో తన ప్రత్యేకతను చూపిస్తుంది. ఇలాంటి మరిన్ని పోటీల్లో పాల్గొనేలా నాకు ఉత్సాహాన్ని కలిగిస్తుంది.

- దరిమిరెడ్డి శ్రీనివాస్(వాసు), రామన్నపాలెం, అనకాపల్లి

ధనం కన్నా జ్ఞాన సంపద ముఖ్యం

అనపర్తి గ్రామీణం, బిక్కవోలు, న్యూస్‌టుడే: భగవద్గీతను పూజిస్తే సరిపోదని ఆచరించాలని, గీతను ఆచరించడం మొదలు పెడితే ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకుంటామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బిక్కవోలు మండలం బలభద్రపురంలోని ఎంఎస్ఆర్ కల్యాణమండపంలో తొమ్మిది రోజులుగా ట్రూత్ వివేకామృతం ఆధ్యాత్మిక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న వారికోత్సవ వేడుకల్లో ఆదివారం ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక గురువు వివేకానందను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సత్కరించారు. అనంతరం ఆధ్యాత్మిక సూత్రాలతో ముద్రించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం రామకృష్ణారెడ్డిని ఆధ్యాత్మిక గురువు వివేకానంద సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ధనం కన్నా జ్ఞాన సంపద ముఖ్యమని అన్నారు. అమూల్యమైన తత్వజ్ఞాన రహస్యాలను అందరికి అందుబాటులోకి తీసుకువస్తున్న గురువు వివేకానంద సేవలను కొనియాడారు.

ధర్మాన్ని రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుంది

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: ధర్మాని రక్షిస్తే ధర్మం మనల్ని రక్షిస్తుందని ఇస్కాన్ మాజీ ఛైర్మన్ పరవస్తు సత్యగోపీనాథ్‌దాస్ ప్రభూజీ పేర్కొన్నారు. ఆదివారం ధవళేశ్వరం రథం వీధిలో జరిగిన హిందూ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించాలని సూచించారు. చిన్నారులకు మన సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చాలని, రాముడు, కృష్ణుడులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, వేషధారణలు ఆకట్టుకున్నాయి. అధ్యక్షుడు వేగిశెట్టి కోదండరామారావు, పండూరి అప్పారావు, ఒండెద్దు స్వామి, గుర్రాల వెంకటరావు, సాధనాల శివ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ

మోరంపూడి: కరాటే బ్లాక్ బెల్ట్ టెస్ట్‌లో ఇద్దరు విద్యార్థులు అర్హత సాధించారు. కవలగొయ్యిలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన మట్టా తేజస్వీ ఆరెంజ్ బెల్ట్, గుజ్జి నాగదుర్గతేజ బ్రౌన్ బెల్ట్ సాధించినట్లు కోచ్ పంచికట్ల శ్రీనివాస్ తెలిపారు. రాజమహేంద్రవరం సీనియర్ మాస్టర్ చెల్లూరి రాజా రంజిత్ రత్నకు మార్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు, బెల్ట్ అందించారు.

అనుగ్రహభాషణం చేస్తున్న శ్రీసాయిదత్త నాగానంద సరస్వతి స్వామీజీ

ప్రకృతిని గౌరవించడం అందరి బాధ్యత

రాజానగరం, న్యూస్‌టుడే: ప్రతి వ్యక్తి ప్రకృతిని గౌరవించాలని, అదే మనిషిని కాపాడుతుందని శృంగవృక్షం పీఠాధిపతులు, ఆంధ్రప్రదేశ్ ధార్మిక సామాజిక పరిషత్ అధ్యక్షులు శ్రీసాయిదత్త నాగానంద సరస్వతి స్వామీజీ పేర్కొన్నారు. రాజానగరంలో ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన అనుగ్రహభాషణం చేశారు. స్వామీజీ మాట్లాడుతూ దైవదూషణ చేయడం సరికాదన్నారు. విభాగ ఎస్ఎస్ఎఫ్ కన్వీనర్ బండ్ల రామ్‌శంకర్ మాట్లాడుతూ ప్రభావాలకు లోను కాకూడదన్నారు. సామాజిక కార్యకర్త ముళ్లపూడి అనంతలక్ష్మి, సభాధ్యక్షులు మండవిల్లి వెంకన్నబాబు మాట్లాడుతూ హిందూ ధర్మ రక్షణకు నిరంతరం కృషి చేయాలన్నారు. ముళ్లపూడి విజయలక్ష్మి శిష్య బృందం చేసిన కూచిపూడి నృత్యం ఆహుతులను ఆకట్టుకుంది. రాజానగరం ప్రఖండ్ ఆర్వీఎస్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ నరసన్న నిజరూప దర్శనం

స్వామివారి మూర్తి

జిల్లాలో పేరొందిన కోరుకొండ లక్ష్మీ నరసింహస్వామివారి దేవస్థానంలో ఈనెల 30న మంగళవారం జరిగే ముక్కోటి పర్వదినం పురస్కరించుకుని ముందురోజు అంటే సోమవారం కింద ఆలయంలోని లక్ష్మీనరసింహస్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారు. వైష్ణవ, వైఖానస ఆగమం ప్రకారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్వామివారి అలంకరణ తొలగించారు. స్వామివారు భక్తులకు నిజరూప దర్శనం ఇచ్చారు. అలంకరణ అనంతరం స్వామివారిని దర్శించుకున్న భక్తులకు మాత్రమే ఈ అవకాశం దొరికింది. ఆదివారం రాత్రంతా స్వామివారు ఇలానే ఉంటారు. సోమవారం తెల్లవారు జాము 4 గంటల నుంచి పంచామృతాభిషేకాలు నిర్వహించి అలంకరిస్తారు. ఆ తర్వాత ధనుర్మాసం ఉత్సవాల్లో భాగంగా తిరుప్పావై, తీర్థ ప్రసాద గోష్టి జరుగుతుందని ఆలయ అర్చకస్వాములు పి.చంటిబాబు, గిరిధరాచార్యులు, నాగు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కొండపైన స్వయంభువు మూర్తితో పాటు కింద ఆలయంలోని నిజరూప దర్శనంలో స్వామివారు భక్తులకు ఆనందాన్ని నింపారు. - కోరుకొండ, న్యూస్‌టుడే

రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడిగా కల్యాణ చక్రవర్తి

గోకవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడిగా గోకవరం మండలం కొత్తపల్లికి చెందిన శ్రీమెడికల్స్ అధినేత వెత్సా శ్రీనివాస కల్యాణ చక్రవర్తి ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన ఎన్నికలలో ఆరుగురు అభ్యర్థుల ప్యానల్‌లో ఒక సభ్యుడిగా ఆయన విజయం సాధించారు. మండల ఔషధ వర్తక సంఘం నాయకులు గంగిశెట్టి బాలకోటేశ్వరావు, కందుల సత్యనారాయణ, గుర్రం భానుప్రకాష్, బత్తుల వీరబాబు, చోడిశెట్టి త్రినాధ్‌గుప్తా తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

రాజానగరం: ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలో తమ ప్యానల్‌లోని ఆరుగురు అభ్యర్థులు విజయం సాధించారని అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి, దివాన్‌చెరువులోని వీజే ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డి.నరేంద్ర తెలిపారు.

బాధితులతో మాట్లాడుతున్న డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్, మార్గాని సత్యనారాయణ

దోశాలమ్మ కాలనీలో అగ్నిప్రమాదం

కడియం: కడియపులంక పంచాయతీ పరిధి దోశాలమ్మ కాలనీలో నివాసముంటున్న ఎల్లంశెట్టి సముద్రం తాటాకిల్లు ఆదివారం అగ్నికి ఆహుతైంది. విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో జరిగినట్లు బాధితులు చెబుతున్నారు. ఈ సందర్భంగా తెదేపా రాష్ట్ర వైద్యవిభాగ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ బాధితులను పరామర్శించారు. ఎమ్మెల్యే తరఫున సమకూర్చిన రూ.25వేలతో పాటు డాక్టర్ రవిరామ్ కిరణ్ రూ.10వేలు కలిపి వారికి అందించారు. ఉపసర్పంచి పాటంశెట్టి రాంజీ రూ.10వేలు అందించారు. వారికి అండగా నిలుస్తామని కూటమి నాయకులు భరోసా కల్పించారు. మార్గాని ఏడుకొండలు, గట్టి నరసయ్య, వెలుగుబంటి రఘురామ్, కంఠంశెట్టి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కార్నివాల్

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, ఏవీఏ రోడ్డు: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య మైదానంలో కార్నివాల్ వేడుకలు ముగిశాయి. మ్యూజిక్ ఫన్ గేమ్స్ విధానంలో కార్నివాల్ నిర్వహించారు. ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు తరలిరావడంతో మైదానం సందర్శకులతో నిండిపోయింది. కాగా సాయంత్రం మ్యూజికల్ హంగామా సాగింది. సరిగమ ఫేమ్ స్వాతి, పాడుతాతీయగా ఫేమ్ మమన్, ఇండియన్ ఐడిల్ ఫేమ్ వైష్ణవి, జయంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీ గానాలతో అలరించారు. అలనాటి మేటి పాత చిత్రాల్లో పాటలను ఇప్పటి సంగీత నైపుణ్యంతో చక్కగా పాటి వినిపించారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా పిండి వంటల స్టాల్స్ ఏర్పాటు చేశారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఇంటి వంటల పేరుతో ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్ద కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. కమిషనర్ రాహుల్ మీనా నేతృత్వంలో అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. నగర ప్రముఖులు వేడుకల్లో పాల్గొని సందడి చేశారు.

పాటలు పాడుతున్న గాయకులు జయంత్, స్వాతి, మమన్, వైష్ణవి

సమస్యల పరిష్కారానికి కృషి

సమావేశంలో మాట్లాడుతున్న నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి

మోరంపూడి, న్యూస్‌టుడే: పిడింగొయ్యిలోని క్రెడాయ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశానికి నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రెడాయ్ ప్రతినిధులు పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధి, రాష్ట్ర ప్రగతిలో భాగమైన సంస్థకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వ్యాపార సంస్థల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

చోరీ చేసిన వ్యక్తిపై కేసు

పెదపూడి, బిక్కవోలు: ద్విచక్రవాహనం చోరీ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని బిక్కవోలు ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. కొంకుదురులో ఈనెల 27న కర్రి సత్యనారాయణ రెడ్డి ద్విచక్రవాహనం చోరీకి గురైంది. గాలించగా కొమరిపాలెంనకు చెందిన వీర్రెడ్డి తీసుకెళ్లినట్లు తెలిసింది. అతన్ని పట్టుకుని అడగ్గా తప్పించుకుని పారిపోయాడు. ఆదివారం సత్యనారాయణ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం

రాజానగరం: రాజానగరంలోని డా.వడయార్స్ ఆసుపత్రి ప్రాంగణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ ఛైర్మన్ డా.వై.ఎ.వడయార్ ఆధ్వర్యంలో రాజానగరం నియోజకవర్గ సమన్వయకర్త డా.వై.శ్రీనివాస్ వడయార్ అధ్యక్షతన చేపట్టారు. ఈ సందర్భంగా డా.వడయార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశానికి చేసిన సేవలను వివరించారు. దేశాభ్యున్నతికి పేద, బడుగు, బలహీనవర్గాల వారికి మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ చేసిన కార్యక్రమాలను వివరించారు. మాజీ ఎంపీటీసీ సభ్యురాలు అనురాధ, పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.రాజేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పల్లేటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల వద్ద నాయకుల నివాళి

కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

నిడదవోలు: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిడదవోలులో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త మేడవరపు భద్రం దొర అధ్యక్షతన పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించి, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు చిన్నం మురళీకృష్ణ, అగర్వాల్ హీరాలాల్, భావన రమేష్‌బాబు, బుద్ధన లక్ష్మణరావు, షేక్ బషీర్, కాకి కిషోర్, పుచ్చకాయల వరప్రసాద్, ప్రగళ్లపాటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు

● కొవ్వూరు ● నిడదవోలు ● గోపాలపురం

సేవే మానవతా సంస్థ ధ్యేయం

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: సేవే ధ్యేయంగా మానవతా సంస్థ పని చేస్తోందని మండలశాఖ కోఛైర్మన్ కొఠారి సిద్ధార్థరాజు అన్నారు. మోర్తలో ఆదివారం సంస్థ సమావేశం నిర్వహించి సేవా కార్యక్రమాలపై చర్చించారు. ఛైర్మన్ తాతిని వెంకటకృష్ణారావు, కన్వీనర్ కోడూరి ప్రసాదు, రీజినల్ ఛైర్మన్ మద్దిపాటి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నిడదవోలు: ఐఎఫ్‌టీయూ అనుబంధ కార్పెంటరీ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో కొమ్మోజు చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా కొండపల్లి నాగశ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ముషినాని రాంబాబు, పెదపాటి మణికుమార్, కార్యదర్శిగా మందారపు నాని, సహాయకార్యదర్శిగా పనసకాయల మాధవరావు, కోశాధికారిగా పూళ్ల నాగశేఖర్‌ను ఎన్నుకున్నారు. ఈమని గ్రీష్మకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పురోభివృద్ధికి మోదీ చేయూత

ఉండ్రాజవరం: రాష్ట్ర పురోభివృద్ధికి ప్రధాని మోదీ చేయూతనిస్తున్నారని భాజపా మండల శాఖ అధ్యక్షుడు కొప్పినీటి సత్యనారాయణ అన్నారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా మోదీ ప్రసంగాన్ని ఉండ్రాజవరం తదితర గ్రామాల్లో టీవీల్లో పార్టీ నాయకులు, యువతీ, యువకులు ఆదివారం వీక్షించారు.

రెవెన్యూ గ్రీవెన్స్ డే నేడు

గోపాలపురం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్ పేరిట గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సాయిప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని భూ, ఇతర సమస్యలు ఈ కార్యక్రమంలో తెలియజేయవచ్చన్నారు.

చాగల్లు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.మెరికమ్మ తెలిపారు.

లాల్ బహదూర్ శాస్త్రి జయంతి

నిడదవోలు: మానవతా సంస్థ ఆధ్వర్యంలో లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి నిర్వహించారు. ఏవీ రమణ, పొన్నా సుబ్రహ్మణ్యం, దారుపురెడ్డి సూర్యచంద్రరావు, తన్నీడి బోస్, ఎన్వీ చౌదరి, పొడుగు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

పెరవలి: పెరవలి విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని పనులు చేపడుతున్నందున అజ్జరం, వెంకట్రాయపురంలో ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ తెలిపారు.

నిడదవోలు: తాడిమళ్ల 11కేవీ ఫీడర్ పరిధిలో వ్యవసాయ ఫీడర్ విడదీసే పనుల్లో భాగంగా నూతన లైన్, బ్రేకర్ ఏర్పాటు నిమిత్తం ఈనెల 29, 30వ తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తాడిమళ్ల సబ్‌స్టేషన్, తాడిమళ్ల గ్రామ పరిధిలో విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ తెలిపారు.

కాపవరంలో నేడు, రేపు..

కొవ్వూరు పట్టణం: దొమ్మేరు సబ్‌స్టేషను పరిధిలో 11కేవీ కాపవరం ఫీడరులో అభివృద్ధి పనుల నేపథ్యంలో ఈనెల 29, 30న విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగనుందని ఆ శాఖ ఈఈ నారాయణ అప్పారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కాపవరం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తాళ్లపూడి: 80085 74498
ఉ॥ 10 - మ॥ 1 ఉండ్రాజవరం: 80085 74503, నల్లజర్ల: 97011 37112

మురుగు పారక ఇక్కట్లు..

సమస్య: ప్రక్కిలంకలో ర.భ.శాఖ రహదారి నుంచి పంచాయతీ కార్యాయానికి వెళ్లే మార్గంలో డ్రెయిన్ వ్యర్థాలతో నిండిపోయింది. మురుగు పారడం లేదు. దుర్వాసన వస్తుండడంతో అటుగా రాకపోకలు సాగించేవారు ఇబ్బందిపడతున్నారు. – స్థానికుడు

సమాధానం: డ్రెయిన్‌ను శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. – నందిరాజు, పంచాయతీ కార్యదర్శి

- న్యూస్‌టుడే, తాళ్లపూడి

పైప్‌లైన్‌కు మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

నల్లజర్ల: ఆవపాడులోని జగనన్న కాలనీలో భూగర్భంలో ఉన్న తాగునీటి పైపులైన్‌కు రంధ్రం పడడంతో కొళాయిల నుంచి బురద నీరు వస్తోంది. దీనిపై శుక్రవారం 'ఈనాడు'లో వార్త ప్రచురితం కావడంతో పంచాయతీ కార్యదర్శి అనూరాధ స్పందించి ఆదివారం సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్, చిత్రంలో ఎమ్మెల్యే ముప్పిడి, ఆర్డీవో

సాంకేతిక విప్లవ దిశగా క్వాంటమ్ వ్యాలీ

కొవ్వూరు పట్టణం: చదువు పరిణామ క్రమం క్రియాశీలంగా శక్తిమంతంగా మారుతోందని.. సాంకేతిక విప్లవ దిశగా ముఖ్యమంత్రి క్వాంటమ్ వ్యాలీని తీసుకొస్తున్నారని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కొవ్వూరులో ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఫ్యూజన్-2025 సంబరాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దుర్గేష్ మాట్లాడుతూ విజ్ఞానానికి సాంకేతికత తోడైతే ఏ రంగంలోనైనా రాణించవచ్చని [illegible] ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, [illegible] తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ హెచ్చరించారు. సంక్రాంతి నేపథ్యంలో గ్రామాల్లో కోడి పందేలు, జూదం, గుండాట తదితర జూద క్రీడలపై ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే సీతానగరం, కొవ్వూరు, నల్లజర్ల పోలీసుస్టేషన్లన పరిధిలో జూద శిబిరాలపై దాడులు చేసి 23 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. 200 కోడి కత్తులు, వాటి తయారీకి వినియోగించిన 2 మోటారు యంత్రాలను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశామన్నారు. సంప్రదాయ క్రీడలను మాత్రమే ప్రోత్సహించాలని, అసాంఘిక కార్యకలాపాలు జరిగితే సమాచారమివ్వాలన్నారు.

చేతి రాత.. మార్చేను భవిత..

గుండ్రని అక్షరాలతో మంచి మార్కులకు అవకాశం

న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం, గోపాలపురం

మా అబ్బాయి బాగానే చదివినా మార్కులు ఆ స్థాయిలో రావడం లేదు.. ఎందుకో అర్థం కావడం లేదని కొందరు తల్లితండ్రుల నుంచి వినిపించే మాట. నాకొచ్చినవన్నీ సరిగ్గానే రాశాను కదా అంటూ విద్యార్థుల ఆవేదన. ఆశించిన మార్కులు తగ్గడానికి అందంగా రాయకపోవడం, రాయలేకపోవడం కూడా ఓ కారణమే. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపాల్సిన అవసరాన్ని గుర్తించే తరుణమిది. ఎంత బాగా చదివినా ఆఖరికి వచ్చిన మార్కులే విద్యార్థి భవితను నిర్ణయిస్తాయి. సరైన సమాధానం రాయడంతోపాటు అందమైన చేతి రాత ఎంతో ముఖ్యం. దస్తూరి సాధన చేస్తే మంచి ఫలితం ఉంటుందని అధికారులు, మంచి మార్కులు సాధించిన విద్యార్థులు సూచిస్తున్నారు.

శిక్షణ పొందుతున్న పదో తరగతి విద్యార్థులు

మూల్యాంకనంలో ఆకట్టుకునేలా..

ఏడాదంతా కష్టపడి చదివిన దానికి ఫలితం ఆ పరీక్ష రాయడంతో వస్తుంది. చదవడమే కాకుండా నిర్దేశించిన సమయంలో అక్షరాలను బాగా రాయాలని ఉపాధ్యాయులు పదే పదే చెప్పడంతో ఆ దిశగా బాగా ప్రయత్నిస్తున్నా. మా సమాధానాలకు మార్కులు వేసే వారిని ఆకట్టుకునేలా ప్రయత్నిస్తున్నాం.
– కోమటి మహాలక్ష్మి, పంగిడి

అర్థవంతంగా రాయాలి..

సంగ్రహక శక్తి ఎంత ఉన్నా అర్థవంతంగా రాయడమే ప్రధానం. ఎక్కువ రాయాలన్న తపనతో సమయాన్ని వృథా కాకుండా చూసుకోవాలి. బాగా వచ్చిన జవాబును అందంగా రాస్తే మంచి మార్కులు సులభంగా వస్తాయి. ఈ విధానం భవిష్యత్తులో పోటీ పరీక్షలకు తోడ్పడుతుంది.
– దిలీప్‌కుమార్, డీవైఈవో, కొవ్వూరు

స్వీయ జాగ్రత్తలు పాటిస్తే..

● మొదటి జవాబు అక్షరాలు గుండ్రంగా రాసి సమయం మించిపోతుందన్న ఆందోళన పడవద్దు. ● రెండు పదాల మధ్య ఒక అక్షరం లేదా '0' పట్టేంత ఖాళీ స్థలంతో రాయాలి. రెండు వరుసల మధ్య అరంగుళం దూరం వదలాలి. ● అంటుకున్నట్లు కాకుండా ప్రతి అక్షరం ఒకే పరిమాణంలో రాయాలి. ● కలాన్ని (పెన్ను) గట్టిగా పట్టుకుని రాయడం మంచిది కాదు. కొట్టివేసే రాయడం, దిద్దడం వంటివి మంచిది కాదు. ● చిత్రపటాలు ఉంటే వాటిని ఆకట్టుకునే విధంగా శీర్షికలు, ఉప శీర్షికలు స్పష్టంగా కనిపించాలి. ● గణితంలో సూత్రాలు, సమీకరణాలు కనిపించే విధంగా రాయాలి. ● పేజీ పైభాగంలో ఒక అంగుళం, ఎడమవైపు అదే స్థాయిలో మార్జిన్లను విడిచి పెట్టాలి.

మాట్లాడుతున్న ఆరెస్సెస్ ఖండ సహ చాలక్ దోర్బల ప్రభాకరశర్మ

హిందూ ధర్మ ధ్వజం సజీవం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: హిందూ ధర్మ ధ్వజం సజీవమైన, సచేతనమైనదని.. సంఘటిత శక్తి ద్వారా సంస్కృతిని సంరక్షించాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) కొవ్వూరు ఖండ సంఘ చాలక్ దోర్బల ప్రభాకరశర్మ అన్నారు. కొవ్వూరు ఖండ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని సంస్కృతోన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఖండ కార్యవాహ గోవర్ధనం శ్రీనివాసమూర్తి అధ్యక్షత వహించగా విభాగ్ సహ కార్యవాహ (రాజమహేంద్రవరం) కామవరపు మోహనకృష్ణ, గౌడీయమఠం స్వామి భక్తి విభుద వామన మహారాజ్ మాట్లాడుతూ దేశ, స్వధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. హైందవ సమ్మేళనాలను జయప్రదం చేసి ప్రతి ఇంటా కాషాయ ధ్వజం ఎగురవేయాలన్నారు. భక్తి బాంధవ కేశవ మహరాజ్, పద్మావతి మాట్లాడుతూ హిందూ ధర్మ వైశిష్ట్యానికి సంబంధించి సంఘటనలను ఉదహరించారు. వారాహి పీఠం ప్రతినిధి దుర్గాప్రసాద్, డాక్టర్ యల్లాప్రగడ రమేష్, భాజపా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఆరెస్సెస్ ప్రతినిధులు పరిమి రాధాకృష్ణ, పిల్లలమర్రి మురళీకృష్ణ, అనుపిండి చక్రధరరావు, టీఎన్వీ రమణమూర్తి, టి.విజయలక్ష్మి, కేఎస్ఎన్ మూర్తి, గుడివాక శ్రీనివాస్, రంగావఝల భూషణశర్మ, అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

సంస్కృతి పరిరక్షణకు కృషి

నిడదవోలు: హిందూ ధర్మం, సంస్కృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కామవరపుకోట లక్ష్మీహయగ్రీవ లలితా పీఠాధీశ్వరులు సుదర్శనం రామదుర్గాకుమారాచార్యులు అన్నారు. తాడిమళ్ల రుక్మిణి సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. దేవాలయాలను ఆధ్యాత్మిక క్షేత్రాలుగా తీర్చిదిద్దేందుకు గోమాతల్ని, మన ఇతిహాసాలను సంరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన అన్నారు. భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయ విలువలు, రామాయణపురం రామాయణ మహాభారత, భగవద్గీతను నేర్పించాల్సిన గురుతర బాధ్యత మాతృమూర్తిపై ఉందన్నారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ ఉత్తరాంధ్ర గోరక్ష ప్రముఖ్ మెట్టపల్లి సుబ్బారాయుడు, అధ్యక్షుడు కూచి సుబ్రహ్మణ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

తాడిమళ్లలో మాట్లాడుతున్న రామదుర్గాకుమారాచార్యులు

వైశిష్ట్యాన్ని భక్తులకు వివరిస్తున్న వైసేసిక ప్రభు

భగవద్గీత ఆత్మస్థైర్యాన్ని నింపుతుంది

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: భగవద్గీత ప్రతి ఒక్కరిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని ఇస్కాన్ ప్రతినిధి వైసేసిక ప్రభు అన్నారు. కాలిఫోర్నియాకు చెందిన ఆయన గ్లోబల్ యూత్ యాత్రలో భాగంగా కృష్ణతత్వాన్ని బోధిస్తూ కొవ్వూరు గోష్పద క్షేత్రానికి శిష్యగణంతో ఆదివారం వచ్చారు. నిరాకుళ మాతాజీతో కలసి ప్రధాన రేవులో భగవద్గీత సారాంశాన్ని వివరించారు. చైతన్య మహాప్రభు కొవ్వూరు గోష్పద క్షేత్రానికి వచ్చిన నేపథ్యంలోనే ఇక్కడ గౌడీయమఠం స్థాపించారన్నారు. శ్రీకృష్ణ లీలలను వివరిస్తూ పుణ్య క్షేత్రాలు, కృష్ణుని ఆలయాలను దర్శిస్తూ భగవద్గీతను బోధిస్తున్నామని తెలిపారు. రాజమహేంద్రవరం, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు చెందిన యువత, కృష్ణ భక్తులు ఆయనతో ఉన్నారు.

తుప్పలు పెరిగి.. మురుగు నిలిచి..

మండలంలోని ప్రధాన మురుగు కాలువలో ఇటీవల మరింతగా తుప్పలు పెరిగాయి. సుమారు 6 కిలోమీటర్ల మేర ఇలా చిట్టడవిలా ఉండటంతోపాటు మేట వేయటంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకాలు ఎదరవుతున్నాయి. ఈ కాలువ నిడదవోలు నుంచి ఉండ్రాజవరం మీదుగా తణుకు వరకు విస్తరించి ఉంది. పూడికతీత, తుప్పల తొలగింపు పనులు చేపట్టాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పరిశీలించి కాలువ అభివృద్ధికి చర్యలు చేపడతామని డ్రెయిన్స్‌శాఖ ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు. – న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

కార్యాలయాల దారి.. అధ్వానంగా మారి

దేవరపల్లిలోని పల్లంట్ల వెళ్లే రహదారిలో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న విద్యుత్తు నియంత్రిక వద్ద చెత్తచెదారం గుట్టలుగా పేరుకుపోయింది. ఆకతాయిలు ఎవరైనా నిప్పు పెడితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. శునకాలు, పందులు చెత్తచెదారాన్ని రహదారిపైకి లాగుతుండడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలకు ఆస్కారం కలుగుతుంది. ఈ రహదారిలోనే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంలో నిత్యం ప్రజలు, అధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి నిట్టా రవికిషోర్‌ని సంప్రదించగా పరిశీలించి చెత్త తొలగింపునకు చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, దేవరపల్లి

వ్యర్థాలు తొలగక.. సాగునీరందక

పెరవలి మండలం అన్నవరప్పాడులోని పుట్టగుంట, దానికి అనుసంధానమైన కాలువలు వ్యర్థాలతో నిండిపోవడంతో సాగునీటి పారుదలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. రబీ నారుమడులు వేసి, దమ్ములు మొదలు పెడుతున్న తరుణంలో భూములకు సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువలను బాగుజేయాలని కోరుతున్నారు. ఈ సమస్యను నీటిపారుదలశాఖ ఎఈ ఎన్.బాలమురళి దృష్టికి తీసుకువెళ్లగా కాలువలను పరిశీలించి వ్యర్థాల తొలగింపునకు చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, పెరవలి

కాలువ గట్టుపై పంటల సాగు

కోరుపల్లి అడ్డరోడ్డు సమీపంలో అరటి సాగు

నిడదవోలు నియోజకవర్గ పరిధిలో సుమారు 2700 ఎకరాలకు సాగునీరు అందించే కానూరు కాలువ పొడవునా ఆక్రమణలే. ప్రధానంగా డి.ముప్పవరం నుంచి మునిపల్లి వరకు ర.భ. శాఖ ప్రధాన రహదారి-కాలువ మధ్యలో ఉన్న స్థలాన్ని పలువురు ఆక్రమించుకుని పంటలు సాగు చేసుకుంటున్నారు. ఈ ఆక్రమణల కారణంగా భూములకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది పశువుల పాకలు ఏర్పాటు చేసుకోగా, మరి కొందరు అరటి, కొబ్బరి, జామాయిలు, వివిధ రకాల కూరగాయల పంటలు వేశారు. ఆక్రమణల తొలగింపుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. దీనిపై నీటిపారుదలశాఖ ఏఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, నిడదవోలు

ఎమ్మెల్యే ముప్పిడికి వినతిపత్రం అందిస్తున్న ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నాయకులు

పోలవరం ప్రాజెక్టుకు అమరజీవి పేరు పెట్టాలని వినతి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: భాషా ప్రయుక్త రాష్ట్రాల పితామహుడు, తెలుగు ప్రజలు, భాషా వికాసానికి ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు పేరును పోలవరం ప్రాజెక్టుకు పెట్టాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దుల సత్యనారాయణ కోరారు. ఈ మేరకు కొవ్వూరు ఆర్యవైశ్య సంఘ నాయకులతో కలసి తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు ఆదివారం వినతిపత్రం, 200 మంది సంతకాల ప్రతులను అందించారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, సూరపనేని చిన్ని, మద్దిపట్ల శివరామకృష్ణ, పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు, మట్టే ప్రసాద్, కొల్లేపర శ్రీను, మద్దుల నాని తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలకు స్థల పరిశీలన

చాగల్లు: మండలంలోని బ్రాహ్మణగూడెంలో ఆరోగ్య, విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆదివారం స్థలాలను పరిశీలించారు. ఇటీవల మృతి చెందిన చందవరానికి చెందిన కూటమి నాయకుడు అబ్దుల్ వహీద్ కుటుంబ సభ్యులను పరామర్శించి, గ్రామ తెదేపా నాయకులు సమకూర్చిన రూ. 40 వేల చెక్కు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ ఛైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు ఆళ్ల హరిబాబు, గారపాటి శ్రీను, జి.బాబూరావు, డి.వేణు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు ఆడుతున్న ఐదుగురి అరెస్టు

చాగల్లు: కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతున్న ఐదుగురిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై కె.శ్రీహరి తెలిపారు. వారి నుంచి రూ.1,610 స్వాధీనం చుసుకున్నామన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

చాగల్లు: మండలానికి చెందిన ఓ వివాహిత ఈనెల 26వ తేదీన భర్తతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు చాగల్లు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు.

సందడిగా క్రిస్మస్ వేడుకలు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: క్రీస్తు బోధించిన క్షమాగుణాన్ని అలవర్చుకుని ఆదర్శంగా జీవించాలని ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ అన్నారు. వాడపల్లిలోని బైబిల్ మిషన్ సంపూర్ణ ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో క్రిస్మస్ ఆరాధన కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ఎంపీపీ, తెదేపా జిల్లా కార్యదర్శి మరపట్ల కళాధర్ చక్రవర్తి హాజరై కేకు కోశారు. విశ్వాసులతో కలసి కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు, అన్నదానంలో పాల్గొన్నారు. దైవ సేవకుడు క్రిస్టియన్‌పాల్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

చాగల్లు: మండలంలోని కలవలపల్లిలో ఆదివారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చిన్నారుల గీతాలాపనలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని అందించారు. అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

కొవ్వూరులో ఎంపీపీ సత్యనారాయణ, ప్రముఖులు

పెరవలి: మండలంలోని ముక్కామల జేపీఎఫ్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం క్రిస్మస్ వేడుకలు జరిగాయి. రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరిగెల అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రు, దమ్మెన్ను, వెలగదుర్రు తదితర గ్రామాల్లో ఆదివారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సంఘకాపరులు దైవసందేశమిచ్చారు. యువతీ, యువకులు ప్రదర్శించిన నాటికలు, గానాలాపనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. వృద్ధులకు దుస్తులు అందజేశారు. సంఘకాపరులు కత్తుల ప్రకాశ్, దాసరి జాన్‌మోజెస్, కొయ్యె షారోన్‌రాజు, సిరివెన్నెల హనోకు, రోసిలిన్, జుత్తిగ చిట్టిబాబు పాల్గొన్నారు.

దమ్మెన్నులో కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న విశ్వాసులు

తాడిపర్రులో చిన్నారుల నృత్య ప్రదర్శన

పాలంగిలో డెమోన్ పవన్‌కు కేకు తినిపిస్తున్న తల్లి

అందరి ఆదరాభిమానాలతో ఉన్నత శిఖరాలకు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: బిగ్‌బాస్ సీజన్ 9లో 3వ స్థానం సాధించిన డెమోన్ పవన్‌కు ఉండ్రాజవరం మండలం పాలంగిలోని మేనమామ బొద్దాని కాశీవిశ్వనాథం ఇంటి వద్ద ఘనస్వాగతం పలికారు. తణుకు నుంచి జంగంచెరువు మీదుగా పాలంగి వరకు భారీ ర్యాలీగా విచ్చేశారు. దారి వెంట ఆయనకు మహిళలు హారతులిచ్చి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. మేనమామ ఇంటి వద్ద కుటుంబ సభ్యులు, అభిమానుల సమక్షంలో కేకు కోశారు. మీ అందరి ఆదరాభిమానాలతో భవిష్యత్తులో మరిన్ని ఉన్నతశిఖరాలను అధిరోహిస్తానని డెమోన్ పవన్ పేర్కొన్నారు. పలువురు ఆయనతో స్వీయచిత్రాలు దిగారు.

వెదురుకు భలే గిరాకీ

అరటి సాగు విస్తీర్ణం పెంపే కారణం

న్యూస్‌టుడే, నిడదవోలు

రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించడంతో నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో అరటి సాగు విస్తీర్ణం పెరిగింది. ఓ మోస్తరు ఈదురు గాలులు వీచినా ఈ పంటకు భారీ నష్టం ఏర్పడుతుంది. గెలలు వేసిన చెట్లు విరిగిపోయే ప్రమాదం ఎక్కువ. ఈ ఏడాది అక్టోబరు నెల చివరిలో వీచిన ఈదురు గాలులు, తుపాను కారణంగా ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో అరటి పంటకు కొంత మేర నష్టం వాటిల్లింది. గాలి దుమారాలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి అరటి పంటను రక్షించుకునేందుకు రైతులు వెదురు గెడలను వినియోగిస్తారు. దీంతో వాటికి గిరాకీతోపాటు ధరలు కూడా పెరిగాయి. వెదురు కొనాలంటేనే రైతులు వెనుకాడుతున్నారు. అరటి సాగులో ఎకరాకు అయ్యే ఖర్చులో సగం వెదురు గెడలకు వెచ్చించాల్సి వస్తోందని అంటున్నారు. ప్రస్తుతం వెదురు గెడ ధర రూ.100 నుంచి రూ.150 వరకు పలుకుతోంది. ఎర్ర అరటి చెట్టుకు గెడ ధర రూ.135 నుంచి రూ.150 వరకు ఉండగా, తెల్ల అరటి చెట్టుకు వేసే గెడ ధర రూ.100ల నుంచి రూ.120ల వరకు అవుతుంది. ఎకరాకు సుమారు 800 నుంచి 900 వరకు మొక్కలు నాటుతారు. వీటన్నింటికీ వెదురు గెడలు వేయాల్సిందే. దీంతో ఎకరాకు సుమారు రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు వీటికే వ్యయం చేయాల్సి వస్తోంది. లేని పక్షంలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో చేతికొచ్చిన పంట నేలకొరిగి రైతు పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉంది.

ముందస్తు చర్యల్లో భాగంగా అరటి చెట్లకు వేసిన వెదురు గడలు

CHANGE OF NAME
I, SAYYED AHMADUNNISA BEGUM (New Name), W/o Late Sayyed Shajahan. Aged 49 Years previously called Sayyad Hamadunisa Begam (Old Name), Resident of D.No: 16-10-12/1, Bismillapeta, Aurangabad, Kovvur, Kovvur Mandal, East Godavari Dist, A.P., Now changed my name from Sayyad Hamadunisa Begam (Old name) to SAYYED AHMADUNNISA BEGUM (New Name), Henceforth I will be called as SAYYED AHMADUNNISA BEGUM (New Name) for all purpose

(c) eenadu

ఈనాడు కర్ణాటక
సోమవారం డిసెంబరు 29, 2025

రాష్ట్రపతి చేతులమీదుగా పురస్కారం అందుకున్న ధినిధి

కసిగా ఈదేసి.. విజయకేతనం ఎగరేసి..

● జాతీయ బాలపురస్కారాన్ని అందుకున్న ఈత క్రీడాకారిణి ధినిధి సింగు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: కర్ణాటక ఈత రంగంలో దూసుకెళ్తున్న స్విమ్మర్ ధినిధి సింగు ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్రీయ బాలపురస్కారాన్ని అందుకొని ఉద్యాన నగరి కీర్తి పతాకను హస్తినలో రెపరెపలాడించింది. శుక్రవారం దిల్లీలో జరిగిన వేడుకల్లో ఈ ప్రతిష్ఠాత్మకమైన అవార్డును రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ చేతులమీదుగా అందుకొంది. 14 ఏళ్ల వయస్సులోనే గతేడాది ప్యారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందిన ధినిధి 200 మీటర్ల ఫ్రీస్టైల్లో పరిణితి పొందింది. 15 ఏళ్ల ధినిధి 100 మీటర్స్ ఫ్రీస్టైల్, 200 మీటర్ల వ్యక్తిగత మిడ్లేలోనూ రాణిస్తోంది. 2022 ఏషియన్ క్రీడాపోటీలో భారత తరఫున అతిచిన్న వయస్సులో పాల్గొన్న ఈ స్విమ్మర్ సీవీ రామన్‌నగరలోని డీఆర్‌డీఓ కేంద్రీయ విద్యాలయంలో పదోతరగతి విద్యార్థిని. 2018లో సరదాగా ఈతలో పాల్గొన్న ఈ అమ్మాయి అంచెలంచెలుగా ఈతలో పట్టును సాధించి పరిణితి పొందింది.

ఈత బరిలో ధినిధి సింగు

డాల్ఫిన్ ఈత క్లబ్‌లో శిక్షణ పొందుతున్న ధినిధి 2023 జాతీయ సబ్ జూనియర్, జూనియర్ పోటీలో 100 మీటర్లలో రికార్డును నెలకొల్పింది. 200 మీటర్ల ఫ్రీస్టైల్, వ్యక్తిగత మిడ్లేలోనూ రికార్డు సృష్టించిన ఈ స్విమ్మర్ 2023 గోవాలో జరిగిన జాతీయ క్రీడా పోటీల్లో వివిధ విభాగాల్లో ఏడు పతకాలను సాధించడం విశేషం. దోహాలో జరిగిన ప్రపంచ పోటీల్లో పాల్గొన్న ధినిధి ఒడిశాలో జరిగిన 78వ జాతీయస్థాయి సీనియర్ ఈత పోటీల 100, 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో జాతీయ రికార్డును నెలకొల్పి శభాష్ అనిపించుకుంది. ఏషియన్ గేమ్స్, ఇతర ప్రతిష్ఠాత్మకమైన పోటీల్లో పాల్గొని బోలెడన్ని పతకాలను సాధించిన ధినిధి భవిష్యత్తులో మరింతగా సాధనలు చేయాలని ఆశిద్దాం.

విద్యార్థి సంఘాలకు ఎన్నికలు?

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: రాష్ట్రంలో వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఉన్న విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహణపై అధ్యయనం చేసేందుకు కేపీసీసీ ఉన్నత స్థాయి సమితి ఏర్పాటు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ తెలిపారు. సమితి అధ్యక్షుడిగా వైద్య విద్యాశాఖ మంత్రి డాక్టర్ శరణ్‌ప్రకాశ్ పాటిల్‌ను నియమించామని, సభ్యులుగా ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ సుధాకర్, విధానపరిషత్తులో ప్రభుత్వ విప్ సలీం అహ్మద్, శాసనసభ్యులు రిజ్వాన్ హర్షద్, బి. శివణ్ణ, పుట్టణ్ణ బసవనగౌడ బాదర్లి, యువజన కాంగ్రెస్‌నేత మంజునాథ్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కార్తిక్ గణేష్ ఉంటారని వివరించారు. ఎన్నికలు నిర్వహించాలా వద్దా అనే అంశంతో పాటు ఎన్నికలు నిర్వహిస్తే వచ్చే లాభ, నష్టాలను అధ్యయనం చేస్తారని పేర్కొన్నారు.

ప్రభుత్వం విఫలం

అశోక్

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో సాగుతున్న మాదక ద్రవ్యాల విక్రయాలను నియంత్రించడంలో ప్రభుత్వం సంపూర్ణంగా విఫలమైందని ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ ఆరోపించారు. ఆదివారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మాదకద్రవ్యాలను నియంత్రించకుండా యువత జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. బెళగావి శాసనసభ సమావేశంలో తాను మాదక ద్రవ్యాలపై ప్రస్తావిస్తే అన్ని ప్రాంతాల్లో అవి ఉన్నట్లు లెక్కలేని సమాధానం హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ ఇచ్చారని ఆక్రోశం వ్యక్తం చేశారు.

ఏఐ అండగా

✦ కొత్త ఏడాదిలో అవకాశాల్ని ఒడిసిపడదామిలా
✦ ఊరిస్తున్న జాబ్ మార్కెట్

కొలువుదీరుదాం సులువుగా

మేధో చర్చలతో నైపుణ్యానికి పదును

ఈనాడు, బెంగళూరు: క్యాలెండర్‌లో ఓ ఏడాది ముగిసే సమయానికి విద్యా సంవత్సరమూ ముగింపు దశకు వస్తుంది. విద్యార్థులు ప్రాంగణ ఎంపికల కోసం కసరత్తు మొదలు పెట్టినా అందరికీ ఉద్యోగాలు దొరకటం కష్టమే. తాము చదివే కోర్సులతో ఉపాధి మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యం పెంచుకున్నా కొత్తతరం నైపుణ్యం కోసం కంపెనీలు జల్లెడ పడుతుంటాయి. ప్రస్తుతం నడుస్తున్న కృత్రిమ మేధ(ఏఐ) యుగంలో ఉపాధి సాధించటం ఎంత కష్టమో వచ్చిన ఉద్యోగాన్ని కాపాడుకోవటం అంతే సవాలుగా మారింది. భారతీయ ఉపాధి గమ్యస్థానంగా ఉన్న కర్ణాటకలో 2026 ఏడాది ఉద్యోగార్థుల ఉపాధి అవకాశాలను కొత్తతరం సాంకేతిక నైపుణ్యాలు నిర్ణయించనున్నాయి.

నిపుణులతో చర్చించే అవకాశాలెన్నో

ఇవి తెలుసుకోండి

నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్) ఫ్యూచర్ స్కిల్స్‌తో పాటు, యాంబిషన్ బాక్స్, ఐబీపీసీ వంటి సంస్థల అధ్యయనం ప్రకారం 2027 నాటికి భారతీయ ఏఐ మార్కెట్ విలువ 17 బిలియన్ డాలర్లకు చేరుకుంటుండగా, ఏఐ నిపుణుల డిమాండ్ 2026లో 22 శాతం పెరగనుంది. భారత్‌లో రెండో అత్యధిక ఏఐ టాలెంట్‌పుల్ కేంద్రమైన బెంగళూరులో ఏఐ ఇంజినీర్, ఏఐ ప్రొడక్ట్ మేనేజర్, ఆటోమేషన్ ఇంజినీర్, డేటాఎనలిస్ట్, ఎంఎల్ స్పెషలిస్ట్, రోబోటిక్స్ డెవలపర్, సైబర్ సెక్యూరిటీ విభాగంలో ఎస్ఓసీ, క్లౌడ్ సెక్యూరిటీ ఇంజినీర్లకు 2025తో పోలిస్తే 40-50 శాతం అదనపు వార్షిక వేతనాలు అందించేందుకు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి.

డిమాండ్ ఇలా..

టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్ ఈ ఏడాది ఏఐ ఇంజినీర్‌తో పాటు స్పెషలిస్ట్ ప్రోగ్రామర్, డిజిటల్ స్పెషలిస్ట్, ఇంజినీర్ డీప్ స్కిల్స్ ఉన్న ఎల్-3 ట్రైనీలకు రూ.21 లక్షల వార్షిక వేతనాన్ని ఆఫర్ చేసింది. తొలి ఏడాదే ఈ స్థాయి వేతనాలు ప్రకటించటం రికార్డే. ఎల్-2 ట్రైనీకి రూ.16 లక్షలు, ఎల్-1 ట్రైనీకి రూ.11 లక్షలు, సాధారణ ట్రైనీకి రూ.7లక్షల వేతనాలు ప్రకటించింది. బ్యాంకింగ్ ఫైనాన్స్‌లో ఏఐ, ఎంఎల్ సైబర్ ఎక్స్‌పర్ట్‌కు రూ.15 లక్షలు, మిషన్ లెర్నింగ్ స్పెషలిస్ట్‌కు రూ.11లక్షలు నుంచి రూ.18 లక్షలు, డేటా ఎనలిస్ట్‌కు రూ. రూ.26 లక్షల వరకు, ఏఐ ప్రొడక్ట్ మేనేజర్‌కు రూ.27లక్షల వరకు, ఆటోమేషన్ ఇంజినీర్‌కు, రోబోటిక్స్ డెవలపర్, సైబర్ టెక్‌కు 30-60 శాతం వేతనాలు పెంచే అవకాశం ఉంది.

బెంగళూరులోనే ఎందుకు?

భారతీయ ఐటీ హబ్‌గా ఉన్న బెంగళూరులో సహజంగానే టెక్ ఎకోసిస్టమ్ ప్రపంచశ్రేణి ప్రమాణాలతో రాణిస్తోంది. గూగుల్ నుంచి మైక్రోసాఫ్ట్, ఐబీఎం, ఇన్ఫోసిస్, విప్రో వంటి సంస్థలు నైపుణ్య మానవ వనరులను ఎంపిక చేసుకునేందుకు కార్యశాలలు, హ్యాకథాన్‌లు, నెట్‌వర్కింగ్ ఈవెంట్‌లు ఏర్పాటు చేస్తున్నాయి. ఫిన్‌టెక్, హెల్త్‌కేర్, ఈ-కామర్స్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ సర్వీసెస్, రక్షణ, వైమానిక, ఈవీ, ఆటోమొబైల్స్, ఉత్పాదన, ఆర్ అండ్‌డీ, జీసీసీ, రంగాల్లో ప్రపంచశ్రేణి సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ రంగాల్లో నైపుణ్య మానవ వనరుల లభ్యత బెంగళూరులో సాధ్యమవుతోంది.

ఈ నైపుణ్యాలు ఉంటే చాలు

ప్రస్తుతం టెక్ కోర్సులు లేకున్నా నాన్‌టెక్ విద్యార్థులు కూడా కంపెనీలకు అవసరమైన నైపుణ్యం పెంచుకుంటే ఉపాధి సులువుగా మారుతోంది. ఏఐ, ఎంఎల్‌లో పైటార్క్, ఎంఎల్, డీప్‌లెర్నింగ్‌లో అండర్‌స్టాండింగ్, ఇంప్లిమెంటేషన్ టెక్నిక్స్, న్యూరల్ నెట్‌వర్క్స్, డేటా ఎనాలసిస్, హ్యాండ్లింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, ఎంఎల్ఓప్స్‌తో పాటు సమస్యా పరిష్కారం, లోతైన ఆలోచనాదృక్పథం, సమాచార ప్రసారం, అడాప్టబిలిటీ, నైతిక అవగాహన వంటి సాఫ్ట్ స్కిల్స్ ఉంటే పోటీలో సులువుగా నెగ్గగలరు.

లక్ష మందికి శిక్షణ



కర్ణాటక డిజిటల్ ఎకానమీ మిషన్ (కేడీఈఎం) ద్వారా ఈ ఏడాది 50 వేల మందికి ఏఐతో పాటు డీప్ లెర్నింగ్‌తోపాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంలో శిక్షణ ఇచ్చాం. రాష్ట్ర 'నిపుణ్' కార్యక్రమం ద్వారా గ్రామాల్లోనూ ఏఐ నైపుణ్యం పెంచుతున్నాం. ఏఐ అంకురాల్లోనూ కొత్తతరం ఔత్సాహికులకు 'హ్యాపీ లామా' ద్వారా ఈ రంగంలో నిపుణులతో సలహాలిచ్చే ఏర్పాటు చేస్తున్నాం.

- సంజీవ్‌కుమార్ గుప్త, సీఈఓ, కర్ణాటక డిజిటల్ ఎకానమీ మిషన్

ఏఐతో విశ్వాసం పెరుగుతోంది

ఏఐతో ఉద్యోగ భద్రతతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతోంది. గతంలో ఓ ప్రాజెక్టు పూర్తి చేయాలంటే సీనియర్లతో కనీసం నాలుగైదుసార్లు భేటీ అవటం, వాటిపై చర్చలకు సమయం కేటాయించాలి. ఇప్పుడు ప్రాథమిక దశలోనే ఓ ప్రాజెక్టుపై అవగాహన పెరుగుతోంది. ఏఐ నైపుణ్యంతో సులువుగా ఉపాధితో పాటు వచ్చిన ఉద్యోగాన్ని సమర్థమంతంగా నిర్వహించే వీలుంది. కొత్తగా కొలువుల కోసం ప్రయత్నించే అభ్యర్థులు కృత్రిమ మేధ సాయంతో సులువుగా తాము ఎంచుకున్న రంగంలో రాణించే అవకాశం ఉంది. ఈ ఏడాది ఏఐ మార్కెట్ దూసుకెళ్తోంది.

- బి.గంగాధర్, మేనేజర్, అల్కాన్ లేబొరేటరీస్

నేరగాళ్ల తాటతీస్తాం

పరమేశ్వర్

బెంగళూరు (యలహంక),న్యూస్‌టుడే: మాదకద్రవ్యాలు తయారు చేసే డ్రగ్స్ పెడ్లర్లపై నిర్లక్ష్యంగా వ్యవహరించే పోలీసు అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు ఉద్యోగం నుంచి తొలగిస్తామని రాష్ట్ర హోం శాఖమంత్రి డాక్టర్ పరమేశ్వర్ హెచ్చరించారు. ఆదివారం ఇక్కడ నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఆయన పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బెంగళూరు నగరంలో మాదకద్రవ్యాలు తయారు చేసే కేంద్రాలు బయటపడ్డాయని, దాన్ని సమర్థించుకోవడం లేదన్నారు. ఇంకా అలాంటి ఫ్యాక్టరీలు ఎన్ని ఉన్నాయనే వాటిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారన్నారు. మాదక ద్రవ్యాల విక్రయదారులతో పోలీసులు చేతులు కలిపినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతన సంవత్సరం వేడుకలు సందర్భంగా మాదకద్రవ్యాలు విక్రయాలు ఎక్కువగా సాగే అవకాశం ఉందని అన్ని ప్రాంతాలపై నిఘావేయాలని సూచించారు. పబ్, బార్ అండ్ రెస్టారెంట్లు, ఇతర ప్రాంతాల్లో వేడుకలు జరుగుతాయని, నిఘా పెంచాలని తెలిపారు.

● నూతన సంవత్సరం వేడుకలు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా 20వేల మంది పోలీసులతోపాటు రిజర్వ్‌డ్ పోలీసులను కూడా రప్పించుకోవాలని మంత్రి నగర పోలీసు అధికారులకు సూచించారు. వేడుకలు జరిగే ఎంజీరోడ్డు, చర్చివీధి, బ్రిగేడ్ రోడ్డులో ఉన్న పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లపై నిఘా వేయాలని తెలిపారు. ప్రజలు ఎక్కువగా చేరే ప్రాంతాల్లో భద్రత పెంచాలన్నారు. సమావేశంలో డీజీపీ డాక్టర్ ఎం.ఎ.సలీం, నగర పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

సాహితీ సమ్మేళనకు సిద్ధం

కల్పతరు నాడుగా ప్రసిద్ధికెక్కిన తుమకూరులోని గ్లాస్‌హౌస్ ఆవరణలో జిల్లా కన్నడ సాహిత్య సమ్మేళనానికి సర్వం సిద్ధమైంది. వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీతల చిత్రపటాలను ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు జరిగే సమ్మేళనంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని సాహిత్య పరిషత్తు ప్రతినిధులు పేర్కొన్నారు. సాహిత్యవేత్తలు వివిధ అంశాలపై చర్చలు జరుపుతారన్నారు.

- న్యూస్‌టుడే, తుమకూరు

'నిర్వాసితులకు గూడు నిర్మిస్తాం'

డీకే శివకుమార్

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: బ్యాటరాయనపుర నియోజకవర్గంలోని కోగిలు వద్ద చెత్తవేసే క్వారీ భూమి ఆక్రమించుకుని ఇళ్లు వేసుకున్న పేదల్లో అర్హులకు రాజీవ్‌గాంధీ వసతి పథకం కింద ఇంటి వసతికల్పిస్తామని ఉప ముఖ్యమంత్రి డీకేశివకుమార్ తెలిపారు. ఆ ప్రదేశంలో పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించడంపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్ర నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం కూడా దృష్టి సారించింది. పేదలకు ఇంటి వసతి కల్పించాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అక్కడ గుడిసెలు వేసుకున్న పేదల వివరాలను సేకరించి వారికి న్యాయం చేస్తామని ఈనెల 29న ఆ విషయాన్ని చర్చించేందుకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తారని తెలిపారు.

తనిఖీలు ముమ్మరం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: మైసూరు ప్యాలెస్ ముందు హీలియం సిలిండర్ పేలిన సంఘటనకు సంబంధించిన మైసూరు నగర పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. వారితో పాటు ఎన్ఐఏ బృందం కూడా ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టింది. ఈ సంఘటనలో మృతి చెందిన సలీం మైసూరు నగరానికి రాకముందు ఉత్తరప్రదేశ్, హైదరాబాద్, తదితర నగరాల్లో బెలూన్లు విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. గత నెలలో మైసూరుకు వచ్చి బెలూన్ వ్యాపారం మొదలు పెట్టారు. అతడితో పాటు వచ్చిన స్నేహితులు రిజ్వాన్, హుసేన్, సునీల్‌సింగ్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సలీం ఉన్నలాడ్జి యజమానిని కూడా పోలీసులు విచారిస్తున్నారు. నగరంలో ఉన్న లాడ్జిలపై పోలీసులు నిఘా వేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు సమాచారాన్ని సేకరిస్తున్నారు. జరిగిన పేలుడు సంఘటనలో మృతి చెందిన నంజనగూడు చామలాపుర నివాసి మంజుల అన్న పరమేశ్వర్ మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెల్లెలు మృతి చెందిన తరువాత మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

అలంకరణలో వేంకటేశ్వరుడు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం నిర్వహించే ఆధ్యాత్మిక పర్వదినం. నగరంలో రాష్ట్రవ్యాప్తంగా వైష్ణవాలయాల్లో పర్వదినం కోసం ఘనంగా ఏర్పాట్లు పూర్తయ్యాయని నిర్వాహకులు తెలిపారు. ఇట్టమడులోని ఆనంద తిరుపతి వేదస్థానంలో భక్తుల దర్శనార్థం విశేష ఏర్పాట్లు చేసినట్లు ప్రధాన అర్చకుడు మురళీధరభట్ తెలిపారు. హనుమంతనగర్ శ్రీశేష మహాగణపతి ఆలయంలో వేంకటేశ్వరుడికి అలంకారం కనువిందు చేస్తోంది. బన్నేరుగట్టరోడ్డులో చంపకధామ వేంకటేశ్వర ఆలయంలో, శ్రీనగర్‌లోని శ్రీనివాస ఆలయం, సీతాసర్కిల్‌లో వరాహ, లక్ష్మీనరసింహ, వేంకటేశ్వర ఆలయం, హోసకెరెహళ్లిలోని శ్రీలక్ష్మి వరాహ వేంకటేశ్వర ఆలయంలో ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. ఉదయం నాలుగు గంటల నుంచే భక్తులు దర్శన నిమిత్తం విచ్చేస్తారని ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశామన్నారు.

జన రాజ్యోత్సవ వేడుక షురూ

జన రాజ్యోత్సవ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. కన్నడ చలువళిగరర సమితి ఆధ్వర్యంలో స్థానిక ప్యాలెస్ గ్రౌండులో ఆదివారం జనరాజ్యోత్సవం-2025 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. నిర్వాహకులు సీఎంను ఘనంగా సత్కరించారు.

- బెంగళూరు, న్యూస్‌టుడే

రూ.5 కోట్ల విలువైన బంగారు నగల దోపిడీ

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం మైసూరు జిల్లా హుణసూరు పట్టణంలోని స్కైగోల్డ్ అండ్ డైమండ్ దుకాణంలోకి ప్రవేశించిన ఐదుగురు నిందితులు అక్కడ సిబ్బందికి గన్ చూపించి బెదిరించి రూ.4 కోట్లు నుంచి రూ.5 కోట్లు విలువైన బంగారు నగలు వజ్రాభరణాలను దోచుకువెళ్లిన సంఘటన ఆదివారం పట్టపగలు మధ్యాహ్నం 2.10 గంటలకు జరిగింది. ఐదుగురు నిందితుల్లో నలుగురు ముసుగులు ధరించినట్లు పోలీసులు గుర్తించారు. సినీ పక్కీలో దుకాణంలోకి ప్రవేశించి అక్కడ ఉన్న ఏడుగురు సిబ్బందిని తుపాకీ చూపించి బెదిరించి బంగారు నగలు, వజ్రాభరణాలను సంచుల్లో వేసుకుని పరారైనట్లు దక్షిణ విభాగం ఐజీపీ డాక్టర్ బోరలింగయ్య తెలిపారు. మైసూరు జిల్లాలో ఉన్న 18 చెక్‌పోస్టులను అప్రమత్తం చేశారు. దుకాణంలో పని చేస్తున్న సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులు కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

స్వాధీనం చేసుకున్న మత్తుపదార్థాల ముడి పదార్థాలను పరిశీలిస్తున్న మహారాష్ట్ర పోలీసులు

మత్తు కార్ఖానాల గుట్టు రట్టు

● నగరంలో మహారాష్ట్ర పోలీసుల తనిఖీలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్న బెంగళూరు నగరంలో మూడు మాదక ద్రవ్యాల తయారీ కేంద్రాలను మహారాష్ట్ర పోలీసులు కనిపెట్టడం తీవ్ర సంచలనమైంది. అప్రమత్తమైన నగర పోలీసులు డ్రగ్స్ పెడ్లర్స్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వివిధ వర్గాల నుంచి వచ్చిన సమాచారం మేరకు శనివారం రాత్రి బెంగళూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో మహారాష్ట్ర పోలీసులు మాదక ద్రవ్యాల తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించి రూ.56 కోట్లు విలువైన మెఫెడ్రోన్ అనే మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. నగర శివార్లలోని గొల్లహళ్లి, యరప్పనహళ్లి, కణ్ణూరు ప్రాంతాల్లో ఉన్న మత్తు పదార్థాలను తయారు చేసే ఇళ్లపై మహారాష్ట్ర పోలీసులు నగర పోలీసులకు సమాచారం ఇవ్వకుండా నేరుగా వచ్చి దాడులు నిర్వహించడం గమనార్హం. మాదక ద్రవ్యాల నియంత్రణకు పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నా, మూడు మాదక ద్రవ్యాలు ఉత్పత్తి కేంద్రాలు బయటపడటం బెంగళూరు నగరం డ్రగ్స్ హాట్‌స్పాట్‌గా మారినట్లు నగర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత జులైలో మైసూరులో డ్రగ్స్ ఉత్పత్తి కేంద్రాన్ని మహారాష్ట్ర పోలీసులు కనిపెట్టి నిందితులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇటీవల మహారాష్ట్ర మాదకద్రవ్యాల నియంత్రణ దళం పోలీసులు అబ్దుల్ ఖాదీర్ షేక్ అనే పెడ్లర్‌ను అరెస్టు చేసి రూ.1.5కోట్లు విలువ చేసే మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు బెళగావి నివాసి ప్రశాంత్ యల్లప్ప పాటిల్‌ను బంధించి విచారించారు. విచారణలో వెల్లడైన సమాచారం మేరకు బెంగళూరు నగర శివార్లలో ఉన్న మూడు మాదకద్రవ్యాల తయారీ కేంద్రాలపై ఆకస్మికంగా దాడులు చేశారు. ఆ కేంద్రాల నుంచి నాలుగు కిలోల మెఫెడ్రోన్ డ్రగ్స్, 17 కిలోలు ఇతర మాదక ద్రవ్యాలు, యంత్రాలు, డబ్బాలు, లిక్విడ్ సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రశాంత్‌తో పాటు రాజస్థాన్ నివాసులు రమేష్ యాదవ్, మల్బన్ రామ్ లాల్ బిష్ణోయిలను అరెస్టు చేశారు. మాదక ద్రవ్యాలను తయారు చేసి వాటిని వివిధ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. వచ్చిన నగదుతో నిందితులు నగరంలోని కొన్ని ప్రాంతాల్లో భూమి కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ఈ సంఘటనతో అప్రమత్తమైన నగర పోలీసులు ఇతర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల తయారీ కేంద్రాలు ఉన్నాయనే అంశంపై గాలింపు చర్యలు చేపట్టారు.

నీటి బిల్లు చెల్లింపునకు ఓటీఎస్

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: కావేరి తాగునీటి బిల్లు బకాయిలు దీర్ఘకాలం చెల్లించని వ్యక్తులు కోసం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకాన్ని అమలులోకి తెచ్చేందుకు బెంగళూరు జలమండలి నిర్ణయం తీసుకుంది. జలమండలికి దాదాపు రూ.701 కోట్ల బిల్లు బకాయిలు రావాల్సి ఉంది. అంత మొత్తం బకాయిలను చెల్లించడం లబ్ధిదారులకు కష్టంగా మారింది. రూ.439 కోట్ల అసలు బిల్లు కాగా రూ.262 కోట్ల వడ్డీ ఉంది. ఓటీఎస్ పథకం అమల్లోకి వస్తే వంద శాతం వడ్డీ రద్దు చేస్తారు. అసలు మొత్తాన్ని మూడునెలల్లోపు చెల్లింపునకు అవకాశం కల్పిస్తారు. బిల్లు బకాయిలు నానాటికీ పెరుగుతుండటంతో వసూలు పెద్దకష్టంగా మారింది. ఈ నేపథ్యంలో వినియోగదారులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు అవకాశం ఇస్తున్నట్లు మండలి అధికారులు తెలిపారు.

సమాజంలో చీలికలకు కమలదళం కుట్ర

● విరుచుకుపడిన ముఖ్యమంత్రి

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: దేశం, సమాజంలో చీలిక తేవడమే భాజపా సాధనమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఇక్కడ భారత్ జోడో సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భాజపా దేశానికి చేసిందేమి లేదన్నారు. దేశ ప్రజల మధ్య చిచ్చుపెట్టడమే వారి సాధనమని ఎద్దేవా చేశారు. దేశంలో కులవ్యవస్థను సృష్టించింది మనువాదులు, చతురవర్ణాన్ని సృష్టించిన మనుస్మృతిని భాజపా అమలు చేస్తోందని ఆరోపించారు. దేశానికి భాజపా నేతలు ఏమి చేయలేదన్నారు. భాజపాకు ముందు ఏర్పడిన ఆర్ఎస్ఎస్‌కు స్వాతంత్ర్య పోరాట పాత్ర లేదని, బ్రిటిష్ పాలకులతో చేతులు కలిపారని తెలిపారు. క్విట్‌ఇండియా ఉద్యమానికి దూరంగా ఉన్నారని తెలిపారు. ఇప్పుడు ఆర్ఎస్ఎస్ నేతలు దేశభక్తిపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదని, మహాత్మాగాంధీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సే ఆర్ఎస్ఎస్ కార్యకర్త అన్నారు. మహాత్మాగాంధీని మొదటి నుంచి ఆర్ఎస్ఎస్ వ్యతిరేకించిందని ఇప్పుడు కేంద్ర భాజపా ప్రభుత్వం అదేబాటలో నడుస్తోందని ఆరోపించారు. నరేగా పథకానికి మహాత్మాగాంధీ పేరు తొలగించారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ నేతలకు దేశానికి స్వాతంత్ర్యం రావడం ఇష్టం ఉండేది కాదన్నారు.

వేదికపై సిద్ధు, శివుడి ఆత్మీయ కరచాలనం

దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ అనేక పథకాలు చేపట్టారని, జైజవాన్, జైకిసాన్ నినాదం ఇచ్చిన లాల్ బహదూర్ శాస్త్రి, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన ఇందిరా గాంధీ తదితరులు దేశాన్ని ముందుకు తీసుకుపోయారని తెలిపారు. దేశాన్ని 21వ శతాబ్దం వైపు రాజీవ్ గాంధీ తీసుకెళ్లారని, భాజపా నేతలు ఏమి చేశారని ప్రశ్నించారు. రాజ్యాంగంపై దాడికి ప్రయత్నిస్తున్నారని, డాక్టర్ అంబేడ్కర్‌ను తక్కువ చేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. పేద ప్రజల కోసం ఐదు గ్యారంటీ పథకాలు అమల్లోకి తెచ్చామని వాటి వల్ల పేదరికం అదుపులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రి కేజే జార్జి, కేపీసీసీ కార్యాధ్యక్షుడు చంద్రశేఖర్ హాజరయ్యారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేసిన ఉప ముఖ్యమంత్రి డీకేశివకుమార్, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితరులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

సిద్ధమైన మెట్రో రైలు ఉపరితల వంతెన

మెట్రో సొరంగ మార్గాన్ని పరిశీలిస్తున్న బీఎంఆర్‌సీఎల్

సిల్క్‌బోర్డు కూడలి నుంచి కె.ఆర్.పురం వరకు ఉపరితల వంతెన నిర్మాణం

గులాబీ మార్గంలో కూ..చుక్..చుక్..

■ కొత్త ఏడాది మెట్రో రైలు సంచారం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: నమ్మమెట్రో గులాబీ మార్గంలో రైలు సంచారం వచ్చే ఏడాది మే, జూన్ నెలల్లో అధికారికంగా ప్రారంభం కానుంది. ఈ మార్గంలో రైలు సంచారం ప్రారంభమైతే రహదారిపై సంచార రద్దీ నియంత్రణలోకి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గులాబీ మార్గంలో సంచరించే పైలెట్ రహిత మెట్రోను బెమెల్ సమకూర్చింది. వచ్చిన రైళ్లు జనవరి నుంచి ప్రయోగాత్మకంగా ఈ మార్గంలో సంచరిస్తాయి. కాళేనా అగ్రహార నుంచి నాగవార వరకు గులాబీ మార్గాన్ని నిర్మించారు. దేశంలోనే అత్యంత పొడవు కలిగిన మెట్రో సొరంగ మార్గంగా గుర్తింపు పొందనుంది. కాళేనా అగ్రహార నుంచి తావరెకెరె వరకు 7.5 కిలోమీటర్ల ఉపరితల వంతెనపై రైలు సంచరించనుంది. ఈ మార్గంలో ఆరు మెట్రో స్టేషన్లను నిర్మించారు. డెయిరీ కూడలి నుంచి నాగవార వరకు 13 కిలోమీటర్ల సొరంగ మార్గంలో రైలు సంచరిస్తుంది. 12 భూగర్భ స్టేషన్లను నిర్మించారు. భూగర్భ మార్గాన్ని బీఎంఆర్‌సీఎల్ ఎండీ డాక్టర్ రవిశంకర్ ఉన్నతాధికారులతో పరిశీలించారు. 2026 డిసెంబర్ల కల్లా భూగర్భ మార్గంలో రైలు సంచారాన్ని ప్రారంభించాలనే లక్ష్యం ఉన్నా దానికి ముందే రైలు సంచారాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. స్టేషన్ల నిర్మాణాలు పూర్తయి సాంకేతికపరమైన పనులు సాగుతున్నాయని తెలిపారు. ఆ పనులు పూర్తయ్యేందుకు చాలా సమయం తీసుకుంటుందన్నారు. కాళేనా అగ్రహార నుంచి తావరెకెరె వరకు ఉపరితల వంతెన నిర్మాణ పనులతో పాటు సిగ్నల్ వ్యవస్థ, స్టేషన్ల ప్లాట్‌ఫారాల నిర్మాణం, ఇతర పనులు పూర్తయినట్లు వివరించారు. 2027 కల్లా అంతర్జాతీయ విమానాశ్రయానికి మెట్రో రైలు హెబ్బాళ్ నుంచి సంచరిస్తుందని వివరించారు. వచ్చే ఏడాది ఆఖరి కల్లా నగరంలో 175 కిలోమీటర్ల పరిధిలో మెట్రో రైలు సంచరించనుంది. ప్రస్తుతం 92 కిలోమీటర్లు మెట్రో రైలు సంచరిస్తున్న విషయం తెలిందే.

● ప్రధానంగా రహదారిపై సంచార రద్దీ ఉండే కోరమంగల డెయిరీ కూడలి, లక్కసంద్ర, ఎంజీరోడ్డు, శివాజినగర, కంటోన్మెంట్, ట్యానరీ రోడ్డు, వెంకటపుర, కేజీహళ్లి, నాగవార అవుటర్ రింగ్ రోడ్డు వరకు భూగర్భంలో గులాబీ రైలు సంచరిస్తుంది. రైలు సంచారం ప్రారంభమైతే కాళేనాఅగ్రహార నుంచి నాగవార అవుటర్‌రింగ్ రోడ్డుకు కేవలం 45 నిమిషాల్లో చేరుకోవచ్చు. ప్రస్తుతం రహదారిపై రెండు నుంచి రెండున్నర గంటల సమయం పడుతోంది. ఈ ప్రదేశాల్లో 30 శాతం సంచార రద్దీ అదుపులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. కోరమంగల, జేపీ నగర, జయదేవ ఆసుపత్రి, ఐఐఎంబీ, శివాజినగర, ఎంజీరోడ్డు, ప్యాటరీ టౌన్, కంటోన్మెంట్ రైల్వేస్టేషన్ అతి తక్కువ సమయంలో చేరుకోవచ్చు. ఈ మార్గంలో రైలు సంచారం కోసం నగరవాసులు ఎదురు చూసే రోజులు దగ్గర పడుతున్నాయి.

బెమెల్ తయారు చేసిన పైలెట్ రహిత గులాబీ మెట్రో రైలు

వైభవంగా శ్రీనివాస కల్యాణోత్సవం

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: బెంగళూరు దక్షిణ జిల్లా మాగడి పట్టణంలో శ్రీనివాస కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు బెంగళూరు నగరంతో పాటు మాగడి పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తన భార్య ఉషా శివకుమార్‌తో కలిసి కార్యక్రమానికి హాజరై పూజలు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన పూజారులు కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చిన భక్తులకు తిరుమల లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

స్వామివారికి నమస్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆయన భార్య ఉషా శివకుమార్

రోడ్డు ప్రమాదంలో పాదచారి మృతి

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: విలాసవంతమైన కారులో ఇష్టమొచ్చినట్లుగా సంచరిస్తున్న సమయంలో పాదచారిని ఢీకొనడంతో అతడు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి జక్కూర హెచ్.ఎస్.ఆర్ లేఅవుట్ పోలీసు ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. మృతుడిని బెలగావి నివాసి సంతోష్ దొడ్డగౌడ (26)గా పోలీసులు గుర్తించారు. రాత్రి 10 గంటలకు పాదచారి మార్గంలో నడిచి వస్తుండగా అతివేగంగా కారు అతడిని ఢీకొనటంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కారుడ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ప్రేమ పెళ్లి పేరుతో రూ.37 లక్షల వంచన

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: ప్రేమ పెళ్లి పేరుతో ఓ యువతిని నమ్మించి రూ.37 లక్షలు తీసుకుని మోసగించిన నిందితుడు హరియాణా వాసి శుభాంశు శుక్లాను బాగలకుంటె పోలీసులు అరెస్టు చేశారు. టి.దాసరహళ్లిలోని అద్దె ఇంట్లో నివసిస్తున్న నిందితుడు విలాసవంతమైన జీవితానికి అలవాటుపడ్డాడు. యువతి అతడి ప్రేమలో పడింది. వివాహ పేరుతో యువతిని నిందితుడు నమ్మించి దశలవారీగా నగదు తీసుకున్నాడు. మరోవైపు నిందితుడు ముంబయిలో ఓ అపార్ట్‌మెంట్‌లో మరోయువతితో కలిసి సహజీవనం సాగిస్తున్నట్లు యువతి గుర్తించారు. దానికి ముందు అతడికి పెళ్లి అయినట్లు సమాచారం వచ్చింది. మోసపోయినట్లు ఆలస్యంగా గుర్తించిన యువతి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతని వద్ద డబ్బులు తీసుకోవడంతో పాటు ఇంట్లో 559 గ్రాముల బంగారు నగలు దొంగిలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

500 మంది మద్యపాన ప్రియులపై కేసులు

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: నూతన సంవత్సరం రానున్న సందర్భంగా నగర సంచార పోలీసులు వివిధ ప్రాంతాల్లో వాహనాలు తనిఖీలు చేపట్టారు. శనివారం రాత్రి పది గంటల నుంచి ఆదివారం తెల్లవారు జామున రెండుగంటల వరకు తనిఖీలు చేయగా ఐదువందల మంది మద్యపాన ప్రియులను గుర్తించారు. వారిపై కేసులు నమోదు చేసి జరిమానా విధించి వదిలేశారు. 140 పాయింట్లలో తనిఖీలు చేపట్టారు. గత మూడు రోజుల్లో 1,500 మంది మద్యపాన ప్రియులు గుర్తించి కేసులు నమోదు చేసినట్లు సంచార పోలీసులు తెలిపారు.

లారీ-బస్సు ఢీకొని 20 మందికి గాయాలు

బెంగళూరు(బాణసవాడి): ముందు సంచరిస్తున్న లారీని వెనుక వస్తున్న ప్రైవేట్ బస్సు ఢీకొనటంతో 20 మంది ప్రయాణికులు గాయపడిన సంఘటన శనివారం రాత్రి హాసన జిల్లా చెన్నరాయనపట్టణ బైపాస్ రోడ్డులో జరిగింది. బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో 20 మంది గాయపడగా 13 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు హాసన జిల్లా పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

వివాహిత ఆత్మహత్య

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: వరకట్న వేధింపులు తాళలేక మల్లసంద్ర నివాసి ఐశ్వర్య (23) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం రాత్రి బాగలకుంటె పోలీసు ఠాణా పరిధిలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి భర్త సింహను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. మూడు నెలలు కిందట వివాహమైంది. ఆ సమయంలో ఎక్కువ కట్నం ఇచ్చామని, అయినా చాలదని తన కుమార్తెను చిత్రహింసలకు గురి చేసి హత్య చేశారని బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులోఉంది.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: వక్కతోటలో వక్కలు తెంపుతుండగా విద్యుదాఘాతానికి గురై ఇద్దరు కార్మికులు గాయపడగా వారిలో ఒకరు మృతి చెందాడు. మృతుడిని పుట్టస్వామి (48)గా గుర్తించారు. ఈ సంఘటన ఆదివారం ఉదయం శివమొగ్గ జిల్లా హొసనగర తాలూకా త్రివేణి గ్రామంలో జరిగింది. గాయపడిన మరో కార్మికుడిని చికిత్స కోసం శివమొగ్గ ఆసుపత్రికి తరలించారు. కత్తి విద్యుత్తు తీగలకు తగలడంతో ఈ సంఘటన జరిగినట్లు గుర్తించారు.

బ్రహ్మయ్యనాయుడును సన్మానిస్తున్న వాణిజ్య, పరిశ్రమల సంస్థ బృందం

ఆదర్శ రైతుకు ఆత్మీయ సన్మానం

బళ్లారి, న్యూస్‌టుడే: దిల్లీ ఎఫ్.ఐ.సి.సి.ఐ సుస్థిర కృషి-2025 ఏడాదిలో పురస్కారం అందుకున్న తమ్మినేని బ్రహ్మయ్యనాయుడును బళ్లారి వాణిజ్య, పరిశ్రమల సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సన్మానించారు. సంస్థ అధ్యక్షుడు అవ్వారు మంజునాథ్, గౌరవ ప్రధాన కార్యదర్శి కె.సి.సురేష్ బాబు, ఉపాధ్యక్షులు దొడ్డనగౌడ, సొంత గిరిధర, పాలన్న, సహాయ కార్యదర్శి రామచంద్ర, కోశాధికారి నాగళ్లి రమేష్‌లను పాల్గొని సన్మానం చేసి అభినందించారు. బ్రహ్మయ్యనాయుడు సేంద్రియ పద్ధతిలో మిరప సాగు, సుమారు 3000మంది రైతులను ప్రోత్సహించడం, రసాయన రహిత సుస్థిర మిరప సాగు, దేశ, విదేశాలకు ఎండు మిరప ఎగుమతులతో పలువురు ఆదర్శంగా నిలిచారు. ఆయన దివ్యాంగుడు అని ఏనాడు కుంగిపోలేదు. రెట్టింపు ఉత్సాహంతో ముందుకు వెళ్తున్నారు. ఆయన చేస్తున్న సేవలను గుర్తించి జాతీయ స్థాయి పురస్కారం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. సన్మాన కార్యక్రమంలో సంస్థ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

అందరి చూపు.. హంపీ వైపు

● కొత్త సంవత్సరం వేడుకలకు ముస్తాబైన విజయనగర ● విడిది గృహాలకు పెరిగిన గిరాకీ

విదేశీయులు ఇష్టపడే కాటేజీ మాదిరి వసతి కేంద్రం

హొసపేటె, న్యూస్‌టుడే: హంపీ, హొసపేటెల్లో కొత్త సంవత్సరం వేడుకల సందడి మొదలైంది. మరో రెండు రోజుల్లో సంబరాలు హోరెత్తనున్న నేపథ్యంలో దేశ, విదేశీ పర్యాటకులు, సందర్శకులను ఆకర్షించేందుకు పర్యాటక నగరి ఆతిథ్యానికి రంగం సిద్ధం చేసుకుంటోంది. పర్యాటక కేంద్రం హంపీలో ఆరుబయలు నూతన సంవత్సరం వేడుకలను జరుపుకొనేందుకు దేశ, విదేశాల పర్యాటకులు చాలా ఇష్టపడతారు. విజయనగర వీధుల్లోని విడిది గృహాలు అందంగా, ఆకర్షణీయంగా ముస్తాబవుతున్నాయి. పచ్చని పరిసరాలు, ప్రకృతి సోయగాల నడుమ రిసార్టులు, కాటేజీలను సందర్శకుల అభిరుచికి తగ్గట్లుగా మలుస్తున్నారు. హంపీ, కమలాపురలోని హోంస్టేలకు కూడా మంచి గిరాకీ ఉంది. ఇప్పటికే 80 శాతం హోంస్టేలు, విడిది గృహాలను దేశ, విదేశీ పర్యాటకులు బుక్ చేసుకున్నారు. సాధారణ వేళల్లో హంపీలోని ఓ హోంస్టే రోజుకి రూ.వెయ్యి ఉంటుంది. కాని ప్రస్తుతం ఆ ధర రూ.3వేలకు చేరుకుంది. అయినప్పటికీ విడిది గృహాలకు గిరాకీ తగ్గలేదు. ఎంతైనా ఇచ్చి వాటిని బుక్ చేయటానికి పర్యాటకులు ముందుకొస్తున్నారు. పర్యాటకులను ఆకర్షించేందుకు విడిది గృహాలు, హోంస్టే నిర్వాహకులు కూడా వాటిని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. గోడలపై జానపద బొమ్మలు, ఆసక్తికర చిత్రాలు గీస్తున్నారు. గృహాల చుట్టూ పచ్చదనం కనిపించేలా పూలు, మొక్కల కుండీలను ఏర్పాటు చేసి విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు.

హొసపేటెలోనూ సందడి

హొసపేటెలో కూడా విడిది గృహాలు దాదాపు బుక్కయ్యాయి. రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు సుమారు పాతిక పైగా విడిది గృహాల్లో గదులు నిండిపోయాయి. సాధారణ రోజుల్లో పట్టణంలో లాడ్జి గది రూ.3వేలు ఉండగా, ప్రస్తుతం రూ.5వేలకు చేరుకుంది. ఐదు, మూడు నక్షత్రాల హోటళ్లలో ఇప్పటికే కొత్త సంవత్సరం సందడి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళ, మహారాష్ట్రల నుంచి వచ్చిన పర్యాటకులు హంపీ, హొసపేటెలోని లాడ్జి గదులను బుక్ చేసుకున్నారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుశాఖ కూడా హంపీ, హొసపేటెలోని విడిది గృహాలు, లాడ్జి, హోంస్టేలను బుక్ చేసిన, బసచేస్తున్న వారి వివరాలను సేకరిస్తున్నారు. దేశ, విదేశీ పర్యాటకులు, సందర్శకులను తరలించేందుకు, హంపీ, హొసపేటెలో రవాణా రంగ సంస్థ కూడా అన్ని ఏర్పాట్లు చేసింది.

ప్రకృతి చెంత విశ్రాంతి నిలయం

జేఈఈ, నీట్ ర్యాంకర్లకు పురస్కారాలు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: ఐఐటీ - జేఈఈ, నీట్ యూజీ-2025 పరీక్షల్లో విజయాలు సాధించిన అలెన్ సంస్థ విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో టాప్ ర్యాంకర్లకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లురవీంద్ర, ఇస్రో మాజీ అధ్యక్షుడు ఎ.ఎస్.కిరణ్‌కుమార్ తదితరులు నగదు బహుమతులు పతకాలను అందజేసి సత్కరించారు. బెంగళూరు నగరంలో శిక్షణ పొందిన టాప్ ర్యాంకులు సాధించిన 161 మంది విద్యార్థులకు రూ.29.76 లక్షల నగదు బహుమతులు అందజేయగా 1,256 మంది విద్యార్థులకు స్మారక చిహ్నాలు, వెండి పతకాలను అందించారు.

కబ్బన్ అందాలు.. అదిరెన్

ఉద్యానవనంలో కట్టిపడేస్తున్న ప్రకృతి సౌందర్యం

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: శీతాకాలంలో కబ్బన్ పార్కు ప్రకృతి సహజ సిద్ధమైన అందాలను తిలకించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. మంచు, చలిగాలి మధ్య ప్రజలు వాయువిహారం చేస్తూ ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నారు. మరోవైపు కబ్బన్ పార్కులో ఖ్యాతి పొందిన గులాబీ పూదోటను ప్రస్తుతం పునరుద్ధరించారు. కొత్తగా మొక్కలు నాటారు. వేసవి నాటికి గులాబీ పూలు పూస్తాయి. అప్పుడు పూలతోట అందంగా మారుతోంది. పర్యాటకులను ఎక్కువగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఉద్యానవనంలో ఉన్న ప్రతి మొక్కకు పూలు పూయడం ప్రారంభమైంది. పూలను తిలకించి తమ చరవాణిలో పర్యాటకులు బంధించే పనిలో నిమగ్నమవుతున్నారు. ఏటా శీతాకాలంలో ఉద్యానవనం ఎప్పుడూలేని విధంగా పచ్చదనంతో నిండిపోతోంది. సహజసిద్ధమైన సౌందర్యాలను తిలకించేందుకు నగర ప్రజలు ప్రతి రోజూ సాయంత్రం ఉద్యానవనానికి వస్తున్నారు. ఎండ వచ్చిన తరువాత ఎక్కువ మంది ఉద్యానవనంలోకి వచ్చి వాయువిహారం చేస్తున్నారు. ప్రతి శని, ఆదివారాలు ఉద్యానవనంలోకి వాహనాలను అనుమతించరు. వాయు మాలిన్యం నియంత్రణతో పాటు మొక్కలు నాశనం కాకూడదనే ఉద్దేశంతో సంచారాన్ని ఆపేశారు.

కేంద్ర గ్రంథాలయం వద్ద గులాబీ తోట

బళ్లారిలో చేనేత వస్త్రాల ప్రదర్శన

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : చేనేత వస్త్రాలు, ఖాదీవస్త్రాలు, పట్టు చీరలు, గృహాలంకరణ వస్తువుల ప్రదర్శన బళ్లారిలోని డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డు సెంటెనరీ హాల్లో ఏర్పాటు చేసినట్లు చేనేత వస్త్ర ప్రదర్శన సంచాలకుడు ఉన్నికృష్ణన్ తెలిపారు. ఇక్కడ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సాయంతో నడుస్తున్న చేనేత సహకార సంఘాలు, మహిళా స్వయం సహాయక బృందాలు తయారు చేసిన వస్తువులు, వస్త్రాలు, అల్లికలను ప్రదర్శనలో ఉంచినట్లు వెల్లడించారు. రాజస్థాన్‌లో చేతితో తయారుచేసిన ఆభరణాలు, తివాచీలు, మోజరీలు, జుటిస్ తదితర వాటిని వినియోగదారులకు అందుబాటులో తెచ్చినట్లు తెలిపారు. త్వరలో బెంగళూరు నగరంలో ప్రదర్శన ఏర్పాటు చేస్తామని, ఉత్తర, తూర్పు భారత్ చేనేత వస్త్రాలను నగర ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.

ప్రదర్శనలో వస్త్రాలను తిలకిస్తున్న మహిళలు

కన్నడ భాష ఇంపును ప్రపంచానికి చాటిన కువెంపు

చిత్రదుర్గం,న్యూస్‌టుడే: కన్నడ భాషను నేర్చుకొనే విద్యార్థికి కువెంపును ప్రత్యేకంగా పరిచయం చేయవలసిన పని లేదు. ఆయన సాహిత్య రచనలను ఒకటో తరగతి నుంచి స్నాతకోత్తర తరగతుల వరకు విద్యార్థులు తప్పనిసరిగా ఎప్పుడో ఒకసారి చదివే ఉంటారు. కన్నడ నాట కువెంపు గురించి తెలియని కన్నడిగుడు లేరంటే అతిశయోక్తి కాదు. కన్నడకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చి కన్నడ ఇంపును ప్రపంచానికి చాటిచెప్పిన మేరు కవి, సాహితీవేత్త, విమర్శకుడు, నాటక రచయిత, విద్యావేత్త కువెంపు. నేడు ఆయన జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం. కువెంపు పూర్తి పేరు కుప్పళ్లి వెంకటప్ప పుట్టప్ప. ఆయన తల్లి సీతమ్మ పుట్టినిల్లు అయిన చిక్కమగళూరు జిల్లా కొప్ప తాలూకా హిరేకొడిగె గ్రామంలో 1904 సంవత్సరం డిసెంబరు 29న జన్మించారు. తండ్రి సొంతూరు శివమొగ్గ జిల్లా తీర్థహళ్లి తాలూకా కుప్పళ్లిలో పెరిగారు. ఆయన తన ప్రాథమిక విద్యను స్థానికంగా పూర్తి చేసుకొని కళాశాల చదువులకు మైసూరులోని మహారాజ డిగ్రీ కళాశాలలో చేరి 1929లో డిగ్రీ పూర్తి చేశారు. తర్వాత మైసూరు విశ్వవిద్యాలయంలో ఎంఏ చదివి అక్కడే అధ్యాపక వృత్తిని ప్రారంభించారు. కువెంపు 1937 ఏప్రిల్ 30న హేమావతిని వివాహం చేసుకొన్నారు. వీరికి ఇద్దరు కుమారులు పూర్ణచంద్ర తేజస్వి, కోకిలోదయ చైత్ర కాగా ఇద్దరు కుమార్తెలు ఇందుకలా, తారిణి ఉన్నారు. చివరకు ఆయన మైసూరు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ పదవిని నిర్వహించి విరమణ పొందారు.

శివమొగ్గ జిల్లా కుప్పళ్లిలోని కువెంపు నివాసం.. నేడు వస్తు సంగ్రహాలయం

రచనలతో గుర్తింపు

ఆంగ్ల కవులు జాన్ కీట్స్, వర్డ్స్‌వర్త్, షెల్లీ, తదితరుల ప్రభావంతో ఆయన ఉత్తమ సాహితీవేత్తగా రూపొందారు. ఆంగ్లభాషపై పట్టు సాధించిన కువెంపు తన 18వ ఏటనే ఆంగ్ల కవితల పుస్తకాన్ని ప్రకటించారు. ఆయనకు అమ్మభాషపై మక్కువతో కన్నడలో రచనలు ప్రారంభించారు. తన రచనల ద్వారా జ్ఞానపీఠ్ అవార్డును స్వీకరించి జాతీయ కవిగా గుర్తింపు పొందారు. ఆయన సాహిత్య సేవలకు 1955లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1958లో జాతీయ కవి గుర్తింపు, 1969లో జ్ఞానపీఠ్, 1988లో పద్మవిభూషణ్, 1992లో కర్ణాటక రత్న తదితర పురస్కారాలను పొందారు. తన 89వ ఏట ఆయన 1994లో మృతి చెందారు. ఆయన సొంతూరైన కుప్పళ్లిలోని కవిశైలలో స్మారకాన్ని నిర్మించారు. ఆయన నివాసాన్ని వస్తు సంగ్రహాలయంగా రూపొందించారు. కన్నడ భాషకు ప్రత్యేక గుర్తింపు తేవడానికి కువెంపు చేసిన సేవలు అనన్య సామాన్యమైనవి.

కువెంపు (పాతచిత్రం)

రక్కి చిత్రీకరణ పూర్తి

ఎస్‌ఎన్‌ఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'రక్కి' చిత్రం చిత్రీకరణ పూర్తి చేశారు. ఇటీవల చిత్రం టీజర్ విడుదల చేయడంతో ప్రేక్షకుల నుంచి ఉత్తమ స్పందన వస్తుందని దర్శకుడు వెంకట్ భరద్వాజ్ తెలిపారు. చిత్రీకరణ పూర్తి చేసుకుని డబ్బింగ్ పనుల్లో నిమగ్నమైనట్లు తెలిపారు. వినోదం, క్రైమ్ సంఘటనలు చిత్రకథకు ఆధారమన్నారు. చిత్రం ద్వారా హీరోగా రక్కి సురేష్ కన్నడచిత్ర రంగానికి పరిచయమవుతున్నారు. ఆశికా, సోమశేఖర్, పల్లవి మంజునాథ్, బి.సురేష్, సంపత్ మైత్రేయ, బలరాజ్‌వాడి, రమేష్‌పండిత్, హరిణిశ్రీకాంత్, హర్షఅర్జున్, డాక్టర్‌సుధాకర్ శెట్టి నటిస్తున్నారు.



రక్కిచిత్రంలో రక్కి సురేష్

వైషభ విడుదల

ప్రముఖ సినీనటుడు మోహన్‌లాల్, సమర్జిత్ లంకేష్ కలిసి నటించిన 'వైషభ' చిత్రం రాష్ట్రవ్యాప్తంగా విడుదలైంది. విడుదల కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హాజరయ్యారు. ఇది తండ్రీ కుమారుల మధ్య ఉన్న సంబంధాలను చెప్పే చిత్రకథ అని దర్శకుడు నందకిశోర్ తెలిపారు. ప్రముఖ పాత్రికేయుడు లంకేష్ మనవడు సమర్జిత్ లంకేష్ తొలిసారిగా చిత్రం ద్వారా కన్నడ చిత్రపరిశ్రమకు పరిచయం చేసినట్లు తెలిపారు. రాగిణి ద్వివేది, నయన్ సారికా, అజయ్, నేహసక్సేనా, గరుడ రామ్, వినయ్‌వర్మ, ఆలి, అయప్ప శర్మ, కిశోర్ తదితరులు నటిస్తున్నారు.

వైషభ చిత్రం విడుదల కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు

కాంగరూ ప్రారంభం

విభిన్నమైన కథ చిత్రం' కాంగరూ' చిత్రం చిత్రీకరణ క్రిస్మస్ సందర్భంగా ప్రారంభమైంది. కె.జి.ఎఫ్. చిత్రానికి సంగీతం అందించిన రవిబస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. క్రైమ్, థ్రిల్లర్‌తో కూడిన చిత్రమని, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని దర్శకుడు కిశోర్ మేగళమనె తెలిపారు. మాస్తి చిత్రానికి సంభాషణ అందించారు. తారగణాన్ని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

కాంగరూ చిత్రంలో కిశోర్

క్యాలెండర్ పాటలు వచ్చేశాయ్

హీరో ఆదర్శ గుండురాజ్ నటిస్తున్న 'క్యాలెండర్' చిత్రానికి సంబంధించిన రెండు పాటలు ఇటీవల విడుదల చేశారు. పాటలకు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నట్లు దర్శకుడు నవీన్ శక్తి తెలిపారు. రెండు పాటలను సంజయ్, నవీన్‌శక్తి రాయగా హృతిక్ పూజారి, సంజయ్ గానం చేయగా, సునాద్ గౌతమ్ సంగీతం అందించారు. సుస్మిత, నివిష్యాపాటిల్, తదితరులు నటిస్తున్నారు.

క్యాలెండర్ చిత్రంలో నవీన్ శక్తి, సుస్మిత, నివిష్యాపాటిల్

- న్యూస్‌టుడే, బెంగళూరు(యశ్వంతపుర)

EENADU Classifieds

JOBS

బెంగుళూరులో పనిచేయుటకు ప్రముఖ వస్త్ర దుకాణంలో అనుభవం గల సేల్స్‌మెన్స్ కావలెను. Age: 18-45Y, ESI+PF+ జీ-17K ✆ 7019632854

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

గణపయ్యకు..చందన శోభ

రాయల్‌కాలనీ వినాయకుడికి విశేషాలంకరణ

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: రాయల్ కాలనీ వరసిద్ధి గణపతి ఆలయంలో స్వామి వారికి నిత్య కైంకర్యాలు చేపట్టారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని విశేషంగా చందనంతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి పూజలను తిలకించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. వడ్రబండ అయ్యప్ప స్వామి ఆలయంలో గణపతి, అయ్యప్పస్వామి, కార్తికేయుడికి విశేష అభిషేకాలు చేసి అలంకరించారు. అయ్యప్ప మాలధారులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సత్యనారాయణ, అర్చకుడు శ్రీనివాస ఆచార్, అరుణ మంజునాథ్, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

జీవిత అనుభవాలే బసవ గీత

గ్రంథాన్ని విడుదల చేస్తున్న సాహితీవేత్తలు

మాన్వి, న్యూస్‌టుడే : బసవరాజ్‌స్వామి తన జీవిత అనుభవాలే బసవ గీత సత్య సంవాద గ్రంథమని పలువురు సాహితీవేత్తలు పేర్కొన్నారు. 12వ శతమానంలోనే సమసమాజ నిర్మాణం కోసం శరణులు పాటుపడ్డారని, శరణుల అనుభవంలోంచి పుట్టినవే వచనాలన్నారు. బసవరాజ్‌స్వామి రచించిన బసవ గీత సత్య సంవాద గ్రంథాన్ని ఆదివారం విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రముఖులు బి.జి.హులి, బసవ ప్రభుపాటిల్, డి.జి.కర్నూహళ్లి, శరణబసవ, కె.ఇ.నరసింహ, బి.వి.రెడ్డి, రంగప్ప, విజయలక్ష్మీ, రాజా సుభాశ్చంద్రనాయక్, శర్ఫుద్దీన్, మూకప్ప, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు ఘన స్వాగతం

చిన్నారులను ప్రశంసించిన స్వామీజీ

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: శ్రీరామనగర్‌లో నిర్మల తుంగభద్ర అభియాన్ కార్యక్రమం శనివారం రాత్రి జరిగింది. మూడో విడత పాదయాత్ర కంప్లి నుంచి జంగమర కల్గుడి, మరళి మీదుగా శ్రీరామనగర్ చేరుకుంది. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు తుంగభద్ర స్వచ్ఛత, కాలుష్య నియంత్రణ గురించి మాట్లాడారు. స్థానిక క్లీన్ అండ్ గ్రీన్ ఫోర్స్ లో ఉండి మొక్కలు నాటి వాటి సంరక్షణకు పాటుపడుతున్న చిన్నారులు మోహిత్, సాక్షలను హెబ్బాళ నాగభూషణ స్వామీజీ సత్కరించారు. గిరిజన వేషధారణలో ఉన్న చిన్నారులు అభియాన్ ప్రతినిధులకు గ్రామ పొలిమేరలో స్వాగతం పలికారు. గ్రామ పెద్దలు, రైతులు, జీపీ సభ్యులు, యువకులు, నాయకులు, ఏకేఆర్‌డీ కళాశాల, ఇందిరాగాంధీ పాఠశాల, స్వామి వివేకానంద, దేవరాజ్ అరసు వసతి పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారులు ఇలా..తిరిగేది ఎలా?

● అంతర్గత మార్గాల దుస్థితి ● జన సంచారానికి ఇబ్బందులు

రహదారి దుస్థితి

బళ్లారి, న్యూస్‌టుడే: నగరంలో ప్రధాన రహదారులు, కూడళ్లు మాత్రమే అభివృద్ధి చేసి...ప్రజలను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారే తప్పా...నగరంలో పలు అంతర్గత రహదారులు దుస్థితికి చేరుకున్నాయి. కంకర తేలి..చిన్న వాహనం వెళ్లినా లేచిన దుమ్మూధూళితో స్థానిక పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంత రహదారుల కంటే అధ్వానంగా మారాయి. కొత్త వ్యక్తులు వస్తే నగరంలో అడ్డు రహదారులను చూస్తే ముక్కుపై వేలు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా గ్రామీణ నియోజకవర్గం లోని రేడియోపార్క్, మేరీమాత కూడలి నుంచి బెళగల్లు క్రాస్‌ను కలిపే ప్రధాన రహదారి, ఆర్.టి.వో కార్యాలయం, సుధా క్రాస్, తదితర ప్రాంతాల్లో రహదారులు ఘోరంగా మారాయి. రేడియోపార్క్ రైల్వే గేటు ఇరువైపులా రహదారి దుస్థితికి చేరుకోవడంతో తవ్వి కంకర మట్టి వేసి చేతులు దులుపుకొన్నారు. నగరంలోని బ్రాహ్మణ, కాళమ్మ వీధి, వీరన్నగౌడ కాలనీల్లో మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి ముందు వెళ్లే రహదారి, మాజీ మంత్రి బి.శ్రీరాములు ఇంటి ముందు, సత్యనారాయణపేట పై వంతెన కింద వేసిన సిమెంట్ రహదారి దారుణంగా తయారయ్యాయి. పలుచోట్ల తాగునీరు, మురుగు కాలువ గొట్టాలు వేయడానికి రహదారులు తవ్వి విడిచి పెట్టారు. బెంగళూరు రహదారిలోకి బెంకి మారెమ్మ దేవస్థానం, గుగ్గరహట్టి నుంచి కాక్షర్లతోటకు వెళ్లే నందమూరి తారకరామారావు రహదారి తదితరాలు దుస్థితికి చేరుకున్నాయి. నగర పాలికెలో రహదారులపై పడిన గుంతలను పూడ్చడానికి రూ.40లక్షలు కేటాయించినట్లు ప్రకటించారు. కనీసం గుంతలను మట్టితో పూడ్చి వాహనదారులకు అనుకూలం చేయాలని స్థానికులు కోరుతున్నారు. బళ్లారి మున్సిపాలిటీ నుంచి నగర పాలికెకు వర్గోన్నతి చెందినా రహదారులు పరిస్థితి మారలేదని నగరాభివృద్ధి పోరాట సమితి సంచాలకుడు సోమశేఖర్‌గౌడ, డాక్టర్ ప్రమోద్ తదితరులు ఆరోపిస్తున్నారు.

సత్యనారాయణపేట పైవంతెన కింద అధ్వానం

విద్యార్థులకు సంస్కారవంతమైన విద్యాబోధన

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వామదేవ శివాచార్య, చిత్రంలో ఎమ్మెల్యే తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: చెట్లు విత్తనాల ద్వారా పండ్లకు రుచిని ఇస్తాయి. తల్లులు అన్ని బాధలను దిగమింగుకుని తమ పిల్లలకు సంస్కారవంతమైన విద్యను అందించాలని ఎమ్మిగనూరు వామదేవ శివాచార్య అన్నారు. ఆదివారం తాలూకా కేంద్రం సమీపంలోని ఎమ్మిగనూరు గ్రామంలో ధర్మస్థల గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు నిర్వహించిన సామూహిక శారదా పూజ, అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఎమ్మెల్యే జె.ఎన్.గణేష్ మాట్లాడుతూ విద్యారంగాభివృద్ధికి ప్రాధాన్యమిచ్చే లక్ష్యంతో రూ.400 కోట్ల నిధులు తీసుకు వచ్చినట్లు వివరించారు. కురుగోడు తాలూకాలో మొరార్జీ దేశాయ్ పాఠశాల, కార్మికుల పిల్లల కోసం ఒక కార్మిక పాఠశాల నిర్మిస్తామన్నారు. గెనికేహళ్ గ్రామంలో గాంధేయ సూత్రాల ఆధారంగా బాలికల వసతిశాలను నిర్మిస్తున్నట్లు వివరించారు. కంప్లిలో సాంకేతిక విద్యా పాఠశాలను నిర్మాణానికి అనుమతి లభించిందన్నారు. ఈ మూడేళ్లలో విద్యారంగానికి ప్రాధాన్యమిస్తామన్నారు. హెచ్.వీరాపురం శివలింగ మఠం జడేశతాత, ధర్మస్థలం గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు జిల్లా డైరెక్టర్ రోహిత మాట్లాడారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, కిరణ్‌కుమార్, శ్రీనివాస, నెల్లుడి గ్రామపంచాయతీ అధ్యక్షురాలు జడెమ్మ రామాంజనేయులు, హంపాదేవనహళ్లి గ్రామపంచాయతీ అధ్యక్షుడు కవిత పంపనగౌడ, ప్రముఖులు గాద్రి నాగిరెడ్డి, యోగప్పస్వామి, కనకప్ప సుణగార్, శివప్ప, సుధీర్, జడేశరెడ్డి, మంజునాథ, ప్రభు, రాము, రేఖ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వందేమాతరం వార్షికోత్సవం

ప్రదర్శనలో సంస్థాన్ నిర్వాహకులు

మాన్వి, న్యూస్‌టుడే : స్థానిక ఓంమండలి శివశక్తి అవతార్ సేవ సంస్థాన్ ఆధ్వర్యంలో వందేమాతరం వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ కూడలి వద్ద ఓం శివశక్తి మండలి తాలూకా సంచాలకురాలు బి.కె.అక్కమ్మ జాథాని ప్రారంభించి మాట్లాడారు. స్వాతంత్ర్య పూర్వం దేశభక్తుల్లో స్ఫూర్తి నింపేందుకు రచించిన వందేమాతరం గీతం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశభక్తులు, వందేమాతరం గీతాన్ని మననం చేసుకోవటం మన బాధ్యతగా భావించాలన్నారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో వందేమాతరం జాతా సాగింది. ఓంమండలి శివశక్తి అవతార్ సేవ సంస్థాన్ తాలూకా సమితి సభ్యులు, కార్యకర్తలు, సంఘ సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

గౌతమ సూర్యసిద్ధాంత కాలమానిని విడుదల

కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తి దినేష్ గుడి, హరికుమార్, గురురాజ్ కులకర్ణి

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రముఖ పంచాంగకర్త గురురాజ కులకర్ణి రచించిన గౌతమ సూర్యసిద్ధాంత కాలమానిని న్యాయమూర్తి వాసుదేవగుడి ఆవిష్కరించారు. ఆదివారం సత్యనారాయణ పేట శనీశ్వర ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హైందవ సంప్రదాయంలో నిత్యం కాలమానిని ఉపయోగపడుతోందన్నారు. 16 ఏళ్లుగా గౌతమ కాలమానిని రచించి ప్రజలకు అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి వాసుదేవగుడి, విశ్రాంత ప్రధానాచార్యులు హరికుమార్, బ్రాహ్మణ మహాసభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనాథ్, వేదపండితుడు గురురాజ ఆచార్, ప్రభుత్వ న్యాయవాది జనార్దన్‌లను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులందరికీ అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మనమ్మలగౌడ, శ్రీనివాసరావు హనుమంత, కరణం శ్రీనివాస్, గిరి, రమణందర్, వ్యాసాచార్, వసుధ, విజయవిఠల తదితరులు పాల్గొన్నారు.

అభియాన్‌ను విజయవంతం చేద్దాం

వివరాలు తెలుపుతున్న బాదర్లి, కేవీ, నాడగౌడ, కేకే

సింధనూరు, న్యూస్‌టుడే: జల జాగృతి-జన జాగృతి పేరిట నిర్వహిస్తున్న నిర్మల తుంగభద్ర అభియాన్ పాదయాత్ర రెండు దశలు పూర్తి చేసుకుని మూడో దశలో కిష్కింధ నుంచి మంత్రాలయం వరకూ సాగుతోంది..పాదయాత్ర పొడవునా నదిలో సబ్బు, షాంపూల వంటివి కూడా కలవకూడదంటూ ప్రచారం చేస్తున్న ఈ బృహత్ కార్యక్రమానికి అందరూ చేతులు కలపాలన్నారు. నదిలో స్నానమాచరించే వారికి శనగపిండి పొట్లాలను అభియాన్ పంపిణీ చేస్తోంది. ఈ జాగృతి కార్యక్రమానికి మనమందరం సహకరిద్దాం..29, 30 తేదీల్లో సింధనూరు చేరుకోనున్న అభియాన్‌ను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే బాదర్లి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన మాజీ మంత్రి నాడగౌడ, మాజీ ఎంపీ కేవీ, భాజపా నాయకుడు కె.కరియప్పతో కలసి ఆదివారం సర్క్యూట్ హౌస్‌లో విలేకరులకు అభియాన్ వివరాలు అందించారు. అభియాన్ ముఖ్యులు బసవరాజపాటిల్ వీరాపూర మాట్లాడుతూ తుంగభద్ర నదిలో కలుషితాలు తొలగించి స్వచ్ఛతకు నాంది పలకడమే అభియాన్ ముఖ్య ఉద్దేశమన్నారు. కె.విరుపాక్షప్ప మాట్లాడుతూ తుంగభద్రతో పాటు అన్ని నదుల స్వచ్ఛతను కాపాడేందుకు ఓ ట్రస్ట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. మాజీ మంత్రి నాడగౌడ మాట్లాడుతూ ప్రమాదకర వ్యర్థాలను తొలగించే అధునాతన యంత్రాలను ప్రభుత్వం ప్రతి పంచాయతీలో ఏర్పరచాలని సూచించారు. తుంగభద్ర నది స్వచ్ఛతకు తొలుత జనంలో జాగృతి తెద్దాం. .ఆపై చర్యలు చేపడదామని కరియప్ప పేర్కొన్నారు.

'సమస్యల్ని శాసనసభలో చర్చిస్తా'

70ఏళ్లు పైబడిన విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

కంప్లి, న్యూస్‌టుడే: విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి విధానసభలో చర్చిస్తానని స్థానిక ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. స్థానిక మల్లికార్జున కల్యాణ మంటపంలో ఆదివారం ఏర్పాటైన విశ్రాంత ఉద్యోగుల 7వ వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులు సమాజ సేవా కార్యక్రమాల పట్ల యువతలో చైతన్యం కలిగించాలన్నారు. సంఘం అధ్యక్షుడు ఎం.ఎస్.గంగాధరయ్య మాట్లాడుతూ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు ఆరోగ్య సంజీవని, ఆంతిమసంస్కారాలకు రూ.20 వేలు ఇవ్వాలన్నారు. 70 ఏళ్లు పైబడిన విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. వివిధ విభాగాల సంఘం తాలూకా అధ్యక్షుడు హేమయ్య స్వామి, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు డి.వి.సుబ్బారావు, ఎస్.ఎం.నాగరాజ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

దేశం కోసం పాటుపడింది కాంగ్రెస్సే

కార్యక్రమంలో పాల్గొన్న అల్లం ప్రశాంత్, రఫీకుమార్ తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 141వ కాంగ్రెస్ సంస్థాపక దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ నేతృత్వంలో నగర పాలికె మేయర్ పూజారి గాదెప్ప, క్రిస్టియన్ అభివృద్ధి మండలి రాష్ట్ర సభ్యులు రఫీకుమార్, పార్టీ సీనియర్ నేత కల్లుకంబ పంపాపతి, ఎల్.మారెణ్ణ, వీరేసాగౌడ, జోయపాటి విష్ణు, శ్రీనివాసులు, బి.ఎం.పాటిల్, ఈరన్నగౌడ, వెంకటలక్ష్మి, ఎరుకుల స్వామి, మంజుల, జగన్నాథ్ తదితరులు పాల్గొని కాంగ్రెస్ పార్టీని స్థాపించిన అలెన్ ఆక్టేవియన్ హ్యూమ్, మహాత్మాగాంధీ, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందిన దేశాభివృద్ధికి అప్పటి కాంగ్రెస్ పార్టీ నేతలే బీజం వేయడంతో నేడు అభివృద్ధిలో ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. వారి మార్గదర్శకంలో ముందుకు వెళ్లాలని డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ కార్యకర్తలు, నేతలకు సూచించారు.

హొసపేటె, న్యూస్‌టుడే: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారిలో అత్యధికులు కాంగ్రెస్ నాయకులే ఉన్నారని జిల్లా కాంగ్రెస్ సమితి ఉపాధ్యక్షుడు కె.ఎం.హాలప్ప అభివర్ణించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంస్థాపన దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఆంగ్లేయుల నుంచి దేశానికి విముక్తి కల్పించడంలో పార్టీ నాయకుల పాత్ర కీలకమని సాక్షి పలికారు. దాదాపు ఒకటిన్నర శతాబ్దాల క్రితం ప్రారంభమైన కాంగ్రెస్ నేడు మహావృక్షంగా విస్తరించిందని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నింబగల్లు రామకృష్ణ, ప్రముఖులు కె.రమేశ్, మారెణ్ణ, బణ్ణదమని సోమశేఖర్, భరతకుమార్, లింగణ్ణనాయక, రుక్మాన తదితరులు పాల్గొన్నారు.

హొసపేటె: వేడుకకు హాజరైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

ఘనంగా ఏఐడీఎస్‌వో సంస్థాపక దినోత్సవం

ధ్వజారోహణ చేస్తున్న ఏఐడీఎస్‌వో సభ్యులు రవికిరణ్, ఈరణ్ణ తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: ఏఐడీఎస్‌వో 72వ సంస్థాపక దినోత్సవం ఆదివారం ఉదయం నగరంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికిరణ్, జిల్లా అధ్యక్షుడు ఈరణ్ణ, కార్యదర్శి కంబళి మంజునాథ, సభ్యులు శాంతి, అనుపమా, నిహారిక, సమీర్, తిప్పేస్వామి, కాంతేశ్, రియాజ్, రాజశేఖర్, కార్తిక్ తదితరులు ఏఐడీఎస్‌వో కార్యాలయంలో జెండా ఎగురవేశారు. అనంతరం వైద్య కళాశాల క్రీడామైదానంలో జ్యోతిరావు పూలె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. నేడు విద్యార్థులు సావిత్రిబాయి పూలె, జ్యోతిరావ్ పూలె, విద్యాసాగర్ సింగ్, నేతాజీ వంటి మహానుభావుల మార్గదర్శనంలో ముందుకు వెళ్లాలన్నారు. దేశంలో ఎల్.కె.జి నుంచి పీజీ వరకు ఉచిత విద్యను బోధించాలి. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి. విద్యార్థులు, కార్మికులు, మహిళలు, రైతులు సమస్యలపై పోరాటం చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఈరణ్ణ మాట్లాడుతూ కె.పి.ఎస్.మ్యాగ్నెట్ పేరుతో రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. పేద విద్యార్థులు చదువుకు దూరమవుతారనే సంగతి గుర్తించుకోవాలని తెలిపారు.

అమృత పనులు నిర్ణీత వ్యవధిలో పూర్తిచేయాలి

అధికారులతో మాట్లాడుతున్న మంత్రి బోసురాజు

మాన్వి, న్యూస్‌టుడే : ప్రారంభించిన పనులను నిర్ణయించిన గడువులోగా పూర్తి చేయాల్సిందేనని, అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోవటానికి వెనుకాడబోమని మంత్రి ఎన్.ఎస్.బోసురాజు సూచించారు. పట్టణంలో చేపట్టిన వివిధ నిర్మాణాలు నాసిరకంగా జరుగుతున్నాయని కాంగ్రెస్ ప్రముఖులు, కార్యకర్తలు మంత్రి దృష్టికి తీసుకెళ్లిన క్రమంలో ఆయన ఎమ్మెల్యే హంపయ్యనాయక్‌తో కలిసి శనివారం రాత్రి పట్టణంలో పర్యటించి నిర్మాణాలను పరిశీలించారు. తర్వాత పురపాలక కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. అమృత్ పనులు ఆలస్యమై ఆరా తీసారు. ముఖ్యంగా అమృత్ 2 యోజనను సంబంధించి పైప్‌లైన్లు వేసి ఇతర పనులను చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏజెన్సీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గడువులోగా పూర్తి చేయాల్సిందేనని, తర్వాత ప్రాధేయపడి ఫలితం లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్, తహసీల్దార్ భీమరాయ రామసంద్ర, పురపాలక సంఘం ముఖ్యాధికారి పరశురామ్‌దేవమానే, అధికారులు హనుమంతప్ప, దేవరాజ్, చౌహాణ్, గఫూర్‌సాబ్, అమరేశప్ప, పురపాలక సంఘం సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోహిణి సింధూరిపై రైతు సంఘం ఫిర్యాదు

కార్యదర్శి రోహిణి సింధూరి

బళ్లారి, న్యూస్‌టుడే: వాణిజ్య, పరిశ్రమల (గనులు) శాఖ కార్యదర్శి రోహిణి సింధూరి బళ్లారి జిల్లా పర్యటన సందర్భంగా జిందాల్ టౌన్‌షిప్‌లో వాస్తవ్య (స్టే పై) దర్యాప్తు చేయించాలని కోరుతూ రాష్ట్ర రైతు సంఘం హసిరు సెనె సంఘటన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి ఫిర్యాదు చేసింది. డిసెంబరు 25 నుంచి 27 వరకు రోహిణి బళ్లారి జిల్లాలో పర్యటించారు. సండూరు ప్రాంతంలోని గనులను ఆమె సందర్శిస్తారని రైతులు భావించారు. విచ్చలవిడిగా గనుల తవ్వకాల కారణంగా వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యల గురించి రోహిణికి వినతిపత్రం సమర్పించడానికి రెండు రోజులు వేచి చూశామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె రెండు రోజులు జిందాల్ టౌన్‌షిప్‌లో ఉండటంపై రైతు సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. జిందాల్ కంపెనీ ఉక్కు ఉత్పత్తితో పాటు సండూరులో గనులు తవ్వకాలు కూడా చేస్తోంది. ఇటీవల వేలంలో నాలుగు గనులను కొనుగోలు చేసింది. ఈ గనులు వేలం సమయంలో ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించిందని హైకోర్టు కమిటీ సుప్రీంకోర్టుకు నివేదించింది. ఈ విషయంలో సుప్రీంకోర్టులో మధ్యంతర దరఖాస్తును దాఖలు చేసిన జిందాల్ కంపెనీ వివిధ ప్రభుత్వ శాఖలను ప్రతివాదులుగా చేసింది. ఇందులో ప్రభుత్వం ప్రభుత్వ కార్యదర్శి రోహిణి కూడా ప్రతివాది అయితే ఆమెకు అదే జిందాల్ ఆతిథ్యం ఇవ్వడం అనేక సందేహాలకు దారితీసిందని రైతు సంఘం ఆరోపించింది.

శ్రీకృష్ణ లీలామృతం..ఓ అద్భుత మహాకావ్యం

పుస్తకాన్ని విడుదల చేస్తున్న సాహితీవేత్తలు, అభిమానులు

హొసపేటె, న్యూస్‌టుడే: శ్రీకృష్ణ లీలామృతం అనే మహాకావ్యాన్ని రచించిన రంగోపంత్ నాగరాజ్‌రావు అద్భుత ప్రతిభావంతుడని బెంగళూరు సంస్కృత విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య మల్లేపురం వెంకటేశ్ అభివర్ణించారు. హొసపేటకు చెందిన 86 ఏళ్ల కవి రంగోపంత్ నాగరాజ్‌రావు తన 35వ ఏట భామిని షట్పది (ఆరుసాళ్ల పద్యం)లో రాసిన 16000 పేజీల శ్రీకృష్ణ లీలామృతం పుస్తకాన్ని ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఈ అద్భుతమైన కావ్యం విడుదలకు 51ఏళ్లు పట్టిందని విచారం వ్యక్తం చేశారు. ఆయన శిష్యుడు, ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ యత్నిళ్లి మల్లయ్య శ్రద్ధ తీసుకుని పుస్తకాన్ని రాసి, ముద్రించారని అభినందించారు. కన్నడ కవి కుమారవ్యాస రాసిన మహాభారత కావ్య ప్రేరణతో రంగోపంత్ నాగరాజ్‌రావు ఈ పుస్తకాన్ని రాశారని గుర్తుచేశారు. ప్రతీ ఒక్కరూ ఈ పుస్తకాన్ని కొని చదవాలని సూచించారు. కార్యక్రమంలో హంపీ వర్సిటీ విశ్రాంత ఆచార్య కె.రవీంద్రనాథ్, విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ మృత్యుంజయ రుమాలె, బళ్లారి జిల్లా శరణసాహిత్య పరిషత్తు అధ్యక్షుడు సిద్ధరామ కల్మఠ, పీయూ విద్యాశాఖ అధికారి హవాల్దార్ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల హక్కుల రక్షణ సమష్టి బాధ్యత

కంప్లి, న్యూస్‌టుడే: పిల్లల హక్కుల రక్షణ అందరి బాధ్యత..బాల్య వివాహాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బళ్లారి రీడ్స్ నిర్దేశకుడు సి.తిప్పేశప్ప తెలిపారు. స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో ఆదివారం జరిగిన బాల్య వివాహాల నిషేధ చట్టం, పిల్లల హక్కుల రక్షణ జాగృతి సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మూడునెలల్లో కంప్లి తాలూకాలో మూడు బాల్య వివాహాలను నియంత్రించినట్లు తెలిపారు. మరో మూడు కేసులు నమోదయ్యాయన్నారు. బెంగళూరు పిల్లల హక్కుల నిఘా కేంద్రం సభ్యుడు డాక్టర్ హెచ్.సి.రాఘవేంద్ర మాట్లాడుతూ పిల్లల హక్కుల రక్షణ, చట్టాలు గురించి చాలా మందికి తెలియదు. పిల్లల రక్షణ - చట్టాలు పుస్తకాలను జిల్లాలోని 850 పాఠశాలల్లో పంపిణీ చేశామన్నారు. దివాకర్, కరిస్వామి, కె.ఎం.తిప్పేస్వామి పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

28-12-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1611.15	1627.22
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	453
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	8,999	8,895
నీటి నిల్వ (టి.ఎం.సి)	39.885	83.988

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

పట్టు పురుగుల పెంపకంలో శిక్షణ

మహిళకు ప్రమాణపత్రం అందిస్తున్న అధికారి మల్లన గౌడ

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి తాలూకా రామసాగరలో 10 రోజులు జరిగిన పట్టు పురుగుల పెంపకంలో శిక్షణ ఆదివారం ముగిసింది. తాలూకా పంచాయతీ సహాయ నిర్దేశకుడు మల్లన గౌడ శిక్షణ పొందిన మహిళలకు ప్రమాణపత్రాలు అందించి మాట్లాడుతూ శిక్షణ పొందిన వారు పట్టు పురుగుల పెంపకం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఉపాధి హామీ పథకం సదుపాయాలను సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. 35 మంది మహిళలు శిక్షణ పొందారు. కార్యక్రమ మేనేజర్ రాజేంద్ర, అధికారులు హాలప్ప, అపూర్వ, సమృద్ధి సంజీవని సమాఖ్య అధ్యక్షురాలు లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమీకృత పంటల సాగు లాభాలు బాగు

ఉల్లి పంట సాగు

బంతిపూల సాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

సండూరు(బళ్లారి), న్యూస్‌టుడే: జాతీయ రైతు దినోత్సవం సండూరు తాలూకా తాళూరు గ్రామంలో జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫౌండేషన్ అధికారులు, వ్యవసాయశాఖాధికారులు పలువురు రైతులకు సమీకృత వ్యవసాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు. టి.వీరేశ్ అనే స్థానిక రైతు ఈ పద్ధతిని అవలంబిస్తూ తమలపాకు, అరటి, ఉల్లి, బంతిపూలు తదితర ఉద్యానవన పంటలతో కలిపి మొత్తం 23 రకాల పంటలను సాగుచేస్తూ మంచి దిగుబడి సాధించారు. పలువురికి ఆదర్శంగా నిలిచిన ఈ రైతునే ఉదాహరణగా చూపిస్తూ అధికారులు పలు సూచనలు చేశారు. బళ్లారి తాలూకా హగరి వ్యవసాయ విజ్ఞాన పరిశోధన కేంద్రం బాధ్యుడు, శాస్త్రవేత్త పాలయ్య, మరోశాస్త్రవేత్త డాక్టర్ ఎస్.రవి సమీకృత వ్యవసాయ పద్ధతులు, నేల, నీటి యాజమాన్యం, తెగుళ్ల నివారణ, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సండూరు తాలూకాలోని వాతావరణానికి సరిపడే పంటలు, మంచి దిగుబడి నిచ్చే పంటలను వివరించారు. అనంతరం రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఇస్కో బళ్లారి విభాగం మేనేజర్ హనుమంతప్ప ఆదర్శ రైతులు సాగు పద్ధతులను తెలుసుకుని మరిన్ని శాస్త్రీయ పద్ధతులను వివరించారు. స్థానిక రైతులకు జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ పూర్తి సాయమందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధికారి నాగనగౌడ, రాజా, గంగాధర, వీరేష్, బసప్ప తదితర ప్రగతిశీల రైతులు, వివిధ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఉన్నత విద్య అందించండి

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామీజీ

కంప్లి, న్యూస్‌టుడే: ఉన్నత విద్యతోనే అభివృద్ధి సాధ్యం. పిల్లలకు ఉన్నత విద్య అందించాలని ఎరెహొసళ్లి రెడ్డి గురుపీఠాధిపతి హేమనానంద స్వామీజీ తెలిపారు. స్థానిక రాఘవేంద్ర కల్యాణ మంటపంలో ఆదివారం జరిగిన హిందూ రెడ్డి జాగృతి సమావేశాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవాలి. విద్యా సంస్థలు, కల్యాణ మంటపాలు నిర్మించాలన్నారు. హేమ, వేమ రెడ్డి సముదాయ జిల్లా అధ్యక్షుడు నారా ప్రతాప రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రెడ్డి అభివృద్ధి మండలి ఏర్పాటు చేయాలన్నారు. కంప్లిలో సముదాయ భవన నిర్మాణం కోసం స్థలం ఇస్తానని గంగావతి గద్ది గౌసులప్ప తెలిపారు. సముదాయ జిల్లా గౌరవ అధ్యక్షుడు జి.సోమశేఖర రెడ్డి, తాలూకా అధ్యక్షుడు బస లింగప్ప, నాయకులు ఐనాథ రెడ్డి, సదాశివప్ప, హొన్నళ్లి గంగాధర్, టి.వి.సుదర్శన రెడ్డి, చంద్రకాంత రెడ్డి, తిరుపతి రెడ్డి, కుమార స్వామి రెడ్డి, సముదాయ మహిళలు, యువకులు పాల్గొన్నారు.

చదరంగంతో మెదడుకు చురుకు

సింధనూరు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు ఆదివారం స్థానిక ఆనంద్ పబ్లిక్ పాఠశాల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంతో పాటు ఆంధ్రా, తెలంగాణ నుంచి కూడా ఆటగాళ్లు వచ్చి పోటీలో పాల్గొన్నారు. స్థానిక సుభద్ర అకాడమీ 1600 లోపు రేటింగ్ గల ఆటగాళ్ల కోసం ఈ ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నీ ఏర్పాటు చేసింది. కె.శివరాజ్, వీరేశ్ తాళ్లూరి, అపూర్వ మెడికల్స్ ప్రాయోజికత్వం వహిస్తున్నాయి. టోర్నీలో మొత్తం 290 మంది ఆటగాళ్లు పాల్గొంటున్నారు. ఫిడే నియమాలతో స్విస్ పేరింగ్ మెథడ్‌లో ఏడు రౌండ్లలో పోటీలు నిర్వహించి విజేతలను నిర్ణయించనున్నట్లు అకాడమీ అధ్యక్షుడు లక్ష్మయ్యశెట్టి తెలిపారు. బళ్లారి, బెంగళూరు, హావేరిల నుంచి విచ్చేసిన చదరంగం నిపుణులు ప్రమోద్‌మోరె, కె.బసవరాజ్, కృష్ణ షిండే ముగ్గురూ ఈవెంట్ ఆర్బిటర్లుగా వ్యవహరించారు. తొలుత పోటీల కార్యక్రమాన్ని ప్రారంభించిన భాజపా నాయకుడు కె.కరియప్ప మాట్లాడుతూ..చదరంగం ఆట ఎంతో ఉపయోగకరమైందన్నారు. కార్యక్రమంలో వీరేశ్ నాయక్, గౌతం మెహతా, శశి ధాని తదితరులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న భాజపా నాయకుడు కరియప్ప

మూడో రౌండుకు చేరుకుని ఆటలో ఎత్తులు వేస్తున్న ఆటగాళ్లు

(c) eenadu

సిద్ధమైన మెట్రో రైలు ఉపరితల వంతెన

మెట్రో సొరంగ మార్గాన్ని పరిశీలిస్తున్న బీఎంఆర్‌సీఎల్

సిల్క్‌బోర్డు కూడలి నుంచి కె.ఆర్.పురం వరకు ఉపరితల వంతెన నిర్మాణం

గులాబీ మార్గంలో కూ..చుక్..చుక్..

■ కొత్త ఏడాది మెట్రో రైలు సంచారం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: నమ్మమెట్రో గులాబీ మార్గంలో రైలు సంచారం వచ్చే ఏడాది మే, జూన్ నెలల్లో అధికారికంగా ప్రారంభం కానుంది. ఈ మార్గంలో రైలు సంచారం ప్రారంభమైతే రహదారిపై సంచార రద్దీ నియంత్రణలోకి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గులాబీ మార్గంలో సంచరించే పైలెట్ రహిత మెట్రోను బెమెల్ సమకూర్చింది. వచ్చిన రైళ్లు జనవరి నుంచి ప్రయోగాత్మకంగా ఈ మార్గంలో సంచరిస్తాయి. కాళేనా అగ్రహార నుంచి నాగవార వరకు గులాబీ మార్గాన్ని నిర్మించారు. దేశంలోనే అత్యంత పొడవు కలిగిన మెట్రో సొరంగ మార్గంగా గుర్తింపు పొందనుంది. కాళేనా అగ్రహార నుంచి తావరెకెరె వరకు 7.5 కిలోమీటర్ల ఉపరితల వంతెనపై రైలు సంచరించనుంది. ఈ మార్గంలో ఆరు మెట్రో స్టేషన్లను నిర్మించారు. డెయిరీ కూడలి నుంచి నాగవార వరకు 13 కిలోమీటర్ల సొరంగ మార్గంలో రైలు సంచరిస్తుంది. 12 భూగర్భ స్టేషన్లను నిర్మించారు. భూగర్భ మార్గాన్ని బీఎంఆర్‌సీఎల్ ఎండీ డాక్టర్ రవిశంకర్ ఉన్నతాధికారులతో పరిశీలించారు. 2026 డిసెంబర్ల కల్లా భూగర్భ మార్గంలో రైలు సంచారాన్ని ప్రారంభించాలనే లక్ష్యం ఉన్నా దానికి ముందే రైలు సంచారాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. స్టేషన్ల నిర్మాణాలు పూర్తయి సాంకేతికపరమైన పనులు సాగుతున్నాయని తెలిపారు. ఆ పనులు పూర్తయ్యేందుకు చాలా సమయం తీసుకుంటుందన్నారు. కాళేనా అగ్రహార నుంచి తావరెకెరె వరకు ఉపరితల వంతెన నిర్మాణ పనులతో పాటు సిగ్నల్ వ్యవస్థ, స్టేషన్ల ప్లాట్‌ఫారాల నిర్మాణం, ఇతర పనులు పూర్తయినట్లు వివరించారు. 2027 కల్లా అంతర్జాతీయ విమానాశ్రయానికి మెట్రో రైలు హెబ్బాళ్ నుంచి సంచరిస్తుందని వివరించారు. వచ్చే ఏడాది ఆఖరి కల్లా నగరంలో 175 కిలోమీటర్ల పరిధిలో మెట్రో రైలు సంచరించనుంది. ప్రస్తుతం 92 కిలోమీటర్లు మెట్రో రైలు సంచరిస్తున్న విషయం తెలిందే.

● ప్రధానంగా రహదారిపై సంచార రద్దీ ఉండే కోరమంగల డెయిరీ కూడలి, లక్కసంద్ర, ఎంజీరోడ్డు, శివాజినగర, కంటోన్మెంట్, ట్యానరీ రోడ్డు, వెంకటపుర, కేజీహళ్లి, నాగవార అవుటర్ రింగ్ రోడ్డు వరకు భూగర్భంలో గులాబీ రైలు సంచరిస్తుంది. రైలు సంచారం ప్రారంభమైతే కాళేనాఅగ్రహార నుంచి నాగవార అవుటర్‌రింగ్ రోడ్డుకు కేవలం 45 నిమిషాల్లో చేరుకోవచ్చు. ప్రస్తుతం రహదారిపై రెండు నుంచి రెండున్నర గంటల సమయం పడుతోంది. ఈ ప్రదేశాల్లో 30 శాతం సంచార రద్దీ అదుపులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. కోరమంగల, జేపీ నగర, జయదేవ ఆసుపత్రి, ఐఐఎంబీ, శివాజినగర, ఎంజీరోడ్డు, ప్యాటరీ టౌన్, కంటోన్మెంట్ రైల్వేస్టేషన్ అతి తక్కువ సమయంలో చేరుకోవచ్చు. ఈ మార్గంలో రైలు సంచారం కోసం నగరవాసులు ఎదురు చూసే రోజులు దగ్గర పడుతున్నాయి.

బెమెల్ తయారు చేసిన పైలెట్ రహిత గులాబీ మెట్రో రైలు

వైభవంగా శ్రీనివాస కల్యాణోత్సవం

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: బెంగళూరు దక్షిణ జిల్లా మాగడి పట్టణంలో శ్రీనివాస కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు బెంగళూరు నగరంతో పాటు మాగడి పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తన భార్య ఉషా శివకుమార్‌తో కలిసి కార్యక్రమానికి హాజరై పూజలు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన పూజారులు కార్యక్రమాన్ని నిర్వహించారు. వచ్చిన భక్తులకు తిరుమల లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

స్వామివారికి నమస్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి డీకేశివకుమార్, ఆయన భార్య ఉషా శివకుమార్

రోడ్డు ప్రమాదంలో పాదచారి మృతి

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: విలాసవంతమైన కారులో ఇష్టమొచ్చినట్లుగా సంచరించే సమయంలో పాదచారిని ఢీకొనడంతో అతడు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి ఇక్కడ హెచ్.ఎస్.ఆర్ లేఅవుట్ పోలీసు ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. మృతుడిని బెళగావి నివాసి సంతోష్ దొడ్డగౌడర (26)గా పోలీసులు గుర్తించారు. రాత్రి 10 గంటలకు పాదచారి మార్గంలో నడిచి వస్తుండగా అతివేగంగా కారు అతడిని ఢీకొనటంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కారుడ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ప్రేమ పెళ్లి పేరుతో రూ.37 లక్షల వంచన

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: ప్రేమ పెళ్లి పేరుతో ఓ యువతిని నమ్మించి రూ.37 లక్షలు తీసుకుని మోసగించిన నిందితుడు హరియాణా వాసి శుభాంను శుక్రవారం బాగలకుంటె పోలీసులు అరెస్టు చేశారు. టి.దాసరహళ్లిలోని అద్దె ఇంట్లో నివసిస్తున్న నిందితుడి వివాహసంబంధ జీవితానికి ఆకర్షితురాలైన యువతి ఆతడి ప్రేమలో పడింది. వివిధ పేర్లతో యువతిని నిందితుడు నమ్మించి దశలవారీగా నగదు తీసుకున్నాడు. మరోవైపు నిందితుడు ముంబయిలో ఓ అపార్ట్‌మెంట్‌లో మరోయువతితో కలిసి సహజీవనం సాగిస్తున్నట్లు యువతి గుర్తించారు. దానికి ముందు అతడికి పెళ్లి అయినట్లు సమాచారం వచ్చింది. మోసపోయినట్లు ఆలస్యంగా గుర్తించిన యువతి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతని వద్ద డబ్బులు తీసుకోవడంతో పాటు ఇంట్లో 559 గ్రాముల బంగారు నగలు దొంగిలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

500 మంది మద్యపాన ప్రియులపై కేసులు

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: నూతన సంవత్సరం రానున్న సందర్భంగా నగర సంచార పోలీసులు వివిధ ప్రాంతాల్లో వాహనాలు తనిఖీలు చేపట్టారు. శనివారం రాత్రి పది గంటల నుంచి ఆదివారం తెల్లవారు జామున రెండుగంటల వరకు తనిఖీలు చేయగా ఐదువందల మంది మద్యపాన ప్రియులను గుర్తించారు. వారిపై కేసులు నమోదు చేసి జరిమానా విధించి వాహనాలు చేశారు. 140 పాయింట్లలో తనిఖీలు చేపట్టారు. గత మూడు రోజుల్లో 1,500 మంది మద్యపాన ప్రియులను గుర్తించి కేసులు నమోదు చేసినట్లు సంచార పోలీసులు తెలిపారు.

లారీ-బస్సు ఢీకొని 20 మందికి గాయాలు

బెంగళూరు(బాణసవాడి): ముందు సంచరిస్తున్న లారీని వెనుక వస్తున్న ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో 20 మంది ప్రయాణికులు గాయపడిన సంఘటన శనివారం రాత్రి హాసన జిల్లా చెన్నరాయపట్టణ బైపాస్ రోడ్డులో జరిగింది. బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో 20 మంది గాయపడగా 13 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు హాసన జిల్లా పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

వివాహిత ఆత్మహత్య

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: వరకట్న వేధింపులు తాళలేక మల్లసంద్ర నివాసి ఐశ్వర్య (23) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం రాత్రి బాగలకుంటె పోలీసు ఠాణా పరిధిలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి భర్త సింహను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. మూడు నెలలు కిందట వివాహమైంది. ఆ సమయంలో ఎక్కువ కట్నం ఇచ్చినా, అయినా చాలలేదని తన కుమార్తెను చిత్రహింసలకు గురి చేసి హత్య చేశారని బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులోంది.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: వక్కతోటలో వక్కలు తెంపుతుండగా విద్యుదాఘాతానికి గురై ఇద్దరు కార్మికులు గాయపడగా వారిలో ఒకరు మృతి చెందారు. మృతుడిని పుట్టస్వామి (48)గా గుర్తించారు. ఈ సంఘటన ఆదివారం ఉదయం శివమొగ్గ జిల్లా హొసనగర తాలూకా త్రివేణి గ్రామంలో జరిగింది. గాయపడిన మరో కార్మికుడిని చికిత్స కోసం శివమొగ్గ ఆసుపత్రికి తరలించారు. కత్తి విద్యుత్తు తీగలకు తగలడంతో ఈ సంఘటన జరిగినట్లు గుర్తించారు.

హెసరుఘట్ట గడ్డి పెంపక క్షేత్రం పరిశీలన

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం కొన్ని రోజుల కిందట సురక్షితమైన గడ్డి ప్రదేశంగా హెసరుఘట్ట చెరువు చుట్టు పక్కల ఉన్న 5,678 ఎకరాల గడ్డి పెంపక ప్రదేశాన్ని ఆదివారం ఇక్కడ అటవీ పరిసరాల శాఖ మంత్రి ఈశ్వర్ బి.ఖండ్రె సందర్శించారు. ఏళ్ల తరబడి పదిలక్షల మందికి తాగునీరు సరఫరా చేసే సామర్థ్యం కలిగిన హెసరుఘట్ట చెరువులోకి కట్టడాల వ్యర్థాలు, చెత్త రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. అర్కావతి నది కాలువలు ఆక్రమణలకు గురికాకుండా చర్య తీసుకోవాలని, ప్రకృతి సహజంగా పెరుగుతున్న గడ్డి సంరక్షించాలని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న పశువులు మేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఏపుగా పెరిగిన గడ్డి మధ్య పక్షులు గుడ్లు పెట్టి సంతానోత్పత్తి కేంద్రంగా ఉందన్నారు. జలరాశులు ఉన్నందున వివిధ ప్రాంతాల నుంచి పక్షులు ఇక్కడికి వచ్చి గూళ్లు కట్టుకుని నివసిస్తున్నాయని తెలిపారు. హెసరుఘట్ట చెరువు చుట్టుపక్కల ప్రదేశాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ పథకాన్ని సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు అటవీ శాఖ ప్రధాన అటవీ సంరక్షణాధికారి మీనాక్షి నేగి, ఏపీసీసీఎఫ్ కుమార్ పుష్కర్, తదితరులు ఉన్నారు.

హెసరుఘట్ట గడ్డి ప్రదేశంలో పశువుల కాపలాదారులతో మాట్లాడుతున్న మంత్రి ఈశ్వర్ బి.ఖండ్రె

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	65
క్యారెట్-	65
బీరకాయలు-	55
క్యాబేజి-	50
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	30
సొరకాయ-	55
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	70
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	70
టమాటా(సాధారణ)-	55
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	45
ఉల్లి(మేలురకం)-	40
ఉల్లి(సాధారణ)-	35
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	55
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	120

పండ్లు, ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	385
సిమ్లా ఆపిల్-	265
గ్రీన్ ఆపిల్-	325
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	65
బొప్పాయి-	35
ఆరంజి-	95
బత్తాయి-	65

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

జేఈఈ, నీట్ ర్యాంకర్లకు పురస్కారాలు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: ఐఐటీ - జేఈఈ, నీట్ యూజీ-2025 పరీక్షలో అద్భుతమైన విజయాలు సాధించిన అలెన్ సంస్థ విద్యార్థులకు ప్రత్యేక పురస్కారాలు అందజేశారు. ఆదివారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో టాప్ ర్యాంకర్లకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లురవీంద్ర, ఇస్రో మాజీ అధ్యక్షుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత ఎ.ఎస్.కిరణ్‌కుమార్ తదితరులు నగదు బహుమతులు పతకాలను అందజేసి సత్కరించారు. బెంగళూరు నగరంలో శిక్షణ పొందిన టాప్ ర్యాంకులు సాధించిన 161 మంది విద్యార్థులకు రూ.29.76 లక్షల నగదు బహుమతులు అందజేయగా 1,256 మంది విద్యార్థులకు స్మారక చిహ్నాలు, వెండి పతకాలను అందించారు. అలెన్ విద్యాసంస్థ దక్షిణాది ఉపాధ్యక్షుడు మహేశ్ యాదవ్ మాట్లాడుతూ మరిచిపోలేని రోజు. ఇంత మంది విద్యార్థులు పరీక్షల్లో టాప్‌ర్యాంకులు సాధించి సంస్థ గౌరవాన్ని నిలబెట్టారని తెలిపారు. విశ్వేశ్వరయ్య సాంకేతిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎస్.విద్యాశంకర్, ఇస్రో యు.ఆర్.రావు శాటిలైట్ సెంటర్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఆర్.నడగౌడ తదితరులు హాజరయ్యారు.

విద్యార్థులను సత్కరిస్తున్న మంత్రి కొల్లురవీంద్ర, ఇస్రో మాజీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఉపకులపతి విద్యాశంకర్ తదితరులు

కబ్బన్ అందాలు.. కనుమా

ఉద్యానవనంలో కట్టిపడేస్తున్న ప్రకృతి సిద్ధమైన సౌందర్యం

ఉద్యానవనంలో శీతాకాలంలో ఎటు చూసినా పచ్చదనం

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: శీతాకాలంలో కబ్బన్‌పార్కు ప్రకృతి సహజ సిద్ధమైన అందాలను తిలకించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. మంచు, చలి గాలి మధ్య ప్రజలు వాయువిహారం చేస్తూ ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నారు. మరోవైపు కబ్బన్ పార్కులో ఖ్యాతి పొందిన గులాబీ పూదోటను ప్రస్తుతం పునరుద్ధరించారు. కొత్తగా మొక్కలు నాటారు. వేసవి నాటికి గులాబీ పూలు పూస్తాయి. అప్పుడు పూలతోట అందంగా మారుతోంది. పర్యాటకులను ఎక్కువగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఉద్యానవనంలో ఉన్న ప్రతి మొక్కకు పూలు పూయడం ప్రారంభమైంది. పూలను తిలకించి తమ చరవాణిలో పర్యాటకులు బంధించే పనిలో నిమగ్నమవుతున్నారు. ఏటా శీతాకాలంలో ఉద్యానవనం ఎప్పుడూలేని విధంగా పచ్చదనంతో నిండిపోతోంది. సహజ సిద్ధమైన సౌందర్యాలను తిలకించేందుకు నగర ప్రజలు ప్రతి రోజూ సాయంత్రం ఉద్యానవనానికి వస్తున్నారు. ఎండ వచ్చిన తరువాత ఎక్కువ మంది ఉద్యానవనంలోకి వచ్చి వాయువిహారం చేస్తున్నారు. ప్రతి శని, ఆదివారాలు ఉద్యానవనంలోకి వాహనాలను అనుమతించరు. వాయుమాలిన్యం నియంత్రణతో పాటు మొక్కలు నాశనం కాకూడదనే ఉద్దేశంతో సంచారాన్ని ఆపేశారు.

కేంద్ర గ్రంథాలయం వద్ద గులాబీ తోట

కన్నడ భాష ఇంపును ప్రపంచానికి చాటిన కువెంపు

చిత్రదుర్గం,న్యూస్‌టుడే: కన్నడ భాషను నేర్చుకొనే విద్యార్థికి కువెంపును ప్రత్యేకంగా పరిచయం చేయవలసిన పని లేదు. ఆయన సాహిత్య రచనలను ఒకటో తరగతి నుంచి స్నాతకోత్తర తరగతుల వరకు విద్యార్థులు తప్పనిసరిగా ఎప్పుడో ఒకసారి చదివే ఉంటారు. కన్నడ నాట కువెంపు గురించి తెలియని కన్నడిగుడు లేరంటే అతిశయోక్తి కాదు. కన్నడకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చి కన్నడ ఇంపును ప్రపంచానికి చాటిచెప్పిన మేరు కవి, సాహితీవేత్త, విమర్శకుడు, నాటక రచయిత, విద్యావేత్త కువెంపు. నేడు ఆయన జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం. కువెంపు పూర్తి పేరు కుప్పళ్లి వెంకటప్ప పుట్టప్ప. ఆయన తల్లి సీతమ్మ పుట్టినిల్లు అయిన చిక్కమగళూరు జిల్లా కొప్ప తాలూకా హీరేకొడిగే గ్రామంలో 1904 సంవత్సరం డిసెంబరు 29న జన్మించారు. తండ్రి సొంతూరు శివమొగ్గ జిల్లా తీర్థహళ్లి తాలూకా కుప్పళ్లిలో పెరిగారు. ఆయన తన ప్రాథమిక విద్యను స్థానికంగా పూర్తి చేసుకొని కళాశాల చదువులకు మైసూరులోని మహారాజ డిగ్రీ కళాశాలలో చేరి 1929లో డిగ్రీ పూర్తి చేశారు. తర్వాత మైసూరు విశ్వవిద్యాలయంలో ఎంఏ చదివి అక్కడే అధ్యాపక వృత్తిని ప్రారంభించారు. కువెంపు 1937 ఏప్రిల్ 30న హేమావతిని వివాహం చేసుకొన్నారు. వీరికి ఇద్దరు కుమారులు పూర్ణచంద్ర తేజస్వి, కోకిలోదయ చైత్ర కాగా ఇద్దరు కుమార్తెలు ఇందుకలా, తారిణి ఉన్నారు. చివరకు ఆయన మైసూరు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ పదవిని నిర్వహించి విరమణ పొందారు.

శివమొగ్గ జిల్లా కుప్పళ్లిలోని కువెంపు నివాసం.. నేడు వస్తు సంగ్రహాలయం

రచనలతో గుర్తింపు

ఆంగ్ల కవులు జాన్ కీట్స్, వర్డ్స్‌వర్త్, షెల్లీ, తదితరుల ప్రభావంతో ఆయన ఉత్తమ సాహితీవేత్తగా రూపొందారు. ఆంగ్లభాషపై పట్టు సాధించిన కువెంపు తన 18వ ఏటనే ఆంగ్ల కవితల పుస్తకాన్ని ప్రకటించారు. ఆయనకు అమ్మభాషపై మక్కువతో కన్నడలో రచనలు ప్రారంభించారు. తన రచనల ద్వారా జ్ఞానపీఠ్ అవార్డును స్వీకరించి జాతీయ కవిగా గుర్తింపు పొందారు. ఆయన సాహిత్య సేవలకు 1955లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1958లో జాతీయ కవి గుర్తింపు, 1969లో జ్ఞానపీఠ్, 1988లో పద్మవిభూషణ్, 1992లో కర్ణాటక రత్న తదితర పురస్కారాలను పొందారు. తన 89వ ఏట ఆయన 1994లో మృతి చెందారు. ఆయన సొంతూరైన కుప్పళ్లిలోని కవిశైలలో స్మారకాన్ని నిర్మించారు. ఆయన నివాసాన్ని వస్తు సంగ్రహాలయంగా రూపొందించారు. కన్నడ భాషకు ప్రత్యేక గుర్తింపు తేవడానికి కువెంపు చేసిన సేవలు అనన్య సామాన్యమైనవి.

కువెంపు (పాతచిత్రం)

బళ్లారిలో చేనేత వస్త్రాల ప్రదర్శన

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: చేనేత వస్త్రాలు, ఖాదీవస్త్రాలు, పట్టు చీరలు, గృహాలంకరణ వస్తువుల ప్రదర్శన బళ్లారిలోని డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డు సెంటెనరీ హాల్లో ఏర్పాటు చేసినట్లు చేనేత వస్త్ర ప్రదర్శన సంచాలకుడు ఉన్నికృష్ణన్ తెలిపారు. ఇక్కడ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సాయంతో నడుస్తున్న చేనేత సహకార సంఘాలు, మహిళా స్వయం సహాయక బృందాలు తయారు చేసిన వస్తువులు, వస్త్రాలు, అల్లికలను ప్రదర్శనలో ఉంచినట్లు వెల్లడించారు. రాజస్థాన్‌లో చేతితో తయారుచేసిన ఆభరణాలు, తివాచీలు, మోజరీలు, జుటిస్ తదితర వాటిని వినియోగదారులకు అందుబాటులో తెచ్చినట్లు తెలిపారు. త్వరలో బెంగళూరు నగరంలో ప్రదర్శన ఏర్పాటు చేస్తామని, ఉత్తర, తూర్పు భారత్ చేనేత వస్త్రాలను నగర ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.

ప్రదర్శనలో వస్త్రాలను తిలకిస్తున్న మహిళలు

EENADU Classifieds

JOBS

బెంగుళూరులో పనిచేయుటకు
ప్రముఖ వస్త్ర దుకాణంలో అనుభవం గల సేల్స్‌మెన్స్ కావలెను. Age: 18-45Y, ESI+PF+ జీ-17K © 7019632854

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్ళారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

రక్కి చిత్రీకరణ పూర్తి

ఎస్ఎన్ఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'రక్కి' చిత్రం చిత్రీకరణ పూర్తి చేశారు. ఇటీవల చిత్రం టీజర్ విడుదల చేయడంతో ప్రేక్షకుల నుంచి ఉత్తమ స్పందన వస్తుందని దర్శకుడు వెంకట్ భరద్వాజ్ తెలిపారు. చిత్రీకరణ పూర్తి చేసుకుని డబ్బింగ్ పనుల్లో నిమగ్నమైనట్లు తెలిపారు. వినోదం, క్రైమ్ సంఘటనలు చిత్రకథకు ఆధారమన్నారు. చిత్రం ద్వారా హీరోగా రక్కి సురేష్ కన్నడచిత్ర రంగానికి పరిచయమవుతున్నారు. ఆశికా, సోమశేఖర్, పల్లవి మంజునాథ్, బి.సురేష్, సంపత్ మైత్రేయ, బలరాజ్ వాడి, రమేష్‌పండిత్, హరిణిశ్రీకాంత్, హర్షఅర్జున్, డాక్టర్‌సుధాకర్ శెట్టి నటిస్తున్నారు.

రక్కిచిత్రంలో రక్కి సురేష్

వైషభ విడుదల

ప్రముఖ సినీనటుడు మోహన్‌లాల్, సమర్జిత్ లంకేష్ కలిసి నటించిన 'వైషభ' చిత్రం రాష్ట్రవ్యాప్తంగా విడుదలైంది. విడుదల కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హాజరయ్యారు. ఇది తండ్రీ కుమారుల మధ్య ఉన్న సంబంధాలను చెప్పే చిత్రకథ అని దర్శకుడు నందకిశోర్ తెలిపారు. ప్రముఖ పాత్రికేయుడు లంకేష్ మనవడు సమర్జిత్ లంకేష్ తొలిసారిగా చిత్రం ద్వారా కన్నడ చిత్రపరిశ్రమకు పరిచయం చేసినట్లు తెలిపారు. రాగిణి ద్వివేది, నయన్ సారికా, అజయ్, నేహాసక్సేనా, గరుడ రామ్, వినయ్‌వర్మ, అలి, అయప్ప శర్మ, కిశోర్ తదితరులు నటిస్తున్నారు.


వైషభ చిత్రం విడుదల కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు

కాంగరూ ప్రారంభం

విభిన్నమైన కథ చిత్రం' కాంగరూ' చిత్రం చిత్రీకరణ క్రిస్మస్ సందర్భంగా ప్రారంభమైంది. కె.జి.ఎఫ్. చిత్రానికి సంగీతం అందించిన రవిబస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. క్రైమ్, థ్రిల్లర్‌తో కూడిన చిత్రమని, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని దర్శకుడు కిశోర్ మేగళమనె తెలిపారు. మాస్తి చిత్రానికి సంభాషణ అందించారు. తారగణాన్ని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

కాంగరూ చిత్రంలో కిశోర్

క్యాలెండర్ పాటలు వచ్చేశాయ్

హీరో ఆదర్శ గుండురాజ్ నటిస్తున్న 'క్యాలెండర్' చిత్రానికి సంబంధించిన రెండు పాటలు ఇటీవల విడుదల చేశారు. పాటలకు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నట్లు దర్శకుడు నవీన్ శక్తి తెలిపారు. రెండు పాటలను సంజయ్, నవీన్‌శక్తి రాయగా హృతిక్ పూజారి, సంజయ్ గానం చేయగా, సునాద్ గౌతమ్ సంగీతం అందించారు. సుస్మిత, నివిష్యాపాటిల్, తదితరులు నటిస్తున్నారు.

క్యాలెండర్ చిత్రంలో నవీన్ శక్తి, సుస్మిత, నివిష్యాపాటిల్

- న్యూస్‌టుడే, బెంగళూరు(యశ్వంతపుర)

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

దుష్యంత్ శ్రీధర్‌కు పాంచజన్య పురస్కారం ప్రదానం

పాంచజన్య ప్రతిష్ఠాన వార్షిక వేడుకలో భాగంగా ఇక్కడి జయనగర ప్రముఖ వివేక ఆడిటోరియంలో ఆధ్యాత్మిక, ఆరోగ్య క్షేత్రాల్లో గుర్తింపు పొందిన దుష్యంత్ శ్రీధర్‌కు పాంచజన్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కర్ణాటక మాజీ అడ్వకేట్ జనరల్ అశోక్ హారనహళ్లి, ట్రస్టీలు మురళి కాకాశు, ఎస్.వి.సుబ్రమణ్య, అనంతపద్మనాభ దుష్యంత్ శ్రీధర్‌కు పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో ప్రముఖులు వి.ఆర్.వెంకటేశ్, శిక్షణ పండితులు గీతారామానుజం, కె.ఎస్.సమీరసింహ, టి.వి.రాజు తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, బెంగళూరు (క్రీడలు)

కిత్తూరు రాణి చెన్నమ్మ ఉద్యానవనం ఉన్నతీకరణ

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : యశ్వంతపుర విధానసభ క్షేత్రం కెంగేరి వార్డు బీహెచ్‌ఈఎల్ లేఅవుట్‌లోని కిత్తూరురాణి చెన్నమ్మ ఉద్యానవనం ఉన్నతీకరణ, వివిధ అభివృద్ధి పనులకు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే సోమశేఖర్ ప్రారంభించారు. సందర్భంగా నిర్మాణానికి వర్షాకాలంలో స్థానికులు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చి పరిష్కరించాలని మనవి చేశారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు, నివాసులు, జీబీఏ అధికారులు పాల్గొన్నారు.

చర్చావేదికపై ఎమ్మెల్యే సోమశేఖర్, తదితరులు

హో సూ రు క బు ర్లు

రైతుల సమస్యలు పరిష్కరించాలని కేంద్రమంత్రికి వినతి

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు అదియమాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈశా ఫౌండేషన్ కార్యక్రమానికి వచ్చిన కేంద్ర వ్యవసాయమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కృష్ణగిరి మాజీ ఎంపీ కె.నరసింహన్ నేతృత్వంలో రైతు సంఘాల ప్రతినిధులు కలిశారు. కృష్ణగిరి జిల్లాలో ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించారు. పూలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయని, కాయగూరలు అధిక ప్రమాణంలో సాగుచేస్తున్నట్లు గుర్తు చేశారు. వ్యవసాయ ఉత్పత్తులు అగ్రి ఎక్స్‌పోర్టు జోన్ ఏర్పాటు చేయాలని, బెంగళూరు నుంచి దక్షిణ పినాకిని నదిలో మురుగునీరు, పరిశ్రమల వ్యర్థాలు కలుస్తుండడంతో పంటలు దిగుబడికి కష్టంగా ఉన్నాయని సమస్యలను విన్న కేంద్ర మంత్రి రైతుల నుంచి స్వీకరించిన వినతి పత్రాలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తమిళనాడు వ్యవసాయ సంఘం అధ్యక్షుడు రామాగౌండర్, భాజపా నాయకులు ఎం.నాగరాజ్, రవీంద్రరెడ్డి, నాగరాజురెడ్డి, బి.కె.నిశికాంత్‌రెడ్డి, వీరభద్రప్ప, మోహన్‌కుమార్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో రైతులు

పంచాయతీ కార్యాలయ భవనానికి శంకుస్థాపన

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు తాలూకా బెలత్తూరు గ్రామంలో రూ.33 లక్షల వ్యయంతో చేపట్టిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ పనులకు ఆదివారం హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్ భూమిపూజ చేశారు. డి.ఎం.కె.పాలనలో గ్రామాల అభివృద్ధి వేగవంతంగా సాగుతోందని, అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆనందయ్య, గజేంద్రమూర్తి, అలసప్పల్లి లోకేశ్‌రెడ్డి, కె.నారాయణస్వామి, నాగరాజు, మురళి, రమేశ్, చంద్రప్ప, విశ్వేష, కెంపరాజు, తిమ్మరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ తదితరులు

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

కెలమంగలం (డెంకణీకోట), న్యూస్‌టుడే : కెలమంగలం శివారు మంజుగిరి గ్రామంలో కొత్తగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆదివారం తళి ఎమ్మెల్యే రామచంద్రన్ ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రం కావాలని స్థానికులు ఎమ్మెల్యేను అభ్యర్థించగా ఆయన ముఖ్యమంత్రి, అధికారులతో సంప్రదించి రూ.16.55 లక్షల వ్యయంతో కొత్త భవనాన్ని నిర్మించారు. కార్యక్రమంలో కెలమంగలం బీడీఓలు మురుగన్, శ్రీనివాసమూర్తి, యూనియన్ ఉప ఛైర్మన్ శ్రీనివాస్, యూనియన్ కార్యదర్శి కృష్ణప్ప, పంచాయతీ అధ్యక్షుడు మురళి, ముత్తన్, కార్యదర్శి మధు, యూనియన్ కౌన్సిలర్లు జయరాం, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామచంద్రన్, తదితరులు

ద్విచక్రవాహనం, ఆటో ఢీకొని ఒకరి మృతి

కృష్ణగిరి (డెంకణీకోట) న్యూస్‌టుడే : కృష్ణగిరి-తిరవణ్ణామలై రోడ్డు ప్రాంతంలో నివసిస్తున్న శబరీశన్, తన కూతురు ధనశ్రీ (17) ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఎదురుగా ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ధనశ్రీ అక్కడికక్కడే చనిపోయింది. శబరీశన్‌ను తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. కృష్ణగిరి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురు నకిలీ విలేకరుల అరెస్టు

కృష్ణగిరి (డెంకణీకోట) : కృష్ణగిరికి చెందిన వ్యాపారులు హోసూరులో పశువులు కొనుగోలు చేసి వాహనంలో కృష్ణగిరికి వెళ్తుండగా హోసూరు-కృష్ణగిరి రోడ్డులో ఆరుగురు వ్యక్తులు వచ్చి వాహనాన్ని ఆపి తాము విలేకరులమని రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాగ్రత్త పడిన వ్యాపారులు ఆరుగురిని కృష్ణగిరి పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారిని విచారించగా కర్ణాటక రాష్ట్రం కోలారు, కె.జి.ఎఫ్, తిరుపత్తూరు ప్రాంతాలకు చెందిన నకిలీ విలేకరులని గుర్తించారు. పోలీసులు ఆరుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్లూరు.. పట్టు చీరలకు పుట్టినిల్లు

తుమకూరు, న్యూస్‌టుడే : జిల్లాలోని గుబ్బి తాలూకా కడబ హోబళిలోని కల్లూరు పట్టుచీరలకు మహిళలను ఆకట్టుకుంటున్నాయి. కల్లూరు కర్ణాటక రాష్ట్రంలోనే కాకుండా ఆంధ్ర, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు ప్రసిద్ధి గాంచింది. ఇక్కడి తయారయ్యే చీరలు పెద్ద పెద్ద నగరాలకు సరఫరా చేస్తారు. కల్లూరు గ్రామంలో 800 కుటుంబాలు నివసిస్తున్నాయి. 20 శాతం ప్రజలు వక్క, కొబ్బరి తోటల పెంపకంలో జీవనాలు కొనసాగిస్తుండగా, 80 శాతం కుటుంబాలు వంశపారంపర్యంగా పట్టుచీరల తయారీ, చీరల వ్యాపారాలు చేస్తున్నారు. 40-50 పట్టు చీరల దుకాణాలు ఉన్నాయి. ఈ గ్రామం తుమకూరుకు 55 కిలోమీటర్ల దూరంలో ఉంది. కల్లూరు చీరలకు భారీ డిమాండ్ ఉంటుంది. మంచి మార్కెటింగ్ సౌకర్యం ఉన్న నేపథ్యంలో కొనుక్కున్న చీరలను తక్కువ ధరలకే లభిస్తాయి. చీరల అమ్మకాల దుకాణాలు నిత్యం జనసందడితో కిటకిటలాడుతుంటాయి. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ముంబయి, కేరళ ప్రాంతాల నుంచి వ్యాపారులు చీరలు తీసుకెళతారని చంద్రయ్య సిల్క్స్ దుకాణ యజమాని తెలిపారు. బెంగళూరు, మైసూరు, శివమొగ్గ, హుబ్బళ్లి, దావణగెరె, తుమకూరు, హాసన్, రామనగర, చిత్రదుర్గ ప్రాంతాల నుంచి చీరల వ్యాపారులు, వివాహది శుభకార్యాలకు ఇక్కడి చీరలనే తీసుకెళతారు. సిల్క్ చీరల యజమాని చంద్రయ్యకు ఇటీవల జీటీవీ కన్నడ ఉత్తమ చీరల వ్యాపారిగా అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ దుకాణాల్లో రూ.280 రూపాయలకే సింథటిక్ చీరలు దొరుకుతాయని, కాటన్ సిల్క్, పట్టు చీరలు రూ.4500 నుంచి లభిస్తాయన్నారు. సూరత్ చీరలు, బెనారస్ రకాలు, ఆకర్షణీయమైన చీరలు అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉన్నాయన్నారు. చేతి మగ్గాలపై ఆధారపడి జీవిస్తున్న వారి పరిస్థితి దారుణంగా ఉంది. చాలా ఏళ్లుగా చేతిమగ్గాలపైనే పట్టుచీరలు తయారు చేస్తున్న వారు ఇక్కడ చాలా మంది ఉన్నారు. ఒక చీరను తయారు చేస్తే కేవలం 250 రూపాయలు మాత్రమే ఇస్తారని, నెలకు 25 నుంచి 30 చీరలు నేస్తామని, విద్యుత్తు సమస్య కారణంగా ఇబ్బందిగా ఉన్నట్లు మహాలక్ష్మి ఆనంద్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్తు నిరంతరం ఉంటే నెలకు 40 చీరలు నేస్తామని మరో వ్యక్తి జగదీశ్ పేర్కొన్నారు. కొందరు స్వతహాగా చీరలు పల్లెలకు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు.

చీరల తయారీలో నిమగ్నమైన జగదీశ్

పట్టు చీరల దుకాణం

ఎట్టకేలకు వంతెన ప్రారంభం

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : నగరంలోని జక్కూరు రైల్వేక్రాస్ వద్ద చేపట్టిన ఉపరితల వంతెన నిర్మాణ పనులను పునఃప్రారంభించారు. 12 ఏళ్ల కిందట వంతెన నిర్మాణ పనులను ప్రారంభించగా.. పలు కారణాలు వల్ల పనులు వాయదా పడ్డాయి. స్థానిక ప్రజల ఏళ్ల తరబడి పోరాటాలు చేశారు. అయినా అధికారులు స్పందించలేదు. బ్యాటరాయనపుర విధానసభ నియోజకవర్గం పరిధిలోకి జక్కూరు వస్తుంది. నియోజకవర్గానికి రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణభైరేగౌడ రైల్వేశాఖపై ఎన్నిసార్లు ఒత్తిళ్లు తెచ్చిన ప్రయోజనం లేకుండా పోయింది. నిర్మాణ పనులకు సంబంధించిన వస్తువులు రైలు పట్టాలు వద్ద వేయడం వల్ల ప్రజల సంచారానికి ఇబ్బందికరంగా మారింది. వాహనదారులు సంచారం కష్టతరంగా మారింది. జక్కూరు నుంచి ప్రధాన బళ్లారి రహదారికి వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన నిర్మాణ పనులు ప్రారంభించామని, వచ్చే ఏడాది ఆఖరి కల్లా పూర్తి స్థాయిలో నిర్మాణ పనులు పూర్తి చేసి వాహన సంచారానికి అనుమతులు ఇస్తామని అధికారులు వివరించారు.

ఉపరితల వంతెన పనులు

ఉద్యోగం కోసం చదవొద్దు : అశోక్

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : ఉద్యోగం సాధించాలని కాకుండా, పది మందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో చదవాలని విపక్ష నాయకుడు ఆర్.అశోక్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. జయనగర నేషనల్ కళాశాల మైదానంలో నిర్వహించిన వార్షికోత్సవాల్లో ఆయన ప్రత్యేక సంచికను ఆవిష్కరించి, సత్కారాన్ని అందుకుని మాట్లాడారు. ఆధునిక యుగంలో శ్రద్ధతో చదువుకుంటే, పలు రంగాల్లో ఉద్యోగాలు చేసేందుకు, వ్యాపారం, పరిశ్రమలను నెలకొల్పేందుకు పలు అవకాశాలు ఉన్నాయని వివరించారు. జనాభా వృద్ధికి అనుగుణంగా ప్రతి రంగంలోనూ కొత్త అవకాశాలు వస్తున్నాయని చెప్పారు. గాంధేయవాది హెచ్.నరసింహయ్య దూరదృష్టితో నేషనల్ కళాశాల శాఖలను విస్తరించారని, ఆయన సూచించిన బాటలో యాజమాన్యం ఇప్పటికీ నడుస్తోందని ప్రశంసించారు. వార్షికోత్సవాల్లో భాగంగా హాస్య ప్రసంగాలు చేసే వైవీ గుండూరావు విద్యార్థులకు పలు సలహాలు, మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధులు డాక్టర్ హెచ్ ఎన్ సుబ్రహ్మణ్య, వైజీ మధుసూదన, వి.వెంకట శివరెడ్డి, బీఎస్ అరుణ్ కుమార్, వి.మంజునాథ్, తల్లం ద్వారకానాథ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న అశోక్, తదితరులు

బనశంకరి జాతర మహోత్సవాలు ప్రారంభం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : బనశంకరి జాతర మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. వేకువజామున నాలుగు గంటలకు సుప్రభాత పూజల అనంతరం, భక్తుల దర్శనాలకు అనుమతించారు. జనవరి 7వ తేదీ వరకు నిత్యం వేర్వేరు పూజలను ఆలయంలో నిర్వహిస్తామని ప్రధాన అర్చకుడు ఎ.చంద్రమోహన్ తెలిపారు. గర్భగుడి ముందు భక్తులు నిమ్మ డొప్పల్లో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం గోపూజ, గంగాపూజలను నిర్వహించారు. భక్తులు నిత్యావసరాలను తులాభార సేవలో ఆలయం వంటశాలకు అందజేశారు.

నిమ్మ డొప్పల్లో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మహిళల వన్‌డే కెప్టెన్ కాశ్వీ

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : కోల్‌కతాలో జనవరి రెండు నుంచి ప్రారంభం కానున్న అండర్-15 మహిళల వన్డే క్రికెట్ కర్ణాటక జట్టుకు కాశ్వి కందికుప్ప కెప్టెన్‌గా ఎంపికైంది. రాష్ట్ర జట్టు క్రీడాకారిణుల జాబితాను కర్ణాటక క్రికెట్ సంఘం ప్రకటించింది. ఓవై రోహిణీదేచమ్మ, ఎస్.శీతల్-వికెట్‌కీపర్, నిసార సప్తగిరీశ్-వైస్‌కెప్టెన్, అరుషీమిత్రా, యశికాగౌడ, మారియా ఫ్రాన్సియా, కె.హర్షిత, ఆర్.తనుశ్రీ, బి.ఎ.నిత్యశ్రీ పాటిల్ ఎన్.రెడ్డి, ఎస్.శ్రీకాచతుర, హెచ్.ఆర్.సాన్వీ, ఎస్.కాశ్వీ పాల్గొంటున్నారు.

నిడిగల్లు దుర్గంలో మంత్రి సుధాకర్, ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ, న్యూస్‌టుడే : రాష్ట్ర గణాంక, ప్రణాళికా శాఖ మంత్రి డి.సుధాకర్, స్థానిక ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేశ్ ఆదివారం తాలూకాలోని నిడిగల్లు దుర్గంలో నిర్వహించిన పూజా మహోత్సవంలో పాల్గొని మంగళ పురప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్శ్వనాథ, వీరభద్రస్వామి ఆలయాలను సందర్శించి పూజలాచరించుకొన్నారు. కార్యక్రమంలో జగద్గురు చారుకీర్తి భట్టారక పట్టాచార్య స్వామీజీ, శ్రావణబెళగొళ జైన మఠం, లక్ష్మీసేన భట్టారక స్వామీజీ, శ్రీక్షేత్ర సింహనగద్దె బస్తీమఠ్ ఎన్.ఆర్.పుర, జయన్న, జినేశ్‌బాబు, అజిత్, అంకిత్‌దరెనేంద్ర కుమార్, నాగప్ప, మహాబలి, బాహుబలి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే వెంకటేశ్ నిడిగల్లు గ్రామంలోని రామతీర్థ, రామేశ్వర దేవాలయాలకు వెళ్లి ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని నాయకులకు హామీ ఇచ్చారు.

ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే తదితరులు

జనవరి 18న బహుభాషా కవుల సమావేశం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య-బెంగళూరు, ఇండో ఏషియన్ అకాడమీ అధ్వర్యంలో జనవరి 18న బహుభాషా కవుల సమ్మేళనం-2026 జరుగుతుందని సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ సింగురు నరేంద్రబాబు తెలిపారు. ఆదివారం ఇక్కడ సమాఖ్య ఛైర్మన్ డాక్టర్ మాల్యాద్రి బొగ్గవరపు అధ్యక్షతన పదాధికారులు సమావేశమై కార్యక్రమాలపై చర్చించారు. తెలుగు, కన్నడ, తమిళం, హిందీ, మలయాళం భాషలకు చెందిన కవులు హాజరు కానున్నారని తెలిపారు. మాల్యాద్రి అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి డీఆర్‌డీఓ శాస్త్రవేత్త ఎల్.జగదీశ్వరరావు, స్వాతంత్ర్య సమరయోధుడు చిలకమర్తి ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి పెరుమాళ్ల రఘునాథ్, ఇండో ఏషియన్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ టి.ఏకాంబరం నాయుడు, కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పి.చంద్రశేఖర్‌లతో పాటు సమాఖ్య అధ్యక్షుడు మరంగంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ ఎం.వి.లక్ష్మీ, మహిళ కార్యదర్శి పుష్పలత తదితరులు హాజరవుతారని వివరించారు.

సమావేశమైన తెలుగు కవులు

కృత్రిమ అవయవాల శిబిరం

ఉమేశ్‌కుమార్ తదితరులతో దివ్యాంగులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కర్ణాటక మర్వాడి సమాజ ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన కృత్రిమ అవయవాలు అమర్చే శిబిరాన్ని ఏడీజీపీ ఉమేష్ కుమార్ ప్రారంభించారు. బెంగళూరు, బెంగళూరు గ్రామీణ, దొడ్డబళ్లాపుర, చిక్కబళ్లాపుర, చిత్రదుర్గ, బళ్లారి, రాయచూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులకు కృత్రిమ పాదాలు, చేతులను వైద్యులు అమర్చారు. 124 మందికి అమర్చినట్లు సమాజ కార్యదర్శి మోహిత్ తుల్సాన్ తెలిపారు. కార్యక్రమంలో భాజపా నేత ఎన్.ఆర్.రమేశ్, వైద్యుడు డాక్టర్ అలోక్‌బాంకా, సమాజ మహిళ విభాగం అధ్యక్షురాలు సుష్మా చందగూఠియా, ఉపాధ్యక్షురాలు వందనా తుల్సాన్, అధ్యక్షుడు ప్రవీణ్ తుల్సాన్ తదితరులు హాజరయ్యారు.

ధార్మిక క్షేత్రంలో భక్త మహోత్సవం

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న స్వామీజీ, తదితరులు

తుమకూరు, న్యూస్‌టుడే : తుమకూరు చిక్కపేటే వీధిలో ఉన్న హిరేమఠం పీఠాధ్యక్షుడు శివానంద శివాచార్య స్వామీజీ ఆధ్వర్యంలో ఆదివారం సింహావలోకన, భక్త మహోత్సవం, వివిధ రంగాల్లో సేవలందించిన సాధకులను సత్కరించారు. ఈసందర్భంగా హరళూరు శివకుమార్ రచించిన నగెబిందు, అభినందన సింధు పుస్తకాలను ఆవిష్కరించారు. ధార్మిక కార్యక్రమంలో తుమకూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి వెంకటేశ్వరులు, వివిధ మఠాధీశులు, పారిశ్రామికవేత్తలు, భక్తులు పాల్గొన్నారు

కన్నడ భాషాభివృద్ధికి కృషి చేయాలి

బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి), న్యూస్‌టుడే : ప్రాంతీయ భాషల్లో కన్నడనాడు సుసంపన్నంగా ఉందని, కన్నడ భాషాభివృద్ధికి కృషి చేయాలని కన్నడ రక్షణ వేదిక రాష్ట్ర సంఘటన కార్యదర్శి అబ్బిగిరి వినోద్ పేర్కొన్నారు. ఇక్కడ అబ్బిగిరిలోని శివకుమార్ స్వామీజీ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కన్నడ రాజ్యోత్సవంలో ఆయన ఎమ్మెల్యే మునిరాజుతో కలిసి కన్నడ జెండాను ఎగురవేసి కన్నడ మాత భువనేశ్వరికి పూజలు చేశారు. ఈ సందర్భంగా కన్నడ అభిమాన నాయకులను అబ్బిగిరి వినోద్, రఘు సత్కరించారు. బెంగళూరు నగర జిల్లా సంఘటన కార్యదర్శి రఘు అరసు, మాజీ కార్పొరేటర్ నాగభూషణం, నాయకులు కె.సి.దేవేగౌడ, కె.సి.శేఖర్, మనోహర్ అబ్బిగిరి, కన్నడ అభిమానులు పాల్గొన్నారు.

శేఖర్‌ను సత్కరిస్తున్న అబ్బిగిరి వినోద్, రఘు, తదితరులు

నేడు విశ్వమానవ దినోత్సవం

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : బెంగళూరు నగర విశ్వవిద్యాలయంలో సోమవారం విశ్వమానవ దినోత్సవాల సందర్భంగా పబ్లికేషన్ వింగ్-ప్రసారాల విభాగాలను ఏర్పాటు చేశారు. సెంట్రల్ కళాశాల క్యాంపస్ జ్ఞానభారతి సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేడుకలను కర్ణాటక జానపద పరిషత్తు అధ్యక్షుడు, మాజీ హంపీ కన్నడ విశ్వవిద్యాలయం ఉపకులపతి హెచ్.సి.బోరలింగయ్య ప్రారంభించనున్నారు.

కన్నడ 'రక్షక' విజయోత్సవ వేడుకలు

బేలికె, న్యూస్‌టుడే : 32 ఏళ్ళ సినీ పరిశ్రమ సేవలకు 'రక్షక' కన్నడ చిత్రం ద్వారా విజయం దక్కిందని చిత్ర నిర్మాత, దర్శకుడు డాక్టర్ ఆర్.విజయకుమార్ పేర్కొన్నారు. బెంగళూరులోని రాజాజీనగర్‌లోని ఎన్.ఎఫ్.డి.సి.హాల్లో రక్షక చిత్రం వంద రోజుల విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నిర్మాతలు, దర్శకులు, సీనియర్ నటులు, చిత్ర కళాకారులు, సాంకేతిక నిపుణులు, రక్షక చిత్ర నటీనటులను ఆహ్వానించారు. ప్రత్యేక అతిథులను కన్నడ దర్శకుడు అశోక్‌చక్రవర్తి, స్టంట్ మాస్టర్ వైలాంట్‌వేలు, పంపిణీదారు ప్రసాద్, చింతమణి బాబురెడ్డి, మేఘరాజ్‌గౌడ, కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో చిత్ర ప్రధాన నటుడు రాజవంశీ, కళాకారులు విజయ్, మధాలే, సించన, మురళి, యోగి, విజయ్, కల్లెల్, సాయిప్రజ్వల్, కృష్ణ, మంజు, అన్బు పాల్గొన్నారు.

జ్ఞాపికలతో విజయకుమార్, నటీనటులు

ట్రాక్టర్ బోల్తా ఇద్దరి మృతి

చిక్కమగళూరు, న్యూస్‌టుడే : తరికేరి తాలూకా ముండ్రె వద్ద ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవరు శశికుమార్ (28), పదో తరగతి విద్యార్థి ప్రీతమ్ నాయక్ (16) మరణించారు. వీరిద్దరూ నీలగిరి దుంగలను ట్రక్కులో నింపుకుని వస్తుండగా ప్రమాదం సంభవించింది. మృతదేహాలకు శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. బీరూరు ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఉదయం నుంచే మద్యం విక్రయాలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా మద్యం దుకాణాల్లో 31 ఉదయం ఆరు గంటల నుంచి మధ్య రాత్రి ఒంటి గంట వరకు మద్యం విక్రయాలకు అనుమతిస్తున్నామని నగర పోలీసు కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్ ప్రకటించారు. ఎక్సైజ్ శాఖ నుంచి సీఎల్ 5 లైసెన్సు తీసుకున్న దుకాణదారులకు మాత్రమే ఈ విక్రయాలకు అవకాశం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

పిల్లల దొంగలని కొట్టారు

గదగ, న్యూస్‌టుడే : చెంపపిన్నులు, తిలకాలు, గాజులు, పిన్నీసులు విక్రయించుకునే ఏడుగురు మహిళలను పిల్లలను దొంగిలించేందుకు వచ్చారని భావించి స్థానికులు కొట్టారు. ముండరగి తాలూకా డోణి గ్రామంలో వారిని కొట్టి పోలీసులకు అప్పగించారు. ఈ మహిళలు ధార్వాడ జిల్లా అణ్ణిగేరికి చెందిన వారని ముండరగి ఠాణా పోలీసులు గుర్తించారు. వారు నిజంగా ఇంటింటికీ తిరిగి చిన్న వస్తువులు విక్రయించుకుని, ఉపాధి కల్పించుకున్నారని దర్యాప్తు అనంతరం గుర్తించి, వారిని విడిచి పెట్టారు.

వేరే గ్రూపు రక్తాన్ని ఎక్కించారు

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : రక్తహీనత సమస్యను ఎదుర్కొంటున్న పునీత్ సూర్య అనే యువకుడికి ఓ పాజిటివ్ బదులుగా, ఏ పాజిటివ్ రక్తాన్ని ఎక్కించారు. దీంతో అతని ఆరోగ్య పరిస్థితి వికటించడంతో చికిత్స కోసం ఐసీయూకు తరలించారు. ల్యాబ్ టెక్నీషియన్ నిర్లక్ష్యంతో ఏ పాజిటివ్ గ్రూపు రక్తాన్ని ఇవ్వగా, నర్సు కూడా దాన్ని గమనించకుండానే ఆ రక్తాన్ని ఎక్కించడంతో ఈ ఘటన సంభవించింది. నిపుణులైన వైద్యుల సమక్షంలో బాధితునికి చికిత్స కొనసాగించామని వైద్యులు తెలిపారు. బాధితుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ల్యాబ్ టెక్నీషియన్ ఉమేశ్‌పై తిలక్ నగర ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఫిర్యాదు చేసేందుకు వెళితే..

విజయపుర, న్యూస్‌టుడే : తన భర్త నిత్యం వేధిస్తున్నాడని వెళ్లిన ఒక గృహిణి (29)ని అలమేల ఠాణాలో ఏఎస్సై మనోహర కంచగార వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అతని చెర నుంచి తన భార్యను రక్షించి తనకు అప్పగించాలని ఆమె భీమాశంకర హోళ్కర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తన భార్య అతనితో చేసిన వాట్సప్ చాటింగ్ స్క్రీన్ షాట్లను తన ఫిర్యాదుతో పాటు అధికారులకు అందించారు.

బిక్షగాళ్లను రాజస్థాన్‌కు పంపిన అధికారులు

ఉడుపి, న్యూస్‌టుడే : బాలలు, చంటిపిల్లలతో కలిసి భిక్షాటన చేస్తున్న 40 మంది భిక్షగాళ్లను బాలల రక్షణ విభాగం, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు రాజస్థాన్‌కు పంపించారు. రాజస్థాన్ నుంచి వచ్చిన వీరు శ్రీకృష్ణ మఠం పరిసరాలు, ఉడుపి యాత్రికుల వాహనాల పార్కింగ్ ప్రదేశంలో కొద్ది రోజులుగా భిక్షాటన చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. సమాజ సేవకుడు నిత్యానంద, బాలల రక్షణ విభాగం సిబ్బంది విశాల్, రమ్య, అక్షత, విద్యాశ్రీ, పోలీసు సిబ్బంది యోగీశ్, సవిత తదితరులు కార్యాచరణ నిర్వహించి, వారందరినీ ఒక్క చోటు చేర్చారు. ఇక్కడ భిక్షాటనపై నిషేధం ఉందని నచ్చజెప్పి రాజస్థాన్‌కు వెళ్లే రైలు ఎక్కించి సాగనంపారు.

స్వదేశీమేళాను విజయవంతం చేయాలి

బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి), న్యూస్‌టుడే : బాగలగుంట ఎంఈఐ క్రీడా మైదానంలో నిర్వహించే స్వదేశీ మేళాను దాసరహళ్లి నియోజకవర్గ ప్రజలందరూ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఎస్.మునిరాజు కోరారు. బాగలగుంటలోని కళ్యాణ మండపంలో ఆదివారం స్వదేశీ మేళా కరపత్రలను నిర్వాహకులతో కలసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మన దేశంలో తయారైన వస్తువులనే వాడాలని, స్వదేశీ వస్తువులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దక్షిణ ప్రావిన్స్ స్వదేశీ జాగరణ్ మంచ్ కన్వీనర్ జగదీశ్‌జీ నాయకత్వంలో మేళా ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు వసంతమూర్తి, సుజాత మునిరాజు, సోమశేఖర్, భరత్ సౌందర్య, ఉమాదేవి, నాగరాజు, మంతేశ్ పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మునిరాజు, తదితరులు

ఘనంగా అఖిల కర్ణాటక కూచిపూడి నృత్యోత్సవం

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : నాట్య సరస్వతి కూచిపూడి అకాడమీ ఆధ్వర్యంలో డాక్టర్ సరస్వతి రాజతేశ్ నేతృత్వంలో అఖిల కర్ణాటక కూచిపూడి నృతోత్సవం పదకొండో ఎడిషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కర్ణాటక నృత్య అకాడమీ ఛైర్మన్ శుభధనంజయ్, సునందాదేవి, వరంగల్ నుంచి సుధీర్‌రావు, ఖలీల్, శ్రీవత్స శాండిల్య, హరిచేతన, కేశవరాజ్‌బాలకృష్ణన్, మంత్రిత్వ శాఖకు చెందిన గోవిందలు పురస్కారాలను అందుకున్నారు. కర్ణాటకలోని 25 మంది కళాకారులు ఒడిస్సీ, కూచిపూడి జుగల్‌బందీ, భామాకలాపంపై ప్రత్యేక నృత్య ప్రదర్శన చేసి సభికుల మెప్పు పొందారు. కన్నడ సంస్కృతిక శాఖ, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ మద్దతు నిచ్చినట్టు నిర్వాహకులు తెలిపారు.



ముఖ్యులతో నృత్యకళాకారులు

సమాజంపై అవగాహన ఉండాలి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఆధునిక సమాజం, భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు తదితర వాటిపై అవగాహన కలిగి ఉండాలని కర్ణాటక మాల మహాసభ అధ్యక్షుడు ఎల్.నాగేశ్వర రావు తెలిపారు. ఆదివారం ఇక్కడ జీవనహళ్లిలో ఏర్పాటు చేసిన మాలమహాసభ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో తమ హక్కులను గురించి ప్రజలకు అవగాహన లేక పోతే రాణించలేరన్నారు. హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. పోరాటాలు చేయలేని ఏవర్గం ముందుకు రాదని, అభివృద్ధి సాధించలేదన్నారు. రాష్ట్రంలో మాలలు సంఖ్య తక్కువ ఉన్న తమ హక్కులు కోసం ఇతరులతో కలిసి ఉద్యమించాలన్నారు. సమావేశంలో సంస్థ ఉపాధ్యక్షులు సిద్ధం నారయ్య, సంపూర్ణ, ప్రధాన కార్యదర్శి సంజీవ రావు, కార్యదర్శులు చక్రవర్తి, గంధం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మహాసభ పదాధికారులు

(c) eenadu

ఆవిష్కరణలో ప్రతినిధులు

తెలుగు కాలమానిని విడుదల

రాయచూరు : రాయచూరు తాలూకా కమ్మవారి సంఘం తెలుగులో రూపొందించిన 2026 కాలమానిని ఆదివారం స్థానిక ఈదయ మాణిక్యమ్మ కాకతీయ వసతి పాఠశాల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమ్మ సంఘం అధ్యక్షుడు బూరుగుపల్లి ప్రసాద్ మాట్లాడుతూ అందరికీ ఉపయోగపడేలా తయారు చేయించిన కాలమానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతినిధులు చిట్టూరి శ్రీనివాస్ (విజయనగర క్యాంపు), నెక్కంటి ఆదినారాయణ, వైట్ల రాము, నూతక్కి అజయ్, గోదవర్తి శ్రీనివాస్, సూర్యచంద్రరావు (జానకి రామయ్య క్యాంపు), రామలింగయ్య చౌదరి, బడ్డి నారాయణ పాల్గొన్నారు.

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

నీటి బిల్లు చెల్లింపునకు ఓటీఎస్

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: కావేరి తాగునీటి బిల్లు బకాయిలు దీర్ఘకాలం చెల్లించని వ్యక్తుల కోసం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకాన్ని అమలులోకి తేవాలని బెంగళూరు జలమండలి నిర్ణయం తీసుకుంది. జలమండలికి దాదాపు రూ.701కోట్ల బిల్లు బకాయిలు రావల్సి ఉంది. అంతమొత్తం బకాయిలను చెల్లించడం లబ్ధిదారులకు కష్టంగా మారింది. రూ.439 కోట్లు అసలు బిల్లు కాగా రూ.262 కోట్లు వడ్డీ. ఓటీఎస్ పథకం అమల్లోకి వస్తే వంద శాతం వడ్డీ రద్దు చేస్తారు. అసలు మొత్తాన్ని మూడునెలల్లోపు చెల్లించేందుకు అవకాశం కల్పిస్తారు. బిల్లు బకాయిలు నానాటికీ పెరుగుతుండటంతో వసూలు పెద్దకష్టంగా మారింది. ఈనేపథ్యంలో వినియోగదారులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు అవకాశం ఇస్తున్నట్లు మండలి అధికారులు తెలిపారు.

కలల కొలువు.. ఇలా చేస్తే సులువు

➡ కొత్త ఏడాదిలో అవకాశాల్ని ఒడిసిపడదామిలా ➡ ఊరిస్తున్న ఏఐ జాబ్ మార్కెట్

నిపుణులతో చర్చించే అవకాశాలెన్నో

ఈనాడు, బెంగళూరు : క్యాలెండర్‌లో ఓ ఏడాది ముగిసే సమయానికి విద్యా సంవత్సరము ముగింపు దశకు వస్తుంది. విద్యార్థులు ప్రాంగణ ఎంపికల కోసం కసరత్తు మొదలు పెట్టినా అందరికీ ఉద్యోగాలు దొరకటం కష్టమే. తాము చదివిన కోర్సులతో ఉపాధి మార్కెట్టుకు అవసరమైన నైపుణ్యం పెంచుకున్నా కొత్తతరం నైపుణ్యం కోసం కంపెనీలు ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం నడుస్తున్న కృత్రిమ మేధ(ఏఐ) యుగంలో ఉపాధి సాధించటం ఎంత కష్టమో వచ్చిన ఉద్యోగాన్ని కాపాడుకోవటం అంతే సవాలుగా మారింది. భారతీయ ఉపాధి గమ్యస్థానంగా ఉన్న కర్ణాటకలో 2026 ఏడాది ఉద్యోగార్థుల ఉపాధి అవకాశాలను కొత్తతరం సాంకేతిక నైపుణ్యాలు నిర్ణయించనున్నాయి.

ఇవి తెలుసుకోండి

నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్) ఫ్యూచర్ స్కిల్స్‌తో పాటు యాంబిషన్ బాక్స్, ఐబీఈఎఫ్ వంటి సంస్థల అధ్యయనం ప్రకారం 2027 నాటికి భారతీయ ఏఐ మార్కెట్ విలువ 17 బిలియన్ డాలర్లకు చేరుకుంటుండగా, ఏఐ నిపుణుల డిమాండ్ 2026లో 22 శాతం పెరగనుంది. భారత్‌లో రెండో అత్యధిక ఏఐ టాలెంట్‌పుల్ కేంద్రమైన బెంగళూరులో ఏఐ ఇంజినీర్, ఏఐ ప్రొడక్ట్ మేనేజర్, ఆటోమేషన్ ఇంజినీర్, డేటాఎనలిస్ట్, ఎంఎల్ స్పెషలిస్ట్, రోబోటిక్స్ డెవలపర్, సైబర్ సెక్యూరిటీ విభాగంలో ఎస్ఓసీ, క్లౌడ్ సెక్యూరిటీ ఇంజినీర్లకు 2025తో పోలిస్తే 40-50 శాతం అదనపు వార్షిక వేతనాలు అందించేందుకు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి.

బెంగళూరులోనే ఎందుకు?

భారతీయ ఐటీ హబ్‌గా ఉన్న బెంగళూరులో సహజంగానే టెక్ ఎకోసిస్టమ్ ప్రపంచవ్యాప్త ప్రమాణాలతో రాజిల్లోంది. గూగుల్ నుంచి మైక్రోసాఫ్ట్, ఐబీఎం, ఇన్ఫోసిస్, విప్రో వంటి సంస్థలు నైపుణ్య మానవ వనరులను ఎంపిక చేసుకునేందుకు కార్యశాలలు, హ్యాకథాన్‌లు, నెట్‌వర్కింగ్ ఈవెంట్‌లు ఏర్పాటు చేస్తున్నాయి. ఫిన్‌టెక్, హెల్త్‌టెక్, ఈ-కామర్స్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ సర్వీసెస్, రక్షణ, వైమానిక, ఈవీ, ఆటోమొబైల్స్ ఉత్పాదన, ఆర్అండ్‌డీ, జీసీసీ, రంగాల్లో ప్రపంచశ్రేణి సంస్థల పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఈ రంగాల్లో నైపుణ్య మానవ వనరుల లభ్యత బెంగళూరులో సాధ్యమవుతోంది.

డిమాండ్ ఇలా..

టెక్ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ ఈ ఏడాది ఏఐ ఇంజినీర్‌తో పాటు స్పెషలిస్ట్ ప్రోగ్రామర్, డిజిటల్ స్పెషలిస్ట్, ఇంజినీర్ డీప్ స్కిల్స్ ఉన్న ఎల్-3 ట్రైనీలకు రూ.21 లక్షల వార్షిక వేతనాన్ని ఆఫర్ చేసింది. కొత్తవారికి తొలి ఏడాదే ఈ స్థాయి వేతనాలు ప్రకటించటం రికార్డే. వీటితో పాటు ఎల్-2 ట్రైనీ రూ.16 లక్షలు, ఎల్-1 ట్రైనీ రూ.11 లక్షలు, సాధారణ ట్రైనీ రూ.7లక్షల వేతనాలు ప్రకటించింది. బ్యాంకింగ్ ఫైనాన్స్‌లో ఏఐ, ఎంఎల్ సైబర్ ఎక్స్‌పర్ట్స్‌కు రూ.15 లక్షలు, మెషిన్ లెర్నింగ్ స్పెషలిస్ట్‌కు రూ.11లక్షల నుంచి రూ.18లక్షలు, డేటా ఎనలిస్ట్‌కు రూ.7లక్షల నుంచి రూ.26 లక్షలు, ఏఐ ప్రొడక్ట్ మేనేజర్లకు రూ.18లక్షల నుంచి రూ.27లక్షలు, ఆటోమేషన్ ఇంజినీర్, రోబోటిక్స్ డెవలపర్, సైబర్ టెక్కు 2025తో పోలిస్తే 30-60శాతం వేతనాలు ఈ ఏడాది పెంచేందుకు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి.

మేధో చర్చలతో నైపుణ్యానికి పదును

ఈ నైపుణ్యాలు ఉంటే చాలు

ప్రస్తుతం టెక్ కోర్సులు లేకున్నా నాన్‌టెక్ విద్యార్థులు కూడా కంపెనీలకు అవసరమైన నైపుణ్యం పెంచుకుంటే ఉపాధి సులువుగా మారుతోంది. ఏఐ, ఎంఎల్‌లో పైథాన్, ఎంఎల్, డీప్‌లెర్నింగ్‌లో అండర్ స్టాండింగ్, ఇంప్లిమెంటేషన్ టెక్నిక్స్, న్యూరల్ నెట్‌వర్క్స్, డేటా ఎనాలసిస్, హ్యాండ్లింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, ఎంఎల్‌ఓప్స్‌తో పాటు సమస్యా పరిష్కారం, లాజిక్ ఆలోచనాధృక్పథం, సమాచార ప్రసారం, అడాప్టబిలిటీ, నైతిక అవగాహన వంటి సాఫ్ట్ స్కిల్స్ ఉంటే పోటీలో సులువుగా నెగ్గగలరు.

లక్ష మందికి శిక్షణ


- సంజీవ్‌కుమార్ గుప్త, సీఈఓ, కర్ణాటక డిజిటల్ ఎకానమీ మిషన్

కర్ణాటక డిజిటల్ ఎకానమీ మిషన్ (కేడీఈఎం) ద్వారా ఈ ఏడాది 50 వేల మందికి ఏఐతో పాటు డీప్ లెర్నింగ్‌తో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంలో శిక్షణ ఇచ్చాం. రాష్ట్ర 'నిపుణ' కార్యక్రమం ద్వారా గ్రామాల్లోనూ ఏఐ నైపుణ్యం పెంచుతున్నాం. ఏఐ అంశాల్లోనూ కొత్తతరం బెంగళూరులో 'హ్యూవీ లామా' ద్వారా ఈ రంగంలో నిపుణులతో సలహాలిచ్చే ఏర్పాటు చేస్తున్నాం.

ఏఐతో విశ్వాసం పెరుగుతోంది

- జి.గంగాధర్, మేనేజర్, అల్మాన్ లేబొరేటరీస్

ఏఐతో ఉద్యోగ భద్రతతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతోంది. గతంలో ఓ ప్రాజెక్టు పూర్తి చేయాలంటే సీనియర్లతో కనీసం నాలుగైదుసార్లు భేటీ అవటం, వాటిపై చర్చలకు సమయం కేటాయించాలి. ఇప్పుడు ప్రాథమిక దశలోనే ఓ ప్రాజెక్టుపై అవగాహన పెరుగుతోంది. ఏఐ నైపుణ్యంతో సులువుగా ఉపాధితో పాటు వచ్చిన ఉద్యోగాన్ని సమర్థమంతంగా నిర్వహించే వీలుంది.

సత్కారం పొందిన అన్నదాతలు

రైతులతోనే దేశాభివృద్ధి సాధ్యం

రాయచూరు, న్యూస్‌టుడే : అన్నదాతలు అభివృద్ధి చెందితేనే ఏ దేశంలోనైనా ప్రగతి సాధ్యపడుతుందని చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజు తెలిపారు. ధనగరంలోని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ఆదివారం రైతుల దినోత్సవాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు, ఉన్నతాధికారులు, పారిశ్రామిక వేత్తలు, వైద్యులు, ఇంజినీర్లు కుటుంబ నేపథ్యం రైతులైనప్పటికీ వారి ప్రధాన సమస్యలు తీరకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. పుష్కలమైన దిగుబడులు సాధించినప్పుడు గిట్టుబాటు ధర అందడం లేదని, అరకొరగా పంట పండితే రేటు లభించే విచిత్రమైన పరిస్థితులు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశించిన, స్థిరమైన ధరలు మార్కెట్‌లో కొనసాగేందుకు ప్రభుత్వాలు ఒక పరిష్కార మార్గాన్ని కనుగొనాల్సిన అవసరం ఉందని చెప్పారు. రైతుల సేవలను మననం చేసుకునేందుకు ఈశ్వరీయ విద్యాలయం వారిని సత్కరించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా..150 మందికి పైగా అన్నదాతలను ఘనంగా సత్కరించారు. ఏపీఎంసీ అధ్యక్షుడు మల్లికార్జున, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు లక్ష్మణగౌడ, బ్రహ్మకుమారీ విశ్వవిద్యాలయం సంచాలకురాలు స్మితా, కార్యదర్శి శారదా వేదికను అలంకరించారు.

ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ వసంత్

స్వాతంత్ర్య సంగ్రామంలో కాంగ్రెస్ కీలక పాత్ర

రాయచూరు, న్యూస్‌టుడే : దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించి, భారత కీర్తిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందని కేపీసీసీ కార్యాధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎ.వసంతకుమార్ పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం పార్టీ సంస్థాపన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత్ మాట్లాడుతూ 1885 డిసెంబరు 28న మహామహులు స్థాపించిన కాంగ్రెస్ ప్రజల్లో స్వాతంత్ర్య పోరాట పటిమను నూరి పోసి, అన్ని వర్గాల వారిని ఉద్యమాల వైపు మళ్లించడంలో సఫలమైందన్నారు. ఎందరో యోధులు బలైనా పోరాటాలు కొనసాగించినందునే దేశానికి విముక్తి కల్గిందని తెలిపారు. స్వాతంత్ర్యం తర్వాత ప్రధానిగా నెహ్రూ ముందు చూపుతో తీసుకున్న సాహసోపత నిర్ణయాల వల్ల భారత్ కీలక రంగాల్లో పురోగతి సాధించిందని వివరించారు. ఇందిరా, రాజీవ్, నరసింహారావు హయంలో ఊహించనంత ప్రగతి జరిగిందని వెల్లడించాచారు. కార్యక్రమంలో కేపీసీసీ అధికార ప్రతినిధి రజాక్, నాయకులు బసవరాజ్ దరూర్, రామకృష్ణ నాయక్, మురళీ యాదవ్, ఈశప్ప, అంజినకుమార్, మరిస్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

రాయచూరు: రాయచూరు గ్రామీణ విభాగం పరిధి మలియాబాద్ 110/11 కిలోవాట్ల ఉప కేంద్రంలో అత్యవసర పనులు చేపడుతారు. ఇందువల్ల సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరాను నిలివేస్తారు. ఈ వ్యాప్తిలోని గ్రామాల ప్రజలు విద్యుత్తు అంతరాయానికి సహకరించాలని జెస్కాం ఇంజినీర్లు ఒక ప్రకటనలో కోరారు.

సమాజంలో చీలికలకు కమలదళం కుట్ర

కాంగ్రెస్ జెండా ఎగురవేసిన ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తదితరులు

విరుచుకుపడిన ముఖ్యమంత్రి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: దేశం, సమాజంలో చీలిక తేవడమే భాజపా సాధనమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఇక్కడ భారత్ జోడో సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భాజపా దేశానికి చేసిది ఏమిలేదన్నారు. దేశాన్ని ప్రజల మధ్య చిచ్చుపెట్టడమే వారి సాధనమని ఎద్దేవా చేశారు. దేశంలో కులవ్యవస్థను సృష్టించింది మనువాదులు, చతురవర్ణాన్ని సృష్టించిన మనుస్మృతిని భాజపాఅమలు చేస్తుందని ఆరోపించారు. దేశానికి భాజపా నేతలు ఏమి చేయలేదన్నారు. భాజపాకుముందు ఏర్పడిన ఆర్ఎస్ఎస్ స్వాతంత్ర్య పోరాట పాత్ర లేదని, బ్రిటిష్ పాలకులతో చేతులు కలిపారని తెలిపారు. క్విట్ ఇండియా ఉద్యమానికి దూరంగా ఉన్నారని తెలిపారు. ఇప్పుడు ఆర్ఎస్ఎస్ నేతలు దేశభక్తిపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదని, మహాత్మాగాంధీ హత్య చేసిన నాథూరామ్ గాడ్సే ఆర్ఎస్ఎస్ కార్యకర్త అన్నారు. మహాత్మాగాంధీని మొదటి నుంచి ఆర్ఎస్ఎస్ వ్యతిరేకించిందని ఇప్పుడు కేంద్ర భాజపా ప్రభుత్వం అదేబాటలో నడుస్తోందని ఆరోపించారు. నరేగా పథకానికి మహాత్మాగాంధీ పేరు తొలగించారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ నేతలకు దేశానికి స్వాతంత్ర్యం రావడం ఇష్టం ఉండేది కాదన్నారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అనేక పథకాలు చేపట్టారని, జైజవాన్, జైకిసాన్ నినాదం ఇచ్చిన లాల్ బహదూర్ శాస్త్రి, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన ఇందిరాగాంధీ, తదితరులు దేశాన్ని ముందుకు తీసుకుపోయారని తెలిపారు. దేశాన్ని 21వ శతాబ్దం వైపు రాజీవ్ గాంధీ తీసుకెళ్లారని, భాజపా నేతలు ఏమి చేశారని ప్రశ్నించారు. రాజ్యాంగంపై దాడికి ప్రయత్నిస్తున్నారని, డాక్టర్ అంబేడ్కర్‌ను తక్కువ చేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. పేద ప్రజల కోసం ఐదు గ్యారంటీ పథకాలు అమల్లోకి తెచ్చామని వాటి వల్ల పేదరికం అదుపులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రి కేజేజార్జి, కేపీసీసీ కార్యాధ్యక్షుడు చంద్రశేఖర్, తదితరులు హాజరయ్యారు.

వేదికపై సిద్ధు, శివుడి ఆత్మీయ కరచాలనం

నిబద్ధతతో పనిచేస్తే సముచిత స్థానం

రఘునాథరెడ్డిని సత్కరిస్తున్న మంత్రి బోసురాజు, తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే : వివిధ సమస్యలను ప్రతిబింబించడంతో సహా జరిగిన ప్రగతిని ప్రచారం చేయాలని చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు పాత్రికేయులకు హితవు పలికారు. సమాచార పౌర సంబంధాల శాఖ, రాయచూరు రిపోర్టర్స్ గిల్డ్, జిల్లా, ప్రాంతీయ దిన పత్రికల సంపాదకుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గిల్డ్ రెండో అంతస్తులో జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఆచరించారు. బోసు రాజు ప్రారంభించి మాట్లాడారు. నిబద్ధతతో, నిజాయతీగా ప్రజలకు ఉపయోగపడే వార్తలు రాసే విలేకరులకు సమాజంలో సముచిత స్థానం ఉంటుందని చెప్పారు. స్వాతంత్ర్యానికి ముందు తర్వాత దేశాభివృద్ధిలో పత్రికలు కీలక పాత్ర పోషించాయని కొనియాడారు. ప్రస్తుతం చిన్న పత్రికలు నడపడటం కష్టసాధ్యమైందని చెబుతూ పారిశ్రామికవేత్తల స్వాధీనంలోని పెద్ద పత్రికలు పరిస్థితి ఆశాజనకంగా లేదన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విశ్రాంత పాత్రికేయులకు ఇచ్చే పింఛన్‌ను రూ.15 వేలకు పెంచారని, గ్రామీణ విలేకర్లకు ఉచిత బస్సుల పాస్‌లను ఇచ్చినట్లు వివరించారు. జిల్లాలోని పలువురు సీనియర్ పాత్రికేయులు, సంపాదకులు తనకు రాజకీయంగా మార్గదర్శనం చేశారని మంత్రి తెలిపారు. గిల్డ్ వెబ్‌సైట్‌ను విడుదల చేసిన రాయచూరు గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ ఉపన్యసిస్తూ వాస్తవానికి దగ్గరగా ఉండే వార్తలు రాయాలని, యువ విలేకర్లు వృత్తిలో రాణించేందుకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. కల్యాణ కర్ణాటక మండలి నుంచి రిపోర్టర్స్ గిల్డ్ నిధికి రూ.10 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా పాలనాధికారి నితీశ్ విలేకర్ల అత్యవసర నిధిని ప్రారంభించారు. నగరపాలక సంస్థ మాజీ అధ్యక్షురాలు నరసమ్మ పేపర్లు పంపిణీ చేసేవారికి జెర్కిన్లను అందజేశారు. క్రికెట్ టోర్నీ విజేత జట్టుకు షీల్డ్‌ను ప్రదానం చేశారు. ఏఎస్పీ కుమారస్వామి, గిల్డ్ అధ్యక్షుడు విజయకుమార్ జాగటకల్, మాజీ అధ్యక్షుడు కిషన్‌రావు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ హూగార, కోశాధికారి సణ్ణ వీరన్న, విజయవాణి దినపత్రిక స్థానిక సంపాదకుడు జగన్నాథ్ దేశాయి, దిన పత్రికల సంపాదకుల సంఘం అధ్యక్షుడు చెన్నబసవ బాగలవాడ, ప్రధాన కార్యదర్శి ఖాన్‌సాబ్ మెమిన్ పాల్గొన్నారు.

పురస్కారాలు అందుకున్న పాత్రికేయులు

రఘునాథరెడ్డి మన్సలాపూరుకు జీవమాన సాధన విశేష ప్రశస్తి, చంద్రకాంత్ మసాని, బి.రాజు, శ్రీనివాస్, అబ్దుల్ ఖాదర్ (ఫొటోగ్రాఫర్)కు దత్తి పురస్కారాలను ప్రదానం చేశారు. కలబురగి విభాగానికి తొలిసారిగా సమాచార హక్కు కమిషనర్ అయిన పూర్వ విలేఖరి వెంకటసింగ్‌ను సత్కరించారు.

'మత్తు'గాళ్ల తాటతీస్తాం

డాక్టర్ పరమేశ్వర్

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: మాదకద్రవ్యాలు తయారు చేసే డ్రగ్స్ పెడ్లర్లపై నిర్లక్ష్యంగా వ్యవహరించే పోలీసు అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు ఉద్యోగం నుంచి తొలగిస్తామని రాష్ట్ర హోం శాఖమంత్రి డాక్టర్ పరమేశ్వర్ హెచ్చరించారు. ఆదివారం ఇక్కడ నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఆయన పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బెంగళూరు నగరంలో మాదకద్రవ్యాలు తయారు చేసే కేంద్రాలు బయటపడ్డాయని, దాన్ని సమర్థించుకోవడం లేదన్నారు. ఇంకా అలాంటి ఫ్యాక్టరీలు ఎన్ని ఉన్నాయనే వాటిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారన్నారు. మాదక ద్రవ్యాల విక్రయదారులతో పోలీసులు చేతులు కలిపినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతన సంవత్సరం వేడుకలు సందర్భంగా మాదకద్రవ్యాలు విక్రయాలు ఎక్కువగా సాగే అవకాశం ఉందని అన్నిప్రాంతాలపై నిఘావేయాలని సూచించారు. పబ్, బార్‌అండ్ రెస్టారెంట్లు, ఇతర ప్రాంతాల్లో వేడుకలు జరుగుతాయని, నిఘా పెంచాలని తెలిపారు.

✦ నూతన సంవత్సరం వేడుకలు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా 20వేల మంది పోలీసులతోపాటు రిజర్వుడ్ పోలీసులను కూడా రప్పించుకోవాలని మంత్రి నగర పోలీసు అధికారులకు సూచించారు. వేడుకలు జరిగే ఎంజీరోడ్డు, చర్చివీధి, బ్రిగేడ్ రోడ్డులో ఉన్న పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లపై నిఘా వేయాలని తెలిపారు. ప్రజలు ఎక్కువగా చేరే ప్రాంతాల్లో భద్రత పెంచాలన్నారు. సమావేశంలో డీజీపీ డాక్టర్ ఎం.ఎ.సలీం, నగర పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.


గ్రంథాన్ని విడుదల చేస్తున్న సాహితీవేత్తలు

జీవిత అనుభవాలే బసవ గీత

మాన్వి, న్యూస్‌టుడే : బసవరాజ్‌స్వామి తన జీవిత అనుభవాలే బసవ గీత సత్య సంవాద గ్రంథమని పలువురు సాహితీవేత్తలు పేర్కొన్నారు. 12వ శతమానంలోనే సమసమాజ నిర్మాణం కోసం శరణులు పాటుపడ్డారని, శరణుల అనుభవంలోంచి పుట్టినవే వచనాలన్నారు. బసవరాజ్‌స్వామి రచించిన బసవ గీత సత్య సంవాద గ్రంథాన్ని ఆదివారం విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రముఖులు బి.జి.హులి, బసవ ప్రభుపాటిల్, డి.జి.కర్కిహళ్లి, శరణబసవ, కె.ఇ.నరసింహ, బి.వి.రెడ్డి, రంగప్ప, విజయలక్ష్మీ, రాజా సుభాశ్చంద్రనాయక్, శర్ఫుద్దీన్, మూకప్ప, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వందేమాతరం వార్షికోత్సవం

ప్రదర్శనలో సంస్థాన్ నిర్వాహకులు

మాన్వి, న్యూస్‌టుడే : స్థానిక ఓంమండలి శివశక్తి అవతార్ సేవ సంస్థాన్ ఆధ్వర్యంలో వందేమాతరం వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ కూడలి వద్ద ఓం శివశక్తి మండలి తాలూకా సంచాలకురాలు బి.కె.అక్కమ్మ జాథాని ప్రారంభించి మాట్లాడారు. స్వాతంత్ర్య పూర్వం దేశభక్తుల్లో స్ఫూర్తి నింపేందుకు రచించిన వందేమాతరం గీతం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశభక్తులు, వందేమాతరం గీతాన్ని మననం చేసుకోవటం మన బాధ్యతగా భావించాలన్నారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో వందేమాతరం జాతా సాగింది. ఓంమండలి శివశక్తి అవతార్ సేవ సంస్థాన్ తాలూకా సమితి సభ్యులు, కార్యకర్తలు, సంఘ సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం వైఫల్యం

అశోక్

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో సాగుతున్న మాదక ద్రవ్యాల విక్రయాలను నియంత్రించడంలో ప్రభుత్వం సంపూర్ణంగా విఫలమైందని ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ ఆరోపించారు. ఆదివారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మాదకద్రవ్యాలను నియంత్రించకుండా యువత జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. బెళగావి శాసనసభ సమావేశంలో తాను మాదక ద్రవ్యాలను గురించి ప్రస్తావిస్తే అన్ని ప్రాంతాల్లో మాదక ద్రవ్యాలు ఉన్నట్లు లెక్కలేని సమాధానం హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ ఇచ్చారని ఆక్రోశం వ్యక్తం చేశారు. తక్షణం మాదక ద్రవ్యాలను నియంత్రించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

28-12-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1611.15	1627.22
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	453
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	8,999	8,895
నీటి నిల్వ (టి.ఎం.సి)	39.885	83.988
గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు)	వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు	

కసిగా ఈదేసి.. విజయకేతనం ఎగరేసి..

జాతీయ బాలపురస్కారాన్ని అందుకున్న ఈత క్రీడాకారిణి ధినిధి సింగు

రాష్ట్రపతితో ప్రశస్తి అందుకుంటున్న ధినిధి సింగు

ఈత సాధనలో..

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: కర్ణాటక ఈత రంగంలో దూసుకెళ్తున్న స్విమ్మర్ ధినిధి సింగు ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్రీయ బాలపురస్కారాన్ని అందుకొని ఉద్యాన నగరి కీర్తి పతాకను హస్తినలో రెపరెపలాడించింది. శుక్రవారం దిల్లీలో జరిగిన వేడుకల్లో ఈ ప్రతిష్ఠాత్మకమైన అవార్డును రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో అందుకొంది. 14 ఏళ్ల వయస్సులోనే గతేడాది ప్యారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందిన దినిధీ 200 మీటర్ల ఫ్రీస్టైల్లో పరిణితి పొందింది. 15 ఏళ్ల ధీనిధి 100 మీటర్స్ ఫ్రీస్టైల్, 200 మీటర్ల వ్యక్తిగత మిడ్లేలోనూ రాణిస్తోంది. 2022 ఏషియన్ క్రీడాపోటీలో భారత తరఫున అతిచిన్న వయస్సులో పాల్గొన్న ఈ స్విమ్మర్ సీవీ రామన్‌నగరలోని డీఆర్‌డీఓ కేంద్రీయ విద్యాలయంలో పదోతరగతి విద్యార్థిని. 2018లో సరదాగా ఈతక్రీడలో పాల్గొన్న ఈ అమ్మాయి అంచెలంచెలుగా ఈతలో పట్టును సాధించి పరిణితి పొందింది. డాల్ఫిన్ ఈత క్లబ్‌లో శిక్షణ పొందుతున్న ధినిధి 2023 జాతీయ సబ్ జూనియర్, జూనియర్ పోటీలో 100 మీటర్లలో రికార్డును నెలకొల్పింది. 200 మీటర్ల ఫ్రీస్టైల్, వ్యక్తిగత మిడ్లేలోనూ రికార్డు సృష్టించిన ఈ స్విమ్మర్ 2023 గోవాలో జరిగిన జాతీయ క్రీడా పోటీల్లో వివిధ విభాగాల్లో ఏడు పతకాలను సాధించడం విశేషం. దోహాలో జరిగిన ప్రపంచ పోటీల్లో పాల్గొన్న ధినిధి ఒడిశాలో జరిగిన 78వ జాతీయ సీనియర్ ఈత పోటీల 100, 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో జాతీయ రికార్డును నెలకొల్పి శభాష్ అనిపించుకుంది. ఏషియన్ గేమ్స్, ఇతర ప్రతిష్ఠాత్మకమైన పోటీల్లో పాల్గొని బోలెడన్ని పతకాలను సాధించిన ధినిధి భవిష్యత్తులో మరింతగా సాధనలు చేయాలని ఆశిద్దాం.

విశ్వవిద్యాలయంలో నేటి నుంచి సమ్మేళనం

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయం, జాతీయ వ్యవసాయ అభివృద్ధి సహకార అంశంపై నేటి నుంచి మూడు రోజులు అంతర్జాతీయ సమ్మేళనాన్ని నిర్వహించనుంది. ఇక్కడి వ్యవసాయ విశ్వవిద్యాలయం సభా భవనంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది. ఐఏఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ సి.హెచ్.శ్రీనివాస్ రావు ప్రారంభిస్తారని, రాయచూరు విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఎం.హనుమంతప్ప అధ్యక్షత వహిస్తారని విద్యాశాఖ డైరెక్టర్ గురురాజ సుంకద ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా విశ్వవిద్యాలయాల ఉపకులపతులు సురేష్, జగదీష్, వీరణ్ణ, పాటిల్, విష్ణువర్ధన్, ఎన్ఏడీఎస్ఎల్ ఛైర్మన్ ఖ్యుమర్ (బారాముల్లా) హాజరవుతారని వివరించారు.

యాదగిరిలో శాస్త్రీయ సమ్మేళనం

రాయచూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర వైజ్ఞానిక పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 29, 30వ తేదీల్లో యాదగిరి జిల్లా క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి ఐదో శాస్త్రీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తామని రవి పాటిల్ ఫౌండేషన్ సంస్థాపక అధ్యక్షుడు రవి పాటిల్ తెలిపారు. నిజగుణానంద స్వామీజీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. శరణ సాహితీవేత్త విశ్వారాధ్య సత్యం పేట సమ్మేళనానికి అధ్యక్షత వహిస్తారని వెల్లడించారు. కువెంపు జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సమ్మేళనంలో శాస్త్రీయ అంశాలపై చర్చలు, గోష్ఠిలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. దేశ, రాష్ట్ర స్థాయిలో విజ్ఞాన ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. మూఢ విశ్వాసాలపై మేధావులు ప్రజలను చైతన్య పరుస్తారని, శాస్త్రీయ భావాలు పెంపొందిస్తారని వివరించారు.

అభియాన్‌ను విజయవంతం చేద్దాం

వివరాలు తెలుపుతున్న బాదర్లి, కేవీ, నాడగౌడ, కేకే

సింధనూరు, న్యూస్‌టుడే: జల జాగృతి-జన జాగృతి పేరిట నిర్వహిస్తున్న నిర్మల తుంగభద్ర అభియాన్ పాదయాత్ర రెండు దశలు పూర్తి చేసుకుని మూడో దశలో కిష్కింద నుంచి మంత్రాలయం వరకూ సాగుతోంది..పాదయాత్ర పొడవునా నదిలో సబ్బు, షాంపూల వంటివి కూడా కలవకూడదంటూ ప్రచారం చేస్తున్న ఈ బృహత్ కార్యక్రమానికి అందరూ చేతులు కలపాలన్నారు. నదిలో స్నానమాచరించే వారికి శనగపిండి పొట్లాలను అభియాన్ పంపిణీ చేస్తోంది. ఈ జాగృతి కార్యక్రమానికి మనమందరం సహకరిద్దాం..29, 30 తేదీల్లో సింధనూరు చేరుకోనున్న అభియాన్‌ను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే బాదర్లి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన మాజీ మంత్రి నాడగౌడ, మాజీ ఎంపీ కేవీ, భాజపా నాయకుడు కె.కరియప్పతో కలిసి ఆదివారం సర్క్యూట్ హౌస్‌లో విలేకరులకు అభియాన్ వివరాలు అందించారు. తుంగభద్ర నది స్వచ్ఛతకు తొలుత జనంలో జాగృతి తెద్దాం..ఆపై చర్యలు చేపడదామని కరియప్ప పేర్కొన్నారు.

అమృత పనులు నిర్ణీత వ్యవధిలో పూర్తిచేయాలి

అధికారులతో మాట్లాడుతున్న మంత్రి బోసురాజు

మాన్వి, న్యూస్‌టుడే : ప్రారంభించిన పనులను నిర్ణయించిన గడువులోగా పూర్తి చేయాల్సిందేనని, అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోవటానికి వెనుకాడబోమని మంత్రి ఎన్.ఎస్.బోసురాజు సూచించారు. పట్టణంలో చేపట్టిన వివిధ నిర్మాణాలు నాసిరకంగా జరుగుతున్నాయని కాంగ్రెస్ ప్రముఖులు, కార్యకర్తలు మంత్రి దృష్టికి తీసుకెళ్లిన క్రమంలో ఆయన ఎమ్మెల్యే హంపయ్యనాయక్‌తో కలిసి శనివారం రాత్రి పట్టణంలో పర్యటించి నిర్మాణాలను పరిశీలించారు. తర్వాత ఐబీకి అధికారులని రప్పించి పనుల విషయమై ఆరా తీశారు. అమృత్ 2 యోజనను సంబంధించి పైప్‌లైన్లు వేసి ఇతర పనులను చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏజెన్సీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గడువులోగా పూర్తి చేయాల్సిందేనని, తర్వాత ప్రాధేయపడి ఫలితం లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్, తహసీల్దార్ భీమరాయ రామసంద్ర, పురపాలక సంఘం ముఖ్యాధికారి పరశురామ్‌దేవమానే, అధికారులు హనుమంతప్ప, దేవరాజ్, చౌహాణ్, గఫూర్‌సాబ్, అమరేశప్ప, పురపాలక సంఘం సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తనిఖీలు ముమ్మరం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: మైసూరు ప్యాలెస్ ముందు హీలియం సిలిండర్ పేలిన సంఘటనకు సంబంధించిన మైసూరు నగర పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. వారితో పాటు ఎన్ఐఏ బృందం కూడా ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టింది. ఈ సంఘటనలో మృతి చెందిన సలీం మైసూరు నగరానికి రాకముందు ఉత్తరప్రదేశ్, హైదరాబాద్, తదితర నగరాల్లో బెలూన్లు విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. గత నెలలో మైసూరుకు వచ్చి బెలూన్ వ్యాపారం మొదలు పెట్టారు. అతడితో పాటు వచ్చిన స్నేహితులు రిజ్వాన్, హుసేన్, సునీల్‌సింగ్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సలీం ఉన్నలాడ్జి యజమానిని కూడా పోలీసులు విచారిస్తున్నారు. నగరంలో ఉన్న లాడ్జిలపై పోలీసులు నిఘా వేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు సమాచారాన్ని సేకరిస్తున్నారు. జరిగిన పేలుడు సంఘటనలో మృతి చెందిన నంజనగూడు చామలాపుర నివాసి మంజుళ అన్న పరమేశ్వర్ మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెల్లెలు మృతి చెందిన తరువాత మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థి సంఘాలకు ఎన్నికలు

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే: రాష్ట్రంలో వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఉన్న విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహణపై అధ్యయనం చేసేందుకు కేపీసీసీ ఉన్నత స్థాయి సమితి ఏర్పాటు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ తెలిపారు. సమితి అధ్యక్షుడిగా వైద్య విద్యాశాఖ మంత్రి డాక్టర్ శరణ్‌ప్రకాశ్ పాటిల్‌ను నియమించామని, సభ్యులుగా ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ సుధాకర్, విధానపరిషత్తులో ప్రభుత్వ విప్ సలీం అహ్మద్, శాసనసభ్యులు రిజ్వాన్ హర్షద్, బి.శివణ్ణ, పుట్టణ్ణ బసవనగౌడ బాదర్లి, యువజన కాంగ్రెస్‌నేత మంజునాథ్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కార్తీక్ గణేష్ ఉంటారని వివరించారు.

(c) eenadu

కసాయిగా మారిన కన్నతండ్రి

నవరంగపూర్, న్యూస్‌టుడే: ఐదు రోజుల కిందట మూడేళ్ల బాలుడికి కన్నతండ్రే కాళ్లు, చేతులు కట్టేసి లుంగీలో రాళ్లు వేసి మూటగా మెడకు కట్టి చెరువులో పడేసిన ఘటన నవరంగపూర్ జిల్లా డాబుగావ్ ఠాణా పరిధిలో ఓల్మాగూడ గ్రామంలో చోటుచేసుకుంది. ఐఐసీ హరిహర్ బొత్ర తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌లోని కొండగావ్ జిల్లా పరష గ్రామానికి చెందిన రోహిత్ సెరియా ఈనెల 22 నుంచి తన కుమారుడు కనిపించటం లేదని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆదివారం ఉదయం ఓల్మాగూడ చెరువులో మృతదేహం తేలుతూ ఉండటాన్ని గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఉమ్మర్‌కోట్ అగ్నిమాపక శాఖ సిబ్బంది బాలుడి మృతదేహాన్ని బయటకు తీశారు. ఇరు రాష్ట్రాల పోలీసులు అనుమానంతో తండ్రి రోహిత్‌ను దర్యాప్తు చేయగా, తానే చెరువులో పడేసినట్లు అంగీకరించాడు. ఉమ్మర్‌కోట్‌లో బాలుడు మృతదేహానికి పరీక్షలు చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రోహిత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మూడు దశల్లో జగన్నాథుని సంపద లెక్కింపు

పాలకవర్గం ఆమోదం తర్వాత ప్రభుత్వ ఎస్ఓపీ

విలేకర్లతో మాట్లాడుతున్న జస్టిస్ బిశ్వనాథ్ రథ్, అరవింద్‌పాఢి

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ జగన్నాథుని రత్నభాండాగారం సంపద లెక్కింపు ప్రక్రియ కోసం జస్టిస్ బిశ్వనాథ్‌రథ్ అధ్యక్షతన ఏర్పాటైన పరిశీలన సంఘం సమావేశం శనివారం రాత్రి శ్రీక్షేత్ర పాలనా కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో ఆలయ పాలనాధికారి అరవిందపాఢి, పూరీ పాలనాధికారి దివ్య జ్యోతి పరిఢ, ఇతర అధికారులు పాల్గొన్నారు. సంపద లెక్కింపునకు సంబంధించి అయిదు గంటలపాటు చర్చ జరిగినా తేదీలు మాత్రం నిర్ణయం కాలేదు.

రథయాత్రలోగా పూర్తయ్యే అవకాశం

సమావేశానంతరం జస్టిస్ రథ్, అరవింద్ విలేకర్లతో మాట్లాడుతూ సంపద లెక్కింపు సుదీర్ఘ ప్రక్రియ అని, ఇది మూడు దశల్లో జరుగుతుందని రథయాత్రలోగా పూర్తయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఏ ప్రాతిపదికన లెక్కింపు చేయాలన్న దానిపై నివేదిక సిద్ధం చేశామని, దీనికి శ్రీక్షేత్ర పాలకవర్గం సమావేశమై ఆమోదించిన తర్వాత ప్రభుత్వ పరిశీలనకు పంపిస్తామన్నారు. అనంతరం సమగ్ర నియమావళి ప్రభుత్వం ప్రకటిస్తుంది. దీనికి అనుగుణంగా లెక్కింపు జరుగుతుందన్నారు. తొలుత రోజువారీ పురుషోత్తమునికి ధరింపజేసే ఆభరణాలు, రెండో దశలో గర్భగుడిలో వేడుకల్లో స్వామికి అలంకరింపజేసే నగలు, వజ్రాలు, మూడో చివరి విడతలో రహస్య గదిలో ఉన్న విలువైన సంపద లెక్కింపు జరుగుతుందన్నారు. మూడు గదుల సంపద లెక్కింపునకు వేర్వేరు తేదీలు నిర్ణయమవుతాయని, ఇదంతా రిజర్వుబ్యాంకు(ఆర్‌బీఐ) అధికారుల సమక్షంలో చేపట్టాలని తీర్మానించామన్నారు. లెక్కింపు వల్ల స్వామి సేవలు, భక్తుల దర్శనాలకు ఇబ్బందులు లేకుండా వేళలు నిర్ణయిస్తామన్నారు. ఇదంతా వీడియోగ్రఫీ, డిజిటలైజేషన్ చేయిస్తామని, 1978లో జరిగిన లెక్కింపు వివరాలతో పోలుస్తామన్నారు. జనవరి నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందన్న అంచనా ఉందని, పాలకవర్గం సమావేశం తర్వాత పూర్తి స్పష్టత వస్తుందన్నారు.

పోలీసుపై దాడి.. చికిత్స పొందుతూ మృతి

తులసీరావు (పాతచిత్రం)

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ బస్టాండ్ వద్ద టీ తాగుతుండగా సివిక్ వాలంటీర్ పోలీసు తులసీరావు(30)పై ఓ వ్యక్తి దాడి చేశాడు. గాయపడిన ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డిసెంబరు 16న జరిగిన ఈ ఘటనలో గాయపడిన తులసీని కటక్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడని పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఒకరిని అరెస్టు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తులసీ మిడ్నాపూర్‌లోని ఐబీ బ్రాంచ్‌లో పనిచేస్తున్నాడు.

పశ్చిమ ఒడిశా మదర్‌థెరెసా పార్వతిగిరి

'మన్ కీ బాత్'లో ప్రస్తుతించిన ప్రధాని మోదీ

ప్రధాని నరేంద్రమోదీ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పార్వతిగిరి స్వాతంత్ర్య సంగ్రామంలో క్రియాశీలక పాత్ర పోషించారు. సమాజ సేవలో తరించి పశ్చిమ ఒడిశా మదర్‌థెరెసాగా మన్ననలు అందుకున్న వనిత. ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ 'తన మన్ కీ బాత్' (మనసులో మాట) 129వ ఎపిసోడ్‌లో పార్వతి సేవలను ప్రస్తావించారు. 16 ఏళ్ల వయసులో స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న ఆమె తర్వాత అనాథలకు అండగా నిలుస్తూ, సమాజానికి ఎనలేని సేవలు చేశారన్నారు. 2026 జనవరి 26 వేడుకల నేపథ్యంలో పార్వతిగిరి శత జయంతి ఉత్సవాలకు శ్రీకారం చుడుతున్నామని ప్రధాని తన ఆకాశవాణి కార్యక్రమంలో పేర్కొన్నారు.

రాష్ట్రానికి గర్వకారణం

ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమం ప్రసారంతో కలిసి తిలకించిన ఉపముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్ విలేకర్లతో మాట్లాడుతూ మహనీయురాలిని గౌరవించడం, స్మరించుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. ఆమె శత జయంతి వేడుకలు చేపడతామని ప్రధాని పేర్కొనడం హర్షణీయమన్నారు.

సేవలకు చిరునామా పార్వతి

బరగఢ్ జిల్లా సమలాయి గ్రామానికి చెందిన పార్వతిగిరి 1926 జనవరి 19న ఒక దళిత కుటుంబంలో జన్మించారు. 11 ఏళ్ల వయసులో చదువుకు స్వస్తి పలికారు. స్వాతంత్ర్య ఉద్యమానికి ఉద్యమిస్తున్న మహనీయుల గురించి తెలుసుకున్నారు. 16 ఏళ్ల ప్రాయంలో నాటి కాంగ్రెస్ నాయకులతో కలిసి సంగ్రామంవైపు అడుగులేశారు. క్విట్ ఇండియా ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. స్వాతంత్ర్యానంతరం పార్వతి అవిభక్త సంబల్‌పూర్ జిల్లాకు చేసిన సేవలు అనన్యం. అనాథలకు అక్కున చేర్చుకున్న ఆమెను పశ్చిమ ఒడిశా మదర్‌థెరెసాగా ప్రజలు కీర్తించారు. 1995 ఆగస్టు 17న ఆమె తుదిశ్వాస విడిచారు.

'స్వచ్ఛత'కు ప్రతిఒక్కరు కృషి చేయాలి: ధర్మేంద్ర

అనుగుల్‌లో వీధులు ఊడుస్తున్న ధర్మేంద్ర తదితరులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: 'స్వచ్ఛత'కు ప్రతిఒక్కరు కృషి చేయాలని, ప్రధాని నరేంద్ర మోదీ దీన్ని బాధ్యతగా స్వీకరించాలని పునరుద్ఘాటిస్తున్న నేపథ్యంలో జన్మభూమిని శుభ్రంగా ఉంచడానికి శ్రమదానం చేయాలని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కోరారు. ఆదివారం అనుగుల్ పట్టణ పరిధిలో సేవా సంస్థల ప్రతినిధులతో కలిసి పారిశుద్ధ్యం పనులు నిర్వహించిన ఆయన వారానికోసారి ఈ పనుల్లో పాల్గొనాలని, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పనులు చేయాలన్నారు. దీనికి ముందుగా సంబల్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) క్యాంపస్‌లో నూతన వసతి గృహాలు, రెండో ల్యాబొరేటరీ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు.

స్వామిని జాగరణలో ఉంచడం తగునా?

గోపాలపూర్, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం పేరిట జగన్నాథునికి జాగరణలో ఉంచడం, పవళింపు సేవ మినహాయించటం తగునా? అని, ఇది సనాతన ధర్మానికి పురుషోత్తమ సంస్కృతికి విరుద్ధం కాదా? అంటూ పూరీ శ్రీక్షేత్ర పాలకవర్గం సభ్యుడు మహేష్‌సాహు ప్రశ్నించారు. దీనిపై పూరీ రాజు గజపతి దివ్యసింగ్ దేవ్, న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, పాలనాధికారి అరవింద పాఢిలకు లేఖలు రాశారు. డిసెంబరు 31 అర్ధరాత్రి నుంచి స్వామి దర్శనాలకు ఏర్పాట్లు తగవని, పవళింపుసేవ రద్దు చేయడం భావ్యం కాదన్నారు. ధనుర్మాసం వల్ల ఇప్పటికే రాత్రి 2 గంటలకు ఆలయం తలుపులు తెరుస్తున్న నేపథ్యంలో మళ్లీ నూతన సంవత్సరం పేరిట జగన్నాథునికి జాగరణలో ఉంచడం శాస్త్ర విరుద్ధమని పేర్కొన్నారు. వాస్తవానికి 2025 క్యాలెండర్ మారడం మినహా నూతన సంవత్సరమంటూ ఏమీ లేదని, ఇది పాశ్చాత్య దేశాలకు పరిమితమన్నారు. హిందూ సంప్రదాయం ప్రకారం సూర్యోదయంతో రోజు మొదలవుతుందని, అర్ధరాత్రిగా ఏ ధర్మశాస్త్రంలోనూ లేదన్నారు. రాశుల్లో తొలిదైన మేష సంక్రాంతిని నూతన సంవత్సరంగా ఒడియా ప్రజలు పరిగణిస్తున్నారని, దీనిపై శ్రీక్షేత్ర పాలకులు దృష్టి సారించాలని, అర్ధరాత్రి దర్శనాలు తగవని లేఖలో పేర్కొన్నారు. మహేష్ రాసిన లేఖలో వాస్తవం ఉందని కొంతమంది సేవాయత్‌లు సమర్థించారు.

డబుల్ ఇంజిన్ పాలన ప్రజలకు తీరని శాపం

పతాకావిష్కరణలో భక్తచరణ్, రామచంద్ర తదితరులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: డబుల్ ఇంజిన్ పాలన ప్రజలకు తీరని శాపంగా పరిణమించిందని, భాజపా పాలకులు ప్రచారానికే పరిమితమయ్యారని పీసీసీ అధ్యక్షుడు భక్తచరణ్‌దాస్ దుయ్యబట్టారు. ఆదివారం భువనేశ్వర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ 140వ ఆవిర్భావ వేడుకలు జరిగాయి. శాసన సభాపక్షం నేత రామచంద్ర కడం, ఇతర నాయకులు పాల్గొన్నారు. పతాకావిష్కరణ చేసిన తర్వాత దాస్ విలేకర్లతో మాట్లాడుతూ 18 నెలల మోహన్‌చరణ్ మాఝి సర్కారు సాధించిందేమీ లేదని, అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, దీనిపై కాంగ్రెస్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తుందని, ప్రజలకు అండగా ఉంటామని చెప్పారు.

ప్రభుత్వ వైఫల్యాలు.. నిరుద్యోగ సమస్యపై ముమ్మర ఆందోళన

మాట్లాడుతున్న రామచంద్ర పాత్ర్. చిత్రంలో ప్రకాష్ పాత్ర్, కామదేవ్ నాహక్ తదితరులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: భాజపా ఆధ్వర్యంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వ వైఫల్యాలు, నిరుద్యోగం, మహిళలపై పెరుగుతున్న హింస, ఇళ్లు లేని వారికి ఇళ్లు తదితర ప్రజా సమస్యలపై రానున్న రోజుల్లో ముమ్మర ఆందోళనలు నిర్వహిస్తామని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. ఆ పార్టీ ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో యువ, విద్యార్థి, మహిళ, కార్మిక, బ్యాంకింగ్, న్యాయవాదుల శాఖల సమ్మేళనం ఆదివారం జరిగింది. స్థానిక పార్కు వీధిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన దీనికి రామచంద్ర పాత్ర్ అధ్యక్షత వహించారు. సీపీఐ రాష్ట్ర సంపాదక మండలి సభ్యుడు ప్రకాష్ పాత్ర్, జిల్లా సహాయ కార్యదర్శి నీలకంఠ దాస్, జోనల్ కార్యదర్శి కామదేవ్ నాహక్, ఇతర నాయకులు సీహెచ్.జనార్ధన రెడ్డి, ప్రఫుల్ల జెనా తదితరులు పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు కార్యాలయం బయట పార్టీ పతాకాన్ని సీనియరు నాయకుడు మహ్మద్ ఉస్మాన్ ఆవిష్కరించారు. సమ్మేళనానికి పలువురు ప్రతినిధులు హాజరయ్యారు.

పూల సేద్యం... లాభాలే నిత్యం

అందరూ ఆలోచించే విధంగా కాకుండా వినూత్నంగా ఆలోచిస్తే లాభాల బాట పయనించొచ్చు. ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా మనమే పది మందికి ఉపాధి కలిగించేలా ఉండాలి అనే ఆలోచనతో తల్లిదండ్రులు గర్వించేలా అందరి చూపు తన వైపు తిప్పుకొన్నాడు. పదుల ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని బంతిపూల సాగుతో సిరులు కురిపిస్తున్నాడు

–న్యూస్‌టుడే, రాయగడ పట్టణం

కౌలు భూమిలో సిరులు కురిపిస్తున్న యువకుడు


బంతిపూల తోటలో రమేష్

50 మందికి ఉపాధి కల్పిస్తూ..

రాయగడకు చెందిన చంద్రరమేష్ ఏపీలోని తాడేపల్లిగూడెం సమీపంలో ఓ కళాశాలలో బీకాం కంప్యూటర్ కోర్సు పూర్తిచేశాడు. ఉద్యోగ ప్రయత్నాలు మొదలెడుతున్న సమయంలో ఓ రోజు మదిలో మెదిలిన ఆలోచన రమేష్‌ను సొంతూరు తిరిగొచ్చేలా చేసింది. ఆ తర్వాత జిల్లా కేంద్రానికి నాలుగు కి.మీ. దూరాన కొత్తపేట సమీపంలో 40 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. అందులో నాలుగు ఎకరాల్లో కేవలం బంతిపూలు, మరికొన్ని ఎకరాల్లో కూరగాయల సాగును మొదలెట్టాడు. బంతిపూల సాగు మంచి ఫలితాలు ఇవ్వడంతో దానిపై దృష్టి పూర్తిగా కేంద్రీకరించాడు. మరో 50 మందికి ఉపాధి కల్పిస్తూ ఆ యువకుడు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

పూలు సేకరిస్తున్న మహిళలు

తల్లిదండ్రుల ప్రోత్సాహం.. లక్షల్లో ఆదాయం....

ఒక్కో ఎకరాకు సుమారు 150 కిలోల బంతిపూల ఉత్పత్తితో నెలకు రూ. 2 లక్షల మేర ఆదాయం సమకూరుతోంది. దీనికి తోడు క్యాబేజీ పువ్వు, బుట్టాకు తదితర కూరగాయల సాగుతో అదనపు ఆదాయం చేకూరుతోంది. రమేష్ దగ్గర 50 మంది పని చేస్తుండగా, వారిలో 10 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉండటం గమనార్హం. వీరికి వారాల (వీక్లీ) వారీగా వేతనాలు చెల్లిస్తున్న రమేష్ కూడా తనవంతు చెమటోడ్చుతుంటాడు. గతంలో పండగలు, ఉత్సవాలు, ఇతరత్రా శుభకార్యాలకు అవసరమగు బంతిపూల కోసం పొరుగు రాష్ట్రం ఏపీపైన ఆధారపడే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు స్థానికంగా లభిస్తుండటంతోపాటు రాజమండ్రి, నవరంగపూర్, బ్రహ్మపుర తదితర చోట్లకు ఈ పూలు ఎగుమతి అవుతుండడం గమనార్హం. దీనిపై రమేష్ స్పందిస్తూ చాలామంది బయట ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేస్తూ, ఉపాధి కోసం అన్వేషిస్తుంటారు. అక్కడ ఎన్నో సవాళ్లతో కూడుకున్న ఉద్యోగాల కంటే సొంతూరులో తల్లిదండ్రుల చెంత ఉంటూ ఏదైనా స్వయం ఉపాధి కల్పించుకోవడం ఉత్తమమని చెబుతున్నారు. మనసుంటే మార్గం ఉంటుందన్న నానుడిని విశ్వసిస్తానని ఆయన పేర్కొన్నారు. తన నిర్ణయానికి తల్లిదండ్రులు ఎలాంటి అడ్డు చెప్పకుండా ప్రోత్సహించారని రమేష్ గుర్తు చేశారు.

గిరిజనంలో జ్ఞానజ్యోతులు వెలిగించిన ముర్ము: సీఎం

ఆదివాసీ ఎమ్మెల్యేలు, భాషావేత్తలతో సీఎం మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: గిరిజనంలో జ్ఞానజ్యోతులు వెలిగించిన పండిత రఘునాథ్ ముర్ము ఆదివాసీ ప్రాంతాలకు ఎంతో సేవ చేసిన ధన్యజీవి అని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి చెప్పారు. కేంఝర్ జిల్లాలోని సిలిసువాలో శనివారం రాత్రి సంతాళి భాష, సాహిత్య ఆవిర్భావ శత వార్షికోత్సవం నిర్వహించారు. సంతాళీ తెగ గిరిజనులు దీన్ని ఆల్చికి లిపిగా పేర్కొంటారు. ఈ వేడుకలో పాల్గొన్న సీఎం మాట్లాడుతూ పండిత ముర్ము విరచిత రచనలు, నాటకాలు, పద్య కావ్యాలు ఆదివాసీ సంస్కృతి ప్రతిబింబించేలా ఉంటాయని, జాతిని జాగృతం చేసి ముందుకు నడిపించాయన్నారు. ఒడిశా, పశ్చిమబెంగాల్, బిహారు రాష్ట్రాలు పర్యటించి సంతాళీ భాష విశిష్టత చాటారన్నారు. 'సాగెన్, సాకమ్' పేరిట వారపత్రిక ప్రారంభించారని, గ్రంథాలయాలూ ఏర్పాటు చేశారన్నారు. 2003లో కేంద్రం సంతాళీ భాషకు గుర్తింపు ఇచ్చిందని, గిరిజన ప్రాంతాల్లోని స్కూళ్లల్లో ఈ భాషలో బాలబాలికలకు బోధన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు భాదవ్ హంసదా, సంచలి ముర్ము, ఫకీర్‌మోహన్ నాయక్, అఖిల్‌చంద్ర నాయక్, సంతాళీభాషావేత్త యాదవ్ టుడు, ఇతర ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన వికాసం ధ్యేయంగా సేవలందిస్తున్న వారికి సీఎం సత్కరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గురువుల్ని సత్కరిస్తూ...

ఆనందోత్సాహాలతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గురువులకు సత్కారం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలోని పురాతన 'సిటీ హై స్కూల్లో' 1979వ సంవత్సరం మెట్రిక్యులేషన్ చదువుకున్న పూర్వ విద్యార్థుల తొలి ఆత్మీయ సమ్మేళనం ఆదివారం రోజంతా ఆనందోత్సాహాలతో జరిగింది. స్థానిక ధర్మనగర్‌లోని శుభం సెలబ్రేషన్స్ ఆవరణలో ఇది ఏర్పాటైంది. సమ్మేళనం నిర్వహణ కమిటీ ఛైర్మన్ తంగుడు సురేష్. కో-ఛైర్మన్ ప్రత్తి పరమేష్, ఛైర్మన్ (ఆర్థిక) ఎ.గోవింద రాజు, సలహాదారు కె.వి.ఆర్.సుబుద్ధి తదితరుల పర్యవేక్షణలో నిర్వహించిన సమ్మేళనం పూర్వ విద్యార్థులకు మధుర స్మృతులు మిగిల్చాయి. వేడుకల్లో తమకు విద్యా బుద్ధులు నేర్పిన సిటీ హైస్కూలు విశ్రాంత ఉపాధ్యాయులు డి.సహదేవరావు (బెంగళూరు), డి.విజయ రామకృష్ణ (హైదరాబాద్), ప్రభాత్ కుమార్ జెనా, ప్రకాష్‌చంద్ర రథ్ (బ్రహ్మపుర)లతో పాటు సిటీ హైస్కూలు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ మిశ్రలను మంత్రోచ్ఛారణల మధ్య పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించి, గురువుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం ఇదే ఆవరణలో పూర్వ విద్యార్థుల స్వీయ పరిచయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. అంతకుముందు ఉదయం పూర్వ విద్యార్థులంతా తాము చదువుకున్న సిటీ హైస్కూలును సందర్శించి, అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అక్కడి వారంతా రంగుల బెలూన్లు గాల్లోకి వదిలి, ధర్మనగర్‌లోని శుభం సెలబ్రేషన్స్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిర్వహించిన వేడుకల్లో బ్రహ్మపురతోపాటు రాయగడ, భువనేశ్వర్, హైదరాబాద్, బెంగళూరు, ముంబయి, చెన్నై, దిల్లీ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు తమ జీవిత భాగస్వాములతో కలిసి హాజరయ్యారు.

సిటీ హైస్కూలు బయట రంగుల బెలూన్లు గాల్లోకి వదిలి ర్యాలీ చేపట్టిన పూర్వ విద్యార్థులు

నందన్‌కాననకు కొత్త అతిథి

వన్యప్రాణుల కేంద్రంలో పులి కూన

భువనేశ్వర్‌లోని నందన్‌కానన్ జంతు ప్రదర్శనశాలకు కొత్త అతిథి వచ్చింది. ఇక్కడ మూడేళ్ల ప్రాయం గల ఆడ పులి జయశ్రీ మూడు కూనలకు జన్మనిచ్చినట్లు ఆదివారం అధికారవర్గాలు తెలిపాయి. రెండు కూనలు పుట్టిన వెంటనే మృతిచెందాయి. ఒక్కటి ఆరోగ్యంతో ఉంది. ఈ అతిథి చేరికతో నందన్‌కానన్‌లో పులుల సంఖ్య 29కి పెరిగింది. –న్యూస్‌టుడే, భువనేశ్వర్

సీనియర్ ఐఏఎస్‌లకిక స్థాన చలనం

జనవరి ప్రథమార్ధంలో భారీగా మార్పులు, చేర్పులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే

ఐఏఎస్ అధికారిణి అనూగార్గ్ గురువారం (జనవరి 1న) ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా బాధ్యతలు చేపట్టనున్నారు. తర్వాత ఆమె లోక్ సేవాభవన్‌లో సీనియర్ ఐఏఎస్ అధికారుల స్థాయిలో భారీగా మార్పులు, చేర్పులు చేయనున్నారు. ఈ ప్రక్రియ జనవరి ప్రథమార్ధంలో నియమిస్తారని విశ్వసనీయంగా తెలిసింది.

అనూగార్గ్

సత్యబ్రత సాహు

దేవ్‌రంజన్ కుమార్‌సింగ్

సురేంద్రకుమార్

డీసీ పోస్టు ఎవర్ని వరించేనో?

సీఎస్ తర్వాత అంతటి ప్రాధాన్యం కల పోస్టు అభివృద్ధి కమిషనర్ (డీసీ).. ప్రస్తుతం ఈ బాధ్యతలు అనూగార్గ్ విధులు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. 1991 ఒడిశా క్యాడర్ ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన సత్యబ్రతసాహు, 1993 బ్యాచ్‌కి చెందిన దేవ్‌రంజన్ కుమార్‌సింగ్, సురేంద్రకుమార్ పోటీలో ఉన్నారు. హోం, సాధారణ పాలన(జీఏ), ఆర్థిక, జలవనరుల శాఖలు కీలకమైనవి. సమర్థ అధికారులను ఆయా శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులుగా నియమించే అవకాశముంది.

ఐఏఎస్‌ల కొరత

శాసనసభలో ఇటీవల ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి తెలిపిన వివరాల మేరకు.. 248 ఐఏఎస్ అధికారులు రాష్ట్రానికి అవసరం కాగా, 45 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 25 మంది కేంద్రం డిప్యుటేషన్‌లో దిల్లీలో ఉన్నారు. దీని వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయి. లోక్‌సేవా భవన్‌లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారుల వద్ద రెండు, మూడుకు మించి కీలకశాఖల బాధ్యతలున్నాయి. పాలనా యంత్రాంగం క్రియాశీలకంగా విధులు నిర్వహించాలంటే అంతే దక్షతగా పనులు చేసే అధికారుల అవసరం ఉంది.

భువనేశ్వర్ వచ్చే అవకాశం

సమృద్ధ ఒడిశా తమ ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటిస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝి కేంద్ర ప్రభుత్వానికి పరిస్థితి వివరించి డిప్యుటేషన్‌పై దిల్లీ వెళ్లిన వారిని రాష్ట్రానికి రప్పిస్తారని తెలిసింది. జనవరిలో ఇది సాధ్యం కావచ్చని, ఆరుగురు సమర్థ ఐఏఎస్ అధికారులు వస్తున్నారని చెబుతున్నారు. సీఎస్‌గా బాధ్యతలు చేపట్టనున్న అనూగార్గ్‌కు విశేషానుభవం ఉంది. 'వికసిత్ ఒడిశా-2036' విజన్ డాక్యుమెంట్‌ను ప్రభుత్వం రూపకల్పన చేసింది. దీన్ని సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై ఉంది. దీన్ని దృష్టిలో పెట్టుకున్న అనూగార్గ్ సమర్థ పాలన, ప్రజల చెంతకు పాలన చేర్చడానికి వీలుగా లోక్ సేవా భవన్‌కు కొత్త టీం (ఉన్నతాధికారుల బృందం) పరిచయం చేయనున్నారని భావిస్తున్నారు. ఎన్నో మార్పులకు అవకాశం ఉందని పరిశీలకులంటున్నారు.

(c) eenadu

రాధామాధవుల ప్రేమలో ఆధ్యాత్మిక భావం

దుర్గతి నాశిని ఒడిస్సీ రూపకం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాధామాధవుల ప్రేమలో వేదాంత సారం, ఆధ్యాత్మిక భావం ఇమిడి ఉన్నాయని, భక్త కవి జయదేవుడు తన గీతాగోవిందం కావ్యంలో దీన్ని వివరించారని ప్రముఖ ఒడిస్సీ నృత్య తార(గురు) నందిని ఘోషల్ చెప్పారు. భువనేశ్వర్‌లోని రవీంద్ర మండపంలో జరుగుతున్న అంతర్జాతీయ ఒడిస్సీ నృత్యోత్సవాల్లో శనివారం (రెండో రోజు) రాత్రి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ రాధామాధవుల ప్రణయ కావ్యం వెనుక ఇమిడి ఉన్న భావం విపులంగా వివరించారు. ఇది జగత్తుకి సందేశంగా చెప్పారు. అనంతరం జరిగిన 'జయ జయ జగన్నాథ నీలగిరిపతి' శ్రుతి కమలా కుచమండల, కస్తూరి తిలకం లలాట ఫలకే తదితర గీతాలకు చేసిన నృత్య రూపకాల్లో సృజనీనాయక్, శృతిశ్రీ స్వాయిన్, అరుణిమ ఆచార్య, వేణీ రాయ్ నృత్య గురువులు తమ హావభావాలు ప్రదర్శించారు. భువనేశ్వర్ నగర ప్రముఖులు ఉత్సవాలు తిలకించారు.

మాధవున్ని స్మరిస్తూ...

చారిత్రక ప్రాంతాలు సందర్శించిన ఈసీఐ దంపతులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: రాష్ట్రానికి మూడు రోజుల పర్యటనకు వచ్చిన కేంద్ర ఎన్నికల కమిషనర్ (ఈసీఐ) జ్ఞానేష్‌కుమార్ సతీసమేతంగా ఆదివారం చారిత్రక ప్రాంతాలు సందర్శించారు. ఉదయం పూరీ జిల్లాలోని రఘురాజపూర్‌లో పట్టాచిత్రాల శిల్పుల గ్రామాన్ని తిలకించారు. శిల్పులతో మాట్లాడారు. వారు చిత్రాలు ఎలా తీర్చి దిద్దుతున్నదీ పరిశీలించారు. ఈ సందర్భంగా వారిచ్చిన జగన్నాథ, బలభద్ర, సుభద్రల ఫొటో స్వీకరించారు. అనంతరం ఈసీఐ దంపతులు భువనేశ్వర్ పరిధిలోని ధౌళి బౌద్ధ శాంతిస్థూపం, ఖండగిరి, ఉదయగిరి గుహలు, ముక్తేశ్వరాలయాలు తిలకించారు. సోమవారం జ్ఞానేష్‌కుమార్ భువనేశ్వర్‌లోని ఎన్నికల అధికారి కార్యాలయంలో బూత్‌స్థాయి ఎన్నికల సిబ్బందితో సమావేశమవుతారు.

శిల్పులిచ్చిన ముగ్గురు మూర్తుల ఫొటో స్వీకరిస్తున్న ఈసీఐ దంపతులు, పక్కన కలెక్టర్

సదానందకు పసిడి..మీనాకు కాంస్యం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: పంజాబ్ విశ్వవిద్యాలయం (చండీగఢ్) డైరెక్టరేట్ ఆఫ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 30 వరకు జరుగుతున్న ఉత్తర-తూర్పుజోన్ అంతర్ వర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్ర లిఫ్టర్లు పతకాలు గెలుచుకున్నారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ సెక్టార్‌లో శనివారం నిర్వహించిన పురుషుల విభాగంలో 65 కిలోల శరీరబరువు కేటగిరీలో సదానంద బరిహా స్నాచ్‌లో 110 కిలోలు, క్లీన్ జర్క్‌లో 144 కిలోలు బరువులెత్తి మొదటిస్థానంలో నిలిచి పసిడి పతకం సాధించారు. మహిళా విభాగంలో 58 కిలోల శరీరబరువు కేటగిరీలో మీనా శాంత స్నాచ్‌లో 80 కిలోలు, క్లీన్‌జర్క్‌లో 98 కిలోల బరువులెత్తి తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. వీరిద్దరూ కిస్ (భువనేశ్వర్) విశ్వవిద్యాలయానికి చెందినవారు. వీరిని కిట్, కిస్ వ్యవస్థాపకుడు డాక్టర్ అచ్యుత సామంత అభినందనలు తెలిపారు.

పసిడి పతకంతో సదానంద బరిహా

కాంస్య పతకంతో మీనా శాంత

ప్లాస్టిక్ రహిత పిక్నిక్ స్పాట్ పోటీ

జాబితాలో 16 పర్యాటక ప్రదేశాలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: రాష్ట్ర కాలుష్య బోర్డు అటవీ, పర్యావరణ, వాతావరణ తదితర విభాగాలు ప్లాస్టిక్ రహిత పిక్నిక్ స్పాట్ పోటీని నిర్వహించనున్నారు. పిక్నిక్ స్పాట్‌ను చెత్త, ప్లాస్టిక్ లేకుండా ఉంచడం, పరిశుభ్రమైన పర్యావరణం సందేశాన్ని అందించడం ఈ పోటీ ప్రధాన లక్ష్యమని జిల్లా పర్యాటక విభాగం అధికారిణి తాలిమ ప్రధాని వెల్లడించారు. రాష్ట్రంలోని 30 జిల్లాల్లోని 500 పర్యాటక ప్రదేశాలను పోటీ జాబితాలో చేర్చారు. కొరాపుట్ జిల్లాలో 16 ప్రదేశాలు వాటిలో ఉన్నాయి. ఆయా ప్రదేశాల్లో పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పాలిథిన్ వాడకుండా ఉండటం వంటి ఇతర కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తారు. పోటీలో ఎంపికైన పిక్నిక్ స్పాట్‌లను అభివృద్ధి చేస్తారు.


పోటీ జాబితాలో సుందర దేవ్‌మాలి పర్వతం

2026 మహిళలకు కలిసొస్తుంది: ప్రభాతి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా మహిళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా (సీఎస్) బాధ్యతలు చేపడుతున్నారని, 2026 సంవత్సరం మహిళలకు అన్నివిధాలా కలిసొస్తుందన్న ఆశాభావం ఉందని ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడ చెప్పారు. శనివారం భువనేశ్వర్‌లో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర మహిళలు సర్వోన్నత పదవులు చేపట్టి, వాటికి న్యాయం చేస్తున్నారని, స్వయం సహాయ సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) ప్రతిభకు అద్దం పడుతున్నాయన్నారు. మహిళాభ్యుదయం ధ్యేయంగా ఎన్నో కార్యక్రమాలు అమలవుతుండగా, జగన్నాథుని కృపతో సంకల్పసిద్ధి జరుగుతుంది. రాష్ట్ర మహిళలు అన్నిరంగాల్లో ముందంజ వేస్తారన్న నమ్మకం ఉందన్నారు.

ప్రభాతి పరిడ

నిధులు మంజూరైనా నిర్మాణానికి దూరం

జయపురం, న్యూస్‌టుడే: శవపరీక్ష గది నిర్మించేందుకు నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా నేటికీ పనులు ప్రారంభించలేదని కొరాపుట్‌లోని కుంద్రా వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కుంద్రా ఆసుపత్రికి దూరంగా నిర్మానుష ప్రదేశంలో 1980లో శవపరీక్ష గది నిర్మించారు. ఆ గది పూర్తిగా మరమ్మతులకు గురై చుట్టూ పనికిరాని మొక్కలతో అధ్వానంగా తయారైంది. నియమావళి ప్రకారం శవపరీక్ష సామగ్రిని మారుస్తుండటం. కానీ ఆ గదికి తలుపులు లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గం లేక అక్కడే పరీక్షలు చేస్తున్నామని వైద్యులు తెలిపారు. ఈ ఏడాది మే నెలలో గది నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసినా పనులు జరగలేదు. ఇంజినీర్ రమాకాంత్ నాయక్‌ను 'న్యూస్‌టుడే' అడగ్గా, రెవెన్యూ, సమితి శాఖాధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో గది నిర్మాణ స్థలం గుర్తించలేదని చెప్పారు.

పనికిరాని మొక్కల మధ్య శవపరీక్ష గది

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

రాయగడ, రాయగడ పట్టణం, పర్లాఖెముండి, జయపురం, సిమిలిగుడ, బ్రహ్మపుర నగరం: రాష్ట్రంలో పలు ప్రాంతాల్లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయాల్లో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాయగడలో ఎమ్మెల్యే అప్పలస్వామి, దుర్గాప్రసాద్

జయపురం: కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

బ్రహ్మపుర నగరంలో పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

పర్లాఖెముండిలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే దాశరథి గమాంగ్, నాయకులు, కార్యకర్తలు

పొట్టంగిలో పాల్గొన్న అర్జున్, గుప్తా, శుక్ర, విమలలు

భాజపాలో 30 కుటుంబాల చేరిక

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా చికిటి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మనోరంజన్ ద్యాన్ సామంతరాయ్ సమక్షంలో ఆదివారం పలు కుటుంబాలు భాజపాలో చేరాయి. పాత్రపురంలోని కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో చికిటి సమితిలోని రామచంద్రపూర్ పంచాయతీ పరిధిలోని గ్రామానికి చెందిన 30 కుటుంబాలు భాజపా తీర్థం తీసుకోగా, వారికి ఎమ్మెల్యే మనోరంజన్ కాషాయ టోపీలు ధరింపజేసి, కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు.

మహిళను పార్టీలోకి స్వాగతిస్తున్న చికిటి ఎమ్మెల్యే మనోరంజన్ ద్యాన్ సామంతరాయ్

ఆచార్య సుమన్ చక్రవర్తికి పురస్కారం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఐఐటీ ఖరగ్‌పూర్ డైరెక్టర్ ఆచార్య సుమన్ చక్రవర్తి బెంగళూరులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ 2025 విశిష్ట పూర్వ విద్యార్థి అవార్డు అందుకున్నారు. పలువురు అభినందనలు తెలిపారు.

పోటాపోటీగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఒడిశా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో 71వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. కటక్‌లోని బిజూపట్నాయక్ సింథటిక్ మైదానంలో ఏర్పాటైన పోటీల్లో కేందుఝర్, జగత్సింగ్‌పూర్, పూరీ, ఖోర్ధా, మయూర్‌భంజ్, గంజాం, సుందర్‌గఢ్, రఘునాథ్‌పూర్ స్పోర్ట్స్ హాస్టల్, కొరాపుట్, జాజ్‌పూర్, నవరంగపూర్, కటక్, సంబల్‌పూర్, అనుగుల్, ఢెంకానాల్, బర్గఢ్, బాలేశ్వర్, భువనేశ్వర్, మల్కాన్‌గిరి, దేవగఢ్, భద్రక్ తదితర ప్రాంతాలకు చెందిన పురుషులు, మహిళా క్రీడాకారులు వివిధ అంశాల్లో పోటీపడుతున్నారు. ఇందులో 400, 800, 5000 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, పోల్‌వాల్ట్, జావెలిన్‌త్రో నిర్వహిస్తున్నారు. రెండురోజులు జరిగిన పోటీల్లో కేందుఝర్, జగత్సింగ్‌పూర్, ఒడిశా పోలీస్, జాజ్‌పూర్, సుందర్‌గఢ్ జిల్లాల క్రీడాకారులు వివిధ అంశాల్లో ముందంజలో నిలిచారు. తొలిరోజు నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులందజేశారు. క్రీడాశాఖ కార్యదర్శి సచిన్ యాదవ్, సంచాలకుడు విజయ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. క్రీడాంశాల విజేతలకు పతకాలు బహూకరించారు.

పరుగులో క్రీడాకారిణుల పోటీ

బిజద యువ ఉపాధ్యక్షులుగా కొరాపుట్ నేతలు

జయపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర బిజద యువ ఉపాధ్యక్షులుగా కొరాపుట్ జిల్లాకు చెందిన నలుగురు నేతలు ఎంపికైనట్లు పార్టీ ప్రకటించింది. ఉపాధ్యక్షులుగా శిల్పాపాణి, ఆదిత్య నందో, శంకర్ సౌంటా, సిని ఉపాధ్యక్షురాలిగా సస్మిత మెలక ఎంపిక కాగా, పలువురు బిజద సీనియర్ నేతలు వారికి అభినందనలు తెలియజేశారు. నవరంగపూర్ జిల్లాకు చెందిన అరుణ్ మిశ్ర ఉపాధ్యక్షుడిగా, సిలంపాడ్ పాత్ర్ సాధారణ కార్యదర్శిగా ఎంపికయ్యారు.

సస్మిత మెలక

శిల్పాపాణి

చదరంగం పోటీలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: గంజాం జిల్లా చదరంగం సంఘం (జీడీసీఏ) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఓపెన్ చదరంగం పోటీలు శనివారం జరిగాయి. స్థానిక అస్కారోడ్డులోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటైన పోటీని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేష్ ఠాకూర్, సమాజ సేవకుడు చిత్తరంజన్ సాహు అతిథులుగా హాజరై ప్రారంభించారు. మొత్తం ఏడు రౌండ్ల వారీగా నిర్వహిస్తున్న పోటీల్లో గంజాం, గజపతి జిల్లాల నుంచి మొత్తం 56 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో వివిధ వయసు కేటగిరీల్లో అండర్-13, 15, 17 బాలబాలికలు, సీనియర్ క్రీడాకారులు నువ్వా నేనా అన్నట్లు ఆడుతున్నారు. చీఫ్ ఆర్బిటర్ వినాయక్ పాత్ర, సోమనాథ్ బెహరా, గౌరచంద్ రెడ్డిలు పోటీలు పర్యవేక్షిస్తున్నారు. పోటీ అనంతరం ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులందజేస్తామని జీడీసీఏ కార్యదర్శి శేఖర్ 'న్యూస్‌టుడే'కు చెప్పారు.

చదరంగం ఆడుతున్న వివిధ కేటగిరీల క్రీడాకారులు

ముండాగుడ అడవిలో శివలింగం గుర్తింపు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా పపడహండి సమితి ముండాగుడ అడవిలో స్థానికులు శివలింగం గుర్తించారు. కాలిహాగుడ గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం కనిపించడంతో పలువురు భక్తులు అక్కడికి చేరుకుని, శుభ్రం చేసి పూజలు నిర్వహించారు.



పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పట్టణంలోని మహారాజ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1992 ఏడాది విద్యార్థులు పట్టణంలో సందడి చేశారు. వారంతా రాజుగారి కోట ప్రాంగణం నుంచి బ్యాండు వాద్యాల నడుమ ప్యాలెస్ వరకు డాన్స్ చేస్తూ వెళ్లి, ప్యాలెస్‌లో అందరూ ఒకరినొకరు పలకరించుకున్నారు. ఎన్నో ఏళ్ల అనంతరం కలిసిన వారంతా సందడి చేశారు.

వీధుల్లో సందడి చేస్తూ..

రాష్ట్ర అండర్-17 కబడ్డీ జట్టులో సూరజ్

సిమిలిగుడ, న్యూస్‌టుడే: రాష్ట్ర అండర్-17 కబడ్డీ జట్టుకు కొరాపుట్ జిల్లా నంద్‌పూర్ సమితికి చెందిన సూరజ్ పాండే ఎంపికయ్యారు. జనవరి 7 నుంచి 11 వరకు తెలంగాణలోని ఈదులవరంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఒడిశా జట్టుతో పాటు పాల్గొంటారు. ఆదివాసీ యువకుడు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడం విశేషమని పలువురు సూరజ్‌ను అభినందించారు.

సూరజ్

చారల జింకను కాపాడిన గ్రామస్థులు

రాయగడ పట్టణం: చెరువులో చిక్కుకున్న చారల జింకను గ్రామస్థులు కాపాడి అటవీ అధికారులకు అప్పగించిన ఘటన పూరీ జిల్లాలో శనివారం చోటు చేసుకుంది. అస్తరంగ అటవీ ప్రాంతంలో అరంగ గ్రామంలోకి జింక చొరబడింది. గ్రామ శివారులో ఉన్న చెరువులో దూకేయడంతో గ్రామస్థులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు అక్కడికి చేరుకుని జింకను స్వాధీనం చేసుకున్నారు. చికిత్స అనంతరం అటవీ ప్రాంతంలో విడిచిపెట్టనున్నట్లు వెల్లడించారు.

మిల్లెట్స్ వాడకాన్ని పెంచాలి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: మిల్లెట్స్ వాడకాన్ని పెంచాలని గనులు శాఖ డైరెక్టర్ సుదాన్సు మోహన్ సామల్ పిలుపునిచ్చారు. గనులు శాఖ డైరెక్టర్ సిమిలిగుడ సమితి రాజ్‌పుట్‌లోని మిల్లెట్స్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆదివారం ఉదయం సందర్శించారు. పాలనాధికారి మనోజ్ సత్యవాన్ మహాజన్, సిమిలిగుడ సమితి అభివృద్ధి అధికారి జాస్మిన్‌కుమార్ ప్రధాన్ పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న డైరెక్టర్ సుదాన్సుమోహన్

బండారి సంఘ కార్యవర్గ ఎంపిక

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం రెండో డైలీ మార్కెట్ సమీపంలో ఉన్న కార్యాలయంలో ఆదివారం బండారి సంఘ కార్యవర్గ ఎంపిక జరిగింది. ఎన్నికల అధికారి న్యాయవాది బిజయ్‌కుమార్ జెనా నేతృత్వంలో ఎన్నికలు జరగ్గా, అధ్యక్షుడుగా ఎన్.పోలిరాజు, ఎడిటర్‌గా టి.మహేష్, ఉపాధ్యక్షుడుగా కె.సంతోష్, కోశాధికారిగా వై.ప్రవీణ్ ఎంపికయ్యారు.


ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న అతిథులు

జిల్లాలో ఏడు ఏకలవ్య పాఠశాలలు

రాయగడ, న్యూస్‌టుడే: రాయగడ జిల్లాలో మరో ఏడు ఏకలవ్య ఆదర్శ విద్యాలయాలు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని భవానిపట్న నుంచి వచ్చిన రాజ్యసభ సభ్యుడు సుజీత్‌కుమార్ అన్నారు. శనివారం రాత్రి జీసీడీ క్రీడామైదానంలో జరిగిన చౌయితీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. కలెక్టర్ అశుతోష్ కులకర్ణి అధ్యక్షతన జరిగిన ఈ సభలో జడ్పీ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, జడ్పీ సీఈఓ అక్షయ్‌కుమార్ ఖెముండ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వృక్షమిత్ర ఈశ్వరరావును సత్కరిస్తున్న అతిథులు

కేసింగ జట్టు గెలుపు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక క్రీడా మైదానంలో కొనసాగుతున్న అటల్ బిహారీ వాజ్‌పేయి టీ-20 క్రికెట్ టోర్నీలో శనివారం జరిగిన డే అండ్ నైట్ మ్యాచ్‌లో కేసింగ జట్టు 31 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన కేసింగ నిర్ణీత 20 ఓవర్లలో 171 పరుగులు చేసింది. తరువాత బరిలోకి దిగిన సంబల్‌పూర్ డీసీఏ జట్టు 140 పరుగులు చేసి ఓటమి పాలైంది. కేసింగ క్రీడాకారుడు సుప్రియో 46 పరుగులు చేసి, 3 వికెట్లు తీసుకోవడంతో మ్యాన్ ఆఫ్‌ది మ్యాచు బహుమతి అందుకున్నారు.

సుప్రియోకు బహుమతి అందజేస్తున్న పాత్ర్, సన్యాసి జానీలు

ప్రభుత్వ న్యాయవాదుల నియామకం

రాయగడ, గుణుపురం, న్యూస్‌టుడే: గుణుపురంలో వివిధ న్యాయస్థానాల్లో పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఏపీపీ పోస్టుల్లో న్యాయవాదులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వంలో నలుగురికి అవకాశం రాగా, ఇప్పుడు మరో 9 మంది నియామకమయ్యారు.

ఆటపాటలతో వనవిహార్ యాత్ర

రాయగడ, న్యూస్‌టుడే: సాయిప్రియ వాకర్స్‌క్లబ్ వారు ఆదివారం బాకురుగుడ జిల్లా ఉద్యానవనంలో వన విహార యాత్ర జరిగింది. అధ్యక్షుడు కొల్లూరు సూర్యనారాయణ శర్మ, శుభాష్ బెహరా, డా.ఎం.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొని ఈ ఏడాదిలో చేసిన కార్యక్రమాలు వివరించారు. 2026కు నూతన కార్యవర్గ సభ్యులను ప్రకటించారు. ఉత్తమ సేవలు అందించిన సభ్యులను సత్కరించారు.

ఉత్తమ సేవా అవార్డు అందిస్తున్న శర్మ, బెహరా, కుమార్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

క్రీడాకారిణి జ్యోత్స్నకు ఘన స్వాగతం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా రాయగడ సమితి పేకాట గ్రామానికి చెందిన క్రీడాకారిణి జ్యోత్స్న సబర్ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ చేతుల మీదుగా రాష్ట్రీయ బాల్ పురస్కార్ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం స్వగ్రామానికి చేరుకున్న జ్యోత్స్నకు గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికి, ఊరేగింపు చేపట్టారు.

గ్రామస్థులతో క్రీడాకారిణి జ్యోత్స్న

విజయవంతంగా స్కౌట్స్, గైడ్స్ క్యాంప్

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: స్థానిక స్కౌట్స్ డెన్‌లో 22వ డిస్ట్రిక్ట్ సౌట్స్, గైడ్స్ క్యాంప్ శనివారం విజయవంతంగా ముగిసింది. ఇందులో పలు రైల్వే పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. క్యాంపులో ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్న విద్యార్థులకు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. డీఆర్ఎం లలిత్ మోహన్ పాండే పాల్గొన్నారు.

హిందువులపై అరాచకాలు సరికాదు

నవరంగపూర్, ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అరాచకాలు సరికాదని, కేంద్రప్రభుత్వం దీనిని వ్యతిరేకిస్తూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నవరంగపూర్, మిడ్నాపూర్ పట్టణంలో బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్తు సభ్యులు ఆదివారం ర్యాలీ నిర్వహించింది.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: గత పది రోజుల కిందట అదృశ్యమైన వ్యక్తి మృతదేహాన్ని ఎట్టకేలకు ఆదివారం పోలీసులు గుర్తించారు. సోన్‌పూర్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గులాపొడ గ్రామానికి చెందిన ప్రకాష్ మహంతి డిసెంబరు 18 నుంచి అదృశ్యమయ్యారు. దీనిపై ప్రకాష్ భార్య బొనిత పోలీసులకు ఫిర్యాదు చేస్తూ కొంతమందితో కలిసి ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన భర్త కనిపించకుండా పోయారని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు బింకా పోలీసుస్టేషన్ పరిధి గణేశ్‌పూర్ గ్రామ సమీపంలో ఓ పొలంలో ప్రకాష్ మృతదేహాన్ని గుర్తించారు. ఈ కేసుకు సంబంధించి నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. విచారణ కొనసాగుతోందని, పూర్తి వివరాలు తరువాత వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

ప్రకాష్ మహంతి

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నవరంగపూర్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ జయపురం ప్రైవేటు ఆసుపత్రిలో ఆదివారం మృతిచెందాడు. ఐఐసీ సచ్చీంద్ర ప్రధాన్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక కుంబార్‌సాహికి చెందిన శుభమ్‌దొర(19), ఆయన స్నేహితుడు 15 రోజుల కిందట జబాకనాడి మలుపు వద్ద అదుపు తప్పి బోల్తాపడ్డారు. శుభమ్ తీవ్రంగా గాయపడటంతో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. ఆదివారం మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పశ్చిమ మిడ్నాపూర్‌లోని మకంపూర్ గ్రామానికి చెందిన సుభాష్ ఘోరాయ్(38) శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ద్విచక్ర వాహనంపై లక్కన్‌నాథ్‌కి వెళుతుండగా 60వ నెంబర్ జాతీయ రహదారిపై జమునాపాల్సి వద్ద ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

నవరంగపూర్, న్యూస్‌టుడే: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నవరంగపూర్ జిల్లా డాబుగావ్ సమితి రాజ్‌పూర్ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సదాజానీ(38) ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తిరిగి వచ్చి ఆయనను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

రోడ్డుప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మాచ్‌ఖండ్, న్యూస్‌టుడే: రాణితోట పోలీస్ స్టేషన్ పరిధిలో మాలిపేట వద్ద ఫారం కోళ్లతో వస్తున్న లారీ ఈకో కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. రాణితోట ఏఎస్సై బలరాం హిక్కాక తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుంద్ర ప్రాంతానికి చెందిన కొందరు బొర్రా గుహలను సందర్శించడానికి బయలుదేరారు. ఆదివారం ఉదయం ఆంధ్ర నుంచి వస్తున్న కోళ్లలారీ, కారు ఢీకొన్నాయి. మంచు ఎక్కువగా ఉండటమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. కారు చోదకుడు, ఇద్దరి ప్రయాణికులకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కత్తితో బెదిరించి దోపిడీ

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే; కొడుకు ఇంట్లో లేని సమయం చూసి కొందరు దుండగులు ఓ ఇంట్లో చొరబడి వృద్ధురాలిని బెదిరించి 7 తులాల బంగారం, రూ.2,50,000 నగదును దోచుకున్న ఘటన పట్టణంలోని సాయిలక్ష్మీనగర్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణానికి ఆనుకోని ఉన్న సాయిలక్ష్మీనగర్‌లో నివాసముంటున్న పి.వాసు వాహన మరమ్మతులకై జేకేపూర్‌కు వెళ్లారు. బాగా ఆలస్యం కావడంతో రాత్రంతా అక్కడే ఉండాల్సి వచ్చింది. ఆ సమయంలో వృద్ధురాలైన తల్లి లక్ష్మీ ఒంటరిగా ఉంది. అర్ధరాత్రి సమయంలో ఐదుగురు దొంగలు ఇంట్లో ప్రవేశించి, ఎవరు అని అడిగే లోపు మారణాయుధాలు చూపించి భయపెట్టారు. తన ఒంటిలో ఉన్న నగలతో పాటు లారీ కోనేందుకు అప్పుగా తీసుకొచ్చిన నగదుని దోచుకున్నారు. వచ్చిన వారిలో ఒకడు తెలుగులో మాట్లాడుతున్నట్లు బాధితుడు తెలిపాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఐఐసి సాహు తెలిపారు. క్లూస్ టీంతో పాటు పోలీసు జాగిలాలతో గాలిస్తున్నారు. సమీపంలో ఉన్న రైలు లైను దాటి దొంగలు వెళ్లినట్లు జాగిలం ద్వారా తెలిసినట్లు పోలీసులు

దోపిడీ ముఠా అరెస్టు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: అంతర్ జిల్లా దోపిడీ ముఠాకు చెందిన ఎనిమిది మంది నిందితులను కేంద్రపడ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. జిల్లాలోని నికిరాయి స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో వరుస చోరీలు, దోపిడీ ఘటనలు చోటు చేసుకుంటున్నట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో నికిరాయి కేంద్రపడ టౌన్, బారి పోలీసుస్టేషన్ ఐఐసీల నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందం దర్యాప్తు ప్రారంభించాయి. ఈ కేసులకు సంబంధించి కేంద్రపడ, జాజ్‌పూర్ జిల్లాలకు చెందిన ఎస్.కె.ముస్తాఖుల్(30), షేక్ సాహిల్(25), షేక్ తన్వీర్(32), ఎస్.కె. నసూమ్(34), అబ్దుల్(30), అన్వర్(40), సౌరవ్ మిశ్ర(22), అక్షయకుమార్ పోథల్(53)ను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి కరిగించిన బంగారం, 555 గ్రాముల వెండి, రూ.14 వేల నగదు, నేరాలకు వినియోగిస్తున్న సామగ్రి, మోటారు సైకిల్, స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. కేంద్రపడ, జాజ్‌పూర్, భద్రక్, కటక్ జిల్లాల్లో పలు దొంగతనాల కేసుల్లో వీరి హస్తమున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు. తాజాగా డిసెంబరు 22న ధోళా గ్రామంలోని డొంబురుధర్ బారిక్ ఇంట్లో చొరబడి రూ.3.5 లక్షల విలువ చేసే బంగారు నగలు, రూ.30 వేల నగదును చోరీ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

స్వాధీనం చేసుకున్న సొత్తు

జయపురంలో హరియాణా పోలీసుల తనిఖీలు

జయపురం, న్యూస్‌టుడే: నాలుగేళ్ల కిందట నమోదైన గంజాయి కేసుకు సంబంధించి నిందితుడి గాలింపులో భాగంగా హరియాణా పోలీసులు జయపురం పట్టణంలో తనిఖీలు చేశారు. చేస్తున్నారు. స్థానిక ఐఐసీ ఉల్లాస్ చంద్రరౌత్ తెలిపిన వివరాల ప్రకారం.. 2021లో హరియాణా పోలీసులు క్వింటాల్ గంజాయి స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేశారు. ఆ గంజాయి జయపురానికి చెందిన యువకుడి వద్ద కొనుగోలు చేసినట్టు నిందితులు పేర్కొనడంతో ప్రధాన నిందితుడి కోసం పలుచోట్ల తనిఖీలు చేసినట్లు తెలిపారు.

సెల్‌టవర్ వద్ద మంటలు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం పరాబెడ ప్రాంతంలో ఉన్న శ్రీనగర్ కాలనీలో ఓ ఇంటిపైన ఉన్న ఓ సెల్ టవర్‌పై ఆదివారం మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపు చేశారు.

(c) eenadu

జోరుగా... హుషారుగా...

గరుగుబిల్లి మండలం తోటపల్లి జలాశయం పరిసరాలు ఆదివారం పర్యాటకులతో కళకళలాడాయి. సుంకి వద్ద ఐటీడీఏ ఉద్యాన క్షేత్రం, చిన్నారుల పార్కులో ఆటపాటలతో సందడి చేశారు. నాగావళిపై పెడల్, బోటుషికారుతో యువత కేరింతలు కొట్టారు. ప్రకృతి అందాలను వీక్షించారు. – న్యూస్‌టుడే, గరుగుబిల్లి గ్రామీణం

కేరళలా తోటపల్లి పర్యాటకం తీర్చిదిద్దాలి

ఐటీడీఏ ఉద్యోగులకు సూచనలు ఇస్తున్న కలెక్టరు ప్రభాకరరెడ్డి

గరుగుబిల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: తోటపల్లి జలాశయాన్ని కలెక్టరు ప్రభాకరరెడ్డి ఆదివారం సందర్శించారు. మండలంలోని సుంకి వద్ద ఐటీడీఏ ఉద్యాన క్షేత్రం, పార్కులను పరిశీలించారు. కేరళస్థాయిలో దీనికి గుర్తింపు తీసుకురావాలన్నారు. బోటుషికారుతో పాటు నాగావళి కుడి పిల్లకాలువలో పడవలు, ఈత కొట్టేందుకు కొలనులు, కాలువ గట్లపై ఉయ్యాలలు సిద్ధం చేయాలని సూచించారు. రానున్న కొత్త సంవత్సరం, సంక్రాంతి వేళల్లో ఆహ్లాదకరమైన వాతావరణంతో ఆకట్టుకునేలా ఉండాలన్నారు.

మరుభూమికి స్థలం కేటాయించండి

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: మండలంలోని చింతలబెలగాంలో 35 ఎస్సీ కుటుంబాల్లో ఉన్న 150 మంది దళితులకు శ్మశాన వాటిక లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుండాల చెరువు వద్ద ఉన్న సెంటు స్థలంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. నేడు అది తుప్పలతో నిండిఉందని వాపోతున్నారు. దీనిపై గతంలో పలుమార్లు రెవెన్యూ అధికారులకు వినతులు అందించారు. అప్పట్లో 3 సెంట్ల స్థలాన్ని కేటాయించిన ఇప్పటికీ అమలులోకి రాలేదు. రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి శ్మశాన వాటికకు స్థలం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్ఐ సీతారామరాజును వివరణ కోరగా విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లామని, చర్యలు తీసుకుంటామన్నారు.

అధ్వానంగా శ్మశాన వాటిక

మామిడిపల్లి సమస్యలు పరిష్కరించండి

సోంపేట, న్యూస్‌టుడే: మామిడిపల్లి పంచాయతీ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు రామకృష్ణ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ ఆర్.కోదండకృష్ణ కోరారు. ఆదివారం ఎంపీ క్యాంపు కార్యాలయంలో తెదేపా స్థానిక నాయకులతో కేంద్రమంత్రిని కలిసి సామాజిక భవనం, గ్రంథాలయం, ఆసుపత్రిలకు భవనాలు సమకూర్చాలని, లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలని విన్నవించుకున్నారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి హామీ ఇచ్చినట్లు కోదండకృష్ణ తెలిపారు.

పోటీ పరీక్షలతో ప్రతిభకు మెరుగులు

సోంపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, మరింత మెరుగులు దిద్దేందుకు పోటీ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని ఉత్తరాంధ్ర ఒడియా డీఐ డీపీ చౌదరి అన్నారు. ఆదివారం సోంపేటలో ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణిత ఉపాధ్యాయుల సహకారంతో జిల్లాస్థాయి ఒడియా గణిత ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఇందులో 13 మండలాల నుంచి 650 మంది 8, 9, 10 తరగతుల విద్యార్థులు హాజరయ్యారు. అపోటా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌పాడి, బృందావన్ దొళాయి, ఒడియా లాంగ్విస్టిక్ మైనార్టీ సంఘ అధ్యక్షుడు సత్యనారాయణ, బాపూజీ ఒడియా పారాగార్ అధ్యక్షుడు రఘునాథ గౌడ ఒడియా ఉపాధ్యాయులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాలు ఆవిష్కరిస్తున్న ఒడియా డీఐ డీపీ చౌదరి, ఇతర ప్రతినిధులు

క్రీడలతో మానసిక ఉల్లాసం...

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు స్నేహభావం ఏర్పడుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ఆదివారం మకరాంపురం క్రీడా మైదానంలో శ్రీవృక్ష, ఫిజిక్స్‌వాలా విద్యాసంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర టీ-20 క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాటింగ్ చేసి అలరించారు. మొదటి రోజు పాలకొండ, కల్లికోట(ఒడిశా) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కల్లికోట జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 140 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన పాలకొండ జట్టు 14.1 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 141 పరుగులు చేసింది. నాలుగు వికెట్లు తీసిన పాలకొండ జట్టుకు చెందిన నాని మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. మైదానం చుట్టూ రక్షణ గోడ ఏర్పాటుకు సహకరించాలని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శోభన్‌బాబు కోరారు. ఫిజిక్స్‌వాలా విద్యాసంస్థల రాష్ట్ర డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, శ్రీవృక్ష విద్యాసంస్థల అధినేత బి.రమణమూర్తి, టీవీ రమణ, బి.బోగేశ్, బి.తిలక్, బి.కామేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

మకరాంపురం క్రీడా మైదానంలో బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

గణితంపై ఆసక్తి పెంచాలి

సాలూరు, న్యూస్‌టుడే: విద్యార్థులలో గణితం పట్ల భయాన్ని పోగొట్టి ఆసక్తి పెంపొందించేలా యూసీమాస్ గణిత తరగతులు నిర్వహించడం అభినందనీయమని విశ్రాంత ఎస్పీ ఉప్పాడ రవిప్రకాష్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఆర్యవైశ్య ధర్మశాలలో యూసీమాస్ ఎనిమిదో వార్షికోత్సవం నిర్వహించారు. డాక్టర్ ద్రాక్షాయణి, జె. ఈశ్వరరావు, కె. రామ్మూర్తి, ఎం. స్వప్న, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశానికి భవిత

సాలూరు, న్యూస్‌టుడే: కాంగ్రెస్‌తో దేశంలో సుపరిపాలన సాగడమే కాకుండా దేశాభివృద్ధికి అడుగులు పడ్డాయని పార్టీ నాయకుడు జి. రామకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. సీనియర్ నేత శిగడాపు బంగారయ్యను సత్కరించారు. డి. పుండరీకాక్షయ్య, బుచ్చయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తితో కందికొత్తలు

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: ఏటా డిసెంబరు చివరి వారంలో గిరిజనులు నిర్వహించే కందికొత్తలు పండగను ఈ ఏడాది సంప్రదాయ పద్ధతిలో జరుపుకున్నారు. ఈమేరకు ఆదివారం మండలంలో టీకేజమ్ము, పీటీమండ, కొండచిలకాం, అలమండ పంచాయతీల్లోని గ్రామాల్లో ఊరేగుతూ గొడ్లమ్మ, జాకారమ్మ, సత్తెమ్మను స్మరిస్తూ నృత్యాలు చేస్తూ పూజలు జరిపారు. యువత, మహిళలు పాల్గొన్నారు.

టీకేజమ్ములో గొడ్లమ్మ ఊరేగింపు

అంగరంగ వైభవంగా హిందూ సమ్మేళనం

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట మండలం అమ్మవలస గిరిజన గ్రామ రామాలయం ఆవరణలో ఆర్‌ఎస్‌ఎస్ వంద వసంతాలు పురస్కరించుకుని ఆదివారం అంగరంగ వైభవంగా హిందూ సమ్మేళనం హిందూ బంధువుల కలయిక పేరున నిర్వహించారు. గ్రామ గిరిజన యువతులు, మహిళలు కోలాటం ఆడుతూ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ హిందూ తత్వంపై ప్రచారం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యవాహ రాజశేఖర్, కృష్ణాజీ, సుదర్శనరావు, గోపి తదితరులు మాట్లాడారు. నిర్వాహకులు ముత్యాలు గ్రామస్థులు పాల్గొన్నారు.

కోలాటంలో గిరిజన యువతులు, మహిళలు

సొండికుల కార్యవర్గ ఎంపిక

సొండికుల కంచిలి మండల సామాజిక వర్గం కార్యవర్గాన్ని ఆదివారం ఆ సామాజికవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాహుకారి రామారావు, ఉపాధ్యక్షుడిగా లాభాల డిల్లీరావు, కార్యదర్శిగా నల్లని జోగేశ్వరరావు, సహాయక కార్యదర్శిగా ఎస్.అనిల్, కోశాధికారి ఆర్.ఉపేంద్ర, సేనాపతి రుషి, కన్వీనర్లుగా ఆర్.ప్రవీణ్, ఆర్.వెంకటరావు, ఎన్.రవి ఎంపికయ్యారు. సామాజిక వర్గ అభివృద్ధికి కృషి చేస్తామని కార్యవర్గ సభ్యులు తెలిపారు. – న్యూస్‌టుడే, కంచిలి

మృతులకు నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్, స్నేహితులు

పూర్వ విద్యార్థుల ఔదార్యం అభినందనీయం

సోంపేట, న్యూస్‌టుడే: వైద్య సేవలు అందుకోలేక తమ స్నేహితులు మృత్యువాత పడిన నేపథ్యంలో పూర్వ విద్యార్థులు చేపట్టిన మెగా వైద్యశిబిరం ఆదర్శనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. సోంపేట ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో 1995-96లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 388 మంది సేవలందుకున్నారు. ప్రభుత్వ విప్ శిబిరాన్ని ప్రారంభిస్తూ యువత సేవాదృక్పథంతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. వైద్య నిపుణులు ఎం.ఫణీంద్ర, పి.దుర్యోధన, టి.వెంకటేశ్, కె.నాగేంద్ర, బి.వెంకటసూర్యమాణిక్యం తదితరులు సేవలందించారు. అనారోగ్యంతో మృతి చెందిన 9 మంది స్నేహితులకు నివాళులర్పించారు. ఎంపీపీ ఎన్.దాసు, జడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు శ్రీను, చంద్రమోహన్, కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కవిటి తీరంలో సందడి

ఈ ఏడాదికి చివరి ఆదివారం కావడంతో కవిటి బీచ్ సందర్శకులతో కళకళలాడింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి సందర్శకులు వచ్చి తీరంలో సందడి చేశారు. సందర్శకులు సరుగుడు తోటల్లో వంటలు చేసి సామూహిక భోజనాలు అనంతరం తీరంలో సేదతీరారు. అలలతో ఆహ్లాదంగా గడిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

ఆదిత్య దర్శనం.. మరింత సులభతరం..!

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి క్షేత్రంలో ఆదిత్యుని దర్శనంతో పాటు ఆర్జిత సేవలను పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. భక్తుల సౌకర్యార్థం శీఘ్రదర్శనం నుంచి ప్రత్యేక పూజలు, వసతి గదులు, ప్రసాదాలు తదితర సేవలన్నీ ఆన్‌లైన్‌లో పొందే వెసులుబాటు కల్పించింది.

మన మిత్రలోనూ అవకాశం..

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'మన మిత్ర' యాప్(ఈ గవర్నెన్స్) ద్వారా కూడా ఈ సేవలు పొందొచ్చు. భక్తులు తమ వాట్సప్ నుంచి 95523 00009 నంబరుకు హాయ్ అని మెసేజ్ పెడితే ప్రభుత్వ సేవల వివరాలు వస్తాయి. అందులో ఆలయాలకు సంబంధించిన అంశంపై క్లిక్ చేసి.. శ్రీసూర్యనారాయణస్వామి ఆలయాన్ని సెలెక్ట్ చేసుకుని నచ్చిన సేవలను బుక్ చేసుకోవచ్చు.

ముందుగా ఏం చేయాలంటే..

- భక్తులు www.aptemples.ap.gov.in , www.aptemples.org వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి.
- సెర్చ్ ఆప్షన్‌లో అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయం పేరు నమోదు చేస్తే వివరాలు కనిపిస్తాయి.
- ఆ తర్వాత పిల్‌గ్రిమ్ సర్వీసెస్‌ను ఎంచుకుంటే సేవలు, దర్శనం, వసతి, విరాళాల వివరాలు కనిపిస్తాయి.

అంతరాలయ దర్శనంతో పాటు ప్రతి నెల మాస సంక్రమణం రోజున జరిపే క్షీరాభిషేకం, శుద్ధ ఉపవాస ఏకాదశి నాడు నిర్వహించే కల్యాణం, అష్టోత్తర శతనామావళి, క్షీరాభిషేకం, సహస్ర నామార్చన, సూర్యనమస్కార సేవలు, వసతి గదులు, ప్రసాదాలను ఆన్‌లైన్‌లో ముందుగానే బుక్ చేసుకోవచ్చు.

- స్వయంగా ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోలేని వారి కోసం ఆలయం లోనూ నమోదు చేసే అవకాశం కల్పించామని, భక్తులను అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈవో కె.ఎన్.వి.డి.వి. ప్రసాద్ కోరారు.
- వాట్సప్‌లో అవసరమైన దానిపై క్లిక్ చేసి.. సేవలను బుక్ చేసుకోవచ్చు. దీనికి మొబైల్ నంబరుతో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది.
- నిత్యాన్నదానం, గో సంరక్షణ, శాశ్వత అన్నదానం, ఆలయ అభివృద్ధికి విరాళాలు అందించొచ్చు

https://www.srisuryatemple.com వెబ్‌సైట్ ద్వారా కూడా సేవలు పొందవచ్చు. క్షేత్ర సమాచారం, ఇతర వివరాలు తెలుసుకోవచ్చు.

వినూత్నం.. ఆదర్శం..

వివిధ విభాగాల్లో సత్తా చాటుతున్న ఎంఎస్‌పల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు

– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధించి అత్యధిక మార్కులు సాధించేలా చేయడమే కాదు.. వారికి ఆసక్తి ఉన్న విభాగాల్లో శిక్షణ కూడా ఇవ్వాలి. అప్పుడే అది పరిపూర్ణ పాఠశాల అవుతుంది. ప్రస్తుతం చాలా పాఠశాలల్లో కేవలం చదువు చెబుతున్నారు.. మిగతావి నేర్చుకోవాలంటే శిక్షణ కేంద్రాలకు వెళ్లాల్సిందే.. కానీ కంచిలి మండలం ఎంఎస్‌పల్లి ఆదర్శ పాఠశాలలో వివిధ విభాగాల్లో తర్ఫీదు ఇస్తుండటంతో ఇక్కడి విద్యార్థులు ఓ వైపు చదువులో రాణిస్తూనే మరో వైపు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు.

కెరీర్ గైడెన్స్ విభాగంలో బహుమతులు అందుకుంటున్న ఆదర్శపాఠశాల విద్యార్థులు

సాధించిన విజయాలు

★ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన విద్యార్థుల మాక్ అసెంబ్లీకి ఇచ్ఛాపురం నియోజకవర్గం తరఫున ఈ పాఠశాలకు చెందిన ఆరాధ్య పాత్రో ఎంపికైంది.

★ గణిత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి గణిత పోటీల్లో జూనియర్స్ విభాగంలో టి.బాలు, ఎన్.పుష్పక్, సీనియర్స్ విభాగంలో షర్మిళ, సిరి ద్వితీయ స్థానంలో నిలిచి సత్తా చాటారు.

★ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి నైపుణ్య పోటీల్లో ఐటీ విభాగంలో పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ప్రథమ స్థానం కైవసం చేసుకుని ఈనెల 29న అమరావతిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

★ ఇటీవల విజయవాడలో జరిగిన కళాఉత్సవ్ జిల్లా స్థాయి పోటీల్లో 2-డీ (విజువల్ ఆర్ట్) విభాగంలో పాఠశాలకు చెందిన ఏపూరి జానకి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.

★ ఈనెల 22న శ్రీకాకుళంలో నిర్వహించిన జిల్లా స్థాయి కెరీర్ గైడెన్స్ పోటీల్లో పోస్టర్ మేకింగ్ విభాగంలో పాఠశాలకు చెందిన జె.సిరి, ఎల్. ప్రియదర్శిని ద్వితీయ బహుమతి పొంది, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఫ్యాషన్ డిజైనర్‌గా స్థిరపడతా..

మా పాఠశాలలో ఉపాధ్యాయులు అందిస్తున్న ప్రోత్సాహంతో వివిధ విభాగాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ ప్రదర్శించే అవకాశం మాకు లభిస్తోంది. డ్రాయింగ్‌ను కొనసాగిస్తూ భవిష్యత్తులో మంచి ఫ్యాషన్ డిజైనర్‌గా స్థిరపడాలనేది నా లక్ష్యం. – ఏపూరి జానకి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం

పనులు కావు.. సేవలందవు..

కవిటి మండలం లండారిపుట్టుగలో వైకాపా హయాంలో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో రైతు సేవా కేంద్రాన్ని సచివాలయంలోనే నిర్వహిస్తున్నారు. సేవలందించేందుకు ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సోంపేట ఏడీఏ భవానీ శంకర్‌ను వివరణ కోరగా నిధులు రాగానే నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

ఇలాగైతే రోగాలు రావా..

తేలుకుంచిలో మంచి నీటి కుళాయి పక్కనే ఉన్న కాలువ మురుగుతో దర్శనమిస్తోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోందని, నీటిని సేకరించలేకపోతున్నామని స్థానిక మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కె.కల్పనను వివరణ కోరగా మురుగు తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

కానరాని మరమ్మతులు

పాతటెక్కలిలో 100 ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగి ఉన్న పెద్దచెరువు నుంచి దిగువ భూములకు నీరు వదిలే మదుములు పలు చోట్ల పాడయ్యాయి. ప్రస్తుతం చెరువు నీటితో నిండుగా ఉండటంతో రెండో పంటకు రైతులు సమాయత్తమవుతున్నారు. మదుములు మరమ్మతులకు గురవ్వడంతో నీరు వృథాగా పోతోందని వాపోతున్నారు. దీనిపై శాఖ ఏఈ భాస్కర్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

రాకపోకలెలా..?

వీధి మధ్యలో ఎత్తుగా గట్టు.. ఎటు వెళ్లాలన్నా అది దాటాల్సిందే.. ఈ పరిస్థితి కస్బా బొబ్బిలివీధి సమీపంలో ఉంది. పాత నివాస ప్రాంతాలన్నీ చిన్న చిన్న సందులతో ఉన్నాయి. దీంతో విశాలంగా ఉన్న వీధిలో కాలువలు నిర్మించి, వాటికి గొట్టాలు అనుసంధానం చేశారు. గొట్టాలు పెద్దవి కావడంతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. సమస్యపై అధ్యయనం చేసి, ప్రతిపాదనలు చేస్తామని పుర ఏఈ వీరకిశోర్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

రక్షణ కరవు..

గంగాధరపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రక్షణ గోడ లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల రహదారికి ఆనుకుని ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ గోడ నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంఈవో2 వద్ద ప్రస్తావించగా సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

ఆటంటే ఇష్టం... ఆడాలంటేనే కష్టం

★ ఇండోర్ స్టేడియం లేక క్రీడాకారుల ఇక్కట్లు

– న్యూస్‌టుడే, పలాస, కాశీబుగ్గ

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో షటిల్ బ్యాడ్మింటన్ ఆడాలంటే ఇక్కట్లు తప్పడం లేదు. పిల్లల నుంచి పెద్దల వరకు ఆటపై ఆసక్తి ఉన్నా ఆడేందుకు ఇండోర్ స్టేడియం లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో ఆరుబయటే ఆడుకోవాల్సి వస్తోందని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్ మూత.. ఆరుబయటే శిక్షణ

పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లోని బ్యాడ్మింటన్ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు రైల్వేకాలనీలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఉండేది. దీంతో జంట పట్టణాలతోపాటు సోంపేట వంటి ప్రాంతాల నుంచి క్రీడాకారులు ఇక్కడికి వచ్చి శిక్షణ పొందేవారు. దాన్ని కల్యాణమండపంగా మార్చడంతో క్రీడాకారులకు ఇబ్బందులు మొదలయ్యాయి. ఖాళీ ప్రదేశాల్లో పరదాలు కట్టుకుని ఉదయం, సాయంత్రం నానా అవస్థలు పడుతూ ఆడాల్సి వస్తోంది. మెరుగైన శిక్షణ కోసం సోంపేటకు వెళ్లాల్సి వస్తోందని క్రీడాకారులు వాపోతున్నారు.

కాశీబుగ్గలో పరదాల చాటున బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

అసంపూర్తిగా నిలిచింది..

జంట పట్టణాల్లో చాలా మంది క్రీడాకారులు జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రాణిస్తూ రాష్ట్రస్థాయిలో ఒత్తిడి తట్టుకోలేక వెనకబడి పోతున్నారు. దీంతో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం ఆవరణలో రూ.2కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి 2018లో పునాది పడింది. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇండోర్ స్టేడియం పనులు పరిశీలించి, క్రీడాకారులకు అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని డీఎస్‌డీవో మహేష్ తెలిపారు.

కోదండరామునికి... కొత్త ఆలయం!

పాలకొండ పట్టణంలోని ముదునూరువారి వీధిలో ఉన్న కోదండరాముని ఆలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో నూతన భవనం నిర్మించనున్నారు. 1932లో నిర్మించిన ఆలయం పూర్తిగా పాడైంది. దీంతో నూతన ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ చొరవతో తొలివిడతలో నిధులు మంజూరయ్యాయి. రూ.70 లక్షలు అవసరం కాగా, ప్రభుత్వం రూ.56 లక్షలు నిధులు విడుదల చేస్తోంది. మిగిలిన నిధులకు మ్యాచింగ్ గ్రాంటును చెల్లించాల్సి ఉంది. దీంతో స్థానికులు మ్యాచింగ్ గ్రాంటు కోసం విరాళాలు పోగు చేస్తున్నారు. దీనికి సంబంధించి ప్రత్యేక కమిటీని భక్తులే ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రావాలంటే ముందుగా మ్యాచింగ్ గ్రాంటును చెల్లించాల్సి ఉంది. త్వరలో ఆలయం నిర్మాణం కానుంది. న్యూస్‌టుడే, పాలకొండ

గంజాయి పట్టివేత

ఆర్కేపురం, న్యూస్‌టుడే: ఒడిశా రాష్ట్రం నుంచి కొందరు గంజాయిని హైదరాబాద్ తీసుకొచ్చారనే సమాచారం మేరకు తెలంగాణలో హైదరాబాద్‌లోని ఎస్టీఎఫ్-సీ టీం సీఐ వెంకటేశ్వర్లు సరూర్‌నగర్ ఆబ్కారీ స్టేషన్ పరిధి హుడా కాలనీలో దాడులు నిర్వహించారు. ఒడిశాకు చెందిన బెహన్ దూరే, జగన్నాథ్ డాల్, సరోజ్‌జలారి గంజాయితో పట్టుబడ్డారు. వారి నుంచి 6.3 కిలోల సరకు స్వాధీనం చేసుకుని సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. ముగ్గురిని అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నామని సరూర్‌నగర్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

విజయకాంత్ సమాధికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎడప్పాడి పళనిసామి, ప్రేమలత, ఎల్.కె.సుధీష్, విజయ ప్రభాకరన్, షణ్ముగ పాండియన్ తదితరులు

ఘనంగా విజయకాంత్ గురుపూజ

చెన్నై, న్యూస్‌టుడే: డీఎండీకే వ్యవస్థాపకుడు, నటుడు దివంగత విజయకాంత్ రెండో వర్ధంతి(గురుపూజ) ఆదివారం ఘనంగా జరిగింది. ఆయన సమాధికి సినీ, రాజకీయ ప్రముఖులు పలువురు పుష్పాంజలి ఘటించారు. కోయంబేడులోని డీఎండీకే ప్రధాన కార్యాలయంలో ఉన్న ఆయన సమాధి వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కార్యాలయం సమీపం నుంచి విజయకాంత్ సమాధి వరకు పార్టీ ప్రధానకార్యదర్శి ప్రేమలత ఆధ్వర్యంలో కార్యకర్తలు, నిర్వాహకులు ఊరేగింపు నిర్వహించారు. ఇందులో కోశాధికారి ఎల్.కె.సుధీష్, కార్యదర్శి పార్థసారథి, విజయకాంత్ కుమారులైన యువజన విభాగ కార్యదర్శి విజయ ప్రభాకరన్, నటుడు షణ్ముగ పాండియన్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ ప్రధాన కార్యాలయం వద్దకు చేరుకున్న తర్వాత అక్కడి విజయకాంత్ విగ్రహానికి ప్రేమలత పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అన్నాడీఎంకే ప్రధానకార్యదర్శి ఎడప్పాడి పళనిసామి తదితరులు అంజలి ఘటించారు.

కోవైలో పైవంతెనకు సి.సుబ్రమణియం పేరు: స్టాలిన్ ప్రకటన

చెన్నై, న్యూస్‌టుడే: కోయంబత్తూరులోని పైవంతెనకు కేంద్ర మాజీ మంత్రి సి.సుబ్రమణియం పేరును పెడుతున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఆయన తన 'ఎక్స్'లో.. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి దేశప్రజల ఆకలిని పోగొట్టే హరిత విప్లవానికి భారతరత్న సి.సుబ్రమణియం నాంది పలికారన్నారు. ఆయన కీర్తిని వ్యాపింపచేయాలన్న డాక్టర్ కృష్ణరాజ్ వానవరాయర్ అభ్యర్థన మేరకు కోయంబత్తూర్‌లోని ఆత్తుపాలం నుంచి ఉక్కడం జంక్షన్ ఐన్‌స్టీన్ వీధి వరకు ఉన్న పైవంతెనకు సి.సుబ్రమణియం పేరును పెట్టే ప్రకటనను అందరితోనూ పంచుకున్నట్లు పేర్కొన్నారు.

'నలం కాక్కుం' శిబిరాలతో 13లక్షల మందికి లబ్ధి

చెన్నై: నలం కాక్కుం స్టాలిన్ పథకం శిబిరాల ద్వారా ఇప్పటివరకు 13లక్షల మంది లబ్ధిపొందినట్టు ముఖ్యమంత్రి స్టాలిన్ తన 'ఎక్స్' పేజీలో వెల్లడించారు. ఫుల్ బాడీ హెల్త్ చెకప్, ప్రత్యేక వైద్యుల సూచనల ద్వారా ప్రారంభంలోనే లక్షలాది మంది ఆరోగ్య సమస్యలను గుర్తించి తగిన ఉన్నత చికిత్సలకు ప్రతిపాదించి వారి ప్రాణాలను కాపాడామన్నారు. శిబిరాల్లోనే ముఖ్యమంత్రి సమగ్ర ఆరోగ్య బీమా పథకంలో చేర్చి ప్రజల దుఃఖాన్ని పోగొట్టామన్నారు. మేలు పొందిన కుటుంబాల కృతజ్ఞతలతో 'నలం కాక్కుం స్టాలిన్' కొనసాగుతోందని తెలిపారు.

నూతన సంవత్సర వేడుకలకు ఆంక్షలు

ప్యారిస్, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాది వేడుకలను పురస్కరించుకుని చెన్నైలోని స్టార్ హోటళ్లకు పోలీసులు ఆంక్షలు విధించారు. కొత్త సంవత్సర వేడుకల నిర్వహణకోసం చెన్నైలోని స్టార్ హోటళ్లలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. డిసెంబరు 31వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి మరుసటి రోజు తెల్లవారుజామున ఒంటి గంట వరకు పలు ప్రాంతాల్లో జరిగే వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. హోటళ్లు, స్టార్ హోటళ్లు మొదలైన చోట్లకు వచ్చే వాహనాలను పూర్తిగా తనిఖీ చేసి, అన్ని ప్రవేశమార్గాల్లో, కార్యక్రమాలు, విందులు జరిగే చోట సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని సూచించారు.

అనుమతులు తప్పనిసరి

అదేవిధంగా వినోద వేదికలు ఏర్పాటు చేసే అగ్నిమాపక సిబ్బంది మొదలైన శాఖల నుంచి తగిన అనుమతులు పొందాలని, అనుమతిచ్చిన చోట మాత్రమే వేదికలు జరపాలని తెలిపారు. అదేవిధంగా వాహనాలను ఆయా హోటళ్లలో మాత్రమే పార్క్ చేయాలని, ఏ కారణం చేతైనా రోడ్లపై వాహనాలను నిలుపకూడదని చెప్పారు. ఆహారం తీసుకోవడం, మద్యం తాగడం తదితరాలు తెల్లవారుజామున ఒంటి గంటలోపు పూర్తి చేయాలని, పోలీసులు విధించే సమయ పరిమితిని కచ్చితంగా పాటించాలని తెలిపారు. వినోద కార్యక్రమాల్లో భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా మహిళా భద్రతా సిబ్బందిని నియమించాలన్నారు. ప్రాంగణంలో పల బాణసంచా కాల్చకూడదన్నారు. ఆంక్షలు ఉల్లంఘించే హోటళ్లపై కఠిన చర్యలు చేపడతారని హెచ్చరించారు. స్టార్ హోటళ్లు మాత్రమే కాకుండా చెన్నైలో మెరీనా బీచ్, ఎలియట్స్ బీచ్, ఈస్ట్‌కోస్ట్ రోడ్, రాజీవ్‌గాంధీ సాలై మొదలైన చోట్ల పటిష్ట పోలీసు భద్రతను ఏర్పాటు చేశారు.

నీలగిరి అటవీ ప్రాంతంలో...

విళివాక్కం: నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవడానికి నీలగిరి జిల్లాకు పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తుంటారు. అందులో చాలామంది అడవి పరిధిలో వెళ్లి మంటలు వేసి, కోడిని, మద్యం సేవించడం, పాటలు పాడుతూ నృత్యాలు చేయడం వంటివి చేస్తుంటారు. ఇలాంటి కార్యకలాపాలను నివారించడానికి అటవీశాఖ చర్యలు చేపట్టింది. ముదుమలై పులుల అభయారణ్యంలో భాగమైన సింగార, మాయారు, మసినకుడి, సిరియూర్, బొక్కపురం అటవీ ప్రాంతాల్లో లాడ్జీలున్నాయి. ఇక్కడ పెద్ద శబ్దం వచ్చే బాణసంచా పేల్చడం, రాకెట్‌లు వదలడానికి అటవీశాఖ నిషేధం విధించింది.

విక్టోరియా హాలు వీక్షించొద్దామా!

- అబ్బురపరుస్తున్న కళాఖండాలు, ఇతర ప్రదర్శనలు
- పూర్వ కళాకృతి దెబ్బతినకుండా పునరుద్ధరణ

విక్టోరియా పబ్లిక్ హాల్.. చెన్నై మహానగరానికే గర్వకారణంగా నిలిచిన భవనం. పాత కట్టడం కళాకృతి చెక్కుచెదరకుండా ఆధునిక హంగులతో పునర్నిర్మించిన ఈ భవంతిని తాజాగా ముఖ్యమంత్రి స్టాలిన్ పునఃప్రారంభించారు. ఆనాటి పాత జ్ఞాపకాల్ని, చారిత్రక ఘట్టాల్ని గుర్తుచేసే ఈ అద్భుత భవన సౌందర్యాన్ని వీక్షించేందుకు నగరవాసులకు అవకాశం కల్పించారు. **- ఈనాడు-చెన్నై**

హాలులో రాజసం ఉట్టిపడేలా లోపలిభాగం

సందర్శన వేళలు

- **మంగళవారం:** సెలవు
- **మిగిలిన రోజుల్లో:** ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6గంటల మధ్య
- సందర్శకుల కోసం అందుబాటులో కెఫే

టికెట్ ధర..
- ప్రస్తుతానికి ఉచితం
- గైడ్‌లు దగ్గరుండి భవనం గురించి వివరిస్తారు

ఈ అపూర్వ కట్టడాన్ని 1880-87లో నిర్మించారు. మద్రాస్‌లోని తొలి టౌన్‌హాల్ ఇదే. క్వీన్ విక్టోరియా జ్ఞాపకార్థం దీన్ని నిర్మించగా.. విక్టోరియా పబ్లిక్ హాల్‌గా పేరుగాంచింది. ఇప్పుడిది ప్రజా విడిది ప్రాంతంగా, ప్రజా వేడుకల వేదికగా మారుతోంది.

అప్పట్లో వినియోగం ఇలా..

- బ్రిటిష్ కాలంలో ఇక్కడ సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సమాలోచన సమావేశాలు, కళాకారుల ప్రదర్శనలు జరిగేవి.
- ఈ హాల్‌లో పెద్ద తెరను ఏర్పాటుచేసి సినిమాలను ప్రదర్శించేవారు. వేదిక ద్వారా డ్రామాలు వేయించేవారు.
- చాలా సందర్భాల్లో ఇక్కడి వేదిక సంగీత కచేరీలతో మారుమోగిపోయేది. పాటలు, నృత్యాలు, వివిధ రకాల వాయిద్యాలు.. చూసేందుకు ఆ వాతావరణం ఆహ్లాదంగా ఉండేది.
- ఇండోర్ ఆటల పోటీలు సైతం ఇక్కడి భవనంలో నిర్వహించేవారు. టెన్నిస్, క్యారమ్, బిలియర్డ్స్ లాంటివి జరిగేవి.

ప్రముఖుల ప్రసంగాలు.. ఈ భవనంలో స్వాతంత్ర్య సమరయోధులు, ఇతర ప్రముఖులు వచ్చి ప్రసంగాలు చేసిన సందర్భాలున్నాయి. మహాత్మా గాంధీ, స్వామి వివేకానంద, భారతియార్ లాంటి ప్రముఖులు ఇక్కడికొచ్చి తమ సందేశాల్ని వినిపించారు.

జస్టిస్ పార్టీ ఆవిర్భావానికి బీజం

తమిళనాడు రాజకీయ ప్రభంజనానికి ఈ విక్టోరియా హాల్లోనే బీజం పడిందని చరిత్రకారులు చెబుతున్నారు. రాష్ట్రంలో జస్టిస్ పార్టీ రాకకు ఇక్కడి నుంచే నిర్ణయం తీసుకున్నారని అంటారు. ఈ పార్టీ నుంచే వచ్చిన డీఎంకే, అన్నాడీఎంకే పక్షాలు తమిళనాడు రాజకీయాల్ని శాసిస్తున్నాయి. సింగార చెన్నై పథకంలో భాగంగా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఈ విక్టోరియా పబ్లిక్ హాల్‌ను అత్యంత సుందరంగా, పూర్వ వైభవం ఉట్టిపడేలా, అత్యాధునిక హంగులతో, కళ్లు చెదిరే వెలుగులతో తీర్చిదిద్దారు. ఇందుకోసం రూ.32.62కోట్లను ఖర్చుచేసింది.

ప్రత్యేక ప్రదర్శనలు

- ఈ భవనం కిందిభాగంలో పలు ఆకట్టుకునే ప్రదర్శనలు ఉంచారు. విక్టోరియా హాల్ చరిత్ర, ఎవరు నిర్మించారు, గుత్తేదార్ల వివరాలు, ఇక్కడికి విచ్చేసిన నేతలు, జస్టిస్ పార్టీ పుట్టుక, పూర్వం ఇక్కడ ప్రదర్శితమైన సినిమాలు, క్రీడలు తదితరాల చిత్రమాలికల్ని వేర్వేరు గ్యాలరీల్లో చూడొచ్చు.
- ఆవరణలో ఆనాటి ట్రామ్ కార్, కళాఖండాల ప్రదర్శన, పాత మద్రాస్ జ్ఞాపకాల్ని ప్రదర్శిస్తున్నారు.
- విక్టోరియా హాల్‌లో ప్రత్యేకించి సెల్ఫీ పాయింట్‌ను రూపొందించారు. బకింగ్‌హామ్ కాలువలో పడవ ప్రయాణం, పాత స్కూటర్లు, రిక్షాలు లాంటివాటితో ఫొటోలు దిగొచ్చు.

ఒకసారి 60మంది

భవనంలోకి బృందంగా 60మందిని పంపిస్తారు. అంతకు మించితే లోపల చెక్కతో చేసిన మెట్లు దెబ్బతింటాయని చెబుతున్నారు. సహజంగా ఉండేలా ఆకాలం లాగే ఇప్పుడు కూడా చెక్కతో చేసిన మెట్లనే ఉంచారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, సంస్థలు, కార్పొరేట్ ఉద్యోగులు ఇలా ఎవరైనా బృందంగా విక్టోరియా హాల్‌ను చూడాలనుకుంటే వారికోసం ప్రత్యేక ఏర్పాట్లను జీసీసీ చేస్తోంది. ముందస్తు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డులు తప్పనిసరి.

వేడుకలకూ అవకాశం

పూర్వం తరహాలోనే ఈ హాల్‌లో వేడుకలు జరుపుకొనేలా, సభలు, సమావేశాలు, ఇతరత్రా కళల ప్రదర్శనకు అవకాశాలిచ్చేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీనికి జీసీసీ నుంచి ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

'మన్ కీ బాత్'తో ప్రజల మనసులు గెలిచిన ప్రధాని

సైదాపేట, న్యూస్‌టుడే: 'మన్‌కీ బాత్' కార్యక్రమంతో తమిళనాడు ప్రజల మనసును ప్రధాని నరేంద్ర మోదీ గెలుచుకున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ తెలిపారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ప్రధాని ప్రతి నెలా చివరిలో మన్‌కీ బాత్ కార్యక్రమం ద్వారా దేశ ప్రజలతో మాట్లాడుతున్నారని, ఆదివారం జరిగిన కార్యక్రమంలో తమిళ జాతి గొప్పదనాన్ని మరోసారి ప్రపంచానికి తెలియజేశారని తెలిపారు. 'తమిళం నేర్చుకుందాం' అనే ఇతివృత్తంతో జరిగిన కాశీ తమిళ సంగమంలో వారణాసిలోని 50కి పైగా పాఠశాలల్లో ప్రత్యేక తమిళ తరగతులు జరిగాయని తెలిపిన ప్రధాని.. దేశంలోని ఇతర ప్రాంతాల్లోని యువకులు, పిల్లలు తమిళ భాషపై ఆసక్తి చూపటం సంతోషంగా ఉందన్నారని చెప్పారు. అదేవిధంగా ఫిజి దేశంలో ఓ పాఠశాలలో పిల్లలు తమిళంలో కవితలు చదివి, మాట్లాడటాన్ని చాలా గొప్పగా ప్రజలతో ప్రధాని పంచుకున్నారని తెలిపారు. అవకాశం వచ్చినప్పుడల్లా ప్రధాని తమిళం గొప్పదనాన్ని చాటి చెబుతున్నారని పేర్కొన్నారు.

31న అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం

సైదాపేట, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం ఈనెల 31న జరుగనుంది. ఇందుకు సంబంధించి పార్టీ అధిష్ఠానం విడుదల చేసిన ప్రకటనలో... 31వ తేదీ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి నేతృత్వంలో జిల్లా కార్యదర్శుల సమావేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో జరుగుతుందని, ఇందులో అసెంబ్లీ ఎన్నికల పనుల గురించి చర్చించనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా అన్నాడీఎంకే తరఫున పోటీ చేయాలనుకునే ఆశావహులకు దరఖాస్తుల పంపిణీ గడువు పొడిగించిన నేపథ్యంలో ఆదివారం పలువురు దరఖాస్తులు పొందారు. దీంతో కార్యాలయం సందడిగా కనిపించింది.

దరఖాస్తులు పొందుతున్న ఆశావహులు

ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పు, తొలగింపు, సవరణలకు సంబంధించి ప్రత్యేక శిబిరాలు జరుగుతున్న నేపథ్యంలో చెన్నై మయిలాపూర్ శాసనసభ నియోజకవర్గంలోని ఎస్ఐఈటీ మహిళా కళాశాలలో ఆదివారం జరిగిన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఓటర్ల జాబితా పరిశీలకులు కుమారవేల్ పాండియన్ **- న్యూస్‌టుడే, చెన్నై**

'నాన్ ముదల్వన్'తో సత్తా చాటుతున్న యువత

సైదాపేట, న్యూస్‌టుడే: నాన్ ముదల్వన్ పథకం ద్వారా సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో యువత సులభంగా ఉత్తీర్ణత సాధిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తెలిపారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... 2017 తర్వాత యూపీఎస్సీ పరీక్షల్లో తమిళనాడు భాగస్వామ్యం తగ్గిందనేది వాస్తవమేనని తెలిపారు. దీనికి కారణం శిక్షణ పొందడంలో తేడాలేనని చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువతకు తగిన మార్గదర్శకం లేకపోవటమని తెలిపారు. దీంతో 2021లో ఉత్తీర్ణత సాధించినవారి సంఖ్య అత్యల్పంగా 27గా ఉందని తెలిపారు. అయితే ప్రస్తుతం ముఖ్యమంత్రి కలల పథకమైన నాన్ ముదల్వన్ పథకం ద్వారా యువత యూపీఎస్సీ పరీక్షల్లో సులభంగా ఉత్తీర్ణత సాధిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగిందని తెలిపారు.

బీచ్‌లో రాళ్ల మధ్య చిక్కుకున్న మహిళ సురక్షితం

రీల్స్ చేస్తుండగా ప్రమాదం

సైదాపేట, న్యూస్‌టుడే: బీచ్‌లో రాళ్లపై నిలబడి రీల్స్ చేస్తుండగా కాలుజారి వాటి మధ్య చిక్కుకున్న మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను పోలీసులు కాపాడారు. మదురైకి చెందిన వైష్ణవి(26) చెన్నైలోని ఓ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆమె తన స్నేహితురాళ్లతో కలిసి పుదుచ్చేరి పర్యాటకానికి వెళ్లారు. ఆదివారం సాయంత్రం పుదుచ్చేరి బీచ్‌లో బండరాళ్లపై నిలబడి రీల్స్ చేస్తుండగా అదుపుతప్పి రాళ్ల మధ్య పడిపోయింది. స్నేహితురాళ్ల కేకలు వేయడంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని వైష్ణవిని బయటకు తీసేందుకు యత్నించి విఫలమయ్యారు. రెస్క్యూ బృందం క్రేన్‌తో వచ్చి రాళ్లను తొలగించి వైష్ణవిని సురక్షితంగా బయటకు తీశారు. ఆమె కాళ్లకు గాయాలయ్యాయి. పుదుచ్చేరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రాళ్ల మధ్య చిక్కుకున్న వైష్ణవి

నేడు పుదుచ్చేరిలో ఉప రాష్ట్రపతి పర్యటన

సైదాపేట, న్యూస్‌టుడే: ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పుదుచ్చేరి పర్యటన సందర్భంగా పుదుచ్చేరి, తిరుచ్చి విమానాశ్రయాల్లో భారీ భద్రత ఏర్పాటు చేశారు. సోమవారం పుదుచ్చేరిలో జరిగే పలు కార్యక్రమాల్లో ఉప రాష్ట్రపతి పాల్గొననున్నారు. దీంతో పుదుచ్చేరిలో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు ఆయనకు స్వాగతం పలకనున్నారు. సోమవారం దిల్లీ నుంచి సైనిక విమానంలో తిరుచ్చి చేరుకోనున్న సీపీ రాధాకృష్ణన్.. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా పుదుచ్చేరి చేరుకుంటారు. అక్కడి కార్యక్రమాలు ముగిసిన తర్వాత తిరుచ్చి విమానాశ్రయం చేరుకుని తిరువనంతపురం వెళ్తారు.

ఎంజీఆర్ మండ్ర కార్యదర్శి తొలగింపు

సైదాపేట, న్యూస్‌టుడే: ఎంజీఆర్ మండ్ర కార్యదర్శి సి.కృష్ణన్‌ను అన్నాడీఎంకే నుంచి తొలగిస్తూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి చర్యలు తీసుకున్నారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... అన్నాడీఎంకే సిద్ధాంతాలు, విధానాలు, లక్ష్యాలకు విరుద్ధంగా, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరించినందుకు సేలం సబర్బన్ జిల్లా ఎంజీఆర్ మండ్ర కార్యదర్శి సి.కృష్ణన్‌ను పార్టీ కనీస సభ్యత్వం సహా అన్ని బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు ఎవరూ ఆయనతో ఎలాంటి సంబంధాలు పెట్టుకోకూడదని సూచించారు.

కూటమిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు: టీటీవీ

విలేకర్లతో మాట్లాడుతున్న టీటీవీ దినకరన్

సైదాపేట, న్యూస్‌టుడే: కూటమి గురించి ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ తెలిపారు. తిరుచ్చిలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. . తమను నడిపించేది కార్యకర్తలని, పార్టీని తదుపరి స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత వారికే ఉందన్నారు. వారి అభిప్రాయాలు తెలుసుకుని, ఎన్నికల్లో తమకు విజయాన్ని ఇచ్చే కూటమిలో చేరుతామని తెలిపారు. జయలలిత మద్దతుదారులు ఏకమైతే విజయం సాధ్యమన్నారు. తమపై ఎవరి ఒత్తిడి లేదని, ఒత్తిళ్లకు ఏఎంఎంకే లొంగదని స్పష్టం చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చడం సరికాదన్నారు. దీనిపై కేంద్రం పునఃపరిశీలన చేయాలని పేర్కొన్నారు. అదే సమయంలో పని రోజులను 125కి పెంచడం స్వాగతనీయమన్నారు. కూటమికు నేతృత్వం వహిస్తున్న పార్టీలు తమతో మాట్లాడుతుండటం వాస్తవమన్నారు. అయితే ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిపారు.

భాజపా బలపడితే అన్నాడీఎంకే ఉనికి ప్రశ్నార్థకం: తిరుమావళవన్

సైదాపేట, న్యూస్‌టుడే: తమిళనాడులో భాజపా బలపడితే అన్నాడీఎంకే ఉనికి కోల్పోతుందని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ తెలిపారు. శనివారం ఆయన తిరుచ్చి విమానాశ్రయంలో విలేకర్లతో మాట్లాడుతూ... అధికారంలో భాగస్వామ్యం గురించి తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మతవాద పార్టీలు రాష్ట్రంలో కాలు మోపేందుకు అన్నాడీఎంకే తదితర కొన్ని పార్టీలు సహకరిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో భాజపా కొంతమేర అభివృద్ధి చెందటానికి అన్నాడీఎంకేనే కారణమన్నారు. భాజపా బలపడితే అన్నాడీఎంకే ఉనికి కోల్పోతుందని ఎద్దేవా చేశారు. సనాతన శక్తులకు సహకరించే విధంగా విజయ్, సీమాన్‌లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇది రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. భాజపాతో డీఎంకే కూటమి ఏర్పాటు చేసినప్పుడు మతవాద రాజకీయాలు మాట్లాడకూడదనే నిబంధన విధించే కరుణానిధి పొత్తు పెట్టుకున్నారని చెప్పారు. అయితే ప్రస్తుతం అన్నాడీఎంకే భాజపా సిద్ధాంతాలకు బానిసగా మారిందని విమర్శించారు.

నిరసనలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నిరసన చేపట్టిన ఉపాధ్యాయుల అరెస్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: మూడో రోజుగా ఆందోళన చేపట్టిన మాధ్యమిక పాఠశాలల ఉపాధ్యాయులను పోలీసులు అరెస్టు చేశారు. పలు డిమాండ్లతో చెన్నై కలెక్టరు కార్యాలయం ఎదుట ఆదివారం మూడో రోజుగా ఉపాధ్యాయుల ఆందోళన కొనసాగింది. 500 మందికి పైగా పాల్గొన్నారు. పోలీసులు వారికి చర్చించినా ఆందోళన విరమించకపోవడంతో అరెస్టు చేశారు. ఆ సమయంలో ముగ్గురు స్పృహకోల్పోయారు.

తమిళనాడుపైనే అధిక రుణభారం

☛ ప్రవీణ్ చక్రవర్తి

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడుకే ఎక్కువ అప్పులు ఉన్నాయని ప్రొఫెషనల్స్ కాంగ్రెస్, డేటా అనలిస్ట్ ప్రవీణ్ చక్రవర్తి తెలిపారు. ఆయన తన 'ఎక్స్'లో.. అన్ని రాష్ట్రాల కన్నా తమిళనాడుకు అత్యధిక అప్పులు ఉన్నాయన్నారు. తమిళనాడు కన్నా ఉత్తరప్రదేశ్‌కు 2010లో రెట్టింపు అప్పు ఉండగా ప్రస్తుతం తమిళనాడుకే ఎక్కువగా ఉందని తెలిపారు. కొవిడ్‌కు ముందు కన్నా అప్పు/జీడీపీ ఇప్పటికీ చాలా ఎక్కువగా ఉందన్నారు. రాష్ట్ర రుణ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని తెలిపారు.

ఆస్పత్రిలో చేరిన దర్శకుడు భారతిరాజా

చెన్నై, న్యూస్‌టుడే: దిగ్గజ సినీ దర్శకుడు భారతిరాజా (84) అనారోగ్యంతో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. తన కుమారుడు, దర్శకనటుడు మనోజ్ ఈ ఏడాది మార్చిలో మరణించారు. ఆ బాధ నుంచి తేరుకోలేని భారతిరాజా కొన్నాళ్లు మలేసియాలోని కుమార్తె వద్ద ఉన్నారు. ఇటీవల చెన్నైకు చేరుకున్న ఆయన అనారోగ్యానికి గురవడంతో కుటుంబీకులు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. మూడు రోజులుగా చికిత్సలు పొందుతున్న ఆయన ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి.

విజయ్ రాజకీయ ప్రస్థానం విజయవంతంగా ఉండాలి

శ్రీలంక మాజీ అధ్యక్షుడి కుమారుడు శుభాకాంక్షలు

చెన్నై, న్యూస్‌టుడే: టీవీకే అధ్యక్షుడు విజయ్ రాజకీయ ప్రస్థానం విజయవంతంగా ఉండాలంటూ శ్రీలంక మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్స కుమారుడు నమల్ రాజపక్స శుభాకాంక్షలు తెలిపారు. ఆయన తన 'ఎక్స్'లో... తనకు నచ్చిన నటుల్లో విజయ్ ఒకరన్నారు. ఆయన సినీ ప్రస్థానం, తెరపై చూపించిన నైపుణ్యం ప్రశంసనీయమని, మరవలేనివని తెలిపారు. ఈ అధ్యాయాన్ని ముగించుకుని మరో (రాజకీయ) రంగంలోకి అడుగుపెట్టే సమయంలో ఆయన్ను సినీ రంగం తప్పకుండా కోల్పోతుందని పేర్కొన్నారు. అన్నింటా ఆయనకు గెలుపు లభించాలంటూ, ఆయన ప్రస్థానం విజయవంతంగా ఉండాలంటూ శుభాకాంక్షలు తెలిపారు.

రోగాలు నయంచేసే వైదీశ్వరుడు

- మయిలాడుదురై సమీపంలో ఆలయం
- అంగారక దోష పరిహారానికి ప్రసిద్ధి

- న్యూస్‌టుడే, కాంచీపురం

వైదీశ్వరస్వామి

తంజవూరు-చిదంబరం హైవేలో మయిలాడుదురై నుంచి 13 కి.మీ దూరం, తంజావూరు నుంచి 90 కి.మీ దూరంలో ఉంది వైదీశ్వరాలయం. ఐదు అంతస్తుల గోపురం, రెండు లోపలి గోపురాలతో పెద్ద ప్రాంగణాలున్నాయి. గర్భగుడి చుట్టూ మొదటి ప్రాకారంలో సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవ విగ్రహం ఉంది. ఇక్కడ ఈ విగ్రహాన్ని ముత్తుకుమారస్వామిగా పూజిస్తారు. ఈ ఆలయం నవగ్రహాల్లో 9వ గ్రహమైన అంగారక దోష పరిహార స్థలంగా ప్రసిద్ధి. ఇక్కడ అమ్మవారు తైయ్యల్ నాయకిగా చేతిలో ఔషధంతో నిలబడిన భంగిమలో భక్తులకు దర్శనమిస్తుంది. స్వామివారు రోగాలను రూపుమాపుతాడని భక్తుల విశ్వాసం. అందుకే వైదీశ్వరస్వామిగా పేరు. ఆలయ ప్రాంగణంలో సిద్ధామృతం అనే పుష్కరిణి ఉంది. ఇందులో స్నానమాచరించి బెల్లం కరిగిస్తే చర్మ వ్యాధులు నయమవుతాయని భక్తుల విశ్వాసం.

17వ శతాబ్దంలో నిర్మాణం

ఆలయానికి వచ్చే భక్తులు మొదటిగా పుష్కరిణిలో బెల్లం కరిగించిన తరువాతే స్వామి, అమ్మవార్ల దర్శనానికి వెళ్తారు. 7వ శతాబ్దం నాటి ఆలయాన్ని విక్రమ చోళ, వీరరాజేంద్ర పాండ్య, అచ్యుత నాయక (క్రీ.శ 1560-1614) మరాఠా యువరాజు తుజ వంటి పాలకులు అభివృద్ధి చేశారు. అందుకు నిదర్శనంగా ఆలయంలో కులోత్తుంగ కాలం నాటి ఐదు శాసనాలు ఉన్నాయి. క్షేత్రం ధర్మపురం ఆధీనం పరిరక్షణలో ఉంది. దక్షిణ భారతదేశంలో ఇతర ఆలయాల్లో లాగా కాకుండా ఇక్కడున్న ప్రతి మందిరంలో ఓ పూజారి ఉంటాడు.

ఆలయ ప్రవేశ ద్వారం

ఔషధంగా విభూది

ఇక్కడ అందజేసే విభూదిని ఔషధంగా భక్తులు భావిస్తారు. ఆలయంలో జనవరి, ఫిబ్రవరి నెలల్లో బ్రహ్మోత్సవాలు, కార్తిక మాసంలో దీపోత్సవాలు, మురుగన్‌కు స్కందషష్టి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. రామాయణ కాలంలో రాముడు, లక్ష్మణుడు, సప్త రుషులు ఈ ప్రదేశంలో పూజలు నిర్వహించారని, నవగ్రహాల్లో ఒకరైన అంగారకుడు కుష్ఠు వ్యాధితో బాధపడుతూ వైద్యనాథస్వామిని పూజించడంతో వ్యాధి నయమైందని స్థల పురాణం చెబుతోంది.

కోవైలో హాకీ మైదానం 30న ప్రారంభం

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కోయంబత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ తరఫున నిర్మించిన అంతర్జాతీయ హాకీ మైదానాన్ని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ఈనెల 30వ తేదీ అందుబాటులోకి తీసుకురానున్నారు. కోయంబత్తూరు ఆర్ఎస్ పురంలో కార్పొరేషన్ తరఫున రూ.9.67 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ హాకీ మైదానాన్ని నిర్మించారు. తర్వాత 10 వేల మందికి ప్రభుత్వ సంక్షేమ సాయం పంపిణీ చేయనున్నారు. ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి.

(c) eenadu

తిరుత్తణి ఆలయంలో భక్తుల రద్దీ

అలంకరణలో శ్రీ వళ్లి దేవసేన సమేత స్వామివారు, ఆలయ ప్రాంగణంలో భక్తులు

తిరుత్తణి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. సెలవు దినం కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలైంది. ఈ సందర్భంగా మూలమూర్తికి తెల్లవారుజాము ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్నారు. అభిలాంత వద్ద మహిళా భక్తులు నెయ్యి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనేక మంది భక్తులు కావళ్లు మోసుకొచ్చి తలనీలాలు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

దైవానుగ్రహానికి శ్రవణ కీర్తనం ఉత్తమ మార్గం

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: దైవానుగ్రహం పొందేందుకు నవవిధ భక్తి మార్గాలు ఉన్నాయని, అందులో శ్రవణ కీర్తనం చాలా సులువైన

ఉపన్యాసకులతో పాలక మండలి సభ్యులు

మార్గమని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు ఉభయ వేదాంత కిడంబి నారాయణస్వామి అభివర్ణించారు. పప్పిశెట్టి రామయ్య శెట్టి ధర్మ సంస్థ ఆధ్వర్యంలో ధనుర్మాస సందర్భంగా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమం చెన్నై త్యాగరాయ నగర్‌లోని వీలర్‌సీ సెంటినరీ హాలులో ఆదివారం జరిగింది. ముందుగా పాలక మండలి సభ్యులు కోటా సుబ్బారావు, గోరంట్ల బాలాజీ, ఎస్‌ హరిప్రసాద్‌లు ఉపన్యాసకుడిని ఘనంగా సత్కరించారు.

కష్టాలు ఎదురైనా చివరికి ధర్మమే గెలుస్తుంది

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగే యుద్ధంలో చివరికి ధర్మమే గెలుస్తుందనే సందేశాన్ని కంబ రామాయణం తెలియజేస్తుందని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్ పేర్కొన్నారు. మయిలాడుతురై జిల్లా కుత్తాలం సమీపంలోని కవిచక్రవర్తి కంబర్ జన్మించిన తేరళుందూరులోని కంబర్ కోటలో తేరళుందూర్ కంబర్ ఆర్గనైజేషన్ తరఫున కంబర్ ఉత్సవం శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంబ రామాయణం పారాయణం చేశారు. జస్టిస్ స్వామినాథన్ 'కంబనుం వైష్ణవం' పుస్తకాన్ని విడుదల చేయగా మైలాడుతురై జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి సత్యమూర్తి స్వీకరించారు. ఆమరుది దేవనాథన్ పుస్తక సమీక్ష సమర్పించారు. కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రాజేంద్రన్, బాజపా జిల్లా అధ్యక్షుడు నాంజిల్ బాలు, కంబర్ ఆర్గనైజేషన్ ఇన్‌ఛార్జులు, తమిళ పండితులు తదితరులు పాల్గొన్నారు.

విడుదల చేసిన పుస్తకాలతో జస్టిస్ స్వామినాథన్ తదితరులు

తిరువళ్లూర్, చెంగల్పట్టు జిల్లాల్లో

పళనిసామి ప్రచారం

ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మాజీ ఎంపీ హరి

సైదాపేట, న్యూస్‌టుడే: 'మక్కళై కాప్పోం- తమిళగత్తై మీట్పోం' పేరుతో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి రాష్ట్ర వ్యాప్త ఎన్నికల ప్రచార పర్యటన చేపట్టిన సంగతి తెలిసిందే. జూన్ నెలలో పర్యటన ప్రారంభించారు. 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటన ముగించారు. ఈ నేపథ్యంలో తిరువళ్లూర్, చెంగల్పట్టు జిల్లాల్లో ఈపీఎస్ ఆదివారం సాయంత్రం నుంచి మూడు రోజులపాటు ఎన్నికల ప్రచారం చేయనున్నారు.

నేడు తిరుత్తణిలో... తిరుత్తణి: సోమవారం సాయంత్రం 4 గంటలకు తిరుత్తణి చేరుకోనున్న ఆయన వేర్వేరు ప్రాంతాల్లో ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా తిరుత్తణి వీరసెల్వ్ ప్రాంతంలో బహిరంగ సభలో పాల్గొనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను అన్నాడీఎంకే ఆర్గనైజింగ్ కార్యదర్శి, మాజీ ఎంపీ హరి ఆదివారం పర్యవేక్షించారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న రాజశేఖర్ తదితరులు

వడపళని, న్యూస్‌టుడే: ఆర్య వైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోప్) తమిళనాడు శాఖ 69వ వార్షిక సర్వసభ్య సమావేశం టీనగర్ అవోప్ ప్రాంగణంలోని కృష్ణా హాలులో ఆదివారం జరిగింది. సమావేశానికి టి.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. కార్యదర్శి రంగనాథం శెట్టి 2024-25 వార్షిక నివేదికను, ఆడ కాలానికి కోశాధికారి పి.రాధాకృష్ణ ఆందించిన ఆదాయ వ్యయాలను సభ్యులు ఆమోదించారు. అవోప్ ప్రెసిడెన్షియల్ విద్యా సపోర్ట్ స్కీమ్ ఫర్ ప్రొఫెషనల్స్ పేరిట ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్, న్యాయశాస్త్రం లాంటి వృత్తి విద్యలు చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున మొత్తం 16 మందికి ఉపకార వేతనం అందించారు.

తామరైకుళం ఆలయంలో పూజలు చేయలేని పరిస్థితి

హెచ్.రాజా

విలేకరులతో మాట్లాడుతున్న హెచ్.రాజా

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: తేని జిల్లా పెరియకుళం సమీపం తామరైకుళం కొండపై ఉన్న పురాతన వెంకటాచలపతి పెరుమాళ్ ఆలయం దేవాదాయశాఖ ఆధీనంలోకి వచ్చిన తర్వాత భక్తులు పూజలు నిర్వహించలేని పరిస్థితి నెలకొందని భాజపా సీనియర్ నాయకుడు హెచ్.రాజా ఆరోపించారు. వెంకటాచలపతి పెరుమాళ్ ఆలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కొండపై దర్గా, వైద్యుల కాళాల నిర్మించారని, ప్రభుత్వం కేటాయించిన భూమిని దాటి ఆలయ స్థలాన్ని ఆక్రమించారన్నారు. ఆక్రమణ గురైన ఆలయ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని చెప్పారు. హిందువులు ఇక్కడ పూర్తిగా పూజలు చేసుకోవడానికి అనుమతించాలని, లేకుంటే దేవాదాయ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేయాల్సి ఉంటుందన్నారు. ఆలయంలో హుండీ కూడా లేదని, ఎందుకు ఆలయానికి తాళాలు వేసి తీసుకెళ్తున్నారో అర్థం కావడంలేదన్నారు.

ఎగ్మూరు స్టేషను వద్ద పనిచేయని వాటర్ ఏటీఎం

వాటర్ ఏటీఎంలు..

ఉన్నా లేనట్టే!

ప్రధాన రైల్వే స్టేషన్లలో పనిచేయని యంత్రాలు

రైలు ప్రయాణికుల కోసం చెన్నై సెంట్రల్ స్టేషను సహా పలు స్టేషన్లలో 'ఐఆర్‌సీటీసీ' ఏర్పాటు చేసిన 'స్మార్ట్ వాటర్ నీటి యంత్రాలు' మెట్రో వాటర్ బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటైన వాటర్ ఏటీఎంలు నెలల తరబడి పనిచేయట్లేదు. దీంతో ప్రయాణికులు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెన్నై సెంట్రల్ స్టేషనులో రోజుకు సగటున రెండు లక్షలు, ఎగ్మూరులో 1.3 లక్షలు, ఎంఎంసీ సబర్బన్ టెర్మినల్ నుంచి భారీగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఈ మూడు చోట్ల యంత్రాల్లో తాగునీరు రావడం లేదు.

- న్యూస్‌టుడే, వడపళని

ఐదు లీటర్లు రూ.25

సెంట్రల్‌లోని 3వ నెంబరు ప్లాట్‌ఫారం, సబర్బన్‌లోని 14, 15 ప్లాట్‌ఫారలపై ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న కనీసం ఐదు వాటర్ వెండింగ్ యంత్రాలు తాళం వేసి, తుప్పుపట్టి, పక్షుల రెట్టలతో దయనీయంగా ఉన్నాయి. అదేవిధంగా ఎగ్మూరు స్టేషను బయట టికెట్ కౌంటరు సమీపంలో మెట్రోవాటర్ విభాగం ఏర్పాటు చేసిన ఏటీఎంలో కుళాయిలు విరిగిపోయాయి. క్షేత్రస్థాయి సిబ్బందికి వెండింగ్ యంత్రాల నీరు అతి తక్కువ ధరకే పొందే వీలుంటుందని పారిశుద్ధ్య కార్మికురాలు గౌరి పేర్కొన్నారు. అయితే యంత్రాలు దాదాపు మూడు నెలలుగా మొరాయిస్తున్నాయని చెప్పారు. ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న వాటర్ వెండింగ్ యంత్రాల ద్వారా 300 మిల్లీలీటర్ల నీరు రూ.3, లీటరు రూ.8, ఐదు లీటర్లు రూ.25కు తక్కువ ధరతో అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ మెట్రో వాటర్ ఏటీఎంలను జూన్‌లో ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇవి ఐఓటీ ఆధారిత వ్యవస్థ ద్వారా 150 మిల్లీలీటర్లు, లీటరు నీటిని ఉచితంగా అందిస్తాయి. ఈ తరహా యంత్రం ఎగ్మూరు స్టేషను బయట ఒకటి ఉంది. అయితే ఈ యంత్రం కుళాయిలు కూడా విరిగిపోయి కనిపిస్తున్నాయి.

పొంగల్‌లోగా మరమ్మతులు చేపడతాం

దీనిపై దక్షిణ రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజరు (చెన్నై ప్రాంతం) భరత్ కుమార్ మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్లలోని వాటర్ వెండింగ్ యంత్రాలను గతంలో ఐఆర్‌సీటీసీ నిర్వహించేదని, ఇటీవల నిర్వహణ తమకు అప్పగించారన్నారు. కొత్తగా కాంట్రాక్టర్ల కోసం త్వరలో టెండర్లను ఆహ్వానించి, పొంగల్ నాటికి ఏటీఎంలను వినియోగంలోకి తీసుకొస్తామని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రికి ఈపీఎస్‌తో చర్చించే సమయం లేదు

ప్యారిస్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఎడప్పాడి పళనిసామితో చర్చించడానికి సమయం లేదని ఎంపీ కనిమొళి పేర్కొన్నారు. శివగంగై జిల్లా తిరుప్పువనం సమీపం కీళడి పురావస్తు తవ్వకాలను తూత్తుకుడి

విద్యార్థినులతో ఎంపీ కనిమొళి

ప్రభుత్వ మోడల్ స్కూల్ పాఠశాల విద్యార్థినులతో కలిసి ఆమె శనివారం సందర్శించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కీళడి తవ్వకాల ద్వారా వేల ఏళ్ల క్రితం తమిళుల చరిత్ర, నాగరికత గురించి తెలుసుకునే అవకాశాన్ని ముఖ్యమంత్రి కల్పించారని చెప్పారు. పథకాలపై స్టిక్కర్ అతికించి ప్రపంచ వ్యాప్తంగా గర్వపడే వ్యక్తి ఎడప్పాడి పళనిసామి అని ఎద్దేవా చేశారు. పథకాల గురించి ఆయనతో చర్చించే సమయం ముఖ్యమంత్రి స్టాలిన్‌కు లేదని తెలిపారు. పార్టీలో ఉన్న మిగిలిన నాయకులు ఆయనతో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

వడపళని, న్యూస్‌టుడే: ఫోర్ట్ లయన్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ మద్రాస్ ఫోర్ట్ సెయింట్

దుప్పట్లు, చీరలు అందుకున్నవారితో నిర్వాహకులు

జార్జ్ గ్రామాభివృద్ధి ప్రాజెక్టు కింద చెన్నై శివారు ఈచంగాడు గ్రామాన్ని దశాబ్దం క్రితం దత్తత తీసుకుంది. ఈచంగాడులో ఆదివారం కావేరి హాస్పిటల్, డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రుల వైద్య బృందంతో వైద్య శిబిరాన్ని నిర్వహించింది. లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ మొదటి వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రాజేష్ ఎం జోషి కంటైనర్ లైబ్రరీ ప్రాంగణంలో మొక్కలు నాటి శిబిరాన్ని ప్రారంభించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఫోర్ట్ సెయింట్ జార్జి అధ్యక్షుడు మితేష్ షా స్థానికులకు కొత్త పుస్తకాలు, శానిటేషన్ కిట్లు పంపిణీ చేశారు. కార్యదర్శి హేమల్ ఆర్.జోషి దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు.

పురాతన బంగారు నాణేలు లభ్యం

▸ వెలుగుచూసిన నాణేలు ▸ వేళచ్చేరి: తెన్ పెన్నై నది తీరంలో లభ్యమైన వస్తువులు

వేలూరు, న్యూస్‌టుడే: తిరుపత్తూరు సమీపం సుందరంపల్లి ప్రాంతానికి చెందిన ఆదవన్(55) రైతు. ఈయన ఈనెల 22న తన ఇంటి వద్ద బావి నిర్మాణం చేపట్టాడు. కార్మికులు మట్టి తవ్వుతుండగా ఓ జాడీ కనిపించింది. అందులో 86 బంగారు నాణేలు ఉన్నాయి. విషయాన్ని ఆదవన్ వీఏవో మురుగన్‌కు ఆరు రోజుల తర్వాత ఆలస్యంగా తెలియచేశాడు. తహసీల్దార్ నవనీతన్ విచారించి జాడీని స్వాధీనం చేసుకుని పరిశీలించారు. అది పాక్షికంగా పగిలి ఉండటంతో భూమి యజమానిపై అనుమానంతో కందిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసును నమోదు చేసుకుని ఆదవన్‌ను విచారిస్తున్నారు.

తెన్ పెన్నై నది తీరంలో వస్తువులు

వేళచ్చేరి: విళుప్పురం జిల్లా పిటాగం-కూచిపాళ్యం మధ్య ప్రవహిస్తున్న తెన్ పెన్నై నది తీరంలో పురావస్తు శాస్త్రవేత్త ఇమ్మానుయేల్, విళుప్పురం అరిజ్ఞర్ అన్నా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు శామ్యూల్, వెట్రివేల్ కలిసి క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పురాతన కళాఖండాలను కనుగొన్నారు. దీని గురించి ఇమ్మానుయేల్ మాట్లాడుతూ.. తెన్ పెన్నై నది పరీవాహక ప్రాంతంలో నలుపు, ఎరుపు కుండ ముక్కల మధ్య ఒక రాతియుగపు 6.5 సెం.మీ పొడవున్న పనిముట్టు, విరిగిన ఇనుప వస్తువును గుర్తించినట్లు తెలిపారు. ఇది 5 వేల ఏళ్ల నాటిదని, మయిలాడుదురై, మంగుడి, పయ్యంపల్లి, కల్వరాయన్ కొండ తదితర ప్రాంతాల్లో ఇలాంటి నవీన శిలాయుగం ఆయుధాలు లభించాయని వివరించారు. ఇటీవల తెన్ పెన్నై నదిలో ఏర్పడిన వరదకు పురాతన కుండల ముక్కలు, భూమి ఉపరితలంపై 17 సెం.మీ పొడవున్న విరిగిన ఇనుప ఆయుధం, ఇతర వస్తువులను కనుగొన్నామని పేర్కొన్నారు.

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తుశాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కోవూర్ ప్రాంతంలో సరఫరాలో అంతరాయం కలగనుందని అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

చెరకు గడకు రూ.25 అందజేయాలి

విల్లివాక్కం, న్యూస్‌టుడే: చెరకు గడకు రూ.25 చొప్పున అందజేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. చెరకును రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో మాత్రమే పండిస్తున్నారు. ఈరోడ్ సమీపంలోని సమయసంగిలి కట్టలై కదవనై సమీపంలో అధికంగా సాగు చేశారు. ప్రస్తుతం కోతకు సిద్ధమైంది. సంక్రాంతికి వారం రోజుల ముందు నరుకుతారు. దీన్ని ఈరోడ్ జిల్లా మాత్రమే కాకుండా పలు జిల్లాలకు కూడా విక్రయానికి పంపుతున్నారు. చెరకు 10 నెలల పంట అని, రూ.3 లక్షలు ఖర్చవుతుందని రైతులు తెలిపారు. తమ శ్రమ, ఖర్చులను దృష్టిలో ఉంచుకొని ఒక చెరకు గడకు రూ.25 చొప్పున అందజేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సైబర్ నేరాల నియంత్రణకు

ప్రజలు సహకరించాలి

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: సైబర్ నేరాల నియంత్రణకు పోలీసులకు శిక్షణ ఇచ్చామని, వారికి ప్రజలు సహకరించాలని మాజీ డీజీపీ జంగిడ్ కోరారు. తిరువళ్లూరు జిల్లా ఆవడిలో విజయంత మోడల్ హయ్యర్ సెకండరీ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న జంగిడ్ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులను జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. నేరస్థులను పట్టుకోవడానికి పోలీసులకు సాంకేతిక సాయం, అధునాతన నిఘా అవసరమన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

నామక్కల్‌లో పారిశ్రామిక పార్కు

కేంద్ర అనుమతి కోసం దరఖాస్తు

విల్లివాక్కం: నామక్కల్ జిల్లా మోహనూర్‌లో 803 ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక పార్కు నిర్మాణానికి తమిళనాడు పారిశ్రామికాభివృద్ధి సంస్థ తరఫున కేంద్ర పర్యావరణశాఖ అనుమతి కోసం దరఖాస్తు చేశారు. మోహనూర్ తాలూకా ఎన్.పుదుపట్టి, వాయకట్టి, అరూర్ గ్రామాల చుట్టూ పార్కుని అభివృద్ధి చేయనున్నారు. ఇందులోని స్థలాలను ఇంజినీరింగ్ సంస్థలు, మిల్లుల స్థాపనకు కేటాయిస్తారు. ప్రస్తుతం పార్కులో మౌలిక వసతులు కల్పించడానికి కేంద్ర పర్యావరణశాఖ అనుమతి కోసం 'సిప్కాట్' దరఖాస్తు చేసింది. అనుమతి రాగానే పనులు ప్రారంభించనున్నట్టు అధికారులు తెలిపారు.

పులి సంచారంతో భయాందోళన

విల్లివాక్కం: నీలగిరి జిల్లా గూడలూర్ సమీపం వాచ్చిక్కొల్లి ప్రాంతంలో తరచూ పులి సంచరిస్తూ పశువులను చంపుతోంది. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతానికి చెందిన రమేష్ అనే వ్యక్తి శనివారం మధ్యాహ్నం మేతకు విడిచిన పాడి పశువుపై పులి దాడిచేసి చంపింది. ఈ నెల 16వ తేదీ ఆవు దూడను చంపడం గమనార్హం. తరచూ పశువులను చంపుతున్న పులిని పట్టుకోవాలని ప్రజలు అటవీశాఖకు విజ్ఞప్తి చేస్తున్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న దత్తో శ్రీ శరవణన్

కోవైలో మలేసియా ఎంపీ పర్యటన

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కోయంబత్తూరులో జరిగే ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనడానికి మలేసియా ఎంపీ దత్తో శ్రీ శరవణన్ ఆదివారం విమానంలో కోయంబత్తూరుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... ఆజాద్ మతాలకు అతీతంగా పనిచేసే వ్యక్తి అని, ఆయన కార్యక్రమంలో పాల్గొనడానికి కోయంబత్తూర్ వచ్చానని, ఇందులో విదేశాల్లోని తమిళులకు అవార్డులు ప్రదానం చేయనున్నారని తెలిపారు.

'డీఎంకే ప్రభుత్వం హిందువులకు వ్యతిరేకం'

విలేకరులతో మాట్లాడుతున్న కాదేశ్వర సుబ్రహ్మణ్యం

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: డీఎంకే ప్రభుత్వం హిందువులకు వ్యతిరేకమని హిందూ మున్నని రాష్ట్ర కార్యనిర్వాహకుడు కాదేశ్వర సుబ్రహ్మణ్యం విమర్శించారు. కోయంబత్తూరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఐదేళ్ల క్రితం ప్రారంభించిన హిందూ ట్రేడర్స్ అసోసియేషన్ వ్యాపారులలో ఐక్యత, అవగాహన కల్పించడానికి బాగా పనిచేస్తోందన్నారు. జనవరి 4వ తేదీ కోయంబత్తూరులో హిందూ వ్యాపారుల సమావేశం జరగనుందని ప్రకటించారు. డీఎంకే ప్రభుత్వం హిందూ వ్యతిరేక, నాస్తిక ప్రభుత్వంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తిరుప్పరంకుండ్రం వ్యవహారంలో హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వం అమలు చేయకపోవడం ఆమోదయోగ్యం కాదన్నారు.

వికటకవి మేధోసంపత్తి అద్వితీయం

టీనగర్, న్యూస్‌టుడే: తెలుగు సాహిత్య ఆకాశంలో ధ్రువతార, అష్టదిగ్గజాల్లో అగ్రగణ్యుడు తెనాలి రామకృష్ణుడి సాహిత్య వైభవాన్ని నేటి తరానికి పరిచయం చేస్తూ చెన్నైలో ఓ సాహిత్య కార్యక్రమాన్ని ఆదివారం వేద విజ్ఞాన వేదిక(చెన్నై) ఆధ్వర్యంలో టీనగర్‌లోని ఆంధ్ర క్లబ్ కృష్ణా హాలులో నిర్వహించారు. ప్రముఖ పరిశోధకులు డా.ఊరిమిండి నరసింహారెడ్డి ప్రధాన వక్తగా పాల్గొని రామకృష్ణుడి సాహిత్య విశేషాలను గుర్తు చేశారు. వికటకవి మేధోసంపత్తి అద్వితీయమని తెలిపారు. కార్యక్రమానికి చెన్నైలోని సాహితీ ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా వేద విజ్ఞాన వేదిక సంస్థ కార్యదర్శి కందనూరు మధు స్వాగతోపన్యాసం చేయగా, అధ్యక్షుడు జేకే రెడ్డి వక్తను సభకు పరిచయం చేశారు. అనంతరం ఇద్దరూ వక్తను జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమానికి అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు సీఎంకే రెడ్డి, ప్రముఖ సినీ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్, తెలుగు ప్రముఖులు అనంతకుమార్ రెడ్డి, ఏవీ శివకుమారి తదితరులు హాజరయ్యారు.

నరసింహారెడ్డిని సత్కరిస్తున్న కందనూరు మధు, జేకే రెడ్డి. చిత్రంలో సీఎంకే రెడ్డి, కాట్రగడ్డ ప్రసాద్, అనంతకుమార్ రెడ్డి, ఏవీ శివకుమారి

ఆ సర్వసభ్య సమావేశం చట్టవిరుద్ధం

సైదాపేట: రామదాస్ నేతృత్వంలో సోమవారం జరుగనున్న సర్వసభ్య సమావేశం చట్టవిరుద్ధమని పీఎంకే న్యాయవాది, అన్బుమణి మద్దతుదారుడు బాలు తెలిపారు. మయిలాడుతురైలో ఆదివారం ఆయన మాట్లాడుతూ... పీఎంకే ఎన్నికల పనులు

మాట్లాడుతున్న న్యాయవాది బాలు

బూత్‌ల వారీగా జరుగుతున్నాయని, పీఎంకే ఉండే కూటమే విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అందుకుగాను వ్యూహాలు అన్బుమణి రచిస్తున్నారని చెప్పారు. పార్టీ పూర్తిగా తమ నియంత్రణలో ఉందన్నారు. అది సహించలేకే తమపై ప్రతిరోజూ పలు ఆరోపణలు, విమర్శలు రామదాస్ వర్గం చేస్తోందని తెలిపారు. రామదాస్ నేతృత్వంలో 29న సేలంలో జరుగనున్న సర్వసభ్య సమావేశం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు.

ముగ్గురు జాలర్లను అరెస్టు చేసిన శ్రీలంక నావికా దళం

చెన్నై, న్యూస్‌టుడే: తమ సముద్ర జలాల పరిధిలోకి చొరబడి చేపలు పడుతున్నారన్న ఆరోపణలపై రాష్ట్రానికి చెందిన ముగ్గురు జాలర్లను శ్రీలంక నావికా దళం అరెస్టు చేసింది. రామనాథపురం జిల్లాలోని మండపం నార్త్ ఫిషింగ్ హార్బరు నుంచి శనివారం ఉదయం 300కు పైగా మరబోట్లలో వెయ్యి మందికిపైగా జాలర్లు చేపలు పట్టేందుకు సముద్రంలోకి వెళ్లారు. వారిలో నెడుతీవు వద్ద చేపలు పడుతున్న ఆమోస్టిన్ (24), జోన్‌దాస్ (37), పరలోగ జబస్టిన్ అన్రోస్ (25)లను శ్రీలంక నావికాదళం అదుపులోకి తీసుకుంది. బోటు సహా వారిని శ్రీలంకకు తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిన రాష్ట్ర జాలర్లను, వారి బోట్లను వెంటనే విడిపించడానికి అవసరమైన దౌత్యపరమైన చర్యలను చేపట్టాలని కోరుతూ కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదివారం లేఖ రాశారు.

చర్చిలపై దాడులను ఖండిస్తూ ఆందోళన

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు జిల్లా వేలూరు నగరంలోని సీఎస్ఐ సెంట్రల్ చర్చి తరఫున ప్రధాన పాస్టర్ సైమన్ అధ్యక్షతన ఆదివారం ఆందోళన జరిగింది. సీఎస్ఐ ఆర్చ్ డయోసెస్ బిషప్ శర్మనిత్యానందం ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న క్రైస్తవులు ఉత్తరాది రాష్ట్రాల్లో చర్చిలపై జరుగుతున్న దాడులను ఖండించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఆందోళనలో పాల్గొన్న క్రైస్తవులు

మంచులో పక్షులకు పసందైన విందు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లాలో గత 10 రోజుల నుంచి మంచు తీవ్రంగా కురుస్తోంది. ఈ నేపథ్యంలో ఇక్కడికి వస్తున్న పక్షులు ఆహారాన్ని ఘనీభవ మంచులో వెతుకులాడుతున్నాయి. ఊటీలోని రేస్ కోర్స్, కాందల్, తలైకుందా, కిళన్‌మార్గల్ ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇండియన్ కార్మంట్, స్పాట్ బిల్డ్ డక్, కేటిల్ ఈగ్రిట్, వెన్ నారైలు, చిట్టుక్కురివి, నీలగిరి ఉడ్ పిజిన్, నీలగిరి లాపింగ్ థ్రిష్, నీలగిరి ఫ్లైకేచర్ తదితర పక్షులు మంచు కారణంగా భూమిలోంచి బయటికి వస్తున్న పురుగులు, కీటకాలను వేటాడి తింటున్నాయి.

బొటానికల్ గార్డెన్‌లోని చిత్తడి నేలలో పురుగులు తింటున్న పక్షులు

చెన్నైలో 'స్మార్ట్ ట్రాఫిక్ సిగ్నల్స్'

☛ సులభతర ప్రయాణానికి వీలు

☛ 31వ తేదీ నాటికి 100 ప్రాంతాలలో ఏర్పాటు

- న్యూస్‌టుడే, విల్లివాక్కం

చెన్నై నగరంలో ఈ నెల 31వ తేదీ నాటికి 100 'స్మార్ట్ ట్రాఫిక్ సిగ్నల్స్' అందుబాటులోకి తీసుకురావాలని ట్రాఫిక్ పోలీసు విభాగం చర్యలు చేపడుతోంది. తద్వారా నగరంలోని కూడళ్లలో వాహనదారుల 120 సెకన్ల తప్పనిసరి నిరీక్షణకు తెరపడనుంది. వీటిని రియల్-టైమ్ ట్రాఫిక్‌ని గణించడానికి, సిగ్నల్ సమయాలను డైనమిక్‌గా సర్దుబాటు చేయడానికి రూపొందించారు. పలు ప్రదేశాలలో స్తంభాలు ఏర్పాటు చేసినా విద్యుద్దీకరణ, ఇంటర్నెట్ కనెక్షన్ కోసం వేచియున్నాయి. పసుపు రంగు స్తంభాలకు అమర్చిన కెమెరాతో జంక్షన్ నలువైపులా ట్రాఫిక్ సరళిని, వాహనాల కదలికలను విశ్లేషిస్తాయి. ఆటోమేటిక్‌గా ఎరుపు, ఆకుపచ్చ రంగుకు మారుతాయి. నగరంలోని సుమారు 90 ప్రాంతాలలో స్తంభాలను ఏర్పాటు చేశారు. టేలర్స్ రోడ్డు, సెంట్రల్, పచ్చయప్పన్ కళాశాల సహా కొన్ని జంక్షన్లలో ప్రయోగాత్మకంగా పరిశీలించారు.

ఓ కూడలిలో ఏర్పాటు చేసిన స్మార్ట్ సిగ్నల్స్

కంట్రోల్ రూము ద్వారా పర్యవేక్షణ

చెన్నై ట్రాఫిక్ విభాగ జాయింట్ కమిషనర్ విజయకుమార్ మాట్లాడుతూ... ఈ నెల 31వ తేదీ నాటికి సుమారు 100 స్తంభాలు సిద్ధంగా ఉంటాయని చెప్పారు. కొన్ని ప్రాంతాలలో గుంతలు తవ్వడానికి అనుమతులు తీసుకోవాలని, సిగ్నల్ రియల్ టైమ్ రద్దీ పసిగట్టడానికి, ప్రజల కదలికలను అంచనా వేయడానికి వాహనాల కచ్చితమైన సంఖ్యపై సిమ్యులేషన్ నమూనాలను అమలు చేయాలని చెప్పారు. ఇది మానవశక్తికి ప్రత్యామ్నాయం కాదని, డేటా ఎప్పటికీ కంట్రోల్ రూము ద్వారా పర్యవేక్షిస్తుంటారని తెలపారు. అంతేకాకుండా స్థానిక పోలీసులకు డేటా పంపుతుందని పేర్కొన్నారు. అదే సమయంలో ట్రాఫిక్ పోలీసులకు శారీరిక శ్రమ తగ్గుతుందన్నారు.

మొత్తం 165 కూడళ్లలో...

స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా చెన్నై మహానగర పాలక సంస్థ, చెన్నై యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (సీయూఎంటీఏ), ట్రాఫిక్ విభాగం 165 ప్రాంతాలలో సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించాయి. ఈ పనులు 2023లో ప్రారంభమయ్యాయి. అరుంబాక్కం లాంటి కొన్ని ప్రాంతాలలో కొత్త సిగ్నళ్లను పాత సిగ్నళ్ల వెనుక ఉంచారు. కానీ, సిమ్యులేషన్‌లు పెండింగ్‌లో ఉన్నందున అవి పనిచేయలేదు. ప్రముఖుల వాహనాల శ్రేణి, అత్యవసర పరిస్థితులలో ట్రాఫిక్ పోలీసుల అవసరం ఉంటుందని అధికారులు తెలిపారు. సీయూఎంటీఏ కార్యదర్శి జయకుమార్ మాట్లాడుతూ.. రియల్-టైమ్ ఇన్ఫర్మేషన్ ఇంటిగ్రేషన్ ప్రయాణానికి సంబంధించిన ప్రాజెక్టులను ప్రణాళిక చేయడంలోనూ ఈ సిగ్నల్స్ సహాయపడుతాయని చెప్పారు. పైవంతెనలు, కాలినడక పైవంతెనల అవసరాన్ని మనం శాస్త్రీయంగా అర్థ చేసుకోగలమని వివరించారు.

(c) eenadu

మలేసియాతో అనుబంధముంది: విజయ్

చెన్నై: హెచ్.వినోద్ దర్శకత్వంలో విజయ్ నటించిన 'జననాయగన్' చిత్రం వచ్చే ఏడాది జనవరి 9న విడుదల కానున్న నేపథ్యంలో ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో శనివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో విజయ్ మాట్లాడుతూ... మలేసియాతో తనకు అనుబంధం ఉందన్నారు. ఆ తర్వాత 'బిల్లా' తరహాలో తనకు 'కురువి' అని, ఆ సినిమా చిత్రీకరణ కోసం మలేసియా వచ్చానని గుర్తు చేసుకున్నారు. దర్శకుడు హెచ్.వినోద్ మాట్లాడుతూ... చిత్రంలోని చివరి 20 నిమిషాల్లో విజయ్ 'పేరోల్' వీడియో ఉంటుందన్నారు. చిత్రం ముగింపులో ఆవేదన ఉండదని, నవ్వులు మాత్రమే ఉంటాయని తెలిపారు. దళపతికి ఎండ్ లేదని, బిగినింగ్ మాత్రమేనని పేర్కొన్నారు. ఇది 100శాతం వినోదాత్మక చిత్రమన్నారు. దర్శకుడు నాజర్ మాట్లాడుతూ... విజయ్ సినిమాల్లో కొనసాగాలంటూ అభిమానుల తరఫున విజ్ఞప్తి చేశారు. ఈ అభ్యర్థనను ఆమోదించాలని కోరారు. విమర్శలు వచ్చినా దాన్ని ఎదుర్కొనే మార్గంవైపు ఆయన నడుస్తున్నారని తెలిపారు. దర్శకుడు లోకేశ్ కనగరాజ్ మాట్లాడుతూ... 'జననాయగన్' విజయ్ ఆఖరి చిత్రం కావడం బాధాకరమన్నారు. ఆయన నటించిన 'మాస్టర్', 'లియో' తన సినీ ప్రస్థానంలో కీలక చిత్రాలని తెలిపారు. మలేసియాలో అత్యధిక మంది పాల్గొన్న ఆడియో ఆవిష్కరణ కార్యక్రమంగా మలేసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 'జననాయగన్' చోటుచేసుకుంది. ఈ కార్యక్రమానికి 80వేల మంది హాజరయ్యారు.

అభివృద్ధి చేసిన సరస్సు తీరం

మాధవరం సరస్సులో 'జెట్ స్కీ రైడ్'

● పొంగల్ నుంచి ప్రారంభం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: చెన్నై నగరంలోని మాధవరం సరస్సులో పొంగల్ నుంచి జెట్ స్కీ రైడ్ ప్రారంభం కానుంది. దీంతో పొంగల్ సెలవులకు ఉత్తర చెన్నైవాసులకు మంచి వినోదం దక్కనుంది. కొన్ని జలవనరుల్లో గతంలో బోటింగ్ ప్రవేశపెట్టినప్పటికీ జెట్ స్కీ రైడింగ్ మాధవరం సరస్సులో మొట్టమొదటిగా ప్రవేశపెట్టనున్నారు. చెన్నైలో బోటింగ్ సౌకర్యం కల్పించిన రెండో సరస్సుగా గుర్తింపు పొందుతుంది. ఇది సందర్శకుల సంఖ్య పెంచుతుందని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు విశ్వసిస్తున్నారు. జీసీసీ తరఫున సరస్సును పునరుద్ధరిస్తున్నారు. తొలి విడతగా రూ.4.56 కోట్లతో 750 మీటర్ల విస్తీర్ణంలో పనులు పూర్తయ్యాయి. మలి విడతగా ప్రస్తుతం రూ.7 కోట్ల వ్యయ అంచనాతో పనులు జరుగుతున్నాయి. టీటీడీసీ జెట్ స్కీ, బోటింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేసి నిర్వహించనుంది. ఈ సేవలకుగాను జీసీసీ టికెటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసి స్వయంగా నిర్వహించనుంది. సరస్సు మొత్తం 66 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా సుమారు 30 ఎకరాలను పునరుద్ధరించారు. బోటింగ్, నీటి ఆధారిత కార్యకలాపాలకు కేటాయించారు.

త్రిభిన్న సింఫొని ఆవిష్కరించిన ఎ.ఆర్.రెహమాన్

సింఫొని ఆవిష్కరిస్తున్న ఎ.ఆర్.రెహమాన్

చెన్నై, న్యూస్‌టుడే: గ్రామీ పురస్కారం అందుకున్న వయోలిన్ కళాకారుడు గణేశ్ రాజగోపాలన్ కంపోజింగ్ చేసిన 'త్రిభిన్న' ఇండియన్ సింఫొని మ్యూజిక్ ఆల్బమ్‌ను ప్రముఖ సంగీత దర్శకుడు ఎ.ఆర్.రెహమాన్ ఆవిష్కరించారు. చెన్నై అరుంబాక్కంలోని బిగ్ వయోలిన్ షాప్‌లో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో స్వరయోగ బృందంతో కలిసి ఆల్బమ్‌లోని సంగీత అంశాలను గణేశ్ రాజగోపాలన్ ప్రత్యక్షంగా వాయించి చూపించారు. ఈ సందర్భంగా ఎ.ఆర్.రెహమాన్ మాట్లాడుతూ... నేడు కృత్రిమ మేధ ద్వారా ఎవరైనా వయోలిన్‌ను వాయించవచ్చన్నారు. అయినా చేతితో వాయించడమే ఉత్తమమని, అందులోని మానవ భావోద్వేగాలను తీసుకురాగలమని తెలిపారు. కార్యక్రమంలో కర్ణాటక సంగీత కళాకారుడు కృష్ణకుమార్, బిన్ని కృష్ణకుమార్, వయోలిన్ కళాకారుడు కుమరేశ్, వీణ కళాకారులు జయంతి కుమరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సిరైతో మనసు సంతృప్తిగా ఉంది

మారి సెల్వరాజ్

చిత్రంలోని ఓ సన్నివేశం

చెన్నై: వర్ధమాన దర్శకుడు సురేశ్ రాజకుమారి దర్శకత్వంలో విక్రమ్ ప్రభు నటించిన 'సిరై' క్రిస్మస్‌కు విడుదలైంది. ఈ చిత్రాన్ని దర్శకుడు మారి సెల్వరాజ్ తన 'ఎక్స్' ద్వారా ప్రశంసించారు. 'సిరై'ను చూశానని, మనసు సంతృప్తిగా ఉందని తెలిపారు. తర్వాత తరానికి నమ్మకాన్ని, ధైర్యాన్ని ఇచ్చే చిత్రమని పేర్కొన్నారు. తొలి చిత్రం ద్వారానే తనేంటో దర్శకుడు నిరూపించుకున్నారని తెలిపారు. తమవంతు కృషి చేసిన చిత్రబృందం సభ్యులందరికీ శుభాకాంక్షలు చెప్పారు.

తమిళ సినిమాకు కలిసిరాని 2025



చెన్నై, న్యూస్‌టుడే: తమిళ సినీ పరిశ్రమకు ఈ ఏడాది పెద్దగా కలిసి రాలేదు. ముందెన్నడూ లేని విధంగా ఈ ఏడాది 280కిపైగా చిత్రాలు విడుదలైనా వాటిలో విజయం సాధించినవి వేళ్లపైన లెక్కపెట్టే పరిస్థితి ఉంది. సుమారు 30 చిత్రాలు మాత్రమే హిట్టయ్యాయి. ఈ ఏడాది భారీ బడ్జెట్ చిత్రాలుగా రజినీకాంత్ 'కూలీ', కమల్‌హాసన్ 'థగ్‌లైఫ్', అజిత్‌కుమార్ 'విడా ముయర్చి', 'గుడ్ బ్యాడ్ అగ్లీ', విక్రమ్ 'వీర ధీర శూర-2', సూర్య 'రెట్రో', ధనుష్ 'కుబేర', 'ఇడ్లీ కడై', విజయ్ సేతుపతి 'ఏస్', శివకార్తికేయన్ 'మదరాసి' చిత్రాలు ఉన్నాయి. వాటిలో 'కూలీ', 'గుడ్ బ్యాడ్ అగ్లీ' మాత్రమే అత్యధిక లాభాలు చవిచూశాయి. 'కూలీ' రూ.600 కోట్ల వసూళ్లతో దక్షిణాదిలో అత్యధిక వసూళ్లను రాబట్టిన చిత్రాల్లో ఐదో స్థానంలో నిలిచింది. 'థగ్ లైఫ్', 'విడాముయర్చి', 'రెట్రో', 'కుబేర', 'ఇడ్లీ కడై', 'ఏస్', 'మదరాసి' చిత్రాలు రూ.100 కోట్లకు అటుఇటుగా నిలిచాయి. 'కుబేర' చిత్రం తమిళంలో నష్టాన్ని, తెలుగులో లాభాలను మిగిల్చింది. తక్కువ బడ్జెట్‌తో నిర్మితమైన 'తలైవన్ తలైవి', 'మదగజ రాజా', 'డ్రాగన్', 'డ్యూడ్', 'టూరిస్ట్ ఫ్యామిలీ', 'బైసన్', 'మామన్', 'కుడుంబస్థన్', 'అన్ పావం పొల్లాతతు' చిత్రాలు ఎక్కువ లాభాలు గడించాయి. వాటిలో ప్రదీప్ రంగనాథన్ నటించిన 'డ్రాగన్', 'డ్యూడ్' చిత్రాలు రూ.100 కోట్ల క్లబ్‌లో చేరాయి. ఈ ఏడాది తమిళ సినీ పరిశ్రమకు కలిసిరాలేదని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. సుమారు రూ.2వేల కోట్ల నష్టాన్ని తమిళ సినీ పరిశ్రమ చవిచూసిందని అంచనా వేస్తున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి టోకెన్లు లేని భక్తులకు 10 గంటలు, రూ.300 ఎస్‌ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటలు పట్టనుంది. శనివారం స్వామివారిని అర్ధరాత్రి వరకు 91,147 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.4.31 కోట్ల హుండీ కానుకలు లభించాయి. తిరుమలలో చలి తీవ్రత అధికంగా ఉంది.

శబరిగిరీశునికి అభిషేకాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం ముక్కంటి ఆలయంలోని అచ్చుతరాయ మండపంలో కొలువుదీరిన శబరిగిరీశునికి విశేష అభిషేకాలు జరిపారు. గోక్షీరంతో పాటు వివిధ పూజా ద్రవ్యాలతో ఆదివారం అభిషేకాలు జరిపారు. విశేష అలంకరణలు చేపట్టారు. ధూప, దీప, నివేదనలు చేపట్టారు.

కెప్టెన్‌కు ఘన నివాళి

చెన్నై, న్యూస్‌టుడే: డీఎండీకే వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత విజయకాంత్ గురుపూజ సందర్భంగా ఆదివారం చెన్నైలోని డీఎండీకే కార్యాలయంలో ఉన్న ఆయన సమాధికి పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు అంజలి ఘటించారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీ అధ్యక్షులు పొన్.రాధాకృష్ణన్, మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరు.నాగరాజన్, నటి కస్తూరి, టీఎంసీ అధ్యక్షుడు జి.కె.వాసన్, ఎన్టీకే చీఫ్ కన్వీనర్ సీమాన్, సినీ దర్శకులు ఆర్కే సెల్వమణి, పేరరసు, సంగీత దర్శకుడు దీన తదితరులు నివాళులర్పించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ తన 'ఎక్స్' లో... నిరుపేదలపై దయ కలిగి, అందరికీ సహాయపడే హృదయంతో తమిళుల అపారమైన ప్రేమను విజయకాంత్ పొందారన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా ఆ సేవలను గుర్తు చేసుకుంటున్నట్లు తెలిపారు. టీవీకే అధ్యక్షుడు విజయ్ తన 'ఎక్స్'లో... ప్రజల హృదయాల్లో విజయకాంత్ సుస్థిర స్థానాన్ని పొందారన్నారు. ఆయన వర్ధంతి నాడు ఆయనకు కీర్తి అంజలి అర్పిస్తున్నట్లు తెలిపారు.

సమాధికి నివాళి అర్పిస్తున్న ఉదయనిధి స్టాలిన్

సినీ నటి కస్తూరి, మాజీ గవర్నరు తమిళిసై సౌందరరాజన్, నామ్ తమిళర్ కట్చి ప్రధాన సమన్వయకర్త సీమాన్

● శిల్పకళలో రాణిస్తున్న తంజావూర్ కళాకారుడు
● రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం

శిల్పాలకు జీవం.. కళకు ప్రాణం

– న్యూస్‌టుడే, ఆర్కేనగర్

రాయిని శిల్పంగా మార్చడం ఓ కళ. ఆ కళతో దేశం దృష్టిని ఆకర్షించడం విజయం. ఆ ఘనతను సాధించారు మామల్లపురానికి చెందిన ప్రపంచ ప్రఖ్యాత శిల్పి భాస్కర్. గత 36ఏళ్లుగా ప్రపంచ ప్రఖ్యాత శిల్పిగా గుర్తింపు పొందుతున్నారు. ఈయన రాతి శిల్ప కళలో సంప్రదాయ, ఆధునికతను మిళితం చేస్తూ అనేక విగ్రహాలను సృష్టిస్తున్నారు. శివుడు నృత్యం చేస్తూ కుందేలును చంపుతున్నట్లు రూపొందించిన విగ్రహానికి 2024-25 ఏడాదికిగాను ఉత్తమ శిల్ప కళాకారుడిగా జాతీయ అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. తంజావూర్ జిల్లా అమ్మాపేట్టై ప్రాంతానికి చెందిన భాస్కర్(61) మామల్లపురంలోని

రూపొందించిన శిల్పాలు

ప్రభుత్వ ఆర్కిటెక్చర్, శిల్పకళా కళాశాల నుంచి శిల్పకళలో పట్టా పొందారు. ఆపై అదే కళాశాలలో నాలుగేళ్లపాటు అధ్యాపకుడిగా పనిచేసిన తర్వాత 'క్రియేటివ్ స్కిల్స్' అనే శిల్పాల గ్యాలరీని ప్రారంభించి వివిధ విగ్రహాలను రూపొందించడం ప్రారంభించారు. ఆయన సృష్టించిన విగ్రహాలు నేడు రాష్ట్రం, దేశాలు దాటి వివిధ విదేశాలలో ఉద్యానవనాలు, దేవాలయాలలో ప్రతిష్ఠితమయ్యాయి. శిల్ప కళా ప్రయాణం గురించి భాస్కర్ మాట్లాడుతూ..

శ్రమకు గుర్తింపుగా అవార్డులు

2010లో ఉత్తమ శిల్ప కళాకారుడిగా రాష్ట్ర పురస్కారం అందుకున్నాను. 2015లో శిల్పకళా రంగంలో ఉత్తమ ఎగుమతిదారు అవార్డు, రాష్ట్ర కలైసెమ్మల్ అవార్డు తీసుకున్నాను. 2024-25 ఏడాదికిగాను జాతీయ పురస్కారం లభించింది. ఈ పురస్కారాలన్నీ శిల్పకళలో కృషి, శ్రమకు గుర్తింపు, ప్రోత్సాహంగా భావిస్తున్నా. విద్యార్థులు నా వద్ద శిక్షణ తీసుకున్నారు. విదేశీ శిల్పులు కూడా నాతో పనిచేస్తున్నారు. నా తండ్రి చేనేత కార్మికుడు. పాఠశాలలో చదువుతున్నప్పటి నుంచే పెయింటింగ్, చిత్రలేఖనం, శిల్పకళపై ఆసక్తి ఉండేది.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న భాస్కర్

రాతి కొరతను పరిష్కరించాలి

ఈ రంగంలో కష్టానికి తగ్గట్టుగానే ఆదాయం దక్కుతుంది. నెలకు రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు లాభం వస్తుంది. నేను తయారుచేసే విగ్రహాలను ఆలయాలలో ప్రతిష్ఠించి పూజించడం చూస్తుంటే చాలా ఆనందంగా అనిపిస్తుంది. మన సాంప్రదాయ కళల పరిరక్షణకు ఓ కళాశాల ఉందంటే అది తమిళనాడు మామల్లపురంలోని ప్రభుత్వ ఆర్కిటెక్చర్, శిల్పకళా కళాశాల మాత్రమే. అయితే ప్రస్తుతం రాతి కొరతను ఎదుర్కొంటున్నాము. శిల్పుల కోసం ఒక క్వారీని సృష్టించి రాళ్లను విక్రయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము.

ఐర్లాండ్‌లోని పార్కులో ప్రతిష్ఠ

మామల్లపురంలోని కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నప్పుడు ఐర్లాండ్‌లో జీవితాన్ని అర్థం చేసుకోవడానికి శిల్పాలతో కూడిన పార్కుని ఏర్పాటు చేస్తున్నామని నన్ను సంప్రదించారు. దీంతో అధ్యాపక ఉద్యోగానికి స్వస్తి పలికి దాదాపు 16ఏళ్లలో ఆ పనులను పూర్తి చేశాను. ఐర్లాండ్‌లోని విక్టర్స్‌వేలోని పార్కులో కొలువైన ప్రత్యేక విగ్రహాలు నేను చెక్కినవే. జననం నుంచి మరణం వరకు ప్రతి సందర్భాన్ని తెలియజేసేలా అక్కడి విగ్రహాలను రూపొందించాను. ఆ తర్వాతే మామల్లపురంలో సొంతంగా శిల్ప గ్యాలరీని ప్రారంభించాను. సింగపూర్‌లోని ఓ విద్యాసంస్థ కోసం 10 మంది ప్రపంచ పండితులతో కూడిన ప్రత్యేకమైన కళాఖండాన్ని చెక్కాను. తిరువళ్లువర్ మధ్యలో కూర్చునట్లు అరిస్టాటిల్, సోక్రటిస్ సహా 10మంది ప్రపంచ పండితులు దాని చుట్టూ నిలబడి ఉన్నట్లుగా ఉంటుంది. నేను తయారుచేసిన విగ్రహాలు మలేసియా, సింగపూర్, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్ తదితర దేశాలలో ఉన్నాయి.

భార్య గొంతుకోసి భర్త ఆత్మహత్య

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు జిల్లా వేలూరు నగరం సమీపం సెన్‌బాక్కం ప్రాంతానికి చెందిన వినోద్(40) సైదాపేటకు చెందిన ట్రాన్స్‌జెండర్ రసిక(35)ను రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం వీరు వేలూరు సమీపం మోటూరులో నివసిస్తున్నారు. వీరి మధ్య విభేదాలు తలెత్తడంతో విడివిడిగా జీవిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం వీరి మధ్య గొడవ జరిగింది. ఆగ్రహించిన వినోద్ కత్తితో రసిక గొంతుకోసి పారిపోయాడు. స్థానికులు రసికను వేలూరులోని అడుకంపారై ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి విరింజిపురం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు నిందితుడి కోసం గాలించగా అతను బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. అరియలూరు పోలీసులు వినోద్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కళాశాల విద్యార్థుల దుర్మరణం

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: లారీని ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు కళాశాల విద్యార్థులు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు... పూందమల్లి సమీపం సెన్నీర్‌కుప్పంకి చెందిన నిర్మల్(19), సంతోశ్‌కుమార్(18) స్నేహితులు. వీరు స్థానికంగా ఉన్న కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున సెన్నీర్‌కుప్పం నుంచి పారివాక్కం సిగ్నల్ వద్ద ఉన్న టీ దుకాణానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. మార్గమధ్యంలో కోళ్ల లోడుతో వస్తున్న వ్యాను వారి బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో లారీ చక్రం కిందపడిన ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఆవడి ట్రాఫిక్ పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. పోలీసులు రాణిపేటకు చెందిన లారీ డ్రైవర్ నజీర్‌ను అరెస్టు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని కార్మికుడు...

శ్రీపెరుంబుదూర్: శ్రీపెరుంబుదూర్ సమీపం వలర్‌పురం గ్రామానికి చెందిన ఏళుమలై(39) స్థానికంగా ఓ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నారు. ఈయన శుక్రవారం రాత్రి వలర్‌పురం నుంచి మన్నూర్ వైపు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతుడి కుటుంబీకులు, బంధువులు, గ్రామ ప్రజలు శనివారం మధ్యాహ్నం వలర్‌పురం మెయిన్ రోడ్డులో రాస్తారోకో చేపట్టారు. ఏళుమలై మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. పోలీసులు వారితో చర్చలు జరపడంతో ఆందోళన విరమించారు.

ప్రమాదానికి గురై గాయపడిన లిఫ్ట్ టెక్నీషియన్...

ఫిల్మ్‌నగర్: లిఫ్ట్ పనులు చేస్తూ నాలుగో అంతస్తు నుంచి జారిపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తిరునెల్వేలి జిల్లా వాగైకుల్లం గ్రామానికి చెందిన ప్రదీప్‌కుమార్(22) ఉపాధి కోసం కొంతకాలం క్రితం హైదరాబాద్‌కు వలస వచ్చి లిఫ్ట్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 14న జూబ్లీహిల్స్ రోడ్ నం.10లోని ఓ నిర్మాణంలో పనిచేస్తుండగా ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. జూబ్లీహిల్స్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రదీప్‌కుమార్‌ను ఆర్థిక ఇబ్బందుల వల్ల స్వగ్రామానికి తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. శనివారం రాత్రి స్వగ్రామానికి వెళ్తుండగా అతడి పరిస్థితి విషమించింది. మార్గం మధ్యలోని కర్నూల్ ఆసుపత్రిలో చేర్చాక కొద్దిసేపటికే మృతిచెందాడు. అతడి సోదరుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆత్మాహుతికి యత్నించిన మహిళ మృతి

కారణమైన కుమారుడు, కోడలు అరెస్టు

అరెస్టయిన శంకర్, శాంతి

కాంచీపురం: కాంచీపురం జిల్లా ఉత్తిరమేరూర్ యూనియన్ ఇలనగర్‌కు చెందిన ఆర్ముగం(70), వసంత(65) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. అందరికీ పెళ్లిళ్లు కావడంతో వేర్వేరుగా నివసిస్తున్నారు. పెద్ద కుమారుడు శంకర్(47), రెండో కుమారుడు వెంకటేశ పెరుమాళ్(38) మధ్య ఆస్తి పంపకాల విషయమై గొడవలు జరుగుతున్నాయి. వెంకటేశ పెరుమాళ్ కాంచీపురం సమీపంలోని అత్తవారింట్లో ఉంటున్నాడు. ఇదిలా ఉండగా వసంత ఈనెల 1వ తేదీ కుమారుడు శంకర్‌ను తమ ఇంటికి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో ఇల్లు కట్టుకోమని చెప్పింది. దీంతో ఆగ్రహించిన శంకర్, అతని భార్య శాంతి కలిసి వసంతను అసభ్యపదజాలంతో దూషించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పటించుకుంది. తీవ్రంగా గాయపడటంతో చెంగల్పట్టు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమారుడు, కోడలు తిట్టడంతోనే తాను ఆత్మహత్యకు యత్నించినట్లు మేజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం ఇచ్చింది. 26 రోజులుగా చికిత్స పొందుతూ శనివారం వసంత మృతి చెందింది. ఘటనపై ఆర్ముగం పెరునగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని శంకర్, శాంతిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండుకు తరలించారు.

హత్య కేసులో 10 మంది అరెస్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: యువకుడి హత్య కేసులో 10 మందిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల మేరకు... తూత్తుకుడి నగరంలోని సత్యనగర్‌కి చెందిన శీను(26) అనే యువకుడిపై పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలా ఉండగా అతను గత 24వ తేదీ హత్యకు గురయ్యాడు. పోలీసుల దర్యాప్తులో శీనుకి ఆమె స్నేహితుడు కపిల్‌దేవ్‌కి మధ్య ఏర్పడిన కక్షల కారణంగా హత్య జరిగినట్లు తెలిసింది. అనంతరం కపిల్‌దేవ్, జేసురాజ్, ఆకాష్, ముకేష్, మదియళగన్, శక్తిబాలా మొదలైన 10 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అదేవిధంగా సంతోష్, ప్రకాష్‌ల కోసం గాలిస్తున్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన ఇద్దరు ఉపాధ్యాయులు...

టీనగర్: సేలం జిల్లాలో ఓ విద్యార్థినిని లైంగికంగా వేధించిన ఇద్దరు ఉపాధ్యాయులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు... బాధితురాలు సేలం ప్రాంతంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో గతంలో చదివింది. ప్రస్తుతం ఉన్నత విద్య అభ్యసిస్తోంది. అయితే, అదే పాఠశాలలో పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు ఆమెకు వాట్సాప్‌లో అసభ్యకర సందేశాలు పంపడం ప్రారంభించారు. లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అమ్మాపేట పోలీసులు దర్యాప్తు చేపట్టి ఉపాధ్యాయులను అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు.

డిజిటల్ అరెస్టు పేరిట రూ.90 లక్షలు స్వాహా

మోసపోయిన ప్రభుత్వాధికారి

సైదాపేట, న్యూస్‌టుడే: తిరుచ్చి విమానాశ్రయం ప్రాంతానికి చెందిన 57ఏళ్ల ప్రభుత్వ అధికారి సెల్‌ఫోన్‌కు కొన్ని రోజుల క్రితం ఓ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి.. తాను పోలీసు అధికారినని, దిల్లీ నుంచి మాట్లాడుతున్నానని పరిచయం చేసుకున్నాడు. యువతుల లైంగిక వేధింపుల కేసులో ముఖ్య నిందితుడి నుంచి పలు బ్యాంకులకు చెందిన 147 ఏటీఎం కార్డులను స్వాధీనం చేసుకున్నామని, అందులో మీ ఏటీఎం కార్డు కూడా ఉందని చెప్పాడు. అతనితో మీకు సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని, మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నామని చెప్పాడు. అరెస్టు చేయకుండా ఉండాలంటే మీ బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బులను తాము చెప్పే బ్యాంకు ఖాతాకు పంపాలని, విచారణ పూర్తయ్యి నిర్దోషిగా తేలితే మీ డబ్బులు తిరిగి పంపిస్తామని తెలిపాడు. దీంతో దిగ్భ్రాంతి చెందిన ప్రభుత్వ అధికారి.. భార్య నగలు బ్యాంకులో కుదువపెట్టి కుమార్తె వివాహం కోసం తీసుకున్న రూ.90 లక్షలు బదిలీ చేశారు. తర్వాత తన స్నేహితుడైన న్యాయవాదికి విషయం చెప్పారు. ఆయన సూచనతో తిరుచ్చి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక బస్సులు

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని అప్పలాయగుంటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు చేరుకోవడానికి మంగళం ఆర్టీసీ డిపో ప్రత్యేకంగా బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ సుధాకరయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 30 నుంచి జనవరి ఒకటో తేదీ వరకు మంగళం నుంచి తిరుపతి మీదుగా అప్పలాయగుంట వరకు నాలుగు ప్రత్యేక బస్సులను నడుపుతామని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైల్లో గంజాయి పట్టివేత

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: అలప్పుజా ఎక్స్‌ప్రెస్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ప్రకాశం జిల్లా ఒంగోలు నుంచి సింగరాయకొండ వరకు శనివారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో గంజాయి చాక్లెట్లను పోలీసులు గుర్తించారు. గంజాయి, మత్తుపదార్థాల నిర్మూలన చర్యల్లో భాగంగా మహిళా పీఎస్ ఇన్‌స్పెక్టర్ యు.సుధాకర్ నేతృత్వంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. 11.5 కేజీల గంజాయి, 37 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి నాగపట్నం జిల్లాకు చెందిన ఆశిక్ అనే యువకుడిని అరెస్టు చేసినట్లు జీఆర్పీ డీఎస్పీ మురళీధర్, సీఐ మౌలాషరీఫ్, ఎస్సై మధుసూదన్ తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu